ఈనాడు
అల్లూరి సీతారామరాజు
గురువారం 3 జులై 2025 7

పడకుండా వెళ్లడమే పాఠం..!

ఆ ఊర్లో బడి లేదు. అక్కడి పిల్లలు పక్క గ్రామాలకు వెళ్లి చదువుకోవాల్సిన పరిస్థితి. ఆ గ్రామానికి నిధులు మంజూరైనా రోడ్డు నిర్మాణం పూర్తికాలేదు. వర్షం వస్తే గిరి బాలలు బురద దారిలో పడి లేస్తూ పాఠశాలకు వెళ్లాల్సి వస్తోంది. బడిలో పాఠాలు నేర్చుకోవాల్సిన ఆ చిన్నారులు పడకుండా వెళ్లడమే వారికి పెద్ద పాఠంగా మారింది. గూడెంకొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ నేలపాడు గ్రామంలో సుమారు 10 మంది గిరి బాలబాలికలు ఉన్నారు. రింతాడ, కొడిసింగి గ్రామాల్లోని పాఠశాలల్లో వీరు చదువుతున్నారు. ఈ గ్రామానికి రహదారి నిర్మాణం కోసం రూ. 40 లక్షలు మంజూరై పది నెలల క్రితం పనులు ప్రారంభించారు. బిల్లులు రాకపోవడంతో పనులు పూర్తి కాలేదు. వర్షాకాలంలో అక్కడి ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. – న్యూస్‌టుడే, గూడెంకొత్తవీధి

మన్యం సిగలో గంగమ్మ సొబగు

మోతుగూడెం, న్యూస్‌టుడే: చింతూరు మండలం మోతుగూడెంలో పది రోజులుగా తెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలతో జలపాతాలు, నదులు, వాగులు నిండుగా కళకళలాడున్నాయి. పొల్లూరు ఎగువ, దిగువ, సుకమామిడి జలపాతాలు పైనుంచి పాలనురగలు కక్కుతూ జాలువారుతున్నాయి. సందర్శకులు వీక్షించటమే కాకుండా జలపాత అందాలను కెమెరాల్లో పదిలం చేసుకున్నారు.

సౌకర్యాలున్నా సంకోచం ఎందుకమ్మా?

జూన్ 25: పాడేరు మండలం వరంకుర గ్రామానికి చెందిన కొర్ర రత్నాలమ్మ ఇంట్లోనే ప్రసవించింది. తల్లీ, బిడ్డ నీరసంగా ఉండి నడవలేని పరిస్థితుల్లో వైద్య సిబ్బంది గిరిజనులతో కలసి డోలీపై ఆసుపత్రికి తీసుకువచ్చారు.

జూన్ 26: గూడెంకొత్తవీధి మండలం పోతురాజుగున్నలకు చెందిన ఆశా కార్యకర్త కుస్సేకు పురిటినొప్పులు రావడంతో రహదారి లేక కుటుంబీకులు డోలీపై మూడు కిలోమీటర్లు తీసుకువచ్చారు. ఆసుపత్రిలో ప్రసవానికి ముందస్తు వసతి, పర్యవేక్షణ, ఆహారం, వైద్యం అందిస్తున్నారని గ్రామాల్లో గర్భిణులకు అవగాహన కల్పించే ఆశా కార్యకర్తా పురిటినొప్పులు వచ్చేవరకు గ్రామంలోనే ఉండిపోయింది.

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే

జిల్లాలో నెలరోజుల వ్యవధిలో అత్యవసర పరిస్థితుల్లో డోలీపై తరలించిన ఘటనలు పరిశీలిస్తే వారిలో ఎక్కువమంది గర్భిణులే ఉన్నారు. ప్రభుత్వం ఆసుపత్రుల్లో ప్రసవాలకు కావాల్సిన అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. దీంతో పాటు ఈ కేంద్రాల్లో ఉన్నన్ని రోజులు పోషకాహారం, ప్రోత్సాహకాలు అందిస్తోంది. కానీ గర్భిణులేమో ఇళ్లవద్ద ప్రసవాలకే మొగ్గు చూపుతున్నారు. గర్భిణులకు ఆసుపత్రి ప్రసవాలపై అవగాహన కల్పించాల్సిన ఆశా కార్యకర్తలు సైతం పురిటినొప్పులు వచ్చేవరకు ఇళ్లలోనే ఉండిపోతున్నారు.

ప్రసవ నిరీక్షణ గదులకు దూరంగా..

ప్రసవం కష్టమై ఏ ఒక్క తల్లీబిడ్డా ప్రాణం పోకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం ఆసుపత్రి ప్రసవాలను ప్రోత్సహిస్తోంది. మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ఆమె బాగోగులు పర్యవేక్షించేలా ప్రత్యేకంగా ట్రాకింగ్ వ్యవస్థ తీసుకొచ్చింది. దీంతోపాటు సురక్షిత కాన్పులే లక్ష్యంగా ఆసుపత్రుల్లో ప్రసవ నిరీక్షణ భవనాలు ఏర్పాటు చేసింది. గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని బట్టి ప్రసవానికి పది, పదిహేను రోజు నుంచి నెల ముందువరకు ఇక్కడ ఉంచుతారు. ప్రత్యేక సౌకర్యాలతో ఏర్పాటు చేసిన గదుల్లో వైద్యుల పర్యవేక్షణలో ఉంచి ఆహారం అందిస్తారు. అధికశాతం గర్భిణులు ఈ సేవలను వినియోగించుకోవడం లేదు. ప్రసవం గడువు సమీపించే వరకు ఇళ్లవద్దనే ఉండిపోతున్నారు. కొన్నిసార్లు అనుకోని విధంగా ముందస్తు కాన్పు అయ్యే పరిస్థితి ఎదురవుతోంది. దీంతో అప్పటికప్పుడు డోలీలు, సొంత వాహనాలు, అంబులెన్స్‌ల్లో ఆసుపత్రులకు తీసుకువస్తున్నారు. ఇలాంటి సమయాల్లో కొన్నిసార్లు పరిస్థితి విషమించి తల్లీ, బిడ్డ ప్రాణాలు కోల్పోయిన సందర్భాలూ ఉన్నాయి.

★ ప్రసవ నిరీక్షణ భవనాలకు వెళ్లడానికి గిరిజన మహిళలు సంకోచిస్తున్నారు. అక్కడ నుంచి మైదాన ప్రాంతాలకు పంపించేస్తారేమో, అక్కడికి వెళితే ఏం జరుగుతుందోనన్న భయంతో వారు రావడం లేదు. ప్రసవ నిరీక్షణ భవనాల్లో కల్పిస్తున్న సౌకర్యాలు, వైద్య సేవలపై గర్భిణులకు వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, క్షేత్ర సిబ్బంది పూర్తిస్థాయిలో అవగాహన కల్పించడం లేదు.

చింతపల్లి ప్రసవ నిరీక్షణ భవనంలో గర్భిణులు

డివిజన్	ప్రభుత్వ ఆసుపత్రులు	ప్రసవ నిరీక్షణ భవనాలు
పాడేరు	35	26
రంపచోడవరం	29	20
మొత్తం	64	46

రెండువారాలు ముందే వస్తే మేలు: గర్భిణులు నెలలు నిండటానికి రెండు వారాల ముందే ఆసుపత్రికి వస్తే పరీక్షించి ప్రసవ నిరీక్షణ భవనంలో ఉంచుతాం. అక్కడ వారికి ఆహారం, మందులు అందిస్తాం. సరైన పర్యవేక్షణ ఉండటంతో సుఖ ప్రసవం అయ్యేందుకు వీలుంటుంది. దీనిపై గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నాం. – సౌమ్య, వైద్యాధికారి, ఆర్వీనగర్

క్షేత్ర సిబ్బందిపై వదిలేయొద్దు: ప్రసవ నిరీక్షణ గదులపై ఉన్నతాధికారులు, వైద్యాధికారులు గిరి మహిళకు అవగాహన కల్పించడం లేదు. క్షేత్ర సిబ్బందిపై ఆ బాధ్యత వదిలేస్తున్నారు. గర్భిణులు వారి మాట వినడం లేదు. రికార్డుల ఆధారంగా ముందుగానే అధికారులు గ్రామాల్లోకి వెళ్లి గర్భిణులను ఆసుపత్రులకు తరలిస్తే కొంతవరకు ప్రయోజనం ఉంటుంది. – ఎ.బుజ్జిబాబు, గిరిజన సంఘం కార్యదర్శి, గూడెంకొత్తవీధి

మీ పిల్లల బలాబలాలేమిటంటే!

పాడేరు, న్యూస్‌టుడే: జిల్లాలో అన్ని యాజమాన్య పాఠశాలల విద్యార్థులకు గత విద్యా సంవత్సరం పరీక్షల్లో వచ్చిన మార్కులు, వారి ఆరోగ్య వివరాలను తెలియజేయడానికి సమగ్ర ప్రగతి పత్రం కార్డులు సిద్ధం చేస్తున్నారు. ఈనెల 10న జరిగే మెగా తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశంలో (మెగా పేటీఎం) వాటిని తల్లిదండ్రులకు ఇస్తారు. బాలల అభ్యసన సామర్థ్యాలతోపాటు వారిలో ఉన్న భావవ్యక్తీకరణ, బలాలు, బలహీనతలు, భవిష్యత్తు లక్ష్యాలు, ఆసక్తులను ఉపాధ్యాయులు తెలుసుకుని ఆ కార్డుల్లో పొందుపరుస్తారు. వాటిని తల్లిదండ్రులకు తెలియజేయడంతోపాటు వారు ఆ దిశగా లక్ష్యం చేరుకోవడానికి తమవంతు చర్యలు తీసుకుంటారు.

★ గత విద్యా సంవత్సరంలో ప్రతి పాఠశాలల్లో 1-10 తరగతులు చదివిన ప్రతి విద్యార్థి నాలుగు ఫార్మెటివ్, రెండు సమ్మెటివ్ పరీక్షల్లో వచ్చిన మార్కులను ఈ కార్డుల్లో పొందుపరుస్తారు. సమీపంలో ఉండే ప్రాథమిక వైద్య, ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆసుపత్రుల వైద్యులతో జూన్‌-నవంబర్ మధ్య ఒకసారి, ఏడాదిలో రెండుసార్లు అన్ని రకాల వైద్య పరీక్షలు చేస్తున్నారు. ఆ వివరాలు కూడా నమోదు చేస్తారు. మానసిక ఆరోగ్యం, డ్రగ్ వ్యతిరేక అవగాహన సందేశాలు, పిల్లల ప్రగతి తెలిపే సమీక్షిస్తారు. జిల్లాలో 3,023 విద్యాసంస్థల్లో జరిగే తల్లిదండ్రుల సమావేశాల్లో దాదాపు 1,93,582 మంది విద్యార్థులు, 9000 మంది ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, దాతలు పాల్గొననున్నారు.

విద్యార్థులకు పంపిణీ చేయనున్న ప్రగతి కార్డులు

★ తల్లిదండ్రుల సమావేశాలను విజయవంతం చేయాలని జిల్లా సమగ్ర శిక్షా ప్రాజెక్టు అధికారి డాక్టర్ వి.ఎ.స్వామినాయుడు కోరారు. జిల్లాలో అన్ని మండలాల విద్యా శాఖాధికారులు, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కోరారు. ఏ పాఠశాలలోనైనా ఈ కార్యక్రమం ఏర్పాట్లపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రమాదస్థాయికి డుడుమ నీటినిల్వలు

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: మన్యంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాల ఉమ్మడి నిర్వహణలోని మాచ్‌ఖండ్ జలవిద్యుత్కేంద్రానికి చెందిన డుడుమ జలాశయం నీటినిల్వలు (డైవర్షన్ డ్యాం) ప్రమాదస్థాయికి చేరుకున్నాయి. 2,590 అడుగుల సామర్థ్యం గల డుడుమ జలాశయంలో బుధవారం నీటిమట్టం 2588.3 అడుగులకు చేరింది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా అధికారులు మధ్యాహ్నం ఏడో నెంబరు గేటు ఒక అడుగు ఎత్తి 1000 క్యూసెక్కుల నీటిని దిగువన బలిమెలకు విడుదల చేస్తున్నారు. గత శనివారం నాటికి డుడుమ జలాశయం నీటి మట్టం 2579.5 అడుగులుగా ఉండేది. కుండపోత వర్షాలకు ఐదురోజుల్లో ఏకంగా ఎనిమిది అడుగుల మేర నీటినిల్వలు పెరిగాయి. వరద ఉద్ధృతి తగ్గుముఖం పట్టకపోతే మరిన్ని గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తామని ప్రాజెక్టు వర్గాలు పేర్కొన్నాయి. మంగళవారం నుంచి జోలాపుట్ ప్రధాన జలాశయం నుంచి నీటి విడుదల నిలిపివేశారు. ప్రస్తుతం జోలాపుట్ నీటిమట్టం 2727.20 అడుగులకు చేరుకుంది.

జలాశయం నుంచి నీటి విడుదల

వాగు దాటాలంటే సాహసం చేయాల్సిందే

మన్యంలో విడవకుండా కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించిపోతోంది. అత్యవసర పరిస్థితుల్లో వాగులు దాటేందుకు సాహసం చేయాల్సి వస్తోంది. చింతపల్లి మండలంలోని గొందిపాకలు, ఎర్రబొమ్మలు పంచాయతీల్లో ఎర్రవరం, ఎర్రాపల్లి గ్రామాలున్నాయి. ఈ గ్రామాల గిరిజనులు గ్రామం వదిలి బయటకు రావాలంటే మధ్యలో కొండవాగులు దాటాలి. ఇక్కడ కల్వర్టులు లేకపోవడంతో వాగులు దాటేందుకు గిరిజనులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వేగంగా ప్రవహిస్తున్న వాగులు దాటేందుకు ఒక్కొక్కరు వెళితే అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతారన్న భయంతో ఒకరికి ఒకరు సాయం చేసుకుంటూ పట్టు జారిపోకుండా ఆధారం చేసుకుని భయంభయంగా వాగు దాటుతున్నారు. – చింతపల్లి, న్యూస్‌టుడే

గుంపుగా కొండవాగు దాటుతున్న గిరిజనులు

సొలబంగి గ్రామంలో సమస్యలు పరిష్కరిస్తాం

అనంతగిరి, న్యూస్‌టుడే: పినకోట పంచాయతీ సొలబంగి గ్రామంలో అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్ బుధవారం పర్యటించారు. ఈ గ్రామానికి నడకదారి బురదగా ఉండటంతో తహసీల్దార్ మాణిక్యంతో కలిసి ఇబ్బందులు పడుతూ గ్రామానికి వెళ్లారు. ఇటీవలే మంజూరు చేసిన రహదారి పనులను పరిశీలించారు. అనంతరం తాత్కాలిక పాఠశాల వద్దకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించారు. విద్యార్థులు ఏ విధంగా చదువుతున్నారు. అంతకు ముందు నదిని దాటుకుంటూ పాఠశాలకు వెళ్లేందుకు ఎటువంటి కష్టాలు పడ్డారు అని తెలుసుకున్నారు. ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించాలని వారికి సూచించారు. గ్రామస్థులతో మాట్లాడి సమస్యలపై ఆరా తీశారు. సమస్యలను పరిష్కరిస్తామని పేర్కొన్నారు. గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్

ఉపాధ్యాయుల్లేక.. ఉసూరుమంటూ రాక!

సీలేరు, న్యూస్‌టుడే: దారకొండ పంచాయతీ పేట్రాయి జీపీఎస్ పాఠశాలలో గత 20 రోజులుగా ఉపాధ్యాయుడు కోసం విద్యార్థులు ఎదురుచూపులు చూస్తున్నారు. రోజు పాఠశాలకు వెళ్లి, ఉపాధ్యాయులు రాకపోవడంతో తిరిగి వచ్చేస్తున్నారు. పాఠశాలలో సుమారు 45 మంది విద్యార్థులు చదువుతున్నారు. గత విద్యాసంవత్సరంలో ఉన్న ఉపాధ్యాయుడు బదిలీపై వెళ్లిపోయారు. ఈయన స్థానంలో వేరెవ్వరిని నియమించలేదు. దీంతో బాలలు బోధనకు దూరమవుతున్నారు. అధికారులు స్పందించి ఉపాధ్యాయులను నియమించాలని మాజీ వార్డు సభ్యుడు కొర్రా బలరాం, సీపీఐ మండల కార్యదర్శి కవర్ల భగవాన్, గిరిజన సమాఖ్య మండల అధ్యక్షుడు పాంగి నాగేశ్వరరావు, విద్యార్థుల తల్లిదండ్రులు మల్లేష్, కిముడు రాంబాబు, బురిడి రాము తదితరులు కోరారు.

ఉపాధ్యాయులను నియమించాలని కోరుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

పింఛన్ల పంపిణీలో జిల్లా ప్రథమం

పాడేరు, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో అల్లూరి సీతారామరాజు జిల్లా మరోసారి ప్రథమ స్థానంలో నిలిచిందని కలెక్టర్ దినేష్‌కుమార్ తెలిపారు. సచివాలయ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిబ్బంది, ఎంపీడీఓలను అభినందించారు. బుధవారం సాయంత్రం 5 గంటల సమయానికి 98.34 శాతం మందికి పంపిణీ చేశారు. జిల్లాలో కొత్తగా 1194 పింఛన్లు మంజూరు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు.

జాతీయ లోక్ అదాలత్ 5న

పాడేరు, న్యూస్‌టుడే: జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పాడేరు సీఐ దీనబంధు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 5వ తేదీన పాడేరు ప్రథమ శ్రేణి జ్యుడీషియల్ కోర్టు వద్ద లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎప్పటినుంచో కోర్టుల్లో ఉన్న కేసులను రాజీ చేసుకునేందుకు ఇరువర్గాలకు ఇది చక్కని అవకాశమన్నారు.

గోదావరి పెరుగుతోంది.. గుండె అదురుతోంది

గండిపోశమ్మ ఆలయాన్ని తాకిన వరద

దేవీపట్నం, న్యూస్‌టుడే: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరిలో నీటి మట్టం జోరుగా పెరుగుతోంది. మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారేసరికి మూడు అడుగుల మేర పెరగడంతో దండంగి- డి.రావిలంక గ్రామాల మధ్య ఆర్‌అండ్‌బీ రహదారిని వరద నీరు పూర్తిగా ముంచెత్తింది. గోకవరం నుంచి పోశమ్మగండి వైపునకు వాహనాల రాకపోకలు తాత్కాలికంగా నిలిచాయి. గండిపోశమ్మ ఆలయం వద్దకు వరద నీరు చేరడంతో ఆలయాధికారులు అప్రమత్తమయ్యారు. దీంతో ఆలయంలో ఉన్న ఆరు హుండీలను బుధవారం లెక్కించారు. అమ్మవారి దర్శనానికి వెళ్లే భక్తుల క్యూ లైన్ల వద్దకు వరద నీరు చేరడంతో భక్తులు అటువైపు వెళ్లకుండా అన్ని జాగ్రత్త చర్యలు తీసుకున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి జి.వి.లక్ష్మీకుమార్ తెలిపారు. పోశమ్మగండి వద్ద దుకాణాలు నిర్వహించే పలువురు ఇళ్లను ఖాళీచేసి సామగ్రితో పురుషోత్తపట్నం వెళ్లిపోయారు. బుధవారం సాయంత్రానికి గోదావరి కాస్త తగ్గుముఖం పట్టి నిలకడగా ఉన్నా ఎగువ ప్రాంతాల నుంచి గురువారం నాటికి వరద నీరు వచ్చే అవకాశం ఉండటంతో ఆందోళన చెందుతున్నారు. పూడిపల్లి వద్ద సీతపల్లి వాగుకు పోటెత్తిన గోదావరి క్రమంగా సీతారం వరకు చేరడంతో దామనపల్లి పరిసర ప్రాంతాల గిరిజనులకు సీతపల్లి వాగులో తాత్కాలికంగా రాకపోకలు నిలిచాయి. వరద మరింత పెరిగితే అమ్మవారి దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు ఈఓ తెలిపారు. హుండీల లెక్కింపు ద్వారా రూ.లక్ష రెండు వేల ఆదాయం సమకూరిందన్నారు.

గండిపోశమ్మ ఆలయం క్యూలైన్ల వద్దకు చేరిన నీరు

తాత్కాలిక నివాసాల ఏర్పాటు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: గోదావరి నదిలో నీటిమట్టం నెమ్మదిగా పెరుగుతుండటంతో పరివాహక ప్రాంతాల ప్రజలు ఇళ్లను వదిలి ముంపునకు గురికాని ప్రాంతాల్లో తాత్కాలిక నివాసాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. వరరామచంద్రాపురం పంచాయతీలోని నాలుగు గ్రామాల ప్రజలు రేఖపల్లిలోని పునరావాస కేంద్రంలో, శ్రీరామగిరి గ్రామస్థులు కొండపైన, చింతరేవుపల్లి గ్రామస్థులు సమీపంలోని అడవిలో గుట్టపైన బుధవారం కట్టెల పాకలు వేసుకుంటున్నారు. వరద నీరు మరీ ఎక్కువగా పెరిగితే ఈ కట్టెల పాకలపైన టార్పాలిన్లు వేసుకుని, సామగ్రిని తీసుకు వచ్చి పెట్టుకుంటారు. వరదల ప్రభావం తక్కువగా ఉంటే కొద్దికాలం, ఎక్కువగా ఉంటే నెలల తరబడి ఈ కుటీరాల్లో ఉండాల్సి వస్తుంది.

రేఖపల్లిలో కట్టెల పందిరి వేసుకుంటున్న ముంపుగ్రామాల ప్రజలు

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే

రంపచోడవరం, రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని, దీనిలో భాగంగానే ఏడాది కాలంలో చేపట్టిన సంక్షేమ పథకాలను తెలుగు యువత, క్లస్టర్ ఇన్‌ఛార్జుల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తున్నామని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి పేర్కొన్నారు. రంపచోడవరంలో బుధవారం యూత్, క్లస్టర్ ఇన్‌ఛార్జుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు పార్టీ రూపొందించిన యాప్‌పై ప్రోగ్రాం ట్రైనర్ బాచినేని శ్రీకాంత్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలపై 'సుపరిపాలనలో తొలిఅడుగు' పేరుతో ముద్రించిన కరపత్రాలను ఎమ్మెల్యే శిరీషాదేవితోపాటు మాజీ ఎమ్మెల్యేలు శీతంశెట్టి వెంకటేశ్వరరావు, చిన్నం బాబూరమేష్, గిరిజన సహకార సంస్థ డైరెక్టర్ గొర్లె సునీత ఆవిష్కరించారు. రాజవొమ్మంగి మండలం శరభవరం పంచాయతీలోని కాలనీల్లో ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మరణించిన అప్పన్నపాలెంకు చెందిన పార్టీ బూత్ ఇన్‌ఛార్జి ముర్ల భీమరాజు కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

శరభవరంలో ప్రచారపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

పాపికొండల విహారయాత్రకు బ్రేక్

దేవీపట్నం, వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: రుతుపవనాల ప్రభావంతోపాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరి నదిలో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. ఈ నేపథ్యంలో పాపికొండల విహారయాత్రను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు జలవనరుల శాఖ ఏఈ భాస్కర్ తెలిపారు. దేవీపట్నం మండలం పోశమ్మగండి, వరరామచంద్రాపురం మండలం పోచవరం రేవుల నుంచి పాపికొండల విహారయాత్రకు వెళ్లే పర్యాటక బోట్లు అన్నింటినీ నిర్వాహకులు పూర్తిగా నిలిపివేశారు. వరద పెరుగుతున్న నేపథ్యంలో మత్స్యకారులను సైతం గోదావరిలోకి వేటకు వెళ్లరాదని అధికారులు సూచించారు. వర్షాలు తగ్గి వాతావరణం పూర్తిగా అనుకూలిస్తే విహారయాత్రను పునరుద్ధరిస్తామని, ఈ సమాచారాన్ని బోటు నిర్వాహకులకు ముందుగానే తెలియజేస్తామన్నారు.

నిర్వాసితుల గోడు పట్టదా?

ఐటీడీఏ ఎదుట ఆందోళన

రంపచోడవరం, న్యూస్‌టుడే: పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి సర్వం త్యాగం చేసిన నిర్వాసితుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని సీపీఎం నాయకులు మట్ల వాణిశ్రీ, కంబం శాంతిరాజు ఆరోపించారు. పోలవరం ప్రాజెక్టు ముంపు ప్రాంతమైన దేవీపట్నం మండలం చిన్నారిగండి, మూలపాడు, మడిపల్లి, తాళ్లూరు, కచ్చులూరు పునరావాస కాలనీల నిర్వాసితులు సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం రంపచోడవరం ఐటీడీఏ ఎదుట ఆందోళన చేశారు. ముందుగా గ్రామంలో ర్యాలీ చేపట్టారు. అనంతరం ఐటీడీఏ ఎదుట ఆందోళన చేశారు. ఐటీడీఏ పీవో సింహాచలం బయటకు వచ్చి నిర్వాసితుల నుంచి వినతిపత్రం తీసుకున్నారు. ఈ సందర్భంగా సీపీఎం నాయకురాలు వాణిశ్రీ మాట్లాడుతూ నిర్వాసితులకు ప్రభుత్వం చెల్లించాల్సిన భూపరిహారాన్ని వెంటనే చెల్లించాలని కోరారు. పునరావాస కాలనీల్లో తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పీఓకు వివరించారు. కటాఫ్ తేదీతో సంబంధం లేకుండా గ్రామాలను ఖాళీగా చేసే నాటికి 18 ఏళ్లు నిండిన యువతీ యువకులందరికి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని వర్తింపచేయాలన్నారు. చిన్నారిగండి కాలనీలో మరుగుదొడ్లు ఇంతవరకు నిర్మించలేదన్నారు. వారం రోజులలో తాగునీటి సమస్యను పరిష్కరిస్తానని, మిగిలిన సమస్యలపై పోలవరం ఏఓ, ఆర్‌అండ్‌ఆర్ కమిషనర్‌లకు లేఖ రాస్తానని పీఓ హామీ ఇచ్చారు. దీంతో నిర్వాసితులు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో నిర్వాసిత నాయకులు కొమరం కృష్ణ, మడి గంగరాజు, సోమరాజు, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

ఐటీడీఏ ఎదుట పోలవరం నిర్వాసితుల నిరసన ప్రదర్శన

జీఎస్టీ వసూళ్ల వేగవంతం

పాడేరు, న్యూస్‌టుడే: వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు వేగవంతం చేయాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం ఉమ్మడి జిల్లా వాణిజ్య పన్నులశాఖ సంయుక్త కమిషనర్ వై.కిరణ్‌కుమార్‌తో కలిసి అధికారులతో కలెక్టర్ సమన్వయ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. పరిశ్రమలు, పంచాయతీరాజ్, పర్యాటక, వాణిజ్య పన్నుల శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. జిల్లా, మండల అధికారులందరికీ టీడీఎస్ నిర్వహణపై సమావేశం నిర్వహించాలని డీటీఓకు సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాడేరు సబ్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ పాల్గొన్నారు. ఉప కమిషనర్ అపర్ణ, అసిస్టెంట్ కమిషనర్ టి.రమేష్‌కుమార్‌రెడ్డి, సబ్ రిజిస్ట్రార్ కె.రమేష్‌కుమార్, డ్వామా పీడీ విద్యాసాగర్, రహదారుల భవనాల శాఖ ఈఈ బాలసుందరబాబు, గిరిజన సంక్షేమశాఖ ఈఈ కె. వేణుగోపాల్, జిల్లా పర్యాటక శాఖ అధికారి దాసు, లీడ్ మేనేజర్ మాతునాయుడు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, చిత్రంలో వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్ తదితరులు

(c) eenadu

అధికారులకు జవాబుదారీతనం అవసరం

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని, జవాబుదారీగా ఉండాలని జిల్లా పరిషత్తు ఛైర్‌పర్సన్ సుభద్ర అన్నారు. అరకులోయ మండల పరిషత్తు సర్వసభ్య సమావేశం ఉప ఎంపీపీ రామన్న అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జడ్పీ ఛైర్‌పర్సన్, ఎమ్మెల్యే మత్స్యలింగం హాజరయ్యారు. సుభద్ర మాట్లాడుతూ.. ఈ సమావేశాలకు అధికార్లుల గైర్హాజరు సరికాదని తెలిపారు. సమస్యలపై నిర్ణయాలు తీసుకునేలా ఉన్నప్పుడే సమావేశాలు అర్థవంతమవుతాయన్నారు. అరకు ఘాట్ రోడ్డు నిర్వహణ లేమితో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. విశాఖ, శృంగవరపుకోట నుంచి ఆర్టీసీ బస్సులు అరకు వరకు వెళ్లాల్సి ఉండగా.. అరకులోయ నుంచి తిరుగుముఖం పడుతున్నట్లు ఫిర్యాదులు వచ్చాయని ఆర్టీసీ సిబ్బందికి తెలిపారు. అరకు వరకు వెళ్లేలా అధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ప్రొటోకాల్ విధిగా పాటించాలని సూచించారు. అరకు బురదగెడ్డ వంతెన వద్ద రోడ్డు కోతకు గురైందని, వంతెన కూలిపోయే పరిస్థితులున్నట్లు ఎమ్మెల్యే మత్స్యలింగం ప్రస్తావించారు.

మాట్లాడుతున్న జడ్పీ ఛైర్‌పర్సన్ సుభద్ర, వేదికపై ఎమ్మెల్యే మత్స్యలింగం

వైభవంగా విగ్రహ ఊరేగింపు

హుకుంపేట, న్యూస్‌టుడే: హుకుంపేటలో షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠ 26వ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా ఊరేగించారు. విగ్రహాన్ని బుధవారం పల్లకిలో గ్రామస్థులు, కమిటీ సభ్యులు ఊరేగించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. గురువారం అన్నదానం జరుతుందని కమిటీ సభ్యులు రవణమ్మ తెలిపారు. గణేశ్వరి, నాగలక్ష్మి, భవాని, లోకేష్, రాధ, భూలక్ష్మి, రామరాజు, విజయ్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బాబా విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు

అడ్డేదెవరు.. ఆపేదెవరు!

యథేచ్ఛగా జలవనరుల దోపిడీ

ఈనాడు డిజిటల్, అనకాపల్లి

జిల్లాలో అక్రమ మైనింగ్‌కు హద్దు, అదుపూ లేకుండా పోతోంది. సహజ వనరులు ఎక్కడ కనిపించినా.. వాటిని పిప్పి చేసేంతవరకు అక్రమార్కులు వదలడం లేదు. అధికారులు అడ్డుకున్నా.. లెక్కచేయడం లేదు. ముఖ్యంగా సాగుకు ఆధారమైన చెరువుల రూపురేఖలు మార్చేస్తున్నారు. దీంతో వాటిపై ఆధారపడి జీవిస్తున్న అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. అక్రమార్కులు బరితెగిస్తున్నా.. అధికారులు మాత్రం కొరడా ఝుళిపించడం లేదు. ఫిర్యాదులొచ్చినా తూతూమంత్రం చర్యలతోనే సరిపెడుతున్నారు.

రోలుగుంట మండలం రాజన్నపేట గ్రామంలో సర్వే నెంబర్ 57-2లో భూపతి చెరువు ఉంది. దీనికింద 40 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. చెరువు ఆధారంగా కొన్ని సంవత్సరాల నుంచి రైతులు సాగు చేసుకుంటున్నారు. ఈ చెరువు గర్భాన్ని చదును చేసి రోడ్డుగా మార్చేశారు ఓ మైనింగ్ నిర్వాహకుడు. కొండలను పేల్చి బండరాళ్లను ఈ దారిమీదుగా తరలించేందుకు సిద్ధం చేసుకున్నారు. దీనిపై కొన్ని రోజుల క్రితం స్థానికులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు స్పందించి దీనిపై విచారణ చేపట్టారు. జలవనరులు, రెవెన్యూ అధికారులు రెండేసిసార్లు నిర్వాహకులకు నోటీసులిచ్చారు. ఇటీవల దారికి అడ్డంగా పొక్లెయిన్ గండ్లు తీసి.. రవాణాకు వీలులేకుండా చేశారు. అయినా అక్రమార్కులు దానిని ఏమాత్రం లెక్కచేయలేదు. చక్కగా గండ్లు పూడ్చేసి.. మళ్లీ రోడ్డు వేసి దర్జాగా మైనింగ్ సాగిస్తున్నారు.

తవ్వకాలను అరికట్టేందుకు రోడ్డుకు అడ్డంగా గండ్లు తీయిస్తున్న రెవెన్యూ అధికారులు

చెరువుల చిక్కిపోతున్నాయి.. జిల్లాలో సుమారు 2,890 వరకు చెరువులు, సాగునీటి వనరులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిపై ఆధారపడి 2.5లక్షల ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. గత ప్రభుత్వ కాలం నుంచి సాగునీటి వనరులు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయి. పాయకరావుపేట మండలం పెదరామభద్రపురంలో ఎనిమిదెకరాల్లో లేఅవుట్ వేస్తున్నారు. దీనికి ఆనుకుని ఉన్న పంటకాలువలను కలిపేసుకున్నారు. రావికమతం మండలం మేడివాడలో ఓ స్థిరాస్తి వ్యాపార సంస్థ వేసిన లేఅవుట్‌లో భారీగా ప్రభుత్వ భూములు, గెడ్డలు ఆక్రమించుకున్నట్లు ఫిర్యాదులొచ్చాయి. కానీ అధికారులు వాటిని పట్టించుకోలేదు.

గండ్లు పూడ్చేసి మళ్లీ రోడ్డు వేశారిలా..

పరిశీలించి చర్యలు తీసుకుంటాం... రాజన్నపేట చెవులో అక్రమంగా వేసిన రోడ్డును అడ్డుకున్నాం. మళ్లీ రోడ్డు వేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. పరిశీలిస్తాం.. అతిక్రమించినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ పరిధిలో భూ అక్రమాలను సహించేదే లేదు. సహజవనరుల దోపిడీకి పాల్పడితే చర్యలు తప్పవు. – వి.వి.రమణ, ఆర్డీవో, నర్సీపట్నం

వడివడిగా ఉక్కు అడుగులు

రైల్వే లైనుకు 111 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు

నక్కపల్లి, న్యూస్‌టుడే

పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న మండలంలో ప్రస్తుతం అందరి దృష్టి ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమ పైనే ఉంది. ఇది ఏర్పాటైతే వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటు, దీని పరిసర ప్రాంతాలన్నీ అభివృద్ధి దిశగా పరుగులు పెట్టనున్నాయి. తాజాగా రైల్వే లైను కోసం 111 ఎకరాలు కేటాయిస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందనేది తెలుస్తోంది.

తెదేపా హయాంలోనే సిద్ధంచేసిన సుమారు 4,900 ఎకరాల భూముల్లో ఇప్పటికే 1800 ఎకరాల వరకు బల్క్ డ్రగ్ పార్కుకు ఇచ్చారు. ఈ ఏడాది జనవరిలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడు ఈ పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి అవి శరవేగంగా సాగుతున్నాయి. మరోవైపు ఉక్కు పరిశ్రమను రాష్ట్రానికి రప్పించడంలోనూ ప్రభుత్వం సఫలీకృతమైంది. దీనికోసం నక్కపల్లి మండలంలోనే రెండు వేల ఎకరాలకు పైగా కేటాయించడంతో పాటు దీని పనులు ప్రారంభానికి సంబంధించిన అవసరమైన అనుమతులు ఇవ్వడానికి కేబినెట్‌లోనూ తీర్మానించారు. దీని తర్వాత నుంచి ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు వేగవంతమయ్యాయి. ఇప్పటికే టౌన్‌షిప్ నిమిత్తం సుమారు 500 ఎకరాలు, రెండో విడతలో అదనపు భూముల కోసం మూడు వేల ఎకరాలకు పైగా అవసరం కాగా, ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. కొద్ది రోజుల క్రితం రెండోవిడత సేకరణ పనులు మొదలు పెట్టారు. ప్రస్తుతం రైతుల నుంచి దీనిపై అభ్యంతరాలు వస్తున్న నేపథ్యంలో వారితో చర్చించి ముందుకెళ్లాలని మంత్రి వంగలపూడి అనిత చర్యలు ప్రారంభించారు. మరో వైపు మిత్తల్ పరిశ్రమను వీలైనంత వేగంగా మొదలు పెట్టేలా మరో అడుగు ముందుకు వేసింది. ఆ మేరకు రైల్వే సైడింగ్‌కు (ప్రధాన లైను నుంచి పరిశ్రమలకు వేసే లైను) 111 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

మిత్తల్ ఉక్కు నిమిత్తం కేటాయించిన భూములు

అదనపు భూముల నిమిత్తం సర్వే చేస్తున్న అధికారులు

గుల్లిపాడు నుంచే! ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే ఎగుమతులు, దిగుమతుల నిమిత్తం కచ్చితంగా అవసరమైన రవాణా సదుపాయం కావాలి. ప్రస్తుతం కేటాయించిన భూముల తీరప్రాంతాన్ని ఆనుకుని ఉండటంతో క్యాప్టివ్ పోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీంతో పాటే ఇప్పుడు రైల్వే లైను ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఆ మేరకు 111 ఎకరాలను కేటాయించారు. ప్రస్తుతం నక్కపల్లి మండలంలో సంబంధించి గుల్లిపాడు రైల్వేస్టేషన్ ఉండగా, ఇక్కడ ప్యాసింజర్ రైళ్లు మాత్రమే ఆగుతాయి. ఈ స్టేషన్ అభివృద్ధి పనులు మూడేళ్ల క్రితం చేపట్టారు. ఇవన్నీ తుదిదశకు చేరుకుంటున్నాయి. ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే... దీనికి పది కిలో మీటర్ల లోపే ఈ స్టేషన్ ఉంటుంది. దీని ద్వారా ప్రత్యేక లైనువేసే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. స్టేషన్ నుంచి లైను వేస్తే చినదొడ్డిగల్లు, వేంపాడు రెవెన్యూల పరిధిలోని దాదాపుగా తీసుకోవచ్చని తెలిసింది. ఇప్పటికే ఈ ప్రాంతంలో దీనికి సంబంధించిన భూముల పరిశీలించినట్లు తెలియవచ్చింది. కాగా మధ్యలో జాతీయ రహదారి ఉండటంతో దీన్నెలా దాటిస్తారనేది సందేహంగా మారింది. జాతీయ రహదారి దాటే ప్రాంతంలో వాహనాల కోసం పై వంతెన వేస్తారని రైల్వే ఇంజినీర్ ఒకరు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

రహదారిపై కూలిన భారీ వృక్షం

అడ్డతీగల, న్యూస్‌టుడే: రెండు రోజులుగా ఎడతెపి లేకుండా కురుస్తున్న వర్షాలకు అడ్డతీగల నుంచి వై.రామవరం వెళ్లే రహదారిలో మల్లవరం మామిళ్ల వద్ద భారీ వృక్షం బుధవారం నేలకొరిగింది. మూడు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ర.భ.శాఖ అధికారులకు సమాచారం తెలియడంతో స్థానికుల సహకారంతో రహదారిపై వృక్షాన్ని తొలగించారు.

బాధిత కుటుంబాలకు సాయం

ఎటపాక, న్యూస్‌టుడే: కృష్ణవరం పంచాయతీ జిన్నెగట్టులో ఆదివారం విద్యుదాఘాతంతో రెండు తాటాకిళ్లు దగ్ధమైన సంగతి తెలిసిందే. ఆ ఘటనలో సర్వం కోల్పోయిన చిచ్చడి జనార్దన్‌రావు, చిచ్చడి మహేష్ కుటుంబాలకు బుధవారం మండలంలోని పాస్టర్లు స్టీవెన్ దొర, ఎలిషా, ఉయికా పీటర్ సింగయ్య తమవంతు సహాయంగా బియ్యం, కూరగాయలు, దుప్పట్లు, పిల్లలకు దుస్తులు, నిత్యావసర సరకులు అందజేశారు.

ఎటపాక, న్యూస్‌టుడే: కృష్ణవరం పంచాయతీ జిన్నెగట్టులో ఆదివారం చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన రెండు కుటుంబాలకు జమాల్‌ఖాన్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఇంటి నిర్మాణ సామగ్రిని బుధవారం అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులైన చిచ్చడి జనార్దన్‌రావు, చిచ్చడి మహేష్‌లకు సిమెంటు రేకులు, ఇనుప పైపులను ట్రస్టు ఛైర్మన్ జమాల్‌ఖాన్ అందించారు. తెదేపా నాయకులు కణితి మధు, దానే రాజు, యాకూబ్‌పాషా, గ్రామస్థులు పాల్గొన్నారు.

రేకులు, ఇనుప రాడ్డులు అందిస్తున్న జమాల్‌ఖాన్ ట్రస్టు సభ్యులు

వసతిగృహం తెరిపించాలని వినతి

చింతూరు, న్యూస్‌టుడే: చింతూరు బీసీ బాలికల గృహాన్ని తెరిపించాలి ఐటీడీఏ ఏపీవో జగన్నాథంకు బుధవారం బాలికల తల్లిదండ్రులు వినతిపత్రం అందజేశారు. విద్యా సంవత్సరం ప్రారంభమైనా ఇప్పటి వరకు వసతిగృహం తెరుచుకోకపోవడంతో చింతూరు జిల్లా పరిషత్తు పాఠశాలలో చదువుకునే ఎటపాక, చింతూరు మండలాల విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

పొలాల్లోకి కొట్టుకొచ్చిన చేపలు

అడ్డతీగల, న్యూస్‌టుడే: అడ్డతీగల మండలం వీరభద్రపురం గ్రామ శివారున గల ఎర్రకాలవ పొంగడంతో పంట పొలాల్లోకి చేపలు కొట్టుకువచ్చాయి. రెండు రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలకు వాగులు పొంగి పొర్లుతున్నాయి. బుధవారం పంట పొలాల్లోకి చేరిన చేపలను పట్టుకోడానికి గ్రామస్థులు, చిన్నారులు ఎగబడ్డారు.

రాయితీపై విత్తనాల పంపిణీ

కూనవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జడ్పీటీసీ సభ్యురాలు గుజ్జా విజయ సూచించారు. కోతులగుట్ట వెలుగు కార్యాలయం వద్ద వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన రాయితీ విత్తనాలను ఆమె, కూటమి నాయకులతో కలసి రైతులకు అందించారు. వ్యవసాయాధికారి దేవి మాట్లాడుతూ ఎంటీయూ 1121, బీపీటీ 5204 రకాల విత్తనాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. సర్పంచి కారం పార్వతి, తెదేపా మండల అధ్యక్షుడు బరపాటి ప్రకాశరావు, భాజపా నాయకులు సత్యనారాయణ, జనసేన నాయకుడు దాసరి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాలను రైతులకు అందిస్తున్న ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు

జనసేన బలోపేతానికి కృషి

చింతూరు, న్యూస్‌టుడే: మారుమూల గ్రామాల్లో జనసేన పార్టీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ రంపచోడవరం నియోజకవర్గం నాయకుడు కుర్ల రాజశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పేగలో బుధవారం పార్టీ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీపై నమ్మం కలిగించేలా నాయకులు గ్రామాల్లో పనిచేస్తే పార్టీ మరింత బలోపేతం అవుతుందని చెప్పారు. పంచాయతీ పరిధిలోని 60 కుటుంబాలు జనసేన పార్టీలో చేరాయి. నియోజకవర్గం లీగల్ సెల్ ఉపాధ్యక్షుడు కాకి స్వామి, రంపచోడవరం, చింతూరు మండలాల పార్టీ అధ్యక్షులు శ్రీను, మడివి రాజు మండల నాయకులు తీగల రవి, కవిత, బేడే సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

జనసేనలో చేరినవారికి పత్రాలు అందజేస్తున్న నియోజకవర్గ నాయకులు

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ముంచంగిపుట్టు గ్రామీణం, న్యూస్‌టుడే: మాచ్‌ఖండ్ జలవిద్యుత్కేంద్రం పరిధిలో బుధవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగింది. మంగళవారం అర్ధరాత్రి ప్రాజెక్టులోని లోకల్ ట్రాన్స్‌ఫార్మర్‌కు చెందిన కేబుల్ కాలిపోయింది. దీంతో ఒనకఢిల్లీ, మాచ్‌ఖండ్, జోలాపుట్ క్యాంప్‌లకు విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది. సిబ్బంది మరమ్మతులు పనులు చేపట్టి సాయంత్రం అయిదు గంటలకు సరఫరా పునరుద్ధరించారు. విద్యుత్తు ఉత్పత్తికి ఎటువంటి ఆటంకం కలగలేదని ప్రాజెక్టు ఈఈ జనరేషన్ బి.గోవిందరాజులు తెలిపారు.

విధి నిర్వహణలో అలసత్వం తగదు

జి.మాడుగులలో రోగులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో విశ్వేశ్వరనాయుడు

జి.మాడుగుల, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు హెచ్చరించారు. జి.మాడుగుల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో పాఠశాలలు, వసతిగృహాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలన్నారు. మలేరియా కేసులపై ఆరా తీశారు. ఆసుపత్రిలో ప్రసవాల వివరాలు అడిగి తెలుసుకున్నారు. రోగులతో మాట్లాడారు. వైద్యాధికారి కిషోర్, యూడీసీ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మండలాన్ని యూనిట్‌గా తీసుకోవాలి

కూనవరం, న్యూస్‌టుడే: కాంటూరులతో సంబంధం లేకుండా పోలవరం ముంపునకు మండలాన్ని యూనిట్‌గా తీసుకుని నిర్వాసితులందరికీ పరిహారం, పునరావాసం కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మేకల నాగేశ్వరరావు కోరారు. నిర్వాసితుల సమస్యలపై పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కూనవరంలో ప్రదర్శన చేశారు. ఆర్‌అండ్‌ఆర్ పరిహారం రూ. 15 లక్షలు ఇవ్వాలని, 2022 వరదలను ప్రామాణికంగా తీసుకుని ముంపు గ్రామాలను గుర్తించాలని, మరో పది ప్రధాన డిమాండ్లుతో కూడిన వినతిపత్రం తహసీల్దార్ శ్రీనివాసరావుకు అందించారు. మండల కార్యదర్శి బాబు బొర్రయ్య, పాయం సీతారామయ్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, నాగరాజు, ఈశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

రైలు పట్టాలపై విరిగిపడిన కొండచరియలు

జయపురం, న్యూస్‌టుడే: ఒడిశాలోని కొరాపుట్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో రైల్వే ట్రాక్‌పై కొండచరియలు విరిగిపడి రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. కొరాపుట్-జయపురం రైల్వేస్టేషన్ల మధ్య జరటి రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో జగదల్‌పూర్ నుంచి భువనేశ్వర్ వెళ్లే హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్, కిరండూల్- విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రద్దు చేసినట్లు ఆ శాఖ అధికారులు ప్రకటించారు. రైల్వే సిబ్బంది రంగంలోకి దిగి యుద్ధప్రాతిపదికన మట్టి తొలగింపు చర్యలు చేపడుతున్నారు.

రైల్వేట్రాక్‌పై చరియలు

సరియాలో సందడి

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: జీనబాడు పంచాయతీ సరియా జలపాతం వద్ద బుధవారం పర్యాటకుల సందడి నెలకొంది. ఈ అందాలు ఆస్వాదించడానికి విశాఖపట్నం, విజయనగరం, కాకినాడ, తుర్పుగోదావరి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు వచ్చారు. స్నానాలు చేస్తూ సరదాగా గడిపారు. ఇక్కడ మరిన్ని సదుపాయాలు అధికారులు కల్పిస్తే సందర్శకుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

ఆరోగ్యంపై అప్రమత్తం

జి.మాడుగుల, న్యూస్‌టుడే: విద్యార్థులు ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ఇన్‌ఛార్జి డీఎంహెచ్‌వో విశ్వేశ్వరనాయుడు పేర్కొన్నారు. కలెక్టర్ ఆదేశాలతో బందవీధి ఆశ్రమ పాఠశాలను బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థిని ఎం.లక్ష్మి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు.

విద్యార్థిని మృతికి సంతాపం!

విద్యార్థిని లక్ష్మి మృతికి ఏటీడబ్ల్యూవో నాగశిరీష, ఎంఈవో బాబూరావు, ఉపాధ్యాయులు సంతాపం తెలిపారు. బుధవారం విద్యార్థిని స్వగ్రామం సారుబయలులో అంత్యక్రియలు నిర్వహించారు. అంత్యక్రియల్లో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విచారణ చేయాలి

విద్యార్థిని మృతిపై సమగ్ర విచారణ చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎస్.ధర్మన్నపడాల్ డిమాండ్ చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. పాఠశాల ఉపాధ్యాయులు పొంతన లేని సమాధానాలు చెప్పి తప్పించుకుంటున్నారని విమర్శించారు. ఆమె మృతిపై పలు అనుమానాలు ఉన్నాయని చెప్పారు. బాధిత కుటుంబానికి రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు.

మహిళా చట్టాలపై అవగాహన అవసరం

గంగవరం, న్యూస్‌టుడే: మహిళా చట్టాలపై ప్రతి ఒక్కరు తప్పనిసరిగా అవగహన కలిగి ఉండాలని, మహిళలపై దాడులుచేసే వారిని ఉపేక్షించేదిలేదని గంగవరం ఎస్సై బి.వెంకటేష్ అన్నారు. స్థానిక ఆశ్రమబాలికోన్నత పాఠశాలలో గురువారం హెచ్‌ఎం వరలక్ష్మి, వార్డెన్ లావణ్య ఆధ్వర్యంలో బాలికలకు మహిళా చట్టాలు, బాలల హక్కులపై అవగాహన కల్పించారు. గంగవరం వైద్యాధికారి భావన ఆశ్రమ బాలికోన్నత పాఠశాల, వసతి గృహాలను సిబ్బందితో కలిసి సందర్శించారు. సీజనల్ వ్యాధులు, ఆరోగ్య విద్యపై విద్యార్థినులకు అవగాహన కల్పించి వైద్య పరీక్షలు చేశారు.

గంగవరంలో అవగాహన కల్పిస్తున్న ఎస్సై

కదలని నీరు... వదలని వాన

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండల కేంద్రమైన కూనవరంలో రహదారుల పైనే నీటి గుంతలు దర్శనమిస్తున్నాయి. మండలంలో రాత్రి అత్యధికంగా వర్షపాతం నమోదైంది. దీంతో ప్రధాన రహదారులన్నీ జలమయంగా మారాయి. చెరువులు నీటితో కలకళలాడాయి. కూనవరం ప్రధాన రహదారిపై నుంచి నీరు దిగువకు వెళ్లడానికి మార్గం లేకపోవడంతో నీటి గుంతలు ఏర్పడి బాటసారులకు తీవ్ర ఇబ్బందులు సృష్టిస్తున్నాయి. అధికారులు ఈ నీటిని రహదారి నుంచి మళ్లించాలని గ్రామస్థులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కూనవరం

కూనవరం పాత బస్టాండ్ ఆవరణలో రహదారిపై నిలిచిన నీరు

నెట్‌వర్క్ లేక ఇక్కట్లు

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: స్థానిక యూనియన్ బ్యాంక్‌లో నెట్‌వర్క్ పనిచేయకపోవడంతో వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారని, మండల విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కృష్ణవర్మ బుధవారం పేర్కొన్నారు. బ్యాంకు సిబ్బంది నెట్‌వర్క్ లేదని ఖాతాదారులను వర్షంలోనే ఉంచి తాళాలు వేస్తున్నారని ఆరోపించారు. పింఛనుదారులు 80 ఏళ్లు పైబడిన దాదాపు 100 మంది మండలంలోని పలు ప్రాంతాల నుంచి బ్యాంకుకు వెళితే డబ్బు లేదనడంతో నిరాశతో వెనుదిరిగి పోతున్నారని ఆరోపించారు. ప్రతి నెలా మొదటి వారంలో నగదు ఉంచుకోవాలని విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

సమ్మె జయప్రదం చేయండి

అనంతగిరి గ్రామీణం: ఈనెల 9వ తేదీన దేశవ్యాప్త కార్మికుల సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ కిల్లో మోస్యా పిలుపునిచ్చారు. బొర్రాగుహలు వద్ద గైడ్స్ యూనియన్ సభ్యులకు కరపత్రాలు పంపిణీ చేశారు. నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కిల్లో సోమేష్, నాగేష్, సింహాద్రి, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

రహదారి దుస్థితి కనిపించడం లేదా?

ఈనాడు, కాకినాడ – న్యూస్‌టుడే, రాజవొమ్మంగి: రమణయ్యపేట నుంచి జడ్డంగి అన్నవరం వరకు ఉన్న ప్రధాన రహదారి మరమ్మతుకు గురై ప్రయాణికులు, వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నా అధికారులకు కనిపించడం లేదా అని జడ్పీటీసీ సభ్యురాలు వడుగుల జ్యోతి ప్రశ్నించారు. కాకినాడలో బుధవారం జడ్పీ ఛైర్మన్ వేణుగోపాలరావు అధ్యక్షతన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్తు సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి తొలిసారి మూడు జిల్లాల కలెక్టర్లు షాన్‌మోహన్ (కాకినాడ), ప్రశాంతి (తూర్పుగోదావరి), మహేష్‌కుమార్ (అంబేడ్కర్ కోనసీమ) హాజరయ్యారు. ఈ సమావేశంలో జ్యోతి మాట్లాడుతూ రహదారి మంజూరై నాలుగేళ్లు అవుతున్నా కనీసం నేటికీ రోడ్డు వేయలేని పరిస్థితి నెలకొందన్నారు. ఏలేశ్వరం నుంచి జడ్డంగి అన్నవరం వరకు మెటల్ క్వారీలు ఉన్నాయన్నారు. పగటి సమయంలో కూడా లారీలు అధిక లోడుతో తిరగడంతో లారీలో ఉన్న మెటల్ రాళ్లు రోడ్డుపై పడుతున్నాయన్నారు. ఈ మార్గంలో ప్రయాణించే భారీ లారీలను రాత్రులు మాత్రమే తిరిగే విధంగా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. రాజవొమ్మంగి, అడ్డతీగల, రేవళ్ల, అడ్డతీగల, వైరామవరం, డి.రామవరం, నర్సీపట్నం తదితర ప్రాంతాలకు రోజూ బస్సులు, ఇతర ప్రైవేటు వాహనాల్లో ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఆసుపత్రులకు వెళ్లాలన్నా నరకం చూడాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 'ఈనాడు'తోపాటు ఇతర పత్రికల్లో వచ్చిన కథనాలను చూపించారు. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి పనులు పూర్తయ్యేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ మేరకు జడ్పీ ఛైర్మన్ వేణుగోపాలరావు, జడ్పీ సీఈవో లక్ష్మణరావుకు వినతిపత్రం అందజేశారు. ★ పాఠశాలలో అసంపూర్తి భవనాలతో ఆరుబయట, వరండాల్లో కూర్చోబెట్టాల్సి వస్తుందని, వాటిని పూర్తిచేయకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని రంపచోడవరం జడ్పీటీసీ సభ్యురాలు పండా వెంకటలక్ష్మి అన్నారు.

మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మన్ వేణుగోపాలరావు, వేదికపై తూర్పుగోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల కలెక్టర్లు ప్రశాంతి, షాన్‌మోహన్, మహేష్‌కుమార్

జడ్పీ సీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న జడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి

బంగారం, నగదు చోరీ

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: రాజవొమ్మంగిలో రత్నకుమారి అనే మహిళ ఇంటి వద్ద బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. సీఐ సన్యాసినాయుడు కథనం ప్రకారం.. బాధిత కుటుంబం నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని వ్యక్తి ఇంటి కిటికీలో నుంచి లోపలకి ప్రవేశించి మరొక గదిలోని బీరువాలో ఉన్న 34 గ్రాముల విలువైన బంగారు ఆభరణాలు, 20 తులాల వెండి పట్టీలు, రూ 70 వేలు నగదు ఎత్తుకుపోయాడన్నారు. శబ్దం రావడంతో బయటకు వచ్చి చూసే సరికి కిటికీలోంచి పారిపోయాడని బాధిత మహిళ తెలిపారన్నారు. సమాచారం అందడంతో సీఐ సన్యాసినాయుడు, ఎస్సై నరసింహమూర్తి ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్లూస్ టీం హెచ్‌సీ శ్రీనివాస్, సిబ్బందితో కలసి వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్షయ నివారణకు చర్యలు

చింతపల్లి, న్యూస్‌టుడే: జిల్లాలో క్షయ వ్యాధి నివారణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, క్షయ నియంత్రణ విభాగం ప్రోగ్రాం అధికారి డాక్టర్ కిరణ్‌కుమార్ అన్నారు. బుధవారం ఆయన లోతుగెడ్డ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. క్షయ బాధితులకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. మందులు, రికార్డులు పరిశీలించారు. వైద్యాధికారి పర్యవేక్షణలోనే రోగులకు వైద్యం అందించాలన్నారు. రోగుల పరిస్థితిని ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలించాలని పేర్కొన్నారు. వైద్యాధికారులు డాక్టర్ జానకి, డాక్టర్ శివప్రసాద్, ఫార్మసిస్ట్ సుధారాణి, చింతపల్లి టీబీ యూనిట్ ఎస్‌టీఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

లోతుగెడ్డ పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న ప్రోగ్రాం అధికారి కిరణ్‌కుమార్

ఈ-కేవైసీ తప్పనిసరి

డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: ముఖ ఆధారిత గుర్తింపుతో అంగన్‌వాడీ సేవలను పొందాలని సీడీపీఓ రాణి తెలిపారు. గర్భిణులు, బాలింతలు, ఆరేళ్ల లోపు చిన్నారులు విధిగా ఎఫ్‌ఆర్‌ఎస్‌తోపాటు ఈ-కేవైసీ చేయించుకోవాలని పేర్కొన్నారు. లేని పక్షంలో ఆగస్టు నెలలో సరకుల పంపిణీ జరగదని పేర్కొన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	79	70
లైవ్	101	90
డ్రెస్‌డ్	146	150
స్కిన్‌లెస్	167	160

(c) eenadu

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు : 89853 66570, అరకులోయ: 63034 86346
రంపచోడవరం: 94908 77172

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: ?: ముంచంగిపుట్టు నుంచి కుమడ మార్గంలో నందిమెట్ట సమీపంలో ఏర్పడిన గుంత ప్రమాదకరంగా ఉంది. వర్షాలకు నీరు చేరి చెరువును తలపిస్తోంది. - సీతారాం, నందిమెట్ట, ✓: మరమ్మతులు చేయిస్తాం. - మురళీకృష్ణ, మండల ఇంజినీరు, ముంచంగిపుట్టు

చింతపల్లి, న్యూస్‌టుడే: ?: తాజంగి ప్రధాన కూడలి నుంచి ప్రభుత్వ ఆసుపత్రి వరకూ వీధి దీపాలు లేక అంధకారంగా ఉంటోంది. రాత్రివేళల్లో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. - నూకరాజు, తాజంగి, ✓: జాతీయ రహదారి విస్తరణ పనుల కారణంగా విద్యుత్తు స్తంభాలు తొలగించాల్సి వచ్చింది. కొత్తవాటిని అమర్చాలని జాతీయ రహదారి విభాగం, విద్యుత్తు సంస్థ అధికారులను కోరాం. - శ్రీధర్, పంచాయతీ కార్యదర్శి, తాజంగి

ఏడాది పాలనపై ప్రజల్లో సంతోషం

పాడేరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలందరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారని జీసీసీ ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి అన్నారు. బుధవారం సుంద్రుపుట్టు, లోచలిపుట్టు గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పథకాల అమలుపై ఆరా తీశారు. వారు మాట్లాడుతూ.. ప్రజల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. గ్రామంలో తాగునీరు సమస్య తీవ్రంగా ఉందని స్థానిక మహిళలు విన్నవించారు. సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వైస్ ఎంపీపీ శివకుమార్, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, తెదేపా నేతలు కొట్టగుళ్లి సుబ్బారావు, విజయరాణి, వెంకటరమణ, పాండురంగస్వామి తదితరులు పాల్గొన్నారు..

సుంద్రుపుట్టులో పథకాలపై అవగాహన కల్పిస్తున్న జీసీసీ ఛైర్మన్ శ్రావణ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

వానాకాలం.. వాహనదారులు జరభద్రం

చింతపల్లి, న్యూస్‌టుడే: మే 18న చింతపల్లి- నర్సీపట్నం ప్రధాన రహదారిలో రౌరింతాడ వద్ద వర్షం కురుస్తోందని కొందరు ద్విచక్రవాహనచోదకులు తమ వాహనాలను రోడ్డు పక్కన ఆపి ఉంచారు. ఈ క్రమంలో ఒక్కసారిగా మలుపు వద్ద భద్రాచలం నుంచి విశాఖపట్నం వైపు వెళుతున్న సూపర్ లగ్జరీ బస్సు ఓ ద్విచక్రవాహనాన్ని బలంగా ఢీకొంది. ఈ ఘటనలో పెంటపాడు గ్రామానికి చెందిన బైక్ మెకానిక్ చంద్రరావు మరణించారు. వెనుక కూర్చున్న అతని భార్య తీవ్రంగా గాయపడింది.

★ జూన్ 20న రౌరింతాడ వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్రవాహనాలు బలంగా ఢీకొనడంతో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. కాలమేదైనా అతి వేగం అత్యంత ప్రమాదకరం. అందులోనూ వర్షాకాలంలో వాహన చోదకులు మరింత ఆచితూచి రాకపోకలు సాగించాలని రవాణా, పోలీసు అధికారులు సూచిస్తున్నారు. మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది మే నెల నుంచే మన్యంలో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న భారీ వృక్షాలు సైతం అనుకోకుండా వేళ్లతో సహా నేలకొరుగుతున్నాయి. ఈ క్రమంలో వాహన చోదకులు అత్యంత జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉంది

★ చింతపల్లి మీదుగా ప్రస్తుతం 516-ఈ జాతీయ రహదారి నిర్మాణం జరుగుతోంది. ఇందులో భాగంగా పలుచోట్ల భారీ వంతెనలు నిర్మిస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు

వర్షాలకు బురదమయంగా మారిన రహదారిలో రాకపోకలు

మన్యంలో పెరుగుతున్న రోడ్డు ప్రమాదాలు

వీలుగా పక్క నుంచి అప్రోచ్‌రోడ్లు వేశారు. వర్షానికి ఈ మార్గాలు బురదమయంగా మారుతున్నాయి. పెద్దగెడ్డ, రాజుపాకలు వద్ద ఈ పరిస్థితి ఉంది. పెంటపాడు వద్ద జాతీయ రహదారిపైకి కంకరరాళ్లు కొండపై నుంచి కొట్టుకువస్తున్నాయి. రాత్రివేళల్లో ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్ని చోట్ల ప్రధాన రహదారి అంతా బురదమయంగా మారుతోంది. వర్షపునీరు నిల్వ ఉండిపోతోంది. ఇక్కడ ఏమాత్రం అప్రమత్తంగా లేకపోయినా వాహన చోదకులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. లంబసింగి ఘాట్‌రోడ్లో వృక్షాలు, చెట్ల కొమ్మలు, కొండచరియలు, బండరాళ్లు భారీ వర్షాల సమయంలో రహదారులపై పడుతున్నాయి.

ఇలా చేస్తే మేలు..

ద్విచక్రవాహనదారులు శిరస్త్రాణం ధరించాలి. కార్లు, ఇతర వాహనాలైతే సీటు బెల్టు తప్పనిసరిగా వినియోగించాలి. రాత్రివేళల్లో, చిరుచీకట్లో సిగ్నల్స్‌ను గమనించాలి.

అవగాహన కల్పిస్తున్నాం

వర్షాకాలంలో ప్రమాదాలు అధికంగా జరిగేందుకు ఆస్కారం ఉంటుంది. రహదారి అంతా తడిచి ఉండటం వల్ల ఒక్కోసారి వాహనాలు ఎదురుపడినప్పుడు బ్రేకులు వేసినా అవి జారి అదుపుతప్పి ఢీకొనే పరిస్థితులు నెలకొంటాయి. రహదారి అంచులు బాగోకపోయినా వాహనాలు పక్కకు జారి ప్రమాదాలకు ఆస్కారం ఉంది. వాహన చోదకులు సాధ్యమైనంత వరకూ వర్షం పడేటప్పుడు ప్రయాణాన్ని వాయిదా వేసుకోవాలి. తప్పనిసరి పరిస్థితుల్లో ప్రయాణం చేయాల్సి వస్తే వాహనాన్ని చాలా నెమ్మదిగా నడపాలి. దీనిపై తరచూ వాహన చోదకులకు అవగాహన కల్పిస్తున్నాం. అప్రమత్తతతో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చు. - వినోద్‌బాబు, సీఐ, చింతపల్లి

అ వీ ఇ వీ

దరఖాస్తుల ఆహ్వానం

కొయ్యూరు, న్యూస్‌టుడే: కౌలురైతుల గుర్తింపు కార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల వ్యవసాయ అధికారి భానుప్రియ తెలిపారు. ఈ గుర్తింపు కార్డు ఉంటేనే కౌలురైతులకు వర్తించే అన్ని పథకాలు వర్తిస్తాయన్నారు. కార్డులు కావాలనుకునే వారంతా వీఆర్వోలను సంప్రదించాలని పేర్కొన్నారు.

విద్యుత్తు సమస్య పరిష్కరించాలి

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లిలో తరచూ విద్యుత్తు సమస్యలు తలెత్తుతున్నాయని, వాటిని తక్షణమే పరిష్కరించడంలో సంబంధిత అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని గిరిజన సంఘం అల్లూరి జిల్లా నాయకుడు బోనంగి చిన్నయ్యపడాల్ అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ.. విద్యుత్తు ఉపకేంద్రం ఉన్న ప్రాంతంలోనే తరచూ సాంకేతిక సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయన్నారు.

ధారకొండలో తాగునీటి ఇక్కట్లు

సీలేరు, న్యూస్‌టుడే: ధారకొండ పంచాయతీలో వారం రోజులుగా విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుండటంతో తాగునీటికి ప్రజలు పడుతున్నారు. గత వారం రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయింది. వర్షపు నీటిపై ఆధారపడాల్సి వస్తోందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తీగలపై చెట్టుకొమ్మలు విరిగి పడుతుండటంతో సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్తు సిబ్బంది పేర్కొంటున్నారు.

నూతన నియామకాలపై హర్షం

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా పీవీఎన్ మాధవ్ నియామకంపై గూడెంకొత్తవీధి ఎంపీటీసీ(భాజపా) సభ్యురాలు రీమల రాజేశ్వరి హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఆమె మాట్లాడుతూ.. భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యులుగా అల్లూరి జిల్లాకు చెందిన కురుసా ఉమామహేశ్వరరావు, పాంగి రాజారావులను నియమించడంతో గిరిజన ప్రాంతంలో పార్టీ బలోపేతం అవుతుందన్నారు.

ఏఎన్ఎంలను నియమించాలి

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: రంపచోడవరం ఐటీడీఏ పరిధిలోని అనేక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంలు అందుబాటులో లేకపోవడంతో విద్యార్థులు తీవ్ర అనారోగ్యం బారిన పడుతున్నారని, తక్షణమే అన్ని పాఠశాలల్లోనూ ఏఎన్ఎంలను నియమించాలని వేటుకూరు పంచాయతీ పెసా కమిటీ కార్యదర్శి పి. సురేంద్ర డిమాండు చేశారు. ఏఎన్ఎంలను నియమించకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు.

తుప్పల తొలగింపు

వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: వరదల సమయంలో గ్రామస్థులను తరలించడానికి పడవలకు, బోట్లు అడ్డుగా ఉండే తుప్పలు, ముళ్ల చెట్లను ముందుగా గుర్తించి, తొలగించాలని చింతూరు ఐటీడీఏ పీవో ఆదేశించారు. స్థానిక రెవెన్యూ, వడ్డిగూడెం సచివాలయ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం రహదారికి ఇరువైపులా ఉన్న చెట్లను పొక్లెయిన్‌తో తొలగించారు. రహదారులు శుభ్రం కావడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు.

భవన నిర్మాణానికి చర్యలు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: మంగళపాలెం ప్రభుత్వ పాఠశాలకు కొత్త భవనం నిర్మించేవరకు అంగన్‌వాడీ కేంద్రంలో బడి నిర్వహించనున్నట్లు చింతపల్లి ఏటీడబ్ల్యూవో జయనాగలక్ష్మి తెలిపారు. బుధవారం పాఠశాలను పరిశీలించారు. పాఠశాలకు కొత్త భవనం మంజూరు చేయాలని ఉన్నతాధికారులను కోరతామని పేర్కొన్నారు. హెచ్ఎం సుమిత్ర, ఉపాధ్యాయుడు గిరిబాబు, పాఠశాల కమిటీ ఛైర్మన్ గడుతూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

సందర్శిత ప్రాంతాలు వెలవెల

గిరిజన మ్యూజియం వద్ద ఇలా..

అరకులోయ, న్యూస్‌టుడే: ఆంధ్రాఊటీ అరకులోయలో సందర్శిత ప్రాంతాలు వెలవెలబోతున్నాయి. గత వారం రోజుల నుంచి వర్షాలు కురుస్తుండటంతో పర్యాటకుల రాక బాగా తగ్గింది. గిరిజన మ్యూజియం, పద్మాపురం ఉద్యానం, కాఫీ తోటలు, వ్యూపాయింట్ తదితరాలు నిర్మానుష్యంగా మారాయి. చిరు వ్యాపారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

మధ్యలో ఆగిన మంప బస్సు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: పాడేరు నుంచి కొయ్యూరు మండలం మంప వెళ్తున్న ఆర్టీసీ బస్సు బుధవారం మధ్యాహ్నం మరమ్మతులతో గూడెంకొత్తవీధి మండలం చాపరాతిపాలెం సమీపంలో ఆగిపోయింది. వర్షంలోనే ప్రయాణికుల సహాయంతో సిబ్బంది బాగు చేసేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. సుమారు మూడుగంటలపాటు ప్రయాణికులు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది. మరో బస్సును రప్పించి ప్రయాణికులను గమ్యస్థానాలకు పంపించారు. కండిషన్‌లో ఉన్న బస్సులు నడపకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తుతోందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఆర్టీసీ బస్సు వద్ద ప్రయాణికులు

ఏటీఎంలో పశువుల తిష్ఠ

మన్యంలో ఏటీఎంలకు రక్షణ లేకపోవడంతో మూగజీవాలకు అడ్డాగా మారుతున్నాయి. అరుకులో ఎస్‌బీఐ ఏటీఎంలో పశువులు తిష్ఠ వేస్తున్నాయి. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో గిరిజనుల రాకపోకలు తగ్గాయి. ఏటీఎంలకు పెద్దగా ఎవరూ రావడం లేదు. సెక్యూరిటీ లేకపోవడంతో ఏటీఎంలలోకి పశువులు చేరుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాలని వినియోగదారులు కోరుతున్నారు. - డుంబ్రిగుడ, న్యూస్‌టుడే

వ్యాధుల ముప్పు.. కలగదా కనువిప్పు!

పెదబయలు, ముంచంగిపుట్టులలో చెత్త నుంచి సంపద కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. వీటి చెంతనే చెత్త పారేయడంతో దుర్గంధం వస్తోంది. ప్రధాన రహదారులకు ఆనుకొని ఈ పరిస్థితి తలెత్తడం వల్ల అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. మూడురోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తుండడంతో ప్రజల్లో మరింత ఆందోళన నెలకొంది. మండల కేంద్రాల్లోనే ఈ పరిస్థితి ఉంటే మారుమూల గ్రామాల్లో ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అధికారులు స్పందించి సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.- పెదబయలు, న్యూస్‌టుడే

రహదారి పక్కన పేరుకుపోయిన చెత్త

ఉద్ధృతంగా ప్రవహిస్తున్న సీతపల్లి వాగు

అండంగిసింగి వంతెన పైనుంచి ప్రవహిస్తున్న నీరు

చీడిపుట్టు వంతెన వద్ద..

జోరు వాన.. తప్పని హైరానా

డుంబ్రిగుడ, హుకుంపేట, న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో మన్యంలో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. చాపరాయి, కురిడి, గోరాపూర్ గెడ్డలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. డుంబ్రిగుడ గ్రామానికి చెందిన కూడ జగన్నాథం పెంకుటిల్లు దెబ్బతింది. హుకుంపేట మండలం తీగలవలస పంచాయతీ గుర్రాలతోట గ్రామానికి చెందిన కిల్లో మాల్తీ ఇంటి గోడ కూలిపోయింది.

గూడెంకొత్తవీధి, కొయ్యూరు, న్యూస్‌టుడే: దేవరాపల్లి పంచాయతీ పరిధిలోని మంగళపాలెంలో కామేశ్వరరావు ఇల్లు ధ్వంసమైంది. కొయ్యూరు మండలంలో జనజీవనం స్తంభించింది.

పెదబయలు గ్రామీణం, హుకుంపేట, న్యూస్‌టుడే: కిముడుపల్లి పంచాయతీ సమీపంలో గేదెగెడ్డ కల్వర్టు దాటి ప్రవహిస్తోంది. హుకుంపేట మండలంలోని చీడిపుట్టు, లివిటి, పాతుకోట, అర్లాడ, మత్స్యపురం గ్రామాల వద్ద గెడ్డలు ఉప్పొంగాయి. పంట పొలాలు చెరువులను తలపిస్తున్నాయి.

వీఆర్‌పురం మండలంలోని అన్న వాగు చప్టాపై..

జి.మాడుగుల, న్యూస్‌టుడే: జి.మాడుగుల మండలం అండంగిసింగి బ్రిడ్జి, రాళ్లగెడ్డలపై నుంచి వరద నీరు ప్రవహిస్తోంది.

సీలేరు, న్యూస్‌టుడే: సీలేరు ఉపాధ్యాయుల క్వార్టర్స్ వద్దనున్న విద్యుత్తు లైన్లపై బుధవారం చెట్టు పడిపోయింది. విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడింది.

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: పాడేరు- జి.మాడుగుల ప్రధాన రహదారిలో కరకపుట్టు సమీపంలో రోడ్డు మీదకు రెండు బండరాళ్లు జారిపడ్డాయి. పెదబయలు మండలం మారుమూల కుంతుర్ల పంచాయతీ పరిధిలోని కె.బొడ్డాపుట్టులో నిర్మాణంలో ఉన్న వంతెనను గెడ్డ ముంచేసింది.

వరరామచంద్రాపురం, రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: వీఆర్‌పురంలో అన్నవరం, కుంజవారిగూడెం వాగులు పొంగడంతో రాకపోకలు నిలిచిపోయాయి. పెద్దమట్టపల్లి-కుందులూరు మధ్య ప్రధాన రహదారులపైన మూడుచోట్లవాగునీరు ప్రవహించడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడ్డారు.

రంపచోడవరం, మారేడుమిల్లి, న్యూస్‌టుడే: రంపచోడవరం మండలంలో సీతపల్లి, పాములేరు వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. మారేడుమిల్లితోపాటు, లోతట్టు గ్రామాల్లోనూ విద్యుత్తు సరఫరా నిలిచిపోయింది.

కె.బొడ్డాపుట్టు సమీపంలో నిర్మాణంలో ఉన్న వంతెన వద్ద..

పొలాలు జలమయం

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: లక్ష్మీపురం పంచాయతీలోని బిరిగుడ సమీపంలోగెడ్డ ఉప్పొంగింది. బుంగాపుట్టు, రంగినిగుడ, గర్రం, జబడ, కోడాపుట్టు, ఉబ్బెంగుల, మొవులుపుట్టు, కెందుగుడ, చుట్టుగొంది, పులజల్మా తదితర గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మాకవరం, దోడిపుట్టు, కరిముఖిపుట్టు ప్రాంతాల్లో పొలాలు జలమయమయ్యాయి.

ముక్కిపుట్టు ప్రాంతంలో జలమయమైన పంటపొలాలు

ఏపీపీఈసెట్‌లో ప్రతిభ

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఏపీ ఫిజికల్ ఎడ్యుకేషన్ కామన్ ప్రవేశ పరీక్షలో అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. ఆర్ సాయిశ్రీనివాస్ 2వ ర్యాంకు, ఎస్ అప్పలరాజు 111, జి మధుబాబు 129వ ర్యాంకు సాధించినట్లు ప్రిన్సిపల్ భరత్‌కుమార్‌నాయక్ తెలిపారు. విద్యార్థులను ప్రిన్సిపల్ నాయక్, అధ్యాపక సిబ్బంది బుధవారం అభినందించారు.

ఆర్ సాయి శ్రీనివాస్

కొయ్యూరు, న్యూస్‌టుడే: పీజీ ప్రవేశ పరీక్షలో మర్రిపాలెం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని బోడ్నాయక్ రాణి ఎంఏ హిందీ విభాగంలో 31వ ర్యాంకు సాధించారు. భౌతికశాస్త్రంలో వి. నిర్మలజ్యోతి, ఎ.శాంతి, పి.సౌజన్య, పి.సత్యవతి, గణితంలో జి.బ్రహ్మాజీ, రసాయనశాస్త్రంలో ఎం.చంద్రకళ, అర్థశాస్త్రంలో పి.శివానీ, ఆంగ్లంలో టి.మణి వెయ్యిలోపు ర్యాంకులు సాధించారు. వీరిని ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుధ, అధ్యాపకులు బుధవారం అభినందించారు.

ఖోఖో పోటీల్లో రాజవొమ్మంగి విద్యార్థుల ప్రతిభ

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: స్థానిక అల్లూరి సీతారామరాజు జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 41 మంది విద్యార్థులు ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరంలో నిర్వహించిన పలు పోటీల్లో ప్రతిభ చూపారని ప్రధానోపాధ్యాయురాలు ఎ. ఆదిలక్ష్మి తెలిపారు. పాఠశాలలో బుధవారం ప్రధానోపాధ్యాయురాలు ఎ.ఆదిలక్ష్మి, పీఎంసీ ఛైర్మన్ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో విద్యార్థుల అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ సూరంపాలెం ఆదిత్య గ్లోబల్ యూనివర్సిటీలో జూన్ 22 నుంచి జులై ఒకటో తేదీ వరకు 18వ ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో మేజర్ మహ్మద్ ఆసిఫ్ సారథ్యంలో ఎన్‌సీసీ వార్షిక శిక్షణ శిబిరం నిర్వహించారు. శిబిరంలో పలు విభాగాల్లో పోటీలు జరపగా పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచి ఖో-ఖోలో ప్రథమ స్థానాన్ని సాధించడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను, ఎన్‌సీసీ కేర్ టేకర్ సీహెచ్ శివకృష్ణను ప్రధానోపాధ్యాయురాలు ఎ.ఆదిలక్ష్మి, పీఎంసీ ఛైర్మన్ ఎం.శ్రీనివాస్, కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు అభినందించారు. ఉపాధ్యాయులు బొజ్జయ్య, కొండబాబు పాల్గొన్నారు.

విజేతలతో ప్రధానోపాధ్యాయురాలు, పీఎంసీ ఛైర్మన్

అదుపుతప్పిన అంబులెన్సు

హుకుంపేట, న్యూస్‌టుడే: అంబులెన్సు అదుపుతప్పి రహదారి పక్కన గోతిలోకి దిగిపోయిన ఘటన మండలంలో బుధవారం చోటుచేసుకుంది. బాకూరు గ్రామంలో కడుపునొప్పి బాధితుడితో వాహనం వస్తుండగా నడిమివీధి దాటాక ఎదురుగా వస్తున్న ఆటోను తప్పించే క్రమంలో అంబులెన్సు అదుపుతప్పి పక్కనే ఉన్న గుంతలోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ఈఎంటీకి స్వల్పగాయాలయ్యాయి. మరో 108 వాహనంలో క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు.

గోతిలోకి దిగిపోయిన 108 వాహనం

తెదేపా బలోపేతానికి కృషి

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: తెదేపా మండల పరిశీలకుడు సుబ్బారావు, మండల అధ్యక్షుడు ముక్కలి రమేష్ నేతృత్వంలో పెదవలస, దామనాపల్లి పంచాయతీ కేంద్రాల్లో గ్రామ కమిటీల ఎన్నికలను బుధవారం నిర్వహించారు. కొత్తగా ఎన్నికైన నాయకులు గ్రామస్థాయిలో పార్టీ బలోపేతం దిశగా పనిచేయాలని సూచించారు. జీకేవీధి ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి, పెసా కమిటీ ఉపాధ్యక్షుడు గిరిబాబు, నూతన గ్రామ కమిటీ అధ్యక్షుడు పంద్రా నూకరాజు, నేతలు బలరాం, రామకృష్ణ, రీమల పౌలు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

పెదవలసలో గ్రామ కమిటీ, తెదేపా నేతలు

హైడ్రోప్రాజెక్టులతో తీవ్ర నష్టం

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: పెదకోట ప్రాంతంలో హైడ్రోపవర్ ప్లాంట్ నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చిన జీవో నం. 51ను రద్దు చేయాలని జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకన్న, ఎస్.నాగులు డిమాండ్ చేశారు. బుధవారం ప్రాజెక్టు నిర్మించే ప్రాంతాన్ని స్థానిక గిరిజనులతో కలిసి పరిశీలించారు. రేగులపాలెం వద్ద గెడ్డలో గిరిజనులతో కలిసి నినాదాలు చేశారు. హైడ్రో ప్రాజెక్టులతో తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. శ్రావణి, చిన ఎర్రయ్య, దేముడు, ఆనంద్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

గెడ్డలో గంగరాజు తదితరుల ఆందోళన

ఆశ్రమాల్లో వైద్యశిబిరాలు

కొయ్యూరు, న్యూస్‌టుడే: కొయ్యూరు బాలురు-1, 2 ఆశ్రమ పాఠశాలల్లో బుధవారం రాజేంద్రపాలెం వైద్యాధికారి హేమంత్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలు నిర్వహించారు. 50 మంది విద్యార్థులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. పిల్లలు తాగేందుకు వేడి నీటినే ఇవ్వాలని, వసతిగృహ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని వార్డెన్‌లకు వైద్యాధికారి సూచించారు. సీహెచ్‌వో ప్రశాంత్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ శ్రావణి పాల్గొన్నారు.

విద్యార్థిని పరీక్షిస్తున్న వైద్యాధికారి హేమంత్

విద్యుత్తు సరఫరా నిలిపివేత రేపు

చింతపల్లి, పాడేరు, న్యూస్‌టుడే: ఈనెల 4న పాడేరు డివిజన్ పరిధిలోని 33కేవీ విద్యుత్తు ఫీడరు లైన్లకు మరమ్మతు పనులు చేపడుతున్నామని ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీరింగ్ అధికారి ఎల్.సీహెచ్ పాత్రుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వహణ పనుల కారణంగా జి.మాడుగుల మండలంలోని అన్ని గ్రామాలతోపాటు చింతపల్లి సెక్షన్ పరిధిలోని అన్నవరం, జర్రెల, వంచుల, లోతుగెడ్డ, బలపం, కొయ్యూరు పరిధిలో శరభన్నపాలెం, నడింపాలెం, పి.మాకవరం, వెలగలపాలెం కినపర్తి గ్రామాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సమూల మార్పులు

చింతపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం విద్యావిధానంలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టిందని, మెరుగైన విద్యతోపాటు విద్యార్థుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తోందని తహసీల్దారు రామకృష్ణ అన్నారు. బుధవారం ఆయన చింతపల్లిలోని ప్రభుత్వ ప్రాథమిక ఆదర్శ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల సామర్థ్యాలతోపాటు మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం పెట్టాలని పేర్కొన్నారు. అనంతరం జీసీసీ డీఆర్‌డిపోను తనిఖీ చేశారు. రేషన్‌ను సకాలంలో లబ్ధిదారులకు పంపిణీ చేయాలన్నారు. నిల్వలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు.

సీపీఐ సమితి సమావేశం 5న

కొయ్యూరు, న్యూస్‌టుడే: సీపీఐ మండల సమితి సమావేశాన్ని ఈనెల 5న వై.ఎన్.పాకలు గ్రామంలో నిర్వహించనున్నట్లు ఆ పార్టీ మండల కార్యదర్శి ఉల్లి సూరిబాబు తెలిపారు. ప్రజా సమస్యలపై చర్చిస్తామని పేర్కొన్నారు. పార్టీ జిల్లా కార్యదర్శి పి.సత్యనారాయణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బి.వి.రమణ ముఖ్య అతిథులుగా హాజరయ్యే సమావేశంలో సమితి సభ్యులు, ముఖ్యనేతలంతా హాజరుకావాలని కోరారు.

బడి లేక తప్పని బాధలు

వర్షంలో పాఠశాలకు వెళుతున్న కంజరితోట చిన్నారులు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: బస్కి పంచాయతీ కంజరితోట గ్రామంలో పాఠశాల ఏర్పాటు చేయాలని పెసా కమిటీ కార్యదర్శి దేవన్న తదితరులు కోరారు. గ్రామంలో 20 మంది విద్యార్థులుండగా.. రెండు కిలోమీటర్ల దూరంలోని కొర్రగుడ పాఠశాలకు వెళుతున్నట్లు తెలిపారు. వానాకాలంలో బడికి వెళ్లలేని పరిస్థితులున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కంజరితోట, దూబరంగిని, కొర్రగుడ మూడు గ్రామాల పిల్లలకు కొర్రగుడ పాఠశాల ఆధారం కాగా.. ఇక్కడ రెండే తరగతి గదులుండటంతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అధికారులు స్పందించి కంజరితోటలో అంగన్‌వాడీ, పాఠశాలను ఏర్పాటు చేయాలని కోరారు.

తెరుచుకోని పందిరివలస పాఠశాల

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: అనంతగిరి మండలంలోని గరుగుబిల్లి పంచాయతీ పందిరివలస గ్రామంలో మూడు రోజులుగా పాఠశాల మూతపడి ఉంది. ఉపాధ్యాయులు రాకపోవడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లి ఆటలాడుతూ కాలం గడుపుతున్నారు. మధ్యాహ్న భోజనం అనంతరం ఇంటికి వెళ్లిపోతున్నారు. అధికారులు స్పందించి ఉపాధ్యాయులు వచ్చేలా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మూతపడిన పందిరివలస బడి

రోగులకు మెరుగైన వైద్యసేవలు

వైద్య పరికరాలు పరిశీలిస్తున్న సభ్యులు

చింతపల్లి, న్యూస్‌టుడే: చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామని సూపరింటెండెంట్ డాక్టర్ ఇందిర ప్రియాంక అన్నారు. బుధవారం ప్రాంతీయ ఆసుపత్రిని అభివృద్ధి కమిటీ సభ్యులు జల్లి హలియారాణి, కవడం ఈశ్వరరావు సందర్శించారు. రోగులకు అందుతున్న సేవలు, సదుపాయాలు పరిశీలించారు. ప్రాంతీయ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసిన తరువాత ప్రభుత్వం అందుకు తగ్గట్టుగానే వైద్యనిపుణులు, ఇతర సిబ్బందిని నియమించిందని, పరికరాలు, ఇతర సామగ్రిని సమకూరుస్తుందని సూపరింటెండెంట్ పేర్కొన్నారు. ప్రాంతీయ ఆసుపత్రి శాశ్వత భవనం పూర్తయితే వసతి ఇబ్బందులు తప్పుతాయని తెలిపారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

మోతుగూడెం, న్యూస్‌టుడే: బొడ్డగండి పంచాయతీ డొంకరాయి గ్రామంలోని గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలోని విద్యార్థినులకు డొంకరాయి ఎస్సై శివకుమార్ బుధవారం సైబర్ నేరాలు, మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలపై అవగాహన కల్పించారు. తెలియని వ్యక్తులు, కంపెనీల నుంచి వచ్చే లింక్ మెసేజ్‌లు తెరవకూడదని సూచించారు. సైబర్ నేరం ద్వారా డబ్బులు పోగొట్టుకుంటే వెంటనే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కి కాల్ చేయాలన్నారు. గుడ్, బ్యాడ్ టచ్‌ల గురించి వివరించారు. ఈవ్ టీజింగ్, వేధింపులకు గురైతే వెంటనే 112 టోల్ ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి పోలీసుల సాయం తీసుకోవాలని సూచించారు.

విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై శివకుమార్

(c) eenadu

ఫుడ్ లైసెన్స్‌ల నవీకరణకు ఆరు నెలల ముందే అవకాశం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: ఫుడ్ లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకునేందుకు ఆరు నెలల ముందే అవకాశం లభించిందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. ఆయన దిల్లీ నుంచి వివరాలు తెలిపారు. లైసెన్స్‌ల రెన్యువల్ గురించి వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుంటూరు ఫ్యాన్సీ స్టేషనరీ జనరల్ మర్చంట్స్, హోటల్ అసోసియేషన్ నాయకులు ఫిబ్రవరిలో తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. లైసెన్స్‌ల రెన్యువల్‌కు రిజిస్ట్రేషన్లు 180 రోజులు ముందే చేసుకోవచ్చన్నారు.

ఉత్సాహంగా చదరంగం పోటీలు

ఈనాడు-ఈటీవీ ఛాంపియన్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులకు బుధవారం చదరంగం పోటీలు జరిగాయి. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలు వద్ద జరిగిన పోటీల్లో కలెక్టరేట్‌లోని పలువురు రెవెన్యూ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రత్యర్థుల ఎత్తుకు పైఎత్తు వేస్తూ పోటీల్లో రాణించారు. అనంతరం విజేతలకు జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు ట్రోఫీలు అందించారు. **- న్యూస్‌టుడే, కలెక్టరేట్ (గుంటూరు)**

విజేతలు సీహెచ్ వెంకటకిషోర్, ఎస్.నవీన్‌లకు బహుమతులు అందిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు

వివరాలు 8లో

భూ సమీకరణపై గ్రామ సభలు నేడు

తాడికొండ, న్యూస్‌టుడే: రాజధాని మలి విడత భూ సమీకరణకు ప్రభుత్వం సమాయత్తమైంది. ఈ నేపథ్యంలో తాడికొండ మండలంలో భూ సమీకరణ ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. మండలంలోని పాములపాడు, బేజాత్‌పురం, రావెల గ్రామాలలో గురువారం స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, ఆర్డీవో శ్రీనివాసరావుల అధ్యక్షతన గ్రామ సభ ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలు స్వీకరించనున్నారు. ఇప్పటికే మండలంలోని మోతడక, లచ్చనగుడిపూడి, ముక్కామల గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి రైతుల అభిప్రాయాలు సేకరించగా.. భూ సమీకరణకు అంతా మద్దతు తెలిపారు.

నీరు పల్లమెరుగు.. నాణ్యత దేవుడెరుగు!

నమూనాల సేకరణ లేదు.. | పరీక్షలకూ చెల్లుచీటీ

గుంటూరు నగరంలోని ప్రతీ వార్డు సచివాలయం పరిధిలో ఆర్సీ (రెసిడ్యుల్ క్లోరిన్) టెస్టింగ్‌కు నిత్యం పది నీటి నమూనాలు సేకరించాలి..
- ఇదేమీ జరగడం లేదు!

వారంలో 21 నమూనాల హెచ్2ఎస్ (నీటి నమూనాల్లో హైడ్రోజన్ సల్ఫైడ్ కారణమైన బ్యాక్టీరియాను గుర్తించేందుకు) స్ట్రిప్ పరీక్షలు చేయాలి..
- ఇవి జరగడం లేదు!!

వాటర్ వర్క్స్ వద్ద 2పీపీఎం విలువ ఉండేలా చూడాలి..
- ఇది అటకెక్కింది!!

పైపులైన్ల శివారున 0.2 పీపీఎం క్లోరినేషన్ విలువ ఉండేలా చూడాలి..
- దీన్నీ మరచిపోయారు!!

ఈనాడు - అమరావతి
న్యూస్‌టుడే - నగరపాలకసంస్థ (గుంటూరు)

నగరంలోని 57 డివిజన్లలో సుమారు 11 లక్షల మందికి తాగునీటిని సరఫరా చేస్తున్నప్పుడు ఆ వ్యవస్థ ఎంత పకడ్బందీగా ఉండాలి? ఏమాత్రం నీరు కలుషితమైనా ప్రజారోగ్యం పెనుప్రమాదంలో పడే ప్రమాదం ఉంది కదా? అయినా జీఎంసీ యంత్రాంగానికి ఇవేమీ పట్టడం లేదు. గతానుభవాల నుంచి గుణపాఠాలు నేర్వలేదు. అధికారుల అలసత్వం, క్షేత్రస్థాయిలో సిబ్బంది కొరత కారణాలుగా చెబుతున్నా.. అత్యంత కీలకమైన వ్యవస్థ నిర్వహణలో వైఫల్యానికి ఎవరు సమాధానం చెబుతారు?

రోజువారీ తాగునీటికి డిమాండ్
155.25 ఎంఎల్‌డీ

ప్రస్తుత సరఫరా
135.50 ఎంఎల్‌డీ

లోటు
19.75 ఎంఎల్‌డీ

(ఎంఎల్‌డీ: రోజుకు మిలియన్ గ్యాలన్లు)

నీటిశుద్ధి కేంద్రంలోని ప్రయోగశాలలో పరికరాలు

► జీఎంసీ లెక్కల ప్రకారం రోజుకు 135.50 మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా చేస్తున్నా చాలాచోట్ల పైపులైన్ల లీకేజీ వల్ల వృథాగా పోతోంది.

ఆదిలోనే అవస్థలు

తక్కెళ్లపాడు వద్ద 45, 45, 42 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన మూడు ఫిల్టరేషన్ ప్లాంట్లు, సంగం-జాగర్లమూడి సమీపంలో 50 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన రెండు ప్లాంట్లు ఉన్నాయి. రోజువారీ అవసరాల్లో ఎక్కువభాగం నీరు తక్కెళ్లపాడు నుంచి వస్తోంది. ఇక్కడున్న మూడు ప్లాంట్లకు ఒక్కటే ప్రయోగశాల ఉంది. 2018లో ఏర్పాటు చేసిన 42 ఎంఎల్‌డీ కేంద్రంలోని ప్రయోగశాల సిబ్బంది కొరతతో మూతపడింది. ప్రస్తుతం ఉన్న ప్రయోగశాలలో సిబ్బంది ముగ్గురే ఉన్నారు. వీరు షిఫ్ట్ పద్ధతిలో పని చేస్తున్నారు. సరిపడా సిబ్బంది లేక పరీక్షల్లో నాణ్యత కొరవడుతోంది.

► కొన్నిచోట్ల మురుగునీటి కాలువల్లో మంచినీటి పైపులున్నాయి. పగుళ్లున్నచోట వ్యర్థ జలాలు తాగునీటిలో కలుస్తున్నాయి.

► ఎక్కడికక్కడ డివిజన్లవారీగా నీటి నాణ్యతను పరీక్షించే బాధ్యతను కొంతకాలంపాటు వార్డు సచివాలయ ఉద్యోగులకు అప్పగించారు. ప్రస్తుతం ఇది మూలకు చేరింది.

► రిజర్వాయర్ల వద్ద అరకొరగా సేకరిస్తున్నా.. క్లోరిన్, టీడీఎస్ మినహా ఇతర అంశాలను చూడడం లేదు.

► 2018, 2024 సంవత్సరాల్లో కలుషిత నీరు తాగి కొందరు ప్రాణాలు పోగొట్టుకున్నారు. వందలాదిమంది ఆసుపత్రుల పాలయ్యారు.

► నీటి సరఫరా విభాగం ఎస్ఈ నాగమల్లేశ్వరరావుతో 'ఈనాడు' మాట్లాడగా.. పరీక్షలు కచ్చితంగా నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులపై చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయా..?

'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో మంత్రి లోకేశ్

తాడేపల్లి, న్యూస్‌టుడే: 'ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అందాయా..? రాష్ట్ర అభివృద్ధి కార్యక్రమాలను గమనిస్తున్నారా..?' అంటూ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ తాడేపల్లి పరిధిలోని మహానాడు ప్రజలను ఆప్యాయంగా పలుకరించారు. మంగళగిరి నియోజకవర్గాన్ని నంబర్ వన్‌గా అభివృద్ధి చేయడంతోపాటు ఇక్కడి అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా బుధవారం సాయంత్రం ఆయన మహానాడు ప్రాంతంలో పర్యటించారు. తల్లికి వందనం, దీపం పథకం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, అన్న క్యాంటీన్ పునరుద్ధరణ వంటి అంశాలను వివరించారు. సాయంత్రం ఐదు గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకు మంత్రి లోకేశ్ మహానాడులోని ఒకటో లైను నుంచి 13వ లైను వరకు ఉన్న ఇళ్లకు వెళ్లి సంక్షేమ పథకాలను వివరించే కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకురాగా.. పరిష్కరిస్తానంటూ భరోసా ఇచ్చారు. ఇటీవల ఇళ్ల పట్టాలు అందుకున్న లబ్ధిదారులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

తాడేపల్లిలో మంత్రి లోకేశ్‌కు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న స్థానిక మహిళలు

తాడేపల్లి పరిధి మహానాడులో ఓ కుటుంబాన్ని ఆప్యాయంగా పలుకరిస్తూ..

గతంలో ఎవరూ పట్టించుకోలేదు..

'ఎంతోకాలంగా ఇక్కడ నివశిస్తున్నాం. ఇళ్ల పట్టాలు అడిగితే గతంలో ఎవరూ పట్టించుకోలేదు. మీరు వచ్చాక నూతన వస్త్రాలు ఇచ్చి ఇంటి పట్టా ఇచ్చారు. ఎంతో సంతోషంగా ఉంది. నా కుమారుడికి తల్లికి వందనం, ఉచిత గ్యాస్, నాన్నకు వృద్ధాప్య పింఛను పథకాలతో లబ్ధిపొందుతున్నాం. గతంలో ఇక్కడ గంజాయి బ్యాచ్ ఆగడాలు ఎక్కువగా ఉండేవి. మీరు వచ్చాక ఆ సమస్య లేదు'. అని లక్ష్మి అనే మహిళ మంత్రి లోకేశ్ వద్ద ఆనందం వ్యక్తం చేశారు.

ధైర్యం వచ్చింది..

'నలభై ఏళ్లుగా మహానాడులో ఉంటున్నాం. గతంలో ఎవరూ కూడా పట్టాలు ఇవ్వలేదు. మీరు మా కల నెరవేర్చారు. ఇప్పుడు ధైర్యంగా ఉంది. తల్లికి వందనం అందింది. మా ఇళ్లు వరద ముంపునకు గురి కాకుండా రిటైనింగ్‌వాల్ నిర్మించడం ఎంతో ఆనందంగా ఉంది' అని మహబూబా అనే స్థానికులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

కొండమోడు నుంచి ఓఆర్ఆర్‌కు అనుసంధాన రోడ్డు

నాలుగు వరుసల నిర్మాణానికి ప్రతిపాదన

ఈనాడు - అమరావతి

కొండమోడు - పేరేచర్ల రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించే క్రమంలో మేడికొండూరు నుంచి బైపాస్ ద్వారా వేములూరిపాడు వద్ద అనుసంధానం చేస్తున్నారు. అక్కడి నుంచి బాహ్య వలయ రహదారికి చేరుకునేలా పేరేచర్ల వద్ద నరసరావుపేట వంతెన వరకు 3 కిలోమీటర్ల మేర నాలుగు వరుసలుగా విస్తరించడానికి అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఇందుకు రూ. 50 కోట్లకుపైగా అవసరమని ప్రాథమికంగా అంచనా వేశారు. హైదరాబాద్, పల్నాడు ప్రాంతాల నుంచి వచ్చేవారు కొండమోడు మార్గం మీదుగా అమరావతికి వెళ్లడానికి ఔటర్ రింగ్ రోడ్డుపైకి చేరుకునేలా రోడ్డును అనుసంధానం చేయాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు ఇంజినీర్లు ప్రతిపాదనలు పంపించారు. కొండమోడు నుంచి నాలుగు వరుసల రహదారిపై వచ్చే వాహనాలు వేములూరిపాడు సమీపంలో గుంటూరు-కర్నూలు మార్గంలోకి ప్రవేశిస్తాయి. ప్రస్తుతం ఇది రెండు వరుసలుగా ఉంది. ఈ నేపథ్యంలో బాహ్యవలయ రహదారిపైకి చేరుకునేలా 3 కిలోమీటర్ల మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరిస్తారు. దీనివల్ల అమరావతి నుంచి హైదరాబాద్, పల్నాడు వైపు వెళ్లేవారికి, అటు నుంచి అమరావతికి వచ్చే వారికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది.

అమరావతి-అనంతపురం మార్గంలో కలిపితే మేలు

అనంతపురం నుంచి అమరావతికి కొత్తగా జాతీయ రహదారిని నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రస్తుతం గుంటూరు-కర్నూలు మార్గంలోని ఫిరంగిపురం నుంచి బైపాస్ ఏర్పాటు చేసి పేరేచర్ల-మేడికొండూరు మార్గం మధ్యలో బాహ్యవలయ రహదారికి కలిసేలా ఆకృతి రూపొందించారు. ఇది కొండమోడు-పేరేచర్ల మార్గాన్ని క్రాస్ చేస్తూ వెళ్తుంది. ఈ మార్గం గుంటూరు-కర్నూలు, ప్రస్తుతం ఉన్న కొండమోడు-పేరేచర్ల మార్గాల మధ్య సమాంతరంగా వెళ్తుంది. ప్రస్తుతం అనుకుంటున్న డిజైన్ కొంత మార్చి ఫిరంగిపురం నుంచి బైపాస్ మార్గాన్ని వేములూరిపాడు వద్ద కొండమోడు-పేరేచర్ల రహదారికి అనుసంధానం చేయడంతోపాటు అక్కడి నుంచి బాహ్యవలయ రహదారిపైకి ప్రవేశించేలా చేయాలి. దీనివల్ల కొండమోడు-పేరేచర్ల రహదారి నుంచి ఇప్పుడు ప్రతిపాదించిన 3 కిలోమీటర్ల అనుసంధాన మార్గం అవసరం ఉండదు. భూసేకరణ, రహదారి నిర్మాణ భారం ప్రభుత్వంపై తగ్గుతుంది. అలాకాకుండా ప్రస్తుతం రూపొందించిన ప్రతిపాదనల ప్రకారమైతే అటు అనంతపురం-అమరావతి, కొండమోడు-పేరేచర్ల రహదారులు సుమారు పది కిలోమీటర్ల వ్యవధిలో బాహ్యవలయ రహదారిపైకి ప్రవేశిస్తాయి. వీటిపై ప్రభుత్వం మరింతగా అధ్యయనం చేసి భూసేకరణ భారం, రహదారి నిర్మాణ ఖర్చు తగ్గించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. దీనివల్ల అదనపు ప్రయోజనమే తప్ప నష్టం ఉండదని వారు పేర్కొంటున్నారు.

పేరేచర్ల సమీపంలో బాహ్యవలయ రహదారికి అనుసంధానం చేసే నరసరావుపేట వంతెన ప్రాంతం

పల్లెలు ఇక పరిశుభ్రం

వ్యర్థాల తొలగింపునకు ప్రత్యేక డ్రైవ్

న్యూస్‌టుడే - జిల్లా పరిషత్తు

గ్రామాల్లోకి ప్రవేశించగానే రహదారికి ఇరువైపులా గుట్టలుగా పేరుకుపోయిన చెత్తాచెదారాలు కనిపిస్తుంటాయి. ఎన్నో ఏళ్లుగా ఈ పరిస్థితి ఉన్నా పంచాయతీల అధికారులుగానీ, స్థానిక పాలకవర్గాలుగానీ పట్టించుకోవడం లేదు. దీంతో స్వచ్ఛ భారత్, స్వచ్ఛాంధ్ర కార్యక్రమాల స్ఫూర్తికి విఘాతం కలుగుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ గ్రామాల్లో వ్యర్థాల తొలగింపునకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తోంది. 'లెగసీ వేస్ట్' పేరుతో వ్యర్థాల వివరాలు సేకరించి పీఆర్‌వన్ యాప్‌లో నమోదు చేయాలని ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం జిల్లా వ్యాప్తంగా పంచాయతీరాజ్‌శాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో పర్యటించి చెత్త, వ్యర్థాలను పరిశీలించారు. జిల్లా పరిషత్తు సీఈవో వి.జ్యోతిబసు గ్రామీణ గుంటూరు మండలం లాలుపురం సందర్శించి రోడ్డు పక్కన ఉన్న వ్యర్థాల తొలగింపునకు ఆదేశాలు జారీ చేశారు. గ్రామంలోని ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాన్ని కూడా చూశారు. మండలాల నుంచి వివరాల సేకరణకు జిల్లా పరిషత్తులోని డీపీఆర్‌సీ కేంద్రం ఉద్యోగులతోపాటు ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించారు. వ్యర్థాలను తొలగించాక సమీపంలోని పురపాలకసంఘాలకు తరలించి వాటిని పునరుత్పాదన చేసేలా ప్రణాళికలు తెలియజేయాల్సి ఉంటుంది. తద్వారా పల్లెల్లో పరిశుభ్ర వాతావరణం ఏర్పడేందుకు వీలవుతుంది.

రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కృష్ణతేజ ఆదేశాల మేరకు ఈ నెల 7వ తేదీలోపు గ్రామాల్లో ఉన్న వ్యర్థాల ఉన్న గుట్టలకు సంబంధించి పొడవు, వెడల్పు వివరాలతోపాటు ఎంత ఘన పరిమాణంలో నిల్వలు ఉన్నాయో అంచనా వేసి పీఆర్‌వన్ యాప్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. మండలాల్లోని లింక్ రోడ్ల వివరాలను కూడా యాప్‌లో నమోదు చేయాలి.

తాడికొండలో వ్యర్థాల గుట్ట వివరాలు సేకరిస్తున్న సిబ్బంది

పశ్చిమ డెల్టా కాల్వలకు విడుదల చేసిన నీరు

పశ్చిమ డెల్టాకు సాగునీరు విడుదల

అన్ని గ్రామాల్లో వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో పలుచోట్ల రైతుల నుంచి జింక్ కావాలని అడుగుతున్నారు. గతంలో ప్రభుత్వం సబ్సిడీ మీద వీటిని పంపిణీ చేసింది.

● ఖరీఫ్‌కు అన్నదాతలు సిద్ధం ● రాయితీపై జింక్ అందించాలని వినతి

దుగ్గిరాల, న్యూస్‌టుడే: ఖరీఫ్ మొదలైంది. పశ్చిమ డెల్టా కాలువలకు బుధవారం నీటిని విడుదల చేశారు. ప్రధానంగా సంగంజాగర్లమూడి, రేపల్లె, బాపట్ల తదితర ప్రాంతాల్లో తాగునీటి చెరువులు పూర్తిగా ఖాళీ అయినందున వాటిని నింపుకోవడానికి ఈ నీరు విడుదల చేస్తున్నట్లు జిల్లా ఎస్ఈ వెంకటరత్నం తెలిపారు. తొలిగా 300 క్యూసెక్కులు ఇచ్చారు. ఖరీఫ్‌నకు రైతులు పూర్తిస్థాయిలో సన్నద్ధం అవుతున్నారు కాబట్టి కాలువలకు ఇచ్చే నీటిని సాగుకు వినియోగించుకునే అవకాశం ఉంది. గుంటూరు, బాపట్ల జిల్లాల్లో సుమారు 5.2 లక్షల ఎకరాలు సాగు చేస్తారని అధికారుల అంచనాగా ఉంది. కాలువలపై ఇప్పటికే నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటి వల్ల సాగునీటి ప్రవాహానికి ఇబ్బంది ఉండదని అధికారులు చెబుతున్నారు.

జింక్ సరఫరా కోరుతున్న రైతులు..

జిల్లాకు ఎంత జింక్ కావాలో కోరుతూ ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపామని అధికారులు చెబుతున్నారు. ఎకరాకు 14 కిలోల చొప్పున ఖరీఫ్ ఆరంభంలోనే చేలో వేసేయాలని సూచిస్తున్నారు. ఒకసారి జింక్ వేస్తే మూడేళ్ల వరకూ చేలకు ఇబ్బంది ఉండదని చెబుతున్నారు. వరిలో ఆకుపై మచ్చలు, ఆకులు పాలిపోవడం, మొక్క ఎదుగుదల మందగించడం వంటివి జింక్ వేయడం ద్వారా అరికట్టవచ్చని ఆదర్శ రైతులు వివరిస్తున్నారు. జింక్ లేకపోతే ఎరువులు, నీటి వినియోగం ఎక్కువగా ఉంటుందని వ్యవసాయాధికారులు తెలిపారు.

పాలకవర్గాలు వస్తేనే ప్రగతి

మార్కెట్ కమిటీల పరిధిలో పెండింగ్‌లో సమస్యలు

న్యూస్‌టుడే - మిర్చియార్డు

జిల్లాలో ఇంకా కొన్ని మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయి. ఇన్‌ఛార్జిల పాలన కారణంగా కీలక నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి. గుంటూరు మిర్చియార్డు పరిధిలో అయితే.. అధికారులు కమీషన్ ఏజెంట్ల లైసెన్సుల పునరుద్ధరణ, కొత్తవి జారీ చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

జిల్లాలో ఎనిమిది మార్కెట్ కమిటీలున్నాయి. కూటమి ప్రభుత్వం మంగళగిరి, దుగ్గిరాల కమిటీలకు పూర్తిస్థాయిలో పాలకవర్గాలను నియమించింది. ప్రత్తిపాడు కమిటీకి ఛైర్‌పర్సన్ పేరును మాత్రమే ప్రకటించింది. మిగిలిన గుంటూరు మిర్చియార్డుతోపాటు తాడికొండ, ఫిరంగిపురం, పొన్నూరు, తెనాలికి పాలకవర్గాలను సాధ్యమైనంత తొందరగా నియమిస్తే పాలనాపరమైన అంశాల పరిష్కారానికి అవకాశం ఏర్పడుతుంది.

☛ గుంటూరు మిర్చియార్డులో కల్వర్టుల వద్ద పరిస్థితి దారుణంగా ఉంది. గత మిర్చి సీజన్లో వాహనాలు ముందుకు కదలక ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపించిందని రైతులు వాపోతున్నారు. మంచినీటి వసతి, రైతు విశ్రాంతి భవనంలో ఏసీ సమస్యలు పరిష్కారం కాలేదు. పారిశుద్ధ్యం పరిస్థితి చెప్పక్కర్లేదు. మిర్చి కొరతో రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. ధర లేక రైతులు రోడ్డెక్కాల్సి వచ్చింది. పాలకవర్గం ఉన్నట్లయితే.. వివిధాంశాలపై దృష్టి పెట్టడానికి అవకాశం ఉండేది. మధ్యాహ్న భోజన పథకంలో లోపాలు తలెత్తకుండా రోజుకొకరు పర్యవేక్షించేందుకు వీలుండేది.

☛ గుంటూరు మిర్చియార్డులో అధికారులు పనులు చక్కబెట్టుకునే పనిలో ఉన్నారు. కమీషన్ ఏజెంట్ల లైసెన్సులను పునరుద్ధరించడంతోపాటు నూతన లైసెన్సులు జారీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కొన్నింటికి నవీకరణ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ముడుపులు చేతులు మారాయన్న ఆరోపణలొస్తున్నాయి. కొత్త లైసెన్సుల జారీని వీలైనంత తొందరగా పూర్తి చేసేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం.

గుంటూరు మిర్చియార్డు ముఖ ద్వారం..

పాలకవర్గాలను నియమించాల్సిన మార్కెట్ కమిటీల రిజర్వేషన్ వివరాలు

మిర్చియార్డు	ఓసీ (పురుష)
తెనాలి	బీసీ (పురుష)
పొన్నూరు	ఓసీ (మహిళ)
ఫిరంగిపురం	ఓసీ (పురుష)
తాడికొండ	బీసీ (మహిళ)

4న జడ్పీ సర్వసభ్య సమావేశం

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లాపరిషత్తు సర్వసభ్య సమావేశం గుంటూరులోని జడ్పీ సమావేశ మందిరంలో ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన ఈనెల 4న ఉదయం 10.30 గంటలకు జరగనుందని సీఈవో వి.జ్యోతిబసు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లాల కలెక్టర్లు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు పాల్గొంటారని వెల్లడించారు.

పెంచలేక.. ప్రాణాలు తుంచేశాడు..!

దివ్యాంగురాలైన మనుమరాలిని కాలువలోకి తోసేసి హతమార్చిన తాత

తాడేపల్లి, తాడికొండ, న్యూస్‌టుడే: ఆ బాలిక వినలేదు. .మాట్లాడలేదు. అల్లారు ముద్దుగా పెంచాల్సిన తల్లిదండ్రులు పసితనంలోనే చనిపోయారు. అప్పటి నుంచి కన్నబిడ్డలా సాకిన తాత చెయ్యిపట్టుకుని తీసుకెళ్తుంటే ఎక్కడికో అనుకుంది ఆ చిన్నారి. కానీ తన పాలిట కాలయముడు అవుతాడని గ్రహించలేకపోయింది. ఎత్తుకుని లాలించాల్సిన తాతే ఎత్తి కాలువలో విసిరేయడంతో నిండు నూరేళ్ల బతకాల్సిన ఆమె తిరిగిరాని లోకాలకు చేరిపోయింది. ఆర్థిక పరిస్థితి కారణంగా దివ్యాంగురాలైన మనుమరాలిని పెంచలేక తాతే మనుమరాలిని కాలువలోకి తోసి వదిలించుకున్న ఘటన ఇది. తాడేపల్లి పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తాడికొండ మండలం బడేపురం గ్రామానికి చెందిన కూరపాటి మాధవరావు అలియాస్ బుల్లయ్య, అతని భార్య కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తారు. అతడి కొడుకు, కోడలు 13 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మరణించారు. వారి కూమార్తె హేమ (13) తాత, నాయనమ్మల వద్ద జీవనం సాగిస్తోంది. పుట్టుకతో మూగ, చెవుడు కావడంతో ఆమె బాగోగులు మాధవరావు దంపతులే చూసేవారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా దివ్యాంగురాలైన మనుమరాలిని సాకలేక ఎలాగైనా వదిలించుకోవాలని భావించిన మాధవరావు.. ఈ నెల 1వ తేదీన ఆసుపత్రికి తీసుకువెళుతున్నానని ఇంటి వద్ద చెప్పి హేమతో కుంచనపల్లి వద్దకు చేరుకున్నాడు. అక్కడి నుంచి తాడేపల్లి, మంగళగిరి మధ్య జాతీయ రహదారిపై ఉన్న డెల్టా కాలువ వంతెనపైకి నడిపించుకుంటూ తీసుకొచ్చి అమాంతం కాలువలోకి తోసేశాడు. కాస్త దూరం నుంచి గమనించిన ఓ మహిళ పోలీసులకు సమాచారం ఇచ్చింది. స్పందించిన పోలీసులు కాలువలో గాలించగా బాలిక మృతదేహం లభ్యమైంది. బుధవారం పత్రికల ద్వారా హేమ మృతి విషయాన్ని తెలుసుకున్న గ్రామస్థులు తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో తాడికొండ పోలీసుల సహకారంతో నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా బాలికను కాలువలోకి విసిరివేయడానికి గల కారణాలను వివరించాడని తెలిపారు.

అమరావతి పనుల పురోగతిపై సంతృప్తి

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : రాజధాని అమరావతి నిర్మాణ పనుల పురోగతిపై ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. వరుసగా మూడో రోజైన బుధవారం వారు విజయవాడ ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు, అదనపు కమిషనర్లు జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్, మల్లారపు నవీన్‌లు 'అర్బన్ గవర్నెన్స్'పై కార్యశాల నిర్వహించారు. వివిధ దేశాల్లో దీనిపై అమలవుతున్న అత్యుత్తమ విధానాలు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రతినిధులు.. సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులతో చర్చించారు. అమరావతి నిర్మాణంలో ప్రాజెక్టుల పురోగతి, రాజధానిలో ల్యాండ్ మోనిటైజేషన్ గురించి అధికారులు వారికి వివరించారు. ఆర్థికాభివృద్ధి, రవాణా సదుపాయాల కల్పన, హౌసింగ్ ప్రాజెక్టులు, ప్రైవేట్ సెక్టార్ భాగస్వామ్యం, పౌరసేవల కల్పన తదితర అంశాల్లో సీఆర్‌డీఏ ప్రాతినిధ్యం వహిస్తోందని తెలిపారు. దీనిపై బ్యాంకు ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సంతృప్తికర రీతిలో సమాధానం ఇచ్చారు. రాజధాని ప్రాంత నివాసితులకు అమలు చేస్తున్న సామాజిక సంక్షేమ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, కార్మికులు, మహిళల భద్రతకు అమలవుతున్న చర్యలు, విపత్తుల నిర్వహణకు చేపట్టిన కార్యకలాపాలపై బృంద సభ్యులు పూర్తి స్థాయిలో సంతృప్తి వ్యక్తం చేశారు. ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీపార్థసారథి పాల్గొన్నారు.

మాస్టార్లూ.. ఇదేం పని?

■ ఏఎన్‌యూలో నిధుల దుర్వినియోగం ■ విజిలెన్స్ తనిఖీల్లో బయటపడుతున్న బాగోతం

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే

నంబూరు సమీపంలోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వైకాపా హయాంలో చోటుచేసుకున్న అనేక అవకతవకలపై విజిలెన్స్ అధికారులు బుధవారం తనిఖీలు చేపట్టారు. 2019లో ఆచార్య రాజశేఖర్ ఇన్‌ఛార్జి వీసీగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి 2024 జూన్ వరకు జరిగిన పనులకు సంబంధించిన బిల్లులు, దస్త్రాలను పరిశీలించారు. రూసా సమన్వయకర్తగా పని చేసిన సునీత నిధులను దారి మళ్లించినట్లు గుర్తించారు. అప్పటి సీడీసీ డీన్ ఆచార్య మధుబాబు, సీడీఈ సంచాలకుడు బట్టు నాగరాజు ఆధ్వర్యంలో రెండుసార్లు నిర్వహించిన అకడమిక్ ఎగ్జిబిషన్‌లో భారీగా నిధులు దుర్వినియోగమైనట్లు తెలుసుకున్నారు. రాజశేఖర్ వీసీగా బాధ్యతలు తీసుకొనే నాటికి దూర విద్యాకేంద్రంలో సుమారు రూ. 2 కోట్ల మేర మిగులు నిధులు ఉన్నాయి. వాటిని విచ్చలవిడిగా వినియోగించడంపై ఆరా తీసినట్లు సమాచారం. అప్పటి పీజీ పరీక్షల సమన్వయకర్త ఆచార్య ఉదయ్‌కుమార్ పరీక్షలు నిర్వహించకుండానే బిల్లులు డ్రా చేసినట్లు గుర్తించారు. రాజశేఖర్ హయాంలో రెండు సార్లు స్నాతకోత్సవాలు నిర్వహించారు. విశ్వవిద్యాలయంలో సుందరీకరణ పేరుతో తనకు నచ్చిన వారికి నామినేషన్ పద్ధతిపై పనులు అప్పగించారు. డైక్‌మెన్‌కు వెళ్లే దారిలో అవసరం లేకున్నా డివైడర్ నిర్మించారు. వరద నీరు పోయేలా డ్రెయిన్లు నిర్మించకుండా రోడ్లు వేశారు. దీంతో గతేడాది కురిసిన భారీ వర్షాలకు వరద నీరు బయటకు వెళ్లక పోవడంతో ఆ నీరంతా గ్రంథాలయంలోకి చేరి విలువైన పుస్తకాలు నీటి పాలయ్యాయి. మూడు అడుగుల ఎత్తులో దిమ్మెలు కట్టి వాటిపై డ్రెయినేజీ పైపులు వేశారు. వరద నీరు మూడు అడుగుల మేర పైకి ఉంటేనే అందులోకి నీరు వెళ్తుంది. ఈ పనులపైనా అందరూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. యూనివర్సిటీలో విచ్చలవిడిగా విగ్రహాలు ఏర్పాటు చేశారు. ఒక్క వైఎస్ విగ్రహానికే దాదాపు రూ.20 లక్షలకుపైగా ఖర్చు చేశారు. ఆయన వర్ధంతి, జయంతిలకు, జగన్, సజ్జల పుట్టిన రోజులకు భారీగా నిధులు ఖర్చు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. యూజీసీ సదస్సుల పేరుతో పలువురు అధ్యాపకులు బిల్లులు పెట్టి నిధులు డ్రా చేశారు. వీటిపైనా దృష్టి సారిస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని విశ్వవిద్యాలయ వర్గాలు కోరుతున్నాయి. ఆయా అక్రమాలపై గతంలో 'ఈనాడు' అనేక కథనాలు ప్రచురించింది. వీటితో పాటు విజిలెన్స్ అధికారులు సేకరించిన సమాచారంతో తనిఖీలు చేపట్టారు. ఇవి కనీసం వారం పాటు సాగే అవకాశం ఉంది.

ఫార్మసీ కళాశాల వద్ద ఎత్తుగా వేసిన డ్రెయినేజీ పైపులు

MARGADARSI CHIT FUND PVT. LTD.
Chit Groups are available at our *NARASARAOPET* BRANCH

CHIT GROUP	DURATION IN MONTHS	MONTHLY INSTALLMENT	CHIT VALUE
LT C	50	30,000	15,00,000
LT X	50	20,000	10,00,000
FT VV	40	2,00,000	80,00,000
FT D	40	50,000	20,00,000

Please Contact Branch Manager **Mr. M.ADISESHA RAO,** for further details. Mobile No. **8008229506,** **Landline: 08647-222674, 227161.**

(c) eenadu

లీగల్ స్టడీస్ ఫలితాల విడుదల

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలోని న్యాయ కళాశాలల్లో, లీగల్ స్టడీస్‌లో ఏప్రిల్ నెలలో నిర్వహించిన పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాద్ బుధవారం విడుదల చేశారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీలో మూడో సెమిస్టర్, ఐదేళ్ల ఎల్ఎల్‌బీలో ఏడో సెమిస్టర్‌లో 809 మంది పరీక్ష రాయగా 482 మంది, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ మూడో సెమిస్టర్‌లో 341 మందికి గాను 212 మంది, ఎల్ఎల్‌బీ ఐదేళ్ల హానర్స్ కోర్సు మూడో సెమిస్టర్‌లో 47 మంది పరీక్ష రాయగా 44 మంది ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. పరీక్ష పత్రాల పునః మూల్యాంకనం కోసం ఈ నెల 8వ తేదీ లోపు ఒక్కో పేపరుకు రూ.2,070 చెల్లించాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచామని తెలిపారు.

ఎత్తుకు పైఎత్తువేసి.. ప్రత్యర్థిని చిత్తు చేసి..

ఈనాడు-ఈటీవీ ఛాంపియన్ పోటీల్లో రెవెన్యూ ఉద్యోగుల సందడి

రసవత్తరంగా పోటీ

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: నిత్యం విధుల్లో తలమునకలై ఉండే రెవెన్యూ ఉద్యోగులు ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన చదరంగం పోటీలో ఉల్లాసంగా పాల్గొన్నారు. ఒకరికంటే మరొకరు ఎత్తుకు పైఎత్తులు వేస్తూ రాణించారు. తొలిరౌండ్‌లో తడబడినా...ఆతర్వాత ప్రత్యర్థులపై పోటా పోటీగా పావులు కదిపారు. రెవెన్యూ ఉద్యోగులకు కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలు ఆవరణలో చదరంగం పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి మాట్లాడుతూ ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు చదరంగం పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన సిహెచ్.వెంకటకిషోర్, ఎస్.వినయ్‌లకు జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు బహుమతులు అందజేశారు. చెస్ ఆర్బిటర్ చక్రవర్తి పాల్గొన్నారు.

సృజనకు పోటీలు దోహదం: సీహెచ్ వెంకటకిషోర్, విన్నర్

ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా పోటీలు అవసరం. అప్పుడే నైపుణ్యాలను గుర్తించి తెచ్చుకునేందుకు కాస్త సమయం పట్టింది. చదరంగం అంటే ఇష్టం. ఉద్యోగ రీత్యా ఎప్పుడూ ఏదో ఒక హడావుడిలో ఉంటాం. సృజనాత్మక ఆలోచనలకు, వైవిధ్యమైన ఎత్తుగడలకు పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయి. విజేతగా ట్రోఫీ అందుకోవడం చాలా సంతోషంగా ఉంది.

ఉల్లాసాన్ని ఇస్తాయి: ఎస్.వినయ్, రన్నర్

చదరంగం పోటీలను ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహించడం..అందులో నేను పాల్గొనడం ఆనందంగా ఉంది. చదరంగం అంటే చాలా ఆసక్తి. ఉద్యోగులకు ఇటువంటి పోటీలు ఉల్లాసాన్నిస్తాయి.

ఒత్తిడి నుంచి ఉపశమనం: వై.లోహిత

క్రీడలపై ఆసక్తి ఉన్నా చదువుకోవడం..ఆ తర్వాత ఉద్యోగ జీవితంతో బిజీ అయిపోయాం. ఉద్యోగులకు పోటీలు నిర్వహించడం చాలా సంతోషం. ఇటువంటి క్రీడలతో ఉద్యోగులకు ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుంది. క్రీడా నైపుణ్యాలు పెంపొందడంతోపాటు ప్రతిభ వెలుగులోకి వస్తుంది.

నేటి బంద్‌కు అప్పా దూరం

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: బడ్జెట్ పాఠశాలల సమస్యలపై కూటమి ప్రభుత్వానికి వినతులు ఇచ్చిన వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నారని ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ (అప్పా) రాష్ట్ర నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలిచ్చిన బంద్ పిలుపునకు దూరంగా ఉన్నట్లు వెల్లడించారు. సమస్యలుంటే ముందుగా వివిధ స్థాయిల్లో వినతులివ్వాలి చర్చించాకే... ఫలితం రాకపోతే బంద్‌కు వెళ్లాలని పేర్కొన్నారు. ప్రస్తుతం ఆర్టీఈలో విద్యార్థుల ప్రవేశాలకు సంబంధించి ప్రభుత్వం నిబంధనలు పక్కాగా అమలు చేయాల్సి ఉందని, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి ప్రభుత్వంతో చర్యలు జరపాలని తెలిపారు.

జూపూడి హైమావతమ్మ ఆశీస్సులు తీసుకున్న మాధవ్

మాధవ్‌ను ఆశీర్వదిస్తున్న జూపూడి హైమావతమ్మ

గుంటూరు (నగరంపాలెం), న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ బుధవారం జనసంఘ్ నాయకులు, మాజీ ఎమ్మెల్సీ దివంగత జూపూడి యజ్ఞనారాయణ సతీమణి హైమావతమ్మ ఆశీస్సులు తీసుకున్నారు. రైలుపేటలోని భాజపా నేత జూపూడి రంగరాజు నివాసానికి వచ్చిన మాధవ్ రంగరాజు తల్లి హైమావతమ్మను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా హైమావతమ్మ, రంగరాజులను ఆయన సత్కరించారు. అనంతరం మాధవ్‌ను వారు సత్కరించారు. కార్యక్రమంలో భాజపా జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు, పార్టీ నాయకులు కె.వి.సుబ్బారావు, యడ్లపాటి స్వరూపరాణి, నేరెళ్ల మాధవరావు, భీమినేని చంద్రశేఖర్, పాలపాటి రవికుమార్, వెలగలేటి గంగాధర్, కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

రేవుల వేలం సజావుగా సాగేనా..?

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాపరిషత్తు పరిధిలోని కృష్ణా నదీ తీర ప్రాంతంలో బల్లకట్టులు, పడవల నిర్వహణ కోసం జడ్పీ అధికారులు గురువారం వేలం నిర్వహించనున్నారు. గతంలో వేలం నిర్వహించగా అచ్చంపేట మండలం గింజుపల్లి పడవ రేవును అత్యధిక ధరకు పాట పాడిన గుత్తేదారుడిని స్థానిక నాయకులు అడ్డుకుని పడవ తిప్పకుండా ఆటంకాలు కలిగించారు. దాంతో ఆయన పల్నాడు జిల్లా కలెక్టరు, ఎస్పీతోపాటు జడ్పీ అధికారులకు ఫిర్యాదు చేయాల్సి వచ్చింది. అమరావతి మండలం దిడుగు రేవులో పడవ నిర్వహణకు రూ.50 లక్షలకు పాట పాడిన గుత్తేదారు రూ.2.32 లక్షలు ధరావత్తు చెల్లించి మిగిలిన నగదు చెల్లించకుండా రెండు నెలలు అనధికారికంగా తిప్పారు. దాంతో మే 3న జడ్పీ అధికారులతోపాటు మండల రెవెన్యూ, పంచాయతీరాజ్, పోలీసుశాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేసి పడవను సీజ్ చేశారు. అమరావతి పోలీస్‌స్టేషన్‌లో గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. వీటిని దృష్టిలో పెట్టుకుని ఈనెల 3వ తేదీ ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం వరకు సీల్డ్ టెండర్లు జడ్పీలో స్వీకరించనున్నారు. అచ్చంపేట మండలం చింతపల్లి, గింజుపల్లి(పడవలు), మాదిపాడు(బల్లకట్టు), మాచవరం మండలం గోవిందాపురం(బల్లకట్టు), అమరావతి మండలం దిడుగు, కొల్లిపర మండలం వల్లభాపురం(పడవ) రేవులకు వేలం నిర్వహిస్తారు.

సిండికేట్ కనుసన్నల్లో.. సిండికేట్‌గా ఏర్పడిన నాయకుల కనుసన్నల్లోనే పడవలు, బల్లకట్టులు నిర్వహిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వేలంలో పాట ద్వారా ఆయా రేవులను దక్కించుకున్న గుత్తేదారులను బెదిరిస్తుండడంతో వారు ముందుకు రావడం లేదు. దీనివల్ల జడ్పీ ఆదాయం కోల్పోతుంది.

కొనసాగుతున్న ఏఎన్‌ఎంల బదిలీల కౌన్సెలింగ్

గుంటూరు వైద్యం: గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎం గ్రేడ్-3 బదిలీల కౌన్సెలింగ్ బుధవారం మూడోరోజు కూడా పూర్తికాలేదు. రెండోరోజు మంగళవారం తెల్లవారుజాము వరకూ కౌన్సెలింగ్ నిర్వహించారు. బుధవారం అర్ధరాత్రి వరకు కొనసాగే పరిస్థితి ఉంది. గురువారం సాయంత్రానికి పూర్తికావొచ్చని అంచనా వేస్తున్నారు. ఆ తర్వాత మాత్రమే బదిలీల ఉత్తర్వులు ఇవ్వనున్నారు. ఉద్యోగుల సీనియారిటీ జాబితాలో తప్పులు ఉన్నందున గత నెల 30వ తేదీ రాత్రి 11 గంటలకు కౌన్సెలింగ్ వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. ఒకేచోట అయిదేళ్ల నుంచి పనిచేస్తున్న వారిని తప్పకుండా బదిలీ చేయాలని ప్రభుత్వం స్పష్టమైన మార్గదర్శకాలు జారీచేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో బదిలీకి అర్హులైన వారు 900 మందికి పైనే ఉన్నారు. మరోవైపు ఎంఎల్‌ఏలు, ఎంపీల సిఫార్సు లేఖలు తెచ్చుకున్న వారికి అధికారులు ప్రాధాన్యం ఇస్తున్నారని ఆరోగ్య కార్యకర్తలు ఆరోపిస్తున్నారు. దీనివల్ల సీనియర్లు నష్టపోతున్నారని వాపోతున్నారు. మరోవైపు కొన్ని ఖాళీలను ప్రకటించడం లేదని ఫిర్యాదులు వస్తున్నాయి. ఏఎన్‌ఎంలు తమ దరఖాస్తులో సూచించిన ఐదు ఆప్షన్స్‌లో ఖాళీగా ఉంటే వాటినే కేటాయిస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఆ ఐదు ఖాళీ లేకపోతేనే సంబంధిత ఏఎన్‌ఎంకు ఫోన్‌చేసి అప్పుడు అందుబాటులో ఉన్న ఖాళీలను ప్రకటించి అందులో ఒకదాన్ని ఎంపిక చేసుకోవాల్సిందిగా సూచిస్తున్నామన్నది అధికారుల మాట. జూమ్ కాన్ఫరెన్స్‌లో నిర్వహిస్తే అందరికీ ఖాళీల వివరాలు తెలుస్తాయి. సీనియారిటీ ప్రకారమే పిలుస్తున్నారా? లేదా? తెలుసుకోవచ్చు. అలా చేయకుండా ప్రస్తుతం ఒక్కో ఉద్యోగికి మాత్రమే ఫోన్ చేసి బదిలీలు చేస్తున్నారు. దీనివల్ల ఎవరు ఎక్కడికి బదిలీ అవుతున్నారో ఇతరులకు తెలియడం లేదు. కొందరు ఏఎన్‌ఎంలు బుధవారం రాత్రి కూడా ప్రజాప్రతినిధుల నుంచి సిఫార్సు లేఖలు తీసుకుని డీఎంహెచ్‌వో కార్యాలయానికి వస్తుండడం గమనార్హం.

మా ఏపీలో సభ్యత్వం ఉచితం

మాట్లాడుతున్న మా ఏపీ వ్యవస్థాపక అధ్యక్షుడు దిలీప్‌రాజా, ప్రతినిధులు

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే : మా ఏపీ(మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ఆంధ్రప్రదేశ్) 24 విభాగాల సంఘంలో చేరిన సభ్యుని నుంచి వసూలు చేస్తున్న రూ.2 వేల సభ్యత్వ రుసుమును రద్దు చేసినట్లు సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు దిలీప్‌రాజా తెలిపారు. తెనాలిలోని మా ఏపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పారదర్శకత కోసం సభ్యత్వ రుసుము తీసుకోకుండా ఉచితం చేసిన తీర్మానాన్ని అసోసియేషన్ ఆమోదించినట్టు చెప్పారు. దళారుల ప్రమేయం లేకుండా నేరుగా కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. సభ్యత్వ కార్డు గుర్తింపు కార్డు, సభ్యుల సంక్షేమానికి ఉపయోగపడుతుందన్నారు. వచ్చే నెలలో నిర్వహించే అసోసియేషన్ ఎన్నికల్లో ప్రొడక్షన్ బాయ్ నుంచి దర్శకుడు, సాంకేతిక నిపుణుల వరకు పోటీ చేయవచ్చన్నారు. ఆసక్తి గలవారు తెల్ల కాగితంపై వివరాలు రాసి మా ఏపీ కార్యాలయం, ఆలపాటి నగర్, సుల్తానాబాద్, తెనాలి 522 201, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్ చిరునా మాకు పంపించాలని విజ్ఞప్తి చేశారు. ఆధార్ కార్డు, మూడు ఫొటోలు జతపరచి, ఆయా రంగాల్లో అనుభవం వివరాలను నమోదు చేసి ఈ నెల 31 లోపు పంపించాలని కోరారు. ఈ సమావేశంలో నటుడు మిలటరీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైకాపా నాయకుడి నివాసంలో సీబీఐ సోదాలు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: వైద్యవిద్యార్థులకు సీట్ల కేటాయింపు, ఆసుపత్రుల అనుమతుల కోసం మధ్యవర్తిగా వ్యవహరిస్తూ భారీగా లంచాలు తీసుకున్నారన్న ఆరోపణలపై శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లికి చెందిన వైకాపా నాయకుడు, డాక్టర్ బత్తల హరిప్రసాద్ నివాసంలో మంగళవారం అర్ధరాత్రి వరకు సీబీఐ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో వారు నగదు వివరాలు నమోదు చేసిన పుస్తకంతోపాటు కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. బత్తల హరిప్రసాద్ దిల్లీలోని సీబీఐ అధికారుల ఎదుట హాజరుకావాలని ఆయన కుటుంబసభ్యులకు నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. ఎన్‌ఎంసీ సభ్యులతో సత్సంబంధాలు కలిగిన డాక్టర్ బత్తల హరిప్రసాద్ చెన్నై వేదికగా మరికొందరితో కలిసి రెండు తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల్లో వైద్యవిద్యార్థులకు యాజమాన్య కోటా సీట్లు, ప్రైవేటు వైద్యశాలలకు సంబంధించిన అనుమతుల కోసం పెద్ద మొత్తంలో లంచాలు తీసుకున్నట్లు ఫిర్యాదుల అందినట్లు తెలుస్తోంది. కోట్లాది రూపాయలు వసూలు విషయమై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణల దృష్ట్యా దాదాపు 35 చోట్ల ఒకేరోజు సీబీఐ అధికారులు తనిఖీలు చేసినట్లు సమాచారం. డాక్టర్ బత్తల హరిప్రసాద్‌కు చెన్నై, తిరుపతి, హైదరాబాద్ ప్రాంతాల్లో ఇళ్లు, ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నట్లు సీబీఐకి ఫిర్యాదు అందినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే సీబీఐ అధికారులు హరిప్రసాద్ స్వగ్రామమైన కుమ్మరవాండ్లపల్లిలో తనిఖీలు చేసినట్లు తెలుస్తోంది.

అటవీ భూముల పరిరక్షణకు జనసైనికులు వినతుల అందజేత

అరండల్‌పేట, న్యూస్‌టుడే: అటవీ భూములను పరిరక్షించాలని జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు పిలుపు మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాల జనసేన అధ్యక్షులు సమాచార హక్కు చట్టం కింద వివరాలు కావాలంటూ తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అటవీ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడడమే జనసేనాని పవన్‌కల్యాణ్ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో సహ చట్టం ద్వారా సమాచారం తెలియజేయాలని వినతులు అందచేసినట్లు తెలిపారు. అటవీ భూముల వివరాలు అందిన తర్వాత భవిష్యత్తు కార్యాచరణ ప్రకటిస్తామని తెలిపారు.

మిర్చి యార్డు సమాచారం (నిన్నటి ధరలు)

వచ్చిన బస్తాలు:	46,390
అమ్మకాలు:	45,224
నిల్వ:	10,119

నాన్ ఏసీ కామన్ వెరైటీ (క్వింటా రూ..ల్లో)

334	9500-13000
నెంబర్ 5	10000-13200
273	10000-12500
341	10000-13400

నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	10000-14000
బాడిగ	10000-12800
దేవనూరు డీలక్స్	10000-12600
ఆర్మూర్	9700-11000

ఏసీ కామన్ వెరైటీ

334	9500-12800
నెంబర్ 5	10000-13300
273	10000-12400
341	10000-13200
4884	10000-12400
సూపర్10	9800-12800

ఏసీ స్పెషల్ వెరైటీ

తేజ	10000-13600
బాడిగ	10000-12800
దేవనూరు డీలక్స్	10000-12500
తాలు	4500-7000

- న్యూస్‌టుడే, మిర్చియార్డు

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 98, రిటైల్ ధర - 120, చికెన్ విత్‌స్కిన్ - 174, చికెన్ స్కిన్‌లెస్ - 198.

కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -93 రిటైల్ ధర 115 చికెన్ విత్ స్కిన్ - 167, చికెన్ స్కిన్‌లెస్ - 190.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 101, 109, 120 చికెన్ విత్ స్కిన్ - 194 చికెన్ స్కిన్‌లెస్ - 204.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 590 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

91.9 FM Vijayawada
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ఫెడరల్ బ్యాంక్
మీ పరిపూర్ణ బ్యాంకింగ్ భాగస్వామి
ఎల్‌సిఆర్‌డి/ హైదరాబాద్ డివిజన్: ఇంటి నెం. 8-3-903/10, ప్లాట్ నెం.20, 4వ అంతస్తు, జుబిలీ రిడ్జెస్, నాగార్జున కాలనీ, యెల్లారెడ్డి గూడ, హైదరాబాద్- 500073.
ఈమెయిల్: hydlcrd@federalbank.co.in | CIN: L65191KL1931PLC000368
LCRDHYD/NDM/BPK/SN-64/2025-26 02 జులై 2025
అమ్మకం ప్రకటన (ఇ-వేలం ద్వారా మాత్రమే అమ్మకం)
... వేలం తేదీ మరియు సమయం: 11.08.2025 ...
https://www.federalbank.co.in/web/guest/tender-notices and https://bankeauctions.com
SARFAESI చట్టం క్రింద అధీకృత అధికారి
ది ఫెడరల్ బ్యాంక్ లిమిటెడ్ కొరకు.

ఫెడరల్ బ్యాంక్
మీ పరిపూర్ణ బ్యాంకింగ్ భాగస్వామి
ఎల్‌సిఆర్‌డి/ హైదరాబాద్ డివిజన్: ఇంటి నెం. 8-3-903/10, ప్లాట్ నెం.20, 4వ అంతస్తు, జుబిలీ రిడ్జెస్, నాగార్జున కాలనీ, యెల్లారెడ్డి గూడ, హైదరాబాద్- 500073.
ఈమెయిల్: hydlcrd@federalbank.co.in | CIN: L65191KL1931PLC000368.
LCRDHYD/NDM/K&KP/SN-65/2025-26 02 జులై 2025
అమ్మకం ప్రకటన (ఇ-వేలం ద్వారా మాత్రమే అమ్మకం)
... https://www.federalbank.co.in/web/guest/tender-notices ... https://www.bankeauctions.com
SARFAESI చట్టం క్రింద అధీకృత అధికారి
ది ఫెడరల్ బ్యాంక్ లిమిటెడ్ కొరకు.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అసెట్స్ రికవరీ బ్రాంచ్, డోర్ నెం. 54-20-1B/3F/U6, 3వ అంతస్తు, కెఫ్‌సి మేడమీద, సూర్యప్రకాష్ స్క్వేర్, గురునానక్ నగర్ రోడ్డు, విజయవాడ-520008, ఎన్.టి.ఆర్.జిల్లా,
అధీకృత అధికారి వివరములు : పేరు : శ్రీ పి. ప్రవీణ్ కుమార్ (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. 81217 65159
బ్రాంచ్ ల్యాండ్‌లైన్ నెం.: 83328 35007
ఇ-వేలం అమ్మకం ప్రకటన
సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6) నిబంధనతో చదువబడు (సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 క్రింద బ్యాంకునకు తనఖా చేసిన స్థిరాస్తుల అమ్మకము)
... ఇ-వేలం తేదీ: 07-08-2025, సమయం : ఉ॥ 11.00 నుండి సా॥ 04.00 గంటల వరకు ...
www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices ... https://baanknet.com/eauction-psb/x-login & https://baanknet.com ... Mail ID : support.baanknet@psballiance.com ...
తేది: 02-07-2025, ప్రదేశం : విజయవాడ సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

బహిరంగ ప్రకటన
... కాపాడిపేట బాల గంగాధరరావు, అడ్వకేట్, మంగళగిరి. సెల్: 9390799999, 9989870118

ఫెడరల్ బ్యాంక్
మీ పరిపూర్ణ బ్యాంకింగ్ భాగస్వామి
ఎల్‌సిఆర్‌డి/ హైదరాబాద్ డివిజన్: ఇంటి నెం. 8-3-903/10, ప్లాట్ నెం.20, 4వ అంతస్తు, జుబిలీ రిడ్జెస్, నాగార్జున కాలనీ, యెల్లారెడ్డి గూడ, హైదరాబాద్- 500073.
ఈమెయిల్: hydlcrd@federalbank.co.in | CIN: L65191KL1931PLC000368
LCRDHYD/NDM/GVD/SN-66/2025-26 02 జులై 2025
అమ్మకం ప్రకటన (ఇ-వేలం ద్వారా మాత్రమే అమ్మకం)
... గుంటూరు జిల్లా, తాడికొండ మండలం, పొన్నేకల్లు గ్రామం వద్ద గల 149 చ.గజాల విస్తీర్ణంలో డోర్ నెం. 12-5, బ్లాక్ నెం.12, డి.నెం.272/బి గల నివాస భవనం యావత్తు. సరిహద్దులు: తూర్పు: పంచాయతీ బజార్, పడమర: గుర్రం వెంకటేశ్వర్లు ఆస్తి, ఉత్తరం: గుర్రం శ్రీనివాసరావు ఆస్తి మరియు దక్షిణం: పంచాయతీ బజార్.
అమ్మకం యొక్క నియమ నిబంధనల కొరకు ది ఫెడరల్ బ్యాంక్ లిమిటెడ్ వెబ్‌సైట్ అనగా https://www.federalbank.co.in/web/guest/tender-notices మరియు https://www.bankeauctions.in లో ఏర్పాటు చేయబడిన లింక్‌ను రిఫర్ చేయండి.
(అధీకృత అధికారి SARFAESI చట్టం క్రింద)
ది ఫెడరల్ బ్యాంక్ లిమిటెడ్ తరపున

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవలకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95052 76677, 82474 49036.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

మెగా ★ అవకడో ★ ఫామ్ ల్యాండ్‌లో 11 సెంట్లు ★5 లక్షలకే ★ 5వ సంవత్సరం నుండి సంవత్సరంకి 2 లక్షల ఆదాయం పొందండి. ఫోన్: 9133574455.

PLOT FOR SALE

GENERAL

తెనాలి సుల్తానాబాద్, నన్నపనేని నగర్‌లో తూర్పు ఫేసింగ్, 40 అడుగుల రోడ్డు గల 267 చ॥గ॥ VGTM, UDA అప్రూవల్ గల ప్లాటు అమ్మకమునకు కలదు. సంప్ర॥ 91679 79901.

నందనవనం @ చిలకలూరిపేట 500 గజాల స్థలము 3BHK ప్రీమియం విల్లాలు అన్ని సౌకర్యాలతో కేవలం 39 లక్షల రూపాయలు మాత్రమే సంప్రదించండి. 77027 87797, 97005 65357.

JOBS

Wanted Office Assistant (Female) For EPF Consultancy at Guntur. Qul: Graduate with Computers. Sal: Upto 10,000/-. Send Resume to 93924 44479.

Wanted Lady Tele Callers. Preferred Young & Energetic, Talktive Persons. Qualification: Inter & Degree. Contact: Worldwide Education Consultant. Lakshmipuram, Guntur. Cell: 90001 33866.

Tenali Wanted DTP Operator (Experience with Apple Keyboard) Attractive Salary Offered Immediate Joining prefered Cont : 90526 43626.

Wanted Part Time Lady Graduate Teachers, Time: 1.00 P.M. to 8.00 P.M. & For Study Hours: 4.00 P.M. to 8.00 P.M. Sri Satya Sai Ideal School, Chowtra, Guntur-3. ✆: 0863-2222114, 2241837.

Wanted Marketing Executives to work in a reputed organization (8 Hrs Duty). Salary ranges from 12K to 15K. Interested Candidates. ✆: 98499 89951.

Wanted Experienced Tele Callers to work in a reputed organization. Interested Candidates Contact: ✆: 77290 15053.

Wanted Office Asst. (Male) Qua: Any Degree with Computer Knowledge. Maxmuller Publication Guntur. 94941 61313.

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో+వ + మంచి జీతం+ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

గుంటూరు, 11/2, అరండల్‌పేట, SR Images సంస్థలో పనిచేయుటకు రియల్ ఎస్టేట్ రంగంలో అనుభవం కలిగిన అకౌంటెంట్ కావలెను. ✆: 84658 45211.

గుంటూరులో పనిచేయుటకు Shop Keeper, Sales Person, Delivery Boys కావలెను. రైతన్న మిల్క్ డైరీ. 98487 58107.

శివకార్తికేయ హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు ఇంటి/ వంట పనిచేయుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 20K. ✆ 99120 11499, 99120 11899.

గుంటూరులో గల నర్సింగ్ కాలేజి నందు హాస్టల్‌లోనే ఉండి పనిచేయుటకు 10th/ ఇంటర్/ డిగ్రీ చదివిన లేడి వార్డెన్స్ కావలెను. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్స్: 81224 61164, 70327 10958.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

తెనాలి

•తెనాలి •పొన్నూరు

పారిశుద్ధ్య సమస్యలా? తాగునీటి ఇబ్బందులా?

రేపు డయల్ యువర్ కమిషనర్

ఈనాడు తోడు

తెనాలి పురపాలక సంఘం పరిధిలోని సమస్యలపై 'ఈనాడు' ఆధ్వర్యంలో 'డయల్ యువర్ కమిషనర్' కార్యక్రమం నిర్వహిస్తున్నాము. మీ పరిధిలో తాగునీరు, పారిశుద్ధ్యం, అధ్వాన రోడ్లు, వీధి శునకాలు, పూడికతీత, వీధి దీపాల నిర్వహణ తదితర సమస్యలను ఇన్‌ఛార్జి కమిషనర్ **వల్లూరు మహాలక్ష్మీపతిరావు**కు ఫోన్‌లో తెలుపవచ్చు. ఆయన మీతో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తారు. - తెనాలి(కొత్తపేట)

98499 05830
80085 73127

తేదీ: శుక్రవారం (4-7-2025)

సమయం: ఉదయం 11 గంటల నుంచి 12 వరకు

ఆధునిక సాంకేతికతపై కార్యశాల

తెనాలి టౌన్: ఫొటోగ్రఫీ రంగంలో ఏటికేటా అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతికతపై బుధవారం పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో కార్యశాల నిర్వహించారు. సంబంధిత విభాగాల నిపుణులు అవగాహన కల్పించారు. ది తెనాలి ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

తెనాలి టౌన్: లైన్ల నిర్వహణ పనుల నిమిత్తం తెనాలి పట్టణంలోని చినరావూరు, రామలింగేశ్వరపేట, ప్రకాశం మిల్ వాడ, సుందరయ్య నగర్, గాంధీచౌక్, ప్రకాశం రోడ్డు, నందులపేట, రజక చెరువు రోడ్డు తదితర ప్రాంతాల్లో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్తు సరఫరా నిలిపేస్తున్నట్లు డీఈ అశోక్ కుమార్ బుధవారం తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తెనాలి : 80085 73125 పొన్నూరు : 80085 73144

? తెనాలి పట్టణ ముత్తంశెట్టివారిపాలెం దయానంద వారి వీధిలో కల్వర్టు ప్రమాదకరంగా ఉంది. - **శ్రీరామమూర్తి, స్థానికుడు**
✓ పరిశీలించి మరమ్మతులు చేయిస్తాం. ? తెనాలి పట్టణ నాజరుపేట చెరువు వారి వీధిలో వ్యర్థాల గుట్టలు నెల రోజులుగా పడి ఉన్నాయి. - **స్థానికులు** ✓ తొలగింపజేస్తాం. - **పై ప్రశ్నలకు ఇన్‌ఛార్జి మున్సిపల్ కమిషనర్ లక్ష్మీపతిరావు సమాధానాలు ఇచ్చారు.**
? పొన్నూరు పరిధిలోని క్యాబిన్‌పేటలో సిమెంటు రహదారి నిర్మించాలి. - **పి.అనిల్‌బాబు, క్యాబిన్‌పేట** ✓ రహదారి నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం. - **జంగం అపర్ణ, సహాయ ఇంజినీర్**
? పొన్నూరు పట్టణ పరిధిలోని 29వ వార్డులో రెండు రోజులు నుంచి చెత్త తొలగించడం లేదు. - **షేక్ రియాజ్** ✓ చెత్తను తొలగించి విధిగా చర్యలు తీసుకుంటాం. - **శ్రీనివాసరావు, ప్రజారోగ్యశాఖాధికారి**

స్పందనకు వందనం

✦ తెనాలి పట్టణ నాజరుపేట, బస్టాండ్ మార్గంలో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం..మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారులకు తెలిపారు. దీనిపై స్పందించిన ఇంజినీరింగ్ విభాగం సిబ్బంది మరమ్మతులు చేయించారు. ✦ తెనాలి పట్టణ కొత్తపేటలో కుక్కల బెడద అధికంగా ఉందని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగా ద్వారా మున్సిపల్ అధికారులకు తెలిపారు. దీనిపై వారు స్పందించి సమస్య పరిష్కరించారు. ✦ మేమున్నాం...మీకు తోడుగా శీర్షిక 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పొన్నూరు పట్టణ పరిధి ఐల కాలనీలోని మురుగు కాలువలో పేరుకున్న వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులతో తొలగింపజేశారు. శాంతినగర్‌లో వీధి దీపం చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. - **న్యూస్‌టుడే, తెనాలి టౌన్, పొన్నూరు**

సొసైటీకి స్థలం ఇప్పించాలి

తెనాలి(కొత్తపేట): సుమారు దశాబ్ద కాలంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నప్పటికీ రజక వాలంటీర్ సర్వీస్ సొసైటీ ప్రతినిధులు తెలిపారు. వీరు బుధవారం మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. సొసైటీకి కొంత స్థలం ఇప్పించాలని కమిషనర్‌ను ఆయన్ను సత్కరించారు. ✦ తెనాలి పురపాలక వ్యర్థాలను సమీప గ్రామాల రోడ్ల వెంట పోయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడి మృతి చెందారని, నియంత్రించాలని పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం ప్రతినిధులు ఇన్‌ఛార్జి కమిషనర్ మహాలక్ష్మీపతిరావుకు వినతి పత్రం అందించారు.

ప్రత్యేక అలంకరణలో పీర్లు

పొన్నూరు: మొహర్రం సందర్భంగా పట్టణ పరిధి జీబీసీ రహదారిలోని పీర్ల చావిడి వద్ద బుధవారం సాయంత్రం హజరత్ అలీ జెండాను ఎగురవేశారు. పీర్లను ప్రత్యేకంగా అలంకరించారు. చావిడి వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

రాయితీ పొందండి.. సద్వినియోగం చేసుకోండి

తెనాలి టౌన్, న్యూస్‌టుడే

నూతన విద్యా ఏడాది మొదలైన తరుణంలో విద్యార్థులకు, ఇతరులకు అందుబాటులో ఉన్న పాసుల వివరాలను తెనాలి ఆర్టీసీ డిపో మేనేజర్ రాజశేఖర్ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. రాయితీ పాసులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. తెనాలి ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో పాసుల జారీ కేంద్రం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు అందుబాటులో ఉంటుందని, సంబంధిత ధ్రువపత్రాలు అందించి పాసులు పొందవచ్చని చెప్పారు.
◆ ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న బాలికలు, ఏడు వరకు బాలురకు వారి నివాసం ఉంటున్న ప్రాంతం నుంచి 25 కి.మీ పరిధిలోని పాఠశాల వరకు ఉచితంగా పాసులు ఇస్తున్నామన్నారు. సరైన పత్రాలు అందించి, రూ.50 చెల్లించి పాసు తీసుకోవాలని చెప్పారు.
◆ ఇంటర్, డిగ్రీ, బీటెక్, పీజీ చేసే విద్యార్థులకు 66 శాతం రాయితీతో పాసులు ఇస్తున్నారు. రానుపోను ఛార్జీలో 34 శాతం చెల్లిస్తే సరిపోతుంది. ఏడాదికి ఒకసారి తీసుకోవచ్చు. నెల, మూడు, ఆరు నెలల వ్యవధితో కూడా పొందవచ్చు. 50 కి.మీ పరిధిని ఇవి అందుబాటులో ఉంటాయి.
◆ దివ్యాంగులు రూ.100 చెల్లించి కార్డు పొందితే మూడేళ్ల పాటు ఆర్టీసీ బస్సుల్లో 50 శాతం రాయితీ పొందవచ్చు. నూరు శాతం అంగవైకల్యం ఉన్న వారు ఉంటే సరైన ధ్రువపత్రాలు అందిస్తే వారి వెంట ఉండే సహాయకులకు కూడా 50 శాతం రాయితీ అందుతుంది. వీరితో రాష్ట్రంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా పల్లెవెలుగు, అల్ట్రా డీలక్స్, ఎక్స్‌ప్రెస్‌ల్లో ప్రయాణించవచ్చు.
◆ ఉద్యోగ, వ్యాపార, ఇతర అవసరాలకు రోజూ రాకపోకలు సాగించే వారి కోసం నెల వారీ సీజన్ టికెట్లు ఉన్నాయి. 20 రోజుల రాను-పోను ఛార్జీతో 30 రోజుల పాటు తిరగవచ్చు.
◆ 60 ఏళ్ల దాటిన వృద్ధులు టికెట్ ధరలో 25 శాతం రాయితీ పొందవచ్చు. ఇందుకు వారు ప్రయాణిస్తున్న బస్సులో కండక్టర్‌కు ఆధార్ కార్డు లేదా ఇతర ప్రభుత్వ ధ్రువపత్రాలు చూపితే చాలని డిపో మేనేజర్ తెలిపారు.

బస్సు పాసుల జారీ కేంద్రం వద్ద విద్యార్థులు

మహిళలకు సూచనలు చేస్తున్న డీపీవో సాయి కుమార్

శుభ్రత పాటిద్దాం.. ఆరోగ్యవంతంగా ఉందాం

సుద్దపల్లి(చేబ్రోలు), న్యూస్‌టుడే : ఆరోగ్యవంతమైన గ్రామ నిర్మాణం మనందరి బాధ్యతని జిల్లా పంచాయతీ అధికారి సాయి కుమార్ అన్నారు. మండల పరిధి సుద్దపల్లిలోని పారిశుద్ధ్య పనులను ఆయన బుధవారం పరిశీలించి మాట్లాడారు. ఇంటి నుంచి వెలువడే వ్యర్థాలు ఆరు బయట పడేయకుండా తడి చెత్తను ఖాళీ గోతుల్లోను, తడి చెత్తను డబ్బాల్లో వేసి ఇంటికి వచ్చే హరిత రాయబారులకు అందజేయాలని సూచించారు. పంచాయతీ సిబ్బందితో పాటు స్థానికులకు పలు సూచనలు చేశారు. ఈవోపీఆర్డీ రవి శంకర్, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ఎస్పీ చక్రవర్తి, వెంకటేశ్వర్లు, సంధ్యారాణి

నాయకత్వం బాధ్యతకు ప్రతీక

పెదకాకాని, న్యూస్‌టుడే : నాయకత్వం అనేది బాధ్యతకు ప్రతీక అని సీఐడీ ఎస్పీ కె.చక్రవర్తి అన్నారు. పెదకాకానిలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో బుధవారం నిర్వహించిన విద్యార్థుల 'పదవీ స్వీకార వేడుక'కు జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వర్లు, ఎస్పీ అతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థి నాయకత్వ బృందాలకు బ్యాడ్జిలు, గుర్తింపు పత్రాలు అందజేశారు. నాయకత్వంతో సేవ చేయాలని సూచించారు. పాఠశాల ప్రిన్సిపల్ సిస్టర్ సంధ్యారాణి, పాదర్ దర్శరాజు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్థానికులతో మాట్లాడుతున్న అధికారులు

నీటి శుద్ధి ప్లాంట్ స్థల పరిశీలన

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : నీటి శుద్ధి ప్లాంట్ నిర్మాణానికి తెనాలి మండలం కొలకలూరులో అధికారులు బుధవారం స్థల పరిశీలన చేసి, స్థానికులతో మాట్లాడారు. తహసీల్దార్ గోపాలకృష్ణ, డీఎల్‌పీవో స్వరూపరాణి, ఎంపీడీవో దీప్తి, సర్పంచి బి.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. ప్రజా ఫిర్యాదులు, పరిష్కార వేదికలో అందిన ఫిర్యాదు మేరకు కొలకలూరులో సంబంధిత సమస్యను పరిశీలించారు.

దస్తావేజులు పోయినవి

పఠాన్ రహ్మతుల్లాఖాన్ S/o పఠాన్ మహబూబ్ ఖాన్, పఠాన్ అఫ్జల్‌ఖాన్‌బీబీ W/o పఠాన్ రహ్మత్ ఖాన్, డోర్ నెం: 3-98, దావులూరు, కొల్లిపర మండలం వారికి సంబంధించిన కొరిటిపాడు గ్రామ డి.నెం: 38.39రు రీసర్వే దాఖల డి.నెం: 38/3రు నందు గల 210.5 చ॥గు॥ స్థలం తాలూకు లింకు దస్తావేజులు నెం: 5562/1984, 6977/1984లు కల్లిపర నుండి దావులూరు వెళ్లుచుండగా పోయినవి. ఎవరికైన దొరికినచో దయచేసి తెలుపగలరు.

☎ 99490 20116

పొన్నూరు : సహాయ ఇంజినీరు వెంకట రమణపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్ర

తెనాలిలో కరపత్రాలు పంచుతున్న తెదేపా నాయకులు

పారదర్శక సుపరిపాలనే కూటమి లక్ష్యం

పొన్నూరు, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజలకు పారదర్శకంగా సుపరిపాలన అందిస్తున్నామని ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ పేర్కొన్నారు. మండల పరిధి మామిళ్లపల్లిలో బుధవారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడినప్పటికీ సిబ్బందికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని, విద్యుత్తు ఉప కేంద్రంలో సిబ్బంది పనితీరు బాగు లేదని స్థానికులు చెప్పడంతో ఆ శాఖ సహాయ ఇంజినీరు వెంకట రమణపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం సచివాలయం వద్ద జరిగిన గ్రామ సభలో జడ్పీ ఉన్నత పాఠశాలకు మాజీ మంత్రి ధూళిపాళ్ల వీరయ్య చౌదరి పేరు పెట్టాలని గ్రామస్థులు ఏకగ్రీవంగా తీర్మానం చేశారు. తెదేపా నేతలు పాల్గొన్నారు.

తెనాలి టౌన్: 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా తెదేపా నాయకులు తెనాలి పట్టణ, మండలంలో పర్యటించారు. గత ఏడాది కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని, రాష్ట్రంలో చేపట్టిన ప్రగతిని వివరించారు. గురువారం జరిగే పర్యటనలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొంటారని తెలిపారు.

ఘనంగా సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపక దినోత్సవం

కొల్లిపర పీహెచ్‌సీలో పండ్లు పంపిణీ చేస్తున్న మేయర్ ప్రమీలారాణి

తెనాలి : పతాకం ఆవిష్కరిస్తూ..

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం ఐతానగర్‌లోని చర్చిలో ఘనంగా నిర్వహించారు. పతాక ఆవిష్కరణ చేశారు. గేరా థామస్, సీయోను కుమార్, క్రీస్తుదాసు, రాజకుమారి, జక్రయ్య, రవి కుమార్, కనకరత్నం, నరసింహారావు, ఆశీర్వాదం, యువ ప్రతినిధులు పాల్గొన్నారు.
కొల్లిపర: సాల్వేషన్ ఆర్మీ భక్తులను సన్మార్గంలో నడిపించడంలో 160 వసంతాలను పూర్తి చేసుకుందని మేయర్ జాన్‌మార్కు అన్నారు. సాల్వేషన్ ఆర్మీ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఇందులో భాగంగా కొల్లిపర పీహెచ్‌సీలో మేయర్ కె.ప్రమీలారాణి పండ్లు పంపిణీ చేశారు. అన్నవరంలో చేపట్టిన సేవా కార్యక్రమాలను కెప్టెన్ వెంకటేశ్వరరావు వివరించారు. దివ్యాంగులకు దుస్తులు ఇచ్చారు. సంఘ కాపరులు నక్కా అనిల్ కుమార్ పాల్గొన్నారు.

బీమా ఇస్తోంది ఆర్థిక భరోసా..

కొల్లిపర, న్యూస్‌టుడే : రూ.200 బీమా చెల్లించి ప్రకృతి విపత్తుల నుంచి మినుము పంటను కాపాడుకోవాలని వ్యవసాయ శాఖ ఏడీ కారి ఎస్.శ్రీనివాసరెడ్డి అన్నారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా బుధవారం అత్తోట తదితర గ్రామాల్లో ఆయన పర్యటించి మాట్లాడారు. విపత్తుల సమయంలో ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారంగా బీమా కంపెనీ చెల్లిస్తుందని తెలిపారు. వరికి ఎకరాకు రూ.800 చెల్లిస్తే రూ.40 వేలు బీమా రక్షణ లభిస్తుందన్నారు. మాసూలుకు మినుము పైరుకు బీమా చేయించుకోవాలన్నారు.

9వ వర్ధంతి

జననం: 12-01-1960 మరణం: 03-07-2016

కీ.శే. శ్రీమతి చదలవాడ సుజాత గారు

మీరు గడిపిన మధుర స్మృతులు మా హృదయాలలో సదా చిరస్మరణీయం
మా స్మృతిలో...

భర్త: చదలవాడ కృష్ణారావు
Administrative officer (Retd), CRDA -Vijayawada

కుమారులు, కోడళ్లు
చదలవాడ రవీంద్ర - శ్రీవిద్య
Dr. చదలవాడ ప్రదీప్ - హైమావతి
మనుమడు : జయనందన్

ఖాళీలు భర్తీ చేస్తేనే.. సేవలు సులభం

తెనాలి (కొత్తపేట), న్యూస్‌టుడే

గుంటూరు సర్వజన ఆసుపత్రి తర్వాత జిల్లాలో పెద్దది తెనాలి జిల్లా వైద్యశాల. ఇందులో చర్మ, మానసిక, ఫోరెన్సిక్ వైద్య నిపుణుల పోస్టుల ఖాళీలు భర్తీ చేయలేదు. ఈ విభాగాల ఓపీ రోగులకు పీజీ వైద్య విద్యార్థులు పరీక్షలు చేసి మందులు రాస్తున్నారు. నవజాత శిశు సంరక్షణ కేంద్రంలో నలుగురికి ముగ్గురు వైద్యులే సేవలు అందిస్తున్నారు. బాపట్ల జిల్లా ప్రాంతీయ ఆసుపత్రిలోని వంద పడకలకు 24 మంది నర్సులను నియమించారు. ఈ మేరకు 300 పడకలు ఉన్న తెనాలి జిల్లా వైద్యశాలకు 72 మంది ఉండాలి. కానీ 37 మందితో కాలం గడుపుతున్నారు. ఫార్మాసిస్టులు అయిదుగురికి గాను ముగ్గురితో రోగులకు మందులు పంపిణీ ఇప్పిస్తున్నారు. సి.టి.స్కాన్ యంత్రం పాడై ఐదేళ్లు. ప్లాస్మా, ఎర్ర రక్త కణాలు, ప్లేట్ లెట్స్ వర్గీకరణ యంత్రాలు వచ్చినా బిగించడంలో జాప్యం చేస్తున్నారు.

గుత్తేదారులే చెల్లిస్తున్నారు

ఇక ఎఫ్ఎన్‌వోలు, ఎంఎన్‌వోలను తగినంత మందిని నియమించ లేదు. దీంతో సహాయకులు తమ వారికి చక్రాల కుర్చీలో కూర్చోపెట్టుకొని వివిధ రకాల పరీక్షల కేంద్రాలకు తీసుకువెళ్లి వస్తున్నారు. పారిశుద్ధ్యం, భద్రత, పెస్ట్ కంట్రోల్ విభాగాల్లో నియమితులైన ఉద్యోగులు 15 మందిని ఓపీలు రాయించడం వంటి వాటికి వినియోగిస్తున్నారు. వీరి జీతాలు ఆయా విభాగాల గుత్తేదారులు చెల్లిస్తున్నారు. ఆసుపత్రిలోని భూగర్భ మురుగు పారుదల వ్యవస్థ పూర్తిగా ధ్వంసమైంది. తరచూ మురుగు ముందుకు కదలక దుర్వాసనతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ ఆసుపత్రిలో ఏఆర్‌టీ సెంటర్, క్షయ విభాగం, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స విభాగం, పుట్టుకతో పిల్లల్లో లోపాలు గుర్తించి సత్వర చికిత్సలు, శస్త్ర చికిత్సలు అందించే జిల్లా సత్వర చికిత్స కేంద్రం, అలాగే డయాలసిస్ సెంటర్ ఉన్నాయి.

అయిదేళ్లుగా అద్దె భవనాల్లోనే..

తెనాలిలో ఇప్పటికే నడుస్తోన్న పట్టణ ఆరోగ్య కేంద్రం కాకుండా మరో ఐదు కేంద్రాలు మంజూరు అయ్యాయి. వీటిలో మూడింటికి సొంత భవనాలు ఉన్నాయి. రెండు భవనాలు పగుళ్లు ఇచ్చినా ఇంజినీర్లు సదరు గుత్తేదారులతో వాటిని తిరిగి నిర్మించ లేదు. రాష్ట్రంలోని అన్ని పట్టణ ఆరోగ్య కేంద్రాల భవనాల నిర్మాణం పూర్తి చేసి వినియోగంలోకి తెచ్చారు. కానీ తెనాలి మున్సిపల్ ఇంజినీర్లు మరో రెండు భవనాల నిర్మాణాలు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురాక పోవడంతో వాటిని ఐదేళ్ల నుంచి అద్దె భవనాల్లో నడుపుతున్నారు. వీరి నిర్వాకంతో వీటికి ఇచ్చిన వైద్య సామగ్రి రోగులకు వినియోగానికి నోచుకోవడం లేదు. వీటిలోని అల్ట్రా సౌండ్ పరీక్ష పరికరాలను ఇప్పటికే సమీపంలోని పెద్దాసుపత్రులకు పంపించారు. ఆరు పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో రెండింటికి వైద్యులు లేరు. మిగతా వాటిలో ఉన్న వారినే వారంలో సగం రోజులు వాటిలో సేవలందించాలని పురమాయిస్తున్నారు.

తెనాలి జిల్లా వైద్యశాల ముఖద్వారం

పెదరావూరు : బదిలీ అయిన ఉపాధ్యాయులను సన్మానిస్తూ..

ఆత్మీయ వీడ్కోలు

వల్లభాపురంలో వహబ్‌ను సత్కరిస్తూ..

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : పెదరావూరు జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై ఇతర బడులకు వెళ్తున్న ఉపాధ్యాయులు మధుమయి, సాయిబాబు, ప్రదీప్‌కుమార్, మాధవీ కుమారి, నాగేశ్వరరావు, విజయనిర్మల, కుసుమకుమారి, రాజేశ్వరిలకు ఆత్మీయ వీడ్కోలు పలికారు. ప్రధానోపాధ్యాయిని సరళ పర్యవేక్షణలో వారిని సత్కరించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.
నారాకోడూరు (చేబ్రోలు): మండల పరిధి నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎనిమిదేళ్ల పాటు అంకిత భావంతో పని చేసి బదిలీ అయిన ఉపాధ్యాయులు టి.స్వర్ణగౌరి, ఎన్.సరోజని, ఈ.మాధవిలత, కె.అరుణ కుమారి, ఎ.శ్రీనివాసరావు, బి.వెంకటేశ్వరరావులను ఆ పాఠశాలలోని ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ఏడుకొండలు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
కొల్లిపర, న్యూస్‌టుడే : పాఠశాలలో షేక్ వహబ్ ఉపాధ్యాయుడిగా సేవలందించి బడికి, గ్రామానికి వన్నెతెచ్చారని హెచ్‌ఎం ఖాన్ అన్నారు. వల్లభాపురం ప్రాథమిక పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం వహబ్‌ను సత్కరించారు. ఉపాధ్యాయులు రవికిషోర్, ఉమాదేవి, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

SBI భారతీయ స్టేట్ బ్యాంక్

బజారు బ్రాంచి (12871), తెనాలి, గుంటూరు జిల్లా-522201

స్వాధీనత ప్రకటన

APPENDIX IV (రూలు-8(1) (స్థిరాస్తి కొరకు)

ఇందుమూలముగా సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం-2002 (నెం.54 ఆఫ్ 2002) ప్రకారం భారతీయ స్టేట్ బ్యాంక్, బజారు బ్రాంచి, తెనాలి, గుంటూరు జిల్లా యొక్క అధీకృత అధికారిగా దిగువ సంతకందారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క సెక్షన్ 13 (12) 3వ నిబంధన క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ, సదరు నోటీసు స్వీకరించిన తేది నుండి 60 రోజులలోపు నోటీసులో తెలిపిన ఋణము మొత్తము ది.24-04-2025 నాటికి బకాయి **రూ.20,26,678/-** (అక్షరాల ఇరవైలక్షల ఇరవైఆరువేల ఆరువందల డెబ్బైఎనిమిది రూపాయలు మాత్రమే) మరియు ది.25-04-2025 నుండి చెల్లించవలసిన వడ్డీ, ఖర్చులతో సహా చెల్లించమని కోరుతూ ఋణగ్రహీతలు: మెస్సర్స్ శ్రీ లక్ష్మీ దేవి సూపర్ మార్కెట్, ప్రో॥ శ్రీ చలువాది రమేష్, తండ్రి: సిహెచ్. వెంకటేశ్వర్లు, డోర్ నెం.10-18-1/3, చెంచుపేట, తెనాలి, గుంటూరు జిల్లా. హామీదారు: శ్రీ చలువాది రమేష్, తండ్రి: సిహెచ్. వెంకటేశ్వర్లు, డోర్ నెం.10-18-1/3, చెంచుపేట, తెనాలి, గుంటూరు జిల్లా. యంయస్‌యంఇ సిసి స్మార్ట్‌స్కోర్ అకౌంట్ నెం: 38220708704 వీరిని కోరుతూ ది:24-04-2025 డిమాండ్ నోటీసు జారీచేయడమైనది.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీతలు విఫలమైనందున సదరు రూల్ "8"తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన స్థిరాస్తిని సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 ప్రకారం ఈ దిగువ సంతకందారు ఈ రోజున సింబాలిక్ స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీతకు/హామీదారుకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఈ స్థిరాస్తితో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన పక్షంలో అవి భారతీయ స్టేట్ బ్యాంక్ యొక్క ఛార్జీకి మొత్తం బకాయి ది.24-04-2025 నాటికి **రూ.20,26,678/-** మరియు తదుపరి వడ్డీ + ఖర్చులు మొదలగువాటికి లోబడి ఉంటాయని ఋణగ్రహీతకు/తనఖాదారుకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా తెలియపరచటమైనది.

ఋణగ్రహీతలు సదరు చట్టంలో సబ్ సెక్షన్(8) ఆఫ్ సెక్షన్ 13 ప్రకారం తనఖా ఆస్తిని గడువులోపల విడిపించుకొనుటకు గాను దృష్టి సారించవలసి ఉన్నది.

తనఖాపెట్టిన స్థిరాస్తి వివరము

గుంటూరు జిల్లా, తెనాలి, డోర్ నెం.10-18-1, బ్లాక్ నెం.1, 1వ వార్డు, టియస్ నెం.144/7 లోని 156.21 చ॥గు॥ల విస్తీర్ణములో నిర్మించిన ఆర్‌సిసి భవనము శ్రీ చలువాది రమేష్, తండ్రి: సిహెచ్. వెంకటేశ్వర్లు గారికి చెందిన రిజిష్టర్డ్ గిఫ్ట్ డీడ్ నెం.5227/2006, తేది: 16-09-2006, తెనాలి యస్ఆర్ఓ, గుంటూరు జిల్లా. **హద్దులు:** తూర్పు: ప్లాట్ నెం.యల్ఐజి ఎ-94, దక్షిణం: ప్లాట్ నెం.యల్ఐజి ఎ-96, పడమర: 60 అడుగుల వెడల్పుగల రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నెం.యల్ఐజి ఎ-97.

తేది :27-06-2025
ప్రదేశం: తెనాలి

అధీకృత అధికారి
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

స్పందించారు.. పనులు ఆరంభించారు

పర్యవేక్షిస్తున్న డీసీ ఛైర్మన్ దుద్దుకుమారి బూషిబాబు తదితరులు

పెదకాకాని, న్యూస్‌టుడే : గుంటూరు ఛానల్‌లో తూడు కాడ పేరుకుపోయి చివరి భూముల వరకు నీరు అందే పరిస్థితి లేదని 'నిర్వహణ ఇలా..నీరు పారేదెలా' శీర్షికన జూన్ 23న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఛానల్‌లో తూడుకాడ తొలగింపు పనులను బుధవారం ఆరంభించారు. గుంటూరు ఛానల్ డీసీ ఛైర్మన్ దుద్దుకుమారి బూషిబాబు, ఎంపీటీసీ సభ్యుడు మోపర్తి శ్రీనివాసరావు, ఏఈ చందన తదితరులు పాల్గొన్నారు.

ఒప్పంద ఉద్యోగి మృతి

తెనాలి(కొత్తపేట): మలేరియా సబ్ యూనిట్ కార్యాలయ హెల్త్ అసిస్టెంట్(ఒప్పంద ఉద్యోగి) గుత్తికొండ మహేష్ బాబు(45) అనారోగ్యంతో బుధవారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈ మేరకు కార్యాలయ అధికారులు, ఉద్యోగులు ఆయన మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు.

రోడ్డు మూసేస్తే రాకపోకలెలా?

చినరావూరు తోటలో సుమారు 40 రోజుల కిందట నూతన రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించి పది రోజుల కిందట పూర్తి చేశారు. రహదారిని రెండు భాగాలుగా నిర్మిస్తే ప్రజల రాకపోకలు సాగేవి. అలా కాకుండా మొత్తం పనులు ఒకేసారి చేపట్టడంతో పలు కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పరిష్కారం చూపాల్సిన అవసరం ఉంది. **- న్యూస్‌టుడే, తెనాలి టౌన్**

పోలీసుల అదుపులో పాత బంగారం కొనుగోలు ముఠా

పెదకాకాని, న్యూస్‌టుడే : పాత బంగారం కొనుగోలు చేస్తామని మోసగించిన ముఠాను శ్రీకాళహస్తి పోలీసులు పెదకాకాని బాజిబాబా దర్గా వద్ద బుధవారం అదుపులోకి తీసుకున్నారు. పెదకాకాని, శ్రీకాళహస్తి పోలీసుల కథనం ప్రకారం.. పాత బంగారానికి రెట్టింపు ధర ఇచ్చి కొనుగోలు చేస్తామని శ్రీకాళహస్తిలో కొందరిని నమ్మించారు. బంగారం కొనుగోలు చేసిన తర్వాత నోట్ల కట్టపై అసలు కరెన్సీ పెట్టి లోపల డమ్మీ నోట్లు ఉంచారు. గుర్తు పట్టకుండా ప్యాకింగ్ చేసి ఇచ్చారు. ఇలా పలువురిని మోసగించినట్లు బాధితుల ఫిర్యాదుతో శ్రీకాళహస్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు ముగ్గురు వ్యక్తులు, ఇద్దరు మహిళలు పెదకాకాని బాజిబాబా దర్గాలో తలదాచుకున్నట్లు వచ్చిన సమాచారంతో స్థానిక పోలీసుల సహకారంతో నిందితులను అదుపులోకి తీసుకొని శ్రీకాళహస్తికి తరలించారు.

అత్తింటి వేధింపులపై ఫిర్యాదు

తెనాలి టౌన్, న్యూస్‌టుడే : భర్త, అత్తింటి కుటుంబ సభ్యులు అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ పట్టణ నందులపేటకు చెందిన మహిళ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు రెండో పట్టణ పోలీసులు బుధవారం తెలిపారు.

న్యాయం చేయాలని వినతి

పెదకాకాని, న్యూస్‌టుడే : తనకు న్యాయం చేయాలని అత్తింటి ఎదుట కోడలు నిరసన తెలిపిన ఘటన ఉప్పలపాడులో బుధవారం జరిగింది. బాధితురాలి కథనం మేరకు.. పల్నాడు జిల్లా అవిశాయపాలేనికి చెందిన స్వప్నకు పెదకాకాని మండలం ఉప్పలపాడుకు చెందిన పెద్ది రాజేష్ కుమార్‌తో పదిహేనేళ్ల కిందట వివాహమైంది. వీరికి సంతానం కలగలేదు. ఈ క్రమంలో ఏడాదిన్నర కిందట అనారోగ్యంతో భర్త మృతి చెందారు. అప్పటి నుంచి అత్తింటి వారు స్వప్నను పట్టించుకోవడం లేదు. దీంతో ఆమె పోషణ భారంగా మారిందని, తన భర్తకు రావాల్సిన ఇల్లు, స్థలాలు తనకు ఇవ్వాలని ఆమె అత్తింటి ఎదుట నిరసన తెలిపారు. అత్తమామలు పైసా ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఆరోపించారు. వివాహ సమయంలో పుట్టింటి వారు ఇచ్చిన రూ.2 లక్షల నగదు, 20 సవర్ల బంగారం కూడా ఇవ్వకుండా వేధిస్తున్నారని ఆవేదన చెందారు. దీనిపై సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని ఏమైనా సమస్య లుంటే పోలీస్ స్టేషన్‌కి వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆమె స్టేషన్‌కి వెళ్లారు.

నట్టల నివారణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

తెనాలి(కొత్తపేట), న్యూస్‌టుడే : గొర్రెలు, మేకల్లో మొదటి విడత ఉచిత సామూహిక నట్టల నివారణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెనాలి డివిజన్ పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకురాలు డాక్టర్ వై.పద్మావతి కోరారు. ఆమె బుధవారం పట్టణ పరిధిలో నిర్వహించిన నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. గత నెల 26న ప్రారంభించిన ఈ కార్యక్రమం ఈ నెల 10 వరకు ఉంటుందన్నారు.

చౌక బియ్యం స్వాధీనం

చేబ్రోలు, న్యూస్‌టుడే : కొల్లూరు నుంచి నారాకోడూరు మీదుగా వట్టిచెరుకూరు మండలంలోని ఓ రైస్‌మిల్లుకు చౌక బియ్యం తరలిస్తున్నారని వచ్చిన సమాచారంతో బుధవారం రాత్రి నారాకోడూరులో విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీ చేపట్టారు. ఒక వాహనంలో 72 బస్తాల్లో ఉన్న బియ్యాన్ని గుర్తించారు. డ్రైవర్ శ్రీనివాసరావును అదుపులోకి తీసుకుని వాహనాన్ని చేబ్రోలు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కాగా ఈ బియ్యాన్ని సునీల్ అనే వ్యాపారి అనంతవరప్పాడుకు తరలిస్తున్నట్టు సమాచారం.

అమృతమూర్తికి అశ్రుతాంజలి

జననం: 01-08-1944 మరణం: 19-06-2025

ఆదర్శవిలువలతో జీవిత వైభవాన్ని ప్రారంభించి, మానవత్వం - మంచితనం మూర్తీభవించిన మహామనిషిగా ఎదిగి, కుటుంబ ఉన్నతికోసం, గ్రామ అభివృద్ధికోసం అహర్నిశలు కృషిచేసి అందరి హృదయాల్లో సుస్థిరస్థానాన్ని సంపాదించుకొని భౌతికంగా మమ్ములను వీడి దైవసన్నిధికి చేరుకున్న మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

కీ॥శే॥ కూనంనేని వెంకటేశ్వరరావు గారు
నడిగడ్డపాలెం - చుండూరు (మం)

భార్య: రామశేషమ్మ

కుమారుడు - కోడలు: కూనంనేని గిరిష్ - లక్ష్మీసునీత
మనుమరాండ్రు: కూనంనేని ప్రత్యూష, లహరి
కుమార్తె - అల్లుడు: యలమంచిలి నిమ్మి - శివ దుర్గ శేషు శ్రీబాబు
మనుమరాండ్రు: యలమంచిలి శ్రీఆముక్త, శ్రీనిహారిక

పెద్దకర్మ: ఈరోజు ది: 03.07.2025 గురువారం నడిగడ్డపాలెంలోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయటమైనది.

మంగళగిరి

• మంగళగిరి • తాడికొండ • ప్రత్తిపాడు

అమరావతి నిర్మాణ పనుల్లో వేగం పెంచాలి

తాగు నీటి పైపులను పరిశీలిస్తున్న ఏడీసీ ఛైర్‌పర్సన్ డి.లక్ష్మీపార్థసారథి

తుళ్లూరు, న్యూస్‌టుడే: అమరావతి నిర్మాణ పనులు చేపట్టిన గుత్తేదారులు నిర్దేశిత గడువులోగా లక్ష్యాలు చేరుకోవాలని అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ) ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డి.లక్ష్మీపార్థసారథి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆమె అమరావతిలో నిర్మాణంలో ఉన్న రాజధాని ఎన్‌-9, ఈ-12, ఈ-5, ఈ-7 రహదారులను పరిశీలించారు. మురుగు, వరద నీటి కాలువలు, తాగు నీటి సరఫరా మార్గాలు, ఐసీటీ, విద్యుత్తు డక్ట్‌ల పనుల్లో నాణ్యతను పరిశీలించారు. ఏడీసీ అధికారులు, గుత్తేదారు సంస్థల, పీఎంసీల సమన్వయంతో నిర్మాణ పనులు ఆవాంతరాలు లేకుండా రోజువారీ ప్రణాళికలతో వేగం పెంచాలని సూచించారు. పాలవాగు, గ్రావిటీ కెనాల్స్ అభివృద్ధి పనులను సైతం పరిశీలించారు. ఆమె వెంట ఏడీసీ చీఫ్ ఇంజినీర్, ఎస్‌ఈలు, వై.నరసింహారావు, వి.శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మంగళగిరి: 80085 73111 ప్రత్తిపాడు: 99596 89564 తాడికొండ: 97053 99233

? ప్రత్తిపాడులోని మల్లాయపాలెం వెళ్లే రోడ్డు పక్కన చెత్త, వ్యర్థాలను కుప్పలుగా వేస్తున్నారు. దుర్వాసనతో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. **-స్థానికులు, ప్రత్తిపాడు**
✔ వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులతో తొలగించేస్తాం. **- షేక్.ఖాజా, పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి, ప్రత్తిపాడు.**

◆ ప్రత్తిపాడు శ్రీవేణుగోపాలస్వామి ఆలయం ఎదుట ఉన్న కుళాయి వాల్వ్ తొట్టిలో మురుగునీరు నిలిచింది. వ్యర్థాలతో అపరిశుభ్రంగా ఉన్న దానిని స్థానికులు 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన పంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శి షేక్.ఖాజా స్పందించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, ప్రత్తిపాడు**

స్పందనకు వందనం

సామాజిక సేవకు గుర్తింపు

పురస్కారాలతో మంగళగిరి రోటరీ క్లబ్ ప్రతినిధులు

మంగళగిరి, న్యూస్‌టుడే: రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరికి ఉత్తమ పురస్కారాలు లభించాయి. ఈ మేరకు రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు గాజుల శ్రీనివాసరావు, అందె మురళీమోహన్, ఛార్టర్ అధ్యక్షుడు అనిల్‌చక్రవర్తిలతో కలిసి మంగళగిరిలోని కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. గత నెల 29వ తేదీ హైదరాబాద్‌లోని హైదవ గౌరిక్ కన్వెన్షన్‌లో జరిగిన రోటరీ జిల్లా 3150 అవార్డ్స్ పంపిణీలో మంగళగిరికి 25 ఉత్తమ పురస్కారాలు లభించినట్లు చెప్పారు. ఆంధ్రా రీజియన్‌లో తనకు ఉత్తమ అధ్యక్షుడిగా బంగారు పురస్కారం లభించిందన్నారు. కార్యదర్శి మురళీమోహన్, ఛార్టర్ అధ్యక్షుడు అనిల్ చక్రవర్తికి బెస్ట్ స్టాండింగ్ డిస్ట్రిక్ట్ కో ఛైర్మన్ అవార్డును అందించారని తెలిపారు. కాళ్లు చేతులు కోల్పోయిన వారికి కృత్రిమ చేతులు, కృత్రిమ కాళ్లను మంగళగిరి రోటరీ అందజేసిందని తెలిపారు. పాడి పరిశ్రమకు దోహదపడే పశువైద్యశాల పునరుద్ధరణ, పాఠశాలల్లో జలశుద్ధి కేంద్రాలు ఏర్పాటు చేసినందుకు గాను ఉత్తమ పురస్కారాలు లభించినట్లు తెలిపారు. రోటరీ నూతన అధ్యక్షుడు ప్రగడ రాజశేఖర్, కార్యదర్శి నిరంజన్‌గుప్తా, డైరెక్టర్లు వల్లమాడి శ్రీనివాసరావు, రావెల శ్రీనివాసరావు, కాపరౌతు సుందరయ్య, నూతలపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి పైపుల చోరీ

తుళ్లూరు, న్యూస్‌టుడే: వడ్డమాను గ్రామంలో సాగు నీరు అందించే వెంకటేశ్వర ఎత్తిపోతల పథకం స్కీంకు సంబంధించిన పైపులను దొంగలు అపహరించుకుపోతున్నారు. మంగళవారం వడ్డమాను గ్రామంలో భూమిలో ఉన్న సాగు నీటి పైపులను దొంగలు చోరీ చేశారు. దొంగలను పట్టుకొని కేసులు నమోదు చేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ ఘటనపై తుళ్లూరు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు వారు తెలిపారు.

ఉపాధ్యాయులకు సత్కారం

రేవేంద్రపాడు(దుగ్గిరాల), న్యూస్‌టుడే: విద్యార్థులకు విలువైన బోధన చేసిన ఉపాధ్యాయులు బదిలీ అయినా ఎప్పటికీ గుర్తుంటారని ప్రధానోపాధ్యాయుడు బి.కృష్ణారావు అన్నారు. రేవేంద్రపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన 9 మంది ఉపాధ్యాయులను బుధవారం స్కూలులో ఘనంగా సత్కరించారు. విశ్రాంత హెచ్‌ఎం చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

'గిడ్డంగులు లేకపోవడం వల్లే పొగాకు కొనుగోళ్లలో ఆలస్యం'

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు నియోజకవర్గంలో పొగాకుకొనుగోళ్ల కేంద్రం ఏర్పాటుకు తగిన గిడ్డంగులు లేకనే ఆలస్యం జరుగుతోందని తెదేపా మండల అధ్యక్షుడు గింజుపల్లి శివరామ ప్రసాద్ చెప్పారు. ప్రత్తిపాడు తెదేపా కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రైవేటు పత్తి మిల్లుల యజమానులతో అధికారులు చర్చలు జరుపుతున్నారని, పొగాకు పూర్తిగా కొనుగోలు చేయించేందుకు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు చర్యలు తీసుకుంటున్నారన్నారు.

బడి పిలుస్తోంది.. రండి

పాఠశాల మానేసిన విద్యార్థులు, ప్రవేశాల పెంపుపై ప్రత్యేక దృష్టి

మండలం	వివరాలు ఇలా.. ప్రభుత్వ పాఠశాలలు	విద్యార్థులు	బడికి దూరంగా వారు (డ్రాపౌట్స్)
మేడికొండూరు	53	4,302	250
ఫిరంగిపురం	57	4,400	150
తాడికొండ	48	4,212	422
తుళ్లూరు	45	3,041	----

మేడికొండూరు, ఫిరంగిపురం గ్రామీణం, తాడికొండ, ప్రత్తిపాడు, న్యూస్‌టుడే

రాష్ట్ర ప్రభుత్వం బడి ఈడు పిల్లలందరూ చదువుకోవాలనే సంకల్పంతో ముందుకెళ్తోంది. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి పాఠశాలలు పునఃప్రారంభించి సుమారు 20 రోజులు కావొస్తుంది. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో సర్కారు బడుల్లో పిల్లలకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను సకాలంలో అందించారు. దీనికి తోడు మధ్యాహ్నం సన్న బియ్యంతో నాణ్యమైన భోజనం పెడుతున్నారు. కానీ ఇంకా కొంత మంది బడికి దూరంగా ఉండడం (డ్రాపౌట్స్), ప్రత్తిపాడు నియోజకవర్గంలో పలు చోట్ల ఒకటో తరగతిలో ప్రవేశాలు సున్నాగా నమోదవడంపైనా విద్యాశాఖ ప్రత్యేక దృష్టి పెట్టింది. విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు గ్రామాల్లో బడికి రాని పిల్లల ఇంటికి నేరుగా వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడుతున్నారు. చదువు ప్రాధాన్యం, ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను వివరిస్తున్నారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని, ఆందోళన, అపోహలు వదిలేసి బాలికలను చదివించాలని భరోసా ఇస్తున్నట్లు మేడికొండూరు ఎంఈవో అబ్దుల్ అలీం తెలిపారు.

మేడికొండూరులో విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. ఒకటో తరగతి ప్రవేశం కోసం ఆధార్, పుట్టిన తేదీ లేని విద్యార్థులకు ప్రత్యేక ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేసి వాటి ద్వారా ప్రవేశాలు పెంచేందుకు కృషి చేస్తున్నాం. **-సీవీ రేణుక, డీఈవో**

గ్రావెల్ లారీల నిలిపివేత

తుళ్లూరు: అనంతవరంలో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు పర్యటించారు. అక్కడ అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్న లారీలను గమనించి గ్రావెల్ తరలించకుండా నిషేధించారు. గతంలో ఇక్కడి కొండ ప్రాంతంలో ఐదుగురు వ్యక్తులు గ్రావెల్, కంకర తరలిస్తుండగా గనులశాఖ నుంచి లీజుకు అర్జీలు పెట్టుకున్నారు. వాటికి పూర్తి స్థాయిలో అనుమతులు రాలేదని స్థానికులు చెబుతున్నారు.

చెత్త సేకరణ పక్కాగా చేయాలి

లాలుపురం(ప్రత్తిపాడు), న్యూస్‌టుడే: లాలుపురం గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు ఇంటింటా చెత్త సేకరణ ప్రతి రోజు చేయాలని జడ్పీ సీఈవో వి.జ్యోతి బసు ఆదేశించారు. గ్రామీణ గుంటూరు మండలం లాలుపురం గ్రామంలో బుధవారం పర్యటించారు. చెత్త సేకరణ, మంచినీటి సరఫరా, పారిశుద్ధ్యం తీరును పరిశీలించారు.

మోకాళ్లపై మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

మంగళగిరి, న్యూస్‌టుడే: వేతనాలు పెంచాలని కోరుతూ మంగళగిరిలో మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మె బుధవారం నాటికి మూడో రోజుకు చేరింది. ఈ మేరకు నగరపాలక కార్యాలయం ఎదుట రిలే దీక్ష చేస్తూ దశలవారీ ఆందోళనకు సిద్ధమైనట్లు హెచ్చరిస్తున్నారు. ఇందులో భాగంగా మోకాళ్లపై నిలబడి ఆందోళన నిర్వహించారు. తక్షణం ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో నాయకులు బాలాజీ, కమలాకర్, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తెదేపా మండల, గ్రామ అధ్యక్షుల ఎన్నిక

ఫిరంగిపురం (గ్రామీణం), న్యూస్‌టుడే: ఫిరంగిపురం మండలం తెదేపా అధ్యక్షుడిగా గతంలో పని చేసిన మండవ చిన్న నరసింహారావు, ఫిరంగిపురం గ్రామ పార్టీ అధ్యక్షుడిగా కటికల లోకారావు తిరిగి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండోసారి పదవీ బాధ్యతలు అప్పగించిన ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వారికి పలువురు అభినందనలు తెలిపారు.

ఎన్ని ఇబ్బందులు ఎదురైనా హామీల అమలు

తుళ్లూరు: హరిశ్చంద్రపురంలో ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో..

తుళ్లూరు, తాడికొండ, ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలు అందుకుంటుందని తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలో రాష్ట్రం స్వర్ణాంధ్ర దిశగా వేగంగా అడుగులు వేస్తుందన్నారు. బుధవారం మండలంలోని హరిశ్చంద్రపురం, బోరుపాలెం గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ✦ తాడికొండ మండలం పొన్నెకల్లు, మోతడక గ్రామాలలో తెదేపా నాయకులు నెల్లూరి కాంతారావు, కంచర్ల సాంబశివరావు, ప్రత్తిపాడు మండలం మేడవారిపాలెం గ్రామంలో తెదేపా మండల అధ్యక్షుడు శివరామ ప్రసాద్ ఆధ్వర్యంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం

పెదపలకలూరు (ప్రత్తిపాడు): సీఎం చంద్రబాబు నాయుడు సహకారంతో అభివృద్ధి, సంక్షేమంలో ప్రత్తిపాడు నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులు చెప్పారు. గుంటూరు శివారులోని పెదపలకలూరు, ఓబులనాయుడుపాలెం ప్రాంతాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందించి స్థానికులతో మాట్లాడారు. గత వైకాపా పాలన హయాంలో అభివృద్ధి, సంక్షేమం పూర్తిగా కుంటుపడ్డాయన్నారు. అమ్మఒడి అందరికీ అని చెప్పి అధికారంలోకి వచ్చాక కొర్రీలు వేసి ప్రజలను మోసం చేసిందని గుర్తు చేశారు. బడుగు, బలహీనవర్గాలకు చెందిన సంక్షేమ పథకాలను రద్దు చేశారు. రూ. 3 వేల పింఛన్ ఇస్తానని చెప్పి ఏడాదికి రూ. 250 చొప్పున పెంచి మాట తప్పారని విమర్శలు గుప్పించారు. కూటమి పార్టీలు ఎన్నికల్లో చెప్పినట్లే.. తల్లికి వందనం, పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్లు, ఉచితంగా మూడు సిలిండర్ల అమలు చేసిందని, రహదారులు నిర్మించామని, పలుచోట్ల మరమ్మతులు చేయించామని వివరించారు. రానున్న రోజుల్లో అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమల్లోకి వస్తాయన్నారు. మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో గుంటూరు ఛానల్ పొడిగింపు, కొత్తమల్లాయపాలెంలో ఏకనాథ్ హబ్, నాలుగు వరుసలుగా పర్చూరు రోడ్డు విస్తరణ, నడింపాలెంలో ఈఎస్ఐ వైద్యశాల, ఆయుష్ వైద్యశాల, కార్పొరేషన్‌లో విలీన ప్రాంతాల్లో రోడ్లు, మురుగు కాలువలు, కమ్యూనిటీ భవనాల నిర్మాణం చేపడతామని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ స్మిత పద్మజ, లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పెదపలకలూరు: కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, కూటమి నాయకులు

పొన్నెకల్లులో కూటమి నాయకులు..

బహిరంగ ప్రకటన

నా క్లయింటు గుంటూరు సిటీ, సీతమ్మ కాలనీ 1వ లైను, డోరు నెం. 26-45-58రు కాపురస్తులు లగడపాటి శ్రీనివాసరావు గారి కుమారుడు లగడపాటి శ్రీనివాసరావు గారి నుంచి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది - నా క్లయింటు పేరట గుంటూరు డి., నల్లపాడు సబ్ డి., యిలాకా అంకిరెడ్డిపాలెం గ్రామ డి.నెం.975 లోని 290.4 చదరపు గజముల స్థలము కలదు. నరసరావుపేట నా క్లయింటు పేరటకు డి.08-04-2025న పల్నాడు జిల్లా, వినుకొండ మండలం, దొండపాడు, కొత్త శ్రీరామ్‌నగర్ కాపురస్తులు సలమాటి లక్ష్మయ్య పుత్రిక ఉన్నమ్మ గారి కుమారుడు సలమాటి వెంకట్రావు గారి నుండి విక్రయ దస్తావేజు నెం. 3749/2025 గుంట నల్లపాడు సబ్ రిజిస్ట్రారు వారి కార్యాలయంలో రిజిస్టరు కాబడినది. అయితే సదరు దస్తావేజుకు లింక్ దస్తావేజుగా ఒరిజినల్ దస్తావేజు డి.నెం. 2354/2015 ఒరిజినలు ఒక కవరులో పెట్టబడి డి.27-06-2025న నా నుండి తాడికొండకు నా క్లయింటు తన ఇంటికి టూవీలర్‌పై వెళ్లుచుండగా మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినది. నా క్లయింటు ఎంత వెతికినను దొరకలేదు. సదరు లింకు దస్తావేజు నెం.2354/2015 ఒరిజినల్ ఎవరికైనా దొరికిన యెడల నా క్లయింటుకు తెలియజేయగలరు. ఈ దస్తావేజు ద్వారా నా క్లయింటు తప్ప ఎవరైనా ఎటువంటి లావాదేవీలు జరిపినను అవన్నీ చెల్లవని మరియు నా క్లయింటు తీసుకొను చట్టపరమైన సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు బాధ్యులగుదురని తెలియజేయడమైనది.

ఇట్లు: **తాడిమళ్ల విలియం వర ప్రసన్న కుమార్,** అడ్వకేట్, చిరునామా: బొంగరాలబీడు 5వ లైను, గుంటూరు, సెల్: **9346473176**

వెతలు తీర్చండి మహాప్రభో..!

కాలనీల్లో సమస్యల తిష్ఠ

తాడికొండ, న్యూస్‌టుడే

కాలనీ కష్టాలు

తాడికొండ గ్రామంలోని జెండాచెట్టు బజారు, పడమట వీధిలో పారిశుద్ధ్యం కరవైంది. తాగునీటి సరఫరా అంతంత మాత్రమే. 8, 12 వార్డులలో ఎక్కడి వ్యర్థాలు అక్కడే తిష్ఠ వేశాయి. ఇటీవల పైపులైన్ ఏర్పాటుకు రోడ్డును పగులగొట్టారు. పనులు పూర్తయినా తీసిన గుంతలను పూడ్చకుండా వదిలేయడంతో రాకపోకలకు వాహనచోదకులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అత్యవసర సమయాల్లో అంబులెన్సు, అగ్నిమాపక వాహనం వచ్చేందుకు కూడా వీల్లేని పరిస్థితి ఉందని స్థానికవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇళ్ల ముందు ఎక్కడికక్కడ మెట్లు నడిరోడ్డుపైకి కట్టేశారు. ఇటీవల గడ్డివాములు అంటుకున్నప్పుడు ఫైర్ ఇంజిన్ సైతం లోపలికి వచ్చేందుకు వీలులేకపోయిందని వారు చెబుతున్నారు. కాలనీలో మురుగునీరు నిరంతరంగా రోడ్డు పైనే ప్రవహిస్తోంది. చెత్తను తీసుకువెళ్లేందుకు పంచాయతీ వాహనం రావడం లేదని కాలనీ ప్రజలు వాపోయారు. జెండా చెట్టు సెంటర్ మొదటి వీధిలో కరెంటు తీగలు, కేబుల్ వైర్లు స్తంభాలకు అస్తవ్యస్తంగా అమర్చారు. గాలికి తీగలు ఊగినప్పుడల్లా విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుంది. కొన్ని సందర్భాల్లో నిప్పు రవ్వలు సైతం వస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

తాడికొండ జెండా చెట్టు సెంటర్ బజారులో మట్టి కుప్పలు, రాళ్లు

విద్యుత్తు స్తంభానికి వేలాడుతున్న తీగలు

వివరాలిలా..	
జనాభా	1,421
గృహాలు	347
వార్డులు	8,12

చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దుతాం

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం కౌన్సిల్ హాల్‌లో ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని జీఎంసీ విలీన గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరాన్ని డంపర్‌బిన్ ఫ్రీగా చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 23గా ఉన్న పారిశుద్ధ్య డివిజన్లను 57కు పెంచి ఆ మేరకు పర్యవేక్షణ సిబ్బంది, కార్మికుల కేటాయింపు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ప్రజారోగ్య విభాగ అవసరాల రీత్యా పుష్ కార్ట్స్, చెత్త తరలింపు వాహనాలను డివిజన్ ఇన్‌స్పెక్టర్ పరిధిలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్మికులు విధుల్లో లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ నగర విస్తరణకు తగ్గట్టుగా మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్పొరేటర్లు ఎప్పటికప్పుడు ప్రజల ఇబ్బందులు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం, తదితరులు పాల్గొన్నారు.

అలంకరణ సేవలో భాగస్వాములు కండి

దుగ్గిరాల, న్యూస్‌టుడే: స్థానిక శివాలయంలో అమ్మవారికి ఈ నెల 6వ తేదీ (ఆదివారం) శాకంబరిగా అలంకరణ చేస్తున్నట్లు అర్చకులు నాగేశ్వరం యుగంధర్ తెలిపారు. దీనికి కావల్సిన పళ్లు, కూరగాయాలు ఇచ్చే దాతలు ఈనెల 5న శనివారం ఉదయం 10 గంటల లోపు ఇవ్వాలని కోరారు. అలంకరణ కోసం సేవ చేసే భక్తులు 5న మధ్యాహ్నం 2 గంటలకు దేవాలయానికి రావాలని చెప్పారు. ఇతర వివరాలకు దుంపా కల్యాణిశ్రీనివాస్‌ను (98850 74157)ను సంప్రదించాలన్నారు.

నక్కవాగు పరిశీలన

పెదనందిపాడు, న్యూస్‌టుడే: వరగాని సమీపంలో పాతనక్కవాగు ప్రాంతాన్ని డీఈ ధనలక్ష్మీ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం నుంచి పెదనందిపాడు మండలం పుసులూరు వరకు 25 కిలోమీటర్ల పొడవున గడ్డి మందు చల్లించనున్నట్లు చెప్పారు. కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్‌ఛైర్మన్ సునీల్‌చౌదరి, ఏఈ విజయవర్ధనరాజు పాల్గొన్నారు.

చౌకధరల దుకాణంలో తనిఖీ

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడులోని 16వ నంబర్ చౌకధరల దుకాణాన్ని బుధవారం విజిలెన్స్ సీఐ చంద్రశేఖర్, పౌరసరఫరాల శాఖ తహసీల్దార్ లక్ష్మీమాధవి, ఉపతహసీల్దార్ శివశంకర్ బుధవారం పరిశీలించారు. సరకుల నిల్వలో వ్యత్యాసం ఉండడంతో 6ఏ కేసు నమోదు చేశామని వారు తెలిపారు. అనంతరం పెదనందిపాడులోని సీతారామ ఫిల్లింగ్ స్టేషన్‌ను అధికారులు తనిఖీ చేశారు.

రైతు కుటుంబాన్ని ఆదుకోవాలి

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: ప్రత్తిపాడులో జూన్ 25న ఆత్మహత్యాయత్నం చేసుకుని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందిన రైతు చల్లగిరి నాగరాజు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె. అజయ్ కుమార్ డిమాండు చేశారు. బుధవారం నాగరాజు కుటుంబాన్ని రైతు సంఘం నాయకులతో కలిసి పరామర్శించారు.

సీతమ్మ అన్న క్యాంటీన్ సందర్శన

పుల్లడిగుంట (వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: పుల్లడిగుంట గ్రామంలో ఉప్పుటూరి సీతామహాలక్ష్మి అన్న క్యాంటీన్‌ను టుబాకో బోర్డు ఛైర్మన్ యశ్వంత్ కుమార్ బుధవారం సందర్శించారు. పేదలకు ఆయనే స్వయంగా భోజనాలు వడ్డించి..ట్రస్ట్ సేవలను అభినందించారు. ట్రస్ట్ ఛైర్మన్ చినరాములు తదితరులు పాల్గొన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

పెదనందిపాడు, న్యూస్‌టుడే: పెదనందిపాడుకు చెందిన రూబెన్ ఈ నెల 2న పొలానికి వెళ్లివస్తానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరిగి రాకపోవడంతో భార్య పద్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం ఎస్సై మధూపవన్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పబ్లిక్ నోటీసు

నా క్లయింట్స్ M/s. LIC Housing Finance Ltd., Guntur వారి సంజాయిషీ ప్రకారం ఇచ్చిన పబ్లిక్ నోటీసు:
శ్రీ పసుపులేటి రామారావు గారు నా క్లయింట్స్ నుండి హౌసింగ్ లోన్ తీసుకుని వారి ఆస్తి అనగా House site in an extent of 105 sq. yards in D.No. 34/2, Gorantla village, Koretipadu SRO, Guntur District ను తనఖా ఉంచి వారి original దస్తావేజు అనగా Regd. Sale deed dt. 22-02-2012 (Doc. No. 1129/2012 of Koretipadu SRO) మరియు ఒరిజినల్ లింక్ దస్తావేజులు అనగా Regd. Sale deeds Nos. 906/2008, 11149/2006, 3350/1988 & 3349/1988 నా క్లయింట్స్ వద్ద డిపాజిట్ చేసినారు. సదరు లోన్ close చేసిన దరిమిలా నా క్లయింట్స్ సదరు ఒరిజినల్ టైటిల్ డీడ్స్‌ను రిటర్న్ చేయుటకు ప్రయత్నించగా, నా క్లయింట్స్ ఆఫీస్ నుండి విజయవాడ ఆఫీస్‌కు వెళ్లినప్పుడు సదరు ఒరిజినల్ దస్తావేజులు కల docket file నా క్లయింట్ కస్టడీ నుండి పోయినది. సదరు పసుపులేటి రామారావు గారు సంగతి తెలుసుకుని ఒరిజినల్ దస్తావేజులకు బదులుగా certified copiesని, నా clients నుండి దస్తావేజులు పోయినట్లుగా certificateను తీసుకొనుటకు public notice ఇచ్చుటకు ఒప్పుకున్నారు. సదరు దస్తావేజులు ఎవరికైననూ దొరికినచో 15 రోజులలోగా నా క్లయింట్స్‌కు అప్పచెప్పవలెను. సదరు దస్తావేజులును ఎవరైననూ misuse చేసినచో అది నా క్లయింట్స్‌ను గానీ. పసుపులేటి రామారావును గానీ బైండ్ చేయవని తెలియచేయటమైనది.

P. Ramakrishna Paramahamsa, Advocate
Ayyanna Naidu Street, Durga Agraharam,
Vijayawada-2, Cell: 98663 35633

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తుళ్లూరు, న్యూస్‌టుడే: అనుమానాస్పదస్థితిలో ద్విచక్రవాహన చోదకుడు మృతి చెందిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా అమరావతి మండలం లేమల్లె గ్రామానికి చెందిన మేకల లక్ష్మణరావు (26) మంగళగిరి మండలంలోని అక్షయపాత్రలో వాటర్ ప్లాంట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. రోజు లేమల్లె నుంచి మంగళగిరికి పెదపరిమి మీదుగా ద్విచక్ర వాహనంపై రాకపోకలు సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అక్షయపాత్ర సంస్థకు వెళ్లడానికి ఈ నెల 30న లేమల్లె నుంచి బయలు దేరిన లక్ష్మణరావు ఇంటికి తిరిగి రాలేదు. బుధవారం పెదపరిమి, నీరుకొండ గ్రామాల మధ్య మేకల కాపరులు అటుగా వెళ్లారు. రహదారి పక్కన ఉన్న కాలువలో మేత మేయటానికి బెదురుతున్న మేకలను చూసి అక్కడ మృతదేహం ఉన్నట్టు గమనించిన కాపరులు అధికారులకు సమాచారం అందించారు. రహదారి పక్కన కాలువలో ముళ్లచెట్ల పక్కన లక్ష్మణరావు మృతదేహం, కొద్ది దూరంలో చెట్ల మధ్య ద్విచక్ర వాహనం పడి ఉన్నాయి. రహదారిపై ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తుళ్లూరు ఎస్.ఐ బాబురావు తెలిపారు.

గంజాయి విక్రయదారునికి ఆరు నెలల జైలు

మంగళగిరి, న్యూస్‌టుడే: గంజాయి విక్రయదారునికి గుంటూరు ఫస్ట్‌క్లాస్ అడిషనల్ సెషన్స్ కోర్టు ఆరు నెలల జైలు, రూ.2 వేలు జరిమానా విధించింది. కేసుకు సంబంధించి మంగళగిరి ప్రొహిబిషన్ సీఐ వీరాంజనేయులు బుధవారం ప్రకటన విడుదల చేశారు. మంగళగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాడేపల్లి మండలం కుంచనపల్లి రోడ్డులో 2019లో 1.600 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని హేమంత్‌కుమార్ అనే వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టులో కేసు విచారణలో భాగంగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ మేరకు తీర్పు ఇచ్చారు.

కళాశాల సంచాలకుడిగా బాధ్యతల స్వీకరణ

బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వరరావును అభినందిస్తున్న ఛైర్మన్ పెరుమాళ్లు, ప్రిన్సిపల్ అప్పారావు

పుల్లడిగుంట(వట్టిచెరుకూరు), న్యూస్‌టుడే: మండలంలోని పుల్లడిగుంట మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కళాశాల సంచాలకులుగా డాక్టర్ కోమటి వెంకటేశ్వరరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు, ప్రిన్సిపల్ జెట్టి అప్పారావు మాట్లాడుతూ నూతన సంచాలకులు గతంలో ఇస్రో వంటి ప్రభుత్వ రంగ సంస్థలలో పని చేశారని, ఆయన అనుభవం విద్యాసంస్థలు, విద్యార్థుల ప్రగతికి తోడ్పాటు అందిస్తాయని వివరించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మలినేని విద్యాసంస్థలలో పనిచేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆచార్యులు రమేష్‌బాబు, కిశోర్‌బాబు, విభాగాధిపతులు పాల్గొన్నారు.

అడ్డదిడ్డంగా వాహనం నడిపిన ఇద్దరిపై కేసు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో అడ్డదిడ్డంగా వాహనం నడిపి రోడ్డు ప్రమాదానికి కారణమైన ఇద్దరిపై నల్లపాడు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఇన్నర్ రింగ్‌రోడ్డులో ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి బుల్లెట్ వాహనంపై స్నేక్ డ్రైవింగ్ చేస్తూ ఒకరిని ఢీకొట్టారు. ఆయనకు గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మునగ సాగుకు ప్రోత్సాహం

ఫిరంగిపురం (గ్రామీణం): అమీనాబాద్‌లో బుధవారం రైతుల అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ. విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం మునగ సాగును ప్రోత్సహిస్తుందని తెలిపారు. ముఖ్యంగా 25 సెంట్లు నుంచి ఒక ఎకరం వరకు మునగ పంట వేసే సన్న, చిన్న కారు రైతులకు అనేక రకాలుగా ప్రయోజనాలు అందుతాయని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రాజకుమారి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు చేస్తుందని తెలిపారు.

రైతుల సంక్షేమానికి ప్రాధాన్యం

మాట్లాడుతున్న రాజశేఖర్‌రెడ్డి

తాడేపల్లి, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని తెలుగు రైతు గుంటూరు పార్లమెంట్ అధ్యక్షుడు కళ్లం రాజశేఖర్ రెడ్డి అన్నారు. తాడేపల్లి మండలం పెనుమాకలో వ్యవసాయశాఖ ఆధ్వర్యాన బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతులకు పెట్టుబడి సాయం కోసం కూటమి ప్రభుత్వం అన్నదాత సుఖీభవ పథకాన్ని తీసుకువచ్చిందన్నారు. ఏవో శిరీష, ఉద్యానశాఖ అధికారి దీపిక, ఏఈఓ రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ వినియోగంతో బోలెడు లాభాలు



గ్రూపు సభ్యులకు డ్రోన్ అందిస్తున్న ఏవో సునీత

ముట్లూరు(వట్టిచెరుకూరు) న్యూస్‌టుడే: వట్టిచెరుకూరు మండలంలోని ముట్లూరు, కోవెలమూడి గ్రామాలలో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ముట్లూరు ఎన్టీఆర్ రైతుమిత్ర గ్రూపు సభ్యులకు మండల వ్యవసాయశాఖ అధికారి సునీత, ఎంపీటీసీ గోగినేని కల్యాణచక్రవర్తిలు సబ్సిడీపై కిసాన్ డ్రోన్‌ను అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారి మాట్లాడుతూ రైతులకు కిసాన్ డ్రోన్‌లు అత్యంత ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. ఒక్కో డ్రోన్‌పై ప్రభుత్వం రూ.7.84 లక్షలను భరిస్తుందని, గ్రూపు సభ్యులు రూ.1.96 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు యూనియన్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వరరావు, గ్రామ వ్యవసాయశాఖ అధికారులు షాహిద్, హారిక, మోనాలిసాలు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

నా క్లయింటు అయిన P.S.R.INFRA, గోరంట్ల, గుంటూరు వారి తరపున మేనేజింగ్ పార్టనర్ బండపల్లి కోటేశ్వరరావు గారి కుమారుడు బండపల్లి శ్రీనివాసరావు గారి నుండి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా గుంటూరు సిటీ, పొత్తూరు, డోర్.నెం.3-38రు కాపురస్తులు పొందూరి వెంకటేశ్వర్లు గారి కుమారుడు పొందూరి సీతారామయ్య, గుంటూరు జిల్లా, తాడికొండ మండలము, బండారుపల్లి గ్రామము, నిమ్మగడ్డ బజారు, డోర్ నెం.1-52రు కాపురస్తులు కన్నెగంటి సాంబశివరావు గారి భార్య కన్నెగంటి సామ్రాజ్యం వగైరాలకు పూర్వార్జితముగా సంక్రమించబడిన బండారుపల్లి గ్రామ డి.నెం.702-3డిరు. య.3-41శెంట్లున్నూ, డి.నెం. 702-3ఎ రు, య.0-36సెంట్లున్నూ, డి.నెం.702-1ఎరు,య.3-05 సెంట్లున్నూ, వెరశి మూడు నెంబర్లు తాలూకు య.6-82సెంట్లు భూమి నాటి నుండి నేటివరకు వారి స్వాధీనానుభవములోనే ఉండివున్నదని తెలియచేయగా, నా క్లయింటు కొనుగోలు చేయుటకు సిద్ధపడి యావన్మందికి తెలియజేయుట ఏమనగా సదరు కొనుగోలుపై ఎవ్వరికైనా ఎటువంటి అభ్యంతరములు వున్నా వారికి గల హక్కులను వ్రాతపూర్వకముగా నా క్లయింటుకు గానీ, నాకు గానీ ఒక వారం (7) రోజులలోగా తెలియజేయగలరు. గడువు దాటినతర్వాత చేయు అభ్యంతరములను పరిగణములోనికి తీసుకొనబడవు.

షెడ్యూలు: 1వ అయిటం: గుంటూరు డి., నల్లపాడు సబ్.డి., యిలాకా బండారుపల్లి గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన బండారుపల్లి గ్రామ డి.నెం.702-3డి రు బాపతు య.3-41 సెంట్లు భూమికి **హద్దులు:తూర్పు:** నల్లపనేని సౌజన్య గారి భూమిహద్దు,**దక్షిణం:** జాగర్లమూడి పార్థు గారి భూమి హద్దు, **పడమర:** 2వ అయిటము తాలూకు భూమిహద్దు,**ఉత్తరం:** దండమూడి పాపారావు వగైరాల భూమి హద్దు.యీ హద్దుల మధ్య య.3-41 సెంట్లు లేక హె.1-364ర్సు శేరీ మెరక భూమిన్నీ,

2వ అయిటం: గుంటూరు డి., నల్లపాడు సబ్.డి., యిలాకా బండారుపల్లి గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన బండారుపల్లి గ్రామ డి.నెం.702-3ఎ రు బాపతు య.0-36 శెంట్లు భూమికి **హద్దులు:తూర్పు:** 1వ అయిటం తాలూకు భూమి హద్దు,**దక్షిణం :** పన్నీరు రంగయ్య వగైరాల భూమి హద్దు,**పడమర:** యస్.యస్.పి. బోదె కాలువ హద్దు,**ఉత్తరం:** దండమూడి పాపారావు భూమి హద్దు.యీ హద్దుల మధ్య య.0-36 సెంట్లు లేక హె. 0-114 ర్సు శేరీ మెరక భూమిన్నీ;

3వ అయిటం: గుంటూరు డి., నల్లపాడు సబ్.డి., యిలాకా బండారుపల్లి గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన బండారుపల్లి గ్రామ డి.నెం.702-1ఎ రు బాపతు య.3-05 శెంట్లు భూమికి **హద్దులు:తూర్పు:** యస్.యస్.పి. బోదె కాలువ హద్దు,**దక్షిణం:** పన్నీరు రంగయ్య వగైరాల భూమి హద్దు,**పడమర:** పొలిమేర డొంక హద్దు,**ఉత్తరం:** నేలపల్లి సీతామహాలక్ష్మి గారి భూమి హద్దు. యీ హద్దుల మధ్య య.3-05 సెంట్లు లేక హె.1-220ర్సు శేరీ మెరక భూమిన్నీ, వెరశి 1, 2, 3 అయిటముల మొత్తం విస్తీర్ణం య.6-82 సెంట్లు భూమి యున్నూ మరియు సదరు భూమికి లోగడ ఉన్నటువంటి యూవత్తు పాత ఈజీమెంటు హక్కులతో సహా.

BANDLA GOPI, Advocate,
Door No.130-5-177, Annapurna Nagar, 5th Lane,
Gorantla, Guntur 522 034, A.P. Cell: 9885402037

గుంటూరు తూర్పు

మురుగుకాలువలు శుభ్రం చేయండి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరం నుంచి బయటకు వెళ్లే ప్రధాన మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన రెడ్డిపాలెం, విఘ్నేశ్వరనగర్, పోస్టల్ కాలనీ, వర్కర్స్‌కాలనీ ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను డ్రోన్ ద్వారా పరిశీలించారు. తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. పర్యటనలో డీఈఈ రమేష్‌బాబు, కార్పొరేటర్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ రైతుబజారులో ధరలు నిన్నటివి... (కిలో ఒక్కింటికి రూ.లో) టమాట 30, వంగ 23, బెండ 20, పచ్చిమిర్చి 33, కాకర 35, క్యారెట్ 40, క్యాబేజీ 18, బీర 20, దొండ 35, బంగాళదుంప 26, ఉల్లిపాయలు 22, గోరుచిక్కుళ్లు 32, దోస 15, పొట్ల 20, చామదుంప 28, మునగ 10, గోంగూర 8, తోటకూర 15, చుక్కకూర 15, కొత్తిమీర 25, బీట్‌రూట్ 39, కీర 34, క్యాప్సికం 70, అల్లం 60, ఫ్రెంచి బీన్స్ 64, సొర 12, అరటి 7.
- న్యూస్‌టుడే, పట్నంబజారు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

94406 38515, 80085 73097

? నందివెలుగురోడ్డులోని చిన్నేరుగుంట సెంటర్‌లో వీధి దీపాలు వెలగటం లేదు. రాత్రి వేళల్లో ఇటుగా రాకపోకలు చేసే వారు చీకటిలో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలకు గురవుతున్నారు. **- రాం గణేష్, మంగళ్‌దాస్‌నగర్**

✔ పరిష్కరిస్తాం. **- వెంకటేశ్వరరావు, నగరపాలకసంస్థ ఏ.ఈ.**

? ఏటుకూరురోడ్డులో వేగ నిరోధకాల్లేవు. వాహనదారులు వేగంగా వస్తున్నారు. ఏటుకూరురోడ్డు సెంటర్ నుంచి చాకలిగుంట సెంటర్ వరకు స్పీడ్ బ్రేకర్లు వేయాలి. **- ఆనంద్, ఆర్.అగ్రహారం**

✔ కార్పొరేషన్ అధికారులతో మాట్లాడి స్పీడ్ బ్రేకర్ల ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటాం. **- అశోక్‌కుమార్, ట్రాఫిక్ సి.ఐ.**

? లాలాపేట పరిసరాల్లో స్వీట్స్ విక్రయ వ్యాపారుల్లో కొందరు మూతలు ఉంచడం లేదు. **- రమేష్, చౌత్రాసెంటర్**

✔ మూతలు లేకుండా స్వీట్స్ విక్రయించేవారిపై కేసులు నమోదు చేస్తాం. **- పూర్ణచంద్రరావు, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్**

? పట్నంబజారు పరిసర ప్రాంతాల్లోని కొందరు ఇనుము విక్రయాల వ్యాపారులు ఎలక్ట్రానిక్ కాటాల్లో మోసాలకు పాల్పడుతున్నారు. **- మహమూద్, కింగ్స్ హోటల్ సెంటర్**

✔ బాధ్యులపై కేసులు పెడతాం. ఈ తరహా విక్రయాల్ని కట్టడి చేస్తాం. **- సునీల్, తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్**

☛ తారకరామనగర్ ప్రధానరోడ్డు కాలువల్లో పూడికలు చేరి మురుగునీటి పారుదలకు ఆటంకంగా ఉందని స్థానికుడు ప్రసాద్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను శానిటరీ సూపర్‌వైజర్ అయూబ్‌ఖాన్ దృష్టికి తీసుకెళ్లడంతో కాలువల్లో పూడికలు తీయించారు.

☛ శివనాగరాజుకాలనీ రెండోలైన్‌లో చెత్తకుప్పలు తీయకపోవడంతో వీధి అపరిశుభ్రంగా ఉందని స్థానికుడు రత్తయ్య 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను ప్రజారోగ్య విభాగం అధికారులకు తెలియజేయడంతో చెత్తకుప్పలు తీయించి తరలించారు.

☛ బాలాజీనగర్ ఐదోలైన్‌లో వీధిదీపాలు వెలగక రాత్రిళ్లు ఇబ్బంది పడుతున్నామని స్థానికుడు అశోక్ 'మేమున్నాం.. మీకు తోడుగా'కు తెలిపారు. సమస్యను విద్యుత్తు అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో సిబ్బందిని పంపి విద్యుత్ లైన్లు సరిచేయించారు.
- న్యూస్‌టుడే, నగరపాలక సంస్థ, పట్నంబజారు.

ఖాళీ స్థలాలు.. మురుగుకూపాలు

పట్టించుకోని ప్రజారోగ్య విభాగం

న్యూస్‌టుడే - నగరపాలక సంస్థ

విజయశాంతినగర్‌లోని ఖాళీస్థలంలో చేరిన మురుగు, హెచ్చరిక బోర్డు

ఏటా వర్షాకాలంలో తేమ వాతావరణానికి తోడు... ఇళ్ల పరిసరాలు, చుట్టుపక్కల అపరిశుభ్ర పరిస్థితుల కారణంగా వ్యాధుల వ్యాప్తి ఎక్కువ. నగర పరిధిలోని ప్రతీ డివిజన్‌లో ఇళ్ల మధ్య ఖాళీ స్థలాలతో ఇబ్బందులు తప్పడం లేదు. ఏళ్ల క్రితం స్థలాలను కొనుగోలు చేసిన వ్యక్తులు వాటిని పట్టించుకోకుండా వదిలేయడంతో వాటిల్లోకి మురుగునీరు చేరుతోంది. నాచు, పిచ్చిమొక్కలు పెరిగి విషపురుగులకు ఆవాసాలుగా మారుతున్నాయి. వీటిపై పెద్దఎత్తున ఫిర్యాదులు వస్తున్నా జీఎంసీ ప్రజారోగ్య విభాగానికి పట్టడం లేదు. ఖాళీ స్థలాలను శుభ్రం చేయించుకునేలా యజమానులకు నోటీసులు ఇవ్వడంతోపాటు ఆయా స్థలాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేవారు. ఇప్పుడదీ లేదు. కొందరికి నోటీసులు ఇచ్చినా స్పందన లేదు. చెత్తాచెదారం నుంచి పాములు, విషపురుగులు ఇళ్లల్లోకి వస్తున్నాయని జనం హడలిపోతున్నారు.

☛ నగరంలోని తూర్పు, పశ్చిమ విలీన గ్రామాల్లో నివాసాల మధ్య అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాలు సుమారు 2 వేలకుపైగానే ఉంటాయని అంచనా. కానీ.. ప్రజారోగ్య విభాగం వద్ద మాత్రం పక్కా లెక్క లేదు. వార్డు సచివాలయ వ్యవస్థ ఉన్నా దాన్నీ సక్రమంగా వినియోగించుకున్న దాఖలా లేదు.

☛ కొన్నిచోట్ల పందుల సంచారం ఎక్కువగా ఉంది. దుర్వాసనకు దోమల వ్యాప్తి అధికమై రోగాల బారిన పడుతున్నామని చాలాచోట్ల జనం వాపోతున్నారు.

పరిష్కారం లేదా?

అపరిశుభ్రంగా ఉన్న ఖాళీ స్థలాల యజమానులకు నోటీసులు ఇవ్వడంతోపాటు ఆయా స్థలాలకు అదనంగా 0.25 శాతం పన్ను విధిస్తామని హెచ్చరిక బోర్డులు పెట్టిస్తున్నారు. అదీ కొన్నిచోట్లే. ఖాళీ స్థలాల వివరాలు సేకరించి రిజిస్ట్రేషన్ కాకుండా ఆ శాఖకు నివేదిక పంపుతామని గతంలో అధికారులు హడావుడి చేశారు. ఇదీ పూర్తి చేయలేదు. ఖాళీస్థలాలను జీఎంసీ యంత్రాంగంతో శుభ్రం చేయించి అయిన ఖర్చును సంబంధిత యజమానుల నుంచి వసూలు చేసి, అపరాధ రుసుం విధిస్తామని అధికారులు ప్రకటించారు. ఈ నోటీసులకు స్పందించనివారి స్థలాలను శుభ్రం చేయించి అందులో పారిశుద్ధ్య సామగ్రి, వాహనాలు పెట్టేందుకు వినియోగించాలని మరో ఆలోచన చేశారు. అంతిమంగా అసలు సమస్య మాత్రం పరిష్కారం కావడం లేదు. ఇప్పటికైనా సమస్య పరిష్కారానికి పక్కాగా ఆలోచనలు చేసి చర్యలు తీసుకోవాలని ఇటీవల కౌన్సిల్ సమావేశంలో తూర్పు, పశ్చిమ ఎమ్మెల్యేలు నసీర్ అహ్మద్, గల్లా మాధవి కూడా విజ్ఞప్తి చేశారు.

రెండు కుటుంబాల్లో ఎనిమిది మంది అదృశ్యం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రెండు కుటుంబాల్లో ఎనిమిది మంది అదృశ్యమైనట్లు పట్టాభిపురం ఠాణాలో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోబాల్టుపేట ఆరోలైనులో సంధాని, చినబాజి నివాసం ఉంటున్నారు. వారు బుధవారం పనులకు వెళ్లారు. సంధాని భార్య కరిమూన్, పిల్లలు షాహిద్, సలీమ్, హఫీజ్, చినబాజి భార్య రజియా, ముస్తఖాన్, ముజుంబీర్, మెహరీన్ ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయారు. పనుల నుంచి వచ్చిన సంధాని, చినబాజీలు భార్యాపిల్లల కోసం పలు ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ లభించక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ గంగా వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అడ్డదిడ్డంగా వాహనం నడిపిన ఇద్దరిపై కేసు

పట్టాభిపురం: మద్యం మత్తులో అడ్డదిడ్డంగా వాహనం నడిపి రోడ్డు ప్రమాదానికి కారణమైన ఇద్దరిపై నల్లపాడు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఇన్నర్ రింగ్‌రోడ్డులో ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి బుల్లెట్ వాహనంపై స్నేక్ డ్రైవింగ్ చేస్తూ ఒకరిని ఢీకొట్టారు. ఆయనకు గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

వాహన చోదకులకు శ్వాస పరీక్షలు

శ్వాసపరీక్షలు నిర్వహిస్తున్న నగరంపాలెం పోలీసులు, పర్యవేక్షిస్తున్న డీఎస్పీ అరవింద్

గుంటూరు నేరవార్తలు: నగరంలో బుధవారం పశ్చిమ డీఎస్పీ అరవింద్ ఆధ్వర్యంలో నగరంపాలెం, చుట్టుగుంట, ఎత్తురోడ్డు ప్రాంతాల్లో వాహనచోదకులకు శ్వాస పరీక్షలు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నవారిపై కేసులు నమోదు చేసి వాహనాలు జప్తు చేశారు. సీఐ నజీర్‌బేగ్, ఎస్సైలు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు

పట్నంబజారు: చేపలమార్కెట్ పరిసర ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను బుధవారం తూర్పు విభాగపు ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. పూలమార్కెట్ సెంటర్, ఏలూరుబజారు, పండ్ల మార్కెట్ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నేమ్‌బోర్డులు, ఇతర సామగ్రిని రికవరీ వ్యాన్ ద్వారా బస్టాండు సెంటర్లోని ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

మహిళల రక్షణకు శక్తి యాప్

విద్యార్థినులకు శక్తి యాప్ ఉపయోగాలు తెలియజేస్తున్న ఎస్సై తరంగిణి

గుంటూరు నేర వార్తలు, న్యూస్‌టుడే: మహిళల రక్షణకు శక్తి యాప్ ఉపయోగించుకోవాలని మహిళా పోలీసుస్టేషన్ ఎస్సై తరంగిణి చెప్పారు. మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు శక్తి యాప్ ఉపయోగాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో 112 నంబర్‌కు ఫోన్ చేస్తే శక్తి పోలీసు బృందాలు అక్కడికి చేరుకుంటాయన్నారు. సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఏడాదిలో సాధించిన విజయాలపై కరపత్రాలను ప్రదర్శిస్తున్న ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

విధ్వంసం నుంచి వికాసం వైపు...

సుపరిపాలన-తొలిఅడుగులో ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్

ఎన్టీఆర్ సర్కిల్, న్యూస్‌టుడే: జగన్ అయిదేళ్ల అసమర్థ పాలనలో విధ్వంసమైన రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు వికాసం వైపు పయనింపజేస్తున్నారని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా వాసవి నగర్‌లో సుపరిపాలన-తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం చేసిన మంచి పనులు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. ద్విచక్ర వాహనాల ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులున్నప్పటికీ సీఎం చంద్రబాబు వెనక్కి తగ్గకుండా ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను తొలి ఏడాదిలోనే నెరవేర్చారన్నారు. పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, తల్లికి వందనం పథకాల గురించి వివరించారు. నియోజకవర్గ పరిధిలో సీఎం సహాయనిధి ద్వారా 200 మందికి రూ.2.50 కోట్లు అందజేశామన్నారు. ప్రతీ డివిజన్‌లో అభివృద్ధి పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు దాసరి రాజా మాస్టారు, ఎల్లావుల అశోక్, చిష్టి, మీరావలి, సయ్యద్ అన్సర్, చిట్టాబత్తిన చిట్టిబాబు, జాగర్లమూడి శ్రీనివాసరావు, గోళ్ల ప్రభాకర్, వేములకొండ శ్రీనివాస్, పిచ్చిరెడ్డి, మహంకాళి నరసింహారావు, పోతురాజు సమత, ముప్పవరపు భారతి, వేముల జ్యోతి, గుడిపల్లి వాణి తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు క్యాంప్ కార్యాలయంలో సన్నాహక సమావేశం నిర్వహించారు.

ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాం

కరపత్రాలను మహిళలకు అందిస్తున్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, కూటమి నాయకులు

పెదపలకలూరు (ప్రత్తిపాడు), న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబునాయుడు సహకారంతో అభివృద్ధి, సంక్షేమంలో ప్రత్తిపాడు నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే డాక్టర్ బూర్ల రామాంజనేయులు చెప్పారు. గుంటూరు శివారులోని పెదపలకలూరు, ఓబులునాయుడుపాలెం ప్రాంతాల్లో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందించి స్థానికులతో మాట్లాడారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమం పూర్తిగా కుంటుపడ్డాయన్నారు. కూటమి పార్టీలు ఎన్నికల్లో చెప్పినట్లే.. తల్లికి వందనం, పింఛన్లు, అన్న క్యాంటీన్లు, ఉచితంగా మూడు సిలిండర్లు అమలు చేశామని, రహదారులు నిర్మించామని, పలుచోట్ల మరమ్మతులు చేయించామని వివరించారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో గుంటూరు ఛానల్ పొడిగింపు, కొత్తమల్లాయపాలెంలో ఎకనామిక్ హబ్, నాలుగు వరుసలుగా పర్చూరు రోడ్డు విస్తరణ, నడింపాలెంలో ఈఎస్ఐ వైద్యశాల, ఆయుష్ వైద్యశాల, కార్పొరేషన్‌లో విలీన ప్రాంతాల్లో రోడ్లు, మురుగు కాలువలు, కమ్యూనిటీ భవనాల నిర్మాణం చేపడతామని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ స్మిత పద్మజ, లిడ్ క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

రౌడీషీటర్లపై ఉక్కుపాదం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారిస్తున్నామని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. పట్టాభిపురం ఠాణాలో ఆయన బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 5న లోక్‌అదాలత్ ద్వారా కొన్ని కేసుల్ని పరిష్కరించడం జరుగుతుందన్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచి ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేసి నేరాలను కట్టడి చేస్తామన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రాత్రి గస్తీలో వేలిముద్రల పరికరం ఆధారంగా పాత నేరస్థులు బసవరాజు, మోహన్‌లను అరెస్ట్ చేసిన కానిస్టేబుల్ శ్రీనివాసరావు, హోంగార్డు గురవయ్యను డీఎస్పీ అరవింద్ అభినందించి రివార్డు అందజేశారు. కార్యక్రమంలో సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్సై నరహరి తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

శ్రీనగర్ ప్రధాన రహదారిపై మ్యాన్‌హోల్ మూత పగిలిపోవడంతో ప్రమాదకరంగా మారింది. అందులో నుంచి మురుగు రోడ్డుపై ప్రవహించడంతో ఇబ్బందిగా మారిందని స్థానికులు వాపోతున్నారు. మూత పగిలి గుంత పడటంతో అందులో వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలబారిన పడుతున్నామని ఆందోళన చెందుతున్నారు. రోజుల తరబడి మురుగు నిలవడంతో దుర్వాసన భరించలేకపోతున్నామని వాపోతున్నారు.
- న్యూస్‌టుడే, నెహ్రూనగర్

పడేశారిలా.. ప్రమాదాలు కావా?

జిల్లా కోర్టు నుంచి జీజీహెచ్‌కు వెళ్లే మార్గంలో మరమ్మతులకు గురైన విద్యుత్ స్తంభాన్ని రహదారి పక్కన పడేశారు. ఆ స్తంభానికి చివర ఉన్న ఇనప కడ్డీలు రోడ్డుపై వచ్చేవారికి తగులుతున్నాయని వాహనచోదకులు, పాదచారులు వాపోతున్నారు. ఇటుగా ప్రభుత్వాసుపత్రి, రైల్వేస్టేషన్, మెడికల్ కళాశాల, జిల్లా కోర్టుకు నిత్యం వేలాదిమంది ప్రయాణిస్తుంటారు. రహదారి మలుపులో ఉన్న ఆ స్తంభం అటుగా వచ్చేవారికి తగిలి గాయాలవుతున్నాయని పలువురు ఆందోళన చెందుతున్నారు. రాత్రి వేళల్లో మరీ ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు. **- న్యూస్‌టుడే, గుంటూరు నేరవార్తలు**

గుంతల రోడ్డు.. జనం పాట్లు

నందివెలుగురోడ్డులోని రైల్వేగేటు ముందు రోడ్డు గుంతలమయంగా మారింది. ఈ ప్రాంతంలోని పైవంతెన నిర్మాణ పనులు చేపట్టిన నాటి నుంచి అధికారులు వాహనాల రాకపోకల్ని వెంకట్రామా థియేటర్ వైపు నుంచి బాలాజీనగర్ జీరో లైను మీదుగా మణిహోటల్ సెంటర్‌వైపు మళ్లించారు. వాటి రద్దీ పెరిగిన కారణంగా రోడ్డంతా గుంతలమయంగా ప్రమాదకరంగా మారింది. దాదాపు పదేళ్ల నుంచి ఈ ప్రాంతంలోని రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. ఇటీవల కురిసిన వర్షానికి నీరు గుంతల్లోకి చేరి రోడ్డంతా ప్రమాదకరంగా మారింది. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

చెత్తరహిత నగరంగా తీర్చిదిద్దుతాం

మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసులు, పక్కన ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరాన్ని చెత్త రహితంగా తీర్చిదిద్దేందుకు పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచాలని కమిషనర్ పులి శ్రీనివాసులు తెలిపారు. బుధవారం కౌన్సిల్ హాల్‌లో ప్రత్తిపాడు నియోజకవర్గ పరిధిలోని జీఎంసీ విలీన గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులుతో కలిసి సమీక్షించారు. కమిషనర్ మాట్లాడుతూ నగరాన్ని డంపర్‌బిన్ ఫ్రీగా చేసేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే 23గా ఉన్న పారిశుద్ధ్య డివిజన్లను 57కు పెంచి ఆ మేరకు పర్యవేక్షణ సిబ్బంది, కార్మికుల కేటాయింపు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ప్రజారోగ్య విభాగ అవసరాల రీత్యా పుష్‌కార్ట్స్, చెత్త తరలింపు వాహనాలను డివిజన్ ఇన్‌స్పెక్టర్ పరిధిలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్మికులు విధుల్లో లేకుంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు మాట్లాడుతూ నగర విస్తరణకు తగ్గట్టుగా మౌలిక వసతులు కల్పించాల్సిన అవసరం ఉందని తెలిపారు. కార్పొరేటర్లు ఎప్పటికప్పుడు ప్రజల ఇబ్బందులు అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. సమావేశంలో సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం, తదితరులు పాల్గొన్నారు.

రాజధాని నిర్మాణ బాధ్యత కేంద్రానిదే

మాట్లాడుతున్న బాబూరావు. చిత్రంలో నేతాజీ, రామారావు, భావన్నారాయణ, నళినీకాంత్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రాజధాని నిర్మాణ బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. బుధవారం బ్రాడీపేటలోని కార్యాలయంలో జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. బాబూరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూ. 1,500 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. ఇప్పుడు కూడా అప్పుల పేరుతో ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, ఇతర ఆర్థిక సంస్థల నుంచి అప్పులు తెచ్చి రాజధాని నిర్మాణం చేస్తున్నారు తప్ప కేంద్ర ప్రభుత్వం నిధులివ్వట్లేదని అన్నారు. 11 ఏళ్ల కిందట తీసుకున్న భూముల్లో రైతులకు ప్లాట్లు అభివృద్ధి చేయలేదని చెప్పారు. ముందుగా రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేయాలని, భూసమీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి నేతాజీ, నాయకులు పాశం రామారావు, భావన్నారాయణ, నళినీకాంత్, అప్పారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

స్వచ్ఛ గుంటూరు సాధనకు సమాయత్తమవుదాం

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: స్వచ్ఛ గుంటూరు సాధనలో అందరినీ భాగస్వాముల్ని చేయాలని, ప్రతి డివిజన్‌కు పారిశుద్ధ్యం పర్యవేక్షించే ఒక బాధ్యతాయుత ఉద్యోగిని నియమించాలని తూర్పు ఎమ్మెల్యే మహమ్మద్ నసీర్ అన్నారు. బుధవారం జీఎంసీ కౌన్సిల్ హాల్‌లో కమిషనర్ పులి శ్రీనివాసులుతో కలిసి పారిశుద్ధ్యం మెరుగుకు చేపట్టాల్సిన కార్యాచరణపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ సీఎం చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర నిర్మాణానికి కట్టుబడి ఉన్నామన్నారు. గుంటూరును పచ్చదనం.. పరిశుభ్రంగా తీర్చిదిద్దుతామన్నారు. ఇప్పటి వరకు పారిశుద్ధ్య కార్యక్రమాలపై ఎలాంటి ప్రణాళికలు రూపొందించారు..? ఏ వార్డులో ఎంతమంది సిబ్బంది పని చేస్తున్నారు..? ఎన్ని పరికరాలు, వాహనాలు అవసరం..? అంశాలపై వివరాలు తీసుకున్నట్లు తెలిపారు. కావాల్సిన సిబ్బంది, వాహనాలు సమకూర్చేలా అధికారులు దృష్టి సారించాలని సూచించారు. గత ఐదేళ్ల కాలంలో మురుగునీరు రహదార్లపై ప్రవహించేదని, ప్రస్తుతం రూ.వందల కోట్లతో సీసీ డ్రెయిన్లు నిర్మిస్తున్నామని తెలిపారు. కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ మైక్రోప్లాన్ మేరకు నూరుశాతం పారిశుద్ధ్యం అమలవుతుందన్నారు. సిబ్బందిని పెంచినట్లు చెప్పారు. ప్రతి 350 ఇళ్లకు ఒక మైక్రోపాకెట్ ఉంటుందని, ప్రతి మైక్రోపాకెట్‌కు ఇద్దరు కార్మికులను కేటాయించినట్లు తెలిపారు. ఉదయాన్నే 5.30 గంటకు కార్మికులు హాజరై 350 ఇళ్ల పరిధిలోని రహదారులను శుభ్రం చేస్తారని, తర్వాత ఇంటింటి తడి, పొడి చెత్త సేకరణ చేస్తారన్నారు. మధ్యాహ్నం మైక్రో పాకెట్ ప్రాంతాల్లో సైడుకాల్వల శుభ్రం చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో సీఎంవోహెచ్ డాక్టర్ అమృతం, ఇన్‌ఛార్జి ఎంహెచ్‌వో రామారావు, ఎస్ఎస్‌లు ఆయూబ్‌ఖాన్, సాంబయ్య, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

జీజీహెచ్ ఎదుట టిఫిన్ బండి పెట్టుకునేందుకు స్థలం కేటాయింపు

రాధికకు వెండింగ్ కార్డు జారీ

నగరపాలక సంస్థ (గుంటూరు): జీజీహెచ్ ఎదుట జీవనోపాధి కోసం టిఫిన్ బండి పెట్టుకునేందుకు జిల్లా పాలనాధికారిని కోరిన అలవాల రాధికకు జీఎంసీ అధికారులు స్థలం కేటాయించారు. బుధవారం ఆమెకు కమిషనర్ శ్రీనివాసులు, తూర్పు ఎమ్మెల్యే నసీర్ చేతులమీదుగా ఉపా సెల్ నుంచి వెండింగ్ కార్డును అందజేశారు. ఈ కార్డు ద్వారా బ్యాంకుల నుంచి రుణం పొందేందుకు; కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలకు అర్హతకు వీలు కలుగుతుందని తెలిపారు. అర్జీ ఇచ్చిన అతి తక్కువ వ్యవధిలో వ్యాపారానికి స్థలం చూపి, గుర్తింపుకార్డు జారీ చేసిన అధికారులకు రాధిక కృతజ్ఞతలు చెప్పారు. ఇటీవల ఆమె కుమారుడు కలెక్టర్ నాగలక్ష్మిని కలిసి వినతిపత్రం ఇచ్చిన సంగతి తెలిసిందే.

ఏటుకూరు బైపాస్‌రోడ్డులో స్తంభించిన ట్రాఫిక్

పట్నంబజారు: ఏటుకూరు బైపాస్‌రోడ్డులో బుధవారం సాయంత్రం ట్రాఫిక్ స్తంభించింది. ఏటుకూరు వైపు నుంచి వస్తున్న కాలేజీ బస్సు ముందు వైపు వెళ్తున్న కారును ఢీకొట్టింది. కారు డ్రైవర్.. బస్సు డ్రైవర్‌తో వాదనకు దిగడంతో ఆ ప్రాంతంలో దాదాపు గంటకు పైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. సమాచారం తెలుసుకున్న లాలాపేట పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు అక్కడికి చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

చాలీచాలని జీతాలతో యాతన పడుతున్నాం

జీఎంసీ కార్యాలయం ఎదుట నిరసనలో పాల్గొన్న కార్మికులు

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: చాలీచాలని జీతాలతో జీవనం వెళ్లదీయాల్సి వస్తోందని, ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికుల జీతాలు పెంచాలని జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు చెట్ల ఆకులను తింటున్నట్టు నిరసన చేపట్టి జీఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా కన్వీనర్ పూనేపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత సమ్మె కాలంలో ఒప్పందాలను అమలు చేయాలని, సంక్షేమ పథకాలను కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, ఇంజినీరింగ్ విభాగం కోకన్వీనర్ లలితకుమారి, పాశం పూర్ణచంద్రరావు, దుర్గాప్రసాద్, బాషా, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ఆటో డ్రైవర్లపై కేసులు

నిబంధనలు ఉల్లంఘించి పరిమితికి మించి పాఠశాలల విద్యార్థులతో వెళ్తున్న ఆటో డ్రైవర్లపై బుధవారం ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేశారు. తూర్పు విభాగపు ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్, ఎస్.ఐ.రవీంద్ర బస్టాండు సెంటర్లో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. రికార్డులు సరిగా లేకుండా, పరిమితికి మించి విద్యార్థులను తీసుకెళ్తున్న ఆటో డ్రైవర్లపై కేసులు నమోదు చేసి, అపరాధ రుసుంగా రూ. 20 వేలు వసూలు చేశారు. ట్రాఫిక్ సీఐ అశోక్‌కుమార్ మాట్లాడుతూ బడి పిల్లలను తీసుకెళ్లే ఆటో డ్రైవర్లు విధిగా డ్రైవింగ్ లైసెన్సుతోపాటు, రికార్డుల్ని తమ వెంట ఉంచుకోవాలన్నారు. వాహనాల కండిషన్‌ను ఎప్పటికప్పుడు పరిశీలించాలని సూచించారు. ప్రతిరోజు తనిఖీలుంటాయని చెప్పారు. **- న్యూస్‌టుడే, పట్నంబజారు**

విద్యుత్తు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచాలి

మాట్లాడుతున్న విజయలక్ష్మి, చిత్రంలో ప్రసాద్, శ్రీనివాసబాబు, ఖాన్

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: విద్యుత్తు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు అందరూ కృషి చేయాలని విద్యుత్తు భద్రతా సంచాలకులు, ప్రభుత్వ ప్రధాన విద్యుత్తు తనిఖీ అధికారి విజయలక్ష్మి సూచించారు. జాతీయ విద్యుత్తు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం టౌన్-1 ఈఈ కార్యాలయంలో ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యుత్తు వినియోగంపై సరైన అవగాహన కల్పిస్తూ ప్రమాదాలు జరగకుండా చూడడంపై దృష్టి పెట్టాలన్నారు. నూతన సర్వీసు మంజూరు చేసే సమయంలోనే ఇంటికి ఎర్తింగ్ సక్రమంగా ఉందా? లేదా? తనిఖీ చేయాలన్నారు. గృహ వినియోగదారులు విద్యుదాఘాతానికి గురి కాకుండా ఉండేందుకు 30 ఎంఏ సామర్థ్యం కలిగి ఉన్న ఆర్‌సీసీబీ/ఈఎల్‌సీబీలను విద్యుత్తు సరఫరా వలయాల్లో చట్టప్రకారం విధిగా ఉపయోగించుకునేలా చూడాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు సంబంధించి మోటారు స్టార్టర్లు, స్విచ్చులు ఉన్న ఇనుప బోర్డులకు విధిగా ఎర్తింగు వేసిన అనంతరమే సర్వీసు ఇవ్వాలన్నారు. తడి చేతులతో, నీటిలో నిలబడి విద్యుత్తు మోటార్లు, పరికరాలను తాకవద్దని ప్రచారం చేయాలన్నారు. పొలాల్లో తెగిపడిన, జారిపడిన, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్తు వైర్లకు దూరంగా ఉంటూ సంబంధిత అధికారులకు లేదా 1912కి ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ 1.8 మీటర్ల ఎత్తులో కంచె ఏర్పాటు చేయాలని, ఎర్త్ వైరు భూమికి అనుసంధానం చేసిన ప్రాంతంలో తేమ తగ్గకుండా చూడాలన్నారు. ఎర్త్ వైరు సక్రమంగా ఉంటే విద్యుత్తు సరఫరాలో సమస్య ఏర్పడినప్పటికీ ఫ్యూజ్ పోయి పరికరాలు దెబ్బతినకుండా కాపాడుతుందనే విషయంపై వినియోగదారులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరు ప్రసాద్, ఈఈ శ్రీనివాసబాబు, డిప్యూటీ ఈఈ పీహెచ్ ఖాన్‌తోపాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

జిల్లా జైలు వద్ద చెవిరెడ్డి అనుచరుల మంతనాలు

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మద్యం ముడుపుల కేసులో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అనుచరులు బాలాజీకుమార్ యాదవ్, నవీన్‌కృష్ణలను సిట్ అధికారులు బుధవారం రాత్రి గుంటూరు జిల్లా జైలుకు తీసుకొచ్చినప్పుడు వారి వెంట ఓ ప్రైవేట్ వాహనంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు వచ్చారు. వీరు తీసుకొచ్చిన దుస్తులు, ఇతర సామగ్రిని బాలాజీ, నవీన్‌లకు అందించారు. కొంతసేపు మంతనాలు జరిపినా ఎస్కార్ట్ పోలీసులు, సిట్ అధికారులు అడ్డుకోకపోవడం గమనార్హం. నిందితులు జైల్లోకి వెళ్లాక వారి కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో ఒకరిద్దరు ఎవరికో ఫోన్ చేసి ఎస్కార్ట్ అధికారితో మాట్లాడించారు. ఈ విషయాన్ని అక్కడే ఉన్న మీడియా ప్రతినిధులు, నిఘా వర్గాలు చూస్తున్నారని గమనించిన అధికారులు వెంటనే అప్రమత్తమై దూరంగా వెళ్లాలని ఆదేశించారు.

రుణగ్రహీత ఇంటికి తాళం వేసిన ఘటనపై విచారణ

పట్నంబజారు, న్యూస్‌టుడే: అప్పు తీర్చలేదని రుణగ్రహీత ఇంటికి రుణదాత తాళం వేసిన కేసును తూర్పు విభాగపు డీఎస్పీ అబ్దుల్ అజీజ్ దర్యాప్తు చేస్తున్నారు. పాతగుంటూరు శివాలయం వీధికి చెందిన గోపీ అనే వ్యక్తి రాంబాబు అనే వ్యక్తి నుంచి రూ. 7 లక్షలు అప్పుగా తీసుకొని, వడ్డీ చెల్లిస్తున్నాడు. ఇటీవల తనకు రూ. 15 లక్షలు రావాలని రాంబాబు వచ్చి గోపీకి ఇంటికి తాళం వేశాడు. బుధవారం రాత్రి డీఎస్పీ ఇరువర్గాల వారిని తన కార్యాలయానికి పిలిపించి విచారణ చేశారు.

(c) eenadu

గుంటూరు పశ్చిమ

మురుగు కాల్వలు శుభ్రం చేయండి

నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరం నుంచి బయటకు వెళ్లే ప్రధాన మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని కమిషనర్ పులి శ్రీనివాసులు ఇంజినీరింగ్, ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన రెడ్డిపాలెం, విఘ్నేశ్వరనగర్, పోస్టల్ కాలనీ, వర్కర్స్‌కాలనీ ప్రాంతాల్లో పర్యటించి అభివృద్ధి, పారిశుద్ధ్య పనులను డ్రోన్ ద్వారా పరిశీలించారు. తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. పర్యటనలో డీఈఈ రమేష్‌బాబు, కార్పొరేటర్ రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కృష్ణనగర్ రైతుబజార్‌లో ధరలు.. కిలో ఒక్కింటికీ రూ.ల్లో టమాట 30, వంగ 34, బెండ 20, పచ్చిమిర్చి 33, కాకర 45, బీర 35, క్యాబేజీ 18, క్యారెట్ 40, దొండ 35, బంగాళదుంప 26, ఉల్లిపాయలు 22, గోరుచిక్కుళ్ళు 32, దోస 15, సొర 15, పొట్లకాయ 16, అరటికాయ 7, చామదుంప 25, బీట్‌రూట్ 36, కీరదోసకాయ 38, బీన్స్ 83, క్యాప్సికమ్ 73, కొత్తిమీర 20, ఆకుకూరలు 15, నిమ్మకాయలు 30, అల్లం 58, వెల్లుల్లి 110. - **పట్టాభిపురం, న్యూస్‌టుడే**

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
97042 53525, 80085 74897

స్పందనకు వందనం

★ గుండారావుపేట, నగరంపాలెం ప్రాంతాల్లోని వీధుల్లో చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. ఈ సమస్యను 'మేమున్నాం మీకుతోడుగా' ద్వారా స్థానికులు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అంగడి వెంకటేశ్వరరావు దృష్టికి తీసుకు వెళ్లగా ఆయన పారిశుద్ధ్య సిబ్బందిని పంపి చెత్త, వ్యర్థాలను తొలగింపజేశారు.

★ సాంబశివపేట వీధుల్లోని కాల్వల్లో పూడిక పేరుకుపోయి మురుగు పారుదలకు ఆటంకం ఏర్పడడంతో సమస్యను స్థానికులు 'మేమున్నాం మీకుతోడుగా' ద్వారా శానిటరీ ఇన్‌స్పెక్టర్ మల్లికార్జునరావు దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన సిబ్బందిని పంపి కాల్వల్లో పూడిక తొలగింపజేశారు. **-న్యూస్‌టుడే, నగరంపాలెం**

దుష్ట సంహారిణి వారాహి మాత

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: వారాహి మాత దుష్ట సంహారిణి అని, ఆమెను పూజించిన భక్తులకు రక్షణ కవచంలా ఉంటారని సుందర సత్సంగ్ సభ్యుడు కేవీ కోటేశ్వరరావు అన్నారు. స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై వారాహి వైభవం అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే ప్రవచనాలు బుధవారం రాత్రి ప్రారంభమయ్యాయి. మొదటి రోజు ప్రవచనాన్ని కోటేశ్వరరావు ప్రారంభిస్తూ రాక్షస సంహారణ కోసం అమ్మవారు లలిత పరమేశ్వరి, శ్యామల, వారాహి రూపాల్లో అవతరించారన్నారు. వారాహి దేవి ద్వాదశ నామ పఠనం దేవీ ప్రీతికరమన్నారు. కార్యక్రమాలను తొలుత ఆలయ పాలకమండలి ఉపాధ్యక్షుడు లంకా విజయబాబు, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, సుందర సత్సంగ్ సభ్యులు మన్నవ రవిప్రసాద్, పి.శివారెడ్డి, ఏకాంబరేశ్వరరావు, బసవేశ్వరరావు తదితరులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు.



మాట్లాడుతున్న కేవీ కోటేశ్వరరావు

4 నుంచి గురుపూర్ణిమ ఉత్సవాలు

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: స్థానిక విద్యానగర్ మూడో లైనులోని శ్రీసాయిబాబా సన్నిధానంలో ఈనెల 4వ తేదీ నుంచి 10వ తేదీ దాకా గురుపూర్ణిమ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ గౌరవాధ్యక్షుడు యడ్లపాటి అశోక్‌కుమార్, అధ్యక్షుడు వడ్డమూడి శివరామకృష్ణయ్య ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఉత్సవాల్లో నాలుగో తేదీ ఉదయం అయిదు గంటల నుంచి 11వ తేదీ ఉదయం అయిదు గంటల వరకు అఖండ సాయినామ సప్తాహం జరుగుతుందని. లక్షమల్లెల అర్చన, తొలి ఏకాదశి సందర్భంగా సాయిసత్య వ్రతాలు, అన్న సమారాధన, గ్రామోత్సవం తదితరాలు పదోతేదీ దాకా ఉంటాయి. 11వ తేదీన ఉదయం అయిదు గంటలకు అఖండ సాయినామ సప్తాహ ఉద్యాపన ఉంటుందని ప్రకటనలో పేర్కొన్నారు.

రెండు మండలాల్లో స్వల్ప వర్షపాతం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: జిల్లాలో మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు రెండు మండలాల్లో స్వల్ప వర్షపాతం నమోదైంది. దుగ్గిరాల 2.4, తాడేపల్లి 1.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది.

పశ్చిమ వైపు ఆర్వోబీ పిల్లర్ పనులు ప్రారంభం

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే

గుంటూరు నగరంలో అత్యంత కీలకమైన శంకర్‌విలాస్ ఆర్వోబీ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గత నెల 23న శంకర్‌విలాస్ వంతెన తొలి పిల్లర్ నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయి. తిరిగి పశ్చిమ నియోజకవర్గం వైపున అరండల్‌పేట, బ్రాడీపేట ప్రధాన రహదారిలో పిల్లర్ నిర్మాణానికి అవసరమైన గుంతను తీసే పనిలో కాంట్రాక్టు సంస్థ నిమగ్నమైంది. పొక్లెయిన్‌తో పనులు చేపట్టే సమయంలో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చుట్టూ ఇనుప బారికేడ్లను ఏర్పాటు చేశారు. తవ్విన మట్టిని తరలించే వాహనాలు సైతం బారికేడ్ల లోపల ఉండేలా ముందుగానే విశాలంగా వాటిని ఏర్పాటు చేశారు. గత నెలలో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పలు ప్రాజెక్టుల పనులపై అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్షించారు. ఈ క్రమంలో వంతెన నిర్మాణ పనుల జాప్యం చర్చకు రాగా.. సంబంధిత శాఖల అధికారుల తీరు పట్ల అసహనం వ్యక్తం చేశారు. పనులను పరుగులు పెట్టించేందుకు విద్యుత్తు శాఖ అధికారులతో చర్చించి స్తంభాలు మార్చాలని సూచించడంతో.. విద్యుత్తు అధికారులు వెంటనే అమలు చేయడంతో పనులు ప్రారంభానికి ఆటంకం తొలగింది. మొదటి పిల్లర్ పనులు చేపట్టిన పది రోజుల్లోనే పశ్చిమ వైపు పిల్లర్ ఏర్పాటు పనులు మొదలుపెట్టారు.

అరండల్‌పేట ప్రధాన రహదారిపై జరుగుతున్న పనులు

వాహనచోదకులకు సూచన

శంకర్ విలాస్ ఆర్వోబీ పనుల నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపోకల్లో మార్పులు చేశారు. పనులు పూర్తయ్యే వరకు వాహనాల మళ్లింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే ఎంటీబీ సెంటర్(హిందూ కళాశాల కూడలి) నుంచి లాడ్జి కూడలి వైపునకు మాత్రమే వంతెనపై రాకపోకలను ట్రాఫిక్ పోలీసులు అనుమతిస్తున్నారు. అయితే లాడ్జికూడలి వైపు నుంచి ఎంటీబీ సెంటర్ వైపుగా కూడా వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయి. దీంతో కాంట్రాక్టు సంస్థ భారీ వాహనాలు మలుపు తిరిగే సమయంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అంతేకాకుండా వంతెనపై ఎదురెదురుగా వాహనాలు రావడంతో రాకపోకలు స్తంభిస్తున్నాయి. నగర ప్రజలు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని పోలీసులు కోరుతున్నారు.

ఏడాదిలోనే రికార్డు స్థాయిలో హామీల అమలు

సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే గళ్లా

పట్టాభిపురం, న్యూస్‌టుడే: అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొత్త బెంచ్ మార్క్‌ను సెట్ చేసి అన్నివిధాలా దూసుకుపోతుందని గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్లా మాధవి పేర్కొన్నారు. 49వ డివిజన్‌లో సుపరిపాలన-తొలిఅడుగు కార్యక్రమం జరిగింది. ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి స్వాగతం పలికారు. ఏడాదిలో ప్రభుత్వం చేసిన మంచి పనులు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులున్నా...హామీల అమల్లో ముందున్నామన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వేలాది కోట్ల రూపాయలు సంక్షేమానికి ఖర్చు చేస్తున్నామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలన్న లక్ష్యంతో తల్లికి వందనం పథకం కింద సొమ్ము అందజేస్తున్నామన్నారు. అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే రికార్డు స్థాయిలో హామీలు అమలు చేసి సీఎం చంద్రబాబు చరిత్ర సృష్టించారు. చంద్రన్న చేస్తున్న సంక్షేమం, అభివృద్ధిని చూసి ఓర్వలేక జగన్ బ్యాచ్‌కు మైండ్ బ్లాక్ అవుతోంది. మతిభ్రమించి నోటికొచ్చినట్లు అవాకులు చవాకులు పేలుతూ అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు. అవన్నీ నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరని వైకాపా నేతలు గ్రహించాలని హితవు పలికారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు సింహాద్రి కనకాచారి, మద్దిరాల మ్యాని, తెలగతోటి సుధీర్, సుఖవాసి శ్రీనివాసరావు, నిమ్మల శేషయ్య, తాళ్ల వెంకటేష్ యాదవ్, మానుకొండ శివప్రసాద్, కొమ్మినేని కోటేశ్వరరావు, ఈరంటి వరప్రసాద్, మల్లె ఈశ్వర్, రావిపాటి సాయికృష్ణ, షేక్ చినబాజి, బెల్లంకొండ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధుడితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

రౌడీషీటర్లపై ఉక్కుపాదం

పట్టాభిపురం,న్యూస్‌టుడే: పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి సారిస్తున్నామని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పేర్కొన్నారు. పట్టాభిపురం ఠాణాలో ఆయన బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఈనెల 5న లోక్‌అదాలత్ ద్వారా కొన్ని కేసుల్ని పరిష్కరించడం జరుగుతుందన్నారు. రౌడీషీటర్ల కదలికలపై నిఘా ఉంచి ఉక్కుపాదం మోపుతున్నామన్నారు. రాత్రి వేళల్లో గస్తీని ముమ్మరం చేసి నేరాలను కట్టడి చేస్తామన్నారు. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. రాత్రి గస్తీలో వేలిముద్రల పరికరం ఆధారంగా పాత నేరస్థులు బసవరాజు, మోహన్‌లను అరెస్ట్ చేసిన కానిస్టేబుల్ శ్రీనివాసరావు, హోంగార్డు గురవయ్యను డీఎస్పీ అరవింద్ అభినందించి రివార్డు అందజేశారు. కార్యక్రమంలో సీఐ గంగా వెంకటేశ్వర్లు, ఎస్సై నరహరి తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్పీ సతీష్‌కుమార్

డ్రోన్ వినియోగంతో బోలెడు లాభాలు

ముట్లూరు(వట్టిచెరుకూరు) న్యూస్‌టుడే: వట్టిచెరుకూరు మండలంలోని ముట్లూరు, కోవెలమూడి గ్రామాలలో బుధవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ముట్లూరు ఎన్టీఆర్ రైతుమిత్ర గ్రూపు సభ్యులకు మండల వ్యవసాయశాఖ అధికారి సునీత, ఎంపీటీసీ గోగినేని కల్యాణచక్రవర్తిలు సబ్సిడీపై కిసాన్ డ్రోన్‌ను అందించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖ అధికారి మాట్లాడుతూ రైతులకు కిసాన్ డ్రోన్‌లు అత్యంత ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. ఒక్కో డ్రోన్‌పై ప్రభుత్వం రూ.7.84 లక్షలను భరిస్తుందని, గ్రూపు సభ్యులు రూ.1.96 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో చేబ్రోలు యూనియన్ బ్యాంకు మేనేజర్ వెంకటేశ్వరరావు, గ్రామ వ్యవసాయశాఖ అధికారులు షాహిద్, హారిక, మోనాలిసాలు పాల్గొన్నారు.

గ్రూపు సభ్యులకు డ్రోన్ అందిస్తున్న ఏవో సునీత

శారీరక, మానసిక ఆరోగ్యంపై సదస్సు

గోరంట్ల, న్యూస్‌టుడే: శారీరక, మానసిక ఆరోగ్యంపై గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. నర్సింగ్ కళాశాల విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ మరియ రోజా ముఖ్యఅతిథిగా పాల్గొని పలు సూచనలు చేశారు. ఆరోగ్యం మెరుగుకు దైనందిన జీవితంలో రోజూ పాటించాల్సిన అంశాలను వివరించారు. సెల్‌ఫోన్‌ను పరిమితంగా వినియోగించాలని, అవసరమైన పరిజ్ఞానానికే వినియోగించాలన్నారు. సదస్సులో కళాశాల ప్రిన్సిపల్ సిస్టర్ సంధ్య, వైస్ ప్రిన్సిపల్ ఆర్.షారూన్‌రోజ్, సెమినార్ కమిటీ కన్వీనర్ డి.స్వర్ణచరణిరామ్, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ మరియరోజా

విధుల్లో చేరిన ఆచార్య శ్రీనివాసరావు

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రి జనరల్ సర్జరీ విభాగం ఆచార్యునిగా కట్టా శ్రీనివాసరావు బుధవారం విధుల్లో చేరారు. ఆయన ప్రస్తుతం విజయవాడలో పనిచేస్తూ బదిలీపై గుంటూరు వచ్చారు.

జీజీహెచ్ ఎదుట టిఫిన్ బండి పెట్టుకునేందుకు స్థలం కేటాయింపు

రాధికకు వెండింగ్ కార్డు జారీ

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: జీజీహెచ్ ఎదుట జీవనోపాధి కోసం టిఫిన్ బండి పెట్టుకునేందుకు జిల్లా పాలనాధికారిని కోరిన అలవాల రాధికకు జీఎంసీ అధికారులు స్థలం కేటాయించారు. బుధవారం ఆమెకు కమిషనర్ శ్రీనివాసులు, తూర్పు ఎమ్మెల్యే నసీర్ చేతులమీదుగా ఉపా సెల్ నుంచి వెండింగ్ కార్డును అందజేశారు. ఈ కార్డు ద్వారా బ్యాంకుల నుంచి రుణం పొందేందుకు; కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలకు అర్హతకు వీలు కలుగుతుందని తెలిపారు. అర్జీ ఇచ్చిన అతి తక్కువ వ్యవధిలో వ్యాపారానికి స్థలం చూపి, గుర్తింపుకార్డు జారీ చేసిన అధికారులకు రాధిక కృతజ్ఞతలు చెప్పారు. ఇటీవల ఆమె కుమారుడు కలెక్టర్ నాగలక్ష్మిని కలిసి వినతి పత్రం ఇచ్చిన సంగతి తెలిసిందే.

వెండింగ్ గుర్తింపుకార్డు అందజేస్తున్న కమిషనర్ శ్రీనివాసులు, ఎమ్మెల్యే నసీర్

ఇంటింటికీ తిరుగుతూ.. పథకాలు వివరిస్తూ..

పట్టాభిపురం, న్యూస్‌టుడే: సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా 40 డివిజన్‌లోని వివిధ ప్రాంతాల్లో బుధవారం ప్రత్తిపాడు ఎమ్మెల్యే రామాంజనేయులు పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో లిడ్‌క్యాప్ ఛైర్మన్ పిల్లి మాణిక్యరావు, భాజపా నియోజకవర్గ కోఆర్డినేటర్ కన్నా రవి దేవరాజు, తెదేపా నాయకులు గింజుపల్లి వెంకటేశ్వరరావు, జిల్లా అధికార ప్రతినిధి కల్లూరి శ్రీనివాసరావు, కార్పొరేటర్లు ఏరువ సాంబిరెడ్డి, స్మిత పద్మజ పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రామాంజనేయులు

విద్యుత్తు భద్రతపై ప్రజల్లో అవగాహన అవసరం

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: విద్యుత్తు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు అందరూ కృషి చేయాలని విద్యుత్తు భద్రతా సంచాలకులు, ప్రభుత్వ ప్రధాన విద్యుత్తు తనిఖీ అధికారి విజయలక్ష్మి సూచించారు. జాతీయ విద్యుత్తు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం టౌన్-1 ఈఈ కార్యాలయంలో ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యుత్తు వినియోగంపై సరైన అవగాహన కల్పిస్తూ ప్రమాదాలు జరగకుండా చూడడంపై దృష్టి పెట్టాలన్నారు. నూతన సర్వీసు మంజూరు చేసే సమయంలోనే ఇంటికి ఎర్తింగ్ సక్రమంగా ఉందా? లేదా? తనిఖీ చేయాలన్నారు. గృహ వినియోగదారులు విద్యుదాఘాతానికి గురి కాకుండా ఉండేందుకు 30 ఎంఏ సామర్థ్యం కలిగి ఉన్న ఆర్‌సీసీబీ/ఈఎల్‌సీబీలను విద్యుత్తు సరఫరా వలయాల్లో చట్టప్రకారం విధిగా ఉపయోగించుకునేలా చూడాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు సంబంధించి మోటారు స్టార్టర్లు, స్విచ్చులు ఉన్న ఇనుప బోర్డులకు విధిగా ఎర్తింగు వేసిన అనంతరమే సర్వీసు ఇవ్వాలన్నారు. తడి చేతులతో, నీటిలో నిలబడి విద్యుత్తు మోటార్లు, పరికరాలను తాకవద్దని ప్రచారం చేయాలన్నారు. పొలాల్లో తెగిపడిన, జారిపడిన, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్తు వైర్లకు దూరంగా ఉంటూ సంబంధిత అధికారులకు లేదా 1912కి ఫిర్యాదు చేసేలా అవగాహన కల్పించాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ 1.8 మీటర్ల ఎత్తులో కంచె ఏర్పాటు చేయాలని, ఎర్త్ వైరు భూమికి అనుసంధానం చేసిన ప్రాంతంలో తేమ తగ్గకుండా చూడాలన్నారు. ఎర్త్ వైరు సక్రమంగా ఉంటే విద్యుత్తు సరఫరాలో సమస్య ఏర్పడినప్పటికీ ఫ్యూజ్ పోయి పరికరాలు దెబ్బతినకుండా కాపాడుతుందనే విషయంపై వినియోగదారులకు తెలియజేయాలన్నారు. సమావేశంలో ఎలక్ట్రికల్ ఇన్‌స్పెక్టరు ప్రసాద్, ఈఈ శ్రీనివాసబాబు, డిప్యూటీ ఈఈ పీహెచ్ ఖాన్‌తోపాటు పలువురు ఉద్యోగులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న విజయలక్ష్మి, చిత్రంలో ప్రసాద్, శ్రీనివాసబాబు, ఖాన్

డివైడర్స్‌లో గ్రిల్స్ మాయం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: లాడ్జి సెంటర్ సమీపంలోని డివైడర్స్‌పై చెట్లకు రక్షణగా అమర్చిన గ్రిల్స్‌ను దొంగలు అపహరించుకుపోతున్నారు. తుపాన్‌నగర్‌కు చెందిన కొందరు ఈ తరహా వ్యాపారం చేసేవారు రాత్రిళ్లు గ్రిల్స్ చోరీ చేస్తున్నారంటున్నారు. అరండల్‌పేట 15వ లైను నుంచి 16వ లైను వరకు ప్రధాన రహదారిలో డివైడర్స్‌పై ఉంచిన ఇనుప గ్రిల్స్ రెండు వైపులా రాత్రి వేళల్లో తీసుకెళ్లిపోతున్నారు. వేకువజామున అయితే జనసంచారం ఎక్కువగా ఉండదని గమనించిన దొంగలు వాటిని తస్కరించి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి ఈ తరహా చోరీలకు అడ్డుకట్ట వేయాలని, లేదంటే డివైడర్స్‌లో ఏర్పాటు చేసిన గ్రిల్స్ మొత్తం చోరీకి గురవుతాయని ప్రజలు వాపోతున్నారు.

లాడ్జి సెంటర్‌లో ప్రధాన రహదారి డివైడర్‌లో కనిపించని గ్రిల్స్

బోధనా నిపుణుల హాజరుశాతం పెరగాలి

గుంటూరు వైద్యం, న్యూస్‌టుడే: సర్వజనాసుపత్రి బోధనానిపుణుల హాజరు శాతం పెరగాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి డి.హెచ్.మంజుల సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా బుధవారం మంజుల మాట్లాడుతూ ప్రస్తుత గణాంకాలు పరిశీలిస్తే హాజరు తక్కువగా కనిపిస్తుందన్నారు. ఇది మెరుగుపడాలన్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సూచించిన విధంగా ప్రగతి నివేదికలు తయారు చేయాలన్నారు. నిర్మాణంలో ఉన్న పనులు ఎప్పటికి పూర్తవుతాయి? చేపట్టాల్సిన పనుల వివరాలు తదితర సమాచారాన్ని సిద్ధంగా ఉంచాలన్నారు. సమావేశంలో గుంటూరు వైద్య కళాశాల ప్రధానాచార్యులు సుందరాచారి, సూపరింటెండెంట్ ఎస్ఎస్‌వీ రమణ తదితరులు పాల్గొన్నారు.

చాలీచాలని జీతాలతో యాతన పడుతున్నాం

నగరపాలక సంస్థ (గుంటూరు), న్యూస్‌టుడే: చాలీచాలని జీతాలతో జీవనం వెళ్లదీయాల్సి వస్తోందని, ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న కార్మికుల జీతాలు పెంచాలని జిల్లా మున్సిపల్ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికులు చెట్ల ఆకులను తింటున్నట్టు నిరసన చేపట్టి జీఎంసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. సంఘం జిల్లా కన్వీనర్ పూనేపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత సమ్మె కాలంలో ఒప్పందాలను అమలు చేయాలని, సంక్షేమ పథకాలను కార్మికులకు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ముత్యాలరావు, ఇంజినీరింగ్ విభాగం కోకన్వీనర్ లలిత కుమారి, పాశం పూర్ణచంద్రరావు, దుర్గాప్రసాద్, బాషా, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జీఎంసీ కార్యాలయం ఎదుట నిరసనలో పాల్గొన్న కార్మికులు

రాజధాని నిర్మాణ బాధ్యత కేంద్రానిదే

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రాజధాని నిర్మాణ బాధ్యత కేంద్ర ప్రభుత్వానిదేనని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు అన్నారు. బుధవారం బ్రాడీపేటలోని కార్యాలయంలో జిల్లా నాయకులతో సమావేశం నిర్వహించారు. బాబూరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూ.1,500 కోట్లు ఇచ్చి చేతులు దులుపుకుందన్నారు. ఇప్పుడు కూడా అప్పుల పేరుతో ప్రపంచ బ్యాంకు, ఏషియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్, ఇతర ఆర్థిక సంస్థల నుంచి అప్పులు తెచ్చి రాజధాని నిర్మాణం చేస్తున్నారు తప్ప కేంద్ర ప్రభుత్వం నిధులివ్వట్లేదని అన్నారు. 11 ఏళ్ల కిందట తీసుకున్న భూముల్లో రైతులకు ప్లాట్లు అభివృద్ధి చేయలేదని చెప్పారు. ముందుగా రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేయాలని, భూసమీకరణను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి నేతాజీ, నాయకులు పాశం రామారావు, భావన్నారాయణ, నళినీకాంత్, అప్పారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బాబూరావు

జిల్లా జైలు వద్ద చెవిరెడ్డి అనుచరుల మంతనాలు

గుంటూరు నేరవార్తలు: మద్యం ముడుపుల కేసులో మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అనుచరులు బాలాజీకుమార్ యాదవ్, నవీన్‌కృష్ణలను సిట్ అధికారులు బుధవారం రాత్రి గుంటూరు జిల్లా జైలుకు తీసుకొచ్చినప్పుడు వారి వెంట ఓ ప్రైవేట్ వాహనంలో కుటుంబ సభ్యులు, స్నేహితులు వచ్చారు. వీరు తీసుకొచ్చిన దుస్తులు, ఇతర సామగ్రిని బాలాజీ, నవీన్‌లకు అందించారు. కొంతసేపు మంతనాలు జరిపినా ఎస్కార్ట్ పోలీసులు, సిట్ అధికారులు అడ్డుకోకపోవడం గమనార్హం. నిందితులు జైల్లోకి వెళ్లాక వారి కుటుంబ సభ్యులు, స్నేహితుల్లో ఒకరిద్దరు ఎవరికో ఫోన్ చేసి ఎస్కార్ట్ అధికారితో మాట్లాడించారు. ఈ విషయాన్ని అక్కడే ఉన్న మీడియా ప్రతినిధులు, నిఘా వర్గాలు చూస్తున్నారని గమనించిన అధికారులు వెంటనే అప్రమత్తమై దూరంగా వెళ్లాలని ఆదేశించారు.

30 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: పేదల వద్ద నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు అమ్ముకునేందుకు రేషన్ బియ్యాన్ని మూడు వాహనాల్లో తరలిస్తుండగా అరండల్‌పేట పోలీసులు పట్టుకున్నారు. సంజీవయ్యనగర్ వద్ద ఏడుకొండలు, అంజిబాబు, వెంకటేశ్వర్లును అదుపులోకి తీసుకుని 30 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పట్టాభిపురం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో జరిగిన గొడవలో గాయాలు పాలై చికిత్స పొందుతున్న యువకుడు మృతి చెందాడు. నల్లపాడు పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సంగడిగుంటకు చెందిన ప్రశాంత్‌కుమార్ (19) తన స్నేహితుడు మహేష్ పుట్టిన రోజు కావడంతో సత్యసాయి ట్రస్ట్ వద్ద జాతీయ రహదారి పక్కన ఉన్న ఖాళీ స్థలంలో గత నెల 27న స్నేహితులతో కలిసి మద్యం తాగుతున్నాడు. తక్కెళ్లపాడుకు చెందిన రాజ్ మీనా కూడా అక్కడ ఆగి మద్యం తాగుతుండగా ప్రశాంత్‌తో పాటు స్నేహితులు ఆయన వద్దకు వచ్చారు. రాజు వద్ద ఉన్న మద్యం తాగి ఆయన ఫోన్ బలవంతంగా తీసుకున్నారు. డబ్బు ఇస్తే ఫోన్ ఇస్తామని చెప్పడంతో ఘర్షణ జరిగింది. ఫోన్లు వస్తున్నా ఇవ్వకపోగా విసిరి వేశారు. దీంతో రాజు తన వద్ద ఉన్న కీచైన్‌కు ఉన్న కత్తితో ప్రశాంత్ గొంతుపై కోశాడు. గాయపడ్డ ప్రశాంత్‌ను స్నేహితులు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ప్రశాంత్ మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాట్స్ సభలకు ఆహ్వానం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: అమెరికాలో జరిగే నాట్స్ సభలకు ఏపీ విశ్రాంత పోలీస్ అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కాళహస్తి సత్యనారాయణకు ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా ఆయనను విశ్రాంత పోలీసు అధికారుల సంఘం నాయకులు అభినందించారు.

గుంటూరు సాంస్కృతికం, న్యూస్‌టుడే: అమెరికాలో జులై 4, 5, 6 తేదీల్లో జరిగే నార్త్ అమెరికా తెలుగు సొసైటీ (నాట్స్) 8వ సభల్లో పాల్గొనడానికి ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఉపాధ్యక్షుడు బొమ్ము ఉమామహేశ్వరరెడ్డికి ఆహ్వానం అందింది.

మహిళల రక్షణకు శక్తి యాప్

గుంటూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మహిళల రక్షణకు శక్తి యాప్ ఉపయోగపడుతుందని మహిళా పోలీసుస్టేషన్ ఎస్సై తరంగిణి చెప్పారు. మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నగరంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులకు శక్తి యాప్ ఉపయోగాలపై అవగాహన కల్పించారు. అత్యవసర సమయాల్లో 112 నంబర్‌కు ఫోన్ చేస్తే శక్తి పోలీసు బృందాలు అక్కడికి చేరుకుంటాయన్నారు. సైబర్ నేరాలపట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విద్యార్థినులకు యాప్ ఉపయోగాలు తెలియజేస్తున్న ఎస్సై తరంగిణి

రెండు కుటుంబాల్లో ఎనిమిది మంది అదృశ్యం

పట్టాభిపురం, న్యూస్‌టుడే: రెండు కుటుంబాల్లో ఎనిమిది మంది అదృశ్యమైనట్లు పట్టాభిపురం ఠాణాలో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కోబాల్టుపేట ఆరో లైనులో సంధాని, చినబాజి నివాసం ఉంటున్నారు. వారు బుధవారం పనులకు వెళ్లారు. సంధాని భార్య కరిమూన్, పిల్లలు షాహిద్, సలీమ్, హఫీజ్, చినబాజి భార్య రజియా, ముస్తఖాన్, ముజంబీర్, మెహరీన్ ఇంట్లో చెప్పకుండా వెళ్లిపోయారు. పనుల నుంచి వచ్చిన సంధాని, చినబాజీలు భార్యాపిల్లల కోసం పలు ప్రాంతాల్లో గాలించారు. ఆచూకీ లభించక పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ గంగా వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటింటా చెత్త సేకరణ పక్కాగా నిర్వహించాలి

గోరంట్ల, న్యూస్‌టుడే: ఇంటింటా చెత్త సేకరణ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలని జడ్పీ సీఈవో జ్యోతిబసు అన్నారు. గుంటూరు రూరల్ మండలం లాలుపురం గ్రామంలో బుధవారం పర్యటించారు. పర్యటనలో భాగంగా మంచినీటి సరఫరా, ఇంటింటా చెత్త సేకరణ పనులు పరిశీలించారు. సంపద సృష్టి కేంద్రాన్ని సందర్శించి షెడ్డు నిర్వహణ అంశాలపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో బండి శ్రీనివాసరావు, పీఆర్ ఎస్ఈ రమేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి మహబూబ్ సుభానీ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ఫొటోగ్రాఫర్ల కార్యవర్గం ఎన్నిక

గుంటూరు, న్యూస్‌టుడే: గుంటూరు జిల్లా ఫొటోగ్రాఫర్ల అసోసియేషన్ కార్యవర్గ ప్రమాణస్వీకారం బుధవారం గుంటూరులోని బండ్లమూడి గార్డెన్స్‌లో జరిగింది. అధ్యక్షుడిగా నిమ్మగడ్డ సతీష్‌కుమార్, కార్యదర్శిగా మాటూరు రవికుమార్, కోశాధికారిగా టంకసాల హరిబాబు, ఉపాధ్యక్షులుగా షేక్ ముజీబ్, సంయుక్త కార్యదర్శిగా సయ్యద్ షరీఫ్ ప్రమాణస్వీకారం చేశారు.

ఆక్రమణల తొలగింపు

పట్నంబజారు: చేపలమార్కెట్ పరిసర ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా ఉన్న ఆక్రమణలను బుధవారం తూర్పు విభాగపు ట్రాఫిక్ పోలీసులు తొలగించారు. పూలమార్కెట్ సెంటర్, ఏలూరుబజారు, పండ్ల మార్కెట్ ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. నేమ్‌బోర్డులు, ఇతర సామగ్రిని రికవరీ వ్యాన్ ద్వారా బస్టాండు సెంటర్లోని ట్రాఫిక్ పోలీసుస్టేషన్‌కు తరలించారు.

గంజాయి విక్రయదారునికి ఆరు నెలల జైలు

మంగళగిరి, న్యూస్‌టుడే: గంజాయి విక్రయదారునికి గుంటూరు ఫస్ట్‌క్లాస్ అడిషనల్ సెషన్స్ కోర్టు ఆరు నెలల జైలు, రూ.2 వేలు జరిమానా విధించింది. కేసుకు సంబంధించి మంగళగిరి ప్రొహిబిషన్ సీఐ వీరాంజనేయులు బుధవారం ప్రకటన విడుదల చేశారు. మంగళగిరి ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని తాడేపల్లి మండలం కుంచనపల్లి రోడ్డులో 2019లో 1.600 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని హేమంత్‌కుమార్ అనే వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేశారు. కోర్టులో కేసు విచారణలో భాగంగా నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి ఈ మేరకు తీర్పు ఇచ్చారు.

పోలీసుల అదుపులో పాత బంగారం కొనుగోలు ముఠా

పెదకాకాని, న్యూస్‌టుడే : పాత బంగారం కొనుగోలు చేస్తామని మోసగించిన ముఠాను శ్రీకాళహస్తి పోలీసులు పెదకాకాని బాజిబాబా దర్గా వద్ద బుధవారం అదుపులోకి తీసుకున్నారు. పెదకాకాని, శ్రీకాళహస్తి పోలీసుల కథనం ప్రకారం..పాత బంగారానికి రెట్టింపు ధర ఇచ్చి కొనుగోలు చేస్తామని శ్రీకాళహస్తిలో కొందరిని నమ్మించారు. బంగారం కొనుగోలు చేసిన తర్వాత నోట్ల కట్టపై అసలు కరెన్సీ పెట్టి లోపల డమ్మీ నోట్లు ఉంచారు. గుర్తు పట్టకుండా ప్యాకింగ్ చేసి ఇచ్చారు. ఇలా పలువురిని మోసగించినట్లు బాధితుల ఫిర్యాదుతో శ్రీకాళహస్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు ముగ్గురు వ్యక్తులు, ఇద్దరు మహిళలు పెదకాకాని బాజిబాబా దర్గాలో తలదాచుకున్నట్లు వచ్చిన సమాచారంతో స్థానిక పోలీసుల సహకారంతో నిందితులను అదుపులోకి తీసుకొని శ్రీకాళహస్తికి తరలించారు.

అడ్డదిడ్డంగా వాహనం నడిపిన ఇద్దరిపై కేసు

పట్టాభిపురం, న్యూస్‌టుడే: మద్యం మత్తులో అడ్డదిడ్డంగా వాహనం నడిపి రోడ్డు ప్రమాదానికి కారణమైన ఇద్దరిపై నల్లపాడు పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. ఇన్నర్ రింగ్‌రోడ్డులో ఇద్దరు వ్యక్తులు మద్యం తాగి బుల్లెట్ వాహనంపై స్నేక్ డ్రైవింగ్ చేస్తూ ఒకరిని ఢీకొట్టారు. ఆయనకు గాయాలయ్యాయి. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

(c) eenadu

ఈనాడు
అమరావతి
కృష్ణా
గురువారం జులై 3, 2025

బుసకాసురుల ఆకలి.. భూములు ఖాళీ

మచిలీపట్నం పోర్టులోకి వెళ్లేందుకు కొత్తగా నిర్మిస్తున్న ప్రధాన రహదారిపక్క ఎడమవైపున ప్రహరీకి ఆనుకొని పరిపాలన, సెక్యూరిటీ, భవన నిర్మాణాల సమీపంలో కనిపించే దృశ్యమిది. గోపువానిపాలెంకు చెందిన వ్యక్తి ఏడాదిగా ఇక్కడ ఉన్న బుసక మేటలను కరిగించడంతో భారీ గుంతలు పడి నీరు చేరింది.

పోర్టులోకి వెళ్లే మార్గంలో కుడివైపున చినకరగ్రహారానికి చెందిన కొందరు వ్యక్తుల అరాచక తీరుకు ఫలితమిది. వేల ట్రిప్పుల బుసక తరలించి రూ.1.50కోట్లకుపైగా దండుకున్నారిక్కడ. పది అడుగుల మేర ఉండాల్సిన ఇక్కడి బుసక మేటలను తవ్వేయడంతో ఇలా చెట్ల వద్ద వేర్లు తేలాయి. వందల చెట్లు నేలకొరిగాయి.

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

నేలకొరిగిన వందల తాటిచెట్లు

మచిలీపట్నం గ్రామీణం లోని బుసక తోడేళ్ల ఆకలికి వందలాది ఎకరాల ముడా, ప్రభుత్వ భూములు గుల్లబారిపోయాయి. ఓ ముఖ్య ప్రజాప్రతినిధికి సన్నిహితులుగా చలామణి అవుతున్న గోపువానిపాలెం, చినకరగ్రహారం గ్రామాలకు చెందిన వ్యక్తుల దందాకు పదుల అడుగుల ఎత్తున ఉండే బుసక మేటలు కనుమరుగయ్యాయి. వైకాపా ప్రభుత్వంలో మాజీ మంత్రి అండతో విపరీతంగా ప్రకృతి వనరులు కొల్లగొట్టారు. ప్రభుత్వం మారినా బుసక తోడేళ్ల దందా ఆగట్లేదు. పోర్టుకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన.. పోర్టు ప్రహరీకి ఆనుకుని ఉన్న భూముల్లో భారీ పొక్లెయిన్లతో రాత్రీపగలు విచ్చలవిడిగా తవ్వేసి పదుల సంఖ్యలో లారీలు.. ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. మచిలీపట్నం సహా చుట్టుపక్కల గ్రామాలు, వివిధ వెంచర్లు, పలు నిర్మాణాల మెరకలకు ఈ మేటలను ప్రభుత్వ అనుమతులు లేకుండా తవ్వుకెళ్లిపోతున్నారు. భారీ గుంతలు పడడంతో వాటిలో ఊటలు చేరి చెరువులను తలపిస్తున్నాయి. పోర్టు సమీపంలో బహిరంగంగానే పెద్దఎత్తున అక్రమాలు జరుగుతున్నా జిల్లా యంత్రాంగం కన్నెత్తి చూడకపోవడం తీవ్ర అనుమానాలకు తావిస్తోంది.

అన్యాయమంటే.. బెదిరింపులు

'పోర్టు సమీపంలో అనుమతులు లేకుండా అక్రమంగా రాత్రీ పగలు తవ్వేస్తే ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులకు చెడ్డ పేరు వస్తుంది. ఇక్కడ తవ్వకాలు ఆపేయండి' అని పలువురు కూటమి నేతలు.. అధికారులు హెచ్చరిస్తే.. 'పోర్టు కోసం రైతులతో భూములు ఇప్పించిందే మేము. మమ్మల్ని అడ్డుకునే ధైర్యం ఎవరికి ఉంది. బందరులోని అన్ని పార్టీల ప్రముఖ నాయకుల నుంచి జిల్లా అధికారుల వరకు వాటాలు ఇస్తున్నాం. అడ్డుకునేందుకు ప్రయత్నిస్తే మా సంగతి తెలుసుకదా' అంటూ బెదిరిస్తున్నారని పలువురు వాపోతున్నారు. వైకాపా నేతల ఆగడాలను అడ్డుకున్న వారే అదే బుసక మాఫియాతో చేతులు కలిపి రూ.కోట్లు దోచేస్తున్నారు.

ఈనాడు ETV పరిశీలన

అక్రమార్కుల దోపిడీకి వృక్షాలే సాక్ష్యాలు

పోర్టు సమీపంలో గోపువానిపాలెం, చినకరగ్రహారం, పల్లెతుమ్మలపాలెం, మంగినపూడి తదితర గ్రామాల పరిధిలోని భారీ ఎత్తున ఉండే బుసక మేటలను గద్దలా తన్నుకుపోతున్నారు. ప్రభుత్వాలు మారినా బుసక తోడేళ్ల ఆగడాలు ఆగట్లేదు. ప్రకృతి వనరుల దోపిడీతో వందల ఎకరాల భూములు చెరువులుగా మారాయి. పదుల అడుగుల ఎత్తున ఉండే మేటలు తోడేయడంతో వందల తాటి చెట్లు వేర్లు పైకితేలి నేలకొరిగాయి. ఈ వృక్షాలే అక్రామర్కుల ఆగడాలకు సాక్ష్యాలు. ప్రకృతి విపత్తులు సంభవిస్తే తమ గ్రామాలకు రక్షణ కవచంలాంటి బుసక మేటలను మాయం చేశారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇరుపక్షాల అంగీకారంతో కేసుల పరిష్కారం

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: ఇరుపక్షాల అంగీకారంతో మధ్యవర్తిత్వం ద్వారా కేసులు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నందున కక్షిదారులు వినియోగించుకోవాలని జిల్లా జడ్జి జి.గోపి ఓ ప్రకటనలో కోరారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి 90 రోజుల పాటు 'మీడియేషన్ ఫర్ ది నేషన్' పేరుతో ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అన్ని కోర్టుల్లో సివిల్, చెక్‌బౌన్స్ తదితర కేసులతో పాటు రాజీ పడదగిన క్రిమినల్ కేసులు మీడియేషన్‌కు పంపిస్తామన్నారు.

డయల్ యువర్ డీఎంహెచ్‌వో నేడు

ఈనాడు మీతోడు

మచిలీపట్నం కార్పొరేషన్, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న సమస్యలతో పాటు వివిధ అంశాలపై గురువారం 'ఈనాడు' ఆధ్వర్యంలో డయల్ యువర్ డీఎంహెచ్‌వో కార్యక్రమం జరుగుతుంది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న సమస్యలు, వైద్యులు అందుబాటులో లేకపోవడం, వసతులు ఉన్నా ప్రసవాలు చేయకపోవడం, మందుల కొరత, సిబ్బంది అలసత్వ వైఖరి, 104 వాహనాల ద్వారా సక్రమంగా సేవలు అందకపోవడం.. ఇలా వైద్య ఆరోగ్యశాఖకు సంబంధించిన ఎలాంటి సమస్యలు అయినా నేరుగా డీఎంహెచ్‌వో దృష్టికి తీసుకొచ్చే అవకాశాన్ని 'ఈనాడు' కల్పిస్తోంది. డీఎంహెచ్‌వో శర్మిష్ట అందుబాటులో ఉంటారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల ప్రజలు అందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

81438 66499 | తేదీ: గురువారం (3.7.2025) | సమయం: ఉదయం 11 నుంచి 12 వరకు

పశ్చిమ ప్రధాన కాల్వకు సాగునీరు విడుదల

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు బుధవారం 305 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు కేడబ్ల్యూ ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందుతుంది. బ్యారేజీ తాడేపల్లి వైపున ఉన్న కేడబ్ల్యూ హెడ్ రెగ్యులేటర్ వద్ద జలవనరుల శాఖ అధికారులు పూజా కార్యక్రమాలు నిర్వహించి, నీటిని విడుదల చేశారు. కేడబ్ల్యూ ఈఈ సుధాకరరావు, దుగ్గిరాల డీఈఈ శ్రీనివాసరావు, ఏఈఈ లక్ష్మీనారాయణ, బ్యారేజీ ఏఈఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలకు 5,938 క్యూసెక్కులు... కృష్ణా డెల్టా పరిధిలోని కాలువలకు బ్యారేజీ నుంచి 5,938 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 5,633, కేడబ్ల్యూ ప్రధాన కాలువకు 305 క్యూసెక్కులు విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 3,003, ఏలూరు 1,021, బందరు 956, కేఈబీ (దివిసీమ) కాల్వకు 653 క్యూసెక్కుల చొప్పున నీటిని ఇస్తున్నారు.

వద్దన్నా మారరే.. తగదన్నా మార్చరే

అవనిగడ్డలోని ఆక్వా కల్చరు ప్రయోగశాల, వ్యవసాయ శాఖ సబ్ డివిజన్ కార్యాలయం గోడపై ఇంకా జగన్‌మోహన్‌రెడ్డి చిత్రం ఇలా..

చల్లపల్లి మండలం పురిటిగడ్డ సచివాలయ భవనంపై మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి చిత్రం

అవనిగడ్డ గ్రామీణం, అవనిగడ్డ, కోడూరు, చల్లపల్లి - న్యూస్‌టుడే

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది కాలం పూర్తయినా అవనిగడ్డ నియోజకవర్గంలోని పలు ప్రభుత్వ కార్యాలయాలపై మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రాలే దర్శనమిస్తున్నాయి. ఇంకా జగన్‌మోహన్ రెడ్డినే ముఖ్యమంత్రిగా భావించి ఆయా కార్యాలయాల అధికారులు అలా వదిలేశారేమోనని నియోజకవర్గ ప్రజలు విమర్శిస్తున్నారు. అవనిగడ్డలోని ఆక్వా కల్చరు పరిశోధనా కేంద్రం భవనం, వ్యవసాయశాఖ అవనిగడ్డ సబ్ డివిజన్ కార్యాలయంపైనా మాజీ సీఎం చిత్రం సాక్షాత్కరిస్తోంది. నియోజకవర్గంలోని మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి రైతు సేవా కేంద్రం-2 అడపావారిపాలెం, చల్లపల్లి మండలంలోని పురిటిగడ్డ గ్రామ సచివాలయం భవనంపైనా ముఖ్యమంత్రి హోదాలోనే జగన్ మోహన్ రెడ్డి చిత్రం దర్శనమిచ్చింది. అయితే, సోషల్ మీడియాలో ఈ విషయం వైరల్ అయిన తర్వాత పురిటిగడ్డ గ్రామ సచివాలయం భవనంపైన జగన్ ఫొటోను పేపరు అతికించి కనిపించకుండా చేశారు. ఆయా కార్యాలయాల ఆధికారులు ఇప్పటికైనా విషయాన్ని గ్రహించి మాజీ సీఎం చిత్రాన్ని తొలగించాలని ఆయా ప్రాంతాల ప్రజలు సూచిస్తున్నారు.

పురిటిగడ్డ గ్రామ సచివాలయంపై ఫొటో తీసిన తర్వాత అతికించిన పేపర్

ముందే బేరం.. ముడితేనే పందేరం

- 25 శాతమిస్తేనే ఓఅండ్‌ఎం పనులు అప్పగింత
- చక్రం తిప్పుతున్న కీలక పదవిలో ఉన్న వ్యక్తి

ఈనాడు - అమరావతి

ఉమ్మడి కృష్ణాలో సాగునీటి కాలువల ఓఅండ్‌ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) పనుల్లో ముందస్తు ముడుపుల ముచ్చట సాగుతోంది. పనులు చేశాక కమీషన్లు తీసుకోవడం పరిపాటి.. ఇక్కడ మాత్రం కాంట్రాక్టు కావాలంటే కమీషన్లు ఇవ్వాలని హుకుం జారీ చేశారు. కీలక పదవిలో ఉన్న వ్యక్తి వ్యవహారం నడిపిస్తున్నారు. గుత్తేదారులు పనులు చేసేందుకు బెంబేలెత్తిపోతున్నారు. ఫలితంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి.

ఇప్పటికీ పనులు చేపట్టక అధ్వానంగా బందరు కాలువ

అంతా మా ఇష్టం

ఉమ్మడి జిల్లాలో కాలువల నిర్వహణ పనులకు ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది. 666 పనులు చేయాలి. కాలువలు శుభ్రం చేసి శివారు ప్రాంతాలకూ నీరివ్వాలనేది లక్ష్యం. దీనికి జిల్లాలో కీలక పదవిలో ఉన్న ఓ నాయకుడు తూట్లు పొడుస్తున్నారు. ఎక్కువ నిధులు కేటాయించిన పనుల విషయంలో కొత్త రకం దోపిడీకి తెర తీశారు. ముందుగా మొత్తం పనికి వచ్చే నిధుల్లో 25 శాతం కమీషన్‌గా సమర్పిస్తేనే పనులు అప్పగిస్తామని సొంత రాజ్యాంగం రాశారు. కొందరు గుత్తేదారులకు రూ.కోట్ల విలువైన పనులు అప్పగించి ఇప్పటికే భారీగా దండుకున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఇష్టమైతే చేయండి లేదంటే మానుకోండని ఆయన కుమారుడు చెప్పేస్తున్నారు.

గుత్తేదారుల వెనుకంజ..

ఓఅండ్‌ఎం పనులు చేసినా... బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియదు. ఇప్పుడు బిల్లులు పెడితే ఏడాదిన్నరలోగా వస్తే గొప్పే. పనులు చేయడానికి పెద్ద మొత్తంలో ఖర్చవుతుంది. దీంతో 90 శాతం గుత్తేదారులు ముందస్తు కమీషన్ ఇచ్చేందుకు ముందుకు రాలేదు. కొందరు 5 శాతం ముందుగా ఇచ్చి మిగతాది బిల్లులు వచ్చాక ఇస్తామన్నా ససేమిరా అన్నారు. ఇంత కమీషన్ ఇచ్చి ఖర్చులు పోగా మిగిలేది ఎంతని కొందరు గుత్తేదారులు లెక్కలేసుకున్నారు. ఆ మొత్తం రూ.5 లక్షలు దాటడం లేదు. ఈ మాత్రానికి ఈ తతంగం ఎందుకని చాలా మంది తప్పుకొన్నారు. వెరసి చాలా తక్కువ మంది గుత్తేదారులకు ఎక్కువ పనులు అప్పగించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ బేరాల వల్లే నీరు వదిలి రెండు వారాలైనా ఇప్పటికీ పనులు పూర్తిచేయలేదు.

తూతూమంత్రం.. రైతన్నకు కష్టం

ఈ స్థాయి కమీషన్లు, పెట్టుబడి పెట్టి చేస్తే మిగిలేది లేదని గుత్తేదారులు తూతూమంత్రంగానే పనులు చేస్తున్నారు. తూడు మొత్తం తొలగించి గట్టు మీద వేయాల్సి ఉన్నా దాదాపు ఎక్కడా అలా జరగడం లేదు. గడ్డి మందు చల్లి పైపైన తొలగించి సరిపెడుతున్నారు. గుర్రపుడెక్క, తూటికాడ ప్రవాహంలో కొట్టుకుపోగానే పనులు పూర్తయినట్లు బిల్లులు చేసుకుంటారు. కానీ ఆ వ్యర్థాలన్నీ అదే కాలువలో ఉండి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతాయి. దీంతో నీటి విడుదల ఎంత ఉన్నా శివారు ప్రాంతాలకు నీరు చేరదు.. ముంపు ప్రాంతాల్లో నీటి ఉద్ధృతి పెరిగి గండ్లు పడే ప్రమాదాలున్నాయి. ఏది జరిగినా అవస్థలు పడేది అన్నదాతలే.

పండుగ చేస్కో... రైతన్నా

ఈనాడు, అమరావతి

ఉమ్మడి జిల్లాలో పెద్దఎత్తున ఉద్యాన పంటల వృద్ధికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. 2025-26 ఆర్థిక ఏడాదిలో 5,500 ఎకరాల్లో కొత్తగా పండ్లు, పూలతోటలు ఏర్పాటు చేస్తారు. దీని కోసం ఉపాధి హామీ పథకం నుంచి రూ.60.5 కోట్ల నిధులు కేటాయించారు. ఉద్యాన పంటల అభివృద్ధి, కొత్త పంటలతో రైతులకు ఆదాయం పెంచేందుకు ఈ పథకం దోహద పడనుంది. గతేడాది ఉమ్మడి జిల్లాలో 2వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు అభివృద్ధి చేయగా ఈ ఏడాది రెట్టింపు లక్ష్యం నిర్దేశించుకున్నారు.

జిల్లా	ఏర్పాటు చేసే తోటల విస్తీర్ణం	గుర్తించింది (ఎకరాల్లో)
ఎన్టీఆర్	4,000	2,700
కృష్ణా	1,500	407
మొత్తం	5,500	3,107

3,107 ఎకరాలు గుర్తింపు: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 23 రకాల పండ్ల తోటలు, రెండు రకాల పూల తోటలు సాగు చేయవచ్చు. ఉమ్మడి జిల్లాలో ఆయా ప్రాంతాల నేల స్వభావం, నీటి లభ్యత అంచనా వేసి ఎన్టీఆర్ జిల్లాలో 13, కృష్ణాలో 17 పంటలు, గులాబీ, మల్లె తోటలు వేయడానికి అనుకూలం అని అధికారులు ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 3,107 ఎకరాల్లో రైతులు పంటలు వేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు గుర్తించారు. ఐదెకరాల్లోపు భూమి ఉన్న రైతులే అర్హులు కావడంతో చిన్నా, సన్నకారు రైతులకు ఇది మంచి అవకాశం. పథకం ప్రయోజనాలు పొందాలంటే జాబ్‌కార్డు తప్పనిసరి. వర్షాధారిత, సాగునీటి వసతి ఉండాలి.

ఎంపిక చేసిన పంటలివే.. మామిడి, జామ, సపోటా, నేరేడు, చింత, సీతాఫలం, బత్తాయి, డ్రాగన్‌ఫ్రూట్, అవకాడో, అంజీర, యాపిల్‌బేర్, మునగ, కాజు, స్వీట్ ఆరెంజ్, దానిమ్మ పంటలు ఈ జాబితాలో ఉన్నాయి.

ఎకరానికి రూ.1.10లక్షల సాయం: భూసార పరీక్షల మొదలు మూడేళ్ల వరకు భారమంతా ప్రభుత్వమే చూసుకుంటుంది. ఎకరానికి దుక్కి ఖర్చు రూ.1250 చెల్లిస్తారు. ఆ తోటలో అంతర పంటలు సాగు చేసుకుంటే దానికి దుక్కి ఖర్చు ఇస్తారు. గుంతలు తీయడం, మొక్కలు నాటడం ఉపాధి శ్రామికులతో లేదా సొంతంగా చేసుకున్నా ఆ మొత్తం చెల్లిస్తారు. రైతులు కొనుగోలు చేస్తే రవాణా ఖర్చు మొక్కకు రూ.8 చొప్పున కేటాయించారు. ఏడాదికి 45 తడుల చొప్పున మొక్కకి రూ.5.45 జమ చేస్తారు. కలుపు తీయడం, కాపలా, ఇతర పనులకు కలిపి మొక్కకు రూ.16 చొప్పున చెల్లిస్తారు. ఏడాదికోసారి మొక్కకు రూ.25 చొప్పున ఎరువుల కోసం జమ చేస్తారు. ఇలా ఒక్కో ఎకరానికి మూడేళ్లలో రూ.1.10లక్షల సాయం చేస్తున్నారు.. 'ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తులను ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు, ఏపీవో, క్షేత్ర సహాయకులకు అందజేయాలని డ్వామా పీడీ రాము తెలిపారు.

సుపరిపాలనలో తొలి అడుగు వేశాం: మంత్రి కొల్లు

సుల్తానగరం (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించేందుకే సుపరిపాలనలో తొలి అడుగు నిర్వహిస్తున్నట్లు మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. బుధవారం బందరు మండలం సుల్తానగరం ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. తల్లికి వందనం, ఉచిత గ్యాస్ పథకాల గురించి వివరించారు. ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించిన మంత్రి వాటిని పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి రవీంద్ర మాట్లాడుతూ గుంతలమయమైన రోడ్ల నుంచి ప్రజలకు విముక్తి కలిగించామన్నారు. నియోజకవర్గంలో రూ.32కోట్లతో 50 కి.మీ సీసీ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేసినట్లు చెప్పారు. బందరు నియోజకవర్గంలో 30వేల మందికి పింఛన్లు అందజేస్తున్నట్లు పేర్కొన్నారు.

ప్రజలకు కరపత్రాలు అందిస్తున్న కొల్లు రవీంద్ర

రైతులకు త్వరలోనే అన్నదాత సుఖీభవ ద్వారా రూ.20వేలు అందజేస్తామని, ఉచిత బస్సు పథకాన్ని ఆగస్టు 15 నుంచి అమలు చేస్తామన్నారు. బందరు పోర్టు నిర్మాణాన్ని వచ్చే ఏడాదికి పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. కార్యక్రమంలో మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కుంచె నాని, మండల పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు కాగిత వెంకటేశ్వరరావు, కాటం మధుసూదనరావు, జిల్లా తెలుగు రైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ, ఎంపీడీవో వెంకటేష్ పాల్గొన్నారు.

భూములిస్తే బందరులో విశాఖస్టీల్ మినీ ప్లాంట్.. బుధవారం సాయంత్రం పట్టణంలోని పలు వార్డుల్లో పర్యటించారు. మున్సిపల్ పాలకవర్గం బడ్జెట్ ఆమోదం తెలపకుండా అడ్డుకుంటున్న దుర్మార్గులుగా వైకాపా నేతలు నిలిచిపోతారని దుయ్యబట్టారు. మచిలీపట్నంను రూ.73 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. ప్రజలు భూములిస్తే విశాఖ స్టీల్ మినీప్లాంట్‌ను బందరులో ఏర్పాటు చేస్తామన్నారు. బందరులో ప్రధాన సమస్యగా ఉన్న మురుగు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు లోగిశెట్టి వెంకటస్వామి, కార్యదర్శి బచ్చుల అనిల్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్, పేర్ల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి
లీగల్ ప్రకటనలు
ఈనాడు క్లాసిఫైడ్స్
వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక
అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి: 98496 97616

సాంకేతిక దన్ను.. విరిచే అక్రమాల వెన్ను..

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం, న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

ముఖ గుర్తింపు ద్వారా పౌష్టికాహారం పంపిణీ

పౌష్టికాహారం పంపిణీలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా సాంకేతిక పరిజ్ఞానం వినియోగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో అర్హుల ముఖ గుర్తింపు(ఫేస్ రికగ్నిషన్) ద్వారా పౌష్టికాహారం అందించేందుకు అర్హుల వివరాలు సంబంధిత యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ విధానం ద్వారా మంగళవారం నుంచి పంపిణీ ప్రక్రియ అమల్లోకి వచ్చింది.

పక్కదారి పట్టకుండా

పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లోని గర్భిణులు, బాలింతలు.. చిన్నారులకు అందిస్తున్న బలవర్ధకమైన ఆహారం పలుచోట్ల పక్కదారి పడుతోంది. దీన్ని వ్యాపారంగా మలచుకున్నవారు భారీగా అక్రమాలకు తెరలేపి కోడిగుడ్లు, నిత్యావసరాలు, బాలామృతం వంటి వాటిని దారి మళ్లిస్తున్న ఉదాంతాలు కోకొల్లలు. వీటికి అడ్డుకట్ట వేసేందుకే కేంద్ర ప్రభుత్వం ముఖ గుర్తింపు విధానాన్ని అమల్లోకి తెచ్చింది.

★ అంగన్‌వాడీ కేంద్రాల్లోని గర్భిణులు, బాలింతలు, బాలల ముఖచిత్రాలను చరవాణి ద్వారా అంగన్‌వాడీ సిబ్బంది చిత్రీకరిస్తున్నారు. పోషణ్ ట్రాకర్ అప్లికేషన్‌లో ఎప్పటికప్పుడు వాటిని అప్‌లోడ్ చేయాలి. అవి స్త్రీ, శిశు సంక్షేమశాఖ డైరెక్టరేట్‌కు అనుసంధానం అవుతున్నాయి. ఈ గణాంకాల ఆధారంగా బడ్జెట్ విడుదలవుతుందని అధికారులు వివరించారు. 'ఉమ్మడి జిల్లాలో వీటికి సంబంధించి ఇప్పటి వరకు 90శాతంపైగా ప్రక్రియ పూర్తయింది. లబ్ధిదారుల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. అందరికీ కొత్త విధానంలో 100శాతం పంపిణీ చేస్తాం' అని ఉమ్మడి జిల్లా ఐసీడీఎస్ పీడీలు ఎంఎన్ రాణి, ఎస్కే రుక్సానా సుల్తానా బేగం తెలిపారు.

	కృష్ణా	ఎన్టీఆర్
ఐసీడీఎస్ ప్రాజెక్టులు	8	6
అంగన్‌వాడీ కేంద్రాలు	1,707	1,475
గర్భిణులు	6,990	8,823
బాలింతలు	6,928	7,209
6 నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు	34,807	44,633
3 నుంచి 5 ఏళ్ల పిల్లలు	17,937	18,813

సాంకేతిక సమస్యలపైనా కసరత్తు

గర్భిణులు, బాలింతలు ముఖ కవళికలు.. దేహదారుఢ్యంలో మార్పులు వచ్చే అవకాశం ఉండడంతో ఎఫ్ఆర్ఎస్‌లో ఏమైనా సమస్యలు తలెత్తితే తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు దృష్టి పెట్టారు. అలాంటి పరిస్థితుల్లో పంపిణీ ఎలా చేయాలో మార్గదర్శకాలు జారీ చేశారు. ముఖ గుర్తింపు నమోదు కానివారికి పౌష్టికాహారం అందించడంపైనా యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

ఒక్కో కిట్టులో..

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతి నెలా బాలింతలు.. గర్భిణులకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేస్తారు. ఒక్కో కిట్టులో 2 కిలోల రాగిపిండి, కిలో అటుకులు, 250 గ్రాముల చొప్పున బెల్లం, ఎండు ఖర్జూరం, చిక్కీలు ఉంటాయి. ఇవికాకుండా కిలో కందిపప్పు, మూడు కిలోల బియ్యం, అర లీటరు నూనె, 5 లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు ఇస్తారు. మూడేళ్లలోపు పిల్లలకు 2.5 లీటర్ల పాలు.. 25గుడ్లు.. 2.5 కిలోల బాలామృతం, ప్రీస్కూల్లో చదువుతున్న 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలకు రోజూ గుడ్డు ఇస్తారు.

విజయవాడ ఎగ్జిబిషన్.. మళ్లీ ఆరంభం!

ఈనాడు, అమరావతి: విజయవాడలో అత్యంత ఆదరణతో మూడు దశాబ్దాలకు పైగా కొనసాగిన ఎగ్జిబిషన్‌ను మళ్లీ వచ్చే దసరా నుంచి ఆరంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 2013 వరకు నగరంలోని స్వరాజ్యమైదానంలో ఎగ్జిబిషన్‌ను ఘనంగా నిర్వహించారు. ఆ తర్వాత గత 13 ఏళ్లుగా ఆగిపోయింది. కృష్ణా ఇండస్ట్రియల్ అండ్ అగ్రికల్చరల్ ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వహించేవాళ్లు. సొసైటీకి అధ్యక్షుడిగా కలెక్టర్.. పోలీసు కమిషనర్, నగర ప్రజాప్రతినిధులు, సభ్యులు కమిటీలో ఉండేవారు. తాజాగా మళ్లీ సొసైటీని పునరుద్ధరించాలని, ఎగ్జిబిషన్‌ను గతంలో మాదిరిగానే నిర్వహించేందుకు ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), కమిటీ సభ్యులు కలిసి కలెక్టర్ లక్ష్మీశతో విజయవాడలో బుధవారం సమావేశమయ్యారు. గొల్లపూడి ప్రాంతంలో 25 ఎకరాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. దసరా నుంచి ఏర్పాటు చేసేలా చర్యలూ చేపడుతున్నట్టు ఎంపీ శివనాథ్ వెల్లడించారు.

(c) eenadu

సహజీవనం చేస్తావా? చిత్రాలు అంతర్జాలంలో పెట్టమంటావా?

యువకుడి వేధింపులతో వివాహిత ఆత్మహత్యాయత్నం

పెనమలూరు, న్యూస్‌టుడే: తనతో కలిసి జీవించాలని లేదంటే ఫొటోలను ఇంటర్నెట్‌లో పెడతానంటూ వివాహితను వేధిస్తున్న వ్యక్తి, అందుకు వంత పాడుతున్న అతని తల్లిపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. యనమలకుదురుకు చెందిన ఓ వివాహిత తరచూ సమీపంలో ఉన్న తన తల్లి ఇంటికి వెళుతుండేది. ఈమెకు అక్కడ కొంతకాలం క్రితం హఫీజ్ అనే యువకుడు పరిచయమయ్యాడు. ఈమెకు ఫొటోలు తీయడం, కలిసి జీవించమని వేధించడం చేస్తున్నాడు. ఇతని వేధింపులకు తల్లి మున్నీ కూడా వంతపాడుతుండేది. దీంతో ఆమె వేధింపులు పరాకాష్టకు చేరాయి. దీంతో తీవ్ర మానసిక వేదనకు గురైన వివాహిత మంగళవారం రాత్రి బందరు కాలువలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఇది గుర్తించిన ఈమె భర్త వెంటనే కాలువలోకి దిగి భార్యను కాపాడాడు. తనను వేధిస్తున్న వైనంపై బాధితురాలు పెనమలూరు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేయగా హఫీజ్, ఇతని తల్లి మున్నీలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బ్రాయిలర్ ధరలు (కేజీ కి రూపాయల్లో)

విజయవాడ: బ్రాయిలర్ ఫారం లైవ్ ధర 90 లైవ్ ధర 115 చికెన్ స్కిన్ 167, చికెన్ స్కిన్‌లెస్ - 190. ఉభయగోదావరి జిల్లాలు: బ్రాయిలర్ ఫారం లైవ్ ధర - 100, 108, 119 చికెన్ స్కిన్ - 190 చికెన్ స్కిన్‌లెస్ - 200.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 590 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

వై.యస్.ఆర్. తాడిగడప పురపాలక సంఘం వారి ప్రకటన

ఆర్.ఓ.సి.నెం. 91/2025-G1

వై.యస్.ఆర్. తాడిగడప పురపాలకసంఘ పరిధిలో సనత్‌నగర్ రోడ్డు 80 అడుగులు వెడల్పు చేయు దశలు వారీగా అభివృద్ధి చేయుటకు గాను **మొదటి దశ**లో యు.సి. హోటల్ నుండి తులసినగర్ రోడ్డు నెంబర్ 3 వరకు స్థల యజమానులకు వారు కోల్పోయిన స్థలమును గాను టి.డి.ఆర్. బాండ్లు జి.ఓ.యం.యస్. నెం. 4 తేది: 09.01.2025 ప్రకారము టి.డి.ఆర్. బాండ్లు జారీ చేయవలసి ఉన్నది. టి.డి.ఆర్. స్క్రూటినీ కమిటీ నందు ఉంచుటకు ప్రజల నుండి సూచనలు, అభ్యంతరాలు స్వీకరించుటకు గాను.

వ. నెం.	యజమాని పేరు	సర్వే నెం. గ్రామము	రోడ్డు విస్తరణలో కోల్పోయిన విస్తీర్ణం	ప్రాజెక్ట్ పేరు
1	శ్రీ ఎస్.ఎస్.మణి S/o. ఎల్.ఎ.శ్రీనివాసన్	205/2A పార్టు కానూరు	858.0 చ॥గ॥ or 717.28 చ.మీ.	సనత్‌నగర్ రోడ్డు 80 అడుగుల వెడల్పు
2	శ్రీ షేక్ షమీమ్ S/o షేక్ జబ్బార్ సాహెబ్	206/2 పార్టు కానూరు	112.00 చ॥గ॥ or 93.63 చ.మీ.	సనత్‌నగర్ రోడ్డు 80 అడుగుల వెడల్పు
3.	శ్రీ ఎం.డి.ఇబ్రహీం S/o అబ్దుల్ జబ్బార్	206/2A పార్టు కానూరు	28 చ॥గ॥ or 23.40 చ.మీ.	సనత్‌నగర్ రోడ్డు 80 అడుగుల వెడల్పు
4.	శ్రీ ఎం.డి.అక్బర్ S/o షరీఫ్	206/3 పార్టు & 207/1 పార్టు కానూరు	242.17 చ॥గ॥ or 202.45 చ.మీ.	సనత్‌నగర్ రోడ్డు 80 అడుగుల వెడల్పు
5.	శ్రీ ఎం.డి.గౌస్ S/o ఎం.డి. ఉమర్ & ఎం.డి. కరీమున్నీసా S/o ఎం.డి.గౌస్	207/1 పార్టు కానూరు	84.40 చ॥గ॥ or 70.60 చ.మీ.	సనత్‌నగర్ రోడ్డు 80 అడుగుల వెడల్పు
6.	శ్రీమతి వావిళ్లపల్లి సత్యవతి W/o లక్ష్మీనాయుడు	207/1 పార్టు కానూరు	75.83 చ॥గ॥ or 63.40 చ.మీ.	సనత్‌నగర్ రోడ్డు 80 అడుగుల వెడల్పు
7.	శ్రీ షేక్ అలీ & 5 Others S/o జానిసాహెబ్	207/1 పార్టు కానూరు	120.69 చ॥గ॥ or 100.90 చ.మీ.	సనత్‌నగర్ రోడ్డు 80 అడుగుల వెడల్పు
8.	శ్రీ షేక్ అయూబ్ S/o షేక్ ఇబ్రహీం	207/1 పార్టు కానూరు	72.50 చ॥గ॥ or 60.61 చ.మీ.	సనత్‌నగర్ రోడ్డు 80 అడుగుల వెడల్పు
9.	శ్రీమతి షేక్ షకీలా బేగం W/o మహబూబ్‌వలి	207/1 పార్టు కానూరు	95.50 చ॥గ॥ or 79.84 చ.మీ.	సనత్‌నగర్ రోడ్డు 80 అడుగుల వెడల్పు

పై తెలిపిన విషయములో ఏవైనా సూచనలు మరియు అభ్యంతరములు ఉన్న యెడల 7 దినములలోగా వై.యస్.ఆర్. తాడిగడప మునిసిపాలిటీ వారికి తెలియజేయగలరు.

సం/- కమిషనర్
వై.యస్.ఆర్. తాడిగడప పురపాలక సంఘం

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

సూర్యారావుపేట బ్రాంచి
35-25-35, సన్‌రైజ్ హాస్పిటల్ ఎదురుగా,
సూర్యారావుపేట, విజయవాడ-520002.
Mail id:ubin0912263@unionbankofindia.bank

డిమాండ్ నోటీసు

DEMAND NOTICE ISSUED U/S.13(2) OF SARFAESI Act, 2002
Notice under sec.13(2) read with Sec.13(3) of Securitisation and Reconstruction of Financial Assets and Enforcement of Security Interest Act, 2002.

ఋణగ్రహీత: 1. మెస్సర్స్ ఓంకార విజయలక్ష్మి స్ట్రిప్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ. కోట భాను ప్రసాద్, సమోదిత చిరునామా: డి.నెం.76-18-45, ప్లాట్ నెం.45, ఐరన్ యార్డ్, భవానీపురం, విజయవాడ, కృష్ణాజిల్లా-520012. **హామీదారులు: 1. శ్రీ కోట భాను ప్రసాద్,** కేరాఫ్ కోట సాంబశివ ప్రసాద్, చిరునామా: 76-8/1-13, లలితా నగర్ రోడ్డు, భవానీపురం, ఆల్ఫా హోటల్ ఎదురుగా, విజయవాడ (అర్బన్), కామకోటి నగర్, కృష్ణాజిల్లా-520012. **2. శ్రీమతి కోట శ్రావణి,** కేరాఫ్ కోట భాను ప్రసాద్, చిరునామా: 76-8/1-13, లలితా నగర్ రోడ్డు, భవానీపురం, ఆల్ఫా హోటల్ ఎదురుగా, విజయవాడ (అర్బన్), కామకోటి నగర్, కృష్ణాజిల్లా-520012. **3. శ్రీ పి. వెంకట నరసింహ,** తండ్రి: లక్ష్మీ నారాయణ, చిరునామా: డి.నెం.12-2-26/1, బి.ఆర్.పి.రోడ్డు, జెండా చెట్టు సెంటర్ దగ్గర, ఇస్లాంపేట, విజయవాడ అర్బన్, కృష్ణాజిల్లా-520001. **4. శ్రీ కోట పృథ్వీ వెంకట తేజ,** కేరాఫ్ కోట భాను ప్రసాద్, చిరునామా: 76-8/1-13, లలితా నగర్ రోడ్డు, భవానీపురం, ఆల్ఫా హోటల్ ఎదురుగా, విజయవాడ (అర్బన్), కామకోటి నగర్, కృష్ణాజిల్లా-520012. **5. శ్రీ కోట రాహుల్ సాయి బాలాజీ,** కేరాఫ్ కోట భాను ప్రసాద్, చిరునామా: 76-8/1-13, లలితా నగర్ రోడ్డు, భవానీపురం, ఆల్ఫా హోటల్ ఎదురుగా, విజయవాడ (అర్బన్), కామకోటి నగర్, కృష్ణాజిల్లా-520012. **6. మెస్సర్స్ లక్ష్మీ స్టీల్ పైప్స్ అండ్ ట్యూబ్స్,** సూరంపల్లి, ప్రాతినిధ్యంవహిస్తున్న ప్రొప్రయిటర్, శ్రీమతి కోట శ్రావణి, చిరునామా: డి.నెం.8-99, 8-100 & 8-101, సూరంపల్లి గ్రామం, ఎలియాప్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ దగ్గర, గన్నవరం, కృష్ణాజిల్లా. **7. మెస్సర్స్ శ్రీ విజయలక్ష్మి స్టీల్ ట్రేడర్స్,** ప్రాతినిధ్యంవహిస్తున్న ప్రొప్రయిటర్ శ్రీ కోట భాను ప్రసాద్, చిరునామా: డి.నెం. 76-18-45, ప్లాట్ నెం.45, ఐరన్ యార్డ్, భవానీపురం, విజయవాడ-520012.

నేచర్ ఆఫ్ లిమిట్	ఎన్.పి.ఎ తేది నాటికి అంటే 23.06.2025 బకాయి మొత్తం	వర్తించని వడ్డీ	జరిమానా వడ్డీ (సరళమైనది)	బ్యాంక్ చేసిన ఖర్చు, ఛార్జీలు	23.06.2025 నాటికి బకాయి మొత్తం (రూ.)
CCSUV - 122625010000002	Rs. 24,41,18,210.89	Rs. 10,52,255.00	2%	Rs. 0/-	Rs. 24,51,70,465.89
TL - 122626390000001	Rs. 38,19,843.90	Rs. 23,097.58	2%	Rs. 0/-	Rs. 38,42,941.48
Total	Rs. 24,79,38,054.79	Rs. 10,75,352.58			Rs. 24,90,13,407.37

ఋణగ్రహీతలు చెల్లించాల్సిన లేదా భవిష్యత్తులో చెల్లించవలసిన మొత్తాలకు భద్రత కల్పించడానికి, క్రింది వ్యక్తులు/సంస్థలు ది.13.03.2024న పత్రాలపై ద్వారా సంతకం చేసి, ఈ క్రింది విధంగా భద్రతా ఆసక్తిని సృష్టించారు:
ఎ) శ్రీ. కోట భాను ప్రసాద్, ప్రాపర్టీ నెం.1కి యజమానిగా.
బి) మెస్సర్స్ లక్ష్మీ స్టీల్ పైప్స్ అండ్ ట్యూబ్స్, సూరంపల్లి (ప్రొప్రయిటర్ శ్రీమతి కోట శ్రావణి ద్వారా ప్రాతినిధ్యం వహించబడుతోంది), వీరు ఆస్తి నెం.2లోని ఐటెమ్ నెం.1 మరియు 2లకు యజమాని. అలాగే శ్రీమతి కోట శ్రావణి ప్రాపర్టీ నెం.2లోని ఐటెమ్ నెం.3కి యజమాని.
సి) మెస్సర్స్ ఓంకార విజయలక్ష్మి స్ట్రిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ (మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కె. భాను ప్రసాద్ గారి ద్వారా ప్రాతినిధ్యం వహించబడుతోంది), వీరు ఆస్తి నెం.3లోని ఐటెమ్ నెం.1కి యజమాని. అలాగే మెస్సర్స్ శ్రీ విజయలక్ష్మి స్టీల్ ట్రేడర్స్, విజయవాడ (ప్రొప్రయిటర్ శ్రీ కోట భాను ప్రసాద్ గారి ద్వారా ప్రాతినిధ్యం వహించబడుతోంది), వీరు ఆస్తి నెం.3లోని ఐటెమ్ నెం.2కి యజమాని.
ఈ భద్రతా ఆసక్తి ఈ క్రింది వాటికి సృష్టించబడింది:

[illegible]

తేది: 24-06-2025 అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

అన్నదాతలకు సహకారం

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి గ్రామాల్లోని పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరుగుతాయా... త్రిసభ్య కమిటీలను ఏర్పాటు చేస్తారా అన్న సందిగ్ధం రైతుల్లో నెలకొంది. ఇటీవల డీసీసీబీలకు ప్రభుత్వ పరంగా పర్సన్ ఇన్‌ఛార్జులను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. దీంతో సహకార సంఘాలకు కూడా త్రిసభ్య కమిటీలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. జిల్లాలో వివిధ సంఘాలకు కమిటీలు ఖరారవడంతో రైతుల్లో ఉన్న సందిగ్ధానికి తెరపడింది. ఇప్పటికే పలు సంఘాలకు కమిటీలు ఖరారు కావడంతో మిగిలిన సంఘాలకు ఎవరిని నియమిస్తారోనని చర్చించుకుంటున్నారు.

76 సంఘాలకు కమిటీలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 425 సహకార సంఘాలు ఉంటే కృష్ణా జిల్లాలో 212 ఉన్నాయి. వాటిలో తొలుత 76 సంఘాలకు త్రిసభ్య కమిటీ సభ్యులను ఖరారు చేసింది. 2013 జనవరిలో ఎన్నికలు నిర్వహించి పాలక వర్గాలను ఎన్నుకున్నారు. ఆ పాలవర్గాల గడువు 2018 జనవరితో ముగియడంతో వాటినే తిరిగి కొనసాగించేలా అప్పటి తెదేపా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అలా ఆ పాలకవర్గాలు 2019 జులై వరకు కొనసాగాయి. ఆ తరువాత ఎన్నికలు నిర్వహిస్తారని అందరూ భావించారు. తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం కూడా సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించలేదు. ప్రస్తుతం సాగు పనులు ముమ్మరం కావడంతో రైతులు రుణాలు, తదితరాలకు సంఘాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో వారికి అందించే సేవల్లో జాప్యం కాకూడదన్న నిర్ణయంతో కూటమి ప్రభుత్వం కమిటీల ఏర్పాటుకు చర్యలు తీసుకుంది. జిల్లాలో బందరు, పెడన, గూడూరు, బంటుమిల్లి, కృత్తివెన్ను, మొవ్వ, పామర్రు, పెనమలూరు, కంకిపాడు, తోట్లవల్లూరు, బాపులపాడు, గన్నవరం, ఉంగుటూరు, ఉయ్యూరు, పమిడిముక్కల మండలాల్లోని వివిధ సంఘాలకు తొలివిడతగా కమిటీలను నియమించింది.

పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలు షురూ

బందరు: కానూరు సహకార సంఘ భవనం

ఆగస్టు నుంచి కమిటీల పాలన?

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరవాత వైకాపా హయాంలో ఏర్పాటు చేసిన కమిటీలను రద్దు చేసి, సహకారశాఖ ఉద్యోగులను ఆయా పీఏసీఎస్‌లకు పర్సన్ ఇన్‌ఛార్జులను నియమించింది. వారికి ఈ నెలాఖరు వరకు గడువు ఉంది. విడతల వారీగా అన్ని సంఘాలకు కమిటీలను నియమించి ఆగస్టు నుంచి కమిటీ ఆధ్వర్యంలో సంఘ పాలన సాగించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఉత్తర్వులు అందాయి

జిల్లాలోని అన్ని సంఘాలకు పర్సన్ ఇన్‌ఛార్జుల పదవీకాలం ఈనెలాఖరుతో ముగుస్తుంది. తొలి విడతగా 76 సంఘాలకు కమిటీలు ఖరారయ్యాయి. ప్రభుత్వ ఉత్తర్వులు రాగానే వాటిని ఆయా సంఘాలకు పంపిస్తాం. కమిటీలో ఒక ఛైర్మన్, ఇద్దరు సభ్యులు ఉంటారు. మిగిలిన సంఘాలకు కూడా రెండు రోజుల్లో కమిటీలు ఖరారయ్యే అవకాశం ఉంది. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా శాఖాపరంగా అవసరమైన చర్యలు తీసుకుంటాం. **-చంద్రశేఖరరెడ్డి, జిల్లా సహకారశాఖాధికారి**

చూసేలోపే కసిరావే.. మురిసేలోపే విసిరావే..

నడిరోడ్డుపై రక్తస్రావంతో శిశువు

చిట్టినగర్, న్యూస్‌టుడే: విజయవాడలో అమానవీయ సంఘటన వెలుగుచూసింది. అప్పుడే పుట్టి అమ్మ పొత్తిళ్లలో వెచ్చగా ఒదిగి ఉండాల్సిన శిశువు అర్ధరాత్రి నడిరోడ్డుపై పడి ఉన్నాడు. ఎలుకలు కొరికి రక్తస్రావమై విలవిలలాడిపోయాడు. తల్లి కర్కశానికి తల్లడిల్లి పోయాడు. స్థానికుల గుర్తింపుతో ఆ శిశువు ప్రాణాలు దక్కాయి. కొత్తపేట, శ్రీనివాస మహల్ వెనుక పోలిన సాయిప్రసాద్‌వీధి, చింతాడ రాము ఇంటి సమీపంలో అప్పుడే జన్మించిన మగ శిశువును ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డుపై వదిలేసి వెళ్లారు. అర్ధరాత్రి దాటిన అనంతరం పసికూన ఏడుపు విని స్థానికులు సగురప్రళ్లి సోమరాజు కుటుంబ సభ్యులు బయటకు వచ్చి చూశారు. రోడ్డు మీద ఊపిరి ఆడని శిశువు, కాలిని ఎలుకలు కొరుకుతుండగా రక్తం కారుతుండగా గుక్కపెట్టి ఏడుస్తున్న దృశ్యం చూసి కలత చెందారు. వెంటనే అక్కున చేర్చుకుని సపర్యలు చేసి చికిత్స నిమిత్తం పాత ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. స్థానిక అంగన్‌వాడీ సిబ్బంది భోగిరెడ్డి రామలక్ష్మి ఆసుపత్రికి వెళ్లి మగ శిశువును పరిశీలించి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

పత్రాలు లేని 27 మోటారు సైకిళ్లు, ఒక ఆటో సీజ్

అవనిగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: అవనిగడ్డ పోలీస్ స్టేషన్ పరిధిలోని పులిగడ్డలో బుధవారం ఉదయం డీఎస్పీ టి.విద్యశ్రీ ఆధ్వర్యంలో అవనిగడ్డ, చల్లపల్లి సీఐలు యువకుమార్, ఈశ్వర్రావులు 75 మంది పోలీసులతో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. గ్రామంలోని 197 గృహాలను సందర్శించి గాలింపు చర్యలు చేపట్టారు. ఎటువంటి అనుమతిపత్రాలు లేని 27 మోటారు సైకిళ్లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకుని వాటిని సీజ్ చేసినట్లు డీఎస్పీ చెప్పారు.

సీజ్ చేసిన మోటారు సైకిళ్లతో పోలీసులు, అధికారులు

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి

కలెక్టరేట్ (మచిలీపట్నం): కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమం అమలుపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. దీని సర్వే నిమిత్తం జిల్లాకు వచ్చిన కేంద్ర బృంద సభ్యులు బుధవారం కలెక్టర్‌ను ఛాంబర్‌లో కలిశారు. ఈ సందర్భంగా వారితో కలిసి జిల్లాలో చేపట్టిన సర్వేపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. కేంద్ర బృంద సభ్యులు మాట్లాడుతూ తాము గ్రామాల్లో పర్యటిస్తూ మౌలిక వసతులు, ఇతర అంశాలపై ప్రత్యేక ఫార్మాట్‌లో ప్రజల నుంచి వివరాలు సేకరిస్తున్నామన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కోరారు. కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి కేశవ్‌రోజ్, ఇతర బృంద సభ్యులు సమావేశంలో పాల్గొన్నారు.

కేంద్ర సభ్యులతో కలిసి సమీక్షిస్తున్న కలెక్టర్ బాలాజీ

80 శాతం హామీలు నెరవేర్చాం..

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు బుధవారం మండల పరిధిలోని విశ్వనాధపల్లి గ్రామంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. నియోజకవర్గ పరిశీలకుడు కనపర్తి శ్రీనివాసరావు, మండల పార్టీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, బొబ్బా గోవర్ధన్, తదితరులు పాల్గొని ఇంటింటికీ వెళ్లి, రాష్ట్ర ప్రభుత్వం చేసిన అభివృద్ధి పనులు, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. 80 శాతం వరకు ఇచ్చిన హామీలు నెరవేర్చినట్లు తెలిపారు. ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరించారు. ఈ సందర్భంగా కొనకళ్ల మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు బడుగు, బలహీన వర్గాలకు అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విశేష స్పందన వచ్చిందన్నారు. ప్రజలు ప్రభుత్వంపై సానుకూలంగా ఉన్నారని చెప్పారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు కొల్లూరి వెంకటేశ్వరరావు, పలువురు తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఓ ఇంటి వద్ద మహిళలకు ప్రభుత్వంపై అవగాహన కల్పిస్తున్న కొనకళ్ల, కనపర్తి

రన్నింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించండి

విజయవాడ: రైల్వే లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం ప్రెస్ క్లబ్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సిబ్బందికి సరైన విశ్రాంతి లేకపోవడంతో తీవ్ర ఒత్తిడికి లోనవుతున్నారని చెప్పారు. కుటుంబ సభ్యులతో గడిపేందుకు వీలుగా నిర్ణీత పని గంటలు అమలు చేయాలని కోరారు. రైల్వే మల్టీ డిసిప్లినరీ కమిటీ నివేదికలు.. సిబ్బంది హక్కులకు భంగం కలిగేలా ఉన్నాయని ధ్వజమెత్తారు. అసోసియేషన్ డివిజనల్ అధ్యక్షుడు ఎం.వెంకటేశన్, కార్యదర్శి ఆర్.వి.రాము మాట్లాడుతూ.. రైల్వే ప్రైవేటీకరణ నిలిపివేయాలని, నూతన పింఛను విధానాన్ని రద్దు చేయాలని, లోకో రన్నింగ్ సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని, 8గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు.

'పట్టాభిరామ్ ఆకస్మిక మృతి దిగ్భ్రాంతి కలిగించింది'

అవనిగడ్డ, న్యూస్‌టుడే: హితుడు, సన్నిహితుడు డాక్టర్ బీవీ పట్టాభిరామ్ ఆకస్మిక మరణవార్త దిగ్భ్రాంతి కలిగించిందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ చెప్పారు. తన బోధనల ద్వారా, రచనల ద్వారా యువతకు ఆయన మార్గదర్శకులుగా నిలిచారన్నారు. వారి వ్యక్తిత్వ వికాస గ్రంథాలు వివిధ భాషలలోకి అనువాదమయ్యాయని, ఇంద్రజాలికునిగా అసంఖ్యాక శిష్యసంపద వారి కుందన్నారు. మహాత్ముని వ్యక్తిత్వంపై ఆయన రచించిన పుస్తకాన్ని తనకు అంకితమిచ్చి చరితార్థుని చేశారన్నారు. ఆయన రెండు సార్లు అవనిగడ్డ వచ్చారని గుర్తు చేసుకున్నారు. ఆయన ఆత్మకు శాంతిని ప్రసాదించాలని ప్రార్థిస్తూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

క్యాడెట్‌లను నైపుణ్యాలతో తీర్చిదిద్దుతాం

గుర్రపుస్వారీలో ప్రతిభ కనబర్చిన విజేతలతో డీడీజీ నరసింగ్‌సైలానీ, ఇతర ఉన్నతాధికారులు

కేసరపల్లి(గన్నవరం (గ్రామీణం), న్యూస్‌టుడే: ఉత్తమ నైపుణ్యాలు కలిగిన ఎన్‌సీసీ క్యాడెట్‌లుగా యువతను తీర్చిదిద్దుతామని ఆంధ్ర, తెలంగాణ ఎన్‌సీసీ డైరెక్టరేట్ ఎయిర్ కమోడోర్ డిప్యూటీ జనరల్ నరసింగ్‌సైలానీ అన్నారు. స్థానిక క్యాంప్ కార్యాలయం, శిక్షణ శిబిరాలను ఆయన బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలుత కాకినాడ ఎన్‌సీసీ విభాగానికి చెందిన గ్రూప్ కమాండర్ కల్నల్ రితిన్‌మోహన్ అగర్వాల్‌తో కలిసి డీడీజీకి క్యాడెట్‌లు గౌరవ వందనం చేశారు. అనంతరం క్యాడెట్‌లు చేసిన గుర్రపుస్వారీ విన్యాసాలను తిలకించి ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. విద్యార్థుల్లో క్రమశిక్షణ, దేశభక్తిని పెంపొందించేందుకు ఎన్‌సీసీ దోహదపడతుందన్నారు. దేశరక్షణకు అవసరయ్యే విధంగా విద్యార్థులను తీర్చిదిద్దేందుకు తమ బృందం నిరంతరం కృషి చేస్తున్నట్లు డీడీజీ తెలిపారు. కార్యక్రమంలో కల్నల్ సీకే.నాయక్, ఎయిర్‌వింగ్ కమాండర్ అజిత్‌రాథి, అసోసియేట్ డీన్ కిశోర్, యూనిట్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ తీర్థప్రసాద్, అసోసియేట్ ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డా.ఎల్.జయబాల్, సిబ్బంది, అధ్యాపకులు, క్యాడెట్‌లు తదితరులు పాల్గొన్నారు. విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం ఆవరణలోని ఎన్‌సీసీ ఎయిర్ వింగ్, పైలెట్ శిక్షణ, విమానాల పనితీరును డీడీజీ నరసింగ్ సైలాని పరిశీలించారు.

హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక పారిపోయిన విద్యార్థులు

గంటల వ్యవధిలో పట్టుకున్న పటమట పోలీసులు

ఆటోనగర్, న్యూస్‌టుడే: హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక పారిపోయిన ఇద్దరు విద్యార్థులను విజయవాడలోని పటమట పోలీసులు గంటల వ్యవధిలో పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. తల్లిదండ్రులు లేక ఆర్థిక ఇబ్బందులున్న పేద విద్యార్థులకు కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం ఏకమూరు గ్రామంలోని రెహబత్ వాలంటరీ హాస్టల్ ఉచితంగా ఆశ్రయం కల్పిస్తుంది. తెలంగాణ రాష్ట్రం నకిరేకల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి, నంద్యాల జిల్లా నందికొట్కూర్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి ఏకమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతూ.. స్థానిక హాస్టల్‌లో ఉంటున్నారు. హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక బుధవారం ఉదయం వసతి గృహం నుంచి బయటకు వచ్చి బస్సు ఎక్కి విజయవాడ ఆటోనగర్ వచ్చారు. వారు బస్‌స్టేషన్‌లో దిగారనే సమాచారంతో కృష్ణా జిల్లా పోలీసులు... పటమట పోలీసులను అప్రమత్తం చేశారు. పటమట సీఐ పవన్ కిషోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలించాయి. ఉదయం 10 గంటలకు పంట కాలువ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నారు. హాస్టల్ నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. ఇద్దరికీ సీఐ కౌన్సెలింగ్ ఇచ్చి వారిని కుటుంబ సభ్యులు, హాస్టల్ నిర్వాహకులకు అప్పగించారు.

రైతు ప్రముఖుడి సహృదయం

దోనేపూడి నాగేశ్వరరావు

వక్కలగడ్డ(చల్లపల్లి), న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం వక్కలగడ్డకు చెందిన రైతు ప్రముఖులు దోనేపూడి నాగేశ్వరరావు(79) అనారోగ్యంతో మంగళవారం రాత్రి మృతి చెందారు. ఆయన భౌతికకాయాన్ని కుటుంబీకులు ఇబ్రహీంపట్నంలోని నిమ్రా మెడికల్ కళాశాలకు దానం చేశారు. విజయవాడ ఎల్వీ ప్రసాద్ నేత్ర వైద్యశాలకు నేత్రాలను దానం చేశారు. మరణించిన తర్వాత నేత్రాలు, శరీరం ఇతరులకు ఉపయోగపడాలనే ఉద్దేశాన్ని నాగేశ్వరరావు తమకు తెలియచేశారని భార్య నిర్మలాదేవి, కుమారుడు మహేశ్వరరావు, కుమార్తె రాధిక తెలిపారు. నాగాయలంకకు చెందిన సుదర్శి మానవతా సేవాసంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ సేవాసంస్థ ద్వారా 237వ నేత్రదానం, 15వ శరీరదానం జరిగినట్లు సంస్థ ప్రతినిధి తలశిల రఘుశేఖర్ తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి

గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే: యువకుడు అనుమానాస్పదంగా మృతిచెందిన సంఘటన గన్నవరం మండలం మెట్లపల్లి శివారులో చోటుచేసుకుంది. బ్రహ్మలింగయ్య చెరువు గట్టుపై సుమారు 30 ఏళ్ల యువకుడు మృతిచెందినట్లు ఆత్కూరు పోలీసులకు సమాచారం అందింది. పరిసరాల్లో పురుగుల మందు డబ్బా ఉండటంతో ఆత్మహత్యకు పాల్పడినట్లు భావించి వివరాలు ఆరా తీశారు. మృతుడు మండలంలోని గోపవరపుగూడెంకు చెందిన కనికంటి హరినాథ్(29)గా గుర్తించారు. అతను మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పురుగుల మందు వ్యాపారంలో నష్టాలు రావడంతో అప్పులపాలై ఆత్మహత్యకు పాల్పడ్డాడా? ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అన్న కోణంలో పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

91.9 FM Vijayawada — 91.9 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా పేరు గవర్నమెంట్ రికార్డ్స్ ప్రకారము నా కరెక్ట్ పేరు కోన అంజలిదేవి (కొత్త పేరు), కోన అంజలీదేవి కాదు (పాత పేరు) అని తెలియజేయడమైనది. ఇట్లు: కోన అంజలిదేవి, డోర్ నెం: 32-11-26/B, చర్చ్ స్ట్రీట్, మొగల్‌రాజపురం, విజయవాడ.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవలకు, ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95052 76677, 82474 49036.

REAL ESTATE

LAND FOR SALE

మెగా ★అవకాడో ★ఫామ్‌ల్యాండ్‌లో 11 సెంట్లు ★ 5 లక్షలకే ★ 5వ సంవత్సరం నుండి సంవత్సరంకి 2 లక్షల ఆదాయం పొందండి. ఫోన్: 9133574455

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

NTR **జిల్లా** నందిగామ మండలంలోని కొత్త బెల్లంకొండవారిపాలెం ఊరిలో 2.5 ఎకరాల పొలం అమ్మబడును. వివరాలకు Ph: 9000654713.

JOBS

Wanted Experienced Technician For Fitness Equipment Showroom. Please Contact Pawan. ✆ 79813 88951/ 94403 56731.

కరెంటు మీటర్లు మార్చుటకు అనుభవం గల ఎలక్ట్రీషియన్స్ కావలెను. విద్యార్హత లేకపోయినా పర్వాలేదు. వీక్లీ పేమెంట్స్ ✆ 97035 51122, 94929 40505.

విజయవాడ పటమట ఫన్‌టైమ్స్ క్లబ్ రోడ్డులోని Corn Club రెస్టారెంట్ నందు పనిచేయుటకు బిల్లింగ్ ఆపరేటర్ మరియు చెఫ్ (2 Pm to 10 Pm) కావలెను. ✆ 91001 92046.

విజయవాడలోని ప్రముఖ మొబైల్ షోరూం నందు పనిచేయుటకు మొబైల్ ఫీల్డ్‌లో అనుభవం గల Front ఆఫీస్ ఎగ్జిక్యూటివ్/ మేనేజర్, Stock పర్సన్ కావలెను. ✆ 70932 66678.

Wanted Teachers (Ladies) with U.G. or P.G. Qualification & Good English and Teacher for Science in High School. CIS - School, VJA-1. ✆ 81799 90508.

Wanted P.E.T Teacher with B.P.Ed to Seventh Day Adventist High School, Bander Road, Vijayawada. Ph: 90528 77533.

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలికాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో+వ+ మంచి జీతం+ ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

శ్రీ సాయి శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ & డెవలపర్స్ తాడేపల్లి వారి వినుకొండ దగ్గర్లో 22 ఎ॥ ఎర్రచందనం, మహాగని వెంచర్‌లో ప్లాట్లు అమ్ముటకు ఏజెంట్స్ కావలెను. ✆ 80081 93109, 95050 93432.

VJA 1 టౌన్ బ్రాహ్మణవీధిలో జైదుర్గా రెసిడెన్సీలో రిసెప్షనిస్ట్‌గా పనిచేయుటకు పురుష అభ్యర్థి కావలెను. 12 గం॥ డ్యూటి, 14 వేలు జీతం. ✆ 90305 52222.

శివకార్తికేయ హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు ఇంటి/ వంట పనిచేయుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 20K. ✆ 99120 11499, 99120 11899.

ప్రముఖ ఆటోఫైనాన్స్ ఆఫీస్ నందు అనుభవంగల కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ Age: 25 - 30Y, Sal: 20K-22K. Qul: డిగ్రీ, సొంత ఇల్లు, బైక్ కావలెను. ✆ 99495 58181, 90325 58181.

జి.డి.యం.యం. నర్సింగ్ కళాశాల, నందిగామ, ఎన్టీఆర్ జిల్లా, బి.ఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు బోధించుటకు M.Sc., B.Sc. (Nursing) అర్హతలు కలిగిన అధ్యాపకులు కావలెను. మరియు Boys హాస్టల్‌లో వార్డెన్ కావలెను. భోజనం, హాస్టల్ వసతి కల్పించబడును. వివరాలకు సంప్ర: మీ బయోడేటా ఇమెయిల్ gdmmcon@gmail.com లేదా వాట్స్‌యాప్ నెంబర్‌కు పంపగలరు 98492 02841, 99851 03566.

SECURITY GUARDS

హనుమాన్‌జంక్షన్ దగ్గర అరుగోలనులో పనిచేయుటకు 3 సం॥లు అనుభవం గల సెక్యూరిటీ ఆఫీసర్ (45 సం॥లోపు) కావలెను. జీతం: 25,000/- Ex ఆర్మీ, సివిలియన్ సంప్ర: 95737 01777.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు. ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

మచిలీపట్నం

●మచిలీపట్నం ●పెడన

విద్యార్థుల నమోదు పెంచడమే లక్ష్యం

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల నమోదు పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని డీఐఈవో సరళకుమారి తెలిపారు. 8 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో గతేడాది కంటే ఈ ఏడాది పది శాతం ప్రవేశాలు పెంపుదల లక్ష్యంగా పని చేస్తున్నామని పేర్కొన్నారు. ఒప్పంద అధ్యాపకుల సర్దుబాటు పూర్తయిందని, ప్రస్తుతం అతిథి అధ్యాపకుల సర్దుబాటు చేస్తున్నట్లు వివరించారు. ఇంటర్మీడియట్ మొదటి ఏడాది తెలుగు మాధ్యమం విద్యార్థులకు మినహా అందరికీ ఈ ఏడాది పాఠ్య పుస్తకాలు అందజేసినట్లు వివరించారు. త్వరలో వర్కు పుస్తకాలు, రికార్డులు అందజేస్తామని తెలిపారు.

ధర వరలు

రైతుబజారులో కూరగాయల ధరలు టమాట 33, వంగ 30, బెండ 30, పచ్చిమిర్చి 32, కాకర 44, క్యాబేజీ 20, క్యారెట్ 42, దొండ 32, బంగాళదుంప 28, ఉల్లిపాయలు 27, గోరుచిక్కుడు 30, దోస 18, సొర 10.8, అరటికాయ 8, 7, చిక్కుళ్లు 54, బీర 24, చామదుంప 30, మునగ 10/08, కంద 64, బీట్‌రూట్ 30, కీరదోస 42, బీన్స్ 88, క్యాప్సికం 84, అలసందలు 38, చిలకడదుంప 36, కొత్తిమీర 16/08, పుదీనా 15/5. గురువారం ఉదయం 7 గంటల వరకు ఈ ధరలు వర్తిస్తాయి. -మచిలీపట్నం(గొడుగుపేట), న్యూస్‌టుడే

సినిమాలు

రేవతి: కుబేర
మినీరేవతి: మార్గన్
సిరివెంకట్: కన్నప్ప
-మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

మచిలీపట్నం : 80089 02911, పెడన : 63099 94687

● గూడూరు మండలంలోని తరకటూరు నుంచి మద్దిపట్ల వెళ్లే ప్రధాన రహదారి గుంతల మయంగా మారింది. దీంతో ఆయా గ్రామాల ప్రజలతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై 'ఈనాడు'లో చిత్రకథనం ప్రచురించడంతో పాటు సమస్యను పలువురు 'మేమున్నాం.. మీకుతోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ స్పందించి అధికారులను ఆదేశించగా గుంతలు పూడ్చి రహదారిని అభివృద్ధి చేశారు. - గూడూరు, న్యూస్‌టుడే

స్పందనకు వందనం

● **కల్వర్టులకు ప్రతిపాదనలు:** పట్టణంలోని 14వ వార్డులో డ్రెయిన్ కల్వర్టు లేక మురుగు నీటి పారుదలకు ఇబ్బందులు ఎదురవుతున్నట్లు ఈనాడు మేమున్నాం మీకు తోడుగాకు స్థానికులు చేసిన ఫిర్యాదులపై మున్సిపల్ అధికారులు స్పందించారు. తెలుగు-బైపాస్ రోడ్డుతో పాటు మరో రెండు చోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులతో కల్వర్టులను నిర్మించనున్నామని ఏఈ కాగిత రామాంజనేయులు చెప్పారు. - పెడన, న్యూస్‌టుడే

● నగరంలోని బస్టాండ్ కూడలి నుంచి జిల్లా కోర్టు సెంటరుకు వెళ్లే దారిలో ప్రధాన రహదారి పక్కన వేసిన చెత్త తొలగించకపోవడంతో అక్కడ పశువులు చేరుతున్నాయి. ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఆ ప్రాంత వాసులు మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులు స్పందించి సిబ్బందిని పంపి చెత్త తొలగించేలా చర్యలు తీసుకున్నారు. ● పరాసుపేటలోని గౌతమ్‌స్కూల్‌కు వెళ్లే దారిలో వీధిదీపాలు వెలగకపోవడంతో ఆ ప్రాంతవాసులు మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులు వివరించడంతో విద్యుద్దీపాలు ఏర్పాటు చేయించారు. ● నగరంలోని వలందపాలెంలో ప్రధాన రహదారి పక్కన చెత్త తొలగించకపోవడంతో ఆ ప్రాంతవాసులు సమస్యను మేమున్నాం మీకుతోడుగా దృష్టికి తీసుకురాగా అధికారులు వివరించడంతో సిబ్బందిని పంపి చెత్త తొలగించి ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

ఎంఈవోగా ముబీన్‌బాను

బంటుమిల్లి, న్యూస్‌టుడే: మండల విద్యాశాఖాధికారిగా డాక్టర్ ఎం. ముబీన్‌బాను నియమితులయ్యారు. పదోన్నతిపై ఆమె కైకలూరు నుంచి ఎంఈవోగా వచ్చారు.

డ్వాక్రా సంఘాల బలోపేతం

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: డ్వాక్రా సంఘాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెదేపా రాష్ట్ర నాయకులు గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. నగరంలోని స్వయం సహాయక సంఘాల రిసోర్సుపర్సన్లకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను బుధవారం ఆయన పంపిణీ చేశారు. నాయకులు పీవీ ఫణికుమార్, వంకా వెంకటేశ్వరరావులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం

పామర్రు, న్యూస్‌టుడే: స్థానిక చౌదరిపేటలో నివాసం ఉంటున్న ఓ మహిళ అదృశ్యమైన ఘటనపై కేసు నమోదైంది. సదరు మహిళ జూన్ 30న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అందిన అమృతం

రూ.73.38 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు

న్యూస్‌టుడే, మచిలీపట్నం కార్పొరేషన్

అమృత్ 2.0 పథకంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం నగరపాలక సంస్థకు నిధులు కేటాయించి ఏళ్లు గడిచిపోయింది. నిధులు విడుదలైనా వైకాపా పాలకులు పట్టించుకోలేదు. కనీసం ఈ పనులకు సంబంధించిన అంశాన్ని కౌన్సిల్ ముందుకు తీసుకురాకుండా అడ్డుకోవడంపై నగరవాసుల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. కౌన్సిల్లో ప్రతిపక్ష సభ్యులు ప్రశ్నించినా ఫలితం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం చొరవతో ప్రభుత్వం ఇటీవల నిధులు విడుదల చేయగా తాజాగా టెండర్ల ప్రక్రియ పూర్తయ్యింది. త్వరలోనే పనులు చేపట్టేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఎంత కేటాయించారు.. ఏయే పనులు చేస్తారు..

గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా అమృత్ నిధులు వెనక్కి వెళ్లిపోయే స్థితిలో కూటమి ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంది. ప్రభుత్వ నిబంధనలకు లోబడి కమిషనర్ పరిధిలోనే డీపీఆర్ తయారు చేయించి ప్రభుత్వానికి సకాలంలో నివేదించడంతో నిధులు విడుదల కావడానికి అవకాశం ఏర్పడింది. అమృత్ 2.0 పథకంలో రూ.73.38 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టేందుకు ఇటీవల టెండరు పిలవగా ఆ ప్రక్రియ కూడా పూర్తయింది. వీటిలో అత్యధికంగా రూ.53.10కోట్లతో రెండు మురుగునీటి శుద్ధి ప్లాంట్లు నిర్మించనున్నారు. ఈడేపల్లి సబ్‌జైలు, పతుల్లాబాద అవుట్‌ఫాల్ డ్రైన్ల వద్ద ఇవి నిర్మించనున్నారు. దీంతో పాటు రిజర్వాయర్లు, పైపులైన్లు, ఇతర తాగునీటి సంబంధిత పనులు చేపట్టేందుకు రూ.15.24కోట్లు కేటాయించారు. నగరంలోని కాలనీలు, శివారు ప్రాంతాలతో పాటు బందరు మండలంలోని రుద్రవరం టిడ్కో గృహసముదాయం వరకు పైపులైన్‌తో పాటు ఇతర పనులకు రూ.1.12కోట్లు వెచ్చించనున్నారు. కాలనీల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలకు రూ.1.16కోట్లు, జడ్పీ కూడలిలోని ధర్మాన చెరువును పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు రూ.2.76 కోట్లు కేటాయించారు.

నగరంలో అసంపూర్తిగా మురుగు నీటిశుద్ధి ప్లాంట్

అభివృద్ధి చేయనున్న జిల్లాపరిషత్ కూడలిలోని చెరువు

టెండరు ప్రక్రియ పూర్తి

అమృత్2.0 పథకంలో చేపట్టనున్న అభివృద్ధి పనులకు సంబంధించి ప్రభుత్వం టెండర్లు ఆహ్వానించగా ప్రస్తుతం ఆ ప్రక్రియ పూర్తయ్యింది. త్వరలోనే గుత్తేదారును ఖరారు చేసే అవకాశం ఉంది. ఈనెలాఖరులోపు పనులకు శంకుస్థాపన చేసి ప్రారంభించే అవకాశాలు ఉన్నాయి. పనులు వేగంగా పూర్తి చేయాలన్న లక్ష్యం పెట్టుకున్నాం. **-సీహెచ్‌వీవీఎస్ బాపిరాజు, నగరపాలక సంస్థ కమిషనర్**

కేంద్రీయ విద్యాలయంలో మిగిలిన సీట్లకు దరఖాస్తులు

భాస్కరపురం (మచిలీపట్నం), న్యూస్‌టుడే: మచిలీపట్నం కేంద్రీయ విద్యాలయంలో 4, 8, 9, 10, 11, 12 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ మహమ్మద్ ఆసిఫ్ హుస్సేన్ బుధవారం తెలిపారు. 10, 12 తరగతుల్లో కేటగిరి 1, కేటగిరి 2 వారికి మాత్రమే సీట్లు ఉన్నాయన్నారు. 9వ తరగతి వారికి ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు కేంద్రీయ విద్యాలయం కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

అందుబాటులో అన్ని రకాల టీకాలు

పెడన గ్రామీణం, న్యూస్‌టుడే: పెడన, గూడూరు మండలాల్లో పశువులకు అన్ని రకాల టీకాలు అందుబాటులో ఉన్నాయని పశుసంవర్ధకశాఖ ఏడీ కె.బాబూరావు తెలిపారు. గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందు, నీలినాలుక వ్యాధికి టీకా మందు అందుబాటులో ఉందని పేర్కొన్నారు. రైతులకు 75 శాతం రాయితీపై గడ్డి విత్తనాలు అందిస్తామన్నారు. ఈ నెల 6న జునోసిస్ దినోత్సవం సందర్భంగా కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ అందజేస్తామని తెలిపారు. పశుసంవర్ధకశాఖ సంచార వాహనం బంటుమిల్లిలో ఉందని, దీన్నే అత్యవసర చికిత్స కోసం ఉపయోగిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇంతేరులో 'సుపరిపాలనలో తొలి అడుగు' ప్రారంభం

ఇంతేరు (కృత్తివెన్ను), న్యూస్‌టుడే: మండలంలోని ఇంతేరు గ్రామ పంచాయతీలో బుధవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిన సంక్షేమం, అభివృద్ధి వివరించారు. అనంతరం గ్రామ సమస్యలపై ఆరా తీశారు. అన్ని సమస్యలు పరిష్కరిస్తానని కాగిత హామీ ఇచ్చారు. ముందుగా ప్రతి ఇంటిలోని సభ్యులను పిలిచి, ఏ ఏ పథకాలు వస్తున్నాయి? ఇంకా ఎవరైనా అర్హులు ఉండి పథకాలు రావాలా? అర్హులందరికీ సంక్షేమం అందుతోందా? రేషన్ కార్డు ఉందా? ఇంకా ఏమైనా సమస్యలు ఉన్నాయా? అని వివరాలు అడిగి నమోదు చేసుకున్నారు. ఇంతేరు, కృత్తివెన్ను గ్రామాలను కలిపే కరకట్టను నిర్మించాలని గ్రామ తెదేపా నాయకులు కాగితను కోరారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్, తెదేపా మండలాధ్యక్షుడు ఒడుగు తులసీరావు, తెదేపా ప్రధాన కార్యదర్శి పిన్నెంటి రత్తయ్య, జిల్లా కార్యవర్గ కార్యదర్శి కూనసాని చిన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు కూటమి పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ తదితరులు

ఉపాధి హామీ పనులు భేష్

కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ కితాబు

పెడన, న్యూస్‌టుడే: జిల్లాలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో పురోగతిలో ఉన్న పనులు ఆదర్శంగా నిలుస్తున్నాయని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ రాజ్‌ప్రీత్‌సింగ్ అన్నారు. పెడన మండలం మడక, నందమూరు గ్రామాల్లో బుధవారం సెక్షన్ అధికారి కేశవ్‌రోజ్‌తో కలిసి పర్యటించారు. మడక ఎస్సీ కాలనీలో 6.10 లక్షల ఉపాధి హామీ నిధులతో నిర్మించిన సిమెంటు రోడ్డును ఆయన పరిశీలించారు. పంచాయతీరాజ్ డీఈఈ నగేశ్‌ను సాంకేతిక వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డ్వాక్రా మహిళలతో సమావేశమై మహిళల స్వయం ఉపాధి వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ రుణంతో ఆటో సమకూర్చుకుని స్వయం ఉపాధి పొందుతున్న డ్వాక్రా మహిళ మురాల స్వప్నను అభినందించారు. అనంతరం నందమూరులోని సామాజిక వన పథకం నర్సరీని సందర్శించిన ప్రీత్‌సింగ్ ఫారెస్ట్ రేంజి అధికారి ఎస్‌వీకే కుమార్ నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. రూ.2.30లక్షల ఉపాధి నిధులతో నిర్మించిన మినీ గోకులం, రైతు నిర్వహిస్తున్న మామిడి, కొబ్బరి తోటలను ఈ గ్రామంలో పరిశీలించారు. చివరిగా పుల్లపాడులో ప్రభుత్వ గృహ సముదాయాన్ని పరిశీలించారు. ఆయన వెంట డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్, డ్వామా పీడీ శివపరసాద్, ఎంపీడీవో అరుణకుమారి, పంచాయతీరాజ్ ఏఈ ధర్మయ్య, సర్పంచులు జోగి వెంకటలక్ష్మీ, పరసా నరసింహారావు తదితరులు ఉన్నారు.

మడకలో సీసీ రోడ్డు నిర్మాణ వివరాలు పరిశీలిస్తున్న డైరెక్టర్ రాజ్ ప్రీత్ సింగ్. పక్కన మెప్మా పీడీ తదితరులు

ఎరువులు తగు మోతాదులో వేయండి

కరఅగ్రహారం (మచిలీపట్నంరూరల్), న్యూస్‌టుడే: వ్యవసాయశాఖ సూచనల మేరకు ఎరువులను తగు మోతాదులో మాత్రమే వినియోగించాలని మండల వ్యవసాయాధికారి ఎం. రామ్‌కుమార్ అన్నారు. మచిలీపట్నం మండలంలో కరఅగ్రహారం, మేకావాని పాలెంలో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు సకాలంలో పంట నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు ప్రసన్న, మహాలక్ష్మి, తెదేపా యూనిట్ ఇన్‌ఛార్జి బత్తిన నాగరాజు, మాజీ ఎంపీటీసీ బోలెం అయోధ్య రామయ్య, రైతులు పాల్గొన్నారు.

6న శాకంబరిగా శ్రీకొండలమ్మతల్లి

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: వేమవరం శ్రీకొండలమ్మతల్లి దేవస్థానంలో ఆషాఢ ఏకాదశిని పురస్కరించుకుని ఆదివారం అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించనున్నట్లు ఆలయ ఈవో ఎ.కొండలరావు తెలిపారు. అమ్మవారిని, ఆలయ ఆవరణ, మండపాలను కూరగాయలు, పండ్లతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

వంతెన నిర్మించారు.. అప్రోచ్ మరిచారు..

న్యూస్‌టుడే, తాళ్లపాలెం (మచిలీపట్నంరూరల్)

మచిలీపట్నం ఉత్తర మండల పరిధిలోని పల్లె తాళ్లపాలెం వారధికి మోక్షం కలగడం లేదు. కొద్దిపాటి నిధులు మంజూరు చేస్తే ప్రజలకు వారధి అందుబాటులోకి వస్తుంది. అప్రోచ్ రహదారుల నిర్మాణం కోసం భూమిని సేకరించాల్సి ఉంది. గతంలో వైకాపా ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో భూసేకరణ సాధ్యం కాలేదు.

పల్లెతాళ్లపాలెం బ్రిడ్జి

అసంపూర్తిగా అప్రోచ్ రోడ్డు

రూ.30లక్షలూ ఇవ్వలేదు..: తాళ్లపాలెం-పల్లెతాళ్లపాలెం మధ్య తాళ్లపాలెం డ్రెయిన్‌పై రూ.9కోట్ల పంచాయతీరాజ్ ప్రాజెక్ట్స్ నిధులతో వారధి నిర్మాణానికి 2019లో తెదేపా ప్రభుత్వం శంకుస్థాపన చేసింది. దీనివల్ల సుమారు 1500 మంది ప్రజలు సురక్షితంగా తాళ్లపాలెం డ్రెయిన్ దాటేందుకు వీలు కలుగుతుంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు కాలిబాట వంతెన మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉంది. మెగా కన్‌స్ట్రక్షన్స్ సంస్థ టెండరు దక్కించుకోగా సబ్‌లీజుకు తీసుకున్న విశ్వసముద్ర సంస్థ నిర్మాణ పనులు మొదలుపెట్టింది. 2022 నాటికే వంతెన నిర్మాణం పూర్తయినా అప్రోచ్ రహదారులకు స్థల సేకరణ జరగలేదు. 48 సెంట్లు మాత్రమే భూసేకరణ జరగాల్సి ఉండగా అందుకు రూ.30లక్షలు ఖర్చవుతుందని అంచనా వేశారు. ఇంత చిన్న మొత్తాన్ని కూడా వైకాపా ప్రభుత్వం గత ఐదేళ్లలో మంజూరు చేయలేదు. అధికారులు ప్రతిపాదనలు రూపొందించి పంపటం, నిధులు మంజూరు కాకపోవటం షరా మామూలుగా కొనసాగింది.

ఈ కాలిబాట వారధే ప్రస్తుత మార్గం

కక్షతోనేనా..: తెదేపా ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన వారధిని ఎందుకు పూర్తి చేయాలనే కక్షతోనే నాటి వైకాపా ప్రభుత్వం ఇలా వ్యవహరించిందనే విమర్శలు వెల్లువెత్తాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత అధికారులు అప్రోచ్ రహదారికి భూమిని సేకరించాలని ప్రతిపాదనలు పంపారు.

భూసేకరణపై కలెక్టర్‌కు మంత్రి లేఖ: పల్లెతాళ్లపాలెం వారధి అప్రోచ్ రహదారుల నిర్మాణానికి భూమి సేకరించాలని మంత్రి రవీంద్ర తాజాగా కలెక్టర్‌కు లేఖ రాశారు. భూసేకరణ జరిగితే కొద్దిరోజుల్లోనే అప్రోచ్ రహదారిని నిర్మిస్తామని అధికారులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా నిధులు మంజూరు కాకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అప్రోచ్ రహదారుల నిర్మాణం విషయమై పంచాయతీరాజ్ ప్రాజెక్ట్స్ ఏఈ గోపీ వివరణ కోరగా భూసేకరణ కోసమే ఎదురు చూస్తున్నామన్నారు.

చిన్నాపురంలో కాలువలకు నీరు విడుదల

చిన్నాపురం (మచిలీపట్నం రూరల్), న్యూస్‌టుడే: చిన్నాపురం పరిధిలోని 9/3, 9/4, 9/5 కాలువలకు బుధవారం సాగు నీటి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు, తెదేపా నేతలు పూజలు చేసి సాగునీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో నీటి సంఘం అధ్యక్షుడు చలమలశెట్టి వెంకటరమణారావు, చిన్నాపురం సర్పంచి కాగిత గోపాలరావు, ఉపసర్పంచి నాంచారయ్య, కేసన రమేష్, జేఈ రామ్ కుమార్, రుక్మిణేశ్వరరావు, మాతంగి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సాగునీటికి పూజలు చేస్తున్న తెదేపా నేతలు

కలెక్టర్‌ను కలిసిన నూతన అధికారులు

కలెక్టరేట్ (మచిలీపట్నం), న్యూస్‌టుడే: బదిలీల్లో భాగంగా జిల్లాకు నూతనంగా వచ్చిన అధికారులు బుధవారం కలెక్టర్ డీకే బాలాజీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారిణిగా బాధ్యతలు స్వీకరించిన ఎస్.సరళకుమారి ఛాంబర్‌లో కలెక్టర్‌ను కలిసి పూలకుండీ అందజేశారు. సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్‌చంద్ర, గుడ్లవల్లేరు మండల ఇన్‌ఛార్జి ఎంపీడీవో ఎండీ ఇమ్రాన్‌లు వేర్వేరుగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా అభివృద్ధిలో భాగస్వాములు కావాలంటూ కలెక్టర్ వారికి సూచించి అభినందనలు తెలిపారు.

కలెక్టర్‌కు పూలకుండీ అందజేస్తున్న ఎస్.సరళకుమారి

పీడీఎస్ బియ్యం స్వాధీనం.. వాహనాల సీజ్

గూడూరు, న్యూస్‌టుడే: రైస్‌మిల్లు నుంచి వాహనాల్లో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్నారన్న సమాచారంతో విజిలెన్స్, పౌరసరఫరాలశాఖ అధికారులు బుధవారం మండల పరిధిలోని తరకటూరు పాలెం గోమతి రైసుమిల్లులో తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో మూడు వాహనాల్లో తరలించేందుకు సిద్ధంగా ఉన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మూడు వాహనాల్లో కలిపి 50కేజీలు కలిగిన 221 బస్తాలు ఉన్నాయని, వీటితో పాటు మిల్లులో మరో 55 బస్తాలు పీడీఎస్ బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించినట్లు పీడీఎస్‌డీటీ సుభాన్‌బీ తెలిపారు. మొత్తం 276 బస్తాలు స్వాధీనం చేసుకుని వాహనాలు సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో విజిలెన్స్ ఎస్సై కృష్ణసాయి, ఆర్ఐ ఝాన్సీరాణి, సిబ్బంది పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న బియ్యంతో విజిలెన్స్ ఎస్సై, పీడీఎస్ డీటీ తదితరులు

పీఏసీఎస్‌లకు త్రిసభ్య కమిటీలు

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: బందరు, పెడన నియోజకవర్గాల్లో వివిధ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలు ఖరారయ్యాయి. విడతలవారీగా కమిటీలు ఏర్పాటు చేసే క్రమంలో తొలివిడత కొన్ని సంఘాలకు కమిటీలు ఏర్పాటయ్యాయి. మిగిలిన సంఘాలకు కూడా త్వరలోనే కమిటీలు ఏర్పడతాయని అధికారవర్గాలు తెలిపాయి. ఒక్కో కమిటీలో ఒక ఛైర్మన్, ఇద్దరు సభ్యులను నియమించారు.

మండలం	సహకారసంఘం	ఛైర్మన్
బందరు	చిలకలపూడి	మేకా గంగాధరరావు
„	శివగంగ	పిప్పళ్ల కాంతారావు
„	గుండుపాలెం	తూమాటి బసవయ్య
„	బందరుకోట	బచ్చుల శ్రీనివాస్
„	సీతారామపురం	ఈడే రాంబాబు
„	అరిశేపల్లి	పన్నెంరెడ్డి శ్రీనివాసరవికుమార్
„	గోకవరం	ఎం.నాగేశ్వరరావు
„	చిన్నాపురం	పి. నిరంజన్
„	పెదయాదర	కంచర్లపల్లి మోహన్
„	భోగిరెడ్డిపల్లి	అరిశెట్టి రామకోటేశ్వరరావు
„	వాడపాలెం	దారపురెడ్డి వీరాంజనేయులు
గూడూరు	జక్కంచర్ల	మత్తి సుబ్రహ్మణ్య
„	ఆకులమన్నాడు	ఎజ్జు శివాజి
పెడన	దావూజీపాలెం	కాగిత నాగేశ్వరరావు
„	నందమూరు	మన్నే శ్రీనివాసరావు
„	నందిగామ	యారగాని నాగరాజు
„	కవిపురం	పుట్టి శ్రీనివాసరావు
„	కొంకేపూడి	కట్టా నాగరాజు
బంటుమిల్లి	బంటుమిల్లి	ఇల్లూరి లీలాకృష్ణ
„	కంచడం	గంధం సత్యనారాయణ
కృత్తివెన్ను	మాట్లాం	వాటాల రామచంద్రరావు

15 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు

బంటుమిల్లి, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అందించే నేషనల్ మీన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్‌నకు మండలంలోని చోరంపూడి జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి 15 మంది విద్యార్థులు అర్హత సాధించారు. ఒకే పాఠశాలకు చెందిన 15 మంది విద్యార్థులు దీనికి అర్హత సాధించడం విశేషం. వీరు నాలుగేళ్ల పాటు ఏడాదికి రూ.12వేలు చొప్పున ఉపకార వేతనాలు అందుకోనున్నారు. విద్యార్థులతో పాటు సోషల్ ఉపాధ్యాయుడు శివరామప్రసాద్‌ను ఎంఈవో 2 వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.ధనలక్ష్మీ అభినందించారు.

విద్యార్థులతో ఎంఈవో-2 వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు

పెడనలో వీధి వ్యాపారుల సర్వే

పెడన, న్యూస్‌టుడే: పెడన పట్టణంలో వీధి వ్యాపారుల(స్ట్రీట్ వెండర్స్) సర్వే చేపట్టామని మెప్మా సిటీ మిషన్ మేనేజర్ కేవీఎస్ ఆనందబాబు చెప్పారు. వీధి వ్యాపారులకు రుణాలు అందించి ఆర్థికంగా చేయూత ఇవ్వాలన్న లక్ష్యంతో ఇప్పటివరకు 913 మందిని గుర్తించామన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

అమ్మవారికి ఆషాఢ సారె

మచిలీపట్నం (గొడుగుపేట), న్యూస్‌టుడే: చెమ్మనగిరి పేటలో మహిషాసురమర్దిని సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో అధిక సంఖ్యలో సువాసినులు పాల్గొని అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు.

సారెతో ఆలయానికి వచ్చిన సువాసినులు

హామీలు అమలు చేయమని అడుగుదాం

కప్పలదొడ్డి (గూడూరు), న్యూస్‌టుడే: చేనేత కార్మికులకు కూటమి ప్రభుత్వం వివిధ హామీలు ఇచ్చిందని, వాటిని అమలు చేయమని ప్రభుత్వానికి విన్నవించాలని వివిధ చేనేత సంఘాల నాయకులు తీర్మానించారు. బుధవారం పెడన పట్టణంతో పాటు గూడూరు మండలంలోని వివిధ గ్రామాల చేనేత సహకార సంఘాల ప్రతినిధులు కప్పలదొడ్డిలో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ 2017-18 నుంచి త్రిఫ్ట్‌ఫండ్, నూలు రాయితీతో పాటు వివిధ బకాయిలు విడుదల కావాల్సి ఉందన్నారు. బకాయిలు పేరుకుపోవడంతో సంఘాల మనుగడ ఇబ్బందికరంగా మారి కార్మికులకు పని కల్పించలేని స్థితిలోకి చేరుకున్నాయన్నారు. చేనేత కార్మికులకు ఏడాదికి రూ.24వేలు సాయం, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు, జీఎస్టీ రియంబర్స్‌మెంట్ లాంటి వివిధ పథకాల అమలు చేస్తామని సీఎం హామీ ఇచ్చారన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్నా ఇంతవరకు పథకాలు అమలు కాలేదని వాపోయారు. దీనిలో భాగంగా సుపరిపాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు వినతిపత్రం ఇవ్వాలని నిర్ణయించారు. వివిధ సంఘాల ప్రతినిధులతోపాటు కార్మికులు పాల్గొన్నారు.

సమావేశంలో వివిధ సంఘాల ప్రతినిధులు, కార్మికులు

అన్న క్యాంటీన్ వద్ద పర్యవేక్షణకు ఆదేశం

పెడన, న్యూస్‌టుడే: మద్యం మత్తులో కొంత మంది వ్యక్తులు స్థానిక బస్టాండు సెంటరులోని అన్నక్యాంటీన్ వద్ద తరచూ సిబ్బందితో వివాదాలకు దిగుతున్నారని ఫిర్యాదులు వస్తున్నాయని, దీనిపై సచివాలయ ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ ఎల్.చంద్రశేఖర రెడ్డి ఆదేశించారు. బుధవారం సచివాలయ అమినిటీ కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. మద్యం షాపునకు 80 మీటర్లలోపు ఉన్న ఈ అన్న క్యాంటీన్ వద్ద ఉదయం, సాయంత్రం అమినిటీ కార్యదర్శులు విధులు నిర్వర్తించాలని, వివాదాలకు పాల్పడే వ్యక్తుల సమాచారాన్ని పోలీసుస్టేషన్‌కు తెలియజేయాలన్నారు.

అమినిటీ కార్యదర్శులతో సమీక్షిస్తున్న కమిషనర్

● **నీటి పన్నుల వసూలుకు ఆదేశం:** పురపాలికలో నీటి పన్ను రూ.60లక్షల వరకు వసూలు కావాల్సి ఉందని, అమినిటీ కార్యదర్శులు తమ సచివాలయాల పరిధిలో ప్రజల్ని చైతన్యపర్చి పన్నులు చెల్లించేలా కృషి చేయాలని కమిషనర్ ఆదేశించారు. మున్సిపల్ ఏఈ రామాంజనేయులు పాల్గొన్నారు.

362 గ్రాముల గంజాయి స్వాధీనం

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: విజయవాడ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు నగరంలో బుధవారం నిర్వహించిన దాడుల్లో 362 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పి.వెంకటేశ్వరమ్మ నేతృత్వంలో సిబ్బంది ఉల్లింగిపాలెంలో నిర్వహించిన దాడుల్లో భీమవరానికి చెందిన ఈశ్వర సాయి, మచిలీపట్నంకు చెందిన సయ్యద్‌ఖాదర్, ఏకనాథ్‌ల వద్ద గంజాయి నిల్వ గుర్తించారు. దీంతో పాటు వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు, ఒక బైక్ స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై రామశేషయ్య, సిబ్బంది వసంత్, వినోద్‌బాబు తదితరులు తనిఖీల్లో పాల్గొన్నారు.

ప్రమాదకరంగా గొయ్యి

నగరంలోని పోర్టురోడ్డులో ఎల్ఐసీ కార్యాలయ సమీపంలో రోడ్డు పక్కన పైపులైన్ వాల్వ్ నిమిత్తం తవ్విన గుంతను అలాగే వదిలేయడంతో ప్రమాదకరంగా మారింది. స్థానికులతో పాటు రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

- న్యూస్‌టుడే, మచిలీపట్నం(గొడుగుపేట)

(c) eenadu

పెనమలూరు

• పెనమలూరు • గన్నవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

కానూరు : 80085 74647 హనుమాన్‌జంక్షన్, 98486 27585

స్పందనకు వందనం

• పెనమలూరు చిన్నగుడి ప్రాంతంలో తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడు తోందని, కుళాయిల నుంచి నీరు సరిగా రావడం లేదంటూ స్థానికులు 'మేమున్నాం మీకు తోడుగా' ద్వారా గ్రామ కార్యదర్శి అహ్మద్‌కు తెలుపగా ఆయన స్పందించి సిబ్బందిని పంపి పైప్ లైన్‌కు మరమ్మతులు చేయించారు. • గోసాల సాయిసుప్రజ నగర్‌లో విద్యుత్తు తీగలపై పక్కనే ఉన్న చెట్ల కొమ్మలు విరిగి పడడం, తాకడంతో సమీప నివాసాల్లో ఫ్యూజులు మాడిపోతున్నాయని స్థానికులు.. గ్రామ కార్యదర్శి కూర్మారావు దృష్టికి తీసుకురాగా.. ఆయన పంచాయతీ సిబ్బందిని పంపించి అడ్డుగా ఉన్న కొమ్మలు తొలగింపునకు చర్యలు తీసుకున్నారు. • గోసాల ప్రధాన మార్గంలో వీధి దీపాలు వెలగడం లేదని గ్రామస్థుల నుంచి వచ్చిన ఫిర్యాదుపై కార్యదర్శి కూర్మారావు స్పందించి సిబ్బందిని పంపించి 9 చోట్ల విద్యుత్తు దీపాలకు మరమ్మతులు చేయించారు. **- న్యూస్‌టుడే, పెనమలూరు**

రేపు మేధాశక్తి హక్కులు-పేటెంట్లపై కార్యశాల

నున్న, న్యూస్‌టుడే: నున్న వికాస్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో భారత ప్రభుత్వ సంస్థ, జాతీయ ఇంటలెక్చువల్ ప్రాపర్టీ అవేర్నెస్ మిషన్(ఎన్ఐపీఏఎం) కలిసి మేధాశక్తి హక్కులు, పేటెంట్స్ అంశంపై శుక్రవారం కార్యశాలను నిర్వహిస్తున్నామని కళాశాల ప్రిన్సిపల్ డా.పరమేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జులై 4న ఉదయం కళాశాలలోని సెమినార్ హాలులో ఈ కార్యక్రమం ఉంటుందని, వివిధ కళాశాలల నుంచి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

తెదేపా మండల కమిటీ ఏర్పాటు

కంకిపాడు: కంకిపాడు మండల తెదేపా కమిటీ ఎట్టకేలకు ఏర్పాటైంది. పెనమలూరు, ఉయ్యూరు గ్రామీణం, నగర పంచాయతీ, తాడిగడప పురపాలిక పార్టీ అధ్యక్షుల నియామకం మేరకు సామాజిక వర్గాల సమతుల్యాన్ని పాటిస్తూ ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కంకిపాడు మండల కమిటీకి పచ్చజెండా ఊపారు. అధ్యక్షుడిగా సుదిమళ్ల రవీంద్రప్రసాద్ (జగన్నాథపురం), ఉపాధ్యక్షుడిగా చలవాది రాజాగురవయ్య (కంకిపాడు), ప్రధాన కార్యదర్శిగా వీరంకి పావనమూర్తి (ప్రొద్దుటూరు), కోశాధికారిగా కాసరనేని కరుణకుమార్(పునాదిపాడు), కార్యదర్శులుగా అన్నవరపు శివపార్వతి (కంకిపాడు), శనగల లక్ష్మి (ఉప్పులూరు), కిరణ్‌కుమార్(కాసరనేనివారిపాలెం), కార్యనిర్వాహక కార్యదర్శులుగా మాదు సుబ్రహ్మణ్యం (మంతెన), ఊసల రామయ్య (మారేడుమాక), నూనె బోగయ్య(ఈడుపుగల్లు) నియమితులయ్యారు.

అధనం.. ఇక అధికారికం

• విద్యుత్తు అదనపు లోడు క్రమబద్ధీకరణకు విశేష స్పందన

• కానూరు డివిజన్‌కు రూ.1.30 కోట్ల ఆదాయం

కానూరు, పోరంకి, తాడిగడప, న్యూస్‌టుడే

యనమలకుదురు సబ్‌స్టేషన్

50 శాతం రాయితీతో అదనపు లోడు క్రమబద్ధీకరణకు ప్రభుత్వం వేసవిలో శ్రీకారం చుట్టింది. ఇందు కోసం మార్చి 1 నుంచి జూన్ 30 వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం ఇచ్చింది. కానూరు సబ్ డివిజన్ పరిధిలో ఈ పథకానికి వినియోగదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఇప్పటి వరకు 6096 మంది వినియోగదారులు 10615.83 అదనపులోడు క్రమబద్ధీకరణ చేయించుకున్నారు. ఇందుకు రూ.1,30,53,600 ఆదాయం వచ్చింది. కానూరు సబ్‌స్టేషన్ పరిధిలో 28386, పోరంకి 16029, యనమలకుదురు 33262, పెనమలూరు 16181, కంకిపాడులో 25051 వెరసి.. కానూరు సబ్ డివిజన్‌లో 1,18,909 గృహ విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి.

కానూరు సబ్ డివిజన్ పరిధిలో వివరాలు

సబ్‌స్టేషన్	క్రమబద్ధీకరణ చేయించుకున్నవారు	అదనపులోడు (కిలోవాట్స్)	కట్టిన ఆదాయం (రూ॥లు)
కంకిపాడు	835	1770.45	2166950
కానూరు	1389	2097.7	2588250
పెనమలూరు	704	1464.495	1794400
పోరంకి	539	1002.44	1230550
యనమలకుదురు	2629	4280.745	5273450

లెక్కింపు ఇలా..

ఇంటి విద్యుత్తు కనెక్షన్ తీసుకునే సమయంలో వినియోగదారులు వాడే దీపాలు, ఇతర ఉపకరణాలకు ఎంత విద్యుత్తు వినియోగం అవుతుందో అంచనా వేసి కిలోవాట్లలో లోడ్ లెక్కించారు. ఆ మేరకు డెవలప్‌మెంటు ఛార్జీలు, సెక్యూరిటీ డిపాజిట్ వసూలు చేస్తారు. ఉదాహరణకు ఒక కిలోవాట్ లోడుతో కనెక్షన్ తీసుకుంటే సెక్యూరిటీ డిపాజిట్ రూ. 200, డెవలప్‌మెంట్ రుసుము రూ.2వేలు, దరఖాస్తుకు రూ.50.. కలిపి రూ 2500 చెల్లించాలి. ప్రస్తుతం ప్రకటించిన 50 శాతం రాయితీతో కిలోవాట్‌కు రూ.1250 వసూలు చేశారు. రెండు కిలోవాట్ల అసలు ధర రూ.4450, మూడు అయితే రూ.6650, నాలుగు రూ. 8850, ఐదు అయితే రూ.11050లుగా నిర్ధారించారు. అదనపు లోడు క్రమబద్ధీకరణ బట్టి 50 శాతం రాయితీ ఇస్తారు.

కొత్త లైన్లు, నియంత్రికల ఏర్పాటుకు చర్యలు

అదనపు లోడు క్రమబద్ధీకరణకు వినియోగదారుల నుంచి అనూహ్య స్పందన లభించింది. మార్చి నుంచి జూన్ నెలాఖరు వరకు 6096 మంది వినియోగదారులు క్రమబద్ధీకరించుకున్నారు. తద్వారా సంస్థకు మంచి ఆదాయం సమకూరింది. పెరిగిన లోడుకు అనుగుణంగా కొత్త లైన్లు, నియంత్రికల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. నాణ్యమైన విద్యుత్తు అందిస్తాం. **- బోడేపూడి నవీన్‌కుమార్, ఏడీఈ**

బుడమేరు కట్ట బలోపేతం

గండ్లు పూడ్చిన అనంతరం ఇలా..

వేల్పూరు (కంకిపాడు), న్యూస్‌టుడే: గతేడాది సంభవించిన వరద ప్రవాహానికి బుడమేరు రక్షణ కట్టలకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. ఖరీఫ్ ప్రారంభమవుతున్న సమయంలో కట్టలను బలోపేతం చేయాల్సిన అవసరాన్ని ప్రస్తావిస్తూ గత మే నెల 28వ తేదీన 'ఈనాడు' దినపత్రికలో 'బుడమేరు కట్టకు గండ్లు' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఎమ్మెల్యే బోడే ప్రసాద్ చొరవతో వేల్పూరు-ఉప్పులూరు మధ్య కట్టల బలోపేతం పనులు చేపట్టారు. సమస్యాత్మక ప్రదేశాల్లో రబ్బీష్, క్వారీ కంకర పొడి, నల్లమట్టితో గండ్లు పూడ్చారు. పైభాగాన్ని చదును చేసి ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల రాకపోకలకు అనువుగా తయారు చేశారు. దీంతో బుడమేరు వరద బారి నుంచి పంట పొలాలకు ముంపు బెడద తప్పిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులను ఏఎంసీ ఛైర్మన్ అన్నే ధనయ్య, స్థానిక కూటమి నేతలు పర్యవేక్షించారు.

ప్రైవేటు పాఠశాలల బంద్ నేడు

కంకిపాడు, న్యూస్‌టుడే : తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లండంతో భాగంగా గురువారం ప్రైవేటు పాఠశాలలను మూసివేస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల సంఘం(అపుస్మా) జిల్లా శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఆర్.టి.ఇ.12.1.సి దరఖాస్తుల ధ్రువపత్రాల విషయంలో ఎదురవుతున్న ఇబ్బందులు, గందరగోళాన్ని నివారించాలనే ప్రధాన విన్నపంతో శాంతియుత నిరసన చేపడుతున్నామన్నారు. సంఘ ప్రతినిధులు, సభ్యులు ప్రదర్శనగా వెళ్లి వివిధ స్థాయిలో విద్యాశాఖ కార్యాలయాల్లో వినతి పత్రాలు సమర్పిస్తామన్నారు.

నున్న పంచాయతీకి పారిశుద్ధ్య రిక్షాలు

ఎన్టీఆర్ కలెక్టరేట్: విజయవాడ గ్రామీణ మండలం నున్న పంచాయతీకి మూడు నూతన పారిశుద్ధ్య రిక్షాలు అందజేశారు. విజయవాడ కలెక్టరేట్ ఆవరణలోని ఇగ్నైట్ సెల్‌లో పంచాయతీరాజ్, జిల్లా పంచాయతీ శాఖ స్టాళ్లను బుధవారం ఏర్పాటు చేసిన సందర్భంలో వీటిని పంపిణీ చేశారు. ఒక్కొక్క రిక్షాలో నాలుగు చెత్త సేకరణ ప్లాస్టిక్ డబ్బాలు ఉన్నాయి. వీటితో తడి, పొడి, ఇతర రకాల చెత్తలను వేర్వేరుగా ఇంటింటా సేకరిస్తారు.

బందరు కాలువపై వంతెన నిర్మాణ స్థలం పరిశీలన

మాస్టర్ ప్లాన్ పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే బోడే ప్రసాద్ తదితరులు

తాడిగడప (కానూరు), న్యూస్‌టుడే: తాడిగడపలోని ఎల్వీప్రసాద్ నేత్ర వైద్య విజ్ఞాన సంస్థ వద్ద బందరు కాలువపై వంతెన నిర్మాణానికి ప్రతిపాదించిన స్థలాన్ని కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే బోడే ప్రసాద్‌లు పరిశీలించారు. బుధవారం కార్మికనగర్ కట్ట, తాడిగడపలో స్థలాన్ని చూశారు. అనంతరం మాస్టర్ ప్లాన్‌లో వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. గతంలో 2014 నుంచి 2019లో తెదేపా హయాంలో అప్పటి ఎమ్మెల్యే బోడే ప్రసాద్ ఈ వంతెన నిర్మాణానికి తీవ్ర కృషి చేశారు. కానీ 2019లో వైకాపా ప్రభుత్వం రావడంతో ఈ సమస్యను పక్కన పెట్టింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో తాడిగడపకు మరో వంతెన అందుబాటులోకి రానుంది. ఆర్అండ్‌బీ అధికారులు, రెవిన్యూ అధికారులు, తాడిగడప పురపాలిక అధికారులు తదితరులు పాల్గొన్నారు.

గుర్రపుడెక్క తొలగించరూ..

కృష్ణా కరకట్టకు సమాంతరంగా నాలుగు నియోజకవర్గాల పరిధిలో విస్తరించిన కేఈబీ కాలువకు సాగునీరు విడుదల చేశారు. ఈ కాలువలో ఇటీవల తూడు, గుర్రపుడెక్క తొలగింపు పనులు చేపట్టారు. అయితే పనులు సకాలంలో పూర్తి చేయకపోవడంతో మిగిలిన వ్యర్థాలు, గుర్రపుడెక్క చోడవరం, కాసరనేనివారిపాలెం, దుర్గాపురం, రొయ్యూరు, వల్లూరుపాలెం తదితర గ్రామాల పరిధిలో ఉన్న వంతెనల వద్ద మేట వేసింది. దీంతో ప్రవాహ వేగం తగ్గి సాగునీరు కిందకు సరఫరా కావడం లేదని రైతులు చెబుతున్నారు. మేటలను తొలగించాలని కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, మద్దూరు (కంకిపాడు)

మరమ్మతులు చేపట్టండి

విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయానికి వెళ్లే చెన్నై-కోల్‌కతా జాతీయ రహదారిని జిల్లా కలెక్టర్ డీకే.బాలాజీ బుధవారం పరిశీలించారు. స్థానికంగా బుడమేరు వద్ద దెబ్బతిన్న రోడ్లకు సత్వరమే మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. హైవేపై సెంట్రల్ లైటింగ్ సరిగా పనిచేయడం లేదని, పనిచేయని దీపాలను తొలగించి వాటి స్థానంలో నూతన విద్యుత్తు దీపాల ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం గ్రీనరీ, ఇతర విషయాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. **- గన్నవరం గ్రామీణం, న్యూస్‌టుడే**

తేలప్రోలులో వంశీ మకాం

అనుచరుడు రాము నివాసం నుంచి అభివాదం చేస్తున్న వంశీ

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: వైకాపా నేత, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ విజయవాడలోని జిల్లా జైలు నుంచి బుధవారం విడుదలైన అనంతరం నూజివీడు కోర్టుకు వెళ్లారు. ఆరుగొలనులో తెదేపా నాయకుడి ఎరువుల దుకాణం కూల్చివేత, మల్లవల్లిలో పారిశ్రామికవాడ భూసేకరణ సందర్భంగా పరిహారం విషయంలో మోసం కేసుల్లో గతంలోనే బెయిల్ మంజూరైన నేపథ్యంలో పూచీకత్తుల సమర్పణకు వీలుగా జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులోనూ, రెండవ అదనపు జూనియర్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులోనూ వేర్వేరుగా హాజరయ్యారు. పూచీకత్తుల ప్రక్రియ పూర్తయిన తర్వాత హనుమాన్‌జంక్షన్ మీదుగా ఉంగుటూరు మండలం తేలప్రోలు చేరుకున్నారు. తన ప్రధాన అనుచరుల్లో ఒకరైన తేలప్రోలు రాము నివాసంలో బస చేశారు. ఆయన వెంట సతీమణి పంకజశ్రీ ఉన్నారు. కొన్ని రోజుల పాటు వంశీ తేలప్రోలులోనే ఉండనున్నట్లు సమాచారం.

వైభవంగా వారాహి మాతకు పూజలు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం సందర్భంగా హనుమాన్‌జంక్షన్ శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వారాహి మాత యజ్ఞం వైభవంగా కొనసాగుతోంది. రెండో రోజైన బుధవారం అమ్మవారికి అర్చకులు సీతారామాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ధర్మకర్త కుటుంబం తరపున కాకాని అరుణ ఏర్పాట్లు పర్యవేక్షించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

పోరంకి(కానూరు), న్యూస్‌టుడే : పోరంకి పరిధిలోని ఏవీఎం గార్డెన్స్, సిద్ధిఖ్‌కట్ట రోడ్డు, చేపలకుండీ, బందరు రోడ్డు ప్రాంతాల్లో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్తు కోత విధించనున్నట్లు ఈఈ హరిబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

సమగ్ర నీటి యాజమాన్యంతో అధిక దిగుబడి

ప్రొద్దుటూరు/దావులూరు(కంకిపాడు): సమగ్ర నీటి యాజమాన్యంపై రైతులు దృష్టి సారించాలని వ్యవసాయాధికారులు సూచించారు. 'పొలం పిలుస్తోంది'లో భాగంగా బుధవారం ప్రొద్దుటూరు, దావులూరులో వరి నారుమళ్లు, నాట్లు వేసిన పొలాలను పరిశీలించారు. అవసరానికి మించి సాగునీరు అందించడం పైరుకు మంచిది కాదన్నారు. ఎరువుల వాడకంలోనూ నియంత్రణ పాటించాలని సూచించారు. జిల్లా వనరుల కేంద్రం (డీఆర్సీ) డీడీఏ కె.జ్యోతిరమణి, ఏడీఏ కె.శ్రీనివాసరావు, ఏవోలు వి.ఉషారాణి, పద్మజ, వీఏఏలు పాల్గొన్నారు.

విద్యుత్తు వినియోగంపై జాగ్రత్తలు అవసరం

ఉయ్యూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు వినియోగ సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీసీపీడీసీఎల్ ఉయ్యూరు ఈఈ డి.కృష్ణ నాయక్ అన్నారు. స్థానిక కార్యాలయం వద్ద బుధవారం జరిగిన జాతీయ భద్రతా వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన అతిథిగా పాల్గొని ప్రసంగించారు. అనంతరం అవగాహన ర్యాలీ జరిగింది. పలువురు డీఈఈలు, ఏఈఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సేవలకు గుర్తింపు

మాకాలకు అవార్డు అందిస్తున్న రాజేష్ ఎంజోషి తదితరులు

కానూరు, న్యూస్‌టుడే : కానూరుకు చెందిన ఆక్యుపంక్చర్ థెరపిస్టు, యోగశక్తి సాధన సమితి ఛైర్మన్ మాకాల సత్యనారాయణకు లయన్స్ క్లబ్ ఆఫ్ చెన్నై ఆయుష్ ఉత్తమ సహజ వైద్యుడు అవార్డు ప్రకటించింది. మంగళవారం రాత్రి చెన్నై విజయపార్క్ హోటల్‌లో జరిగిన కార్యక్రమంలో డిస్ట్రిక్టు గవర్నర్ రాజేష్ ఎంజోషి ఈ పురస్కారం అందించారు. మోడీ ఫిట్‌నెస్ మంత్ర కార్యక్రమాన్ని దేశ వ్యాప్తంగా ప్రచారం చేసినందుకు, ఎటువంటి మందులు లేకుండా రుగ్మతలు నయం చేసినందుకు ఈ అవార్డు అందించారని మాకాల తెలిపారు.

సీపీఎం నేత త్రిమూర్తులు ఆశయ సాధనకు కృషి

చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వామపక్ష నాయకులు

పెనమలూరు: సీపీఎం నేత ఉప్పాడ త్రిమూర్తులు ఆశయగా సాధనకు కృషి చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు యార్లగడ్డ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం పెనమలూరు కూడలిలోని అనిల్ ఎస్టేట్స్‌లో జరిగిన త్రిమూర్తులు సంస్మరణ సభలో వామపక్ష, పలు రాజకీయ పార్టీల నేతలు పాల్గొని ఆయన పార్టీకి అందించిన సేవలను కొనియాడారు. వెంకటేశ్వరరావు, పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాద్ మాట్లాడుతూ త్రిమూర్తులు ప్రస్థానాన్ని నేతలు, కార్యకర్తలు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సీపీఎం నేత ఎం.హరిబాబు మాట్లాడుతూ త్రిమూర్తులు మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. అంతకుముందు త్రిమూర్తులు చిత్రపటానికి పలువురు నాయకులు, కార్యకర్తలు పూలదండలు వేసి నివాళులర్పించారు. షేక్ ఖాసిం, ఎన్.వెంకటేశ్వరరావు, మాదాల వెంకటేశ్వరరావు, పంచకర్ల రంగారావు, మున్నంగి నరసింహారావు, అనుమోలు ప్రభాకరరావు, త్రిమూర్తులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బోడే ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్

రామవరప్పాడు: మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

కానూరు: వెలగపూడి శంకరబాబు, దోనేపూడి రవికిరణ్, సమీర్ తదితరులు

సీఎం చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం

కలవపాముల(ఉయ్యూరు గ్రామీణం), న్యూస్‌టుడే: గత వైకాపా ఐదేళ్ల పాలనలో పేరుకుపోయిన అవినీతి, అక్రమాలను కూటమి సర్కారు కడుగుతూ రాష్ట్రాభివృద్ధికి కృషి చేస్తోందని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. బుధవారం ఉయ్యూరు మండలం కలవపాములలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ, వైవీబీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అన్నదాత సుఖీభవలో ఆర్థిక సాయం అందిస్తూ రైతు సంక్షేమానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు.

కానూరు: కానూరు, యనమలకుదురు, తాడిగడప, పోరంకి సర్కిల్స్‌లో జరిగిన కార్యక్రమంలో తెదేపా నేతలు వెలగపూడి శంకరబాబు, అనుమోలు ప్రభాకరరావు, సుచిత్ర తదితరులు పాల్గొన్నారు..

కంకిపాడు గ్రామీణం: కంకిపాడు తెదేపా కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు తుమ్మలపల్లి హరికృష్ణ, తెదేపా గ్రామ పార్టీ అధ్యక్షుడు చిట్టూరి నాగేశ్వరరావు, బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

పెనమలూరు, న్యూస్‌టుడే: పెనమలూరు, గంగూరులో పెనమలూరు క్లస్టర్ నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్‌లు ఆయా గ్రామ పార్టీల అధ్యక్షులతో కలిసి ఇంటింటికీ కరపత్రాలు పంపిణీ చేశారు.

రామవరప్పాడు: ప్రజలకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తోందని ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. రామవరప్పాడులో ఇంటింటికీ వెళ్లి మహిళలకు కరపత్రాలను నేతలతో కలిసి పంపిణీ చేశారు.

గన్నవరం గ్రామీణం: గన్నవరం గౌడపేటలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పాల్గొన్నారు. తొలుత పాతగన్నవరం శ్రీలక్ష్మీతిరుపతమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

కంకిపాడు : మాట్లాడుతున్న తుమ్మలపల్లి హరికృష్ణ

హనుమాన్‌జంక్షన్: కొత్తపల్లి, బిళ్లనపల్లి గ్రామాల్లో నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దయాల రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. తిప్పనగుంటలో జిల్లా తెలుగురైతు నాయకుడు మువ్వా వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

సమ్మె విజయవంతానికి పిలుపు

కంకిపాడు గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా 9న నిర్వహించ తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని ఏపీ కౌలురైతు సంఘ జిల్లా కార్యదర్శి పంచకర్ల రంగారావు పిలుపునిచ్చారు. బుధవారం కంకిపాడులో నిర్వహించిన కార్యాచరణ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కౌలురైతులను గుర్తించడం లేదన్నారు.

ఉయ్యూరు, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యల పరిష్కారానికి సమ్మె అనివార్యమని పట్టణ సీపీఎం కార్యదర్శి రాజేష్ పిలుపునిచ్చారు. స్థానిక నగర పంచాయతీ పారిశుద్ధ్య కార్మికుల కాలనీలో బుధవారం సీఐటీయూ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

హనుమాన్‌జంక్షన్: సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి నల్లి ఆంజనేయులు పేర్కొన్నారు. హనుమాన్‌జంక్షన్‌లో సీఐటీయూ సర్వసభ్య సమావేశం నిర్వహించారు.

దేవదాయ - ధర్మదాయ శాఖ (2వ పరియాయము)

భూముల నందు సేద్యం చేసుకొనే హక్కునకు టెండర్ - కమ్ - బహిరంగ వేలం పాట ప్రకటన

ఏలూరు నగరం, శ్రీ జనార్దన స్వామి నగరేశ్వర కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానం తాలూకు కృష్ణాజిల్లా, బాపులపాడు మండలం, కాకులపాడు గ్రామంలో గల సర్వే నెం. 156లో య. 14.84 సెంట్లు (4 ప్లాట్లు) క్రింద భూములలో సేద్యము చేసుకొనుటకు గాను 2025-2026 నుండి 2027-2028 వరకు అనగా 3 సంవత్సరములకు గాను దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల సమక్షమున బహిరంగ వేలం పాట ది. 10-07-2025 ఉదయం 11 గంటలకు కాకులపాడు గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద టెండరు - కమ్ - బహిరంగ వేలం పాట జరుపబడును. కావున ఆసక్తి గలవారు ప్లాట్ 1కి రూ. 10,000/-లు చొ॥న ధరావతులు చెల్లించి పాటలో పాల్గొనవలసినదిగా కోరుచున్నాము. హిందువులు మాత్రమే పాటలో పాల్గొనవలెను. హెచ్చుపాటదారులు పాట అయిన వెంటనే 1 సం॥ మక్తా సొమ్ము అడ్వాన్స్‌గా చెల్లించవలెను. షరతులు వర్తిస్తాయి.
ఏలూరు, 2-7-2025 సం/- కార్యనిర్వహణాధికారి, సెల్: 98665 75779

సత్యసాయి ప్రేమ రథయాత్ర నేడు

పెనమలూరు, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి శత జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం సత్యసాయి ప్రేమ రథయాత్ర నిర్వహించనున్నట్లు పెనమలూరు సమితి నిర్వాహకులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రథయాత్ర ఉదయం 9.30 గంటలకు స్థానిక సత్యసాయి మందిరం నుంచి ప్రారంభమై మధ్యాహ్నం 2 గంటలకు యనమలకుదురు చేరుకుంటుందన్నారు.

'అధికారిక బార్ అసోసియేషన్ ఒక్కటే'

ఉయ్యూరు: ఉయ్యూరులోని జూనియర్ సివిల్ కోర్టు పరిధిలో అధికారికంగా ఎన్నికైన బార్ అసోసియేషన్‌ను మాత్రమే కౌన్సిల్ ఆమోదించిందని, మరే సంఘం అధికారికం కాదని బార్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ స్పష్టం చేసింది. ఈ మేరకు ఉయ్యూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.గోపీచంద్‌కు బార్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ కార్యదర్శి బి.పద్మలత స్పష్టం చేశారు. ఇటీవల ఉయ్యూరు బార్ అసోసియేషన్(ప్రాక్టీసింగ్ అడ్వకేట్స్) పేరుతో మరో అసోసియేషన్ ఏర్పాటైందనే విషయం బార్ కౌన్సిల్ దృష్టికి వచ్చిన నేపథ్యంలో ఈ ప్రకటన విడుదల చేశారు.

నీటితో వ్యాపారం.. నిర్వహణ అధ్వానం

ఇష్టారీతిన ఆర్వో ప్లాంట్లు, తనిఖీలు శూన్యం

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే

నీళ్లలో కనిపిస్తున్న నాచు

గన్నవరంలో ఓ ఆర్వో ప్లాంటు

గన్నవరం నియోజకవర్గంలో నీటి శుద్ధి పథకాల నిర్వహణపై పర్యవేక్షణ కొరవడింది. అరకొర అనుమతులతో ఎడాపెడా పథకాలు ఏర్పాటు చేసి ఆదాయ వనరులుగా మార్చుకున్న నిర్వాహకులు, కనీస ప్రమాణాలు పాటించడంలేదన్న ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. పేరుకు ఆర్వో పథకాలుగా చెప్పుకుని నీళ్లు అమ్ముకుంటున్నా నీటి వడపోత ఎంతమాత్రం జరుగుతుందనేది ప్రశ్నార్థకంగా మారింది. వీటిపై పరిశీలన, పర్యవేక్షణ లేకపోవడంతో నిర్వహణ లోపించి, అపరిశుభ్రమైన నీటిని తాగడం ప్రజలకు అనివార్యంగా మారింది.

పుట్టగొడుగుల్లా వెలసి..

చెరువులు, బోర్లు ఆధారంగా రక్షిత నీటి పథకాల నుంచి సరఫరా చేస్తున్న నీరు తాగేందుకు ఎంతమాత్రం పనికిరాదనే అభిప్రాయంతో ఆర్వో పథకాల ఏర్పాటుకు బీజం పడింది. రెండు దశాబ్దాల కిందట పంచాయతీకి చెందిన స్థలాల్లో స్వచ్ఛంద సంస్థలు, దాతలు, ప్రజాప్రతినిధుల తోడ్పాటుతో పలుచోట్ల నీటి శుద్ధి పథకాలు నెలకొల్పారు. వీటి ద్వారా 20 లీటర్ల నీటిని రూ.2 నుంచి రూ.5 వరకు సరఫరా చేశారు. ఈ క్రమంలోనే ఎక్కడ పడితే అక్కడ ప్రైవేటు ప్లాంట్లు పుట్టుకొచ్చాయి. ఐఎస్ఐ గుర్తింపు పక్కనపెడితే కనీస ప్రమాణాలు కూడా లేకుండానే వీటిని సంవత్సరాల తరబడి నిర్వహించేస్తున్నారు.

నియోజకవర్గంలో వివరాలు

మండలాలు	4
గ్రామ పంచాయతీలు	84
జనాభా	3.63 లక్షలు
ఆర్వో పథకాలు	40 (సుమారు)
ప్రైవేటువి	150

వ్యాపారమే ముఖ్యం... అనర్థాలు కనం

నీటి పథకాల విషయంలో ప్రైవేటు వ్యక్తులతో పాటు, పంచాయతీ పాలకవర్గాలు కూడా వ్యాపార ధోరణి కనబరుస్తూ వస్తున్నాయి. ప్రజలకు సురక్షితమైన మంచినీరు సరఫరా చేయడమనేది కనీస బాధ్యతగా భావించకుండా ప్రైవేటు పథకాల మాదిరి అమ్మకాలు చేపట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మరోపక్క తమ పరిధిలో నడుస్తున్న ప్రైవేటు ప్లాంట్లు నిర్వహణ సక్రమంగా ఉన్నది, లేనిది తనిఖీ చేయడం లేదు. ఫలితంగా ఆర్వో పథకం ఉన్న ప్రదేశం శుభ్రంగా ఉండటంలేదు. నీటి సరఫరా పైపులైన్ల వ్యవస్థలో లీకేజీలు, పీహెచ్, టీడీఎస్ శాతం నిర్దేశిత పరిమాణంలో వాడకపోవడం, మైక్రాన్ ఫిల్టర్లు, కార్బన్ ఫిల్టర్లు ఎప్పటికప్పుడు మార్చకపోవడం, ఇసుక వడపోత, ఆర్వో పొర తరచుగా తనిఖీ చేయకపోవడంతో బబుల్ నీళ్లు తాగే వారిలో పలువురు మోకాళ్ల నొప్పులు, నోటి సమస్యలు, ఇతర అనారోగ్య సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. వర్షాకాలంలో డయేరియా వంటి వ్యాధులు వ్యాపించడానికి నీరే మూలమని వైద్యులు చెబుతున్న నేపథ్యంలో నీటి పథకాల నిర్వహణ పక్కాగా ఉండేలా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

శ్రద్ధాంజలి

ప్రేమ, మంచితనం, మానవత్వం మూర్తీభవించిన మహోన్నత వ్యక్తి, జూనియర్ కళాశాల అభివృద్ధికి ఎనలేని కృషిచేసిన ఆదర్శమూర్తి మరణానికి చింతిస్తూ.. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ.. వారి కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ..

కీ॥శే॥ చింతా నాగభూషణం గారు (చిన్నబాబు)
శ్రీ చింతా సీతయ్య జూనియర్ కాలేజ్ పాలకవర్గ సభ్యులు, కానుమోలు
మరణం: 21-06-2025

శ్రీ చింతా సీతయ్య జూనియర్ కళాశాల సిబ్బంది, కానుమోలు

చింతా భాస్కర్‌రావు సెక్రటరీ & కరస్పాండెంట్
B. కృపావతి ప్రిన్సిపాల్ (FAC)
B. యూనస్ JL in Physics
J. విజయకుమార్ JL in ఎకనామిక్స్
K. రంగమ్మ JL in కెమిస్ట్రీ
N. కామేశ్వరి JL in బోటని
L. సునీల్ JL in జువాలజీ
M. నాగసునీత JL in తెలుగు
S. చంద్రశేఖర్ జూనియర్ అసిస్టెంట్
V. కనకదుర్గ రికార్డ్ అసిస్టెంట్
N.S.S.S. కళ్యాణి రికార్డ్ అసిస్టెంట్
S. శ్రీనివాసరావు నైట్ వాచ్‌మెన్
మరియు కళాశాల విద్యార్థినీ విద్యార్థులు

(c) eenadu

గుడివాడ

•గుడివాడ •పామర్రు •అవనిగడ్డ

6న శాకంబరిగా శ్రీకొండలమ్మతల్లి

వేమవరం(గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలం లోని ప్రసిద్ధ వేమవరం శ్రీకొండలమ్మతల్లి దేవస్థానంలో ఆషాఢ ఏకాదశి పురస్కరించుకుని ఆదివారం అమ్మవారిని శాకంబరీదేవిగా అలంకరించనున్నట్లు ఆలయ ఈవో ఎ.కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారిని, ఆలయ ఆవరణ, మండపాలను కూరగాయలు, పండ్లతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

చౌకధరల దుకాణాల్లో మొరాయిస్తున్న సర్వర్

మోపిదేవి, న్యూస్‌టుడే: రేషన్ పంపిణీ నత్తనడకన సాగుతోంది. తరచూ సర్వర్ సిగ్నల్ రాక సరుకులు తీసుకుందామని వెళ్లిన లబ్ధిదారులు గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. వ్యవసాయ పనులు ప్రారంభమైన నేపథ్యంలో సాయంత్రం ఎక్కువ మంది డిపోలకు వెళుతున్నారు. ఒకరికి రేషన్ ఇవ్వాలంటే కనీసం 10 నుంచి 15 నిమిషాలు పడుతోందని డీలర్లు పేర్కొంటున్నారు.

‘తెలివిగా ఆలోచించి పెట్టుబడులు పెట్టాలి’

గుడివాడ, న్యూస్‌టుడే: ఎవరైతే సృజనాత్మకత, వినూత్న ఆలోచనలు, ఆవిష్కరణ ఆలోచనలు కలిగి ఉంటారో వారి సంస్థల్లో పెట్టుబడులు పెట్టాలని నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ శిక్షకుడు డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. స్థానిక అక్కినేని నాగేశ్వరరావు కళాశాల ఎంబీఏ విభాగం ఆధ్వర్యంలో పెట్టుబడులు అనే అంశంపై అతిథి ఉపన్యాసం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా నేటి యువత వివిధ సంస్థల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా భారీగా ఆర్జిస్తున్నారన్నారు. తెలివిగా ఆలోచించి పెట్టుబడులు పెట్టాలన్నారు. ఏ రంగంలో పెట్టుబడులు పెట్టాలి, తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం ఎలా పొందాలనే అంశాలపై వివరించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎల్.ఆర్.ఆర్.ప్రసాద్, సెక్రటరీ కరస్పాండెంట్ కె.ఎస్.అప్పారావు, ప్రిన్సిపల్ డాక్టర్ పి.జె.ఎస్.కుమార్, వైస్ ప్రిన్సిపల్ బీఎస్ఎస్.వర్మ, విభాగాధిపతి డాక్టర్ ఎం.బి.సువర్చల, విద్యార్థులు పాల్గొన్నారు.

నిమ్మగడ్డ, ఆముదార్లంకలో రైతులకు సూచనలు

నిమ్మగడ్డలో ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, రైతులు

చల్లపల్లి, న్యూస్‌టుడే: చల్లపల్లి మండలం నిమ్మగడ్డ, ఆముదార్లంక గ్రామాల్లో బుధవారం ‘పొలం పిలుస్తోంది’ కార్యక్రమం జరిగింది. చల్లపల్లి మండల వ్యవసాయశాఖ అధికారి కె.మురళీకృష్ణ మాట్లాడుతూ నారుమడుల దశలోనే ఎలుకల నిర్మూలన చర్యలు తీసుకోవాలని, యాజమాన్య పద్ధతుల ద్వారా నారుమడులను కాపాడుకోవాలని రైతులకు సూచించారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ సుధారాణి రైతులకు ఎలుకల నిర్మూలనపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్త డా.రేవతి, వీఏఏ సాయినందు, రైతులు పాల్గొన్నారు.

సాగునీటి వనరుల పునరుద్ధరణ

పమిడిముక్కల, న్యూస్‌టుడే

గత పాలకుల నిర్లక్ష్యంతో సాగు నీరందక అవస్థ పాలైన అన్నదాతల కూటమి పాలనలో పునరుద్ధరించిన సాగునీటి సంఘాలు సత్వరం కాలువల ప్రక్షాళన, అవసరమైన కట్టడాల నిర్మాణాలు చేపట్టడంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

బందరు కాలువ ప్రక్షాళన

గతంలో బందరు కాలువలో కంపపాదు నుంచి వీరంకి లాకు వరకు తూటుకాడ, గుర్రపుడెక్క, కర్రనాచుతో నీటి పారుదలకు తీవ్ర ఆటంకం ఏర్పడేది. ప్రస్తుతం సాగునీటి సంఘాలు రావడంతో బందరు కాలువ ప్రాజెక్టు కమిటీ అధ్యక్షుడు వేల్పూరి వెంకటేశ్వరరావు కంపపాదు నుంచి దిగువకు పేరుకున్న తూటుకాడ, గుర్రపుడెక్క, నాచును తొలగించి కుంటూ వస్తున్నారు. 2017-18లో తెదేపా పాలనలోనే తొలిసారిగా ఈ విధానం ఆరంభమైంది. ప్రస్తుతం పమిడిముక్కల మండలంలోకి అడుగుపెట్టిన ఈ ప్రక్రియ మరో 15 రోజుల్లో పూర్తవుతుందని వీరంకి సెక్షన్ ఏఈ తిరుమలశెట్టి ఆంజనేయులు, లాకు సూపరింటెండెంట్ ప్రసాద్ తెలిపారు.

బందరు కాలువలో కర్రనాచు తొలగింపు

కాలువ సమస్యల పరిష్కారం

డిస్ట్రిబ్యూటరీ కమిటీ-24 కృష్ణాపురం డీసీ ఛైర్మన్ నాదెళ్ల సుబ్రహ్మణ్యం తన సొంత నిధులు సుమారు రూ.8 లక్షలు పెట్టుబడితో పలు పనులు చేపట్టారు. బందరు కాలువపై వీరంకి లాకు వద్ద ఉన్న తూము లాకు గత నాలుగేళ్లుగా మరమ్మతులు లేకపోవడంతో షట్టర్లు తుప్పు పట్టి దిగువకు నీరు పోవడం లేదు.

తూములకు షట్టర్ బిగిస్తున్న ఏఈ, సిబ్బంది

పుడు గండ్ల పడేవి. కొత్త షట్టర్ బిగించటంతో ఆ సమస్య పరిష్కారమైంది. కొన్నేళ్లుగా నిరుపయోగంగా ఉన్న మేడూరు, కృష్ణాపురంలోని డ్రాప్స్‌ను, హనుమంతపురం హెడ్‌స్లూయిస్‌కు షట్టర్లు ఏర్పాటు చేయటంతో సుమారు 4 వేల ఎకరాల్లో సాగునీటి సమస్య పరిష్కారమైనట్లైనని పలువురు రైతులు తెలిపారు.

◆ 149-మేడూరు నీటి సంఘం అధ్యక్షుడు మైనేని పూర్ణచంద్రరావు పర్యవేక్షణలో మేడూరు ఛానల్ లోని తూటుకాడ, గుర్రపుడెక్క తొలగింపు, నిర్మూలన జరుగుతోంది.

ఉచితంగా పెట్టుడుపళ్ల బిగింపు

వైద్యశిబిరంలో పళ్లసెట్లు బిగించుకున్న రోగులు, వైద్య సిబ్బందితో డాక్టర్ శ్యాంకుమార్

సింగలూరు (గుడ్లవల్లేరు), న్యూస్‌టుడే: మండలంలోని సింగలూరులో భాగ్యవిధాత ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ బందారు శ్యాంకుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్టుడుపళ్ల ఉచిత వైద్యశిబిరంలో మంగళవారం 20 మంది రోగులకు రూ.6 లక్షల విలువైన పళ్లసెట్లను అందజేశారు. జులై 1 జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని గుంటూరు సిబార్ డెంటల్ వైద్య కళాశాల ఉపాధ్యాయుల సహకారంతో నిర్వహించారు. గుడివాడ సీఐ వైస్ ప్రిన్సిపల్, విభాగాధిపతి డయాల్ కృష్ణకిశోర్, సంపత్, మనీష్, ప్రతిష్ఠ, మౌనిక, స్వజన, నవ్య తదితర 21 మంది వైద్య బృందం పాల్గొన్నారు.

పుల్లేరులో డెక్క... సాగునీటికి అడ్డంగా...

గుడ్లవల్లేరు, న్యూస్‌టుడే: నీలకంఠేశ్వరపురం రైల్వే వంతెన వద్ద పుల్లేరులో గుర్రపుడెక్క దట్టంగా మేట వేసింది. దీంతో ఎగువ వదిలిన సాగునీరు కొతదరం లాకులకు చేరడం లేదు. మూడు నెలల కిందటే ఇక్కడ డెక్క మేట వేయగా అధికారులు నిర్లక్ష్యం వహించడంతో ఇది మరింతగా పెరిగింది. ఎగువ నుంచి నీరు, డెక్క కొట్టుకువచ్చి మేట వేస్తుండటంతో ముందున్న డెక్క ఎండి ఒత్తిడికి బిగుసుకుపోయింది. దీంతో నీటికి అవరోధంగా మారింది. దీని తీయాలంటే మనుషుల వల్ల కాదు, యంత్రాలను ఉపయోగించాల్సిందే. పీసీ పరిధిలోని పుల్లేరులో సాగునీటికి అవరోధంగా మారిన డెక్కను తొలగింపుపై అధికారులు, పీసీ కమిటీ మీనమేషాలు లెక్కిస్తుండటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గుడ్లవల్లేరు రైల్వే వంతెన వద్ద దట్టంగా గుర్రపు డెక్క

రేపటి నుంచి పవిత్రోత్సవాలు

అవనిగడ్డ, న్యూస్‌టుడే: స్థానిక లక్ష్మీనారాయణ స్వామి వారి పవిత్రోత్సవాలు ఈనెల 4 నుంచి 7వ తేదీ వరకు త్రయాహ్నిక దీక్షతో వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త పోతరాజు భాస్కర్‌రావు తెలిపారు. ఈసందర్భంగా 4వ తేదీ విశ్వక్సేన ఆరాధన, అంకురార్పణం, 5వ తేదీన అగ్నిప్రతిష్ఠాపన, విశేష హోమాలు, పవిత్ర శయనాధివాసం, 6న మహాశాంతి హోమం, 7న స్వామివారి శాంతి కల్యాణం జరుగుతుందని, భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని ధర్మకర్త కోరారు.

లక్ష్మీనారాయణస్వామి వారు

9న గుడివాడ బంద్ విజయవంతం చేయండి

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ పట్టణంలో స్మార్టు మీటర్లు బిగించకుండా ఆపాలంటే ఈ నెల 9న తేదీన గుడివాడ బంద్ చేయక తప్పదని టీడీపీ, కాంగ్రెస్ అభివృద్ధి కమిటీ కార్యదర్శి బి.అరుణ పేర్కొన్నారు. స్థానిక బంటుమిల్లి రోడ్డులోని శ్రీ సత్యశ్రీధర కళ్యాణ మండపంలో 30 ప్రజా సంఘాల ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా కృష్ణా జిల్లా కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలు తమలం జానీ రాణి మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వాన్ని స్మార్టు మీటర్ల విషయంలో వ్యతిరేకించిన తెదేపా నేడు స్మార్టు మీటర్లు బిగించాలని ఎలా ప్రజలను ఒత్తిడి చేస్తుందని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం స్మార్టు మీటర్ల వ్యవహారంలో దూకుడు తగ్గించాలన్నారు. ఈనెల 9న జరగే బంద్‌కు కాంగ్రెస్ పార్టీ పూర్తి మద్దతు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షుడు మహిపాల్ మరియు బాబు, ముస్లిం జేఏసీ నేత తాజుద్దీన్, ప్రైవేట్ కన్వెంట్ అసోసియేషన్ గుడివాడ అధ్యక్షుడు అల్ల ప్రసాద్, కార్పొరేటర్ సుమంత్ కార్యదర్శి దాగని అశోక్, శ్రీకాకుళపుష్కర కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు బి.వి.రమణ, కార్యదర్శి ఉత్తర లక్ష్మీ, మండపాడు కాలనీ అధ్యక్షురాలు కాశ్ల వెంకటరమణ, పలు సంఘాల నేతలు పాల్గొన్నారు.

నాంచారమ్మ వారికి ఆషాఢ సారె సమర్పణ

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: మండల పరిధిలోని విశ్వనాథపల్లి గ్రామంలో కొలువైన ఆద్దంకి నాంచారమ్మ అమ్మవారికి ఆషాఢమాసం సందర్భంగా గ్రామస్థులు సారె సమర్పించారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో ఆలయానికి సారె తీసుకుని చేరుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, పసుపు, కుంకుమ, గాజులు, పండ్లు, పూలు, మిఠాయిలు, చలిమిడి, చీర, జాకెట్టు సమర్పించారు.

అమ్మవారికి సారె సమర్పిస్తున్న మహిళా భక్తులు

గ్రామాల రోడ్లు అధ్వానం

గుడివాడ, న్యూస్‌టుడే: గుడివాడ మండలంలో పలు గ్రామాల ప్రధాన రహదారులు బురద కయ్యలుగా మారి ప్రజలకు నిత్య నరకం చూపుతున్నాయి. ముఖ్యంగా మండలంలోని శేరీ గొల్వేపల్లికి వెళ్లే రహదారి ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. చాలా కాలంగా రహదారి పాడై గ్రామ ప్రజలు గగ్గోలు పెడుతున్నారు. అధికారులు స్పందించి తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే శేరీ వేల్పూరు గ్రామ రహదారి సిద్ధాంతం అడ్డరోడ్డు వద్ద నుంచి ప్రమాదభరితంగా ఉంది. గుంతలమయం అయిన ఈ రోడ్డు వర్షం వచ్చిన ప్రతిసారీ చెరువులా ఉండటంతో ఎక్కడ బురదలో వాహనాలు అదుపుతప్పి చెరువులోకి పడతామో అని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గుడివాడ మండలం వలివర్తిపాడు-మెరకగూడెం రహదారి దశాబ్దాల కాలంగా పాడై పోవడంతో ఇటీవల కురుస్తున్న వర్షాలకు ప్రధానంగా గుంతలు పూడ్చారు. కానీ పైన తారు వేయకపోవడంతో మళ్లీ పాడై పోతుంది. మెరకగూడెం వద్ద వలివర్తిపాడు నుంచి గుడివాడ వెళ్లే మార్గంలో పలుచోట్ల రోడ్డు గుంతలు పడింది. దీంతో ఈ రహదారిలో ప్రయాణికులు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వేలాది మంది నిత్యం ఈ గ్రామాల రహదారుల గుండా ప్రయాణిస్తుంటారు. గుడివాడకు వందలాది మంది విద్యార్థులు వస్తుపోతూ ఉంటారు. వాటిని తక్షణం అభివృద్ధి చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

గుడివాడ మండలం వేల్పూరు రోడ్డు గుంతలమయం

మెరకగూడెం వద్ద బురద కయ్యగా మారిన రహదారి

విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ

గుడివాడ, న్యూస్‌టుడే: పేద విద్యార్థులకు పాఠశాల దూరమైనా, విద్యకు దూరం కాకూడదని వారిని ప్రోత్సహిస్తూ దాత గోళ్ల వీరాజు నలుగురు విద్యార్థులకు సైకిళ్లను అందించడం అభినందనీయం అని గుడివాడ మండల విద్యాశాఖ అధికారి-2 బి.బాలాజీ పేర్కొన్నారు. మండలంలోని పర్నాస జడ్పీ ఉన్నత పాఠశాలలో దాత అందించిన 4 సైకిళ్లను బుధవారం ఆయన పంపిణీ చేశారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను ప్రోత్సహించాల్సిన భాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రధానోపాధ్యాయిని అట్లూరి ఉషారాణి, పాఠశాల విద్యాకమిటీ ఛైర్మన్ గంటా కిషోర్, సభ్యులు గోళ్ల శివకుమార్, శివకుమారి, తదితరులు పాల్గొన్నారు.

సైకిళ్లను అందిస్తున్న మండల విద్యాశాఖ అధికారి-2 బి.బాలాజీ, తదితరులు

అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి

‘సుపరిపాలనలో తొలి అడుగు’ కార్యక్రమం ప్రారంభం

కరపత్రాలు అందజేసి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడ, న్యూస్‌టుడే: రాష్ట్రాన్ని వైకాపా అప్పుల ఊబిలోకి నెడితే కూటమి ప్రభుత్వం రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తోందని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. స్థానిక ప్రజావేదికలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా తెదేపా కార్యకర్తలకు నాయకులకు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలిసి దిశానిర్దేశం చేశారు. ఈసందర్భంగా రాము మాట్లాడుతూ గత ఏడాది కాలంగా రాష్ట్ర ప్రభుత్వ ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తూ ప్రజల ఆదరాభిమానాలను చూరగొందన్నారు. ఎన్టీఆర్ స్టేడియం కమిటీ వైస్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, పట్టణ తెదేపా అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, మండల పార్టీ అధ్యక్షులు వాసే మురళీ, దానేటి సన్యాసిరావు, మార్కెట్ యార్డు ఛైర్మన్‌లు చాట్రగడ్డ రవికుమార్, పొట్లూరి రవి, తెదేపా నేతలు లింగం ప్రసాద్, బాబ్జి, సునీల్ కుమార్, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

చోడవరంలో ఇంటింటి ప్రచారం

చోడవరం(నాగాయలంక), న్యూస్‌టుడే: ‘సుపరిపాలనలో తొలి అడుగు’ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని చోడవరం గ్రామంలో తెదేపా నేతలు, కార్యకర్తలు, కుటుంబ సాధికారిత సమితి సభ్యులు కలసి ఇంటింటి ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో తెదేపా జిల్లా అధ్యక్షులు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణరావు, అవనిగడ్డ నియోజకవర్గం పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, మండల తెదేపా అధ్యక్షుడు మెండు లక్ష్మణరావు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మండవ బాలవర్ధిరావు, కొల్లూరి వెంకటేశ్వరరావు, బొబ్బాగోవర్ధన్ పాల్గొని ప్రచారం చేశారు. తల్లికి వందనం, దీపం, పింఛను, యువతకు ఉద్యోగాలపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. తొలుత పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో వారు పాల్గొని కరపత్రాలను పంపిణీ చేశారు. గ్రామస్థులు అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో చిరవేళ్ల నాగరాజు, తలశిల వెంకట నరసింహారావు, లకనం నాగాంజనేయులు, ఉప్పల ప్రసాద్, కనగాల రాధ, తాడేపల్లి వెంకట పాపారావు, మేడికొండ విజయ్, గరిపర్తి రాం ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మోపిదేవి, న్యూస్‌టుడే: సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం బుధవారం మోపిదేవి ఎస్సీ కాలనీలో తెదేపా జెండాలు చేతబట్టి ప్రారంభించారు. నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, బొబ్బ గోవర్ధన్, ఎంపీపీ రావి దుర్గావాణి, రావి నాగేశ్వరరావు, పార్టీ మండల అధ్యక్షుడు నడకుదిటి జనార్ధనరావు, జొన్నలగడ్డ రాము, పిచ్చేశ్వరరావు, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పామర్రుగ్రామీణం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. బుధవారం పామర్రు మండలం యలకుర్రు, కొరిమెర్ల, ప్రాకెర్ల, నెమ్మలూరు గ్రామాల్లో నిర్వహించిన ‘సుపరిపాలనలో తొలి అడుగు’ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గత వైకాపా పాలనలో విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని ప్రస్తుత కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టిందన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోనే నియోజకవర్గంలో రూ.165.81 కోట్లు ఖర్చుచేసి అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కృష్ణాడెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ వల్లూరుపల్లి గణేష్, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు కె.ప్రవీణ్‌చంద్ర, ఈడే నాని, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పామర్రు, న్యూస్‌టుడే: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి స్థానిక కొబ్బరితోటలో ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగి ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల పనితీరును వివరించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

చోడవరం సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల

మోపిదేవి ఎస్సీ కాలనీలో తెదేపా నేతల పర్యటన

పామర్రుగ్రామీణం: ఎలకుర్రులో తెదేపా నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా

గుండేరులో స్ప్రేయింగ్ పనులు ప్రారంభం

పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, తదితరులు

చల్లపల్లి, న్యూస్‌టుడే: రైతన్నలకు సమర్థవంతమైన డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. చల్లపల్లి మండలం లక్ష్మీపురం వద్ద గుండేరు మేజర్ డ్రైనేజీలో గుర్రపుడెక్క, తూటుకాడ నిర్మూలనకు డ్రోన్ ద్వారా మందు స్ప్రేయింగ్ పనులను ఎమ్మెల్యే బుద్ధప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గుండేరు మేజర్ డ్రైనేజీలో 42.50 కిలోమీటర్ల పరిధిలో ఆపరేషన్స్ అండ్ మెయింటెన్స్ నిధులు రూ.27.27 లక్షలతో పమిడిముక్కల మండలం ఫతేలంక నుంచి చల్లపల్లి మండలం మాజేరు పంచాయతీ పరిధి వరకు పనులు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో యువనేత మండలి వెంకట్రామ్(రాజా), డీసీ ఛైర్మన్ అయినపూడి భానుప్రకాష్, ఘంటసాల మండల తెదేపా అధ్యక్షుడు తుమ్మల చౌదరిబాబు, డీసీ వైస్‌ఛైర్మన్ పరిశే చలపతిరావు, డ్రైనేజీ డీఈ జె.బాబూనాయక్, ఎంపీటీసీ తాడికొండ చిన్నా, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన లక్ష్యం

ఘంటసాల, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమమే ప్రధాన ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. బుధవారం మల్లాయిచిట్టూరు, పూషడం గ్రామాలలో ఉపాధి నిధులు రూ.2.40 కోట్లతో రెండు బీటీ రోడ్లు నూతనంగా నిర్మించేందుకు భూమిపూజ చేసి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ అవనిగడ్డ నియోజకవర్గంలో ఏడాది కాలంగా రూ.32.24 కోట్ల నిధులతో 56 కిలోమీటర్ల మేరకు 522 సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. నాయకులు మండలి వెంకట్రామ్, తుమ్మల చౌదరిబాబు, అయినపూడి భానుప్రకాష్, రాజేంద్రప్రసాద్, మారుతీరావు, కుమార్‌రాజా, కనకదుర్గ, చిన్నా, రాజశేఖర్, నాగశ్రీనివాసరావు, చలపతిరావు, నందేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

నార్త్ ఛానల్‌కు నీటి విడుదల

కోడూరు (అవనిగడ్డ), న్యూస్‌టుడే: మండల పరిధిలోని వి.కొత్తపాలెం నుంచి సాలెంపాలెం వెళ్లే నార్త్ ఛానల్ ప్రధాన పంటకాల్వకు తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు, నీటి సంఘాల అధ్యక్షులు బడే భావన్నారాయణ, అప్పికట్ల రవీంద్రబాబు, గాదే భాస్కర్‌రావు, ఏఈ విజయ్‌కుమార్ బుధవారం వి.కొత్తపాలెం వద్ద నీటిని విడుదల చేశారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు బడే హనుమంతు, పిచ్చయ్య, కాగిత శివప్రసాద్, గోగినేని సోమశేఖర్‌రావు, పిల్లి మల్లిఖార్జునరావు, తదితరులు పాల్గొన్నారు.

నీటిని విడుదల చేస్తున్న నీటి సంఘాల అధ్యక్షులు, బండే శ్రీనివాసరావు

మైనర్లు వాహనాలు నడపొద్దు

పామర్రు, న్యూస్‌టుడే: మైనర్లు వాహనాలు నడపడం చట్టరీత్యా నేరమని ఎస్ఐ రాజేంద్రప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రసన్న జూనియర్ కళాశాల, జుఝువరం ఉషోదయ పాఠశాలల్లో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఈవ్‌టీజింగ్‌పై డ్రోన్ కెమెరా ద్వారా నిఘా ఉంచినట్లు తెలిపారు. పాఠశాలలు, కళాశాలల వద్ద వాహనాలు అతివేగంగా నడుపుతున్న కొందరిని అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ ఇచ్చామన్నారు. మండల పరిధిలోని జూనియర్ కళాశాలలు, హైస్కూళ్ల వద్ద డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కూచిపూడి పంచాయతీ కార్యదర్శిగా సోమేశ్వరరావు

కూచిపూడి, న్యూస్‌టుడే: కూచిపూడి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా మొవ్వ పంచాయతీ గ్రేడ్ 1 కార్యదర్శి కె.వి.

సోమేశ్వరరావును నియమిస్తూ ఎంపీడీవో డి.సుహాసిని బుధవారం ఆదేశాలు జారీచేశారు. కూచిపూడి కార్యదర్శిగా పనిచేసిన పుష్పనాథం పదవీ విరమణ చేయడంతో ఈయనను నియమించినట్లు పేర్కొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై సమీక్ష

మోపిదేవి: స్వచ్ఛ సర్వేక్షణ్ కింద ఎంపిక చేసిన పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని డీఎల్‌పీవో రజావుల్లా పేర్కొన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో స్వ.స.కు ఎంపికైన మోపిదేవి, బొబ్బర్లంక, నాగాయతిప్ప, పెదప్రోలు, కోసూరుపాలెం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం జరిపారు.

సమాజ సేవలో ముందుండాలి

కూచిపూడి రోటరీ అధ్యక్షునిగా బాధ్యతలు చేపట్టిన హనుమకుమార్‌తో సాయి, తహసీల్దార్ మస్తాన్ తదితరులు

కూచిపూడి, న్యూస్‌టుడే: కూచిపూడి రోటరీ సమాజ సేవలో ముందుండాలని మొవ్వ తహసీల్దార్ కె.మస్తాన్ అన్నారు. రవిప్రకాష్ సిలికానాంధ్ర సంజీవని వైద్యాలయం ఆవరణలో కూచిపూడి రోటరీ క్లబ్ 2025-2026 పాలకమండలి ప్రమాణస్వీకార మహోత్సవం బుధవారం నిర్వహించారు. అసిస్టెంట్ గవర్నర్ ఎం.రమణమూర్తి, ఇప్పటి వరకూ కొనసాగిన ప్రెసిడెంట్ కోనేరు మంజునాథ్, హనుమకుమార్, బి.హెచ్.వి.ఆర్.ఎస్.సాయి, సర్పంచి వెంకటరమణ విజయలక్ష్మీ, మొవ్వ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దోనేపూడి శివరామయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ కూచిపూడి రోటరీ క్లబ్ అధ్యక్షునిగా జె.హనుమకుమార్, కార్యదర్శిగా, బి.హెచ్.ఆర్.ఎస్.సాయి, కోశాధికారిగా బెల్లంకొండ వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షునిగా కొండవీటి అమరబాలేశ్వరరావు, సంయుక్త కార్యదర్శిగా కె.రామాంజనేయులు బాధ్యతలు చేపట్టారు.

ఆలయంలో స్వామీజీ పూజలు

సుందర మహారాజ్ స్వామిజికి చిత్రపటం,ప్రసాదాలు అందిస్తున్న పర్యవేక్షకులు మధుసూధనరావు

మోపిదేవి, న్యూస్‌టుడే: విజయనగరం జిల్లా గుర్ల మండల గొర్లేపేట శ్రీసమర్ధ గురుసాయి సుందర మహారాజ్ స్వామీజీ బుధవారం మోపిదేవి శ్రీవల్లీ దేవసేన మేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించారు. ఆలయ మర్యాదలతో పూర్ణకుంభ స్వాగతం పలికారు.

* మాజీ ఎంపీ మోపిదేవి వెంకటరమణారావు స్వామికి అభిషేకాలు సమర్పించారు. పర్యవేక్షకులు మధుసూధనరావు శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

యువతి అదృశ్యంపై కేసు

గుడివాడ, న్యూస్‌టుడే: ఓ యువతి అదృశ్యంపై గుడివాడ వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల కథనం ప్రకారం బొమ్మ థియేటర్ ప్రాంత యువతి(25) డిగ్రీ చదివి ఇంట్లోనే ఉంటోంది. ఇంట్లో సాయంత్రం 4 గంటల నుంచి కనబడటం లేదని గుర్తించి వెంటనే పోలీసులను ఆశ్రయించారు. ఈమేరకు ఎస్.ఐ పి.గౌతమ్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చౌదరిపేటలో మహిళ..

పామర్రు, న్యూస్‌టుడే: స్థానిక చౌదరిపేటలో నివాసం ఉంటున్న ఓ మహిళ అదృశ్యమైన ఘటనపై కేసు నమోదైంది. సదరు మహిళ జూన్ 30న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. తెలిసిన వారిళ్లల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96431 నంబరును సంప్రదించాలన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

పెదపారుపూడి, న్యూస్‌టుడే: పేదలకు ఇచ్చిన స్థలాల్లో లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని ఎంపీడీవో విమాదేవి అన్నారు. మండలంలోని వెంట్రప్రగడ గ్రామ సచివాలయంలో బుధవారం లబ్ధిదారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. 45 మంది రూఫ్ లెవల్ వరకు నిర్మాణాలు చేపట్టారని మిగిలిన పనులు కూడా త్వరగా పూర్తి చేయాలన్నారు. నిర్మాణాలు పూర్తయితే ప్రభుత్వం నుంచి వచ్చే డబ్బులు వెంటనే జమ అవుతాయని వివరించారు. డిప్యూటీ ఎంపీడీవో వంగా శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సాగర రాణి, ఇన్‌ఛార్జి హౌసింగ్ ఏఈ ఫణికుమార్, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు మహేష్, సృజన తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

ప్రయత్నం ఎంత నిలకడగా ఉంటే..

ప్రయత్నానికి, ఫలితానికి మధ్య కాలావధి ఉంటుంది. అది రోజుల్లో, వారాల్లో, నెలల్లో అవ్వొచ్చు. లేదంటే- కొన్నేళ్లు కూడా కావొచ్చు. ఒక్క విషయం మాత్రం విస్మరించకండి. మీ ప్రయత్నం ఎంత నిలకడగా, ఎంత సుదీర్ఘంగా కొనసాగితే.. ఫలితం కూడా అంత గొప్పగా ఉండే అవకాశాలు పెరుగుతుంటాయి.

- చార్లెస్ మిల్లర్, కంటెంట్ క్రియేటర్

డిగ్రీలో డబుల్ మేజర్ విధానాన్ని తీసుకొచ్చి తక్షణమే ప్రవేశాలు చేపట్టాలని ఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కుల్లాయి స్వామి డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

కేటీఆర్, హరీశ్‌రావుల మధ్య అస్తిత్వ పోరుతోనే బనకచర్లపై వివాదం

- జగన్ సూచించే గన్‌ను ప్రజలు ఆయన మీదే ఎక్కుపెడతారు
- 'సుపరిపాలనలో తొలి అడుగు'లో మంత్రి పయ్యావుల కేశవ్

'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో సంక్షేమ పథకాల అమలు ప్రతిని మహిళకు చూపిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, న్యూస్‌టుడే: బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టమూ లేదని, సముద్రంలోకి వృథాగా పోతున్న జలాలను వినియోగించుకోవాలన్నది ఏపీ ప్రభుత్వ ప్రయత్నమని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా కూడేరు మండలం జయపురంలో బుధవారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారాసలో కేటీఆర్, హరీశ్‌రావుల మధ్య అస్తిత్వ పోరాట రాజకీయ రంగును పులిమి, ఇటో ప్రాంతాల మధ్య సమస్యగా చూపిస్తున్నారని అన్నారు. హరీశ్‌రావు తన రాజకీయ ప్రాబల్యం పెంచుకోవడానికి బనకచర్ల మీద వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారు. బనకచర్ల ప్రాజెక్టును కలిసి ప్రారంభిద్దామని గతంలో తెలంగాణ, ఆంధ్రా మాజీ సీఎంలు కేసీఆర్, జగన్‌లు మాట్లాడుకున్న విషయం హరీశ్‌రావుకు గుర్తుకు రావడం లేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ తిరుపతికి వచ్చినపుడు రాయలసీమకు నీళ్లిస్తామని చెప్పిన మాటలు, అదే అంశాన్ని ఆయన అసెంబ్లీలోనూ ప్రకటించిన విషయం హరీశ్‌రావు గుర్తుతెచ్చుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇదంతా ఆయన కేవలం రాజకీయ అస్తిత్వం కోసమే చేస్తున్న డ్రామాగా అభివర్ణించారు. తాము తెలంగాణకు వ్యతిరేకం కాదని, వృథాగా సముద్రంలోకి వెళ్లే జలాలను మాత్రమే వినియోగించుకోవాలన్నదే లక్ష్యమన్నారు.

ప్రజల దృష్టి మళ్లించడానికే..

'సామాజిక మాధ్యమాలను గన్‌గా వాడుకోవాలని మాజీ సీఎం జగన్ నాయకులు, కార్యకర్తలకు చెప్పడం విడ్డూరంగా ఉంది. ఆయన హయాంలో కూడా గన్ వాడక పాలనే కొనసాగించారు. ప్రజల మధ్య అశాంతి, అభద్రత సృష్టించి వారిని భయపెట్టాలనుకోవడం ఆయన నైజమని ఎద్దేవా చేశారు. ప్రజలను రెచ్చగొట్టడమే ఆయన లక్ష్యమన్నారు. భవిష్యత్తులో సామాజిక మాధ్యమాల వేదికగానే ఆయన సూచిస్తున్న గన్‌ను ప్రజలు ఆయన మీదే ఎక్కుపెట్టనున్నారని తెలిపారు. రాష్ట్రంలో జగన్ రౌడీల రిక్రూట్‌మెంట్ జోరుగా ప్రారంభించారని ఆక్షేపించారు.

పేపరుమిల్లులో హైడ్రోజన్ పెరాక్సైడ్ లీకేజీ

లీకవుతున్న హైడ్రోజన్ పెరాక్సైడ్‌పై నీటిని పిచికారీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాజమహేంద్రవరం (కంబాలచెరువు), ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆంధ్రా పేపరుమిల్లులో బుధవారం ఉదయం ప్రమాదకర హైడ్రోజన్ పెరాక్సైడ్ లీకేజీ కలకలం రేగింది. మిల్లు ఉత్తర ద్వారం మీదుగా 26 టన్నుల హైడ్రోజన్ పెరాక్సైడ్‌తో వచ్చిన లారీ సేఫ్టీ వాల్వ్ నుంచి రసాయనం లీకవుతుండడంతో పరిశ్రమ ప్రతినిధులు అప్రమత్తమై అగ్నిమాపక అధికారులకు సమాచారమిచ్చారు. వారు హుటాహుటిన స్థలానికి చేరుకుని లీకవుతున్న హైడ్రోజన్ పెరాక్సైడ్‌పై నీటిని పిచికారీ చేస్తూ ప్రమాద తీవ్రతను తగ్గించారు. మూడు గంటల పాటు శ్రమించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

కేంద్ర జలసంఘం పరిశీలనలో పోలవరం-బనకచర్ల అనుసంధానం పీఎఫ్ఆర్

కొన్ని సందేహాలు లేవనెత్తుతూ లేఖ

ఈనాడు, అమరావతి: పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ నివేదిక (పీఎఫ్ఆర్)ను కేంద్ర జలసంఘం పరిశీలిస్తోంది. ఏప్రిల్ నెలలో ఈ నివేదిక వారికి అందింది. ఈ నివేదికను ఆమోదిస్తే ఆ తర్వాత డీపీఆర్ రూపకల్పనకు సిద్ధమవుతారు. పీఎఫ్ఆర్‌ను పరిశీలిస్తున్న కేంద్ర జలసంఘం కొన్ని ప్రశ్నలు లేవనెత్తుతూ లేఖ పంపింది. గోదావరి వరద జలాల ఆధారంగా ఈ ప్రాజెక్టు చేపడుతున్నారని పేర్కొన్నారు.. గోదావరి నీటి వివాదాల ట్రైబ్యునల్ 1980 ప్రకారం వరద జలాలు పంపకం చేయలేదు కదా అని ప్రశ్నించింది. అలాగే సిమ్యులేషన్ అధ్యయనాలు చేశారా అని కూడా సందేహం వ్యక్తం చేసింది. ఈ రెండు అంశాలపై రాష్ట్ర జలవనరులశాఖ సమాధానాలు ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్టులో వ్యాప్కోస్ హైదరాబాద్ కన్సల్టెన్సీగా ఉంది. ఆ సంస్థ చీఫ్ ఇంజినీర్ విజయవాడ రానున్నారు. ఈ అంశంపై సమావేశమై కేంద్ర జలసంఘానికి తగిన సమాధానం పంపుతారు. డీపీఆర్ తయారీ క్రమంలో సిమ్యులేషన్ అధ్యయనం తప్పక చేస్తామని పీఎఫ్ఆర్ దశలో అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. కేంద్ర జలసంఘం ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చిన తర్వాత అధికారుల బృందం దిల్లీ వెళ్లి కేంద్ర అధికారులను కలిసి వారి సందేహాలు నివృత్తి చేయనున్నారు.

జగన్ ఇలాకాలోనే దొంగ పింఛన్లు అధికం

- పులివెందులలో 7,487 దివ్యాంగుల పింఛన్లలో 1,708 బోగస్‌వే
- తర్వాతి స్థానాల్లో ధర్మవరం, చంద్రగిరి, మచిలీపట్నం
- వైకాపా హయాంలో విచ్చలవిడిగా అనర్హులకు మంజూరు

ఈనాడు, అమరావతి: దివ్యాంగుల పింఛనుదార్లలో అనర్హులు కుప్పలుతెప్పలుగా బయటపడుతున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో అనర్హులకు పింఛన్లు మంజూరైనట్లు బట్టబయలవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 7.86 లక్షల మంది దివ్యాంగుల కేటగిరీ పింఛన్లు పొందుతున్నారు. 175 నియోజకవర్గాల్లోనూ ఇప్పటివరకు 4.76 లక్షల పింఛన్లను అధికారులు తనిఖీ చేయగా దాదాపు లక్షమంది అనర్హులని తేలింది. జగన్ నియోజకవర్గం పులివెందులలో బోగస్ పింఛన్లు ఎక్కువగా మంజూరైనట్లు బయటపడింది. బోగస్ దివ్యాంగ పింఛన్లు 100లోపు ఉన్న నియోజకవర్గాలు 9 అని వెల్లడైంది. కాకినాడ సిటీ పరిధిలో అత్యల్పంగా 19 బోగస్ పింఛన్లు ఉన్నట్లు గుర్తించారు. విశాఖ దక్షిణంలో 39, తాడికొండలో 55, విశాఖ ఉత్తరంలో 57, నిడదవోలులో 58, విశాఖ తూర్పులో 71, అద్దంకిలో 78, విజయవాడ పశ్చిమలో 83, విజయవాడ సెంట్రల్‌లో 88 మంది అనర్హులు పింఛన్లు పొందుతున్నట్లు బయటపడింది. 1,000 నుంచి 1,300 వరకు బోగస్ పింఛన్లున్న నియోజకవర్గాలు 13 అని తేలింది. 88 నియోజకవర్గాల్లో 500 నుంచి 970 మంది వరకు అనర్హులకు పింఛన్లు మంజూరయ్యాయి. మిగతా 59 స్థానాల్లో 100 నుంచి 500 మధ్యలో బోగస్ పింఛన్లున్నట్లు బయటపడింది.

లోపం లేకున్నా...

అంధత్వం, రేచీకటి, వినికిడి లోపం, కాళ్లు, చేతులు వంకర లేకున్నా ఉన్నట్లు చూపి దొంగ పింఛన్లు మంజూరు చేశారు. తప్పుడు సదరం ధ్రువీకరణ పత్రాలు తీసుకుని పింఛన్లు పొందుతున్న వారు 50,540 మంది ఉన్నారు. కంటి చూపు సరిగా లేనట్లు ధ్రువీకరణ పొందిన వారు 23,200 మంది, చెవుడు లేకపోయినా ఉన్నట్లు చూపిన 20 వేల మంది... బోగస్ పింఛన్లు తీసుకుంటున్నట్లు తేలింది.

నియోజకవర్గాల వారీగా దివ్యాంగుల కేటగిరీలో బయటపడిన బోగస్ పింఛన్లు

నియోజకవర్గం	మొత్తం పింఛన్లు	బోగస్ పింఛన్లు
పులివెందుల	7,487	1,708
ధర్మవరం	7,243	1,671
చంద్రగిరి	5,929	1,604
మచిలీపట్నం	5,680	1,539
జమ్మలమడుగు	5,628	1,451
శింగనమల	8,235	1,418

తనిఖీకి రాని వారికి మళ్లీ నోటీసులు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 7.86 లక్షల మంది దివ్యాంగ కేటగిరీ పింఛనుదార్లలో 5.10 లక్షల మందికి సదరం ధ్రువీకరణపత్రాల తనిఖీకి రావాలంటూ నోటీసులు జారీచేశారు. వీరిలో 4.76 లక్షల మంది.. వైద్యుల ముందు హాజరయ్యారు. మిగిలిన వారికి మరోమారు నోటీసులు జారీ చేసి అప్పటికీ హాజరు కాకపోతే తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

పట్టాభిరామ్‌కు ప్రముఖుల నివాళి

- జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు పూర్తి

పట్టాభిరామ్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న విజయకుమార్, వరప్రసాద్‌రెడ్డి ★ జనార్దన్‌రెడ్డి ★ లక్ష్మీనారాయణ

హైదరాబాద్, న్యూస్‌టుడే: గుండెపోటుతో మృతిచెందిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ఇంద్రజాలికుడు, రచయిత డా.బీవీ పట్టాభిరామ్‌కు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఓమేగా ఆసుపత్రి నుంచి ఆయన భౌతిక కాయాన్ని బుధవారం ఉదయం ఆనంద్‌నగర్ కాలనీ సింపుల్ అపార్ట్‌మెంట్స్‌లోని నివాసానికి తీసుకువచ్చారు. ప్రముఖులు, మిత్రులు, బంధువులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు. పట్టాభిరామ్ సతీమణి భావరాజు జయశ్రీ, కుమారుడు బీవీఎస్ ప్రశాంత్‌లను పరామర్శించి వారిని ఓదార్చారు. ఎమ్మెల్సీ అదినేత విజయకుమార్, సీబీఐ మాజీ జేడీ వి.లక్ష్మీనారాయణ, శాంతా బయోటెక్ వ్యవస్థాపకుడు కేఐ వరప్రసాద్‌రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారులు ప్రభాకర్‌రెడ్డి, బి.జనార్దన్‌రెడ్డి, సినీ నటుడు జెన్నీ, సీనియర్ సంపాదకుడు కె.రామచంద్రమూర్తి, ఇంటెలిజెన్స్ ఓఎస్డీ శివకుమార్, రచయిత యండమూరి వీరేంద్రనాథ్, ఆధ్యాత్మికవేత్త సుఖబోధానందస్వామి, దైవజ్ఞశర్మ తదితరులు పట్టాభిరామ్‌కు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. అనంతరం మధ్యాహ్నం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు.

ఉద్యోగులకు మరో ఏడాది ఉచిత బస సదుపాయం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాలు, అసెంబ్లీ, హైకోర్టు, రాజ్‌భవన్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు గతంలో ప్రతిపాదించిన ఉచిత బస సౌకర్యాన్ని మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విభజన తర్వాత ఏపీకి కేటాయించిన ఉద్యోగులు కుటుంబాలను హైదరాబాద్‌లోనే ఉంచి ఇక్కడ ఒంటరిగా ఉంటున్న ఉద్యోగుల సౌలభ్యం కోసం ప్రభుత్వం అపార్ట్‌మెంటులను అద్దెకు తీసుకుని ఉచిత బస సదుపాయం కల్పిస్తోంది. తాజాగా జూన్ 27తో గడువు ముగియడంతో 2026 జూన్ 26 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

విమాన సర్వీసులకు అంతరాయం

శంషాబాద్, న్యూస్‌టుడే: శంషాబాద్‌లో ప్రతికూల వాతావరణం కారణంగా బుధవారం విమాన సర్వీసుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శంషాబాద్ నుంచి బెంగళూరు, దమామ్, హాంకాంగ్ సిటీ, కౌలాలంపూర్, షార్జాతో పాటు జెడ్డాకు వెళ్లాల్సిన విమాన సర్వీసులు గంటన్నర ఆలస్యంగా బయలుదేరాయి. తెల్లవారుజామున 3.55 గంటలకు మస్కట్ వెళ్లాల్సిన సలామ్ ఎయిర్‌లైన్స్ సర్వీసును రద్దు చేశారు. బెంగళూరు, కోల్‌కతానుంచి శంషాబాద్‌కు చేరుకున్న నాలుగు దేశీయ విమాన సర్వీసులను దారి మళ్లించి బెంగళూర్, విజయవాడలో ల్యాండింగ్ చేశారు. రెండు గంటల అనంతరం వాతావరణం కుదుటపడిన తర్వాత ఆ 4 విమానాలు శంషాబాద్ చేరుకున్నాయని అధికారులు తెలిపారు.

తిరుమలలో కళా ప్రదర్శన పేరుతో బురిడీ

నిందితుడు సూత్రధారి అభిషేక్ అరెస్టు

సూత్రధారి అభిషేక్

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో కళా ప్రదర్శన ఇప్పిస్తామని ఆశచూపి పలువురిని మోసగించిన వ్యక్తిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. తెలంగాణ రాష్ట్రం కాజీపేటకు చెందిన సూత్రధారి అభిషేక్.. తిరుమలలోని ఆస్థాన మండపంలో 'శ్రీనివాస కళార్చన' పేరుతో రెండు రోజుల నాట్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పి తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్ (హెచ్‌డీపీపీ) అనుమతి లేకుండానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 93 కళా బృందాల్లోని 2,900 మంది కళాకారులను నమ్మించాడు. వసతి, భోజనం, శ్రీవారి దర్శనం, ప్రసాదం, జ్ఞాపికల పేరుతో వారి నుంచి రూ.35 లక్షల వరకు వసూలు చేశాడు. దీనిపై ఫిర్యాదులు అందడంతో తిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ విజయ్‌శేఖర్ ఆదేశాలతో అభిషేక్‌ను మంగళవారం అరెస్టు చేసి రూ.14 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం తిరుపతి న్యాయస్థానంలో నిందితుడిని హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు.

వరద ముప్పు అడ్డుకునే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి

విజయవాడలో వరద కారణంగా ప్రాణాలు కోల్పోయారు

ఈనాడు, అమరావతి: వరద ముప్పును అడ్డుకునేందుకు వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని హైకోర్టు వ్యాఖ్యానించింది. గతేడాది విజయవాడలో వరదల కారణంగా ప్రాణనష్టం జరిగినందున అందుకు బాధ్యులైన అధికారులెవరో గుర్తించాలంది. విజయవాడ వరద విషయంలో ప్రజలను అప్రమత్తం చేయడంలో అధికారులు విఫలమయ్యారని, బాధ్యులపై చర్యలు తీసుకునేలా ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం(పిల్)లో కౌంటర్ వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు మరికొంత సమయం ఇచ్చింది. తదుపరి విచారణను అక్టోబరు 8కి వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. గతేడాది బుడమేరు పొంగడం వల్ల విజయవాడ వరద ముంపులో చిక్కుకున్న విషయం తెలిసిందే. వరదను కట్టడి చేయడంలో విఫలమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఒంగోలుకు చెందిన విశ్రాంత పాత్రికేయుడు భూపతిరావు గతేడాది హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. కృష్ణానది ఒడ్డున అనధికార నిర్మాణాలు, బుడమేరు, కొండవీటి వాగుల ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న ఆక్రమణలను తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

వ్యక్తిగతంగా లక్ష్యం చేసుకొని వాదనలు చెప్పొద్దు: ధర్మాసనం

బుధవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది కాసా జగన్‌మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ వరదలకు కృష్ణానది కరకట్ట వెంట అక్రమ నిర్మాణాలు ఓ కారణం అన్నారు. ఆ నిర్మాణాల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం ఉందన్నారు. వరదలకు సీఎం కారణం అన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రిని ప్రతివాదిగా పేర్కొన్నామని చెప్పారు. గతంలో సీఎంకు హైకోర్టు నోటీసు ఇవ్వలేదని, ప్రస్తుతం ఇవ్వాలని కోరారు. అందుకు ధర్మాసనం నిరాకరించింది. వ్యక్తిగతంగా లక్ష్యం చేసుకొని వాదనలు చెప్పొద్దని సూచించింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ప్రణతి వాదనలు వినిపిస్తూ.. వర్షం అధికంగా కురవడమే వరదలకు కారణం అన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు మరికొంత సమయం ఇవ్వాలని కోరారు.

అత్యాధునిక సాంకేతిక హంగులతో పోలీస్ అకాడమీ

మ్యాప్ పరిశీలిస్తున్న డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: అత్యాధునిక సాంకేతిక హంగులు, అన్ని వసతులతో దేశంలోనే మోడల్ పోలీస్ అకాడమీ నిర్మిస్తామని ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం నూగొండపల్లి, పిన్నమరెడ్డిపల్లి గ్రామాల పరిధిలో ఏపీ పోలీస్ అకాడమీ కేంద్రం నిర్మాణ ప్రతిపాదిత ప్రాంతాన్ని డీజీపీ బుధవారం పరిశీలించారు. అప్పా నిర్మాణ ప్రాంతాన్ని మ్యాప్, వీడియో, చిత్రాల ద్వారా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్, తహసీల్దారు పీఎస్వీ ప్రసాద్‌లు డీజీపీకి వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ... 94.49 ఎకరాల్లో ఏపీ పోలీస్ అకాడమీ కేంద్రం నిర్మించేందుకు సన్నాహాలు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు డీజీపీ మధుసూదన రెడ్డి, ఐజీలు జి.వి.జి. అశోక్ కుమార్, ఎం.రవి ప్రకాశ్, డీఐజీ సత్య ఏసుబాబు, సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్, సీఐ కె.రామకృష్ణ, ఎస్సై కె.శుభశేఖర్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అమరావతి పనుల పురోగతిపై సంతృప్తి

సీఆర్‌డీఏ చేపట్టిన పనులను ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు బృంద సభ్యులకు వివరిస్తున్న కమిషనర్ కన్నబాబు

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : రాజధాని అమరావతి నిర్మాణ పనుల పురోగతిపై ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. వరుసగా మూడో రోజైన బుధవారం వారు విజయవాడ ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు, అదనపు కమిషనర్లు జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్, మల్లారపు నవీన్‌లు 'అర్బన్ గవర్నెన్స్'పై కార్యశాల నిర్వహించారు. వివిధ దేశాల్లో దీనిపై అమలవుతున్న అత్యుత్తమ విధానాలు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రతినిధులు.. సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులతో చర్చించారు. అమరావతి నిర్మాణంలో ప్రాజెక్టుల పురోగతి, రాజధానిలో ల్యాండ్ మోనిటైజేషన్ గురించి అధికారులు వారికి వివరించారు. ఆర్థికాభివృద్ధి, రవాణా సదుపాయాల కల్పన, హౌసింగ్ ప్రాజెక్టులు, ప్రైవేట్ సెక్టార్ భాగస్వామ్యం, పౌరసేవల కల్పన తదితర అంశాల్లో సీఆర్‌డీఏ ప్రాతినిధ్యం వహిస్తోందని తెలిపారు. విపత్తు నివారణ కార్యకలాపాలు, సమగ్ర సదుపాయాలతో కూడిన రాజధాని నగర నిర్మాణం గురించి వివరించారు. దీనిపై బ్యాంకు ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సంతృప్తికర రీతిలో సమాధానం ఇచ్చారు. రాజధాని ప్రాంత నివాసితులకు అమలు చేస్తున్న సామాజిక సంక్షేమ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, కార్మికులు, మహిళల భద్రతకు అమలవుతున్న చర్యలు, విపత్తుల నిర్వహణకు చేపట్టిన కార్యకలాపాలపై బృంద సభ్యులు పూర్తి స్థాయిలో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీపార్థసారథి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

కృష్ణమ్మా.. వచ్చేస్తున్నా..!

పట్టిసీమ నుంచి గోదావరి జలాల విడుదల నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే

పట్టిసీమ ఎత్తిపోతల పథకం (పోలవరం కుడి కాలువ) ద్వారా గోదావరి జలాలను ఈ నెల 3వ తేదీ గురువారం విడుదల చేయనున్నారు. సరిగ్గా ఏడాది క్రితం ఇదే తేదీన పట్టిసీమ ద్వారా నీటిని విడుదల చేశారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విడుదల చేయనున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సాగు అవసరాలకు కృష్ణా నది (పులిచింతల), గోదావరి (పట్టిసీమ) నీటిని రెండిటినీ వినియోగించుకునేలా ప్రణాళికతో ఉన్నారు. ఇప్పుడు పులిచింతల ప్రాజెక్టులో 21.67 టీఎంసీల నీటి నిల్వ ఉంది. రోజుకు 4,000 క్యూసెక్కుల వరకు ప్రకాశం బ్యారేజీకి విడుదల చేస్తున్నారు. స్థానిక వరదతో సహా బ్యారేజీకి 5,000 క్యూసెక్కులు వస్తుండగా, 6,000 క్యూసెక్కుల వరకు పంట కాలువలకు విడుదల చేస్తున్నారు. బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటి మట్టానికి గాను, ప్రస్తుతం 11.1 అడుగులు మాత్రమే ఉంది.

గత ఏడాదికంటే మెరుగు..

కృష్ణా నది పరిస్థితి గత ఏడాది కంటే ఈ ఏడాది కాస్త మెరుగ్గా ఉంది. గత ఏడాది పులిచింతల ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీ ఉండగా, నేడు 21.67 టీఎంసీలు ఉంది. గత ఏడాది బ్యారేజీ వద్ద 8.4 అడుగుల నీటి మట్టం ఉండగా, ఈ ఏడాది 11.1 అడుగుల మేర ఉంది. పట్టిసీమలో విడుదల చేసిన నీరు ప్రకాశం బ్యారేజీకి చేరడానికి 5 రోజుల సమయం పడుతుంది. పట్టిసీమ ప్రవాహం ద్వారా కాలువ మార్గ మధ్యంలోని ప్రాంతాలకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. పోలవరం కుడి కాలువ ద్వారా వచ్చే గోదావరి జలాలు బుడమేరు మళ్లింపు కాలువ ద్వారా కృష్ణా నదిలో విలీనం అవుతాయి. వరద ముంపు నేపథ్యంలో బుడమేరు కట్టలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం వీటి మరమ్మతు పనులు జరుగుతున్నాయి. సాగునీటి అవసరాలు, మరమ్మతు పనులను సమన్వయం చేసుకుని తదనుగుణంగా నీటిని విడుదల చేయాల్సి ఉంది. గోదావరి జలాల విడుదల ద్వారా పట్టిసీమ పంపుల పరిస్థితిని కూడా తెలుసుకునే వీలుంది. ప్రకాశం బ్యారేజీ ద్వారా కృష్ణా డెల్టాలోని 13.08 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి : కేసు నమోదు

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్(హెచ్‌సీ)పై దాడి చేసిన సంఘటనపై చిలకలపూడి స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ అబ్దుల్‌నబీ కథనం ప్రకారం.. విజయవాడకి చెందిన పి.నవీన్‌కుమార్ బుధవారం మహిళా సంరక్షణ కార్యదర్శిగా పనిచేస్తున్న తన భార్యను జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్న బదిలీ కౌన్సెలింగ్‌కు తీసుకొచ్చారు. ఆమె కౌన్సెలింగ్ నిమిత్తం లోపలకు వెళ్లగా పోలీసు కార్యాలయం ప్రధాన గేటు సమీపంలో బైక్ పార్కింగ్ చేస్తున్న నవీన్‌కుమార్‌ను అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ బుజ్జిబాబు అక్కడ పార్కింగ్ చేయవద్దని సూచించారు. వినిపించుకోకుండా పార్కింగ్ చేయడంతో సెల్‌ఫోన్‌లో వీడియో తీసే ప్రయత్నం చేసిన హెచ్‌సీతో వాగ్వాదానికి దిగిన నవీన్‌కుమార్ శారీరక దాడికి పాల్పడ్డాడు. బాధితుడైన హెచ్‌సీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. సీసీ కెమెరాల ఫుటేజిని పరిశీలించిన పోలీస్ అధికారులు విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించడంతో పాటు పోలీస్ విధులకు ఆటంకం కల్పించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అయితే హెడ్‌కానిస్టేబులే అకారణంగా తనపై కర్రతో దాడి చేసి గాయపర్చాడని నవీన్‌కుమార్ ఆరోపించారు.

రెండు టన్నుల ఆకు కూరలు.. నిమ్మకాయల విరాళం

రైతులకు అమ్మవారి ప్రసాదాలు అందజేస్తున్న దుర్గగుడి ఉద్యోగులు ప్రసాద్, పునీత్

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఈనెల 8 నుంచి 10 వరకు నిర్వహించే శాకంబరి ఉత్సవాలకు కృష్ణా జిల్లా ఓగిరాల, నూజివీడు మార్కెట్లలో రైతులు, కూరగాయల వ్యాపారులు 2టన్నుల ఆకు కూరలు, నిమ్మకాయలు విరాళం ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. వారికి శాకంబరి ఉత్సవాల ఆహ్వాన పత్రిక, ప్రసాదాలను దేవస్థానం ఉద్యోగులు అందజేశారు. ఉత్సవాలకు 130 టన్నుల కూరగాయలు అవసరం అవుతాయని, విరాళంగా పొందేందుకు రైతులు, మార్కెట్టు వ్యాపారులను కలుస్తున్నట్లు దేవస్థానం ఉద్యోగులు వివరించారు. ఈకార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగులు ప్రసాద్, పునీత్ పాల్గొన్నారు.

సమన్వయంతో జాతీయ రహదారుల అభివృద్ధి

చర్చిస్తున్న రెండు జిల్లాల కలెక్టర్లు, కమిషనర్

ఈనాడు, అమరావతి: విజయవాడ నుంచి గన్నవరం వరకు ఎన్‌హెచ్-16 అత్యధికంగా ప్రముఖులు ప్రయాణించే రహదారి.. సీఎం మొదలు మంత్రులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు... అందరూ ఈ మార్గంలో వెళుతుంటారు. రాజధాని అమరావతి పనులు ఊపందుకుంటున్న నేపథ్యంలో ఈ తాకిడి మరింత పెరిగింది. ఇంత ప్రాధాన్యం ఉన్న మార్గంలో పారిశుద్ధ్యం, డ్రెయినేజీ, వాన నీరు నిలిచిపోవడం వంటి సమస్యలు వేధిస్తున్నాయి. వీటిని పరిష్కరిద్దామంటే.. ఈ మార్గం రెండు జిల్లాల పరిధిలో ఉండడం.. చాలా శాఖల సమన్వయంతో పని చేయాల్సి రావడంతో కొంత అశ్రద్ధ చేశారు. తాజాగా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లు లక్ష్మీశ, బాలాజీ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. వారిద్దరు సంబంధిత అధికారులతో బుధవారం రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

శాఖల సమన్వయంతో సాధ్యం: రామవరప్పాడు-కేసరపల్లి ముందు వరకు ఎన్టీఆర్ జిల్లాలో ఉంటుంది. అక్కడ నుంచి గన్నవరం వరకు కృష్ణా జిల్లాలో ఉంది. మొత్తం రహదారి నిర్వహణ ఎన్‌హెచ్ అధికారులు పర్యవేక్షించాలి. పచ్చదనం పెంచే బాధ్యత సీఆర్‌డీఏ, పారిశుద్ధ్య నిర్వహణ పురపాలక శాఖ చూడాలి. వీటి మధ్య సమన్వయం లేక దారి పొడవునా సమస్యలే. రహదారులు అక్కడక్కడా దెబ్బతినడం, విద్యుత్తు దీపాలు, స్తంభాల నిర్వహణలో లోపాలు, డ్రెయిన్లు, వంతెనలు, పారిశుద్ధ్య నిర్వహణలో సమస్యలు, రహదారి వెంట పచ్చదనం లోపాలు ఉన్నాయి. దీంతో ఈ విషయాలతో సంబంధిత శాఖలు ఎన్‌హెచ్ అధికారులతో సమన్వయం చేసుకుని యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని కలెక్టర్లు ఆదేశించారు. అమరావతికి ముఖద్వారమైన విజయవాడ రహదారుల్లో ట్రాఫిక్ సమస్య, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్‌హెచ్ పీడీ విద్యాసాగర్, కమిషనర్ ధ్యానచంద్ర, డీపీవో లావణ్యకుమారి తదితరులు ఉన్నారు.

పక్కా ప్రణాళికతో అద్విక మోసాలు

పటమట, న్యూస్‌టుడే

అద్విక ట్రేడింగ్ కంపెనీ మోసం ఒక్క రోజులో జరిగింది కాదు. పక్కా ప్రణాళికతో మూడేళ్ల నుంచి ప్రజలను నమ్మించి మోసం చేశారు. ఆదిత్యతో మరికొందరు కలిసి చేసిన మోసానికి వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వివిధ అవసరాలకు దాచుకున్న సొమ్ము కొందరు, రుణం తీసుకుని మరికొందరు అద్విక కంపెనీలో పెట్టుబడి పెట్టారు. ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని ఎన్టీఆర్ కాలనీలోని అద్విక కంపెనీ వద్ద బాధితులు లబోదిబోమంటున్నారు. రూపాయి వస్తుందని ఆశ పడితే తమ కష్టాన్ని దోచుకుపోయారంటూ కన్నీరు పెట్టుకుంటున్నారు. బుధవారం మరో ఐదుగురు బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో మొత్తం ఫిర్యాదుదారులు సంఖ్య 97కి చేరింది.

లెక్కలే లేవు..

అద్విక ట్రేడింగ్ కంపెనీ మోసం లెక్కలు ఇంకా తేలలేదు. ఆదిత్య ఎంతమంది నుంచి పెట్టుబడులు తీసుకున్నాడు... తిరిగి ఎంతమందికి చెల్లించాడో రికార్డులు లేవు. ఏజెంట్లు చెబుతున్న వివరాల ప్రకారం ఆదిత్య ఎంత మంది వద్ద నుంచి నగదు తీసుకున్నాడో పోలీసులు రికార్డు తయారు చేస్తున్నారు. తొలుత ఐదుగురు ఏజెంట్లతో మొదలై ఆ సంఖ్య 44కి చేరింది. దాదాపు 40 మంది ఏజెంట్లను పోలీసులు విచారించారు.

✦✦ పెట్టుబడి పెట్టిన వారికి ప్రతి నెల చెల్లించే వడ్డీ (పేఅవుట్) ఆలస్యంగా చెల్లిస్తున్నారని ఎవరైనా ఏజెంట్ గట్టిగా అడిగితే... వారికి ఆదిత్య సొమ్ము చెల్లించేవాడు కాదు. అతనిని పొగిడినా, సన్మానం చేసినా వెంటనే పేఅవుట్ చేసే వాడని ఏజెంట్ల దర్యాప్తులో తేలింది. ఏజెంట్ల ఖాతాల నుంచే నగదు ఎక్కువగా బదిలీ అయిన నేపథ్యంలో వారి ఖాతాలను ఫ్రీజ్ చేసేందుకు పోలీసులు సిద్ధమైనట్లు తెలుస్తోంది. కొంతమంది ఏజెంట్లు ఆ కేసుతో తమకు సంబంధం లేదని న్యాయస్థానంలో క్యాష్ పిటిషన్ దాఖలు చేశారు. అవి గురువారం విచారణకు రానున్నాయి.

✦✦ ఆదిత్య చేతిలో మోసపోయిన బాధితులు సుమారు 1500 మంది ఉన్నప్పటికీ ఇప్పటివరకు సుమారు 100 మంది మాత్రమే ఫిర్యాదు చేశారు. చాలామంది నల్లధనం పెట్టడంతో పాటు కేసు పెట్టినా ఉపయోగం లేదని ఆలోచనలో ఉన్నారు. ఆదిత్య బయటకు వచ్చిన తర్వాత తేల్చుకుంటామని కొంతమంది బాధితులు ఎదురుచూస్తున్నారు.

(c) eenadu

ముందే బేరం.. ముడితేనే పందేరం

- 25 శాతమిస్తేనే ఓఅండ్‌ఎం పనులు అప్పగింత
- చక్రం తిప్పుతున్న కీలక పదవిలో ఉన్న వ్యక్తి

ఈనాడు - అమరావతి

ఉమ్మడి కృష్ణాలో సాగునీటి కాలువల ఓఅండ్‌ఎం (ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్) పనుల్లో ముందస్తు ముడుపుల ముచ్చట సాగుతోంది. పనులు చేశాక కమీషన్లు తీసుకోవడం పరిపాటి.. ఇక్కడ మాత్రం కాంట్రాక్టు కావాలంటే కమీషన్లు ఇవ్వాలని హుకుం జారీ చేశారు. కీలక పదవిలో ఉన్న వ్యక్తి వ్యవహారం నడిపిస్తున్నారు. గుత్తేదారులు పనులు చేసేందుకు బెంబేలెత్తిపోతున్నారు. ఫలితంగా పనులు నత్తనడకన సాగుతున్నాయి.

ఇప్పటికీ పనులు చేపట్టక అధ్వానంగా ఉన్న బందరు కాలువ

అంతా మా ఇష్టం

ఉమ్మడి జిల్లాలో కాలువల నిర్వహణ పనులకు ప్రభుత్వం రూ.25 కోట్లు మంజూరు చేసింది. 666 పనులు చేయాలి. కాలువలు శుభ్రం చేసి శివారు ప్రాంతాలకూ నీరివ్వాలనేది లక్ష్యం. దీనికి జిల్లాలో కీలక పదవిలో ఉన్న ఓ నాయకుడు తూట్లు పొడుస్తున్నారు. ఎక్కువ నిధులు కేటాయించిన పనుల విషయంలో కొత్త రకం దోపిడీకి తెర తీశారు. ముందుగా మొత్తం పనికి వచ్చే నిధుల్లో 25 శాతం కమీషన్‌గా సమర్పిస్తేనే పనులు అప్పగిస్తామని సొంత రాజ్యాంగం రాశారు. కొందరు గుత్తేదారులకు రూ.కోట్ల విలువైన పనులు అప్పగించి ఇప్పటికే భారీగా దండుకున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఇష్టమైతే చేయండి లేదంటే మానుకోండని ఆయన కుమారుడు చెప్పేస్తున్నారు.

గుత్తేదారుల వెనుకంజ..

ఓఅండ్‌ఎం పనులు చేసినా... బిల్లులు ఎప్పుడు వస్తాయో తెలియదు. ఇప్పుడు బిల్లులు పెడితే ఏడాదిన్నరలోగా వస్తే గొప్పే. పనులు చేయడానికి పెద్ద మొత్తంలో ఖర్చవుతుంది. దీంతో 90 శాతం గుత్తేదారులు ముందస్తు కమీషన్ ఇచ్చేందుకు ముందుకు రాలేదు. కొందరు 5 శాతం ముందుగా ఇచ్చి మిగతాది బిల్లులు వచ్చాక ఇస్తామన్నా ససేమిరా అన్నారు. ఇంత కమీషన్ ఇచ్చి ఖర్చులు పోగా మిగిలేది ఎంతని కొందరు గుత్తేదారులు లెక్కలేసుకున్నారు. ఆ మొత్తం రూ.5 లక్షలు దాటడం లేదు. ఈ మాత్రానికి ఈ తతంగం ఎందుకని చాలా మంది తప్పుకొన్నారు. వెరసి చాలా తక్కువ మంది గుత్తేదారులకు ఎక్కువ పనులు అప్పగించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ బేరాల వల్లే నీరు వదిలి రెండు వారాలైనా ఇప్పటికీ పనులు పూర్తిచేయలేదు.

తూతూమంత్రం.. రైతన్నకు కష్టం

ఈ స్థాయి కమీషన్లు, పెట్టుబడి పెట్టి చేస్తే మిగిలేది లేదని గుత్తేదారులు తూతూమంత్రంగానే పనులు చేస్తున్నారు. తూడు మొత్తం తొలగించి గట్టు మీద వేయాల్సి ఉన్నా దాదాపు ఎక్కడా అలా జరగడం లేదు. గడ్డి మందు చల్లి పైపైన తొలగించి సరిపెడుతున్నారు. గుర్రపుడెక్క, తూటికాడ ప్రవాహంలో కొట్టుకుపోగానే పనులు పూర్తయినట్లు బిల్లులు చేసుకుంటారు. కానీ ఆ వ్యర్థాలన్నీ అదే కాలువలో ఉండి నీటి ప్రవాహానికి ఆటంకంగా మారుతాయి. దీంతో నీటి విడుదల ఎంత ఉన్నా శివారు ప్రాంతాలకు నీరు చేరదు.. ముందు ప్రాంతాల్లో నీటి ఉద్ధృతి పెరిగి గండ్లు పడే ప్రమాదాలున్నాయి. ఏది జరిగినా అవస్థలు పడేది అన్నదాతలే.

తిరువూరులో 18.6 మి.మీ. వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిశాయి. బుధవారం ఉదయం నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. తిరువూరు 18.6 మి.మీ., విస్సన్నపేట 16.2, గంపలగూడెం 14, ఎ.కొండూరు 10.4, రెడ్డిగూడెం 9.2, వత్సవాయి 7.4, వీరులపాడు 7.2, మైలవరం 6.4, కంచికచర్ల 4.8, జి.కొండూరు 4, జగ్గయ్యపేట 3.8, పెనుగంచిప్రోలు 3.6, ఇబ్రహీంపట్నం 3.4 మిల్లీ మీటర్ల మేర వర్షం పడింది.

విజయవాడ ఎగ్జిబిషన్.. మళ్లీ ఆరంభం!

సమావేశమైన ఎంపీ చిన్ని, కలెక్టర్ లక్ష్మీశ, అధికారులు, ఎగ్జిబిషన్ సొసైటీ సభ్యులు

ఈనాడు, అమరావతి: విజయవాడలో అత్యంత ఆదరణతో మూడు దశాబ్దాలకు పైగా కొనసాగిన ఎగ్జిబిషన్‌ను మళ్లీ వచ్చే దసరా నుంచి ఆరంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. 2013 వరకు నగరంలోని స్వరాజ్యమైదానంలో ఎగ్జిబిషన్‌ను ఏటా నిర్వహించారు. ఆ తర్వాత గత 13 ఏళ్లుగా ఆగిపోయింది. కృష్ణా ఇండస్ట్రియల్ అండ్ అగ్రికల్చరల్ ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ ఎగ్జిబిషన్‌ను నిర్వహించేవాళ్లు. సొసైటీకి అధ్యక్షుడిగా కలెక్టర్, పోలీసు కమిషనర్, నగర ప్రజాప్రతినిధులు, సభ్యులు కమిటీలో ఉండేవారు. ఒకప్పుడు విజయవాడకే తలమానికంగా ఉండే ఈ ప్రదర్శన అనుకోని కారణాలతో ఆగిపోయింది. తాజాగా మళ్లీ సొసైటీని పునరుద్ధరించాలని, ఎగ్జిబిషన్‌ను గతంలో మాదిరిగానే నిర్వహించేందుకు ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), కమిటీ సభ్యులు కలిసి కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశతో విజయవాడలో బుధవారం సమావేశమయ్యారు. సొసైటీకి పూర్వవైభవం తెచ్చేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని, వచ్చే దసరా నుంచి వేదిక నిర్వహించాలని నిర్ణయించారు. ప్రస్తుతం స్వరాజ్యమైదానంలో అవకాశం లేకపోవడంతో గొల్లపూడి ప్రాంతంలో 25 ఎకరాల్లో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. ఇందుకు అవసరమైన స్థలాన్వేషణ చేయనున్నారు. విజయవాడ ఎగ్జిబిషన్ పేరుతో ఎగ్జిబిషన్‌ను ఇక నుంచి నిర్వహించాలనే యోచనలో ఉన్నారు. ఎగ్జిబిషన్‌ను అధికారికంగా సొసైటీ ఆధ్వర్యంలో దసరా నుంచి ఏర్పాటు చేసేలా అవసరమైన అన్ని చర్యలూ చేపడుతున్నట్టు ఎంపీ కేశినేని శివనాథ్ వెల్లడించారు.

కేడబ్ల్యూ హెడ్ రెగ్యులేటర్ వద్ద పూజా కార్యక్రమాలు

పశ్చిమ ప్రధాన కాల్వకు సాగునీరు విడుదల

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ప్రకాశం బ్యారేజీ నుంచి కృష్ణా పశ్చిమ (కేడబ్ల్యూ) ప్రధాన కాలువకు బుధవారం 305 క్యూసెక్కుల సాగునీటిని విడుదల చేశారు. గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు కేడబ్ల్యూ ప్రధాన కాలువ ద్వారా సాగునీరు అందుతుంది. బ్యారేజీ తాడేపల్లి వైపున ఉన్న కేడబ్ల్యూ హెడ్ రెగ్యులేటర్ వద్ద జలవనరుల శాఖ అధికారులు పూజా కార్యక్రమాలు నిర్వహించి, నీటిని విడుదల చేశారు. కేడబ్ల్యూ ఈఈ సుధాకరరావు, దుగ్గిరాల డీఈఈ శ్రీనివాసరావు, ఏఈఈ లక్ష్మీనారాయణ, బ్యారేజీ ఏఈఈ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

కాలువలకు 5,938 క్యూసెక్కులు... కృష్ణా డెల్టా పరిధిలోని కాలువలకు బ్యారేజీ నుంచి 5,938 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు (కేఈ) ప్రధాన కాలువకు 5,633, కేడబ్ల్యూ ప్రధాన కాలువకు 305 క్యూసెక్కులు విడుదల చేశారు. కేఈ ప్రధాన కాలువ నుంచి రైవస్ కాల్వకు 3,003, ఏలూరు 1,021, బందరు 956, కేఈబీ (దివిసీమ) కాల్వకు 653 క్యూసెక్కుల చొప్పున నీటిని ఇస్తున్నారు.

కలిసే దందా.. కనబడుతోందా?!

- క్లోక్‌రూంలో పక్కా ప్రణాళికతో భక్తుల బ్యాగుల చోరీ
- సీసీ ఫుటేజీలో తేలినా.. రాజీ

ఈనాడు, అమరావతి

దుర్గగుడిలో సామగ్రి దాచుకునే క్లోక్‌రూం విషయంలో అధికారులు అత్యంత కఠినంగా ఉండాలని ఈ చోరీ ద్వారా అర్థమవుతోంది. రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ఆలయం. రూ.100 కోట్లకు పైగా ఆదాయం వస్తోంది. ఇలాంటి ఆలయంలో ఇంత దారుణంగా.. క్లోక్‌రూంలో పెట్టిన బ్యాగ్‌లను తరచూ ఎత్తుకుపోవడం ఏంటి.? తాజా ఘటనలపై సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలించగా.. పక్కా ప్రణాళికతో కొందరు ఏకమై భక్తులను లూటీ చేస్తున్నట్టు అర్థమవుతోంది.

కన్నేసి.. నిమిషాల్లో కాజేసి...

సీసీ కెమెరా ఫుటేజీలో వంశీకృష్ణ బ్యాగ్ పెట్టేందుకు క్లోక్‌రూం వద్దకు రావడం, తన జేబులోని ఫోన్, డబ్బులు బ్యాగ్‌లో పెడుతుండగా అతని వెనుకే కొద్ది దూరంలో దొంగ నిలబడి ఉన్నాడు. బ్యాగ్‌ను క్లోక్‌రూం సిబ్బంది ర్యాక్‌లో పెడుతుండగా.. ఎక్కడ పెడుతున్నారనేది గమనించాడు.

★ వంశీకృష్ణ.. బ్యాగ్ పెట్టి మెట్ల దారిలో దర్శనానికి వెళ్లగానే.. ఐదు నిమిషాల్లోనే ఆ వ్యక్తి నేరుగా వచ్చి బ్యాగ్‌ను ర్యాక్ నుంచి తీసుకున్నాడు.

★ క్లోక్‌రూం సిబ్బంది వంశీకృష్ణ బ్యాగ్ తీసుకుని టోకెన్ ఇచ్చారు. ఆ టోకెన్‌పై పెన్నుతో.. 0.3/1 నంబర్ వేశారు. అదే నంబరు బ్యాగ్‌పైనా రాశారు. అలాంటప్పుడు.. అదే నంబరు ఉన్న టోకెన్‌ను బ్యాగ్ ఎత్తుకెళ్లిన వ్యక్తి ఎలా తెచ్చాడు. ఆ నంబరు అతనికెలా తెలిసింది. పైగా.. టోకెన్లపై పెన్నుతో నంబర్లు రాసివ్వడం ఏంటి?

వంశీకృష్ణ కౌంటర్ వద్ద బ్యాగు ఇస్తుండగా దూరం నుంచి పరిశీలిస్తున్న దొంగ

ఉదయం 11.25

దుర్గగుడిలోని కనకదుర్గానగర్ క్లోక్‌రూంలో సోమవారం ఉదయం నెల్లూరు వాసి పాలోజి వంశీకృష్ణ తన బ్యాగ్ ఉంచాడు. దానిలో బీమా పత్రాలు, రూ.5 వేలు, ఖరీదైన చరవాణి, పవర్ బ్యాంక్, కొన్ని వస్తువులు ఉంచాడు.

కాసేపటి తర్వాత నేరుగా లోపలకు వచ్చి బ్యాగు తీసుకెళ్తున్న చోరుడు

ఉదయం 11.30

ఓ వ్యక్తి నేరుగా క్లోక్‌రూం వద్దకు వచ్చాడు. దర్జాగా భక్తుల బ్యాగ్‌లు ఉంచిన క్లోక్‌రూం లోపలికి వెళ్లాడు. వంశీకృష్ణ బ్యాగ్‌ను ర్యాక్‌లో నుంచి తీసుకున్నాడు. క్లోక్‌రూం ఎంట్రీ వద్ద కూర్చున్న వ్యక్తికి టోకెన్ చూపించి.. బ్యాగ్‌ను భుజానేసుకుని వెళ్లిపోయాడు.

★ భక్తుల బ్యాగ్‌లను కౌంటర్‌లో సిబ్బంది తీసుకుని.. క్లోక్‌రూంలోని ర్యాక్‌లలో, నేలపై పెడుతున్నారు. వాటిని టోకెన్ చూపించగానే.. సిబ్బందే తెచ్చివ్వాలి. కానీ.. నేరుగా భక్తులే వచ్చి తీసుకునే అవకాశం ఇవ్వడమేంటి.?

విషయం బయటకు రాకుండా...

తాజాగా చోరీపై.. సీసీ ఫుటేజీ, 'ఈనాడు'లో వార్త రావడంతో వ్యవహారం ఎక్కడ బయటకొస్తుందోనని రాజీ ప్రయత్నాలు ఆరంభించారు. బాధితుడు వంశీకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేయగా.. దానిని వెనక్కి తీసుకోమని చెప్పి.. అతనికి పరిహారం ఇస్తామని బుధవారం పిలిపించారు. రూ.30 వేలు, ఒక పాత మొబైల్ ఫోన్‌ను ఇచ్చి.. రాజీ చేసుకున్నారు.

★ పైగా క్లోక్‌రూం నిర్వాహకుల వద్ద పాత మొబైల్ ఫోన్లు ఎక్కడివి.?

★ సీసీ కెమెరాలో స్పష్టంగా కనిపిస్తున్న నిందితుడిని పట్టుకోకుండా.. ఈ బేరాలు చేసి.. చేతులు దులిపేసుకోవడం చూస్తే.. సందేహాలు వెల్లువెత్తుతున్నాయి.

పండుగ చేస్కో... రైతన్నా

ఈనాడు, అమరావతి

ఉమ్మడి జిల్లాలో పెద్దఎత్తున ఉద్యాన పంటల వృద్ధికి జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. 2025-26 ఆర్థిక ఏడాదిలో 5,500 ఎకరాల్లో కొత్తగా పండ్లు, పూలతోటలు ఏర్పాటు చేస్తారు. దీని కోసం ఉపాధి హామీ పథకం నుంచి రూ.60.5 కోట్ల నిధులు కేటాయించారు. ఉద్యాన పంటల అభివృద్ధి, కొత్త పంటలతో రైతులకు ఆదాయం పెంచేందుకు ఈ పథకం దోహద పడనుంది. గతేడాది ఉమ్మడి జిల్లాలో 2వేల ఎకరాల్లో ఉద్యాన పంటలు అభివృద్ధి చేయగా ఈ ఏడాది రెట్టింపు లక్ష్యం నిర్దేశించుకున్నారు.

జిల్లా	ఏర్పాటు చేసే తోటల విస్తీర్ణం	గుర్తించింది (ఎకరాల్లో)
ఎన్టీఆర్	4,000	2,700
కృష్ణా	1,500	407
మొత్తం	5,500	3,107

3,107 ఎకరాలు గుర్తింపు: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 23 రకాల పండ్ల తోటలు, రెండు రకాల పూల తోటలు సాగు చేయవచ్చు. ఉమ్మడి జిల్లాలో ఆయా ప్రాంతాల నేల స్వభావం, నీటి లభ్యత అంచనా వేసి ఎన్టీఆర్ జిల్లాలో 13, కృష్ణాలో 17 పంటలు, గులాబీ, మల్లె తోటలు వేయడానికి అనుకూలం అని అధికారులు ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లాలో ఇప్పటికే 3,107 ఎకరాల్లో రైతులు పంటలు వేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు గుర్తించారు. ఐదెకరాల్లోపు భూమి ఉన్న రైతులే అర్హులు కావడంతో చిన్నా, సన్నకారు రైతులకు ఇది మంచి అవకాశం. పథకం ప్రయోజనాలు పొందాలంటే జాబ్‌కార్డు తప్పనిసరి. వర్షాధారిత, సాగునీటి వసతి ఉండాలి.

ఎంపిక చేసిన పంటలివే.. మామిడి, జామ, సపోటా, నేరేడు, చింత, సీతాఫలం, బత్తాయి, డ్రాగన్‌ఫ్రూట్, అవకాడో, అంజీర, యాపిల్‌బేర్, మునగ, కాజు, స్వీట్ ఆరెంజ్, దానిమ్మ పంటలు ఈ జాబితాలో ఉన్నాయి.

ఎకరానికి రూ.1.10లక్షల సాయం: భూసార పరీక్షల మొదలు మూడేళ్ల వరకు భారమంతా ప్రభుత్వమే చూసుకుంటుంది. ఎకరానికి దుక్కి ఖర్చు రూ.1250 చెల్లిస్తారు. ఆ తోటలో అంతర పంటలు సాగు చేసుకుంటే దానికి దుక్కి ఖర్చు ఇస్తారు. గుంతలు తీయడం, మొక్కలు నాటడం ఉపాధి శ్రామికులతో లేదా సొంతంగా చేసుకున్నా ఆ మొత్తం చెల్లిస్తారు. రైతులు కొనుగోలు చేస్తే రవాణా ఖర్చు మొక్కకు రూ.8 చొప్పున కేటాయించారు. ఏడాదికి 45 తడుల చొప్పున మొక్కకి రూ.5.45 జమ చేస్తారు. కలుపు తీయడం, కాపలా, ఇతర పనులకు కలిపి మొక్కకు రూ.16 చొప్పున చెల్లిస్తారు. ఏడాదికోసారి మొక్కకు రూ.25 చొప్పున ఎరువుల కోసం జమ చేస్తారు. ఇలా ఒక్కో ఎకరానికి మూడేళ్లలో రూ.1.10లక్షల సాయం చేస్తున్నారు.. 'ఆసక్తి ఉన్న రైతులు దరఖాస్తులను ఉపాధిహామీ క్షేత్ర సహాయకులు, ఏపీవో, క్షేత్ర సహాయకులకు అందజేయాలని డ్వామా పీడీ రాము తెలిపారు.

అభివృద్ధి.. సంక్షేమం కళ్లుగా సుపరిపాలన

ఎంపీ కేశినేని శివనాథ్, బుద్ధా వెంకన్న, నాగుల్‌మీరా, తెదేపా నాయకుల ర్యాలీ

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: సుపరిపాలనలో కూటమి ప్రభుత్వం తొలి అడుగు వేసిందని, అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నడిపిస్తున్నారని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. పాతబస్తీ పంజాసెంటర్, వించిపేట ప్రాంతాలలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ.. సూపర్‌సిక్స్ పథకాలను జెట్ స్పీడ్‌తో ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. తల్లికి వందనం కార్యక్రమం ద్వారా ప్రతి విద్యార్థి కుటుంబంలో సంతోషాన్ని నింపామన్నారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరించేందుకు వీలుగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని, త్వరలో పీ-4 లింక్ ద్వారా మహిళలకు భృతి ఇస్తామన్నారు. రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ ఛైర్మన్ డూండీ రాకేష్ మాట్లాడుతూ.. గత వైకాపా ప్రభుత్వం అభివృద్ధి విస్మరించిందని, సంక్షేమ పథకాలలో కోతలు పెట్టిందన్నారు. కూటమి ప్రభుత్వం అందరికీ సంక్షేమం అందిస్తూ, మరోవైపు అభివృద్ధిని పరుగులు పెట్టిస్తోందన్నారు. కార్యక్రమంలో తెదేపా నేతలు సోలంకి రాజుజైన్, తెదేపా ముస్లిం మైనార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ఫతావుల్లా, నేతలు సుకాశి కిరణ్, సయ్యద్ రఫీ, తెలుగు మహిళా నేతలు సుకాశి సరిత, ఆశా, తదితరులు పాల్గొన్నారు.

సాంకేతిక దన్ను.. విరిచే అక్రమాల వెన్ను..

ముఖ గుర్తింపు ద్వారా పౌష్టికాహారం పంపిణీ

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం

పౌష్టికాహారం పంపిణీలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా సాంకేతిక పరిజ్ఞానం వినియోగించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపట్టాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో అర్హుల ముఖ గుర్తింపు(ఫేస్ రికగ్నిషన్) ద్వారా పౌష్టికాహారం అందించేందుకు అర్హుల వివరాలు సంబంధిత యాప్‌లో నమోదు చేస్తున్నారు. ఈ విధానం ద్వారా మంగళవారం నుంచి పంపిణీ ప్రక్రియ అమల్లోకి వచ్చింది.

పక్కదారి పట్టకుండా

పోషకాహార లోపాన్ని అధిగమించేందుకు అంగన్‌వాడీ కేంద్రాల్లోని గర్భిణులు, బాలింతలు.. చిన్నారులకు అందిస్తున్న బలవర్ధకమైన ఆహారం పలుచోట్ల పక్కదారి పడుతోంది. దీన్ని వ్యాపారంగా మలచుకున్నవారు భారీగా అక్రమాలకు తెరలేపి కోడిగుడ్లు, నిత్యావసరాలు, బాలమృతం వంటి వాటిని దారి మళ్లిస్తున్న ఉదంతాలు కోకొల్లలు. వీటికి అడ్డుకట్ట వేసేందుకే కేంద్ర ప్రభుత్వం ముఖ గుర్తింపు విధానాన్ని అమల్లోకి తెచ్చింది.

	కృష్ణా	ఎన్టీఆర్
ఐసీడీఎస్ ప్రాజెక్టులు	8	6
అంగన్‌వాడీ కేంద్రాలు	1,707	1,475
గర్భిణులు	6,990	8,823
బాలింతలు	6,928	7,209
6 నెలల నుంచి మూడేళ్లలోపు చిన్నారులు	34,807	44,633
3 నుంచి 5 ఏళ్ల పిల్లలు	17,937	18,813

★ అంగన్‌వాడీ కేంద్రాల్లోని గర్భిణులు, బాలింతలు, బాలల ముఖచిత్రాలను చరవాణి ద్వారా అంగన్‌వాడీ సిబ్బంది చిత్రీకరిస్తున్నారు. పోషణ్ ట్రాకర్ అప్లికేషన్‌లో ఎప్పటికప్పుడు వాటిని అప్‌లోడ్ చేయాలి. అవి స్త్రీ, శిశు సంక్షేమశాఖ డైరెక్టరేట్‌కు అనుసంధానం అవుతున్నాయి.

ఈ గణాంకాల ఆధారంగా బడ్జెట్ విడుదలవుతుందని అధికారులు వివరించారు. 'ఉమ్మడి జిల్లాలో వీటికి సంబంధించి ఇప్పటి వరకు 90శాతం పైగా ప్రక్రియ పూర్తయింది. లబ్ధిదారుల వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నాం. అందరికీ కొత్త విధానంలో 100శాతం పంపిణీ చేస్తాం' అని ఉమ్మడి జిల్లా ఐసీడీఎస్ పీడీలు ఎంఎన్ రాణి, ఎస్కే రుక్సానా సుల్తానాబేగం తెలిపారు.

సాంకేతిక సమస్యలపైనా కసరత్తు

గర్భిణులు, బాలింతలు ముఖ కవళికలు.. దేహదారుఢ్యంలో మార్పులు వచ్చే అవకాశం ఉండడంతో ఎఫ్‌ఆర్‌ఎస్‌లో ఏమైనా సమస్యలు తలెత్తితే తీసుకోవాల్సిన చర్యలపై అధికారులు దృష్టి పెట్టారు. అలాంటి పరిస్థితుల్లో పంపిణీ ఎలా చేయాలో మార్గదర్శకాలు జారీ చేశారు. ముఖ గుర్తింపు నమోదు కానివారికి పౌష్టికాహారం అందించడంపైనా యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

ఒక్కో కిట్టులో..

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా ప్రతి నెలా బాలింతలు.. గర్భిణులకు పౌష్టికాహారం కిట్లు పంపిణీ చేస్తారు. ఒక్కో కిట్టులో 2 కిలోల రాగిపిండి, కిలో అటుకులు, 250 గ్రాముల చొప్పున బెల్లం, ఎండు ఖర్జూరం, చిక్కీలు ఉంటాయి. ఇవికాకుండా కిలో కందిపప్పు, మూడు కిలోల బియ్యం, అర లీటరు నూనె, 5 లీటర్ల పాలు, 25 కోడిగుడ్లు ఇస్తారు. మూడేళ్లలోపు పిల్లలకు 2.5 లీటర్ల పాలు.. 25 గుడ్లు.. 2.5 కిలోల బాలామృతం, ప్రీస్కూల్లో చదువుతున్న 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలకు రోజూ గుడ్డు ఇస్తారు.

(c) eenadu

వర్షాకాలం.. విద్యుత్తుతో జరభద్రం

జాగ్రత్తలు తీసుకోవాలంటున్న అధికారులు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే

వర్షాకాలంలో విద్యుత్తు ప్రమాదాలకు ఆస్కారం ఉంది. గాలి వానలకు చెట్లు విరిగిపోవడం, విద్యుత్తు లైన్లు తెగిపోవడం జరుగుతుంటాయి. ఈ క్రమంలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా విద్యుదాఘాతం జరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. అందరూ అప్రమత్తంగా ఉండాలని ఆ శాఖ ఎస్ఈ తోట శ్రీనివాసరావు సూచిస్తున్నారు. ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

ఇవి పాటించండి..!

●● తడిసిన కరెంట్ స్తంభాలను పట్టుకోకూడదు. ●● విద్యుత్తు లైన్లకు తగిలే చెట్లను ముట్టుకోకూడదు. ●● లైన్లపై చెట్ల కొమ్మలు పడి ఉంటే.. స్థానిక విద్యుత్తు అధికారికి సమాచారం అందించాలి. ●● ఇంట్లో ఉన్న స్విచ్ బోర్డులు, కరెంట్‌కు సంబంధించిన వస్తువులను తడి చేతులతో ముట్టుకోరాదు. ●● ఆరుబయట ఉన్న లైట్లు నీటితో తడవకుండా చూసుకోవాలి. ●● చిన్న పిల్లలు విద్యుత్తు వస్తువుల వద్దకు రాకుండా చూసుకోండి. స్విచ్ బోర్డులు వారికి అందుబాటులో లేకుండా చూడండి. ●● ఇనుప తీగలపై ఉతికిన దుస్తులు ఆరవేయకూడదు. ●● గాలి దుమారం, వర్షం వచ్చినప్పుడు తెగిన విద్యుత్తు తీగలను తాకరాదు. ●● వాటర్ హీటర్ వాడేటపుడు స్విచ్ ఆఫ్ చేసి, ప్లగ్ నుంచి తీసిన తర్వాతే నీళ్ల పెట్టిన వస్తువును ముట్టుకోవాలి. ●● ఉరుములు, మెరుపులతో వర్షం పడేటప్పుడు డిష్ కనెక్షన్ తీసేయండి. ●● వర్షం పడేప్పుడు టీవీ, రిఫ్రిజిరేటర్, వాటర్‌మోటార్స్, కంప్యూటర్ల స్విచ్‌లను ఆఫ్ చేయండి. లేకపోతే షార్ట్‌సర్క్యూట్ అయ్యే అవకాశం ఉంది. ●● కరెంటు లైను కింద చరవాణి మాట్లాడరాదు. ●● ఇంటికి ఉన్న విద్యుత్తు సర్వీస్ వైరు పాడైపోతే.. వెంటనే అధికారి దృష్టికి తీసుకువెళ్లి మార్పించుకోవాలి. ●● ప్రతి కరెంటు వస్తువుకు ఎర్త్ తప్పనిసరిగా ఉండాలి.

ఫిర్యాదు చేయండిలా..

విద్యుత్తు సరఫరాలో అంతరాయాలు, ఫిర్యాదులు ఉంటే విద్యుత్తు శాఖ టోల్‌ఫ్రీ నంబరు 1912కు లేదా 94408 17561కు ఫోన్ చేసి చెప్పి సమస్యలు పరిష్కరించుకోవాలని ఎస్ఈ తెలిపారు.

మూషికం రాసిన మృత్యు గీతం

పదేళ్లు దాటినా అందని సాయం

సీఎం స్పందించాలని బాధితురాలి వేడుకోలు

కృష్ణలంక(విజయవాడ), న్యూస్‌టుడే

సీఎం ఇచ్చిన హామీలు అమలు చేయాలని బాధితురాలు వేడుకుంటోంది. పది రోజుల పసికందు గుంటూరు జీజీహెచ్‌లో ఎలుకలకు బలైన ఘటన అప్పట్లో కలకలం సృష్టించింది. చిన్నారికి పేగు పంచిన తల్లికి మాత్రం నీడ కరవైంది. అప్పట్లో ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని సుమారు పదేళ్లుగా తిరుగుతున్నా.. ఫలితం లేకుండా పోతోంది. విజయవాడలోని కృష్ణలంక మెట్ల బజారుకు చెందిన చావలి లక్ష్మి 2015, ఆగస్టు 17న విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో మగబిడ్డకు జన్మనిచ్చింది. శిశువుకు శస్త్రచికిత్స అవసరం కావడంతో గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. ఆగస్టు 23న శస్త్రచికిత్స అనంతరం పసికందును ఐసీయూలో ఉంచారు. 25వ తేదీ రాత్రి బాబుకు ఎలుకలు కరిచాయి. 26వ తేదీన మృతి చెందాడు. బిడ్డ పది రోజులకే పర లోకానికి వెళ్లిపోవడంతో ఆమె ఆవేదనకు అంతులేకుండా పోయింది. ఆ ఘటన అప్పటి సీఎం చంద్రబాబుని చలింపజేసింది. బాధితురాలికి నష్టపరిహారం, పక్కా ఇల్లు, ఉద్యోగం ఇస్తామని హామీ ఇచ్చారు. కొద్దిరోజులకు నష్టపరిహారం కింద రూ.5 లక్షలు అందింది. మిగతా రెండు హామీలు నెరవేరలేదు. బాధితురాలు 2019, జనవరి 28న ప్రజా వేదికకు వెళ్లి అప్పటి పంచాయతీ రాజ్ శాఖ మంత్రి లోకేశ్‌కు పరిస్థితి వివరించారు. ఆమెకు ఇల్లు మంజూరు చేయాలని ఆనాటి పంచాయతీరాజ్ శాఖ కార్యదర్శిగా ఉన్న బొంత అర్జునరావును మంత్రి ఆదేశించారు. ఇల్లు కేటాయించాలని వీఎంసీ కమిషనర్‌ను ఆదేశిస్తూ ఆయన లేఖ ఇచ్చారు. తరువాత ఎన్నికల కోడ్ రావడం.. కొత్త ప్రభుత్వం కొలువుతీరడంతో ఆ లేఖ మరుగున పడింది. తరవాత జగన్ ప్రజా దర్బార్‌కు బాధితురాలు వెళ్లి పరిస్థితిని వివరించారు. గత ప్రభుత్వంలో జరిగింది కనుక తామేమీ చేయలేమని అధికారులు చెప్పడంతో మిన్నకుండిపోయారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో జూన్ నెల 9న కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వెళ్లి ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నారు. భర్త, ఇద్దరు పిల్లలను పోషించడానికి ఇబ్బంది పడుతున్నానని బాధితురాలు వాపోతున్నారు. తన భర్త నాగ గతంలో దుస్తుల దుకాణంలో పనిచేసే వారని, అనారోగ్యంతో పని మానేసినట్లు వివరించారు. కుటుంబ పోషణ నిమిత్తం చిన్న బడ్డీ నిర్వహిస్తున్నానని, వచ్చే ఆదాయం సరిపోవడం లేదని, సీఎం స్పందించి ఇల్లు, ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని ఆమె కోరుతున్నారు.

ఇద్దరు పిల్లలతో చావలి లక్ష్మి

చూసేలోపే కసిరావే.. మురిసేలోపే విసిరావే..

నడిరోడ్డుపై రక్తస్రావంతో శిశువు

చిట్టినగర్, న్యూస్‌టుడే: విజయవాడలో అమానవీయ సంఘటన చోటుచేసుకుంది. అప్పుడే పుట్టి అమ్మ పొత్తిళ్లలో వెచ్చగా ఒదిగి ఉండాల్సిన శిశువు అర్ధరాత్రి నడిరోడ్డుపై వణుకుతూ గుక్క పెట్టి ఏడుస్తూ పడి ఉన్నాడు. ఎలుకలు కొరికి రక్తస్రావమై విలవిలాడిపోయాడు. తల్లి కర్కశానికి తల్లడిల్లి పోయాడు. స్థానికులు గుర్తించి అక్కున చేర్చుకున్నారు. కొత్తపేట, శ్రీనివాసమహల్ వెనుక పోతిన సాయిప్రసాద్‌వీధి, చింతాడ రాము ఇంటి సమీపంలో అప్పుడే జన్మించిన మగ శిశువును ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు రోడ్డుపై వదిలేసి వెళ్లారు. అర్ధరాత్రి దాటిన అనంతరం పసికూన ఏడుపు విని స్థానికులు సగురుపిళ్ల సోమరాజు కుటుంబ సభ్యులు బయటకు వచ్చి చూశారు. బొడ్డు కూడా ఊడని మగశిశువు , కాలిని ఎలుకలు కొరుకుతుండగా రక్తం కారుతుండగా గుక్క పెట్టి ఏడుస్తున్న దృశ్యం చూసి కలత చెందారు. వెంటనే అక్కున చేర్చుకుని సపర్యలు చేసి చికిత్స నిమిత్తం పాత ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. స్థానిక అంగన్‌వాడీ సిబ్బంది భోగిరెడ్డి రామలక్ష్మి ఆసుపత్రికి వెళ్లి మగ శిశువును పరిశీలించి కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారానికి దరఖాస్తులు

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలో ఇచ్చే జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం - 2025కు గురువులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి.సుబ్బారావు తెలిపారు. పదేళ్ల సర్వీస్ పూర్తి చేసిన వారు అర్హులని, ఆసక్తి గలవారు http;//nationalawardstoteacher.education.gov.in వెబ్‌సైట్‌లో ఈ నెల 13వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

పీజీ దంత వైద్య సీట్ల భర్తీకి పచ్చజెండా

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: 2025-26 విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు దంత వైద్య కళాశాలల్లో పీజీ (ఎండీఎస్) డిగ్రీ/డిప్లొమా కోర్సు కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. అభ్యర్థులు ఈ నెల రెండో తేదీ బుధవారం ఉదయం 9 గంటల నుంచి 6వ తేదీ రాత్రి 9 గంటల్లోగా వర్సిటీ వెబ్‌సైట్‌లో దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకొని వివరాలను నింపి ఆన్‌లైన్‌లోనే పంపాల్సి ఉంటుంది. అపరాధ రుసుంతో 7వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 8వ తేదీ రాత్రి 9 గంటలోగా పంపడానికి అవకాశం ఉంది. ఇంటర్న్‌షిప్ కటాఫ్ తేదీ ఈ ఏడాది జూన్ 30గా నిర్ణయించారు. నీట్ పీజీ ప్రవేశ పరీక్షలో జనరల్ కేటగిరికి 960 మార్కులకు గాను 261, ఎస్సీ/ఎస్టీ/బీసీకి 227 కటాఫ్ మార్కులుగా నిర్ణయించారు. వారే దరఖాస్తుకు అర్హులు. ఇతర వివరాలకు 89787-80501, 79977-10168 నంబర్లలో సంప్రదించాలని అధికారులు సూచించారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

[illegible]

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 590 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

పరిశ్రమలు, వ్యవసాయానుబంధ రంగాలపై దృష్టి

హాజరైన అధికారులనుద్దేశించి మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాల సాధనకు నియోజకవర్గాల దార్శనిక ప్రణాళికలు దోహదం చేస్తాయని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. నియోజకవర్గాల గ్రాస్ డొమెస్టిక్ ప్రొడక్ట్ (జీడీపీ)తో పాటు స్థూల విలువ జోడింపు, తలసరి ఆదాయం పెంపొందించే [illegible] చేపట్టాల్సి ఉంటుందన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచడంతో పాటు, ఆర్థిక వృద్ధిని వేగవంతం చేయడం ప్రణాళికల లక్ష్యమని వివరించారు. నగరంలోని కలెక్టరేట్‌లో జిల్లా, నియోజకవర్గాల దార్శనిక కార్యాచరణ ప్రణాళికలపై బుధవారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ.. పట్టణ ప్రాంతాల్లో సేవా రంగంపై, గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు, వ్యవసాయానుబంధ రంగాలైన పశుపోషణ, ఉద్యాన, మత్స్య సంపద తదితరాలపై దృష్టిపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం జిల్లా తలసరి ఆదాయం రూ.3.52 లక్షలు ఉండగా, 2047 నాటికి రూ.55 లక్షలకు చేర్చాలన్నదే లక్ష్యమన్నారు. దీనికి స్పష్టమైన ప్రణాళికలతో పాటు, వాటి అమలుకు సమష్టిగా కృషి చేయాలని కోరారు. పేదరిక నిర్మూలన (పీ-4)లో భాగంగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకునేందుకు తాజాగా రోటరీ క్లబ్ సభ్యులు ముందుకు వచ్చారని, వారి స్ఫూర్తితో మిగతా వారు భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. జేసీ ఎస్.ఇలక్కియా, వీఎంసీ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, గ్రామ/వార్డు సచివాలయాల జిల్లా అధికారిణి జి.జ్యోతి, సీపీవో వై.శ్రీలత, డీపీవో పి.లావణ్యకుమారి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.వి.సతీష్, ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి ఎ.రవీంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి, సామాజిక భద్రతకు 'ఈఎల్ఐ' పథకం

మాట్లాడుతున్న అబ్దుల్ ఖాదర్

సీతారాంపురం, న్యూస్‌టుడే : అన్ని రంగాల్లో ఉపాధి కల్పనకు మద్దతివ్వడానికి, ఉపాధి అవకాశాలు, సామాజిక భద్రత పెంపొందించడానికి ప్రభుత్వ ఉపాధి ఆధారిత ప్రోత్సాహక (ఈఎల్ఐ) పథకాన్ని కేంద్ర ప్రభుత్వం రూపొందించిందని ప్రాంతీయ భవిష్య నిధి కమిషనర్ అబ్దుల్ ఖాదర్ తెలిపారు. దుర్గా అగ్రహారంలోని కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడారు. ఈ పథకం కింద మొదటి సారి ఉద్యోగంలో చేరిన [illegible] రూ.15వేల ప్రోత్సాహకంగా అందించనున్నారు. [illegible] రెండేళ్లు అదనంగా ఈ ప్రయోజనాలు కల్పిస్తుందన్నారు. దీని కోసం 2024-25 కేంద్ర బడ్జెట్‌లో రూ.2 లక్షల కోట్లు కేటాయించారని తెలిపారు. ఈఎల్ఐ పథకం ద్వారా రూ.99,446 కోట్ల వ్యయంతో దేశంలో రెండు సంవత్సరాల కాలంలో 3.5కోట్లకు పైగా ఉద్యోగాల కల్పించే లక్ష్యంతో ప్రోత్సాహకాలు అందించనున్నారు. 1.92 కోట్ల మంది తొలి సారి ఉద్యోగంలో చేరనున్నారని వివరించారు. 2025, ఆగస్టు ఒకటి నుంచి 2027, జులై 31వ తేదీ మధ్య కాలంలో కల్పించిన ఉద్యోగాలకు ఈ పథకం ప్రయోజనాలు వర్తిస్తాయన్నారు. తొలి సారిగా ఉద్యోగంలో చేరే ఈపీఎఫ్ఓలో నమోదు చేసుకున్న ఉద్యోగులకు మాత్రమే ఈ పథకం వర్తిస్తుందని ఆయన వెల్లడించారు.

రన్నింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించండి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : రైల్వే లోకో రన్నింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. ఆలిండియా లోకో రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం [illegible] నిర్వహించారు. [illegible] రన్నింగ్ సిబ్బందికి సరైన విశ్రాంతి లేకపోవడంతో [illegible] చెప్పారు. కుటుంబ సభ్యులతో గడిపేందుకు వీలుగా నిర్ణీత పని గంటలు అమలు చేయాలని కోరారు. రైల్వే [illegible] నివేదికలు.. సిబ్బంది హక్కులకు భంగం కలిగేలా ఉన్నాయని ధ్వజమెత్తారు. అసోసియేషన్ [illegible] ఎం.వెంకటేశ్వర్లు, కార్యదర్శి ఆర్.వి.రామ మాట్లాడుతూ.. రైల్వే ప్రైవేటీకరణ నిలిపివేయాలని, నూతన పింఛను విధానాన్ని రద్దు చేయాలని, లోకో రన్నింగ్ సిబ్బంది ఖాళీలను భర్తీ చేయాలని, 8గంటల పని విధానాన్ని అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ రహదారుల విభాగం ఎస్ఈగా శంకరరెడ్డి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : ఏపీఆర్‌డీసీ కర్నూలు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వర్తిస్తున్న డి.శంకరరెడ్డి జాతీయ రహదారుల విభాగం విజయవాడ సర్కిల్ ఎస్ఈగా ఉద్యోగోన్నతిపై వచ్చారు. విజయవాడ డివిజన్ పీఏ, ఈఈగా విధులు నిర్వర్తిస్తున్న గోవిందరాజులనాయుడు విజయవాడ ఆర్‌అండ్‌బీ సర్కిల్ ఈఈ, డిప్యూటీ సూపరింటెండెంట్‌గా ఉద్యోగోన్నతిపై నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

తిరుపతమ్మకు ఆషాఢ సారె సమర్పణ

పూజా కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకొని తిరుపతమ్మ అమ్మవారికి పెనుగంచిప్రోలు భక్తులు సారె సమర్పించారు. గ్రామానికి చెందిన వేలాది మంది మహిళలు ముందుగా అమ్మవారి రంగుల మండపం వద్ద సారెకు బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అక్కడి నుంచి మేళతాళాలు, మంగళవాయిద్యాలు, భారీ ఊరేగింపుతో ఆలయానికి చేరుకున్నారు. వారికి ఆలయ ఈవో కిశోర్‌కుమార్, ఈఈ రమాదేవి, పాలకవర్గ సభ్యుడు బెజవాడ శ్రీనివాసరావు, అర్చకులు స్వాగతం పలికారు. ఆలయంలో అమ్మవారికి సారె సమర్పించి పూజలు చేశారు. అనంతరం దేవాలయంలో మహిళలకు సారె పంచారు. అన్నదానం నిర్వహించారు.

అందరి జీవితాల్లో యోగా భాగమైతే మేలు

కలెక్టర్ లక్ష్మీశ తదితరుల సాధన

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: అందరి జీవితాల్లో యోగా భాగమైతే ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ జి.లక్ష్మీశ పేర్కొన్నారు. యోగాంధ్ర-2025 ద్వారా జిల్లాలో తొమ్మిది లక్షల మందికి యోగాను చేరువ చేశామని, ఆ విజయంలో అమరావతి యోగా, ఏరోబిక్స్ అసోసియేషన్ కీలక పాత్ర పోషించిందని కొనియాడారు. స్థానిక ఐజీఎంసీ స్టేడియంలోని అమరావతి యోగా, ఏరోబిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 24 నుంచి జూన్ 12వ తేదీ వరకు నిర్వహించిన ఉచిత యోగా శిక్షణ శిబిరంలో పాల్గొన్న 108 మందికి బుధవారం ప్రశంసా పత్రాలు అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అమరావతి యోగా, ఏరోబిక్స్ సంఘం జిల్లాకు సంపద అని పేర్కొన్నారు. ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి మంచి ఆలోచనలు అవసరమని అన్నారు. గొప్ప ఆలోచనలకు ఆస్కారం కల్పించేలా శారీరక, మానసిక ఆరోగ్యాన్ని పెంపొందించే సత్తా యోగాకు ఉందని వివరించారు. నిత్య సాధన వల్ల నెగిటివ్ ఆలోచనలు దూరమై. . మనసంతా సానుకూల దృక్పథంతో నిండిపోతుందని చెప్పారు. ఫలితంగా ఆరోగ్య సమాజం సొంతం అవుతుందని చెప్పారు. జిల్లాలోని ఖాళీ స్థలాలు, పార్కుల్లో యోగా సాధనకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండాలంటే యోగాతోనే సాధ్యమని పేర్కొన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు మిరియాల వెంకటేశ్వరరావు, దాసరి కాశీవిశ్వనాథ్, విశ్రాంత డీసీపీ హరికృష్ణ, కార్యదర్శి పీవీ రమణ, కోశాధికారి ఎ.లావణ్యకుమార్, గురువు అంకాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రెండు వాహనాలను ఢీకొట్టిన లారీ



నుజ్జునుజ్జయిన లారీల ముందు భాగాలు



క్రేన్ ద్వారా పక్కకు తీస్తూ..

కృష్ణలంక, న్యూస్‌టుడే: మితిమీరిన వేగంతో వచ్చిన లారీ, రెండు వాహనాలను ఢీకొట్టిన ఘటన విజయవాడలోని కృష్ణలంక వద్ద జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన బొమ్మిడి నాగార్జున మంగళవారం రాత్రి కాకినాడలో సన్‌ఫ్లవర్ ఆయిల్ లోడు చేసుకొని గొల్లపూడిలో దింపేందుకు వెళ్తున్నారు. మితిమీరిన వేగంతో వస్తున్న లారీ కృష్ణలంక సత్యం హోటల్ సెంటర్ వద్ద అదుపు తప్పి ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. తరువాత లారీని పక్కకు తప్పించే క్రమంలో డివైడర్ ఎక్కి రహదారి అవతలి భాగం వైపునకు వెళ్లి.. ఆ సమయంలో బస్టాండ్ వైపు నుంచి వారధి వైపునకు వెళ్తున్న ఐషర్ వాహనాన్ని ఢీకొట్టింది. రెండు వాహనాల ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. డ్రైవర్లు, క్లీనర్లు క్యాబిన్లలో ఇరుక్కుపోయారు. ట్రాఫిక్ పోలీసులు.. స్థానికుల సాయంతో ఇద్దరిని వెలుపలికి తీసినప్పటికీ.. మరో ఇద్దరు లోపల ఉండిపోయారు. రెండు క్రేన్లను తెప్పించి వారిని కూడా బయటకు తీశారు. క్షతగాత్రులను 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఐషర్ వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్ తాడేపల్లిగూడెంకు చెందిన ఆరిమిల్లి వెంకటేశులు కాగా... గొల్లపూడిలో స్టీల్‌సామాన్లు లోడ్ చేసుకుని తణుకు వెళ్తున్నట్లు చెప్పారు. గాయపడిన క్లీనర్లు గొల్ల వంశీకృష్ణ, గుడిపూడి వెంకటేశ్వర్లుగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

91.9FM Vijayawada ఈ FM 91.9 Mee FM

ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008003297

यूनियन बैंक ऑफ इंडिया भारत सरकार का उपक्रम | యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా భారత ప్రభుత్వ రంగ సంస్థ

సూర్యారావుపేట బ్రాంచి
35-25-35, సన్‌రైజ్ హాస్పిటల్ ఎదురుగా,
సూర్యారావుపేట, విజయవాడ-520002.
Mail id:ubin0912263@unionbankofindia.bank

డిమాండ్ నోటీసు

DEMAND NOTICE ISSUED U/S.13(2) OF SARFAESI Act, 2002
Notice under sec.13(2) read with Sec.13(3) of Securitisation and Reconstruction of Financial Assets and Enforcement of Security Interest Act, 2002.

ఋణగ్రహీత: 1. మెస్సర్స్ ఓంకార విజయలక్ష్మి స్ట్రిప్స్ ప్రైవేట్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ. కోట భాను ప్రసాద్, నమోదిత చిరునామా: డి.నెం.76-18-45, ప్లాట్ నెం.45, ఐరన్ యార్డ్, భవానీపురం, విజయవాడ, కృష్ణాజిల్లా-520012. **హామీదారులు: 1. శ్రీ కోట భాను ప్రసాద్,** కేరాఫ్ కోట సాంబశివ ప్రసాద్, చిరునామా: 76-8/1-13, లలితా నగర్ రోడ్డు, భవానీపురం, ఆల్ఫా హోటల్ ఎదురుగా, విజయవాడ (అర్బన్), కామకోటి నగర్, కృష్ణాజిల్లా-520012. **2. శ్రీమతి కోట శ్రావణి,** కేరాఫ్ కోట భాను ప్రసాద్, చిరునామా: 76-8/1-13, లలితా నగర్ రోడ్డు, భవానీపురం, ఆల్ఫా హోటల్ ఎదురుగా, విజయవాడ (అర్బన్), కామకోటి నగర్, కృష్ణాజిల్లా-520012. **3. శ్రీ పి. వెంకట నరసింహ,** తండ్రి: లక్ష్మీ నారాయణ, చిరునామా: డి.నెం.12-2-26/1, బి.ఆర్.పి.రోడ్డు, జెండా చెట్టు సెంటర్ దగ్గర, ఇస్లాంపేట, విజయవాడ అర్బన్, కృష్ణాజిల్లా-520001. **4. శ్రీ కోట పృథ్వీ వెంకట తేజ,** కేరాఫ్ కోట భాను ప్రసాద్, చిరునామా: 76-8/1-13, లలితా నగర్ రోడ్డు, భవానీపురం, ఆల్ఫా హోటల్ ఎదురుగా, విజయవాడ (అర్బన్), కామకోటి నగర్, కృష్ణాజిల్లా-520012. **5. శ్రీ కోట రాహుల్ సాయి బాలాజీ,** కేరాఫ్ కోట భాను ప్రసాద్, చిరునామా: 76-8/1-13, లలితా నగర్ రోడ్డు, భవానీపురం, ఆల్ఫా హోటల్ ఎదురుగా, విజయవాడ (అర్బన్), కామకోటి నగర్, కృష్ణాజిల్లా-520012. **6. మెస్సర్స్ లక్ష్మీ స్టీల్ పైప్స్ అండ్ ట్యూబ్స్,** సూరంపల్లి, ప్రాతినిధ్యంవహిస్తున్న ప్రొప్రయిటర్, శ్రీమతి కోట శ్రావణి, చిరునామా: డి.నెం.8-99, 8-100 & 8-101, సూరంపల్లి గ్రామం, ఎలియాప్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ దగ్గర, గన్నవరం, కృష్ణాజిల్లా. **7. మెస్సర్స్ శ్రీ విజయలక్ష్మి స్టీల్ ట్రేడర్స్,** ప్రాతినిధ్యంవహిస్తున్న ప్రొప్రయిటర్ శ్రీ కోట భాను ప్రసాద్, చిరునామా: డి.నెం. 76-18-45, ప్లాట్ నెం.45, ఐరన్ యార్డ్, భవానీపురం, విజయవాడ-520012.

నేచర్ ఆఫ్ లిమిట్	ఎన్.పి.ఏ తేది నాటికి అంటే 23.06.2025 బకాయి మొత్తం	వర్తించని వడ్డీ	జరిమానా వడ్డీ (సరళమైనది)	బ్యాంక్ చేసిన ఖర్చు, ఛార్జీలు	23.06.2025 నాటికి బకాయి మొత్తం (రూ.)
CCSUV - 122625010000002	Rs. 24,41,18,210.89	Rs. 10,52,255.00	2%	Rs. 0/-	Rs. 24,51,70,465.89
TL - 122626390000001	Rs. 38,19,843.90	Rs. 23,097.58	2%	Rs. 0/-	Rs. 38,42,941.48
Total	Rs. 24,79,38,054.79	Rs. 10,75,352.58			Rs. 24,90,13,407.37

ఋణగ్రహీతలు చెల్లించాల్సిన లేదా భవిష్యత్తులో చెల్లించవలసిన మొత్తాలకు భద్రత కల్పించడానికి, క్రింది వ్యక్తులు/సంస్థలు ది.13.03.2024న పత్రాలపై ద్వారా సంతకం చేసి, ఈ క్రింది విధంగా భద్రతా ఆసక్తిని సృష్టించారు:
ఎ) శ్రీ. కోట భాను ప్రసాద్, ప్రాపర్టీ నెం.1కి యజమానిగా.
బి) మెస్సర్స్ లక్ష్మీ స్టీల్ పైప్స్ అండ్ ట్యూబ్స్, సూరంపల్లి (ప్రొప్రయిటర్ శ్రీమతి కోట శ్రావణి ద్వారా ప్రాతినిధ్యం వహించబడుతోంది), వీరు ఆస్తి నెం.2లోని ఐటెమ్ నెం.1 మరియు 2లకు యజమాని. అలాగే శ్రీమతి కోట శ్రావణి ప్రాపర్టీ నెం.2లోని ఐటెమ్ నెం.3కి యజమాని.
సి) మెస్సర్స్ ఓంకార విజయలక్ష్మి స్ట్రిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ (మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కె. భాను ప్రసాద్ గారి ద్వారా ప్రాతినిధ్యం వహించబడుతోంది), వీరు ఆస్తి నెం.3లోని ఐటెమ్ నెం.1కి యజమాని. అలాగే మెస్సర్స్ శ్రీ విజయలక్ష్మి స్టీల్ ట్రేడర్స్, విజయవాడ (ప్రొప్రయిటర్ శ్రీ కోట భాను ప్రసాద్ గారి ద్వారా ప్రాతినిధ్యం వహించబడుతోంది), వీరు ఆస్తి నెం.3లోని ఐటెమ్ నెం.2కి యజమాని.
ఈ భద్రతా ఆసక్తి ఈ క్రింది వాటికి సృష్టించబడింది:
ఎ) స్టాక్ హైపోథికేషన్: ది.**09.06.2025** నాటి తాజా స్టాక్ స్టేట్‌మెంట్ ప్రకారం స్టాక్‌ను హైపోథికేట్ చేయడం ద్వారా.
బి) ప్లాంట్ మరియు మెషినరీ హైపోథికేషన్: మెస్సర్స్ ఓంకార విజయలక్ష్మి స్ట్రిప్స్ ప్రైవేట్ లిమిటెడ్‌కు మంజూరు చేసిన టర్మ్ లోన్ నిధుల నుండి కొనుగోలు చేసిన ప్లాంట్ మరియు మెషినరీని హైపోథికేట్ చేయడం ద్వారా.
సి) దిగువ వివరించిన ఆస్తుల తనఖా (మోర్ట్‌గేజ్) ద్వారా.

దిగువ వివరించిన స్థిరాస్తుల వివరములు:

ఆస్తి నెం.1: ఎన్.టి.ఆర్ జిల్లా, విజయవాడ జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, విజయవాడ-520012, మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, ఇది 16వ వార్డు, బ్లాక్ నెం-12, ప్లాట్ నెం.45, ఐరన్ యార్డ్, భవానీపురం పరిధిలో ఆర్.ఎస్.నెం. 16/ఏ, 14/బి, 24/1, 25/1ఎ, 49/1బి, 15/2, 50/3ఏ3, 50/2, 50/3ఏ1, 14/2, 16/5ఈ, 16/3, 16/2బి, 16/1ఈ, 11, 15/1, 50/1, 15/2, 49, 53/డి1ఎ, 13/4ఎ, 24/2, 14/1బి, 16/1డి, 16/3ఎ, 16/2ఎ & 16/3ఈ, డి.నెం. 76-18-45 (పన్ను రసీదు ప్రకారం), సమీపంలోని డోర్ నెం. 76-18-130 (అమ్మకపు దస్తావేజు ప్రకారం), లో 471.00 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఆర్‌సిసి వాణిజ్య భూమి మరియు భవనం. ఆస్తి యజమాని శ్రీ కోట భాను ప్రసాద్ గారు. **ఆస్తికి హద్దులు: తూర్పు:** తేలప్రోలు రాజు గారి ఆస్తి ప్లాట్ నెం. 46, **దక్షిణం:** ఇతరుల ఆస్తి, **పడమర:** (గంధి రామారావు, కె.ఎ.ఎల్. నరసింహారావు గార్ల ఆస్తి ప్లాట్ నెం.43 & 44, **ఉత్తరం:** మున్సిపల్ రోడ్డు.

ఆస్తి నెం. 2: దిగువ పేర్కొన్న ఐటమ్‌లలో డోర్ నెం. 8-99, 8-100 మరియు 8-101 కలిగిన పారిశ్రామిక భూమి మరియు భవనం (షెడ్) యొక్క మొత్తం భాగాన్ని, దిగువ పేర్కొన్న ఐటమ్‌లను కలిపి ఆస్తికి ప్రాప్యతతో సహా. **ఐటెమ్ నెం.1:** కృష్ణాజిల్లా, గన్నవరం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం అధికార పరిధిలో, సూరంపల్లి గ్రామం, ఏలియాప్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ దగ్గర, ఆర్.ఎస్.నెం. 143/3లో 84 సెంట్లు లేదా 4065 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న స్థలం. ఈ ఆస్తికి మెస్సర్స్ లక్ష్మీ స్టీల్ పైప్స్ అండ్ ట్యూబ్స్, సూరంపల్లి (ప్రొప్రయిటర్ శ్రీమతి కోట శ్రావణి ద్వారా ప్రాతినిధ్యం వహిస్తున్న) యజమాని. **హద్దులు: తూర్పు:** కోయి రాధాకృష్ణ గారి ఆస్తి, **పడమర:** విక్రేత యొక్క మిగిలిన ఆస్తి, **ఉత్తరం:** విక్రేత యొక్క ఆస్తి, **దక్షిణం:** డొంక. **ఐటెమ్ నెం.2:** కృష్ణాజిల్లా, గన్నవరం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం అధికార పరిధిలో, సూరంపల్లి గ్రామం, ఏలియాప్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ దగ్గర, ఆర్.ఎస్. నెం. 143/3లో 17 సెంట్లు లేదా 822.80 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న స్థలం. ఈ ఆస్తికి మెస్సర్స్ లక్ష్మీ స్టీల్ పైప్స్ అండ్ ట్యూబ్స్, సూరంపల్లి (ప్రొప్రయిటర్ శ్రీమతి కోట శ్రావణి ద్వారా ప్రాతినిధ్యం వహిస్తున్న) యజమాని. **హద్దులు: తూర్పు:** విక్రేత యొక్క ఆస్తి, **పడమర:** మెస్సర్స్ శ్రీ లక్ష్మీ స్టీల్ పైప్స్ అండ్ ట్యూబ్స్ యొక్క ఆస్తి, **ఉత్తరం:** విక్రేత యొక్క ఆస్తి, **దక్షిణం:** మెస్సర్స్ శ్రీ లక్ష్మీ స్టీల్ పైప్స్ అండ్ ట్యూబ్స్ యొక్క ఆస్తి. **ఐటెమ్ నెం. 3:** కృష్ణాజిల్లా, గన్నవరం సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం అధికార పరిధిలో, సూరంపల్లి గ్రామం, ఏలియాప్ ఇండస్ట్రియల్ ఎస్టేట్ దగ్గర, ఆర్.ఎస్.నెం.142/2 మరియు 138, ప్లాట్ నెం.1లో 968 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న స్థలం. ఈ ఆస్తికి శ్రీమతి కోట శ్రావణి యజమాని. **హద్దులు: తూర్పు:** కొంతవరకు ప్లాట్ నెం.2 మరియు కొంతవరకు 40 అడుగుల వెడల్పు రోడ్డు, **పడమర:** మెస్సర్స్. శ్రీ లక్ష్మీ స్టీల్ పైప్స్ అండ్ ట్యూబ్స్ యొక్క ఆస్తి, **ఉత్తరం:** విక్రేత యొక్క మిగిలిన ఆస్తి, **దక్షిణం:** కోయి రాధాకృష్ణ గారి ఆస్తి.

ఆస్తి నెం. 3: దిగువ ఐటెమ్ నెం.1 మరియు 2లుగా పేర్కొన్న స్థలాలలో నిర్మించిన పారిశ్రామిక భూమి మరియు భవనం యొక్క మొత్తం భాగం. **ఐటెమ్ నెం.1:** ఎన్.టి.ఆర్ జిల్లా, విస్సన్నపేట సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం అధికార పరిధిలో, రెడ్డిగూడెం మండలం, ముచ్చనపల్లి గ్రామం, ఆర్.ఎస్.నెం. 348లో ఎకరా 1-00 సెంట్లు లేదా 4840 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఆస్తి. ఈ ఆస్తికి మెస్సర్స్ ఓంకార విజయలక్ష్మి స్ట్రిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ప్రాతినిధ్యం వహిస్తున్న మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ కోట భాను ప్రసాద్) గారు యజమాని. **హద్దులు: తూర్పు:** పెనుగొండ పుల్లారావు గారి భూమి, **దక్షిణం:** యలమంచిలి వంశీకృష్ణ గారి భూమి, **పడమర:** విస్సన్నపేట నుండి ఎ. కొండూరు రోడ్డు, **ఉత్తరం:** మెస్సర్స్ శ్రీ విజయలక్ష్మి స్టీల్ ట్రేడర్స్ యొక్క భూమి. **ఐటెమ్ నెం. 2:** ఎన్.టి.ఆర్ జిల్లా, విస్సన్నపేట సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం, రెడ్డిగూడెం మండలం, ముచ్చనపల్లి గ్రామం, ఆర్.ఎస్.నెం. 348లో ఎకరా 1-00 సెంట్లు లేదా 4840 చదరపు గజాల విస్తీర్ణంలో ఉన్న ఆస్తి. ఈ ఆస్తికి మెస్సర్స్ శ్రీ విజయలక్ష్మి స్టీల్ ట్రేడర్స్, విజయవాడ (ప్రొప్రయిటర్ శ్రీ కోట భాను ప్రసాద్ ద్వారా ప్రాతినిధ్యం వహిస్తున్న) యజమాని. హద్దులు: **తూర్పు:** పెనుగొండ పుల్లారావు గారి భూమి, **దక్షిణం:** మెస్సర్స్ ఓంకార విజయలక్ష్మి స్ట్రిప్స్ ప్రైవేట్ లిమిటెడ్ యొక్క భూమి, **పడమర:** విస్సన్నపేట నుండి ఎ. కొండూరు రోడ్డు, **ఉత్తరం:** పాలంకి కరుణాకర రెడ్డికి విక్రయించిన భూమి.

గౌరవనీయులైన సర్/మేడమ్

విషయం: ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టము ప్రకారము నోటీసు - మీరు మా నుండి పొందిన ఋణ సౌకర్యములకు సంబంధించి- నిరర్ధక ఆస్తులుగా వర్గీకరణ.

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా మీరు చెల్లించవలసిన లోన్ అకౌంట్స్ క్రింద మా **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, సూర్యారావుపేట బ్రాంచి** వద్దనున్న మీ ఋణ బకాయిలను / వడ్డీని చెల్లించుటలో విఫలమైనందున మీ ఖాతాను **ది.23-06-2025**న నిరర్ధక ఆస్తిగా (NPA) వర్గీకరించబడింది. ఎగువ తెలిపిన తేదిన మీ ఋణ ఖాతాల బకాయిలు **ది. 23-06-2025** నాటికి మొత్తము **రూ. 24,90,13,407.37** (అక్షరాలా ఇరవై నాలుగు కోట్ల తొంభై లక్షల పదమూడు వేల నాలుగు వందల ఏడు రూపాయల ముప్పై ఏడు పైసలు మాత్రమే) అనేక మార్లు విన్నపములు చేసినప్పటికి, మీరు మీ ఖాతాలోని బకాయి మొత్తములను చెల్లించలేదు/మీ ఋణములను చెల్లించలేదు. అందువలన సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్ 2002 యొక్క సెక్షన్ 13 (2) ప్రకారము మీ యొక్క బకాయి మరియు ఋణ పత్రములో అంగీకరించబడిన నియమ నిబంధనలలో ఉన్న ఒప్పంద రేటు ప్రకారము పైన తెలుపబడిన బకాయి తదుపరి నెలవారి వడ్డీ మరియు ఇతర ఖర్చులతో సహా ఈ నోటీసు అందిన 60 రోజులలోగా చెల్లించవలసి ఉంటుందని, అట్లు చేయుటలో విఫలమైనచో మీరు మా బ్యాంక్‌కు హామీ ఇచ్చిన ఆస్తులపై సదరు చట్టం ప్రకారం లభించు ఏవేని లేదా అన్ని హక్కులను ప్రయోగించవలసి ఉంటుందని తెలియజేయడమైనది.

1) మీరు సదరు బకాయిలను 60 రోజులలోగా తిరిగి చెల్లించుటలో విఫలమైనచో, బ్యాంక్ వారు సదరు చట్టం ప్రకారం వారికి సంక్రమించిన అన్ని హక్కులను వినియోగించి హామీ ఇవ్వబడిన ఆస్తుల విక్రయ ధనముతో బకాయిలను పూర్తిగా చెల్లించబడనప్పుడు, మిగిలిన బకాయి సొమ్ము మీ నుండి రాబట్టుకొనుటకు, న్యాయస్థానము/డెట్ రికవరీ ట్రిబ్యునల్ నందు తగు న్యాయపరమైన చర్యలు తీసుకోబడునని తెలియజేయడమైనది.
2) సదరు చట్టం యొక్క సెక్షన్ 13 (13) ప్రకారము ఈ నోటీసు పొందిన అనంతరం మీరు పైన చెప్పబడిన ఆస్తులను సాధారణ వ్యాపార కార్యకలాపాలు తప్ప బ్యాంక్ వారి అనుమతి
లేకుండా విక్రయించరాదు. మరియు లావాదేవీలు జరుపరాదు సదరు సెక్షన్‌లో నిబంధనలలో ఏ విధమైన అతిక్రమణ జరిగిన తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని గమనించగలరు.
3) SARFAESI చట్టంలోని సెక్షన్ 13 యొక్క సబ్ సెక్షన్ (8) ప్రకారము ఋణగ్రహీత తనఖా ఆస్తిని గడువు లోపల విడిపించుకొనుటకు గాను దృష్టిసారించవలసి ఉన్నది.

తేది : 24-06-2025 **అధీకృత అధికారి, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

EENADU Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా నా పేరు గవర్నమెంట్ రికార్డ్స్ ప్రకారము నా కరెక్ట్ పేరు కోన అంజలీదేవి (కొత్త పేరు), కోన అంజలీదేవి కాదు (పాత పేరు) అని తెలియజేయడమైనది. ఇట్లు: కోన అంజలిదేవి, డోర్ నెం: 32-11-26/B, చర్చ్ స్ట్రీట్, మొగల్‌రాజపురం, విజయవాడ.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవలకు, ఇంటి/వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95052 76677, 82474 49036.

REAL ESTATE

LAND FOR SALE

మెగా ★ఆవకాడో ★ఫామ్‌ల్యాండ్‌లో 11 సెంట్లు ★ 5 లక్షలకే ★ 5వ సంవత్సరం నుండి సంవత్సరానికి 2 లక్షల ఆదాయం పొందండి. ఫోన్: 9133574455

BOOK YOUR COLOUR CLASSIFIED ₹1200/- (5 Lines) PH: 98496 97616 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

NTR జిల్లా నందిగామ మండలంలోని కొత్త బెల్లంకొండవారిపాలెం ఊరిలో 2.5 ఎకరాల పొలం అమ్మబడును. వివరాలకు Ph: 9000654713.

JOBS

Wanted Experienced Technician For Fitness Equipment Showroom. Please Contact Pawan. ✆ 79813 88951/ 94403 56731.

కరెంటు మీటర్లు మార్చుటకు అనుభవం గల ఎలక్ట్రీషియన్స్ కావలెను. విద్యార్హత లేకపోయినా పర్వాలేదు. వీక్లీ పేమెంట్స్ ✆ 97035 51122, 94929 40505.

విజయవాడ పటమట ఫన్‌టైమ్స్ క్లబ్ రోడ్డులోని Com Club రెస్టారెంట్ నందు పనిచేయుటకు బిల్లింగ్ ఆపరేటర్ మరియు చెఫ్ (2 Pm to 10 Pm) కావలెను. ✆ 91001 92046.

విజయవాడలోని ప్రముఖ మొబైల్ షోరూం నందు పనిచేయుటకు మొబైల్ ఫీల్డ్‌లో అనుభవం గల Front ఆఫీస్ ఎగ్జిక్యూటివ్/ మేనేజర్, Stock పర్సన్ కావలెను. ✆ 70932 66678.

Wanted Teachers (Ladies) with U.G. or P.G. Qualification & Good English and Teacher for Science in High School. CIS - School, VJA-1. ✆ 81799 90508.

Wanted P.E.T Teacher with B.P.Ed to Seventh Day Adventist High School, Bander Road, Vijayawada. Ph: 90528 77533.

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. బో+వ+ మంచి జీతం+ ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

శ్రీ సాయి శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ & డెవలపర్స్ తాడేపల్లి వారి వినుకొండ దగ్గర్లో 22 ఎ. ఎర్రచందనం, మహాగని వెంచర్‌లో ప్లాట్లు అమ్ముటకు ఏజెంట్స్ కావలెను. ✆ 80081 93109, 95050 93432.

VJA 1 టౌన్ బ్రాహ్మణవీధిలో దుర్గా రెసిడెన్సీలో రిసెప్షనిస్ట్‌గా పనిచేయుటకు పురుష అభ్యర్థి కావలెను. 12 గం|| డ్యూటీ, 14 వేలు జీతం. ✆ 90305 52222.

శివకార్తికేయ హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు ఇంటి/ వంట పనిచేయుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 20K. ✆ 99120 11499, 99120 11899

ప్రముఖ ఆటోఫైనాన్స్ ఆఫీస్ నందు అనుభవంగల కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ Age: 25 - 30Y, Sal: 20K-22K. Qul: డిగ్రీ, సొంత ఇల్లు, బైక్ కావలెను. ✆ 99495 58181, 90325 58181.

జి.డి.యం.యం. నర్సింగ్ కళాశాల, నందిగామ, ఎన్టీఆర్ జిల్లా. బి.ఎస్సీ నర్సింగ్ విద్యార్థులకు బోధించుటకు M.Sc., B.Sc. (Nursing) అర్హతలు కలిగిన అధ్యాపకులు కావలెను. మరియు Boys హాస్టల్‌లో వార్డెన్ కావలెను. భోజనం, హాస్టల్ వసతి కల్పించబడును. వివరాలకు సంప్ర: మీ బయోడేటా ఇమెయిల్ gdmmcon@gmail.com లేదా వాట్సాప్ నెంబర్‌కు పంపగలరు 98492 02841, 99851 03566.

SECURITY GUARDS

హనుమాన్‌జంక్షన్ దగ్గర అరుగోలనులో పనిచేయుటకు 3 సం||లు అనుభవం గల సెక్యూరిటీ ఆఫీసర్ (45 సం||లోపు) కావలెను. జీతం: 25,000/- Ex ఆర్మీ, సివిలియన్ సంప్ర: 95737 01777.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

తిరువూరు

• తిరువూరు • మైలవరం

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
కొండపల్లి : 8008574656 మైలవరం 80085 74705

◆ కొండపల్లి శివక్షేత్ర థియేటర్ సమీపంలోని అపార్టుమెంట్ల ప్రాంతంలో వీధి దీపాలు వెల గడం లేదని స్థానికులు రాములు తెలిపిన సమస్యపై వీధి దీపాల పర్యవేక్షకుడు వాసు స్పందించారు. సిబ్బందితో ఆ ప్రాంతంలోని తీగలను సరి చేయించి దీపాలు వెలిగించారు. - న్యూస్‌టుడే, కొండపల్లి
◆ స్థానిక చెరువు బజార్‌లో నెల తరబడి మురుగు కాలు వల్లో పూడిక తీయకపోవడంతో అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యపై 'మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షిక సోమవారం సమస్యను ప్రచురించగా అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి పారిశు ధ్య సిబ్బందితో పూడిక తీయించి బ్లీచింగ్ చల్లించారు. - న్యూస్‌టుడే, జి.కొండూరు
◆ పట్టణంలోని కల్లూరు రోడ్డులో పిచ్చి మొక్కలు పెరిగి అప రిశుభ్రంగా ఉందని స్థానికులు మేమున్నాం.. మీకు తోడుగాకు చేసిన ఫిర్యాదుకు ఐసీడీఎస్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగ దీష్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి పురపాలిక కార్మి కులతో రహదారి పక్కన పిచ్చి మొక్కలు లేకుండా తొలగించ చేశారు. ◆ పట్టణంలోని 15వ వార్డులోని డ్రైనేజీలో పూడిక ఉందని స్థానికులు చేసిన ఫిర్యాదును శానిటరీ అధి కారికి తెలుపగా స్పందించారు. కార్మికులతో పూడికను శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు

హత్య కేసులో అనుమానితుడి ఆచూకీ లభ్యం

జి.కొండూరు, న్యూస్‌టుడే: మండలంలోని చెవుటూరు గ్రామంలో మంగళవారం హత్యకు గురైన మహిళ కేసులో పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్న ఉమ్మడి వేణు ఆచూకీ లభ్యమైనట్లు బుధవారం జి.కొండూరు ఎస్సై సతీష్‌కుమార్ తెలిపారు. హత్యకు గురైన హైమావతికి అద్దెకు ఉండే కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉండగా.. పెద్ద కుమారుడు కొడుకు(మన వడు)ని ప్రధానం అనుమానితుడిగా భావించారు. మంగళ వారం ఉదయం నుంచి అతడు కనిపించకపోవడంతో పోలీ సులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో హైదరాబాద్‌లో గుర్తించి అదుపులోకి తీసుకున్నా మని గురువారం ఉదయానికి జి.కొండూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చి విచారణ జరుపుతామని వెల్లడించారు.

విద్యా సామగ్రి వితరణ

జి.కొండూరు, న్యూస్‌టుడే: కవులూరు గ్రామంలోని మోడల్ ప్రాథమిక పాఠశాలలో 90 మంది విద్యార్థులకు తాడికొండ నారాయ ణరావు, చెరుకూరి శ్రీనివాసరావుల ఆర్థిక సాయంతో బుధవారం రాత పుస్తకాలు, పెన్సిళ్లు, పెన్నులు, అట్టలు తదితర సామగ్రి వితరణ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో సదుపా యాలను సద్వినియోగం చేసుకుని విద్యా ర్థులు ఉన్నతస్థాయి ఎదగాలని సూచించారు. పాఠశాలకు ఎలాంటి సాయం కావాల్సిన చేయడానికి సిద్ధంగా ఉంటామన్నారు. కార్య క్రమంలో హెచ్‌ఎం కవిత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక తనిఖీపై అవగాహన ప్రదర్శన

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై సామాజిక తనిఖీ అవగాహన ప్రదర్శన రెడ్డిగూ డెంలో బుధవారం నిర్వహించారు. ఈ సంద ర్భంగా తెదేపా నాయకులు అడ్డక్షుడు ఎం.నాగే శ్వరరెడ్డి మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకా నికి కూటమి ప్రభుత్వం అందజేస్తున్న సదుపా యాల గురించి వివరించారు. మేట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

సరకులు సక్రమంగా అందించాలి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: స్థానిక పంచా యతీ పరిధిలోని 12, 13 నంబర్ రేషన్ షాపు లను తహసీల్దార్ జె.సుశీలాదేవి బుధవారం తనిఖీ చేశారు. కార్డుదారులకు అందజేస్తున్న సరకుల సరఫరా వివరాలు లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అందరికీ సక్రమంగా సరకులు అందజేయాలని డీలర్లకు సూచిం చారు. ఈ కార్యక్రమంలో విస్సన్నపేట పీడీఎస్ డీటీ శివ నాగరాజు, ఆర్ఐ. జి.పుల్లయ్య, వీఆర్వో జానీసాహెబ్‌లు పాల్గొన్నారు.

చెంతనే బడి.. ఆనందమేనండి

పల్లె విద్యార్థులకు చేరువగా ఉన్నత పాఠశాల

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

పల్లె విద్యార్థులకు తమ గ్రామంలోనే ఉన్నత విద్యను అందించాలనే సంకల్పంతో ప్రాథమిక ఉన్నత పాఠశాలలు స్థాయిని పెంచింది. దీంతో 8వ తరగతి వరకు చదివిన బడిలోనే ఇక నుంచి 9, 10 తరగతుల వరకు చదువుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది. దీంతో ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం కొటికలపూడి, చిలుకూరు, పశ్చిమ ఇబ్రహీంపట్నం ప్రాథమికోన్నత పాఠశాల లను ఉన్నత పాఠశాలలు స్థాయి పెంచింది. ఇప్ప టికే దీనిపై రాష్ట్ర విద్యాశాఖ నుంచి ఆదేశాలు అందడంతోపాటు ప్రతి పాఠశాలకు ఏడుగురు ఉపాధ్యాయులు ఒక గెజిటెడ్ హోదా ఉన్న ప్రధా నోపాధ్యాయుడిని కూడా ఆయా పాఠశాలలో నియమించింది. ఈ విద్యాసంవత్సరం ఈ బడు లలో 9వ తరగతి ప్రవేశాలు పూర్తిచేసి తరగ తులు నిర్వహిస్తున్నారు. దీంతో బడి బయట విద్యకు దూరంగా బాలబాలికలు ఉండకూడదనే ప్రభుత్వ సంకల్పం నెరవేరనుంది.

మార్పు చేసిన కొటికలపూడి ప్రాథమికోన్నత పాఠశాల

తగ్గనున్న దూరాభారం

గ్రామాల్లో ఎంపీపీ పాఠశాలల ద్వారా చిన్న రులు 5వ తరగతి వరకు చదువుతున్నారు. ఆ తర్వాత యూపీ పాఠశా లలు మూడు నాలుగు గ్రామాలకు ఒకటి చొప్పున ఉంటోంది. అయ్యేనే 9, 10 చదవాలంటే కనీసం 3 నుంచి 5 కి.మీ దూరంలోని ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి ఉంటోంది. ఫలితంగా కొందరు తల్లిదం డ్రులు తప్పక పంపిస్తుండగా.. భద్రత దృష్టిలో ఉంచుకుని చాలా మంది తమ పిల్లలను ముఖ్యంగా ఆడపిల్లలను అంత దూరం పంపలేక బడి మాన్పించేస్తున్నారు. దీని వల్ల డ్రాపౌట్స్ సంఖ్య పెరుగుతోంది. అధికారులు గుర్తించి సమస్య తీవ్రత ఉన్న చోట ప్రాథమికోన్నత పాఠ శాలల్లో 75 మంది విద్యార్థులున్న పాఠశాలలను గుర్తించి 10 వరకు పెంచారు. దీనివల్ల దూరా భారం తగ్గడంతోపాటు బడి మానేసే బాలబాలికల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని అధికారులు అంటున్నారు.

బడుల వివరాలు	గతంలో	ఇప్పుడు
గ్రామీణ మండలంలో	2	4
కొండపల్లి పురపాలిక	3	4

సంతోషంగా ఉంది

మా ఊరిలో 8వ తరగతి పూర్తయిన తర్వాత హైస్కూల్‌కు ఐదు కి.మీ. దూరంలోని మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు మా బడినే హైస్కూల్ చేయడంతో సంతోషంగా ఉంది.
- ఎన్.వైశాలి, 9వ తరగతి, కొటికలపూడి

ట్రాఫిక్ ఇబ్బందులు ఉండవు

9, 10 తరగతులకు మూల పాడు ఉన్నత పాఠశాలకు పోవాల్సి వచ్చేది. ప్రస్తుతం మా బడిలో ఆ తరగతులు ఉండడంతో దాదాపు జాతీయ రహదారి వెంట ప్రయాణం చేయడం, ట్రాఫిక్ ఇబ్బందులు తప్పాయి.
- ఎం.శ్రీకాంత్, 9వ తరగతి, చిలుకూరు

విద్యార్థుల సౌకర్యార్థమే

గ్రామీణ మండలంలో 10వ తరగతి చదివే వీలు లేక బాలికలు బడి మానేస్తున్నారు. వీరికి అందు బాటులో ఉన్నతపాఠశాల లేకపోవడంతో సమస్య తలెత్తిందని ప్రభుత్వం నిర్వహించిన సర్వేలో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీని వల్ల బాలికలు కనీసం పదో తరగతి వరకు చదవగలుగుతారు. తద్వారా బాల్య వివాహాలు అడ్డుకునే వీలుంటుంది.
- పుష్పలత, ఎంఈవో, ఇబ్రహీంపట్నం

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

జి.కొండూరు, న్యూస్‌టుడే: పుట్టిన శిశువుకు 24 నెలలు వచ్చే వరకు క్రమం తప్పకుండా టీకాలు వేయాలని డీఎంహెచ్‌వో డా. సుహాసిని సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధ వారం ఆమె ఆకస్మికంగా సందర్శించి సిబ్బంది హాజరు పరిశీలిం చారు. అనంతరం సచివాలయం-1లో జరుగుతున్న టీకాల కార్యక్ర మాన్ని పర్యవేక్షించారు. వైద్యాధికారిణి కె.ప్రసన్నరాణి, ఆశా, ఏఎన్ ఎంలు తదితరులు పాల్గొన్నారు.

రికార్డులు పరిశీలిస్తున్న డా.సుహాసిని, పక్కన ప్రసన్నరాణి తదితరులు

మునేశ్వరరావు సేవలు ఆదర్శప్రాయం

ఇబ్రహీంపట్నంగ్రామీణం, న్యూస్‌టుడే: గుంటుపల్లి గ్రామాభి వృద్ధికి గ్రామ కార్యదర్శి మునేశ్వర రావు చేసిన సేవలు ఆదర్శప్రా యంగా ఉన్నాయని పలువురు వక్తలు కొనియాడారు. ఉద్యోగ విర మణ చేసిన మునేశ్వరరావు దంపతు లను బుధవారం పంచాయతీ కార్యా లయంలో గ్రామస్థులు, పాలకవర్గ సభ్యులు అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో సర్పంచి భూక్యాకవిత, తెదేపా నాయకులు, వివిధ గ్రామాల కార్యదర్శులు, అధికారులు, పంచా యతీ సిబ్బంది, పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పాస్ పోర్టు పోయినది
NTR జిల్లా, గంపలగూడెం (మండలం), సత్యాలపాడు కాపురస్తులయిన గుర్రాల వెంకటనర్సిరెడ్డి S/o. పిచ్చిరెడ్డి తెలియజేయునది ఏమనగా.. B3609345 అను నెంబరు గల నాయొక్క పాస్‌పోర్టు ది. 20-5-2025 మంగళవారం మా స్వగృహమునుంచి గంపలగూడెం జిరాక్స్ కోసం బైక్ మీద వెళుతుండగా మార్గ మధ్యలో పోయినది. దొరికినవారు క్రింది నెంబరుకు తెలియజేయగలరు.
✆ 63002 77826

ప్రజల ఆకాంక్షలు నెరవేర్చే సుపరిపాలన

మైలవరంలో ..

గంపలగూడెంలో..

తిరువూరు: కోకిలంపాడులో కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు, తెదేపా నాయకులు

గొల్లపూడి: మాజీ మంత్రి దేవినేని ఉమా ఆధ్వర్యంలో

ఎ.కొండూరు: మత్రియ తండాలో

కోకిలంపాడు(తిరువూరు), గొల్లపూడి, మైలవరం, కొండపల్లి, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా సుపరిపాలన అంది స్తోందని ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు పేర్కొ న్నారు. మండలంలోని కోకిలంపాడులో బుధవారం సాయంత్రం ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించి కరపత్రాలు పంపిణీ చేశారు. ◆ రాష్ట్రంలో అభివృద్ధి పనులు, ప్రజలకు సంక్షేమ పథకాలను అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా తిరువూరు, మైల వరం నియోజకవర్గాల్లో కూటమి నాయకులు కార్యక ర్తలు ఇంటింటా తిరిగి గత ఏడాదిలో అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను వివ రిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు.

శ్రీరమ్య తల్లిదండ్రులకు ఎమ్మెల్యే పరామర్శ

పుట్రేల(విస్సన్నపేట), న్యూస్‌టుడే: హైదరా బాద్ సమీప ఔషధ పరి శ్రమలో జరిగిన అగ్నిప్ర మాదంలో దుర్మరణం చెందిన మండలంలోని పుట్రేలకు చెందిన రామాల శ్రీరమ్య తల్లిదం డ్రులు నారయ్య, పద్మ, సోదరి జ్యోత్స్నలను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు బుధవారం రాత్రి పరామర్శించారు. మంగళవారం సదరు యువతి మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహిం చగా అర్ధరాత్రి స్వస్థల మైన పుట్రేలకు తీసుకు వచ్చారు. బుధవారం ఉదయం అంత్యక్రి యలు పూర్తి చేశారు. ఎమ్మెల్యే ఆమె చిత్రప టానికి నివాళులర్పించి తల్లిదండ్రులను పరామ ర్శించి ఓదార్చారు. ఎమ్మెల్యేను చూడగానే తల్లిదం డ్రులు, సోదరి విలపించడంతో ఆయన కూడా భావోద్వేగానికి గురయ్యారు. ఆ కుటుంబానికి అండగా ఉంటానని భరోసా ఇచ్చారు.

ఐక్యతకు ప్రతీక పీర్ల పండగ

ఇబ్రహీంపట్నంగ్రామీణం, న్యూస్‌టుడే: పీర్ల పండగ వంటి ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్య క్రమాలు మన సమాజంలో ఐక్యతను పెంచుతా యని మాజీ మంత్రి దేవినేని ఉమా పేర్కొ న్నారు. బుధవారం కేతనకొండలో నిర్వహించిన పీర్ల ఊరేగింపులో ఆయన పాల్గొన్నారు. గ్రామ స్థులు నిర్వహించిన సంప్రదాయ నృత్యాలు, ఊరేగింపులు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో మైనారిటీ నాయకులతో పాటు కూటమి నాయ కులు పాల్గొన్నారు.

తెగినా.. పట్టించుకోరా

మునగపాడు గ్రామంలో పెద్ద చెరువు కింద మాగాణి పొలాల్లో విద్యుత్తు తీగలు తెగి కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. ఈ పొలాల్లో నిత్యం రైతులు, పశువుల కాపరులు సంచరిస్తుం టారు. ఇది గమనించిన స్థానికులు అప్రమత్తమై విద్యుత్తు సిబ్బందికి తెల పడంతో రెండు రోజుల కిందట సరఫరా నిలిపివే శారు. ఆ పొలాల్లో తిరిగే వాళ్లు తెలియక ఆ తీగలను చూసి భయపడుతున్నారు. తక్షణమే విద్యుత్తు సిబ్బంది మరమ్మతులు చేసి ప్రమా దాలు జరగకుండా చర్యలు చేపట్టాలని స్థానిక రైతులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, జి.కొండూరు

బూడిద కళ్లలో పడుతోంది..!

జాతీయ రహదారి(65) పక్కన నిల్వచేశారిలా..

ఇబ్రహీంపట్నం బూడిద మయంగా మారుతోంది. ఇంటా, బయటా ఎక్కడ చూసిన వాటి నిల్వలే. తాజాగా పశ్చిమ ఇబ్రహీంపట్నం జాతీయ రహదారి పక్కన ఆ నిల్వలు వెలిశాయి. చెరువు నుంచి కాలువ ద్వారా వచ్చిన బూడిదను ఎన్టీటీపీఎస్ యాజమాన్యం జేసీబీల ద్వారా ఎత్తి రహ దారి పక్కన నిల్వ చేసింది. రెండు రోజులైనా వాటిని తొలగించక పోవడంతో అటుగా రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పగటి వేళ వీచే గాలులకు బూడిద లేచి ప్రయాణికుల కళ్లల్లో పడుతోందని వాపోతున్నారు. ఎన్టీటీపీఎస్ యాజమాన్యం స్పందించి బూడిద నిల్వలను తొలగిం చాలని, లేని పక్షంలో పురపాలిక సిబ్బందైనా సమస్య పరిష్కరించా లని కోరుతున్నారు. -న్యూస్‌టుడే, ఇబ్రహీంపట్నం

నిలిచిన నీటితో ఇక్కట్లు

స్థానిక పంచాయతీలోని 1, 2వార్డుల వైపు నుంచి కూడలి వైపు వచ్చే తారురోడ్డుపై వర్షంనీరు నిలుస్తుండంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో పాదచా రులు, ద్విచక్రవాహన చోదకులు రాకపోకలు సాగిస్తుంటారు. ఈ ప్రదేశంలో తారురోడ్డు పల్లంగా ఉండడంతో కొద్దిపాటి వర్షం పడినా నీరంతా అందులోకే చేరుతోంది. దీంతో అటుగా వెళ్లలే గ్రామస్థులు తిప్పలు పడుతున్నారు. ఇప్పటికైనా వర్షం నీరు రహదారిపై నిల్వకుండా డ్రెయినేజీల్లోకి వెళ్లేలా అధికా రులు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. - న్యూస్‌టుడే, రెడ్డిగూడెం

ఆక్రమణతో అవస్థలు

ఇలా వరిగడ్డి వామి అడ్డుగా పెట్టారిలా

మండలంలోని మొర్సుమిల్లిలో చెరువు నుంచి నీటి సరఫరా చేసే కాలు వకట్ట ఆక్రమణ రైతులకు ఇబ్బం దిగా మారింది. రాకపోకలను నిలు వరించేలా ఏళ్లుగా వరిగడ్డి వాములతో ఆక్రమిస్తున్నా అధి కారులు చర్యలు తీసుకోవడం లేదు. చెరువు నుంచి రైతుల పొలాలకు నీటిని సరఫరా చేసే కాలువపై ఆక్రమణలను ఇటీవల నిర్వహించిన అభివృద్ధి పనుల్లో భాగంగా కొన్ని తొలగించారు. అయితే ఒక రైతు తొలగించేందుకు ససేమిరా అనడంతో రైతులు ఇబ్బందులు పడుతు న్నారు. సమస్యపై చాలా కాలంగా ప్రజాప్రతినిధులు, అధికారులకు ఫిర్యాదు చేస్తున్నా, తొలగింపు చర్యలు కానరావటంలేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తొలగింపు చర్యలు తీసు కోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, మైలవరం

గ్రామీణ ప్రాంతాల నుంచీ ఆస్ట్రోనాట్‌లు తయారవ్వాలి

కుంటముక్కల గురుకులంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన జాహ్నవి

జి.కొండూరు, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల నుంచి మరింత మంది ఆస్ట్రోనా ట్‌లు తయారై దేశానికి గర్వకార ణంగా నిలవాలని జాహ్నవి దంగేటి సూచించారు. కుంటముక్కలలోని డా.బీఆర్.అంబే ద్కర్ గురుకుల బాలికల పాఠశాలను ఆమె బుధవారం సందర్శించి విద్యార్థినులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం గురుకుల సిబ్బం దితో కలిసి అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్ర మంలో ఎస్ఎస్‌ఏ ఏఎంవో అశోక్‌బాబు, డీసీవో మురళీకృష్ణ, ప్రిన్సి పల్ బ్యూలా, సర్పంచి వంగూరి కుమారి తదితరులు పాల్గొన్నారు.

కొండపల్లి, న్యూస్‌టుడే: ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు ప్రతి విద్యార్థి అహర్నిశలు శ్రమించాలని ఆస్ట్రోనాట్ జాహ్నవి దంగేటి అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన జాహ్నవి.. టైటాన్స్ స్పేస్ ఇండస్ట్రీస్ అంతరిక్ష యాత్రకు ఎంపిక య్యారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ లక్ష్మీశ..జాహ్నవితో విద్యార్థుల ముఖాముఖి కార్యక్రమాన్ని కొండపల్లి ఎస్టీ బాలికల గురుకుల పాఠశాలలో బుధవారం ఏర్పాటు చేయించారు. ఈ సందర్భంగా జాహ్నవి మాట్లాడుతూ.. అంతరిక్షం ఓ అద్భుతం.. దాని గురించి ఎంత వివరించినా తనివి తీరదన్నారు. స్పేస్‌లోకి వెళ్లాలన్న తన లక్ష్యానికి అందరూ సహకరించారని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ ఎస్‌డబ్ల్యూఆర్ఎస్ డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ మురళీకృష్ణ, సమగ్ర శిక్ష ఏఎంవో అశోక్‌బాబు, శిరీషరాణి తదితరులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి కృషి

సత్కారం అందుకున్న రామినేని రాజశేఖర్‌తో నాయకులు, కార్యకర్తలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: జూపూడిలో బుధవారం జరిగిన ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం తెదేపా విస్తృతస్థాయి సమావేశంలో కొండ పల్లి పురపాలిక ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, ఇబ్రహీంపట్నం గ్రామీణ మండలం తెదేపా అధ్యక్షుడు రామినేని రాజశేఖర్‌లను సత్కరిం చారు. నూతనంగా ఏర్పడ్డ కొండపల్లి పురపాలికలో పార్టీ బలోపే తానికి చిట్టిబాబు తన వంతు కృషి చేయాలని కోరారు. అనంతరం జరిగిన పార్టీ సమావే శంలో పరిశీలకులు జగ్గ య్యపేట నియోజకవర్గా నికి చెందిన నాగేశ్వరావు గ్రామీణ మండలానికి పార్టీ అధ్యక్షుడి ఎన్నిక విధి విధానాలు వివరిం చారు. ఆసక్తిగల వారి పేర్లను ప్రతిపాదించాలని సూచించగా పలువురు కొన్ని పేర్లు చెప్పారు. దీంతో ఆయన మాట్లా డుతూ విషయాన్ని పార్టీ పెద్దల దృష్టికి తీసుకెళ్తా నని చెప్పారు.

కొండపల్లి బొమ్మల విశిష్టత పర్యాటకులకు తెలియాలి

ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ తదితరులు

కొండపల్లి, న్యూస్‌టుడే: కొండపల్లి బొమ్మల విశిష్టతను పర్యాటకులకు చాటి చెప్పేందుకే ఎక్స్‌పీరి యన్స్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. కొండపల్లి బొమ్మలకాలనీలో రూపు దిద్దుకుంటున్న ఎక్స్‌పీరి యన్స్ సెంటర్ పనులను కలెక్టర్ బుధవారం పరి శీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ కొయ్య బొమ్మల విశిష్టత పర్యాటకులకు తెలియాలన్నారు. బొమ్మల కళా నైపుణ్యం కళ్లకు కట్టిన ట్లుగా తెలిసేలా సెంటర్ ఉండాలని పేర్కొన్నారు. అందుకు సంబంధిం చిన పెయింటింగ్ పనులు పూర్తి అయ్యా యని..మిగిలిన పనులు కూడా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో చైతన్య, పర్యాటక శాఖ జిల్లా అధికారి శిల్ప తది తరులు ఉన్నారు.

అ వీ ఇ వీ

ఉపాధ్యాయులకు సత్కారం

మునుకుళ్ల(తిరువూరు), మండలంలోని మునుకుళ్ల జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులు బి.వీరభద్రం, బాబాసాహెబ్, ఎం.రాంబాబు, రేణుకను బుధవారం హెచ్‌ఎం జక్కేపల్లి మురళీకృష్ణ ఆధ్వర్యంలో సత్కరించారు. పాఠశాల అభివృ ద్ధికి, విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు వారంతా చేసిన కృషిని అభినందించారు.

సమ్మె నోటీసు అందజేత

రాజుగూడెం, చౌటపల్లి(తిరువూరు), న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా ఈ నెల 9న జరగనున్న సమ్మెలో తాము కూడా పాల్గొం టున్నామని మండలంలోని చౌటపల్లి, రాజు గూడెం వైద్యాధికారులకు ఆశ కార్యకర్తలు బుధవారం సమ్మె నోటీసు అందజేశారు.

నాలుగు నెలలుగా వేతనాలు లేవు

విస్సన్నపేట, న్యూస్‌టుడే: మండలం లోని ప్రభుత్వ బడుల్లో మధ్యాహ్న భోజనం తయారు చేస్తున్న వంట ఏజెన్సీ సభ్యుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధ వారం ఏఐటీయూసీ జిల్లా నాయకుడు ఎం.త్యాగరాజు ఆధ్వర్యంలో ఎంఈవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. గత 4 నెలల నుంచి వేతనాలు ఇవ్వడం లేదని, పెరిగిన నిత్యావసర వస్తువుల ధరకు అను గుణంగా వంట సామగ్రి కొనుగోలుకు

సమస్యలు తీర్చాలని ఆందోళన

కొండపల్లి: మున్సిపల్ కార్మికుల వేతనాలు జీవో నంబర్-36 ప్రకారం పెంచాలని సీఐ టీయూ మండల అధ్యక్షులు మహేష్ డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యల పరి ష్కారంలో భాగంగా సీఐటీయూ రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆందోళనను కొండపల్లి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వద్ద మున్సిపల్ కార్మికులు బుధ వారం నిర్వహించారు.

జూదరుల అరెస్టు

తిరువూరు, న్యూస్‌టుడే: పట్టణంలోని అశోక్‌నగర్‌లో జూదమాడుతున్న నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 15,900 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై కేవీ జీవీ.సత్యనారా యణ బుధ వారం తెలిపారు.

ఇసుక టిప్పర్ స్వాధీనం

గంపలగూడెం, న్యూస్‌టుడే: కృష్ణా నది ఇసుకను తెలంగాణ రాష్ట్రానికి అక్ర మంగా తరలిస్తున్న టిప్పర్‌ను గంపల గూడెం పోలీసులు మంగళవారం రాత్రి మండల పరిధిలోని ఊటుకూరు సరిహ ద్దులో పట్టుకున్నారు. ఎస్సై శ్రీను తెలి పిన వివరాల మేరకు..తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెం సమీప రేవు నుంచి ఇసుక లోడు చేసుకున్న టిప్పర్ నూజివీడు, రెడ్డిగూడెం, గంపలగూడెం మండలాల మీదుగా కల్లూరు మండలం చిన్నకోరుకొండి వైపు సరైన పత్రాలు లేకుండా వెళుతుండగా ఊటుకూరు సమీ పంలో అదుపులోకి తీసుకున్నారు. ఉయ్యూరుకు చెందిన లారీ యజమాని పిట్ల సాంబయ్యపై వాల్టా చట్టం కింద కేసు నమోదు చేసి టిప్పర్‌ను గంపల గూడెం పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చారు.

గజలక్ష్మీదేవికి సారె సమర్పణ

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే: మండలం లోని పెనుగొలను శివారు మెట్టగుట్ట శేషాచల శ్రీనివాస ఆలయంలోని గజలక్ష్మి అమ్మవారికి బుధవారం ఖమ్మం జిల్లా మధిర, మర్లపాడు, ఇనగాలికి చెందిన శ్రీనివాస భక్తబృందం ఆధ్వర్యంలో ఆషాఢ సారె సమర్పించారు. ఆలయ అర్చకులు యోగానందాచార్యులు మూలవిరా ట్‌కు అభిషేకాలు నిర్వహించి అలంకరించగా భక్తులు దర్శించుకున్నారు.

పార్వతీ దేవికి..

ఇబ్రహీంపట్నంగ్రామీణం, న్యూస్‌టుడే: కాచవరం గ్రామానికి చెందిన మహిళలు రామలింగేశ్వరస్వామి దేవాలయంలో పార్వతీదేవికి బుధవారం ఆషాఢ సారె సమర్పించారు. శివారు సత్యనారాయణపురం, దొనబండ గ్రామాల నుంచీ మహిళలు ప్రదర్శనగా ఆలయానికి వచ్చి సారె సమర్పించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

ప్రకటన
ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా, నా క్లయింటు అయిన గుంటూరు జిల్లా, తాడేపల్లి గ్రామం, పార్క్ విల్లా, విల్లా నెం. 61, డోరు నెం.12-353/2/6 రు కాపురస్తులు మండలపు కోదండయ్య గారి కుమారుడు మండలపు హనుమంతరావు గారి సంజాయిషీ మేరకు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా స్థిరాస్తులను NTR జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, కొటికలపూడి గ్రామ కాపురస్తులు బండి వెంకయ్య గారి కుమారుడు బండి శ్రీనివాసరావు అనువారు, తమ స్వాధీన హక్కుభుక్తములో వున్నటువంటి NTR జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, దాములూరు గ్రామ పంచాయతీలో చేరిన సర్వే నెంబరు 92-13 దాఖలా య. 1-43 సెంట్లు మరియు సర్వే నెంబరు 92-12బి దాఖలా య. 0-16 సెంట్లు వెరశి మొత్తము య॥ 1.59 సెంట్లు గల క్రింది షెడ్యూల్ భూమిని నా క్లయింట్ కొనదలచి బయానాగా యాభై వేల రూపాయలు చెల్లించి యున్నారు. ఈ ఆస్తిని బండి శ్రీనివాసరావు గారు, ఆయన సోదర సోదరీమణులైన NTR జిల్లా, కంచికచర్ల మండలం, గండేపల్లి గ్రామ కాపురస్తులు 1) తురక సుందరరావు గారి భార్య తురక భాగ్యమ్మ, 2) రెంటపల్లి మిఖేల్ గారి భార్య రెంటపల్లి అరుణ, 3) తళమల మెర్లిన్ గారి భార్య తళమల రమాదేవి మరియు NTR జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, కొటికలపూడి గ్రామ కాపురస్తుడు 4) బండి వెంకయ్య గారి కుమారుడు బండి గోపాలరావు గార్ల ద్వారా జాయింటు హక్కుకు హక్కు విడుదల దస్తావేజు పొంది ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు ఆఫీసులో 27-06-2025 తేదీన దస్తావేజు నెం. 3937/2025 గా య. 1-59 సెంట్లు రిజిస్టర్ కాబడిన హక్కు విడుదల దస్తావేజు రీత్యా వారికి సంక్రమించి సర్వ స్వాధీన హక్కు భుక్తములో క్రింది షెడ్యూల్ ఆస్తులను అనుభవించుచున్నారని తెలియజేయుచున్నారు మరియు ఈ ఆస్తిని తమ తండ్రిగారైన బండి వెంకయ్య గారికి, పూర్వార్జితముగా సంక్రమించిన ఆస్తులను వారున్నూ, వారి సోదరులున్నూ కలిసి సుమారు 1985వ సం॥నకు పూర్వమే రైత్వారీ పద్ధతి ప్రకారం ముజువాణి విభాగములు చేసుకొనగా లభించి, ఆయన తదనంతరము వారి భార్య మరియు పై వారికి తల్లిగారైన బండి తులశమ్మ గారికి సంక్రమించి, ఆమె తదనంతరం వారసత్వ చట్ట రీత్యా వారి కన్నబిడ్డలైన పై వారికి సంక్రమించినదని తెలియజేయుచున్నారు. కావున బండి శ్రీనివాసరావు గారికి సర్వ స్వాధీన హక్కు భుక్తములో వున్నటువంటి క్రింది షెడ్యూల్ దాఖలా ఆస్తులపై ఎవరైనను, ఏవిధమైన అన్యాక్రాంతములు గాని, తనఖాలు, కోర్టు జప్తులు, హామీలు, భాగబట్టి తగాయిదాలు, ఇతరత్రా ఏమైనా హక్కులు వగైరాలు వున్న యెడల ఈ ప్రకటన తేదీ నుంచి 15 రోజుల లోపుగా తమ అభ్యంతరములను మండలపు హనుమంత రావు గారు, S/o.కోదండయ్య, డోరు నెం. 40-1/1-25/1, శ్రీ నిలయం, నారా చంద్రబాబునాయుడు కాలనీ, బెంజ్ సర్కిల్, విజయవాడ-520001, సెల్ నెం. 70130 32951 అనే చిరునామాకు వ్రాత పూర్వకముగా రిజిస్టర్ పోస్ట్ తిరుగు టపా ద్వారా పంపవలెను. సదరు గడువు లోపల ఎవరినుండైనా ఏవిధమైన అభ్యంతరములు, వగైరాలు రానియెడల నా క్లయింట్ ఈ దిగువ షెడ్యూల్ ఆస్తులను నిర్వివాద ఆస్తిగా భావించి, నా క్లయింట్ పేరున గానీ, వారు కోరిన వారి పేరున గాని విక్రయ దస్తావేజును పొందగలరు. గడువు అనంతరం వచ్చు అభ్యంతరములు, నా క్లయింట్‌ను గాని, సదరు ఆస్తిని గాని ఏవిధముగా బంధం చేయజాలవు.
షెడ్యూలు: NTR జిల్లా, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రారు వారి ఇలాకా, ఇబ్రహీంపట్నం మండలం, దాములూరు గ్రామ పంచాయతీ ఏరియాలో చేరిన దాములూరు గ్రామం దాఖలా 1వ అయిటం: రీ సర్వే నెం. 92-13 దాఖలా య.1-43 సెంట్లకు హద్దులు: తూర్పు: మల్లిడి వెంకటేశ్వరరావు గారి భూమి, దక్షిణం: 2వ అయిటం మరియు ఎద్దూరి పూర్ణచంద్రరావు గారి భూమి, పడమర: మల్లిడి గోవిందయ్య మరియు జొన్నలగడ్డ బుచ్చయ్య గార్ల భూమి, ఉత్తరం: బండి వెంకటేశ్వరరావు గారి భూమి.
2వ అయిటం: రీ సర్వే నెం. 92-12B దాఖలా య.0-16 సెంట్లకు హద్దులు: తూర్పు: 1వ అయిటం దాఖలా భూమి, దక్షిణం: ఎద్దూరి పూర్ణచంద్రరావు గారి భూమి, పడమర: మల్లిడి గోవిందయ్య మరియు జొన్నలగడ్డ బుచ్చయ్య గార్ల భూమి, ఉత్తరం: 1వ అయిటం దాఖలా భూమి.
వెరశి మొత్తము భూమి య. 1-59 సెంట్లు.
ఇట్లు: షేక్ ఇంతియాజ్, B.Com, LL.B (గోల్డ్ మెడలిస్ట్), D.I.T., LL.M (Corporate and Security Law) హై కోర్టు న్యాయవాది, విజయవాడ. సెల్: 7799 732 786

(c) eenadu

విజయవాడ తూర్పు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM
80085 74652

స్పందనకు వందనం

❖ మూడో డివిజన్ గుణదల చిన్న రైస్ మిల్లు ప్రాంతంలో దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానిక నివాసి కనకదుర్గ మేమున్నాం... మీకు తోడుగా ద్వారా మలేరియా అధికారి శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో దోమల పొగ చిమ్మించారు.

❖ 6వ డివిజన్ ఏలూరు రోడ్డు మారుతీనగర్ 6-38/14 విద్యుత్ స్తంభానికున్న దీపం గత కొంత కాలంగా వెలగడం లేదని స్థానిక నివాసి జానకిరామ్ మేమున్నాం... మీకు తోడుగా ద్వారా ఏఈ ప్రభాకర్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కొత్త దీపాన్ని ఏర్పాటు చేయించారు.

❖ నాలుగో డివిజన్ వెంకటేశ్వరనగర్, లయోల కళాశాల ప్రహరీ వెంబడి చెట్ల కొమ్మలు పడేశారని స్థానిక నివాసి ప్రవీణ్ మేమున్నాం... మీకు తోడుగా ద్వారా శానిటరీ అధికారి రామకృష్ణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సిబ్బందితో కొమ్మలను ఎత్తివేయించారు. - న్యూస్‌టుడే, కరెన్సీనగర్

చౌక బియ్యం పట్టివేత

పటమట, న్యూస్‌టుడే: అక్రమంగా తరలిస్తున్న 3 టన్నుల రేషన్ బియ్యాన్ని మాచవరం పోలీసులు పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం... పటమట నల్లూరి సత్యనారాయణనగర్‌కు చెందిన పందిరిపల్లి మల్లికార్జున, బావాజీపేటకు చెందిన కురిటి దుర్గాప్రసాద్ ఏప్రిల్ వరకు ఇంటింటికీ రేషన్ బియ్యం వాహనాల ద్వారా ప్రజలకు బియ్యం పంపిణీ చేసేవారు. ఏప్రిల్ నుంచి ప్రభుత్వం ఆ వాహనాలను నిలిపివేసింది. ఆ క్రమంలో వారు బాడవపేటలోని మీరాబీ అనే మహిళ ఇంటి వద్ద నుంచి రేషన్ బియ్యాన్ని వాహనం ఎక్కించుకుంటుండగా మాచవరం పోలీసులు సరకుతో పాటు ఆ ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రకాష్ తెలిపారు.

చీఫ్ మెడికల్ అధికారిగా అర్జునరావు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ అధికారి (సీఎంవోహెచ్)గా కుంబా అర్జునరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగం జాయింట్ డైరెక్టర్‌గా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఆయన్ని నగరపాలక సంస్థకు బదిలీ చేసింది. గతంలోనూ కొంతకాలం పాటు ఆయన సీఎంవోహెచ్ పోస్టులో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లారు. తిరిగి బదిలీపై వచ్చారు. త్వరలో బాధ్యతలు చేపడతారు.

చదువు పరిమితం.. పథకాలు దూరం!

క్షేత్ర స్థాయిలో విద్యార్థుల సర్వే

కరెన్సీనగర్, న్యూస్‌టుడే

ప్రజల నుంచి వివరాలను సేకరిస్తున్న విద్యార్థిని

డిగ్రీ పాఠ్య ప్రణాళికలో భాగంగా మొదటి ఏడాది పూర్తయిన విద్యార్థులు తమ గ్రామాల పరిధిలో కుటుంబ సర్వే నిర్వహించారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి నిబంధనలు, నూతన విద్యా విధానానికి అనుగుణంగా స్థానిక ఆంధ్రా లయోల కళాశాల విద్యార్థులు 950 మంది క్షేత్ర సాయి పరిశీలనకు వెళ్లారు. సమాజ స్థితిగతులు, పథకాల అమలు తీరు తదితర అంశాలపై వివరాలు సేకరించారు. 49 మంది అధ్యాపకులు మెంటర్లుగా వ్యవహరించారు. ఒక్కొక్కరికీ 20 మంది విద్యార్థులను కేటాయించారు. వారంతా గత నెల 5 నుంచి జూన్ 5 వరకు తమ గ్రామాల్లోని దారిద్ర్య రేఖకు దిగువున ఉన్న కుటుంబాలను సర్వే చేశారు. ఒక్కో కుటుంబానికి 100 ప్రశ్నలు అడిగి జవాబులు రాబట్టారు. ఆ నివేదికను తాజాగా సమర్పించారు. ప్రాజక్టుకు కన్వీనర్‌గా కళాశాల వైస్ ప్రిన్సిపల్ ఫాదర్ ప్రభుదాస్, కోఆర్డినేటర్‌గా జాన్ వ్యవహరించారు. సర్వేలో గుర్తించిన అంశాలు వారి మాటల్లోనే..

పాఠశాల విద్యతోనే సరిపెడుతూ..

ఆధార్, పాన్, రేషన్ తదితర కార్డులున్నా.. అప్‌డేట్ చేసుకోలేక పోతున్నారు. ఎక్కువ మంది పిల్లలు పాఠశాల విద్యకే పరిమితం అవుతున్నారు. పథకాలపై అవగాహన కల్పించాం. పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలి. - దాస్ సాయి సుదీప్ కుమార్, రామవరప్పాడు

కూలీలుగా మారుతున్న రైతులు

గతంలో ఆకుకూరలు, పూలు పండించే రైతులు రాబడి లేక కూలీలుగా మారుతున్నారు. తల్లికి వందనం వంటి పథకాలు కొంతమందికి తెలియడం లేదు. ఇళ్లు కట్టుకొనే అవకాశాలున్నా.. గుడిసెల్లోనే మగ్గుతున్నారు. నిరుద్యోగ భృతికి ఎదురు చూస్తున్నారు. - నూర్‌బాషా ప్రేమ్, వెదుళ్లపల్లి

చెడు అలవాట్ల బారిన...

తెనాలి పరిధి సంగం జాగర్లమూడి ప్రాంతంలో పిల్లలు పాఠశాల విద్యకు దూరంగా ఉంటున్నారు. చెడు అలవాట్లకు బానిసలవుతున్నారు. పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాల గురించి వారి తల్లిదండ్రులకు వివరించాం. పిల్లలను చదివించాలని కోరాం. - నీలటూరి యూనిస్, సంగం జాగర్లమూడి

బడి మానేస్తున్నారు

రైతులు కంపెనీల్లో పనికి, వారి భార్యలు ఇళ్ల పనికి వెళ్తున్నారు. ప్రాథమిక స్థాయి వరకే గ్రామంలో పాఠశాల ఉండడంతో ఉన్నత విద్యకు గొల్లనపల్లి వెళ్లాల్సిందే. ఫలితంగా కొందరు చదువు మానేస్తున్నారు. అమ్మకు వందనం ఇస్తున్నారని మళ్లీ బడికి పంపాలనుకుంటున్నారు. - దేవరపల్లి కారుణ్య, బీబీ గూడెం

ప్రమాదాల నివారణ

మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే : ఎనిమిదో డివిజన్ మదర్‌థెరెసా కూడలిలోని కోనేరు లక్ష్మయ్య వీధి నుంచి ఫార్చ్యూన్ మురళీపార్క్ హోటల్ ఎదురుగా ఉన్న రహదారిని కలిపే మలుపులో తక్కువ ఎత్తులో విద్యుత్తు ఫ్యూజ్‌బాక్సు ఉంది. అది ప్రమాదకరంగా మారిందంటూ ఈ నెల 28న 'ఈనాడు'లో 'మలుపులో ప్రమాదకరంగా' శీర్షికతో కథనం ప్రచురితమైంది. విద్యుత్తు శాఖాధికారులు స్పందించారు. ఫ్యూజ్‌బాక్సును ఎక్కువ ఎత్తులో ఏర్పాటు చేయించారు.

ఎక్కువ ఎత్తులో ఏర్పాటు చేసిన ఫ్యూజ్ బాక్సు

స్పందనకు వందనం

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, అనురాధ

పటమట, న్యూస్‌టుడే: ప్రజల సమస్యలకు పరిష్కారం చూపేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, జడ్పీ మాజీ ఛైర్‌పర్సన్ గద్దె అనురాధ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా 12వ డివిజన్ రఘు గార్డెన్, కరివేపాకు తోట, అశోక్‌నగర్ ప్రాంతాల్లో బుధవారం వారు పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజలు తెలియజేసిన సమస్యలను యాప్‌లో నమోదు చేస్తున్నామని తెలిపారు. వెంటనే ఆ సమాచారం సీఎం చంద్రబాబు దృష్టికి వెళ్తుందని చెప్పారు. స్థానిక నేతలు ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించడమే కాకుండా సమస్యలు తెలుసుకొని యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. నెల రోజుల పాటు కొనసాగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి అందరం సమష్టి కృషి చేద్దామని అన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు వెలగపూడి శంకరబాబు, కార్పొరేటర్లు సాయిబాబు, ముమ్మనేని ప్రసాద్, నాయకులు శాయన బుజ్జి, మహ్మద్ ఖాలిక్, పేరేపి ఈశ్వర్, కరీమ్, మేదరమెట్ల నారాయణ, తుమ్మల శేషుబాబు, జక్కుల సుబ్బారావు, యలమంచిలి రవీంద్ర, చలసాని రమణ్ తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక పారిపోయిన విద్యార్థులు

గంటల వ్యవధిలో పట్టుకున్న పటమట పోలీసులు

ఆటోనగర్, న్యూస్‌టుడే: హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక పారిపోయిన ఇద్దరు విద్యార్థులను విజయవాడలోని పటమట పోలీసులు గంటల వ్యవధిలో పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం. . తల్లిదండ్రులు లేక ఆర్థిక ఇబ్బందులున్న పేద విద్యార్థులకు కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం ఏకమూరు గ్రామంలోని రెహబత్ వాలంటరీ హాస్టల్ ఉచితంగా ఆశ్రయం కల్పిస్తుంది. తెలంగాణ రాష్ట్రం నకిరేకల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి, నంద్యాల జిల్లా నందికొట్కూర్‌కు చెందిన 9వ తరగతి విద్యార్థి ఏకమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతూ.. స్థానిక హాస్టల్‌లో ఉంటున్నారు. హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక బుధవారం ఉదయం వసతి గృహం నుంచి బయటకు వచ్చి బస్సు ఎక్కి విజయవాడ ఆటోనగర్ వచ్చారు. వారు బస్‌స్టేషన్‌లో దిగారనే సమాచారంతో కృష్ణా జిల్లా పోలీసులు... పటమట పోలీసులను అప్రమత్తం చేశారు. పటమట సీఐ పవన్ కిషోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలించాయి. ఉదయం 10 గంటలకు పంట కాలువ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నారు. హాస్టల్ నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. ఇద్దరికీ సీఐ కౌన్సెలింగ్ ఇచ్చి వారిని కుటుంబ సభ్యులు, హాస్టల్ నిర్వాహకులకు అప్పగించారు.

రోడ్లపై వాన నీరు నిలిచిపోకుండా చర్యలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని రహదార్ల వెంట వర్షపు నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ప్రకాశం బ్యారేజ్, రామవరప్పాడు రింగ్, ఏలూరు రోడ్డు, కృష్ణలంక, రాణిగారితోట, గుణదల, ఈఎస్ఐ ఆస్పత్రి, కరెన్సీనగర్ ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. వర్షాకాలంలో బాధ్యులైన అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రహదార్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని తెలిపారు. డ్రెయిన్లలో పూడికతీత పనులు నిరంతరం చేపట్టాలని, మురుగు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అన్న క్యాంటీన్లను పరిశీలించారు. అధికారులు సామ్రాజ్యం, మోహన్‌బాబు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

పూడికతీత పనులు పరిశీలిస్తున్న కమిషనర్ ధ్యానచంద్ర

స్థాయీ సంఘం సభ్యుల ఎన్నిక ప్రారంభం

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ స్థాయీ సంఘం నూతన సభ్యుల కమిటీకి ఈ నెల 17వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. పాలకపక్షం చివరి ఏడాదికి సంబంధించి ఎంపిక చేసిన నలుగురు కార్పొరేటర్లు ఎన్నికల అధికారి డి.చంద్రశేఖర్‌కు బుధవారం తమ నామినేషన్లను అందజేశారు. స్థాయీ సంఘం సభ్యులుగా మొత్తం ఆరుగురు కార్పొరేటర్లను ఎన్నుకోవాల్సి ఉండగా, పాలకపక్షం ప్రస్తుతం ఎంపిక చేసిన నలుగురు మాత్రమే నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. మరో ఇద్దరిని వైకాపా ఎంపిక చేయాల్సి ఉంది. వైకాపా నుంచి కార్పొరేటర్లు శీరంశెట్టి పూర్ణచంద్రరావు, షేక్ రహమతున్నీసా, మొహమ్మద్ రెహానా నాషిద్, పుప్పాల నరసకుమారి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి సమర్పించారు. ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్లు దాఖలు చేస్తున్న కార్పొరేటర్లు

మధ్యాహ్న భోజనం పరిశీలన

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో సుబ్బారావు

కృష్ణలంక, న్యూస్‌టుడే: విద్యార్థులకు పోషక విలువలతో కూడిన బియ్యంతో నాణ్యమైన ఆహారాన్ని అందిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు అన్నారు. కృష్ణలంక ఏపీఎస్సారెమ్ పాఠశాలకు బుధవారం ఆయన వచ్చారు. విద్యార్థులకు అందజేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వారితో కలిసి భోజనం చేశారు. హెచ్‌ఎం రమేష్ తదితరులు ఉన్నారు.

నేటి నుంచి సీనియర్ మల్టీ డే క్రికెట్ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రా క్రికెట్ సంఘం(ఏసీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ నుంచి మూలపాడులోని ఏసీఏ క్రికెట్ కాంప్లెక్స్‌లో ఏసీఏ సెంట్రల్ జోన్ సీనియర్ మల్టీ డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీ నిర్వహిస్తారు. టోర్నీలో పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జట్లు తలపడనున్నాయి. తొలి రోజైన గురువారం డీవీఆర్ మైదానంలో గుంటూరు, పశ్చిమ గోదావరి, సీపీ మైదానంలో కృష్ణా, ప్రకాశం జట్ల మధ్య మ్యాచ్‌లు ఉంటాయని ఏసీఏ వర్గాలు వెల్లడించాయి.

రహదారిపై మురుగు.. రాకపోకలకు ఇక్కట్లు

ఎనిమిదో డివిజన్ ఫార్చ్యూన్ మురళీ పార్క్ హోటల్ పక్క రహదారిలో మ్యాన్‌హోల్ నుంచి మురుగు బయటకు పొంగి ప్రవహిస్తోంది. రాకపోకలు కొనసాగించే పాదచారులు, ద్విచక్రవాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దుర్వాసన వెలువడుతోందని స్థానికులు చెబుతున్నారు. సమస్యను అధికారులు పరిష్కరించాలని కోరుతున్నారు. - మొగల్రాజపురం (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే

మరమ్మతులు చేస్తే.. అక్కరకు రావా?

కొత్త ప్రభుత్వ ఆసుపత్రి ఆవరణలోని ఏ బ్లాక్ మధ్య నడక మార్గంలో చక్రాల కుర్చీలు, కుర్చీలు, స్ట్రెచర్లు మూలన పడేశారు. బి, సి బ్లాక్‌ల మధ్య కూడా మరికొన్ని పడి ఉన్నాయి. ఇప్పటికే ఆసుపత్రిలో చక్రాల కుర్చీలు, ఇతర సామగ్రి కొరత ఉంది. వాటికి మరమ్మతులు చేస్తే ఉపయోగపడతాయి. అధికారులు చొరవ చూపాలని రోగులు కోరుతున్నారు. - విజయవాడ వైద్యం, న్యూస్‌టుడే

లీకేజీలతో నీరు వృథా... పట్టించుకుంటే కదా?

రామవరప్పాడు రింగ్ సెంటర్ నుంచి ఇంద్రలోక్ కాలనీకి వెళ్లే మార్గంలో తాగునీటి పైపు పగిలింది. నీరు వృథాగా పోతోంది. ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. నీరంతా ఏలూరు రోడ్డుకు వచ్చి మురుగునీటి తటాకంలా మారింది. ఒప్పంద కార్మికులు సమ్మె చేస్తున్నారని కార్పొరేషన్ అధికారులు చెబుతూ లీకేజీలను పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. - కరెన్సీనగర్, న్యూస్‌టుడే

వెలగని వీధి దీపం.. అలముకున్న అంధకారం

లబ్బీపేట తుర్లపాటి కుటుంబరావు వీధి బాలాజీ టవర్స్ రోడ్డులో 7-89/36 నంబరు వీధి దీపం వెలగడం లేదు. రాత్రి రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు రాత్రి ద్విచక్రవాహనాల్లో పెట్రోలు, ఆటోల్లో బ్యాటరీలు దొంగిలిస్తున్నారని వాపోతున్నారు. అధికారులు స్పందించి వీధి దీపం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. - లబ్బీపేట (విజయవాడ సిటీ), న్యూస్‌టుడే

గద్దె ఫౌండేషన్ చేయూత

సీతామహాలక్ష్మికి ఆర్థిక సాయం అందజేస్తున్న క్రాంతి కుమార్

పటమట, న్యూస్‌టుడే: తన తండ్రి ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ నిత్యం ప్రజా సేవలో ముందుకు సాగుతున్నారని, ఆయన మార్గానే తాను అనుసరిస్తూ సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెదేపా నాయకుడు గద్దె క్రాంతికుమార్ అన్నారు. గద్దె ఫౌండేషన్ ద్వారా క్రాంతి కుమార్ బుధవారం కొంతమందికి రూ.42 వేల ఆర్థిక సాయం అందజేశారు. 15వ డివిజన్‌కు చెందిన గాదం సీతామహాలక్ష్మి వైద్య ఖర్చులకు రూ.10 వేలు, 6వ డివిజన్‌కు చెందిన పరిమి సౌజన్యకు కళాశాల ఫీజు నిమిత్తం రూ.22 వేలు, 12వ డివిజన్‌కు చెందిన కె.భవానీకి ఫీజు నిమిత్తం రూ.5 వేలు, 9వ డివిజన్‌కు చెందిన కొక్కిలిగడ్డ వెంకటరత్నం చనిపోగా.. ఆ కుటుంబ సభ్యులకు రూ.5 వేలు ఆర్థిక సాయం ఆయా ఇళ్లకు వెళ్లి అందజేశారు. తెదేపా నాయకులు పాల్గొన్నారు.

అధికారుల ఏకపక్ష నిర్ణయాలపై నిరసన

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : కొంత మంది అధికారులు తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలు, తగిన ధ్రువీకరణ లేకుండా విద్యా హక్కు చట్టం దరఖాస్తుదారులను చేర్చుకోవాలని బలవంతం చేయడం, షోకాజ్ నోటీసులతో వేధించడం, పాఠశాల గుర్తింపు రద్దు చేస్తామని బెదిరించడం వంటి చర్యలకు నిరసనగా రాష్ట్రంలోని అన్ని ప్రైవేట్ అన్ ఎయిడెడ్ పాఠశాలలను గురువారం మూసివేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.తులసివిష్ణు ప్రసాద్, ఇండిపెండెంట్ స్కూల్స్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీకాంత్‌బాబు, యునైటెడ్ ప్రైవేట్ ఇండిపెండెంట్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు దాసరి శ్రీనివాస్, యునైటెడ్ ప్రైవేట్ స్కూల్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ మహంతి తెలిపారు. ఈ నిరసన ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని, అధికారుల తీరుకు మాత్రమేనని చెప్పారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

ముందుగానే రేషన్.. ఇంటికే చేరెను

వృద్ధులు, దివ్యాంగులకు ఊరట

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే

పటమటలో వృద్ధురాలికి రేషన్ ఇస్తున్న డీలర్

గత వైకాపా ప్రభుత్వంలో ఇంటింటికీ రేషన్ సరకులు పంపిణీ చేస్తామని ఎండీయూ వాహనాల విధానాన్ని ప్రవేశపెట్టారు. వీధిలో ఓ చోట వాహనం నిలిపి సరకులు ఇచ్చే వాళ్లు. ఎప్పుడు వాహనం వస్తుందో తెలియని పరిస్థితి. పనులు మానుకుని లబ్ధిదారులు ఉండేవారు. వాహనం వచ్చినప్పుడు అందుబాటులో లేకపోతే సరకులు తీసుకోవడం కష్టమే. ఆయా సమస్యలు పరిష్కరించడానికి కూటమి ప్రభుత్వం ఆ విధానాన్ని రద్దు చేసింది. పాత పద్ధతిలో రేషన్ దుకాణాల్లోనే సరకుల పంపిణీకి చర్యలు తీసుకుంది. దుకాణానికి వెళ్లలేని వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే తీసుకెళ్లి సరకులు ఇస్తున్నారు.

62 శాతం మందికి పంపిణీ: తూర్పు నియోజకవర్గంలోని 21 డివిజన్లలో 88 చౌకధరల దుకాణాలు ఉన్నాయి. వాటి పరిధిలో 66,878 మంది కార్డుదారులు రేషన్ దుకాణానికి వెళ్లి సరకులు తీసుకుంటారు. 7,085 మంది వృద్ధులు, దివ్యాంగులు ఉన్నారు. వారి ఇళ్లకు డీలర్లే రేషన్ తీసుకెళ్లి అందిస్తున్నారు. జులై 1 నుంచి 5వ తేదీలోపు ఇళ్ల వద్దకు వెళ్లి సరకులు ఇవ్వాలని నిబంధన. ఆ సమయంలో ఇతర కార్డుదారులు డిపోల వద్దకు వచ్చే అవకాశం ఉంది కనుక జులై నెల బియ్యం, ఇతర సరకులు ముందుగానే వృద్ధులు, దివ్యాంగులకు ఇచ్చారు. మిగిలిన కార్డుదారులకు యథావిధిగా డిపోల వద్దే పంపిణీ చేస్తున్నారు. 7,085 మంది వృద్ధులు, దివ్యాంగులు ఉండగా... 4455 మందికి రేషన్ అందజేశారు. బుధవారానికి 62 శాతం పంపిణీ చేశామని పౌర సరఫరాల సంస్థ ఏఎస్ఓ శ్రీనివాస్ తెలిపారు. నూరు శాతం పంపిణీ చేయాలనే లక్ష్యంతో అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

గతంలో ఎండీయూ వాహనం వద్ద వేచి ఉండడం, సర్వర్ల మొరాయింపు తదితర సమస్యలు లేకుండా నేరుగా ఇంటికే సరకులు తీసుకువస్తున్నారని లబ్ధిదారులైన వృద్ధులు, దివ్యాంగులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వ్యయప్రయాసలు తగ్గాయని పటమటకు చెందిన వృద్ధురాలు లక్ష్మి అభిప్రాయపడ్డారు.

మునిగిన రోడ్డు.. రాకపోకలకు అవస్థ

మూడో డివిజన్ గుణదల పాత పంచాయతీ కార్యాలయం వెటర్నరీ హాస్పిటల్ రోడ్డు మురుగు నీటితో తరచూ నిండిపోతోంది. వర్షాలకు తోడు సైడు కాలువల్లో మురుగు నీరు ముందుకు వెళ్లకపోవడంతో ఇటువంటి పరిస్థితి నెలకొంటోంది. ఎన్నిసార్లు పూడిక తీసినా నీరు ముందుకు వెళ్లడం లేదని, మోకాల్లోతు నీటిలో రాకపోకలకు ఇబ్బంది పడుతున్నామని వాపోతున్నారు. వాహనాలు తరచూ మొరాయిస్తున్నాయని చెబుతున్నారు. సమస్యను స్థానికులు 'ఈనాడు' దృష్టికి తీసుకువచ్చారు. కార్పొరేషన్ పారిశుద్ధ్య అధికారులు దృష్టి సారించి సమస్య పరిష్కరించాల్సిన అవసరం ఉంది. - కరెన్సీ నగర్, న్యూస్‌టుడే

సర్వీస్ రహదారి ధ్వంసం

జాతీయ రహదారి సర్వీస్ రోడ్డు ధ్వంసమై వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. భారీ వాహనాలు తిరగడం, నాసిరకంగా పనులు చేయడం వల్ల రోడ్డు దెబ్బతింటోంది. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఎదుట రహదారి పాడైంది. ఇటీవలే తారు రోడ్డు నిర్మించారు. నాణ్యత లేక ఛిద్రమైందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో హైవే నుంచి గాయత్రినగర్ వైపునకు వెళ్లే వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. రమేష్ ఆస్పత్రి కూడలిలోనూ భారీ గోతులు పడ్డాయి. ఆ మార్గంలో బారికేడ్లు పెట్టడంతో గోతుల మీదుగా వాహనాలు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. కనీసం తాత్కాలిక మరమ్మతులైనా చేయాలని వాహన చోదకులు కోరుతున్నారు. - కరెన్సీనగర్, న్యూస్‌టుడే

వైకాపా నాయకుల సమావేశం

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: చంద్రబాబు ష్యూరిటీ... మోసం గ్యారంటీ పేరుతో రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైకాపా ముఖ్యనేత వైవీ సుబ్బారెడ్డి అన్నారు. గురునానక్ కాలనీ నాక్ కల్యాణ మండపంలో బుధవారం ఆ కార్యక్రమం నిర్వహణపై ఉమ్మడి కృష్ణా జిల్లా వైకాపా నాయకులతో సమావేశం నిర్వహించారు. సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. ఈ నెల 4 నుంచి 11వ తేదీ వరకు చంద్రబాబు మోసాలపై ప్రతి గ్రామంలో ప్రచారం చేయనున్నట్లు తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా వైకాపా అధ్యక్షుడు దేవినేని అవినాష్ మాట్లాడుతూ.. చంద్రబాబు తాను ఇచ్చిన హామీల గురించి మాట్లాడడం లేదని అన్నారు. పరిశీలకుడు వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. జగన్ నాయకత్వంలో నాయకులు మరింత కష్టపడి పని చేయాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ ఎమ్మెల్యే జోగి రమేష్ మాట్లాడుతూ... జమిలి ఎన్నికలకు పార్టీ శ్రేణులు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిందేమీ లేదని మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాస్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రవాణా రంగ సమస్యలు పరిష్కరించండి

విజయవాడ సిటీ, న్యూస్‌టుడే : నగరంలోని ఓ హోటల్లో ఉన్న భాజపా రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌ను బుధవారం లారీ యజమానుల సంఘం ప్రధాన కార్యదర్శి వై.వి.ఈశ్వరరావు, కోశాధికారి నాదెళ్ల కృష్ణ, కృష్ణా జిల్లా సంఘం ప్రధాన కార్యదర్శి అల్లాడ సత్యనారాయణ, కార్యదర్శి రావి శరత్‌బాబు తదితరులు కలిశారు. రవాణా రంగం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

మాధవ్‌తో మాట్లాడుతున్న లారీ యజమానుల సంఘం ప్రతినిధులు

ఏడాది పాలనపై ప్రచారం

చుట్టుగుంట, న్యూస్‌టుడే: ఆరో డివిజన్‌లో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని తెదేపా డివిజన్ అధ్యక్షుడు పడాల గంగాధరరావు ప్రారంభించారు. చుట్టుగుంట బ్రహ్మానందరెడ్డినగర్‌లో ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అందించిన సంక్షేమ పథకాలను వివరించడంతో పాటు ప్రజలకు ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. సప్పా శ్రీనివాస్, మొకర గురునాథం, పి.నాగు, సుబ్బారావు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

4, 5 తేదీల్లో ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఉద్యోగులు ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 4, 5 తేదీల్లో ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నామని విజయవాడ జోన్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

ధర వరలు

వంకాయలు-28/30, టమాటా-34, బెండ-28, పచ్చిమిర్చి-32, కాకర-44, బీర-24/34, క్యాబేజీ-22, క్యారెట్-28/42, దొండ-34, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-27, గోరు చిక్కుళ్లు-34, దోస-18, సొర-10/8, పొట్ల-20/25, అరటికాయ-8/7, చామదుంప-28, అల్లం-60, మునగ-10/8, ఆకు కూరలు (కట్ట)-3, కంద-60, బీట్ రూట్-30, కీరదోస-42, బీన్స్-90, క్యాప్సికమ్-84, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-7/14, పుదీనా-5/15, ముల్లంగి-10, పచ్చిమామిడి-12/10, జాలం మామిడి-20/25 (నిన్నటివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. - ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

9వ వర్ధంతి

జననం: 12-01-1960
మరణం: 03-07-2016
కీ.శే. శ్రీమతి చదలవాడ సుజాత గారు
మీతో గడిపిన మధుర స్మృతులు మా హృదయాలలో సదా చిరస్మరణీయం!
నిరంతరం మీ స్మరణలో...
భర్త : చదలవాడ కృష్ణారావు
Administrative officer (Retd), CRDA-Vijayawada
కుమారులు, కోడళ్ళు
చదలవాడ రవీంద్ర - శ్రీవిద్య
Dr. చదలవాడ ప్రదీప్ - హైమవతి
మనుమడు : జయనందన్

(c) eenadu

కట్టలేరు.. వెళ్లలేరు!

చప్టా మీదుగా ఉద్ధృతంగా ప్రవహిస్తున్న వరదనీరు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని దాములూరు కూడలి వద్ద చప్టా మీదుగా వైరా, కట్టలేరు వరదనీరు ప్రవహిస్తుండడంతో బుధవారం రాకపోకలు నిలిచాయి. తెలంగాణలోని ఖమ్మం జిల్లా మధిరలో ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు వైరా, కట్టలేరులో వరదనీరు ప్రవహిస్తోంది. దాములూరు కూడలి-పల్లంపల్లి గ్రామాల నడుమ చప్టా మీదుగా వరద ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిచాయి. మధిర నుంచి కంచికచర్ల మీదుగా విజయవాడకు వాహనాల రాకపోకలు స్తంభించాయి. ఇక్కడ వంతెన నిర్మించి సంవత్సరాలు గడుస్తున్నా అప్రోచ్ రహదారులు నిర్మించకపోవడంతో రాకపోకలకు విఘాతం కలుగుతోంది. అప్రోచ్‌లు నిర్మించాలని వాహనచోదకులు, రైతులు కోరుతున్నారు.

ఎత్తిపోతల ఆయకట్టుకు సాగునీరు అందిస్తాం

నందిగామ, నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల ఎన్నెస్పీ కాలువల ఆయకట్టుకు ఈ ఖరీఫ్‌లో సాగునీరు అందించడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తెలిపారు. బుధవారం జడ్పీ వైస్ ఛైర్మన్ ఈతే సుకుమార్, ఈతే చెన్నారెడ్డి, ఎన్నెస్పీ ఈఈ కిశోర్, కూటమి నాయకులు, నీటి సంఘాల అధ్యక్షులతో కలిసి వేదాద్రి-కంచల ఎత్తిపోతలను పరిశీలించారు. మరమ్మతు పనులకు శ్రీకారం చుట్టారు. దేవినేని ఆయన మాట్లాడుతూ కంచల, ఏటూరు ఎన్నెస్పీ మేజరు కాలువల ఆయకట్టులో 17,300 ఎకరాల ఆయకట్టుకు దీని ద్వారా సాగునీరు అందించాల్సి ఉంది. గత వైకాపా ప్రభుత్వ అసమర్థతవల్ల దీని మోటార్లు మరమ్మతులకు గురై నాలుగేళ్లుగా నీరు విడుదల చేయలేదని ఆరోపించారు. ఎన్నెస్పీ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కోట వీరబాబు, ఎన్నెస్పీ డీసీ ఛైర్మన్ రాటకొండ చంద్రశేఖర్, నీటి సంఘాల అధ్యక్షుల పర్యవేక్షణలో మరమ్మతు పనులు చేపట్టాలని చెప్పారు. పెద్దవరం క్రెస్ట్ బయోటెక్ కంపెనీ ఎండీ గోగినేని రవిచంద్రను మరమ్మతుల కోసం యంత్రాలను ఏర్పాటు చేయించాలని కోరారు. తెదేపా మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి, నాయకులు అంబటి సీతారామయ్య, మేకల సుధాకర్, ఏచూరి రాము, మున్సిపల్ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, నెలకుదిటి నాగేశ్వరరావు, ఉన్నం అప్పారావు, ఉన్నం నరసింహారావు, నీటిసంఘాల అధ్యక్షులు మన్నెం శ్రీనివాసరావు, వడ్లమూడి శ్రీనివాసరావు, చిలుకూరి సుబ్బారావు, ఎన్నెస్పీ ఏఈ అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తుప్పుపట్టిన పైపులు, మోటార్లను పరిశీలిస్తున్న మాజీ మంత్రి ఉమా

ముఖ్యమంత్రి ఆదేశాలతో కదలిక: ఈ ఎత్తిపోతల మరమ్మతులకు ముప్పాళ్లలో పీ-4 కార్యక్రమానికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు రూ.15 కోట్లు మంజూరు చేయాలని ఆదేశించారు. దీనిపై ఎంపీ కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మాజీ మంత్రి దేవినేని ఉమా.. సీఎం దృష్టికి తీసుకెళ్లి నిధుల కోసం కృషి చేశారు. ఈ ఎత్తిపోతల దుస్థితిపై 'ఈనాడు'లో పలుసార్లు కథనాలు ప్రచురితమవడంతో జడ్పీ, ఎన్నెస్పీ అధికారులలో కదలిక వచ్చింది.

టీబీ లక్షణాలపై అవగాహన

జగ్గయ్యపేట గ్రామీణం: పట్టణంలో టీబీ యూనిట్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పాల్గొని మాట్లాడారు. టీబీ అనేది ఒక అంటు వ్యాధి అని, గాలి ద్వారా వ్యాపిస్తోందన్నారు. దీనిపై సరైన అవగాహన లేక చాలామంది వ్యాధి బారినపడి ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. క్రమం తప్పకుండా నివారణ మందులు వాడితే వ్యాధిని నివారించవచ్చని పేర్కొన్నారు. టీబీ యూనిట్ బృందం, ఏఎన్ఎమ్‌లు, ఆశా వర్కర్లు, తెదేపా శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

మా అవస్థలు పట్టవా?

బురద రోడ్డుపై ధర్నా చేస్తున్న విద్యార్థులు

కంచికచర్ల, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లేందుకు సరైన దారి లేక విద్యార్థులు ఎన్నో అవస్థలు పడుతున్నా.. పాలకులు మాత్రం కనికరించడం లేదని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్షుడు గోపీ నాయక్ విమర్శించారు. బురద కయ్యలా మారిన రహదారిపై కళాశాల విద్యార్థులతో కలిసి బుధవారం ధర్నా నిర్వహించారు. కళాశాల ప్రారంభించిన నాటి నుంచి కళాశాలకు దారి లేక విద్యార్థులు కష్టాలు పడుతుంటే రహదారిని నిర్మించకుండా కాలయాపన చేయడం సరికాదన్నారు. వర్షం కురిస్తే కళాశాలకు రావడానికి విద్యార్థులు భయపడుతున్నారని, వెంటనే సీసీ రహదారి నిర్మించాలని కోరారు. విద్యార్థి సంఘం నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగామ

• నందిగామ • జగ్గయ్యపేట

నిధుల జాప్యం.. పోలంపల్లికి శాపం

ఖరీఫ్ సాగుపై రైతుల ఆందోళన

వత్సవాయి, పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే

పోలంపల్లి ఆనకట్ట మరమ్మతులకు నిధుల మంజూరు ఆలస్యమవుతోంది. ప్రాజెక్టు బలోపేతానికి నిధులు సమీకరించడంలో ప్రజాప్రతినిధులు, అధికారులు విఫలమయ్యారని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. వేసవికి ముందే మరమ్మతులు పూర్తి చేసి ఖరీఫ్‌లో సాగునీటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్న పాలకుల హామీ నీటి మీద రాతలుగా మారాయని వాపోతున్నారు.

బలోపేతం చేస్తేనే..

★ ప్రాజెక్టు కింద స్థిరీకరించిన ఆయకట్టు 16,427 ఎకరాలు, అదనంగా సాగునీరందే భూమి 10 వేల ఎకరాలు. వత్సవాయి, పెనుగంచిప్రోలు, నందిగామ మండలాల్లోని 24 గ్రామాల పరిధిలోని పొలాలకు సాగునీరు అందుతుంది. దీని కింద 9 నీటి సంఘాలు ఉన్నాయి.

★ పోలంపల్లి ఆనకట్ట వద్ద ప్రధాన కాలువకు నీటిని మళ్లించే కట్టలు గతేడాది వరదలకు తెగిపోయాయి. వాటిని బలోపేతం చేయడానికి నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులు ఆనకట్టను పరిశీలించి రూ.19 కోట్లతో అంచనాలు తయారు చేశారు. సత్వరమే నిధులు మంజూరు చేసి వచ్చే ఖరీఫ్ నాటికి పనులు పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించారు. ఇప్పటి వరకు నిధులు మంజూరు కాలేదు. మరమ్మతులు చేపట్టలేదు. ఖరీఫ్ ముంచుకొస్తున్న తరుణంలో ఆయకట్టులో వరి సాగు చేయాలా.. వద్దా అనే ప్రశ్న రైతుల్లో వ్యక్తమవుతోంది.

మరమ్మతులు చేపట్టాల్సిన మునేరు ఆనకట్ట

ఇసుక కట్టలే దిక్కు..

గతేడాది సెప్టెంబరులో వచ్చిన భారీ వరదకు ఆనకట్ట కట్టలు ఎక్కడికక్కడ తెగిపోయాయి. ఎగువ నుంచి వచ్చే నీరంతా నిల్వకు ఆస్కారం లేక దిగువకు పారింది. అప్పటికే సాగులో ఉన్న పంటల పరిస్థితి ఏంటని అన్నదాతలు ఆందోళన చెందారు. అప్పుడు ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య చొరవ తీసుకొని యుద్ధప్రాతిపదికన తాత్కాలిక ఇసుక కట్టలు వేయించి కాలువకు నీరు మళ్లించి పంటలను కాపాడారు. గతేడాది తాత్కాలికంగా పోసిన ఇసుక కట్టలు మళ్లీ భారీ వరద వస్తే ఎలా నిలుస్తాయని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఏటిలో సాధారణం కంటే అధికంగా వరద ప్రవాహం కొనసాగితే ఇసుక కట్టలు తెగిపోతాయని అంటున్నారు. తూముల వద్ద నీటి మట్టం 10 అడుగులకు చేరితే కట్టలు పూర్తిగా కొట్టుకుపోయే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

నిధుల మంజూరుకు కృషి

అధికారులు ప్రతిపాదించిన నిధుల కోసం కృషి చేస్తున్నాం. నిధులు మంజూరు ఆలస్యమైనా రైతుల సహకారంతో కట్టలకు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి కాలువకు నీరు మళ్లించే ప్రయత్నాలు చేస్తాం.

- పొన్నం బాలాజీ, ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్

మద్యం అక్రమ విక్రయాలపై సమాచారం ఇవ్వండి

నందిగామ, న్యూస్‌టుడే: అక్రమ మద్యం కొనుగోలు చేసి తాగితే తీవ్ర అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని స్థానిక ఎక్సైజ్ సీఐ బంగార్రాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అనధికార వ్యక్తుల నుంచి కొనుగోలు చేసే మద్యం నకిలీది కావచ్చని పేర్కొన్నారు. వివాహాలు, ఇతర వేడుకల సందర్భంగా తక్కువ ధరలకు మద్యం సరఫరా చేస్తామని ఎవ్వరైనా చెబితే తీసుకోవద్దన్నారు. ఇలా వచ్చే నకిలీ మద్యం వల్ల ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ రకంగా ఎవరైనా అక్రమ అమ్మకాలు చేస్తుంటే ఎక్సైజ్ శాఖ అధికారి సెల్ నంబరు 94409 02452, టోల్ ఫ్రీ నంబరు 14405కు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఎల్ఈడీ దీపం ఏర్పాటు

కమ్మవారిపాలెం(నందిగామ గ్రామీణం), న్యూస్‌టుడే: మండలంలోని కమ్మవారిపాలెంలో ఏడాది తరువాత ఓ వీధి దీపం బుధవారం వెలిగింది. గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయానికి వెళ్లే బజారులో కొణిదెన ఆదినారాయణ ఇంటి వద్ద దీపం ఏడాది నుంచి వెలుగడం లేదు. స్తంభం ఒరిగిందని, దీపం ఏర్పాటుకు వీలుపడదని పంచాయతీ సిబ్బంది సాకులు చెప్పారు. ఈ సమస్యను 'న్యూస్‌టుడే' గ్రామ సచివాలయ కార్యదర్శి ఆకుల హనుమంతరావు దృష్టికి పలుమార్లు తీసుకెళ్లడంతో స్పందించారు.

ఉపాధ్యాయులకు అభినందన

చందర్లపాడు, న్యూస్‌టుడే: కోనాయపాలెం ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయులను ప్రధానోపాధ్యాయుడు డీవీఎల్ నారాయణ, సిబ్బంది బుధవారం సన్మానించారు. సీహెచ్ జయశ్రీ, ఎం.శ్రీనివాస్, జి.రత్నకుమారి, బి.నాగేశ్వరరావులు వేర్వేరు పాఠశాలలకు బదిలీ అయ్యారు. వీరు పాఠశాల, విద్యాభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. కమిటీ ఛైర్మన్ జానకొట్టయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా దుర్గాప్రసాద్

నందిగామ: నందిగామ పురపాలక సంఘ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా దుర్గాప్రసాద్ నియమితులయ్యారు. ఆయన ఇప్పటివరకు పురపాలక సంఘం నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. బుధవారం కమిషనర్ లోవరాజును కలిసి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.

చంద్రబాబుతోనే సుపరిపాలన సాధ్యం

నందిగామ: పోస్టర్లు ప్రదర్శిస్తున్న మాజీ మంత్రి దేవినేని, నాయకులు

అంబారుపేటలో తెదేపా నాయకులు వీరాస్వామి తదితరులు

నందిగామ, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో జగన్‌మోహన్‌రెడ్డి విధ్వంసకర పరిపాలనతో రాష్ట్రాభివృద్ధి కుంటుపడిందని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత సీఎం చంద్రబాబు అన్ని వర్గాలను గాడిలో పెడుతూ సుపరిపాలన అందిస్తున్నారని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ప్రశంసించారు. నందిగామ మున్సిపల్ కార్యాలయం వద్ద బుధవారం స్థానిక పురపాలక సంఘ ఛైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారి, నాయకులతో కలిసి ఆయన 'సుపరిపాలనలో-తొలి అడుగు' పోస్టర్ ఆవిష్కరించారు. దేవినేని మాట్లాడుతూ గత ఏడాది కూటమి పాలనలో నవ నందిగామ పథకాలు అమలుతో పాటు అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. వచ్చే నెలలో ఆడబిడ్డ నిధి పథకం, ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు చెప్పారు. పోలవరం ప్రాజెక్టు, అమరావతి రాజధాని నిర్మాణ పనులు పరుగులు పెట్టిస్తున్నారన్నారు.

నందిగామ గ్రామీణం: అంబారుపేటలో జరిగిన కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు వీరంకి వీరాస్వామి, నాయకులు గ్రామ తెదేపా అధ్యక్షుడు కామసాని మణిశంకర్, నాయకులు పలు పోగు ప్రశాంత్, వాసు, రాము, సాయి తదితరులు పాల్గొన్నారు.

కంచికచర్ల: కంచికచర్లలో నిర్వహించిన కార్యక్రమంలో నందిగామ నియోజకవర్గ పరిశీలకులు బచ్చుల సుబ్రహ్మణ్యం బోస్, మండల అధ్యక్షుడు కోగంటి బాబు, నాయకులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట గ్రామీణం: మండలంలోని తిరుమలగిరిలో వెలసిన వెంకటేశ్వరస్వామిని కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, నియోజకవర్గ పరిశీలకుడు దొంతు చిన్న దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య పట్టణంలోని 31వ వార్డులో ఇంటింటికి వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై అభిప్రాయాలు అడిగి తెలుసుకున్నారు. ★ పట్టణంలోని ఎస్‌వీఎస్ కొత్త వెంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు, వత్సవాయి: వత్సవాయి, పెనుగంచిప్రోలులో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట: ఇంటింటి ప్రచారంలో నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, దొంతు చిన్న

కంచికచర్లలో కరపత్రం పంపిణీ చేస్తూ..

అయ్యప్ప స్వామికి అభిషేకాలు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: నందిగామ స్వామి అయ్యప్ప దేవాలయంలో బుధవారం ఉత్తర నక్షత్రాన్ని పురస్కరించుకుని స్వామివారి మూలమూర్తికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. మూలమూర్తిని పుష్పాలతో అలంకరణచేసి హారతులిచ్చారు. అయ్యప్ప శరణుఘోషతో ఆలయం మార్మోగింది. దేవాలయ కమిటీ ఛైర్మన్ శాఖమూరు వంశీధర్, కమిటీ సభ్యులు చిరుమామిళ్ల నారాయణ, మహంకాళి వెంకన్నగురుస్వామి, కొమ్మినేని సుబ్బారావు, చెరుకూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాగల్లులో వంట గ్యాస్ లీక్

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలోని మాగల్లు గ్రామానికి చెందిన జొన్నలగడ్డ నరసింహారావు ఇంట్లో బుధవారం సాయంత్రం సిలిండరు నుంచి వంట గ్యాస్ లీకవడంతో ఆందోళనకు గురయ్యారు. సిలిండరుకు రెగ్యులేటర్ బిగిస్తున్న సమయంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో గ్యాస్ లీకవడంతో కంగారుతో బండను బయటకు తీసుకువచ్చి మురుగు కాలువలో పడేశారు. స్థానిక యువకుడు పిన్ను సరిచేయడంతో ప్రమాదం తప్పింది. బాధితుడి సమాచారం మేరకు ఇండేన్ గ్యాస్ కంపెనీ సిబ్బంది వచ్చి సిలిండర్ తీసుకెళ్లారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి మృతి

సాయిసాత్విక్ (పాతచిత్రం)

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: జగ్గయ్యపేట మండలంలోని గౌరవరం వద్ద జాతీయ రహదారిపై బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మైనర్ బాలుడు మృతి చెందాడు. మృతుడి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ పరిధి హస్తినపురానికి చెందిన శ్రీనివాసరెడ్డి-శశికళ దంపతులకు కుమార్తె శ్రీజ, కుమారుడు సాయిసాత్విక్ ఉన్నారు. శ్రీనివాసరెడ్డి ప్రైవేటు ఉద్యోగి. శశికళ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తున్నారు. కేఎల్ యూనివర్సిటీలో పీహెచ్‌డీకి సంబంధించిన పని నిమిత్తం తల్లి శశికళ పిల్లలు శ్రీజ, సాయిసాత్విక్‌తో కలిసి బుధవారం హైదరాబాద్ నుంచి విజయవాడకు కారులో బయలుదేరారు. జగ్గయ్యపేట మండలం గౌరవరం సమీపంలో కారు టైర్ పంక్చర్ అవ్వడంతో అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో సాయిసాత్విక్(15) అక్కడికక్కడే మృతి చెందాడు. శశికళకు స్వల్ప గాయాలు కావడంతో జగ్గయ్యపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పోక్సో కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: పెనుగంచిప్రోలులో బాలికపై జరిగిన లైంగిక దాడి కేసులో నిందితుడు ఓర్సు కిశోర్‌కు మచిలీపట్నం పోక్సో కోర్టు రెండేళ్ల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై అర్జున్ బుధవారం తెలిపారు. పెనుగంచిప్రోలు బీసీ కాలనీలో 2020లో బాలికపై కిశోర్ లైంగిక దాడికి పాల్పడగా.. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోక్సో కేసు నమోదైంది. కేసు విచారణలో పోలీసులు సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టి నేరాన్ని నిరూపించారు. దీంతో మచిలీపట్నం పోక్సో కోర్టు న్యాయమూర్తి గాజుల వెంకటేశ్వర్లు నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష రూ.3 వేలు జరిమానా విధించారు.

ట్రాఫిక్ చిక్కులు తొలగేదెప్పుడో?

- వైఎస్ విగ్రహ దిమ్మెతో ప్రజల అవస్థలు
- తొలగింపునకు తీర్మానం చేసినా పట్టించుకోని అధికారులు

నందిగామ, న్యూస్‌టుడే

నందిగామ గాంధీ సెంటర్‌లో గత వైకాపా ప్రభుత్వంలో నవరత్న పథకాలు, పేదలందరికీ ఇళ్ల పేరుతో ఏర్పాటు చేసిన పైలాన్ ఆ పార్టీ రంగులతో, జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌ల చిత్రాలతో ఇంకా కొనసాగుతున్నా అధికారులు పట్టించుకోవట్లేదు. వీటివల్ల ఎదురవుతున్న ట్రాఫిక్ సమస్యలను కూడా పరిగణనలోకి తీసుకోవడం లేదు. అప్పట్లో ఈ పైలాన్ ఏర్పాటు, రాజశేఖరరెడ్డి విగ్రహ దిమ్మె నిర్మాణానికి స్థానిక మున్సిపాలిటీ నిధులు దుర్వినియోగం చేశారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చి 13 నెలలవుతున్నా ఇప్పటికీ ట్రాఫిక్‌కు అడ్డంగా ఉన్న వైఎస్సార్ విగ్రహం దిమ్మె తొలగించలేదు. విగ్రహం తొలగించి జాతీయ, రాష్ట్ర నేతల విగ్రహాల పక్కన దిమ్మెపై ఏర్పాటు చేయాలని ఇటీవల పురపాలక సంఘం పాలకవర్గం తీర్మానం చేసింది. ఆచరణలో మాత్రం ఒక్క అడుగు ముందుకు పడలేదు.

గాంధీ సెంటర్‌లో జగన్ బొమ్మతో పైలాన్

గతంలో తెదేపా నాయకుల నిరసనలు

గత ప్రభుత్వంలో గాంధీ సెంటర్‌లో ట్రాఫిక్‌కు అడ్డంగా ఉన్నాయని స్వాతంత్ర్య సమరయోధులు, జాతీయ, రాష్ట్ర నేతల విగ్రహాలను అర్ధరాత్రి తొలగించారు. ఇదే సెంటర్‌లో ప్రభుత్వ వైద్యశాల పక్కన నవ నందిగామ- లీడర్స్ పార్కుగా ఏర్పాటు చేసి తొలగించిన విగ్రహాలు ఏర్పాటు చేశారు. కేవలం వైఎస్సార్ విగ్రహం మాత్రం ప్రత్యేకంగా అందరికీ కనిపించేలా పెద్ద దిమ్మె నిర్మించి దానిపై ఉంచారు. వైఎస్ విగ్రహం తొలగించకపోవడంపై అప్పట్లో ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య, తెదేపా నాయకులు, కార్యకర్తలు ఆందోళన చేశారు. వైఎస్సార్ విగ్రహాన్ని మిగిలిన విగ్రహాలు ఉన్నచోట ఏర్పాటు చేయాలని ధర్నా చేశారు. అయినా నాటి వైకాపా ప్రభుత్వంలో ముఖ్య ప్రజాప్రతినిధులు, నాయకుల ఒత్తిడికి తలొగ్గి అధికారులు పట్టించుకోలేదు.

రాకపోకలకు ఇబ్బంది

విగ్రహ, పైలాన్ దిమ్మె ఆర్‌అండ్‌బీ రోడ్డుపైన, రెవెన్యూ కార్యాలయ స్థలంలో ఉంది. అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణతో పైలాన్ ఆవిష్కరించారు. దీనిపైకి ఎక్కేందుకు మెట్లు సైతం చందర్లపాడు వైపు వెళ్లే ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఏర్పాటు చేశారు. దీనివల్ల రద్దీగా ఉండే గాంధీ సెంటర్‌లో రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. వైఎస్ విగ్రహం తొలగింపు తీర్మానం చేసిన మున్సిపల్ పాలకవర్గం సైతం పట్టించుకోవడం లేదు. దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పీఆర్సీ కమిటీలు నియమించాలి

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం పీఆర్సీ కమిటీ నియమించాలని ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ వీసం శ్రీధర్ కోరారు. బుధవారం మండలంలోని రాఘవాపురం, కమ్మవారిపాలెం, పల్లగిరి, రుద్రవరం, సోమవరం, దాములూరు, కొణతమాత్మకూరు, జొన్నలగడ్డ, రామిరెడ్డిపల్లి, కొండూరు, మాగల్లు గ్రామాల పాఠశాలల్లో ఎస్టీయూ సభ్యత్వాలు నమోదు చేయించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సరెండర్ లీవు, సీపీఎఫ్ బకాయిలు చెల్లించాలని, పెండింగ్ డీఏలు ప్రకటించాలని చెప్పారు. యాప్‌లతో ఫొటోలు తీసే భారాన్ని తగ్గించాలని, ఉదయం ఫేషియల్ హాజరుకు పది నిమిషాల గ్రేస్ టైం వర్తింపజేయాలని తెలిపారు. చిన్నపాటి కారణాలకు షోకాజ్ నోటీసులు ఇవ్వడం తగ్గించాలని కోరారు.

సభ్యత్వ రశీదు అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

ఎస్టీయూ మండలశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కట్టా వంశీ, మేకపోతుల రామకృష్ణ, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి ఏకే జిలాని, జిల్లా నాయకులు మైలవరపు సత్యనారాయణ, పి.వెంకటేశ్వరరావు, ఆకుల శ్రీనివాసరావు, చదల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌ల రద్దుకు డిమాండ్

ఎంఈవో-2 పద్మకు సమ్మె నోటీసు ఇస్తున్న గోపాల్, కార్మికులు

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ కోరారు. బుధవారం ఈ నెల 9న కార్మికుల దేశ వ్యాప్త సమ్మె పురస్కరించుకుని మధ్యాహ్న భోజన కార్మికులు ఎంఈవో-2 ఎం.పద్మకు సమ్మె నోటీసు ఇచ్చారు. ఆయన మాట్లాడుతూ కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాల్లో 29 రద్దుచేసి కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా మార్చిందన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మెనూ ఛార్జీలు ఒక్కో విద్యార్థికి రూ.20 ఇవ్వాలని, జాతీయ విద్యా విధానం-2020ని రద్దు చేయాలని డిమాండు చేశారు. మధ్యాహ్న భోజన కార్మికుల సంఘం జిల్లా నాయకులు ఆదూరి సుశీల, తాటి తులసమ్మ, దుర్గా, పద్మ పాల్గొన్నారు.

జగ్గయ్యపేట గ్రామీణం: లేబర్ కోడ్ రద్దు, ఇతర సమస్యల పరిష్కారానికి జులై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎ.కమల పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమల మాట్లాడుతూ.. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ ఆపాలన్నారు. షేక్ గౌసియా, పి.శారద, హుస్సేన్ పాల్గొన్నారు.

వైద్యులకు సత్కారం

జగ్గయ్యపేట గ్రామీణం, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలువురు వైద్యులను ఘనంగా సత్కరించారు. లయన్స్ కమ్యూనిటీ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో రాంకో సిమెంట్ వైద్యాధికారి ఎస్.రాజకేశవప్రసాద్, మద్రాస్ సిమెంట్ వైద్యాధికారి కొన్నాడ శ్రీకాంత్, ప్రభుత్వ ఆసుపత్రి వైద్యురాలు కంతేటి లక్ష్మీప్రసన్న, ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులు షేక్ షైలాను లయన్స్ క్లబ్ అధ్యక్షుడు శ్రీరాం బదరినారాయణ, కార్యదర్శి షేక్ ఖాసింసైదా, క్లబ్ సభ్యులు శాలువాతో సత్కరించారు.

ఉపాధ్యాయినికి వీడ్కోలు

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: మండలంలోని కొల్లికూళ్ల నుంచి తోటచర్ల పాఠశాలకు బదిలీ అయిన ఉపాధ్యాయురాలు పి.లక్ష్మీకుమారిని బుధవారం ఘనంగా సత్కరించి వీడ్కోలు పలికారు. ఎంఈవో రవీంద్ర, పాఠశాల ఛైర్మన్ వెంకటేశ్వరరావు, హెచ్‌ఎం శ్రీనివాసరావు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

మరుగుదొడ్లకు మరమ్మతులు నిర్వహించరూ...

నందిగామ అశోక్‌నగర్‌లోని బీసీ బాలుర కళాశాల వసతిగృహానికి ఇటీవల రూ.2.70 లక్షలతో మరమ్మతులు చేశారు. ఇక్కడ దూర ప్రాంతాలకు చెందిన 70 మంది కళాశాల విద్యార్థులు వసతి పొందాలి. ప్రస్తుతం 35 మంది విద్యార్థులున్నారు. ఈ ఆవరణలో విద్యార్థులు వినియోగించే మరుగుదొడ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటికి మరమ్మతులు చేయించలేదు. దీంతో విద్యార్థులకు అసౌకర్యంగా మారాయి. దీనిపై స్థానిక ఏబీసీడబ్ల్యూవో పి.శ్రీనివాసరావును వివరణ కోరగా వసతి గృహానికి మాత్రమే మరమ్మతులు పూర్తి చేశారని చెప్పారు. నిధుల కొరతతో మరుగుదొడ్లకు మరమ్మతులు చేయలేదని అన్నారు. **-ఈనాడు, అమరావతి, న్యూస్‌టుడే, నందిగామ గ్రామీణం**

జాతీయ ఫెన్సింగ్ పోటీలకు ఎంపిక

విద్యార్థులతో అధ్యాపకులు

పొన్నవరం (వీరులపాడు), న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయిలో జరిగిన యుద్ధక్రీడా (ఫెన్సింగ్) పోటీల్లో ఏకత్వ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల డైరెక్టర్ అమరనేని మనోజ్ తెలిపారు. జూన్ 29 నుంచి విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఏకత్వ పాఠశాల నుంచి వివిధ విభాగాల్లో 250 మంది విద్యార్థులు పాల్గొన్నారన్నారు. వీరిలో ఆరాధ్యసాయి, సాచి ఇహశ్లోక, లక్ష్మీ సహస్ర, స్నితిక, రోహిత్ పవన్, వఖ్యాత్ ప్రజ్వల్, అభిరా నందన్‌లు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. మండల పరిధి పొన్నవరం సమీప ఏకత్వ పాఠశాలలో బుధవారం అభినందన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల వ్యాయామ విద్యా విభాగాధిపతి జి.విజయ్‌కుమార్ మాట్లాడుతూ జాతీయ పోటీలు ఈ నెల 5, 6, 7 తేదీల్లో మహారాష్ట్రలోని నాసిక్‌లో జరుగుతాయని తెలిపారు.

రెండో రోజూ కొనసాగిన రైతుల నిరసన

క్వారీల వద్ద ఆందోళన వ్యక్తం చేస్తున్న రైతులు

పరిటాల (కంచికచర్ల), న్యూస్‌టుడే: పరిటాల సమీపంలోని కంకర క్వారీ యజమానుల అక్రమాలను అరికట్టి తమకు న్యాయం చేయాలని రైతులు చేపట్టిన ఆందోళన కార్యక్రమం బుధవారం రెండో రోజూ కొనసాగింది. రైతులకు మద్దతుగా పలు రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు. తమ సాగు భూములకు నీరందించే ఎన్నెస్పీ కాలువను క్వారీ యాజమాన్యాలు ఆక్రమించి రహదారిని ఏర్పాటు చేసినా సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. క్వారీ యాజమాన్యాలకు అధికారులు సహకరిస్తూ రైతులను అన్యాయానికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్వారీలు, క్రషర్ యూనిట్ల నుంచి వచ్చే కాలుష్యంతో తమ భూములు నిస్సారంగా మారుతున్నాయని వాపోయారు. వంటా-వార్పు నిర్వహించారు. రైతు సంఘాల నాయకుడు కోట కల్యాణ్, రైతులు, కౌలు రైతులు పాల్గొన్నారు.

అధికారుల పరిశీలన : కాలుష్య నియంత్రణ, ఎన్నెస్పీ, మైనర్ ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు బుధవారం క్వారీలను పరిశీలించారు. సమస్యలపై ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడారు. కాలుష్య నియంత్రణ నిబంధనలు పాటించని కారణంగా 17 క్రషర్లను మూసివేస్తున్నట్లు, 6 క్రషర్లకు నోటీసులు జారీ చేస్తున్నట్లు కాలుష్య నియంత్రణ అధికారులు తెలిపారు. ఎన్నెస్పీ కాలువ ఆక్రమణలను పరిశీలించామని, ఉన్నతాధికారులకు నివేదిక అందించిన తరువాత తదనుగుణంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

(c) eenadu

విజయవాడ పశ్చిమ

జగన్నాథ సేవలో రాజధాని మెట్రో డీపీఆర్ బృందం

డీపీఆర్ పరిశీలనా బృంద సభ్యులతో మాట్లాడుతున్న ఈవో శీనానాయక్

ఇంద్రకీలాద్రి: జగన్మాత దుర్గమ్మను రాజధాని మెట్రో డీపీఆర్ పరిశీలనా బృంద సభ్యులు కేంద్ర ప్రభుత్వ జాయింట్ సెక్రెటరీ జయదీప్, రిటైర్డు చీఫ్ ఇంజినీర్ రామకృష్ణారెడ్డికి అధికారులు దుర్గగుడి విశిష్టతను వివరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన బృంద సభ్యులకు వేదపండితులు ఆశీర్వచనం చేశారు. ఈవో శీనానాయక్ వారికి అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రాలు, ప్రసాదాలు అందజేశారు.

క్షయపై అవగాహన ప్రదర్శన

విజయవాడ వన్‌టౌన్: ప్రధానమంత్రి టీబీ ముక్త్ అభియాన్ ద్వారా క్షయ నివారణపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని హెల్త్ విజిటర్ లలితకుమారి తెలిపారు. కొత్తపేట షేక్‌రాజా సాహెబ్ సామాజిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ప్రదర్శనలు నిర్వహించారు. గోడపత్రిక ఆవిష్కరించారు. అధికారి దినేష్, పీపీఎం లీల, శివపార్వతి పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరిస్తున్న అధికారులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

విజయవాడ వన్‌టౌన్ : 90320 99986

? భవానీపురం శివాలయం వీధిలో కుక్కల స్వైర విహారం అధికంగా ఉంది. - పూర్ణచంద్రరావు, స్థానికుడు ✔ పరిశీలించి కుక్కలను పడతాం. - సోమశేఖర్, అసిస్టెంట్ వెటర్నరీ అధికారి

? భవానీపురం పోలీసు స్టేషన్ వెనుక వీధిలో అర్ధరాత్రుల్లో ద్విచక్రవాహనాల దొంగతనం అవుతున్నాయి. - ఇమ్రాన్, స్థానికుడు ✔ ఇప్పటికే నిఘా ఏర్పాటు చేశాం. అటువంటి ఘటనలపై ఫిర్యాదు చేయాలి. - ఉమామహేశ్వరరావు, సీఐ, భవానీపురం

? విద్యాధరపురం కబేళా సెంటర్ ఆర్టీసీ డిపో పక్క కాలువలో పూడిక పేరుకుపోయింది. - అన్నపూర్ణ, స్థానికురాలు ✔ పూడిక తీయిస్తాం. - డి.రాజు, స్థానిక శానిటరీ అధికారి

? పూర్ణానందంపేట ఐదోరోడ్డులో పూడిక తీయక దుర్వాసన వస్తోంది. - రామకృష్ణ, స్థానికుడు ✔ పరిశీలించి పూడిక తీయిస్తాం. - ఆదినారాయణ, స్థానిక శానిటరీ అధికారి

- విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే

పుణ్యక్షేత్రాలకు ఐఆర్‌సీటీసీ ప్రత్యేక రైలు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: పుణ్యక్షేత్రాల సందర్శించే యాత్రికుల సౌకర్యార్థం ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక రైలు నడుపనున్నట్లు సంస్థ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న సికింద్రాబాద్ నుంచి ప్రారంభమయ్యే ఈ రైలు విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు మీదుగా తిరువణ్ణామలైలోని అరుణాచలం, రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయం, మధురైలోని మీనాక్షి ఆలయం, కన్యాకుమారిలోని రాక్ మెమోరియల్, కుమారి అమ్మన్ ఆలయం, త్రివేండ్రంలోని పద్మనాభస్వామి ఆలయం, తిరుచ్చిలోని రంగనాథస్వామి ఆలయం, తంజావూరులోని బృహదీశ్వర ఆలయాలకు చేరుతుందన్నారు. అనంతరం 26న రైలు తిరుగు ప్రయాణమవుతుందని, ఇతర వివరాలకు ఫోన్ నంబరు 9281495848లో సంప్రదించవచ్చని తెలిపారు.

చీఫ్ మెడికల్ అధికారిగా అర్జునరావు

విజయవాడ నగరపాలక సంస్థ: నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ అధికారి (సీఎంవోహెచ్)గా కుంభా అర్జునరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగం జాయింట్ డైరెక్టర్‌గా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. గతంలోనూ కొంతకాలం పాటు ఆయన సీఎంవోహెచ్ పోస్టులో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లారు. తిరిగి బదిలీపై వచ్చారు. త్వరలో బాధ్యతలు చేపడతారు.

రక్షణ లేక.. గోడ పూర్తి కాక!

చిట్టినగర్, న్యూస్‌టుడే: భీమనవారిపేట కొండ ప్రాంతంలో ప్రజా ప్రయోజనార్థం నిర్మిస్తున్న రక్షణ గోడ పనులను అసంపూర్తిగా వదిలేశారు. ప్రస్తుతం ఆ ప్రాంతం ప్రమాదకరంగా మారింది. ఎప్పుడు ఏ ఇల్లు కూలుతుందోనన్న ఆందోళన స్థానికుల్లో నెలకొంది. నడిచేందుకు దారి కూడా లేని పరిస్థితి. రక్షణ గోడ పూర్తి చేసి రోడ్డు వేస్తే 12 కుటుంబాలకు మేలు జరుగుతుంది.

భీమనవారిపేటలో నిలిచిన గోడ నిర్మాణం

అనుసంధానం చేయాల్సి ఉంది: కొండ ప్రాంతంలో రూ.16 లక్షలతో రక్షణ గోడ నిర్మాణం చేశాం. దీన్ని పక్క వీధికి అనుసంధానం చేయాల్సి ఉంది. ఆయా పనులకు అంచనాలు వేసి, టెండర్ ప్రక్రియ పూర్తి కాగానే మిగిలిన నిర్మాణం పూర్తి చేస్తాం. - రాయన భాగ్యలక్ష్మి, మేయర్

గోడు ఆలకించండి

భీమనవారిపేట విశ్వ బ్రాహ్మణ వీధి కొండ ప్రాంతంలో ఐదు దశాబ్దాల నుంచి ఉంటున్నాం. నడిచేందుకు సరైన దారి కూడా లేదు. వర్షాలు కురిసినప్పుడు ఇంటి ముందు మట్టి జారిపోయి ప్రమాదభరితంగా మారుతోంది. దిన దిన గండంగా బతుకుతున్నాం. రక్షణ గోడ సగం వరకు నిర్మించి వదిలేశారు. -పట్నాల రమాదేవి, గృహిణి

వర్షం వస్తే భయమేస్తోంది

కొండ ప్రాంతంలో ఉంటున్నాం. వర్షం వస్తే భయమేస్తోంది. కొండపై నుంచి వచ్చే నీరు మా ఇంటిపై పడుతోంది. వెనుక వైపు మట్టి జారుతోంది. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోననే భయం వెంటాడుతోంది. సమస్యపై ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కూడా ఫిర్యాదు చేశాం. - జి.జయప్రకాష్, ప్రైవేటు ఉద్యోగి

దుర్గమ్మ సన్నిధిలో సారె సంబరం

రాజగోపురం ప్రాంగణంలో సారెతో భక్తులు

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఒకవైపు ఆషాఢ సారె తీసుకు వచ్చే మహిళా బృందాలు, మరోవైపు జాతీయ హిందూ ధార్మిక సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఏపీ సాధు పరిషత్ సభ్యులతో బుధవారం ఆధ్యాత్మిక సందడి నెలకొంది. కృష్ణలంకకు చెందిన కనకదుర్గ లలిత పారాయణ బృందం మేళతాళాలతో పసుపు, కుంకుమ, గాజులు, పూలు, మిఠాయిలతో ఊరేగింపుగా సారెను తీసుకువచ్చారు. బృందం అధ్యక్షురాలు గ్రంధి రామ, కార్యదర్శి రాధిక కమిటీ సభ్యులు పాల్గొన్నారు. భవానీపురం, గవర్నరుపేట, సింగ్‌నగర్, మంగళగిరి, ఉండవల్లి నుంచి మహిళా బృందాలు సారెను మల్లికార్జున మహామండపంలో దుర్గమ్మ ఉత్సవమూర్తి వద్ద అర్చకులకు అందజేశారు. దేవస్థానం అధికారులు వారికి ఆలయమర్యాదలతో అమ్మవారి దర్శనం చేయించి ప్రసాదాలు అందజేశారు. ❖ విజయవాడలో జరుగనున్న జాతీయ హిందూ ధార్మిక సదస్సులో పాల్గొనేందుకు వచ్చిన ఏపీ సాధుపరిషత్ సభ్యులు ఇంద్రకీలాద్రిని సందర్శించారు. సాధుపరిషత్ అధ్యక్షులు ఆట్లూరి నారాయణరావు, శ్రీనివాసానంద సరస్వతి స్వామి(శ్రీకాకుళం), ప్రకాశానంద సరస్వతి స్వామి(నెల్లూరు) అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తుల అనుగ్రహ భాషణం చేశారు. దుర్గమ్మ ఉత్సవమూర్తికి పూజలు నిర్వహించారు.

సంక్షేమ పాలనకు ఏడాది పూర్తి

విద్యాధరపురం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ సంక్షేమ పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా గొల్లపూడి ప్రాంతంలో తెదేపా డివిజన్ అధ్యక్షుడు కె.శివకుమార్ ఆధ్వర్యంలో కరపత్రాలు పంపిణీ చేశారు. బుధవారం ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వం చేపట్టిన పథకాలను వివరించారు. శివకుమార్ మాట్లాడుతూ కూటమి పాలనపై సామాన్యుల స్పందన లభించిందన్నారు. తల్లికి వందనం, పింఛన్లు అందడంతోపాటు అమరావతి అభివృద్ధి పనులతో నగరవాసులు హర్షం వ్యక్తం చేశారన్నారు. ఈకార్యక్రమంలో వెంకన్న, రవికుమార్, సాంబశివయ్య, విజయ్ పాల్గొన్నారు.

ఊర్మిళానగర్‌లో ..

కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

భవానీపురం, న్యూస్‌టుడే: భవానీపురంలో ఏడాది పాలన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. భవానీపురం 43వ డివిజన్ ఊర్మిళానగర్‌లో డివిజన్ అధ్యక్షుడు మోదుబోయిన రాంబాబు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. 41వ డివిజన్‌లో జరిగిన కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ అబ్దుల్ ఖాదర్, నాయకులు పాల్గొని ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. 42వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో మాజీ కార్పొరేటర్లు రామయ్య, నాగేశ్వరరావు, నాయకులు పర్యటించి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. 40వ డివిజన్‌లో నాయకులు పర్యటించి ప్రజలకు పథకాలు తెలియజేశారు.

ఉద్యోగుల సేవలు అభినందనీయం

బదిలీపై వెళుతున్న ఉద్యోగులతో డాక్టర్ సుహాసిని, తదితరులు

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే: ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో పలువురు ఉద్యోగులు బదిలీ అయ్యారు. వారికి బుధవారం పాతాసుపత్రిలోని జిల్లా వైద్యఆరోగ్యశాఖ కార్యాలయంలో వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా.ఎం.సుహాసిని మాట్లాడుతూ.. ఉద్యోగులందరూ అవసరమైన సమయాల్లో అంకిత భావంతో పనిచేసి ప్రజల సంక్షేమం కోసం పాటుపడ్డారన్నారు. ఉద్యోగులను సత్కరించారు. డా.ఉషారాణి, కె.ప్రభాకర్‌రెడ్డి, ప్రసాద్, వాసు, ఆనంద్, నాగమణి, రమణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యాసేవలు చిరస్మరణీయం

విద్యాధరపురం, న్యూస్‌టుడే: విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు కనకదుర్గ వరలక్ష్మి భాషాభివృద్ధికి చేసిన సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. విద్యాధరపురంలోని జెబావ రాజారావు హైస్కూల్లో బుధవారం నిర్వహించిన కనకదుర్గవరలక్ష్మి సంస్మరణ సభలో ఆయన మాట్లాడారు. సీపీఎం నగర కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ వరలక్ష్మి, రాజారావు దంపతులు నాలుగు దశాబ్దాలుగా పశ్చిమంలో విద్యాసేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో బాయన వెంకట్రావ్, డాక్టర్ కొడాలి జయరమేష్, మోతుకూరి వెంకటేశ్వరరావు, కంచర్ల శ్రీనివాసరావు, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

నీటి వృథా.. తీరని వ్యథ

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: పాతబస్తీ నైజాంగేటు సెంటర్ కట్లవారి వీధి ప్రధాన రహదారిలోని రెండులైన్లలో పైప్ లైన్ పగిలి ఉన్న మంచినీటి పైపులైను లీకై నీరు వృథాగా పోతోంది. ఐదు రోజులుగా రోజూ ఉదయం-సాయంత్రం ఇదే పరిస్థితి. అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినా సిబ్బంది సమ్మెలో ఉన్నారని చెప్పి పట్టించుకోవడంలేదని ప్రజలు వాపోతున్నారు. ఒకవైపు నీటి విడుదల సక్రమంగా లేక అలమటిస్తున్నామని, సమస్యను తీర్చాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కట్లవారి వీధి రెండోలైన్‌లో..

దుర్గాఘాట్‌లో దుకాణాలకు అనుమతివ్వాలి

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: దుర్గాఘాట్‌లో తొలగించిన దుకాణాలను తిరిగి ఏర్పాటుకు అధికారులు చర్యలు చేపట్టాలని సీనియర్ నాయకుడు, దుకాణదారుల సంఘం నేత పిళ్లా సుదర్శనరావు కోరారు. పాతబస్తీలోని తెదేపా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఎమ్మెల్యే సుజనా చౌదరికి వినతిపత్రం పంపించామన్నారు. స్థానిక నేత సోలంకి రాజుజైన్ కూడా ముఖ్యమంత్రి కార్యాలయానికి సమస్యను తీసుకువెళ్లారని, త్వరలోనే ఈవోతో ఈవిషయంపై మాట్లాడతామన్నారు. పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రతిపాటి శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నేతలు సోలంకి, శ్యామల, కనకలహరిబాబు, శివరామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

శ్రీధర్‌కు వినతిపత్రం ఇస్తున్న తెదేపా నేతలు

నిబంధనలు మీరితే చర్యలు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: నిబంధనలకు అనుగుణంగా విద్యాసంస్థల నిర్వాహకులు బస్సులు నడపాలని వన్‌టౌన్ ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు అన్నారు. సర్కిల్ పరిధిలోని కళాశాలలు, పాఠశాలలకు సంబంధించిన బస్సుల ఫిట్‌నెస్, ఇన్సూరెన్స్, డ్రైవర్ లైసెన్సులను సీఐ ఆధ్వర్యంలో బుధవారం తనిఖీ చేశారు. పొట్టి శ్రీరాములు-చలువాది మల్లికార్జున రావు ఇంజినీరింగ్ కళాశాల, కేబీఎన్ కళాశాల, ఎంఎస్‌ఆర్ పబ్లిక్ స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్నట్లు తేలితే బస్సును సీజ్ చేయడంతోపాటు డ్రైవర్‌పై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్సై శ్రీధర్ పాల్గొన్నారు.

పత్రాలు పరిశీలిస్తున్న ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావు

భక్తులకు నాణ్యమైన సేవలే లక్ష్యం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: భక్తులకు నాణ్యమైన సేవలు అందించడమే దేవస్థానంలోని ప్రతి ఉద్యోగి లక్ష్యం కావాలని దుర్గగుడి ఈవో శీనానాయక్ అన్నారు. ఇంద్రకీలాద్రిపై బుధవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. మహామండపంలో ముక్కల చీరల గోదామును పరిశీలించారు. ఎందుకు పనికి రాని చీర ముక్కలను నిల్వ చేయాల్సిన అవసరం లేదని, అటువంటివి గుడి ప్రాంగణంలోకి రాకుండా చూడాలని ఆదేశించారు. మహామండపాన్ని భక్తులకు అవసరమైన సేవలు అందించేందుకు వినియోగించాలని సూచించారు. ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. అన్నప్రసాద పంపిణీ కేంద్రంలో భక్తులకు అందజేసే ప్రసాద నాణ్యతను అడిగి తెలుసుకున్నారు. భక్తులు సంతృప్తిని వ్యక్తం చేశారు. ఈకార్యక్రమంలో ఈఈ రాంబాబు, ఏఈవోలు చంద్రశేఖర్, గంగాధర్ పాల్గొన్నారు.

చీరల గోదాములో పరిశీలిస్తున్న ఈవో

4, 5 తేదీల్లో ఆర్టీసీ ఉద్యోగుల ధర్నా

విజయవాడ బస్టేషన్, న్యూస్‌టుడే: ఆర్టీసీ ఉద్యోగులు ఆరేళ్లుగా పెండిగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 4, 5 తేదీల్లో ధర్నా కార్యక్రమాలు చేపడుతున్నామని విజయవాడ జోన్ కార్యదర్శి వై.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని డిపోలలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు వెల్లడించారు.

నిరసనకు మద్దతివ్వాలని వినతి

విద్యాధరపురం, న్యూస్‌టుడే: ఈనెల 3న చేపట్టిన నిరసనకు మద్దతు ఇవ్వాలని కోరుతూ వైద్యవిద్యార్థులు మాజీ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావుకు బుధవారం వినతి పత్రం అందజేశారు. విద్యార్థుల సమస్యలపై వర్సిటీ అలసత్వ ధోరణికి వ్యతిరేకంగా ఆందోళన చేపడుతున్నట్లు తెలిపారు.

భవానీ ద్వీపం ప్రైవేటు పరం ఆపాలి

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: విజయవాడ నగరవాసుల ఆహ్లాదాన్ని కూటమి ప్రభుత్వం దూరం చేస్తోందని ఏఐవైఎఫ్ నగర అధ్యక్షుడు కంచర్ల భార్గవ్ అన్నారు. పాతబస్తీలోని లెనిన్‌భవన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. భవానీ ద్వీపాన్ని కూటమి ప్రభుత్వం ప్రైవేటు పరం చేసేందుకు సన్నాహాలు చేస్తోందని, దీనిని నగరవాసులు సహించరన్నారు. వామపక్షాలతో కలిసి నిరసన తెలిపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

పథకాల్లో కోతలతో కార్మికులకు అన్యాయం

చిట్టినగర్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో మున్సిపల్ కార్మికులకు సంక్షేమ పథకాల్లో కోతలు విధించడమే కాకుండా విద్యుత్తు భారం మోపడం అన్యాయమని సీపీఎం పశ్చిమ నగర కమిటీ గౌరవ అధ్యక్షుడు బి.సత్యబాబు అన్నారు. దేశవ్యాప్త కార్మిక సంఘాల సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ బుధవారం సీపీఎం పశ్చిమ నగర కమిటీ ఆధ్వర్యంలో సర్కిల్-1 వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని చెప్పినప్పటికీ పట్టించుకోవడం లేదన్నారు. కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పేరుతో ఆప్కాస్ కార్మికులను మళ్లీ బానిస వ్యవస్థ వైపు తీసుకు వెళుతున్న విధానాలను విడనాడాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులుగా ఆన్‌లైన్‌లో చూపించి పథకాలు లేకుండా చేశారని, జులై 9న చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు.

సర్కిల్-1 వద్ద కార్మికుల నిరసన

జాతీయ స్థాయి స్కేటింగ్‌లో రత్నరాజ్ ప్రతిభ

చిట్టినగర్, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీల్లో తమ కళాశాల విద్యార్థి ప్రతిభ చాటి పతకాలు సొంతం చేసుకున్నాడని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపల్ జి.కృష్ణవేణి తెలిపారు. కొత్తపేట కేబీఎన్ కళాశాలలో జాతీయ స్థాయి స్కేటింగ్‌లో సత్తాచాటిని విద్యార్థి సిహెచ్.రత్నరాజ్ అభినందన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో జూన్ 19 నుంచి 23 వరకు కోల్‌కతాలో నిర్వహించిన 9వ జాతీయ స్థాయి స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో రత్నరాజ్ పాల్గొన్నారని, 3వేల మీటర్ల రోడ్‌రేస్‌లో బంగారు పతకం, 1000 మీటర్ల రోడ్ రేస్‌లో రజిత పతకం, వన్‌లాప్ రోడ్‌రేస్‌లో కాంస్య పతకం గెలుపొందారన్నారు. ఈ సందర్భంగా రత్నరాజ్, కళాశాల క్రీడావిభాగాధిపతి డి.హేమచంద్రరావులకు కళాశాల కార్యదర్శి టి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు నాగేంద్రకుమార్, ఏవో నారాయణరావు, వైస్ ప్రిన్సిపల్స్ ఎం.వెంకటేశ్వరరావు,పీఎల్.రమేష్, కె.రామకృష్ణ అభినందనలు తెలిపారు.

రత్నరాజ్‌ను అభినందిస్తున్న శ్రీనివాస్, తదితరులు

మెరుగైన వైద్యానికి సాయం

భవానీపురం, న్యూస్‌టుడే: అనారోగ్యంతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఎంఎస్ బేగ్ పేర్కొన్నారు. భవానీపురంలోని శాసనసభ్యుడు కార్యాలయంలో ఎల్ఓసీ పత్రాలను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బేగ్ మాట్లాడుతూ శాసనసభ్యుడు సుజనాచౌదరి సహకారంతో అనారోగ్యంతో బాధపడే వారికి సీఎంఆర్ఎఫ్, ఎల్ఓసీ పత్రాలు అందిస్తున్నట్లు తెలిపారు. వెన్నుముక సంబంధిత వ్యాధితో బాధపడుతున్న 49వ డివిజన్‌కు చెందిన డి.మల్లీశ్వరికి రూ.4లక్షలు, 37వ డివిజన్‌కు చెందిన జి.రమేష్‌బాబుకు రూ.లక్షా 50వేల ఎల్ఓసీ పత్రాలు అందించారు. కార్యాలయ కార్యదర్శి శ్రీధర్, కార్పొరేటర్ విజయ్‌కుమార్, నాయకులు పాల్గొన్నారు.

ఎల్ఓసీ పత్రాన్ని ఇస్తున్న ఎంఎస్ బేగ్, నాయకులు

రోడ్లపై వాన నీరు నిలిచిపోకుండా చర్యలు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరంలోని రహదార్ల వెంట వర్షపు నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. ప్రకాశం బ్యారేజ్, రామవరప్పాడు రింగ్, ఏలూరు రోడ్డు, కృష్ణలంక, రాణిగారితోట, గుణదల, ఈఎస్ఐ ఆస్పత్రి, కరెన్సీనగర్ ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించారు. స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. వర్షాకాలంలో బాధ్యులైన అధికారులు అప్రమత్తంగా ఉండాలని, రహదార్లపై వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని తెలిపారు. డ్రెయిన్లలో పూడికతీత పనులు నిరంతరం చేపట్టాలని, మురుగు సక్రమంగా పారేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. అన్న క్యాంటీన్లను పరిశీలించారు. అధికారులు సామ్రాజ్యం, మోహన్‌బాబు, కామేశ్వరరావు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

విజయవాడ వన్‌టౌన్, న్యూస్‌టుడే: కేంద్రంలోని భాజపా ప్రభుత్వం ముఠా కార్మికుల వ్యవస్థను నిర్వీర్యం చేస్తోందని, కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీపీఎం కార్పొరేటర్, సీఐటీయూ నాయకుడు బోయి సత్యబాబు డిమాండ్ చేశారు. బుధవారం పాతబస్తీలోని కొమలవిలాస్ సెంటర్, చౌకీ, పాడీ వీధి తదితర ప్రాంతాల ముఠా కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అసంఘటిత కార్మికులను పట్టించుకోకుండా కార్పొరేట్ కంపెనీల లాభమే ధ్యేయంగా పని చేస్తోందని ఆరోపించారు. జులై 4న రమేష్ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఏపీసీపీడీసీఎల్ కార్యాలయం ముందు ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ముఠా కార్మికులతో మాట్లాడుతున్న బోయి సత్యబాబు

స్థాయీ సంఘం సభ్యుల ఎన్నికకు నామినేషన్లు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ స్థాయీ సంఘం నూతన సభ్యుల కమిటీకి ఈ నెల 17వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. పాలకపక్షం చివరి ఏడాదికి సంబంధించి ఎంపిక చేసిన నలుగురు కార్పొరేటర్లు ఎన్నికల అధికారి డి.చంద్రశేఖర్‌కు బుధవారం తమ నామినేషన్లను అందజేశారు. స్థాయీ సంఘం సభ్యులుగా మొత్తం ఆరుగురు కార్పొరేటర్లను ఎన్నుకోవాల్సి ఉండగా, పాలకపక్షం ప్రస్తుతం ఎంపిక చేసిన నలుగురు మాత్రమే నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. మరో ఇద్దరిని వైకాపా ఎంపిక చేయాల్సి ఉంది. వైకాపా నుంచి కార్పొరేటర్లు శీరంశెట్టి పూర్ణచంద్రరావు, షేక్ రహమతున్నీసా, మొహమ్మద్ రెహానా నాషిద్, పుప్పాల నరసకుమారి నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి సమర్పించారు. ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

నూతన డీసీటీఎంకు సన్మానం

విజయవాడ బస్టేషన్, న్యూస్‌టుడే: పండిట్‌నెహ్రూ బస్టేషన్ డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్‌మేనేజర్‌గా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సీహెచ్ పవన్‌కుమార్‌ను బుధవారం ఏపీపీటీడీ కార్మికపరిషత్ రీజనల్ కార్యదర్శి యార్లగడ్డ రమేష్ ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సన్మానించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజనల్ అధ్యక్షులు కలపాల నారాయణ కెనడి, రీజనల్ పీఎన్‌బీఎఫ్ కమిటీ సభ్యులు, విజయవాడ డిపో కార్యదర్శి సగ్గుర్తి ప్రభాకర్, పీఎన్‌బీఎస్ యూనిట్ కార్మికపరిషత్ అధ్యక్షుడు యార్లగడ్డ విష్ణు, పీఎస్ రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ రాఘవ, కె.చినబాబురావు, జిల్లా కార్యవర్గ సభ్యులు కొప్పుల గాంధీ, ఈపూరు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

8నుంచి శాకంబరి ఉత్సవాలు

చిట్టినగర్, న్యూస్‌టుడే: చిట్టినగర్‌లోని నగరాల సీతారామస్వామి మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు శాకంబరి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి మరుపిళ్ల హనుమంతరావు, కోశాధికారి పిళ్లా శ్రీనివాసరావు తెలిపారు. మూడు రోజులు పాటు భక్తులు సమర్పించిన పండ్లు, కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరిదేవి అలంకారంలో అమ్మవారు దర్శనం ఇవ్వనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారని దర్శించుకుని తీర్థ ప్రసాదములు స్వీకరించాలని కోరారు.

సిబ్బంది సమయపాలన పాటించాలి

విజయవాడ పాతాసుపత్రి, న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, పీహెచ్‌సీలలో పనిచేసే వైద్యాధికారులు తప్పకుండా సమయపాలన పాటించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా.ఎం.సుహాసిని అన్నారు. పీహెచ్‌సీల తనిఖీల్లో భాగంగా బుధవారం జిల్లాలోని పలు పీహెచ్‌సీలను ఆమె సందర్శించారు. సిబ్బంది సమయపాలన పట్టిక, రికార్డులను పరిశీలించారు. అన్ని రకాల టీకాల ప్రక్రియ కొనసాగింపుపై పలువురు లబ్ధిదారులతో నేరుగా ఫోన్‌లో మాట్లాడారు. శిశువు, బాలింతల వివరాలను తప్పక నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కె.ప్రసన్న, రాణి, ఏఎన్ఎమ్, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు వీధులు.. సమస్యల లోగిళ్లు

చిట్టినగర్, న్యూస్‌టుడే: చిట్టినగర్ సమీపంలోని వీధుల్లో సమస్యలు పాదచారులు, వాహన చోదకులను పట్టి పీడిస్తున్నాయి. ఇరుకు వీధుల కారణంగా రాత్రి సమయాల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రధానంగా సయ్యద్ అప్పలస్వామి కళాశాల వెనుక రోడ్డు, చిట్టినగర్‌లోని ఉప్పలపాటి రామచంద్రరాజువీధి, ఆంజనేయవాగు, టేనర్‌పేట తదితర ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ ఎత్తుగా ప్రమాదకరంగా ఉన్నాయి. ఐజాక్‌వీధి, కేఎల్‌రావునగర్, సిండికేటుబ్యాంకు కాలనీ, ఉప్పు వెంకటనారాయణవీధి, తదితర ప్రాంతాల్లో మ్యాన్‌హోల్స్ కుంగిపోయి ఉన్నాయి. వాటికి మరమ్మతులు చేయాల్సి ఉంది. గండమాల అచ్చమ్మవీధి, చిట్టినగర్ అమ్మవారిగుడి వెనుక రోడ్డు, లంబాడీపేట అడ్డరోడ్డులో అంబటి సముద్రాలవీధి ప్రాంతాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. ఎత్తు లేకుండా సమాంతరంగా ఉండేలా చూడాలని ఇటీవల నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించినా సమస్య పరిష్కారం కాలేదు. రహదారులపై మ్యాన్‌హోల్స్ రోడ్డుకు ఎత్తుగా ఉండటం ఇబ్బందులు కలిగిస్తోందని, సమస్యలను వెంటనే పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. ★ ఈవిషయంపై ఏఈ శ్రీనివాసరావును వివరణ కోరగా, ఎత్తుగా ఉన్న మ్యాన్‌హోల్స్, దెబ్బతిన్న రోడ్లు పరిశీలించి మరమ్మతులు చేయిస్తామన్నారు.

ఐజాక్‌వీధిలో కుంగిన మ్యాన్‌హోల్

గండమాల అచ్చమ్మవీధిలో దెబ్బతిన్న రోడ్డు

(c) eenadu

విజయవాడ మధ్య

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM 63036 11232

? సీతారాంపురం కొల్లిపరవారి వీధి యూనియన్ బ్యాంక్ లైన్‌లో (డోర్ నం: 30-22-76/1) మంచినీళ్లు రంగుమారి వస్తున్నాయి. తగిన చర్యలు చేపట్టండి. - జగన్‌మోహనరావు, స్థానికుడు

✔ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటాం. - దుర్గా భవాని, ఏఈ, వీఎంసీ. - సీతారాంపురం, న్యూస్‌టుడే

తైక్వాండోలో విద్యార్థుల ప్రతిభ

విజేతలను అభినందిస్తున్న సిస్టర్ మేరీ శారద, పీఈటీ వెంకటేశ్వరరావు, అంకమ్మరావు

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: సత్యనారాయణపురంలోని అమలి స్కూల్‌కు చెందిన విద్యార్థుల జాతీయ తైక్వాండో పోటీల్లో పతకాలు కైవసం చేసుకున్నారని ప్రధానోపాధ్యాయులు సిస్టర్ మేరీ శారద తెలిపారు. ఇటీవల హరిద్వార్‌లో నిర్వహించిన జాతీయ సబ్ జూనియర్ తైక్వాండో ఛాంపియన్‌షిప్‌లో తమ పాఠశాలకు చెందిన జి.యోగ్య శ్రీమహాలక్ష్మి పసిడి, కాంస్యం, జి.లియో సోనెల్ పసిడి, కాంస్యం, జి.జోనిష్ కాంస్య పతకాన్ని సాధించారని పేర్కొన్నారు. బుధవారం స్కూల్‌లో జరిగిన అభినందన కార్యక్రమంలో పీఈటీ అర్జా వెంకటేశ్వరరావు, పలువురు ఉపాధ్యాయులు పతకాలు సాధించిన విద్యార్థులను, కోచ్ ఎం.అంకమ్మరావును అభినందించారు.

చీఫ్ మెడికల్ అధికారిగా అర్జునరావు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ చీఫ్ మెడికల్ అధికారి (సీఎంవోహెచ్)గా కంభా అర్జునరావు నియమితులయ్యారు. ప్రస్తుతం ఫ్యామిలీ వెల్ఫేర్ విభాగం జాయింట్ డైరెక్టర్‌గా ఆయన విధులు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వం ఆయన్ని నగరపాలక సంస్థకు బదిలీ చేసింది. గతంలోనూ కొంతకాలం పాటు ఆయన సీఎంవోహెచ్ పోస్టులో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లారు. తిరిగి బదిలీపై వచ్చారు. త్వరలో బాధ్యతలు చేపడతారు.

నేటి నుంచి క్రికెట్ టోర్నీ

విజయవాడ క్రీడలు, న్యూస్‌టుడే: ఆంధ్రా క్రికెట్ సంఘం(ఏసీఏ) ఆధ్వర్యంలో ఈ నెల 3వ తేదీ నుంచి మూలపాడులోని ఏసీఏ క్రికెట్ కాంప్లెక్స్‌లో ఏసీఏ సెంట్రల్ జోన్ సీనియర్ మల్టీ డే అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నీ నిర్వహిస్తున్నారు. టోర్నీలో పశ్చిమ గోదావరి, కృష్ణా, గుంటూరు, ప్రకాశం జట్లు తలపడనున్నాయి. తొలి రోజైన గురువారం డీవీఆర్ మైదానంలో గుంటూరు, పశ్చిమ గోదావరి, సీపీ మైదానంలో కృష్ణా, ప్రకాశం జట్ల మధ్య మ్యాచ్‌లు ఉంటాయని ఏసీఏ వర్గాలు వెల్లడించాయి.

కాలువ గట్టు.. పట్టించుకుంటే ఒట్టు

రేవుల్లో అసాంఘిక కార్యకలాపాలు

సీతారాంపురం, మాచవరం, న్యూస్‌టుడే

కాలువ పొడవున ఉండే ప్రాంతాలు, జనాభా వివరాలు (సుమారు) ఇలా ఉన్నాయి..	
సంజీవయ్య కాలనీ : 1000	దుర్గాపురం : 500
మహబూబ్ సుభాని కాలనీ : 120	
కార్మికపురం : 150	సీతారాంపురం : 1,500
గవర్నర్‌పేట విద్యుత్తు సబ్‌స్టేషన్ : 500	
కొత్తవంతెన పబ్లిక్ టాయిలెట్ : 1,000	

స్థానిక 25వ డివిజన్‌లోని సుమారు 1.5 కి.మీ మేర రైవస్ కాలువ గట్టు ప్రాంతంలో స్థానికులు దుస్తులు శుభ్రం చేసుకునేందుకు, ఇతర అవసరాలకు 12 రేవులు అందుబాటులో ఉండేవి. ప్రస్తుతం వాటి పరిస్థితి దయనీయంగా ఉంది. ఏ రేవు చూసినా వాడుకోవడానికి వీలులేకుండా అపరిశుభ్ర వాతావరణంతో చెత్తతో నిండి ఉన్నాయి. కొన్ని శిథిలావస్థకు చేరుకొన్నాయి. మరికొన్ని మరమ్మతులు చేయాల్సి ఉంది. కాలువలో నీళ్లు వదిలిన తర్వాత కూడా చెత్త పేరుకొని ఉంది. ఇవి మందుబాబులకు, గంజాయి, బ్లేడు బ్యాచ్‌లకు అడ్డాగా మారాయి. మహిళలు బెంబేలెత్తి పోతున్నారు. దీనికి పడిపోయి బయటకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదు. సుమారు 5వేల మంది జనాభా నివసిస్తున్న ఈ ప్రాంతంలోని రేవులను స్థానికులకు అందుబాటులోకి తీసుకొస్తే ఉపయోగకరంగా ఉంటాయి. రాత్రి వేళల్లో పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

అంకమ్మతల్లి గుడి వద్ద రేవు పరిస్థితి..

గవర్నర్‌పేట విద్యుత్తు సబ్ స్టేషన్ సమీపంలో ఇలా..

రైతుబజారుల్లో కూరగాయల ధరలు.. టమాటా-34, వంకాయలు-28/30, బెండ-28, పచ్చిమిర్చి-32, కాకర-44, బీర-24/34, క్యాబేజీ-22, క్యారెట్-28/42, దొండ-34, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-27, గోరు చిక్కుళ్లు-34, దోస-18, సొర-10/8, పొట్ల-20/25, అరటికాయ-8/7, చామదుంప-28, అల్లం-60, మునగ-10/8, ఆకు కూరలు (కట్ట)-3, కంద-60, బీట్ రూట్-30, కీరదోస-42, బీన్స్-90, క్యాప్సికమ్-84, నిమ్మ (డజను)-18/24, కొత్తిమీర-7/14, పుదీనా-5/15, ముల్లంగి-10, పచ్చిమామిడి-12/10, జామ మామిడి-20/25 (నున్న టివి). నగరంలోని రైతుబజార్లలో ఈ ధరలు (రూ./కే) వర్తిస్తాయి. - ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

ధర వరలు

గంగానమ్మకు ఆషాఢ బోనాలు

ప్రదర్శనగా బయలుదేరిన సుజాత, శ్రీదేవి తదితరులు

మధురానగర్, న్యూస్‌టుడే: ముత్యాలంపాడు శివాలయం నుంచి శ్రీదేవి సాంస్కృతిక సామాజిక సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు దూపాటి శ్రీదేవి ఆధ్వర్యంలో ఆషాఢ బోనాల ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. 108 మంది ముత్తయిదువులు కలశాలు చేతపట్టి శివాలయం నుంచి ఊరేగింపుగా బయలుదేరారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు సతీమణి సుజాత మహిళలతో కలిసి కలశంతో పాల్గొన్నారు. శివాలయం నుంచి జీవన్ రాజు రోడ్డు మీదుగా ముత్యాలంపాడులోని గంగానమ్మ ఆలయానికి చేరుకున్నాయి. ఆలయ నిర్వాహకులు సాదరంగా ఆహ్వానం పలికారు. సుజాత మాట్లాడుతూ.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అనేక ఆటుపోట్ల నుంచి రాష్ట్రాన్ని రక్షించి మార్గంలో నడిపేందుకు అమ్మవారి కృప కటాక్షాలు ఉండాలని కోరుతూ ఈ ఉత్సవాలు నిర్వహించినట్లు తెలిపారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ప్రజల చెంతకు తెదేపా దళం..!

ఘనంగా 'సుపరిపాలనలో తొలి అడుగు'

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు

ప్రజలతో మాట్లాడి వివరాలు నమోదు చేస్తున్న బాలస్వామి

సూర్యారావుపేట, చుట్టుగుంట, పాయకాపురం, అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలోనే అభివృద్ధి సాధ్యమని, అందుకే అత్యధిక సీట్లతో కూటమిని ప్రజలు దీవించారని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా బుధవారం పాయకాపురం 62వ డివిజన్‌లో ఎమ్మెల్యే పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. రాబోయే రోజుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేయనున్నామన్నారు. తెదేపా నాయకులు ననిశేశం సాంబశివరావు, దేవతోటి నాగరాజు, కృష్ణమోహన్, దాసరి జయరాజ్, ఏరువోజి శ్రీను, కొండపల్లి రూప్‌కుమార్, జలకం రాజా, పైడి తులసీ, తదితరులు పాల్గొన్నారు. ★ కూటమి ప్రభుత్వం తొలి ఏడాది పాలనలో అందించిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజల ముంగిటకే వెళ్లి తెలియజేస్తున్నామని తెదేపా ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో ప్రజలు ఏమేమీ కోరుకుంటున్నారు? వారి సమస్యలను తెలుసుకుంటున్నామని తెలిపారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన సూర్యారావుపేటలో పర్యటించారు.

కాకానినగర్‌లో కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి

ప్రక్రియ కొనసాగేలా జరుగుతోందని, ఎమ్మెల్యే బొండా ఆధ్వర్యంలో కార్యులు వస్తాయని వివరించారు. చింత దుర్గారావు, కోటి తదితరులు పాల్గొన్నారు. ★ మాజీ కార్పొరేటర్ ఎరుబోతు రమణ ఆధ్వర్యంలో బుధవారం ఎమ్మెల్యే బొండా ఆదేశాల మేరకు 58వ డివిజన్ ఇంచార్జి నాయకులు కార్యక్రమంలో పర్యటించారు. ప్రజలకు పథకాలు వివరించారు. తట్టవర్తి ఆనంద్, గుత్తా వరప్రసాద్, దేవర లక్ష్మణ్, గిరిజల చంద్రశేఖర్, దేవర తాతాజీ తదితరులు పాల్గొన్నారు. ★ 26వ డివిజన్, చుట్టుగుంట కాకానినగర్‌లో బుధవారం కార్పొరేటర్ వల్లభనేని రాజేశ్వరి కాకానినగర్‌లో పర్యటించారు. డివిజన్ ఇన్‌ఛార్జి వల్లభనేని సతీష్‌తో కలిసి ఇంటింటికీ తిరిగారు. ఏడాదిలో ప్రభుత్వం అందించిన పథకాలను వివరించి, ప్రజాభిప్రాయాన్ని సేకరించారు. డివిజన్ అధ్యక్షుడు తోట పాండు, ప్రధాన కార్యదర్శి కారంపూడి సత్య, విజయకృష్ణ సూపర్ బజార్ డైరెక్టర్ కడియం ప్రకాష్, జనసేన డివిజన్ అధ్యక్షుడు బాడిత శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. నియోజకవర్గంలో సమస్యలపై ఎమ్మెల్యే బొండా ఉమా ప్రత్యేక దృష్టి పెట్టి వాటిని పరిష్కరిస్తున్నారని వివరించారు. ప్రజల అభిప్రాయాలను తెదేపా అధిష్ఠానం పంపిన యాప్‌లో నమోదు చేశారు. పాలన, పథకాల అమలుపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. చాలా మంది రేషన్‌కార్డు గురించి అడగడంతో.. ఈ

లయన్స్ జిల్లా 316డి గవర్నర్‌గా ఆంజనేయులు

నూతన కార్యవర్గ సభ్యులు వీరే..

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: లయన్స్ ఇంటర్నేషనల్ జిల్లా 316డి గవర్నర్‌గా వీవీవీఎస్ ఆంజనేయులు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గవర్నర్‌పేటలోని లయన్స్ భవన్‌లో నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమం నిర్వహించారు. పూర్వ గవర్నర్ గద్దె శేషగిరిరావు నుంచి ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఫస్ట్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్‌గా నెక్కంటి ప్రసాద్, సెకండ్ డిస్ట్రిక్ట్ వైస్ గవర్నర్‌గా చెన్నారెడ్డి శ్రీనివాసరెడ్డి, క్యాబినెట్ సెక్రటరీగా వర్ధర్, కోశాధికారిగా అశ్వర్థనారాయణలతో పాటు ఇతర కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఆంజనేయులు మాట్లాడుతూ. . సభ్యులు సేవ, పర్యావరణ పరిరక్షణపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని తెలిపారు. రక్తదానానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నామని.. నేత్రదాన శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు. లయన్స్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రమణారావు తదితరులు పాల్గొన్నారు.

స్థాయీ సంఘం సభ్యుల ఎన్నిక ప్రారంభం

నామినేషన్లు దాఖలు చేస్తున్న కార్పొరేటర్లు

విజయవాడ నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థ స్థాయీ సంఘం నూతన సభ్యుల కమిటీకి ఈ నెల 17వ తేదీన ఎన్నికలు నిర్వహించనున్నారు. పాలకపక్షం చివరి ఏడాదికి సంబంధించి ఎంపిక చేసిన నలుగురు కార్పొరేటర్లు ఎన్నికల అధికారి డి.చంద్రశేఖర్‌కు బుధవారం తమ నామినేషన్లను అందజేశారు. స్థాయీ సంఘం సభ్యులుగా మొత్తం ఆరుగురు కార్పొరేటర్లను ఎన్నుకోవాల్సి ఉండగా, పాలకపక్షం ప్రస్తుతం ఎంపిక చేసిన నలుగురు మాత్రమే నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. మరో ఇద్దరిని వైకాపా ఎంపిక చేయాల్సి ఉంది. వైకాపా నుంచి కార్పొరేటర్లు శీరంశెట్టి పూర్ణచంద్రరావు, షేక్ రహమతున్నీసా, మొహమ్మద్ రెహనా నాహిద్, పుప్పాల నరసకుమార్ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారికి సమర్పించారు. ఫ్లోర్‌లీడర్ వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పుణ్యక్షేత్రాలకు ఐఆర్‌సీటీసీ ప్రత్యేక రైలు

విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: పుణ్యక్షేత్రాలను సందర్శించే యాత్రికుల సౌకర్యార్థం ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక రైలు నడుపుతున్నట్లు సంస్థ అధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19న సికింద్రాబాద్ నుంచి ప్రారంభమయ్యే ఈ రైలు విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు మీదుగా తిరువణ్ణామలైలోని అరుణాచలం, రామేశ్వరంలోని రామనాథస్వామి ఆలయం, మధురైలోని మీనాక్షి ఆలయం, కన్యాకుమారిలోని రాక్ మెమోరియల్, కుమారి అమ్మన్ ఆలయం, త్రివేండ్రంలోని పద్మనాభ స్వామి ఆలయం, తిరుచ్చిలోని రంగనాథస్వామి ఆలయం, తంజావూరులోని బృహదీశ్వర ఆలయాలకు చేరుతుందన్నారు. అనంతరం 26న రైలు తిరుగు ప్రయాణమవుతుందని, ఇతర వివరాలకు ఫోన్ నంబరు 9281495848లో సంప్రదించవచ్చని తెలిపారు.

తవ్వారు.. రోడ్డు వేయడం మరిచారు..

స్థానిక సీతారాంపురం లాల్‌బహదూర్ శాస్త్రి రోడ్డులో పాత ఉపాధి కల్పన కార్యాలయం కూడలి వద్ద యూజీడీ పనులు పూర్తిచేసి నెల రోజులకు పైగా గడిచింది. తవ్విన చోట రాళ్లతో కప్పివేశారు కానీ రోడ్డు మాత్రం ఇంత వరకు వేయలేదు. దీంతో స్థానికులు.. లాల్‌బహదూర్‌శాస్త్రి రోడ్డులో రాకపోకలు సాగించే వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకొని సంబంధిత అధికారులు పనులు చేసిన ప్రదేశంలో

తారురోడ్డు వేయాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, సీతారాంపురం

డివైడర్ పునర్నిర్మాణం

చుట్టుగుంట విశాలాంధ్ర రోడ్డులోని డివైడర్ ఎత్తు తగ్గిపోవడంతో పునర్నిర్మాణానికి రూ.19 లక్షల నిధులు మంజూరు చేశారు. వీఎంసీ అధికారులు పనులు ప్రారంభించారు. చుట్టుగుంట కూడలి నుంచి 150 మీటర్ల పొడవు, రెండు అడుగుల ఎత్తుతో డివైడర్ నిర్మించనున్నారు. మధ్యలో ఎర్రటి మట్టితో నింపి గ్రాస్, మొక్కలతో అందంగా తీర్చిదిద్దనున్నారు. ఈ నెలాఖరులోగా పనులు పూర్తిచేస్తామని డీఈ టి.చంద్రశేఖర్ చెప్పారు.

- న్యూస్‌టుడే, చుట్టుగుంట

అంతా అయోమయం..!

బీ.ఆర్.టి.ఎస్.రోడ్డు భానునగర్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన సిగ్నల్ లైట్లు వాహన చోదకులను గందరగోళానికి గురిచేస్తున్నాయి. ట్రాఫిక్ నియంత్రణ కోసం సిగ్నల్‌లైట్లు ఏర్పాటు చేశారు. చోదకులను అప్రమత్తంగా ఉంచేందుకు పసుపు రంగు లైటు వెలుగుతూ, ఆరుతూ ఉండేలా బ్లింకర్ ఏర్పాటు చేశారు. అయితే ఎరుపు, ఆకుపచ్చ లైట్లు కూడా ఒకేసారి వెలుగుతుండడంతో.. అయోమయ పరిస్థితి నెలకొంది. సాంకేతిక లోపాన్ని సరిచేయాలని వారు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మధురానగర్

ఒకే సారి ఎరుపు, పసుపు, ఆకుపచ్చ లైట్లు వెలుగుతున్నాయిలా..

కళాకారులకు ప్రోత్సాహం అవసరం

కృష్ణమూర్తి నాయుడు, వెంకటేశ్వర్లును సత్కరిస్తున్న నిర్వాహకులు

గాంధీనగర్, న్యూస్‌టుడే: యువ కళాకారులను కళా సంస్థలు ప్రోత్సహించాలని విశ్రాంత డీసీపీ ఎం.కృష్ణమూర్తి నాయుడు కోరారు. తెలుగు కళావాహిని, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, శ్రీకళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఆశీష్ ఈవెంట్స్ హాల్‌లో సినీ సంగీత విభావరి నిర్వహించారు. గాయకులు తెలుగు చిత్రాల్లోని పాటలను ఆలపించి ఆకట్టుకున్నారు. కృష్ణమూర్తినాయుడు, విశ్రాంత ఆకాశవాణి డైరెక్టర్ బి.వెంకటేశ్వర్లును నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో గోళ్ల నారాయణరావు, వెన్నా వల్లభరావు, చింతకాయల చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ మహిళా కార్యదర్శిపై దాడి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: గవర్నర్‌పేట కాంగ్రెస్ ఆఫీస్ రోడ్డులోని ఒక భవనం కొలతలు తీసేందుకు వెళ్లిన మహిళా కార్యదర్శిపై.. భవన యజమాని కుమారుడు దాడి చేసిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. ప్రభుత్వం ఇటీవల నగరంలో డోర్ టు డోర్ సర్వే చేసి, భవనాల కొలతలు తీయాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సచివాలయ ఉద్యోగులు భవనాల కొలతలు తీస్తున్నారు. ఈ క్రమంలో 98వ సచివాలయ కార్యదర్శి అర్చన.. కాంగ్రెస్ ఆఫీస్‌రోడ్డులోని ఒక భవనం కొలతలు తీసేందుకు వెళ్లారు. యజమాని రంగనాయకులు ఆమెను ప్రశ్నించగా.. ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమం గురించి వివరించారు. రంగనాయకులు కుమారుడు మహిళా కార్యదర్శిని వీడియో తీస్తుండడంతో.. ఆమె అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో స్వల్ప వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో రంగనాయకులు కుమారుడు ఆమెను దుర్భాషలాడుతూ దాడి చేసి చెంపపై కొట్టాడు. అర్చన.. గవర్నర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 98496 97616

పాత పద్ధతిలోనే వాహనాల సామర్థ్య పరీక్షలు

సూర్యారావుపేట, న్యూస్‌టుడే: ఆటో, మోటారు వాహనాలకు పాత పద్ధతిలోనే ఫిట్‌నెస్ పరీక్షలు చేయాలని విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) విజ్ఞప్తి చేసింది. ఫిట్‌నెస్‌ను ప్రైవేట్‌పరం చేయడంతో

ఆర్టీవో ప్రవీణ్‌కు వినతిపత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

ఆటో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై బుధవారం ఉపరవాణా కమిషనర్ కార్యాలయంలో ఆర్టీవో ప్రవీణ్‌కు వినతిపత్రం సమర్పించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.దుర్గారావు మాట్లాడుతూ.. టైర్లు బటన్ అరిగాయని, టాపు చిరిగిందని. . ఇలా చిన్న చిన్న కారణాలతో ఫిట్‌నెస్ చేయకుండా నెలల తరబడి తిప్పుతున్నారన్నారు. వెళ్లిన ప్రతిసారీ రూ.800లు చలానా కట్టాల్సి వస్తోందన్నారు. కిరాయి మానుకుని వెళ్లాల్సి రావడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. ప్రభుత్వం పునరాలోచించి గతంలో మాదిరి ప్రభుత్వమే ఫిట్‌నెస్ చేయాలని కోరారు. కార్యక్రమంలో బి.రూబెన్‌కుమార్, ఎం.హనుమంతరావు, డి.కోటయ్య, ఎ.వి.రెడ్డి, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'పదోన్నతుల్లో అన్యాయాన్ని నివారించండి'

సీతారాంపురం, న్యూస్‌టుడే: వార్డు సచివాలయ విద్యా కార్యదర్శుల పదోన్నతుల విషయంలో అన్యాయం జరుగుతుందంటూ రాష్ట్ర పురపాలక శాఖ పరిపాలనా సంచాలకుడు (డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్



సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న ఐకాస ప్రతినిధులు

అడ్మినిస్ట్రేషన్) పి.సంపత్‌కుమార్‌ను మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం అందించినట్లు ఏపీ డబ్ల్యుఈడీఎస్ జేఏసీ ఛైర్మన్ బి.గంటయ్య తెలిపారు. పదోన్నతులే కాకుండా బదిలీల్లోనూ ప్రతిభావంతులు నష్టపోయారని ఆయన దృష్టికి తీసుకెళ్లామని పేర్కొన్నారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందిస్తూ ఉద్యోగులకు ఎలాంటి అన్యాయం జరగకుండా చూస్తానని హామీ ఇచ్చారని చెప్పారు. జేఏసీ కన్వీనర్ జి.యశ్వంత్, కో కన్వీనర్లు శ్రీకాంత్, రాజశేఖర్, యూనియన్ నాయకులు మణికంఠ, మాధురి, గాయత్రి, సునయన, భువన, పలువురు విద్యా కార్యదర్శులు సంచాలకుడిని కలిసిన వారిలో ఉన్నారు.

వైద్య విద్యార్థులకు పీఆర్‌లు ఇవ్వాలి

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేసుకున్న విద్యార్థులకు పీఆర్‌లు ఇవ్వాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.సాయికుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి ఐ.రాజేష్ డిమాండ్ చేశారు. బుధవారం ధర్నా చౌక్‌లో నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. పీఆర్‌లు ఇవ్వాలని ఏడాదిన్నరగా విద్యార్థులు ఏపీఎంసీ చుట్టూ తిరుగుతున్నా.. ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రార్ నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఏ రాష్ట్రంలో లేని నిబంధన ఏపీలో పెడుతున్నారని విమర్శించారు. సమస్య పరిష్కరించాలని ఎన్‌ఎంసీని కోరగా.. విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించి.. పీఆర్‌లు ఇవ్వొచ్చని మెయిల్ ద్వారా రిజిస్ట్రార్‌కు పంపినా.. పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. దేశమంతా అమలవుతున్న నిబంధనలు ఆంధ్రప్రదేశ్‌లో లేవని చెప్పడం దారుణమన్నారు. కక్షసాధింపు చర్యలు మానుకొని సమస్యను పరిష్కరించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకులు, వైద్య విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



సమాఖ్య నాయకులు, వైద్య విద్యార్థులు, తల్లిదండ్రుల నిరసన

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

మధురానగర్, న్యూస్‌టుడే: 31వ డివిజన్ ముత్యాలంపాడు డ్రైనేజీ పంపింగ్ స్టేషన్ వద్ద రూ.32 లక్షలతో నిర్మించే సీసీ రోడ్డుకు బుధవారం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో ఏడాది కాలంలో రూ.240 కోట్ల విలువైన అభివృద్ధి పనులు చేశామన్నారు. రోడ్లు, డ్రైనేజీ, మంచి నీరు, సామాజిక భవనాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల అభివృద్ధిపై దృష్టి పెట్టామని వివరించారు. అభివృద్ధి, సంక్షేమాన్ని రెండింటినీ సమపాళ్లలో అమలు చేస్తూ.. సుపరిపాలన అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పిన్నంరాజు త్రిమూర్తిరాజు, ఇన్‌ఛార్జి కాకొల్లు మహేంద్ర, అధ్యక్షుడు గడ్డం శ్రీను, ప్రధాన కార్యదర్శి దాట్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పూజాదికాలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బొండా ఉమా

అభివృద్ధి చేసి చూపిస్తున్న కూటమి ప్రభుత్వం

పాయకాపురం, న్యూస్‌టుడే: గత ఐదేళ్లల్లో వైకాపా సర్కార్ చేయలేని అభివృద్ధిని కూటమి ప్రభుత్వం చేసి చూపిస్తోందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. పాయకాపురం ఎల్బీఎస్ నగర్ 62వ డివిజన్‌లో రూ.42 లక్షల నిధుల అంచనాతో పార్క్‌కు ప్రహరీ నిర్మాణం, 63వ డివిజన్ ఉడా కాలనీ ఎంఐజీ ప్రాంతంలోని తెలుగు తల్లి పార్క్ ప్రహరీ నిర్మాణానికి రూ.10 లక్షల వ్యయంతో చేపట్టిన అభివృద్ధి పనులకు బుధవారం శంకుస్థాపన చేశారు. ఆయన మాట్లాడుతూ... ఇప్పటి వరకు నియోజకవర్గంలో రూ.240 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని.. తెలుగు తల్లి పార్క్‌లో వాటర్‌లైన్ ఏర్పాటు పనులు కూడా చేస్తున్నామని వెల్లడించారు. మాజీ కార్పొరేటర్ పైడి తులసీ, స్థానిక తెదేపా నేతలు పైడి శ్రీను, లబ్బా వైకుంఠం, జలకం రాజా, బత్తుల కొండ, మరియబాబూ, రామలక్ష్మీ, మంగరాజు, తదితరులు పాల్గొన్నారు.

పీఆర్ స్టాల్ సందర్శన

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: స్వర్ణాంధ్ర-2047 దార్శనిక ప్రణాళికకు అనుగుణంగా దశల వారీ లక్ష్యాలను చేరుకునేలా నగరంలోని కలెక్టరేట్ ఆవరణలో నెలకొల్పిన ఇగ్నైట్ ప్రత్యేక సెల్‌లో బుధవారం పంచాయతీరాజ్, జిల్లా పంచాయతీ శాఖ స్టాల్‌ను ఏర్పాటు చేశారు. దీనిని కలెక్టర్ జి.లక్ష్మీశ, జేసీ ఎస్.ఇలక్కియా పరిశీలించారు. ఈ సందర్భంగా విజయవాడ గ్రామీణ మండలం నున్న పంచాయతీకి మూడు చెత్త సేకరణ రిక్షాలను గ్రీన్ అంబాసిడర్‌లకు కలెక్టర్ అందజేశారు. డీపీవో పి.లావణ్య కుమారి తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్లకు రిక్షాలు అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ, జేసీ ఇలక్కియా తదితరులు

ప్రమాదకర స్తంభాల పరిశీలన

మధురానగర్, న్యూస్‌టుడే: బుడమేరు గట్టుపై ప్రమాదకరంగా వాలిపోతున్న విద్యుత్తు స్తంభాల సమస్యపై బుధవారం 'ఒరిగితే.. తీగలు తెగితే..?' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. మధురానగర్ విద్యుత్తు సెక్షన్ ఏఈ రామలింగేశ్వరరావు స్పందించారు. తన సిబ్బందితో వెళ్లి వాటిని పరిశీలించారు. ప్రస్తుతం వర్షాలు పడుతున్నాయని, వర్షాలు తగ్గుముఖం పట్టి సాధారణ పరిస్థితులు నెలకొనగానే స్తంభాలను మారుస్తామని 'న్యూస్‌టుడే'కు తెలిపారు. దీని కోసం కొత్త సిమెంటు స్తంభాలను తీసుకువచ్చారు. వాటిని మార్చేందుకు విద్యుత్తు ఉపకేంద్రానికి సరఫరా నిలపాల్సి వస్తుందని.. ఈ నేపథ్యంలో త్వరితగతిన మారుస్తామంటూ వివరించారు.

పొంగినా.. పట్టించుకోరా..?

అజిత్‌సింగ్‌నగర్, న్యూస్‌టుడే: అజిత్‌సింగ్‌నగర్, నందమూరినగర్, వాంబేకాలనీ, డాబా కొట్లు సెంటర్‌లలో భూగర్భ డ్రైనేజీల్లో పూడిక తీయకపోవడంతో మ్యాన్‌హోళ్లు పొంగుతున్నాయి. గత వైకాపా పాలనలో మురుగు నీటి పారుదల వ్యవస్థ నిర్వహణను పట్టించుకోలేదు. అయిదేళ్లలో కొత్తగా భూగర్భ డ్రైనేజీలు నిర్మించకపోగా, ఉన్న వాటిని గాలికి వదిలేశారు. పలుచోట్ల అధ్వాన స్థితికి చేరాయి. నందమూరి నగర్ 15వ లైనులో మురుగు పొంగుతోంది. డాబా కొట్లు సెంటర్ ప్రధాన రహదారి పొడవునా ఇదే పరిస్థితి. దారిలో మురుగు పారుతుంటే.. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వినియోగదారులు కూడా రావడం లేదని, వ్యాపారాలు చేసుకోలేకపోతున్నామని దుకాణదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా యూజీడీ అధికారులు స్పందించి పూడిక తీయించాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

నందమూరి నగర్ తోటావారి వీధిలో..

డాబా కొట్లు సెంటర్ ప్రధాన రహదారిలో పొంగుతున్న డ్రైనేజీ

ప్రయత్నం ఎంత నిలకడగా ఉంటే..

ప్రయత్నానికి, ఫలితానికి మధ్య కాలావధి ఉంటుంది. అది రోజులో, వారాలో, నెలలో అవ్వొచ్చు. లేకపోతే- కొన్నేళ్లు కూడా కావొచ్చు. ఒక్క విషయం మాత్రం విస్మరించకండి. మీ ప్రయత్నం ఎంత నిలకడగా, ఎంత సుదీర్ఘంగా కొనసాగితే.. ఫలితం కూడా అంత గొప్పగా ఉండే అవకాశాలు పెరుగుతుంటాయి.

– చార్లెస్ మిల్లర్, కంటెంట్ క్రియేటర్

డిగ్రీలో డబుల్ మేజర్ విధానాన్ని తీసుకొచ్చి తక్షణమే ప్రవేశాలు చేపట్టాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కుల్లాయి స్వామి డిమాండ్ చేశారు. ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన విద్యార్థులు డిగ్రీ ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు.

కేటీఆర్, హరీశ్‌రావుల మధ్య అస్తిత్వ పోరుతోనే బనకచర్లపై వివాదం

- జగన్ సూచించే గన్‌ను ప్రజలు ఆయన మీదే ఎక్కుపెడతారు
- 'సుపరిపాలనలో తొలి అడుగు'లో మంత్రి పయ్యావుల కేశవ్

ఉరవకొండ, న్యూస్‌టుడే: బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణం వల్ల తెలంగాణకు ఎలాంటి నష్టమూ లేదని, సముద్రంలోకి వృథాగా పోతున్న జలాలను వినియోగించుకోవాలన్నది ఏపీ ప్రభుత్వ ప్రయత్నమని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. అనంతపురం జిల్లా కూడేరు మండలం జయపురంలో బుధవారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారాసలో కేటీఆర్, హరీశ్‌రావుల మధ్య అస్తిత్వ పోరుకు రాజకీయ రంగును పులిమి, ఇదేదో ప్రాంతాల మధ్య సమస్యగా చూపిస్తున్నారని అన్నారు. హరీశ్‌రావు తన రాజకీయ ప్రాబల్యం పెంచుకోవడానికి బనకచర్ల మీద వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తున్నారన్నారు. బనకచర్ల ప్రాజెక్టును కలిసి ప్రారంభిద్దామని గతంలో తెలంగాణ, ఆంధ్రా మాజీ సీఎంలు కేసీఆర్, జగన్‌లు మాట్లాడుకున్న విషయం హరీశ్‌రావుకు గుర్తుకురావడం లేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ తిరుపతికి వచ్చినప్పుడు రాయలసీమకు నీళ్లిస్తామని చెప్పిన మాటలు, అదే అంశాన్ని ఆయన అసెంబ్లీలోనూ ప్రకటించిన విషయం హరీశ్‌రావుకు గుర్తులేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇదంతా ఆయన కేవలం రాజకీయ అస్తిత్వం కోసమే చేస్తున్న డ్రామాగా అభివర్ణించారు. తాము తెలంగాణకు వ్యతిరేకం కాదని, వృథాగా సముద్రంలోకి వెళ్లే జలాలను మాత్రమే వినియోగించుకోవాలన్నదే లక్ష్యమన్నారు.

'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో సంక్షేమ పథకాల అమలు ప్రతిని మహిళకు చూపిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజల దృష్టి మళ్లించడానికే...

'సామాజిక మాధ్యమాలను గన్'గా వాడుకోవాలని మాజీ సీఎం జగన్ నాయకులు, కార్యకర్తలకు చెప్పడం విడ్డూరంగా ఉందని పయ్యావుల పేర్కొన్నారు. ఆయనకు నిద్రలో కూడా గన్ అరాచక పాలనే కనిపిస్తోందన్నారు. ప్రజల మధ్య అశాంతి, అభద్రత సృష్టించి వారిని భయపెట్టాలనుకోవడమే ఆయన నైజమని ఎద్దేవా చేశారు. ప్రజలను రెచ్చగొట్టడమే ఆయన లక్ష్యమన్నారు. భవిష్యత్తులో సామాజిక మాధ్యమాల వేదికగానే ఆయన సూచిస్తున్న గన్‌ను ప్రజలు ఆయన మీదనే ఎక్కుపెట్టనున్నారని తెలిపారు. రాష్ట్రంలో జగన్ రౌడీల రిక్రూట్‌మెంట్ బోర్డును ప్రారంభించారని ఆక్షేపించారు.

పేపరుమిల్లులో హైడ్రోజన్ పెరాక్సైడ్ లీకేజీ

లీకవుతున్న హైడ్రోజన్ పెరాక్సైడ్‌పై నీటిని పిచికారీ చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాజమహేంద్రవరం (కంబాలచెరువు), ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆంధ్రా పేపరుమిల్లులో బుధవారం ఉదయం ప్రమాదకర హైడ్రోజన్ పెరాక్సైడ్ లీకేజీతో తీవ్ర కలకలం రేగింది. మిల్లు ఉత్తర ద్వారం మీదుగా 26 టన్నుల హైడ్రోజన్ పెరాక్సైడ్‌తో వచ్చిన లారీ సేఫ్టీ వాల్వ్ నుంచి రసాయనం లీకవుతుండడంతో పరిశ్రమ ప్రతినిధులు అప్రమత్తమై అగ్నిమాపక అధికారులకు సమాచారమిచ్చారు. వారు ఘటనా స్థలానికి చేరుకొని లీకవుతున్న హైడ్రోజన్ పెరాక్సైడ్‌పై నీటిని పిచికారీ చేస్తూ ప్రమాద తీవ్రతను తగ్గించారు. మూడు గంటలపాటు శ్రమించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

జగన్ ఇలాకాలోనే దొంగ పింఛన్లు అధికం

- పులివెందులలో 7,487 దివ్యాంగుల పింఛన్లలో 1,708 బోగస్‌వే
- తర్వాతి స్థానాల్లో ధర్మవరం, చంద్రగిరి, మచిలీపట్నం
- వైకాపా హయాంలో విచ్చలవిడిగా అనర్హులకు మంజూరు

ఈనాడు, అమరావతి: దివ్యాంగుల పింఛనుదార్లలో అనర్హులు కుప్పలుతెప్పలుగా బయటపడుతున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో అనర్హులకు పింఛన్లు మంజూరైనట్లు బట్టబయలవుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 7.86 లక్షల మంది దివ్యాంగుల కేటగిరీ పింఛన్లు పొందుతున్నారు. 175 నియోజకవర్గాల్లోనూ ఇప్పటివరకు 4.76 లక్షల పింఛన్లను అధికారులు తనిఖీ చేయగా దాదాపు లక్షమంది అనర్హులని తేలింది. జగన్ నియోజకవర్గం పులివెందులలో బోగస్ పింఛన్లు ఎక్కువగా మంజూరైనట్లు బయటపడింది. బోగస్ దివ్యాంగ పింఛన్లు 100లోపు ఉన్న నియోజకవర్గాలు 9 అని వెల్లడైంది. కాకినాడ సిటీ పరిధిలో అత్యల్పంగా 19 బోగస్ పింఛన్లు ఉన్నట్లు గుర్తించారు. విశాఖ దక్షిణంలో 39, తాడికొండలో 55, విశాఖ ఉత్తరంలో 57, నిడదవోలులో 58, విశాఖ తూర్పులో 71, అద్దంకిలో 78, విజయవాడ పశ్చిమలో 83, విజయవాడ సెంట్రల్‌లో 88 మంది అనర్హులు పింఛన్లు పొందుతున్నట్లు బయటపడింది. 1,000 నుంచి 1,800 వరకు బోగస్ పింఛన్లున్న నియోజకవర్గాలు 13 అని తేలింది. 88 నియోజకవర్గాల్లో 500 నుంచి 970 మంది వరకు అనర్హులకు పింఛన్లు మంజూరయ్యాయి. మిగతా 59 స్థానాల్లో 100 నుంచి 500 మధ్యలో బోగస్ పింఛన్లున్నట్లు బయటపడింది.

లోపం లేకున్నా...

అంధత్వం, రేచీకటి, వినికిడి లోపం, కాళ్లు, చేతులు వంకర లేకున్నా ఉన్నట్లు చూపి దొంగ పింఛన్లు మంజూరు చేశారు. తప్పుడు సదరం ధ్రువీకరణ పత్రాలు తీసుకుని పింఛన్లు పొందుతున్న వారు 50,540 మంది ఉన్నారు. కంటి చూపు సరిగా లేనట్లు ధ్రువీకరణ పొందిన వారు 23,200 మంది, చెవుడు లేకపోయినా ఉన్నట్లు చూపిన 20 వేల మంది... బోగస్ పింఛన్లు తీసుకుంటున్నట్లు తేలింది.

నియోజకవర్గాల వారీగా దివ్యాంగుల కేటగిరీలో బయటపడిన బోగస్ పింఛన్లు

నియోజకవర్గం	మొత్తం పింఛన్లు	బోగస్ పింఛన్లు
పులివెందుల	7,487	1,708
ధర్మవరం	7,243	1,671
చంద్రగిరి	5,929	1,604
మచిలీపట్నం	5,680	1,539
జమ్మలమడుగు	5,628	1,451
శింగనమల	8,235	1,418

తనిఖీకి రాని వారికి మళ్లీ నోటీసులు

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 7.86 లక్షల మంది దివ్యాంగుల కేటగిరీ పింఛనుదార్లలో 5.10 లక్షల మందికి సదరం ధ్రువీకరణపత్రాల తనిఖీ కోసం రావాలంటూ నోటీసులు జారీచేశారు. వీరిలో 4.76 లక్షల మంది.. వైద్యుల ముందు హాజరయ్యారు. మిగిలిన వారికి మరోమారు నోటీసులు జారీ చేసి అప్పటికీ హాజరు కాకపోతే తదుపరి చర్యలు తీసుకోనున్నారు.

పట్టాభిరామ్‌కు ప్రముఖుల నివాళి

- జూబ్లీహిల్స్ మహాప్రస్థానంలో అంత్యక్రియలు పూర్తి

హైదరాబాద్, న్యూస్‌టుడే: గుండెపోటుతో మృతిచెందిన వ్యక్తిత్వ వికాస నిపుణుడు, ఇంద్రజాలికుడు, రచయిత డా.బీవీ పట్టాభిరామ్‌కు పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని ఓమేగా ఆసుపత్రి నుంచి ఆయన భౌతిక కాయాన్ని బుధవారం ఉదయం ఆనంద్‌నగర్‌కాలనీ సంపత్ అపార్ట్‌మెంట్‌లోని నివాసానికి తీసుకువచ్చారు. ప్రముఖులు, మిత్రులు, బంధువులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పించారు. పట్టాభిరామ్ సతీమణి భావరాజు జయశ్రీ, కుమారుడు బీవీఎస్ ప్రశాంత్‌లను పరామర్శించి వారిని ఓదార్చారు. ఎమెస్కో అధినేత విజయకుమార్, సీబీఐ మాజీ జేడీ వి.లక్ష్మీనారాయణ, శాంతా బయోటెక్ వ్యవస్థాపకుడు కేఐ వరప్రసాద్‌రెడ్డి, విశ్రాంత ఐఏఎస్ అధికారులు ప్రభాకర్‌రెడ్డి, బి.జనార్దన్‌రెడ్డి, సినీ నటుడు జెన్నీ, సీనియర్ సంపాదకుడు కె.రామచంద్రమూర్తి, ఇంటెలిజెన్స్ ఓఎస్‌డీ శివకుమార్, రచయిత యండమూరి వీరేంద్రనాథ్, ఆధ్యాత్మికవేత్త సుఖబోధానందస్వామి, దైవజ్ఞశర్మ తదితరులు పట్టాభిరామ్‌కు నివాళులర్పించిన వారిలో ఉన్నారు. అనంతరం మధ్యాహ్నం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో అంత్యక్రియలు నిర్వహించారు.

పట్టాభిరామ్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న విజయకుమార్, వరప్రసాద్‌రెడ్డి ★ జనార్దన్‌రెడ్డి ★ లక్ష్మీనారాయణ

ఉద్యోగులకు మరో ఏడాది ఉచిత బస సదుపాయం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సచివాలయం, విభాగాధిపతుల కార్యాలయాలు, అసెంబ్లీ, హైకోర్టు, రాజ్‌భవన్‌లో పని చేస్తున్న ఉద్యోగులకు ఉచిత బస సౌకర్యాన్ని మరో ఏడాది పొడిగిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర విభజన తర్వాత కార్యాలయాల తరలింపు నేపథ్యంలో కుటుంబాలను హైదరాబాద్‌లోనే ఉంచి ఇక్కడ ఒంటరిగా ఉంటున్న ఉద్యోగుల సౌలభ్యం కోసం ప్రభుత్వం అపార్ట్‌మెంటులను అద్దెకు తీసుకుని ఉచిత బస సదుపాయం కల్పిస్తోంది. తాజాగా జూన్ 27తో గడువు ముగియడంతో 2026 జూన్ 26 వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

విమాన సర్వీసులకు అంతరాయం

శంషాబాద్, న్యూస్‌టుడే: శంషాబాద్‌లో ప్రతికూల వాతావరణం కారణంగా బుధవారం విమాన సర్వీసుల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. శంషాబాద్ నుంచి బ్రహ్మపూర్, దమామ్, హుబ్లీ, సిటీ, కోలాలంపూర్, పోర్ట్‌తో పాటు జెడ్డాకు వెళ్లాల్సిన విమాన సర్వీసులు గంటన్నర ఆలస్యంగా బయలుదేరాయి. తెల్లవారుజామున 3.55 గంటలకు మస్కట్ వెళ్లాల్సిన సలామ్ ఎయిర్‌లైన్స్ సర్వీస్‌ను రద్దు చేశారు. బెంగళూరు, కోల్‌కతానుంచి శంషాబాద్‌కు చేరుకున్న నాలుగు దేశీయ విమాన సర్వీసులను దారి మళ్లించి బెంగళూర్, విజయవాడలో ల్యాండింగ్ చేశారు. రెండు గంటల అనంతరం వాతావరణం కుదుటపడిన తర్వాత ఆ 4 విమానాలు శంషాబాద్ చేరుకున్నాయని అధికారులు తెలిపారు.

కేంద్ర జలసంఘం పరిశీలనలో పోలవరం-బనకచర్ల అనుసంధానం పీఎఫ్‌ఆర్

కొన్ని సందేహాలు లేవనెత్తుతూ లేఖ

ఈనాడు, అమరావతి: పోలవరం-బనకచర్ల ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ నివేదిక (పీఎఫ్‌ఆర్)ను కేంద్ర జలసంఘం పరిశీలిస్తోంది. ఏప్రిల్ నెలలో ఈ నివేదిక వారికి అందింది. ఈ నివేదికను ఆమోదిస్తే ఆ తర్వాత డీపీఆర్ రూపకల్పనకు సిద్ధమవుతారు. పీఎఫ్‌ఆర్‌ను పరిశీలిస్తున్న కేంద్ర జలసంఘం కొన్ని ప్రశ్నలు లేవనెత్తుతూ లేఖ పంపింది. గోదావరి వరద జలాల ఆధారంగా ఈ ప్రాజెక్టు చేపడుతున్నారని పేర్కొన్నారు.. గోదావరి నీటి వివాదాల ట్రిబ్యునల్ 1980 ప్రకారం వరద జలాలు పంపకం చేయలేదు కదా అని ప్రశ్నించింది. అలాగే స్టిమ్యులేషన్ అధ్యయనాలు చేశారా అని కూడా సందేహం వ్యక్తం చేసింది. ఈ రెండు అంశాలపై రాష్ట్ర జలవనరులశాఖ సమాధానాలు ఇచ్చేందుకు సిద్ధమవుతోంది. ఈ ప్రాజెక్టులో వ్యాప్కోస్ హైడ్రాలజీ కన్సల్టెన్సీగా ఉంది. ఆ సంస్థ చీఫ్ డైరెక్టర్ విజయవాడ రానున్నారు. ఈ అంశంపై సమావేశమై కేంద్ర జలసంఘానికి తగిన సమాధానం పంపుతారు. డీపీఆర్ తయారీ క్రమంలో స్టిమ్యులేషన్ అధ్యయనం తప్ప పీఎఫ్‌ఆర్ దశలో అవసరం లేదని అధికారులు చెబుతున్నారు. కేంద్ర జలసంఘం ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చిన తర్వాత అధికారుల బృందం దిల్లీ వెళ్లి కేంద్ర అధికారులను కలిసి వారి సందేహాలను నివృత్తి చేయనున్నారు.

తిరుమలలో కళా ప్రదర్శన పేరుతో బురిడీ

నిందితుడు సూత్రపు అభిషేక్ అరెస్టు

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో కళా ప్రదర్శనకు అవకాశం ఇప్పిస్తానని పలువురిని మోసగించిన వ్యక్తిని పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. తెలంగాణ రాష్ట్రం కాజీపేటకు చెందిన సూత్రపు అభిషేక్.. తిరుమలలోని ఆస్థాన మండపంలో 'శ్రీనివాస కళార్చన' పేరుతో రెండు రోజుల నాట్య కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పి తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్ (హెచ్‌డీపీపీ) అనుమతి లేకుండానే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 93 కళా బృందాల్లోని 2,900 మంది కళాకారులను నమ్మించాడు. వసతి, భోజనం, శ్రీవారి దర్శనం, ప్రసాదం, జ్ఞాపికల పేరుతో వారి నుంచి రూ.35 లక్షల వరకు వసూలు చేశాడు. దీనిపై ఫిర్యాదులు అందడంతో తిరుమల పోలీసులు కేసు నమోదు చేశారు. డీఎస్పీ విజయ్‌శేఖర్ ఆదేశాలతో అభిషేక్‌ను మంగళవారం అరెస్టు చేసి రూ.14 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. బుధవారం తిరుపతి న్యాయస్థానంలో నిందితుడిని హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించారు.

సూత్రపు అభిషేక్

వరద ముప్పు అడ్డుకునే వ్యవస్థను మరింత బలోపేతం చేయాలి

విజయవాడలో వరద కారణంగా ప్రాణాలు కోల్పోయారు

ఈనాడు, అమరావతి: వరద ముప్పును అడ్డుకునేందుకు వ్యవస్థను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని హైకోర్టు వ్యాఖ్యానించింది. గతేడాది విజయవాడలో వరదల కారణంగా ప్రాణనష్టం జరిగినందున అందుకు బాధ్యులైన అధికారులెవరో గుర్తించాలంది. విజయవాడ వరద విషయంలో ప్రజలను అప్రమత్తం చేయడంలో అధికారులు విఫలమయ్యారని, బాధ్యులపై చర్యలు తీసుకునేలా ఆదేశించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యం(పిల్)లో కౌంటర్ వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు మరికొంత సమయం ఇచ్చింది. తదుపరి విచారణను అక్టోబరు 8కి వాయిదా వేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. గతేడాది బుడమేరు పొంగడం వల్ల విజయవాడ వరద ముంపులో చిక్కుకున్న విషయం తెలిసిందే. వరదను కట్టడి చేయడంలో విఫలమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఒంగోలుకు చెందిన విశ్రాంత పాత్రికేయుడు భూపతిరావు గతేడాది హైకోర్టులో పిల్ దాఖలు చేశారు. కృష్ణానది ఒడ్డున అనధికార నిర్మాణాలు, బుడమేరు, కొండవీటి వాగుల ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న ఆక్రమణలను తొలగించేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు.

వ్యక్తిగతంగా లక్ష్యం చేసుకొని వాదనలు చెప్పొద్దు: ధర్మాసనం

బుధవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫు న్యాయవాది కాసా జగన్‌మోహన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ వరదలకు కృష్ణానది కరకట్ట వెంట అక్రమ నిర్మాణాలు ఓ కారణం అన్నారు. ఆ నిర్మాణాల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసం ఉందన్నారు. వరదలకు సీఎం కారణం అన్నారు. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రిని ప్రతివాదిగా పేర్కొన్నామని చెప్పారు. గతంలో సీఎంకు హైకోర్టు నోటీసు ఇవ్వలేదని, ప్రస్తుతం ఇవ్వాలని కోరారు. అందుకు ధర్మాసనం నిరాకరించింది. వ్యక్తిగతంగా లక్ష్యం చేసుకొని వాదనలు చెప్పొద్దని సూచించింది. ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) ప్రణతి వాదనలు వినిపిస్తూ.. వర్షం అధికంగా కురవడమే వరదలకు కారణం అన్నారు. పూర్తి వివరాలతో కౌంటర్ వేసేందుకు మరికొంత సమయం ఇవ్వాలని కోరారు.

అత్యాధునిక సాంకేతిక హంగులతో పోలీస్ అకాడమీ

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: అత్యాధునిక సాంకేతిక హంగులు, అన్ని వసతులతో దేశంలోనే మోడల్ పోలీస్ అకాడమీ నిర్మిస్తామని ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం నూగొండపల్లి, పిన్నమరెడ్డిపల్లి గ్రామాల పరిధిలో ఏపీ పోలీస్ అకాడమీ కేంద్రం నిర్మాణ ప్రతిపాదిత ప్రాంతాన్ని డీజీపీ బుధవారం పరిశీలించారు. అప్పా నిర్మాణ ప్రాంతాన్ని మ్యాప్, వీడియో, చిత్రాల ద్వారా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్, తహసీల్దారు పీఎన్వీ ప్రసాద్‌లు డీజీపీకి వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ... 94.49 ఎకరాల్లో ఏపీ పోలీస్ అకాడమీ కేంద్రం నిర్మించేందుకు సన్నాహాలు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు డీజీపీ మధుసూదన రెడ్డి, ఐజీలు జి.వి.జి. అశోక్ కుమార్, ఎం.రవి ప్రకాశ్, డీఐజీ సత్య ఏసుబాబు, సబ్ కలెక్టర్ బి. స్మరణ్‌రాజ్, డీఎస్పీ కేవీవీఎన్వీ ప్రసాద్, సీఐ కె.రామకృష్ణ, ఎస్సై కె.శుభశేఖర్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

మ్యాప్ పరిశీలిస్తున్న డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా

అమరావతి పనుల పురోగతిపై సంతృప్తి

విజయవాడ (గవర్నర్‌పేట), న్యూస్‌టుడే : రాజధాని అమరావతి నిర్మాణ పనుల పురోగతిపై ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రతినిధులు సంతృప్తి వ్యక్తం చేశారు. వరుసగా మూడో రోజైన బుధవారం వారు విజయవాడ ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఏపీ సీఆర్‌డీఏ కమిషనర్ కె.కన్నబాబు, అదనపు కమిషనర్లు జి.సూర్యసాయి ప్రవీణ్‌చంద్, మల్లారపు నవీన్‌లు 'అర్బన్ గవర్నెన్స్'పై కార్యశాల నిర్వహించారు. వివిధ దేశాల్లో దీనిపై అమలవుతున్న అత్యుత్తమ విధానాలు, పర్యావరణ పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలపై ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు ప్రతినిధులు.. సీఆర్‌డీఏ, ఏడీసీఎల్ అధికారులతో చర్చించారు. అమరావతి నిర్మాణంలో ప్రాజెక్టుల పురోగతి, రాజధానిలో ల్యాండ్ మోనిటైజేషన్ గురించి అధికారులు వారికి వివరించారు. ఆర్థికాభివృద్ధి, రవాణా సదుపాయాల కల్పన, హౌసింగ్ ప్రాజెక్టులు, ప్రైవేట్ సెక్టార్ భాగస్వామ్యం, పౌరసేవల కల్పన తదితర అంశాల్లో సీఆర్‌డీఏ ప్రాతినిధ్యం వహిస్తోందని తెలిపారు. విపత్తు నివారణ కార్యకలాపాలు, సమగ్ర సదుపాయాలతో కూడిన రాజధాని నగర నిర్మాణం గురించి వివరించారు. దీనిపై బ్యాంకు ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు సంతృప్తికర రీతిలో సమాధానం ఇచ్చారు. రాజధాని ప్రాంత నివాసితులకు అమలు చేస్తున్న సామాజిక సంక్షేమ కార్యక్రమాలు, పర్యావరణ పరిరక్షణ, కార్మికులు, మహిళల భద్రతకు అమలవుతున్న చర్యలు, విపత్తుల నిర్వహణకు చేపట్టిన కార్యకలాపాలపై బృంద సభ్యులు పూర్తి స్థాయిలో సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఏడీసీఎల్ సీఎండీ లక్ష్మీపార్థసారథి, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

సీఆర్‌డీఏ చేపట్టిన పనులను ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు బృంద సభ్యులకు వివరిస్తున్న కమిషనర్ కన్నబాబు

రెండు టన్నుల ఆకు కూరలు.. నిమ్మకాయల విరాళం

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: ఇంద్రకీలాద్రిపై ఈనెల 8 నుంచి 10 వరకు నిర్వహించే శాకంబరి ఉత్సవాలకు కృష్ణా జిల్లా ఓగిరాల, నూజివీడు మార్కెట్లలో రైతులు, కూరగాయల వ్యాపారులు 2టన్నుల ఆకు కూరలు, నిమ్మకాయలు విరాళం ఇచ్చేందుకు ముందుకు వచ్చారు. వారికి శాకంబరి ఉత్సవాల ఆహ్వాన పత్రిక, ప్రసాదాలను దేవస్థానం ఉద్యోగులు అందజేశారు. ఉత్సవాలకు 130 టన్నుల కూరగాయలు అవసరం అవుతాయని, విరాళంగా పొందేందుకు రైతులు, మార్కెట్టు వ్యాపారులను కలుస్తున్నట్లు దేవస్థానం ఉద్యోగులు వివరించారు. ఈకార్యక్రమంలో దేవస్థానం ఉద్యోగులు ప్రసాద్, పునీత్ పాల్గొన్నారు.

రైతులకు అమ్మవారి ప్రసాదాలు అందజేస్తున్న దుర్గగుడి ఉద్యోగులు ప్రసాద్, పునీత్

కృష్ణమ్మా.. వచ్చేస్తున్నా..!

పట్టిసీమ నుంచి గోదావరి జలాల విడుదల నేడు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే

పట్టిసీమ ఎత్తిపోతల పథకం (పోలవరం కుడి కాలువ) ద్వారా గోదావరి జలాలను ఈ నెల 3వ తేదీ గురువారం విడుదల చేయనున్నారు. సరిగ్గా ఏడాది క్రితం ఇదే తేదీన పట్టిసీమ ద్వారా నీటిని విడుదల చేశారు. జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విడుదల చేయనున్నారు. ప్రస్తుత ఖరీఫ్ సాగు అవసరాలకు కృష్ణా నది (పులిచింతల), గోదావరి (పట్టిసీమ) నీటిని రెండిటినీ వినియోగించుకునేలా ప్రణాళికతో ఉన్నారు. ఇప్పుడు పులిచింతల ప్రాజెక్టులో 21.67 టీఎంసీల నీటి నిల్వ ఉంది. రోజుకు 4,000 క్యూసెక్కుల వరకు ప్రకాశం బ్యారేజీకి విడుదల చేస్తున్నారు. స్థానిక వరదతో సహా బ్యారేజీకి 5,000 క్యూసెక్కులు వస్తుండగా, 6,000 క్యూసెక్కుల వరకు పంట కాలువలకు విడుదల చేస్తున్నారు. బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటి మట్టానికి గాను, ప్రస్తుతం 11.1 అడుగులు మాత్రమే ఉంది.

గత ఏడాదికంటే మెరుగు..

కృష్ణా నది పరిస్థితి గత ఏడాది కంటే ఈ ఏడాది కాస్త మెరుగ్గా ఉంది. గత ఏడాది పులిచింతల ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీ ఉండగా, నేడు 21.67 టీఎంసీలు ఉంది. గత ఏడాది బ్యారేజీ వద్ద 8.4 అడుగుల నీటి మట్టం ఉండగా, ఈ ఏడాది 11.1 అడుగుల మేర ఉంది. పట్టిసీమలో విడుదల చేసిన నీరు ప్రకాశం బ్యారేజీకి చేరడానికి 5 రోజుల సమయం పడుతుంది. పట్టిసీమ ప్రవాహం ద్వారా కాలువ మార్గ మధ్యంలోని ప్రాంతాలకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాలు వృద్ధి చెందుతాయి. పోలవరం కుడి కాలువ ద్వారా వచ్చే గోదావరి జలాలు బుడమేరు మళ్లింపు కాలువ ద్వారా కృష్ణా నదిలో విలీనం అవుతాయి. వరద ముంపు నేపథ్యంలో బుడమేరు కట్టలు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం వీటి మరమ్మతు పనులు జరుగుతున్నాయి. సాగునీటి అవసరాలు, మరమ్మతు పనులను సమన్వయం చేసుకుని తదనుగుణంగా నీటిని విడుదల చేయాల్సి ఉంది. గోదావరి జలాల విడుదల ద్వారా పట్టిసీమ పంపుల పరిస్థితిని కూడా తెలుసుకునే వీలుంది. ప్రకాశం బ్యారేజీ ద్వారా కృష్ణా డెల్టాలోని 13.08 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుంది.

హెడ్ కానిస్టేబుల్‌పై దాడి : కేసు నమోదు

మచిలీపట్నం క్రైం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉన్న హెడ్‌కానిస్టేబుల్(హెచ్‌సీ)పై దాడి చేసిన సంఘటనపై చిలకలపూడి స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఐ అబ్దుల్‌నబీ కథనం ప్రకారం.. విజయవాడకి చెందిన పి.నవీన్‌కుమార్ బుధవారం మహిళా సంరక్షణ కార్యదర్శిగా పనిచేస్తున్న తన భార్యను జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహిస్తున్న బదిలీ కౌన్సెలింగ్‌కు తీసుకొచ్చారు. ఆమె కౌన్సెలింగ్ నిమిత్తం లోపలకు వెళ్లగా పోలీసు కార్యాలయం ప్రధాన గేటు సమీపంలో బైక్ పార్కింగ్ చేస్తున్న నవీన్‌కుమార్‌ను అక్కడ విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ హెచ్‌సీ బుజ్జిబాబు అక్కడ పార్కింగ్ చేయవద్దని సూచించారు. వినిపించుకోకుండా పార్కింగ్ చేయడంతో సెల్‌ఫోన్‌లో వీడియో తీసే ప్రయత్నం చేసిన హెచ్‌సీతో వాగ్వాదానికి దిగిన నవీన్‌కుమార్ శారీరక దాడికి పాల్పడ్డాడు. బాధితుడైన హెచ్‌సీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నారు. సీసీ కెమెరాల ఫుటేజిని పరిశీలించిన పోలీస్ అధికారులు విధి నిర్వహణలో ఉన్న సిబ్బందిపై దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండించడంతో పాటు పోలీస్ విధులకు ఆటంకం కల్పించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అయితే హెడ్‌కానిస్టేబులే అకారణంగా తనపై కర్రతో దాడి చేసి గాయపర్చాడని నవీన్‌కుమార్ ఆరోపించారు.

సమన్వయంతో జాతీయ రహదారుల అభివృద్ధి

ఈనాడు, అమరావతి: విజయవాడ నుంచి గన్నవరం వరకు ఎన్‌హెచ్-16 అత్యధికంగా ప్రముఖులు ప్రయాణించే రహదారి.. సీఎం మొదలు మంత్రులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారవేత్తలు... అందరూ ఈ మార్గంలో వెళుతుంటారు. రాజధాని అమరావతి పనులు ఊపందుకుంటున్న నేపథ్యంలో ఈ తాకిడి మరింత పెరిగింది. ఇంత ప్రాధాన్యం ఉన్న మార్గంలో పారిశుద్ధ్యం, డ్రెయినేజీ, వాన నీరు నిలిచిపోవడం వంటి సమస్యలు వేధిస్తున్నాయి. వీటిని పరిష్కరిద్దామంటే.. ఈ మార్గం రెండు జిల్లాల పరిధిలో ఉండడం.. చాలా శాఖల సమన్వయంతో పని చేయాల్సి రావడంతో కొంత అశ్రద్ధ చేశారు. తాజాగా ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల కలెక్టర్లు లక్ష్మీశ, బాలాజీ దిద్దుబాటు చర్యలకు ఉపక్రమించారు. వారిద్దరు సంబంధిత అధికారులతో బుధవారం రహదారిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

శాఖల సమన్వయంతో సాధ్యం: రామవరప్పాడు-కేసరపల్లి ముందు వరకు ఎన్టీఆర్ జిల్లాలో ఉంటుంది. అక్కడ నుంచి గన్నవరం వరకు కృష్ణా జిల్లాలో ఉంది. మొత్తం రహదారి నిర్వహణ ఎన్‌హెచ్ అధికారులు పర్యవేక్షించాలి. పచ్చదనం పెంచే బాధ్యత సీఆర్‌డీఏ, పారిశుధ్య నిర్వహణ పురపాలక శాఖ చూడాలి. వీటి మధ్య సమన్వయం లేక దారి పొడవునా సమస్యలే. రహదారులు అక్కడక్కడా దెబ్బతినడం, విద్యుత్తు దీపాలు, స్తంభాల నిర్వహణలో లోపాలు, డ్రెయిన్లు, వంతెనలు, పారిశుద్ధ్య నిర్వహణలో సమస్యలు, రహదారి వెంట పచ్చదనం లోపాలు ఉన్నాయి. దీంతో ఈ విషయాలతో సంబంధిత శాఖలు ఎన్‌హెచ్ అధికారులతో సమన్వయం చేసుకుని యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టాలని కలెక్టర్లు ఆదేశించారు. అమరావతికి ముఖద్వారమైన విజయవాడ రహదారుల్లో ట్రాఫిక్ సమస్య, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎన్‌హెచ్ పీడీ విద్యాసాగర్, కమిషనర్ ధ్యానచంద్ర, డీపీవో లావణ్యకుమారి తదితరులు ఉన్నారు.

చర్చిస్తున్న రెండు జిల్లాల కలెక్టర్లు, కమిషనర్

పక్కా ప్రణాళికతో అద్విక మోసాలు

పటమట, న్యూస్‌టుడే

అద్విక ట్రేడింగ్ కంపెనీ మోసం ఒక్క రోజులో జరిగింది కాదు. పక్కా ప్రణాళికతో మూడేళ్ల నుంచి ప్రజలను నమ్మించి మోసం చేశారు. ఆదిత్యతో మరికొందరు కలిసి చేసిన మోసానికి వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వివిధ అవసరాలకు దాచుకున్న సొమ్ము కొందరు, రుణం తీసుకుని మరికొందరు అద్విక కంపెనీలో పెట్టుబడి పెట్టారు. ప్రభుత్వ ఆసుపత్రి సమీపంలోని ఎన్టీఆర్ కాలనీలోని అద్విక కంపెనీ వద్ద బాధితులు లబోదిబోమంటున్నారు. రూపాయి వస్తుందని ఆశ పడితే తమ కష్టాన్ని దోచుకుపోయారంటూ కన్నీరు పెట్టుకుంటున్నారు. బుధవారం మరో ఐదుగురు బాధితులు ఫిర్యాదు చేశారు. దీంతో మొత్తం ఫిర్యాదుదారులు సంఖ్య 97కి చేరింది.

లెక్కలే లేవు..

అద్విక ట్రేడింగ్ కంపెనీ మోసం లెక్కలు ఇంకా తేలలేదు. ఆదిత్య ఎంతమంది నుంచి పెట్టుబడులు తీసుకున్నాడు... తిరిగి ఎంతమందికి చెల్లించాడో రికార్డులు లేవు. ఏజెంట్లు చెబుతున్న వివరాల ప్రకారం ఆదిత్య ఎంత మంది వద్ద నుంచి నగదు తీసుకున్నాడో పోలీసులు రికార్డు తయారు చేస్తున్నారు. తొలుత ఐదుగురు ఏజెంట్లతో మొదలై ఆ సంఖ్య 44కి చేరింది. దాదాపు 40 మంది ఏజెంట్లను పోలీసులు విచారించారు.

✦✦ పెట్టుబడి పెట్టిన వారికి ప్రతి నెల చెల్లించే వడ్డీ (పేఅవుట్) ఆలస్యంగా చెల్లిస్తున్నారని ఎవరైనా ఏజెంట్ గట్టిగా అడిగితే... వారికి ఆదిత్య సొమ్ము చెల్లించేవాడు కాదు. అతనిని పొగిడినా, సన్మానం చేసినా వెంటనే పేఅవుట్ చేసే వాడని ఏజెంట్ల దర్యాప్తులో తేలింది. ఏజెంట్ల ఖాతాల నుంచే నగదు ఎక్కువగా బదిలీ అయిన నేపథ్యంలో వారి ఖాతాలను ఫ్రీజ్ చేసేందుకు పోలీసులు సిద్ధమైనట్లు తెలుస్తోంది. కొంతమంది ఏజెంట్లు ఆ కేసుతో తమకు సంబంధం లేదని న్యాయస్థానంలో క్యాష్ పిటిషన్ దాఖలు చేశారు. అవి గురువారం విచారణకు రానున్నాయి.

✦✦ ఆదిత్య చేతిలో మోసపోయిన బాధితులు సుమారు 1500 మంది ఉన్నప్పటికీ ఇప్పటివరకు సుమారు 100 మంది మాత్రమే ఫిర్యాదు చేశారు. చాలామంది నల్లధనం పెట్టడంతో పాటు కేసు పెట్టినా ఉపయోగం లేదని ఆలోచనలో ఉన్నారు. ఆదిత్య బయటకు వచ్చిన తర్వాత తేల్చుకుంటామని కొంతమంది బాధితులు ఎదురుచూస్తున్నారు.

(c) eenadu

వచ్చిందండీ.. పోలీసు బండి!

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో రహదారి భద్రత పర్యవేక్షణ, ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి ద్విచక్ర వాహనాలు కేటాయించినట్లు ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. జిల్లాకు కేటాయించిన 16 ద్విచక్రవాహనాలను అనకాపల్లిలో బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రహదారి భద్రత, ట్రాఫిక్ నియంత్రణలో సమర్థంగా పనిచేయడానికి జిల్లాలోని పోలీస్ స్టేషన్లకు వీటిని కేటాయించినట్లు తెలిపారు. సైరన్, బ్లింకర్, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్, క్రౌడ్ కంట్రోల్ టెక్నాలజీతో ప్రత్యేకంగా రూపొందించినట్లు తెలిపారు. మారుమూల ప్రాంతాలకు సైతం వేగంగా పోలీసులు చేరుకోవడానికి ఈ వాహనాలు ఉపయోగపడతాయన్నారు. అదనపు ఎస్పీ మోహనరావు, డీఎస్పీలు శ్రావణి, శ్రీనివాసులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలను ప్రారంభిస్తున్న ఎస్పీ తుహిన్‌సిన్హా

అచ్యుతాపురం కేంద్రంగా కల్తీ మద్యం వ్యాపారం!

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: మద్యం కల్తీ వ్యాపారంపై అబ్కారీ పోలీసులు దాడులు నిర్వహించారు. అచ్యుతాపురం కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న ముఠా వివరాలు తెలుసుకుని పోలీసులు రెండు రోజులుగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఇతర రాష్ట్రాల నుంచి నాసిరకమైన మద్యాన్ని, స్పిరిట్‌ను తీసుకొచ్చి ఖరీదైన మద్యంలో కల్తీ చేసి మద్యం, గొలుసు దుకాణాలకు సరఫరా చేస్తున్నట్లు సమాచారం పోలీసుల వద్ద ఉంది. కొంతకాలంగా గుట్టుచప్పుడుకాకుండా జరుగుతున్న ఈ వ్యాపారంపై ముందస్తు సమాచారంతో పోలీసులు దాడులు నిర్వహించి నమూనాలు సేకరించి పరీక్షలకు పంపినట్లు తెలిసింది. దీని మూలాలు వెలికితీస్తే భారీ కల్తీవ్యాపారం బయటకు వచ్చే అవకాశం ఉండటంతో సమగ్ర విషయాలను తెలుసుకునే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ఈ కల్తీ ముఠా వివరాలను త్వరలో వెల్లడిస్తామని ఓ పోలీసు అధికారి తెలిపారు.

అడ్డేదెవరు.. ఆపేదెవరు!

యథేచ్ఛగా జలవనరుల దోపిడీ

ఈనాడు డిజిటల్, అనకాపల్లి

జిల్లాలో అక్రమ మైనింగ్‌కు హద్దు, అదుపూ లేకుండా పోతోంది. సహజ వనరులు ఎక్కడ కనిపించినా.. వాటిని పిప్పి చేసేంతవరకు అక్రమార్కులు వదలడం లేదు. అధికారులు అడ్డుకున్నా.. లెక్కచేయడం లేదు. ముఖ్యంగా సాగుకు ఆధారమైన చెరువుల రూపురేఖలు మార్చేస్తున్నారు. దీంతో వాటిపై ఆధారపడి జీవిస్తున్న అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. అక్రమార్కులు బరితెగిస్తున్నారు. అధికారులు కొరడా ఝుళిపించడం లేదు. ఫిర్యాదులొచ్చినా తూతూమంత్రం చర్యలతోనే సరిపెడుతున్నారు.

రోలుగుంట మండలం రాజన్నపేట గ్రామంలో సర్వే నెంబర్ 57-2లో భూపతి చెరువు ఉంది. దీనికింద 40 ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. చెరువు ఆధారంగా కొన్ని సంవత్సరాలుగా రైతులు సాగు చేసుకుంటున్నారు. ఈ చెరువు గర్భాన్ని చదును చేసి రోడ్డుగా మార్చేశారు ఓ మైనింగ్ నిర్వాహకుడు. కొండలను పేల్చి బండరాళ్లను ఈ దారిమీదుగా తరలించేందుకు సిద్ధం చేసుకున్నారు. దీనిపై కొన్ని రోజుల క్రితం స్థానికులు జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు స్పందించి దీనిపై విచారణ చేపట్టారు. జలవనరులు, రెవెన్యూ అధికారులు రెండేసిసార్లు నిర్వాహకులకు నోటీసులిచ్చారు. ఇటీవల దారికి అడ్డంగా పొక్లెయిన్ గండ్లు తీసి.. రవాణాకు వీలులేకుండా చేశారు. అయినా అక్రమార్కులు దానిని ఏమాత్రం లెక్కచేయలేదు. చక్కగా గండ్లుపూడ్చేసి.. మళ్లీ రోడ్డు వేసి దర్జాగా మైనింగ్ సాగిస్తున్నారు.

తవ్వకాలను అరికట్టేందుకు రోడ్డుకు అడ్డంగా గండ్లు తీయిస్తున్న రెవెన్యూ అధికారులు

చెరువుల చిక్కిపోతున్నాయి... జిల్లాలో సుమారు 2,890 వరకు చెరువులు, సాగునీటి వనరులు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. వీటిపై ఆధారపడి 2.5లక్షల ఎకరాల్లో పంటలు పండిస్తున్నారు. గత ప్రభుత్వ కాలం నుంచి సాగునీటి వనరులు క్రమంగా ఆక్రమణలకు గురవుతున్నాయి. పాయకరావుపేట మండలం పెదరామభద్రపురంలో ఎనిమిదికరాల్లో లేఅవుట్ వేస్తున్నారు. దీనికి ఆనుకుని ఉన్న పంటకాలువలను కలిపేసుకున్నారు. రావికమతం మండలం మేడివాడలో ఓ స్థిరాస్తి వ్యాపార సంస్థ వేసిన లేఅవుట్‌లో భారీగా ప్రభుత్వ భూములు, గెడ్డలు ఆక్రమించుకున్నట్లు ఫిర్యాదులొచ్చాయి. కానీ అధికారులు వాటిని పట్టించుకోలేదు.

గండ్లు పూడ్చేసి మళ్లీ రోడ్డు వేశారిలా..

పరిశీలించి చర్యలు తీసుకుంటాం... రాజన్నపేట చెరువులో అక్రమంగా వేసిన రోడ్డును పరిశీలిస్తున్నాం. మళ్లీ రోడ్డు వేస్తున్నట్లు మా దృష్టికి రాలేదు. పరిశీలిస్తాం.. ఆక్రమించినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ పరిధిలో భూ అక్రమాలను సహించేది లేదు. సహజవనరుల దోపిడీకి పాల్పడితే చర్యలు తప్పవు. – వి.వి.రమణ, ఆర్డీఓ, నర్సీపట్నం

ఆవేదనగా అసహాయుల ఎదురుచూపు

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే

పింఛను పొందుతూ భర్త మరణిస్తే భార్యకు అందించే స్పౌజ్ పింఛన్ల కోసం లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే వివిధ కారణాలతో పలుమార్లు పంపిణీ ప్రక్రియ వాయిదా వేశారు. ఎప్పుడు పంపిణీ చేస్తారో స్పష్టత లేకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారు. కూటమి ప్రభుత్వం 2023 డిసెంబరు 1 నుంచి 2024 అక్టోబరు 31 మధ్య సామాజిక భద్రత పింఛను తీసుకుంటూ మృతిచెందిన లబ్ధిదారుల పింఛను వారి జీవిత భాగస్వామికి బదలాయించి స్పౌజ్ పింఛను అందించేందుకు ఏప్రిల్ 24న చర్యలు ప్రారంభించింది. మరణించిన లబ్ధిదారుడి వివరాలు, మరణ ధ్రువపత్రంతోపాటు జీవిత భాగస్వామి వివరాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో అందించి ఆన్‌లైన్ చేసుకోవాలని సూచించింది. దీంతోపాటు 2024 నవంబరు నుంచి మృతి చెందిన వారి భాగస్వామికి స్పౌజ్ పింఛను అవకాశం కల్పించింది. దీంతో 3906 మంది దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు వివిధ దశల్లో పరిశీలన అనంతరం వీరిలో 3300 మందిని అర్హులుగా గుర్తించారు.

జిల్లాలో 24 మండలాలతోపాటు అనకాపల్లి జీవీఎంసీ, నర్సీపట్నం, ఎలమంచిలి మున్సిపాలిటీల పరిధిలో జూన్ 12న పంపిణీ చేయడానికి లబ్ధిదారుల జాబితాను జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు సిద్ధం చేశారు. అనివార్య కారణాలతో వాయిదా వేశారు. మళ్లీ ఎప్పుడు పంపిణీ చేస్తారో అధికారులు చెప్పక పోవడంతో లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పూర్తయిన సందర్భంగా 'సుపరిపాలన' వేడుకలు జరుగుతుండటంతో ప్రజా ప్రతినిధులు ఆ కార్యక్రమాల్లో బిజీగా ఉన్నారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) అధికారులు సైతం ప్రభుత్వం నుంచి స్పష్టమైన తేదీ రాలేదని చెబుతున్నారు. సత్వరం వీటి పంపిణీ చేపట్టి ఆర్థికంగా ఆదుకోవాలని లబ్ధిదారులు ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

ఆదేశాలు అందగానే.. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే స్పౌజ్ పింఛన్లను లబ్ధిదారులకు అందిస్తాం. మండలాల వారీగా జాబితాలను సిద్ధం చేశాం. స్పష్టమైన తేదీ అంటూ ఏమీ రాలేదు. ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో ఇంటికి వెళ్లి అందజేస్తాం. – శచీదేవి, పీడీ, డీఆర్‌డీఏ

విశాఖ తీరానికి 'కార్డేలియా' కళ!!

క్రూయిజ్ నౌక ప్రయాణికులకు బోర్డింగ్ పాస్‌ను అందజేస్తున్న మంత్రి కందుల దుర్గేష్. ప్రజాప్రతినిధులు, అధికారులు

విశాఖ పోర్టులో అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ నిర్మాణం తరువాత తొలిసారిగా బుధవారం క్రూయిజ్ నౌక 'కార్డేలియా' వచ్చింది. దీంతో తీర ప్రాంతం సరికొత్త కళ సంతరించుకుంది. తెల్లని భారీ నౌక సాగర జలాల్లో వస్తుంటే సమీప కొండలపైనుంచి జనం ఆసక్తిగా తిలకించారు. వందల మంది ప్రయాణికులతో వచ్చిన ఈ నౌకకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. రాత్రి కడలి జలాలపై హుందాగా వెళుతున్న సమయంలో విద్యుత్తు కాంతుల్లో మెరిసిన తీరు ఎంతగానో ఆకట్టుకుంది. నౌకలో వచ్చిన పర్యాటకులను ప్రత్యేక బస్సుల్లో ఆర్‌కే బీచ్ ప్రాంతానికి తీసుకురాగా... పలువురు సాగర తీర అందాలను సెల్‌ఫోన్లలో బంధించారు. వందల మంది ఒకేసారి బీచ్ రోడ్డుకు చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. –ఈనాడు, విశాఖపట్నం.

ఆర్‌కే బీచ్ తీరంలో పర్యాటకులు

నౌకలో వచ్చిన ప్రయాణికులు... సెల్ఫీలు దిగుతూ...

వడివడిగా ఉక్కు అడుగులు

రైల్వే లైనుకు 111 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు

నక్కపల్లి, న్యూస్‌టుడే

పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న మండలంలో ప్రస్తుతం అందరి దృష్టి ఆర్సెలార్ మిత్తల్ ఉక్కు పరిశ్రమపైనే ఉంది. ఇది ఏర్పాటైతే వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలతోపాటు, దీని పరిసర ప్రాంతాలన్నీ ఆర్థికాభివృద్ధి దిశగా పరుగులు పెట్టనున్నాయి. తాజాగా రైల్వే లైను కోసం 111 ఎకరాలు కేటాయిస్తూ సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం ఎంత ప్రతిష్ఠాత్మకంగా తీసుకుందనేది తెలుస్తోంది.

తెదేపా హయాంలోనే సిద్ధంచేసిన సుమారు 4,300 ఎకరాల భూముల్లో ఇప్పటికే 1800 ఎకరాల వరకు బల్క్ డ్రగ్ పార్కుకు ఇచ్చారు. ఈ ఏడాది జనవరిలో ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడు ఈ పనులు ప్రారంభించారు. అప్పటి నుంచి ఇవి శరవేగంగా సాగుతున్నాయి. మరోవైపు ఉక్కు పరిశ్రమను రాష్ట్రానికి రప్పించడంలోనూ ప్రభుత్వం సఫలీకృతమైంది. దీనికోసం నక్కపల్లి మండలంలోనే రెండు వేల ఎకరాలకు పైగా కేటాయించడంతోపాటు దీని పనులు ప్రారంభానికి సంబంధించి అవసరమైన అనుమతులు ఇవ్వడానికి కేబినెట్‌లోనూ తీర్మానించారు. దీని తర్వాత నుంచి ఉక్కు పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు వేగమయ్యాయి. ఇప్పటికే టౌన్‌షిప్ నిమిత్తం సుమారు 500 ఎకరాలు, రెండో విడతలో అదనపు భూముల కోసం మూడు వేల ఎకరాలకు పైగా అవసరం కాగా, ఆ దిశగా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. కొద్ది రోజుల క్రితం రెండోవిడత సేకరణ పనులు మొదలు పెట్టారు. ప్రస్తుతం రైతుల నుంచి దీనిపై అభ్యంతరాలు వస్తున్న నేపథ్యంలో వారితో చర్చించి ముందుకెళ్లేలా మంత్రి వంగలపూడి అనిత చర్చలు ప్రారంభించారు. మరోవైపు మిత్తల్ పరిశ్రమను వీలైనంత వేగంగా మొదలు పెట్టేలా మరో అడుగు ముందుకు వేసింది. ఆ మేరకు రైల్వే సైడింగ్‌కు (ప్రధాన లైను నుంచి పరిశ్రమలకు వేసే లైను) 111 ఎకరాలు కేటాయిస్తూ ఉత్తర్వులు వచ్చాయి.

మిత్తల్ ఉక్కు నిమిత్తం కేటాయించిన భూములు

అదనపు భూముల నిమిత్తం సర్వే చేస్తున్న అధికారులు

గుల్లిపాడు నుంచే! ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే ఎగుమతులు, దిగుమతుల నిమిత్తం కచ్చితంగా అవసరమైన రవాణా సదుపాయం కావాలి. ప్రస్తుతం కేటాయించిన భూములు తీరప్రాంతాన్ని ఆనుకుని ఉండటంతో క్యాప్టివ్ పోర్టు ఏర్పాటుకు ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీంతో పాటే ఇప్పుడు రైల్వే లైను ఏర్పాటుకు ముందుకు వచ్చింది. ఆ మేరకు 111 ఎకరాలను కేటాయించారు. ప్రస్తుతం నక్కపల్లి మండలానికి సంబంధించి గుల్లిపాడు రైల్వేస్టేషన్ ఉండగా, ఇక్కడ ప్యాసింజర్ రైళ్లు మాత్రమే ఆగుతాయి. ఈ స్టేషన్ అభివృద్ధి పనులు మూడేళ్ల క్రితం చేపట్టారు. ఇవన్నీ తుదిదశకు చేరుకుంటున్నాయి. ఉక్కు పరిశ్రమ ఏర్పాటైతే... దీనికి పది కిలో మీటర్ల లోపే ఈ స్టేషన్ ఉంటుంది. దీని ద్వారా ప్రత్యేక లైనువేసే అవకాశం ఉన్నట్లు అధికారులు భావిస్తున్నారు. స్టేషన్ నుంచి లైను వేస్తే చినదొడ్డిగల్లు, వేంపాడు రెవెన్యూల పరిధిలోనే దాదాపుగా తీసుకోవచ్చని తెలిసింది. ఇప్పటికే ఈ ప్రాంతంలో దీనికి సంబంధించిన భూముల పరిశీలించినట్లు తెలియవచ్చింది. కాగా మధ్యలో జాతీయ రహదారి ఉండటంతో దీన్నెలా దాటిస్తారనేది సందేహంగా మారింది. జాతీయ రహదారి దాటే ప్రాంతంలో వాహనాల కోసం పై వంతెన వేస్తారని రైల్వే ఇంజినీర్ ఒకరు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

వడ్డాది వంతెనంటే గండమే!

వడ్డాది వంతెనపై ప్రయాణం దినదినగండంగా మారింది. మూడేళ్ల కిందట ఈ వంతెన కూలిపోయింది. తాత్కాలికంగా మరమ్మతులు చేయించి వాహనాల రాకపోకలను మళ్లిస్తున్నారు. వంతెనపై పెద్ద గోతులు ఉన్నాయి. వర్షాలకు నీరు చేరి గోతులు కనిపించడం లేదు. బుధవారం సామాన్లతో వెళ్తున్న ఆటో గుంతలో బోల్తాపడింది. స్థానికులంతా తలోచేయి వేసి ఆటోని లేపి యథాస్థితికి తీసుకువచ్చారు. – బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే

ఏడాదిలో సుపరిపాలన దిశగా అడుగులు

హోం మంత్రి అనిత వెల్లడి

పాయకరావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఏడాది కాలంలో సుపరిపాలన దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేసిందని రాష్ట్ర హోంశాఖ మంత్రి అనిత తెలిపారు. మండలంలోని సీతారాంపురంలో 'సుపరిపాలన తొలిఅడుగు' కార్యక్రమం నిర్వహించారు. రూ.60 లక్షలతో నిర్మించనున్న రహదారి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. నిర్మాణం పూర్తయిన కల్వర్టు, రక్షిత తాగునీటి కేంద్రాలను ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను గ్రామస్థులకు వివరించారు. గత వైకాపా ప్రభుత్వం గ్రామాల్లో అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. తమ ప్రభుత్వం ద్వారా ఏడాది కాలంలో మౌలిక వసతులైన రహదారులు, కాలువలు వంటి కార్యక్రమాలు చేపట్టామన్నారు. అధికారం చేపట్టిన వెంటనే పింఛను నగదు రూ. నాలుగు వేలకు పెంచామన్నారు. మహిళలకు ఏడాదికి ఉచిత గ్యాస్ సిలిండర్లు, అమ్మకు వందనం ద్వారా ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి రూ. 13 వేలు అందజేశామన్నారు. చేసిన అభివృద్ధి వివరించేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు ఎమ్మెల్యేలు, మంత్రులు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రానున్న నాలుగు ఏళ్లలో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. నియోజకవర్గంలో సుమారు రూ. లక్ష కోట్లతో భారీ పరిశ్రమలు ఏర్పాటు కాబోతున్నాయని వివరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, కూటమి నాయకులు గెడ్డం బుజ్జి, కొప్పిశెట్టి వెంకటేష్, పద్దు, వరహాలబాబు, రామాకుమారి, వెంకటరమణ, నారాయణరావు, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాల అమలు తీరుపై గ్రామస్థులను ఆరా తీస్తున్న మంత్రి అనిత

వర్షాలకు కూలిన పాఠశాల ప్రహరీ

దేవరాపల్లి, న్యూస్‌టుడే : దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రహరీ పాక్షికంగా దెబ్బతింది. గత కొద్ది రోజుల నుంచి ఓ మోస్తరు వర్షం కురుస్తూనే ఉండటంతో ప్రహరీ లోపల వేసిన మట్టి జారి గోడపై పడింది. దీంతో పాఠశాల వెనక నిర్మించిన గోడలో కొంతమేరకు కూలిపోయింది. దీని నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలో ఉపాధి హామీ నిధులు రూ. 22.60 లక్షలు వెచ్చించారు. ఇంతలోనే కూలిపోయిందంటూ స్థానికులు మండిపడుతున్నారు. దీనిపై సమగ్ర శిక్షా ఏఈఈ సంతోష్ మాట్లాడుతూ కూలిన గోడను నిర్మిస్తామన్నారు.

కూలిన పాఠశాల గోడ

ప్రభుత్వ బడుల్లో పిల్లల సంఖ్య పెంచేలా కృషి

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా ఉపాధ్యాయులు ఉత్తమ బోధన అందించాలని డీఈఓ అప్పారావు నాయుడు సూచించారు. ఎస్.రాయవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు సందర్శించారు. విద్యార్థులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ వహించాలని, ఉపాధ్యాయులంతా సమయపాలన పాటించాలని సూచించారు. సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. విద్యార్థులకు మధ్యాహ్న భోజనం వడ్డించి, డిప్యూటీ డీఈఓ అప్పారావుతో కలిసి భోజనాన్ని రుచిచూసి, సంతృప్తి వ్యక్తం చేశారు. మరమ్మతులు జరుగుతున్న మండల రిసోర్స్ కార్యాలయాన్ని పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు షేక్ రమణ, ఉపాధ్యాయులు ఉన్నారు.

ఎస్.రాయవరంలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న డీఈఓ అప్పారావు నాయుడు

జిల్లా అధికారుల బాధ్యతల స్వీకారం

అనకాపల్లి పట్టణం, కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిగా హైమావతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖ మానసిక వైద్యశాలలో సివిల్ సర్జన్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమెను అనకాపల్లిలో నియమించారు. ఈ మేరకు ఆమె బాధ్యతలు చేపట్టారు.

డాక్టర్ హైమావతి

✦ జిల్లా ప్రజా రవాణా అధికారిగా వి.ప్రవీణ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రవీణను అధికారులు, కార్మికులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, సిబ్బంది మర్యాద పూర్వకంగా కలిశారు.

ప్రవీణ

జిల్లాలో 97.45 శాతం పింఛన్ల పంపిణీ

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో రెండో రోజు బుధవారం 97.45 శాతం పింఛన్ల పంపిణీ పూర్తి చేశామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్ట్ డైరెక్టర్ శచీదేవి పేర్కొన్నారు. అత్యధికంగా సబ్బవరంలో 98.91 శాతం మందికి పంపిణీ చేపట్టారు. 24 మండలాలతోపాటు అనకాపల్లి జీవీఎంసీ, ఎలమంచిలి, నర్సీపట్నం మున్సిపాలిటీల పరిధిలోని 254285 మంది లబ్ధిదారులకు 247942 మందికి రూ. 104.26 కోట్లు పంపిణీ చేశారు. ఇంకా 6343 మందికి పంపిణీ చేయాల్సి ఉంది.

వసతిగృహ ఘటనపై ఆర్‌డీఓ విచారణ

పాయకరావుపేట, న్యూస్‌టుడే: పాయకరావుపేట బీసీ బాలికల కళాశాల వసతిగృహం నిర్వహణపై ఆర్‌డీఓ వి.వి. రమణ బుధవారం విచారణ చేపట్టారు. హోంమంత్రి వంగలపూడి అనిత ఆకస్మిక తనిఖీలో భోజనంలో తల వెంట్రుక రావడంతోపాటు నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో వార్డెన్ గంగాభవానిని సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో బుధవారం ఆర్‌డీఓ రమణ, పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్ జయంతి సమక్షంలో వివరాలు సేకరించారు. వార్డెన్‌ను పలు అంశాలపై వివరణ తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి శ్రీదేవి, తహసీల్దారు మహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్లు.. అయిదుగురు ఎంపీపీలు

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: ఎస్.రాయవరం మండల పరిషత్తు అధ్యక్ష స్థానం ఎవరూ ఎక్కువ కాలం కొనసాగడం లేదు. దీంతో నాలుగేళ్ల కాలంలో నలుగురు ఎంపీపీలు మారారు. ఇంతవరకు ఎంపీపీగా ఉన్న కేసుబోయిన వెంకటలక్ష్మి వ్యక్తిగత కారణాలతో గతనెల ఆరున పదవికి రాజీనామా చేశారు. దీంతో తదుపరి ఎన్నిక జరిగేవరకు మండల పరిషత్తు ఉపాధ్యక్షుడిగా ఉన్న ఎస్.రాయవరం-2 ఎంపీటీసీ సభ్యుడు బొలిశెట్టి గోవిందరావును జిల్లా పరిషత్తు ముఖ్య కార్యనిర్వహణాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో బుధవారం ఎంపీడీఓ సత్యనారాయణ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.

✦ ఎస్.రాయవరం మండల అధ్యక్ష పదవి ఒకరి నుంచి మరొకరికి మారుతూ వచ్చింది. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ పదవిని బీసీ మహిళకు కేటాయించడంతో చినగుమ్ములూరు ఎంపీటీసీ సభ్యురాలిగా గెలుపొందిన బొలిశెట్టి శారదా కుమారి బాధ్యతలు చేపట్టారు. అనంతరం అప్పటి ఎమ్మెల్యే గొల్ల బాబూరావుతో శారదాకుమారి భర్త గోవిందరావుకు విభేదాలు రావడంతో ఆమె ఎంపీపీ పదవికి రాజీనామా చేశారు. ఆ తరువాత ఉప ఎంపీపీ అయిన కోన లోవలక్ష్మి 2023 ఫిబ్రవరిలో ఎంపీపీగా ఎన్నికయ్యారు. అప్పటి నుంచి పదవిలో కొనసాగుతున్న ఆమె అకస్మాత్తుగా మార్చి మూడున రాజీనామా చేశారు. దీంతో ఉప ఎంపీపీగా ఉన్న గుడివాడ ఎంపీటీసీ సభ్యుడు చోడిపల్లి అప్పలరాజును మార్చి 15న జడ్పీ సీఈఓ ఎంపీపీగా నియమించారు. అనంతరం రాష్ట్ర ఎన్నికల సంఘం ఖాళీగా ఉన్న ఎంపీపీ స్థానాలకు ఎన్నిక నిర్వహించడంతో మార్చి 27న కొరుప్రోలు ఎంపీటీసీ సభ్యురాలు కేసుబోయిన వెంకటలక్ష్మి ఎంపీపీగా ఎన్నికయ్యారు. తాజాగా ఆమె రాజీనామా చేయడంతో బొలిశెట్టి గోవిందరావు ఎంపీపీగా నియమించారు. దీంతో నాలుగేళ్ల కాలంలో ఐదుగురు ఎంపీపీలను చూసే అవకాశం ఎస్.రాయవరం మండల ప్రజలకే దక్కింది.

గోవిందరావుకు ఎంపీపీగా నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎంపీడీఓ సత్యనారాయణ

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

(c) eenadu

పెదబొడుగల్లం బడికి కొత్త భవనాలు

పెదబొడుగల్లంలో ఉన్నత పాఠశాలలో భవనాలను పరిశీలిస్తున్న డీఈఓ అప్పారావు

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లి మండలం పెదబొడుగల్లం ఉన్నత పాఠశాలలో నూతన భవనం నిర్మాణానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు వెల్లడించారు. ఇక్కడ భవనాలు శిథిలావస్థకు చేరడంపై మంత్రి అనిత ఆదేశాలతో ఉప విద్యాశాఖాధికారి అప్పారావుతో కలిసి బుధవారం ఆయన ఈ పాఠశాలను పరిశీలించారు. ఇక్కడి భవనాల పరిస్థితిపై గతంలో 'ఈనాడు'లో కథనం ప్రచురితం కాగా, అప్పట్లో అధికారులు స్పందించి తాత్కాలికంగా రెండు ప్రత్యామ్నాయ తరగతి గదులు ఏర్పాటు చేశారు. మిగిలిన భవనాలు నానాటికీ శిథిలమై ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో మంత్రి అనిత దృష్టికి ఈ సమస్యను తెదేపా నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్, పెదబొడుగల్లం సర్పంచి పాతిమున్నీసా తీసుకెళ్లారు. ఆ మేరకు డీఈఓ ఇక్కడకు వచ్చి విద్యార్థులకు ప్రస్తుతం ఏర్పాటు చేసిన తరగతులను పరిశీలించారు. దెబ్బతిన్న భవనాల చుట్టూ ఎవరూ రాకుండా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయురాలు జయశ్రీని ఆదేశించారు. తక్షణం దీనికి అంచనాలు తయారుచేసి పంపాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఇక్కడ భవనం బాగుంటే విద్యార్థుల సంఖ్య భారీగా పెరుగుతుందని నాయకులు తెలిపారు. అనంతరం నక్కపల్లి కస్తూర్బా విద్యాలయాన్ని డీఈఓ తనిఖీ చేశారు. భోజనం పరిశీలించారు. విద్యార్థులతోనూ మాట్లాడారు. డీఈఓ వెంట ఎంఈఓ కె.నరేశ్, సీసీ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ సలీమా పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒలింపిక్ యూనిఫైడ్ పోటీల్లో సత్తా

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: జాతీయస్థాయి స్పెషల్ ఒలింపిక్ యూనిఫైడ్ వాలీబాల్ పోటీల్లో రావికమతం మండలానికి చెందిన మానసిక దివ్యాంగ విద్యార్థి అప్పికొండ గణేష్ కాంస్య పతకం సాధించడం అభినందనీయమని సమగ్ర శిక్ష ఏపీసీ జయప్రకాష్ పేర్కొన్నారు. ఈ మేరకు పట్టణంలోని సమగ్ర శిక్షా కార్యాలయంలో బుధవారం గణేష్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగ విద్యార్థులను ప్రోత్సహిస్తే మరింత అద్భుతాలు సాధిస్తారన్నారు. తొలిసారిగా గణేష్ పోటీల్లో పాల్గొని ఏపీ తరఫున మెడల్ సాధించడం ఆనందంగా ఉందన్నారు. ప్రత్యేక శిక్షణ అందించిన ఉపాధ్యాయులను అభినందించారు. జిల్లా సహిత విద్య సమన్వయకర్త ఎల్.గిరిధర్ పాల్గొన్నారు.

గణేష్‌కు ధ్రువపత్రం అందిస్తున్న జయప్రకాష్

విభాగాలు సరే.. వైద్యం చేయరే!!

★ కేజీహెచ్‌లో ఇదేం దుస్థితి..!
★ పని చేయని పరికరాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర జిల్లాల ఆరోగ్య ప్రదాయినిగా గుర్తింపు పొందిన కేజీహెచ్‌లో కీలకమైన విభాగాల్లో పూర్తిస్థాయి వైద్యసేవలు అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్య పరికరాలు, వైద్యుల కొరతతో రోగులకు అవస్థలు తప్పడం లేదు.

'గుండె'కు అందని వైద్యం: గుండె శస్త్రచికిత్స (కార్డియో థొరాసిక్) విభాగంలో కీలకమైన హార్ట్‌లంగ్ మిషన్, పంపింగ్ స్టేషన్ వైద్య పరికరాలు మూలకు చేరాయి. వైద్యనిపుణులు ఉన్నా.. పరికరాలు లేక రెండు నెలల నుంచి గుండె శస్త్రచికిత్సలు, కవాటాల (వాల్వ్) మార్పిడి చికిత్సలు నిలిచిపోయాయి. 1996లో హిందుస్థాన్ షిప్‌యార్డు ఆర్థిక చేయూతతో కేజీహెచ్‌లో ఓపెన్ హార్ట్ శస్త్రచికిత్సలకు శ్రీకారం చుట్టారు. నెలకు 25 నుంచి 30 వరకు సర్జరీలు చేసేవారు. ఆ తర్వాత పీపీపీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) కింద హార్ట్‌లంగ్ మిషన్, పంపింగ్ స్టేషన్‌కు ప్రతి నెలా అద్దె చెల్లిస్తూ...సర్జరీలు చేశారు. అలా అద్దెకు తీసుకున్న పరికరాలు పాడయ్యాయి. కొత్త పరికరాల కొనుగోలుకు రూ.5 కోట్లు అవసరమని ప్రతిపాదిస్తూ.. ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఈ విషయాన్ని వైద్యాధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఊపిరితిత్తులు, వాస్కులర్ సర్జరీలు మాత్రం చేస్తున్నారు.

మూలకు చేరిన హార్ట్‌లంగ్ మిషన్, పంపింగ్ స్టేషన్

సీట్లు కోల్పోయే ప్రమాదం: నెఫ్రాలజీ విభాగంలో పని చేస్తున్న ప్రొఫెసర్, సహ ప్రొఫెసర్‌ను ఇటీవల బదిలీ చేశారు. ఆ స్థానాలను భర్తీ చేయలేదు. ప్రస్తుతం ఇద్దరు సహాయ ప్రొఫెసర్లతో విభాగం నడుస్తోంది. ఇక్కడ నాలుగు డీఎం కోర్సు సీట్లు ఉన్నాయి. ఆ సీట్లు కొనసాగాలంటే కచ్చితంగా ప్రొఫెసర్, సహ ప్రొఫెసర్ ఉండాల్సిందే. ఆయా ఖాళీలు భర్తీ కాకుంటే, సీట్ల కొనసాగింపునకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అనుమతులు జారీ చేయదు.

★ ఈనెల 5 తర్వాత సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈలోపు కొత్తవారిని నియమించాల్సి ఉంది. కేజీహెచ్‌లో వంద మందికి రోజూ డయాలసిస్ జరుగుతుంది. 60 నుంచి 70 మంది కిడ్నీ బాధితులు చికిత్స పొందుతున్నారు. ఇంతటి కీలకమైన విభాగంలో నియామకాలపై దృష్టిసారించాలి.

'ఎముకల'కు ఒక్కరే: ఎముకల విభాగంలో పని చేస్తున్న ఇద్దరు ప్రొఫెసర్లు డాక్టర్ శివానంద, డాక్టర్ లోక్‌నాథ్‌కు ఇటీవల బదిలీ అయింది. వారి స్థానంలో ఎవర్నీ నియమించలేదు. దీంతో ఆ విభాగం బాధ్యతల్ని కేవలం ఒకే ప్రొఫెసర్ పర్యవేక్షిస్తున్నారు. రోజూ ఎముకల ఓపీ ఉంటుంది. వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు.

నూకాలమ్మ దేవస్థానం ఈఓగా సుధారాణి

అనకాపల్లి, న్యూస్‌టుడే: అనకాపల్లి నూకాలమ్మ దేవస్థానం ఇన్‌ఛార్జి కార్యనిర్వహణాధికారిగా కె.ఎల్.సుధారాణి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈమె ప్రస్తుతం దేవాదాయ శాఖ జిల్లా అధికారిగా ఉన్నారు. ఇంత వరకు ఈఓగా పనిచేసిన వెంపలి రాంబాబు మంగళవారం పదవీ విరమణ చేశారు.

సబ్ కలెక్టరేట్ ఏఓగా సుధాకర్

నర్సీపట్నం, న్యూస్‌టుడే: స్థానిక సబ్ కలెక్టరేట్ పాలనాధికారి (ఏఓ)గా బత్తుల సుధాకర్ బుధవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు ఇక్కడ పనిచేసిన ఏఓ సూర్యనారాయణ పదవీ విరమణ చేశారు. సుధాకర్ అనకాపల్లి ఆర్డీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈయన గతంలో నక్కపల్లి ఆర్ఐగా, కశింకోట తహసీల్దారుగా విధులు నిర్వర్తించారు. కార్యాలయ సిబ్బంది సహకారంతో ప్రజలకు సంతృప్తికర సేవలు అందించేందుకు కృషి చేస్తానని ఆయన తెలిపారు.

సబ్‌జైలులో సౌకర్యాలు మెరుగుపరచాలి

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఉపకారాగారంలో పరిశుభ్రత, సౌకర్యాలు మెరుగుపరచాలని జైళ్లశాఖ డీజీపీ అంజనీకుమార్ తెలిపారు. అనకాపల్లిలోని సబ్‌జైలును ఆయన బుధవారం పరిశీలించారు. ఇక్కడికి వచ్చిన డీజీపీకి ఎస్పీ తుహిన్‌సిన్హా పూలమొక్కను అందజేసి స్వాగతం పలికారు. జైలును పరిశీలించిన అంజనీకుమార్ జైలులో భద్రతా ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. సౌకర్యాలు మెరుగుపర్చడానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. జైళ్లశాఖ డీఐజీ ఎం.ఆర్.రవికిరణ్‌రెడ్డి, అనకాపల్లి సబ్‌జైలు సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్, అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, సీఐలు విజయ్‌కుమార్, అశోక్‌కుమార్, వెంకట నారాయణ, స్వామినాయుడు పాల్గొన్నారు.

సబ్‌జైలును పరిశీలిస్తున్న డీజీపీ అంజనీకుమార్

త్వరలో అందుబాటులోకి డబుల్‌డెక్కర్ బస్సులు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ప్రజలు, విహార యాత్రికులకు మరింత ఆహ్లాదాన్ని అందించేందుకు నగరంలో కొత్తగా డబుల్ డెక్కర్ బస్సులు అందుబాటులోకి రానున్నాయని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ పేర్కొన్నారు. సాగర్‌నగర్ ప్రాంత బీచ్ రోడ్డులోని ఈపీడీసీఎల్ కార్యాలయానికి చేరువలో డబుల్ డెక్కర్ విద్యుత్తు బస్సులతో పాటు సంబంధిత ఛార్జింగ్ కేంద్రాన్ని బుధవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బస్సుల్లోని సౌకర్యాలను, ఛార్జింగ్ స్టేషన్ నిర్వహణ తీరుతెన్నులను క్షుణ్ణంగా పరిశీలించి ట్రయల్ రన్ నిర్వహించారు. గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్, టూరిజం శాఖ సంయుక్తంగా విశాఖ పోర్టు అథారిటీ సౌజన్యంతో రెండు డబుల్ డెక్కర్ బస్సులను త్వరలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం బస్సుల ఛార్జింగ్ నిర్వహణ, తదితర అంశాలను జీవీఎంసీ కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ ఈ బస్సులు మరింత సౌకర్య, ఆహ్లాదకర ప్రయాణానికి అనువుగా ఉంటాయన్నారు. టూరిజం ఆర్డీ జగదీష్, పర్యవేక్షక ఇంజినీర్ సత్యనారాయణరాజు, డీటీవో కె.మాధవి పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న రాష్ట్ర పర్యాటక శాఖ ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్

ఆర్థిక సంక్షోభంలోనూ అభివృద్ధి పథకాలు

కశింకోటలో ఇంటింటి ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే గోవింద, తాతయ్యబాబు తదితరులు

కశింకోట, న్యూస్‌టుడే: రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలో ఉన్నా పలు సంక్షేమ పథకాలను అమలు చేసే ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌కు దక్కిందని తెదేపా జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు, కార్పొరేషన్ ఛైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా బుధవారం కశింకోటలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఉచిత గ్యాస్ సిలెండరు, అమ్మకు వందనం, ఆగస్టు 15 నుంచి శ్రీకారం చుట్టనున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తదితర పథకాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. తీడ గ్రామంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ఇంటింటి ప్రచారం చేసి సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించారు. మండల తెదేపా అధ్యక్షులు కాయల మురళీధర్ జి.భీమవరం గ్రామంలో ఇంటింటి ప్రచారం చేశారు.

నిర్వాసితుల సమస్యలన్నీ పరిష్కరిస్తాం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: నిర్వాసితుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు తెలిపారు. అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలిలోని (సెజ్) ఏపీఐఐసీ వన్‌స్టాప్ కార్యాలయంలో బుధవారం వివిధ గ్రామాల సెజ్ నిర్వాసితుల సమస్యలపై అధికారులతో వారు చర్చించారు. ఉద్దపాలెం చినపూడి, ఉద్దపాలెం, చిప్పాడ గ్రామాల్లో పెండింగ్‌లో ఉన్న ఇళ్లస్థలాలు, ఆర్అండ్ఆర్ ప్యాకేజీలపై అధికారులతో మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న ప్రతి సమస్యను పరిష్కరించి పట్టాలు అందజేసి ఇళ్లస్థలాలు క్షేత్రస్థాయిలో చూపించాలని ప్రత్యేక ఉప కలెక్టర్ అనితను ఆదేశించారు. ఏపీఐఐసీ డీజెడ్ఎం సూర్యనారాయణ, తెదేపా రాష్ట్ర కార్యదర్శి రాజాన రమేష్‌కుమార్, నిర్వాసితుల ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుందరపు, పక్కన ప్రగడ

పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వండి

కశింకోట, న్యూస్‌టుడే: విద్యార్థులు పరిసరాలతోపాటు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని జిల్లా పంచాయతీ అధికారి ఇ.సందీప్ అన్నారు. బయ్యవరంలో బుధవారం ఆయన పర్యటించారు. జడ్పీ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి పారిశుద్ధ్యంపై ఫోన్ కాల్స్ వస్తున్నాయా? చెత్తబండి ఇంటికి వస్తుందా అని ఆరా తీశారు. రక్షిత నీటి పథకం, సంపద కేంద్రం నిర్వహణను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీడీవో వంగలపూడి రవికుమార్, బయ్యవరం, తాళ్లపాలెం కార్యదర్శులు బాబూరావు, సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీపీవో సందీప్

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

ఉపకార వేతనాలు పొందిన విద్యార్థులతో ఎస్పీ తుహిన్‌సిన్హా

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటిని సాధించాలని ఎస్పీ తుహిన్‌సిన్హా తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చూపిన పోలీస్ కుటుంబాలకు చెందిన 26 మంది విద్యార్థులకు రూ. 1.3 లక్షలు ఉపకార వేతనాలుగా అందజేశారు.

అంధుల జీవితాల్లో 'అక్షర' వెలుగులు

★ విశాఖలో బాలికలకు ప్రత్యేక ఆశ్రమ పాఠశాల
★ ప్రభుత్వం మరింత చేయూత ఇస్తే ఎందరికో మేలు

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో అంధ బాలికలకు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏకైక ఆశ్రమ పాఠశాల అది. విశాఖ బీచ్ రోడ్డులో సాగర్‌నగర్ సమీపంలో దాదాపు మూడెకరాల్లో విస్తరించి ఉంది. దృష్టి లోపంతో బాధపడుతున్న బాలికల జీవితాల్లో 38 ఏళ్లుగా వెలుగులు నింపుతోంది. ఏపీ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు సహకారం అందిస్తున్నారు.

● రాష్ట్రంలో అంధ బాలికలకు ప్రత్యేక పాఠశాల ఉందనే విషయం చాలా మందికి తెలియదు. దీనికి ప్రభుత్వం ప్రాచుర్యం కల్పించడంతోపాటు మరిన్ని సదుపాయాలు సమకూరిస్తే ఎంతో మందికి ఆశాకిరణంగా మారుతుంది.

ఏడాదంతా..: ప్రస్తుతం పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 52 మంది విద్యార్థులు చదువుతున్నారు. 40 శాతం, అంత కంటే ఎక్కువ అంధత్వమున్న విద్యార్థులను 'సదరం' ధ్రువపత్రం, ఆధార్ కార్డు ఉంటే చేర్చుకుంటారు. ఒకటి నుంచి తొమ్మిది తరగతులకు ఏడాదిలో ఎప్పుడొచ్చినా ప్రవేశాలు కల్పిస్తారు. పదో తరగతి విద్యార్థులకు ఆగస్టు నెలాఖరులోగా ప్రవేశాలు కల్పిస్తారు. ఏటా పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఈ ఏడాది ఫలితాల్లో అత్యధికంగా శ్రీకాకుళానికి చెందిన ఓ విద్యార్థిని 378 మార్కులు సాధించింది. పాఠశాల పూర్వ విద్యార్థిని ఎం.సత్యవతి ఇటీవల జరిగిన అంధుల ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించింది.

కళాశాల ఏర్పాటు చేస్తే: ఉమ్మడి రాష్ట్రంలో 1987లో పాఠశాలను స్థాపించారు. బోధనకు 19 పోస్టులు మంజూరు కాగా ఉద్యోగ విరమణలు, బదిలీల తర్వాత ప్రస్తుతమున్న ఉపాధ్యాయులు ఆరుగురే. డీఎస్సీ ఫలితాల తర్వాత ఉపాధ్యాయులను కేటాయిస్తారనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బోధనేతర సిబ్బంది పోస్టులు 13 మంజూరు కాగా ఆరు ఖాళీలున్నాయి. ఇక్కడ బాలికల కోసం జూనియర్ లేదా వొకేషనల్ కళాశాల ఏర్పాటు చేయాలని గతేడాది ప్రతిపాదన వచ్చింది. ఇప్పటికీ ఆ దిశగా చర్యలు లేవు. కళాశాల ఏర్పాటైతే ఇక్కడ చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

ప్రవేశాలకు ఆహ్వానం: అంధుల పాఠశాలలో ప్రవేశాల ప్రక్రియ చేపడుతున్నాం. ఆరు నుంచి 14 ఏళ్ల లోపు వయసు గల బాలికలు అర్హులు. ఇక్కడ విద్యార్థులకు బ్రెయిలీ లిపిలో బోధన సాగుతుంది. అందుకు తగ్గ పుస్తకాలు ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ఉచిత విద్యతోపాటు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు, ఉచిత వసతి, భోజనం, అన్ని వేళలా వైద్య సౌకర్యం, కంప్యూటర్ శిక్షణ అందుబాటులో ఉంటుంది. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలి.

–డి.విజయ, ప్రధానోపాధ్యాయురాలు

డీసీసీబీ అభివృద్ధికి సహకరించాలి

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి), న్యూస్‌టుడే: జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ (డీసీసీబీ) అభివృద్ధికి అందరూ సహకరించాలని ఛైర్మన్ కోన తాతారావు పేర్కొన్నారు. పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం డీసీసీబీ ఆధ్వర్యంలో జాతీయ సహకార దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖాతాదారులు, రైతులు అభ్యున్నతికి బ్యాంకు కృషి చేస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ మాట్లాడుతూ సకాలంలో రైతులకు రుణాలు అందించడంలో బ్యాంకు ముందు వరుసలో ఉందన్నారు. ఆర్థిక అవసరాలకు బ్యాంకు అండగా నిలుస్తుందన్నారు. అనంతరం ఛైర్మన్‌తో కలిసి రూ. 2.5 కోట్ల రుణాలను లబ్ధిదారులకు అందించారు. డీసీఎంఎస్ ఛైర్మన్ కోట్ని బాలాజీ, బ్యాంకు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డీసీసీబీ ఛైర్మన్ తాతారావు

EENADU e Classifieds

AUTO

VEHICLES FOR SALE

Creta 2022 Run 72000 Diesel * TATA Punch 2022 Run 7000 Petrol Owner Dirven for Sale. ✆ 9849113313, 8333859555.

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును, అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I, Steffie Ann Gonsalvez, daughter of Leslie Michael Gonsalvez, residing at Laasya Residency, Bakkanapalem, Visakhapatnam, formerly known as Steffie Ann Gonsalvez Achanalu have changed my name to Steffie Ann Gonsalvez (affidavit number: 2865/2025) will henceforth be known and addressed as such. All concerned may note.

HEALTH & CARE

మందు మానేయడం ఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్, షుగర్‌కు విశాఖపట్నం : హోటల్ దాక్షాయణి, రైల్వేస్టేషన్ రోడ్, చావుల మదుం జంక్షన్ వద్ద. ప్రతీనెల 5, 19 తేదీల్లో మందులు.

PERSONAL INTEREST COURSES

MUSIC & DANCE CLASSES

ఉచితంగా కర్ణాటక శాస్త్రీయ సంగీతం & సంస్కృత పాఠాలు, భగవద్గీత, భాగవతం మొదలగు శ్లోకాలు, పద్యాలు నేర్పబడును. ఫోన్: 9000323878, 9963532805.

REAL ESTATE

HOUSE FOR SALE

ATCHYUTAPURAM

North- East Corner Building for Sale. Ready to Move. 121 Sq.Yds. (Cellar+ G+1) 60 Ft., Double Rd., Facing. Prime Location at Atchutapuram ✆ 9885824528.

PLOT FOR SALE

GENERAL

Prime Site 72 & 54 Cents at Dabbanda Near Simhachalam 18km from RTC Complex, Vizag. Contact: 8333859555, 9440320255.

JOBS

Delivery Boys Wanted Visiting Card Co. - Vizag Salary 13K - 15K + Petrol Speak Telugu, Hindi. Call : 9887840205.

Wanted Office Assistant Female with knowledge of Cash, minimum Accounts and Computer knowledge. 8.30 AM to 6 PM. Contact: 9393003003.

శ్రీరామ్ గ్రూప్‌లో విశాఖజిల్లా అంతటా ఎంప్లాయిస్ కావలెను. BDES-15+ Inc., BDMs-24K+ Inc. Exp. Min. 2 Yrs. Age: 25-35. Any Degree. 9666331353.

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో+వ+మంచి జీతం + ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

శివకార్తికేయ హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు ఇంటి/ వంట పనిచేయుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 20K. ✆ 99120 11499, 99120 11899.

ద్వారకానగర్ 3rd లేన్ దగ్గర, S.B.I. ప్రక్కన, ఆశీర్వాద్ జ్యూవెలర్స్‌లో పనిచేయుటకు హెల్పర్స్ (Male, వ॥ 50-60 Years) కావలెను. బయోడేటాతో సంప్రదించవలెను. 5pm-8:30pm.

WANTED

స్త్రీ అధికార్ సెంటర్ - పరవాడ నందు పనిచేయుటకు ఉమెన్ సెంటర్ ఇన్‌ఛార్జ్ కావలెను. (Female)

వయస్సు: 35 సం॥ కంటే ఎక్కువ
అర్హత: కనీస డిగ్రీ
గౌరవ వేతనం: 28,000/- to 35,000/- (భత్యాలతో సహా స్థూల)
దరఖాస్తు గడువు: 15-07-2025
స్త్రీ అధికార్ సెంటర్ - పరవాడ అనే సబ్జెక్టుతో దరఖాస్తును breds.rk@gmail.com కు పంపాలి. 25-07-2025 నాటికి ఇంటర్వ్యూకి పిలుస్తాము.

గమనిక: అభ్యర్థినిలు మా సెంటర్ నందు నిరంతర పర్యవేక్షణలో ఉండాలి. వసతి కల్పించబడును.

స్త్రీ అధికార్ సెంటర్ - పరవాడ
సెల్: 9440387563

FACULTY/ TEACHERS

నవోదయ, సైనిక్ స్కూల్ 6th క్లాస్ ఎంట్రన్స్ పరీక్ష కొరకు Maths, Mental ability, English faculty మరియు ఆఫీస్ అసిస్టెంట్ కావలెను. ప్రతిభ పెందుర్తి. 9393121315.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

విశాఖపట్నం, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం కారును ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందిన ఘటన జాతీయ రహదారి తాటిచెట్లపాలెం కూడలి సిగ్నల్స్ వద్ద బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ఫైబర్ నెట్ కంపెనీలో పనిచేస్తున్న ఆర్.రాకేశ్, వి.చిరంజీవి, పి.పైడిరాజు కలిసి మంగళవారం రాత్రి ఎన్ఏడీ వద్దనున్న స్నేహితుడి ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి వరకు అక్కడే ఉండి కారులో తిరుగుపయనమయ్యారు. కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాల వద్ద అదే కంపెనీలో పనిచేస్తున్న స్నేహితుడు చందక రాము (25)ను ఎక్కించుకుని నగరంలోకి వెళ్తుండగా తాటిచెట్లపాలెం

స్నేహితులను కలిసేందుకు వెళ్లి మృత్యుఒడిలోకి..

చందక రాము (పాతచిత్రం) ప్రమాదంలో నుజ్జయిన కారు

సిగ్నల్స్ వద్ద మలుపు తిరుగుతుండగా మద్దిలపాలెం నుంచి బిర్లా కూడలి వైపు వేగంగా వస్తున్న గుర్తు తెలియని వాహనం వీరి కారును బలంగా ఢీకొట్టింది. దీంతో కారు వెనుక సీటులో కుడివైపు కూర్చుని ఉన్న చందక రాము అక్కడికక్కడే మృతి చెందాడు. రాకేశ్, చిరంజీవి, పైడిరాజులకు తీవ్ర గాయాలయ్యాయి. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని ప్రమాదానికి కారణాలను అడిగి తెలుసుకున్నారు. గాయాలైన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాముకు భార్య ఉంది. వివాహం జరిగి రెండేళ్లు అవుతోంది. స్నేహితులను కలిసి వస్తానని అర్ధరాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

పురుగుమందు తాగి ఒకరి ఆత్మహత్య

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: కృష్ణదేవిపేటకు చెందిన తురుగోలు ధర్మరాజు (45) మంగళవారం సాయంత్రం పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మరాజు వ్యక్తిగత సమస్యలతో మనస్తాపానికి గురై తాను నిర్వహిస్తున్న హెయిర్ సెలూన్ దుకాణం వద్ద ఉన్న గడ్డి మందు తాగాడు. భార్యకు ఈ విషయం ముందు నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి, అక్కడి నుంచి విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ కేజీహెచ్‌లో బుధవారం మృతి చెందినట్లు ఎస్.ఐ. తెలిపారు. భార్య సాయిసత్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

31 వరకు ఇంటర్ ప్రవేశాల గడువు

విశాఖపట్నం, న్యూస్‌టుడే: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ప్రవేశాల గడువు ఈనెల 31 వరకు పొడిగించినట్లు ఇంటర్ బోర్డు ఆర్ఐఓ పి.మురళీధర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం అమరావతిలో ఇంటర్ బోర్డు కమిషనర్ కృతికాశుక్లా ఉత్తర్వులు విడుదల చేశారన్నారు

9న జడ్పీ సర్వసభ్య సమావేశం

విశాఖపట్నం: ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం 9న నిర్వహిస్తామని జడ్పీ సీఈఓ నారాయణమూర్తి బుధవారం తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరిగే సమావేశంలో జడ్పీటీసీ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొంటారన్నారు.

వ్యక్తిపై కత్తితో దాడి

గోపాలపట్నం, న్యూస్‌టుడే : ఓ వ్యక్తిపై కత్తితో దాడిచేసిన ఘటన గోపాలపట్నం పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. దీనికి సంబంధించి ఆ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా వేపాడ మండలానికి చెందిన గనిరెడ్డి శ్రీనివాసరావు(25), సాయి అన్నదమ్ములు. వీరు సింహాచలం దరి గోశాల సమీపంలోని కె.కన్వెన్షన్‌లో పని చేస్తున్నారు. ఈనెల 1న భూలోకనగర్‌లోని ఓ వీధిలో సాయి తన ద్విచక్రవాహనం పార్క్ చేశారు. ఇదే ప్రాంతానికి చెందిన సిరిపురపు చంద్రశేఖర్(22) తన కారును ఆ ద్విచక్రవాహనానికి అడ్డంగా పార్క్ చేశారు. ఈ విషయమై ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ విషయాన్ని సాయి తన సోదరుడు శ్రీనివాసరావుకు చెప్పారు. దీంతో రాత్రి 8 గంటల ప్రాంతంలో అన్నదమ్ములిద్దరూ కలిసి చంద్రశేఖర్ ఇంటికి వెళ్లారు. అక్కడ కూడా ముగ్గురి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో చంద్రశేఖర్ తన ఇంట్లో ఉన్న కూరగాయల కత్తితో శ్రీనివాసరావుపై దాడికి పాల్పడ్డాడు. గాయపడిన శ్రీనివాసరావును స్థానికుల సాయంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఎన్.వి.ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఎస్సై అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండుకు తరలించారు. చంద్రశేఖర్ ఆరిలోవలో జీవీఎంసీ శానిటరి సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గాయపడిన శ్రీనివాసరావు

లారీ ఢీకొని యువకుడికి తీవ్ర గాయాలు

రాంబిల్లి, న్యూస్‌టుడే: రాంబిల్లి-వెంకటాపురం రహదారిలో జంగాలపాలెం వద్ద మంగళవారం రాత్రి జరిగిన ప్రమాదంలో యువకుడు ఈరుగుల కృష్ణ తీవ్రంగా గాయపడ్డాడు. రాంబిల్లి శివారు కుండలదేవునిపాలెం గ్రామానికి చెందిన యువకుడు అచ్యుతాపురం వైపు వెళ్తుండగా పరిశ్రమల నుంచి లోడుతో రాంబిల్లి ప్రధాన రహదారిపైకి వస్తున్న లారీ ఢీకొందని స్థానికులు చెప్పారు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అతనిని అనకాపల్లి, అక్కడి నుంచి విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ ప్రమాదంపై తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని సీఐ సీహెచ్ నరసింగరావు తెలిపారు.

9న భారీ వాహనాల రాకపోకల నిలిపివేత

విశాఖపట్నం, న్యూస్‌టుడే: గురుపౌర్ణమి సందర్భంగా ఈనెల 9న భక్తులు సింహాచలం గిరి ప్రదక్షిణ చేయనున్నందున నగరంలోకి, జాతీయ రహదారిపై ట్రావెల్స్ బస్సులు, భారీ వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ద్వారకా సబ్ డివిజన్ ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు పేర్కొన్నారు. ట్రావెల్ బస్సుల యాజమాన్యంతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	79	70
లైవ్	101	90
డ్రెస్‌డ్	146	150
స్కిన్‌లెస్	167	160

అనకాపల్లి

• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా: **భైరవం,** రామచంద్ర: **మారన్,** శ్రీసత్య: **కట్టప్ప జడ్జిమెంట్,** సత్యనారాయణ స్క్రీన్-1: **కన్నప్ప,** స్క్రీన్-2: **8 వసంతాలు,** వెంకటేశ్వర: **చంద్రేశ్వర,** పర్తిసాయి: **కుబేర,** షిర్డిసాయి: **సితారే జమీన్ పర్,** **అచ్యుతాపురం:** స్క్రీన్-1: **కుబేర** స్క్రీన్-2: **కన్నప్ప**

తాగునీటి పరీక్షలు తప్పనిసరి

నక్కపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల్లో తప్పనిసరిగా తాగునీటి పరీక్షలు చేయించాలని ఎంపీడీఓ డి.సీతారామరాజు సూచించారు. డీఎల్‌పురంలో బుధవారం ఆయన సంపద కేంద్రం పరిశీలించారు. పారిశుద్ధ్య నిర్వహణను పరిశీలించారు. ప్రస్తుతం మారుతున్న వాతావరణం దృష్ట్యా పంచాయతీ కార్యాలయాల్లోని తాగునీటి పరీక్ష కిట్‌లను ఉపయోగించి నీటి పరీక్షలు చేయాలన్నారు. సర్పంచి కిల్లాడ కృష్ణ, యేడిద సత్యనారాయణ, కార్యదర్శి నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

జనవాణిలో ఫిర్యాదుల వెల్లువ

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి పట్టణంలో బుధవారం ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ నిర్వహించిన జనవాణి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో వినతులు వచ్చాయి. భూముల రీసర్వేలో తప్పులు, రేషన్‌కార్డులపైనే అధికంగా ఉన్నాయి. వీటిని శాఖల వారీగా అధికారులకు పంపించారు. సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

వృద్ధురాలి సమస్య తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

మినీ అంగన్‌వాడీల స్థాయి పెంపు

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

మినీ అంగన్‌వాడీలకు ప్రధాన కేంద్రాలుగా ప్రభుత్వం గుర్తించింది. జిల్లాలో 183 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. ఈ కేంద్రాల్లో సహాయకులు ఉంటారు. వీరికి నెలకు రూ. 7 వేలు జీతంగా చెల్లిస్తున్నారు. మినీ కేంద్రాలను ప్రధాన కేంద్రాలుగా మార్చడంతో ఇక్కడ పనిచేసే సహాయకులు అంగన్‌వాడీ కార్యకర్తలుగా గుర్తింపు పొంది నెలకు రూ. 11,500 జీతం అందుకోనున్నారు. అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు చేయాలంటే కనీసం వెయ్యి మంది జనాభా ఉండాలి. దూరంగా ఉన్న గ్రామాల్లో 159 నుంచి 300 జనాభా ఉన్న ప్రాంతాల్లో మినీ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేసి సహాయకులను నియమించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం వీటిని ప్రధాన కేంద్రాలుగా మార్చింది. ఈ కేంద్రాల్లో చిన్నారులకు విద్యాబోధన చేస్తున్నారు. ఇక్కడ టీవీలను ఏర్పాటుచేశారు. ప్రతి కేంద్రంలో అయిదు నుంచి పదిమంది వరకు చిన్నారులు ఉన్నారు. ఆ ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని అందిస్తున్నారు. ఇక నుంచి వీరంతా అంగన్‌వాడీ కార్యకర్తలుగా హోదా పొంది సేవలు అందించనున్నారు.

మినీ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

నోటిఫికేషన్ ఇస్తాం

మినీ అంగన్‌వాడీలను ప్రధాన కేంద్రాలుగా మారుస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. విధివిధానాలు వచ్చాక నోటిఫికేషన్‌లు ఇస్తాం. పదోతరగతి పాసైన వారిని అంగన్‌వాడీ కార్యకర్తలుగా గుర్తిస్తాం. ఎవరికైనా విద్యార్హత లేకుంటే పదోతరగతి పాసవ్వాలి. దీనిపై ప్రభుత్వం నుంచి వచ్చే నివేదిక ఆధారంగా పరిశీలిస్తాం. – సూర్యలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ

దడ పుట్టిస్తున్న తుపాను రక్షిత భవనాలు

తీరప్రాంత గ్రామాల్లో శిథిల తుపాను రక్షిత భవనాలు మత్స్యకారులకు దడ పుట్టిస్తున్నాయి. వీటి తొలగింపులో జాప్యం గ్రామస్థులకు శాపంలా మారుతోంది. కొన్నిచోట్ల కొత్తవాటిని నిర్మించి పాత వాటిని కూల్చకుండా వదిలేశారు. దీంతో బిక్కుబిక్కుమంటూ జీవనం సాగిస్తున్నారు. – న్యూస్‌టుడే, పాయకరావుపేట

నియోజకవర్గంలోని ఎస్.రాయవరం, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల్లో సుమారు 30 కి.మీ. పొడవైన తీరప్రాంతం ఉంది. తుపానులు, ప్రకృతి విపత్తుల సమయంలో ఉపయోగపడేందుకు రక్షిత భవనాలు నిర్మించారు. పదేళ్ల క్రితం మండలంలోని పాల్మన్‌పేట, కుమారపురం, గజపతినగరం, ఎస్.రాయవరం మండలం రేవుపోలవరం తదితర చోట్ల కొత్త భవనాలను ఆధునిక హంగులతో నిర్మించారు. ఇంతవరకు బాగానే ఉన్న ఈ గ్రామాల్లోని పాత భవనాలు కూల్చకుండా వదిలేశారు. దీంతో ఇవి శిథిలావస్థకు చేరి ఉత్సవ విగ్రహాలను తలపిస్తున్నాయి. కొన్నిచోట్ల పైభాగం కూలిపోగా, గోడలు శిథిలావస్థకు చేరాయి. ఏక్షణాన కూలుతాయో తెలియక మత్స్యకారుల ఆందోళన చెందుతున్నారు.

✦ మండలంలోని వెంకటనగరం, రాజానగరం, నక్కపల్లి మండలం దొండవాక, బుచ్చిరాజుపేట, డీఎల్‌పురం, పెదతీనార్ల, ఎస్.రాయవరం మండలం బంగారమ్మపాలెంలలో రెండు భవనాలు కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. రాజానగరం, వెంకటనగరం, రేవుపోలవరంలో పాఠశాలల పక్కనే ఉండటంతో విద్యార్థులకు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని భయపడుతున్నారు. మిగిలిన భవనాలు గ్రామాల మధ్యలో ఉండటంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ఎన్నిసార్లు అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. తుపానులు, వర్షాల సమయంలో భారీ గాలులు వీస్తే ప్రమాదం జరిగే అవకాశముంది.

కుమారపురంలో శిథిలావస్థకు చేరిన భవనం

ఫిర్యాదు చేసినా స్పందన శూన్యం...: పాఠశాల ఆవరణలోని కూలేందుకు సిద్ధంగా ఉన్న భవనాలు తొలగించాలని ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందన కనిపించడం లేదు. పాతవి తొలగించి కొత్తగా నిర్మించాల్సి ఉంది. తుపానుల సమయంలో వీటిలోనే తలదాచుకుంటాం. – వంకా శివ, వెంకటనగరం

పరశురామావతారంలో జగన్నాథస్వామి

అనకాపల్లి పట్టణం, మునగపాక, నక్కపల్లి, న్యూస్‌టుడే: జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలో స్వామివారు పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామివారిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. మహిళల కోలాటం నృత్యం ఆకట్టుకుంది. దేవస్థాన ఉత్సవ కమిటీ ఛైర్మన్ దాడి బుజ్జి, ఈవో మురళీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. మునగపాక, నాగులాపల్లిలో జగన్నాథస్వామిని వందలాదిమంది భక్తులు దర్శించుకొన్నారు. నాగులాపల్లి జగన్నాథస్వామి ఆలయ ట్రస్టీ మళ్ల ఉమాకాశీ ఆధ్వర్యంలో దాతలు భారీఎత్తున అన్నసమారాధన చేశారు.

దొండవాకలోజగన్నాథస్వామి ఊరేగింపు ఘనంగా జరిగింది. అనంతరం పూజలు చేశారు. అమ్మోరియ్య, నూకనాథం, వెంకటేష్, పైడిరాజు, రమణ, శాంతి ప్రసాద్ పాల్గొన్నారు. నక్కపల్లిలో గణపతి ఆలయం వార్షికోత్సవం ఘనంగా జరిగింది. కొత్తపేటలో ఆలయం వద్ద ధర్మకర్త అడ్డూరి ప్రకాశరావు ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆలయం వద్ద కోలాటం

అవీ ఇవీ

కోళ్లఫారంతో ఇబ్బందులు

మునగపాక, న్యూస్‌టుడే: రాజుపేట సమీపంలో అడ్డగోలుగా నిర్విస్తున్న కోళ్లఫారం నిర్వాహణ నిలిపివేయాలని గ్రామస్థులు సరపల్లి ప్రసాద్, జంగాల శ్రీరామమూర్తి, కర్నల అయ్యప్ప తదితరులు కోరారు. ఇప్పటికే అధికారులకు ఫిర్యాదు చేశామని, నిర్వాహణ నిలిపాలని ఆదేశించినా పెద్ద నిర్విస్తున్నారన్నారు. నిబంధనలను అతిక్రమించిన బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

కాలువపై వంతెన అవసరం

నక్కపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని పెదబొడ్డుగాం - పెదబొడ్డిగెల్లు గ్రామాల మధ్య పోలవరం కాలువపై వంతెన నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. పార్టీ నాయకులతో కలిసి వంతెన నిర్మించాల్సిన ప్రాంతంలో బుధవారం నిరసన తెలిపారు. ఈ మార్గం మీదుగా అనేక గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారన్నారు. వర్షాల కారణంగా రాకపోకలకు మట్టి జారిపోతుండటంతో రాకపోకలు సాగించే వారు ప్రమాదాలకు గురవుతున్నారు. పక్కనే నీరు ఉండటంతో ముప్పు పొంచి ఉందన్నారు. ఇప్పటికే సమస్య అధికారులు, గుత్తేదారుల దృష్టికి వెళ్లినా ఎంత వరకు పట్టించుకోలేదని విమర్శించారు. కార్యక్రమంలో ఎం.రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీమా పరిహారం అందజేత

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో దావేదినుముద్దు డిగ్రీ కళాశాల విద్యార్థి అశ్విన్‌కుమార్ మృతిచెందారు. బాధిత కుటుంబ సభ్యులకు రూ.3 లక్షల బీమా పరిహారాన్ని బుధవారం అందజేసినట్లు ప్రిన్సిపల్ కోటిరెడ్డి ఉమేశ్ తెలిపారు. కళాశాలలో చదువుతున్న 900మంది విద్యార్థులకు, అధ్యాపకులకు కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్ సామూహిక బీమా చేయించారన్నారు.

రూ. 30 వేల ఆర్థిక సాయం

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: అనకాపల్లికి చెందిన రూ. 10 సేవా సంస్థ తన ఉదారతను చాటుకుంది. ఇటీవల రహదారి ప్రమాదంలో కుడి కాలుకు తీవ్ర గాయం కావడంతో మంచం పట్టిన తాళ్లపాలెంకు చెందిన మేరపురెడ్డి నితిన్ కుమార్‌కు బుధవారం రూ. 30 వేల సాయం చేసినట్లు సంస్థ ప్రతినిధులు లాలం ఏసుబాబు, సాయికుమార్, షేక్‌దరియా, సారధి, రేణుక, హారిక పాల్గొన్నారు.

బస్సు సౌకర్యానికి వినతి

కొత్తూరు (అనకాపల్లి), న్యూస్‌టుడే: రేబాక పాలిటెక్నిక్ కళాశాల సమయాలకు అనుగుణంగా బస్సు సదుపాయం కల్పించాలని ఏఐఎస్ఎఫ్ నాయకులు జి.ఫణీంద్రకుమార్, వియ్యపు రాజు, జగదీష్, సింహాద్రి, జస్వంత్ జిల్లా ప్రజా రవాణా అధికారి ప్రవీణకు వినతిపత్రం అందజేశారు. బస్సు సౌకర్యం కల్పించి గ్రామీణ విద్యార్థులకు చదువుకోవడానికి సహకరించాలని కోరారు.

వన్‌స్టాప్ సెంటర్‌పై అవగాహన

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లి వన్‌స్టాప్ సెంటర్‌పై గవరపాలెంలోని పాఠశాల విద్యార్థులకు ఎస్సై రాములమ్మ అవగాహన కల్పించారు. బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై, సైబర్ నేరాలపై వివరించారు.

కూటమి పాలనలో సంక్షేమ పథకాలు

అనకాపల్లి/ పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: ఏడాది పాలనలో 140 సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ తెలిపారు. అనకాపల్లి కరివారివీధిలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. తెదేపా 80వ వార్డు ఇన్‌ఛార్జి బీసెట్టి జోగినాయుడు, సత్యనారాయణస్వామి దేవస్థానం ఛైర్మన్ బొడ్డేడ మురళి పాల్గొన్నారు. కొప్పాకలో చిరతాలెంలో సర్పంచి మార్కుర్ సన్యాసమ్మ, తెదేపా నాయకులతో కలిసి పీలా పాల్గొన్నారు. గవరపాలెంలో తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్ ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అందించిన పథకాలను వివరించారు.

ఎలమంచిలి/గ్రామీణం, అచ్యుతాపురం, మునగపాక, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు అన్నారు. ఏటికొప్పాకలో తెదేపా నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. నాయకులు కొలుకులూరి విజయబాబు, నాయకులు కాండ్రకోట చిరంజీవి, ఇత్తిశెట్టి సన్యాసినాయుడు, గొర్లె నానాజీ, రాజాన నారాయణమ్మ పాల్గొన్నారు. మాజీ ఎంపీ పప్పల చలపతిరావు ఖాజీపాలెంలో కరపత్రాలను అందించి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామికవేత్తలు సీఎం చంద్రబాబుపై ఉన్న నమ్మకంతో ముందడుగు వేస్తున్నారని అన్నారు. తెదేపా అధ్యక్షులు పీలా తులసీరామ్, కాండ్రేగుల వెంకటరమణ, గంగరాజు, రమణ, నాగశ్రీను, తాతబాబు పాల్గొన్నారు. బయ్యవరంలో గొన్నాబత్తుల నాగేశ్వరావు, గెంజి శ్రీను తదితరులు పర్యటించారు. మునగపాకలో పెంటకోట విజయ్ ఆధ్వర్యంలో కర్రి సాయికృష్ణ, జిల్లా తెలుగు మహిళ అధ్యక్షురాలు ఆడారి మంజు, నాయకులు భీమరశెట్టి శ్రీనివాసరావు, డొక్కా నాగభూషణం, పొలమరశెట్టి వీర అప్పారావు, నరసింగరావు పాల్గొన్నారు.

ఖాజీపాలెంలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎంపీ పప్పల, తెదేపా నాయకులు

అనకాపల్లిలో దాడి రత్నాకర్ ప్రచారం

చెరువు కాదు.. రోడ్డే

నక్కపల్లి, న్యూస్‌టుడే: నక్కపల్లి మండలం పెదతీనార్ల నుంచి దొండవాక వెళ్లే మార్గం పలు చోట్ల దారుణంగా దెబ్బతినడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా గ్రామ శివారున ఉన్న రామాలయం ప్రాంతం వద్ద రహదారి బాగా గుంతలు పడింది. దీంతో కొద్దిపాటి వర్షానికే రహదారి మొత్తం నీటితో నిండి చెరువును తలపిస్తోంది. ఈ సమస్య చాన్నాళ్లుగా ఉన్నా అధికారులెవరూ పట్టించుకోలేదని ఏపీ మత్స్యకార జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిక్కి కోదండరావు ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణం రహదారికి మరమ్మతులు చేపట్టి ఇబ్బందులు తొలగించాలని కోరారు.

సమ్మె విజయవంతం చేయండి

కొత్తూరు (అనకాపల్లి): ఈ నెల 9న జరిగే సమ్మెను జిల్లాలో విజయవంతం చేయాలని అఖిల పక్ష కార్మిక సంఘాల ప్రతినిధులు డిమాండ్ చేశారు. అనకాపల్లి సీఐటీయూ భవనంలో బుధవారం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శంకరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. ప్రజా సంఘాల ప్రతినిధులు రాజాన దొరబాబు, గండి నాయనబాబు, రాంబాబు, పరమేశ్వరరావు, శ్రీనివాసరావు, త్రినాథ్ తదితరులు మాట్లాడారు.

ఆధునిక సాగు పద్ధతులే మేలు

లక్ష్మీదేవిపేట (అనకాపల్లి): రైతులు ఆధునిక సాగు పద్ధతులను అవలంబించాలని ఏఓ రంగాచారి పేర్కొన్నారు. తుమ్మపాలలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం చేపట్టారు.

రోడ్డుపైనే పూడిక

ఎలమంచిలి యానాద్రి కాలనీలోని కాలువలో తీసిన పూడిక రోడ్డుపై కుప్పలు పోశారు. గుట్టగా పోసిన ఈ చెత్తతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. కాలువ పనులు చేపట్టిన గుత్తేదారు తొలగించాలని మున్సిపల్ సిబ్బంది.. మున్సిపల్ సిబ్బందే తొలగించాలని గుత్తేదారు ఇలా ఒకరిపై మరొకరు నెట్టుకుంటూ పూడిక వదిలేశారు. ఈ కారణంగా దోమలు పెరిగిపోయాయి. అసలే ఇరుకు రోడ్డు దానిపై ఇలా పూడిక వేస్తే రాకపోకలు ఎలా సాగించాలని కాలనీ వాసులు ప్రశ్నిస్తున్నారు. వర్షాలకు రోడ్డుపై చెల్లాచెదురుగా మారింది. పరిస్థితి దారుణంగా ఉన్నా పట్టించుకోవడంలేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. - ఎలమంచిలి, న్యూస్‌టుడే

అభివృద్ధిని చూసి ఓర్వలేక ఆరోపణలు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ చేస్తున్న అభివృద్ధి పనులు చూసి ఓర్వలేక మాజీ మంత్రి అమర్‌నాథ్ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని జనసేన నాయకులు జనపరెడ్డి శ్రీనివాసరావు, కొరుప్రోలు చిన్నారావు అన్నారు. బుధవారం ఎలమంచిలి జనసేన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్యేపైనా, కుటుంబ సభ్యులపైనా తప్పుడు ఆరోపణలు చేస్తే ఊరుకోమన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిందన్నారు. దీపం పథకం, తల్లికి వందనం అమలు చేసి రికార్డు నెలకొల్పిందన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నారన్నారు. వీటిని చూసి ఓర్వలేక తప్పుడు ఆరోపణలు చేస్తున్నారన్నారు. నాయకులు పిట్ట శ్రీను, రామదాసు, కర్రి జాన్సీ, బొద్దపు శ్రీను పాల్గొన్నారు.

జనసేన కార్యాలయంలో సమావేశంలో పాల్గొన్న నాయకులు

పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పంచాయతీ కార్యదర్శుల నూతన కార్యవర్గం ఎన్నిక అచ్యుతాపురం ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం జరిగింది. వివిధ గ్రామాల నుంచి హాజరైన పంచాయతీ కార్యదర్శులు అధ్యక్షునిగా కరణం నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా ఏ.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శిగా ఎం.సరస్వతి, సహాయ కార్యదర్శిగా సీహెచ్.రమణ, కోశాధికారిగా ఎస్‌కే.శ్రీను, బి.భానుప్రియలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఎన్నికైన పంచాయతీ కార్యదర్శులు

వసతి గృహాల సమస్యలు పరిష్కరించరూ..

కొత్తూరు (అనకాపల్లి): వసతి గృహాల్లో సమస్యలను పరిష్కరించాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి జి.ఫణీంద్ర కుమార్ తెలిపారు. అనకాపల్లి సీపీఐ భవనంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో పలు పర్యాయాలు వినతులు, విజ్ఞాపనలు సమర్పించినా వాటికి పరిష్కారం లభించలేదన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి జగదీష్, సింహాద్రి, జస్వంత్ పాల్గొన్నారు.

భయపడుతూ ఇంకెంత కాలం విధులు?

అనకాపల్లిలో తహసీల్దార్ కార్యాలయం భవన నిర్మాణంపై అధికారులు దృష్టి సారించడం లేదు. బ్రిటిష్ కాలం నాటి భవనం శిథిలావస్థకు చేరింది. వర్షం వస్తే కారిపోతుంది. ఎప్పుడు కూలిపోతుందోనని సిబ్బంది బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్నారు. 2017లో అప్పటి తెదేపా హయాంలో భవన నిర్మాణానికి రూ. 2 కోట్లు మంజూరు చేసినా వైకాపా పాలనలో పనులు మొదలు కాలేదు. కూటమి ప్రభుత్వ హయాంలోనైనా తహసీల్దార్ కార్యాలయానికి నూతన భవనం సమకూరుతుందనే ఆశాభావాన్ని సిబ్బంది వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, అనకాపల్లి పట్టణం

తహసీల్దార్ కార్యాలయంలో ఇదీ పరిస్థితి..

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి- 80085 74722 | పాయకరావుపేట- 80085 74750
ఎలమంచిలి- 80085 74726

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని ఎన్టీఆర్ క్రీడామైదానం ఎదురుగా ఎల్లయ్యకాలువ నుంచి తీస్తున్న వ్యర్థాలు తొలగించడం లేదు. వర్షం వస్తే రోడ్డంతా బురదగా మారుతోంది. – **రమాకాంత్, అనకాపల్లి,** ✓: ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగిస్తాం. – **శేఖర్, డీఈ**

?: అనకాపల్లి గొల్లవీధిలో వీధిలైట్లు వెలగడంలేదు. వీటిని బాగు చేయాలి. – **శారద, అనకాపల్లి,** ✓: వీధిలైట్ల మరమ్మతులు వెంటనే చేపడతాం. – **శివబ్రహ్మాజీ, ఏఈ**

?: అనకాపల్లి రైల్వే గేటు నుంచి లక్ష్మీదేవిపేటకు వెళ్లే రహదారిలో కాలువలను కప్పేశారు. – **పీలా తులసీరామ్, అనకాపల్లి,** ✓: కాలువులు బాగు చేయిస్తాం. –**రవికుమార్, శానిటరీ సూపర్‌వైజర్**

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ?: ఎలమంచిలి పంటకాలువలో పూడిక పెరిగిపోయింది. పట్టణంలో చెత్త అంతా అందులో వేస్తున్నారు. – **ఆర్.రమణ ఎలమంచిలి,** ✓: కాలువలో చెత్త పోయవద్దని మున్సిపల్ అధికారులకు లేఖ రాస్తాం. –**ప్రశాంతి, జలవనరుల శాఖ డీఈ**

?: కొత్తపేటలో రోడ్డు ఆక్రమించి మెట్లు నిర్మించారు. రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. – **వినయ్, ఎలమంచిలి,** ✓: ఆక్రమణలు తొలగిస్తాం. – **ప్రసాదరాజు, కమిషనర్**

పాయకరావుపేట, న్యూస్‌టుడే: ?: పాయకరావుపేటలోని దుర్గాకాలనీకి వెళ్లే రోడ్డులో గుంతలతో ఇబ్బంది పడుతున్నాం. ఒక్కోసారి వాహనచోదకులు బోల్తా పడుతున్నారు. – **శ్రీనివాస్, స్థానికుడు,** ✓: రోడ్డులో పడిన గుంతలను పూడ్చిస్తాం. – **లవరాజు, ఈవో**

?: పాయకరావుపేటలోని బృందావనంలోని కుళాయిలకు పూర్తిస్థాయిలో మూతలు లేకపోవడంతో నీరు వృథాగా పోతోంది. - నాగు, పాయకరావుపేట, ✓: పట్టణంలోని 20 వార్డుల్లోనూ కుళాయిలకు దశల వారీగా మూతలు ఏర్పాటు చేస్తున్నాం. – **లవరాజు, పాయకరావుపేట**

దివ్యాంగులు లక్ష్యాలను సాధించాలి

లక్ష్మీదేవిపేట(అనకాపల్లి), న్యూస్‌టుడే: దివ్యాంగులు అనుకున్న లక్ష్యాలను సాధించి జీవితంలో ఎదగాలని వైద్యుడు గండి వెంకట సత్యనారాయణ పేర్కొన్నారు. పట్టణంలో బుధవారం రూరల్ డెవలప్‌మెంట్ సర్వీస్ సొసైటీ సహకారంతో సమకూర్చిన మూడు చక్రాల కుర్చీలను ఇద్దరు దివ్యాంగులకు అందించారు. విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వ్యవస్థాపకుడు వీరు యాదవ్, సంస్థ కార్యదర్శి గాడి శ్రీను పాల్గొన్నారు.

మూడు చక్రాల కుర్చీలతో వైద్యుడు సత్యనారాయణ, శ్రీను, వీరుయాదవ్

(c) eenadu

తెరపై ఈనాడు

నర్సీపట్నం శ్రీకృష్ణ: ఆది: ఎఫ్1 ది మూవీ, సితారే జమీన్‌పర్, ఆడి2: కన్నప్ప, ఆడి3: కుబేర ఆడి4: కన్నప్ప, మార్గన్, హనుమాన్, బంగారాజు: మార్గన్, చోడవరం శ్రీసాయిలక్ష్మి: తమ్ముడు, సాయిలక్ష్మి: కన్నప్ప, పూర్ణ: కుబేర

భూములు ఆన్‌లైన్ చేయాలని ఆందోళన

మాకవరపాలెం, న్యూస్‌టుడే: జి.కోడూరు రెవెన్యూ జంగాలపల్లికి చెందిన భూములు ఆన్‌లైన్ చేయాలంటూ బుధవారం రైతులు తహసీల్దారు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. భూములు ఉన్నప్పటికీ తమకు ఉపయోగం లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు పదేళ్లుగా ఆన్‌లైన్ చేయాలని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోదన్నారు. ప్రభుత్వ పథకాలు అందడం లేదని చెప్పారు. 200 మంది రైతులకు సంబంధించి 500 ఎకరాల భూమి ఆన్‌లైన్‌లో లేదని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని కోరారు.

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

రూ.21 కోట్లతో సీసీ రోడ్లు: పద్మావతి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రభుత్వం అమలు చేస్తుందని 26 వార్డు కౌన్సిలర్ చింతకాయల పద్మావతి తెలిపారు. బుధవారం ఆమె ఇంటింటి ప్రచారంలో మాట్లాడుతూ త్వరలోనే రైతు భరోసా నగదు రైతుల ఖాతాల్లో జమ కానుందని వివరించారు. నర్సీపట్నంలో ఏడాది కాలంలోనే రూ.21 కోట్లు ఖర్చుతో సిమెంటు రోడ్లు నిర్మించామని తెలిపారు. 25వ వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పథకాలు వివరిస్తున్న పద్మావతి

వామనావతారంలో జగన్నాథుడు

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక కేశవస్వామి దేవాలయంలో బుధవారం జగన్నాథుడు శ్రీవామన, పరశురామావతారంలో కొలువయ్యారు. సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథుడిని భక్తులు దర్శించుకున్నారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు ప్రసాదాలు అందజేశారు.

సరుగుడుతోట నరికివేతపై ఫిర్యాదు

రోలుగుంట, న్యూస్‌టుడే: మండలంలోని కంచుగుమ్మల గ్రామానికి చెందిన చేపూరి అప్పారావుకి చెందిన సొంత భూమిలో సాగులో ఉన్న సరుగుడుతోటను గుర్తుతెలియని వ్యక్తులు నరికేసి ధ్వంసం చేశారు. దీని వల్ల తనకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లిందని బాధితుడు వాపోయాడు. పటువైపై సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

ఈవోఆర్డీ మహేష్‌కు బదిలీ

చోడవరం, న్యూస్‌టుడే: చోడవరం మండల పరిషత్తు ఈవోఆర్డీగా మహేష్ అందించిన సేవలకు గుర్తుగా చోడవరం పంచాయతీ ఉద్యోగులు ఆయన్ను సత్కరించారు. జి.కె.వీధికి బదిలీపై వెళ్తున్న మహేష్‌కు బుధవారం కార్యాలయంలో వీడ్కోలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన స్థానంలో మంత్రిగమ మండలం నుంచి అర్జున రావు ఇక్కడికి వస్తున్నారు.

మెగా వైద్య శిబిరానికి స్పందన

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక జవహర్‌క్లబ్‌లో లల్ల అంధత్వ నివారణ, శంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం జరిగింది. 163మందిని కంటి పరీక్షలు నిర్వహించి 58మందిని శస్త్రచికిత్సలు నిమిత్తం విశాఖ కంటి ఆసుపత్రికి తీసుకెళ్లారు.

మాకవరపాలెం, న్యూస్‌టుడే: మాకవరపాలెంలో విశాఖపట్నం శంకర్ ఫౌండేషన్, జిల్లా అంధత్వ నివారణ సంస్థ నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 95 మందికి వైద్యులు పరీక్షలు నిర్వహించారు. వివిధ కంటి సమస్యలతో బాధపడుతున్న 63 మందిని శస్త్రచికిత్సల కోసం శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు.

రెవెన్యూ కార్యక్రమాలపై సమీక్ష

రావికమతం: గ్రామ స్థాయిలో రెవెన్యూ, సర్వే పరమైన సమస్యలను సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దారు ఎస్వీ అంబేద్కర్ వీఆర్వో, సర్వేయర్లను ఆదేశించారు. ఇటీవల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఎస్వీ అంబేద్కర్ బుధవారం వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు.

హాజరు పెరిగింది!

నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: మహిళా సర్పంచుల శిక్షణ కార్యక్రమానికి బుధవారం హాజరు పెరిగింది. ఉదయం 12 గంటల సమయంలో దాదాపు 20 మంది హాజరు కనిపించింది. శిక్షణలో భాగంగా మహిళా సర్పంచులు పాలనలో తమ అనుభవాలను పంచుకున్నారు. గురువారం మరో ఆరు మండలాల్లోని మహిళా సర్పంచులకు శిక్షణ మొదలు కానుంది.

నారాయణమూర్తి సేవలు చిరస్మరణీయం

దేవరాపల్లి మాజీ సర్పంచి రొంగలి నారాయణమూర్తి సేవలు చిరస్మరణీయమని పలువురు సేవల్ని కొనియాడారు. ఇటీవల మృతి చెందిన ఆయన సంస్మరణ సభ పెదనందిపల్లి శివారు సత్యనారాయణపురంలో బుధవారం జరిగింది. మాజీ మంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, జడ్పీటీసీ సభ్యుడు సత్యం, వైస్ ఎంపీపీ సింహాచలంనాయుడు, మాజీ ఎంపీపీ రావాడ సింహాద్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

గుంతల్లో మొక్కలు నాటి నిరసన

రావికమతం, న్యూస్‌టుడే: భీమునిపట్నం-నర్సీపట్నం (బి.ఎన్) రహదారి దుస్థితి, రోడ్డు అభివృద్ధి పనుల్లో జాప్యంపై సీపీఎం ఆధ్వర్యంలో బుధవారం కొత్తకోట వద్ద గోతుల్లో మొక్కలు నాటుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. బి.ఎన్ రోడ్డుపై రాస్తా రోకో చేపట్టారు. ఈ రోడ్డుపై మూడు నియోజకవర్గాల పరిధిలోని వందలాది గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. గుంతలు పూడ్చకుంటే ఈనెల 9న జరిగే జిల్లా పరిషత్ పాలకవర్గం సమావేశం వద్ద ఆందోళన చేపడతామని పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.గోవిందరావు అన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

గుంతల్లో మొక్కలు నాటుతున్న సీపీఎం నాయకులు

స్పందించి.. స్ఫూర్తిగా నిలిచి

పూర్వ విద్యార్థులు నిర్మించిన వేదిక

చోడవరం, న్యూస్‌టుడే: బాల్యంలో తామంతా కలయాడిన ప్రాంతాలను గుర్తుకు తెచ్చుకుంటున్నారు. తమ అపూర్వమైన జ్ఞాపకాలనిచ్చిన ప్రదేశాల్లో తమ బాధ్యతగా ఏదొక సేవా కార్యక్రమాలు చేయాలన్న ఆలోచనలకు గ్రామాలు వేదికగా మారుతున్నాయి. ఇటీవల కాలంలో పూర్వపు విద్యార్థుల సమ్మేళనాల్లో అలాంటి కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారు. తాము చదువుకున్న విద్యాలయాల్లో వసతులు సమకూర్చడం, ఇతర సదుపాయాలను అందించేందుకు ముందుకొస్తున్నారు. వీటితో గ్రామాల్లో స్ఫూర్తిదాయక పనులు మనకు కనిపిస్తున్నాయి.

కళావేదిక నిర్మాణం..

చోడవరంలోని గాంధీ గ్రామంలో పాఠశాల ఉండేది. ఈ పాఠశాలను అప్పట్లో సినీనటుడు అక్కినేని నాగేశ్వరరావు ప్రారంభించారు. ఆనాటి భవనాలు నేటికి చెక్కుచెదరకుండా ఉన్నాయి. పైకప్పు కారిపోతుండటంతో కొద్దిపాటి మార్పులతో పూర్వపు భవనాలకు రూపురేఖలు మార్చారు. ప్రస్తుతం ఈ ఉన్నత పాఠశాల భవనాలతో ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల నడుస్తోంది. ఇక్కడ నడిచే ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో కొత్తగా భవనాలు నిర్మించారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు వేదిక లేదు. దీంతో 1968-69-70 సంవత్సరాల్లో లెవెన్త్‌ఫారమ్ చదివిన(12వ తరగతి) విద్యార్థులు మూడేళ్ల కిందట సమావేశమయ్యారు. పాఠశాల వద్ద సరస్వతి విగ్రహం, రూ.97వేలతో కళావేదిక నిర్మించారు.

అందుబాటులోకి మరుగుదొడ్లు

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు మరుగు దొడ్లు లేక విద్యార్థినులు, అధ్యాపకులు ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను గుర్తించిన పూర్వ విద్యార్థుల అసోసియేషన్‌ను సదుపాయాల కల్పనకు ముందుకొచ్చింది. కళాశాలలో ఆల్మీ్మ పేరిట ఏర్పాటు చేసిన పూర్వపు విద్యార్థుల అసోసియేషన్ అధ్యక్షుడు కసిరెడ్డి శేషగిరి చొరవతో రూ.2.50 లక్షలతో మరుగుదొడ్లు నిర్మించారు. ఈ నిధులను 1978-80, 1977-78 పది, ఇంటర్ చదివిన విద్యార్థులు, జుత్తాడ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.వి. శేషగిరిరావు రూ.50వేలు అందించారు.

సర్పంచ్ సహకారంతో నిర్మించిన షెడ్డు

శ్మశానంలో ఏర్పాట్లు..

రాయపురాజుపేట పంచాయతీ శ్మశాన వాటికలో దహనసంస్కారాలు నిర్వహించే క్రమంలో ఎండ, వానతో ఇబ్బందులు పడేవారు. ఈ సమస్యను గుర్తించిన సర్పంచి బొడ్డేడ రామునాయుడు తనను సొంత నిధులతో ఓ షెడ్డు నిర్మించారు.

ఆదర్శంగా తీసుకోవాలి..

మనకు ఉన్నంతలో గ్రామాలలో పనులు సొంత నిధులు చేపడితే వాటిని చూసి మిగతా గ్రామాల ప్రజలు స్ఫూర్తి పొందుతారు. పుట్టినరోజు, పెళ్లిరోజు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న క్రమంలో గ్రామాల్లో పనులకు తోచినంత మేరకు నిధులు కేటాయించాలి. సొంతూరికి ఏదొకటి చేయాలన్న తపనతో పనిచేయాలి.

– బొడ్డేడ రామునాయుడు, సామాజిక కార్యకర్త, రాయపురాజుపేట

విస్తరించని రోడ్డు.. తప్పని ట్రాఫిక్ కష్టాలు

రావికమతం, న్యూస్‌టుడే: సుమారు 16వేల జనాభా కలిగిన మేజరు పంచాయతీ కొత్తకోటలో ప్రధాన రహదారి విస్తరించక నిత్యం ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. కొత్తకోట పరిసర 25 గ్రామాలకు ప్రధాన కూడలి. పోలీస్ సర్కిల్ కేంద్రం ఇక్కడే ఉంది. బీఎన్ రోడ్డులో నర్సీపట్నం - చోడవరం పట్టణాల మధ్య కొత్తకోట ప్రధాన కూడలిగా ఉంటుంది. ఇక్కడి మెయిన్ రోడ్డు చాలా ఇరుకుగా ఉంటుంది. సింగిల్ రోడ్డు అవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు తప్పించుకుని వెళ్లలేని పరిస్థితి. దీంతో నిత్యం ట్రాఫిక్ కష్టాలు తప్పడంలేదు. శనివారం వారపు సంత రోజు ట్రాఫిక్‌ను నియంత్రించడం పోలీసులకు ఇబ్బంది అవుతోంది. బీఎన్ రోడ్డు అభివృద్ధిలో భాగంగా కొత్తకోట మెయిన్ రోడ్డును విస్తరిస్తామని ఆర్‌అండ్‌బీ అధికారులు చెప్పడంతో రెండు వరుసలుగా అభివృద్ధి చేస్తారని ప్రజలు భావించారు. తొలుత 80 అడుగుల మేర విస్తరించాలని నిర్ణయించగా వ్యాపారులు అభ్యంతరం తెలపడంతో 60 అడుగులకు పరిమితం చేశారు. శాశ్వత కట్టడాలతో పాటు ఇళ్లు, షాపులు ఉండటంతో వారంతా అధికారులపై ఒత్తిడి తీసుకొచ్చి ఆక్రమణల తొలగించకుండా నిలుపుచేయించారు. దీంతో ఆక్రమణల తొలగింపు మధ్యలోనే నిలిచిపోయింది. రోడ్డు విస్తరణ పనులు ముందుకు వెళ్లలేదు. ఈలోగా 2024లో సార్వత్రిక ఎన్నికలు రావడంతో రోడ్డు విస్తరణకు బ్రేకు పడింది. ఇప్పటికే బీఎన్ రోడ్డు అభివృద్ధితో పాటుగా కొత్తకోట మెయిన్ రోడ్డు విస్తరణ పనులు పూర్తిచేయాల్సి ఉందని నాలుగేళ్లుగా ముందుకు సాగడంలేదు. కూటమి ప్రభుత్వం రావడంతో ఎమ్మెల్యే రాజు ఆర్‌అండ్‌బీ అధికారులు, గుత్తేదారుతో మాట్లాడి ఆదివారం నుంచి రోలుగుంట వరకు బీఎన్ రోడ్డు అభివృద్ధికి చర్యలు చేపట్టారు. దీనిలోభాగంగా ఇప్పటికే నర్సీపట్నం సెక్షన్ పరిధిలో రోలుగుంట నుంచి జి.అర్జాపురం వరకు తారు వేయడం పూర్తయింది. కొత్తకోట, రోలుగుంట, దొండపూడి, జి.అర్జాపురం కూడలిలో సిమెంటు రోడ్డు వేయాల్సి ఉంది. వి.మాడుగుల సెక్షన్ పరిధిలో గర్నికం, పొట్టిదొరపాలెం, బుచ్చెన్నపాలెం, బంగారుమెట్ట కూడలిలో సిమెంటు రోడ్డు వేశారు. మేడివాడలో గుంతలతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. డబుల్ రోడ్డుగా విస్తరించి ట్రాఫిక్ కష్టాల నుంచి విముక్తి కలిగించాలని కొత్తకోట వాసులు కోరుతున్నారు.

ప్రధాన కూడలిలో ఇరుకు రోడ్డుతో ట్రాఫిక్ అవస్థలు

పాత ట్యాంకు శిథిలం.. నిర్మాణంలో జాప్యం

రోలుగుంట, న్యూస్‌టుడే: మండలంలోని అడ్డసరంలో తాగునీటి పథకం నిర్మాణ పనుల్లో తీవ్ర జాప్యం వెంటాడుతోంది. పాత ట్యాంకు పూర్తిగా శిథిలమై తరచూ నీరు లీకవుతుండటంతో ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ గ్రామంలోని జనాభా 260 వరకూ ఉండగా 10బోర్లతోపాటు 10వేల లీటర్ల సామర్థ్యంగల మినీట్యాంకు ద్వారా సరఫరా చేస్తున్నారు. జల్‌జీవన్ పథకంలో గ్రామానికి రూ.20లక్షల అంచనా వ్యయంతో 20వేల లీటర్ల ట్యాంకు మంజూరు చేశారు. గుత్తేదారు పనులను ప్రారంభించడంలో జాప్యం కారణంగా ఇటీవల పనులు ప్రారంభించారు. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు పాత ట్యాంకు పూర్తిగా శిథిలమై ఏ క్షణంలో కూలుతుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మరో వైపు జల్‌జీవన్ పనులను పూర్తిచేయాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ విషయమై మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటరాజు న్యూస్‌టుడేతో మాట్లాడుతూ జల్‌జీవన్ పనులు ఆలస్యంగా ప్రారంభమయ్యాయని త్వరలోనే పూర్తిచేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

శిథిలమవుతున్న ట్యాంకు

నిర్మాణంలో నూతన పథకం

కోనాం రోడ్డు నరకప్రాయం

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలంలోని ప్రధానమైన కోనాం-బీఎన్‌రోడ్డుకు అనుసంధాన మార్గం అధ్వానంగా మారింది. ఈ రోడ్డుకు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కొంతమేరకు మరమ్మతులు చేపట్టారు. నిధుల కొరతతో అసంపూర్తిగా వదిలేశారు. ఈ రోడ్డులోని సిరిజాం గదబూరు నుంచి కోనాం వరకు మరింత అధ్వానంగా ఉంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు గుంతల్లో నీరు చేరడంతో వాహనచోదకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ రోడ్డుపై చీడికాడతో పాటు పాడేరు, హుకుంపేట, అనంతగిరి మండలాల గిరిజన గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. కొన్నేళ్లగా కోనాం-విజయరామరాజుపేట రోడ్డుపై రాకపోకలకు వందలాది మంది వాహనదారులు నిత్యం నరకం చూస్తున్నా ఎవరూ పట్టించుకోలేదని చీడికాడ జడ్పీటీసీ పూర్వ సభ్యుడు చలుగు సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీనివాసరావును 'న్యూస్‌టుడే' సంప్రదించగా మరమ్మతులు ప్రతిపాదనలు పంపించామన్నారు.

సిరిజాం గదబూరు సమీపంలో గుంతలో బిక్కుబిక్కుమంటూ వస్తున్న వాహనచోదకుడు

వైద్యకళాశాల పనులు ఆపేయడం తగదు

మాకవరపాలెం, నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వం ప్రారంభించిన వైద్యకళాశాల పనులను కూటమి ప్రభుత్వం ఆపేయడం అన్యాయమని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అన్నారు. భీమబోయినపాలెం వద్ద వైద్య కళాశాలను బుధవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ.. ఇక్కడ ఆసుపత్రి నిర్మాణం జరిగితే నర్సీపట్నం నియోజకవర్గ ప్రజలతోపాటు కొయ్యూరు, చింతపల్లి, కోటవురట్ల తదితర ప్రాంతాల ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులోకి వస్తుందన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.త్రిమూర్తులు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, బత్తుల రవిశేఖర్ పాల్గొన్నారు. హక్కుల పరిరక్షణకు అన్ని వర్గాల కార్మికులు సంఘటితంగా పోరాడాలని సీఐటీయూ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షుడు ఎ.అజశర్మ అన్నారు. బుధవారం ప్రజా సంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

వైద్య కళాశాలను పరిశీలిస్తున్న అజయ్‌శర్మ

బి.ఎన్ రోడ్డులో గోతులు ఎందుకు పూడ్చలేదు..

రావికమతం, న్యూస్‌టుడే: బీఎన్ రోడ్డులో గుంతలు ఏర్పడి వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. గోతులు పూడ్చకుండా ఎందుకు వదిలేశారంటూ ఆర్‌అండ్‌బీ అధికారులపై ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్‌రాజు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం సాయంత్రం ఎమ్మెల్యే ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సుధాకర్, ఏఈ విద్యాసాగర్‌తో కలిసి చోడవవరం నుంచి రోలుగుంట వరకు రోడ్డును పరిశీలించారు. మోకాలి లోతు ఉన్న గోతుల్లోకి దిగి వాహనదారుల ఇబ్బందులు వివరించారు. పనుల్లో ఎందుకు జాప్యం జరిగిందని ప్రశ్నించారు.

మోకాలి లోతులోని గుంతలో దిగి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజు

రేపు విద్యుత్తు సరఫరా ఉండదు

చోడవరం: మండలంలోని జన్నవరం, బెన్నవోలు, చాకిపల్లి, రామజోగిపాలెం, కన్నంపాలెం, తిమ్మన్నపాలెం, జె.కొత్తూరులో శుక్రవారం ఉదయం పది నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదని డీఈఈ అప్పారావు తెలిపారు.

బుచ్చెయ్యపేట, చీడికాడ: పోలేపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో గ్రామాలకు శుక్రవారం విద్యుత్తు సరఫరా ఉండదని ఏఈ రాజు అన్నారు. చీడికాడ మండలం అప్పలరాజుపురం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని అప్పలరాజుపురం, ఖండివరం ఎల్.బి.పట్నం, కోనాం, మంచాల, సిరిజాం, వీరభద్రపేట, బి.సింగవరం గ్రామాలకు ఉదయం గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరా ఉండదని ఈఈ అప్పారావు తెలిపారు.

హెచ్ఎంలకు సన్మానం

రోలుగుంట, న్యూస్‌టుడే: స్థానిక జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్లిన హెచ్ఎం ప్రసాద్‌కు, ఆయన స్థానంలో బాధ్యతలు స్వీకరించిన శేషగిరిలను బుధవారం పాఠశాల ప్రాంగణంలో ఘనంగా సత్కరించారు. బుధవారం సాయంత్రం నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఇతర ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వర్షాకాలంలో వంతెనల దగ్గర ప్రమాదాల నివారణకు పోలీసులు చర్యలు చేపట్టారు. వడ్డాదిలో పెద్దేరుపై వంతెన దగ్గర పెద్ద పెద్ద గుంతలు పడి వాహనాలు నిలిచిపోతున్నాయి. వాటిల్లో వాహనాలు ఇరుక్కుని ప్రమాదాలు జరుగుతున్నాయి. తరచూ ట్రాఫిక్ స్తంభించిపోతోంది. దాంతో పంచాయతీ సహకారంతో పోలీసులు బుధవారం గుంతల్లో మెటల్, క్రషర్‌బుగ్గి వేయించి చదును చేయించారు. అలాగే వంతెన బలహీనంగా ఉండడంతో భారీ వాహనాలు వెళ్లకుండా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. విజయరామరాజుపేట వంతెన దగ్గర కాజ్‌వే మరమ్మతుల పనులు జరుగుతుండడంతో స్టాపర్లను ఏర్పాటు చేయించారు. వర్షాల నేపథ్యంలో వంతెనల దగ్గర జాగ్రత్తగా రాకపోకలు సాగించాలని ఎస్సై శ్రీనివాసరావు సూచించారు.

వడ్డాది వంతెన దగ్గర గుంతల పూడ్చివేత పనులు

వరి సాగుకు అనుకూలత

నాతవరం, న్యూస్‌టుడే: వరి సాగుకు అనుకూల వాతావరణం ఉందని వ్యవసాయాధికారి సుగణ తెలిపారు. గన్నవరం, శరభవరం ప్రాంతాల్లో బుధవారం ఆమె పర్యటించి రైతులను ప్రోత్సహించారు. తాండవ జలాశయంలో నీటి నిల్వలు సమృద్ధిగా ఉన్నందున ఖరీఫ్ సాగుకు ఇబ్బందులు ఉండవన్నారు.

పామాయిల్ సాగుపై రైతుల దృష్టి

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో పామాయిల్ పంట సాగుపై రైతులు దృష్టి పెట్టారు. మండలంలోని కరక, యల్లవరం, రాజుపేట, కొత్తమల్లంపేట జోగుంపేట, పాతమల్లంపేట, చిన్నయ్యపాలెం, అమ్మపేట తదితర గ్రామాల్లో రైతులు పామాయిల్ సాగులో నిమగ్నమయ్యారు.

స్మార్ట్ మీటర్ల ఒప్పందం సరికాదు: సీపీఐ

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: ఆదానీతో కుదుర్చుకున్న స్మార్ట్ మీటర్ల ఒప్పందాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల అయిదున నర్సీపట్నం, అనకాపల్లి విద్యుత్తు కార్యాలయాల ముందు ఆందోళన చేపడుతున్నట్టు సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు తెలిపారు. బుధవారం ఇక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ స్మార్ట్‌మీటర్లు రైతులకు నష్టదాయకమని పేర్కొన్నారు. జిల్లా కార్యవర్గ సభ్యుడు బాలేపల్లి వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలపై ప్రచారం

రావికమతం: జగన్ పాలనలో అమలైన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆ పార్టీ శ్రేణులకు సూచించారు. బుధవారం జరిగిన మండల వైకాపా సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వ వైఫల్యాలు ప్రజల్లోకి తీసుకెళ్లి ఎండగట్టాలన్నారు. ఎంపీపీ పైల రాజు, చోడవరం మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ ఏడువాక సత్యారావు, తదితరులు పాల్గొన్నారు.

ఏడాది పాలనలోనే ప్రజలకు మంచి పనులు చేశాం..

చోడవరం, న్యూస్‌టుడే: ప్రజలకు మంచి చేయడంతో పాటు రాష్ట్రాన్ని సుస్థిరమైన పాలన అందించే సత్తా తెదేపాకే ఉందని స్థానిక ఎమ్మెల్యే కె.ఎస్.ఎన్.ఎస్.రాజు అన్నారు. బుధవారం చోడవరం పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. ఇందులోభాగంగా రేవళ్ల సీతారాముల ఆలయంలో పూజలు చేసి ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను వివరించారు. పట్టణంలోని సీతారామ కల్యాణ మండపంలో నియోజకవర్గంలోని సమన్వయ కమిటీ, బూత్ కమిటీలు తదితర నాయకులతో సమావేశం నిర్వహించారు. గవర కార్పొరేషన్ డైరెక్టర్ బొడ్డేడ గంగాధర్, తెలుగు రైతు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గూనూరు మల్లునాయుడు జనసేన నాయకుడు సిరిపురపు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండల కేంద్రంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమానికి తెదేపా బుధవారం శ్రీకారం చుట్టింది. మాజీ ఎంపీపీ పోతల రమణమ్మ, మాజీ సర్పంచి యర్రా అప్పారావు, పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బొడ్డు వరహామూర్తి, నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడు బూసాల దేముడునాయుడు, రొంగలి రామునాయుడు, నడుపూరి ముత్యాలు కలిసి ఇంటింటికీ పర్యటించారు.

ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధిని వివరిస్తున్న ఎమ్మెల్యే రాజు తదితరులు

సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి

కె.కోటపాడు, న్యూస్‌టుడే: 'సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి శ్రీకారం చుట్టారు. మండలంలోని పిండ్రంగి, లంకవానిపాలెం గ్రామాల్లో ఆయన ఇంటింటికి వెళ్లారు. ప్రజా సమస్యల పరిష్కారంలో కూటమి ప్రభుత్వం ముందుంటుందంటూ ప్రజలకు ఆయన భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గ తెదేపా పరిశీలకుడు వాసిరెడ్డి ఏసుదాసు, మాజీ శాసనసభ్యుడు గవిరెడ్డి రామానాయుడు, కొప్పల వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ పీవీజీ కుమార్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకోవాలి: రాజేష్

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: సుపరిపాలన-తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లే నాయకులు ఏడాదిలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరించడంతో పాటు జిల్లా, నియోజకవర్గంలో అభివృద్ధిని చేపట్టిన అభివృద్ధిని తెలియజేయాలని వార్డు కౌన్సిలర్ చింతకాయల రాజేష్ సూచించారు. నర్సీపట్నంలో బుధవారం జరిగిన నియోజకవర్గ పార్టీ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాష్ట్రంలోని రోడ్లన్నీ మరమ్మతు చేయించిందని పేర్కొన్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రద్దు తదితర కార్యక్రమాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. తాండవ ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ కరక సత్యన్నారాయణ, మార్కెట్ కమిటీ ఛైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743, చోడవరం - 80085 74732, మాడుగుల - 80085 74740 చీడికాడ - 80085 74742

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: ?: భీమునిపట్నం-నర్సీపట్నం(బీఎన్) రోడ్డు అధ్వానంగా ఉంది. చోడవరం నుంచి వడ్డాది, రావికమతం మీదగా నర్సీపట్నం వెళ్లే రోడ్డు గోతులమయంగా తయారైంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించలేకపోతున్నాం – వెంకట్రావు, వ్యాపారి, వడ్డాది

✔: ఈ రోడ్డు ఎన్‌డీబీ ప్రాజెక్టులో ఉంది. గుత్తేదారు పనులు చేయాల్సి ఉంది. రోడ్డు పరిస్థితిపై ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాం. – సత్యప్రసాద్, ఏఈ, ఆర్‌అండ్‌బీ, చోడవరం సెక్షన్

గొలుగొండ, న్యూస్‌టుడే: ?: లింగంపేట-కృష్ణదేవిపేట మధ్య ప్రధాన రహదారి వంతెన మధ్యలో గోతులు ఏర్పడ్డాయి. ఇక్కడ రోడ్డు ఇరుగ్గా ఉండడంతో ఎదురెదురుగా వచ్చే ద్విచక్ర వాహనాలు అదుపు తప్పితే ప్రమాదం జరిగే అవకాశం ఉంది.

– చినసత్యనారాయన, లింగంపేట

✔: గోతులను పూడ్చించేందుకు తారుమిశ్రమంతో కూడిన కంకర తెప్పిస్తున్నాం. – ప్రసాదరావు, జేఈ

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: ?: కొత్తమల్లంపేట బొడ్డువారి వీధిలో మురుగు కాలువకు ఆనుకుని ఉన్న బోరు ద్వారా కలుషితమైన తాగునీరు వస్తోంది.

– సత్యవతి, కొత్తమల్లంపేట

✔: ఈ సమస్య మాదృష్టికి వచ్చింది. గ్రామీణ నీటిసరఫరా సిబ్బందికి సమాచారం ఇచ్చాం. పైపులైన్లు మార్చాలి.

– శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శి

ఇసుక అక్రమ రవాణాకు అడ్డుకట్ట

గొలుగొండ, న్యూస్‌టుడే: చోద్యం, లింగంపేట వద్ద బొడ్డేరు గెడ్డలో అక్రమంగా తవ్విన ఇసుకను రోజుకు సుమారు 20 ట్రైరుబళ్లతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఇక్కడ భారీ నీటి పథకం, వంతెన దెబ్బతింటుంది. దీనిపై గత నెల 24న 'మేమున్నాం..మీకు తోడుగా' శీర్షికన 'ఈనాడు'లో చిత్రకథనం ప్రచురితమైంది. స్పందించిన రెవెన్యూ అధికారులు వీఆర్ఏల కాపలాతో తవ్వకాలకు అడ్డుకట్ట వేశారు.

స్పందనకు వందనం

వీరభద్రపేటలో మద్యం పట్టివేత

చీడికాడ, న్యూస్‌టుడే: చీడికాడ మండలం వీరభద్రపేటలో బుధవారం పోలీసులు మద్యం పట్టుకున్నారు. పాన్‌షాపులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న నాగేశ్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సతీష్ చెప్పారు. ఎనిమిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ప్రయాణికులతో కిక్కిరిసిన ఆటోపై కేసు

చీడికాడ: చీడికాడ ఉప్పరగూడెం కూడలి వద్ద మంగళవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా చోడవరం నుంచి 15 మంది ప్రయాణికులతో ప్రమాదకరంగా వస్తున్న ఆటోపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

దొంగలు తిరుగుతున్నారు.. అప్రమత్తం

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: ఇంట్లో ఎవరూ లేకుండా చూసి తాళాలు వేసిన ఇళ్లలోకి చొరబడి కొందరు దొంగతనాలకు పాల్పడుతున్నారని, వీరిపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై తారకేశ్వరరావు సూచించారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం వ్యవసాయ పనులు ముమ్మరంగా జరుగుతున్న నేపథ్యంలో పంట పొలాల్లోకి కుటుంబ సభ్యులంతా వెళ్లినా ఇంటి వద్ద ఒకరైనా ఉండాలని సూచించారు. గ్రామాల్లో పగలు, రాత్రుళ్లు పోలీసులు గస్తీ తిరుగుతున్నారన్నారు.

మన్యం వైద్యుల రాకకు నిరీక్షణ

రోలుగుంట, న్యూస్‌టుడే: పరిపాలనాపరంగా కొన్ని ప్రభుత్వం తీసుకున్న పలు నిర్ణయాలకు ప్రజలను ఇబ్బందుల్లో పడేస్తుంటాయి. ఇటీవల జరిగిన వైద్యుల బదిలీల్లో భాగంగా ఇక్కడి డాక్టర్లను వేరే ప్రాంతాలకు పంపించారు. ఆ స్థానాలను నేటికీ భర్తీ చేయకపోవడంతో రోగులకు అవస్థలు తప్పడం లేదు. అసలే వర్షాకాలం కావడంతో వైద్యుల లేమి మరింతగా వేధిస్తోంది. మండలంలోని బుచ్చెంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలోని డాక్టరు శ్రీనివాసరావును విశాఖ కేజీహెచ్‌కు బదిలీచేయగా ఇదే ఆసుపత్రిలో మరో వైద్యురాలు సునీత పీజీ కోర్సులో చేరారు. రోలుగుంట పీహెచ్‌సీ వైద్యురాలు ధనలక్ష్మి విశాఖ నగరపరిధి కణితికి బదిలీచేశారు. ఈ మూడు స్థానాలను అల్లూరి జిల్లాకి చెందిన వైద్యులను నియామకం చేస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలను జారీచేసింది. రోలుగుంటకు కొయ్యూరు మండలం కంఠారం పీహెచ్‌సీ చెందిన వైద్యురాలిని, బుచ్చెంపేటకు మన్యం ప్రాంతానికి చెందిన వైద్యులను నియమించినప్పటికీ నేటికీ విధుల్లో చేరలేదు. అక్కడి జిల్లా కలెక్టరు వీరిని రిలీవ్ చేయకపోవడమే కారణమని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. అధికారులు స్పందించి దీనిపై దృష్టి సారించాలని స్థానికులు, రోగులు కోరుతున్నారు.

బుచ్చెంపేట ప్రాథమిక ఆరోగ్యకేంద్రం

(c) eenadu

పెందుర్తి

తెరపై ఈనాడు
పెందుర్తి, న్యూస్‌టుడే
లక్ష్మీకాంత్ స్క్రీన్-1 - కుబేర
స్క్రీన్-2 - కన్నప్ప

పెందుర్తి ఎస్ఐ బాధ్యతల స్వీకరణ

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి ఎస్ఐగా ఎన్.వి.భాస్కర రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఎస్ఐ అని రితాశ జటిలవ బదిలీపై వెళ్లగా.. ఆ స్థానంలో ద్వారకా పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న భాస్కరరావును నియమిస్తూ సీపీ శంఖబ్రత బాగ్చీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన విధుల్లో చేరారు.

భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పరవాడ, న్యూస్‌టుడే: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని జిల్లా ఐద్వా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. పరవాడలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పప్పులు, కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటడంతో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ప్రభుత్వం ఇచ్చే ఛార్జీలు సరిపోక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. నెల నెలా బిల్లులు చెల్లించాలని, గుర్తింపు కార్డులు, యూనిఫారాలు అందించాలని, మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలక్ష్మి, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట మధ్య

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ సబ్‌స్టేషన్ కూడలిలోని రహదారి వర్షాలకు అధ్వానంగా తయారై రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. - రమణ, పరవాడ

✓: మీప్రాంత రహదారి సమస్యను ఆర్అండ్‌బీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతాం. - ధర్మారావు, ఈవోపీఆర్డీ, పరవాడ

వేపగుంట, న్యూస్‌టుడే: ?: 94వార్డు రవినగర్ కాలనీలో భూగర్భ డ్రైనేజీ గోతులు ప్రమాదకరంగా మారాయి. - సూర్యకళ, రవినగర్

✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. - హేమవతి, జోనల్ కమిషనర్, జోన్-8

వేపగుంట, న్యూస్‌టుడే: ?: సబ్బవరం మండలం గుల్లేపల్లిలో పందుల సంచారం ఎక్కువగా ఉంది. - వి.కోటేశ్వరరావు, గుల్లేపల్లి

✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి నివారణ చర్యలు చేపడతాం. - వి.మంగ, పర్యవే, గుల్లేపల్లి

?: సబ్బవరం కళాకారుల కాలనీలో అంతర్గత రోడ్లు, కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నాం. - ఎం.భాస్కరరావు, కళాకారుల కాలనీ

✓: ఇక్కడ మౌలిక వసతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. - వై.రాజేశ్వరరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించేదెప్పుడో..!

రాకపోకలకు స్థానికులకు నిత్యం ఇక్కట్లే..

పరవాడ, న్యూస్‌టుడే

జీవీఎంసీ 79వార్డు పరిధిలోని లంకెలపాలెం రైల్వే గేటు మూసివేత కారణంగా స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో ఫార్మాసిటీ ఏర్పాటుతో 18 ఏళ్ల క్రితం ఇక్కడి రైల్వేగేటు మూసివేసి పైవంతెన నిర్మించారు. రైలు పట్టాలకు అవతల వైపు గ్రామం ఉండడంతో స్థానికులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలు వివిధ పనుల నిమిత్తం జాతీయ రహదారి మీదకి వెళ్లాలన్నా.. తిరిగి రావాలన్నా వంతెన చుట్టూ రెండు వైపులా కలుపుకొని అదనంగా 3 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. రైల్వే గేటు వద్ద రాకపోకలకు వీలుగా అండర్ బ్రిడ్జి నిర్మించకపోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొంది. గత వైకాపా ప్రభుత్వ పాలకులు అప్పట్లో.. అండర్‌బ్రిడ్జి నిర్మాణం త్వరలో జరుగుతుందని పదేపదే చెప్పి మోసగించారని వాపోతున్నారు. కూటమి పాలకులు ఇక్కడి ఇబ్బందులు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

తప్పనిసరి పరిస్థితిలో ప్రమాదకర ప్రయాణాలు

ఇక్కడ 5వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. రైల్వే గేటుకు ఇవతల పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, దుకాణాలు, ఆసుపత్రులు, బస్‌స్టాప్‌లు ఉన్నాయి. పాదచారులు దగ్గరి దారిలో చేరుకోవచ్చునని పైవంతెన చుట్టూ తిరిగి వెళ్లకుండా, మూసివేసిన రైల్వే గేటులో నుంచి ప్రమాదకరంగా రైలు పట్టాలు దాటుతున్నారు. ఆ సమయంలో పలువురు ప్రమాదానికి గురవుతుండగా కొందరు ప్రాణాలు కోల్పోతున్నారని స్థానికులు అంటున్నారు. ఊరిలోకి అంబులెన్స్‌లు, ఆటోలు, పాఠశాల బస్సులు రావాలన్నా ఎక్కువ మొత్తంలో అడుగుతున్నారని గగ్గోలు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇక్కడ రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుకు స్థానికులు వినతులు ఇచ్చారు. ఈమేరకు ఎమ్మెల్యే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో స్థల పరిశీలన చేశారు.

నానా ఇబ్బందులు పడుతున్నాం....

18ఏళ్లుగా ఇక్కడ రైల్వే అండర్ బ్రిడ్జి కోసం ఎదురు చూస్తున్నాం. రైల్వేగేటు మూసివేత వల్ల నిత్యం వ్యయప్రయాసలకు గురవుతున్నాం. పిల్లలు, వృద్ధులు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు రైల్వేగేటు నుంచే పాఠశాలలకు వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి ఇక్కడ అండర్ బ్రిడ్జి నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలి.
- జి.నాయుడు, స్థానిక నివాసి

దగ్గరి దారిలో వెళ్లేందుకు రాకపోకలిలా..

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ఆరా..

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో సూచనలిస్తున్న జడ్పీ సీఈవో నారాయణమూర్తి

వి.జుత్తాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: గ్రామాల్లో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ప్రణాళిక ప్రకారం అమలు చేయాలని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి ఆదేశించారు. బుధవారం ఆయన పెందుర్తి మండలం వి.జుత్తాడ పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి వ్యర్థాల నిర్వహణ తీరుపై ఆరా తీశారు. ఇంటింటి చెత్త సేకరణకు సిబ్బంది వీలున్నప్పుడు వెళ్లడం కాకుండా సమయపాలన పాటించాలన్నారు. ఈ ప్రక్రియ రోజు విడిచి రోజు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి నమూనాలను పరిశీలించి నాణ్యత తనిఖీ చేశారు. పెందుర్తి ఎంపీడీవో గుండు అప్పలరాజు ఇతర అధికారులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని జీవీఎంసీ వార్డుల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను కోరారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప మేయర్ దల్లి గోవిందరెడ్డి, జీవీఎంసీ జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్, 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ కేతన్ గార్గ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

అవీ ఇవీ

పెయింటర్ ఆత్మహత్య

కృష్ణరాయపురం(వేపగుంట), న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. కృష్ణరాయపురం సమీప జ్యోతినగర్‌కు చెందిన పెయింటర్ బమ్మిడి గౌరీశ్(41), భార్య పద్మ, తల్లి నూకాలమ్మలతో కలసి ఓ అద్దె గృహంలో నివసిస్తున్నారు. కొద్దిరోజులుగా గౌరీశ్ పనులకు వెళ్లకుండా మద్యానికి బానిస కావడంతో భార్య కన్నవారింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో తల్లి నూకాలమ్మను అతడు మానసికంగా వేధించడంతో మంగళవారం రాత్రి ఆమె కాలనీలో తెలిసిన వారింటికి వెళ్లి తలదాచుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గౌరీశ్ ఫ్యాన్ హుక్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మర్నాడు ఉదయం తల్లి ఇంటికి వెళ్లి చూడగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆత్మహత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించామన్నారు.

విధుల నుంచి కానిస్టేబుల్ సస్పెన్షన్

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం పోలీసు స్టేషన్‌లో బీచ్ మొబైల్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జి.బాబూరావును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ సీపీ శంఖబ్రతబాగ్చీ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల విధి నిర్వహణలో భాగంగా రుషికొండ ప్రాంతంలోని కొందరు సందర్శకుల నుంచి అనధికారికంగా నగదు వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో కానిస్టేబుల్ సూచనతో సందర్శకుడు స్థానిక మద్యం దుకాణంలోని వ్యక్తికి ఫోన్‌పేలో నగదు పంపించడం, ఆపై కానిస్టేబుల్‌కు ఆ మొత్తం చేరడాన్ని గుర్తించారు. దీంతో విధుల నుంచి సస్పెండ్ చేస్తూ సీపీ చర్యలు తీసుకున్నారు. పోలీసుశాఖలో పని చేసే అధికారులు, సిబ్బంది పూర్తి పారదర్శకంగా విధులు నిర్వహించాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులు ఎవ్వరైనా లంచం అడిగితే 79950 95799 నంబరుకు ఫోన్‌లో తెలియజేయాలని సూచించారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి

సబ్బవరం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి పీవీఎస్ శాస్త్రి తదితరులు మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంస్థ సీఈవో గొంప రమణ తదితరులు పాల్గొన్నారు.

జగన్నాథుడికి భక్తుల జేజేలు

చింతలగ్రహారం (వేపగుంట), న్యూస్‌టుడే: చింతలగ్రహారం కృష్ణాలయంలో జరుగుతున్న జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా బుధవారం పరశురాముని అవతారంలో జగన్నాథుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని జగన్నాథస్వామిని దర్శించుకున్నారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

వేద పాఠశాలలకు భూమి కేటాయించరూ..

పెందుర్తి, న్యూస్‌టుడే: వేద పాఠశాలతో పాటు పితృకార్యాల కోసం అవసరమైన భవన నిర్మాణానికి ప్రభుత్వం తరపున భూమి కేటాయించాలని విశాఖ జిల్లాలో పౌరోహిత్యం చేస్తున్న శుక్లయజుర్వేద, స్మార్త అభివృద్ధి సంఘం ప్రతినిధులు జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు బుధవారం మేయర్‌ను పెందుర్తిలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మేయర్ సానుకూలంగా స్పందించినట్లు సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా, పురోహితులు, వేద విద్యార్థులు పాల్గొన్నారు.

మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న శుక్లయజుర్వేద స్మార్త సంఘం ప్రతినిధులు

రోడ్డు మధ్యలో గుంత.. నిత్యం చింత

బాలాజీనగర్ మూడవ వీధిలో ప్రమాదకరంగా..

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి బాలాజీనగర్ మూడవ వీధి రోడ్డు మధ్యలో గొయ్యి ప్రమాదకరంగా మారిందని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రోడ్డు మధ్యలోని కాలువపై ఉన్న పలక కొన్నాళ్ల క్రితం ధ్వంసమైపోయింది. దీంతో వాహనాల రాకపోలకు ఇబ్బందికరంగా మారింది. రాత్రివేళ చీకట్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పరవాడ, న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా మండల కేంద్రం పరవాడలో బుధవారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు త్వరలో అమల్లో తీసుకొచ్చే పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తొలుత పరవాడ సంతబయలు వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెదేపా పరిశీలకుడు కోరాడ రాజబాబు, మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, నియోజకవర్గ పరిశీలకుడు కోరాడ రాజబాబు తదితరులు

పాలవలస(పరవాడ), న్యూస్‌టుడే: పెదగంట్యాడ మండలం జీవీఎంసీ 77వవార్డు పరిధి ఈశరపువానిపాలెంలోనూ బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. వార్డు తెదేపా అధ్యక్షుడు పాల అచ్చిలనాయుడు ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలతో పాటు త్వరలో అమలు చేయనున్న పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకున్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం అమృతపురంలో గురువారం ఈ కార్యక్రమం జరుగుతుందని సబ్బవరం మండల తెదేపా అధ్యక్షుడు గండి ముత్యాలునాయుడు పేర్కొన్నారు. సాయంత్రం 5గంటలకు చేపట్టనున్న ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులంతా హాజరు కావాలని కోరారు.

77వ వార్డులోని ఓ దుకాణం వద్ద ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న నాయకులు

ఆబ్కారీ పోలీసుల ఆకస్మిక తనిఖీ

అక్రమ స్పిరిట్ నిల్వలున్నట్లు అనుమానం

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడలో అక్రమ స్పిరిట్ నిల్వలు ఉన్నాయనే సమాచారం మేరకు ఆబ్కారీ పోలీసు అధికారులు బుధవారం రెండు గృహాల్లో సోదాలు నిర్వహించారు. ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుర్జీత్‌సింగ్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. అమలాపురంలో ఇటీవల అక్రమ స్పిరిట్, నకిలీ మద్యం దొరికిన సమయంలో విచారించగా.. పరవాడలో కూడా ఆ నిల్వలు ఉన్నట్లు సంబంధిత కేసులోని నిందితుడు చెప్పడంతో ఈ సోదాలు చేపట్టినట్లు తెలుస్తోంది. తొలుత వెన్నెలపాలెం సమీప జగనన్నకాలనీలోని ఓ ఇంటి వద్దకు వెళ్లారు. తాళం వేసి ఉండడంతో ఓ పోలీసును అక్కడ కాపలా పెట్టి వెళ్లిపోయారు. పరవాడ కొత్తకాలనీలోని మరో ఇంట్లో కూడా సోదాలు చేపట్టారు. ఇక్కడ స్పిరిట్‌తో మద్యం తయారు చేసి విక్రయిస్తున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారి సుర్జీత్‌సింగ్‌ను వివరణ కోరగా.. ఇక్కడ అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని, దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.

'గోల్‌మాల్'పై చర్యలేవీ..

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట జోనల్ కార్యాలయ సౌకర్యం కేంద్రంలో సుమారు రూ.50లక్షల ప్రజాధనం గోల్‌మాల్ అయిన విషయం పక్కాగా వెలుగులోకి వచ్చినా బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ విషయాన్ని 'ఈనాడు' వెలుగులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై జోనల్ అధికారులు విచారణ చేపట్టి రూ.49లక్షలు పక్కదారి పట్టినట్టు తేల్చారు. సంబంధిత ఉద్యోగి నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేసి కమిషనర్‌కు నివేదిక సమర్పించారు. ఈ నేపథ్యంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించినా.. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేకపోవడంతో స్థానికంగా పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో కూడా గత పన్నుల కుంభకోణంలో మాదిరిగా వదిలేస్తారా అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయమై జోనల్ కమిషనర్ హేమవతిని వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామాల్లో 'పొలంబడి'

పరవాడ, న్యూస్‌టుడే: రైతులంతా అధునాతన పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని తద్వారా పెట్టుబడులు తగ్గడంతో పాటు మంచి దిగుబడులు సాధించవచ్చునని పరవాడ మండల వ్యవసాయాధికారిణి ఎం.రమాదేవి అన్నారు. వాడచీపురుపల్లి, రావాడ గ్రామాల్లో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొలంబడి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా వరి విత్తన శుద్ధి, భూసార పరీక్షల వల్ల కలిగే లాభాలు వివరించారు. వాడచీపురుపల్లి సర్పంచి శివలంక లక్ష్మి, ఉపసర్పంచి కూండ్రపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారిణి రమాదేవి తదితరులు

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి

రాంపురం (పెందుర్తి), న్యూస్‌టుడే: ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని పెందుర్తి మండల వ్యవసాయాధికారి చంద్రావతి పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం రాంపురం గ్రామంలో విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, ఎంపీటీసీ సభ్యురాలు గండి హిమబిందు అతిథులుగా పాల్గొని విత్తనాలు పంపిణీ చేశారు.

సేవలకు సత్కారం

చింతలగ్రహారం(వేపగుంట), న్యూస్‌టుడే: చింతలగ్రహారం జడ్పీ పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన 11 మంది ఉపాధ్యాయులను సహచర ఉద్యోగులు, గ్రామ పెద్దలు బుధవారం ఘనంగా సత్కరించారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసిన ఎల్.అనంతలక్ష్మికి పదోన్నతిపై స్థానచలనం కాగా.. మిగిలిన వారిలో జె.శాంతి, కె.మాధవి, ఎస్.ఎస్.నాగమణి, లక్ష్మీ, డి.హేమలత, జి.అవతారం, బి.వేలంగిణి, బి.గిరివరప్రసాద్ వేర్వేరు పాఠశాలలకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రధానోపాధ్యాయిని పి.వి.ఎస్.ఎన్.నాగమణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచి దాడి గోపీఅప్పలనాయుడు, ఇతర నాయకులు కాళ్ల వరలక్ష్మి, పి.వెంకటరమణ, ఆళ్ల తాతారావు, పి.అప్పారావు, బొడ్డేటి నూకరాజు, మద్దాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులతో పాఠశాల బోధనా సిబ్బంది

అభ్యసన సామర్థ్యాలపై ఆరా..

సబ్బవరం, న్యూస్‌టుడే: అనకాపల్లి డీఈవో అప్పారావునాయుడు బుధవారం సబ్బవరం మండలం గొట్టివాడ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. కొద్దిసేపు పిల్లలతో మమేకమై వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. నూతన ప్రవేశాలను ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. బడిఈడు పిల్లలంతా బడిలో ఉన్నట్లు చూడాలన్నారు. ప్రభుత్వ పథకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

చందనం అరగదీతకు సన్నాహాలు

సింహాచలం, న్యూస్‌టుడే: ఆషాఢ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 10న అప్పన్న స్వామికి చివరి విడత చందన సమర్పణ జరగనుంది. ఆ మేరకు గంధం అరగదీతకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. బుధవారం ఏఈవో ఎన్.ఆనందకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆలయ భాండాగారంలోని చందనం చెక్కలను బయటకు తీసి తూకం వేశారు. అరగదీసేందుకు వీలుగా ముక్కలుగా కోశారు. శనివారం నుంచి సిబ్బంది గంధం అరగదీతను ప్రారంభిస్తారు.

చందనం చెక్కలను ముక్కలుగా చేస్తున్న సిబ్బంది

వివాదాస్పద స్థలంలో వాగ్వాదం

మొక్కలు తొలగించేందుకు వచ్చిన సిబ్బందిపై రైతుల ఆగ్రహం

పోలీసులతో మాట్లాడుతున్న స్థానిక నాయకులు

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట వుడా వివాదాస్పద 144 ఎకరాల్లో రైతులు మొక్కలు వేసిన చోట వీఎంఆర్డీఏ సిబ్బందికి, రైతులకు మధ్య బుధవారం వాగ్వాదం చోటుచేసుకుంది. రెండు రోజులుగా రైతులు ఆ భూమిలో యూకలిప్టస్ మొక్కలు వేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న వీఎంఆర్డీఏ భూపరిరక్షణ సిబ్బంది సంబంధిత స్థలానికి చేరుకోగా రైతులు వారిని నిలదీశారు. మొక్కలు తొలగించేందుకు యత్నిస్తే ఊరుకోబోమని హెచ్చరించడంతో వారు పెందుర్తి పోలీసుస్టేషన్‌లో రైతులపై ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకోగా గ్రామ పెద్ద ముత్తానాయుడు తదితరులు పోలీసులతో మాట్లాడారు. యోగా పార్కింగ్ కోసం ఈ స్థలాన్ని అధికారులు చదును చేయించి అందుకు వినియోగించలేదని, ప్రస్తుతం రైతులు ఆ భూమిలో మొక్కలు వేసుకుంటే అడ్డు పడడమేమిటని ప్రశ్నించారు. ఈ విషయమై చర్చించేందుకు పోలీసుస్టేషన్‌కు రావాలని పోలీసులు కోరగా.. అధికారులే ఇక్కడికొచ్చి సమాధానం చెప్పాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు తమకు న్యాయం జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

రైతులు వేసిన మొక్కలను పరిశీలిస్తున్న వీఎంఆర్డీఏ భూపరిరక్షణ సిబ్బంది

ట్రాఫిక్ సమస్య లేకుండా సహకరించాలి

సేవా సంస్థల ప్రతినిధులకు సూచనలిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు, అధికారులు

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాచలం గిరి ప్రదక్షిణ సందర్భంగా భక్తులకు సేవ లందించే స్వచ్ఛంద సేవా సంస్థలు భక్తుల పాదయాత్రకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు కోరారు. గిరి ప్రదక్షిణలో సేవలందించే సంస్థలతో బుధవారం దేవస్థానం కార్యాలయంలో సమావేశం జరిగింది. సుమారు 40 సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. దేవస్థానం సూచించిన ప్రదేశాల్లోనే స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. గోపాలపట్నం బంకు - గోశాల, గోశాల - ధారపాలెం, గోశాల - వేపగుంట మార్గాల్లో ఆహార పదార్థాల పంపిణీకి అనుమతి లేదని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈవో రాధ, ఈఈ సీహెచ్‌వీ రమణ, ఏఈవోలు రమణమూర్తి, ఎన్.ఆనందకుమార్, డీఈఈ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాయితీ విత్తనాల పంపిణీ

సబ్బవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వం సరఫరా చేస్తున్న రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ అన్నారు. సబ్బవరంలో బుధవారం చేపట్టిన విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఏవో రమాదేవి మాట్లాడుతూ ఎంటీయూ 1224 రకం, బీపీటీ 3291, బీపీటీ 5204, ఎంటీయూ 1121 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వాటి ధరలు, రాయితీ వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తమరాన బంగారునాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు అతిథులు రైతులకు విత్తనాలు అందజేశారు.

రైతులకు విత్తన బస్తాలు అందిస్తున్న గండి బాబ్జీ తదితరులు

ఐఐపీఈ స్వచ్ఛత పక్వాడా

సబ్బవరం, న్యూస్‌టుడే: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) ఆధ్వర్యంలో బుధవారం వంగలి గ్రామంలో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఐఐపీఈ డైరెక్టర్ శాలివాహన్, రిజిస్ట్రార్ రాంపాల్ తదితరులు స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రపర్చారు. ఈ సందర్భంగా పాఠశాలకు కంప్యూటర్, డస్ట్‌బిన్; పంచాయతీ కార్యాలయానికి, అంగన్‌వాడీ కేంద్రాలకు డస్ట్‌బిన్లు, విద్యార్థులకు ఆట వస్తువులు అందించారు. ఈ సందర్భంగా శాలివాహన్ మాట్లాడుతూ ఈ పాఠశాలను దత్తత తీసుకుని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం గ్రామంలోని గ్రీన్ అంబాసిడర్లను సత్కరించి దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ మురళీకృష్ణ, ఎంఈవో-2 రవీంద్రబాబు, సర్పంచి ఆకుల శ్రీహేమ ఇతర నాయకులు గణేశ్, గవర తులసి, గవర రాజు, జెట్టి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

వంగలి ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో శుభ్రత పనులు చేపడుతున్న ఐఐపీఈ అధికారులు

(c) eenadu

జయపురంలో స్థానికులతో మాట్లాడుతున్న మంత్రి పయ్యావుల కేశవ్

ప్రజలకు రెట్టింపు సంక్షేమ ఫలాలు

'సుపరిపాలనలో తొలి అడుగు'లో మంత్రి పయ్యావుల

కూడేరు (ఉరవకొండ), న్యూస్‌టుడే: రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూనే గతంలో కంటే రెట్టింపుగా సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. బుధవారం కూడేరు మండలం జయపురంలో జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అధికారులు, నాయకులతో కలిసి ఇంటింటా తిరిగారు. పథకాల లబ్ధిని తెలుసుకొంటూనే, ప్రజాసమస్యలను విన్నారు. మంత్రి మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆర్థిక, అరాచక విధ్వంసాన్ని సృష్టించింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని కాపాడుకుంటూ అభివృద్ధిబాటలో పయనిస్తున్నామన్నారు. గతంలో అమ్మఒడి కింద 45 లక్షల మందికి లబ్ధి చేకూరగా.. ప్రస్తుతం 67 లక్షల మంది తల్లికి వందనం పథకాన్ని వర్తింపజేశామన్నారు. 'ప్రస్తుత ప్రభుత్వం మాది' అంటూ అన్ని వర్గాల ప్రజలు స్వాగతిస్తున్నారని చెప్పారు. ఏదైనా చేయకపోతే ఎందుకు చేయలేదనే విషయాన్ని కూడా ప్రజాప్రతినిధులు ప్రజలకు వివరిస్తున్నారన్నారు. హంద్రీనీవా ప్రధాన కాలువను విస్తరించడంతో పాటు ఉప కాలువల నిర్మాణానికి కృషి చేస్తున్నామని తెలిపారు. తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, నాయకులు నాగరాజు, బ్రహ్మయ్య, రామచంద్ర, మురళి, సర్పంచి రమాదేవి, తహసీల్దార్ మహబూబ్ బాషా, ఎంపీడీవో కుళ్లాయిస్వామి, ఏవో శుభకర్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేద్దాం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు నాయుడు కొత్తచెరువులో ఈ నెల 10న పర్యటించే అవకాశం ఉంది. అధికారికంగా షెడ్యూల్ రావాల్సి ఉంది. అధికారులు సమన్వయంతో పని చేసి పర్యటన విజయవంతం చేయాలి' అని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సీఎం పర్యటనపై జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్వో విజయసారథితో కలిసి కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. తల్లికి వందనం కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం కొత్తచెరువులో పర్యటించే అవకాశం ఉంది. ఈ పర్యటనకు సంబంధించి ప్రతి శాఖకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించామని, ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో ప్రోటోకాల్‌కు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని, భద్రతా చర్యల విషయంలో పోలీసు విభాగం పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కాన్వాయ్‌లో ప్రత్యేక వైద్యులతోపాటు అత్యవసర మందులకు అంబులెన్స్ సిద్ధంగా ఉంచుకోవాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. బ్యారికేడింగ్ తదితర ఏర్పాట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు పటిష్ఠంగా చేపట్టాలన్నారు.

నైరుతి.. నైరాశ్యం

- మేఘాలు ఊరింపు
- ఖరీఫ్ సాగుపై కర్షకుల్లో సందిగ్ధం

"**అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే:** మరో రెండు రోజుల్లో ఆరుద్ర కార్తె ముగియనుంది. ఇంతవరకు చినుకు జాడలేదు. గతేడాది కంటే ఈసారి ఉమ్మడి అనంత జిల్లాలో ముందస్తుగా రుతుపవనాలు ప్రవేశించడంతో భారీ వర్షాలు కురుస్తాయని తొలుత వాతావరణ శాఖ సంకేతాలు ఇచ్చింది. దీంతో అన్నదాతల్లో ఆశలు రేకెత్తాయి. జులై వచ్చినా వరుణుడు కరుణించడం లేదు. కారుమబ్బులు కమ్ముకుంటున్నా బలమైన గాలులతో మేఘాలను తరిమేస్తున్నాయి. దుక్కులు చేసుకుని సిద్ధంగా ఉన్న అన్నదాతలు నిత్యం ఆకాశం వైపు చూస్తున్నారు"

అనంతపురం: ఎదగని కంది మొక్కలు

వేసవిలో అధికం..

ఉమ్మడి జిల్లాలో సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో భారీగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఆయా నెలల్లోనే సాధారణం కంటే అత్యధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం. మే చివరి వారంలో నైరుతి రుతుపవనాలు రావడంతో భారీ వర్షాలు కురిసి పంటలకు నష్టం వాటిల్లింది.

★ అనంత జిల్లాలో గతేడాది జూన్‌లో 61.0 మి.మీ సాధారణ వర్షపాతం కాగా 142 మి.మీ నమోదైంది. శ్రీసత్యసాయి జిల్లాలో గతేడాది జూన్‌లో 66.6 మి.మీ గాను 148.9 మి.మీ అత్యధికంగా నమోదైంది.

47 వేల ఎకరాల్లోనే..

జూన్ ఒకటి నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. అన్ని రకాల పంటల సాధారణ సాగు లక్ష్యం 16,12,991 ఎకరాలు. ఇప్పటి వరకు 47,487 ఎకరాల్లోనే సాగయ్యాయి. అనంత జిల్లాలో సాధారణ సాగు లక్ష్యం 8,48,149 ఎకరాలు కాగా... అందులో 24,044 ఎకరాలు, శ్రీసత్యసాయి జిల్లాలో సాధారణ సాగు లక్ష్యం 6,64,842 ఎకరాలకుగాను 23,449 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి.

గత మూడు నెలల్లో ఇరు జిల్లాల్లో సాధారణ, నమోదైన వర్షపాతం (మి.మీలో)

నెల	అనంతపురం		శ్రీసత్యసాయి	
	సాధారణ	నమోదు	సాధారణ	నమోదు
ఏప్రిల్	12.1	56.3	13.0	46.4
మే	36.7	101.5	42.4	116.9
జూన్	61.0	47.0	66.6	34.8

18 వేల ఎకరాల్లోనే వేరుసెనగ

ఉమ్మడి జిల్లాలో ప్రధాన పంట వేరుసెనగ ఇప్పటివరకు 18,786 ఎకరాల్లోనే సాగైంది. ఈనేపథ్యంలో కర్షకుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

★ కంది 8,653 ఎకరాలు, మొక్కజొన్న 6,714, పత్తి 6,675, ఆముదం 2,595, సజ్జ 1000 ఎకరాలు సాగైనట్లు వ్యవసాయశాఖ గణాంకాలు పేర్కొంటున్నాయి.

అరకొర పదునులో విత్తు వేసుకోవద్దు

- డాక్టర్ మల్లీశ్వరి, ప్రధాన శాస్త్రవేత్త, కేవీకే, రెడ్డిపల్లి

ఖరీఫ్ పంటల సాగుకు సమయం ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. జులై మొదటి వారం తర్వాత వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంది. అరకొర పదునులో విత్తు వేసుకోవద్దు. మొలకరాక నష్టపోతారు. జులై నెలంతా సాగుకు అనుకూలమే. వేరుసెనగతో పాటు కంది, సజ్జ, కొర్రలు, పెసర తదితరాలు సాగు చేసుకోవడం ఉత్తమం.

ఒప్పంద పత్రాలతో జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య తదితరులు

క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ఒప్పందం

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూలో విద్యార్థులకు క్వాంటమ్ కంప్యూటింగ్‌పై తర్ఫీదు ఇవ్వడానికి గ్లోబల్ ఫౌండేషన్‌తో అవగాహన ఒప్పందం చేసుకొన్నట్లు ఉపకులపతి ఆచార్య సుదర్శనరావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాలోని అడ్వెంట్ గ్లోబల్ ఫౌండేషన్, అనంతపురం జేఎన్‌టీయూ మధ్య బుధవారం అవగాహన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తున్నారు. అదే కోవలో రాష్ట్రంలోనే మొదటిసారి జేఎన్‌టీయూలో క్వాంటమ్ కంప్యూటింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులకు ఉన్నతమైన శిక్షణ, పారిశ్రామిక నైపుణ్యానికి సంబంధించిన కార్యకలాపాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు మెరుగు పరచుకోవాలన్నారు. ఇంటర్న్‌షిప్‌కు సంబంధించిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనుబంధ కళాశాలల విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. విశ్వవిద్యాలయం పర్యావరణ వ్యవస్థ, దేశ భవిష్యత్తు, సాంకేతిక అవసరాలకు అనుగుణంగా మార్పులు చేయడానికి ఈ ఒప్పందం తోడ్పడుతుందన్నారు. రిజిస్ట్రార్ కృష్ణయ్య మాట్లాడుతూ.. ఈ ఒప్పందంతో ఎన్ఎస్‌డీసీ, గ్లోబల్ ప్రమాణీకరించిన నైపుణ్యాలు, అడ్వాన్స్‌డ్ ల్యాబొరేటరీస్, డ్రోన్ కిట్స్, ఐఓటీ, అటానమస్ సిస్టమ్స్, క్వాంటమ్ కంప్యూటింగ్‌కు సంబంధించిన ప్రయోగశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీసీ, రిజిస్ట్రార్‌తో పాటు ఓఎస్‌డీ దేవన్న, డైరెక్టర్లు సత్యనారాయణ, భానుమూర్తి, వైశాఖి ఘోర్పడే, సుబ్బారెడ్డి, సుజాత, సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్ భారతిపూడి, కిశోర్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ఎదుర్కోవడమెలా?

న్యూస్‌టుడే, అనంతపురం (వైద్యం): ప్రస్తుతం వాతావరణ మార్పులతో పాటు తాగునీరు కలుషితంతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ, అతిసారం తదితర సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి? ఒకవేళ సోకినా ఆయా ప్రభుత్వ వైద్యశాలల్లో ఎలాంటి సేవలు అందిస్తారు. వైద్యపరీక్షలు, అవసరమైన ఔషధాలు అందుబాటులో ఉన్నాయా.. తదితర అంశాలను మీరు తెలుసుకోవాలని అనుకుంటున్నారా.. అయితే మీకు 'ఈనాడు-మీతోడు' చక్కటి అవకాశం కల్పించనుంది. **అనంతపురం జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఈ.బి.దేవి**తో ఫోన్‌లో నేరుగా మాట్లాడి.. సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. సూచనలు, సలహాలు స్వీకరించవచ్చు. మీరు చేయాల్సిందల్లా కింద పేర్కొన్న నిర్ణీత తేదీన ఫోన్ నంబరుకు కాల్ చేయడమే..!

- ఫోన్ చేయాల్సిన తేదీ: 04-07-2025 (శుక్రవారం)
- సమయం: ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్య
- నంబర్లు : 80085 73008, 08554-277434

వైద్యసామగ్రిని అందుబాటులో ఉంచండి: కలెక్టర్

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: గత నెల 29న 'ఈనాడు'లో 'సూది..దారమూ కరవే!' శీర్షికన ప్రచురితమైన కథనంపై అనంతపురం జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ స్పందించారు. వైద్యులతో విచారణ కమిటీ ఏర్పాటు చేయాలని సర్వజన వైద్యశాల ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాంను ఆదేశించారు. ఆసుపత్రిలో అందుబాటులోలేని మందులు, సామగ్రి వివరాలను ఆయా విభాగాల హెచ్‌వోడీలతో సేకరించి.. ఔషధాల సరఫరా విభాగం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. అక్కడ అందుబాటులో లేకపోతే స్థానికంగా కొనుగోలు చేయడానికి టెండర్లు పిలవాలని కలెక్టర్ ఆదేశించినట్లు ఆత్మారాం తెలిపారు. రోగులకు అవసరమైన మందులు, సామగ్రి అందుబాటులో ఉంచేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

ఇరుకు గదులు.. ఇక్కట్లతో చదువు

వరండాలో ఇరుకుగా కూర్చున్న విద్యార్థులు

కూడేరు (ఉరవకొండ), న్యూస్‌టుడే: కూడేరు మండలం కొర్రకోడు జడ్పీ ఉన్నత పాఠశాలకు ప్రత్యేక భవనం లేదు. దీంతో ప్రాథమిక పాఠశాలలోని ఇరుకు గదుల్లోనే బోధన కొనసాగుతోంది. ఫలితంగా విద్యార్థులకు అగచాట్లు తప్పడం లేదు. ఇక్కడ 6 నుంచి 10వ తరగతి వరకు సుమారు 130 మంది విద్యార్థులున్నారు. గదుల కొరత వల్ల డిజిటల్ తరగతుల నిర్వహణ కష్టంగా మారింది. మరో వైపు క్రీడల సాధనకు అవకాశమే లేదు. రెండేళ్ల కిందట 'నాడు- నేడు' కింద రూ.1.80 కోట్లతో గ్రామం బయట 8 గదులతో ప్రారంభించిన ఉన్నత పాఠశాల భవనం పనులు నేటికీ పూర్తికాలేదు. దీనిపై ఉప విద్యాధికారి శ్రీనివాసులును 'న్యూస్‌టుడే' వివరణ కోరగా... నూతన భవన నిర్మాణ పనులు ఇటీవల పరిశీలించామని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

వైకాపా నాయకుడి నివాసంలో పత్రాలు స్వాధీనం

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: వైద్యవిద్యార్థులకు సీట్ల కేటాయింపు, ఆసుపత్రుల అనుమతుల కోసం మధ్యవర్తిగా వ్యవహరిస్తూ భారీగా లంచాలు తీసుకున్నారన్న ఆరోపణలపై కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లికి చెందిన వైకాపా నాయకుడు, డాక్టర్ బత్తల హరిప్రసాద్ నివాసంలో మంగళవారం రాత్రి సోదాలు నిర్వహించిన సీబీఐ అధికారులు నగదు వివరాలు నమోదు చేసిన పుస్తకంతోపాటు కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అర్ధరాత్రి దాటాక కూడా తనిఖీలు చేసిన అధికారులు బత్తల హరిప్రసాద్ దిల్లీలోని సీబీఐ అధికారుల ఎదుట హాజరుకావాలని ఆయన కుటుంబసభ్యులకు నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. ఎన్ఎంసీ సభ్యులతో సత్సంబంధాలు కలిగిన డాక్టర్ బత్తల హరిప్రసాద్ చెన్నై వేదికగా మరికొందరితో కలిసి రెండు తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల్లో వైద్యవిద్యార్థులకు యాజమాన్య కోటా సీట్లు, ప్రైవేటు వైద్యశాలలకు సంబంధించిన అనుమతుల కోసం పెద్దమొత్తంలో లంచాలు తీసుకున్నట్లు ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. కోట్లాది రూపాయలు వసూలు విషయమై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణల దృష్ట్యా దాదాపు 35 చోట్ల ఒకేరోజు సీబీఐ అధికారులు తనిఖీలు చేసినట్లు సమాచారం. డాక్టర్ బత్తల హరిప్రసాద్‌కు చెన్నై, తిరుపతి, హైదరాబాద్‌లోని ఇళ్లు, ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నట్లు సీబీఐకి ఫిర్యాదు అందినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే సీబీఐ అధికారులు హరిప్రసాద్ స్వగ్రామమైన కుమ్మరవాండ్లపల్లిలో తనిఖీలు చేసినట్లు తెలుస్తోంది.

తొలి దశ కింద కొనసాగుతున్న కాలువ విస్తరణ పనులు

అటు వెడల్పు.. ఇటు లైనింగ్

- వేగంగా హంద్రీనీవా ఆధునికీకరణ
- మందకొడిగా పీబీసీ పనులు

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంత జిల్లా వరప్రదాయినిగా భావించే హంద్రీనీవా ప్రధాన కాలువ ఆధునికీకరణ పనులు కొనసాగుతున్నాయి. నీటి సీజన్ మొదలు కావడం.. శ్రీశైలం ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో పనుల పురోగతిపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. కాలువకు ఈనెలాఖరులోపు నీటిని విడుదల చేసే అవకాశం ఉండటంతో జిల్లా జలవనరుల శాఖ సీఈ నాగరాజు, ఎస్ఈ అన్నవరం స్వరూప్‌కుమార్.. క్షేత్ర స్థాయి పనులను పర్యవేక్షిస్తున్నారు. దీంతో ప్రధాన కాలువ పనుల్లో వేగం పెరిగింది. కానీ పుంగనూరు ఉప కాలువ(పీబీసీ) పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఇక్కడ మట్టి తొలగింపులో వేగం పెరగాల్సి ఉంది. ఈనెల 10 నాటికి పూర్తి చేయాలని గడువు పెట్టుకున్నారు. ప్రధాన కాలువ తొలి దశ కింద వెడల్పు, రెండో దశలో పీబీసీ లైనింగ్ పనులు చేస్తున్న సంగతి తెలిసిందే.

తొలి దశ కీలకం

ప్రధాన కాలువ తొలి దశ కింద విస్తరణ పనులు చేస్తున్నారు. 88 కి.మీ. నుంచి 216.300 కి.మీ. దాకా వెడల్పు చేయడానికి ప్రభుత్వం రూ.695.53 కోట్ల అంచనా వ్యయంతో పరిపాలన ఉత్తర్వు ఇచ్చిన సంగతి తెలిసిందే. 3850 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో విస్తరిస్తున్నారు. మార్చి రెండో వారం నుంచి పనులు మొదలయ్యాయి. ఇప్పటివరకు 71.02 శాతం పనులు జరిగాయి. 84.97లక్షల క్యూబిక్ మీటర్ల మట్టిని తొలగించాల్సి ఉండగా. . 60.345 క్యూబిక్ మీటర్ల మట్టిని ఎత్తిపోశారు. తొలి దశ కాలువ ద్వారా గుంతకల్లు, ఉరవకొండ, రాయదుర్గం, కళ్యాణదుర్గం ప్రాంతాలకు నీరు అందనుంది.

259 కి.మీ.మేరకు..

రెండో దశలో ప్రధాన కాలువ, పీబీసీ కలిపి లైనింగ్ పనులు 259 కి.మీ. చేయాల్సి ఉంది. 216 నుంచి 400 కి.మీ. దాకా ఇద్దరు గుత్తేదారులు ఐదు ప్యాకేజీలుగా విభజించారు. ఇందుకు రూ.1256.30 కోట్ల అంచనా వ్యయంతో పని చేస్తున్నారు. లైనింగ్ పనుల్లో జాప్యం జరుగుతోంది. ఇక పీబీసీని రెండు ప్యాకేజీలు విభజించారు. రూ.266.24 కోట్ల అంచనా వ్యయంతో ఆధునికీకరణ సాగుతోంది. లైనింగ్‌లోనే కాదు.. మట్టి పనిలోనూ నత్తనడక కొనసాగుతోంది. ఈ రెండు ప్యాకేజీల్లో వేగం పెరగాల్సి ఉంది. మేలో కొంతమేర వర్షాలు పడటంతో పనులకు ఆటంకం ఏర్పడింది. ఈనెలాఖరుకు పనులు పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నట్లు ఎస్ఈ స్వరూప్‌కుమార్ తెలిపారు. రెండో దశ ప్రధాన కాలువ ఉరవకొండ, రాప్తాడు, పుట్టపర్తి, మడకశిర, పెనుకొండ, హిందూపురం, కదిరి నియోజకవర్గాల మీదుగా వెళ్తుంది.

పంపిణీ చేశారు.. మూలన పడేశారు!

వైకాపా ప్రభుత్వ హయాంలో రూ.లక్షలు ఖర్చు చేసి నియోజకవర్గంలోని 79 రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేసిన కియోస్క్ యంత్రాలు దిష్టిబొమ్మల్లా మారాయి. గత సర్కారు అనాలోచిత నిర్ణయంతో ప్రజాధనం బూడిదలో పోసిన పన్నీరైంది. ఈ విషయంగా వ్యవసాయశాఖ సహాయ సంచాలకురాలు పద్మజ మాట్లాడుతూ చరవాణుల ద్వారా ఇండెంట్ పెడుతుండటంతో కియోస్క్ యంత్రాలను వినియోగించడం లేదన్నారు.

- న్యూస్‌టుడే, రాయదుర్గం

జాతీయస్థాయి ఫెన్సింగ్ పోటీలకు పలువురి ఎంపిక

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: ఇటీవల విజయవాడలో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-10, 12 విభాగాల ఫెన్సింగ్ పోటీల్లో జిల్లా క్రీడాకారులు పతకాల పంట పండించారు. వివిధ విభాగాల్లో 18 మంది క్రీడాకారులు పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో ఈ నెల 5 నుంచి 7వరకు జరగనున్న పోటీల్లో రాష్ట్రం తరపున ఈ క్రీడాకారులు పాల్గొంటారు. జాతీయస్థాయికి ఎంపికైన క్రీడాకారులను జిల్లా ఫెన్సింగ్ సంఘం అధ్యక్షుడు ఎ.మురళీకృష్ణ, కార్యదర్శి పుష్పవతిలు అభినందించారు. అండర్-10 విభాగంలో బి.సాద్విన్, కె.ఆర్య, బి.మోహన్ కృష్ణ, జె.గౌతమ్ కృష్ణ, బి.చైత్ర, ఆర్.అస్వితభాయ్, కె.అన్నెచౌదరిలు పతకాలు సాధించి జాతీయస్థాయికి అర్హత సాధించారు. అండర్-12 విభాగంలో జి.అబ్దుల్లా, దుర్గావియాన్, బి.జశ్వంత్‌రెడ్డి, డి.బాబాఫక్రుద్దీన్, కె.ఫణికుమార్, డి.జావీద్, బి.ముక్తామేక, కె.విక్ష, ఆర్.లిఖితబాయ్‌లు జాతీయస్థాయికి ఎంపికయ్యారు. పోటీల్లో కూడా పతకాలు సాధించి రాష్ట్రానికి పేరుప్రఖ్యాతలు తేవాలని వారు పిలుపునిచ్చారు.

రూ.వంద కోసం గొడవ..

కత్తితో గొంతు కోసిన వైనం

నంబులపూలకుంట (గాండ్లపెంట), న్యూస్‌టుడే: రూ.వంద కోసం గొడవపడి కత్తితో గొంతు కోసిన ఘటన ఎన్పీకుంట మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. నల్లగుట్టపల్లికి చెందిన నరసింహులు, చీమలచెరువుపల్లికి చెందిన రవీంద్రారెడ్డి రూ.100 కోసం వాదించుకున్నారు. ఈ క్రమంలో రవీంద్రారెడ్డి కత్తితో నరసింహులు గొంతు కోశాడు. ఈ ఘటన పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో జరిగింది. బాధితుడు చికిత్స చేయించుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇద్దరిని విచారిస్తున్నట్లు ఎస్ఐ వలిబాషా తెలిపారు. మామిడి కాయల డబ్బుల విషయంలో గొడవపడినట్లు ఆయన తెలిపారు.

జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల

జేఎన్‌టీయూ టు స్వీడన్

డబుల్ డిగ్రీ కోర్సులు ప్రారంభం

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: అనంత జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ చదివితే స్వీడన్‌కు వెళ్లే అవకాశం ఉంది. స్వీడన్‌లోని బకింగ్‌హమ్ విశ్వవిద్యాలయంతో జేఎన్‌టీయూ ఒప్పందం కుదుర్చుకుంది. సాధారణంగా బీటెక్ చదివితే ఒక డిగ్రీ పట్టా వస్తుంది. జేఎన్‌టీయూ అందిస్తున్న డబుల్ డిగ్రీ కోర్సుల్లో నాలుగేళ్ల బీటెక్ కోర్సు పూర్తి చేస్తే ఒకేసారి రెండు డిగ్రీలు పొందొచ్చు. ఇక్కడ మూడేళ్లు, స్వీడన్‌లో ఏడాది చదవాల్సి ఉంటుంది. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు జేఎన్‌టీయూ బీటెక్ పట్టా, స్వీడన్‌లోని ఇంజినీరింగ్ కళాశాల సర్టిఫికెట్ ప్రదానం చేయనున్నారు. 2017 నుంచి కళాశాల ఈ సదవకాశాన్ని కల్పిస్తోంది. ఇటీవలే మాస్టర్స్ డిగ్రీ జత కలిపారు.

ప్రవేశాలు ఎలా..

డబుల్ డిగ్రీ కోర్సుల్లో చేరాలంటే ఇంటర్మీడియట్‌లో 60 శాతంతో ఉత్తీర్ణులై ఉండాలి. జేఈఈ, ఈఏపీసెట్ గాని, తెలంగాణ ఈఏపీసెట్‌లో అర్హత సాధించి ఉండాలి. జేఈఈలో ర్యాంకు సాధించిన వారికి 50 శాతం ప్రవేశాలు కల్పిస్తారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో 20, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో 10 సీట్లున్నాయి.

ప్రయోజనం ఏమిటి?

విదేశీ విద్య, ఉద్యోగాలు చేయాలనుకొనేవారికి కోర్సు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. జేఎన్‌టీయూ అందించే బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బీఎస్సీ) సర్టిఫికెట్‌తో ఎంఎస్‌లో చేరడానికి ప్రవేశ పరీక్ష రాయాల్సిన అవసరం ఉండదు. నేరుగా ఎంఎస్‌లో చేరి స్వీడన్‌లోనే కొలువులు సాధించవచ్చు.

ఈనెల 10 వరకు గడువు

- ఆచార్య సుదర్శనరావు, ఉపకులపతి, జేఎన్‌టీయూ

దరఖాస్తుకు ఈనెల 10 తుది గడువుగా నిర్ణయించాం. 14 న కౌన్సెలింగ్ నిర్వహించనున్నాం. ఏటా రూ.1.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. చివరి ఏడాది స్వీడన్ కళాశాల నిర్ణయించిన మేరకు ఫీజు చెల్లించాలి. అక్కడ ఉత్తమ మార్కులు సాధిస్తే ఉపకారవేతనం లభిస్తుంది. సాధారణ బీటెక్‌లా కాకుండా డబుల్‌డిగ్రీ కోర్సుల్లో చేరడం వల్ల రెండు డిగ్రీలు లభిస్తాయి. ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవచ్చు.

హెచ్చెల్సీ మరమ్మతులకు రూ.95.90 లక్షలు

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: గతేడాది నీటి సీజన్‌లో అత్యవసర మరమ్మతు పనులు చేసినందుకు రూ.95.9 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసింది. రాష్ట్ర జలవనరుల శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి సాయిప్రసాద్ ప్రత్యేక ఉత్తర్వు జారీ చేశారు. గతేడాది జులై, ఆగస్టు, సెప్టెంబరు మాసాల్లో హెచ్చెల్సీ ప్రధాన కాలువలో ప్రవాహం కొనసాగే సమయంలో పడిన గండ్లకు మరమ్మతులు, యూటీ లీకేజీ, రక్షణ గోడలను నిర్మించారు. 119.638 కి.మీ. వద్ద యూటీ లీకేజీ ఏర్పడటంతో అప్పటికప్పుడు పనులు చేశారు. ఇందుకు రూ.60.80 లక్షలు, 112.200 కి.మీ. వద్ద పడిన గండిని పూడ్చడానికి రూ.13.50 లక్షలు, ప్రధాన కాలువ ఒకటో పంట కాలువ, హెచ్ ఉప కాలువల వద్ద రక్షణ గోడల నిర్మాణానికి సంబంధించి రూ.21.60 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులు నిర్దేశిత గుత్తేదారులకు చెల్లిస్తారు. ఈ పనులన్నీ నామినేషన్‌పైనే అప్పట్లో చేశారు.

(c) eenadu

భక్తిశ్రద్ధలతో ఐదో సరిగెత్తు

గూగూడుకు పోటెత్తిన భక్తులు

పూజలందుకున్న కుళ్లాయిస్వామి పీర్లు

నార్పల, న్యూస్‌టుడే : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఐదో సరిగెత్తును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే పీర్ల చావిడిలో అర్చకులు హుసేని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి భక్తులకు స్వామి దర్శన భాగ్యం కల్పించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. పోలీసులు ఆలయం వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులు అగ్నిగుండంలో చక్కెర, కొబ్బెర వేసి మొక్కులు చెల్లించారు.

జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ప్రసాద్‌బాబు విజ్ఞప్తి చేశారు. కనీసం 10 సంవత్సరాలు ఉపాధ్యాయులుగా పని చేసి ఉండాలన్నారు. ఇతర వివరాలకు డీఈవో బ్లాక్‌స్పాట్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

కూరగాయల నార్లు సిద్ధం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: జిల్లాలో కూరగాయ పంటలు సాగు చేసే రైతులను దృష్టిలో ఉంచుకుని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో టమాటా, వంగ, మిరప నార్లు అందుబాటులో ఉంచుతున్నామని కేవీకే శాస్త్రవేత్త త్రిశల మాధవి తెలిపారు. షేడ్ నెట్‌లో ఆరోగ్యకరమైన వాతావరణంలో నాణ్యమైన విత్తనాలతో కూరగాయల నారు మడులు పెంచుతున్నామన్నారు. పీకేఎం-1 రకం మునగ మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న రైతులు నేరుగా రెడ్డిపల్లి కేవీకేలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు చరవాణి : 99497 37160 నంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని శాస్త్రవేత్త తెలిపారు.

నాన్న దిద్దిన జీవితం

జన్మనిచ్చిన నాన్నే వారిని బ్రహ్మగా మారారు. బ్రహ్మ రాసిన తలరాతను సైతం తన రెక్కల కష్టంతో మార్చి బ్రహ్మాండమైన జీవితాన్నిచ్చారు. తండ్రి కష్టాన్ని కళ్లారా చూసిన ఆ కుర్రాళ్లు కసితో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి.. తల్లిదండ్రుల కలలు నెరవేర్చారు. నాన్న ఆటోడ్రైవర్ కాగా.. కుమారుల్లో ఒకరు శాస్త్రవేత్త, మరొకరు ఇంజినీరు. రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లికి చెందిన తండ్రీకుమారుల స్ఫూర్తిదాయక కథనం.

– ఈనాడు, పుట్టపర్తి

కుమారులతో తల్లిదండ్రులు నాగభూషణం, ఉమాదేవి

పూజారి నాగభూషణం, ఉమాదేవిలకు ఇద్దరు కుమారులు నాగప్రదీప్, నాగసాయి. కనగానపల్లిలో ఉన్న నాలుగెకరాల్లో పంటలు పండేవి కావు. పిల్లలకు రెండుపూటలా భోజనం పెట్టడం కష్టమైన పరిస్థితుల్లో నాగభూషణం సరకు రవాణా వ్యాన్ నడుపుతూ జీవనం సాగించేవారు. తన కష్టం పిల్లలకు రాకూడదని, ఉన్నతస్థానాల్లో చూడాలని కలలు కన్నారు. వారిని 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ధర్మవరంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చేర్పించారు. హాస్టల్‌లో ఉంచి చదివించే ఆర్థిక స్తోమత లేకపోవడంతో డేస్కాలర్‌గా చేర్పించారు.

ఆటోడ్రైవర్‌గా మారి..

పిల్లలు రోజూ పాఠశాలకు వెళ్లి రావడం కష్టంగా మారింది. దీంతో రవాణా వ్యాన్‌ను విక్రయించి తనే ఆటోడ్రైవర్‌గా మారారు. ఉదయాన్నే పిల్లలను ధర్మవరంలో వదిలిన తర్వాత సాయంత్రం వరకు ఆటో తిప్పేవారు. తర్వాత పిల్లలను గ్రామానికి తీసుకొచ్చేవారు. అలా 12 ఏళ్లు గడిచింది. పదో తరగతి అనంతరం విజయవాడలోని ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో చేర్పించారు.

భారం తగ్గించాలని..

ఇంటర్మీడియట్ వరకు తండ్రి కష్టపడి ఆదాయపడిన తర్వాత బాగా చదివి ర్యాంకులు తెచ్చుకున్నారు. నాగప్రదీప్ ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించి అనంతపురం జేఎన్‌టీయూలో 2020లో బీటెక్ పూర్తి చేశారు. ఎంటెక్ ప్రవేశ పరీక్షలోనూ ఉత్తమ ర్యాంకుతో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో సీటు సాధించారు. ఇక్కడ చదువుతుండగానే తన పరిశోధనలపై గతేడాది సెప్టెంబరులో ఇటలీ, ఫ్రాన్స్, ప్యారిస్, రోమ్ తదితర నగరాల్లో పేపర్ ప్రజంటేషన్ ఇచ్చాడు. ఎంటెక్ తర్వాత సెంట్రల్ ఇంటెలిజెన్స్ బ్యూరో, బార్క్, ఇస్రోతోపాటు రెండు కంపెనీల్లో ఉద్యోగాలు సాధించాడు. శాస్త్రవేత్త కావాలని చిన్నప్పటి నుంచి లక్ష్యంగా పెట్టుకున్న నాగప్రదీప్ ఈ ఏడాది ఫిబ్రవరిలో శ్రీహరికోటలో ఇస్రో శాస్త్రవేత్తగా విధుల్లో చేరాడు.

అన్నబాటలో..

నాన్నపై ఆర్థిక భారం తగ్గించాలని భావించిన రెండో కుమారుడు నాగసాయి అన్నలాగే కష్టపడి చదివి ఎన్విట్‌లో బీటెక్ పూర్తి చేశాడు. ఎన్‌టీపీసీ ఉద్యోగంలో చేరాడు. తర్వాత ఐఓసీఎల్‌లో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అక్కడ చేరడం ఇష్టంలేని నాగసాయి తన కలలన్నీ ఓఎన్‌జీసీలో ఇంజినీరుగా ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం రాజమండ్రిలో పనిచేస్తున్నాడు. ఇక్కడ రెండువారాలు విధులు, మరో రెండువారాలు సెలవులు ఉండటంతో దీన్ని అనుకూలంగా మార్చుకొని సివిల్స్‌కు సిద్ధమవుతున్నాడు. ఎస్పీ కావాలన్న అమ్మ కోరికను తీర్చేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు.

న్యాయవాదవృత్తితో బాధితులకు న్యాయం..

నమూనా పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు

అనంతపురం (మూడో రోడ్డు), న్యూస్‌టుడే: న్యాయవాద వృత్తితో బాధితులకు న్యాయం అందించడం సాధ్యమవుతుందని ఐఏఎల్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రసూల్ అన్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఆధ్వర్యంలో బుధవారం బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో జూనియర్ సివిల్ న్యాయమూర్తుల ఉద్యోగ పోటీ పరీక్షల అభ్యర్థులకు నమూనా నిర్వహించారు. అబ్దుల్ రసూల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాల్లో జడ్జి ఉద్యోగాలు భిన్నమైనవన్నారు. నేరం చేసిన వాడికి శిక్ష విధించి, అభాగ్యులైన బాధితులకు న్యాయం అందించే అవకాశం ఉందన్నారు. సమాజంలో ఎక్కడా న్యాయం జరిగే పరిస్థితి లేకపోవడంతో సామాన్యులు పూర్తిగా కోర్టులపై ఆధార పడుతున్నారన్నారు. సివిల్ కేసులైనా, క్రిమినల్ కేసుల్లోనైనా కోర్టుల్లోనే న్యాయం లభిస్తుందన్నారు. విభిన్నమైన ఉద్యోగాన్ని ఎంచుకున్న అభ్యర్థులను ఆయన అభినందించారు. ప్రజల్లో కోర్టులపై ఉన్న విశ్వాసాన్ని కాపాడేలా న్యాయవాదులు కృషి చేయాలన్నారు. చట్టాల్లోని లోపాలను సవరించేందుకు కూడా ఐఏఎల్ కృషి చేస్తుందన్నారు.

శింగనమల తెదేపాలో భగ్గుమన్న వర్గ విభేదాలు

ఎమ్మెల్యేపై కార్యకర్తల తిరుగుబాటు

గొడవ కారణంగా సమావేశం నుంచి బయటకు వెళ్తున్న తెదేపా నాయకులు

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే : శింగనమల నియోజకవర్గం తెదేపాలో మరోసారి వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. గ్రామ, మండల కమిటీల ఏర్పాటుకు బుధవారం సాయంత్రం అనంతపురం రహదారుల, భవనాల శాఖ అతిథి గృహంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ద్విసభ్య కమిటీ సభ్యులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. పార్టీ కోసం ఎంతో కష్టపడ్డాం. ఎన్నికల ముందు ఎమ్మెల్యే గెలుపునకు శక్తివంచన లేకుండా పనిచేశాం. తెదేపా అధికారంలోకి వస్తే న్యాయం జరుగుతుందని అంతా ఆశించాం. ఏడాది గడిచిపోయినా ఏ ఒక్కరికీ న్యాయం జరగలేదు..అంటూ పలు సమస్యలపై నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను ప్రశ్నించారు. నియోజకవర్గంలో కనీసం చౌకధరల దుకాణాలు, ఉపాధి హామీ పథకంలో క్షేత్రస్థాయి సహాయకుల పోస్టులు ఇవ్వడం లేదని నిలదీశారు. కష్టపడితే మీరిచ్చే గుర్తింపు ఇదేనా అంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. క్లస్టర్ ఇన్‌ఛార్జులు పనిచేయడం లేదని, ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేయడంతో కార్యకర్తల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. బుక్కరాయసముద్రంలో చౌకధర దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తిని రాజీనామా చేయించి ఇస్తాం. దరఖాస్తు చేసుకోవాలని స్వయానా ఎమ్మెల్యే చెప్పారని క్లస్టర్ ఇన్‌ఛార్జి నరేంద్ర యాదవ్ తెలిపారు. ఎన్నోసార్లు ఇస్తామని చెప్పి.. చివరకు దుకాణం డీలరు ఇచ్చే ప్రసక్తే లేదని తెగేసి చెప్పి అవమానపరుస్తారా? అంటూ ఎమ్మెల్యేని ప్రశ్నించారు. పరిశీలకులు పర్వీన్‌తాజ్, కాటమయ్య ఎంత సర్దిచెప్పే ప్రయత్నం చేసినా కార్యకర్తలు వినలేదు. ఎమ్మెల్యే మాట్లాడిన మాట తీరుపై ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్ కేశవరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, పర్వతనేని శ్రీధర్‌బాబు, రామలింగారెడ్డి, ఆయా మండలాల కన్వీనర్లు, ఇతర నాయకులంతా బయటకు వెళ్లిపోయారు. పోలీసులు చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపించారు.

మెస్‌బిల్లుల స్వాహా.. ఉద్యోగిపై కేసు

అనంత నేరవార్తలు: అనంతపురం మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థుల మెస్ బిల్లులు పక్కదారి పట్టించిన కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగిని సాకే ఓబులేశ్వరి అలియాస్ వాణిని రెండో పట్టణ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మెస్ బిల్లులు సుమారు రూ.20 లక్షలు కాజేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ గత నెలలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితురాలిని అరెస్టు చేశారు.

ధాన్యం సరే.. డబ్బులు ఇవ్వరా!

కలెక్టరేట్ వద్ద అన్నదాతల నిరసన

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రెండు మాసాల క్రితం రబీ సీజన్ వరి ధాన్యాన్ని సేకరించారు. దీనికి తగిన రూ.10 కోట్ల డబ్బులు ఇవ్వకుండా రైతులను ఇబ్బందికి గురి చేయడం సరికాదని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున విమర్శించారు. బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో అనంత కలెక్టర్ కార్యాలయం ప్రధాన గేటు ముందు నిరసన తెలిపారు. మొన్నటి రబీ సీజన్‌లో రైతుల నుంచి రూ.వంద కోట్ల ఖరీదు చేసే ధాన్యాన్ని తీసుకున్నారు. కొంతమేర డబ్బులు చెల్లించారు. బొమ్మనహాళ్, కణేకల్లు వంటి మండలాలకు చెందిన రైతుల నుంచే 10 వేల మెట్రిక్ టన్నుల వరిని ప్రభుత్వం సేకరించింది. అక్కడి రైతులకు ఇంకా రూ.10 కోట్లు బకాయి ఉందని గుర్తుచేశారు. ఈ బకాయిలు సత్వరమే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామన్నారు. ఆ తర్వాత డీఆర్‌ఓ మాలోలకు వినతి అందజేశారు. ఈ నిరసనలో సీపీఐ రాయదుర్గం కార్యదర్శి నాగార్జున, నాయకులు తిప్పేస్వామి, బండి రామకృష్ణ, టి.నారాయణస్వామి, రామాంజనేయులు, ఆనంద్, తిమ్మప్ప, గోవిందు, పెద్దిరెడ్డి, ఆంజనేయులు, దేవా, తేజ పాల్గొన్నారు.

EENADU e Classifieds

EDUCATION

GNM అడ్మిషన్స్: ఇంటర్మీడియట్‌లో Any గ్రూప్ పాస్ అయినవారికి G.N.M (నర్సింగ్) గవర్నమెంట్ సీట్స్‌కి అడ్మిషన్లు జరుగుచున్నవి. Only గర్ల్స్ కాలేజీలో అడ్మిషన్స్ పొందవచ్చు. G.మురళి 9030661651, ATP.

REAL ESTATE

PLOT FOR SALE

ముదిగుబ్బ మండలం రాళ్ల అనంతపురంలో హైవేకు ఆనుకొని ఉన్న 75 సెంట్ల స్థలము, ATP టౌన్ ఈనాడు ఆఫీసు దగ్గరలో ఉన్న 4 సెంట్ల స్థలం వెంటనే అమ్మబడును. Con: 9912733883.

JOBS

Wanted: Tutors (Gents), Bus Incharges, PET's Montessori Elite EM School, Gollapalli, Rapthadu (M), Anantapur. Cont: 9666332816, 9866676304.

ప్రముఖ సప్లయర్స్ నందు పనిచేయుటకు మేనేజర్ కావలెను. వయస్సు 35 పైన ఉండవలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్రదించండి: 9949089001.

MARKETING/ SALES

ATP టౌన్‌లోని కన్‌స్ట్రక్షన్స్ & ఇంటీరియర్స్ ఆఫీస్ నందు మార్కెటింగ్ చేయడానికి లేడీస్ ఫీల్డ్ స్టాఫ్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + టూవీలర్ మస్ట్. వివరాలకు సంప్ర: 9666958268.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS 5 లైన్ల ప్రకటన రూ. 395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

విధుల్లో చేరిన నెఫ్రాలజిస్ట్

అనంతపురం (వైద్యం), న్యూస్‌టుడే: సూపర్ స్పెషాల్టీ వైద్యశాలలో పని చేస్తున్న నెఫ్రాలజిస్ట్ డాక్టర్ హరీశ్ మంగళవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈయన సూపర్ స్పెషాల్టీ వైద్యశాలతోపాటు, సర్వజన వైద్యశాలలో ప్రభుత్వ అనుసంధానంతో ప్రైవేట్ సంస్థ నెఫ్రో నిర్వహిస్తున్న డయాలసిస్ కేంద్రంలో కూడా పనిచేస్తూ రెండో చోట్ల వేరువేరుగా ప్రతి నెలా వేతనం తీసుకుంటున్న వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ విషయంపై 'ఈనాడు'లో గత నెల 1న 'రెండు చోట్ల ఉద్యోగం.. వేతనం, సర్వజన ఆసుపత్రిలోనే నెఫ్రాలజిస్ట్ బాగోతం' ఈ కథనంపై స్పందించిన ఉన్నతాధికారులు గత నెల 3న నెఫ్రాలజిస్ట్ వ్యవహారంపై విచారణ కమిటీని ఏర్పాటు చేశారు. వారు నివేదికను సైతం అందజేశారు. ఈ వ్యవహారం సాగుతుండగానే గత నెల 1 నుంచి నెల రోజులపాటు సదరు నెఫ్రాలజిస్ట్ సెలవు పెట్టి వెళ్లిపోయారు. తన విభాగంలో ఉన్న 12 మంది ఇన్‌పేషెంట్లను హఠాత్తుగా డిశ్ఛార్జి చేసేసి వెళ్లి పోవటంపై పెద్దఎత్తున విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటివరకూ నెఫ్రాలజిస్ట్‌పై ఎలాంటి చర్యలు లేకపోవటం గమనార్హం. అతను విధుల్లో చేరినట్లు ప్రభుత్వ వైద్యకళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ డాక్టర్ షారోన్ సోనియా ధ్రువీకరించారు.

ANANTAPURAMU MUNICIPAL CORPORATION

e-PROCUREMENT - Tender Notice

1	Tender Notice No.	181 to 189/ General Funds/15th FC/2025-26/TO
2	Scope of Work	Providing of CC Roads, Drains and Chain link mesh in Anantapuramu Municipal Corporation
3	No. of Works	9 Nos.
4	Estimate Cost	Rs. 2.40 to 30.00 Lakhs

Note: The details of tender may be seen on e-procurement market place available @ https://tender.apeprocurement.gov.in

Sd/- Commissioner, Municipal Corporation, Anantapuramu

ANDHRA PRADESH STATE WAQF BOARD

(Imdad Ghar, 4th Floor, Adjacent to Head Post Office, Vijayawada-01)

F.No. 149/Lease/DM&Rent/ATP/2024, Dated: 02-07-2025

TENDER NOTICE

Sealed tenders are invited from the interested bidders / persons to participate in the bid for utilization of JCNRM (Moulana Abul Kalam) Shadi Khana hall only for Exhibition of Handicrafts and Handlooms purpose situated at Tadipatri (Town & Mandal) Anantapuramu District for a period of Forty five (45) days only from the date of handing over of the premises.

The tender schedule can be obtained from the O/o A.P.State Waqf Board at Vijayawada during office hours or can be downloaded from the QR code. For further details please contact Mobile No.9949352388.

Sd/- CHIEF EXECUTIVE OFFICER

HEFT ENERGY CONCEPT TO COMPLETION

WALK-IN DRIVE M/s HEFT ENERGY PRIVATE LIMITED

Join one of the fastest-growing companies in Renewable Energy Sector We are conducting walk-in interviews for the following roles:

★ Positions: Technicians

★ Date & Time: 05-07-2025 to 06-07-2025, Time: 9.00 AM to 05.00 PM

★ Venue: Alexander Hotels, No.11-120, Sapthagiri Circle, OPP. To Municipal Corporation office, Anantapur, AP – 515001.

★ Eligibility

- Qualification: ITI - Fitter, Electrician, Rigger & Mechanical Experience: 1–5 years – Preferable from Wind Sector, Engineering & Construction. ITI / Diploma – Freshers
- Experienced Technicians (Non-Qualified) Minimum 3 Years experience in Wind, Engineering & Construction.
- Helper – Experienced in construction Sector – Minimum 3 yrs

Bring updated resume, Present employer salary slips, Aadhar Card, PAN Card, Passport Size photo, Academic & Experience Certificates.

Note: "Male Candidates Only"

Contact: 9344997784, 9626499837

Email: hr@heft-energy.com

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి : శ్రీరామ్

గీతానగర్‌లో కరపత్రాలు అందజేస్తున్న పరిటాల శ్రీరామ్ తదితరులు

ధర్మవరం, న్యూస్‌టుడే: ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, రాష్ట్రాభివృద్ధి గురించి తెదేపా శ్రేణులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలియజెప్పాలని ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంపై ధర్మవరంలోని మారుతి రాఘవేంద్రస్వామి కల్యాణ మండపంలో బుధవారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పరిటాల శ్రీరామ్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నెరవేర్చారన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లికి వందనం, దీపం పథకం గురించి పార్టీ శ్రేణులు ప్రజలకు తెలియజెప్పాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం స్థానిక 17వ వార్డు గీతానగర్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని పరిటాల శ్రీరామ్ ప్రారంభించారు. ఇంటింటా వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కాటమయ్య, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌బాబు, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ అయ్యప్ప, ఉమ్మడి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు నాగభూషణ, మాజీ ఎంపీపీలు మద్దిలేటి, వేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రామాంజనేయులు, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు ముతుకూరు బీబీ, తెదేపా పట్టణాధ్యక్షుడు సుధాకర్, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి మహేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగ్గురు సర్వేయర్లకు షోకాజ్ నోటీసులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: గత నెల 29న జరిగిన సాధారణ బదిలీల కౌన్సెలింగ్‌లో అనవసర రాద్ధాంతం చేయడం, సహ ఉద్యోగులకు ఇబ్బందులు సృష్టించారన్న అభియోగంపై ముగ్గురు గ్రామ సర్వేయర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లా సర్వే, భూమి రికార్డుల అధికారి (డీఎస్‌ఎల్‌ఏ) రూపా నాయక్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. తాఖీదులు పొందిన వారిలో శ్రీసత్యసాయి జిల్లా అమడగూరు మండలం జౌకుల కొత్తపల్లి గ్రామ సర్వేయర్ ఎం.మహేశ్ నాయుడు, అగళి మండలం అగళి సచివాలయ సర్వేయర్ యు.తిప్పేస్వామి, అనంత జిల్లా గుత్తి మండలం కరడికొండకు చెందిన ఎస్.రవికుమార్ ఉన్నారు. ఈ ముగ్గురూ కౌన్సెలింగ్ రోజున తరచూ గొడవలు చేయడమే కాదు.. అరుపులు, కేకలతో కౌన్సెలింగ్‌కు అంతరాయం కలిగించారని నోటీసులో పేర్కొన్నారు. వీరి మూలంగా చంటి బిడ్డలతో హాజరైన మహిళలు ఇబ్బంది పడ్డారు. ఆ రోజు రాత్రంతా కౌన్సెలింగ్ జరగడానికి వారే కారణమని చెప్పారు. ఏవైనా సమస్యలు, అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా తెలపాలని సూచించినా పెడచెవిన పెట్టారని తెలిపారు.

పంచాయతీరాజ్‌శాఖ ఇన్‌ఛార్జి ఎస్‌ఈగా ప్రభాకర్‌రెడ్డి

లక్ష్మీనగర్ (అనంతపురం),న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా పంచాయతీరాజ్‌శాఖ ఇన్‌ఛార్జి ఎస్‌ఈగా ప్రభాకర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. అనంతపురం పీఆర్‌ఐ డివిజన్ ఈఈగా పనిచేస్తున్న ఆయనకు ఇన్‌ఛార్జి ఎస్‌ఈగా నియమించారు. ఇక్కడ ఎస్‌ఈగా పనిచేస్తున్న జహీర్ అస్లాం ఈ నెల 30న పదవీ విరమణ పొందారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎస్‌ఈని డీఈలు లక్ష్మీనారాయణ, రవీంద్రతో పాటు అధికారులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. పీఐయూ ఇన్‌ఛార్జి ఈఈగా పనిచేస్తున్న ప్రభాకర్‌రెడ్డిని తప్పించి ఆయన స్థానంలో చిత్తూరు జిల్లాలో డీఈగా పనిచేస్తున్న నవీన్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ఆశాఖ ఈఎన్‌సీ బాలునాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.

భారీ స్కోరు దిశగా చిత్తూరు జట్టు

125 పరుగులకే కుప్పకూలిన కడప

శతకం చేసిన శశాంక్ సూర్యచరణ్ (5 వికెట్లు)

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: సౌత్‌జోన్ అంతర్ జిల్లా మూడు రోజుల క్రికెట్ రెండో రౌండు పోటీల్లో చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో భారీస్కోరు దిశగా పయనిస్తోంది. తొలిరోజు బుధవారం ఆటముగిసే సమయానికి ఆ జట్టు కడప జట్టుపై 33 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 194 పరుగులు చేసింది. బ్యాటర్లు శశాంక్ (104), సీఆర్ జ్ఞానేశ్వర్ (89) అద్భుత బ్యాటింగ్‌తో అజేయంగా నిలిచారు. అంతకుముందు ఉదయం టాస్ గెలిచి మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేపట్టిన కడప జట్టు 38.4 ఓవర్లలో 125 పరుగులకే కుప్పకూలింది. ధ్రువకుమార్ (35), జయవర్ధన్ (24)లు తప్ప మిగతా బ్యాటర్లు పేలవంగా ఆడారు. చిత్తూరు బౌలరు దీప్ సాయినాథ్ 5 వికెట్లు కూల్చి కడప జట్టు పతనాన్ని శాసించాడు. మరో పోటీలో కర్నూలు జట్టు నెల్లూరు జట్టుపై మొదటి ఇన్నింగ్స్‌లో 70 ఓవర్లలో 8 వికెట్లకు 208 పరుగులు చేసింది. వి.సంజయ్ నాయుడు (85), సూర్యతేజ (61) బ్యాటింగ్‌లో రాణించారు. గురువారం ఈ రెండు పోటీలు ఎలా మలుపు తిరుగుతాయో వేచిచూడాల్సిందే!

జూన్‌లో రూ.92 కోట్ల జీఎస్టీ వసూలు

అరవిందనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: ఈ ఆర్థిక సంవత్సరం జూన్‌లో రూ.92 కోట్లు జీఎస్టీ వసూలైంది. 70 శాతం వృద్ధి నమోదుతో ఉమ్మడి అనంతపురం జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. 2024లో ఇదే నెలలో వసూళ్ల (రూ.54 కోట్లు) కంటే ఇది రూ.38 కోట్లు ఎక్కువ. అదే సమయంలో ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక నికర జీఎస్టీ వసూళ్లతో ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. గతేడాది తొలి త్రైమాసిక పన్ను వసూళ్లు రూ.307 కోట్లు కాగా గత ఆర్థిక సంవత్సరంలో తొలి 3 నెలల్లో వసూళ్లు రూ. 261 కోట్లు.

కడుపులో ఆరు కిలోల గడ్డ తొలగింపు

సర్వజన వైద్యశాలలో మహిళకు అరుదైన శస్త్రచికిత్స

లక్ష్మితో శస్త్రచికిత్స చేసిన గైనకాలజీ వైద్యుల బృందం

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: నగరంలో ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గైనకాలజీ విభాగంలో వైద్య సేవలు పొందేందుకు చేరిన లక్ష్మి అనే మహిళకు వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. ఈ మేరకు గుత్తికి చెందిన లక్ష్మి (44) కడుపులో గడ్డ పెరుగుతుండటంతో తీవ్ర ఆయాసంతో ఇబ్బంది పడుతుండటంతో ఆమె కుమార్తెలు చికిత్స చేయించేందుకు గత నెల 23న తీసుకువచ్చి గైనకాలజీ ఓపీలో వైద్యులకు చూపించారు. ఆమెను పరిశీలించిన వైద్యులు స్కానింగ్, రక్త పరీక్షలు చేయించి. . కడుపులో 6 కిలోల గడ్డ ఉన్నట్లు గుర్తించారు. ఆమెకు హిమోగ్లోబిన్ కేవలం నాలుగు శాతం ఉండటంతో మొదటగా నాలుగు యూనిట్లు రక్తం ఎక్కించారు. అనంతరం ఆమెకు బుధవారం ఆపరేషన్ థియేటర్‌లో గైనకాలజీ హెచ్‌వోడీ షంషాద్ బేగం పర్యవేక్షణలో వైద్యులు నిస్సార్ బేగం, సౌజన్యలతో పీజీలు ఊర్మిల, రమణిలు శస్త్రచికిత్స చేసి గడ్డను తొలగించారు. ప్రస్తుతం లక్ష్మి ఐసీయూలో ఉందని ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.

బ్యాంకు ఖాతాలో నగదు మాయంపై ఫిర్యాదు

యాడికి, న్యూస్‌టుడే : ఓ మహిళ బ్యాంకు ఖాతాలో నగదు మాయం అయిన ఘటన యాడికిలో బుధవారం వెలుగుచూసింది. యాడికిలోని అంత్రాలవీధిలో వడ్డే జయమ్మ నివాసం ఉంటున్నారు. వైకాపా ప్రభుత్వంలో సచివాలయ పరిధిలో వాలంటీర్లు పింఛన్లు పంచేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వాలంటీర్ల వ్యవస్థే లేకుండా పోయింది. అప్పటి నుంచి సచివాలయ ఉద్యోగులే పింఛన్లు పంపిణీ చేస్తూ వచ్చారు. ఇటీవల పింఛన్ పంపిణీ సమయంలో పలు చోట్ల మాజీ వాలంటీర్ల సేవలను సచివాలయం ఉద్యోగులు వినియోగించుకుంటున్నారు. దీంతో వడ్డే జయమ్మకు పింఛన్ ఇచ్చేటప్పుడు యాడికి సచివాలయంలోని ఓ కార్యదర్శి మాజీ వాలంటీరును తన వెంట తీసుకెళ్లాడు. ఈక్రమంలో మాజీ వాలంటీరు పింఛను లబ్ధిదారురాలు జయమ్మ ఇంటి వద్దకు వెళ్లి జనాభా లెక్కలు అంటూ ఆధార్ తీసుకుని డివైజ్ ద్వారా వేలిముద్రను వేయించుకున్నాడు. ఆ తర్వాత ఆమె ఖాతాలోని రూ.10 వేలు ఉపసంహరించినట్లు చరవాణికి సంక్షిప్త సమాచారం వచ్చింది. అనుమానంతో వాలంటీరు చరవాణికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో అసలు విషయం తెలియాల్సి ఉంది.

450 అరటి మొక్కల నరికివేత

నరికివేసిన అరటి మొక్కల వద్ద రైతు

తాడిపత్రి, న్యూస్‌టుడే : కొండపల్లి గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ పొలంలో అరటి మొక్కలను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. విజయ్‌కుమార్ కిష్టిపాడు సమీపంలో కొంతపొలాన్ని కౌలుకు తీసుకుని అరటి పంటను సాగు చేశారు. తనపై కక్ష పెంచుకున్న కొందరు 450 మొక్కలు నరికివేసినట్లు బాధితుడు వాపోయారు. గ్రామంలో తనపై ఎవరికీ కక్షసాధింపు లేదని, తనను ఆర్థికంగా దెబ్బతీయాలనే ఎవరో ఇలా చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రైలు కిందపడి ఒకరి బలవన్మరణం

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి జీఆర్పీ స్టేషన్ పరిధిలోని గుంతకల్లు మండలంలోని తిమ్మాపురం వద్ద బుధవారం ఉదయం గుర్తు తెలియని ఓ వ్యక్తి(50) బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి వివరాలు తెలియరాలేదని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పంచనామా నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అప్పులు తీర్చే మార్గం కానరాక..

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణం కక్కలపల్లి కాలనీకి చెందిన బండి నాగార్జున (32) ఆర్థిక ఇబ్బందులతో బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతడు గొర్రెల వ్యాపారంతో పాటు కాపరిగా ఉండేవాడు. వ్యాపారం నిమిత్తం ప్రైవేటు వ్యక్తుల వద్ద రూ.15 లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో చెట్టుకు ఉరి బిగించుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని భార్య చందన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదని భార్యపై భర్త దాడి

ఆపై ఉరి వేసుకొని ఆత్మహత్య

ధర్మవరం, న్యూస్‌టుడే: మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదని భార్యపై భర్త దాడి చేశాడు. ఆపై ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ధర్మవరంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. ధర్మవరం ప్రియాంకనగర్‌కు చెందిన లింగారెడ్డి (45), లక్ష్మీదేవి దంపతులు మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నారు. మద్యానికి బానిస అయిన అతడు బుధవారం భార్యను డబ్బు అడిగాడు. తన వద్ద లేవని చెప్పడంతో మగ్గం కర్ర తీసుకొని భార్యపై దాడి చేశాడు. స్థానికుల సమాచారం మేరకు కుమారుడు సాయినాథ్ రెడ్డి గాయపడిన లక్ష్మీదేవిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. లింగారెడ్డి ఇంట్లోకి వెళ్లి చీరతో ఉరి బిగించి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు లింగారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రాయదుర్గం
•రాయదుర్గం •కళ్యాణదుర్గం •ఉరవకొండ

పాడి రైతులకు దాణా పంపిణీ

డి.హీరేహాళ్, బెళుగుప్ప: కాదలూరులో తెదేపా మండల కన్వీనర్ పాటిల్ మోహన్‌రెడ్డి, పశువైద్యాధికారి అమరేషప్ప బుధవారం రైతులకు పశువులత దాణా పంపిణీ చేశారు. ● పశువైద్యాధికారి మంజునాథ్ 50 క్వింటాళ్ల రాయితీ దాణా బెళుగుప్పలో సరఫరా చేశారు.

వాహనాలు తుక్కు చేస్తున్న దొంగల అరెస్టు

డి.హీరేహాళ్: ఓబుళాపురం మైనింగ్ కంపెనీ పరిధిలో వివాదాస్పదంగా మారి గతంలో సీబీఐ సీజ్ చేసిన హిటాచి యంత్రాన్ని తుక్కుగా మారుస్తున్న ఏడుగురిని బుధవారం పోలీసులు పట్టుకున్నట్లు తెలిసింది. గతంలో ఈ ప్రాంతాల్లో కొన్ని యంత్రాల చోరీ ఘటనల్లో వీరిపై కేసులు నమోదయ్యాయి. ఎస్సై గురుప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కేసు విచారణలో ఉందని, వివరాలు త్వరలో వెల్లడిస్తామన్నారు.

సీత్లాభవానికి ప్రత్యేక పూజలు

వజ్రకరూరు(ఉరవకొండ), న్యూస్‌టుడే: వర్షాలు కురిసి.. పంటలు పండాలని కోరుతూ వజ్రకరూరు మండలం రూపానాయక్‌తండాలో గిరిజనులు సీత్లాభవాని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు సంప్రదాయ దుస్తులు ధరించి ప్రదర్శనలో పాల్గొనడం ఆకర్షణగా నిలిచింది. బుధవారం ఉదయం అమ్మవారికి మంగళహారతి ఇచ్చారు. సుబ్రహ్మణ్యం నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నైవేద్యాలతో ప్రదర్శనగా వస్తున్న భక్తులు

మేమున్నాం.. మీకు తోడుగా

రాయదుర్గం పట్టణం: 9666888046
కళ్యాణదుర్గం గ్రామీణం: 9985668661
ఉరవకొండ: 8008573071

సమస్య: జయనగర్ కాలనీ ఎస్ఆర్‌పీ వాటర్ ప్లాంట్ వీధిలో వర్షం నీళ్లు నిలుస్తున్నాయి. మట్టిని వేసి తగు చర్యలు తీసుకోవాలి. **-నాగరాజు, విశ్రాంత ఉద్యోగ.**
పరిష్కారం: సమస్య మా దృష్టికి వచ్చింది. తాత్కాలికంగా తగు చర్యలు తీసుకుంటాం. కాలువ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు పంపాం. **-అలీఖాన్, మున్సిపల్ పారిశుద్ధ్య అధికారి.**
సమస్య: మండలంలోని కదరంపల్లిలో వీధి దీపాలు వెలగడం లేదు. చర్యలు తీసుకోవాలి. **- మారెప్ప, కదరంపలి.**
సమాధానం: వీధి దీపాలు సక్రమంగా వెలిగేలా ఏర్పాట్లు చేయిస్తాం. **-ఓబుళపతి, కార్యదర్శి, మహంతపురం.**
సమస్య: కుందుర్పి దిగువనున్న పీర్లచావిడి వద్ద మురుగు రోడ్డుపై పారడంతో అపరిశుభ్రత నెలకొంది. **-తిప్పేస్వామి, కుందుర్పి.**
సమాధానం: మురుగు శుభ్రం చేయించేందుకు చర్యలు తీసుకుంటాం. **-లక్ష్మీశంకర్, ఎంపీడీఓ కుందుర్పి**
సమస్య: కుందుర్పి మండలం అపిలేపల్లిలో శ్రీరామిరెడ్డి తాగునీటి ట్యాంకు వద్ద పొదలతో అపరిశుభ్రత నెలకొంది. **-రామాంజనేయులు, అపిలేపల్లి.**
సమాధానం: త్వరలో శుభ్రం చేయిస్తాం. **-ఆనందరావు, కార్యదర్శి, అపిలేపల్లి.**
-న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం, కుందుర్పి

ఏం కొనాలన్నా.. కష్టమే!

☛ పెరుగుతున్న ధరలతో ప్రజల ఆందోళన

న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం: రోజురోజుకు పెరుగుతున్న కూరగాయల ధరలు సామాన్యులను భయపెడుతున్నాయి. పది రోజుల్లోనే ధరలు అమాంతం పెరగడంతో కొనేందుకు ప్రజలు జంకుతున్నారు. గతంలో వర్షాలు పడటం, ఇటీవల ఎండలు ఎక్కువ కావడంతో కూరగాయల దిగుబడులు తగ్గిపోయాయి. ఇతర ప్రాంతాల నుంచి వీటిని దిగుమతి చేసుకోవడంతో ధరలు పెరిగినట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. నియోజకవర్గంలో సుమారు 100 హెక్టార్లలో కూరగాయల పంటలు సాగు చేస్తున్నట్లు ఉద్యాన శాఖ అధికారులు చెబుతున్నారు.

కూలీల ఇక్కట్లు

గ్రామాల్లో పనులు లేకపోవడంతో సమీప పట్టణాలకు వందలాది సంఖ్యలో ప్రజలు వలసొచ్చి వివిధ పనుల్లో నిమగ్నమయ్యారు. వీరితోపాటు అత్తెసరు పనులతో ఆర్థికంగా ఇబ్బందులు పడేవారిపై పెరిగిన నిత్యావసరాల ధరల ప్రభావం ఎక్కువగా ఉంటుంది. వీటికితోడు వాతావరణ ప్రభావంతో కూరగాయల ధరలు సైతం పెరగడంతో వారిపై మరింత భారం పెరగనుంది. రూ.500లతో కూరగాయలు కొంటే చేతి సంచి నిండటం లేదని స్థానికుడైన మంజునాథ వాపోయారు. ధరలు పెరగడంతో సరకులో సగం కూడా అమ్ముడుపోవడం లేదని, మరుసటి రోజుకు అవి పాడవటంతో నష్టాలు చవిచూస్తున్నామని వ్యాపారి హుస్సేన్ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కూరగాయల రకాలు	(కిలో రూలలో) 10 రోజుల కిందట	ప్రస్తుతం ధరలు
వంకాయలు	40	70
టమాటా	20	30
పచ్చిమిర్చి	40	60
క్యారెట్	50	80
బీట్‌రూట్	40	60
బీర	30	50
బెండ	30	50
ముల్లంగి	30	50

కూటమితోనే అందరి సంక్షేమం: కాలవ

ఇంటింటి ప్రచారంలో ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం ఊహకు అందని సంక్షేమ పథకాలు అందించిందని ప్రభుత్వ ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం కేపీకుంటలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని లబ్ధిదారుల వివరాలను తెలుసుకున్నారు. భవిష్యత్తులో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చి ప్రజల మద్దతు కూడగట్టుకోవడమే ప్రధాన ధ్యేయమన్నారు. కార్యక్రమంలో తెదేపా కన్వీనర్ గిరిమల్లప్ప, క్లస్టర్ ఇన్‌ఛార్జి కాలవ సన్నన్న, నాగరాజు, కేపీకుంట రాముడు, సంజీవ, రాజు, సదాశివ, ఈరణ్ణ, దడ్డయ్య, వడ్డెర్ల సంఘం నాయకులు పాల్గొన్నారు.

ఏడాదిలోపే సూపర్ సిక్స్ పథకాల అమలు

శెట్టూరు, కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 'సూపర్ సిక్స్ పథకాలు' అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే దక్కుతుందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు, అబ్జర్వర్ నాగేశ్వర్‌రావు పేర్కొన్నారు. శెట్టూరు మండలం పెరుగుపాళ్యం, ములకలేడు, తిప్పనపల్లి గ్రామాల్లో బుధవారం చేపట్టిన 'ఇంటింటికీ తెదేపా' కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఈ నెలలోనే రైతులకు 'అన్నదాత సుఖీభవ పథకం' ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. గ్రామాల్లో విద్యుత్తు, తాగునీరు, ఇతర సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తేగా అక్కడే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. సొంత నిధులతో ఏర్పాటు చేసిన శుద్ధజలం ప్లాంటును ఆయన ప్రారంభించారు. పెరుగుపాళ్యంలో ఒక దివ్యాంగుడికి, కళ్యాణదుర్గం పట్టణానికి చెందిన మహిళ బాను కుమార్తె వైద్యానికి రూ.10 వేలు నగదును అందజేసి ధైర్యం చెప్పారు. ఎమ్మెల్యే ఆదేశాలతో సర్పంచి కుమార్ శెట్టూరు ఆదర్శ పాఠశాలలో తాగునీటి సమస్య పరిష్కరించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక పంచాయతీలకు నిధులు ఇవ్వడంతో సర్పంచులకు గౌరవం పెరిగిందని ములకలేడు సర్పంచి లక్ష్మీదేవి భర్త నాగరాజు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెదేపా కార్యనిర్వాహక కార్యదర్శి కరణం రామ్మోహన్ చౌదరి, నాయకులు మల్లికార్జున, అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

శుద్ధజలం ప్లాంటును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సురేంద్రబాబు

ఎస్సీ, ఎస్టీల సమస్యలకు తక్షణ పరిష్కారం

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీలకు సంబంధించిన కేసులు, ఇతర సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తామని ఆర్డీవో వసంతబాబు, డీఎస్పీ రవిబాబు తెలిపారు. బుధవారం ఆర్డీవో కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ డివిజనల్ స్థాయి విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. ఇప్పటివరకు నమోదైన 43 ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో బాధితులకు రూ.38 లక్షలు ఇప్పించామన్నారు. ఇళ్ల స్థలాల గురించి కమిటీ సభ్యులు తమ దృష్టికి తెచ్చారని, ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకుంటే మంజూరు చేయిస్తామన్నారు. అన్ని మండలాల్లోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నీటి సమస్యను పరిష్కరించాలని ఎంపీడీవోలను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆర్డీవో వసంతబాబు, అధికారులు

ఏపీవోగా లక్ష్మీకాంతబాయి బాధ్యతల స్వీకరణ

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండల ఉపాధి హామీ ఏపీవోగా బుధవారం లక్ష్మీకాంతబాయి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఏపీవో భాగ్యలక్ష్మి శింగనమలకు బదిలీపై వెళ్లారు. ప్రతి కూలీకి పని కల్పించి, ఉపాధి హామీ పనులు వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకుంటానని ఆమె చెప్పారు.

ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ కన్వీనర్‌గా సోము

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఎమ్మార్పీఎస్ ఉరవకొండ నియోజకవర్గ కన్వీనర్‌గా మండలంలోని రాయంపల్లికి చెందిన ఎగ్గిడి సోము ఎంపికయ్యారు. సంఘాన్ని బలోపేతం చేయడానికి అందరి సహకారంతో ముందుకెళ్తున్నట్లు ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో కార్మికుడికి గాయాలు

ఉరవకొండ: విద్యుదాఘాతంతో వై.రాంపురానికి చెందిన ప్రైవేటు విద్యుత్తు కార్మికుడు శ్రీరాములు తీవ్రంగా గాయపడిన ఘటన ఉరవకొండ మండలంలో బుధవారం చోటుచేసుకుంది. స్థానికులు ఆయనను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

కౌలు వేలం ఆదాయం రూ.8.11,500

కణేకల్లు: మాల్యం గ్రామ కల్లేశ్వర, బసవేశ్వర స్వామి ఆలయాలకు సంబంధించి భూములకు నిర్వహించిన వేలం పాటలో కౌలు ద్వారా రూ.8,11,500 ఆదాయం వచ్చినట్లు దేవాదాయ ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్, ఈవో దేవదాసు బుధవారం పేర్కొన్నారు.

పరిశ్రమ పనులు నిలిపివేయాలని వినతి

డి.హీరేహాళ్: ఓబుళాపురం సమీపంలోని నిర్మాణ చేస్తున్న ఓ కెమికల్ పరిశ్రమల అనుమతులు వెంటనే నిలిపవేయాలని డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌బాబు, ఎస్సై గురుప్రసాద్‌రెడ్డిలకు స్థానికులు బుధవారం వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ పాటిల్ మోహన్‌రెడ్డి, ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్లి రాజు, ఓబుళాపురం తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షులు తాయప్ప పాల్గొన్నారు.

వసతుల మెరుగుకు చొరవ

ఉరవకొండ: కాలనీల్లో మౌలిక వసతుల మెరుగుకు చొరవ చూపుతున్నట్లు సర్పంచి లలితమ్మ, కార్యదర్శి గౌస్‌సాహెబ్ పేర్కొన్నారు. బుధవారం పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో వారు మాట్లాడారు. కాలనీల్లో తాగునీటి సమస్య ఉందని పలువురు అధికారుల దృష్టికి తేగా.. ఆ దిశగా చర్యలు తీసుకుంటామని తెలిపారు

మార్కెట్ యార్డులో వసతులకు చర్యలు

రాయదుర్గం, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, యార్డు ఛైర్మన్ హనుమంతరెడ్డిల ఆదేశాలతో రాయదుర్గం వ్యవసాయ మార్కెట్ యార్డులో సౌకర్యాల కల్పనకు అధికారులు చర్యలు తీసుకున్నారు. కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో బుధవారం ఆ శాఖ డీఈ రఘునాథరెడ్డి, ఏఈలు కణేకల్లు రోడ్డు వైపు పది వ్యాపార దుకాణాల నిర్మాణం, రైతుల విశ్రాంతి భవనం, ఓవర్ హెడ్ ట్యాంకు ద్వారా తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్ల నిర్మాణాలకు కొలతలు తీసి ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

వేతనాలు చెల్లించాలని జిల్లా కేంద్రానికి...

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ఏళ్లుగా శ్రీరామిరెడ్డి నీటి పథకంలో కార్మికులుగా పనిచేస్తున్నా.. జీతాలు ఇవ్వడంలో ప్రభుత్వం, అధికారులు, గుత్తేదారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు ఆరోపించారు. కార్మికులు సమ్మె చేపట్టి 85 రోజులు కావస్తున్నా.. ఎలాంటి స్పందన లేకపోవడంతో బుధవారం కళ్యాణదుర్గంలోని అంబేడ్కర్ విగ్రహం నుంచి జిల్లా కేంద్రానికి పాదయాత్ర ప్రారంభించినట్లు ఆయన పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేపడతామన్నారు. పాదయాత్రకు పలు పార్టీలు, సంఘాల నాయకులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రామాంజనేయులు, మండల అధ్యక్షుడు రంగనాథ్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి హనుమంతరాయుడు, కార్మికులు పాల్గొన్నారు.

పాదయాత్ర ప్రారంభిస్తున్న ఓబులు, పాల్గొన్న కార్మికులు

ఆన్‌లైన్‌లోనే ఉద్యాన పంటల ఎగుమతులు

అనంతపురం (వ్యవసాయం): జిల్లా ఉద్యాన పంటలకు ప్రసిద్ధి. పంట ఉత్పత్తుల నాణ్యతగా ఉండడంతో ఇతర దేశాల్లో డిమాండ్, మంచి ధరలు లభిస్తున్నాయని ఉద్యానశాఖ సహాయ సంచాలకులు దేవానంద తెలిపారు. సాంకేతిక సాయంతో ఆన్‌లైన్‌లో పంట ఉత్పత్తులు విక్రయిస్తున్నారన్నారు. వ్యవసాయ, ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి అథారిటీ, జిల్లా ఉద్యానశాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ప్రాంతీయ ఉద్యాన శిక్షణ కేంద్రంలో ఉద్యాన పంటల ఎగుమతులపై రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీహెచ్ దేవానంద మాట్లాడుతూ.. ఉద్యాన మిషన్ ద్వారా కోత, అనంతరం యాజమాన్య పద్ధతులు ఆచరించేందుకు రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్యాక్‌హౌస్‌లు, కలెక్షన్ సెంటర్లు, సోలార్ శీతల గదులు, సోలార్ డ్రయర్లు 50 శాతం రాయితీతో అందిస్తున్నామన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో కళ్యాణదుర్గం మండలం బోరంపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణతోపాటు ఉపాధి అవకాశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ శ్రీధర్ కుమార్, నైపుణ్యాభివృద్ధి సంస్థ జిల్లా అధికారి వెంకటప్రతాప్ రెడ్డి బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 5 లోగా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో దరఖాస్తులు సమర్పించాలని కోరారు. మరిన్ని వివరాలకు 94406 61900, 90109 65230 చరవాణి నంబర్లను సంప్రదించాలన్నారు.

'బదిలీల్లో అన్యాయం జరిగితే ఊరుకోం'

అనంత నగరపాలక, న్యూస్‌టుడే : సచివాలయాల్లో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీలకు బదిలీల్లో అన్యాయం చేస్తే ఊరుకోబోమని ఎమ్మార్పీఎస్ నాయకుడు దాస్ పేర్కొన్నారు. బుధవారం ప్రజారోగ్య విభాగం ఎస్ఈతో ఆయన వాగ్వాదానికి దిగారు. ఎస్సీలకు జరిగిన అన్యాయంపై ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఉద్యోగులు కోరుకున్న విధంగా బదిలీలు చేయకుంటే కలెక్టరు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

శెట్టూరు, న్యూస్‌టుడే: శెట్టూరు మండలం చెర్లోపల్లి ఉన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులు హెచ్.ఎం శిరీష, ఉపాధ్యాయులు తలారి క్రిష్ణ, పాపావలి, హరికృష్ణ, రాధాదేవిలను బుధవారం సన్మానించి వీడ్కోలు తెలిపారు. హెచ్.ఎం బాస్కర్, ఉపాధ్యాయులు వారి సేవలు కొనియాడారు. ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు బొమ్మయ్య, మురళి, ఈరన్న, బద్రి, చారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బద్దెనాయక్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొనాపురం(బ్రహ్మసముద్రం): కొనాపురం ఉన్నత పాఠశాలలో బదిలీ ఉపాధ్యాయులైన ఈశ్వరయ్య, నారాయణ, వెంకటేశులు, తిమ్మయ్యలను హెచ్ఎం మల్లికార్జున, తెదేపా నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు మల్లికార్జున, నలమల్ల, తిప్పేస్వామి, అక్కన్న, చంద్రశేఖర్, వీరపాక్షి, కృష్ణమూర్తి, పాల్గొన్నారు.

ఏడాదిగా హామీల అమలు శూన్యం: వైకాపా

ఉరవకొండ: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచినా హామీలు అమలు కాలేదని వైకాపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సతీశ్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణంలోని వీరశైవ కళ్యాణ మందిరంలో ఏర్పాటు చేసిన పార్టీ అనుబంధ కమిటీల అభినందన, నియామక పత్రాల అందించే కార్యక్రమంలో వారు మాట్లాడారు.

సీసీ దారులు నిర్మించరూ...

రాయదుర్గం పట్టణంలోని చర్చి ఏరియాలో జూనియర్ కళాశాల వైపు నుంచి స్టేషన్ దారి గుంతలు పడి అధ్వానంగా మారింది. అధికారులు వీటిలో మట్టి వేసి చదును చేసి చేతులు దులుపుకున్నారు. మున్సిపల్ కమిషనర్‌ను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా కాలనీల్లో వసతుల కల్పనకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

- న్యూస్‌టుడే, రాయదుర్గం పట్టణం

వీధుల్లో అంధకారం!

ఉరవకొండలోని పలు ప్రాంతాల్లో వీధి దీపాలు ఏర్పాటు చేయకపోవడంతో అంధకారం నెలకొంది. వీరశైవనగర్‌లో నిత్యం ప్రత్యేక తరగతులకు వెళ్లే విద్యార్థులు రాత్రిపూట ఇబ్బందులు పడుతున్నారు. పంచాయతీ కార్యదర్శి గౌస్‌సాహెబ్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ వీధి దీపాలు ఏర్పాటు చేయిస్తామన్నారు.

-న్యూస్‌టుడే, ఉరవకొండ

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తుల స్వీకరణ

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఆ ఆర్థిక సంవత్సరంలో పండ్లతోటల పెంపకానికి సంబంధించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ దివాకర్ తెలిపారు. ఐదు ఎకరాలు లోపు ఉన్న రైతులు ఈ నెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మామిడి, జామ, చీని, నిమ్మ, సపోటా, దానిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్ 0.5 ఎకరాకు మాత్రమే ఇస్తామన్నారు. మునగ, కొబ్బరి, యాపిల్ బేర్, నేరేడు, సీతాఫలం, చింత, మల్లె, గులాబీ 0.25 నుంచి ఎకరా వరకు పెంపకానికి మొక్కలు అందజేస్తామన్నారు. దరఖాస్తులు గ్రామ క్షేత్ర సహాయకులు లేదా మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

సమాచార లోపం.. ఖాతాదారులకు శాపం

రాయదుర్గం పట్టణం, న్యూస్‌టుడే: రాయదుర్గం పట్టణంలోని మొలకాల్మూరు రోడ్డులోని యూనియన్ బ్యాంకు(ఆంధ్రా బ్యాంకు) సేవలకు రెండు రోజులుగా నిలిచిపోవడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయ రుణాల నవీకరణ, నగదు విత్‌డ్రా, జమ చేసేందుకు వచ్చిన వారు బ్యాంకు ఎదుట పడిగాపులు పడాల్సి వచ్చింది. బుధవారం ఆధార్ కార్డు నవీకరణ, ఇతర కార్యకలాపాలు గేటువేసి నిర్వహించడంతో వృద్ధులు తీవ్ర అవస్థలు పడ్డారు. బ్యాంకు లోపలికి అనుమతించకపోవడంతో మహిళా సంఘ సభ్యులు, ప్రజలు ఆరుబయటే ఎదురు చూశారు. సాంకేతిక సమస్య ఉంటే నోటీసు బోర్డు పెట్టాల్సిందని పలువురు ప్రశ్నించారు. బ్యాంకు మేనేజర్ సిద్దార్థ్ 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ గురువారానికి సేవలను అందుబాటులోకి వస్తాయన్నారు.

బ్యాంకు ఎదుట నిరీక్షిస్తున్న ఖాతాదారులు

భక్తిశ్రద్ధలతో పీర్ల ప్రతిష్ఠ

ఎన్.హనుమాపురంలో కొలువుదీరిన లాలుస్వామి పీర్లు

కణేకల్లు, బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో బుధవారం పీర్ల సంబురాలు ప్రారంభమయ్యాయి. ఎన్.హనుమాపురంలో ప్రత్యేకంగా అలంకరించిన లాలు స్వామి పీర్లు కొలువుదీర్చి చక్కెర చదివింపులు చేసి ప్రార్థనలు గావించారు. బ్రహ్మసముద్రం, మాల్యం, యర్రగుంట గ్రామాల్లోనూ పీర్లు కొలువుదీర్చారు.
● ఉద్దేహాళ్, ఉంతకల్లు, బొమ్మనహాళ్, కురువళ్లి, గోవిందవాడ, దర్గా హొన్నూరు, కల్లుహోళ, గోనేహాళ్, శ్రీధరగట్ట, తదితర గ్రామాల్లో పీర్లను ప్రతిష్ఠించారు.

జూదరుల అరెస్టు

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: చంద్రగిరికి చెందిన 8 మంది జూదరులను బుధవారం అరెస్టుచేసి రూ.7,200 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై నబీరసూల్ తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రాయదుర్గం కోర్టులో హాజరు పర్చనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

తెదేపా మండల కన్వీనర్‌కు సన్మానం

డి.హీరేహాళ్: డి.హీరేహాళ్ మండల తెదేపా మండల కన్వీనర్‌గా ఎంపికైన కాదలూరు పాటిల్ మోహన్‌రెడ్డిని ఆ పార్టీ నాయకులు బుధవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ వెంకటేశులు, నల్లయ్య, బసవరాజు, నాగ, మారన్న, రామకృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలకు తాళాలు వేసి నిరసన

ఆందోళన చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

డి.హీరేహాళ్, న్యూస్‌టుడే: మలపనగుడి ప్రాథమిక పాఠశాలలో 103 మంది విద్యార్థులకు ఒకే టీచర్ ఉన్నారని.. ఇలా అయితే విద్యార్థులకు చదువు ఎలా వస్తుందని తల్లిదండ్రులు బుధవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలకు తాళాలు వేసి నిరసన తెలిపారు. పలుమార్లు ఈ విషయాన్ని ఎంఈవో దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదన్నారు. కార్యక్రమంలో సర్పంచి రుద్రేష్, స్కూల్ కమిటీ ఛైర్మన్ ఉమేష్, దురుగన్న పాల్గొన్నారు.

అండేపల్లిలో తీరిన నీటి ఇక్కట్లు

కంబదూరు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని అండేపల్లి గ్రామంలో నీటి ఎద్దడి తీవ్రంగా ఉండటంతో మండల ప్రజా పరిషత్ నిధులతో బుధవారం బోరుబావి తవ్వించారు. నీరు పుష్కలంగా లభించడంతో గ్రామస్థులు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామస్థుల దాహార్తిని తీర్చడానికి కృషి చేసిన ఎంపీపీ తనయుడు భీమేష్‌కు ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంబడి వైకాపా మండల నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.



(c) eenadu

‘పెద్దారెడ్డి అరాచకాలు కనిపించలేదా?’

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రిలో పెద్దారెడ్డి తన అధికారాన్ని అడ్డం పెట్టుకుని ఎన్నో అరాచకాలు చేశారని, అప్పుడు వైకాపా నాయకులకు అవి కానపడలేదా? అని జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు జగన్నాథ్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన సామాజిక మాధ్యమాలతో మాట్లాడుతూ ప్రస్తుతం పెద్దారెడ్డిని తాడిపత్రిలోకి రానివ్వకుంటే ఆటవిక రాజ్యం నడుస్తోందని వైకాపా నాయకులు అనడం సరికాదన్నారు. వైకాపా అధికారంలోకి రాగానే జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంట్లోకి దౌర్జన్యంగా వెళ్లడం, డీఎస్పీని అడ్డుపెట్టుకుని అనేక అక్రమాలకు పాల్పడటం, అక్రమ కేసులు, మహిళలపై హత్యాయత్నం వంటి కేసులు పెట్టి జైలుకు పంపించిన విషయాన్ని గుర్తు చేసుకోవాలన్నారు.

గుంతకల్లు

•గుంతకల్లు •శింగనమల •తాడిపత్రి

నదిలో ఇసుక తోడితే కఠినచర్యలు

శింగనమల, న్యూస్‌టుడే : ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే వాహనాల జప్తుతో పాటు వ్యక్తుల పైనా కేసులు నమోదు చేస్తామని సీఐ కౌలుట్లయ్య హెచ్చరించారు. ఇసుక వ్యాపారం కోసం టిప్పర్లు, జేసీబీలు వినియోగిస్తే వాటిపై కేసులు నమోదు చేసి న్యాయస్థానం ఎదుట ఉంచుతామన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఇసుక తవ్వరాదన్నారు. పెన్నా నది ప్రాంతంలో ఇసుక తవ్వకాలు చేయకూడదన్నారు. రైతులు ఎక్కడికక్కడ అడ్డుకొని సమాచారం ఇవ్వాలన్నారు. ఇసుక తవ్వకాల గురించి సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ప్రజలు పోలీసులకు సహకారం అందించాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య : గుంతకల్లులోని భాగ్యనగర్‌లో ఎస్‌జేపీ ఉన్నత పాఠశాలకు వెళ్లే రోడ్డులో రెండు చోట్ల పైపులైన్ లీకేజీల ఏర్పడి తాగునీరు వృథా అవుతోంది. - **ప్రసాద్**

సమాధానం : పైపులైన్‌కు మరమ్మతుల చేయించడానికి చర్యలు తీసుకుంటాం.
- నాయిమ్ అహ్మద్, కమిషనర్, గుంతకల్లు పురపాలక సంఘం

– న్యూస్‌టుడే గుంతకల్లు పట్టణం

సమస్య : శింగనమల మండలం బండమీదపల్లి గ్రామంలో తాగునీటి సమస్య ఉంది.
- చంద్రశేఖర్, బండమీదపల్లి

సమాధానం : త్వరలోనే సమస్య పరిష్కరిస్తాం. **- భాస్కర్, ఎమ్పీడీవో, శింగనమల**

సమస్య : శింగనమల మండలం ఇరువెందుల గ్రామ రోడ్డుకు ముళ్ల పొదలు, కంకర రాళ్లతో నిండి ఉంది. రోడ్డు సమస్యను పరిష్కరించండి. **- నాగమునేంద్ర, ఇరువెందుల**

సమాధానం : రోడ్డుకు అడ్డంగా ఉన్న ముళ్ల పొదలను వెంటనే తొలగించి సమస్యను పరిష్కరిస్తాం. **- భాస్కర్, ఎమ్పీడీవో, శింగనమల**

– న్యూస్‌టుడే శింగనమల

వేరుసెనగ పంటకు గడ్డుకాలం

● సాగుకు ఆసక్తి చూపని అన్నదాతలు ● కేంద్రాల్లోనే విత్తన నిల్వలు

గుత్తిలో విత్తన వేరుసెనగను ఆటోలో తరలిస్తున్న రైతులు

గుత్తి, శింగనమల, న్యూస్‌టుడే : గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాల్లో రాయితీ విత్తన వేరుసెనగ కొనుగోలుకు రైతులు ముందుకు రావడం లేదు. వేరుసెనగ సాగుకు పెద్దగా ఆసక్తి చూపకపోవడంతోనే ఇలాంటి పరిస్థితి దాపురించింది. వేరుసెనగ సాగుకు పెట్టుబడులు ఏడాదికేడాది ఎక్కువ అవుతున్నాయి. ఎకరాకు రూ.10 వేల దాకా పెట్టుబడులు పెట్టాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. రాష్ట్రంలోనే అత్యధికంగా వేరుసెనగ సాగు అనంతపురం జిల్లాలోనే ఉంది. అలాంటిది ఇక్కడే ఆ పంట సాగుకు ఆలోచించాల్సిన దుస్థితి కొనసాగుతోంది.

మండలం	విత్తన కేటాయింపులు	పంపిణీ
గుత్తి	2,300	1500
పామిడి	1200	600
పెద్దవడుగూరు	500	200
శింగనమల	1500	900

● 40 శాతం రాయితీతో ప్రభుత్వం విత్తనాలు ఇస్తోంది. రైతులు తీసుకోవడానికి రావడం లేదు. గుత్తి, పామిడి, పెద్దవడుగూరు, యాడికి, శింగనమలలో సుమారు 2 లక్షల ఎకరాల సాగు భూమి ఉంది. రైతులు వేరుసెనగకు ప్రత్యామ్నాయంగా పత్తి, కంది, జొన్న, కొర్ర పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు. గుత్తి వ్యవసాయ డివిజన్‌లో మునుపు ఎన్నడూలేని విధంగా ఈసారి వేరుసెనగ సాగు తగ్గుతోంది.

ముందస్తు వర్షాలతో..

ముందస్తు వర్షాలతో రైతులు పత్తి, కంది వేశారు. అనేక మంది రైతులు వేరుసెనగను కొనుగోలు చేసి ఇళ్లల్లో ఉంచుకున్నారు. వర్షం వస్తే సేద్యం చేయాలనుకుంటున్నారు. వర్షం రాకపోతే కొనుగోలు చేసిన విత్తనాలను అమ్ముకొనేందుకు సిద్ధంగా ఉన్నారు.

● వర్షం వస్తే పత్తి, కంది పంటలను ఎక్కువగా సాగు చేయనున్నారు. వేరుసెనగ సాగు తగ్గుతోందని ఏడీఏ వెంకట్రాముడు తెలిపారు. పెట్టుబడులు ఎక్కువ అవుతుండటంతో రైతులు వేరుసెనగపై ఆసక్తి చూపలేకపోతున్నారన్నారు.

చంద్రన్నతోనే సుపరిపాలన సాధ్యం

మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు శ్రావణి

గార్లదిన్నె: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సుపరిపాలన సాధ్యమవుతుందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణి, తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ పేర్కొన్నారు. బుధవారం గార్లదిన్నె మండల కేంద్రంలో సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికి తెదేపా కార్యక్రమం జరిగింది. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలో అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ఎమ్మెల్యే వివరించారు. అనంతరం రచ్చకట్ట సమావేశం ఏర్పాటు చేసి ప్రజల నుంచి నేరుగా పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు రూ.4 వేలు, రూ.6 వేలు, రూ.15 వేలు పెంచి పేదలకు ఆర్థిక భరోసాను కూటమి ప్రభుత్వం కల్పించిందన్నారు. ఒక నెల పింఛను తీసుకోకుంటే పింఛన్లు ఎగ్గొట్టిన చరిత్ర జగన్‌ది, కూటమి ప్రభుత్వం 3నెలల పింఛన్‌ను ఒకేసారి తీసుకునే అవకాశం కల్పించిందన్నారు. యువగళం పాదయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీ మేరకు రూ.3కోట్ల ఖర్చుతో గార్లదిన్నె మండలం జంబులదిన్నె గ్రామంలో వద్ద చీనీ ప్రాసెసింగ్ యూనిట్‌ను మంజూరు చేశారన్నారు. ఏడీసీసీ ఛైర్మన్ కేశవరెడ్డి, తెదేపా అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాక కార్యదర్శి రామలింగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి పర్వతనేని శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

ఉద్యోగుల్లేక.. పనులు సాగక!

ఉద్యోగుల కోసం వేచి చూస్తున్న ప్రజలు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: పెద్దవడుగూరు మండలంలోని దిమ్మగుడి గ్రామ సచివాలయ ఉద్యోగులందరూ బదిలీ పనుల్లో కార్యాలయానికి రాకపోవడంతో ప్రజలు ఎదురుచూపులు తప్పడం లేదు. బుధవారం 11 గంటలైనా ఎవరూ రాకపోవడంతో సచివాలయానికి వచ్చిన పలు సమస్యలపై వచ్చిన ప్రజలు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుత సచివాలయంలో పనిచేస్తున్న ఉద్యోగులు బదిలీ ప్రక్రియ నిమిత్తం జిల్లా కేంద్రానికి వెళ్లినట్లు తెలిసింది. ఎంతకూ రాకపోవడంతో కొంతమంది వెనుదిరిగి వెళ్లిపోయారు.

తొలి అడుగులోనే అభివృద్ధి ముద్ర

సంక్షేమ పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో రాష్ట్రం అభివృద్ధి వైపు అడుగులు వేస్తోందని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ పేర్కొన్నారు. మండలంలోని కసాపురం గ్రామంలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ముందుగా ఎమ్మెల్యే కసాపురం ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే గుమ్మనూరు ప్రజలను కలిసి వారు అందుకుంటున్న సంక్షేమ పథకాల వివరాలు తెలియజేశారు. కసాపురం ఆలయానికి వెళ్లే మార్గంలో మురుగు కాలువ సమస్యను పరిష్కారం చూపాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో నాగభూషణాన్ని ఆదేశించారు. ఓబుళాపురం, మైనాపురం గ్రామాల మధ్య నూతనంగా నిర్మించిన సబ్‌స్టేషన్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. తెదేపా మండల అధ్యక్షుడు రామన్న చౌదరి, మాజీ మార్కెట్ యార్డు ఛైర్మన్ గుమ్మనూరు వెంకటేశ్, తహసీల్దారు రామదేవి పాల్గొన్నారు. ● నార్పల, తాడిపత్రి, గుత్తి ప్రాంతాల్లోనూ తెదేపా నాయకులు సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ప్రైవేట్ విద్యాసంస్థల బంద్

ఎంఈవో రవినాయక్‌కు వినతిపత్రం ఇస్తున్న ప్రైవేట్ పాఠశాలల యజమానులు

గుత్తి: అధికారుల వేధింపులకు నిరసనగా గురువారం గుత్తి, పెద్దవడుగూరులో ప్రైవేట్ విద్యాసంస్థలను గురువారం బంద్ చేస్తున్నామని పలు విద్యాసంస్థల యజమానులు తెలిపారు. కొందరు అధికారులు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యంపై అతిగా స్పందిస్తున్నారన్నారు. అనంతరం గుత్తి ఎంఈవో రవినాయక్‌కు వినతిపత్రం ఇచ్చారు. ప్రైవేట్ యాజమాన్య సంఘం నాయకులు రంగారావు, వేదమూర్తి, షేక్షావలి, బాబు, జయరాం, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత అవసరం

ప్రజలకు సూచనలిస్తున్న పీడీ సుధాకర్‌రెడ్డి

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : ప్రజలు తమ ఇంటిముందు తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని డ్వామా పీడీ సుధాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన బుక్కరాయసముద్రంలోని పూసలకాలనీలో పర్యటించారు. కాలనీలో ప్రయోగాత్మకంగా ఉపాధిహామీ పథకం కింద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఏపీవో సుజాత, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

‘నిధులున్నా.. వినియోగించుకోలేకపోతున్నాం’

మాట్లాడుతున్న మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, న్యూస్‌టుడే: పురపాలికలో నిధులున్నా వాటిని అభివృద్ధి పనులకు వినియోగించలేకపోతున్నామని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సీఎఫ్ఎంఎస్ పద్ధతిని చంద్రబాబు నాయుడు ప్రవేశపెట్టారని, అప్పట్లో బాగానే ఉండేదన్నారు. వైకాపా అధికారంలో సీఎఫ్ఎంఎస్‌ను నాశనం చేశారన్నారు. ఆ ప్రభావంతో ప్రస్తుతం పురపాలికల్లో నిధులున్నా ఉపయోగించలేని పరిస్థితి నెలకొందన్నారు. మున్సిపాలిటీలో ఉన్న వాహనాలకు డీజిల్ పోయించాలంటే నగదు ఇవ్వాలని, సీఎఫ్ఎంఎస్ ద్వారా చెల్లింపులు ఆలస్యమవుతోందన్నారు. 30 లీటర్ల డీజిల్‌కు 25 లీటర్లు మాత్రమే పట్టి బిల్లులు పెడుతున్నారని ఆరోపించారు. డీజిల్ వ్యాపారికి ఆలస్యంగా బిల్లు ఇస్తుండటంతోనే అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. ప్రస్తుతం తాడిపత్రి మున్సిపాలిటీలో రూ.5కోట్లు నగదు ఉందన్నారు. అభివృద్ధి పనులకు వినియోగించుకోలేని పరిస్థితి ఉందన్నారు. దీనిపై రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించి ఒక నిర్ణయం తీసుకోవాలని తెలిపారు.

బాలిక అదృశ్యంపై ఫిర్యాదు

పామిడి, న్యూస్‌టుడే : పామిడి మండల కేంద్రానికి చెందిన ఓ బాలిక అదృశ్యమైందని స్థానిక పోలీస్ స్టేషన్‌లో తండ్రి బుధవారం ఫిర్యాదు చేశారు. ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదని, బంధువులను అడిగినా ఎవరూ తెలియదని చెప్పడంతో రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశానని బాలిక తండ్రి తెలిపారు. ఆయన ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

యువకుడికి అరుదైన శస్త్రచికిత్స

అనంతపురం(వైద్యం) : పదివేల మందిలో ఐదుగురికి వచ్చే డయాఫ్రమాటిక్ హెర్నియా సమస్యతో బాధపడుతున్న ఒక యువకుడికి విజయవంతంగా అరుదైన శస్త్రచికిత్సను అనంతపురం కిమ్స్ సవీరా వైద్యశాలలో నిర్వహించినట్లు బుధవారం కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ మహమ్మద్ షాహిద్ తెలిపారు. తాడిపత్రి మండలం కల్లుమడికి చెందిన నల్లప్పకు ఎద భాగంతోపాటు కడుపులో తీవ్ర నొప్పి రావటం, ఊపిరాడక పోవటం, 3 రోజులుగా వాంతులు వస్తుండటంతో వైద్యసేవలు పొందేందుకు కిమ్స్ ఆసుపత్రికి రాగా వైద్యులు పరిశీలించి సీఈసీటీ పరీక్ష చేయించారు. ఎడమ వైపు గుండె, ఊపిరితిత్తులకు పొట్ట, ప్లీహం, కిడ్నీ, పేగులు ఆనుకున్నట్లు గుర్తించామని తెలియజేశారు. పుట్టుకతోనే ఈ సమస్య ఉండగా ప్రస్తుతం అది తీవ్రంగా మారిందని వివరించారు. మెలితిరిగిన పొట్టభాగాన్ని సరి చేసి ఎడమ ఎదభాగంలోకి చొచ్చుకెళ్లిన కిడ్నీ, పేగులను అవి ఉండాల్సిన చోటులోకి మార్పు చేశామన్నారు.

మంగపట్నం టోల్ ప్లాజా ప్రారంభం

టోల్ ప్లాజాను ప్రారంభిస్తున్న ఎన్‌హెచ్ అధికారులు తరుణ్‌కుమార్, మురళీకృష్ణ, చంద్రశేఖర్‌రెడ్డి

కొండాపురం, న్యూస్‌టుడే: కడప-తాడిపత్రి ప్రధాన జాతీయ రహదారిలోని ముద్దనూరు నుంచి తాడిపత్రి వరకు ఇటీవల నాలుగు వరుసల రోడ్డు నిర్మించారు. మార్గమధ్యంలోని మంగపట్నం వద్ద టోల్‌ప్లాజా ఏర్పాటు చేయగా బుధవారం ఎన్‌హెచ్ ఏఐ (అనంతపురం) పీడీ తరుణ్‌కుమార్, ఏపీడీ మురళీకృష్ణ, డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్‌హెచ్ ఏఈ సురేంద్రరెడ్డి ప్రారంభించారు. ఈ మార్గంలో వెళ్తున్న వాహనాలను బట్టి రుసుం వసూలు చేస్తున్నారు. టోల్‌ప్లాజాలో ఎనిమిది వాహనాలు వెళ్లడానికి.. మరో ఎనిమిది రావడానికి వీలుగా తీర్చిదిద్దారు.

వసతి గృహం.. సమస్యల వలయం

గుత్తిలోని పత్తికొండ రోడ్డులో ఉన్న నంబర్-1 వసతి గృహంలో విద్యార్థులకు కష్టాలు తప్పడం లేదు. విద్యార్థులు బహిర్భూమికి ఆరు బయటికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కనీసం స్నానాలు చేసేందుకు కూడా కుళ్లాయిలు కూడా లేవు. ఉన్న ఒక కుళాయి వద్ద డ్రమ్ము ఏర్పాటు చేశారు. అక్కడే స్నానం చేయాల్సిన పరిస్థితి నెలకొంది. సాంఘిక సంక్షేమ శాఖ అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే గుత్తి గ్రామీణం

గుట్టుగా ఇసుక నిల్వలు

గుత్తి మండలంలోని బేతాపల్లి గ్రామ సమీపంలోని ఊటకల్లు రోడ్డులో కొంత కాలంగా ఇసుకను అక్రమంగా నిల్వ చేస్తున్నా ఎవరికీ పట్టడం లేదు. కొందరు దీన్నే వ్యాపారంగా మార్చుకొని సొమ్ము చేసుకుంటున్నారు. సమీప వంకల్లో ఇసుకను తవ్వేస్తున్నారు. అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదని జనం ఆరోపిస్తున్నారు. పెద్దొడ్డి, అనగాదొడ్డి, అబ్బేదొడ్డి గ్రామాల్లో తవ్వకాలు జోరందుకున్నాయి. అధికారులు స్పందించాల్సిన అవసరం ఉంది.

– న్యూస్‌టుడే బేతాపల్లి(గుత్తి గ్రామీణం)

ఉపాధ్యాయులకు సత్కారం

వేదికపై సత్కారం అందుకున్న ఉపాధ్యాయులు

యాడికి, న్యూస్‌టుడే : యాడికి జడ్పీ హైస్కూల్‌లో పనిచేస్తూ బదిలీపై ఇతర ప్రాంతాలకు వెళ్లినవారికి, కొత్త వచ్చిన ప్రధానోపాధ్యాయులను బుధవారం ఘనంగా సత్కరించారు. వీడ్కోలు, స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అతిథులుగా పాల్గొన్న ఎంఈవో కాశెప్ప, విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ ఇక్కడ పని చేయడం ఎంతో అదృష్టమని, ప్రస్తుతం బాధ్యతలు తీసుకున్న వారందరూ ఉత్తీర్ణత శాతం పెంచడానికి కృషి చేయాలని కోరారు. అదే విధంగా పాఠశాల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రధానోపాధ్యాయులు సీతారామాంజనేయులు, విజయమ్మ, నాగన్న, ఉపాధ్యాయులు శ్రీనివాసయాదవ్, శ్రీదేవి, మంజుల, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

పెద్దవడుగూరు : అప్పేచర్ల సమీపంలో ఉన్న 67వ జాతీయ రహదారిలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆనంద్‌కు గాయాలయ్యాయి. గుత్తి మండలం కొత్తపేట గ్రామానికి చెందిన ఇతను సొంత పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంపై కిష్టిపాడు గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా వాహనం అదుపు తప్పి బోల్తా పడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స కోసం గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రతిభావంతులకు చేయూత

విద్యార్థులతో రాజ్‌ఫౌండేషన్ నిర్వాహకులు

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: ప్రతిభావంతులను రాజ్ ఫౌండేషన్ ఆదుకుంటుందని ట్రస్టు ఛైర్మన్ గోపాల్‌నాయుడు పేర్కొన్నారు. గుంతకల్లులోని సరస్వతీ విద్యామందిరంలో చదివిన సాయిచరణ్, లోకేశ్వరి, అకీరా, తేజస్విని పదో తరగతిలో మంచి మార్కులు సాధించారు. ఈ నలుగురికి ఒక్కొక్కరికి రూ.పది వేల చొప్పున ఉపకార వేతనాలను రాజ్‌ఫౌండేషన్ నిర్వాహకులు గోపాల్‌నాయుడు, వైస్ ఛైర్మన్ రామకృష్ణనాయుడు అందజేశారు. విశ్రాంత ఎంఈవో చలపతి, పాఠశాల యజమాన్యం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కారు అదుపు తప్పి ఒకరి మృతి

ముద్దనూరు, న్యూస్‌టుడే : ముద్దనూరు - తాడిపత్రి ప్రధాన రహదారిలోని శెట్టివారిపల్లె గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణానికి చెందిన ప్రభాకర్ (29) ఫ్లెక్సీ దుకాణం నిర్వహిస్తున్నాడు. అతను సొంత పనిమీద కారులో కడపకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో శెట్టివారిపల్లె గ్రామ సమీపంలో వాహనం అదుపు తప్పింది. పంట పొలాల్లోకి కారు దూసుకెళ్లి పడిపోవడంతో ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు.

అనాథలకు అల్పాహారం అందజేత

గుంతకల్లు పట్టణం, న్యూస్‌టుడే: గుంతకల్లులో రోటరీ క్లబ్ నూతన కమిటీ ఏర్పాటు కావడంతో బుధవారం అధ్యక్షుడు సుధీర్ కార్వా, కార్యదర్శి రవికుమార్ రైల్వే మైదానంలోని ఆలయంలో వినాయకుడికి పూజలు చేయించి సేవా కార్యక్రమాలను మొదలపెట్టారు. రోడ్డు పక్కన ఉన్న అనాథలకు 50 మందికి పైగా అల్పాహారం అందించి ఆకలి తీర్చారు. ఈకార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

విత్తనాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేస్తాం : కలెక్టర్

స్థల పత్రాలు పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

తాడిపత్రి, న్యూస్‌టుడే : రైతులకు సౌకర్యంగా విత్తనాభివృద్ధి కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. బుధవారం తాడిపత్రిలోని బోగసముద్రం, వెంకటాంపల్లి, తలారిచెరువు గ్రామాల్లో పలు ప్రభుత్వ స్థలాలు ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులకు నాణ్యమైన విత్తనాలు, మొక్కలు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. తాడిపత్రిలో విత్తనాభివృద్ధి, అరటి టిష్యూ కల్చర్ కేంద్రం, పరిశోధన కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. భూ సేకరణ కోసం ప్రతిపాదనలు పంపాలని ఆయన అధికారులను ఆదేశించారు. అనంతరం ఊరు చింతల వద్ద ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ ఉద్యానాన్ని పరిశీలించి, త్వరలోనే వాటిని ప్రారంభిస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఆర్డీవో కేశవనాయుడు, ఉద్యాన శాఖ అధికారి ఉమాదేవి, తహసీల్దార్ సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్తు తీగల చోరీ

యాడికి, న్యూస్‌టుడే : మండలంలోని రాయలచెరువు జడ్పీ ఉన్నత పాఠశాల పక్కన ఉన్న ఓ తోటలో విద్యుత్తు తీగలు చోరీకి గురయ్యాయి. రాయలచెరువుకు చెందిన ప్రభాకర్ తన తోటలోని మోటారు మరమ్మతుకు గురికావడంతో పైపులు, తీగలను తీసి తోటలో ఉంచారు. అర్ధరాత్రి గుర్తు తెలియని దొంగలు 450 మీటర్ల తీగలను ఎత్తుకెళ్లారు.

సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

గుంతకల్లు గ్రామీణం, న్యూస్‌టుడే : సమస్యల పరిష్కారం కోసమే గ్రామసభలు నిర్వహిస్తున్నామని తహసీల్దారు రమాదేవి పేర్కొన్నారు. మండలంలోని నక్కనదొడ్డి గ్రామంలో బుధవారం గ్రామసభను సర్పంచి వరలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. గ్రామస్థులు తమ సమస్యలను అర్జీల రూపంలో అందజేశారు. నక్కనదొడ్డి గ్రామంలో శ్మశానవాటిక కోసం స్థలం కేటాయించాలన్నారు. నర్సాపురం గ్రామంలో రస్తా సమస్యను పరిష్కరించాలన్నారు. నర్సాపురం గ్రామంలో దోభీఘాట్ ఏర్పాటుకు స్థలం చూపాలని రజకులు వినతి పత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో, రెవెన్యూ సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

పురపాలికకు సొంత భవనం

గుత్తి, న్యూస్‌టుడే : ఎట్టకేలకు గుత్తి పురపాలికకు సొంత భవనం సమకూరనుంది. ఇప్పటికే మూడు సార్లు టెండర్లు నిర్వహించినా గుత్తేదారులు ముందుకు రాలేకపోయారు. నాలుగోసారి పిలిచిన టెండర్లలో గుత్తేదారులు ముందుకొచ్చారు. ప్రభుత్వం 2011లో గుత్తి, చెట్నేపల్లి మేజర్ పంచాయతీలను కలుపుతూ పురపాలికను ఏర్పాటు చేసింది. కార్యాలయ నిర్మాణానికి అప్పట్లోనే రూ.50 లక్షలు వచ్చాయి. ఆ సొమ్ము చాలదని అధికారులు పట్టించుకోలేదు. తరువాత ప్రభుత్వం రూ.1.50 కోట్లు ఇచ్చింది. మొత్తం రూ.2 కోట్లతో కార్యాలయ నిర్మాణం నిర్మించాలనుకున్నారు. ప్రస్తుతం సాంఘిక సంక్షేమశాఖ వసతి గృహంలో కార్యాలయం నడుస్తోంది. సిబ్బంది, అధికారులు చిన్నగదుల్లో పనులు చేస్తున్నారు. ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అధికారులు ప్రతినెలా అద్దెను సంక్షేమశాఖకు చెల్లిస్తున్నారు. కార్యాలయం నిర్మాణానికి కౌన్సిల్ కూడా ఆమోదం తెలిపింది. టెండర్లను కూడా ఆమోదించారు. త్వరలోనే పనులు మొదలు కానున్నాయి.

అద్దెభవనంలో పురపాలిక కార్యాలయం

అస్తవ్యస్తంగా పశువైద్యశాలల నిర్వహణ

మూగజీవాలకు అందని చికిత్స

పామిడి, గుత్తి, పెద్దవడుగూరు, న్యూస్‌టుడే : మూగజీవాలకు వైద్యసేవలు మృగ్యమవుతున్నాయి. వైద్యశాలల నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. గుత్తి, పామిడి, పెద్దవడుగూరు మండలాల్లోని పశువైద్యశాలు అలంకారప్రాయంగా ఉన్నాయి. ఆయా కేంద్రాల్లో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇష్టమొచ్చినప్పుడు విధులకు హాజరు అవుతున్నారన్న విమర్శలున్నాయి. రైతులు జబ్బుతో ఉన్న తమ పశువులతో ఆసుపత్రుల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోంది. పశువైద్యశాలలపై సరైన పర్యవేక్షణ లేదు.

ఎద్దులపల్లి పశువైద్యశాల

వేధిస్తున్న వైద్యులు, మందుల కొరత

గుత్తి మండలంలోని జక్కలచెరువు, గుత్తి, పామిడి, ఎద్దులపల్లి, పెద్దవడుగూరు, క్రిష్టిపాడులో పశువైద్యశాలలు ఉన్నాయి. పశువులకు సీజనల్ వ్యాధులు వస్తున్నాయి. ఈక్రమంలో నివారణకు కావాల్సిన ఔషధాల కొరత వేధిస్తోంది. వైద్యులు బయటే ఔషధాలు కొనుక్కోండని రాసి ఇస్తున్నారు. రైతులు పశువులను కాపాడుకొనే ప్రయత్నంలో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు.

● జక్కలచెరువు మారుమూలన ఉండటంతో గుత్తి ఆసుపత్రికి పశువులను రైతులు ఎక్కువగా తరలిస్తుంటారు. ఇక్కడా మందుల కొరత అధికంగా ఉంటోంది.

● పెద్దవడుగూరు, క్రిష్టిపాడు, ఎద్దులపల్లి వైద్యశాలల్లోనూ ఇదే పరిస్థితి కొనసాగుతోంది.

● పామిడి మండలంలోని ఎద్దులపల్లి వైద్యశాలకు వైద్యులు లేరు. ఇప్పటి వరకు ఉన్న వైద్యుడిని ఉన్నతాధికారులు మరోప్రాంతానికి బదిలీ చేశారు. 20 రోజులవుతున్నా ఎవరినీ నియమించలేదు. లైవ్‌స్టాక్ అసిస్టెంట్ కూడా లేరు. కేవలం అటెండర్ మాత్రమే ఉన్నారు. అటెండరే వైద్యసేవలను అందిచాల్సి వస్తోంది.

● గుత్తిలో అటెండర్ లేరు. ఉన్న వైద్యుడే అన్నీ చూసుకోవాల్సి వస్తోంది.

● జక్కలచెరువులో చిన్న పాత గదిలో ఆసుపత్రి నడుస్తోంది. ఇక్కడ సరైన వసతులు లేవు. వర్షం వస్తే గది కారుతోంది. పైకప్పు శిథిలావస్థలో ఉంది.

ఎక్కడా సమస్య లేదు

గుత్తి, పామిడి, పెద్దవడుగూరు మండలాల్లోని పశువైద్యశాలను సక్రమంగా నిర్వహిస్తున్నారు. ఎద్దులపల్లికి వైద్యుడు లేరు. త్వరలోనే నియామకాలు జరుగుతాయి. వైద్యసిబ్బంది, వైద్యులు ఆసుపత్రులను సమయపాలన పాటిస్తూ సేవలందిస్తున్నారు. మందుల కొరత ఎక్కడా లేదు. ఉన్నంత వరకు వైద్యం చేసి లేని ఔషధాలు బయటికి రాసి ఇస్తున్నాం.

- డాక్టర్ భారతి, ఏడీ, పశుసంవర్ధకశాఖ, గుత్తి

మద్యం మత్తులో వీరంగం

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం ఓ యువకుడు మద్యం మత్తులో వీరంగం చేశాడు. కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన అర్జున్ గుత్తి తాడిపత్రిరోడ్డులోని కాలనీలో నివాసం ఉంటున్నాడు. భార్యతో గొడవపడి తనకు తాను గాయం చేసుకోగా మిత్రుడు అతన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లాడు. మద్యం మత్తులో ఉన్న అర్జున్ వైద్యులు, సిబ్బందిపైనా దురుసుగా ప్రవర్తించాడు.

వంటమనిషి కావలెను
ఇంటియందు పనిచేయుటకు వంటమనిషి కావలెను. గుంతకల్లు టౌన్ నందు 6 మెంబర్స్ ఉన్న ఇంటిలో వంట చేయుటకు ఆడ వంటమనిషి కావలెను. బ్రాహ్మణ, వైశ్య, లింగాయిత సామాజిక వర్గానికి ప్రాధాన్యము ఇవ్వబడును. మంచి జీతం ఇవ్వబడును.
సంప్రదించండి
8179506127

(c) eenadu

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

పండ్లతోటల పెంపకానికి దరఖాస్తుల స్వీకరణ

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఆ ఆర్థిక సంవత్సరంలో పండ్లతోటల పెంపకానికి సంబంధించి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీఓ దివాకర్ తెలిపారు. ఐదు ఎకరాలు లోపు ఉన్న రైతులు ఈ నెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. మామిడి, జామ, చీని, నిమ్మ, సపోటా, దానిమ్మ, డ్రాగన్‌ఫ్రూట్ 0.5 ఎకరాకు మాత్రమే ఇస్తామన్నారు. మునగ, కొబ్బరి, యాపిల్ బేర్, నేరేడు, సీతాఫలం, చింత, మల్లె, గులాబీ 0.25 నుంచి ఎకరా వరకు పెంపకానికి మొక్కలు అందజేస్తామన్నారు. దరఖాస్తులు గ్రామ క్షేత్ర సహాయకులు లేదా మండల ప్రజాపరిషత్తు కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

‘అంగన్‌వాడీల పనితీరు అధ్వానం’

శ్రీనివాస్‌నగర్: ‘కొందరు అంగన్‌వాడీ కార్యకర్తలు కేంద్రాలకు వెళ్లడం లేదు. ఫొటో తీసి యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. తాను తనిఖీ చేసిన కేంద్రాల్లో చాలా లోపాలు వెలుగు చూశాయి. చాలా మంది పనితీరు అధ్వానంగా ఉంది. పద్ధతి మార్చుకోకపోతే ఇబ్బంది పడతారు’ అని ఐసీడీఎస్ పీడీ నాగమణి హెచ్చరించారు. బుధవారం అనంత అర్బన్ ఐసీడీఎస్ కార్యాలయంలో నగరం, గ్రామీణ ప్రాజెక్టుల సూపర్ వైజర్ల సమీక్ష జరిపారు. పీడీ మాట్లాడుతూ.. ఇటీవల నగరం, గ్రామీణంలో కొన్ని కేంద్రాలను ఆకస్మికంగా చూశా. చాలా అధ్వాన పనితీరు ఉంది. అనేక లోపాలను గుర్తించానన్నారు. ఎఫ్ఆర్ఎస్ నమోదు మరీ దయనీయంగా ఉంది. టీహెచ్ఆర్ నమోదులోనూ నిర్లక్ష్యం చూపిస్తున్నారు. ప్రతి నెలా ఐదో తేదీలోపు బియ్యం కేంద్రాలకు రావాల్సిందేనన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఆత్మకూరు: 9701452321,
ఎస్కే, జేఎన్‌టీయూ: 8008573005
శారదానగర్: 8008573049

సమస్య: రహమత్ నగర్ 12వ క్రాస్ రైల్వే ట్రాక్ సమీపంలో వీధి లైటు వెలగడం లేదు. చర్యలు తీసుకోండి - **నాగమణి**

సమాధానం: వెంటనే సమస్య పరిష్కరిస్తాం.

సమస్య: ఖాజానగర్ గౌరీ కాంప్లెక్స్ వద్ద మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది.

సమాధానం: వెంటనే కాలువలో మురుగు తీయిస్తాం.

(పై ప్రశ్నలకు డీఈ దాక్షాయిణి, ఎంహెచ్‌ఓ రంగస్వామి సమాధానాలు ఇచ్చారు)

– న్యూస్‌టుడే, అశోక్‌నగర్

చౌకగా కట్టబెట్టారు.. వదలమంటే కిరికిరి

జడ్పీ ఆధార్ నమోదు భవనం అద్దె నిర్ణయంపై విమర్శలు

తపోవనం: జడ్పీలో ఒక ప్రైవేటు వ్యక్తి మూడేళ్లుగా ఆధార్ నమోదు కేంద్రం నిర్వహిస్తున్నాడు. జడ్పీకి సంబంధించిన ఏ ఆస్తినైనా అద్దెకు ఇవ్వాలంటే పాలకవర్గం తీర్మానం చేయాలి. లేదా కలెక్టర్ నిర్ణయం తీసుకుంటారు. ఇక్కడ సీఈఓ క్యాంప్ ఆఫీస్ కోసం నిర్మించిన భవనాన్ని 2022లో ఆధార్ నమోదు కేంద్రానికి ఇచ్చారు. కానీ భవనాన్ని కేవలం రూ. వెయ్యికి బాడుగకు కట్టబెట్టారు. విచిత్రంగా విద్యుత్తు బిల్లు సైతం జడ్పీనే భరిస్తోంది. సదరు ప్రైవేటు వ్యక్తి ఇప్పటిదాకా అద్దె చెల్లించకపోవడం చర్చనీయాంశంగా మారింది.

● వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి సీఈఓ భాస్కర్‌రెడ్డి ఈ భవనాన్ని హనుమంతుకు ఆధార్ కేంద్రం నడుపుకోవడానికి అనుమతి ఇచ్చాడు. అద్దె చెల్లించకపోవడంతో భవనాన్ని ఖాళీ చేయాలని అధికారులు తాఖీదులు జారీ ఆ వ్యక్తి ఖాళీ చేసేది లేదంటూ భీష్మించుకున్నాడు. ఈ భవనం చాలా పాతది. శిథిలావస్థకు చేరిందని ఇంజినీర్లు నివేదిక ఇచ్చారు. రోజూ వందలాది మంది ఆధార్ నమోదు, సవరణల కోసం వస్తుంటారు. వర్షకాలంలో జరగరాని ప్రమాదం జరిగితే జడ్పీకి చెడ్డపేరు వస్తుందని అధికారులు ఖాళీ చేయాలని తాఖీదులు జారీ చేసినా సదరు వ్యక్తి పట్టించుకోవడం లేదు. ఆధార్ సాకుతో రాత్రిళ్లు సైతం ఎవరెవరో కార్యాలయంలోకి వస్తున్నారని ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మహిళా ఉద్యోగినులు కూడా పాలకవర్గానికి ఫిర్యాదులు చేశారు. ఈ కేంద్రం వల్ల ఎలాంటి లాభం లేకపోగా.. అన్నీ నష్టాలే కనబడుతున్నాయి.

ఖాళీ చేయాలని తాఖీదులు జారీ చేశాం..

ఆధార్ కేంద్రానికి అద్దెకు ఇచ్చిన భవనం శిథిలావస్థలో ఉంది. దీన్ని పడగొట్టాల్సిందేనని ఇంజినీర్లు కూడా నివేదిక ఇచ్చారు. ఖాళీ చేయాలని తాఖీదులు ఇచ్చాం. అతను ఇప్పటి వరకు ఖాళీ చేయకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు.
- బి.గిరిజమ్మ, జడ్పీ ఛైర్‌పర్సన్

ఇప్పటికిప్పుడు అంటే ఎలా..?

అప్పట్లో అన్ని అనుమతులతోనే కేంద్రాన్ని ప్రారంభించాను. నిబంధనల ప్రకారమే ఆధార్ నమోదు, సవరణకు డబ్బులు వసూలు చేస్తున్నాం. భవనం పైకప్పు కూడా మరమ్మతు చేయించాను. ఇప్పటికిప్పుడు ఖాళీ చేయాలంటే అనేక ఎలా..ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాను. **- హనుమంతు, ఆధార్ కేంద్రం నిర్వాహకుడు**

కలెక్టరేట్‌కు వచ్చిన బాధిత సచివాలయ వ్యవసాయ సహాయకులు

వ్యవసాయ సహాయకుల బదిలీల్లో అన్యాయం

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: ‘గ్రామ సచివాలయాల్లో పని చేస్తున్న తమకు మొన్నటి సాధారణ బదిలీల్లో తీరని అన్యాయం చేశారు. ర్యాంకుల (ప్రతిభ) ఆధారంగా కాకుండా ఇష్టానుసారంగా చేయడంతో తమకు తీరని మోసం చేశారు’.. అని బాధిత గ్రామ వ్యవసాయ సహాయకులు ఆరోపించారు. బుధవారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా పలువురు బాధితులు అనంత కలెక్టర్ కార్యాలయానికి వచ్చారు. ఇక్కడ డీఆర్‌ఓ మాలోలకు వినతి అందజేసిన తర్వాత విలేకరులతో మాట్లాడారు. గత నెల 28న అనంత జేడీఏ కార్యాలయంలో రెండు జిల్లాల వ్యవసాయ సహాయకులకు బదిలీ కౌన్సెలింగ్ జరిపారన్నారు. ఇందులో ర్యాంకుల వారీగా, ప్రాధాన్య కేటగిరీలైన దివ్యాంగులు, వ్యాధులు, స్పౌజ్, వితంతువులు.. వంటి వాటిని అసలు పరిగణలోకి తీసుకోలేదని ఆరోపించారు. సీనియారిటీ జాబితానే ప్రకటించలేదు. ప్రతిభా కలిగిన వారికి సుదూర ప్రాంతాల్లోని ఆర్ఎస్‌కే కేంద్రాలకు బదిలీ చేశారన్నారు.

పాఠశాలల బంద్‌కు ఏడీపీఎస్‌ఏ మద్దతు లేదు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: కొన్ని ప్రైవేటు పాఠశాలలు ఈ నెల 3న చేపట్టబోయే బంద్‌కు తాము మద్దతు ఇవ్వడం లేదని ఏపీ పీఎస్‌ఏ, ఏడీపీఎస్‌ఏ సంఘాల నేతలు గంగాధర్, గోపాల్‌రెడ్డి, రమణారెడ్డి, రవిచంద్రారెడ్డి, రామచంద్ర, చంద్రశేఖర్ తెలిపారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిర్వహిస్తున్న ఈ బంద్‌లో తాము పాల్గొనడం లేదని తెలియజేశారు.

రవాణా, భవనాలశాఖ ఇన్‌ఛార్జి ఎస్ఈగా మురళీకృష్ణ

జేఎన్‌టీయూ: అనంతపురం సర్కిల్ రహదారులు, భవనాలశాఖ ఇన్‌ఛార్జి ఎస్ఈగా మురళీకృష్ణ నియమితులయ్యారు. నెల్లూరులో ఈఈగా ఉన్న ఆయనను అనంతపురానికి బదిలీ చేయడంతో పాటు, ఇన్‌ఛార్జి పర్యవేక్షక ఇంజినీరుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

మంత్రిని కలిసిన డీఐపీఆర్వో, డీపీఆర్వో

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే : రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను జిల్లా డీఐపీఆర్వో బాలకొండయ్య, డీపీఆర్వో వెంకట రమణ మర్యాద పూర్వకంగా కలిశారు. బుధవారం నగరంలోని రాంనగర్ క్యాంపు కార్యాలయంలో మంత్రి కేశవ్‌కు పుష్పగుచ్ఛం అందించారు. బదిలీల్లో భాగంగా కొత్తగా జిల్లాకు వచ్చామని మంత్రికి తెలిపారు.

సుపరిపాలనతో ప్రజలు సుభిక్షం

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, నాయకులు, కార్యకర్తలు,

రాంనగర్(అనంతపురం), న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రభుత్వ సుపరిపాలనతో ప్రజలంతా సుభిక్షంగా ఉన్నారని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం తొలిరోజు నగరంలోని 35, 39 డివిజన్లలో ఇంటింటికి కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలు, అభివృద్ధిపై ముద్రించిన కరపత్రాలను ఎమ్మెల్యే విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన జగన్ ఐదేళ్ల పాటు రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని ధ్వజమెత్తారు. చంద్రబాబు రాష్ట్రాన్ని మళ్లీ అభివృద్ధి బాటలో నడిపిస్తున్నారన్నారు. అన్న క్యాంటీన్లు పునరుద్ధరించారన్నారు. మెగా డీఎస్సీ నిర్వహణ, ఉచిత ఇసుక విధానం, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, తదితర అంశాలు అమలు చేశారన్నారు. మాజీ ఎంపీ సైపుల్లా, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారాం, తెదేపా రాష్ట్ర నాయకులు బుగ్గయ్యచౌదరి, ఆదినారాయణ, ఆదెన్న, గౌస్‌మొద్దీన్ పాల్గొన్నారు.

క్షయవ్యాధి నిర్మూలనకు కృషి

జిల్లాలో క్షయవ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని అనంతపురం అర్బన్ దగ్గుపాటి ప్రసాద్ పిలుపునిచ్చారు. టీబీ ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం అనంతపురం అర్బన్ క్యాంపు కార్యాలయంలో గోడపత్రాలను వైద్యులతో సహా ఆవిష్కరించారు. అశా, వర్కర్లు, ఏఎన్ఎంలు, ఇంటింటికి తిరిగి సర్వే చేపట్టాలన్నారు. ప్రతినెలా కేంద్రం రూ.1000 సాయం అందిస్తోందని, ప్రధానమంత్రి టీబీ ముక్త్‌భారత్ అభియాన్ పోషకాహార కిట్లను అందించేందుకు తమవంతు సాయం అందిస్తామన్నారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు గంగారాం, జిల్లా క్షయవ్యాధి నివారణాధికారిణి డాక్టర్ అనుపమజేమ్స్, తదితరులు పాల్గొన్నారు.

చంద్రన్నతోనే అన్నివర్గాల అభివృద్ధి

గార్లదిన్నె: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సుపరిపాలన సాధ్యమవుతుందని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే బండారు శ్రావణి, తెదేపా జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడుయాదవ్ పేర్కొన్నారు. బుధవారం గార్లదిన్నె మండల కేంద్రంలో సుపరిపాలనలో తొలి అడుగు, ఇంటింటికి తెదేపా కార్యక్రమం జరిగింది. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలో అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి ఎమ్మెల్యే వివరించారు. అనంతరం రచ్చబండ సమావేశం ఏర్పాటు చేసి ప్రజల నుంచి నేరుగా పలు సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అనంతరం వారు మాట్లాడుతూ అధికారంలోకి రాగానే ఎన్టీఆర్ భరోసా పింఛన్లు రూ.4 వేలు, రూ.6 వేలు, రూ.15 వేలు పెంచి పేదలకు ఆర్థిక భరోసాను కూటమి ప్రభుత్వం కల్పించిందన్నారు.

ఏడాది పాలనపై ప్రజల్లో హర్షం

శుద్ధజల కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఆత్మకూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజల్లో హర్షం వ్యక్తం అవుతోందని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని ముట్టాల గ్రామంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ప్రజల అభివృద్ధికి అనేక పథకాలు అందిస్తోందన్నారు. రాష్ట్రం ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నా పథకాలు అందించడంలో ముందంజలో ఉందన్నారు. అనంతరం ముట్టాలలో ఇంటింటికి తిరుగుతూ పింఛను మెప్మ, ఉచిత గ్యాస్ సిలిండర్ల పంపిణీ, తల్లికి వందనం, తదితర వాటి గురించి ప్రజలకు వివరించారు. ప్రజల స్పందనను మైటీడీపీ యాప్‌లో నమోదు చేశారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నాణ్యమైన విత్తనం అందిస్తున్నాం

కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలకు నాణ్యమైన విత్తనాన్ని అందిస్తున్నామని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండలంలోని బుధవారం గ్రీన్‌కో రాయల్ విండ్ పవర్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో శుద్ధజల కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభం కాక ముందే ప్రజలకు విత్తనాన్ని అందించామన్నారు. వేరుసెనగలో 4 రకాలను రైతులకు అవకాశాని అనుగుణంగా పంపిణీ చేశామన్నారు. అనంతరం అధికారులతో కలిసి మొక్కలు నాటారు. అధికారులు, తెదేపా నాయకులు పాల్గొన్నారు.

ఎస్కేయూలో టెండర్లు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అద్దెగదులు, క్యాంటీన్ నిర్వహణకు బుధవారం టెండర్లు నిర్వహించారు. రిజిస్ట్రార్ రమేశ్‌బాబు నేతృత్వంలోని కమిటీ సమక్షంలో ప్రక్రియ జరిగింది. క్యాంటీన్‌కు రూ.29 వేల అద్దె ప్రకారం టెండర్ నిర్ణయించారు. దీంతోపాటు మరో నాల్గు దుకాణాలకు టెండర్లు నిర్వహించారు.

‘అనుమతులున్నచోటే మద్యం కొనుగోలు చేయాలి’

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్ ఎక్సైజ్ శాఖ ద్వారా లైసెన్సు పొందిన రిటైల్ మద్యం దుకాణాల నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రామమోహన్‌రెడ్డి తెలిపారు. ఆయన బుధవారం ప్రకటన విడుదల చేశారు. లైసెన్సు లేని వ్యక్తులు, అనధికార వ్యక్తుల నుంచి మద్యం కొనుగోలు చేయడం వల్ల ప్రమాదకరం కావొచ్చని, ఎందుకంటే అటువంటి మద్యం నకిలీది అయి ఉండవచ్చన్నారు.

13వ రోజుకు చేరిన మున్సిపల్ కార్మికుల సమ్మె

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: కార్మికులు 13 రోజులు సమ్మె చేస్తున్నా పట్టించుకోకుండా ఉండటం శోచనీయమని ఆంధ్రప్రదేశ్ ఇంజినీరింగ్ మున్సిపల్ వర్కర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి లోకేశ్వరావు పేర్కొన్నారు. కార్మికుల సమ్మె బుధవారం నాటికి 13వ రోజుకు చేరుకుంది. వైఎస్ఆర్ ట్రేడ్ యూనియన్ నేతలు సంఘీ భావం తెలిపారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన మరింత ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు.

కాయగూరల ధరలు

అనంతపురం (అరవిందనగర్), న్యూస్‌టుడే: (అనంతపురం పాతూరు మార్కెట్లో ధరలు కిలో రూ..లలో) టమాటాలు 30, రెండోరకం 20, ఉల్లిగడ్డలు 25, రెండోరకం 15, బంగాళాదుంపలు 35, మిరపకాయలు 35, బెండకాయలు 40, వంకాయలు 20, ముల్లంగి 40, బీట్‌రూట్ 35, బీరకాయలు 35, కాకరకాయలు 40, చౌళేకాయలు 25, క్యాప్సికమ్ 30, చిక్కుడుకాయలు 30, క్యారెట్ 50, బీన్స్ 60, క్యాబేజీ 35, మునగకాయలు 40, నిమ్మకాయలు (వంద) 300, అల్లం 50.

మొక్కజొన్నకు కత్తెర పురుగు

అవగాహన కార్యక్రమంలో ఏవో వెంకటకుమార్ తదితరులు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణం నరసనాయనకుంట, కొడిమి రైతు సేవా కేంద్రాల పరిధిలో బుధవారం ఏవో వెంకటకుమార్ ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ముందుగా రైతులతో కలిసి ఖరీఫ్‌లో వేరుసెనగ, ఆముదం, మొక్కజొన్న పంటల్ని పరిశీలించారు. ఏవో మాట్లాడుతూ మొక్కజొన్నకు కత్తెర పురుగు ఆశించిందన్నారు. క్లోరాంట్రినిలిప్రోల్ 0.4 మి.లీ ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఆముదంలో బూజు తెగులు నివారణకు ఫ్లూజెండిమేడ్ (ప్రేమ్) మందును తగిన మోతాదులో పిచికారీ చేయాలన్నారు. వేరుసెనగ 30-45 రోజుల వ్యవధిలో జిప్సం వేసుకున్నట్లైతే కాయలు నాణ్యత, దిగుబడి, నూనె శాతం పెరుగుతుందన్నారు. ఎవోటీసీ ఏవో రమానాదేవి, విస్తరణాధికారులు మురళీకృష్ణ, అలేఖ్య, మల్లికార్జున, భాగ్యశ్రీ, రైతులు పాల్గొన్నారు.

యువకుడికి అరుదైన శస్త్రచికిత్స

అనంతపురం(వైద్యం),న్యూస్‌టుడే: పదివేల మందిలో ఐదు మందికి వచ్చే డయాఫ్రమాటిక్ హెర్నియా సమస్యతో బాధపడుతున్న ఒక యువకుడికి విజయవంతంగా అరుదైన శస్త్రచికిత్సను అనంతపురం కిమ్స్ సవీరా వైద్యశాలలో నిర్వహించినట్లు బుధవారం కన్సల్టెంట్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ మహమ్మద్ షోహెబ్ తెలిపారు. తాడిపత్రి మండలం కల్లూమడికి చెందిన నల్లప్పకు ఎద భాగంలోపాటు కడుపులో తీవ్రమైన నొప్పి, ఊపిరాడక పోవడం, 3 రోజులుగా వాంతులు వస్తుండటంతో వైద్యసేవలు పొందేందుకు కిమ్స్ ఆసుపత్రికి రాగా వైద్యులు పరిశీలించి సీటీస్కాన్ పరీక్ష చేయించారు. ఎడమ వైపు గుండె, ఊపిరితిత్తుల మధ్యలో పొట్ట, ప్లీహం, కిడ్నీ, పేగులు అనుకున్నట్లు గుర్తించామని తెలియజేశారు. పుట్టుకతోనే ఈ సమస్య ఉండగా ప్రస్తుతం అది తీవ్రంగా మారిందని వివరించారు. మొదటగా మెలితిరిగిన పొట్టభాగాన్ని సరిచేసి ఎడమ ఎదభాగంలోకి చొచ్చుకెళ్లిన కిడ్నీ, పేగులను ఎలా ఉండాల్సిన చోటులోకి మార్పు చేసినట్లు తెలిపారు.

ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత అవసరం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : ప్రజలు తమ ఇంటిముందు తప్పనిసరిగా ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసుకోవాలని డ్వామా పీడీ సుధాకర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఆయన బుక్కరాయసముద్రం లోని పూసలకాలనీలో పర్యటించారు. కాలనీలో ప్రయోగాత్మకంగా ఉపాధిహామీ పథకం కింద ఇంకుడు గుంతలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈకార్యక్రమంలో ఏపీవో సుజాత, ఉపాధిహామీ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో భార్యపై హత్యాయత్నం..

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: ఇరవై ఏళ్లు కాపురం చేసిన భార్యను హతమార్చాలని చూశాడొక ఓ భర్త. తప్పించుకుని బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. ధనలక్ష్మి తెలిపిన వివరాలు ఇలా.. భవానీ నగర్‌లో గఫూర్ సందులో నివాసముంటున్న మునీంద్ర, ధనలక్ష్మిలకు ఇరవై ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ముగ్గురు కుమార్తెలు. మద్యానికి బానిసైన భర్త ..భార్యపై అనుమానం పెంచుకున్నాడు. తరచూ ఇరువురి మధ్య గొడవలు జరిగేవి. ఆరేళ్ల క్రితం విడాకులు తీసుకునే వరకు వెళ్లారు. చివరకు వెనక్కి తగ్గి కాపురం కొనసాగిస్తున్నారు. ఇటీవల తిరిగి భార్యపై వేధింపులు ప్రారంభించాడు. రెండు రోజుల క్రితం తీవ్ర స్థాయిలో ఇద్దరూ గొడవపడ్డారు. బుధవారం మధ్యాహ్న సమయంలో మరోసారి ఘర్షణ పడ్డారు. ఈ క్రమంలో భార్యను ఆమె చున్నీతోనే మెడకు బిగించి ఊపిరాడకుండా చేశాడు. అంతటితో ఆగకుండా బలవంతంగా వాస్మల్ ద్రావణాన్ని నోట్లో పోసి హత్యాయత్నం చేశాడు. స్థానికులు గమనించి బాధితురాలిని ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు. వన్‌టౌన్ పీఎస్ హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు బాధితురాలి నుంచి వివరాలు సేకరించారు. ఆమెకు ప్రమాదమేం లేదని వైద్యులు తెలిపారు.

CHANGE OF NAME

I, Rathan Divyabharathi, W/o S.Chandra Babu, 11/413A, Aravinda nagar, Anantapur, hereby declare that my name has been mentioned as "Rathan Divyabharathi" in my Intermediate, Degree, MBA, and B.P.Ed certificates. However, my correct name as per my SSC certificate and Aadhaar is "Radhana Divya Bharathi". Henceforth, I shall be known as "**RADHANA DIVYA BHARATHI**" for all official and educational purposes.

మలుపు తిరగకుంటే కాలువలోకే!

నగరంలోని కోవూరు నగర్‌లోని వీధుల్లో నుంచి ప్రధాన దారిలోకి వచ్చే మార్గంలో కాలువపై సిమెంటు రోడ్డు పూర్తిగా వేయకుండా ఆపేశారు. పలకలు సైతం వేయలేదు. సరిగ్గా అక్కడే మలుపు ఉంది. రోడ్డుంది కదా అని ఏమరపాటుగా వస్తే కచ్చితంగా కాలువలో పడాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, అశోక్‌నగర్**

ఆన్‌లైన్‌లోనే ఉద్యాన పంటల ఎగుమతులు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే : జిల్లా ఉద్యాన పంటలకు ప్రసిద్ధి. పంట ఉత్పత్తుల నాణ్యతగా ఉండడంతో ఇతర దేశాల్లో డిమాండ్, మంచి ధరలు లభిస్తున్నాయని ఉద్యానశాఖ సహాయ సంచాలకులు దేవానంద తెలిపారు. సాంకేతిక సాయంతో ఆన్‌లైన్‌లో పంట ఉత్పత్తులు విక్రయిస్తున్నారన్నారు. వ్యవసాయ, ఆహార ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి అథారిటీ, జిల్లా ఉద్యానశాఖ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ప్రాంతీయ ఉద్యాన శిక్షణ కేంద్రంలో ఉద్యాన పంటల ఎగుమతులపై రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఏడీహెచ్ దేవానంద మాట్లాడుతూ.. ఉద్యాన మిషన్ ద్వారా కోత, అనంతరం యాజమాన్య పద్ధతులు ఆచరించేందుకు రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ప్యాక్‌హౌస్‌లు, కలెక్షన్ సెంటర్లు, సోలార్ శీతల గదులు, సోలార్ డ్రయర్లు 50 శాతం రాయితీతో అందిస్తున్నామన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

నగరంలోని ఐదో రోడ్డు కనకదుర్గ ఆలయ సమీపంలోని ఐదో క్రాస్ మొదట్లో రోడ్డు మధ్యలో ఉన్న డ్రైనేజీపై వేసిన సిమెంటు పలకలు దెబ్బతిన్నాయి. పాదచారులు, వాహనదారులు ఏమరపాటుగా ఉంటే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు.
- న్యూస్‌టుడే, శారదానగర్

తూమాటి దోణప్ప శతజయంతి కమిటీ ఏర్పాటు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఆచార్య తూమాటి దోణప్ప శతజయంతి కమిటీ ఏర్పాటు చేసినట్లు ఎస్కేయూ విశ్రాంత ఆచార్యులు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ‘ఆచార్య తూమాటి దోణప్ప జీవన యానం’ అనే లఘు గ్రంథాన్ని బుధవారం ఆర్ట్స్ కళాశాలలో ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అనంత జిల్లాలో ఉరవకొండ సమీపంలో రాకెట్ల గ్రామంలో జన్మించారన్నారు. గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ఆచార్యులుగా పని చేశారని తెలిపారు. శతజయంతి కమిటీ కన్వీనర్‌గా ప్రసిద్ధ కథారచయిత ఉప్పరపాటి వెంకటేశ్వర్లు, సహ కన్వీనర్‌గా ఆడవాల శేషగిరిరాయుడును ఎన్నుకున్నారు. డాక్టర్ శాంతి నారాయణ, తరిమెల అమర్‌నాథ్‌రెడ్డి, టీవీ రెడ్డి, ఎస్ఎం బాషా, రియాజుద్దీన్, జూటూరు షరీఫ్ పాల్గొన్నారు.

లఘు గ్రంథాలు ఆవిష్కరిస్తున్న విశ్రాంత ఆచార్యులు రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, రచయితలు

‘బదిలీల్లో ఎస్సీలకు అన్యాయం జరిగితే ఊరుకోం’

అనంత నగరపాలక, న్యూస్‌టుడే : సచివాలయాల్లో పని చేస్తున్న ఎస్సీ, ఎస్టీలకు బదిలీల్లో అన్యాయం చేస్తే ఊరుకోబోమని ఎమ్మార్పీఎస్ నాయకుడు దాస్ పేర్కొన్నారు. బుధవారం ప్రజారోగ్య విభాగం ఎస్ఈతో ఆయన వాగ్వాదానికి దిగారు. ఎస్సీలకు జరిగిన అన్యాయంపై ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరుకు ఫిర్యాదు చేస్తామన్నారు. ఉద్యోగులు కోరుకున్న విధంగా బదిలీలు చేయకుంటే కలెక్టరు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

నేతాజీ నగరపాలకోన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మానం

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: నగరంలోని నేతాజీ నగరపాలకోన్నత పాఠశాల నుంచి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు బుధవారం సన్మానం చేశారు. ప్రధానోపాధ్యాయులు ప్రకాశ్‌రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఉపాధ్యాయులు సుభాషిణి, రాధ, సుజాత, రామాంజనేయులు, రామాంజనమ్మ, శేషాచార్యులు, మహాదేవి, సౌజన్య, మహేశ్వరి బదిలీ అయ్యారు. కొత్తగా 10 మంది ఉపాధ్యాయులు ఈ పాఠశాలకు బదిలీపై వచ్చారు.

సర్వశిక్షా పథకంలో ఉద్యోగుల బదిలీలు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: సమగ్రశిక్షా పథకంలో పొరుగుసేవలు, ఒప్పంద ప్రాతిపదికన పనిచేస్తున్న ఉద్యోగులకు బుధవారం బదిలీ కౌన్సెలింగ్ నిర్వహించారు. పథకం అదనపు సమన్వయకర్త శైలజ ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ జరిగింది. 128 మంది ఉద్యోగులు రీపొజిషన్‌కు దరఖాస్తు చేశారు. అందులో 45 మంది బదిలీలకు ఆప్షన్లు ఇచ్చారు. 58 మంది నాట్ అప్టెడ్ ఇచ్చారు. 25 మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు గైర్హాజరయ్యారు. అర్హులైన వారిని బదిలీ చేశారు.

‘మాజీ సీఎంపై కించపరిచే వ్యాఖ్యలు తగవు’

అనంత నగరపాలక: మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పట్ల అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటిప్రసాద్ కించపరిచేలా మాట్లాడటం తగదని మేయర్ వసీం అన్నారు. జగన్‌పై ఎమ్మెల్యే చేసిన వ్యాఖ్యలను ఖండించారు. వైకాపా హయాంలో ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదంటున్నారు.. లక్షకు పైగా సచివాలయం ఉద్యోగాలిచ్చింది జగన్ కాదా అని ప్రశ్నించారు. వైకాపా హయాంలోనే ఇంటింటికి పింఛన్ పంపిణీ చేశామన్నారు.

ఆత్మకూరులో పీర్ల దర్శనం

ఆత్మకూరు, న్యూస్‌టుడే: మండల కేంద్రంలో బుధవారం పీర్ల దర్శనం ప్రారంభమైంది. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు వచ్చి పీర్ల దర్శనం చేసుకుంటున్నారు. 4న చిన్న సరిగెత్తు, 5న విడిదినం, 6న పెద్ద సరిగెత్తు, 7న పీర్లకు గ్రామోత్సవం నిర్వహించి అదేరోజు సాయంత్రం జలధికి తరలిస్తారు. 9న స్వామి వారి చివరి దర్శనం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు.

ప్రథమ వర్ధంతి

మంచికి, మానవత్వానికి మారుపేరుగా నిలిచిన మీరు మా నుండి దూరమై సంవత్సరకాలం గడిచిననూ మీ మధుర జ్ఞాపకాలు మా మదిలో పదిలం. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తూ...

మహేంద్రకర్ శ్రీనాథ్ గారు
D.O.B: 01-07-1964, D.O.D: 03-07-2024

From: Staff, Sunanda Transformer Industries

(c) eenadu

రాయచోటి రహస్యం

◆ అడ్డాగా చేసుకున్న ఉగ్ర మూకలు
◆ పసిగట్టడంలో విఫలమైన జిల్లా పోలీసులు

గున్నికుంట్ల రోడ్డులో మహ్మద్ అలీ చీరల వ్యాపారం చేసిన ఇల్లు

కొత్తపల్లిలోని అబూబకర్ సిద్ధిక్ నివాసం ఉన్న రెండు అంతస్తుల భవనం

రాయచోటి, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా కేంద్రం. ఘన చరిత్ర.. ప్రశాంతతకు నిలయం రాయచోటి. తమిళనాడుకు చెందిన ఇద్దరు ఉగ్రవాదులు గత ముప్పై ఏళ్లుగా ఈ పట్టణాన్ని అడ్డాగా చేసుకుని ఉన్నారనే విషయం తెలిసి స్థానికులు కలవరపడుతున్నారు. దశాబ్దాలపాటు నివాసాల మధ్య నక్కి ఉండటంపై ఉలిక్కిపడుతున్నారు. అనేకచోట్ల బాంబు పేలుళ్లకు పాల్పడిన వరుసకు సోదరులైన అబూబక్కర్ సిద్ధిఖీ, మహమ్మద్ అలీలు స్థానికుల్లో ఒకరుగా కలిసిపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● **ఆ ఇద్దరు కొందరికే తెలుసు:** బాంబు పేలుళ్ల కేసులో ప్రధాన నిందితులుగా అనుమానిస్తున్న సిద్ధిఖీ, అలీలు యుక్త వయస్సులోనే రాయచోటికి వచ్చారు. నాటి నుంచి వారి కదలికలు కొందరికే తెలుసనే విషయాన్ని పోలీసు వర్గాలు గుర్తించాయి. పెట్టెల్లో సామగ్రి తేవడం, ఇళ్లలోకి వెళ్లిన తర్వాత బయటికి రాకుండా రహస్య జీవితాన్ని ఒకరు గడుపుతుండగా.. మరొకరు చీరల వ్యాపారం చేస్తూ ఇతరులకు అనుమానం రాకుండా మసిలారని తెలుసుకున్నారు. రహస్య శిక్షణలు, మందుగుండు సామగ్రి తయారీలో ఈ ఇద్దరూ సిద్ధహస్తులనే విషయాన్ని నిఘా వర్గాలు పసిగట్టాయి.

● **ఇంతకీ చేరదీసిందెవరు!:** ఉగ్రమూలాలు కలిగిన వ్యక్తులను రాయచోటిలో తొలుత చేరదీసిన వారు ఎవరనే విషయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. తమిళనాడుకు చెందిన ఆ ఇద్దరు.. ఎవరి పరిచయం, ప్రోద్బలంతో వచ్చారనే దిశగా ఐబీ అధికారులతో పాటు జిల్లా పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. స్వాధీనం చేసుకున్న చరవాణుల ఆధారంగా వారి కదలికలు, ఎవరితో ఎక్కువసార్లు మాట్లాడారు.. అనే విషయాలను సాంకేతిక పరిజ్ఞానం సాయంతో విశ్లేషిస్తున్నారు. పేలుడు పదార్థాలను ఎక్కడి నుంచి తెస్తున్నారనే అంశంపై విచారిస్తున్నారు.

● **ఆధార్ కార్డులు.. బ్యాంకు ఖాతాలు:** తీవ్రవాదుల ఇళ్లల్లో ఐబీ అధికారులతో పాటు పోలీసులు తనిఖీ చేసినప్పుడు కొన్ని పరికరాలు, పుస్తకాలు, ఆధార్ కార్డులు, బ్యాంకుల ఖాతాల వివరాలు లభ్యమయ్యాయి. ఒక్కొక్కరికి 2 నుంచి 4 వరకు ఆధార్ కార్డులు ఉండడం, నాలుగైదు బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నట్లు గుర్తించారు. అబూబకర్ సిద్ధిక్ ఇంట్లో పేలుడు పదార్థాలతో పాటు ఎలక్ట్రిక్ పరికరాలు, అమ్మోనియం నైట్రేట్ లభించినట్లు సమాచారం. ఇదే నివాసంలో బకెట్ బాంబు కూడా ఉందని.. నిర్వీర్యం చేసేందుకు సాంకేతిక బృందాన్ని పిలిపించినట్లు తెలుస్తోంది.

● **విస్తృత సోదాలు:** రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి, మహబూబ్‌నగర్ వీధుల్లోని ఉగ్రవాదుల ఇళ్లలో ఐబీ అధికారులు బుధవారం రాత్రి విస్తృత సోదాలు నిర్వహించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న బాంబు తయారీ సామగ్రిని పరిశీలించినట్లు తెలిసింది. మూడు దశాబ్దాలుగా రాయచోటిలోనే ఉగ్రమూకలు మకాం వేసినప్పటికీ స్థానిక పోలీసులు పసిగట్టకపోవడంపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

మహేశ్వరరెడ్డి.. అప్పట్లో కలెక్టర్ కంటే ఎక్కువ

- స్థాయిని మించి అధికారం చెలాయింపు
- వెలుగు చూస్తున్న మరిన్ని భూదందాలు

ఈనాడు, కడప: వైకాపా హయాంలో ఆ పార్టీ నేతలు ఎక్కడికక్కడ రెచ్చిపోయారు. కొందరు అధికారులు వారి అడుగులకు మడుగులొత్తారు. అక్రమాలకు వత్తాసు పలికారు. మరికొందరు ఇంకొంత ఎక్కువ స్వామిభక్తి ప్రదర్శించారు. నాటి పాలకుల అండతో కలెక్టరును మించిన అధికారాన్ని ప్రదర్శించారు. తమ వారికి ప్రభుత్వ భూములను అప్పనంగా కట్టబెట్టేశారు. ఈ విషయంలో అప్పట్లో సీకే దిన్నె తహసీల్దారుగా పని చేసి.. ఇప్పుడు నెల్లూరు జీజీహెచ్ పరిపాలనాధికారిగా విధులు నిర్వహిస్తున్న మహేశ్వర్ రెడ్డి మరింత ముందుకు పోయారు. గత ప్రభుత్వంలో అతను చేసిన మాయలు మరెన్నో ఇప్పుడు వెలుగు చూస్తున్నాయి.

● **హద్దు మీరి చుక్కలు చెరిపారు:** నిషేధిత జాబితాతో పాటు చుక్కల భూముల వ్యవహారాల్లో ఏదైనా చర్యలకు కలెక్టరుకు మాత్రమే అధికారాలుంటాయి. వైకాపా పాలకుల అండతో మహేశ్వర్‌రెడ్డి ఈ విషయాన్ని విస్మరించారు. ఆయన 2020, 2021 సంవత్సరాల్లో తహసీల్దారుగా పని చేసిన సమయంలో తానే కలెక్టర్ స్థాయి అధికారాలను చూపుతూ ఇష్టానుసారంగా భూములను రాసిచ్చారు. నిషేధిత జాబితాలో ఉన్న సర్వే నంబరు 455/5లోని అయిదు ఎకరాల భూమిని డీకేటీ నంబరు 308/78 కింద మారుస్తూ గుప్తల రాయప్పకు, సర్వే నంబరు 455/6లోని డీకేటీ నంబరు 308/78 కింద 1.13 ఎకరాలు గోవింద అంజోరికి అప్పగించారు. ఈ వ్యవహారాన్ని కడప కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీసీఎల్ఏ జయలక్ష్మి తాజాగా మహేశ్వర్‌రెడ్డికి నోటీసులు జారీ చేశారు.

● **చట్టవిరుద్ధంగా మార్పులు.. చేర్పులు:** వెబ్‌ల్యాండ్ రికార్డుల నుంచి పేర్లను ఇష్టారాజ్యంగా తొలగించడం, ఇతరుల పేర్లను చేర్చడం వంటి చర్యలకు మహేశ్వర్‌రెడ్డి పాల్పడినట్లు వెలుగు చూసింది. డీకేటీ పట్టాలు లేని వ్యక్తుల పేర్లను ఆన్‌లైన్ రికార్డుల్లో చట్ట విరుద్ధంగా మార్చారు. సీకే దిన్నె మండలంలో రూ.400 కోట్ల విలువైన భూముల విషయంలో ఇలాంటి వ్యవహారం చారు. 296 ముట్టడిన్నట్లు చేస్తున్నా వాటిలో 96 వరకు అక్రమాలే అని అధికారులు గుర్తించారు. ఎల్లారెడ్డికి 1.23 ఎకరాలు, భాస్కర్‌రెడ్డికి 6.12 ఎకరాలు, ఎ.మాధవికి 7 ఎకరాలు చొప్పున ప్రభుత్వ భూముల్ని కట్టబెట్టేశారు. ఈ విషయమై మాధవి మాట్లాడుతూ.. మహేశ్వరరెడ్డి అక్రమాలు ప్రోత్సహించిన కారణంగా తామూ నష్టపోయామని, ఈ విషయంలో న్యాయ పోరాటం చేస్తున్నట్లు తెలిపారు.

ప్రభుత్వ లక్ష్యాల సాధనకు కార్యాచరణ ప్రణాళిక

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి.. చిత్రంలో కలెక్టర్ శ్రీధర్, అధికారులు

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించేందుకు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో కార్యాచరణ ప్రణాళిక రూపొందించనున్నట్లు మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. జిల్లా స్థాయి అధికారులతో రాయచోటి కలెక్టరేట్లో ఆయన బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన ఏడాదిలోనే అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందుతున్నాయన్నారు. లక్ష్యాల సాధనకు గాను ప్రతి నియోజకవర్గానికి కార్యాచరణ ప్రణాళిక అధ్యక్షుడిగా ఎమ్మెల్యే, ఉపాధ్యక్షుడిగా ఆర్డీవో, సభ్యులుగా తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ఉంటారని వివరించారు. ప్రజాప్రతినిధులు ప్రజల వద్దకు వెళ్లి ప్రభుత్వ పథకాలు అర్హులకు అందుతున్నదీ లేనిదీ స్వయంగా తెలుసుకుంటున్నట్లు తెలిపారు. పింఛన్లకు సంబంధించిన సమస్యలు త్వరితగతిన పరిష్కరించనున్నట్లు చెప్పారు. లక్ష్యాల సాధనకు అధికారులు సమష్టిగా కృషి చేయాలన్నారు. జిల్లాలోని ఆరు నియోజకవర్గాలకు సంబంధించి ముప్ఫై మంది సచివాలయ సిబ్బందిని కార్యాచరణ అమలుకు కేటాయించినట్లు కలెక్టర్ శ్రీధర్ తెలిపారు. సమీక్షలో ఆర్డీవో శ్రీనివాస్, జిల్లా స్థాయి అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న వైవీయూ రిజిస్ట్రార్ పద్మ, ప్రొఫెసర్ కృష్ణారావు

బీఈడీ రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

మారుతీనగర్, న్యూస్‌టుడే: యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ బీఈడీ కళాశాలల్లో రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా పదహారు కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. నిర్వహణ తీరును వైవీయూ రిజిస్ట్రార్ పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కేఎస్వీ.కృష్ణారావు తనిఖీ చేశారు. కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాల, నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల, పలు కేంద్రాల్లో పర్యటించి విద్యార్థుల హాల్‌టికెట్లు, వసతులను పరిశీలించారు. మొదటి రోజు పరీక్షకు మొత్తం 4,551 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

చిరునవ్వుల వరమెప్పుడు!

◆ వెతలు తీర్చని వైకాపా గొప్పలు
◆ పరిశీలించి పట్టించుకోని అధికారులు

చిరు ధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుకు కేటాయించిన స్థలంలో అధికారులు(పాతచిత్రం)

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: రైతులు చిరు ధాన్యాల సాగుకు మొగ్గు చూపుతున్నారు. ఆరుగాలం శ్రమించి పండిస్తున్నారు. తీరా దిగుబడులు చేతికొచ్చిన తర్వాత అమ్ముకోవడానికి తంటాలు పడుతున్నారు. దళారులు అందిన కాడికి తెగనమ్ముకుంటూ నష్టపోతున్నారు. ఈ క్రమంలో చిరు ధాన్యాలు పండించే రైతులకు మేలు చేస్తామంటూ గత వైకాపా ప్రభుత్వం గొప్పలు చెప్పింది. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం పదకొండు చోట్ల చిరు ధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేస్తామని ప్రచారం చేసుకుంది. అందులో భాగంగా పీలేరులో ఒకటి నెలకొల్పుతున్నట్లు తెలుపుతూ.. యూనిట్‌కు రూ.5 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ఆర్భాటం చేసింది.

● **స్థల పరిశీలనతో సంతోషం:** చిరు ధాన్యాల ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు ప్రకటనతో అప్పట్లో ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ అధికారులు కదిలారు. పీలేరులో అందుకు అవసరమైన స్థలం కావాలని కోరారు. స్పందించిన రెవెన్యూ అధికారులు 2023లో పీలేరు - తిరుపతి మార్గంలోని గూడరేవుపల్లె పంచాయతీ సర్వే నంబరు 198లో ఎకరా భూమిని ప్రతిపాదించారు. అనంతరం సంబంధిత అధికారులు సదరు స్థలాన్ని పరిశీలించి బోర్డులు కూడా ఏర్పాటు చేశారు. దీంతో స్థానికంగా పరిశ్రమ ఏర్పాటవుతుందని.. తమ దిగుబడులకు మంచి ధరలు లభిస్తాయని రైతులు సంతోషించారు. అనంతరం యూనిట్ ఏర్పాటు విషయాన్నే వైకాపా ప్రభుత్వం మరిచింది. దీంతో తాము మోసపోయామని కర్షకులు గుర్తించారు.

● **కూటమి పైనే భారం:** పీలేరులో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటుపై కూటమి ప్రభుత్వం దృష్టిసారించాలని రైతులు కోరుతున్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తేవడంలో ప్రస్తుత పాలకులు సఫలీకృతమవుతున్నందున అన్నదాతలు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి కూడా ఈ దిశగా కృషి చేయాలని కోరుతున్నారు. యూనిట్ ఏర్పాటుపై పీలేరు డివిజన్ ఉద్యాన అధికారి సుకుమార్ రెడ్డి మాట్లాడుతూ.. అప్పట్లో ఏర్పాటుకు శంకుస్థాపన చేశామని.. తర్వాత ప్రక్రియ నిలిచిపోయిందన్నారు. పూర్తి నివేదికను కలెక్టర్‌కు అంజేశామని, తదుపరి ఉత్తర్వుల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తూముకుంటలో బయో గ్యాస్ ప్లాంట్

ప్రభుత్వ భూముల పత్రాలు పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాసులు, తహసీల్దార్ భాగ్యలత

గాలివీడు, న్యూస్‌టుడే: భారీ పెట్టుబడితో పరిశ్రమ ఏర్పాటైతే చదువుకున్న పిల్లలకు ఉద్యోగాలొస్తాయి. చుట్టుపక్కల ప్రాంతాల్లో చిన్నాచితకా వ్యాపారాలు వృద్ధి చెంది పలువురి జీవితాలు బాగుపడతాయి. పన్నుల రాబడి అధికమై ప్రభుత్వానికి ఆదాయం సమకూరి అభివృద్ధీ వేగవంతమవుతుంది. ఈ విషయంలో గత వైకాపా ప్రభుత్వం నిర్లక్ష్యం వహించింది. బంగారు అవకాశాలను రాష్ట్రానికి రాకుండా చేసింది. ఇప్పుడు అధికారం చేపట్టిన ప్రభుత్వం.. పెట్టుబడులు రాబట్టేందుకు సిద్ధమైంది. పారిశ్రామికవేత్తలనూ ఆహ్వానిస్తోంది. దీంతో రాష్ట్రం పారిశ్రామికంగా, ఉద్యోగ ఉపాధి అవకాశాల స్వర్గంగా ఎదిగేందుకు అడుగులు పడుతున్నాయి. ఈ క్రమంలో తూముకుంట రెవెన్యూ గ్రామ సమీపంలో బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు రిలయన్స్ సంస్థ ముందుకొచ్చింది. ఈ మేరకు అక్కడి ప్రభుత్వ భూములను రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన భూమి సేకరణ కోసం క్షేత్రస్థాయిలో పర్యటించారు. దస్త్రాలు పరిశీలించి అందుబాటులో భూములున్నట్లు గుర్తించారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ భాగ్యలత, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

చావాలని లేదు.. బతకనిచ్చేలా లేరు

స్వీయ వీడియో రికార్డు చేసి బలవన్మరణం

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: ‘భార్య బిడ్డలతో బతకాలని ఉంది. కానీ ఇతరులు నన్ను బతకనిచ్చేలా లేరు. ఎన్నో కష్టాలు పడుతున్నాను. మోసపోతున్నాను. నా భార్య బిడ్డలకు తోడుగా ఉండాలనుకున్నా. అయినా ఉండలేకపోతున్నా. నేను చనిపోతే కొందరు బాధపడతారు. ఇంకొందరు బాగుపడతారు. నాపై లేనిపోని మాటలు చెబుతున్నారు. నీచంగా తిడుతున్నారు. బతకడం కష్టమనిపిస్తోంది. అప్పులిచ్చిన వాళ్లు ప్రాణం తీస్తున్నారు. వడ్డీలకు వడ్డీలు కట్టాను. అయినా వేధిస్తున్నారు. ఇక బతకడం కష్టం. అందరికీ సెలవు’... అంటూ మదనపల్లెలోని అమ్మినేనివీధికి చెందిన బి.రాజేంద్రప్రసాద్(50) అనే స్థిరాస్తి వ్యాపారి తన కార్యాలయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. ఈ విషాదకర ఘటన బుధవారం చోటుచేసుకుంది. రాజేంద్రప్రసాద్ గత కొంతకాలంగా స్థిరాస్తి వ్యాపారం చేస్తుండగా.. అతనికి సంబంధించి పలు స్థలాలు అమ్ముడు కావడం లేదు. ఈ నేపథ్యంలో అప్పుల వారి వేధింపులు ఎక్కువ కావడం, వడ్డీలకు వడ్డీలు వసూలు చేస్తుండడంతో విసిగి వేసారిపోయారు. కృష్ణానగర్‌లో ఉన్న తన నివాసం పైఅంతస్తులో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. సమాచారం అందుకున్న రెండో పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతుడి చరవాణిలో పరిశీలించగా ఆత్మహత్యకు ముందు రికార్డు చేసిన సెల్ఫీ వీడియో కనిపించింది. దీంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు. రాజేంద్రప్రసాద్‌కు భార్య లత, ఇంటర్ చదువుతున్న కుమార్తె రిషిత ఉన్నారు.

రోదిస్తున్న కుటుంబ సభ్యులు
స్థిరాస్తి వ్యాపారి రాజేంద్రప్రసాద్ (పాత చిత్రం)

చరవాణే సేవలకు మన మిత్రుడు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: పరిపాలనలో విప్లవాత్మక మార్పులకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఇప్పటికే అనేక విధానాలు తీసుకొచ్చింది. ప్రస్తుతం చరవాణి లేని జేబులు.. కానరాని చేతులు ఉండటం లేదు. ఈ నేపథ్యంలో చరవాణి సాయంతో పౌర సహాయక సేవలను వినియోగించుకునే అవకాశాన్ని అమలు చేస్తోంది. ఇందుకుగాను మన మిత్ర(వాట్సప్ గవర్నెన్స్)ను 9552300009 నంబరుతో అందుబాటులోకి తెచ్చింది. తద్వారా పౌరులు కార్యాలయాల మెట్లు ఎక్కకుండానే తమ పనులు చక్కబెట్టుకునే అవకాశం కల్పించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కొన్ని ముఖ్యమైన పౌర సహాయక సేవలను ఓసారి తెలుసుకుందాం...

● **ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు:** ఏదైనా దీర్ఘకాలికంగా పరిష్కారం కాని సమస్య ఉంటే పీజీఆర్ఎస్ పోర్టల్‌లో పౌరులు ఫిర్యాదు చేయొచ్చు. కలెక్టర్ పరిశీలిస్తారు. సంబంధిత శాఖ అధికారులను క్షేత్రస్థాయిలో విచారించి నివేదిక కోరతారు. తదుపరి సదరు ఫిర్యాదు పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.



● **విద్యుత్తు వెతలకు చెల్లు:** విద్యుత్తు బిల్లుల చెల్లింపు, కొత్త కనెక్షన్లు, సరఫరాలో అంతరాయంపై సేవా నంబరు నమోదు చేసి సహాయం పొందే అవకాశం ఉంది.

● **దైవ దర్శనానికి నమోదు:** రాష్ట్రంలో ప్రముఖ ఆలయాల్లో దైవ దర్శన టికెట్లకు చరవాణి ద్వారా నమోదు చేసుకోవచ్చు. మన మిత్ర యాప్‌లో సేవల రకాల సమాచారమూ తెలుసుకునే అవకాశం ఉంది. దర్శనం, వసతి, తేదీ ఎంపిక చేసుకోవచ్చు.



● **వైద్య సేవలు తెలుసుకోవచ్చు:** యాప్‌లో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య కార్డు ద్వారా అందుబాటులో ఉన్న వైద్య సేవలను ఆధార్ సంఖ్యను నమోదు చేసి తెలుసుకోవచ్చు.

● **ఇంటి నుంచే బస్సు టికెట్లు:** జిల్లా నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విజయవాడ తదితర మెట్రో నగరాలకు రాకపోకలు ఎక్కువగా సాగిస్తుంటారు. ప్రభుత్వం సూచించిన మన మిత్ర యాప్ ద్వారా ఎక్కడికి వెళ్లాలన్నా ఇంట్లో నుంచే టికెట్లు నమోదు చేసుకోవచ్చు.

● **ధ్రువపత్రాలు పొందొచ్చు:** ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అవసరమైన రెవెన్యూ ధ్రువపత్రాలు పొందొచ్చు. కుటుంబ సభ్యుల ధ్రువపత్రం, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, నీటి పన్ను, టైటిల్ డీడ్, పట్టాదారు పాసుపుస్తకం, వివాహ ధ్రువపత్రం, కంప్యూటరైజ్డ్ అడంగల్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు పొందవచ్చు.

● **ఆదుకునే పోలీసులు:** ఆపద అంటే మొదట గుర్తుకొచ్చేది పోలీసులే. ఎవరైనా అదృశ్యమైనా, ధ్రువపత్రాలు, వస్తువులు పోగొట్టుకున్నా మన మిత్ర యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. అందుకు ఆధార్, ఇతర వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

● **పన్నుల వివరాలు:** నీటి, ఆస్తి పన్ను, కుళాయి కనెక్షన్లు, మురుగు నీటి సమస్యలు, నిర్మాణాలకు అనుమతులు, నీటి ఛార్జీల బకాయిలు మన మిత్ర ద్వారా తెలుసుకోవచ్చు.

విద్యార్థుల జీవితాలతో వైకాపా చెలగాటం

కడప (మారుతీనగర్), న్యూస్‌టుడే: విద్యార్థుల జీవితాలతో గత వైకాపా ప్రభుత్వం చెలగాటమాడిందని.. వైఎస్సార్ ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయం పేరుతో అనుమతులు లేకుండా నడిపి ఐదు వందల మంది బతుకులను అగమ్యగోచరంగా మార్చిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు విమర్శించారు. కడప నగరం సమీపంలోని విశ్వవిద్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి ఆయన బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వలరాజు మాట్లాడుతూ.. పది రోజుల్లో విద్యా సంవత్సరం పూర్తి కావస్తున్నప్పటికీ విశ్వవిద్యాలయానికి సీవోఏ అనుమతులు లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయంపై విద్యార్థులు ఆందోళన చెందుతుంటే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతి గృహానికి ముందస్తుగా విద్యార్థుల నుంచి డబ్బులు కట్టించుకుని.. ముందస్తు సమాచారం లేకుండా ఇప్పుడు ఖాళీ చేయాలని చెప్పడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి విశ్వవిద్యాలయంపై సమగ్ర విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు చంద్ర, అరుణ్, నగర కార్యదర్శి తేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి గడపకు సంక్షేమ ఫలాలు

ప్రచార కరపత్రాలు ఆవిష్కరిస్తున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు జగన్ మోహన్ రాజు, నాయకులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు అర్హత ఉన్న ప్రతి గడపకూ అందించనున్నట్లు తెదేపా అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్ మోహన్ రాజు తెలిపారు. మండలంలోని కొత్త మాధవరంలో నూతనంగా ఏర్పాటు చేసిన చౌక ధరల దుకాణాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు ప్రచార కరపత్రాలను ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం జగన్‌మోహన్ రాజు మాట్లాడుతూ.. గత వైకాపా పాలనలో ప్రభుత్వ నిధులను మింగేశారని, ప్రకృతి వనరులను విధ్వంసం చేశారని విమర్శించారు. వైకాపా నేతలు ఉగ్రవాదుల కంటే ప్రమాదకరమని ఆరోపించారు. సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తుండటంతో పేదల మోముల్లో రెట్టింపు సంతోషం కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు గజ్జల నరసింహారెడ్డి, కొత్తపల్లి బొబ్బిలి రాయుడు, నామాల వెంకటయ్య, నామాల వెంకట సుబ్బయ్య, ఎస్వీ రమణ, ప్రతాప్‌రాజు, సుబ్రహ్మణ్యం నాయుడు, గంజి సుబ్బరాయుడు, కుమార్, ఆలూరి వెంకట సుబ్బయ్య, ఆలూరి ప్రసాద్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

శ్రావణ మాస ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

చక్రాయపేట, వేంపల్లె, న్యూస్‌టుడే : జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం గండిక్షేత్రంలో ఈ నెల 26 నుంచి జరగనున్న శ్రావణమాస ఉత్సవాల కోసం పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం గండిలో శ్రావణమాస ఉత్సవాల ఏర్పాట్లపై ఆలయ కమిటీ ఛైర్మన్ కావలి కృష్ణతేజ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రావణమాసాల్లో గండికి వచ్చే వీఐపీలకు పరిమిత సంఖ్యలో మాత్రమే పాసులివ్వాలని సూచించారు. సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా వాహన పూజలను రద్దు చేయాలన్నారు. గండిలోని హరిత రెస్టారెంట్ నుంచి భూమానంద ఆశ్రమం వరకు ఉన్న కాలువలో పూడికతీత పనులు చేయించాలన్నారు.

చిన్నారులకు ఉల్లాసమేదీ!

◆ కేంద్రాలకు సరఫరా కాని పరికరాలు
◆ ఆటలకు నోచని అంగన్‌వాడీ బాలలు

చిన్నమండెంలోని ఓ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు

- జిల్లాలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు: 11
- అంగన్‌వాడీ కేంద్రాలు: 1,858 (ప్రధాన), 417(మినీ)
- ప్రీ స్కూల్ పిల్లలు: దాదాపు 90 వేలకు పైగా
- సొంత భవనాలున్నవి: 1,017
- అద్దె భవనాల్లో నడుస్తున్నవి: 833
- ప్రభుత్వ, పాఠశాలల్లో నిర్వహిస్తున్నవి: 425

రాయచోటి, చిన్నమండెం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లోని బాలలు.. ఆటపాటలకు నోచుకోవడం లేదు. ఈ విద్యా సంవత్సరంలో చిన్నారులకు అవసరమైన ఆట వస్తువులను ప్రభుత్వం సరఫరా చేయలేదు. గతంలో ఇచ్చినవి చాలా వరకు దెబ్బతిన్నాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ప్రీ స్కూల్ పిల్లలకు ఆట పాటలతో కూడిన విద్య అందించాలన్న లక్ష్యం నెరవేరడం లేదు. అసౌకర్యాల మధ్య.. పౌష్టికాహారంతో సరిపుచ్చుకోవాల్సి వస్తోంది.

● **మైదానాలూ కానరావు:** జిల్లాలో 833 కేంద్రాలు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. అద్దె లేకుండా ఇతర ప్రభుత్వ, పాఠశాలల గదుల్లో 425 కేంద్రాలను నిర్వహిస్తున్నారు. వీటిల్లో చాలా వాటికి క్రీడా మైదానాలు లేవు. సొంత భవనాలున్న చోట కూడా అదే పరిస్థితి. గతంలో కేంద్రాలకు జారుడు బల్ల, కదిలే బొమ్మలు, చిన్న కుర్చీలు, ఊయల, రింగులు, ప్లాస్టిక్ బ్యాట్లు, బంతులు వంటి ఆట పరికరాలు వచ్చేవి. నేడు కొన్ని కేంద్రాల్లో వాటి ఊసే కనిపించడం లేదు.

● **బలోపేతం దిశగా కూటమి చర్యలు:** ఆట పరికరాలు లేకపోవడంతో చాలా కేంద్రాల్లో చిన్నారులకు కేవలం పౌష్టికాహారం అందించి చేతులు దులుపుకొంటున్నారు. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం కేంద్రాల బలోపేతానికి చర్యలు చేపట్టింది. ఆ మేరకు మినీలను మెయిన్ కేంద్రాలుగా మార్చే ప్రక్రియ మొదలు పెట్టింది. ఆ తర్వాత అయినా చిన్నారులకు అవసరమైన ఆట పరికరాలు అందిస్తే ఎంతో మేలని తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై ఐసీడీఎస్ పీడీ ఉమాదేవి మాట్లాడుతూ.. చాలా కేంద్రాల్లో ఆట వస్తువుల కొరత లేదని, ఎక్కడైనా ఉంటే పరిశీలించి అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

గాలిలో వేలాడిన ప్రాణం

తీగల్లో చిక్కుకుని విద్యుత్తు స్తంభంపై వేలాడుతున్న వెంకట రమణ

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే: పొట్ట కూటి కోసం పనులు చేస్తున్న ఓ కూలీ ప్రాణాలు కొద్దిసేపు చిక్కుల్లో పడ్డాయి. అనుకోని ప్రమాదంతో గాలిలో దీపంలా వేలాడాయి. ఈ సంఘటన మదనపల్లె పట్టణంలో బుధవారం చోటుచేసుకుంది. వెంకట రమణ అనే వ్యక్తిది నిమ్మనపల్లె మండలం తవళం పంచాయతీ ఉంటావారిపల్లె. ఇతను ఓ విద్యుత్తు గుత్తేదారు వద్ద కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. పట్టణంలోని ఎన్టీఆర్ కూడలిలో ఉన్న స్తంభాన్ని టిప్పర్ ఢీకొట్టడంతో విరిగిపోయింది. వేలాడుతున్న తీగలను మరో స్తంభానికి అమర్చేందుకు విద్యుత్తు అధికారులు చర్యలు చేపట్టారు. ఈ పనులు చేసేందుకు వచ్చిన వెంకట రమణ.. స్తంభం ఎక్కి తీగలు లాగేందుకు యత్నించారు. ఈ సమయంలో పైన వెళ్తున్న తీగలు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యారు. అదుపు తప్పి ఆ దిగువన ఉన్న డిష్, నెట్ తీగల్లో చిక్కుకుని గాలిలో వేలాడుతూ ఉండిపోయారు. తోటి కూలీలు కిందికి దించి ఆసుపత్రికి తరలించి చికిత్స అందించడంతో ప్రాణాలతో బయట పడ్డారు. మరమ్మతులు చేపట్టే సమయంలో విద్యుత్తు సరఫరా కావడంపై పలువురు మండిపడుతున్నారు. అధికారులు కూలీల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి : కడప : 99899 97626
మదనపల్లి : 80080 01768

(c) eenadu

ప్రజల చెంతకు అభివృద్ధిని చేర్చేందుకే సుపరిపాలనలో తొలి అడుగు

సంబేపల్లె(రాయచోటి), న్యూస్‌టుడే: ప్రభుత్వం ఏడాది పాలనలోనే చేసిన అభివృద్ధిని ప్రజల చెంతకు తీసుకెళ్లేందుకే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం కూటమి ప్రభుత్వం చేపడుతోందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. సంబేపల్లె మండలం దేవపట్లలో బుధవారం ఆయన ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం తెదేపా జెండాను ఆవిష్కరించి ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించారు. రౌతుకుంటలోని ఎంపీపీ స్కూల్ వద్ద ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు తీగలను తక్షణం తొలగించాలని అధికారులను ఆదేశించారు. మావాండ్లపల్లి, బోయపల్లి, రైతుకుంట కస్పా, వంగిమళ్ల వాండ్లపల్లిలో ఇంటింటికీ తిరిగారు. నూతనంగా నిర్మించిన పశువుల నీటి తొట్టెలను ప్రారంభించారు. అనంతరం యండపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎగువ దళితవాడలో తాగునీటి బోరును ప్రారంభించారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై రూపొందించిన కరపత్రాన్ని అందజేస్తున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి

అరుణాచలానికి ప్రత్యేక బస్సు

మదనపల్లె అర్బన్, న్యూస్‌టుడే : పౌర్ణమి సందర్భంగా అరుణాచలం ఆలయానికి గిరి ప్రదక్షిణార్థం వెళ్లే ప్రయాణికుల కోసం అల్ట్రా డీలక్స్ బస్సు ఏర్పాటు చేశామని డిపో మేనేజరు ఎం.వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ బస్సు ఈ నెల 10న మదనపల్లెలో ఉదయం 9 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా పేర్లను నమోదు చేసుకోవచ్చని, ఇతర వివరాలకు 1వ డిపో కార్యాలయంలో సంప్రదించవచ్చని డీఎం తెలిపారు.

నవోదయం... భవితకు శుభోదయం

మదనపల్లి విద్య, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే నవోదయ విద్యాలయంలో 2026-27లో 6వ తరగతిలో ప్రవేశానికి గాను విద్యాలయ సమితి వారు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించారు. ఇప్పటికే ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ప్రైవేటు, ఎయిడెడ్, ప్రభుత్వ విద్యా సంస్థల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం ప్రారంభించారు. నవోదయ విద్యాలయం వారు నిర్వహించే ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు ఉచిత విద్యను అభ్యసించవచ్చు. క్రమశిక్షణతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉంటూ చదువుకునే వెసులుబాటు ఉంటుంది. అందుకే నవోదయ విద్యాలయానికి ప్రతి సంవత్సరం పోటీ పెరుగుతోంది. ఉమ్మడి కడప జిల్లాలో రాయచోటి మండలం ఆకేపాడులో, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మదనపల్లెలో నవోదయ విద్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఒక్కోచోట 80 సీట్ల భర్తీకి గాను ప్రతి ఏటా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో సీటు పొందేందుకు ఏటా 6 వేల నుంచి 7 వేల మంది విద్యార్థులు పోటీ పడతారు. అందులో అత్యధిక మార్కులు సాధించిన వారికే సీటు లభ్యం అవుతుంది. అందుకే ఇప్పటి నుంచే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు దృష్టి పెడితే సీటు సాధించడం సులభం అవుతుందని నిపుణులు చెబుతున్నారు.

ఎన్‌సీసీలో శిక్షణ తీసుకుంటున్న విద్యార్థినులు

విద్యాలయంలో ఉన్న సదుపాయాలివి..

మదనపల్లె జవహర్ నవోదయ విద్యాలయం పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంది. అత్యాధునిక ల్యాబ్ సౌకర్యాలు, విశాలమైన గదులు, కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు భౌతిక, జీవశాస్త్ర ల్యాబ్‌లు, దీంతో పాటు అటల్ టింకరింగ్ ల్యాబ్ అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా ఆధునాతన నైపుణ్యాలను పెంపొందించవచ్చు. అదనంగా విశాలమైన క్రీడా మైదానం, రన్నింగ్‌ట్రాక్ ఉన్నాయి. ఏటా విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొని అత్యధిక బహుమతులను సాధిస్తున్నారు. ప్రతి విద్యార్థి ఏదో ఒక ఆటలో రాణించేలా శిక్షణ ఇస్తున్నారు. ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అలాగే విద్యార్థులకు నృత్యం, సంగీతంలో శిక్షణ ఇచ్చి కళా ఉత్సవ్ వేదికగా వివిధ పోటీల్లో పాల్గొనేలా నైపుణ్యాలను పెంపొందిస్తున్నారు. దక్షిణ, అవంతి ఫౌండేషన్ సహకారంతో జేఈఈ, నీట్ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు మేటి విద్యార్థులకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు. అలాగే ఖాన్ అకాడమీ వారు గణితంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్నారు. త్రిభాషా సూత్రం ద్వారా ఆంగ్లం, హిందీ, తెలుగు ద్వారా విద్యార్థులకు విద్యాబోధన ఉంటుంది. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన అందిస్తున్నారు. అమ్మాయిలకు, అబ్బాయిలకు ప్రత్యేకమైన వసతి గృహాలు, డార్మిటరీలు అందుబాటులో ఉన్నాయి. అలాగే విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు స్థానికంగా పండించే కూరగాయలను వినియోగిస్తున్నారు. ఆయుర్వేద మొక్కలు పెంచుతున్నారు. గణిత గార్డెన్ అందుబాటులో ఉంది. చిత్రలేఖనంలోనూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. నవోదయ విద్యాలయంలో సీటు సాధిస్తే ఏడేళ్ల పాటు ఉచిత విద్యతో పాటు వసతి, దుస్తులు, పుస్తకాలు, బ్యాగులు అన్నీ ప్రభుత్వం నుంచే అందిస్తారు.

ఈ నెల 29 వరకు గడువు

విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి గాను ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. ఈ ఏడాది డిసెంబరు 13వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుంది. గ్రామీణ విద్యార్థులకు 75 శాతం సీట్లు, పట్టణ ప్రాంతాల వారికి 25 శాతం సీట్లు కేటాయించడం జరుగుతుంది. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు http://cseitems.rcil.gov.in/nvs వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

\- ఎం.గీత, ప్రిన్సిపల్, నవోదయ విద్యాలయం, మదనపల్లె

జగన్ మాటలు బాధ్యతా రాహిత్యం

ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో తెదేపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతోందని, ఇప్పటికే అన్నీ చేసేయాలని, సంక్షేమం ఏం జరగలేదని ప్రతిపక్ష నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆరోపించడం బాధ్యతా రాహిత్యమని పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. తెదేపా రాష్ట్ర పరిశీలకులు, పీలేరు నియోజకవర్గ పరిశీలకుడు సుధాకర్‌రెడ్డితో కలిసి స్థానిక మార్కెట్ కమిటీ కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ఏడాదిలోనే రాష్ట్ర రాజధాని, జాతీయ ప్రాజెక్టు పోలవరాన్ని నిర్మించడంతో పాటు పారిశ్రామిక రంగంలో ప్రభుత్వం దూసుకుపోతోందన్నారు. ఇంకో నాలుగేళ్లలో అభివృద్ధి, సంక్షేమం ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చునన్నారు. రాష్ట్రంలో వైకాపా పాలనలో ఆర్థిక ఇబ్బందులున్నా సూపర్ సిక్స్ పథకాలు తెదేపా ప్రభుత్వం అందించి తీరుతుందన్నారు. ఇప్పటికే కొన్ని పథకాలు అమల్లో ఉన్నాయని, రాబోయే రెండు మూడు మాసాల్లో మరో రెండు పథకాలు అమలు చేయనున్నాయని తెలిపారు. ఏదైనా కాలంలోనే దేశంలో ఏ ప్రభుత్వం చేయని అభివృద్ధి, సంక్షేమాన్ని కూటమి ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. కార్యక్రమంలో నాయకులు కంభం నిరంజన్‌రెడ్డి, వల్లిగట్ల వెంకట్రమణ, నౌషాద్, మల్లికార్జునరెడ్డి, కృష్ణారెడ్డి, రాజేంద్రనాథ్, శేషారెడ్డి, గాండీవ రమణ, మురళి, దామోదర్రెడ్డి, సయ్యద్ బాషా, డిష్ బ్రదర్స్, బొజ్జసం బ్రదర్స్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే నల్లారి కిషోర్‌కుమార్‌రెడ్డి, తెదేపా రాష్ట్ర పరిశీలకుడు సుధాకర్‌రెడ్డి

మంగపట్నం టోల్ ప్లాజా ప్రారంభం

కొండాపురం : కడప-తాడిపత్రి ప్రధాన జాతీయ రహదారిలోని ముద్దనూరు నుంచి తాడిపత్రి వరకు ఇటీవల నాలుగు వరుసల రోడ్డు నిర్మించారు. మార్గమధ్యంలోని మంగపట్నం వద్ద టోల్‌ప్లాజా ఏర్పాటు చేయగా బుధవారం ఎన్‌హెచ్ ఏఐ (అనంతపురం) పీడీ తరుణ్‌కుమార్, ఏపీడీ మురళీకృష్ణ, డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్‌హెచ్ ఏఈ సురేంద్రరెడ్డి ప్రారంభించారు. ఈ మార్గంలో వెళ్లే వాహనాలకు బట్టి రుసుం వసూలు చేస్తున్నారు. టోల్‌ప్లాజాలో ఎనిమిది వాహనాలు వెళ్లడానికి.. మరో ఎనిమిది రావడానికి.. ఒకే సారి పదహారు వరకు రాకపోకలు సాగించడానికి వీలుగా తీర్చిదిద్దారు.

మహారాష్ట్ర రోడ్డు ప్రమాదంలో ములకలచెరువు వాసి మృతి

ములకలచెరువు, న్యూస్‌టుడే: మహారాష్ట్రలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ములకలచెరువు వాసి మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. వినాయక నగర్‌లో నివాసం ఉంటున్న రమణ (45)కు ఎరువుల ఫ్యాక్టరీతో పాటు తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దులో నర్సరీలున్నాయి. వాటి నిర్వహణలో భాగంగా మంగళవారం గుడిహత్నూర్ మార్గంలో రమణ ప్రయాణిస్తున్న బొలెరో వాహనాన్ని మహారాష్ట్ర బస్సు ఢీకొంది. ప్రమాదంలో రమణ తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని బుధవారం ములకలచెరువుకు తీసుకువచ్చిన బంధువులు అంత్యక్రియలు నిర్వహించారు. తంబళ్లపల్లె తెదేపా ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డి రమణ భౌతికకాయాన్ని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడికి ఇద్దరు భార్యలు, నలుగురు పిల్లలు ఉన్నారు.

రమణ (పాత చిత్రం)

అనుమానాస్పద స్థితిలో రైతు...

వీరబల్లి : మామిడి తోటకు నీరు పెట్టేందుకు వెళ్లిన రైతు విగత జీవిగా కనిపించిన సంఘటన వీరబల్లి మండలం నల్లపర్వతయ్యగారిపల్లిలో చోటు చేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రైతు పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి (70) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం తన మామిడి తోటకు నీరు పెట్టేందుకు వెళ్లారు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా విగత జీవిగా కనిపించారు. సమాచారం అందుకున్న రాయచోటి గ్రామీణ సీఐ వరప్రసాద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. ముఖం, వెన్నెముక భాగాల్లో విద్యుత్తు ప్రమాదానికి గురై కాలిన గాయాలున్నట్లు గుర్తించారు. స్థానికులను విచారించారు. ఎవరైనా చంపి పడేశారా? సమీప పొలాల రైతులు పంటల రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్తు తీగలకు తగిలి చనిపోతే తన పొలంలో పడేశారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఆయన కుమారుడు పెద్దిరెడ్డి మల్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదుతో అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. ఎస్సై నరసింహారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడి యువకుడు..

కలికిరి గ్రామీణ : వాల్మీకిపురం మండలం గండబోయనపల్లె సమీపంలోని జాతీయ రహదారిపై టోల్‌గేటు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వినేష్ (28) చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మంగళవారం రాత్రి ద్విచక్ర వాహనంపై మదనపల్లె నుంచీ కలికిరికి వస్తుండగా కర్ణాటకకు చెందిన వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని తిరుపతికి తరలించి చికిత్స చేయిస్తుండగా తుదిశ్వాస విడిచాడు. మృతుడు కలికిరి సర్పంచి ఎల్లయ్య కుమారుడు. ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి, కలికిరి పంచాయతీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు రెడ్డివారి యోగేష్‌రెడ్డిలు సర్పంచి ఎల్లయ్యను పరామర్శించి ఓదార్చారు.

వినేష్ (పాతచిత్రం)

జలపాతంలో మునిగి ఒకరి దుర్మరణం...

యర్రావారిపాలెం : తలకోన జలపాతం వద్ద నీటిలో దిగి యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. మదనపల్లెకు చెందిన సాహిల్ (20) తన మిత్రులతో కలసి తలకోన సందర్శనకు వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం జలపాతం వద్ద సరదాగా అందరూ కలసి ఈత కొట్టారు. లోతు ఉండదనే అభిప్రాయంతో ఈత రాని సాహిల్ నీటిలో దిగడంతో ప్రవాహం ధాటికి బండరాళ్లలో ఇరుక్కుపోయి మృతి చెందినట్లు ఎస్సై బాలకృష్ణ తెలిపారు. మృతదేహం వెలికితీయడానికి సమయం పడుతుందన్నారు. స్థానికంగా పర్యాటకశాఖ మనిషికి రూ.30 చొప్పున వసూలు చేస్తున్నా ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదని, కనీసం అందుబాటులో ఉండటం లేదని, హెచ్చరిక బోర్డులు సైతం లేవని పలువురు ఆరోపించారు.

వేధింపులు తాళలేక మహిళ బలవన్మరణం

లత (పాత చిత్రం)

రామాపురం, న్యూస్‌టుడే: మండలంలోని కుమ్మరిపల్లె పంచాయతీ మన్నేరువాండ్లపల్లెకు చెందిన మన్నేరు లత (38) అనే మహిళ విషద్రావణం తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. లతకు కొంత కాలం కిందట భర్త చనిపోయారు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కొన్ని రోజులుగా తనను ప్రేమించాలని వేధింపులకు గురి చేస్తుండటంతో ఆమె మనోవేదనకు గురయ్యారు. ఈ విషయం కుటుంబ సభ్యులకు చెప్పుకోలేక మంగళవారం ఇంట్లోనే విష ద్రావణం తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు వేలూరు సీఎంసీ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటసుధాకర్‌రెడ్డి తెలిపారు.

శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం

గండిక్షేత్రము, మారెళ్ళమడక (గ్రా॥), చక్రాయపేట (మం), వై.యస్.ఆర్. కడప జిల్లా, ఫోన్ : 9676661801, e-mail aceosrigandiveeranjaneyaswamy@gmail.com

"రెండవ పర్యాయము" సీల్డ్ టెండరు ప్రకటన

శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానము, గండిక్షేత్రం నందు శ్రావణమాస ఉత్సవములు పురస్కరించుకుని 25.07.2025 నుండి 23.08.2025 వరకు అవసరముల మేరకు ప్రత్యేక పూల అలంకరణ, విద్యుత్ దీపాలంకరణ, చలువ పందిర్లు, బారికేడ్స్ ఏర్పాట్లకు సంబంధించి సీల్డ్ టెండర్ల ద్వారా లీజు ఇచ్చుటకు 08.07.2025వ తేదీన మంగళవారం మధ్యాహ్నం 12.00 గంటలకు సీల్డ్ టెండర్లు నిర్వహించబడును. సదరు సీల్డ్ టెండర్ల యందు పాల్గొనుటకు ఆసక్తి గల టెండరుదారులు సదరు హక్కులకు సంబంధించిన టెండరు షెడ్యూలు దేవస్థానము కార్యాలయము పనివేళల యందు 03.07.2025 నుండి 07.07.2025 సాయంత్రం 5.00 గంటల వరకు పొందవచ్చును. 08.07.2025వ తేదీన ఉదయం 11.00 గంటలవరకు దేవస్థానము కార్యాలయము నందు టెండరు బాక్సు నందు సీల్డ్ టెండర్లు వేయవలెను. మిగతా వివరములకు దేవస్థానము కార్యాలయము నందు సంప్రదించవలెను.

చైర్మన్ మరియు పాలకమండలి సభ్యులు | సహాయ కమిషనరు & కార్యనిర్వహణాధికారి

సీఎస్ వీడియో కాన్ఫరెన్స్‌కు నివేదికలు సిద్ధం చేయాలి

రాయచోటి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ప్రాధాన్యం కార్యక్రమాలు, నిర్దేశించిన లక్ష్యాలు, ప్రగతి సాధనపై సమగ్ర నివేదికలు సిద్ధం చేయాలని కలెక్టర్ శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో బుధవారం ఆయన మాట్లాడారు. ఈ నెల 3న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిర్వహించే వీడియో కాన్ఫరెన్స్ ఉంటుందని.. సంబంధించిన అంశాలపై అధికారులతో ఆయన సమీక్షించారు. అన్న క్యాంటీన్లలో రుచికరమైన ఆహారం అందించడంతో పాటు శుచి శుభ్రతపై దృష్టి సారించేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఆర్వో మధుసూదన్‌రావు, జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

తలొగ్గిన తంబళ్లపల్లె వైకాపా నేతలు!

తెదేపా వర్గాల ఇళ్ల మార్గంలో రాళ్లు తొలగింపు

ఈనాడు, కడప: తంబళ్లపల్లె వైకాపా నేతలు ఎట్టకేలకు తలొగ్గారు. తెదేపా కార్యకర్తల ఇంటి దారికి అడ్డంగా వేసిన రాళ్లను చిన్న వెంకటరామన్నగారిపల్లెలో తొలగించారు. పీటీఎం మండల పోలీసులు బుధవారం గ్రామానికి వెళ్లి వైకాపా నేతల చర్యపై ఆరా తీయడంతో పాటు వెంటనే రాళ్లు తొలగించాలని వారిని హెచ్చరించారు. ఇలాంటి అనాగరిక చర్యలకు భవిష్యత్‌లో పాల్పడే పక్షంలో కఠిన చర్యలకు గురి కావాల్సి ఉంటుందని హెచ్చరించారు. 'ఈనాడు'లో మంగళవారం 'తంబళ్లపల్లెలో అదే తాలిబన్ల రాజ్యం' శీర్షికన ప్రచురితమైన కథనంపై పోలీసులు స్పందించారు. తెదేపా కార్యకర్తలతో పాటు గ్రామంలోని ప్రజలకు రాకపోకలకు సౌలభ్యం కల్పించారు.

చిన్న వెంకటరామన్నగారిపల్లె రహదారిపై రాళ్ల తొలగింపు

బుద్ధుడి విగ్రహం ధ్వంసం

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : మండలంలోని వేంపల్లె సమీపంలోని బుద్ధునికొండపై ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దిమ్మెపై ఉన్న విగ్రహాన్ని కిందకు తోసేసి తలను నరికి కాళ్ల దగ్గర పెట్టారు. గతంలో కూడా ఇక్కడ ఉన్న విగ్రహాన్ని పాక్షికంగా ధ్వంసం చేశారు. దీనిపై నాగలోకం బుద్ధవిహార్ ఫౌండర్ ట్రస్టీ పీటీఎం శివప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జరిగిన ఘటనపై ఫిర్యాదు చేసినా పోలీసులు సరైన రీతిలో స్పందించకపోవడంతోనే నేడు మళ్లీ ధ్వంసం చేశారని అభిప్రాయపడ్డారు. పోలీసులు చట్టపరిధిలో తగు చర్యలు తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్ఠమైన చర్యలు చేపట్టాలని కోరారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

బి.కొత్తకోట, న్యూస్‌టుడే: మత్తు పదార్థాల ఉచ్చులో విద్యార్థులు చిక్కుకుని జీవితాన్ని నాశనం చేసుకోవద్దని బి.కొత్తకోట సీఐ జీవన్ గంగానాథ్ బాబు పిలుపునిచ్చారు. బి.కొత్తకోట సుంకు జూనియర్ కళాశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు.

మంత్రి దృష్టికి వైద్య కళాశాల, ప్రభుత్వాసుపత్రి సమస్యలు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : మదనపల్లె వైద్య కళాశాల, ప్రభుత్వాసుపత్రి సమస్యలను మదనపల్లెకు చెందిన నాయకులు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ దృష్టికి తీసుకెళ్లారు. భాజపా సీనియర్ నాయకుడు చల్లపల్లె నరసింహారెడ్డి, ఎన్.సేతు, డాక్టర్లు అజ్మతుల్లాఖాన్, బాబు మంత్రిని విజయవాడలో కలిశారు. ఈ సందర్భంగా మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో పలు సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని బురకాయలకోటలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఏర్పాటు చేయించాలని మంత్రిని కోరారు. మదనపల్లెలో వైద్య కళాశాలను అర్ధాంతరంగా ఆపేశారని దీనిపై ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకుని ఈ ప్రాంత ప్రజలకు న్యాయం చేయాలని కోరారు. మనదపల్లె ప్రభుత్వాసుపత్రిలో అనేక సమస్యలున్నాయని వాటన్నింటినీ పరిష్కరించడానికి చర్యలు చేపట్టాలని కోరారు. బురకాయలకోటలో త్వరలోనే ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ఏర్పాటు చేయిస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు.

★ భాజపా నాయకులు, కురబ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు, భువనేశ్వరి సత్య వైద్యఆరోగ్యశాఖమంత్రి సత్యకుమార్‌ను కలిశారు. బుధవారం విజయవాడలోని మంత్రి ఛాంబరుకు వెళ్లి శాలువ కప్పి సన్మానించారు. మంత్రికి పలు సమస్యలను విన్నవించారు.

వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌తో మదనపల్లె నాయకులు

అధికారుల నిర్లక్ష్యంపై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం కారణంగానే రోజువారీగా కూలీలు తీవ్ర గాయాల పాలవుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శి పి.శ్రీనివాసులు అన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్టీఆర్ కూడలిలో విద్యుదాఘాతానికి గురై తీవ్రంగా గాయపడిన వెంకటరమణను ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యుత్ అధికారులు ఇష్టం వచ్చినట్లు ఎల్సీలు తీసుకోవడం, తీసుకున్న వాటిపై స్పష్టత లేకపోవడం కారణంగా వెంకట రమణ గాయాలపాలయ్యారన్నారు. ట్రాన్స్‌కో డీఈ గంగాధరం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, సచివాలయం గ్రేడ్-2 జేఎల్ఎంలకు కూడా ఎల్‌సీలు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేయడం అంటే ప్రజలపైన ఆయనకు ఉన్న అభిప్రాయం ఏమిటో అర్థం చేసుకోవాలన్నారు. గాయపడిన ఆసుపత్రి పాలైన వెంకటరమణ అధికారులు ఎవరూ పరామర్శించకపోవడం దారుణమన్నారు. కలెక్టర్ జోక్యం చేసుకుని విద్యుత్ అధికారుల తీరుపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో గాయపడిన వెంకట రమణకు వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 లక్షలు ఇవ్వాలని కోరారు. లైన్ ఇన్‌స్పెక్టర్, సచివాలయ జేఎల్ఎంను సస్పెండ్ చేయాలని కోరారు.



వెంకట రమణతో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు

ఎస్సై స్పందనతో నిలిచిన యువకుడి ప్రాణం

ములకలచెరువు, న్యూస్‌టుడే: ఎస్.ఐ నరసింహుడు చొరవ ఓ యువకుడి ప్రాణం నిలిచింది. సరైన సమయానికి స్పందించి ఆత్మహత్యకు యత్నించిన యువకుడి ప్రాణాలను కాపాడిన ఎస్.ఐ నరసింహుడును పలువురు అభినందిస్తున్నారు. వివరాలివి... ములకలచెరువు ఉమాశంకర్ కాలనీకి చెందిన సాయికుమార్ గుజిరి వ్యాపారి. ఇతడికి భార్య రోజాతో పాటు 15 రోజుల కుమార్తె ఉన్నారు. కుటుంబ సమస్యల కారణంగా భార్యభర్తలిద్దరు వాదులాడుకున్నారు. మనస్తాపం చెందిన సాయికుమార్ సమీపంలో ఉన్న రైలు పట్టాల మీదకు వెళ్లి ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నాడు. పట్టాల మీద పడుకొని ఉండగా గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్.ఐ నరసింహుడు ఘటనా స్థలానికి చేరుకుని యువకుడిని పట్టాల మీద నుంచి పక్కకు తీసుకుళ్లాడు. ఇదే సమయంలో ముంబయి నుంచి నాగర్‌కోయిల్‌కు వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలు రావడంతో ప్రమాదం తప్పింది. అనంతరం యువకుడిని, అతడి కుటుంబ సభ్యులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు.

రైల్వేట్రాక్‌పై యువకుడిని తరలిస్తున్న ఎస్సై నరసింహుడు

రిటైల్ దుకాణాల్లోనే మద్యం కొనుగోలు చేయాలి

రాయచోటి, న్యూస్‌టుడే: ఎక్సైజ్ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన రిటైల్ దుకాణాలలోనే మద్యం కొనుగోలు చేయాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్‌రావు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనధికార వ్యక్తుల వద్ద మద్యం కొనడం ప్రమాదకరమన్నారు. అటువంటి మద్యం నకిలీది కావచ్చని ఆయన పేర్కొన్నారు. వివాహాలు, సామూహిక వేడుకల సందర్భాలలో మద్యంను తగ్గింపు ధరలకు సరఫరా చేసే వారు మోసం చేసే అవకాశం ఉందన్నారు. నకిలీ మద్యం ఆరోగ్యానికి హాని కలిగిస్తుందని.. అనధికారికంగా బయట మద్యం విక్రయించే వ్యక్తుల వివరాలను వెంటనే టోల్ ఫ్రీ నెంబరు 14405 ఎక్సైజ్ శాఖకు తెలియజేయాలని ఆయన కోరారు.

12, 13 తేదీల్లో బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపికలు

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : ఉమ్మడి కడప జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలను ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి తెలిపారు. అండర్-15, 17 విభాగాలకు చెందిన బాలబాలికలకు ఈ నెల 12న కడప డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో, 13న ప్రొద్దుటూరులోని జార్జ్‌క్లబ్‌లో అండర్-11, 13 విభాగాలకు ఎంపికలు జరుగుతాయన్నారు. బాల బాలికలకు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో వేర్వేరుగా పోటీలు నిర్వహించి జిల్లా జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఎంపికల్లో పాల్గొనేవారు ఈ నెల 10వ తేదీ సాయంత్రం లోపు తమ పేర్లను 94401 07080, 94402 23908 నంబర్లకు పంపించాల్సి ఉంటుందన్నారు. డబుల్స్ విభాగంలో పాల్గొనే వారు తమ జోడీ పేరును తప్పనిసరిగా జతచేసి పంపించాల్సి ఉంటుందన్నారు. సింగిల్స్ విభాగంలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు, డబుల్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించిన జోడీ మాత్రమే రాష్ట్రస్థాయి పోటీలకు అర్హులన్నారు.

ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకు విధుల్లోకి రావాలి

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : పురపాలక సంఘం ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలపై ప్రభుత్వం నిర్ణయం తీసుకునే వరకు సమ్మెలో ఉన్న కార్మికులు విధుల్లోకి వచ్చి తాగునీరు, వీధిదీపాల నిర్వహణను చేపట్టాలని కమిషనర్ ప్రమీల ఐకాస నాయకులకు సూచించారు. కార్మికులు కార్యాలయం ఎదుట చేస్తున్న రిలే నిరాహారదీక్ష శిబిరం వద్దకు వెళ్లి ఐకాస నాయకులు కన్నయ్య, ఎస్.కె.రెడ్డెప్ప, గోపాలకృష్ణ తదితరులతో మాట్లాడారు. గత 29 రోజులుగా నిరసన దీక్షలు చేస్తున్నారని, గత రెండు రోజులుగా పట్టణంలో తాగునీరు సరఫరా, వీధి దీపాల నిర్వహణను పూర్తిగా ఆపేశారన్నారు. ప్రజలకు ఇబ్బంది కలుగకుండా కార్మికులు సహకరించాలన్నారు. రాష్ట్ర నాయకత్వం ఆదేశాల మేరకు సమ్మె చేస్తున్నామని తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించడానికి సముఖంగా లేదన్నారు.

★ పట్టణంలోని వాటర్ ట్యాంకుల వద్ద కనీసం విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయలేదని, లక్ష మంది జనాభా ఉన్నప్పుడు ఇంజినీరింగ్ విభాగంలో 130 మంది కార్మికులున్నారని, నేడు 2 లక్షలు మందికి 102 మంది కార్మికులు సేవలందిస్తున్నారని తెలిపారు. దీని వల్ల ప్రతి కార్మికునిపై అదనపు పని భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈపీఎఫ్ నిధులు కోసం కడపకు వెళ్లాల్సి వస్తోందని, ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు కార్మికులకు వర్తింపజేసే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. ఒక్క సమస్యను కూడా పరిష్కరించుకుంటే తాము విధుల్లోకి ఎలా వెళ్లాలని కమిషనర్‌కు విన్నవించారు. బుధవారం సాయంత్రం వరకు వేచి చూసి గురువారం విధులకు హాజరౌతామని తెలిపారు. కమిషనర్ ఆదేశాల ప్రకారం విధుల్లోకి వెళ్లకపోవడంతో సమ్మెలో ఉన్న కార్మికులందరికి తాఖీదులు జారీ చేశారు. అయితే వీటిని తీసుకోకుండా కార్మికులు తిరస్కరించినట్లు తెలిసింది.

కార్మికులతో మాట్లాడుతున్న పురపాలక కమిషనర్ ప్రమీల

పారిశుద్ధ్య కార్మికుల చేత నీటి సరఫరా

పారిశుద్ధ్యం విభాగంలో పనిచేస్తున్న కార్మికుల ద్వారా పట్టణంలో తాగునీటి సరఫరా చేస్తున్నారు. ఇంజినీరింగ్ విభాగంలోని ఫిట్టర్లు సూచన ప్రకారం కాలనీలకు నీటిని వదులుతున్నారు. సోమవారం అర్ధరాత్రి నుంచి పట్టణంలో తాగునీటి సరఫరాను పూర్తిగా ఆపేయడంతో కొన్నిచోట్ల స్థానికులు ఇబ్బంది పడ్డారు.

EENADU Classifieds

AUTO

VEHICLES WANTED

Wanted Vehicle: అశోక్ లేలాండ్ దోస్త్, టాటా ఇంట్రా, టాటా పికప్ వాహనాలు నెలవారి అద్దె ప్రాతిపదికన ప్రముఖ కంపెనీకి వాహనం అద్దెకు కావలెను. సంప్ర: ©: 63022 27985.

JOBS

పల్లా హాస్పిటల్, 7 రోడ్స్, కడప నందు పనిచేయుటకు X-RAY & C-ARM టెక్నీషియన్స్ కావలెను. Contact: 98490 40153.

కర్నాటక కొప్పళ జిల్లాలో ఉన్న కోళ్ళ ఫారంలో పని చేయుటకు సూపర్‌వైజర్స్ కావలెను, ఫ్యామిలీకి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. Ph: 7829928044

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే Contact: KDP: 9989997626 8008514248 PDTR: 8008597620 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

SBI లైఫ్ కడప బ్రాంచ్ నందు అడ్వైజర్‌గా మరియు సేల్స్ ఆఫీసర్ ఉద్యోగ ఉపాధి నియామకాలు జరుగుచున్నవి. విద్యార్హత పదవ తరగతి మరియు ఆ పైన ఉన్నత విద్య కలిగిన వారు అర్హులు. వివరాలకు SBI లైఫ్ మేనేజర్ గారిని సంప్ర: 9491111140.

FACULTY/ TEACHERS

శ్రీ వత్సల్ గురుకుల విద్యాలయ, తిరుపతి CBSE సంస్థలో చేరేందుకు మహిళా వైస్ ప్రిన్సిపాల్ (CBSE పాఠశాల అనుభవం అవసరం), హైస్కూల్ ఇంగ్లీష్ టీచర్, రెసిడెన్షియల్ మహిళా వార్డెన్. Ph: 7997555530, 7997557999, 9000256532.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

మహల్‌రాజుపల్లెలో జరుగుతున్న ద్రౌపది కల్యాణం

వైభవంగా ద్రౌపది కల్యాణం

కంభంవారిపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని మహల్ రాజుపల్లెలో క్రాస్‌లో తెదేపా నాయకుడు మదనమోహన్ రెడ్డి ఆధ్వర్యంలో మహాభారత యజ్ఞం జరుగుతోంది. ఈ సందర్భంగా ద్రౌపది, పాండవులు ఉత్సవ విగ్రహాలను ఊరే గింపుగా మంగళ వాయిద్యాలు, చెక్క భజనలతో మహాభా రతం జరిగే స్థలం వద్దకు తీసుకొచ్చారు. వేద పండితులు సాంప్రదాయబద్ధంగా ద్రౌపది, పాండవులకు వేద పండితుల మంత్రాల మధ్య కల్యాణం జరిపించారు.

మదనపల్లె

•మదనపల్లె • పీలేరు • తంబళ్లపల్లె

ఐకమత్యంతో పనిచేయండి

ములకలచెరువు, న్యూస్‌టుడే: తంబళ్లపల్లెలో తెదేపా శ్రేణులు వర్గాలు వీడి ఐకమత్యంతో పనిచేయాలని రాజంపేట పార్లమెంట్ తెదేపా అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేశ్ సూచించారు. తంబళ్లపల్లెలో బుధవారం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మధుబాబుతో కలిసి కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. రాష్ట్రం మొత్తం కూటమి హవాతో వైకాపా మట్టి కరిచినా తంబళ్లపల్లెలో స్వల్ప తేడాతో ఓడిపోవడం బాధాకరమని అభిప్రాయపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైకాపాను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న ఆర్జే వెంకటేశ్

డిగ్రీ కళాశాలలో బ్రిడ్జ్ కోర్సులు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: పీలేరు సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బ్రిడ్జ్ కోర్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ సుధాకర్‌రెడ్డి బుధవారం తెలిపారు. ఇంటర్ పూర్తి చేసుకున్న విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లిషు, కమ్యూనిటీ ఇంగ్లిషు, వ్యక్తిత్వ వికాసం, పోటీ పరీక్షల్లో నైపుణ్యం తదితర అంశాలపై తర్ఫీదు ఇవ్వడం జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ కోర్సు ఈ నెల 7వ తేదీ నుంచి కళాశాలలో ప్రారంభిస్తామని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

త్రోబాల్ పోటీలకు ఎంపిక

మదనపల్లె విద్య: ఆంధ్రా, తెలంగాణ ప్రాంతీయ త్రోబాల్ పోటీలకు మదనపల్లె శ్రీ వేద పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు కరస్పాండెంట్ లక్ష్మీనారాయణ, ప్రిన్సిపల్ ఉపేంద్రరెడ్డి తెలిపారు. గత నెల 30న కడప జిల్లాలో జరిగిన సీబీఎస్‌ఈ జోనల్స్ పోటీల్లో పాఠశాల విద్యార్థులు ధనవర్షిణిరెడ్డి, నాగ అభిజ్ఞ, జె.చరితశ్రీ, భానురెడ్డి ఎంపికైనట్లు తెలిపారు. ప్రాంతీయ స్థాయి త్రోబాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులను కరస్పాండెంట్, ప్రిన్సిపల్‌తో పాటు వ్యాయామోపాధ్యాయుడు మహేంద్ర, ఏవో కిశోర్ అభినందించారు.

ఆక్రమణలు తొలగించాలని వినతి

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : ర.భ.శాఖ స్థలాలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారని వీటిని తక్షణమే తొలగించడానికి చర్యలు చేపట్టాలని కోరుతూ ఆ శాఖ ఈఈ అరవిందాదేవికి బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్ కోరారు. బుధవారం సీటీఎం రోడ్డులోని ర.భ.శాఖ కార్యాలయానికి వెళ్లి ఈఈకి వినతిపత్రం ఇచ్చారు. మదనపల్లెలో పలు చోట్ల స్థలాలను ఆక్రమించుకుని అక్రమ నిర్మాణాలు చేపట్టారన్నారు. తిరుపతి రోడ్డు దేవతానగర్‌లో రోడ్లకు ఇరువైపులా కంపచెట్లు పెరిగి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. నాయకులు హరికృష్ణ, జిలానీబాషా, శశికుమార్, వినయ్, ద్వారక, ఆసిఫ్, సాదిక్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

రామసముద్రం, న్యూస్‌టుడే: రామసముద్రం మండలం ఎలవానెల్లూరు గ్రామ పంచాయతీ కొత్తూరుకు చెందిన తెదేపా మండల సీనియర్ నాయకుడు చంద్రప్ప (60) బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. తెదేపా ఆవిర్భావం నుంచి పార్టీ అభివృద్ధికి కృషి చేశాడు. మృతుడికి కుమార్తెలు అశ్విని, లక్ష్మీ, నాగమ్మ, కుమారులు సుధాకర్, మంజునాథ్ ఉన్నారు. మదనపల్లె మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ ఆయన మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తెదేపా మండల నాయకులు చిన్నస్వామి, రాజేష్ స్వామి, సీతప్ప, కృష్ణమరాజు యాదవ్, సీఆర్.నారాయణరెడ్డి, ఎంవీ.రమణ, రాజేంద్ర ఆయన మృతికి సంతాపం తెలియజేశారు.

పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

గుర్రంకొండ, న్యూస్‌టుడే: పట్టణంలో ఎదురుమిట్టపై నున్న గురుకుల బాలికల పాఠశాలలో అతిథి ఉపాధ్యాయులుగా పనిచేయడానికి దరఖాస్తు చేసుకోవాలని పాఠశాల ప్రధానాచార్యులు శిరీషా ప్రకటనలో పేర్కొన్నారు. టీజీటీ సైన్స్ (ఫిజికల్ సైన్స్), పీఈటీ పోస్టులకు అర్హత కలిగిన వారు నేరుగా దరఖాస్తు ఇవ్వవచ్చన్నారు.

నాణేలు... చెబుతున్నాయ్ పాఠాలు

ఆకట్టుకుంటున్న ఉపాధ్యాయుడి అభిరుచి

కలికిరి, న్యూస్‌టుడే: కాలగర్భంలో కలిసిన నాగరికతను, సంస్కృతి, సంప్రదాయాలను అప్పటి నాణేలు మన కళ్ల ముందు ఉంచుతాయి. అలాంటి చరిత్ర చెప్పే వివిధ దేశాల కరెన్సీ నోట్లు, నాణేలను కష్టపడి సేకరిస్తున్నారు కలికిరి మండలం గుట్టపాలెం గ్రామానికి చెందిన కుమారయ్య.. ప్రస్తుతం ఆయన వాల్మీకిపురం మండలంలోని గండబోయనపల్లె పంచాయతీ బూతంవారిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. గత 36 ఏళ్లుగా ఈ అభిరుచిని కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఆయన వద్ద 25 దేశాలకు చెందిన కరెన్సీ నోట్లు, సుమారు 25 దేశాలకు చెందిన 250 నాణేలు ఉన్నాయి. విదేశాల్లో ఉన్న బంధువులు, స్నేహితుల ద్వారా ఆయా ప్రాంతాలకు చెందిన కరెన్సీ తెప్పించుకుని భద్రపరుస్తున్నారు. ఇలా సేకరించిన కరెన్సీ నోట్లతో ఆల్బమ్ తయారు చేశారు. శ్రీకృష్ణదేవరాయలు, మొఘల్, బహమనీ రాజుల కాలం నాటి నాణేలు కూడా ఆయన సేకరించిన వాటిలో ఉన్నాయి. ఈస్ట్ ఇండియా కంపెనీకి చెందిన 1806, 1808, 1834 సంవత్సరాల నాటి రాగి, వెండి, అల్యూమినియం, బ్రిటీష్ ఇండియా నాణేలు, భారతీయ కరెన్సీ అయిన అణి, పావు అణా, అర్ధణా, ఒకటి నుంచి నాలుగు వరకు అణాలు ఉన్నాయి. 40 రకాల ఒక రూపాయి, 22 రకాల రెండు రూపాయలు, 14 రకాల ఐదు రూపాయల బిల్లలు ఉన్నాయి. ఇవే కాకుండా అమెరికా, సౌత్‌ఆఫ్రికా, చైనా, ఇంగ్లండ్, పాకిస్తాన్, శ్రీలంక, నేపాల్, బర్మా, ఇరాక్, సౌదీ అరేబియా, బంగ్లాదేశ్, ఫ్రాన్స్, మలేషియా, ఇటలీ, దుబయ్, రష్యా, ఉక్రెయిన్, జర్మనీ, ఫిలిపిన్స్, కువైట్, మాల్‌దీవులు, బోల్టాన్ తదితర 25 దేశాలకు చెందిన నాణేలు, కరెన్సీ నోట్లు పదిల పరిచారు. సుమారు 1835వ సంవత్సరం, అంతకంటే పురాతన నాణేలు నయా పైసలు, అణాలు, రాగి, వెండి, ఇత్తడి నాణేలతో పాటు వివిధ సందర్భాల్లో ప్రధాన వ్యక్తులు, దినోత్సవాల సందర్భంగా విడుదల చేసిన 200 పైగా నాణేలు కూడా సేకరించారు.

సేకరించిన నాణేలు, కరెన్సీ నోట్లతో ఉపాధ్యాయుడు కుమారయ్య

10కి పైగా ప్రదర్శనలు

గండబోయనపల్లె పంచాయతీ బూతంవారిపల్లె ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కుమారయ్య పాఠాలు చెప్పే సమయంలో ఈ నాణేలను, కరెన్సీనీ, ఆనాటి నాగరికత, సంస్కృతిని విద్యార్థులకు ప్రత్యక్షంగా చూపించి పాఠాలు చెబుతుంటారు. ప్రత్యేకంగా ల్యాప్‌టాప్‌లో వీటిని ఎక్కించి భద్రపరిచారు. 21 ఏళ్లుగా జిల్లాలో ఎక్కడ సైన్సు ప్రదర్శన జరిగిన కుమారయ్య తాను సేకరించిన నాణేలను ప్రదర్శనకు పెడతారు.

విశిష్టతను తెలియజేస్తుంటా..

అన్ని దేశాల కరెన్సీ సేకరించాలన్నది నా లక్ష్యం. నాణేలపై ఉన్న ముద్రణల వల్ల పూర్వం నుంచి ఉన్న వృత్తులు, సాగు చేసిన పంటలు, వాడుకలో ఉన్న యంత్రాలు, దేశ నాయకులు ఇలా అనేక విషయాలు తెలుసుకునే వీలుంది. నేటితరం విద్యార్థులు చరిత్ర సాక్ష్యాలను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఈ వివరాలు అందరికీ చాటాలన్నదే నా లక్ష్యం. **- కుమారయ్య, ఉపాధ్యాయుడు, బూతంవారిపల్లె**

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
మదనపల్లె : 8008574611
పీలేరు : 8008574958
తంబళ్లపల్లె : 8008574612

- న్యూస్‌టుడే, మదనపల్లె గ్రామీణ

?: పట్టణంలోని ఎన్వీఆర్ విస్తరణ ప్రాంతంలో మురుగు కాలువలు పూడిపోయాయి. మురుగు ప్రవహించడం లేదు. పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంది? **- అశోక్‌కుమార్, ఎన్వీఆర్ విస్తరణ**
✓: పారిశుద్ధ్య పనులు చేపడతాం. **- శ్రావణి, డీఈ, పురపాలక సంఘం, మదనపల్లె**
?: ఆర్టీసీ బస్టాండులో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి? శుభ్రత లేకపోవడం వల్ల దుర్గంధం వస్తోంది? **- కొండారెడ్డి, కడప**
✓: మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా చూస్తాం. **- డీఎం, మదనపల్లె**
?: పట్టణంలోని కదిరి రోడ్డులో వసతిగృహం ఎదుట మురుగు ప్రవహించడంతో దుర్వాసన వస్తోంది. దోమలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం? **- బాబు, కదిరి రోడ్డు**
✓: మురుగు రోడ్డుపై ప్రవహించకుండా చర్యలు తీసుకుంటాం. **- ప్రమీల, కమిషనర్, పురపాలక సంఘం, మదనపల్లె**
?: నేతాజీ కాలనీ సమీపంలోని తిరుపతి మార్గంలో చెత్తదిబ్బలు పేరుకుపోయాయి. వాహనాల రాకపోకలతో ఇళ్ల ముందు చెత్త పేరుకుని దుర్వాసన వస్తోంది? **- లక్ష్మీదేవి, తిరుపతి రోడ్డు, నేతాజీ కాలనీ**
✓: చెత్తదిబ్బలు లేకుండా చర్యలు తీసుకుంటాం. **- తాజ్‌మస్రూర్, ఎంపీడీవో, మదనపల్లె**
?: గాంధీపురం బోర్డు సమీపంలోని వాటర్ ప్లాంట్ ఎదురుగా చెత్తదిబ్బలు వేస్తున్నారు. దుర్వాసన వస్తోంది? **- అర్జున్, గాంధీపురం**
✓: పారిశుద్ధ్య పనులు చేయించి చెత్తచెదారాన్ని దూరంగా తరలిస్తాం. **- శ్రావణి, డీఈ, పురపాలక సంఘం, మదనపల్లె**
?: మండలంలోని బెంగళూరు రోడ్డులోని నక్కలదిన్నె వద్ద మురుగు రోడ్డుపై ప్రవహిస్తుంది. కాలువలు లేకపోవడంతో నీరు రహదారిపై ప్రవహిస్తు దుర్వాసన వస్తోంది? **- శివకుమార్, బెంగళూరు రోడ్డు**
✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి మురుగు రహదారిపై ప్రవహించకుండా చూస్తాం. **- నాగరాజు, డీఎల్‌పీవో, మదనపల్లె**
?: మండలంలోని దేవతానగర్‌లోని పలు ప్రాంతాల్లో వీధిదీపాలు వెలగడం లేదు. రాత్రివేళల్లో మహిళలు, పిల్లలు భయాందోళన చెందుతున్నారు? **- శ్రీరాములు, దేవతానగర్**
✓: మరమ్మతులు చేయించి దీపాలు వెలిగేలా చూస్తాం. **- తాజ్‌మస్రూర్, ఎంపీడీవో, మదనపల్లె**
?: మండలంలోని బసినికొండ పంచాయతీ నిమ్మనపల్లె రోడ్డు వంక పూడిపోయి రహదారిపైకి మురుగు ప్రవహిస్తోంది? కొండ వంక పూడిపోయి ఇళ్ల నుంచి వచ్చే మురుగుతో దుర్వాసన వస్తోంది? **- చలపతి, నిమ్మనపల్లె రోడ్డు**
✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి మురుగు రహదారిపై ప్రవహించకుండా చర్యలు తీసుకుంటాం. **- అబ్దుల్‌షుకూర్, ఈవోపీఆర్డీ, మదనపల్లె**

- న్యూస్‌టుడే, పెద్దతిప్పసముద్రం

?: మండలంలోని కందుకూరు కన్యకా పరమేశ్వరి ఆలయం వెనుక మురుగు నీరు నిల్వ ఉంది. దీంతో దోమలు, పురుగులతో ఇబ్బందులు పడుతున్నాం. **- పీర్‌బాషా, కందుకూరు**
✓: రెండు రోజుల్లో కాలువను శుభ్రం చేస్తాం. **- మనోహర్, పంచాయతీ కార్యదర్శి, కందుకూరు**

కౌన్సిలర్‌పై కేసు నమోదు చేశారని ధర్నా

మదనపల్లె నేరవార్తలు, న్యూస్‌టుడే : కౌన్సిలర్‌పై కేసు నమోదు చేశారని ఆయన అనుచరులు బుధవారం మదనపల్లె రెండో పట్టణ స్టేషన్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సంఘటనపై పట్టణంలోని ఆరో వార్డు కౌన్సిలర్ ప్రసాద్ మాట్లాడుతూ... గత నెల 30వ తేదీన తాను పట్టణంలోని కారు తీసుకెళ్తుండగా రామారావు కాలనీకి చెందిన సుధాకర్ తన కారును అడ్డుగా తీసుకొచ్చాడన్నారు. కారు పక్కకు తీయకుండా గొడవకు దిగారన్నారు. రాయితో తనపైకి దాడి చేసేందుకు యత్నించాడన్నారు. ఈలోగా కాలనీలో ఉన్న పలువురు అక్కడికి చేరుకుని కౌన్సిలర్‌పై దాడికి యత్నించారని అడ్డుకోవడం జరిగిందన్నారు. అయితే ఈ విషయంపై సుధాకర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారన్నారు. తాము ఫిర్యాదు చేస్తే పోలీసులు పట్టించుకోలేదన్నారు. దీనిపై ఆగ్రహించిన కాలనీవాసులు స్టేషన్ ఎదుట ఆందోళన చేశారన్నారు. తాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయకుంటే ఆందోళన చేయాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. ఈ సందర్భంగా రెండో పట్టణ సీఐ రామచంద్ర వారికి సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు.

సబ్జెక్ట్ ఉపాధ్యాయులను నియమించాలి

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : మున్సిపల్ ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించాలని యూటీఎఫ్ నాయకులు బుధవారం డీవైఈవో లోకేశ్వరరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇటీవల జరిగిన బదిలీలు, ఉద్యోగోన్నతుల్లో నూతన ఉపాధ్యాయులు వచ్చారన్నారు. కొన్ని పాఠశాలలకు సబ్జెక్టు ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోందన్నారు. దీనివల్ల పదో తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ఇబ్బందికరంగా ఉంటుందన్నారు. మధ్యాహ్న భోజనానికి ప్రధానోపాధ్యాయులు స్టాక్‌పాయింట్ వద్దకు వచ్చి తీసుకు వెళ్లాలని తెలియజేశారని ఏజెన్సీ పంపాలని కోరారు. యూటీఎఫ్ నాయకులు సుధాకర్, పురం వెంకటరమణ, గంపల శీనప్ప, విజయ్‌కుమార్, సుధాకర్, రవీంద్ర, చలపతి నాయుడు, మునిరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డీవైఈవోకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

గుంతలు.. పడితే అంతే సంగతులు

కలికిరి నుంచి నర్రావాండ్లపల్లె క్రాస్ మధ్య పదేళ్ల క్రితం వేసిన తారు రోడ్డు గతుకులమయంగా మారింది. ఈ మార్గంలో అక్కడక్కడ లోతైన గుంతలు పడడంతో వాహనచోదకులు పట్టుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి నర్రావాండ్లపల్లె మార్గాన్ని అభివృద్ధిపరిచి రాకపోకలకు సౌకర్యాన్ని మెరుగుపరచాలని స్థానిక ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, కలికిరి**

నడి మధ్య స్తంభం.. నడిచేదెలా శకటం

మండలంలోని నారిగానిపల్లెలో నడివీధిలో విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ వీధి గుండా ట్రాక్టర్లు, లారీలు, పండగ రోజుల్లో దేవతా విగ్రహాల బండ్లు ప్రయాణించలేక పోతున్నాయి. గ్రామస్థులు రాకపోకలకు నానా అవస్థలు పడుతున్నారు. విద్యుత్ స్తంభాలను తొలగించి పక్కన ఏర్పాటు చేయాలని బాధితులు కోరుతున్నారు. ఈ విషయంపై డిస్కం ఏఈ మస్తాన్‌ను వివరణ కోరగా లైన్ మార్పునకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆ చిత్రమే ఇది. **- న్యూస్‌టుడే, రామసముద్రం**

రహదారి బాగుంది... బస్సే రాకుంది

కలికిరి-కలకడ ప్రధాన మార్గానికి అనుబంధంగా మేడికుర్తి క్రాస్ నుంచి సొరకాయలపేట వరకు రెండు వరుసల మార్గం అభివృద్ధి చేసి దశాబ్దం అవుతున్నా.. ఇంత వరకు బస్సులు నడపకపోవడంతో ఆ మార్గంలోని మారుమూల గ్రామాల ప్రజలు ఇబ్బందికరంగా ప్రయాణం సాగిస్తున్నారు. గతంలో కంకరతేలిన మార్గమున్న సమయంలో ఆర్టీసీ అధికారులు బస్సులు నడిపేవారు. మార్గం రెండు వరుసలుగా అభివృద్ధి చెందిన సమయంలో బస్సులను పునరుద్ధరించలేదని ప్రజలు వాపోతున్నారు. **- న్యూస్‌టుడే, కలికిరి**

వైకాపా పాపం... బాలబడి శిథిలం

రామసముద్రం మండలం నారిగానిపల్లెలో 2016లో ఉపాధి పథకం నిధులు రూ.6.5 లక్షలతో అంగన్‌వాడీ కేంద్ర భవనం మంజూరయింది. భవన నిర్మాణ పనులు కూడా గోడల దశకు చేరుకున్నాయి. రూ.2.5 లక్షల వరకు బిల్లు చెల్లించారు. తరువాత నిధుల కొరతతో పనులు ఆగిపోయాయి. తరువాత వచ్చిన వైకాపా ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు నిలిచిపోయాయి. నిర్మించిన గోడలు కూడా కూలిపోయాయి. ప్రస్తుతం కంపచెట్ల మధ్య అసంపూర్తి నిర్మాణం శిథిలావస్థలో ఉంది. అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చే పిల్లలు గ్రామ పంచాయతీ కేంద్రంలో కూర్చొని కాలం గడుపుతున్నారు. ఆ చిత్రమే ఇది. **- న్యూస్‌టుడే, రామసముద్రం**

వాహనం లాక్కెళ్లారని ఫిర్యాదు

బి.కొత్తకోట: నిత్యావసర వస్తువులను వినియోగదారులకు గతంలో సరఫరా చేసిన వాహనాన్ని దౌర్జన్యంగా ఓ వ్యక్తి తీసుకెళ్లినట్లు బి.కొత్తకోట తహసీల్దారు బావాజాన్‌కు బుధవారం స్థానిక సంతబజారువీధికి చెందిన ఖలీల్‌బాషా ఫిర్యాదు చేశారు. గట్టు గ్రామ పరిధిలో ఎండీయూ ఆపరేటర్‌గా పనిచేసిన వ్యక్తి రాజీనామా చేయడంతో తనకు వాహనాన్ని 2023లో అప్పగించారని తెలిపారు. వాహనాల ద్వారా పంపిణీని ప్రభుత్వం ఇటీవల నిలిపివేయడంతో వాహనాన్ని ఇంటి వద్ద నిలిపినట్లు తెలిపారు. బుధవారం గతంలో రాజీనామా చేసిన వ్యక్తి దౌర్జన్యంగా వాహనాన్ని తీసుకెళ్లాడని, ఆ సమయంలో తన భార్య అడ్డుపడితే కొట్టి గాయపర్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడిగా రామచంద్ర

పెద్దతిప్పసముద్రం: ఎమ్మార్పీఎస్ నూతన అధ్యక్షుడిగా రామచంద్రను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా ఇన్‌ఛార్జి డానియల్ తెలిపారు. బుధవారం పీటీఎంలో ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడిగా రామచంద్ర, ఉపాధ్యక్షుడిగా వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా చరణ్‌కుమార్, కార్యదర్శిగా వెంకట రమణ, సహాయ కార్యదర్శిగా నరసింహులు, ప్రచార కార్యదర్శిగా గంగులప్ప, కోశాధికారిగా నరసింహులును ఎన్నుకున్నారు. సమావేశంలో నియోజకవర్గ అధ్యక్షుడిగా ప్రతాప్‌కుమార్, మాజీ మండలాధ్యక్షుడు ఈశ్వరప్ప పాల్గొన్నారు.

కార్మికులకు సీఐటీయూ మద్దతు

మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పురపాలక సంఘ కార్యాలయం ఎదుట ఇంజినీరింగ్ విభాగం కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపి శిబిరంలో కూర్చొన్నారు. బుధవారం సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీఐటీయూ నాయకులు శిబిరంలో కూర్చొని మద్దతు ప్రకటించారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

చర్యలు తీసుకోవాలని ఆందోళన

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యుత్తు అధికారులపై చర్యలు తీసుకోవాలని బహుజన యువసేన రాష్ట్ర అధ్యక్షులు పునీత్ డిమాండ్ చేశారు. విద్యుదా ఘాతానికి గురై గాయపడ్డ వెంకటరమణకు న్యాయం చేయాలని బుధవారం బహుజన యువసేన ఆధ్వర్యంలో పట్టణంలో నిరసన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్సీ తీసుకోకుండా రోజువారి కార్మికుడిగా పనిచేస్తున్న వెంకట రమణను విద్యుత్తు స్తంభం ఎక్కించడంతో ప్రాణాపాయానికి గురయ్యారని విద్యుత్తుశాఖ అధికారుల నిర్లక్ష్యమే కారణమన్నారు. బాధితుడికి మెరుగైన వైద్యచికిత్సలు అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు, బాధితుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

పట్టాదారు పాసుపుస్తకాలివ్వాలని ఆందోళన

మదనపల్లె గ్రామీణ, న్యూస్‌టుడే: పిత్రార్జితంగా అనుభవంలో ఉన్న తమ భూములకు పట్టా, పాసు పుస్తకాలివ్వాలని అవికేనాయక్ తాండా ప్రజలు డిమాండ్ చేశారు. బుధవారం సబ్ కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ... పెద్దమండ్యం మండలంలోని ఈ గ్రామానికి చెందిన వీరి పూర్వీకుల నుంచి దిగువపల్లెలో 55.56 ఎకరాల వ్యవసాయ భూములున్నాయన్నారు. అప్పట్నుంచి తాము అనుభవించుకుంటున్నామని, గతంలో జరిగిన అగ్నిప్రమాదంలో ఇళ్లు దగ్ధం కావడంతో తమ వద్ద ఉన్న పట్టాలు, పత్రాలు కాలిపోయాయన్నారు. ఇప్పటికీ తమ అనుభవంలోని భూముల్లోనే వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నామని చెప్పారు. రీసర్వేలో కొంతమంది ఆక్రమణదారులు తమ భూమిగా పేర్కొంటూ దౌర్జన్యానికి పాల్పడుతున్నారని, దీనిపై క్షేత్రస్థాయిలో, రెవెన్యూ దస్త్రాలను పరిశీలించి తమకు న్యాయం చేయాలన్నారు. ఈ మేరకు డీఏవో నిర్మలాదేవికి అర్జీ సమర్పించారు ఈ సందర్భంగా సర్పంచి నటరాజన్, బాధితులు మల్లీ నాయక్, మున్నే నాయక్, కాంతమ్మ, గణేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టరేట్ ఎదుట నినాదాలు చేస్తున్న బాధితులు

సమస్యల పరిష్కారానికే ఇంటింటికీ తెదేపా

గోడ పత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, కలికిరి, మదనపల్లె పట్టణం, న్యూస్‌టుడే : ప్రజలకు ఎలాంటి సమస్యలున్నా నేరుగా, ధైర్యంగా తమ దృష్టికి తీసుకు రావచ్చని పీలేరు, మదనపల్లె ఎమ్మెల్యేలు నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి, షాజహాన్‌బాషా అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం వాల్మీకిపురం, కలికిరిలో కిశోర్‌కుమార్‌రెడ్డి, మదనపల్లె పట్టణంలోని రెండో వార్డులో షాజహాన్‌బాషా ఇంటింటికీ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని నిర్వహించారు. అంతకు మునుపు కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యేలకు పూలమాలలు వేసి మంగళ హారతులతో మహిళలు ఘన స్వాగతం పలికారు. అనంతరం పీలేరు తెదేపా సీనియర్ నాయకులు కంభం నిరంజన్‌రెడ్డి, నాయకులు బొక్కసం రామకృష్ణ, ఆనంద్ తదితరులతో కలిసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గంలో 6 నెలల వ్యవధిలో రూ.4 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు అందజేసినట్లు ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. అనంతరం స్థానిక ప్రజలు రోడ్డు, కాలువలు నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. నియోజకవర్గం పార్టీ పరిశీలకులు శివరామ్‌ప్రతాప్, స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు గురుమూర్తి గౌడ, సురేష్‌రాజు, శ్రీనివాసులు, రామకృష్ణాచారి, మల్లికార్జుననాయుడు తెదేపా రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకట్రమణ, మండల పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

మదనపల్లె పట్టణం: తెదేపాలో కష్టపడిన వారికి స్థానిక సంస్థల ఎన్నికల్లో, గ్రామ, మండల, పట్టణ కమిటీల్లో సముచిత స్థానం కల్పిస్తామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. బుధవారం పట్టణంలోని ఎన్వీఆర్ కల్యాణ మండపంలో ఎమ్మెల్యే, నియోజకవర్గం పార్టీ పరిశీలకులు, స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకులు పర్యవేక్షణలో గ్రామ, మండల, పట్టణ కమిటీలు ఏర్పాటుపై నియోజకవర్గం స్థాయి సమావేశం జరిగింది. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చినబాబు, స్థానిక సంస్థల ఎన్నికల పరిశీకులు గురుమూర్తిగౌడ్, పార్టీ నియోజకవర్గ పరిశీలకులు శివరామ్‌ప్రతాప్, మదనపల్లె ఎన్నికల పరిశీలకులు చలపతినాయుడు, సురేష్‌రాజు, మదనపల్లె మండల పరిశీలకులు మల్లికార్జునరెడ్డి సమావేశమై చర్చ నిర్వహించారు.

రెండో వార్డులో పర్యటిస్తోన్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

IN THE COURT OF THE 7TH ADDITIONAL DISTRICT JUDGE MADANAPALLE
A.S. No. 73/2016

Appellants
M. Sidda Reddy and others
Vs
Respondents
M. Viswanatha Reddy and others
14th respondent
E.Rama Krishna Reddy, s/o Venkatramana, resident of Surapuvaripalle h/o Badikayalapalle village, B.Kothakota Mandal, Annamayya Dist

APPEAL SUMMONS TO 14TH RESPONDENT

Please take notice that the above matter stands posted to **08-07-2025** for your appearance either in person or through an Advocate at 10-30 am before the Hon'ble Court and to answer all points raised in the above proceedings, failing which the matter will be decided ex-parte.
//By Order of the Court//
Kaalam Raghupathy,
Advocate for Appellants

ఎమ్మెల్యే సహకారంతో కమిటీ అభివృద్ధి

మాట్లాడుతున్న చైర్మన్ పురం రామ్మూర్తి

పీలేరు, న్యూస్‌టుడే: పీలేరు ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సహకారంతో వ్యవసాయ మార్కెట్ కమిటీని అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అందుకు డైరెక్టర్లు సహకరించాలని పీలేరు కమిటీ ఛైర్మన్ పురం రామ్మూర్తి అన్నారు. బుధవారం కమిటీ కార్యాలయంలో జరిగిన తొలి పాలక మండలి సమావేశంలో రామ్మూర్తి మాట్లాడుతూ... పీలేరులో రైతుబజారు, తిరుపతి మార్గంలోని గూడరేవుపల్లె పంచాయతీ సర్వే నంబర్ 760-6లో రెండు ఎకరాల్లో కోల్డ్ స్టోరేజీ, కంభంవారిపల్లె మండలంలో సర్వే నంబర్ 580-6.26 ఎకరాల స్థలంలో నిర్మాణాలు, పీలేరు కమిటీ ప్రాంగణంలో 'అన్న క్యాంటీన్' నిర్మాణానికి, చిత్తూరు మార్గంలో సర్వే నంబర్ 565లో ఉన్న పదెకరాల స్థలానికి రక్షణ గోడ నిర్మాణానికి ఎమ్మెల్యే సహకారం అవసరమని తెలిపారు. ఉపాధ్యక్షులు సురేంద్రరెడ్డి, డైరెక్టర్లు సాధన, అమరనాథరెడ్డి, రమాదేవి మాట్లాడుతూ... తొలుత కమిటీ ఆస్తుల రక్షణకు ప్రహరీలు నిర్మించాలని, ప్రాంగణంలో తాగునీటి శుద్ధి కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని కోరారు. సమావేశంలో కార్యదర్శి ఎం.హరినాథ్, డైరెక్టర్లు శ్రీధర్ నాయుడు, సుబ్బయ్య, రవి, అనురాధ, వనిత, రహంతుల్లా, శివమ్మ పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80080 01768
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

రాయచోటి
• రాయచోటి • రాజంపేట • రైల్వేకోడూరు

ఆలయ పునరుద్ధరణ పనుల పరిశీలన

ఆలయ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అధికారులు

చిన్నమండెం, న్యూస్‌టుడే: మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామం జల్లావాండ్లపల్లెలోని శ్రీమండెం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో రూ.1.25 కోట్లతో జరుగుతున్న పునరుద్ధరణ పనులను బుధవారం ఇంజినీరింగ్ అధికారులు పరిశీలించారు. దేవాదాయ శాఖ ఎస్ఈ సతీష్, డీఈ జనార్దన్‌లు నిర్మాణ పనులను తనిఖీ చేశారు. నాణ్యతగా చేయాలని ఆదేశించారు. ప్రస్తుతం విమాన గోపురం పనులు సాగుతున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా నిర్వహించుకోండి

శాంతి కమిటీ సభ్యులతో మాట్లాడుతున్న ఎస్సై సుధాకర్

చిన్నమండెం, న్యూస్‌టుడే: చిన్నమండెంలో ఈ నెల 5, 6వ తేదీల్లో జరిగే మొహర్రం పండుగను హిందూ, ముస్లిం సోదరులు ఐకమత్యంతో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని ఎస్సై సుధాకర్ పేర్కొన్నారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో బుధవారం సాయంత్రం శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అల్లర్లు, గొడవలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వివరించారు. అనంతరం అశాంతి కమిటీ సభ్యులు పలు సూచనలు చేశారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్తమ సేవలతోనే సమాజంలో గుర్తింపు

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మల్లూరు ఉన్నత పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

చిన్నమండెం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించినప్పుడే సమాజంలో గుర్తింపు వస్తుందని మల్లూరు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రెడ్డెన్న అన్నారు. పాఠశాల ఆవరణలో బుధవారం బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు సాంబశివ, మోహన్‌నాయక్, గంగాధరరెడ్డిలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఎం మాట్లాడుతూ.. ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైందన్నారు. అనంతరం బదిలీపై పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులు నరేంద్ర, రామరాజులను ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంఈవో శివానాయక్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఊరిస్తూ... ఉసూరుమనిపిస్తూ

✦ వేరుసెనగ సాగుకు అన్నదాతల ఎదురుచూపులు

చిన్నమండెం, సుండుపల్లి, న్యూస్‌టుడే: వేసవిలో ముందస్తు వర్షాలు కురవడంతో రైతులు తమ పంట పొలాలను దుక్కులు చేసుకుని విత్తనాలు సిద్ధం చేసుకున్నారు. వేరుసెనగ సాగుకు సిద్ధమయ్యారు. గత నెలలో ఒక్క రోజు కూడా రాయచోటి ప్రాంతంలో పదును వర్షం కూడా కురవలేదు. దీంతో రైతులు వరుణ దేవుడి కరుణ కోసం ఎదురు చూస్తున్నారు. రెండు రోజులుగా ఆకాశం మేఘావృతమై ఊరిస్తుండడంతో పదును వర్షమైనా కురుస్తుందేమోనని రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

కొండమూల వద్ద వేరుసెనగ సాగుకు సిద్ధం చేసిన పొలం

ఇదీ పరిస్థితి!

జిల్లాలో 38 వేల హెక్టార్లలో వేరుసెనగ పంట సాగు కావాల్సి ఉంది. ఈ నెల 15వ తేదీలోగా పంట సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నా వర్షం కురవలేదు. సుండుపల్లి మండల వ్యాప్తంగా 1,259 మంది రైతులు 712 క్వింటాళ్ల విత్తనాలు పొందారు. రాయచోటి, లక్కిరెడ్డిపల్లె డివిజన్లలో వర్షాధారంగా పండే ప్రధాన పంట వేరుసెనగ మాత్రమే. పదేళ్ల కిందట 50 వేల హెక్టార్లలో సాగవుతున్న పంట నిరుడు కేవలం 9 వేల ఎకరాల్లోనే సాగయింది. జూన్ నెలలో 80 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 54 మి.మీ మేర వర్షపాతం మాత్రమే గత నెల 23 నుంచి నేటి వరకు చినుకు జాడే లేదని రైతులు ఉసూరుమంటూ నిట్టూరుస్తున్నారు.

• సుండుపల్లి ఏవో మహబూబ్‌బాషా మాట్లాడుతూ.. రైతులు వర్షం కోసం ఎదురు చూస్తున్నారని ఖరీఫ్ వేరుసెనగ సాగులో అర్ధ అదును దాటిపోయిందని ఈ నెలంతా కూడా సాగుకు అనుకూలమేనని వర్షం వస్తే రైతులు వేరుసెనగ సాగుకు వీలుంటుందన్నారు.

అన్నీ సిద్ధం చేసుకున్నాం

మాది చిన్నమండెం మండలం కొండమూల గ్రామం. రెండు ఎకరాల్లో వేరుసెనగ సాగు చేసేందుకు విత్తనాలతో పాటు పొలాన్ని దుక్కులు చేసుకుని సిద్ధంగా పెట్టుకున్నాం. తీరా వర్షం కురవలేదు. ఈ నెల 5న పునర్వసు కార్తె వస్తుంది. ఆ కార్తె అయిపోయేలోగా వర్షం పడితే పంట సాగు చేస్తాం. లేకపోతే విత్తనాలు అమ్ముకోవాల్సిందే. గతేడాది పంట సాగులో పెట్టుబడి కూడా రాలేదు.

\- రామచంద్ర, రైతు, కొండమూల

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
రాజంపేట : 9441872651
రాయచోటి : 9703622242
రైల్వేకోడూరు : 9703572572

?: చిన్నమండెంలోని పాత మసీదు వద్దకువెళ్లే దారిలో చెత్త పేరుకుపోయింది. - స్థానికులు, చిన్నమండెం

✓: సమస్యను గుర్తించాం. వెంటనే జేసీబీ సాయంతో చెత్తను తీయించి శుభ్రంగా చేయిస్తాం. - పద్మావతమ్మ, పంచాయతీ కార్యదర్శి, చిన్నమండెం - న్యూస్‌టుడే, చిన్నమండెం

?: చిన్నమండెం పాత పోలీసుస్టేషన్ వద్దనున్న నీటి పథకం నుంచి నీరు తరచూ లీకవుతోంది. చిన్నర్సుపల్లెకు వెళ్లే రోడ్డు మధ్యలో నీరు పారుతోంది. - బాషా, చిన్నమండెం

✓: నీటి పథకం లీకేజీలు అరికట్టేందుకు తగు చర్యలు తీసుకుంటాం. ఇంకుడు గుంతను ఏర్పాటు చేసి రోడ్డుపై నీరు పారకుండా చర్యలు చేపడతాం. - పద్మావతమ్మ, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, చిన్నమండెం

యాభై ఏళ్లకే పింఛనివ్వాలి

గాలివీడు, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబు ఎన్నికల హామీల్లో ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 50 ఏళ్లకే పింఛను మంజూరు పథకాన్ని అమలు చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి సుధీర్‌కుమార్ కోరారు. గాలివీడులో బుధవారం నిర్వహించిన డీహెచ్‌పీఎస్ మండల శాఖ సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు వీరభద్ర, రమణ, ఆంజనేయులు, రామాంజులు, రెడ్డెయ్య పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలని వినతి

జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపరింటెండెంట్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న యూనియన్ నాయకులు

రాయచోటి గ్రామీణ, న్యూస్‌టుడే: కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 9న తలపెట్టిన సమ్మెలో అంగన్‌వాడీ వర్కర్లు పాల్గొంటారని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ ఉత్తీదేవికి బుధవారం ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ నాయకులు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అంగన్‌వాడీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని విన్నవించారు. కనీస వేతనం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.

ఆలయానికి గరుడ వాహనం అందజేత

గరుడ ఉత్సవ విగ్రహాన్ని తితిదే అధికారులకు అందిస్తున్న సర్పంచి గౌరీశంకర్, కుటుంబ సభ్యులు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: అన్నమయ్య జన్మస్థలి తాళ్లపాకలోని చెన్నకేశవ స్వామి ఆలయానికి సర్పంచి గౌరీశంకర్ కుటుంబ సభ్యులు స్వామి వారికి ఉత్సవాల సందర్భంగా ఉపయోగించే గరుడ వాహనాన్ని బుధవారం ఆలయ ఇన్‌స్పెక్టర్ బాలాజీకి అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచి మాట్లాడుతూ.. ప్రత్యేకంగా తయారు చేయించి అదించామని.. వచ్చే ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో తితిదే అధికారులు, వేద పండితులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వెండి ప్రసాదం గిన్నె వితరణ

ముడుంపాడు (సుండుపల్లి): మండల పరిధిలోని ఎన్‌జేఆర్ కాలనీ పరికిబండ బిడికి కూడలిలోని ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయానికి ఆరోగ్యపురానికి చెందిన కిరణ్మయి, అరుణ్‌కుమార్‌నాయక్ దంపతులు బుధవారం నైవేద్యం పెట్టే వెండిగిన్నె, స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు అమృత నాయక్ వారిని అభినందించారు.

అంగన్‌వాడీ కార్యకర్తల సమ్మె నోటీసు

ఏసీడీపీవో సరళాదేవికి సమ్మె నోటీసు అందజేస్తున్న అంగన్‌వాడీ యూనియన్ సభ్యులు

రైల్వేకోడూరు, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక, ఉద్యోగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె నిర్వహిస్తున్నట్లు జిల్లా ఏఐటీయూసీ అధ్యక్షుడు మాదా రాజు గంగాధర్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సరోజనమ్మ ఆధ్వర్యంలో ఏసీడీపీవో సరళాదేవికి సమ్మె నోటీసు అందజేశారు. 9వ తేదీన ఉద్యోగులు, కార్మికులు విధులను బహిష్కరించి పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు నిర్మల, విజయలక్ష్మి, సభ్యులు పాల్గొన్నారు.

పశువులకు నట్టల నివారణ తప్పనిసరి

వీరబల్లి, న్యూస్‌టుడే: పశువులకు నట్టల నివారణ మందు తప్పని సరిగా తాపాలని పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ మాల కొండయ్య అన్నారు. మండలంలోని మట్లి పంచాయతీలోని నాయునిపల్లి, బీసీకాలనీ, బత్తినవారిపల్లిలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేసి పశువులను పరీక్షలు చేశారు. 1,240 గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందు తాపారు. పశువైద్యులు గణేష్, లైవ్‌స్టాక్ అధికారి జయప్రకాష్, సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు వైద్య సేవలందిస్తున్న పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు డాక్టర్ మాలకొండయ్య

ఇంటింటికీ కూటమి ప్రభుత్వ విజయాలు

రాజుకుంటలో ర్యాలీ నిర్వహిస్తున్న కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి, తెదేపా నాయకులు

రాజంపేటలో కూటమి ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరిస్తున్న తెదేపా నాయకులు

రాజంపేట, న్యూస్‌టుడే: ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు తీసుకెళుతున్నట్లు తెదేపా లీగల్‌సెల్ పార్లమెంట్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ తెలిపారు. రాజంపేట పట్టణంలోని 14వ వార్డు, రైల్వేస్టేషన్ రోడ్డు ప్రాంతాల్లో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు చేస్తూ వస్తోందని.. ప్రజలు ఎంతో సంతోషంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు వెంకటేశ్వర్లనాయుడు, షామీర్‌బాషా, పి.చంద్రనాయుడు, సుబ్బనరసయ్యానాయుడు ప్రసాద్, కృష్ణచైతన్య పాల్గొన్నారు.

ఓబులవారిపల్లె: కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా కుడా ఛైర్మన్, తెదేపా నియోజకవర్గ బాధ్యుడు ముక్కా రూపానందరెడ్డి చిన్నఓరంపాడు పంచాయతీలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, రాష్ట్రాభివృద్ధిని వివరించారు. తెదేపా నాయకులు చెన్నరాయుడు, వెంకటేశ్వరరాజు, సుబ్రహ్మణ్యం నాయుడు, రమేష్ నాయుడు, ఈశ్వర్‌నాయుడు, శివయ్యనాయుడు, వాసుదేవ రెడ్డి పాల్గొన్నారు.

చిట్వేలి (పుల్లంపేట): రాతికుంట పంచాయతీలో కుడా ఛైర్మన్ ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచార కార్యక్రమం నిర్వహించారు.

ఇంటర్ ప్రవేశాల గడువు పొడిగింపు

రాజంపేట గ్రామీణ, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో ప్రవేశించే విద్యార్థులకు ఈ నెల 31 వరకు గడువు పొడిగించినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినట్లు రాజంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రమణరాజు బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన కోరారు.

అంత్యక్రియలకు వెళ్లి వచ్చేలోగా దోచేశారు

సిద్దవటం, న్యూస్‌టుడే : మాధవరం-1 పరిధిలోని రోడ్డు నంబరు-10 వీధిలో ఉన్న మోదుగుల నరసింహులు ఇంట్లో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు బంగారు నగలు, నగదు, మరికొన్ని వస్తువులు అపహరించారు. నరసింహులు జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లారు. ఆయన తండ్రి నరసింహులు ఆదివారం ఉదయం మాధవరం-1లో మృతి చెందారు. వీరి స్వగ్రామమైన అన్నమయ్య జిల్లా పొత్తపిలో అంత్యక్రియలు నిర్వహించాలని నరసింహులు భార్య లక్ష్మీప్రసన్న ఇంటికి తాళం వేసి మృతదేహాన్ని పొత్తపికి తీసుకెళ్లారు. తండ్రి మృతి చెందిన సమాచారాన్ని తెలుసుకున్న నరసింహులు సోమవారం స్వగ్రామానికి వచ్చారు. అదే రోజు తండ్రి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. బుధవారం మాధవరం-1లోని నరసింహులు ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన స్థానికులు ఆయనకు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే ఆయన ఇంటికి వచ్చి బీరువాను పరిశీలించగా అందులోని ఎనిమిది తులాల బంగారు నగలు, రూ.30 వేల నగదు, ఒక చరవాణి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై మహమ్మద్ రఫీ, ఏఎస్సై సుబ్బరామచంద్ర ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు.

వరకట్నం వేధింపులపై కేసు నమోదు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : అదనపు కట్నం కోసం భర్త సురేష్‌తో పాటు అత్త, మామ, ఆడబిడ్డ వేధిస్తున్నారని చొప్పా జానకీప్రసన్న అనే మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు బుధవారం తెలిపారు. సిద్దవటం మండలం పార్వతీపురంలో ఉంటున్న జానకీ ప్రసన్నకు ఒంటిమిట్ట మండలం కొత్తమాధవరంలో నివాసం ఉంటున్న సురేష్‌కు 2024 అక్టోబరు 11న వివాహమైనట్లు తెలిపారు. వివాహం జరిగిన కొన్నిరోజుల తర్వాత కట్నం తీసుకు రావాలని భర్త, అత్తమామలు, ఆడపడుచు వేధింపులకు పాల్పడినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని వివరించారు.

దాడి ఘటనపై ఫిర్యాదు

సుండుపల్లి, న్యూస్‌టుడే: బుర్రలదిన్నెపల్లెకు చెందిన అశోక్ తనపై దాడి చేశారని ఇచ్చిన ఫిర్యాదు మేరకు జయరామయ్య, సురేష్, శంకర్‌లతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేశామని ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. గ్రామానికి చెందిన అశోక్, జయరామయ్యలు ఓ స్థలంలో విషయమై హైకోర్టుకు వెళ్లారు. సదరు స్థలంలో ప్రహరీ నిర్మించగా దాన్ని తొలగించాలని ఆదేశాలతో రావడంతో తహసీల్దారు మహబూబ్‌చాంద్ పర్యవేక్షణలో పోలీసులు బుధవారం ప్రహరీ తొలగించారు. ఈ క్రమంలో అశోక్‌పై పైన పేర్కొన్న వారు దాడి చేయగా కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

రైతులకు సూచనలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : నాణ్యమైన విత్తనాలు తెప్పిస్తామని దళారులు చెబుతున్న మాటలను రైతులు నమ్మొద్దని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ సూచించారు. మండలంలోని చెర్లోపల్లిలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధికారికంగా అనుమతి పొందిన వ్యాపారుల వద్దే వంగడాలు కొనుగోలు చేయాలని సూచించారు. తప్పనిసరిగా రసీదులు పొందాలన్నారు. ఎవరైనా కల్తీ, నాసిరకం విత్తనాలు విక్రయిస్తుంటే అధికారులకు సమాచారమివ్వాలని కోరారు. పంటల సాగుపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను అన్నదాతలకు సాంకేతిక సలహాలు అందించేందుకు శిక్షణ ఇస్తామన్నారు. ఏఈవో ప్రభాకర్‌రెడ్డి, ఆర్ఎస్కే బాధ్యులు చంద్రమోహన్, ప్రియదర్శిని, ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

సీఎంను కలిసిన సుగవాసి ప్రసాద్‌బాబు

చంద్రబాబుతో తితిదే బోర్డు మాజీ సభ్యుడు ప్రసాద్‌బాబు

రాయచోటి, న్యూస్‌టుడే: మంగళగిరిలోని పార్టీ కార్యాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిని మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసినట్లు రాయచోటి నియోజకవర్గ తెదేపా నేత, తితిదే బోర్డు మాజీ సభ్యుడు సుగవాసి ప్రసాద్‌బాబు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా తన తండ్రి మాజీ ఎంపీ పాలకొండ్రాయుడు అనారోగ్యంతో మృతి చెందిన విషయంపై వివరాలు అడిగి తెలుసుకున్నారని ఆయన చెప్పారు. అనంతరం నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లినట్లు ప్రసాద్‌బాబు వివరించారు.

మంత్రికి ఆహ్వానం

చిన్నమండెం, న్యూస్‌టుడే: చిన్నమండెంలో మొహర్రం కార్యక్రమానికి హాజరు కావాలని మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని కమిటీ సభ్యులు బుధవారం ఆహ్వానించారు. బోడిరెడ్డిగారిపల్లెలోని మంత్రి నివాసానికి వెళ్లిన వారు ఈ నెల 5, 6వ తేదీల్లో జరిగే కార్యక్రమాలపై ఆయనతో చర్చించారు. గంధం పీరు దర్శనానికి వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని మంత్రి సూచించారు.

భూ సంరక్షణతోనే అధిక దిగుబడులు

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : రైతులు భూ సంరక్షణపై దృష్టి సారించాలని ఊటుకూరు కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ వీరయ్య సూచించారు. మండలంలోని చింతరాజుపల్లె రైతు సేవా కేంద్రంలో అన్నదాతలకు బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి, సాంకేతికత, శాస్త్రీయతను జోడించి పంటలు సాగు చేస్తే నాణ్యమైన దిగుబడులు పొందొచ్చన్నారు. రసాయనాల వినియోగంతో భూములు నిస్సారంగా మారతాయన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు వి.శిల్పకళ, ఎస్.మానస తదితరులు పాల్గొన్నారు.

మంటపంపల్లె... సమస్యల ముల్లె..!

✤ పట్టించుకోని అధికార యంత్రాంగం

సీసీ రహదారికి నోచుకోని మంటపంపల్లెలోని జగనన్నకాలనీ

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : మంటపంపల్లె పంచాయతీ పరిధిలో పలు సమస్యలు తిష్ట వేసినా అధికారులు పరిష్కారం చూపడం లేదు. గత వైకాపా పాలనలో జగనన్నకాలనీ కోసం ప్రభుత్వ స్థలాన్ని సేకరించారు. ఇక్కడ 76 మందికి ఇంటి స్థలాలు ఇవ్వాలని నిర్ణయించారు. సొంత నివాసం లేని 59 మందికి పక్కాగృహాలు మంజూరు చేశారు. ఇప్పటికే గోడల దశకు ఆరు, గోడల స్థాయి 12, పైకప్పు వరకు వచ్చినవి 3, పూర్తయ్యే దశలో 38 ఉన్నాయి. ఇక్కడ మట్టి రహదారులతో సరిపెట్టేశారు. సీసీ రోడ్లు వేయలేదు. నీటి నిల్వ కోసం తాత్కాలిక ట్యాంకులను ఏర్పాటు చేసి చేతులు దులుపుకొన్నారు. ఉపరితల జలాశయాలను నిర్మించలేదు. మౌలిక వసతులు పూర్తి స్థాయిలో లేకపోవడంతో ఇక్కడ నివాసం ఉండేందుకు లబ్ధిదారులు ఆసక్తి చూపడం లేదు.

✶ రామచంద్రాపురంలోని బీసీ బాలుర వసతి గృహం మూతపడింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తిరిగి అందుబాటులోకి తీసుకురావాలని ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేసినా ఇంతవరకు అమలుకు నోచుకోలేదు. మంటపంపల్లె, చింతరాజుపల్లెల్లో జడ్పీ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఈ రెండు జడ్పీ బడుల్లో 320 మంది పైగా పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. హాస్టల్ వస్తే వసతి దక్కుతుందని ఆశించిన వారికి నిరాశే మిగులుతోంది. గత విద్యా సంవత్సరంలో మోక్షం లభించలేదు. ఈసారైనా తెరవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. మారయ్యగారిపల్లెలోని ఉపరితల ట్యాంకు నిరుపయోగంగా ఉంది. గ్రామంలో చెత్త నుంచి సంపద కేంద్రం వినియోగంలో లేదు. ప్రతి గడప నుంచి తడి, పొడి చెత్తను సేకరించడం లేదు. చెత్త, వ్యర్థాలను సేకరించడానికి సరఫరా చేసిన సైకిళ్లు మూలకు చేరాయి. అధికారులు స్పందించి సమస్యలు పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఉద్యానంలో పైపులైన్ పనులకు మోక్షం

స్పందనకు వందనం

రాజంపేట పుర ఉద్యానవనంలో పైపులైన్ పనులు చేపడుతున్న సిబ్బంది

రాజంపేట, న్యూస్‌టుడే: రాజంపేట పట్టణంలోని పురపాలక ఉద్యాన వనం గుండా వేసిన పైపులైన్ల నుంచి కొంత కాలంగా నీరు లీకవుతోంది. దీంతో పార్కుకు వచ్చే ప్రజలు అసౌకర్యానికి గురయ్యేవారు. ఈ సమస్యపై ఈ ఏడాది మార్చి 11న 'ఏడాదిగా మీనమేషాలు' అనే శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. అప్పట్లో స్థానిక అధికారులు రూ.20 లక్షల వ్యయంతో నూతన పైపులైన్ వేయడానికి ఏడాది కిందట పైపులు తెచ్చి అక్కడే ఉంచారు. పనులు మాత్రమ మొదలు కాలేదు. ప్రస్తుతం సంబంధిత అధికారులు నూతన పైపులైన్ ఏర్పాటు పనులు చేపట్టారు.

హెచ్‌ఎం సేవలు అభినందనీయం

తిమ్మసముద్రం(సుండుపల్లి), న్యూస్‌టుడే: తిమ్మసముద్రం జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బదిలీపై వెళ్లిన హెచ్‌ఎం సి.జి.కె.రాజు, ఉపాధ్యాయులు ఉమాశంకర్, రమేష్‌లను ఉపాధ్యాయులతో కలిసి గ్రామస్థులు సత్కరించారు. పాఠశాలలో బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్ మాట్లాడుతూ.. విద్యార్థుల అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో విద్యా కమిటీ అధ్యక్షురాలు గుండమ్మ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాస్‌పోర్ట్ పోయినది
Passport No : P4337362, కొప్పుల లక్ష్మీదేవి, భర్త కొప్పుల ధర్మ, D.No. 1/147, సంబేపల్లి మండలం, కడప జిల్లా, ప్రస్తుతం అన్నమయ్య జిల్లా, A.P., అను నేను సంబేపల్లి బస్టాండ్ నందు బస్సు కోసం వేచివుండగా నా Passport (No : P4337362) పోయినది. కావున దొరికిన వారు క్రింది సెల్ నెంబర్‌కు తెలియజేసి తగిన పారితోషికం పొందగలరని మనవి.
Cell : 9381334320

పోలీసులు న్యాయం చేయడం లేదని ఆరోపణ

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఒంటిమిట్ట పోలీసులు బాధితుల గోడు ఆలకించడం లేదని కొత్తమాధవరం పంచాయతీ మల్లేశ్వరపురానికి చెందిన శిరీషా అనే యువతి ఆరోపించారు. ఆమె బుధవారం ఓ వీడియో విడుదల చేశారు. ఇటీవల తన తల్లి అలిశెట్టి లక్ష్మీదేవి (57)పై సమీప బంధువులు దాడి చేయడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వివరించారు. ఠాణాకు వెళ్లి ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని వాపోయారు. కేసు వెనక్కి తీసుకోవాలని, రాజీ కావాలని పోలీసులే ఒత్తిడి చేశారని ఆరోపించారు. దాడి చేసిన ఎనిమిది మందిపై ఫిర్యాదు చేసి వారం రోజులైనా కనీసం విచారణ కూడా చేయలేదన్నారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని వివరించారు. ఈ విషయంపై సీఐ బాబుతో 'న్యూస్‌టుడే' చరవాణిలో మాట్లాడగా కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నామని తెలిపారు. శిరీషా చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు.

మార్కుల లిస్టు పోయినవి
పాలతొట్టి తేజ, తండ్రి పాలతొట్టి గంగాధర్, R/o D.No. 5/8, రెడ్డివారిపల్లి (Vi) & (Po), రైల్వేకోడూరు (మం), అన్నమయ్య జిల్లాకి చెందిన నేను ఆంజనేయపురం నుండి ఇంటికి వెళుతుండగా రైల్వేకోడూరు సమీపంలో నా యొక్క పదవ తరగతి మార్కుల లిస్టు (Roll No : 1922145805), ఇంటర్మీడియట్ మార్కుల లిస్టు (Roll No : 2112231247) పోయినవి. దొరికినవారు పై అడ్రస్‌కు తెలపగలరు.

వరద ప్రభావిత గ్రామాల్లో వసతులు కల్పించాలి

లంకా దినకర్‌కు వినతిపత్రం అందిస్తున్న భాజపా నేత రమేష్‌నాయుడు

రాజంపేటగ్రామీణ, న్యూస్‌టుడే: అన్నమయ్య జలాశయం మట్టికట్ట తెగిపోయి పలు గ్రామాల్లో కనీస సౌకర్యాలు లేక అక్కడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రాజంపేట భాజపా నేత రమేష్‌నాయుడు అన్నారు. 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంక దినకర్‌ను బుధవారం ఆయన కలిసి పలు సమస్యలను విన్నవించారు. రాజంపేట మండలం ఆకేపాడు క్రాస్ రోడ్డు నుంచి మందపల్లి, ఎగువ మందపల్లి, పులపుత్తూరు, బగిడిపల్లి, ఏకరిపల్లి వరకు రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందించినట్లు ఆయన చెప్పారు.

ప్రథమ వర్ధంతి

కీ॥శే॥ K.N.పొన్నురంగమ్ గౌడ్ గారు
మురుగన్ స్వీట్స్, రైల్వేకోడూరు.
మరణం : 03.07.2024
మా ఉన్నతి కొరకు అహర్నిశలు శ్రమించి అందరికీ ఆదర్శంగా, మాకు మార్గదర్శకంగా నిలిచిన మీరు మా నుండి దూరమై ఏడాది గడిచినను... మీ జ్ఞాపకాలను నేటికీ మరువలేకున్నాం. మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని దేవుని ప్రార్థిస్తూ...
కుటుంబ సభ్యులు
Cell : 8523093254

వైద్య శిబిరానికి విశేష స్పందన

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : మండలంలోని కొత్తమాధవరం రైతు సేవా కేంద్రంలో తిరుపతి రమాదేవి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. స్థానిక తెదేపా నాయకుడు బోడిచర్ల శివ శ్రీనివాసులు ఆహ్వానం మేరకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ ప్రదీప్‌కుమార్ పర్యవేక్షణలో రోగులకు రక్తపోటు, మధుమేహం పరీక్షలను నిర్వహించారు. శిబిరాన్ని తెదేపా అన్నమయ్య జిల్లా తెదేపా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్ రాజు పరిశీలించి సహకారం అందించిన నాయకులను అభినందించారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

ఉత్సాహంగా చదరంగం పోటీలు

విజేతలు వెంకటకిశోర్, నవీన్‌లకు ట్రోఫీలు అందిస్తున్న జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు

వివరాలు 8లో

ఈనాడు-ఈటీవీ ఛాంపియన్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులకు బుధవారం చదరంగం పోటీలు జరిగాయి. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాల్ వద్ద జరిగిన పోటీల్లో కలెక్టరేట్‌లోని పలువురు రెవెన్యూ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రత్యర్థుల ఎత్తుకు పైఎత్తు వేస్తూ పోటీల్లో రాణించారు. అనంతరం విజేతలకు జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు ట్రోఫీలు అందించారు. - న్యూస్‌టుడే, కలెక్టరేట్ (గుంటూరు)

అటవీ భూముల పరిరక్షణకు వినతి

గుంటూరు: అటవీ భూములను పరిరక్షించాలని జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు పిలుపు మేరకు ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 57 మండలాల జనసేన అధ్యక్షులు సమాచార హక్కు చట్టం కింద వివరాలు కావాలంటూ తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ అటవీ భూముల ఆక్రమణకు కాకుండా చూడడమే జనసేనాని పవన్‌కల్యాణ్ లక్ష్యమన్నారు. అందులో భాగంగానే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ద్వారా సమాచారం తెలియజేయాలని వినతులు అందజేసినట్లు తెలిపారు.

పశ్చిమ డెల్టాకు నీటి విడుదల

సీతానగరం వద్ద ప్రకాశం బ్యారేజీ నుంచి పశ్చిమ డెల్టా ప్రధాన కాలువలోకి విడుదల చేసిన సాగునీరు

బాపట్ల, న్యూస్‌టుడే: కృష్ణా పశ్చిమ డెల్టాకు జలవనరుల శాఖ అధికారులు బుధవారం నీరు విడుదల చేశారు. తాడేపల్లి మండలం సీతానగరం వద్ద ప్రకాశం బ్యారేజ్ నుంచి డెల్టా ప్రధాన కాలువకు 300 క్యూసెక్కులు వదిలారు. గుంటూరు, బాపట్ల జిల్లాల్లో తాగునీటి చెరువులు నింపడానికి, ఆయకట్టు రైతులు నారుమడులు పోసుకోవడానికి ఈ నీటిని వినియోగించనున్నారు. కొమ్మమూరు కాలువ సహా ఇతర ప్రధాన కాలువల్లో కాంక్రీట్ పనులు, మరమ్మతులు జరుగుతుండగానే నీరు విడుదల చేయడం గమనార్హం.

తాగునీటి చెరువులు నింపేలా ప్రణాళిక

● తూర్పు డెల్టాకు గత నెల 18న సాగునీరు విడుదల చేశారు. పశ్చిమ డెల్టాకు రెండు వారాల తర్వాత విడుదల చేశారు. బాపట్ల, రేపల్లె పురపాలక సంఘం రక్షిత నీటి పథకాల చెరువుల్లో నీటి మట్టం తగ్గింది. 77 రక్షిత నీటి పథకాల చెరువుల్లో నిల్వలు పడిపోయాయి. గుంటూరు నగరానికి తాగునీరందించే సంగం జాగర్లమూడి చెరువు నిండుకుని ఉంది. దశలవారీగా నీటి విడుదల పెంచి తొలుత తాగునీటి చెరువులను నింపడానికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. డెల్టాలో ఎగువన దుగ్గిరాల, తెనాలి, వేమూరు ప్రాంతాల్లో రైతులు నారుమడులు పోసుకోవడానికి కాలువలకు నీరు వదలనున్నారు.

మరమ్మతులు పూర్తి కాకుండానే..

● పశ్చిమ డెల్టాలో గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో 5.71 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. వైకాపా ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో సాగు, మురుగునీటి కాలువలన్నీ అధ్వానంగా మారాయి. కనీస మరమ్మతులు కొరవడి షట్టర్లు, రెగ్యులేటర్లు, లాకులు శిథిలావస్థకు చేరి కుప్పకూలాయి. వందల సంఖ్యలో గండ్లు పడి కట్టలు బలహీనంగా తయారయ్యాయి. కొమ్మమూరు కాలువ పరిధిలో రూ.2.65 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కాలువ కట్టలు బలహీనంగా ఉండటంతో పూర్తి సామర్థ్యం మేర నీరు వదల్లేని పరిస్థితి.

● కాలువల్లో ఓఅండ్ఎం కింద రూ.25 కోట్లతో 746 పనులు, జీవో నంబరు 65 కింద రూ.13.98 కోట్లతో కాంక్రీట్ నిర్మాణాలు, మరమ్మతులు చేపట్టారు. మే మూడు, నాలుగువారాల్లో వర్షాలు కురవడంతో కాంక్రీట్ పనులు నిలిపివేశారు. ఓఅండ్ఎం పనులు ప్రారంభించడంలో జాప్యం జరిగింది. ప్రస్తుతం 75 శాతం పనులు మాత్రమే జరిగాయి. ఈ నేపథ్యంలోనే జలవనరుల శాఖ అధికారులు నీరు విడుదల చేశారు. చీరాల సబ్ డివిజన్ పరిధిలో కొమ్మమూరు, అనుబంధ కాలువల్లో 60 శాతం పనులు కూడా పూర్తి కాలేదు.

నల్లమడ లాకుల వద్ద నీటిని ఆపుతాం

పశ్చిమ డెల్టా పరిధిలో తాగు, సాగునీటి అవసరాల కోసం కాలువలకు నీటిని విడుదల చేశాం. అవసరాన్ని బట్టి నీటి పరిమాణాన్ని పెంచుతాం. చీరాల సబ్‌డివిజన్ పరిధిలోని కాలువల్లో అత్యవసర పనులు పూర్తి చేయడానికి నల్లమడ లాకుల వద్ద కొమ్మమూరు కాలువలో నీటిని నిలిపేస్తాం. పనులు పూర్తి చేసిన తర్వాత దిగువకు వదులుతాం.
- వెంకటరత్నం, జలవనరుల శాఖ ఎస్ఈ

4న జడ్పీ సర్వసభ్య సమావేశం

జిల్లాపరిషత్తు(గుంటూరు), న్యూస్‌టుడే: ఉమ్మడి గుంటూరు జిల్లాపరిషత్తు సర్వసభ్య సమావేశం గుంటూరులోని జడ్పీ సమావేశ మందిరంలో ఛైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా అధ్యక్షతన ఈ నెల 4న ఉదయం 10.30 గంటలకు జరగనుందని సీఈవో వి.జ్యోతి బసు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లాల కలెక్టర్లు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు పాల్గొంటారని వెల్లడించారు.

రండి.. విద్యార్థుల భవితకు బాటలు వేద్దాం

10న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలకు విద్యా శాఖ ఆహ్వానం

న్యూస్‌టుడే, బాపట్ల, రేపల్లె అర్బన్

ముత్తాయపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. చదువుతో పాటు విద్యార్థులు క్రమశిక్షణతో మెలగడానికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సమన్వయం అవసరమని భావిస్తోంది. తరగతి గదిలో గురువులు విద్యార్థులను పర్యవేక్షించినా మిగిలిన సమయంలో అమ్మానాన్న భాగస్వామ్యం ఉండేలా ప్రణాళిక రూపొందించింది. అందులో భాగంగా ఈ నెల 10న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల నుంచి జూనియర్ కళాశాలల వరకు మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించాలని తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో అన్ని విద్యా సంస్థల్లో ఈ కార్యక్రమాన్ని వేడుకలా నిర్వహించేందుకు విద్యా శాఖాధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

● సమావేశంలో విద్యార్థుల నడవడిక, తీరుతెన్నులు, వివిధ అంశాల్లో ప్రతిభపై తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభిప్రాయాలు పంచుకుంటారు. విద్యార్థి ప్రవర్తన, చదువులో రాణింపు, క్రమశిక్షణ తదితర అంశాలపై చర్చిస్తారు. విద్యా హక్కు చట్టం, ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత సీట్ల కేటాయింపు అంశాలపై అవగాహన కల్పిస్తారు. విద్యార్థుల మార్కులు, సంబంధించిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డులు తయారు చేసి తల్లిదండ్రులకు అందజేస్తారు. రాష్ట్రీయ బాల సురక్ష కార్యక్రమం వివరించి ఆరోగ్య పరిరక్షణకు సంబంధించిన బుక్‌లెట్స్ పంపిణీ చేస్తారు.

జిల్లాలో ఇలా..
- ప్రభుత్వ బడులు: 1,432
- విద్యార్థుల సంఖ్య: 84,146
- జూనియర్ కళాశాలలు: 75
- విద్యార్థుల సంఖ్య: 17,283

బృంద చిత్రాలు.. లక్ష్యాల బోర్డులు

విద్యా సంస్థల ప్రాంగణాల్లో తల్లిదండ్రులు, విద్యార్థులు, ఉపాధ్యాయుల బృంద చిత్రాలు తీసుకునేలా ఫోటో స్పాట్‌లు ఏర్పాటుచేస్తున్నారు. డ్రీమ్‌వాల్స్ ఏర్పాటు చేసి విద్యార్థులతో వారి లక్ష్యాలను రాయిస్తారు. అమ్మ పేరిట మొక్కలు నాటేలా విద్యార్థులను ప్రోత్సహిస్తారు. పాఠశాల ప్రగతిని వేదికపై వెల్లడిస్తారు. తల్లిదండ్రులకు పలు పోటీలు నిర్వహిస్తారు.

విజయవంతంగా నిర్వహించడానికి ఏర్పాట్లు

ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు విజయవంతంగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. సమావేశాల నిర్వహణకు పాఠశాలలకు నిధులు విడుదల చేస్తున్నాం. వీటి ద్వారా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమన్వయం పెరుగుతుంది. విద్యార్థుల మనోవికాసం, ఎదుగుదల, కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాల దిశగా అడుగులు వేయడానికి తగినంత ప్రోత్సాహం లభిస్తుంది. ఉత్తమ పౌరులుగా ఎదిగేలా దోహదపడుతుంది.
- నాగిరెడ్డి, సమగ్ర శిక్షా ఏపీసీ

జనాల్లోకి సుపరిపాలన సందేశం

ఏడాది పాలనలో చేసిన మేలును వివరించిన మంత్రులు, ఎమ్మెల్యేలు

బల్లికురవలో మహిళతో మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

బాపట్ల, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం జిల్లాలో తొలిరోజు బుధవారం ఘనంగా ప్రారంభమైంది. మంత్రులు.. ఎమ్మెల్యేలు గ్రామాలు, పట్టణాల్లో ఇంటింటికి వెళ్లి తొలి ఏడాదిలో ప్రభుత్వం చేసిన మేలు, వైకాపా ఐదేళ్ల విధ్వంస పాలనతో అన్ని రంగాలకు జరిగిన నష్టాన్ని వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. త్వరలో ప్రారంభం కానున్న అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం పథకాల గురించి వివరించారు. అద్దంకి నియోజకవర్గం బల్లికురవలో మంత్రి గొట్టిపాటి రవికుమార్ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి ప్రజల్ని కలిసి కరపత్రాలు పంపిణీ చేశారు. వైకాపా ఐదేళ్ల పాలనలో రాష్ట్రం పాతికేళ్లు వెనక్కి వెళ్లిందని విమర్శించారు. సుపరిపాలనలో ఏపీకి సీఎం చంద్రబాబు కొత్త బెంచ్ మార్క్ సృష్టించారని అన్నారు. రేపల్లె మండలం కారుమూరు, పట్టణంలోని ఒకటో వార్డులో మంత్రి అనగాని సత్యప్రసాద్ పర్యటించారు. ప్రజలను కలిసి కూటమి ప్రభుత్వ విజయాలను వివరించారు. పారిశ్రామిక రంగంలో 8.5 లక్షల ఉద్యోగాల కల్పనకు ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిపారు. వేమూరు నియోజకవర్గం అమృతలూరు, బాపట్ల పట్టణం 9, 11 వార్డుల్లో ఎమ్మెల్యే వేగేశన నరేంద్ర వర్మ, తెదేపా జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖరబాబు, చీరాల మండలం తోటవారిపాలెంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించి ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు.

కారుమూరులో స్థానికులను కలిసిన మంత్రి అనగాని సత్యప్రసాద్

ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యుత్తు ఉద్యోగులు, అధికారులు

అప్రమత్తతతో విద్యుత్తు ప్రమాదాలు దూరం

చీరాల, న్యూస్‌టుడే : అప్రమత్తంగా ఉండటం వల్ల విద్యుత్తు ప్రమాదాలు దరిచేరవని విద్యుత్తు ఈఈ జాన్‌థామస్ అన్నారు. జాతీయ విద్యుత్తు భద్రత వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం విద్యుత్తు ఉద్యోగులు ప్రదర్శన నిర్వహించారు. ఈసందర్భంగా ఈఈ మాట్లాడుతూ ప్రమాదవశాత్తు తెగిన తీగలకు దూరంగా ఉండాలన్నారు. పాదరక్షలు లేకుండా విద్యుత్తు పరికరాలు ముట్టుకోరాదని తెలిపారు. సరఫరా నిలపకుండా ఎలాంటి మరమ్మతులు చేయకూడదన్నారు. సమస్య వస్తే సొంత ప్రయోగాలు చేయకుండా నిపుణులను సంప్రదించాలని సూచించారు. అనధికార విద్యుత్తు వినియోగం చట్టప్రకారం నేరమని దీనికి తగిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. నీటి పైపులు, విద్యుత్తు తీగలు పక్కన ఉంచరాదన్నారు. తడిచేత్తో విద్యుత్తు పరికరాలు ఉపయోగించవద్దని చెప్పారు. దుస్తులు ఆరబెట్టేందుకు విద్యుత్తు తీగలు ఎట్టిపరిస్థితుల్లో వినియోగించవద్దని సూచించారు. చీరాల, పర్చూరు డీఈఈ లు బి.హరిప్రసాదరావు, జె.శ్రీనివాసరావు, ఏఈలు, విద్యుత్తు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రగతి దిశగా వేగంగా అడుగులు

ఏడాది పాలనలో విజయాలు వివరించిన కలెక్టర్

మాట్లాడుతున్న వెంకటమురళి

బాపట్ల, న్యూస్‌టుడే : కలెక్టర్‌గా తాను బాధ్యతలు చేపట్టిన ఏడాదిలో జిల్లా అన్ని రంగాల్లో గణనీయమైన ప్రగతి సాధించిందని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. కలెక్టరేట్లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన సాధించిన విజయాలు వివరించారు. కృష్ణానది వరదల సమయంలో కొల్లూరు, భట్టిప్రోలు మండలాల్లో 11 లక్షల క్యూసెక్కులకు పైగా వరద వచ్చినా ప్రాణ నష్టం సంభవించకుండా జిల్లా యంత్రాంగంతో కలిసి సహాయ, పునరావాస చర్యలు చేపట్టి సీఎం చంద్రబాబు నుంచి ప్రశంసలు అందుకున్నట్లు చెప్పారు. వరద బాధితులను అన్ని విధాలుగా ఆదుకున్నామని తెలిపారు. పీ-4 అమలులో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉన్నట్లు చెప్పారు. సూర్యలంక బీచ్ అభివృద్ధికి కేంద్రం నుంచి రూ.97.52 కోట్లు సాధించినట్లు చెప్పారు. చీరాల చేనేత కుప్పడం పట్టుచీరలు ఒకే జిల్లా- ఒకే ఉత్పత్తి పథకానికి ఎంపిక కావడం, రెడ్‌క్రాస్ సభ్యత్వ నమోదులో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచి గవర్నర్ అబ్దుల్ నజీర్ నుంచి పురస్కారం అందుకోవటం సంతృప్తి ఇచ్చిందన్నారు. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రణాళికలు అమలు చేస్తున్నామని, మోటుపల్లిలో వీరభద్రస్వామి ఆలయం అభివృద్ధి, మ్యూజియం నిర్మాణానికి చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు. ప్రత్యేక డ్రైవ్ చేపట్టి 1900 మంది నిరుపేద ఎస్టీలకు ఆధార్ కార్డులు జారీ చేయించామని చెప్పారు. సంక్షేమ వసతి గృహాల్లో రూ.1.94 కోట్లలో వసతులు మెరుగుపరిచినట్లు చెప్పారు. జిల్లా సమగ్రాభివృద్ధికి అంకితభావంతో కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ఇసుక దిబ్బలు తొలగించి.. అప్పనంగా దోచేసి

గత ప్రభుత్వ హయాంలో రెచ్చిపోయిన అక్రమార్కులు

న్యూస్‌టుడే, బాపట్ల, చీరాల అర్బన్

ఇసుక తవ్వి ట్రాక్టర్‌లో పోస్తున్న జేసీబీ (పాత చిత్రం)

గత ప్రభుత్వ హయాంలో ఇసుకాసురులు చెలరేగిపోయారు. సముద్రతీరాన్ని సైతం వదల్లేదు. బాపట్ల, చీరాల మండలాల సరిహద్దుల్లో మత్స్యకారులకు చెందిన వేట పడవలు సముద్రంలో నుంచి రాకపోకలు సాగించే ఈపూరుపాలెం స్ట్రెయిట్‌కట్ కాలువ స్వరూపాన్నే మార్చారు. మత్స్యకారులకు మేలు చేస్తున్నామంటూ డ్రెడ్జింగ్ యంత్రాలతో వేల టన్నుల ఇసుకను తవ్వి విక్రయించి సొమ్ము చేసుకున్నారు. వాయుగుండాలు, తుపానుల వేళ అలల ఉద్ధృతి నుంచి తీరాన్ని కాపాడుతూ సహజరక్షా కవచాలుగా ఉన్న ఎత్తైన ఇసుక దిబ్బలు అక్రమార్కుల స్వార్థానికి కరిగిపోయాయి. ఈపూరుపాలెం స్ట్రెయిట్‌కట్ కాలువను 1974లో తవ్వారు. పర్చూరు వాగు ఎడమ వైపు నుంచి కాలువ ప్రారంభమవుతుంది. పర్చూరు, కారంచేడు, చీరాల, బాపట్ల మండలాల పరిధిలోని వేల ఎకరాల మురుగు ఈ కాలువ గుండా ప్రవహించి అడవి తీరంలో సముద్రంలో కలుస్తుంది. కాలువ సముద్రంలో కలిసే ముఖద్వారం వద్ద నేరుగా కాకుండా వంపుగా నిర్మించారు. దీనివల్ల అలల తీవ్రత ఎక్కువగా లేకుండా వేట పడవలు సులువుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఆరు తీర గ్రామాల మత్స్యకారులకు చెందిన వెయ్యికి పైగా మర పడవలను కాలువలో నిలుపుతున్నారు.

ఈపూరుపాలెం స్ట్రెయిట్ కట్ కాలువలో ఇసుక తీస్తున్న యంత్రం

జెట్టీ నిర్మిస్తామని చెప్పి..

● బాపట్ల, చీరాల తీరప్రాంతాలు పర్యాటకంగా వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. స్థిరాస్తి వ్యాపారులు వందల ఎకరాల భూములు కొనుగోలు చేసి ప్లాట్లు వేశారు. రూ.కోట్లు ఖర్చుచేసి రిసార్టులు నిర్మిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో బాపట్లకు చెందిన బడా నేత బినామీ దృష్టి ఈపూరుపాలెం కాలువపై పడింది. అప్పటికే అతను రెండు మండలాల్లో ఇసుక మాఫియా నడుపుతున్నారు. కాలువలో మత్స్యకారులు పడవలు నిలపడానికి జెట్టీ నిర్మిస్తామని, ఇసుక తవ్వి పూడిక తీయిస్తామని నమ్మబలికారు. 2023 అక్టోబరులో డ్రెడ్జింగ్ యంత్రాలు తెచ్చి కాలువలో టన్నుల కొద్దీ ఇసుక తవ్వారు. సముద్ర ముఖద్వారం వద్ద వంపును పూడ్చించి కాలువను నేరుగా ఉండేలా మార్చారు. ఎత్తైన ఇసుక దిబ్బలను తవ్వి వందల ట్రాక్టర్లలో స్థిరాస్తి వ్యాపారులు వేసిన లేఔట్లకు తరలించారు. కాలువ వంపును తొలగించడంపై మత్స్యకారులు ఆందోళన చేశారు. అప్పటి కలెక్టర్ రంజిత్‌బాషాకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాలతో జలవనరులు, రెవెన్యూ, గనులు, పోలీసు శాఖల అధికారులు అడవి తీరాన్ని సందర్శించి కాలువ వంపు తొలగించడాన్ని పరిశీలించారు. తాత్కాలికంగా పనులు నిలిపివేసినా అక్రమార్కులపై చర్యలు తీసుకోలేదు. సముద్ర ముఖద్వారాన్ని స్థిరాస్తి వ్యాపారి బుర్ల వెంకట్రావు ఇటీవల మూసేయడంతో మత్స్యకారులు పెద్దఎత్తున ఆందోళన చేశారు. కలెక్టర్ వెంకటమురళి ఆదేశాలతో బాపట్ల ఆర్డీవో, మత్స్య శాఖ జేడీ, జలవనరుల శాఖ ఈఈ, కాలుష్య నియంత్రణ మండలి ఈఈ, డీఎస్పీ, గనుల శాఖ ఏడీలో కూడిన జిల్లాస్థాయి కమిటీ విచారణ ప్రారంభించింది.

న్యాయ విద్య ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున వర్సిటీ పరిధిలోని న్యాయ కళాశాలల్లో ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన లీగల్ స్టడీస్ పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాద్ బుధవారం విడుదల చేశారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీలో మూడో సెమిస్టర్, ఐదేళ్ల ఎల్ఎల్‌బీలో ఏడో సెమిస్టర్‌లో 809 మంది పరీక్ష రాయగా 482 మంది, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ మూడో సెమిస్టర్‌లో 341 మందికి గాను 212 మంది, ఎల్ఎల్‌బీ ఐదేళ్ల హానర్స్ కోర్సు మూడో సెమిస్టర్‌లో 47 మంది పరీక్ష రాయగా 44 మంది ఉత్తీర్ణత సాధించారని వివరించారు.

ఫుడ్ లైసెన్స్‌ల రెన్యువల్‌కు అవకాశం

గుంటూరు: ఫుడ్ లైసెన్స్‌లను రెన్యువల్ చేసుకునేందుకు ఆరు నెలల ముందే అవకాశం లభించిందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ వెల్లడించారు. ఆయన దిల్లీలోని తన కార్యాలయం నుంచి వివరాలు తెలిపారు. ఫుడ్ లైసెన్స్‌ల రెన్యువల్ గురించి వ్యాపారులు ఎదుర్కొంటున్న సమస్యలను గుంటూరు పట్టణ ఫ్యాన్సీ స్టేషనరీ జనరల్ మర్చంట్స్, హోటల్ అసోసియేషన్ నాయకులు ఫిబ్రవరిలో తన దృష్టికి తీసుకువచ్చారన్నారు. ఫుడ్ సేఫ్టీ స్టాండర్స్ అథారిటీ ఆఫ్ ఇండియా కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రి జగత్ ప్రకాష్ నడ్డా నేతృత్వంలో కీలక సంస్కరణలు తీసుకువచ్చారు. ఫుడ్ లైసెన్స్‌ల రెన్యువల్‌కు సంబంధించి రిజిస్ట్రేషన్లు 180 రోజులు ముందే చేసుకోవచ్చు. కేవలం రూ.1000 నామమాత్ర ఫీజు చెల్లిస్తే సరిపోతుంది.

పాలకవర్గాలు వస్తేనే ప్రగతి

మార్కెట్ కమిటీల పరిధిలో పెండింగ్‌లో సమస్యలు

“ జిల్లాలో ఇంకా కొన్ని మార్కెట్ కమిటీలకు పాలకవర్గాలను నియమించకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే పేరుకుపోయాయి. ఇన్‌ఛార్జుల పాలన కారణంగా కీలక నిర్ణయాలు తీసుకోలేని పరిస్థితి. గుంటూరు మిర్చియార్డు పరిధిలో అయితే.. అధికారులు కమీషన్ ఏజెంట్ల లైసెన్సుల పునరుద్ధరణ, కొత్తవి జారీ చేయడానికి ప్రయత్నిస్తున్నారు.

న్యూస్‌టుడే, మిర్చియార్డు

జిల్లాలో ఎనిమిది మార్కెట్ కమిటీలున్నాయి. కూటమి ప్రభుత్వం మంగళగిరి, దుగ్గిరాల కమిటీలకు పూర్తిస్థాయిలో పాలకవర్గాలను నియమించింది. ప్రత్తిపాడు కమిటీకి ఛైర్‌పర్సన్ పేరును మాత్రమే ప్రకటించింది. మిగిలిన గుంటూరు మిర్చియార్డుతోపాటు తాడికొండ, ఫిరంగిపురం, పొన్నూరు, తెనాలికి పాలకవర్గాలను సాధ్యమైనంత తొందరగా నియమిస్తే పాలనాపరమైన అంశాల పరిష్కారానికి అవకాశం ఏర్పడుతుంది.

● గుంటూరు మిర్చియార్డులో కల్వర్టుల వద్ద పరిస్థితి దారుణంగా ఉంది. గత మిర్చి సీజన్లో వాహనాలు ముందుకు కదలక ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమయ్యాయి. మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లోపించిందని రైతులు వాపోతున్నారు. మంచినీటి వసతి, రైతు విశ్రాంతి భవనంలో ఏసీ సమస్యలు పరిష్కారం కాలేదు. పారిశుద్ధ్యం పరిస్థితి చెప్పక్కర్లేదు. మిర్చి కోరుతో రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. ధర లేక రైతులు రోడ్డెక్కాల్సి వచ్చింది. పాలకవర్గ ఉన్నట్లయితే.. వివిధాంశాలపై దృష్టి పెట్టడానికి అవకాశం ఉండేది. మధ్యాహ్న భోజన పథకంలో లోపాలు తలెత్తకుండా రోజుకొకరు పర్యవేక్షించేందుకు వీలుండేది.

● గుంటూరు మిర్చియార్డులో అధికారులు పనులు చక్కబెట్టుకునే పనిలో ఉన్నారు. కమీషన్ ఏజెంట్ల లైసెన్సులను పునరుద్ధరించడంతోపాటు నూతన లైసెన్సులు జారీ చేసేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే కొన్నింటికి నవీకరణ పూర్తి చేశారు. ఈ సందర్భంగా ముడుపులు చేతులు మారాయన్న విమర్శలున్నాయి. కొత్త లైసెన్సుల జారీని వీలైనంత తొందరగా పూర్తి చేసేందుకు పావులు కదుపుతున్నట్లు సమాచారం.

గుంటూరు మిర్చియార్డు ముఖద్వారం

పాలకవర్గాలను నియమించాల్సిన మార్కెట్ కమిటీల రిజర్వేషన్ వివరాలు..

మిర్చియార్డు -	ఓసీ (పురుష)
తెనాలి -	బీసీ (పురుష)
పొన్నూరు -	ఓసీ (మహిళ)
ఫిరంగిపురం -	ఓసీ (పురుష)
తాడికొండ -	బీసీ (మహిళ)

త్రిసభ్య కమిటీల కూర్పుపై కసరత్తు

నెలాఖరుకు 167 సహకార సంఘాలకు సారథులు

శావల్యాపురం సొసైటీ కార్యాలయం

శావల్యాపురం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అండగా నిలిచే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు త్వరలో సారథులు రానున్నారు. ప్రస్తుతం పర్సన్ ఇన్‌ఛార్జులుగా సంబంధిత శాఖాధికారులు వ్యవహరిస్తున్నారు. వారి స్థానంలో త్రిసభ్య కమిటీలను నియమిస్తారు. ఇది వరకే ఈ ప్రక్రియ మొదలుపెట్టినా పూర్తి కావడంలో జాప్యమైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 167 సహకార సంఘాలున్నాయి. వైకాపా హయాంలో వీటికి ఎన్నికలు నిర్వహించకుండా పార్టీ కార్యకర్తలను కమిటీ సభ్యులుగా నియమించి ప్రతి ఆరు నెలలకు పదవీ కాలం పొడిగించుకుంటూ వచ్చారు. అదే సమయంలో సహకార సంఘాల్లో కొన్నిచోట్ల అక్రమాలు చోటు చేసుకుని అవి నష్టాల్లోకి వెళ్లాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక త్రిసభ్య కమిటీలను రద్దు చేసి సహకార శాఖ అధికారులను పర్సన్ ఇన్‌ఛార్జులుగా నియమించింది. వీరు తగినంత మంది లేక మూడు, నాలుగు సంఘాలకు ఒకరిని చొప్పున నియమించడంతో సక్రమంగా పర్యవేక్షణ చేయలేకపోతున్నారు. జూన్ 28 వరకు వీరికి గడువు ఇచ్చారు. మళ్లీ ఆరు నెలలకు వీరి పదవీ కాలం పెంచాల్సి ఉండగా నెల రోజులే పొడిగింపు ఇచ్చారు. ఈ సమయంలో త్రిసభ్య కమిటీల నియామక ప్రక్రియను కొలిక్కి తీసుకురానున్నారు.

ఆశావహుల నిరీక్షణ: జిల్లాలో సహకార సంఘాల త్రిసభ్య కమిటీల్లో ఛైర్మన్, డైరెక్టర్లుగా నియమించేందుకు మూడు నెలల కిందటే ఆశావహుల జాబితాలు సిద్ధం చేసి అధిష్ఠానానికి పంపించారు. కొన్నిచోట్ల ఎన్డీయే కూటమిలోని జనసేన నేతలకూ అవకాశం కల్పించారు. కమిటీల్లో పేర్లున్న ఆశావహులంతా ఈ పదవుల కోసం రెండు నెలలుగా ఎదురుచూస్తున్నారు. ఈ నెలాఖరులోగా సంఘాలన్నింటికీ కమిటీలు వేయబోతున్నారు. అనంతరం ఎన్నికలు నిర్వహించినా అప్పుడూ వీరినే అధ్యక్షులుగా కొనసాగించేలా అభ్యర్థుల్ని ఎంపిక చేయాలని, తేడాలుంటే ఇప్పుడు సరిదిద్ది మరోసారి జాబితా పునఃపరిశీలన చేసుకోవాలని పార్టీ నుంచి స్థానిక నాయకులకు ఆదేశాలందాయి.

అక్రమ రవాణాపై చర్యలు

ఇసుక తవ్వకాలను పరిశీలిస్తున్న అధికారులు

వేటపాలెం, న్యూస్‌టుడే: కలెక్టరు ఆదేశాల మేరకు ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు హెచ్చరించారు. అక్రమ రవాణాను అరికట్టేందుకు రెవెన్యూ, పోలీసుల ఆధ్వర్యంలో తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మండల పరిధిలో ఇసుక తరలించిన దేశాయిపేట పంచాయతీ రైల్వేగేటు సమీపంలోని సర్వే నంబరు 22/2, పుల్లరిపాలెం పంచాయతీ సర్వే నంబరు 179లోని వాన్‌పిక్ భూములను ఆయన డీఎస్పీ మొయిన్‌లు బుధవారం పరిశీలించారు. గ్రామ రెవెన్యూ అధికారులు కృష్ణవేణి, పురుషోత్తంలతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వారి వెంట గ్రామీణ సీఐ ఎం.శేషగిరిరావు, వేటపాలెం ఎస్సై జనార్దన్ ఉన్నారు.

MARGADARSI CHIT FUND PVT. LTD.
Chit Groups are available at our *NARASARAOPET* BRANCH

CHIT GROUP	DURATION IN MONTHS	MONTHLY INSTALLMENT	CHIT VALUE
LT C	50	30,000	15,00,000
LT X	50	20,000	10,00,000
FT VV	40	2,00,000	80,00,000
FT D	40	50,000	20,00,000

Please Contact Branch Manager **Mr. M.ADISESHA RAO,** for further details. Mobile No. **8008229506,**
Landline: 08647-222674, 227161.

(c) eenadu

కలం పట్టు.. గళం వినిపించు

మీ గ్రామం/పట్టణం/ నగరంలో తాగునీరు, పారిశుద్ధ్యం, మురుగునీటి పారుదల, రహదారుల సమస్యలు ఉన్నాయా? పథకాల అమలులో లోపాలు, నిధుల దుర్వినియోగం, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయా? మీ ప్రాంతం విశేషాలు, ప్రత్యేకతలు, ఇతరులకు స్ఫూర్తినిచ్చే అంశాలు, ప్రతిభాపాటవాలు.. అలాగే ఉత్సవం, ఆశ్చర్య పరిచే దృశ్యాలతో కూడిన వివరాలను స్పష్టంగా మాకు పంపండి. వాటిని మీ పేరు తోనే 'ఈనాడు' 'పౌరపాత్రికేయం' ద్వారా ప్రచురిస్తాం. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తాం. ఇందుకు మీరు చేయాల్సిందల్లా ఈ కింది నంబరుకు వాట్సాప్ చేయండి. సమాజహితానికి ఇది దోహదపడుతుంది.

వాట్సాప్ నంబరు : 96528 85839
(దీనికి వాట్సాప్ మాత్రమే చేయాలి. ఫోన్ కాల్స్ స్వీకరించరు)

గమనిక : మీ పేరు, ఊరు, మండలం, జిల్లా, చరవాణి నంబరు తప్పక పేర్కొనాలి. సామాజిక మాధ్యమాల్లోని అంశాలు/ ఫొటోలను పంపకూడదు. స్వయంగా మీ కంటితో చూసిన అంశాలు, మీరు తీసిన చిత్రాలనే పంపాలి. మా ప్రమాణాల మేరకు పారదర్శకంగా ఉన్నవాటినే ప్రచురిస్తాం.

రహదారిలో పశువుల వ్యర్థాలతో ఇబ్బందులు

సమస్య: కొల్లూరు పంచాయతీ పరిధి యాదవపాలెంలో మా ఇంటి నుంచి రాకపోకలు సాగించే ఉమ్మడి గల్లీలో కొలుసు కృష్ణ అనే వ్యక్తి తన పశువులు కట్టేయడంతో పాటు వాటి వ్యర్థాలు అక్కడే వేయడంతో రాకపోకలు సాగించేందుకు వీలు కుదరడం లేదు. వర్షం కురిస్తే దుర్వాసన వస్తోంది. ఈగలు, దోమలు పరిసరాల్లో ముసురుకుంటున్నాయి. ఓ ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న నేను సమస్యను కృష్ణ అతని కుటుంబ సభ్యులకు వివరించేందుకు ప్రయత్నిస్తే నాపై దాడికి యత్నించారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించగలరు. **- డొక్కు శివ నాగమల్లేశ్వరరావు, యాదవపాలెం, కొల్లూరు**

అధికారుల సమాధానం: ❖ తమ నివాసం నుంచి రాకపోకలు సాగించే ఉమ్మడి గల్లీలో పశువుల వ్యర్థాలు వేసి ఇబ్బందిపెట్టడంతో పాటు దౌర్జన్యానికి దిగుతున్నారని శివనాగమల్లేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన కొలుసు కృష్ణ, అతని కుమారుడు రాంబాబుపై కేసు నమోదు చేశాం. నిందితులపై చర్యలు తీసుకుంటాం. **- అమరవర్ధన్, ఎస్సై, కొల్లూరు**

❖ కొల్లూరు పంచాయతీ పరిధి యాదవపాలెంలో శివనాగమల్లేశ్వరరావు పడుతున్న సమస్య విన్నాం. రెండు కుటుంబాల వారితో మాట్లాడి పశువుల వ్యర్థాలు రోడ్డుపై వేయకుండా, ఉన్న వాటిని తొలగింపజేసి సమస్య పరిష్కరిస్తాం. **- శంకరరావు, పంచాయతీ కార్యదర్శి, కొల్లూరు**

- కొల్లూరు, న్యూస్‌టుడే

స్ట్రాంగ్ మ్యాన్ ఆఫ్ ఇండియాగా ఖాజావలి

సాధించిన పతకాలతో ఖాజావలి

వేటపాలెం, న్యూస్‌టుడే: సెయింట్ ఆన్స్ కళాశాల ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఎంబీఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఖాజావలి జాతీయస్థాయి లిఫ్టింగ్ పోటీల్లో స్ట్రాంగ్ మ్యాన్ ఆఫ్ ఇండియా టైటిల్ సాధించారు. కర్ణాటక రాష్ట్రంలోని దేవనగిరిలో గత నెల 22 నుంచి 30 వరకు జరిగిన పోటీల్లో 93 కిలోల విభాగంలో 338 బ్యాక్ స్క్వాట్, బెంచ్‌ప్రెస్ 200, డెడ్‌లిఫ్ట్ 318.5 మొత్తం 856.5 కిలోల ఎత్తి జాతీయస్థాయి రికార్డులు బ్రేక్ చేసి స్ట్రాంగ్ మ్యాన్ ఆఫ్ ఇండియా టైటిల్‌తో పాటు మూడు బంగారు, ఒక రజత పతకాలు కైవసం చేసుకున్నారు. ఖాజావలిని కళాశాల కార్యదర్శి వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు, వ్యాయామ అధ్యాపకుడు అన్నం శ్రీనివాసరావు, జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఛైర్మన్ తాడివలస దేవరాజ్, అధ్యక్షుడు టి.ఎస్.ఆర్.సి.ఎస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏవై ప్రసాద్ తదితరులు అభినందించారు.

పనులు చేస్తారా.. పంట ముంచుతారా?

చెరుకుపల్లి గ్రామీణ, న్యూస్‌టుడే

☛ బలహీనంగా ఆర్ఎం డ్రెయిన్ ☛ హామీ ఇచ్చి బాగు చేయని పాలకులు

తీరంలో ప్రధానమైన ఆర్ఎం డ్రెయిన్ నిర్లక్ష్యానికి గురైంది. దశాబ్దాలుగా దీనికి నిర్వహణ లేదు. దీంతో బలహీనపడ్డ కట్టలతో వానాకాలంలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. పూడిక తీయకపోవడం, రెగ్యులేటర్ వద్ద షట్టర్ల నిర్వహణ లోపం.. వంతెనల ఎగువ ఎత్తులో నిర్మించకపోవడం వంటి కారణాలతో డ్రెయిన్‌లో వరద నీటి పారుదల ప్రభావితం అవుతోంది. గుర్రపుడెక్కను సకాలంలో తొలగించక వంతెనల పిల్లర్లకు అడ్డుపడి నీటిని నిలిపి వేస్తోంది. వరద నీరు వెనక్కు వేగంగా మరలడంతో వరి పొలాలు నీట మునుగుతున్నాయి. పక్కలో ఉన్న మా సాగు ఈ పరిస్థితిని రైతులు ఎదుర్కొన్నారు. గతేడాది పరిస్థితి 50 ఏళ్ల తర్వాత మొదటిసారి అంటున్నారు. అధికారులు, పాలకులు డ్రెయిన్ బాగు చేస్తామని చెబుతున్నారు తప్ప ఆచరణలో పనులు చేయడం లేదు.

✦ గూడవల్లి వద్ద రెగ్యులేటర్ దిగువన రెండు కట్టలు కోతకు గురయ్యాయి. 2015-16లో వరద వచ్చినప్పుడు షట్టర్లను ఎత్తి నీటిని దిగువకు ఒక్కసారిగా విడుదల చేయగా కట్టలు కోతకు గురయ్యాయి. కుడికట్ట 2020లో గండిపడగా కర్షకులు పాతి ఇసుక బస్తాలతో తాత్కాలికంగా కట్ట ఏర్పాటు చేశారు. వరద సమయంలో నీటిని ఎక్కువగా రెగ్యులేటర్ నుంచి దిగువకు వదిలితే ఈ కట్టలకు గండిపడే అవకాశం.. నీటిని వదలకపోతే గతేడాది మాదిరిగా ఎగువన పొలాలు ముంపునకు గురై పంట నష్టం జరుగుతుంది.

తీరంలో ఇదీ పరిస్థితి
- ఆర్ఎం డ్రెయిన్ మొత్తం పొడవు - దాదాపు 48 కి.మీ.
- డ్రెయిన్ పరిధిలో ఉన్న జిల్లాలు - బాపట్ల, గుంటూరు
- మండలాలు - 8
- గ్రామాలు - 62
- సాగు విస్తీర్ణం - దాదాపు 1.50 లక్షల ఎకరాలు
- గతేడాది వరదలకు పంట మునిగిన సాగు భూమి - సుమారు 12 వేల ఎకరాలు
- పంట దెబ్బతిన్న సాగు భూమి - దాదాపు 25 వేల ఎకరాలు
- నష్టపోయిన రైతులు- 15,590

గతేడాది వరదలకు నీట మునిగిన కుళ్లిన వరి పంట చూపుతున్న రైతులు (పాత చిత్రం)

పంట విరామం తప్పదేమో

అధికారులు వస్తున్నారు.. డ్రెయిన్‌లో పూడిక, ఇసుక మేటలు తొలగిస్తామని చెబుతున్నారు. కానీ పనులు చేయడం లేదు. గతేడాది ఒక్కో రైతు ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు నష్టం వచ్చింది. అంతా పెద్ద రైతులే. రూ.లక్షల్లో నష్టం. ఈ సారి కూడా వరదలు వచ్చి నష్టం వస్తే అంత కష్టాన్ని భరించే స్థితిలో రైతులు లేరు. ఇచ్చిన హామీ నిలబెట్టుకోవడంలో పాలకులు, అధికారులు విఫలయ్యారు. పంట విరామం తప్పకపోవచ్చు.
- మహేష్, రైతు, గూడవల్లి

ఎత్తుకు పైఎత్తు వేసి.. ప్రత్యర్థిని చిత్తు చేసి..

ఈనాడు-ఈటీవీ ఛాంపియన్ పోటీల్లో పాల్గొన్న రెవెన్యూ ఉద్యోగులు

ఈనాడు-ఈటీవీ ఛాంపియన్ చదరంగం పోటీలో పాల్గొన్న రెవెన్యూ ఉద్యోగులు

ఈనాడు ETV ఛాంపియన్

కలెక్టరేట్ (గుంటూరు), న్యూస్‌టుడే: నిత్యం విధుల్లో తలమునకలై ఉండే రెవెన్యూ ఉద్యోగులు ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన చదరంగం పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒకరికంటే మరొకరు ఎత్తుకు పైఎత్తులు వేస్తూ రాణించారు. తొలిరౌండ్‌లో తడబడినా.. ఆతర్వాత ప్రత్యర్థులపై పోటా పోటీగా పావులు కదిపారు. రెవెన్యూ ఉద్యోగులకు కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలు ఆవరణలో చదరంగం పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి మాట్లాడుతూ ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు చదరంగం పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన సిహెచ్. వెంకటకిషోర్, ఎస్.వినయ్‌లకు జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు బహుమతులు అందజేశారు. చెస్ ఆర్బిటర్ చక్రవర్తి పాల్గొన్నారు.

సృజనకు దోహదం - సీహెచ్ వెంకటకిశోర్, విన్నర్

ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా పోటీలు అవసరం. అప్పటి నైపుణ్యాలను గుర్తుతెచ్చుకునేందుకు కాస్త సమయం పట్టింది. చదరంగం అంటే ఇష్టం. ఉద్యోగ రీత్యా ఎప్పుడూ ఏదో ఒక హడావుడిలో ఉంటాం. సృజనాత్మక ఆలోచనలకు, వైవిధ్యమైన ఎత్తుగడలకు పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయి. విజేతగా ట్రోఫీని అందుకోవడం చాలా సంతోషంగా ఉంది.

ఉల్లాసాన్ని ఇస్తాయ్ -ఎస్.నవీన్, రన్నర్

చదరంగం పోటీలను ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహించడం.. అందులో నేను పాల్గొనడం ఆనందంగా ఉంది. చదరంగం అంటే చాలా ఆసక్తి. ఉద్యోగులకు ఇటువంటి పోటీలు ఉల్లాసాన్నిస్తాయి.

ఒత్తిడి నుంచి ఉపశమనం - వై.లోహిత

క్రీడలపై ఆసక్తి ఉన్నా చదువుకోవడం.. ఆ తర్వాత ఉద్యోగ జీవితంతో బిజీ అయిపోయాం. ఉద్యోగులకు ఈ పోటీలు నిర్వహించడం చాలా సంతోషం. ఇటువంటి క్రీడలతో ఉద్యోగులకు ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుంది. క్రీడా నైపుణ్యాలు పెంపొందడంతోపాటు ప్రతిభ వెలుగులోకి వస్తుంది.

సూర్యఘర్ యూనిట్లు పెంచాలి

సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, న్యూస్‌టుడే : జిల్లాలో సూర్యఘర్ పథకం కింద సౌరశక్తి యూనిట్ల అమరిక పెంచాలని కలెక్టర్ వెంకటమురళి అన్నారు. కలెక్టరేట్ నుంచి మండల స్థాయి అధికారులతో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సౌర విద్యుత్తును ప్రజలు సద్వినియోగం చేసుకునేలా విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కొరిశపాడు, యద్దనపూడి మండలాల్లో పథకం అమల్లో పురోగతి లేదని ఎంపీడీవోలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనిట్లు వేగంగా గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రహదారుల వెంట చెత్త లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని, చెత్త ఇష్టం వచ్చినట్లు నిల్వ చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

పొగాకుకు గిట్టుబాటు ధర కల్పించాలని వినతి

మంత్రి గొట్టిపాటితో మాట్లాడుతున్న పొగాకు రైతులు

అద్దంకి, న్యూస్‌టుడే: బ్యారన్ పొగాకు పంటకు మద్దతు ధర కల్పించాలంటూ రైతులు మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమానికి హాజరైన ఆయనకు మండలంలోని పేరాయపాలెం, మోదేపల్లి గ్రామాల రైతులు కలిసి గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. వారం రోజుల క్రితం వెల్లంపల్లి పొగాకు వేలం కేంద్రం వద్ద గిట్టుబాటు ధర లేకపోవడంతో కొటికలపూడి గ్రామ రైతులు రాస్తారోకో చేపట్టిన విషయం తెలిసిందే. మంత్రి స్పందిస్తూ అంచనా కంటే రెండింతలు అధికంగా పొగాకు పండించారని, అందువల్లే ధర లేకుండా పోయిందన్నారు. పొగాకు కొనుగోలు కంపెనీల ప్రతినిధులతో మాట్లాడి మద్దతు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ఏపీఎల్ ఫ్రాంఛైజీ క్రికెట్ జట్టును దక్కించుకున్న సతీష్

బాపట్ల: ఏసీఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆంధ్రా ప్రీమియర్ లీగ్ ఫ్రాంఛైజీ క్రికెట్ జట్టును బాపట్ల జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్‌కు చెందిన అపర్ణ మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థ దక్కించుకుంది. సీజన్ 4లో నూతనంగా సెంట్రల్ జోన్‌లో ఎంపిక చేసిన ఏడో ఫ్రాంఛైజీ క్రికెట్ జట్టు కోసం దిగ్గజ వ్యాపార సంస్థలతో పోటీ పడి బిడ్‌లో అపర్ణ మెరైన్ ఎక్స్‌పోర్ట్స్ సంస్థ విజయం సాధించింది. అన్నం సతీష్ మాట్లాడుతూ ఏసీఏ ఆధ్వర్యంలో నిర్వహించే ఆంధ్రా ప్రీమియర్ లీగ్ ద్వారా క్రికెట్ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. త్వరలో జరిగే పోటీల్లో తమ ఫ్రాంఛైజీ క్రికెట్ జట్టు పేరు, వివరాలు త్వరలో తెలియజేస్తామని చెప్పారు. నైపుణ్యం, ప్రతిభ కలిగిన క్రికెటర్లకు జట్టులో అవకాశం కల్పించి ప్రోత్సహిస్తామని పేర్కొన్నారు.

విద్యుత్తు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచాలి

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: విద్యుత్తు భద్రతపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు అందరూ కృషి చేయాలని విద్యుత్తు భద్రతా సంచాలకులు, ప్రభుత్వ ప్రధాన విద్యుత్తు తనిఖీ అధికారి విజయలక్ష్మి సూచించారు. జాతీయ విద్యుత్తు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం టౌన్-1 ఈఈ కార్యాలయంలో ఉద్యోగులతో నిర్వహించిన సమావేశంలో విజయలక్ష్మి మాట్లాడుతూ విద్యుత్తు వినియోగంపై సరైన అవగాహన కల్పిస్తూ ప్రమాదాలు జరగకుండా చూడడంపై దృష్టి పెట్టాలన్నారు. నూతన సర్వీసు మంజూరు చేసే సమయంలోనే ఇంటికి ఎర్తింగ్ సక్రమంగా ఉందా? లేదా? తనిఖీ చేయాలన్నారు. గృహ వినియోగదారులు విద్యుదాఘాతానికి గురి కాకుండా ఉండేందుకు 30 ఎంఏ సామర్థ్యం కలిగి ఉన్న ఆర్‌సీసీబీ/ ఈఎల్‌సీబీలను విద్యుత్తు సరఫరా వలయాల్లో చట్టప్రకారం విధిగా ఉపయోగించుకునేలా చూడాలన్నారు. వ్యవసాయ పంపుసెట్లకు సంబంధించి మోటారు స్టార్టర్లు, స్విచ్చులు ఉన్న ఇనుప బోర్డులకు విధిగా ఎర్తింగు వేసిన అనంతరమే సర్వీసు ఇవ్వాలని తెలిపారు.

డ్వాక్రా సభ్యులకు పథకాలపై అవగాహన తప్పనిసరి

మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు, చిత్రంలో వివిధ శాఖల అధికారులు

కొరిశపాడు (మేదరమెట్ల), న్యూస్‌టుడే: పీఎం సూర్యఘర్ పథకంపై డ్వాక్రా సభ్యులు అందరికి అవగాహన కల్పించాలని డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు అన్నారు. కొరిశపాడులోని వెలుగు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో బుధవారం ఆయన పాల్గొని మాట్లాడారు. సూర్యఘర్ పథకం ఆవశ్యకతను ప్రతి ఒక్కరికీ తెలియజేయాలన్నారు. ప్రజలు వీటిని ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహించాలని సూచించారు. ప్రభుత్వం డ్వాక్రా సభ్యులకు అందిస్తున్న పథకాల గురించి వివరించారు. ఎంపీడీవో రాజ్యలక్ష్మి, డీపీఎం ఐబీ రవికుమార్, ఏపీఎం మాణిక్యరావు, పంచాయతీ కార్యదర్శులు, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సురేష్ (పాత చిత్రం)

జె.పంగులూరు న్యూస్‌టుడే: అప్పుల బాధ తాళలేక యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన మండలంలోని రామకూరులో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ఎర్రిబోయిన సురేశ్(36) గొర్రెలు కాస్తూ జీవనం సాగిస్తున్నాడు. అప్పులు ఉండటంతో పాటు కుటుంబ కలహాలు తోడవడంతో మనస్తాపానికి గురై గత నెల 26న గడ్డి మందు తాగాడు. కుటుంబ సభ్యులు చిలకలూరిపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తీసుకెళ్లగా మెరుగైన చికిత్స నిమిత్తం కాటూరి వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినోద్‌బాబు తెలిపారు.

రైలు నుంచి జారిపడి ఒకరు..

రేపల్లె అర్బన్: రేపల్లె- పల్లెకోన రైల్వేస్టేషన్ల మధ్యలో రైలు నుంచి కిందకు జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు తెనాలి జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ వేణు బుధవారం తెలిపారు. ఉదయం ట్రాక్‌పై విధులు నిర్వహిస్తున్న కీమెన్ చూసి సమాచారం అందించారన్నారు. సుమారు 30 నుంచి 35 ఏళ్ల వయసున్న వ్యక్తి బ్లూజీన్స్ ప్యాంట్ ధరించాడని, చొక్కా లేదని తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 9440627554 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

కారు ఢీకొని కార్మికుడి దుర్మరణం

బాపట్ల: పట్టణ శివారున కమ్మజన సేవా సమితి కల్యాణ మండపం సమీపంలో 216 ఏ జాతీయ రహదారిని దాటుతున్న సైకిలిస్టును చీరాల నుంచి బాపట్ల వైపు వేగంగా వస్తున్న కారు బుధవారం రాత్రి ఢీకొట్టింది. ఈ ఘటనలో పడమర బాపట్ల వైఎస్ నగర్‌కు చెందిన మల్లవరపు సాంబయ్య (60) తీవ్ర గాయాలతో మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రాంతీయ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. బాపట్ల గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు. మృతుడికి భార్య, పిల్లలు ఉన్నారు. సాంబయ్య బాపట్ల ఇంజినీరింగ్ కళాశాలలో కార్మికుడు.

ఆస్తి వివాదం

కుమారుడిపై మాజీ ఎంపీపీ ఫిర్యాదు

చీరాల గ్రామీణం, న్యూస్‌టుడే: కుమారుడిపై మాజీ ఎంపీపీ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైంది. ఈపూరుపాలెం ఎస్సై చంద్రశేఖర్ తెలిపిన వివరాలు మేరకు.. ఈపూరుపాలేనికి చెందిన మాజీ ఎంపీపీ గంజి ప్రసాద్‌కు కొంత కాలంగా ఆస్తి విషయంపై కుమారుడు సుబ్బారావుతో గొడవలు జరుగుతున్నాయి. ఈనేపథ్యంలో తన కుమారుడు మద్యం తాగి తనపై దౌర్జన్యం చేస్తున్నాడని ప్రసాద్ బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

జిల్లాలో భాజపా బలోపేతం

బాపట్ల, న్యూస్‌టుడే : భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యులుగా సీనియర్ నేతలు, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్ ప్రభాకర్, మువ్వల వెంకటరమణారావులను ఎంపిక చేయటం ద్వారా జిల్లాలో పార్టీ బలోపేతం అవుతుందని భాజపా జిల్లా అధ్యక్షుడు కొండముది బంగారుబాబు అన్నారు. భాజపా జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. భాజపా రాష్ట్ర నూతన అధ్యక్షుడు వీవీఎన్ మాధవ్ నాయకత్వంలో ఏపీలో భాజపా బలమైన రాజకీయ శక్తిగా ఎదుగుతుందన్నారు. కేంద్రంలో ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో సమాజంలో అన్ని వర్గాల అభ్యున్నతికి 11 ఏళ్లుగా సంక్షేమ, అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పీఎం కిసాన్ ద్వారా త్వరలో రైతులకు తొలి విడత రూ. రెండు వేల సాయాన్ని ప్రధాని నరేంద్ర మోదీ త్వరలో విడుదల చేస్తారని చెప్పారు. రాజధాని అమరావతి, పోలవరం ప్రాజెక్టు, జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్రం పెద్ద మొత్తంలో ఏపీకి నిధులు కేటాయిస్తున్నట్లు వివరించారు. నేతలు శ్రీనివాసరాజు, మణియాదవ్, బాలనారాయణ, రమేష్‌కుమార్, అనిల్‌కుమార్, రామకృష్ణ, సాయిబాబా, కరీముల్లా పాల్గొన్నారు.

హామీల అమలులో మోసం

బాపట్ల, న్యూస్‌టుడే : సూపర్-6 హామీల అమలులో ప్రజలను సీఎం చంద్రబాబు మోసం చేస్తున్నారని వైకాపా ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి విమర్శించారు. బాపట్లలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల, ఆగస్టులో వైకాపా సమన్వయకర్తలు, నేతలు, కార్యకర్తలు జిల్లా, డివిజన్, మండల, గ్రామస్థాయిలో నాలుగు దశల్లో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం చేసిన మోసాన్ని ప్రజలకు వివరించి చెప్పాలన్నారు. వైకాపా జిల్లా అధ్యక్షుడు మేరుగ నాగార్జున మాట్లాడుతూ ఎన్నికల హామీల అమలుకు కూటమి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేలా ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, ఎమ్మెల్సీ తూమాటి మాధవరావు, నియోజకవర్గ సమన్వయకర్తలు వరికూటి అశోక్‌బాబు, కరణం వెంకటేష్, ఈవూరి గణేష్, గాదె మధుసూదనరెడ్డి, పాణెం హనిమిరెడ్డి పాల్గొన్నారు.

12 బడి బస్సులపై కేసులు

తనిఖీల్లో ఎంవీఐ గోపాల్

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : చిలకలూరిపేట - నరసరావుపేట రహదారిలో మోటారు వాహనాల తనిఖీ అధికారి కె.గోపాల్ ఆధ్వర్యంలో పాఠశాలల బస్సులను బుధవారం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా బీమా, కాలుష్య రహిత ధ్రువపత్రాలతో పాటు పన్ను చెల్లించకపోవడం, డ్రైవర్లకు సమ వస్త్రాలు లేకపోవడం, ప్రథమచికిత్స పెట్టెలు లేకపోవడం వంటి అంశాలను గుర్తించి 12 పాఠశాలల బస్సులపై కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. వారి నుంచి రూ.47,200 అపరాధ రుసుము వసూలు చేశామన్నారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయన్నారు. బస్సులకు సంబంధించిన పత్రాలన్నీ తనిఖీ సమయంలో అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

మేలైన విత్తనాలు ఎంచుకోండి

కర్లపాలెం, న్యూస్‌టుడే : రైతులు మేలైన విత్తనాలు ఎంచుకోవాలని ఏవో సుమంత్‌కుమార్ తెలిపారు. మండలంలోని పేరలి, సమ్మెటవారిపాలెంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. పంట వేసే ముందు విత్తనశుద్ధి చేసుకోవాలని ఆయన సూచించారు. ఆగస్టు 15లోపు రైతులు పంటల బీమా చేయించుకోవాలని చెప్పారు.

రెండు రేషన్ దుకాణాలపై కేసులు

అద్దంకి, బల్లికురవ, న్యూస్‌టుడే : రేషన్ దుకాణాల్లోని నిల్వల్లో వ్యత్యాసం ఉండటంతో రెండు రేషన్ దుకాణాలపై 6ఏ కేసులు నమోదు చేసినట్లు ఎన్ఫోర్స్‌మెంట్ ఉప తహసీల్దారు సుధీర్ తెలిపారు. సాధారణ తనిఖీల్లో భాగంగా అద్దంకి ఎంఎల్ఎస్ పాయింట్ పరిధిలోని చౌకధరల దుకాణాలను తనిఖీ చేశారు. బల్లికురవ మండలం కూకట్లపల్లి గ్రామ దుకాణం నంబరు 35లో మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వల్లో తేడాలున్నట్లు గుర్తించారు. ఆమేరకు కేసు నమోదు చేశారు. ఇప్పటికే 70 శాతం బియ్యం పంపిణీ జరిగిన నేపథ్యంలో మిగిలిన సరకును సంబంధిత వీఆర్వోకు అప్పగించినట్లు ఉప తహసీల్దారు తెలిపారు. అద్దంకి మండలం వెంకటాపురంలోని 37వ నంబరు రేషన్ దుకాణాల్లో 1.15 క్వింటాళ్ల బియ్యం తేడా ఉన్నట్లు గుర్తించడంతో 6ఏ కేసు నమోదు చేసినట్లు ఉప తహసీల్దారు తెలిపారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 98, రిటైల్ ధర - 120, చికెన్ విత్‌స్కిన్ - 174, చికెన్ స్కిన్‌లెస్ - 198.
కృష్ణా జిల్లాలో: వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -93 రిటైల్ ధర 115 చికెన్ విత్ స్కిన్ - 167, చికెన్ స్కిన్‌లెస్ - 190.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 101, 109, 120 చికెన్ విత్ స్కిన్ - 194 చికెన్ స్కిన్‌లెస్ - 204.

నెక్ సూచించిన కోడిగ్రుడ్లు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 590 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

91.9FM Vijayawada ఈ FM 91.9 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

EENADU Classifieds

BUSINESS SERVICES
బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

PEOPLE CARE
OLD AGE HOME
రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవలకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95052 76677, 82474 49036.

Book your 5 lines Classified Colour Rs.770/-
3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/-
3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

REAL ESTATE
LAND FOR SALE
GENERAL
మెగా ★ అవకాడో ★ ఫామ్ ల్యాండ్‌లో 11 సెంట్లు ★5 లక్షలకే ★ 5వ సంవత్సరం నుండి సంవత్సరంకి 2 లక్షల ఆదాయం పొందండి. ఫోన్: 9133574455.

PLOT FOR SALE
GENERAL
తెనాలి సుల్తానాబాద్, నన్నపనేని నగర్‌లో తూర్పు ఫేసింగ్, 40 అడుగుల రోడ్డు గల 267 చ॥గ॥ VGTM, UDA అప్రూవల్ గల ప్లాటు అమ్మకమునకు కలదు. సంప్ర॥ 91679 79901.
నందనవనం @ చిలకలూరిపేట 500 గజాల స్థలము 3BHK ప్రీమియం విల్లాలు అన్ని సౌకర్యాలతో కేవలం 39 లక్షల రూపాయలు మాత్రమే సంప్రదించండి. 77027 87797, 97005 65357.

JOBS
Wanted Office Assistant (Female) For EPF Consultancy at Guntur. Qul: Graduate with Computers. Sal: Upto 10,000/-. Send Resume to 93924 44479.
Wanted Lady Tele Callers. Preferred Young & Energetic, Talktive Persons. Qualification: Inter & Degree. Contact: Worldwide Education Consultant. Lakshmipuram, Guntur. Cell: 90001 33866.
Tenali Wanted DTP Operator (Experience with Apple Key-board) Attractive Salary Offered Immediate Joining prefered Cont : 90526 43626.
Wanted Part Time Lady Graduate Teachers, Time: 1.00 P.M. to 8.00 P.M. & For Study Hours: 4.00 P.M. to 8.00 P.M. Sri Satya Sai Ideal School, Chowtra, Guntur-3. ✆: 0863-2222114, 2241837.
Wanted Marketing Executives to work in a reputed organization (8 Hrs Duty). Salary ranges from 12K to 15K. Interested Candidates. ✆: 98499 89951.
Wanted Experienced Tele Callers to work in a reputed organization. Interested Candidates Contact: ✆: 77290 15053.
Wanted Office Asst. (Male) Qua: Any Degree with Computer Knowledge. Maxmuller Publication Guntur. 94941 61313.
రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. జో+వ + మంచి జీతం+ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.
గుంటూరు, 11/2, అరండల్‌పేట, SR Images సంస్థలో పనిచేయుటకు రియల్ ఎస్టేట్ రంగంలో అనుభవం కలిగిన అకౌంటెంట్ కావలెను. ✆: 84658 45211.
గుంటూరులో పనిచేయుటకు Shop Keeper, Sales Person, Delivery Boys కావలెను. రైతన్న మిల్క్ డైరీ. 98487 58107.
శివకార్తికేయ హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు ఇంటి/ వంట పనిచేయుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 20K. ✆ 99120 11499, 99120 11899.
గుంటూరులో గల నర్సింగ్ కాలేజి నందు హాస్టల్‌లోనే ఉండి పనిచేయుటకు 10th/ ఇంటర్/ డిగ్రీ చదివిన లేడీ వార్డెన్స్ కావలెను. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్స్: 81224 61164, 70327 10958.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం..
ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

బాపట్ల

•బాపట్ల •రేపల్లె •వేమూరు

భూ వారాహీదేవిగా బండ్లమ్మ

చందోలు (పిట్టలవానిపాలెం), న్యూస్‌టుడే : చందోలు బండ్లమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న వారాహీ నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారిని భూ వారాహీదేవిగా అలంకరించారు.

అలంకరణలో అమ్మవారు

వైభవంగా శ్రీనివాసుని కల్యాణం

జిల్లెళ్లపల్లి (నగరం), న్యూస్‌టుడే : మండలంలోని జిల్లెళ్లపల్లి పద్మావతి సమేత శ్రీనివాసుడి కల్యాణం బుధవారం తిరుపూరు బ్రహ్మశ్రీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. భక్తులు పూజలు చేశారు. అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

కల్యాణంలో పాల్గొన్న దంపతులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

బాపట్ల : 80085 73141, రేపల్లె : 80085 73136, వేమూరు: 91107 83738

? జంపని పదో వార్డులో కొత్తకాలనీకి వెళ్లే మార్గంలో కాల్వలోని చెత్తను తీసి రోడ్డు పక్కన వేశారు. **- స్థానికుడు**

✔ వెంటనే పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి చెత్త తొలగించేలా చూస్తాం. **-శేఖర్, ఈవోపీఆర్‌డీ – వేమూరు, న్యూస్‌టుడే**

? లో ఓల్టేజీ సమస్యతో విద్యుత్తు మోటర్లు పని చేయక వేరుశనగ పొలాలకు నీటికి ఇబ్బందిగా ఉంది. **- జొన్నలగడ్డ వారిపాలెం రైతులు** ✔ గతంలో సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేశారు. ఆ సమయంలో కొద్దిమంది రైతులు మాత్రమే విద్యుత్తు మోటర్లు వాడేవారు. ప్రస్తుతం ఆ సంఖ్య పెరిగింది. ట్రిపుల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి. రైతులు దరఖాస్తు చేసుకుంటే ఏర్పాటు చేస్తాం. **- సురేష్, విద్యుత్తు శాఖ ఈఈ – న్యూస్‌టుడే, చెరుకుపల్లి** ? ప్యాడిసన్‌పేట లేఅవుట్ పేదల కాలనీలో ప్లాట్ నంబరు 650 నుంచి 655 వరకు వీధి దీపాలు వెలగటం లేదు. **-నాగేంద్రం** ✔ ఇంజినీరింగ్ సిబ్బందిని పంపి.. వెలగని దీపాల స్థానంలో కొత్త వాటిని అమర్చి వెలిగేలా చర్యలు తీసుకుంటాం. **-కృష్ణారెడ్డి, పురపాలక డీఈ – న్యూస్‌టుడే, బాపట్ల**

పనులు పూర్తికావు... రైతులకు సేవలందవు

న్యూస్‌టుడే, వేమూరు

జంపనిలో ముళ్లపొదలతో ఇలా..

● వేమూరు మండల పరిధిలో గత ప్రభుత్వం రైతుభరోసా కేంద్రాలు(ఆర్బీకేలు) నిర్మిస్తామని గొప్పలు చెప్పింది. 12చోట్ల నిర్మిస్తామని చెప్పి ఒక్కచోట కూడా నిర్మాణాలు పూర్తి చేయలేదు. కొన్నిచోట్ల పనులు ప్రారంభించినా పూర్తి కాలేదు. జంపనిలో పునాదుల దశలో ఆగిపోవడంతో పిచ్చిచెట్లు మొలిచాయి. ఇలాంటి పరిస్థితి నియోజకవర్గంలో చాలాచోట్ల ఉంది.

● నియోజకవర్గంలో 51 చోట్ల అప్పటి వైకాపా ప్రభుత్వం ఆర్బీకేల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. 17 చోట్ల భవన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మిగిలిన చోట్ల వివిధ దశల్లో ఆగిపోయాయి. వీటి గురించి పట్టించుకున్న వారు లేరు. అయితే అద్దె భవనాల్లో కేంద్రాలు నడపడం వల్ల అన్నదాతలకు నామమాత్రంగా సేవలు అందుతున్నాయి. ఒక్కొక్కచోట కనీసం పదిమంది రైతులు ఒక్కసారిగా వెళితే కూర్చోవడానికి అవకాశం ఉండటం లేదు.

● అప్పట్లో ప్రారంభించిన నిర్మాణాలకు 50 శాతం ఉపాధి హామీ నిధులు, మిగతావి రాష్ట్ర ప్రభుత్వం వాటా కేటాయించాలి. అయితే గత ప్రభుత్వం ఉపాధి నిధులకు తోడు రాష్ట్రం వాటావి కేటాయించలేదు. దీంతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మూడేళ్ల క్రితం పనులు నిలిచి పోవడంతో పిచ్చి మొక్కలు మొలిచి ముళ్లపొదలను తలపిస్తున్నాయి. వాటిని అలానే వదిలేస్తే చేసిన పనులు సైతం దెబ్బతింటాయని రైతులు చెబుతున్నారు. ఆర్బీకేలను రైతు సేవా కేంద్రాలు(ఆర్ఎస్‌కేలు)గా పేరు మార్చిన కూటమి ప్రభుత్వం అయినా వాటి పనులు పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని రైతులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ డీఈ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అసంపూర్తిగా ఉన్న కేంద్రాల విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. వారి సూచనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామన్నారు.

భవనాల కొరత.. రోజూ వ్యధ

చందోలు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థినులకు ఇక్కట్లు

న్యూస్‌టుడే, చందోలు (పిట్టలవానిపాలెం)

కళాశాల నిర్వహిస్తున్న రేకుల షెడ్డు

పిట్టలవానిపాలెం మండలం చందోలు ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలకు నేటికీ సొంత భవనం లేక విద్యార్థినుల పరిస్థితి దయనీయంగా మారింది. అన్నిరంగాల్లో బాలికలు సత్తా చాటుతున్నారు. కానీ ప్రభుత్వం వారికి సంపూర్ణంగా తగిన సదుపాయాలు, మేలైన విద్యాబోధన అందించడంలో వెనకబడింది.

✦ 2009లోనే కళాశాల ఏర్పాటు అయినా ప్రత్యేక భవన సదుపాయం లేదు. హెచ్ఈసీ, సీఈసీ, బైపీసీ, ఎంపీసీ గ్రూపుల్లో విద్యార్థినులు ఉన్నారు. ప్రథమ, ద్వితీయ ఏడాది కలిసి 130 మంది విద్య అభ్యసిస్తున్నారు. చుట్టుపక్కల మూడు మండలాల నుంచి ఇక్కడకు వచ్చి చదువుకుంటున్నారు.

✦ కళాశాల ఏర్పాటు చేసిన మొదట్నుంచి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ఆవరణలోని రేకుల షెడ్డుల్లోనే తరగతులు నిర్వహిస్తున్నారు. దీంతో విద్యార్థినులు మౌలిక సదుపాయాల విషయంలో సర్దుకుపోవాల్సి వస్తోంది. సైన్స్ ల్యాబ్‌కు మూడు కిలోమీటర్ల దూరంలో గల పిట్టలవానిపాలెం ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లాలి. వారికి సొంత భవనం ఉంటే ఇలా వ్యయ, ప్రయాసలతో పాటు విద్యాబోధనకు ఆటంకాలు ఉండవు. మిగతా సదుపాయాలు కూడా అందుబాటులోకి వచ్చేవి.

ప్రతిపాదనలు పంపలేరా?

బాలికల కళాశాలకు సొంత భవన నిర్మాణ విషయంలో కనీసం ప్రతిపాదనలు కూడా పంపలేదు. ఏళ్లు గడుస్తున్నా భవన నిర్మాణానికి చర్యలు లేవు. ఐదేళ్ల క్రితం స్థలం కేటాయింపు పేరుతో రెవెన్యూ అధికారులు హడావుడి చేసినా స్పష్టత కరవైంది. గత వైకాపా ప్రభుత్వం నాడు- నేడు సదుపాయాలు కల్పించడంలో విఫలమైంది. కూటమి ప్రభుత్వం స్పందించి బాలికల కళాశాలకు సొంత భవనాన్ని నిర్మించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

తెదేపా మండల కార్యవర్గం ఎంపిక

అమృతలూరు : తెదేపా మండల కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా కొత్తపల్లి రవీంద్ర బాబు (పెద్ద బుల్లెబ్బాయి), కొత్తపల్లి మాథ్యూస్, ప్రధాన కార్యదర్శిగా పాములపాటి వెంకటసుబ్బారావు, కోశాధికారిగా తాతా నాగేశ్వరరావు, మరో ఆరుగురు సభ్యులను ఎన్నుకున్నారు. వీరిని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, పలువురు పార్టీ నాయకులు అభినందించారు.

నేడు విస్తృత స్థాయి సమావేశం

వేమూరు : తెదేపా విస్తృత స్థాయి సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు వేమూరులో నిర్వహించనున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆనందబాబు హాజరవుతారని చెప్పారు.

10న బాల వికాస కేంద్రాలు ప్రారంభం

గుళ్లపల్లి (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే : సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 10న వ్యాస పౌర్ణమి సందర్భంగా బాల వికాస కేంద్రాలను ప్రారంభించనున్నట్లు ఫౌండేషన్ జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ తెలిపారు. ఫౌండేషన్ నెలవారీ సమావేశాన్ని మండలంలోని గుళ్లపల్లి శివాలయం వద్ద బుధవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల వికాస కేంద్రాల ద్వారా చిన్నారుల్లో భక్తిభావం పెంపొందించడం, సృజనాత్మకత మెరుగుపరిచే కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. 5 వరకు గ్రామ సమావేశాలు, 12న సత్సంగం, 6, 12న ఏకాదశి నగర సంకీర్తన, 10న పౌర్ణమి సందర్భంగా ఆలయాల్లో సామూహిక హారతి కార్యక్రమాలు నిర్వహించాలని నేతలకు ఆయన సూచించారు. సమావేశంలో నేతలు జంజనం హేమశంకరరావు, పడమట వెంకటేశ్వరరావు, చింత మురళీకృష్ణ, మత్తి సీతారాంబాబు, గుర్రం వెంకటేశ్వరరావు, పడితపు వెంకటేశ్వరరావు, దామర్ల పుణ్యవతి, పీటా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా కుబేర హోమం

బాపట్ల, న్యూస్‌టుడే: త్యాగ్యరాయనగర్ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మహాలక్ష్మి దేవి పంచలోహ విగ్రహ సంప్రోక్షణ కార్యక్రమాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుడు కపిలవాయి రామశాస్త్రి సోమయాజులు ఆధ్వర్యంలో పూర్ణాహుతి, శాంతి, మహాలక్ష్మి, కుబేర హోమాన్ని కనుల పండువగా చేశారు. భక్తులకు అన్నప్రసాద సంతర్పణ నిర్వహించారు. శ్రీనివాస సేవా సమితి ప్రతినిధులు, దంపతులు పూజలు చేశారు.

మహాలక్ష్మి పంచలోహ విగ్రహం

గుర్రపుడెక్క.. నీరు పారదు పక్కా

గంగాయి కాల్వ మరమ్మతుల్లో భాగంగా గుర్రపుడెక్కను రసాయనం పిచికారీ చేశారు. ఎండిన తర్వాత దాన్ని తొలగిస్తే నీటి ప్రవాహానికి అడ్డులేకుండా ఉంటుంది. అలానే వదిలేయడంతో సమస్య ఉంటుందని రైతులు చెబుతున్నారు. ఎండిన డెక్క తొలగించడంతో పాటు అక్కడక్కడ బలహీనంగా ఉన్న కట్టలను బలపరచాలని కోరుతున్నారు. **- అమృతలూరు, న్యూస్‌టుడే**

కాల్వలోనే వదిలేసిన ఎండిన గుర్రపుడెక్క

పక్కన పెట్టారు.. పట్టించుకోరు

రేపల్లె మండలం ఉప్పూడి పంచాయతీ ప్రాంగణంలో తడి- పొడి చెత్త సేకరణకు కేటాయించిన వాహనం అలంకారప్రాయంగా మారింది. గ్రామంలో చెత్త వ్యర్థ నిర్వహణ కేంద్రం లేక డ్రైవర్, ఆయిల్ ఖర్చు దండగని యోచించిన పాలకులు, అధికారులు వాహనాన్ని పక్కన పెట్టించారు. 2022లో గత ప్రభుత్వంలో రూ.లక్షలు వెచ్చించి వాహనాల్ని కొని.. నిర్వహణను గాలికొదిలేసి ప్రజాధనాన్ని వృథా చేశారని స్థానికులు విమర్శిస్తున్నారు. వాహనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి విషసర్పాలకు నిలయంగా మారాయి. అధికారులు దీన్ని వినియోగంలోకి తేవాలని స్థానికులు కోరుతున్నారు. **-రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే**

నిరుపయోగంగా చెత్త సేకరణ వాహనం

జారితే ఆసుపత్రికే...

నగరం- రేపల్లె సీసీ రహదారిలో మట్టి

మట్టి అక్రమ రవాణాదారుల దెబ్బకు వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. తీరం గ్రామాల నుంచి పట్టణాలకు ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలిస్తున్న మట్టి జారి రహదారులపై గుట్టలుగా పడుతోంది. మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్లు చెదిపోతే ట్రాక్టర్‌లోని మట్టిని నడిరోడ్డుపై వేస్తున్నారు. వానలకు అది తడిసి.. బురదగా మారి ద్విచక్ర వాహనదారులు జారి ప్రమాదాలకు గురవుతున్నాయి. మట్టిని తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. **-నగరం, న్యూస్‌టుడే**

సంక్షేమం.. అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం : మంత్రి

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే : సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. రేపల్లె మండలం కారుమూరు, రేపల్లె పట్టణంలో ఒకటో వార్డులో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికి తిరిగి ఏడాదిలో అమలు చేసిన సంక్షేమ పథకాలను ఆయన వివరించారు. వీటితో పాటు ఈనెలలో రైతులకు అన్నదాత సుఖీభవ, ఆగస్టులో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని తెలిపారు. సర్పంచి రమాదేవి, నాయకులు గూడపాటి శ్రీనివాసరావు, వెంకటసుబ్బారావు, రామకృష్ణ, సాంబశివరావు పాల్గొన్నారు.

పథకాలు వివరిస్తున్న అనగాని సత్యప్రసాద్

5 వరకు ఆప్షన్స్‌కు అవకాశం

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే : రేపల్లె ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్‌కు హాజరైన విద్యార్థులకు కళాశాలల ఆప్షన్లు నమోదు చేసుకునే ప్రక్రియ ఈనెల 5 వరకు ఉచితంగా చేస్తామని ప్రిన్సిపల్ చంద్రశేఖర్ తెలిపారు. 6న ఆప్షన్లల్లో మార్పులు, 9న జాయినింగ్ రిపోర్టు తీసుకోవచ్చని చెప్పారు. 10 నుంచి మొదటి ఏడాదికి తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు.

సమ్మె ఒప్పందాలు అమలు చేయాల్సిందే

రేపల్లె అర్బన్ : రేపల్లె మున్సిపల్ కార్యాలయం ఎదుట బుధవారం ఇంజినీరింగ్ కార్మికులు ఒంటి కాలిపై నిలబడి నిరసన ప్రదర్శన చేశారు. కార్మికుల జీతాలు పెంచాలని, సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ మణిలాల్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు రాఘవేంద్రరావు, రవిబాబు, యువరాజు, శివ, గీత, అనూష, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు మౌలిక వసతులు కల్పిస్తాం

నిజాంపట్నం: కొత్తపాలెం పంచాయతీలోని పెద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు మౌలిక వసతులు సమకూరుస్తామని గ్రామపెద్దలు హామీ ఇచ్చారు. బుధవారం తెదేపా మండల అధ్యక్షుడు దండుప్రోలు వెంకటేశ్వరరావు పాఠశాలను సందర్శించి విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్తు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ఇళ్ల స్థలాల కేటాయించాలని ధర్నా

కొల్లూరు, న్యూస్‌టుడే : ఇళ్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని సీపీఎం జిల్లా నాయకుడు తురుమిళ్ల కృష్ణమోహన్ కోరారు. కొల్లూరు శివారు గాంధీనగరానికి చెందిన కొందరు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలని ధర్నా చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా ప్రభుత్వం హడావుడిగా కొందరికి ఇళ్ల పట్టాలు ఇచ్చిందని.. స్థలాలు చూపించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఇళ్ల స్థలాలు ఊసే ఎత్తడం లేదని ధ్వజమెత్తారు. అనంతరం తహసీల్దార్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. సీపీఎం మండల నేత బొనిగల సుబ్బారావు, స్థానికులు మణిరత్న కుమార్, శ్రీనివాస్, ఏసోబు పాల్గొన్నారు.

అవీ ఇవీ

పారిశుద్ధ్య కార్యక్రమాల అమలు

నిజాంపట్నం : మండలంలోని పంచాయతీల్లో పక్కాగా పారిశుద్ధ్య కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు ఎంపీడీవో నర్రా నాగలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం నిజాంపట్నంలో పారిశుద్ధ్య కార్యక్రమాల నిర్వహణను ఆమె పర్యవేక్షించారు. వర్షాలు పడుతున్న కారణంగా పంచాయతీల్లో పనులు చేయిస్తున్నట్లు చెప్పారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు, ఇతర సిబ్బంది ఉన్నారు.

5 నుంచి ఏకరూప దుస్తులు ధరించాలి

నిజాంపట్నం, న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 5 నుంచి ఏక రూప దుస్తులు ధరించి పాఠశాలలకు రావాలని ఎంపీవోలు శోభాచంద్, శేషగోపాలం సూచించారు. బుధవారం మండలంలోని ఎక్స్ మిలటరీ కాలనీ ప్రాథమిక పాఠశాలను వారు తనిఖీ చేశారు. విద్యార్థులతో కలసి భోజనం చేశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు అడిగి తెలుసుకున్నారు. దస్త్రాలు పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు బాపయ్య ఉన్నారు.

ఒకరికి తీవ్ర గాయాలు

చెరుకుపల్లి గ్రామీణ : మండల కేంద్రం చెరుకుపల్లి కొత్తపేట వద్ద జాతీయ రహదారిపై రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని పి.శ్రీనివాసరావు కుడి కాలికి తీవ్ర గాయమైంది. స్థానికులు గుళ్లపల్లిలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. మరో వాహనంపై ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలు కాగా స్నేహితులు తీసుకువెళ్లారు. పోలీసులు వివరాలు నమోదు చేశారు.

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ

వేమూరు : పంచాయతీ కార్యదర్శులు మండల పరిధిలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో రవికుమార్ తెలిపారు. ఈ విషయంపై వేమూరు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈవోపీఆర్‌డీ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు

భట్టిప్రోలు : మండలంలోని ఐలవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు ఇటీవల ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. పాఠశాల ఆవరణలో బుధవారం విద్యార్థులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. జడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి, ఉపాధ్యాయులు వారిని అభినందించి సన్మానించారు. ఎంఈవో నీలం దేవరాజ్, ప్రధానోపాధ్యాయుడు మాచర్ల మోహనరావు, విద్యాకమిటీ ఛైర్మన్ దుర్గాదేవి, వైస్ ఛైర్మన్ రవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పందులను బయటకు వదలొద్దు

రేపల్లె అర్బన్, న్యూస్‌టుడే : జనావాసాల మధ్య, రహదారులపై పందులు సంచరించకుండా పెంపకందారులు చర్యలు తీసుకోవాలి పురపాలక సంఘ కమిషనర్ సాంబశివరావు సూచించారు. రేపల్లె మున్సిపల్ కార్యాలయంలో బుధవారం పందుల పెంపకందారులతో ఆయన సమావేశం నిర్వహించారు. రోడ్ల పక్కన వ్యర్థాలను పందులు పెకళించడంతో పరిసరాల్లో పారిశుద్ధ్య సమస్య తీవ్రం అవుతోందని చెప్పారు. దీనిపై ప్రజల నుంచి ఫిర్యాదులొస్తున్నాయని తెలిపారు. వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాటిని బయటకు రాకుండా దృష్టి సారించాలని సూచించారు. నిర్లక్ష్యం వహిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పట్టణ ఎస్సై రాజశేఖర్, పారిశుద్ధ్య అధికారి రామచంద్రరావు, పారిశుద్ధ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

రౌడీషీటర్ జిలానీ అరెస్టు

బాపట్ల: పట్టణంలోని ఇస్లాంపేటకు చెందిన రౌడీషీటర్ జిలానీని పోలీసులు అరెస్టు చేశారు. అతను తన ప్రత్యర్థులు యాసిన్, వినోద్, సాయిని హత్య చేయాలన్న కుట్రతో కత్తి పట్టుకుని తిరుగుతుండగా చిల్లరగొల్లపాలెం రైల్వే గేటు వద్ద పట్టణ సీఐ రాంబాబు ఆధ్వర్యంలో పోలీసులు బుధవారం పట్టుకున్నారు. అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచి.. అనంతరం జడ్జి ఆదేశాల మేరకు.. గుంటూరు జిల్లా జైలుకు పంపినట్లు సీఐ తెలిపారు.

తల్లికి వందనం.. విద్యకు ఇంధనం

నగరం, న్యూస్‌టుడే : తల్లికి వందనం విద్యకు ఇంధనమని ఎంఈవో వీరాంజనేయరావు అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తల్లికి వందనం పథకంపై విద్యార్థులకు బుధవారం వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఆయా విభాగాల్లో ఎస్.జశ్వితశ్రీ, పి.భావన, పి.వెంకటనిత్య, కె.శ్రీలత, ఎ.నాగలక్ష్మి బహుమతులు సాధించారు. ప్రధానోపాధ్యాయుడు చాంద్ బాషా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

వేమూరు : పెరవలి విద్యుత్తు ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా మండలంలోని చావలి, కోడిపర్రు, పెరవలి తదితర గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా ఆపుతున్నట్లు ఏఈ గోపి తెలిపారు.

పచ్చిరొట్టతో సేంద్రియ కర్బనం

అమృతలూరు : పచ్చిరొట్ట సాగుచేసి పూతదశలో భూమిలో కలియ దున్నితే సేంద్రియ కర్బనం పెరుగుతుందని.. తద్వారా సూక్ష్మ పోషకాలు వృద్ధి చెందుతాయని ఏవో భరత్‌కుమార్ తెలిపారు. తురుమెళ్ల, మోపర్రులో బుధవారం పొలం పిలుస్తోంది నిర్వహించారు. ఏఈవో మణికంఠ, వీపీఏలు భాస్కర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బడిలో చేర్పించటమే లక్ష్యం

భట్టిప్రోలు : బడి వీడిన విద్యార్థులను బడిలో చేర్పించటమే ఉపాధ్యాయుల లక్ష్యమని ఎంఈవో నీలం దేవరాజ్ అన్నారు. మండలంలోని వెల్లటూరులో బుధవారం ఉపాధ్యాయులతో కలిసి ఆయన సర్వే చేశారు. బడి బయట ఉన్న ఆరుగురిని గుర్తించి పాఠశాలలో చేర్పించారు.

మెరుగైన వైద్యసేవలు అందించండి

భట్టిప్రోలు: ప్రభుత్వ వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ దావూరి వెంకట లలితకుమారి అన్నారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ప్రభుత్వ వైద్యశాలలో నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వైద్యులు, వైద్య సిబ్బందితో ఆమె సమావేశం నిర్వహించారు. జ్వరాలు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొన్నారు. నీరు నిల్వ లేకుండా చూసి దోమల నివారణ మందులు చల్లాలని సూచించారు. ఎంపీడీవో ఎస్.వి.రమణ మాట్లాడుతూ రహదారుల వెంట శుభ్రత చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

పేదరిక నిర్మూలనే లక్ష్యంగా సుపరిపాలన

పిట్టలవానిపాలెం, బాపట్ల, న్యూస్‌టుడే : వైకాపా పాలనలో ధ్వంసమైన రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తూ, ప్రజలకు సుపరిపాలన అందించటమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం ముందడుగు వేస్తోందని ఎమ్మెల్యే నరేంద్రవర్మ అన్నారు. మండలంలోని మంతెనవారిపాలెంలో, బాపట్ల పట్టణంలోని దేవుడిమాన్యం, చిల్లర గొల్లపాలెంలో బుధవారం 'సుపరిపాలనలో- తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేశారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు సలగల రాజశేఖర బాబు మాట్లాడుతూ ఎన్టీఆర్ భరోసా పథకం కింద పింఛన్లు నెలకు రూ.నాలుగు వేలు, దివ్యాంగులకు రూ.6 వేల నుంచి రూ.15 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ మహమ్మద్ అఫ్జల్, తెలుగు మహిళ మండల అధ్యక్షురాలు గ్లోరి యానెట్, తెదేపా సీనియర్ నాయకులు వెంకటపతిరాజు, పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు శివసాంబిరెడ్డి, తెదేపా బాపట్ల పట్టణాధ్యక్షుడు శ్రీనివాసరావు, నేతలు పాల్గొన్నారు

నిజాంపట్నం : ప్రజా సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వానికే సాధ్యమని జట్పీటీసీ నర్రా సుబ్బయ్య, తెదేపా నాయకులు పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం మంత్రి అనగాని సత్యప్రసాద్ ఆదేశానుసారం నిజాంపట్నం పంచాయతీ క్రోసూరివారిపాలెంలో ఇంటింటా పర్యటించి ఏడాదిలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలు ప్రజలకు వివరించారు. పార్టీ నాయకులు ఖాదర్‌బాబు, లంకే మీరయ్య, ఫైబరు బోటు యజమానుల సంఘ అధ్యక్షుడు నాయుడు గోపి, జిల్లా బీసీ యువజన సంఘ అధ్యక్షుడు పచ్చపట్ల గంగరాజు, యేమినేని ప్రసాద్, మాణిక్యారావు పాల్గొన్నారు.

నిజాంపట్నం : కూటమి ప్రభుత్వంలో ఏడాదిలో ఎంతో అభివృద్ధి జరిగిందని, రానున్న కాలంలో రాష్ట్రం మరింత ప్రగతి పథంలో ఉంటుందని ఐటీడీపీ మండల అధ్యక్షుడు పరిశా నాగకిషోర్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక తెదేపా నాయకులతో కలసి ఇంటింటా పర్యటించారు. నల్లపాటి ఎల్లయ్య, పార్టీ నాయకులున్నారు.

మంతెనవారిపాలెంలో మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ, తెదేపా నాయకులు

పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న తెదేపా నాయకులు

కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు

అమృతలూరు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ఇంటింటికి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ కార్యకర్తలు, నాయకులు చేపట్టాలని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు అన్నారు. ఆయన అమృతలూరులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం రాష్ట్రంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పాలన, గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. ప్రగతిని కరపత్రాల రూపంలో వారికి అందజేశారు. వేమూరు వ్యవసాయ కమిటీ ఛైర్మన్ పూర్ణకుమారి, తెదేపా నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఒరిజినల్ బాండు పోయినది

నేను, పెనుమచ్చ నాగరాజు, తండ్రి: పెనుమచ్చ వెంకట రామరాజు, బాపట్ల జిల్లా, బాపట్ల టౌన్, శ్రీనివాసకాలని, 1వ లైను, జై మారుతి నివాస్, ప్లాట్ నెం.601రు, తెలియజేయునది ఏమనగా ది.20-06-2025వ తేదీన నేను నా తాలూకు ఎల్ఐసి ఒరిజినల్ బాండ్ నెం.672408134ను తీసుకొని మా ఇంటి వద్ద నుండి ఎల్ఐసి ఆఫీసుకు వెళ్ళుచుండగా మార్గమధ్యములో జారి పోయినది. ఎంత వెతికినను దొరకలేదు. నేను నా యొక్క ఎల్ఐసి బాండ్‌ను ఎటువంటి సెక్యూరిటీ గాని, తాకట్టు గానీ, సరెండర్ గానీ చేయలేదు. పైన పేర్కొనబడిన బాండ్ ఎవరికైనను దొరికిన ఎడల ఈ దిగువ ఫోన్ నెంబర్ నందు తెలియజేయగలరు.

✆ 9490216669

వరి గడ్డివాము దగ్ధం

కావూరు (చెరుకుపల్లి గ్రామీణ), న్యూస్‌టుడే : మండలంలోని కావూరులో బుధవారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు నిప్పంటుకుని వరి గడ్డివాము కాలిపోయింది. రైతు బర్మా సుధాకర్ ఇంటి వరండాలో నిద్రిస్తుండగా పక్కనే ఉన్న వరి గడ్డివాము నుంచి ఒక్కసారిగా మంటలు లేచాయి. నిద్రలేచిన ఆయన చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేశారు. నీటిని చల్లి ఆర్పే ప్రయత్నం చేశారు. సమాచారం అందుకున్న పొన్నూరు అగ్నిమాపక శాఖాధికారి కె.ప్రసాదరావు శకటంతో అక్కడకు చేరుకుని మంటలు ఆర్పివేశారు. ప్రమాదంలో రూ.5 లక్షల 20 ఎకరాల వరిగడ్డి కాలిపోయినట్లు రైతు సుధాకర్ వాపోయారు. ప్రమాదానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

అమృతమూర్తికి అశ్రుతాంజలి

ఆదర్శవిలువలతో జీవిత వైభవాన్ని ప్రారంభించి, మానవత్వం - మంచితనం మూర్తీభవించిన మహామనిషిగా ఎదిగి, కుటుంబ ఉన్నతికోసం, గ్రామ అభివృద్ధికోసం అహర్నిశలు కృషిచేసి అందరి హృదయాల్లో సుస్థిరస్థానాన్ని సంపాదించుకొని భౌతికంగా మమ్ములను వీడి దైవసన్నిధికి చేరుకున్న మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ...

జననం: 01-06-1944 మరణం: 19-06-2025

కీ॥శే॥ కూనంనేని వెంకటేశ్వరరావు గారు
నడిగడ్డపాలెం - చుండూరు (మం)

భార్య: రామశేషమ్మ

కుమారుడు - కోడలు: కూనంనేని గిరీష్ - లక్ష్మీసునీత
మనుమరాండ్రు: కూనంనేని ప్రత్యూష, లహరి
కుమార్తె - అల్లుడు: యలమంచిలి నిమ్మి - శివ దుర్గ శేషు శ్రీబాబు
మనుమరాండ్రు: యలమంచిలి శ్రీఆముక్త, శ్రీనిహారిక

పెద్దకర్మ: ఈరోజు ది: 03.07.2025 గురువారం నడిగడ్డపాలెంలోని మా స్వగృహము నందు జరుగును. కావున తెలియజేయటమైనది.

(c) eenadu

చీరాల

•చీరాల •అద్దంకి •పర్చూరు

5న జాతీయ లోక్‌అదాలత్

చీరాల, న్యూస్‌టుడే: చీరాల కోర్టు ప్రాంగణంలో ఈనెల 5న జాతీయ లోక్‌అదాలత్ నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎం.సుధా తెలిపారు. దీనిలో రాజీ చేయదగిన అన్ని కేసులు పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఇంజినీరింగ్ సిబ్బంది నిరసన

అద్దంకి, న్యూస్‌టుడే: పురపాలక ఇంజినీరింగ్ కార్మికులు అద్దంకి కార్యాలయం ఎదుట బుధవారం విధులు బహిష్కరించి నిరసన చేపట్టారు. వీరికి సీఐటీయూ నేతలు సంఘీభావం తెలిపారు. నేత తంగిరాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిపుణులైన కార్మికులకు రూ.24 వేలు, నైపుణ్యం లేని వారికి రూ.21 వేలు జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈనెల 4న ఛలో విజయవాడ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు పెనుబాక ఆదాం, యూనియన్ అధ్యక్షుడు గాలి భీష్మ పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రం పరిశీలన

కారంచేడు, న్యూస్‌టుడే: స్థానిక మూడో సచివాలయంలో మహిళలకు స్వయం ఉపాధి కల్పించడమే లక్ష్యంగా గత కొన్ని రోజులుగా జరుగుతున్న కుట్టుశిక్షణ కేంద్రాన్ని బుధవారం ఎంపీడీవో కె.నేతాజీ, డిప్యూటీ ఎంపీడీవో ఎల్.కె కృష్ణ పరిశీలించారు. శిక్షణ కేంద్రంలోని మహిళలకు అందుతున్న సదుపాయాలపై ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం సచివాలయంలో ఆధార్‌నమోదు కార్యాలయాన్ని పరిశీలించారు.

విద్యుత్తు సరఫరా నిలిపివేత నేడు

జె.పంగులూరు న్యూస్‌టుడే: మండలంలోని రామకూరు విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలోని భగవాన్‌రాజుపాలెం ఫీడర్ మరమ్మతుల నిమిత్తం గురువారం ఉదయం 11 గంటల నుంచి 3గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ ఏఈ గోరంట్ల అనిల్‌కుమార్ తెలిపారు.

తమ్మవరం (మేదరమెట్ల): కొరిశపాడు మండలం తమ్మవరంలో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్తుశాఖ ఏఈ ఎం.శ్రీనివాసరావు తెలిపారు.

అద్దంకి: విద్యుత్తు తీగల మరమ్మతుల కారణంగా శింగరకొండ రోడ్డులోని విద్యుత్తు కార్యాలయం నుంచి భవానీ కూడలి వరకు, ఎన్టీఆర్ నగర్, కొత్తదామావారిపాలెం, పాత దామావారిపాలెం, కట్టకిందపాలెం, భవానీకూడలి నుంచి దర్శిరోడ్డు వివరవరకు, పోలేరమ్మ గుడి చుట్టుపక్కల, నాగులబజాజ బజారు చప్టా వరకు, ప్రభుత్వ ఆసుపత్రి చుట్టుపక్క ప్రాంతాలు, తపాలా కార్యాలయం చుట్టుపక్క ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందని డీఈ దామోదరం తెలిపారు.

మార్టూరు: మార్టూరు విద్యుత్తు సబ్ డివిజన్ పరిధిలో గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు మరమ్మతుల దృష్ట్యా విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ డీఈఈ ఎం.సురేంద్రబాబు తెలిపారు. మార్టూరు మండలం దేశాయిపూడి, యద్దనపూడి మండలం యనమదల, బల్లికురవ మండలం వైదన, ఎస్ఎల్ గుడిపాడు, రామాంజనేయపురం, సంతమాగులూరు మండలం తంగేడుమల్లి, చవటపాలెం, గురజేపల్లిలో విద్యుత్తు సరఫరా ఉండదన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

చీరాల అర్బన్: 9849165189 అద్దంకి: 9440915704 పర్చూరు: 8008574106

? మేదరమెట్లలో మిద్దెలదొంక దారి ప్రారంభంలో ఉన్న విద్యుత్తు స్తంభానికి ఉన్న వీధి దీపాల స్విచ్‌బోర్డు ఎత్తు తక్కువలో ప్రమాదకరంగా ఉంది.- స్థానికులు

✓ కొద్దిరోజుల్లో అక్కడ నూతన స్తంభాలు ఏర్పాటు చేసే పనులు ప్రారంభిస్తాం. అప్పుడు స్విచ్‌బోర్డు ఎత్తు పెంచుతాం. **-లక్ష్మీకాంత్, పంచాయతీ కార్యదర్శి, మేదరమెట్ల -న్యూస్‌టుడే, మేదరమెట్ల**

? స్థానిక సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని డ్రైనేజీల్లో మురుగు పారడం లేదు. **-ప్రసాద్, స్థానికుడు**

✓ రెండ్రోజుల్లో డ్రైనేజీలను శుభ్రపరిచి బ్లీచింగ్ చల్లిస్తాం **-కె.సత్యనారాయణ, డిప్యూటీ ఎంపీడీవో, పర్చూరు**

- పర్చూరు, న్యూస్‌టుడే

? పుట్టావారిపాలెం వాణిజ్య కూడలిలో ఉన్న వందకు పైగా దుకాణాల వద్దకు చెత్త సేకరణ బండి రావడం లేదు. **-స్థానిక వ్యాపారులు, పుట్టావారిపాలెం కూడలి**

✓ పుట్టావారిపాలెంలో గతంలో ఏర్పాటు చేసిన చెత్త సేకరణ వాహనం మరమ్మతులకు గురైంది. అందువల్ల సమస్య తలెత్తుతోంది. నూతనంగా ఎలక్ట్రికల్ చెత్త సేకరణ వాహనాన్ని ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడతాం. **-శివరామప్రసాద్, ఈవోఆర్డీ, సంతమాగులూరు -న్యూస్‌టుడే, పుట్టావారిపాలెం**

ఫోన్‌లో సందేశం.. రైతుల్లో ఆనందం

సజావుగా సాగుతున్న బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలు

పర్చూరు, మార్టూరు, న్యూస్‌టుడే

నల్లబర్లీ పొగాకు కొనుగోలు ప్రక్రియ పక్కాగా జరుగుతోంది. రైతులను ఆదుకునేందుకు మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా ఆరు కేంద్రాలు ప్రారంభించిన సంగతి తెలిసిందే. కర్షకుల కొనుగోలు కేంద్రాలకు పొగాకును ఏ విధంగా తరలించాలో.. ఏయే ప్రక్రియలు చేపట్టాలో గ్రామ వ్యవసాయ సహాయకులు వివరిస్తున్నారు.

చీరాల, పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లోని 19 వేలమంది రైతులు ఈ ఏడాది సాగు చేసిన 67 వేల ఎకరాల్లోని నల్లబర్లీ కొనుగోలు చేసేందుకు కూటమి ప్రభుత్వం కేంద్రాలను ప్రారంభించింది. వీటికి పొగాకు చెక్కులు తీసుకువచ్చే విధానాలపై వ్యవసాయ, మార్క్‌ఫెడ్ శాఖల అధికారులు ప్రత్యేక యాప్‌ను రూపొందించారు. కేంద్రాలను ఇటీవల ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పరిశీలిస్తూ రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటికి 10011మంది నమోదు చేసుకున్నారు. ప్రక్రియ పక్కా ప్రణాళికతో, సజావుగా జరుగుతుండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

సీఎం యాప్‌లో నమోదైన రైతుల వివరాలు	
పర్చూరు	2578
చినగంజాం	282
అద్దంకి అర్బన్	12
సంతమాగులూరు	35
బల్లికురవ	425
మార్టూరు	613
యద్దనపూడి	1366
కారంచేడు	1182
ఇంకొల్లు	1609
జె.పంగులూరు	1090
అద్దంకి	162
కొరిశపాడు	657

పొగాకు చెక్కులను కొనుగోలు కేంద్రానికి తీసుకొచ్చిన రైతులు

పొగాకు ధరలు ఇలా: గ్రేడ్-1 రకం (పైకం): రూ.12వేలు, గ్రేడ్-2 రకం (మధ్యకం): రూ.9వేలు, గ్రేడ్-3 రకం (కింద ఆకు): రూ.6వేలు

పొగాకు కొనుగోలు కేంద్రాలు: పర్చూరు-2, చీరాల-1, బీకేపాలెం-1, జె.పంగులూరు-1, ఇంకొల్లు-1

నమోదు ప్రక్రియ ఇలా...: రైతులు గతంలో ఏ గ్రామంలోని పొగాకు బ్యారన్ దగ్గర పొలో దిగారో ఆ గ్రామంలోని రైతు సేవ కేంద్రానికి వెళ్లి ఎక్కడైనా సాగు చేసిన భూమి వివరాలను పీఏసీఎస్‌కు అందజేయాలి. ఏపీఏఎంఎస్ యాప్‌లో వీఏఏ ద్వారా నమోదు చేయించుకోవాలి. రైతును మండి దగ్గర ఉంచి వీఏఏ ఫొటో తీసి, నమోదు చేస్తారు. సీఎం యాప్ ద్వారా రైతు వివరాలు నమోదు చేసి, రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తారు. వెంటనే వారి ఫోన్‌కు వివరాలు సందేశం ద్వారా అందుతాయి.

సీఎం యాప్ వినియోగం

సీఎం యాప్‌లో నమోదైన సంఖ్య ప్రకారం మార్క్‌ఫెడ్ శాఖ ద్వారా ఏ రైతు ఏ రోజు ఎంత పొగాకు, ఎన్ని చెక్కులు తీసుకురావాలనేది వరవాణిలో ఏడు రోజుల ముందుగానే సందేశం వస్తుంది. అనంతరం ముందుగానే రైతుకు ఫోన్ ద్వారా, వీఏఏ ద్వారా సమాచారం చేరవేస్తారు. కేంద్రాల్లో రైతుల నుంచి కొన్న పొగాకు చెక్కులను మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక క్యూఆర్ కోడ్‌తో కూడిన స్టిక్కర్లతో వివరాలు నమోదు చేస్తున్నారు. దీంతో ఏ సమయంలో ఏ రైతు వద్ద పొగాకు కొనుగోలు చేశారో అంశం క్షణాల్లో తెలుసుకోవచ్చు. జిల్లా వ్యాప్తంగా ఆరు కేంద్రాల్లో 230 మంది రైతుల వద్ద నుంచి 6956 బేళ్ల కొనుగోలు చేసినట్లు మార్క్‌ఫెడ్ డీఎం కరుణశ్రీ తెలిపారు.

రైతు సంక్షేమానికి మార్కెట్ కమిటీలు కృషి చేయాలి: గొట్టిపాటి

అద్దంకి, న్యూస్‌టుడే: రైతుల సంక్షేమానికి వ్యవసాయ మార్కెట్ కమిటీలు కృషి చేయాలని రాష్ట్ర విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలకమండలి ప్రమాణస్వీకారం బుధవారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన మంత్రి గొట్టిపాటి మాట్లాడుతూ కొరిశపాడు మండలం పి.గుడిపాడులో రైతులు సాగు చేసిన కూరగాయల ఉత్పత్తుల్ని మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లామని, ఆ ఉత్పత్తుల్ని మార్కెట్‌కు తరలించేందుకు రహదారి వ్యవస్థను మెరుగు పరిచినట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో మార్టూరు మాదిరిగా పి.గుడిపాడు వద్ద ఆరు ఎకరాల విస్తీర్ణంలో దుకాణాలు ఏర్పాటు చేసేందుకు కృషిచేస్తామని మంత్రి తెలిపారు. రాష్ట్ర చరిత్రలో నిలిచిన అన్నగారి సంతను పునఃప్రారంభించాలని పాలకమండలికి సూచించారు.

మాట్లాడుతున్న మంత్రి రవికుమార్

ఏఎంసీ పాలక మండలి ప్రమాణస్వీకారం

అద్దంకి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా వరగాని పద్మావతి, వైస్ ఛైర్మన్‌గా ధర్మవరపు నాగేశ్వరరావు, పాలకమండలి సభ్యులుగా చింతా వెంకటేశ్వర్‌రెడ్డి, గుంజి రామాంజనేయులు, రేణుక, కర్నాటి పూర్ణచంద్రరావు, కొప్పర్తి నాగరాజు, మద్దుమాల నారాయణ, మేకల అంకమ్మ, పూనాటి పద్మ, రాయపాటి రామాంజమ్మ, షేక్ రహమానబీ, బొప్పూడి భారతి, కరిచేటి వెంకట సుబ్బారావు, మిద్దెబోయిన పాపారావు తోపాటు మరికొందరు ప్రమాణస్వీకారం చేశారు.

హామీలు నెరవేర్చడంలో తొలి అడుగు వేశాం

బల్లికురవ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ సుపరిపాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో తొలి అడుగు వేశామని విద్యుత్తు శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. బుధవారం బల్లికురవలో సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. తొలుత స్థానిక కూడలిలోని నందమూరి తారకరామారావు, గొట్టిపాటి హనుమంతరావు విగ్రహాలకు పూలమాలలు వేసి మంత్రి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం చేనేత వ్యాపారులకు మంత్రి ప్రత్యేకంగా తయారుచేయించిన 16 తోపుడు బండ్లు, దివ్యాంగులకు 8 ట్రైస్కూటర్లు పంపిణీ చేశారు. వైదన గ్రామానికి వ్యవసాయ శాఖ ద్వారా రాయితీపై వచ్చిన డ్రోన్ స్ప్రేయర్‌ను అందజేశారు. రూ.30 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్లను మంత్రి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని కొమ్మినేనివారిపాలెం వద్ద బ్రాంచ్ కెనాల్‌పై నూతన వంతెన నిర్మాణానికి రూ.2 కోట్లు విడుదల చేశామని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

సంక్షోభం నుంచి సంక్షేమం వైపు

చీరాల, న్యూస్‌టుడే: జగన్ తన ఐదేళ్ల పాలనలో రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టివేస్తే చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదే రాష్ట్రాన్ని సంక్షేమం వైపు నడుపుతున్నారని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం తోటవారిపాలెంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైకాపా సంక్షేమమంతా మాటలగారడీయేనని ఎద్దేవా చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచే అభివృద్ధి, సంక్షేమం రెండు సమానంగా ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. గ్రామంలో కూడా పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని వివరించారు. ఏఎంసీ ఛైర్మన్ కె.జనార్దన్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

అద్దంకి విద్యార్థికి జాతీయ స్థాయిలో ఆరోస్థానం

అద్దంకి, న్యూస్‌టుడే: భారత ప్రభుత్వం నిర్వహించిన ప్రాజెక్టుల సమర్పణ పోటీల్లో అద్దంకి విద్యార్థి పొన్నలూరి జయంత్ ఆరోస్థానంలో నిలిచాడు. ఈ ఏడాది ఏప్రిల్‌లో డేటా విజువలైజేషన్ అంశంపై ప్రాజెక్టు సమర్పించగా బుధవారం ఫలితాలు విడుదలయ్యాయి. దేశ వ్యాప్తంగా 3.30 లక్షల మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. తొలి 30 మందిలో జయంత్ ఆరోస్థానం సాధించినట్లు విద్యార్థి తండ్రి కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ అవార్డు సాధించిన విద్యార్థికి భారత ప్రభుత్వం ప్రశంసాపత్రంతో పాటు రూ.20 వేల నగదు అందించనున్నారు. జయంత్ ప్రస్తుతం గుంటూరు ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం చదువుతున్నాడు.

జయంత్

అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చర్యలు

చినగంజాం, న్యూస్‌టుడే: అనుమతి లేకుండా ఇసుక తరలించే వారిపై పీడీ చట్టం కింద కేసులు నమోదు చేస్తామని ఇంకొల్లు సీఐ వైవీ రమణయ్య హెచ్చరించారు. 216 జాతీయ వంతెన కింద అక్రమంగా తవ్విన ఇసుక క్వారీని ఆయన ఎస్సై రమేష్, సిబ్బంది బుధవారం పరిశీలించారు.

చీరాల గ్రామీణం: ఈపూరుపాలెం పరిధిలో ఇసుక అక్రమ రవాణా నివారణకు ఆటోనగర్‌లో పోలీస్, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో పికెట్ నిర్వహించారు.

మీనాక్షి కోల్డ్ స్టోరేజి

ఇంకొల్లు గ్రామము, మండలం, బాపట్ల జిల్లా

శీతల గిడ్డంగిలోని సరుకు నిల్వల బహిరంగ వేలము ప్రకటన

ఈ దిగువ పేర్కొనబడిన వ్యక్తులు మా కోల్డ్ స్టోరేజి తాలూకు కెనరా బ్యాంకు ఇడుపులపాడు లోగల ఓవర్ డ్రాఫ్టు అకౌంటు ద్వారా దిగువ కనపరచిన శీతల గిడ్డంగిలో ఉన్న సరుకుల నిల్వల తాకట్టుపై తీసుకున్న రుణములకు గడువు కాలము దాటి నోటీసు పంపినను బాకీ మరియు అద్దెలు చెల్లించి ఉండలేదు. ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ క్రింది ఖాతాదారులు వారి తాలూకు మా శీతల గిడ్డంగిలో ఉన్న మిర్చిని Dt. 09.07.2025 తేదీ నుండి స్టాకు పూర్తిగా అమ్మకం అయ్యేంత వరకు ప్రతిరోజు ఉదయం 11 గంటలకు మీనాక్షి కోల్డ్ స్టోరేజి నందు ఉన్న సదరు సరుకు నిల్వలను బహిరంగ వేలము వేసి వచ్చిన సొమ్మును వారు చెల్లించవలసిన బకాయిలకు జమ కట్టుకొనబడును.

నియమ నిబంధనలు:-

1. వేలం పాటలో ఎవరైనను పాల్గొనవచ్చును. (వారి తాలూకు ఆధార్ కార్డు దాఖలు చేయవలయును)
2. వేలంలో సఫలీకృత కొనుగోలుదారుడు వెంటనే 25% బిడ్ మొత్తంలో చెల్లించవలెను. మిగిలిన మొత్తంను 2 రోజులలో పూర్తిగా చెల్లించి సరుకును స్వాధీనం చేసుకొనవలెను.
3. అమ్మకము చేయగా ఇంకనూ బాకీ మొత్తము పూర్తిగా వసూలు కాని యడల కోల్డ్ స్టోరేజి వారు దిగువ ఖాతాదారులపై చట్టపరమైన చర్యల ద్వారా మిగిలిన బాకీని వసూలు చేసుకొనుదురు.
4. ఎట్టి కారణము చూపకనే వేలము నిలుపుదల చేయుటకు కోల్డ్ స్టోరేజి వారికి పూర్తి అధికారము కలదు.
5. గతంలో ఇచ్చిన నోటీసు అందని వారికి మరియు రుణ వారసులకు ఈ పేపరు ప్రకటన ఆఖరి నోటీసుగా తెలియజేయడమైనది.
6. వేలము వేయు సరుకు ధరను వేలము వేయు తేదీన ఉండే మార్కెట్ ధర ప్రకారము నిర్ణయించబడును.
7. సరుకు రవాణా చార్జీలను మరియు GST తదితర ఖర్చులను సఫలీకృత పాటదారుడు మాత్రమే భరించవలయును.
8. ఎక్కడ ఉన్నది అక్కడే ఎలా ఉన్న అలానే పద్ధతిలో వేలం జరుగును.
9. వేలంలో సఫలీకృత పాటదారుడుకు మాత్రమే సరుకు నిల్వలు అందజేయబడును.
10. క్రింది మొత్తము బకాయిలు 31-5-2025 నాటికి అసలు, వడ్డీ మరియు అద్దెలు కలిపినవి మరియు పేపరు ప్రకటన ఖర్చులు దరిమిల వడ్డీ అదనము.

క్రమ సంఖ్య	ఖాతాదారుని పేరు మరియు చిరునామా	2023 వరకు సరుకు వివరములు	అసలు, వడ్డీ అద్దెలు మొత్తము
1.	బోరుగడ్డ వంశీ, S/o. బెనీని జరుగులవారిపాలెం కారంచేడు మండలం, బాపట్ల జిల్లా	మిర్చి	3,73,346,00
2.	దార్ల దేవసహాయం, S/o. ప్రకాశం, తిమిడిదపాడు కారంచేడు మండలం, బాపట్ల జిల్లా	మిర్చి	2,18,968.00
3.	నూతలపాటి శ్యాంబాబు, S/o. వసంతరావు భీమవరం, ఇంకొల్లు మండలం, బాపట్ల జిల్లా	మిర్చి	1,14,009.00
4.	పాటిబండ్ల ఉదయబాస్కర్, S/o. శ్యామసుందరరావు భీమవరం, ఇంకొల్లు మండలం, బాపట్ల జిల్లా	మిర్చి	14,41,667.00
5.	పూర్ణగంటి సురేష్, S/o. బుగ్గేష్, బూదవాడ జె.పంగులూరు మండలం, బాపట్ల జిల్లా	మిర్చి	1,27,758.00
6.	విప్పర్ల సూర్యనారాయణ, S/o. ఏసురత్నం, జరుబులవారిపాలెం, కారంచేడు మండలం, బాపట్ల జిల్లా	మిర్చి	1,99,695.00
7.	విప్పర్ల సరిత, S/o. హరిబాబు, నూజెళ్ళపల్లి జె.పంగులూరు మండలం, బాపట్ల జిల్లా	శనగలు	8,39,793.00
8.	యామల డేవిడ్, S/o. బుచ్చియ్య గొనసపూడి, చిన్నగంజాం మండలం, బాపట్ల జిల్లా	మిర్చి	3,27,531.00

ఉపాధ్యాయులకు సత్కారం

సన్మానం పొందిన ఉపాధ్యాయులు

కొత్తపేట(వేటపాలెం), న్యూస్‌టుడే: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో ఏళ్లుగా పనిచేసి ఇటీవల జరిగిన బదిలీల్లో ఒకేసారి ఎనిమిది మంది ఉపాధ్యాయులు ఇతర ప్రాంతాలకు వెళ్లారు. వీరిలో ధనలక్ష్మి, ప్రభావతి, నిర్మల, నీలిమ, శ్రీనివాసరావు, రామారావు, కాసం, బాస్కరరావు ఉన్నారు. బుధవారం ప్రధానోపాధ్యాయురాలు గుమ్మా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో పాఠశాలలో జరిగిన అభినంద సభలో వీరిని శాలువాలతో సత్కరించారు.

పెదగంజాం (చినగంజాం): పెదగంజాం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎనిమిది సంవత్సరాలు పనిచేసి ఇటీవల బదిలీ అయిన 8 మంది ఉపాధ్యాయులు డి.నారాయణ రెడ్డి, బి.నాగేశ్వరరావు, ఎ.వీరాచారి, బి.చెంచు రెడ్డి, పి.బ్రహ్మయ్య, ఎన్.శ్రీరమణి, జి.హవీలాదేవి, ఎం.రాజశేఖర్‌లను హెచ్‌ఎం నన్నపనేని రవి బుధవారం శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

పెదగంజాంలో..

పేదల పక్షాన ఎర్రజెండా

మాట్లాడుతున్న కోటేశ్వరరావు

పుట్టావారిపాలెం (సంతమాగులూరు): గత వందేళ్లుగా ఎర్రజెండా పేదల పక్షాన పోరాడుతోందని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సి.హెచ్.కోటేశ్వరరావు అన్నారు. పుట్టావారిపాలెంలో బుధవారం జరిగిన అద్దంకి నియోజకవర్గ మహాసభలో ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. ప్రస్తుత ప్రభుత్వాలు వ్యవసాయ రంగాన్ని ప్రైవేటు పరం చేసే విధానాలు దులుపుకోవాలని చూస్తున్నాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. గత మహాసభల్లో నియోజకవర్గ స్థాయిలో పార్టీ చేసిన పోరాటాలను సమీక్షించి, సూచనలు చేశారు. మహాసభలో పార్టీ జిల్లా అధ్యక్షుడు తన్నీరు శింగరకొండ, నాయకులు పాల్గొన్నారు.

మువ్వలకు పదవి హర్షణీయం

చీరాల, న్యూస్‌టుడే: మువ్వల రమణారావుకు జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా పదవి రావటం హర్షణీయమని ఇదే స్ఫూర్తితో చీరాలలో పార్టీ బలోపేతానికి అందరం కృషిచేద్దామని భాజపా జిల్లా అధ్యక్షుడు కె.బంగారుబాబు పేర్కొన్నారు. మువ్వల రమణారావుకు పదవి వచ్చిన సందర్భంగా బుధవారం ఆయన కార్యాలయంలో అభినందన సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ జాతీయ అధ్యక్షుడి ఎన్నికలో పాల్గొనే అవకాశం రావటం చీరాలకు దక్కిన అదృష్టమన్నారు. అనంతరం రమణారావును సన్మానించారు. పార్లమెంటు కన్వీనర్ బి.హేమంత్‌కుమార్, నియోజకవర్గ బాధ్యుడు కూమార్, పట్టణాధ్యక్షురాలు జి.భవానీ, చీరాల, వేటపాలెం మండలపార్టీ అధ్యక్షులు మనోహరరెడ్డి, యశోద తదితరులు పాల్గొన్నారు.



రమణారావును సన్మానిస్తున్న నాయకులు

వ్యవసాయానికి సాంకేతికత జోడించాలి

రైతులు వ్యవసాయంలో సాంకేతికతను జోడించి ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని అద్దంకి, పర్చూరు నియోజకవర్గాల్లోని మండల వ్యవసాయ అధికారులు తెలిపారు. ఆయా గ్రామాల్లో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొని రైతులకు పలు సూచనలు చేశారు. అద్దంకి మండలంలో మూడు డ్రోన్‌లు రైతు సంఘాలకు మంజూరయ్యాయని మండల ఏవో వెంకటకృష్ణ తెలిపారు. రైతులు నల్లబర్లీపొగాకు సాగుకు బదులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని కారంచేడు, యద్దనపూడి మండల వ్యవసాయాధికారులు ఎం.నాగరాజు, కుమారి చెప్పారు. **-న్యూస్‌టుడే బృందం**

తూర్పు కొప్పెరపాడులో మాట్లాడుతున్న ఏవో సుబ్బారెడ్డి

లలిత కోల్డ్ స్టోరేజి

ఇంకొల్లు గ్రామము, మండలం, బాపట్ల జిల్లా

శీతల గిడ్డంగిలోని సరుకు నిల్వల బహిరంగ వేలము ప్రకటన

ఈ దిగువ పేర్కొనబడిన వ్యక్తులు మా కోల్డ్ స్టోరేజి తాలూకు కెనరా బ్యాంకు ఇడుపులపాడు లోగల ఓవర్ డ్రాఫ్టు అకౌంటు ద్వారా దిగువ కనపరచిన శీతల గిడ్డంగిలో ఉన్న సరుకుల నిల్వల తాకట్టుపై తీసుకున్న రుణములకు గడువు కాలము దాటి నోటీసు పంపినను బాకీ మరియు అద్దెలు చెల్లించి ఉండలేదు. ఈ ప్రకటన ద్వారా తెలియజేయునది ఏమనగా ఈ క్రింది ఖాతాదారులు వారి తాలూకు మా శీతల గిడ్డంగిలో ఉన్న మిర్చిని Dt. 09.07.2025 తేదీ నుండి స్టాకు పూర్తిగా అమ్మకం అయ్యేంత వరకు ప్రతిరోజు ఉదయం 11 గంటలకు **లలిత కోల్డ్ స్టోరేజి** నందు ఉన్న సదరు సరుకు నిల్వలను బహిరంగ వేలము వేసి వచ్చిన సొమ్మును వారు చెల్లించవలసిన బకాయిలకు జమ కట్టుకొనబడును.

నియమ నిబంధనలు:-

1. వేలం పాటలో ఎవరైనను పాల్గొనవచ్చును. (వారి తాలూకు ఆధార్ కార్డు దాఖలు చేయవలయును)
2. వేలంలో సఫలీకృత కొనుగోలుదారుడు వెంటనే 25% బిడ్ మొత్తంలో చెల్లించవలెను. మిగిలిన మొత్తంను 2 రోజులలో పూర్తిగా చెల్లించి సరుకును స్వాధీనం చేసుకొనవలెను.
3. అమ్మకము చేయగా ఇంకనూ బాకీ మొత్తము పూర్తిగా వసూలు కాని యడల కోల్డ్ స్టోరేజి వారు దిగువ ఖాతాదారులపై చట్టపరమైన చర్యల ద్వారా మిగిలిన బాకీ వసూలు కొనుదురు,
4. ఎట్టి కారణము చూపకనే వేలము నిలుపుదల చేయుటకు కోల్డ్ స్టోరేజి వారికి పూర్తి అధికారము కలదు.
5. గతంలో ఇచ్చిన నోటీసు అందని వారికి మరియు రుణ వారసులకు ఈ పేపరు ప్రకటన ఆఖరి నోటీసుగా తెలియజేయడమైనది
6. వేలము వేయు సరుకు ధరను వేలము వేయు తేదీన ఉండే మార్కెట్ ధర ప్రకారము నిర్ణయించబడును.
7. సరుకు రవాణా ఛార్జీలను మరియు GST తదితర ఖర్చులను సఫలీకృత పాటదారుడు మాత్రమే భరించవలయును.
8. ఎక్కడ ఉన్నది అక్కడే ఎలా ఉన్నది అలానే పద్ధతిలో వేలం జరుగును.
9. వేలంలో సఫలీకృత పాటదారుడుకు మాత్రమే సరుకు నిల్వలు అందజేయబడును.
10. క్రింది మొత్తము బకాయిలు 31-5-25 నాటికి అసలు + వడ్డీ మరియు అద్దెలు కలిగినవి మరియు పేపరు ప్రకటన ఖర్చులు దరిమిల వడ్డీ అదనము.

క్రమ సంఖ్య	పేరు మరియు చిరునామా	2023 వరకు సరుకు వివరములు	అసలు+వడ్డీ+అద్దెలు మొత్తము
1.	బాలిన సోమయ్య, S/o. నాగేశ్వరరావు దగ్గుబాడు కారంచేడు మండలం, బాపట్ల జిల్లా.	మిర్చి	2,54,192.00
2.	ఈరపనేని వాసు, S/o. హనుమంతరావు, పూనూరు యద్దనపూడి మండలం, బాపట్ల జిల్లా.	మిర్చి	2,16,151.00
3.	గోపతోటి సువర్ణరావు, S/o. శ్రీరాములు, దగ్గుబాడు కారంచేడు మండలం, బాపట్ల జిల్లా.	మిర్చి	73,277.00
4.	కొండ్రగుంట వెంకట్రావు, S/o. రామయ్య, ఈదుమూడి నాగులుప్పలపాడు మండలం, ప్రకాశం జిల్లా	మిర్చి	4,32,960.00
5.	కొండ్రగుంట వేణు, S/o. వెంకటేశ్వర్లు, ఈదుమూడి నాగులుప్పలపాడు మండలం, ప్రకాశం జిల్లా.	మిర్చి	1,45,510.00
6.	పల్లెపోగు పుల్లయ్య, S/o. యాకోబు, దగ్గుబాడు కారంచేడు మండలం, బాపట్ల జిల్లా.	మిర్చి	1,24,356.00
7.	పల్లెపోగు సునీల్, S/o. మస్తాన్‌రావు, దగ్గుబాడు కారంచేడు మండలం, బాపట్ల జిల్లా.	మిర్చి	1,43,814.00
8.	పోతూరి కిషోర్‌బాబు, S/o. నరసింహారావు, పూనూరు, యద్దనపూడి మండలం, బాపట్ల జిల్లా	మిర్చి	9,50,809.00
9.	పోలిశెట్టి రవీంద్ర, S/o. శ్రీనివాసరావు, గంగవరం, ఇంకొల్లు మండలం, బాపట్ల జిల్లా.	మిర్చి	5,84,016.00
10.	సజ్జా శ్రీకాంత్, S/o. ప్రభాకరరావు, దగ్గుబాడు కారంచేడు మండలం, బాపట్ల జిల్లా.	మిర్చి	6,14,322.00
11.	వంకాయలపాటి నాగేశ్వరరావు, S/o. యాకోబు, పూనూరు, యద్దనపూడి మండలం, బాపట్ల జిల్లా.	మిర్చి	3,45,392.00

లలిత కోల్డ్ స్టోరేజి, మేనేజింగ్ పార్టనర్

ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలి

జె.పంగులూరు న్యూస్‌టుడే: మండలంలోని ఉద్యోగులు అంకితభావంతో పని చేసి మండలాన్ని జిల్లాలోనే ప్రథమ స్థానంలో నిలిపేలా కృషి చేయాలని తహసీల్దారు పి. శింగారావు అన్నారు. ఆయన కార్యాలయంలో గ్రామ సర్వేయర్లు, వ్యవసాయ సహాయకులు విఆర్‌వోలతో బుధవారం సమావేశం నిర్వహించారు. విఆర్‌వోలు, గ్రామ సర్వేయర్లు సింగిల్ ఎల్‌పీఎంలుగా రైతులను సమన్వయం చేసుకొని త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.

పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడి నియామకం



నూతన కమిటీ సభ్యులు

పర్చూరు, న్యూస్‌టుడే : పర్చూరు మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం నూతన కమిటీ ఎన్నికను బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఎమ్మార్సీ భవనంలో సీనియర్ పంచాయతీ కార్యదర్శి కోసన సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. ఎ.మస్తానరావు అధ్యక్షుడిగా, ఉపాధ్యక్షులుగా పి.వెంకటేశ్వరరావు, బి.హరిప్రసాద్, కె.సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా వి.అనీల్‌కుమార్ తదితరులు ఎన్నికయ్యారు.

చెత్త నిల్వ డబ్బాల పంపిణీ

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రతి ఇంటికి చెత్త నిల్వ చేసే డబ్బాలు బుధవారం అందజేశారు. పంచాయతీ పరిధిలోని 2,200 ఇళ్లకు ఉచితంగా డబ్బాలను అందజేసినట్లు కార్యదర్శి కె.అంజయ్య తెలిపారు.

నేడు స్వర్ణాంధ్ర విజన్-2047పై సమావేశం

చీరాల అర్బన్, న్యూస్‌టుడే: మున్సిపల్ కార్యాలయంలో గురువారం స్వర్ణాంధ్ర విజన్-2047 పాలసీకి సంబంధించి ఎమ్మెల్యే ఎంఎంకొండయ్య అధ్యక్షతన సమావేశం జరుగుతుందని ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు తెలిపారు. ఉదయం పదిన్నర గంటలకు జరిగే ఈ సమావేశానికి అన్నిశాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఆయన ఆదేశించారు.

5న అద్దంకిలో

అద్దంకి : విజన్-2047పై 5న సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో బి.సింగయ్య తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే కార్యక్రమానికి మండల స్థాయి అధికారులతో నివేదికలతో హాజరు కావాలని సూచించారు.

విద్యార్థులకు చేయూత

మార్టూరు, న్యూస్‌టుడే: మండలంలోని చిమ్మిరిబండ జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు విద్యావికాస్ ఆధ్వర్యంలో స్టడీ మెటీరియల్ అందజేశారు. విద్యార్థుల ఉన్నతికి అవసరమైన పాలిటెక్నిక్, ఎన్ఎంఎంఎస్, ఆంగ్ల వ్యాకరణం, అట్లాస్ వంటి రూ.10వేల విలువైన పుస్తకాలు విద్యా వికాస్ ఆధ్వర్యంలో దాతలు విద్యార్థులకు బుధవారం అందించారు.

అవీ ఇవీ

వేటపాలెం: పట్టభద్రుల సంఘం ఆధ్వర్యంలో దేశాయిపేట పంచాయతీ ఐటీఐ కాలనీ మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పలకలు, రాతపుస్తకాలు అందజేశారు. సంఘ అధ్యక్షుడు ప్రత్తి వెంకటసుబ్బారావు, ప్రధానోపాధ్యాయిని పద్మావతి, సంఘ ప్రతినిధులు పాల్గొన్నారు.

బంద్ జయప్రదం చేయండి

జె.పంగులూరు న్యూస్‌టుడే: దేశ వ్యాప్తంగా ఈ నెల 9న జరిగే కార్మిక కర్షక బంద్‌ను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్ గంగయ్య పిలుపునిచ్చారు. మండల కేంద్రం పంగులూరులో బుధవారం జరిగిన సీపీఎం మండల కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ కార్మికులు రైతులు అసంఘటిత కార్మికులు పాల్గొని బంద్‌ను జయప్రదం చేయాలని కోరారు.

వాహనాల తనిఖీ

మార్టూరు, న్యూస్‌టుడే : కోల్‌కతా-చెన్నై జాతీయరహదారిలో కోనంకి - ఇసుకదర్శి గ్రామాల పరిధిలో బుధవారం మార్టూరు పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించారు. వాహనదారులు వాహనాలకు సంబంధించిన ధ్రువీకరణపత్రాలను వెంట ఉంచుకోవాలని సూచించారు. తనిఖీల్లో ఏఎస్సై మహమ్మద్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

బల్లికురవ: శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా పోలీసులు వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. బుధవారం బల్లికురవ కూడలిలో ఎస్సై నాగరాజు బృందంతో కలసి వాహనాలను తనిఖీ చేశారు.

వెలిగిన వీధి దీపాలు

స్పందనకు వందనం

వేటపాలెం, న్యూస్‌టుడే: ఓరుగంటి రెడ్డి వీధి నుంచి కొర్నెపాటి వారి వీధికి వెళ్లే రోడ్డులో వరుసగా మూడు విద్యుత్తు దీపాలు రెండు వారాలుగా వెలగడం లేదని ఆప్రాంత వాసులు మంగళవారం 'మేమున్నాం... మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. దీనికి స్పందించిన పంచాయతీ కార్యదర్శి బాలిగ సురేంద్ర బుధవారం సిబ్బందిని పంపి దీపాలకు మరమ్మతులు చేయించారు.

ఆట స్థలం బాగు చేయండి

చినగంజాం, న్యూస్‌టుడే: చినగంజాం ప్రాథమిక పాఠశాలలో సుమారు 90 మంది విద్యార్థులు చదువుతున్నారు. కానీ వారు సంతృప్తిగా ఆటలు ఆడుకునేందుకు సరైన వసతులు లేవు. ఉన్న స్థలంలో కంకర రాళ్లు, పిచ్చి మొక్కలు ఉన్నాయి. వాటిని తొలగించి తాము ఆడుకునేందుకు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.



ఇబ్బంది పడుతూ ఆటలాడుతున్న విద్యార్థులు

త్రుటిలో తప్పిన ప్రమాదం

బల్లికురవ, న్యూస్‌టుడే: ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ ఘటనలో బైకు చోదకుడికి పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటన మండలంలోని మల్లాయపాలెం- వేమవరం నాలుగు రోడ్ల కూడలి మధ్యలో బుధవారం చోటు చేసుకుంది. ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీకొనగా ద్విచక్ర వాహనం లారీ కింద పడి నుజ్జునుజ్జు అవ్వగా వాహన చోదకుడు నాగార్జునకు త్రుటిలో ప్రాణ పాయం తప్పింది. క్షతగాత్రుణ్ని 108 వాహనంలో చిలకలూరిపేట ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగరాజు తెలిపారు.

(c) eenadu

స్వర్ణ కుప్పం సాకారమే లక్ష్యంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు పేర్కొన్నారు. రెండు రోజుల కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా.. బుధవారం శాంతిపురం మండలం తుమ్మిశి ఏపీ మోడల్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజావేదిక బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. కుప్పం ప్రజలు ఎనిమిది దఫాలు ఎమ్మెల్యేగా గెలిపించి అందిస్తున్న ఆశీస్సులతోనే నవ్యాంధ్రకు రెండో దఫా సీఎంను కాగలిగానని తెలిపారు. కుప్పం అభివృద్ధి బాధ్యత నాది.. సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత మీదే.. అని స్పష్టం చేశారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కలెక్టర్ సుమిత్‌కుమార్ పాల్గొన్నారు.

ఈనాడు- చిత్తూరు; న్యూస్‌టుడే, శాంతిపురం, కుప్పం పట్టణం, గ్రామీణ

ఇంటింటా సౌరభం

నియోజకవర్గంలో ప్రతి ఇంటా సోలార్ పవర్ సాకారం దిశగా వెంటపడతానని స్పష్టం చేశారు. ఇందుకోసం రూ.564 కోట్లు ఖర్చు చేస్తామన్నారు.

పాడి రైతుకు ప్రాధాన్యం

నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో రోజుకు పది లక్షల లీటర్ల పాల ఉత్పత్తిని లక్ష్యంగా పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

కరవుకు శాశ్వత పరిష్కారం

కుప్పానికి ఈ ఏడాదిలోనే హంద్రీ- నీవా జలాలు తెచ్చి నీటి కరవుకు శాశ్వత పరిష్కారం చూపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు.

వైద్యసేవల మెరుగుకు..

కుప్పం ప్రాంతంలో వైద్య సేవలు మెరుగుపరచేందుకు రూ.5 కోట్లతో నెర్వ్ సెంటర్‌ను నెలకొల్పామని చంద్రబాబు తెలిపారు. ఈ పైలెట్ ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు.

ఏడాది పాలనలో..

- కుప్పం అభివృద్ధికి రూ.1,293 కోట్లు మంజూరు చేసి.. రూ.123 కోట్ల విలువైన పనుల్ని పూర్తి చేశాం.
- 2026లోపు పెండింగ్ పనులన్నింటినీ పూర్తి చేస్తాం.
- పారిశ్రామిక ప్రగతిలో భాగంగా రూ.1,645 కోట్ల పెట్టుబడులకు శంకుస్థాపనలు చేశాం.
- శ్రీశైలం నుంచి 'హంద్రీ-నీవా కాలువ సాకారానికి రూ.3,895 కోట్లు ఖర్చు చేశాం.



ప్రజావేదిక కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

స్వర్ణ కుప్పం.. సాకారమే లక్ష్యం

సొంత నియోజకవర్గ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆత్మీయంగా పలకరించి.. అభివృద్ధిని వివరించి..

'నమస్కారం అమ్మా.. బాగున్నారా? పిల్లలు ఏం చదువుతున్నారు? ఈ ఏడాదిలో ప్రభుత్వ పరిపాలన ఎలా ఉంది? ఇంకా మీకు ఏమైనా చేయాలా?. నేనూ ఈ ప్రాంతంలోనే ఇల్లు కట్టుకున్నా. ఎప్పుడు వచ్చినా ఇక్కడే ఉంటా' అంటూ తెదేపా అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం రాత్రి తెదేపా కుటుంబ సాధికార సమితి సభ్యుడి హోదాలో తిమ్మరాజుపల్లెలోని 49వ పోలింగ్ బూత్ పరిధిలోని 26 కుటుంబాలను కలుసుకున్నారు. 'సార్ మా ఇంటికి మీరు రావడం ఎంతో ఆనందంగా ఉంది. మీరు చల్లగా ఉండాలి. మేడమ్ (నారా భువనేశ్వరి) బాగున్నారా? లోకేశ్, బ్రాహ్మణి ఎలా ఉన్నారు? మా కుప్పం దేవుడు సార్ మీరు. మీ హయాంలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందింది' అని అంతే భావోద్వేగంతో గ్రామస్థులు బదులిచ్చారు. 'హాయ్ సార్.. బై సార్' అంటూ పాఠశాలలోని చిన్నారులు ఉత్సాహంగాఖీ స్వాగతం, వీడ్కోలు పలికారు. పాఠశాలలోకి రావాలని విద్యార్థులు కోరగా.. ఇంకా వారిని పాఠశాలలో ఎందుకు ఉంచారని అధికారులను ప్రశ్నించారు. చంద్రబాబు అందరితో కుటుంబ పెద్దలా మాట్లాడారు. తొలుత వెంకటస్వామి ఇంటికి వెళ్లారు. ఆ తర్వాత వెంకటమ్మ అనే మహిళ గృహానికి చేరుకుని పింఛను అందించారు. ఈ సందర్భంగా ఆమె కుమారుడు వెంకటేశ్ బతుకుదెరువు కోసం బెంగళూరుకు వెళుతున్నానని.. ఆటో ఇప్పిస్తే ఉపాధి పొందుతానని అడిగారు. వాహనంతోపాటు రెండు- మూడు ఆవులు కొనిస్తానని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఇల్లు కట్టుకోవడానికి సాయం అందించాలని కోరగా చర్యలు తీసుకోవాలని కడా పీడీ వికాస్ మర్మత్‌ను ఆదేశించారు. మునెమ్మ అనే మహిళ కుటుంబసభ్యులతో ఇంటి పెద్దలా మాట్లాడారు. ఆమె కూతురు డిగ్రీ చదివి ఖాళీగా ఉందని తెలుసుకుని.. నువ్వు చదువుకుని ఉద్యోగం చేయడం లేదంటే ఆశ్చర్యమనిపిస్తోందన్నారు. నైపుణ్య శిక్షణ ఇప్పిస్తానని మంచి ఉద్యోగం చేయాలని సూచించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి సీఎం రిలీఫ్ ఫండ్ కింద సాయమందిస్తామన్నారు. ఇళ్లు కట్టిస్తానని భరోసా ఇచ్చారు.

స్వచ్ఛ కుప్పం ఒప్పంద పత్రాలతో ఐటీసీ కంపెనీ ప్రతినిధులు

సల్లాపురి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

మీరు జైలులో ఉన్నన్ని రోజులు ఒక్క పూటే అన్నం తిన్నా

సల్లాపురి అనే వ్యక్తి గృహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వెళ్లారు. ఇప్పటికీ తాము ఉమ్మడిగానే 19 మందిమి కలిసి ఉంటున్నామని ఆయన చెప్పారు. అయితే మీతో మాట్లాడాల్సిందే అని చంద్రబాబు అన్నారు. తెలుగుదేశం ప్రభుత్వం గతంలో విదేశీ విద్యకు రూ.10 లక్షల సాయమందించిందని దాంతో తాను అమెరికాలో చదువుకుని ఆరేళ్లుగా అక్కడే ఉద్యోగం చేస్తున్నానని సల్లాపురి కుమారుడు బాలసుబ్రహ్మణ్యం ఆనందంగా చెప్పారు. 'మీరు జైలులో ఉన్నన్ని రోజులు.. మూడు పూటలకు బదులు ఒక్క పూటే అన్నం తిన్నా. బయటకు వచ్చి ముఖ్యమంత్రి అయితే తిరుపతిలోనే ఉంటానని వేంకటేశ్వరుడిని మొక్కుకున్నా' అని సల్లాపురి చంద్రబాబుకు వివరించారు. చివర్లో తనకు పార్టీలో పదవి కావాలని కోరగా ఇప్పిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. వచ్చే నెలలో తన వివాహముందని రావాలని ఒకరు కోరారు.

లోటుపాట్లు ఉంటే సరిదిద్దుకోవాలి

గ్రామంలోని గృహాలకు వెళ్లిన తర్వాత చివరగా స్థానికంగా ఉన్న గుడికి వెళ్లారు. అనంతరం ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. ఇక్కడే కాపురం ఉంటున్నానని చంద్రబాబు చెప్పారు. అందుకే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొంటున్నానని పేర్కొన్నారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు రాష్ట్రంలోని అన్ని ఇళ్లకూ వెళ్లి ఇదేవిధంగా పరిపాలన గురించి వివరించాలన్నారు. ప్రజలు ఏమైనా లోటుపాట్లు చెబితే సరిదిద్దుకోవాలన్నారు. త్వరలోనే నిరుద్యోగ భృతి ఇస్తానన్నారు. చదువుకున్న వారికి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఒక ఇంట్లో తల్లికి వందనం కింద రూ.1.05 లక్షలు పడ్డాయని చెప్పారు.

తిమ్మరాజుపల్లెలో ఓ ఇంట్లోకి వెళ్తూ ..

మహిళకు గ్యాస్ కనెక్షన్ పత్రం అందజేస్తూ..

యూరియా.. దొరకడమే కష్టమయ్యా..!

రైతులను వేధిస్తున్నా దృష్టిపెట్టని యంత్రాంగం

చిత్తూరు (వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలో యూరియా కొరత జటిలమైంది. అధికారుల పర్యవేక్షణ కొరవడటం, సరైన ప్రణాళిక లేకపోవడమే ప్రధాన కారణమని ఆ శాఖ అధికారులే పేర్కొంటున్నారు.

ఈ ఏడాది ముందస్తు వర్షాలతో కుప్పం, పలమనేరు నియోజక వర్గాల్లో కూరగాయలు, ఉద్యాన పంటలు; చిత్తూరు, పూతలపట్టు, జీడీ నెల్లూరు, నగరి నియోజకవర్గాల్లో వరి, కూరగాయలు సాగు చేస్తున్నారు. పశుగ్రాసం సాగు విస్తరిస్తుండటంతో ఇందుకు యూరియా అధికంగా వినియోగిస్తున్నారు. అవసరాలకు అనుగుణంగా యూరియా అందుబాటులో లేకపోవడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు.

ముందస్తు చర్యలు లేకపోవడంతోనే..

ఖరీఫ్ సీజన్ మొదలై నెల రోజులు పూర్తికానుంది. ఏ మండలంలో ఏ పంటలు సాగవుతున్నాయి..? ఎంత యూరియా అవసరం..? రైతు సేవా కేంద్రాల్లో, ప్రైవేటు డీలర్లు, హోల్‌సేల్ డీలర్ల వద్ద ఎంత నిల్వ ఉంది..? తదితర అంశాలు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాల్సిన ఏవోలు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి. రైతు సేవా కేంద్రాల్లో రైతులకు విక్రయించిన వివరాలను అంతర్జాలంలో నమోదు చేయకపోవడంతో యూరియా నిల్వ ఉన్నట్లు అంతర్జాలంలో చూపుతున్నాయి. పలు మండలాల్లోని రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్లు, సహకార సంఘాల వద్ద యూరియా లేకపోవడంతో అన్నదాతలు అవస్థలు పడుతున్నారు.

అవసరం మేరకు అందుబాటులో..

జిల్లాలో ప్రస్తుతం 4,200 టన్నుల యూరియా నిల్వ ఉంది. అన్ని ప్రాంతాల్లో అవసరమైన మేర అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం.

- మురళీకృష్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి

వైభవంగా.. పుష్పయాగం

శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయంలో బుధవారం పుష్పయాగ మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం 1-4 గంటల మధ్య పుష్పయాగ మహోత్సవం కనుల పండుగగా చేపట్టారు. ఇందుకు మూడు టన్నుల పుష్పాలు వినియోగించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లు ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు.

- న్యూస్‌టుడే, తిరుపతి (తితిదే)

104FM Tirupati
104 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact
8008555167, 9000180635

(c) eenadu

భవితకు బంగారు బాట

- ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బాసట
- కూటమి ప్రభుత్వ చొరవ

ప్రత్యేక అవసరాలున్న చిన్నారులను భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నిర్వహించిన సర్వే ఇటీవల ముగిసింది. సహిత విద్య ఉపాధ్యాయులు పలు కారణాలతో చదువుకు దూరంగా ఉంటున్న చిన్నారుల ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. ఇలా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 563 మందిని గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి కొందరిని ఇప్పటికే భవిత కేంద్రాల్లో చేర్పించడం గమనార్హం.

- న్యూస్‌టుడే, పుత్తూరు

జిల్లాలో భవిత కేంద్రాలు: 31

విద్యనభ్యసించే ప్రత్యేక అవసరాల విద్యార్థులు: 2,800 మంది

సహిత ఉపాధ్యాయులు: 62 మంది

స్పెషల్ ఎడ్యుకేటర్లు: 33 మంది

సర్వేలో కొత్తగా గుర్తించిన చిన్నారులు: 214 మంది

పుత్తూరులో ప్రత్యేక అవసరాలున్న పిల్లల్ని గుర్తిస్తున్న సిబ్బంది (పాత చిత్రం)

ఫిజియోథెరపీ సేవలతో..

భవిత కేంద్రంలో పిల్లలకు వారంలో ఒక రోజు ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు అందించనున్నారు. అవసరమైన వారికి వినికిడి యంత్రాలు, వీల్‌ఛైర్లు, మూడు చక్రాల సైకిళ్లు, బ్రెయిలీ కిట్లు ఇవ్వనున్నారు. ప్రతి విద్యార్థికి ఆట వస్తువులు అందజేస్తారు. పాఠశాలకు నడచి రాలేని వారికి 1 నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులకు తల్లిదండ్రులకు సాయంతో పాఠశాలలకు తీసుకెళ్లేందుకు నెలకు రూ.300, బడికి రాలేని స్థితిలో ఉన్న వారికి ఇంటి వద్ద విద్య అలవెన్స్ కింద నెలకు రూ.200, దృష్టి లోపం విద్యార్థులకు నెలకు రూ.300 చొప్పున చెల్లిస్తారు.

ఆటపాటలతో బోధన..

ప్రత్యేక అవసరాల చిన్నారులకు సహిత విద్య ఉపాధ్యాయులు పుస్తకాలతో పాటు విద్య ఉపకరణాలతో పాఠాలు చెబుతారు. అందరి మాదిరిలా కాకుండా వారికి అర్థమయ్యేలా బోధిస్తూ రోజూ చిన్నారులు భవిత కేంద్రానికి వచ్చేలా చూస్తారు.

అవగాహనా లోపం..

ఒక్కో భవిత కేంద్రాల్లో చిన్నారులకు ప్రభుత్వం పలు సదుపాయాలు కల్పిస్తోంది. చాలామంది తల్లిదండ్రుల్లో అవగాహన లేక భవిత కేంద్రాల్లో చేర్పించలేక పోతున్నారు. గత నెల 13 నుంచి ఈ నెల తొమ్మిదో తేదీ వరకు జిల్లా సహిత విద్య సమన్వయ కర్తల పర్యవేక్షణలో సర్వే చేపట్టారు. 18 ఏళ్ల లోపు వయసున్న ప్రత్యేక అవసరాల చిన్నారులను భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు సిద్ధం చేస్తున్నారు.

ఫ్లోబస్.. సాంకేతికత అదుర్స్

❖ విద్యార్థుల చెంతకు ఏఐ పాఠాలు ❖ ఏపీలో మొదటిసారిగా మహిళా వర్సిటీలో ప్రారంభం

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: 'ఎవడబ్బ సొత్తు కాదురా ట్యాలెంటు'.. అన్న మాటలను నిజం చేశాడా కుర్రాడు. చిన్ననాటి నుంచి తాను అందిపుచ్చుకోలేని సాంకేతికతను నేటితరానికి పరిచయం చేస్తూ సరికొత్త ఆవిష్కరణకు శ్రీకారం చుట్టాడు. కళాశాలల్లో సరైనా ప్రయోగశాలల్లేక తాను పడిన కష్టం మరెవ్వరికీ ఎదురవ్వకూడదని బస్సులోనే ల్యాబ్ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి, ప్రముఖుల ప్రశంసలు అందుకున్నాడు. మూడేళ్ల శ్రమకోర్చి దేశంలో ఎక్కడా లేని విధంగా మొదటి సారి ఫ్లో (ఫ్యూచర్ ల్యాబ్ ఆన్ వీల్స్) బస్సులో ల్యాబ్‌ను ఆవిష్కరించాడు. అతడే పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం శృంగవృక్షానికి చెందిన క్రొవ్విడి మధులాష్‌బాబు. ఆ ఆవిష్కరణ గురించి తెలుసుకుందాం రండి.

ఫ్లోబస్

● **ఆలోచనతో మెరిసి..** మధుకు చిన్నప్పటి నుంచి సాంకేతిక పరిజ్ఞానంపై మక్కువ ఎక్కువ. తండ్రి లారీ డ్రైవర్ కావడంతో ఇంటర్ వరకు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే చదివాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్‌లో ఎలక్ట్రానిక్స్ కోర్సు తీసుకుని వినూత్నంగా రాణించాలనుకున్నాడు. కానీ కళాశాలలో సరైన ప్రయోగశాలలు, పరికరాల్లేక ఆశించిన స్థాయిలో విద్యాబోధన లేదని మదనపడ్డాడు. తాను పడిన కష్టం మరెవరికీ కలగకూడదని వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టాడు. సాంకేతిక పరికరాలతో కూడిన బస్సును రూపొందించాలనుకున్నాడు. అది ఖర్చుతో కూడుకున్న పనైనా విశ్రమించలేదు. తన ఆలోచనలతో ఇన్వెస్టర్లను ఆకర్షించాడు.

● **దేశంలోనే మొదటిది..** తన ఆలోచనను వివరిస్తూ శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలోని టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్(టీబీఐ)కు దరఖాస్తు చేసుకోగా.. వారు దాన్ని పరిశీలించి స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ కింద రూ.25 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేసింది. ఇదే కాకుండా అమెరికాకు చెందిన జార్జ్ మాసన్ యూనివర్సిటీ నుంచి రూ.80 లక్షల నిధులొచ్చాయి. ఈ ఏడాది జూన్‌లో హైదరాబాద్‌లో 'ఎడోధ్వజ' అనే పేరుతో తన స్నేహితులతో కలిసి ఒక సంస్థ ఏర్పాటు చేశాడు. ఈ నిధులతో దేశంలోనే తొలి సంచార ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్ (ఫ్లో) బస్సును రూపొందించాడు.

బస్సు లోపల ఏర్పాటు చేసిన సాంకేతిక పరికరాలు

● **16రకాల పరిజ్ఞానాలు..** బస్సులోపల విద్యుత్తు సరఫరా కోసం బస్సుపై 2కే సోలార్ ప్యానల్, త్రీడీ ప్రింటింగ్‌తో బొమ్మలు, అంతరిక్షంలో అడుగుపెట్టినట్లు అనుభూతిని కలిగించే ప్లానెటోరియం, డ్రోన్‌లు, రోబోటిక్స్ తయారీ, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, ఐవోటీ, వర్చువల్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, ఏఐ వంటి పదహారు రకాల టెక్నాలజీలను ఇక్కడ నేర్పిస్తారు. విద్యార్థులు తమకు నచ్చిన విభాగంలో డీఐవై కిట్ల సాయంతో సొంతంగా ప్రయోగాలు చేయొచ్చు. బస్సులో ఉన్న మెంటార్లు సాయం అందిస్తారు.

మేమే వస్తాం

ఇప్పటి వరకు తెలంగాణలో 40వేల మంది విద్యార్థులకు బస్సులో ఉన్న పరికరాలు, పనితీరు, ప్రయోగాలకు ఎలా వినియోగించుకోవాలో చూపించాం. మొదటిసారిగా మహిళా వర్సిటీలో ప్రారంభించాం. విద్యార్థుల చెంతకు మేమే వచ్చి సందేహాలు నివృత్తి చేస్తాం. ఆసక్తి ఉన్న యాజమాన్యాలు చరవాణి నెంబరు : 9010388921, వెబ్‌సైట్: డబ్ల్యు.డబ్ల్యు.ఇడీవోడీడబ్ల్యుఏజేఏ.కామ్‌లో సంప్రదించవచ్చు.

- మధులాష్‌బాబు, ఎడోధ్వజ సంస్థ వ్యవస్థాపకులు, సీఈవో

భక్తులతో మాట్లాడుతున్న ఈవో పెంచల కిషోర్

నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయకస్వామి భక్తులకు నాణ్యమైన భోజనం అందించడమే లక్ష్యంగా అధికారులు, సిబ్బంది పనిచేయాలని ఈవో పెంచల కిషోర్ ఆదేశించారు. అన్నదాన భవనంలో భోజన నాణ్యత ఎలా ఉందని ఈవో బుధవారం స్వయంగా భక్తులతో మాట్లాడారు. రానున్న రోజుల్లో నూతన అన్నదాన భవనంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిరంతరం అన్నదానం జరుగుతుందని, ఇందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు. ఈఈ వెంకటనారాయణ, ఏఈవో ఎస్వీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీ ఇన్‌ఛార్జి ఎస్‌ఈగా సురేష్‌బాబు

చిత్తూరు (సంతపేట), న్యూస్‌టుడే: రహదారులు, భవనాల శాఖ ఇన్‌ఛార్జి ఎస్‌ఈగా సురేష్‌బాబును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. కర్నూలులో ఈఈగా ఉన్న ఆయనను ఇక్కడ ఇన్‌ఛార్జి ఎస్‌ఈగా నియమించింది. చిత్తూరు ఎన్‌హెచ్ డీఈఈగా ఉన్న కృష్ణయ్య.. అనంతపురం ఎన్‌హెచ్ ఇన్‌ఛార్జి ఈఈగా బదిలీ అయ్యారు. చిత్తూరు ఎన్‌హెచ్ సబ్ డివిజన్ డీఈఈ సత్యమూర్తికి.. ఆర్‌అండ్‌బీ టెక్కలి ఇన్‌ఛార్జి ఈఈగా పోస్టింగ్ ఇచ్చారు. ఏఈగా పనిచేసిన సుజాతను.. ఉద్యోగోన్నతిపై చిత్తూరు సబ్ డివిజన్ డీఈఈగా నియమించారు.

పీపీ, ఏపీపీల నియామకం

రామకృష్ణ

బాలాజీ

చిత్తూరు (న్యాయవిభాగం), న్యూస్‌టుడే: చిత్తూరులోని ప్రధాన జిల్లా సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ)గా వి.ఆర్.రామకృష్ణ నియమితులయ్యారు. స్థానిక ఆరో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా ఎం.బాలాజీని నియమించారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్ల పాటు వీరు ఈ పదవుల్లో కొనసాగనున్నారు. వీరి నియామకంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. తనను నియమించిన సీఎం చంద్రబాబు, కూటమి నాయకులకు పీపీ రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

గోవిందరాజస్వామి సన్నిధిలో అర్ధరాత్రి అగ్ని ప్రమాదం

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: నగరంలోని శ్రీగోవిందరాజస్వామివారి ఆలయ రాజగోపురం ముందు భాగంలో బుధవారం అర్ధరాత్రి అనంతరం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఓ దుకాణంలో ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపించాయి. దీంతో ఒక్కసారిగా దట్టమైన పొగలు పరిసరాల చుట్టూ అలుముకున్నాయి. మంటలు పైనున్న చలువ పందిళ్ల వరకు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కాసేపటికి మంటలు అదుపులోకి తెచ్చారు. ప్రమాదానికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

అ'ధర'గొడుతున్న కొబ్బరి

❖ రికార్డు స్థాయిలో పెరిగిన ధర ❖ వెయ్యి కాయలు రూ.17 వేలు

పాలసముద్రం, న్యూస్‌టుడే: పండించిన పంటకు మద్దతు ధర లభిస్తే అన్నదాతల కళ్లలో ఆనందం నిలుస్తుంది. అన్ని రోజులు పడిన కష్టాన్ని వారు మర్చిపోతారు. తాజాగా కొబ్బరి రైతుల పరిస్థితి అలానే ఉంది. జిల్లాలో ఓ వైపు మామిడి రైతులు ధర లేక రోడ్లపై ట్రాక్టర్లలో పడిగాపులు కాస్తున్నారు. ఇదే సమయంలో.. కొబ్బరి రైతులు మద్దతు ధర రావడంతో ఒకింత ఆశగా ఉన్నారు.

పాలసముద్రంలో కాయలు ఒలుస్తున్న కూలీలు

ఇక గతంలో ఎన్నడూలేని విధంగా కొబ్బరికి ధర పెరిగింది. వెయ్యి పచ్చికాయల ధర ఏకంగా రూ.17 వేలు పలకడంతో రైతులు ఆనందంతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో దిగుబడి తగ్గడం, ఒకప్పుడు తెలుగు రాష్ట్రాలతో పాటు ఆంధ్రా కొబ్బరికి డిమాండ్ పెరిగింది. ధర మరింత పెరిగే అవకాశం ఉందని రైతులు భావిస్తున్నారు. పాల సముద్రం మండలం పాలసముద్రం, కమ్మపాళ్యం, వెంగళరాజుకుప్పం, శ్రీబొమ్మరాజుపురం, కనికాపురం గ్రామాల కాయలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు. ప్రస్తుతం మండలం నుంచి కర్నూలు, నెల్లూరు, తిరుపతి, చెన్నై, బెంగళూరు, పుదుచ్చేరి, గుడియాత్తం సహా ఇతర ప్రదేశాలకు తరలిస్తున్నారు. ఒలిచిన వెయ్యి కాయల ధర రూ.25 వేలు పలుకుతోంది.

'నవ మోసాలు చేసిన వైకాపా'

చిత్తూరు (జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: నవరత్నాల పేరుతో గత వైకాపా ప్రభుత్వం ప్రజలను నవ మోసాలు చేసిందని తెదేపా రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్రకుమార్ ఆరోపించారు. స్థానిక తెదేపా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని, ఓర్వలేని జగన్.. ప్రజల దృష్టి మళ్లించడానికి రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో అని దుష్ట కార్యక్రమానికి పిలుపునిచ్చారన్నారు. జగన్‌కు హామీల గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. కూటమి ప్రభుత్వంపై వైకాపా విషం చిమ్ముతోందని, జగన్ ఐదేళ్ల అరాచక పాలనను అనుభవించిన ప్రజలు ఇక రాష్ట్రంలో వైకాపాకు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతు ఇవ్వరన్నారు.

మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహన్

పీ4 కింద తడుకు పంచాయతీని దత్తత తీసుకోండి

పుత్తూరు, న్యూస్‌టుడే: తడుకు పంచాయతీని పీ4 కింద దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని సర్పంచి వెంకటేష్ డిమాండ్ చేశారు. తడుకు పంచాయతీ కార్యాలయం వద్ద స్థానిక సర్వే నంబరు 507/1, 2లో 2.520 హెక్టార్లలో శ్రీకనకదుర్గ మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు లీజుకు సంబంధించి ఆర్డీవో అధ్యక్షతన బుధవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. సర్పంచి మాట్లాడుతూ మండలంలోనే మేజర్ పంచాయతీ తడుకు అభివృద్ధికి సహకరించాలని, గ్రామంలో తాగునీటి శుద్ధి యంత్రాలు దశల వారీగా ఏర్పాటు చేయాలని, రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బరత్నమ్మ భర్త గంగాధరం, కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ రాజశేఖర్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, వీఆర్వో జయప్రకాష్, కార్యదర్శి అనిల్, గ్రామస్థులు పాల్గొన్నారు.

భాజపా జాతీయ కౌన్సిల్‌లో చోటు

సన్నారెడ్డి దయాకర్ రెడ్డి



మునిసుబ్రహ్మణ్యం

తిరుపతి (గాంధీరోడ్డు): భాజపా జాతీయ కౌన్సిల్‌లో జిల్లా నుంచి ఇద్దరికి చోటు లభించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి పేరు ప్రకటించిన వేదికపై నుంచే ఎన్నికల పరిశీలకుడు బెంగళూరు సెంట్రల్ ఎంపీ పీసీ మోహన్ మండలి సభ్యుల పేర్లను ప్రకటించారు. మొత్తం 40 మందికి చోటు దక్కగా జిల్లాకు చెందిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి, కార్యదర్శి మునిసుబ్రహ్మణ్యంలకు సభ్యులుగా అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేస్తూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. త్వరలో జరగనున్న జాతీయ అధ్యక్షుడి ఎన్నికల్లో వీరు పాల్గొననున్నారు.

కౌన్సిల్ సభ్యురాలిగా నిషిధ

నిషిధ

పుత్తూరు, న్యూస్‌టుడే: భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా పుత్తూరుకు చెందిన నిషిధను ఎన్నుకున్నట్లు బుధవారం ప్రకటించారు. గతంలో ఆమె పార్టీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె మాట్లాడుతూ ఏపీలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. పార్టీలో సముచిత స్థానం దక్కడంపై ఆమె జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు వానతి శ్రీనివాసన్, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఘనంగా ఎమ్మెల్యే అమరనాథరెడ్డి జన్మదిన వేడుకలు

వి.కోట, న్యూస్‌టుడే: ఎమ్మెల్యే అమరనాథరెడ్డి జన్మదిన వేడుకలను నియోజకవర్గంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎన్టీఆర్ సర్కిల్ వద్ద ఎమ్మెల్యే అమరనాథరెడ్డి కేకు కోసి కార్యకర్తలకు పంచారు.

ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి పూలమాల వేస్తున్న పారిశ్రామికవేత్త డీఎం కుమార్

సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన పారిశ్రామికవేత్త, బీసీ సెల్ మండల అధ్యక్షుడు డీఎం కుమార్‌తో కలిసి ఇంటింటి పర్యటనలో పాల్గొన్నారు. పడిగల కుప్పంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కుమార్ సన్మానించారు. నాయకులు రంగనాథ్, రాంబాబు, ధీరజ్, జనార్ధన్‌రెడ్డి, కోదండ, మధు పాల్గొన్నారు.

'చర్యలు తీసుకునేవరకు న్యాయ పోరాటం'

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తన కుమార్తె, తెదేపా జిల్లా మహిళా కార్యదర్శి శ్రీదుర్గ మృతికి కారణమైన అపోలో యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకునే వరకు న్యాయ పోరాటం ఆగదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు షణ్ముగం తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన కుమార్తె శ్రీదుర్గ రోడ్డు ప్రమాద విషయమై తనకు న్యాయం జరగలేదన్నారు. ప్రభుత్వం ఈ ఘటనపై నియమించిన వైద్య నిపుణుల కమిటీ.. అపోలో యాజమాన్యానికి తలొగ్గి వారికే అనుకూలంగా నివేదికను ప్రభుత్వానికి అందించిందన్నారు. నివేదికలోని లోపాలు గుర్తించి హైకోర్టును ఆశ్రయించానని చెప్పారు. హైకోర్టు తన అభ్యర్థనపై 15 రోజుల్లోగా శ్రీదుర్గ మృతికి, వైద్య నిపుణుల కమిటీ నివేదికపై.. ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించిందన్నారు. ఈ కేసు రాజీ చేసుకోవాలని తిరుపతి ఎమ్మెల్యే చరవాణిలో తనతో మాట్లాడారని, ఆ సంభాషణల్ని తాను వైద్య కమిటీ నిపుణులకు అందజేశానన్నారు.

పర్యాటకశాఖకు 12.70 ఎకరాల భూమి కేటాయింపు

తిరుపతి (నగరం): వడమాలపేట మండలం ఎస్వీపురంలో సర్వేనెం.428/2, 428/3లోని 12.70 ఎకరాల భూమిని రాష్ట్ర పర్యాటకశాఖకు కేటాయిస్తూ సీసీఎల్ఏ జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. పర్యాటకశాఖకు సంబంధించిన వివిధ ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఈ భూమిని కేటాయించారు. భూమిని అప్పగించాలంటూ జిల్లా రెవెన్యూశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

చోరీ కేసులో తమిళనాడు వాసి అరెస్టు

నగరి, న్యూస్‌టుడే: పట్టణంలో జరిగిన ఓ చోరీ కేసులో తమిళనాడు తిరుత్తణికి చెందిన ధరన్‌సాయిని బుధవారం అరెస్టు చేశామని సీఐ విక్రమ్ తెలిపారు. జూన్ ఎనిమిదో తేదీన నగరి కోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న లోకేష్ ఇంటిలో అర్ధరాత్రి దొంగలు చొరబడి, రూ.లక్ష నగదు, రెండు చరవాణులు చోరీ చేశారని, దీనిపై కేసు నమోదు చేశామన్నారు. ఆ కేసులో నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక నిఘా బృందం ఏర్పాటు చేసి ఎట్టకేలకు నగరి ఓంశక్తి ఆలయం ఎదురుగా అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించామని చెప్పారు. అతడు తిరుత్తణికి చెందిన ధరన్‌సాయిగా గుర్తించామని అతడి నుంచి రూ.75 వేల నగదు, రూ.40 వేల విలువ చేసే రెండు చరవాణులను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. నిందితుడిపై తమిళనాడులోని తిరుత్తణిలో పలు చోరీ కేసులు ఉన్నాయని, కేసు ఛేదనలో ప్రతిభ చూపిన ఎస్సై విజయనాయక్, సిబ్బంది లోకనాథం, గోపీ, సత్య, గజేంద్ర, అశోక్, రమేష్‌ను సీఐ అభినందించారు.

నిందితుడి అరెస్టు చూపుతున్న సీఐ విక్రమ్

చికెన్ ధరలు

వెన్‌కాబ్ (కిలో రూ.ల్లో)

బ్రాయిలర్ (రైతు ధర)	95
రిటైల్	117
లేయర్	115
బ్రాయిలర్	170
బ్రాయిలర్ స్కిన్ లెస్	193
లేయర్ మాంసం	195

ఏ బిడ్డా.. ఇదీ మా అడ్డా

❖ ఆర్టీసీ పరిసరాల్లో ప్రైవేటు ట్రావెల్స్ దందా ❖ ప్రతి నెలా రూ.లక్షల్లో ఆదాయానికి గండి

తిరుపతి (ఆర్టీసీ), న్యూస్‌టుడే: తిరుపతిలోని ఆర్టీసీ కేంద్రీయ బస్‌స్టేషన్ పరిసరాలు ప్రైవేట్ ట్రావెల్స్ దందాకు వేదికగా మారాయి. ప్రభుత్వ నిబంధనలు ఇక్కడ కాగితాలకే పరిమితమయ్యాయి. ఫలితంగా శ్రీవారి భక్తులు, సాధారణ ప్రయాణికులు పెద్దఎత్తున దోపిడీకి గురవుతున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులతో పాటు ఆర్టీసీ నష్టపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆర్టీసీ, రవాణా శాఖల నిబంధనల మేరకు ప్రైవేట్ బస్సులను ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు రెండు కి.మీ. పరిధిలో నిలపడానికి, ప్రయాణికులను ఎక్కించుకోవడానికి లేదు. కానీ తిరుపతిలో ప్రాంగణానికి ఇరువైపులా పెద్దఎత్తున వాహనాలు ఆపుతున్నారు. సమీపంలోనే అనధికార బస్టాప్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడి నుంచి 24 గంటలూ ఏ సమయంలోనైనా వాహనాలు అందుబాటులో ఉంచుతూ ఆర్టీసీ ఆదాయానికి పెద్దఎత్తున గండికొట్టేలా తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. విద్యుత్తు కాంతులు, టీవీ, ఏసీలతో ప్రయాణికులను ఆకర్షిస్తున్నారు. పగలు విశాఖపట్నం, విజయవాడ, బెంగళూరు, చెన్నై వైపు.. సాయంత్రం హైదరాబాద్ వైపు బస్సులు నడుపుతున్నారు. సోమ, మంగళ, బుధ, గురు వారాల్లో ఆర్టీసీ కంటే తక్కువ ఛార్జీలతో నడపుతూ శుక్ర, శని, ఆదివారాల్లో మూడింతలు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈవీలు అందుబాటులోకి రావడంతో ప్రయాణ ఛార్జీల్లో తరచూ ఆర్టీసీ కంటే తక్కువ వసూలు చేస్తున్నారు.

తిరుపతి నుంచి బస్సుల రాకపోకలు ఇలా..

మార్గం	ఆర్టీసీ	ప్రైవేట్
హైదరాబాద్	7	58
విజయవాడ	98	42
బెంగళూరు	72	11
చెన్నై	67	8

బస్టాండ్‌లోకి బస్సులు ప్రవేశించే మార్గానికి ఎదురుగా నిలిపిన ప్రైవేట్ బస్సులు

సమన్వయంతో చర్యలు తీసుకుంటాం

ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై ఇదివరకు జిల్లా ప్రజారవాణాధికారితో కలిసి ఎస్పీకి ఫిర్యాదు చేశాం. ఆయన సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు, రవాణా శాఖాధికారుల సమన్వయ సహకారంతో చర్యలు తీసుకుంటాం.

- విశ్వనాథ్, ఆర్టీసీ జిల్లా డిప్యూటీ సీటీఎం

మామిడి రైతులను ఆదుకోవడంలో విఫలం

గంగాధర నెల్లూరు, న్యూస్‌టుడే: మామిడి రైతులను ఆదుకోవడంలో ప్రభుత్వం విఫలమైనట్లు మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి, నియోజకవర్గ వైకాపా బాధ్యురాలు కృపాలక్ష్మి విమర్శించారు. బుధవారం వారు స్థానిక జైన్ గుజ్జు పరిశ్రమ వద్ద ట్రాక్టర్లలో ఉన్న రైతులకు భోజనం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆలస్యంగా గుజ్జు పరిశ్రమలు ప్రారంభించడం, ఆ పరిశ్రమలతో ప్రభుత్వం కుమ్మక్కై రైతులను మోసం చేస్తోందని ఆరోపించారు. కనీసం ప్రభుత్వం ప్రకటించిన టన్నుకు రూ.12 వేలు అయినా రైతులకు తప్పక ఇప్పించాలని డిమాండ్ చేశారు. పార్టీ నాయకులు వెంకటరెడ్డి, మునిరాజారెడ్డి, గుణశేఖర్‌రెడ్డి, ఏకాంబరం, రఘుపతిరెడ్డి, సురేంద్రరెడ్డి, నాయని రెడ్డి పాల్గొన్నారు.

జలపాతంలో మునిగి యువకుడి దుర్మరణం



సాహిల్ (పాతచిత్రం)

యర్రావారిపాలెం: తలకోన జలపాతం వద్ద నీటిలో దిగి యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. మదనపల్లెకు చెందిన సాహిల్ (20) తన ఆరుగురు మిత్రులతో కలసి తలకోన సందర్శనకు వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం జలపాతం వద్ద సరదాగా అందరూ కలసి ఈత కొట్టారు. లోతు ఉండదనే అభిప్రాయంతో ఈత రాని సాహిల్ నీటిలో దిగడంతో ప్రవాహం ధాటికి బండరాళ్లలో ఇరుక్కుపోయి మృతి చెందినట్లు ఎస్సై బాలకృష్ణ తెలిపారు. మృతదేహం వెలికితీయడానికి సమయం పడుతుందన్నారు. స్థానికంగా పర్యాటక శాఖ మనిషికి రూ.30 చొప్పున వసూలు చేస్తున్నా ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదని, హెచ్చరిక బోర్డులు సైతం లేవని పలువురు ఆరోపించారు.

ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

బంగారుపాళ్యం: జీవనోపాధి కోసం పొరుగు రాష్ట్రం నుంచి వచ్చిన వ్యక్తి ప్రమాదవశాత్తూ కిందపడి మృతి చెందాడని ఎస్సై ప్రసాద్ బుధవారం రాత్రి తెలిపారు. ఆయన కథనం మేరకు.. మొగిలివారిపల్లె వద్ద బెంగళూరు, చెన్నై ఎక్స్‌ప్రెస్ వే పనుల్లో భాగంగా. . బ్రిడ్జిపై సెంట్రింగ్ పనులు చేస్తున్న పశ్చిమ బంగా రాష్ట్రం సతీష్‌నగర్‌కు చెందిన ఆశిష్ మండే(31) ప్రమాదవశాత్తూ మంగళవారం కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో అతడికి తీవ్ర గాయాలవడంతో ఇక్కడ ప్రథమ చికిత్స నిర్వహించి తిరుపతికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. కేసు నమోదు చేశామని ఏఎస్సై మలప్ప పేర్కొన్నారు.

ధర లేక మామిడి చెట్ల తొలగింపు

జిల్లాలోని మామిడి రైతులకు ఏటా గిట్టుబాటు ధర లేకపోవడం.. దళారీ వ్యవస్థ, వ్యయభారం సార్వసాధారణమే. ఈ ఏడాది మరింత దారుణంగా మామిడి కాయల ధర పడిపోవడంతో బుధవారం తుమ్మిందలో రైతు కుమార్ తనకున్న రెండున్నరెకరాల మామిడి తోటలో ఎకరా తోటలోని మామిడి చెట్లను జేసీబీతో తొలగించి చదును చేశారు. ఈ ఎకరాలో వాణిజ్య, ఉద్యాన పంటల్ని సాగు చేయనున్నట్లు వెల్లడించారు. ఇప్పటికైనా సీఎం మామిడి రైతుల కష్టాల్ని గుర్తించి, దళారీ వ్యవస్థకు అడ్డుకట్ట వేసి గిట్టుబాటు ధర కల్పించాలని ఆయన కోరారు. -న్యూస్‌టుడే, చిత్తూరు గ్రామీణ

పోలీసుల అదుపులో పాత బంగారం కొనుగోలు ముఠా

పెదకాకాని: పాత బంగారం కొనుగోలు చేస్తామని మోసగించిన ముఠాను శ్రీకాళహస్తి పోలీసులు గుంటూరు జిల్లా పెదకాకాని గ్రామంలోని బాజీబాబా దర్గా వద్ద బుధవారం అదుపులోకి తీసుకున్నారు. పెదకాకాని, శ్రీకాళహస్తి పోలీసుల కథనం ప్రకారం..పాత బంగారానికి రెట్టింపు ధర ఇచ్చి కొనుగోలు చేస్తామని శ్రీకాళహస్తిలో కొందరిని నమ్మించారు. బంగారం కొనుగోలు చేసిన తర్వాత నోట్ల కట్టపై అసలు కరెన్సీ పెట్టి లోపల డమ్మీ నోట్లు ఉంచారు. గుర్తు పట్టకుండా ప్యాకింగ్ చేసి ఇచ్చారు. ఇలా పలువురిని మోసగించినట్లు బాధితుల ఫిర్యాదుతో శ్రీకాళహస్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ముగ్గురు వ్యక్తులు, ఇద్దరు మహిళలు పెదకాకాని బాజీబాబా దర్గాలో తలదాచుకున్నట్లు వచ్చిన సమాచారంతో స్థానిక పోలీసుల సహకారంతో నిందితులను అదుపులోకి తీసుకొని శ్రీకాళహస్తికి తరలించారు.

ఏనుగుల విషయంలో అప్రమత్తంగా ఉండండి

ఐరాల, న్యూస్‌టుడే: ఐరాల మండలం నాగంవాండ్లపల్లె, నెల్లిమందలపల్లె, వినాయకపురం, నయనంపల్లె, ఐకే రెడ్డిపల్లె, పి.ఎల్లంపల్లె, కట్టకిందపల్లె, బెల్లంగోవిందుపల్లె అటవీ సరిహద్దు ప్రాంతాల్లోని ప్రజలు ఏనుగుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని మండల అటవీ శాఖ అధికారులు బుధవారం హెచ్చరిక జారీ చేశారు. పై గ్రామాల పరిధిలో ఏనుగులు సంచరిస్తున్నాయని వారు వివరించారు. రాత్రి వేళ పొలాల వద్ద ఎవరూ బస చేయరాదని స్పష్టం చేశారు.

దంపతులపై గుర్తుతెలియని వ్యక్తుల దాడి

బైరెడ్డిపల్లె: గుర్తుతెలియని వ్యక్తులు కామినాయనిపల్లెలో దంపతులపై జూన్ 29న దాడి చేసిన ఘటనపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పరశురాముడు తెలిపారు. గ్రామానికి చెందిన మురళిని ధనలక్ష్మి రెండో వివాహం చేసుకున్నారు. దంపతులిద్దరూ గ్రామ సమీప పొలం వద్ద ఉన్న ఇంట్లో నిద్రిస్తుండగా జూన్ 29న రాత్రి ముగ్గురు గుర్తుతెలియని వ్యక్తులు ధనలక్ష్మిపై దాడి చేసి కత్తితో వీపులో పొడిచారు. ఆమె కేకలు వేయడంతో భర్త మేల్కొని వారిని ప్రతిఘటించారు. దీంతో అతని కళ్లలో కారం చల్లి చేతి వేలు కత్తిరించారు. మొదటి భర్త తరఫు వారు దాడి చేసిఉంటారని గ్రామస్థుల సమాచారం. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

EENADU Classifieds

AUTO

VEHICLES WANTED

Wanted Vehicle: అశోక్ లేలాండ్ దోస్త్, టాటా ఇంట్రా, టాటా పికప్ వాహనాలు నెలవారి అద్దె ప్రాతిపదికన ప్రముఖ కంపెనీకి వాహనం అద్దెకు కావలెను. సంప్ర: ✆: 63022 27985.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

ఎర్రచందనం మొక్కలతో సహా ఫైనల్ అప్రూవ్డ్ కలిగిన ప్లాట్లు తిరుపతి IIT దగ్గరలో స్పాట్ రిజిస్ట్రేషన్, డైరెక్ట్ ఓనర్ ✆ 95027 74175 / 79959 92114.

WANTED FOR Primary Teachers (Subject: English), Depends upon Skills, Salary: Above 25K, Contact: ✆ 77318 09480.

స్టాఫ్ నర్సులు (GNM, ANM & B.Sc. Nursing) వార్డుబాయ్స్ (10th/ Inter) ఆయాలు (F) OT టెక్నీషియన్లు, రిసెప్షనిస్టులు, నర్సింగ్ సూపరింటెండెంట్లు కావలెను. M.S. హాస్పిటల్, తిరుపతి. ✆ 98492 84543.

నవయుగ గ్రూప్ ఆఫ్ కంపెనీలో పనిచేయుటకు టీం లీడర్స్ (&) మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. జీతం : 20K to 25K, Qua: Inter పైన Age: 25 to 40 yrs. ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించవలసిన Cell No: ✆ 91828 98446.

కర్నాటక కొప్పళ జిల్లాలో ఉన్న కోళ్ళ ఫారంలో పని చేయుటకు సూపర్‌వైజర్స్ కావలెను, ఫ్యామిలీకి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. Ph: 7829928044

మోహన్‌సాయి ఫైనాన్స్ నందు ... Cont: ✆ 86399 12874, 99083 94931.

FACULTY/ TEACHERS

శ్రీ వత్సల్ ... CBSE ... Ph: 7997555530, 7997557999, 9000256532.

JOBS

SHREE VINAYAKA AGENCIES: Chittoor, Tirupati Marketing Sales Man & Mis System Operator Wanted Age: 20 Years to 25 Years. Comapanys: Realme & Nokia, Infinix, Noise. Phone No: 97047 07019, 98852 11199.

గమనిక

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే

80085 13290

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి B/W: రూ. 600 Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

(c) eenadu

ముగిసిన గుండాలమ్మ జాతర

చిత్తూరు(క్రీడలు): టూటౌన్‌లోని ఆశోకపురంలో గుండాలమ్మ జాతర బుధవారం ముగిసింది. భక్తులు అమ్మవారికి సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. నిమజ్జనం కోలాహలంగా సాగింది.

నిమజ్జన యాత్రలో గుండాలమ్మ

సబ్‌స్టేషన్‌కు స్థల పరిశీలన

బంగారుపాళ్యం: మంగళపల్లె, జిల్లేడుపల్లె, తుంబుగానిపల్లె పంచాయతీలకు అదనంగా 33/11 కెవి విద్యుత్తు సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని బుధవారం పరిశీలించారు. మంగళపల్లె సమీపంలో ఎకరా స్థలాన్ని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, ఏడీఈ కొండయ్య, ఏఈ హేమచంద్ర, తెదేపా ఇన్‌ఛార్జి మోహన్‌నాయుడు, మాజీ సర్పంచి రామచంద్ర నాయుడు, ఆశోక్‌రెడ్డి ఎంపిక చేశారు.

చిత్తూరు

• చిత్తూరు • పూతలపట్టు • గంగాధరనెల్లూరు • నగరి

10న అమ్మవారికి శాకంబరీ అలంకారం

కాణిపాకం, న్యూస్‌టుడే: శ్రీ వరసిద్ధి వినాయక స్వామి వారి ఆలయ అనుబంధ ఆలయమైన శ్రీ మరగదాంబికా సమేత మణికంఠేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 10న ఆషాఢ పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి శాకంబరీ అలంకారం ఉంటుందని ఈవో పెంచల కిశోర్ బుధవారం తెలిపారు. ఎవరైనా అమ్మవారికి ఉచితంగా కూరగాయలు తొమ్మిదో తేదీన అర్చకులకు అందజేయాలని కోరారు.

నగరపాలక సంస్థ కార్మికుల సమ్మె విరమణ

చిత్తూరు నగరం, న్యూస్‌టుడే: తమ సమస్యల్ని పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నిరసన కొనసాగిస్తున్న నగరపాలక పొరుగు సేవల కార్మికులు బుధవారం సమ్మె విరమించారు. సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో.. సమ్మె విరమించినట్లు ఏపీ మున్సిపల్ ఇంజినీరింగ్ టౌన్ ప్లానింగ్ అండ్ శానిటేషన్ వర్కర్స్ ట్రేడ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి గంజి రామ్మూర్తి ప్రకటించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
చిత్తూరు నగరం: 80085 74598
నగరి: 9866112017
గంగాధరనెల్లూరు: 80085 74605
పూతలపట్టు: 9505557466

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం: **సమస్య:** విజయనగర్ కాలనీలో నివాసాల మధ్య చెత్త, వ్యర్థాలు పేరుకుపోయాయి. - స్థానికులు

సమాధానం: చెత్త, వ్యర్థాలు తొలగించి దోమల నివారణకు ఫాగింగ్ చేస్తాం. -లోకేష్, ఆరోగ్యాధికారి, నగరపాలక సంస్థ

న్యూస్‌టుడే, పెనుమూరు: **సమస్య:** గ్రామంలో కాలువలు లేవు. [illegible] -సుబ్రహ్మణ్యంనాయుడు, స్థానికుడు

సమాధానం: కాలువల నిర్మాణానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపి నిధులు మంజూరు కాగానే పనులు చేపట్టి పూర్తిచేస్తాం. -నీలకంఠేశ్వర్‌రెడ్డి, ఎంపీడీవో

న్యూస్‌టుడే, నగరి: **సమస్య:** ఇందిరానగర్‌లో వీధి దీపాలు వెలగక రాత్రివేళ చీకటిలో వృద్ధులు, మహిళలు ఇబ్బంది పడుతున్నారు. -ఖాదర్‌బాషా, నగరి

సమాధానం: ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమ్మెలో ఉన్నందున ఆలస్యమైంది. త్వరలో దీపాలు ఏర్పాటు చేస్తాం. -నవీన్, ఏఈ, నగరి

న్యూస్‌టుడే, తవణంపల్లె: **సమస్య:** తెల్లగుండ్లపల్లె ఎస్సీ కాలనీ సమీప రహదారిలో కలుపు మొక్కలతో ఇబ్బందికరంగా ఉంది. -స్థానికులు

సమాధానం: కలుపు మొక్కలు తొలగింపజేస్తాం. -మధుబాబు, పంచాయతీ కార్యదర్శి

పేదల బియ్యం.. పరులపాలు

✷ యథేచ్ఛగా అక్రమ రవాణా ✷ పట్టుబడుతున్నా ఆగని దందా

న్యూస్‌టుడే, చిత్తూరు(జిల్లా పంచాయతీ)

పేదల కడుపు నింపాల్సిన రేషన్ బియ్యం అక్రమార్కుల పరమవుతున్నాయి.. గోదాముల నుంచి డీలర్ల వద్దకు రావడమే ఆలస్యం డబ్బు ఆశజూపి లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని సేకరించి నల్లబజారుకు తరలిస్తున్నారు.. పట్టుబడితే కేసు పెట్టి అధికారులు చేతులు దులుపుకొంటున్నారు.. మూలాల్లోకి వెళ్లి అక్రమ దందా సాగిస్తున్న ముఠా నాయకులపై చర్యలు చేపట్టడం లేదు.. గత వైకాపా ప్రభుత్వ హయాంలో రేషన్ బియ్యాన్ని సరిహద్దులు దాటించి రూ.లక్షల్లో సంపాదించిన అక్రమార్కులు, అలవాటుగా కూటమి ప్రభుత్వంలోనూ దందాలు కొనసాగిస్తున్నా గట్టి చర్యలు లేవన్న విమర్శలు ఉన్నాయి.

ఇవిగో నిదర్శనాలు..

❖ రెండ్రోజుల క్రితం నగరిలో ప్రభుత్వ చౌక దుకాణ బియ్యం అక్రమ రవాణాపై పోలీసులు నిఘా ఉంచి రూ.6 లక్షల విలువ చేసే 13 టన్నుల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన నిందితులతో పాటు, మొత్తం ఎనిమిది మందిపై కేసు నమోదు చేశారు.

❖ తిరుపతి జిల్లా పుత్తూరు, నారాయణవనం, పిచ్చాటూరు మండలాల నుంచి బియ్యాన్ని సేకరించి చిన్న వాహనాల్లో తరలించి నగరి సమీపంలో పెద్ద వాహనంలో లోడ్ చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఐదు వాహనాలు స్వాధీనం చేసుకున్నారు.

❖ గత నెల ఆరో తేదీన యాదమరి మండలం, చెన్నై బెంగళూరు హైవే సమీప వరిగపల్లి వద్ద అక్రమంగా తరలిస్తున్న ఆరు టన్నుల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పలమనేరుకు చెందిన సద్దాం హుస్సేన్, అతడి అనుచరులు బైరెడ్డిపల్లికి చెందిన కిషోర్‌రెడ్డి, బలరామ్‌రెడ్డి, దేవేంద్రరెడ్డి, బంగారుపాళ్యానికి చెందిన మోతీష్‌పై కేసు నమోదు చేసి రెండు వాహనాలు, ఓ ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

❖ యాదమరి మండలం పుల్లయ్యగారిపల్లిలో పురుషోత్తం నాయుడికి చెందిన ఖాళీ గోదామును పలమనేరుకు చెందిన చెంగల్రాయులు, యాదమరికి చెందిన అబ్దుల్ సలాం, కర్ణాటకకు చెందిన రోషన్, ప్రదీప్ మొక్కజొన్నల వ్యాపారం చేస్తున్నామని చెప్పి నెలకు రూ.3 వేల అద్దెకు తీసుకున్నారు. అందులో రేషన్ బియ్యాన్ని నిల్వ చేసి వివిధ ప్రాంతాలకు అక్రమంగా రవాణా చేసేవారు. పోలీసులు ఈ ఏడాది మే నెల ఎనిమిదో తేదీ దాడి చేసి 10.8 టన్నుల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నలుగురిపై కేసు నమోదు చేశారు.

యాదమరి మండలంలో స్వాధీనం చేసుకున్న బియ్యం వాహనంతో నిందితుడు (పాత చిత్రం)

నగరి పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం వాహనాలు (పాత చిత్రం)

❖ గుడిపాల మండలంలో ఐటీ వల అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

రహస్య ప్రాంతాల్లో నిల్వ..

చిత్తూరు, జీడీనెల్లూరు, పూతలపట్టు, నగరి నియోజకవర్గాల పరిధిలో ఈ అక్రమ రవాణా జోరుగా సాగుతోంది. కొందరు డీలర్లతో కుమ్మక్కైన అక్రమార్కులు రేషన్ బియ్యానికి డబ్బు ఆశ జూపి అమాయకుల నుంచి సేకరిస్తున్నారు. అలా సేకరించేందుకు దళారులను నియమించుకున్నారు. వారికి కమిషన్ రూపంలో కొంత మొత్తాన్ని ముట్టజెప్పి బియ్యాన్ని సేకరించి రహస్య ప్రాంతాల్లో నిల్వ చేస్తున్నారు. లోడుకు సరిపడా బియ్యం సమకూరగానే పెద్ద వాహనాల్లో ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు.

అక్రమ రవాణాపై కఠిన చర్యలు..

రేషన్ బియ్యాన్ని అక్రమ రవాణా చేసి విక్రయిస్తే కఠిన చర్యలు చేపడతాం. అక్రమ రవాణా చేస్తున్నా, లబ్ధిదారుల నుంచి బియ్యాన్ని సేకరిస్తున్నా వెంటనే స్థానికులు అధికారులకు సమాచారం ఇవ్వాలి. -శంకరన్, డీఎస్పీ

జనసేన పార్టీలో చేరిన వైకాపా కార్యకర్తలతో యుగంధర్

పవన్‌కల్యాణ్ ఆశయ సాధన వైపు అడుగులు

పాలసముద్రం, న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ఆశయ సాధన వైపు అడుగులు వేస్తామని మాల కార్పొరేషన్ డైరెక్టర్, జనసేన నియోజకవర్గ బాధ్యులు పొన్నా యుగంధర్ పేర్కొన్నారు. బుధవారం ఆముదాల పంచాయతీ, జయలక్ష్మీపురం గ్రామాల్లోని వైకాపా కార్యకర్తలు, మహిళా నాయకురాలిని జనసేన పార్టీలోకి కండువా కప్పి ఆహ్వానించారు. [illegible]

సేవలు అభినందనీయం

మునిరామయ్యను సత్కరిస్తున్న డిప్యూటీ కమిషనర్ విధు బాజ్‌పాయ్

నిండ్ర, న్యూస్‌టుడే: [illegible] భోపాల్‌లోని నవోదయ ప్రాంతీయ విద్యాలయ సమితి అసిస్టెంట్ కమిషనర్‌గా ఉద్యోగ విరమణ పొందారు. విద్యాలయ సమితి ఆధ్వర్యంలో ఆయన్ను ఘనంగా సత్కరించి సేవలు అభినందనీయమని ప్రస్తుతించారు. నవోదయ సమితి డిప్యూటీ కమిషనర్ విధు బాజ్‌పాయ్, అసిస్టెంట్ కమిషనర్లు శ్రీ లేఖ్‌రాజ్ మీనా, దేవేంద్ర కుమార్ సింగ్, అశోక్ కుమార్, దీక్షాజ్యోతి, భోపాల్ నవోదయ విద్యాలయ ప్రాంతీయ కార్యాలయ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

IN THE COURT OF THE HON'BLE
I ADDITIONAL JUNIOR
CIVIL JUDGE, TIRUPATI
I.A.No. 1048 of 2021
O.S.No. 1012 of 2021

Batte Chanikya Prathap ..Petitioner
Vs
1. S.Saradamma and 12 others ..Respondents

TO:R-6
S.Chellamma @Sompalli Chellamma, W/o.S.Chengalrayulu, Residing at Singalagunta, Tirupathi Town, Tirupathi District. Present residing at D.No.3-372, Godugamooru, Greemspet, Kajuru, Chittoor Town, Chittoor District.

Whereas the petitioner has filed petition in the above matter. If you have got any objection you may appear before this court at 10:30 am., on 17-07-2025 either in person or through an advocate and file your objection. If you fail to do so, the matter will be decided exparte.

Sd/- R.SREEHARI,
Y.Maruthi Ram
Advocates, Tirupathi

కుక్కల సంతతి పెరగకుండా చర్యలు

ఐరాల, వీఎస్ అగ్రహారంలో కుక్కల సంతతి పెరగకుండా చర్యలు తీసుకుంటామని పశువైద్య సహాయ సంచాలకురాలు కె.రాజమ్మ బుధవారం తెలిపారు. 'ఈనాడు'లో గత నెల 30న ప్రచురితమైన 'బాబోయ్ శునకాలు' కథనంపై ఆమె స్పందించారు. పంచాయతీ అధికారుల సహకారంతో కుక్కలను పట్టి వాటికి యాంటీ రేబీస్ టీకా వేయిస్తామని ఆమె వివరించారు. -న్యూస్‌టుడే, ఐరాల

వినతులు స్వీకరిస్తున్న ఈఈ మునిచంద్ర

విద్యుత్తు సమస్యల విషయంలో నిర్లక్ష్యం వద్దు

చిత్తూరు(మిట్టూరు), న్యూస్‌టుడే: విద్యుత్తు సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపొద్దని, వెంటనే పరిష్కరించి వినియోగదారులకు మెరుగైన సేవలు అందించాలని అర్బన్ ఈఈ మునిచంద్ర ఆదేశించారు. స్థానిక అర్బన్ ఈఈ కార్యాలయంలో బుధవారం గ్రీవెన్స్ నిర్వహించారు. అధికంగా బిల్లుల జారీ, లైన్లు, స్తంభాల మార్పు తదితర సమస్యలపై మూడు వినతులు అందాయి. వీటిని వెంటనే పరిష్కరించాలని ఇంజినీర్లను ఆయన ఆదేశించారు. సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఈఈ ప్రసాద్, ఏఈఈలు, అధికారులు పాల్గొన్నారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి

కార్వేటినగరం: డెంగీపై అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి హేమశ్రీ అన్నారు. కత్తెరపల్లి పీహెచ్‌సీలో వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో డెంగీ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పరిసరాల శుభ్రతతో వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. సీహెచ్‌వో రాజేశ్వరి, పర్యవేక్షకులు త్యాగు, వైద్య సహాయకులు అంబరీష్‌రాజు, రామ్మోహన్ పాల్గొన్నారు. **వెదురుకుప్పం:** డెంగీ నివారణకు దోమతెరలు వాడాలని పచ్చికాపల్లం వైద్యాధికారి చెంగారెడ్డి అన్నారు. పచ్చికాపల్లం ఆరోగ్య ఉపకేంద్రం, వెదురుకుప్పం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల్లో అవగాహనా కార్యక్రమాలు చేపట్టారు. హెల్త్ అసిస్టెంట్ బాలకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం

వాడవాడలా 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం ప్రారంభం

చిత్తూరు(జిల్లా పంచాయతీ), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం చిత్తూరు నియోజకవర్గంలో బుధవారం ప్రారంభమైంది. ఎమ్మెల్యే జగన్మోహన్ ఆధ్వర్యంలో ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, తెదేపా చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు సి.ఆర్.రాజన్, మేయర్ అముద, చుడా ఛైర్‌పర్సన్ కఠారి హేమలత, నియోజకవర్గ పరిశీలకులు సునీల్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ రాజసింహులు.. దొడ్డిపల్లి సప్తకన్నికలమ్మ ఆలయంలో పూజలు చేసి ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. ఎం.అగ్రహారం, మురకంబట్టు, చవటపల్లి, దొడ్డిపల్లి, కట్టమంచి ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు, సూపర్ సిక్స్ హామీల అమలు, అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు. అగ్రహారం, చవటపల్లిలో నీటి సమస్యను మహిళలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, బోరు వేయిస్తామని, చవటపల్లిలో త్రీఫేజ్ విద్యుత్తు సరఫరా చేయిస్తామని హామీ ఇచ్చారు. ఉప మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, తెదేపా నాయకులు సురేంద్రకుమార్, బాలాజీ, త్యాగరాజులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

చిత్తూరు: ప్రభుత్వ పథకాల కరపత్రాలు చూపుతున్న ఎంపీ దగ్గుమళ్ల, ఎమ్మెల్యే జగన్మోహన్

జీడీనెల్లూరులో..

కరపత్రాలు అందిస్తున్న పార్టీ అధ్యక్షుడు రాజేంద్రన్, వాసునాయుడు

పాలసముద్రం, పెనుమూరు, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుపరిపాలన సాగుతుందని తెదేపా మండల అధ్యక్షుడు రాజేంద్రన్, చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గ కార్యదర్శి వాసునాయుడు పేర్కొన్నారు. క్రిష్ణజిమ్మాపురం పంచాయతీ బలిజకండ్రిగలో ఇంటింటికీ పర్యటించి సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. సర్పంచి భానుప్రియ, బొజ్జయ్య, రవి నాయుడు, వాసుయాదవ్, రామచంద్ర, ఏలుమలై, బాబుయాదవ్ పాల్గొన్నారు. **గంగాధరనెల్లూరు:** జిల్లా తెదేపా కార్యదర్శులు కృష్ణమనాయుడు, దేవసుందరం ఆధ్వర్యంలో జీడీనెల్లూరు పంచాయతీలో ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలు ప్రజలకు పంపిణీ చేశారు. స్వామిదాస్, శ్రీధర్ యాదవ్, శివకుమార్, చిట్టిరెడ్డి, పప్పురాజ్, జ్యోతియాదవ్, జీవా పాల్గొన్నారు. **వెదురుకుప్పం:** మండల తెదేపా అధ్యక్షుడు లోకనాథరెడ్డి పెరుమాళ్లపల్లిలో ప్రభుత్వ పథకాలు ప్రచారం చేశారు. జిల్లా మాజీ కార్యదర్శి మోహనమురళి పాల్గొన్నారు.

పన్నూరులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్

నగరి నియోజకవర్గంలో..

విజయపురం, న్యూస్‌టుడే: సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకెళ్తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. పన్నూరు సబ్‌స్టేషన్‌లో నూతన ఏఈ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. ఆపై పన్నూరులో అభివృద్ధి-సంక్షేమం కరపత్రాలను గ్రామంలో ఇంటింటికీ వెళ్లి అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఆర్థిక పరిస్థితి బాగోలేకున్నా ఇచ్చిన హామీలు ఒక్కోటిగా కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదికే నెరవేరుస్తోందన్నారు. ట్రాన్స్‌కో ఏఈ సదాశివం, ఎంపీడీవో రాజేంద్ర, తహసీల్దార్ కిరణ్, నాయకులు రమేష్‌రాజు, బాబుయాదవ్, గుణశేఖర్‌రెడ్డి, ధనుంజయయాదవ్, బాలసుబ్రహ్మణ్యం రాజు, మహేంద్ర, శివలింగం, జయరాజ్, దశరథ రాజు, ఉదయ్, బాలాజీ, పరంధామన్, తులసీరామనాయుడు పాల్గొన్నారు.

SUIT SUMMONS
IN THE COURT OF THE HON'BLE
I ADDITIONAL JUNIOR
CIVIL JUDGE, TIRUPATI
O.S.No.1012 of 2021

Batte Chanikya Prathap ..Plaintiff
Vs
1.S.Saradamma and 12 others ..Defendants

TO:D-6
S.Chellamma @Sompalli Chellamma, W/o.S.Chengalrayulu, Residing at Singalagunta, Tirupathi Town, Tirupati District. Present residing at D.No.3-372, Godugamooru, Greemspet, Kajuru, Chittoor Town, Chittoor District.

Whereas the plaintiff has instituted a suit against you, you are hereby summoned to appear in the court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some other person able to answer all such questions on the date 17-07-2025 at 10:30 am., in the forenoon answer the claim and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of defence. Take summons that in default of your appearance on the day above mentioned, the suit will be heard and determined in your absence.

Sd/- R.SREEHARI,
Y.Maruthi Ram
Advocates, Tirupathi

పూతలపట్టు నియోజకవర్గంలో..

ఐరాల, న్యూస్‌టుడే: దేశంలో ఏ రాష్ట్రంలో ప్రజలకు అందించనన్ని సంక్షేమ పథకాలను రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ కలికిరి మురళీమోహన్ తెలిపారు. ఐరాలలోని వడ్రాంపల్లె, బంగారుపాళ్యంలోని నూనెగుండ్లపల్లె, యాదమరి డీకేచెరువు, పూతలపట్టు కమ్మగుట్టపల్లె, తవణంపల్లె తెల్లగుండ్లపల్లె పంచాయతీల్లో నాయకులతో కలిసి పర్యటించి మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఏడాదిలో రూ.వంద కోట్లకు పైగా నిధులతో అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. వడ్రాంపల్లె ప్రాథమిక పాఠశాల తనిఖీ చేసి విద్యార్థులతో ఆయన ముచ్చటించారు. ప్రజలకు కూటమి ప్రభుత్వ అభివృద్ధి పనుల కరపత్రాలు అందజేశారు. మండల తెదేపా అధ్యక్షులు హరిబాబునాయుడు, దొరబాబు, దిలీప్, మురార్జీ యాదవ్, ధరణిప్రసాద్, వెంకటేశ్వరచౌదరి, మోహన్‌నాయుడు, గిరిబాబునాయుడు, జయప్రకాష్‌నాయుడు, లత పాల్గొన్నారు.

ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే మురళీమోహన్

వాగ్దానాలు నెరవేర్చాలి

శ్రీరంగరాజపురం, న్యూస్‌టుడే: ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను అధికారంలోకి వచ్చాక నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిన చంద్రబాబు రాజీనామా చేయాలని వైకాపా ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని దీపికా కల్యాణ మండపంలో నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాల అమలులో అలసత్వం చూపుతున్నారన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను నాయకులు, కార్యకర్తలు గ్రామాల్లో ప్రచారం చేయాలన్నారు. మాజీ ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి మాట్లాడుతూ జగన్ హయాంలో ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేశామని, ప్రస్తుత పరిస్థితులు విరుద్ధంగా ఉన్నాయన్నారు. నియోజకవర్గ బాధ్యులు కృపాలక్ష్మి, ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, మండల కన్వీనర్ మణి పాల్గొన్నారు.

పట్టు తప్పితే ప్రమాదమే..!

మిట్టపల్లె నూనెగుండ్లపల్లె మార్గం మధ్యలోని రహదారి అంచున రాళ్లు కుప్పలుగా తోలారు. వాహనదారులు అదుపు తప్పితే పక్కకు వెళ్తే ప్రమాదానికి గురికావాల్సిందే. ఈ మార్గంలో నిత్యం ఓ ప్రధాన పరిశ్రమకు వెళ్లే కార్మికులు, పాఠశాలకు వెళ్లే ప్రైవేటు బస్సులు, ఆటోలు, ద్విచక్ర వాహనాలతో రద్దీగా ఉంటుంది. అధికారులు రహదారి అంచున ఉన్న రాళ్లు తొలగించి, పొంచి ఉన్న ప్రమాదాన్ని నివారించాలి. -న్యూస్‌టుడే, బంగారుపాళ్యం

తప్పుడు దస్త్రాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోండి

చిత్తూరు గ్రామీణ, న్యూస్‌టుడే: తమ భూములపై తప్పుడు రికార్డులు సృష్టించి, పట్టాలు జారీ చేసిన రెవెన్యూ అధికారులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని పెనుమూరుకు చెందిన విశ్రాంత సబ్-రిజిస్ట్రార్ శ్రీహరి ఆరోపించారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో తహసీల్దారు, ఆర్ఐ, వీఆర్వోల సహకారంతో తమ భూములకు సంబంధించిన రికార్డులు మార్పులు చేసి, కాజేసే ప్రయత్నాలు జరిగాయన్నారు. ఈ విషయమై గతంలోనే ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశానన్నారు. అధికారులు ఆ ఫిర్యాదును పరిశీలించకుండానే సమస్య పరిష్కరించామంటూ సంక్షిప్త సందేశం చరవాణికి పంపారన్నారు. తప్పుడు రికార్డులు సృష్టించి, భూ ఆక్రమణకు పాల్పడిన వ్యక్తులు, అందుకు సహకరించిన రెవెన్యూ అధికారుల్ని సీఎం చంద్రబాబు కఠినంగా శిక్షించాలని ఆయన కోరారు.

BEFORE THE HONOURABLE
DEPUTY REGISTRAR OF
CHITS: CHITTOOR
ARC NO 07 OF 2025

Between:
M/s Margadarsi Chit Fund Pvt Ltd., Chittoor Branch,
Rep by its Manager/ Foreman
Disputant
Versus
Mr V. Ravi and Others Opponents
To,
Opp No. 5) Mr G. Chitti Babu, S/o Govinda Swamy, W/as Senior Branch Head (Business Devp), Muthoottu Mini Finance Ltd., Greamspet, Chittoor.
R/o D No. 6-517, Shiva Shakthi Nagar, Santhapeta, Chittoor.

Please take Notice that the above Suit is posted to 19-07-2025 for your appearance before the above said Honourable Deputy Registrar at 10.30 A M., you can appear either in person or through an Advocate and raise your objections if any, failing which the suit will be decided in your absence, as exparte.
Hg Date: 19-07-2025.
DEPUTY REGISTRAR OF
CHITS CHITTOOR

అతివల ఉపాధి బాట

✷ స్వయం ఉపాధిపై దృష్టి ✷ బ్యాంకు లింకేజీ రుణాలతో వ్యాపారాభివృద్ధి

న్యూస్‌టుడే, చిత్తూరు నగరం

ఓవైపు ఇంటిని చక్కబెడుతూనే మరోవైపు వ్యాపార నిర్వహణ ద్వారా కుటుంబానికి ఆర్థిక తోడ్పాటు అందిస్తున్నారు మహిళలు.. నగరంలోని స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు బ్యాంకు లింకేజీ రుణాల ద్వారా స్వయం ఉపాధికి అవకాశాలు అందిపుచ్చుకున్నారు.. వివిధ వ్యాపారాలు చేపట్టి ఎంతో కొంత ఆదాయాన్ని సంపాదిస్తూ నాలుగురాళ్లు వెనకేసుకుంటున్నారు.. తద్వారా భర్త సంపాదనకు చేదోడువాదోడుగా ఉంటూ కుటుంబ నిర్వహణలో తమ బాధ్యత నిర్వర్తిస్తున్నారు.. స్వయం ఉపాధిలో రాణిస్తూ ఆత్మవిశ్వాసంతో అడుగులు ముందుకు వేస్తున్నారు.

వ్యాపార విస్తరణే లక్ష్యం..

దుకాణం నిర్వహిస్తున్న చంద్రకళ

సత్యానారాయణపురానికి చెందిన చంద్రకళ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలు. పొదుపు సంఘంలో చాలా ఏళ్లుగా సభ్యురాలిగా ఉన్న ఆమె.. బ్యాంకు లింకేజీ ద్వారా రూ.2 లక్షల రుణం పొందారు. స్థానికంగానే నిత్యావసర వస్తువుల దుకాణాన్ని ఏర్పాటు చేసుకుని స్వయం ఉపాధి పొందుతున్నారు. పెట్టుబడి పోనూ నెలకు రూ.15 వేలు ఆదాయం వస్తోందని చెబుతున్నారు. బ్యాంకు రుణంతో తన కాళ్లపై తాను నిలదొక్కుకున్నానని తెలిపారు. వ్యాపారాన్ని మరింతగా విస్తరించనున్నట్లు చెబుతున్నారు.

కుటుంబానికి బాసటగా..

పేపర్ ప్లేట్ల యూనిట్‌లో సోమేశ్వరి

వినాయకపురానికి చెందిన సోమేశ్వరి మహిళా సమాఖ్య పరిధిలోని పొదుపు సంఘం సభ్యురాలు. స్థానికంగా ఓ పేపర్ ప్లేట్ యూనిట్ నిర్వహిస్తున్నారు. మెప్మా ద్వారా బ్యాంకు లింకేజీ రుణం రూ.2 లక్షలతో ఈ యూనిట్ ఏర్పాటు చేశారు. కుటుంబ సభ్యుల తోడ్పాటుతో స్వయం ఉపాధిపై ఆమె దృష్టి సారించారు. స్వయం సహాయక సంఘంలో సభ్యత్వం ద్వారా అవసరమైన సందర్భాల్లో పెట్టుబడి రుణాన్ని బ్యాంకు లింకేజీ ద్వారా మంజూరు చేయించుకుంటున్నారు. తన వ్యాపారం ద్వారా నెలకు రూ.20 వేలు ఆదాయాన్ని ఆర్జిస్తున్నానని సోమేశ్వరి చెబుతున్నారు. కుటుంబ నిర్వహణకు తన ఆదాయాన్ని వెచ్చిస్తున్నట్లు పేర్కొన్నారు.

స్వశక్తిపై నిలవాలనే..

దుస్తుల దుకాణంలో సెల్వి

ధర్మరాజుల కాలనీకి చెందిన సెల్వి లక్ష్మీనారాయణ సమాఖ్య పరిధిలోని ఓంశక్తి పొదుపు సంఘ సభ్యురాలు. స్వయం ఉపాధితో తన కాళ్లపై తాను నిలబడాలనే ఉద్దేశంతో దుస్తుల వ్యాపారాన్ని చేపట్టారు. బ్యాంకు లింకేజీ ద్వారా రూ.లక్ష రుణం పొంది దుస్తుల దుకాణాన్ని నిర్వహిస్తున్నారు. నిర్వహణ వ్యయం పోను నెలకు రూ.15 వేలు ఆదాయం వస్తోందని ఆమె తెలిపారు. పొదుపు సంఘంలో సభ్యురాలిగా ఉన్నందున తక్కువ వడ్డీకి రుణాన్ని పొందుతున్నానని, గృహిణిగా ఇంటి వద్ద ఖాళీగా ఉండకుండా ఈ దుకాణాన్ని ప్రారంభించానని చెప్పారు. వ్యాపార నిర్వహణతో కుటుంబానికి ఆసరాగా నిలిచానని, ఇంటి వద్దే ఉంటూ ఈ మాత్రం సంపాదిస్తుండటం ఆనందంగా ఉందన్నారు.

వైభవంగా గొల్లల గంగమ్మ కొలుపు

పుత్తూరు, న్యూస్‌టుడే: తడుకు పంచాయతీ పరిధి వేణుగోపాలపురంలో బుధవారం గొల్లల గంగమ్మ కొలుపు మహోత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం బియ్యపు కొలత, మంగళవారం గరిగె ఊరేగింపు, బుధవారం అన్నం తోడే కార్యక్రమంతో ఉత్సవాలు ముగిశాయి. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ కార్యక్రమాన్ని తిలకించడానికి పరిసర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అమ్మవారిని సర్పంచి వెంకటేష్, మండల తెదేపా మాజీ అధ్యక్షుడు రవికుమార్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు ఆదిమందడి, తెదేపా నాయకులు నరసింహులు, శంకర్ దర్శించుకున్నారు. **వడమాలపేట:** భక్త జనసందోహం నడుమ అయ్యంగారిపల్లి గంగమ్మ జాతర ఘనంగా ముగిసింది. మంగళవారం రాత్రి గంగమ్మ విగ్రహానికి విశేష పుష్పాలంకరణ చేసి గ్రామ వీధుల్లో ఊరేగించారు. అనంతరం పర్ణశాలలో కొలువులో ఉంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. అమ్మవారి సేవలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్, జడ్పీటీసీ సభ్యులు మురళీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇరుగువాయిలో జాతర

నిండ్ర: ఇరుగువాయి దళితవాడలో బుధవారం జరిగిన జాతరలో గాలి జగదీష్ విచ్చేసి పూజలు చేశారు. స్థానికులు ఆయనకు స్వాగతం పలికి సత్కరించారు. నగరిలోని కృష్ణరామాపురంలో ద్రౌపదీదేవి తిరుణాళ్ల, పుత్తూరు మండలం వేణుగోపాలపురంలోని గంగమ్మ కొలుపులోనూ జగదీష్ పాల్గొన్నారు.

చరవాణినీ వదలడం లేదు

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: దిల్లీ.. రాజస్థాన్ తదితర ప్రాంతాల్లో చరవాణిలో మాట్లాడుతూ కనిపిస్తే ఉన్నపళంగా వాటిని లాక్కెళ్లిపోతారు. జనసంచారం ఉన్నా ఇలాంటి చోరీలు అక్కడ సర్వసాధారణం. అలాంటి చోరీలు చిత్తూరు నగరంలోనూ ప్రారంభం కావడం ఆందోళన కలిగిస్తోంది. కొంగారెడ్డిపల్లిలో బుధవారం రాత్రి ప్రభుత్వ ఉద్యోగి మధు రోడ్డు పక్కన నిల్చొని చరవాణిలో మాట్లాడుతుండగా గుర్తుతెలియని ఓ యువకుడు ద్విచక్ర వాహనంలో వచ్చి చరవాణి లాక్కుని వెళ్లాడు. సదరు ఉద్యోగి తేరుకుని చూసేలోగా అతడు పరారవడంతో వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాలిక అదృశ్యంపై కేసు

చిత్తూరు(నేరవార్తలు), న్యూస్‌టుడే: గ్రామీణ మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలిక(15) గత నెల 30న ఇంటి నుంచి బజారుకు వెళ్లి తిరిగిరాలేదని, దీంతో ఆ బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని తాలూకా ఎస్సై మల్లికార్జున బుధవారం తెలిపారు.

IN THE COURT OF THE
PRL. CIVIL JUDGE (JUNIOR DIVISION),CHITTOOR
O.E.P.No. 1 of 2020
O.S.No. 165 of 2017(Jr.Civil Judge,Palamaner)
Between : T.Krishna Reddy ... Decree Holder
And: V.Venkatamma ... Judgment Debtor

AUCTION NOTICE

The property mentioned in the schedule hereunder will be sold in public auction on 29.07.2025 between 10.30 A.M. and 5.00 P.M. in the premises of the above said court. The intending bidders may participate in the auction to be conducted by the court.

SCHEDULE

Chittoor District - Chittoor Rural Sub-District - G.D.Nellore Mandal - Vinjam Gram Panchayat - Vinjam revenue village - land

	VALUE Rs
1. S.No.269/1 - Ac.0.10 cents or 0. 040 hectors full.	27000
2. S.No.269/17 - Ac.0.21 cents or 0.085 hectors full	56700
3. S.No.269/12 - Ac.0.05 cents or 0.020 hectors full	13500
4. S.No.269/11 - Ac.0.04 cents or 0.016 hectors full.	10800
5. S.No.269/15- Ac.0.13 cents or 0.052 hectors full.	35100
6. S.No.270/2- Ac.0.09 cents or 0.036 hectors full.	24300
7. S.No.242 - Ac.0.21 cents or 0.085 hectors full	56700
8. S.No.243/1 - Ac.0.36 cents or 0.145 hectors full	97200
9. S.No.241/1 - Ac.0.07 cents or 0.028 hectors full,	18900
10.S.No.241/2 - Ac.0.07 cents or 0.028 hectors full	18900
Extent Ac.1.33 Cents Total Value	Rs.359100

Total Ac.1.33 cents situated within the. Following boundaries:
East;: Lands of Doraswamy Mandadi and Pattabhi. : West:Land of Govinda Reddy and Doraswamy Mandadi, North: Lands Govinda Reddy and Venkata Reddy @ Doraswamy Mandadi.South : Land of Rajagopal Reddy.
D.Hr. value Rs. 1,50,000-00 Amin's value Rs.5,00,000-00
Market Value Rs.3,59,100/-
E.C: The J.Dr. has mortgaged the properties mentioned as items 1 to 10 to P.Ramesh under a Regd., mortgage deed dt.6.9.2012.

V.SREERAMULU NAIDU,Advocate for Decree-Holder

పలమనేరు
•పలమనేరు • కుప్పం •పుంగనూరు

దరఖాస్తుల ఆహ్వానం

పలమనేరు, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్హత ఆధారంగా 2 సంవత్సరాల యానిమల్ హస్బెండరీ కోర్సు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తిరుపతి శ్రీవెంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పి.రవికుమార్ తెలిపారు. జులై 2వ తేదీ నుంచి 7వ తేదీ వరకు గడువు పొడిగించినట్లు పేర్కొన్నారు.

శుభ్రతతో వ్యాధులు దూరం

సోమల, న్యూస్‌టుడే: పరిసరాల శుభ్రతతో అంటువ్యాధులు దూరమవుతాయని ఎంపీడీవో నారాయణ సూచించారు. బుధవారం కందూరులో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను కార్యదర్శి జయశంకర్‌తో కలిసి పరిశీలించారు.

ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

పలమనేరు, న్యూస్‌టుడే: గంగవరంలోని ఓ ప్రైవేటు డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ యుగంధర్, కార్యదర్శి డాక్టర్ మల్లికార్జున ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. 30 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. కళాశాల ప్రిన్సిపల్ లక్ష్మీసుధ పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న విద్యార్థులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

మహిళలతో మాట్లాడుతున్న చల్లా బాబు

కల్లూరు, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో సంక్షేమ పథకాల అమలులో ప్రజలు వివక్షతను ఎదుర్కొన్నారని.. కూటమి ప్రభుత్వంలో అర్హులందరికీ సమానంగా పథకాలు అందిస్తున్నామని పుంగనూరు నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి ప్రజలకు వివరించారు. బుధవారం కల్లూరులోని బీసీకాలనీ, తలారివారిపల్లె, కొత్తకాలనీల్లో ఇంటింటికీ 'సుపరి పాలనలో తొలి అడుగు' కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా? అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పనితీరు, ప్రజల సమస్యలను తెలుసుకునేందుకే సుపరి పాలనలో తొలి అడుగు చేపట్టినట్లు వివరించారు. తలారివారిపల్లెలో మనోహర్ అనే వ్యక్తి ఇంట్లోకి వెళ్లి సమస్యలు తెలుసుకుని, పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

రిలేదీక్షలో పాల్గొన్న ఔట్‌సోర్సింగ్ కార్మికులు

తాత్కాలికంగా దీక్షల విరమణ

పుంగనూరు, న్యూస్‌టుడే: పురపాలక ఇంజినీరింగ్ శాఖ ఔట్ సోర్సింగ్ కార్మికుల రిలేదీక్షలను బుధవారం తాత్కాలికంగా విరమించినట్లు సంఘం నాయకులు శ్రీరాములు, లక్ష్మీకుమార్ తెలిపారు. గత నెల 16 నుంచి రాష్ట్ర యూనియన్ పిలుపు మేరకు దీక్షలు చేపట్టారు. రాష్ట్ర యూనియన్ నాయకులు, పురపాలక అధికారులు చర్చలు జరిపి తమ డిమాండ్లను సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించడంతో దీక్షలు తాత్కాలికంగా విరమించుకున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు జవహర్, నాగరాజ, విజయ్ పాల్గొన్నారు.

ఈసారైనా వందశాతం సాగయ్యేనా..?

• నిరాశ మిగుల్చుతున్న రుతుపవనాలు

పుంగనూరు, న్యూస్‌టుడే: ప్రధాన వాణిజ్య పంటగా, వర్షాధార పంటగా వేరుసెనగ సాగు చేస్తారు. గతంలో తక్కువ ఖర్చుతో సాగు చేసి మంచి దిగుబడులు పొందేవారు. గత మూడేళ్లుగా అరకొర వర్షాలతో సాగులు అంతంతమాత్రమే సాగుతున్నాయి. ఏటా సాగు ఖర్చులు పెరగడంతో వేరుసెనగ సాగుకు రైతులు వెనకడుగు వేస్తున్నారు. ఒకప్పుడు పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాలు వేరుసెనగ సాగులో పేరొందాయి. ఈ ఖరీఫ్ సీజన్‌లో సాధారణ వర్షపాతం కూడా కురవకపోవడంతో దుక్కులు కూడా సక్రమంగా చేయలేని పరిస్థితి. ఇటీవల అక్కడక్కడ కురిసిన వర్షానికి కొందరు రైతులు దుక్కులు చేసి, ఎరువులు దింపి విత్తనాలు విత్తడానికి సిద్ధంగా ఉన్నారు.

వేరుసెనగ సాగుకు దుక్కి చేస్తున్న రైతన్న

తగ్గిన సాగు లక్ష్యం

పుంగనూరు, పలమనేరు వ్యవసాయశాఖ సబ్ డివిజన్ల పరిధిలో ప్రభుత్వం ఏటా సాగు లక్ష్యాన్ని తగ్గించుకుంటున్నా లక్ష్యం నెరవేరని దుస్థితి. కేవలం వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, సాగు ఖర్చులు పెరగడమే. వర్షాలు సక్రమంగా కురిస్తే 30 వేల హెక్టార్లలో సాగయ్యేది. ఈ సీజన్‌లో వర్షాలే లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా వర్షాలు కురిస్తే ఈ నెల 15 వరకు విత్తనాలు విత్తుకోవడానికి రైతులు సిద్ధంగా ఉన్నారు.

మూడేళ్లలో ఇలా (హెక్టార్లలో)...

పుంగనూరు	సాధారణ-సాగైంది	పలమనేరులో..
2023	14107.80-3381.49	12224.0-4782.4
2024	11549-3430	11,114-4434
2025	8880-224	10,123-153

ఆకాశం వైపు ఎదురుచూపులు

కూటమి ప్రభుత్వం సకాలంలో రాయితీ విత్తనాలు సరఫరా చేసినా వర్షాలు లేని కారణంగా రైతన్నలు ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. సాగు పెట్టుబడులు వడ్డీకి తెచ్చుకున్న రైతన్నలకు ఆర్థిక భారం పడుతోంది. సీజన్ ప్రారంభంలోనే ఇలా ఉంటే విత్తనాలు విత్తిన తర్వాత ఆపై వర్షాలు కురుస్తాయో లేదోనని ఆందోళన రైతన్నల్లో నెలకొంది.

15 వరకు అనుకూలం

వేరుసెనగ విత్తనాలు విత్తుకోవడానికి ఈ నెల 15 వరకు అనుకూలం. రైతులకు సకాలంలో వేరుసెనగ విత్తనాలు సరఫరా చేశాం. సాగుపై సూచనలు అందించాం. సాగు సమయంలో ఎలాంటి అనుమానాలు ఉన్నా రైతు సేవా కేంద్రాల్లోని సిబ్బందిని అడిగి తెలుసుకోవచ్చు.

- శివకుమార్, వ్యవసాయశాఖ, సహాయ సంచాలకులు, పుంగనూరు

మేమున్నాం.. మీకు తోడుగా..
(10 AM TO 1 PM)
పలమనేరు: 80085 74580
కుప్పం పట్టణం: 80085 73490
పుంగనూరు: 80085 74622

పెద్దపంజాణి, న్యూస్‌టుడే: సమస్య: అమ్మరాజుపల్లె పంచాయతీ కేంద్రంలో వీధిదీపాలు పగలు కూడా వెలుగుతున్నాయి. **- రమణ, స్థానికుడు**

సమాధానం: వీధిలైట్లు పగలు వెలగకుండా చర్యలు తీసుకుంటాం. **- మయూరి, కార్యదర్శి, అమ్మరాజుపల్లె**

పలమనేరు, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని ముత్తా ద్వారపాళ్యంలో ప్రజలు రోడ్ల మీదే చెత్త పడేస్తుంటారు. అలాగే మురుగు కాలువలు శుభ్రం చేయాలి. **- మురుగన్, పలమనేరు**

సమాధానం: వ్యర్థాలు రోడ్లమీద పడేయకుండా ప్రజలకు అవగాహన కల్పిస్తాం. పరిసరాలు శుభ్రం చేయిస్తాం. **- ఎన్వీ రమణారెడ్డి, కమిషనర్**

పరిసరాలు శుభ్రం

పలమనేరు, న్యూస్‌టుడే: పట్టణంలోని జనిశీవీధిలోని భజన మందిరం పరిసరాలను మున్సిపల్ సిబ్బంది శుభ్రం చేశారు. పరిసరాలు అధ్వానంగా ఉండటంతో సమస్యపై 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షిక కథనం ప్రచురితమైంది. అధికారులు ఆ మేరకు స్పందించారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

సోమల, న్యూస్‌టుడే: గన్నావారిపల్లెలో పైప్‌లైన్ పగలడంతో కొన్ని రోజులుగా నీరు వృథాగా పోతోంది. సమస్యపై 'ఈనాడు'లో 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షిక కథనం ప్రచురితమైంది. స్పందించిన ఈవో పీఆర్డీ లక్ష్మీదేవి పైప్‌లైన్ మరమ్మతుకు చొరవ చూపారు.

ప్రోత్సహించడం శుభపరిణామం

పుంగనూరు, న్యూస్‌టుడే: ఉన్నత పాఠశాలల, కళాశాలల విద్యార్థులు ఉత్తమ మార్కులు సాధించేలా ప్రోత్సహించడం శుభపరిణామమని బీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ దయానందరావు పేర్కొన్నారు. బుధవారం స్థానిక కళాశాల అవసరాలకు పట్టణానికి చెందిన అబ్దుల్‌కలాం హెల్పింగ్ ఎడ్యుకేషనల్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గతేడాది ఉత్తమ మార్కులు పొందిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందించారు. కార్యక్రమంలో బాలికల కళాశాల ప్రిన్సిపల్ గంగాధరనాయుడు, ట్రస్టు ఫౌండర్ అయూబ్‌ఖాన్, సభ్యులు నాగేనాయక్, నాగరాజ పాల్గొన్నారు.

అమరేంద్రకుమార్‌ను సన్మానిస్తున్న కళాశాల చైర్మన్ కోటేశ్వరరావు

ఉత్తమ ఫలితాలకు కృషి చేయండి

సోమల, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకులు సమన్వయంతో పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని కళాశాల చైర్మన్ కోటేశ్వరరావు నూతన ప్రిన్సిపల్‌గా విధుల్లో చేరిన అమరేంద్రకుమార్‌కు సూచించారు. ప్రిన్సిపల్‌కు పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు.

వైకాపా ప్రభుత్వం కక్షసాధింపుతోనే కాలయాపన

వి.కోట, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వం కక్షసాధింపు చర్యలపై పెట్టిన శ్రద్ధ పాలనపై పెట్టలేదని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పేర్కొన్నారు. మండలంలోని పడిగల కుప్పంలో 'సుపరి పాలనలో తొలి అడుగు' కార్యక్రమం ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాల కరపత్రాలను గ్రామస్థులకు అందజేశారు. పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సమస్యలు త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన విద్య అందించండి

సోమల, న్యూస్‌టుడే: ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందించాలని జిల్లా సర్వశిక్షా అభియాన్ ఏపీసీ వెంకటరమణ, సీఎంవో మధుసూదన్ రావు సూచించారు. బుధవారం మండలంలోని ఇరికిపెంట, నంజంపేట ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేసి దస్త్రాలు పరిశీలించారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి ప్రారంభం నుంచే శ్రద్ధ తీసుకోవాల్సిన ప్రణాళికలను ప్రధానోపాధ్యాయులకు వివరించారు. అలాగే పలు పాఠశాలలను ఎంఈవో కేశవరెడ్డి తనిఖీ చేశారు.

ఇంటింటా పలకరిస్తూ.. సమస్యలు ఆలకిస్తూ..!

• సంక్షేమంతో ఆదుకుంటామని సీఎం చంద్రబాబు హామీ

శాంతిపురం: కూటమి విజయాలను వివరిస్తూ.. ఇంటింటా ప్రజా సమస్యలను ఆలకిస్తూ.. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమానికి తిమ్మరాజుపల్లెలో సీఎం చంద్రబాబునాయుడు బుధవారం శ్రీకారం చుట్టారు. తుమ్మిశి బహిరంగ సభ నుంచి రాత్రి 8:20 కి తిమ్మరాజుపల్లెకు చేరుకున్న చంద్రబాబుకు గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలను తెలుసుకుని సమస్యలను ఆలకించారు. సంక్షేమ పథకాలతో అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. చదువులు, రెక్కల కష్టంతో ఉన్నత స్థానాలు చేరుకున్న వారిని అభినందిస్తూ.. తమవంతు సమాజానికి తోడ్పాటు అందించాలని సూచించారు. కడపల్లె పంచాయతీలో సొంత ఇంటిని నిర్మించుకున్నందున.. స్థానిక నేతగా నాకు సంబంధించిన పోలింగ్ బూత్ పరిధిలో కుటుంబ సాధికార సమితి సభ్యుడిగా 19 కుటుంబాలను కలుసుకోవడం ఆనందంగా ఉందని సీఎం తెలిపారు.

సంక్షేమ పథకాలతో లబ్ధి

సీఎం పర్యటనలో పలు సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందించారు. కొత్తగా మంజూరైన పింఛన్లతో పాటు ఉచితంగా వంట గ్యాస్ కనెక్షన్లు అందజేశారు.

వెంకటస్వామి కుటుంబ సభ్యుల సమస్యలు తెలుసుకొంటున్న చంద్రబాబు

ప్రజలకు అభివాదం చేస్తున్న సీఎం

వి.కోట: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వి.కోట ఎగువ చెక్‌పోస్టు వద్ద కాన్వాయ్ ఆపి ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి పుష్పగుచ్ఛం ఇచ్చి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

ఒప్పందాలిలా..

శాంతిపురం, న్యూస్‌టుడే: కుప్పం పర్యటనలో భాగంగా పలు కంపెనీ ప్రతినిధులతో సీఎం చంద్రబాబు ఒప్పందాలు చేసుకున్నారు. ఎలక్ట్రిక్ వాహన తయారీ యూనిట్ రూ.200కోట్లు, గ్రీన్ పీల్ డెయిరీ రూ.525 కోట్లు, సోయాఫీడ్ కంపెనీ రూ.375 కోట్లు, శ్రీజ మదర్ డెయిరీ ఉత్పత్తుల యూనిట్‌కు రూ.558 కోట్లతో ఒప్పందం కుదుర్చుకోగా.. ఈ నాలుగు కంపెనీల ద్వారా 6,350 మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయి.

సబ్‌స్టేషన్‌కు స్థల పరిశీలన..

బంగారుపాళ్యం: మండలంలోని గంగపల్లె, జిల్లేడుపల్లె, తంబుగానిపల్లె పంచాయతీలకు అదనంగా 33/11కేవీ విద్యుత్తు సబ్‌స్టేషన్ ఏర్పాటుకు స్థలాన్ని బుధవారం పరిశీలించారు. మంగళపల్లె సమీపంలో ఎకరా స్థలాన్ని తహసీల్దార్ బాబురాజేంద్రప్రసాద్, ఏడీఈ కొండయ్య, ఏఈ హేమచంద్ర, తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి మోహన్‌నాయుడు, మాజీ సర్పంచి రామచంద్ర నాయుడు, ఆశోక్‌రెడ్డి ఎంపిక చేశారు.

సారా పట్టివేత.. పలమనేరు: బొమ్మదొడ్డి గ్రామానికి చెందిన ఆదినారాయణ నుంచి ఐదు లీటర్ల సారాను పోలీసులు బుధవారం స్వాధీనం చేసుకున్నారు.

ప్రమాదకరంగా ప్రయాణం

ఈ వాహనంలో ప్రయాణం చేస్తున్న వారికి ఎవరికీ రక్షణ లేదు. అందరూ ప్రమాదకర ప్రయాణం చేస్తున్నారు. ట్రాక్టర్‌లో మితిమీరిన లోడ్ వేయడమే కాకుండా దాని మీద కూర్చోవడం గమనార్హం. పట్టుజారితే అందులోని వారి ప్రాణాలకే ప్రమాదం. బుధవారం పలమనేరు-మదనపల్లె రహదారిలో కల్లుపల్లె మీదుగా ఈ ట్రాక్టర్ బంగారుపాళ్యం వెళ్తూ కనిపించింది. **- న్యూస్‌టుడే, పలమనేరు**

నిలువ నీడ లేదు.. తలదాచుకునేందుకు చోటు లేదు

స్థానిక పుంగమ్మ ట్యాంక్ బండ్ రోడ్డుపై ఉదయం నుంచి సాయంత్రం వరకు బస్సులు, ఆటోల కోసం ప్రయాణికులు, విద్యార్థులు వేచి ఉంటున్నారు. ఎండకు, వానకు ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. అధికారులు స్పందించి బస్సు షెల్టర్ నిర్మాణం చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, పుంగనూరు గ్రామీణ

వృథా నీరు.. మురుగు అయ్యేను

చౌడేపల్లె మండలం దిగువపల్లె పంచాయతీ దేవిరెడ్డి చెరువు యానాదిండ్ల కాలనీల్లో పైపుల లీకేజీతో నీరు వృథా అవుతుంది. బోయకొండ-రాజనాల బండ ప్రధాన రహదారిపై నీరు పారడంతో నీరు నిలిచి మురుగును తలపిస్తోంది. సంబంధిత అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాల్సిన అవసరముంది. కార్యదర్శి పవన్‌కుమార్‌ని వివరణ కోరగా పరిశీలించి సమస్య పరిష్కరిస్తానని పేర్కొన్నారు. **- న్యూస్‌టుడే, చౌడేపల్లె**

చిత్రంలో కనిపిస్తున్న రక్షిత మంచినీటి ట్యాంకు రాయలపేట జడ్పీ ఉన్నత పాఠశాల ప్రహరీ లోపల ఉంది. ఈ ట్యాంకు నిర్మించి దాదాపు 25 ఏళ్లు అవుతోందని స్థానికులు తెలిపారు. ప్రస్తుతం ట్యాంకు పిల్లర్లు పెచ్చులూడిపోయి కూలిపోయే స్థితికి చేరుకున్నాయి. ఇక్కడే ఈ ట్యాంకుతోపాటు మరో ట్యాంకు ఉంది. రెండు ట్యాంకులకు నీటిని నింపి గ్రామానికి సరఫరా చేస్తున్నారు. అయితే నేడో రేపో కూలిపోయే స్థితిలో ఉన్న తాగునీటి ట్యాంకును తొలగించి ప్రమాదం జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ఇక్కడ నిత్యం

కూలేదాకా పట్టించుకోరా..?

విద్యార్థులు విరామ సమయంలో తిరుగుతూ ఉంటారు. ప్రమాదం జరగక ముందే అధికారులు మేల్కోవాలని స్థానికులు పేర్కొంటున్నారు.

- న్యూస్‌టుడే, రాయలపేట (పెద్దపంజాణి)

ముంపు భయం.. పట్టించుకోని యంత్రాంగం

• ప్రమాదంలో భారత్‌నగర్ వాసులు

రూపుకోల్పోయి అధ్వానంగా మారిన పత్రపల్లె కాలువ

వి.కోట, న్యూస్‌టుడే: మండల కేంద్రంలోని భారత్‌నగర్ వాసులు ప్రమాదపుటంచున బిక్కుబిక్కుమంటున్నారు. పత్రపల్లె సప్లై ఛానల్ పిచ్చిమొక్కలు, చెత్తతో పూడిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. అధికారులు ముందస్తు చర్యలు చేపడితే ప్రమాదం తప్పుతుందని స్థానికులు కోరుతున్నారు. పత్రపల్లె చెరువు నుంచి వి.కోట కీపల్లె చెరువు వరకు పత్రపల్లె సప్లై ఛానల్(కాలువ) వెళ్తుంది. దాదాపు రెండు కి.మీ దూరం ప్రవహించే ఈ కాలువ వి.కోట మండల కేంద్రంలో భారత్ నగర్, గంగమ్మగుడి వీధుల మీదుగా వెళ్తుంది.

గతంలో ప్రమాదకరంగా ప్రవాహం..

ఈ సప్లై ఛానల్ ఆక్రమణకు గురికావడంతో పత్రపల్లె చెరువు నుంచి వచ్చే నీరు భారత్‌నగర్ లోని ఇళ్లలోకి రావడంతో ఇల్లు విడిచి సురక్షిత ప్రాంతాలకు పరుగులు తీసిన ఘటనలు ఉన్నాయి.

సమస్య ఇదే..

పత్రపల్లె కాలువ పిచ్చిమొక్కలు, చెత్తా చెదారంతో నిండిపోయింది. చాలా వరకు ఆక్రమణకు గురై కుచించుకుపోయింది. మురుగు నీరు వెళ్లకుండా నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. పిచ్చిమొక్కల వల్ల విషసర్పాలు సంచరించడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు.

ప్రతిపాదనలు పంపాం

వి.కోట పత్రపల్లె సప్లై ఛానల్ మరమ్మతుల విషయమై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. వారి ఆదేశాల మేరకు చర్యలు చేపడతాం. ప్రజలకు ఇబ్బంది లేకుండా చూస్తాం.

- ఇరిగేషన్‌శాఖ ఏఈ

కాగితాలు ఏరుకునే వ్యక్తి మృతి

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పట్టణంలో చిత్తు కాగితాలు ఏరుకుంటూ స్థానిక అంబేడ్కర్ భవనం వద్ద ఉంటున్న ఓ వ్యక్తి (50) బుధవారం మృతి చెందినట్లు సీఐ సుబ్బరాయుడు తెలిపారు. శవపంచనామా నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

కడుపునొప్పి తాళలేక యువతి ఆత్మహత్య

పలమనేరు, న్యూస్‌టుడే: కడుపునొప్పి తాళలేక యువతి ఆత్మహత్య చేసుకున్న ఘటన పట్టణంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల మేరకు.. పట్టణంలోని పాతపేటకు చెందిన సుల్తానా(19) కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నారు. ఈ క్రమంలోనే కడుపునొప్పి తీవ్రమవడంతో విష రసాయనం తాగి ఆత్మహత్య చేసుకున్నారు. తండ్రి అహ్మద్‌బాషా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సీఎం సారూ.. నిత్య సమస్యలు పరిష్కరించండి..!

కంకరతేలిన దాసిమానిపల్లె రోడ్డు

గుడుపల్లె, న్యూస్‌టుడే: కుప్పం నియోజకవర్గం గుడుపల్లెలో ఏళ్ల తరబడి నెలకొన్న సమస్యలపై ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టిసారించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. అందులో ప్రధానంగా నెలకొన్న సమస్యలు.. ● గుడుపల్లె సమీప రైల్వే గేటు వద్ద పైవంతెన పనుల్లో జాప్యం సాగుతోంది. ● కుప్పం నుంచి బెంగళూరుకు ఉపాధి కోసం వేలాది మంది రాకపోకలకు సాగిస్తుంటారు. పుష్ రైలు ఉదయం, సాయంత్ర నడిచేలా చొరవ చూపాలి. ● మండల పరిధిలోని పలు అంతర్గత గ్రామీణ, రహదారులు కంకరలు తేలిపోయాయి. ● 2014-2019 మధ్య మండల పరిధిలో చేపట్టిన పలు కార్యాలయాలు, సామాజిక భవనాలు అర్ధంతరంగా ఆగిపోయింది. పునఃప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాల్సి ఉంది. ● గ్రామీణ ప్రాంతాల్లో ప్రజల ఆరోగ్య, పాలనా భవనాల్లో కనీస మౌలిక వసతులు లేక నిత్యం అవస్థలు పడుతున్నారు. ● భూ-సర్వే పనులకు అవసరమైన సాంకేతిక పరికరాలు(రోవర్లు) లేక తీవ్ర జాప్యం జరుగుతోంది.

దాడి ఘటనపై కేసు నమోదు

పుంగనూరు గ్రామీణ, న్యూస్‌టుడే: అన్నదమ్ముల కుమారులు దాడి చేసుకున్న ఘటన బుధవారం మండలంలోని అడివినాథునికుంట సమీపంలో చోటు చేసుకుంది. సీఐ సుబ్బరాయుడు వివరాల మేరకు.. అడవినాథునికుంటకు చెందిన కృష్ణారెడ్డి, సుబ్రహ్మణ్యం రెడ్డి, రత్నాకర్‌రెడ్డి ముగ్గురు అన్నదమ్ములు. వీరికి గ్రామం సమీపంలో 1.72 ఎకరాల పొలం ఉంది. ఈ పొలం విషయమై అన్నదమ్ముల మధ్య కొంత కాలంగా ఘర్షణ జరుగుతున్నాయి. ఈ క్రమంలోనే బుధవారం రత్నాకర్‌రెడ్డి కుమారుడు మహేంద్రరెడ్డిపై కృష్ణారెడ్డి, అతని కుమారుడు లోకేశ్‌రెడ్డి తదితరులు దాడి చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వ్యక్తి మృతి

పెద్దపంజాణి: ముందస్తు సిగ్నల్స్ లేకుండా రోడ్డుపై నిలిపి ఉన్న బొలెరో వాహనాన్ని ద్విచక్ర వాహనం ఢీకొనడంతో వ్యక్తి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల మేరకు.. బందార్లపల్లెకు చెందిన శంకర(55) జూన్ 29న రాత్రి ద్విచక్ర వాహనంపై చౌడేపల్లె నుంచి ఇంటికి వెళ్తుండగా.. వీరప్పల్లె వద్ద రోడ్డుపై ఎలాంటి సిగ్నల్స్ లేకుండా బొలెరో వాహనాన్ని నిలిపి ఉంచడంతో వెనుక నుంచి ఢీకొన్నారు. ప్రమాదంలో శంకర్ తీవ్రంగా గాయపడ్డారు. రుయాలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందారు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని..

శాంతిపురం: మండల పరిధి గుండిశెట్టిపల్లె వద్ద కుప్పం-పలమనేరు జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. బస్టాండు వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో వ్యక్తి అక్కడికక్కడే మరణించాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం

చౌడేపల్లె, న్యూస్‌టుడే: మండలంలోని కాటిపేరికి చెందిన సుబ్రహ్మణ్యం బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశారు. కుటుంబ కలహాలు, అప్పులు ఎక్కువ కావడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు కుటుంబీకులు తెలిపారు. చికిత్స నిమిత్తం పుంగనూరు ఆసుపత్రికి తరలించారు.

IN THE COURT OF
THE PRINCIPAL JUNIOUR CIVIL JUDGE; TIRUPATI
O.S.No. 67 / 2022
State Bank of India, P.B Branch, Tirupati
...Plaintiff
V/s
G.Chenchu Reddy and another
..Defendant
SUMMONS TO DEFENDANT 2
D2) V.Chandra Sekhar s/o V.Ramanaiah, Budetivari Palli, S.Nadimpalli Suraiahgari Palli post Somala Mandal, Chittoor District.
Please take summons that the above suit filed by the plaintiff for recovery of amount against you and the matter is posted to 31.7.2025 for your appearance either in person or through your counsel at about 10.30 a.m. in the above court. In the event of your absence, the matter will be decided exparte.
Date of hearing 31.7.2025
K.RAMESH BABU
ADVOCATE, TIRUPATI

(c) eenadu

కాలు పెట్టే మార్గంలేక.. బడిదారిలో తడబడి

అమలాపురం మండలం జనుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లే రహదారి బురదమయంగా మారడంతో విద్యార్థులు రాకపోకలకు అష్టకష్టాలు పడుతున్నారు. గ్రామంలోని మన్నాకాలనీ, రామలక్ష్మణ కాలనీకి చెందిన సుమారు 80 మంది ఇక్కడ చదువుతున్నారు. ఈ కాలనీలకు, పాఠశాలకు మధ్య సుమారు కిలోమీటరుకు పైగా ఉన్న ఈ మార్గం ప్రస్తుత వర్షాలకు చిత్తడిగా మారింది. నడిచి వెళ్లేందుకు వీలులేని విధంగా తయారైంది. వర్షాకాలంలో ఏటా ఇవే ఇబ్బందులు పడుతున్నామని, ఒక్కోసారి జారి పడిపోతున్నామని విద్యార్థులు వాపోతున్నారు. నడిచి వెళ్లలేక కొందరు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. **-న్యూస్‌టుడే, కోనసీమ**

విద్యార్థిమిత్ర కిట్ల పంపిణీ పూర్తి

ముమ్మిడివరం: జిల్లాలో ఒకటి నుంచి పదో తరగతి వరకు విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లు పంపిణీ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. 94,416 మంది విద్యార్థులకు అందించేందుకు మూడు రోజుల క్రితమే ఏకరూప దుస్తులు, బూట్లు చేరుకున్నాయి. గత నెల 12 పాఠశాలలు పునఃప్రారంభం రోజే పుస్తకాల పంపిణీ చేపట్టారు. మొదటి విడతలో 4,85,894 పాఠ్య, వర్కు పుస్తకాలు అవసరం కాగా.. 4,83,009 పంపిణీ చేశారు. రాత పుస్తకాలు 6,27,930, బెల్టులు 60,300, బ్యాగులు 91,015, నిఘంటువులు 7,936 ఆయా పాఠశాల్లో విద్యార్థులకు పునఃప్రారంభం రోజే అందజేశారు. విద్యార్థులకు 100 శాతం కిట్లు అందజేసినట్లు సీఎంఓ సుబ్రహ్మణ్యం తెలిపారు.

ప్రైవేటు ఆసుపత్రుల కిరికిరి

ఎన్టీఆర్ వైద్యసేవల్లో అదనపు వసూళ్లు

న్యూస్‌టుడే, అమలాపురం కలెక్టరేట్

● అల్లవరం మండలం బోడసకుర్రుకు చెందిన ఓ వ్యక్తికి గుండెపోటు రావడంతో ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్ పరిధిలోని ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు చేసి రెండు స్టంట్లు పడతాయని నిర్ధారించారు. ఎన్టీఆర్ వైద్య సేవలో వేసేవి నాణ్యత తక్కువగా ఉంటాయని చెప్పి.. అతడి నుంచి ఒక్కొక్క దానికి రూ.50వేల చొప్పున వసూలు చేశారు. ఉచిత వైద్యం అందుతుందని వెళ్తే రూ.లక్షకు పైగా ఖర్చయిందని ఆయన వాపోయారు.

● అమలాపురం పట్టణానికి చెందిన ఓ వ్యక్తికి రోడ్డు ప్రమాదంలో కాలి ఎముక విరిగింది. శస్త్ర చికిత్సలో వేసే ఇన్‌ప్లాంటేషన్(రాడ్డు)కు నాణ్యత పేరుతో అదనంగా వసూలు చేశారు.

ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా పేదలకు పూర్తి స్థాయిలో వైద్యం అందించాల్సి ఉండగా.. కొన్ని ఆసుపత్రులు లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నాయి. కార్డు ఉన్నా.. అదనపు బిల్లులు తప్పడం లేదు. వ్యాధి నిర్ధారణ పరీక్షలకు తామే సొమ్ము చెల్లించాల్సి వస్తోందని రోగులు వాపోతున్నారు. కొన్ని శస్త్రచికిత్సలకు ప్రభుత్వం ఇస్తున్న సొమ్ము తక్కువగా ఉందని, అదనంగా చెల్లించాలని రోగి బంధువులతో ఆసుపత్రి సిబ్బంది బేరాలు ఆడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

ఓ ఆసుపత్రిలో ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్ట్ కేంద్రం

కోట్లలో ఖర్చులు..

ఎన్టీఆర్ వైద్య సేవలో పేద రోగులకు అందిస్తున్న వైద్యానికి ప్రభుత్వం ఏటా రూ.కోట్లలో ఖర్చు చేస్తోంది. బాధితులు ఎక్కువగా ప్రైవేటు ఆసుపత్రులనే ఆశ్రయిస్తున్నారు. దీంతో వారు చెప్పినట్లు చేస్తేనే ప్రవేశం కల్పిస్తున్నారు.

54 ఫిర్యాదులపై విచారణ

గత ఆర్థిక సంవత్సరంలో ఎన్టీఆర్ వైద్య సేవ పథకం నెట్‌వర్క్ పరిధిలోని ఆరు ప్రైవేటు ఆసుపత్రులకు జరిమానా విధించారు. గత ఏడాది రోగులను చేర్చుకునే క్రమంలో స్కానింగ్, రక్త పరీక్షల పేరుతో కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు రోగుల నుంచి అదనంగా వసూలు చేసినట్లు తేలింది. ఆ ఆసుపత్రులు సంబంధిత రోగులకు తిరిగి రూ.1.50 లక్షలు చెల్లించాలని ఆదేశించారు. ఈ ఆసుపత్రులపై తాజాగా 54 ఫిర్యాదులపై విచారణ జరిపి నివేదిక కలెక్టర్‌కు అందజేశారు. అదనపు వసూళ్లు చేసినట్లు అధికారులు నిర్ధారించారని సమాచారం. రోగులు కోలుకుని ఇంటికి వెళ్లే సమయంలో ఆరోగ్య మిత్రలు వారి అభిప్రాయాలు తెలుసుకోవాలి. సేవా లోపాలు ఉంటే ఉన్నతాధికారులకు తెలియజేయాలి. క్షేత్రస్థాయిలో ఇవేమీ జరగడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

జిల్లాలో వివరాలు..

ఏడాది	శస్త్రచికిత్సలు/ చికిత్సలు	ఖర్చు (రూ.కోట్లలో)
2022-23	19,003	36.43
2023-24	25,836	47.10
2024-25	27,775	50.55
2025-26 (ఇప్పటి వరకు)	3,828	7.01

3,255 రకాల శస్త్ర చికిత్సలు

ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా 3,255 రకాల శస్త్ర చికిత్సలు చేస్తారు. జిల్లాలోని 77 ఆసుపత్రుల్లో ఈ సేవలు అందుతున్నాయి. ఇందులో 56 ప్రభుత్వాసుపత్రులు, మిగిలినవి ప్రైవేటువి. ప్రభుత్వానికి సంబంధించి ప్రాంతీయ ఆసుపత్రులు 2, సీహెచ్‌సీలు 9, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు 45, దంత వైద్యశాలలు 6 ఎన్టీఆర్ వైద్య సేవ నెట్‌వర్క్‌లో అనుసంధానమై ఉన్నాయి.

డబ్బులడిగితే ఫిర్యాదు చేయవచ్చు

ఈ పథకంలో నమోదైన ఆసుపత్రుల్లో అదనంగా డబ్బులు అడిగితే నేరుగా ఫిర్యాదు చేయవచ్చు. ఆసుపత్రులకు వ్యాధి నిర్ధారణ పరీక్షలకు సంబంధించిన బిల్లులు సైతం చెల్లిస్తున్నాం. నిబంధనలు ఉల్లంఘించి, రోగుల నుంచి అదనంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు తప్పవు.

-రాధాకృష్ణ, జిల్లా సమన్వయకర్త, ఎన్టీఆర్ వైద్యసేవ ట్రస్టు

సంక్షేమం, అభివృద్ధి కూటమి లక్ష్యం

కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంపీ హరీష్ మాథుర్, ఎమ్మెల్సీ పేరాబత్తుల

సఖినేటిపల్లి: సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వం లక్ష్యమని, ఆ దిశగానే సీఎం చంద్రబాబు నాయకత్వంలో సుపరిపాలన అందిస్తున్నట్లు ఎంపీ హరీష్ మాథుర్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. ఏడాది పాలనలో ప్రభుత్వం చేపట్టిన సంక్షేమంపై సఖినేటిపల్లి మండలం వివిమెరకలో బుధవారం 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పింఛన్ల పెంపు, మత్స్యకార భరోసా, తల్లికి వందనం, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉపాధ్యాయుల పోస్టుల భర్తీ తదితర సంక్షేమ పథకాలు అమలుచేశారన్నారు. మన మంచి ప్రభుత్వం కచ్చితంగా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తుందన్నారు.. వైకాపా ప్రభుత్వం అరాచక పరిపాలన చేసి రాష్ట్రాన్ని అధోగతి పట్టించిందన్నారు. ఇంటింటికి తిరిగి ఏడాదిలో చేపట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. నియోజకవర్గ పరిశీలకుడు రామ్మోహన్ రావు, మండల పార్టీ అధ్యక్షుడు ముప్పర్తి నాని, మంగెన భూదేవి, తెదేపా శ్రేణులు పాల్గొన్నారు.

కోనసీమ రైల్వేలైనుకు మార్గం సుగమం: ఎంపీ

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్‌కు అడ్డంకులు ఒక్కొక్కటిగా తొలుగుతున్నాయని అమలాపురం ఎంపీ హరీష్‌మాథుర్ పేర్కొన్నారు. భూసేకరణ ప్రక్రియపై ఉన్న స్టే ఉత్తర్వులను హైకోర్టు తొలగించడంతో మార్గం సుగమమైందన్నారు. ప్రభుత్వ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం స్టే ఎత్తివేసిందన్నారు. కోనసీమ ప్రజల కోరికైన రైల్వే ప్రాజెక్టు పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు.

మద్యం తక్కువ ధరకు ఇస్తామంటే నమ్మొద్దు: ఈఎస్

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: ఎక్సైజ్ శాఖ ద్వారా లైసెన్సు పొందిన దుకాణాల్లోనే మద్యం కొనుగోలు చేయాలని జిల్లా అబ్కారీశాఖ సూపరింటెండెంట్(ఈఎస్) ఎస్‌కేవీ ప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. లైసెన్సులేని మద్యం దుకాణాలు, వ్యక్తుల నుంచి కొనుగోలు చేయడం ప్రమాదకరమన్నారు. వివాహాలు, పార్టీలు, ఇతర కార్యక్రమాలు తక్కువ ధరలో మద్యం సరఫరా చేస్తామని ఎవరైనా చెబితే నమ్మవద్దన్నారు. నకిలీ మద్యం, స్పిరిట్ విక్రయంలో అనుమానిత వ్యక్తుల వివరాలను టోల్‌ఫ్రీ నంబరు 14405కు చెప్పాలన్నారు.

డెల్టా సరే.. మెట్ట మాటేమిటి?

జలవనరులు, వ్యవసాయశాఖల మధ్య సమన్వయ లోపం ● జడ్పీ సర్వసభ్య సమావేశంలో వాడీవేడిగా చర్చ

ఈనాడు, కాకినాడ; న్యూస్‌టుడే, కాకినాడ నగరం

'డెల్టా ప్రాంతంలో మూడు పంటలు సాగుచేయాలని ముందస్తుగానే నీరు విడిచిపెట్టడం మంచిదే. మరి మెట్ట ప్రాంతంలో రైతుల సంగతేమిటి? అని ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన బుధవారం కాకినాడలో నిర్వహించారు. మూడు జిల్లాల కలెక్టర్లు షాన్‌మోహన్ (కాకినాడ), ప్రశాంతి (తూర్పుగోదావరి), మహేష్‌కుమార్ (అంబేడ్కర్ కోనసీమ) హాజరయ్యారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ మెట్టలో జలవనరులు, వ్యవసాయ శాఖల మధ్య సమన్వయం కొరవడిందన్నారు. మెట్ట సాగుకోసం ప్రత్యేకంగా జరిగే షట్ డౌన్ తమ నియోజకవర్గంలో ఏర్పాటుచేయాలని కోరారు. తాళ్లూరు ఎత్తిపోతలు వినియోగంలో తీవ్రంగా లోపాలున్నాయని ఆరోపించారు.

వాకౌట్‌తో నిరసన

సమావేశం ప్రారంభంలోనే దాళ్వా ధాన్యం సొమ్ములు ఇంకా జమ కాలేదని, ప్రభుత్వం 24 గంటల్లో ఇస్తామని మోసం చేసిందంటూ వైకాపా జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు కాసేపు వాకౌట్ చేశారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణ, ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ మద్దతు పలికారు. కాసేపటి తర్వాత మళ్లీ వచ్చి చర్చలో పాల్గొన్నారు.

కాలువల కలుషితంపై నిర్లక్ష్యం తగదు

పంట కాలువల కలుషితంపై అధికారుల నిర్లక్ష్యం తగదని ఎమ్మెల్సీలు సూర్యనారాయణ, సోము వీర్రాజు ప్రస్తావించారు. కాలువల్లోకి వ్యర్థాలు వదిలేస్తున్నారని, గత మరుగుదొడ్ల గొట్టాలను వదిలేస్తున్నారన్నారు. రాజమహేంద్రవరంలోనూ పేపరు మిల్లు వ్యర్థాలు గోదావరి జలాల్లో కలుస్తున్నాయన్నారు. పూర్తిగా మానవ తప్పిదాలే కారణమని అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు.

డ్రెయిన్ల ఆధునికీకరణకు తీర్మానం

జిల్లాలో డ్రెయిన్ల ఆధునికీకరణపై చర్యలు తీసుకోవాలని ఎంపీ సుభాష్‌చంద్రబోస్ ప్రస్తావించారు. మురుగు కాలువల ఆధునికీకరణ, పడకేసిన ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని జడ్పీ ఛైర్మన్ తీర్మానాన్ని ప్రతిపాదించగా, సభ్యులు ఆమోదించారు.

మరికొన్ని సమస్యలపై..

● కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డుల జారీకి నీటి తీరువా బకాయిలతో ముడిపెడుతున్నారని గొల్లప్రోలు జడ్పీటీసీ నాగలోవరాజు ఆరోపించారు. కలెక్టర్ షాన్ మోహన్ స్పందిస్తూ నీటి తీరువా తప్పనిసరని, వాటిని కార్డులతో ముడిపెడితే చర్యలు తీసుకుంటామన్నారు. ● ఏలేశ్వరం నుంచి అల్లూరి జిల్లా మార్గం అధ్వానంగా ఉందని రాజవొమ్మంగి జడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి అన్నారు. ● పాఠశాలల్లో అసంపూర్తి పనులతో ఆటంకాలు ఎదురవుతున్నాయని జడ్పీటీసీ సభ్యులు ప్రస్తావించారు. ● ఆలమూరు, రామచంద్రాపురంలో పారిశుద్ధ్య శాఖ గోదాముల్లో ఉండాల్సిన గోనెసంచులు, బియ్యం తరలిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రశ్నించారు. ● డీసీసీబీ రూ.907 కోట్ల నష్టాల్లో కూరుకుపోయిందని, రుణాల తీసుకున్నవారు తిరిగి చెల్లిస్తేనే మనుగడ సాధించగలదని, సిబ్బంది కొరతతో వచ్చిపడ్డాయని ప్రజా ప్రతినిధులు సహకరించాలని డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ అనంతబాబు, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, అధికారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మన్ వేణుగోపాలరావు, వేదికపై కలెక్టర్లు ప్రశాంతి, షాన్‌మోహన్, మహేష్‌కుమార్, జడ్పీ సీఈవో లక్ష్మణరావు

పాల్గొన్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు నల్లమిల్లి, నెహ్రూ, ఎమ్మెల్సీ త్రిమూర్తులు, ఎంపీ బోస్

భారీ టేకుచేప లభ్యం

యానాం గోదావరిలో మత్స్యకారుల వలకు భారీ టేకుచేప చిక్కింది. పొన్నమండ వీరరాజు బృందం బుధవారం వేటకు వెళ్లగా జీఎంసీ బాలయోగి వారధి సమీపంలో 160 కిలోల బరువు, ఎనిమిది అడుగుల పొడవుతో ఉన్న టేకు చేప వలలో పడింది. దానిని అతి కష్టంమీద ఒడ్డుకు చేర్చారు. సముద్రంలో మాత్రమే ఉండే ఇది భైరవపాలెం మొగ ద్వారా గోదావరిలోకి వచ్చి ఉంటుందని మత్స్యకారులు చెప్పారు. ఈ చేపను పొన్నమండ భద్రం వేలంలో రూ.17వేలకు దక్కించుకున్నారు. సాధారణంగా ప్రశాంతంగా ఉండే ఇది ఆపద వస్తుందని గుర్తిస్తే మాత్రం తోకతో తీవ్రంగా దాడి చేస్తుందని మత్స్యకారులు తెలిపారు. క్యాన్సర్లు, గుండెపోటు నివారణకు దీనిని ఆహారంగా తీసుకుంటారని యానాం మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దడాల గొంతెయ్య తెలిపారు. **– న్యూస్‌టుడే, యానాం**

నీట మునిగిన నారుమళ్లు

బ్యాంక్ కెనాల్ నీటి మట్టం పెరగడంతో ఆత్రేయపురం మండలంలోని లొల్ల, వాడపల్లి, మెర్లపాలెం వంటి ప్రాంతాల్లో వరి పొలాలు నీటమునిగాయి. సుమారు 150 ఎకరాల్లో వరినారు దెబ్బతింటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు దమ్ములు చేసి నాట్లకు సిద్ధం కాగా, మరికొందరు ఆకు మడులు వేశారు. ఏటా సార్వా సమయంలో ముంపు సమస్య రైతులకు కునుకు లేకుండా చేస్తోంది. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం రూ.2.95 లక్షలు మంజూరు చేయడంతో లొల్ల, మెర్లపాలెం వద్ద సైఫన్లు నిర్మిస్తున్నారు. పనులు పూర్తికాకపోవడంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ముక్తేశ్వరం కాలువ నీటి మట్టం తగ్గిస్తే ముంపునీరు బయటకు పోతుందని స్థానిక రైతులు చెబుతుండగా.. నీటిమట్టం తగ్గిస్తే జిల్లాలోని శివారు భూములకు నీరందక రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయంలో సంబంధిత అధికారులు ఏమీచేయలేక నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. పంట, మురుగు కాలువలు ఆక్రమణలకు గురికావడంతో నిడివి తగ్గిపోయి నీటిమట్టం పెరిగి ముంపు సమస్య ఏర్పడుతోంది. ఈ విషయాన్ని రైతులు బుధవారం మండల పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు దృష్టికి తీసుకొచ్చారు. ఉన్నతాధికారులతో మాట్లాడి నీటిమట్టం తగ్గించేందుకు చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. **- న్యూస్‌టుడే, ఆత్రేయపురం**

కపిలేశ్వరపురం ఇసుక రీచ్ రద్దుకు నిర్ణయం!

ఈనాడు, ఈటీవీ కథనానికి స్పందన

ఈనాడు, అమలాపురం: పర్యావరణ నిబంధనలకు విరుద్ధంగా కపిలేశ్వరపురంలో అడ్డగోలుగా ఇసుక తవ్వకాలు చేసిన అంశాన్ని జిల్లా యంత్రాంగం సీరియస్‌గా తీసుకుంది. సంబంధిత నిర్వహణ ఏజెన్సీని రద్దు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్లు తెలుస్తోంది. గత నెల 29న 'ఇసుక తోడేళ్లు' శీర్షికతో 'ఈనాడు, ఈటీవీ'లో వచ్చిన కథనంపై ఇప్పటికే స్పందించిన అధికారులు బాధ్యులపై చర్యలు తీసుకునేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. జూన్ 1 నుంచి తవ్వకాలు చేయకూడదన్న ఉద్దేశంతో సమీపంలో నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. అక్కడ భూగర్భ గనులశాఖ అధికారులు తనిఖీ చేయగా పరిమితికి మించి 56 వేల మెట్రిక్ టన్నులు ఉన్నట్లు నిర్ధారించారు. అంత నిల్వ అక్కడికి ఎలా వచ్చిందని ప్రశ్నిస్తూ సంబంధిత ఏజెన్సీ మిథిల కన్‌స్ట్రక్షన్స్‌కు నోటీసులు జారీ చేశామని జిల్లా మైన్స్ అధికారి వంశీధరరెడ్డి తెలిపారు. ఈ నెల 4న జిల్లా ఇసుక కమిటీ సమావేశం నిర్వహించి ఆ రీచ్‌ను దక్కించుకున్న ఏజెన్సీ రద్దుకు నిర్ణయించినట్లు తెలిసింది. దీంతో పాటు అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఇటీవల తవ్వకాలు జరిగిన అన్ని ప్రాంతాల్లోనూ ఆర్డీవో స్థాయి అధికారులతో తనిఖీలు చేయించనున్నారు. ఇందుకు ప్రత్యేక బృందాలు నియమించారు. అక్రమాలు నిర్ధారించి భారీ ఎత్తున జరిమానా విధించేందుకు కలెక్టర్ మహేష్‌కుమార్ నిర్ణయిచినట్లు సమాచారం. ఇప్పటికే ప్రాథమిక నివేదిక ఉన్నతాధికారులకు పంపించారు.

కపిలేశ్వరపురంలో ఇసుక నిల్వ

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

సాగు హక్కు పత్రం ఏదీ?

కౌలు రైతులకు అంతంత మాత్రంగానే జారీ

ఈనాడు, అమలాపురం; న్యూస్‌టుడే, ముమ్మిడివరం: కౌలు రైతులకు ప్రభుత్వ రాయితీలు, బీమా పరిహారం వర్తించాలంటే సీసీఆర్‌సీ కార్డులు(పంట సాగు హక్కు పత్రం) తప్పనిసరి. ఉమ్మడి జిల్లాలో మూడొంతుల మేర కౌలు పద్ధతిలోనే సాగు జరుగుతుండగా వారికి కార్డుల జారీలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. ఖరీఫ్ కాలం ప్రారంభమైన నేపథ్యంలో ఒప్పందాలు పూర్తయి అంతా పనుల్లో నిమగ్నమవుతున్నారు. 11 నెలల కాలపరిమితితో వీరికి మేలు చేయాలన్న ఉద్దేశంతో సీసీఆర్‌సీ కార్డుల మంజూరుకు ప్రతి జిల్లాకు మండలాలవారీగా లక్ష్యాలు నిర్దేశించిప్పటికీ ఆచరణ తీరు అంతంతే.

లక్ష్యం ఇలా.. అమలు అలా

● డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 1.63 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణంకాగా..1.40 లక్షల మంది రైతులున్నారు. వీరిలో దాదాపు 80 శాతం మంది కౌలు రైతులే. 2025-26 పంట కాలానికి 75 వేల సీసీఆర్‌సీ కార్డులు లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటికి 16,800 మంజూరు చేశారు. వేగం పెంచాల్సి ఉంది.

● తూర్పుగోదావరి జిల్లాలో 1.85 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా 2.18 లక్షల మంది రైతులున్నారు. వీరిలో దాదాపు 80 శాతం కౌలుకు తీసుకున్నవారే. 1.10 లక్షల మందికి కార్డులివ్వాలని లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటికి 32852 మందికి (29.87 శాతం) మంజూరు చేశారు. ఇతర మండలాల్లో 30 శాతం లక్ష్యం అధిగమించగా...రాజానగరం, బిక్కవోలు, కోరుకొండ, నల్లజర్ల, రంగంపేట మండలాల్లో పరిస్థితి తీసికట్టుగా ఉంది.

అవగాహన అవసరం..

సీసీఆర్‌సీ కార్డుల మంజూరుకు సంబంధించి అసలు రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. ఈ మేరకు వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు చొరవ చూపాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ కార్డు వల్ల కౌలు రైతుకు కేవలం 11 నెలల కాలంలో పండించిన పంటపై మాత్రమే హక్కు ఉంటుందని, భూమిపై ఉండదన్న విషయాన్ని వివరించాల్సి ఉంది. కార్డు ఉంటే విపత్తుల వేళ పంట నష్టపరిహారం పొందేందుకు, అలానే ధాన్యం ఆర్‌ఎస్‌కేల ద్వారా విక్రయించేందుకు వీలుంటుంది. అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు వర్తింపజేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెలాఖరునాటికి లక్ష్యాలు పూర్తి చేస్తామని ఇరు జిల్లాల వ్యవసాయాధికారులు మాధవరావు, బోసుబాబు తెలిపారు.

ఖైదీల్లో పరివర్తనకు ప్రత్యేక కార్యక్రమాలు

బండిలో పెట్రోలు వేస్తున్న మంత్రి అనిత, ఎమ్మెల్యే దివ్య

తుని, న్యూస్‌టుడే: ఏదో ఒక తప్పు చేసి జైలుకు వచ్చిన ఖైదీల్లో పరివర్తనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. తునిలో జైళ్లశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెచ్‌పీ పెట్రోలు బంకును మంత్రి అనిత, ఎమ్మెల్యే యనమల దివ్యతో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఇద్దరూ కలిసి పలు ద్విచక్ర వాహనాల్లో ఇంధనం నింపారు. మంత్రి అనిత మాట్లాడుతూ.. ఇప్పటికే జైళ్లశాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో 3 పెట్రోలు బంకులు ఏర్పాటు చేయగా, తునిలో నాలుగోది ప్రారంభించామన్నారు. సెంట్రల్ జైల్లో ఉన్న అనేక మంది ఖైదీలు రోజూ హోటళ్లు, కేఫ్, ఇతర దుకాణాలు నిర్వహించడంలో భాగస్వాములు అవుతున్నారన్నారు. శిక్షాకాలం పూర్తయ్యాక వారు పరివర్తనతో బయటకు వచ్చి సంతోషకర జీవితాన్ని గడపాలనేది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. అనంతరం కొత్తగా నిర్మించిన తుని ఉప కారాగారంలోని పలు విభాగాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జైళ్లశాఖ డీజీపీ అంజనీకుమార్, డీఐజీ ఎమ్మార్ రవికిరణ్, కాకినాడ జిల్లా ఎస్పీ బిందు మాధవ్, జిల్లా జైళ్లశాఖ అధికారి ఎల్.రంగస్వామి, పురపాలక ఛైర్‌పర్సన్ నార్ల భువనసుందరి తదితరులు పాల్గొన్నారు.

ధవళేశ్వరం బ్యారేజీకి మహర్దశ

రూ.150 కోట్లు మంజూరుచేసిన ప్రభుత్వం

– న్యూస్‌టుడే, పి.గన్నవరం

కాటన్ బ్యారేజి

గోదావరి డెల్టాకు కేంద్ర బిందువైన ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ మరమ్మతు పనులకు ప్రభుత్వం రూ.150 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీనికి సంబంధించి తాజాగా పరిపాలనామోదం ఇచ్చింది. ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో సుమారు 10 లక్షల ఎకరాలకు సాగు, లక్షలాది మంది ప్రజలకు తాగునీరు అందిస్తున్న ఈ బ్యారేజీకి మరమ్మతులు చేపట్టాలని ఏడేళ్ల క్రితం ప్రతిపాదించారు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో తాజాగా నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వం పరిపాలనామోదం ఇవ్వడంతో తదుపరి చర్యలు మొదలుపెడతామని హెడ్‌వర్క్స్ ఈఈ జి.శ్రీనివాస్ తెలిపారు.

మరమ్మతులు ఇలా..

ప్రధానంగా బ్యారేజీకి సంబంధించి వివిధ విభాగాలకు చెందిన తలుపులు పాడైపోవడంతో వరదల సమయంలో సముద్రంలోకి నీరు వదిలే సమయంలో ఇబ్బంది పడాల్సి వస్తుంది. 175 తలుపులకు గాను 117 కొత్తవి ఏర్పాటుచేస్తారు. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలకు సాగునీరు సరఫరా చేసే మూడు హెడ్ స్లూయిస్‌లకు కొత్త తలుపులు వస్తాయి. తూర్పుడెల్టా హెడ్ స్లూయిస్‌కు 3, మధ్యడెల్టా 4, పశ్చిమ డెల్టా హెడ్‌స్లూయిస్‌కు 5 వెరసి 12 కొత్త తలుపులు బిగిస్తారు. వరదల అనంతరం బురద పోయేలా స్కవర్ స్లూయిస్‌ల ద్వారా ఫ్లషింగ్ ఆపరేషన్ నిర్వహిస్తారు. తూర్పుడెల్టాకు 3, పశ్చిమడెల్టా 3, మధ్య డెల్టాకు 2 వెరసి ఎనిమిది స్కవర్‌స్లూయిస్‌లు ఉన్నాయి. వీటికి సంబంధించి కొత్త తలుపులు ఏర్పాటుచేస్తారు. విద్యుత్తు, ఇతర సివిల్ పనులూ చేపడతారు.

పనులు మొదలుపెడతాం

ధవళేశ్వరం బ్యారేజీ మరమ్మతులకు ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేసింది. టెండర్లు పూర్తిచేసి పనులు మొదలుపెడతాం. తద్వారా వ్యవసాయ రంగానికి మేలుతో పాటు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయి.

- నిమ్మల రామానాయుడు, రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి

(c) eenadu

అటవీశాఖ ఐ.టి.ప్రాజెక్టు సలహాదారుడిగా నాగబాబు

పి.గన్నవరం, న్యూస్‌టుడే: పి.గన్నవరం మండలం ఊడిమూడి గ్రామానికి చెందిన జనసేన నాయకుడు పెన్నమరెడ్డి నాగేశ్వరరావు(నాగబాబు)ను అటవీశాఖ ఐ.టి.ప్రాజెక్టు సలహాదారుడిగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన రెండేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగుతారు. ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. జనసేన ఆవిర్భావం నుంచి పార్టీ ఐటీ విభాగంలో బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

నేటి నుంచి కేశవరం రైల్వేగేటు మూసివేత

ద్వారపూడి: కేశవరం రైల్వే గేటును గురువారం నుంచి నాలుగు రోజుల పాటు మూసివేస్తామని రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రైలు పట్టాల నవీకరణ, మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 3వ తేదీన ఉదయం 7 గంటల నుంచి 6వ తేదీ రాత్రి 7 గంటల వరకు గేటును మూసేస్తామని ప్రకటించారు. కేశవరం గ్రామంలోకి వెళ్లే ద్విచక్ర వాహనదారులు ద్వారపూడి గ్రామం మీదుగా వెళ్లాలని మండల రైల్వే ఎస్సై ఎ.కిషోర్ సూచించారు. ఈ మేరకు వాహనాల రాకపోకలను మళ్లించినట్లు వివరించారు.

మార్ఫింగ్ చిత్రాలు పంపి.. డబ్బులు డిమాండ్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: మార్ఫింగ్ చేసిన యువతి ఫొటోలను ఆమె తల్లికి పంపించి డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిని బుధవారం సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన ఓ అమ్మాయికి ఇన్‌స్టాగ్రాం ద్వారా గుర్తు తెలియని వ్యక్తి పరిచయమయ్యాడు. వీడియోకాల్ సైతం చేసుకునేవారు. వాటిని ఫొటోల రూపంలో రికార్డు చేసుకున్నాడు. వాటిని మార్ఫింగ్ చేసి ఆ అమ్మాయి తల్లి వాట్సాప్‌కి పంపి డబ్బులు కావాలని డిమాండ్ చేశాడు. లేకుంటే సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తానని బెదిరించాడు. భయాందోళనకు గురైన ఆమె సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన వ్యక్తిగా గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అపరిచిత వ్యక్తులపట్ల సామాజిక మాధ్యమాల్లో స్పందించవద్దని.. ఎవరైనా ఇటువంటి బెదిరింపులకు పాల్పడితే 1930 లేదా 79950 95799 నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

తూ.గో. జిల్లా, రంగంపేట మం. వడిశలేరు గ్రామ స. నెం.77 లో గల ఎ 1-87 ½ జిరాయితీ భూమి కొనుగోలుకు సంబంధించిన

బహిరంగ ప్రకటన తేది: 03-07-2025

'విజ్ఞాన్' అను ప్రఖ్యాతి చెందిన పేరుతో ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ అనేక చోట్ల విద్యా సంస్థలను స్థాపించి, అభివృద్ధి పరుస్తున్న మా క్లయింట్లు ... (ముద్రణ సూక్ష్మం)

షెడ్యూలు

తూర్పు గోదావరి జిల్లా, పెద్దాపురం సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసు ఇలాకాలో చేరిన రంగంపేట మండలం, వడిశలేరు గ్రామ పంచాయితీ పరిధి లోని వడిశలేరు గ్రామం తాలూకు ఆర్. ఎస్. నెం. 77 లోని ఎ 1-87 ½ జిరాయితీ భూమికి హద్దులు

తూర్పు : ఆర్. ఎస్. నెం. 76 లో భూమి

దక్షిణం : మా క్లయింటు లావు ఎడ్యుకేషనల్ సొసైటీ వారి భూమి

పడమర : మా క్లయింటు లావు ఎడ్యుకేషనల్ సొసైటీ వారి భూమి

ఉత్తరం : చెరువు

B.A. Raja Rao, Smt M. Jayasree, Tata Rama Rao, V.V Srujan, Smt T. Ramadevi, Saripilli Krishna
Advocates

Vignan Admin Office: # 8-1-13/1, Siripuram, Opp: A U Registrar Office, Visakhapatnam - 530 003

మహాత్మా జ్యోతిభా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాలలు, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా

Ref: RC.No.05/B/2025-26 Date: 02-07-2025

టెండరు ప్రకటన

డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని మహాత్మా జ్యోతిబా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల సంస్థ ఆధ్వర్యంలో నడుపబడుచున్న సమనస, రామచంద్రపురం గురుకుల పాఠశాలలు 2025-26 విద్యాసంవత్సరమునకు దిగువ తెలిపిన ఆహార వస్తువుల సరఫరా కొరకు ప్రముఖ సంస్థల నుండి సీల్డ్ టెండర్లు కోరబడుచున్నవి.

1. కూరగాయలు, 2. పండ్లు, 3. కోడిగుడ్లు, 4. చికెన్ (స్కిన్‌లెస్) వీటికి సంబంధించిన టెండర్ ఫారాలు సమనస పాఠశాలలో తేది. 4-7-25 నుండి తేది. 14-7-25 వరకు కార్యాలయ పనిదినములలో 10.00 a.m. నుండి 4.00 pm గంటల వరకు 500.00 రూపాయలను సమనస Principal MJPAPBCWR School పేరు మీద డిమాండ్ డ్రాఫ్ట్ ద్వారా చెల్లించి పొందవలెను.

సీల్డ్ వేసిన టెండరు ఫారాలను తేది. 14-7-25 సాయంత్రం 4.00 p.m గంటల లోపు సమనస పాఠశాలలో టెండర్ బాక్స్‌లో వేయవలెను. గడువు సమయం దాటిన తరువాత వచ్చిన టెండర్లు ఎట్టి పరిస్థితుల్లోను స్వీకరించబడవు.

సీల్డ్ వేసిన టెండర్ ఫారాలు తేది. 15-7-25, 12.30 గం॥లకు జిల్లా జాయింట్ కలెక్టర్ మరియు ఛైర్మన్, జిల్లా కొనుగోలు కమిటీ, డా॥ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వారి సమక్షంలో జిల్లా కలెక్టర్ వారి కార్యాలయంలో తెరువబడును. టెండర్లను రద్దుచేయుటకు లేదా తేదీల్లో మార్పు చేయు అధికారము జిల్లా కొనుగోలు కమిటీకి కలదు. మిగతా వివరములకై జిల్లా కన్వీనర్, సమనస వారిని సంప్రదించగలరు.

సం/- జిల్లా జాయింట్ కలెక్టర్ వారి తరపున జిల్లా కన్వీనర్ & Principal
Dr. Y.T.S.RAJU
MJPAPBCWR School, SAMANASA
Dr. B.R.Ambedkar Konasema District - 533 213, Mobile No: 98661 95979

SHRIRAM Finance

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

నమోదిత కార్యాలయం : శ్రీ టవర్స్ ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్,గిండి,చెన్నై-600032.
ఆఫీస్ చిరునామా : డి.నెం.20-1-10, 2వ అంతస్తు, సూపర్ బజార్ కాంప్లెక్స్, మెయిన్ రోడ్, కాకినాడ.

స్వాధీనత ప్రకటన

మెస్సర్స్ శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (గతంలో 'శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్') (గౌరవనీయులైన ఎన్.సి.ఎల్.టి చెన్నై అదేశాల మేరకు 09-11-2022 న సి.పి నెం.69-76 ... శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్‌ను శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్‌లో విలీనం చేయడమైనది ... 30-11-2022 నుండి మెస్సర్స్ శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ పేరు ... ప్రభుత్వ శాఖ కింద కంపెనీల రిజిస్ట్రార్ ధృవీకరించిన ... కంపెనీల చట్టం కింద నమోదు చేయబడిన కంపెనీ మరియు బ్యాంకింగ్ యేతర ఫైనాన్స్ కంపెనీ ... నమోదిత ఆఫీసు: శ్రీ టవర్స్, ప్లాట్ నెం.14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600 032 ... బ్రాంచ్ ఆఫీసు: ... 1వ అంతస్తు, కొత్త ఎల్.ఐ.సి భవనం దగ్గర, మెయిన్ రోడ్ ... ఆంధ్రప్రదేశ్ (ఇకపై సంస్థ/లెండర్‌గా సూచిస్తారు)

శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ (ఎస్.ఎఫ్.ఎల్) ... సెక్యూరిటైజేషన్ అండ్ రికన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంట్రెస్ట్ యాక్ట్ 2002 (సదరు చట్టం) క్రింద మరియు సెక్యూరిటీ ఇంట్రెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 (సదరు రూల్స్) యొక్క రూల్ 3 తో చదవవలసిన సదరు చట్టంలోని సెక్షన్ 13(12) క్రింద ... డిమాండ్ నోటీసులో పేర్కొనబడిన మొత్తమును తిరిగి చెల్లించవలసిందిగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలకు డిమాండ్ నోటీసులను జారీ చేశారు. వారి వివరాలు దిగువ పట్టికలో పేర్కొనబడినవి.

... ఋణగ్రహీతలు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలముగా ... సదరు చట్టం యొక్క సెక్షన్ 13(4) క్రింద తనకు సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ దిగువ సంతకందారు 28.06.2025 న స్వాధీన పర్చుకున్నారు.

ఋణగ్రహీత మరియు గ్యారంటర్ల పేరు మరియు చిరునామా

1. దాసరి సరసింహ స్వామి, తండ్రి: సత్యనారాయణ, డి.నెం. 5-67, సాయి నగర్, గొంది:533 250, శంకరగుప్తం, సఖినేటిపల్లి మండలం, తూర్పుగోదావరి జిల్లా.
2. దాసరి సుజాత, భర్త: నరసింహ స్వామి, డి.నెం. 5-67, సాయి నగర్, గొంది:533 250, శంకరగుప్తం, సఖినేటిపల్లి మండలం, తూర్పుగోదావరి జిల్లా.
3. కడిమిరెడ్డి రామకృష్ణ, తండ్రి: నరసింహ మూర్తి, డి.నెం. 5-67, సాయి నగర్, గొంది:533 250, శంకరగుప్తం, సఖినేటిపల్లి మండలం, తూర్పుగోదావరి జిల్లా.

డిమాండ్ నోటీసు ప్రకారం మొత్తము బాకాయి లోన్ అకౌంట్ నెంబరు: RAZOLTF2101250001 కు రూ. 31,60,230/- (అక్షరాల ...)

డిమాండ్ నోటీసు తేది.30.08.2024 — ఆస్తిని స్వాధీన పర్చుకొబడిన తేది 28.06.2025

ఋణగ్రహీత మరియు హామీదారులకు చెందిన ఆస్తి వివరములు

డ్యాక్యుమెంట్ నెం.318/2021(ఎస్.ఆర్.ఓ. మల్కిపురం) వారి ప్రకారం దాసరి సుజాత గారు తనఖా ఉంచిన ఆస్తి

తూర్పుగోదావరి జిల్లా, మల్కిపురం సబ్-జిల్లా, సఖినేటిపల్లి మండలం, గొంది గ్రామపంచాయితీ,అంతర్వేది శివారు, గొంది ... సెంట్లలలో కొంతభాగం అమ్మగా మిగిలిన స్థలం ... గారికి చెందిన స్థలం, దక్షిణం: అల్లూరి ... ఉత్తరం: రోడ్డు

... లో పైన తెలిపిన స్థిరాస్తిపై శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ ... నోటీసు అందిన తర్వాత ఋణగ్రహీతలు లేదా ఎవరైనా ... ఈ నోటీసులో పైన తెలిపిన ఏదేని సెక్యూర్డు ఆస్తిని ... చేయరాదు.

ప్రదేశం: కాకినాడ, తేది: 28.06.2025 — సం/- అధీకృత అధికారి, శ్రీరామ్‌ఫైనాన్స్ లిమిటెడ్

న్యూస్‌టుడే, గాంధీనగర్

స్నాతకోత్సవానికి సర్వం సిద్ధం

- రేపు జేఎన్‌టీయూకేలో నిర్వహణ
- హాజరుకానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి లోకేశ్

జేఎన్‌టీయూకే విశ్వవిద్యాలయ 11వ స్నాతకోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈ నెల 4 మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నారు. కులపతి, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్, విద్యాశాఖ మంత్రి లోకేశ్, పలువురు అతిథులు హాజరుకానున్నారు. 43,811 మందికి పట్టాలు అందుకోనున్నారు.

ప్రతిభావంతులకు పతకాలు

స్నాతకోత్సవం సందర్భంగా వివిధ విభాగాల్లో ఇంజినీరింగ్, ఇతర డిగ్రీలు పూర్తిచేసిన వారికి ఒరిజినల్ డిగ్రీ పట్టాలను అందించనున్నారు. ప్రతిభావంతులకు 35 బంగారు, 5 నగదు పతకాలు ఇవ్వనున్నారు. 100 మందికి పీహెచ్‌డీ పట్టాలు ప్రదానం చేయనున్నారు. బీటెక్, బీఫార్మసీ, ఎం.టెక్, ఎంబీఏ, ఎం.ఫార్మసీ, బీబీఏ, ఫార్మా.డి, పీజీ కోర్సులు పూర్తిచేసిన 7029 మందికి, యూజీ డిగ్రీలో

ప్రత్యేక ఏర్పాట్లు

ఏర్పాట్లను వీసీ సీఎస్ ఆర్‌కే ప్రసాద్ బుధవారం పరిశీలించారు. మాజీ వీసీ ప్రసాదరాజు, ఏపీఏస్సీ మాజీ ఛైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్, జేఎన్‌టీయూకే చీఫ్ ఇంజినీర్ శ్రీనివాస్‌తో సమీక్షించారు. అతిథులు, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ముఖ్య అతిథిగా అమెరికాలోని బోస్టన్ గ్రూప్ ఛైర్మన్ కోట సుబ్రహ్మణ్యం (సుబు కోట) హాజరుకానున్నారు. ఆయనకు గవర్నర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నారు. మాజీ ఉపకులపతులు, పాలక మండలి సభ్యులు, ఉన్నత విద్యామండలి అధికారులు హాజరుకానున్నారు.

మరపురాని వేడుకగా..

జేఎన్‌టీయూకే పేరు ప్రఖ్యాతులు ఇనుమడించేలా వేడుక నిర్వహిస్తాం. విద్యార్థుల జీవితంలో మరపురాని కార్యక్రమంగా నిర్వహించాలన్న సంకల్పంతో ఏర్పాట్లు చేస్తున్నాం. పలువురికి పట్టాలు, పతకాలు, డాక్టరేట్‌లు ప్రదానం చేస్తాం.

- సీఎస్ఆర్‌కే ప్రసాద్, వీసీ, జేఎన్‌టీయూకే

లోవ అమ్మవారికి సారె సమర్పణ

తుని గ్రామీణం, ద్రాక్షారామం: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో ఆషాఢమాస ఉత్సవాల సందర్భంగా ద్రాక్షారామం భీమేశ్వరస్వామి దేవస్థానం సహాయ కమిషనర్ దుర్గాభవాని జిల్లారాం సాంప్రదాయపరంగా అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయాధికారులు, ప్రజాప్రతినిధులు తరలివచ్చి బుధవారం భారీ ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారెను సమర్పించారు. లోవ దేవస్థానం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి సారె సమర్పించారు. లోవ దేవస్థానం అధికారులు వారికి ఆశీర్వచనాలు చేసి ప్రసాదం అందజేశారు.

అక్రమ తవ్వకాలు.. అనధికార బాటలు

న్యూస్‌టుడే, పి.గన్నవరం

వరదల సీజన్ సమీపిస్తున్నా తొలగించని వైనం

జులై 15లోగా గోదావరికి వరదనీరు తగులుతుంది. ఈ నేపథ్యంలో నది బేసిన్(గర్భం)లో ఎలాంటి అడ్డుకట్టలు లేకుండా చేస్తే ముంపునకు గ్రామాల వైపు ప్రవాహం రాకుండా ఉంటుంది. కోనసీమ జిల్లాలో అధికారిక ర్యాంపులే కాకుండా వాటికి మించి అనధికారికంగా అక్రమార్కులు ఇసుక, లంకమట్టి, బొండుసుక తవ్వి తరలించేందుకు ఎక్కడికక్కడే అక్కడ గోదావరి నదీపాయల్లో బాటలు వేశారు. సహజ వనరులతో బయటకు తరలించేందుకు వీలుగా వీటిని నిర్మించారు. ఈ కారణంగా పడవలు తిరిగేందుకు, మత్స్యసంపద సంచారానికి వీలులేకుండా పోతుంది. ఆనకట్టకు మించి నదీజలాల సహజ ప్రవాహాన్ని అడ్డుకుంటున్నాయి. టిప్పర్లు సంచరించడంతో నది కాలుష్యానికి కూడా ఒకవిధంగా కారణమవుతాయి. గోదావరి నది పరిరక్షణ చట్టం ప్రకారం ఇది నేరం. అయినా అధికారులు నివారణకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. మరో పది రోజుల్లో గోదావరి నదికి వరదనీరు చేరుతుంది. ఎగువ ప్రాంతాల్లో కురిసే వర్షాలను బట్టి దానికంటే ముందుగానే రావొచ్చు. ఈ ప్రవాహానికి అడ్డు లేకుండా నదీపాయల్లో ఉన్న అక్రమ బాటలను తక్షణమే తొలగించాల్సిన అవసరం ఉంది. వీటిని తొలగించకపోతే వరదనీటి సక్రమ ప్రవాహానికి ప్రతిబంధకం ఏర్పడి దాని దిశమార్చి సమీపంలోని లంక భూములను కోతకు గురిచేసే ప్రమాదం ఉంది. పి.గన్నవరం, కొత్తపేట, రావులపాలెం, ఆయినవిల్లి, రాజోలు, మామిడికుదురు, కపిలేశ్వరపురం, ఆత్రేయపురం, కొత్తపేట, కె.గంగవరం తదితర మండలాల్లో ఇలాంటి బాటలు ఎక్కువగా ఉన్నాయి.

మానేపల్లిలో వైనతేయ గోదావరి నదీపాయకు అడ్డంగా వేసిన మార్గం

పట్టని నిబంధనలు

ప్రధానంగా నదీపాయల్లో బాటలు వేసేముందు జలవనరులశాఖ పరిధిలోని గోదావరి హెడ్‌వర్క్స్ విభాగం నుంచి అనుమతులు తీసుకోవాలి. వారికి కొంతమొత్తం జమ చేయాలి. బాటలు వేసినవారు వాటిని తొలగించిన అనంతరం తిరిగి ఆ మొత్తం చెల్లిస్తారు. తొలగించకపోతే ఆ డబ్బులతో అధికారులే వాటిని తొలగించే చర్యలు చేపడతారు. ప్రస్తుతం చాలామంది ఎలాంటి నిబంధనలు పాటించడం లేదు. వాటిని తొలగించకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. దీంతో వరద ఉధృతి పెరిగినప్పుడు తీర గ్రామాలు పెద్దఎత్తున నష్టపోయే ప్రమాదం ఉంది. దీంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కందాలపాలెం నుంచి ఇసుకను తరలిస్తున్న టిప్పర్లు

చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం

వరదల సీజన్ నేపథ్యంలో గోదావరి నదీపాయల్లో ఉన్న బాటలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. నిర్మించినవారే వాటిని తొలగించాలి. లేకపోతే చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. కొంతమంది డబ్బులు చెల్లించారు.

- కె.గోపీనాథ్, ఎస్.ఇ., జలవనరులశాఖ, ధవళేశ్వరం సర్కిల్

స్వదేశానికి తీసుకురావాలని వేడుకోలు

రామలక్ష్మి

అయినవిల్లి: విలస గ్రామానికి చెందిన సవరపు రామలక్ష్మి మస్కట్‌లో చిక్కుకుంది. అధికారులు, ప్రజాప్రతినిధులు తనను రక్షించి స్వదేశానికి తీసుకురావాలంటూ విలపిస్తూ ఓ వీడియోను బుధవారం స్థానిక వాట్సాప్ గ్రూపుల్లో పోస్టు చేసింది. పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన ఓ ఏజెంట్ ఈ ఏడాది మార్చి నెలలో ఉపాధి నిమిత్తం రామలక్ష్మిని మస్కట్ పంపాడు. అక్కడ ఉద్యోగంలో చేరినప్పటి నుంచి ఇంటి యజమానులు ఆమెను సక్రమంగా పెట్టకుండా చిత్రహింసలకు గురిచేస్తున్నట్లు వాపోయింది. అక్కడి భారత ఎంబసీ వద్దకు వెళ్లినా ఎవరూ స్పందించలేదని, అధికారులు ప్రజాప్రతినిధులు తనను రక్షించి స్వదేశానికి తీసుకురావాలని వేడుకుంది. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె కుమారుడు సతీష్ తెలిపాడు.

పాపికొండల విహారయాత్రకు బ్రేక్

దేవీపట్నం: పాపికొండల విహారయాత్రను రెండు రోజులపాటు తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు జల వనరుల శాఖ ఏఈ భాస్కర్ తెలిపారు. ఈ క్రమంలో బుధవారం మండలం పోశమ్మగండి, వీరవల్లిపాలెం మండలం పోచవరం రేవుల నుంచి పాపికొండల విహారయాత్రకు వెళ్లే పర్యాటక బోట్లు మొత్తం నిర్వాహకులు పూర్తిగా నిలిపివేశారు.

ఉద్యోగులకు ఈఎల్ఐ ప్రయోజనాలు

రాజమహేంద్రవరం ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-2 వెంకటేశ్వర్లు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో)లో నమోదయ్యే కొత్త ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ ఉపాధి ఆధారిత ప్రోత్సాహక(ఈఎల్ఐ) పథకం ప్రయోజనాలు వర్తిస్తాయని రాజమహేంద్రవరం ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-2 వెంకటేశ్వర్లు కలువాయి తెలిపారు. స్థానిక వి.ఎల్.పురంలోని ఈపీఎఫ్‌వో కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఈఎల్ఐ పథకానికి సంబంధించిన వివరాలు, ప్రయోజనాల గురించి వివరించారు. దేశంలో అన్ని రంగాల్లో ఉపాధి కల్పనకు మద్దతునివ్వడం, ఉపాధి అవకాశాలు, సామాజిక భద్రతను పెంపొందించేందుకు ప్రభుత్వం రూపొందించిన ఈ పథకాన్ని రెండు భాగాలుగా విభజించినట్లు తెలిపారు. కొత్తగా ఉద్యోగాల్లో చేరే వారికి ఆర్థిక ప్రయోజనం చేకూర్చడం, మరిన్ని ఉద్యోగాలు కల్పించేలా అన్ని రంగాల్లోని యాజమాన్యాలను ప్రోత్సహించడం దీని ఉద్దేశమన్నారు. ఈ ఏడాది ఆగస్టు ఒకటి నుంచి కొత్తగా ఉద్యోగాల్లోకి చేరి తొలిసారి ఈపీఎఫ్‌లో నమోదైన ఉద్యోగులకు రూ.15 వేలు ఆర్థిక ప్రోత్సాహాన్ని ప్రభుత్వం ఏడాది కాల వ్యవధిలో రెండు విడతలుగా అందిస్తుందన్నారు. ఆరు నెలల సర్వీసు పూర్తి చేసుకున్న తర్వాత సగం మొత్తం, మరో ఆరు నెలల సర్వీసు అనంతరం మిగతా సగం మొత్తం నేరుగా ఉద్యోగుల ఖాతాలో డీబీటీ విధానంలో జమ చేస్తుందన్నారు. నెలకు రూ.లక్ష వరకు సంపాదించే కొత్త ఉద్యోగులందరికీ ప్రభుత్వం అందించే ఈ ఆర్థిక ప్రయోజనం వర్తిస్తుందన్నారు.

వెంకటేశ్వర్లు

యాజమాన్యాలకు మద్దతు..

ఈ పథకం తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని, అన్ని రంగాల్లో అదనపు ఉద్యోగాల కల్పనకు ఊతమిస్తుందని తెలిపారు. ఉద్యోగాలు కల్పించే యాజమాన్యాలకు కూడా ప్రభుత్వం మద్దతు నిలుస్తుందని, రూ.లక్ష వరకు వేతనం తీసుకునే ఉద్యోగులను కలిగి ఉన్న యాజమాన్యాలకు ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. కనీసం ఆరు నెలల నిరంతర ఉపాధి ప్రాతిపదికన నియమించుకున్న ప్రతి అదనపు ఉద్యోగి కోసం ఆయా సంస్థల యాజమాన్యాలకు రెండేళ్లపాటు నెలకు రూ.3 వేల వరకు ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. అదే తయారీ రంగానికి సంబంధించిన యాజమాన్యాలకు 3వ, 4వ సంవత్సరాల వరకు ప్రోత్సాహకాలు ప్రతినెలా అందిస్తుందని తెలిపారు. ఈపీఎఫ్‌వోలో నమోదు చేసుకుని 50 మంది, అంతకంటే తక్కువ ఉద్యోగులున్న సంస్థలు కనీసం ఆరు నెలలపాటు నిరంతర ప్రాతిపదికన కనీసం ఇద్దరు అదనపు ఉద్యోగులను, 50 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న సంస్థలు అయిదుగురు అదనపు ఉద్యోగులను నియమించుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు ఒకటి నుంచి 2027 జులై 31 మధ్య సృష్టించే ఉద్యోగాలకు ఈ పథకం వర్తిస్తుందని, యాజమాన్యాలకు వారి పాన్ అనుసంధానిత ఖాతాల్లో ప్రోత్సాహక చెల్లింపులు జమవుతాయని వివరించారు.

భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా వేమా

రాజోలు: భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర భాజపా ఉపాధ్యక్షుడు మానేపల్లి అయ్యాజీవేమా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడి నుంచి నియామక ఉత్తర్వులు వచ్చాయని ఆయన బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

'సజ్జల నిజాయతీ నిరూపించుకోవాలి'

రావులపాలెం పట్టణం: మెడికల్ సీట్ వ్యవహారంలో తన పాత్ర ఉందో లేదో సజ్జల రామకృష్ణారెడ్డి నిజాయతీని నిరూపించుకోవాలని తెదేపా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జీ, మండల పార్టీ మాజీ అధ్యక్షుడు గుత్తుల రాంబాబు అన్నారు. బుధవారం రావులపాలెంలోని తెదేపా క్యాంపు కార్యాలయంలో వారు మాట్లాడుతూ వైకాపా జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డి వక్రభాష్యాలు మానుకోవాలన్నారు. అసలు విషయన్ని పక్కన పెట్టి వాడపాలేనికి చెందిన మత బోధకుడు అడపా ప్రసాద్.. ఎమ్మెల్యే బండారు సత్యానందరావుకు అనుచరుడని, తెదేపా సానుభూతిపరుడని చెప్పడం సరికాదన్నారు. సొమ్ముల వసూలు గురించి జగ్గిరెడ్డి మాట్లాడకపోవడం చూస్తుంటే సజ్జల పాత్ర ఉందని ఆయన నమ్ముతున్నట్లు కనిపిస్తోందన్నారు. నాయకులు పల్లి ఏసు, కాసా విజయసాగర్, వీరేష్, శ్రీనివాస్, రాంబాబు, రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తి అమ్మేసి.. సొమ్ము కాజేసి

పాలకొల్లు: ఆస్తి విక్రయించగా వచ్చిన రూ.4 కోట్లను ఇవ్వకుండా మోసం చేశారంటూ అందిన ఫిర్యాదు మేరకు పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి పోలీస్ స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం తాటిపాకకు చెందిన పితాని వెంకటేశ్వరరావుకు అమలాపురం పట్టణంలో 13 సెంట్ల భూమి ఉంది. దీనిని విక్రయిస్తామంటూ యలమంచిలి మండలం గుంపర్రుకు చెందిన తుంగ నాగేశ్వరరావు, మరో 8 మంది కలిసి పత్రాలు తీసుకున్నారు. జూన్ 11న ఆ భూమిని మరో వ్యక్తికి విక్రయించారు. దీని నిమిత్తం వచ్చిన సుమారు రూ.4 కోట్ల నగదును వెంకటేశ్వరరావుకు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే దుర్భాషలాడారు. దీంతో వెంకటేశ్వరరావు పోలీసులను ఆశ్రయించగా ఎస్సై కె.గురయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

హామీలతో బాబు మోసం: బొత్స

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: హామీలు ఇచ్చి అమలు చేయకుండా కూటమి ప్రజలను మోసం చేసిందని మాజీ మంత్రి, ఉభయ గోదావరి జిల్లాల వైకాపా ప్రాంతీయ సమన్వయకర్త బొత్స సత్యనారాయణ ఆరోపించారు. ఇందుపల్లిలోని ఎ1 కన్వెన్షన్ హాలులో జిల్లా వైకాపా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి అధ్యక్షతన బాబు ష్యూరిటీ- మోసం గ్యారెంటీ విస్తృత స్థాయి సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కాలంలో మహిళలు, రైతులను అన్నివిధాలుగా మోసం చేశారన్నారు. తల్లికి వందనం పథకం ఎంత మందికి ఇచ్చారో ఇప్పటికీ స్పష్టత లేదన్నారు. యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వకుండా స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో పబ్బం గడుపుతున్నారని ఆరోపించారు. మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ మాట్లాడుతూ మోసగాడు.. వేషగాడిని కలుపుకొని ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. హామీలను విస్మరించిన కూటమి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెబుతారని మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ అన్నారు. రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్, జడ్పీ ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, ఎమ్మెల్సీలు తోట త్రిమూర్తులు, కుడుపూడి సూర్యనారాయణ, బొమ్మి ఇజ్రాయిల్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు, మాజీ ఎంపీ చింతా అనురాధ, జక్కంపూడి విజయలక్ష్మి, పొన్నాడ సతీష్, పినిపే శ్రీకాంత్, పాముల రాజేశ్వరిదేవి, పితాని బాలకృష్ణ, గన్నవరపు శ్రీనివాసరావు, పిల్లి సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యనారాయణ

అమ్మవారి జాతరకొచ్చి.. విగతజీవిగా మారి..

ప్రమాదవశాత్తు కాలువలో పడి యువకుడి మృతి

కాజులూరు, న్యూస్‌టుడే: స్వగ్రామంలో జరుగుతున్న జాతరకు హైదరాబాద్ నుంచి వచ్చిన యువకుడు ప్రమాదవశాత్తు టేకి కాలువలో జారిపడి ప్రాణాలు కోల్పోయాడు. చేతికందివచ్చిన కొడుకు అనూహ్యంగా మృత్యువాతపడటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు, కుటుంబ సభ్యుల సమాచారం ప్రకారం.. కోలంక గ్రామానికి చెందిన దాకమూరి నాగరాజు (22) హైదరాబాద్ నగరంలో రాపిడో సర్వీసులో పనిచేస్తున్నారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన అమ్మవారి జాతరకు వచ్చిన ఆయన సోమవారం రాత్రి కోలంక నుంచి ద్రాక్షారామకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఉప్పుమిల్లి శివారు గోపిరేవు వంతెన వద్ద ప్రమాదవశాత్తు వాహనంపై నుంచి జారిపడి కాలువలో కొట్టుకుపోయారు. వంతెన రైలింగ్ శిథిలమవడంతో అక్కడే అదుపుతప్పిన ఆయన నేరుగా కాలువలో పడిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తాళ్లరేవు వద్ద బుధవారం మృతదేహం లభించడంతో పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు గొల్లపాలెం పోలీసులు తెలిపారు. ఘటనపై ఎస్సై మోహన్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.



నాగరాజు

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	24,000
పాతకాయ: గండేరా	25,000
గటగట	26,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-20,000
కొత్త (పచ్చి) కాయ	18,000-20,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	4,500
కిలో	300

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	93-00
రిటైల్ లైవ్	115-00
డ్రెస్డ్	167-00
స్కిన్‌లెస్	190-00

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

AUTO
VEHICLES WANTED
Wanted Vehicle: అశోక్ లేలాండ్ దోస్త్, టాటా ఇంట్రా, టాటా పికప్ వాహనాలు నెలవారి అద్దె ప్రాతిపదికన ప్రముఖ కంపెనీకి వాహనం అద్దెకు కావలెను. సంప్ర: ✆: 63022 27985.

HEALTH & CARE
మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్, షుగర్‌కు. రాజమండ్రి (ఇంతకు ముందు మెట్రో లాడ్జి) ఇప్పుడు same క్యాంప్. శ్రీసాయిలక్ష్మీ లాడ్జిలో మందులు. SVG మార్కెట్ రోడ్, ఆర్.టి.సి. బస్టాండ్ ఎదురుగా, ప్రతీ నెల 3, 17 తేదీల్లో.

REAL ESTATE
FLAT FOR SALE
KAKINADA CITY
Kakinada 2 BHK Flat 1000 sft, Kanna Enclave, Gudarigunta, NFCL Road, Kakinada with Car Parking, Near RTO Off. Ph: 63794 37423.

HOUSE FOR SALE
GENERAL
Kkd & సామర్లకోటలో 45 లక్షలు & 30 లక్షలకే, House (85 లక్షలు, 1.20 లక్షలకే విల్లా), Open Sites అమ్మకం. 80% లోన్ Kuda, 98490 40891.

EENADU for Advertisement Contact: 8008597607

PLOT FOR SALE
RAJAMAHENDRAVARAM RURAL
రాజమండ్రి, బొమ్మూరులో తక్షణం ఇల్లు కట్టుకొనుటకు అన్ని సదుపాయములతో 150 చ॥గ॥ RUDA అప్రూవ్డ్ స్థలములు అమ్మకం. బ్యాంక్ లోన్ సదుపాయం కలదు. ✆ 78424 28888.

రాజమండ్రి, పిడింగొయ్యి, లోటస్ స్కూల్ దగ్గర, N/F 40x70 కొలతలతో 311 గజాల స్థలం (3 బిట్లు-933 గజాలు) అమ్మకమునకు కలదు. (డైరెక్ట్ పార్టీస్ మాత్రమే). Govt. Rate గజం 22,000/-. Ph: 63794 37423.

JOBS
అభినయ ఎంటర్‌ప్రైజెస్, రాజమండ్రి. టాటా సోలార్ నందు పనిచేయుటకు అనుభవంగల టెక్నీషియన్స్ & కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. Contact: 94924 44555.

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో+ వ+ మంచి జీతం + ఇన్సెంటివ్స్ కలవు. 99590 21122/ 99590 31122.

కావలెను
మా ఆఫీస్ నందు పనిచేయుటకు ఆఫీస్ అసిస్టెంట్ (F) మరియు సైట్ సూపర్‌వైజర్స్(M) కావలెను. Qul: డిగ్రీ, Exp: 2 yrs., 2 వీలర్ మస్ట్
OSTRICH
Axis బ్యాంక్ పైన, దానవాయిపేట రాజమండ్రి. సెల్: 93462 16570

రామకృష్ణ ఓల్డేజ్ హోం, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్లు సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో. వ. + జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ✆ 92814 52845, 82475 00574.

WANTED
High School Teachers
RAVINDRA HIGH SCHOOL, Madiki
Location: Madiki, in between Jonnada and Vemagiri, Near NH16 Highway.
Need Telugu, English, and Physics High School Teachers.
Phone Number
91105 67164
95334 31103

రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No-1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+ వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119430, 9618802390.

ప్రభాకరనిధి, దేవిచౌక్, రాజమండ్రి నందు బిజినెస్ ప్రమోషన్ చేయుటకు అభ్యర్థులు కావలెను. ఆసక్తిగలవారు సంప్రదించండి. సెల్: 79952 33384.

శివకార్తికేయ హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు ఇంటి/ వంట పనిచేయుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 20K. ✆ 99120 11499, 99120 11899.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-70 పైసలు
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

రాజోలు

• రాజోలు • కొత్తపేట • పి.గన్నవరం

విరాళం ఇచ్చిన దాతలకు రశీదు అందిస్తున్న ఆలయ ట్రస్టు సభ్యులు

అయ్యప్ప ఆలయ అభివృద్ధికి వితరణ

మలికిపురం, న్యూస్‌టుడే: స్థానిక శ్రీహరిహరసుత అయ్యప్పస్వామి ఆలయ అభివృద్ధికి టేకిశెట్టిపాలేనికి చెందిన పులపర్తి సుబ్బారావు (తాతాజీ), జయలక్ష్మి దంపతులు (ఎన్నారై), వారి కుటుంబ సభ్యులు రూ.1.70 లక్షల విరాళం సమకూర్చారు. దాత కుటుంబానికి చెందిన వలవల సునీల్‌కుమార్, సంతోషిరాజశ్రీ దంపతులను సన్మానించారు. పూజారి నందన్‌నంబూద్రి, ఆలయ ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చేపట్టిన ఏకకాల నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విశాఖపట్నంలో గాజువాకకు చెందిన శ్రీసాయి వైష్ణవి ఇన్‌ఫ్రా సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ అధినేత నాగబిల్లి అప్పలరాజు, సంతోషి దంపతులు రూ.50,001 విరాళాన్ని బుధవారం అందజేశారు. వీరికి స్వామివారి చిత్రపటం అందించి దేవస్థానం ఈవో ఎన్ఎస్ చక్రధరరావు అభినందించారు.

దాతకు చిత్రపటం అందజేస్తున్న ఈవో చక్రధరరావు

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: రాజోలు: 80085 74174 పి.గన్నవరం: 80085 74229 కొత్తపేట: 90323 93884

అనుసంధాన రహదారిని సరిచేశారు

స్పందనకు వందనం

మలికిపురం: స్థానిక వినాయకుడి ఆలయం కూడలిలో ప్రధాన రోడ్డును కలిసే అనుసంధాన రహదారిని సరిచేసి సౌకర్యాన్ని మెరుగు పర్చారు. ఇక్కడ పంట కాలువపై కల్వర్టు నుంచి ప్రధాన రహదారి వరకు ఉన్న అనుసంధాన రహదారి గుంతలు పడి వాహన చోదకులు ఇబ్బందులకు గురవుతున్నారని సర్పంచి గెద్దం రాజ్యలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి తాడి ఏసు దృష్టికి తీసుకువెళ్లగా, గుంతలను గ్రావెల్ కంకరతో పూడ్చించారు.

వ్యర్థాల తొలగింపు

అంబాజీపేట: పుల్లేటికుర్రు పంచాయతీ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పేరుకుపోయిన వ్యర్థాలను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. ప్రధాన రహదారి, వీవర్స్‌కాలనీ, మార్కెట్‌పాలెం తదితర ప్రాంతాల్లో వ్యర్థాలు పేరుకుపోయి గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. విషయాన్ని సర్పంచి జల్లి బాలరాజు, కార్యదర్శి బి.లక్ష్మీపతి వద్ద ప్రస్తావించగా స్పందించి శుభ్రం చేయించారు.

డ్రెయినేజీ శుభ్రం

రావులపాలెం పట్టణం: రావులపాలెం మండలం దేవరపల్లిలో డ్రెయినేజీ పూడిక పోవడంతో మురుగునీరు ముందుకు పారక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను ఎంపీడీవో మహేష్ దృష్టికి తీసుకువెళ్లగా సిబ్బందిని పంపి డ్రెయినేజీలో పూడికతీత తీయించారు.

నీరు పుష్కలం.. సాగు సఫలం

పి.గన్నవరం, అంబాజీపేట, న్యూస్‌టుడే: పి.గన్నవరం నియోజకవర్గంలో ఖరీఫ్ సాగు పనులు ఊపందుకున్నాయి. జూన్ ఒకటిన కాలువలకు సాగునీరు విడుదల చేశారు. అయిదేళ్ల తరువాత కూటమి ప్రభుత్వం పుణ్యమాని పంట కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడంతో శివారు ఆయకట్టుకు నీరు చేరుతుంది. దీంతోపాటు తొలకరి వర్షాలు పడుతుండటంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. నియోజకవర్గంలోని పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి, మామిడికుదురు మండలాల్లో మొత్తం ఖరీఫ్‌సాగు విస్తీర్ణం 20,295 ఎకరాలుకాగా ఇప్పటికి 30 శాతం నారుమళ్లు పూర్తయ్యాయి. నెలాఖరుకు నూరు శాతం నాట్లు పూర్తిచేయాలని వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలోకివెళ్లి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. ఇలాచేస్తే నవంబరు 15 నాటికి ఖరీఫ్ సీజన్ పూర్తవుతుంది. అనంతరం రబీ సీజన్ సకాలంలో మొదలై మార్చి 31 నాటికి కోతలు వస్తాయని వివరిస్తున్నారు. మూడో పంట అపరాలు సాగు చేసుకునేందుకు సమయం సరిపోతుందని రైతులకు వివరిస్తున్నారు. కొంతమంది రైతులు విత్తనాలను వెదజల్లుతున్నారు.

నియోజకవర్గంలో ఇలా..

మండలం	ఆయకట్టు (ఎకరాల్లో)	అవసరమైన నారుమళ్లు	ఇంతవరకు పోసిన నారుమళ్లు	నేరుగా వెదజల్లటం
అయినవిల్లి	8291	300	82.05	--
పి.గన్నవరం	6284	238	135.40	25
అంబాజీపేట	3147	105	57.00	--
మామిడికుదురు	2575	95	15.00	--

పి.గన్నవరంలో దమ్ము పనులు

రైతులు సీజన్ అందిపుచ్చుకోవాలి

రైతులు ఖరీఫ్ సీజన్ అందిపుచ్చుకోవాలి. నవంబరు 15 నాటికి కోతలు పూర్తయితే పంట చేతికొస్తుంది. తుపాన్లు, అధిక వర్షాల నుంచి బయటపడొచ్చు. ఎం.టి.యు 7029, ఎం.టి.యు 1318 రకాలు సాగు చేస్తున్నారు. ఈ రకం చేలు గాలులకు పడిపోవు. యూరియా తదితర ఎరువులకు కొరతలేదు. – సీహెచ్‌డీ విజయకుమార్, ఏడీఏ, పి.గన్నవరం వ్యవసాయ సబ్‌డివిజన్

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి

అంబాజీపేట: క్షయ వ్యాధిపై అవగాహన పెంపొందించి నిర్మూలనకు కృషి చేయాలని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్‌వో భరతలక్ష్మి కోరారు. పుల్లేటికుర్రు పంచాయతీ పరిధి వ్యాఘ్రేశ్వరంలో ఎన్‌టీఈపీఎస్ గుంటూరుకు చెందిన స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం వైద్యశిబిరం నిర్వహించారు. ముక్కామల పీహెచ్‌సీ వైద్యులు సుమప్రియ, సర్పంచి జల్లి బాలరాజు, సీహెచ్‌వో రవికుమార్ పాల్గొన్నారు.

ఎంపీపీ కుటుంబానికి ఎమ్మెల్సీ పరామర్శ

సఖినేటిపల్లి, రాజోలు: రాజోలు ఎంపీపీ కేతా శ్రీనివాసరావు జీవిత భాగస్వామి మృతి చెందడంతో ఆయన కుటుంబ సభ్యులను ఎంపీ హరీష్‌మాధుర్, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం, తెదేపా శ్రేణులు బుధవారం సఖినేటిపల్లి మండలం వి.మెరకలో పరామర్శించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

భక్తుల మనోభావాలకు అనుగుణంగా పనిచేయాలి

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో భక్తుల మనోభావాలకు అనుగుణంగా పనిచేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. ఆయన బుధవారం ఆలయ అభివృద్ధిపై సమీక్షించారు. అరకొర వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామని ఆలయంలో తాత్కాలిక సిబ్బంది తమ సమస్యలను ఏకరువు పెట్టారు. తొలుత అర్చకుల వసతి గృహ సముదాయం వద్ద విద్యుత్తు నియంత్రికను ఎమ్మెల్యే ప్రారంభించారు. **కొత్తపేట:** మండలంలో మందేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరిశీలించారు. భక్తుల కోసం దర్శనం, స్వామివారికి కల్యాణ మండపం నిర్మిస్తామన్నారు.

సేవల్లో నిబద్ధతతో ప్రజల్లో గుర్తింపు

కొత్తపేట: నిబద్ధతతో సేవలందించిన వారు ప్రజలు, అధికారుల గుర్తింపు పొందుతారని డీఎల్‌డీవో బి.వి.రాజేశ్వరరావు, డీపీవో రాజు అన్నారు. కొత్తపేట డిప్యూటీ ఎంపీడీవోగా పనిచేసిన డి.సుబ్బారావు ఉద్యోగ విరమణ చేయడంతో బుధవారం ఎంపీడీవో నరేష్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సన్మానసభ నిర్వహించారు. సుబ్బారావు అందించిన సేవలను అధికారులు, నాయకులు కొనియాడారు. ఎంపీపీ మార్గాని గంగాధర్, సర్పంచులు భూసి జయలక్ష్మి, పల్లి భీమారావు, త్సామాబాబు, రెడ్డి చంటి, సాగి బంగార్రాజు, మండల పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

సుబ్బారావు దంపతులను సత్కరిస్తున్న అధికారులు, నాయకులు

హామీలను అమలు చేస్తూ సుపరిపాలన

మాజీ మంత్రి చిక్కాల రామచంద్రరావు

పి.గన్నవరంలో కరపత్రం ఇస్తున్న చిక్కాల, నామన తదితరులు

పి.గన్నవరం, అంబాజీపేట, న్యూస్‌టుడే: ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోందని మాజీ మంత్రి, పి.గన్నవరం నియోజకవర్గ పరిశీలకుడు చిక్కాల రామచంద్రరావు అన్నారు. బుధవారం పి.గన్నవరం భవానీ కాలనీలో ఏర్పాటు చేసిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సంపద సృష్టిస్తూ పేదలకు అందిస్తున్నారన్నారు. చిక్కాలతో పాటు నాయకులు ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. నియోజకవర్గ తెదేపా కన్వీనర్ నామన రాంబాబు, పరిశీలకుడు షేక్ సుభాన్, డొక్కా నాథ్‌బాబు, జగన్నాథం, అంబటి భూలక్ష్మి పాల్గొన్నారు. ● **ఆత్రేయపురం:** వాడపల్లి వెంకటేశ్వరస్వామిని దర్శించుకున్న అనంతరం గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం ఏడాదిపాలనలో హామీల అమలు, సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. ● **అయినవిల్లి:** కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పేద, మధ్యతరగతి ప్రజలకు ఎంతో మేలు కలుగుతుందని తెదేపా జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి అన్నారు. తొత్తరమూడిలో ఇంటింటికీ వెళ్లి ప్రచార కరపత్రాలు పంచారు. మాజీ ఎమ్మెల్యే రెడ్డి సుబ్రహ్మణ్యం, ఏఎంసీ ఛైర్మన్ చిట్టూరి శ్రీనివాసరావు, మండల తెదేపా అధ్యక్షుడు వస్సా శ్యామ్‌సుందర్ పాల్గొన్నారు. ● **అంబాజీపేట:** పసుపల్లిలో ఇంటింటికీ వెళ్లి తెదేపా జిల్లా అధ్యక్షురాలు రెడ్డి అనంతకుమారి, పి.గన్నవరం నియోజకవర్గ పరిశీలకుడు షేక్ సుభాన్ కరపత్రాలు పంచారు. రాష్ట్ర ఎస్సీ విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి చిర్రా బాలవిజయరావు, జిల్లా అధికార ప్రతినిధి దాసరి వీరవెంకటసత్యనారాయణ, పార్టీ మండల అధ్యక్షుడు గూడాల ఫణి, నాయకులు పాల్గొన్నారు. అంబాజీపేటలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, నాయకులు గణపతి వీరరాఘవులు, డొమ్మేటి శ్యామ్, మేడిద శ్రీను, డొమ్మేటి వెంకటరమణ, నైనాల ప్రభాకర్ పాల్గొన్నారు. ● **మామిడికుదురు:** ఆదుర్రు, పాశర్లపూడి, అప్పనపల్లి తదితర గ్రామాల్లో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బోనం బాబు, నాయకులు మొల్లేటి శ్రీనివాస్, దుట్టు గిరి కిషోర్, గంధం బాస్కర్, కోలా రామకృష్ణ, మల్లాడి విష్ణు, ఆదుర్రు సర్పంచి బళ్ల శ్రీనివాసరావు తదితరులు పర్యటించి కరపత్రాలు పంచారు.

వాడపల్లిలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే బండారు

తొత్తరమూడిలో రెడ్డి సుబ్రహ్మణ్యం, అనంతకుమారి తదితరులు

ఆదుర్రులో కరపత్రాలు అందజేస్తున్న తెదేపా నాయకులు

గుర్రాలపై పీర్ల ఊరేగింపు

మామిడికుదురు, న్యూస్‌టుడే: మొహర్రం కార్యక్రమంలో ఏడో రోజైన బుధవారం నగరంలో ముస్లిం సోదరులు గుర్రాలపై పీర్లను ఊరేగించారు. ముహమ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్, ఆతని పరివారానికి జక్రిప్రతన్నలతో నివాళి అర్పించారు. హజ్రత్ అబ్బాస్ పంజాలో మేరిండి మజ్లిస్ జరిగింది. ప్రవచకులు మహ్మదలీ జాఫరీ కర్బలా యుద్ధంలో అమరత్వం పొందిన షహీదుల త్యాగాన్ని వివరించారు. ఆరు గుండెలు బాదుకుంటూ మాతం చేశారు.

ఊరేగింపులో ముస్లిం సోదరులు

అతిసార వ్యాధిపై నిర్లక్ష్యం వద్దు

అంబాజీపేట: వర్షాకాలంలో వ్యాధులు అధికంగా ప్రబలే అవకాశం ఉందని, అతిసారపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అంబాజీపేట పీహెచ్‌సీ సీహెచ్‌ఓ బి.ఇన్నయ్య సూచించారు. మాచవరం జయంతినగర్‌లో బుధవారం అతిసారాపై అవగాహన కల్పించారు. ఈ వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంఎల్‌హెచ్‌పి అనూష, ఎఎన్ఎం ఆకుమర్తి వరప్రసాద్ పాల్గొన్నారు.

మాచవరంలో అవగాహన కల్పిస్తున్న సీహెచ్‌ఓ ఇన్నయ్య

అయినవిల్లి: పరిసరాల శుభ్రత, దోమల నివారణతోనే డెంగీ నియంత్రణ సాధ్యమవుతుందని పెదపట్నంలంక పీహెచ్‌సీ వైద్యాధికారి డా. సాయికిరణ్ తెలిపారు. డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా బుధవారం పీహెచ్‌సీ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డెంగీ వ్యాధి నియంత్రణపై ఈ నెల 31 వరకు ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పిస్తారు. వైద్య సిబ్బంది, ఆశాలు, ఎఎన్ఎంలు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. **మామిడికుదురు:** డెంగీ రాకుండా అంతా అప్రమత్తంగా ఉండాలని, దోమలను నివారించడంతో పరిసరాలను నిత్యం శుభ్రంగా ఉంచాలని లూటుకుర్రు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఈదరాడలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. నీరు నిల్వ ఉండకుండా, ఇళ్లలోకి దోమలు రాకుండా చూడాలని సూచించారు. డెంగీ లక్షణాలపై అవగాహన కల్పించారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్తబుట్టలు కొందరికేనా?

అంబాజీపేట, న్యూస్‌టుడే: తడి, పొడి చెత్తను వేరుచేసి అందించాలని పంచాయతీ అధికారులు నిత్యం ప్రచారం చేస్తున్నారు. జిల్లాలోనే అతిపెద్ద మేజర్ పంచాయతీ అయిన మాచవరంలో మాత్రం ఇప్పటికీ కొంతమందికి బుట్టలు సరఫరా చేయలేదు. ఇక్కడ దాదాపు 20 వేల జనాభా ఉండగా రోజుకు రెండు టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిని తడి, పొడి చెత్తగా వేరు చేసేందుకు నీలం, ఆకుపచ్చ రంగుల బుట్టలను ప్రభుత్వం సరఫరా చేసింది. కొంతమందికే అందించడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సర్పంచి నాగాబత్తుల శాంతకుమారిని వివరణ కోరగా అందరికీ పంపిణీ చేస్తామని చెప్పారు. సిబ్బంది కొరతతో అన్ని ప్రాంతాలకు సరఫరా చేయలేకపోయామన్నారు.

విద్యుత్తు సమస్యలు లేకుండా చర్యలు : బండారు

రావులపాలెం పట్టణం, ఆత్రేయపురం, రావులపాలెం గ్రామీణం: గ్రామాల్లో విద్యుత్తు సమస్యలు రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం కొత్తకాలనీలోని సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్లు, బ్రేకర్లు, ఆత్రేయపురం మండలం వాడపల్లిలో బ్రేకర్లను ఆయన బుధవారం ప్రారంభించారు. ఆత్రేయపురం, రావులపాలెం, ఈతకోట సబ్‌స్టేషన్ పరిధిలో రూ.4.32 కోట్లతో ప్రత్యేక పరికరాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రావులపాడులో 100 కె.వి. ట్రాన్స్‌ఫార్మర్లు, ఈతకోట సబ్‌స్టేషన్‌లో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఎమ్మెల్యే బండారు ప్రారంభించారు.

కూలితే అంతే..

వాకలగరువు గ్రామం మత్స్యకారపేటలో వైనతేయ గోదావరి నది ఉద్ధృతికి గట్టు కొట్టుకుపోతోంది. ఇక్కడ ఉన్న విద్యుత్తు స్తంభం కూలేందుకు సిద్ధంగా ఉంది. ఒకవేళ పడిపోతే ఈ ప్రాంతానికి విద్యుత్తు సరఫరా నిలిచిపోతుంది. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. మండల విద్యుత్తుశాఖ ఉప ఇంజినీర్ కాకర మోహన్‌ను వివరణ కోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, అంబాజీపేట

సచివాలయ భవనం.. అసంపూర్తి నిర్మాణం..

తూర్పుపాలెంలో నాలుగేళ్ల క్రితం రూ.40 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన సచివాలయ భవన నిర్మాణం నిధుల కొరతతో నిలిచిపోయింది. రెండంతస్తులకుగాను మొదటి స్లాబు వేశారు. గోడల నిర్మాణం జరగలేదు. ప్రస్తుతం సచివాలయాన్ని స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహిస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఎం.సింధు మాట్లాడుతూ నిధుల లభ్యతను బట్టి పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. - న్యూస్‌టుడే, మలికిపురం

వ్యర్థాలు గుట్టలుగా.. కాలువ దుర్భరంగా

మొగలికుదురు వద్ద ప్రధాన పంట కాలువలో వ్యర్థాలు చేరడంతో జలాలు కలుషితంగా మారాయని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. నీటిపారుదలకు ఆటంకం ఏర్పడటమేగాక దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. 2,229 ఎకరాల వరిచేలతోపాటు అరవపాలెం, ముత్యాలపాలెంలో సమగ్ర రక్షిత నీటి ప్రాజెక్టులకు ఈ నీరే ఆధారమైనా ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇక్కడి దుస్థితిని తాటిపాక నీటి సంఘం అధ్యక్షుడు కడలి కృష్ణమోహన్ దృష్టికి తీసుకువెళ్లగా కాలువలో, పేరుకుపోయిన చెత్త, ఇతర వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు చేపడతామన్నారు. - న్యూస్‌టుడే, మామిడికుదురు

శిథిల కల్వర్టు తొలగింపు

పి.గన్నవరం: శివకోడు-మానేపల్లి ర.భ.శాఖ రహదారిలో వాడ్రేవుపల్లి-మానేపల్లి మధ్య ఉన్న కల్వర్టు శిథిలావస్థకు చేరుకుని ప్రమాదభరితంగా మారింది. నాలుగు రోజుల క్రితం ఒకవైపు కుంగిపోవడంతో ముందుజాగ్రత్త చర్యగా అధికారులు పూర్తిగా తొలగించేశారు. ఆ ప్రదేశంలో పైపులు ఏర్పాటు చేశారు. దీనిపై గ్రావెల్ వేసి తాత్కాలిక కల్వర్టు ఏర్పాటు చేస్తున్నారు. ఈ పనులతో వాడ్రేవుపల్లి నుంచి మానేపల్లి వెళ్లే ప్రజలు కొబ్బరి తోటల్లోంచి రాకపోకలు సాగిస్తున్నారు. ఆర్.సి.సి. కల్వర్టు నిర్మాణం చేపట్టాలంటే రూ.30 లక్షలు అవసరం ఉంటుందని, ఈలోగా రాకపోకలకు ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ర.భ.శాఖ డీఈఈ జి.రాజేంద్ర తెలిపారు.

విద్యుత్తు తీగలపై పడిన చెట్టు

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

ఆలమూరు, న్యూస్‌టుడే: మడికిలో బుధవారం ఉదయం 11 కేవీ విద్యుత్తు తీగలపై కొబ్బరిచెట్టు పడిపోవడంతో స్తంభం కూలిపోయింది. ఈ ఘటనలో ఆరుబయట ఉన్న ఇద్దరు యువకులు, ఇంటి వద్ద నిలబడి ఉన్న గృహిణి, చిన్నారి త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. 216వ జాతీయ రహదారి నుంచి దుళ్ల వెళ్లే రహదారిలో ఓ ఇంటి వద్ద ఉన్న గృహిణిని ఇద్దరు యువకులు పని నిమిత్తం అడుగుతుండగా సమీపంలోని కొబ్బరిచెట్టు విరిగి 11 కేవీ విద్యుత్తు లైన్‌పై పడింది. తీగలు తెగిపడటం, ఒక యువకుడు రెప్పపాటులో తప్పించుకున్న దృశ్యం సీసీ టీవీలో నమోదు కావడంతో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. విద్యుత్తు తీగలు తెగిపడిన వెంటనే చొప్పెల్ల సబ్‌స్టేషన్ నుంచి సరఫరా నిలిచిపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే ఆలమూరు ఏఈ డీఎంకే దుర్గాప్రసాద్, ఎల్ఐ సుబ్రహ్మణ్యం ఘటనా స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన స్తంభాన్ని ఏర్పాటు చేసి సరఫరా పునరుద్ధరించారు. కాలువగట్లపై ఒకవైపు ఒరిగి ఉన్న కొబ్బరిచెట్లను కూడా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్ లైను పునరుద్ధరిస్తున్న సిబ్బంది

కొనసాగుతున్న పోలీస్ పికెట్

అంబాజీపేట: మాచవరం పంచాయతీ పరిధి హడ్కోకాలనీలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది. ఇక్కడ బీఆర్ అంబేడ్కర్, ఇందిరాగాంధీ విగ్రహాల చెంతన గత నెల 21న అర్ధరాత్రి ఓ వర్గానికి చెందినవారు బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు చేసిన నేపథ్యంలో వివాదం నెలకొంది. ఓ వర్గం బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం తీసేయాలని, మరోవర్గం ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యను శాంతియుతంగా పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే కమిటీలను వేశారు. ఇంకా కొలిక్కి రాకపోవడంతో గత 12 రోజులుగా పోలీస్ పికెట్‌ను కొనసాగిస్తున్నారు.

ఉన్నతంగా చదువుకోవాలి

కె.ఏనుగుపల్లిలో విద్యార్థులతో ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

పి.గన్నవరం, న్యూస్‌టుడే: ప్రతి విద్యార్థి ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నతంగా చదువుకోవాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. బుధవారం కె.ఏనుగుపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లు అందించారు. సర్పంచి తోలేటి బంగారునాయుడు, ఎంపీటీసీ సభ్యుడు కొల్లే సూర్యనారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎలిజబెత్, తోలేటి సత్తిబాబు, శేరు శ్రీనుబాబు, మహిపాల తాతాజీ, వాసంశెట్టి కుమార్, తాటికాయల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: గుడిమెళ్లంక జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు విద్యార్థి మిత్ర కిట్లు అందజేశారు. సర్పంచి నల్లి విజయకుమారి, నాయకులు, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గూడపల్లి కొప్పిడివారిమెరక ఉన్నత పాఠశాలలో 110 మంది విద్యార్థులకు కిట్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు జి.వి.ఎస్.ప్రసాద్ సర్పంచి పెదపాటి సత్యనారాయణ, ఎస్ఎంసీ ఛైర్మన్ కానూరి వెంకట్రావు, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సుందర బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిమిత్ర కిట్ల పరిశీలన

రాజోలు: శివకోటిలో జడ్పీ ఉన్నత పాఠశాలను సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర స్టాక్ పాయింట్ రాష్ట్ర పరిశీలకుడు అబ్దుల్ ఖలీల్ తనిఖీ చేసి స్టాక్ పాయింట్‌లో కిట్లను పరిశీలించారు. ఏకరూప దుస్తులు, బూట్లు ఆయా పాఠశాలలకు త్వరితగతిన అందజేయాలని సూచించారు. విద్యార్థుల కాలి కొలతల ఆధారంగా బూట్లు సక్రమంగా ఇవ్వాలన్నారు. కిట్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఎంఈవోలు నల్లి మనోహరం, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

శివకోటిలో రికార్డులు తనిఖీ చేస్తున్న పరిశీలకుడు ఖలీల్

విద్యార్థిమిత్ర కిట్లతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

రహ'దారు'ణం

వాడపల్లి నుంచి మెర్లపాలెం రోడ్డు దుస్థితి

ఉచ్చిలి - వద్దిపర్రు రహదారి ఇలా..

ఆత్రేయపురం మహాలక్ష్మి గుడి వద్ద..

ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు గ్రామీణ ప్రాంతాల్లోని ర.భ., పంచాయతీరాజ్ రహదారులు నామరూపాల్లేకుండా తయారయ్యాయి. ప్రయాణికులు, ఆయా గ్రామాల ప్రజలు పడరానిపాట్లు పడుతున్నారు. కనీస మరమ్మతులు కూడా చేయకపోవడంతో దారుణంగా తయారయ్యాయి. ఆత్రేయపురం మండలంలో వాడపల్లి నుంచి మెర్లపాలెం వెళ్లే ర.భ. బ్యాంక్ కెనాల్ రోడ్డు మట్టిరోడ్డుగా మారిపోయింది. ఇటీవల సైఫన్ నిర్మాణ సమయంలో తవ్వేసి ఇటీవల పునరుద్ధరించారు. గ్రావెల్, తారువేసి పటిష్ఠం చేయకపోవడంతో బురదగా తయారైంది. వాడపల్లి ఆలయానికి రాకపోకలు సాగించే భక్తులతో పాటు గ్రామ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఉచ్చిలి చిన్నవసంతవాడ మీదుగా వద్దిపర్రు వెళ్లే ర.భ. రోడ్డు మోకాలిలోతు గోతులతో తటాకాన్ని తలపిస్తోంది. ర్యాలి నుంచి బుల్లెయ్యరేవు రోడ్డుదీ అదే పరిస్థితి. ఈ విషయాన్ని ర.భ. ఏఈ మణికుమార్, డ్రెయిన్స్ ఏఈ విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆత్రేయపురం మహాలక్ష్మి అమ్మవారి గుడి సమీపంలో ఎత్తిపోతల పథకం పంట కాలువ కల్వర్టు వద్ద రోడ్డు చిత్తడిగా మారింది. ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. వాహనాలు దిగబడిపోయి మొరాయిస్తున్నాయి. కనీస మరమ్మతులు చేయకపోవడంతో ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ సమస్యను పంచాయతీరాజ్ ఏఈ వీరభద్రరావు వద్ద ప్రస్తావించగా, మరమ్మతులు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. - న్యూస్‌టుడే, ఆత్రేయపురం

"మంచిపోరాటము పోరాడితిని నా పరుగు కడముట్టించితిని విశ్వాసము కాపాడుకొంటిని" తిమోతి 4:7

4వ వర్ధంతి

ప్రేమ, ఆప్యాయతలకు మారుపేరుగా నిలిచి, మంచితనంతో అందరి హృదయాలలో సుస్థిరస్థానం సంపాదించిన కీ.శే. చెవల శుభలక్ష్మి గారు ప్రభువు సాన్నిధ్యం చేరి 4 సం॥లు కాలం అయినా వారి మధురస్మృతులు మా మదిలో నిలిచే ఉంటాయి..

కీ.శే. చెవల శుభలక్ష్మి గారు
జననం: 13-06-1967 మరణం: 03-07-2021
పెదకందాలపాలెం

భర్త: చెవల కనకాంబరం

కుమారుడు: చెవల రాహుల్ కోడలు: మనీషా
కుమార్తెలు: మనీషా, తనీషా, రేవతి అల్లుడు: సైమన్‌రాజ్
తల్లిదండ్రులు: మాకే రాఘవులు - కమలావతి (లేటు)
అత్తమామలు: చెవల సుబ్బమ్మ - వెంకన్న (లేటు)
మరిదిలు: చెవల ఏసుదాసు - సుజాత (లేటు)
చెవల యోహోను (లేటు)

ఓం నమో వేంకటేశాయ నమః
దేవదాయ ధర్మదాయ శాఖ

శ్రీ బాలబాలాజీ దేవస్థానం, అప్పనపల్లి

మామిడికుదురు మండలం, డా॥ బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా.

సీల్డు టెండర్-కమ్-బహిరంగ వేలం ప్రకటన

ఆర్.సి.నెం. బి5/19-12/2025 తేది: 02-07-2025

డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా, మామిడికుదురు మండలం, అప్పనపల్లి గ్రామంలో వేంచేసియున్న శ్రీ బాలబాలాజీ స్వామివారి దేవస్థానము నందు ది.15-07-2025న ఈ క్రింది వాటికి సీల్డు టెండరు-కమ్ బహిరంగ వేలం నిర్వహించబడును.

వ.నెం.	వివరములు	కాల పరిమితి	ధరావతు రూ.
1.	శ్రీ స్వామివారికి భక్తులు సమర్పించిన తలనీలాలు (దేవస్థానం వారిచే ప్రోగుచేయబడినవి సుమారు 25 కేజీలు)	14-11-2024 నుండి 31-12-2024	50,000/-
2	శ్రీ స్వామివారికి భక్తులు సమర్పించిన బియ్యం (దేవస్థానం వారిచే ప్రోగుచేయబడినవి సుమారు 700 కేజీలు)	03-08-2024 నుండి 31-12-2024	20,000/-
3	వస్త్రములు సరఫరా చేయుటకు	అప్పగించిన తేదీ నుండి 1 సం॥ర కాలమునకు	20,000/-
4	ఖాళీ నూనె డబ్బాలు	--	2,000/-

షరతులు: 1. సదరు సీల్డు టెండర్లు శ్రీయుత కమిషనర్, దేవదాయ ధర్మదాయ శాఖ, ఏ.పి., అమరావతి, గొల్లపూడి వారి ఆమోదపు ఉత్తర్వులకు లోబడి ఆనుమతించబడును.
2. సీల్డు టెండర్‌లలో పాల్గొనువారు ధరావతును కార్యనిర్వహణాధికారి, శ్రీ బాలబాలాజీ దేవస్థానం వారి పేరున ఏదేని జాతీయ బ్యాంకు నుండి డి.డి. తీసి టెండర్‌తో జతపర్చవలెను లేదా నగదును టెండర్లు సమయములో చెల్లించవలెను. సీల్డు టెండర్లు దాఖలు చేయు ఆఖరు తేది. 15-07-2025 మ॥ 12 గంటలలోపు టెండర్ బాక్సు నందు వేయవలెను.
3. సీల్డు టెండర్లు అదేరోజు అనగా తేది. 15-07-25 మ॥ 01.00 లకు దేవస్థానం కార్యాలయం నందు టెండర్‌దారుల సమక్షంలో తెరువబడును.
4. ఇతర షరతులు మరియు వివరములు కార్యాలయం పనివేళలయందు ఫోన్ నెంబర్ 08862-239562, 94910 00720, 96523 23999 ద్వారా తెలుసుకొనవచ్చును.

అప్పనపల్లి,
02-07-2025

సహాయ కమిషనర్ మరియు కార్యనిర్వహణాధికారి

(c) eenadu

అమలాపురం

• అమలాపురం • ముమ్మిడివరం

పోక్సో చట్టంపై అవగాహన అవసరం

యానాం, న్యూస్‌టుడే: బాలికలు చెడు, మంచి స్పర్శల వ్యత్యాసాన్ని గుర్తించి ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని యానాం చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధి సంసాని రవికుమార్ కోరారు. స్థానిక పీఎంశ్రీ రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమ పాఠశాలలో విద్యార్థినులకు బాల్య వివాహాల వల్ల ఎదురయ్యే నష్టాలను వివరించారు. పోక్సో చట్టం, శిక్షలు గురించి బాలికలకు తెలియజేశారు. బాలికలకు ఎలాంటి కష్టం వచ్చినా 1098 నంబరుకు తెలియజేయాలన్నారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కొత్త లోగోను ఆవిష్కరించారు. కమిడి ప్రభాకరరావు, సూర్యసుందరి, హంసాని రామలక్ష్మణుడు తదితరులు పాల్గొన్నారు.

అవినీతి లెక్క తేల్చుతాం: దాట్ల

తాళ్లరేవు: వైకాపా ప్రభుత్వంలో పేదల ఇళ్ల స్థలాల కోసం భూముల కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై లెక్క తేల్చుతామని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. గాడిమొగలో సర్పంచి కామాడి గోవలక్ష్మి, తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు సంగాడి కామేశ్వరరావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యేతో పాటుగా తెదేపా కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం భూముల కొనుగోళ్లలో రూ.కోట్లు దోచుకున్నారన్నారు. పొల్లంగి నుంచి నీలపల్లి వరకు ఇళ్ల స్థలాలకు కేటాయించిన భూములపై విచారణ చేయిస్తామన్నారు. సంక్షేమ పథకాలు గురించి అడిగి తెలుసుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

© ఉ॥ 10 - మ॥ 1 మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు

అమలాపురం పట్టణం: 79939 35935, గ్రామీణం: 91000 20948
అల్లవరం: 91548 46718, ముమ్మిడివరం: 80085 74166
కాట్రేనికోన: 79950 67044 ఉప్పలగుప్తం: 91548 46716

సినిమారోడ్డులో మట్టి తొలగింపు

అగ్రహారంలో మురుగు..

సమస్య: అమలాపురం మద్దాలవారిపేట శివారు రోడ్డు పక్కన చెత్త, ప్లాస్టిక్ వ్యర్థాలు పేరుకుపోయాయి. తొలగించేలా చర్యలు తీసుకోవాలి. -శ్రీను, స్థానికుడు

సమస్య: కె.అగ్రహారం బ్యాంకు వీధి మురుగుకాలువలో పూడికలు తీసి అక్కడే వదిలేశారు. దుర్వాసన వస్తోంది. -శర్మ, స్థానికుడు

పరిష్కారం: మద్దాలవారిపేటలో చెత్త, సినిమారోడ్డులో మట్టి, వడ్డిగూడెం, శ్రీరామపురం శివారులో పిచ్చిమొక్కలు సమస్యలు తెలుపగా ఆయా వార్డుల సచివాలయ కార్యదర్శులు స్పందించారు. వారు సిబ్బందితో వాటిని తొలగింపజేశారు. కె.అగ్రహారం బ్యాంకువీధి మురుగుకాలువ వద్ద పూడికలు తీసేలా చర్యలు తీసుకుంటామన్నారు. -న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

సమస్య: అమలాపురం సినిమా రోడ్డు డివైడర్ పక్కన మట్టి ఉంది. అటుగా వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. -చంటి, వ్యాపారి

సమస్య: వడ్డిగూడెం రోడ్డులో పిచ్చిమొక్కలు పెరిగి ఇబ్బందికరంగా ఉంది. -వెంకటేష్, స్థానికుడు

సమస్య: శ్రీరామపురం శివారులో పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో కీటకాలు, దోమలు పెరిగిపోయాయి. -రాంబాబు, స్థానికుడు

సమస్య: ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని బళ్లగేటుసెంటర్ ప్రాంతంలో డ్రెయిన్ పూడిపోవడంతో నీరు ముందుకుసాగక దుర్వాసన వస్తోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. -ఎం.ఫణీశ్వరరావు

సమస్య: నగర పంచాయతీ పరిధిలోని మార్కెట్ ప్రాంతంలో చెత్త పేరుకుపోవడంతో ఇబ్బందులు పడుతున్నాం. -టి.సత్యనారాయణ

పరిష్కారం: బళ్లగేటుసెంటర్, మార్కెట్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన పారిశుద్ధ్య సిబ్బందితో వాటిని తొలగించి సమస్యను పరిష్కరించారు. -న్యూస్‌టుడే, ముమ్మిడివరం

సామాజిక భవనాలపై నిర్లక్ష్యం

న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం, కాట్రేనికోన

పలు గ్రామాల్లో సామాజిక భవనాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. రూ.లక్షల వ్యయంతో నిర్మాణ పనులు ప్రారంభించినా పూర్తి చేసేందుకు శ్రద్ధ చూపలేదు. కొన్ని చోట్ల ఇవి పాడైపోతున్నాయి. ఇవి అందుబాటులో లేకపోవడంతో వివాహ తదితర శుభ కార్యాలు నిర్వహించుకోవడానికి అధిక మొత్తాలు చెల్లించి ప్రైవేటు ఫంక్షన్ హాళ్లను ఆశ్రయిస్తున్నారు. గ్రామాల్లోని భవనాలను పూర్తిచేయాలని పలువురు కోరుతున్నారు.

చల్లపల్లిలో అసంపూర్తిగా నిలిచిపోయిన సామాజిక భవనం

గ్రామాల్లో పరిస్థితి..

● ఉప్పలగుప్తం మండలం చల్లపల్లిలో ఆరేళ్ల క్రితం సుమారు రూ.50 లక్షలతో కాపు సామాజిక భవనం నిర్మించారు. గత ప్రభుత్వం నిధులు మంజూరు చేయక చివరి దశలో నిలిచిపోయింది. భవనం లోపల స్టేజ్, ఫ్లోరింగ్, విద్యుత్తు, తలుపులు తదితర పనులు చేపట్టాల్సి ఉంది. చినగాడవిల్లిలో రూ.50 లక్షలతో తలపెట్టిన కాపు సామాజిక భవనం పునాదుల్లో ఉంది. ఈ భవనాలను పూర్తిచేయాలని పలువురు కోరుతున్నారు. సన్నవిల్లిలో సుమారు 10 ఏళ్ల క్రితం నిర్మించిన సామాజిక భవనం అసంపూర్తిగా నిలిచిపోయింది. వర్షాల నేపథ్యంలో ఆయా గ్రామాల్లో శుభకార్యాలు నిర్వహించుకోవడానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చల్లపల్లి, చినగాడవిల్లి కమ్యూనిటీ భవనాలకు ప్రతిపాదనలు పంపించామని పీఆర్ జెఈ రాధాకృష్ణ తెలిపారు.

కాట్రేనికోనలో..

కాట్రేనికోన మండలంలో పలుచోట్ల గతంలో నిర్మించిన సామాజిక భవనాలు పాడయ్యాయి. కొన్నిచోట్ల నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. తిమ్మాపురంలో రూ.20 లక్షలతో చేపట్టిన శెట్టిబలిజ సామాజిక భవనం నిధులు చాలక నిర్మాణంలో నిలిచింది. మిలటరీపేటలోని సామాజిక భవనం పాడైంది. కాట్రేనికోనలో ఎస్సీ సామాజిక భవనం నిర్మించాలని స్థానికులు ఎప్పటి నుంచో కోరుతున్నా ఫలితం లేదు. అధికారులు స్పందించి నిర్మాణంలో నిలిచిన సామాజిక భవనాలను పూర్తిచేసి పాడైన వాటికి మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నాయుడు

దొణప్ప సేవలు మరువలేనివి

యానాం, న్యూస్‌టుడే: తెలుగు విశ్వవిద్యాలయం తొలి ఉప కులపతి ఆచార్య తూమాటి దొణప్ప శతజయంతి సందర్భంగా ఆయన సాహిత్యంపై ఎన్.సుధాకరనాయుడు రాసిన 'విశిష్ట తెలుగు దిగ్గజం' పుస్తకం ఆవిష్కరణ సభ రీజెన్సీ అతిథిగృహంలో కవి దాట్ల దేవదానంరాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. దొణప్ప తెలుగు సాంస్కృతిక రంగానికి అందించిన సేవలను దేవదానంరాజు వివరించారు. పుస్తకాన్ని రీజెన్సీ సంస్థల అధినేత డాక్టర్ జీవన్ నాయుడు ఆవిష్కరించారు. సమావేశంలో యానాం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ కార్యదర్శి ఈలప్రోలు విష్ణువర్ధనరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం: రీజెన్సీ పబ్లిక్‌స్కూల్‌లో పదో తరగతి టాపర్లుగా నిలిచిన మౌనిక(589), శ్రీరామ్(588), నిషాంత్(584), తనూజ(583), మేఘన(581)ను ఛైర్మన్ డాక్టర్ జీవన్ నాయుడు సత్కరించారు. బుధవారం నాయుడుకాలనీలో నివసిస్తున్న పదిశ్రమ విశ్రాంత ఉద్యోగులతో సమావేశం నిర్వహించిన అనంతరం రీజెన్సీ పబ్లిక్‌స్కూల్, జూనియర్ కళాశాలల్ని సందర్శించారు.

బిల్లులు చెల్లించాలని వినతి

అమలాపురం పట్టణం, న్యూస్‌టుడే: వైకాపా పాలనలో పెండింగ్‌లో ఉన్న జిల్లా పరిషత్తు పనుల బిల్లులు రూ.6 కోట్లు చెల్లించాలని జిల్లా పంచాయతీరాజ్ డివిజన్ గుత్తేదారుల సంఘం అధ్యక్షుడు అల్లాడ వెంకటరమణ కోరారు. ఆయన ఆధ్వర్యంలో గుత్తేదారులు బుధవారం జిల్లా అధికారులను కలిసి వినతిపత్రం అందజేశారు. జిల్లా ఛైర్మన్, కలెక్టర్, ఎమ్మెల్యేలు, జడ్పీ సీఈవో, జడ్పీటీసీ సభ్యులకు ఈ మేరకు విన్నవించామని వెంకటరమణ తెలిపారు.

నేడు ప్రైవేట్ పాఠశాలలకు సెలవు

అమలాపురం పట్టణం: రాష్ట్ర సంఘం పిలుపు మేరకు గురువారం జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు సంఘం కోశాధికారి సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు ఉదయం గడియారస్తంభం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్లనున్నారు.

భక్తుల మనోభావాలకు అనుగుణంగా పనిచేయాలి

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో భక్తుల మనోభావాలకు అనుగుణంగా పనిచేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. ఆయన బుధవారం ఆలయ అభివృద్ధిపై సమీక్షించారు. అర్చకులు, ఇతర సిబ్బంది తమ సమస్యలను ఏకరవు పెట్టారు. తొలుత అర్చకుల వసతి గృహ సముదాయం వద్ద విద్యుత్తు నియంత్రికను ఎమ్మెల్యే ప్రారంభించారు.

కొత్తపేట: మండపల్లిలో మందేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులను ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పరిశీలించారు. భక్తుల కోసం డార్మిటరీ, స్వామివారికి కల్యాణ మండపం నిర్మిస్తున్నామన్నారు.

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా భీమారావు

ముమ్మిడివరం, న్యూస్‌టుడే: కాట్రేనికోన మండలం దొంతికుర్రుకు చెందిన వాకపల్లి భీమారావు డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బహుజన సమాజ్ పార్టీ ఇన్‌ఛార్జిగా నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతంకుమార్ ఉత్తర్వులు ఇచ్చినట్లు భీమారావు ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా ఉన్న తనకు జిల్లా ఇన్‌ఛార్జితో పాటు.. ముమ్మిడివరం నియోజకవర్గ ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారని ఆయన తెలిపారు.

చంద్రబాబుతోనే రాష్ట్రం అభివృద్ధి: ఎమ్మెల్యే

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడితోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. బుధవారం రెడ్డిపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. తొలుత ఎమ్మెల్యే ఆనందరావు తాళ్లమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ పనితీరుపై ఆరా తీశారు. దశల వారీగా సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, అముడా ఛైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మాజీ ఎంపీపీలు బొర్రా ఈశ్వరరావు, యెరుబండి వెంకటేశ్వరరావు, జడ్పీటీసీ మాజీ సభ్యురాలు అధికారి జయవెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

అనాతవరంలో నాయకులతో ఎమ్మెల్యే దాట్ల

అల్లవరం: రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలకు మరింతగా మెరుగైన సేవలు అందించేందుకే సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ప్రవేశ పెట్టినట్లు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు తెలిపారు. బుధవారం తాడికోనలో ఈ కార్యక్రమం ప్రారంభించారు. మెట్ల రమణబాబు, అల్లాడి సోంబాబు, దెందుకూరి సత్తిబాబు రాజు, కడలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉప్పలగుప్తం: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలని అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. ఎస్.కొత్తపల్లిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి బుధవారం శ్రీకారం చుట్టారు.

కాట్రేనికోన: ఏడాది కూటమి పాలనలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను కూటమి నాయకులు, కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించాలని మండల తెదేపా అధ్యక్షుడు నడింపల్లి సుబ్బరాజు పేర్కొన్నారు. చెయ్యేరులో బుధవారం తెదేపా యూనిట్, బూత్ ఇన్‌ఛార్జులు, కో- కన్వీనర్లతో సమావేశం నిర్వహించారు. చెయ్యేరు, నడవపల్లిలో ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ పథకాలను వివరించారు. ఐ.వెంకటేశ్వరరావు, చెల్లి సురేష్, సుధీర్, గిడ్డి చంటి, సీతారామకృష్ణంరాజు, రమణారావు పాల్గొన్నారు.

తాడికోనలో పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

ముమ్మిడివరం: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అన్నారు. ప్రభుత్వం ఏడాది పూర్తయిన సందర్భంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' పేరుతో అనాతవరంలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరించి సమస్యలు తెలుసుకున్నారు. ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాలను ఒక్కొక్కటిగా ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. హామీల అమలును చూసి వైకాపా నాయకులు ఓర్వలేక అసత్యప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. నాగిడి నాగేశ్వరరావు, గొలకోటి దొరబాబు, చెల్లి అశోక్, తాడి నరసింహారావు, శివబాబు తదితరులు పాల్గొన్నారు.

తూడు తొలగించేదెన్నడు..?

ఉప్పలగుప్తం మండలం వాడపర్రు- కూనవరం పంటకాలువ తూడు, గుర్రపుడెక్కతో నిండిపోయింది. ఈ కాలువ పరిధిలో సుమారు 200 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. ప్రస్తుతం రైతులు నారుమడులకు నీరు అందక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను ఇరిగేషన్ జేఈ పవన్ దృష్టికి తీసుకువెళ్లగా పరిశీలించి తూడు తొలగిస్తామని ఆయన తెలిపారు. - న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

చినుకు పడితే మడుగే..!

ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోని ఒకటో వార్డు రాజుపాలెంలోని రహదారి ఇది. డ్రెయినేజీ వ్యవస్థ లేక కొద్దిపాటి చినుకులకే మడుగులా మారుతోంది. వర్షాకాలంలో రహదారి నీట మునిగి ప్రయాణానికి ఇబ్బందులు పడుతున్నామని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, ముమ్మిడివరం

మద్యం తాగి.. బస్టాండ్‌లో తిష్ఠ

యానాంలోని రాజీవ్‌గాంధీ మున్సిపల్ బస్టాండ్‌లో కొందరు మద్యం తాగిన వ్యక్తులు తిష్ఠవేయడంతో ప్రయాణికులు అసౌకర్యానికి గురవుతున్నారు. సమీపంలోని మద్యం దుకాణాల నుంచి మద్యం తెచ్చుకుని బహిరంగంగానే తాగి బస్టాండ్‌లోని బెంచీలు, కుర్చీల్లో వాలిపోతున్నారు. గతనెల ఈ బస్టాండ్‌పైన 100 మంది వరకు అర్ధరాత్రి జూదం ఆడుతుండగా సమీప ప్రాంత యువకులు ప్రశ్నించడంతో పరారయ్యారు. రాత్రిపూట జూదరులు, పగలు మందుబాబులతో ప్రయాణికులకు రక్షణ కొరవడింది. ఇక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, యానాం

ప్రమాదకరంగా రహదారి అంచు

అమలాపురంలోని భూపయ్యఅగ్రహారం వడ్డిగూడెం రోడ్డులో ప్రమాదం పొంచి ఉంది. సిమెంట్ రహదారికి, డ్రెయిన్‌కు మధ్య బెర్మ్ కుంగిపోయింది. ఇదే మార్గంలో పాఠశాలలు, ఆసుపత్రులు ఉన్నాయి. వాహనాలు ఏమాత్రం అదుపుతప్పినా ప్రమాదమే. ఈ సమస్యను సచివాలయ కార్యదర్శి దృష్టికి తీసుకువెళ్లగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. -న్యూస్‌టుడే, అమలాపురం పట్టణం

విద్యార్థులకు పుస్తకాల అందజేత

యానాం: ప్రభుత్వ సదుపాయాల్ని సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులు చక్కగా చదవాలని యానాం ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. పుదుచ్చేరి విద్యాశాఖ విద్యార్థులకు కేటాయించిన ఉచిత రాత పుస్తకాల పంపిణీని గిరియాంపేటలోని పెరుంతలైవర్ కామరాజర్ ప్రభుత్వ హైస్కూల్‌లో బుధవారం ప్రారంభించారు. ఒకటి నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 440 మంది విద్యార్థులకు పుస్తకాలు అందజేశారు. విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణప్రవీణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్తు సరఫరా నిలుపుదల

ఐ.పోలవరం, న్యూస్‌టుడే: మండలంలో ఈ నెల 4న విద్యుత్తు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఎగ్జిక్యూటివ్ ఇంజినీరు కె.రాంబాబు తెలిపారు. 11 కేవీ లైన్ నిర్మాణ పనుల నిమిత్తం ఆ రోజు సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గురుకులంలో ఆహార కమిషన్ సభ్యుల తనిఖీ

అమలాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: సమనసలోని మహాత్మాజ్యోతీబాపులే బీసీ బాలుర గురుకుల పాఠశాలను రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యులు జక్కంపూడి కృష్ణకిరణ్, ఇ.లక్ష్మీరెడ్డి బుధవారం తనిఖీ చేశారు. పాఠశాలలోని తరగతి, వసతి గదులను పరిశీలించారు. వంటశాలలోని ఆహార పదార్థాలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అన్నం సక్రమంగా ఉడకలేదని సిబ్బందిని నిలదీశారు.

అన్నం పరిశీలిస్తున్న ఆహార కమిషన్ సభ్యులు కృష్ణకిరణ్, లక్ష్మీరెడ్డి

నాణ్యమైన ఆహారం అందించాలి

అమలాపురం కలెక్టరేట్: సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యమైన ఆహారం అందించాలని రాష్ట్ర ఆహార భద్రతా కమిషన్ సభ్యులు తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లో వసతి గృహాలు, తూనికలు- కొలతల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నట్లు చెప్పారు. రాష్ట్ర ఆహార భద్రతా కమిషన్ సభ్యులు లక్ష్మీరెడ్డి, జక్కంపూడి కిరణ్, డీఎస్ఓ ఉదయ్ భాస్కర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రొయ్యల రవాణాకు తిప్పలు

వర్షం రొయ్య రైతుకు కష్టాలు తెచ్చింది. చల్లపల్లి- అమలాపురం పంటకాలువ ఆవలగట్టు మట్టిరోడ్డు కావడంతో వాహనాలు దిగబడిపోయి వెళ్లే అవకాశం లేదు. దీంతో ఓ రైతు బుధవారం ఎడ్ల బండి సాయంతో చెరువుల వద్ద రొయ్యలను తెచ్చి కిత్తనచెరువు పరిధి సీతారామపురం వద్ద పంటకాలువ మీదుగా దాటించి ప్రధాన రహదారికి చేర్చాడు. రహదారి నిర్మించి రైతుల కష్టాలను తీర్చాలని పలువురు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఉప్పలగుప్తం

సమాచారం తెలిసేదెలా..!

జాతీయ రహదారుల్లో ఏ ఊరు ఎంత దూరమో తెలుసుకునేందుకు ఏర్పాటు చేసే సూచిక బోర్డులు అధ్వానంగా మారుతున్నాయి. అమలాపురం మండలం భట్నవిల్లి జాతీయ రహదారిలో గతంలో ఏర్పాటు చేసిన ఈ బోర్డుపై సమాచారం కనిపించడం లేదు. అటుగా ప్రయాణాలు సాగించేవారు అసౌకర్యానికి గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చొరవ తీసుకుని ఈ బోర్డును సరిచేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

-న్యూస్‌టుడే, అమలాపురం గ్రామీణం

పర్యావరణ పరిరక్షణకు కృషి

ఉప్పలగుప్తం: పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని విలసవిల్లి సర్పంచి సలాది ఊర్మిళాదేవి అన్నారు. బుధవారం సచివాలయం ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. సలాది సతీష్ పాల్గొన్నారు.

యూనియన్ సమావేశం

కాట్రేనికోన: సిద్ధి వినాయక లైటింగ్, టెంట్‌హౌస్ ఓనర్స్ అసోసియేషన్ సమావేశం తాడి సుధీర్ ఆధ్వర్యంలో బుధవారం కందికుప్పలోని సాయిబాబా గుడి ఆవరణలో నిర్వహించారు. యూనియన్ సభ్యుల సమస్యలు, వివిధ అంశాలపై చర్చించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. శోభన్‌బాబు, నాగేశ్వరరావు, శ్రీనివాస్, ధర్మారావు, నాని, గణేష్, విష్ణు, నాగరాజు, కృష్ణ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఆఖరు మజిలీకి అష్టకష్టాలు

న్యూస్‌టుడే, ముమ్మిడివరం

ఆఖరు మజిలీలో అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఏర్పడింది. శ్మశాన వాటికల సమస్య తీవ్రంగా ఉంది. వీటి అభివృద్ధికి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో 2014-19లో నిధులు విడుదల చేసి కొన్ని పనులు ప్రారంభించగా.. తర్వాత వచ్చిన వైకాపా పూర్తిగా గాలికొదిలేసింది. దీంతో పనులు మధ్యలోనే నిలిచిపోయాయి. ఉపాధి హామీ పథకంలో వీటిని పూర్తి చేయాలని పలువురు కోరుతున్నారు.

గ్రామాల్లో ఇదీ పరిస్థితి..

ముమ్మిడివరం నియోజకవర్గంలో ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, తాళ్లరేవు మండలాల్లోని 63 గ్రామాల్లో సుమారు 125 శ్మశానవాటికలు ఉన్నాయి. వీటిలో ఎక్కడా కనీస సౌకర్యాలు లేవు. గ్రామాల్లో శ్మశానవాటికలన్నీ కాలువగట్లు, గోదావరి చెంతన ఉన్నాయి. ఎవరైనా మరణిస్తే అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి ఇబ్బందులు తప్పడం లేదు.

రహదారి సౌకర్యమూ లేదు

శ్మశాన వాటికలకు వెళ్లడానికి రహదారులు లేని పరిస్థితి కనిపిస్తోంది. కాలువలు, గోదావరి గట్ల వెంబడి ఉన్న శ్మశాన వాటికలకు వెళ్లడానికి రహదారి సౌకర్యాలు లేకపోవడం.. ఏటిగట్టు ఎత్తు నుంచి లంకల్లోకి దిగాలంటే తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. వంతెనలు లేక మోకాల్లోతు నీటిలోంచి మృతదేహాలను తీసుకువెళ్తున్న పరిస్థితులు ఉన్నాయి. కాట్రేనికోన మండలం గచ్చకాయలపోరలో ఉప్పుటేరు పర్రభూముల్లో అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి అక్కడ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐ.పోలవరం మండలం కేశనకుర్రు గ్రామంలో ఏటిగట్టు దిగి మృతదేహాన్ని శ్మశానవాటికకు తీసుకెళ్లడానికి ప్రజలు ఇక్కట్లు అన్నీ ఇన్నీ కావు. నియోజకవర్గంలోని 90 శాతం చాలా గ్రామాల్లో ఈ పరిస్థితులు కనిపిస్తున్నాయి.

కొత్తలంకలో నిలిచిపోయిన నిర్మాణం

మంజూరు 16.. పూర్తి 3

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో శ్మశాన వాటికల అభివృద్ధికి 2014-19లో ప్రతి గ్రామంలో ఒక్కొక్క పని మంజూరుకు అవకాశం కల్పించారు.

రహదారి నిర్మాణం, షెడ్లు, ఘాట్లలో మెట్లు వంటివి ఏర్పాటు చేయడానికి ఉపాధి హామీ పథకంలో రూ.7లక్షలు, దాతలు సాయం అందిస్తే మరో రూ.3 లక్షలు కలిపి రూ.10 లక్షలతో అభివృద్ధి చేపట్టాలని తొలుత భావించారు. ఎవరూ ముందుకు రాకపోవడంతో ఉపాధి హామీ పథకంలోనే పూర్తిగా నిధులు మంజూరు చేశారు. నియోజకవర్గంలోని 16 గ్రామాల్లో శ్మశాన వాటికలకు నిధులు మంజూరు కాగా.. ఐ.పోలవరం మండలంలో మాత్రమే మూడు శ్మశానవాటికలు పూర్తయ్యాయి. మరో ఏడు చోట్ల పనులు ప్రారంభించి వదిలేశారు. ముమ్మిడివరం మండలంలో 16 గ్రామాలకు అనాతవరం, కొత్తలంక, తాళ్లరేవు మండలంలో తాళ్లరేవు, కోరంగిలో పనులు మధ్యలో నిలిచిపోయాయి. కాట్రేనికోన మండలంలో ఆరు శ్మశానవాటికలకు నిధులు మంజూరైనా ఎక్కడా పనులు ప్రారంభం కాలేదు. కూటమి ప్రభుత్వంలోనైనా పనులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు

యానాం, న్యూస్‌టుడే: స్థానిక వెటర్నరీ ఆసుపత్రి సమీపంలోని పీర్ పంజా వద్ద బుధవారం ప్రత్యేక ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పీర్లకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. రాత్రి తొమ్మిది గంటల సమయంలో పంజా ఎదురుగా నిప్పులగుండం ఏర్పాటు చేశారు. డప్పుల మోతల నడుమ నిప్పులగుండం తొక్కుకుంటూ వెళ్లారు.

మామిడికుదురు, న్యూస్‌టుడే: మొహర్రం కార్యక్రమంలో ఏడో రోజైన బుధవారం నగరంలో ముస్లిం సోదరులు గుర్రాలపై పీర్లను ఊరేగించారు. మహ్మద్ ప్రవక్త మనవడు హజ్రత్ ఇమామ్ హుస్సేన్, అతని పరివారానికి భక్తిప్రపత్తులతో నివాళి అర్పించారు. హజ్రత్ అబ్బాస్ పంజాలో మెహందీ మజ్లిస్ జరిగింది. ప్రబోధకుడు మహ్మద్‌అలీ జాఫరీ కర్బలా పుణ్యభూమిలో అమరత్వం పొందిన షహజాదె ఖాసిం వీరత్వాన్ని వివరించారు. అంతా గుండెలు బాదుకుంటూ మాతం చేశారు.

(c) eenadu

మండపేట

• మండపేట • రామచంద్రపురం

కొనసాగుతున్న పోలీస్ పికెట్

అంబాజీపేట, న్యూస్‌టుడే: మాచవరం పంచాయతీ పరిధి హుస్సేన్‌కాలనీలో పోలీస్ పికెట్ కొనసాగుతోంది. ఇక్కడ బీఆర్ అంబేద్కర్, ఇందిరాగాంధీ విగ్రహాల చెంతన గత నెల 21న అర్ధరాత్రి ఓ వర్గానికి చెందినవారు బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఏర్పాటు చేసిన నేపథ్యంలో వివాదం నెలకొంది. ఓ వర్గం బాబూజగ్జీవన్‌రామ్ విగ్రహం తీసేయాలని, మరోవర్గం ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్యను శాంతియుతంగా పరిష్కరించాలని ప్రజాప్రతినిధులు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే కమిటీలను వేశారు. ఇంకా కొలిక్కి రాకపోవడంతో గత 12 రోజులుగా పోలీస్ పికెట్‌ను కొనసాగిస్తున్నారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

దాతకు చిత్రపటం అందజేస్తున్న ఈవో

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: వాడపల్లి వెంకటేశ్వరస్వామి ఆలయం వద్ద చేపట్టిన పకళామత నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విశాఖపట్నంలో గాజువాకకు చెందిన శ్రీసాయి వైష్ణవి ఇన్‌ఫ్రా సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత నాగలక్ష్మి అప్పలరాజు, సంతోష్ దంపతులు రూ.50,001 విరాళాన్ని బుధవారం అందజేశారు. వీరికి స్వామివారి చిత్రపటం అందించి దేవస్థానం ఈవో ఎన్ఎస్ చక్రధరరావు అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు
ఉ. 10 - మ. 1
మండపేట: 80085 74183
రామచంద్రపురం: 80085 74191

వీధి దీపాలు వెలిగాయి

స్పందనకు వందనం

రాయవరం, న్యూస్‌టుడే: సోమేశ్వరం నాగమంజీయుల కాలనీలో వీధి దీపాలు వెలగక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా' ద్వారా పంచాయతీ కార్యదర్శి పి.వెంకటరత్నం దృష్టికి తీసుకెళ్లారు. సమస్యపై కార్యదర్శి స్పందించి వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు.

తొలగిన నీరు..

ఈనాడు కథనానికి స్పందన

ద్వారపూడి, న్యూస్‌టుడే: ద్వారపూడి జడ్పీ బాలికోన్నత పాఠశాలలో నాడు-నేడులో భాగంగా నిర్మించిన అదనపు తరగతి గదులు దుస్థితిలో చిక్కుకున్నాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో వీటి నిర్మాణం ప్రారంభించినా సకాలంలో నిధులు విడుదలకాకపోవడంతో పనులు స్లాబ్ దశలో ఆగిపోయాయి. ప్రస్తుత వర్షాలతో స్లాబ్‌పై నీరు నిలిచి లీకేజీ ప్రమాదం ఉందని జూన్ 28న 'నాడు అదనపు గదులు.. నేడు నీటి తటాలు' శీర్షికన ప్రచురించిన కథనానికి ఎంఈవో-2 చింతా వెంకటేశ్వరరెడ్డి స్పందించారు. హెచ్ఎంతో కలిసి నీరు నిలిచిపోకుండా చర్యలు తీసుకున్నారు.

కౌలుకార్డుల జారీ మందకొడి

10 శాతం కూడా పూర్తవని ప్రక్రియ

మండపేట, న్యూస్‌టుడే: మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో రైతులకు కౌలుకార్డుల (సీసీఆర్సీ) జారీ ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. ఇప్పటికే ఈ ప్రక్రియ ఆలస్యమవడంతో సొసైటీల్లో రుణాలు తీసుకున్న రైతులు రాయితీ కోల్పోయే ప్రమాదం పొంచి ఉంది. ప్రతి సంవత్సరం జూన్ నెలాఖరు నాటికి కనీసం 30 శాతం కార్డుల జారీ పూర్తవుతున్నా ఈసారి 8.9 శాతమే పూర్తయింది. రెండు నియోజకవర్గాల్లో మొత్తం 31,456 కౌలు కార్డులు పంపిణీ చేయాలనేది లక్ష్యం కాగా మంగళవారం నాటికి 3,532 మాత్రమే పూర్తి చేశారు.

ఆలస్యంగా మొదలుపెట్టి..

ఏటా జూన్ మొదటి వారంలో పంటకాలంగా నిర్ణయించి వలలిన తరువాత వ్యవసాయ సీజను ప్రారంభమవుతుంది. అప్పటి నుంచి ఆన్‌లైన్ విధానం ప్రారంభిస్తారు. ఈ ఏడాది జూన్ 4వ వారంలో ఆన్‌లైన్ తెరవడంతో కార్డుల జారీ ప్రక్రియ ఆలస్యంగా మొదలైంది. మండల స్థాయిలో అవగాహన: కౌలుకార్డుల జారీకి ప్రభుత్వం ప్రకటన చేసిన తరువాత రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. దీనికి సంబంధించిన అనుమతి పత్రాలను కౌలు రైతులు 'సేకరించి సచివాలయాల్లో అందించాలని సూచించారు.

రాయితీ నష్టం..

పంటకాలం 11 నెలలు కావడంతో సొసైటీలో రుణాలు తీసుకున్న రైతులు సకాలం 11వ నెలలో తీసుకున్న మొత్తం వడ్డీతో కలిపి చెల్లిస్తే వెంటనే కొత్త రుణం జారీ చేస్తారు. ఆ తరవాత వడ్డీ రాయితీ బ్యాంకులో జమవుతుంది. అయితే కార్డు జారీ మూడు వారాలు ఆలస్యం కావడంతో జూన్ మొదటి, మూడు వారాల్లో రుణాలు తీసుకున్న రైతులకు రాయితీ ప్రయోజనం దక్కడం లేదని వాపోతున్నారు. గత సంవత్సరం కూడా కార్డుల జారీలో జాప్యం కారణంగా రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

మండలాల వారీగా కార్డుల జారీ ఇలా..

మండలం	లక్ష్యం	జారీచేసినవి
మండపేట	4733	647
కపిలేశ్వరపురం	5786	531
రాయవరం	4831	527
రామచంద్రపురం	8118	510
కె.గంగవరం	7988	1317

పంట రుణం పొందేందుకు సొసైటీలో కౌలుకార్డులు అందిస్తున్న రైతు

రైతుల్లో ఇంకా కొన్ని అనుమానాలు..

కౌలు కార్డు జారీకి సంబంధించి రైతు అంగీకారం ఉండాలి. అయితే కొంతమంది సంతకాలు పెట్టేందుకు నిరాకరిస్తున్నారు. కార్డు జారీచేసిన 11 నెలల పంటకాలంలో రుణ సదుపాయం, బీమా సదుపాయం పొందేందుకు మాత్రమే పనిచేస్తుంది. జులై నెలలో పంట రుణాలు తీసుకున్న రైతులకు ఒక నెల ముందు జూన్‌లో ఆన్‌లైన్ తెరుచుకుంటుంది. ఆ విధంగా కొత్త కార్డులు జారీ చేస్తున్నాం. కొత్తవారితో పాటు పాతవారికి కూడా ఆగస్టు వరకు సమయం ఉంది.

- తేజేశ్వరరావు, తహసీల్దారు, మండపేట.

మున్సిపల్ దుకాణాలకు వేలం

మండపేట, న్యూస్‌టుడే: మున్సిపల్ దుకాణ సముదాయంలో ఖాళీగా ఉన్న దుకాణాలను అద్దెకిచ్చేందుకు బుధవారం వేలం నిర్వహించారు. మొత్తం 45 దుకాణాల లీజుకు ఏర్పాట్లుచేయగా కేవలం మూడు షాపులను మాత్రమే వ్యాపారులు సొంతం చేసుకున్నారని మున్సిపల్ కమిషనర్ టి.వి.రంగారావు చెప్పారు. కౌన్సిల్ ఆమోదంతో గతంలో ఉన్న అద్దెను తగ్గించి వేలం నిర్వహించినా ఎక్కువ మంది ముందుకురాలేదు. మరోసారి ఈ ప్రక్రియను నిర్వహిస్తామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్వో జె.వి.శాస్త్రి, ఆర్ఐ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డు ఉండాలి

కాజులూరు: కేంద్ర ప్రభుత్వం 70 సంవత్సరాల పైబడిన వృద్ధులకు అందజేసే ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులను అర్హులందరూ తీసుకోవాలని భాజపా మండల అధ్యక్షుడు పుణ్యమంతుల శివాజీ అన్నారు. బుధవారం వికసిత భారత్ 2047, ప్రధాని మోదీ 11 సంవత్సరాల పాలన, సేవ, సుపరిపాలన కార్యక్రమాల్లో భాగంగా కాజులూరు మండలం చేదువాడ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. జిల్లా పర్యావరణ పరిరక్షణ కోకన్వీనర్ సలాది వీరబాబు, మండల ప్రధాన కార్యదర్శులు నిమ్మన రాజేష్, వాసంశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈపంట నమోదు తప్పనిసరి

ద్రాక్షారామ: ఖరీఫ్ సీజన్‌లో నాయుళ్లు నూరు శాతం పూర్తయ్యేలా నాట్లు కూడా తొందరగా పూర్తిచేసుకోవాలని మండల వ్యవసాయాధికారి టీవీఆర్ మణిదీప్ తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం తోగరుపాడి సావరం, జగన్నాయకులపాలెం గ్రామాల్లో ఆయన మాట్లాడారు. రైతులు తప్పనిసరిగా ఈపంట నమోదు చేయించుకోవాలన్నారు. ఖరీఫ్‌లో పంట బీమాకు రూ.76 చెల్లించి మీసేవా కేంద్రాల్లో బీమా చేయించుకోవాలని తెలిపారు. అన్ని పీఏసీఎస్‌లలో ఎరువులు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకుడు సీహెచ్.లోవరాజు, వెటర్నరీ అసిస్టెంట్, రైతులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో రైతులు

నిరుపేదల పక్షపాతి కూటమి ప్రభుత్వం : మంత్రి సుభాష్

కొత్తూరులో దివ్యాంగునికి పింఛను అందిస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం, న్యూస్‌టుడే: నిరుపేదల పక్షపాతి కూటమి ప్రభుత్వమని, వారికి సంక్షేమ ఫలాలు అమలు చేయడంలో రాజీపడేది లేదని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. బుధవారం రామచంద్రపురం పట్టణంలోని ఒకటో వార్డు కొత్తూరులో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో మంత్రి పాల్గొన్నారు. గత వైకాపా పాలనలో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉందని, అయినా సంక్షేమ, అభివృద్ధి పథకాలను కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో అమలు చేస్తోందన్నారు. వైకాపా పాలన అయిదేళ్లలో రాష్ట్రం అంధకారంలోకి వెళ్లిందని ఆ పరిస్థితులను అధిగమించి సుపరిపాలన సాగిస్తున్నామన్నారు. పూర్తిగా మంచానికే పరిమితమైనవారికి రూ.15 వేల పింఛన్ అందించి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌ఛార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, ఎన్నికల పరిశీలకులు కాకినాడ రామారావు, గిరిపాటి సూర్యనారాయణమూర్తి, గుబ్బల వినోద్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం

నదురుబాదలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల

రాయవరం: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటుతోనే అభివృద్ధి, సంక్షేమం ఊపందుకున్నాయని రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తిచేసుకున్న సందర్భంగా 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా బుధవారం నదురుబాద, వి.సావరం గ్రామాల్లో ఎమ్మెల్యే ఇంటింటా లబ్ధిదారులను కలుసుకున్నారు. కూటమి పాలనలో అందుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ కరపత్రాలు అందించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన 'సూపర్ సిక్స్' హామీని అమలుచేయడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికే సాధ్యమైందన్నారు. తల్లికి వందనం ద్వారా చిన్నారుల చదువుకు ఎంతమంది ఉంటే అంత మందికి ఇస్తున్నారు. రూ.13 వేల చొప్పున వారి ఖాతాల్లో జమ చేయడం, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల ద్వారా వృద్ధులు, దీర్ఘకాలిక రోగులు, దివ్యాంగులకు నెల నెలా ఆర్థికసాయం అందిస్తున్నారని పేర్కొన్నారు. ఆగస్టు 15 నుంచి ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో నదురుబాద ఎంపీటీసీ సభ్యుడు పుండరీష్ సుబ్బారాయుడు, తెదేపా నాయకులు ఉప్పలపాటి చంద్రం, పోతుల గంగాధరప్రసాద్, శిర్రా కోటేశ్వరావు, గుండపల్లి దుర్గాప్రసాద్, వి.సావరంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు పిల్లి గణేష్, రాయుడు ప్రసాద్, వెలగల వీర్రెడ్డి, వాసంశెట్టి లక్ష్మణరావు, వెలగల నాగిరెడ్డి, సింగంపల్లి శ్రీనివాసరావు, మాజీ వైస్ ఎంపీపీ దేవు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా కరపత్రాల పంపిణీ

కాజులూరు: సుపరిపాలనలో సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వ పాలన కొనసాగుతుందని తెదేపా మండల అధ్యక్షుడు దుడ్డాల నారాయణమూర్తి చెప్పారు. బుధవారం సుపరిపాలనలో తొలి అడుగులో భాగంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఏడాది కూటమి పాలనలో అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజాభిప్రాయాలు సేకరించి మై టీడీపీ యాప్‌లో నమోదుచేశారు. కార్యక్రమంలో కోటిపల్లి, సిరిపురం, డీసీలు దాట్ల విజయగోపాల రాజు, పేపకాయల నారాయణరావు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

పథకాలు వైకాపా నాయకులకు కనిపించటంలేదు: ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల అమలు తీరు వైకాపా నాయకులకు కనిపించడం లేదా అని ఎస్ఈసీ ఛైర్మన్, ఎమ్మెల్యే వేగుళ్లజోగేశ్వరావు ప్రశ్నించారు. ఇప్పటికే మూడు అమలుచేయగా ఆగస్టు నాటికి మరో రెండు పథకాలు అమలు చేయనున్నట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణంలోని 9వ వార్డులో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తెదేపా అమలుచేసిన పథకాలు వివరిస్తూ కరపత్రాలను ఇంటింటికి పంపిణీచేశారు. మున్సిపల్ మాజీ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, సొసైటీ మాజీ అధ్యక్షుడు మల్లిపూడి గణేశ్వరరావు, వాదా ప్రసాదరావు, చుండ్రు సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

పామర్రు: కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది పూర్తయిన సందర్భంగా సుపరిపాలనకు తొలిఅడుగు పేరుతో పలు గ్రామాల్లో తెదేపా శ్రేణులు సంబరాలు నిర్వహించారు. ప్రభుత్వ పథకాలు, వివిధ సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటా పంచారు. కోటిపల్లి, కె..గంగవరం, సత్యవాడ, శివల, పామర్రు, యండగండి, తామరపల్లి, కుందూరు తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. ఎర్రపోతవరం నీటి సంఘం అధ్యక్షుడు నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వర రావు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు మేడిశెట్టి రవికుమార్, నాయకులు మరివాడ సూరిబాబు, సలాది రమేష్, వి.వీర్రాఘవ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

మండపేట: సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా పలు వార్డుల్లో కూటమి నాయకులు ఇంటింటా పథకాల ప్రచారం నిర్వహించి కరపత్రాలు పంపిణీచేశారు. 11, 23 వార్డుల్లో కౌన్సిలర్ కొవ్వాడ బేబి, ఇన్‌ఛార్జి బొడ్డు రామకృష్ణ ఆధ్వర్యంలో పథకాలపై అవగాహన కల్పించారు. యూనిట్ ఇన్‌ఛార్జి జొన్నపల్లి సూర్యారావు, చింతల శ్రీను, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఉంగరాల రాంబాబు, కాళ్ల సురేష్ పాల్గొన్నారు. వార్డు తెదేపా అధ్యక్షుడు ఆళ్ల వీరబాబు, కొవ్వాడ అప్పన్నబాబు, జనిపల్లి సూరిబాబు, వెల్ల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అనుసంధాన దారి.. అధ్వానం

మండపేట మండలం కేశవరం నుంచి ద్వారపూడి వెళ్లే అనుసంధాన రహదారి అధ్వానంగా మారింది. ఎర్ర గ్రావెల్‌తో నిర్మాణం చేసిన రహదారిపై గుంతలు ఏర్పడి వర్షపునీరు నిలిచి బురదమయంగా తయారైంది. రాకపోకల సమయంలో స్థానికులు అదుపుతప్పి కిందపడి గాయాలపాలవుతున్నారు. రోడ్డు దుస్థితిని ఎంపీడీవో కె.సత్యనారాయణ మూర్తి దృష్టికి తీసుకువెళ్లగా రహదారుల నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, ద్వారపూడి

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

ద్వారపూడి: అర్తమూరు శ్రీసత్యభాస్కర మండల ప్రజా పరిషత్ మోడల్ పాఠశాల విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఒకటి నుంచి అయిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు ఏకరూప దుస్తులను జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్ నల్లమిల్లి వీర్రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో పడాల రామకృష్ణారెడ్డి, కర్రి సత్యనారాయణ, తాడి శేషారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కిట్లు అందిస్తున్న నల్లమిల్లి వీర్రెడ్డి తదితరులు

విద్యుత్తు తీగలపై పడిన చెట్టు

త్రుటిలో తప్పిన ప్రాణాపాయం

ఆలమూరు, న్యూస్‌టుడే: మడికిలో బుధవారం ఉదయం 11 కేవీ విద్యుత్తు తీగలపై కొబ్బరిచెట్టు పడిపోవడంతో స్తంభం కూలిపోయింది. ఈ ఘటనలో ఆరుబయట ఉన్న ఇద్దరు యువకులు, ఇంటి వద్ద నిలబడి ఉన్న గృహిణి, చిన్నారి త్రుటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. 216వ జాతీయ రహదారి నుంచి దుళ్ల వెళ్లే రహదారిలో ఓ ఇంటి వద్ద ఉన్న గృహిణిని ఇద్దరు యువకులు పని నిమిత్తం అడుగుతుండగా సమీపంలోని కొబ్బరిచెట్టు విరిగి 11 కేవీ విద్యుత్తు లైన్‌పై పడింది. తీగలు తెగిపడటం, ఒక యువకుడు రెప్పపాటులో తప్పించుకున్న దృశ్యం సీసీ టీవీలో నమోదు కావడంతో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. విద్యుత్తు తీగలు తెగిపడిన వెంటనే చొప్పెల్ల సబ్‌స్టేషన్ నుంచి సరఫరా నిలిచిపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు. విషయం తెలుసుకున్న వెంటనే ఆలమూరు ఏఈ డీఎంకే దుర్గాప్రసాద్, ఎల్ఐ సుబ్రహ్మణ్యం ఘటనా స్థలానికి చేరుకుని యుద్ధప్రాతిపదికన స్తంభాన్ని ఏర్పాటు చేసి సరఫరా పునరుద్ధరించారు. కాలువగట్లపై ఒకవైపు ఒరిగి ఉన్న కొబ్బరిచెట్లను కూడా తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యుత్ లైను పునరుద్ధరిస్తున్న సిబ్బంది

మంత్రి వస్తున్నారని..

రామచంద్రపురం, న్యూస్‌టుడే: రామచంద్రపురం పట్టణంలో దాదాపు నెల రోజులుగా శుభ్రతకు నోచుకోని మురుగు కాలువలను బుధవారం యుద్ధప్రాతిపదికన శుభ్రం చేశారు. మున్సిపల్ అధికారులు, కార్మికులు వీధుల్లోకి ఉదయాన్నే చేరుకుని పారిశుద్ధ్య పనులు చేపట్టారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమానికి మంత్రి వాసంశెట్టి సుభాష్ పలు వార్డుల్లో పర్యటిస్తారనే సమాచారంతో మురుగుకాలువలను శుభ్రం చేశారు. గురువారం అయిదో వార్డు వైఎస్సార్‌నగర్‌లో మంత్రి పర్యటించనున్న సందర్భంగా అక్కడ కూడా కాలువలను కార్మికులు శుభ్రం చేశారు. కార్మికుల కొరత కారణంగా పట్టణంలోని కొన్ని వార్డుల్లో సకాలంలో పారిశుద్ధ్య పనులు చేయలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు.

బాలికలకు చదువు అత్యంత అవసరం

రామచంద్రపురం, న్యూస్‌టుడే: బాలికలకు చదువు అత్యంత అవసరమని రామచంద్రపురం సీఐ ఎం.వెంకటనారాయణ అన్నారు. కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ రామకృష్ణ అధ్యక్షతన బుధవారం మహిళలు సోషల్ మీడియా వలలో పడి ఎలా నష్టపోతున్నారనే అంశంపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. మహిళలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయన్నారు. సామాజిక మాధ్యమాల విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్ఐ ఎస్.నాగేశ్వరరావు మాట్లాడుతూ గృహహింస చట్టం, సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

నిండుశోకంతో 7వ రోజు సంతాప దినం

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: మొహర్రంలోని 7వ రోజు సంతాపదినాన్ని బుధవారం ద్రాక్షారామలో ముస్లింలు నిండుశోకంతో జరుపుకొన్నారు. మహ్మద్ ప్రవక్త మనవడు ఇమామ్ హుసేన్ పరివారానికి ప్రత్యేక ప్రార్థనలతో పాటు మాతం నిర్వహించారు. మధ్యాహ్నం బీబీ సకీనా పంజాలో మజలిస్ అనంతరం నక్షాపంజా, బీబీ సకీనా పంజా, షాహజాదె ఖాసీం పంజాల నుంచి పీర్లను గుర్రాలపై ఊరేగించారు. మాతం చేసుకొంటూ ఆగావారిపంజాకు చేరి ఇమాం హుసేన్ తనయుడు 'షాహజాదె ఖాసీం'కు నివాళులు అర్పించారు. పీర్లను ఊరేగిస్తున్న సమయంలో మహిళలు, పురుషులు ఖాసీంను తలచుకొని విలపించారు. కార్యక్రమంలో స్థానికులతో పాటుగా ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన ముస్లింలు పాల్గొన్నారు. లక్‌నవూ (ఫైజాబాద్) నుంచి వచ్చిన మత ప్రబోధకులు మొహమ్మద్ షంసీ సాహెబ్ మొహర్రంలోని 7వ రోజు ప్రాముఖ్యతను వివరించారు.

ద్రాక్షారామ వీధుల్లో గుర్రంపై పీర్లను ఊరేగిస్తున్న ముస్లింలు

కార్మికులకు న్యాయం చేయాలని నిరసన

రామచంద్రపురం: రామచంద్రపురం పురపాలక సంఘం కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికుల దీక్షలు బుధవారం 45వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా కార్మికులు మాట్లాడుతూ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. శిబిరంలో ఇంజినీరింగ్, వీధి దీపాలు, నీటి సరఫరా విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

శిబిరంలో నినాదాలు చేస్తున్న కార్మికులు

భక్తుల మనోభావాలకు అనుగుణంగా పనిచేయాలి

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో అధికారులు, సిబ్బంది సమన్వయంతో భక్తుల మనోభావాలకు అనుగుణంగా పనిచేయాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు సూచించారు. ఆయన బుధవారం ఆలయ అభివృద్ధిపై సమీక్షించారు. అరకొర వేతనాలతో ఇబ్బందులు పడుతున్నామని ఆలయంలో తాత్కాలిక సిబ్బంది తమ సమస్యలను ఏకరువు పెట్టారు. తొలుత అర్చకుల వసతిగృహ సముదాయం వద్ద విద్యుత్తు నియంత్రికను ఎమ్మెల్యే ప్రారంభించారు.

వెదజల్లే విధానంపై సూచనలు తీసుకోండి

పామర్రు, న్యూస్‌టుడే: కె.గంగవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం ఎంపీపీ పంపన నాగమణి అధ్యక్షతన నిర్వహించారు. వ్యవసాయాధికారి ఎ.సద్గురుమూర్తి మాట్లాడుతూ వరినాట్లు వేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయని, వెదజల్లే విధానంలో వ్యవసాయాధికారుల సలహాలు తీసుకోవాలని సూచించారు. మండల విద్యాశాఖాధికారులు అలజంగి నాగరాజు, చోడిశెట్టి ఆంజనేయులు మాట్లాడుతూ మండలంలో అన్ని గ్రామాల్లోని పాఠశాలల విద్యార్థులకు తల్లికి వందనం నిధులు మంజూరయ్యాయన్నారు. ఎవరికైనా రాకపోతే సంబంధిత సచివాలయంలో సంప్రదించాలని సూచించారు. వర్షాకాలంలో సుందరపల్లి, కూళ్ల, కోటిపల్లి సావరం వద్ద గట్టు పటిష్ఠతకు తాత్కాలిక చర్యలు చేపట్టడానికి అవసరమైన సామగ్రిని కోటిపల్లి వరద స్టోర్సులో ఉంచామని ఏఈ తెలిపారు. పశువైద్యాధికారి డి.సంయుక్తలక్ష్మితో పాటు వివిధ శాఖల అధికారులు సభ్యుల సందేహాలకు సమాధానాలిచ్చారు. మండల ఉపాధ్యక్షుడు దూడల నాగేశ్వరరావు, ఎంపీడీవో ఎన్.శ్రీనివాసరావు, కార్యదర్శులు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో ఎంపీపీ, అధికారులు

ఆసియా చెస్ ఛాంపియన్‌కు అభినందనలు

ద్వారపూడి, న్యూస్‌టుడే: ఆసియా చెస్ ఛాంపియన్‌షిప్ సాధించిన గోలి సంధ్యను మండపేట నియోజకవర్గం భాజపా నాయకులు విజయవాడలోని ఆమె స్వగృహంలో బుధవారం కలిసి అభినందనలు తెలిపారు. ద్వారపూడి జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఈనెల 10న జరిగే మెగా పేరెంట్స్ డేకి రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో భాజపా జిల్లా ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, మండపేట నియోజకవర్గం కోకన్వీనర్ కంకటాల మురళీకృష్ణ, చేకూరి రమేష్‌వర్మ, వల్లభనేని రవీంద్రబాబు, మద్దుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

సంధ్యకు పుష్పగుచ్ఛం అందిస్తున్న భాజపా నాయకులు

క్షయవ్యాధిపై గ్రామస్థులకు అవగాహన

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: కందులపాలెం గ్రామంలో టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమాన్ని వెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీప్రసన్న ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. గ్రామంలో క్షయ లక్షణాలతో బాధపడుతున్న 23 మందికి కళ్లె పరీక్షచేసి వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. వైద్యాధికారి మాట్లాడుతూ క్షయ రహిత భారతదేశం కోసం కృషిచేయాలని కోరారు. మూడు వారాలకు పైగా కఫంతో కూడిన దగ్గు, జ్వరం, ఛాతీ నొప్పి ఉంటే పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. డివిజినల్ సూపర్‌వైజరు జి.కమల్‌శేషు మాట్లాడుతూ రామచంద్రపురం టీయూ పరిధిలో జూన్ నెలలో ఐదు కొత్త కేసులకు చికిత్స ప్రారంభించామని చెప్పారు. అనంతరం టీబీ నివారణకు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఎస్‌టీఎల్ఎస్ భానుబేగం, టీబీ హెచ్‌వీ పావని, సూపర్‌వైజర్లు జి.రత్నం, డి.రాజేశ్వరి పాల్గొన్నారు.

కందులపాలెంలో ప్రచారంలో పాల్గొన్న వైద్య సిబ్బంది

నేడు ప్రైవేట్ పాఠశాలలకు సెలవు

అమలాపురం పట్టణం: రాష్ట్ర సంఘం పిలుపు మేరకు గురువారం జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు సంఘం కోశాధికారి సతీష్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయులు ఉదయం గడియారస్తంభం నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీగా వెళ్తారన్నారు.

9న సార్వత్రిక సమ్మె

గోడపత్రికలను ప్రదర్శిస్తున్న డ్వాక్రా యానిమేటర్లు

ద్రాక్షారామ, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జులై 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని డ్వాక్రా యానిమేటర్ల సంఘం పిలుపునిచ్చింది. ద్రాక్షారామలో బుధవారం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహించిన యానిమేటర్ల సంఘ సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నూకల బలరాం, మండల కన్వీనరు మేడిశెట్టి దుర్గ, డ్వాక్రా యానిమేటర్ల సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎ.జ్యోతి మాట్లాడారు. అనంతరం సమ్మెకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యానిమేటర్లు పాల్గొన్నారు.

(c) eenadu

డిజిటల్ విధానానికి శ్రీకారం

నిడదవోలులో మెప్మా ఆర్పీలకు ట్యాబ్‌లు అందిస్తున్న మంత్రి దుర్గేష్

నిడదవోలు, న్యూస్‌టుడే: కార్పొరేషన్‌లు, పురపాలక సంఘాల్లో స్వయం సహాయక సంఘాల సభ్యులకు త్వరితగతిన సేవలం దించేందుకు కూటమి ప్రభుత్వం మెప్మాలో డిజిటల్ విధానానికి శ్రీకారం చుట్టిందని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. ఈ మేరకు బుధవారం తన క్యాంపు కార్యాలయంలో నిడదవోలు పురపాలక సంఘంలో పని చేస్తున్న మెప్మా రిసోర్స్‌పర్సన్‌లకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఆర్పీల పనిభారం, సమయ భావం తగ్గించాలనే ఉద్దేశంతో ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నామన్నారు. అధునాతన సాంకేతికతను అందిపుచ్చుకుని ట్యాబ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మెప్మా, డ్వాక్రాలు సీఎం చంద్రబాబు మానసపుత్రికలని అభివర్ణించారు. పురపాలక సంఘ వైస్‌ఛైర్మన్ షేక్ వజీరుద్దీన్, మెప్మా మేనేజర్ జ్యోతి, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

నేటి నుంచి కేశవరం రైల్వేగేటు మూసివేత

ద్వారపూడి: కేశవరం రైల్వే గేటును గురువారం నుంచి నాలుగు రోజుల పాటు మూసివేస్తామని రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రైలు పట్టాల నవీకరణ, మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 3వ తేదీన ఉదయం 7 గంటల నుంచి 6వ తేదీ రాత్రి 7 గంటల వరకు గేటును మూసేస్తామని ప్రకటించారు. కేశవరం గ్రామంలోకి వెళ్లే ద్విచక్ర వాహనదారులు ద్వారపూడి గ్రామం మీదుగా వెళ్లాలని మండపేట రూరల్ ఎస్సై వి.కిషోర్ సూచించారు. ఈ మేరకు వాహనాల రాకపోకలను మళ్లించినట్లు వివరించారు.

పురుషోత్తపట్నం.. సాగుకు అభయం

● 1.50 లక్షల ఎకరాలకు గోదావరి జలాలు
● నేడు మంత్రి చేతులమీదుగా నీటి విడుదల

ప్రయోగాత్మక పరిశీలనలో అచ్చయ్యపాలెం వద్ద బుధవారం గోదావరి జలాలు

సీతానగరం, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వంలో నిర్లక్ష్యంగా వదిలేసిన ఎత్తిపోతల పథకాలను కూటమి ప్రభుత్వం గాడిలో పెట్టడంతో ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే సాగునీటి విడుదలకు మార్గం సుగమమైంది. పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం నుంచి తూర్పు, కాకినాడ జిల్లాల్లోని 18 మండలాల్లో 1.50 లక్షల ఎకరాలకు సాగునీరు.. ఏలేరు జలాశయం నింపేందుకు కార్యాచరణ పూర్తయింది. జలవనరులశాఖ బుధవారం ప్రయోగాత్మక పరిశీలన పూర్తిచేసింది. మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం ఇక్కడి నుంచి నీటిని విడుదల చేయనున్నారు.

విద్యుత్తు బిల్లు రూ.10.56కోట్లు చెల్లించి..

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం పంపుహౌస్ వద్ద 10 మోటార్లు ఉన్నాయి. ఒక్కోటి 350 క్యూసెక్కుల నీటిని వదిలే సామర్థ్యం కలిగి ఉంది. ఏటా నిర్వహణకు రూ.3 కోట్లకు పైగా ఖర్చవుతోంది. వైకాపా ప్రభుత్వం దిగిపోయేసరికి నిర్వహణ నిధులు, విద్యుత్తు బిల్లులు సుమారు రూ.55 కోట్లు బకాయిలు పెట్టింది. కూటమి ప్రభుత్వం మేఘా సంస్థకు నిర్వహణ బాధ్యతలు అప్పగించి ఇటీవల రూ.10.56 కోట్ల విద్యుత్తు బకాయిలను తీర్చింది. ఎత్తిపోతల భూసేకరణలో మిగిలిపోయిన నిర్వాసిత రైతులకు రూ.28.18 కోట్లు చెల్లించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు.

పుష్కరకు..పురుషోత్తపట్నం నీరే

పోలవరం ప్రాజెక్టు వద్ద చేసే పనులకు పుష్కర పథకం పైపులైన్లు అడ్డురావడంతో వాటిని తొలగించి రూ.80 కోట్లతో కొత్తవి వేస్తున్నారు. ఖరీఫ్ సీజన్‌లో పుష్కర నుంచి సాగునీటి విడుదల నిలిపివేశారు. పురుషోత్తపట్నం ఎత్తిపోతల నుంచి 3,500 క్యూసెక్కుల నీటిని ఏలేరు జలాశయానికి తరలించే మార్గంలో అచ్చయ్యపాలెం వద్ద రెగ్యులేటర్ ఏర్పాటు చేశారు. దీని నుంచి ఉమ్మడిజిల్లాలోని 1.50 లక్షల ఆయకట్టుకు నీటిని సరఫరా చేస్తారు. ఏలేరు జలాశయం నుంచి పిఠాపురం బ్రాంచి కెనాల్ పరిధిలోని 67,614 ఎకరాలను పూర్తిస్థాయిలో స్థిరీకరించనున్నారు.

ఏలేరు ఇన్‌ఫ్లో పెరుగుతోంది..

పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం ప్రయోగాత్మక పరిశీలన విజయవంతమైంది. ప్రస్తుతం ఏలేరు జలాశయంలో 10 టీఎంసీల వల్ల ఇన్‌ఫ్లో పెరుగుతోంది. ఎత్తిపోతల నుంచి మెట్టలోని 18 మండలాలకు 1,400 క్యూసెక్కుల నీటిని తొలుత సరఫరా చేస్తాం. రానున్న రోజుల్లో ఏలేరు జలాశయంలో 24 టీఎంసీల సామర్థ్యం పూర్తిచేసేలా నీటి విడుదలకు 5 మోటార్లు పురుషోత్తపట్నంలోనే సిద్ధం చేశాం.

-సీహెచ్.కోటేశ్వరరావు,
డీఈ-ఎల్‌ఎంసీ-I, ధవళేశ్వరం

మిగిలింది యంత్రాల అమరికే

చకచకా మురుగుశుద్ధి ప్లాంటు పనులు

ఈనాడు మీ తోడు

న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

గోదావరి కాలుష్యాన్ని అరికట్టేందుకు ఆవ ప్రాంతంలో తలపెట్టిన మురుగు నీటి శుద్ధి ప్లాంటు (ఎస్‌టీపీ) నిర్మాణ పనులు కొలిక్కి వస్తున్నాయి. ఇప్పటికే బేస్‌మెంటు నిర్మాణ పనులు 70 శాతం పూర్తయినట్లు సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు తెలిపారు. యంత్రాల అమరికే మిగిలింది. మరోవైపు ప్లాంటులో కీలకమైన సంపుల నిర్మాణం చేపడుతున్నారు. వివిధ దశల్లో ఫిల్టర్ చేసే ప్రక్రియలో భాగంగా మురుగు నీటిని నీటిలో నిల్వ చేస్తారు. ఆ తర్వాత దశల వారీగా రసాయనిక ప్రక్రియలో నీటిని ఒకొక్క సంపు నుంచి ముందు దశలకు మళ్లిస్తారు. నాలుగు సంపులను ఒకే సారి నిర్మాణం చేపట్టారు. అవి పూర్తయితే కాంక్రీటు పనులు దాదాపు పూర్తయినట్లవుతుంది. రానున్న రెండు నెలల్లో ఈ పనులు పూర్తయితే ఈ ఏడాది చివరి నాటికి యంత్రాల అమరిక జరుగుతుంది. నగరంలో వివిధ

బేస్‌మెంటు నిర్మాణ పనులు

లైన మురుగు నీరు నేరుగా గోదావరిలో కలవ కుండా ఈ ప్లాంటుకు మళ్లిస్తారు. నల్లా, ఆవ కాలువల ద్వారా మురుగునీటిని ప్లాంటుకు అనుసంధానం చేస్తారు.

పరిశ్రమల అవసరాలకు శుద్ధి చేసిన నీరు..

నదీ కాలుష్యాన్ని అరికట్టేందుకు మురుగునీటిని శుద్ధి చేసి తిరిగి గోదావరిలో కలిపే ప్రక్రియలో భాగంగా ప్లాంటు పనులు చేపట్టారు. శుద్ధి చేసిన నీటిని ఏపీఐఐసీ, గెయిల్ వంటి సంస్థలు, వివిధ పరిశ్రమలకు సరఫరా చేసేందుకు ఒప్పందం చేసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నమామి గోదావరి ప్రాజెక్టులో భాగంగా ప్లాంటు మొదటి విడత రూ. వంద కోట్లు విడుదల చేసింది. వీటిలో సుమారు రూ. 89 కోట్లతో ఈ ప్రాజెక్టు నిర్మాణానికి ప్రతిపాదించారు. మొత్తం 50 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ఈ ప్లాంటు త్వరలో అందుబాటులోకి రానుంది. వాస్తవానికి నగరంలో ప్రతి రోజు 60 ఎంఎల్‌డీ మురుగు నీరు విడుదలవుతుంది. ఇప్పటికే ఆవ ప్రాంతంలో 30 ఎంఎల్‌డీ సామర్థ్యంగల ప్లాంటు ఉంది. అయితే అది మరమ్మతులతో ఉండటంతో భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని యుద్ధ ప్రాతిపదికన కొత్త ప్లాంటు నిర్మిస్తున్నారు. ఆ తర్వాత పాత ప్లాంటుకు మరమ్మతు పనులు చేపడతారు. రానున్న పుష్కరాలకు ఈ రెండు అందుబాటులోకి వస్తే నగరంలో గోదావరి కాలుష్యం తగ్గుతుంది.

డెల్టా సరే.. మెట్ట మాటేమిటి?

జలవనరులు, వ్యవసాయశాఖల మధ్య సమన్వయ లోపం ● జడ్పీ సర్వసభ్య సమావేశంలో వాడీవేడిగా చర్చ

ఈనాడు, కాకినాడ; న్యూస్‌టుడే, కాకినాడ నగరం

'డెల్టా ప్రాంతంలో మూడు పంటలు సాగుచేయాలని ముందస్తుగానే నీరు విడిచిపెట్టడం మంచిదే. మరి మెట్ట ప్రాంతంలో రైతుల సంగతేమిటి? అని ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన బుధవారం కాకినాడలో నిర్వహించారు. మూడు జిల్లాల కలెక్టర్లు షాన్‌మోహన్ (కాకినాడ), ప్రశాంతి (తూర్పుగోదావరి), మహేష్‌కుమార్ (అంబేడ్కర్ కోనసీమ) హాజరయ్యారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ మెట్టలో జలవనరులు, వ్యవసాయ శాఖల మధ్య సమన్వయలోపం కనిపిస్తోందన్నారు. మెట్ట సాగుకోసం ప్రత్యేకంగా ఇరిగేషన్ డివిజన్ తమ నియోజకవర్గంలో ఏర్పాటుచేయాలని కోరారు. తాళ్లూరు ఎత్తిపోతలను వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉందన్నారు.

వాకౌట్‌తో నిరసన

సమావేశం ప్రారంభంలోనే దాళ్వా ధాన్యం సొమ్ములు ఇంకా జమ కాలేదని, ప్రభుత్వం 24 గంటల్లో ఇస్తామని మోసం చేసిందంటూ వైకాపా జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు కాసేపు వాకౌట్ చేశారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణ, ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ మద్దతు పలికారు. కాసేపటి తర్వాత మళ్లీ వచ్చి చర్చలో పాల్గొన్నారు.

కాలువల కలుషితంపై నిర్లక్ష్యం తగదు

పంట కాలువల కలుషితంపై అధికారుల నిర్లక్ష్యం తగదని ఎమ్మెల్సీలు సూర్యనారాయణ, సోము వీర్రాజు ప్రస్తావించారు. కాలువల్లోకి వ్యక్తిగత మరుగుదొడ్ల గొట్టాలను వదిలేస్తున్నారన్నారు. రాజమహేంద్రవరంలోనూ పేపరు మిల్లు వ్యర్థాలు గోదావరి జలాల్లో కలుస్తున్నాయన్నారు. పూర్తిగా మానవ తప్పిదాలే కారణమని అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు.

డ్రెయిన్ల ఆధునికీకరణకు తీర్మానం

జిల్లాలో డ్రెయిన్ల ఆధునికీకరణకు చర్యలు తీసుకోవాలని ఎంపీ సుభాష్‌చంద్రబోస్ ప్రస్తావించారు. మురుగు కాలువల ఆధునికీకరణ, పడకేసిన ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని జడ్పీ ఛైర్మన్ తీర్మానాన్ని ప్రతిపాదించగా, సభ్యులు ఆమోదించారు.

మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మన్ వేణుగోపాలరావు, వేదికపై కలెక్టర్లు ప్రశాంతి, షాన్‌మోహన్, మహేష్‌కుమార్, జడ్పీ సీఈవో లక్ష్మణరావు

పాల్గొన్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు నల్లమిల్లి, నెహ్రూ, ఎమ్మెల్సీ త్రిమూర్తులు, ఎంపీ బోస్

మరికొన్ని సమస్యలపై..

● కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డుల జారీకి నీటి తీరువా బకాయిలతో ముడి పెడుతున్నారని గొల్లప్రోలు జడ్పీటీసీ నాగలోవరాజు ఆరోపించారు. కలెక్టర్ షాన్ మోహన్ స్పందిస్తూ నీటి తీరువా తప్పనిసరని, వాటిని కార్డులతో ముడి పెడితే చర్యలు తీసుకుంటామన్నారు. ● ఏలేశ్వరం నుంచి అల్లూరి జిల్లా మార్గం అధ్వానంగా ఉందని రాజవొమ్మంగి జడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి అన్నారు. ● పాఠశాలలో అసంపూర్తి భవనాలతో ఆరుబయట, వరండాల్లో కూర్చోబెట్టాల్సి వస్తుందని రంపచోడవరం జడ్పీటీసీ ప్రశ్నించారు. ● ఆలమూరు, రామచంద్రాపురంలో పౌరసరఫరాల శాఖ గోదాములు ఉండగా ద్వారపూడి గోడౌన్‌కు ఎందుకు బియ్యం తరలిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రశ్నించారు. ● డీసీసీబీ రూ.307 కోట్ల నష్టాల్లో కూరుకుపోయిందని, రుణాలు తీసుకున్నవారు తిరిగి చెల్లిస్తేనే మనుగడ సాధించగలదని, సిబ్బంది రికవరీకి వచ్చినప్పుడు ప్రజా ప్రతినిధులు సహకరించాలని డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ అనంతబాబు, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, అధికారులు పాల్గొన్నారు.

మద్యం తక్కువ ధరకు ఇస్తామంటే నమ్మొద్దు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఎక్సైజ్‌శాఖ ద్వారా అనుమతులు కలిగిన దుకాణాల్లో మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని, అనధికార వ్యక్తుల వద్ద కొనుగోలు చేయవద్దని జిల్లా ఎక్సైజ్ అధికారిణి సీహెచ్ లావణ్య ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అనుమతి లేని వ్యక్తులు నకిలీ మద్యం విక్రయిస్తున్నారని.. అది ప్రమాదకరమన్నారు. వివాహాలు, పార్టీలు, ఇతర వేడుకలకు మద్యం తగ్గింపు ధరలకు ఇస్తామని చెప్పి వారు మోసం చేసే అవకాశం ఉందన్నారు. అలాంటి నకిలీ వ్యక్తుల వివరాలను టోల్‌ఫ్రీ నంబరు 14405 లేదా జిల్లా ఎక్సైజ్ అధికారి 96767 14547 నంబరులో తెలియజేయాలని కోరారు.

సాగు హక్కు పత్రం ఏదీ?

కౌలు రైతులకు అంతంతమాత్రంగానే జారీ

ఈనాడు, రాజమహేంద్రవరం: కౌలు రైతులకు ప్రభుత్వ రాయితీలు, బీమా పరిహారం వర్తించాలంటే సీసీఆర్సీ కార్డులు(పంట సాగు హక్కు పత్రం) తప్పనిసరి. ఉమ్మడి జిల్లాలో మూడొంతుల మేర కౌలు పద్ధతిలోనే సాగు జరుగుతుండగా వారికి కార్డుల జారీలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. ఖరీఫ్ కాలం ప్రారంభమైన నేపథ్యంలో ఒప్పందాలు పూర్తయి అంతా పనుల్లో నిమగ్నమవుతున్నారు. 11 నెలల కాలపరిమితితో వీరికి మేలు చేయాలన్న ఉద్దేశంతో సీసీఆర్సీ కార్డుల మంజూరుకు ప్రతి జిల్లాకు మండలాలవారీగా లక్ష్యాలు నిర్దేశించిప్పటికీ ఆచరణ తీరు అంతంతే.

లక్ష్యం ఇలా.. అమలు అలా

● డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల్లో 1.63 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణంకాగా..1.40 లక్షల మంది రైతులున్నారు. వీరిలో దాదాపు 80 శాతం మంది కౌలు రైతులే. 2025-26 పంట కాలానికి 75 వేల సీసీఆర్సీ కార్డులు లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటికి 16,800 మంజూరు చేశారు. వేగం పెంచాల్సి ఉంది. ● తూర్పుగోదావరి జిల్లాలో 1.85 లక్షల ఎకరాల సాగు విస్తీర్ణం ఉండగా 2.18 లక్షల మంది రైతులున్నారు. వీరిలో దాదాపు 80 శాతం కౌలుకు తీసుకున్నవారే. 1.10 లక్షల మందికి కార్డులివ్వాలని లక్ష్యంగా నిర్దేశించగా ఇప్పటికి 32852 మందికి (29.87 శాతం) మంజూరు చేశారు. ఇతర మండలాల్లో 30 శాతం లక్ష్యం అధిగమించగా...రాజానగరం, బిక్కవోలు, కోరుకొండ, నల్లజర్ల, రంగంపేట మండలాల్లో పరిస్థితి తీసికట్టుగా ఉంది.

అవగాహన అవసరం..

సీసీఆర్సీ కార్డుల మంజూరుకు సంబంధించి అసలు రైతులకు అవగాహన కల్పించాల్సి ఉంది. ఈ మేరకు వ్యవసాయ, రెవెన్యూ శాఖ అధికారులు చొరవ చూపాలన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ కార్డు వల్ల కౌలు రైతుకు కేవలం 11 నెలల కాలంలో పండించిన పంటపై మాత్రమే హక్కు ఉంటుందని, భూమిపై ఉండదన్న విషయాన్ని వివరించాల్సి ఉంది. కార్డు ఉంటే విపత్తుల వేళ పంట నష్టపరిహారం పొందేందుకు, అలానే ధాన్యం ఆర్‌ఎస్‌కేల ద్వారా విక్రయించేందుకు వీలుంటుంది. అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు వర్తింపజేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెలాఖరునాటికి లక్ష్యాలు పూర్తి చేస్తామని ఇరు జిల్లాల వ్యవసాయాధికారులు మాధవరావు, బోసుబాబు తెలిపారు.

కోనసీమ రైల్వేలైనుకు మార్గం సుగమం: ఎంపీ

అమలాపురం పట్టణం: కోటిపల్లి-నరసాపురం రైల్వేలైన్‌కు అడ్డంకులు ఒక్కొక్కటిగా తొలుగుతున్నాయని అమలాపురం ఎంపీ హరీష్‌మాథుర్ పేర్కొన్నారు. భూసేకరణ ప్రక్రియపై ఉన్న స్టే ఉత్తర్వులను హైకోర్టు తొలగించడంతో మార్గం సుగమమైందన్నారు. ప్రభుత్వ వాదనలను పరిగణనలోకి తీసుకున్న ధర్మాసనం స్టే ఎత్తివేసిందన్నారు. రైల్వే ప్రాజెక్టు పూర్తి చేయడానికి కృషి చేస్తామన్నారు.

నేడు తాడిపూడి నుంచి సాగునీరు విడుదల

తాళ్లపూడి: తాళ్లపూడి మండలంలోని తాడిపూడి ఎత్తిపోతల పథకం స్టేజ్-1, స్టేజ్-2 నుంచి గురువారం మధ్యాహ్నం సాగునీరు విడుదల చేస్తున్నట్లు పథకం డీఈ రామేశ్వరనాయుడు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కొవ్వూరు, గోపాలపురం ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజు ముఖ్య అతిథులుగా హాజరవుతారని వెల్లడించారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని సుమారు 2లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతుందన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల
(అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

తప్పిన పెను ముప్పు

✦ పేపరుమిల్లులో ప్రమాదకర హైడ్రోజన్ పెరాక్సైడ్ లీకేజీ
✦ చాకచక్యంగా వ్యవహరించిన అగ్నిమాపక సిబ్బంది

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), ఏవీఏ రోడ్డు, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరంలో బుధవారం పెను ప్రమాదం తప్పింది. ప్రమాదకరమైన విషవాయువు లీకై ఎంతో మంది అస్వస్థతకు గురవ్వాల్సిన పరిస్థితి అదుపులోకి వచ్చింది. అగ్నిమాపకశాఖ చాకచక్యంగా వ్యవహరించడంతో ఎలాంటి ఇబ్బంది కలగలేదు. రాజమహేంద్రవరంలోని ఆంధ్రా పేపరుమిల్లుకు 26 టన్నుల హైడ్రోజన్ పెరాక్సైడ్ రసాయనంతో వచ్చిన ఓ లారీని ఉత్తర గేటు వద్ద నిలిపి ఉంచారు. బుధవారం ఉదయం 8.30 గంటలు దాటిన తరువాత దాని సేఫ్టీ వాల్వ్ నుంచి రసాయనం లీకైంది. సిబ్బంది గుర్తించి అగ్నిమాపకశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు హుటాహుటిన రాజమహేంద్రవరంలోని రెండు వాహనాలు, కొవ్వూరు నుంచి మరో వాహనం, పేపరు మిల్లుకు చెందిన ఒక వాహనంతో అక్కడికి చేరుకుని దానిని అదుపు చేశారు. హైడ్రోజన్ పెరాక్సైడ్ ఒంటి మీద పడితే కాలిపోయినట్లు బొబ్బలెక్కడం, పీల్చితే

పేపరుమిల్లులో హైడ్రోజన్ పెరాక్సైడ్‌పై నీటి చల్లే ప్రక్రియను పరిశీలిస్తున్న అధికారులు

అస్వస్థతకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయే ప్రమాదం ఉండడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. లీకేజీని ఆపేందుకు అవకాశం లేకపోవడంతో దానిని చల్లటి నీటితో డైల్యూట్ చేస్తే రసాయనం శక్తి కోల్పోయి సాధారణ స్థితికి వస్తుందని గుర్తించారు. సుమారు మూడు గంటల పాటు నాలుగు వాహనాలతో నీటిని లీకవుతున్న పెరాక్సైడ్‌పై చల్లుతూ దానిని డైల్యూట్ చేశారు. దీంతో పరిస్థితి అదుపులోకి రావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. దీనిని అదుపు చేయడానికి ఎంతో నీరు అవసరమైందని.. మిల్లు లోపల ఘటన జరిగింది కాబట్టి నీటికి ఇబ్బంది లేక త్వరగా అదుపు చేయగలిగామని అధికారులు తెలిపారు. బహిరంగ ప్రదేశాల్లో ఇలాంటి ఘటన జరిగితే పెను ప్రమాదం సంభవించేదన్నారు. పేపరుమిల్లులో వేస్ట్ పేపరును గుజ్జుగా చేసి దానిని మంచిగా మార్చడానికి ఈ హైడ్రోజన్ పెరాక్సైడ్ వినియోగిస్తారని.. అందులో భాగంగానే తీసుకొచ్చారని వివరించారు. ఘటనకు సంబంధించి ఆర్డీవో కృష్ణనాయక్, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ కె.కృష్ణమూర్తి, ప్రాంతీయ అగ్నిమాపకశాఖ అధికారి స్వామి, జిల్లా అగ్నిమాపకశాఖ అధికారి మార్టిన్ లూథర్‌కింగ్ సంఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

ఎడతెరపిలేని వర్షం

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: రుతుపవనాలు, అల్పపీడనం ప్రభావంతో జిల్లావ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం పలుచోట్ల రహదారులపై నీరు నిలిచిపోవడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. ముఖ్యంగా రోడ్ల పక్కన సైకిళ్లు, తోపుడు బండ్లపై పండ్లు, కూరగాయాలు వంటివి విక్రయించే చిరువ్యాపారులు, పనులు నిలిచిపోయి రోజువారీ కూలీలు ఇబ్బందిపడ్డారు. మరో రెండు రోజులు వర్షాలు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఇప్పటికే ఖరీఫ్ వరి నాట్లు పూర్తి చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. నాట్లు కుళ్లిపోయే అవకాశం ఉందని చెబుతున్నారు.

చాగల్లులో పాలిథిన్ సంచులు తలకు చుట్టుకొని నాట్లు వేస్తున్న కూలీలు

గోపాలపురంలో అత్యధిక వర్షపాతం..

గడిచిన 24 గంటల్లో (బుధవారం ఉదయం 8.30 గంటల వరకు) జిల్లా సగటు వర్షపాతం 18.1 మి.మీ. నమోదైంది. మండలాలవారీగా చూస్తే.. అత్యధికంగా గోపాలపురంలో 37.6 మి.మీ., తాళ్లపూడి 30.4, రాజమహేంద్రవరం అర్బన్ 27.8, సీతానగరం 26.6, గోకవరం 22.4, నల్లజర్ల 20.6, రాజమహేంద్రవరం గ్రామీణం 20.4, దేవరపల్లి 18.4, చాగల్లు 18.2, రాజానగరం 16.6, కడియం 15.4, రంగంపేట 15.2, కొవ్వూరు 14.8, బిక్కవోలు 12.2, కోరుకొండ 12.2, నిడదవోలు 11.2, అనపర్తి 10.4, ఉండ్రాజవరం 8.2, పెరవలి 5.6 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది.

ఆరికిరేవులలో కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే ముప్పిడి, నాయకులు

కూటమి పాలనలో అభివృద్ధి సాకారం

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ముఖ్యమంత్రి సంకల్పమని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఆరికిరేవుల గ్రామంలో బుధవారం ఆయన ప్రారంభించారు. నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనపై ముద్రించిన కరపత్రాలను అందించారు. నెల రోజుల పాటు ఇంటింటికీ తిరిగి ప్రజలను కలవడంతో పాటు క్షేత్రస్థాయిలో సమస్యలు, మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటామన్నారు. ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి, కంఠమణి రామకృష్ణ, చావా శ్రీను, వట్టికూటి వెంకటేశ్వరరావు, యనమదల శివుడు, మద్దిపట్ల శివరామకృష్ణ పాల్గొన్నారు.

కాటన్ కట్టడానికి మహర్దశ

రూ.150 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

– న్యూస్‌టుడే, ధవళేశ్వరం, కడియం:

గోదావరి డెల్టాకు కేంద్ర బిందువైన ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ మరమ్మతు పనులకు ప్రభుత్వం రూ.150 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీనికి సంబంధించి తాజాగా పరిపాలనా మోదం ఇచ్చింది. ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో సుమారు 10 లక్షల ఎకరాలకు సాగు, లక్షలాది మంది ప్రజలకు తాగునీరు అందిస్తున్న ఈ బ్యారేజీకి మరమ్మతులు చేపట్టాలని ఏడేళ్ల క్రితం ప్రతిపాదించారు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో తాజాగా నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వం పరిపాలనామోదం ఇవ్వడంతో తదుపరి చర్యలు ఉంటాయని హెడ్‌వర్క్స్ ఈఈ జి.శ్రీనివాస్ తెలిపారు.

కాటన్ బ్యారేజి

మరమ్మతులు ఇలా..

ప్రధానంగా బ్యారేజీకి సంబంధించి వివిధ విభాగాల గేట్లు పాడైపోవడంతో వరదల సమయంలో సముద్రంలోకి నీరు వదిలే సమయంలో ఇబ్బంది పడాల్సి వస్తుంది. ధవళేశ్వరం, ర్యాలీ, మద్దూరు, విజ్జేశ్వరం ఆర్మ్‌ల పరిధిలోని 175 గేట్లలో 110 పూర్తిగా తుప్పు పట్టాయి. అడుగుభాగంలోని ప్లేట్లకు పెద్ద రంధ్రాలు పడడంతో ఏటా లక్షల క్యూసెక్కుల జలాలు వృథాగా సముద్రంలోకి తరలిపోతున్నాయి. దీంతో 117 గేట్లు కొత్తవి ఏర్పాటుచేస్తారు. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలకు సాగునీరు సరఫరా చేసే మూడు హెడ్ స్లూయిస్‌లకు సైతం కొత్త గేట్లు వస్తాయి. తూర్పుడెల్టా హెడ్‌స్లూయిస్‌కు 3, మధ్యడెల్టా 4, పశ్చిమడెల్టా హెడ్‌స్లూయిస్‌కు 5 వెరసి 12 కొత్త తలుపులు బిగిస్తారు. వరదల అనంతరం బురద పోయేలా స్కవర్ స్లూయిస్‌ల ద్వారా ఫ్లషింగ్ ఆపరేషన్ నిర్వహిస్తారు. తూర్పుడెల్టాకు 3, పశ్చిమడెల్టా 3, మధ్యడెల్టాకు 2 వెరసి ఎనిమిది స్కవర్ స్లూయిస్‌లు ఉన్నాయి. వీటికి సంబంధించి కొత్త తలుపులు ఏర్పాటుచేస్తారు. విద్యుత్తు, ఇతర సివిల్ పనులూ చేపడతారు.

పనులు మొదలుపెడతాం

'ధవళేశ్వరం బ్యారేజీ మరమ్మతులకు ప్రభుత్వం రూ.150 కోట్లు మంజూరు చేసింది. టెండర్లు పూర్తిచేసి పనులు మొదలుపెడతాం. తద్వారా వ్యవసాయ రంగానికి మేలుతో పాటు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయ'ని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అన్నారు. గోదావరి హెడ్‌వర్క్స్ సూపరింటెండెంట్ ఇంజినీర్ గోపీనాథ్ మాట్లాడుతూ నిధులు రాగానే పనులు వెంటనే చేపడతామన్నారు.



(c) eenadu

కాలుష్య కారక పరిశ్రమలపై చర్యలకు వినతి

పీసీబీ ఛైర్మన్‌తో ఎమ్మెల్యే నల్లమిల్లి చర్చ

ఎమ్మెల్యేతో మాట్లాడుతున్న ఛైర్మన్ కృష్ణయ్య

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: అనపర్తి మండలం రామవరంలో ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు (ఏపీపీసీబీ) ఛైర్మన్ డా.పి.కృష్ణయ్య బుధవారం కలిశారు. ఈ సందర్భంగా బిక్కవోలు మండలం బలభద్రపురంలో క్యాన్సర్ కేసులపై ఆయన వివరాలు అడిగి తెలుసుకున్నారు. నల్లమిల్లి, బలభద్రపురంలోని తొస్సిపూడి, కొమరిపాలెం గ్రామాల్లోని కేపీఆర్ ఫెర్టిలైజర్స్, గ్రాసిమ్ పరిశ్రమ, పౌల్ట్రీలు, రైసుమిల్లుల నుంచి విడదలయ్యే కాలుష్యంపై ఎమ్మెల్యే ఆయనకు వివరించారు. గోదావరి నదిలోకి ఏపీ పేపర్‌మిల్లు వదిలే వ్యర్థాలు, తుల్యభాగ డ్రెయిన్‌లోకి చేరే వ్యర్థాలపై చర్చించి చర్యలు తీసుకోవాలని కోరారు. **ఆలయాల్లో పూజలు..:** అనపర్తి మండలం మహేంద్రవాడలోని రుక్మిణి, సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి, బాలాత్రిపురసుందరి సమేత శ్రీరామలింగేశ్వరస్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయాల వార్షికోత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్నాతకోత్సవానికి సర్వం సిద్ధం

- రేపు జేఎన్‌టీయూకేలో నిర్వహణ
- హాజరుకానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రి లోకేశ్

న్యూస్‌టుడే, గాంధీనగర్

జేఎన్‌టీయూకే విశ్వవిద్యాలయ 11వ స్నాతకోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈ నెల 4 మధ్యాహ్నం 3 గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నారు. కులపతి, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్‌నజీర్, విద్యాశాఖా మంత్రి లోకేశ్, పలువురు అతిథులు హాజరుకానున్నారు.

ప్రతిభావంతులకు పతకాలు

స్నాతకోత్సవం సందర్భంగా వివిధ విభాగాల్లో ఇంజినీరింగ్, ఇతర డిగ్రీలు పూర్తిచేసిన వారికి ఒరిజినల్ డిగ్రీ పట్టాలను అందించనున్నారు. ప్రతిభావంతులకు 35 బంగారు, 5 నగదు పతకాలు ఇవ్వనున్నారు. 100 మందికి పీహెచ్‌డీ పట్టాలు ప్రదానం చేయనున్నారు. బీటెక్, బీఫార్మసీ, ఎం.టెక్, ఎంబీఏ, ఎం.ఫార్మసీ, బీబీఏ, ఫార్మాడి, పీజీ కోర్సులు పూర్తిచేసిన 7029 మందికి, యూజీ డిగ్రీలో 43,811 మందికి పట్టాలు అందుకోనున్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు

ఏర్పాట్లను వీసీ సీఎస్ ఆర్‌కే ప్రసాద్ బుధవారం పరిశీలించారు. మాజీ వీసీ ప్రసాదరాజు, ఏపీపీఎస్సీ మాజీ ఛైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్, జేఎన్‌టీయూకే చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసులతో సమీక్షించారు. అతిథులు, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ముఖ్య అతిథిగా అమెరికాలోని బోస్టన్ గ్రూప్ ఛైర్మన్ కోట సుబ్రహ్మణ్యం (సుబు కోట) హాజరుకానున్నారు. ఆయనకు గవర్నర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నారు. మాజీ ఉపకులపతులు, పాలక మండలి సభ్యులు, ఉన్నత విద్యామండలి అధికారులు హాజరుకానున్నారు.

మరపురాని వేడుకగా..

జేఎన్‌టీయూకే పేరు ప్రఖ్యాతులు ఇనుమడింపజేసేలా వేడుక నిర్వహిస్తాం. విద్యార్థుల జీవితంలో మరపురాని కార్యక్రమంగా నిర్వహించాలన్న సంకల్పంతో ఏర్పాట్లు చేస్తున్నాం. పలువురికి పట్టాలు, పతకాలు, డాక్టరేట్‌లు ప్రదానం చేస్తాం.

- సిఎస్ఆర్‌కె ప్రసాద్, వీసీ, జేఎన్‌టీయూకే

అరటి గెల అదిరింది

సాధారణంగా చక్రకేళి అరటి గెల 5 హస్తాలు ఉంటుంది. సుమారు 80 అరటికాయలు ఉంటాయి. ఉండ్రాజవరం మండలం వడ్లూరులో సింగారపు చిన్నబ్బాయి ఇంటి పెరట్లో పెంచిన చక్రకేళి రకం అరటి చెట్టు ఏకంగా 11 హస్తాలతో సుమారు 196 అరటి కాయలు కల్గి అబ్బురపరుస్తుంది. చూపరులకు కనువిందు చేస్తుంది. ఎటువంటి ఎరువులు, పురుగుల మందులు వాడకుండా ఇంటి పెరట్లో పెంచామని ఆయన తెలిపారు. సారవంతమైన మట్టి కల్గి ఉండటంతో ఇలా అరుదుగా పెద్ద సైజులో ఎక్కువ కాయలు కల్గి గెల వేస్తుందని ఈ సందర్భంగా ఉద్యానశాఖాధికారి కాళహస్తి గంగాధర్ న్యూస్‌టుడేకు తెలిపారు.

- న్యూస్‌టుడే, ఉండ్రాజవరం

గుడ్డు.. ఆశాజనకం

తగ్గిన ఉత్పత్తి, పెరిగిన ధర

రంగంపేట, న్యూస్‌టుడే: గడ్డు పరిస్థితుల నుంచి కోళ్ల పరిశ్రమ గట్టెక్కుతోంది. గుడ్డు ధర ఆశాజనకంగా మారింది. బర్డ్ ఫ్లూతో అధిక సంఖ్యలో కోళ్లు మృతిచెందడం, గుడ్ల ఉత్పత్తి తగ్గడంతో డిమాండు నెలకొంది. దాణా ధరలు విపరీతంగా పెరగడంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కొందరు రైతులు పరిశ్రమ నుంచి బయటకు వచ్చేశారు. దీంతో ప్రస్తుతం కోళ్ల సంఖ్య కొంత తగ్గిపోయి గుడ్డు ఉత్పత్తి 70 లక్షలకు పడిపోయింది. గతంలో 1.30 కోట్ల కోళ్లు, రోజుకు కోటి గుడ్లు ఉత్పత్తి అయ్యేవి. ఉమ్మడి తూర్పు, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల నుంచి సాధారణంగా పశ్చిమ బెంగాల్, బిహార్, అసోంలకు గుడ్ల ఎగుమతి ఎక్కువగా జరుగుతోంది.

మార్చి 30న ధరలు (రూ.ల్లో)

ఏడాది	ధర
2023	5.35
2024	5.25
2025	5.70

విదేశాలకు ఎగుమతులు లేవు..

గుడ్ల ఉత్పత్తికి ప్రసిద్ధిచెందిన ఉమ్మడి జిల్లాల నుంచి విదేశాలకు ఎగుమతులు లేకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాకినాడ, విశాఖ పోర్టులు అందుబాటులో ఉన్నా గుడ్లను ఎగుమతి చేయలేకపోతున్నారు. ప్రపంచవ్యాప్తంగా బర్డ్ ఫ్లూ ప్రభావంతో మాంసం కన్నా గుడ్లపైనే ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకుని విదేశాలకు ఎగుమతి చేపట్టేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోళ్ల రైతులు కోరుతున్నారు.

డిమాండు ఉన్నా..

అమెరికాలో ప్రస్తుత మన ధరల ప్రకారం ఒక గుడ్డు రూ.80 వరకు విక్రయం ఉంటుంది. డిమాండ్ పెరిగిన నేపథ్యంలో మన దగ్గర రూ.8లపైన ధర ఉండాలి. పరిశ్రమలో కొందరు వ్యాపారాల చర్యల వల్ల ధర అంతగా పెరగడం లేదు. ఈ ధర తాత్కాలికమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టిసారిస్తే కోట్ల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా మేలు చేకూరుతుంది.

- పడాల సుబ్బారెడ్డి, రాష్ట్ర కోళ్ల రైతుల సంఘం ప్రధాన కార్యదర్శి

మారనున్న మలకపల్లి రూపురేఖలు

సీఎం చంద్రబాబు సందర్శనతో గ్రామస్థుల ఆశాభావం

తాళ్లపూడి, న్యూస్‌టుడే: తాళ్లపూడి మండలంలోని మలకపల్లిలో మంగళవారం జరిగిన ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజావేదిక సభ అనంతరం గ్రామ రూపురేఖలు, బంగారు కుటుంబాల జీవన స్థితిగతులు మారనున్నాయి. సీఎం రాక ముందు.. వచ్చిన తర్వాత గ్రామపరిస్థితి పరిశీలిస్తే సరికొత్త మార్పులు చోటుచేసుకున్నాయి. పీ-4 కింద గ్రామంలో 95 మందిని గుర్తించారు. వీరిలో 11 కుటుంబాలను దత్తత తీసుకునేలా చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు సమక్షంలో మలుపు నవ్యశ్రీ కుటుంబాన్ని దత్తత తీసుకుని వారి కుమార్తెల చదువు, ఉద్యోగ కల్పన, తల్లిదండ్రుల ఉపాధి కల్పించేలా పి.కాశీవిశ్వనాథ రాజు ముందుకొచ్చారు. అదే విధంగా మిగిలిన 10 మంది కుటుంబాలకు 10 మంది మార్గదర్శులు అందుబాటులో ఉన్నారు. వారంతా స్వయం ఉపాధిలో రాణించాలని, వారి పిల్లల చదువు, ఉద్యోగాలు కల్పించాలని ఆశిస్తున్నారు. త్వరలో వారందరిని బంగారు కుటుంబాలుగా మార్చనున్నారు. ఇంకా మిగిలిన 84 మంది కుటుంబాలకు మార్గదర్శకులను ఎంపిక చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. పూర్తిస్థాయిలో బంగారు కుటుంబంగా మారితే మిగతా గ్రామాలకు మలకపల్లి ఆదర్శం కానుంది.

పీజీఆర్ఎస్‌లో సమస్యలు తెలియజేస్తున్న గ్రామస్థులు

పోసిబాబు కుటుంబాన్ని కలెక్టర్ దత్తత..

చర్మకారుల పింఛన్ పొందుతున్న సనమండ్ర పోసిబాబు కుటుంబాన్ని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి దత్తత తీసుకున్నారు. ఆయనకు స్వయం ఉపాధి కల్పించేలా చర్యలు చేపట్టనున్నారు. అసంపూర్తిగా ఉన్న గృహానికి కొత్త కళ రానుంది. అతని కుమారుడికి ఉద్యోగాన్ని కల్పించనున్నారు. ప్రజాసమస్యల పరిష్కార వేదిక శిబిరాన్ని ఏర్పాటు చేసి గ్రామంలోని సుమారు 90 మంది నుంచి అర్జీలను స్వీకరించారు. వారి సమస్యలకు పరిష్కారం లభించనుంది. పోసిబాబు ఇంటికి వెళ్లేందుకు సీసీ రహదారి ఉంది కాని మురుగునీరు వెళ్లే మార్గం లేదు. ఇలా గ్రామంలో పలు చోట్ల మురుగుకాలువల నిర్మాణానికి చర్యలు చేపట్టే అవకాశం ఉంది.

ఒక్కొక్కటిగా సమకూరనున్నాయి..

అసంపూర్తిగా ఉన్న విద్యుత్తు సమస్యలు తక్షణ పరిష్కార దిశగా చర్యలు చేపట్టారు. వేలాడుతున్న తీగలు సరిచేయడంతో పాటు నూతన స్తంభాలను ఏర్పాటు చేశారు. ఇలా ఒక్కొక్కటి పరిష్కార దిశగా చేయనున్నారు. ఇంకా అసంపూర్తిగా ఉన్న పాఠశాల భవనం పునరుద్ధరణ పనులు చేపట్టనున్నారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు వసతులు మెరుగయ్యే వీలుంది. శుద్ధిచేసిన గోదావరి నీరు పూర్తిస్థాయిలో సమకూర్చేలా చర్యలు చేపట్టనున్నారు. ఇక్కడకు వచ్చిన జిల్లాస్థాయి అధికారులు గ్రామ పరిస్థితిపై తగిన నివేదిక సిద్ధం చేశారు. నివేదికలోని అంశాలకనుగుణంగా గ్రామాన్ని తీర్చిదిద్దనున్నారు.

బొత్స ఎదుటే వైకాపా నాయకుల గలాటా!

మధురపూడి విమానాశ్రయం వద్ద ఘటన

ఈనాడు, రాజమహేంద్రవరం: కోనసీమ జిల్లా అమలాపురంలో బుధవారం వైకాపా కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన మాజీ మంత్రి బొత్స సత్యనారాయణకు మధురపూడి విమానాశ్రయం వద్ద ఊహించని పరిస్థితి ఎదురైంది. ఆయనకు స్వాగతం పలికేందుకు రాజమహేంద్రవరానికి చెందిన నాయకులు, వారి అనుచరులు వెళ్లారు. బొత్స రాగానే అంతా ఆయన వద్దకు చేరుకోవడంతో కొంత గందరగోళం నెలకొంది. అదే విమానంలో వచ్చిన విశాఖకు చెందిన ఓ మాజీ మంత్రి కుమారుడు ఏదో వ్యాఖ్య చేయడంతో అతనిపైకి వైకాపా శ్రేణులు దూసుకువెళ్లి గలాటా చేసినట్లు సమాచారం. ఈ క్రమంలో తోపులాట జరిగినట్లు తెలిసింది. అక్కడున్న నేతలు జోక్యం చేసుకుని సర్దిచెప్పడంతో వివాదం సమసింది. దీనిపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసు వర్గాలు తెలిపాయి. గలాటాకు సంబంధించి ఆ ప్రాంగణంలోని సీసీ ఫుటేజీలు సేకరిస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు.

ఆర్టీసీ ఉచిత, రాయితీ బస్సు పాసులు 3,560 జారీ

వి.ఎల్.పురం: రాజమహేంద్రవరం ఆర్టీసీ డిపో పరిధిలో గత నెల ఒకటి నుంచి ఇప్పటి వరకు ఉచిత, రాయితీ బస్సు పాసులు 3,560 జారీ చేశారు. వీటిలో విద్యార్థులకు ఉచిత బస్సు పాసులు 66, రాయితీతో 3,111, దివ్యాంగుల(పీహెచ్‌సీ)కు 82, జర్నలిస్టులకు 109 పాసులు జారీ చేసినట్లు డిపో అధికారులు తెలిపారు. విద్యార్థులకు జారీ చేసిన రాయితీ పాసుల్లో ఏడాది కాలానికి చెల్లుబాటయ్యేవి 3, నెల రోజులకు 1,532, మూడు నెలల కాలానికి చెల్లుబాటయ్యేవి 1,571, ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు జారీ చేసిన నెలవారీ, క్వార్టర్లీ పాసులు 5 ఉన్నట్లు తెలిపారు. ఇవి కాక ఉద్యోగులకు మంత్లీ సీజన్ టికెట్లు(ఎంఎస్‌టీ) ఎక్స్‌ప్రెస్ 5, అల్ట్రాడీలక్స్ 54, పల్లెవెలుగు బస్సులకు 133 చొప్పున జారీ చేసినట్లు తెలిపారు. ఇంకా ఎవరైనా ఉచిత, రాయితీ పాసులు తీసుకోవాల్సినవారు ఉంటే స్థానిక ఆర్టీసీ కాంప్లెక్సులోని బస్సుపాసుల కౌంటర్ వద్ద సంప్రదించవచ్చని డీఎం మాధవ్ తెలిపారు.

నేడు ప్రైవేటు పాఠశాలలు బంద్

తాళ్లపూడి: రాష్ట్ర ప్రైవేటు పాఠశాలల మేనేజ్‌మెంట్ యూనియన్ నిర్ణయం మేరకు గురువారం మండలంలోని ప్రైవేటు పాఠశాలల బంద్ పాటిస్తున్నామని తెలియజేస్తూ బుధవారం ఎంఈవో బాలామణి, నెహ్రూలాలకు నోటీసు పత్రాన్ని అందజేశారు. పాఠశాల విద్యాశాఖలో కొందరి అధికారుల తీరు ఏకపక్ష నిర్ణయాలతో ప్రైవేటు పాఠశాలలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ బంద్ నిర్వహిస్తున్నామన్నారు. ఆయా పాఠశాలల కరస్పాండెంట్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఖరీఫ్ ప్రారంభంలోనే సాగునీరు విడుదల

సీతానగరం: ప్రతి ఎకరాకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో ఎత్తిపోతల పథకాలపై దృష్టి సారించి ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే నీటిని విడుదల చేస్తున్నామని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ అన్నారు. కాటవరం, తొర్రిగెడ్డ ఎత్తిపోతల పథకాల నుంచి బుధవారం సాగునీరు విడుదల చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎత్తిపోతలన్నీ సీతానగరంలోనే ఉండటం వల్ల ఈ ప్రాంత రైతాంగానికి సాగునీరు ఇబ్బందులు లేవన్నారు. ఏటా ఖరీఫ్ సీజన్‌లో తొర్రిగెడ్డ నుంచి 3.2 టీఎంసీల నీటిని అయిదు నెలల పాటు సరఫరా చేస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన అన్ని ప్రాజెక్టులకు సంబంధించి ప్రభుత్వానికి నివేదికలు చేరవేయడంతో సమయానికి నీటిని విడుదల చేయగలిగామని రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అన్నారు. భాజపా కన్వీనర్ నీరుకొండ వీరన్నచౌదరి, తొర్రిగెడ్డ ఛైర్మన్ వేగి శ్రీనివాసు, వైస్ ఛైర్మన్ జగపతిరాజు, ఏఈ ఎస్.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి జలాల్లో పుష్పాలు వేస్తున్న ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి తదితరులు

వైకాపా నియమించిన వారిని తొలగించాలి

తొర్రిగెడ్డ ఎత్తిపోతల పథకంలో వైకాపా హయాంలో నియమించిన ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులను తొలగించాలని చినకొండేపూడికి చెందిన జనసేన పార్టీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. ఇద్దరిని తొలగించామని ఒకరు కాంట్రాక్టరు వద్ద పనిచేస్తుంటే, పొరుగు సేవల్లో ఒక్కరే ఉన్నారని ఏఈ శివరామకృష్ణ ఎమ్మెల్యేకు వివరించారు.

చాగల్లులో ముగిసిన ప్రసన్న అంత్యక్రియలు

చాగల్లు: పాశమైలారం పారిశ్రామికవాడలో గతనెల 30వ తేదీన సంభవించిన విస్ఫోటనంలో చాగల్లు యువతి పోలిశెట్టి ప్రసన్న మృతి చెందిన వార్త విదితమే. అయితే ఆమె మృతదేహాన్ని ప్రత్యేక భద్రతతో తెలంగాణా ప్రభుత్వం చాగల్లు పంపించారు. మంగళవారం అర్ధరాత్రి 2గంటల సమయంలో మృతదేహం గ్రామానికి చేరుకోగా బుధవారం ఉదయం ఆమెకు అంత్యక్రియలు నిర్వహించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా యువతి తండ్రి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలంగాణా ప్రభుత్వం తక్షణ సాయంగా రూ.లక్ష అందించారన్నారు. ప్రత్యేక అంబులెన్సులో తామంతా చాగల్లు వచ్చామన్నారు.

ఉద్యోగులకు ఈఎల్ఐ ప్రయోజనాలు

రాజమహేంద్రవరం ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-2 వెంకటేశ్వర్లు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో)లో నమోదయ్యే కొత్త ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ ఉపాధి ఆధారిత ప్రోత్సాహక(ఈఎల్ఐ) పథకం ప్రయోజనాలు వర్తిస్తాయని రాజమహేంద్రవరం ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-2 వెంకటేశ్వర్లు కలువాయి తెలిపారు. స్థానిక వి.ఎల్.పురంలోని ఈపీఎఫ్‌వో కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఈఎల్ఐ పథకానికి సంబంధించిన వివరాలు, ప్రయోజనాల గురించి వివరించారు. దేశంలో అన్ని రంగాల్లో ఉపాధి కల్పనకు మద్దతునివ్వడం, ఉపాధి అవకాశాలు, సామాజిక భద్రతను పెంపొందించేందుకు ప్రభుత్వం రూపొందించిన ఈ పథకాన్ని రెండు భాగాలుగా విభజించినట్లు తెలిపారు. కొత్తగా ఉద్యోగాల్లో చేరే వారికి ఆర్థిక ప్రయోజనం చేకూర్చడం, మరిన్ని ఉద్యోగాలు కల్పించేలా అన్ని రంగాల్లోని యాజమాన్యాలను ప్రోత్సహించడం దీని ఉద్దేశమన్నారు. ఈ ఏడాది ఆగస్టు ఒకటి నుంచి కొత్తగా ఉద్యోగాల్లోకి చేరి తొలిసారి ఈపీఎఫ్‌లో నమోదైన ఉద్యోగులకు రూ.15 వేలు ఆర్థిక ప్రోత్సాహాన్ని ప్రభుత్వం ఏడాది కాల వ్యవధిలో రెండు విడతలుగా అందిస్తుందన్నారు. ఆరు నెలల సర్వీసు పూర్తి చేసుకున్న తర్వాత సగం మొత్తం, మరో ఆరు నెలల సర్వీసు అనంతరం మిగతా సగం మొత్తం నేరుగా ఉద్యోగుల ఖాతాలో డీబీటీ విధానంలో జమ చేస్తుందన్నారు. నెలకు రూ.లక్ష వరకు సంపాదించే కొత్త ఉద్యోగులందరికీ ప్రభుత్వం అందించే ఈ ఆర్థిక ప్రయోజనం వర్తిస్తుందన్నారు.

వెంకటేశ్వర్లు

యాజమాన్యాలకు మద్దతు..

ఈ పథకం తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని, అన్ని రంగాల్లో అదనపు ఉద్యోగాల కల్పనకు ఊతమిస్తుందని తెలిపారు. ఉద్యోగాలు కల్పించే యాజమాన్యాలకు కూడా ప్రభుత్వం మద్దతు నిలుస్తుందని, రూ.లక్ష వరకు వేతనం తీసుకునే ఉద్యోగులను కలిగి ఉన్న యాజమాన్యాలకు ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. కనీసం ఆరు నెలల నిరంతర ఉపాధి ప్రాతిపదికన నియమించుకున్న ప్రతి అదనపు ఉద్యోగి కోసం ఆయా సంస్థల యాజమాన్యాలకు రెండేళ్లపాటు నెలకు రూ.3 వేల వరకు ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. అదే తయారీ రంగానికి సంబంధించిన యాజమాన్యాలకు 3వ, 4వ సంవత్సరాల వరకు ప్రోత్సాహకాలు ప్రతినెలా అందిస్తుందని తెలిపారు. ఈపీఎఫ్‌వోలో నమోదు చేసుకుని 50 మంది, అంతకంటే తక్కువ ఉద్యోగులున్న సంస్థలు కనీసం ఆరు నెలలపాటు నిరంతర ప్రాతిపదికన కనీసం ఇద్దరు అదనపు ఉద్యోగులను, 50 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న సంస్థలు అయిదుగురు అదనపు ఉద్యోగులను నియమించుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు ఒకటి నుంచి 2027 జులై 31 మధ్య సృష్టించే ఉద్యోగాలకు ఈ పథకం వర్తిస్తుందని, యాజమాన్యాలకు వారి పాన్ అనుసంధానిత ఖాతాల్లో ప్రోత్సాహక చెల్లింపులు జమవుతాయని వివరించారు.

మిత్రుడే ఉసురు తీశాడు!

హత్య కేసులో నిందితుడి అరెస్టు

నరసాపురం, న్యూస్‌టుడే: కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటనపై నమోదు చేసిన కేసులో పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేసి అతడు హత్యకు గురైనట్లు నిర్ధారించారు. నిందితుడిని అరెస్టు చేశారు. పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం పట్టణంలోని ఎస్‌డీపీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అద్నాన్ నయీంఅస్మి ఈ వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది జనవరి 27న నరసాపురం మండలం కొప్పర్రు సమీపాన జిన్నూరు కాలువలో గుర్తించలేని స్థితికి చేరిన మృతదేహం ఉన్నట్లు వీఆర్వో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై నరసాపురం గ్రామీణ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతుడిది పెరవలి మండలం నడిపల్లి గ్రామానికి చెందిన చుక్కల శ్రీనివాస్‌గా వివిధ పరీక్షలు చేసి గుర్తించారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

చంపి.. కాలువలో పడేసి..

మృతుడిని గుర్తించాక లోతుగా దర్యాప్తు చేయడంతో అతడు హత్యకు గురైనట్లు తేలింది. మృతుడు చుక్కల శ్రీనివాస్, పెరవలి మండలం కాకరపర్రు గ్రామానికి చెందిన పూల వ్యాపారి మల్లిపూడి శ్రీనివాస్‌లు మిత్రులు. రాజమహేంద్రవరంలో డీఎస్సీ కోచింగ్‌కి వెళ్లే అంశంపై వారి మధ్య జనవరి 3న వాగ్వాదం చోటు చేసుకుని ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో పెరవలి వద్ద మల్లిపూడి శ్రీనివాస్ తన మిత్రుడిని బీరు సీసాతో కడుపులో పొడిచి హతమార్చాడు. తరువాత మృతదేహాన్ని కాళ్లు, చేతులు తాళ్లతో కట్టి పెరవలి కాలువలో పడేశాడు. ప్రవాహ ఉద్ధృతికి మృతదేహం జిన్నూరు కాలువలోకి చేరింది. సాంకేతిక ఆధారాలతో దర్యాప్తు చేయడంతో నిందితుడు పట్టుబడినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించేందుకు కృషి చేసిన అదనపు ఎస్పీ వి.భీమారావు, డీఎస్పీ జి.శ్రీవేద అరవింద, సీఐ జి.దుర్గాప్రసాద్, ఎస్సైలను ఎస్పీ అభినందించారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి	24,000
కురిడీ (వెయ్యింటికి):	
పాతకాయ: గండేరా	25,000
గటగట	26,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-20,000
కొత్త (పచ్చి) కాయ	18,000-20,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	4,500
కిలో	300

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	93-00
రిటైల్ లైవ్	115-00
డ్రెస్డ్	167-00
స్కిన్‌లెస్	190-00

తూ.గో. జిల్లా, రంగంపేట మం. పడిశలేరు గ్రామ స. నెం.77 లో గల య 1-87 ట్ల జిరాయితీ భూమి కొనుగోలుకు సంబంధించిన

బహిరంగ ప్రకటన తేది: 03-07-2025

'విజ్ఞాన్' అను ప్రఖ్యాతి చెందిన పేరుతో ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ అనేక చోట్ల విద్యా సంస్థలను స్థాపించి, అత్యంత ప్రతిష్ఠాత్మకముగానూ, విజయవంతముగానూ నిర్వహించుచున్న మా క్లయింట్లైన 'లావు ఎడ్యుకేషనల్ సొసైటీ' సంస్థ వారు, ఈ దిగువ పేర్కొన్న షెడ్యూలులో ఉదహరించిన స్థిరాస్తిని, సదరు ఆస్తి పూర్తి హక్కు దార్లైన (1) వల్లేపల్లి బ్రహ్మాజీరావు, (2) వల్లేపల్లి వెంకట దుర్గ సుధాకర్, (3) చక్కపల్లి రామచంద్రపతి, (4) తుమ్మల వీర పద్మ సుబ్బలక్ష్మి గార్ల నుండి క్రయము పొందుటకు ఉద్దేశించి, వారికి హెచ్చు మొత్తములో బయానా ఇచ్చి కొదువ క్రయ ధనము వారికి చెల్లించుటకున్నూ, వారి నుండి రిజిష్టర్డు క్రయ దస్తావేజును పొందుటకున్నూ, సంసిద్ధులై ఉన్నారు. కావున, సదరు వ్యవహారము పట్ల ఎవరికైననూ ఎట్టి అభ్యంతరములు గాని, సదరు ఆస్తిపై ఎట్టి క్లెయిములుగాని ఉన్నచో, వాటిని, ఈ పత్రికా ప్రకటన వెలువడిన పది దినములలోగా, తగు సాక్ష్యాధారములతో సహా ఈ క్రింది చిరునామాకు రిజిష్టర్డు పోస్టు ద్వారా మాత్రమే వారి వారి ఫోన్ నెంబర్లతో సహా తెలుపవలెను. ఆపై వచ్చు అభ్యంతరములు పరిగణింపబడవు.

షెడ్యూలు

తూర్పు గోదావరి జిల్లా, పెద్దాపురం సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసు ఇలాకాలో చేరిన రంగంపేట మండలం, పడిశలేరు గ్రామ పంచాయతీ కి చెందిన, పడిశలేరు గ్రామం తాలూకు రి. స. నెం. 77 రులో య 1-87 ట్ల జిరాయితీ భూమికి హద్దులు

తూర్పు : రి. స. నెం. 76 రు భూమి
దక్షిణం : మా క్లయింటు లావు ఎడ్యుకేషనల్ సొసైటీ వారి భూమి,
పడమర : మా క్లయింటు లావు ఎడ్యుకేషనల్ సొసైటీ వారి భూమి
ఉత్తరం : చెరువు

B.A. Raja Rao, Smt M. Jayasree, Tata Rama Rao, V.V Srujan, Smt T. Ramadevi, Saripilli Krishna
Advocates

Vignan Admin Office: # 8-1-13/1, Siripuram, Opp: A U Registrar Office, Visakhapatnam - 530 003

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్సడ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం
అధీకృత అధికారి వివరములు: పేరు: శ్రీ. వై. శ్రీకాంత్ (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. 80994 44378,
ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు: 79951 98451.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

[illegible]

రిజర్వు ధర: రూ.80,36,000/- | ధరావత్తు: రూ.8,03,600/- | బిడ్ పెంపుదల: రూ. 25,000/-
ఇ-వేలం తేది: 21-07-2025 | సమయం: ఉ॥ 11:00 గం.ల నుండి సా॥ 04.00 గం.ల వరకు

[illegible]

తేది: 26.06.2025, ప్రదేశం: విశాఖపట్నం | సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

EENADU Classifieds

AUTO
VEHICLES WANTED
Wanted Vehicle: అశోక్ లేలాండ్ దోస్త్, టాటా ఇంట్రా, టాటా పికప్ వాహనాలు నెలవారీ అద్దె ప్రాతిపదికన ప్రముఖ కంపెనీకి వాహనం అద్దెకు కావలెను. సంప్ర: ✆: 63022 27985.

HEALTH & CARE
మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్, షుగర్‌కు. రాజమండ్రి (ఇంతకు ముందు మెట్రో లాడ్జి) ఇప్పుడు same కేంప్. శ్రీసాయిలక్ష్మీ లాడ్జిలో మందులు. SVG మార్కెట్ రోడ్, ఆర్.టి.సి. బస్టాండ్ ఎదురుగా, ప్రతీ నెల 3, 17 తేదీల్లో.

REAL ESTATE
FLAT FOR SALE
KAKINADA CITY
Kakinada 2 BHK Flat 1000 sft, Kanna Enclave, Gudarigunta, NFCL Road, Kakinada with Car Parking, Near RTO Off. Ph: 63794 37423.

HOUSE FOR SALE
GENERAL
Kkd & సామర్లకోటలో 45 లక్షలు & 30 లక్షలకే, House (85 లక్షలు, 1.20 లక్షలకే విల్లా), Open Sites అమ్మకం. 80% లోన్ Kuda, 98490 40891.

EENADU for Advertisement Contact: 8008597607

PLOT FOR SALE
RAJAMAHENDRAVARAM RURAL
రాజమండ్రి బొమ్మూరులో తక్షణం ఇల్లు కట్టుకొనుటకు అన్ని సదుపాయములతో 150 చ॥గ॥ RUDA అప్రూవ్డ్ స్థలములు అమ్మకం. బ్యాంక్ లోన్ సదుపాయం కలదు. ✆ 78424 28888.

రాజమండ్రి పిడింగొయ్యి, లోటస్ స్కూల్ దగ్గర, N/F 40x70 కొలతలతో 311 గజాల స్థలం (3 బిట్లు-933 గజాలు) అమ్మకమునకు కలదు. (డైరెక్ట్ పార్టీస్ మాత్రమే). Govt. Rate గజం 22,000/-. Ph: 63794 37423.

JOBS
అభినయ ఎంటర్‌ప్రైజెస్, రాజమండ్రి, టాటా సోలార్ నందు పనిచేయుటకు అనుభవంగల టెక్నీషియన్స్ & కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. Contact: 94924 44555.

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో+ వ+ మంచి జీతం + ఇన్సెంటివ్స్ కలవు. 99590 21122/ 99590 31122.

కావలెను
మా ఆఫీస్ నందు పనిచేయుటకు ఆఫీస్ అసిస్టెంట్ (F) మరియు సైట్ సూపర్‌వైజర్స్(M) కావలెను.
Qul: డిగ్రీ, Exp: 2 yrs., 2 వీలర్ మస్ట్
OSTRICH
Axis బ్యాంక్ పైన, దానవాయిపేట రాజమండ్రి, సెల్: 93462 16570

రామకృష్ణ ఓల్డేజ్ హోం, VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్లు సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో. వ. + జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ✆ 92814 52845, 82475 00574.

WANTED
High School Teachers
RAVINDRA HIGH SCHOOL, Madiki
Location: Madiki, in between Jonnada and Vemagiri, Near NH16 Highway.
Need Telugu, English, and Physics High School Teachers.
Phone Number
91105 67164
95334 31103

రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No-1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+ వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119430, 9618802390.

ప్రభాకరనిధి, దేవిచౌక్, రాజమండ్రి నందు బిజినెస్ ప్రమోషన్ చేయుటకు అభ్యర్థులు కావలెను. ఆసక్తిగలవారు సంప్రదించండి. సెల్: 79952 33384.

శివకార్తికేయ హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు ఇంటి/ వంట పనిచేయుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 20K. ✆ 99120 11499, 99120 11899.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-70 పై॥
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

రాజమహేంద్రవరం

తెరపై ఈనాడు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: సూర్య ప్యాలెస్, అనుశ్రీ, రాజా, అప్సర, అశోక, వీఎస్‌మహల్: కన్నప్ప; సూర్యామినీ: ఎఫ్-1 ది మూవీ; స్వామి, శివ జ్యోతి: కుబేర; రంభ: మా; ఊర్వశి: 8 వసంతాలు; మేనక: చంద్రేశ్వర, హనుమాన్‌జంక్షన్; శ్యామల: మార్గన్.

జీజీహెచ్ ఎంఆర్ అధికారిగా జయచంద్రన్

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం జీజీహెచ్ మెడికల్ రికార్డు అధికారిగా ఎ.జయచంద్రన్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా కాకినాడ జీజీహెచ్ నుంచి ఆయన ఇక్కడికి వచ్చారు. జనన, మరణ ధ్రువపత్రాలకు సంబంధించి కచ్చితత్వమైన రికార్డు నిర్వహణతోపాటు రోగులకు ఇబ్బందులు లేకుండా అన్ని ధ్రువపత్రాలు జారీచేస్తామని ఆయన వివరించారు.

జెండా ఆవిష్కరణ కార్యక్రమంలోఎమ్మెల్యే శ్రీనివాస్, నాయకులు

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

టి.నగర్, న్యూస్‌టుడే: నగరంలో అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందిస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ తెలిపారు. తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం ఒకటో డివిజన్ నుంచి ప్రారంభించారు. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనప్పటికీ పథకాలు కొనసాగించడం జరుగుతుందన్నారు. ఏడాది కాలంలో ప్రజలకు అవసరమైన రోడ్లు, కాలువలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ముంపు ప్రాంతాల్లో సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టామన్నారు. త్వరలో కొత్తగా రేషన్ కార్డులు, పింఛన్లు అందిస్తామన్నారు. అర్హులకు ఇళ్ల పట్టాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఇంటింటికి తిరిగి పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ చేసి యాప్‌లో నమోదు చేశారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, నాయకులు గన్ని కృష్ణ, మజ్జి రాంబాబు, వర్రే శ్రీనివాసరావు, జానకీరామయ్య తదితరులు పాల్గొన్నారు

విద్యుత్తు ఛార్జీల భారం తగ్గించాలి

వి.ఎల్.పురం, న్యూస్‌టుడే: వినియోగదారులపై విద్యుత్తు ఛార్జీల భారాన్ని తగ్గించాలని, నివాస గృహాలను స్మార్ట్‌మీటర్లు బిగింపు ప్రక్రియను మానుకోవాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక శ్యామలా సెంటర్ వద్ద ఉన్న సీపీఎం కార్యాలయంలో విద్యుత్తు స్మార్ట్‌మీటర్లకు వ్యతిరేకంగా రూపొందించిన గోడపత్రికలను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి అరుణ్ మాట్లాడుతూ ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా గృహాలకు విద్యుత్తు స్మార్ట్‌మీటర్లు బిగించే

గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

ప్రక్రియ ప్రారంభమైందని, ఇది ప్రజలపై ఆర్థిక భారం మోపే కుట్రని, విద్యుత్తు రంగాన్ని ప్రైవేటు సంస్థలకు అప్పగించే యోచనని విమర్శించారు. స్మార్ట్‌మీటర్లు బిగిస్తున్న వారు కార్పొరేట్ సంస్థకు చెందినవారైనప్పటికీ విద్యుత్తు శాఖ సిబ్బంది అని చెప్పి మోసం చేస్తున్నారని ఆయన ఆరోపించారు. స్మార్ట్‌మీటర్ల ఖర్చు వినియోగదారులే భరించాల్సి ఉంటుందని, సింగిల్ ఫేజ్ మీటర్‌కు రూ.8,927, త్రిఫేజ్ మీటర్‌కు రూ.17,286లు చొప్పున ఆ మొత్తాన్ని విద్యుత్తు బిల్లుల్లో కలిపి వసూలు చేస్తారంటూ ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పీక్‌టైం ఛార్జీలు పేరుతో ఉదయం, సాయంత్రం 6 నుంచి 10 గంటల మధ్య అధిక ఛార్జీలు వసూలు చేస్తారన్నారు. ప్రభుత్వాలు మారినా విధానాలు మారలేదని విమర్శించారు. గృహాలకు స్మార్ట్ మీటర్లు బిగించడానికి వస్తే అనుమతించవద్దంటూ ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పవన్, రామచంద్రరావు, మూర్తి, పూర్ణిమరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రవేశాలు సకాలంలో ప్రారంభమయ్యేనా..?

న్యూస్‌టుడే, దేవీచౌక్

ఏటా డిగ్రీలో ప్రవేశాలు ఆలస్యంగా ప్రారంభం కావడంతో విద్యార్థులు నష్టపోవాల్సి వస్తోంది. ఇంటర్ ఫలితాలు వచ్చి నెలలు అవుతున్నా... డిగ్రీలో ప్రవేశాలపై ఇంత వరకు ఎటువంటి సమాచారం లేదు. గత ఏడాది జులైలో అడ్మిషన్లు ప్రారంభం కాగా నవంబరు వరకు జరిగాయి. ఇంజినీరింగ్ ప్రవేశాలు పూర్తయిన తర్వాత డిగ్రీలో ప్రారంభించడంతో నేరుగా చేరేవారి సంఖ్య తగ్గిపోతోంది. తెలంగాణలో ఇప్పటికే మూడో విడత ప్రవేశాలు పూర్తయ్యాయి. ఇప్పటికే ప్రైవేటు కళాశాలల్లో గుట్టుచప్పుడు కాకుండా అడ్మిషన్లు జరిగిపోతున్నాయి.

రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల

- రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో 2200 సీట్లు ఉండగా మొదటి విడత కౌన్సెలింగ్‌లో తక్కువ సీట్లు భర్తీ అయ్యాయి. రెండు, మూడు విడతల్లో మొత్తం సీట్లు భర్తీ అయ్యాయి. ప్రతిష్ఠాత్మకమైన ఆర్ట్స్ కళాశాలలో సీట్ల భర్తీ ఇబ్బంది కానప్పటికీ మిగత ప్రభుత్వ కళాశాలల పరిస్థితి ఏమిటన్నది ప్రశ్నార్థకం. పూర్తిగా సీట్లు భర్తీ అయ్యేలోగా తరగతులు ప్రారంభించేస్తున్నారు. మొదటి సెమిస్టర్ పరీక్ష వరకు ప్రవేశాలు కొనసాగుతూనే ఉన్నాయి. దీని వల్ల ఆలస్యంగా ప్రవేశాలు పొందిన విద్యార్థులు తరగతులను కోల్పోతున్నారు. నవంబరులో ప్రవేశం పొందిన విద్యార్థులు రెండు నెలల్లోనే మొదటి సెమిస్టర్ పరీక్షకు హాజరు కావాల్సి వస్తోంది. గత ఏడాది నవంబరులో ప్రవేశాలు పొందిన విద్యార్థులు జనవరిలో సెమిస్టర్ పరీక్షకు హాజరయ్యారు. ఇప్పటికైనా సకాలంలో ప్రవేశాలు ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో పెరిగిన పిచ్చి మొక్కలు

ఖాళీ స్థలం.. వ్యాధుల భయం

రాజమహేంద్రవరం నగరపాలక సంస, న్యూస్‌టుడే: నగరంలో ఇళ్ల మధ్యలో ఖాళీ స్థలాలు ఇబ్బందికరంగా మారుతున్నాయి. వర్షాకాలంలో నీరు నిలిచిపోయి దోమలకు ఆవాసంగా మారుతున్నాయి. దీంతోపాటు అక్కడ చేరిన చెత్తాచెదారం వర్షాలకు కుళ్లి దుర్వాసన వెల్లువెత్తుతోంది. ఫలితంగా చుట్టుపక్కల ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. దోమలు పెరిగిపోవడం వల్ల ప్రజలు డెంగీ, మలేరియా వంటి వ్యాధులు బారిన పడుతున్నారు. కొన్ని చోట్ల పందులు, పశువులకు నిలయంగా మారుతున్నాయి. నగరపాలక సంస్థ నిర్వహించే పీజీఆర్ఎస్ (గ్రీవెన్స్)లో అధికంగా చుట్టుపక్కల యజమానులు ఫిర్యాదు చేస్తున్నారు. వాస్తవానికి ఖాళీ స్థలాల విషయంలో నగరపాలక సంస యంత్రాంగం చేతులెత్తేస్తోంది. అర్బన్‌లో 2 వేల వరకు ఖాళీ స్థలాలు ఉన్నట్లు గుర్తించారు. వీటిలో కేవలం 600 స్థలాలకు సంబంధించి మాత్రమే యజమానులను గుర్తించగలిగారు. ఎక్కువ శాతం మంది ఇతర రాష్ట్రాలు, విదేశాల్లో స్థిరపడడంతో కనీసం చిరునామా కూడా కనుగోలేకపోతున్నారు. దీంతో వారిని నోటీసులు జారీ చేసేందుకు ఆస్కారం లేకుండాపోతోంది. దీని వల్ల నగరపాలక సంస్థకు ఖాళీ స్థలాల పన్ను రూపంలో ఆదాయం కూడా రావడం లేదు. ఇక డివిజన్లలో ఖాళీ స్థలాలు చుట్టుపక్కల నివాసితులకు ఇబ్బందిగా మారుతున్నాయి. ప్రధానంగా వర్షాకాలం, శీతాకాలంలో మరిన్ని అవస్థలు పడాల్సి వస్తోంది. చెత్త చెదారంతో దుర్వాసన వస్తోంది. నగరంలో నారాయణపురం, చౌడేశ్వరనగర్, రెవెన్యూ కాలనీ, ఏవీఏ రోడ్డు, జేఎన్ రోడ్డు, ఆవ, నగర శివారు ప్రాంతాల్లో ఎక్కువగా ఖాళీ స్థలాలు ఉన్నాయి. ఇప్పటికైనా యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

మిగిలిన ఆహారం ఎందరికో ఉపయోగం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: సమాజంలో మార్పు కోసం చేసే ప్రయత్నం సఫలమవుతుందని స్వర్ణాంధ్ర సేవాసంస్థ నిర్వాహకుడు గుబ్బల రాంబాబు తెలిపారు. వివాహాలు, పుట్టిన రోజు వేడుకలు, పండగలు, పర్వదినాల సందర్భంగా మిగిలిన ఆహారం వృథా కాకుండా పేదలకు అందిస్తే బాగుంటుందనే తపనతో 15 ఏళ్ల నుంచి మిగులు ఆహారాన్ని సేకరించి నగరంలోని నడక దారులపై జీవనం సాగిస్తున్న వారికి అందిస్తున్నామన్నారు. కొవిడ్ తర్వాత నుంచి సేవలను విస్తరించి సంస్థలో రోజుకు 500 మందికి సరిపడా ఆహారం వండించి స్వర్ణాంధ్ర సంచార వాహనం ద్వారా రాజమహేంద్రవరం నగరంలోని పుష్కరఘాట్, ప్రభుత్వాసుపత్రి, గోకవరం బస్టాండ్ వద్ద మధ్యాహ్న భోజనం అవసరార్థులకు అందిస్తున్నామన్నారు. ఇవి కాకుండా వేడుకల్లో మిగిలిన ఆహార పదార్థాలను కొందరు తెచ్చి ఇస్తున్నారని, వాటిని సాయంత్రం సమయంలో పంపిణీ చేస్తున్నామన్నారు. దాతలు తాము నిర్వహించే వేడుకల్లో మిగిలిన ఆహారాన్ని అందించాలని భావిస్తే లాలా చెరువులోని తమ కేంద్రంలో సంప్రదించాలని కోరారు.

ఆహారం అందిస్తున్న స్వర్ణాంధ్ర సిబ్బంది

కోనేరు మురళికి ప్రముఖుల పరామర్శ

టి.నగర్, న్యూస్‌టుడే: పుత్ర వియోగంతో బాధపడుతున్న తెదేపా నాయకుడు కోనేరు మురళీకృష్ణ సాయిని పలువురు పరామర్శించారు. ఆయన తనయుడు కోనేరు సుష్మంత్ వెంకట్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలిసిందే. తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్ నాయుడు బుధవారం కోనేరు నివాసానికి చేరుకొన్నారు. సుష్మంత్ వెంకట్ చిత్రపటానికి నివాళి అర్పించారు. కోనేరు కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించి ఓదార్చారు. ఆయనతోపాటు రాజమహేంద్రవరం అర్బన్, కొవ్వూరు, గోపాలపురం ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అమలాపురం ఎంపీ హరీష్ మాథుర్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు , తిరుమల విద్యా సంస్థల ఛైర్మన్ తిరుమలరావు , స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు తదితరులు పరామర్శించారు.

పరామర్శిస్తున్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ప్రముఖులు

నిత్యాన్నదానానికి రూ. లక్ష విరాళం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: రాజమహేంద్రవరం ఆర్యాపురం సత్యనారాయణ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి బీఎస్ఎన్ఎల్ విశ్రాంత ఉద్యోగి ఆకెళ్ల సూర్య సుబ్రహ్మణ్య కామేశ్వరశర్మ రూ. లక్ష విరాళం ఇచ్చారు. ఈ మేరకు చెక్కు ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.లక్ష్మీబాయికి బుధవారం అందించారు. దాతకు అర్చకులు పి.వి.జి.రవిబాబు, సత్య శ్రీనివాసాచార్యులు స్వామివారి జ్ఞాపిక బహూకరించి వేదాశీస్సులు పలికారు.

ఆలయ ఈవో లక్ష్మీబాయికి చెక్కు అందజేసిన దాత కామేశ్వరశర్మ

వైద్యులు సేవా దృక్పథంతో పని చేయాలి

రాజమహేంద్రవరం వైద్యం, న్యూస్‌టుడే: వైద్యులు సేవా దృక్పథం, నిబద్ధతతో పనిచేయాల్సిన అవసరం ఉందని రాజమహేంద్రవరం జీజీహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ రాజశేఖర్ కెనడీ పేర్కొన్నారు. వికాస ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో బుధవారం జీజీహెచ్‌లోని ఎంసీహెచ్ విభాగంలో జాతీయ వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బీసీ రాయ్ వైద్యులకు సంబంధించి ఎంసీఐ(మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా), ఐఎంఏ(ఇండియన్ మెడికల్ అసోసియేషన్) తదితర ఎన్నో సంస్కరణ తెచ్చారన్నారు. ఆయన గుర్తుగా జయంతి రోజున వైద్యుల దినోత్సవాన్ని జరుపుకొంటున్నామన్నారు. నిర్వాహకులు సూపరింటెండెంట్‌ను సత్కరించి జ్ఞాపిక అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణంరాజు, ఆర్ఎంవో డాక్టర్ సుబ్బారావు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌ను సత్కరిస్తున్న సిబ్బంది

రోడ్లపై తిష్ఠ.. రాకపోకలకు అవస్థ

పశువులను రోడ్లపై వదిలేస్తుండడం ప్రమాదాలకు ఆస్కారం కలుగుతోందని వాహనచోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొందరు యాజమానులు తమ పశువులను నగరంలోని రోడ్లపైకి వదిలేస్తుండడం పెద్ద సమస్య మారిందని, రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లోనూ అవి సంచరిస్తుండటంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయని చెబుతున్నారు. కొన్నిసార్లు రోడ్లపై ఉన్న పశువులను చూసి ఒక్కసారిగా బ్రేకులు వేయడంతో ద్విచక్రవాహనాలు అదుపు తప్పి పడిపోతున్నట్లు చెబుతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి నగర రోడ్లపైకి నిర్లక్ష్యంగా పశువులను వదిలే వాటి యాజమానులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

వెలగని దీపాలు.. తొలగని చీకట్లు

నగరంలో ప్రధాన నివాస ప్రాంతాల్లో ఒకటైన ఇన్నీసు పేటలో రాత్రి వేళలో బయట తిరగాలంటే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. ఇతర చోట్ల నుంచి అర్ధరాత్రి వేళ నగరానికి వచ్చేవారు ముందుగా చేరేది ఈ ప్రాంతానికే. వి.టి.కళాశాల నుంచి కోటిపల్లి బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో వీధి దీపాలు వెగకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, ఏ.వి.ఏ రోడ్డు

మురుగు పారదు.. దుర్వాసన వీడదు

స్థానిక స్టేడియం రోడ్డు, రైల్వే ట్రాక్‌ను ఆనుకొని రాతి ఛానల్‌లో కలిసే ప్రధాన కాలువ పూడుకుపోయింది. మురుగు పారడం లేదు. దర్వాసన వెల్లువెత్తుతుండడంతో పరిసరాల్లోని నివాసితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరమ్మతు పేరుతో కాలువ వద్ద కొంత మేర తవ్వి వదిలేశారని, దీంతో మురుగు నీరు రోడ్డుపైకి చేరుతోందని తెలిపారు. మున్సిపల్ పారిశుధ్య విభాగం స్పందించి పనులు చేపట్టాలని కోరారు. - న్యూస్‌టుడే, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ

వ్యూహాలక్ష్మికి మహాభిషేకం

రాజమహేంద్రవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గాడాలలోని శ్రీమహాలక్ష్మీ సమేత చిన్నవేంకటేశ్వరస్వామి పీఠంలో గురువారం వ్యూహాలక్ష్మి అమ్మవారికి మహాభిషేకం జరుగుతుందని పీఠాధిపతి చిన్నవెంకన్నబాబు స్వామీజీ తెలిపారు. గుప్త నవరాత్రుల ఉత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో నిర్మాత సురేష్ కొండేటి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ తదితరులు పాల్గొంటారని చెప్పారు.

భారతీయ క్రైస్తవ దినోత్సవం

నేడు

ఏ.వి.ఏ రోడ్డు, న్యూస్‌టుడే: తూర్పు గోదావరి జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్, రాజమండ్రి పాస్టర్స్ ఫెలోషిప్ సంయుక్తంగా గురువారం సాయంత్రం 5 గంటలకు స్థానిక ఆనాల వెంకట అప్పారావు రోడ్డులోగల సి.ఎస్.ఎన్ చర్చి ప్రాంగణంలో భారతీయ క్రైస్తవ దినోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ బిషప్ ప్రతాప్ సిన్హా తెలిపారు. సి.ఎస్.ఎన్ చర్చిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీస్తు 12మంది శిష్యుల్లో ఒకరైన తోమా క్రీస్తు శకం 52 సంవత్సరంలో మన దేశానికి(కేరళ) వచ్చి సువార్త గురించి పరిచయం చేశారని, క్రీస్తు శకం 72లో చెన్నై ప్రాంతంలో జులై 3 ప్రాణత్యాగ చేశారన్నారు. దానికి గుర్తుగా 2021 నుంచి జులై 3న భారతీయ క్రైస్తవ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చర్చిలో జరిగే కార్యక్రమానికి జిల్లాలోని శాసన, శాసన మండలి సభ్యులు, ఎంపీ పురందేశ్వరిని, మంత్రి కందుల దుర్గేష్, రూడా ఛైర్మన్, నగర పెద్దలు తదితరులను ఆహ్వానించినట్లు తెలిపారు. సమావేశంలో మోజెస్ బాబు, డా.జుహాని, టాటా విక్టర్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం తగిన హామీ ఇవ్వాలి

రాజమహేంద్రవరం సాంస్కృతికం: గోవధ నిషేధం, హిందూ దేవాలయాల రక్షణ కోరుతూ హరిబాబు చేస్తున్న దీక్షకు ప్రభుత్వం తగిన హామీ ఇవ్వాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టి.కె.విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. మాతృరూపిణీ సేవా సంస్థ వ్యవస్థాపకుడు అజ్జరపు హరిబాబు సీతంపేటలో చేపట్టిన రిలే దీక్ష శిబిరాన్ని విశ్వేశ్వరరెడ్డి బుధవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. రాజమహేంద్రవరం నగర బ్రాహ్మణ మిత్ర సేవా సంఘం అధ్యక్షుడు దూర్వాసుల సత్యనారాయణ సంఘం తరపున మద్దతు ప్రకటించారు. దేశిరెడ్డి బలరామ నాయుడు, గోరుగొంతు సత్యనారాయణమూర్తి, బుద్ధవరపు ఉదయ భాస్కర్, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి పాల్గొన్నారు.

9న దేశవ్యాప్త సమ్మె

తాళ్లపూడి: నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 9న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు తెలిపారు. తాళ్లపూడిలో రైసుమిల్లుల కార్మికులతో కరపత్రాలను బుధవారం ప్రదర్శించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మసీదు సెంటర్(కాకినాడ): రాజమహేంద్రవరం, శ్రీకృష్ణపట్నానికి చెందిన దాసరి రాంబాబు(45) బొమ్మూరు పరిధిలో బుధవారం నడిచి వెళుతుండగా లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయనను కాకినాడ జీజీహెచ్‌లో చేర్పగా చికిత్స పొందుతూ చనిపోయారు. బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

వివాహిత అదృశ్యంపై ఫిర్యాదు

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): నగరంలోని ముగ్గుపేటకు చెందిన బిస్వాల్ అలామ్ అనే వ్యక్తి తన భార్య ఈ నెల ఒకటో తేదీ నుంచి కనిపించడం లేదని ఒకటో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. త్రిపురకు చెందిన ఆయన కుటుంబం పొట్టకూటి కోసం నగరానికి వచ్చింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకం

రాజమహేంద్రవరం సాంస్కృతికం: దేశాభివృద్ధిలో యువత పాత్ర కీలకమని ఈగల్ డిపార్ట్‌మెంట్ సీఐ పి.వి.సూర్య మోహన్‌రావు అన్నారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం మాదక ద్రవ్యాల వినియోగం ప్రమాదకరం అంశంపై ఈగల్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. సూర్య మోహన్‌రావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వాడకం కారణంగా భవిష్యత్తు అంధకారంగా మారతుందన్నారు. చదువుపై ఏకాగ్రత కోల్పోతారని, కుటుంబం నుంచి అనేక సమస్యలు వస్తాయన్నారు. మాదక ద్రవ్యాల వాడకం ఎంత ప్రమాదమో వివరిస్తూ ఫ్లకార్డులు ప్రదర్శించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపల్ బి.వి.తిరుపణ్యం, డి.వి.రమణమూర్తి, పి.వి.బి.సంజీవరావు, వి.దీప్తి, ఎం.శివప్రసాద్, ఎస్.రాజ్‌కుమార్, కళాశాల ఈగల్ క్లబ్ సభ్యులు, 300మంది విద్యార్థులు పాల్గొన్నారు.

పోస్టర్లు ప్రదర్శిస్తున్న సీఐ సూర్య మోహన్‌రావు తదితరులు

రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో పతకాలు

శ్యామలాసెంటర్: రాష్ట్రస్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో రాజమహేంద్రవరం టౌన్ మున్సిపల్ పాఠశాల విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు ప్రధానోపాధ్యాయుడు ఎ.సూరిబాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత నెల 28న విశాఖలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో 9వ తరగతి విద్యార్థిని లిఖిత, పదో తరగతి విద్యార్థి ఫిరోజ్ బంగారు పతకాలు సాధించారన్నారు. వారిని డీఎస్ఈవో కె.వాసుదేవరావు తన కార్యాలయంలో అభినందించారన్నారు. ఈ కార్యక్రమంలో డీఐ బి.దిలీప్‌కుమార్, జిల్లా పరీక్షల నిర్వహణ సంస్థ కార్యదర్శి దేవా అనిత, ఉపాధ్యాయులు మహేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులను అభినందిస్తున్న డీఎస్ఈవో వాసుదేవరావు

'ఆ ఇద్దరి తీరుతో ఆశ్రమాన్ని వీడుతున్న వృద్ధులు'

ఏ.వి.ఏ రోడ్డు: రాజమహేంద్రవరం లలితానగర్‌లోని ఓ వృద్ధాశ్రమం మేనేజర్ మధు, వంటశాల నిర్వాహకుడు శ్రీనివాస్ తనను ఇబ్బందులకు గురిచేసినట్లు అన్నవరం దేవస్థానం విశ్రాంత ప్రధానార్చకుడు ఇంద్రగంటి గోపాలకృష్ణ ఆరోపించారు. రాజమహేంద్రవరం ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తన ఆరోగ్య పరిస్థితి దృష్ట్యా ఆశ్రమ సంరక్షకుడు సత్యనారాయణ సేవలు చేస్తుంటే వాటిని నిలుపుదల చేయాలంటూ వారు తనతో వాగ్వాదానికి దిగి అవమానకరంగా మాట్లాడారన్నారు. వారి దురుసు ప్రవర్తన కారణంగా ఒకరిద్దరు వృద్ధులు ఆశ్రమాన్ని విడిచి వెళ్లారన్నారు. చాలా మంది బయటకు చెప్పుకోలేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారు చేసే పనులు సహించలేక తాను సుమారు నెల రోజుల క్రితం ఆశ్రమం విడిచి వచ్చినట్లు తెలిపారు. ఆశ్రమంలో చేరినప్పుడు కట్టిన రూ. 20 వేల కాషన్ డిపాజిట్ ఇప్పటికీ తనకు ఇవ్వలేదన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఏ.వి.ఏ రోడ్డు: గౌతమి ఘాట్ వాకర్స్ అండ్ యోగా వెల్ఫేర్ అసోసియేషన్ అనుబంధ సంస్థ గౌతమి ఘాట్ మహిళ వాకర్స్ అండ్ యోగా వెల్ఫేర్ అసోసియేషన్ 2025-26 సంవత్సరానికిగాను నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం బుధవారం ఉదయం నగరంలోని గౌతమి ఘాట్ ఓంకారేశ్వర సన్నిధిలో జరిగినట్లు అధ్యక్షుడు కీర్తి అచ్చిరాజు తెలిపారు. ప్రెసిడెంట్‌గా కంబాల రుద్రమదేవి, కార్యదర్శిగా బొడ్డు కనకదుర్గ, కోశాధికారి సుగ్గు కమల ప్రమాణ స్వీకారం చేశారు. అసోసియేషన్ సభ్యులు వెంకటేశ్వరరావు, బాబురావు, విజయ్ కిరణ్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం

దేవీచౌక్, న్యూస్‌టుడే: అత్యవసర మరమ్మతుల నిమిత్తం ఈ నెల 3, 4 తేదీల్లో పలు ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ నక్కపల్లి శామ్యూల్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు క్వారీ ప్రాంతం, కొంతమూరులోని కళ్యాణ్‌నగర్, ఆదర్శనగర్, జంగాల కాలనీ, శేషాద్రి లేఅవుట్, కంటిపూడి లేఅవుట్ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతుందన్నారు. ఆయా ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

WANTED IMMEDIATELY
- **WANTED FLOOR INCHARGES** (Male), Qualification: Any Degree
- **COMPUTER LAB ASSISTANTS** (Male) Qualification: Any Degree in Computer Science

Contact:
ADITYA DEGREE COLLEGE
Nr. R.T.C.Complex, Rajahmundry
Cell: 95534 76669, 98660 76668
email ID: adcrjy@aditya.ac.in

ఆషాఢం... తగ్గిన ఆదాయం

న్యూస్‌టుడే, వి.ఎల్.పురం

ఆషాఢమాస ప్రభావం ఆర్టీసీపై పడింది. ప్రయాణికుల రద్దీ తగ్గడంతో టికెట్ సర్వీసు ద్వారా వచ్చే రోజువారీ ఆదాయం కూడా గత వారం రోజులుగా తగ్గిపోయింది. ఆక్యుపెన్సీ రేషియో(ఓఆర్) ప్రస్తుతం 3 శాతం వరకు పడిపోయిందని, ఇది మరింత తగ్గే అవకాశం ఉందని ఆర్టీసీ వర్గాలు చెబుతున్నాయి. ఆషాడం ముగిసేవరకు ఆర్టీసీ ఆదాయం పుంజుకునే పరిస్థితి కన్పించడంలేదని అంటున్నారు. సాధారణంగా రాజమహేంద్రవరం ప్రధాన బస్టాండ్ నిత్యం ప్రయాణికులతో కిటకిటలాడుతూ ఉంటుంది. ప్రతిరోజూ ఇక్కడ నుంచి వివిధ ప్రాంతాలకు ఆర్టీసీ బస్సుల్లో రాకపోకలు సాగించేవారు 25 వేల మందికిపైగా ఉంటారు. పండగ, పెళ్లిళ్ల సీజన్లలో రద్దీ మరింత ఎక్కువగా ఉంటుంది. డిపో నుంచి రోజూ 40 రూట్లలో 136 షెడ్యూల్ సర్వీసులు నడుస్తున్నాయి. సాధారణ రోజుల్లో టికెట్ సర్వీసు ద్వారానే సగటున రోజుకు రూ.20-రూ.22 లక్షల వరకు రాబడి వస్తుంది. అదే ఆదివారం రోజు అయితే రూ.24 లక్షల వరకు ఉంటుంది. ప్రస్తుతం రోజువారీ ఆదాయం రూ.17-రూ.18 లక్షలకు పడిపోయింది. మే నెలలో టికెట్ ఆదాయం మొత్తం రూ.7.6 కోట్లు రాగా జూన్‌లో రూ.6.72 కోట్లకు తగ్గింది. ఆ నెల 25 నుంచి ఆషాడం మొదలవడమే దీనికి కారణం. మామూలు రోజుల్లో అక్యుపెన్సీ రేషియో 79 శాతంగా ఉండగా ప్రస్తుతం అది 76కు తగ్గింది.

రాజమహేంద్రవరం ఆర్టీసీ ప్రధాన బస్టాండ్

THE RAJAHMUNDRY BAR ASSOCIATION
RAJAHMUNDRY
INVITATION TO TENDER

BARB/2025, Dated: 02-07-2025

Tenders are called for construction of The Rajahmundry Bar Association Building at the Association Premises consisting of Ground + Two Floors of approximately 16000 Sq. feet.

1. Schedule of work, specifications and conditions may be collected from The Secretary - Sri P. Ramesh (Mobile No.9866725724), The Rajahmundry Bar Association, Rajahmundry at the Association Premises during working hours, by paying a Non-refundable deposit of Rs.1,000/- (Rupees One Thousand only).
2. Last date for obtaining schedule, specifications and conditions 10-7-2025.
3. Last date for submission of tender: 15-7-2025

NOTE: A. This is only an invitation to offer.
B. Acceptance of tender is the sole discretion of the Executive Committee of The Rajahmundry Bar Association.

Secretary,
The Rajahmundry Bar Association
Rajahmundry.
Date: 2-7-2025.

(c) eenadu

రాజమహేంద్రవరం గ్రామీణం

• రాజమహేంద్రవరం గ్రామీణం • రాజానగరం • అనపర్తి

చిన్నారులకు దైనందిని అందజేత

సీతానగరం: మండలంలోని కూనవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం కన్నూరి కల్యాణి, వెంకన్న ఆధ్వర్యంలో ఒకటి నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న బాలబాలికలకు బుధవారం దైనందిని అందజేశారు. రోజూ బోధనాంశాలతోపాటు మిగతా విషయాలను దైనందినిలో రాయడం వల్ల విద్యార్థుల భవితవ్యం మెరుగుపడుతుందని వ్యాయామ ఉపాధ్యాయురాలు భువనేశ్వరి అన్నారు. విద్యాకమిటీ ఛైర్మన్ మాదురెడ్డి కృష్ణ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అవగాహన

అనపర్తి గ్రామీణం, న్యూస్‌టుడే: డెంగీని పారద్రోలేందుకు ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని రామవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డా.మీనాక్షి చెప్పారు. డెంగీ మాసోత్సవాల సందర్భంగా రామవరంలో బుధవారం అవగాహన ర్యాలీ, సభలో ఆమె మాట్లాడారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఇళ్ల వద్ద నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. జ్వరం, తలనొప్పి, ఒళ్లు నొప్పులు ఉంటే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈవో సీహెచ్ శ్రీనివాస్, సుబ్రహ్మణ్యం, పీహెచ్‌ఎన్ రత్నకుమారి, డీపీఎంవో మల్లేశ్వరరావు, హెచ్‌వీ లక్ష్మీ, ఏఎన్‌ఎం అచ్యుతాంబ, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

ఉ॥ 10 - మ॥ 1 | మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: ధవళేశ్వరం: 91212 29057, కడియం: 91212 29062, అనపర్తి: 91000 20947

పూడిక తీయాలి

సమస్య: బొమ్మూరు రాఘవేంద్రనగర్‌లో పూడికలు తీయకపోవడం వల్ల మురుగు పారడం లేదు. మలుపు వద్ద వ్యర్థాలు నిండిపోయి దుర్వాసన వస్తుంది.

- కిరణ్, స్థానికుడు

సమాధానం: పూడికలు తీయమని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశిస్తాం.

- కాశీ, గ్రామకార్యదర్శి, బొమ్మూరు

– న్యూస్‌టుడే, బొమ్మూరు

మురుగు పారడం లేదు

సమస్య: బొమ్మూరు ప్రశాంతినగర్‌లోని కాలువలో మురుగు పారడం లేదు. కాలువలో పిచ్చి మొక్కలు, పాదులు పెరిగిపోయాయి. పారిశుద్ధ్య సిబ్బంది పూడికలు తీయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదు. **- స్థానికుడు**

సమాధానం: సిబ్బందిని పంపి కాలువ వెంబడి పిచ్చి మొక్కలను తొలగిస్తాం.

- కాశీ, గ్రామ కార్యదర్శి, బొమ్మూరు

ప్రభుత్వం తగిన హామీ ఇవ్వాలి

రాజమహేంద్రవరం సాంస్కృతికం : గోవధ నిషేధం, హిందూ దేవాలయాల రక్షణ కోరుతూ హరిబాబు చేస్తున్న దీక్షకు ప్రభుత్వం తగిన హామీ ఇవ్వాలని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు టి.కె.విశ్వేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. మాతృరూపిణీ సేవా సంస్థ వ్యవస్థాపకుడు అజ్జరపు హరిబాబు సీతంపేటలో చేపట్టిన రిలే దీక్ష శిబిరాన్ని విశ్వేశ్వరరెడ్డి బుధవారం సందర్శించి సంఘీభావం తెలిపారు. రాజమహేంద్రవరం నగర బ్రాహ్మణ మిత్ర సేవా సంఘం అధ్యక్షుడు దూర్వాసుల సత్యనారాయణ సంఘం తరపున మద్దతు ప్రకటించారు. దేశిరెడ్డి బలరామ నాయుడు, గోరుగొంతు సత్యనారాయణమూర్తి, బుద్ధవరపు ఉదయ భాస్కర్, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఖాతాల్లో నిధుల జమ

కడియం, న్యూస్‌టుడే: పంటనష్టం నిధులు జమ కావడంతో కడియం ఆవ రైతులు ఆనందం వ్యక్తం చేశారు. గత ఏడాది ఖరీఫ్ పంటకు సంబంధించి నీటి నిల్వతో నారుమళ్లు కుళ్లి నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. ఈ మేరకు కడియం ఆవలో 127 ఎకరాల విస్తీర్ణంలో వేసిన నారుమళ్లకు దాదాపు వంద మంది రైతుల నుంచి వివరాలు సేకరించి నివేదికలు సిద్ధం చేశారు. అందుకు ప్రభుత్వం రూ.8.63లక్షల నిధులను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసిందని వారంతా హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా కడియంలోని రైతుసేవా కేంద్రంలో డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ చేతుల మీదుగా 150 మంది కౌలురైతులకు సాగుకార్డులను అందించారు. తహసీల్దార్ మరపట్ల సునీల్‌కుమార్, మార్గాని సత్యనారాయణ, ఉపసర్పంచి వెలుగుబంటి రఘురామ్ పాల్గొన్నారు.

పాపికొండల విహార యాత్రకు అంతరాయం

దేవీపట్నం, వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: వర్షాలకు గోదావరి నదిలో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. దేవీపట్నం మండలంలోని పాపికొండల విహార యాత్రను రెండు రోజుల పాటు తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు జల వనరుల శాఖ ఏఈ భాస్కర్ బుధవారం తెలిపారు. దేవీపట్నం మండలం పోశమ్మగండి, వీఆర్‌పురం మండలం పోచవరం రేవుల నుంచి పాపికొండల విహారయాత్రకు వెళ్లే పర్యాటక బోట్లు మొత్తం నిర్వాహకులు పూర్తిగా నిలిపివేశారు. పర్యాటకులు విషయం గమనించి సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు.

తాగునీటికి నిధుల వరద

జేజేఎంలో అనపర్తి నియోజకవర్గానికి రూ.22.60 కోట్ల పనులు

రంగంపేట, న్యూస్‌టుడే: పల్లె ప్రజల దాహార్తిని తీర్చేందుకు నిధుల వరద మొదలైంది. జల్‌జీవన్ మిషన్(జేజేఎం), గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై ప్రాజెక్టుల కింద నిధుల కేటాయింపులతో పనులు ఊపందుకున్నాయి. అనపర్తి నియోజకవర్గంలోనే ఇప్పటి వరకు రూ.57.16కోట్ల వరకు నిధుల కేటాయింపు జరుగగా మరి కొన్ని ప్రతిపాదనలు పంపించేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రణాళికలను సిద్ధం చేస్తున్నారు. ఊరూరా.. మంచినీటి ట్యాంకుల నిర్మాణం, బోర్లు, పైపులైన్లు, కొళాయిల ఏర్పాట్లతో దాహార్తి తీరనుంది.

ఆరునెలల్లో పూర్తిచేయాలని..

జల్‌జీవన్ మిషన్ పథకం కింద రూ.22.60 కోట్లతో ట్యాంకులు, పైపులైన్లు, బోర్లు, కొళాయిల ఏర్పాటు పనులు జరుగుతున్నాయి. 27 గ్రామాల్లో ఈ పనులు జరుగుతుండడంతో ఆయా గ్రామాలకు ఇబ్బందులు చాలా వరకు తొలగనున్నాయి. 6 నెలల్లో ఈ పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నాయి. పెదపూడిలోని మంచినీటి ట్యాంకు నిల్వ చేసే రిటైనింగ్ వాల్ కోసం రూ.9కోట్లు కేటాయించారు. రెండు ట్యాంకుల నిర్మాణం జరుగగా చెరువు రిటైనింగ్ వాల్ పనులు ప్రారంభం కావాల్సి ఉంది. రంగంపేటలోనే అధికంగా నీటి సమస్యలు ఉండటంతో మెట్ట గ్రామాలకు తాజాగా అధిక ప్రాధాన్యతను ఇచ్చి నిధులు కేటాయించారు.

పెదపూడిలో నిర్మిస్తున్న ఓవర్‌హెడ్ ట్యాంకు

మండలం	పనుల సంఖ్య	మొత్తం (రూ.కోట్లలో)
పెదపూడి	13	16.24
రంగంపేట	9	4.036
అనపర్తి	1	0.22
బిక్కవోలు	4	2.16

మూడు మండలాలకు స్థానం..

కోస్టల్ ఏరియాలోని 12 నియోజకవర్గాలకు చెందిన 24 మండలాల్లోని 13.62 లక్షల మందికి గోదావరి నీటిని తాగునీటిగా అందించేందుకు 'ప్రొవైడింగ్ డ్రింకింగ్ వాటర్ సప్లై' ప్రాజెక్టుకి ప్రభుత్వం రూ.1650 కోట్లు కేటాయించింది. రెండేళ్లలో పూర్తికానున్న ఈ ప్రాజెక్టు పరిధిలో అనపర్తి నియోజకవర్గంలోని మూడు మండలాలకు (అనపర్తి, బిక్కవోలు, పెదపూడి) స్థానం దక్కింది. రూ.34.5కోట్లతో నియోజకవర్గంలో ఈ పథకం కింద తాగునీటి సౌకర్యాలు మెరుగుపడనున్నాయి.

నీటి కష్టాలు లేని పల్లెలే లక్ష్యం

పల్లెల్లో తిరుగుతున్నప్పుడు ప్రజలు నీటి సమస్యలను తమ దృష్టికి ఎక్కువగా తీసుకువస్తున్నారు. నాలుగు మండలాల ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులతో తరచూ సమీక్షిస్తున్నపుడు ఆయా సమస్యల పరిష్కారానికి ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి పంపిస్తున్నాం. ఉన్నత స్థాయిలోని ప్రజాప్రతినిధులు, అధికారులకు సమస్యలను వివరించగా నిధులను కేటాయిస్తున్నారు. ఫలితంగా తాగునీటి సమస్యల పరిష్కారం దిశగా చాలా చోట్ల పనులు జరుగుతున్నాయి.

- నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్యే, అనపర్తి

అయ్యప్పస్వామికి జన్మనక్షత్ర పూజలు

బిక్కవోలు: బలభద్రపురంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో బుధవారం స్వామివారి జన్మనక్షత్రం ఉత్తర సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. అర్చకులు కామేశ్‌శర్మ, సుమంత్ శర్మ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. పలువురు భక్తులు స్వామిని దర్శించుకున్నారు

ఇళ్ల పట్టాలు ఇప్పించాలని వినతి

గోకవరం: గోకవరం జడ్పీ ఉన్నత పాఠశాల సమీపంలోని నివాసం ఉంటున్న వారికి ఇళ్ల పట్టాలు అందించాలని ఎంపీపీ సుంకర శ్రీవల్లి కలెక్టర్ ప్రశాంతికి వినతిపత్రం అందించారు. కాకినాడలో బుధవారం నిర్వహించిన జడ్పీ సమావేశానికి హాజరైన ఎంపీపీ ఈ సమస్యపై మాట్లాడారు. సుమారు 120 కుటుంబాలు అక్కడ ఉన్న జడ్పీ స్థలంలో నివాసం ఉంటున్నాయన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

బిక్కవోలు: కాపవరం జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వివిధ పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం పాఠశాలలో సత్కరించారు. ఉమామహేశ్వరరెడ్డి, లోవ ప్రసాద్, వెంకటలక్ష్మి, ప్రసాదరెడ్డి, గంగాధరరావులను పాఠశాల విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు సత్కరించి వారి సేవలను కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.గోపాలకృష్ణారావు పాల్గొన్నారు.

'కుట్టు'.. ప్రగతికి మెట్టు!

సీతానగరం, న్యూస్‌టుడే: మహిళలు ఆర్థిక వృద్ధి సాధించేలా కూటమి ప్రభుత్వం వీరిని వెన్నుతట్టి ప్రోత్సహిస్తోంది. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 25 శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేసి 3,593 మందికి కుట్టు శిక్షణ ఇస్తోంది. 90 రోజుల శిక్షణలో గౌన్లు, నెక్‌డిజైన్స్, చుడీ ఫ్యాంట్స్, బ్లౌజ్‌లు తదితర 20 అంశాలను నేర్పిస్తున్నారు. 60 రోజుల్లోనే పూర్తి స్థాయిలో కుట్టు శిక్షణ నేర్చుకున్నవారు సుమారు 387 మంది ఉంటే ఒక్కొక్కరికి రూ.1,500 చొప్పున ఎమ్మెల్యే బలరామకృష్ణ సతీమణి బత్తుల వెంకటలక్ష్మి వారి సొంత నిధులను ఇచ్చి ప్రోత్సహిస్తున్నారు. శిక్షణ పూర్తి చేసినవారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలు ఇచ్చి కుట్టుమిషన్లు ఉచితంగా అందజేయనున్నట్లు బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. జిల్లాలో అత్యధికంగా 12,974 మంది కుట్టుశిక్షణకు నమోదుచేసుకున్నారని వీరందరికి విడతల వారీగా శిక్షణను పూర్తిచేసేలా ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చామన్నారు.

సీతానగరంలో కుట్టుశిక్షణలో మహిళలు..

సుపరిపాలనకు తొలి అడుగు

బిక్కవోలు, న్యూస్‌టుడే: ఏడాది పాలనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడమే ధ్యేయంగా సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం చేపట్టినట్లు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి చెప్పారు. బుధవారం తొస్సిపూడి నుంచి ఆయన ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనపర్తి నియోజకవర్గంలో ఏడాది కాలంలో 477 పనులు రూ.160.3 కోట్లతో చేపట్టినట్లు వివరించారు. రైల్వే శాఖ ద్వారా రూ.292.1 కోట్లతో నాలుగు పనులు చేపడుతున్నట్లు చెప్పారు. ఒక్క ఏడాదిలోనే రాష్ట్రంతో పాటు నియోజకవర్గం కూడా అభివృద్ధి, సంక్షేమాల్లో దూసుకుపోతోందన్నారు. వైకాపా పాలనలో సీఎంఆర్ నిధులు రాకపోతే ఏనాడైనా నోరెత్తారా అని ప్రశ్నించారు. నియోజకవర్గ పరిశీలకుడు ఆకుల రామకృష్ణ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో పోలవరం, విశాఖ ఉక్కు, జలవనరుల శాఖ వంటివి నిర్వీర్యానికి గురయ్యాయని, కూటమి ప్రభుత్వం వాటిని సరిదిద్దుతోందని అన్నారు. కార్యక్రమంలో తెదేపా నియోజకవర్గ బాధ్యులు నల్లమిల్లి మనోజ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ముందుగా గణపతి దేవాలయంలో పూజలు చేసి అక్కడి నుంచి ఎన్టీఆర్ విగ్రహం వద్దకు ఊరేగింపుగా వెళ్లి విగ్రహానికి పూలమాల వేశారు. అనంతరం ఇంటింటికీ తిరిగి అభివృద్ధి కార్యక్రమాలు వివరించారు.

పాదయాత్రగా వస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తదితరులు

కోరుకొండ: మండలంలోని బూరుగుపూడి గ్రామంలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. రుడా ఛైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ కరపత్రాలు అందజేశారు.

కార్యక్రమంలో పాల్గొన్న రుడా ఛైర్మన్ బీఆర్ చౌదరి

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. కంటే కేశవరావు, మల్ల అప్పలనరసారావు, బీవీవీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కడియం,బొమ్మూరు: కడియం, బొమ్మూరులో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి, ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ కలిసి ఆ పార్టీ రాష్ట్ర వైద్యవిభాగ ప్రధాన కార్యదర్శి డాక్టర్ గోరంట్ల రవిరామ్‌కిరణ్ పాల్గొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఏడాది పాలనలో అందించిన సంక్షేమ పథకాలను ఇంటింటా కరపత్రాలను పంచుతూ గ్రామస్థులకు వివరించారు.

మూగజీవాలను కాపాడుకుందాం!

2.5 లక్షల నట్టల నివారణ డోసుల పంపిణీ

బిక్కవోలు,న్యూస్‌టుడే: జీవాలు పెంచే రైతులు అప్రమత్తంగా లేకపోతే రూ.వేలాది విలువైన జీవాలు ప్రాణాలు కోల్పోతాయి. దీంతో వాటి రైతులు ఆర్థికంగా ఇబ్బందుల్లో పడతారు. అందుకోసం కూటమి ప్రభుత్వం ముందుగానే మేల్కొని జీవాలకు నట్టల నివారణా మందు పంపిణీ చేసింది. వర్షాకాలంలో వివిధ ప్రాంతాల్లో గుడ్ల రూపంలో ఉండే పరాన్న జీవులు వర్షపు నీటికి ఒకచోటి నుంచి మరో చోటికి ప్రయాణించి పచ్చికను పట్టుకుని ఉంటాయి. వాటిని తిన్న జీవాల్లో శరీరంలో ప్రవేశించి ఇబ్బంది పెడతాయి. కొన్ని సందర్భాల్లో జీవాల్లో మరణాలు కూడా సంభవిస్తాయి. ముందుగానే నట్టల నివారణా మందు వేయటం ద్వారా పరాన్న జీవులన్నీ చనిపోయే అవకాశం ఉంటుంది. జిల్లాకు 2.5 లక్షల డోసులు విభజిత తూర్పు గోదావరి జిల్లాకు 2.5 లక్షల నట్టల నివారణా మందుల డోసులు వచ్చాయి. వీటిని వివిధ మండలాలకు సరఫరా చేసి అక్కడి నుంచి ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి జీవాలకు అందిస్తున్నారు. జులై పది వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది. బిక్కవోలు మండలం రంగాపురంలో పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ వెంకటేశ్వరరావు(రాజమహేంద్రవరం) జీవాలకు మందులు వేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవాలు పెంచే ప్రతి రైతు నట్టల నివారణ వేయించాలని సూచించారు. ఏడాదికి మూడు సార్లు వేస్తామని, మూడుసార్లు వేయించాలని సూచించారు. దీనివల్ల అనేక వ్యాధులకు జీవాలు దూరంగా ఉంటాయని వెల్లడించారు. అనపర్తిలో కూడా అనపర్తి మండలం దుప్పలపూడిలో ఏడీప శ్రీనివాసరావు పాల్గొన్నారు. నియోజకవర్గంలో దాదాపు 30,000 జీవాలు ఉన్నాయని డీడీ తెలిపారు.

రంగాపురంలో నట్టల నివారణ మందు వేస్తున్న పశుసంవర్ధకశాఖ డీడీ వెంకటేశ్వరరావు

కోనేరు మురళికి ప్రముఖుల పరామర్శ

టి.నగర్, న్యూస్‌టుడే: పుత్ర వియోగంతో బాధపడుతున్న తెదేపా నాయకుడు కోనేరు మురళీకృష్ణ సాయిని పలువురు పరామర్శించారు. ఆయన తనయుడు కోనేరు సుష్మంత్ వెంకట్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలిసిందే. తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్ నాయుడు బుధవారం కోనేరు నివాసానికి చేరుకొన్నారు. సుష్మంత్ వెంకట్ చిత్రపటానికి నివాళి అర్పించారు. కోనేరు కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని కల్పించి ఓదార్చారు. ఆయనతోపాటు రాజమహేంద్రవరం అర్బన్, కొవ్వూరు, గోపాలపురం ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి శ్రీనివాస్, ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకట్రాజు, రుడా ఛైర్మన్ బీవీఆర్ చౌదరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అమలాపురం ఎంపీ హరీష్ మాథుర్, పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు , తిరుమల విద్యా సంస్థల ఛైర్మన్ తిరుమలరావు , స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బూరుగుపల్లి శేషారావు తదితరులు పరామర్శించారు.

పరామర్శిస్తున్న టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ప్రముఖులు

రోడ్డు గుంతలమయం

రాపాక నుంచి కోరుకొండ చేరే పది కిలో మీటర్ల ప్రధాన రహదారి పూర్తిగా ధ్వంసమైంది. అడుగడుగునా గుంతలు ఉండడంతో వాహన చోదకులు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. రోజూ వందలాది మంది రైతులు, కూలీలు వ్యవసాయ పనులకు ఇదే రోడ్డుపై రాకపోకలు చేస్తుంటారు. రాత్రి 7 గంటలు దాటితే ఈ మార్గంలో ప్రయాణం చేయలేమని, వీధి దీపాలు వెలగక ఇబ్బందులు తప్పడం లేదని వాహన చోదకులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యను ర.భ.శాఖ జేఈ వీరన్నబాబు దృష్టికి తీసుకువెళ్లగా, రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు పంపామని తెలిపారు.

– న్యూస్‌టుడే, సీతానగరం

విద్యార్థులకు తప్పని అవస్థలు

పిడింగొయ్యి ప్రాథమిక పాఠశాలలో నాడు-నేడు రెండో దశలో నిధుల కొరత వల్ల పనులు అసంపూర్తిగా నిలిచాయి. ఏడాదిన్నర నుంచి పనులు జరగక ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. మరుగుదొడ్లు పునాదుల వరకే పరిమితం కావడంతో విద్యార్థులకు అవస్థలు తప్పడంలేదు. గతంలో వేసిన రంగులు పూర్తిగా వెలసిపోవడంతో పాఠశాల చూడడానికి పాడుబడిన బంగ్లాలా కన్పిస్తుంది. బదిలీపై కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. పాఠశాల సమస్యలు ఉన్నతాధికారులకు తెలియజేశామన్నారు. విద్యార్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామన్నారని తెలిపారు.

–న్యూస్‌టుడే బొమ్మూరు

WANTED IMMEDIATELY

- **WANTED FLOOR INCHARGES** (Male), Qualification: Any Degree
- **COMPUTER LAB ASSISTANTS** (Male) Qualification: Any Degree in Computer Science

Contact:
ADITYA DEGREE COLLEGE
Nr. R.T.C.Complex, Rajahmundry
Cell: 95534 76669, 98660 76668
email ID: adcrjy@aditya.ac.in

CHANGE OF NAME

I, Mullapudi Saroja (Old Name), W/o. Mullapudi Sambasivarao, R/o Door No.2-268, Sai Durga Nagar, Diwancheruvu Village, Rajanagaram Mandal, East Godavari District, Andhra Pradesh, India-533296. Changing my name from Mullapudi Saroja (Old Name) to **Mullapudi Sarojini** (New Name). Henceforth I am being called as **MULLAPUDI SAROJINI** (New Name) for all purposes.

విద్యాభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలి

కడియం, న్యూస్‌టుడే: విద్యార్థుల భవితకు పునాది వేసే పాఠశాలలో వ్యర్థాలు దర్శమిస్తుండటంపై మండల భాజపా నేతలు ధ్వజమెత్తారు. ఆ మేరకు మురమండ జడ్పీ ఉన్నత పాఠశాలలో చిన్నారులకు అందుతున్న మధ్యాహ్న భోజనం తదితర సదుపాయాలపై ఆరా తీసేందుకు భాజపా నాయకులు వెళ్లారు. ఆ క్రమంలో పాఠశాలలో పేరుకుపోయిన వ్యర్థాలను చూసి అవాక్కయ్యారు. పాఠశాలలో అపరిశుభ్రత వాతావరణం హేయం కాదని ఉపాధ్యాయులకు సూచించారు. గ్రామస్థుల సహకారంతో విద్యాభివృద్ధికి ప్రాధాన్యమివ్వాలని వివరించారు. భాజపా మండలశాఖ అధ్యక్షుడు బొరుసు సుబ్రహ్మణ్యం, గుర్రాల రామ్మోహనరావు, చిక్కాల శ్రీను, గారపాటి తాతబ్బాయి తదితరులు పాల్గొన్నారు.

మురమండ జడ్పీ ఉన్నత పాఠశాలలో పేరుకుపోయిన వ్యర్థాలు

భాజపాతోనే మెరుగైన పాలన

గోకవరం, న్యూస్‌టుడే: భాజపాతోనే మెరుగైన పాలన సాధ్యమని కాకినాడ జిల్లా పార్టీ అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు అన్నారు. విశ్వ హిందూ ధర్మపరిరక్షణ రామసేన అధ్యక్షుడు, భాజపా నాయకులు కంబాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గంగంపాలెం గ్రామంలో బుధవారం రాత్రి ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గంగంపాలెం, ఠాకూర్‌పాలెం గ్రామాలకు చెందిన వారు పార్టీలోకి చేరగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ.. ప్రధాని మోదీ పాలనలో దేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతుందన్నారు. గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా మంగరాజు, మండల పార్టీ అధ్యక్షుడు ఇనకోటి బాపన్నదొర, నాయకులు సత్తి వెంకటరెడ్డి, దాట్ల కృష్ణవర్మ, కొండలరావు, అడపా దొరబాబు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలోకి ఆహ్వానిస్తున్న విశ్వేశ్వరరావు, శ్రీనివాసరావు

భారతీయ క్రైస్తవ దినోత్సవం నేడు

ఏ.వి.ఏ రోడ్డు, న్యూస్‌టుడే : తూర్పు గోదావరి జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్, రాజమండ్రి పాస్టర్స్ ఫెలోషిప్ సంయుక్తంగా గురువారం సాయంత్రం 5 గంటలకు స్థానిక ఆనాల వెంకట అప్పారావు రోడ్డులోగల సి.ఎస్.ఎన్ చర్చి ప్రాంగణంలో భారతీయ క్రైస్తవ దినోత్సవం నిర్వహించనున్నట్లు జిల్లా పాస్టర్స్ ఫెలోషిప్ ప్రెసిడెంట్ బిషప్ ప్రతాప్ సిన్హా తెలిపారు. సి.ఎస్.ఎన్ చర్చిలో బుధవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రీస్తు 12మంది శిష్యుల్లో ఒకరైన తోమా క్రీస్తు శకం 52 సంవత్సరంలో మన దేశానికి(కేరళ) వచ్చి సువార్త గురించి పరిచయం చేశారని, క్రీస్తు శకం 72లో చెన్నై ప్రాంతంలో జులై 3 ప్రాణ త్యాగం చేశారన్నారు. దానికి గుర్తుగా 2021 నుంచి జులై 3న భారతీయ క్రైస్తవ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చర్చిలో జరిగే కార్యక్రమానికి జిల్లాలోని శాసన, శాసన మండలి సభ్యులు, ఎంపీ పురందేశ్వరి, మంత్రి కందుల దుర్గేష్, రుడా ఛైర్మన్, నగర పెద్దలు తదితరులను ఆహ్వానించినట్లు తెలిపారు. సమావేశంలో మోజెస్ బాబు, డా. జుహాని, టాటా విక్టర్, సుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు అనపర్తి

E.P.No.26/2024 IN O.S.No.105/2020

మధ్య:

సత్తి కొండారెడ్డి ... DHR

మరియు

సత్తి సోమిరెడ్డి ... JDR

పై నెంబరు E.P. వారెంటు బాకీ నిమిత్తం JDR తాలూకు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని పై కోర్టు వారి ఎదుట ది.**16-07-2025** ఉదయం గం. 10.30 ని॥ లగాయితు వేలం వేయబడును. కావలసిన వారు పాటలో పాల్గొని పాడుకొనవచ్చును.

షెడ్యూల్

తూ॥గో॥ జిల్లా, అనపర్తి మండలం, అనపర్తి సబ్ రిజిస్ట్రార్‌లో చేరిన, అనపర్తి గ్రామ పంచాయితీ, అనపర్తి గ్రామం తాలూకు సర్వే నెం.11/1 రు పూరా య.7-64 ట్లులో తూర్పులో ఉత్తరంలో ఈశాన్యం మూల య.2-38 1/2 ట్లులో దర్శిలా సబ్ డివిజన్ ప్రకారం సర్వే నెం.11/1 బి లోని య.2-38 ట్లులో మధ్య య.0.79 1/2 ట్లులో 187.5 చ॥గ॥లు స్థలం అనగా అనపర్తి గ్రామం డోర్ నెం.3-774 సమీపంలో గల ఖాళీ నివేశ స్థలం.

తూర్పు: అ.37-06లు 20 అడుగులు వెడల్పు గల వీధి,
పడమర: అ. 37-06 లు సబ్బెళ్ళ సుబ్బారెడ్డి ఆస్తి,
ఉత్తరం: అ.45-00 మామిడి సుబ్బలక్ష్మి గారి ఆస్తి,
దక్షిణం: అ.45-00 సబ్బెళ్ళ వెంకట గంగరాజు ఆస్తి.
సదరు హద్దుల మధ్యస్తమై 187.5 చ॥గ॥లు స్థలం అందలి యావత్తు ఈజిమెంట్ హక్కులు సహా.

DHR కిమ్మత్తు: రూ. **9,00,000/-**
అమీనా కిమ్మత్తు: రూ. **10,00,000/-**
SRO కిమ్మత్తు: రూ. **10,50,000/-**

M.V.V.R.K.Reddy, S.V.Raghava Reddy, S.Veerendra Reddy
అనపర్తి, Dt:2-07-2025, Advocates, Cell: 93463 22113

నిరుపయోగంగా జడ్పీ అతిథి గృహం

రాజానగరం, న్యూస్‌టుడే: నియోజకవర్గ కేంద్రం రాజానగరంలోని దాదాపు అయిదు ఎకరాల్లో ఉండే జడ్పీ అతిథి గృహం నిరుపయోగంగా మారింది. సుమారు 30 ఏళ్ల క్రితం ఈ అతిథి గృహాన్ని నిర్మించారు. ఈ ప్రాంగణంలో వివిధ సదుపాయాలతో రెండు సూట్లు, మూడు గోదాములు, వాచ్‌మెన్‌కు నివాస భవనం నిర్మించారు. అధికారులు, ప్రజాప్రతినిధులు అవసరమైన సందర్భంలో ఈ అతిథి గృహంలో ఉండేవారు.

తుప్పలతో నిండిన గోదాము

నిర్లక్ష్యానికి నిలువుటద్దంలా..

గతంలో రద్దీగా ఉన్న ఈ అతిథి గృహం కొన్నాళ్లుగా నిర్లక్ష్యానికి గురైంది. ఈ భవనంలో కార్యకలాపాలు నిర్వహించడం మానేశారు. దీంతో నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరింది. ఈ భవన ప్రాంగణంలో నిర్మించిన మూడు గోదాముల్లో ప్రస్తుతం ఒక దానిని మాత్రమే గృహ నిర్మాణశాఖ అధికారులు సిమెంటు బస్తాలు నిల్వ ఉంచేందుకు వినియోగిస్తున్నారు. మిగిలిన రెండు ఖాళీగా ఉన్నాయి.

ఆక్రమణల జోరు

జడ్పీ అతిథి గృహ ప్రాంగణం చుట్టూ స్థలం ఆక్రమణకు గురైంది. ఒకవైపు చిరువ్యాపారులు మెకానిక్‌షెడ్లు, చిన్నతరహా హోటళ్లు, మాంసం దుకాణం ఏర్పాటు చేసుకున్నారు. ప్రాంగణం లోపల సైతం కొందరు గడ్డి వేసుకునేందుకు, పశువుల కొట్టంగా వినియోగించుకుంటున్నారు.

శిథిలావస్థలో ఇలా..

అన్న క్యాంటీన్‌కు ప్రతిపాదనలు

నిరుపయోగంగా ఉన్న జడ్పీ అతిథి గృహం ప్రాంగణంలో కొంత భాగాన్ని అన్న క్యాంటీన్ ఏర్పాటుకు కేటాయించేందుకు ప్రతిపాదిస్తున్నాం. ప్రాంగణంలో మిగిలిన ప్రదేశంలో దుకాణ సముదాయం నిర్మాణానికి జడ్పీ సమావేశంలో ప్రతిపాదిస్తాం. శిథిలావస్థలకు చేరుకున్న భవనాలకు మరమ్మతులు చేయించి, ఆధునికంగా తయారు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

- లక్ష్మణరావు, సీఈఓ, ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిషత్

శ్రద్ధాంజలి

కీ॥శే॥ పేదిలం అప్పారావు గారు
15వ వార్డు మెంబరు - గోకవరం
జననం: 29-07-1989 మరణం: 19-6-2025

మంచితనం, ప్రేమ, ఆప్యాయతతో అందరి మనస్సులలో చిరస్థాయిగా నిలిచి, గోకవరం గ్రామ పంచాయతీ 15వ వార్డు సభ్యునిగా ప్రజలందరికి విశేషమైన సేవలందిస్తూ... ఆకస్మికంగా మృతి చెందిన పేదిలం అప్పారావు గారి మరణానికి చింతిస్తూ... వారి కుటుంబసభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియపరుస్తున్నాం.

గోకవరం గ్రామ పంచాయతీ పాలకవర్గ సభ్యులు

కామేరం ద్రాక్షాయణి (బుజ్జి), గ్రామ సర్పంచ్ - గోకవరం | B. అలీష్, పంచాయతీ కార్యదర్శి, గోకవరం & సిబ్బంది

కొవ్వూరు

•కొవ్వూరు •నిడదవోలు •గోపాలపురం

దిగబడిన ఇసుక లారీతో ఇక్కట్లు

ఉండ్రాజవరం: మండలంలోని మోర్త, పెరవలి రహదారిలో ఇసుక లోడు లారీ బుధవారం దిగబడింది. గంటల కొద్దీ రహదారికి అడ్డుగా ఉండటంతో వాహనాల రాకపోకలకు ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఇరుపక్కలా ట్రాఫిక్ నిలిచిపోవటంతో సాయంత్రం సమయంలో పాఠశాలల బస్సులు అక్కడే నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడ్డారు. ద్విచక్రవాహనదారులు బోల్తా కొట్టటంతో ప్రమాదాలకు గురయ్యారు. ఇసుక దిగుమతి చేసి జేసీబీ సహాయంతో దిగబడిన లారీని బయటకు తీశారు.

పంట బీమాతో ప్రయోజనం

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: పంటల బీమా చేయించుకుంటే వల్ల రైతులకు ప్రయోజనం చేకూరుతుందని మండల వ్యవసాయాధికారి బి.రాజారావు అన్నారు. మండలంలోని సత్యవాడ, కాల్దరి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి రైతులకు వరి సాగుపై సూచనలిచ్చారు. వరి నారుమడులు, నాట్లు పనులు పరిశీలించారు. వ్యవసాయ సహాయకుడు రాజ్‌కుమార్, వంశీ, ప్రకృతి వ్యవసాయ విభాగం ప్రతినిధులు అక్కిన కాశీ, ఉమ, రైతులు పాల్గొన్నారు.

సత్యవాడలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ప్రదర్శన

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

తాళ్లపూడి: మండలంలోని ప్రక్కిలంక విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో మరమ్మతుల నిమిత్తం గురువారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని బుధవారం ఏఈ శ్రీనివాసు తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తాళ్లపూడి, కుకునూరు, బల్లిపాడు, వేగేశ్వరపురం, పెద్దేవం, ప్రక్కిలంక, వైడిమెట్ట, గజ్జరం, పోచవరం, తుపాకులగూడెం, రాగోలపల్లి, తాడిపూడి గ్రామాల్లో సరఫరా నిలుపుదల చేస్తున్నామన్నారు.

నిడదవోలు, దేవరపల్లి: కోరుమామిడి విద్యుత్తు సబ్‌స్టేషన్‌లో నిర్వహణ పనుల నిమిత్తం ఈనెల 4న విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ నారాయణ అప్పారావు తెలిపారు. కోరుమామిడి, అమ్మేపల్లి గ్రామాల పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. తాడిమళ్ల వ్యవసాయ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం తాడిమళ్ల గ్రామ పరిధిలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలుపుదల చేయనున్నట్లు తెలిపారు. ● పల్లంట్ల విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని 11కేవీ చిక్కాల ఫీడర్ ఆర్డీఎస్ఎస్ పనుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్తు నిలిపివేస్తున్నామన్నారు.

సూర్యారావుపాలెం గ్రామాభివృద్ధికి చేయూత

ఉండ్రాజవరం, న్యూస్‌టుడే: కెనరా బ్యాంకు 120 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా సేవా కార్యక్రమాల్లో భాగంగా మండలంలోని సూర్యారావుపాలెంలో చేపట్టాల్సిన పనులను గుర్తించారు. గ్రామంలో అభివృద్ధి పనులకు రూ.10 లక్షల చెక్కు సర్పంచి, ఉపసర్పంచులు మెండె లలితకుమారి, నందిన శ్రీనివాసరావులకు బుధవారం అందజేశారు. ఈ నిధులతో గ్రామంలో డ్రెయినేజీ నిర్మాణం, పాఠశాలలో విద్యార్థులకు భోజనం షెడ్డు తదితర పనులు చేపట్టనున్నట్లు వారు తెలిపారు. కెనరాబ్యాంకు డీజీఎం మాధవరావు, ఏజీఎం బి.పవన్‌కుమార్, బ్రాంచి మేనేజరు డి.రాజేంద్రప్రసాదు, తాడేపల్లిగూడెం నిట్ డైరెక్టర్ దినేష్‌శంకర్‌రెడ్డి, మెండె శ్రీనివాసు పాల్గొన్నారు.

అమ్మచేతి వంటలా.. బడి భోజనం

నియోజకవర్గం	పాఠశాలలు	విద్యార్థులు	తింటున్న శాతం
గోపాలపురం	153	13,410	96
కొవ్వూరు	123	10,175	98
నిడదవోలు	157	10,819	95

దేవరపల్లి, న్యూస్‌టుడే: అమ్మా నేను పాఠశాలలో భోజనం చెయ్యను. అక్కడ అన్నం లావుగా ఉంటూ ఉడకడం లేదు. అది తింటే కడుపులో నొప్పి, విరోచనాలు, వాంతులు అవుతున్నాయి. అనే విద్యార్థుల సమస్యలకు కూటమి ప్రభుత్వం ముగింపు పలికింది. ఎంతో రుచికరమైన డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని సన్నబియ్యంతో విద్యార్థులకు పాఠశాలల్లో అందజేస్తుంది. ఈ విద్యాసంవత్సరం నుంచే విద్యార్థుల శారీరక, మానసిక ఎదుగుదలను దృష్టిలో పెట్టుకుని కమ్మని ఆహారాన్ని మెనూ ప్రకారం వడ్డిస్తున్నారు. కూటమి ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకంలో తీసుకువచ్చిన మార్పులతో ప్రతి పాఠశాలలో విద్యార్థులు 95 నుంచి 100 శాతం తింటున్నారని ఉపాధ్యాయులు తెలిపారు.

దేవరపల్లి పాఠశాలలో భోజనాలు చేస్తున్న విద్యార్థులు

కడుపు నిండా తింటున్నాం..

గతంలో బడిలో పెట్టిన భోజనంలో పప్పు, అన్నం సరిగ్గా ఉడికేవి కాదు. తినాలంటేనే భయం వేసేది. ఆకలికి తట్టుకులేక సగం మాత్రమే తినేవాళ్లం. కొత్తగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సన్నబియ్యంతో రుచిగా వండి పెడుతున్నారు. అందరం కడుపునిండా తింటున్నాం. ఇంటి వద్ద తినే నా స్నేహితులు కూడా నాతోనే తింటున్నారు. - కళ్లేపల్లి వర్షిణి, పదో తరగతి

గుడ్డు బాగుంటుంది..

గతంలో సాంబారు కూడా నీళ్లగా ఉండేది. ముద్ద నోటిలోకి వెళ్లాలంటేనే కష్టంగా ఉండేది. ప్రభుత్వం మెనూ మార్చడంతో కంచాన్ని ఖాళీ చేస్తున్నాం. వారంలో మూడు రోజులు చిక్కీలు, రెండు రోజులు రాగిజావ ఇస్తున్నారు. ఫ్రై చేసిన గుడ్డు చాలా బాగుంటుంది. - లక్ష్మీ ప్రసన్న, 8వ తరగతి

98 శాతం చేస్తున్నారు..

గతంలో ఏ చెత్త బుట్టను చూసినా విద్యార్థులు భోజనాన్ని పడేసేవారు. ఇప్పుడు అవి ఖాళీగా దర్శనమిస్తున్నాయి. దేవరపల్లి మండలంలో మొత్తం 47 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ప్రస్తుతం 4,750 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతి రోజూ 98 శాతం భోజనం చేస్తున్నారు. సన్నబియ్యంతో రుచికరమైన భోజనం పెట్టడంతో కడుపునొప్పి, వాంతులు, విరోచనాల సమస్యల నుంచి విద్యార్థులు దూరంగా ఉండి కడుపునిండా తింటున్నారు. - ఎం.తిరుమలదాస్, ఎంఈవో, దేవరపల్లి

ముత్యాలమ్మకు ఆభరణాల సమర్పణ

ఉండ్రాజవరం: మండల కేంద్రమైన ఉండ్రాజవరం గ్రామ దేవత ముత్యాలమ్మకు గ్రామానికి చెందిన కడలి వెంకటలక్ష్మి కుటుంబ సభ్యులు బంగారపు కనుబొమ్మలు, కళ్లు సమర్పించారు. దాతలు విరాళంగా ఇచ్చిన ఆభరణాలను అమ్మవారికి బుధవారం అలంకరించి పూజలు చేశారు.

రవాణా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం విద్యాలయాలకు చెందిన అన్ని వాహనాలకు సామర్థ్య ధ్రువపత్రాలు పొందాలని.. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎంవీఐ కేవీ శివప్రసాద్ అన్నారు. కొవ్వూరు - నిడదవోలు రహదారిలో పాఠశాలలు, కళాశాలలకు చెందిన బస్సులను బుధవారం ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఎంవీఐ మాట్లాడుతూ తనిఖీల్లో భాగంగా 8 వాహనాలపై కేసులు నమోదు చేశామన్నారు. బస్సుల్లో అటెండెంట్, అగ్నిమాపక పరికరాలు లేకపోవడం, లైసెన్సులు లేని అంశాలను గుర్తించి రూ.84,300 అపరాధ రుసుం విధించామన్నారు. ధ్రువపత్రాలు లేకుండా తిరిగే వాహనాలపై ప్రత్యేక నిఘా నడుస్తోందన్నారు. ఏఎంవీఐ వి.లక్ష్మీప్రవీణ, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు పత్రాలను పరిశీలిస్తున్న ఎంవీఐ కేవీ శివప్రసాద్

ప్రతి సంక్షేమం ప్రజలకు తెలియచెప్పాలి

•సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఎమ్మెల్యేలు

చాగల్లు, నిడదవోలు, నల్లజర్ల: ప్రతి నాయకుడి కదలికలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేస్తున్నారని, పార్టీ అభివృద్ధికి పనిచేసే వ్యక్తులకే పదవులు వరిస్తాయని కొవ్వూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా చాగల్లు మండలం నెలటూరు గ్రామంలో మండల స్థాయి నాయకుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కార్యకర్తలు ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి తక్షణ పరిష్కార దిశగా కృషి చేయాలన్నారు. ఆళ్ల హరిబాబు, నాదెళ్ల శ్రీరామ్ చౌదరి, టి.ప్రసాద్, కె.సతీష్ పాల్గొన్నారు. ● కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేసిందని తెదేపా నిడదవోలు పట్టణ అధ్యక్షుడు కొమ్మిన వెంకటేశ్వరరావు అన్నారు. పట్టణంలోని 42, 43 బూత్‌లలో బుధవారం బూరుగుపల్లి శేషారావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. కరపత్రాలను పంపిణీ చేశారు. పట్టణ ప్రధానకార్యదర్శి తిరుపతి సత్యనారాయణ, నాయకులు కాళ్ల లక్ష్మణరావు, కుర్రు దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

రావిమెట్లలో తెదేపా మండల అధ్యక్షుడు వెలగన సూర్యారావు పాల్గొన్నారు. ● నల్లజర్ల మండలంలోని పోతవరంలో ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు, గ్రామీణాభివృద్ధి కోసం చేపట్టిన చర్యలపై వివరించారు. అంతకముందు పోతవరం నుంచి యర్నగూడెంకు వెళ్లే సీసీ రోడ్డును ప్రారంభించారు. జిల్లా పరిషత్తు ఛైర్మన్ ఘంటా పద్మశ్రీ, తెదేపా మండలశాఖ అధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, సర్పంచి నూతుకూర్తి లక్ష్మణరావు, పసుమర్తి రతీష్ పాల్గొన్నారు.

చాగల్లులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముప్పిడి

నిడదవోలులో అభివృద్ధిని వివరిస్తున్న వెంకటేశ్వరరావు, తెదేపా శ్రేణులు

అభివృద్ధే ధ్యేయంగా పాలన: దుర్గేష్

పెరవలి: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. పెరవలి మండలం నడుపల్లిలో ఆయన కానూరు-నడుపల్లి రోడ్డును బుధవారం పరిశీలించారు. ఈరోడ్డుకు రూ.1.50 కోట్లు నిధులు మంజూరయ్యాయని త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. ముందుగా రోడ్డుపై వర్షపునీరు నిల్వ ఉండకుండా చేయాలని అధికారులకు సూచించారు. ఈరోడ్డులో కల్వర్టుతోపాటు సిమెంటురోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. నిడదవోలు-నరసాపురం రోడ్డులో కానూరు-ఉసులుమర్రు సిమెంటు రోడ్డు నిర్మాణానికి రూ.3కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ర.భ.శాఖ ఈఈ జి.రూప్‌కుమార్, డీఈ రమణమూర్తి, పీఆర్ డీఈ కరుటూరి రామ్మోహనరావు, మండలశాఖ అధ్యక్షుడు పిప్పర రవి, అతికాల వెంకటరామకృష్ణమ్మ, కోటిపల్లి మురళీకృష్ణ, నాయకులు చిట్టూరి వెంకటనారాయణ పాల్గొన్నారు.

కానూరు-నడుపల్లి రోడ్డును పరిశీలిస్తున్న మంత్రి దుర్గేష్

9న దేశవ్యాప్త సమ్మె

తాళ్లపూడి: హమాలీలకు సంక్షేమ బోర్డులను ఏర్పాటు చేయాలని, నాలుగు లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 9న దేశవ్యాప్తంగా జరిగే సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సుందరబాబు తెలిపారు. తాళ్లపూడిలో సమ్మెకు సంబంధించిన రైసుమిల్లుల కార్మికులతో కరపత్రాలను బుధవారం ప్రదర్శించి పలు నినాదాలు చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సమ్మెలోకి దిగుతున్నామని తెలిపారు. ఎస్.వెంకటేశ్వరరావు, ఆర్.విష్ణు, వరప్రసాద్, శేషగిరి, అప్పారావు, పోశిబాబు తదితరులు పాల్గొన్నారు.

క్రైస్తవ హక్కుల సంరక్షణకు కౌన్సిల్

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: ఐక్యంగా సామాజిక సేవను కొనసాగిస్తూ క్రైస్తవ హక్కుల సంరక్షణకు కౌన్సిల్ పనిచేస్తుందని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఎన్‌సీసీ) కొవ్వూరు నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు బిషప్ డాక్టర్ జి.విలియమ్స్ అన్నారు. కౌన్సిల్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కొవ్వూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కౌన్సిల్ రాష్ట్ర రాజకీయ విభాగ అధ్యక్షుడు కొల్లి సాక్షిబాబు అధ్యక్షతన జరిగింది. జి.మనషే (యూఎస్‌ఏ), కొవ్వూరు, తాళ్లపూడి, చాగల్లు మండలాలకు చెందిన కౌన్సిల్ ప్రతినిధులు వి.విల్సన్, ఎం.హజ్కియరాజు, జి.మధు తదితరులు పాల్గొన్నారు.

తుప్పలతో తిప్పలు..

పెరవలిలో శ్మశానవాటిక తుప్పలతో నిండిపోయింది. దీనిని కనీసం శుభ్రం కూడా చేయలేదని స్థానికులు వాపోతున్నారు. ఇక్కడ దహన కార్యక్రమాలు నిర్వర్తించుకోవాలంటే కష్టతరం అవుతుందని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిచ్చిమొక్కలను వెంటనే తొలగించాలని వారు కోరుతున్నారు. దీనిపై విస్తరణాధికారి వెంకటరమణ వివరణకోరగా పరిశీలించి చర్యలు తీసుకుంటానన్నారు. - న్యూస్‌టుడే, పెరవలి

నరకం చూపిస్తున్న మార్గం

కొవ్వూరు మండలం వాడపల్లి నుంచి చాగల్లు మండలం చంద్రవరానికి వెళ్లే సుమారు 5 కిలోమీటర్ల మార్గంలో ప్రయాణమంటే హడలెత్తిపోతున్నారు. మల్లవరం, చంద్రవరం, వాడపల్లి, ఆ పరిసర గ్రామాల ప్రజానీకం, రైతాంగం, విద్యార్థులు రోజూ వెయ్యి మంది వరకు రాకపోకలు సాగిస్తుంటారు. చంద్రవరం వాసులు ఈ సమస్యను 'మేమున్నాం.. మీకు తోడుగా' దృష్టికి తీసుకొచ్చారు. రభశా డీఈ బీవీ రమణని వివరణ కోరగా పుష్కరాల నిధులతో ఈ రోడ్డు నిర్మాణం చేపట్టాలని రూ.1.60 కోట్లతో ప్రతిపాదనలు చేశామని తెలిపారు. - న్యూస్‌టుడే, కొవ్వూరు పట్టణం

ముఖ్యమంత్రి కార్యాచరణ ప్రశంసనీయం: రాజీవ్‌కృష్ణ

కొవ్వూరు పట్టణం, న్యూస్‌టుడే: పేదరికం లేని సమాజ నిర్మాణానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న కార్యాచరణ ప్రశంసనీయమని కొవ్వూరు నియోజకవర్గ తెదేపా నేత ఎస్.రాజీవ్‌కృష్ణ అన్నారు. ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్ల పంపిణీ, పేదల సేవ కార్యక్రమం కోసం జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును రాజీవ్‌కృష్ణ కలిశారు. సీఎంకు వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని బహూకరించారు. పలు అంశాలపై చర్చించారు.

సీఎంకి వేంకటేశ్వరస్వామి ప్రతిమను అందిస్తున్న తెదేపా నేత రాజీవ్‌కృష్ణ

ఏకపక్ష నిర్ణయాలకు నిరసనగా బంద్

కొవ్వూరు పట్టణం, నల్లజర్ల, న్యూస్‌టుడే: ప్రైవేటు, అన్‌ఎయిడెడ్ పాఠశాలల పట్ల ఏకపక్ష నిర్ణయాలకు నిరసనగా ఈనెల 3న బంద్ నిర్వహిస్తున్నామని కొవ్వూరు డివిజన్ ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ నాయకులు నెల్సన్‌ఆంథోని, పాలెంపాటి వెంకటరత్నం తెలిపారు. ఈమేరకు కొవ్వూరు మండల విద్యావనరుల కేంద్రంలో ఎంఈవో-2 టి.రామకిశోర్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. ● నల్లజర్ల మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రైవేట్ పాఠశాలల ప్రతినిధులు విద్యాశాఖాధికారి వై.సత్యనారాయణను ఆయన కార్యాలయంలో కలసి వినతిపత్రం అందజేశారు. ఎం.ఎస్.చెల్లారావు, వై.రామారావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సెల్‌టవర్ సిగ్నల్ పెంపు

నల్లజర్ల, న్యూస్‌టుడే: తమ గ్రామంలో బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ సక్రమంగా పనిచేయకపోవడంతో చరవాణులకు సిగ్నల్స్ అందక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని సింగరాజుపాలెం ఎంపీటీసీ సభ్యురాలు వామిశెట్టి పావనీకుమారి, పరమేశ్వరరావు మంగళవారం విజయవాడలోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో జీఎం శ్రీనివాసరావును కలసి వినతి పత్రం అందచేసి సమస్యను వివరించారు. ఈమేరకు బుధవారం జీఎం శ్రీనివాసరావు ఆ గ్రామానికి తమ సిబ్బందితో వచ్చి సిగ్నల్‌ను పూర్తిస్థాయిలో పెంచడమే కాకుండా 4జీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులంతా తమ హర్షం వ్యక్తం చేశారు.

బీఎస్ఎన్ఎల్ సెల్‌టవర్ వద్ద జీఎం.శ్రీనివాసరావు తదితరులు

మాట్ల మృతి భాజపాకు తీరని లోటు

నిడదవోలు, న్యూస్‌టుడే: నిడదవోలు మండలం సమిశ్రగూడెంకు చెందిన భాజపా సీనియర్ నాయకుడు మాట్ల వెంకటేశ్వరరావు మృతి భాజపాకు తీరని లోటని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర అన్నారు. మాట్ల సంతాప సభను నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో బుధవారం నిర్వహించారు. వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. భాజపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.లక్ష్మీనారాయణ, నాయకులు ఎ.వెంకటేష్, నియోజకవర్గ సమన్వయకర్త బండి సత్యనారాయణ, నాయకులు సుంకర నరసింహం, మండల అధ్యక్షుడు బాలాజీ పాల్గొన్నారు.

ఆండ్రు అనిల్‌కు ఎమ్మెల్యే ముప్పిడి పరామర్శ

దేవరపల్లి, న్యూస్‌టుడే: దేవరపల్లి మండలం గౌరీపట్నం మాజీ సర్పంచి ఆండ్రు వెంకటేశ్వరరావు(68) గత నెల 27వ తేదీన అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందిన విషయం విదితమే. బుధవారం ఆయన కుమారుడు తెదేపా మండల పార్టీ అధ్యక్షుడు ఆండ్రు అనిల్‌ని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు పరామర్శించారు. ఆండ్రు వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.

అదుపు తప్పి లారీ బోల్తా

నల్లజర్ల: అదుపు తప్పి ఆయిల్‌పాం లోడుతో వెళ్తున్న లారీ రహదారి పక్కన ఉన్న బోదెలో పడిన ఘటన కొత్తగూడెంలో బుధవారం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు ఎటువంటి గాయాలు కాలేదు. ఇటీవల నూతనంగా నిర్మించిన రహదారి పక్కన మార్జిన్‌లో ఉన్న మట్టి వర్షాలకు జారడంతో 25 టన్నుల లోడుతో వెళ్తున్న లారీ అదుపు తప్పి ఈ ప్రమాదం జరిగి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు.

ప్రకటన

తూ॥గో॥జిల్లా, రాజమహేంద్రవరం గ్రామ కాపురస్తులైన కొవ్వూరి గోపాలకృష్ణ గారి కుమారుడు కొవ్వూరి నేత విద్యాధర్ మరియు ఇతరులు నాకు ఇచ్చిన సంజాయిషీపై యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది.

నా క్లయింట్స్ ప॥గో॥జిల్లా, కొవ్వూరు మండలం, పెనకనమెట్ట సాపరం గ్రామ కాపురస్తులైన గూడపాటి రామారావు గారి భార్య గూడపాటి చంద్ర ధనలక్ష్మి గారికి పారీఖత్తు దస్తావేజు రీత్యా దఖలుపడిన ఆస్తి డాక్యుమెంటు నం.3522/2008లో "D" షెడ్యూల్ ఆస్తి ప॥గో॥జిల్లా, కొవ్వూరు సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో చేరిన బందపురం పంచాయతీలో గల బందపురం గ్రామం తాలూకు జి॥మెరక R.S.No.167/3, Sub-Division R.S.No.167/3Aలో య.1.05 సెంట్లు భూమిలో రోడ్డు నిమిత్తం పోగా మిగిలిన భూమి య.0.7625 సెంట్లులో య.0.40 సెంట్లు భూమిని నా క్లయింట్స్ కొనుటకు నిశ్చయించినారు.

కావున యీ ఆస్తిపై ఎవరికైన ఎటువంటి అభ్యంతరాలు, ఆక్షేపణలు వున్న ఎడల ఈ ప్రకటన ప్రచురించిన నాటి నుండి వారం రోజులలోగా ఈ క్రింది అడ్రస్‌కు తెలియజేయవలెను. లేనియెడల నా క్లయింట్స్‌పై ఎటువంటి క్లయిములు బైండ్ కావని, బాధ్యులు కారని ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

A.K.BALA SUNDAR, అడ్వకేట్
D.No.76-5-36, గాంధీపురం, రాజమండ్రి,
Cell: 98491 89686
రాజమహేంద్రవరం, ది.02-07-2025.

లయన్స్ సేవలు అభినందనీయం

నిడదవోలు, న్యూస్‌టుడే: తిమ్మరాజుపాలెం లయన్స్ క్లబ్ ద్వారా అందిస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు ఎంతో అభినందనీయమని సమిశ్రగూడెం ఎస్సై బాలాజీ సుందరరావు అన్నారు. నిడదవోలు మండలం సమిశ్రగూడెంలో తిమ్మరాజుపాలెం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో దాపర్తి రాధాకృష్ణ ఆర్థిక సహకారంతో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని సుందరరావు ప్రారంభించారు. సుమారు 120 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందచేశారు. క్లబ్ అధ్యక్షురాలు బండి అరుణకుమారి, కార్యదర్శి నిడమర్తి భాస్కరరావు, కోశాధికారి సుంకవల్లి శ్రీధర్, శిబిర కోఆర్డినేటర్ సుంకవల్లి ఉషారాణి, క్లబ్ ఛైర్మన బండి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సమిశ్రగూడెంలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్సై బాలాజీ సుందరరావు

శతాధిక వృద్ధురాలు మృతి

దేవరపల్లి, న్యూస్‌టుడే: యర్నగూడెంకి చెందిన శతాధిక వృద్ధురాలు చింతా సీతమ్మ(108) బుధవారం వృద్ధాప్యంతో మృతి చెందారు. ఈమెకు ముగ్గురు అమ్మాయిలు, ఒక అబ్బాయి సంతానం ఉన్నారు. అలాగే ఆరుగురు మనవరాళ్లు, నలుగురు మనవళ్లు మొత్తం 11 మంది ఉన్నారు. వీరి పిల్లలు, వాళ్ల పిల్లల ఇలా మొత్తం నాలుగు తరాల వారిని సీతమ్మ చూసింది. మంగళవారం జులై 1వ తేదీన ఎన్టీఆర్ సామాజిక పింఛన్ తీసుకున్నామని కుటుంబ సభ్యులు తెలిపారు.



శ్రద్ధాంజలి

కీ॥శే॥ పడమటి చెన్నారావు గారు
జననం: 1938 మరణం: 25-06-2025
వేళ్ళచింతలగూడెం, గోపాలపురం మం॥

కుటుంబ శ్రేయస్సు కొరకు అహర్నిశలు శ్రమించి, మాకు మార్గాన్ని నిర్దేశించిన మహనీయమూర్తి, కీ॥శే॥ పడమటి చెన్నారావు గారి మరణం మాకు తీరని లోటు. వారి అడుగు జాడలే మాకు అనుసరణీయం. వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని సదా కోరుకుంటూ...

ఇట్లు : కుటుంబసభ్యులు

పెద్దకార్యం : ది. 05-07-2025 శనివారం గోపాలపురం మం॥ వేళ్ళచింతలగూడెంలో మా స్వగృహంలో జరుపబడును. సెల్ : 63003 75475, 75501 71187

ఈ మార్గానికి మోక్షమెప్పుడో..!

● అధ్వానంగా పంగిడి, నిడదవోలు రహదారి

చాగల్లు, న్యూస్‌టుడే: నిడదవోలు వ్యాపార కూడలిగా ఉండడంతో తాళ్లపూడి మండలం, కొవ్వూరు మండలంలోని కొన్ని గ్రామాల వ్యాపారులు, దేవరపల్లికి చెందిన వారు పంగిడి మీదుగా, నిడదవోలు చేరుకుంటారు. తమ చిన్నపాటి వాహనాలపైనే భారీగా సరకు తీసుకువెళ్తుంటారు. అటువంటి వ్యాపారులు అదుపుతప్పి పడిపోవడం, తమ సరకు పాడవ్వడంతో వారు ఆందోళన చెందుతున్నారు.

గోతులమయంగా మారిన ప్రాంతాలివే

కొవ్వూరు పంగిడి గ్రామం నుంచి ప్రారంభమైన ఈ రోడ్డు సుమారు 10 కిలోమీటర్లు ఉంటుంది. 20 గ్రామాల ప్రజలకు అవసరమయ్యే ఈ మార్గంలో రోజుకి వెయ్యికి పైగానే వాహనాలు తిరుగుతుంటాయి. ఈ రోడ్డులో పంగిడి ప్రధాన కూడలి వద్ద పరిస్థితి అధ్వానంగా ఉంది. కనీసం డ్రెయినేజీలు లేకపోవడంతో వర్షపు నీరు వెళ్లేందుకు అవకాశం లేక వ్యాపారులు వేసిన చెత్త కుళ్లి దుర్వాసనమయంగా తయారవుతుంది. మీనానగరం ప్రారంభంలో ఏర్పడిన గోతులు రాత్రి వేళ కనిపించే పరిస్థితి లేదు. దీంతో వాహనదారులు అదుపుతప్పి పడిపోతున్నారు. చక్కెర ఫ్యాక్టరీ సమీపంలో, చాగల్లు ప్రధాన కూడలి చిల్లుల జల్లెడను తలపిస్తూ రోడ్డు ఉంది.

చాగల్లు ప్రధాన కూడలి దుస్థితి

ప్రతిపాదనలు పంపించాం..

పంగిడి, నుంచి నిడదవోలు మీదుగా కానూరు వరకూ సుమారు 20 కిలోమీటర్ల వరకూ శాశ్వత ప్రాతిపదికన రోడ్ల నిర్మాణాలకు సుమారు రూ.45 కోట్లకు ప్రతిపాదనలు పంపించాం. వీటికి అనుమతులు వస్తే పలు చోట్ల సీసీ రోడ్లతో పాటు, బీటీ రోడ్ల నిర్మాణాలను వేగవంతం చేస్తాం. ప్రస్తుతం తాత్కాలిక మరమ్మతులకు చర్యలు చేపడుతున్నాం. - బి.వెంకటరమణ, ఆర్‌అండ్‌బీ డీఈ, కొవ్వూరు

వరి పంటలో వచ్చు కాండము తొలచు పురుగు మరియు పొడ (మాగుడు) తెగులు నియంత్రణకు
బాయర్ కంపెనీ నుండి నూతన ఉత్పత్తుల ఆవిష్కరణ

తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాలలో వరి పంటను ఆశించే ముఖ్యమైన సమస్యలైన కాండం తొలుచు పురుగు మరియు పొడ (మాగుడు) తెగులు నివారణకు బాయర్ క్రాప్‌సైన్స్, రాజమహేంద్రవరంలో నూతన ఉత్పత్తులను ఆవిష్కరించింది.

ఈ ఉత్పత్తుల ఆవిష్కరణ కార్యక్రమంలో బాయర్ క్రాప్‌సైన్స్ సౌత్ 2 సేల్స్ లీడ్ శ్రీ విశ్వేశ్వరరావు గారు మరియు మార్కెంటింగ్ లీడ్ శ్రీ కిషోర్ నాయుడు గారు ముఖ్యఅతిథులుగా పాల్గొని, బికోట గుళికలు వరిపంటలో ఎకరాకు 5 కెజీలు వాడుట వలన కాండం తొలుచు పురుగును నివారించవచ్చునని. మరియు ఫెలోజిత్ ఎకరాకు 320 మిలీ వాడుట వలన పొడ (మాగుడు తెగులు) పూర్తిగా నివారించబడి అధిక దిగుబడులు సాధించవచ్చని తెలియజేసారు.

ఈ కార్యక్రమానికి ఉభయ గోదావరి జిల్లాల నుండి అధీకృత పంపిణీదారులు, 600 మందికి పైగా డీలర్లు, మరియు కంపెనీ అధికారులు పాల్గొని జయప్రదం చేసారు.

Advertisement

(c) eenadu

ఈనాడు ఏలూరు
గురువారం జులై 3, 2025 7

ఉత్సాహంగా తొలి అడుగు

● చిరు జల్లుల మధ్య కొనసాగింపు
● ఇంటింటికీ తెదేపా శ్రేణులు

ఏలూరులో మహిళకు కరపత్రాన్ని అందజేస్తున్న మహేశ్ కుమార్, వీరాంజనేయులు, చంటి తదితరులు

ఈనాడు-ఏలూరు: జిల్లాలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమానికి తెదేపా శ్రేణులు ఉత్సాహంగా కదిలాయి. చిరుజల్లుల మధ్యే కార్యక్రమాన్ని కొనసాగించారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో బుధవారం ప్రారంభమైంది. మంత్రి పార్థసారథి తన నియోజకవర్గం నూజివీడులో పాల్గొన్నారు. ఏలూరులో ఎమ్మెల్యే బడేటి చంటితో కలిసి ఎంపీ పుట్టా మహేష్, జిల్లా పార్టీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ఎంఆర్‌సీ కాలనీలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాదిలో సాధించిన విజయాలను వివరించారు. దెందులూరు నియోజకవర్గంలోనూ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి ఎంపీ పుట్టా మహేష్ పాల్గొన్నారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఏడాదిలో వైకాపా విధ్వంస పాలన నుంచి రాష్ట్రాన్ని వికాసం వైపు నడిపించటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని మంచి ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. చేసిన పనులతో పాటు ఇంకా చేయని వాటిని కూడా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించి వాటిని ఎప్పుడు పూర్తి చేసేదీ తెదేపా శ్రేణులు వివరించాయి.

అన్ని చోట్లా ఆశీర్వాదం

పార్టీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు ఉంగుటూరు నియోజకవర్గం పిప్పరలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా కార్యక్రమం ఉత్సాహంగా ప్రారంభమైందని, తొలి రోజు ఊహించిన దానికన్నా ప్రజలు తమను ఆశీర్వదించారని తెలిపారు. చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ విదేశీ పర్యటనలో ఉండటంతో అక్కడ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తల ఆధ్వర్యంలో సాగింది. పోలవరం, కైకలూరు నియోజకవర్గాల్లోనూ పార్టీ శ్రేణులు ప్రారంభించాయి. తాము సందర్శించిన ప్రతి ఇంటినీ యాప్‌లో అప్లోడ్ చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలను అనుసరించి కలిసిన ప్రతి ఇంటి వద్ద నుంచే ప్రభుత్వ కార్యక్రమాలను వివరిస్తూ యాప్‌లో అప్లోడ్ చేయాలని జిల్లా అధ్యక్షుడు గన్ని కోరారు.

నేడు పట్టిసీమ పంపులు ప్రారంభం

పోలవరం, న్యూస్‌టుడే: గోదావరిలో నీటి మట్టం పెరగడంతో పట్టిసీమ ఎత్తిపోతల పథకంలోని పంపులు గురువారం మంత్రి నిమ్మల రామానాయుడుతో ప్రారంభించేందుకు జలవనరుల శాఖాధికారులు ఏర్పాట్లు చేశారు. ఎత్తిపోతల వద్ద గోదావరిలో నీటి మట్టం బుధవారం 15 మీటర్లకు పెరిగింది. నాలుగు కిలోమీటర్ల పొడవునా.. ప్రాజెక్టు కుడి కాలువ వద్ద నిర్మించిన డెలివరీ సిస్టమ్ వరకు గతంలో వేసిన పైపులైన్ మొత్తం పరిశీలించి 24 పంపులు ట్రయల్ రన్ పూర్తి చేసినట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు. గతేడాది జూన్ నెలలో పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా కుడి కాలువలోకి నీటిని విడుదల చేయగా.. గోదావరిలో నీటి మట్టం 14 మీటర్లకు చేరకపోవడంతో ఈ సంవత్సరం జులై మొదటి వారంలో ప్రారంభిస్తున్నామన్నారు. మంత్రి పర్యటన దృష్టిలో ఉంచుకుని ఎత్తిపోతల పథకం వద్ద మామిడి తోరణాలతో అలంకరించారు. జలవనరుల శాఖాధికారులు బుధవారం వచ్చి ఏర్పాట్లు పరిశీలించి వెళ్లారు.

ముగిసిన డీఎస్సీ పరీక్షలు

ఏలూరు విద్యా విభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడుల్లో ఉపాధ్యాయుల నియామకానికి నిర్వహిస్తున్న డీఎస్సీ పరీక్షలు ముగిశాయి. గత నెల 6వ తేదీన ప్రారంభమైన పరీక్షలు నిరంతరాయంగా కొనసాగాయి. జిల్లాలోని మూడు కేంద్రాల్లో బుధవారం నిర్వహించిన పరీక్షకు 34 మంది గైర్హాజరయ్యారు. ఉదయం పరీక్షకు 520కి 507 మంది హాజరుకాగా 13 మంది హాజరు కాలేదు. మధ్యాహ్నం పరీక్షకు 476 మంది హాజరు కావాల్సి ఉండగా 454 మంది హాజరయ్యారు. జిల్లాలో నిర్వహించిన డీఎస్సీ పరీక్షలన్నిటికీ కలిపి మొత్తం 17,386కి 16,154 మంది హాజరయ్యారు. 1,232 మంది హాజరు కాలేదు.

ఇక్కడ.. పిల్లలెక్కడ

ఆ బడుల్లో ప్రవేశాలు ఐదులోపే

0, 1, 2, 3, 4, 5.. ఏమిటీ అంకెలు అనుకుంటున్నారా? ఇదీ కొన్ని ప్రాథమిక బడుల్లో ఉన్న విద్యార్థుల సంఖ్య. జిల్లాలో జీరో అడ్మిషన్లు కొన్నిచోట్ల.. ఇంకొన్ని చోట్ల ఒకరు లేదా ఐదుగురు లోపు విద్యార్థులే ఉన్నారు. వినడానికి ఆశ్చర్యమనిపించినా అక్షరాలా నిజం. విద్యార్హతలు, బోధనానుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్న చోటే ఈ పరిస్థితి ఉండటం బాధాకరం.

ఈనాడు-ఏలూరు

అసలు పాఠశాల విద్యాశాఖలో ఏం జరుగుతోంది? ప్రవేశాలు ఉండకపోవటానికి కారణం ఏమిటి? ఏక సంఖ్యలో ప్రవేశాలు ఎప్పటి నుంచి ఉన్నాయి? వాటి పెంపుదలకు ఏం చర్యలు తీసుకున్నారని ఆరా తీసే నాథుల్లేరు. ఇటీవల కలెక్టర్ సమీక్షలో 155 పాఠశాలల్లో ఐదు లోపే ప్రవేశాలు ఉన్నాయని నివేదిక ఇచ్చి మిన్నకుండిపోయారు.

ప్రభుత్వం ఒక విద్యార్థిపై భారీగా ఖర్చు పెడుతోంది. ఉచిత పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం, తల్లికి వందనం కింద రూ.15 వేలు సాయం ఇలా ఎన్నో చేస్తోంది. అయినా పిల్లలు ఎందుకు చేరడం లేదు? లోపం ఎక్కడ ఉంది అని కలెక్టర్ ఆరా తీసి ప్రవేశాలు పెంచటానికి చర్యలు తీసుకుంటేనే తప్ప పరిస్థితి మెరుగుపడదు. ఇంకా ప్రవేశాలకు గడువు ఉన్న నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు ఆ దిశగా చర్యలు ఉపక్రమించాలి. ఒకరిద్దరు ఉన్న చోట తల్లిదండ్రులు వారిని కూడా ప్రైవేటు బడులకు పంపుతున్నారు. గతంలో వైకాపా ప్రభుత్వం 3,4,5 తరగతుల పిల్లలను ఉన్నత పాఠశాలల్లోకి విలీనం చేసి స్కూల్ అనే సైంటిఫిక్ బోధన చేయిస్తామని ప్రాథమిక బడుల ఉనికిని ప్రశ్నార్థకం చేసింది.

ఇంటింటికీ వెళ్లినా ఫలితం లేదు

పెదపాడు ఏఎల్ పేట పాఠశాలలో ఒక్కరూ లేరు. అంగన్‌వాడీ కేంద్రంలో ముగ్గురు చిన్నారులు ఉండగా ఇద్దరేమో కాన్వెంట్‌లో, ఒకరేమో మోడల్ ప్రైమరీ పాఠశాలలో చేరారని హెచ్‌ఎంగా వ్యవహరిస్తున్న జయప్రకాశ్ తెలిపారు. ఇంటింటికీ తిరిగి పిల్లలను బడికి పంపాలని కోరినా స్పందన లేదని, వ్యక్తిగతంగా కొందరికి దుస్తులు అందజేస్తానని చెప్పినా చేరలేదన్నారు. ఇలాగైతే బడి మూసేస్తారని తల్లిదండ్రుల కమిటీకి చెప్పినా ఫలితం లేదన్నారు.

ఉన్న ఒకడు చేజారిపోయాడు

పెదపాడు మండలం జీవీ హెచ్ గట్టు పాఠశాలలో ఉన్న ఒక్క విద్యార్థిని తల్లిదండ్రులు ఊరికి కిలోమీటరు దూరంలో ఉన్న మెయిన్ స్కూల్‌లో చేర్పించారని స్కూల్ హెచ్‌ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. గతంలో 15 మంది ఉండగా ఉన్నత పాఠశాలల్లో విలీనం పేరుతో కొందరిని, ఈ ఏడాది ఆదర్శ ప్రాథమిక పాఠశాల పేరుతో మరికొందరిని తీసుకెళ్లిపోయారు. కొత్తగా చేరేవారు లేకుండా పోయారు.

✦ జిల్లాలో ఐదులోపు ఉన్న ప్రవేశాలు ఉన్నవి కొన్ని.. భీమడోలు మండలం పూళ్ల ఎంపీపీఎస్‌లో ఇద్దరు, ఆగిరిపల్లి మండలం తోటపల్లిలో ముగ్గురు, బుట్టాయగూడెం మండలం లంకలపల్లిలో ముగ్గురు, చింతలపూడి మండలం తలార్లపల్లిలో ముగ్గురు ఉన్నారు.

వంట గ్యాస్ పక్కదారి

➡ యథేచ్ఛగా అక్రమ వినియోగం
➡ పట్టించుకోని అధికారగణం

ఏలూరు అర్బన్, మండవల్లి, న్యూస్‌టుడే: గృహావసరాల గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు అక్రమంగా వినియోగిస్తున్నప్పటికీ అధికారులు మిన్నకుండిపోతున్నారు. పలు వ్యాపార దుకాణాలు, హోటళ్లు కల్యాణ మండపాల్లో కళ్లెదుటే కనిపిస్తున్నప్పటికీ చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు. ఏలూరు పరిధిలో నెలకు సగటున పది వేల వాణిజ్య సిలిండర్లు అవసరం కాగా మూడు గ్యాస్ ఏజెన్సీల నుంచి వెయ్యి మాత్రమే విక్రయాలు సాగుతున్నాయి. మిగిలిన 9 వేలు గృహావసరాలకు సంబంధించినవే వినియోగిస్తున్నారు. దీంతో ప్రభుత్వానికి రూ.లక్షల్లో నష్టం వాటిల్లుతోంది.

ఏలూరులో తినుబండారాల విక్రయ దుకాణంలో గృహావసరాల గ్యాస్ సిలిండర్ వినియోగం

✸ వాణిజ్య సిలిండర్ల ధరతో పోలిస్తే గృహ వినియోగ గ్యాస్ ధర తక్కువగా ఉండటంతో పలువురు వ్యాపారులు వీటిని ఎక్కువగా వినియోగిస్తున్నారు. డెలివరీ బాయ్‌లు ఒక్కో సిలిండర్‌కు రూ.100 నుంచి రూ.150 వరకు అదనంగా తీసుకుని సిలిండర్లు ఇస్తున్నారు. గృహాలకు గ్యాస్ బుక్ చేసుకుంటే రెండు మూడు రోజుల ఆలస్యంగా సిలిండర్లు ఇస్తున్నారు. ఒక్క కైకలూరు ప్రాంతంలోనే రోజూ 300 వరకు గృహావసరాల గ్యాస్ బండలు పక్కదారి పడుతున్నాయి. గృహ వినియోగ గ్యాస్‌తో పోల్చితే వాణిజ్య గ్యాస్ ధర కిలోకు రూ.66 ఎక్కువ ఉండటంతో వ్యాపారులు దొడ్డిదారిన గృహ అవసరాల గ్యాస్‌ను వినియోగిస్తున్నారు.

తనిఖీలు నిర్వహిస్తాం: వంట గ్యాస్ సిలిండర్ల అక్రమ వినియోగం నిరోధానికి జిల్లా అంతటా తనిఖీలు నిర్వహిస్తామని జిల్లా పౌరసరఫరాల అధికారి ఇ.విలియమ్స్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా సిలిండర్లను వినియోగించేవారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

ముందే సమాచారం.. సిలిండర్ల అక్రమ వినియోగంపై ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఆ సమాచారం ముందుగానే సంబంధిత వ్యాపార దుకాణదారుకు/హోటల్ యజమానికి చేరిపోతోంది. వారు అప్రమత్తమై సిలిండర్లను మార్చేస్తున్నారు. పౌరసరఫరాలు, విజిలెన్స్ అధికారులు తూతూమంత్రంగా తనిఖీలు చేస్తున్నారు.

వర్షాలతో పాపికొండల విహారయాత్రకు విరామం

దేవీపట్నం, వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: రుతుపవనాల ప్రభావంతోపాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. పాపికొండల విహారయాత్రను రెండు రోజులపాటు తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు జల వనరుల శాఖ ఏఈ భాస్కర్ తెలిపారు. ఈ క్రమంలో దేవీపట్నం మండలం పోశమ్మగండి, వీఆర్‌పురం మండలం పోచవరం రేవుల నుంచి పాపికొండల విహారయాత్రకు వెళ్లే పర్యాటక బోట్లు మొత్తం నిర్వాహకులు పూర్తిగా నిలిపివేశారు. వరద పెరుగుతున్న నేపథ్యంలో మత్స్యకారులను సైతం గోదావరిలోకి వేటకు వెళ్లరాదని అధికారులు సూచించారు. వర్షాలు తగ్గి వాతావరణం పూర్తిగా అనుకూలిస్తే విహారయాత్రను పునరుద్ధరిస్తామన్నారు.

పండాలి సార్వాంతంగా

జిల్లాలో వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. గోదావరి డెల్టా పరిధిలో సగటున రోజుకు వెయ్యి ఎకరాల్లో నాట్లు పడుతున్నాయి. కల్టివేటర్లు, రొటావేటర్లు, దమ్ము చక్రాలు తదితర యంత్ర పరికరాలతో పొలాలు దున్ని నాట్లుకు సిద్ధం చేస్తున్నారు. గతేడాదితో పోలిస్తే ఈఏడాది చాలా ముందుగా వర్షాలు పడటంతో 10-15 రోజుల ముందే ఖరీఫ్ (సార్వా) సాగు ప్రారంభమైంది. ఈ పరిణామం రైతులకు ఊరటనిస్తోంది.

ముందుగానే పొలం పనులు

పొలంలో వరి నాటుతున్న కూలీలు

ఈనాడు-ఏలూరు

సేద్యానికి సిద్ధంగా అవసరమైన ఎరువులను మార్క్‌ఫెడ్ అందుబాటులో ఉంచటం.. వ్యవసాయ యంత్ర పరికరాలను ముందుగానే పంపిణీ చేయటంతో సాగు పనులు ఊపందుకున్నాయి. గతేడాది ఆగస్టు 20 వరకు నాట్లు వేశారు. ఈసారి ఆ పరిస్థితి ఉండదని మెట్ట ప్రాంతాల్లో కూడా నెలాఖరు నాటికి పూర్తవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. సరిగ్గా కోతలు కోసే సమయంలో గతేడాది వరదలు, తుపాన్లు రావటంతో చేతికొచ్చిన పంట నష్టపోయి రైతులు ఇబ్బంది పడుతున్నారు. వాటన్నింటి నేపథ్యంలో. ఈసారి వ్యవసాయశాఖ కూడా ఓ పది రోజుల ముందుగానే ఖరీఫ్ సీజన్ ప్రారంభించేలా రైతులను సమాయత్తం చేసింది.

సరిపడగా నారు

జిల్లా వ్యాప్తంగా 2.22 లక్షల ఎకరాల్లో వరి సాగవుతోంది. దీనికి 11 వేల ఎకరాల్లో వరి నారుమడులు పోశారు. ఇది జిల్లాలో సాగుకు సరిపోతుంది. నారు కొరత కూడా రాదు. జులై రెండోవారానికి 50 ఎకరాల్లో నాట్లు పూర్తవుతాయని అధికారులు భావిస్తున్నారు.

✪ ఈసారి పశ్చిమబెంగాల్ నుంచి పెద్దఎత్తున వరి నాటేందుకు కూలీలను తీసుకొచ్చారు. ఒక ముఠా రోజుకు 10-12 ఎకరాల్లో నాట్లు వేస్తున్నారు. దీంతో ప్రస్తుతం గోదావరి డెల్టా పరిధిలోని ఏలూరు, దెందులూరు, భీమడోలు, గణపవరం, ఉంగుటూరు తదితర మండలాల్లో నాట్లు ఊపందుకున్నాయి.

✪ పెదపాడు ట్యాంకు, చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్ పరిధిలోనూ వారం, పది రోజుల్లో ప్రారంభించి నెలాఖరు కల్లా పూర్తి చేసేలా రైతులకు అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. నెలాఖరునాటికి నూరుశాతం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు.

✪ కైకలూరు, ముదినేపల్లి ప్రాంతాల్లో వెద పద్ధతిలో వరి పండిస్తారు. ఇక్కడ సుమారు 10 వేల ఎకరాలకు ఇప్పటికే 4 వేల ఎకరాల్లో విత్తనాలు చల్లారు.

✪ 'చాలా వరకు ప్రతి రైతు తన పొలంలో మడులు పోసుకోవటంతో వరి నారుకు కొరత లేకుండా పోయింది. ముమ్మరంగా నాట్లు పడుతున్నాయి' అని వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు హబీబ్ బాషా తెలిపారు.

మాట్లాడుతున్న వెట్రిసెల్వి, చిత్రంలో ఎంపీ మహేశ్ కుమార్, ఎమ్మెల్యేలు బడేటి చంటి, ప్రభాకర్ తదితరులు

జవాబుదారీతనంతో పనిచేయాలి : కలెక్టర్

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: వైద్య సిబ్బంది జవాబుదారీతనంతో పనిచేయాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి సూచించారు. జిల్లా సర్వజన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని బుధవారం కలెక్టరేట్‌లో నిర్వహించారు. కలెక్టర్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో ఎంపీ మహేశ్ కుమార్, ఏలూరు, దెందులూరు ఎమ్మెల్యేలు బడేటి చంటి, ప్రభాకర్ తదితరులు పాల్గొని వైద్యాధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సర్వజన ఆసుపత్రిలో ప్రధాన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అన్నారు. అల్ట్రా సౌండ్ స్కానింగ్, టూడీ ఎకో వంటి రేడియాలజీ విభాగంలో వైద్యులను నియమించాలన్నారు. ఎంపీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించేలా వైద్యాధికారులు పనిచేయాలని అన్నారు. ఆసుపత్రుల్లో అవసరమైన వైద్య సదుపాయాలు కల్పించేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. వైద్య సేవల్లో లోపం కారణంగా ఎవరూ మరణించకూడదన్నారు. ఏలూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా సర్వజన ఆసుపత్రిలో రోగులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు తాము పూర్తి సహకారాన్ని అందిస్తామని తెలిపారు. దెందులూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రసూతి విభాగంలో మరిన్ని మంచాలు పెంచాలని సూచించారు. అత్యవసర సమయంలో రోగులను విజయవాడ వంటి ప్రదేశాలకు తరలించేందుకు అవసరమైన అంబులెన్సులను ఏర్పాటు చేయాలని సూచించారు. తగినంతమంది వైద్యులను నియమించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సర్వజన ఆసుపత్రి పర్యవేక్షకుడు శశిధర్, డీసీహెచ్ఎస్ పాల్‌సతీశ్, డీఎంహెచ్‌వో మాలిని, జిల్లా రెడ్‌క్రాస్ సంస్థ ఛైర్మన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజీకాదగిన కేసులను గుర్తించాం

5న జాతీయ లోక్‌అదాలత్

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: కేసుల సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఈ నెల 5న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి అన్నారు. ఏలూరు కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాధికార సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇప్పటికే రాజీ కాదగిన కేసులు 4,633 గుర్తించామన్నారు. గత మార్చిలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 5 వేలకు పైగా వివిధ కేసులను పరిష్కరించగలిగామన్నారు. రాజీ రాజమార్గమని, కేసులు పరిష్కారమైతే కక్షిదారులిద్దరూ గెలిచినట్లేనన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ మాట్లాడుతూ లోక్‌అదాలత్‌కు జిల్లాలో 34 బెంచ్‌లు ఏర్పాటు చేశామని దూరప్రాంతాల నుంచి రాలేని కక్షిదారులు ఆన్‌లైన్ ద్వారా కూడా తమ కేసులను పరిష్కరించుకోవచ్చుని చెప్పారు. ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోనే సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

ప్రాజెక్టు స్పిల్‌వే గేట్ల నుంచి దిగువకు ప్రవహిస్తున్న వరద

గోదావరికి జలకళ

పోలవరం, న్యూస్‌టుడే: పోలవరం వద్ద బుధవారం తెల్లవారే సరికి గోదావరిలో నీరు రంగు మారడంతో పాటు ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి వడివడిగా దిగువకు ప్రవహిస్తోంది. స్పిల్‌వే వద్ద నీటిమట్టం 27.16 మీటర్లకు పెరిగింది. 48 గేట్ల నుంచి 1.06లక్షల క్యూసెక్కులు స్పిల్ ఛానల్ ద్వారా తిరిగి గోదావరిలోకి వెళ్తోంది. ప్రాజెక్టులో భారీ వాహనాల రాకపోకల కోసం 902 కొండ సమీపంలో మహానందీశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో స్పిల్‌ఛానల్‌లో వేసిన రహదారి నీటమునిగింది. నిన్నటి వరకు పోలవరం, గూటాల గ్రామాల మధ్యలో కనిపించిన ఇసుక తిన్నెలు క్రమేపీ నీటమునుగుతున్నాయి. పట్టిసీమ ఆలయానికి పడవపై నది దాటి ఇసుక తిన్నెలపై నడిచి వెళ్లే భక్తులకు వరద పెరిగి ఇసుక తిన్నెలు మునగడంతో నడక భారం తగ్గింది.

జలాశయాల్లో పెరుగుతున్న నీటిమట్టం

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి బుట్టాయగూడెం మండలం అలివేరు వద్ద గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయంలోకి నీరు వచ్చి చేరుతుండటంతో నీటిమట్టం పెరుగుతోంది. జలాశయ పూర్తిస్థాయి నీటిమట్టం 217.80 మీటర్లు కాగా, బుధవారం సాయంత్రానికి 210.60 మీటర్లు ఉంది. చింతలగూడెం సమీపాన ఉన్న పోగొండ జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 157 మీటర్లు కాగా, 156 మీటర్లకు చేరింది. ఇక్కడ సర్‌ప్లస్ వియర్‌పై నుంచి నీరు పొంగి పొర్లుతోంది. ప్రస్తుతం జలాశయాల్లో నీరు సాధారణ స్థితిలోనే ఉందని జలవనరుల శాఖ జేఈఈ సురేశ్ తెలిపారు.

పోగొండ జలాశయం వద్ద పొర్లుతున్న నీరు

ఉన్నత చదువులకు ఇదే తరుణం

చింతలపూడి, న్యూస్‌టుడే

విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో విద్యాలక్ష్మి పోర్టల్ ద్వారా కేంద్ర ప్రభుత్వం విద్యార్థులకు బ్యాంకుల నుంచి రుణాలు అందించేందుకు చర్యలు చేపట్టింది. స్థానిక బ్యాంకులు ఏటా విద్యా రుణాల లక్ష్యాలను పెంచుకుంటూ వెళ్తున్నాయి. విదేశాల్లో ఉన్నత విద్యాభ్యాసానికి రుణ సాయం అందజేస్తున్నాయి. జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, చింతలపూడి, నూజివీడు తదితర ప్రాంతాల్లో బ్యాంకర్లు రుణాలిచ్చేందుకు ఉత్సాహం చూపిస్తున్నాయి. ఎటువంటి పూచీకత్తు లేకపోయినా విదేశీ రుణం ఇచ్చేందుకు ముందుకు రావడం గమనార్హం.

బ్యాంకులు అందించే రుణ సాయం ఉన్నత చదువుకు సోపానంగా మారుతోంది. ఇంటర్ నుంచి పీజీ, పీహెచ్‌డీ వరకు విరివిగా రుణాలందించేందుకు బ్యాంకర్లు సిద్ధంగా ఉన్నారు. స్వదేశం.. విదేశాల్లో చదువుకు తోడ్పాటు అందించనున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బ్యాంకుల ద్వారా అందించే రుణ సాయాన్ని సద్వినియోగం చేసుకుని జిల్లాకు చెందిన ఎంతో మంది యువకులు తమ లక్ష్యాలను సాకారం చేసుకుంటున్నారు.

కోర్సులు... ✪ ఇంటర్మీడియట్, గ్రాడ్యుయేషన్, పోస్టు గ్రాడ్యుయేషన్, ఇంజినీరింగ్ మెడిసిన్, పీజీ డిప్లొమా ఇన్ ప్రొఫెషనల్ కోర్సెస్, ఛార్టర్డ్ ఎకౌంటెంట్, ఐఐఎం మేనేజ్‌మెంట్, ఐఐటీ, వృత్తి విద్యా కోర్సులకు రుణాలిస్తారు. ✪ యూజీసీ, ఏఐసీటీఈ, ఎంసీఐ, ఇతర ప్రభుత్వ అధీకృత సంస్థలు, విశ్వవిద్యాలయాల్లో చదువుకునే వారికే రుణాలందిస్తారు.

ఈ ఏడాది లక్ష్యం రూ.124 కోట్లు

అమలు ఇలా...

పేద, మధ్యతరగతి వర్గాలకు ఉన్నత విద్య చేరువ చేయాలనే సదుద్దేశంతో కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి విద్యాలక్ష్మి కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. కేంద్ర, ఆర్థిక, ఉన్నత విద్య, మానవ వనరుల అభివృద్ధి మంత్రిత్వ శాఖలు ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్‌లు(ఐబీఏ)లు సంయుక్తంగా విద్యాలక్ష్మి పోర్టల్‌ను రూపొందించాయి. ఇందులో 38 బ్యాంకులు నమోదై ఉన్నాయి. 86 రకాల విద్యా రుణాలను అందిస్తున్నాయి. గత ఆర్థిక సంవత్సరం జిల్లాలో రూ.91 కోట్లు లక్ష్యంగా పెట్టుకోగా రూ.117 కోట్లు రుణాలిచ్చాయి. ఈ ఆర్థిక సంవత్సరం రూ.124 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు.

విద్యాలక్ష్మి పోర్టల్

దరఖాస్తు ఇలా...

మూడు పద్ధతుల్లో విద్యా రుణానికి దరఖాస్తు చేయొచ్చు. తొలుత విద్యాలక్ష్మి పోర్టల్‌లో నమోదవ్వాలి. దరఖాస్తు పూరించాలి. చివరగా బ్యాంకుల్ని ఎంపిక చేసుకోవాలి. ఒకేసారి గరిష్ఠంగా మూడు వేర్వేరు బ్యాంకుల్ని ఎంపిక చేసుకోవచ్చు. ఈ ప్రక్రియ పూర్తయితే రుణానికి సంబంధించిన వివరాలు చరవాణి, ఈ- మెయిల్‌కి వస్తాయి.

లక్ష్యానికి పైగా ఇచ్చాం : ఉన్నత విద్య అభ్యసించాలనుకునే ఔత్సాహిక విద్యార్థులకు బ్యాంకులు విద్యారుణం ఇచ్చేందుకు ముందుకు వస్తున్నాయి. గతేడాది లక్ష్యానికి పైగా రుణాలిచ్చాం. ఈ ఏడాది రూ.124 కోట్లు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. **-నీలాద్రి, లీడ్ బ్యాంకు మేనేజర్**

హమ్మయ్య.. గోతులు పూడ్చారు..

అడగలేం.. అడుగేయలేం.. శీర్షికతో జూన్ 25న 'ఈనాడు' జిల్లా సంచికలో ప్రచురితమైన చిత్ర కథనానికి అధికారులు స్పందించారు. ఏలూరు సైన్స్ పార్కు రోడ్డు గోతులమయమై అధ్వానంగా ఉండేది. చిన్నపాటి వర్షానికే మడుగును తలపించేది. ఈ మార్గంలోనే సాంఘిక సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాలున్నాయి. నిత్యం వందలాది మంది విద్యార్థులు బురద నీటిలోనే రాకపోకలు సాగించేవారు. నగర పాలక సంస్థ కమిషనర్ భానుప్రతాప్ ఆదేశాల మేరకు తాత్కాలికంగా గోతులను పూడ్చారు. అవస్థలు వీడటంతో విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. **- ఈనాడు, ఏలూరు.**

వర్జీనియా పొగాకు ధర రూ.10 పెరుగుదల

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: వర్జీనియా పొగాకు ధరల్లో కదలిక మొదలైంది. బుధవారం ఎన్ఎల్ఎస్‌లోని జంగారెడ్డిగూడెంలోని ఒకటి, రెండు వేలం కేంద్రాలు, కొయ్యలగూడెం, దేవరపల్లి కేంద్రాల్లో జరిగిన వేలంలో మేలు రకం పొగాకు కేజీకి రూ.10 చొప్పున ధర పెరిగింది. దీంతో గరిష్ఠ ధర రూ.310కి చేరింది. ప్రారంభం నుంచి గత వారం వరకు రూ.290కే కొన్నారు. మేలు రకం పొగాకుకు క్రమంగా రూ.20 పెంచడంతో రూ.310కి చేరింది. అయితే తక్కువ గ్రేడు పొగాకు ధరలు ఒక పక్క తగ్గుతున్నాయి. ఈ రకం పొగాకు కనిష్ఠ ధర రెండు వారాల కిందటి వరకు రూ.220 ఉండగా.. అది ప్రస్తుతం రూ.200కు పడిపోయింది. దీంతో మేలు రకానికి రూ.20 పెరిగితే అంతే మొత్తం తక్కువ గ్రేడ్ పొగాకు తగ్గించడంపై రైతులు పెదవి విరుస్తున్నారు.

ప్రత్యేక రైళ్ల సేవల పొడిగింపు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ప్రత్యేక రైళ్ల సేవలను పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి - నరసాపూర్ - 07131 ప్రత్యేక రైలు ఆగస్టు 3 నుంచి వచ్చే ఏడాది మార్చి 9 వరకు ప్రతి ఆదివారం పయనిస్తుందని అన్నారు. నరసాపూర్-తిరుపతి- 07132 ప్రత్యేక రైలు ఆగస్టు 4 నుంచి వచ్చే ఏడాది మార్చి 30 వరకు ప్రతి సోమవారం నడుస్తుందని వెల్లడించారు.

94.49 ఎకరాల్లో అప్పా నిర్మాణానికి సన్నాహాలు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: అత్యాధునిక సాంకేతిక హంగులు, అన్ని వసతులతో దేశంలోనే మోడల్ పోలీస్ అకాడమీ నిర్మిస్తామని ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం నూగొండపల్లి, పిన్నమరెడ్డిపల్లి గ్రామాల పరిధిలో ఏపీ పోలీస్ అకాడమీ కేంద్రం నిర్మాణ ప్రతిపాదిత ప్రాంతాన్ని డీజీపీ బుధవారం పరిశీలించారు. అప్పా నిర్మాణ ప్రాంతాన్ని మ్యాప్, వీడియో, చిత్రాల ద్వారా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్, తహసీల్దారు పీఎన్వీ ప్రసాద్‌లు డీజీపీకి వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ... 94.49 ఎకరాల్లో ఏపీ పోలీస్ అకాడమీ కేంద్రం నిర్మించేందుకు సన్నాహాలు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు డీజీపీ మధుసూదన రెడ్డి, ఐజీలు జి.వి.జి.అశోక్ కుమార్, ఎం.రవి ప్రకాశ్, డీఐజీ సత్య ఏసుబాబు, సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, డీఎస్పీ కేవీవీఎన్వీ ప్రసాద్, సీఐ కె.రామకృష్ణ, ఎస్సై కె.శుభశేఖర్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, అదనపు డీజీపీ, ఐజీ, ఎస్పీ తదితరులు

కలిసి కట్టుగా.. ఒకటే జట్టుగా | జాతీయ రహదారిపై లారీల బీభత్సం | 8లో మిత్రుడే ఉసురు తీశాడు!

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 80080 12494

(c) eenadu

కలిసి కట్టుగా.. ఒకటే జట్టుగా

ఆదర్శంగా లంక గ్రామాలు

కైకలూరు, మండవల్లి, న్యూస్‌టుడే: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కొల్లేరు తీరంలోని గ్రామాలు అందంగా తయారవుతున్నాయి. ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా అభివృద్ధిలో ముందుంటూ ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. గ్రామస్థుల సమష్టి కృషితో మౌలిక వసతుల కల్పన, వాటి నిర్వహణలో ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. అవసరాన్ని గుర్తించి.. ప్రణాళిక సిద్ధం చేసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు. ఆయా గ్రామాల్లోని పారిశుద్ధ్యం, రోడ్లు, కమ్యూనిటీ భవనాలు, పాఠశాలల అభివృద్ధి అంతా గ్రామస్థులే పూర్తి బాధ్యతను తీసుకుంటారు.

కట్టుబాట్లతో ప్రగతి బాట

కొల్లేరు ప్రాంతంలోని గ్రామాల్లో ఒకే సామాజిక వర్గానికి చెందిన ప్రజలు అధికంగా నివశిస్తుంటారు. వీరంతా బంటాలు(జట్లు)గా ఏర్పడి ఏటా కొంతమంది పెద్దలను ఎన్నుకుంటారు. ఈ పెద్దలు తీసుకున్న నిర్ణయాలను ప్రతి ఒక్కరు గౌరవించాల్సిందే. గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయాలన్నా ముందు రోజే మైక్ ద్వారా బంటాకు కొంత మంది వచ్చి పనులు చేయాలని ఆదేశిస్తారు. దీంతో రెండో రోజు పనులన్నీ పూర్తయిపోతాయి.

ఇంగిలిపాకలంక

ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత...

సాధారణంగా కొల్లేరులో దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. ఇంగిలిపాకలంక గ్రామస్థులు దోమల పెరుగుదలకు మురుగే ప్రధాన కారణంగా 30 ఏళ్ల క్రితమే తెలుసుకున్నారు. గ్రామంలో ఎక్కడ మురుగు ఉండకూడదని నిర్ణయం తీసుకున్నారు. ప్రతి ఇంట్లో ఓ ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకున్నారు. ఇంట్లో వాడే ప్రతి నీటి బొట్టు, వర్షం నీరు సైతం అందులోకి వెళ్లాల్సిందే. వారికి తెలియకుండానే భూగర్భ జలాల్ని రీఛార్జి చేస్తున్నారు. దీంతోపాటు పాఠశాల అభివృద్ధి, ఆలయాల నిర్మాణాలు సైతం గ్రామస్థుల నిధులతోనే జరుగుతున్నాయి.

పాఠశాల అభివృద్ధిలో చింతపాడు కీలకం..

చింతపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల అభివృద్ధిలో కీలకంగా గ్రామస్థులు వ్యవహరిస్తున్నారు. విద్యార్థులకు తాగు, వాడుక నీటి సమస్యను పరిష్కరించేందుకు శాశ్వత ప్రాతిపదికన రూ.4 లక్షలతో ట్యాంక్‌ను ఏర్పాటు చేసి ప్రతి రెండు నెలలకు 30 ట్యాంకర్ల నీటిని నిల్వ చేస్తుంటారు. పాఠశాలలో రహదారుల నిర్మాణం, విద్యార్థులకు అన్ని అవసరాలను గ్రామస్థులే తీర్చుతుంటారు. ఆగస్టు 15, జనవరి 26 వేడుకలను ఎంతో వైభవంగా నిర్వహిస్తూ దేశభక్తిని చాటుకుంటున్నారు. గ్రామంలోని కమ్యూనిటీ హాలు, వివేకానందుడి విగ్రహం, ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణంతో పాటు అన్ని రహదారులు సీసీ రోడ్లుగా మార్చుకున్నారు.

గ్రామంలో నిర్మించుకున్న సీసీ రోడ్డు

గ్రామ స్వరాజ్యానికి ఆదర్శం చటాకాయ

మహాత్ముడు కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి నిలువెత్తు నిదర్శనం చటాకాయ గ్రామం. ఐక్యతతో గ్రామస్థులు ముందుకు సాగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్ని నిధులను సద్వినియోగం చేసుకుని రెండు సార్లు ఆదర్శ గ్రామంగా నిర్మల్ పురస్కారాన్ని పొందారు. ప్రతి వీధిలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణంతో పాటు మంచినీటి చెరువులు ఏర్పాటు చేసుకున్నారు. పారిశుద్ధ్య రహిత గ్రామమంటే ముందు గుర్తొచ్చేది చటాకాయ మాత్రమే. రెండు దశాబ్దాల కిందటే వీధుల్లో ఎవరూ చెత్త వేయరాదనే నిబంధన విధించారు. పశువులు సీసీ రోడ్లపై పేడ వేసినా.. మూత్రం పోసినా వాటి యజమానులకు అపరాధ రుసుం చెల్లించేలా హుకుం జారీ చేశారు. నూరుశాతం వ్యక్తిగత మరుగుదొడ్లు కలిగిన ఏకైక గ్రామం కూడా ఇదే.

నేడు మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ పర్యటన

ఏలూరు కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ రాయపాటి శైలజ ఈ నెల 3న జిల్లాలో పర్యటించనున్నారు. ఆమె ఉదయం 11 గంటలకు హనుమాన్ జంక్షన్ చేరుకుని శక్తి సదన్ సందర్శిస్తారు. 11.30 గంటలకు ముసునూరు వెళ్తారు. స్థానిక గురుకుల పాఠశాలను పరిశీలిస్తారు. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం 1 గంటకు ముసునూరు నుంచి బయలుదేరి ఏలూరు చేరుకుంటారు. వన్ స్టాప్ కేంద్రాన్ని, వర్కింగ్ ఉమెన్స్ హాస్టల్‌ను సందర్శిస్తారు. మధ్యాహ్నం 3.30 గంటలకు దెందులూరు చేరుకుని బాలసదనాన్ని సందర్శిస్తారు. సాయంత్రం 4.30 గంటలకు బయలుదేరి తాడేపల్లి వెళ్తారు.

విద్యుత్తు అంతరాయం లేకుండా చర్యలు : కలెక్టర్

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా సిబ్బంది నిరంతరం పర్యవేక్షించేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి ఆ శాఖ ఎస్ఈ సాల్మన్‌రాజును ఆదేశించారు. విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని, సరఫరా అంతరాయం లేకుండా చూడాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని మండల స్థాయి అధికారుల ఫోన్ నంబర్లు అందరికీ అందుబాటులో ఉంచాలని ఏవైనా సమస్యలుంటే వారిని సంప్రదించాలన్నారు. ఫోను చేసినప్పుడు సిబ్బంది స్పందించకపోయినా సమస్యలు పరిష్కరించకపోయినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పుణ్యక్షేత్ర యాత్రలకు అవకాశం

ఆర్టీసీ ప్రత్యేక బస్సుల సదుపాయం

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ప్రత్యేక రోజుల్లో ప్రముఖ దేవాలయాలను సందర్శించుకునే అవకాశం ఆర్టీసీ యాజమాన్యం కల్పిస్తోంది. ప్రస్తుత ఆషాఢ మాసంతోపాటు రాబోయే శ్రావణ మాసంలోనూ రాష్ట్రంలోని పలు పుణ్యక్షేత్రాలకు ప్రత్యేక బస్సుల సదుపాయాన్ని జిల్లా అధికారులు కల్పించారు.

గురుపౌర్ణమి సందర్భంగా..

అరుణాచలం క్షేత్రానికి వెళ్లి శివుడిని దర్శించుకోవడంతోపాటు గిరి ప్రదక్షిణ చేయడం వల్ల ఎంతో పుణ్యఫలం కలుగుతుందని ప్రతీతి. గురుపౌర్ణమి సందర్భంగా ఆ క్షేత్రాన్ని సందర్శించుకునేలా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేశారు. జిల్లాలోని ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డిపోల నుంచి ఈ నెల 8వ తేదీ సాయంత్రం 6 గంటలకు ప్రత్యేక బస్సులు బయలుదేరతాయి. 9వ తేదీన శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం దర్శనం అనంతరం అదేరోజు రాత్రికి అరుణాచలం చేరుకుంటాయి. 10వ తేదీ ఉదయం గిరిప్రదక్షిణ అనంతరం కంచి కామాక్షి అమ్మవారి దర్శనం చేసుకుని తిరిగి ఆయా డిపోలకు చేరుకుంటాయి. ఈ బస్సుల్లో ప్రయాణానికి టికెట్ ధర ఒక్కొక్కరికీ రూ.3 వేలుగా నిర్ణయించారు. మిగిలిన ఖర్చులను ప్రయాణికులే భరించుకోవాల్సి ఉంటుందని జిల్లా ప్రజా రవాణా అధికారిణి షేక్ షబ్నం తెలిపారు.

సప్తమాతృక దర్శనం

ఆషాఢం, శ్రావణ మాసాల్లో సప్తమాతృక దర్శనానికి ఆర్టీసీ యాజమాన్యం అవకాశం కల్పించింది. ప్రతి ఆదివారం ప్రత్యేక బస్సులు నడిపేలా టూర్ ప్యాకేజీని రూపొందించారు. ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డిపోల నుంచి ప్రతి ఆదివారం తెల్లవారుజామున 4, 5 గంటలకు బయలుదేరతాయి. కొల్లేటి కోట పెద్దింట్లమ్మ, భీమవరం మావుళ్లమ్మ, పెనుగొండ వాసవీ మాత, పిఠాపురం కోటసత్తెమ్మ, ద్రాక్షారామం దాక్షాయణి, పిఠాపురం పురుహూతికా మాత-అష్టాదశ పీఠం, పెద్దాపురం మరిడమ్మ దర్శనానంతరం ఆయా డిపోలకు చేరుకుంటాయి. ఈ బస్సుల్లో ప్రయాణానికి టికెట్ ధర రూ.800 నిర్ణయించారు.

★ ఏదైనా ఒక ఊరి నుంచి కనీసం 36 మంది ఆయా పుణ్యక్షేత్రాలకు వెళ్లాలనుకుంటే వారికి ప్రత్యేకంగా బస్సును ఏర్పాటు చేస్తారు. ఈ బస్సుల్లో ప్రయాణానికి ఆన్‌లైన్ ద్వారా ముందుగానే apsrtconline.in వెబ్‌సైట్ ద్వారా టికెట్లను బుక్ చేసుకోవచ్చు.

డిపోల వారీగా చరవాణుల సంఖ్యలు	
ఏలూరు: 93467 67670, రిజర్వేషన్ కౌంటరు: 63038 59484	
నూజివీడు: 73829 01757	జంగారెడ్డిగూడెం: 94910 19105

తడిసి ముద్దయిన మన్యం

రికార్డు స్థాయిలో వాన

కుక్కునూరు, వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆవర్తనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలు జిల్లాలోని మన్యం ప్రాంతాన్ని తడిసి ముద్ద చేశాయి. మూడ్రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం మంగళవారం రాత్రి కుంభవృష్టికి దారితీసింది. మంగళవారం ఉదయం 7 నుంచి బుధవారం ఉదయం 7 గంటల వరకు నమోదయిన వర్షపాతం వివరాలు.. వేలేరుపాడు మండలంలో రికార్డు స్థాయిలో 103.2 మి.మీ. కురిసింది. కుక్కునూరు మండలంలో 82.0 మి.మీ నమోదయింది. వర్షాకాలం ప్రారంభం అయ్యాక కురిసిన అతి భారీ వర్షం ఇదే. పోలవరం, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, టి.నరసాపురం మండలాల్లోనూ భారీ వర్షం కురిసింది. గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. వేలేరుపాడు మండలంలోని పెదవాగు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. కుక్కునూరు మండలంలోని గుండేటి వాగు, రాళ్లవాగు, పాలవాగు, పాములేరు, కిన్నెరసాని వరద ప్రవాహంతో పోటెత్తాయి.

వర్షపాతం వివరాలిలా..	
మండలం	నమోదు (మి.మీ.లలో)
వేలేరుపాడు	103.2
కుక్కునూరు	82.0
పోలవరం	28.4
కొయ్యలగూడెం	25.6
బుట్టాయగూడెం	17.4
జంగారెడ్డిగూడెం	16.6

ఉద్ధృతంగా ప్రవహిస్తున్న పెదవాగు

పెరిగిన ప్రవాహం..

గోదావరి ఎగువ ప్రాంతంలో భారీగా వర్షాలు కురుస్తుండటంతో గోదావరిలో ప్రవాహం పెరుగుతోంది. నిన్నమొన్నటి వరకు 8 అడుగుల వరకు ఉన్న నీటిమట్టం బుధవారం 12 అడుగులకు చేరింది. ఇది మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గోదావరి తీర ప్రాంతంలో భారీవర్షాలు కురుస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. [illegible] ప్రాంతాల్లో పరిస్థితులను పరిశీలిస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో ముందుగా మరుగుదొడ్ల ఏర్పాటు చేయాలనే కలెక్టర్ ఆదేశాలతో ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రస్తుతం ప్రమాదకర పరిస్థితి లేనప్పటికీ, వర్షాల ప్రభావం మరింత పెరిగితే నదికి వరద పోటెత్తుతుంది.

సెలవులకు నిబంధనలు సవరించాలి: పీఆర్‌టీయూ

ఏలూరు విద్య విభాగం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయుల సెలవులకు నిబంధనలు సవరించాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పి.అంజనేయులు కోరారు. ఈ మేరకు డీఈవో ఎం.వెంకటలక్ష్మమ్మకు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ [illegible] బదిలీ అయి రిలీవర్ లేనందున పాత స్థానాల్లో కొనసాగుతున్న వివిధ కేడర్ల ఉపాధ్యాయులను ప్రత్యామ్నాయ విధానాలతో వెంటనే రిలీవ్ చేయాలని కోరారు. ప్రభుత్వ బడుల్లో కొత్తగా ప్రవేశాలు పొందిన విద్యార్థులకు రాత పుస్తకాలతోపాటు విద్యార్థి కిట్లను అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

డీఈవోకు వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర కల్పించాలి

కొండలరావుపాలెం (పెదవేగి), న్యూస్‌టుడే: కోకో రైతుల వద్ద ఉన్న కోకో గింజలకు అంతర్జాతీయ మార్కెట్ ధర కల్పించాలని ఏపీ కోకో రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొల్లు రామకృష్ణ ప్రభుత్వాన్ని కోరారు. పెదవేగి మండలం కొండలరావుపాలెంలో ఏపీ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో కోకో రైతులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జులై 15వ తేదీ వరకు రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రూ.50 ప్రోత్సాహకంతో రూ.500 ధర వచ్చేలా కంపెనీలను ఆదేశించాలని కోరారు. రైతులు ఇబ్బందులు పడకుండా గింజల కొనుగోలుకు చర్యలు చేపట్టాలని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ కోరారు. కోకో గింజలను రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సంఘీభావం తెలుపుతున్న రైతు సంఘాల నాయకులు

డెంగీ జ్వరాలపై అప్రమత్తం చేద్దాం : డీఎంహెచ్‌వో

ప్రదర్శనలో పాల్గొన్న మాలిని, అధికారులు, సిబ్బంది

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: డెంగీ జ్వరాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తం కావాలని డీఎంహెచ్‌వో మాలిని అన్నారు. జాతీయ డెంగీ వ్యతిరేక మాసోత్సవం ప్రారంభమైన నేపథ్యంలో బుధవారం అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. స్థానిక డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి నిర్వహించిన ప్రదర్శనను డీఎంహెచ్‌వో మాలిని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగీ జ్వరాలకు గురికాకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలన్నారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని ఇంటి పరిసరాల్లో, ఇంటి లోపల నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని చెప్పారు. జిల్లా మలేరియా అధికారి ప్రసాద్, ఇమ్యునైజేషన్ అధికారి శోభ, పరిపాలనా అధికారి గంగాభవానీ, అసిస్టెంట్ మలేరియా అధికారి గోవిందరావు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉన్నత ఉద్యోగ సాధనకు కృషి చేయండి

విద్యార్థినికి ప్రవేశ పత్రాన్ని అందిస్తున్న డైరెక్టర్ బాలాజీ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో సీటు సాధించిన విద్యార్థులు తరగతులు ప్రారంభం అయిన నాటి నుంచే ఉన్నతమైన ఉద్యోగ సాధనకు కృషి చేయాలని శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ఆచార్య కేవీజీడీ బాలాజీ సూచించారు. బుధవారం నూజివీడు ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో శ్రీకాకుళం క్యాంపస్‌కు చెందిన విద్యార్థులకు ప్రవేశాల ప్రక్రియను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. సీట్లు సాధించిన విద్యార్థులకు ప్రవేశ పత్రాలను అందించారు. మొత్తం 517 మంది విద్యార్థులను పిలవగా 437 మంది చేరారు. వీరిలో బాలురు 127 మంది ఉండగా బాలికలు 310 మంది కావడం గమనార్హం. ఏవో సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి సదరం స్లాట్ బుకింగ్

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: విభిన్న ప్రతిభావంతులకు వైకల్య నిర్ధారణకు బుధవారం నుంచి సదరం స్లాట్ బుకింగ్ ప్రారంభించనున్నట్లు జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయ అధికారి పాల్ సతీశ్ ఒక ప్రకటనలో తెలిపారు. జులై నుంచి సెప్టెంబరు వరకు మూడు నెలలకు గ్రామ, వార్డు సచివాలయాలు, మీ సేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవచ్చునన్నారు. మంగళవారం ఏలూరులోని జిల్లా ప్రధాన ఆసుపత్రిలో శారీరక, మానసిక, బధిరులు, దృష్టి వైకల్యం ఉన్న వారికి.. నూజివీడులోని ఏరియా ఆసుపత్రిలో శారీరక, దృష్టి వైకల్యం వారికి.. సోమవారం కైకలూరు సీహెచ్‌సీలో శారీరక వైకల్యం, జంగారెడ్డిగూడెంలోని ఏరియా ఆసుపత్రిలో శారీరక, దృష్టి వైకల్యం వారికి సదరం ధ్రువ పత్రాల జారీకి స్లాట్ నమోదు చేసుకోవచ్చని తెలిపారు.

జాతీయ రహదారిపై లారీల బీభత్సం

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- పదుల సంఖ్యలో ద్విచక్రవాహనాలు ధ్వంసం

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: దేవరపల్లి- తల్లాడ జాతీయ రహదారిపై జంగారెడ్డిగూడెం మండలం వేగవరం వద్ద బుధవారం రెండు లారీలు బీభత్సం సృష్టించాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నుంచి విశాఖపట్నానికి సిమెంటు లోడుతో వెళ్తున్న లారీని.. వేగవరం గ్రామ ప్రధాన సెంటర్ వద్ద ముంబాయి నుంచి రాజమహేంద్రవరం పేపరులోడుతో వెళ్తున్న బలంగా ఢీకొట్టింది. దీంతో ముందు వెళ్తున్న లారీ రోడ్డుపై పలు కార్లను ఢీకొట్టుకుంటూ ఎడమ చేతి వైపు దుకాణాల్లోకి దూసుకుపోయింది. అదే సమయంలో వెనుక లారీ సైతం రహదారిపై కుడిచేతి వైపు ఉన్న దుకాణాల్లోకి దూసుకువెళ్లింది. ఈ ఘటనలో లారీ చోదకుడు పవన్న పిన్నెబాయ్, రోడ్డు పక్కన నిలుచున్న వ్యక్తి కొప్పర్తి నాగేంద్రబాబుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న జంగారెడ్డిగూడెం సీఐ సుభాష్ ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను పోలీసు వాహనంలో జంగారెడ్డిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించారు. ప్రమాదంలో రోడ్డు పక్కన నిలుపుదల చేసిన పదుల సంఖ్యలో ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. అనంతరం రహదారికి ఇరువైపులా దుకాణాలు ముందుకు వచ్చేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆక్రమణలను తొలగించాలని గ్రామస్థులు జాతీయ రహదారిపై బైఠాయించి నినాదాలు చేశారు. సీఐ వారితో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు.

ఫ్యాన్సీ దుకాణంలోకి దూసుకెళ్లిన లారీ

చక్రాల కింద ద్విచక్రవాహనాలు

కొంటాం.. అడ్డంగా తింటాం

తూకంలో మోసం చేస్తున్న ట్రేడర్లు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: హఠాత్తుగా క్షీణిస్తున్న ధరలు, విజృంభిస్తున్న వ్యాధులతో ఆక్వా రైతులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోతున్నారు. ఇది చాలదన్నట్లు రొయ్యల పట్టుబడి పట్టాక తూకం వేసే సమయంలో కొందరు ట్రేడర్లకు చెందిన ఏజెంట్లు మోసగిస్తున్నారు. ప్రతి కిలోకు 60 గ్రాములు తగ్గేలా కాటా యంత్రంలో మార్పులు చేస్తున్నారు. దానివల్ల ధర తగ్గిపోవడంతో పాటు కౌంట్లు వారీగా తీవ్ర నష్టం కలుగుతుంది. టన్నుకు 60 కిలోల నష్టం వాటిల్లుతోంది. మొత్తం మీద రూ.40 వేలు కోల్పోతున్నామని రైతులు వాపోతున్నారు. ఇదే అంశంపై రొయ్య రైతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం గొల్లలకోడేరులో సమావేశమయ్యారు. సాంకేతిక నిపుణుడితో కాటాలో మోసం ఎలా చేస్తున్నారో ప్రయోగాత్మకంగా రైతులకు చూపించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, ఆక్వా రైతులు మళ్ల తులసీరాం, వీరవల్లి చంద్రశేఖర్, నాని, వర్మ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న రొయ్యల రైతులు

మోసాలపై దృష్టి పెట్టాలి.. ప్రభుత్వం మోసాలపై తక్షణం దృష్టి సారించాలి. బాధ్యులైన వారిని చట్టపరంగా శిక్షించాలి. 20 సెకన్ల వ్యవధిలో కాటాలో మార్పులు చేయగలుగుతున్నారు. అది కూడా రైతు దృష్టిని మరల్చి అతని కాటాలో ఆ విధంగా చేయడం సైబర్ నేరం కింద మేము భావిస్తున్నాం. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి సాగులో నిత్యం ఎంతో ఒత్తిడికి గురవుతూ ఆర్థికంగా నష్టపోతున్నాం.

- గజపతిరాజు, జీకేఎస్ సుబ్బరాజు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిల్లా రొయ్య రైతుల సంక్షేమ సంఘం

☛ ఇటీవల కైకలూరులో ఓ రైతులు ఈ తరహా మోసాన్ని గ్రహించి నిలదీస్తే సంబంధిత ట్రేడర్లు ఈ తప్పు ఏజెంట్ల వల్ల జరిగిందని చెప్పి బాధిత రైతుకు రూ.15 లక్షలు నష్ట పరిహారంగా చెల్లించారు. ఈ విషయం బయటకు రాని వ్వొద్దని కోరారు.

☛ కొన్ని రోజుల కిందట అమలాపురంలోనూ ఇలాంటివి ఎక్కువగా జరిగాయి. ఇటీవల పాలకొల్లు పరిధిలో ఈ తరహా మోసం జరిగింది. ఇలాంటివి జరిగినప్పుడు వారిచ్చే పరిహారం తీసుకుని సాగుదారులు మౌనంగా ఉండొద్దు. విషయాన్ని బయట పెట్టాలి.

అనధికార మద్యం కొనుగోలు చేయొద్దు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: అనధికారికంగా ఎవరైనా మద్యం అమ్మితే కొనుగోలు చేయవద్దని లైసెన్సు కలిగిన మద్యం దుకాణాల వద్దే కొనుగోలు చేయాలని ఏలూరు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆవులయ్య ఓ ప్రకటనలో తెలిపారు. అనధికారికంగా మద్యం కొనుగోలు చేయటం ప్రమాదమని, నకిలీ మద్యం ఇచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. వివాహాలు, వేడుకలు తదితర కార్యక్రమాలకు మద్యం తక్కువ ధరలకు సరఫరా చేస్తామని ఎవరైనా చెబితే నమ్మవద్దని అది నకిలీ మద్యం కావొచ్చన్నారు.. అలాంటి వారి వివరాలు ఉంటే టోల్ ఫ్రీ నెంబర్ 14405, 9440902425 కు తెలియజేయాలన్నారు.

మిత్రుడే ఉసురు తీశాడు!

హత్య కేసులో నిందితుడి అరెస్టు

నరసాపురం, న్యూస్‌టుడే: కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటనపై నమోదు చేసిన కేసులో పోలీసులు వివిధ కోణాల్లో దర్యాప్తు చేసి అతడు హత్యకు గురైనట్లు నిర్ధారించారు. ఈ కేసులో కీలక ఆధారాలు సేకరించి నిందితుడిని అరెస్టు చేశారు. నరసాపురం పట్టణంలోని ఎస్‌డీపీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అద్నాన్ నయీంఅస్మి ఈ వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది జనవరి 27న నరసాపురం మండలం కొప్పర్రు సమీపాన జిన్నూరు కాలువలో గుర్తించలేని స్థితికి చేరిన మృతదేహం ఉన్నట్లు వీఆర్వో పోలీసులకు పిర్యాదు చేశారు. దీనిపై నరసాపురం గ్రామీణ పోలీస్‌స్టేషన్లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో నమోదైన అదృశ్యం కేసులపై ఆరా తీసి మృతుడిని పెరవలి మండలం నడిపల్లి గ్రామానికి చెందిన చుక్కల శ్రీనివాస్‌గా ప్రాథమికంగా గుర్తించారు. శవ పంచనామాలో మృతదేహం నుంచి నమూనాలు సేకరించి పరీక్షలు చేయించగా అతడి తల్లి డీఎన్ఏతో సరిపోలినట్లు ఎస్పీ తెలిపారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

చంపి.. కాలువలో పడేసి..

మృతుడిని గుర్తించాక లోతుగా దర్యాప్తు చేయడంతో అతడు హత్యకు గురైనట్లు తేలింది. మృతుడు చుక్కల శ్రీనివాస్, పెరవలి మండలం కాకరపర్రు గ్రామానికి చెందిన పూల వ్యాపారి మల్లిపూడి శ్రీనివాస్‌లు మిత్రులు. రాజమహేంద్రవరంలో డీఎస్సీ కోచింగ్‌కు వెళ్లే అంశంపై వారి మధ్య జనవరి 3న వాగ్వాదం చోటు చేసుకుని ఘర్షణకు దారి తీసింది. ఈ క్రమంలో పెరవలి వద్ద మల్లిపూడి శ్రీనివాస్ తన మిత్రుడిని బీరు సీసా ముక్కతో కడుపులో పొడిచి హతమార్చాడు. తరువాత మృతదేహంపై దుస్తులు తొలగించి కాళ్లు, చేతులు తాళ్లతో కట్టి పెరవలి కాలువలో పడేశాడు. ప్రవాహ ఉద్ధృతితో మృతదేహం జిన్నూరు కాలువలోకి చేరింది. సాంకేతిక ఆధారాల ద్వారా దర్యాప్తు చేయడంతో నిందితుడు పట్టుబడినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించేందుకు కృషి చేసిన అదనపు ఎస్పీ వి.భీమారావు, డీఎస్పీ జి.శ్రీవేద అరవింద, సీఐ జి.దుర్గాప్రసాద్, ఎస్సైలు టీవీ సురేశ్, బి.సురేంద్రకుమార్, కె.సుధాకరరెడ్డి, కె.వెంకటరమణ, హెచ్‌సీ ఆర్.వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు.

భూముల పరిశీలన

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు ఐటీడీఏ పరిధిలో పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు సేకరించేందుకు బుట్టాయగూడెం మండలంలో రెడ్డిగణపవరం, సూరప్పవారిగూడెం గ్రామాల్లో గుర్తించిన భూములను రెవెన్యూ అధికారులు బుధవారం పరిశీలించారు. చింతూరు ప్రత్యేక ఉప కలెక్టర్ కె.ఆంజనేయులు, బుట్టాయగూడెం తహసీల్దారు పీవీ చలపతిరావు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా) (కిలో 1 కి రూ.ల్లో)
వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -93 రిటైల్ ధర 115 చికెన్ విత్ స్కిన్ - 167, చికెన్ స్కిన్‌లెస్ - 190.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 100, 108, 119 చికెన్ విత్ స్కిన్ - 190 చికెన్ స్కిన్‌లెస్ - 200.

ICUB
ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
ప్రధాన కార్యాలయము : గాంధీ బొమ్మ దగ్గర, జాంపేట, రాజమహేంద్రవరం

బహిరంగ వేలం నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8 (6) నిబంధనలతో చదవబడు
SARFAESI యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకమునకు వేలం ప్రకటన

ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి., వారికి దిగువ తెలిపిన ఋణగ్రహీతలు/హామీదారులు చెల్లించవలసిన బకాయి మొత్తమును రాబట్టుకొనుటకు ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి., అధీకృత అధికారిచే భౌతికంగా స్వాధీనం చేసుకున్న బ్యాంకునకు తాకట్టు పెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తులను "ఎక్కడ ఎలా ఉన్నది అక్కడ అలా" అనే ప్రాతిపదికన SARFAESI చట్టం 2002 లోని సెక్షన్ 13 క్రింద ఇవ్వబడిన అధికారాలను వినియోగించి బహిరంగ వేలం ద్వారా విక్రయించబడునని యావన్మంది ప్రజానీకానికి మరియు ముఖ్యంగా దిగువ తెలిపిన ఋణగ్రహీతలు మరియు హామీదారులకు ఇందుమూలముగా తెలియజేయడమైనది.

బహిరంగ వేలం తేది & సమయము : తేది: 14-08-2025, సమయము: సా. 4.00 గం. లకు,
ప్రదేశము : ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి, ఏలూరు బ్రాంచి, ఏలూరు.

ఆసక్తి గలవారు రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును ఆర్.టి.జి.ఎస్/నెఫ్ట్/ఫండ్ ట్రాన్స్ ఫర్ ద్వారా ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి., వారి ఖాతా నెం.000201234000110 కు తేది: 13-08-2025, సా. 4.00 గం.ల లోపుగా చెల్లించవలెను.

బ్రాంచి : ఏలూరు

1) ఋణగ్రహీత(లు): (1) శ్రీమతి పాలెపు స్వరాజ్యం, తండ్రి: సత్యనారాయణ, (2) హామీదారుడు: శ్రీ మేడపాటి రవి శంకర్ రెడ్డి, తండ్రి: కృష్ణారెడ్డి
బకాయి మొత్తము: తేది: 30-11-2023 నాటికి రూ.44,36,091/-మరియు తదుపరి వడ్డీ ఖర్చులు మరియు ఇతర ఛార్జీలు.
స్థిరాస్థి వివరములు: 163.40 చ.గజాల స్థలం, అందులోని శ్రీమతి పాలెపు స్వరాజ్యం కు చెందిన గృహ భవనం, డోర్.నెం.5-135/3, నోవా కాలేజీ దగ్గర, లక్ష్మీ నరసింహా నగర్, తంగెళ్ళమూడి, ఏలూరు, రిజిష్టర్ దస్తావేజు నెం.3363/2020, తేదీ:03-06-2020. మరియు సరిహద్దులు: తూర్పు: ప్లాట్ నెం.15,16, పడమర: 33 అడుగుల రోడ్డు, ఉత్తరం: ప్లాట్ నెం.10, దక్షిణం: ప్లాట్ నెం.11.
రిజర్వు ధర: రూ.55,00,000/- ధరావత్తు సొమ్ము: రూ.5,50,000/-

1. అత్యధిక బిడ్డుతో విజయవంతమయిన పాటదారుడు పాటధర మొత్తంలో 25% వెంటనే అధీకృత అధికారికి చెల్లించవలసి ఉంటుంది మరియు మిగిలిన మొత్తము 15 రోజులలోగా చెల్లించవలసి ఉంటుంది. పాట మొత్తం సొమ్మును 15 రోజులలోపు చెల్లించకపోయిన యెడల జమ చేసిన 25% సొమ్ము నిలిపివేయబడుతుంది. మరియు ఆస్తిని మరలా విక్రయించుటకు బ్యాంకునకు అధికారం ఉంటుంది.
2. ఆసక్తి కలిగిన వ్యక్తులు ఆస్తిని పరిశీలించడానికి ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి, ప్రధాన కార్యాలయములో అనుమతి పొందిన తరువాత అధీకృత అధికారిని సంప్రదించి ఏదైనా పని దినమున పని వేళలలో చూసుకొనవచ్చును.
3. ఏవైనా స్థానిక పన్నులు లేదా ఎక్సైజ్ డ్యూటీ మరియు ఏ రకమైన చట్టపరమైన బకాయిలు ఆస్తిపై ఉన్న యెడల అవి చెల్లించు భాధ్యత కొనుగోలుదారు వహించవలెను. ఆస్తి రిజిస్ట్రేషన్ కు అయ్యే స్టాంప్ డ్యూటీ ఖర్చులు మరియు ఇతరములు కొనుగోలుదారుడే చెల్లించవలెను.
4. ఆస్థి అమ్మకానికి సంబంధించి తుది నిర్ణయం బ్యాంక్ వారిదే, దానిపై ప్రశ్నించే అధికారము ఉండదు.
5. ఎటువంటి కారణములను చూపకుండా వేలము/అమ్మకములను రద్దు చేయు లేదా వాయిదా వేయు అధికారము బ్యాంక్ కలిగి ఉంటుంది.

ప్రదేశం : రాజమహేంద్రవరం, తేది : 02.07.2025 సం/- అధీకృత అధికారి, ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్

చిన్నారి ప్రతిభ

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు

నారాయణం కృష్ణ సాద్విక

రావులపర్రు (ఉంగుటూరు), న్యూస్‌టుడే: ఆ చిన్నారి వయసు నాలుగేళ్లలోపే. అయితేనేం తన అసాధారణమైన జ్ఞాపకశక్తి, ప్రతిభా సామర్థ్యాలతో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకుంది. ఉంగుటూరు మండలం రావులపర్రుకు చెందిన నారాయణం రాంప్రసాద్, వైష్ణవి దంపతుల కుమార్తె కృష్ణ సాద్విక పండ్లు, జంతువులు, రంగులను గుర్తించి వాటి పేర్లను చెబుతోంది. చిన్నారికి ఒకసారి శ్లోకాలను వినిపిస్తే తిరిగి గడగడా చెప్పేస్తోంది. సాద్విక 2021 సెప్టెంబరు 28న జన్మించింది. జంగారెడ్డిగూడెంలోని ఓ శిక్షణ సంస్థలో సుమారు 8 నెలలుగా సాద్వికకు ఆమె తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో శిక్షణ ఇప్పించారు. ఇటీవల జంగారెడ్డిగూడెంలోని శిక్షణ సంస్థను సందర్శించిన తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ ప్రతినిధులు సాద్విక ప్రతిభను గుర్తించి ధ్రువపత్రాలు అందజేసినట్లు ఆమె తండ్రి రాంప్రసాద్ బుధవారం తెలిపారు.

అంతా సానుకూలమే!

ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలపై పరిశీలన

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం మండలం బియ్యపుతిప్పతో పాటు కోనసీమ జిల్లా ఓడలరేవు వద్ద నిలిచిపోయిన ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల నిర్మాణాలను తిరిగి చేపట్టే దిశగా నివేదిక సమర్పించనున్నట్లు సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోస్టల్ ఇంజినీరింగ్ ఫర్ ఫిషరీస్ (బెంగళూరు) ఉప సంచాలకుడు బిలియప్ప పేర్కొన్నారు. బియ్యపుతిప్పలో ఫిష్ ల్యాండింగ్ కేంద్రం నిర్మాణ ప్రాంతాన్ని ఆయన నేతృత్వంలో అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార సహకార సంఘాల ఫెడరేషన్ రాష్ట్ర ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, జిల్లా సమాఖ్య అధ్యక్షుడు మైల వసంతరావు, ఆ శాఖ జిల్లా అధికారులతో వారు పలు అంశాలపై చర్చించారు. ఈ రెండు ప్రాంతాల్లో కేంద్రాల నిర్మాణాలను పునఃప్రారంభించే దిశగా కసరత్తు జరుగుతోందని నాయకులు తెలిపారు. జిల్లా మత్స్యశాఖ అధికారి కేఎస్‌వీ నాగలింగాచార్యులు, ఏపీ ఈడబ్ల్యూఐడీసీ కార్యనిర్వహక ఇంజినీరు రంగనాథస్వామి, మత్స్యశాఖ జిల్లా సహాయ సంచాలకుడు ఎల్ఎన్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

92.7 FM Rajamahendravaram
92.7 Mee FM
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 6304901226

EENADU Classifieds

AUTO
VEHICLES WANTED
Wanted Vehicle: అశోక్ లేలాండ్ దోస్త్, టాటా ఇంట్రా, టాటా పికప్ వాహనాలు నెలవారీ అద్దె ప్రాతిపదికన ప్రముఖ కంపెనీకి వాహనం అద్దెకు కావలెను. సంప్ర: ✆: 63022 27985.

REAL ESTATE
PLOT FOR SALE
భీమవరం మెంటేవారి తోటలో బైపాస్ రోడ్‌కు దగ్గర్లో 5 సెంట్లు చొప్పున 2 స్థలాలు అమ్మకం. కాంటాక్ట్: 98482 09906.
తాడేపల్లిగూడెం యాగర్లపల్లి కరెంట్ ఆఫీసు దగ్గరలో 600 చ॥గ॥ మరియు 200 చ॥గ॥ తూర్పుఫేసింగ్ స్థలం అమ్మకం. సంప్ర: ✆ 99895 15392, 98498 49363.

JOBS
అభినయ ఎంటర్‌ప్రైజెస్, రాజమండ్రి, టాటా సోలార్ నందు పనిచేయుటకు అనుభవంగల టెక్నీషియన్స్ & కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. Cont: 94924 44555.
రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో+వ+మంచి జీతం + ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.
MAX గోల్డ్ సేంద్రియ ఎరువులు డైరెక్ట్‌గా మార్కెట్ చేయుటకు Q: 10th, ఇంటర్, డిగ్రీ. శాలరీ: 15000, TA, DA + ఇన్సెంటివ్. వయస్సు: 20 సం॥ - 45 సం॥. కాంటాక్ట్: ✆ 99666 34933.
రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్లు సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో. వ. + జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ✆ 92814 52845, 82475 00574.
రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No-1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+ వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119430, 9618802390.
ప్రముఖ SML ISUZU జయలక్ష్మి మోటార్స్ ఏలూరు నందు సర్వీస్ అడ్వైజర్స్, మెకానిక్స్, సిస్టమ్ ఆపరేటర్స్, ఎలక్ట్రీషియన్స్ కావలెను. ✆ 94405 80868.
శివకార్తికేయ హోంకేర్ నందు వృద్ధులు/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు ఇంటి/ వంట పనిచేయుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 20K. ✆ 99120 11499, 99120 11899.

SECURITY GUARDS
పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవోలు, తణుకులలో సెక్యూరిటీ గార్డులు కావలెను. 8 గం|| డ్యూటీ, వీక్లీ ఆఫ్, జీతం: 15,000/- PF + ESI. Ex. సర్వీస్ జీతం: 20,000/-, PF + ESI. ✆ 95818 58667.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప ప్రకటనలద్వారా ప్రజల నుండి ఎటీ డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.70 పైII తణుకు ఆఫీసు: 08819-224254

ఏలూరు

•ఏలూరు •దెందులూరు •ఉంగుటూరు

నేడు తాడిపూడి నుంచి సాగునీరు విడుదల

తాళ్లపూడి, న్యూస్‌టుడే: తాళ్లపూడి మండలంలోని తాడిపూడి ఎత్తిపోతల పథకం స్టేజ్-1, స్టేజ్-2 నుంచి గురువారం మధ్యాహ్నం సాగునీరు విడుదల చేస్తున్నామని ఆ పథకం డీఈ రామకృష్ణరాయుడు తెలిపారు. సాగునీరు విడుదల ప్రారంభోత్సవ కార్యక్రమానికి జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, కొవ్వూరు, గోపాలపురం నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ముప్పిడి వెంకటేశ్వరరావు, మద్దిపాటి వెంకటరాజు ముఖ్య అతిథులుగా హాజరవుతారని పేర్కొన్నారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాల పరిధిలోని సుమారు 2లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందుతోందన్నారు.

మహిళలు, బాలికల భద్రతే లక్ష్యం

విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న శక్తి టీమ్ పోలీసులు

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: మహిళలు, బాలికల రక్షణే ధ్యేయంగా శక్తి టీమ్ పనిచేస్తుందని ఏలూరు మహిళా పోలీసుస్టేషన్ సీఐ సుబ్బారావు అన్నారు. ఆయన ఆదేశాల మేరకు బుధవారం శక్తి టీమ్ పోలీసులు నగరంలోని అనేక ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహించారు. పార్కులు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్, కళాశాలల వద్ద గస్తీ నిర్వహించారు. కళాశాలల వద్ద పలువురు విద్యార్థినులకు రక్షణ సంబంధించిన అంశాలపై అవగాహన కల్పించారు. కళాశాలల వేళల్లో పార్కుల్లో ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి కౌన్సెలింగ్ ఇచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

ఏలూరు టూటౌన్: 80085 74487 ఏలూరు గ్రామీణ: 80085 74535
పెదపాడు, పెదవేగి: 80085 74483 ఉంగుటూరు: 79933 00492

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ? హనుమాన్‌నగర్‌లో రహదారి పక్కనే చెత్త వేస్తున్నారు. వర్షాలకు చెత్త, వ్యర్థాల నిల్వలు కుళ్లి దుర్వాసన వెదజల్లుతోంది. **- సునీల్‌కుమార్, హనుమాన్‌నగర్**

✔ పారిశుద్ధ్య సిబ్బందిని పంపించి చెత్త తొలగించి శుభ్రం చేయిస్తాం. రహదారి పక్కన చెత్త వేయకుండా చర్యలు తీసుకుంటాం. **- చంద్రయ్య, అదనపు కమిషనర్, ఏలూరు నగరపాలక సంస్థ**

? తంగెళ్లమూడిలోని భాగ్యనగర్ శివారులో వీధి దీపం వెలగడం లేదు. చీకట్లో ఇబ్బందులు పడుతున్నాం. **- రత్నాకర్, స్థానికుడు**

✔ సిబ్బందిని పంపించి వీధి దీపం వెలిగించేలా చేస్తాం. **- సాంబశివరావు, విద్యుత్తు ఏఈ, ఏలూరు నగరపాలక సంస్థ**

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ? ఏలూరు శాంతినగర్ 6, 7, 8 రోడ్లలో కుళాయిల ద్వారా కలుషిత నీరు సరఫరా అవుతుంది. దీంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. **- వెంకటేశ్వరరావు**

✔ సమస్య పరిష్కరిస్తాం. పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- భానుప్రతాప్, నగర కమిషనర్**

? ఏలూరు అమీనాపేట ఏటిగట్టు రోడ్డులో వీధి దీపం వెలగడం లేదు. రాత్రయితే చీకటి మయంగా ఉంటుంది. **- సుశీల**

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- భానుప్రతాప్, నగర కమిషనర్**

రెండేళ్లకే ఛిద్రమైన రహదారి

వాహన చోదకులకు తప్పని తిప్పలు

క్రొవ్విడిలో పలుచోట్ల గుంతలు పడిన దారి

గణపవరం మహాలక్ష్మి కూడలిలో ...

గణపవరం, న్యూస్‌టుడే: గణపవరం నుంచి ఆకివీడు వెళ్లే ప్రధాన రహదారి పలుచోట్ల ఛిద్రమైంది. 5.3 కి.మీ. రహదారిని రెండేళ్ల కిందట రూ.1.5 కోట్లతో నిర్మించారు. గణపవరం మహాలక్ష్మి కూడలి, బావాయిపాలెం గ్రామ ముఖద్వారం, క్రొవ్విడి శివారులో రహదారి కంగోళిగా పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. వాటిని తప్పించుకుని వెళ్లాలంటే వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. భారీ వాహనాల చోదకులు రహదారిపై తమ వాహనాలను నిలుపుదల చేసి ఎటు వైపు వెళ్లాలో పరిశీలన చేస్తుండటంతో తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. ఆకివీడు వెళ్లేందుకు దగ్గరి మార్గం కావడంతో అత్యధిక మంది ఈ దారిలోనే రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయాల్లో గుంతలు కనిపించక ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేవారు ప్రమాదాలకు గురవుతున్నారు. కొత్తవారు ఎవరైనా రహదారిపై ప్రయాణిస్తే గుంతలను తప్పించబోయి కాలువలోకి దూసుకుపోయే ప్రమాదం ఉంది. ఈ సమస్యను భీమడోలు ర.భ.శా ఏఈ భాస్కరరావు దృష్టికి తీసుకెళ్లగా.. మరమ్మతుల కోసం టెండర్లు పిలవాల్సి ఉందన్నారు. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే పనులు చేపడతామని చెప్పారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

పెదవేగి, న్యూస్‌టుడే: పెదవేగి మండలం విజయరాయి సెక్షన్ పరిధిలోని జానంపేట విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో మరమ్మతుల దృష్ట్యా జులై 3న ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ కె.ఎం.అంబేడ్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ఉపకేంద్రం పరిధిలోని గ్రామాల్లోని విద్యుత్తు వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: విద్యుత్తు లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలు నరకడం వంటి పనులు చేపట్టే నేపథ్యంలో ఏలూరు మండలం చాటపర్రు సెక్షన్ కొమడవోలు, పోణంగి పరిధిలోని హమాలీ కాలనీ, దుర్గా గ్రాండ్ సిటీ, కొమడవోలు, చాటపర్రు రోడ్డు, అండాలమ్మ తోట, రామానగర్, మారుతీనగర్, మస్తాన్ మన్యం, నాగేంద్ర, శ్రీరామ్‌నగర్, ఆటోనగర్, తూర్పు లాకులు, సాయినగర్, ఇందిరమ్మ, ఎన్టీఆర్, మల్కాపురం, చంద్రబాబునాయుడు, ఎస్సీ కాలనీలు, బాబూఖాన్‌గూడెం తదితర ప్రాంతాల్లో ఈ నెల 4న ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా నిలుపుదల చేస్తామని ఆ శాఖ ఏలూరు ఈఈ అంబేడ్కర్ ఓ ప్రకటనలో తెలిపారు.

సకల జనుల సంక్షేమమే లక్ష్యం

తొలి అడుగు ప్రతులను ప్రదర్శిస్తున్న గన్ని, నాయకులు

గణపవరం, న్యూస్‌టుడే: సకల జనుల సంక్షేమం, రాష్ట్రాభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు అన్నారు. పిప్పరలో తెదేపా మండల అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు అధ్యక్షతన 'సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికి తెదేపా' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గన్ని, నియోజకవర్గ పరిశీలకుడు, రాష్ట్ర టైలర్స్ ఫెడరేషన్ ఛైర్మన్ ఆకాశపు స్వామి పిప్పరలో ఇంటింటికి వెళ్లి ఏడాది కాలంలో ప్రభుత్వ ప్రగతి, సంక్షేమాన్ని వివరించారు.

ఉంగుటూరు, న్యూస్‌టుడే: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కాగుపాడులో తెదేపా మండల కమిటీ మాజీ అధ్యక్షుడు కడియాల రవిశంకర్ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు.

ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న దాసరి ఆంజనేయులు

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు అన్నారు. స్థానిక 5వ డివిజన్‌లోని శ్రీరామ్‌నగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథిగా హాజరైన దాసరి ఆంజనేయులు మాట్లాడారు.

ప్రతి ఇంటికీ చెప్పండి: ఎంపీ

లక్ష్మీపురంలో మాట్లాడుతున్న పుట్టా మహేశ్

పెదవేగి, న్యూస్‌టుడే: ఏడాది కూటమి పాలనలో చేసిన సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ తెలిపారు. పెదవేగి మండలం లక్ష్మీపురంలోని దెందులూరు మార్కెట్ యార్డు వద్ద బుధవారం దెందులూరు నియోజకవర్గ తెదేపా నాయకులతో సమావేశం నిర్వహించారు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జులై 2 నుంచి 30 వరకు ఇప్పటివరకూ చేసిన సంక్షేమం, అభివృద్ధి గురించి తెలుపుతూనే వారి అవసరాలు తెలుసుకోవాలన్నారు. 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా అధినేత చంద్రబాబు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని రూపొందించారని చెప్పారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు ఇప్పటి నుంచే సన్నద్ధం కావాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. అనంతరం 'సుపరిపాలనలో తొలి అడుగు' గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, ఏఎంసీ ఛైర్‌పర్సన్ గారపాటి రామసీత, తెదేపా నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే ప్రగతి సాధ్యం: ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యపడుతుందని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు అనే కార్యక్రమాన్ని ఏలూరులో బుధవారం ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే బడేటి చంటి నేతృత్వంలో 50వ డివిజన్‌లో చేపట్టిన ఈ కార్యక్రమంలో తెదేపా జిల్లా అధ్యక్షుడు వీరాంజనేయులు పాల్గొన్నారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ తల్లికి వందనం పథకం ద్వారా ప్రతి పేద విద్యార్థికీ రూ.13 వేల చొప్పున తల్లుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని అన్నారు. ఎన్టీఆర్ భరోసా పథకం కింద వృద్ధులు, దివ్యాంగులు తదితర కేటగిరీల వారికి పింఛన్లు పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. దీపం పథకం ద్వారా అర్హులందరికీ ఏడాదికి మూడు చొప్పున గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ నూర్జహాన్, ఈడా ఛైర్మన్ శివప్రసాద్, తెదేపా పరిశీలకుడు వలీ, ఆర్టీసీ విజయవాడ జోనల్ ఛైర్మన్ అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి పెద్ద పీట: చింతమనేని

కరపత్రం అందజేస్తున్న ప్రభాకర్

దెందులూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది సుపరిపాలనలో సంక్షేమం, అభివృద్ధికి పెద్ద పీట వేసిందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా దెందులూరు మండలంలోని పెరుగుగూడెం, చల్లచింతలపూడి, రామారావుగూడెం, ముప్పవరం గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సుపరిపాలన తొలి అడుగు కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైకాపా హయాంలో విధ్వంసానికి గురైన రాష్ట్రం, దెందులూరు నియోజకవర్గం కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో వికాసం వైపు అడుగులు వేస్తోందని చెప్పారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న చంటి

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు కూటమి ప్రభుత్వం నాణ్యమైన భోజనం అందిస్తోందని ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. నగరంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను ఆయన బుధవారం సందర్శించి మధ్యాహ్న భోజన పథకం అమలు తీరును పరిశీలించారు. విద్యార్థులకు ఆహార పదార్థాలను వడ్డించడంతోపాటు వారితో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక సుబ్బమ్మదేవి నగరపాలక పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండటం లేదని తనకు సామాజిక మాధ్యమం ద్వారా అందిన ఫిర్యాదుపై పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే వెంట ఈడా ఛైర్మన్ శివప్రసాద్ తదితరులు ఉన్నారు.

సూర్యనారాయణుడికి అభిషేకాలు

ఉత్సవమూర్తులకు విశేష అలంకరణ

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఏలూరు పవరుపేటలోని సూర్య దేవాలయంలో సూర్యనారాయణస్వామికి బుధవారం విశేష అభిషేకాలు చేశారు. ధన్వంతరి, మృత్యుంజయ, నవగ్రహ హోమాలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, అలంకరణలు చేశారు.

విఘ్నేశ్వరస్వామికి విశేష పూజలు

విశేష అలంకరణలో

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: సత్రంపాడులోని లక్ష్మీ గణపతి ఆలయంలో విఘ్నేశ్వరస్వామికి బుధవారం ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు చేశారు.

కనకదుర్గమ్మకు...

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: స్థానిక బావిశెట్టివారిపేటలోని కనకదుర్గమ్మ ఆలయంలో నిర్వహిస్తున్న వారాహి నవరాత్రుల్లో అమ్మవారిని బుధవారం వారాహిదేవిగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

వైభవంగా నవకోటి దత్తహోమాలు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: దొండపాడులోని శ్రీ నం దత్తనాథ క్షేత్రంలో జరుగుతున్న నవకోటి దత్త హోమాల్లో భాగంగా 8వ కోటిలో జరిగే దత్త హోమాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా దత్తాత్రేయ మూల మంత్ర హోమం చేశారు.

సభ్యత్వ నమోదు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: యూటీఎఫ్ ఏలూరు మండలశాఖ ఆధ్వర్యంలో సత్రంపాడు, గవరవరం, శనివారపుపేట, కండ్రిక గూడెం, తంగెళ్లమూడి, హనుమాన్ నగర్, సాయినగర్, బూరాయిగూడెం తదితర ప్రాంతాల్లోని పాఠశాలల్లో యూటీఎఫ్ సభ్యత్వ నమోదు బుధవారం ప్రారంభించారు. ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నంబూరి రాంబాబు, నాయకులు పాల్గొన్నారు.

రక్షణ చర్యలు చేపట్టరూ..

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే : నిడమర్రు ఇందిరమ్మ కాలనీ రక్షిత మంచి నీటి సరఫరా ట్యాంక్ వద్ద విద్యుత్తు నియంత్రణ బాక్స్ మూత లేకుండా ప్రమాదకరంగా ఉంది. తీగలు బయటకు కనిపిస్తున్నాయి. చిన్నారులు తిరిగే ఈ ప్రాంతంలో ప్రమాదం జరగక ముందే చర్యలు తీసుకోవాలని స్థానికులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు. దీనిని విద్యుత్తు ఏఈ వివరణ కోరగా సిబ్బందిని పంపి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

పోషకాహారం లెక్కపక్కా..!

అంగన్‌వాడీ కేంద్రాల్లో ముఖ గుర్తింపు తప్పనిసరి

లబ్ధిదారురాలి ముఖ గుర్తింపు తీసుకుంటున్న కార్యకర్త

ఉంగుటూరు, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించి ఆరోగ్య భారతాన్ని సృష్టించేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో వీరికి ఇచ్చే పౌష్టికాహారం పక్కదారి పడుతోంది. దీని వల్ల ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. లబ్ధిదారులకు పోషకాహారం పారదర్శకంగా పంపిణీ చేసేలా ఈ నెల 1 నుంచి ముఖ ఆధారిత గుర్తింపు (ఫేషియల్ రికగ్నిషన్) తప్పనిసరి చేసింది. ఎంత మంది కేంద్రానికి వచ్చారో చరవాణి ద్వారా ఫొటోలు తీసి పోషణ ట్రాకర్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. దీంతో పంపిణీపై పర్యవేక్షణ సులభతరం కానుంది.

ఏలూరు, భీమడోలు ఐసీడీసీ ప్రాజెక్టుల పరిధిలో 401 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వీటిలో గర్భిణులు 1,888, బాలింతలు 1,633, చిన్నారులు 22,275 మంది ఉన్నారు. గతంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు సరఫరా చేసిన చరవాణులు చాలా వరకు మూలకు చేరాయి. దీంతో సొంత చరవాణులు వినియోగిస్తున్నారు. లబ్ధిదారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా సరకులు ఇచ్చే సమయంలో కేంద్ర ప్రభుత్వానికి సంబంధించిన పోషణ్ ట్రాకర్, రాష్ట్ర ప్రభుత్వ బాల సంజీవని యాప్‌లో వీటిని కచ్చితంగా అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. లబ్ధిదారుల ఆధార్‌కు అనుసంధానమైన చరవాణికి వచ్చే ఓటీపీ నిక్షిప్తం చేయాలి. చాలా మంది లబ్ధిదారులు తమ చరవాణి నంబర్లు మార్చి వేయడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారు. ఓటీపీ విధానాన్ని తొలగించి కొత్త చరవాణులు అందించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరుతున్నారు.

రక్తదానంతో ప్రాణదానం

రక్తదాన శిబిరాన్ని ప్రారంభిస్తున్న కళాశాల కార్యదర్శి మోజేస్

దుగ్గిరాల (పెదవేగి), న్యూస్‌టుడే: విద్యార్థులు రక్తదానం చేయడం ద్వారా ప్రాణదానం చేయవచ్చని సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల కార్యదర్శి మోజేస్ తెలిపారు. పెదవేగి మండలం దుగ్గిరాలలోని సెయింట్ జోసెఫ్ దంత వైద్యకళాశాలలో బుధవారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

చిన్నారులకు రక్తమార్పిడి

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: ఇండియన్ రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో బుధవారం తలసీమియా బాధిత చిన్నారులకు రక్తమార్పిడి చేశారు. ఏలూరు సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలోని రెడ్‌క్రాస్ తలసేమియా చికిత్సా భవనంలో వైద్యులు 20 మంది చిన్నారులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి రక్తమార్పిడి చేసి అవసరమైన మందులు అందజేశారు. చిన్నారులకు, వారి తల్లిదండ్రులకు, సహాయకులకు భోజనం ఏర్పాటు చేశారు. రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ మాగంటి ప్రసాద్, చిన్నపిల్లల వైద్య నిపుణులు శ్రీనివాస్, ఆల్బర్ట్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం బకాయిలు చెల్లించాలి

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: రబీలో ధాన్యం విక్రయించి రెండు నెలలు అయినా రైతులకు సొమ్ములు చెల్లించకపోవడం అన్యాయమని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ ఆవేదన వ్యక్తం చేశారు. ఏలూరులోని స్థానిక అన్నేభవన్‌లో రైతుల సమస్యలపై ఆయన మాట్లాడారు.

● ఆయిల్ పామ్ గెలల రైతు ధర పడిపోవడంపై రైతు సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. టన్ను గెలల ధర రూ.20 వేలు తగ్గకుండా ఉండేలా చర్యలు చేపట్టాలని సంఘం కోరింది.

అర్హులకు కేంద్ర బీమా పథకాలు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, భద్రత కోసం అమలు చేస్తున్న జన సురక్ష పథకాలను సద్వినియోగం చేసుకోవాలని నాబార్డ్ డీడీఎం టి.అనిల్ కాంత్ కోరారు. చాటపర్రులోని సామాజిక భవనంలో జనసురక్ష పథకాలపై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ బీమా పథకాల గోడ పత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా అనిల్ కాంత్ మాట్లాడారు. జిల్లా లీడ్ బ్యాంక్ సహాయక మేనేజర్ ఎస్.చంద్రశేఖర్, కెనరా బ్యాంకు చాటపర్రు శాఖ మేనేజర్ డి.ఆదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రకాలువ జలాశయం నీటి విడుదల

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: రైతులకు వెన్నుదన్నుగా కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు ఉంటుందని డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు అన్నారు. కొంగువారిగూడెం ఎర్ర కాలువ జలాశయం కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిని విడుదల చేసే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెదేపా పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్‌తో కలిసి రాంబాబు కాలువ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు.

కొత్త వంగడాలను సాగు చేయాలి

పంట సాగు హక్కు పత్రాలు పంపిణీ చేస్తున్న హబీబ్ బాషా

ఉంగుటూరు, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో స్వర్ణ వంటి ముతక రకానికి ప్రత్యామ్నాయంగా ఎంటీయూ 1224, ఎంటీయూ 1262 కొత్త వంగడాలను సాగు చేయాలని, దీని వల్ల అధిక దిగుబడులు పొందవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాషా తెలిపారు. ఉంగుటూరులో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 80 శాతం రాయితీపై ప్రభుత్వం అందిస్తున్న డ్రోన్లకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కౌలు రైతులకు పంట సాగు హక్కు పత్రాలు పంపిణీ చేశారు. అనంతరం క్షేత్ర స్థాయిలో నారుమళ్లు, నాట్లు పరిశీలించారు. ఏడీఏ ఉషారాజకుమారి, ఏవో ప్రవీణ్‌కుమార్, ఎఫ్‌డీవో మంగారావు, పశు సంవర్ధక శాఖ వైద్యాధికారిణి శిరీషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఎంపీడీవో విజయకుమారి

తడి, పొడి చెత్తను వేరు చేసి ఇవ్వాలి

నిడమర్రు గ్రామీణం, న్యూస్‌టుడే : తడి, పొడి చెత్తను వేర్వేరుగా ఉంచి పంచాయతీ వాహనం వచ్చిన సమయంలో అందించాలని ఎంపీడీవో విజయకుమారి సూచించారు. బావాయిపాలెం గ్రామంలో బుధవారం ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్త సేంద్రియ ఎరువు తయారీకి వినియోగపడుతుందన్నారు. అనంతరం బువ్వనపల్లి గ్రామ శివారులో ఉన్న సంపద కేంద్రాన్ని పరిశీలించారు.

ఇంటింటికీ చెత్త సేకరణ తీరుపై పరిశీలన

గణపవరం, న్యూస్‌టుడే: ఇంటింటికి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించేందుకు వాకపల్లి, వీరేశ్వరపురం, జల్లికొమ్మర గ్రామాల్లో ఇన్‌ఛార్జి డీఎల్పీవో వై.దోసిరెడ్డి బుధవారం పర్యటించారు. ఐవీఆర్ఎస్ సర్వేలో ఆ గ్రామాల్లో చెత్త సేకరణ అధ్వానంగా ఉందని పలు ఫిర్యాదులు రావడంతో ఎంపీడీవో బేబి శ్రీలక్ష్మి, పంచాయతీ విస్తరణాధికారి సత్యనారాయణలతో కలిసి ఆయన పరిశీలన చేశారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఈవోలకు చెత్త సేకరణపై పలు సూచనలు చేశారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

ఏలూరు నేరవార్తలు, న్యూస్‌టుడే: రైలు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం .. ఏలూరు పవరుపేట గిలకల గేటు సమీపంలో 50 నుంచి 56 సంవత్సరాల వయసున్న వ్యక్తి బుధవారం రైలు పట్టాలు దాటుతుండగా అదే సమయంలో వచ్చిన గూడ్స్ రైలు ఢీ కొనడంతో మృతిచెందాడు. రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని సర్వజన ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుని వివరాలు తెలియరాలేదని నలుపు తెలుపు జుట్టు, తెల్లని గెడ్డం, కుంకుమ రంగు పొట్టిచేతుల టీషర్టు, గోదుమ రంగు షార్ట్స్ కలిగి ఉన్నాడన్నారు. రైల్వే ఎస్సై సైమన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పొలాలకు చేరని కృష్ణమ్మ

సాగునీటికి ఎదురు చూపులు

వంతెన పనుల కోసం పంపుల చెరువు వద్ద కృష్ణా కాలువపై వేసిన అడ్డుకట్ట

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: కాలువలకు నీరు వదిలినా పొలాల్లోకి చేరని పరిస్థితి నెలకొంది. వేసవిలో కాలువలు మూసివేసిన సమయంలో చేపట్టాల్సి పనులు, కాలువలకు నీటిని విడుదల చేసే ముందు చేపట్టడంతో రైతులు సాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. ఏలూరులో పంపుల చెరువు సమీపంలో కాలువపై వంతెన నిర్మాణం ఆలస్యంగా మొదలు పెట్టారు. ప్రస్తుతం పనులు కొనసాగుతున్నాయి. వాటికి ఆటంకం కలగకుండా అడ్డుకట్ట వేశారు. ఏలూరు కాలువకు కొద్ది రోజుల కిందటే కృష్ణా జలాలు విడుదల చేశారు. ఈ నీరు దిగువ ప్రాంతాలకు వెళ్లకుండా పడమర లాకుల వద్దనే ఆగిపోయింది. దీంతో దిగువన ఉన్న ఏలూరు మండలంలోని గ్రామాలకు చుక్క నీరు వెళ్లడం లేదు. ఏలూరు మండలంలో సుమారు 9 వేల ఎకరాలు కృష్ణా కాలువ కింద ఆయకట్టు ఉంది. ఇప్పటి వరకు రైతులు నారుమడులు పోయలేదు. సాగు ఆలస్యమైతే ఆ ప్రభావం దిగుబడులపై ఉంటుందని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ముందస్తు ప్రణాళిక లేకపోవడంతోనే ఇటువంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని రైతులు వాపోతున్నారు. రహదారులు, భవనాలశాఖ అధికారులతో మాట్లాడి దిగువన ఉన్న ప్రాంతాలకు నీటిని విడుదల చేసే ప్రయత్నం చేస్తున్నామని జలవనరులశాఖ ఏఈ దుర్గారావు తెలిపారు.

అందించిన సేవలు ఎనలేనివి

కైకరం (ఉంగుటూరు), న్యూస్‌టుడే: అంకితభావంతో పనిచేసి కైకరం జడ్పీ ఉన్నత పాఠశాలను అన్ని రంగాల్లో ముందంజలో ఉంచిన ప్రధానోపాధ్యాయుడు గుళ్ల ప్రసాదరావు సేవలు ఎనలేనివని ఏలూరు డీవైఈవో నిమ్మగడ్డ రవీంద్రభారతి కొనియాడారు. స్థానిక పాఠశాలలో ప్రసాదరావు ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం ఆయనకు ఘనంగా వీడ్కోలు పలికారు. సర్పంచి సలగాల గోపి, జట్పీటీసీ సభ్యుడు కొరిపల్లి జయలక్ష్మి, ఎస్ఎంసీ ఛైర్మన్ అల్లూరి జగదీశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాత పుస్తకాల పంపిణీ

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక 41వ డివిజన్‌లోని నరసింహ స్పెషల్ మోడల్ ప్రైమరీ పాఠశాలలో విద్యార్థులకు బుధవారం ఉచితంగా రాత పుస్తకాలు పంపిణీ చేశారు. బొమ్మి రంగారావు స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

5 నుంచి సీపీఐ మహా సభలు

ఏలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: చింతలపూడిలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో సీపీఐ ఏలూరు జిల్లా మహా సభలు జరుగుతాయని ఆ పార్టీ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య తెలిపారు. 5న చింతలపూడిలో వేలాది మందితో ప్రజా ప్రదర్శన, బహిరంగ సభ జరుగుతుందని చెప్పారు. 6, 7 తేదీల్లో చింతలపూడి మండలం ఎర్రగుంటపల్లిలోని రాధాకృష్ణ గార్డెన్స్‌లో ప్రతినిధుల సభ ఉంటుందని పేర్కొన్నారు.

పేదింటి బిడ్డలు.. ప్రతిభావంతులు

13 మందికి అత్యుత్తమ ర్యాంకులు

మాధవరపు కృష్ణప్రియ 3

● జంతుశాస్త్రం
● పెదనిండ్రకొలను
● గరటరాజు, వ్యవసాయ కూలీ
● నాగవేణి, గృహిణి
● ప్రొఫెసర్‌గా

ముత్యాల రూపశ్రీ 22

● వృక్షశాస్త్రం
● గణపవరం
● పుణ్యవతి, వస్త్ర దుకాణంలో పని
● అధ్యాపకురాలిగా

సకలాబత్తుల సంధ్యారాణి 70

● వృక్షశాస్త్రం
● అర్ధవరం
● రత్నరాజు, రైతు
● కృష్ణవేణి, గృహిణి
● అధ్యాపకురాలిగా

● విభాగం ● గ్రామం ● తండ్రి ● తల్లి ● లక్ష్యం

వేమన బేబి శిరీష 96

● రసాయనశాస్త్రం
● గణపవరం
● బాలబాలాజీ, పంక్చర్ల దుకాణం
● నాగలక్ష్మి, గృహిణి
● ఫార్మారంగంలో స్థిరపడతా.

కొట్టే బాహ్య లహరి 74

● వృక్షశాస్త్రం
● వెలగపల్లి
● కనకదుర్గా ప్రసాద్, వ్యవసాయ కూలి
● ధనలక్ష్మి, గృహిణి
● పీహెచ్‌డీ చేసి పరిశోధనలపై అధ్యయనం

గణపవరం, న్యూస్‌టుడే: గణపవరం శ్రీచింతలపాటి వరప్రసాద మూర్తిరాజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పీజీ సెట్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చారు. కళాశాలలోని సౌకర్యాలను సద్వినియోగం చేసుకుంటూ అధ్యాపక సిబ్బంది ప్రత్యేక శిక్షణ, వేసవిలో ఆన్‌లైన్ తరగతుల నిర్వహణతో రాష్ట్రస్థాయిలో 100 లోపు 5 ర్యాంకులు, 100 నుంచి 1000లోపు మరో 8 ర్యాంకులు సాధించారు పేదింటి బిడ్డలు. ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన విద్యాబోధనకు వీరు చిరునామాగా నిలుస్తూ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. దీంతో ఈ ఏడాది ప్రవేశాలు మరిన్ని పెరిగాయి. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ అభిప్రాయాలను 'న్యూస్‌టుడే'కు వెల్లడించారు.

ఏలూరు సినిమాలు

ఏలూరు వన్‌టౌన్, న్యూస్‌టుడే

అంబిక డీలక్స్	అందాల రాక్షసి
అంబిక మినీ	తొలిప్రేమ
సాయిబాలాజీ	శ్రీశ్రీశ్రీ రాజావారు
బాలాజీ	హౌ టూ ట్రైన్ యువర్ డ్రాగన్
సత్యనారాయణ స్క్రీన్ 1	కన్నప్ప
సత్యనారాయణ స్క్రీన్ 2	మార్గన్
సత్యనారాయణ స్క్రీన్ 3	8 వసంతాలు
విజయలక్ష్మి వీమ్యాక్స్ 1	కుబేర
విజయలక్ష్మి వీమ్యాక్స్ 2	సితారే జమీన్ పర్
విజయలక్ష్మి వీమ్యాక్స్ 3	వైభవం
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 1	కుబేర
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 2	మార్గన్
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 3	కన్నప్ప
ఎస్వీసీ మల్టీప్లెక్స్ స్క్రీన్ 4	కన్నప్ప

(c) eenadu

పోలవరం
•పోలవరం •చింతలపూడి

భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా నిర్మల

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: భారతీయ జనతా పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా కొయ్యలగూడేనికి చెందిన బొల్లిన నిర్మలకిశోర్ నియమితులయ్యారు. ఈ మేరకు భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఉత్తర్వులు జారీ చేశారని బుధవారం ఆమె తెలిపారు. ప్రస్తుతం ఆమె మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలిగా వ్యవహరిస్తున్నారు. త్వరలో జరగనున్న పార్టీ జాతీయ అధ్యక్షుడి ఎన్నికల్లో కౌన్సిల్ సభ్యులకు ఓటు వేసే అవకాశం ఉండటం గమనార్హం. జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా ఎన్నికైన సందర్భంలో నిర్మలకు పలువురు అభినందనలు తెలియజేశారు.

పరశురామావతారంలో జగన్నాథస్వామి

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: ద్వారకాతిరుమల మండలం లక్ష్మీపురం జగన్నాథస్వామి బుధవారం పరశురామావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. జగన్నాథ రథోత్సవాల్లో భాగంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మండపంలో స్వామివారిని ఇలా విశేషంగా అలంకరించారు. భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

'ఒక దేశం.. ఒకే పన్ను' విధానం గొప్పది

మాట్లాడుతున్న ప్రసాద్‌బాబు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఒక దేశం.. ఒకే పన్ను విధానం అనేది గొప్ప విషయమని సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రసాద్‌బాబు అన్నారు. జీఎస్‌టీ దినోత్సవం సందర్భంగా డిగ్రీ కళాశాలలో బుధవారం కామర్స్ విభాగం ఆధ్వర్యంలో నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్‌తో ఆన్‌లైన్ వెబినార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరోక్ష పన్నులను లెక్కించడం జీఎస్‌టీ అమలులోకి వచ్చాక సులభమైందన్నారు. సమావేశంలో వైస్ ప్రిన్సిపల్ బి.శ్రీనివాసరావు, కామర్స్ అధ్యాపకురాలు సిహెచ్ రమాదేవి, అధ్యాపకులు శిరీష, మధు, బదరీ నారాయణ, గల్లా శ్రీనివాసరావు, సన్యాసిరావు, టీవీ రాంబాబు, రాజా శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గుంటుపల్లి తెదేపా అధ్యక్షుడిగా బేతిన

కామవరపుకోట, న్యూస్‌టుడే: తెదేపా గుంటుపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బేతిన వెంకట్రావుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పరిశీలకుడు ఎర్ని అశోక్ తెలిపారు. పంచాయతీ పరిధి కొల్లివారిగూడేనికి చెందిన వెంకట్రావు గతంలోనూ తెదేపా గ్రామ అధ్యక్షుడిగా పని చేశారు.

కరెంట్ పోని రోజే లేదు!

జంగారెడ్డిగూడెంలో విద్యుత్తు సరఫరా అస్తవ్యస్తం

ఇంజినీర్లను నియమించకుండా నిర్లక్ష్యం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: ఏలూరు నగరం తరువాత జిల్లాలో ముఖ్య పట్టణాల్లో జంగారెడ్డిగూడెం మొదటిది. కీలకమైన పట్టణంలో విద్యుత్తు సరఫరాను ఏపీఈపీడీసీఎల్ పట్టించుకోవడం లేదు. మూడేళ్లుగా ఏఈ, ఏడాదిగా సబ్ ఇంజినీర్ లేరు. ఇక్కడకు రావడానికి ఆప్షన్ ఇవ్వడం లేదని కాలం వెలిబుచ్చుతున్నారు. 25 వేల సర్వీసులున్న పట్టణంలో కనీసం రెండు సెక్షన్లు ఏర్పాటు చేసి ఆ మేరకు ఇద్దరు ఏఈలు, ఇతర సిబ్బందిని నియమించాలి. అదీ జరగలేదు. ఉన్న పోస్టుల్లో కూడా అధికారులను నియమించి పని చేయించలేని పరిస్థితి ఇక్కడ కనిపిస్తోంది. ఇవన్నీ వెరసి పట్టణంలో అస్తవ్యస్త విద్యుత్తు సరఫరా సమస్యలకు, ఇష్టానుసార కోతలకు, కారణం అవుతున్నాయి.

మరో చోటుకు బదిలీ.. గత నెలలో ఏలూరు స్టోర్స్ నుంచి ఏఈగా మురళీకృష్ణను నియమిస్తే ఆయన చేరలేదు. రెండో రోజే మరో చోటుకు బదిలీ అయ్యారు. సబ్ ఇంజినీరు బాలునాయక్ ఏలూరులో ఎంఆర్‌టీ విభాగంలో యుటిలైజేషన్ విధుల్లో ఉన్నారు. సుమారు 8 నెలలుగా ఆయన ఇక్కడకు బదులు ఏలూరులో చేస్తున్నారు. ఈ స్థానమూ ఖాళీగా ఉంది.

పరెడ్డిగూడెం ఉపకేంద్రం వ్యవసాయ విద్యుత్తు ఫీడర్‌లో గత వారం ఏకధాటిగా మూడ్రోజుల పాటు సరఫరా పూర్తిగా ఆగిపోవడంతో రైతులు నానా అవస్థలు పడ్డారు. ఈఈ పీఆర్ అహ్మద్‌ఖాన్ వద్ద సమస్య మొర పెట్టుకుంటే అతి కష్టం మీద సరఫరా పునరుద్ధరించారు.

ఇటీవల భారీగా వీచిన ఈదురుగాలులతో ఉప్పలమెట్టలో ప్రధాన రహదారిపై ఉన్న స్తంభం ఒరిగింది. ఈ కరెంటు తీగలు రోడ్డుపై వేలాడుతున్నాయి. ఇవి పాఠశాలల బస్సులు, వ్యాన్‌లకు తగిలేటంత కిందకు ఉన్నాయి. స్తంభం కూడా పడిపోయేలా ఉంది. దాదాపు రెండు నెలలవుతున్నా.. దీనిని పట్టించుకోవడం లేదు. అడిగితే స్తంభం పడిపోలేదు కదా అని ఎదురు ప్రశ్నిస్తున్నారని ఈ ప్రాంతానికి చెందిన అప్పారావు, పార్వతి, మనోజ్ తదితరులు పేర్కొన్నారు.

సమస్యను ఈఈకు వివరిస్తున్న రైతులు

10 నుంచి 20 సార్లు.. గడచిన కొంత కాలంగా పట్టణంలో రోజులో 10 నుంచి 20 సార్లు కరెంటు ట్రిప్ అవుతోంది. ఇలా జరిగిన ప్రతి పర్యాయం కొంత సేపు సరఫరా నిలుస్తోంది. రోజూ గంట నుంచి రెండు గంటల సేపు ఏదో రూపంలో సరఫరా జరగడం లేదు. పర్యవేక్షణ లోపం, సాంకేతిక ఇబ్బందులు పెరిగిపోయి ఈ పరిస్థితి తలెత్తుతోంది. కరెంటు హెచ్చు తగ్గులతో ప్రమాదాలు పెరిగాయి. ఇటీవల డాంగేనగర్‌లో ఇల్లు కాలిపోయింది. పలు చోట్ల ఇటువంటి ప్రమాదాలతో ఉపకరణాలు కాలిపోతున్నాయి. 'సమస్యను ఉన్నతాధికారులకు నివేదించాం. పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.' అని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు.

అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి ముత్యాలరావు

పచ్చిరొట్ట సాగుతో అధిక దిగుబడి

కామవరపుకోట, న్యూస్‌టుడే: మండలంలో ప్రధాన పంట అయిన వరి సాగుకు పచ్చిరొట్ట సాగు అత్యంత ఉపయోగకరంగా ఉంటుందని వ్యవసాయాధికారి ముత్యాలరావు తెలిపారు. బుధవారం తడికలపూడి, కె.ఎస్.రామవరం గ్రామాల్లో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మండలంలో ఖరీఫ్ సీజన్‌లో 5600 ఎకరాలలో వరి సాగుకు ప్రణాళిక రూపొందించామన్నారు.

ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా రత్నకుమార్

చింతలపూడి, న్యూస్‌టుడే: చింతలపూడి మండల ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా జేఎం.రత్నకుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న మురళీకృష్ణ పదవీ విరమణ కావడంతో రత్నకుమార్‌కు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు. ఈయన ప్రస్తుతం చింతలపూడి, లింగపాలెం ఈవోఆర్డీగా విధులు నిర్వర్తిస్తున్నారు.

ఎర్రకాలువ జలాశయం నీటి విడుదల

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: రైతులకు వెన్నుదన్నుగా కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడు ఉంటుందని డీసీసీబీ మాజీ ఛైర్మన్ కరాటం రాంబాబు అన్నారు. కొంగువారిగూడెం ఎర్ర కాలువ జలాశయం కుడి, ఎడమ కాలువల ద్వారా నీటిని విడుదల చేసే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా తెదేపా పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్‌తో కలిసి రాంబాబు కాలువ గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ముందుగా గేట్ల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. జలవనరుల శాఖ డీఈ సునీత, జేఈ రాహుల్‌బాష్యర్, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, కొనేటి చంటి, కరణం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

విడుదల చేస్తున్న రాంబాబు తదితరులు

డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మె ఉద్ధృతం

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: తమ డిమాండ్లు పరిష్కరించకుంటే సమ్మెను ఉద్ధృతం చేస్తామని జంగారెడ్డిగూడెం పురపాలక ఇంజినీరింగ్ విభాగ కార్మికులు హెచ్చరించారు. పురపాలక కార్యాలయం వద్ద మూడు రోజులుగా ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేస్తున్నారు. మూడో రోజైన బుధవారం వీరు మోకాళ్లపై నిల్చొని నిరసన తెలిపారు. విధులను బహిష్కరించి వీరు సమ్మె చేస్తున్నారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కంతేటి వెంకట్రావు, నాయకులు నిమ్మల సుబ్బారావు, ఎ.ముత్యాలరావు, కె.అప్పారావు, ముసలయ్య, నూకరాజు, అంజి, శ్రీను, మున్ని, సోమకుమారి, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న కార్మికులు

పేదల ఆర్థిక ప్రగతే ధ్యేయం: బొరగం

బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో పేదల ఆర్థిక ప్రగతి సాధించడమే ధ్యేయంగా ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందని ట్రైకార్ ఛైర్మన్, తెదేపా నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాసులు అన్నారు. బూసరాజుపల్లిలో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కరపత్రాలు ఆవిష్కరించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కూటమి నాయకులు అనపర్తి వెంకట నారాయణ, యంత్రప్రగడ శ్రీనివాసరావు, మొగపర్తి సోంబాబు, పారేపల్లి నరేశ్, అమరవరపు శరత్, బొడ్డు కృష్ణ పాల్గొన్నారు.

బూసరాజుపల్లి: పథకాలు వివరిస్తున్న శ్రీనివాసులు

జంగారెడ్డిగూడెం, న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని తెదేపా పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 15, 16 వార్డుల్లో ఇంటింటి పర్యటన నిర్వహించారు. సుపరిపాలన కరపత్రాలను ప్రదర్శించారు. శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, సీనియర్ నాయకులు మండవ లక్ష్మణరావు, పరిమి సత్యనారాయణ, రావూరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం: కరపత్రాలు ప్రదర్శిస్తున్న కూటమి నాయకులు

లింగపాలెం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే సూపర్-6 పథకాలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికే దక్కిందని చింతలపూడి నియోజకవర్గ పరిశీలకుడు కొల్ల నాగేశ్వరరావు అన్నారు. లింగపాలెంలో నియోజకవర్గ స్థాయి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. కూటమి నాయకులు గరిమెళ్ల చలపతిరావు, పంది మహేశ్, జగ్గవరపు ముత్తారెడ్డి పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్ర అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు అన్నారు. వేగవరంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలపాటి దుర్గాప్రసాద్, సాయల సత్యనారాయణ, కఖీల మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది పాలన ప్రగతిని ప్రజలకు వివరించేందుకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. తెదేపా నాయకులు ఇంటింటికీ తిరిగి ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు.

టి.నరసాపురం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతోందని క్లస్టర్ ఇన్‌ఛార్జి జయవరపు శ్రీరామమూర్తి అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని రాజుపోతేపల్లిలో ప్రారంభించారు. నల్లూరి చలపతిరావు, బొంతు శ్రీను, గుండు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల్లో తనిఖీ

చింతలపూడి పట్టణం, న్యూస్‌టుడే: చింతలపూడి, లింగపాలెం మండలాల్లోని మద్యం దుకాణాలను ఎక్సైజ్ సీఐ అశోక్ బుధవారం తనిఖీ చేశారు. దస్త్రాలు పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మద్యం విక్రయించాలని సూచించారు. నిబంధనలు పాటించని దుకాణాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

నేటి నుంచి మహిళా సర్పంచులకు శిక్షణ

జంగారెడ్డిగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: జంగారెడ్డిగూడెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జంగారెడ్డిగూడెం డివిజన్‌లోని మహిళా సర్పంచులకు మూడ్రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కృష్ణప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం నుంచి 5వ తేదీ వరకూ 'మార్పు ద్వారా విజేతలు-మహిళా సాధికారతతో సుపరిపాలన సాధ్యం' అనే అంశంపై శిక్షణ ఉంటుందన్నారు.

వ్యర్థానికీ ఓ అర్థం!

వాడిపడేసిన వస్తువులతో విద్యార్థినుల ప్రతిభ

వేలేరుపాడు, న్యూస్‌టుడే: వాడిన ప్లాస్టిక్ సీసాలు.. ప్యాకింగ్ కవర్లు.. ఐస్‌క్రీమ్ పుల్లలు, పుస్తకాలపై అట్టలు. ఇలా.. పనికిరాని వస్తువులను మనం బయట పడేస్తాం. కానీ భూదేవిపేట కస్తూర్బాగాంధీ విద్యాలయం విద్యార్థినులు వాటితో వివిధ ఆకృతులను తయారు చేస్తున్నారు. చదువుతో పాటు సృజనను వెలికితీసేందుకు అక్కడి ఉపాధ్యాయినులు ప్రత్యేక శ్రద్ధ చూపడంతో విరామ సమయంలో విద్యార్థినులు వీటిని రూపొందించి ఔరా.. అనిపించుకుంటున్నారు.

ఔరా అనేలా.. మండలంలోని భూదేవిపేట కస్తూర్బాగాంధీ విద్యాలయంలో ఆరు నుంచి పదో తరగతి వరకు ఉండగా, మొత్తం 200 మంది విద్యార్థినులు చదువుతున్నారు. వీరంతా కొన్నేళ్లుగా వృత్తి విద్యా ఉపాధ్యాయిని విజయలక్ష్మి పర్యవేక్షణలో వ్యర్థాలతో వివిధ రకాల అలంకరణ వస్తువులు తయారు చేస్తున్నారు. ఏ ఖర్చు లేకుండా కాగితాలు, ప్లాస్టిక్ సీసాలతో తమకు అందుబాటులో ఉన్న వాటితో టేబుల్‌పై పెట్టుకునే పూల కుండీలు, గుమ్మాలకు వేలాడే దండలు, గోడలపై అలంకరించే వస్తువులు తయారు చేసి అబ్బుర పరుస్తున్నారు. అంతేకాక వాడి పడేసిన ఎల్‌ఈడీ బల్బులతో కుందేళ్లు, దారంతో పూసల దండలు ఎంబ్రాయిడరీ, కుట్లు, అల్లికల్లో రాణిస్తున్నారు.

విద్యార్థినులకు శిక్షణ ఇస్తున్న ఉపాధ్యాయిని విజయలక్ష్మి

క్రమం తప్పకుండా.. నేను తొమ్మిదో తరగతి చదువుతున్నా. చదువుతో పాటు రోజూ సాయంత్రం 4 నుంచి 5.30 గంటల వరకు కుట్లు అల్లికలు, చిత్ర లేఖనం, చీరల పెయింటింగ్, నేర్చుకుంటున్నా. వేసవి సెలవుల్లో ఇంటి వద్ద ఖాళీగా ఉండకుండా చుట్టుపక్కల వారికి అల్లికలు, కుట్లు నేర్పించా. **- బి.హర్షిత**

స్వశక్తితో ఎదగాలని.. మాది కుక్కునూరు. ప్రస్తుతం పదో తరగతి చదువుతున్నా. కొత్త డిజైనింగ్ వస్తువులు తయారు చేయడం నేర్చుకున్నా. భవిష్యత్తులో ఉద్యోగం రాకపోయినా.. బాధపడకుండా స్వశక్తితో ఎదిగేందుకు ఇక్కడ నేర్చుకున్న కుట్లు, అల్లికలు ఉపయోగ పడతాయనుకుంటున్నా. **- వైష్ణవి**

హామీల అమలులో ప్రభుత్వాలు విఫలం: సీపీఐ

టి.నరసాపురం, న్యూస్‌టుడే, ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అన్నారు. మక్కినవారిగూడెంలో బుధవారం ఆ పార్టీ మండల మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. నిత్యావసర సరకుల ధరలు రోజురోజుకు పెరుగుతున్నాయన్నారు. అలాగే ప్రభుత్వ ఆస్తులను ప్రైవేటు పరం చేయాలని చూడటం తగదన్నారు. నాయకులు శ్రీనివాసరావు, సాగర్, వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కృష్ణచైతన్య

వరద నివారణ చర్యలు చేపట్టాలి: సీపీఎం

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముందస్తుగా గోదావరి వరద నివారణ చర్యలు తక్షణమే చేపట్టాలని సీపీఎం మండల కార్యదర్శి ధర్ముల రమేశ్ కోరారు. ఈ మేరకు తహసీల్దార్ డీవీ సత్యనారాయణకు బుధవారం వినతిపత్రం అందజేశారు. పునరావాస కాలనీల్లో నిత్యావసరాలు తదితర సౌకర్యాలను ముందుగానే ఏర్పాటు చేయాలన్నారు. నాయకులు మడివి దుర్గారావు, కమిటీ సభ్యులు కారం వెంకటరావు, ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వివాహిత ఆత్మహత్య

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన జంగారెడ్డిగూడెం మండలంలో బుధవారం చోటు చేసుకుంది. లక్కవరం ఎస్సై శశాంక కథనం మేరకు.. ద్వారకాతిరుమల మండలం కొమ్మర గ్రామానికి చెందిన నాగ వెంకటశిరీష(39)కు.. జంగారెడ్డిగూడెం మండలం టెక్కినవారిగూడేనికి చెందిన గౌతు వెంకటరామకృష్ణతో 19 ఏళ్ల కిందట వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులున్నారు. మంగళవారం వెంకటశిరీషకు.. ఆమె అత్తకు మధ్య చిన్న గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెందిన వెంకటశిరీష కలుపుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమెను జంగారెడ్డిగూడెంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ వెంకటశిరీష మంగళవారం రాత్రి మృతి చెందారు. దీనిపై మృతురాలి తండ్రి గంగాధరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద స్థితిలో మృతిగా బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

ఖాతాలో డబ్బు మాయంపై ఫిర్యాదు

వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: తన ఖాతాలోని డబ్బును బ్యాంకు మిత్రలు తీసుకున్నారని కాచారం గ్రామానికి చెందిన పూరెం చిన్నక్క వేలేరుపాడు గ్రామీణ బ్యాంకు మేనేజర్ మోహన్‌కు బుధవారం ఫిర్యాదు చేశారు. మే నెలలో డ్వాక్రా డబ్బులు ఎంత జమయ్యాయో తెలుసుకోవడానికి బ్రాంచ్‌కు సంబంధించిన బ్యాంకు మిత్రల వద్దకు వెళ్లామని, వేలి ముద్ర వేయించి తనకు తెలియకుండానే ఖాతా నుంచి రూ.5 వేలు తీసుకున్నారన్నారు. ఇటీవల డబ్బులు ఎంత ఉన్నాయో చూడగా.. విషయం వెలుగులోకి వచ్చిందని బాధితురాలు వాపోయారు. తన డబ్బులను ఇప్పించి, వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్థికసాయం అందజేత

ద్వారకాతిరుమల, న్యూస్‌టుడే: అట్టడుగున ఉన్న పేదల సాధికారత కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమం స్ఫూర్తితో పలువురు ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా ద్వారకాతిరుమలకు చెందిన తెదేపా నేత మొగతడకల ఓం ప్రకాష్ చౌదరి ముందుకొచ్చి రూ.25వేలు ఆర్థిక సాయం అందించారు. ఈ సొమ్మును చెక్కు రూపంలో స్థానిక ఎంపీడీవో ప్రకాష్‌కి బుధవారం అందజేశారు. సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థుల అవసరాల కోసం ఈ సొమ్మును ఇచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు. పాకనాటి శేషు తదితరులు పాల్గొన్నారు.

నాయకులు ప్రజల్లోనే ఉండాలి

కామవరపుకోట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రజలు మళ్లీ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డినే కోరుకుంటున్నారని ఏలూరు మాజీ ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. బుధవారం కళ్లచెర్వులో ఎంపీపీ మేడవరపు విజయలక్ష్మిని, స్థానిక నేతలను కలిసి పార్టీ పరిస్థితులపై చర్చించారు. పార్టీ నాయకులు ప్రజలతో కలిసి ఉండాలని సూచించారు. ఒకటి రెండు నెలల్లో పూర్తిస్థాయిలో పార్టీ అభివృద్ధికి, ప్రజలతో కలిసి సమస్యల సాధనకు పని చేస్తానన్నారు.

కుక్కునూరుకు సహకార సేవలు

పచ్చజెండా ఊపిన ఆప్కాబ్ ఛైర్మన్

కుక్కునూరు, న్యూస్‌టుడే: కుక్కునూరు మండలానికి సహకార సేవలు అందబోతున్నాయి. ఇందుకు సంబంధించి ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు స్థానిక కూటమి నేతలకు సమాచారం ఇచ్చారు. ప్రధానంగా వ్యవసాయ సీజన్ కావడంతో సహకార గిడ్డంగి ఏర్పాటు చేసి, ఎరువులు, విత్తనాలు, ఇతర వ్యవసాయ ఉపకరణాలు అందజేసే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే ఇందుకు సంబంధించి గోదామును ఎంపిక చేశారు.

వైకాపా వచ్చాక మంగళం.. 2022కు పూర్వం వరకూ ఇక్కడ సహకార సేవలు కొనసాగాయి. వైకాపా ప్రభుత్వం విలీన మండలాల్లో సహకార సేవలకు మంగళం పాడింది. రాష్ట్ర విభజన సమయానికి ఖమ్మం జిల్లా సహకార బ్యాంకు పరిధిలో కుక్కునూరు, వింజరం, రుద్రంకోట సహకార సంఘాలు ఉండేవి. విభజనలో అన్ని శాఖలను విలీనం చేసుకున్న ప్రభుత్వం సహకార బ్యాంకును మాత్రం చేసుకోలేదు. పరిమితికి మించి ఆ బ్యాంకు అప్పుల ఊబిలో కూరుకుపోవడంతో, ఏలూరు సహకార కేంద్ర బ్యాంకు విలీనం చేసుకోలేదు. కొన్నేళ్లపాటు అదే బ్రాంచి కొనసాగినా, చివరకు తెలంగాణ అధికారులు దాన్ని ఎత్తేశారు. ఆ తర్వాత వేగవరం సహకార బ్యాంకు పరిధిలో కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు సహకార సేవలు కొనసాగాయి. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ఆ సేవలను నిలిపివేసింది. దీంతో రైతులు ఎరువులు అధిక ధరలకు ప్రైవేటు వ్యాపారుల నుంచి కొనుగోలు చేసుకోవాల్సి వస్తోంది.

సహకార సేవల విషయమై స్థానిక తెదేపా అధ్యక్షుడు నాగేశ్వరరావు చొరవ తీసుకుని ఎంపీ మహేశ్‌యాదవ్, ఎమ్మెల్యే బాలరాజు, ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు ద్వారా ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని దృష్టికి తీసుకువెళ్లి, రైతులు పడుతున్న ఇబ్బందులను వివరించారు. దీంతో సహకార సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆయన సహకారశాఖ అధికారులను ఆదేశించారు. దీంతో ఇక్కడ ఒక సెక్రటరీని ఏర్పాటు చేసి కార్యకలాపాలు జరుపనున్నారు.

గొలుసు దుకాణంపై దాడి

టి.నరసాపురం, న్యూస్‌టుడే, మండలంలోని ప్రకాశ్‌నగర్‌లో గొలుసు దుకాణంపై చింతలపూడి ఎక్సైజ్ పోలీసులు బుధవారం దాడి చేశారు. మద్యం విక్రయిస్తున్న శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసి, అతని వద్ద నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ అశోక్ తెలిపారు.

తెదేపా నాయకుడి మృతికి సంతాపం

టి.నరసాపురం, న్యూస్‌టుడే: తెదేపా టి.నరసాపురం గ్రామ కమిటీ ఉపాధ్యక్షుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి సందేపూడి సాయి ప్రభాకర్(57) మంగళవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఆయన భౌతికదేహాన్ని ట్రైకార్ ఛైర్మన్ బొరగం శ్రీనివాసులు, తెదేపా నాయకులు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

ఆక్రమణల తొలగింపు

కామవరపుకోట, న్యూస్‌టుడే: సాగిపాడు పంచాయతీ పరిధిలో మురుగు కాలువల్లో పూడిక తొలగింపునకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు కార్యదర్శి బి.బాలాజి తెలిపారు. బుధవారం సాగిపాడు ప్రధాన రహదారి పక్కన ఆక్రమణలు పొక్లెయిన్ సాయంతో తొలగించారు. పనులను సర్పంచి గోగు సుబ్బారావు పర్యవేక్షించారు.



పల్లె బాట పట్టిన అధికారులు

పారిశుద్ధ్యం, రహదారుల పరిశీలన

కొయ్యలగూడెం గ్రామీణ, న్యూస్‌టుడే: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పన దిశగా అధికారులు బుధవారం పల్లెబాట పట్టారు. మెరుగైన పారిశుద్ధ్య నిర్వహణపై దృష్టి సారించారు. గ్రామాల్లోని అనుసంధాన రహదారులకు మోక్షం కలగనుంది. దశాబ్దాల కిందట ప్రజలకు తాగునీటిని అందించిన చేతిపంపులకు పునర్వైభవం కలగనుంది. ఈ మేరకు ఇటీవల ఉన్నతాధికారుల ఆదేశాలతో క్షేత్ర పర్యటనల్లో నిమగ్నమయ్యారు. ● వర్షాకాలంలో ప్రజారోగ్యం దృష్టిలో ఉంచుకుని గ్రామాల్లోని రహదారుల వెంబడి పేరుకున్న చెత్త నిల్వలను తొలగించనున్నారు. ఆ చెత్తను సమీపంలోని సంపద తయారీ కేంద్రాలకు తరలించనున్నారు. ఈ మేరకు ఏ గ్రామంలో ఎంత పరిమాణంలో చెత్త నిల్వలు పేరుకున్నాయన్న విషయమై క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శులకు దిశానిర్దేశం చేస్తున్నారు. ● పంచాయతీరాజ్ పరిధిలోని అనుసంధాన రహదారుల పరిస్థితి సంబంధిత ఏఈలు పరిశీలన చేస్తున్నారు. ఆ రహదారులకు మరమ్మతులు చేయాలా లేక కొత్తగా నిర్మించాలా అన్న విషయమై ప్రభుత్వానికి నివేదికలు అందజేయనున్నారు. ● ఆర్‌డబ్ల్యూఎస్ పర్యవేక్షణలోని చేతిపంపుల ప్రస్తుత పరిస్థితిని వివరిస్తూ.. నివేదికలను ఆ శాఖ ఏఈలు అందజేయాల్సి ఉంది. రక్షిత మంచినీటి పథకం కుళాయిల వాడకం పెరిగిన నేపథ్యంలో చాలాచోట్ల చేతిపంపుల వినియోగం లేకపోవడంతో పాడైన వాటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకురానున్నారు.

నరసన్నపాలెం: పేరుకున్న చెత్తను పరిశీలిస్తున్న అధికారులు

ప్రభుత్వానికి నివేదికలు.. మూడు రోజుల వ్యవధిలో గ్రామాల్లో పర్యటించి నివేదికలను ప్రభుత్వానికి అందజేయాల్సి ఉందని కొయ్యలగూడెం ఎంపీడీవో కె.కిరణ్‌కుమార్ తెలిపారు. పంచాయతీరాజ్ ఏఈ సురేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మురళీకృష్ణలతో కలిసి బయ్యనగూడెం, నరసన్నపాలెం, సీతంపేట, రామానుజపురం తదితర గ్రామాల్లో పరిశీలన పూర్తి చేశామన్నారు.

కొయ్యలగూడెం మండలంలో.. పంచాయతీలు : 17 అనుసంధాన రహదారులు: 30 చేతిపంపులు: 124

(c) eenadu

నూజివీడు

• నూజివీడు • కైకలూరు

స్వచ్ఛ గ్రామాలు సాధిద్దాం రండి: డీపీవో

పారిశుద్ధ్యంపై సిబ్బందితో మాట్లాడుతున్న అనూరాధ

కలిదిండి, న్యూస్‌టుడే: చెత్త రహితంగా గ్రామాలను అభివృద్ధి చేస్తూ స్వచ్ఛత సాధించడంలో ప్రజలంతా భాగస్వాములు కావాలని జిల్లా పంచాయతీ అధికారిణి కె.అనూరాధ పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం కలిదిండి గ్రామ పంచాయతీలో పారిశుద్ధ్య పనుల నిర్వహణ తీరును ఆకస్మికంగా సందర్శించారు. ప్రధాన కూడళ్లలో ఎక్కడా చెత్త డంప్ చేయొద్దని, సేకరించిన చెత్తంతా డంపింగ్ యార్డుకు తరలించాలని పారిశుద్ధ్య కార్మికులకు సూచించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల ప్రభావం ఎక్కువ ఉంటుందని ప్రతి ఒక్కరు తమ నివాసాల చెంత పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి సంపద కేంద్రాలను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కలిదిండి, ఎస్సార్పీ అగ్రహారం పంచాయతీ ఈవోలు ఉదయ్‌కుమార్, ఆనందభూషణం, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి ఇంటి నుంచి చెత్త సేకరించాలి

చెత్త సేకరణ పరిశీలిస్తున్న సత్యనారాయణ

ముసునూరు, న్యూస్‌టుడే: రోజూ ప్రతి ఇల్లు, వీధుల నుంచి తడి, పొడి చెత్తను వేరు చేసి తప్పకుండా సేకరించి సంపద కేంద్రానికి తరలించాలని ఇన్‌ఛార్జి ఎంపీడీవో బీవీ సత్యనారాయణ ఆదేశించారు. బుధవారం ముసునూరులో సిబ్బంది ఇంటింటా చెత్త సేకరించే విధానాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి పంచాయతీలో ఉన్న సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలన్నారు. కార్యదర్శులు, సర్పంచులు ఈ కార్యక్రమాలను నిత్యం పర్యవేక్షించాలని సూచించారు. కార్యదర్శి ఆరేపల్లి వెంకటేశ్వరావు పాల్గొన్నారు.

భవిత కేంద్రాలతో భరోసా

చిన్నారికి ఫిజియోథెరపీ

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ప్రత్యేక అవసరాల చిన్నారులకు భవిత కేంద్రాలతో భరోసా లభిస్తుందని ఎంఈవో కె.ఆనంద్ కుమార్ తెలిపారు. ఆగిరిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలోని భవిత కేంద్రంలో ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు బుధవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఫిజియో థెరపిస్ట్ జె.ప్రశాంతి చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి వారికి అవసరమైన సూచనలు చేశారు. ఈ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

శుద్ధ జలం.. పచ్చి అబద్ధం

కుళాయిల్లో మురుగు నీరే దిక్కు

కైకలూరు, న్యూస్‌టుడే: నియోజకవర్గ కేంద్రమైన కైకలూరు పట్టణంలో తాగునీటి కోసం ప్రజలకు కష్టాలు తప్పడం లేదు. రక్షిత తాగునీటి పథకం నుంచి కొన్ని రోజులుగా రంగు మారిన నీరు సరఫరా చేస్తున్నారని ప్రజలు వాపోతున్నారు. ఒక్కొక్కసారి చెరువు నుంచి నేరుగా మురుగు నీరు విడుదలవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీ పరిధిలోని 20 వార్డుల్లో 40 వేల మంది జనాభా ఉన్నారు. అధిక శాతం కుళాయిల నుంచి వచ్చే నీటినే తాగేందుకు వినియోగిస్తున్నారు. నీరు దుర్వాసన వెదజల్లుతూ కనీసం గృహావసరాలకు ఉపయోగపడటం లేదని ప్రజల వాదన. బ్రహ్మంగారి గుడివీధి, వైఎస్సార్ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, కొత్తపేట, గాంధీ బొమ్మ కూడలిలోని పలు వార్డుల్లో నాలుగు రోజులుగా మురుగు నీరే దిక్కైందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. నడవలేని స్థితిలో ఉన్న వృద్ధులు, దివ్యాంగులు, ఎక్కువ రోజులు గత్యంతరం లేక ఆ నీటినే వాడుకోవాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు.

బ్రహ్మంగారి గుడివీధిలో సరఫరా అయిన రంగు మారిన నీరు

అడుగంటిన చెరువులు.. కైకలూరు గ్రామ పంచాయతీకి సుమారు 40 ఎకరాలు విస్తీర్ణం కలిగిన మూడు చెరువులు అందుబాటులో ఉన్నాయి. గత వేసవిలో కొన్ని చెరువులకు పూర్తి స్థాయిలో నీరు నింపకపోవడంతో ప్రస్తుతం చెరువుల్లో నీరు అడుగంటింది. దీంతో ప్రజావసరాలకు అనుగుణంగా నీటిని వంతుల వారీగా విడుదల చేస్తున్నారు. ఆ నీటిలో కనీసం బ్లీచింగ్ కలిపి క్లోరినేషన్ చేయడంలో సిబ్బంది అశ్రద్ధ వహించడంతో ప్రజలకు నీటి ఇక్కట్లు తప్పడం లేదు. దీనిపై పంచాయతీ ఈవో వై.ప్రసాద్‌ను సంప్రదించగా.. తాగునీటి సమస్య పరిష్కారంపై ఇప్పటికే సిబ్బందికి సూచించానని.. ఫిల్టర్ బెడ్లు మెరుగు పరిచి శుద్ధి చేసిన జలాన్నీ ప్రజలకు సరఫరా చేస్తామన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నూజివీడు	:80085 74698	కైకలూరు	:73060 88555
ముసునూరు	:93983 81268	కలిదిండి	:90594 84862

కైకలూరు, న్యూస్‌టుడే: ? కైకలూరు పెద్ద మసీదు వెనుక వీధిలో కొన్నిరోజులుగా చెత్త సేకరణ చేయడం లేదు. పశువులు చెత్తను రోడ్డుపై చెల్లాచెదురు చేస్తున్నాయి. **-శ్రీను, కైకలూరు**

✔ వెంటనే వ్యర్థాలను తొలగిస్తాం. **-వై.ప్రసాద్ పంచాయతీ ఈవో**

ముసునూరు, న్యూస్‌టుడే: ? గుళ్లపూడి నుంచి లోపూడి వైపు వెళ్లే రహదారి అధ్వానంగా తయారైంది. నిత్యం ఈ దారిలో వందలాది వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. కొన్నేళ్ల నుంచి రహదారికి మరమ్మతులు చేయకపోవడంతో పెద్ద పెద్ద గోతులు ఏర్పడ్డాయి. ప్రయాణం చేయలేకున్నాం. **-ఆర్.రాజు, గుళ్లపూడి**

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **-బాబూరావు ఆర్అండ్‌బీ, డీఈ**

‘అభివృద్ధి సాధిస్తూ హామీలన్నీ నెరవేరుస్తాం’

ముసునూరు మండలం చెక్కపల్లిలో కరపత్రం అందిస్తున్న నాయకులు

కైకలూరు, న్యూస్‌టుడే: వైకాపా అరాచకాలకు చరమగీతం పాడి కూటమి ప్రభుత్వం సుపరిపాలనతో ప్రజలకు మరోసారి స్వాతంత్ర్యం కల్పించిందని తెదేపా నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అన్నారు. రాష్ట్ర పర్యాటక, ఆర్య వైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ కొడాలి వినోద్, వీజీఎస్ మల్లేశ్వరి, తెదేపా మండలాధ్యక్షుడు పి.త్రినాథరావు, పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం కైకలూరు పట్టణంలో ‘సుపరిపాలనలో తొలి అడుగు’ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందించి ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించి, వారి సమస్యలు తెలుసుకున్నారు.

ముదినేపల్లి, న్యూస్‌టుడే: కూటమి పాలనలో రాష్ట్రం ప్రగతి బాటలో సాగుతుందని, అన్ని వర్గాలకు న్యాయం జరుగుతుందని రాష్ట్ర పర్యాటకాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కొడాలి వినోద్ అన్నారు. వడాలిలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు.

ముసునూరు, న్యూస్‌టుడే: ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని కూటమి ప్రభుత్వం అమలు చేస్తుందని పార్టీ మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు అన్నారు. బుధవారం ముసునూరు మండలం కాట్రేనిపాడు, చెక్కపల్లి, వలసపల్లి, చింతలవల్లి గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు పేరుతో ఇంటింటా కార్యక్రమం నిర్వహించారు.

మండవల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం తోనే రాష్ట్రానికి సుపరిపాలన అందుతుందని నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు పేర్కొన్నారు. మండవల్లి, కొవ్వాడలంక, మణుగునూరు, కూటమి ప్రభుత్వ అభివృద్ధిని ప్రజలకు వివరించారు. రానున్న నాలుగేళ్లలో రాష్ట్ర అభివృద్ధికి మరింత ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని వివరించారు. మండల పార్టీ అధ్యక్షుడు నారగాని నాగేశ్వరరావు, సత్తిబాబు, మురళీకృష్ణ, కోటేశ్వరరావు, చందు, గణేశ్ పాల్గొన్నారు.

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: సుపరిపాలనే ధ్యేయంగా సీఎం చంద్రబాబు పాలన సాగిస్తున్నారని మండల తెదేపా అధ్యక్షుడు నక్కనబోయిన వేణు తెలిపారు. ఆగిరిపల్లి మండలం శోభనాపురంలో ‘సుపరిపాలనలో తొలి అడుగు’ కార్యక్రమాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇంటింటా ప్రచారంలో పాల్గొని కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఉదయం తెదేపా నాయకుడు దొండపాటి ఏసుపాదం, కొమ్మూరి రాజశేఖర్ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు.

చాట్రాయి, న్యూస్‌టుడే: సుపరిపాలనతో మెరుగైన పాలనను అందిస్తూ ఎన్నికల హామీలను అమలు చేస్తున్నట్లు జిల్లా తెదేపా అధికార ప్రతినిధి మందపాటి బసవా రెడ్డి తెలిపారు. చాట్రాయిలో సుపరిపాలన బుధవారం నిర్వహించారు. మాజీ సర్పంచి కోట జోషిబాబు పర్యటించారు.

ప్రజా సేవలో భాగస్వాములకు అభినందనలు

వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారథి

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: మండలంలోని పల్లెర్లమూడిలో తెదేపా నాయకులు డి.కృష్ణమోహన్ దావులూరి ఫౌండేషన్ ద్వారా రూ.8.50 లక్షలతో నిర్మించిన మినరల్ వాటర్ ప్లాంట్, బస్ షెల్టర్‌ను రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ప్రారంభించారు. ఈ సందర్భంగా కొలుసు మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కారం నిమిత్తం ప్రజలకు నామమాత్రపు రుసుముతో ఈ సౌకర్యం కల్పించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శిరీష, నాయకులు కాపా శ్రీనివాసరావు, అట్లూరి రమేష్, అక్కినేని సతీష్, వల్లభనేని భాస్కర్, గోగినేని మధు, పొట్లూరి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి.. సమస్యలున్నాయి.. తమరు దయతో పరిష్కారం చూపాలని పలువురు ప్రజలు మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకుని వెళ్లారు. స్పందించిన ఆయన అక్కడికక్కడే సంబంధిత అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు ఇచ్చి పరిష్కారం చూపాలని కోరారు. బుధవారం నూజివీడు మండలంలోని పల్లెర్లమూడి, సీతారామపురం, మీర్జాపురం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు గ్యాస్ బండల నగదు రావడం లేదని, గృహనిర్మాణం పూర్తి కాలేదని, ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నామని, రెవెన్యూ భూములకు సంబంధించి సమస్యను, రహదార్ల ఆక్రమణలు తదితరాలను ఆయన దృష్టికి తీసుకుని వచ్చారు. అనంతరం ఆయా గ్రామాల్లో మంత్రి మాట్లాడుతూ ప్రజల ఆశలు ఆకాంక్షలు తీర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. నూజివీడు నియోజకవర్గంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శిరీష, మండల తెదేపా అధ్యక్షులు యనమదల శ్రీనివాసరావు(వాసు), సర్పంచి పులపాక సౌమ్యరేఖ, గ్రామ పార్టీ అధ్యక్షులు యనమదల సిద్ధయ్య, మీర్జాపురంలో వైస్ ఎంపీపీ డి.స్వర్ణలత, సర్పంచి గోళ్ల పద్మ, పార్టీ గ్రామ అధ్యక్షుడు మరీదు గాంధీ, మందపాటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఈసారైనా నిగ్గు తేల్చేనా..?

మరోసారి పెయ్యేరు పంచాయతీపై విచారణకు ఆదేశం

ముదినేపల్లి, న్యూస్‌టుడే: పెయ్యేరు పంచాయతీలో నిధులు దుర్వినియోగం, అవినీతి, అక్రమాలపై మరోసారి విచారణకు అధికారులు ఆదేశాలు ఇచ్చారు. పంచాయతీలో 2019-2020 ఆర్థిక సంవత్సరం నుంచి 2023 వరకు పంచాయతీ నిధులు వినియోగం, వ్యక్తిగత కుళాయిల సొమ్ములో భారీ అవకతవకలు జరిగాయని 2023లో గ్రామానికి చెందిన పలువురు ఫిర్యాదు చేశారు. దానిపై అప్పటి పంచాయతీ అధికారి ఆదేశాలు మేరకు అధికారుల బృందం పర్యటించి విచారణ నిర్వహించింది. ఆ నివేదిక బయట పెట్టలేదు. దీనిపై ఫిర్యాదుదారులు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. అయినా అధికారులు విచారణ నివేదికను న్యాయస్థానానికి సైతం అందించకపోవడంతో పలు అనుమానాలు రేకెత్తుతున్నాయి.

10న ఆధారాలతో రండి.. అక్రమాలు, నిధులు దుర్వినియోగంపై తిరిగి గ్రామానికి చెందిన దూబ చంద్రకాంత్, షేక్ అల్లాభక్షు, రెడ్డి వెంకటేశ్వరరావులు పీజీఆర్ఎస్‌లో ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన జిల్లా పంచాయతీ అధికారిణి అనురాధ విచారణకు ఆదేశించారు. జంగారెడ్డిగూడెం డీఎల్పీవోను విచారణ అధికారిగా నియమించారు. ఈ నెల 10న నిర్వహించే విచారణకు ఫిర్యాదుదారులు తమవద్ద ఉన్న ఆధారాలతో, అప్పుడు పనిచేసిన పంచాయతీ కార్యదర్శులు హాజరు కావాల్సిందిగా ఆమె ఆదేశించారు. దీంతో ఈ విచారణతోనైనా నిజాలు నిగ్గుతేలతాయా..? దుర్వినియోగం, అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుని వాటిని రికవరీ చేస్తారా..లేదా అనేది చర్చనీయాంశంగా మారింది.

తెదేపా మండలాధ్యక్ష పదవికి పోటీ

కలిదిండి, న్యూస్‌టుడే : కలిదిండి తెదేపా మండలాధ్యక్ష పదవికి పోటీ ఏర్పడింది. మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షుడు వల్లభనేని శ్రీనివాసచౌదరి(నాని), తెలుగు యువత నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి నున్న సుబ్రహ్మణ్యం అధ్యక్ష పదవికి పోటీ పడ్డారు. క్లస్టర్, బూత్ ఇన్‌ఛార్జులు, కార్యదర్శులతో పాటు ఓటు హక్కు కలిగిన నేతలు ఓటింగ్ పాల్గొన్నారు. మండల ప్రధాన కార్యదర్శిగా బండి తులసీరావు ఒక్కరే పోటీలో నిలిచారు. తెదేపా నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్సీ కమ్మిలి విఠల్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మామిళ్లపల్లి పార్థసారథి, మెంటే పార్థసారథి, పెద్దిబోయిన శివప్రసాద్, కోళ్ల నాగేశ్వరరావు తదితరులు పరిశీలకులుగా వ్యవహరించారు.

పారిశుద్ధ్య సామగ్రి పంపిణీ

నూజివీడు రూరల్, న్యూస్‌టుడే: నియోజకవర్గంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు బుధవారం చీపుర్లు, ఫినాయిల్, సబ్బులు సీడీపీవో పి.విజయకుమారి పంపిణీ చేశారు. 319 కేంద్రాలకు వీటిని అందిస్తామని సీడీపీవో పేర్కొన్నారు. కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి ఆలయానికి వెళ్లే మార్గం

గుడికెళ్లే లోపే దేవుడు కనిపిస్తున్నాడు!

భక్తుల పాట్లు ఎవరికీ పట్టడం లేదు. గుడికి వెళ్లి భగవంతుడితో కష్టాలు చెప్పుకొందామంటే దారులు దారుణంగా తయారయ్యాయి. మేజర్ పంచాయతీ కోరుకొల్లులోని శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, పార్వతీ సమేత సోమేశ్వరస్వామివారి ఆలయాలకు వెళ్లే మార్గాలు పూర్తిగా పాడయ్యాయి. రోజూ ఆలయాలకు వెళ్లే భక్తులు అధ్వాన దారితో అవస్థలు పడుతున్నారు. వీటికి కనీసం మరమ్మతులైన చేసే నాథుడు లేక నిత్యం నరకం అనుభవిస్తున్నామని వాపోతున్నారు. ఇప్పటి వరకు ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని పంచాయతీరాజ్ ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. **- న్యూస్‌టుడే, కలిదిండి**

నీటి కుంట.. లక్ష్యం చేరలేదంట..!

చొప్పరమెట్లలో పంట కుంటను పరిశీలిస్తున్న డ్వామా పీడీ సుబ్బారావు

నూజివీడు, న్యూస్‌టుడే: భూగర్భ జలాలు పెంచడమే ప్రధాన లక్ష్యంగా కూటమి ప్రభుత్వం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద రైతుల పొలాల్లో నీటి కుంటల తవ్వకాలకు చర్యలు తీసుకుంది. ఈ ఏడాది వర్షాకాలం లోపు నియోజకవర్గంలో 1,362 ఏర్పాటు చేయాలని లక్ష్యం విధించగా 983 నీటి కుంటలు మంజూరు చేశారు. అయితే ఇప్పటివరకు నియోజకవర్గంలో 551 మాత్రమే నీటి కుంటలు పూర్తి చేశారు.

మండలం	పంచాయతీలు	నీటి కుంటల లక్ష్యం	మంజూరు	పూర్తయినవి
నూజివీడు	29	435	179	50
ఆగిరిపల్లి	25	400	274	192
ముసునూరు	16	240	238	173
చాట్రాయి	18	287	292	136

పంటలకు ఉపయోగం.. పలు గ్రామాల్లో పంట కుంటలు లేకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు నీరంతా వృథా అవుతోంది. పలు ప్రాంతాల్లో కనీస నిల్వలు ఉండటం లేదు. దీంతో రైతులకు అవగాహన కల్పించి నీటి కుంటలు తవ్వించాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. క్షేత్రస్థాయిలో సిబ్బంది గ్రామాలకు వెళ్లి రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. పొలాల వద్ద పంట కుంటలు తవ్వితే మేలని, భూగర్భ జలాలు పెరుగుతాయని వివరిస్తున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం... పంట కుంటలను పొలాల వద్ద తవ్వుకుంటే ప్రయోజనం కలుగుతుందని అవగాహన కల్పిస్తున్నాం. దీనిపై మండల, క్షేత్ర స్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహిస్తున్నాం. లక్ష్యం మేర నీటి కుంటలు రైతులతో తవ్వించే విధంగా చర్యలు తీసుకుంటాం. **- శ్రీదేవి, ఏపీడీ, నూజివీడు.**

శిథిలావస్థలో తాగునీటి ట్యాంకు

పందిరిపల్లెగూడెంలో ప్రమాదకరంగా ఇలా..

కైకలూరు, న్యూస్‌టుడే: కైకలూరు మండలం కొల్లేటిలంక గ్రామమైన పందిరిపల్లెగూడెంలో రక్షిత తాగునీటి సరఫరా ట్యాంకు శిథిలావస్థకు చేరింది. పిల్లర్ల సిమెంటు పెచ్చులు ఊడి పడుతూ ఇనుప చువ్వలు బయటకు చొచ్చుకు వస్తున్నాయి. 40 వేల లీటర్ల నీటి నిల్వ సామర్థ్యం కలిగిన ఈ ట్యాంకును సుమారు 30 ఏళ్ల కిందట నిర్మించారు. పందిరిపల్లెగూడెంతో పాటు కొల్లేటికోట, లక్ష్మీపురం గ్రామాల్లో సుమారు 5 వేల మంది జనాభాకు ఇక్కడ నుంచే తాగునీరు సరఫరా అవుతోంది. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ట్యాంకు అడుగు భాగాన సిమెంటు పూర్తిగా తొలగిపోయి ఇనుప చువ్వలతో ప్రమాదకరంగా కనిపిస్తోంది. మూడు గ్రామాలకు ఆధారమైన రక్షిత నీటి ట్యాంకు స్థానంలో నిల్వ సామర్థ్యం ఎక్కువగా ఉండే నూతన ట్యాంకు నిర్మించాలని గ్రామస్థులు కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి వై.ప్రసాద్‌ను వివరణ కోరగా.. పరిస్థితిని పరిశీలించి నూతన ట్యాంకు ఏర్పాటుకోసం ఉన్నతాధికారులకు నివేదిస్తానని తెలిపారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

గురజ హైస్కూల్‌లో పంపిణీ చేస్తున్న కిట్లు

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య లభిస్తుందని, ప్రభుత్వం కల్పిస్తున్న అనేక వసతులు, పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తెదేపా నియోజకవర్గ కన్వీనర్ వీరమల్లు నరసింహారావు కోరారు. మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం సర్వేపల్లి రాధాకృష్ణ విద్యా కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు వీరిశెట్టి కొండ, అడుసుమిల్లి రాము, తదితరులు పాల్గొన్నారు.

రాత పుస్తకాలు, బ్యాగుల అందజేత

చాట్రాయి, న్యూస్‌టుడే: సి.గుడిపాడు ఉన్నత పాఠశాలలో 105 మంది, బీసీ ఏరియాలో 35 మంది, దళితవాడలో 40 మంది విద్యార్థులకు స్నేహా ఫౌండేషన్ సంస్థ సమన్వయకర్తలు వెంకటేశ్వర రెడ్డి, యోగేంద్రరెడ్డిలు బుధవారం విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచి విస్సంపల్లి ప్రశాంతి, విద్యా కమిటీ ఛైర్మన్ అల్లాడ నాగరాజు, ప్రధానోపాధ్యాయులు సేకు బక్కయ్య, పిల్లి జయరాజు, గోల్లపల్లి వెంకటేశ్వరరావు ఉపాధ్యాయులు కూటమి నాయకులు నోబుల్ రెడ్డి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం

మండవల్లిలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహచరులు, నాయకులు

మండవల్లి, న్యూస్‌టుడే: మండవల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీలలో వేరే ప్రాంతాలకు వెళ్లిన ఉపాధ్యాయులను సహచరులు, నాయకులు బుధవారం సన్మానించారు. ఉపాధ్యాయులతోనే విద్యార్థుల భవిష్యత్తుతోపాటు దేశ భవిష్యత్తు మారుతుందని తెలిపారు. మండవల్లి హెచ్.ఎం. ప్రసాద్‌తోపాటు మరో 15 మంది ఉపాధ్యాయులను దుశ్శాలువలతో అభినందించారు. ఇందులో సర్పంచి మెండా ఝాన్సీ, ముళ్లపూడి సత్తిబాబు, సురేశ్‌బాబు, విద్యాకమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఉన్నతమైనది ఉపాధ్యాయ వృత్తి.. ముదినేపల్లి, న్యూస్‌టుడే: గురజ జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో జీవశాస్త్రం ఉపాధ్యాయుడు చింతల వెంకట పాండురంగారావు ఉద్యోగ విరమణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఇందులో పలువురు మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి మహోన్నతమైనదని, 30 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తి నిర్వహించి దానికే వన్నె తెచ్చారన్నారు. అనంతరం పాండురంగారావు దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. మాజీ సర్పంచి కామినేని వెంకటేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జె.సునీత తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లిలో రైతుబజారు ఏర్పాటు చేయాలి

ముదినేపల్లి, న్యూస్‌టుడే: ముదినేపల్లిలో రైతు బజారు ఏర్పాటు చేయాలని అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి కోరారు. ముదినేపల్లిలో బుధవారం ఆమె మాట్లాడుతూ మండలంలో రైతుబజారు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. అలాగే కూరగాయలు పండిస్తున్న కొర్రగుంటపాలెం, రాజానగరం, చిగురుకోట, చినకామనపూడి, పెదకామనపూడి రైతులు వాటిని గుడివాడ వరకు తీసుకువెళ్లి విక్రయించుకోవాల్సి వస్తుందన్నారు. దీనిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతుబజారు ఏర్పాటుకు కృషి చేస్తానని వివరించారు.

యాజమాన్య పద్ధతులతో పంటలకు మేలు

ముసునూరు, న్యూస్‌టుడే: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి, రైతులకు సాగులో మెలకువలు నేర్పించి, తద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించడమే పొలం పిలుస్తోంది కార్యక్రమం ఉద్దేశమని మండల వ్యవసాయాధికారి ఎ.చాముండేశ్వరి అన్నారు. బుధవారం ముసునూరు మండలం కాట్రేనిపాడులో రైతులకు పలు సూచనలు చేశారు. విత్తనశుద్ధి చేసుకోవాలని, వ్యవసాయంలో యాజమాన్య పద్ధతులు, రాయితీ విత్తనాలు, పంటల బీమా తదితరాలు వివరించారు.

తాగునీరు అందించడమే ధ్యేయం

తాగునీటి పరీక్షల తీరును పరిశీలిస్తున్న ఎంపీడీవో భార్గవి

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: ప్రజలకు శుద్ధి చేసిన తాగునీటిని అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీడీవో బి.భార్గవి స్పష్టం చేశారు. ఆగిరిపల్లిలో తాగునీటి ట్యాంకుల వద్ద తాగునీటి పరీక్షల తీరును ఎంపీడీవో బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రజలకు శుద్ధమైన తాగునీటిని అందించాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులదేనని అన్నారు. వర్షాకాలంలో తాగునీరు కలుషితమయ్యే ప్రమాదం ఉందని, తాగునీటి ట్యాంకులు తరచుగా క్లోరినేషన్ చేయించాలని, ప్రతి సచివాలయ పరిధిలో తాగునీటి పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఎంపీడీవో హెచ్చరించారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అర్జున్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు

నూజివీడు పట్టణం

సత్యనారాయణ	మార్గన్
సత్యనారాయణ మినీ	---------
ద్వారక సినిమాస్ స్క్రీన్ 1	కన్నప్ప
ద్వారక సినిమాస్ స్క్రీన్ 2	కుబేర
ద్వారక సినిమాస్ స్క్రీన్ 3	ఎఫ్ I ద మూవీ
ఆగిరిపల్లి: శ్రీఅను డీలక్స్	ఓదెల 2
కైకలూరు: విజయలక్ష్మి జీ3	కన్నప్ప
మాగంటి సినిమాస్	మార్గన్
శ్రీవెంకటరమణ సినిమాస్	కుబేర
ముదినేపల్లి: పూర్ణిమ	కుబేర

పాల సేకరణ సంఘంలో సమసిన వివాదం

లక్ష్మణరావుతో మాట్లాడుతున్న మేనేజర్ సాంబశివమూర్తి, చిత్రంలో రామచంద్రరావు

చాట్రాయి, న్యూస్‌టుడే: చీపురుగూడెం పాల సేకరణ సంఘంలో అవినీతిపై తెదేపా నాయకుడు బొట్టు లక్ష్మణరావు చేపట్టిన నిరహార దీక్ష చర్చల అనంతర విరమించారు. పాల శీతలీకరణ కేంద్ర మేనేజర్ సాంబశివమూర్తి బుధవారం చీపురుగూడెం వచ్చి లక్ష్మణరావుతో చర్చలు జరిపారు. ఆయన సంఘంలో నిధుల వినియోగంపై వేసిన ప్రశ్నలకు సమాధానం చెప్పగా ఇరువురి నడుమ వాదనలు జరిగాయి. చర్చలు సఫలం కాగా లక్ష్మణరావుకు మేనేజర్ నిమ్మ రసాన్ని అందించారు. కేంద్రం పాల తూకం యంత్రాన్ని మార్చేందుకు అంగీకరించారు. నిధుల వినియోగంలో పూర్తి స్థాయిలో సమాచారం ఇస్తామని హామీ ఇచ్చారు. శివారు గ్రామమైన మంగపేటలో కొత్త సేకరణ సంఘాన్ని ఏర్పాటుకు నిర్ణయించారు. జిల్లా మిల్క్ యూనియన్ డైరెక్టర్ బొట్టు రామచంద్రరావు, సూపర్‌వైజర్లు నరసింహారావు, శివ నాగేశ్వరరావు, కె.ప్రసాద్, ఎంపీటీసీ సభ్యురాలు మోరంపూడి స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ విద్యార్థులకు నగదు పురస్కారం

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: విద్యతో ఉజ్వల భవిత సాధ్యమవుతుందని ఎంఈవో కె.ఆనంద్ కుమార్ తెలిపారు. ఆగిరిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ ఏడాది పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి జూలూరు బాపనయ్య గుప్తా జ్ఞాపకార్థం ఆయన కుమారుడు స్వరాజ్ కిశోర్ అందించిన నగదు పురస్కారాలను శోభనాచల గుప్తా విద్యార్థులకు బుధవారం అందజేశారు. కార్యక్రమంలో జూలూరు చంద్రమౌళీశ్వరరావు, పి.చంద్రశేఖర్, ఎం.గోపాలకృష్ణ, చలవాది వెంకటరత్నం, వై.చంద్రశేఖర్, కె.సతీశ్, ప్రధానోపాధ్యాయురాలు పి.పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి వితరణ

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: గ్రంథాలయానికి దాతల సహకారం అభినందనీయమని ఎంఈవో కె.ఆనంద్ కుమార్, గ్రంథాలయాధికారి డి.నాగేశ్వరరావులు తెలిపారు. ఆగిరిపల్లి శాఖా గ్రంథాలయానికి జూలూరి రంగారావు, స్వరాజ్యలక్ష్మిల జ్ఞాపకార్థం వారి కుమారుడు శోభనాచల గుప్తా 100 పుస్తకాలు, ఒక వాటర్ కూలర్ వితరణగా అందజేశారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం : దేవదాయ - ధర్మదాయ శాఖ

శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానం

కలిదిండి గ్రామం, కలిదిండి మండలం, ఏలూరు జిల్లా

చేపల చెరువు నందు చేపలు పెంచుకొను లైసెన్స్ హక్కునకు టెండర్ - కం - బహిరంగ వేలం ప్రకటన

ఏలూరు జిల్లా, కలిదిండి మండలం, కలిదిండి గ్రామంలో వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానమునకు చెందిన ఈ క్రింది షెడ్యూలు దాఖలా కలిదిండి మండలం సానారుద్రవరము గ్రామంలో గల రీ.సర్వే నెం. 485 లు య. 19.35 సెంట్లు చేపల చెరువులో చేపలు పెంచుకొనే లైసెన్స్ నిమిత్తం మూడు సంవత్సరాలు అనగా 2025-26 నుండి 2027-28 వరకు సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం పాట G.O.M.S. No. 426, Revenue (దే॥ద॥శాఖ) డిపార్ట్‌మెంట్ తేదీ. 9-11-2015 అనుసరించి దే॥ద॥శాఖ అధికారుల సమక్షంలో నిర్వహించబడును.

వ. నెం.	భూములు ఉన్న గ్రామం	రీ.సర్వే నెం.	భూమి వివరం	విస్తీర్ణం	ధరావతు రూ.	లైసెన్స్ కాలపరిమితి	బహిరంగ వేలం జరుగు తేదీ సమయం	బహిరంగ వేలం నిర్వహించు ప్రదేశం
1	సానారుద్రవరం	485	చెరువు	19-35	1,00,000	3సం॥రాలు 2025-2026 నుండి 2027-2028	ది. 15-7-2025 మంగళవారం ఉదయం గం. 11-00లకు	సానారుద్రవరం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద

ఇతర వివరములకు కలిదిండి గ్రూపు దేవస్థానముల వారి కార్యాలయం పనిచేయు వేళలలో లేదా కార్యనిర్వహణాధికారి వారి సెల్ నెం. 91771 45150 నందు సంప్రదించగలరు.

కలిదిండి, 2-7-2025 సం/- కూచిపూడి శ్రీనివాసు, కార్యనిర్వహణాధికారి

(c) eenadu

ప్రజా సంక్షేమానికి పాటుపడతాం

తిరుపతి గ్రామంలో చిన్నారితో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు సతీష్‌బాబు, పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప, జ్యోతుల నవీన్ తదితరులు

పెద్దాపురం, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే పరమావధిగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు అన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పెద్దాపురం మండలం తిరుపతి, చదలాడ గ్రామాల్లో బుధవారం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పతో కలిసి ఆయన కార్యక్రమంలో పాల్గొన్నారు. సతీష్‌బాబు మాట్లాడుతూ సుపరిపాలనలో తొలి అడుగును తొలి తిరుపతి నుంచి ప్రారంభించామన్నారు. సంక్షేమం, అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. అన్నివర్గాల ప్రజల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాల గురించి అవగాహన కల్పించారు. ప్రభుత్వ పనితీరును అడిగి తెలుసుకున్నారు. అంతకు ముందు తిరుపతిలోని శ్రీశృంగార వల్లభస్వామి దేవాలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో కాకినాడ జిల్లా తెదేపా అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రాజాసూరిబాబురాజు, సర్పంచి మొయిళ్ల కృష్ణమూర్తి, నాయకులు రంగనాగ్, శ్రీనివాసరావు, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో తేలికపాటి వర్షం

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో బుధవారం రోజంతా తేలికపాటి వర్షం కురిసింది. రౌతులపూడి మండలంలో అత్యధికంగా 40.4 మి.మీ, తాళ్లరేవులో అత్యల్పంగా 5.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. మండలాల వారీగా శంఖవరంలో 31.2 మి.మీ., తొండంగిలో 27, కోటనందూరులో 26.4, ఏలేశ్వరంలో 25.6, తుని, జగ్గంపేటలో 23.2, ప్రత్తిపాడులో 20.4, గండేపల్లిలో 19.2, కరపలో 17.6, పెద్దాపురంలో 15.2, కాకినాడ అర్బన్‌లో 15.4, కాకినాడ గ్రామీణంలో 15.2, పెదపూడిలో 14.6, సామర్లకోటలో 13.4, యు.కొత్తపల్లిలో 13.2, కిర్లంపూడిలో 12.4, కాజులూరులో 11.4, పిఠాపురంలో 9.4, గొల్లప్రోలులో 9.2 మి.మీ. వర్షం కురిసింది.

బడి నిర్వహణకు నిధులొచ్చాయ్!

న్యూస్‌టుడే, కాకినాడ నగరం

ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ నిధులు విడుదలయ్యాయి. విద్యార్థుల సంఖ్య ఆధారంగా వీటిని కేటాయించారు. బడుల్లో చిన్న చిన్న మరమ్మతులకు, సుద్ద ముక్కలు, డస్టర్లు కొనుగోలు, ఇతర అవసరాలకు ఈ సొమ్మును వినియోగించుకోవచ్చు. గత వైకాపా పాలనలో నిర్వహణ నిధులను నిలుపుదల చేశారు. దాంతో పాఠశాలల్లో ఏ చిన్న పనికైనా ప్రధానోపాధ్యాయులు సొంత డబ్బులు ఖర్చు చేయాల్సి వచ్చేది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిర్వహణ నిధులను పునరుద్ధరించి గత విద్యా సంవత్సరం నుంచే మంజూరు చేస్తోంది. ఈ ఏడాది కూడా ఇచ్చింది.

ఉమ్మడి జిల్లాకు రూ.5 కోట్లు విడుదల

ఏడాది ప్రారంభంలోనే సగం సొమ్ము

పాఠశాలలకు 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభంలోనే నిర్వహణ నిధుల్లో సగం సొమ్ములను ప్రభుత్వం విడుదల చేసింది. మిగతావి తర్వాత ఇవ్వనున్నారు. ఉమ్మడి జిల్లాకు సుమారు రూ.10 కోట్లు రావాల్సి ఉండగా ప్రస్తుతానికి రూ.5 కోట్లు విడుదల చేశారు.

తూర్పుగోదావరి జిల్లాలో 959 పాఠశాలలున్నాయి. వీటికి రూ. 2.89 కోట్లు అవసరం కాగా, రూ. 1.44 కోట్లు విడుదలయ్యాయి. కాకినాడ జిల్లాలో 1249 పాఠశాలలకు గాను రూ. 3.73 కోట్లకు రూ. 1.86 కోట్లు, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1561 పాఠశాలలకు రూ. 3.31 కోట్లకు రూ. 1.65 కోట్లు మంజూరయ్యాయి.

విద్యార్థుల సంఖ్య ఆధారంగా..

పాఠశాలలో విద్యార్థులు ఒకటి నుంచి 30 మంది వరకు ఉంటే నిర్వహణ గ్రాంటు రూ.10 వేలు మంజూరవుతుంది. 31 నుంచి 100 మందికి రూ. 25వేలు, 101 నుంచి 250 మందికి రూ.50 వేలు, 251 నుంచి 1000 మంది వరకు రూ. 75 వేలు, ఇంకా ఎక్కువ మంది ఉంటే రూ. లక్ష వరకు నిర్వహణ గ్రాంటును చెల్లిస్తారు.

పాఠశాల ఖాతాల్లో జమ

రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలలకు నిర్వహణ గ్రాంటును విడుదల చేసింది. రావాల్సిన నిధుల్లో తొలుత సగం విడుదల చేశారు. పాఠశాలల ఖాతాలకే ఇవి నేరుగా జమ అవుతాయి. ప్రధానోపాధ్యాయులు ఈ నిధులను సద్వినియోగం చేసుకోవాలి.

- పి.వేణుగోపాలరావు, ఏపీసీ, సమగ్ర శిక్ష, కాకినాడ

మాట్లాడుతున్న జడ్పీ ఛైర్మన్ వేణుగోపాలరావు, వేదికపై కలెక్టర్లు ప్రశాంతి, షాన్‌మోహన్, మహేష్ కుమార్, జడ్పీ సీఈవో లక్ష్మణరావు

పాల్గొన్న ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఎమ్మెల్యేలు నల్లమిల్లి, నెహ్రూ, ఎమ్మెల్సీ త్రిమూర్తులు, ఎంపీ బోస్

డెల్టా సరే.. మెట్ట మాటేమిటి?

- జలవనరులు, వ్యవసాయశాఖల మధ్య సమన్వయ లోపం
- జడ్పీ సర్వసభ్య సమావేశంలో వాడీవేడిగా చర్చ

ఈనాడు, కాకినాడ; న్యూస్‌టుడే, కాకినాడ నగరం

డెల్టా ప్రాంతంలో మూడు పంటలు సాగుచేయాలని ముందస్తుగానే నీరు విడిచిపెట్టడం మంచిదే. మరి మెట్ట ప్రాంతంలో రైతుల సంగతేమిటి? అని ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఛైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు అధ్యక్షతన బుధవారం కాకినాడలో నిర్వహించారు. మూడు జిల్లాల కలెక్టర్లు షాన్‌మోహన్ (కాకినాడ), ప్రశాంతి (తూర్పుగోదావరి), మహేష్‌కుమార్ (అంబేడ్కర్ కోనసీమ) హాజరయ్యారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ మెట్టలో జలవనరులు, వ్యవసాయ శాఖల మధ్య సమన్వయలోపం కనిపిస్తోందన్నారు. మెట్ట సాగుకోసం ప్రత్యేకంగా ఇరిగేషన్ డివిజన్ తమ నియోజకవర్గంలో ఏర్పాటుచేయాలని కోరారు. తాళ్లూరు ఎత్తిపోతల వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉందన్నారు.

డ్రెయిన్ల ఆధునికీకరణకు తీర్మానం

జిల్లాలో డ్రెయిన్ల ఆధునికీకరణకు చర్యలు తీసుకోవాలని ఎంపీ సుభాష్‌చంద్రబోస్ ప్రస్తావించారు. మురుగు కాలువల ఆధునికీకరణ, పడకేసిన ఎత్తిపోతల పథకాల పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని జడ్పీ ఛైర్మన్ తీర్మానం ప్రతిపాదించగా, సభ్యులు ఆమోదించారు.

వాకౌట్‌తో నిరసన

సమావేశం ప్రారంభంలోనే ధాన్యం సొమ్ములు ఇంకా రైతులకు జమ కాలేదని, ప్రభుత్వం 24 గంటల్లో ఇస్తామని మోసం చేసిందంటూ వైకాపా జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు కాసేపు వాకౌట్ చేశారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణ, ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ మద్దతు పలికారు. కాసేపటి తర్వాత మళ్లీ వచ్చి చర్చలో పాల్గొన్నారు.

కాలువల కలుషితంపై నిర్లక్ష్యం తగదు

పంట కాలువల కలుషితంపై అధికారుల నిర్లక్ష్యం తగదని ఎమ్మెల్యేలు సూర్యనారాయణ, సోము వీర్రాజు ప్రస్తావించారు. కాలువల్లోకి వ్యర్థాలు, మరుగుదొడ్ల గొట్టాలను వదిలేస్తున్నారన్నారు. రాజమహేంద్రవరంలోనూ పేపరు మిల్లు వ్యర్థాలు గోదావరి జలాల్లో కలుస్తున్నాయన్నారు. పూర్తిగా మానవ తప్పిదాలే కారణమని అనపర్తి ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి అన్నారు.

మరికొన్ని సమస్యలపై..

● కౌలు రైతులకు సీసీఆర్‌సీ కార్డుల జారీకి నీటి తీరువా బకాయిలతో ముడిపెడుతున్నారని గొల్లప్రోలు జడ్పీటీసీ నాగలోవరాజు ఆరోపించారు. కలెక్టర్ షాన్‌మోహన్ స్పందిస్తూ నీటి తీరువా తప్పనిసరని, వాటిని కార్డులతో ముడిపెడితే చర్యలు తీసుకుంటామన్నారు. ● ఏలేశ్వరం నుంచి అల్లూరి జిల్లా మార్గం అధ్వానంగా ఉందని రాజవొమ్మంగి జడ్పీటీసీ సభ్యురాలు జ్యోతి అన్నారు. ● పాఠశాలల్లో అదనపు భవనాలు లేక, వరండాల్లో కూర్చోబెట్టాల్సి వస్తుందని రంపచోడవరం జడ్పీటీసీ ప్రస్తావించారు. ● ఆలమూరు, రామచంద్రాపురంలో పౌరసరఫరాల శాఖ గోదాములు ఉండగా ద్రాక్షారామ గోడౌన్‌కు ఎందుకు బియ్యం తరలిస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ప్రశ్నించారు. ● డీసీసీబీ రూ. 307 కోట్ల నష్టాల్లో కూరుకుపోయిందని, రుణాలు తీసుకున్నవారు తిరిగి చెల్లిస్తేనే మనుగడ సాధించగలదని, సిబ్బంది రికవరీకి వచ్చినప్పుడు ప్రజా ప్రతినిధులు సహకరించాలని డీసీసీబీ ఛైర్మన్ తుమ్మల రామస్వామి అన్నారు. సమావేశంలో ఎమ్మెల్సీ అనంతబాబు, జడ్పీ సీఈవో లక్ష్మణరావు, అధికారులు పాల్గొన్నారు.

ఖైదీల్లో పరివర్తనకు ప్రత్యేక కార్యక్రమాలు

బండిలో పెట్రోలు వేస్తున్న మంత్రి అనిత, ఎమ్మెల్యే దివ్య

తుని, న్యూస్‌టుడే: ఏదో ఒక తప్పు చేసి జైలుకు వచ్చిన ఖైదీల్లో పరివర్తనకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోందని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. తునిలో జైళ్లశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెచ్‌పీ పెట్రోలు బంకును మంత్రి అనిత, ఎమ్మెల్యే యనమల దివ్యతో కలిసి బుధవారం ప్రారంభించారు. అనంతరం ఇద్దరూ కలిసి పలు ద్విచక్ర వాహనాల్లో ఇంధనం నింపారు. మంత్రి అనిత మాట్లాడుతూ.. ఇప్పటికి జైళ్లశాఖ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలో 3 పెట్రోలు బంకులు ఏర్పాటు చేయగా, తునిలో నాలుగోది ప్రారంభించామన్నారు. సెంట్రల్ జైల్లో ఉన్న అనేక మంది ఖైదీలు రోజూ హోటళ్లు, కేఫ్, ఇతర దుకాణాలు నిర్వహించడంలో భాగస్వాములు అవుతున్నారన్నారు. శిక్షా కాలం పూర్తయ్యాక వారు పరివర్తనతో బయటకు వచ్చి సంతోషకర జీవితాన్ని గడపాలనేది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. అనంతరం కొత్తగా నిర్మించిన తుని ఉప కారాగారంలోని పలు విభాగాలను ప్రారంభించారు. కార్యక్రమంలో జైళ్లశాఖ డీజీపీ అంజనీకుమార్, డీఐజీ ఎమ్మార్ రవికిరణ్, కాకినాడ జిల్లా ఎస్పీ బిందుమాధవ్, జిల్లా జైళ్లశాఖ అధికారి ఎల్.రంగస్వామి, పురపాలక ఛైర్‌పర్సన్ నార్ల భువనసుందరి తదితరులు పాల్గొన్నారు.

తక్కువ ధరకు మద్యం అమ్మితే నమ్మొద్దు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: తక్కువ ధరకు మద్యం అమ్ముతామంటే నమ్మొద్దని లైసెన్స్ పొందిన రిటైల్ మద్యం దుకాణాల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి కృష్ణకుమారి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ లేని వ్యక్తులు, అనధికార వ్యక్తుల వద్ద నుంచి మద్యం కొనుగోలు చేయడం చాలా ప్రమాదకరమని, అది నకిలీది కావచ్చన్నారు. ఎవరైనా అలా అమ్మితే టోల్‌ఫ్రీ- 14405 లేదా 9440902400 నెంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

భారీ టేకుచేప లభ్యం



యానాం గోదావరిలో మత్స్యకారుల వలకు భారీ టేకుచేప చిక్కింది. పొన్నమండ భీమరాజు బృందం బుధవారం పడవలో వేటకు వెళ్లగా జీఎంసీ బాలయోగి వారధి సమీపంలో 160 కిలోల బరువు, ఎనిమిది అడుగుల చుట్టుకొలత ఉన్న టేకు చేప వలలో పడింది. దానిని అతి కష్టంమీద ఒడ్డుకు చేర్చారు. సముద్రంలో మాత్రమే ఉండే ఇది భైరవపాలెం మొగ ద్వారా గౌతమి గోదావరిలోకి వచ్చి ఉంటుందని మత్స్యకారులు చెప్పారు. ఈ చేపను పొన్నమండ భద్రం వేలంలో రూ.17వేలకు దక్కించుకున్నారు. సాధారణంగా ప్రశాంతంగా ఉండే ఇది ఆపద వస్తుందని గుర్తిస్తే మాత్రం తోకతో తీవ్రంగా దాడి చేస్తుందని మత్స్యకారులు తెలిపారు. క్యాన్సర్లు, గుండెపోటు నివారణకు దీనిని ఆహారంగా తీసుకుంటారని యానాం మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దడాల గొంతెయ్య తెలిపారు. – న్యూస్‌టుడే, యానాం

రౌతులపూడి: బంగారయ్యపేట వద్ద రెయిలింగ్ ధ్వంసమైన వంతెనపై వాహనం

సేతువులకు శకటాలతో సమస్యే..!

అప్రమత్తం కాకుంటే అగమ్యగోచరమే..

– న్యూస్‌టుడే, ప్రత్తిపాడు

శంఖవరంలో ఏళ్లనాటి ఏటి పైకట్టపై క్వారీ లారీ

కొండలను మోసుకెళ్తున్న శకటాలు పురాతన వంతెనలను వణికిస్తున్నాయి. క్వారీల నుంచి నల్లకంకర, పెద్ద బండలను తరలించే లారీలు 30-50 టన్నుల బరువుతో, వేగంగా దూసుకెళ్తుంటే వారధులు బిక్కుబిక్కుమంటున్నాయి. ప్రత్తిపాడు నియోజకవర్గంలో వంతెనలకు ఈ మోత ఉండగా.. రౌతులపూడి నుంచి శంఖవరం వరకు ఉన్న చాన్నాళ్లనాటి సేతువులపై వీటి తాకిడి ఎక్కువే. పేర్పుడు రాళ్లు, కట్టుబడి సున్నంతో బ్రిటిష్ కాలంలో నిర్మించిన కట్టడాలు.. నాణ్యత వల్ల కొండంత బరువులను మోయగలుగుతున్నా ముప్పు ముంగిటే ఉన్నాయి. రౌతులపూడి మండలం బంగారయ్యపేట, శృంగవరం మీదుగా శంఖవరం వరకు ర.భ రహదారిపై ఏరులు పారేచోట ఉన్న వంతెనలు భారీ వాహనాల తాకిడిని ఎదుర్కొంటున్నాయి. రౌతులపూడి పరిధిలోని 15కు పైగా క్వారీల నుంచి రోజూ కనీసం 100 వాహనాలు రేయింబవళ్లు తిరుగుతున్నాయి. 20 టన్నులకు మించి బరువులు అవిచ్ఛిన్నంగా ఒత్తిడి పెడితే వంతెనలకు ఇబ్బందేనని ఇంజినీరింగ్ వర్గాలు చెపుతుండగా.. మూడింతల బరువును భరిస్తున్నాయని పరిస్థితులే చెపుతున్నాయి. రౌతులపూడి మండల పరిధిలోని వంతెనలపై ఉన్న రెయిలింగులు ఏళ్ల కిందటే దెబ్బతినగా మరమ్మతులు చేయలేదు. అసలు నిర్మాణానికే ముప్పు వాటిల్లితే చక్కదిద్దడం భారీ ఖర్చుతో కూడిన వ్యవహారమే. ఏలేశ్వరం మండలం అప్పనపాలెం వంతెన శిథిలావస్థకు చేరి మూడేళ్లు దాటుతున్నా కొత్తది కట్టలేని దైన్యం. ఉన్నవాటిని భద్రంగా చూసుకోవడం అవసరం.

స్నాతకోత్సవానికి సర్వం సిద్ధం

రేపు జేఎన్‌టీయూకేలో నిర్వహణ ✦ హాజరుకానున్న గవర్నర్ అబ్దుల్ నజీర్, విద్యాశాఖామంత్రి లోకేశ్

న్యూస్‌టుడే, గాంధీనగర్

జేఎన్‌టీయూకే విశ్వవిద్యాలయం 11వ స్నాతకోత్సవానికి సర్వం సిద్ధమైంది. ఈ నెల 4వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం 3గంటలకు కార్యక్రమం నిర్వహించనున్నారు. కులపతి, రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర విద్యాశాఖామంత్రి నారా లోకేశ్, పలువురు అతిథులు హాజరుకానున్నారు.

ప్రతిభావంతులకు పతకాలు

స్నాతకోత్సవం సందర్భంగా వివిధ విభాగాల్లో ఇంజినీరింగ్, ఇతర డిగ్రీలు పూర్తి చేసిన వారికి ఒరిజినల్ డిగ్రీ పట్టాలను ముఖ్య అతిథుల చేతుల మీదుగా అందించనున్నారు. ప్రతిభావంతులకు 35 బంగారు పతకాలు, 5 నగదు పతకాలు ఇవ్వనున్నారు. అలాగే 100 మందికి పీహెచ్‌డీ పట్టాలు ప్రదానం చేయనున్నారు. బీటెక్, బీఫార్మసీ, ఎం.టెక్, ఎంబీఏ, ఎం.ఫార్మసీ, బీబీఏ, ఫార్మాడి, పీజీ కోర్సులు పూర్తి చేసిన 7029 మందికి, యూజీ డిగ్రీలో 43,811 మందికి పట్టాలు అందనున్నాయి.

జేఎన్‌టీయూకే

ఏర్పాట్లు పరిశీలిస్తున్న వీసీ ప్రసాద్ తదితరులు

ప్రత్యేక సమీక్ష

స్నాతకోత్సవ ఏర్పాట్లను వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ బుధవారం పరిశీలించారు. మూడు వేడుకలను నిర్వహించిన అనుభవం ఉన్న మాజీ వీసీ ప్రసాదరాజు, ఏపీపీఎస్సీ మాజీ ఛైర్మన్ పి.ఉదయ్‌భాస్కర్, జేఎన్‌టీయూకే చీఫ్ ఇంజినీర్ శ్రీనివాసులు తదితరులతో సమీక్షించారు. వర్షం కురుస్తున్న నేపథ్యంలో అతిథులు, విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చేయాల్సిన ఏర్పాట్లపై చర్చించారు. ముఖ్య అతిథిగా అమెరికాలోని బోస్టన్ గ్రూప్ ఛైర్మన్ కోట సుబ్రహ్మణ్యం (సుబు కోట) హాజరుకానున్నారు. ఆయనకు గవర్నర్ చేతుల మీదుగా గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయనున్నారు. మాజీ ఉపకులపతులు, పాలక మండలి సభ్యులు, ఉన్నత విద్యామండలి అధికారులు, జిల్లా అధికారులు, విద్యావేత్తలు హాజరుకానున్నారు.

మరపురాని వేడుకగా....

రాష్ట్రంలో జేఎన్‌టీయూకే పేరు ప్రఖ్యాతులు ఇనుమడింపజేసేలా వేడుకలను నిర్వహిస్తాం. ప్రయోజకులైన విద్యార్థుల జీవితంలో మరపురాని కార్యక్రమంగా నిర్వహించాలన్న సంకల్పంతో ఏర్పాట్లు చేస్తున్నాం. పలువురికి పట్టాలు, పతకాలు, డాక్టరేట్‌లు ప్రదానం చేస్తాం.

- సీఎస్ఆర్‌కే ప్రసాద్, వీసీ, జేఎన్‌టీయూకే

గవర్నర్ పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ఈ నెల 4న కాకినాడ జేఎన్‌టీయూకే స్నాతకోత్సవానికి హాజరుకానున్న నేపథ్యంలో ఆయన పర్యటనకు పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ షాన్ మోహన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం జేసీ రాహుల్ మీనా, కాకినాడ మున్సిపల్ కమిషనర్ భావనతో కలిసి వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. ఎటువంటి లోటుపాట్లు రాకుండా గవర్నర్ పర్యటన విజయవంతంగా ముగిసేలా యంత్రాంగం ఏర్పాట్లు చేయాలని సూచించారు. డీఆర్వో వెంకటరావు, జేఎన్‌టీయూకే, పోలీసు, నగరపాలక సంస్థ, వైద్యాధికారులు పాల్గొన్నారు.

పైకప్పు.. తలపై ముప్పు

కలెక్టరేట్‌లోని బెన్నెట్‌క్లబ్ పైఅంతస్తు భవనంలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల సమన్వయ అధికారి కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఈ భవనం శిథిలమై పైకప్పు నుంచి పెచ్చులూడి పడిపోతున్నాయి. వర్షం వస్తే నీరు కారిపోతోంది. ఇక్కడ అధికారులు, ఉద్యోగులు భయంతో విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలతో రోజూ పెద్ద ఎత్తున తల్లిదండ్రులతో కలిసి విద్యార్థులు ఇక్కడకు వస్తున్నారు. పైకప్పు నుంచి వర్షపునీరు పడుతుండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ విద్యుత్తు మీటరు, తీగలు వేలాడుతూ ఎవరి మీద పడతాయో అనేలా ఉన్నాయి. కార్యాలయాన్ని సురక్షిత భవనంలోకి మార్చాలని ఉద్యోగులు, సందర్శకులు కోరుతున్నారు.

– న్యూస్‌టుడే, కాకినాడ కలెక్టరేట్

తుని ఆసుపత్రి వైద్యులు, సిబ్బందిపై.. అయిదేళ్ల అనంతరం.. అనిశా కేసుపై విచారణ

తుని, న్యూస్‌టుడే: తుని పట్టణంలోని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో 2020వ సంవత్సరంలో అవినీతి నిరోధక శాఖ అధికారులు ఆకస్మిక తనిఖీలు చేసిన కేసుకు సంబంధించి అప్పట్లో విధులు నిర్వహించిన అయిదుగురు ఉద్యోగులపై తదుపరి విచారణ చేయాలని ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. దీనిలో అప్పటి సివిల్ సర్జన్ స్పెషలిస్టు విష్ణువర్ధిని (ఉద్యోగ విరమణ చేశారు), మరో సివిల్ సర్జన్ స్పెషలిస్టు రమేష్, ఫార్మాసిస్టు పద్మజ, జూనియర్ అసిస్టెంట్లు శివ భాస్కర్, సుధారాణిలపై విచారణ చేయాలని సూచిస్తూ వైద్యఆరోగ్యశాఖ తాజాగా ఆదేశాలిచ్చింది.

నేపథ్యమిదీ..

తుని ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో 2020 ఫిబ్రవరి 27, 28 తేదీల్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు సోదాలు చేశారు. అప్పట్లో 17 మంది సిబ్బంది అన్ని విభాగాల్లో ఏకకాలంలో తనిఖీలు చేశారు. ఆరోగ్యశ్రీ నిధుల వినియోగం, రోగులకు అందించే ఆహారం, పారిశుద్ధ్యం, మందుల నిల్వలు, అంబులెన్సు, తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ తదితర విభాగాలకు సంబంధించి పలు దస్త్రాలు క్షుణ్ణంగా పరిశీలించారు. ఆసుపత్రి అభివృద్ధి, సొసైటీ నిధుల వినియోగం, నేషనల్ హెల్త్ మిషన్, మాతాశిశు సంరక్షణ నిధుల వినియోగం, బేబీ కిట్లు, రక్తనిధి కేంద్రం నిల్వలు, జనన ధ్రువపత్రాల జారీ తదితర వివరాల దస్త్రాలను పరిశీలించారు. 2014వ సంవత్సరం నుంచి మందుల నిల్వ, పంపిణీ లెక్కల్లో కొన్ని లోపాలు, అభివృద్ధి పనుల నిధుల వినియోగంలో అవకతవకలు గుర్తించినట్లు తెలుస్తోంది.

ధవళేశ్వరం బ్యారేజీకి మహర్దశ

రూ.150 కోట్లు మంజూరు చేసిన ప్రభుత్వం

– న్యూస్‌టుడే, పి.గన్నవరం

గోదావరి డెల్టాకు కేంద్ర బిందువైన ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజీ మరమ్మతు పనులకు ప్రభుత్వం రూ.150 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీనికి సంబంధించి తాజాగా పరిపాలనామోదం ఇచ్చింది. ఉభయ ఉమ్మడి గోదావరి జిల్లాల్లో సుమారు 10 లక్షల ఎకరాలకు సాగు, లక్షలాది మంది ప్రజలకు తాగునీరు అందిస్తున్న ఈ బ్యారేజీకి మరమ్మతులు చేపట్టాలని ఏడేళ్ల క్రితం ప్రతిపాదించారు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకోవడంతో తాజాగా నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వం పరిపాలనామోదం ఇవ్వడంతో తదుపరి చర్యలు మొదలుపెడతామని హెడ్‌వర్క్స్ ఈఈ జి.శ్రీనివాస్ తెలిపారు.

మరమ్మతులు ఇలా..

ప్రధానంగా బ్యారేజీకి సంబంధించి వివిధ విభాగాలకు చెందిన తలుపులు పాడైపోవడంతో వరదల సమయంలో సముద్రంలోకి నీరు వదిలే సమయంలో ఇబ్బంది పడాల్సి వస్తుంది. 175 తలుపులకు గాను 117 కొత్తవి ఏర్పాటుచేస్తారు. తూర్పు, మధ్య, పశ్చిమ డెల్టాలకు సాగునీరు సరఫరా చేసే మూడు హెడ్ స్లూయిస్‌లకు కొత్త తలుపులు వస్తాయి. తూర్పుడెల్టా హెడ్‌స్లూయిస్‌కు 3, మధ్యడెల్టా 4, పశ్చిమడెల్టా హెడ్‌స్లూయిస్‌కు 5 వెరసి 12 కొత్త తలుపులు బిగిస్తారు. వరదల అనంతరం బురద పోయేలా స్కవర్ స్లూయిస్‌ల ద్వారా ఫ్లషింగ్ ఆపరేషన్ నిర్వహిస్తారు. తూర్పుడెల్టాకు 3, పశ్చిమడెల్టా 3, మధ్యడెల్టాకు 2 వెరసి ఎనిమిది స్కవర్‌స్లూయిస్‌లు ఉన్నాయి. వీటికి సంబంధించి కొత్త తలుపులు ఏర్పాటుచేస్తారు. విద్యుత్తు, ఇతర సివిల్ పనులూ చేపడతారు.

కాటన్ బ్యారేజీ

పనులు మొదలుపెడతాం

ధవళేశ్వరం బ్యారేజీ మరమ్మతులకు ప్రభుత్వం రూ. 150 కోట్లు మంజూరు చేసింది. టెండర్లు పూర్తి చేసి పనులు మొదలుపెడతాం. తద్వారా వ్యవసాయ రంగానికి మేలుతో పాటు బహుళ ప్రయోజనాలు చేకూరతాయి.

- నిమ్మల రామానాయుడు, రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97607
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80082 34669

వెరికోస్ వెయిన్స్ (సిరల వాపు) ఫైల్స్ & ఫిస్టుల సమస్యలకు
మొట్టమొదటిసారిగా
అత్యాధునికమైన లేజర్ చికిత్స
ఎటువంటి కోత లేకుండా లేజర్ చికిత్స
Dr. Nitin Rimmalapudi, M.S.
Laser & Laparoscopic Surgeon
అపాయింటుమెంట్ కొరకు సంప్రదించండి
93 922 922 00
సోమవారం నుండి శనివారం
APEX HOSPITALS
LASER CENTRE
ప్రకాష్ నగర్, రాజమండ్రి | 0883-2449191

(c) eenadu

లోవ అమ్మవారికి సారె సమర్పణ

తుని గ్రామీణం, ద్రాక్షారామ: తలుపులమ్మ అమ్మవారి లోవ దేవస్థానంలో ఆషాఢమాస ఉత్సవాల సందర్భంగా ద్రాక్షారామ భీమేశ్వరస్వామి దేవస్థానం సహాయ కమిషనర్ దుర్గాభవాని బుధవారం సాంప్రదాయపరంగా అమ్మవారికి సారె సమర్పించారు. ఆలయాధికారులు వారికి సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి సారె సమర్పించారు. లోవ దేవస్థానం అధికారులు వారికి ఆశీర్వచనాలు చేసి ప్రసాదం అందజేశారు.

నేటి నుంచి కేశవరం రైల్వేగేటు మూసివేత

ద్వారపూడి: కేశవరం రైల్వే గేటును గురువారం నుంచి నాలుగు రోజుల పాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. రైలు పట్టాల నవీకరణ, మరమ్మతుల నేపథ్యంలో ఈనెల 3వ తేదీన ఉదయం 7 గంటల నుంచి 6వ తేదీ రాత్రి 7 గంటల వరకు గేటును మూసేస్తామని ప్రకటించారు. కేశవరం గ్రామంలోకి వెళ్లే ద్విచక్ర వాహనదారులు ద్వారపూడి గ్రామం మీదుగా వెళ్లాలని మండపేట రూరల్ ఎస్సై వి.కిషోర్ సూచించారు. ఈ మేరకు వాహనాల రాకపోకలను మళ్లించినట్లు వివరించారు.

ఉప్పాడ తీరానికి కొబ్బరికాయలు

తీరానికి కొట్టుకొచ్చిన కాయలను చూపుతున్న వ్యక్తి

యు.కొత్తపల్లి: మండలం ఉప్పాడ తీరానికి కొబ్బరికాయలు కొట్టుకొచ్చాయి. బీచ్‌రోడ్డు శివారు ఎస్పీజీఎల్ పరిశ్రమ సమీపంలో కొత్త వంతెన వద్ద సముద్రంలో కొబ్బరికాయలు తేలాడుతూ రావడంతో సందర్శకులు ఆశ్చర్యానికి గురయ్యారు. వర్షాల నేపథ్యంలో ఎక్కడనుంచైనా కొట్టుకువచ్చాయని, ఆలయాల్లో మొక్కులు కట్టిన కాయలు సముద్రంలో వేయడంతో ఇలా వచ్చి ఉండవచ్చని పలువురు పేర్కొన్నారు. - న్యూస్‌టుడే, కొత్తపల్లి

సార్వత్రిక సమ్మె విజయవంతానికి పిలుపు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏపీ మెడికల్ అండ్ సేల్స్ రిప్రజెంటేటివ్ యూనియన్ జిల్లాశాఖ పిలుపునిచ్చింది. కలెక్టరేట్ వద్ద బుధవారం సమ్మె గోడపత్రికలను ఆవిష్కరించారు. యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.వెంకటరావు, కోశాధికారి దువ్వల ప్రసాద్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 11 కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన సమ్మె పిలుపునకు తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామన్నారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కనీస వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకుల ప్రతినిధులు పలివెల వీరబాబు, మలకా వెంకటరమణ, యూనియన్ ప్రతినిధులు అప్పలస్వామి, అప్పారావు, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న యూనియన్ ప్రతినిధులు

పోలవరం నిర్వాసితులకు ఇళ్ల పట్టాలు సిద్ధం

పట్టాలను సిద్ధం చేస్తున్న వీఆర్వోలు

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: పోలవరం కాలువ నిర్మాణంలో భాగంగా తొలగించిన కుమ్మరిలోవ కాలనీ నిర్వాసితుల కోసం సేకరించిన భూముల్లో ఇళ్లపట్టాలు ఇచ్చేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ కాలనీ పరిధిలోని సుమారు 472 మంది నిర్వాసితులను గుర్తించి వారికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేయనున్నట్లు తహసీల్దారు ప్రసాద్ తెలిపారు. అయితే రానున్న వర్షాకాలం వరకు కాలనీవాసులు తమ నివాసాలు ఖాళీ చేయాలని ఫ్లషింగ్ పనులు చేపట్టేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారని తెలిపారు. నిర్వాసితులకు కేటాయించిన స్థలాల్లో మంచినీటి, విద్యుత్తు సదుపాయం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు.

బిల్లులు చెల్లించాలని గుత్తేదారుల నిరసన



జడ్పీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న గుత్తేదార్లు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: జడ్పీ నిధులతో చేసిన పనులకు బిల్లులు చెల్లించాలని కోరుతూ గుత్తేదారులు జడ్పీ కార్యాలయం వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. గత వైకాపా హయాంలో రోడ్లు, సామాజిక భవనాలు, ఇతర అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. మూడేళ్లవుతున్నా బిల్లులు చెల్లించలేదని వాపోయారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా రూ.6 కోట్ల మేర బకాయిలున్నాయన్నారు. అప్పుతెచ్చి పనులు చేశామని, వడ్డీలు పెరిగిపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని వాపోయారు. జడ్పీ ఛైర్మన్ వేణుగోపాలరావు, వైస్ ఛైర్మన్లు బుర్రా అనుబాబు, మేరుగు పద్మలత, సీఈవో లక్ష్మణరావు, రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్‌చంద్రబోస్ తదితరులకు వినతిపత్రాలు అందజేశారు. గుత్తేదార్ల సంఘ నాయకుడు అల్లాడి వెంకటరమణ పాల్గొన్నారు.

విజ్ఞాన కొండ.. బకాయిల బండ..!

- న్యూస్‌టుడే, గాంధీనగర్(కాకినాడ)

అన్నివర్గాలకూ విజ్ఞానం అందించే గ్రంథాలయాలు గత వైకాపా ప్రభుత్వంలో అయిదేళ్లు నిరాదరణకు గురయ్యాయి. స్థానిక సంస్థల నుంచి విజ్ఞాన భాండాగారాలకు సెస్ రూపంలో అందాల్సిన నిధులనూ గత పాలకులు దారి మళ్లించారు. నగర, పురపాలికలు, గ్రామ పంచాయతీలు వసూలు చేసే పన్నుల్లో ప్రతి రూపాయిలో ఎనిమిది పైసలు గ్రంథాలయాలకు సెస్ రూపంలో చెల్లించాల్సిఉంది. జిల్లాలో మాత్రం చెల్లించడం లేదు. గత నాలుగేళ్లలో రూ.17.75 కోట్ల బకాయిలున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

కాకినాడ కేంద్ర గ్రంథాలయంలో చదువుకుంటున్న యువత

కాకినాడ జిల్లాలో..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 101 గ్రంథాలయాలున్నాయి. వీటిలో కాకినాడ నగరపాలికలో 4, రాజమహేంద్రవరంలో 4 ఉన్నాయి. గ్రేడ్ 1 గ్రంథాలయాలు 5. ఇవి పెద్దాపురం, రామచంద్రపురం, తుని, రాజమహేంద్రవరం, అమలాపురంలలో ఉన్నాయి. గ్రేడ్ 2, 3 కేటగిరీలో 85 ఉన్నాయి. 2020 నుంచి స్థానిక సంస్థల నుంచి గ్రంథాలయాలకు సెస్ అందడం లేదు. ఒక్క కాకినాడ నగరపాలిక నుంచే 2012-13 నుంచి 2015-16 మధ్య బకాయి రూ.96,77,432 ఉంటే, 2020-21 నుంచి 2024-25 కాలానికి రూ.8,29,40,169 బకాయి పడింది. మొత్తం రూ.9.20 కోట్ల బకాయి ఉండగా 2024-25 ఆర్థిక సంవత్సరం ముగిసి మూడు నెలలవుతున్నా.. కాకినాడ నగరపాలిక నుంచి నేటికీ ఒక్క రూపాయి కూడా జమ చేయలేదు. జిల్లాలోని 385 గ్రామ పంచాయతీల నుంచి 2007-08 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.8,49,02,913 వరకూ చెల్లించాల్సి ఉంది. కూటమి పాలనలో నిధులు దారి మళ్లించకుండా ఇటీవల కొన్ని గ్రామ పంచాయతీలు రూ.2.40 కోట్ల మేర చెల్లించాయి.

నిధులతోనే మనుగడ..

జిల్లావ్యాప్తంగా స్థానిక సంస్థల నుంచి సెస్ బకాయిలు రూ.కోట్లలో పేరుకుపోయాయి. అవి వసూలైతేనే గ్రంథాలయాలు మనుగడ సాధిస్తాయి. ప్రస్తుతం నిర్వహణ భారంగానే ఉంది. కనీస మౌలిక వసతుల కల్పన కష్టసాధ్యమవుతుంది. పైగా జిల్లా గ్రంథాలయ సంస్థ ఉద్యోగులకు ప్రతినెలా కోటి ముప్పై స్థానిక సంస్థలు సహకరించాలి.

- ప్రసాద్, కాకినాడ జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి

సమగ్రశిక్షా ఉద్యోగులకు బదిలీలు

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: సమగ్రశిక్షాలో పనిచేస్తున్న తాత్కాలిక ఇన్‌స్ట్రక్టర్లు, క్లస్టర్ రిజర్వు మొబైల్ టీచర్స్, ఎంఐఎస్ కోఆర్డినేటర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఒప్పంద, పొరుగు సేవల ఉద్యోగులకు బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 61 మంది హాజరు కాగా, 40 మందికి కౌన్సెలింగ్ నిర్వహించి బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. సమగ్ర శిక్ష ఏపీసీ పి.వేణుగోపాలరావు పర్యవేక్షించారు.

తెదేపా శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే వర్మ

సమస్యల పరిష్కారానికే 'సుపరిపాలనలో తొలి అడుగు'

గొల్లప్రోలు, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార దిశగా కృషి చేసేందుకు సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ఎన్ వర్మ అన్నారు. పిఠాపురం నియోజకవర్గంలోని గొల్లప్రోలులో బుధవారం కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. పరిశీలకులుగా కొప్పుల వెలమ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ పీవీ గణేష్‌కుమార్ పాల్గొన్నారు. ఇంటింటా పర్యటించి కరపత్రాలు పంచుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో వర్మ మాట్లాడుతూ ప్రజలకు జవాబుదారీతనంగా కూటమి ప్రభుత్వం ఉందని, పథకాలు అందని వారుంటే తెలుసుకుని సాయం అందేలా చర్యలు చేపడతారన్నారు. గుంతలులేని రోడ్లే లక్ష్యంగా పనులు నిర్వహించినట్లు వివరించారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పోలవరం ప్రాజెక్టు పనులు నిలిపివేశారని, రూ.12,500 కోట్లతో చంద్రబాబు పనులు చేపట్టారని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నిలుపుతోందన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆధ్వర్యంలో రోడ్ల నిర్మాణం, ఇతర పనులతో నియోజకవర్గం అభివృద్ధిపథంలో ఉందన్నారు. తెదేపా పట్టణ అధ్యక్షుడు గుండ్ర సుబ్బారావు, శీరం మాణిక్యం, ఉలవకాయల దేవేంద్రుడు, మడికి సన్యాసి రావు, బర్ల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు రాజకీయాలతో సంబంధం లేదు

• హోం మంత్రి అనిత

మాట్లాడుతున్న హోం మంత్రి అనిత

తుని, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రాజకీయాలతో సంబంధం లేదని హోం మంత్రి వంగలపూడి అనిత అన్నారు. తునిలో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో అధికారం మారినప్పుడల్లా సాధారణ కానిస్టేబుల్ నుంచి ఐజీస్థాయి వరకు రాజకీయ బాధితులుగా మారుతున్నారని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం ఇస్తూ.. ప్రభుత్వం వేరు, రాజకీయ పార్టీ, నాయకులు వేరన్నారు. చట్టప్రకారం పనిచేసే ఉద్యోగులకు ఇబ్బందీ రాదని స్పష్టం చేశారు. అలాకాకుండా పనిచేసిన కొందరికి చిన్నచిన్న ఇబ్బందులు వస్తున్నాయని, అలాంటివారు 10 శాతం ఉంటారన్నారు. వైకాపా హయాంలో జైళ్లు, ఇతర ప్రాంతాల్లో సీసీ కెమెరాలు పనిచేయని పరిస్థితి ఉండేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక నిఘా పెంచామన్నారు. విజయవాడ కమిషనరేట్ పరిధిలో 7,500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచారన్నారు. రాష్ట్రవ్యాప్తంగా లక్ష సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడమే లక్ష్యం కాగా ఇప్పటికే 60 శాతం పూర్తి చేశామన్నారు. దేశంలో తొలిసారి ఆంధ్ర పోలీస్ ఏఐ సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి హ్యాక్‌థాన్ పేరుతో ప్రత్యేకంగా మూడు రోజుల కార్యక్రమం నిర్వహించామన్నారు.

తూ.గో. జిల్లా, రంగంపేట మం. పడిశలేరు గ్రామ స. నెం.77 లో గల య 1-87 ట్ల జిరాయితీ భూమి కొనుగోలుకు సంబంధించిన

బహిరంగ ప్రకటన తేది: 03-07-2025

'విజ్ఞాన్' అను ప్రఖ్యాతి చెందిన పేరుతో ఉభయ తెలుగు రాష్ట్రాలలోనూ అనేక చోట్ల విద్యా సంస్థలను స్థాపించి, అత్యంత ప్రతిష్టాత్మకముగానూ, విజయవంతముగానూ నిర్వహించుచున్న మా క్లయింటైన 'లావు ఎడ్యుకేషనల్ సొసైటీ' సంస్థ వారు, ఈ దిగువ పేర్కొన్న షెడ్యూలులో ఉదహరించిన స్థిరాస్థిని, సదరు ఆస్థి పూర్తి హక్కు దార్లైన (1) వల్లేపల్లి బ్రహ్మాజీరావు, (2) వల్లేపల్లి వెంకట దుర్గ సుధాకర్, (3) చక్కపల్లి రామచంద్రపతి, (4) తుమ్మల వీర పద్మ సుబ్బలక్ష్మి గార్ల నుండి క్రయము పొందుటకు ఉద్దేశించి, వారికి హెచ్చు మొత్తములో బయానా ఇచ్చి కొదువ క్రయ ధనము వారికి చెల్లించుటకున్నూ, వారి నుండి రిజిష్టర్డు క్రయ దస్తావేజును పొందుటకున్నూ, సంసిద్ధులై ఉన్నారు. కావున, సదరు వ్యవహారము పట్ల ఎవరికైననూ ఎట్టి అభ్యంతరములు గాని, సదరు ఆస్తిపై ఎట్టి క్లెయిములుగాని ఉన్నచో, వాటిని, ఈ పత్రికా ప్రకటన వెలువడిన పది దినములలోగా, తగు సాక్ష్యాధారములతో సహా ఈ క్రింది చిరునామాకు రిజిష్టర్డు పోస్టు ద్వారా మాత్రమే వారి వారి ఫోన్ నెంబర్లతో సహా తెలుపవలెను. ఆపై వచ్చు అభ్యంతరములు పరిగణింపబడవు.

షెడ్యూలు

తూర్పు గోదావరి జిల్లా, పెద్దాపురం సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసు ఇలాకాలో చేరిన రంగంపేట మండలం, పడిశలేరు గ్రామ పంచాయతీ కి చెందిన, పడిశలేరు గ్రామం తాలూకు రి. స. నెం. 77 రులో య 1-87 ట్ల జిరాయితీ భూమికి హద్దులు

తూర్పు : రి. స. నెం. 76 రు భూమి
దక్షిణం : మా క్లయింటు లావు ఎడ్యుకేషనల్ సొసైటీ వారి భూమి,
పడమర : మా క్లయింటు లావు ఎడ్యుకేషనల్ సొసైటీ వారి భూమి
ఉత్తరం : చెరువు

B.A. Raja Rao, Smt M. Jayasree, Tata Rama Rao,
V.V Srujan, Smt T. Ramadevi, Saripilli Krishna
Advocates

Vignan Admin Office: # 8-1-13/1, Siripuram, Opp: A U Registrar Office,
Visakhapatnam - 530 003

అదనపు సాయంతో గృహాల పూర్తికి చర్యలు

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: పీఎంఏవై-1 కింద ఇళ్లు మంజూరై, నిర్మాణాలు మధ్యలో నిలిపివేసిన పేదలకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు సాయం విడుదల చేసిందని హౌసింగ్ ఎండీ శివప్రసాద్ సూచించారు. ఆయన బుధవారం అమరావతి నుంచి వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా నుంచి పథక సంచాలకుడు ఎన్‌వీవీ సత్యనారాయణ, కార్యనిర్వాహక ఇంజినీర్లు శ్రీనివాస్, గుప్తా, డీఈఈ, ఏఈఈలు హాజరయ్యారు. జిల్లాలో 2,700కు పైగా ఇళ్లకు సంబంధించి ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు చొప్పున బ్యాంకు ఖాతాలకు జమ చేశారని, త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా కృషి చేయాలని సూచించారు.

ఉద్యోగులకు ఈఎల్ఐ ప్రయోజనాలు

రాజమహేంద్రవరం ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-2 వెంకటేశ్వర్లు

వెంకటేశ్వర్లు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో)లో నమోదయ్యే కొత్త ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ ఉపాధి ఆధారిత ప్రోత్సాహక(ఈఎల్ఐ) పథకం ప్రయోజనాలు వర్తిస్తాయని రాజమహేంద్రవరం ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-2 వెంకటేశ్వర్లు కలువాయి తెలిపారు. స్థానిక వి.ఎల్.పురంలోని ఈపీఎఫ్‌వో కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఈఎల్ఐ పథకానికి సంబంధించిన వివరాలు, ప్రయోజనాల గురించి వివరించారు. దేశంలో అన్ని రంగాల్లో ఉపాధి కల్పనకు మద్దతునివ్వడం, ఉపాధి అవకాశాలు, సామాజిక భద్రతను పెంపొందించేందుకు ప్రభుత్వం రూపొందించిన ఈ పథకాన్ని రెండు భాగాలుగా విభజించినట్లు తెలిపారు. కొత్తగా ఉద్యోగాల్లో చేరే వారికి ఆర్థిక ప్రయోజనం చేకూర్చడం, మరిన్ని ఉద్యోగాలు కల్పించేలా అన్ని రంగాల్లోని యాజమాన్యాలను ప్రోత్సహించడం దీని ఉద్దేశమన్నారు. ఈ ఏడాది ఆగస్టు ఒకటి నుంచి కొత్తగా ఉద్యోగాల్లోకి చేరి తొలిసారి ఈపీఎఫ్‌లో నమోదైన ఉద్యోగులకు రూ.15 వేలు ఆర్థిక ప్రోత్సాహాన్ని ప్రభుత్వం ఏడాది కాలవ్యవధిలో రెండు విడతలుగా అందిస్తుందన్నారు. ఆరు నెలల సర్వీసు పూర్తి చేసుకున్న తర్వాత సగం మొత్తం, మరో ఆరు నెలల సర్వీసు అనంతరం మిగతా సగం మొత్తం నేరుగా ఉద్యోగుల ఖాతాలో డీబీటీ విధానంలో జమ చేస్తుందన్నారు. నెలకు రూ.లక్ష వరకు సంపాదించే కొత్త ఉద్యోగులందరికీ ప్రభుత్వం అందించే ఈ ఆర్థిక ప్రయోజనం వర్తిస్తుందన్నారు.

యాజమాన్యాలకు మద్దతు..

ఈ పథకం తయారీ రంగంపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని, అన్ని రంగాల్లో అదనపు ఉద్యోగాల కల్పనకు ఊతమిస్తుందని తెలిపారు. ఉద్యోగాలు కల్పించే యాజమాన్యాలకు కూడా ప్రభుత్వం మద్దతు నిలుస్తుందని, రూ.లక్ష వరకు వేతనం తీసుకునే ఉద్యోగులను కలిగి ఉన్న యాజమాన్యాలకు ఆర్థిక ప్రోత్సాహాన్ని అందిస్తుందన్నారు. కనీసం ఆరు నెలల నిరంతర ఉపాధి ప్రాతిపదికన నియమించుకున్న ప్రతి అదనపు ఉద్యోగి కోసం ఆయా సంస్థల యాజమాన్యాలకు రెండేళ్లపాటు నెలకు రూ.3 వేల వరకు ప్రోత్సాహకాలను అందిస్తుందన్నారు. అదే తయారీ రంగానికి సంబంధించిన యాజమాన్యాలకు 3వ, 4వ సంవత్సరాల వరకు ప్రోత్సాహకాలు ప్రతినెలా అందిస్తుందని తెలిపారు. ఈపీఎఫ్‌వోలో నమోదు చేసుకుని 50 మంది, అంతకంటే తక్కువ ఉద్యోగులున్న సంస్థలు కనీసం ఆరు నెలలపాటు నిరంతర ప్రాతిపదికన కనీసం ఇద్దరు అదనపు ఉద్యోగులను, 50 లేదా అంతకంటే ఎక్కువ మంది ఉద్యోగులు ఉన్న సంస్థలు అయిదుగురు అదనపు ఉద్యోగులను నియమించుకోవాల్సి ఉంటుందని ఆయన తెలిపారు. ఈ ఏడాది ఆగస్టు ఒకటి నుంచి 2027 జులై 31 మధ్య సృష్టించే ఉద్యోగాలకు ఈ పథకం వర్తిస్తుందని, యాజమాన్యాలకు వారి పాన్ అనుసంధానిత ఖాతాల్లో ప్రోత్సాహక చెల్లింపులు జమవుతాయని వివరించారు.

ఆశా కార్యకర్తల ఖాళీల భర్తీకి దరఖాస్తులు

మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: ఆశా కార్యకర్తల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహనాయక్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో 29, పట్టణ ప్రాంతాల్లో 13 పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. పదో తరగతి ఉత్తీర్ణులై, 25-45 ఏళ్ల లోపు వయస్సు గల స్థానికులు అర్హులని చెప్పారు. పూర్తి వివరాలకు http:///kakinada. ap.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని సూచించారు. దరఖాస్తులను ఈ నెల 7 నుంచి 9వ తేదీ లోపు అర్బన్ ప్రాంతం వారు యూపీహెచ్‌సీ వైద్యాధికారికి, గ్రామీణ ప్రాంత వాసులు ఆ గ్రామ పరిధిలోని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కు అందజేయాలన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారంపై దృష్టి

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని సంయుక్త కలెక్టర్ రాహుల్‌మీనా ఆదేశించారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ, సర్వేశాఖ అధికారులతో బుధవారం కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రతి వారం నిర్వహిస్తున్న ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికకు రెవెన్యూ, సర్వేశాఖకు సంబంధించిన ఫిర్యాదులే ఎక్కువగా వస్తున్నాయని, వీటిని సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు. అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల్లో నిర్మించిన ఇళ్ల క్రమబద్ధీకరణకు ప్రభుత్వం అవకాశం కల్పించిందని, ఈ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. భూముల రీ-సర్వే జరిగిన గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎం సమస్యలకు సంబంధించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. న్యాయస్థానాల భవనాలకు, జాతీయ రహదారులకు భూ సేకరణ పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమైనచోట కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు అవకాశం కల్పించారని, పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. నీటి తీరువా నూరుశాతం రాబట్టాలని సూచించారు. డీఆర్వో జె.వెంకటరావు, కేఆర్‌సీ డిప్యూటీ కలెక్టర్ రత్నకుమారి, సర్వేశాఖ ఏడీ కట్టా శ్రీనివాస్, ఆర్డీవోలు ఎస్.మల్లిబాబు, కె.శ్రీరమణి, తహసీల్దార్లు, సర్వేయర్లు పాల్గొన్నారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించాలి

కూరాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆహారాన్ని తిని పరిశీలిస్తున్న రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు కృష్ణకిరణ్, లక్ష్మిరెడ్డి

కరప, న్యూస్‌టుడే: పిల్లలకు అందించే ఆహారంలో ఎటువంటి అలసత్వం లేకుండా చూడాలని రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యులు జక్కంపూడి కృష్ణకిరణ్, ఇ.లక్ష్మిరెడ్డి సూచించారు. కరప మండలం కొరిపల్లి, వాకాడ, కూరాడ, వేళంగిలలో బుధవారం పలు అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేశారు. కొరిపల్లిలో గత నెలలో సరఫరా చేసిన కోడిగుడ్లు పిల్లలకు పెట్టడంపై ప్రశ్నించారు. కార్యకర్తతో పాటు పర్యవేక్షణ చేయకపోవడం పట్ల సూపర్‌వైజర్‌కు షోకాజ్ నోటీస్ ఇమ్మని ఆదేశించారు. కూరాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆహారాన్ని రుచి చూశారు. సన్నబియ్యం కాకుండా దొడ్డుబియ్యం వాడటంపై ఇన్‌ఛార్జి హెచ్ఎంను ప్రశ్నించారు. గత నెలలో సరఫరా చేసిన కోడిగుడ్లు విద్యార్థులకు ఎలా పెడతారని, వాటిని వెంటనే వెనక్కి పంపించి కొత్తవి తీసుకుని పెట్టాలని సూచించారు. రికార్డులు సక్రమంగా నిర్వహించకపోవడంపట్ల షోకాజ్ నోటీసుకు ఆదేశించారు. అనంతరం వేళంగిలో ఎంఎల్ఎస్ గోదామును పరిశీలించారు. కొన్ని బస్తాలను కాటా వేయించగా కొన్నింటిలో అర కేజీ తక్కువగా ఉండటాన్ని గుర్తించి సక్రమంగా ఉండేలా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. డీవైఈవో ఎస్.వెంకటేశ్వరరావు, ఐసీడీఎస్ నోడల్ ఆఫీసర్ జెస్సీ ఫ్లోరెన్స్, సీడీపీవో వై.లక్ష్మి, ఎంఈవో కె.బులికృష్ణవేణి, సూపర్‌వైజర్ అన్నపూర్ణ, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ధరవరలు

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి (క్వింటాళ్లలో)	ధర (రూ॥లలో)
కొత్తకొబ్బరి కురిడీ (వెయ్యింటికి):	24,000
పాతకాయ: గండేరా	25,000
గటగట	26,000
కొత్తకాయ: గండేరా	26,000
గటగట	24,000
నీటి కాయ (వెయ్యింటికి):	
పాత (ముక్కుడు) కాయ	18,000-20,000
కొత్త (పచ్చి) కాయ	18,000-20,000
కొబ్బరినూనె మార్కెట్:	
15 కిలోలు	4,500
కిలో	300

గమనిక: అంబాజీపేట కొబ్బరి మార్కెట్ ధరలు ప్రతి బుధ, శనివారాల్లో మాత్రమే మారుతాయి.

వెన్‌కాబ్ చికెన్ ధర కిలోకు రూ॥లో

ఫారంరేటు	93-00
రిటైల్ లైవ్	115-00
డ్రెస్డ్	167-00
స్కిన్‌లెస్	190-00

92.7 FM Rajamahendravaram
ఈ FM 92.7 Mee FM
ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 9989993175

అమ్మవారి జాతరకొచ్చి.. విగతజీవిగా మారి..

ప్రమాదవశాత్తు కాలువలో పడి యువకుడి మృతి

నాగరాజు (పాతచిత్రం)

కాజులూరు, న్యూస్‌టుడే: స్వగ్రామంలో జరుగుతున్న జాతరకు హైదరాబాద్ నుంచి వచ్చిన యువకుడు ప్రమాదవశాత్తు టేకి కాలువలో జారిపడి ప్రాణాలు కోల్పోయాడు. చేతికందివచ్చిన కొడుకు మృత్యువాత పడటంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. పోలీసులు, కుటుంబ సభ్యుల సమాచారం ప్రకారం.. కోలంక గ్రామానికి చెందిన దాకమూరి నాగరాజు (22) హైదరాబాద్ నగరంలో ర్యాపిడో సర్వీసులో పనిచేస్తున్నారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన అమ్మవారి జాతరకు వచ్చిన ఆయన సోమవారం రాత్రి కోలంక నుంచి ద్రాక్షారామకు ద్విచక్ర వాహనంపై వెళుతుండగా ఉప్పుమిల్లి శివారు గోపిరేవు వంతెన వద్ద ప్రమాదవశాత్తు వాహనంపై నుంచి జారిపడి కాలువలో కొట్టుకుపోయారు. వంతెన రైలింగ్ శిథిలమవడంతో అక్కడే అదుపుతప్పిన ఆయన నేరుగా కాలువలో పడిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తాళ్లరేవు వద్ద బుధవారం మృతదేహం లభించడంతో పోస్టుమార్టం నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు గొల్లపాలెం పోలీసులు తెలిపారు. ఘటనపై ఎస్సై మోహన్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు..

కారు ఢీకొని దుకాణ యజమాని దుర్మరణం



చంద్రశేఖర్ (పాతచిత్రం)

ఏలేశ్వరం, న్యూస్‌టుడే : నిర్మాణ పనుల కోసం టిప్పర్‌లో నల్ల మెటల్ వచ్చిందని తెలిసి వేకువజామునే లేచి నడిచి వెళుతున్న ఆయనపై 'విధి' విషం చిమ్మింది. ప్రధాన రహదారి దాటుతున్న ఆయనను అపరిమిత వేగంతో వచ్చిన కారు ఢీకొట్టి వెళ్లడంతో సంతోషంగా సాగుతున్న ఆ కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. ఏలేశ్వరంలో బుధవారం తెల్లవారుజామున జరిగిన రహదారి ప్రమాదంలో స్థానికంగా ఉన్న చెప్పుల దుకాణం యజమాని గూడపాటి నాగ సత్య చంద్రశేఖర్ (44) అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. నడుస్తూ వెళుతున్న శేఖర్‌ను యర్రవరం నుంచి నర్సీపట్నం వైపు వెళ్లే కారు ఢీకొట్టి వెళ్లిపోవడం సమీపానే ఉన్న దుకాణాలకి చెందిన సీసీ కెమెరాల్లో అస్పష్టంగా రికార్డు అయింది. వాహన నంబరు మాత్రం కనిపించడం లేదు. శేఖర్‌కు భార్య దివ్య, 12 ఏళ్ల కుమారుడు, 9 ఏళ్ల కుమార్తె ఉన్నారు. వీరి రోదనలు మిన్నంటాయి. ఏలేశ్వరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ప్రమాదానికి కారణమైన వాహనం ఆచూకీ కోసం ప్రయత్నాలు సాగిస్తున్నారు.

EENADU e Classifieds

AUTO
VEHICLES WANTED
Wanted Vehicle: అశోక్ లేలాండ్ దోస్త్, టాటా ఇంట్రా, టాటా పికప్ వాహనాలు నెలవారి అద్దె ప్రాతిపదికన ప్రముఖ కంపెనీకి వాహనం అద్దెకు కావలెను. సంప్ర: ✆: 63022 27985.

HEALTH & CARE
మద్యపానం మానేయడం ఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్, షుగర్‌కు. రాజమండ్రి (ఇంతకు ముందు మెట్రో లాడ్జి) ఇప్పుడు same ప్లేస్. శ్రీసాయిలక్ష్మీ లాడ్జిలో మందులు. SVG మార్కెట్ రోడ్, ఆర్.టి.సి. బస్టాండ్ ఎదురుగా, ప్రతీ నెల 3, 17 తేదీల్లో.

REAL ESTATE
FLAT FOR SALE
KAKINADA CITY
Kakinada 2 BHK Flat 1000 sft, Kanna Enclave, Gudarigunta, NFCL Road, Kakinada with Car Parking, Near RTO Off. Ph: 63794 37423.

HOUSE FOR SALE
GENERAL
Kkd & సామర్లకోటలో 45 లక్షలు & 30 లక్షలకే, House (85 లక్షలు, 1.20 లక్షలకే విల్లా), Open Sites అమ్మకం. 80% లోన్ Kuda, 98490 40891.

EENADU for Advertisement Contact: 8008597607

PLOT FOR SALE
RAJAMAHENDRAVARAM RURAL
రాజమండ్రి బొమ్మూరులో తక్షణం ఇల్లు కట్టుకొనుటకు అన్ని సదుపాయములతో 150 చ॥గ॥ RUDA అప్రూవ్డ్ స్థలములు అమ్మకం. బ్యాంక్ లోన్ సదుపాయం కలదు. ✆ 78424 28888.

రాజమండ్రి వీడిగొయ్యి, లోటస్ స్కూల్ దగ్గర, N/F 40x70 కొలతలతో 311 గజాల స్థలం (3 బిట్లు-933 గజాలు) అమ్మకమునకు కలదు. (డైరెక్ట్ పార్టీస్ మాత్రమే). Govt. Rate గజం 22,000/-. Ph: 63794 37423.

JOBS
అభినయ ఎంటర్‌ప్రైజెస్, రాజమండ్రి, టాటా సోలార్ నందు పనిచేయుటకు అనుభవంగల టెక్నీషియన్స్ & కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. Contact: 94924 44555.

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో+ వ+ మంచి జీతం + ఇన్సెంటివ్స్ కలవు. 99590 21122/ 99590 31122.

కావలెను
మా ఆఫీస్ నందు పనిచేయుటకు ఆఫీస్ అసిస్టెంట్ (F) మరియు సైట్ సూపర్‌వైజర్స్(M) కావలెను. Qul: డిగ్రీ, Exp: 2 yrs., 2 వీలర్ మస్ట్
OSTRICH
Axis బ్యాంక్ పైన, దానవాయిపేట రాజమండ్రి, సెల్: 93462 16570

రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్ల సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో. వ. + జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ✆ 92814 52845, 82475 00574.

WANTED
High School Teachers
RAVINDRA HIGH SCHOOL, Madiki
Location: Madiki, in between Jonnada and Vemagiri, Near NH16 Highway.
Need Telugu, English, and Physics High School Teachers.
Phone Number
91105 67164
95334 31103

రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No-1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+ వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119430, 9618802390.

ప్రభాకరనిధి, దేవిచౌక్, రాజమండ్రి నందు బిజినెస్ ప్రమోషన్ చేయుటకు అభ్యర్థులు కావలెను. ఆసక్తిగలవారు సంప్రదించండి. సెల్: 79952 33384.

శివకార్తికేయ హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు ఇంటి/ వంట పనిచేయుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 20K. ✆ 99120 11499, 99120 11899.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ తూర్పుగోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు ధర రూ. 5-70 పైౖ
అనపర్తి ఆఫీసు: 08857-226908

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

కాకినాడ

రైతుబజార్‌లో నిన్నటి ధరలు(కిలోకు)

గాంధీనగర్: టమాట - 24, 26, వంకాయలు - 36, 46, 54, బెండకాయలు - 38, పచ్చిమిర్చి - 46, 48, కాకరకాయ - 40, బీర - 32, 40, క్యాబేజీ - 29, క్యారెట్ - 36, దొండకాయలు - 36, 40, బంగాళాదుంపలు - 20, 23, ఉల్లి - 23, 29, గోరుచిక్కుళ్లు - 38, దోసకాయలు - 14, చిక్కుళ్లు- 60, చేమదుంపలు - 40, బీట్‌రూట్ - 34, కీరదోస - 40, బీన్స్ కాయలు - 96, అల్లం - 50, క్యాప్సికం - 78, బొబ్బర్లు - 36, చిలకడదుంపలు - 36, ఒకటి చొప్పున ఆనపకాయ - 12, 17, పొట్లకాయ - 16 20, అరటికాయ - 7, 9, మునగకాడ - 12, 14, మామిడికాయ - 10, 12, నిమ్మకాయలు(డజన్) - 24, 36, 48.

నగరంలో సినిమాలు

ఆనంద్ సినిమాస్ 4(స్క్రీన్స్)- కన్నప్ప, మార్గాన్, కుబేర, ఎఫ్1 ది మూవీ, దేవి మల్టీప్లెక్స్ 4(స్క్రీన్స్- కన్నప్ప, మార్గాన్, మా, లక్ష్మీ- కుబేర, సత్యగౌరి - కన్నప్ప, తిరుమల - కన్నప్ప, సీఅండ్‌సీ 1- ఎఫ్1 ది మూవీ, సీఅండ్‌సీ 2- కుబేర, శ్రీప్రియ - సింగిల్, పద్మప్రియ- కన్నప్ప, సూర్య1(వాకలపూడి) - కుబేర, సూర్య 2 - కన్నప్ప - **న్యూస్‌టుడే, గాంధీనగర్**

విద్యార్థిని చదువుకు ఆర్థికసాయం

గాంధీనగర్, న్యూస్‌టుడే: ఇంజినీరింగ్ విద్యార్థిని నందిత చదువు అవసరాలకు రూ.25 వేల ఆర్థికసాయాన్ని శ్రీయువసేన ఆధ్వర్యంలో సహాయనిధి ద్వారా మానసిక వైద్య నిపుణులు డాక్టర్ వి.వరప్రసాద్, డాక్టర్ సురేఖ దంపతులు తమ కుమారుడు కస్విన్ పుట్టినరోజు సందర్భంగా బుధవారం అందజేశారు. మెయిన్‌రోడ్డులోని గ్లాస్ హౌస్ సెంటర్‌లోని శ్రీయువసేన బ్లడ్‌బ్యాంకులో జరిగిన కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు సతీష్, సోము స్వాతి, రాజ్‌కుమార్, సానం హరీష్, దీపిక, కర్రి శ్రీనివాసు, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

26న నాటక ప్రదర్శన

కాకినాడ కలెక్టరేట్, న్యూస్‌టుడే: అభ్యుదయ అకాడమీ-హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈనెల 26న కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో బుద్ధునితో నా ప్రయాణం- డాక్టర్ అంబేడ్కర్ నాటకాన్ని ప్రదర్శించనున్నట్లు అంబేడ్కర్ బౌద్ధ ధార్మిక సంఘాలు ప్రతినిధులు తెలిపారు. బుధవారం స్థానిక బుద్ధవిహార్‌లో ఆయా సంఘాల ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అయితాబత్తుల రామేశ్వరరావు మాట్లాడుతూ బౌద్ధ ఔన్నత్యాన్ని నాటకంలో ప్రదర్శిస్తారని, ప్రజలు హాజరై విజయవంతం చేయాలని కోరారు. పి.రాంప్రసాద్, పి.రామారావు, ఎన్.పెద్దిరాజు, కింగ్‌కుమార్‌బాబు, ఎస్.విజయశేఖర్, మౌర్య, రమేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆచమనం నాటిక..

గాంధీనగర్: ఎస్వీ రంగారావు కళాస్రవంతి సామాజిక సాంస్కృతిక సేవాసంస్థ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం దంటు కళాక్షేత్రంలో ఆచమనం నాటిక ప్రదర్శిస్తారని సంస్థ నిర్వాహకులు పేర్నిడి వెంకన్నబాబు, డేగల వెంకట్ తెలిపారు. తొలుత నాట్యాచార్య ఎంవి.రమణ శిష్య బృందంతో నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు:	
సాంబమూర్తినగర్	91548 46719
మసీదుసెంటర్	91541 18210
గాంధీనగర్	80085 74159
బాలాజీచెరువు	80085 74154
కాకినాడ నగరం	80085 74157

ఉ. 10 - మ. 1

చెత్త నిల్వలు తరలించండి..

గాంధీ పార్కు ఉత్తరం వైపు గేటు పక్కన కొమ్మలు, చెత్తను చాలా రోజులుగా తరలించకుండా అలాగే వదిలేశారు. దుర్వాసన వస్తోంది. నగరపాలక అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని సందర్శకులతోపాటు స్థానికులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

రామారావుపేట సుబ్బయ్య హోటల్ కూడలి వద్ద డ్రైనేజీ చుట్టూ గోడతో ప్రజలు రాకపోకల సమయంలో ఇబ్బందులు పడుతున్నారు. మలుపు తిరిగే క్రమంలో ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా చెట్టు

విద్యుత్‌నగర్ క్రాస్‌రోడ్ నంబరు1లో ఓ చెట్టు రోడ్డుపైకి వాలి ప్రమాదకరంగా ఉండటంతో వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాల నేపథ్యంలో ఇది కూలే ఆస్కారం ఉందని సంబంధిత అధికారులు స్పందించి చెట్టును తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్**

ఆత్మరక్షణ.. ఆత్మవిశ్వాసం

తైక్వాండోలో రాణిస్తున్న విద్యార్థులు

న్యూస్‌టుడే, మసీదు సెంటర్ (కాకినాడ)

చదువుతో పాటు ఆత్మరక్షణ క్రీడలో అదుర్స్ అనిపిస్తున్నారు కాకినాడ విద్యార్థులు. ఏ ప్రాంతానికి వెళ్లినా పోటీల్లో పతకాలు సాధిస్తూ దూసుకెళ్తున్నారు. చదువుతో పాటు జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి పోటీల్లో రాణిస్తున్నారు. గత నెలలో ఉత్తరాఖండ్‌లో జరిగిన జాతీయస్థాయి టోర్నమెంటులో సత్తా చాటారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు గెలుస్తామని, క్రీడాకోటాలో ఉద్యోగాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు.

అమ్మానాన్నల ప్రోత్సాహంతో..

ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్నా. నాన్న సంతోష్ వ్యాపారి. అమ్మ స్వాతిలత గృహిణి. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ఆత్మరక్షణ క్రీడల్లో 9 ఏళ్ల నుంచి శిక్షణ పొందుతున్నా. ఇప్పటివరకూ 7 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని 14 పతకాలు సాధించాను. జాతీయస్థాయి పోటీల్లో 4 పతకాలు వచ్చాయి. తైక్వాండో శిక్షణతో ఆత్మవిశ్వాసం పెరిగింది. ఇటీవల జరిగిన జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని ఒక బంగారు, ఒక కాంస్యంతో సత్తాచాటాను. క్రీడాకోటాలో ఉద్యోగం సాధించి ఎయిర్‌ఫోర్స్ అధికారి అవ్వాలనేది నా కల. - **శ్రీస్నేహ**

ఆర్మీలో చేరి దేశసేవ చేస్తా

ఇంటర్ ద్వితీయ ఏడాది చదువుతున్నా. నాన్న సురేష్ వ్యాపారి, అమ్మ శ్రీదేవి గృహిణి. అమ్మ ప్రోత్సాహంతో ఐదో తరగతి నుంచి కోచ్ అర్జునరావు వద్ద తైక్వాండోలో శిక్షణ పొందుతున్నా. ప్రతిరోజూ రెండు గంటల పాటు సాధన చేస్తా. ఇప్పటివరకూ 5 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని 10 పతకాలు సాధించాను. జాతీయస్థాయిలో 4 పతకాలు వచ్చాయి. ఆర్మీలో చేరి దేశసేవ చేయాలనేది నా ఆశయం. ఇప్పటినుంచే సన్నద్ధమవుతున్నా - **అఖిల్**

అంతర్జాతీయస్థాయిలో రాణించాలని...

ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్నా. నాన్న వేణుగోపాల్ హోటల్‌లో పనిచేస్తారు. వెంకటదుర్గ గృహిణి. 10 ఏళ్ల నుంచి శిక్షణ పొందుతున్నా. ఆడపిల్లలకు ఇలాంటి క్రీడలు ఎంతో అవసరం. ఇప్పటి వరకూ 8 సార్లు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని 15 పతకాలు సాధించా. ఇటీవల జరిగిన జాతీయస్థాయి పోటీల్లో తొలిసారి కాంస్య పతకం సాధించా. ఎంతో ఆనందంగా ఉంది. అంతర్జాతీయస్థాయిలో తైక్వాండోలో రాణించి పతకం సాధించాలనేది నా లక్ష్యం. - **జయలక్ష్మి**

ఆటపై మక్కువతో..

ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్నా. నాన్న సురేష్ వ్యాపారి. అమ్మ శ్రీదేవి గృహిణి. తైక్వాండోపై మక్కువతో గత ఐదేళ్ల నుంచి కోచ్ అర్జునరావు వద్ద నేర్చుకుంటున్నా. ఇప్పటివరకూ పలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించా. ఇటీవల తొలిసారి జాతీయస్థాయి పతకం గెలవడంతో సంతోషంగా ఉంది. తైక్వాండో రాణిస్తూ సేవ చేస్తా. - **పల్లవి దుర్గామల్లిక**

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: జగన్నాథపురంలోని అన్నవరం సత్యవతీదేవి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనంత లక్ష్మి తెలిపారు. కంప్యూటర్ సైన్స్, మ్యాథమెటిక్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, కామర్స్, బోటనీ, జువాలజీ, ఆక్వాకల్చర్, మైక్రోబయాలజీ, పొలిటికల్ సైన్స్, హిస్టరీ, సంస్కృతం, లైబ్రరీ సైన్స్‌కు సంబంధించి అధ్యాపకుల నియామకానికి మౌఖిక పరీక్ష నిర్వహిస్తామన్నారు. పీజీలో కనీసం 55 శాతం మార్కులు వచ్చిన వారు అర్హులని, నెట్, సెట్, స్లెట్, పీహెచ్‌డీలో అర్హత పొంది, అనుభవం ఉన్న మహిళా అభ్యర్థులకు ప్రాధాన్యం ఇస్తామని చెప్పారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ బయోడేటా, ఒరిజినల్ ధ్రువపత్రాలు, నకళ్లతో జులై 4న హాజరుకావాలని సూచించారు. ఆర్ట్స్, కామర్స్, సంస్కృతం సబ్జెక్టులకు ఉదయం 10 గంటలకు, సైన్స్ సబ్జెక్టులకు మధ్యాహ్నం 2 గంటలకు పరీక్ష జరుగుతుందన్నారు.

చోదకులకు ఏకాగ్రత అవసరం

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: డ్రైవర్లు వాహనాలు నడిపే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని, ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ఏకాగ్రతతో ఉండాలని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ జి.శ్రీకాంత్‌బాబు సూచించారు. కాకినాడ ఆర్టీసీ బస్టాండులో హెవీ మోటారు డ్రైవింగ్ శిక్షణ తరగతులు 20వ బ్యాచ్ బుధవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథులుగా పాల్గొన్న జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.శ్రీనివాసరావు, డిపో అసిస్టెంట్ కమిషనర్ ఎయూబీ మనోహర్ మాట్లాడుతూ క్రమశిక్షణతో తరగతులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం శిక్షణ డ్రైవర్లకు మెటీరియల్ అందజేశారు. శిక్షకులు కేబీఎం రాజు, కె.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మెటీరియల్ అందజేస్తున్న డీపీటీవో శ్రీనివాసరావు

రేపు విద్యుత్తు సరఫరా నిలిపివేత

కాకినాడ కలెక్టరేట్: నగరంలోని ప్రతాప్‌నగర్ విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఎన్.ఉదయ్‌భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రతాప్‌నగర్, దుర్గయ్యతోట, టీచర్స్‌కాలనీ, ట్రెజరీ కాలనీ ప్రాంతాల్లో విద్యుత్తు సరఫరా ఉండదని చెప్పారు.

హామీలు అమలు చేస్తున్నాం: ఎమ్మెల్యే

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పక్కాగా అమలు చేస్తున్నామని నగర ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలిపారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం 6, 24వ డివిజన్లలో జరిగిన కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. గత అయిదేళ్లలో జగన్ రాష్ట్రాన్ని ఆర్థికంగా విచ్ఛిన్నం చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు తన తెలివితేటలతో రాష్ట్రాన్ని గాడిన పెడుతూనే, సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నారని చెప్పారు. పింఛన్ల పెంపు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం పథకాలు అమలు చేశారని తెలిపారు. త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు అన్నదాతా సుఖీభవ, నిరుద్యోగ భృతి అందజేయనున్నారని కొండబాబు తెలిపారు. ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరుతూ ఆయన ఆయా డివిజన్లలో కరపత్రాలను పంపిణీ చేశారు. గదుల సాయిబాబు, ఎంఏ తాజుద్దీన్, వమ్మి బాలాజీ, పలివెల రవి, పోలపల్లి జగన్, పాలిక నాని, సూర్య, చిట్నీడీ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కొండబాబు

వైద్యులకు సత్కారం

సత్కారం పొందిన వైద్యులతో క్లబ్ సభ్యులు, చిన్నారులు

సాంబమూర్తినగర్, న్యూస్‌టుడే: స్థానిక రెయిన్‌బో చిల్డ్రన్ హోమ్‌లో హోప్ ఫర్ చేంజ్ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు లక్ష్మీనాగేంద్ర సారథ్యంలో బుధవారం పలువురు వైద్యులకు సన్మానం చేశారు. డాక్టర్స్ డే పురస్కరించుకుని అలయన్స్ క్లబ్ ఆఫ్ కాకినాడ రెయిన్‌బో అధ్యక్షురాలు సత్యకుమారి, కార్యదర్శి రేవతి ఆధ్వర్యంలో వైద్యులు గౌరీశేఖర్, తన్మయి, హరినాథ్, చప్పిడి వెంకటేశ్వరరావు, వనుము శ్రీనివాస్‌లను ఘనంగా సత్కరించారు. హరినాథ్, బాలాత్రిపురసుందరి, కుమారి, రేవతి, ప్రమీల, హేమలత, కిరణ్, కౌశిక్ తదితరులు పాల్గొన్నారు.

వైకాపా నిరసన సిగ్గుచేటు: మోకా

కాకినాడ నగరం, న్యూస్‌టుడే: రైతులకు ధాన్యం బకాయిలను చెల్లించాలని కోరుతూ బుధవారం జడ్పీ సమావేశంలో వైకాపా సభ్యులు నిరసన వ్యక్తం చేయడం సిగ్గుచేటని రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ మోకా ఆనంద సాగర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రస్తుత పంటకు సంబంధించి రూ.5,456 కోట్ల ధాన్యాన్ని కొనుగోలు చేశారని, వీటి తాలూకు సొమ్ములను రైతులకు జమ చేశారని గుర్తుచేశారు. రూ.900 కోట్లు మాత్రమే చెల్లించాల్సి ఉందని వరించారు. ఈ బకాయిలపై ఇటీవల జరిగిన పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ల సమావేశంలో చర్చించి, సీఎం దృష్టికి తీసుకెళ్లగా ఆయన స్పందించి వెంటనే రూ.300 కోట్లు విడుదల చేశారని గుర్తుచేశారు. మిగతా సొమ్ము త్వరలోనే చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా వైకాపా ప్రజాప్రతినిధులు జడ్పీ వద్ద రాద్ధాంతం చేయడం ప్రజలను మభ్యపెట్టడానికేనని విమర్శించారు. గత వైకాపా ప్రభుత్వం నెలల తరబడి ధాన్యం సొమ్ములు చెల్లించని పరిస్థితిని రైతులు మరచిపోలేదని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

మసీదు సెంటర్(కాకినాడ): రాజమహేంద్రవరం, శ్రీకృష్ణపట్నానికి చెందిన దాసరి రాంబాబు(45) బొమ్మూరు పరిధిలో బుధవారం నడిచి వెళుతుండగా లారీ ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన ఆయనను కాకినాడ జీజీహెచ్‌లో చేర్చగా చికిత్స పొందుతూ చనిపోయారు. దీనిపై బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు.

గాయపడిన వృద్ధుడు..

మసీదు సెంటర్(కాకినాడ): ముమ్మిడివరానికి చెందిన పి.సూర్యనారాయణ(65) కాలినగాయాలతో గతనెల 28న జీజీహెచ్‌లో చేరారు. పరిస్థితి విషమించడంతో మంగళవారం అర్ధరాత్రి మృతిచెందారు. ముమ్మిడివరం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ బాలుడు..

మసీదు సెంటర్(కాకినాడ): ద్రాక్షారామ, వేగయమ్మపేటకి చెందిన బాలుడు(17) గతనెల 28న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అతడిని కుటుంబసభ్యులు కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. దీనిపై ద్రాక్షారామ పోలీసులు కేసు నమోదు చేశారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

మసీదు సెంటర్(కాకినాడ): ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం కాకినాడలో చోటుచేసుకుంది. గాంధీనగర్‌లోని ఎల్విన్‌పేటకు చెందిన డి.షాహిన్(19) ఏడోతరగతి వరకు చదివి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడు. అతనికి తల్లి శాంత కుమారి, సోదరి ఉన్నారు. ప్రేమ వ్యవహారం నేపథ్యంలో మనస్తాపంతో ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. అపస్మారక స్థితిలో ఉన్న అతడిని కుటుంబసభ్యులు జీజీహెచ్‌కు తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుని బంధువు ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

అప్పులబాధతో ఏసీ మెకానిక్..

మసీదు సెంటర్(కాకినాడ): అప్పులబాధ తాళలేక ఓ యువకుడు ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. కాకినాడ ప్రతాప్‌నగర్‌కు చెందిన నల్లా రాజు(29) ఏసీ మెకానిక్‌గా పనిచేస్తారు. అతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఇటీవల అప్పులు ఎక్కువవడంతో వాటిని తీర్చలేక మనస్తాపంతో బుధవారం తెల్లవారుజామున ఫ్యాన్ ఉక్కుకు దుప్పటితో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మృతుని బంధువు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కదలవు.. కనిపించవు

- రోడ్డుకు అడ్డంగా పశువులు
- చీకట్లో వాహన చోదకులకు ఇక్కట్లు

సాంబమూర్తినగర్(కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ నగరంలోని పలు ప్రధాన రహదారులు, కూడళ్ల వద్ద పశువుల సంచారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పశువులు గుంపులు గుంపులు యథేచ్ఛగా రోడ్లపై సంచరిస్తుండటంతో వాహన చోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. గతంలో నగరపాలక అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టి పశువుల సంచారాన్ని కొంత మేర అరికట్టారు. చాలాకాలంగా వీటిపై ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంతో మళ్లీ పరిస్థితి దారుణంగా తయారైంది. గతంలో డెయిరీఫారం కూడలి, దుమ్ములపేట, గొడారిగుంట ప్రాంతాల్లో పశువులు అడ్డు రావడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురై ఆస్పత్రి పాలయ్యారు. పరిస్థితి ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గాంధీనగర్ ప్రధాన రహదారిలో అడ్డుగా పశువులు

ఈ ప్రాంతాల్లో అధికం

- గొడారిగుంట, పళ్లంరాజునగర్ ప్రధాన రహదారులతోపాటు కూడళ్ల వద్ద నిత్యం రాత్రి సమయంలో పశువులు అడ్డుగా ఉంటున్నాయి. ఇదే ప్రాంతంలో గతంలో పలువురు వాహన చోదకులు ప్రమాదాలకు గురయ్యారు.
- డెయిరీఫారం కూడలి, దుమ్ములపేట, సంజయ్‌నగర్ ప్రధాన రహదారులపై ఈ సమస్య అధికంగా ఉంది. నిత్యం రద్దీగా ఉండే గాంధీనగర్, ప్రతాప్‌నగర్, రామారావుపేట తదితర ప్రాంతాల్లో ఇదే పరిస్థితి నెలకొంది.

నిత్యం ట్రాఫిక్‌కు అంతరాయం..

గాంధీనగర్ మెయిన్‌రోడ్డుతోపాటు వీధుల్లో నిత్యం పశువులు తిష్ఠ వేస్తున్నాయి. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. వాహనాలపై వెళ్తున్న వృద్ధులు, మహిళలు, చిన్న పిల్లలు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు వెంటనే వాటిని తరలించడానికి చర్యలు చేపట్టాలి.

– గోడి సత్యవతి వెంకట్, మాజీ కార్పొరేటర్, గాంధీనగర్

అదుపుతప్పి లెక్చరర్ దుర్మరణం

మసీదు సెంటర్ (కాకినాడ): చీకట్లో రోడ్డుకు అడ్డుగా ఉన్న ఆవును ఢీకొని లెక్చరర్ దుర్మరణం చెందిన విషాద సంఘటన బుధవారం రాత్రి కాకినాడలో చోటుచేసుకుంది. నగరానికి చెందిన ఎం.ఎస్.వి.వి.రమేష్(46) ఓ ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తున్నారు. ద్విచక్రవాహనంపై వెళ్తుండగా స్థానిక డీమార్ట్ సమీపంలో రహదారికి అడ్డుగా చీకట్లో ఉన్న ఆవు కనిపించకపోవడంతో ప్రమాదవశాత్తూ ఢీకొన్నారు. ఆయన కిందపడిపోవడంతో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే జీజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. దీనిపై సర్పవరం పోలీసులు కేసు నమోదు చేశారు. డీమార్ట్ నుంచి గొడారిగుంట చుట్టుపక్కల రహదారులపై రోడ్డుకు అడ్డుగా పశువులు తిష్ఠ వేస్తున్నాయని, దీంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు వాపోతున్నారు.

తవ్వేశారు.. వదిలేశారు

కాకినాడ వెంకట్‌నగర్‌లోని ప్రధాన రహదారి మధ్యలో గతంలో పైపులైను లీకవడంతో గుంతను తవ్వి మరమ్మతులు చేపట్టారు. తర్వాత దానిని సరిగా పూడ్చకుండా పైపైన మట్టి వేసి వదిలేశారు. దీంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పలువురు అదుపుతప్పి పడిపోవడంతో గాయాల పాలవుతున్నారు. రాత్రిపూట ఇటువైపు కొత్తగా ప్రయాణించేవారు మరిన్ని ఇక్కట్లు పాలవుతున్నారు. గత కొన్నిరోజులుగా ఈ పరిస్థితి నెలకొన్నా ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. దీనిపై సంబంధిత సచివాలయ కార్యదర్శిని సంప్రదించగా రోడ్డును సరి చేయిస్తామని చెప్పారు. - **న్యూస్‌టుడే, మసీదుసెంటర్**

చోరీ ఘటనలపై కేసులు

మసీదు సెంటర్, న్యూస్‌టుడే: వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన చోరీలపై కాకినాడ పోర్టు పోలీసులు బుధవారం కేసులు నమోదు చేశారు. కాకినాడ ఏటిమొగకు చెందిన ఎ.నూకరత్నం ఇంట్లో గతనెల 8న గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి బంగారు మంగళసూత్రాలు, అలాగే ఎం.లోవరాజు ఇంట్లో మరో రెండు బంగారు మంగళసూత్రాలు చోరీకి పాల్పడ్డారు. గతనెల 9న ఏటిమొగకి చెందిన ఎం.సీతామహాలక్ష్మి ఇంట్లోకి గుర్తుతెలియని వ్యక్తులు ప్రవేశించి బంగారు ఆభరణాలు, అదే రోజు కె.అమ్మాజి ఇంట్లో రెండు బంగారు మంగళసూత్రాలు దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసులు నమోదు చేశారు.

నీళ్లు అనుకుని విషద్రావణం తాగిన ఉద్యోగిని

మసీదు సెంటర్: కాకినాడ గ్రామీణ మండలం గంగనాపల్లికి చెందిన వివాహిత స్థానిక కలెక్టరేట్ కార్యాలయంలోని ఎస్‌టీపీటీ బ్లాక్‌లో పనిచేస్తున్నారు. ఆమె మంచినీళ్లు అనుకుని పక్కనే సీసాలో ఉన్న విషద్రావణం తాగారు. అస్వస్థతకు గురవడంతో చికిత్స నిమిత్తం బుధవారం జీజీహెచ్‌లో చేర్చారు.

ప్రమాదాల కూడలికి కుర్చీయే అడ్డు

కాకినాడ ఆర్టీవో కార్యాలయం ప్రధాన రహదారి నుంచి గంగరాజునగర్ వెళ్లే నాలుగు రోడ్ల కూడలి ప్రమాదాలకు నిలయంగా మారింది. మలుపు వద్ద గుంతలు ఏర్పడ్డాయి. రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గుంతల్లో నీరు చేరింది. రాత్రి సమయంలో వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. అటుగా రాకపోకలు సాగించకుండా స్థానికులు కొందరు కుర్చీతోపాటు కర్రను అడ్డుగా ఉంచారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - **న్యూస్‌టుడే, సాంబమూర్తినగర్**

నేడు క్రిస్టియన్ డే వేడుకలు

గాంధీనగర్: ఆల్ ఇండియా క్రిస్టియన్ కౌన్సిల్, పాస్టర్స్ ఫెలోషిప్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కాకినాడలో ఇండియన్ క్రిస్టియన్ డే వేడుకలు నిర్వహించనున్నట్లు కౌన్సిల్ జిల్లా అధ్యక్షుడు రిక్కీగూటం తెలిపారు. నగరంలో బుధవారం జరిగిన జిల్లా శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సందర్భంగా మెగా వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. సాయంత్రం మెక్లారిన్ హైస్కూల్ ప్రాంగణంలో బహిరంగ సభ జరుగుతుందన్నారు. అతిథులుగా ఎంపీ తంగెళ్ల ఉదయ శ్రీనివాసు, ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీలు పాల్గొంటారన్నారు. సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.స్టీఫెన్, బిషప్ జోసఫ్ బెన్నీ, శీరం ఐజాక్, జాషువాగిరి తదితరులు పాల్గొన్నారు.

వర్షం.. రహదారులు జలమయం

సాంబమూర్తినగర్, మసీదు సెంటర్ (కాకినాడ), న్యూస్‌టుడే: కాకినాడ నగరంలో బుధవారం తెల్లవారుజాము నుంచి వర్షం పడడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులతోపాటు కాలనీ వీధుల్లో నీరు నిలిచింది. శాంతినగర్, పోస్టల్‌కాలనీ, పళ్లంరాజునగర్ తదితర ప్రాంతాల్లో గుంతల్లో నీరు నిలబడడంతో రాకపోకలకు స్థానికులు ఇబ్బందులు పడ్డారు. కాలువల్లో మురుగు రోడ్లపైకి చేరుతోంది. దాంతో దుర్వాసన వెదజల్లుతోందని, దోమలవ్యాప్తి చెంది వ్యాధుల బారిన పడుతున్నామని నగరవాసులు వాపోతున్నారు.

డీఎస్‌పీ మైదానంలో నిలిచిన వర్షపునీరు

కొత్తకాకినాడ కూడలి వద్ద..

శాంతినగర్‌లోని ఓ వీధిలో..

శ్రీ పైండా చలమయ్య సత్రం (శ్రీనివాస కళ్యాణ మండపం)
దేవదాయ ధర్మదాయ శాఖ, డో.నెం.27-4-24, దేవాలయం వీధి, కాకినాడ.

టెండర్ ప్రకటన

కాకినాడ జిల్లా, కాకినాడ నగరం, దేవాలయం వీధిలో గల శ్రీ పైండా చలమయ్య గారి ధర్మ సత్రం నందు ఉచిత భోజన సదుపాయము నిమిత్తం సత్రమునకు కూరగాయలు స్వంత ఖర్చులతో సరఫరా చేయుటకు ది.01-08-2025 నుండి ది.31-07-2026 వరకు ఈ దిగువ కూరగాయలు సరఫరా కొరకు అర్హత గల వ్యాపారుల నుండి సీలు టెండర్లు కోరడమైనది.

వ.నెం.	సరుకు వివరము	ధరావతు	టెండర్ షెడ్యూల్	కాలపరిమితి
1	కూరగాయలు	10,000/-	రూ. 200/-	ది.01-08-2025 నుండి ది.31-07-2026

ముఖ్య షరతులు

తేది: 02-07-2025

ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లిమిటెడ్
ప్రధాన కార్యాలయము : గాంధీ బొమ్మ దగ్గర, జాంపేట, రాజమహేంద్రవరం

బహిరంగ వేలం నోటీసు

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8 (6) నిబంధనలతో చదవబడు
SARFAESI యాక్ట్ 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకమునకు వేలం ప్రకటన

బహిరంగ వేలం తేది & సమయము: తేది: 14-08-2025, సమయము: సా. 4.00 గం. లకు.
ప్రదేశము: ది జాంపేట కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ లి., ఏలూరు బ్రాంచి, ఏలూరు.

బ్రాంచి: ఏలూరు

బకాయి మొత్తము: తేది: 30-11-2023 నాటికి రూ.44,36,091/-

రిజర్వు ధర: రూ.55,00,000/- ధరావత్తు సొమ్ము: రూ.5,50,000/-

ప్రదేశము: రాజమహేంద్రవరం, తేది: 02.07.2025

కాకినాడ గ్రామీణం

• కాకినాడ గ్రామీణం • పెద్దాపురం • పిఠాపురం

రాయుడుపాలెంలో అమ్మవారు

వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు

పిఠాపురం, సర్పవరం జంక్షన్: పిఠాపురంలోని చింతావారి వీధిలోని మహలక్ష్మి గణపతి సహిత సీతారామాంజనేయ స్వామి ఆలయంలోని వారాహి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి నవరాత్రుల సందర్భంగా ప్రత్యేక అలంకరణ చేశారు. ✦ కాకినాడ శ్రీపీఠంలో స్వామి పరిపూర్ణానంద సరస్వతి ఆధ్వర్యంలో ఇష్టసిద్ధి గణపతికి పంచామృత అభిషేకాలు, సకలసిద్ధికి, విఘ్ననివారణకు అష్టద్రవ్య హోమాలు నిర్వహించారు. చండీ హోమం, వారాహి, బగళాముఖి, వటుక భైరవ జపాత్మక హోమాలు నిర్వహించారు.

విధుల్లో చేరిన అధికారులు

పిఠాపురం: సాధారణ బదిలీల్లో భాగంగా పిఠాపురం పురపాలక సంఘంలో ముగ్గురు అధికారులు కొత్తగా విధుల్లో చేరారు. చాలాకాలంగా ఖాళీగా ఉన్న మేనేజర్, ఏఎస్‌వో పోస్టు భర్తీ అయ్యాయి. మున్సిపల్ మేనేజర్‌గా మండపేట నుంచి కడియం హరి మోహన్, ఏఎస్‌వోగా రాజమణి, ఏఈగా కాకినాడ కార్పొరేషన్ నుంచి ఉద్యోగోన్నతిపై కమలహాసన్ బాధ్యతలు స్వీకరించారు.

నట్టల నివారణ మందు పంపిణీ

గొల్లప్రోలు: గొర్రెలు, మేకల్లో నట్టల నివారణకు ఉచితంగా మందు పంపిణీ చేస్తున్నట్లు దుర్గాడ పశువైద్యాధికారి డా. డి.శ్రీనివాస్ తెలిపారు. దుర్గాడలో బుధవారం ప్రత్యేక శిబిరం ఏర్పాటుచేసి 1000 గొర్రెలు, మేకలకు వేసేందుకు వాటి యజమానులకు మందును పంపిణీ చేశారు.

భూముల కొనుగోళ్ల లెక్క తేల్చుతాం: ఎమ్మెల్యే దాట్ల

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు

తాళ్లరేవు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో పేదల ఇళ్ల స్థలాల కోసం భూముల కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై లెక్క తేల్చుతామని ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు పేర్కొన్నారు. గాడిమొగలో సర్పంచి కామాడి గోవలక్ష్మి, తెదేపా గ్రామ కమిటీ అధ్యక్షుడు సంగాడి కామేశ్వరరావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. ఎమ్మెల్యేతోపాటుగా తెదేపా కార్యకర్తలు ఇంటింటికీ తిరుగుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో పేదలకు ఇళ్ల స్థలాల కోసం భూముల కొనుగోళ్లలో రూ.కోట్లు దోచుకున్నారన్నారు. త్వరలోనే చొల్లంగి నుంచి నీలపల్లి వరకు ఇళ్ల స్థలాలకు కేటాయించిన భూములపై విచారణ చేయిస్తామన్నారు. ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మాతరాజు, గంగసూర్యనారాయణ, లక్ష్మణరావు, వినోద్, వెంకటరమణ, రామలక్ష్మి, నూకరాజు పాల్గొన్నారు.

సాగునీరు రాగా.. ఏరువాక సాగగా

• పీబీసీ నుంచి మొదలైన విడుదల

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురం బ్రాంచి కెనాల్ (పీబీసీ) నుంచి సాగునీటి విడుదల మొదలైంది. మరో రెండు రోజుల్లో పుష్కలంగా పొలాలకు నీరు చేరనుంది. ఖరీఫ్ పంటకు రైతులు నారుమళ్ల సిద్ధం చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. అదే విధంగా ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చొరవతో శివారు ఆయకట్టు వరకు నీరే చేరేలా కాలువల శుభ్రతకు చర్యలు చేపట్టారు.

ఆలస్యమైన సాగు..

పీబీసీ పరిధిలో సాగు ఇప్పటికే ఆలస్యమైంది. గోదావరి నుంచి జూన్ ఒకటినే నీటి విడుదల మొదలైనప్పటికీ ఇక్కడి ఆయకట్టు రైతులు సన్నద్ధం కాకపోవడం, కాలువల శుభ్రత పనులు జాప్యంతో సమస్యలు తలెత్తాయి. ఎట్టకేలకు తొలకరి పంటకు సంబంధించి నారుమళ్ల కోసం నీటి విడుదల ప్రారంభించగా జూలై ఒకటినే కాలువలకు నీరు చేరింది.

పీబీసీపై ఆయకట్టు..

మండలం	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)
సామర్లకోట	5,076
కాకినాడ గ్రామీణం	2,907
యు.కొత్తపల్లి	14,076
పిఠాపురం	2,135
గొల్లప్రోలు	5,115
తొండంగి	3,198

మొదటి పంటకు నవంబరు నెలాఖరు వరకు నీటి సరఫరాకు అన్ని చర్యలు చేపట్టారు. ఆరు మండలాల పరిధిలో పీబీసీపై 32,507 ఎకరాలకు నీరు ఇవ్వడానికి సన్నాహాలు చేస్తున్నారు. ఆ దిశగా తొలుత నారుమళ్ల కోసం 200 నుంచి 300 క్యూసెక్కుల విడుదల చేస్తున్నారు. రైతులు సకాలంలో నారుమళ్లు సిద్ధం చేసుకుంటే రెండో పంటకు కూడా త్వరితగతిన నీరు అందించేందుకు చర్యలు చేపడతామని అధికారులు అంటున్నారు.

107 పనులు రూ.3.91 కోట్లు..

గత వైకాపా ప్రభుత్వ హయాంలో కాలువల శుభ్రతను గాలికొదిలేశారు. ఏటా చేపట్టే క్లోజర్ పనుల ఊసే లేదు. ఈసారి కూటమి ప్రభుత్వం తొలకరి పంటకు ముందు వేసవిలో కాలువలు శుభ్రతకు చర్యలు చేపట్టింది. ఇలా పీబీసీపై 107 పనులకుగాను రూ. 3.91 కోట్లు మంజూరు చేయగా నెలరోజుల నుంచి పనులు జరుగుతున్నాయి. ఈ పనులన్నీ సాగునీటి సంఘాల పాలకవర్గం ఆధ్వర్యంలో సాగుతున్నాయి. ప్రస్తుతం 39 పనులు పూర్తి కాగా, మరో 39 పనులు జరుగుతున్నాయి. పీబీసీ నీరు 400 క్యూసెక్కుల మేర విడుదల చేసినప్పుడు గుర్రపు డెక్క తొలగింపునకు సంబంధించిన 29 పనులు మొదలు పెట్టాల్సి ఉంది.

పీబీసీ కాలువలో పూడికతీత పనులు

సద్వినియోగం చేసుకోవాలి..

కాలువలు శుభ్రత పనులు చాలా వరకు పూర్తయ్యాయి. గుర్రపు డెక్క తొలగింపు మాత్రం ఆలస్యమవుతుంది. రైతులు నీటిని సద్వినియోగం చేసుకుని నారుమళ్లు వేసుకుని, నెలాఖరుకు నాట్లు వేయడం పూర్తి చేసుకోవాలి. **- సంతోష్‌కుమార్, డీఈ, పీబీసీ**

విద్యుత్తు సరఫరాకు అంతరాయం రేపు

కొత్తపల్లి, పెద్దాపురం, పెదపూడి, గొల్లప్రోలు: యు.కొత్తపల్లి మండలం కోనపాపపేట విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలో గ్రామాలకు శుక్రవారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు సరఫరా నిలిపేస్తున్నట్లు ఆ శాఖ డీఈ ప్రభాకర్ తెలిపారు. ✦ పెద్దాపురం పట్టణం విద్యుత్తు ఉపకేంద్రంలో మరమ్మతుల కారణంగా ఉదయం 7 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ప్రభాకర్ తెలిపారు. ఉపకేంద్రం పరిధిలోని ప్రాంతాలకు సరఫరా ఉండదన్నారు. ✦ పెదపూడి మండల పరిధిలోని గండ్రేడు, పైన, రాజుపాలెం, వేంద్ర గ్రామాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ ఎన్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తామన్నారు. ✦ చేబ్రోలు ఉపకేంద్రం పరిధిలోని పరిశ్రమల లైను, దుర్గాడ, ఎ.విజయనగరం, మల్లవరం, తాటిపర్తి, చిజనగ్గంపేట, చెందుర్తి , వన్నెపూడి, చేబ్రోలు, కొడవలిలో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సరఫరా నిలిచిపోతుందన్నారు.

తాటిపర్తి ఫీడర్ పరిధిలో నేడు..

గొల్లప్రోలు: తాటిపర్తి ఫీడర్ పరిధిలో పరిశ్రమల లైను, చిజనగ్గంపేట, తాటిపర్తిలో గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకూ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ ప్రభాకర్ తెలిపారు.

సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోవద్దు

పిఠాపురం, సామర్లకోట, న్యూస్‌టుడే: చరవాణి అధికంగా వినియోగిస్తూ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో చిక్కుకోవద్దని పిఠాపురం సీఐ శ్రీనివాస్ విద్యార్థులకు సూచించారు. బుధవారం జగ్గయ్యచెరువు ప్రాంతంలోని బీఎంఆర్ బాలికోన్నత ప్లస్‌టూ స్కూల్‌లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఎస్సై మణికుమార్, ఎంఈవో శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు. ● ప్రమాదకర యాప్‌లతో అప్రమత్తంగా ఉండాలని సామర్లకోట ఎస్సై రాజు విద్యార్థులకు సూచించారు. యార్లగడ్డ అక్కిరాజు పురపాలిక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు నేరాలపై అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయురాలు కె.శ్రీదేవి, ఏఎల్‌వీ కుమారి, నాగమణి, భద్రమ్మ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్న సీఐ శ్రీనివాస్

12వ అదనపు జిల్లా కోర్టు ఏపీపీగా లక్ష్మణదొర

పిఠాపురం: పిఠాపురంలోని 12వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఏపీపీ(పబ్లిక్ ప్రాసిక్యూటర్)గా పిఠాపురానికి చెందిన ప్రముఖ న్యాయవాది బత్తిన లక్ష్మణ దొర నియమితులయ్యారు. బుధవారం రాత్రి హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులు జారీ చేశారు. ఏపీపీగా లక్ష్మణ దొర మూడేళ్ల పాటు కొనసాగుతారని పేర్కొన్నారు. 34ఏళ్లుగా న్యాయవాద వృత్తిలో ఉన్న ఈయనకు ఏపీపీగా అవకాశం దక్కింది. గతంలో పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పని చేశారు.

ఇంటింటా చెత్త సేకరణ పరిశీలన

గొల్లప్రోలు: ఇంటింటా చెత్త సేకరణతో సంపూర్ణ పారిశుద్ధ్యం సాధించవచ్చునని డిప్యూటీ ఎంపీడీవో కుమార్ అన్నారు. మండలంలోని చెందుర్తిలో ఇంటింటా చెత్త సేకరణ తీరును బుధవారం తనిఖీచేశారు. తడి, పొడి చెత్తను వేరువేరుగా సిబ్బందికి అందించాలని మహిళలను కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్సీ బొర్రా

మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపీమూర్తి

పెద్దాపురం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాటుపడతామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. ఉపాధ్యాయుడు బి.అనంతరావు స్వచ్ఛంద పదవీ విరమణ సభ స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనంలో మంగళవారం రాత్రి నిర్వహించారు. ఆయనను జేవీవీ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు చెలికాని స్టాలిన్, యూటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ప్రభాకరరావు, కేవీఎంఆర్ ప్రసాద్, రవి వర్మ, సూరిబాబు, సతీష్, శివశంకర్, శివ, సీతారామారావు తదితరులు సత్కరించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

పెద్దాపురం: అల్లూరి సీతారామరాజు జయంతిని పురస్కరించుకుని పెద్దాపురం చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం, క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు 4న సాయంత్రం బహుమతులు అందిస్తామని క్లబ్ గౌరవాధ్యక్షుడు బుద్దా శ్రీనివాస్, అధ్యక్ష, కార్యదర్శి కూనిరెడ్డి అరుణ, రొంగల అరుణ్ తెలిపారు.

సుపరిపాలనతో ప్రజల్లో సంతోషం

ఇంద్రపాలెంలో కుడిపూడి సత్తిబాబు తదితరులు

సర్పవరం జంక్షన్, కాజులూరు: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలతో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు అన్నారు. కాకినాడ గ్రామీణం వలసపాకలలో బుధవారం మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మితో కలిసి ఆయన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం విజయాలు వివరిస్తూ ప్రజల అభిప్రాయాలు తెలుసుకుని కరపత్రాలు పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే అనంతలక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన అన్ని హామీలు ప్రాధాన్యత క్రమంలో అమలుచేస్తున్నారు. నియోజకవర్గం కోఆర్డినేటర్ సత్యనారాయణమూర్తి, తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ● ముఖ్యమంత్రి తన సమర్థతో అభివృద్ధి వైపు నడిపిస్తున్నారని రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ ఛైర్మన్ కుడిపూడి సత్తిబాబు అన్నారు. కాకినాడ అర్బన్ 47, 50 డివిజన్లు, ఇంద్రపాలెం గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ప్రభుత్వ విజయాలను వివరించారు. కార్పొరేషన్ డైరెక్టర్ డా.చప్పిడి వెంకటేశ్వరరావు, నాయకులు వెంకటేశ్వరరావు, ప్రకాష్‌గౌడ్, చలపతిరావు, నాగమణి, సీతయ్యదొర పాల్గొన్నారు. ● కాజులూరులో తెదేపా మండల అధ్యక్షుడు చుప్పల నారాయణమూర్తి ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కోటిపల్లి, సిరిపురం, డీసీలు దాట్ల విజయగోపాలరాజు, పేపకాయల నారాయణ, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభం

సర్పవరం జంక్షన్, న్యూస్‌టుడే: రమణయ్యపేట పంచాయతీ ఏపీఐఐసీ కాలనీ అడబాల ట్రస్టు కార్యాలయంలో బుధవారం లయన్స్ క్లబ్ కాకినాడ విజన్ అధ్యక్షురాలు శ్రీదేవిరెడ్డి ఆధ్వర్యంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ప్రసూన, శ్రీవాణి, మాజీ సర్పంచ్ లక్ష్మీప్రసాదరావు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

పెద్దాపురం: భవన నిర్మాణ సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని ప్రైవేట్ ఎలక్ట్రికల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షుడు సత్యనారాయణ అన్నారు. స్థానిక వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు స్మారక భవనంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగం తర్వాత అధికంగా భవన నిర్మాణ రంగం ఉపాధి కల్పిస్తోందన్నారు. జులై 9న దేశవ్యాప్తంగా సమ్మె చేస్తామన్నారు. గంగా, సుధాకర్, సూర్యనారాయణ, దుర్గ, భాషా, రమణ పాల్గొన్నారు.

హరియాణా సమావేశానికి ఛైర్‌పర్సన్ అరుణ

సామర్లకోట: పురపాలిక అభివృద్ధి, పరిపాలనపై హరియాణాలో నిర్వహించనున్న సమావేశానికి సామర్లకోట ఛైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ వెళ్లారు. గురువారం నుంచి అక్కడ గురుగ్రామ్‌లో నిర్వహించే ప్రత్యేక సమావేశానికి రాష్ట్రంలోని 25 పురపాలికల నుంచి ప్రభుత్వం ఛైర్‌పర్సన్‌లను ఎంపిక చేసి పంపించడం జరిగిందని కమిషనర్ శ్రీవిద్య తెలిపారు.

విద్యా సామగ్రి పంపిణీ

తాళ్లరేవు, న్యూస్‌టుడే: జార్జిపేట ఎంఎల్‌కే నగర్ ఆదర్శ పాఠశాలలో దివంగత మాజీ ఎంపీటీసీ సభ్యురాలు మందపల్లి నాగమ్మ జ్ఞాపకార్థం ఆమె కుమారుడు రాంబాబు ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన విద్యా సామగ్రిని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు బుధవారం పంపిణీ చేశారు. ఉప్పంగలలో పెంతెకోస్తు ప్రార్థన మందిరం పైఅంతస్తును, తంగేటిపంపులో రేషన్ దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. తెదేపా నాయకులు వేగేశ్న భాస్కరరాజు, గుత్తుల సూరిబాబు, కడలి శ్రీనివాస్, దడాల సువర్ణలత తదితరులు పాల్గొన్నారు.

నిందితుడికి 14 రోజుల రిమాండ్

కరప: మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి తీసుకెళ్లిన నిందితుడిని అరెస్ట్ చేసి న్యాయస్థానం ముందు హాజరుపర్చగా 14రోజుల రిమాండ్ విధించినట్లు ఎస్సై తోట సునీత తెలిపారు. ఆమె వివరాల ప్రకారం.. కరప మండలానికి చెందిన మైనర్ బాలిక ఈ నెల 8వ తేదీన అదృశ్యమవ్వగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అనంతపురం జిల్లా హిందూపూర్‌లో ఉన్నట్లు గుర్తించి ఇటీవల తీసుకువచ్చారు. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు బి.మణికంఠ అనే యువకుడిపై మిస్సింగ్, పోక్సో కేసు నమోదు చేశామన్నారు. కాకినాడ సబ్‌డివిజన్ ఏఎస్పీ పాటిల్ దేవరాజ్ మానిష్ బుధవారం మధ్యాహ్నం ఆయన కార్యాలయం వద్ద మణికంఠను అరెస్ట్ చేసి స్పెషల్ జేఎఫ్‌సీఎంఫర్ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కోర్టులో హాజరు పర్చగా నిందితుడికి 14 రోజులు రిమాండ్ విధించారన్నారు.

చోరీలకు పాల్పడుతున్న యువకుడి అరెస్టు

సర్పవరం జంక్షన్: సర్పవరం పోలీస్ స్టేషన్ పరిధిలో మోటారుసైకిళ్లు చోరీ చేస్తున్న యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. సర్పవరం ఎస్సై శ్రీనివాస్ వివరాల ప్రకారం.. కాకినాడ అర్బన్ రామకృష్ణారావుపేటకు చెందిన కడియాల ప్రేమ్‌కుమార్‌ను అదుపులోకి తీసుకుని అతని వద్ద నుంచి సుమారు రూ.3.5 లక్షల విలువైన ఏడు మోటారుసైకిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు.

మహిళా మార్ట్ నిధులు ఏమైనట్లు?

విచారణ చేపట్టాలని సభ్యుల డిమాండ్

కొత్తపల్లి, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో రాష్ట్రంలోనే తొలిసారిగా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడలో ఏర్పాటుచేసిన చేయూత మహిళా మార్ట్‌లో భారీస్థాయిలో నిధులు గోల్‌మాల్ అయ్యాయని తీవ్రమైన ఆరోపణలు వినిపిస్తున్నా అధికారుల చర్యలు మాత్రం శూన్యం. ఉన్నతాధికారులు పరిశీలించకపోవడం ఏంటని పలువురు ప్రశ్నిస్తున్నారు. మార్ట్ ఏర్పాటు సమయంలో కీలకపాత్ర పోషించిన అధికారులు నిధులు పక్కదారి పట్టించారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. మార్ట్ ఏర్పాటు కోసం సంఘ సభ్యుల పొదుపు ఖాతాల నుంచి అప్పటి అధికారులు రూ.48 లక్షలు తీసుకుని పెట్టుబడి పెట్టారు. ఇదే కాకుండా నిబంధనలకు విరుద్ధంగా రహస్యంగా కొత్తపల్లి, ఉప్పాడ మహిళా సమాఖ్యల నుంచి రూ.20 లక్షలు తీసుకున్నారు. ఏడాదిలో రూ.20 లక్షల ఆదాయం వచ్చినట్టు బహిరంగంగా ప్రకటించారు. ఈ సొమ్మంతా ఏమైందో తెలియని పరిస్థితి. ప్రస్తుతం మార్ట్ మాత్రం మూతబడే దిశగా నడుస్తోంది. పూర్తిస్థాయిలో సరకులు అందుబాటులో లేక కొనుగోలు కూడా అంతంత మాత్రమే సాగుతోంది. ఇటీవల ఓ జనరల్ స్టోర్ నుంచి సరకులు అప్పుగా తీసుకుని మార్ట్ నిర్వహిస్తున్నట్లు సమాచారం.

యానిమేటర్ల ఆవేదన..

మార్ట్ ఏర్పాటులో పొదుపు ఖాతాల నుంచి తీసుకున్న నగదు గురించి సంఘ సభ్యులు యానిమేటర్లపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఏడాదికి ఇచ్చేస్తామని చెప్పి ఇంకా ఎందుకివ్వడం లేదని ప్రశ్నిస్తున్నారు. దీంతో యానిమేటర్లు సమాధానం చెప్పలేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పుడు మళ్లీ సభ్యులతో బలవంతంగా సరకులు కొనుగోలు చేయించాలని ఉన్నతాధికారులు ఒత్తిడి చేస్తున్నారని పలువురు చెబుతున్నారు. మార్ట్‌లో జరిగిన నిధుల గోల్‌మాల్‌పై విచారణ చేపట్టి సంబంధిత వారిపై చర్యలు తీసుకోవాలని సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

వైభవంగా మహాలక్ష్మమ్మ జాతర

తాళ్లరేవు: గాడిమొగ పంచాయతీ పేదలవలస దేవత మహాలక్ష్మమ్మ జాతర, తీర్థ మహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. గరగల నృత్యాలు, డప్పుల వాయిద్యాలతో అమ్మవారిని ఊరేగించారు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అమ్మవారిని దర్శించుకున్నారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

డిప్యూటీ ఎంపిడివోగా ప్రకాశ్

తాళ్లరేవు: డిప్యూటీ ఎంపీడీవోగా సీహెచ్.ఎన్.ఎం. ప్రకాశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు పంచాయతీ కార్యదర్శులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట గ్రామీణం, న్యూస్‌టుడే: అచ్చంపేటలోని ఎమ్మెల్యే చినరాజప్ప బుధవారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును హుస్సేన్ పురానికి చెందిన యవర్న సూరిబాబు కుటుంబ సభ్యులకు అందించారు. ఆయన ఇటీవల అనారోగ్యానికి గురి కాగా వైద్య ఖర్చుల నిమిత్తం రూ.40,400 మంజూరు కాగా చెక్కును అందజేశారు.

పూడిక తొలగింపు పనులు

గొల్లప్రోలు: ఆయకట్టు పొలాలకు సాగునీరు సక్రమంగా అందేలా పంట కాలువల్లో గుర్రపుడెక్క, పూడిక తొలగింపు పనులు నిర్వహిస్తున్నట్లు జలవనరులశాఖ ఏఈ పద్మజ తెలిపారు. గొల్లప్రోలులో మెరకచేను కాలువలో చేస్తున్న పనులను బుధవారం పరిశీలించారు. గొల్లప్రోలు ఏలేరు నీటి సంఘం పరిధిలోని కాలువల్లో రూ.49 లక్షలతో పనులు నిర్వహిస్తున్నట్లు నీటి సంఘం అధ్యక్షుడు దువ్వా కొండలరావు తెలిపారు.

వంట గ్యాస్ లీకై మంటలు

పెద్దాపురం: పెద్దాపురం పట్టణం మిరపకాయలవారివీధిలోని స్వాగత్ మెస్‌లో వంట గ్యాస్ లీకై బుధవారం మంటలు రేగాయి. గోలి రామకృష్ణకు చెందిన మెస్‌లో వంట చేస్తుండంగా సిలిండర్‌కి అమర్చిన వాచర్ సరిగ్గా లేకపోవడంతో గ్యాస్ లీకై మంటలు వచ్చాయి. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో హుటాహుటిన వచ్చి మంటలను అదుపు చేశారు. ఆస్తి నష్టంగానీ, ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు.

ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డు ఉండాలి

కాజులూరు: కేంద్ర ప్రభుత్వం 70 సంవత్సరాల పైబడిన వృద్ధులకు అందజేసే ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య కార్డులను అర్హులందరూ తీసుకోవాలని భాజపా మండల అధ్యక్షుడు పుణ్యమంతుల శివాజీ అన్నారు. బుధవారం వికసిత భారత్ 2047, ప్రధాని మోదీ 11 సంవత్సరాల పాలన, సేవా, సుపరిపాలన కార్యక్రమాల్లో భాగంగా కాజులూరు మండలం చేదువాడ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ పథకాలు వివరించి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పర్యావరణ పరిరక్షణ కోకన్వీనర్ సలాది వీరబాబు, మండల ప్రధాన కార్యదర్శులు నిమ్మర రాజేష్, వాసంశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

డెంగీ, మలేరియా ప్రబలకుండా అవగాహన

మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ పర్యవేక్షణాధికారి బాషా

గొల్లప్రోలు: డెంగీ, మలేరియా ప్రబలకుండా చేపట్టాల్సిన చర్యలపై డెంగీ నివారణ మాసోత్సవాల్లో భాగంగా బుధవారం గొల్లప్రోలులో వైద్యఆరోగ్యశాఖ అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. వర్షాకాలంలో జ్వరాలు ప్రబలినప్పుడు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. వైద్యాధికారిణి డాక్టర్ సునీతమెర్సీ, పర్యవేక్షణాధికారి అహ్మద్‌బాషా, హెచ్‌వి రజన్‌బీ, సిబ్బంది, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు. ✦ తాటిపర్తిలో గర్భిణులు, శిశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. గ్రామాల్లో శిబిరాలు ఏర్పాటుచేశారు.

వర్షాలకు కూలిన తాటాకిల్లు

సామర్లకోట: రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు సామర్లకోట పట్టణం కోటపేట చెందిన మల్లవరపు తాతీలు, జ్యోతిల తాటాకిల్లు మంగళవారం అర్ధరాత్రి కూలిపోయింది. ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగకుండా సురక్షితంగా బయటపడ్డారు. ఇంట్లోని సామగ్రి ధ్వసమైంది. బుధవారం వార్డు కౌన్సిలర్ పాలిక కుసుమ, నాయకులు చంటిబాబు బాధితులను పరామర్శించి అధికారులకు సమాచారమిచ్చారు.

ప్రైవేట్ పాఠశాలలో ఉచిత సీట్లు కల్పించాలి

సామర్లకోట గ్రామీణం: ప్రైవేట్ పాఠశాల యాజమాన్యాలతో చర్చించి ఆయా పాఠశాలల్లో పేద విద్యార్థులకు 25 శాతం ఉచిత సీట్లు కల్పించేందుకు కృషి చేయనున్నట్లు ఎంపీ సానా సతీష్ బాబు తెలిపారు. కొప్పవరం కూడలిలో ఎంపీ క్యాంపు కార్యాలయంలో విద్యార్థుల తల్లిదండ్రుల సంఘం నాయకులు బుధవారం ఆయనను కలిశారు. ఉచిత సీట్లు కేటాయించినా యాజమాన్యాలు చేర్చుకోవడం లేదని ఫిర్యాదు చేశారు. దీనిపై ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి రెండు రోజుల్లో సీట్లు కల్పించడం జరుగుతుందని భరోసా ఇచ్చారు.

కెరటాల కోత.. తీరని వెత

కొత్తపల్లి, న్యూస్‌టుడే: యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో రోజురోజుకు కెరటాల కోత పెరుగుతోంది. పాతమార్కెట్ సెంటర్‌లో నాలుగు కుటుంబాలు నివసించే భారీ పెంకుటిల్లు కెరటాల తీవ్రతకు నాశనమైంది. గత తుపాను సమయంలో పాక్షికంగా దెబ్బతిన్న ఈ గృహం ప్రస్తుతం వారం రోజులపాటు విజృంభిస్తున్న రాకాసి అలల దాటికి పూర్తిగా ధ్వసంమైంది. ఈ ఇంటిలో ఉంటున్న నాలుగు కుటుంబాలు ఇటీవల అద్దె ఇళ్లల్లోకి వెళ్లాయి. వారం రోజుల వ్యవధిలో పదిమీటర్ల వరకు తీరం వెంబడి గ్రామాలు కోతకు గురయ్యాయి.

చోరీ కేసులో నాలుగేళ్ల జైలు

పిఠాపురం: పిఠాపురంలో 2024 జులైలో జరిగిన చోరీ కేసుకు సంబంధించి ఓ వ్యక్తికి నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.విజయరామేశ్వరి బుధవారం తీర్పు చెప్పారు. ఎస్సై మణికుమార్ వివరాల ప్రకారం.. పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్దనున్న దుర్గమ్మతల్లి ఆలయంలో 2024 జులై 22న 16 గ్రాముల బంగారం చోరీ జరిగింది. దీనిపై అప్పట్లో ఎస్సై మురళీమోహన్ కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు కిర్లంపూడి మండలం భూపాలపట్నానికి చెందిన తబేరిశెట్టి శ్రీనును నిందితుడిగా గుర్తించి రెండు సెక్షన్లపై కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరుపరచగా రెండు సెక్షన్లకు రెండేసి ఏళ్ల జైలు శిక్ష విధించి, ఒకేసారి శిక్ష అనుభవించే వెసులుబాటు కల్పించారు. రూ.వెయ్యి జరిమానా విధించారు.

ప్రమాదకరంగా రహదారి

కాండ్రకోట నుంచి కట్టమూరు వెళ్లే సమీప రహదారి మార్గం ఏలేరు కాలువ నీటి ప్రవాహానికి కోతకు గురవుతోంది. ఏ మాత్రం అజాగ్రత్తగా వాహనం నడిపినా ఏలేరు కాలువలో పడిపోయే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. దీనిపై ర.భ.శాఖ డీఈఈ రాఘవరావు మాట్లాడుతూ కోతకు గురికాకుండా ఉండేందుకు రిటెమ్మెంట్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. **– న్యూస్‌టుడే, పెద్దాపురం**

[illegible] అదనపు జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, పెద్దాపురం.
F.D.P. No: 6/2024

[illegible]

...తేదిన పైన తెలిపిన కోర్టులో ఉదయం గం॥ 10.30 ని॥లకు హాజరై అక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేనియెడల పై దావా తమ పరోక్షమున తీర్మానము చేయబడునని ఇందుమూలముగా తెలియపరచడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
గుణ్ణం రవికుమార్, అడ్వకేట్
మెయిన్‌రోడ్డు, సామర్లకోట
2-7-2025 సెల్:9676804050

బహిరంగ ప్రకటన

సాధారణ ప్రజలకు ఇందుమూలముగా తెలియచేసేదేమంటే, నా క్లయింటు **శ్రీమతి పి.ఎన్.వసంత** మరియు ఇతరులు రెండవ అపీలు నం.1452/2010, ఎస్.ఎ.15310/2024 మరియు ఎ.ఎస్.ఎస్.ఆర్.నం.21292/2025ను, హైకోర్ట్ ఆంధ్రప్రదేశ్ అమరావతి సమక్షంలో, శాలిపేట, పిఠాపురం మునిసిపాలిటీ, తూర్పు గోదావరి జిల్లాలోని సర్వే నం.715/1 మరియు 715/2లోని భూమి మరియు ఇంటి ఆస్తి నం. 2-3-73 నిమిత్తం దాఖలు చేయగా, గౌరవనీయ హైకోర్ట్, ఆంధ్రప్రదేశ్‌లో ఆ కేసులు పెండింగులో ఉన్నవి. ఇపుడు నా క్లయింటుకు తెలియవచ్చినదేమనగా, పై కేసులలో పార్టీలు అయిన బండి భాగ్యలక్ష్మి, బండి సతీష్, బండి సునీల్, బండి సౌమ్య అనువారు తప్పుదారి పట్టిస్తూ మరియు వాస్తవాలను తొక్కిపట్టి పై ఆస్తులను ఆసక్తి గల కొనుగోలు దారులకు అన్యాక్రాంతం చేయుటకు ప్రయత్నిస్తున్నారు. నిజానికి నా క్లయింటు అనుమతి లేనిదే, పై కేసులు పెండింగులో ఉన్న వ్యవధిలో ఆస్తిని విక్రయించుటకు వారికి ఏ హక్కూ లేదు, పై వ్యక్తులతో పై భూమి విషయమై ఎవరైనా ఏ విక్రయ ఒప్పందం, సేల్‌డీడ్, లీజు లేదా తాకట్టు వంటివి కుదుర్చుకుంటే, వారికి దానిపై ఏవిధమైన టైటిలు దక్కదు వారి చర్యలకు వారిదే పూచీ. కాబట్టి, నా క్లయింటు తరపున సాధారణ ప్రజలను నేను హెచ్చరించునదేమనగా, పై వ్యక్తులతో గానీ వారి తరపు వ్యక్తులతో గానీ సదరు భూములతో ఏవిధముగానూ లావాదేవీలు జరుపరాదు, లేని ఎడల వారు నా క్లయింటు ప్రారంభించు చట్టపరమైన చర్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది మరియు నా క్లయింటు సదరు వ్యక్తుల అక్రమ చర్యలకు ఏ విధంగానూ బాధ్యత వహించరు.

వి.నాగేశ్వరరావు, వి.మల్లికాదేవి, టి.హేమలత, న్యాయవాదులు,
ఫ్లాట్ నం–11, సత్య అపార్ట్‌మెంట్, శ్రీనికేతన్ కాలని రోడ్ నం.3, బంజారాహిల్స్, హైదరాబాద్–34 సెల్: 93945 55515.

శ్రీ పైండా చలమయ్య సత్రం (శ్రీనివాస కళ్యాణ మండపం)
దేవదాయ ధర్మదాయ శాఖ, డో.నెం.27-4-24, దేవాలయం వీధి, కాకినాడ.

టెండర్ ప్రకటన

కాకినాడ జిల్లా, కాకినాడ నగరం, దేవాలయం వీధిలో గల శ్రీ పైండా చలమయ్య గారి ధర్మ సత్రం నందు ఉచిత భోజన సదుపాయము నిమిత్తం సత్రంనకు కూరగాయలు స్వంత ఖర్చులతో సరఫరా చేయుటకు ది.01-08-2025 నుండి ది.31-07-2026 వరకు ఈ దిగువ కూరగాయలు సరఫరా కొరకు అర్హత గల వ్యాపారుల నుండి సీలు టెండర్లు కోరడమైనది.

వ.నెం.	సరుకు వివరము	ధరావతు	టెండర్ షెడ్యూల్	కాలపరిమితి
1	కూరగాయలు	10,000/-	రూ. 200/-	ది.01-08-2025 నుండి ది.31-07-2026 వరకు

ముఖ్య షరతులు
సదరు టెండరుదారుల ప్రభుత్వ లైసెన్సులు ఆస్తియు కలిగి ఉండవలెను. కార్యాలయం పనివేళలలో రూ.200/- లు చెల్లించి ది.08-07-2025 నుండి ది.13-07-2025 సాయంత్రం 5 గంటలు వరకు టెండర్ షెడ్యూల్ పొందవచ్చును. టెండర్లు దాఖలు చేయుటకు ఆఖరి తేది 14-07-2025 మధ్యాహ్నం 2.00 గంటల లోపు పూర్తిచేసి టెండర్ బాక్స్ నందు వేయవలెను. అదేరోజు మధ్యాహ్నం 3.00 గంటలకు టెండరుదారుల సమక్షములో టెండర్లు తెరచి తక్కువ టెండర్ను డిపార్ట్‌మెంట్ ఉన్నతాధికారుల ఉత్తర్వుల లోబడి ఖాయపర్చబడును. ఇతర వివరములు కార్యాలయం పనివేళలలో తెలుసుకొనవచ్చును.

కాకినాడ. శ్రీ దా॥ పి.శ్రీరామకృష్ణయ్య — ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్
ది.02-07-2025. ఎమ్.శ్రీదేవి — కార్యనిర్వహణాధికారిణి, గ్రేడ్-I

(c) eenadu

తుని

• తుని • ప్రత్తిపాడు • జగ్గంపేట

పారిశుద్ధ్యంపై అలసత్వం వద్దు

పనులను పర్యవేక్షిస్తున్న డీఎల్‌పీవో బాలమణి

జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామాల్లో రోడ్లపక్కన, వీధుల్లో చెత్తవేయకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులు, పారిశుద్ధ్య సిబ్బందికి డీఎల్‌పీవో బాలమణి సూచించారు. మండలంలోని కాండ్రేగుల, రామవరం తదితర గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ఆమె వెంట సర్పంచి బొడిరెడ్డి వర్ధరాజు, పంచాయతీ కార్యదర్శి నూకరాజు, పారిశుద్ధ్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

భారీ వాహనాలపై 16 కేసులు.. రూ.98 వేల జరిమానా

శంఖవరం: 'ఊళ్లపై బండరాళ్లు' అంటూ బుధవారం ఈనాడు సంచికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కత్తిపూడి నుంచి రౌతులపూడి వరకు నిబంధనలు ఉల్లంఘించిన భారీ వాహనాలను ఎంవీఐ శ్రీనివాస్ అడ్డుకుని 16 కేసులు నమోదు చేశారు. రూ.98 వేల అపరాధ రుసుము విధించారు. రాత్రి వేళల్లో తిరిగేలా చర్యలు తీసుకుంటామన్నారు.

శంఖవరంలో భారీ వాహనాలపై కేసులు నమోదు చేస్తున్న ఎంవీఐ శ్రీనివాస్

మేమున్నాం.. మీకు తోడుగా

మీరు సంప్రదించాల్సిన ఫోన్ నంబర్లు: తుని: 9100020946, ప్రత్తిపాడు: 98669 62946 జగ్గంపేట: 80086 22066
ఉ: 10 - మ: 1

సమస్య: పీతచిన్నాయిపాలెంలో సచివాలయం పక్కనే మురుగు కాలువలు పూడికతో నిండి ఉన్నాయి. దీంతో దుర్వాసన వస్తోంది. పూడిక తీయించాలి. - నాని, స్థానికుడు

సమాధానం: పంచాయతీ సిబ్బందికి తెలియజేసి కాలువల్లో పూడిక తీయిస్తాం. - సూరిబాబు, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, తొండంగి

సామూహిక సీమంతాలు, అన్నప్రాసన

తుని, న్యూస్‌టుడే: పట్టణంలోని గవరపేట అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలు జరిగాయి. ఐసీడీఎస్ సీడీపీవో శ్రీలత హాజరై గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం, తల్లి పాల ఆవశ్యకత వివరించారు. సూపర్ వైజర్ సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

తుని గవరపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో అన్నప్రాసన

నిర్వహణకు నీళ్లు..

నియోజకవర్గంలో ప్రయాణ ప్రాంగణాల తీరు

పరిశీలన

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు, శంఖవరం

కత్తిపూడి, ప్రత్తిపాడు బస్‌స్టేషన్లు నియోజకవర్గంలో ప్రజారవాణాకు ప్రధాన కేంద్రాలు. నిత్యం వందలాది మంది ప్రయాణికులతో కళకళలాడే ఈ ప్రాంగణాల నిర్వహణ అంతంతమాత్రంగా ఉంటోంది. బస్సులు నిలిపేందుకు సిమెంటు ప్లాట్‌ఫామ్‌లు ఉండగా మిగతా ఆవరణంతా వర్షం పడ్డప్పుడల్లా చెరువులను తలపిస్తున్నాయి. ఎండకు ఇంకడం తప్ప నీరు వెళ్లే మార్గం లేదు. ఈ బస్‌స్టేషన్లు లోతట్టులో ఉండడంతో వానాకాలంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. నియోజకవర్గ కేంద్రంలోని బస్‌స్టేషన్ ముందు గతంలో ఉద్యానవనం ఉండేది. ప్రవేశద్వారం జలమయం అవుతోంది. ప్లాట్‌ఫామ్ మినహా అంతా చిత్తడిగా ఉంటోంది. సాయంత్రం ఆరు దాటితే ఒక్కోసారి దీపాలు వెలగని పరిస్థితి ఉంటోంది. ఆకతాయిల ఆగడాలు సాగుతున్నాయి. బస్సుల సమాచారం తెలిపే వివరాలు ఉండడం లేదు. ప్రత్తిపాడు, కత్తిపూడి మండలాల ప్రయాణికులు ఏ పట్టణాలకు వెళ్లాలన్నా ఈ బస్‌స్టేషన్‌కు రావాలి. ఆరు కళాశాలలకు చెందిన వేల మంది విద్యార్థులు ఇక్కడ నుంచే ఇళ్లకు వెళ్తారు. కత్తిపూడి బస్‌స్టేషన్ ఆవరణలో ఎప్పుడూ పూడిక చెరువు ఉంటుంది. వర్షం నీరు వెలుపలకు వెళ్లే మార్గం లేదు. ప్రాంగణానికి ఇరువైపులా రహదారి ఎత్తులో ఉండడం, డ్రైన్లు వేయలేని పరిస్థితితో నీళ్లు ఎండకు ఇంకాల్సిందే. బస్‌స్టేషన్ భవనానికి మరమ్మతులు చేసినా.. భవనం పెచ్చులూడుతూ, బీటలతోనూ దర్శనమిస్తోంది. శంఖవరం, రౌతులపూడి, కోటనందూరు మండలాలకు చెందిన ప్రజలు కత్తిపూడి మీదుగానే కాకినాడ, రాజమహేంద్రవరం, విశాఖపట్నం వైపు వెళ్లాలి. ప్రాంగణాలు శుచిగా, ప్రయాణికులకు భద్రతగా ఉండేలా నిర్వహించాలని అంతాకోరుతున్నారు. పరిస్థితిని సమీక్షించి చక్కదిద్దుతామని ఆర్టీసీ అధికారులు తెలిపారు.

వానొస్తే కత్తిపూడి బస్‌స్టేషన్ చెరువే..

ప్రత్తిపాడు బస్‌స్టేషన్ ప్రవేశమార్గం..జలమయం

లింగంపర్తిలో ఆషాఢమాస మహోత్సవం

ఏలేశ్వరం: లింగంపర్తిలో వేంచేసియున్న వసంతమ్మ, నూకాలమ్మలను బుధవారం విశేష అలంకరణ చేశారు. లలిత సత్సంగం మాతృమూర్తుల ఆధ్వర్యంలో జరిగిన ఆషాఢ మాస మహోత్సవంలో భక్తులు, వీహెచ్‌పీ సభ్యులు, ప్రముఖులు పాల్గొన్నారు. అమ్మవార్లు వివిధ రకాల కూరగాయలు, గాజులతో సుందరంగా దర్శనమిచ్చారు. మగువలకు గోరింటాకు ఉత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారికి సారె అందజేశామని వీహెచ్‌పీ నాయకులు అలమండ దుర్గాప్రసాద్, తూమురౌతు గుర్రయ్య చెప్పారు.

నందనవనంలో పూజలు

రౌతులపూడి, న్యూస్‌టుడే: శృంగవరం, ఎం.చామవరం గ్రామాల్లోని నందనవనంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీమహాలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం చేశారు. శాంతి హోమం, కల్యాణ ఉత్సవంలో భక్తులు పాల్గొన్నారు. కల్యాణ ఉత్సవాలకు సంబంధించి వస్త్రాలను రౌతులపూడికి చెందిన శ్రీవల్లీ వస్త్ర దుకాణం యాజమాన్యం అందచేశారు.

ఖరీఫ్ గట్టెక్కేలా రెగ్యులేటర్ వద్ద పనులు

కిర్లంపూడి, జగ్గంపేట గ్రామీణం, న్యూస్‌టుడే: ఏలేరు ఆధారిత ఆయకట్టులో ఖరీఫ్ పంట గట్టెక్కాలంటే ముక్కొల్లు రెగ్యులేటర్ వద్ద యుద్ధప్రాతిపదికన తాత్కాలిక పనులు చేపట్టాల్సి ఉందని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ తెలిపారు. కిర్లంపూడి మండలం ముక్కొల్లు రెగ్యులేటర్ వద్ద గట్టు పాడైపోవడంతో ప్రస్తుతం సాగునీరు వదిలితే కొట్టుకుపోయే పరిస్థితి నెలకొంది. ఈ పరిస్థితులపై ఏలేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మను బస్వా వీరబాబు ఆధ్వర్యంలో రైతులు ఎమ్మెల్యే దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లడంతో ముక్కొల్లు రెగ్యులేటర్ వద్ద పరిస్థితులను ఏలేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మను, జలవనరులశాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే నెహ్రూ బుధవారం పరిశీలించారు. ఇక్కడ నెలకొన్న పరిస్థితులను జలవనరులశాఖ ఈఈ శేషగిరిరావు, డీఈఈ రవికుమార్‌లు వివరించారు. ● ప్రజాస్వామ్యంలో మంచి కార్యక్రమాలతో ప్రజల్లోకి వెళ్లాలే కాని రప్‌రప్ ఆడించుకుంటూ కాదని వైకాపా అధినేత జగన్‌కు ఎమ్మెల్యే నెహ్రూ హితోపదేశం చేశారు. సీతానగరంలో 'తొలి అడుగు' కూటమి పాలనలో అభివృద్ధిని వివరిస్తూ ప్రచారం చేపట్టారు. జిల్లా తెదేపా అధ్యక్షుడు నవీన్‌కుమార్ మాట్లాడుతూ.. ఏ ఇంటికి వెళ్లినా పాలన భేషుగ్గా ఉందని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముక్కొల్లు రెగ్యులేటరును పరిశీలిస్తున్న నెహ్రూ, అధికారులు

అత్యవసర పనులు చేపట్టాలి

ఏలేరుపై ప్రస్తుత ఖరీఫ్‌కు సాగునీటికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయని ఆయా ప్రదేశాల్లో జలవనరులశాఖ ఆధ్వర్యంలో అత్యవసర పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, ఏలేరు ప్రాజెక్టు కమిటీ ఛైర్మను బస్వా వీరబాబు, డీసీలు జిల్లాకలెక్టరుకు బుధవారం వినతి పత్రం అందజేశారు.

ఏడాది పాలనలో అభివృద్ధి, సంక్షేమం

ప్రత్తిపాడు, న్యూస్‌టుడే: సుపరిపాలనలోనే తొలి అడుగు కార్యక్రమంలో ఇంటింటి పర్యటనకు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ ప్రత్తిపాడులో బుధవారం శ్రీకారం చుట్టారు. పరిశీలకుడు మెట్ల రమణబాబు, పార్టీ శ్రేణులతో కలిసి గ్రామంలోని ఇళ్లకు వెళ్లి కూటమి ప్రభుత్వం విజయాలను వివరించారు. రాక్షస పాలనకు, సుపరిపాలనకు మధ్య వ్యత్యాసాన్ని ప్రజలు గుర్తించారన్నారు. అభివృద్ధి, సంక్షేమ ఫలాలతో ప్రతి కుటుంబం లబ్ధి పొందుతోందన్నారు. ఏడాది పాలన విశేషాలను వివరించే కరపత్రాలను తెదేపా నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ వెళ్లి అందజేశారు. అనంతరం పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో గ్రామ, మండల, క్లస్టర్, యూనిట్ కమిటీలతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి ఇంటికీ వెళ్లి వివరించాలన్నారు. తెదేపా నాయకులు పర్వత సురేష్, జ్యోతుల పెదబాబు, వెన్నా శివ, తటవర్తి సుబ్బారావు, కొమ్ముల కన్నబాబు, యాళ్ల విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడులో కరపత్రాలు పంచుతున్న ఎమ్మెల్యే సత్యప్రభ

ఉత్తమ పన్నుచెల్లింపుదారుడికి పురస్కారం

తుని, న్యూస్‌టుడే: పట్టణంలోని జీఎన్‌టీ రోడ్డులో ఉన్న సాయి రామ్ ఆటోమొబైల్స్ యజమాని దాసరి రాజ్‌కుమార్ ఉత్తమ పన్ను చెల్లింపుదారు పురస్కారం అందుకున్నారు. విశాఖలో మంగళవారం జరిగిన 8వ జాతీయ జీఎస్టీ సంబరాల కార్యక్రమంలో ఎంపీ భరత్ చేతుల మీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు.

'సుపరిపాలనలో తొలి అడుగు'కు స్పందన భేష్

తుని పట్టణం, తుని గ్రామీణం, తొండంగి, న్యూస్‌టుడే: అమ్మా... కూటమి ప్రభుత్వం ఎలా పనిచేస్తోంది? ఆయా పథకాల లబ్ధి సకాలంలో అందుతోందా? స్థానికంగా సమస్యలు ఏమున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పట్టణంలోని వీరవరపుపేటలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం బుధవారం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి ప్రజలను పలకరించారు. సూపర్‌సిక్స్ పథకాల్లో ఇప్పటి వరకూ అమలు చేసినవాటిని వివరిస్తూ కరపత్రాలు పంచారు. వర్షంలో తమ వద్దకు వచ్చిన ఎమ్మెల్యే దివ్యకు స్థానిక మహిళలు హారతులిచ్చి, పూల మాలలు వేసి స్వాగతం పలికారు. పురపాలక ఛైర్‌పర్సన్ నార్ల భువన సుందరి తదితరులు పాల్గొన్నారు. ● కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో ఇచ్చిన హామీల్లో 80 శాతం పూర్తి చేశామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య అన్నారు. ఏడాది సుపరిపాలన తీరుపై ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం ఆమె కోటనందూరు మండలం కేవో అగ్రహారం, తుని మండలం కవలపాడు గ్రామాల్లో ఇంటింట పర్యటించారు. నాయకులు యనమల రాజేష్, చింతంనీడి అబ్బాయి, గాడి రాజబాబు, చిరంజీవి రాజు, మోతుకూరి వెంకటేష్, కుసుమంచి శోభారాణి పాల్గొన్నారు. ● సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని తొండంగి మండలం వేమవరంలో ఎమ్మెల్యే యనమల దివ్య పార్టీ మండలాధ్యక్షుడు చొక్కా అప్పారావు ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభించారు. ఇంటింటికీ తిరిగి ఏడాది పాలనలో ప్రభుత్వం చేసిన సంక్షేమ పథకాలను, అభివృద్ధిని వివరించారు. నాయకులు యనమల రాజేష్, నేమాల బాబూరావు, నేమాల విజయ్, తాటిపర్తి శ్రీను, చొక్కా కాశి, నేమాల సత్యన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీరవరపుపేటలో కరపత్రాలు పంచుతున్న ఎమ్మెల్యే దివ్య

వాన నీరు బయటికిపోయే మార్గమెక్కడ..?

ర.భ. రోడ్డు విస్తరణలో భాగంగా ఇరువైపులా ఎన్‌హెచ్ తరహాలో నిర్మించిన సిమెంటు కాలువలు ప్రస్తుతం గ్రామాలకు గుడిబండల్లా మారాయి. రోడ్డుపైకి చేరిన వర్షపు నీటిని ఎటూబయటకు పోనివ్వకుండా అడ్డుపడుతున్నాయి. దీంతో రోడ్డుపైనే గోతుల్లోకి చేరి చెరువులను తలపిస్తున్నాయి. ఇటీవల వర్షాలకు రామచంద్రపురం, గోనేడ, వీరవరం గ్రామాల్లో రోడ్డు విస్తరణ పనులలో భాగంగా నిర్మించిన సిమెంటు కాలువలు వల్ల ఉపయోగం సంగతి ఎలా ఉన్నా నిలిచిపోయిన పనులతో పలుచోట్ల చెరువుల్లా మారి రోడ్డు పరిస్థితి దారుణంగా మారింది. - న్యూస్‌టుడే, కిర్లంపూడి

'ప్లాస్టిక్ పర్వతం'..కాలుష్యభరితం

ఏళ్లుగా పేరుకుపోయిన చెత్తను (లెగసీవేస్ట్) పూర్తిగా విభజించి ఇతర అవసరాలకు వినియోగించేలా పురపాలక సంఘం చర్యలు తీసుకుంది. ఇసకలపేట వద్ద తాండవ నది ఒడ్డున ఉన్న చెత్తను ఇటీవల ఓ సంస్థ యంత్రాలతో వేరుచేసే ప్రక్రియ పూర్తి చేసింది. అయితే దాని నుంచి భారీగా వచ్చిన ప్లాస్టిక్ వ్యర్థాలు విశాఖలోని ఎనర్జీ ప్లాంటకు తరలించాల్సి ఉంది. కొంతకాలంగా నిర్లక్ష్యంగా వదిలేయడంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నామంటున్నారు. పురపాలక ఏఈ లక్ష్మీ ప్రసన్నను 'న్యూస్‌టుడే' వివరణ కోరగా వ్యర్థాలు తరలించేలా చర్యలు తీసుకుంటామన్నారు. - న్యూస్‌టుడే, తుని

రామవరం రోడ్డు.. రాకపోకలెలా..!

జగ్గంపేట గ్రామీణ మండలంలోని రామవరం ప్రధాన రహదారి గోతులతో చెరువును తలపిస్తుంది. ఐదేళ్లుగా రోడ్డునిర్మాణ పనులు జరుగుతుండడంతో గోతులుపడి వర్షంనీరు చేరి వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రామవరం కూడలిలో పెద్దపెద్ద గోతులు పడడంతో ప్రయాణికులకు అగచాట్లు తప్పడంలేదు. ద్విచక్ర వాహనాలు, కార్లు, ఆటోలు ఇంజిన్లలోకి నీరు చేరడంతో నిలిచిపోతున్నాయని వాపోతున్నారు. వర్షం వచ్చినప్పుడల్లా ఇదే పరిస్థితి. రోడ్డునిర్మాణం చేసేలోపు కనీసం మట్టితోనైనా పూడ్చాలని గ్రామస్థులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, జగ్గంపేట గ్రామీణం.

చెరువు గర్భమే ఇదీ..

పచ్చటి క్రీడామైదానాన్ని తలపిస్తున్న ఈ ప్రాంతం సాగునీటి చెరువు కావడం విశేషం. లోవకొత్తూరు సమీపంలోని పెద్ద చెరువు గర్భంగా కాలుష్యకారణంగా ఇలా పచ్చని చాపగా మారింది. ఈ చెరువులో పెద్ద ఎత్తున గ్రామం నుంచి సేకరించిన చెత్తతోపాటు ప్లాస్టిక్ వ్యర్థాలు వేయడం ద్వారా ఈ పరిస్థితి నెలకొందని ఆయకట్టు రైతులు వాపోతున్నారు. ఈ పరిస్థితుల్లో సాగునీటి చెరువులో చెత్త వేయకుండా అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాలని గ్రామస్థులు, కోరుతున్నారు. - న్యూస్‌టుడే, తుని గ్రామీణం

సారా రహిత గ్రామాలు గుర్తింపు

తుని గ్రామీణం, న్యూస్‌టుడే: తుని అబ్కారి స్టేషన్ పరిధిలో గతంలో నాటు సారా విక్రయాలతో ఎక్కువ కేసులు నమోదు చేసిన ఎనిమిది గ్రామాలను సారా రహిత గ్రామాలుగా గుర్తించామని ఎస్సై శాస్త్రి తెలిపారు. ఇసుకలపేట, కొండవారిపేట, డి.పోలవరం, హంసవరం, బొద్దవరం, ఎస్‌ఆర్ పేట, గిడజాం, డీజేపురాలను సారా రహిత గ్రామాలుగా గుర్తించామన్నారు.

రైతులకు అమూల్యమైన సేవలు అందించారు

కిర్లంపూడి: మండల రైతులకు ఆరేళ్లుగా తగిన సూచనలు, సలహాలు ఇస్తూ వస్తున్న మండల వ్యవసాయాధికారిణి జోకా అమృత బదిలీపై వెళ్లడంతో ఆమె సేవలను రైతులు కొనియాడారు. మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో బదిలీపై వెళ్లిన ఏవో అమృతను బుధవారం రైతులు, వ్యవసాయశాఖ సిబ్బంది, ఎరువులు, పురుగుమందు దుకాణదారులు ఘనంగా సత్కరించారు. నాయకులు అల్లు విజయ్‌కుమార్, గుడాల రాంబాబు, కుర్ల చిన్నబాబు, కాళ్ల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

అమృతను సన్మానిస్తున్న రైతు నాయకులు, సిబ్బంది

చోరీ కేసులో నాలుగేళ్ల జైలు

పిఠాపురం, న్యూస్‌టుడే: పిఠాపురంలో 2024 జులైలో జరిగిన చోరీ కేసుకు సంబంధించి ఓ వ్యక్తికి నాలుగేళ్ల జైలు శిక్ష విధిస్తూ జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎం.విజయరామేశ్వరి బుధవారం తీర్పు చెప్పారు. ఎస్సై మణికుమార్ వివరాల ప్రకారం.. పట్టణంలోని రైల్వేస్టేషన్ వద్దనున్న దుర్గమ్మతల్లి ఆలయంలో 2024 జులై 22న 16 గ్రాముల బంగారం చోరీ జరిగింది. దీనిపై అప్పట్లో ఎస్సై మురళీమోహన్ కేసు నమోదు చేశారు. విచారణ చేపట్టిన పోలీసులు కిర్లంపూడి మండలం భూపాలపట్నానికి చెందిన తబేరిశెట్టి శ్రీనును నిందితుడిగా గుర్తించి రెండు సెక్షన్లపై కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరుపరచగా రెండు సెక్షన్లకు రెండేసి ఏళ్లు జైలు శిక్ష విధించి, ఒకేసారి శిక్ష అనుభవించే వెసులుబాటు కల్పించారు. రూ.వెయ్యి జరిమానా విధించారు.

ఏలేశ్వరంలో 90 మందికి నేత్ర పరీక్షలు

ఏలేశ్వరం, న్యూస్‌టుడే: ఏలేశ్వరంలోని అలమండ తనూజ నాయుడు ఫిజియోథెరఫీ ఆసుపత్రిలో బుధవారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు. డా.తనూజ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన శిబిరంలో రాజానగరం జీఎస్‌ఎల్ ఆసుపత్రి వైద్యులు జె.సాకేత్, ఇందుప్రియ తదితరులు 90 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. అలమండ ఛారిటబుల్ ట్రస్ట్ ప్రముఖులు దుర్గాప్రసాద్, ఎ.వీరరాఘవస్వామి, వీహెచ్‌పీ నాయకుడు తూమురౌతు గుర్రయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరిస్తా: ఎమ్మెల్సీ బొర్రా

పెద్దాపురం: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పాటుపడతామని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి అన్నారు. ఉపాధ్యాయుడు బి.అనంతరావు స్వచ్ఛంద పదవీ విరమణ సభ స్థానిక అంబేడ్కర్ సామాజిక భవనంలో మంగళవారం రాత్రి నిర్వహించారు. ఆయనను జేవీవీ రాష్ట్ర గౌరవధ్యక్షుడు చెలికాని స్టాలిన్, యూటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ప్రభాకరవర్మ, కేఎంఎంఆర్ ప్రసాద్, రవి వర్మ, సూరిబాబు, నగేష్, శివశంకర్, శివ, సీతారామారావు తదితరులు సత్కరించారు.

మాట్లాడుతున్న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గోపీమూర్తి

స్తంభాన్ని ఢీకొట్టిన లారీ.. ట్రాఫిక్‌కు అంతరాయం

శంఖవరం: భారీ వాహనాలకు వేగనియంత్రణ లేదు. రౌతులపూడి నుంచి శంఖవరం మీదుగా కత్తిపూడి వైపు వెళ్లే వాహనాలతో రోజూ ఇబ్బందే. వరుసగా ఒక్క రోజే మూడు ప్రమాదాలు జరిగాయి. ఒక లారీ అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లగా, మరో వాహనం బోల్తా పడింది. మరో లారీ అదుపు తప్పి విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సుమారు 3 గంటల పాటు కళాశాల బస్సులు, ఇతర వాహనాలన్నీ నిలిచిపోయాయి. జనసేన నేత మేకల కృష్ణ ఈ విషయం ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లనన్నారు.

పింఛన్ల పంపిణీలో తుని మండలం ప్రథమం

తుని గ్రామీణం: పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో రెండో రోజుకు జిల్లాలో మొదటి స్థానంలో తుని మండలం నిలవడం విశేషం. మండల పరిధిలోని 12,036 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సిఉండగా బుధవారం సాయంత్రానికి సుమారు 11,743 మందికి పింఛన్లు పంపిణీ చేశామని జిల్లాలోని 97.57 శాతం మందికి పింఛన్లు అందించి మొదటి స్థానంలో నిలిచినట్లు డిప్యూటీ ఎంపీటీవో మరిడయ్య తెలిపారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం రేపు

జగ్గంపేట,న్యూస్‌టుడే: జగ్గంపేట, పరిసర ప్రాంతాల్లోని ఈనెల 4న విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని ఈఈ వీరభద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మత్తుల కారణంగా స్థానిక గోకవరం రోడ్డు, టీచర్స్ కాలనీ, తహసీల్దార్, ఎంపీడీవో కార్యాలయాలకు, నెహ్రూ కాలనీ, కాట్రావులపల్లి, ఆక్వా సర్వీసులకు శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్తు సరాఫరా ఉండదు.

ద్విచక్ర వాహనం చోరీ

తుని పట్టణం: పట్టణంలోని గొల్లప్పారావు సెంటర్‌లో పార్కింగ్ చేసిన బైక్ గత నెల 28న చోరీకి గురైనట్లు అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రాంతానికి చెందిన నాగరాజు ఫిర్యాదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ యాదవ్ తెలిపారు. వాహనాలు తనిఖీ నిర్వహిస్తున్న సమయంలో నిర్లక్ష్యం, వేగంగా బైక్ నడిపిన ఏడుగురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై విజయబాబు తెలిపారు.

బెల్లం ఊట ధ్వంసం

తొండంగి: అన్నయ్యపేట శివారులో సారా కాసేందుకు సిద్ధంగా ఉంచిన 4,600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు బుధవారం తుని ప్రొహిబిషన్ ఇన్‌ఛార్జి సీఐ శివప్రసాద్ తెలిపారు. ఖాళీ డ్రమ్ములను మరోసారి వినియోగించకుండా ధ్వంసం చేశారు.

గడ్డిమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

గండేపల్లి, న్యూస్‌టుడే: అప్పుల బాధ తాళలేక గడ్డిమందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. మల్లేపల్లి గ్రామానికి చెందిన ముగ్గిన నాగేశ్వరరావు(34) ఆర్థిక ఇబ్బందులతో సోమవారం ఉదయం గ్రామశివారున ఉన్న జగ్గయ్యచెరువు వద్ద గడ్డిమందు తాగాడు. కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకుని నాగేశ్వరరావును కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

పాలవ్యాపారంలో నష్టంతో..

నాగేశ్వరరావు(34) పాలవ్యాపారం చేసేవాడు. అందులో నష్టం రావడంతో కిళ్లీ దుకాణం పెట్టారు. అందులోనూ కోలుకోలేకపోవడంతో గడ్డిమందు తాగాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారని గ్రామస్థులు తెలిపారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ తుని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
ఇ.పి.నెం. 20/2022 ఒ.ఎస్.నెం. 835/2020

బిట్వీన్:
జక్కంపూడి వీరవెంకట రామ సూర్య సత్యనారాయణమూర్తి ...డి.హెచ్.ఆర్.

మరియు

కొయ్యా శ్రీను ...జె.డి.ఆర్.

ఈ నెంబరు డిక్రీ బాకీ నిమిత్తము జె.డి.ఆర్. తాలూకు ఈ దిగువ షెడ్యూల్ దాఖలా ఆస్తిని పై కోర్టు వారిచే ది.24-07-2025న ఉదయం గం.10.30 ని॥లగాయితు బహిరంగంగా వేలం వేయబడును. వేలంలో పాల్గొనదలచిన వారు ది.24-07-2025వ తేదీన పై కోర్టులో హాజరై పాడుకొనవచ్చును. వివరాలకు డీహెచ్ఆర్ తరపున అడ్వకేట్ గార్ని గాని, కోర్టు నజారత్‌లో గాని సంప్రదించగలరు.

షెడ్యూల్: కాకినాడ జిల్లా, తుని స॥రి॥, తొండంగి మండలం, పి.ఇ.చిన్నయపాలెం గ్రామం, జిరాయితీ మెర్క భూమి.

1వ ప్రతి: సర్వే నెం.287రులో య.0.13 ట్లు భూమికి హద్దులు.
తూర్పు: సర్కారు పుంత; దక్షిణం: కె.పాపారావు గారి భూమి; పడమర: ఎ.వి.నగరం గ్రామం భూమి; ఉత్తరం: డి.చక్రమ్మ గారి భూమి.

2వ ప్రతి: సర్వే నెం.286రులో య.0.35 ట్లు భూమికి హద్దులు.
తూర్పు: సర్కారు పుంత; దక్షిణం: కె.పాపారావు గారి భూమి; పడమర: ఎ.వి.నగరం గ్రామం భూమి; ఉత్తరం: డి.చక్రమ్మ గారి భూమి.

డి.హెచ్.ఆర్ విలువ : రూ.11,00,000/-
అమీనా విలువ : రూ.40,00,000/-
(శ్రీ కోర్టు వారి అనుమతితో)

ఎ.విజయలక్ష్మి
అడ్వకేట్, తుని
సెల్: 90103 74668

తడిసిన సంత..స్థలం లేక చింత..!

న్యూస్‌టుడే-ప్రత్తిపాడు

ప్రత్తిపాడులో ప్రతి బుధవారం సంత నిర్వహిస్తుండగా వర్షం వస్తే వ్యాపారులు, వినియోగదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రహదారి, తోట వీధికి వెళ్లే చెరువు గట్టుమార్గంలోనే దుకాణాలు ఏర్పాటు చేసుకుంటారు. 5 గంటలపాటు జరిగే ఈ అంగడికి ప్రత్తిపాడు పరిసర గ్రామాల నుంచి వస్తారు. తాజా కూరగాయలు, అన్నిరకాల ఫలాలు ఈ సంత ప్రత్యేకత! చెరువు గట్టును అధ్వానంగా వాడుకోవడం వల్ల వ్యాపారులు ఇబ్బంది పడుతూనే దుకాణాలు ఏర్పాటు చేసుకుంటున్నారు. గ్రామంలో ప్రభుత్వ జాగాలు ఎక్కడికక్కడ ఆక్రమణలకు గురికాగా.. సంతకు స్థలం కరవైంది. దశాబ్దాలుగా రహదారిపైనే సంత జరుగుతున్నా.. నీరు నిలవకుండా, పరిసరాలు శుచిగా ఉండేలా ఏర్పాట్లు చేయడం లేదు. ఆశీళ్ల వసూలుపై ఉన్న శ్రద్ధ సంత నిర్వహణపై లేకపోయింది.

ప్రత్తిపాడులో వారపు సంత

తుంగభద్ర జలాశయం తొణికిసలాడుతున్న తరుణంలో వీక్షించడానికి కదలివచ్చిన ప్రజలు

జోరుమీద.. వానదేవుడు!

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : ఐదేళ్ల ప్రారంభ సమయానికే వానదేవుడు హోరెత్తుతున్నాడు. రాష్ట్ర వ్యాప్తంగా జలాశయాలు నిండుకుండలను తలపించే స్థాయికి చేరాయి. కర్ణాటకాంధ్రుల జీవనది తుంగభద్ర పొంగిపొర్లుతున్న తరుణంలో హొసపేటె సమీప జలాశయం నుంచి బుధవారం సాయంత్రానికి ఆరు గేట్లు ఎత్తేసి నీటిని విడుదల చేయడంతో రైతుల ఆనందానికి అవధులు లేవు. ఉత్తర కన్నడ, బెళగావి, ధార్వాడ, చిక్కమగళూరు, హాసన, కొడగు, శివమొగ్గ జిల్లాల్లో వాన తీవ్రత కారణంగా ఎల్లో అలర్ట్ ప్రకటించారు. గురువారం నుంచి ఈ జిల్లాల్లో భారీ వర్షాలు కొనసాగుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. బెంగళూరు, బెంగళూరు గ్రామీణ, మైసూరు, రామనగర, ధార్వాడ, గదగ, హావేరి, బెళగావి, బాగలకోటె, కొప్పళ, బీదర్, కలబురగి, విజయపుర, రాయచూరు, విజయనగర, యాదగిరి, చామరాజనగర, చిక్కబళ్లాపుర, చిత్రదుర్గ, దావణగెరె, మండ్య, కోలారు జిల్లాల్లో ఈ వారాంతం వరకు ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయని అధికారులు వెల్లడించారు.

తల్లీ, కుమార్తె ఆత్మహత్య

మండ్య, న్యూస్‌టుడే : మండ్య నగర శివారు నెహ్రూనగరలో రమ్య (28), ఆమె కుమార్తె రిత (9)తో కలిసి బుధవారం ఆత్మహత్య చేసుకోవడం తీవ్ర ఆందోళన కలిగించింది. బెంగళూరుకు చెందిన ఆమె భర్త నుంచి విడిపోయి మండ్యలోని ఓ కళ్లజోడు దుకాణంలో పనిచేసి, కుటుంబాన్ని పోషిస్తోంది. జీవితంపై విరక్తితోనే ఆమె కుమార్తెకు ఉరివేసి, తాను ఉరివేసుకుని ఉంటుందని మండ్య రాణా పోలీసులు వివరించారు.

వాల్మీకి మండలిలో అక్రమాలు వాస్తవమే

ప్రాథమికంగా గుర్తించిన సీఐడీ

బెంగళూరు (హలసూరు), న్యూస్‌టుడే : వాల్మీకి అభివృద్ధి కార్పొరేషన్‌లో రూ.187 కోట్ల అక్రమాలకు సంబంధించిన దర్యాప్తును సీబీఐ ప్రారంభించింది. కర్ణాటక జర్మన్ సాంకేతిక శిక్షణ సంస్థ నుంచి రూ.95 లక్షలు, షెడ్యూల్డ్ కులాలు, తెగల సంక్షేమ శాఖ నుంచి రూ.2.17 కోట్లను అక్రమంగా నెక్కంటి నాగరాజ్ అనే వ్యక్తి ఖాతాకు బదిలీ చేశారని సీబీఐ గుర్తించింది. బెంగళూరులోని కెనరా బ్యాంక్ శాఖకు రూ.95 లక్షలు, బ్యాంక్ ఆఫ్ బరోడా ఖాతాకు రూ.2.17 కోట్లు బదిలీ అయ్యాయని అధికారులు వివరించారు. మరో రూ.94 కోట్లను హైదరాబాద్‌లోని ఫస్ట్ బ్యాంక్ శాఖలో ఉన్న 18 నకిలీ ఖాతాలకు బదిలీ అయ్యాయని గుర్తించారు. మాజీ మంత్రి నాగేంద్రకు అప్పుడు నెక్కంటి నాగరాజ్‌తో పాటు హైదరాబాద్‌కు చెందిన నాగేశ్వరరావు అనే వ్యక్తి సిఫార్సు, సూచనలతోనే ఈ నగదు ఆయా ఖాతాలకు బదిలీ చేశారని తమ ప్రాథమిక విచారణలో సీబీఐ గుర్తించింది.

స్వచ్ఛంద పదవీ విరమణకు ఏసీపీ నారాయణ సిద్ధం

ధార్వాడ, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం ధరలను పెంచుతుందని ఆరోపిస్తూ గత ఏప్రిల్‌లో బెళగావిలో నిర్వహించిన సమావేశంలో ఏసీపీ నారాయణ బరమణ్ణిపై కొడుతున్నట్లు ముఖ్యమంత్రి చేయి ఎత్తిన ఘటన మరింత తీవ్రం అవుతోంది. సమావేశంలో భాజపా కార్యకర్తలు సీఎంకు, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేయడంతో ముఖ్యమంత్రి ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ధార్వాడ నుంచి బెళగావికి విధులు నిర్వహించేందుకు వచ్చిన నారాయణను బదిలీ చేసిన ప్రభుత్వం.. పోస్టింగ్ ఇవ్వలేదు. దీంతో ఆయన స్వచ్ఛంద పదవీ విరమణకు సిద్ధమయ్యారు.

కోతులకు విషాహారం

చామరాజనగర: గుండ్లుపేట తాలూకా కందేగాల-కొడసోగ గ్రామాల మధ్య 20కుపైగా కోతుల కళేబరాలను స్థానికులు గుర్తించారు. తోటల్లోకి వచ్చి పంటలను నాశనం చేస్తున్నాయని కొందరు రైతులు విషాహారాన్ని పెట్టడంతో అవి మరణించాయని అటవీశాఖ అధికారులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. గుండ్లుపేట గ్రామీణ ఠాణా పోలీసుల సహకారంతో దర్యాప్తు చేపట్టామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

తిరుపతికి చిక్క రైలు

చిక్కమగళూరు: చిక్కమగళూరు నుంచి వారానికి ఒక రోజు తిరుపతికి రైలు సేవలు ఈనెల 11వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని లోక్‌సభ సభ్యుడు కోటా శ్రీనివాస పూజారి తెలిపారు. కేంద్ర రైల్వే సహాయ మంత్రి వి.సోమణ్ణ ఈ సేవలను ప్రారంభిస్తారని వెల్లడించారు. రానున్న రోజుల్లో వారానికి మూడు రోజులు రైలు పరుగులు తీసేలా ఏర్పాటు చేస్తామని తెలిపారు. శుక్రవారం (11వ తేదీ) సాయంత్రం 5కు చిక్కమగళూరు నుంచి బయలుదేరే రైలు బెంగళూరు మార్గంగా శనివారం ఉదయం 7.40కి తిరుపతి చేరుతుందని, ప్రతి గురువారం రాత్రి 9కి తిరుపతిలో బయలుదేరే రైలు శుక్రవారం ఉదయం చిక్కమగళూరుకు ఉదయం 10.30కు చేరుకుంటుందని వివరించారు.

పాటిల్‌కూ పదవీభాగ్యం

విజయపుర: భారీ పరిశ్రమల మంత్రి ఎంబీ పాటిల్‌కు కర్ణాటక ముఖ్యమంత్రి అయ్యే యోగం ఉందని కోడిమఠం సంస్థానాధిపతి శివానందన శివయోగి రాజేంద్ర స్వామి జోస్యం చెప్పారు. విజయపుర జిల్లా ఆలమేల తాలూకా కడని గ్రామంలో నిర్వహించిన సామూహిక వివాహ కార్యక్రమంలో ఆయన బుధవారం పాల్గొన్నారు. అనంతరం తనను కలుసుకున్న విలేకరులతో మాట్లాడుతూ మంత్రిగా, ఎమ్మెల్యేగా పాటిల్ ఉత్తమ సేవలు అందించారని, ఉత్తర కర్ణాటక ప్రాంతం నుంచి ముఖ్యమంత్రి అయ్యే అవకాశాన్ని కాంగ్రెస్ అందించవలసిన అవసరం ఉందన్నారు. ఆయనకు ముఖ్యమంత్రి అయ్యే యోగం స్పష్టంగా కనిపిస్తుందని పేర్కొన్నారు.

నందిబెట్ట.. నజరానాల బుట్ట!

- వేగంగా 'ఎత్తినహొళె' పథకం
- ఇక 'బెంగళూరు దక్షిణ జిల్లా'
- మంత్రివర్గం.. హామీల వర్షం

ఈనాడు, బెంగళూరు : అధికార వికేంద్రీకరణ, రాష్ట్రం నలుమూలలా ప్రగతి పథం, వెనుకబడిన జిల్లాలకు వేగంగా నిధుల సమీకరణ తదితర లక్ష్యాలతో కర్ణాటక రాజధాని బెంగళూరుకు బయట మంత్రివర్గ సమావేశాలు నిర్వహించే సంప్రదాయాన్ని సిద్ధరామయ్య సర్కారు విజయవంతంగా కొనసాగిస్తోంది. ఇప్పటికే కలబురగి, చామరాజనగరలోని మలెమహదేశ్వర బెట్టపై మంత్రివర్గ సమావేశాలు కొనసాగించిన సర్కారు.. బుధవారం చిక్కబళ్లాపుర సమీప నందిబెట్టపై మరో సమావేశాన్ని నిర్వహించింది. గత నెలలోనే ఇక్కడ సమావేశాన్ని నిర్వహించాల్సి ఉన్నా ఇక్కడి ప్రాధాన్యతలపై ప్రతిపాదనలు సకాలంలో అందని కారణంగా వాయిదా పడింది. బుధవారం ఆ సమయం కలిసి రావటంతో మంత్రిమండలి నందిబెట్టకు తరలింది. అధికారపక్షంలో అంతర్గత రాజకీయాలు వేడెక్కిన ఈ సమయంలో నిర్వహించిన సమావేశం సాధారణంగానే ఆసక్తిగొలిపింది. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ నేతృత్వంలో సుదీర్ఘంగా కొనసాగిన ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలిలా ఉన్నాయి.

జలధారలు..

బెంగళూరులో నిర్వహించిన గత సమావేశంలో చర్చించిన అంశాలనే ఈ సమావేశంలోనూ చర్చించినా ఈసారి ఎత్తినహొళె ఎత్తిపోతల పథకంపై మరింత విస్తృతంగా చర్చించారు. కరవు సీమ గొంతు తడిపే లక్ష్యంతో నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టు సవరణ వ్యయంతో కలిపి ప్రస్తుతం రూ.23,251 కోట్లకు చేరుకోగా ఇప్పటి వరకు రూ.17,147 కోట్లు వ్యయం చేశారు. కేవలం తాగునీటి వ్యవస్థ కోసమే నిర్మిస్తున్న ఈ ప్రాజెక్టులోని 24.1 టీఎంసీల నీటిలో తాగేందుకు 14 టీఎంసీలను వినియోగించాలని తీర్మానించారు. ప్రస్తుతం రూ.9,807 కోట్ల మొత్తంతో గ్రావిటీ కాల్వలు నిర్మిస్తుండగా ఇందులో 85 శాతం పనులు ముగిశాయి. ఇంకా ఈ నిర్మాణానికి రూ.8 వేల కోట్లు అవసరం. మరో రూ.6 వేల కోట్ల పనులకు డీపీఆర్ సిద్ధం చేయాలి. 2027 నాటికి లక్ష్యంలోని 60 శాతం గ్రామాలకు తాగునీరు అందించేలా పనులు పూర్తి చేయాలని సమావేశంలో తీర్మానించారు. మొత్తం 9 జిల్లాలకు చెందిన 75 లక్షల మంది ప్రజల దాహార్తి ఈ ప్రాజెక్టు ద్వారా తీరనుంది.

48 అంశాలపై చర్చ..

పేరుకు చిక్కబళ్లాపురలో సమావేశమైనా.. ఇక్కడ చర్చించిన అంశాల్లో 90 శాతం బెంగళూరు అభివృద్ధికి చెందినవి. సమావేశంలో 48 అంశాలు చర్చించగా వీటికి రూ.3,400 కోట్లు మంజూరు చేశారు. ఈ మొత్తంలో బెంగళూరుకు సంబంధించిన 31 అంశాలకు రూ.2,050 కోట్లు దక్కుతాయి. మిగిలిన 17 అంశాలు చిక్కబళ్లాపుర జిల్లాకు చెందగా ఇందుకు రూ.1,350 కోట్లు మంజూరు చేశారు. మొత్తంగా ఈ సమావేశంలో విద్య, ఆరోగ్యం, నీటిపారుదల, తాగునీరు, చెరువుల భర్తీకి సంబంధించిన ప్రాజెక్టులపై ఎక్కువగా దృష్టి సారించారు.

సమావేశంలో చర్చించే అంశాలను ముఖ్యమంత్రికి వివరిస్తున్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాలిని రజనీశ్

మంత్రివర్గ సమావేశంలో పాల్గొన్న మంత్రులు, అధికారులతో పాటు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్

కొత్త జిల్లాకు ప్రాణం

రామనగర జిల్లా బెంగళూరులో విలీనం అయిన కారణంగా జిల్లాల పేర్లు కూడా మారబోతున్నాయి. ఇలా ప్రస్తుతమున్న బెంగళూరు గ్రామీణ జిల్లాను బెంగళూరు ఉత్తర జిల్లాగా, బాగేపల్లి పట్టణాన్ని భాగ్యనగరగా పేరు మారుస్తూ ఈ సమావేశంలో తీర్మానం చేశారు. ఇదే సందర్భంగా బెంగళూరు నగర విశ్వవిద్యాలయాలన్ని డాక్టర్ మన్మోహన్‌సింగ్ విశ్వవిద్యాలయంగా నామకరణం చేయాలని తీర్మానించారు.

మరిన్ని తీర్మానాలు..

- ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు లేని తాలూకాల్లో సముదాయ ఆరోగ్య కేంద్రాల స్థాపన, విద్యకు రూ.1,627 కోట్లు కేటాయించారు. ఇందులో కళాశాలలు, విశ్వవిద్యాలయాల మౌలిక సదుపాయాలకు ఎక్కువగా కేటాయించారు. బీసీ విద్యార్థులకు సివిల్ సర్వీసెస్ పరీక్షల కోసం వసతి, శిక్షణకు రూ.10 కోట్లు, కార్మికుల సంక్షేమ మండలిలో సభ్యులైన వారి పిల్లలకు విద్య, వసతి కోసం రూ.1,125 కోట్లు ప్రత్యేకిస్తున్నట్లు ప్రకటించారు. నీటి పారుదలకు కేటాయించిన రూ.1,154 కోట్లలో రూ.237 కోట్లను బెంగళూరు మురుగునీటి శుద్ధీకరణకు, శిడ్లఘట్ట, చింతామణి తాలూకాల్లో 164 చెరువుల భర్తీకి కేటాయించారు. ఈ ప్రాంతంలో పూల సాగు ఎక్కువగా ఉన్న కారణంగా రూ.10 కోట్లతో పూల వేలం కేంద్రం, చిక్కబళ్లాపురలో రూ.141 కోట్లతో హైటెక్ ఫ్లవర్ మార్కెట్‌ను స్థాపించనున్నారు. ఆరోగ్యశాఖ పరిధిలో రూ.46 కోట్లతో సముదాయ ఆరోగ్య కేంద్రాలు, రూ.21.40 కోట్లతో చిక్కబళ్లాపుర, హుబ్బళ్లి వైద్య కళాశాలలకు ఎంఆర్ఐ యంత్రాల ఏర్పాటు, చిక్కబళ్లాపుర జిల్లా కైవారలో రూ.56 కోట్లతో పీహెచ్‌సీ, మంచేనహళ్లిలో ఆస్పత్రి ఉన్నతీకరణకు కేటాయించారు.

మంత్రివర్గ సమావేశానికి వేదికగా మారిన నందిబెట్ట

డీకేకు మద్దతిస్తే తప్పేంటి?

నిలదీసిన ఇక్బాల్‌హుస్సేన్

రామనగర, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రిగా సిద్ధరామయ్య రెండేళ్ల పాలన అనంతరం ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సీఎంగా అవకాశం ఇవ్వాలన్న మాటకు తాను కట్టుబడి ఉన్నానని రామనగర ఎమ్మెల్యే ఇక్బాల్ హుసేన్ స్పష్టం చేశారు. తాను చేసిన వ్యాఖ్యలకు వివరణ కోరుతూ ఉప ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్ తనకు తాఖీదులు జారీ చేశారని వెల్లడించారు. కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి సిద్ధరామయ్యతో సమంగా శివకుమార్ కూడా శ్రమించారని- మా రామనగర జిల్లాకు చెందిన నాయకుడు ముఖ్యమంత్రి కావాలని నేను కోరుకోవడంతో తప్పేముందని ప్రశ్నించారు.

బీఆర్ పాటిల్ విచారం

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సిద్ధరామయ్య- తన మధ్య ఉన్న సాన్నిహిత్యాన్ని చెడగొట్టేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆళంద ఎమ్మెల్యే బీఆర్ పాటిల్ వ్యాఖ్యానించారు. సిద్ధరామయ్యకు సీఎం పదవి లాటరీలో వచ్చిందని తాను వ్యాఖ్యానించలేదని, లక్కీ లాటరీ సిద్ధుకు దొరికిందని మాత్రమే కేఆర్‌పేటలో పేర్కొన్నానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీకి సిద్ధరామయ్యను తానే పరిచయం చేశానని ఎన్నడూ మాట్లాడలేదని తెలిపారు. సిద్ధరామయ్య ప్రజా నాయకుడని, ఆయనను ముఖ్యమంత్రి చేసే శక్తి తనకు లేదన్నారు. ఆయనపై ఉన్న అభిమానంతో తనతో పాటు తొమ్మిది మంది ఎమ్మెల్యేలు గతంలో దళ్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరామని గుర్తు చేసుకున్నారు.

చాముండి సన్నిధిలో శివణ్ణ

మైసూరు, న్యూస్‌టుడే : రాచనగరి శివారు చాముండి బెట్టపై చాముండేశ్వరి అమ్మవారిని హ్యాట్రిక్ హీరో శివరాజ్ కుమార్, గీత దంపతులు బుధవారం దర్శించుకున్నారు. గత కొద్ది రోజులుగా తన భార్యతో కలిసి మైసూరు, చామరాజనగర జిల్లాల్లో ఆయన పర్యటిస్తున్నారు. ఇప్పటికే 125 సినిమాలను పూర్తి చేసిన శివణ్ణ చేతిలో 5 కొత్త సినిమాలు ఉన్నాయి. ఆయన రాక సందర్భంగా అభిమానులు సందడి చేశారు.

తొక్కిసలాటలకు ఇక తెర

సర్కారు కొత్త నిబంధనలు

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే : రాజధాని నగరంలోని చిన్నస్వామి క్రికెట్ మైదానం వద్ద తొక్కిసలాట ఘటన తరహాలో భవిష్యత్తులో మరో అంకం పునరావృతం కాకుండా కర్ణాటక ప్రభుత్వం స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ (ప్రామాణీకృత నియంత్రణ విధానం)ను అమలులోకి తీసుకువచ్చింది. రద్దీకి అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవడం, కార్యక్రమ నిర్వాహకులతో పోలీసుల సమన్వయం, భద్రతా ప్రమాణాలను ముందుగా పరిశీలించి అనుమతులు జారీ చేయడం, ముప్పు కారకాలను గుర్తించి సూచనలు చేసే బాధ్యతలను ఆయా ఠాణాల పరిధి పోలీసులు, ఉన్నతాధికారులకు ప్రభుత్వం అప్పగించింది. పౌరుల ప్రాణాలకు, ఆస్తికి భద్రత కల్పిస్తూ, నష్టాన్ని వీలైనంత తగ్గించేందుకే ఈ మార్గదర్శక సూత్రాలను నిపుణులతో కలిసి రూపొందించామని హోం శాఖ మంత్రి డాక్టర్ పరమేశ్వర్ తెలిపారు. భారీ కార్యక్రమాలు నిర్వహించే చోట అగ్నిమాపకదళ సిబ్బంది, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచుకోవడం నిర్వాహకుల బాధ్యత అని చెప్పారు. మైదానం, కార్యక్రమ వేదిక వద్దకు వెళ్లే మార్గంలో పలు చెక్‌పాయింట్లు, అత్యవసర సందర్భంలో దారి మళ్లింపుకు ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేసుకోవలసి ఉంటుందని ఆయన వివరించారు.

చిన్నస్వామి మైదానం వద్ద ఇటీవల విపరీత రద్దీ తెచ్చిపెట్టిన ఇక్కట్లు ఎన్నెన్నో

సిద్ధు పదవికి ఇక మూడినట్లే: విజయేంద్ర

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి పీఠం పైనుంచి సిద్ధరామయ్యను గద్దె దించేందుకే కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యుడు రణదీప్ సింగ్ సుర్జేవాలా కర్ణాటకకు వచ్చారని భాజపా రాష్ట్రాధ్యక్షుడు బీవై విజయేంద్ర వ్యాఖ్యానించారు. గద్దె దించేందుకు కావలసిన ఆధారాలను ఆయన సిద్ధం చేస్తున్నారని పేర్కొన్నారు. పరిపాలన యంత్రాంగం కుప్పకూలడం, పాలన అస్తవ్యస్తంగా మారడం, ఎమ్మెల్యేల మధ్య అంతర్గత కలహాలు తీవ్రం అయ్యాయని తెలిపారు. అభివృద్ధి పనులు పూర్తిగా నిలిచిపోవడంతో సామాన్యులు కూడా ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు.

అంతుచిక్కని హృదయ వేదన

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : హాసనతో పాటు ఆయా జిల్లాల్లో చిన్నవయసులోనే గుండెపోటుకు గురై మరణించిన యువత, మధ్యవయసు వారి కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైద్యుల సమితి భేటీ అయ్యే ప్రక్రియను ప్రారంభమయ్యింది. జయదేవ ఆసుపత్రి వైద్యాధికారి నేతృత్వంలోని 12 మంది వైద్యులు ఆయా గ్రామాలకు వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు. పొగ తాగడం, మద్యం అలవాటు, ఫాస్ట్‌ఫుడ్ ఎక్కువగా తినడం, కొవ్వు ఎక్కువగా ఉండడంతోనే ఎక్కువ మరణాలు జరిగాయని ప్రాథమిక దర్యాప్తు, బాధితుల వైద్య నివేదికల ఆధారంగా అంచనాకు వచ్చారు. కొవిడ్ సమయంలో వేసుకున్న టీకాతో మరణాలు సంభవించాయని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం ఏమీ లేదని ఇప్పటికే కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించిన విషయాన్ని ఆరోగ్య శాఖ అధికారి గౌరవ్ గుప్త స్పష్టం చేశారు.

యమనూరులో ఇద్దరు..

ధార్వాడ: నవలగుంద పట్టణ శివారు ప్రాంతం యమనూరలో కేబుల్ ఆపరేటర్‌గా పని చేస్తున్న ఫకీరప్ప బణగార (45), ప్రైవేటు కంపెనీ ఉద్యోగి శంకరప్ప పూజార (44) ఇద్దరూ గుండెపోటుతో బుధవారం ఉదయం మరణించారు. ఇద్దరికీ ఛాతీలో నొప్పి వచ్చి పడిపోగా, చికిత్స కోసం నవలగుందలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఇద్దరూ మరణించారని వైద్యులు తెలిపారు.

ఛాతీ పట్టుకుని.. కుప్పకూలి..

బెంగళూరు (గ్రామీణం): ఛాతీలో నొప్పి రావడంతో ఆసుపత్రికి నడుచుకుంటూ వచ్చిన కోనప్ప (52) అనే వ్యక్తికి చికిత్స ఇచ్చేలోగా జీవన్మృతునిగా మారాడు. బుధవారం ఉదయం ఛాతీపట్టుకుని వచ్చిన కోనప్పను ఐసీయూలోకి తరలించేలోగా అపస్మారకస్థితికి వెళ్లి కుప్పకూలిపోయాడు. వైద్య పరీక్షల్లో అతను జీవన్మృతునిగా మారాడని వైద్యులు వెల్లడించారు.



మందు బిళ్లలు కొంటూ..

చిక్కమగళూరు: తనకు కావలసిన ఔషధాల కొనుగోలుకు వచ్చిన విశ్వనాథ్ (60) అనే వ్యక్తి గుండెపోటుతో ఆ దుకాణం వద్దే మరణించారు. చిక్కమగళూరులోని దీపా నర్సింగ్ హోంలో వైద్య పరీక్షలకు వచ్చి ఔషధాన్ని కొనుగోలు చేసుకునేందుకు వచ్చిన సమయంలో ఆయన గుండెపోటుకు గురయ్యారు. నర్సింగ్ హోంకు తరలించి చికిత్స చేసేలోగా ఆయన మరణించారు. హాసన, మైసూరు జిల్లాల్లో ప్రతి నెలా సగటున 100 మంది గుండెపోటుతో మరణిస్తున్నారని వైద్యులు గుర్తించారు. చిన్న సమస్యను ఎక్కువగా ఆలోచించడంతోనూ గుండెపోటుకు గురవుతున్న వారి సంఖ్య ఎక్కువ అవుతుందని వైద్యులు తెలిపారు.

ఇటు వైద్య విద్యార్థి..

బాగలకోటె: బాగలకోటెలోని బీవీవీ సంఘం ఎస్.నిజలింగప్ప వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థి లక్ష్మీపుత్ర కులకర్ణి (24) గుండెపోటుతో బెంగళూరులో మరణించాడు. విజయపుర జిల్లా సింధగి తాలూకా కుమసగి గ్రామానికి చెందిన లక్ష్మీపుత్ర ఈ నెల 10కి ఇంటర్న్‌షిప్ పూర్తి కానుంది. సెలవు ఉండడంతో తమిళనాడుకు వెళ్లి, అక్కడి నుంచి బెంగళూరుకు వస్తూ మంగళవారం రాత్రి అస్వస్థతకు గురయ్యాడు. ఆసుపత్రికి తీసుకువెళ్లాక మరణించాడు.

లక్ష్మీపుత్ర కులకర్ణి

ఏఆర్ రెహమాన్ సందడి

ముద్దేనహళ్లి (చిక్కబళ్లాపుర) : ప్రఖ్యాత సంగీత దర్శకుడు, ఆస్కార్ అవార్డు గ్రహీత ఏఆర్ రెహమాన్ బుధవారం బెంగళూరు సమీప సత్య సాయి (ముద్దేనహళ్లి) గ్రామాన్ని సందర్శించారు. గ్లోబల్ హ్యూమానిటేరియన్, ఆధ్యాత్మికవేత్త మధుసూదన్ సాయి నేతృత్వంలోని 'వన్ వరల్డ్ వన్ ఫ్యామిలీ మిషన్' చేపడుతోన్న వివిధ మానవతా కార్యక్రమాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా 2014లో ప్రారంభమైన సాయి సింఫనీ ఆర్కెస్ట్రా విద్యార్థుల ప్రతిభకు ఫిదా అయ్యారు. ఈ సింఫనీలో గ్రామీణ, పేద నేపథ్యాల నుంచి వచ్చిన 170మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. భారత్‌లోనే అతిపెద్ద స్వదేశీ ఆర్కెస్ట్రా ఇదే కావడం విశేషం.

- ఏఆర్ రెహమాన్ సత్యసాయి గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా విద్యార్థులు ప్రత్యేక ప్రదర్శనను నిర్వహించారు. మిషన్ ఇంపాజిబుల్, పైరేట్స్ ఆఫ్ కరేబియన్ సహా ప్రపంచ ప్రఖ్యాతి చెందిన పలు గీతాలను ప్రదర్శించి ఆకట్టుకున్నారు. గ్రీకు- అమెరికన్ మల్టీ ఇన్‌స్ట్రుమెంటలిస్ట్ డిమిత్రిస్ లాంబ్రియానోస్ ఆధ్వర్యంలో గురుకులం విద్యార్థులు శిక్షణ పొందారు. ఈ ప్రదర్శనను వీక్షించిన రెహమాన్ తాను చూసిన అత్యద్భుత ప్రదర్శనల్లో ఇదొకటి అని ప్రశంసించారు. భవిష్యత్తులో ఇది దేశంలోనే అత్యుత్తమ సింఫనీగా గుర్తింపు పొందేందుకు అన్ని అవకాశాలూ ఇక్కడి విద్యార్థులకు ఉన్నాయన్నారు. అత్యంత అరుదైన, విలువైన వాద్య పరికరాలను అందించి వారిలో నైపుణ్యాలను పెంపొందించేందుకు వీలు కల్పించిన వన్ వరల్డ్ వన్ ఫ్యామిలీ మిషన్‌ను అభినందించారు.
- సాయి సింఫనీ ప్రదర్శన అనంతరం మధుసూదన్ సాయి మాట్లాడుతూ. . రెహమాన్ తన ఫౌండేషన్ ద్వారా పేద వర్గాలకు సంగీతాన్ని అందించి ప్రోత్సహిస్తున్నారని, వన్ వరల్డ్ -వన్ ఫ్యామిలీ మిషన్ కోసం ఓ ప్రత్యేక గీతాన్ని కంపోజ్ చేస్తున్నారని తెలిపారు. మధుసూదన్ సాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆస్పత్రుల్లో రోగులకు సాంత్వన కలిగించేందుకు హీలింగ్ మ్యూజిక్‌ను సైతం కంపోజ్ చేయనున్నట్లు చెప్పారన్నారు. అనంతరం రెహమాన్ సహా ఈ కార్యక్రమానికి హాజరైన పలువురు ప్రముఖులకు సన్మానం చేశారు.

సర్కారుపై నిప్పులు

రాష్ట్రంలో అవినీతి ప్రభుత్వం గద్దె దిగాలంటూ జనతాదళ్ బెంగళూరు నగర శాఖ ఉద్యమించింది. రాజధాని నడిబొడ్డున స్వాతంత్ర్య ఉద్యానవనంలో బుధవారం నిర్వహించిన ధర్నాలో వివిధ స్థాయి నేతలు పాల్గొని.. సర్కారుపై నిప్పులు చెరిగారు. తక్షణమే సిద్ధరామయ్య రాజీనామా చేయాలని పట్టుబట్టారు. **(న్యూస్‌టుడే, బెంగళూరు)**

రాష్ట్ర భూస్వాధీన వ్యతిరేక పోరాట సమితి కార్యకర్తలు, నేతలు బుధవారం బెంగళూరులో ధర్నాకు దిగారు. దేవనహళ్లి సమీపంలో పరిశ్రమల కోసం సాగుభూముల స్వాధీన ప్రక్రియను నిరసించారు. **(న్యూస్‌టుడే, బెంగళూరు)**

హెచ్‌సీజీ వ్యవహారాలపై ఆరోగ్య శాఖకు ఫిర్యాదు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : క్యాన్సర్‌కు ఉత్తమ చికిత్స అందిస్తున్న హెల్త్‌కేర్ గ్లోబల్ ఎంటర్‌ప్రైజెస్ (హెచ్‌సీజీ) ఆసుపత్రిలో క్లినికల్ ట్రయల్స్ పేరిట అక్రమాలు జరుగుతున్నాయని విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ పి.కృష్ణభట్ ఆరోపించారు. బెంగళూరు కేంద్రంగా విస్తరించిన ఈ సంస్థలో నైతిక సమితికి అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న ఆయన కేంద్ర డ్రగ్ కంట్రోలర్ జనరల్, కేంద్ర ఔషధ నాణ్యత నియంత్రణ సంస్థ, రాష్ట్ర ఆరోగ్య శాఖ కమిషనర్‌కు తాజాగా ఫిర్యాదు పత్రాలను పంపించారు. జస్టిస్ కృష్ణభట్ ఈ ఆరోపణలు చేసి తన పదవికి రాజీనామా చేశారు. న్యాయమూర్తి పదవి వీడిన అనంతరం సంస్థలో పలువురు ఉన్నతాధికారులు, వైద్యులు, డైరెక్టర్లు తమ పదవులకు రాజీనామా చేశారు. క్యాన్సర్ చికిత్సకు వస్తున్న వారి కుటుంబ సభ్యుల నుంచి అనుమతి తీసుకుని, కొన్నిసార్లు అనుమతులు లేకుండా వేర్వేరు ఔషధాలతో చికిత్సలు చేయడం అనైతికమని ఆయన అభ్యంతరం తెలిపారు. తాము అన్ని అనుమతులూ తీసుకున్న అనంతరమే ఔషధాలను వినియోగిస్తున్నామని, చట్టవ్యతిరేకంగా ఎటువంటి క్లినికల్ ట్రయల్స్ నిర్వహించడం లేదని హెచ్‌సీజీ అధ్యక్షుడు డాక్టర్ బీఎస్ అజయ్ కుమార్ స్పష్టం చేశారు. దీనిపై దర్యాప్తునకు ఆదేశించాలని డీసీజీఐకు కోరుతున్నామని కర్ణాటక ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కేబీ శివకుమార్ తెలిపారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వరైజ్‌మెంట్స్) కొరకు
Cell: 9121167525
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 9945050116

(c) eenadu

యుద్ధప్రాతిపదికన.. కాలువల ఆధునికీకరణ

● తుంగభద్ర కాలువలకు 10న సాగునీరు విడుదల ● 50 శాతం పనులను పూర్తి చేస్తామని ఇంజినీర్ల వెల్లడి

యుద్ధప్రాతిపదికన సాగుతున్న సిమెంట్ లైనింగ్ పనులు

బళ్లారి, న్యూస్‌టుడే: తుంగభద్ర జలాశయం కాలువలకు మరో ఎనిమిది రోజుల్లో సాగునీటిని విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా ప్రారంభించిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయిస్తున్నారు. మిగిలిన పనులను వచ్చే ఏడాది కాలువకు నీటిని నిలిపివేసిన తర్వాత పూర్తి చేసే విధంగా సిద్ధం చేసుకున్నారు.

మూడు ప్యాకేజీల పనుల్లో వేగం

తుంగభద్ర కుడి దిగువ (ఎల్లెల్సీ) కాలువ సున్న (గుండ్లకెరె) కిలోమీటరు నుంచి 250వ కిలోమీటరు వరకు తుంగభద్ర మండలి పరిధిలోకి వస్తోంది. గతంలో 204వ కిలోమీటరు వరకు డీప్ కాలువ (భూ ఉపరితలం నుంచి దిగువకు) మినహా మిగిలిన కాలువను ఆధునికీకరణ పనులు చేయించారు. ఈ ఏడాది 205వ కిలోమీటరు నుంచి 250వ కిలోమీటరు వరకు పనులు మే చివరిలో ప్రారంభించారు. మధ్యలో ఓ మూడు ప్యాకేజీ పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. పనులు 205 నుంచి 210 వరకు 40 శాతం, 210 నుంచి 224వ కిలోమీటరు 60 శాతం, 224 నుంచి 336వ కిలోమీటరు వరకు 80 శాతం, 236వ నుంచి 246వ కిలోమీటరు వరకు 65 శాతం, 246 నుంచి 250వ కిలోమీటరు వరకు 30 శాతం పనులు మాత్రమే పూర్తి చేశారు. ఈ నెల 10న కాలువకు నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా పనులు పూర్తి చేయడానికి తుంగభద్ర మండలి అధికారులు గుత్తేదారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. రాత్రింబవళ్లు పనులు చేస్తున్నారు. నాణ్యతలోపించిన పనులు చేసిన గుర్తించి, తొలగించి మరోసారి పనులు చేయిస్తున్నారు. ఎల్లెల్సీ కాలువ నుంచి డీపీ హాచ్చొళ్లి, పీఎస్ డీపీ, డీపీ-65 ఉప కాలువలు కర్ణాటక - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దులో ఉండటంతో తుంగభద్ర మండలి పరిధిలోకి వస్తాయి. ఈ ఉప కాలువల నుంచి బళ్లారి, కర్నూలు జిల్లాల్లోని పలు గ్రామాలకు సాగు, తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మూడు ఉప కాలువలను ఆధునికీకరణ చేయనున్నారు. మిగిలిన పనులను వచ్చే ఏడాది పూర్తి చేయిస్తామని తుంగభద్ర మండలి ఇంజినీర్లు తెలిపారు.

పూర్తయిన కాలువ ఆధునికీకరణ పనులు

పనులను పరిశీలిస్తున్న ఆదోని ఎమ్మెల్యే

ప్రమాణాలు పాటిస్తాం

ఈ నెల 10న తుంగభద్ర దిగువ కాలువకు నీటిని విడుదల చేస్తారని.. ఆధునికీకరణ పనులు హడావుడిగా చేయడం లేదు. కాలువలను తవ్విన తర్వాత మొదటి సారిగా పూర్తి స్థాయిలో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. భవిష్యత్తులో మరో 20 ఏళ్ల ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇరు రాష్ట్రాల రైతులకు కేటాయించిన సాగు, తాగునీటిని ఇవ్వాలి. ప్రధాన కాలువలో ఈ ఏడాది ప్రారంభించిన రూ.395 కోట్లతో ఐదు ప్యాకేజీలు, ఉప కాలువలు మూడు ప్యాకేజీలు, గతేడాది పెండింగ్‌లో ఉన్న మూడు ప్యాకేజీల పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. ఈ ఏడాది 50 శాతం పనులు పూర్తి చేసి, వచ్చే ఏడాది కాలువకు నీటిని నిలిపివేసిన తర్వాత మిగిలిన పనులు పూర్తి చేయిస్తాం. **- నారాయణ నాయక్, ముఖ్య పర్యవేక్షక ఇంజినీర్, తుంగభద్ర మండలి**

బళ్లారి రాఘవ పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

బళ్లారి రాఘవ

బళ్లారి, న్యూస్‌టుడే: నాట్య కళా ప్రపూర్ణ బళ్లారి రాఘవ జయంతి సందర్భంగా ఏటా తెలుగు, కన్నడ నాటక రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తున్న కళాకారులకు రాష్ట్రస్థాయి పురస్కారం అందజేస్తున్నట్లు రాఘవ స్మారక సంఘం గౌరవ కార్యదర్శి ఎన్.ప్రకాష్ తెలిపారు. గత 16 సంవత్సరాలుగా తెలుగు, కన్నడ నాటక రంగంలో కళాకారులను ప్రోత్సహించడానికి బళ్లారి రాఘవ పురస్కారం అందజేస్తున్నాం. ఈ ఏడాది ఆగస్టు 2, 3 తేదీల్లో బళ్లారిలోని రాఘవ కళామందిరంలో ఆయన జయంతి సందర్భంగా పురస్కారాలు అందజేస్తామని చెప్పారు. ఇందులో భాగంగా రాష్ట్ర స్థాయిలోని కళాకారులు తమ నటన, కళాత్మక సేవలను పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను ఈ నెల 15లోపు అధ్యక్షుడు, కార్యదర్శి రాఘవ కళామందిరం, డా.రాజ్‌కుమార్ రహదారి, బళ్లారి అనే చిరునామాకు పంపాలని కోరారు.

రూ.3.50 కోట్లతో చెక్‌డ్యాంల నిర్మాణం

చెళ్లకెర(చిత్రదుర్గం),న్యూస్‌టుడే: హొళల్కెర తాలూకా కల్లవ్వ నాగతిహళ్లి వద్ద రూ.3.50 కోట్లతో రెండు చెక్ డ్యాంలను నిర్మించనున్నట్లు ఎమ్మెల్యే డాక్టర్ ఎం.చంద్రప్ప పేర్కొన్నారు. బుధవారం ఆయన చెక్‌డ్యాంల నిర్మాణానికి భూమిపూజ చేసి మాట్లాడారు. చెక్‌డ్యాం నిర్మాణంతో భూగర్భ జలాల స్థాయి పెరుగుతుందన్నారు. రైతుల గొట్టపు బావుల్లో ఏడాది వరకు పూర్తిగా సాగు నీరు లభిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తదన్నారు. గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు గీతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

కల్లవ్వనాగతిహళ్లి వద్ద చెక్‌డ్యాం నిర్మాణానికి భూమి పూజ చేసిన హొళల్కెర ఎమ్మెల్యే చంద్రప్ప

అక్టోబరు వరకు రాష్ట్రీయ రాజీమార్గ అభియాన్

బళ్లారి, న్యూస్‌టుడే: జాతీయ, కర్ణాటక న్యాయ సేవా ప్రాధికార, జిల్లా న్యాయసేవా ప్రాధికార సమితి ఆధ్వర్యంలో రాజీమార్గ అభియాన్ జులై 1 నుంచి అక్టోబరు 7 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవా ప్రాధికార సంస్థ అధ్యక్షురాలు జస్టిస్ కె.జి.శాంతి వెల్లడించారు. రాష్ట్రీయ మధ్యవర్తిత్వం అభియాన్ దేశంలో అన్ని తాలూకా న్యాయస్థానాలు, జిల్లా న్యాయస్థానాలు, హైకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం ద్వారా కేసులను పరిష్కరించుకోవాలన్నారు. సర్వోన్నత న్యాయస్థానం మధ్యవర్తిత్వం, రాజాంగం పరిష్కార సమితి ఆధ్వర్యంలో జాతీయ న్యాయసేవా ప్రాధికార భారత ముఖ్య న్యాయమూర్తి, భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తి, ఎన్.ఎ.ఎల్.ఎన్.ఎ. కార్యనిర్వాహక అధ్యక్షుడు, ఎం.సి.పి.పి. అధ్యక్షుడు, న్యాయమూర్తి సూర్యకాంత్ మార్గదర్శనంలో మధ్యవర్తిత్వం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బళ్లారి, విజయనగర జిల్లాల్లోని న్యాయస్థానాల్లో రాష్ట్రీయ మధ్యవర్తిత్వం అభియాన్ జులై 1 నుంచి అక్టోబరు 7 వరకు కొనసాగుతుందని తెలిపారు. కేసులను రాజీ మార్గం ద్వారా పరిష్కరించుకోవాలన్నారు.

గ్యారంటీ పథకాలతో ఆర్థిక లబ్ధి

గంగావతి,న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గ్యారంటీ పథకాలతో రాష్ట్రంలో నిరుపేదలు ఆర్థికంగా పుంజుకున్నారని కొప్పళ లోక్‌సభ సభ్యుడు రాజశేఖర్ హిట్నాళ పేర్కొన్నారు. ఆయన కొప్పళలో బుధవారం రాష్ట్ర ప్రభుత్వం రెండేళ్ల సాధనలపై సమాచార, ప్రచార శాఖ నిర్వహించిన ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. గృహలక్ష్మీ, గృహజ్యోతి, యువనిధి, అన్నభాగ్య, శక్తి పథకాలు లబ్ధిదారులందరికీ అందుతున్నాయన్నారు. కొప్పళ ప్రయాణ ప్రాంగణంలో రెండు రోజులపాటు జరిగే ఈ వస్తుప్రదర్శనను ప్రజలు తిలకించాలని కోరారు. గ్యారంటీ సమితి జిల్లాధ్యక్షుడు రెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ పథకాలను ప్రజలకు సక్రమంగా అందిస్తున్న జిల్లాల్లో కొప్పళ ముందు వరుసలో ఉందన్నారు. కార్యక్రమంలో జిల్లా పాలనాధికారి సురేశ్ ఇట్నాళ, జడ్పీ సీఈవో వర్ణిత్ నేగి, ఉపాధ్యక్షుడు మంజునాథ్ గొండబాళ, ఆరోగ్య శాఖ నియంత్రణాధికారి రాజేంద్ర జాదవ్, వార్తాధికారి జి.సురేశ్ పాల్గొన్నారు.

కొప్పళలో ప్రభుత్వం రెండేళ్ల పాలన సాధనల పుస్తకం విడుదల చేస్తు న్న రాజశేఖర్ హిట్నాళ

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

కారటగి, న్యూస్‌టుడే: అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని కారటగి పురసభ ముఖ్యాధికారి సాబణ్ణ అధికారులు, సిబ్బందికి సూచించారు. పురసభ అధ్యక్షురాలు రేఖ అధ్యక్షతన బుధవారం పురసభ అధికారులు, సిబ్బంది సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డుల్లో ఏదైనా సమస్య ఉంటే అక్కడి వార్డు సభ్యుడు, సంబంధిత అధికారి దృష్టికి తెచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేయాలి. తాగు నీరు, స్వచ్ఛత, రోడ్ల మరమ్మతులు వంటి కనీస సదుపాయాలు కల్పించాలి. ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని సూచించారు. అధ్యక్షురాలు రేఖ మాట్లాడుతూ ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోకుండా వీలైనంత త్వరగా పనులు చేయాలన్నారు. స్థాయి సమితి అధ్యక్షుడు ఈశప్ప ఇట్టంగి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న పురసభ అధ్యక్షురాలు, ముఖ్యాధికారి, అధికారులు

రాబకొవికి 52 నామినేషన్ల దాఖలు

బళ్లారి, న్యూస్‌టుడే: రాయచూరు, బళ్లారి, కొప్పళ, విజయనగర జిల్లాల పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల సమాఖ్య (రాబకొవి) 12 మంది డైరెక్టర్లకు మొత్తం 52 మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. రాయచూరు-15, ఉమ్మడి బళ్లారి-15, కొప్పళ-22 మంది నామినేషన్ పత్రాలు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి ప్రమోద్ తెలిపారు. జూన్ 30వ తేదీ నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. బుధవారం చివరి గడువు కావడంతో మొత్తం 52 మంది నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. 3న నామినేషన్ పత్రాల పరిశీలన, 4న వాటిని ఉపసంహరించుకోవడానికి చివరి తేదీ. 10న ఎన్నిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాయచూరు, కొప్పళ జిల్లాల నుంచి కాంగ్రెస్, భాజపా పార్టీల మద్దతుదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

కమల్‌హాసన్ కేసు.. విచారణ వాయిదా

రామనగర, న్యూస్‌టుడే : తమిళం నుంచి కన్నడ భాష జన్మించిందనే వ్యాఖ్యలతో పాటు కన్నడిగులను కించపరుస్తూ మాట్లాడిన నటుడు కమల్‌హాసన్‌పై కనకపురలో రెండో సివిల్ న్యాయస్థానంలో కేసు నమోదైంది. శ్రీరామసేన జిల్లా అధ్యక్షుడు నాగార్జున గౌడ కేసు వేశారు. హ్యాట్రిక్ హీరో శివరాజ్‌కుమార్‌ను సాక్షిగా పరిగణనలోకి తీసుకోవాలని తన అర్జీలో కోరారు. కేసును పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం తదుపరి విచారణను శనివారానికి వాయిదా వేసింది.

కృషిహోండాలో మొసలి ప్రత్యక్షం

తెక్కలకోట(సిరుగుప్ప), న్యూస్‌టుడే: కృషిహోండాలో మొసలి ప్రత్యక్షం కావడంతో రైతు ఆందోళన చెందాడు. తెక్కెలకోట ఆయకట్టు పరిధిలో ఉప్పార సిద్ధయ్య అనే రైతు కృషిహోండా ఏర్పాటు చేసుకుని పంటలకు సాగు నీరుతో పాటు చేపల పెంపకం చేపట్టాడు. కొద్ది రోజులుగా మొసలి చెరువులో కనపడటంతో ఆందోళనకు గురై సంబంధిత అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అటవీశాఖ అధికారి బసవనగౌడ, హళేకోట గ్రామానికి చెందిన పగటి వేషగాడు మల్లయ్య సాయంతో అటవీ శాఖ సిబ్బంది కలిసి మొసలిని పట్టుకున్నారు. దాన్ని తుంగభద్ర నదిలో విడిచి పెడుతున్నామని అటవీశాఖ అధికారి బసవనగౌడ పేర్కొన్నారు. మొసలిని పట్టుకోవడంతో రైతు ఉప్పార సిద్ధయ్య సంతోషం వ్యక్తం చేశాడు.

తెక్కలకోటలో కృషిహోండాలో మొసలిని పట్టుకున్న రైతులు

పరిహారం అందించాలని ఆందోళన

బళ్లారి, న్యూస్‌టుడే: సండూరు తాలూకా రాజాపురం, తుమిటి గ్రామాలకు చెందిన దళిత, గిరిజన సముదాయంలో అన్యాయానికి గురైన వారికి పరిహారం ఇవ్వాలని కోరుతూ దళిత హక్కుల సమితి జిల్లా పాలనాధికారి కార్యాలయం ఎదుట బుధవారం ఆందోళన నిర్వహించారు. 2022 ఏప్రిల్ 22న తాలూకా సుల్తానాపుర సమీపంలో జిందాల్ వెస్ట్ డంపింగ్‌లో ఇనుప ముక్కలు ఏరుకుంటున్న రాజాపురానికి చెందిన హొన్నూరుస్వామి, తుమిటి గ్రామానికి చెందిన రామాంజనేయులుపై మట్టిపెళ్లలు పడి మృతిచెందారు. మూడేళ్లు గడిచినా మృతుల కుటుంబాలకు నేటి వరకు జిందాల్ పరిహారం అందజేయలేదన్నారు. రిజర్వేషన్ క్షేత్రాల నుంచి ఎమ్మెల్యేలు, ఎంపీలుగా గెలుపొందిన ప్రజాప్రతినిధులు సైతం పట్టించుకోవడం లేదని ఆరోపించారు. దళిత, గిరిజన కుటుంబాలకు చెందిన ఇద్దరు మృతికి కారణమైన వారిని అరెస్టు చేసి, మృతుల కుటుంబాలకు పరిహారం అందజేయాలని శివశంకర్ డిమాండ్ చేశారు. సభ్యులు గంగాధర, ఎ.స్వామి, చెన్నబసయ్య, బాదామి శివలింగనాయక్ పాల్గొన్నారు.

జిల్లా పాలనాధికారి కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న దళిత హక్కుల సమితి సభ్యులు

హత్య కేసులో.. మూడేళ్ల తర్వాత అరెస్టు

మంగళూరు, న్యూస్‌టుడే : ఒక హత్య కేసులో సర్వోన్నత న్యాయస్థానం బెయిలు రద్దు చేసిన తర్వాత మూడేళ్లుగా పరారీలో ఉన్న ఓ నిందితుడ్ని అరెస్టు చేశామని మంగళూరు పోలీసులు బుధవారం వెల్లడించారు. ముల్కి విజయ్ అనే వ్యక్తిని పది మందితో కలిసి హత్య చేసిన నిందితుల్లో ఒకడైన మహ్మద్ ముస్తఫాకు కర్ణాటక హైకోర్టు బెయిలు మంజూరు చేసింది. బెయిలును 2022 ఏప్రిల్ 22న సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేసింది. నకిలీ పాస్‌పోర్టుతో విదేశాలకు పరారయ్యాడు. నకిలీపత్రాలు ఉపయోగించి 2024 ఏప్రిల్‌లో నేపాల్ మార్గంలో భారత్‌లోకి చేరుకున్నాడు. ముల్కి తాలూకాలోని పక్షికెరె గ్రామానికి వచ్చినట్లు గుర్తించి నిందితుడ్ని అరెస్టు చేశారు. న్యాయస్థానం ముందు హాజరు పరచగా, న్యాయనిర్బంధానికి పంపిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు ఇచ్చారు. ఇతనిపై మంగళూరు, చిక్కమగళూరు, ఉడుపిలతో పాటు వివిధ ప్రాంతాల్లో తొమ్మిది క్రిమినల్ కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

బంగారు దుకాణానికే కన్నం

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే : సీగేహళ్లి సమీప భవానీ జ్యువెలర్స్‌లో దొంగతనానికి పాల్పడిన ఐదుగురు నిందితులను కేఆర్‌పుర ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. కెంగేరికి చెందిన నారాయణలాల్, కీర్తరామ్, మహేంద్ర గహ్లోత్, పుష్పేంద్ర సింగ్‌లు ప్రధాన నిందితులు కాగా, వారి నుంచి బంగారాన్ని కొనుగోలు చేసిన దిలీప్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.50 లక్షల విలువైన 478 గ్రాముల ఆభరణాలను జప్తు చేసుకున్నామని అధికారులు బుధవారం వెల్లడించారు. నగరంలో ఫినాయిల్ విక్రయించుకునే నారాయణ లాల్ నగల దుకాణంలో భద్రత తక్కువగా ఉంటుందని గుర్తించి తన సహచరులతో కలిసి గోడకు కన్నం వేసి దొంగతనం చేశాడని ప్రాథమిక విచారణలో గుర్తించారు.

భోగ నందీశ్వర వైభవం

● మంత్రివర్గం కదలిరాకతో సందడి

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : బెంగళూరు నగరానికి చేరువలోని నంది బెట్టపై మంత్రివర్గ సమావేశానికి వెళ్లేందుకు ముందుగా.. కొండ దిగువన చారిత్రక భోగ నందీశ్వరుని ఆలయంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన మంత్రివర్గ సహచరులు పూజలు చేసి, ఆ పరిసరాల్లో కలియతిరిగారు. ఆలయ ముఖ మండపం, పుష్కరిణి చెంత ఫొటోలకు ఫోజులిచ్చి సందడి చేశారు. చిక్కబళ్లాపుర జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ప్రదీప్ ఈశ్వర్, సుబ్బారెడ్డి, మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, మాజీ మంత్రి శివశంకర్‌రెడ్డి తదితరులు ముఖ్యమంత్రిని సత్కరించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తనకు రెండు కళ్లలాంటి వారని ప్రదీప్ ఈశ్వర్ పేర్కొన్నారు. తన హృదయాన్ని చీల్చితే శివకుమార్ ఉంటారని, ఆయన కోసం తాను ప్రాణ త్యాగం చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. ముఖ్యమంత్రి మార్పునకు సంబంధించి జరుగుతున్న ప్రచారంపై తాను వ్యాఖ్యలు చేసేంత పెద్దవాడిని కాదన్నారు. ఐదేళ్లూ తానే ముఖ్యమంత్రిని అని సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందిస్తూ.. ముఖ్యమంత్రి అలా అన్న అనంతరం నేనేమి వ్యాఖ్యానించాలని ప్రశ్నించారు. నన్ను ముఖ్యమంత్రి చేయండంటూ ఎవరిపైనా ఒత్తిడి తీసుకురావడం లేదన్నారు. సిద్ధరామయ్యకు మద్దతు ఇవ్వడం మినహా నేనేం చేయలేనని అన్నారు. ప్రభుత్వం ఏ పనీ చేయడం లేదని భాజపా నాయకులు చేస్తున్న ఆరోపణలకు భోగ నందీశ్వరుని ఆలయం ఆవరణలో ముఖ్యమంత్రి అచ్చంగా ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ శైలిలో బదులిచ్చారు. భాజపా నాయకులు నిధులన్నీ ఖాళీ చేసి వెళ్లినా తాము ఉత్తమ పాలన అందిస్తున్నామని వ్యాఖ్యలు చేశారు. మంత్రివర్గ సభ్యులతో కలిసి బృంద చిత్రం దిగే సమయానికి డీకే శివకుమార్ రాకపోవడంతో మిగిలిన వారితోనే ఆయన ఫొటో దిగారు. నంది గ్రామంలో స్థానికుల కోసం ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్, ఇతర కాంగ్రెస్ నేతలు మాంసాహార వంటకాలను సిద్ధం చేయించారు. విందు కోసం 500 కిలోల వేటమాంసం, 800 కిలోల కోడి మాంసాన్ని తెప్పించారు. స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు, ఎక్కువ నిధులు కేటాయించేందుకు మంత్రివర్గంతో కలిసి ముఖ్యమంత్రి నందిబెట్టకు రావడం నూతన చరిత్ర అని ప్రదీప్ ఈశ్వర్ పేర్కొన్నారు. ● నంది బెట్టపై మంత్రివర్గ సమావేశానికి వచ్చిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను చిక్కబళ్లాపుర జిల్లా నేతలు బుధవారం ఘనంగా సత్కరించారు. కోలారు పాల సమాఖ్యకు అధ్యక్షురాలిగా ఎన్నికైన మహాలక్ష్మి, ఇతర సభ్యులు సీఎంను భేటీ అయ్యారు. నంది గిరిధామ వద్ద కేఎస్‌టీడీసీ మయూర ఫైన్ టాప్ సన్ రైజ్ రెస్టారెంటు నిర్మాణానికి మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం భూమి పూజ చేశారు.

మంత్రివర్గ సమావేశానికి ముందు.. నేతలతో సిద్ధు బృంద చిత్రం



అనుభవ మండప
చారిత్రక ఘట్టాలను విశ్లేషిస్తున్న నిపుణుడు

దిల్లీ వీధిల్లో విహరించిన బసవేశ్వరుడి రథం (పాతచిత్రం)

బసవ కల్యాణ ఆధ్యాత్మిక కేంద్ర ముఖద్వారం

విశ్వమానవుడు.. బసవేశ్వరుడు!

బసవకల్యాణ క్షేత్రం.. శ్రమజీవుల దివ్యధామం

బీదర్, న్యూస్‌టుడే : శ్రమజీవుల హృదయమే దివ్య దేవాలయం చాటిన చారిత్రక పురుషుడు బసవేశ్వరుడు! వీరశైవ సమాజాన్ని దశ, దిశలా విస్తరింప చేసిన ఆ సామాజిక ఉద్యమకారుడు నడయాడిన క్షేత్రమే బసవకల్యాణ పట్టణం. ప్రస్తుత పార్లమెంటును పోలిన ఆనాటి 'అనుభవ మండపం'.. ప్రజాస్వామ్య ప్రియులకు ఇష్టమైన వేదిక. క్రీస్తు శకం 12వ శతాబ్దంలోనే ఆదర్శ పాలన అందించిన బసవకల్యాణ చక్రవర్తి బసవేశ్వరుడి ఆదర్శాలను భవిష్యత్తు తరాలకు చక్కగా వివరించే ప్రయత్నంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని చక్కగా విస్తరించడానికి తాజాగా మంత్రివర్గ సమావేశంలో ప్రతిపాదించింది. రూ.742 కోట్లతో అనుభవ మండప పరిసరాలను నవ్యాతి నవ్యంగా పునర్నిర్మించే ప్రక్రియకు ముందడుగు వేసింది. ప్రస్తుత కోట ప్రాంతానికి చేరువలోనే 12 ఎకరాల విస్తీర్ణంలో వివిధ నిర్మాణాలు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. నిర్మాణరంగ నిపుణుల సహకారంతో భవంతుల నమూనాలు సిద్ధం చేయించారు. అన్నీ అనుకున్నట్లు సాగితే.. సిద్ధరామయ్య ప్రభుత్వ పాలనాకాలంలోనే పునరుద్ధరించిన 'బసవకల్యాణ' వైభవాన్ని చరిత్రప్రియులు, పర్యాటకులు సందర్శించవచ్చు.

అనుభవ మండపానికి నవ్యరూపం.. ప్రతిపాదిత నిర్మాణ రూపురేఖలు

ఎందరికో ఆదర్శం..

అభ్యుదయభావాల, చారిత్రక ఘట్టాల సమాహారమే బీదర్ జిల్లాలోని బసవకల్యాణ. ప్రత్యేకించి పాలనా కేంద్రమైన సామాజిక ఉద్యమకారుడు బసవేశ్వరుడు ఇక్కడ నిర్మించిన కోట, అనుభవ మండపం ప్రత్యేకతలు తెలుసుకోవడానికి ఇప్పటికే అక్కడ కొన్ని నిర్మాణాలు విస్తరించాయి. అందులో బసవేశ్వర మహా విగ్రహం- ధ్యానముద్రలో అందరినీ ఇట్టే ఆకట్టుకుంటుంది. ఒకనాటి కల్యాణి చాళుక్యుల రాజధానిగానూ చరిత్ర ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతం మధ్య భారతంలో కీలకమైంది. బసవన్న తీర్చిదిద్దిన పాలనాకేంద్రం 'అనుభవ మండపం' సామాజిక, మత సంస్కరణలకు వేదిక. లింగాయత ఉద్యమానికి ఇది నిలయంగా మారింది. మనుషులంతా ఒక్కటే.. పనిచేసే వారు దేవుడితో సమానమనే ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. బసవేశ్వరుడితో పాటు ఆనాటి సమాజ సంస్కరణ ఉద్యమకారులు.. అల్లమ ప్రభు, అక్కమహాదేవి, చెన్న బసవన్న, సిద్ధరామ తదితరుల సిద్ధాంతాలను నేటికీ కన్నడిగులు అనుసరిస్తున్నారు. అన్ని వర్గాల, కులాల మేధావులను ఈ మండప పాలక మండలి (మంత్రివర్గం)లో చేర్చుకుని ఎన్నో ప్రయోగాలు చేశారు. ప్రస్తుతం మనం చూసే ఇక్కడి కోటను పదో శతాబ్దంలోనే నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు.

చెట్లను రక్షించాలని వినతి

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: పర్యావరణ రక్షణకు చెట్లను రక్షించాలని కోరుతూ కర్ణాటక రక్షణ వేదిక తాలూకా అధ్యక్షుడు పంపనగౌడ అదనపు జిల్లా అధికారి ఝుబేర్ అహమ్మద్‌కు వినతి పత్రం అందజేశారు. మొహరంను పురస్కరించుకుని అగ్ని గుండాల్లో చెట్లను నరికి వేస్తారని.. పచ్చని చెట్లను నరకరాదన్నారు. ఎండిన చెట్లను నరికి వాడుకోవచ్చని తెలిపారు. పచ్చని చెట్లను నరికివేస్తే వాతావరణంలో మార్పులు వచ్చి వర్షాలు సరైన సమయంలో కురవవన్నారు. అధికారులు పరిశీలించి పచ్చదనానిచ్చే చెట్లను కాపాడాలని ఆయన కోరారు. కరవే సభ్యులు, శేఖర్, అంజనేయులు, లింగేష్, తిరుమలేష, ఉలిగప్ప తదితరులు పాల్గొన్నారు.

అదనపు జిల్లా పాలనాధికారి ఝుబేర్‌అహమ్మద్‌కు వినతిపత్రం అందజేస్తున్న పంపనగౌడ తదితరులు

కుమార పీఠమెక్కితే మహిళా లోకానికి పండగే!

మండ్య, న్యూస్‌టుడే : జనతాదళ్ నాయకుడు కుమారస్వామి ముఖ్యమంత్రి పీఠమెక్కితే మహిళలకు ప్రతి నెలా రూ.5 వేలు ఇస్తారని యువ జనతాదళ్ అధ్యక్షుడు నిఖిల్ గౌడ ప్రకటించారు. మండ్య, రామనగర జిల్లాల్లో నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు ప్రక్రియకు చక్కని స్పందన లభిస్తోందన్నారు. తనను కలుసుకున్న విలేకరులతో నిఖిల్ మాట్లాడుతూ అధికార పార్టీ ప్రజలకు ఇస్తానన్న గ్యారంటీ పథకాలను అర్హులకు ఇవ్వకుండా మొండిచేయి చూపిస్తోందని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్‌తో కలిసి దళ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం సిద్ధరామయ్యకు కంటగింపు కావడంతోనే సంకీర్ణ ప్రభుత్వాన్ని ఆయనే కుప్పకూల్చారని విమర్శించారు. కాంగ్రెస్ నుంచి 15 మంది ఎమ్మెల్యేలను భాజపాకు సాగనంపింది సిద్ధరామయ్యేనని ఆరోపించారు.

(c) eenadu

బళ్ళారి

● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

డా.కె.ఎన్.బసవరాజుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న అధికారి గిరీశ్‌కుమార్, తదితరులు

నూతన డీఎఫ్‌వోగా డా.కె.ఎన్.బసవరాజ

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి జిల్లా అటవీశాఖ ఉప సంరక్షణ (డీఎఫ్‌వో) అధికారిగా డా. కె. ఎన్. బసవరాజ బాధ్యతలు స్వీకరించారు. డీఎఫ్‌వో నందీప్ హెచ్. సూర్యవంశీ శిర్శి అటవీ శాఖ ఉప సంరక్షణాధికారిగా బదిలీ కావడంతో, ఆ స్థానంలో నూతన డీఎఫ్‌వోగా డా. కె. ఎన్. బసవరాజ బుధవారం ఉదయం కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బళ్లారి విభాగం అటవీశాఖాధికారి గిరీశ్‌కుమార్ తదితరులు అభినందించారు.

వీఎస్కేయూ బాధ్య రిజిస్ట్రార్‌గా దినేశ్

దినేశ్‌కు బాధ్యతలు అప్పగిస్తున్న ఎస్.ఎన్.రుద్రేశ్

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి విజయనగర శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ బాధ్య రిజిస్ట్రార్‌గా డా.జి.బి.దినేశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పూర్వ రిజిస్ట్రార్ ఎస్.ఎన్.రుద్రేశ్ ధార్వాడ నీటిపారుదల విభాగం అధికారిగా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా బదిలీ అయిన ఎస్.ఎన్. రుద్రేశ్‌కు సన్మానం చేసి, నూతన రిజిస్ట్రార్ దినేశ్‌కు స్వాగతం పలికారు.

యోజనాధికారి నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లా మహిళ - శిశు అభివృద్ధి శాఖ దేవదాసీ పునర్వసతి పథకం కార్యాలయంలో ఖాళీగా ఉన్న యోజనాధికారి నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంబంధిత అధికారి విజయకుమార్ తెలిపారు. యోజనాధికారిగా నియమించుకోవడానికి ఎం.ఎ.సోషియాలాజీ, ఎమ్మెస్సీ ఇన్ సైకాలజీ పూర్తి చేసి కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలి. విశ్రాంత అధికారులకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు పూర్తి వివరాలతో కూడిన దరఖాస్తులను ఈ నెల 12లోపుల సమర్పించాలని కోరారు.

ఇద్దరు చోరుల అరెస్టు

హొసపేటె, న్యూస్‌టుడే: చోరీ కేసు దాఖలై రెండు గంటల్లో హరపనహళ్లి తాలూకా అరసీకెరె పోలీసులు ఇద్దరు దొంగలను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.1.66 లక్షల విలువైన బంగారు ఆభరణాలు, నగదు స్వాధీనం చేసుకున్నారు. హరపనహళ్లి తాలూకా ఉచ్చంగి దుర్గలో అంజినప్ప అనే వ్యక్తి ఇంట్లో రాత్రి చోరీ జరిగింది. కేసు నమోదు చేసుకున్న ఎస్సై కె. రంగయ్య నేతృత్వంలో సిబ్బంది దాదాపీర్, గురురాజ్, వసంత్‌కుమార్, గుర్యా నాయక్, రవికుమార్, నారప్పలు కూపీలాగి హూవిన హడగలి తాలూకా మాన్యర మసలవాడకు చెందిన చోరుడు శివకుమార్ (28), హగరిబొమ్మనహళ్లి వాసి చోరుడు జహాంగీర్ బాషా (33)ను అదుపులోకి తీసుకొని విచారించారు. చోరులను పట్టుకున్న పోలీస్ అధికారి, సిబ్బందిని విజయనగర ఎస్పీ డాక్టర్ బి.ఎల్.శ్రీహరిబాబు అభినందించారు.

వరుణుడు.. ముఖం చాటేశాడు

● బళ్లారి జిల్లాలో 19.6 మి.మీ వర్షపాతం నమోదు ● ఆందోళనలో అన్నదాతలు

తేలికపాటి వానలకు సాగు చేసిన వరి పంట

బళ్లారి, న్యూస్‌టుడే: జిల్లాలో వరుణుడు ముఖం చాటేయడంతో ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు వాడి పోతున్నాయి. మరో పక్క ఎగువన వానలతో జలాశయాలు గడువుకు ముందే నిండిపోయాయి. రాష్ట్రంలో 16 జిల్లాల్లో రుతు పవనాలు విఫలమయ్యాయి. జూన్‌లో వరుణుడు కరుణించలేదు. మే నెలలో రుతుపవనాలకు ముందే వర్షాలు కురిశాయి. మే 23న రాష్ట్రంలోకి రుతుపవనాలు ప్రవేశించాయి. రైతులు ఖరీఫ్‌పై కోటి ఆశలు పెట్టుకున్నారు. జూన్‌లో పూర్తిగా వర్షాలు రాక పోవడంతో వర్షాధారం కింద సాగు చేసిన పంటలు వాడిపోతున్నాయి.

ఆయకట్టు కింద పొలాలను సిద్ధం చేసుకుంటున్న రైతులు

లోటు వర్షపాతం

దక్షిణ కర్ణాటకలోని 11 జిల్లాల్లో జూన్‌లో 6.55 సెం.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ప్రస్తుతం 5 సెం.మీ. వర్షపాతం నమోదైంది. 24 శాతం తక్కువ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖాధికారులు తెలియజేస్తున్నారు. కోలారు, తుమకూరు, చామరాజనగర జిల్లాల్లో తీవ్ర కొరత ఏర్పడింది. దావణగెరెలో సాధారణ వర్షపాతం కంటే ఎక్కువ నమోదైంది. ఉత్తర కర్ణాటకలోని 13 జిల్లాల్లో సాధారణం 10.90 సెం.మీ. వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, 9.66 సెం.మీ. వర్షపాతం నమోదైంది. 6 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. బళ్లారి, బీదర్, కొప్పళ, యాదగిరిలో సాధారణ వర్షపాతంలో సగం మాత్రమే నమోదైంది. బెళగావి, ధార్వాడ, విజయనగర, హావేరిలో సాధారణ వర్షపాతం 36.30 సెం.మీ. లకుగాను 41.51 సెం.మీ. వర్షపాతం నమోదైంది. సాధారణ వర్షపాతం కంటే 14 శాతం ఎక్కువగా నమోదైంది. కోస్తా జిల్లాల్లో 83.15 సెం.మీ. లకు గాను 88.14 సెం.మీ. నమోదైంది. సాధారణ వర్షపాతం కంటే 6 శాతం ఎక్కువగా నమోదైంది. జూన్‌లో రాష్ట్రంలో సాధారణ వర్షపాతం 19.94 సెం.మీ.లకుగాను 20.33 సెం.మీ వర్షపాతం నమోదైంది. 14 శాతం ఎక్కువ నమోదైంది.

జిల్లాలో 17.96 శాతం విత్తనాలు

బళ్లారి జిల్లాలో మొత్తం 1,63,754 హెక్టార్లలో ఖరీఫ్‌లో సాగు చేస్తారని వ్యవసాయశాఖాధికారులు అంచనా వేయగా, 1,13,862 హెక్టార్లలో నీటిపారుదల, 49,891 హెక్టార్లలో వర్షాధారం కింద పంటలు సాగు చేస్తారని అంచనా వేశారు. నేటి వరకు ఆయకట్టు, వర్షాధారం కింద మొత్తం 29,409 హెక్టార్లలో సాగు చేశారు. బళ్లారి-1.61 శాతం, కురుగోడు-4.54 శాతం, సిరుగుప్ప-27.81 శాతం, సండూరు- 36.19 శాతం, కంప్లి-2.13 శాతం సాగు చేశారు.

జూన్‌లో మందగమనం

బళ్లారి జిల్లాలో జూన్‌లో వరుణుడు ముఖం చాటేశాడు. రుతుపవనాలు మే 23న ప్రారంభం కావడంతో ఈ సమయంలో వర్షాలు వస్తే పంటలు సాగు చేయడానికి అనుకూలంగా ఉంటుంది. జిల్లాలో మే 23 నుంచి జులై 2వ తేదీ వరకు 173.88 మి.మీటర్లకు గాను 38.8 మి.మీ నమోదైంది. తాలూకా వారీగా బళ్లారి 59.99 మి.మీలకు గాను 19.6మి.మీ., సండూరు 100.1 మి.మీ.లకుగాను 37.9శాతం, కురుగోడు 60.4 మి.మీ.లకు గాను 42.6.మి.మీ, సిరుగుప్ప 85.7మి.మీ.లకు గాను 52.7మి.మీ నమోదైంది. కంప్లిలో 55.3 మి.మీ.లకు గాను 58.8 మి.మీ నమోదైంది.

జూన్‌లో వర్షం రాలేదు

జిల్లాలో జూన్‌లో వర్షం రాలేదు. వర్షాధారం కింద సాగు చేసే పొలాల్లో రైతులు విత్తనాలు సరిగ్గా వేయలేదు. మేలో కురిసిన వర్షాలకు విత్తిన విత్తనాల పైర్లు వాడిపోతున్నాయి. భవిష్యత్తులో మంచి వర్షాలు వస్తాయని నమ్మకం ఉంది.

- సోమసుందర్, వ్యవసాయశాఖ జేడీ బళ్లారి

అన్నదాత సంక్షేమంతోనే దేశ ప్రగతి

రైతులకు సన్మానం

కంప్లి, న్యూస్‌టుడే: రైతు దేశానికి వెన్నెముక. దేశానికి అన్నం పెట్టే రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని కిసాన్ జాగృతి వికాస సంఘం జాతీయ అధ్యక్షుడు యుగంధర నాయుడు తెలిపారు. స్థానిక ప్రభుత్వ దళిత వర్గాల మెట్రిక్ నంతర విద్యార్థి వసతి నిలయంలో జేసీఐ కంప్లి సోనా బుధవారం ఏర్పాటు చేసిన 'సెల్యూట్ టు సైలెంట్ స్టార్స్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు సేంద్రియ సాగుపై దృష్టి సారించాలి. భూసారాన్ని సంరక్షించుకోవాలి. నీటి పొదుపును పాటించి భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. జేసీఐ కంప్లి సోనా అధ్యక్షుడు బి. రఘుల్ మాట్లాడారు. సెల్యూట్ టు సైలెంట్ స్టార్స్ పేరిట ప్రగతిపర రైతులు ఎ.హులిగెమ్మ, కొట్టూరు రమేశ్, యుగంధర నాయుడులను సత్కరించారు. జేసీఐ వలయ 24 పూర్వ అధ్యక్షుడు సంతోష్ సోగి, అమరనాథ్ శాస్త్రి, మనోజ్ కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

జిల్లాలో విద్యాబోధన మెరుగుపడాలి

జిల్లా పాలనాధికారికి వినతిపత్రం సమర్పిస్తున్న వేదిక కార్యకర్తలు

హొసపేటె, న్యూస్‌టుడే: కొత్త జిల్లా విజయనగరలో విద్యాబోధన మరింత మెరుగుపడాలి. పదో తరగతి విద్యార్థులకు ఉత్తమ విద్య అందాలన్న పలు డిమాండ్లతో ప్రభుత్వ పాఠశాల అభివృద్ధి వేదిక కార్యకర్తలు బుధవారం జిల్లా పాలనాధికారికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వేదిక ప్రముఖులు అక్కమ్మ, శైనాజ్ మాట్లాడుతూ ఈ సంవత్సరం విజయనగర జిల్లా పది ఫలితాల్లో 19వ స్థానం దక్కించుకుంది. వచ్చే ఏడాది మొదటి పది స్థానాల్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పాఠశాలల్లో బోధనలు ఎంత ముఖ్యమో, విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పన కూడా అంతే ముఖ్యమన్నారు. పలు పాఠశాలల్లో నేటికీ శౌచాలయాలు, ప్రహరీ సహా కనీస సౌకర్యాలు లేవని వాపోయారు. గ్రామీణ ప్రాంతాల బడులపై అధికారులు దృష్టిపెట్టాలని కోరారు. రత్నమ్మ, సుధా, హనుమక్క తదితరులు పాల్గొన్నారు.

దేవలాపురలో గ్రంథాలయ భవనం ప్రారంభం

గ్రంథాలయ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే గణేశ్

కంప్లి, న్యూస్‌టుడే: తాలూకాలోని దేవలాపురలో గ్రామ పంచాయతీ గ్రంథాలయ భవనాన్ని ఎమ్మెల్యే గణేశ్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి. ఉన్నత విద్య అభ్యసించి గ్రామానికి, కుటుంబానికి పేరు తేవాలని సూచించారు. అంతకుముందు ఆయన రూ.16 లక్షలతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల తరగతి గదులను ప్రారంభించారు. గ్రామ పంచాయతీ అధ్యక్షురాలు ఈరమ్మ పూజార్, ఉపాధ్యక్షుడు నాగరాజ్, గ్రంథ పాలకుడు సి.డి.గిరీశ్, ఎస్‌డీఎంసీ అధ్యక్షుడు కురి నాగేశ్, నాయకులు గౌడ్రు లింగన గౌడ, అంజినప్ప, సురేశ్ గౌడ, దేవరమని మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

గ్రామదేవత ఆలయ నిర్మాణానికి విరాళం

మాజీ మంత్రి సాలోణి నాగప్పకు విరాళం అందిస్తున్న ఆర్య ఈడిగ క్షేమాభివృద్ధి సంఘం నాయకులు

కారటగి, న్యూస్‌టుడే: కారటగి గ్రామ దేవత దేవమ్మ దేవి నూతన ఆలయ నిర్మాణానికి ఆర్య ఈడిగ క్షేమాభివృద్ధి సంఘం నాయకులు రూ. 3,01,000 విరాళం అందించారు. ఈ సందర్భంగా ఈడిగ క్షేమాభివృద్ధి సంఘం నాయకుడు బి.కాశీ విశ్వనాథ్ మాట్లాడుతూ గ్రామ దేవత ఆశీర్వాదంతో పట్టణ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉన్నారు. నూతన ఆలయ నిర్మాణానికి తమ సముదాయం నుంచి ఈ విరాళం అందిస్తున్నామన్నారు. మాజీ మంత్రి సాలోణి నాగప్ప, నాయకులు వీకేశప్ప చినివాళ, గోవిందప్ప శెట్టి, నారాయణప్ప, వీరేశ్ సాలుంచిమర, నాగప్ప యరడోణ పాల్గొన్నారు.

క్రీడామైదానంలో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేయండి

బుడా అధ్యక్షుడు ఆంజనేయులుకు వినతిపత్రం అందజేస్తున్న బీఎంసీఆర్‌సీ నడకదారుల సంఘం సభ్యులు

బళ్లారి, న్యూస్‌టుడే: బళ్లారి వైద్య కళాశాల, పరిశోధన కేంద్రం (బీఎంసీఆర్‌సీ) క్రీడామైదానంలో బళ్లారి నగరాభివృద్ధి ప్రాధికార (బుడా) నుంచి ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయాలని క్రీడామైదానం వాకర్స్ అసోసియేషన్ సభ్యులు బుడా అధ్యక్షుడు జె.ఎస్.ఆంజనేయులకు మనవి పత్రం అందజేశారు. బీఎంసీఆర్‌సీ క్రీడామైదానానికి ఉదయం, సాయంత్రం సుమారు 2 వేల మందికిపైగా నడకకు వస్తున్నారు. వృద్ధులు, పిల్లలు నడక చేయడానికి ఇబ్బందిగా ఉండటంతో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేస్తే అనుకూలంగా ఉంటుందని కోరారు. వచ్చే సమావేశంలో తీర్మానం చేసి క్రీడా మైదానంలో రెండు ప్రదేశాల్లో జిమ్‌ను ఏర్పాటు చేస్తామని భరోసా ఇచ్చారు. సభ్యులు ఆనంద్‌చౌదరి, చంద్ర, వెంకటేశులు, బుజ్జి. పరమేశప్ప, జట్టింగి. కృష్ణ పాల్గొన్నారు.

త్రిచక్ర వాహనాలను సమకూర్చరూ..

రూపేశ్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న దివ్యాంగులు

హొసపేటె, న్యూస్‌టుడే: నగరసభ పరిధిలో నివసిస్తున్న దివ్యాంగులకు వెంటనే త్రిచక్ర వాహనాలను వితరణ చేయాలి, దివ్యాంగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ సంఘం ఆధ్వర్యంలో దివ్యాంగులు బుధవారం నగరసభ అధ్యక్షుడికి వినతిపత్రం సమర్పించారు. నేతృత్వం వహించిన సంఘం ప్రముఖుడు లోహిత్ తళవార్, హులిగెమ్మ మాట్లాడుతూ..నగరసభ నిధుల్లో ఏటా 5శాతం నిధులను దివ్యాంగుల సంక్షేమానికే కేటాయించాలి. చాలా ఏళ్లనుంచి దివ్యాంగులకు త్రిచక్ర వాహనాలను వితరణ చేయలేదని వాపోయారు. ఇంతకుముందు రెండుసార్లు అనర్హులకు కూడా త్రిచక్ర వాహనాలు వితరణ చేసినట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. ఈ ఏటా పారదర్శకంగా వితరణ చేయాలని కోరుతూ అధ్యక్షుడు రూపేశ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు.

భగవంతుడు అందరినీ చల్లగా చూడాలి

బూతలదిన్ని గ్రామంలో మొహరం ప్రార్థనల్లో భక్తులు

సింధనూరు, న్యూస్‌టుడే: వాతావరణం బాగుంది.. రాష్ట్రం అంతటా విస్తారంగా వానలు కురుస్తున్నాయి, ఏడాది పొడవునా సస్యశ్యామలంగా ఉండి భగవంతుడు సకల జీవరాసులను చల్లగా చూడాలని భాజపా సీనియర్ నాయకుడు కె.కరియప్ప అన్నారు. ఆయన సింధనూరు తాలూకా బూతలదిన్ని గ్రామంలో హజరత్ మహబూబ్ సుభానీ కట్టా వద్ద ఏర్పాటు చేసిన మొహరం ప్రార్థనల్లో పాల్గొన్నారు. సద్గురు అబ్బాస్ ఆలీ శరణను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..అందరూ కలసి స్నేహభావంతో మొహరంను ఆచరించాలని కోరారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు గ్రామంలో దేవతా సవారీలను ఊరేగించారు.

6న విద్యుత్తు సరఫరాలో అంతరాయం

బళ్లారి: నగర జెస్కాం ఉప విభాగం-1 పరిధి 220/11 కె.వి. అల్లీపురం విద్యుత్తు సరఫరా కేంద్రంలో మరమ్మతులు జరుగుతుండటంతో ఈ నెల 6న ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఎదురవుతుందని జెస్కాం అధికారి తెలిపారు. కేంద్రం పరిధిలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని వివరించారు.

చెళ్లకెర నగరసభ అధ్యక్షురాలిగా శిల్ప

నగరసభ అధ్యక్షురాలిగా ఎంపికైన శిల్ప

చెళ్లకెర, న్యూస్‌టుడే: చెళ్లకెర నగరసభ అధ్యక్షురాలిగా శిల్ప ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈమేరకు ఎన్నికల అధికారిగా విధులను నిర్వహించిన సహాయక కమిషనర్ మహబూబ్ జిలాని ఖురేశి ప్రకటించారు. శిల్ప ఒక్కరే నామ పత్రాలను సమర్పించడంతో ఆమె ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఆమెను నగరసభ ఉపాధ్యక్షురాలు కవిత, మాజీ అధ్యక్షురాలు మంజుళ, ఉప సమితి అధ్యక్షుడు మల్లికార్జున, కమిషనర్ జగ్గరెడ్డి తదితరులు అభినందించారు. ఆమెను స్థానిక ఎమ్మెల్యే రఘుమూర్తి అభినందించారు. పట్టణ ప్రజల సమస్యలను పరిష్కరించాలని సూచించారు.

సోమలాపూరు పంచాయతీ ఉపాధ్యక్షుడి మృతి

నామాల నాగేశ్వర రావు (పాతచిత్రం)

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు తాలూకా సోమలాపూరు గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షుడు, తెలుగు ప్రముఖుడు నామాల నాగేశ్వరరావు (72) బుధవారం స్థానిక ఆసుపత్రిలో మృతి చెందారు. ఈయనది సిరుగుప్ప మార్గంలోని వెంకటేశ్వరక్యాంపు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మంగళవారం రాత్రి ఉన్నపళంగా అపస్మారక స్థితికి వెళ్లగా సింధనూరులోని ఓ ఆసుపత్రిలో చేర్చి వైద్యం అందించినా ఫలించలేదు. బుధవారం ఉదయం ఆయన మృతి చెందారు. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం వెంకటేశ్వరక్యాంపులో అంత్యక్రియలు పూర్తిచేశారు. మాజీ మంత్రి నాడగౌడ నాగేశ్వరరావు మృతి పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.

సీఏ 77వ సంస్థాపన దినోత్సవం

పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో సంస్థ సభ్యులు

బళ్లారి, న్యూస్‌టుడే: భారతీయ చార్టర్డ్ అకౌంటెంట్ సంస్థ 77వ సంస్థాపన దినోత్సవం సందర్భంగా బళ్లారి శాఖ ఆధ్వర్యంలో బుధవారం వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. సీఏ చదువుతున్న విద్యార్థులకు విద్యార్థి వేతనం, బేవినహళ్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు రాతపుస్తకాలు పంపిణీ చేశారు. సభ్యులు రక్తదానం చేసి రక్తాన్ని బీఎంసీఆర్‌సీకి అందజేశారు. కార్యాలయం ముందు మొక్కలు నాటారు. ప్రముఖ వైద్యుడు కమల్ కుమార్ జైన్, సంస్థ అధ్యక్షుడు గజరాజ్, ఉపాధ్యక్షుడు పురుషోత్తమ రెడ్డి, కార్యదర్శి విశ్వనాథ్ ఆచారి, కోశాధికారి స్వప్న ప్రియ, విద్యార్థి సంఘం అధ్యక్షుడు శరణ్‌పాటీల్, సభ్యులు హనుమంతరెడ్డి, వెంకటేశ్, జితేంద్ర పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో రోటరీ క్లబ్ కీలకపాత్ర

లెక్కపరిశోధకుడు రాజశేఖర్‌ను సత్కరిస్తున్న సండూరు ఎమ్మెల్యే అన్నపూర్ణ, త్రివిక్రమజోషి, ప్రకాశ్‌కుమార్ జైన్ తదితరులు

బళ్లారి గ్రామీణ, న్యూస్‌టుడే: సమాజాభివృద్ధిలో రోటరీక్లబ్‌ల పాత్ర అనన్యమని సండూరు శాసనసభ్యురాలు అన్నపూర్ణ తుకారాం పేర్కొన్నారు. రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో సండూరు పట్టణంలోని పద్మావతి కల్యాణమండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. సమాజానికి విలువైన సేవలందించిన ప్రముఖులను సత్కరించడం అభినందనీయమన్నారు. వైద్య రంగంలో ఉత్తమ సేవలందించిన డా. రామశెట్టి, లెక్కపరిశోధకుడు రాజశేఖర్‌ను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాజశేఖర్ మాట్లాడుతూ వైద్యులు ఆరోగ్యం కాపాడితే..లెక్కపరిశోధకులు ఆర్థిక రక్షణ చేస్తారన్నారు. రోటరీ గవర్నర్ త్రివిక్రమ జోషి, క్లబ్ అధ్యక్షుడు ప్రకాశ్‌కుమార్‌జైన్, ప్రముఖులు కె.ఎం.కొట్రయ్య, రాజేశ్ కుమార్, సోమనగౌడ, వినాయక, నాగరాజు, సురేశ్‌గౌడ, ఆశలత, బసవరాజు పాల్గొన్నారు.

మహిళలకు నాటుకోడి పిల్లల పంపిణీ

మహిళలకు నాటుకోడి పిల్లలను పంపిణీ చేస్తున్న పశు వైద్య అధికారులు

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి పశువుల ఆసుపత్రిలో గ్రామీణ రైతు మహిళలకు అధికారులు బుధవారం నాటు కోడి పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పశువుల ఆసుపత్రి వైద్యాధికారి కె.యు.బసవరాజ్ మాట్లాడుతూ కలబురగి కర్ణాటక సహకార సమాఖ్య ద్వారా కంప్లి విధానసభ నియోజకవర్గంలోని 148 మంది మహిళలకు అయిదు వారాల నాటు కోడి పిల్లలను పంపిణీ చేస్తున్నాం. అయిదుగురు దళిత మహిళలు, 138 మంది గిరిజన మహిళలు, అయిదుగురు సామాన్య వర్గాల మహిళలకు తలా 20 కోడి పిల్లలను పంపిణీ చేశామన్నారు. కోడి పిల్లలను జాగ్రత్తగా పెంచాలని సూచించారు. కురుగోడు పశు ఆసుపత్రి వైద్యుడు ప్రదీప్ కుమార్, సిబ్బంది శివప్ప, తదితరులు పాల్గొన్నారు.

డీఈడీ శిక్షణకు చర్యలు

బళ్లారి, న్యూస్‌టుడే: వికలచేతన, వృద్ధుల నాగరికర సబలీకరణ శాఖ ఆధ్వర్యంలో మైసూరు అంధ, శ్రవణ దోషం బాలల శిక్షణ కేంద్రంలో అంధ, శ్రవణ దోషం ఉన్న అభ్యర్థులు రెండేళ్ల డీఈడీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కల్యాణశాఖాధికారి గోవిందప్ప తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ద్వితీయ పీయూసీ ఉత్తీర్ణత సాధించాలన్నారు. శిక్షణ క్షేత్రంలో రాష్ట్రీయ పునర్వసతి మండలి పాఠ్యపుస్తకాలు, మార్గదర్శనంలో డిప్లొమా ఇన్ స్పెషల్ ఎడ్యుకేషన్ శిక్షణ కన్నడ మాధ్యమంలో ఇస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈ నెల 12వ తేదీ లోపుల దరఖాస్తులను సమర్పించాలని కోరారు.

హలకట్టి సేవలు చిరస్మరణీయం

చెళ్లకెర(చిత్రదుర్గం): వచన సాహిత్య గ్రంథాల సేకరణ, సంరక్షణ, పరిశోధన, ప్రకటనలకు డా. ఫగు హలకట్టి తన సర్వస్వాన్ని ధారపోశారని మైసూరుకు చెందిన రచయిత గణేశ అమినఘడ పేర్కొన్నారు. బుధవారం ఇక్కడ వచన సాహిత్య సంరక్షణ దినోత్సవాన్ని సందర్భంగా డా. ఫగు హలకట్టి చిత్రపటానికి పుష్పార్చన చేసి మాట్లాడారు. ఆధ్యాత్మిక గురువులు బసవకుమారస్వామి, మల్లికార్జునస్వామి, వీరశైవ మహాసభ జిల్లా అధ్యక్షుడు మహడి శివమూర్తి, వీరశైవ లింగాయత జిల్లా అధ్యక్షుడు సిద్ధప్ప, రచయిత ఆనందమూర్తి, నాగరాజ్ పాల్గొన్నారు.

తుంగభద్ర జలాశయం నీటిమట్టం

పూర్తిస్థాయి నీటిమట్టం 1633 అడుగులు

2-07-2025 (ఉ॥ 8 గంటలకు)	ప్రస్తుతం	గత సంవత్సరం
నీటిమట్టం (అడుగుల్లో)	1625.20	1585.87
ఇన్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	32,767	13,410
అవుట్‌ఫ్లో (క్యూసెక్కుల్లో)	1710	297
నీటి నిల్వ (టి.ఎం.సి)	77.144	7.909

గరిష్ఠసామర్థ్యం (133 టీఎంసీలు) వాస్తవసామర్థ్యం 105.788 టీఎంసీలు

వచన సాహిత్య పరిరక్షణకు హలకట్టి ఎనలేని కృషి

బళ్లారి: నివాళి అర్పిస్తున్న చిదానందప్ప, తిమ్మనగౌడ, నాగరాజ తదితరులు

బళ్లారి, న్యూస్‌టుడే: డా.పక్కీరప్ప గురుబసప్ప హలకట్టి వచన సాహిత్య పరిరక్షణకు తన జీవితం అంకితం చేశారని జిల్లా గ్యారంటీ పథకాలు అమలు ప్రాధికార సమితి అధ్యక్షుడు కె.ఇ.చిదానందప్ప పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం, పంచాయతీ, కన్నడ సాంస్కృతిక శాఖ, నగర పాలికె సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక రాజ్‌కుమార్ రహదారిలోని కన్నడ సముచ్చయ భవనం ఆవరణలోని సభాభవనంలో డా.పక్కీరప్ప గురుబసప్ప హలకట్టి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా వచన సాహిత్య పరిరక్షణ దినోత్సవాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. కాల గర్భంలో కలిసిపోతున్న శరణుల జీవిత విలువలను శోధించడం, అన్వేషించడం, సేకరించడం, వాటిని ప్రచారం చేయడంలో డా.హలకట్టి పరిశోధన రంగానికి విశేష కృషి చేశారని తెలిపారు. ఆచార్యుడు డా.తిమ్మనగౌడ డా. హలకట్టి జీవిత చరిత్ర, సాహిత్యం, విద్య ప్రాముఖ్యత, మానవ విలువలను వివరించారు. 1880 జులై 2న డా.పక్కీరప్ప గురుబసప్ప హలకట్టి ధార్వాడలో జన్మించారు. మద్రాస్‌లో ఉన్నత శిక్షణ పూర్తి చేశారని తెలిపారు. డా.హలకట్టి సాహిత్య రంగానికి చేసిన సేవలను గుర్తించి 1926లో బళ్లారి నగరంలో జరిగిన 12వ అఖిల భారత కన్నడ సాహిత్య సమ్మేళనం అధ్యక్షుడిగా డా.హలకట్టిని ఎంపిక చేశారని గుర్తు చేశారు. అనంతరం దొడ్డయ్య వి.కల్లూరు బృందంతో వచన సంగీత కార్యక్రమం నిర్వహించారు. అధికారి నాగరాజ, ఉప తహసీల్దార్ మహమ్మద్ సాధిక్, బాషా, కొట్రేశ్, హుసేన్, వివిధ పాఠశాల, కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు.

బళ్లారి: కార్యక్రమానికి హాజరైన విద్యార్థులు

కంప్లి, న్యూస్‌టుడే: కంప్లి తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం కన్నడ సాహిత్య పితామహుడు హలకట్టి జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి పూజలు జరిపారు. షామియాచంద్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు డాక్టర్ సునీల్ మాట్లాడుతూ కన్నడ సాహిత్య సంరక్షణకు హలకట్టి అందించిన సేవలు అమూల్యమని కొనియాడారు. తహసీల్దార్ మంజు నాయక్ మాట్లాడారు. డిప్యూటీ తహసీల్దార్ రవీంద్ర కుమార్, శరణ సాహిత్య పరిషత్ తాలూకా అధ్యక్షుడు జి.ప్రకాశ్, హేమయ్య స్వామి, ఎస్.డి. బసవరాజ్, అశోక్ కుకనూరు, వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కంప్లిలో కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్, ఇతర అధికారులు నాయకులు

(c) eenadu

పనిచేసిన చోటే నేరాలు

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: తన బెట్టింగ్ అవసరాలకు తాను పని చేసిన కంపెనీలో 56 ల్యాప్‌టాప్‌లు, 16 ఐఫోన్లు దొంగతనం చేసిన సుబ్రహ్మణ్య ప్రసాద్ (34) అనే మాజీ ఉద్యోగిని ఎలక్ట్రానిక్ సిటీ ఠాణా పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మంగళూరుకు చెందిన నిందితుడు కొద్ది నెలల కిందట పని మానేశాడు. అంతర్గతంగా జరిగిన ఆడిట్‌లో ఎలక్ట్రానిక్ ఉపకరణాలు దొంగతనం అయ్యాయని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు అందింది. దర్యాప్తు పూర్తి చేసి నిందితుడ్ని అరెస్టు చేశారు.

బంగారు దుకాణానికే కన్నం

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే : సీగేహళ్లి సమీప భవానీ జ్యువెలర్స్‌లో దొంగతనానికి పాల్పడిన ఐదుగురు నిందితులను కేఆర్ పుర ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. కెంగేరికి చెందిన నారాయణలాల్, కీర్తరామ్, మహేంద్ర గహ్లోత్, పుష్పేంద్ర సింగ్‌లు ప్రధాన నిందితులు కాగా, వారి నుంచి బంగారాన్ని కొనుగోలు చేసిన దిలీప్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.50 లక్షల విలువైన 478 గ్రాముల ఆభరణాలను జప్తు చేసుకున్నామని అధికారులు బుధవారం వెల్లడించారు. నగరంలో ఫినాయిల్ విక్రయించుకునే నారాయణ లాల్ నగల దుకాణంలో భద్రత తక్కువగా ఉంటుందని గుర్తించి తన సహచరులతో కలిసి గోడకు కన్నం వేసి దొంగతనం చేశాడని ప్రాథమిక విచారణలో గుర్తించారు.

ఒకే ఇంట్లో వరుస చోరీలు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : బసవేశ్వరనగరలోని ఒక ఇంట్లో నెల రోజుల్లో ఒక దొంగ రెండుసార్లు దొంగతనానికి పాల్పడ్డాడు. టెర్రస్‌పై ఉన్న సౌర విద్యుత్తు ఫలకంపై ఉన్న స్టీలు, రాగి తీగలను నెల రోజుల కిందట దొంగిలించుకుని వెళ్లాడు. మళ్లీ రెండు రోజుల కిందట వచ్చి టెర్రస్‌పై ఉంచిన వస్తువులను దొంగిలించుకుని వెళ్లినట్లు సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా గుర్తించిన ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫుటేజ్ ఆధారంగా నిందితుని కోసం బసవేశ్వరనగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కోళ్ల కోసం పోటాపోటీ

శివమొగ్గ, న్యూస్‌టుడే : కడూరు నుంచి సాగరకు కోళ్ల లోడుతో వస్తున్న లారీ ఆనందపురం చెరువు గట్టుపై మంగళవారం ఉదయం బోల్తా కొట్టింది. ఎదురుగా వచ్చిన కారును తప్పించే ప్రయత్నంలో డ్రైవరుకు స్టీరింగ్‌పై నియంత్రణ తప్పింది. సుమారు 700 కోళ్లు లారీ కింద పడి మరణించగా మరో 800 కోళ్లను స్థానికులు దొరకబుచ్చుకుని వెళ్లిపోయారు. క్యాంటర్ డ్రైవరు మౌనంగా వీక్షించడం మినహా ఏమీ చేయలేకపోయాడు. ఆనందపుర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసులో అన్నదమ్ముల అరెస్టు

శివమొగ్గ, న్యూస్‌టుడే : కుంశి కుంబేశ్వర వీధిలో వసంత్ అలియాస్ వాసు అనే వ్యక్తిని హత్య చేసిన హరీశ్ (23), ఆకాశ్ (21) అనే అన్నదమ్ములను పోలీసులు అరెస్టు చేశారు. పాత గొడవలను దృష్టిలో ఉంచుకుని బైకుపై ఒంటరిగా వస్తున్న వసంత్‌పై మచ్చుకత్తితో దాడి చేసి హత్య చేశారని కుంశి ఠాణా ఇన్‌స్పెక్టర్ దీపక్ తెలిపారు.

పోలీస్ అధికారిపై వేటు

బెళగావి, న్యూస్‌టుడే : గోవులను అక్రమంగా కబేళాకు తరలిస్తున్న నిందితులను అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఘటనలో నిందితుల చేతిలో దాడికి గురైన శ్రీరామసేన కార్యకర్తలు ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించని హుక్కేరి ఠాణా ఎస్సై నిఖిల్ కాంబ్లేను సస్పెండ్ చేస్తూ ఎస్పీ భీమా శంకర్ గుళేద్ ఆదేశాలు ఇచ్చారు. నిందితుల వివరాలు, వాహనం నంబరు చెప్పినా నిఖిల్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ప్రాథమిక విచారణలో గుర్తించి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.



అనుభవ మండపం చారిత్రక ఘట్టాలను విశ్లేషిస్తున్న నిపుణుడు

దిల్లీ వీధుల్లో విహరించిన బసవేశ్వరుడి రథం (పాతచిత్రం)

బసవ కల్యాణ ఆధ్యాత్మిక కేంద్ర ముఖద్వారం

విశ్వమానవుడు.. బసవేశ్వరుడు!

బసవకల్యాణ క్షేత్రం.. శ్రమజీవుల దివ్యధామం

బీదర్, న్యూస్‌టుడే : శ్రమజీవుల హృదయమే దివ్య దేవాలయం చాటిన చారిత్రక పురుషుడు బసవేశ్వరుడు! బీదర్ జిల్లా సమాజాన్ని దశ, దిశలా విస్తరింప చేసిన ఆ సామాజిక ఉద్యమకారుడు నడయాడిన క్షేత్రమే బసవకల్యాణ పట్టణం. ప్రస్తుత పార్లమెంటును పోలిన ఆనాటి 'అనుభవ మండపం'.. ప్రజాస్వామ్య ప్రియులకు ఇష్టమైన వేదిక. క్రీస్తు శకం 12వ శతాబ్దంలోనే ఆదర్శ పాలన అందించిన బసవకల్యాణ చక్రవర్తి బసవేశ్వరుడి ఆదర్శాలను భవిష్యత్తు తరాలకు చక్కగా వివరించే ప్రయత్నంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం ఆ ప్రాంతాన్ని చక్కగా విస్తరించడానికి తాజాగా మంత్రివర్గ సమావేశంలో ప్రతిపాదించింది. రూ.742 కోట్లతో అనుభవ మండప పరిసరాలను నవ్యాతి నవ్యంగా పునర్నిర్మించే ప్రక్రియకు ముందడుగు వేసింది. ప్రస్తుత కోట ప్రాంతానికి చేరువలోనే 12 ఎకరాల విస్తీర్ణంలో వివిధ నిర్మాణాలు చేపట్టడానికి ప్రణాళికలు సిద్ధమయ్యాయి. నిర్మాణరంగ నిపుణుల సహకారంతో భవంతుల నమూనాలు సిద్ధం చేయించారు. అన్నీ అనుకున్నట్లు సాగితే.. సిద్ధరామయ్య ప్రభుత్వ పాలనాకాలంలోనే పునరుద్ధరించిన 'బసవక్షేత్రం' వైభవాన్ని చరిత్రప్రియులు, పర్యాటకులు సందర్శించవచ్చు.

సామాజిక ఉద్యమకారుడు బసవేశ్వరుడు ఇక్కడ నిర్మించిన కోట, అనుభవ మండపం ప్రత్యేకతలు తెలుసుకోవడానికి ఇప్పటికే ఇక్కడ కొన్ని నిర్మాణాలు విస్తరించాయి. అందులో బసవేశ్వర మహా విగ్రహం- ధ్యానముద్రలో అందరినీ ఇట్టే ఆకట్టుకుంటుంది. ఒకనాటి కల్యాణి చాళుక్యుల రాజధానిగానూ చరిత్ర ప్రసిద్ధి చెందిన ఈ ప్రాంతం మధ్య భారతంలో కీలకమైంది.

అనుభవ మండపానికి నవ్యరూపం.. ప్రతిపాదిత నిర్మాణ రూపురేఖలు

ఎందరికో ఆదర్శం..

అద్భుతదృశ్యాలు, చారిత్రక ఘట్టాల సమాహారమే బీదర్ జిల్లాలోని బసవకల్యాణ. ప్రత్యేకించి పాలనా కేంద్రమైన బసవన్న తీర్చిదిద్దిన పాలనాకేంద్రం 'అనుభవ మండపం' సామాజిక, మత సంస్కరణలకు వేదిక. లింగాయత ఉద్యమానికి ఇది నిలయంగా మారింది. మనుషులంతా ఒక్కటే.. పనిచేసే వారు దేవుడితో సమానమనే ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. బసవేశ్వరుడితో పాటు ఆనాటి సమాజ సంస్కరణ ఉద్యమకారులు. అల్లమ ప్రభు, అక్కమహాదేవి, చెన్న బసవన్న, సిద్ధరామ తదితరుల సిద్ధాంతాలను నేటికీ కన్నడిగులు అనుసరిస్తున్నారు. అన్ని వర్గాల, కులాల మేధావులను ఈ మండప పాలక మండలి (మంత్రివర్గం)లో చేర్చుకుని ఎన్నో ప్రయోగాలు చేశారు. ప్రస్తుతం మనం చూసే ఇక్కడి కోటను పదో శతాబ్దంలోనే నిర్మించినట్లు చరిత్రకారులు చెబుతున్నారు.

తహసీల్దారుపై కేసు నమోదుకు ఆదేశం

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే : తన ముందుకు వచ్చిన 53 కేసులను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన తహసీల్దారు అపూర్వ బిదరిపై క్రిమినల్ కేసును దాఖలు చేయాలని బెంగళూరు ప్రాంతీయ కమిషనర్ సంబంధిత జిల్లాధికారికి సిఫార్సు చేశారు. బెంగళూరు దక్షిణ ఉప విభాగం తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క కేసునూ ఆమె విచారణ చేయలేదని గుర్తించారు. భూ వివాదాలను పరిష్కరించకపోవడంతో ఈ విభాగం నుంచి ఎక్కువ కేసులు న్యాయస్థానాల వరకు వెళుతున్నాయని గుర్తించి ఈ సిఫార్సులు చేశారు.

మంజునాథగౌడకు ఊరట

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే : నకిలీ బంగారాన్ని తాకట్టు పెట్టుకుని రూ.62.77 కోట్ల రుణాన్ని ఇచ్చిన ఆరోపణలపై అరెస్టయిన శివమొగ్గ జిల్లా సహకార బ్యాంకు మాజీ అధ్యక్షుడు మంజునాథ గౌడకు సర్వోన్నత న్యాయస్థానం (సుప్రీంకోర్టు) బెయిలు మంజూరు చేసింది. గత ఏప్రిల్‌లో ఈడీ అధికారులు మంజునాథగౌడ నివాసం, కార్యాలయంతో పాటు 8 చోట్ల అరెస్టు చేశారు. ఆయనను అదుపులోకి తీసుకుని చామరాజపేట అపెక్స్ బ్యాంకు అతిథి గృహంలో విచారణ చేసి, పరప్పన అగ్రహార కారాగారానికి పంపించారు. ఉన్నత న్యాయస్థానంలో బెయిలు రాకపోవడంతో సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

వివిధ రంగాల మహిళా ప్రముఖులతో ముఖ్యమంత్రి సమాలోచనలు

ఆలయం ఆవరణలో మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి

వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నేతల బృందం

భోగ నందీశ్వర వైభవం

- మంత్రివర్గం కదలిరాకతో సందడి

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే : బెంగళూరు నగరానికి చేరువలోని నంది బెట్టపై మంత్రివర్గ సమావేశానికి వెళ్లేందుకు ముందుగా.. కొండ దిగువన చారిత్రక భోగ నందీశ్వరుని ఆలయంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన మంత్రివర్గ సహచరులు పూజలు చేసి, ఆ పరిసరాల్లో కలియతిరిగారు. ఆలయ ముఖ మండపం, పుష్కరిణి చెంత ఫొటోలకు ఫోజులిచ్చి సందడి చేశారు. చిక్కబళ్లాపుర జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ప్రదీప్ ఈశ్వర్, సుబ్బారెడ్డి, మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, మాజీ మంత్రి శివశంకర్‌రెడ్డి తదితరులు ముఖ్యమంత్రిని సత్కరించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తనకు రెండు కళ్లలాంటి వారని ప్రదీప్ ఈశ్వర్ పేర్కొన్నారు. తన హృదయాన్ని చీల్చితే శివకుమార్ ఉంటారని, ఆయన కోసం తాను ప్రాణత్యాగం చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. ముఖ్యమంత్రి మార్పునకు సంబంధించి జరుగుతున్న ప్రచారంపై తాను వ్యాఖ్యలు చేసేంత పెద్దవాడిని కాదన్నారు. ఐదేళ్లూ తానే ముఖ్యమంత్రిని అని సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందిస్తూ.. ముఖ్యమంత్రి అలా అన్న అనంతరం నేనేమి వ్యాఖ్యానించాలని ప్రశ్నించారు. నన్ను ముఖ్యమంత్రి చేయండంటూ ఎవరిపైనా ఒత్తిడి తీసుకురావడం లేదన్నారు. సిద్ధరామయ్యకు మద్దతు ఇవ్వడం మినహా నేనేం చేయలేనని అన్నారు. ప్రభుత్వం ఏ పనీ చేయడం లేదని భాజపా నాయకులు చేస్తున్న ఆరోపణలకు భోగ నందీశ్వరుని ఆలయం ఆవరణలో ముఖ్యమంత్రి అచ్చంగా ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ శైలిలో బదులిచ్చారు. భాజపా నాయకులు నిధులన్నీ ఖాళీ చేసి వెళ్లినా తాము ఉత్తమ పాలన అందిస్తున్నామని వ్యాఖ్యలు చేశారు. మంత్రివర్గ సభ్యులతో కలిసి బృంద చిత్రం దిగే సమయానికి డీకే శివకుమార్ రాకపోవడంతో మిగిలిన వారితోనే ఆయన ఫొటో దిగారు. నంది గ్రామంలో స్థానికుల కోసం ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్, ఇతర కాంగ్రెస్ నేతలు మాంసాహార వంటకాలను సిద్ధం చేయించారు. విందు కోసం 500 కిలోల వేటమాంసం, 800 కిలోల కోడి మాంసాన్ని తెప్పించారు. స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు, ఎక్కువ నిధులు కేటాయించేందుకు మంత్రివర్గంతో కలిసి ముఖ్యమంత్రి నందిబెట్టకు రావడం నూతన చరిత్ర అని ప్రదీప్ ఈశ్వర్ పేర్కొన్నారు. ● నంది బెట్టపై మంత్రివర్గ సమావేశానికి వచ్చిన ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను చిక్కబళ్లాపుర జిల్లా నేతలు బుధవారం ఘనంగా సత్కరించారు. కోలారు పాల సమాఖ్యకు అధ్యక్షురాలిగా ఎన్నికైన మహాలక్ష్మి, ఇతర సభ్యులు సీఎంను భేటీ అయ్యారు. నంది గిరిధామ వద్ద కేఎస్‌టీడీసీ మయూర ఫైన్ టాప్ సన్ రైజ్ రెస్టారెంటు నిర్మాణానికి మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి సీఎం భూమి పూజ చేశారు.

మంత్రివర్గ సమావేశానికి ముందు.. నేతలతో సిద్ధు బృంద చిత్రం

భాజపా అధ్యక్షుడి మార్పు తథ్యమా?

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టేందుకు పలువురు నాయకులు ఉవ్విళ్లూరుతున్నారు. ప్రస్తుత అధ్యక్షుడు విజయేంద్ర స్థానంలో మరో నేతకు బాధ్యతలు అప్పగించాలని పార్టీ నేతలు రమేశ్ జార్ఖిహొళి, అరవింద్ లింబావళి, అరవింద్ బెల్లద్, కుమారబంగారప్ప తదితరులు డిమాండ్ చేశారు. వారితో పాటు ఆయా జిల్లాల నేతలు అభిప్రాయాలను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఇప్పటికే సేకరించారు. అధికారాన్ని కోల్పోయి 60 స్థానాలకే పరిమితమైన భాజపాను మరోసారి సంఘటితం చేసేందుకు ఇప్పటి నుంచే ప్రయత్నాలు చేపట్టాలని బీఎల్ సంతోశ్, ప్రహ్లాద్ జోషి తదితరులు కేంద్ర మంత్రి అమిత్‌షాకు సూచించారు. కొత్త నాయకుడిని ఎన్నుకునే ప్రక్రియ తెరవెనుక కొనసాగుతోంది. విపక్ష నేత అశోక్, మాజీ మంత్రులు సీటీ రవి, సునీల్ కుమార్ తదితరులు అధ్యక్ష పదవిని చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నారు.

ముగ్గురిని సస్పెండ్ చేసిన అధికారులు

మైసూరు, న్యూస్‌టుడే : భార్య మరణించకున్నా.. ఆమెను హత్య చేశాడంటూ ఆదివాసీ సురేశ్ అనే యువకుడిని రెండేళ్ల పాటు కారాగారానికి పంపించిన ఆరోపణలపై కుశాల నగర ఇన్‌స్పెక్టర్ బీజీ ప్రకాశ్, ఇలవాల సీఐ మహేశ్ కుమార్, జయపుర ఠాణా ఇన్‌స్పెక్టర్ ప్రకాశ్ ఎత్తినమనెలను సస్పెండ్ చేస్తూ హోం శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు. తాను ప్రేమిస్తున్న వ్యక్తితో భార్య పరారైందని చెబుతున్నా వినకుండా శిక్ష వేయించారని సురేశ్ ఆరోపించారు. గుర్తుతెలియని మహిళ మరణిస్తే.. ఆమే సురేశ్ భార్య అంటూ ఆధారాలు సృష్టించి, హత్య కేసు నమోదు చేసి కారాగారానికి పంపించారనేది అభియోగం. ఆయన విడుదలైన అనంతరం ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆ సమయంలో ఆయనను కారాగారానికి పంపించిన ఇన్‌స్పెక్టర్లను విధుల నుంచి తప్పిస్తూ ఆదేశాలు జారీ చేశారు.

కుమార పీఠమెక్కితే మహిళా లోకానికి పండగే!

మండ్య, న్యూస్‌టుడే : జనతాదళ్ నాయకుడు కుమారస్వామి ముఖ్యమంత్రి పీఠమెక్కితే మహిళలకు ప్రతి నెలా రూ.5 వేలు ఇస్తారని యువ జనతాదళ్ అధ్యక్షుడు నిఖిల్ గౌడ ప్రకటించారు. మండ్య, రామనగర జిల్లాల్లో నిర్వహిస్తున్న సభ్యత్వ నమోదు ప్రక్రియకు చక్కని స్పందన లభిస్తోందన్నారు. తనను కలుసుకున్న విలేకరులతో నిఖిల్ మాట్లాడుతూ అధికార పార్టీ ప్రజలకు ఇస్తానన్న గ్యారంటీ పథకాలను అర్హులకు ఇవ్వకుండా మొండిచేయి చూపిస్తోందని ఆరోపించారు. గతంలో కాంగ్రెస్‌తో కలిసి దళ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం సిద్ధరామయ్యకు కంటగింపు కావడంతోనే సంకీర్ణ ప్రభుత్వాన్ని ఆయనే కుప్పకూల్చారని విమర్శించారు. కాంగ్రెస్ నుంచి 15 మంది ఎమ్మెల్యేలను భాజపాకు సాగనంపింది సిద్ధరామయ్యేనని ఆరోపించారు.



పరేస్థి రూపకానికి చక్కని స్పందన

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే : ప్రముఖ నృత్య గురువు బోర్నాలీ సర్కార్ నృత్య సంయోజనలో సుబ్రతే దే సంగీతాన్ని అందించిన 'పరేస్థి' నృత్య రూపకానికి సంగీత అభిమానుల నుంచి చక్కని స్పందన లభించింది. కోరమంగలలోని మేడై ఆడిటోరియంలో శుభం స్కూల్ ఆఫ్ పర్‌ఫార్మింగ్ ఆర్ట్స్‌లో శిక్షణ పొందుతున్న విద్యార్థులు చిన్న సెలయేరు, నదిగా మారే ప్రక్రియ, తన గమ్యస్థానానికి చేరిన నదీమతల్లిని చక్కని నృత్య రీతుల్లో మంగళవారం రాత్రి ప్రదర్శించారు. ప్రదర్శనకు తగిన విద్యుత్తు దీపాలంకరణను మిటాంకర్ దాస్ సర్కార్ సృష్టించారు.

నృత్య రూపకం, ప్రదర్శనలో కళాకారులు

బెంగళూరు విపణిలో కూరగాయల ధరలు

(హాప్‌కామ్స్-కిలో..రూ.లలో)

బీన్స్-	90
క్యారెట్-	110
బీరకాయలు-	55
క్యాబేజి-	35
క్యాలీఫ్లవర్(ఒక్కోటి)-	35
సొరకాయ-	45
దొండకాయలు-	45
పొట్లకాయ-	35
టమాటా(నాటు)-	25
టమాటా(సాధారణ)-	20
గుమ్మడి-	35
ఆలుగడ్డ-	30
ఉల్లి(మేలురకం)-	30
ఉల్లి(సాధారణ)-	25
వెల్లుల్లి-	190
సాంబారు ఉల్లి-	170
బీట్‌రూట్-	40
వంకాయలు-	60
బెండకాయలు-	55
ముల్లంగి-	45
నిమ్మకాయ-	280

పండ్లు,ఫలాలు ధరలు

వాషింగ్టన్ ఆపిల్-	420
సిమ్లా ఆపిల్-	285
గ్రీన్ ఆపిల్-	395
అరటి కాయలు-	35
సపోటా-	65
పైనాపిల్-	45
బొప్పాయి-	35
ఆరంజి-	195
బత్తాయి-	95

(న్యూస్‌టుడే, యశ్వంతపుర)

రాబకొవికి 52 నామినేషన్ల దాఖలు

బళ్లారి, న్యూస్‌టుడే: రాయచూరు, బళ్లారి, కొప్పళ, విజయనగర జిల్లాల పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాల సమాఖ్య(రాబకొవి) 12 మంది డైరెక్టర్లకు మొత్తం 52 మంది అభ్యర్థులు నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. రాయచూరు-15, ఉమ్మడి బళ్లారి-15, కొప్పళ-22 మంది నామినేషన్ పత్రాలు దాఖలు చేసినట్లు ఎన్నికల అధికారి ప్రమోద్ తెలిపారు. జూన్ 30వ తేదీ నుంచి నామినేషన్ ప్రక్రియ ప్రారంభమైంది. బుధవారం చివరి రోజు కావడంతో మొత్తం 52 మంది నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. 3న నామినేషన్ పత్రాల పరిశీలన, 4న నామినేషన్ పత్రాలు ఉపసంహరించుకోవడానికి చివరి తేదీ. 10న ఎన్నిక నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాయచూరు, కొప్పళ జిల్లాల నుంచి కాంగ్రెస్, భాజపా పార్టీల మద్దతుదారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు.

కృషిహోండాలో మొసలి ప్రత్యక్షం

తెక్కెలకోట(సిరుగుప్ప), న్యూస్‌టుడే: కృషిహోండాలో మొసలి ప్రత్యక్షం కావడంతో రైతు ఆందోళన చెందాడు. తెక్కెలకోట ఆయకట్టు పరిధిలో ఉప్పార సిద్ధయ్య అనే రైతు కృషి హోండా ఏర్పాటు చేసుకుని పంటలకు సాగు నీరుతో పాటు చేపల పెంపకం చేపట్టాడు. కొద్ది రోజులుగా మొసలి చెరువులో కనపడటంతో ఆందోళనకు గురై సంబంధిత అటవీ శాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ అధికారి బసవనగౌడ, హాళేకోట గ్రామానికి చెందిన పగటి వేషగాడు మల్లయ్య సాయంతో అటవీ శాఖ సిబ్బంది కలిసి మొసలిని పట్టుకొని తుంగభద్ర నదిలో విడిచి పెడుతున్నామని అటవీశాఖ అధికారి బసవనగౌడ పేర్కొన్నారు. మొసలిని పట్టుకోవడంతో రైతు ఉప్పార సిద్ధయ్య సంతోషం వ్యక్తం చేశాడు.

తెక్కెలకోటలో కృషిహోండాలో మొసలిని పట్టుకున్న రైతులు

కమల్‌హాసన్ కేసు.. విచారణ వాయిదా

రామనగర, న్యూస్‌టుడే : తమిళం నుంచి కన్నడ భాష జన్మించిందనే వ్యాఖ్యలతో పాటు కన్నడిగులను కించపరుస్తూ మాట్లాడిన నటుడు కమల్‌హాసన్‌పై కనకపురలో రెండో సివిల్ న్యాయస్థానంలో కేసు నమోదైంది. శ్రీరామసేన జిల్లా అధ్యక్షుడు నాగార్జున గౌడ కేసు వేశారు. హ్యాట్రిక్ హీరో శివరాజ్‌కుమార్‌ను సాక్షిగా పరిగణనలోకి తీసుకోవాలని తన అర్జీలో కోరారు. కేసును పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం తదుపరి విచారణను శనివారానికి వాయిదా వేసింది.

హత్య కేసులో.. మూడేళ్ల తర్వాత అరెస్టు

మంగళూరు, న్యూస్‌టుడే : ఒక హత్య కేసులో సర్వోన్నత న్యాయస్థానం బెయిలు రద్దు చేసిన తర్వాత మూడేళ్లుగా పరారీలో ఉన్న ఓ నిందితుడ్ని అరెస్టు చేశామని మంగళూరు పోలీసులు బుధవారం వెల్లడించారు. ముల్కి విజయ్ అనే వ్యక్తిని పది మందితో కలిసి హత్య చేసిన నిందితుల్లో ఒకడైన మహ్మద్ ముస్తఫాకు కర్ణాటక హైకోర్టు బెయిలు మంజూరు చేసింది. బెయిలును 2022 ఏప్రిల్ 22న సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేసింది. నకిలీ పాస్‌పోర్టుతో విదేశాలకు పరారయ్యాడు. నకిలీపత్రాలు ఉపయోగించి 2024 ఏప్రిల్‌లో నేపాల్ మార్గంలో భారత్‌లోకి చేరుకున్నాడు. ముల్కి తాలూకాలోని పక్షికెరె గ్రామానికి వచ్చినట్లు గుర్తించి నిందితుడ్ని అరెస్టు చేశారు. న్యాయస్థానం ముందు హాజరు పరచగా, న్యాయనిర్బంధానికి పంపిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు ఇచ్చారు. ఇతనిపై మంగళూరు, చిక్కమగళూరు, ఉడుపిలతో పాటు వివిధ ప్రాంతాల్లో తొమ్మిది క్రిమినల్ కేసులు ఉన్నాయని పోలీసులు తెలిపారు.

యుద్ధప్రాతిపదికన.. కాలువల ఆధునికీకరణ

- తుంగభద్ర కాలువలకు 10న సాగునీరు విడుదల
- 50 శాతం పనులను పూర్తి చేస్తామని ఇంజినీర్ల వెల్లడి

బళ్లారి, న్యూస్‌టుడే: తుంగభద్ర జలాశయం కాలువలకు మరో ఎనిమిది రోజుల్లో సాగునీటిని విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా ప్రారంభించిన పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయిస్తున్నారు. మిగిలిన పనులను వచ్చే ఏడాది కాలువకు నీటిని నిలిపివేసిన తర్వాత పూర్తి చేసే విధంగా సిద్ధం చేసుకున్నారు.

మూడు ప్యాకేజీల పనుల్లో వేగం

తుంగభద్ర కుడి దిగువ (ఎల్లెల్సీ) కాలువ సున్న (గుండ్లకెరె) కిలోమీటరు నుంచి 250వ కిలోమీటరు వరకు తుంగభద్ర మండలి పరిధిలోకి వస్తోంది. గతంలో 204వ కిలోమీటరు వరకు డీప్ కాలువ (భూ ఉపరితలం నుంచి దిగువకు) కాలువ మినహా మిగిలిన కాలువను ఆధునికీకరణ పనులు చేయించారు. ఈ ఏడాది 205వ కిలోమీటరు నుంచి 250వ కిలోమీటరు వరకు పనులు మే చివరిలో ప్రారంభించారు. మధ్యలో ఓ మూడు ప్యాకేజీ పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. పనులు 205 నుంచి 210 వరకు 40 శాతం, 210 నుంచి 224వ కిలోమీటరు 60 శాతం, 224 నుంచి 336వ కిలోమీటరు వరకు 80 శాతం, 236వ నుంచి 246వ కిలోమీటరు వరకు 65 శాతం, 246 నుంచి 250వ కిలోమీటరు వరకు 30 శాతం పనులు మాత్రమే పూర్తి చేశారు. ఈ నెల 10న కాలువకు నీటిని విడుదల చేయనున్న నేపథ్యంలో నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా పనులు పూర్తి చేయడానికి తుంగభద్ర మండలి అధికారులు గుత్తేదారులపై ఒత్తిడి తీసుకొచ్చారు. రాత్రింబవళ్లు పనులు చేస్తున్నారు. నాణ్యతలోపించిన పనులు చేసిన గుర్తించి, తొలగించి మరోసారి పనులు చేయిస్తున్నారు. ఎల్లెల్సీ కాలువ నుంచి డీపీ హొచ్చొళ్లి, పీఎస్ డీపీ, డీపీ-65 ఉప కాలువలు కర్ణాటక - ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల సరిహద్దులో ఉండటంతో తుంగభద్ర మండలి పరిధిలోకి వస్తాయి. ఈ ఉప కాలువల నుంచి బళ్లారి, కర్నూలు జిల్లాల్లో పలు గ్రామాలకు సాగు, తాగునీటిని సరఫరా చేస్తున్నారు. మూడు ఉప కాలువలను ఆధునికీకరణ చేయనున్నారు. మిగిలిన పనులను వచ్చే ఏడాది పూర్తి చేయిస్తామని తుంగభద్ర మండలి ఇంజినీర్లు తెలిపారు.

యుద్ధప్రాతిపదికన సాగుతున్న సిమెంట్ లైనింగ్ పనులు

నారాయణ నాయక్, తుంగభద్ర మండలి ముఖ్య పర్యవేక్షక ఇంజినీర్

పూర్తయిన కాలువ ఆధునికీకరణ పనులు

ప్రమాణాలు పాటిస్తాం

ఈ నెల 10న తుంగభద్ర దిగువ కాలువకు నీటిని విడుదల చేస్తారని.. ఆధునికీకరణ పనులు హడావుడిగా చేయడం లేదు. కాలువలను తవ్విన తర్వాత మొదటి సారిగా పూర్తి స్థాయిలో ఆధునికీకరణ పనులు జరుగుతున్నాయి. భవిష్యత్తులో మరో 20 ఏళ్ల ఎలాంటి ఇబ్బంది లేకుండా ఇరు రాష్ట్రాల రైతులకు కేటాయించిన సాగు, తాగునీటిని ఇవ్వాలి. ప్రధాన కాలువలో ఈ ఏడాది ప్రారంభించిన రూ.395 కోట్లతో ఐదు ప్యాకేజీలు, ఉప కాలువలు మూడు ప్యాకేజీలు, గతేడాది పెండింగ్‌లో ఉన్న మూడు ప్యాకేజీల పనులు యుద్ధప్రాతిపదికన సాగుతున్నాయి. ఈ ఏడాది 50 శాతం పనులు పూర్తి చేసి, వచ్చే ఏడాది కాలువకు నీటిని నిలిపివేసిన తర్వాత మిగిలిన పనులు పూర్తి చేయిస్తాం.

- నారాయణనాయక్, ముఖ్య పర్యవేక్షక ఇంజినీర్, తుంగభద్ర మండలి

(c) eenadu

బెంగళూరు

● బెంగళూరు ● కోలారు ● మైసూరు ● హోసూరు ● చిక్కబళ్లాపుర ● తుమకూరు

ఒలింపిక్ స్వర్ణపతక విజేత నీరజ్‌చోప్రాకు సన్మానం

నీరజ్‌చోప్రాను సత్కరిస్తున్న సంఘం నిర్వాహకులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : కర్ణాటక అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఒలింపిక్ బంగారు పతక విజేత నీరజ్‌చోప్రాను కర్ణాటక అథ్లెటిక్స్ సంఘం కార్యదర్శి రాజవేలు తదితరులు ఇక్కడి కంఠీరవ స్టేడియంలో సత్కరించారు. ఈనెల 5న క్లాసిక్ జావలిన్‌త్రో పోటీలు కంఠీరవ క్రీడాప్రాంగణంలో జరుగనున్నాయి. ఈ పోటీలకు ఏర్పాట్లు చేశారు. 18 వేల మంది క్రీడాభిమానుల వీక్షించేందుకు ఆసనాలు సిద్ధం చేశారు. ఈ పోటీలను వీక్షించేందుకు టికెట్లు అందుబాటులో ఉంచారు.

అమెరికా క్రీడల్లో సత్తాచాటిన తుమకూరు కానిస్టేబుల్

తుమకూరు, న్యూస్‌టుడే : తుమకూరు తిలక్‌పార్క్ పోలీస్‌స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న గురుప్రసాద్ అమెరికాలో జరిగిన పోలీస్ క్రీడాపోటీల్లో సత్తాచాటారు. 21వ వరల్డ్ పోలీస్ అండ్ ఫైర్ గేమ్-2025 క్రీడా పోటీల్లో భారతదేశం పోలీస్ క్రీడా బృందం నుంచి పాల్గొన్న గురుప్రసాద్ 10 కిలోమీటర్ల క్రాస్‌కంట్రీ, 5 కిలోమీటర్ల రేస్‌లో బంగారు పతకాలు, 800 మీటర్ల పరుగు పందెంలో కాంస్య పతకాన్ని దక్కించుకున్నారు. ఎస్పీ కె.వి.అశోక్, పోలీస్ అధికారులు గురుప్రసాద్‌ను అభినందించారు.

ఇతర దేశాల క్రీడాకారులతో గురుప్రసాద్

హోసూరు ఖబర్లు

ప్రభుత్వం, పోలీసుల వైఖరిని నిరసిస్తూ ఆందోళన

జూజువాడిలో ఆందోళన చేస్తున్న నాయకులు, కార్యకర్తలు

హోసూరు, న్యూస్‌టుడే : శివగంగై జిల్లా తిరుప్పువనం సమీపం మటత్తుపురం గ్రామానికి చెందిన అజీత్‌కుమార్ (27) పోలీసుల చిత్రహింసలతో మృతి చెందాడని, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని ఏఐఏడీఎంకే నాయకులు, కార్యకర్తలు డిమాండ్ చేశారు. పార్టీ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. హోసూరు జూజువాడిలో ఆ పార్టీ నాయకుడు అశోకరెడ్డి నేతృత్వంలో కార్యకర్తలు నిరసన ప్రదర్శన చేపట్టారు. శూలగిరి యూనియన్ ఎ.శెట్టిపల్లిలో బాబు వెంకటాచలం ఆధ్వర్యంలో కార్యకర్తలు ఆందోళన చేశారు. బాగలూరు బెళత్తూరు వృత్తంలో రవికుమార్ నేతృత్వంలో గుణశేకర్ తదితర ప్రముఖులు ప్రదర్శన చేసి పోలీసులు, డీఎంకే ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. హోసూరు-మత్తిగెరి నాలుగురోడ్ల కూడలిలో వాసుదేవన్ నేతృత్వంలో ఆందోళన చేశారు

ఆంధ్ర సాంస్కృతిక సమితి నాయకుడి మృతి

వెంకటరమణప్ప

హోసూరు, న్యూస్‌టుడే : ఆంధ్ర సాంస్కృతిక సమితి మాజీ సహాయ కార్యదర్శి ఎన్.వెంకటరమణప్ప బుధవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ చనిపోయినట్లు ప్రతినిధులు తెలిపారు. వెంకటరమణప్ప రాష్ట్ర ప్రభుత్వంచే ఉత్తమ ఉపాధ్యాయ ప్రశస్తి గ్రహీత. ఇతని మృతి పట్ల రాష్ట్రేతర తెలుగు సమాఖ్య దక్షిణ భారత అధ్యక్షుడు సీతారామయ్య, ప్రతినిధులు వెంకటేష్, జయరాం, తెలుగు సంస్థలు ప్రతినిధులు, ఉపాధ్యాయల సంఘాలు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు. అంత్యక్రియలు మృతుని స్వగ్రామం హోసూరు సమీపం చిన్నకూళ్ల గ్రామంలో సాయంత్రం ముగిశాయి.

డెంగీ నియంత్రణ చర్యలు ముమ్మరం

బెంగళూరు (యశ్వంతపుర), న్యూస్‌టుడే : నగరంలో పెరుగుతున్న డెంగీ వ్యాధి నియంత్రణ చర్యలను పాలికె ముమ్మరం చేసింది. డెంగీ కేసులు అధికంగా నమోదవుతున్న ప్రాంతాలపై అధికారులు దృష్టి సారించారు. ఆయా ప్రాంతాల్లో ఫాగింగ్, రసాయనిక మందులు పిచికారి చేయడం, డబ్బాలు, కొబ్బరి చిప్పలు, టైర్లు తదితర వాటిల్లో నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటున్నారు. మురుగునీరు నిల్వ లేకుండా చేస్తున్నారు. రహదారులు, పాదచారి మార్గాలు, నివాస ప్రాంతాల్లో చెత్త తొలగిస్తున్నారు. డెంగీ వ్యాధి నియంత్రణపై ప్రజలను చైతన్యవంతులు చేసే కార్యక్రమాలను చేపట్టారు. జ్వరంతో బాధపడే వారిని గుర్తించి వారి ఇళ్లకు వెళ్లి పరిసరాలను పరిశీలించి శుభ్రత చర్యలు చేపడుతున్నారు. జ్వరం వ్యాధగ్రస్తులను ఆసుపత్రుల్లో చేర్పిస్తున్నారు. చెరువులు, గుంతలు, కాలువలు పక్కల నివశిస్తున్న ప్రజలను అప్రమత్తం చేశారు. ఆయా ప్రాంతాల్లో దోమల నియంత్రణ చర్యలు చేపట్టారు. రాత్రిళ్లు దోమతెరలు వినియోగించాలని, దోమలు రాకుండా ఎలక్ట్రిక్ పరికరాలతో పాటు రసాయనిక మందులను ఇంటి లోపల బయట పిచికారి చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. దోమల నియంత్రణకు పాలికె నిరంతర ప్రయత్నాలు మొదలు పెట్టింది.

రసాయన మందు పిచికారి చేస్తున్న పాలికె సిబ్బంది

ఇళ్ల మధ్య ఫాగింగ్ చేస్తున్న కార్మికులు

నేటి నుంచి రాఘవేంద్రమఠంలో ఉత్సవాలు

లతారమేష్

మనస్వికా కశ్యప్, వర్ణశ్రీ మురూర్

సమనాఆచార్

సోనియా

బెంగళూరు (సాంస్కృతికం), న్యూస్‌టుడే : జయనగర్ ఐదో బ్లాక్‌లోని నంజన్‌గూడు రాఘవేంద్రమఠంలో ఆషాఢమాసం నేపథ్యంలో భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలను ఐదు గురువారాలు నిర్వహించనున్నారు. ఈ నెల 3న గురువారం సాయంత్రం శివానుగ్రహ లలితకళా ట్రస్టు సంస్థ విద్యార్థులచే భరతనాట్యం, (గురువు లతా రమేష్), 10వ తేదీ సాయంత్రం కళాకారిణులు మనస్వి కశ్యప్, వర్ణశ్రీమురూర్‌లచే దాసవాణి సంగీతం, 17వ తేదీ సాయంత్రం నాట్య వేద నృత్యశాల నాట్య విద్యార్థులచే భరతనాట్య ప్రదర్శన (గురువు సమనాఆచార్), 24వ తేదీ సాయంత్రం దీపక్ నారాయణన్, శరత్ చంద్ర తదితరులచే వాద్యగోష్ఠి, 31న కళాగ్రణి ప్రతిష్ఠాన విద్యార్థుల భరతనాట్య ప్రదర్శన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నిత్యం ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, మహా మంగళ హారతులు జరుగుతాయి.

చదరంగం పోటీలో బంగారు, రజత పతకాలు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : జార్జియాలో బుధవారం ముగిసిన అండర్-12 ఫిడే ప్రపంచకప్ చదరంగం పోటీలో నగరవాసులు బి.ప్రతీతి, ఆద్యాగౌడ స్వర్ణ, రజత పతకాలను సాధించినట్లు కర్ణాటక చెస్ సంఘం ప్రతినిధులు తెలిపారు. శిష్యా బీఈఎంఎల్ పబ్లిక్ పాఠశాల విద్యార్థిని ప్రతీతి 6.5 పాయింట్లను సాధించి అగ్రస్థానంలో నిలించింది. కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ పాఠశాల విద్యార్థిని ఆద్యాగౌడ ఆరు పాయింట్లతో రెండో స్థానంతో నిలిచింది. 2024లో ప్రతీతి రన్నర్‌అప్‌గా నిలిచింది. గత ఏడాది హైదరాబాద్‌లో జరిగిన 37వ జాతీయ అండర్-11 చదరంగం పోటీలో అతితీ, ఆద్యా తొలి రెండు స్థానాలు చేపట్టారు. విజేతలకు ప్రశస్తులతో పాటు జ్ఞాపికలు అందజేశారు. అతితీ మ్యాక్‌బుక్, ఆద్యా ఐఫోన్ బహుమతిగా అందుకున్నారు.

ప్రతీతి, ఆద్యాగౌడ

బాస్కెట్‌బాల్ పోటీల్లో మైసూరు జట్టు విజయం

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : కర్ణాటక బాస్కెట్‌బాల్ సంఘం ఎస్.రంగరాజన్ స్మారక ట్రోఫీ కోసం నిర్వహిస్తున్న బాస్కెట్‌బాల్ పోటీల్లో మైసూరు జిల్లా జట్టు 80-77 పాయింట్ల తేడాతో అప్పయ్య జట్టుపై విజయం సాధించింది. బుధవారం ఇక్కడి కంఠీరవ క్రీడాప్రాంగణంలో జరిగిన ఈ టోర్నమెంట్ ఇతర పోటీల్లో చిక్కమగళూరు జట్టు 72-57 పాయింట్ల తేడాతో రాజ్‌కుమార్ జట్టుపై నెగ్గగా, డీఆర్‌డీఓ జట్టు 53-38 పాయింట్లతో హాసన్ జిల్లా జట్టుపై, మద్రాస్ ఇంజినీరింగ్ గ్రూపు సెంటర్ జట్టు 69-30 పాయింట్లతో ధార్వాడ జిల్లా జట్టుపై విజయం సాధించాయి.

భాగ్యనగరగా..బాగేపల్లి

చింతామణి, న్యూస్‌టుడే : చిక్కబళ్లాపుర జిల్లాలోని బాగేపల్లి పేరును భాగ్యనగరగా మార్చడానికి మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించామని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య తెలిపారు. నందికొండలో మంత్రివర్గ సమావేశం తర్వాత ముఖ్యమంత్రి విలేకరులతో మాట్లాడారు. దేవనహళ్లి, నెలమంగల, హొసకోటే, దొడ్డబళ్లాపురతో ఉన్న బెంగళూరు గ్రామీణ జిల్లాను బెంగళూరు ఉత్తర జిల్లాగా మార్చనున్నట్లు వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం బండరాయిగా గట్టిగా ఉందని, ఎస్సీ వర్గీకరణ సమీక్ష చురుగ్గా జరుగుతోందన్నారు.

వచన సాహిత్య పితామహుడు హళకట్టి

హళకట్టి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

తుమకూరు, న్యూస్‌టుడే : శరణుల వచనాలను సేకరించి సంకలనం చేసిన ఘనత డాక్టర్ ఫ.గు.హళకట్టికి దక్కుతుందని జిల్లా కన్నడ సాహిత్య పరిషత్తు అధ్యక్షుడు కె.ఎస్.సిద్ధలింగప్ప అభిప్రాయపడ్డారు. మంగళవారం తుమకూరులోని కన్నడ భవనంలో హళకట్టి జయంతి, వచన సాహిత్య సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్ధలింగప్ప మాట్లాడుతూ న్యాయశాస్త్రం చదివినప్పటికీ వచన సాహిత్యం ప్రచారానికి హళకట్టి జీవితాంతం శ్రమించారన్నారు. తన ఇంటినే అమ్మి ముద్రణ యంత్రాన్ని కొనుగోలు చేసి వచన సాహిత్యం విస్తరణకు కృషిచేశారని శ్లాఘించారు. కార్యక్రమంలో నంజుండస్వామి, శంకరలింగ బిరాదర, కన్నడ సాహిత్య శాఖ ఇన్‌ఛార్జ్ డైరెక్టర్ సంతోష్‌కుమార్, శరణ సాహిత్యపరిషత్తు అధ్యక్షుడు ఎం.జి.సిద్ధరామయ్య, బసవకేంద్ర అధ్యక్షులు సిద్ధగంగయ్య తదితరులు పాల్గొన్నారు.

చిత్రదుర్గం, న్యూస్‌టుడే : రాష్ట్రంలో ఇంటింటికీ తిరిగి వచన సాహిత్య తాళపత్ర గ్రంథాలను సేకరించి, పరిష్కరించి, పరిశోధనలను చేసిన హళకట్టిని వచన సాహిత్య పితామహుడుగా అభివర్ణించారని సహాయక కమిషనర్ మహబూబ్ జిలాని ఖురేషి పేర్కొన్నారు. బుధవారం ఇక్కడి జిల్లా పాలనాధికారి కార్యాలయంలో నిర్వహించిన వచన సాహిత్య సంరక్షణ దినోత్సవంలో హళకట్టి చిత్రపటానికి పుష్పార్చన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హళకట్టి పరిశోధనలతో పలువురు వచన సాహితీవేత్తలను సమాజానికి పరిచయం చేశారన్నారు. కార్యక్రమంలో కన్నడ సంస్కృతి శాఖ సహాయక డైరెక్టర్ గుర్నాథ్, జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు శివస్వామి, పట్టణాభివృద్ధి సంస్థ అధ్యక్షుడు తాజ్ పీర్, తహసీల్దార్ నరసింహమూర్తి, అధ్యాపకురాలు మమత తదితరులు పాల్గొన్నారు.

చిత్రపటానికి పుష్పార్చన చేస్తున్న ప్రతినిధులు

తాగునీటి పథకాల నివేదికలు రూపొందించాలి

తుమకూరు, న్యూస్‌టుడే : జిల్లాలో జలజీవన్ మిషన్‌తో పాటు వివిధ పథకాల కింద జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించిన నివేదికలను నిర్ణీత సమయానికి పూర్తి చేసి ఆమోదం పొందాలని జడ్పీ సీఈవో జి.ప్రభు సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా పంచాయితీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తాగునీటి పథకాల సమగ్ర వివరాలు, బిల్లులు, చేయాల్సిన పనుల వివరాలు అందజేయాలన్నారు. జడ్పీ ఉప కార్యదర్శి సంజీవప్ప, సభ్యులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో ప్రభు, తదితరులు

బీఎంటీసీ ఆదాయం జోరు

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే : రాజధాని నగరంలో నమ్మ మెట్రోలో ప్రయాణ ఛార్జీలు పెంచిన అనంతరం బీఎంటీసీ సేవలు వినియోగించుకుంటున్న వారి సంఖ్య గణనీయంగా పెరిగిందని సంబంధిత అధికారులు సంతోషం వ్యక్తం చేశారు. బీఎంటీసీలో సగటున నిత్యం 40 లక్షల మంది ప్రయాణిస్తుండగా, నాలుగు నెలల నుంచి ఈ సంఖ్య 42 లక్షలకు చేరుకుంది. రోజుకు రూ.6.90 కోట్ల ఆదాయం వచ్చేది, ఇప్పుడు రూ.7.2 కోట్లకు చేరుకుందని అధికారులు తెలిపారు. ఉద్యానగరంలో 6900 బస్సులు నిత్యం 54 వేల ట్రిప్పులు పరుగులు తీస్తుండగా, డిపోల్లో ఉన్న మరో 300 బస్సులను రహదారిపైకి తీసుకురావడంతో ట్రిప్పుల సంఖ్య 62 వేలకు పెరిగిందన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

చింతామణి, న్యూస్‌టుడే : మాలూరు తాలూకా బావనహళ్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కోరమంగల అర్చన (25) అనే మహిళ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇన్నోవా వాహనంలో వెళుతుండగా అదుపు తప్పి చెట్టును ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆమె భర్త ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పట్టాలపై మృతదేహం

హాసన, న్యూస్‌టుడే : శంకరపురం పోలీసు రాణాలో అరకెరె శివు భార్య విద్య (24) మృతదేహం అరసికెరె నగర రైల్వేస్టేషన్ సమీపంలో పట్టాల పక్కన బుధవారం లభించింది. దావణగెరె జిల్లా చెన్నగిరి తాలూకా సోమలాపుర గ్రామానికి చెందిన విద్యతో ఆరు నెలల కిందటే శివుకు వివాహమైంది. వివాహమైనప్పటి నుంచి కట్నం కోసం అత్తింటి వారు వేధించడంతో రైల్లో అరసికెరె వరకు వచ్చి ఆత్మహత్య చేసుకుందని విద్య తల్లిదండ్రులు ఆరోపించారు. అరసికెరె రైల్వే పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

రెండిళ్లలో నగదు, బంగారం చోరీ

పావగడ, న్యూస్‌టుడే : పట్టణంలోని శ్రీదేవి లేఅవుట్‌లో నివాసముంటున్న చాంద్‌పాషా ఇంట్లో చోరీ జరిగింది. మంగళవారం రాత్రి దొంగలు ఇంటి వెనుక గేటు తాళాలను పగులకొట్టి ఇంట్లో చొరబడి అల్మరాలో దాచిన రూ.30 వేల నగదు, 20 గ్రాముల బంగారు ఆభరణాలను చోరీ చేశారు. అదే వీధికి చెందిన చఫాయత్ ఇంటి తాళాలు పగులకొట్టి 15 గ్రాముల బంగారు ఆభరణాలను దోచుకెళ్లినట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ విజయ్‌కుమార్, ఏఎస్ఐ తిమ్మరాజు దర్యాప్తు చేపట్టారు.

కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పత్రాల పంపిణీ

బెంగళూరు (బ్యాటరాయణపుర), న్యూస్‌టుడే : బ్యాటరాయణపుర నియోజకవర్గంలోని విద్యారణ్యపుర కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఈ-ఖాతా పత్రాలను పార్టీ నాయకులు హరినాయుడు, లక్ష్మీహరి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ గ్యారంటీ పథకాల ద్వారా పేద వర్గాలు అభివృద్ధి చెందుతున్నారన్నారు. తమ వార్డులో 768 మందికి ఈ-ఖాతా చేశామన్నారు, ప్రతి ఒక్కరూ ఈ-ఖాతా చేయించుకొని ఆస్తులను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, సురేష్, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పత్రాలు అందజేస్తున్న హరినాయుడు, తదితరులు

24 కేంద్రాల్లో పదో తరగతి పరీక్షలు

సమావేశంలో మాట్లాడుతున్న కుమారస్వామి, అధికారులు

చిత్రదుర్గం : ఈ నెల 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జిల్లాలో జరుగనున్న మూడో దశ పదో తరగతి పరీక్షలకు 7,453 విద్యార్థులు హాజరవుతారని, 24 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అదనపు జిల్లా పాలనాధికారి కుమారస్వామి పేర్కొన్నారు. బుధవారం ఇక్కడ పరీక్షల నిర్వహణపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చిత్రదుర్గం తాలూకాలో 7, చెళ్లకెరలో 6, హిరియూరులో 4, హొసదుర్గంలో 3, హొళల్కెర, మొలకాల్మూరు తాలూకాల్లో రెండు చొప్పున కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పరీక్షల్లో ఎలాంటి అవకతవకలకు అవకాశం లేకుండా కట్టుదిట్టంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో విద్యాశాఖ అధికారి తిప్పేస్వామి, డైట్ ప్రిన్సిపల్ నజీరుద్దీన్, ఆరు తాలూకాల విద్యాశాఖ అధికారులు, పరీక్షల కేంద్రాల ముఖ్యులు పాల్గొన్నారు.

'పాక్ నాయకత్వం దారుణం'

బెంగళూరు (శివాజీనగర): ప్రపంచ సంస్థల నేతృత్వం వహించే బాధ్యతను పాకిస్థాన్ అప్పగించడం అంటే తోడేలుకు గొర్రెలను అప్పగించడమేనని కర్ణాటక కాంగ్రెస్ వ్యవహారాల బాధ్యుడు రణదీప్ సింగ్ సూర్జేవాలా వ్యాఖ్యానించారు. కర్ణాటక ప్రదేశ్ కాంగ్రెస్ సమితి కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇప్పటికే ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తున్న దేశంగా పాకిస్థాన్ పేరొందిన విషయం, ఇప్పుడు ఉగ్రవాదుల నియంత్రణ సమితి ఉపాధ్యక్ష స్థానాన్ని పాక్‌కు అప్పగించడం కంటే చేసేది వ్యవహారమని విమర్శించారు. శ్రీలంక, బంగ్లాదేశ్, నేపాల్, మాల్దీవులకు ప్రధాన మంత్రి నరేంద్రమోదీ సహాయం చేసినా.. ఒక్కరు కూడా భారత్‌కు మద్దతుగా నిలవడం లేదన్నారు. ప్రధాని మోదీ రూ.8 వేల కోట్ల జెట్ విమానాల్లో ప్రపంచ యాత్రలు చేసినా, ఏ దేశం భారత్‌కు మద్దతు ఇవ్వడం లేదన్నారు. గత పదేళ్లలో ప్రపంచ పర్యటనల కోసం రూ.10 వేల కోట్లను ఖర్చు చేశారని ఆరోపించారు. ఇన్ని జరుగుతున్నా రక్షణ శాఖ మంత్రి రాజనాథ్ సింగ్ మౌనంగా ఎందుకు ఉన్నారని ప్రశ్నించారు. ప్రపంచ వేదికపై మోదీ నేతృత్వంలోని ప్రభుత్వానికి ఇది ఎదురుదెబ్బ అని వ్యాఖ్యానించారు.

మస్కల్ గ్రామ పంచాయతీ అధ్యక్షురాలిగా ఉమాదేవి

తుమకూరు, న్యూస్‌టుడే : తుమకూరు రూరల్ గూళూరు హోబళి మస్కల్ గ్రామ పంచాయతీ నూతన అధ్యక్షురాలిగా ఉమాదేవి గంగరాజు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు ప్రకటించారు. అధ్యక్షురాలిగా ఉన్న కమలాక్షి చంద్రశేఖర్ రాజీనామా చేయడంతో ఖాళీగా ఉన్న అధ్యక్ష స్థానానికి బుధవారం ఎన్నిక నిర్వహించారు. అధ్యక్ష స్థానానికి ఉమాదేవి గంగరాజు ఒక్కరే నామినేషన్ వేయగా.. ఎన్నికల అధికారులు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఈ పంచాయతీలో 15 మంది సభ్యులు ఉన్నారు. ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌తో పాటు సభ్యులందరూ హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షురాలిని జిల్లా పంచాయతీ మాజీ సభ్యుడు రామచంద్రప్ప, తాలూకా భాజపా ప్రధాన కార్యదర్శి సిద్దేగౌడ, ప్రతినిధులు సంజీవయ్య, ఉమేష్, మంజణ్ణ, విజయకుమార్ తదితరులు అభినందించారు.

ఉమాదేవిని సత్కరించిన సభ్యులు, నాయకులు

వర్ధమాన రంగాల్లో రాణించాలి

కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కార్తిక్‌శెట్టి, బాలకృష్ణశెట్టి తదితరులు

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : విద్యార్థులు, సంప్రదాయ వృత్తులే కాక లాజిస్టిక్స్ వంటి వర్ధమాన రంగాల్లో ఆసక్తి కనబరచాలని మంగళూరు షిప్పింగ్ ఏజెన్సీ సీఈవో కార్తిక్‌శెట్టి తెలిపారు. బుధవారం ఆళ్వాస్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ లాజిస్టిక్స్, షిప్పింగ్ రంగాలు ఆర్థికాభివృద్ధిలో ముందున్నాయన్నారు. కార్యక్రమంలో పాలనాధికారి బాలకృష్ణశెట్టి, నిర్వహణ విభాగం ముఖ్యురాలు సురేఖారావు, సహాయక అధ్యాపకులు పాల్గొన్నారు.

సైబర్ నేరగాళ్లకు సాయం

బెంగళూరు (జేపీనగర), న్యూస్‌టుడే : సైబర్ నేరగాళ్ల కోసం బ్యాంకు ఖాతాలు సృష్టించి ఇస్తున్న మండ్య జిల్లా ఛత్రద హొసహళ్లి గ్రామానికి చెందిన ఎన్ లక్ష్మీశ్, తాతగుణి సమీపంలోని అగర నివాసి ప్రకాశ్, జేపీనగర ఏడో స్టేజ్ సంతృప్తినగర నివాసి సునీల్ కుమార్, రామనగర జిల్లా అర్చకరహళ్లి నివాసి పుట్టస్వామయ్యలను నిందితులుగా గుర్తించారు. పేదలకు నగదు ఆశచూపించి వారితో బ్యాంకు ఖాతా తెరిపించేవారు. ఆ ఖాతాల నిర్వహణకు నిందితులకు అప్పగించేవారు. సైబర్ నేరగాళ్ల ప్రజలను వంచించి, ఆ ఖాతాలకు నగదు మళ్లించుకునేవారని పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి ఒక ల్యాప్‌టాప్, 4 చరవాణులు జప్తు చేసుకున్నారు.

అన్నదాతలకు రమ్య మద్దతు

బెంగళూరు (రామమూర్తినగర) : దేవనహళ్లి తాలూకా చెన్నరాయపట్టణ హోబళి చుట్టుపక్కల గ్రామాల రైతుల నుంచి పారిశ్రామిక అభివృద్ధి మండలి బలవంతంగా భూములు లాక్కోనడం సరికాదని మండ్య మాజీ ఎంపీ, సీనియరు నటి రమ్య వ్యాఖ్యానించారు. రైతులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూపించకుండా, పరిహారం, ఉద్యోగ భరోసా ఇవ్వకుండా చక్కని ఫలసాయం అందిస్తున్న భూములను లాక్కోనే బదులు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కరుణ చూపించాలంటూ ఆమె ట్వీట్ చేశారు.

సేవలను సద్వినియోగం చేసుకోవాలి

బెంగళూరు (పీణ్యాదాసరహళ్లి) న్యూస్‌టుడే : శెట్టిహళ్లివార్డు, కమ్మగుండనహళ్లి వార్డుల ప్రజల కోసం బెంగళూరు వన్ కేంద్రం ఏర్పాటు చేయించామని మాజీ విద్యాసమితి అధ్యక్షుడు కె.నాగభూషణం తెలిపారు. బుధవారం అబ్బిగిరిలోని బీబీఎంపీ బెంగళూరు వన్ కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. అక్కడ ఆధార్‌కార్డుల కోసం వచ్చిన ప్రజలతో మాట్లాడారు. ఆన్‌లైన్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కన్నడ సేవ అబ్బిగిరి అధ్యక్షుడు జేమ్స్, బీబీఎంపీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యాలయాన్ని పరిశీలిస్తున్న నాగభూషణం, తదితరులు

బైక్‌ట్యాక్సీలపై విచారణ

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే : బైక్ ట్యాక్సీ సేవలను రద్దు చేయడంతో నగరంలో వాహన రద్దీ సమస్యలు తీవ్రం అయ్యాయని ఆ సేవలు అందిస్తున్న సంస్థల తరపు న్యాయవాది హైకోర్టులో బుధవారం గట్టిగా వాదించారు. బైకు ట్యాక్సీలతో ప్రయాణికుల భద్రత గాలిలో దీపంగా మారిందంటూ ఒక ప్రయాణికురాలి తరపున న్యాయవాది జయ్నా కొఠారి వాదనలు వినిపించారు. ఈ సేవలను రద్దు చేసేందుకు ముందుగా మహిళా ప్రయాణికుల అభిప్రాయాలను కూడా సేకరించవలసి ఉందని ఓలా, ఉబర్, ర్యాపిడో సంస్థల తరపు న్యాయవాది అభిప్రాయపడ్డారు. వాదనలను ఆలకించిన జస్టిస్ వి.కామేశ్వరరావు, జస్టిస్ సీఎం జోషి పీఠం విచారణను శుక్రవారానికి వాయిదా వేశారు.

మహిళకు ఆర్థిక స్వేచ్ఛ అవసరం

సమావేశంలో పాల్గొన్న మహిళా ప్రతినిధులు

బెంగళూరు (మల్లేశ్వరం), న్యూస్‌టుడే : మహిళా పారిశ్రామికవేత్తలు, ఆర్థిక రంగానికి చెందిన యువతులు తమ వ్యాపార విస్తరణకు, సాధికారత కల్పించేందుకు ప్రపంచ ఆర్థిక సాంకేతిక సంస్థ అస్పైర్ ఫర్ హర్ 'షీ ఎక్స్‌పోర్ట్' పేరిట సదస్సును నిర్వహించింది. ఈ ఏడాది చివరకు పది లక్షల మంది మహిళలను, 2030 నాటికి పది లక్షల మంది యువతులకు సాధికారత కల్పించే లక్ష్యాన్ని కలిగి ఉన్నామని నిర్వాహక ప్రతినిధులు ఆండ్రూ కొలిస్టర్, జూహి సంతాని తెలిపారు. ఐటీ, బీపీఓ రంగాల్లో లాభదాయకతను కలుపుకుని ఉపాధిని పొందే వినూత్న, స్థిరమైన వ్యాపార నమూనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పయనీర్ ఇండియా సంస్థ ఉపాధ్యక్షుడు గౌరవ్ సిసోడియా తెలిపారు. తాము 18 రాష్ట్రాల్లో 120కు పైగా ప్రముఖ మహిళా పారిశ్రామికవేత్తలు, యువ మహిళా వ్యాపారవేత్తల కోసం అవగాహన శిబిరాలను నిర్వహిస్తున్నామని వివరించారు.

చిరుత పిల్లను బంధించిన రైతులు

చింతామణి, న్యూస్‌టుడే : చిక్కబళ్లాపుర జిల్లా గుడిబండే తాలూకా వర్లకొండ వద్ద రామకృష్ణప్ప అనే రైతు తన పొలంలో పనిచేస్తుండగా హఠాత్తుగా ఓ చిరుత పిల్ల అతనిపై దాడిచేసింది. రైతు కేకలు వేయడంతో సమీపం పొలాల్లో ఉన్న రైతులు, కూలీలు వచ్చి చిరుతను చుట్టుముట్టి బంధించారు. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించి చిరుతను వారికి అప్పగించారు.

ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించిన సప్తమీగౌడ

బెంగళూరు (క్రీడలు), న్యూస్‌టుడే : యలహంకలో చర్మవ్యాధి నిపుణుల నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఓ క్లినిక్‌ను సినీనటి సప్తమీగౌడ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెటింగ్ ప్రతినిధి మాట్లాడుతూ చర్మం, జుట్టు సంరక్షణకు డిమాండ్ పెరుగుతోందన్నారు. ఏరోలెస్, మెటిమలు, యాంటిఏజింగ్, పిగ్మెంటేషన్ తదితర చర్మ సమస్యలకు కొత్త సాంకేతిక విధానాలతో వినియోగదారులకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

నిర్వాహకులతో కలిసి క్లినిక్‌ను ప్రారంభిస్తున్న సప్తమీగౌడ

విద్యార్థులకు దాతల సాయం అవసరం

బెంగళూరు (యడియూరు), న్యూస్‌టుడే : ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు దాతల సాయం చాలా అవసరమని, దాతల తోడ్పాటులో విద్యార్థులు చక్కగా రాణిస్తారని ఎమ్మెల్యే గోపాలయ్య తెలిపారు. ఇక్కడ మహాలక్ష్మి లేఅవుట్ వృషభావతి నగరలోని వాజ్‌పేయీ ప్రభుత్వ పాఠశాలల్లో మహాలక్ష్మి ఎడ్యుకేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో రాత పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఉప మేయర్ హేమలతా గోపాలయ్య, హర్ష ఆసుపత్రి ఎండీ శివ, డాక్టర్ మన్మన్‌గౌడ, అంజనప్ప, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ఎమ్మెల్యే గోపాలయ్య, తదితరులు

(c) eenadu

బళ్ళారి
● బళ్ళారి ● రాయచూరు ● కొప్పళ ● విజయనగర ● చిత్రదుర్గ

జడ్పీ సీఈవోకు ప్రశంసా పత్రం

రాహుల్ తుకారాం

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లా పంచాయతీ సీఈవో రాహుల్ తుకారాం పాండే రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అధ్యక్షతన మే 14న బెంగళూరులో కేంద్ర వలయ పథకాల ప్రగతిని సమీక్షించారు. మట్టి సారవంతం, ప్రధాన మంత్రి కృషి సించాయి, ప్రధాన మంత్రి మాతృ వందన, జాతీయ వికాస్ పథకాలు, గ్రామీణ ఉపాధి పథకం, ఉద్యాన పంటల మిషన్ తదితర యోజనలు జిల్లాలో గణనీయ అభివృద్ధి సాధించాయని గుర్తించిన సీఎం ప్రశంసా పత్రానికి సిఫార్సు చేశారు. జడ్పీలోని వివిధ విభాగాల అధికారుల నిబద్ధత, శ్రమ వల్లనే ప్రభుత్వ పథకాలు విజయవంతమయ్యాయని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ శాలిని రజనీశ్ అభినందించారు. ఈ సాధనలు ఇతర జిల్లాలకు ప్రేరణగా నిలిచిందని పేర్కొన్నారు.

ఆలమట్టిలో 88 టీఎంసీల నీరు

రాయచూరు: ఎగువ భాగం నుంచి వరద ప్రవాహం ముంచెత్తడంతో ఆలమట్టి జలాశయంలోకి ఇబ్బడి ముబ్బడిగా వస్తోంది. డ్యాంలో నీటి మట్టం క్రమేణా పెరుగుతోంది. భర్తీ కావటానికి 34.578 టీఎంసీల నీరు చేరాలి. బుధవారం సాయంత్రానికి 88.503 టీఎంసీల నీటి మట్టం నమోదైంది. ఒక రోజులో 1.531 టీఎంసీలు అదనంగా చేరాయి. మహారాష్ట్ర కొయ్నా డ్యాం నుంచి 98,278 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 80 వేల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. ఆలమట్టికి దిగువన ఉన్న నారాయణపురలో కొన్ని రోజులుగా నీటి సామర్థ్యం నిలకడగా ఉంటోంది. ప్రస్తుతం 26.58 టీఎంసీల నిల్వ ఉంది. పై ప్రాంతం నుంచి 80 వేల క్యూసెక్కులు చేరుతుంటే.. 26 గేట్లను ఎత్తేసి కిందకు 76,330 క్యూసెక్కులను విడుస్తున్నారు. కృష్ణా ఆయకట్టు ప్రదేశానికి జులై 8 నుంచి 120 రోజుల పాటు సాగునీటిని సరఫరా చేయాలని తీర్మానించారు.

భోగ నందీశ్వర వైభవం

మంత్రివర్గం కదలిరాకతో సందడి

ఆలయం ఆవరణలో మంత్రులు, ఎమ్మెల్యేలతో ముఖ్యమంత్రి

చిక్కబళ్లాపుర, న్యూస్‌టుడే: బెంగళూరు నగరానికి చేరువలోని నంది బెట్టపై మంత్రివర్గ సమావేశానికి వెళ్లేందుకు ముందుగా.. కొండ దిగువన చారిత్రక భోగ నందీశ్వరుని ఆలయంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, ఆయన మంత్రివర్గ సహచరులు పూజలు చేసి, ఆ పరిసరాల్లో కలియతిరిగారు. ఆలయ ముఖ మండపం, పుష్కరిణి చెంత ఫొటోలకు ఫోజులిచ్చి సందడి చేశారు. చిక్కబళ్లాపుర జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు ప్రదీప్ ఈశ్వర్, సుబ్బారెడ్డి, మంత్రి డాక్టర్ ఎంసీ సుధాకర్, మాజీ మంత్రి శివశంకర్‌రెడ్డి తదితరులు ముఖ్యమంత్రిని సత్కరించారు. ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి తనకు రెండు కళ్లలాంటి వారని ప్రదీప్ ఈశ్వర్ పేర్కొన్నారు. తన హృదయాన్ని చీల్చితే శివకుమార్ ఉంటారని, ఆయన కోసం తాను ప్రాణ త్యాగం చేసేందుకు సిద్ధమని ప్రకటించారు. ముఖ్యమంత్రి మార్పునకు సంబంధించి జరుగుతున్న ప్రచారంపై తాను వ్యాఖ్యలు చేసేంత పెద్దవాడిని కాదన్నారు. ఐదేళ్లూ తానే ముఖ్యమంత్రిని అని సిద్ధరామయ్య చేసిన వ్యాఖ్యలకు ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ స్పందిస్తూ.. ముఖ్యమంత్రి అలా అన్న అనంతరం నేనేమి వ్యాఖ్యానించాలని ప్రశ్నించారు. నన్ను ముఖ్యమంత్రి చేయండంటూ ఎవరిపైనా ఒత్తిడి తీసుకురావడం లేదన్నారు. సిద్ధరామయ్యకు మద్దతు ఇవ్వడం మినహా నేనేం చేయలేనని అన్నారు. ప్రభుత్వం ఏ పనీ చేయడం లేదని భాజపా నాయకులు చేస్తున్న ఆరోపణలకు భోగ నందీశ్వరుని ఆలయం ఆవరణలో ముఖ్యమంత్రి అచ్చంగా ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ శైలిలో బదులిచ్చారు. భాజపా నాయకులు నిధులన్నీ ఖాళీ చేసి వెళ్లినా తాము ఉత్తమ పాలన అందిస్తున్నామని వ్యాఖ్యలు చేశారు. మంత్రివర్గ సభ్యులతో కలిసి బృంద చిత్రం దిగే సమయానికి డీకే శివకుమార్ రాకపోవడంతో మిగిలిన వారితోనే ఆయన ఫొటో దిగారు. నంది గ్రామంలో స్థానికుల కోసం ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్, ఇతర కాంగ్రెస్ నేతలు మాంసాహార వంటకాలను సిద్ధం చేయించారు. విందు కోసం 500 కిలోల వేటమాంసం, 800 కిలోల కోడి మాంసాన్ని తెప్పించారు. స్థానిక సమస్యలను పరిష్కరించేందుకు, ఎక్కువ నిధులు కేటాయించేందుకు మంత్రివర్గంతో కలిసి ముఖ్యమంత్రి నందిబెట్టకు రావడం నూతన చరిత్ర అని ప్రదీప్ ఈశ్వర్ పేర్కొన్నారు.

వివిధ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న నేతల బృందం

అటు ఆనందం.. ఇటు ఆవేదన

అగమ్యగోచరంగా సాగు పరిస్థితి

కడగండొడ్డిలో మొగ్గదశలో ఉన్న పత్తి

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లాలో వ్యవసాయ పరంగా విభిన్న పరిస్థితులు నెలకొన్నాయి. తుంగభద్ర ఎడమకాలువ, నారాయణపుర కుడి కాలువ (కృష్ణా నది)లకు సాగునీటిని విడుదల చేయాలని నీటి పారుదల సలహా సమితి సమావేశాల్లో తీర్మానించారు. గత కొన్నేళ్లుగా జులై తొలి వారంలో నీటి సరఫరాకు మొగ్గు చూపడం ఇదే తొలిసారి. కాలువల కింద సాగుచేస్తున్న రైతులు ఉత్సాహంతో సేద్యం పనులకు సంసిద్ధమవుతున్నారు. రెండో పంటకు నీరు దక్కగలదన్న ఆకాంక్ష అన్నదాతల్లో కన్పిస్తోంది.

నైరాశ్యంతో మెట్ట ప్రాంత రైతులు

జిల్లాలో వర్షాధారిత ప్రాంతంలోని మెట్ట రైతులను నైరాశ్యం ఆవహించింది. నైరుతికి ముందు మేలో మురిపించిన వానలు జూన్‌లో ముఖం చాటేశాయి. మే చివరిలో నాటిన పత్తి, కంది, సజ్జ విత్తనాలు మొగ్గ తొడిగాయి. నెల రోజులుగా సరిగా వర్షం పడనందున సాగు మొగ్గ దశలోనే ఆగిపోయింది.. ఆకాశంలో మబ్బులు ఊరిస్తున్నాయే కానీ మోస్తరు వాన జాడ లేదు. చిటపట చినుకులు పలుకరిస్తున్నాయి. అత్యధిక గ్రామాల్లో సాధారణ వర్షపాతం నమోదు కాలేదు. మాదిరి వర్షం పడినా గట్టెక్కుతామని కర్షకులు భావిస్తూ నిత్యం ఆకాశం వైపు ఆశగా చూస్తున్నారు. అనావృష్టి పరిస్థితులు గోచరిస్తున్నాయి.

జూన్‌లో 17 శాతం లోటు

గత నెలలో సాధారణ వర్షపాతం 86 మి.మీ. పడాలి. 69 మి.మీ. కురిసింది. దీంతో 17 శాతం లోటు ఏర్పడింది.

ఫలితంగా 35 శాతం మాత్రమే వ్యవసాయ పనులు ఊపందుకున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందు మేలో 65 మి.మీ. నమోదు కావాల్సి ఉండగా.. ఏకంగా 191 మి.మీ. కురిసింది. అవసరమైన సమయంలో కురవడం లేదని రైతులు వాపోతున్నారు. గతేడాది సాగును రక్షించుకునేందుకు ట్యాంకర్ల ద్వారా పొలాలకు నీళ్లు చల్లారు.

జులైలో విత్తనం వేస్తే దిగుబడి పతనం

- లక్ష్మణగౌడ (జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు)

వారం రోజుల్లో వాన రాకపోతే నిండా మునిగిపోతాం. ఆ తర్వాత పడినా దిగుబడి తగ్గుతుంది. రోహిణి కార్తెలో వర్షం పడితే ఇంటికి గింజలు చేరినట్లే అని పెద్దలు చెప్పేవారు. ఇప్పుడు పరిస్థితి తారుమారైంది. రైతులకు దిక్కుతోచడం లేదు. ఆ దేవుడే కాపాడాలి.

ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయరూ

డిమాండ్లను తెలియజేస్తున్న ప్రతినిధులు

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీ ఉపాధ్యాయ ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, అతిథి గురువులను నియమించుకోవాలని సర్కారీ పాఠశాల అభివృద్ధి వేదిక ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ప్రతినిధులు విద్యా పాటిల్, సయ్యద్ హఫిజుల్లా, అక్కమ్మ, మారెమ్మ, భీమమ్మ, వీణా నాయకత్వంలో జిల్లా పాలనాధికారి కార్యాలయం అధికారికి వినతి పత్రం అందజేశారు. పాఠశాలల్లో మౌలిక వసతులను సమకూర్చాలని, బోధనా నాణ్యత ప్రమాణాలు పెంచాలని, సమస్యల అధ్యయనానికి ముఖ్యమంత్రి, విద్యా, సాంఘిక సంక్షేమ, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రులతో ఉన్నత స్థాయి సమితిని నియమించాలని కోరారు.

పోలీస్ అధికారిపై వేటు

బెళగావి: గోవులను అక్రమంగా కబేళాకు తరలిస్తున్న నిందితులను అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఘటనలో నిందితుల చేతిలో దాడికి గురైన శ్రీరామ సేన కార్యకర్తలు ఇచ్చిన ఫిర్యాదును స్వీకరించని హుక్కేరి ఠాణా ఎస్సై నిఖిల్ కాంబ్లేను సస్పెండ్ చేస్తూ ఎస్పీ భీమా శంకర్ గుళేద్ ఆదేశాలు ఇచ్చారు. నిందితుల వివరాలు, వాహనం నంబరు చెప్పినా నిఖిల్ నిర్లక్ష్యంగా వ్యవహరించారని ప్రాథమిక విచారణలో గుర్తించి సస్పెండ్ చేస్తూ ఆదేశాలు ఇచ్చారు.

పనిచేసిన చోటే చోరీలు

బెంగళూరు (మారతహళ్లి), న్యూస్‌టుడే: తన బెట్టింగ్ అవసరాలకు తాను పని చేసిన కంపెనీలో 56 ల్యాప్‌టాప్‌లు, 16 ఐఫోన్లు దొంగతనం చేసిన సుబ్రహ్మణ్య ప్రసాద్ (34) అనే మాజీ ఉద్యోగిని ఎలక్ట్రానిక్ సిటీ ఠాణా పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. మంగళూరుకు చెందిన నిందితుడు కొద్ది నెలల కిందట పని మానేశాడు. అంతర్గతంగా జరిగిన ఆడిట్‌లో ఎలక్ట్రానిక్ ఉపకరణాలు దొంగతనం అయ్యాయని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు అందింది. దర్యాప్తు పూర్తి చేసి నిందితుడ్ని అరెస్టు చేశారు.

బంగారు దుకాణానికే కన్నం

బెంగళూరు (కృష్ణరాజపురం), న్యూస్‌టుడే: సీగేహళ్లి సమీప భవానీ జ్యువెలర్స్‌లో దొంగతనానికి పాల్పడిన ఐదుగురు నిందితులను కేఆర్‌పుర ఠాణా పోలీసులు అరెస్టు చేశారు. కెంగేరికి చెందిన నారాయణలాల్, కీర్తరామ్, మహేంద్ర గహ్లోత్, పుష్పేంద్ర సింగ్‌లు ప్రధాన నిందితులు కాగా, వారి నుంచి బంగారాన్ని కొనుగోలు చేసిన దిలీప్‌ను కూడా పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.50 లక్షల విలువైన 478 గ్రాముల ఆభరణాలను జప్తు చేసుకున్నామని అధికారులు బుధవారం వెల్లడించారు. నగరంలో ఫినాయిల్ విక్రయించుకునే నారాయణ లాల్ నగల దుకాణంలో భద్రత తక్కువగా ఉంటుందని గుర్తించి తన సహచరులతో కలిసి గోడకు కన్నం వేసి దొంగతనం చేశాడని ప్రాథమిక విచారణలో గుర్తించారు.

ఒకే ఇంట్లో వరుస చోరీలు

బెంగళూరు (మల్లేశ్వరం): బసవేశ్వరనగరలోని ఒక ఇంట్లో నెల రోజుల్లో ఒక దొంగ రెండుసార్లు దొంగతనానికి పాల్పడ్డాడు. టెర్రస్‌పై ఉన్న సౌర విద్యుత్తు ఫలకంపై ఉన్న స్టీలు, రాగి తీగలను నెల రోజుల కిందట దొంగిలించుకుని వెళ్లాడు. మళ్లీ రెండు రోజుల కిందట వచ్చి టెర్రస్‌పై ఉంచిన వస్తువులను దొంగిలించుకుని వెళ్లినట్లు సీసీ కెమెరా ఫుటేజ్ ఆధారంగా గుర్తించిన ఇంటి యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫుటేజ్ ఆధారంగా నిందితుని కోసం బసవేశ్వరనగర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

హత్య కేసులో అన్నదమ్ముల అరెస్టు

శివమొగ్గ, న్యూస్‌టుడే: కుంశి కుంబేశ్వర వీధిలో వసంత్ అలియాస్ వాసు అనే వ్యక్తిని హత్య చేసిన హరీశ్ (23), ఆకాశ్ (21) అనే అన్నదమ్ములను పోలీసులు అరెస్టు చేశారు. పాత గొడవలను దృష్టిలో ఉంచుకుని బైకులో ఒంటరిగా వస్తున్న వసంత్‌పై మచ్చుకత్తితో దాడి చేసి హత్య చేశారని కుంశి ఠాణా ఇన్‌స్పెక్టర్ దీపక్ తెలిపారు.

కోతులకు విషాహారం

చామరాజనగర, న్యూస్‌టుడే: గుండ్లుపేట తాలూకా కందేగాల-కొడసోగ గ్రామాల మధ్య 20కుపైగా కోతుల కళేబరాలను స్థానికులు గుర్తించారు. తోటల్లోకి వచ్చి పంటలను నాశనం చేస్తున్నాయని కొందరు రైతులు విషాహారాన్ని పెట్టడంతో అవి మరణించాయని అటవీశాఖ అధికారులు ప్రాథమిక విచారణలో గుర్తించారు. గుండ్లుపేట గ్రామీణ ఠాణా పోలీసుల సహకారంతో దర్యాప్తు చేపట్టామని అటవీశాఖ అధికారులు తెలిపారు.

కోళ్ల కోసం పోటాపోటీ

శివమొగ్గ, న్యూస్‌టుడే: కడూరు నుంచి సాగరకు కోళ్ల లోడుతో వస్తున్న లారీ ఆనందపురం చెరువు గట్టుపై మంగళవారం ఉదయం బోల్తా కొట్టింది. ఎదురుగా వచ్చిన కారును తప్పించే ప్రయత్నంలో డ్రైవరుకు స్టీరింగ్‌పై నియంత్రణ తప్పింది. సుమారు 700 కోళ్లు లారీ కింద పడి మరణించగా మరో 800 కోళ్లను స్థానికులు దొరకబుచ్చుకుని వెళ్లిపోయారు. క్యాంటర్ డ్రైవరు మౌనంగా వీక్షించడం మినహా ఏమీ చేయలేకపోయాడు. ఆనందపుర ఠాణా పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

తహసీల్దారుపై కేసు నమోదుకు ఆదేశం

బెంగళూరు (జయనగర), న్యూస్‌టుడే: తన ముందుకు వచ్చిన 53 కేసులను పరిష్కరించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన తహసీల్దారు అపూర్వ బిదరిపై క్రిమినల్ కేసును దాఖలు చేయాలని బెంగళూరు ప్రాంతీయ కమిషనర్ సంబంధిత జిల్లాధికారికి సిఫార్సు చేశారు. బెంగళూరు దక్షిణ ఉప విభాగం తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు ఒక్క కేసునూ ఆమె విచారణ చేయలేదని గుర్తించారు. భూ వివాదాలను పరిష్కరించకపోవడంతో ఈ విభాగం నుంచి ఎక్కువ కేసులు న్యాయస్థానాల వరకు వెళుతున్నాయని గుర్తించి ఈ సిఫార్సులు చేశారు.

అంతుచిక్కని 'హృదయ' వేదన

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: హాసనతో పాటు ఆయా జిల్లాల్లో చిన్నవయసులోనే గుండెపోటుకు గురై మరణించిన యువత, మధ్యవయసు వారి కుటుంబ సభ్యులను ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైద్యుల సమితి భేటీ అయ్యే ప్రక్రియను ప్రారంభమయ్యింది. జయదేవ ఆసుపత్రి వైద్యాధికారి నేతృత్వంలోని 12 మంది వైద్యులు ఆయా గ్రామాలకు వెళ్లి దర్యాప్తు ప్రారంభించారు. పొగ తాగడం, మద్యం అలవాటు, ఫాస్ట్‌ఫుడ్ ఎక్కువగా తినడం, కొవ్వు ఎక్కువగా ఉండడంతోనే ఎక్కువ మరణాలు జరిగాయని ప్రాథమిక దర్యాప్తు, బాధితుల వైద్య నివేదికల ఆధారంగా అంచనాకు వచ్చారు. కొవిడ్ సమయంలో వేసుకున్న టీకాతో మరణాలు సంభవించాయని జరుగుతున్న ప్రచారంలో వాస్తవం ఏమీ లేదని ఇప్పటికే కేంద్ర ఆరోగ్య శాఖ ప్రకటించిన విషయాన్ని ఆరోగ్య శాఖ అధికారి గౌరవ్ గుప్త స్పష్టం చేశారు.

యమనూరులో ఇద్దరు..

ధార్వాడ, న్యూస్‌టుడే: నవలగుంద పట్టణ శివారు ప్రాంతం యమనూరలో కేబుల్ ఆపరేటర్‌గా పని చేస్తున్న ఫకీరప్ప బణగార (45), ప్రైవేటు కంపెనీ ఉద్యోగి శంకరప్ప పూజార (44) ఇద్దరూ గుండెపోటుతో బుధవారం ఉదయం మరణించారు. ఇద్దరికీ ఛాతీలో నొప్పి వచ్చి పడిపోగా, చికిత్స కోసం నవలగుందలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఇద్దరూ మరణించారని వైద్యులు తెలిపారు.

ఛాతీ పట్టుకుని.. కుప్పకూలి..

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: ఛాతీలో నొప్పి రావడంతో ఆసుపత్రికి నడుచుకుంటూ వచ్చిన కోనప్ప (52) అనే వ్యక్తికి చికిత్స ఇచ్చేలోగా జీవన్మృతునిగా మారాడు. బుధవారం ఉదయం ఛాతీపట్టుకుని వచ్చిన కోనప్పను ఐసీయూలోకి తరలించేలోగా అపస్మారకస్థితికి వెళ్లి కుప్పకూలిపోయాడు. వైద్య పరీక్షల్లో అతను జీవన్మృతునిగా మారాడని వైద్యులు వెల్లడించారు.

ఇటు వైద్య విద్యార్థి..

లక్ష్మీపుత్ర కులకర్ణి

బాగలకోటె, న్యూస్‌టుడే: బాగల్‌కోటెలోని బీవీవీ సంఘం ఎస్.నిజలింగప్ప వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇంటర్న్‌షిప్ చేస్తున్న విద్యార్థి లక్ష్మీపుత్ర కులకర్ణి (24) గుండెపోటుతో బెంగళూరులో మరణించాడు. విజయపుర జిల్లా సింధగి తాలూకా కుమసగి గ్రామానికి చెందిన లక్ష్మీపుత్ర ఈ నెల 10కి ఇంటర్న్‌షిప్ పూర్తి కానుంది. సెలవు ఉండడంతో తమిళనాడుకు వెళ్లి, అక్కడి నుంచి బెంగళూరుకు వస్తూ మంగళవారం రాత్రి అస్వస్థతకు గురయ్యాడు. ఆసుపత్రికి తీసుకువెళ్లాక మరణించాడు.

కార్మికుల పని వేళలను పెంచొద్దు

ప్రదర్శనలో నినాదాలు చేస్తున్న కార్మికులు

రాయచూరు, న్యూస్‌టుడే : కార్మికుల పనివేళలను పెంచేలా కార్మిక చట్టంలో మార్పులు తేవొద్దని కోరుతూ 'ఏఐసీసీటీయూ' ఆధ్వర్యంలో బుధవారం స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద నిరసన ప్రదర్శనకు దిగారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు అజీజ్ జాగీర్దార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు మేలు చేసేందుకు 12 గంటల పనికి మొగ్గు చూపుతోందని, మహిళా కార్మికులతో రాత్రి వేళల పని చేయించుకోరాదన్న నిబంధనను ఎత్తివేస్తున్నారని దుయ్యబట్టారు. సగం రోజు పనిచేస్తే ఆరోగ్యంపై దుష్ప్రభావాన్ని చూపుతుందని, మహిళలు రాత్రి విధుల్లో ఉంటే వారిపై వేధింపులు పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. అంతర్జాతీయ కార్మిక సంస్థ నియమాల ప్రకారం 8 గంటలు పని, 8 గంటలు విశ్రాంతి, 8 గంటలు మనోరంజన కార్యక్రమానికి కేటాయించారని వివరించారు. వ్యతిరేక చట్టాన్ని రూపొందిస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. నిపుణుల సమితితో అధ్యయనం చేయించి, కార్మిక సంఘాలు వెల్లడించే ఇబ్బందులు విని, మెజారిటీ అభిప్రాయం మేరకు చట్టాన్ని అమలు చేయాలని సూచించారు.

భగవంతుడు అందరినీ చల్లగా చూడాలి

బూతలదిన్ని గ్రామంలో మొహరం ప్రార్థనల్లో భక్తులు

సింధనూరు, న్యూస్‌టుడే: వాతావరణం బాగుంది..రాష్ట్రం అంతటా విస్తారంగా వానలు కురుస్తున్నాయి, ఏడాది పొడవునా సస్యశ్యామలంగా ఉండి భగవంతుడు సకల జీవరాసులను చల్లగా చూడాలని భాజపా సీనియర్ నాయకుడు కె.కరియప్ప అన్నారు. ఆయన సింధనూరు తాలూకా బూతలదిన్ని గ్రామంలో హజరత్ మహబూబ్ సుభానీ కట్టా వద్ద ఏర్పాటు చేసిన మొహరం ప్రార్థనల్లో పాల్గొన్నారు. సద్గురు అబ్బాస్ ఆలీ శరణును దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందరూ కలిసి స్నేహభావంతో మొహరంను ఆచరించాలని కోరారు. అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు గ్రామంలో దేవతా సవారీలను ఊరేగించారు.

ఇంజినీరింగ్ ఫలితాల్లో నవోదయకు ఉత్తమ ర్యాంకులు

పృథ్వీరెడ్డి

సయ్యద్

రాయచూరు, న్యూస్‌టుడే : రాయచూరులోని నవోదయ విద్యాసంస్థ విద్యార్థులకు విశ్వేశ్వరయ్య సాంకేతిక విశ్వవిద్యాలయం (వీటీయూ) పరిధిలో మంచి ర్యాంకులు లభించాయి. ఇంజినీరింగ్ చివరి సంవత్సరం ఫలితాలను తాజాగా ప్రకటించారు. జి.పృథ్వీరెడ్డి (మెకానికల్)లో రెండో ర్యాంకు, సయ్యద్ మిస్కిన్ ఖాద్రి(ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్)లో ఐదో ర్యాంకు సాధించినట్లు విశ్వవిద్యాలయం అధికారులు ప్రకటించారు. ర్యాంకర్లను విద్యా సంస్థల ఛైర్మన్ ఎస్.రాజేంద్రరెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ తాడిపత్రి శ్రీనివాస్, ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ మల్లికార్జున అభినందించారు. నాణ్యమైన బోధన, మెరుగైన ప్రయోగశాలలు ఉన్నందున ఏటా మంచి ర్యాంకులు వస్తున్నట్లు ప్రిన్సిపల్ తెలిపారు. కర్ణాటకలోని సుమారు 200 కళాశాలలు వీటీయూ పరిధిలో ఉన్నాయి.

వసతి నిలయాన్ని మూసివేయవద్దు

ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థినులు

రాయచూరు: స్థానిక అరబ్ మొహల్లా ప్రాంతంలోని వెనుకబడిన వర్గాల బాలికల వసతి నిలయాన్ని కొనసాగించాలంటూ 'ఏఐడీఎస్‌వో' నాయకత్వంలో విద్యార్థినులు ప్లకార్డులు పట్టుకుని బుధవారం టిప్పుసుల్తాన్ ఉద్యానవనంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు హయ్యాళప్ప మాట్లాడుతూ ప్రస్తుతం వసతి నిలయంలో 40 మంది ఆశ్రయం పొందుతున్నారన్నారు. గ్రామాల నుంచి చదువుకునేందుకు నగరానికి వచ్చిన బాలికలు ఎక్కడ నివసించాలని ప్రశ్నించారు. ప్రైవేటు వసతి నిలయాల్లో వేల రూపాయల ఫీజులు కట్టే స్తోమత వారికి లేదన్నారు. హాస్టల్‌ను మూసివేయవద్దని బీసీ సంక్షేమశాఖ అధికారులపై ఒత్తిడి తెచ్చారు. వసతి గృహంలో చేరటానికి దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు అభయ్ దివాకర్, జిల్లా కార్యదర్శి బసవరాజ్, నందగోపాల్ పాల్గొన్నారు.

'క్యాట్' తీర్పుపై హైకోర్టు మెట్లెక్కుతాం

హోంమంత్రి డాక్టర్ పరమేశ్వర్ వెల్లడి

బెంగళూరు (సదాశివనగర), న్యూస్‌టుడే: ఐపీఎల్ క్రికెట్ పోటీల విజయోత్సవ వేళ.. బెంగళూరులోని చిన్నస్వామి క్రికెట్ మైదానం వద్ద తొక్కిసలాట ఘటనలో ఐపీఎస్ అధికారి వినయ్‌కుమార్‌ను ప్రభుత్వం సస్పెండ్ చేస్తూ ఇచ్చిన ఆదేశాలను సెంట్రల్ అప్పిలేట్ ట్రిబ్యునల్ (క్యాట్) రద్దు చేయడాన్ని ప్రశ్నిస్తూ ఉన్నత న్యాయస్థానం- హైకోర్టును ఆశ్రయిస్తామని హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్ తెలిపారు. అన్ని అంశాలనూ పరిగణనలోకి తీసుకున్న అనంతరమే ప్రభుత్వం ఐపీఎస్ అధికారులను సస్పెండ్ చేసిందన్నారు. బెంగళూరులోని తన నివాసం వద్ద కలుసుకున్న విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడారు. బళ్లారి కారాగారంలో ఖైదీల మధ్య ఘర్షణకు సంబంధించిన ఫొటో వైరల్ అయిన అంశం తన దృష్టికి వచ్చిందన్నారు. ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకుని మరోసారి అటువంటి ఘటన పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించానని చెప్పారు. ధార్వాడ ఏసీపీ నారాయణ బరమణ్ణి ముందస్తుగా పదవీ విరమణ (వీఆర్ఎస్) తీసుకుంటానని ప్రకటించిన విషయాన్ని గుర్తించానని చెప్పారు. ఆయనకు పోస్టింగ్ ఇవ్వకుండా వేధిస్తున్నట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. వేదికపై ముఖ్యమంత్రి కోపంతో చెయ్యెత్తినంత మాత్రాన కొట్టినట్లు కాదు కదా అని ప్రశ్నించారు. తుమకూరును బెంగళూరు ఉత్తర జిల్లాలో కలిపే విషయం మంత్రివర్గంలో చర్చ జరిగిన అనంతరమే తదుపరి ఆదేశాలు ఉంటాయని చెప్పారు. కొత్త జిల్లాగా పేరు మారినా, తుమకూరు పేరు మాత్రం మారదన్నారు. బెంగళూరు నుంచి తుమకూరు వరకు మెట్రో అవసరం ఉందన్నారు. మెట్రో వస్తే బెంగళూరులోనూ ట్రాఫిక్ ఒత్తిడి తగ్గుముఖం పడుతుందని తెలిపారు. వాల్మీకి కార్పొరేషన్‌లో అక్రమాలకు సంబంధించి సీబీఐ దర్యాప్తునకు బాధ్యతలు అప్పగిస్తూ ఉన్నత న్యాయస్థానం ఇచ్చిన ఆదేశాలపై తమకు ఎటువంటి అభ్యంతరం లేదన్నారు. కేసు విచారణ త్వరగా పూర్తయితే, అదే చాలని అన్నారు.

సోమలాపూరు పంచాయతీ ఉపాధ్యక్షుడి మృతి

నామాల నాగేశ్వరరావు (పాతచిత్రం)

సింధనూరు, న్యూస్‌టుడే: సింధనూరు తాలూకా సోమలాపూరు గ్రామ పంచాయతీ ఉపాధ్యక్షుడు, తెలుగు ప్రముఖుడు నామాల నాగేశ్వరరావు (72) బుధవారం స్థానిక ఆసుపత్రిలో మృతి చెందారు. ఈయనది సిరుగుప్ప మార్గంలోని వెంకటేశ్వరక్యాంపు. కొద్ది రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. మంగళవారం రాత్రి ఉన్నపళంగా అపస్మారక స్థితికి వెళ్లగా సింధనూరులోని ఓ ఆసుపత్రిలో చేర్చి వైద్యం అందించినా ఫలించలేదు. బుధవారం ఉదయం ఆయన మృతి చెందారు. నాగేశ్వరరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. బుధవారం వెంకటేశ్వరక్యాంపులో అంత్యక్రియలు పూర్తిచేశారు. మాజీ మంత్రి నాడగౌడ నాగేశ్వరరావు మృతి పట్ల ఆవేదన వ్యక్తం చేశారు.

టేబుల్ టెన్నిస్‌లో రాయచూరు విద్యార్థుల సత్తా

విజేతలతో నిర్వాహకులు

రాయచూరు, న్యూస్‌టుడే : జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల విజేతలను ప్రకటించారు. 14 ఏళ్ల లోపు బాలుర విభాగంలో వసురూప (ప్రథమ, ఇన్‌ఫెంట్ జీసెస్ పాఠశాల, రాయచూరు), కె.ఎన్.వివేకానంద (ద్వితీయ, మెలరోస్ పాఠశాల, రాయచూరు), బాలికల విభాగంలో తమన్నా ప్రథమ, మధుప్రియా ద్వితీయ (గ్లోబల్ విజన్, రాయచూరు) స్థానంలో నిలిచారు. 17 ఏళ్ల లోపు బాలుర విభాగంలో శరత్‌కుమార్ ప్రథమ, మణికంఠ ద్వితీయ (బ్లెసడ్ ఆల్ఫోన్, శక్తినగర్), బాలికల విభాగంలో కాజల్ ప్రథమ, బసవ లింగమ్మ ద్వితీయ (జీహెచ్ఎస్, యద్లాపూరు, రాయచూరు తాలూకా) స్థానాన్ని దక్కించుకున్నారు. మహిళల్లో శహగుప్తా (ప్రథమ, వ్యవసాయ విశ్వవిద్యాలయం), కాజల్ ద్వితీయ (జీహెచ్ఎస్ పాఠశాల, యద్లాపూరు), పురుషుల డబుల్ పోటీల్లో ప్రథమ స్థానాన్ని పృథ్వీరాజ్, నేసర్ ఇటగల్, ద్వితీయ స్థానాన్ని చెన్నబసయ్య, అయ్యణ్ణ, పురుషుల సింగిల్స్‌లో నేసర్ ఇటగల్ ప్రథమ, ద్వితీయ వసురూప సాధించారు. నిఖిల్ కుమార్ మంచాల్, శ్రేయా, రాఘవేంద్ర, ఆకాశ్‌లకు వ్యక్తిగత బహుమతులను ప్రకటించారు. జిల్లా యువజన సంక్షేమశాఖ, క్రీడా శాఖ, జిల్లా టేబుల్ టెన్నిస్ సంస్థ, రాయచూరు రోటరీ ఈస్ట్ ఆధ్వర్యంలో ఇండోర్ స్టేడియంలో జూన్ చివరిలో పోటీలు నిర్వహించారు. బాలుర, బాలికల విభాగంలో 85 జట్లు, మహిళలు, పురుషుల విభాగంలో 45 జట్లు పాల్గొన్నాయి. విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో టేబుల్ టెన్నిస్ సంస్థ అధ్యక్షుడు యు.లక్ష్మినారాయణ, రోటరీ ఈస్ట్ అధ్యక్షుడు హనుమంతరెడ్డి, ప్రతినిధులు కె.చంద్రకాంత్, రవీంద్ర కురి, రంగలింగనగౌడ, క్రీడాశాఖ అధికారి సంతోష్ పాల్గొన్నారు.

(c) eenadu

రక్తం పోటెత్తుతోంది.. తీపి తినేస్తోంది!

13.16 లక్షల మందికి ప్రాథమిక పరీక్షలు

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే : జిల్లాలో ఎన్‌సీడీ (నాన్ కమ్యూనికబుల్ డిసీజెస్) బారిన పడుతున్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. చాలా మందిలో రక్తం పోటెత్తుతోంది.. తీపి తినేస్తున్నట్లు ఎన్‌సీడీ 3.0 సర్వేలో తేలింది. అదేవిధంగా వయస్సుతో సంబంధం లేకుండా రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్, బ్రెయిన్ స్ట్రోక్, గుండెపోటు తదితర వాటి బారిన పడుతున్నారు. 18-60 ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరి ఆరోగ్య పరిస్థితిపై సర్వే చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఏఎన్ఎంలు ఎంఎల్‌హెచ్‌పీలు, నర్సింగ్ విద్యార్థులతో ఇంటి ఇంటి సర్వే చేపట్టారు. 13.16 లక్షల మందికి ఇటీవల ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు చేశారు. ఇందులో రక్తపోటు ఉన్నవారు 86,638, మధుమేహం బాధితులు 36,226 మంది, ఈ రెండింటితో బాధపడేవారు 57,485 మందిగా తేలింది.

భావితరం బాధలమయం

● స్కూల్ హెల్త్ ప్రోగ్రామ్ కింద ఈ విద్యా సంవత్సరంలో 3.14 లక్షల మంది పిల్లల ఎత్తు, బరువు వివరాలు నమోదు చేయనున్నారు. దీనికోసం 672 మంది ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలను నియమించనున్నారు. ఈనెల 10వ తేదీ తర్వాత విద్యార్థులకు స్క్రీనింగ్ పరీక్షలు చేయనున్నారు.

● మిషన్ వాత్సల్య కింద జిల్లా వ్యాప్తంగా చైల్డ్‌కేర్ ఇన్‌స్టిట్యూట్‌లోని అనాథ పిల్లలు.. పెద్దపాడులో 49, పత్తికొండ 37, కర్నూలులో ముగ్గురికి స్క్రీనింగ్ పరీక్షలు పూర్తి చేశారు.

● 'జిల్లావ్యాప్తంగా 13.16 లక్షల మందికి వైద్య పరీక్షలు నిర్వహించాం. క్యాన్సర్ బాధితులను గుర్తించి స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు రెఫర్ చేశాం' అని ఆర్‌బీఎస్‌కే సమన్వయకర్త డా.మహేశ్వరప్రసాద్ బుధవారం తెలిపారు.

క్యాన్సర్ కబళిస్తోంది

జిల్లాలో ఓరల్ క్యాన్సర్ అనుమానితులు 4,104 మందికి ప్రాథమిక పరీక్షలు చేయగా 41 మంది నిర్ధారణ అయింది. 2,355 మంది గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ అనుమానితులకు ఆరోగ్య సిబ్బంది పరీక్షలు నిర్వహించగా వారిలో 23 మందికి ఉన్నట్లు తేల్చారు. 1,758 మందికి రొమ్ము క్యాన్సర్ పరీక్షలు చేసి 45 మంది బాధితులను గుర్తించారు. వీరందరిని చికిత్స నిమిత్తం కర్నూలు సర్వజన ఆస్పత్రి ఆవరణలోని స్టేట్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌కు పంపారు. అక్కడ వీరికి మెరుగైన వైద్యం అందించనున్నారు. అవసరమైన పరీక్షలు సైతం చేస్తారు.

దరఖాస్తుల ఆహ్వానం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: ఇన్‌స్పైర్ మనక్ పురస్కారానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈవో శామ్యూల్‌పాల్ తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 6వ తరగతి నుంచి ఇంటర్ వరకు చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. ప్రాజెక్టు వివరాలను www.inspireaward-sndts.gov.in వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో రూ.10 వేలు, రాష్ట్ర స్థాయిలో రూ.25 వేలు, జాతీయ స్థాయిలో రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు నగదు బహుమతి ఉంటుందని చెప్పారు. 87901 11331ను సంప్రదించాలని కోరారు.

జలసవ్వడిపై రాళ్లు

పాణ్యం మండల పరిధిలో ఎస్సార్బీసీ కాల్వ అధ్వానంగా ఉంది. బనగానపల్లి రోడ్డులో కొణిదేడు వద్ద చాలాచోట్ల దెబ్బతింది. కాల్వలో రాళ్లు, విరిగిపడిన చెట్ల కొమ్మలు నీటి ప్రవాహానికి ఆటంకంగా మారాయి. నందవరం సమీపంలో కట్టకు మరమ్మతులు చేసేందుకు తెచ్చిన సిమెంటు పలకలు అక్కడే వదిలేశారు.

– ఈనాడు, కర్నూలు

పొదుపు ఖాతాకు కన్నం

పేదల పొదుపు సొమ్మును కాజేశారు.. ఖాతాదారుల సొమ్ముకు రక్షణగా నిలవాల్సిన వారే భక్షకులుగా మారారు. నగరంలోని " ది కర్నూలు అర్బన్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ"లో రూ.2.42 కోట్లు పక్కదారి పట్టిన వైనం తాజాగా వెలుగులోకి వచ్చింది. పాతబస్తీలోని కర్నూలు అర్బన్ బ్యాంకు 2010లో ది కర్నూలు అర్బన్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీగా ఏర్పాటైంది. నాలుగు వేల మంది సభ్యులున్నారు. వ్యాపారాన్ని పెంచుకునేందుకు 100 రోజుల కాలపరిమితితో రోజువారీ డిపాజిట్లు సేకరించారు. 2018-19 నుంచి 2021-22 వరకు పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్లు గుర్తించారు.

– న్యూస్‌టుడే, కర్నూలు సచివాలయం

కర్నూలు అర్బన్ బ్యాంకు.

రూ.2.42 కోట్లు స్వాహా

డైలీ డిపాజిట్లలో రూ.60 లక్షలు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, రికరింగ్ డిపాజిట్లు, సేవింగ్స్ డిపాజిట్లలో రూ.99 లక్షలు పక్కదారి పట్టించారు. షేర్ క్యాపిటల్ (మూలధనం) నగదు రూ.32 లక్షలు, చేతిలో ఉంచుకున్న నగదు రూ.10 లక్షలు, పాత బకాయిల వసూళ్లలో రూ.56 లక్షలు, నగదు పుస్తకంలోని కూడికల్లో రూ.3.50 లక్షలు, ఉద్యోగుల వేతనాల పేరుతో రూ.6 లక్షలు, ఇంకా ఇతరత్రా రూపాల్లో కలిపి మొత్తం రూ.2,42,76,980 సొమ్ము కాజేసినట్లు తేలిందని జిల్లా సహకార శాఖ అధికారి వెంకటకృష్ణ తెలిపారు.

విచారణ పేరుతో కాలయాపన

ఫిక్స్‌డ్ డిపాజిట్‌ల కాలపరిమితి పూర్తయినప్పటికీ తిరిగి ఇవ్వకపోవడంతో బాధితులు కర్నూలు ఒకటో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. 2021-22లో లావాదేవీలపై ఆడిట్ నిర్వహించగా రూ.40 లక్షల వరకు పక్కదారి పట్టినట్లు తేలింది. పెద్దఎత్తున ఫిర్యాదులు రావడంతో 2023 నవంబరులో సహకార అధికారులు విచారణకు ఆదేశించారు. నిధుల స్వాహా జరిగి మూడేళ్లవుతున్నా విచారణల పేరుతో కాలయాపన చేస్తున్నారే తప్ప నిందితులపై ఎలాంటి చర్యలు చేపట్టలేదు. 2018లోనే తగుచర్యలు తీసుకొని ఉంటే పేదల సొమ్ముకు రెక్కలొచ్చేవి కాదు.

కాపాడాల్సిన వారే కాజేశారు

2023 నవంబరు వరకు మాజీ కార్పొరేటర్ బాలరాజు పాలకమండలి ఛైర్మన్‌గా వ్యవహరించారు. సహకార చట్టంలో ఛైర్మన్, సీఈవోకు జాయింట్ చెక్ పవర్ ఉండాలి. కానీ ఇక్కడ మాత్రం నాన్ అఫీషియల్ పాలకమండలి ఛైర్మన్ అయిన బాలరాజు ఒక్కరికే చెక్ పవర్ ఉండడంతో అవినీతి అక్రమాలకు అడ్డూఅదుపు లేకుండా పోయింది. సొసైటీ ఏర్పాటైనప్పటి నుంచి 2023 నవంబరు వరకు బాలరాజు పాలకమండలి ఛైర్మన్‌గా వ్యవహరించారు. సొసైటీలో పని చేసే క్లర్క్ పదోన్నతిపై సీఈవో జాకీర్ బాషా 2022 వరకు పనిచేశారు. అదే సొసైటీలో క్లర్క్, క్యాషియర్, సీఈవోగా పనిచేసిన ఎస్.ఏ రఫీక్ పాత్ర ఉన్నట్లు తేలింది. బ్యాంకులో పనిచేస్తూ.. బ్యాంకుకే కన్నం వేశారు. పాలకమండలి ఛైర్మన్‌గా పనిచేస్తూ సహకార సొసైటీని అభివృద్ధి చేయాల్సిన వ్యక్తి.. ఆయనకు ఒక్కడికే చెక్ పవర్ ఉండడంతో తనను అడిగేదెవరూ అంటూ అందిన కాడికి దోచుకున్నారు.

ముగిసిన డీఎస్సీ పరీక్షలు కర్నూలు విద్య, న్యూస్‌టుడే: జిల్లాలో జూన్ 6వ తేదీ నుంచి జులై 2వ తేదీ వరకు జరిగిన డీఎస్సీ పరీక్షలు 51,510 మంది హాజరయ్యారు.

బుధవారపేటలో ఇంటింటికి తిరిగి ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

ఏడాది పాలనపై ప్రజల సంతృప్తి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: తమ ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలు పూర్తిగా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు 15వ వార్డు బుధవారపేటలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఆయన బుధవారం పర్యటించారు. వార్డులోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రజలతో మాట్లాడి సంక్షేమం, అభివృద్ధిని వివరించారు. స్థానికులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలుచేస్తున్న అన్ని పథకాలు అందుతున్నాయని చెప్పారు. వార్డులో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన సమస్యలు సైతం పరిష్కారమయ్యాయని చెప్పారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబుకు, మంత్రి టీజీ భరత్‌కు వారు ధన్యవాదాలు తెలిపారు. మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను వివరించడంతోపాటు ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు సీఎం చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమం చేపట్టారన్నారు. ఇచ్చిన అన్ని హామీలు నెరవేరుస్తున్నట్లు చెప్పారు. త్వరలో మరిన్ని పథకాలకు శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు బ్రాండ్‌తో రాష్ట్రానికి భారీగా పరిశ్రమలు వస్తున్నాయన్నారు. రాయలసీమను అభివృద్ధి చేసేందుకుగాను ఈ ప్రాంతానికి పరిశ్రమలు తీసుకొస్తున్నట్లు చెప్పారు. అనంతపురం నుంచి కర్నూలు వరకు ఇండస్ట్రియల్ కారిడార్ అభివృద్ధి చేస్తున్నట్లు పేర్కొన్నారు. మంచి పనులు చూసి ఓర్వలేక ప్రతిపక్ష పార్టీ నాయకులు ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తున్నారని అన్నారు.

నేడు ప్రైవేటు పాఠశాలలకు సెలవు

జిల్లాలోని ప్రైవేటు పాఠశాలలకు గురువారం సెలవు ప్రకటించినట్లు ఏపీ ప్రైవేటు పాఠశాలల యాజమాన్య సంఘం జిల్లా అధ్యక్షుడు వాసుదేవయ్య ఒక ప్రకటనలో తెలిపారు. కొందరు అధికారులు ప్రైవేటు పాఠశాలల్లో ఇష్టానుసారంగా తనిఖీ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలిపారు. విద్యాహక్కు చట్టం కింద అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా డీఈవో శామ్యూల్‌పాల్‌ను కలిసి వినతిపత్రం అందజేసినట్లు చెప్పారు. సరైన ధ్రువీకరణ లేకుండా ఆర్‌టీఈ కింద అడ్మిషన్లకు బలవంతం చేస్తున్నారన్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు విద్య

తుంగభద్ర తరలివస్తోంది

హాలహర్వి, న్యూస్‌టుడే: ఆంధ్ర, కర్ణాటక రాష్ట్రాలకు జీవనాడి తుంగభద్ర జలాశయం నిండు కుండులా తొణికిసలాడుతోంది. డ్యాం నుంచి బుధవారం రెండు గేట్లు తెరిచి సుమారు 12,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఎగువన వర్షాలు కురుస్తుండటంతో మధ్యాహ్నం మూడు గంటలకు 32,318 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. డ్యాంలో 1625.40 అడుగులకుగాను 77.81 టీఎంసీలు నీటి నిల్వ ఉందన్నారు. దీంతో రెండు గేట్లు నదికి, విద్యుత్తు ఉత్పత్తికి కలిపి 12,400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

మలిసంధ్య కంటతడి

■ సైబర్ నేరగాళ్ల వల ■ దాచుకొన్న సొమ్ము దోచేస్తున్నారు

కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన పంచాయతీ రాజ్ శాఖ విశ్రాంత ఇంజినీరును సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ పెట్టుబడి పేరుతో నమ్మించి రూ.54.44 లక్షలు కాజేశారు.

ఒంటరి జీవితం సాగిస్తున్న కోర్టు విశ్రాంత ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు ఈడీ పేరుతో బెదిరించి రూ.53.50 లక్షలు మోసగించారు.

.. ఇలా వృద్ధులను ఓ వైపు సైబర్ నేరగాళ్లు దోచేస్తున్నారు.. మరో వైపు ఏటీఎంలు మార్చేసి ఖాతాలో సొమ్ము స్వాహా చేస్తున్నారు. ఇంకోవైపు నేరగాళ్లు బరితెగించి వారి స్థలాలు కబ్జా చేస్తున్నారు.

కర్నూలు నేరవిభాగం, సచివాలయం న్యూస్‌టుడే : ఎన్నో కష్టాలు దాటుకొచ్చారు.. పిల్లలను పెంచి పెద్దచేశారు.. వారిని ఓ ఇంటి వారిని చేసి.. నేడు ఒంటరిగా నిలిచారు. ఇంత కాలం పడిన కష్టాలకు స్వస్తిపలికి.. మలిసంధ్య వేళ విశ్రాంత జీవనం సాగించాల్సిన వారిని సవాళ్లు చుట్టుముట్టాయి. కొందరు నేరగాళ్లు వృద్ధులను దోచుకుంటున్నారు. ప్రశాంత జీవనం సాగించాల్సినవారు కష్టాల సుడిలో, కన్నీటి అలలో, భయం గుప్పిట్లో కొట్టుమిట్టాడుతున్నారు. వృద్ధులన్న కనికరం లేకుండా నేరగాళ్లు దోపిడీలకు పాల్పడుతున్నారు.

అందరూ ఉన్నా.. అనాథల్లా..

ఉమ్మడి జిల్లాలోని 21 వృద్ధాశ్రమాల్లో సుమారు 500 మంది వృద్ధులు కన్నబిడ్డల ఆదరణకు నోచుకోనివారే అధికంగా ఉన్నారు. ఓ ప్రభుత్వ విశ్రాంత అధికారి భార్య చనిపోగా.. ఆయన్ను కొడుకు, కోడలు ఇంటి నుంచి గెంటేశారు. వృద్ధాశ్రమంలో కాలం గడుపుతున్నారు. కన్నబిడ్డలు ఇంటి నుంచి గెంటేయటంతో వృద్ధాశ్రమాలు, ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్‌లు, పట్టణ నిరాశ్రయుల వసతి గృహాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పలుచోట్ల తలదాచుకుంటున్నారు.

ఆస్తుల కోసం వేధింపులు

జిల్లా కేంద్రాలు మొదలుకుని మారుమూల ప్రాంతాల వరకు చాలామంది వృద్ధులు ఆస్తుల కోసం కొడుకులు, కుమార్తెల వేధింపులకు గురవుతున్నారు. కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల్లో ఇలాంటి బాధిత వృద్ధుల ఫిర్యాదులే అధికంగా వస్తున్నాయి.

వృద్ధులకు అవగాహన కల్పిస్తూ..

ఉమ్మడి జిల్లాలోని వృద్ధాశ్రమాలను జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలావెంకటశేషాద్రి నిరంతరం తనిఖీ చేస్తూ వారికి కల్పించే సౌకర్యాలను పరిశీలిస్తున్నారు. వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం, వారికి ప్రభుత్వం కల్పించే పథకాలు వివరిస్తూ వృద్ధులకు అవగాహన కల్పిస్తున్నారు. ఒక న్యాయవాది, ఎన్‌జీవో సభ్యుడు, దివ్యాంగులు.. వయోవృద్ధులు, హిజ్రాల సంక్షేమ సహాయ సంచాలకుల శాఖ కార్యాలయం నుంచి ఒక ఉద్యోగితో కమిటీ ఏర్పాటుచేసి న్యాయ సాయం అందిస్తున్నారు.

పల్లెల్లో ఆకలికేకలు

పట్టణాల్లో వృద్ధులు బయటకు వెళ్లి ఎక్కడో ఒకచోట ఓ ముద్ద దొరికించుకునే వీలుంటుంది. కానీ పల్లెల్లో బయట ఎక్కడా యాచించే వీలుండదు. కొడుకులు, కోడళ్ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడి కడుపు నింపుకోవాల్సిన పరిస్థితి. ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు తదితర సబ్‌డివిజన్ పరిధిలోని గ్రామాల్లో చాలా మంది వృద్ధులను ఇళ్ల వద్దే వదిలేసి వారి పిల్లలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. దీంతో ఆకలితో అలమటిస్తూ నరకయాతన అనుభవిస్తున్నారు.

ఆర్డీవో ట్రైబ్యునళ్లనూ ఆశ్రయించొచ్చు

– రయిస్ ఫాతిమా, జిల్లా దివ్యాంగులు, వయో వృద్ధులు, హిజ్రాల సంక్షేమ సహాయ సంచాలకుల శాఖ ఏడీ

తల్లిదండ్రుల వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం-2007, ఆంధ్రప్రదేశ్ తల్లిదండ్రుల వయో వృద్ధుల పోషణ, సంరక్షణ నియమావళి-2011 అమలు కోసం ఆర్డీవో కార్యాలయాల్లో ప్రత్యేకమైన ట్రైబ్యునళ్లు ఉన్నాయి. పిల్లల ఆదరణకు నోచుకోని వృద్ధులు వాటి ద్వారా న్యాయం పొందొచ్చు. తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేస్తే జైలుశిక్ష, జరిమానా విధిస్తారు. వృద్ధులు సాయం కోసం 14567 టోల్‌ఫ్రీ నంబరును సంప్రదించవచ్చు.

పురాలకు అమృత్ బిందువు

ఆదోని, నంద్యాల, కర్నూలు, పురపాలికలు, న్యూస్‌టుడే: ఉమ్మడి కర్నూలు జిల్లాలో అమృత్ ఫలాలు అందనున్నాయి. పురపాలక సంఘాల్లో అమృత్ 2.0 పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా నీటి ప్రాజెక్టుల కింద రూ.233 కోట్లు, మురుగు నీటి శుద్ధికి రూ.170 కోట్లు విలువైన పనులు చేపట్టాలని ప్రతిపాదించింది. అప్పటి వైకాపా రాష్ట్ర ప్రభుత్వం నిధులు సర్దుబాటు చేయలేదు. కనీసం డీపీఆర్ రూపొందించలేదు. సమస్యను గుర్తించిన 'కూటమి' ప్రభుత్వం పనులు పట్టాలెక్కించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన రాష్ట్ర వ్యాప్తంగా 281 పనులకు రూ.10 వేల కోట్లు విలువైన పనులకు ఆన్‌లైన్ టెండర్లు పిలిచింది.

తాగునీటి కోసం జనం ఇబ్బందులు

జగన్నాథగట్టుపై నిల్వ

కర్నూలులో రూ.130 కోట్లుతో 20కి పైగా ఉపరితల నీటి ట్యాంకులు నిర్మించే దిశగా యోచిస్తున్నారు. ప్రస్తుతం 30 ఉపరితల నీటి ట్యాంకులున్నా.. నీటి సరఫరాపై ఒత్తిడి పెరుగుతోంది. దీంతో పాటు జగన్నాథ గట్టు ప్రాంతంలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించి, నీరు నిల్వ చేయాలనేది లక్ష్యం. గత వైకాపా ప్రభుత్వంలో పై పనులు టెండర్ దశకు వెళ్లి ఆగిపోయాయి. పై పనులు పూర్తయి ఉంటే.. నగరంలో 52 వార్డులకు తాగునీటి ఇబ్బందులు తొలగేవి. సుంకేసుల నుంచి మునగలపాడు రూ.83 కోట్లతో పైపులైన్ పనులు చేపట్టారు. కేసీ కాలువ నుంచి నీటిని పైపులైన్‌తో సరఫరా చేయాలనే దిశగా ఆలోచనలు చేస్తున్నారు.

ఆదోని అవస్థలు తీర్చేలా

ఆదోనిలో రెండు పనుల ప్రణాళికలు చేశారు. మొదటిది రూ.12.9 కోట్లు, రెండోది రూ.22.27 కోట్లతో నీటి పైపులైన్ ఏర్పాటు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఉపరితల నీటి ట్యాంకులు, నీటిశుద్ధి కేంద్రంతో పాటు బలహీనవర్గాల కాలనీల్లో కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించారు. పనులు పట్టాలెక్కలేదు.

ఇక్కడా పనులు చేపడతారు

డోన్‌లో రూ.23.56 కోట్లు, బేతంచెర్ల రూ.2.66, ఆత్మకూరులో రూ.9.66, నందికొట్కూరులో రూ.10.18, ఎమ్మిగనూరులో రూ.3.52, గూడూరు రూ.5.68 కోట్లతో బలహీనవర్గాల కాలనీలు, నివాస ప్రాంతాల్లో నీటి వనరుల పెంపు, నీటి నిల్వ పనులు చేసి. సరఫరా చేయాలని సంకల్పించారు. ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి.

మురుగు శుద్ధికి ప్రణాళికలు

అమృత్ పథకాలకు కొనసాగింపుగా అమృత్ 2.0 కింద తాగునీటి ప్రాజెక్టులు చేపట్టింది. దీంతోపాటు మురుగు నీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కర్నూలుకు రూ.2.47 కోట్లు, నంద్యాల రూ.74 కోట్లు, ఆదోనిలో రెండు చోట్ల రూ.93.79 కోట్లతో ఎస్టీపీ ప్లాంట్లు నిర్మించాలని ప్రణాళిక రూపొందించారు.

నందుల కోటలో

నంద్యాలలో రెండు ప్యాకేజీల్లో పనుల ప్రణాళిక చేశారు. రూ.10.47 కోట్లతో 7కేఎల్ ఈఎల్ఎస్ఆర్, 19 కి.మీ.లు నీటి గొట్టాల నిర్మాణం, 3006 కొత్తగా కుళాయి కనెక్షన్లు, 4.51 కి.మీ.లు నీటి గొట్టాల నిర్మాణం. రెండోది రూ.32.94 కోట్లతో 12.50 ఎం.ఎల్.డి. వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, 13.32 కి.మీ.లు నీటి గొట్టాల నిర్మాణం, 500 కేఎల్ సామర్థ్యంతో క్లియర్ వాటర్ సంప్ నిర్మించాలనుకున్నారు.

భవిష్య నిధి

■ 6,960 మంది సభ్యులకు భరోసా

కర్నూలు నగరం (జడ్పీ), న్యూస్‌టుడే: ఉద్యోగులను గత వైకాపా ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు పెట్టింది. వేతనాలు సరైన సమయానికి చెల్లించలేదు. చివరికి భవిష్య నిధిలో దాచుకున్న సొమ్మును చెల్లించడంలోనూ నిర్లక్ష్యం చేసింది. గృహాల కొనుగోలు, పిల్లల చదువు, వారి పెళ్లిళ్ల తదితర అవసరాల నిమిత్తం దరఖాస్తు చేసినా వాటిని పక్కన పెట్టేసింది. ఫలితంగా చాలామంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి సారించింది. పీఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్న రెండు మూడు నెలల్లోనే సొమ్ము అందజేస్తోంది.

470 మంది దరఖాస్తు

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి 470 మంది సభ్యులు నగదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 443 మంది సభ్యులకు రూ.21.08 కోట్లు మంజూరు చేశారు. పదవీ విరమణ పొందిన 234 మంది సభ్యులకు సంబంధించి రూ.28.12 కోట్లు చెల్లించేందుకు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారు. ఇందులో 190 మందికి రూ.18.82 కోట్ల మేర సొమ్ము జమైంది. మరో రూ.9.30 కోట్లు విడుదల కావాల్సి ఉంది. దరఖాస్తులను వేగంగా పరిష్కరిస్తుండటంతో ఉద్యోగులతోపాటు విశ్రాంత సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి నెలా పొదుపు చేస్తూ..

ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ భవిష్య నిధికి సంబంధించి 6,960 మంది సభ్యులున్నారు. జడ్పీ పరిధిలో ఏర్పాటుచేసిన భవిష్యనిధిలో జడ్పీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది సభ్యులుగా చేరి ప్రతి నెలా పొదుపు చేస్తుంటారు. దీనిపై ఏడాదికోసారి వడ్డీతో లెక్కగట్టి సంబంధిత ఉద్యోగి ఖాతాకు జమ చేస్తారు. ఇప్పటివరకు రూ.282.38 కోట్ల సొమ్మును ఉద్యోగులు పీఎఫ్ ఖాతాలో దాచుకున్నారు.

వివరాలు నవీకరించక..

● జడ్పీ భవిష్యనిధి ఖాతా సభ్యుల వివరాలు నవీకరించక ఏడాదిగా పెండింగ్‌లో ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ చేయాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఎప్పటికప్పుడు వివరాలను ఆన్‌లైన్ చేస్తేనే వివరాలు పూర్తిగా అందుబాటులో ఉంటాయని సభ్యులు చెబుతున్నారు. మరో నెల రోజుల్లో ఆన్‌లైన్ ప్రక్రియ చేపడతామని జడ్పీ పీఎఫ్ ఉద్యోగులు తెలిపారు.

● ఉద్యోగులు దాచుకున్న సొమ్ము వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని.. అవసరార్థులకు సొమ్ము విడుదల చేస్తున్నామని జడ్పీ ఉప సీఈవో వెంకట సుబ్బారెడ్డి చెప్పారు.

చిక్కుడు పూత.. చక్కని కాత

ఈ పూలవనాన్ని చూస్తే ఒక్క క్షణం ఆగి కళ్లప్పగించాల్సిందే. తెలుపు, ఊదా రంగులో ఆకర్షణీయంగా ఉన్న పొలం చూపరులను కట్టిపడేస్తోంది. తుగ్గలి మండలం జొన్నగిరికి చెందిన నాగేష్ చిక్కుడు తోట సాగు చేశారు. ప్రస్తుతం పూత దశలో ఉంది. ప్రధాన రహదారికి ఆనుకొని ఉండడంతో అటు వెళ్లేవారిని కనువిందు చేస్తుంది. – న్యూస్‌టుడే, తుగ్గలి

విత్తన విపత్తి

■ రైతులను ముంచిన కంపెనీలు

■ పంట కొనుగోలుకు కొర్రీలు

ఎమ్మిగనూరు వ్యవసాయం, న్యూస్‌టుడే: పశ్చిమ ప్రాంతం విత్తన పత్తికి సాగుకు అనుకూలం.. గతేడాది రైతులు మంచి లాభాలు పొందారు. ఈ ఏడాది ఓ కంపెనీ ఆర్గనైజర్ కర్షకులను నిండా ముంచారు. బ్రీడర్ సీడ్ విత్తనాలు ఇచ్చారు.. సాగు చేయండి పెట్టుబడి ఇస్తామని నమ్మబలికారు. పంట వేసిన తర్వాత.. పెట్టుబడి ఇవ్వలేం. అరకొరగా కొంటామని కొర్రీలు పెడుతున్నారు. చేసేది లేక రైతులు పంటను తొలగించి మరోటి వేయడానికి సిద్ధమవుతున్నారు.

⏩ ఎమ్మిగనూరు, కోసిగి, పెద్దకడబూరు, గోనెగండ్ల తదితర మండలాల్లో 500 ఎకరాలకు పైగా సీడ్ పత్తి సాగు చేసున్నట్లు అంచనా. విత్తనం వేసి నెలన్నర కావస్తోంది.

కోటేకల్‌లో పత్తి మొక్కలను తొలగిస్తున్న రైతులు

⏩ బ్రీడర్ సీడ్ విత్తనం, పెట్టుబడులు ఇస్తామని, ఎకరాకు నాలుగు క్వింటాళ్ల వరకు కొంటామని ఓ ప్రైవేట్ కంపెనీ ఆర్గనైజర్ నమ్మించారు. ఇంతవరకు పెట్టుబడికి రూపాయి ఇవ్వలేదు. సాధారణంగా సీడ్ పత్తి సాగుకు ఎకరానికి రూ.3నుంచి రూ.4 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది.

⏩ డబ్బులు అడిగితే ఇవ్వకుండా..ఈసారి ఎకరానికి రూ.48వేల చొప్పున రెండు క్వింటాళ్లు కొంటామని కంపెనీ ప్రతినిధులు చెబుతున్నారు.

కొర్రీలు పెట్టి మోసం

⏩ జిల్లాలో దాదాపు మూడు దశాబ్దాలుగా రైతులు సీడ్ పత్తి సాగు చేస్తున్నారు. పలు కంపెనీ ఆర్గనైజర్లు విత్తనంతోపాటు పెట్టుబడి ఇస్తారు. పంట చేతికొచ్చిన తర్వాత కొనుగోలు చేస్తారు. ఈసారి పెట్టుబడి ఇవ్వకుండా, పంట రాకముందే రెండు క్వింటాళ్లే కొంటామని కొర్రీలు పెడుతున్నారు.

⏩ దిక్కుతోచని రైతులు జులై చివరి వరకు ఇతర పంటల సాగుకు సమయం ఉండటంతో ప్రత్యామ్నాయ పంటల సాగుకు సమాయత్తమవుతున్నారు. కోటేకల్, నక్కలమిట్ట తదితర గ్రామాల్లో సీడ్ పత్తి పంటను తొలగిస్తున్నారు.

⏩ " ఎకరన్నరలో సీడ్ పత్తి వేశాం. పంట కొంటాం, పెట్టుబడి ఇస్తామని కంపెనీ ఆర్గనైజర్ చెప్పారు. ఇప్పుడు రెండు క్వింటాళ్లు కొంటామని చెబుతున్నారు. ధర బాగా తగ్గించారు. చేసేది లేక పంటను తొలగించి వేరే పంట వేసుకునేందుకు నేల శుద్ధి చేసుకుంటామని" కోటేకల్‌కు చెందిన రంగన్న పేర్కొన్నారు.

నకిలీ మద్యంతో జాగ్రత్త

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : మద్య నిషేధ, ఆబ్కారీ శాఖ అనుమతి పొందిన మద్యం దుకాణాల్లో మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని, అనధికార వ్యక్తులు విక్రయించే మద్యం కొనుగోలు చేయొద్దని ఆ శాఖ జిల్లా పర్యవేక్షణాధికారి సుధీర్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు. అనధికార వ్యక్తులు నకిలీ మద్యం విక్రయించి మోసగించే అవకాశముందని పేర్కొన్నారు. తక్కువ ధరకు విక్రయించేవారిని నమ్మొద్దని.. అలాంటి నకిలీ మద్యం ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందని చెప్పారు. ఎవరైనా నకిలీ మద్యం విక్రయిస్తుంటే తమకు తెలపాలని కోరారు. టోల్‌ఫ్రీ నంబరు 14405, 94409 02572 నంబరుకు సమాచారం అందించాలని చెప్పారు.

ఈనాడు

దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు

Cell: 99899 97628

ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి

Cell: 80085 13479

గోతుల దారిలో.. అభివృద్ధి జాడలు

పత్తికొండ, మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెర- పత్తికొండ ప్రధాన రహదారి నిన్నటి దాకా మోకాలి లోతు గుంతలతో ప్రయాణం అడుగడుగునా ప్రమాదకరంగా సాగింది. కూటమి ప్రభుత్వం చొరవతో ప్రస్తుతం అభివృద్ధి బాట పట్టింది. మద్దికెర- నుంచి బురుజుల వరకు 10 కి.మీ. మేర పూర్తిగా దెబ్బతింది. ఈ దారిలో ఇటీవలే ఇద్దరు యువకులు ద్విచక్ర వాహన ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. పదుల సంఖ్యలో గాయపడ్డారు. గత ఐదేళ్లు వాహనదారులు, ప్రయాణికులు నరకం చూశారు. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేకపోయింది. రహదారి పనులకు పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు భూమి పూజ చేశారు. రూ.5.80 కోట్లతో బీటీ రోడ్డు పనులు నెల రోజుల్లో పూర్తిచేయించి, ప్రజల ఇబ్బందులు తీర్చారు. ఇప్పుడు ఈ దారిలో ప్రయాణం సులభంగా మారింది.

నాడు: గుంతలతో ప్రమాదంగా ఉన్న మద్దికెర- పత్తికొండ ప్రధాన రహదారి

నేడు: నిర్మాణం అనంతరం

పోరాట విద్యలో అన్నదమ్ముల పట్టు

అన్నదమ్ముళ్లు జీవన్, పోషిత్

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణం బీటీ ఆర్ ఎస్టేట్‌కు చెందిన ఆది, నిర్మల దంపతుల కుమారులు జీవన్, పోషిత్ 8వ, 5వ తరగతి చదువుతున్నారు. చదువుతోపాటు మార్షల్ ఆర్ట్స్‌లో ఒకటైన తైక్వాండో క్రీడలో ప్రతిభ చాటుతున్నారు. పట్టణానికి చెందిన తైక్వాండో మాస్టర్ దాదాబాషా వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకుంటూ పలు పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు సాధిస్తున్నారు. ఇప్పటికే అన్నదమ్ములు బ్లాక్ బెల్ట్-1 సొంతం చేసుకున్నారు. గతేడాది తిరుపతిలో జరిగిన సౌత్‌జోన్, రాష్ట్ర స్థాయి పోటీల్లో జీవన్ అండర్-14 విభాగంలో రజత, కాంస్య పతకాలు సాధించగా.. అండర్-12 విభాగంలో పోషిత్ రెండు కాంస్య పతకాలు గెలుపొందారు. తైక్వాండో క్రీడలో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతామంటున్నారు ఈ అన్నదమ్ములు.

కూచిపూడిలో ప్రశంసల సిరులు

ఆదోని పట్టణానికి చెందిన సత్యం ప్రకుమార్, అంకిత దంపతుల కుమార్తె రూపల్ సాయిశ్రీ 6వ తరగతి చదువుతుంది. సంప్రదాయ నృత్యంపై ఆసక్తి కలగడంతో తల్లిదండ్రులు ఆదోని పట్టణంలోని మాస్టర్ వీరేష్ రాయల్ వద్ద కూచిపూడి నేర్పించడం ప్రారంభించారు. తొమ్మిదేళ్ల నుంచి ఈ బాలిక కూచిపూడి నృత్యంలో సాధన చేస్తూ పలు ప్రదర్శనలిచ్చి పలువురి ప్రశంసలు పొందుతోంది. మహారాష్ట్రలోని ముంబయిలో జరిగిన ఆల్ ఇండియా డ్యాన్స్ ఫెస్టివల్‌లో రూపల్ సాయిశ్రీ పాల్గొని మొదటి బహుమతి అందుకుంది. తిరుపతి, నంద్యాల, ఆదోని పట్టణంతోపాటు పలు ప్రాంతాల్లో 40 వరకు నృత్య ప్రదర్శనలిచ్చి అవార్డులు.. రివార్డులు సొంతం చేసుకుంది. చదువుతోపాటు నృత్యంలో రాణించి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకుంటానంటోంది రూపల్ సాయిశ్రీ.

సాగు నీరు విడుదల చేయండి

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: సాగునీటి ప్రాజెక్టులకు నీటిని విడుదల చేయాలని జడ్పీ ఛైర్మన్ పాపిరెడ్డి కోరారు. కర్నూలులోని జడ్పీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ఎండిపోయే పరిస్థితి నెలకొందని చెప్పారు. శ్రీశైలం జలాశయంలో 854 అడుగుల నీటి మట్టం దాటినా నీరు వదలకపోవడంతో నంద్యాల జిల్లాలో పంటలు దెబ్బతింటున్నాయని అన్నారు.

జడ్పీ సమావేశంలో ఏం చేసినట్టు

గత నెల 28వ తేదీ నాటికి శ్రీశైలంలో 867 అడుగుల నీటి మట్టం.. 129 టీఎంసీల మేర నీటి నిల్వలు ఉన్నాయి. అదే రోజు జడ్పీ సమావేశం జరిగింది. ఆ సమయంలో అధికారులు, సభ్యులు ఎవరు సాగునీటి విడుదల అంశాన్ని ఎందుకు లేవనెత్తలేదనే చర్చ జరుగుతోంది. అన్ని శాఖల అధికారులు, ఇరు జిల్లాల కలెక్టర్లు, మంత్రి సమక్షంలో ప్రశ్నించి ఉంటే ఉంటే సరైన సమాధానం వచ్చేదని, ఇపుడు మాట్లాడటమేంటని పలువురు పేర్కొంటున్నారు.

పులికొండ(పత్తికొండ గ్రామీణం), న్యూస్‌టుడే: రాష్ట్రంలో అధికారం చేపట్టిన ఏడాది కాలంలోనే ఎంతో అభివృద్ధి సాధించామని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు, కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా అధ్యక్షుడు తిక్కారెడ్డి అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది సందర్భంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా పులికొండలో బుధవారం పర్యటించారు. జగన్ ప్రభుత్వ హయాంలో పింఛన్ రూ.వెయ్యి పెంచేందుకు ఐదేళ్లు పట్టిందన్నారు. అధికారం చేపట్టిన నెల రోజుల్లోనే పెంచిన రూ.వెయ్యితో పాటు అంతకు ముందు రెండు నెలలకు సంబంధించిన మొత్తం కూడా చెల్లించామన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు సాంబశివారెడ్డి, రామానాయుడు, తిమ్మయ్యచౌదరి, ప్రమోద్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, సుధాకర్, సోమ్లానాయక్, రంగప్ప, చల్లా రవీంద్రనాథ్‌చౌదరి, చంద్ర, పాండు, రంగస్వామి, చిన్నరంగడు, సురేంద్రనాయుడు, తుఫాన్‌రాజు, చిన్ననారాయణ, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

పథకాల అమలుపై కరపత్రాలను చూపుతున్న ఎమ్మెల్యే కేఈ, తిక్కారెడ్డి తదితరులు

ఏడాదిలోనే ఎంతో చేశాం

గూడూరు, న్యూస్‌టుడే: కె.నాగలాపురంలో ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి బుధవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు వివరిస్తూ.. సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలు పంపిణీ చేశారు. తెదేపా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

కె.నాగలాపురంలో కరపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

కూటమి ఏడాది పాలనలో ప్రగతి బాట

నందవరం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలం పరిధిలోని మిట్టాసోమాపురం గ్రామంలో పర్యటించి 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ.. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ ఫలాల గురించి ప్రజలకు వివరించారు. తెదేపా మండల అధ్యక్షుడు కాశీంవలి, మార్కెట్ యార్డు ఛైర్మన్ కురువ మల్లయ్య, తెదేపా సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మిట్టాసోమాపురంలో ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి

సాగునీరు వెంటనే విడుదల చేయాలి

ధర్నా చేస్తున్న సాగునీటి సాధన సమితి ప్రతినిధులు దశరథరామిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు

కర్నూలు జలమండలి, న్యూస్‌టుడే: తుంగభద్ర, కృష్ణా నదుల ద్వారా జలాశయాల్లోకి వరదనీరు చేరుతున్నా సాగు నీటి విడుదలలో జాప్యం జరుగుతోందని రాయలసీమ సాధన సమితి నేతలు పేర్కొన్నారు. కర్నూలులోని జలవనరుల శాఖ సీఈ కార్యాలయం వద్ద ఆ సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ధర్నా జరిగింది. ప్రజా సంఘాల నాయకులు, సమితి ప్రతినిధులు హాజరయ్యారు. బొజ్జా దశరథరామిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రాజెక్టులకు పూర్తిస్థాయిలో మరమ్మతులు చేసి నీటిని విడుదల చేయాలని కోరారు. శ్రీశైలం జలాశయంలో నీటి నిల్వలున్నా వదలకపోవడం బాధాకరమని చెప్పారు. ఈ ఆందోళనలో నేతలు రామకృష్ణారెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, సీపీఐ నాయకులు రామాంజనేయులు, శేషగిరి, రామచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం కర్నూలు ఎస్ఈ బాలచంద్రారెడ్డికి వినతిపత్రం అందచేశారు.

తాగునీటి విషయంలో అప్రమత్తత అవసరం

కర్నూలు నగరం (జడ్పీ), న్యూస్‌టుడే: వర్షాకాలంలో తాగునీటి విడుదల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎక్కడైనా ప్రజలు కలుషిత నీరు తాగి అనారోగ్యానికి గురైతే సంబంధిత కార్యదర్శులపై చర్యలు తీసుకోవాల్సి వస్తుందని జిల్లా పంచాయతీ అధికారి జి. భాస్కర్ హెచ్చరించారు. స్థానిక డీపీవో కార్యాలయం నుంచి జిల్లాలోని ఈవోఆర్డీలు, మేజరు పంచాయతీ కార్యదర్శులతో బుధవారం గూగుల్ మీట్ ద్వారా మాట్లాడారు. ఈవోఆర్డీలు కార్యాలయాలకు పరిమితం కాకుండా పంచాయతీల్లో పర్యటించాలని డీపీవో సూచించారు. క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

నీటిబాటలో బడి పారం

వీధులు జలమయం అయ్యాయి. మోకాలి లోతులో నీరు నిలిచింది. దేవనకొండ మండలం తెర్నేకల్ గ్రామంలోని పంచాయతీ కార్యాలయం, పశువైద్యాలయం దగ్గర డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. వర్షం నీరు పారే దారిలేక.. కాలనీవాసులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బుధవారం సాయంత్రం పడిన వర్షానికి కాలనీ దారి జలమయమైంది. మోకాళ్లలోతు నీరు నిలవడంతో పాఠశాల నుంచి ఇంటికి వెళ్లేందుకు విద్యార్థులు ఇబ్బంది పడ్డారు.

– న్యూస్‌టుడే, తెర్నేకల్(దేవనకొండ)

గన్.. వేగంపై ఏదీ కన్ను

డోన్, డోన్ నేరవిభాగం, నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: మానవ జీవనంలో ప్రతి క్షణం విలువైందే. ప్రయాణాల్లో ఏమరపాటు వహిస్తే రెప్పపాటు కాలంలోనే మృత్యువు ముంచుకొస్తుంది. అతివేగంగా వాహనాలు నడిపితే ప్రాణాల మీదికి తెచ్చుకోవటంతో పాటు ఎదుటి వారి ప్రాణాలు బలిగొంటున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇటీవల ప్యాపిలి సమీపంలో అతివేగంతో కారు బోల్తాపడిన ఘటనలో ముగ్గురు యువకులు మృత్యువాత పడ్డారు.

- స్పీడ్ గన్ తనిఖీలు అంతంతే..
- ప్రమాదాలపై కానరాని నియంత్రణ

150 కి.మీ. వేగంతో..

దేశంలోనే ప్రాధాన్యమున్న జాతీయ రహదారులు 44, 40 ఉమ్మడి కర్నూలు జిల్లా గుండా వెళ్తున్నాయి. ఈ రహదారులతోపాటు రాష్ట్ర రహదారులు, ఉపరితల వంతెనలు, గ్రామీణ రహదారుల్లోనూ అతివేగంతో ప్రమాదాలు చోటుచేసుకుంటూ ఎంతో మంది క్షతగాత్రుల అవుతుండగా మరెందరో ప్రాణాలు కోల్పోతున్నారు. ఎన్‌హెచ్ 44లో నిత్యం 10వేలకు పైగా వాహనాలు వెళ్తుంటాయి. ఎన్ఎహెచ్ 40లో 7వేలకు పైగా వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. హైవేల్లో గంటకు 100 - 110 కి.మీ. వేగంతో వాహనాలు వెళ్తే కొంతమేర ప్రమాదాలు తగ్గించుకునేందుకు అవకాశం ఉంటుంది. కానీ కొందరు 120 నుంచి 150 కి.మీ. వేగంతో వాహనాల్లో వెళ్తుంటారు. అతివేగాన్ని నివారించేందుకు పోలీసు, రవాణాశాఖ అధికారులు స్పీడ్‌గన్‌ల ద్వారా తనిఖీలు చేపట్టి వాహనాలు గుర్తించాల్సి ఉంటుంది.

పాణ్యం వద్ద స్పీడ్ గన్‌తో వేగాన్ని చూస్తున్న రవాణా శాఖ సిబ్బంది

ఉమ్మడి జిల్లాలో రహదారి ప్రమాదాలు ఇలా..

ఏడాది	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2023	499	268	558
2024	523	273	614
2025	272	118	326

ఇటీవల సంఘటనలు..

- డోన్ పట్టణంలోని ఉపరితల వంతెనపై మే నెలలో ఓ యువకుడు ద్విచక్రవాహనంపై అధిక వేగంతో వెళ్తూ అదుపుతప్పి కిందపడి మృతిచెందారు.
- ప్యాపిలి సమీపంలో మే నెలలో కర్ణాటకకు చెందిన నలుగురు యువకులు కారులో అతివేగంగా వెళ్తూ ప్రమాదవశాత్తూ అదుపుతప్పి వాహనం బోల్తాపడటంతో ముగ్గురు మృత్యువాతపడ్డారు.
- డోన్ నుంచి బేతంచెర్లకు వెళ్లే రహదారిలో జనవరిలో ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై అతివేగంగా వాహనం నడపడంతో అదుపుతప్పి తీవ్రగాయాలకు గురయ్యారు.
- కర్నూలు నుంచి డోన్ వచ్చే రహదారిలో వెల్దుర్తి సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను అతివేగంగా వెళ్తున్న లారీ ఢీకొనటంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు.

ఉమ్మడి జిల్లాకు రెండు మాత్రమే..

నిబంధనల ప్రకారం హైవేపై నిర్దేశించిన ప్రాంతాల్లో వాహనాలు గంటకు 60 కి.మీ., పట్టణ పరిధిలో 30 కి.మీ. వేగంతో వెళ్లాలి. దీన్ని అతిక్రమిస్తే కేసు నమోదు చేసి రూ. 14,00 జరిమానా విధిస్తారు. ఇలా చేయటంతో చాలా వరకు ప్రమాదాలు తగ్గేందుకు అవకాశం ఉంటుంది. నంద్యాల, కర్నూలు జిల్లాలకు ఒక్కొక్కటి చొప్పున స్పీడ్ గన్‌లు ఉన్నాయి. డోన్, ఆత్మకూరు, ఆదోని పట్టణాలకు స్పీడ్‌గన్ల అవసరం ఉంది. కర్నూలు, పాణ్యం, ఉలిందకొండ ప్రాంతాల్లో మాత్రమే హైవేపై అప్పుడప్పుడు నామమాత్రంగా తనిఖీలు చేపడుతున్నారు.

శ్రీమఠం పేరుతో మరో మోసం

మంత్రాలయం, న్యూస్‌టుడే: శ్రీమఠం పేరుతో మరో మోసం వెలుగులోకి వచ్చింది. దీంతో దేశవ్యాప్తంగా ఉన్న రాఘవేంద్రస్వామి భక్తులు అప్రమత్తంగా ఉండాలని శ్రీమఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు సూచించారు. అంతర్జాలంలో నకిలీ గదుల మోసం మరువక ముందే మరో మోసం బయటపడింది. మఠం మేనేజర్ బుధవారం వివరాలు వెల్లడించారు. బెంగళూరు, మైసూర్ జాతీయ రహదారిలో 253 అడుగుల రాఘవేంద్ర స్వామి విగ్రహం నిర్మాణం కోసం ఓ భక్తుడు రూ.1,15,000లను కె.సురేశ్ పేరుతో ఉన్న చరవాణి నంబరుకు బదిలీ చేశారని, తర్వాత అతను స్పందించకపోవడంతో భక్తుడు ఫిర్యాదు చేశాడని మేనేజర్ తెలిపారు. సురేశ్ అనే వ్యక్తి బెంగళూరు, మైసూర్ జాతీయ రహదారిలో 235 అడుగుల రాఘవేంద్ర స్వామి విగ్రహం నిర్మిస్తున్నామని.. శ్రీమఠంకు హెలిక్యాప్టర్ బహుమతిగా ఇస్తామని భారీగా విరాళాలు సేకరిస్తున్నట్లు తెలిసిందన్నారు. ఏ సంస్థకూ, ఏ రూపంలోనూ డబ్బులు వసూలు చేయడానికి శ్రీమఠం అధికారం ఇవ్వలేదని పేర్కొన్నారు. ఎవరైనా రాఘవేంద్ర స్వామి పేరు చెప్పి విరాళాల కోసం వస్తే చెల్లించరాదని, వారి వివరాలు తెలియజేయాలన్నారు.

వక్ఫ్‌భూముల వేలం.. సద్దుమణిగిన వివాదం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: నందవరం మండలంలోని హాలహర్వి గ్రామం, మంత్రాలయం మండలంలోని సూగూరు, లచ్చుమర్రి తదితర ప్రాంతాల్లోని వక్ఫ్ భూముల వేలం ప్రక్రియను బుధవారం కర్నూలులోని వక్ఫ్ కార్యాలయంలో నిర్వహించారు. హాలహర్విలోని 85.83 ఎకరాలను వేలం వేయడంపై బి.యాపిలయ్య అనే వ్యక్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయా భూములను 2021 జూన్ 30న వేలం వేశారని, అప్పుడు తాను ఆయా భూములను రూ.5.71 లక్షలకు వార్షిక లీజుతో దక్కించుకున్నానని తెలిపారు. నాడు పాడుకున్న ఆయా భూములను మళ్లీ ఎలా వేలం వేస్తారని ఆయన ప్రశ్నించారు. అధికారుల వైఖరికి నిరసనగా యాపిలయ్య, మరికొందరు రైతులు వక్ఫ్ కార్యాలయ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ప్రస్తుతం తుమ్మకంపలు, ఇతర పిచ్చిమొక్కలతో ఉన్న ఆయా భూములను వేలంలో పాడుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దాంతో ఆ భూముల వేలం నిలిచిపోవడంతో వివాదం సద్దుమణిగినట్లయింది.

శక్తి యాప్, వాట్సప్ సేవలు వినియోగించుకోండి

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: మహిళల భద్రత కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శక్తి యాప్, వాట్సప్ నంబరు 79934 85111ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్పీ విక్రాంత్‌పాటిల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలు అత్యవసర సమయాల్లో ఫోన్ చేసినా, సంక్షిప్త సమాచారం ఇచ్చినా స్పందించేలా వీటిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అన్ని పోలీసుస్టేషన్ల పరిధిలోని కళాశాలలు, పాఠశాలలు, వాణిజ్యకేంద్రాలు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో సదస్సులు నిర్వహించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రతిఒక్కరూ శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. వరకట్న వేధింపులు, ఈవ్‌టీజింగ్, బాల్యవివాహాలు ఇతర ఏ సమస్యలు ఎదురైనా మహిళలు వీటి ద్వారా సంప్రదించవచ్చని చెప్పారు.

చిత్తూరు ఇన్‌ఛార్జి ఎస్ఈగా సురేశ్‌బాబు

కర్నూలు సంక్షేమం, న్యూస్‌టుడే: కర్నూలు ఆర్అండ్‌బీ ఈఈగా విధులు నిర్వహిస్తున్న బి.సురేశ్‌బాబును చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జి ఎస్ఈగా నియమిస్తూ ప్రభుత్వం బుధవారం రాత్రి ఉత్తర్వులిచ్చింది. కర్నూలు ఆర్అండ్‌బీ విభాగం ఏపీఆర్‌డీసీ డివిజన్ ఈఈ శంకర్‌రెడ్డిని విజయవాడ ఎన్.హెచ్ సర్కిల్ ఇన్‌ఛార్జి ఎస్ఈగా నియమిస్తూ జీవో విడుదల చేసింది.

13న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: నగరంలోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో 13వ తేదీన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఇందిరాశాంతి, క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1997-2000లో డిగ్రీ పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని చెప్పారు.

లా సెమిస్టర్ ఫలితాల విడుదల

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన లా మూడేళ్ల కోర్సులో 6వ సెమిస్టర్, ఐదేళ్ల కోర్సులో 10వ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం ఆర్‌యూ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత..

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని మండలం ఇస్వీ గ్రామ సమీపంలోని ఓ నర్సరీలో పనిచేస్తున్న వివాహిత ప్రశాంతి అలియాస్ జాహ్నవి(18) కర్నూలులో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందినట్లు ఇస్వీ పోలీసులు తెలిపారు. మదనపల్లి గ్రామానికి చెందిన శివ, జాహ్నవి ఆదోని మండలం ఇస్వీ గ్రామ సమీపంలో ఉన్న నర్సరీలో పని చేస్తున్నారన్నారు. వీరికి నాలుగు నెలల కిందటే వివాహమైందన్నారు. కాగా.. గత నెల 17వ తేదీన జాహ్నవి తన పుట్టింటికి వెళ్తానంటే భర్త శివ వద్దన్నాడని మనస్తాపంతో నర్సరీలో ఉన్న గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. గుర్తించిన స్థానికులు ఆస్పత్రికి తరలించారు. కర్నూలులో చికిత్స పొందుతూ మృతిచెందారన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఇష్టానుసారంగా బదిలీలు చేశారని ఏఎన్ఎంల ఆందోళన

కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న వార్డు సచివాలయ ఏఎన్ఎంలు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న తమను గ్రామీణ ప్రాంతాలకు బదిలీలు చేశారని, పట్టణంలో ఒక వార్డు నుంచి మరో వార్డుకు బదిలీలు చేయాల్సి ఉండగా, ఇష్టానుసారంగా బదిలీలు చేశారని ఏఎన్ఎంలు పద్మావతి, సురేఖ, బాలేశ్వరిబాయి, పద్మావతి, రేణుక సుజాత తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపారు. పట్టణ ప్రాంతాల్లో పనిచేస్తున్న తమను గ్రామీణ ప్రాంతాలకు ఎలా బదిలీ చేస్తారని, తమ ర్యాంకుల ఆధారంగా కాకుండా.. ఎలాంటి ఆప్షన్లు తీసుకోలేదన్నారు. డీఎంఅండ్‌హెచ్‌వో, వైద్యఆరోగ్య శాఖ అధికారులు బదిలీల్లో ఏకపక్షంగా వ్యవహరించారన్నారు. తమకు అనుకూలమైన వారికి వార్డు సచివాలయాలకు బదిలీలు చేసి తమను గ్రామీణ ప్రాంతాలకు బదిలీ చేశారన్నారు. బాధిత ఏఎన్ఎంలు డీఆర్వో వెంకటనారాయణమ్మను కలిసి వినతి పత్రం సమర్పించారు.

యువకుడి మృతి

దేవనకొండ, న్యూస్‌టుడే: దేవనకొండలోని పత్తికొండ- కర్నూలు రహదారి పక్కన ఉన్న ఓ మద్యం దుకాణం దగ్గర 24 ఏళ్ల యువకుడు మృత్యువాత పడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. పత్తికొండ మండలం కోతిరాళ్ల గ్రామానికి చెందిన శివ(24) ట్రాక్టర్ డ్రైవరుగా పని చేస్తూ.. జీవనం సాగిస్తున్నాడు. పని నిమిత్తం బుధవారం దేవనకొండకు వెళ్లాడు. ఒక్కసారిగా కుప్పకూలి కిందకు పడిపోవడంతో స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం ఇచ్చారు. అప్పటికే మృతిచెందినట్లు స్థానికులు తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

తమడపల్లె (మహానంది), న్యూస్‌టుడే : మహానంది మండలం తమడపల్లె గ్రామానికి చెందిన కోలా శేషాద్రి (19) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. బుధవారం సాయంత్రం వర్షం కురుస్తున్న సమయంలో శేషాద్రి తన పెద్దనాన్న ఇంటి వద్దకు వెళ్లి వసారాలో ఉన్న ఇనుప స్తంభాన్ని పట్టుకున్నాడు. పైనున్న రేకులకు సర్వీసు తీగ తగలడం వల్ల స్తంభానికి విద్యుత్తు ప్రసారం కావడంతో యువకుడికి షాక్ కొట్టింది. అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పక్కనే ఉన్న మరో యువకుడు ఇది గమనించి విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. వెంటనే శేషాద్రిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న మండల విద్యుత్తుశాఖ ఏఈఈ ప్రభాకర్ రెడ్డి, తెదేపా నాయకుడు జనార్దన్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మహానంది ఎస్సై ఎన్. రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

కేసీ కాల్వకు సాగునీరు విడుదల చేయాలి

ఈనాడు డిజిటల్, నంద్యాల : రాయలసీమ రైతుల పట్ల ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్య వైఖరి విడనాడి కేసీ కాల్వకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి మహేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. సంఘం నాయకులు బుధవారం నంద్యాల కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. శ్రీశైలం జలాశయం నీటిమట్టం 870 అడుగులకు చేరుకున్నా పోతిరెడ్డిపాడు నుంచి నీరు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ముందస్తు వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా రైతులు పంటలు సాగు చేశారని తెలిపారు. వెంటనే శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘః జిల్లా అధ్యక్షుడు గడ్డం అంకాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటరాముడు, సూరిబాబు, ప్రధాన కార్యదర్శి భూపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, చంద్ర ఓబుల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.


జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీకేఎస్ నాయకులు

EENADU Classifieds

EDUCATION

DISTANCE EDUCATION

Open 10th, Inter, DPPTTC, Online Degree, PG, MBA & MCA Courses. Cont: Sri Sai College of Distance Education, Knl. ✆ 79812 23882.

REAL ESTATE

HOUSE FOR SALE

రోహిణి ఇన్‌ఫ్రా వారి నూతన ప్రాజెక్ట్ కామదేను నివాస్ - 2, బెంగుళూరు రోడ్డు లక్ష్మీపురం దగ్గర ఇండిపెండెంట్ హౌసెస్ కలవు. అనూష: 91600 38988, 88866 62148.

JOBS

కర్నూలు - నంద్యాల చెక్ పోస్ట్‌లో కొత్తగా ప్రారంభించిన మల్లికార్జున ఫర్నిచర్ నందు పనిచేయుటకు అకౌంటెంట్ M/F కావలెను. అర్హత: B.Com, MBA. ✆ 98493 50328.

డోన్ లో ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: Inter, డోన్ పరిసర ప్రాంతంలో ఉన్నవారికి ప్రాధాన్యత. ✆ 83415 18171.

అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు
B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.
కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.
ప్రకటనలపై 5% GST వర్తించును.
వివరాలకు: 99899 97628

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

ఆదోని

•ఆదోని •ఆలూరు •పత్తికొండ

ఆదోని సబ్ కలెక్టర్‌ను కలిసిన సబ్ రిజిస్ట్రార్

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: ఆదోని సబ్ రిజిస్ట్రార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సునంద బుధవారం ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి, పూలమొక్కను అందించారు. ఆమె విజయవాడ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడి సబ్ రిజిస్ట్రార్ అరుణ్‌కుమార్ ఆస్పరికి బదిలీ అయ్యారు.

ఆదోని సబ్ కలెక్టర్‌కు పూలమొక్క అందిస్తున్న ఆదోని సబ్ రిజిస్ట్రార్ సునంద

ఎల్లెల్సీ మరమ్మతులకు నిధులు

హొళగుంద, న్యూస్‌టుడే: తుంగభద్ర దిగువకాల్వ కింద ఉన్న డీపీల మరమ్మతులకు నిధులు మంజూరైనట్లు చిన్నకాలువ ఏఈ ఈశ్వర్ తెలిపారు. తుంగభద్ర బోర్డు కార్యాలయం విశ్రాంతి భవనంలో సాగునీటి సంఘం డీసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. చింతకుంట నుంచి ఎండీహళ్లి అయకట్టు వరకు మరమ్మతుల నిమిత్తం రూ.80 లక్షలు, మరో ప్యాకేజీ రూ.49 లక్షలు మంజూరైనట్లు, రైతులకు తీవ్రంగా సమస్య ఉన్న చోట పనులు చేపట్టి అనంతరం ఇతర పనులు చేపట్టాలని సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

ఆదోని:	ఆలూరు:	పత్తికొండ:
77996 66004	80085 62277	80085 73822

ఆదోని పురపాలకరే: ?: ఆదోని పట్టణ శివారులోని తిరుమలనగర్‌లో 10-175-22 కత్తి ఆంజనేయ కాలనీలో ఇళ్ల ముందు చెత్త పేరుకుపోయింది. సిబ్బంది ఎవరూ రావడం లేదు. తాగునీరు, రహదారి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నాం. **- మరుళారాధ్య, విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, ఆదోని**

✔: ఆ ప్రాంతంలో స్వచ్ఛత పనులు చేపట్టి, సమస్య పరిష్కరిస్తాం. **- చంద్ర, ప్రజారోగ్య విభాగం అధికారి, తిరుమలనగర్**

మద్దికెర: ?: మద్దికెరలోని ఎస్సీ కాలనీలో కుళాయిల ఏర్పాటుకు అన్నీ సిద్ధం చేసుకున్నాం. అనుమతి ఇవ్వండి. **- విరోభ, మద్దికెర**

✔: పరిశీలించి వెంటనే అనుమతి ఇస్తాం. **- శివకుమార్, పంచాయతీ కార్యదర్శి, మద్దికెర**

చిప్పగిరి, న్యూస్‌టుడే: ?: నేమకల్లు బీసీ కాలనీలో వీధులన్నీ చిత్తడిగా మారి కాలు బయట పెట్టేందుకు వీల్లేకుండా మారింది. రహదారులు, మురుగు కాల్వలు శుభ్రం చేయాలి. **- రంగన్న, నేమకల్లు**

✔: పారిశుద్ధ్య సిబ్బందిని పంపి శనివారం లోగా మురుగు కాల్వలు, వీధులు శుభ్రం చేయిస్తాం. **- బాలన్న, ఈవోఆర్డీ, ప్రేమ్‌కుమార్, నేమకల్లు**

ఆస్పరి, న్యూస్‌టుడే: ?: జొహరాపురం గ్రామంలో జిల్లా పరిషత్తు పాఠశాల ఆవరణ చుట్టూ చెత్తాచెదారం, ముళ్ల కంప చెట్లు ఉన్నాయి. పురుగులతో ప్రమాదం పొంచి ఉంది. **- సంజయ్‌కుమార్, ఉచ్చీరప్పయాదవ్, జొహరాపురం**

✔: చెత్తాచెదారం తొలగించి, పారిశుద్ధ్య చర్యలు చేపడతాం. **- విజయరాజు, పంచాయతీ కార్యదర్శి, జొహరాపురం**

మూడు రోజులు మాత్రమే... రేషన్

ఆస్పరి, న్యూస్‌టుడే: మండలంలోని శంకరబండ గ్రామంలో ప్రభుత్వ చౌకదుకాణంలో మూడు రోజులు మాత్రమే రేషన్ సరఫరా చేస్తామని చాటింపు వేశారు. గ్రామానికి చెందిన కొందరు యువకులు, గ్రామస్థులు చాటింపు వేస్తున్న వ్యక్తి వీడియోను సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. గ్రామంలో మొహర్రం ఉందని మూడు రోజులే సరకులు పంపిణీ చేస్తామని మంగళవారం సాయంత్రం చౌకదుకాణం డీలర్ చాటింపు వేయించారు. ప్రభుత్వం 1 నుంచి 18వ తేదీ వరకు సరకులు పంపిణీ చేయాలని చెబుతుంటే.. డీలర్ మాత్రం మూడు రోజులే అని చాటింపు వేయడం ఏమిటని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. విషయం తెలుసుకున్న తహసీల్దారు రామేశ్వరరెడ్డి బుధవారం చౌకదుకాణాన్ని పరిశీలించారు. ప్రతి నెల 1 నుంచి 18వ తేది వరకు ప్రతి చౌకదుకాణంలోనూ లబ్ధిదారులకు సరకులు పంపిణీ చేస్తారన్నారు. అనవసర కారణాలు చెప్పి, సరకులు ఇవ్వకపోతే చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట సర్వేయర్ ఆర్ఐ భీమేష్, సిబ్బంది ఉన్నారు.

శంకరబండలోని చౌకదుకాణాన్ని పరిశీలిస్తున్న తహసీల్దారు రామేశ్వరరెడ్డి,

బసాపురం.. నీటినిల్వ ప్రశ్నార్థకం

☛ చెదిరిన పలకలకు మరమ్మతులేవీ

బసాపురం ఎస్.ఎస్.ట్యాంకులో జారిపోయిన సీసీ పలకలు

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణ శివారులోని బసాపురం నీటి కుంటకు ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికే రెండు ప్రాంతాల్లో మట్టి కట్ట దెబ్బ తిన్న విషయం తెలిసిందే. తాజాగా.. మరో చోట 115 మీటర్లు మేర మట్టి కుంగి, సీసీ పలకలు జారాయి. దీంతో నీటి ట్యాంకుకు ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన మొదలైంది. ట్యాంకు సామర్థ్యం 3,110 ఎం.ఎల్. అప్పటికే ట్యాంకు లోపలి భాగం దెబ్బతినడంతో పూర్తిస్థాయిలో కాకుండా ముప్పాతిక శాతం నీటితోనే సరిపెడుతున్నారు. వేసవి కాలం కావడంతో నీరు తగ్గింది. దెబ్బతిన్న మట్టి కట్ట భాగం బయట పడింది. ఇప్పుడు నీటి నిల్వ ప్రశ్నార్థకంగా మారింది.

మరమ్మతుల సొమ్ము జేబుల్లోకి

ఆదోని పట్టణ జనాభా రెండు లక్షలు, బసాపురం నీటి కుంట దెబ్బతిన్నా.. నిర్లక్ష్యం వదిలేశారు. రాజుల చెరువును గతేడాది నుంచి శుభ్రం చేసి నీటి నిల్వ చేస్తున్నారు. చెరువులో నీటి సామర్థ్యం వెయ్యి ఎం.ఎల్. కాగా.. కొంతవరకు అవసరాలు తీరుస్తోంది. భవిష్యత్తులో బసాపురం నీటి ట్యాంకు సేవలు అత్యవసరమవుతాయి. ఇప్పటికే మరో ఎస్.ఎస్.ట్యాంకు నిర్మించాలనే డిమాండ్ తెరపైకి వస్తోంది. పాలకులు ఉన్న ట్యాంకును బాగుచేసుకోలేకపోతున్నారు. గత వైకాపా పాలనలో రెండు సార్లు బసాపురం ట్యాంకు లోపలి భాగంలో మట్టి కట్ట దెబ్బతినడంతో రెండు సార్లు రూ.2-3 కోట్లు సాధారణ నిధులు వెచ్చించి పనులు చేపట్టారు. చేసిన పనులు నిలవ లేదు. మొదటి సారి చేసిన రివిట్‌మెంట్ (స్టోన్ పిచ్చింగ్) పనుల్లో నాణ్యత తేలిపోయి.. పనులు జరిగిన నెల రోజుల్లోపే కుంగి.. రాళ్లు నీటిలో జారిపోయాయి. రెండో వైపు మట్టి కట్ట దెబ్బతినడంతో నీటి అవసరాల పేరుతో రూ.50 లక్షల అంచనాతో మట్టి కట్టకు ఇసుక బస్తాల అడ్డుకట్ట పనులు చేపట్టారు. ఆ పనులు కాస్త.. రూ.కోటి దాటి పోయాయి.. వేసిన ఇసుక బస్తాలు పగిలిపోవడం, జారిపోవడం వంటివి జరిగాయి. వెచ్చించిన నిధులు నీటిలో పోసినట్లైంది.

తాత్కాలిక పనులు కాకుండా

ప్రతి సారి నీటి అవసరాల పేరుతో తాత్కాలిక పనుల కోసం రూ.లక్షలు వ్యయం చేస్తున్నా.. ఫలితం ఇవ్వడం లేదు. ప్రస్తుతం దెబ్బతిన్న బసాపురం నీటి కుంట సమస్యను ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలుస్తోంది. మరోసారి తాత్కాలిక పనులు చేపట్టినా ఫలితం ఉండదనే ఆలోచన చేస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వంలో అమృత్ పథకం కింద ఇచ్చిన నిధులు రూ.15 కోట్లతో కొంత వరకు స్టోన్ పిచ్చింగ్ పనులు చేసుకోవాలని భావించి.. పైఅధికారులను సంప్రదించారు. కేంద్రం నిధుల బదలాయింపునకు సమస్యలు ఏర్పడతాయని నిర్ణయం మానుకున్నారు. కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించి ఆదోని పట్టణ ప్రజల తాగునీటి సమస్యను పరిష్కరించాలని పురజనులు కోరుతున్నారు.

వాననీటిలో మురుగు పరుగు

మండల కేంద్రమైన దేవనకొండ బస్టాండు కూడలిలో ప్రధాన డ్రైనేజీ కాలువ పొంగిపొర్లింది. బుధవారం సాయంత్రం కురిసిన చిన్నపాటి వర్షానికే.. దేవనకొండ-కర్నూలు రహదారిపై మురుగు పరుగులు పెట్టింది. దుర్వాసనతో వాహనదారులు, పాదచారులు ముక్కుమూసుకొని వెళ్లాల్సి వచ్చింది. మురుగు కాలువ నిర్మాణ పనులు నిలిచిపోవడంతో ఈ పరిస్థితి నెలకొంది. నిర్మాణం పూర్తిచేసి, ప్రజల ఇబ్బందులు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, దేవనకొండ

కుండపోత.. తగ్గిన ఉక్కపోత

ఆదోని పట్టణంలో వాన కుండపోతగా కురిసింది. బుధవారం సాయంత్రం గంట పాటు కురిసిన వర్షానికి ప్రధాన రహదారులతో పాట లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెద్ద వర్షం కురిసి.. రోజులు గడుస్తోంది. దీంతో జనం ఉక్కపోత, వేడిమి వాతావరణంతో అల్లాడిపోయారు. వర్షంతో వాతావరణం చల్లబడింది. ముందస్తుగా విద్యుత్తు సరఫరా నిలిపివేశారు. – న్యూస్‌టుడే, ఆదోని పురపాలకం

అమకతాడు.. చెదిరిన తారు

తారంతా చెదిరిపోయింది.. కంకర దారిలో ప్రయాణం నరకంగా మారింది. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. కృష్ణగిరి మండలం అమకతాడు, మాదాపురం గ్రామాల మధ్యన రహదారి ఇలా గుంతల మయంగా మారింది. అమకతాడు టోల్ ప్లాజా సమీపం నుంచి ఎరుకలచెరువు గ్రామానికి వెళ్లే తారురోడ్డు దెబ్బతింది. ఇదే దారిలో గుడెంపాడు, పెనుమాడ, ఎరుకలచెరువు గ్రామాల సమీపంలో వాహనదారులు రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, కృష్ణగిరి

చెడు అలవాట్లకు దూరంగా ఉండండి

విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎస్సై జి.కృష్ణమూర్తి

కృష్ణగిరి, న్యూస్‌టుడే: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ.. ఉన్నత చదువులు చదవాలని ఎస్సై జి.కృష్ణమూర్తి తెలిపారు. కృష్ణగిరి ఆదర్శ పాఠశాల, కళాశాల విద్యార్థులతో బుధవారం సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొహర్రం ప్రశాంతంగా జరుపుకోవాలి

ఆస్పరి, న్యూస్‌టుడే: మండలంలో మొహర్రం కార్యక్రమాలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ మస్తాన్‌వలీ సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం వివిధ గ్రామాల ప్రజలతో సమావేశం నిర్వహించారు. పలు సూచనలు చేశారు.

చిన్నారులకు టీకాలతోనే రక్షణ

వెల్దుర్తి, న్యూస్‌టుడే: చిన్నారులకు సకాలంలో టీకాలు వేయించాలని జిల్లా నోడల్ అధికారి రఘు అన్నారు. వెల్దుర్తి ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో ఏర్పాటు చేసిన సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యులు భువనతేజ, ఆరోగ్య సిబ్బంది హసినా, మోహన్, సయ్యద్ ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

వివరాలు తెలుసుకుంటున్న నోడల్ అధికారి రఘు

ఆదోని ఎంఈవో-I బాధ్యతల స్వీకరణ

ఆదోని విద్య, న్యూస్‌టుడే: ఆదోని మండల విద్యాధికారి-1గా భూపాల్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన ఆలూరు మండలం హుళేబీడు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడి ఎంఈవో రాజేంద్రప్రసాద్ బదిలీపై కర్నూలుకు వెళ్లారు.

భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా సావిత్రి

సావిత్రి

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణానికి చెందిన రాష్ట్ర రజక కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ సావిత్రి, భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా ఎంపికయ్యారు. విద్యార్థి దశ నుంచే ఏబీవీపీ, ఆర్.ఎస్.ఎస్ కార్యకర్తగా సేవలందించానని, తన సేవలు గుర్తించి జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా ఎంపిక చేయడం హర్షం వ్యక్తం చేశారు.

సంక్షిప్త సమాచారం

మద్దికెర, న్యూస్‌టుడే: రైతులు, ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ పరమైన సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తహసీల్దారు గుండాల నాయక్ అన్నారు. మండలంలోని అగ్రహారం రైతులు ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా ఇచ్చిన అర్జీల మేరకు ఆయన సిబ్బందితో కలిసి బాధితులతో మాట్లాడారు.

ఆదోని పురపాలకం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని అంబేడ్కర్ కూడలిలోని అన్న క్యాంటీన్‌ను బుధవారం పురపాలక కమిషనర్ కృష్ణ పరిశీలించారు. అల్పాహారానికి వచ్చిన వారితో మాట్లాడి క్యాంటీన్ సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. సేవల పట్ల ప్రజలు సంతృప్తి వ్యక్తం చేసినట్లు కమిషనర్ వెల్లడించారు.

చిప్పగిరి, న్యూస్‌టుడే: మద్యం తాగి వాహనం నడిపితే.. చర్యలు తప్పవని ఎస్సై ఏపీ శ్రీనివాసులు హెచ్చరించారు. చిప్పగిరి అంబేడ్కర్ కూడలిలో వాహనాలను బుధవారం తనిఖీ చేశారు. కార్యక్రమంలో షబ్బీర్, రామాంజీ, శంకర్ పాల్గొన్నారు.

చిప్పగిరి, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ కేంద్రాలు సక్రమంగా నిర్వహించాలని ఎమ్మెల్యే విరూపాక్షి సూచించారు. ఆలూరు ఐసీడీఎస్ సీడీపీవో నరసమ్మ, సిబ్బంది ఎమ్మెల్యేను కలిసి పలు విషయాలపై చర్చించారు. నిత్యం అంగన్‌వాడీ కేంద్రాలను తనిఖీ చేయాలని ఆయన సీడీఈవోను కోరారు. కార్యక్రమంలో మండల సూపర్‌వైజర్లు పద్మావతి, ఈరమ్మ పాల్గొన్నారు.

ఆదోని: దిబ్బనకల్లులో కరపత్రాలు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు, తదితరులు

ఆలూరు: బాధితులకు చెక్కులు అందజేస్తున్న తెదేపా ఇన్‌ఛార్జి వీరభద్రగౌడ్

వెల్దుర్తి : మాట్లాడుతున్న తెదేపా జిల్లా నాయకుడు సుబ్బరాయుడు

తుగ్గలి: కరపత్రం అందిస్తున్న తెదేపా నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకటరాముడు తదితరులు

కృష్ణగిరి: కోయిలకొండలో పాల్గొన్న పత్తికొండ మార్కెట్ యార్డు ఛైర్మన్ నబిసాహెబ్, తదితరులు

సుపరిపాలన అడుగులు.. ప్రగతి జాడలు

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి పనులు చిరస్థాయిగా నిలుస్తాయని తెదేపా ఆలూరు ఇన్‌ఛార్జి వీరభద్రగౌడ్ అన్నారు. ఆలూరు సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. పార్టీ మండల కన్వీనరు అశోక్, నరసప్ప, కొమ్మురాజు, తిప్పేష్, వెంకటేష్, గుండన్న తదితరులు పాల్గొన్నారు.

ఆదోని ఎస్కేడీ కాలనీ, న్యూస్‌టుడే: దేశంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అభివృద్ధిలో నెం.1 స్థానంలో నిలబెట్టడమే ముఖ్యమంత్రి చంద్రబాబుకే ధ్యేయమని తెదేపా ఆదోని బాధ్యుడు, మాజీ ఎమ్మెల్యే కె.మీనాక్షినాయుడు అన్నారు. ఆదోని మండలం దిబ్బనకల్లు గ్రామంలో బుధవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం ప్రారంభించారు. కార్యక్రమంలో కురవ కార్పొరేషన్ ఛైర్మన్ దేవేంద్రప్ప, తెదేపా సీనియర్ నాయకులు భాస్కర్‌రెడ్డి, గుడిసె కృష్ణమ్మ, భూపాల్‌చౌదరి, తెదేపా మండల అధ్యక్షుడు బసవరాజు, నాయకులు రామస్వామి, శ్రీకాంత్ రెడ్డి, గోపాల్‌రెడ్డి, ఫక్రుద్దీన్, లక్ష్మన్న, రామకృష్ణ, అన్వర్‌బాషా, బాబునాయుడు, బుద్దారెడ్డి, రామచంద్ర, ఓబుమన్న, వెంకటేశ్‌చౌదరి తదితరులు పాల్గొన్నారు.

వెల్దుర్తి, న్యూస్‌టుడే: స్థానిక తెదేపా కార్యాలయంలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కార్యకర్తలతో బుధవారం సమావేశం నిర్వహించారు. సమస్యలు ఎమ్మెల్యే కేఈ.శ్యాంబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. కార్యక్రమంలో తెదేపా జిల్లా నాయకుడు సుబ్బరాయుడు తెదేపా జిల్లా ఉపాధ్యక్షుడు పుల్లయ్య, మండల తెదేపా నాయకులు బలరాంగౌడ్, అమర్‌నాథ్‌గౌడ్, సుధాకర్‌గౌడ్, వెంకట్రాముడు, రామకృష్ణాఆచారి, మహిధర్‌రెడ్డి, మద్దిలేటి, రాజేశ్వర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తుగ్గలి, న్యూస్‌టుడే: రాంపురం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర నాయకులు తుగ్గలి నాగేంద్ర, బత్తిన వెంకటరాముడు పథకాలకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు వెంకటస్వామి, తిరుపాల్ నాయుడు, శ్రీనివాసగౌడ్, బీమలింగప్ప, మల్లయ్య, చంద్ర తదితరులు పాల్గొన్నారు.

కోయిలకొండ, ఆగవేలి(కృష్ణగిరి), న్యూస్‌టుడే: మండలంలోని కోయిలకొండ గ్రామంలో పత్తికొండ మార్కెట్ యార్డు ఛైర్మన్ నబిసాహెబ్ ఆధ్వర్యంలో, ఎస్.ఎర్రగుడి, ఆగవేలి, ఎరుకలచెరువు గ్రామాల్లో తెదేపా జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు ఎల్వీ ప్రసాద్ ఆధ్వర్యంలో తెదేపా నాయకులు, కార్యకర్తలతో కలిసి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు.

తెదేపా ప్రోగ్రాం కమిటీ నియామకం

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆలూరు నియోజకవర్గ తెదేపా ప్రోగ్రాం కమిటీ కో-ఆర్డినేటర్లుగా జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు, ఆర్టీసీ ఛైర్మన్, ఆలూరు నియోజకవర్గ పరిశీలకులు పూల నాగరాజును నియమిస్తున్నట్లు తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఆలూరు నియోజకవర్గంలో పార్టీ విభేదాలు సరిదిద్దేందుకు, అందరినీ సమన్వయం చేయడంతో పాటు, పార్టీ చేపట్టిన స్వపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఈ కమిటీ పనిచేస్తుందని తెలుస్తోంది.

కష్టపడే వారికి తగిన గుర్తింపు

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తనూ పార్టీ అధిష్ఠానం గుర్తుంచుకొని తగిన ప్రాధాన్యం కల్పిస్తుందని పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు అన్నారు. మండల పరిధిలోని చందోలి గ్రామానికి చెందిన తలారి రంగప్పను పత్తికొండ వ్యవసాయ పరపతి సంఘం ఛైర్మన్‌గా పార్టీ రాష్ట్ర నాయకత్వం ఎంపిక చేయటంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు. పత్తికొండ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆయన్ని పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు.

పల్లెలు ఐక్యత చాటాలి

గుండ్లకొండ (దేవనకొండ) న్యూస్‌టుడే: గ్రామ ప్రజలంతా కలసిమెలసి జీవించాలని, అందరూ సంతోషంతో గడపాలని డీఎస్పీ వెంకట్రామయ్య, ఆర్డీవో భరత్‌నాయక్ అన్నారు. మండలంలోని గుండ్లకొండలో గ్రామస్తులతో బుధవారం సమావేశమయ్యారు. గ్రామంలో మొహర్రం నేపథ్యంలో ఇరువర్గాలు వాగ్వాదం చేసుకోవడంతో డివిజన్ అధికారులు అప్రమత్తమై ప్రజలతో సమావేశమయ్యారు. గుండ్లకొండ, గుడిమిరాళ్ల గ్రామస్థులు కలిసి మొహర్రం జరుపుకొంటున్నారు. ఎలాంటి వివాదాలకు తావివ్వరాదన్నారు. కార్యక్రమంలో సీఐ వంశీనాథ్, తహసీల్దారు రామంజనేయులు పాల్గొన్నారు.

గుండ్లకొండలో పర్యటించిన డీఎస్పీ, ఆర్డీవో, తదితరులు

క్షయ నిర్మూలనే లక్ష్యం

ఆదోని వైద్యం, న్యూస్‌టుడే: ఆదోని పట్టణంలోని శంకర్‌నగర్ అర్బన్ ఆరోగ్య కేంద్రం పరిధిలోని క్రాంతినగర్‌లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నిర్మూలనపై బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డా. పృథ్వీ రాజు మాట్లాడారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు బాబురాజు, సీతారాముడు, అరుణ, సుబ్బమ్మబాయి, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పత్తికొండ గ్రామీణం, న్యూస్‌టుడే: పత్తికొండ పట్టణంలోని మూడో సచివాలయ పరిధిలో డెంగీ వ్యాధి నివారణపై వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. వ్యాధి లక్షణాలు నివారణ చర్యలపై వైద్యురాలు సుజాత పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది సాయిబాబా, వెంకటేశ్వర్లు, వరలక్ష్మి, చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

పత్తికొండలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు

వైద్యుల సమస్యల పరిష్కారానికి కృషి

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డా.మధుసూదన్

ఆదోని పాతపట్టణం, న్యూస్‌టుడే: వైద్య వృత్తి ఎంతో గొప్పదని, వారి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ అన్నారు. బుధవారం ఇండియన్ మెడికల్ అసోషియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ ఓ.ఎం.కృష్ణమూర్తి అధ్యక్షతన అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం నిర్వహించారు. అనంతరం క్రీడా పోటీల్లో విజయం సాధించిన వైద్యులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో ఐఎంఏ కేంద్ర కమిటీ సభ్యుడు డా.గోపినాథ్, కార్యదర్శి డా.శ్రీనివాస్, కోశాధికారి డా.మధుసూదన్, ఆదిత్యకుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు డా.హరిష్, తదితరులు పాల్గొన్నారు.

సమన్వయ లోపం.. అభివృద్ధికి ఆటంకం

- మేజర్ పంచాయతీ వెల్దుర్తిలో అవస్థలు
- తాగునీటి సమస్యతో ప్రజల ఇబ్బందులు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయ లోపంతో వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయతీలో సమస్యల పరిష్కారం జరగడంలేదు. నీటి సమస్యతో ప్రజలు పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగుతున్నారు. అధికారులు, పంచాయతీ పాలకమండలి మధ్య సమన్వయం లేకపోవడంతో అభివృద్ధి పనులకు తీర్మానాలు జరగడంలేదు.

వెల్దుర్తి పంచాయతీ ఎదుట ఆందోళన చేస్తున్న మహిళలు

బిల్లులు రాక బేంబేలు

కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయతీలో దాదాపు రూ.80 లక్షల మేర అభివృద్ధి పనులు చేపట్టారు. వీధి దీపాల కొనుగోలు, పంచాయతీ నిధులతో ఏర్పాటు చేసిన రహదారులకు తీర్మానాలు చేయకపోవడంతో పనులు చేపట్టిన వారు సైతం బిల్లుల మంజూరుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైకాపా పాలనలో నిధులు లేకపోవడంతో పంచాయతీలో అభివృద్ధి జరగలేదు. కూటమి ప్రభుత్వంతో పంచాయతీలకు నిధులు మంజూరు చేసిన అభివృద్ధి పనుల విషయంలో సమన్వయం లేక సమస్య ఏర్పడుతోంది.

అయోమయంలో అధికారులు

వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయతీలోని అధికారుల పరిస్థితి ఇరుక్కున్నవారిగా మారింది. అధికారులు, ప్రజాప్రతినిధుల మధ్య విబేధాలు రావడంతో చిన్నపాటి మరమ్మతులు జరగడం లేదు. విభేదాలు కాస్తా తీవ్రం కావడంతో అధికారులు పోలీసు స్టేషన్‌ను ఆశ్రయించారు. అయితే స్థానిక నాయకులు జోక్యంతో ఫిర్యాదు చేయకుండా అధికారులు వెనుదిరిగారు.

ఇదీ పరిస్థితి

- వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయతీలో వైకాపాకు చెందిన సర్పంచి ఉన్నారు. కూటమి ప్రభుత్వం రావడంతో గ్రామంలో అభివృద్ధి చేపట్టేందుకు తెదేపా నాయకులు ప్రణాళికలు సిద్ధం చేశారు. పాలకమండలికి, కూటమి నాయకుల మధ్య సమన్వయం లేకపోవడంతో తీర్మానాల విషయంలో విభేదాలు వస్తున్నాయి. దీంతో వెల్దుర్తి పంచాయతీ పరిధిలో చిన్నపాటి పనులు చేసేందుకు సాధ్యం కావడంలేదు.
- వర్షాకాలమైనా వెల్దుర్తి మేజర్ గ్రామపంచాయతీలో నీటి సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నీటి వసతులు ఉన్న వాటిని వినియోగించుకోవడంలో అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం లేకపోవడంతో సమస్య పరిష్కారం కావడం లేదు. గ్రామానికి నీటి సరఫరా చేసే పైపులైను దెబ్బతిన్నా.. వాటి మరమ్మతులకు అధికారులు, సర్పంచి అనుమతులు తప్పనిసరి. అయితే ఇద్దరి మధ్య సఖ్యత లేకపోవడంతో వాటి పనులు జరగక నీటి సరఫరా కష్టంగా మారింది. దీంతో 15 రోజులకోసారి నీటి సరఫరా రావడంతో మహిళలు పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనలకు దిగుతున్నారు.

పాముకాటుతో బాలికకు అస్వస్థత

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణం రాయనగర్‌కు చెందిన ప్రియ(3) అనే బాలికకు పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురైంది. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. ఇంటి వద్ద ఆడుకుంటూ ఉండగా పాము కాటు వేసిందని స్థానికులు పేర్కొన్నారు.

యువతి ఆత్మహత్యాయత్నం

ఆదోని నేరవార్తలు, న్యూస్‌టుడే: ఆదోని మండలం హనవాళు గ్రామానికి చెందిన ఓ యువతి బుధవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు ఆస్పత్రి ఔట్‌పోస్టు పోలీసులు తెలిపారు. గుర్తించిన కుటుంబ సభ్యులు చికిత్స కోసం ఆదోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. కడుపునొప్పి బాధ తాళలేక ఈ అఘాయిత్యానికి పాల్పడినట్లు పేర్కొన్నారు.

పొలానికి వెళ్తానని వెళ్లి.. అదృశ్యం

ఆలూరు గ్రామీణ, న్యూస్‌టుడే: పొలానికి వెళ్తున్నానని చెప్పి గత నెల 29న ఇంటి నుంచి వెళ్లిన బాలుడు తిరిగి రాలేదని ఎస్సై మహబూబ్‌బాషా తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఆలూరు మండలం కురువళ్లి గ్రామానికి చెందిన అంపమ్మ, హనుమంతప్ప దంపతులకు ఇద్దరు సంతానం. వీరిలో పెద్దకుమారుడు విజయేంద్ర ఆలూరులోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. జూన్ 29న పొలానికి వెళ్తున్నానని చెప్పి వెళ్లిన బాలుడు ఇంటికి తిరిగి రాలేదు. అన్ని చోట్ల గాలించినా ఎక్కడా కనిపించలేదు. బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వెల్లడించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత..

హొళగుంద, న్యూస్‌టుడే: హొళగుంద మండల పరిధి కర్ణాటక సరిహద్దు మార్లమడికి గ్రామం అంచున వేదవతి హగరి నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకుని జిల్లా మైనింగ్ శాఖ అధికారులకు అప్పగించినట్లు హొళగుంద ఎస్సై దిలీప్‌కుమార్ తెలిపారు.

పశుగ్రాసం దగ్ధం

మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెర ఎస్సీ కాలనీకి చెందిన నల్లక్క పాడిగేదెలను పోషిస్తున్నారు. వీటికి అవసరమైన పశుగ్రాసాన్ని స్థానిక రైతుల నుంచి రూ.4 లక్షలు వెచ్చించి కొనుగోలు చేసి, ఇటీవలే వామిదొడ్డిలో నిల్వ ఉంచారు. బుధవారం వేకువ జామున జరిగిన ప్రమాదంలో మేత మొత్తం అగ్నికి ఆహుతైంది. గుంతకల్లు నుంచి వచ్చిన అగ్నిమాపక దళం మంటలను ఆర్పినా ఫలితం లేకుండా పోయింది.

(c) eenadu

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

మల్లికార్జున్‌గౌడ్‌కు చెక్కు అందజేస్తున్న రాఘవేంద్రరెడ్డి

మంత్రాలయం, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరమని తెదేపా నియోజకవర్గ బాధ్యుడు రాఘవేంద్రరెడ్డి అన్నారు. కౌతాళం మండల పరిధిలోని నదిచాగి గ్రామానికి చెందిన తెదేపా కార్యకర్త మల్లికార్జున్‌గౌడ్ కూతురు కాలేయం సమస్యతో బాధపడుతున్నారు. వైద్యులు శస్త్రచికిత్స చేయాలని సూచించడంతో.. రాఘవేంద్రరెడ్డి సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేయించారు. సీఎం కార్యాలయం నుంచి రూ.3లక్షలు మంజూరు కావడంతో బుధవారం మాధవరంలోని పార్టీ కార్యాలయంలో మల్లికార్జున్‌గౌడ్‌కు ఆయన చెక్కు అందజేశారు.

ఎమ్మిగనూరు

• ఎమ్మిగనూరు • మంత్రాలయం • కోడుమూరు

కొలువుదీరిన పీర్లు.. భక్తుల మొక్కులు

సి.బెళగల్, న్యూస్‌టుడే: మండలంలోని ఈర్లదిన్నె, ముడుమాల, కొండాపురం, పల్దొడ్డి, గుండ్రేవుల, చింతమానుపల్లె, కంబదహల్, బురాన్‌దొడ్డి, మారందొడ్డి, బ్రాహ్మణదొడ్డి గ్రామాల్లోని ఆయా పీర్లచావిడిలో బుధవారం పీర్లు కొలువుదీరాయి. సి.బెళగల్‌లో కంఠమల్లయ్య, మిన్నల్లా స్వామి, పాతకొండలయ్య, కొత్త కొండలయ్య, పెద్దదేవుడు, చిన్న, పెద్ద విమాంఖాసీంల చావిడిల్లో చక్కెర చదివించి మొక్కులు తీర్చుకున్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఎమ్మిగనూరు గ్రామీణం	కోసిగి
80085 73794	9550434095

కౌతాళం, న్యూస్‌టుడే: ?: కౌతాళం మండలంలోని గోతులదొడ్డి - కుంబళనూరు క్యాంపు గ్రామాల మధ్య రహదారి కల్వర్టు కోతకు గురైంది. 20 రోజులుగా రాకపోకలు పూర్తిగా ఆగిపోయాయి. మరమ్మతులు చేసి రాకపోకలను పునరుద్ధరించాలి. – రాముడు, కుంబళనూరు.

✔: రహదారి కల్వర్టు మరమ్మతులకు గొట్టాలు తీసుకొచ్చాం. రెండు, మూడు రోజుల్లో పనులు ప్రారంభించి పూర్తి చేస్తాం. రాకపోకలను పునరుద్ధరిస్తాం. –సాయి సురేష్, ఆర్‌అండ్‌బీ జేఈ, కౌతాళం.

?: కౌతాళం మండలంలోని హాల్వి గ్రామంలో సంతబజారులో విద్యుత్ నియంత్రిక చుట్టూ కంచె, రక్షణ లేక ప్రమాదకరంగా మారింది. పశువులు, కోతులు, తదితర జంతువులు విద్యుత్ ప్రమాదంలో చనిపోతున్నాయి. విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. కంచె ఏర్పాటు చేయాలి. – మనోజ్, హాల్వి.

✔: హాల్వి సంతబజారులో ఉన్న విద్యుత్ నియంత్రిక చుట్టూ కంచె ఏర్పాటు చేస్తాం. ప్రమాదాలు జరగకుండా చూసుకుంటాం.
– నరసన్న, విద్యుత్ ఏఇ, కౌతాళం.

ఎమ్మిగనూరు, న్యూస్‌టుడే: ?: ప్రధాన రహదారిలో విద్యుత్తు దీపాలు వెలగక చీకటి ఉంది. – రంగన్న, వీవర్స్‌కాలనీ

✔:దీపాల మరమ్మతులకు చర్యలు చేపడతాం. – శరత్, ఏఈ

సమస్య: సోమేశ్వర టాకీస్ సమీపంలో ఉన్న మురుగు కాల్వలను శుభ్రం చేయడం లేదు. – సురేష్, లక్ష్మీపేట కాలనీ

✔: కాల్వలను శుభ్రం చేయిస్తాం.
– శ్రీనివాసులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్

వివాదాస్పద భూమిపై తహసీల్దార్ విచారణ

మంత్రాలయం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వివాదాస్పద స్థలంపై వచ్చిన ఆర్జీపై బుధవారం తహసీల్దార్ రమాదేవి విచారణ చేపట్టారు. రచ్చుమర్రి గ్రామానికి చెందిన కడతట్ల వెంకటలక్ష్మికి చెందిన భూమిని అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి అతని భార్యపై అక్రమంగా రిజిస్టర్ చేసుకున్నట్లు ఐదేళ్లుగా పోరాడుతున్నామని.. తమ వద్ద రికార్డులున్నాయని, న్యాయం చేయాలని ఆమె అర్జీ ఇచ్చారు. తహసీల్దార్ బుధవారం అధికారులతో కలిసి గ్రామంలో వివాదాస్పదంగా ఉన్న పొలం వద్ద విచారణ చేపట్టారు. ఇరువైపులా ఉన్న రికార్డులు తమకు

రచ్చుమర్రిలో పత్రాలను పరిశీలిస్తున్న రమాదేవి

ఇవ్వాలని, వాటిని పరిశీలించి సబ్ కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని తహసీల్దార్ తెలిపారు. రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌రావు, మండల సర్వేయర్ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకేంద్రం మరుగున

● గాజులదిన్నెలో నిర్వహణ లోపంతో నిరుపయోగం

అలంకారప్రాయంగా చేప పిల్లల తొట్లు

సిబ్బంది కొరత.. ప్రారంభం కానీ రేరింగ్

ఈ కేంద్రంలో మొదట్లో సుమారు 20 మంది సిబ్బంది పనిచేసినట్టు అధికారులు చెప్పారు. ప్రస్తుతం ఎఫ్‌డీవో, అటెండర్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం చేపల ఉత్పత్తి జరగడం లేదు. రేరింగ్ మాత్రమే(చిన్న పిల్లలను తీసుకొచ్చి కొన్నిరోజులు పెంచడం) కొనసాగుతోంది. ఏటా జూన్ నెలలోనే పిల్లలను తెప్పించి తొట్టెలలో పెంచుతారు. నెల తర్వాత మత్స్యకారులకు పంపిణీ చేస్తున్నారు. ఈ ఏడాది జలాశయంలో నీరున్నప్పటికీ ప్రక్రియ ప్రారంభం కాకపోవడం గమనార్హం.

మత్స్యకేంద్రం వివరాలు..

కేంద్రం : గాజులదిన్నె చేపల ఉత్పత్తి కేంద్రం	
మొత్తం తొట్టెలు	: 98
గతంలో అభివృద్ధి చేసినవి	: 50
ఐదేళ్లలో చేసినవి	: 06
నిరుపయోగంగా ఉన్నవి	: 40
ముళ్లపొదలు కప్పేసిన మడుగులు	: 08
మొదట్లో చేప పిల్లల ఉత్పత్తి	: కోటి
నేడు రేరింగ్	: 60లక్షలు

1982లో ప్రారంభం

గాజులదిన్నె జలాశయ పరిధిలో చేపపిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని 1982లో ప్రారంభించారు. గాజులదిన్నె మత్స్యకేంద్రంలో ఉత్పత్తి చేసిన సీడును అనంతపురం, కడప, చిత్తూరు తదితర జిల్లాలకు సరఫరా చేసేవారు. దీని పరిధిలో ఎమ్మిగనూరు, కోడుమూరు, గోనెగండ్ల, పత్తికొండ, దేవనకొండ, తుగ్గలి, కృష్ణగిరి, పెద్దకడుబూరు, ఆస్పరి మండలాల్లోని చెరువులు, మూడు రిజర్వాయర్లు ఉన్నాయి. ఈ చెరువుల పరిధిలోని సంఘాలకు చేప పిల్లలు పంపిణీ చేయాల్సి ఉంది.

గోనెగండ్ల, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలోనే గాజులదిన్నె మత్స్యకేంద్రానికి ఎంతో పేరుంది. అప్పట్లో సుమారు కోటి చేపపిల్లల ఉత్పత్తి జరిగేది. నేడు నిధుల లేమి, నిర్వహణ లోపంతో శిథిలావస్థకు చేరింది. సీడు తయారు చేసేందుకు ఏర్పాటు చేసిన యూక్విప్‌మెంట్ తుప్పు పట్టిపోయింది. కేంద్రం పరిధిలో ఉన్న తల్లి, పిల్లచేపల మడుగుల్లో ముళ్లపొదలు, పిచ్చిమొక్కలు పెరిగి అస్తవ్యస్తంగా మారాయి. 2014లో తెదేపా హయాంలో సగం తొట్లకు ఆధునికీకరణ పనులు చేపట్టారు. గత వైకాపా పాలనలో అభివృద్ధిని గాలికి వదిలేసింది. కూటమి ప్రభుత్వం పూర్వ వైభవం తీసుకొచ్చి ఉపాధి కల్పించాలని మత్స్యకారులు కోరుతున్నారు.

అభివృద్ధికి ప్రతిపాదనలు –నాగరాజు, ఇన్‌ఛార్జి ఎఫ్‌డీవో గాజులదిన్నె

సిబ్బంది కొరత వల్ల చేపపిల్లల రేరింగ్ ప్రక్రియకు మాత్రమే పరిమితమైంది. ఉన్నతాధికారులు మత్స్య కేంద్రం అభివృద్ధికి ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ ఏడాది తుంగభద్ర దిగువ కాలువకు నీరు విడుదలైన వెంటనే చేపపిల్లల పెంపకం ప్రారంభిస్తాం.

ఏడాది పాలనలోనే 80శాతం హామీలు పూర్తి

చెట్నిహళ్లిలో కరపత్రాలు పంచుతున్న రాఘవేంద్రరెడ్డి

గూడూరు పట్టణంలో వివరిస్తున్న కేడీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్‌రెడ్డి

మంత్రాలయం, న్యూస్‌టుడే: అధికారంలోకి వచ్చిన ఏడాదిలోపే 80శాతం హామీలు నెరవేర్చిన ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందని తెదేపా నియోజకవర్గ బాధ్యుడు రాఘవేంద్రరెడ్డి పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా మొదటి రోజు చెట్నిహళ్లి గ్రామం చేరుకున్న ఆయనకు గ్రామ తెదేపా నాయకులు స్వాగతం పలికారు. ఇంటింటికీ తిరిగి సంవత్సర కాలంలోనే కూటమి ప్రభుత్వం అమలు చేసిన పథకాలను ప్రజలకు వివరించారు. మంచాల సొసైటీ డైరెక్టర్ చాపల నాగేశ్, మేకల మల్లేషు, వరద రాజులు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు, గూడూరు గ్రామీణం: గూడూరు పట్టణంలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో కేడీసీసీబీ ఛైర్మన్ విష్ణువర్ధన్ హాజరయ్యారు. మాజీ వైస్ ఛైర్మన్ కె.రామాంజినేయులు, కౌన్సిలర్ బి.సృజన్, పాషావలి, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గోనెగండ్ల: మండలంలోని వేముగోడు, గంజహళ్లి గ్రామాల్లో గ్రామ తెదేపా అధ్యక్షుడు సాయినాథ్, మాజీ సర్పంచి సత్యనారాయణ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. గంజహళ్లిలో గ్రామ తెదేపా అధ్యక్షుడు శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేస్తూ.. ప్రజల సమస్యలు తెలుసుకున్నారు.

కోడుమూరు గ్రామీణం: పట్టణంలోని 251, 252 పోలింగ్‌కేంద్రాల పరిధిలో తెదేపా సీనియర్ నాయకుడు గోపాల్ నాయుడు, పట్టణాధ్యక్షుడు గంగాధర్‌నాయుడు ఇంటింటికీ తిరిగి తెదేపా సంక్షేమ పథకాలను వివరించారు.

సి.బెళగల్: మండల కేంద్రమైన సి.బెళగల్‌లోని వడ్డెర వీధుల్లో తెదేపా ఆదేశాల మేరకు 149, 150, 151 బూత్‌లలో పర్యటిస్తూ పథకాల గురించి వివరించారు. మండల తెదేపా కన్వీనర్ బి.చంద్రశేఖర్, సింగిల్‌విండో ఛైర్మన్ చిన్న తిమ్మప్ప, ఎంపీటీసీ వీరన్నగౌడ, కోడుమూరు తెలుగు యువత అధ్యక్షుడు హరి ధనుంజయ పాల్గొన్నారు.

కోడుమూరు పట్టణంలో కరపత్రం అందజేస్తున్న తెదేపా నేతలు

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి

సి.బెళగల్‌లో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో నాసరరెడ్డి

సి.బెళగల్, న్యూస్‌టుడే: గ్రామాల్లో ఏర్పాటు చేసిన చెత్త సంపద కేంద్రాలను పంచాయతీల కార్యదర్శులు వినియోగంలోకి తేవాలని కర్నూలు జడ్పీ సీఈవో నాసరరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రమైన సి.బెళగల్‌లో బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన స్వచ్ఛాంధ్ర కోసం ఐ.వి.ఆర్.ఎస్ కాల్స్ ద్వారా గ్రామాల్లోని పరిసరాల పరిశుభ్రతపై ఆరా తీస్తున్నారని వివరించారు. కార్యదర్శులు ఉదయమే గ్రామాల్లో చేరి ఇంటింటా తడి, పొడి చెత్త సేకరించి.. చెత్తసంపద కేంద్రానికి చేర్చి.. ఎరువులు తయారీ చేసి.. రైతులకు అమ్మి ఆదాయాన్ని గడించుకోవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అనంతరం కంబదహల్, సి.బెళగల్, బురాన్‌దొడ్డి, ఇనగండ్ల గుండ్రేవుల గ్రామాల్లో చెత్తసంపద కేంద్రాలను సందర్శించారు. బురాన్‌దొడ్డి చెత్తసంపద కేంద్రంలో పనులు చేపట్టకపోవడంతో కార్యదర్శిపై మండిపడ్డారు. కంబదహల్‌లో గ్రామానికి దూరంగా ఉన్న చెత్త సంపద కేంద్రం వినియోగం సాధ్యమా అని కార్యదర్శి అభిషేక్‌ను ప్రశ్నించగా.. చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీవో రాణెమ్మ తదితరులు ఉన్నారు.

పనుల్లో ప్రమాణాలు పాటించాలి

గోనెగండ్ల, న్యూస్‌టుడే: మండలంలో జలజీవన్ మిషన్ పథకం కింద చేపడుతున్న పనుల్లో ప్రమాణాలు పాటించాలని క్వాలిటీ కంట్రోల్ ఏఈ మహేశ్వరి తెలిపారు. బుధవారం మేజరు పంచాయతీ గోనెగండ్ల, గాజులదిన్నె జలాశయం వద్ద జరుగుతున్న ఓహెచ్‌ఆర్ ట్యాంకు, పైపులైను, ఇన్‌టెక్‌వెల్ తదితర తాగునీటి పథకం పనులను ఆమె పరిశీలించారు. నిర్దేశిత గడువులోగా పనులు పూర్తి చేయాలని గుత్తేదారుడికి సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాసరెడ్డి, చంద్రశేఖర్, బాబునాయుడు, గుత్తేదారుడు రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు సమయపాలన అవసరం

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న సత్యవతి

కోసిగి, న్యూస్‌టుడే: ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చిన రోగులకు సరైన సమయంలో వైద్యం అందించాలని ఆదోని డిప్యూటీ డీఎంహెచ్‌వో సత్యవతి అన్నారు. కోసిగి ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా ఆసుపత్రిని పరిశీలించారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. వైద్యాధికారులు అభిరూప్, మౌనిక, సిబ్బందితో వారు మాట్లాడుతూ..సిబ్బంది సమయపాలన పాటించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు వేశారు.. కాల్వలు మరిచారు

శివారు ప్రాంతాల్లో అభివృద్ధి పనులు అరకొరగా చేసి వదిలేశారు. సీసీ రోడ్డు వేసి కాల్వల నిర్మించకపోవడంతో వర్షాకాలంలో మురుగు కుంటను తలపిస్తోంది. ఎమ్మిగనూరు పట్టణంలో సోమప్పనగర్, రాఘవేంద్ర, మునెప్పనగర్, కొత్త ఇందిరానగర్ కాలనీల్లో రూ.50లక్షలతో సీసీ రోడ్లు వేశారు. పక్కన డ్రైనేజీ నిర్మించకపోవడంతో కాల్వలు లేక మురుగు, కాల్వలో నీళ్లన్నీ ఇళ్ల ముందే కుంటమాదిరిగా ఏర్పడుతోంది. నిత్యం కాలనీలో దుర్వాసన వెదజల్లుతోంది. దోమలుతో వ్యాధులు ప్రబలుతున్నాయి. అధికారులు కాల్వలు నిర్మించాలని స్థానికులు కోరారు.– న్యూస్‌టుడే, ఎమ్మిగనూరు

దాహం తీర్చని నీటి తొట్టి

రాష్ట్ర ప్రభుత్వం పల్లెపండగలో భాగంగా ఉపాధిహామీ పథకం కింద గ్రామాల్లో పశువులు దాహర్తి తీర్చుకోవడానికి నీటితొట్టెలు నిర్మించింది. మండలంలోని చిన్నమర్రివీడు పంచాయతీలో ఊరికి దూరంగా చెత్త సంపద కేంద్రం వద్ద నెలకొల్పారు. సమీపంలో ఉన్న బోరు మోటారు పనిచేయకపోవడంతో అందులో నీరు పెట్టడం లేదు. బోరు మోటారుకు మరమ్మతులు చేపట్టి తొట్టిని నీటితో నింపితే పశువుల దాహర్తి తీర్చవచ్చు.– న్యూస్‌టుడే, గోనెగండ్ల

నాలుగు కిలోమీటర్లు.. నడకయాతన

మండల పరిధిలోని నాగలదిన్నె-మిట్టాసోమాపురం వెళ్లే నాలుగు కిలోమీటర్ల మేర రహదారి అధ్వానంగా మారడంతో ప్రయాణం చేసే వారికి నరకం కనిపిస్తోంది. ఈ రహదారిపై నిత్యం వందల సంఖ్యలో నాగలదిన్నె, మిట్టాసోమాపురం, సోమలగూడూరు, పోనకలదిన్నె, దైవందిన్నె మీదుగా ఎమ్మిగనూరు గ్రామాలకు రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రివేళల్లో ద్విచక్ర వాహనాలపై వెళ్లేవారు ప్రమాదాల బారిన పడిన ఘటనలు అనేకం. అధికారులు పట్టించుకోపోవడంతో తారు లేచిపోయి, కంకర రాళ్లు తేలి అడుగడుగునా గుంతలు పడ్డాయి. గుంతలమయంగా మారిన రోడ్డులో ప్రయాణం నరకప్రాయంగా మారిందని స్థానిక ప్రజలు వాపోయారు. అధికారులు స్పందించి రోడ్డును బాగు చేయాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నందవరం

మూలన పడిన నీటిశుద్ధి యంత్రం

మండలంలోని ముడుమాల గ్రామంలో రెగ్యులర్ ప్రాథమిక పాఠశాల సమీపంలో గత ప్రభుత్వ పాలనలో ఆఘమేఘాల మీద రూ.8లక్షలు వెచ్చించి నీటిశుద్ధి యంత్రం ఏర్పాటుచేశారు. సర్పంచి బతుకమ్మ కొద్దిరోజుల పాటు ఉదయం, సాయంత్రం బిందెకు రూ.5 వసూలు చేసి గ్రామస్థులకు తాగునీరుగా అందించారు. తరువాత యంత్రం మరమ్మతులకు గురికావడంతో అలాగే వదిలేశారు. కూటమి ప్రభుత్వంలో అయినా దీనికి తక్షణమే మరమ్మతులు చేసి వినియోగంలోకి తెస్తే బాగుంటుందని గ్రామస్థులు అంటున్నారు.
– న్యూస్‌టుడే, ముడుమాల(సి.బెళగల్)

దంపతుల ఆత్మహత్యాయత్నం

గోనెగండ్ల, ఎమ్మిగనూరు, నేరవార్తలు, న్యూస్‌టుడే: గోనెగండ్లకు చెందిన ఈరన్న, అంజినమ్మ భార్యాభర్తలు బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. వీరిద్దరూ పశువులను పోషిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరి మధ్య కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నట్లు చెబుతున్నారు. బుధవారం ఇద్దరు గొడవ పడి భార్య ముందుగా పురుగుల మందు తాగగా.. తరువాత భర్త కూడా తాగాడు. ఇద్దరిని చికిత్స కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి రెఫర్ చేశారు.

శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే చర్యలు

మాట్లాడుతున్న సీఐ మంజూనాథ్, ఎస్సై హనుమంతరెడ్డి

కోసిగి, న్యూస్‌టుడే: ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా మొహర్రం నిర్వహించుకోవాలని కోసిగి సీఐ మంజూనాథ్ అన్నారు. కోసిగి సర్కిల్ కార్యాలయంలో సీఐ మంజూనాథ్, ఎస్సై హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం చిన్నభూంపల్లి, దుద్ది, ఐరన్‌గల్, కోల్మాన్‌పేట, జంపాపురం, దొడ్డి బెళగల్, కోసిగి గ్రామాల పెద్దలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. మంజూనాథ్ మాట్లాడుతూ..శాంతిభద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ సిబ్బంది, గ్రామాల పెద్దలు, నాయకులు పాల్గొన్నారు.

తల్లి, పిల్లలను కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

మంత్రాలయం, న్యూస్‌టుడే: ఇంటి నుంచి వచ్చిన తల్లి, పిల్లలను రాయచూరు పోలీసులకు అప్పగించామని ఎస్సై శివాంజల్ తెలిపారు. రాయచూరుకు చెందిన శివమ్మ ఇద్దరు పిల్లలతో మంత్రాలయం వచ్చినట్లు ఉన్నారని, ఆచూకీ తెలుసుకోవాలని రాయచూరు పోలీసులు తెలిపారని ఎస్సై అన్నారు. వెంటనే శ్రీమఠం ప్రోటోకాల్ పోలీస్ రంగస్వామి రంగంలోకి దిగి.. శ్రీమఠం పరిసరాల్లో తల్లి, కూతుళ్లను గుర్తించి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. రెండు గంటల్లోనే ఆచూకీ కనుక్కొని పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు.

జోరుగా వర్షం.. రైతుల్లో హర్షం

కోడుమూరు గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో జోరుగా వర్షం కురిసింది. వాన రాకతో బుధవారం పంట పొలాలు కళకళలాడాయి. పత్తి, కంది వేసిన రైతులు వారం రోజులుగా వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. గంటపాటు వర్షం కురవటంతో మేలు జరిగిదంటూ ఆనందం వ్యక్తం చేశారు. పలు దారులు బురదమయమయ్యాయి. ప్రధాన దారిలో నీరు నిలిచిపోయి ఇబ్బందులు పడ్డారు.

ఎమ్మిగనూరు వ్యవసాయం: ఎమ్మిగనూరులో బుధవారం గంటకు పైగా వర్షం కురిసింది. పట్టణంలోని మురుగు కాల్వలు పొంగి ప్రవహించాయి. వర్షం రాకతో రైతులు ఎరువులు వేసేందుకు సిద్ధమవుతున్నారు.

కౌతాళం: కౌతాళం మండలంలో మధ్యాహ్నం జోరు వానలు కురిశాయి. ఎరిగేరి గ్రామంలో వీధులన్నీ జలమయమయ్యాయి. మండలంలో హాల్వి, కౌతాళం, ఉరుకుంద, సుళేకేరి తదితర గ్రామాల్లో వర్షం కురిసింది.

ఎరిగేరి గ్రామంలోని వీధుల్లో నిలిచిన నీరు

సంక్షిప్త సమాచారం

ఎమ్మిగనూరు నేరవార్తలు: పట్టణంలోని జాతీయ రహదారిపై వెంకటసాయి దేవాలయం సమీపంలో ద్విచక్ర వాహనం ఢీకొని కోటేశ్వర రావు అనే వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం 108 వాహనంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కోటేశ్వరరావు నడిచి వెళ్తుండగా ద్విచక్ర వాహనం ఢీకొంది.

మంత్రాలయం: మూడు నెలల క్రితం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం మంత్రాలయానికి వచ్చిన కర్ణాటకకు చెందిన లలిత అనే భక్తురాలి చరవాణి చోరీకి గురైంది. సాంకేతిక పరిజ్ఞానంతో చరవాణిని గుర్తించామని, ఆమెకు సమాచారం అందించి బుధవారం చరవాణిని అందించినట్లు ఎస్సై శివాంజల్ తెలిపారు. 10 రికవరీ అయ్యాయని, చరవాణుల ఐఎంఈఐ నంబర్లు సరిచూసుకుని పోగొట్టుకున్నవారు మంత్రాలయం పోలీస్ స్టేషన్‌లో వివరాలు ఇవ్వాల్సిందిగా తెలిపారు.

మంత్రాలయం: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై శివాంజల్ కళాశాల విద్యార్థులకు తెలియజేశారు. మండల కేంద్రంలో ఉన్న రాఘవేంద్ర డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ సుబ్బారాయుడు ఆధ్వర్యంలో బుధవారం విద్యార్థులకు సైబర్ నేరాలు, లోన్ యాప్‌లు, అంతర్జాలంలో మోసాల పట్ల అవగాహన కల్పించారు.

గూడూరు గ్రామీణం: గూడూరు మండలానికి తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్ నాయక్‌ను తెదేపా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన్ను కలిసి పూలమాలలతో సత్కరించి, అభినందనలు తెలిపారు.

చింతమానుపల్లె తిమ్మందొడ్డి(సి.బెళగల్): మండలంలోని చింతమానుపల్లె తిమ్మందొడ్డి గ్రామాల్లో బుధవారం కోడుమూరు ఆర్‌డబ్ల్యూఎస్ డీఈఈ శ్రీనివాసులు ఏఈ గోనెనాయక్‌లు పర్యటించి రక్షిత మంచినీటి పథకం నిర్మాణ పనులను పరిశీలించారు. నాణ్యత ప్రమాణాల పాటించాలని గుత్తేదారునకు సూచించారు.

బాలిక బడి.. అవస్థల్లో పడి

○ కోడుమూరు బాలికోన్నత పాఠశాలలో అవస్థలు

కోడుమూరు బాలికోన్నత పాఠశాలలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. బాలికల కోసం ప్రత్యేకంగా పాఠశాల ఉండాలనే ఉద్దేశంతో 1989లో పాఠశాలను ప్రారంభించారు. గత ప్రభుత్వంలో రూ.లక్షలు ఖర్చుపెట్టి నాబార్డు కింద మరమ్మతులు చేయించారు. పనులు అరకొరగా చేసి వదిలేయటంతో ఇబ్బందులు పడుతున్నారు.
– న్యూస్‌టుడే, కోడుమూరు గ్రామీణం

ప్రమాదకరంగా గదులు

పెచ్చులూడుతున్న గది పైకప్పు

పాఠశాలలో మొత్తం 1000 మంది బాలికలు, 34 మంది సిబ్బంది ఉన్నారు. 25 గదులున్నాయి. మూడు గదులు ప్రమాదకరంగా మారాయి. వర్షం వస్తే కారుతున్నాయి. గత ప్రభుత్వం రూ.లక్షలు పెట్టి మరమ్మతు చేసినా ఏమాత్రం ప్రయోజనం లేదని బాలికలు, తల్లిదండ్రులు విమర్శలు గుప్పిస్తున్నారు. పాఠశాలకు రంగులు వేయకపోవటంతో గోడలు అపరిశుభ్రంగా మారాయి. శౌచాలయాల సామూహిక గదులకు సరైన మురుగు నీటి వ్యవస్థ లేకపోవటంతో దుర్వాసనలు వెదజల్లుతున్నాయి. మురుగు ముందుకు కదలటం లేదు. మురుగునీటి వ్యవస్థను నిర్మించాల్సిన అవసరం ఉంది.

బదిలీ చేసినా.. రిలీవ్ చేయక

ఎనిమిదేళ్లుగా హిందీ ఉపాధ్యాయురాలు షాహిద ఒక్కరే పాఠాలు చెపుతున్నారు. వారానికి 36 పీరియడ్లతో కష్టమైనా ఇష్టాంగానే పాఠాలు చెపుతున్నారు. ఈ ఏడాది 10వ తరగతిలో 204 మంది హిందీ పరీక్ష రాయగా 203మంది ఉత్తీర్ణులయ్యారు. సప్లమెంటరీలో మిగిలిన ఒక్కరూ విజయం సాధించారు. ఎట్టకేలకు హిందీ చెప్పేందుకు ఇక్కడకు నలుగురిని బదిలీ చేశారు. కానీ, వారిని రిలీవ్ చేయకపోవటంతో పూర్వపు పాఠశాలల్లోనే ఉండిపోయారు. దాంతో ఇక్కడి హిందీ ఉపాధ్యాయురాలిని రిలీవ్ చేయలేదు. ఒకే గదిలో రెండు తరగతులు కలిపి బోధించాల్సిన పరిస్థితి. మరోపక్క అంత మంది బాలికలకు ఒక్కరే వ్యాయామ సంచాలకులు ఉన్నారు. మరోపక్క జూనియర్ సహాయకులు లేకపోవటంతో ఉపాధ్యాయులే విద్యార్థినులకు ధ్రువపత్రాలు రాయాల్సిన పరిస్థితి ఉంది. సమస్యలను పరిష్కరించాలని బాలికల తల్లిదండ్రులు కోరుతున్నారు.

శౌచాలయాల వద్ద మురుగు

పంటల సాగుకు సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వెంకటగిరిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ వెంకటేశ్వర్లు

గోనెగండ్ల, న్యూస్‌టుడే: పత్తి పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏరువాక కేంద్రం కర్నూలు కోర్డినేటర్ ప్రధాన శాస్త్రవేత్త సుజాత అన్నారు. బుధవారం గోనెగండ్లలో మండల వ్యవసాయాధికారిణి హేమలత ఆధ్వర్యంలో నిర్వహించిన 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో ఏడీఏ మహ్మద్‌ఖాద్రి, సుజాత హాజరై మాట్లాడారు. 80శాతం రాయితీతో ప్రభుత్వం మంజూరు చేసే డ్రోన్ పరికరాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వ్యవసాయ విస్తరణాధికారులు పులిరాజు, అరుణ, రైతు సేవా కేంద్రాల సహాయకులు షఫీ, మహీంద్ర, రాజ్యలక్ష్మి, చైతన్య తదితరులు పాల్గొన్నారు.

కోడుమూరు గ్రామీణం: వెంకటగిరి, ఎర్రదొడ్డి గ్రామాల్లో డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. పత్తి, కంది పంటలను పరిశీలించారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏడీఏ, మండల వ్యవసాయాధికారి రవిప్రకాశ్ వివరించారు.

సి.బెళగల్: పోలకల్ గ్రామంలో ఏవో మల్లేశ్‌కుమార్ మాటాడుతూ.. వాతావరణ బీమా యోజన పథకం ద్వారా పత్తిపంట ఎకరానికి రూ.2000, వేరుసెనగ పంటకు రూ.500 చెల్లిస్తే వారి పంటలకు బీమా చేయబడుతుందన్నారు. ఏఈవో హిమబిందూ, వీఏఏ ఆఫ్రిన్, ఎంపీఈవో భాస్కర్ పాల్గొన్నారు.

గూడూరు గ్రామీణం: పోన్నకల్లు, జాలకల్లు గ్రామాల్లో మండల వ్యవసాయాధికారి దస్తగిరి రెడ్డి సిబ్బందితో కలిసి పర్యటించి కర్షకులు సాగుచేసిన పంటలను పరిశీలించారు. వ్యవసాయాధికారులు, రైతు సేవా కేంద్రాల సహాయకులు రైతులు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు గ్రామీణం: చెన్నాపురంలో ఏవో శివశంకర్ మాట్లాడుతూ..భూసార పరీక్షల ఆధారంగా ఎరువులు వేసుకోవడంతో అధిక దిగుబడులు పొందడంతోపాటు నేల ఆరోగ్యంగా ఉంటుందన్నారు. ఏఈవోలు నరసింహుడు, వినోద్, వీపీహెచ్ నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

కర్నూలు

• కర్నూలు • పాణ్యం

22 మండలాల్లో కురిసిన వర్షం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాలో మంగళవారం నుంచి బుధవారం ఉదయం వరకు 22 మండలాల్లో వర్షం కురిసింది. కల్లూరులో 17.8 మిల్లీ మీటర్ల వర్షం పడింది. ఓర్వకల్లు 16.0, కర్నూలు అర్బన్ 15.2, సి.బెళగల్ 14.2, కర్నూలు రూరల్ 13.4, గోనెగండ్ల 13.4, పెద్దకడబూరు 12.4, గూడూరు 10.6, దేవనకొండలో 9.8 మ.మీ. కురిసింది. ఎమ్మిగనూరు 9.6, ఆలూరు 2.0, కోసిగిలో 1.0 మి.మీ.గా ఉంది. జిల్లా సగటున 7.3 మి.మీ.గా నమోదైంది. ఈనెల సాధారణ వర్షపాతం 90.7 మి.మీ. కాగా ఇప్పటి వరకు 7.7 మి.మీ. కురిసింది. ప్రస్తుతం సాగు చేసిన పంటలకు ఈ వర్షం ఎంతో మేలు చేస్తుందని అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాగులో మెలకువలు అవసరం

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: పంట సాగులో మెలకువలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని ఏవో మధుమతి సూచించారు. మండలంలోని ఉప్పలపాడులో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పత్తి పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో మధు, రైతులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM) కర్నూలు : 80085 52632, కర్నూలు గ్రామీణం : 85010 05408, ఓర్వకల్లు : 63004 66875

కర్నూలు నగరపాలకసంస్థ ?: ఆరోరానగర్, మహాలక్ష్మి నగర్‌లో కాలువలు శుభ్రం చేయాలి. పెద్దఎత్తున వ్యర్థాలు పేరుకుపోయాయి. - గుణశేఖర్

?: పాతనగరం హాజీరా కాశాలు సమీపంలో వీధి దీపాలు సరిగా వెలగడం లేదు. రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నాం. - స్థానికులు

✔: సమస్యలు పరిశీలించి పరిష్కరిస్తాం. ఇబ్బందులు లేకుండా చూస్తాం. - నగరపాలక సంస్థ అధికారులు

ఆహ్లాద వాతావరణం అందించేలా చర్యలు

పార్కును ప్రారంభిస్తున్న మంత్రి టీజీ భరత్, ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: నగరంలో ఉద్యానవనాలను అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి టీజీ భరత్ అన్నారు. కర్నూలు బుధవారపేటలోని దామోదరం సంజీవయ్య మైదానంలో నడకబాట, ఓపెన్ జిమ్, ఆట వస్తువులు, పచ్చదనం, సుందరీకరణ పనులను ఎంపీ బస్తిపాటి నాగరాజుతో కలిసి బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ బుధవారపేట ప్రాంతంలో జనాభా ఎక్కువగా ఉన్నప్పటికీ సేదదీరేందుకు ఆహ్లాదకరమైన ప్రదేశం లేదని చెప్పారు. దీనిని దృష్టిలో ఉంచుకుని చేపల గుంత మైదానాన్ని రూ.31.4 లక్షలతో అభివృద్ధి చేశామన్నారు. నగరంలో 4,800 మొక్కలను నగరపాలక ఆధ్వర్యంలో నాటించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నగరపాలక కమిషనర్ రవీంద్రబాబు, కార్పొరేటర్ శివమ్మ, డిప్యూటీ కమిషనర్ సతీష్‌రెడ్డి, నగరపాలక అధికారులు పాల్గొన్నారు.

ఈసీ శిక్షణకు కలెక్టర్ బృందం పయనం

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: ఓటర్ల జాబితా సవరణ, ఎన్నికల చట్టాలు, సంస్కరణలపై భారత ఎన్నికల సంఘం దిల్లీలో ఈనెల 3, 4 తేదీల్లో జాతీయ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి కర్నూలు, పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కలెక్టర్లను ఎంపిక చేసింది. కర్నూలు జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా దిల్లీకి బయలుదేరి వెళ్లారు. కలెక్టర్‌తోపాటు ఆలూరు నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి (ఈఆర్వో), హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్-యూనిట్-4 ప్రత్యేక ఉప కలెక్టర్ టి.అజయ్‌కుమార్, ఒక్కో నియోజకవర్గం నుంచి ఒక్కో బీఎల్వో చొప్పున తరలివెళ్లారు.

చుక్కలు చూపిస్తున్నారు

• నగరంలో మందుబాబుల ఆగడాలు

నగరంలో మందుబాబుల ఆగడాలు మితిమీరాయి. మద్యం మత్తులో స్వీయ నియంత్రణలో లేని స్థితిలో కొందరు ప్రధాన రహదారులపై బైకులు, కార్లు నడుపుతూ బీభత్సం సృష్టిస్తున్నారు. ఇటీవల కర్నూలులో పలువురు మందుబాబులు చేసిన రహదారి ప్రమాదాలతో జనం రాత్రి వేళల్లో బయటకు వచ్చేందుకే జంకుతున్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు నేరవిభాగం

నగర పరిధిలో ప్రతిరోజూ సుమారు 4 లక్షల వరకు వాహనాలు తిరుగుతుంటాయి. నగరంలో 21 మద్యం దుకాణాలుండగా 18 బార్లు ఉన్నాయి. రాత్రి 10 గంటల వరకు మద్యం దుకాణాలు, 12 గంటల వరకు బార్లు తెరిచే ఉంటాయి. ప్రతిరోజూ రూ.కోటికిపైగా మద్యం విక్రయాలు జరుగుతున్నట్లు అంచనా. సాయంత్రం నుంచి మద్యం దుకాణాలు కిటకిటలాడుతుంటాయి. కొందరు ఇంటికి వెళ్లే క్రమంలో మద్యం తాగి వాహనాలు నడుపుకొంటూ వెళ్తుంటారు. కొందరు యువకులు మరీ రెచ్చిపోతున్నారు.



ఇటీవల అర్ధరాత్రి వేళ కారు ఢీకొట్టడంతో దెబ్బతిన్న మేజర్ సీఆర్ రెడ్డి విగ్రహం (పాతచిత్రం)

ఇటీవల ఐదుగురు యువకులు అర్ధరాత్రి సమయంలో కారులో ఏపీఎస్పీ రెండో పటాలం ప్రధాన ద్వారం ఎదుట మేజర్ సీఆర్ రెడ్డి విగ్రహాన్ని ఢీకొట్టిన ఘటన తెలిసిందే. విగ్రహం కూలిపోయిన స్థితిని చూస్తే వాహనం వేగం అంచనా వేసుకోవచ్చు. అదృష్టవశాత్తు జనాలు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది.

ప్రాణాలు తీస్తూ..

అంతకుముందు కలెక్టరేట్ ఎదుట వాహనం అదుపుతప్పిన ఘటనలో ఇద్దరు గాయపడ్డారు. గతంలో ద్విచక్ర వాహనచోదకులు మద్యం మత్తులో వాహనాలు నడిపి బళ్లారి చౌరస్తా, కోడుమూరు రోడ్డు తదితర మార్గాల్లో ప్రమాదాలకు గురై ప్రాణాలు కోల్పోయారు. కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తనవారిని చూసేందుకు వచ్చిన అనంతపురం జిల్లాకు చెందిన ఒకరు వస్తుండగా కలెక్టరేట్ వద్ద మద్యం మత్తులో ఓ ద్విచక్ర వాహన చోదకుడు ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోయారు.

ప్రభావం చూపని తనిఖీలు

కర్నూలులో పోలీసు అధికారులు నిర్వహించే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు పెద్దగా ప్రభావం చూపడం లేదు. ఫిబ్రవరి నుంచి మే వరకు ఆరు పోలీసుస్టేషన్ల పరిధిలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో కేవలం 1,291 మంది వాహనచోదకులు మాత్రమే దొరికారు. నగర శివారు మార్గాల్లోనే తనిఖీలు నిర్వహిస్తున్నారు తప్ప రాజ్‌విహార్ తదితర ప్రధాన కూడళ్లపై దృష్టి సారించడం లేదు. నిరంతరం తనిఖీలు జరగకపోవడం లోపంగా మారింది. బార్లు, మద్యం దుకాణాలు, హోటళ్లు, దాబాలున్న ప్రాంతాల్లో ముమ్మర తనిఖీలు చేపట్టాల్సి ఉంది.

రాష్ట్ర అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కరపత్రాలతో తెదేపా నాయకులు

కర్నూలు (గ్రామీణ), న్యూస్‌టుడే: రాష్ట్రం అన్నివిధాలా అభివృద్ధి చెందడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని కర్నూలు మండల తెదేపా నాయకులు అన్నారు. మండల పరిధిలోని బి.తాండ్రపాడు గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా బుధవారం పర్యటించారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలన, పథకాల అమలు గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు బుర్ర వెంకటేష్, ఏసురాజు, సర్పంచి జయన్న, ఎంపీటీసీ సభ్యుడు మద్దిలేటి, రామాంజనేయులు, విజయకుమార్, సత్యం రామకృష్ణుడు తదితరులు పాల్గొన్నారు.

కాలనీలో పర్యటిస్తున్న సోమిశెట్టి తదితరులు

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కర్నూలు 24వ వార్డులో కుడా ఛైర్మన్, తెదేపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ తెదేపా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్ తదితరులు పర్యటించారు. కాలనీ ప్రజలతో మాట్లాడారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు నాగరాజు యాదవ్, నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీరు నిలిచి.. రాకపోకలు ఆగి

బిర్లాగడ్డ రైల్వే వంతెన కింద పెద్దఎత్తున వర్షం నీరు నిలిచిపోయింది. దీనికితోడు మురుగునీటి కాలువ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం పడిన ప్రతిసారి ఇదే పరిస్థితి నెలకొంటోంది. ఫలితంగా వాహనదారులు రాకపోకలు సాగించలేని పరిస్థితి ఏర్పడింది.

– న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలక సంస్థ

చూడకుంటే.. పడతారు

నగరంలో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు రహదారులు అధ్వానంగా మారుతున్నాయి. గుంతలు పడటంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రూ.లక్షలు వెచ్చించి గుంతలు పడిన రహదారులకు మరమ్మతులు చేశారు. పనులు నాణ్యతగా చేయకపోవడంతో చిన్నపాటి వర్షానికే తారు లేచిపోయింది. బిర్లా గేటు నుంచి గాయత్రీ ఎస్టేట్‌కు వచ్చే దారి అధ్వానంగా మారిందని.. వెంటనే మరమ్మతులు చేయాలని పలువురు విన్నవిస్తున్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు నగరపాలక సంస్థ

పనులు చేయక.. మురుగు కదలక

కల్లూరు శరీన్‌నగర్‌లోని ఆదర్శ ప్రాథమిక పాఠశాల పక్కవీధిలో కాలువలు అధ్వానంగా మారాయి. పనులు చేపట్టేందుకు తవ్వేశారు. ఆ తర్వాత పూర్తి చేయలేదు. ఫలితంగా రహదారిపై మురుగు ప్రవహిస్తోంది. నెలల తరబడి సమస్య ఇలానే ఉన్నా పట్టించుకునే వారే కరవయ్యారు. నగరపాలక సంస్థ అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

– న్యూస్‌టుడే, కల్లూరు గ్రామీణ

విరిగిన స్తంభం.. ఆందోళనలో జనం

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. ఈదురు గాలులు బలంగా వీస్తున్నాయి. పలు ప్రాంతాల్లో విద్యుత్తు స్తంభాలు దెబ్బతిని ప్రమాదకరంగా మారాయి. పాత కల్లూరు మీదుగా దేవనగర్‌కు వెళ్లే కల్లూరు మార్గంలో ఓ విద్యుత్తు స్తంభం కింద విరిగిపోయి కూలిపోయేలా ఉంది. ఫలితంగా ఈ రహదారిపై వెళ్లే జనం ఆందోళన చెందుతున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి తగిన చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది.

– న్యూస్‌టుడే, కర్నూలు వెంకటరమణ కాలనీ

అర్ధరాత్రి రౌడీల వీరంగం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే: నగర శివారు గుత్తి పెట్రోలు బంకు వద్ద ఓ హోటల్‌లో రౌడీలు మంగళవారం అర్ధరాత్రి వీరంగం సృష్టించారు. శరీన్‌నగర్‌కు చెందిన రౌడీషీటర్ ఇమ్రాన్‌ఖాన్ తమ్ముడు ఫిరోజ్ తన బంధువులైన జాకీర్, హారున్‌రషీద్‌లతో కలిసి మద్యం తాగి ఆటోలో పిస్తా హౌస్ హోటల్‌కు వెళ్లారు. హోటల్‌కు ఎదురుగా ఆటోను అడ్డంగా ఆపడంతో అక్కడ ఉన్న కాపలాదారుడు పక్కన పార్క్ చేయాలని సూచించాడు. దీంతో వారు రెచ్చిపోయి అతనితో గొడవకు దిగారు. హోటల్ యజమాని కుమారుడు ప్రీతం సాయి జోక్యం చేసుకుని ఇతర వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉంటుందని నచ్చజెప్పారు. అయినా వాళ్లు వినకుండా కోపోద్రేకంతో హోటల్‌లోని కంప్యూటర్‌తో ప్రీతంపై దాడి చేయడంతో ఉద్రిక్తత నెలకొంది. హోటల్ సిబ్బంది ప్రతిఘటించడంతో జాకీర్, రషీద్‌లు పారిపోయారు. ప్రీతం సాయి ఫిర్యాదు మేరకు కర్నూలు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాధులపై అప్రమత్తత అవసరం

గోడపత్రాలు ఆవిష్కరిస్తున్న వైద్యులు తదితరులు

ఓర్వకల్లు, న్యూస్‌టుడే: వర్షాకాలం నేపథ్యంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధుల విషయంలో వైద్యులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా నోడల్ అధికారి డా.రఘు సూచించారు. ఉప్పలపాడులోని సంచార చికిత్స కార్యక్రమాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్యులు నాగరాజు, జానకి తదితరులు పాల్గొన్నారు.

జీవన స్థితిగతుల్లో మార్పు శూన్యం

మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రామచంద్రయ్య

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : జిల్లా అభివృద్ధికి పెద్దఎత్తున నిధులు కేటాయిస్తున్నట్లు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెబుతున్నా ఆ పరిస్థితి కానరావడం లేదని.. ప్రజల జీవన స్థితిగతులు మారడం లేదని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు పి.రామచంద్రయ్య అన్నారు. నగరంలోని సీపీఐ కార్యాలయంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య అధ్యక్షతన బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. నిత్యం కరవు కాటకాలతో జనం ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. జులై 28వ తేదీ నుంచి 30వ తేదీ వరకు నిర్వహించే సీపీఐ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా మాజీ కార్యదర్శి భీమలింగప్ప, లెనిన్‌బాబు, శేఖర్, మునెప్ప, లలితమ్మ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించేదాకా పోరాటం

కర్నూలు నగరపాలకసంస్థ, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించేంత వరకు ఆందోళన చేస్తూనే ఉంటామని నగరపాలక ఇంజినీరింగ్ విభాగ కార్మికులు తెలిపారు. వారు గత కొన్ని రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం పెట్రోలు బాటిళ్లు చేతపట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. వారు మాట్లాడుతూ ఇకనైనా అధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని అధికారులను కోరారు.

పెట్రోలు బాటిళ్లతో నిరసన తెలుపుతున్న కార్మికులు

కందులు క్వింటా గరిష్ఠ ధర రూ.6,512

కర్నూలు మార్కెట్, న్యూస్‌టుడే: కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు బుధవారం వివిధ పంట ఉత్పత్తులు వచ్చాయి. వేరుశనగకాయలు క్వింటా గరిష్ఠ ధర రూ.6,400, ఆముదాలు రూ.5,790, మొక్కజొన్న రూ.2,009, కందులు రూ.6,512, కందులు వడకలు రూ.3,289, శనగలు రూ.5,402, కొర్రలు రూ.2,089, మినుములు రూ.6,750కు వ్యాపారులు కొనుగోలు చేశారు.

6న క్రికెట్ ఎంపిక పోటీలు

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: నగరంలోని డీఎస్‌ఏ స్టేడియంలో ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్, జిల్లా క్రికెట్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అండర్-14 బాలుర క్రికెట్ జిల్లా జట్టు ఎంపిక పోటీలను 6వ తేదీన నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి దేవేంద్రగౌడ్ బుధవారం తెలిపారు. ఎంపిక పోటీలు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. ఆసక్తిగల క్రీడాకారులు తగిన పత్రాలతో హాజరుకావాలని కోరారు.

4న పవర్‌లిఫ్టింగ్ క్రీడాకారుల ఎంపిక

కర్నూలు క్రీడలు (బి.క్యాంపు), న్యూస్‌టుడే: నగరంలోని డీఎస్‌ఏ స్టేడియంలో ఈనెల 4న జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు సంఘం నాయకుడు వేణుగోపాల్ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 12 నుంచి 13వ తేదీ వరకు విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. మరిన్ని వివరాలకు 95051 57553 నంబరును సంప్రదించాలని కోరారు.

క్యాన్సర్ బాధితురాలికి అరుదైన చికిత్స

కర్నూలు వైద్యాలయం, న్యూస్‌టుడే: అన్నవాహిక క్యాన్సర్ బాధితురాలికి ఎలాంటి శస్త్రచికిత్స చేయకుండా సెమ్స్ స్టెంట్ వేసి ప్రాణాలు కాపాడినట్లు కిమ్స్ వైద్యులు తెలిపారు. కర్నూలు నగరానికి చెందిన మహాలక్ష్మి (75) అనే వృద్ధురాలికి క్యాన్సర్ సోకడంతో అన్నవాహిక మూసుకుపోయింది. కనీసం ఊపిరి తీసుకోలేని పరిస్థితిలో ఆమె గత నెల 20న కిమ్స్ ఆసుపత్రిలో చేరారు. వైద్యులు పరీక్షలు చేసి మెటాలిక్ స్టెంట్ అమర్చాలని నిర్ణయించారు. శస్త్రచికిత్స అవసరం లేకుండా స్టెంట్ వేసి శ్వాసకోసనాళానికి ఉన్న అడ్డంకిని తొలగించారు. ఆపరేషన్ లేకుండా సెమ్స్ స్టెంట్ వేయడం ఇదే తొలిసారి అని.. ఇదో అరుదైన చికిత్స అని కిమ్స్ ఆసుపత్రి పల్మనాలజిస్ట్ డా.యశోవర్ధన్, డా.చలమయ్య బుధవారం తెలిపారు.

చర్యలు తీసుకోవాలని వినతి

డీఎస్పీకి ఫిర్యాదు పత్రం అందజేస్తున్న నాయకులు

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : రెడ్డి సామాజిక వర్గంపై అసత్య ఆరోపణలు చేస్తూ సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బిర్రు ప్రతాప్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు పల్లె శ్రీధర్‌రెడ్డి తదితరులు కోరారు. వారు మంగళవారం కలెక్టరేట్‌లో జేసీ డా.నవ్యను కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం స్థానిక కార్యాలయంలో కర్నూలు డీఎస్పీ బాబూప్రసాద్‌ను కలిసి ఫిర్యాదు చేశారు.

4న ఉద్యోగ మేళా

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో ఈనెల 4న ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి పి.దీప్తి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన యువతీ యువకులు ఉద్యోగ మేళాకు హాజరుకావాలని కోరారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు.

సంక్షిప్త సమాచారం

కర్నూలు నేరవిభాగం, న్యూస్‌టుడే : కర్నూలు కృష్ణానగర్‌లోని కేశవరెడ్డి పాఠశాలలో మాదకద్రవ్యాల నివారణపై ఈగల్ పోలీసులు ఎలీషా, రమేష్, మాసుంవలీలు బుధవారం విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మత్తు పదార్థాలతో ఎదురయ్యే సమస్యలను వివరించారు. మత్తు పదార్థాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే 1972 టోల్‌ఫ్రీ నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కల్లూరు గ్రామీణ, న్యూస్‌టుడే : కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ సిబ్బందితో డ్వామా పీడీ వెంకటరమణయ్య బుధవారం సమీక్షించారు. ఫారంపాండ్స్, ఉద్యానపంటల పురోగతిపై చర్చించారు. నిర్దేశించిన లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీవో జీఎన్ఎస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెద్దటేకూరు, చిన్నటేకూరు (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే : పెద్దటేకూరు, చిన్నటేకూరు గ్రామాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు సాలురెడ్డి హాజరయ్యారు.

బొల్లవరం (కల్లూరు గ్రామీణ), న్యూస్‌టుడే : బొల్లవరం గ్రామంలో టీబీ ముక్తా అభియాన్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. టీబీ లక్షణాలు, దీర్ఘకాలిక జబ్బుతో బాధపడేవారికి పరీక్షలు నిర్వహించారు. దాతల సహకారంతో ప్రతి నెలా బాధితులకు పౌష్టికాహారం అందజేయాలని డా.మోతిలాల్ నాయక్ సిబ్బందికి సూచించారు.

కర్నూలు వెంకటరమణ కాలనీ, న్యూస్‌టుడే : 9వ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.డి.అంజిబాబు, సెక్యూరిటీ గార్డ్స్ సంఘం నాయకులు కృష్ణ బుధవారం పిలుపునిచ్చారు.

సమావేశమైన జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలావెంకటశేషాద్రి తదితరులు

అనాథ పిల్లల గుర్తింపునకు చర్యలు

కర్నూలు గాయత్రీఎస్టేట్, న్యూస్‌టుడే: నగరంలోని న్యాయసేవాసదన్‌లో జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలావెంకటశేషాద్రి ఆధ్వర్యంలో అనాథ పిల్లల గుర్తింపు అంశంపై బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సాధి కమిటీ నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ ద్వారా ఉమ్మడి జిల్లాలో 125 మంది అనాథ పిల్లలను గుర్తించినట్లు ఆయన తెలిపారు. ప్రత్యేక ఆధార్ కేంద్రం ఏర్పాటుచేసి ఆధార్ కార్డులు జారీ చేయిస్తామన్నారు. అనాథ పిల్లలు కనిపిస్తే 15100 టోల్‌ఫ్రీ నంబరుకు తెలియజేయాలని కోరారు. ఈ సమావేశంలో ఐసీడీఎస్ డీసీపీ శారద, నంద్యాల జిల్లా ఐసీడీఎస్ సీడీపీవో స్వప్న, కర్నూలు జిల్లా అర్బన్ తహసీల్దారు రవిచంద్ర, పారాలీగల్ వాలంటీర్ డాక్టర్ రాయపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.

కంది పంట పరిశీలన

కోడుమూరు గ్రామీణం: వెంకటగిరి, ఎర్రదొడ్డి గ్రామాల్లో డీఆర్‌సీ ఏడీఏ వెంకటేశ్వర్లు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. పత్తి, కంది పంటలను పరిశీలించారు. పంటల సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఏడీఏ, మండల వ్యవసాయాధికారి రవిప్రకాశ్ వివరించారు.

ప్రతిభ చాటి.. విజేతలుగా నిలిచి

• ఫుట్‌బాల్‌లో రాణిస్తున్న క్రీడాకారులు

కర్నూలుకు చెందిన క్రీడాకారులు ఫుట్‌బాల్‌లో రాణిస్తూ తమ సత్తా చాటుతున్నారు. కీలకపాత్ర పోషిస్తూ జట్లను విజయపథంలో తీసుకెళ్తున్నారు. అంతర పాఠశాలలు, జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు అందుకున్నారు. ఒకపక్క చదువుకుంటూనే మరోవైపు ఫుట్‌బాల్‌పై దృష్టి సారించారు. రానున్న రోజుల్లో తమ ప్రతిభ చాటేందుకు సిద్ధమవుతున్నారు.

– న్యూస్‌టుడే, కర్నూలు క్రీడలు (బి.క్యాంపు)

ప్రవీణ్.. ప్రతిభ చాటి

కర్నూలుకు చెందిన ప్రవీణ్ నగరంలోని పాఠశాలలో పదో తరగతి చదువుతున్నారు. అతని తల్లిదండ్రులు మహేశ్వరి, సుధాకర్. వీరిది కల్లూరు మండలం బూడిదపాడు స్వగ్రామం. ఇతనికి మొదటి నుంచి ఫుట్‌బాల్ అంటే ఆసక్తి. 2023 ఆగస్టులో కర్నూలు డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన అంతర పాఠశాలల ఫుట్‌బాల్ పోటీల్లో జట్టు మొదటి స్థానంలో నిలిచేలా కృషి చేశారు. గతేడాది జూన్‌లో కర్నూలులో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో జట్టు మొదటి స్థానంలో నిలిచేలా తన ప్రతిభ చాటి పతకం అందుకున్నారు. ఈ ఏడాది జూన్‌లో అండర్-16 జోనల్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించారు.

నిఖిత.. విజేత

నగరంలోని ఓ పాఠశాలలో నిఖితారెడ్డి తొమ్మిదో తరగతి చదువుతున్నారు. ఆమె తల్లిదండ్రులు సరస్వతి, రవీంద్రారెడ్డి. వీరిది వైఎస్సార్ కడప జిల్లాలోని జమ్మలమడుగు ప్రాంతం. ఆమె ఫుట్‌బాల్‌పై ఆసక్తి చూపి వివిధ పోటీల్లో పాల్గొనడం ప్రారంభించారు. గతేడాది జూన్‌లో కర్నూలులోని డీఎస్‌ఏ స్టేడియంలో జరిగిన జిల్లాస్థాయి పోటీల్లో జట్టు మొదటి స్థానంలో నిలిచేలా ప్రతిభ చాటారు. అదే ఏడాది జులైలో తిరుపతిలో జరిగిన అసోసియేషన్ రాష్ట్రస్థాయి పోటీల్లో రాణించి జట్టును రెండో స్థానంలో నిలిపి వెండి పతకం అందుకున్నారు. 2024 ఆగస్టులో అనంతపురం జిల్లా హిందూపురంలో జరిగిన ఎస్‌జీఎఫ్ అండర్-14 బాలికల పోటీల్లో వ్యక్తిగత ప్రతిభ చాటి రాష్ట్ర జట్టులో స్థానం సాధించారు. ఈ సందర్భంగా నిఖితారెడ్డి మాట్లాడుతూ మరింతగా రాణించి జాతీయ పోటీల్లో పాల్గొనడమే లక్ష్యమని చెప్పారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు

కర్నూలు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: ఆషాఢమాసం సందర్భంగా అమ్మవారి ఆలయాల్లో వారాహి పూజలు కొనసాగుతున్నాయి ఏడో రోజైన బుధవారం పాత బస్తీ లలితాపీఠంలో వారాహి అమ్మవారికి టెంకాయలతో ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళలు కుంకుమార్చన చేశారు. నవరాత్రుల్లో భాగంగా సూర్యనారాయణ స్వామి ఆలయంలోని మహాగౌరీ అమ్మవారి సన్నిధిలో అర్చకులు మండపారాధన, శ్రీదేవి ఖడ్గమాల, లలితాసహస్ర నామ లలితా త్రిశతి నామపూర్వక కుంకుమార్చనలు నిర్వహించారు. రాత్రి వారాహి సహస్రనామం, మహా మంగళ హారతి నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

లలితాపీఠంలో టెంకాయల అలంకరణలో వారాహి అమ్మవారు

దంపతుల ఆత్మహత్యాయత్నం

గోనెగండ్ల, ఎమ్మిగనూరు, నేరవార్తలు, న్యూస్‌టుడే: గోనెగండ్లకు చెందిన ఈరన్న, అంజినమ్మ భార్యాభర్తలు బుధవారం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. వీరిద్దరూ పశువులను పోషిస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరి మధ్య కొంతకాలంగా మనస్పర్థలు ఉన్నట్లు చెబుతున్నారు. బుధవారం ఇద్దరు గొడవ పడి భార్య ముందుగా పురుగుల మందు తాగగా. తరువాత భర్త కూడా తాగాడు. ఇద్దరిని చికిత్స కోసం ఎమ్మిగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలి

కర్నూలు సచివాలయం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత వైకాపా నాయకులు అరాచక శక్తులను ఉసిగొల్పి, అల్లర్లు సృష్టించేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారని కర్నూలు పార్లమెంట్ తెదేపా ప్రధాన కార్యదర్శి ఆకెపోగు ప్రభాకర్ మండిపడ్డారు. ప్రస్తుతం జరుగుతున్న 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో తెదేపా శ్రేణులు నిర్వహిస్తున్న ఇంటింటికి కార్యక్రమంలో వారి అరాచకాలను ప్రజలకు తెలియజెప్పాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. బుధవారం తెదేపా జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వైకాపా పాలనలో రాష్ట్రంలో యువతను గంజాయి, డ్రగ్స్, మద్యం వంటి మత్తు పదార్థాలకు బానిసలుగా మార్చడం తప్ప వారు చేసిందేమీ లేదన్నారు. చంద్రబాబు చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయడమేగాక వైకాపా నాయకుల అరాచకాలను ప్రజలకు వివరించాలని ఆయన పార్టీ శ్రేణులకు సూచించారు.

(c) eenadu

అద్దెరువు

● గోదాము లీజు పేరుతో దోపిడీ
● నాలుగున్నరేళ్ల నుంచి అక్రమాల పర్వం

గోనవరంలోని 'శ్రీసాయిరాం రూరల్ ఫార్మర్స్ వేర్‌హౌస్'

ఈనాడు, నంద్యాల: ఓ ప్రైవేటు గోదాము ప్రతినిధులు, పౌర సరఫరాలశాఖ అధికారులు కుమ్మక్కై ప్రభుత్వ ఖజానాను కొల్లగొట్టారు. గోదాము విస్తీర్ణాన్ని పెంచి భారీ ఎత్తున అద్దెను (స్టోరేజీ రుసుములు) దండుకున్నారు. ప్రతి నెల రూ.1,68,640 చొప్పున నాలుగున్నరేళ్లలో సుమారు రూ.కోటి వరకు అదనంగా చెల్లింపులు జరిగాయి. జిల్లా అవసరాల నిమిత్తం పౌరసరఫరాలశాఖ గోనవరంలోని 'శ్రీ సాయిరామ్ రూరల్ ఫార్మర్స్ వేర్‌హౌస్'ను 2019లో అద్దెకు తీసుకుంది. దీని నిర్వాహకుడైన రాజ్‌కుమార్ నుంచి తీసుకోవడం గమనార్హం. ఆ గోదామును రాజ్‌కుమార్ లీజుకు తీసుకుని పౌరసరఫరాలశాఖకు అద్దెకు ఇచ్చారు. దాని సామర్థ్యం 13 వేల మెట్రిక్ టన్నులని చెప్పి అద్దె వసూలు చేసుకున్నారు. సుమారు నాలుగున్నరేళ్లపాటు ఎలాంటి సమస్య తలెత్తలేదు. అక్రమ లోగుట్టు కొలతలు తీయడంతో దీని సామర్థ్యం 1984 టన్నులు అదనంగా అద్దె మాటలు చేశారన్న విషయం వెలుగులోకి వచ్చింది.

లీజు మార్పుతో వెలుగులోకి

● అద్దెకు తీసుకున్న ప్రైవేటు గోదాము విషయంలో భారీ అక్రమాలు జరిగినట్లు 'కూటమి' ప్రభుత్వం దృష్టికి వచ్చింది. దీంతో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ (ఏపీఎస్‌డబ్ల్యూసీ) గోదాములను తీసుకోవాలని నిర్ణయించింది. దీంతో ఏపీఎస్‌డబ్ల్యూసీ గోదాముల్లో రేషన్ బియ్యాన్ని నిల్వ చేయాల్సిన పరిస్థితి వచ్చింది. సదరు సంస్థకు జిల్లాలో సొంత గోదాములు లేకపోవడంతో ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయించక తప్పని పరిస్థితి నెలకొంది. తాము అద్దెకు తీసుకున్న 'శ్రీ సాయిరామ్ రూరల్ ఫార్మర్స్ వేర్‌హౌస్'ను గిడ్డంగుల సంస్థకు బదలాయించాలని పౌర సరఫరాల శాఖ అధికారులు నిర్ణయించారు. ఆ మేరకు గిడ్డంగుల సంస్థ ఉన్నతాధికారులకు లేఖ రాశారు. దీంతో గిడ్డంగుల సంస్థ అధికారులు పరిశీలనకు వచ్చి దాని కొలతలు తీసుకోవడంతో తేడాలొచ్చాయి. అందులో 13 వేల టన్నులు సరుకు పట్టదని.... 11,016 టన్నులు నిల్వ చేసేందుకే సరిపోతుందని తేల్చారు. అంత విస్తీర్ణానికే అద్దె చెల్లిస్తామని తేల్చి చెప్పారు. ఆమేరకు ఏపీఎస్‌డబ్ల్యూసీ అధికారులు పౌరసరఫరాల శాఖ అధికారులకు లేఖ రాయడంతో అక్రమాల గుట్టు రట్టయింది. అదనంగా జరిగిన విషయం తేలినా గోదాము అనుమతిని గత నెల 24వ తేదీ వరకు పొడిగిస్తూ నిర్ణయం తీసుకున్నారు.

1,800 సంచుల బియ్యం మాయం

గోనవరం బఫర్ గోదాములో ఉండాల్సిన 1,800 సంచుల బియ్యాన్ని పక్కదారి పట్టించారు. లెక్క ప్రకారం ఉండాల్సిన బియ్యం సంచులు లేకపోవడంతో ఆయా అధికారుల ఉద్యోగాల మీదే గుజరాల్సిన పరిస్థితి నెలకొంది. వివరాలు రాస్తే అక్రమాల విషయం బయటపడుతుందన్న ఉద్దేశంతో గోదాములో సరుకు మొత్తం ఖాళీ చేసిన తర్వాతే గిడ్డంగుల సంస్థ స్వాధీనం చేసుకున్నట్లు చూపారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

నాలుగు వరుసల్లో రయ్.. రయ్

డోన్ జాతీయ రహదారి 44 నుంచి నంద్యాల జాతీయ రహదారి 40ను కలుపుతూ బేతంచెర్ల మీదుగా నిర్మించే 340బి హైవే పనులు డోన్ పట్టణంలో చివరిదశకు చేరుకున్నాయి. మొత్తం రూ.650 కోట్లతో 52 కి.మీ. మేర దీన్ని నిర్మిస్తున్నారు. పట్టణంలో జాతీయ రహదారిని అటు, ఇటు నాలుగు వరుసలుగా మార్చడంతో వాహనాల రాకపోకలు సాగుతున్నాయి. నిర్మాణం దాదాపు పూర్తవడంతో పట్టణానికి కొత్త శోభ సంతరించుకుంది. – న్యూస్‌టుడే, డోన్

పురాలకు అమృత్ బిందువు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో అమృత్ ఫలాలు అందనున్నాయి. పురపాలక సంఘాల్లో అమృత్ 2.0 పనులకు టెండర్ల ప్రక్రియ ప్రారంభమైంది. పట్టణీకరణ పెరుగుతున్న నేపథ్యంలో ప్రజా సమస్యలు పరిష్కరించాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా నీటి ప్రాజెక్టుల కింద రూ.233 కోట్లు, మురుగు నీటి శుద్ధికి రూ.170 కోట్లు విలువైన పనులు చేపట్టాలని ప్రతిపాదించింది. అప్పటి వైకాపా రాష్ట్ర ప్రభుత్వం నిధులు సర్దుబాటు చేయలేదు. కనీసం డీపీఆర్ రూపొందించలేదు. సమస్యను గుర్తించిన 'కూటమి' ప్రభుత్వం పనులు పట్టాలెక్కించాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన రాష్ట్ర వ్యాప్తంగా 281 పనులకు రూ.10 వేల కోట్లు విలువైన పనులకు ఆన్‌లైన్ టెండర్లు పిలిచింది.
– న్యూస్‌టుడే, ఆదోని, నంద్యాల, కర్నూలు, పురపాలికలు

తాగునీటి కోసం జనం ఇబ్బందులు

మురుగు శుద్ధికి ప్రణాళికలు

● అమృత్ పథకాలకు కొనసాగింపుగా అమృత్ 2.0 కింద తాగునీటి ప్రాజెక్టులు చేపట్టింది. దీంతోపాటు మురుగు నీటి శుద్ధి ప్లాంట్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. కర్నూలుకు రూ.2.47 కోట్లు, నంద్యాల రూ.74 కోట్లు, ఆదోనిలో రెండు చోట్ల రూ.93.79 కోట్లతో ఎస్టీపీ ప్లాంట్లు నిర్మించాలని ప్రణాళిక రూపొందించారు.

నందుల కోటలో

నంద్యాలలో రెండు ప్యాకేజీల్లో పనుల ప్రణాళిక చేశారు. రూ.10.47 కోట్లతో 7కేఎల్ ఈఎల్ఎస్ఆర్, 19 కి.మీ.లు నీటి గొట్టాల నిర్మాణం, 3006 కొత్తగా కుళాయి కనెక్షన్లు, 4.51 కి.మీ.లు నీటి గొట్టాల నిర్మాణం. రెండోది రూ.32.94 కోట్లతో 12.50 ఎం.ఎల్.డి. వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, 13.32 కి.మీ.లు నీటి గొట్టాల నిర్మాణం, 500 కేఎల్ సామర్థ్యంతో క్లియర్ వాటర్ సంప్ నిర్మించాలనుకున్నారు.

ఇక్కడా పనులు చేపడతారు

డోన్‌లో రూ.23.56 కోట్లు, బేతంచెర్ల రూ.2.66, ఆత్మకూరు రూ.9.66, నందికొట్కూరు రూ.10.18, ఎమ్మిగనూరు రూ.3.52, గూడూరులో రూ.5.68 కోట్లతో బలహీనవర్గాల కాలనీలు, నివాస ప్రాంతాల్లో నీటి వనరుల పెంపు, నీటి నిల్వ పనులు చేసి.. సరఫరా చేయాలని సంకల్పించారు. ఎక్కడి పనులు అక్కడ నిలిచిపోయాయి.

ఆదోని అవస్థలు తీర్చేలా

ఆదోనిలో రెండు పనుల ప్రణాళికలు చేశారు. మొదటిది రూ.12.9 కోట్లు, రెండోది రూ.22.27 కోట్లతో నీటి పైపులైన్ ఏర్పాటు, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్, ఉపరితల నీటి ట్యాంకులు, నీటి శుద్ధి కేంద్రంతో పాటు బలహీనవర్గాల కాలనీల్లో కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించారు. పనులు పట్టాలెక్కలేదు.

జగన్నాథగట్టుపై నిల్వ

కర్నూలులో రూ.130 కోట్లతో 20కి పైగా ఉపరితల నీటి ట్యాంకులు నిర్మించే దిశగా యోచిస్తున్నారు. ప్రస్తుతం 30 ఉపరితల నీటి ట్యాంకులున్నా.. నీటి సరఫరాపై ఒత్తిడి పెరుగుతోంది. దీంతో పాటు జగన్నాథ గట్టు ప్రాంతంలో వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ నిర్మించి, నీరు నిల్వ చేయాలనేది లక్ష్యం. గత వైకాపా ప్రభుత్వంలో పై పనులు టెండర్ దశకు వెళ్లి ఆగిపోయాయి. పై పనులు పూర్తయి ఉంటే.. నగరంలో 52 వార్డులకు తాగునీటి ఇబ్బందులు తొలగేవి. సుంకేసుల నుంచి మునగాలపాడు రూ.83 కోట్లతో పైపులైన్ పనులు చేపట్టారు. కేసీ కాలువ నుంచి నీటిని పైపులైన్‌తో సరఫరా చేయాలనే దిశగా ఆలోచనలు చేస్తున్నారు.

ఉచిత స్పర్శ దర్శనానికి తరలివచ్చిన భక్తజనం

తండోపతండాలు

● శ్రీశైల మల్లన్న ఉచిత స్పర్శ దర్శనం
● అంచనాలకు మించి భక్తుల రాక

శ్రీశైల మహాక్షేత్రం భక్తజన సందోహంతో నిండిపోయింది. మల్లన్న ఉచిత స్పర్శ దర్శనానికి విశేష స్పందన లభిస్తోంది. బుధవారం అంచనాకు మించి భక్తులు తరలొచ్చారు. ఉదయం 10 నుంచే క్యూలైన్ల వద్ద బారులు తీరారు. రద్దీ కారణంగా మధ్యాహ్నం 12.45 గంటల వరకు అనుమతించారు. అయినా రద్దీ తగ్గకపోవడంతో మిగిలిన భక్తులను అలంకార దర్శనానికి అనుమతించారు. రద్దీ కారణంగా టోకెన్లపై ఆధార్ నమోదును మినహాయించారు. మహాశివరాత్రి తరహాలో తాత్కాలిక కంపార్ట్‌మెంట్లను ఏర్పాటు చేసుకొని భక్తులను ఉచిత స్పర్శ దర్శనానికి అనుమతించాలని భక్తులు అభిప్రాయపడ్డారు. క్యూలైన్లు సరిపడా లేకపోవడంతో కొంత అసౌకర్యానికి గురయ్యారు. –న్యూస్‌టుడే, శ్రీశైలం ఆలయం

నకిలీ మక్కలు.. నాటగానే నష్టాలు

నకిలీ విత్తనాలు మొక్కజొన్న రైతులను నిండా ముంచాయి. మే, జూన్ నెలల్లో వర్షాలు కురవడంతో పలు మండలాల్లో మొక్కజొన్న సాగు చేశారు. కొత్తపల్లి, జూపాడుబంగ్లా, పాములపాడు, నందికొట్కూరు, ఆత్మకూరు, గడివేముల, పాణ్యం, అవుకు, బనగానపల్లి మండలాల్లో కలిపి 22 వేల ఎకరాల వరకు సాగు చేశారు. చాలాచోట్ల విత్తనాలు మొలకెత్తలేదు. ఫిర్యాదులందుకున్న వ్యవసాయాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నకిలీ విత్తనాలతోనే ఈ పరిస్థితి వచ్చిందని తేల్చారు. చేసేది లేక రైతులు మళ్లీ దున్నేసి ఇతర పంటలు వేస్తున్నారు.
– న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం, నందికొట్కూరు గ్రామీణ, అవుకు



కొత్తపల్లి మండలం ఎదురుపాడులో ఓ రైతు సాగు చేసిన మొక్కజొన్న. గత నెలలో నాలుగెకరాల్లో విత్తనం నాటారు. పదిరోజులు దాటినా పూర్తిగా మొలకలు రాలేదు. వ్యవసాయాధికారులను సంప్రదించగా నకిలీ విత్తనాల వల్లే ఈ పరిస్థితి వచ్చిందని తేల్చారు. వారంతా వ్యాపారిని నిలదీయగా నష్ట పరిహారం చెల్లిస్తానని అంగీకరించారు.

ఆత్మకూరులో విక్రయించిన నకిలీ మొక్కజొన్న విత్తనాలు

కిలోపై రూ.1500 మిగులు

సాధారణంగా కిలో మొక్కజొన్న విత్తనాలు సంస్థను బట్టి రూ.1400 నుంచి రూ.1700 వరకు విక్రయిస్తున్నారు. నకిలీవి కిలో రూ.200లకే లభిస్తాయి. వీటిని ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లో అధిక ధరలకు విక్రయించడం ద్వారా కిలోపై రూ.1500 వరకు సొమ్ము చేసుకుంటున్నారు.
● అవుకులో 15 మంది రైతులు 120 ఎకరాల్లో 5252 రకం మొక్కజొన్న విత్తనం సాగు చేశారు. 30 శాతం పొలాల్లో మొలకలు రాలేదు. రైతులంతా కలిసి వ్యాపారిని ప్రశ్నించడంతో ఉచితంగా మరో రకం విత్తనాలు ఇచ్చారు.

గతేడాది భారీగా...

గతేడాది నంద్యాల మండలం పోలూరు గ్రామంలో రైతులు నంద్యాలకు చెందిన ఓ వ్యాపారి వద్ద కొనుగోలు చేసిన సీఎంహెచ్ఎస్ 150 రకం విత్తనాన్ని 125 ఎకరాల్లో సాగు చేశారు. పంట ఏపుగా పెరిగినా కంకి మాత్రం రాలేదు. నంద్యాల మండలాల రైతులు ఇదే పరిస్థితిని ఎదుర్కొన్నారు. ఎకరాకు రూ.20 వేల నుంచి రూ.25 వేల వరకు పెట్టుబడి పెట్టి తీవ్రంగా నష్టపోయారు. చేసేది లేక ఆందోళన బాట పట్టారు.

రంగుల ప్యాకెట్లలో పెట్టి

నంద్యాల, ఆత్మకూరు, బనగానపల్లి, డోన్, కోవెలకుంట్ల, ఆళ్లగడ్డ తదితర ప్రాంతాల్లోని వ్యాపారులు నకిలీ విత్తనాల దందా చేస్తున్నారు. గుర్తింపు పొందిన, వ్యవసాయ అధికారులు ధ్రువీకరించిన విత్తన సంస్థల ఉత్పత్తులు పోలిన ప్యాకింగ్‌తో విక్రయిస్తున్నారు. మరికొందరు అసలు విత్తనాలతో పాటు వీటిని విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. 5252 రకం, సీఎంహెచ్ 165 రకం, అర్జున్ సంకరం తదితర పేర్లతో అంటకడుతున్నారు. గుంటూరు, హైదరాబాద్, కర్ణాటక ప్రాంతాల నుంచి ఇవి జిల్లా మార్కెట్‌లోకి వస్తున్నాయి.

మద్దతు ధరతో పెరిగిన సాగు

● మొక్కజొన్న క్వింటాలు రూ.2,100 మద్దతు ధర ప్రకటించారు. ఎకరాకు సగటున రూ.20- 22 వేల వరకు వ్యయమవుతుంది. ఒక ఎకరాకు 35 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. పెట్టుబడిపోను రూ.40 వేల వరకు గిట్టుబాటు అవుతుంది. గతేడాది మెట్ట ప్రాంతాల్లో పత్తి సాగు చేసినా ఆశించిన దిగుబడులు లేవు. దీంతో ఈ ఏడాది మెట్ట ప్రాంతాల రైతులు ఈసారి పెద్దఎత్తున మొక్కజొన్న సాగు చేస్తున్నారు.

నేరాల నియంత్రణలో పురోగతి

మాట్లాడుతున్న ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా

నంద్యాల నేర విభాగం, న్యూస్‌టుడే: కేసుల దర్యాప్తు, నేరాల నియంత్రణలో పురోగతి సాధించినట్లు ఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా పేర్కొన్నారు. నంద్యాలలోని జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఆయన ఆరు నెలల నేర నివేదికను వెల్లడించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. ఆరు నెలల్లో హత్యలు 48 శాతం, కిడ్నాప్‌లు 24, అత్యాచార ఘటనలు 39, తీవ్రమైన నేరాలు 33 శాతం తగ్గినట్లు తెలిపారు. చోరీ కేసుల్లో గతేడాది కంటే ఈ ఏడాది 12 శాతం అధికంగా సొత్తు రికవరీ చేసినట్లు వెల్లడించారు. 2025లో పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 1887 ఫిర్యాదులు అందగా 1686 పరిష్కరించినట్లు వివరించారు. డ్రోన్ ద్వారా బహిరంగంగా మద్యం తాగుతున్న వారిని గుర్తించి 420 మందిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచినట్లు తెలిపారు. పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం ప్రతి శుక్రవారం గ్రీవెన్స్ డే నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీ మంద జావళి ఆల్ఫోన్స్, ప్రమోద్‌కుమార్, రామాంజినాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

కృష్ణమ్మ పరవళ్లు

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైల జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. జూరాల నుంచి 64,030 క్యూసెక్కులు వస్తోంది. శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 63,023 క్యూసెక్కులు నాగార్జునసాగర్‌కు విడుదల చేస్తున్నారు. బుధవారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైల జలాశయంలో 875.60 అడుగులు, నీటి నిల్వ 166.3148 టీఎంసీలుగా నమోదైంది.

తొలి ఏడాదిలోనే 80 శాతం హామీలు నెరవేర్చాం

తొలి అడుగు కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 80 శాతం హామీలను నెరవేర్చినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన నంద్యాల పట్టణంలోని సాయిబాబానగర్‌లో ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల గురించి ప్రజలకు వివరించారు. రానున్న నాలుగేళ్ల కాలంలో రాష్ట్రాన్ని మరింతగా అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. ప్రజల సమస్యలు తెలుసుకుని తెదేపా యాప్‌లో నమోదు చేయించారు. ఈ సమస్యలను త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తెదేపా ఇన్‌ఛార్జి సాయిరామ్ రాయల్, జ్యోతి రాయల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మార్కెట్‌యార్డు ఛైర్మన్ హరిబాబు, క్లస్టర్ ఇన్‌ఛార్జి శివశంకర్, నాయకులు అజ్మీర్, స్వామినాయక్, కృపాకర్, మంజుల సుబ్బరాయుడు, శ్రీదేవి, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

సుపరిపాలనకు శ్రీకారం

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది.. ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నాయకత్వంలో తామంతా శ్రమిస్తున్నామని రోడ్లు, భవనాలశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. కోవెలకుంట్ల మండలం గుల్లదుర్తి గ్రామంలో కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి హాజరై సీసీ రోడ్డు, శుద్ధజల కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేర సూపర్ సిక్స్ పథకాలను దశలవారీగా అమలు చేస్తున్నామన్నారు. రూ.3 వేల పింఛను రూ.4వేలు చేసి దాదాపుగా 65లక్షల మందికి ఇచ్చామన్నారు. వైకాపా ప్రభుత్వం ఒకరికి మాత్రమే అమ్మఒడి పథకం వర్తిస్తే కూటమి హయాంలో తల్లికి వందనం కింద ఇంట్లో ఎంతమంది ఉంటే అంతమందికి ఇచ్చామన్నారు. ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇచ్చామని, ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామన్నారు. రైతులకు అన్నదాత సుఖీభవ వారం రోజుల్లో ఇవ్వబోతున్నామని, నిరుద్యోగులకు మెగా డీఎస్సీ నిర్వహించి 16,347 ఉద్యోగాలు కల్పించబోతున్నామన్నారు. ఇవన్నీ కూటమి ప్రభుత్వ సుపరిపాలన విజయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో వరప్రసాదరావు, తహసీల్దారు పవన్‌కుమార్‌రెడ్డి, ఇన్‌ఛార్జీ ఎంపీడీవో ప్రకాష్‌నాయుడు తెదేపా నాయకులు పరమేశ్వరరెడ్డి, రవీంద్రారెడ్డి, శివనాగిరెడ్డి పాల్గొన్నారు.

సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి

భవిష్య నిధి

● 6,960 మంది సభ్యులకు భరోసా

కర్నూలు నగరం (జడ్పీ), న్యూస్‌టుడే: ఉద్యోగులను గత వైకాపా ప్రభుత్వం తీవ్ర ఇబ్బందులు పెట్టింది. వేతనాలు సరైన సమయానికి చెల్లించలేదు. చివరికి భవిష్య నిధిలో దాచుకున్న సొమ్మును చెల్లించడంలోనూ నిర్లక్ష్యం చేసింది. గృహాల కొనుగోలు, పిల్లల చదువు, వారి పెళ్లిళ్లు తదితర అవసరాల నిమిత్తం దరఖాస్తు చేసినా వాటిని పక్కన పెట్టేసింది. ఫలితంగా చాలామంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి సారించింది. పీఎఫ్ కోసం దరఖాస్తు చేసుకున్న రెండు మూడు నెలల్లోనే సొమ్ము అందజేస్తోంది.

ప్రతి నెలా పొదుపు చేస్తూ..

ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ భవిష్య నిధికి సంబంధించి 6,960 మంది సభ్యులున్నారు. జడ్పీ పరిధిలో ఏర్పాటుచేసిన భవిష్యనిధిలో జడ్పీ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది సభ్యులుగా చేరి ప్రతి నెలా పొదుపు చేస్తుంటారు. దీనిపై ఏడాదికోసారి వడ్డీతో లెక్కగట్టి సంబంధిత ఉద్యోగి ఖాతాకు జమ చేస్తారు. ఇప్పటి వరకు రూ.282.38 కోట్ల సొమ్మును ఉద్యోగులు పీఎఫ్ ఖాతాలో దాచుకున్నారు.

470 మంది దరఖాస్తు

ఉమ్మడి జిల్లాలో ఈ ఏడాది జనవరి నుంచి 470 మంది సభ్యులు నగదు కోసం దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో 443 మంది సభ్యులకు రూ.21.08 కోట్లు మంజూరు చేశారు. పదవీ విరమణ పొందిన 234 మంది సభ్యులకు సంబంధించి రూ.28.12 కోట్లు చెల్లించేందుకు సీఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారు. ఇందులో 190 మందికి రూ.18.82 కోట్ల మేర సొమ్ము జమైంది. మరో రూ.9.30 కోట్లు విడుదల కావాల్సి ఉంది. దరఖాస్తులను వేగంగా పరిష్కరిస్తుండటంతో ఉద్యోగులతోపాటు విశ్రాంత సిబ్బంది హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వివరాలు నవీకరించక..

● జడ్పీ భవిష్యనిధి ఖాతా సభ్యుల వివరాలు నవీకరించక ఏడాదిగా పెండింగ్‌లో ఉన్నాయి. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆన్‌లైన్ చేయాల్సి ఉందని అధికారులు పేర్కొంటున్నారు. ఎప్పటికప్పుడు వివరాలను ఆన్‌లైన్ చేస్తేనే వివరాలు పూర్తిగా అందుబాటులో ఉంటాయని సభ్యులు చెబుతున్నారు. మరో నెల రోజుల్లో ఆన్‌లైన్ ప్రక్రియ చేపడతామని జడ్పీ పీఎఫ్ ఉద్యోగులు తెలిపారు.
● ఉద్యోగులు దాచుకున్న సొమ్ము వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నామని.. అవసరార్థులకు సొమ్ము విడుదల చేస్తున్నామని జడ్పీ ఉప సీఈవో తెలిపారు.

డీఈ రవికాంత్‌చౌదరి ఇంట్లో అనిశా సోదాలు

నంద్యాల గ్రామీణం, న్యూస్‌టుడే : ఆదాయానికి మించిన ఆస్తులు కలిగున్నారన్న సమాచారంతో విద్యుత్తుశాఖ డీఈ రవికాంత్‌చౌదరి ఇంట్లో అవినీతి నిరోధక శాఖ అధికారులు మరోసారి సోదాలు చేపట్టారు. నంద్యాల పట్టణంలోని రైతు నగరంలో ఉన్న ఆయన నివాసంలో బుధవారం సోదాలు నిర్వహించి పలు దస్త్రాలు స్వాధీనం చేసుకున్నట్లు అనిశా డీఎస్పీ సోమన్న తెలిపారు. డీఎస్పీ వెల్లడించిన వివరాల మేరకు.. ఆళ్లగడ్డలో విద్యుత్తుశాఖ డీఈగా పనిచేస్తున్న రవికాంత్‌చౌదరి మే 16న రుద్రవరం మండలం చిన్నకంబలూరు గ్రామానికి చెందిన రైతు నుంచి లంచం తీసుకుంటుండగా అరెస్టు చేశారు. అప్పట్లో నిర్వహించిన సోదాల్లో దొరికిన ఆధారాలతో దర్యాప్తు చేపట్టారు. ఆదాయానికి మించి ఆస్తులు ఉన్నట్లు గుర్తించిన అనిశా అధికారులు బెయిల్‌పై ఉన్న అతన్ని మళ్లీ అరెస్టు చేసి పలు ప్రాంతాల్లో సోదాలు చేసినట్లు డీఎస్పీ వివరించారు.

డీఈ ఇంటి నుంచి దస్త్రాలతో బయటికొస్తున్న అనిశా అధికారులు

మలిసంధ్య కంటతడి

సైబర్ నేరగాళ్ల వల ● దాచుకొన్న సొమ్ము దోచేస్తున్నారు

ఎన్నో కష్టాలు దాటుకొచ్చారు.. పిల్లలను పెంచి పెద్దచేశారు.. వారిని ఓ ఇంటి వారిని చేసి.. నేడు ఒంటరిగా నిలిచారు. ఇంతకాలం పడిన కష్టాలకు స్వస్తిపలికి.. మలిసంధ్యవేళ విశ్రాంత జీవనం సాగించాల్సిన వారిని సవాళ్లు చుట్టుముట్టాయి. కొందరు నేరగాళ్లు వృద్ధులను దోచుకుంటున్నారు. ప్రశాంత జీవనం సాగించాల్సిన వారు కష్టాల సుడిలో, కన్నీటి అలలో, భయం గుప్పిట్లో కొట్టుమిట్టాడుతున్నారు. వృద్ధులన్న కనికరం లేకుండా నేరగాళ్లు దోపిడీలకు పాల్పడుతున్నారు. జిల్లాలో వృద్ధుల కష్టాలు వర్ణనాతీతం.
– న్యూస్‌టుడే, కర్నూలు నేరవిభాగం, సచివాలయం

1 కర్నూలు వెంకటరమణ కాలనీకి చెందిన పంచాయతీరాజ్ శాఖ విశ్రాంత ఇంజినీరును సైబర్ నేరగాళ్లు ఆన్‌లైన్ పెట్టుబడి పేరుతో నమ్మించి రూ.54.44 లక్షలు కాజేశారు.

2 ఒంటరి జీవితం సాగిస్తున్న కోర్టు విశ్రాంత ఉద్యోగిని సైబర్ నేరగాళ్లు ఈడీ పేరుతో బెదిరించి రూ.53.50 లక్షలు మోసగించారు.

.. ఇలా వృద్ధులను ఓ వైపు సైబర్ నేరగాళ్లు దోచేస్తున్నారు.. మరో వైపు ఏటీఎంలు మార్చేసి ఖాతాలో సొమ్ము స్వాహా చేస్తున్నారు. ఇంకోవైపు నేరగాళ్లు బరితెగించి వారి స్థలాలు కబ్జా చేస్తున్నారు.

ఆస్తుల కోసం వేధింపులు

జిల్లా కేంద్రాలు మొదలుకుని మారుమూల ప్రాంతాల వరకు చాలామంది వృద్ధులు ఆస్తుల కోసం కొడుకులు, కుమార్తెల వేధింపులకు గురవుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాల్లో ఇలాంటి బాధిత వృద్ధుల ఫిర్యాదులే అధికంగా వస్తున్నాయి.

పల్లెల్లో ఆకలికేకలు

పట్టణాల్లో వృద్ధులు బయటకు వెళ్లి ఎక్కడో ఒకచోట ఓ ముద్ద దొరికించుకునే వీలుంటుంది. కానీ పల్లెల్లో బయట ఎక్కడా యాచించే వీలుండదు. ఆదోని, పత్తికొండ, ఎమ్మిగనూరు తదితర సబ్‌డివిజన్ పరిధిలోని గ్రామాల్లో చాలామంది వృద్ధులను ఇళ్ల వద్దే వదిలేసి వారి పిల్లలు ఇతర ప్రాంతాలకు వలస వెళ్తున్నారు. దీంతో ఆకలితో అలమటిస్తూ నరకయాతన అనుభవిస్తున్నారు.

అందరూ ఉన్నా.. అనాథల్లా..

ఉమ్మడి జిల్లాలో చాలామంది వృద్ధులు దయనీయ స్థితిలో జీవనం సాగిస్తున్నారు. కన్నబిడ్డలు ఇంటి నుంచి గెంటేయటంతో వృద్ధాశ్రమాలు, ఆర్టీసీ బస్టాండు, రైల్వేస్టేషన్‌లు, పట్టణ నిరాశ్రయుల వసతి గృహాలు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో పలుచోట్ల తలదాచుకుంటున్నారు. ఉమ్మడి జిల్లాలోని 21 వృద్ధాశ్రమాల్లో సుమారు 500 మంది వృద్ధులు కన్నబిడ్డల ఆదరణకు నోచుకోనివారే అధికంగా ఉన్నారు. ఓ ప్రభుత్వ విశ్రాంత అధికారి భార్య చనిపోగా.. ఆయన్ను కొడుకు, కోడలు ఇంటి నుంచి గెంటేశారు. వృద్ధాశ్రమంలో కాలం గడుపుతున్నారు. పింఛను పొందే విశ్రాంత ఉద్యోగులు, పింఛను తీసుకునే వృద్ధులు సైతం పిల్లలు ఛీత్కారాలతో బయటకు వెళ్లలేక అన్నీ భరిస్తూ కాలం వెళ్లదీస్తున్నారు. వృద్ధ మహిళల పరిస్థితి మరీ దయనీయం. కన్నబిడ్డల ఇళ్లలో ఆయాలుగా, పాచి పనిచేసే పని మనుషులుగా దుర్భర జీవనం సాగిస్తున్నారు. కర్నూలులో పలు నిరుపేద కాలనీలకు చెందిన కొందరు భిక్షాటన చేసి డబ్బులు తెస్తేనే తల్లిదండ్రులను ఇంట్లోకి అనుమతిస్తుండటంతో ఆలయాలు, పలు కూడళ్లలో భిక్షాటన చేస్తున్నారు.

వృద్ధులకు అవగాహన కల్పిస్తూ..

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలావెంకటశేషాద్రి వృద్ధాశ్రమాలను నిరంతరం తనిఖీ చేస్తూ వారికి కల్పించే సౌకర్యాలను పరిశీలిస్తున్నారు. వయోవృద్ధుల పోషణ, సంక్షేమ చట్టం, వారికి ప్రభుత్వం కల్పించే పథకాలు వివరిస్తూ వృద్ధులకు అవగాహన కల్పిస్తున్నారు. ఒక న్యాయవాది, ఎన్జీవో సభ్యుడు, దివ్యాంగులు.. వయో వృద్ధులు, హిజ్రాల సంక్షేమ సహాయ సంచాలకుల శాఖ కార్యాలయం నుంచి ఒక ఉద్యోగితో కమిటీ ఏర్పాటుచేసి న్యాయ సాయం అందిస్తున్నారు.

ఆర్డీవో ట్రైబ్యునళ్లనూ ఆశ్రయించొచ్చు

– రయిస్ ఫాతిమా, జిల్లా దివ్యాంగులు, వయో వృద్ధులు, హిజ్రాల సంక్షేమ సహాయ సంచాలకుల శాఖ ఏడీ

తల్లిదండ్రుల వయో వృద్ధుల పోషణ సంక్షేమ చట్టం-2007, ఆంధ్రప్రదేశ్ తల్లిదండ్రుల వయో వృద్ధుల పోషణ, సంరక్షణ నియమావళి-2011 అమలు కోసం ఆర్డీవో కార్యాలయాల్లో ప్రత్యేకమైన ట్రైబ్యునళ్లు ఉన్నాయి. తల్లిదండ్రులను నిరాదరణకు గురిచేస్తే జైలుశిక్ష, జరిమానా విధిస్తారు. వృద్ధులు సాయం కోసం 14567 టోల్‌ఫ్రీ నంబరును సంప్రదించవచ్చు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97628
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 13479

(c) eenadu

గోతుల దారిలో.. అభివృద్ధి జాడలు

పత్తికొండ, మద్దికెర, న్యూస్‌టుడే: మద్దికెర- పత్తికొండ ప్రధాన రహదారి నిన్నటి దాకా మోకాలి లోతు గుంతలతో ప్రయాణం అడుగడుగునా ప్రమాదకరంగా సాగింది. కూటమి ప్రభుత్వం చొరవతో ప్రస్తుతం అభివృద్ధి బాట పట్టింది. మద్దికెర- నుంచి బురుజుల వరకు 10 కి.మీ. మేర పూర్తిగా దెబ్బతింది. ఈ దారిలో ఇటీవలే ఇద్దరు యువకులు ద్విచక్ర వాహన ప్రమాదంలో మృతిచెందిన విషయం తెలిసిందే. పదుల సంఖ్యలో గాయపడ్డారు. గత ఐదేళ్లు వాహనదారులు, ప్రయాణికులు నరకం చూశారు. గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేకపోయింది. రహదారి పనులకు పత్తికొండ ఎమ్మెల్యే కేఈ శ్యాంబాబు భూమి పూజ చేశారు. రూ.5.80 కోట్లతో బీటీ రోడ్డు పనులు నెల రోజుల్లో పూర్తిచేయించి, ప్రజల ఇబ్బందులు తీర్చారు. ఇప్పుడు ఈ దారిలో ప్రయాణం సులభంగా మారింది.

నాడు: గుంతలతో ప్రమాదంగా ఉన్న మద్దికెర- పత్తికొండ ప్రధాన రహదారి

నేడు: నిర్మాణం అనంతరం

పోరాట విద్యలో అన్నదమ్ముల పట్టు

అన్నదమ్ముళ్లు జీవన్, పోషిత్

ఆదోని క్రీడలు, న్యూస్‌టుడే: ఆదోని పట్టణం బీవీఆర్ ఎస్టేట్‌కు చెందిన ఆది, నిర్మల దంపతుల కుమారులు జీవన్, పోషిత్ 8వ, 5వ తరగతి చదువుతున్నారు. చదువుతోపాటు మార్షల్ ఆర్ట్స్‌లో ఒకటైన తైక్వాండో క్రీడలో ప్రతిభ చాటుతున్నారు. పట్టణానికి చెందిన తైక్వాండో మాస్టర్ దాదాబాషా వద్ద ప్రత్యేక శిక్షణ తీసుకుంటూ పలు పోటీల్లో ప్రతిభ చాటి పతకాలు సాధిస్తున్నారు. ఇప్పటికే అన్నదమ్ములు బ్లాక్ బెల్ట్-1 సొంతం చేసుకున్నారు. గతేడాది తిరుపతిలో జరిగిన సౌత్‌జోన్, రాష్ట్రస్థాయి పోటీల్లో జీవన్ అండర్-14 విభాగంలో రజత, కాంస్య పతకాలు సాధించగా.. అండర్-12 విభాగంలో పోషిత్ రెండు కాంస్య పతకాలు గెలుపొందారు. తైక్వాండో క్రీడలో జాతీయ స్థాయిలో ప్రతిభ చాటుతామంటున్నారు ఈ అన్నదమ్ములు.

కూచిపూడిలో ప్రశంసల సిరులు

ఆదోని పట్టణానికి చెందిన సత్యేంద్రకుమార్, అంబికా దంపతుల కుమార్తె రూపల్ సాయిశ్రీ 6వ తరగతి చదువుతుంది. సంప్రదాయ నృత్యంపై ఆసక్తి కలగడంతో తల్లిదండ్రులు ఆదోని పట్టణంలోని మాస్టర్ వీరజ్ రాయల్ వద్ద కూచిపూడి నేర్పించడం ప్రారంభించారు. తొమ్మిదేళ్ల నుంచి ఈ బాలిక కూచిపూడి నృత్యంలో సాధన చేస్తూ పలు ప్రదర్శనలిచ్చి పలువురి ప్రశంసలు పొందుతోంది. మహారాష్ట్రలోని ముంబయిలో జరిగిన ఆల్ ఇండియా డ్యాన్స్ ఫెస్టివల్‌లో రూపల్ సాయిశ్రీ పాల్గొని మొదటి బహుమతి అందుకుంది. తిరుపతి, నంద్యాల, ఆదోని పట్టణంతోపాటు పలు ప్రాంతాల్లో ఇప్పటివరకు 40 వరకు నృత్య ప్రదర్శనలిచ్చి అవార్డులు.. రివార్డులు సొంతం చేసుకుంది. చదువుతోపాటు నృత్యంలో రాణించి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకుంటానంటోంది రూపల్ సాయిశ్రీ.

రాజకీయాలు వదిలేస్తాం కానీ.. రాజీపడం

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: రాజకీయాలు వదులుకోవడానికి సిద్ధం కానీ ప్రత్యర్థులతో రాజీపడమని ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పేర్కొన్నారు. అహోబిలం గ్రామంలో బుధవారం తెదేపా 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం చేసిన సంక్షేమం ప్రజలకు

పథకాల కరపత్రాలు అందజేస్తున్న భూమా అఖిలప్రియ

వివరించారు. అంతకుముందు ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇటీవల మాజీ ఎమ్మెల్యే బ్రిజేంద్రరెడ్డి ఆళ్లగడ్డలో ఏ పని జరగాలన్నా అఖిలక్క పన్ను కట్టాలని చెప్పడంపై ఘాటుగా స్పందించారు. 'అహోబిలంలో తలనీలాల వేలంలో సంబంధించి వసూళ్లు చేస్తున్నారని చెబుతున్నావు.. తలనీలాలు దొంగతనం చేసిన సిబ్బందిని సస్పెండ్ చేస్తే విధుల్లోకి తీసుకోవాలని సిఫారసు చేసింది నువ్వు కాదా' అని దుయ్యబట్టారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సరకులు కొట్టేసింది మీరు కాదా అని ప్రశ్నించారు. మీరు చేసిన అరాచకాలు ఆధారాలతో బయటపెట్టి కేసులు పెడితే ఏంటి పరిస్థితి అని వ్యాఖ్యానించారు. భూమా వర్గంలో ఏ కార్యకర్తకు అన్యాయం చేయలేదన్నారు. వైకాపా హయాంలో కాంట్రాక్టర్లకు పనులు అప్పజెప్పి కార్యకర్తలకు ఇబ్బందులు కలుగజేశారన్నారు. టోల్‌గేట్ వేలానికి సంబంధించి వైకాపా వారు పాల్గొనకుండా చూస్తానని, అందుకు రూ.25లక్షలు కమిషన్ ఇవ్వాలని డిమాండ్ చేశావా లేదా అని ప్రశ్నించారు. ఆ విషయం నా దృష్టికి వచ్చి, నువ్వు పెట్టాల్సిందిగానే చెప్పి పోలీసు బందోబస్తుతో నిర్వహిస్తే వైకాపా వారు వేలానికి వచ్చి పాడలేదన్నారు. 60, 40 శాతం కమిషన్ల గురించి మాతో చర్చించిన విషయాలను బయట పెట్టాల్సి వస్తుందన్నారు. రాజకీయాలు వదులుకుంటామే కాని రాజీపడే ప్రసక్తే లేదన్నారు. మాజీ ఎమ్మెల్యేని ఉద్దేశిస్తూ.. తమ్ముడూ మాట తీరును మార్చాలని, అక్క వదిలేస్తుందేమో కాని, బావ వదలడని గుర్తుంచుకోవాలన్నారు. కార్యక్రమంలో తెదేపా నాయకులు గూడూరు సంజీవరాయుడు, ఎస్‌ఎల్ రమణ, ఆంజనేయులు, హరి, కౌన్సిలర్ హుశేన్‌బాషా పాల్గొన్నారు.

అభివృద్ధి.. సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఆత్మకూరు, న్యూస్‌టుడే : రాష్ట్ర ప్రజల అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు మండలం ఇందిరేశ్వరం గ్రామంలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం ప్రారంభించారు. ఈసందర్భంగా గ్రామస్థులు గజమాలతో ఎమ్మెల్యేకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. నాయకులు తిరువమయ్య, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

పేదల గుమ్మం వద్దకే పథకాలు

పాణ్యం (గ్రామీణం), న్యూస్‌టుడే : 'పేదల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తున్నట్లు పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి చెప్పారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా బుధవారం పాణ్యంలోని చెంచుకాలనీలో ఆమె ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలు అందాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. చెంచుకాలనీ మంజూరైన ఇళ్లను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్‌ను ఫోన్ ద్వారా కోరారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు రంగారమేష్, విజయభాస్కరెడ్డి, మార్కెట్‌యార్డు ఛైర్మన్ గీత, మండల కన్వీనర్ జయరామిరెడ్డి, నాయకులు లాయర్‌బాబు, రమణమూర్తి, ఖాదర్ బాషా, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

చెంచుకాలనీలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

ప్రగతి చూసి ఓర్వలేకనే అనవసర విమర్శలు

నందికొట్కూరు గ్రామీణం, న్యూస్‌టుడే: పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎంపీ బైరెడ్డి తెలిపారు. మండలంలోని దామగట్ల గ్రామంలో బుధవారం 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని ఎంపీ ప్రారంభించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి గురించి ప్రజలకు వివరించారు. ఎంపీ మాట్లాడుతూ.. వైకాపా నాయకులు ప్రజల్లో తిరగాలంటే గత అయిదేళ్ల పాలన గురించి చెప్పుకొని తిరగాలని, దిగజారుడు రాజకీయాలను ప్రోత్సహిస్తే ఎవరూ ఊరుకోరన్నారు. వైకాపా నాయకులు తెదేపా నాయకులపై ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వ పనితీరుపై ప్రజల్లో సంతృప్తి ఉందన్నారు. ఏడాది పాలనలో సాధించిన ప్రగతిని ఓర్వలేక ఏదేదో మాట్లాడుతున్నారన్నారు. ప్రజలను మోసం చేసేందుకు, మభ్యబెట్టేందుకు వస్తే గుణపాఠం నేర్పుతారన్నారు.

ప్రభుత్వ పథకాల గురించి వివరిస్తున్న ఎంపీ బైరెడ్డి శబరి

అహోబిలంలో హుండీ నగదు చోరీ!

అహోబిలం (ఆళ్లగడ్డ గ్రామీణం),న్యూస్‌టుడే: ఎగువ అహోబిలంలో హుండీ నగదు చోరీ జరిగినట్లు సమాచారం. వారం రోజుల క్రితం ఎగువ అహోబిలంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది నిఘా కెమెరాలను పని చేయకుండా చేసి గర్భగుడి ఆవరణలోని హుండీలోని నగదు చోరీ చేసినట్లు ప్రజలు చర్చించుకుంటున్నారు. దీనిపై మఠం ప్రతినిధి సుందరరాజన్ మాట్లాడుతూ చోరీ విషయం తన దృష్టికి రాలేదన్నారు. విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

బయట మద్యం కొనుగోలు చేయరాదు

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : ఆబ్కారీ శాఖ ద్వారా లైసెన్సు పొందిన రిటైల్ దుకాణాల నుంచి మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని, బయట ఎక్కడా కొనొద్దని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. లైసెన్స్ లేని వ్యక్తుల దగ్గర కొనుగోలు చేస్తే నకిలీ మద్యం వచ్చే ప్రమాదం ఉందన్నారు. వివాహాలు, ఇతర వేడుకలు, పార్టీలకు తగ్గింపు ధరలతో మద్యం సరఫరా చేస్తామని కొంతమంది మోసం చేసే అవకాశం ఉందన్నారు. నకిలీ మద్యం ఆరోగ్యానికి తీవ్రమైన హాని కలిగిస్తుందని వెల్లడించారు. ఎవరైనా నకిలీ మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం ఉంటే టోల్‌ఫ్రీ నంబరు 14405, చరవాణి నంబరు 8008828467కు సమాచారం ఇవ్వాలని కోరారు.

కేసీ కాల్వకు సాగునీరు విడుదల చేయాలి

ఈనాడు డిజిటల్, నంద్యాల : రాయలసీమ రైతుల పట్ల ప్రభుత్వం, అధికారులు నిర్లక్ష్య వైఖరి విడనాడి కేసీ కాల్వకు వెంటనే సాగునీరు విడుదల చేయాలని భారతీయ కిసాన్ సంఘ్ రాష్ట్ర కార్యదర్శి మహేశ్‌రెడ్డి డిమాండ్ చేశారు. సంఘం నాయకులు బుధవారం నంద్యాల కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. అనంతరం జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ.. శ్రీశైలం జలాశయం నీటి మట్టం 870 అడుగులకు చేరుకున్నా పోతిరెడ్డిపాడు నుంచి నీరు విడుదల చేయకపోవడం దారుణమన్నారు. ముందస్తు వర్షాల కారణంగా జిల్లా వ్యాప్తంగా రైతులు పంటలు సాగు చేశారని తెలిపారు. వెంటనే శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేసి రైతులను ఆదుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు గడ్డం అంకాల్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకటరాముడు, సూరిబాబు, ప్రధాన కార్యదర్శి భూపాల్‌రెడ్డి, జిల్లా కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, విజయ్ కుమార్‌రెడ్డి, చంద్ర ఓబుల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న బీకేఎస్ నాయకులు

సమయపాలన పాటించకపోతే చర్యలు

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: వైద్య ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించకపోతే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఆర్.వెంకటరమణ అన్నారు. కోవెలకుంట్ల మండలంలోని రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన బుధవారం తనిఖీ చేశారు. ఓపీ విభాగాన్ని, రోగులకు వైద్య సిబ్బంది అందిస్తున్న సేవలు, వ్యవహరిస్తున్న తీరు, దస్త్రాలను పరిశీలించారు. జాతీయ ఆరోగ్య కుటుంబ సంక్షేమ కార్యక్రమాల ఐఈసీ మెటీరియల్‌ను ప్రజల అవగాహన కోసం ప్రదర్శించాలన్నారు. మాతా శిశు సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకు సాధారణ కాన్పులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాలింత, శిశువు సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని, జేఎస్‌వై, జేఎస్ఎస్‌కే కార్యక్రమాల కింద అందే రాయితీలు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు మహబూబ్ సుబహాని, దివ్యజ్యోతి, ఆరోగ్య పర్యవేక్షకురాలు ప్రభావతి పాల్గొన్నారు.



దస్త్రాలు పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ డా.వెంకటరమణ

ముగిసిన డీఎస్సీ పరీక్షలు

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: జిల్లాలో జూన్ 6వ తేదీ నుంచి జులై 2వ తేదీ వరకు జరిగిన డీఎస్సీ పరీక్షలు ప్రశాంతంగా ముగిసినట్లు డీఈవో శామ్యూల్‌పాల్ బుధవారం తెలిపారు. మొత్తం 56,115 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా 51,510 మంది పరీక్షలు రాసినట్లు చెప్పారు.

కోవెలకుంట్ల కో-ఆపరేటివ్ బ్యాంక్ లి॥, Q.No. 309
కోవెలకుంట్ల

మహాజన సభ

కోవెలకుంట్ల కో-ఆపరేటివ్ బ్యాంకు మహాజన సభ 22-07-2025 మంగళవారం ఉదయం 11 గం॥ 30 ని॥లకు శ్రీ వాసవి భవనం నందు ఈ క్రింది అంశములు చర్చించు నిమిత్తం ఏర్పాటు చేయడమైనది. కనుక బ్యాంకు సభ్యులందరూ సదరు సమావేశమునకు తప్పక విచ్చేసి సభను జయప్రదం చేయవలసినదిగా కోరడమైనది.

చర్చించు అంశములు:

1. 2024-2025 ఆర్థిక సంవత్సరం ఆడిట్ రిపోర్ట్ చదివి వినిపించుట, ఆమోదించుట, నికర లాభాలను విభజించుట.
2. అధ్యక్షుల వారి అనుమతితో ఇతర అంశములు చర్చించుట.

పాలకవర్గ అనుమతితో

శ్రీ సి.వి.కృష్ణమూర్తి, సి.ఈ.వో | శ్రీ సముద్రాల శ్రీనివాసరావు, అధ్యక్షులు

గన్.. వేగంపై ఏదీ కన్ను

స్పీడ్ గన్ తనిఖీలు అంతంతే..

ప్రమాదాలపై కానరాని నియంత్రణ

డోన్, డోన్ నేరవిభాగం, నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే: మానవ జీవనంలో ప్రతి క్షణం విలువైందే. ప్రయాణాల్లో ఏమరపాటు వహిస్తే రెప్పపాటు కాలంలోనే మృత్యువు ముంచుకొస్తుంది. అతివేగంగా వాహనాలు నడిపితే ప్రాణాల మీదికి తెచ్చుకోవటంతో పాటు ఎదుటి వారి ప్రాణాలు బలిగొంటున్న సంఘటనలు ఎన్నో ఉన్నాయి. ఇటీవల ప్యాపిలి సమీపంలో అతివేగంతో కారు బోల్తాపడిన ఘటనలో ముగ్గురు యువకులు మృత్యువాత పడ్డారు.

పాణ్యం వద్ద స్పీడ్ గన్‌తో వేగాన్ని పరిశీలిస్తున్న రవాణా శాఖ సిబ్బంది

150 కి.మీ. వేగంతో..

దేశంలోనే ప్రాధాన్యమున్న జాతీయ రహదారులు 44, 40 ఉమ్మడి కర్నూలు జిల్లా గుండా వెళ్తున్నాయి. ఈ రహదారులతో పాటు రాష్ట్ర రహదారులు, ఉపరితల వంతెనలు, గ్రామీణ రహదారుల్లోనూ అతివేగంతో ప్రమాదాలు చోటుచేసుకుంటూ ఎంతో మంది క్షతగాత్రుల అవుతుండగా మరెందరో ప్రాణాలు కోల్పోతున్నారు. ఎన్‌హెచ్ 44లో నిత్యం 10వేలకు పైగా వాహనాలు వెళ్తుంటాయి. ఎన్‌ఎహెచ్ 40లో 7వేలకు పైగా వాహనాలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటాయి. హైవేల్లో గంటకు 100 - 110 కి.మీ. వేగంతో వాహనాలు వెళ్తే కొంతమేర ప్రమాదాలు తగ్గించుకునేందుకు అవకాశం ఉంటుంది. కానీ కొందరు 120 నుంచి 150 కి.మీ. వేగంతో వాహనాల్లో వెళ్తుంటారు. అతివేగాన్ని నివారించేందుకు పోలీసు, రవాణాశాఖ అధికారులు స్పీడ్‌గన్‌ల ద్వారా తనిఖీలు చేపట్టి వాహనాలు గుర్తించాల్సి ఉంటుంది.

ఇటీవల సంఘటనలు..

- డోన్ పట్టణంలోని ఉపరితల వంతెనపై మే నెలలో ఓ యువకుడు ద్విచక్రవాహనంపై అధిక వేగంతో వెళ్తూ అదుపుతప్పి కిందపడి మృతిచెందారు.
- ప్యాపిలి సమీపంలో మే నెలలో కర్ణాటకకు చెందిన నలుగురు యువకులు కారులో అతివేగంగా వెళ్తూ ప్రమాదవశాత్తూ అదుపుతప్పి వాహనం బోల్తాపడటంతో ముగ్గురు మృత్యువాతపడ్డారు.
- డోన్ నుంచి బేతంచెర్లకు వెళ్లే రహదారిలో జనవరిలో ఇద్దరు యువకులు ద్విచక్రవాహనంపై అతివేగంగా వాహనం నడపడంతో అదుపుతప్పి తీవ్రగాయాలకు గురయ్యారు.
- కర్నూలు నుంచి డోన్ వచ్చే రహదారిలో వెల్దుర్తి సమీపంలో ద్విచక్రవాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులను అతివేగంగా వెళ్తున్న లారీ ఢీకొనటంతో ఇద్దరూ అక్కడికక్కడే మృతిచెందారు.

ఉమ్మడి జిల్లాలో రహదారి ప్రమాదాలు ఇలా..

ఏడాది	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2023	499	268	558
2024	523	273	614
2025	272	118	326

ఉమ్మడి జిల్లాకు రెండు మాత్రమే..

నిబంధనల ప్రకారం హైవేపై నిర్దేశించిన ప్రాంతాల్లో వాహనాలు గంటకు 60 కి.మీ., పట్టణ పరిధిలో 30 కి.మీ. వేగంతో వెళ్లాలి. దీన్ని అతిక్రమిస్తే కేసు నమోదు చేసి రూ.14,00 జరిమానా విధిస్తారు. ఇలా చేయటంతో చాలా వరకు ప్రమాదాలు తగ్గేందుకు అవకాశం ఉంటుంది. నంద్యాల, కర్నూలు జిల్లాలకు ఒక్కొక్కటి చొప్పున స్పీడ్ గన్‌లు ఉన్నాయి. డోన్, ఆత్మకూరు, ఆదోని పట్టణాలకు స్పీడ్‌గన్ల అవసరం ఉంది. కర్నూలు, పాణ్యం, ఉలిందకొండ ప్రాంతాల్లో మాత్రమే హైవేపై అప్పుడప్పుడు నామమాత్రంగా తనిఖీలు చేపడుతున్నారు.

వ్యర్థాల పొగ.. వాహనదారులకు సెగ

బనగానపల్లి మండలం యాగంటి పుణ్యక్షేత్రానికి వెళ్లే రహదారిలో మొక్కజొన్న వ్యర్థాలకు నిప్పుపెట్టడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ముఖ్యంగా క్షేత్రానికి పెద్దసంఖ్యలో వచ్చే భక్తులు తికమకపడుతున్నారు. ఎటువైపు ఏ వాహనం వస్తుందో కనిపించక ఆందోళన చెందుతున్నారు. ఈ పొగ వల్ల ప్రమాదాల పాలవుతామని పలువురు యాత్రికులు వాపోతున్నారు.

– న్యూస్‌టుడే, బనగానపల్లి గ్రామీణం

లా సెమిస్టర్ ఫలితాల విడుదల

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: రాయలసీమ విశ్వవిద్యాలయం పరిధిలో జరిగిన లా మూడేళ్ల కోర్సులో 6వ సెమిస్టర్, ఐదేళ్ల కోర్సులో 10వ సెమిస్టర్ ఫలితాలు విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితాల కోసం ఆర్‌యూ అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

13న పూర్వ విద్యార్థుల సమ్మేళనం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే : నగరంలోని ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాలలో 13వ తేదీన పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ ఇందిరాశాంతి, క్లస్టర్ వర్సిటీ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్లు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1997-2000లో డిగ్రీ పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. అలనాటి గురువులు సైతం హాజరవుతారని, వారిని సన్మానించుకోవడం మన బాధ్యత అని నిర్వాహకులు అన్నారు.

హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక పారిపోయిన విద్యార్థులు

➤ గంటల వ్యవధిలో పట్టుకున్న పటమట పోలీసులు

ఆటోనగర్, న్యూస్‌టుడే: హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక పారిపోయిన ఇద్దరు విద్యార్థులను విజయవాడలోని పటమట పోలీసులు గంటల వ్యవధిలో పట్టుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. తల్లిదండ్రులు లేక ఆర్థిక ఇబ్బందులున్న పేద విద్యార్థులకు కృష్ణా జిల్లా తోట్లవల్లూరు మండలం ఏకమూరు గ్రామంలోని రెహబత్ వాలంటరీ హాస్టల్ ఉచితంగా ఆశ్రయం కల్పిస్తుంది. తెలంగాణ రాష్ట్రం నకిరేకల్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థి, నంద్యాల జిల్లా నందికొట్కూరుకు చెందిన 9వ తరగతి విద్యార్థి ఏకమూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతూ.. స్థానిక హాస్టల్‌లో ఉంటున్నారు. హాస్టల్‌లో ఉండడం ఇష్టం లేక బుధవారం ఉదయం వసతి గృహం నుంచి బయటకు వచ్చి బస్సు ఎక్కి విజయవాడ ఆటోనగర్ వచ్చారు. వారు బస్‌స్టేషన్‌లో దిగారనే సమాచారంతో కృష్ణా జిల్లా పోలీసులు... పటమట పోలీసులను అప్రమత్తం చేశారు. పటమట సీఐ పవన్ కిషోర్ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు గాలించాయి. ఉదయం 10 గంటలకు పంట కాలువ రోడ్డు వద్ద అదుపులోకి తీసుకున్నారు. హాస్టల్ నిర్వాహకులకు సమాచారం ఇచ్చారు. ఇద్దరికీ సీఐ కౌన్సెలింగ్ ఇచ్చి వారిని కుటుంబ సభ్యులు, హాస్టల్ నిర్వాహకులకు అప్పగించారు.

వక్ఫ్‌భూముల వేలం.. సద్దుమణిగిన వివాదం

కర్నూలు విద్య, న్యూస్‌టుడే: నందవరం మండలంలోని హాలహర్వి గ్రామం, మంత్రాలయం మండలంలోని సూగూరు, లచ్చుమర్రి తదితర ప్రాంతాల్లోని వక్ఫ్ భూముల వేలం ప్రక్రియను బుధవారం కర్నూలులోని వక్ఫ్ కార్యాలయంలో నిర్వహించారు. హాలహర్విలోని 85.83 ఎకరాలను వేలం వేయడంపై బి.యాపిలయ్య అనే వ్యక్తి అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయా భూములను 2021 జూన్ 30న వేలం వేశారని, అప్పుడు తాను ఆయా భూములను రూ.5.71 లక్షలకు వార్షిక లీజుతో దక్కించుకున్నానని తెలిపారు. నాడు పాడుకున్న ఆయా భూములను మళ్లీ ఎలా వేలం వేస్తారని ఆయన ప్రశ్నించారు. అధికారుల వైఖరికి నిరసనగా యాపిలయ్య, మరికొందరు రైతులు వక్ఫ్ కార్యాలయ అధికారులతో వాగ్వాదానికి దిగారు. ప్రస్తుతం తుమ్మకంపలు, ఇతర పిచ్చిమొక్కలతో ఉన్న ఆయా భూములను వేలంలో పాడుకునేందుకు ఎవరూ ముందుకు రాలేదు. దాంతో ఆ భూముల వేలం నిలిచిపోవడంతో వివాదం సద్దుమణిగినట్లయింది.

EENADU Classifieds

EDUCATION

DISTANCE EDUCATION

Open 10th, Inter, DPPTTC, Online Degree, PG, MBA & MCA Courses. Cont: Sri Sai College of Distance Education, Knl. ✆ 79812 23882.

డోన్ లో ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. అర్హత: Inter, డోన్ పరిసర ప్రాంతంలో ఉన్నవారికి ప్రాధాన్యత. ✆ 83415 18171.

REAL ESTATE

HOUSE FOR SALE

రోహిణి ఐస్‌ఫ్యాక్టరీ వారి నూతన ప్రాజెక్ట్ కామయ్య నివాస్ - 2, బెంగుళూరు రోడ్డు ... దగ్గర ఇండిపెండెంట్ హౌసెస్ కలవు. సంప్రదించండి: 91600 38988, 88866 62148.

JOBS

కర్నూలు - నంద్యాల చెక్ పోస్ట్ లో కొత్తగా ప్రారంభించిన మల్లికార్జున ఫర్నిచర్ షోరూమ్ నందు పనిచేయుటకు అకౌంటెంట్ M/F కావలెను. అర్హత: B.Com, MBA. ✆ 98493 50328.

అన్నిరకాల బిజినెస్ ప్రకటనలు

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే.

కలర్ 5 లైన్ల ప్రకటన రూ. 555/- మాత్రమే.

ప్రకటనలపై 5% GST వర్తించును.

వివరాలకు: 99899 97628

గమనిక

ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

అవుకు, న్యూస్‌టుడే: మండలంలోని రామాపురం సమీపంలో జరిగిన రహదారి ప్రమాదంలో గ్రామానికి చెందిన సి.బాలయ్య(51) మృతి చెందినట్లు ఎస్సై రాజారెడ్డి బుధవారం తెలిపారు. మృతుడు గ్రామ సమీపంలోని బస్టాండు వద్ద రహదారి దాటుతుండగా, అటు వైపు నుంచి వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొంది. ప్రమాదానికి కారణమైన వ్యక్తి పరారీలో ఉన్నాడని, గాలింపు చేపట్టామన్నారు. మృతుడికి భార్య ఉసేనమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

తమడపల్లె (మహానంది), న్యూస్‌టుడే : మహానంది మండలం తమడపల్లె గ్రామానికి చెందిన కోలా శేషాద్రి (19) విద్యుదాఘాతంతో మృతి చెందాడు. బుధవారం సాయంత్రం వర్షం కురుస్తున్న సమయంలో శేషాద్రి తన పెద్దనాన్న ఇంటి వద్దకు వెళ్లి వసారాలో ఉన్న ఇనుప స్తంభాన్ని పట్టుకున్నాడు. పైనున్న రేకులకు సర్వీసు తీగ తగలడం వల్ల స్తంభానికి విద్యుత్తు ప్రసారం కావడంతో యువకుడికి షాక్ కొట్టింది. అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. పక్కనే ఉన్న మరో యువకుడు ఇది గమనించి విద్యుత్తు సరఫరాను నిలిపివేశారు. వెంటనే శేషాద్రిని నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సమాచారం అందుకున్న మండల విద్యుత్తుశాఖ ఏఈఈ ప్రభాకర్‌రెడ్డి, తెదేపా నాయకుడు జనార్దన్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు మహానంది ఎస్సై ఎన్.రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

కుప్పకూలిన ట్రాక్టర్ డ్రైవర్

దేవనకొండ, న్యూస్‌టుడే: దేవనకొండలోని పత్తికొండ- కర్నూలు రహదారి పక్కన ఉన్న ఓ మద్యం దుకాణం దగ్గర 24 ఏళ్ల యువకుడు మృత్యువాత పడ్డాడు. స్థానికుల వివరాల మేరకు.. పత్తికొండ మండలం కోతిరాళ్ల గ్రామానికి చెందిన శివ(24) ట్రాక్టర్ డ్రైవరుగా పనిచేస్తూ.. జీవనం సాగిస్తున్నాడు. పని నిమిత్తం బుధవారం దేవనకొండకు వెళ్లాడు. ఒక్కసారిగా కుప్పకూలి కిందకు పడిపోవడంతో స్థానికులు వెంటనే 108 వాహనానికి సమాచారం ఇచ్చారు.

అదనంగా భూములు కోల్పోయిన వారి వివరాలు పరిశీలిస్తున్న ఆర్డీవో నాగజ్యోతి

భూములు కోల్పోయిన వారికి పరిహారం

పాములపాడు, న్యూస్‌టుడే : జాతీయ రహదారి 340సీ నిర్మాణం కోసం అదనంగా భూములు కోల్పోయిన వారికి పరిహారం అందించేందుకు కృషి చేస్తామని ఆర్డీవో నాగజ్యోతి చెప్పారు. పాములపాడు తహసీల్దారు కార్యాలయంలో బుధవారం ఆమె అదనంగా భూములు కోల్పోయిన రైతుల వారి వివరాలను పరిశీలించారు. బాధితులు తహసీల్దారు కార్యాలయంలో వివరాల సమర్పించాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు సుభద్రమ్మ, సర్వేయర్ భాస్కర్ పాల్గొన్నారు.

నంద్యాల

•నంద్యాల •నందికొట్కూరు •శ్రీశైలం •పాణ్యం

ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోండి

నందికొట్కూరు, న్యూస్‌టుడే : ప్రభుత్వం అందిస్తున్న స్వయం ఉపాధి అవకాశాలను యువత అందిపుచ్చుకొని ఆర్థికంగా ఎదగాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ సునీత సూచించారు. నందికొట్కూరులోని కళాశాలలో బుధవారం యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రోత్సాహాలను సద్వినియోగం చేసుకుని పరిశ్రమలు స్థాపించాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
నందికొట్కూరు : 94403 61729
ఆత్మకూరు : 90149 09024
నంద్యాల : 98853 28120

నంద్యాల పురపాలకం: ?: పట్టణంలోని ఆర్‌ఎస్ రోడ్డులో రహదారిపై వాహనాలు నిలుపుతున్నారు. **- నివేదిత**

✔: రోడ్డుపై వాహనాలు నిలపకుండా చర్యలు తీసుకుంటాం. **- మల్లికార్జునగుప్తా, ట్రాఫిక్ సీఐ**

?: సాయిబాబానగర్‌లో రహదారిపై మురుగు పారుతోంది. దోమల బెడద అధికమైంది. **- త్యాగరాజు, స్థానికుడు**

?: పట్టణంలోని జ్ఞానాపురంలో వీధికుక్కలు దాడులు చేస్తున్నాయి. **- రాజు, స్థానికుడు**

?: బైరమల్ వీధిలో వీధికుక్కలు ఎక్కువయ్యాయి. బయటికెళ్లాలంటే భయంగా ఉంది. **- రెడ్డి**

?: నంద్యాల పట్టణం నూనెపల్లెలో వీధికుక్కలు విపరీతంగా పెరిగాయి. పిల్లలు, ద్విచక్ర వాహనదారులపై తరచూ దాడులు చేస్తున్నాయి. **- మనోహర్‌రెడ్డి**

✔: సాయిబాబానగర్‌లో మురుగు తొలగిస్తాం. త్వరలోనే కుక్కలను పట్టించి సమస్య పరిష్కరిస్తాం.
- లక్ష్మీనారాయణశర్మ, శానిటరీ సూపర్‌వైజర్

ఆత్మకూరు పట్టణం : ?: ఖిల్లావీధిలో మార్కెట్ ప్రహరీని ఆనుకుని ఉన్న ఇనుప విద్యుత్తు స్తంభం ఒరిగిపోయింది. వర్షాలకు కూలిపోయే ప్రమాదం ఉంది.
- సద్దాం, స్థానికుడు

✔: విద్యుత్తుశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లి స్తంభాన్ని మార్పిస్తాం. **- రమేష్‌బాబు, కమిషనరు**

?: పెద్దబజారు నుంచి వడ్లరామపురం వెళ్లే మార్గంలో మురుగు కాల్వలు పూడిపోయాయి.
- లింగస్వామి, స్థానికుడు

✔: కార్మికులకు సూచించి కాల్వల్లో పూడిక తొలగిస్తాం.
- జీవన్‌కుమార్, పారిశుద్ధ్య పర్యవేక్షకులు

గ్రామాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

కొత్తపల్లి, న్యూస్‌టుడే: గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. గువ్వలకుంట్ల, జి.వీరాపురం గ్రామాల్లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ ఏడాది పాలనలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. గువ్వలకుంట్లలో మురుగు కాలువలు, వీధి స్తంభాలు, సీసీరోడ్లు సమస్య గురించి స్థానికులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ ఛైర్మన్ ప్రసాదరెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు యాదవ్, తెదేపా మండల కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి లింగస్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గువ్వలకుంట్లలో రహదారిపై నిలిచిన వర్షంనీటిని ఎమ్మెల్యేకు చూపుతున్న స్థానికులు

ప్రధాన కాల్వ.. అక్రమాలు కనిపించవా

☛ అనధికార కట్టడాలతో కుచించుకుపోయిన వాగులు

పరిశీలన

శ్రమదానం వంతెన వద్ద వాగులోకి చొచ్చుకొచ్చిన నిర్మాణాలు

నంద్యాల పురపాలకం, ఆత్మకూరు పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల, ఆత్మకూరు పురపాలక సంఘాల్లో డ్రైనేజీ వ్యవస్థలో కీలకమైన వాగులు ఆక్రమణలతో కుచించుకుపోయాయి. ఇష్టానుసారం వాటిని ఆక్రమించి కట్టడాలు నిర్మించారు. దీంతో వాగులు కుచించుకుపోయి వరద నీటి ప్రవాహానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. భారీ వర్షాలు కురిసి వరదలొస్తే పలు కాలనీలు ముంపునకు గురవుతున్నాయి. రూ.కోట్ల విలువైన స్థలాలు ఆక్రమించి భారీ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. వారి నిర్లక్ష్యం కారణంగా ఏటా లోతట్టు ప్రాంతాలు మునుగుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఈసారైనా ఆక్రమణలు తొలగించి ముంపు ముప్పు తప్పించాలని కోరుతున్నారు.

నంద్యాలలో 40 వేల మందికి ముప్పు

చామకాల్వ పట్టణంలో 7 కి.మీ పైగా ప్రవహిస్తోంది. దీనికి వరద వస్తే విశ్వనగర్, సాయిబాబానగర్, ఫక్కీర్‌పేట, గోపాల్‌నగర్, శ్యాంనగర్, హనీఫ్‌నగర్‌లు జలమయం అవుతున్నాయి. ఈ కాలనీల్లో సుమారు 40 వేలమంది ప్రజలు నివసిస్తున్నారు. వీరంతా ముంపు ముప్పును ఎదుర్కొంటున్నారు. భారీ వర్షాలు కురిసిన ప్రతిసారి వీరంతా బిక్కుబిక్కుమంటూ జీవిస్తున్నారు. ముంపు ముప్పు తప్పించేందుకు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రక్షణ గోడ నిర్మాణం చేపట్టారు. కొందరు నాయకుల స్వార్థ రాజకీయాలతో ఆ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

ఎటుచూసినా కబ్జాలే..

- పట్టణంలోని రెవెన్యూ క్వార్టర్స్ సమీపంలోని తాతయ్య గుడి పరిసరాల్లో చామకాల్వను కబ్జాకు గురైంది. ఈ ప్రాంతంలో రూ.కోట్ల విలువైన స్థలం అన్యాక్రాంతమైంది.
- సాయిబాబానగర్‌లో సైతం చామకాల్వ స్థలంలో పెద్దఎత్తున భవనాలు నిర్మించారు. దీంతో ఈ ప్రాంతంలో కాల్వ పూర్తిగా కుచించుకుపోయింది. వరద వస్తే సాయిబాబానగర్ వద్ద ఉన్న వంతెనపై నీరు పారుతోంది. దీంతో ఎన్జీవోకాలనీ, నూనెపల్లె, సాయిబాబానగర్‌కు రాకపోకలు నిలిచిపోతున్నాయి.
- పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీ, విశ్వనగర్‌లో పలు భవనాలు కాల్వ స్థలంలోనే నిర్మించారు. దీంతో వరదనీరు విశ్వనగర్, ఎస్‌బీఐ కాలనీలోని వంతెనలపై ప్రవహిస్తోంది.

60 నుంచి 20 అడుగులకు..

ఆత్మకూరు పురపాలక సంఘంలో వర్షాకాలం వచ్చిందంటే లోతట్టు ప్రాంతాల ప్రజలను ముంపు భయం వెంటాడుతోంది. పట్టణం మీదుగా వెళ్తున్న గుండ్లకమ్మవాగు అడుగడుగునా ఆక్రమణకు గురవ్వడమే ఇందుకు కారణం. ప్రస్తుతం ఈ వాగు పిల్లకాల్వను తలపిస్తోంది. దీంతో భారీ వర్షాలు కురిస్తే వరదనీరు కాలనీలను ముంచెత్తుతోంది.

- రహ్మత్‌నగర్, హుసేన్‌షానగర్, అక్కిరాజుకాలనీ, ఏకలవ్యనగర్, సాయిబాబానగర్, ఇందిరానగర్, గరీబ్‌నగర్, స్వరాజ్‌నగర్, ఆర్టీసీకాలనీలు నీట మునుగుతున్నాయి. ఈ కాలనీల్లో అటుచూసినా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. పాత చెక్‌పోస్టు వద్ద కాల్వపై ప్రహరీ గోడలు, బాత్‌రూంలు నిర్మించడం వల్ల 60 అడుగులు ఉండాల్సిన గుండ్లకమ్మ కాల్వ 20 అడుగులు కూడా లేదు.
- రహ్మత్‌నగర్‌లో కల్వర్టు సమీపంలో కాల్వపైనే ప్రహరీలు నిర్మించారు. అక్కిరాజుకాలనీలో కాల్వ గట్టును ఆక్రమించి రాతి కట్టడం చేపట్టారు. ఏకలవ్యనగర్ కాలనీలో కల్వర్టుకు ఇరువైపులా ఇళ్లు నిర్మించుకున్నారు. ఏటా అధికంగా నష్టపోతున్నది ఏకలవ్యనగర్ వాసులే.
- సాయిబాబానగర్‌లో కల్వర్టులు, సిమెంటు దిమ్మెల నిర్మాణం వల్ల గుండ్లకమ్మ వాగు లోతు తగ్గిపోయింది. మురుగు, వర్షంనీళ్లు రోడ్లపై ప్రవహిస్తూ మార్కెట్‌యార్డు, ఇందిరానగర్, స్వరాజ్‌నగర్, వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంతం, గరీబ్‌నగర్‌లను ముంచెత్తుతున్నాయి.

గుండ్లకమ్మవాగు స్థలంలో చేపట్టిన నిర్మాణాలు (పాతచిత్రం)

ఎన్జీవో సంఘం అధ్యక్షుడిగా హుసేన్‌రెడ్డి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : నంద్యాల తాలూకా ఎన్జీవో సంఘం అధ్యక్ష, కార్యదర్శులుగా బీసీ హుసేన్‌రెడ్డి, ఎల్.నరసారెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక ఎన్జీవో హోంలో ఆ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వెంగళరెడ్డి ఆధ్వర్యంలో బుధవారం తాలూకా సమావేశం నిర్వహించారు. అధ్యక్షుడిగా ఉన్న టి.మణిశేఖరరెడ్డి ఉద్యోగ విరమణ చేయడంతో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు హుసేన్‌రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఎన్జీవో సంఘం ముందుంటుందన్నారు.

అరకొర ఎరువులు.. అన్నదాతల బారులు

ఎరువుల కోసం రైతుల రైతులు పడుతున్న అగచాట్లు అన్నిఇన్ని కావు. బండిఆత్మకూరు మండలంలోని ఎ.కోడూరు సొసైటీలో ఎరువులు తీసుకోవడానికి పెద్ద సంఖ్యలో రైతులు తరలిరావడంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. వ్యవసాయశాఖ ఉన్నతాధికారులు ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో ఎరువులు సమృద్ధిగా ఉన్నాయని చెబుతున్నా.. క్షేత్రస్థాయిలో కొరత ఉందని రైతులు చెబుతున్నారు. ఇప్పుడే పరిస్థితి ఇలాగుంటే.. వరినాట్లు వేసే సమయంలో ఎరువుల కోసం ఎన్ని కష్టాలు పడాలోనని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, బండిఆత్మకూరు

నిర్లక్ష్యపు వేళ్లు.. కట్టడానికి పగుళ్లు

బండిఆత్మకూరు మండలం శింగవరం గ్రామంలోని గ్రామీణ ఆరోగ్య కేంద్రం గది గోడలపై మొక్కలు ఏపుగా పెరిగాయి. కొన్నేళ్లుగా వాటిని తొలగించకపోవడంతో వాటి గోడల్లోకి వేళ్లు దిగి పగుళ్లు ఏర్పడ్డాయి. వీటివల్ల వర్షాకాలంలో గోడల్లోకి నీరుచేరి ఈ భవనం కూలిపోయే ప్రమాదం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే మొక్కలు తొలగించాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, నంద్యాల బొమ్మలసత్రం

గుంతల్లో.. ప్రయాణానికెన్ని కష్టాలో

బ్రాహ్మణకొట్కూరు నుంచి వడ్డెమాను గ్రామానికి వెళ్లే మలుపు వద్ద రహదారిపై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. ఇరుకైన వాహనాలు మలుపు తిప్పుకొనేందుకు చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిపై కోళ్లబావాపురం, కోనేటమ్మపల్లి, వడ్డెమాను గ్రామాల ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. మలుపులో గుంతల కారణంగా తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికారులు స్పందించి గుంతలు పుడ్చివేయాలని ప్రయాణికులు విన్నవిస్తున్నారు. – న్యూస్‌టుడే, నందికొట్కూరు గ్రామీణం

బొమ్మలసత్రం.. జలమయం

నంద్యాల పట్టణంలోని బొమ్మలసత్రం ప్రాంతం చిన్నపాటి వర్షానికే జలమయం అవుతోంది. మురుగు కాల్వలను సరిగా శుభ్రం చేయకపోవడం.. ఆక్రమణలు పెరిగిపోవడంతో మురుగు, వర్షంనీరు రహదారులపై ప్రవహిస్తోంది. బుధవారం సాయంత్రం కురిసిన వర్షానికి [illegible] వెళ్లే ప్రధాన మార్గంతో పాటు బొమ్మలసత్రంలోని అంతర్గత రహదారులపై మోకాళ్ల లోతున నీరు ప్రవహించింది. – న్యూస్‌టుడే, నంద్యాల పట్టణం

లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే బుడ్డా

నిరుపేదలకు వరం సీఎం సహాయనిధి

వేల్పనూరు (వెలుగోడు), న్యూస్‌టుడే : సీఎం సహాయనిధి నిరుపేదలకు వరంలాంటిదని శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. పలువురు అనారోగ్య బాధితులకు మంజూరైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను వెలుగోడు మండలం వేల్పనూరులోని తన నివాసంలో బుధవారం ఆయన అందజేశారు. ఆత్మకూరు, వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాలకు చెందిన 32 మంది లబ్ధిదారులకు రూ.34 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేశారు.

● ఆత్మకూరు మండలం కృష్ణాపురానికి చెందిన తెదేపా కార్యకర్త ముర్తుజావలి విద్యుదాఘాతంతో మృతి చెందగా.. వారి కుటుంబానికి మంజూరైన రూ.5 లక్షల ప్రమాద బీమా చెక్కును ఎమ్మెల్యే కుటుంబ సభ్యులకు అందజేశారు.

గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలి

బండిఆత్మకూరు, న్యూస్‌టుడే : ప్రతి గ్రామంలో ఎమ్మార్పీఎస్ జెండా ఎగురవేయడమే లక్ష్యమని ఎంఆర్‌పీఎస్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మున్నంగి నాగరాజు అన్నారు. మండలంలోని పార్నపల్లెలో ఉన్న తితిదే కల్యాణ మండపంలో బుధవారం ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నియోజకవర్గ స్థాయి నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... ఈ నెల 7వ తేదీన ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కమిటీ, గ్రామ కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు.

శ్మశానవాటిక అభివృద్ధికి సహకరించండి

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : పట్టణంలోని నూనెపల్లెలో ఉన్న హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి సహకరించాలని వైకుంఠధామం కమిటీ సభ్యులు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కోరారు. స్థానిక మంత్రి కార్యాలయంలో బుధవారం వారు మంత్రిని

మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న వైకుంఠధామం కమిటీ సభ్యులు

కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు తోట పార్థసారథి, బాలకొండారెడ్డి, తోట వెంకటసుబ్బయ్య, శ్రీనివాసులు, గుద్దేటి వెంకటేశ్వర్లు, జయప్రకాశ్, వెంకటేశ్వర్లు, బ్యాంకు తిమ్మయ్య, పత్తి మహేశ్ తదితరులు పాల్గొన్నారు. త్వరలోనే శ్మశానవాటికలో నెలకొన్న సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

8 ఎంవీఏ నియంత్రిక ఏర్పాటు

గడివేముల, న్యూస్‌టుడే : గడివేముల విద్యుత్తు ఉపకేంద్రంలో బుధవారం 8 ఎంవీఏ నియంత్రికను ఏర్పాటు చేశారు. ఉపకేంద్రంలో ప్రస్తుతం రెండు 5 ఎంవీఏ నియంత్రికలు ఉన్నాయి. విద్యుత్తు వినియోగం పెరగడంతో వాటిపై భారం అధికమవుతోంది. వ్యవసాయానికి నిరంతరం 9 గంటల పాటు విద్యుత్తు సరఫరా చేసేందుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. దీంతో రెండు విడతలుగా సరఫరా చేస్తున్నారు. నియంత్రికలపై అదనపు భారం తగ్గించేందుకు 5 ఎంవీఏ స్థానంలో 8 ఎంవీఏ నియంత్రికను ఏర్పాటు చేశారు. త్వరలో మరొకటి ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

ఉత్తమ సేవలతోనే చక్కటి గుర్తింపు

నంద్యాల పట్టణం, న్యూస్‌టుడే : ఉద్యోగులు విధుల్లో ఉత్తమ సేవలు అందించినప్పుడే చక్కటి గుర్తింపు లభిస్తుందని ఏపీ ఎన్జీవో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వీసీహెచ్ వెంగళరెడ్డి పేర్కొన్నారు. 15 ఏళ్లుగా నంద్యాల తాలూకా ఎన్జీవో సంఘం అధ్యక్షుడిగా పనిచేసిన టి.మణిశేఖరరెడ్డి ఉద్యోగ విరమణ చేశారు. పట్టణంలో బుధవారం ఆయనకు సన్మాన సభ నిర్వహించారు. ఈసందర్భంగా వెంగళరెడ్డి

మణిశేఖరరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఎన్జీవో సంఘం నాయకులు

మాట్లాడుతూ.. మణిశేఖరరెడ్డి ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం చేసిన పోరాటాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సహాయ కమిషనర్ వెంకటదాసు, ఎన్జీవో సంఘం అసోసియేట్ ప్రెసిడెంట్ విజయరెడ్డి, ఉపాధ్యక్షుడు నరసయ్య, సంయుక్త కార్యదర్శి చక్రవర్తి, వివిధ తాలూకాల ఎన్జీవో సంఘం కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలి

నంద్యాల గాంధీచౌక్, న్యూస్‌టుడే : ప్రతిఒక్కరూ ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని తితిదే బ్రహ్మోత్సవ వ్యాఖ్యాత డాక్టర్ దీవి హయగ్రీవాచార్యులు సూచించారు. నంద్యాల పట్టణంలోని మెయిన్ బజార్‌లో ఉన్న వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆరు రోజులుగా నిర్వహిస్తున్న గురు చరిత్ర, గురు వైభవం ప్రవచనాల కార్యక్రమం బుధవారం ముగిసింది. చివరి రోజు ఆయన దత్తాత్రేయుని జన్మ వృత్తాంతం, అశ్వర్థ వృక్ష విశేషాలను భక్తులు వివరించారు.

పనిభారం తగ్గించాలని సీఆర్పీల డిమాండు

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : సీఆర్పీలపై పనిభారం తగ్గించాలని సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు

మెప్మా కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న సీఆర్పీలు, సీఐటీయూ నాయకులు

లక్ష్మణ్, మహమ్మద్‌గౌస్ డిమాండ్ చేశారు. పట్టణంలోని మెప్మా కార్యాలయం ఎదుట బుధవారం సీఆర్పీలు, సీఐటీయూ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఆర్పీ రహమ్మత్‌బీపై దాడి చేసిన సీవో లక్ష్మీకుమారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

మౌలిక వసతులు కల్పించండి

నందికొట్కూరు, న్యూస్‌టుడే: పట్టణం శివారులో ఉన్న జగనన్న కాలనీకి ప్రధాన రహదారి నిర్మించాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా నాయకుడు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. జగనన్న కాలనీని ఆయన బుధవారం సందర్శించారు. గత ప్రభుత్వం శివారు ప్రాంతాల్లో కాలనీలను ఏర్పాటు చేసి ప్రజలను సమస్యల్లోకి నెట్టిందన్నారు. కనీస మౌలిక సదుపాయాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

పల్లెల్లో సమస్యలపై ప్రత్యేక దృష్టి

తిమ్మాపురం (మహానంది), న్యూస్‌టుడే : పల్లెల్లో నెలకొన్ని సమస్యలపై ప్రత్యేక దృష్టిసారించాలని మండలాధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని అధికారులకు సూచించారు. ఎం.తిమ్మాపురంలోని సచివాలయంలో ఈవోఆర్డీ నాగేంద్రుడు ఆధ్వర్యంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సమన్వయంతో గ్రామాభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో ట్యాంకులను తరచూ శుభ్రం చేస్తూ గ్రామీణులకు సురక్షిత తాగునీరు సరఫరా చేయాలని చెప్పారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి జ్వరాలు ప్రబలకుండా వైద్యారోగ్యశాఖ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో నంద్యాల జిల్లా కేసీ కెనాల్ ప్రాజెక్టు ఛైర్మన్ బన్నూరు రామలింగారెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు కేవీఆర్ మహేశ్వరరెడ్డి, మండల వ్యవసాయాధికారి బి.నాగేశ్వరరెడ్డి, విద్యుత్తుశాఖ ఏఈఈ ప్రభాకరరెడ్డి, ఎంఈవో రామసుబ్బయ్య, ఐసీడీఎస్ మండల పర్యవేక్షకురాలు తోట కవిత, అటవీశాఖ డీఆర్వో హైమావతి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మండలాధ్యక్షురాలు బుడ్డారెడ్డి యశస్విని

మాయదారి పనులు.. అన్నదాతకు దిగులు

☛ ఎన్‌హెచ్ 340సీ నిర్మాణంతో పొలాలకు వెళ్లలేని పరిస్థితి

☛ అండర్ పాసింగ్ వంతెనలు ఏర్పాటు చేయాలని వినతి

10-బొల్లవరం వద్ద ఎడ్లబండ్లపై ప్రమాదకరంగా జాతీయ రహదారి దాటుతున్న రైతులు

నందికొట్కూరు, న్యూస్‌టుడే : జాతీయ రహదారి 340సీ నిర్మాణం అన్నదాతలకు జీవనాధారాన్ని దూరం చేస్తోంది. రైతులు పొలాలకు వెళ్లే మార్గాల మీదుగా నాలుగు వరుసల రహదారి నిర్మించారు. అవసరమైన చోట్ల అండర్ పాసింగ్ రోడ్లు ఏర్పాటు చేయలేదు. దీంతో పలు గ్రామాల్లో రైతులు పొలాలకు వెళ్లలేని దుస్థితి నెలకొంది. పంటలు సాగు చేయాలంటే కష్టంగా మారింది. రైతులు ప్రమాదకరంగా జాతీయ రహదారి దాటుతూ పొలాలకు వెళ్లాల్సి వస్తోంది.

రైతులను విస్మరించారు

జాతీయ రహదారి పనుల్లో భాగంగా ఆర్‌అండ్‌బీ రహదారులు ఉన్న ప్రాంతంలో మాత్రమే అండర్ పాసింగ్‌లను నిర్మించారు. పంచాయతీరాజ్, లోకల్ రోడ్ల గురించి ఏ మాత్రం పట్టించుకోకుండా పనులు చేపట్టారు. దీంతో రైతులు పొలాలకు వెళ్లే మార్గాలు పూర్తిగా మూసుకుపోయాయి.

● నందికొట్కూరు మండలం 10-బొల్లవరం గ్రామానికి చెందిన అన్నదాతలు రహదారి నిర్మాణం సమయంలో గుత్తేదారులతో గొడవపడి పనులు నిలిపేశారు. నేటికీ ప్రత్యామ్నాయం చూపలేదు. వీరు పొలాలకు వెళ్లాలంటే 3 నుంచి 10 కి.మీ దూరం చుట్టి రావాల్సి వస్తోంది. ప్రస్తుతానికి వీరు గ్రామంలోనే జాతీయ రహదారిని దాటుతున్నారు. భవిష్యత్తులో ఈ అవకాశం ఉండదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎక్కడెక్కడ సమస్య

నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు, దామగట్ల, 10-బొల్లవరం, నందికొట్కూరు, జూపాడుబంగ్లా మండలం మండ్లెం, తంగడంచ, జూపాడుబంగ్లా, 80 బన్నూరు, పాములపాడు మండలం కృష్ణరావుపేట, రుద్రవరం, పాములపాడు, ఎర్రగూడూరు గ్రామాలకు చెందిన అన్నదాతలు పొలాలకు దారి లేక ఇబ్బందులు పడుతున్నారు.

సర్వీసు రోడ్లు పొడిగిస్తే ఊరట

నందికొట్కూరు మండలంలోని బ్రాహ్మణకొట్కూరు, దామగట్ల, నందికొట్కూరులో రెండు చోట్ల, జూపాడుబంగ్లా ప్రాంతాల్లో ఆర్‌అండ్‌బీ రహదారులకు అనుసంధానంగా అండర్ పాసింగ్ నిర్మాణాలు చేపట్టారు. వీటి నుంచి సర్వీసు రోడ్లను నిర్మించి జాతీయ రహదారితో అనుసంధానించారు. ఈ సర్వీసు రోడ్లను పొలాల వరకు పొడిగిస్తే సమస్య కొంతమేర పరిష్కారమవుతుందని నందికొట్కూరు, పాములపాడు, జూపాడుబంగ్లా మండలాల రైతులు కోరుతున్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : కార్మిక, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 9న దేశ వ్యాప్తంగా చేపట్టనున్న సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు పిలుపునిచ్చారు. పట్టణంలోని సీఐ

మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు

టీయూ కార్యాలయంలో బుధవారం సీఐటీయూ, ఏపీ రైతు సంఘం నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్ మాట్లాడుతూ.. పండించిన పంటలకు గిట్టుబాటు ధరలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయరంగంలో నల్ల చట్టాలు, కార్మికుల హక్కులను కాలరాసే లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కేఎండీ గౌస్, బాలవెంకట్, రామచంద్రుడు, సురేష్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

నంద్యాల రైతునగరం, న్యూస్‌టుడే : రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సూర్యప్రతాప్ డిమాండ్ చేశారు. పట్టణంలోని స్వామిరెడ్డి భవన్‌లో బుధవారం ఏఐఎస్ఎఫ్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీజీ విద్యార్థులకు శాపంగా మారిన జీవో 77ను రద్దు చేయాలని కోరుతూ ఈనెల 4 నుంచి 10వ తేదీ వరకు జిల్లా వ్యాప్తంగా చేపట్టనున్న నిరసన కార్యక్రమాలను జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శశిధర్ రెడ్డి, రమేష్, రోహిత్, ప్రవీణ్ పాల్గొన్నారు.

వేతనం పెంచాలంటూ ధర్నా

నంద్యాల నేరవిభాగం, న్యూస్‌టుడే : నంద్యాల సర్వజన ఆసుపత్రి, వైద్య కళాశాలలో పనిచేస్తున్న భద్రతా సిబ్బందికి ఎంవోయూ ప్రకారం నెలకు రూ.18,500 వేతనం చెల్లించాలని సీఐటీయూ నాయకులు డిమాండు చేశారు. నంద్యాల సర్వజన ఆసుపత్రి ఎదుట బుధవారం వారు భద్రతా సిబ్బందితో కలిసి ధర్నా చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలవెంకట్ మాట్లాడుతూ.. ఎంవోయూలో పొందుపరిచిన వేతనం, క్యాజువల్ సెలవులు, ఆరు నెలలకు ఒక్కసారి యూనిఫామ్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సెక్యూరిటీ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు చెన్నయ్య, నాగన్న, రమణ తదితరులు పాల్గొన్నారు.

9న గ్రామీణ బంద్

నందికొట్కూరు, న్యూస్‌టుడే : గ్రామీణ ఉపాధిహామీ పథకం పరిరక్షణ కోసం ఈనెల 9న గ్రామీణ బంద్‌కు పిలుపునిచ్చినట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు తెలిపారు. నంద్యాల పట్టణంలో బుధవారం సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. కేంద్ర ప్రభుత్వం ఉపాధి పథకం అమలులో అవలంబిస్తున్న విధానాలకు నిరసనగా కూలీలతో కలిసి బంద్‌కు పిలుపునిచ్చామన్నారు.

సహకార సంఘం సేవలపై ప్రదర్శన నేడు

నందికొట్కూరు, న్యూస్‌టుడే : ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం సేవలపై గురువారం ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు నందికొట్కూరు సహకార బ్యాంకు సీఈవో రబ్బానీ తెలిపారు. స్థానిక కేడీసీసీ బ్యాంకులో బుధవారం ఆయన మాట్లాడుతూ.. సహకార వారోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న ఎగ్జిబిషన్‌లో రైతులకు కావాల్సిన ఎరువులు, రుణాలు వంటివి అందజేస్తామన్నారు.

(c) eenadu

ఆళ్లగడ్డ

• ఆళ్లగడ్డ • బనగానపల్లి • డోన్

ఇంటర్న్‌షిప్ పత్రాల అందజేత

ధ్రువపత్రాలు అందుకున్న విద్యార్థులతో వైస్ ప్రిన్సిపల్ డా.గంగన్న, అధ్యాపకులు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: ఆళ్లగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఎస్సీ, బీకాం చివరి సంవత్సరం విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ పత్రాలను వైస్ ప్రిన్సిపల్ డా.గంగన్న అందించారు. బుధవారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన ఈ పత్రాలను అందించారు. ఆయన మాట్లాడుతూ తాము విద్యార్థులకు అందిస్తున్న పత్రాలు వారికి ప్రైవేటు, ప్రభుత్వ విభాగాల్లో ఉపాధి కల్పించేందుకు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు కాశీవిశ్వనాథ్, నాగమస్తాన్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థినులకు ట్రిపుల్ ఐటీ సీట్లు

ఆళ్లగడ్డ, న్యూస్‌టుడే: పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించి తమ గురుకులానికి చెందిన ఏడుగురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటీ సీట్లు సాధించినట్లు డా.బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ సంధ్యారాణి అన్నారు. బుధవారం ఆమె మాట్లాడుతూ కీర్తన, వర్షిత, ప్రియాంక, కావ్య సుధ, వైష్ణవి, రుబిక, దివ్యబాయి అనే విద్యార్థినులు పదోతరగతిలో మంచి మార్కులు సాధించారన్నారు. ఈ సందర్భంగా బాలికలను అభినందించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఆళ్లగడ్డ: 8008 574916 | డోన్ పట్టణం: 94408 57790 | బనగానపల్లె: 80085 73763

కోవెలకుంట్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ?: సౌదరదిన్నె గ్రామ సచివాలయం వెనుక వీధిలో మురుగు కాల్వలు నిండా మట్టి వ్యర్థాలతో నిండిపోయాయి. **- నరసింహుడు, స్థానికుడు.**

✔: పరిశీలించి పూడిక తొలగించే ఏర్పాట్లు చేస్తాం. **- మధుసూదన్, సర్పంచి.**

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో అంతర్గత వీధుల్లో సీసీ రహదారులు, మురుగు కాల్వలు లేక ఇబ్బంది పడుతున్నాం. **- రాముడు, కాలనీవాసి.**

✔: మంత్రి దృష్టికి తీసుకెళ్లి వసతులు కల్పిస్తాం. **-ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జీ ఈవో.**

?: పట్టణంలోని అంకాలమ్మ గుడికి వెళ్లే దారిలో మురుగు కాల్వ అధ్వానంగా తయారైంది. **- వెంకటేశ్వర్లు, స్థానికుడు.**

✔: పరిశీలించి పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. **-ప్రకాష్‌నాయుడు, ఇన్‌ఛార్జీ ఈవో.**

శిరివెళ్ల, న్యూస్‌టుడే: ?: మండలంలోని గోవిందపల్లె కోళ్లఫారం కాలనీలో ప్రధాన రహదారికి మరమ్మతులు చేయాలి. **- యేసునాథం**

✔: మరమ్మతులు చర్యలు తీసుకుంటాం. **- లక్ష్మీమనోహర్, ఏఈ, గోవిందపల్లె.**

చాగలమర్రి, న్యూస్‌టుడే: ?: శెట్టివీడు గ్రామంలో పారిశుద్ధ్యం లోపించింది. అధికారులు స్పందించి చర్యలు చేపట్టండి. **-రాజు, శెట్టివీడు.**

✔: గ్రామంలో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటాం. **- ఆదినారాయణ, పంచాయతీ కార్యదర్శి.**

సంజామల, న్యూస్‌టుడే: ?: ముదిగేడు గ్రామంలోని కాల్వ నిర్వహణ లేక ప్రధాన రహదారిపై మురుగు పారుతోంది. **-అలీ, ముదిగేడు.**

✔: కాల్వలో మురుగు పారేలా చర్యలు తీసుకుంటాం. **-సాల్మన్, ఎంపీడీవో, సంజామల.**

బనగానపల్లి, న్యూస్‌టుడే: ?: పట్టణంలోని ఆస్థానం ప్రాంతం బోయపేట రహదారి తగ్గుగా ఉండటంతో వానకు జలమయం అవుతోంది. సీసీ రోడ్డు నిర్మించాలి. - సురేంద్ర, కాలనీవాసి.

✔: సిబ్బందిని పంపించి తగు చర్యలు తీసుకుంటాం. **- సతీష్‌కుమార్‌రెడ్డి, ఈవో.**

తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలా ?

బేతంచెర్ల నగర పంచాయతీ పరిధిలో తాగునీరు, అపరిశుభ్రత, సీసీ రహదారులు, మురుగు కాల్వలు, కల్వర్టులు ఇతర సమస్యలను ఎవరికి చెప్పాలో తెలియడం లేదా.. బేతంచెర్ల మున్సిపల్ కమిషనర్ హరిప్రసాదర్ దృష్టికి సమస్యలను తీసుకెళ్లి వాటికి పరిష్కారం చూపేందుకు ఈనాడు ఈ నెల 3న ఫోన్-ఇన్ ఏర్పాటు చేసింది. పట్టణ ప్రజలు ఆయా సమస్యల పరిష్కారానికి గానూ ఈ కింద నంబర్లకు గురువారం ఫోన్ చేస్తే చాలు.

తేది: 3వ తేదీ (గురువారం)

సమయం: ఉదయం 11 గంటల నుంచి 12 వరకు :

✆: 9885677424, 7702163363

తాగునీటి సమస్యకు పరిష్కారం

స్పందనకు వందనం

కొలిమిగుండ్ల, న్యూస్‌టుడే: అంకిరెడ్డిపల్లె గ్రామంలో తాగునీటి సమస్యపై బుధవారం ఈనాడు పత్రికలో 'అంకిరెడ్డిపల్లె నీటి గోస' శీర్షికన జులై 1న వార్త ప్రచురితమైంది. ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈ మనోహర్, డీఈ మధుసూదన్, ఎంపీడీవో ప్రసాదరెడ్డి ఇతర అధికారులు గ్రామన్ని సందర్శించి సమస్య పరిష్కరించినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కరీముల్లా తెలిపారు. ట్యాంకర్ల ద్వారా రోజుకు రెండుసార్లు కాలనీల్లో తాగునీటిని సరఫరా చేయాలని సిబ్బందిని ఈఈ సూచించారు.

పల్లె వైద్యం.. పేదలకు దూరం

పూర్తికాని విలేజీ హెల్త్ క్లినిక్ భవనాలు

గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందించాల్సిన విలేజీ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు పూర్తికాలేదు. కొన్ని చోట్ల అద్దె భవనాల్లో ఏర్పాటు చేసిన క్లినిక్‌లకు అద్దె భారం తప్ప సేవలు లేవు. పూర్తయిన భవనాలు సక్రమంగా తెరుచుకోవడం లేదు. ఆయా క్లినిక్‌లలో పనిచేస్తున్న మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు నామమాత్రంగా హాజరవుతుండటంతో సమయానికి పేదలకు వైద్యం అందడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి క్లినిక్‌ల నిర్మాణాలు పూర్తి చేయించి, సేవలను పర్యవేక్షించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

చివరిదశలో ఆగిపోయిన పనులు

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: బనగానపల్లి పట్టణం తహసీల్దారు కార్యాలయం వద్ద హెల్త్ క్లినిక్ నిర్మాణం చివరి దశలో ఆగిపోయింది. టంగుటూరు, పలుకూరులో పీహెచ్‌సీలు ఉన్నాయి. టంగుటూరు పరిధిలోని 9 సచివాలయాల్లో ఎంఎల్‌హెచ్‌పీలు పనిచేయాల్సి ఉండగా యాగంటిపల్లి గ్రామంలో ఒకటి ఖాళీగా ఉంది. పలుకూరు పీహెచ్‌సీ పరిధిలో 15 సచివాలయాల్లో 15 మంది ఎంఎల్‌హెచ్‌పీలు పనిచేయాల్సి ఉండగా వాటిలో ఒకటి ఖాళీగా ఉంది. చాలా వరకు కేంద్రాల్లో పనులు ప్రారంభించి వదిలేశారు. మరికొన్ని చోట్ల అసలే పునాదులకు నోచుకోక ఉన్నాయి. దీంతో అద్దె భవనాల్లో నిర్వహించుకోవాల్సిన పరిస్థితులున్నాయి.

పునాదులకే పరిమితం

ప్యాపిలి, న్యూస్‌టుడే: కలుచట్ల గ్రామంలో రూ.లక్షలతో వెచ్చిస్తున్న విలేజీ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణం బేస్ మట్టానికి పరిమితమై పిల్లర్ల వరకు నిర్మించి వదిలేశారు. వైద్య సేవలు అందించే నిమిత్తం ఓ ప్రభుత్వ భవనంలో సిబ్బంది సేవలు కొనసాగిస్తున్నారు. ఈ భవనంలో సౌకర్యాలు లేకపోవడంతో ఇటు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకటే గది ఉండటంతో మహిళలకు వైద్య సేవలను అందించలేని పరిస్థితి నెలకొంది. మౌలిక సౌకర్యాలు కొరవడ్డాయి. గుడిపాడు గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లినిక్ భవనంలో విద్యుత్, నీటి సౌకర్యం, బండ పరుపు వంటి నిర్మాణాలు పూర్తి చేయలేదు.

పరిశీలన

సిబ్బంది నిర్లక్ష్యం.. రోగులకు కష్టం

అవుకు, న్యూస్‌టుడే: ఉప్పలపాడు పీహెచ్‌సీ పరిధిలో ఏడు హెల్త్ క్లినిక్‌లు ఉండగా అరకొర సేవలు అందుతున్నాయి. ఆరోగ్య కేంద్రాల పరిధిలో సేవలు అందించాల్సిన ఎంఎల్‌హెచ్‌పీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. అవసరమైన మందులు తీసుకునేందుకు కేంద్రాలకు వెళ్లడం కష్టంగా మారినట్లు రోగులు వాపోతున్నారు. సుంకేసులలో గతంలో ప్రజలకు చేరువలో 104 వాహనాన్ని ఉంచి సేవలు అందించేవారని, ప్రస్తుతం గ్రామం వెలుపల నిర్మించిన భవనం వద్ద పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఉపసర్పంచి పార్థసారథిరెడ్డి పేర్కొన్నారు. నెలలో ఒక్కరోజు నిర్వహించే కార్యక్రమం ప్రజలకు అందుబాటులో లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు.

మధ్యాహ్నం.. కేంద్రానికి తాళం

హరివరం (ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: ఉయ్యాలవాడ పీహెచ్‌సీ పరిధిలో నాలుగు హెల్త్ క్లినిక్‌లు ఉన్నాయి. ఉయ్యాలవాడ, హరివరం, సుద్దమల్ల, గుళ్లదుర్తి గ్రామాల్లో కేంద్రాలు నడుస్తున్నాయి. హరివరంలో ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం పరిశీలించగా మధ్యాహ్నం 2.30 గంటలకే తాళం వేశారు. ఆరోగ్య సిబ్బంది సమయానికి కేంద్రంలో లేక పోవటంతో ఇక్కడి గ్రామస్థులు వైద్యం కోసం కోవెలకుంట్ల, నంద్యాల వంటి పట్టణ ప్రాంతాలకు వెళ్తున్నారు.

బడి మైదానం.. జలమయం

వానొస్తే చాలు వైపీపీఎం ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానం వర్షం నీళ్లతో నిండిపోతోంది. సమస్యను పరిష్కరించేందుకు పాఠశాల బృందం వారు 40 ట్రాక్టర్ల మట్టితో చదును చేశారు. బుధవారం కురిసిన వర్షానికి మళ్లీ పాత స్థితే ఏర్పడింది. పాఠశాల ముందున్న స్థలంలో ఉన్న మురుగు కాల్వ ఆక్రమణలకు గురై పూడికతో నీళ్లు బయటకు వెళ్లడం లేదని పాఠశాల సిబ్బంది అంటున్నారు. పూడిక తొలగించి సమస్యకు పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, ఆళ్లగడ్డ**

రూపుదిద్దుకున్న అప్రోచ్ రోడ్డు

డోన్ పట్టణంలోని రైల్వేస్టేషన్‌లో రూపురేఖలు మార్చేందుకు అమృత్ భారత్ యోజన పథకం కింద పలు అభివృద్ధి నిర్మాణ పనులకు గాను రూ.8.64కోట్లు మంజూరైనట్లు రైల్వే అధికారులు పేర్కొన్నారు. ఇందులో భాగంగా రైల్వేస్టేషన్ రోడ్డులో మున్సిపల్ కార్యాలయం సమీపం నుంచి రైల్వే స్టేషన్ సమీపం వరకు అప్రోచ్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. దీంతో వాహన రాకపోకలు సాఫీగా సాగుతున్నాయి. **- న్యూస్‌టుడే, డోన్‌పట్టణం**

భారీ వర్షంతో భక్తుల అవస్థలు

ఆళ్లగడ్డ మండలంలో బుధవారం భారీ వర్షం కురిసింది. ఉదయం నుంచి మేఘావృతమై సాయంత్రం ఒక్కసారిగా పెద్ద ఎత్తున వాన కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పొలాల్లో వర్షపు నీరు నిలిచాయి. అహోబిలంలో ఆలయ ప్రాకారంలో వాన నీరు నిలవడంతో ప్రదక్షిణలు చేసేందుకు భక్తులు ఇబ్బందులు పడ్డారు. విత్తు నాటి వాన కోసం ఎదురుచూస్తున్న రైతన్నలు ఆనందం వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, అహోబిలం(ఆళ్లగడ్డ గ్రామీణం)**

కాలనీలో దొంగలు పడ్డారు

డోన్ పట్టణ సమీపంలోని దొరపల్లె గుట్ట వద్ద నిర్మించిన పీఎంఏవై-ఎన్టీఆర్ నగర్(గతంలో జగనన్న కాలనీ)లో దొంగలు రెచ్చిపోతున్నారు. కాలనీలోని పలు ఇళ్లకు బుధవారం విద్యుత్తు మీటర్లు, వాకిళ్లు పగలగొట్టి ఎత్తుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. ఇలా దొంగలు రెచ్చిపోతుంటే అక్కడికి వెళ్లి ఎలా నివాసముండాలని పలువురు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికే రూ.కోట్ల ప్రభుత్వ నిధులతో ఇళ్లు నిర్మించారు. ఇవన్నీ నిరుపయోగమయ్యే పరిస్థితులు ఉన్నాయి. **- న్యూస్‌టుడే, డోన్**

స్వయం ఉపాధిపై యువత దృష్టి సారించాలి

బనగానపల్లి, న్యూస్‌టుడే: యువత స్వయం ఉపాధిపై దృష్టి సారించాలని ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.లలిత పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ అనే కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన ఆలోచనలు, పారిశ్రామికంగా ఎలా అభివృద్ధి చెందాలనే అంశాలను వెల్లడించారు. అధ్యాపకులు మహమ్మద్ గౌస్, ఉమామహేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ లలిత

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: రాష్ట్రాభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యమని ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. డోన్ పట్టణం ఇందిరానగర్‌లో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన ఇంటింటి పర్యటన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. ఇంట్లో ఎంత మంది చదువుకుంటున్నారో అంత మంది పిల్లలకు తల్లికి వందనం పథకం కింద డబ్బు జమ చేయడం, దీపం పథకం గ్యాస్ సిలిండర్లు, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పెంపు వంటి పలు రకాల పథకాలను వర్తింపజేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొట్రికె హరికిషన్, కూటమి నాయకులు విజయ్ భట్టు, ఆంజనేయులుగౌడ్, రాఘవేంద్రగౌడ్, శ్యామ్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కోట్ల

నేడు కొండపేటలో ఎంపీ, ఎమ్మెల్యే పర్యటన

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని కొండపేటలో గురువారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం ఉంటుందని తెదేపా నాయకులు బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి డోన్ ఎమ్మెల్యే కోట్ల జయసూర్య ప్రకాష్‌రెడ్డి, నంద్యాల జిల్లా ఎంపీ బైరెడ్డి శబరి ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ప్రైవేట్ పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరి

డోన్ పట్టణం, న్యూస్‌టుడే: డోన్ నియోజకవర్గంలో తిరిగే ప్రైవేట్ పాఠశాలల బస్సులకు ఫిట్‌నెస్ తప్పనిసరిగా ఉండాలని మోటార్ వాహనాల తనిఖీ అధికారి టి.క్రాంతికుమార్ బస్సుల యాజమాన్యాలకు సూచించారు. పట్టణం సమీపంలో బుధవారం జాతీయ రహదారిలో ప్రైవేట్ పాఠశాలల బస్సులను ఆపి తనిఖీలను నిర్వహించారు. నిబంధినలు అతిక్రమించిన బస్సుల యజమాలకు జరిమానా విధించామన్నారు.

మహిళల సహకారంతో మరిన్ని సేవలు

ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులతో ఇన్నర్ వీల్ మహిళా సభ్యులు

డోన్, న్యూస్‌టుడే: మహిళల సహకారంతో మరిన్ని సేవలు చేపడతామని ఇన్నర్ వీల్ క్లబ్ గుంతకల్లు మాజీ అధ్యక్షురాలు వరలక్ష్మి పేర్కొన్నారు. డోన్ ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నికను బుధవారం నిర్వహించారు. డోన్ అధ్యక్షురాలిగా శకుంతలరెడ్డి, కార్యదర్శిగా విజయలక్ష్మి, ఐఎస్ఓగా లీలారాధ, కోశాధికారిగా పద్మలను ఎన్నుకున్నట్లు తెలిపారు. నూతన అధ్యక్షురాలు శకుంతల రెడ్డి మాట్లాడుతూ క్లబ్ ద్వారా మహిళా సభ్యులందరినీ కలుపుకుని మరిన్ని సమాజ సేవా కార్యక్రమాలు గుర్తించి అమలు చేస్తామన్నారు. ఇందుకోసం అందరి సహకారం అవసరం అన్నారు.

భోజన పథకం నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

బేతంచెర్ల, న్యూస్‌టుడే: విద్యార్థులకు మధ్యాహ్న భోజనం పథకం అమలు చేయడంలో నిర్లక్ష్యం చేయవద్దని ఎంఈవో సోమశేఖర్ అన్నారు. కొమ్మూరు కొట్టాల గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకురాలు విద్యార్థులకు అరకొర భోజనం వడ్డిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. పూర్తిస్థాయిలో గురువారం విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎంఈవో తెలిపారు.

ఆలయ భూములు ఆక్రమిస్తే చర్యలు

నందవరం(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయ భూములు, స్థలాలు ఆక్రమిస్తే కఠిన చర్యలుంటాయని ఆలయాధికారి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్థానిక మారుతి సత్రం, వెంకటరాముడు సత్రాలు ఆలయ భూమిలో ఉండటంతో కోర్టు ఉత్తర్వుల మేరకు బుధవారం యంత్రాలతో తొలగించారు. శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

రుద్రవరంలో నర్సరీ ప్రారంభం

రుద్రవరం, న్యూస్‌టుడే: రుద్రవరం అటవీశాఖ కార్యాలయంలో మొక్కలను పెంచేందుకు నర్సరీని ప్రారంభించినట్లు తాత్కాలిక రేంజర్ ముర్తుజావలి తెలిపారు. ఆయన మాట్లాడుతూ నర్సరీని ఏర్పాటు చేసేందుకు రూ.17 లక్షల ప్రభుత్వ నిధులు మంజూరయ్యాయన్నారు. లక్ష మొక్కలను పెంచేందుకు సిద్ధం చేస్తున్నామన్నారు.

కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి

బేతంచెర్ల, న్యూస్‌టుడే: కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నగర పంచాయతీ ఛైర్మన్ చలంరెడ్డి అన్నారు. బుధవారం బోయపేట కాలనీలో సందర్శించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో రోడ్డు గుంతలమయంగా మారిందని, వరాహాలు ఇళ్లల్లోకి వస్తున్నాయని మహిళలు ఛైర్మన్‌కు తెలిపారు. కాలనీలో అభివృద్ధికి నోచుకోలేదని మహిళలు పేర్కొన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న ఛైర్మన్ చలంరెడ్డి

ఏడాదికాలంలోనే ప్రజలకు సంక్షేమ పథకాలు

నల్లమేకలపల్లె (ప్యాపిలి), న్యూస్‌టుడే: ఏడాదికాలంలోనే రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఏ రాష్ట్రంలో లేనివిధంగా అద్భుతమైన సంక్షేమ పథకాలను ప్రజలకు అందిస్తున్నారని మాజీ సర్పంచి నరసింహులు, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజశేఖర్ నాయుడు పేర్కొన్నారు. నల్లమేకలపల్లె గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో సత్యం, భాస్కర్‌నాయుడు, బాలనరసింహ, ప్రసాద్, నాయుడు, బాబు పాల్గొన్నారు.

బేతంచెర్ల, న్యూస్‌టుడే: పేదల సంక్షేమమే కూటమి లక్ష్యమని తెదేపా ఎస్టీసెల్ రాష్ట్ర కార్యదర్శి రవీంద్ర నాయక్ అన్నారు. బుధవారం గొరుమానుకొండ తండా గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం ఎమ్మెల్యే కోట్ల ఆదేశాల మేరకు ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి శ్రీధర్‌బాబు, బూత్ కో-కన్వీనర్ పులి నాగేశ్వర నాయక్ తదితరులు పాల్గొన్నారు.

నల్లమేకలపల్లెలో కరపత్రాలు అందజేస్తున్న తెదేపా నాయకులు

ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులు

బనగానపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: ఉపాధ్యాయులు సమాజ మార్గదర్శకులని పలువురు వక్తలు పేర్కొన్నారు. బనగానపల్లి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నతపాఠశాలలో ఇటీవల బదిలీ అయిన 8 మంది ఉపాధ్యాయులకు ప్రధానోపాధ్యాయులు ప్రసాదరావు ఆధ్వర్యంలో బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు

బేతంచెర్ల,న్యూస్‌టుడే: విధుల పట్ల అంకితభావంతో పనిచేస్తే సమాజంలో గుర్తింపు వస్తుందని నంద్యాల జిల్లా విద్యుత్ ఎస్ఈ సుధాకర్ పేర్కొన్నారు. పట్టణ విద్యుత్ ఏఈగా పనిచేస్తున్న పుల్లయ్య బుధవారం పదవీవిరమణ పొందారు. ఈ సందర్భంగా ఏడీ మధుసూదన్‌రెడ్డి, ఏఈ శ్రీనివాసులు, సిబ్బంది ఆధ్వర్యంలో షాదీఖానాలో సన్మానించారు.

సంక్షిప్త సమాచారం

గోవిందపల్లె (శిరివెళ్ల), న్యూస్‌టుడే: గోవిందపల్లె గ్రామంలో విద్యుత్తు తీగల చోరీ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చిన్నపీరయ్యాయాదవ్ బుధవారం తెలిపారు. గోవిందపల్లెకు 15 మంది రైతుల పొలాల్లోని విద్యుత్తు తీగలను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారన్నారు.

శిరివెళ్ల, న్యూస్‌టుడే: గ్రామంలో నాగుల చెరువు సమగ్రాభివృద్ధికి రూ.కోటితో ప్రతిపాదనలు పంపినట్లు ఏఈ రఘురాముడు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండలంలోని రెండు చెరువుల అభివృద్ధికి గతంలో రూ.11 లక్షలకు ప్రతిపాదనలు పంపగా నిధులు మంజూరయ్యాయన్నారు.

కోవెలకుంట్ల, న్యూస్‌టుడే: ఏపీ ఎక్సైజ్ శాఖ నుంచి లైసెన్సులు పొందిన రిటైల్ మద్యం దుకాణాల నుంచి మాత్రమే మద్యాన్ని కొనుగోలు చేయాలని కోవెలకుంట్ల ఎక్సైజ్ ఎస్సై సందీప్ బుధవారం తెలిపారు. లైసెన్సులు లేని వ్యక్తుల నుంచి మద్యం కొనుగోలు ప్రమాదకరమన్నారు.

ఓబులంపల్లె(ఆళ్లగడ్డ గ్రామీణం), న్యూస్‌టుడే: ఓబులంపల్లె గ్రామంలో దొండ్లవాగులో మట్టి దందా జరగట్లేదని గ్రామ తెదేపా నాయకుడు గౌరు రామకృష్ణారెడ్డి తెలిపారు. పొలం రస్తాలో బాగా లేదని ప్రజలు కోరడంతో వాగులోని మట్టితో పొలం రస్తా వేసినట్లు తెలిపారు.

నందవరం (బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: నందవరం గ్రామానికి చెందిన కె.రమాదేవిని తన భర్త శేఖర్ మద్యానికి బానిసై ఘర్షణపడుతున్నాడు. ఇదే విషయంపై రమాదేవి తల్లి నారాయణమ్మ ప్రశ్నించడంతో శేఖర్ సోదరుడు మహేష్ ఆమెపై దాడి చేశాడు. కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటసుబ్బయ్య తెలిపారు.

డోన్‌పట్టణం, న్యూస్‌టుడే: పట్టణంలోని నెహ్రూనగర్ వేంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలో మున్సిపల్ అధికారులు సీసీ రహదారి నిర్మాణం చేపట్టారు. సాధారణ నిధుల కింద రూ.5లక్షలతో చేపడుతున్న నిర్మాణ పనులను మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్, వైస్ ఛైర్మన్ జాకీర్‌హుస్సేన్ బుధవారం పరిశీలించారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: పట్టణంలోని మంగలి వీధిలో హుర్షహీద్ పీర్ల ఊరేగింపు ఘనంగా జరిగింది. స్థానిక చావిడి వద్ద మంగళవారం అర్ధరాత్రి కమిటీ సభ్యులు, వందల మంది భక్తుల నడుమ సవారీ వేడుకలను నిర్వహించారు. భక్తులు పెద్దఎత్తున పాల్గొని స్వామికి పాతేహాలు సమర్పించారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: గ్రామాల్లో సమస్యల పరిష్కారం కోసమే ప్రభుత్వం గ్రామ సభలను నిర్వహిస్తోందని సర్పంచి తులసమ్మ తెలిపారు. పట్టణంలోని మేజర్ పంచాయతీ కార్యాలయంలో జరిగిన గ్రామ సభలో సర్పంచి, ఈవో తాహీర్‌హుసేన్‌లు పలు అంశాలను చర్చించారు.

డోన్, న్యూస్‌టుడే మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచకుంటే ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకయ్య పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల దీక్షలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు అబ్బాస్, మోటారాముడు, ప్రభాకర్, చంద్ర, గౌస్, అజయ్‌రెడ్డి, సంజీవకుమార్ పాల్గొన్నారు.

బనగానపల్లి, న్యూస్‌టుడే: బనగానపల్లి ఇన్‌ఛార్జీ ఎంపీడీవోగా నాగరాజు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న వెంకటరమణ సెలవుపై వెళ్లడంతో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న నాగరాజుకు ఉన్నతస్థాయి అధికారులు ఇన్‌ఛార్జీ బాధ్యతలు అప్పచెప్పారు.

అన్నదాతకు అండగా.. ఆర్థిక భరోసా

ఆళ్లగడ్డ గ్రామీణం, న్యూస్‌టుడే: రైతులకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీ అమలు చేసేందుకు కార్యచరణను సిద్ధం చేసింది. అన్నదాత సుఖీభవ-పీఎం కిసాన్ పథకం ద్వారా ఏటా రూ.20వేలు ఆర్థిక సహాయం అందించేందుకు వ్యవసాయాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆళ్లగడ్డ, డోన్, బనగానపల్లి నియోజకవర్గాల్లో 1,20,321 మంది రైతులకు ఈ పథకం ద్వారా లబ్ధిచేకూర్చేందుకు జాబితాను సిద్ధం చేశారు. రైతన్నల బ్యాంకు ఖాతాల్లో త్వరలోనే నగదు జమకానుంది.

ఈకేవైసీ చేయించుకుంటున్న రైతులు

వెబ్‌ల్యాండ్ ఆధారంగా సేకరణ

★ వ్యవసాయశాఖ వెబ్‌ల్యాండ్ ఆధారంగా రైతుల జాబితాను ఖరారు చేసి రియల్‌టైమ్ గవర్నెన్స్ ద్వారా వడబోత విధానంలో అర్హుల జాబితాను సిద్ధం చేశారు. ప్రజాప్రతినిధులు, ఆదాయ పన్ను చెల్లింపుదారులు, ప్రభుత్వ ఉద్యోగులు, వ్యవసాయేతర పనులకు భూమిని వినియోగించేవారిని తొలగించారు. ఇప్పటికే రైతులతో ఈకేవైసీ పూర్తి చేయించారు. భూ రీసర్వే జరిగిన గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిగణలోకి తీసుకుని అర్హులైన రైతులకు నగదు జమ చేసేలా ప్రభుత్వం కార్యచరణ చేపట్టింది.

నియోజకవర్గం	అర్హులు	ఈకేవైసీ పూర్తైనవి
డోన్	35280	34635
ఆళ్లగడ్డ	43705	42853
బనగానపల్లి	41336	40577

★ వెబ్‌ల్యాండ్‌లో ఆధార్ జత కాకున్నా, తప్పుగా జోడించినా, చనిపోయిన ఖాతాలు, నోషనల్ ఖాతాలు కలిగిన రైతులు రెవెన్యూ అధికారులను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని ప్రభుత్వం సూచిస్తోంది. రైతుల నుంచి అభ్యర్థనలు స్వీకరించేందుకు వెబ్‌పోర్టల్‌ను సైతం ఆరంభించనుంది.

అర్హులకు బ్యాంకు ఖాతాల్లో జమ

- రామ్మోహన్‌రెడ్డి, ఏడీఏ

ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రైతులతో ఈకేవైసీ పూర్తి చేయించాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు త్వరలోనే రైతుల బ్యాంకు ఖాతాలకు రెండు విడతలుగా నగదు జమ చేయనున్నాయి. ఖరీఫ్ సీజన్‌లో రైతులు సద్వినియోగం చేసుకోవడానికి మంచి అవకాశం.

సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు

టంగుటూరు(బనగానపల్లి గ్రామీణం), న్యూస్‌టుడే: రైతులు సస్యరక్షణ చర్యలతో అధిక దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ అధికారి సుబ్బారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని నందవరం, టంగుటూరు గ్రామాల్లో ఆయన ఆధ్వర్యంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు తగిన సూచనలు చేశారు.

నందవరంలో కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, రైతులు

బి.నాగిరెడ్డిపల్లె(రుద్రవరం), న్యూస్‌టుడే: మండలంలోని బి.నాగిరెడ్డిపల్లె, కొండమాయపల్లె గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించినట్లు మండల వ్యవసాయాధికారి సుమతి తెలిపారు. సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడులు సాధించాలని సూచించారు.

చాగలమర్రి, న్యూస్‌టుడే: రైతుల సమస్యలను తెలుసుకుని వారికి అండగా నిలిచేందుకే ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయాధికారి హేమసుందర్‌రెడ్డి తెలిపారు. మద్దూరు, చాగలమర్రి గ్రామాల్లో వ్యవసాయ అధికారి రంగనేతాజీ ఆధ్వర్యంలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మొక్కజొన్న పంటలో కత్తెరపురుగు వ్యాప్తి చెందితే తీసుకోవాల్సిన నివారణ చర్యలను రైతులకు వివరించారు.

చెన్నూరు (శిరివెళ్ల), న్యూస్‌టుడే: గ్రామాల్లో భూసార పరీక్షల ఆధారంగా రైతులు ఎరువులను వాడాలని ఏవో సుధాకర్ సూచించారు. చెన్నూరు, ఇసుకపల్లె గ్రామాల్లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో బుధవారం రైతులకు ఎరువుల వాడకంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఇంజేడు(ఉయ్యాలవాడ), న్యూస్‌టుడే: పంటల సాగు అంశంలో రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు పాటిస్తే అధిక దిగుబడులు సాధించటం సాధ్యమని ఏవో శ్రీనివాసరెడ్డి అన్నారు. 'పొలం పిలుస్తోంది' కార్యక్రమంలో భాగంగా ఇంజేడులో రైతులతో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వ్యవసాయశాఖ ఏపీఎం సునిత, రాణి ఉన్నారు.

రైతుకు కౌలుకార్డు తప్పనిసరి

గుండుపాపల (దొర్నిపాడు), న్యూస్‌టుడే: సాగు భూమి లేని ప్రతి రైతు కౌలు కార్డు తప్పనిసరిగా పొందాలని ఏవో ప్రమీల పేర్కొన్నారు. మండలంలోని గుండుపాపల గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి కౌలు రైతు భూయజమానితో ఒప్పంద పత్రంతో సంబంధిత వీఆర్వోల వద్దకు వెళ్తే వారు కౌలు కార్డు అందిస్తారన్నారు.

పత్రికా ప్రకటన

కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు లి॥ డోన్ శాఖ ఖాతాదారులకు విజ్ఞప్తి

డోన్ బ్రాంచి కార్యాలయమును ప్రస్తుత భవనము నుండి దిగువ కనబర్చిన నూతన భవనములోనికి అతి త్వరలో మార్చబడును. కావున ఖాతాదారులందరూ ఈ యొక్క బ్రాంచి కార్యాలయ భవన మార్పును గమనించమనవి.

నూతన కార్యాలయ భవన చిరునామా:
H.No: 9-13-5, K.V.S. కాలనీ,
శ్రీ సుధ జూనియర్ కళాశాల ప్రక్కన, డోన్.

ఖాతాదారులకు అత్యున్నత సేవలు అందించుటలో డి.సి.సి. బ్యాంకు నిరంతరము కృషి చేయునని తెలియజేయడమైనది. కార్యాలయ భవన మార్పు వల్ల కలుగు తాత్కాలిక అసౌకర్యానికి చింతిస్తున్నాము.

బ్రాంచి మేనేజరు, డి.సి.సి. బ్యాంకు లి॥ డోన్ బ్రాంచి. సెల్: 99516 16120.

(c) eenadu

ఈనాడు ఒడిశా
గురువారం జులై 3, 2025

నలుగురు ఒడిశా కార్మికుల దుర్మరణం

తెలంగాణ పరిశ్రమలో ప్రమాదం

ఘటనాస్థలంలో కొనసాగుతున్న సహాయక చర్యలు

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: తెలంగాణ రాష్ట్రం సంగారెడ్డి జిల్లాలో ఓ పరిశ్రమలో జరిగిన ప్రమాదంలో చెందిన నలుగురు కార్మికులు దుర్మరణం చెందగా, మరో ముగ్గురు గాయపడ్డారు. ఒడిశా రాష్ట్ర కార్మిక, కుటుంబ సంక్షేమశాఖ దీనిని నిర్ధారిస్తూ ఆ వివరాలను వెల్లడించింది. ప్రమాదంలో చనిపోయిన వారిలో జగన్నాథపూర్ (గంజాం), లగ్నజిత్ దువారి (టిగిరియా, కటక్), మనోజ్ రౌత్ (బాలేశ్వర్), ధోళగోవింద సాహు (జాజ్‌పూర్) ఉన్నారు. గాయపడ్డ వారిలో గంజాం జిల్లాకు చెందిన సమీర్‌పాడి, చందన్‌కుమార్ నాయక్ (భద్రక్), నీలాంబర్ భద్ర (నవరంగపూర్) ఉన్నారు. వీరిలో సమీర్ 35 శాతం కాలిన గాయాలతో మదీనాగూడ ప్రణమ్ ఆసుపత్రి ఐసీయూలో చికిత్స పొందుతుండగా, మిగతా ఇద్దరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఒడిశా పరిపాలన డైరెక్టరేట్‌కు చెందిన డీసీపీ ప్రదీప్‌పండా, ఓపీసీ చంద్రశేఖర్ హోతాలు తెలంగాణ వెళ్లి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. దీంతో రాష్ట్రంలో విషాద ఛాయలు అలముకున్నాయి. బాధిత కుటుంబాల సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ తమవారిని చివరి సారిగా చూసుకునే అవకాశం కల్పించాలని కోరుతున్నారు.

గొంతు తడవదు... ఆకలి తీరదు

చాలీచాలని సహాయ సామగ్రి

వరద బాధితుల ఆక్రందన

బలియాపాల్‌లో వరదనీరు

బాలేశ్వర్ జిల్లా బలియాపాల్ సమితిలోని బిష్ణుపూర్, పొంటెయి, జమకుండ, కులాబోద, ఇక్షిపాల్, బోడొరాపొవడ తదితర గ్రామాల్లో చాలా నివాసాల్లోకి వరదనీరు ప్రవేశించడంతో బాధితులు వాపోతున్నారు.

ఒక్కో కుటుంబానికి కేవలం 500 గ్రాముల అటుకులు, 100 గ్రా. పంచదార పంపిణీ చేస్తున్నారని, దీంతో ఒక కుటుంబం మూడు రోజులపాటు ఎలా నెట్టుకురాగలదన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వండిన ఆహారం సైతం సక్రమంగా సరఫరా చేయకపోవడంతో చాలామంది పునరావాస కేంద్రాలకు వెళ్లేందుకు విముఖత చూపుతున్నారు.

– న్యూస్‌టుడే, భువనేశ్వర్, రాయగడ పట్టణం

వరదపీడిత బాలేశ్వర్ జిల్లాలో బాధితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గొంతు తడుపుకోవడానికి నానా అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న సహాయ సామగ్రి ఎటూ సరిపోవడం లేదంటున్నారు. జిల్లాలోని బలియాపాల్, బస్తా, జలేశ్వర్ సమితుల్లోని 30కిపైగా గ్రామాల్లో వరదనీరు ఇంకా నిలిచిఉంది. ప్రజలు పడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. లోతట్టు గ్రామాల్లోని ఇళ్లల్లోనూ నీరు చేరడంతో కొందరు పైకప్పులపైకెక్కారు. పిల్లలు, వృద్ధుల పరిస్థితి దయనీయంగా ఉంది. ముంపులో ఉన్న గ్రామాల్లో ఓడ్రాఫ్ జవానులు ఆహార పొట్లాలు, అటుకులు, బెల్లం, నీటి సీసాలు పంపిణీ చేస్తున్నా కడుపులు నిండటం లేదని పలువురు చెబుతున్నారు. కోతకొచ్చిన కూరగాయల పంటలు నీట మునిగిపోవడంతో అన్నదాతలు బావురుమంటున్నారు. పశుసంవర్ధక శాఖ సిబ్బంది సమకూరుస్తున్న పశుగ్రాసం సరిపోక మూగప్రాణులు అలమటిస్తున్నాయి.

సహాయ కార్యక్రమాల్లో ఓడ్రాఫ్ జవానులు

పొంచి ఉన్న మరో అల్పపీడనం

ఈనెలలో బంగాళాఖాతంలో మూడు అల్పపీడనాలు ఏర్పడే సూచనలు ఉన్నాయని వాతావరణ అధ్యయనశాఖ (ఐఎండీ) అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ విపత్తుల ఉత్తరకోస్తా తీరంలో ఏర్పడితే మహానది, వైతరణి, బ్రాహ్మణి తీరప్రాంతాల్లో నీటిమట్టాలు పెరుగుతాయని, ఈ నదులకు వరద లొస్తే ఇబ్బందులు అనివార్యం కావచ్చని మహంతి అభిప్రాయపడ్డారు.

పడవల్లో రాకపోకలు

3,656 మంది తరలింపు

బస్తా, జలేశ్వర్, బలియాపాల్, భోగరాయి, రెమున సమితుల్లోని 53 పంచాయతీలు, జలేశ్వర్ పురపాలక సంస్థ పరిధిలో 3,656 మందిని పునరావాస కేంద్రాలకు తరలించినట్లు జిల్లా అత్యవసర విభాగ అధికారి సాయికృష్ణ జెనా పేర్కొన్నారు. మొత్తం 14 పునరావాస కేంద్రాలను(వంట గదితో కలిపి) ఏర్పాటు చేసినట్లు జెనా చెప్పారు. 1,975 మందికి వండిన ఆహారంతోపాటు నిత్యావసర సరకులు పంపిణీ చేశారని, సహాయక చర్యల కోసం ఆరు ఓడ్రాఫ్, పన్నెండు అగ్నిమాపక బృందాలను ఏర్పాటు చేసినట్లు జెనా వెల్లడించారు.

ఖోగ్రాయిలో ఇంటి పైకప్పుపై కుటుంబం

ప్రమాదస్థాయికి దిగువ నదులు

జలవనరుల శాఖ ప్రొక్యూర్మెంట్ డివిజన్ చీఫ్ ఇంజినీరు సాగర్ మహంతి బుధవారం భువనేశ్వర్‌లో విలేకర్లతో మాట్లాడుతూ సువర్ణరేఖ, బుడా బొలంగ, జలకా నదులు ప్రమాదస్థాయికి దిగువ ప్రవహిస్తున్నాయని చెప్పారు. మహానది, బ్రాహ్మణి, వైతరణి నదుల పరివాహక ప్రాంతంలో భారీ వర్షాలు లేవన్నారు. ఛత్తీస్‌గఢ్, ఝార్ఖండ్ అధికారులతో నిరంతరం సంప్రదిస్తున్నామని తెలిపారు.

లోతట్టు ప్రాంతాల ప్రజలను తరలిస్తున్న ఓడ్రాఫ్ సిబ్బంది

జనజీవనం అస్తవ్యస్తం

మాలిపుంగార్‌లో ధ్వంసమైన ఇల్లు

జయపురం, కొరాపుట్, సిమిలిగుడ, న్యూస్‌టుడే: కొరాపుట్, నవరంగపూర్ జిల్లాల్లో భారీ వర్షాలకు జనజీవనం అస్తవ్యస్తమైంది. కొరాపుట్ జిల్లా బంగలగూడ వద్ద వంతెనపై నుంచి నీరు ప్రవహిస్తుండటంతో వాహనాలు ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నాయి. వర్షాల కారణంగా కొరాపుట్ జిల్లాలో 13 ఇళ్లు ధ్వంసం కాగా, జయపురం సమితిలో మూడు పాడయ్యాయి. బి.మాలిగూడ, పూజారిపుట్, ఖయిరాముండి ప్రాంతాల్లో ఇళ్లు పాడైనవారికి బుధవారం తహసీల్దార్ చిత్తరంజన్‌పట్నాయక్ ప్లాస్టిక్ పరదాలు అందజేశారు. జయపురం పట్టణంలో బుధవారం కురిసిన భారీ వర్షానికి గడియాదోబసాహి, పవర్‌హౌస్ కాలనీల్లో ఉన్న ప్రాథమిక పాఠశాల తరగతి, వంట గదుల్లో వర్షపునీరు చేరింది. దీంతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందక ఆకలితో అలమటించారు. విషయం తెలుసుకున్న బీఈవో చందన్‌కుమార్ నాయక్ పాఠశాలను పరిశీలించి, వెంటనే అభివృద్ధి నిధుల సహాయంతో మరమ్మతులు చేయించాలని ఆదేశించారు. రహదారులకు ఇరువైపుల కాలువలు నిర్మించకపోవడంతో బొయిపరిగుడ సమితి బిరఖంబ వద్ద జాతీయ రహదారి-326పైన వర్షపు నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. అగ్నిమాపక శాఖ రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టింది. గడిచిన 24 గంటల్లో అత్యధికంగా కొట్పాడ్ సమితిలో 152 మి.మీ. వర్షపాతం నమోదైంది. మరో పక్క జాతీయ రహదారిపై వర్షపునీరు ప్రవహిస్తుండడంతో రాకపోకలకు సమస్యగా మారింది. కొరాపుట్-రాయగడ రోడ్డు మార్గంపై పొడగూడ వద్ద వర్షపునీరు ప్రవహిస్తుండగా, బొయిపరిగూడ వద్ద చెట్లు కూలి రాకపోకలకు అంతరాయం కలిగింది.

బంగలగూడ వద్ద ప్రమాదకరస్థితిలో ప్రయాణిస్తున్న బస్సు

బొయిపరిగుడ వద్ద జాతీయ రహదారిపై కూలిన చెట్టు

పూజారిపుట్‌లో ధ్వంసమైన ఇంటిపై పరదా కప్పుతూ...

నందిఘోష్ రథం తన్ని వెళ్లిన మహాలక్ష్మి

● హీరాపంచమి వేడుక తిలకించిన భక్తులు

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీలోని గుండిచా ఆలయంలో మంగళవారం రాత్రి హీరా పంచమి వేడుకలు నేత్రపర్వం చేశాయి. భక్తులు ఆసక్తిగా తిలకించారు. రథయాత్రలో భాగంగా ఆనవాయితీ ప్రకారం శ్రీక్షేత్రం నుంచి మహాలక్ష్మిని సేవాయత్‌లు పల్లకిలో గుండిచా సన్నిధికి ఊరేగింపుగా తెచ్చారు. తర్వాత మహాలక్ష్మి, జగన్నాథుని సంవాదం కీర్తనల మాధ్యమంలో వినిపించారు. తన వెంట రాని స్వామిపై ఆగ్రహించిన తల్లి జగన్నాథుని నందిఘోష్ రథం చక్రం తన్ని నిజ మందిరానికి (శ్రీక్షేత్రానికి) వెళ్లిపోయిన వైనం కమనీయంగా ప్రదర్శించారు. మహాలక్ష్మి చక్రానికి తన్నిన చోట ఒక ఊచ సేవాయత్‌లు తొలగించారు. బుధవారం ఉదయం ఆనవాయితీ ప్రకారం కొత్తగా తయారు చేసిన ఊచను వడ్రంగి సేవాయత్‌లు చక్రానికి అమర్చారు. రథయాత్రలో తనను వెంట తీసుకెళ్లని స్వామి చెప్పిన విధంగా నిజ మందిరానికి(శ్రీక్షేత్రానికి) రాకపోవడంతో ఆగ్రహించిన మహాలక్ష్మి గుండిచా మందిరానికి చేరి స్వామితో జగడమాడిన వైనం భక్తులంతా మరోసారి తనివి తీరా తిలకించి ప్రార్థనలు చేశారు.

మహాలక్ష్మిని పల్లకిలో శ్రీక్షేత్రం నుంచి గుండిచా ఆలయానికి తెస్తున్న సేవాయత్‌లు

స్వామి సన్నిధిలో షష్ఠి సేవలు

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీలోని గుండిచా ఆలయంలో ఆషాఢ శుక్ల పక్షమి షష్ఠి తిథిని పురస్కరించుకుని బుధవారం పురుషోత్తమునికి ప్రత్యేక సేవలు నిర్వహించారు. తెల్లవారుజామున 4 గంటలకు ఆలయం తలుపులు తెరిచిన సేవాయత్‌లు అడప సింహాసనం వద్ద జగన్నాథ, బలభద్ర, సుభద్రల సన్నిధిలో మంగళహారతి, మైలం, అబకాశ, తిలకధారణ, గోపాలవల్లభ సేవలు చేపట్టారు. ఉదయం 6.30 నుంచి ప్రారంభమైన దర్శనాలు రోజంతా జరిగాయి.

గుండిచా ఆలయం వద్ద భక్తుల రద్దీ

పెరిగిన భక్తుల సంఖ్య

అనుకూల వాతావరణం వల్ల ఈ ఏడాది పూరీలో భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. గుండిచా ఆవరణ యాత్రికులతో కళకళలాడుతోంది. శారదాబలిని భక్తులు వీడటం లేదు. దర్శనాలకు రద్దీ పెరగడంతో ఆసుపత్రి కూడలి నుంచి బారికేడింగ్ చేశారు. పూరీ పాలనాధికారి చంచల్‌రణ, ఎస్పీ పినాక మిశ్ర దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

బొడొదండొలో బారులుదీరిన యాత్రికులు

రైలు పట్టాలపై విరిగిపడిన కొండచరియలు

జయపురం, న్యూస్‌టుడే: కొరాపుట్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో రైల్వే ట్రాక్‌పై కొండచరియలు విరిగిపడి రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. కొరాపుట్-జయపురం రైల్వేస్టేషన్ల మధ్య జరటి రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో జగదల్‌పూర్ నుంచి భువనేశ్వర్ వెళ్లే హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్, కిరండోల్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు చేసినట్లు ఆ శాఖ అధికారులు ప్రకటించారు. రైల్వే సిబ్బంది రంగంలోకి దిగి యుద్ధప్రాతిపదికన మట్టి తొలగింపు పనులు చేపడుతున్నారు.

రైల్వేట్రాక్‌పై ఉన్న మట్టి చరియలు

ధారాకోట ఘటనపై మానవహక్కుల సంఘం ఆరా

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా ధారాకోట ఠాణా పరిధిలో ఇటీవల ఇద్దరు దళితులపై కొందరు అమానుషంగా వ్యవహరించిన ఘటనపై జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్‌ఆర్‌సీ) ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ ఘటనను సుమోటోగా స్వీకరించిన కమిషన్ రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీలను ఆదేశించింది. ఇద్దరు దళితులకు అరగుండ్లు కొట్టించి, వారి నోట్లో గడ్డి కుక్కి, మురుగు కాలువ నీరు తాగించినట్లు వార్తల ద్వారా తెలిసిందని, ఇందులో వాస్తవముంటే, ఇది మానవ హక్కుల ఉల్లంఘనే అని పేర్కొంది. బాధ్యులపై తీసుకున్న చర్యలు, బాధితులకు నష్టపరిహారం తదితర వివరాలపై నివేదిక ఇవ్వాలని సూచించింది.

అరుణస్తంభాన్ని ఇక తాకలేరు

అరుణ స్తంభం చుట్టూ నిర్మాణం

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీ శ్రీక్షేత్రం ఎదుట ఉన్న అరుణ స్తంభం కోట్లాదిమంది భక్తుల మనోభావాలకు ప్రతీక. జగన్నాథ దర్శనానికి వచ్చే వారంతా అరుణస్తంభానికి ప్రార్థన చేసి చేతితో తాకి ఆలయం లోపలకు వెళ్లేవారు. ఇకపై ఎవరూ దీన్ని ముట్టుకోలేరు. అరుణస్తంభం చుట్టూ ఇదివరకు మూడడుగుల ఎత్తులో ఇనుప ఫ్రేమింగ్ ఉండేది. దీని వెలుపల నుంచి ముట్టుకునేవారు. ఆలయానికి వచ్చే ప్రముఖులు, భక్తులు ఇక్కడ ప్రార్థనలు చేసేవారు. ఈ నేపథ్యంలో శ్రీక్షేత్ర యంత్రాంగం మంగళవారం అయిదడుగుల ఎత్తులో ఇత్తడి ఫెన్సింగ్ ఏర్పాటు చేయించింది. దీంతో భక్తులెవరూ స్తంభాన్ని తాకే అవకాశం లేకుండా చేశారు. ఎందుకీ నిర్ణయం తీసుకున్నారన్నదానిపై ఎవరి వద్దా సమాధానం లేదు. సేవాయత్‌లు విస్మయానికి గురవుతున్నారు. భక్తుల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. దేశవ్యాప్తంగా ఉన్న జగన్నాథ ఆలయాల్లోనూ అరుణస్తంభాలున్నాయి. భక్తులు స్తంభాలను ఆలింగనం చేసుకుంటారు. పూరీలో కేవలం దీన్ని తాకడానికి మాత్రమే వెసులుబాటుండేది. ఆ అవకాశం కూడా ఇప్పుడు లేకుండా చేశారు.

భక్తుల మనోభావాలు కాపాడాలి..

దీనిపై జగన్నాథుని ప్రధాన సేవాయత్ జగన్నాథ స్వయిన్ మహాపాత్ర్ బుధవారం పూరీలో విలేకర్లతో మాట్లాడుతూ యంత్రాంగం తీసుకున్న నిర్ణయం సరికాదన్నారు. అరుణస్తంభాన్ని తాకడం శుభకరమని భక్తులు నమ్ముతారని, వారి మనోభావాలకు భంగం కలిగించే అధికారం ఎవరికీ లేదన్నారు. దీనిపై పునరాలోచించాలన్నారు. ఇతర సేవాయత్‌లంతా ఇలాగే స్పందించారు.

రథాలు దక్షిణాభిముఖం


రథాల వద్ద ఆజ్ఞమాలలుంచి పూజలు చేస్తున్న సేవాయత్‌లు

గోపాలపూర్, న్యూస్‌టుడే: పూరీలోని గుండిచా ఆలయం పరిధిలోని శారదాబలి ఆవరణలో నందిఘోష్, తాళధ్వజ, దర్పదళన్ రథాలను బుధవారం సాయంత్రం ఆనవాయితీ ప్రకారం దక్షిణాభిముఖం చేశారు. దీంతో తిరుగు (బహుడా) యాత్రకు సన్నాహాలు ప్రారంభమయ్యాయి. 5వ తేదీన పురుషోత్తముడు సోదర, సోదరి (బలభద్రుడు, సుభద్ర)తో కలిసి దక్షిణదిశ యాత్రగా శ్రీక్షేత్రానికి చేరుకోనున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం సేవాయత్‌లు స్వామి మెడలోని ఆజ్ఞ (పూల) మాలలు గుండిచా ఆలయం గర్భగుడి నుంచి వెలుపలికి తెచ్చారు. మూడు రథాలపై ఉంచి పూజలు చేసి దక్షిణాభిముఖం చేశారు. ఆనవాయితీ ప్రకారం తొలుత దేవీ సుభద్ర దర్పదళన్ శ్రీక్షేత్రాభిముఖం చేశారు. అనంతరం బలభద్రుని తాళధ్వజ, చివరిగా జగన్నాథుని నందిఘోష్ రథాలు దక్షిణాభిముఖం చేశారు. ఈ వేడుక భక్తులంతా తిలకించారు.

స్వయంగా రథం దక్షిణాభిముఖం చేస్తున్న పాలనాధికారి అరవిందపాఢి

ఓడ్రాఫ్ సాయంతో 8,191 మంది సురక్షితం

రాయగడ పట్టణం, న్యూస్‌టుడే: వరదలతో వణుకుతున్న బాలేశ్వర్, మయూర్‌భంజ్ జిల్లాల్లో ఓడ్రాఫ్ సిబ్బంది ముమ్మర సహాయక చర్యలు చేపడుతున్నారు. సువర్ణరేఖ, సోనో, బుడాబొలంగ, జలకా తదితర నదులు పొంగి ప్రవహించడంతో వరదల్లో చిక్కుకున్న వారిని సిబ్బంది కాపాడి సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చారు. రాష్ట్ర పోలీసు శాఖ మీడియా ప్రకటనలో వెల్లడించిన వివరాల మేరకు రెండు జిల్లాల్లోని 18 సమితుల్లో ఇంతవరకు 8,191 మందిని ఓడ్రాఫ్ సిబ్బంది కాపాడారు. బాలేశ్వర్‌లో బలియాపాల్, బస్తా, సింగ్లా తదితర ప్రాంతాలకు చెందిన 2 వేల మందికిపైగా వరద బాధితులను కాపాడిన సిబ్బంది, మయూర్‌భంజ్ జిల్లాల్లో సరసాకోన, దాస్‌గోవింద్‌పూర్, బరిపద తదితర ప్రాంతాల్లో మరో 6 వేల మందికిపైగా ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ఇందుకోసం 11 ఓడ్రాఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాల్గొన్నారని ప్రకటనలో పేర్కొన్నారు.

రాష్ట్రంలో విద్యుత్తుశాఖ మంత్రుల సదస్సు

భువనేశ్వర్, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఏడాది చివరిలో విద్యుత్తు శాఖల మంత్రుల జాతీయ సదస్సు చేపడతామని ఆ శాఖ బాధ్యతలు పర్యవేక్షిస్తున్న ఉపముఖ్యమంత్రి కనకవర్ధన్ సింగ్‌దేవ్ బుధవారం భువనేశ్వర్‌లో విలేకర్లకు చెప్పారు. మంగళవారం రాత్రి లోక్‌సేవాభవన్‌లో టోనీబ్లెయర్ ఇన్‌స్టిట్యూట్, ఐఐటీ కాన్పూర్‌కి చెందిన నిపుణులతో సింగ్‌దేవ్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో విద్యుత్తు రంగంలో పెట్టుబడులు, నిర్మాణంలో ఉన్న కర్మాగారాలకు సంబంధించి చర్చలు జరిగాయని సింగ్‌దేవ్ తెలిపారు.

11న భువనేశ్వర్‌కు రాహుల్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఈ నెల 11న భువనేశ్వర్ వస్తారని, బర్ముండా మైదానంలో ఏర్పాటయ్యే బహిరంగ సభలో పాల్గొంటారని ఆ పార్టీ సీనియర్ నాయకుడు జయదేవ్ జెనా బుధవారం భువనేశ్వర్‌లో విలేకర్లకు చెప్పారు. రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరవైందని, శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించిన నేపథ్యంలో భాజపా పాలకులు ఉత్సవాలు, ప్రచారంలో మునిగారని, దీనిపై ఉద్యమిస్తున్న రాష్ట్ర కాంగ్రెస్‌లో ఉత్సాహం నింపడానికి రాహుల్ వస్తున్నారని, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

మట్టి చరియలు విరిగిపడి ఇద్దరి మృతి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: కేంఝర్ జిల్లాలోని బిచ్చాకుండి మాంగనీసు గనుల వద్ద మట్టిచరియలు విరిగిపడి మంగళవారం సాయంత్రం ఇద్దరు మృతిచెందినట్లు పశ్చిమమండల డీఐజీ బ్రిజేష్‌రాయ్ బుధవారం విలేకర్లకు చెప్పారు. ఖనిజం దొంగతనానికి వెళ్లిన సందీప్ పూర్తి(32), కందె ముండ(19)లు చీకటి పడినంత వరకు గని ప్రాంతంలో ఉన్నారు. ఆ సమయంలో కురిసిన వానతో మట్టి చరియలు విరిగిపడ్డాయి. దీనిపై సమాచారం తెలిసిన తర్వాత సహాయ కార్యక్రమాలు చేపట్టినా చీకటి కారణంగా సాధ్యం కాలేదు. బుధవారం ఉదయం మృతదేహాలు బయటపడినట్లు డీఐజీ చెప్పారు.

నడ్డాను కలిసిన అపరాజిత

భువనేశ్వర్ ఎంపీ అపరాజిత షడంగి బుధవారం దిల్లీలో భాజపా కేంద్రశాఖ అధ్యక్షుడు, ఆరోగ్యశాఖ మంత్రి జె.పి.నడ్డాను ఆయన నివాస భవనంలో కలిశారు. రాష్ట్రంలో రాజకీయ పరిస్థితి గురించి వివరించారు. జాజ్‌పూర్ జిల్లాలో ప్రబలిన అతిసారం నియంత్రణలోకి వచ్చినట్లు తెలిపారు. భువనేశ్వర్ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులు వివరించి సహకరించాలని కోరారు.

– న్యూస్‌టుడే, భువనేశ్వర్

(c) eenadu

ప్రజా చైతన్యానికి సైకిల్‌పై భారత్ యాత్ర

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా అస్కా సమితిలోని కోశసుతా గ్రామానికి చెందిన దీపక్ గౌడ (18) అనే యువకుడు సైకిల్‌పై భారత్ యాత్రకు మంగళవారం శ్రీకారం చుట్టాడు. అస్కా పట్టణం నుంచి యాత్ర ప్రారంభించిన గౌడకు స్థానిక ప్రముఖులు, వివిధ సంస్థల ప్రతినిధులు అభినందించారు.

సైకిల్‌పై యాత్ర ప్రారంభించిన దీపక్ గౌడను అభినందిస్తున్న స్థానిక ప్రముఖులు

ఖరగ్‌పూర్: రాజరాజేశ్వరి అలంకరణలో..

బ్రహ్మపుర: గుసానినువాగాంలో..

గుణుపురం: వామనావతారంలో జగన్నాథుడు, పరశురామావతారంలో బలభద్రుడు

పర్లాఖెముండిలో..

వామనావతారంలో జగన్నాథుడు

రాయగడలో వామనావతారంలో జగన్నాథస్వామి

రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా బుధవారం జగన్నాథుడు వామనావతారంలో, బలభద్రుడు పరశురామావతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. గుణుపురం, పర్లాఖెముండి, బ్రహ్మపుర, జయపురం, సిమిలిగుడ, కొరాపుట్, రాయగడ పట్టణాల్లో పలుచోట్ల మూర్తులకు పూజలు కొనసాగుతున్నాయి. – న్యూస్‌టుడే, బృందం

జయపురంలో..

భక్తిశ్రద్ధలతో ఆంజనేయ విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: సునాబెడలో ఉన్న రామమందిరం వద్ద కొత్తగా నిర్మించిన హనుమాన్ ఆలయంలో స్వామి విగ్రహ ప్రతిష్ఠామహోత్సవం బుధవారం భక్తిశ్రద్ధల మధ్య నిర్వహించారు. ఉదయం మహిళలు కలశయాత్ర చేపట్టారు. అనంతరం సూర్య, అగ్ని, హోమం హారతి తదితర పూజా కార్యక్రమాలు జరిగాయి. పూజా కార్యక్రమంలో పురపాలక సంస్థ అధ్యక్షుడు రాజేంద్రకుమార్ పాత్ర్ పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

హోమం నిర్వహిస్తున్న దృశ్యం

జగన్నాథ ప్రధాన్‌ను అరెస్టు చేయాలి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భాజపా నేత జగన్నాథ ప్రధాన్‌ను అరెస్టు చేయాలని ఓఏఎస్ అధికారుల సంఘం ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝికి బుధవారం లిఖితపూర్వకంగా కోరింది. భువనేశ్వర్ నగరపాలక సంస్థ(బీఎంసీ) సహాయ కమిషనర్ రత్నాకర్‌సాహుపై దాడికి ప్రేరేపించిన మాస్టర్ మైండ్ జగన్నాథ అని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులందరికీ భద్రత కల్పించాలని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ● భువనేశ్వర్ నగరపాలక సంస్థ(బీఎంసీ) సహాయ కమిషనర్ రత్నాకర్ సాహుపై దాడి ఘటనలో మాస్టర్ మైండ్‌ను అరెస్టు చేసేవరకు విధుల నిర్వహించేది లేదని భీష్మించిన ఓఏఎస్ అధికారుల డిమాండ్‌కు తమ పూర్తి మద్దతు ఉందని భువనేశ్వర్ మేయరు సులోచనాదాస్ చెప్పారు. బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయంలో అధికారిపై దాడి తీవ్రమైనదని పేర్కొన్నారు.

తొక్కిసలాట ఘటనపై కమిటీ

భువనేశ్వర్, న్యూస్‌టుడే: పూరీలోని గుండిచా ఆలయం వద్ద తొక్కిసలాటలో ముగ్గురు భక్తుల మృతి ఘటనపై అభివృద్ధి కమిషనర్ అనుగార్గ్‌కు ప్రభుత్వం దర్యాప్తు బాధ్యత అప్పగించిన సంగతి తెలిసిందే. ఆమెకు సహకరించడానికి మరో నలుగురు ఓఏఎస్ అధికారులను బుధవారం నియమించింది.

గోశాల నిర్మించేందుకు సన్నాహాలు

బ్రహ్మపుర బజారు: బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ) పరిధిలోని వివిధ ప్రాంతాల్లో రోడ్లపై సంచరిస్తున్న ఆవులను ఓ చోట ఉంచేందుకు బీఈఎంసీ స్థలాన్ని గుర్తించింది. స్థానిక 27వవార్డులోని గుసానినువాగాంలో స్వర్గద్వార ప్రాంతంలో బీఈఎంసీ తరఫున గోశాలను నిర్మించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

పట్టణ ఆరోగ్య కేంద్రాలను పరిశీలించిన కమిషనర్

బ్రహ్మపుర బజారు, న్యూస్‌టుడే: బ్రహ్మపుర పురపాలక సంఘం (బీఈఎంసీ) పరిధిలో ఉన్న పలు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను బీఈఎంసీ కమిషనర్ ప్రమేష్ అరవింద్ రాజేషిర్కే పరిశీలించారు. బుధవారం ఆయన స్థానిక ఎస్ఎంబీటీ రోడ్డులోని రెడ్‌క్రాస్, అస్కారోడ్డు, తులసీనగర్‌లలో ఉన్న ఆరోగ్య కేంద్రాలను సందర్శించి ఆయా కేంద్రాలలో రోగులకు ఎటువంటి ఆరోగ్య సేవలు అందిస్తున్నారు, ఔషధాలు అందుబాటులో ఉన్నాయా, వైద్యులు, ఇతర సిబ్బంది సక్రమంగా విధులు నిర్వర్తిస్తున్నారా అన్నదానిపై స్వయంగా పరిశీలించి సంబంధిత ఆరోగ్య శాఖ అధికారులతో మాట్లాడారు.

ఆరోగ్య కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్ ప్రమేష్ అరవింద్ రాజేషిర్కే, చిత్రంలో సామల్, డిగాల్

చట్టం తనపని చేస్తుంది.. ఆందోళన వీడండి

భువనేశ్వర్, న్యూస్‌టుడే: చట్టం తన పని చేస్తుందని, బీఎంసీ సహాయ కమిషనర్‌పై దాడి ఘటనలో నిందితులు ఎవరైనా అరెస్టవుతారని, దీని విషయంలో ఓఏఎస్ అధికారులు ఆందోళనబాట పట్టడం తగదని రెవెన్యూ, విపత్తుల నివారణ శాఖ మంత్రి సురేష్ పూజారి అన్నారు. బుధవారం భువనేశ్వర్‌లో మంత్రి విలేకర్లతో మాట్లాడుతూ ఉత్కళాస్పిరా తప్పిదాల వల్ల ప్రజలు బాధితులను ఆదుకోలేరని, పూరీ జగన్నాథుని బహుడా, సునాబేషా వేడుకల్లో అధికారుల పాత్ర కీలకం కాగా ఆందరూ విధుల్లో రావాలని కోరుకుంటున్నాను.

సమీక్షించిన సీఎం: మరోవైపు ముఖ్యమంత్రి మోహన్‌చరణ్ మాఝి సాయంత్రం లోక్‌సేవాభవన్‌లో అత్యవసర సమావేశం చేపట్టి పరిస్థితి సమీక్షించారు. కార్యక్రమంలో మంత్రులు బిభూతి భూషణ్ జెనా, సూర్యవంశీ సూరజ్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మనోజ్ అహూజా తదితర అధికారులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి బిభూతి విలేకర్లతో మాట్లాడుతూ ఓఏఎస్ అధికారిపై దాడి తీవ్రమైనది, నిందనీయం కాగా, దీన్ని ప్రేరేపించిన వారిపైనా చర్యలు తప్పవని పేర్కొన్నారు.

మొక్కల పెంపకంతోనే మానవ మనుగడ

పర్లాఖెముండి, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని, వాటి పెంపకంతోనే మానవ మనుగడ సాధ్యమని సెంచూరియన్ వర్సిటీ వ్యవసాయ విద్యార్థులు అన్నారు. వనమహోత్సవాల్లో భాగంగా బుధవారం గుసాని సమితి సరదాపురంలో ఉన్నత పాఠశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. కార్యక్రమంలో వర్సిటీ వ్యవసాయ, పాఠశాల విద్యార్థులు, ప్రధానాచార్యులు శేషగిరిరావు, సర్పంచి శెల్లి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు. పర్లాఖెముండిలోని సరస్వతి శిశువిద్యా మందిర్‌లో విద్యార్థులు మొక్కలు నాటారు.

పర్లాఖెముండిలో మొక్కలు నాటుతున్న విద్యార్థులు

ఘనంగా వైద్యుల దినోత్సవం

బ్రహ్మపుర నగరం, భువనేశ్వర్, ఖరగ్‌పూర్, రాయగడ, న్యూస్‌టుడే: వైద్యుల దినోత్సవం సందర్భంగా బ్రహ్మపురంలోని వివిధ సంస్థల ఆధ్వర్యంలో, భువనేశ్వర్‌లోని హైటెక్ వైద్య కళాశాల ఆసుపత్రిలో మంగళవారం వేడుకలు నిర్వహించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) బ్రహ్మపుర శాఖ ఆధ్వర్యంలో గాంధీ స్థానిక ఎమ్మెస్‌జీ ఆవరణలోని ఐఎంఏ భవనంలో నిర్వహించిన కార్యక్రమంలో పలువురు వైద్యుల్ని సత్కరించారు. అంతకుముందు ఉదయం ప్రముఖ సామాజిక, సేవా సంస్థ (ఫ్రెండ్స్ హెల్పింగ్ క్లబ్ (ఎఫ్‌హెచ్‌సీ) ఆధ్వర్యంలో గిరి మార్కెట్‌లోని 'స్నేహం' భవనంలో వేడుకలు జరిగాయి. భువనేశ్వర్ హైటెక్ వైద్యకళాశాలలో జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాణిగ్రాహి మాట్లాడుతూ వైద్యుల సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో హైటెక్ గ్రూపు సంస్థల మేనేజింగ్ ట్రస్టీ సురేష్‌కుమార్ పాణిగ్రాహి, పర్లాఖెముండి ఎమ్మెల్యే రూపేష్‌కుమార్ పాణిగ్రాహి, వైద్య కళాశాల సహాయ సంచాలకుడు అనిల్‌కుమార్, ఉపాధ్యక్షురాలు డాక్టర్ లిసా షడంగి పాల్గొన్నారు. ● రాయగడలో లేడీస్‌క్లబ్ పలువురు మహిళా వైద్యులను సత్కరించింది. క్లబ్ అధ్యక్షురాలు కస్తూరీసాహు, ఇతిశ్రీ పాత్ర్, బురిడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌హెచ్‌సీ ఆధ్వర్యంలో సత్కారం అందుకున్న వైద్యులు, చిత్రంలో అతిథులు, నిర్వాహకులు

ఆసుపత్రిలో కేకు కోస్తున్న వైద్యులు

రాయగడ: వైద్యులను సన్మానిస్తున్న లేడీస్ క్లబ్ సభ్యులు

ఉద్యోగాలు ఇప్పించండి సారూ!

నవరంగపూర్, న్యూస్‌టుడే: నవరంగపూర్ జిల్లా విద్యాశాఖలో విధులు నిర్వర్తించి మరణించిన ఉద్యోగుల కుటుంబాలు బుధవారం పాలనాధికారి శుభంకర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ నియమావళి ప్రకారం ప్రభుత్వ ఉద్యోగి మృతిచెందితే ఆ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలి. జిల్లాలో కుశల్‌చంద్రహియాల్, కుమార్‌దాస్, నిరంజన్‌మహంతి, గౌరంగా మాఝి, సురేంద్రపనకతోపాటు మరో 15 మంది తల్లిదండ్రులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తూ మృతిచెందారు. ఏళ్లు గడుస్తున్నా నేటికీ తమకు ఇవ్వాల్సిన ఉద్యోగాలు ఇవ్వడం లేదని, పలుమార్లు శాఖాధికారుల చుట్టూ తిరిగినా ఫలితం లేదని వారు వాపోతున్నారు.

పాలనాధికారి కార్యాలయం ఎదుట బాధితులు

అధ్యాపకుల నియామకానికి వినతి

గుణుపురం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా ప్రభుత్వ కళాశాలల్లో దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టులను భర్తీ చేయాలని గుణుపురానికి చెందిన గిరిజన నాయకుడు అవినాష్ గమాంగ్ కోరారు. మంగళవారం సాయంత్రం భువనేశ్వర్‌లో ఉన్నత విద్యాశాఖ మంత్రి సూర్యవంశీ సూరజ్‌ను కలిసి సమస్యలు వివరించి పత్రాన్ని అందజేశారు. దీనిపై మంత్రి సానుకూలంగా స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపినట్లు గమాంగ్ చెప్పారు.

విద్యామంత్రి సూర్యవంశీతో అవినాష్ గమాంగ్

చార్టెర్డ్ అకౌంటెంట్స్‌పై గురుతర బాధ్యత

హాజరైన చార్టెర్డ్ అకౌంటెంట్స్

రాయగడ, న్యూస్‌టుడే: దేశ ఆర్థిక వ్యవస్థ బాగుండాలి అంటే సీఏలు ఆర్థిక విశ్లేషణ చేసి సూచనలు ఇవ్వడంతో పాటు ఆడిటింగ్, టాక్స్ రిటర్న్స్ సమర్పించడం వంటి కీలక విషయాల్లో వారి పాత్ర కీలకమని సీనియర్ సీఏలు అన్నారు. మంగళవారం జాతీయ సీఏ దినోత్సవం సందర్భంగా స్థానిక జెమ్స్ విద్యాసంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో స్థానిక సీఏలు పాల్గొన్నారు. సంస్థ ఛైర్మన్ ఏవీఎస్ గిరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సీఏ దినోత్సవం ఆవశ్యకత, సీఏల పాత్రలపై ప్రసంగించారు. అనంతరం స్థానిక సీఏలు ఎన్.త్రినాథ్‌రావు, కె.రవి, సురేష్‌కుమార్, రాజ్, ఉజ్వల్, మనోజ్‌కుమార్, బి.శరత్‌లను సత్కరించి జ్ఞాపికలు అందించారు. జెమ్స్ ఉద్యోగులు కెవి రావు, బి.లావణ్య, శ్రీవాణి, హారిక, ఎన్.ఎన్.పండా పాల్గొన్నారు.

తల్లి కానున్న జీనత్

భువనేశ్వర్, న్యూస్‌టుడే: భువనేశ్వర్ నందన్‌కానన్‌లోని పులి జీనత్ తల్లి కానుంది. ఇప్పుడది చూలుతో ఉన్నట్లు వన్యప్రాణి అధికారవర్గాలు మంగళవారం తెలిపాయి. ఇటీవల ఎన్‌క్లోజర్ నుంచి తప్పించుకుని బెంగాల్, ఝార్ఖండ్ అడవులకు వెళ్లిన జీనత్‌ను అటవీశాఖ అదుపులోకి తీసుకుని, మళ్లీ ఎన్‌క్లోజర్ ఉంచి గట్టి భద్రత కల్పించింది.

సుంగేరి పంచాయతీలోకి పోలీసు బలగాలు

రాయగడ గ్రామీణం, న్యూస్‌టుడే: రాయగడ జిల్లా కాశీపూర్ సుంగేరి పంచాయతీ గ్రామాల్లో బధవారం సాయంత్రం భారీ ఎత్తున పోలీసు బలగాలు చేరుకున్నాయి. సుంగేరి పంచాయతీ మొదలుకోని కలహండి జిల్లా తురుమల్ రాంపూర్ వరకు సిజిమాలి బాక్సైట్ గనులు పుష్కలంగా ఉన్నాయి. వాటి తవ్వకాలకు సంబంధించి ఇప్పటికే ప్రభుత్వం అనుమతులు ఇచ్చింది. దీనిని వ్యతిరేకిస్తూ స్థానికులు నిరసనబాట పట్టారు. సిజిమాలి పర్వతాల్లో గుడారాలను ఏర్పాటు చేసికొని కాపలాగా ఉన్నట్లు తెలియడంతో తవ్వకాలు జరిపేందుకు పరిశ్రమల సిబ్బందికి ముందడుగు వేయలేకపోతున్నారు. ఈ విషయంపై స్థానిక ఎమ్మెల్యే అప్పలస్వామి కద్రక దృష్టికి తీసుకురాగా పూర్తి వివరాలు తెలుసుకుంటామన్నారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాదిలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. తెదేపా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలి అడుగు ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని బుధవారం కురుపాంలో నిర్వహించారు.

రోజూ పోరాటం వారిది.. ఎప్పుడు నిర్మిస్తారో వారధి

చిటికి నదిపై వంతెన లేకపోవడంతో విద్యార్థులు, స్థానికులు ప్రమాదకర పరిస్థితిలో రాకపోకలు చేస్తున్న దుస్థితి కొరాపుట్ జిల్లా దశమంత్‌పూర్ సమితి పండిపొదర పంచాయతీలో శిశికుడిలో నెలకొంది. గ్రామంలో 45 కుటుంబాలతో 290 మంది నివాసం ఉంటున్నారు. గ్రామ పంచాయతీకి 3 కి.మీ. సమితికి 15 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఏళ్లుగా నదిపై శాశ్వత వంతెన నిర్మించలేదు. పలుమార్లు అధికారులు, రాజకీయ నేతల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునేవారే లేరు. వేసవి, శీతాకాలంలో నీటిమట్టం తక్కువగా ఉండటంతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తడం లేదని, వర్షాకాలంలో నీటి మట్టం పెరిగి ప్రయాణాలకు ఇబ్బందులు పడుతున్నామని పేర్కొంటున్నారు. ఈ విషయంపై 'న్యూస్‌టుడే' బీడీవో మిలన్‌కుమార్‌ను వివరణ కోరగా గ్రామస్థులు స్పందన కార్యక్రమంలో పాలనాధికారి దృష్టికి తీసుకెళ్లారని, నిధులు మంజూరు కాగానే వంతెన నిర్మాణం పనులు ప్రారంభిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, జయపురం

ఆదర్శ సునాబెడగా తీర్చిదిద్దడమే లక్ష్యం

సిమిలిగుడ, న్యూస్‌టుడే: ఆదర్శ సునాబెడగా తీర్చిదిద్దడమే లక్ష్యమని కొరాపుట్ ఎమ్మెల్యే రఘురామ్ మచ్చో అన్నారు. సునాబెడ పురపాలక సంస్థ ఆధ్వర్యంలో సిమిలిగుడ వెండింగ్ జోన్ వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ పాయింట్‌ను ఎమ్మెల్యే మచ్చో మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. పట్టణ సుందరీకరణలో భాగంగా దీన్ని ఏర్పాటు చేశామని ఆయన పేర్కొన్నారు. పాలనాధికారి వి.కీర్తీవాసన్ మాట్లాడుతూ వెండింగ్ జోన్ అభివృద్ధి సైతం చేస్తామన్నారు. పురపాలక సంస్థ అధ్యక్షులు రాజేంద్రకుమార్ పాత్ర్, ఉపాధ్యక్షురాలు రీతు కంట, కార్యనిర్వాహక అధికారి సుజిత్‌కుమార్ చౌదరి, భాజపా నేతలు తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫీ పాయింట్ వద్ద ఎమ్మెల్యే మచ్చో, అధికారులు

అర్హులందరికీ ప్రధానమంత్రి ఆవాస్‌యోజన ఇళ్లు

కొరాపుట్, న్యూస్‌టుడే: అర్హులందరికీ ప్రధానమంత్రి ఆవాస్‌యోజన కింద పక్కా ఇళ్లు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే రఘురాం మచ్చో అన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలో బుధవారం స్థానిక పురపాలక సభ మందిరంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 65 మంది లబ్ధిదారులకు పక్కా ఇళ్ల నిర్మాణం కోసం వర్క్ ఆర్డర్లు అందజేశారు. మొత్తం 265 వర్క్ ఆర్డర్‌లు త్వరలో అర్హులైన వారికి అందజేయనున్నట్లు తెలిపారు. పురపాలక ఛైర్మన్ లలాట రంజన్ సెఠి, జడ్పీ ఛైర్మన్ సస్మిత మెలక పాల్గొన్నారు.

రక్షణ కల్పించండి

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి జిల్లాలోని కతామటేరులో గతనెల 21న రెండు వర్గాల మధ్య ఘర్షణ జరిగిన సంగతి తెలిసిందే. ఇందులో సుమారు 30 మంది గాయపడ్డారు. దీనిపై జూన్ 23న మల్కాన్‌గిరి ఠాణాలో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఓ వర్గం వారు వాపోయారు. ఇందుకు సంబంధించి పాలనాధికారి ఆశిష ఈశ్వర్ పాటిల్‌కి వినతి పత్రం అందజేశారు. తమపై దాడి చేసిన 16 మందిని అరెస్టు చేసి రక్షణ కల్పించాలని పేర్కొన్నారు.

తపాలా కార్యాలయంలో వర్షం ఇక్కట్లు

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు జయపురం పట్టణంలోని తపాలా కార్యాలయంలో గోడల నుంచి వర్షపు నీరు కారుతోంది. భవనం నిర్మించి 35 ఏళ్లు గడిచింది. కార్యాలయంలో 42 మంది ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తుండగా, రోజూ వందలాది మంది ఖాతారులు, ఇతరత్రా పనుల కోసం వస్తుంటారు. ఏళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో వర్షాల సమయంలో ఇక్కట్లు తప్పడం లేదు. కార్యాలయంలో సీపీయూ, కంప్యూటర్లు తడవకుండా పరదాలు కప్పి ఉంచడం, పైకప్పు నుంచి కారుతున్న వర్షపు నీటిని సేకరించేందుకు ప్లాస్టిక్ టబ్బులు పెట్టడంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రస్తుతం ఈ చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. – న్యూస్‌టుడే, జయపురం

30 మంది రక్తదానం

సీతంపేట, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఐటీడీఏలో సీతంపేట ప్రాంతీయాసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించినట్లు పర్యవేక్షకుడు బి.శ్రీనివాసరావు తెలిపారు. 30 మంది రక్తదానం చేశారన్నారు. ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ, వైద్య నిపుణురాలు పి.అమృత, ల్యాబ్ సిబ్బంది మురళి పాల్గొన్నారు.

అటవీ సిబ్బందిపై చర్యలు తీసుకోండి

నవరంగపూర్, న్యూస్‌టుడే: అటవీ భూమిలో వ్యవసాయం, చెట్ల పెంపకం విషయంలో వివాదం కారణంగా మూడు రోజుల కిందట నవరంగపూర్ జిల్లా రాయ్‌ఘర్ పోలీసుస్టేషన్ ముందు అటవీశాఖ ఉద్యోగులు కుసుమపూర్ గ్రామస్థులపై దాడి చేశారు. ఈ విషయంపై గ్రామస్థులు బుధవారం పాలనాధికారి, ఎస్పీ, డీఎఫ్‌ఓలను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. దోషులైన ఉద్యోగులను సస్పెండ్ చేసి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. వారిపై చర్యలు తీసుకోకపోతే రానున్న రోజుల్లో రాస్తారోకో చేస్తామని హెచ్చరించారు. జిల్లా గిరిజన సంఘం ఎడిటర్ రాజేష్ జానీ, రాష్ట్ర రైతు సంఘ ఉపాధ్యక్షుడు దేవరాజ్‌నాగ్ నేతృత్వంలో కుసుమపూర్ గ్రామానికి చెందిన వందలాది మంది అధికారులకు లేఖను అందజేశారు.

ఎస్పీ కార్యాలయం వద్ద గ్రామస్థులు

అనిల్‌దాస్‌పై దాడితో స్థానికుల ఆగ్రహం

ఖరగ్‌పూర్, న్యూస్‌టుడే: అమరావామపంతి ప్రధాన కార్యదర్శి అనిల్‌దాస్‌పై దాడిచేసిన వారిని కఠినంగా శిక్షించాలని స్థానికులు భారీ ర్యాలీ నిర్వహించి డిమాండ్ చేశారు. స్థానికులు పెద్దసంఖ్యలో ఏకీకృతమై శుక్రవారం సాయంత్రం స్థానిక మలంచా ప్రేమ్ హరిభవన్ నుంచి గోల్‌బజార్ వరకు భారీ ర్యాలీ తీశారు. ఇటీవల ఖరీదా ప్రాంతంలో అనిల్‌దాస్‌పై బేబీకోలే, ఆమె అనుచరులు ముగ్గురు మొత్తం నలుగురు దాడిచేసి గాయపర్చిన సంగతి తెలిసిందే. అనిల్‌దాస్ ప్రస్తుతం ఆసుపత్రిలో ఉన్నాడు. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ● మాజీ ఎంపీ దిలీప్‌ఘోష్ అనిల్‌దాస్ ఇంటికి వెళ్లి బుధవారం ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నారు.

నిరసన చేస్తున్న ఖరీదా ప్రాంత వాసులు

వసతి గృహ విద్యార్థి మృతి

మల్కాన్‌గిరి, న్యూస్‌టుడే: మల్కాన్‌గిరి సమితి మటపక ఆశ్రమ పాఠశాల పరిధిలో ఉన్న వసతి గృహం విద్యార్థి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. సమితిలోని శిఖ్‌పల్లి పంచాయతీ ఉర్మాగుడ గ్రామానికి చెందిన ఐత మడ్కామి కుమారుడు రోహిత్ మడ్కామి(12) మటపక ఆశ్రమ పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నాడు. రెండు రోజుల కిందట రోహిత్ జ్వరం బారిన పడటంతో పాఠశాల సిబ్బంది వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి బాలుడికి మలేరియా జ్వరం వచ్చినట్లు తెలిపి మందులు ఇచ్చారు. మంగళవారం ఉదయం రోహిత్ మరోసారి అస్వస్థతకు గురికావడంతో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రోహిత్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. పాఠశాల సిబ్బంది బాలుడి మృతదేహాన్ని బుధవారం ఉదయం కుటుంబ సభ్యులకు అప్పగించారు. విషయం తెలుసుకున్న మల్కాన్‌గిరి పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

హత్య మిస్టరీ వీడింది

భువనేశ్వర్, న్యూస్‌టుడే: బొలంగీర్ జిల్లా దుమెర్‌చవన గ్రామంలో జూన్ 20న కుంజ మాఝి అనే యువకుని హత్య జరిగింది. ఈ కేసు దర్యాప్తు చేసిన కంటాబంజి ఠాణా పోలీసులు నిందితులు సత్యనాగ్, శంకర్‌ఘర్సెల్‌లను మంగళవారం అరెస్టు చేశారు. ఒక యువతిని కుంజి ప్రేమించాడు. ఆమెపై ఆశలు పెంచుకున్న సత్య ఓర్వలేక శంకర్‌తో కలిసి కుంజను హత్యచేసి మృతదేహాన్ని పాతిపెట్టారు.

మారణాయుధాలతో దాడి

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లాలోని గంజాం ఠాణా పరిధిలో చిన్న వివాదం మంగళవారం రాత్రి ఇద్దరిపై మారణాయుధాలతో దాడికి దారి తీసింది. తీవ్రంగా గాయపడ్డ తెలుగు నువాగావ్ గ్రామానికి చెందిన రింకి బెహరా, ఆమెకు వరుసకు సోదరుడైన భీమ తౌరాయిలు స్థానిక ఎమ్కేసీజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో భీమ తౌరాయ్ ఆరోగ్యం విషమంగా ఉంది. రింకి 13 ఏళ్ల కుమార్తె గ్రామానికి సమీపంలోని అగస్తి నువాగావ్‌లోని పాఠశాలలో చదువుతోంది. మంగళవారం పాఠశాల బయట ఆమెకు, మరో బాలికల మధ్య గొడవ జరిగింది. దీంతో ఆ బాలిక కుటుంబానికి చెందిన ఓ యువకుడు రింకి కుమార్తెపై చేయి చేసుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రింకి, భీమలు ఠాణాలో ఫిర్యాదు చేయగా, చేయి చేసుకున్న యువకుడు, ఆయన కుటుంబ సభ్యుల్ని పోలీసులు స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించారు. దీంతో యువకుడు, మరికొందరు కలిసి రింకి, భీమలపై మారణాయుధాలతో దాడి చేశారు.

19 చోరీ ద్విచక్ర వాహనాలు స్వాధీనం: నలుగురి అరెస్టు

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: గంజాం జిల్లా కళ్లికోట ఠాణా పోలీసులు ద్విచక్ర వాహనాల చోరీ ముఠాను పట్టుకున్నారు. ప్రధాన నిందితుడితోపాటు ఆయన ముగ్గురు సహచరులను అరెస్టు చేసి మంగళవారం న్యాయస్థానానికి తరలించారు. వారి నుంచి జిల్లాలోని వివిధ ఠాణాల పరిధుల్లో చోరీ చేసిన 19 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. వాటిని ఆయా వాహనాల యజమానులకు అందజేస్తామని గంజాం ఎస్పీ శుభేందు కుమార్ పాత్ర్ విలేకరులకు చెప్పారు.

చోదకుడు డిపిన్‌కార్జి మృతిపై దర్యాప్తు చేయాలి

గుణుపురం, న్యూస్‌టుడే: చోదకుడు డిపిన్‌కార్జి మృతిపై దర్యాప్తు నిర్వహించాలని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు డిమాండ్ చేస్తూ గుణుపురం సబ్‌కలెక్టరు కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. గజపతి జిల్లా కాశీనగర్ సమితిలో గత నెల 22న వంశధార నది తీరంలో మృతదేహాన్ని కాశీనగర్ పోలీసులు గుర్తించారు. ఆయన పుటాసింగి పోలీసుస్టేషన్ పరిధి జంగ్‌జంగ్ గ్రామానికి చెందిన ఇలాంతకార్జి కుమారుడు డిపిన్ కార్జీగా(25) కాశీనగర్ పోలీసులు గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మంగళవారం సాయంత్రం గ్రామానికి చెందిన పలువురు, పంచాయతీ ప్రతినిధులు సబ్‌కలెక్టరు కార్యాలయానికి వచ్చి వినతి పత్రాన్ని ఇచ్చారు. డిపిన్ మూడేళ్లుగా కాశీనగర్ సమితి కండవ పంచాయతీలో ఓ వ్యక్తి వద్ద పొక్లెయిన్ డ్రైవరుగా పని చేస్తున్నాడు. తన కుమారుని మృతిపై ఉన్నత స్థాయి లేదా క్రైంబ్రాంచ్ ద్వారా దర్యాప్తు జరపాలని ఇలాంతకార్జి డిమాండ్ చేశాడు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

బాధ్యులను శిక్షించండి

కొరాపుట్, న్యూస్‌టుడే: రాజధానిలో ఓ ప్రభుత్వ అధికారిపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని కొరాపుట్ జిల్లా ఓఏఎస్ అధికారుల సంఘం సభ్యులు నిరసన వ్యక్తం చేశారు. రెండు రోజుల పాటు నల్లరిబ్బన్లు ధరించి నిరసన తెలుపగా, మంగళవారం ర్యాలీ నిర్వహించి పాలనాధికారికి వినతిపత్రం అందజేసినట్లు సంఘ అధ్యక్షుడు తపన్‌కుమార్ తెలిపారు. దోషులను శిక్షించాలని అధికారులపై దాడులు ఏంటని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగుల రక్షణపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరుతున్నట్లు తెలిపారు.

తనకు దక్కదన్న అక్కసుతో ప్రియురాలి హత్య

బ్రహ్మపుర నగరం, న్యూస్‌టుడే: 'నిరుద్యోగిగా ఉన్న తనను ప్రియురాలు ప్రియాకుమారి మహరణా (24) వదిలి వేరే వాడిని వివాహం చేసుకుంటుంది' అని భావించిన ప్రియుడు అభయ కుమార్ మహరణా (24) ఆమెను చాకుతో పొడిచి హత్య చేసినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. నిందితుడు అభయను అరెస్టు చేసి బుధవారం న్యాయస్థానానికి తరలించామని బ్రహ్మపుర ఎస్పీ శరవణ వివేక్ ఎం. రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. అంతకుముందు హత్య జరిగిన లాడ్జిలోని గదిలో సీన్ రిక్రియేషన్ చేశామని, ప్రియా కుమారిని నిందితుడు ఎలా చాకుతో పొడిచి చంపాడన్నది వివరించాడని ఆయన పేర్కొన్నారు. లంజిపల్లి ప్రాంతానికి చెందిన వీరిద్దరు నాలుగు నెలలుగా ప్రేమించుకుంటున్నారని తెలిపారు. మంగళవారం స్థానిక కొత్త బస్టాండు రోడ్డులో ఓ లాడ్జిలోని గదిలో ఉభయులు కలుసుకున్నారని, అక్కడే పథకం ప్రకారం ప్రియురాలిని చాకుతో పొడిచి హత్య చేసిన నిందితుడు అభయ తర్వాత స్థానిక గుసాని నువాగాం ఠాణాలో లొంగిపోయాడని ఎస్పీ శరవణ వివేక్ ఎం. వివరించారు.

నిందితుడు అభయ కుమార్ మహరణా

(c) eenadu

పౌష్టికాహారం తీసుకోవాలి

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: గర్భిణులు పౌష్టికాహారం సక్రమంగా తీసుకోవడం ద్వారా రక్తహీనతకు గురికాకుండా ఉంటారని వైద్యాధికారి శంకరరావు అన్నారు. బుధవారం కురుపాం సచివాలయంలో రక్తహీనత నివారణ కమిటీ సమావేశం నిర్వహించి ఐరన్ మాత్రలు పంచిపెట్టారు.

కాలువలకు జలకళ

వేగంగా పూడికతీత పనులు

జలుమూరు, న్యూస్‌టుడే: ఖరీఫ్ సమయంలో శివారు భూములకు సైతం సాగునీరు అందించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఓఎన్ఎం, డీఎంఎఫ్ నిధులు రూ.1.80 కోట్లతో పూడిక, పనికిరాని మొక్కలతో నిండిపోయిన కాలువలను పునరుద్ధరిస్తున్నారు.

రాణా గ్రామంలో సమీపంలో నీటితో నిండిన వంశధార ప్రధాన ఎడమ కాలువ

శివారు భూములకు అందేలా..

నీరు విడుదల చేసిన ఏ ఆటంకం లేకుండా శివారు ఆయకట్టుకు సైతం నీరందించేలా వంశధార అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. జలుమూరు, సారవకోట, నరసన్నపేట, పోలాకి మండలాల్లోని కాలువ పరిధిలో సుమారు 52 వేల ఎకరాల వరకు పంట సాగవుతుండగా యుద్ధప్రాతిపదికన పనులు చేస్తున్నారు. 'ప్రభుత్వ ఆదేశాలతో శరవేగంగా చర్యలు తీసుకుంటున్నాం. త్వరలో కాలువలు జలకళ సంతరించుకుంటుంది' అని వంశధార శాఖ డీఈఈ శిమ్మ శ్రీనివాసరావు తెలిపారు.

రేకుల షెడ్డే పాఠశాల.. రాళ్ల గుట్టలే పాకశాల!!

జిల్లాలో ఎత్తయిన కొండలు, పచ్చని అడవి మధ్య ఉంది మక్కువ మండలంలోని చిలకమెండంగి గ్రామం. ఇక్కడ సుమారు 50 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. పిల్లలకు విద్యను దగ్గర చేసేందుకు 1987లో ప్రభుత్వం పాఠశాల ఏర్పాటు చేసింది. 38 ఏళ్లు అవుతున్నా ఇప్పటికీ పక్కా భవనానికి నోచుకోలేదు. దీంతో మట్టి గోడలు, రాళ్ల గుట్టల మధ్య పిల్లల చదువులు సాగుతున్నాయి. 1-5 తరగతులకు చెందిన 22 మంది విద్యార్థులకు ఒక్కరే ఉపాధ్యాయుడు. సాధారణ సమయాల్లో చెట్ల కింద పాఠాలు బోధిస్తారు. వర్షాలు పడుతుండటంతో గ్రామస్థులు వంట సామగ్రి భద్రపర్చుకునేందుకు ఏర్పాటు చేసిన షెడ్డులో బోధన జరుగుతోంది. మధ్యాహ్న భోజనం వండే సౌకర్యం లేక ఓ ఇంట్లో వంటలు చేస్తున్నారు. తరగతి గది నుంచి అక్కడికి చేరాలంటే రాళ్ల మధ్య నుంచి 40 అడుగులకు పైగా కిందకు దిగాలి. ప్రభుత్వాలు మారు

తున్నా విద్యార్థుల అవస్థలు తీరడం లేదని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు. గతంలో నాడు-నేడు పాఠశాల భవన నిర్మాణానికి రూ.10 లక్షలు మంజూరయ్యాయని, రోడ్డు లేక పనుల ప్రారంభానికి ఎవరూ ముందుకు రాలేదని ఉపాధ్యాయుడు ఎస్.సత్తిరాజు తెలిపారు. మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. – న్యూస్‌టుడే, మక్కువ

ఆరోగ్య కలిమి.. కంచెగా బలిమి

రైతేరాజు

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: పొలాల గట్లపై, పండ్ల తోటల చుట్టూ ముళ్ల కంచె పంటగానే కాదు.. చక్కటి ఔషధ సంపదను కలిగి ఉండి ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయి.. కమ్మని పచ్చడి, జామ్ వంటివి తయారు చేసుకోవడంలోనూ ఉపయుక్తంగా ఉంటాయి 'కరొండా' మొక్కలు. వీటిని నాటుకునే సమయం ఇదే. కరొండాను వాక్కాయ, కలిమికాయ అని కూడా పిలుస్తారు. వీటికి మార్కెట్‌లో మంచి గిరాకీ ఉంది. ముళ్లతో కూడిన పొదలాంటి మొక్కలుగా ఎదుగుతాయి. గుబురుగా శాఖోపశాఖలుగా పెరిగే బహువార్షిక మొక్క ఇది. నీటి ఎద్దడిని తట్టుకుని దేశంలో అన్ని మెట్ట ప్రాంతాల్లో వ్యాపించి పెరిగే ఆకుపచ్చని మొక్క.

కాయలతో కరొండా చెట్టు

లాభాలెన్నో...

- వీటికి ముళ్లు ఉండటంతో పండ్ల తోటల చుట్టూ కంచెగా ఉపయోగించే అవకాశం ఉంటుంది.
- గాలికి అడ్డంగా ఉండి, నిస్సారమైన భూమిలో పునరుద్ధరణకు, నేల సంరక్షణకు ఎంతగానో సహకారం అందిస్తుంది.
- వీటి కాయల్లో అధిక ఐరన్, ఆస్కార్బిక్ ఆమ్లం (విటమిన్-సి) కలిగి ఉండి రక్తహీనతను తగ్గిస్తుంది.
- విలువ ఆధారిత పదార్థాలు జామ్, జెల్లీ, స్క్వాష్, సిరప్, పచ్చడి, కరొండా తాండ్రను తయారు చేసి విక్రయించొచ్చు.
- ఆయుర్వేదంలో దీని వేర్లు, పత్రాలు, కాయలు చర్మవ్యాధుల్లో, కోరింత దగ్గు, జ్వర హారిణిగా, ఆకలిని పెంచేందుకు ఉపయోగిస్తారు.
- కనీసం మురుగు నీరు పోయే సదుపాయం ఉంటే చాలు మొక్క సులభంగా బతికేస్తుంది.
- ముఖ్యంగా మెట్ట భూముల్లో పొలం గట్లపైన, కంచెలుగా పెంచుకోవచ్చు.

ఎంతో ఉపయోగం

ఆరోగ్యవంతమైన మొక్కలను ఏక పంటగా లేదా కంచె పంట కోసం జూన్, జులై నెలల్లో 3-4 అడుగుల దూరంలో నాటుకోవాలి. వర్షాకాలంలో నాటడం వల్ల నీటి ఎద్దడికి గురికాకుండా ఉండి మొక్కలు బాగా నిలదొక్కుకుంటాయి. కరొండా మొక్కలు నాటిన మూడేళ్ల నుంచి పూత పూసి కాయలు కాస్తాయి. నాలుగో ఏడాది నుంచి కొద్దిగా దిగుబడి ఆశించవచ్చు. పూత మార్చిలో ప్రారంభమై మే నెల చివరి నుంచి పచ్చికాయలు దొరుకుతాయి. జులై, ఆగస్టు వరకు పండ్లు పక్వానికి వస్తాయి.

– ఉమాజ్యోతి, గృహ విజ్ఞాన విభాగ శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: వరి, కూరగాయల సాగులో నారు పెంపకం ఎంతో కీలకమని, ఆరోగ్యవంతమైన నారు పెంచడంతో తెగుళ్ల నుంచి రక్షణ పొంది ఆశించిన దిగుబడులు సాధించ వచ్చని గుమ్మలక్ష్మీపురం వ్యవసాయాధికారి పి.శంకరరావు సూచించారు. రైతుల ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు.

నారు పెంపకం.. ఎంతో కీలకం

ప్రశ్న: ఆరోగ్యవంతమైన నారు పెంపకంలో ఎలాంటి పద్ధతులు పాటించాలి? – **దాసునాయుడు, కవిటి**

సమాధానం: నారుమడిని 10-12 రోజుల వ్యవధిలో 3 దఫాలు దమ్ముచేసి చదును చేయాలి. నీరు పెట్టడానికి, తీయడానికి వీలుగా కాలువలను ఏర్పాటు చేయాలి. 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని (విత్తనం చల్లేముందు ఒక కిలో, మరో కిలో విత్తిన 10-15 రోజులకు), కిలో భాస్వరం, కిలో పొటాష్ నిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలి. చలి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో, రబీ కాలంలో భాస్వరాన్ని రెట్టింపుగా వేయాలి. శిలీంద్రనాశినితో శుద్ధి చేసి మొలక కట్టిన విత్తనాన్ని సెంటుకు 5 కిలోల చొప్పున చల్లుకోవాలి. నారు, ఒక ఆకు పూర్తిగా పురివిచ్చుకునే వరకు ఆరుతడిగా నీరిచ్చి తర్వాత పలుచగా నీరు నిల్వకట్టాలి. జింకు లోపం ఉంటే లీటరు నీటికి 2గ్రా. జింకు సల్ఫేటు ద్రావణాన్ని పిచికారీ చేయాల్సి ఉంటుంది.

ప్రశ్న: రాగి పంట సాగులో సలహాలు చెప్పండి? – **జనార్దనరావు, ఆమిటి**

సమాధానం: రాగి సాగులో 2.5 కిలోల విత్తనంతో 5 సెంట్లలో పెంచిన నారు ఎకరా పొలంలో నాటడానికి సరిపోతుంది. వెదజల్లే పద్ధతిలో ఎకరాకు 3-4 కిలోల విత్తనం వాడాలి. కిలో విత్తనానికి 2గ్రా. కార్బండిజమ్ 50% డబ్ల్యూపీ లేదా మాంకోజెబ్ 75% డబ్ల్యూపీ లేదా 2గ్రా. ట్రైసైక్లోజోల్ 75% డబ్ల్యూపీ మందుతో కలిపి విత్తనశుద్ధి చేయాలి. తేలికపాటి దుక్కిచేసి విత్తనం చల్లి, పట్టే తోలాలి. నారుపోసి నాటుకోవాలి. మురుగు నీటి పారుదల సౌకర్యమున్న నేలల్లో నారు పోసుకోవాలి.

కంది పంటకు ప్రోత్సాహం

ఉచితంగా విత్తనాలు

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ఖరీఫ్‌లో ప్రధాన పంటలతో పాటు అదనపు ఆదాయంపై రైతులు దృష్టి పెట్టాలని అధికారులు సూచిస్తున్నారు. వరి, చెరకు, పత్తి, మొక్కజొన్న, రాగులు తదితరాలతో పాటు పప్పు ధాన్యాలు సాగు చేయాలని చెబుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో కంది పప్పునకు మంచి డిమాండు ఉందని, పొలం గట్లపై విత్తనాలు వేసుకుంటే ఫలితాలు వస్తాయని చెబుతున్నారు.

జులై 15 వరకు అనుకూలం..

జిల్లాలో 2.35 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతున్నాయి. వీటిలో వరి 1.78 లక్షల ఎకరాలతో పాటు మొక్కజొన్న, రాగులు, కంది, పత్తి, చెరకు మరో 40,193 ఎకరాల్లో పండిస్తారు. కంది వేసేందుకు జూన్ 15 నుంచి జులై 15 వరకు అనుకూల సమయం. ఈ నేపథ్యంలో ప్రస్తుతం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్నారు.

ఎకరా పొలంలో 2 కిలోలు..

ఖరీఫ్‌లో పొలం గట్లపై కంది పంట సాగు చేసే రైతులకు ఉచితంగా విత్తనాలు ఇస్తాం. ఎకరా పొలం ఉన్న గట్లపై 2 కిలోల విత్తనాలు వేసుకోవచ్చు. దీనిపై రైతులకు అవగాహన కల్పించి అదనపు ఆదాయం వచ్చేలా చూస్తాం.

– రాబర్ట్‌పాల్, జిల్లా వ్యవసాయాధికారి

వట్టిగెడ్డ జలాశయానికి జలకళ

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: జియ్యమ్మవలస మండలంలో అతి ప్రధాన సాగునీటి వనరైన వట్టిగెడ్డ జలాశయం నీటిమట్టం పెరిగింది. ఈ ప్రాజెక్టు ద్వారా కురుపాం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాల్లోని సుమారు 17 వేల ఎకరాలకు ఖరీఫ్‌లో సాగునీరు అందిస్తారు. ఏటా ఆగస్టు మొదటి వారంలో నీరు విడుదల చేస్తుంటారు. కొద్ది రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో బుధవారం సాయంత్రానికి 50 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 379 అడుగుల మేర లెవెల్‌కు జలాశయంలో నీరు ఉంది. రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో 399 అడుగుల మేర నీరు వచ్చి చేరుతుందని ఆశిస్తున్నామని ఏఈ వినయ్ తెలిపారు.

క్వాంటమ్.. విజ్ఞాన యానం

న్యూస్‌టుడే, విజయనగరం విద్యావిభాగం

క్వాంటమ్ కంప్యూటింగ్.. ప్రస్తుతం ఎక్కడ విన్నా ఇదే పేరు.. ఆధునిక సాంకేతికత, అత్యాధునిక పరిజ్ఞానంతో పనిచేసే వ్యవస్థ ఈ విధానం. రెప్పపాటులో పని పూర్తిచేసే ఈ కంప్యూటర్లు రాష్ట్రంలో త్వరలో అందుబాటులోకి రానున్నాయి. ఆ దిశగా ఇప్పటికే 'క్వాంటమ్ వ్యాలీ' పేరుతో కూటమి ప్రభుత్వం ముందుకెళుతోంది. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో 2025-26 విద్యా సంవత్సరంలో ఇంజినీరింగ్, డిగ్రీలో దీనిని మైనర్ కోర్సుగా పరిచయం చేసేందుకు విద్యాశాఖ అడుగులు వేస్తోంది. అందులో భాగంగా విజయనగరంలోని జేఎన్‌టీయూ గురజాడ విద్యాలయం అమలుకు సిద్ధమైంది.



ఇంజినీరింగ్ విద్యలో ఇక మైనర్ కోర్సు

అమలుకు సిద్ధమైన జేఎన్‌టీయూ

3 క్రెడిట్లు..
- విద్యాలయం: జేఎన్‌టీయూ గురజాడ
- అనుబంధ కళాశాలలు: 26
- కోర్సుకు ఇచ్చే క్రెడిట్లు: 03
- సిలబస్ అంశాలు: అల్గారిథమ్స్, హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, క్వాంటమ్‌తో కూడిన ఏఐ
- ఎవరు చేయవచ్చు: కంప్యూటర్ సైన్స్‌తో పాటు అన్ని బ్రాంచుల విద్యార్థులు అర్హులు

బీటెక్‌లో..

ఇంజినీరింగ్ విద్యలో క్వాంటమ్ కంప్యూటింగ్‌ను ఈ ఏడాది మైనర్ కోర్సుగా పరిచయం చేస్తున్నారు. జేఎన్‌టీయూ గురజాడ విద్యాలయంలో మూడు, నాలుగో సంవత్సరం విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. వీరు ఏదో ఒక సెమిస్టర్‌లో ఈ కోర్సు ఎంచుకునే అవకాశం కల్పించారు. సిలబస్ రూపకల్పన పూర్తయింది. ఈ కంప్యూటింగ్ గణితం, భౌతికశాస్త్రం, జీవశాస్త్రం, కెమిస్ట్రీ(ఎం)తో మిళితమై ఉంటుంది. విశ్వవిద్యాలయం పరిధిలో 26 అనుబంధ ఇంజినీరింగ్ కళాశాలలకు సిలబస్‌ను అందించారు. ప్రత్యేకంగా రిసోర్స్ పర్సన్లు లేకపోవడంతో అన్ని అనుబంధ కళాశాలల ఎఫ్‌డీపీ(ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం)ని నిర్వహించారు. 2000 మంది ఆచార్యులకు మరోసారి శిక్షణ ఇవ్వనున్నారు.

డిగ్రీలో ఇలా..

సింగిల్ మేజర్ విధానం అమల్లో ఉంది. ప్రస్తుతం రెండు ప్రధాన సబ్జెక్టులను చదువుతున్నారు. ఇక నుంచి డబుల్ మేజర్ విధానం తీసుకొస్తున్నారు. అంతర్గతంగా ప్రభుత్వం పరిశీలిస్తోంది. మేజర్‌తో పాటు మైనర్ కోర్సులను కూడా చదవాల్సి ఉంటుంది. సీఎస్ఈ విద్యార్థులకు తప్పనిసరి. ఉదాహరణకు.. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్ విద్యార్థులు.. కంప్యూటర్ సైన్స్, గణితం సబ్జెక్టులను రెండు మేజర్లుగా చదువుతున్నారు. వీరంతా ఇప్పుడు మైనర్ కోర్సుగా క్వాంటమ్ కంప్యూటింగ్ తీసుకోవాలి. త్వరలో అన్ని గ్రూపుల వారికి అందించే అవకాశం ఉందని జేఎన్‌టీయూ ఉపకులపతి రాజ్యలక్ష్మి తెలిపారు. విద్యార్థులతో పాటు తాము నేర్చుకోవాల్సిన అవసరం ఉందని, ఈ మేరకు కార్యశాలలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. భవిష్యత్తు అంతా ఏఐ అనుసంధానిత క్వాంటమ్‌దేనని ఇంజినీరింగ్ విద్య నిపుణుడు ఆర్.రాజేశ్వరరావు వెల్లడించారు. ఈ కోర్సుకు మూడు క్రెడిట్లు ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు.

రాజ్యలక్ష్మి

రాజేశ్వరరావు

వ్యాధుల కాలం.. మురుగే భయం

– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

ఇచ్ఛాపురం పురపాలక సంఘంలో పాత, కొత్త కాలనీలు సుమారు 12 ఉన్నాయి. ఇవి కాకుండా గతంలో బంజరు భూములుగా ఉండే ప్రాంతాల్లోనూ ప్రస్తుతం నివాసాలు పెరిగాయి. రూ.లక్షలు వెచ్చించి కట్టుకున్న ఇంటి చుట్టూ మురుగు తిష్ట వేయడంతో నరకం చూస్తున్నారు. కాలువలు లేక కూడా బయటకు పోయే పరిస్థితి లేకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. సాధారణ రోజుల్లో ఎలా ఉన్నా, వర్షాకాలంలో అయితే, కాలనీల గుండా వ్యాధులు పెరిగే పరిస్థితి. పరిశుభ్రత ఎంతో ముఖ్యం. కానీ ఇచ్ఛాపురం పురపాలిక పరిధిలో చాలా కాలనీల్లో మౌలిక సదుపాయాలు లేవు. చివరికి కాలువలే లేని దుస్థితి.

★ బెల్లుపడ కాలనీలోని ఓ వీధిలో పాత కాలువ ఉంది. ఇది రోడ్డుకు సమాంతరంగా మారడంతో మురుగు రహదారిపైనే తిష్ట వేస్తోంది. చిన్న వర్షం పడినా, కాలువలో మురుగు నీరంతా రోడ్డుపై చేరుతోంది. ఇంకా పెద్ద వర్షం పడితే ఆ నీరంతా ఇళ్లలోకి వస్తోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద కాలువలను ప్రధాన వీధుల్లో నిర్మించి, వాటికి ఈ కాలువలను అనుసంధానం చేస్తే తప్ప ఈ సమస్యకు పరిష్కారం అవ్వదని వార్డు కౌన్సిలర్ ప్రదీప్ కుమార్ అన్నారు. ఇదే కాలనీలో మరో వీధిలో విద్యుత్తు స్తంభాలు లేవు.

★ 20వార్డు పరిధిలోని గాంధీనగర్, కొండకాలనీ, ఎన్‌బీ కాలనీ, డిగ్రీకాలనీల్లో మురుగు వ్యవస్థ అభివృద్ధి చెందలేదు. కొన్ని రోడ్లు, ఒకటిరెండు చోట్ల కాలువల నిర్మాణం చేపట్టినా, పూర్తిస్థాయిలో సమస్యకు పరిష్కారం అవసరమని వార్డు కౌన్సిలర్ ఆదిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వార్డు పరిధిలో ఉన్న ఎన్టీఆర్ నగర్ రూపుదిద్దుకుంటోంది. ఈ ప్రాంతంలో రోడ్లతోపాటు మురుగు సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

కాలువలు లేవు.. ఉన్నా నీరు పారదు

బెల్లుపడకాలనీలో పేరుకుపోయిన మురుగు

ఇబ్బంది పడుతున్నాం..

తమ కాలనీలో కచ్చా కాలువలు నడుమ, వాగుల రోడ్డుపై మెలికలు తిరుగుతూ, ప్రతి ఇంటికి దుర్గంధం, దోమలను చేరవేస్తున్నాయి. సాధారణ రోజుల్లో కాలువలను దాటుకుంటూ ముందుకు సాగుతాం. వర్షం పడితే ఆ పరిస్థితి ఉండటం లేదు. రోడ్డంతా మురుగు తిష్ట వేస్తోంది. – పైల రాంబాబు, సాయమ్మ, లక్ష్మి

పరిశీలిస్తాం..

మురుగు సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. చెత్త, వాడుక నీరు రోడ్డుపై వదలకుండా సహకరించండి. – ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం

40మంది రక్తదానం

పాచిపెంట, న్యూస్‌టుడే: పాచిపెంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి గోపాలరావు ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. 40 మంది యువకులు రక్తదానం చేశారు. విజయనగరానికి చెందిన ఎన్‌వీయన్ బ్లడ్ బ్యాంకు వారు రక్తం సేకరించారు. తహసీల్దారు రవి రక్తదాతలకు ధ్రువపత్రాలు, పండ్లు అందజేశారు. ప్రిన్సిపల్ ఝాన్సీ, సంస్థ సభ్యులు ఈశ్వరరావు, అధ్యాపకులు, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

ఎత్తు పెంచండి

ఇచ్ఛాపురం మండలం తిప్పనపుట్టుగలో మంచి నీటి బావి నంద తక్కువ ఎత్తులో ఉండటంతో నీరు తోడేటప్పుడు అందులో పడిపోయే ప్రమాదముందని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు పరిశీలించి నంద ఎత్తును పెంచాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఎస్.కృష్ణను వివరణ కోరగా పంచాయతీకి ఆర్థిక సంఘం నిధులు వచ్చిన తరువాత సర్పంచిని సంప్రదించి ఎత్తును పెంచుతామని తెలిపారు.
– న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం గ్రామీణం

పాడైంది.. పట్టించుకోండి..

డి.గొనపపుట్టుగలో సోలార్ పథకం గతేడాది మరమ్మతులకు గురై పని చేయడం లేదు. దీంతో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, చేతి పంపు వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పథకాన్ని మరమ్మతులు చేపట్టి తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీని వివరణ కోరగా పథకం గడువు కాలం అయిపోయిందని సర్పంచితో మాట్లాడి మరమ్మతులకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

అల్లుకున్న నిర్లక్ష్యం

కవిటి నుంచి జగతి, బెజ్జిపుట్టుగ వెళ్లే రోడ్డులో విద్యుత్తు స్తంభానికి తీగ జాతి మొక్కలు అల్లుకున్నాయి. దీంతో విద్యుత్తు సరఫరాకు నిత్యం అంతరాయం ఏర్పడుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వాటిని తొలగించి విద్యుత్తు సరఫరాకు ఇబ్బంది లేకుండా చూడాలని కోరుతున్నారు. దీనిపై విద్యుత్తుశాఖ ఏఈ యు.శ్రీనివాసరావును వివరణ కోరగా మొక్కలు తొలగించి సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

వంటగది బాగు చేయరూ..

మందస మండలం బొగాబంద పాఠశాలకు చెందిన మధ్యాహ్న వంటకాలు నిర్వహించే వంట గది ఇది. తిత్లీ తుపాను గాలులకు పైకప్పు ధ్వంసమైంది. దీంతో వినియోగానికి దూరమైంది. అధికారులు స్పందించి రేకులతో పైకప్పు వేసి వినియోగంలోకి తేవాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఎంఈవో లక్ష్మణరావు తెలిపారు.
– న్యూస్‌టుడే, హరిపురం(మందస)

కల్వర్టు శిథిలం

ఇచ్ఛాపురం పుర పరిధి స్వేచ్ఛానగర్ 2వ మార్గంలోని కల్వర్టు పలకలు ధ్వంసమయ్యాయి. ఆరు ఉండాల్సిన పలకలు మూడే ఉన్నాయి. మరొకటి శిథిలమై ప్రమాదకరంగా మారింది. ఆరు వీధుల వారు రాకపోకలు సాగించేందుకు వినియోగించే ఈ కల్వర్టుకు మరమ్మతులు చేపట్టి, రక్షణ కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. సిమెంటు పలకలు సర్దుబాటు చేసి, సమస్యను పరిష్కరిస్తామని కమిషనర్ రమేష్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

నిర్వహణ నిధులొచ్చాయ్..!

పాఠశాలలు, కళాశాలలకు మహర్దశ

న్యూస్‌టుడే, పొందూరు, జి.సిగడాం

విద్యాభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పాఠశాలల్లో వసతుల కల్పన, విద్యార్థులకు ఏకరూప దుస్తులు, నాణమైన భోజనం, పాఠ్య, రాత పుస్తకాలు అందేలా పర్యవేక్షిస్తోంది. వైకాపా ప్రభుత్వం బడుల నిర్వహణకు నిధులు కేటాయించకపోవడంతో ప్రధానోపాధ్యాయులు సొంత నిధులు వ్యయం చేసేవారు. ప్రస్తుత ప్రభుత్వం ఉపాధ్యాయులకు ఇబ్బందులు తలెత్తకుండా తొలి విడత 50 శాతం నిధులు విడుదల చేసింది. అందులో 10 శాతం మెగా తల్లిదండ్రుల సమావేశానికి, మరో 10 శాతం స్వచ్ఛతకు మిగిలిన మొత్తాన్ని ఇతరత్రా అవసరాలకు వ్యయం చేయాలని మార్గదర్శకాలు జారీ చేసింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత, జిల్లా పరిషత్తు ఉన్నత, పురపాలక, జూనియర్ కళాశాలలకు నిధులు అందనున్నాయి.

విద్యార్థుల సంఖ్య	తొలి విడతలో ఇచ్చే మొత్తం (రూ.వేలల్లో..)
0-30	10
31-100	25
101-250	50
250-1,000	75
1,001 ఆపై..	రూ.లక్ష

జిల్లాలో ప్రాథమిక, ప్రాథమికోన్నత బడులు: 2,226
ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు: 427
పాఠశాలలు, కళాశాలలకు మంజూరు చేసిన నిధులు: 3.08 కోట్లు

ఇబ్బందులకు అడ్డుకట్ట

పాఠశాలల నిర్వహణ ఖర్చులకు సక్రమంగా నిధులు రాకపోడంతో సుద్దముక్కలు, ఇతర సామగ్రి కొనుగోలుకు ఉపాధ్యాయులు అవస్థలు పడేవారు. కొన్నిచోట్ల పర్యవేక్షణ కొరవడటంతో బడులు పరిసరాలు అపరిశుభ్రంగా దర్శనమిచ్చేవి. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా కూటమి ప్రభుత్వం 50 శాతం నిధులు ముందుగానే విడుదల చేయడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు బిల్లుల చెల్లింపు బాధ్యత ప్రభుత్వం తీసుకోవడంతో పెద్ద భారం తప్పిందని అభిప్రాయపడ్డారు.

రెండు రోజుల్లో జమ చేస్తాం..

పాఠశాలలు, కళాశాలల (ఎస్ఎంసీ) ఖాతాలకు రెండు రోజుల్లో నిర్వహణ నిధులు జమ చేస్తాం. ఇప్పటికే దీనికి సంబంధించి అన్ని ఏర్పాట్లు చేశాం. తొలి విడతలో 2,653 పాఠశాలలు, కళాశాలలకు ప్రభుత్వం రూ.3.08 కోట్లు మంజూరు చేసింది. మిగిలిన మొత్తాన్ని విద్యా సంవత్సరం ముగిసే లోపు విడుదల చేస్తుంది. పీఎంశ్రీ పాఠశాలలకు ఈ నిధులు 100 శాతం వచ్చాయి.
– ఎస్.శశిభూషణ్, ఏపీసీ, సమగ్ర శిక్షా, శ్రీకాకుళం

ఘనంగా గ్రామదేవత ఉత్సవాలు

పాలకొండ, న్యూస్‌టుడే: పాలకొండ మండలం అట్టలిలో గ్రామదేవత ఉత్సవాలు ఘనంగా జరిగాయి. భక్తులు అమ్మవారి ఘటాలతో మొక్కులు చెల్లించుకున్నారు. పోలమ్మతల్లి, దేశమ్మతల్లికి పసుపు, కుంకుమలు సమర్పించారు. ఏటా ఆషాఢ మాసోత్సవాలు నిర్వహిస్తుంటారు.

ఘటాలతో మొక్కులు చెల్లించుకుంటున్న గ్రామస్థులు

రాష్ట్ర బాస్కెట్‌బాల్ విజేతలు కటక్, గంజాం

బ్రహ్మపుర క్రీడలు, న్యూస్‌టుడే: నిస్ట్ విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నాలుగు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి బాలబాలికల బాస్కెట్‌బాల్ పోటీలు బుధవారం రాత్రి ముగిశాయి. ఇందులో బాలికల తుది పోరులో కటక్ ఎంటర్‌టైనర్ జట్టు పూరీ జట్టుపై గెలుపొందింది. బాలుర తుదిపోరులో గంజాం జట్టు సెలిటిక్స్ కటక్ జట్టుపై మ్యాచు గెలుపొంది విజేతగా నిలిచింది. మ్యాచుల అనంతరం జరిగిన బహుమతి ప్రదానకార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన బీఈఎంసీ మేయరు సంఘమిత్ర దొళాయి విన్నర్, రన్నర్ జట్లకు బహుమతులు అందజేశారు.

విజేత ట్రోఫీతో గంజాం బాలుర జట్టు క్రీడాకారులు. చిత్రంలో మేయరు దొళాయి

ఛాంపియన్ ట్రోఫీతో కటక్ బాలికల జట్టు క్రీడాకారిణులు

ఉత్సాహంగా చదరంగం పోటీలు

విజేతలు వెంకటకిశోర్, నవీన్‌లకు బహుమతులందిస్తున్న డీఆర్వో ఖాజావలి, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు

ఈనాడు-ఈటీవీ ఛాంపియన్ ఆధ్వర్యంలో రెవెన్యూ ఉద్యోగులకు బుధవారం చదరంగం పోటీలు జరిగాయి. కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్. శంకరన్ హాలు వద్ద జరిగిన పోటీల్లో కలెక్టరేట్‌లోని పలువురు రెవెన్యూ ఉద్యోగులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రత్యర్థుల ఎత్తుకు పైఎత్తు వేస్తూ పోటీల్లో రాణించారు. అనంతరం విజేతలకు జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.ఎస్.కె. ఖాజావలి, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు ట్రోఫీలు అందించారు. - న్యూస్‌టుడే, కలెక్టరేట్ (గుంటూరు)

వివరాలు 8లో

జడ్పీ సర్వసభ్య సమావేశం 4న

గుంటూరు: ఉమ్మడి గుంటూరు జిల్లాపరిషత్తు సర్వసభ్య సమావేశం జడ్పీ సమావేశ మందిరంలో ఛైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా అధ్యక్షతన ఈ నెల 4న ఉదయం 10.30 గంటలకు జరగనుందని సీఈవో వి. జ్యోతిబసు తెలిపారు. కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, జిల్లాల కలెక్టర్లు, జడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, అధికారులు పాల్గొంటారన్నారు.

సంక్షేమ ఫలాలు.. అభివృద్ధి పరుగులు

'సుపరిపాలన తొలి అడుగు'పై ప్రజాప్రతినిధుల ప్రచారం

ఈనాడు డిజిటల్, నరసరావుపేట

'పింఛను వృద్ధులకు రూ.4 వేలు.. దివ్యాంగులకు రూ.6 వేలకు పెంచడమే కాకుండా ఠంచనుగా ఒకటో తేదీ ఉదయమే ఇస్తున్నాం.. ఇంట్లో పిల్లలు ఎంతమంది ఉంటే అంతమందికీ 'తల్లికి వందనం' పేరిట రూ.15 వేల చొప్పున ఖాతాల్లో జమ చేశాం.. గతుకుల రోడ్లను బాగు చేశాం.. గ్రామాలకు ఆర్థిక సంఘం నిధులు జమచేసి అభివృద్ధి పనులు చేపట్టాం. . ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం.. సీసీ రహదారులు వేశాం.. గోకులం షెడ్లు నిర్మించాం.. సాగర్ కాలువల్ని బాగు చేయిస్తున్నాం' అని జిల్లా ప్రజాప్రతినిధులు ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం జిల్లా అంతటా బుధవారం ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు నిర్వహించారు.

❖ పెదకూరపాడులో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ చేపట్టారు. ప్రభుత్వ సంక్షేమ ఫలాల్ని వివరించారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకుని మైటీడీపీ యాప్‌లో నమోదు చేయించారు. త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

❖ నరసరావుపేట నియోజకవర్గం రొంపిచర్ల మండలం కర్లకుంట, విప్పర్ల గ్రామాల్లో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.

❖ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు చిలకలూరిపేట పట్టణంలోని 13, 14, 17 వార్డుల్లో ఇంటింటికీ వెళ్లి సమస్యలు తెలుసుకుని యాప్‌లో నమోదు చేయించారు. పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

చీఫ్ విప్ ఆంజనేయులుకు తిలకం దిద్ది హారతి ఇస్తున్న మహిళ

❖ శావల్యాపురం మండలం కనమర్లపూడిలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, జీడీసీ బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పాల్గొని ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

❖ మాచర్ల నియోజకవర్గం వెల్దుర్తి మండలం శిరిగిరిపాడులో ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి ఇంటింటికీ వెళ్లి సంవత్సర కాలంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. తల్లికి వందనం అందిందా? పింఛన్ అందుతుందా? ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు.

మహిళలకు సంక్షేమ పథకాల కరపత్రం ఇస్తున్న బ్రహ్మారెడ్డి

❖ గురజాల నియోజకవర్గంలోని మాడుగుల గ్రామంలో ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు కూటమి ప్రభుత్వం వచ్చాక చేసిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

❖ సత్తెనపల్లి 11వ వార్డులో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ఇంటింటికి వెళ్లి ప్రజల యోగక్షేమాలు తెలుసుకుని కరపత్రాలు పంపిణీ చేశారు. పథకాలు అందుతున్నాయా లేవా? అని ఆరా తీశారు.

పల్లెకు పండగొచ్చింది

ఉపాధి పనుల బిల్లులకు మోక్షం

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద పల్లెల్లో సీసీ రోడ్లు, కాలువలు, మినీ గోకులాలు తదితర నిర్మాణ పనులు చేపట్టిన వారికి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. జిల్లాలో పల్లె పండగ పనుల బిల్లులు సుమారు ఎనిమిది నెలల నుంచి పెండింగులో ఉన్నాయి. ఆ పనుల తాలూకూ బిల్లుల నిధులు రూ.24.24 కోట్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదలచేశాయి. పాడి రైతులు నిర్మించుకున్న గోకులం షెడ్లకు సంబంధించి జిల్లాలో రూ.6.03 కోట్లు చెల్లించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నిర్మాణం పూర్తయిన సీసీ రోడ్డు

పాత బకాయిలూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ సభలు నిర్వహించి ఉపాధి పనులు గుర్తించారు. ఆ తరువాత పల్లె పండగ పేరుతో గత అక్టోబరులో గ్రామాల్లో ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులతో మౌలిక వసతుల అభివృద్ధి పనులు చేపట్టారు. పల్లెల్లో సిమెంటు రోడ్లు, కాలువలు నిర్మించారు. వీటి బిల్లులను కొంత మేర చెల్లించారు. కొన్నిచోట్ల నిలిచిపోయాయి. రూ.కోట్లు వెచ్చించి పనులు చేసిన వారు బిల్లుల కోసం ఎదురుచూస్తున్నారు. నిధుల విడుదలతో గ్రామాల్లో అసంపూర్తిగా నిలిచిన అభివృద్ధి పనులు వేగం అందుకోనున్నాయి. 2014-19 మధ్య తెదేపా ప్రభుత్వ హయాంలో ఉపాధి నిధులతో చేసిన పనుల తాలూకా బిల్లులను వైకాపా ప్రభుత్వం చెల్లించకుండా నిలిపివేసి తీవ్ర ఇబ్బంది పెట్టింది. ఆ బకాయిలు కూడా విడుదల చేయడంతో అప్పట్లో పనులు చేసిన వారు ఊపిరి పీల్చుకోనున్నారు.

మెటీరియల్ కాంపోనెంట్
నిధులతో చేపట్టిన పనులు: 515
పనుల విలువ: రూ.80.49 కోట్లు
విడుదలైన నిధులు: రూ.24.24 కోట్లు
నిర్మించిన గోకులం షెడ్లు: 700
మంజూరైన బిల్లులు: రూ.6.03 కోట్లు

త్వరలో చెల్లింపులు.. పాడి పోషణను ప్రోత్సహించేలా గోకులం షెడ్ల నిర్మాణాల్ని కూటమి ప్రభుత్వం చేపట్టింది. 90 శాతం రాయితీ, 10 శాతం రైతుల వాటాతో షెడ్లు నిర్మించారు. ఒక్కో మండలానికి 25 షెడ్ల నిర్మాణం లక్ష్యంగా జిల్లా అధికారులు నిర్దేశించారు. దాదాపు లక్ష్యాలను చేరుకున్నారు. వాటికి సంబంధించి రూ.6.03 కోట్లు మంజూరయ్యాయి. రైతుల ఖాతాలకు నగదు జమయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. గ్రామాల్లో చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు సాధ్యమైనంత త్వరగా చెల్లిస్తామని ఏపీవో ప్రసాద్ తెలిపారు.

త్రిసభ్య కమిటీల కూర్పుపై కసరత్తు

నెలాఖరుకు 167 సహకార సంఘాలకు సారథులు

శావల్యాపురం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు అండగా నిలిచే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు త్వరలో సారథులు రానున్నారు. ప్రస్తుతం పర్సన్ ఇన్‌ఛార్జులుగా సంబంధిత శాఖాధికారులు వ్యవహరిస్తున్నారు. వారి స్థానంలో త్రిసభ్య కమిటీలను నియమిస్తారు. ఇది వరకే ఈ ప్రక్రియ మొదలుపెట్టినా పూర్తి కావడంలో జాప్యమైంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 167 సహకార సంఘాలున్నాయి. వైకాపా హయాంలో వీటికి ఎన్నికలు నిర్వహించకుండా పార్టీ కార్యకర్తలను కమిటీ సభ్యులుగా నియమించి ప్రతి ఆరు నెలలకు పదవీ కాలం పొడిగించుకుంటూ వచ్చారు. అదే సమయంలో సహకార సంఘాల్లో కొన్నిచోట్ల అక్రమాలు చోటు చేసుకుని అవి నష్టాల్లోకి వెళ్లాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక త్రిసభ్య కమిటీలను రద్దు చేసి సహకార శాఖ అధికారులను పర్సన్ ఇన్‌ఛార్జులుగా నియమించింది. వీరు తగినంత మంది లేక మూడు, నాలుగు సంఘాలకు ఒకరిని చొప్పున నియమించడంతో సక్రమంగా పర్యవేక్షణ చేయలేకపోతున్నారు. జూన్ 28 వరకు వీరికి గడువు ఇచ్చారు. మళ్లీ ఆరు నెలలకు వీరి పదవీ కాలం పెంచాల్సి ఉండగా నెల రోజులే పొడిగింపు ఇచ్చారు. ఈ సమయంలో త్రిసభ్య కమిటీల నియామక ప్రక్రియను కొలిక్కి తీసుకురానున్నారు.

ఆశావహుల నిరీక్షణ.. జిల్లాలో సహకార సంఘాల త్రిసభ్య కమిటీల్లో ఛైర్మన్, డైరెక్టర్లుగా నియమించేందుకు మూడు నెలల కిందటే ఆశావహుల జాబితాలు సిద్ధం చేసి అధిష్ఠానానికి పంపించారు. కొన్నిచోట్ల ఎన్డీయే కూటమిలోని జనసేన నేతలకూ అవకాశం కల్పించారు. కమిటీల్లో పేర్లున్న ఆశావహులంతా ఈ పదవుల కోసం రెండు నెలలుగా ఎదురుచూస్తున్నారు. ఈ నెలఖారులోగా సంఘాలన్నింటికీ కమిటీలు వేయబోతున్నారు. అనంతరం ఎన్నికలు నిర్వహించినా అప్పుడూ వీరినే అధ్యక్షులుగా కొనసాగించేలా అభ్యర్థులను ఎంపిక చేయాలని.. తేడాలుంటే సరిదిద్ది మరోసారి జాబితా పునఃపరిశీలన చేసుకోవాలని పార్టీ నుంచి స్థానిక నాయకులకు ఆదేశాలు అందాయి.

న్యాయ విద్య ఫలితాలు విడుదల

ఏఎన్‌యూ, న్యూస్‌టుడే : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలోని న్యాయ కళాశాలల్లో ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన లీగల్ స్టడీస్ పరీక్షల ఫలితాలను సీఈ ఆలపాటి శివప్రసాద్ బుధవారం విడుదల చేశారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీలో మూడో సెమిస్టర్, ఐదేళ్ల ఎల్ఎల్‌బీలో ఏడో సెమిస్టర్‌లో 809 మంది పరీక్ష రాయగా 482 మంది, ఐదేళ్ల ఎల్ఎల్‌బీ మూడో సెమిస్టర్‌లో 341 మందికి గాను 212 మంది, ఎల్ఎల్‌బీ ఐదేళ్ల హానర్స్ కోర్సు మూడో సెమిస్టర్‌లో 47 మంది పరీక్ష రాయగా 44 మంది ఉత్తీర్ణత సాధించారని వివరించారు. పరీక్ష పత్రాల పునః మూల్యాంకనం కోసం ఈ నెల 8వ తేదీలోపు ఒక్కో పేపర్‌కు రూ.2,070 చెల్లించాలని ఆయన సూచించారు. మరిన్ని వివరాలను విశ్వవిద్యాలయ వెబ్‌సైట్‌లో ఉంచామని తెలిపారు.

కొండ క్వారీల్లో అధికారుల తనిఖీలు

యడ్లపాడు, న్యూస్‌టుడే: మండలంలోని వంకాయపాడు పంచాయతీ పరిధిలో కొండ క్వారీలను మైనింగ్, రెవెన్యూ, పంచాయతీ, పోలీసు శాఖల అధికారులు సంయుక్తంగా బుధవారం తనిఖీలు నిర్వహించారు. మైనింగ్ శాఖ నుంచి అనుమతులు పొందిన నాలుగు క్వారీల్లో వాస్తవ స్థితిగతుల్ని పరిశీలించారు. క్వారీల్లో మైనింగ్ చేసిన పరిధిలో కొలతలు తీసుకున్నారు. కొండ తవ్వకాల కారణంగా సమీపంలోని ఉప్పరపాలెంలో గృహాలు దెబ్బతింటున్నాయని, తాగునీరు కలుషితం అవుతోందని, లోతైన గోతుల కారణంగా ప్రమాదాలు జరుగుతున్నాయని ఇటీవల గ్రామస్థులు అధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో అధికారులు పరిశీలించారు. కార్యక్రమంలో మైనింగ్ టీఏ కల్యాణి, మైనింగ్ సర్వేయర్ రవితేజ, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ సుబ్బారావు, రెవెన్యూ సర్వేయర్ సురేంద్రనాథ్, పంచాయతీ కార్యదర్శి బాపిరాజు, వీఆర్వో శివకోటి తదితరులు పాల్గొన్నారు.

కొలతలు వేస్తున్న వివిధ శాఖల అధికారులు

ప్రభుత్వ శాఖల్లో కార్మికులకు వేతనాల పెంపు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో నాన్ మస్టర్ రోల్ విధానంలో పని చేస్తున్న కార్మికుల వేతనాల పెంపునకు కార్మిక శాఖ చేసిన ప్రతిపాదనలకు కలెక్టర్ అరుణ్‌బాబు ఆమోదం తెలిపారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో బుధవారం కార్మిక శాఖ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వ శాఖల్లో తాత్కాలిక అవసరాలకు రోజువారీ ప్రాతిపదికన పని చేసే వారికి పెంచిన వేతనాలు చెల్లించాలని అధికారులను ఆదేశించారు. అత్యంత నైపుణ్యం కలిగిన కార్మికులకు రూ.864 నుంచి రూ.899, నైపుణ్యమున్న వారికి రూ.855, పాక్షిక నైపుణ్యం ఉన్నవారికి రూ.742, నైపుణ్యం లేని వారికి రూ.619 రోజు వారీ వేతనంగా నిర్ధారించినట్లు కలెక్టర్ వివరించారు. సమావేశంలో కార్మిక శాఖ సహాయ కమిషనర్ శ్రీనివాసరావు, సీపీవో శ్రీనివాస్, ర.భ.శాఖ ఎస్ఈ రాజునాయక్, డీఈవో చంద్రకళ, ఎన్నెస్పీ ఎస్ఈ కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు

సూక్ష్మ సేద్యం.. సర్కారు ఊతం

జిల్లాలో 4 వేల హెక్టార్లలో సాగు లక్ష్యం

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చే లక్ష్యంతో బిందు, తుంపర సేద్యాన్ని కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. మూస పద్ధతిలో పంటల సాగుకు స్వస్తిపలికి నూతన పంటలు సాగు చేసేలా వెన్నుతడుతోంది. వైకాపా ప్రభుత్వంలో మూలన పడేసిన సూక్ష్మ సేద్యానికి పెద్ద పీట వేస్తోంది. ఈ ఏడాది సూక్ష్మ సేద్యం లక్ష్యాన్ని జిల్లాకు భారీగా నిర్దేశించింది. ఎస్సీ, ఎస్టీ రైతులకు (ఐదు ఎకరాల్లోపు) వంద శాతం రాయితీపై పరికరాలు అందజేయనుంది.

ప్రోత్సాహకాలు.. ఎస్సీ, ఎస్టీలు కాకుండా మిగిలిన రైతులకు ఐదు ఎకరాల్లోపు పంటల సాగుకు 90 శాతం, ఐదు నుంచి 10 ఎకరాల్లోపు 70 శాతం, పది నుంచి 12.5 ఎకరాలకు 50 శాతం రాయితీపై పరికరాలు అందజేస్తారు. ❖ తుంపర సేద్య పరికరాలు అందరికీ 50 శాతం రాయితీపై అందజేయనున్నారు. ❖ పండ్లు, కూరగాయలు, పూల తోటలు, సుగంధ ద్రవ్యాలు, వ్యవసాయ పంటలు అన్నింటికి బిందు, తుంపర సేద్యం పరికరాలు రాయితీపై ఇస్తారు.

2,899 మంది రైతుల దరఖాస్తు.. జిల్లాలో 2025-26 సంవత్సరానికి నాలుగు వేల హెక్టార్లల్లో సూక్ష్మ సేద్యం సాగు లక్ష్యంగా నిర్దేశించారు. ఇప్పటికే జిల్లాలోని అన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా 2,899 మంది రైతులు 2,756 హెక్టార్లలో పంటల సాగుకు అవసరమైన పరికరాల కోసం దరఖాస్తు చేశారు. వీటిలో 929 హెక్టార్ల పొలం పరిశీలన పూర్తయ్యింది. ఇప్పటికే 152 మంది రైతులు 140 హెక్టార్లకు సంబంధించి తమ వాటా నగదు చెల్లించారు. వారికి సంబంధిత పరికరాలు, సామగ్రి పంపిణీ ప్రారంభమైంది.

నమోదు ఇలా.. బిందు, తుంపర సేద్యంలో రాయితీ పొందేందుకు అన్నదాతలు రైతు సేవా కేంద్రంలో వివరాలు నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. పట్టాదారు పాసు పుస్తకం, ఆధార్ కార్డు నకలు, చరవాణి నంబరు, బ్యాంకు పాసు పుస్తకం నకలు, చెక్‌బందీ (భూమి హద్దుల వివరాలు), 1బీ అందజేయాలి.

ఎన్నో ప్రయోజనాలు..

'సూక్ష్మ సేద్య విధానంతో ఎన్నో ప్రయోజనాలుంటాయి. నీటినే కాకుండా ఎరువుల్ని డ్రిప్ ద్వారా అందించే వీలుంటుంది. తద్వారా రైతులకు ఎరువులపై ఖర్చు 60 శాతం వరకు తగ్గుతుంది. ఆటోమేటిక్ రిమోట్ సిస్టమ్ ద్వారా చరవాణితో డ్రిప్ సిస్టమ్‌ను ఇంటి వద్ద నుంచే ఆపరేట్ చేయొచ్చు. దీంతో సమయం ఆదా అవుతుంది. అవసరం మేరకే నీటి వినియోగంతో చీడపీడలు తగ్గి ఎరువులు, పురుగు మందులపై వెచ్చించే ఖర్చు తగ్గుతుంది' అని జిల్లా సూక్ష్మ నీటి సాగు అధికారి సీహెచ్ ఆంజనేయులు తెలిపారు.

వైకాపా నేత లాడ్జిలో జూద శిబిరం

✦ దాడి చేసి పట్టుకున్న పోలీసులు ✦ రూ.10.35 లక్షలు స్వాధీనం

అమరావతి, న్యూస్‌టుడే: పవిత్ర పుణ్యక్షేత్రం అమరావతి అమరేశ్వరాలయానికి అత్యంత సమీపంలోని ఓ వైకాపా నేత లాడ్జిలో జూద శిబిరం వెలుగులోకి వచ్చింది. బుధవారం పోలీసులు దాడి చేసి, జూదరులను అదుపులోకి తీసుకోవడంతో విషయం బయట పడింది. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. అమరావతిలోని అమరేశ్వరాలయ రాజగోపురం ముందు వైకాపా నాయకుడు పులిపాడు పవన్‌కుమార్‌కు చెందిన ఎస్ఆర్ఆర్ లాడ్జి ఉంది. కొంత కాలంగా మాజీ ఎమ్మెల్యే అనుచరుడి సహకారంతో లాడ్జిలో అసాంఘిక కార్యకలాపాలు నడుపుతున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత కూడా వారి ఆగడాలు ఆగలేదు. భారీ స్థాయిలో జూద శిబిరం నిర్వహిస్తున్నారు. దీనిపై పోలీసులకు సమాచారం అందడంతో సీఐ అచ్చయ్య, ఎస్సైలు అమీర్, రాజశేఖర్ సిబ్బందితో వెళ్లి లాడ్జిపై దాడి చేశారు. ఓ గదిలో జూదం ఆడుతున్న 10 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.10.35 లక్షలు, 11 సెల్‌ఫోన్లు, రెండు కార్లు, ఒక ద్విచక్ర వాహనం స్వాధీనం చేసుకున్నారు. జూదరులతోపాటు లాడ్జి యజమానిపై కేసు నమోదు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

త్వరత్వరగా..

తుది దశకు విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: పాఠశాల విద్యపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోంది. గతంలో విద్యా సంవత్సరం పూర్తవుతున్నా పూర్తిస్థాయిలో పాఠ్య పుస్తకాలు పంపిణీ కాని పరిస్థితి ఉండేది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ పరిస్థితిలో మార్పు తెచ్చింది. జిల్లాలో 1,46,771 మంది విద్యార్థులకు అవసరమైన పాఠ్య, నోటు పుస్తకాలు, బెల్టులు అందజేసే ప్రక్రియ పూర్తయింది. విద్యార్థుల్లో నైతికత పెంచేందుకు ప్రభుత్వ సలహాదారు చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో రూపొందించిన విలువల విద్యకు సంబంధించిన పుస్తకం ఆవిష్కరించారు. అవి రెండ్రోజుల్లో జిల్లాకు రానున్నాయి. వాటిని పంపిణీ చేసేందుకు విద్యా శాఖ సన్నాహాలు చేపట్టింది.

శ్రీసర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ తుది దశకు చేరింది. విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు, నిఘంటువులు, వర్క్ బుక్‌లు ఇప్పటికే అందజేశారు. బూట్లు కూడా అందజేశారు. ఈ నెల 10న జిల్లాలోని 2,032 పాఠశాలల్లో మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థుల సమదుస్తులకు సంబంధించిన వస్త్రం శుక్రవారం పూర్తి స్థాయిలో జిల్లాకు చేరనుంది. ప్రతి విద్యార్థికి మూడు జతలకు సరిపడా వస్త్రమిస్తారు. వాటిలో ఒక జత అయినా కుట్టించుకుని పాఠశాలకు రావాలని అధికారులు సూచిస్తున్నారు.

నూతన రైల్వే మార్గంలో టికెట్ల జారీ ప్రారంభం

గుంటూరు రైల్వే, న్యూస్‌టుడే: నడికుడి-శ్రీకాళహస్తి మార్గంలో ఈ నెల 4వ తేదీ నుంచి వారానికి ఒకసారి నడిచే తొలి ప్రయాణికుల రైల్లో రిజర్వేషన్ టికెట్ల జారీ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. తొలుత చర్లపల్లి నుంచి నడికుడి వైపు ఐఆర్‌సీటీసీ ద్వారా టికెట్ల జారీలో సాంకేతిక సమస్యలు వచ్చినప్పటికీ ఆ తర్వాత పరిష్కరించారు. నెమలపురి, రొంపిచర్ల స్టేషన్లలోనూ టికెట్ల విక్రయ కేంద్రాలను మొదటిసారి ఏర్పాటు చేశారు. 2020 జూన్ 30న ఈ నూతన మార్గంలో రైళ్ల రాకపోకలకు అనుమతి మంజూరైనప్పటికీ గత ఐదేళ్ల నుంచి సరకుల రవాణా రైళ్ల రాకపోకలు మాత్రమే కొనసాగుతున్నాయి.

పెండింగ్ దరఖాస్తుల వివరాలను డీఎస్‌వోకు వివరిస్తున్న తహసీల్దార్ నిర్మల

5లోపు రేషన్ దరఖాస్తులు పరిష్కరించండి

రొంపిచర్ల, న్యూస్‌టుడే: కొత్త రేషన్ కార్డులకు ప్రజలు అందించిన దరఖాస్తులను ఈ నెల 5లోపు పరిష్కరించాలని డీఎస్‌వో ఎం.వి. ప్రసాద్ ఆదేశించారు. కొత్త రేషన్ కార్డుల పెండింగ్ దరఖాస్తులపై రొంపిచర్ల తహసీల్దార్ కార్యాలయంలో నూతన వీఆర్వోలతో బుధవారం ఆయన సమీక్ష నిర్వహించారు. మండలంలో ఎన్ని దరఖాస్తులు పెండింగులో ఉన్నాయి. వాటి పరిష్కారానికి తీసుకుంటున్న చర్యలపై తహసీల్దార్ నిర్మలను అడిగి తెలుసుకున్నారు. డీఎస్‌వో మాట్లాడుతూ జిల్లాలో కొత్త రేషన్ కార్డుల కోసం 62,649 దరఖాస్తులు వచ్చాయన్నారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్, సాంకేతిక సమస్యలతో సుమారు 9 వేల దరఖాస్తులు పెండింగులో ఉన్నాయని, వాటిని ఈ నెల 5వ తేదీలోపు పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. నూతనంగా మంజూరు చేసే రేషన్ కార్డు క్యూఆర్ కోడ్‌తో ఉంటుందని, ఏటీఎం కార్డు సైజులో ప్రజలకు సౌలభ్యంగా ఉండేలా రూపొందిస్తున్నట్లు తెలిపారు. సీఎస్‌డీటీ ప్రభాకర్, ఆర్ఐ కోటేశ్వరరావు, డీటీ వెంకటరెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

12 బడి బస్సులపై కేసులు

పత్రాలు తనిఖీ చేస్తున్న ఎంవీఐ

చిలకలూరిపేట గ్రామీణ: చిలకలూరిపేట - నరసరావుపేట రహదారిలో మోటారు వాహనాల తనిఖీ అధికారి కె.గోపాల్ ఆధ్వర్యంలో సిబ్బంది బుధవారం పాఠశాలల బస్సులను తనిఖీ చేశారు. బీమా, కాలుష్య రహిత ధ్రువపత్రాలు లేకపోవడంతో పాటు పన్ను చెల్లించకపోవడం, డ్రైవర్లు సమదుస్తులు ధరించకపోవడం, ప్రథమ చికిత్స పెట్టెలు లేకపోవడం వంటి అంశాలను గుర్తించి 12 బస్సులపై కేసులు నమోదు చేశారు. రూ.47,200 అపరాధ రుసుము వసూలు చేశామని ఎంవీఐ తెలిపారు. తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని, బస్సులకు సంబంధించిన పత్రాలన్నీ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

కొండమోడు నుంచి ఓఆర్ఆర్‌కు అనుసంధాన రోడ్డు

నాలుగు వరుసల నిర్మాణానికి ప్రతిపాదన

ఈనాడు, అమరావతి

కొండమోడు - పేరేచర్ల రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించే క్రమంలో మేడికొండూరు నుంచి బైపాస్ ద్వారా వేములూరిపాడు వద్ద అనుసంధానం చేస్తున్నారు. అక్కడి నుంచి బాహ్య వలయ రహదారికి చేరుకునేలా పేరేచర్ల వద్ద నరసరావుపేట వంతెన వరకు 3 కిలోమీటర్ల మేర నాలుగు వరుసలుగా విస్తరించడానికి అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఇందుకు రూ. 50 కోట్లకుపైగా అవసరమని ప్రాథమికంగా అంచనా వేశారు. హైదరాబాద్, పల్నాడు ప్రాంతాల నుంచి వచ్చేవారు కొండమోడు మార్గం మీదుగా అమరావతికి వెళ్లడానికి ఔటర్ రింగ్ రోడ్డుపైకి చేరుకునేలా రోడ్డును అనుసంధానం చేయాలని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ కేంద్రాన్ని కోరారు. ఈ మేరకు ప్రతిపాదనలు పంపించారు. కొండమోడు నుంచి నాలుగు వరుసల రహదారిపై వచ్చే వాహనాలు వేములూరిపాడు సమీపంలో గుంటూరు-కర్నూలు మార్గంలోకి ప్రవేశిస్తాయి. ప్రస్తుతం ఇది రెండు వరుసలుగా ఉంది. ఈ నేపథ్యంలో బాహ్యవలయ రహదారిపైకి చేరుకునేలా 3 కిలోమీటర్ల మార్గాన్ని నాలుగు వరుసలుగా విస్తరిస్తారు. దీనివల్ల అమరావతి నుంచి హైదరాబాద్, పల్నాడు వైపు వెళ్లేవారికి, అటు నుంచి అమరావతికి వచ్చే వారికి ప్రయోజనకరంగా ఉంటుంది.

బాహ్యవలయ రహదారికి అనుసంధానం చేసే పేరేచర్ల సమీపంలోని వంతెన ప్రాంతం

అమరావతి-అనంతపురం మార్గంలో కలిపితే మేలు

అనంతపురం నుంచి అమరావతికి కొత్తగా జాతీయ రహదారిని నిర్మించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ప్రస్తుతం గుంటూరు- కర్నూలు మార్గంలోని ఫిరంగిపురం నుంచి బైపాస్ ఏర్పాటు చేసి పేరేచర్ల-మేడికొండూరు మార్గం మధ్యలో బాహ్యవలయ రహదారికి కలిసేలా ఆకృతి రూపొందించారు. ఇది కొండమోడు-పేరేచర్ల మార్గాన్ని క్రాస్ చేస్తూ వెళ్తుంది. ఈ మార్గం గుంటూరు-కర్నూలు, ప్రస్తుతం ఉన్న కొండమోడు-పేరేచర్ల మార్గాల మధ్య సమాంతరంగా వెళ్తుంది. ప్రస్తుతం అనుకుంటున్న డిజైన్ కొంత మార్చి ఫిరంగిపురం నుంచి బైపాస్ మార్గాన్ని వేములూరిపాడు వద్ద కొండమోడు-పేరేచర్ల రహదారికి అనుసంధానం చేయడంతోపాటు అక్కడి నుంచి బాహ్యవలయ రహదారిపైకి ప్రవేశించేలా చేయాలి. దీనివల్ల కొండమోడు-పేరేచర్ల రహదారి నుంచి ఇప్పుడు ప్రతిపాదించిన 3 కిలోమీటర్ల అనుసంధాన మార్గం అవసరం ఉండదు. భూసేకరణ, రహదారి నిర్మాణ భారం తగ్గుతుంది. అలాకాకుండా ప్రస్తుతం రూపొందించిన ప్రతిపాదనల ప్రకారమైతే అటు అనంతపురం-అమరావతి, కొండమోడు-పేరేచర్ల రహదారులు సుమారు పది కిలోమీటర్ల వ్యవధిలో బాహ్యవలయ రహదారిపైకి ప్రవేశిస్తాయి. వీటిపై ప్రభుత్వం మరింతగా అధ్యయనం చేసి భూసేకరణ భారం, రహదారి నిర్మాణ ఖర్చు తగ్గించుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

MARGADARSI CHIT FUND PVT. LTD.
Chit Groups are available at our *NARASARAOPET* BRANCH

CHIT GROUP	DURATION IN MONTHS	MONTHLY INSTALLMENT	CHIT VALUE
LT C	50	30,000	15,00,000
LT X	50	20,000	10,00,000
FT VV	40	2,00,000	80,00,000
FT D	40	50,000	20,00,000

Please Contact Branch Manager **Mr. M.ADISESHA RAO,** for further details. Mobile No. **8008229506,** **Landline: 08647-222674, 227161.**

(c) eenadu

కలం పట్టు.. గళం వినిపించు

మీ గ్రామం/పట్టణం/ నగరంలో తాగునీరు, పారిశుద్ధ్యం, మురుగునీటి పారుదల, రహదారుల సమస్యలు ఉన్నాయా? పథకాల అమలులో లోపాలు, నిధుల దుర్వినియోగం, ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి, అక్రమాలు జరుగుతున్నాయా? మీ ప్రాంతాల విశేషాలు, ప్రత్యేకతలు, ఇతరులకు స్ఫూర్తినిచ్చే అంశాలు, ప్రతిభాపాటవాలు.. అలాగే ఆహ్లాదం, అబ్బుర పరిచే దృశ్యాలతో కూడిన వివరాలను క్లుప్తంగా మాకు పంపండి. వాటిని మీ పేరు తోనే 'ఈనాడు' 'పౌరపాత్రికేయం' ద్వారా ప్రచురిస్తాం. సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడానికి కృషి చేస్తాం. ఇంకెందుకు ఆలస్యం.. ఈ కింది నంబరుకు వాట్సాప్ చేయండి. సమాజాభివృద్ధికి దోహదపడండి.

వాట్సాప్ నంబరు : 96528 85839

(దీనికి వాట్సాప్ మాత్రమే చేయాలి. ఫోన్ కాల్స్ స్వీకరించరు)

గమనిక : మీ పేరు, ఊరు, మండలం, జిల్లా, చరవాణి నంబరు తప్పక పేర్కొనాలి. సామాజిక మాధ్యమాల్లోని అంశాలు/ ఫొటోలను పంపకూడదు. స్వయంగా మీ కంటితో చూసిన అంశాలు, మీరు తీసిన చిత్రాలనే పంపాలి. మా ప్రమాణాల మేరకు పారదర్శకంగా ఉన్నవాటిని ప్రచురిస్తాం.

అడుగుకో గుంతతో అవస్థలు

సమస్య: శావల్యాపురం మండలంలో పిచికలపాలెం రహదారి అధ్వానంగా ఉంది. 2005లో ప్రధానమంత్రి సడక్ యోజన పథకం ద్వారా నిర్మాణం చేపట్టారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు తట్టెడు మట్టి పోసిన దాఖలాలు లేవు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అన్ని రహదారులు బాగు చేయిస్తామని ప్రకటించినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదు. ఈ రహదారి మీదుగా వయ్యకల్లు, గుంటుపాలెం, భాస్కరనగరం, చినకంచర్ల, ముంద్రువారిపాలెం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు నియోజకవర్గ కేంద్రమైన వినుకొండకు వెళ్తుంటారు. వినుకొండ మండలం విఠంరాజుపల్లి నుంచి పిచికలపాలెం మధ్య రహదారిపై మోకాలి లోతు గుంతలు ఏర్పడి వాహనాలు వెళ్లడానికి ఇబ్బందికరంగా ఉంది. రాత్రిళ్లు ఎదురుగా వచ్చే వాహనాల వెలుతురులో గుంతలు కనిపించక అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. - ఓ పాఠకుడు

అధికారుల సమాధానం: ఈ రహదారి అధ్వాన స్థితిపై పిచికలపాలెం సర్పంచి గణపర్తి చిన ఆంజనేయులు, నీటి సంఘం అధ్యక్షుడు తిరివీధి శ్రీనివాసరావు, బోడెపూడి నాగేశ్వరరావు తదితరులు సమస్యను చీఫ్ విప్ జి.వి. ఆంజనేయులుకు వివరించారు. ఆయన వెంటనే సీఎం చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకుని వెళ్లారు. సీఎంవో కార్యాలయం నుంచి నూతన రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని పీఐయూ ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. మొత్తం రూ.3.95కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఏఈ వెంకటేశ్వర్లు తెలిపారు.

- న్యూస్‌టుడే, పిచికలపాలెం(శావల్యాపురం)

ఎత్తుకు పైఎత్తువేసి.. ప్రత్యర్థిని చిత్తు చేసి..

ఈనాడు-ఈటీవీ ఛాంపియన్ పోటీల్లో పాల్గొన్న రెవెన్యూ ఉద్యోగులు

ఈనాడు-ఈటీవీ ఛాంపియన్ చదరంగం పోటీలో పాల్గొన్న రెవెన్యూ ఉద్యోగులు

కలెక్టరేట్(గుంటూరు), న్యూస్‌టుడే: నిత్యం విధుల్లో తలమునకలై ఉండే రెవెన్యూ ఉద్యోగులు ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన చదరంగం పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఒకరికంటే మరొకరు ఎత్తుకు పైఎత్తులు వేస్తూ రాణించారు. తొలిరౌండ్‌లో తడబడినా..ఆతర్వాత ప్రత్యర్థులపై పోటా పోటీగా పావులు కదిపారు. రెవెన్యూ ఉద్యోగులకు కలెక్టరేట్‌లోని ఎస్.ఆర్.శంకరన్ హాలు ఆవరణలో చదరంగం పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి మాట్లాడుతూ ఈనాడు-ఈటీవీ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు చదరంగం పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన సిహెచ్.వెంకటకిషోర్, ఎస్.నవీన్‌లకు జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, కలెక్టరేట్ ఏవో పూర్ణచంద్రరావు బహుమతులు అందజేశారు. చెస్ ఆర్బిటర్ చక్రవర్తి పాల్గొన్నారు.

సృజనకు పోటీలు దోహదం - సిహెచ్.వెంకటకిషోర్, విన్నర్

ప్రభుత్వ ఉద్యోగులకు క్రీడా పోటీలు అవసరం. అప్పటి నైపుణ్యాలను గుర్తుతెచ్చుకునేందుకు కాస్త సమయం పట్టింది. చదరంగం అంటే ఇష్టం. ఉద్యోగ రీత్యా ఎప్పుడూ ఏదో ఒక హడావుడిలో ఉంటాం. సృజనాత్మక ఆలోచనలు, వైవిధ్యమైన ఎత్తుగడలకు పోటీలు ఎంతగానో ఉపయోగపడతాయి. విజేతగా ట్రోఫీని అందుకోవడం చాలా సంతోషంగా ఉంది.

ఉల్లాసాన్ని ఇస్తాయి -ఎస్.నవీన్, రన్నర్

చదరంగం పోటీలను ఈనాడు ఆధ్వర్యంలో నిర్వహించడం..అందులో నేను పాల్గొనడం ఆనందంగా ఉంది. చదరంగం అంటే చాలా ఆసక్తి. ఉద్యోగులకు ఇటువంటి పోటీలు ఉల్లాసాన్నిస్తాయి.

ఒత్తిడి నుంచి ఉపశమనం - వై.లోహిత

క్రీడలపై ఆసక్తి ఉన్నా చదువుకోవడం..ఆ తర్వాత ఉద్యోగ జీవితంతో బిజీ అయిపోయాం. ఉద్యోగులకు ఈ పోటీలు నిర్వహించడం చాలా సంతోషం. ఇటువంటి క్రీడలతో ఉద్యోగులకు ఒత్తిడి నుంచి ఉపశమనం కలుగుతుంది. క్రీడా నైపుణ్యాలు పెంపొందడంతోపాటు ప్రతిభ వెలుగులోకి వస్తుంది.

భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా కృపారావు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: పట్టణానికి చెందిన భాజపా సీనియర్ నేత వల్లెపు కృపారావు పార్టీ జాతీయ కౌన్సిల్ సభ్యులుగా నియమితులయ్యారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా గతంలో బాధ్యతలు నిర్వహించారు. జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా రెండోసారి నియామకం పొందారు. పార్టీ కోసం నిబద్ధతతో పని చేసే కార్యకర్తలకు భాజపాలో గౌరవం ఉంటుందనడానికి ఇదే నిదర్శనమని జిల్లా పార్టీ నేతలు పేర్కొన్నారు.

నిరక్షరాస్యత నిర్మూలనపై దృష్టి సారించాలి

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో వయోజనుల విద్య ద్వారా నిరక్షరాస్యత నిర్మూలన అంశంపై అధికారులు దృష్టి సారించాలని కలెక్టర్ అరుణ్‌బాబు సూచించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా వయోజన విద్య ఉపసంచాలకుడు కె.అంజనేయులు, జిల్లా నోడల్ అధికారి మల్లికార్జున్ కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి సూచనలు చేశారు.

రెండు వాహనాలను ఢీకొట్టిన లారీ

అతివేగమే ప్రమాదానికి కారణం

నుజ్జయిన లారీల ముందు భాగాలు

కృష్ణలంక, న్యూస్‌టుడే: మితిమీరిన వేగంతో వచ్చిన లారీ, రెండు వాహనాలను ఢీకొట్టిన ఘటన విజయవాడలోని కృష్ణలంక వద్ద జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన బొమ్మిడి నాగార్జున మంగళవారం రాత్రి కాకినాడలో సన్‌ఫ్లవర్ ఆయిల్ లోడు చేసుకొని గొల్లపూడిలో దింపేందుకు వెళ్తున్నారు. మితిమీరిన వేగంతో వస్తున్న లారీ కృష్ణలంక సత్యం హోటల్ సెంటర్ వద్ద అదుపు తప్పి ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. తరువాత లారీని పక్కకు తప్పించే క్రమంలో డివైడర్ ఎక్కి రహదారి అవతలి భాగం వైపునకు వెళ్లి.. ఆ సమయంలో బస్టాండ్ వైపు నుంచి వారధి వైపునకు వెళ్తున్న ఐషర్ వాహనాన్ని ఢీకొట్టింది. రెండు వాహనాల ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. డ్రైవర్లు, క్లీనర్లు క్యాబిన్‌లో ఇరుక్కుపోయారు. ట్రాఫిక్ పోలీసులు.. స్థానికుల సాయంతో ఇద్దరిని వెలుపలికి తీసుకొచ్చారు. మరో ఇద్దరు లోపల ఉండిపోయారు. రెండు క్రేన్లను తెప్పించి వారిని కూడా బయటకు తీశారు. క్షతగాత్రులను 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఐషర్ వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్ తాడేపల్లిగూడెంకు చెందిన ఆరిమిల్లి వెంకటేశులు కాగా... గొల్లపూడిలో స్టీల్‌సామాన్లు లోడ్ చేసుకుని తణుకు వెళ్తున్నట్లు చెప్పారు. గాయపడిన క్లీనర్లు గొల్ల వంశీకృష్ణ, గుడిపూడి వెంకటేశ్వర్లుగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జిల్లాలో 8 మండలాల్లో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యం

నాదెండ్లలో షేడ్‌నెట్లు పరిశీలిస్తున్న జిల్లా ఉద్యానశాఖ అధికారి

నాదెండ్ల(చిలకలూరిపేట (గ్రామీణ), న్యూస్‌టుడే : జిల్లాలో 8 మండలాల్లో (నాదెండ్ల, ఈపూరు, సత్తెనపల్లి, రాజుపాలెం, పిడుగురాళ్ల, బెల్లంకొండ, మాచవరం, అమరావతి) 1320 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి ఐ. వెంకట్రావు వివరించారు. ఇప్పటికే 650 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు చేస్తున్నారన్నారు. మండల కేంద్రమైన నాదెండ్లలో షేడ్‌నెట్లను బుధవారం పరిశీలించి ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది నుంచి 2500 చ.మీ. లోనే షేడ్‌నెట్‌లు ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. గతంలో ఎకరా వరకు షేడ్‌నెట్లు ఏర్పాటుకు అవకాశం ఉండేదని, ప్రస్తుతం మారిన నిబంధనల ప్రకారం 60 సెంట్లలోనే ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఒక రైతుకు గరిష్ఠంగా షేడ్‌నెట్ల ఏర్పాటుకు రూ.5,62,500 రాయితీ లభిస్తుందన్నారు. గతేడాది షేడ్‌నెట్లు ఏర్పాటు చేసుకున్న రైతులకు సంబంధించి పూర్తి వివరాలు నమోదు చేసుకున్నట్లు వివరించారు. నర్సరీ చట్ట ప్రకారం షేడ్‌నెట్లు ఏర్పాటు చేసుకునే వారు తప్పనిసరిగా లైసెన్సు పొందాలన్నారు. గతంలో లైసెన్సు ఉన్న వారు రెన్యువల్ చేసుకోవాలన్నారు. నాణ్యమైన నారు పెంచేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం గ్రామంలో బొప్పాయి తోటలను పరిశీలించారు. చిలకలూరిపేట ఉద్యానశాఖ అధికారిణి శ్రీలక్ష్మి, సహాయకులు వేదవతి, అనుపమ పాల్గొన్నారు.

MACHERLA MUNICIPALITY

e-Procurement tender notice Roc.No.250/2019/E1, Dt: 03-07-2025
NIT.No.2/2025-26 to 24/2025-26 (Twenty Three Works Only)
BPS-2019 & LRS-2020 Scheme, MP Lads MP Lads (17th LS) NRT-2023-24 Grant & General Fund - Rs.255.00 Lakhs

Further details can be seen at 'e' procurement Market place in www.apeprocurement.gov.in officer inviting bids Commissioner, Macherla Municipality, Macherla, Andhra Pradesh.

Bid Document Download Start Date	: 03-07-2025 at 10.30 A.M.
Bid Document Download End Date	: 17-07-2025 at 3.00 P.M.
Last date & Time for receipt of Bids	: 17-07-2025 at 4.00 P.M.
Price Bid Opening Date	: 17-07-2025 at 4.30 P.M.

Ph: 9849905838

Sd/- Commissioner, Macherla Municipality

పంటల బీమా పథకాలు సద్వినియోగం చేసుకోండి

గోడ పత్రికలు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ అరుణ్‌బాబు, డీఏవో తదితరులు

నరసరావుపేట వ్యవసాయం, న్యూస్‌టుడే: ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోకుండా ప్రభుత్వం రైతులకు బీమా సౌకర్యం కల్పిస్తోందని దానిని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు కోరారు. ఖరీఫ్-2025 సీజన్‌కు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన, పునర్నిర్మించిన వాతావరణ పంటల బీమా పథకాలకు సంబంధించిన గోడ పత్రికలను స్థానికంగా తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటైన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారితో కలిసి కలెక్టర్ బుధవారం ఆవిష్కరించారు. డీఏవో జగ్గారావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పింఛను నగదు ప్రభుత్వ ఖాతాకు జమ

యడ్లపాడు, న్యూస్‌టుడే: యడ్లపాడు- 1 సచివాలయ సంక్షేమ సహాయకుడు చరణ్ ప్రభుత్వ ఖాతాకు జమ చేయాల్సిన రూ.9.50 లక్షలను సొంతానికి వాడుకున్న విషయం తెలిసిందే. నకిలీ చలానాలు సృష్టించి నాలుగు నెలలుగా అతను అధికారులను మభ్యపెడుతున్నారు. ఈ వ్యవహారం మంగళవారం వెలుగులోకి రావడంతో స్పందించిన ఎంపీడీవో హేమలతాదేవి ప్రభుత్వ ఖాతాకు జమ చేయని మొత్తం నగదు 24 గంటల లోపు తిరిగి చెల్లించాలని అతనికి షోకాజ్ నోటీసులు ఇచ్చారు. దీంతో అతడు నగదు మొత్తాన్ని ప్రభుత్వ ఖాతాకు జమ చేసి చలానాలను డీఆర్డీఏ అధికారులకు పంపాడని ఎంపీడీవో బుధవారం తెలిపారు.

'మంతెన' మృతికి నివాళి

గణపవరం (చిలకలూరిపేట (గ్రామీణ), న్యూస్‌టుడే : నాదెండ్ల మండలం గణపవరంలోని విష్ణు స్పన్ పైప్స్ అధినేత మంతెన నాగరాజు (68) మృతికి ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ సంతాపం తెలిపారు. బుధవారం గ్రామానికి వెళ్లి నాగరాజు భౌతికకాయం వద్ద నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు .

ఇంటిని మరిపించేలా..

పేద విద్యార్థులకు వరంగా ప్రభుత్వ వసతి గృహాలు

విద్య, వసతి, పౌష్టికాహారం అన్నీ ఉచితమే

సత్తెనపల్లి, న్యూస్‌టుడే

జిల్లాలోని వసతి గృహాల్లో సీట్లు.. ఖాళీలు..

వసతి గృహం	సంఖ్య	సీట్లు	భర్తీ	ఖాళీ
బీసీ ప్రీ మెట్రిక్	20	2,200	931	1,269
బీసీ పోస్ట్ మెట్రిక్	14	1,400	424	976
ఎస్సీ ప్రీ మెట్రిక్	18	1,800	1736	64
ఎస్సీ పోస్ట్ మెట్రిక్	11	1,100	565	535
ఎస్టీ ప్రీ మెట్రిక్	6	600	295	305
ఎస్టీ పోస్ట్ మెట్రిక్	3	300	285	15

నిరుపేద, మధ్య తరగతి కుటుంబాల్లోని పిల్లల పాఠశాల, ఉన్నత చదువులకు వసతి గృహాలు వెన్నుదన్నుగా నిలుస్తున్నాయి. ఇంటిని తలపించే వాతావరణం వసతి గృహాల్లో ఉండేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. 2025- 26 విద్యా సంవత్సరానికి వసతి గృహాల్లో ప్రవేశాల ప్రక్రియ మొదలైంది. జిల్లాలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో ఎస్సీ, ఎస్టీ, బీసీ వసతి గృహాల్లో సుమారు రూ.4 కోట్లతో పనులు చేపట్టారు. గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, ఇతర వసతులు కల్పించారు. సన్నబియ్యంతో భోజనం వడ్డిస్తున్నారు. దీంతో తమ పిల్లలను వసతి గృహాల్లో చేర్పించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపిస్తున్నారు.

కడుపారా తినేలా కొత్త మెనూ..: ❖ ఆది, మంగళ, శుక్రవారం కోడికూర, భోజనం, పాలు, అల్పాహారం, ఆకు కూర పప్పు, కూరగాయలతో చేసిన కూరలు అందిస్తారు. ❖ శనివారం మినహా ప్రతి రోజూ ఉడికించిన కోడిగుడ్లు ఇస్తారు. ❖ సోమ, బుధవారాల్లో కోడిగుడ్డు కూర, వారానికి రెండు సార్లు ఇడ్లీ, ఒకరోజు ఉప్మా, ఒకరోజు పులిహోర వడ్డిస్తారు. ❖ ఆదివారం పూరీలు, రాత్రి భోజనం తర్వాత అరటి పండు ఇస్తారు. ❖ ఉదయం చిక్కీలు, సాయంత్రం అల్పాహారంగా రాగిపిండి లడ్డూ, మరమరాలు, ఉడికించిన సెనగలు, బఠానీలు, రవ్వకేసరి, అలసందల గుగ్గిళ్లు అందిస్తారు. ❖ ఆహారంతో పాటు వసతికి ఇబ్బందులే కుండా బెడ్‌షీట్లు, ట్రంకు పెట్టె, భోజన పళ్లెం, గ్లాసు ఇస్తారు. కాస్మోటిక్ ఛార్జీలకు సంబంధించి నగదును తల్లుల ఖాతాల్లో జమ చేస్తారు.

అర్హతలు ఇవే..

వసతి గృహాల్లో చేరే బీసీ విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.60 వేల నుంచి రూ.80 వేల లోపు ఉండాలి. ఎస్సీ, ఎస్టీ పిల్లల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం రూ.75 వేల లోపు ఉండాలి. బియ్యం కార్డు కలిగి ఉన్న పిల్లలందరూ అర్హులు. దరఖాస్తుతో పాటు విద్యార్థుల ఆధార్, తల్లిదండ్రుల ఆధార్, కుల ధ్రువపత్రం, రేషన్ కార్డు, ఏదైనా జాతీయ బ్యాంకు ఖాతా, బదిలీ ధ్రువపత్రాలు, మూడు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు అందజేయాలి.

సత్తెనపల్లిలోని బీసీ కళాశాల బాలుర వసతి గృహంలో విద్యార్థులు

❖ వసతి గృహాల్లో ప్రవేశాలు పొంది ఉజ్వల భవిష్యత్తును సాకారం చేసుకునే దిశగా విద్యార్థులు చదువులు కొనసాగించాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ సంక్షేమ సాధికార జిల్లా అధికారులు శ్రీనివాసులు, ఈశ్వరమ్మ, జ్యోత్స్న సూచించారు.

EENADU e Classifieds

BUSINESS SERVICES

బంగారం కొనబడును. బ్యాంకులలో, ఇతర ప్రైవేట్ సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును. (స్పాట్ క్యాష్). సంప్ర: 87907 41166.

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవలకు, ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95052 76677, 82474 49036.

Book your 5 lines Classified Colour Rs.770/- 3Ads Package Rs.1945/-
5 lines Classified B/W Rs.650/- 3Ads Package Rs.1625/-
ప్రకటనపై 5% జి.ఎస్.టి. అదనం

REAL ESTATE

LAND FOR SALE

GENERAL

మెగా ★ అవకడో ★ ఫామ్ ల్యాండ్‌లో 11 సెంట్లు ★5 లక్షలకే ★ 5వ సంవత్సరం నుండి సంవత్సరంకి 2 లక్షల ఆదాయం పొందండి. ఫోన్: 9133574455.

PLOT FOR SALE

GENERAL

తెనాలి సుల్తానాబాద్, నన్నపనేని నగర్‌లో తూర్పు ఫేసింగ్, 40 అడుగుల రోడ్డు గల 267 చ॥గ॥ VGTM, UDA అప్రూవల్ గల ప్లాటు అమ్మకమునకు కలదు. సంప్ర॥ 91679 79901.

నందనవనం @ చిలకలూరిపేట 500 గజాల స్థలము 3BHK ప్రీమియం విల్లాలు అన్ని సౌకర్యాలతో కేవలం 39 లక్షల రూపాయలు మాత్రమే సంప్రదించండి. 77027 87797, 97005 65357.

JOBS

Wanted Office Assistant (Female) For EPF Consultancy at Guntur. Qul: Graduate with Computers. Sal: Upto 10,000/-. Send Resume to 93324 44479.

Wanted Lady Tele Callers. Preferred Young & Energetic, Talktive Persons. Qualification: Inter & Degree. Contact: Worldwide Education Consultant. Lakshmipuram, Guntur. Cell: 90001 33866.

Tenali Wanted DTP Operator (Experience with Apple Keyboard) Attractive Salary Offered Immediate Joining prefered Cont : 90526 43626.

Wanted Part Time Lady Graduate Teachers, Time: 1.00 P.M. to 8.00 P.M. & For Study Hours: 4.00 P.M. to 8.00 P.M. Sri Satya Sai Ideal School, Chowtra, Guntur-3. ✆: 0863-2222114, 2241837.

Wanted Marketing Executives to work in a reputed organization (8 Hrs Duty). Salary ranges from 12K to 15K. Interested Candidates. ✆: 98499 89951.

Wanted Experienced Tele Callers to work in a reputed organization. Interested Candidates Contact: ✆: 77290 15053.

Wanted Office Asst. (Male) Qua: Any Degree with Computer Knowledge. Maxmuller Publication Guntur. 94941 61313.

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో+వ + మంచి జీతం+ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

గుంటూరు, 11/2, అరండల్‌పేట, SR Images సంస్థలో పనిచేయుటకు రియల్ ఎస్టేట్ రంగంలో అనుభవం కలిగిన అకౌంటెంట్ కావలెను. ✆: 84658 45211.

గుంటూరులో పనిచేయుటకు Shop Keeper, Sales Person, Delivery Boys కావలెను. రైతన్న మిల్క్ డైరీ. 98487 58107.

శివకార్తికేయ హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు ఇంటి/ వంట పనిచేయుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 20K. ✆ 99120 11499, 99120 11899.

గుంటూరులో గల నర్సింగ్ కాలేజి నందు హాస్టల్‌లోనే ఉండి పనిచేయుటకు 10th/ ఇంటర్/ డిగ్రీ చదివిన లేడి వార్డెన్స్ కావలెను. సంప్రదించగలరు. ఫోన్ నెంబర్స్: 81224 61164, 70327 10958.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

తక్కువ బడ్జెట్‌లో మీ అవసరాలు తీర్చే ఏకైక మార్గం.. ఈనాడు లో ప్రకటన ఇవ్వటం
పూర్తి వివరాలకు సంప్రదించండి: 8008510541

పశు వైద్యశాల అభివృద్ధి అభినందనీయం

గోనుగుంట్లతో మాట్లాడుతున్న వైద్యుడు పక్కనే దాత కిషోర్

రొంపిచర్ల, న్యూస్‌టుడే: మండలంలోని కర్లకుంటలో శిథిలావస్థకు చేరిన పశువైద్యశాలను వడ్లమూడి కిషోర్ సొంత ఖర్చుతో అభివృద్ధి చేయటం, స్థానిక రైతులకు అందుబాటులో ఉండి పశువైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ సాయి మహేష్ రెడ్డి అభినందనీయులని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. ఆయన పశువైద్యశాలను బుధవారం సందర్శించి మందుల నిల్వలు పరిశీలించారు. స్థానిక రైతులతో మాట్లాడి పశువైద్యశాలలో అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. పక్కనే 7.5 సెంట్ల భూమిని కిషోర్ విరాళంగా ఇచ్చారని పశువైద్యుడు సాయిమహేష్‌రెడ్డి ఛైర్మన్ దృష్టికి తీసుకు రాగా ఆయన దాతను అభినందించారు.

తండ్రి, కుమారుల ఘర్షణ

తల్లి గుండెపోటుతో మృతి

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: తండ్రి, కుమారుడి మధ్య ఘర్షణ చోటుచేసుకోవడంతో మనస్తాపం చెందిన తల్లికి గుండెపోటు రావడంతో మృత్యువాత పడింది. పోలీసుల కథనం మేరకు.. క్రోసూరు మండలం బయ్యవరం గ్రామానికి చెందిన సుందరరావు కుమారుడు ఏసోబు మంగళవారం మద్యం తాగి ఇంటికి వచ్చాడు. దీంతో తండ్రి కుమారుడిని మందలించగా.. ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఏసోబు తల్లి మార్తమ్మ (44) ఇద్దరిని వారిస్తూ ఒక్కసారిగా ఉద్వేగానికి గురైంది. ఆమెకు గుండెపోటు రావడంతో వెంటనే సత్తెనపల్లి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవిబాబు తెలిపారు.

సహకార సంఘాలను బలోపేతం చేయాలి

మాట్లాడుతున్న సబ్ డివిజనల్ కో-ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్వర్ణ చినరామిరెడ్డి

చిలకలూరిపేట గ్రామీణ, న్యూస్‌టుడే : సహకార సంఘాలను మరింత బలోపేతం చేయాలని నరసరావుపేట సబ్ డివిజనల్ కో-ఆపరేటివ్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ స్వర్ణ చినరామిరెడ్డి కోరారు. అంతర్జాతీయ సహకార దినోత్సవం సందర్భంగా మండలంలో కొమరివల్లిపాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆవరణలో మోడల్ ఆడిటింగ్ కార్యక్రమంలో ఆయన పాల్గొని బుధవారం మాట్లాడారు. వీటితో పాటు స్వచ్ఛత కార్యక్రమాలు, సభ్యత్వ నమోదు, సహకార సంఘాలపై పాఠశాలలో అవగాహన సదస్సులు, సంఘాల ఉత్పత్తుల ప్రదర్శన పలు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. సహకార సంఘం సేవలను రైతులంతా వినియోగించుకోవాలని, తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సంఘం ఆర్థికంగా బలపడటానికి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో జీడీసీసీబీ మేనేజర్ జి.శ్రీనివాసరావు, కొమరవల్లిపాడు, యడ్లపాడు, గణపవరం, సొలస సహకార సంఘాల సీఈవోలు బండ్ల అశోక్, శ్రీనివాసరావు, లక్ష్మయ్య, చెన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో కి రూ.లలో)

వెంకాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 98, రిటైల్ ధర - 120, చికెన్ విత్‌స్కిన్ - 174, చికెన్ స్కిన్‌లెస్ - 198.
కృష్ణా జిల్లాలో: వెంకాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -93 రిటైల్ ధర 115 చికెన్ విత్ స్కిన్ - 167, చికెన్ స్కిన్‌లెస్ - 190.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 101, 109, 120 చికెన్ విత్ స్కిన్ - 194 చికెన్ స్కిన్‌లెస్ - 204.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 590 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

91.9 FM Vijayawada ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ. 5 - ఉ. 7
ఈ-మార్నింగ్స్	ఉ. 7 - ఉ. 11
నువ్వా నేనా	ఉ. 11 - మ. 2
సత్యభామ	మ. 2 - సా. 5
లైట్ తీస్కో	సా. 5 - రా. 9
సరదాగా కాసేపు	రా. 9 - రా. 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా. 12 - తె. 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact 80080 03297

ముగ్గురు ద్విచక్ర వాహన చోరుల అరెస్టు

స్వాధీనం చేసుకున్న వాహనాలు, నిందితులతో సీఐ రమేష్, ఎస్సైలు

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే : ద్విచక్రవాహనాలు దొంగతనం చేసి తప్పించుకుని తిరుగుతున్న వారిని పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. దీనిపై సీఐ పి.రమేష్ విలేకరులతో మాట్లాడుతూ తమకు అందిన ముందస్తు సమాచారం మేరకు చిలకలూరిపేట పోలిరెడ్డిపాలెం జాతీయ రహదారి సమీపంలో ఎస్సై హజరత్తయ్య, పోలీసు సిబ్బంది బుధవారం ఉదయం 6 గంటల సమయంలో వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో స్కూటీపై చిలకలూరిపేట పురుషోత్తమపట్నంకు చెందిన పోలాసు ఉదయ్‌కిరణ్, సుగాలీకాలనీకి చెందిన బాణావత్ జస్వంత్ నాయక్, కోడావత్ బాలస్వామి నాయక్ అనుమానాస్పదంగా వెళ్తుండటం గమనించి పట్టుకున్నారు. విచారించగా ద్విచక్రవాహన చోరులుగా తేలింది. వీరి నుంచి 11 ద్విచక్రవాహనాలు స్వాధీనం చేసుకున్నారు. వీటిలో పట్టణానికి చెందినవి 9, తెనాలి, పెద్దకాకానికి చెందినవి ఒక్కొక్క వాహనం ఉన్నాయి. వీటిని నరసరావుపేట రోడ్డులోని ముళ్లపొదల మధ్య దాచి, నగదు అవసరమైనప్పుడల్లా అమ్ముకుంటున్నారు. మద్యం, చెడు అలవాట్లకు బానిసలైన వీరు మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడుతున్నారు. సీసీ కెమెరాలు లేని ప్రాంతాలను ఎంచుకుని దొంగతనాలు చేస్తున్నట్లు తేలింది. సమావేశంలో ఎస్సైలు చెన్నకేశవులు, రహమతుల్లా పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 80085 10541
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80085 14589

(c) eenadu

శిర్డీసాయికి ఎండు ఫలాలతో నైవేద్యం

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలో బోసుబొమ్మ సెంటర్‌లోని శిర్డీసాయి మందిరంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎండు ఫలాలను నైవేద్యంగా సమర్పించినట్లు పూజారి శ్రీనివాసశర్మ తెలిపారు. శంకర సత్యంపం, గీతా మందిరం సభ్యులు సుమారు 400 మంది భక్తులు పాల్గొని విష్ణు సహస్ర నామం, సాయి భజనలు, దండకం పఠనం చేశారన్నారు.

నరసరావుపేట

•నరసరావుపేట • వినుకొండ • చిలకలూరిపేట

9న కార్మికుల సార్వత్రిక సమ్మె

చిలకలూరిపేట పట్టణం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 9న జాతీయ కార్మిక సంఘాలు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చాయని మున్సిపల్ కార్మిక సంఘాలు, సీపీఐ నాయకులు బుధవారం తెలిపారు. దీనిలో భాగంగా చిలకలూరిపేట పురపాలక సంఘ కార్మికులు సమ్మె చేయనున్నట్లు వివరించారు. ఈమేరకు పురపాలక సంఘ కమిషనర్ శ్రీహరిని కలిసి సమ్మె నోటీసు అందజేశారు. కమిషనర్‌ను కలిసిన వారిలో సీపీఐ ఇన్‌ఛార్జి ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబూరావు, ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి సుభాని, నాయకులు దాసరి వరహాలు, చెరుకుపల్లి నిర్మల, వేల్పుల అంజయ్య ఉన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

నరసరావుపేట అర్బన్ : 80085 73156
యడ్లపాడు : 8008145652 వినుకొండ గ్రామీణ : 9440009293

? నరసరావుపేటలో రామిరెడ్డిపేట ఎస్ఎస్ఎన్ కళాశాల పక్క వీధిలో రోడ్డుపైనే చెత్త వేస్తున్నారు. నెలల తరబడి డ్రైనేజీలో పూడిక తీయడం లేదు. దోమలు పెరిగి రోగాలు వస్తున్నాయి. - **కోటేశ్వరరావు, స్థానికుడు**
✔ సిబ్బందికి చెప్పి చెత్త, పూడిక తొలగిస్తాం. - **రమాదేవి, పారిశుద్ధ్య అధికారిణి** – న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)

? పట్టణంలో మదర్‌థెరిస్సా కాలనీ శివారు వీధుల్లో కాలువలు నిర్మించలేదు. దీంతో మురుగు, వర్షం నీరు రోడ్డుపై నిలిచి ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. - **శ్రీనివాసరావు**
✔ కాలువల నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాం. అనుమతులు రాగానే ఏర్పాటుకు కృషి చేస్తాం. - **షేక్ అల్తాఫ్, పురపాలక సంఘ ఏఈ** – న్యూస్‌టుడే, చిలకలూరిపేట పట్టణం

మైదానాల్లేవ్.. ఆటలెలా?

చిలకలూరిపేట గ్రామీణ, వినుకొండ, న్యూస్‌టుడే

పిల్లల శారీరక ఎదుగుదలకు క్రీడలు దోహదపడతాయి. చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక, సాంకేతిక రంగాల్లో ప్రతిభ చూపినప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోగలుగుతారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని పాఠశాలల్లో క్రీడా మైదానాలు లేక విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. ఉన్నత విద్య, ఉద్యోగ అవకాశాల్లో ప్రత్యేకంగా క్రీడా కోటాను ప్రభుత్వం అమలు చేస్తుంది. జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు రిజర్వేషన్లు వర్తింపజేస్తున్నారు. ఈ అవకాశాలను అందిపుచ్చుకోవాలంటే పాఠశాల స్థాయి నుంచే క్రీడల్లో శిక్షణ అవసరం. జిల్లాలో వివిధ పురపాలక, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో సరైన మైదానాలు లేక విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు.

క్రీడా మైదానం లేని చిలకలూరిపేట బీఆర్‌జీ పురపాలక ఉన్నత పాఠశాల

ఆటస్థలం లేని కట్టుబడివారిపాలెం ఉన్నత పాఠశాల

ఇక్కడ వసతి లేదు

చిలకలూరిపేటలోని శారద జడ్పీ ఉన్నత పాఠశాలలో 800 మంది, బీఆర్‌జీ పురపాలక ఉన్నత పాఠశాలలో 400 మంది పిల్లలు విద్యను అభ్యసిస్తున్నారు. ఇక్కడ వ్యాయామ ఉపాధ్యాయులున్నప్పటికీ స్థలం లేక ఆటల్లో శిక్షణ ఇవ్వలేకపోతున్నారు. మండలంలో కట్టుబడివారిపాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో క్రీడా స్థలం లేదు. పట్టణంలో 25 వరకు ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. వాటిలో సగానికి పైగా క్రీడామైదానాలు లేని పాఠశాలలే అధికం. దీంతో వందలాది మంది విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు.

☛ వినుకొండ జడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఆరు నుంచి పదోతరగతి వరకు 1400 మంది విద్యనభ్యసిస్తున్నారు. ఇక్కడ ముగ్గురు వ్యాయామ ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. ఆటస్థలం లేక పిల్లలకు శిక్షణ ఇవ్వలేకపోతున్నారు. ఉర్దూ ఉన్నత పాఠశాలకు ఇదే పరిస్థితి. ఆట స్థలం లేక తరగతి గదులకే పరిమితమవుతున్నారు. పట్టణంలోని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చాలా చోట్ల క్రీడా మైదానాలు లేవు.

వ్యాయామ విద్య తప్పనిసరి

ప్రతి తరగతికి వారానికి నాలుగు పీరియడ్లు ఆరోగ్య సంబంధ విద్య బోధించాలి. ప్రతి గురువారం మాస్ డ్రిల్, యోగా తరగతులు నిర్వహించాలి. సాయంత్రం 4.40 నుంచి 5.30 గంటల వరకు వ్యాయామ ఉపాధ్యాయులు ఆటల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు ఉదయం విద్యార్థుల అసెంబ్లీని పర్యవేక్షించాలి.

ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం

క్రీడా మైదానాలు లేని జడ్పీ ఉన్నత పాఠశాలల వివరాలను ప్రభుత్వానికి నివేదిక పంపుతాం. ఉన్నతాధికారుల ఆదేశాల ప్రకారం నిధులు మంజూరు కాగానే మైదానాల ఏర్పాటుకు కృషి చేస్తాం. విద్యార్థులకు ఆటలు ఇబ్బంది రానీయం. **– ఎస్‌కే సుభాని, ఉప విద్యాశాఖాధికారి, నరసరావుపేట**

భక్తుల భద్రతకు పెద్దపీట

ఘాట్ రోడ్డులో పోసిన కంకర డస్ట్‌ను పరిశీలిస్తున్న జీవీ ఆంజనేయులు

వినుకొండ, న్యూస్‌టుడే: తొలి ఏకాదశి సందర్భంగా ఈనెల 6న నిర్వహించే కొండ పండుగకు వచ్చే భక్తుల సౌకర్యం, భద్రతకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు తెలిపారు. ఘాట్ రోడ్డులో ట్రయల్‌కు వచ్చిన ఆర్టీసీ బస్సులో డీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన మల్లికార్జునరావుతో కలిసి బుధవారం ప్రయాణించారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ వర్షాలకు దెబ్బతిన్న కొండ రహదారిని యుద్ధప్రాతిపదికన బాగు చేస్తున్నట్లు చెప్పారు. హిమాలయ గురూజీ శిష్య బృందం అఖండ జ్యోతి వెలిగిస్తారని, రామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ అధ్యక్షుడు అచ్యుత కోటేశ్వరరావు ఆధ్వర్యంలో అన్నదానానికి ఏర్పాట్లు చేస్తున్నారని తెలిపారు. సాంస్కృతిక ప్రదర్శనలతో పాటు ఇతరత్రా సమస్యలు లేకుండా పోలీస్‌శాఖ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ సురేష్, మున్సిపల్ కమిషనర్ సుభాష్‌చంద్రబోసు, పట్టణ సీఐ శోభన్‌బాబు, ఆలయ ఈవో సుధాకర రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ షకీల పలువురు తెదేపా నాయకులు ఉన్నారు.

అత్యుత్తమ ప్రదర్శనకు సత్కారం

అవార్డు అందుకుంటున్న సింగరకొండయ్య

చిలకలూరిపేట (గ్రామీణ), న్యూస్‌టుడే: మండలంలోని మద్దిరాల గ్రామానికి చెందిన తెదేపా రాష్ట్ర సాంస్కృతిక విభాగం కార్యదర్శి పౌరాణిక నటుడు గోరంట్ల సింగరకొండయ్య చౌదరి నాటక పోటీల్లో అత్యుత్తమ ప్రదర్శన భద్ర అవార్డు అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రం పాల్వంచలో జరిగిన పౌరాణిక పద్యనాటక పోటీల్లో ఆయనకు ఈ గుర్తింపు లభించింది. ఎమ్మెల్యేలు ప్రత్తిపాటి పుల్లారావు, చదలవాడ అరవిందబాబు, పార్టీ నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరీముల్లా, నాతాని ఉమామహేశ్వరరావు తదితరులు ఆయనను అభినందించారు.

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

గణపవరం (చిలకలూరిపేట (గ్రామీణ)), న్యూస్‌టుడే: నాదెండ్ల మండలం గణపవరం గ్రామంలో 132 కేవీ విద్యుత్తు ఉప కేంద్రంలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చిలకలూరిపేట పట్టణంలోని ఎన్జీవో కాలనీ, పోతవరం, కృష్ణారెడ్డి డొంక, కుమ్మరికాలనీ, డైకీమానగర్, రామతీనగర్, నెహ్రూనగర్, వేలూరు డొంక, గుర్రాలచావిడి, శారదా హైస్కూలు రోడ్డు, పెదనందిపాడు రోడ్డు, బీరాల రోడ్డు, మండల పరిధిలోని మానుకొండవారిపాలెం, మిట్టపాలెం, గోట్టిపాడు, దండమూడి, నాగభైరవారిపాలెం, గుదేవారిపాలెం, కట్టుపల్లివారిపాలెం, పసుమర్రు, బొప్పూడి, నాదెండ్ల మండలంలో గణపవరం నుంచి కావూరు రోడ్డు వరకు, అమీన్‌ సాహెబ్‌పాలెం, కనపర్రు, ఇర్లపాడు, ఎండుగుంపాలెం, బుక్కాపురం, రాజుగారిపాలెం, గుండ్లవారిపాలెం, మైనంపాడు ప్రాంతాల్లో గృహ, వ్యవసాయ, వాణిజ్య, చిన్న, భారీ పరిశ్రమలకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు డీఈఈ ఆర్.అశోక్‌కుమార్ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

విధ్వంసం నుంచి వికాసం దిశగా..!

విస్తృతంగా ఇంటింటికీ తెదేపా

రొంపిచర్ల: విప్పర్లలో నిర్వహించిన కార్యక్రమంలో గోనుగుంట్ల, తెదేపానేతలు

చిలకలూరిపేటలో ర్యాలీగా బయల్దేరిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట పట్టణం, రొంపిచర్ల, కనమర్లపూడి(శావల్యాపురం), న్యూస్‌టుడే: కష్టాల్లో ఉన్న రాష్ట్రాన్ని [illegible] ప్రజలను ఏడాది లోనే గట్టెక్కించిన ఘనత సీఎం చంద్రబాబుకు దక్కిందని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు కొనియాడారు. 'సుపరిపాలనలో తొలి అడుగు.. ఇంటింటికి తెదేపా' కార్యక్రమంలో భాగంగా బుధవారం చిలకలూరిపేటలోని 13, 14, 17 వార్డుల్లో పర్యటించి ప్రభుత్వ పథకాలను కరపత్రాల ద్వారా వివరించి, ప్రజల నుంచి ప్రభుత్వ పనితీరుపై అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ తల్లికి వందనం పథకంతో బిడ్డల చదువుకు కూటమి ప్రభుత్వం ఎనలేని భరోసా కల్పించిందన్నారు. దీపం-2 పథకంలో భాగంగా ఏడాదికి 3 ఉచిత సిలిండర్లు అందిస్తున్నట్లు తెలిపారు. మంచి ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసే వారిని ప్రజలు తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. తెదేపా నాయకులు నెల్లూరి సదాశివరావు, షేక్ కరీముల్లా, పఠాన్ సమద్‌ఖాన్, మద్దుమాల రవి తదితరులు పాల్గొన్నారు. శావల్యాపురం మండలం [illegible] ప్రభుత్వ చీఫ్‌విప్ జీవీ ఆంజనేయులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఒక సంవత్సరంలోనే 83 శాతం హామీలను అమలు చేశామన్నారు. కూటమి ప్రభుత్వ హయాంలో రాష్ట్రానికి ఇప్పటి వరకు రూ.10లక్షల కోట్లు పెట్టుబడులు వచ్చాయన్నారు. వినుకొండ పట్టణానికి రూ.210కోట్లతో శాశ్వత మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేస్తున్నామన్నారు. కనమర్లపూడిలో శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంకు స్థానంలో కొత్తది నిర్మించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఎస్సీ, బీసీ కాలనీలో ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జీడీసీసీబీ పర్సన్ ఇన్‌ఛార్జి మక్కెన మల్లికార్జునరావు, పరిశీలకుడు మానుకొండ శివప్రసాదు, తెదేపా మండల అధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు. రొంపిచర్ల మండలం కర్లకుంట, విప్పర్లలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు ఇంటింటికి తెదేపాలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అభివృద్ధి, సంక్షేమాన్ని పరుగులు తీయిస్తున్నారన్నారు.

ఆరోగ్య పథకాలపై అవగాహన పెంచండి

సిబ్బందితో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో పద్మావతి

శావల్యాపురం: ప్రభుత్వం అమలు చేస్తున్న ఆరోగ్య పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో పద్మావతి అన్నారు. శావల్యాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె ఆరోగ్య కేంద్రంలో ఓపీ రిజిస్టర్, ఈహెచ్‌ఆర్, గర్భవతుల నమోదు, పీఎంజేవై కార్డుల నమోదు, ప్రయోగశాల రికార్డులు పరిశీలించారు. పోట్లూరు ఆరోగ్య ఉపకేంద్రానికి సంబంధించి ఎల్‌హెచ్‌వీ, ఆరోగ్య కార్యకర్త పనితీరుపై ఆరా తీశారు. ఆరోగ్య కేంద్రాన్ని శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆమె వెంట వైద్యాధికారి ఎం.రాధాకృష్ణన్, సూపర్‌వైజరు ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్తలు నాగలక్ష్మి, విజయలక్ష్మి, శిరీష ఉన్నారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

దాతతో ఆలయ కమిటీ నేతలు

నరసరావుపేట అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలో పులుపులవారి వీధిలో చేపట్టిన శ్రీవీరాంజనేయ సహిత యోగానంద లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి భక్తులు విరాళాలు సమర్పిస్తున్నారు. పట్టణానికి చెందిన కూరగాయల మార్కెట్ వ్యాపారి చీమకుర్తి నవీన్‌కుమార్, శివపార్వతి దంపతులు రూ.3 లక్షలు నగదును ఆలయ కమిటీ సభ్యులకు బుధవారం అందజేశారు. ఆలయంలో నిర్మిస్తున్న 16 స్తంభాల శిలా ముఖ మండపంలో 9వ స్తంభం ఏర్పాటుకు వినియోగించాలని కోరారు. కమిటీ సభ్యులు వనమా కృష్ణ, వనమా సాంబశివరావు, కోవూరి శివశ్రీనుబాబు, బత్తుల విష్ణువర్ధన్‌రావు, గజవల్లి మురళి తదితరులు ఉన్నారు.

» ఇక్కడో కాలువ ఉండాలే?

పట్టణంలోని బరంపేట మిట్టబజారులో మురుగు కాలువలు రూపు కోల్పోయాయి. కాలువలు ఎక్కడ ఉన్నాయో తెలియడం లేదని ప్రజలు వాపోతున్నారు. అధికారుల పర్యవేక్షణ కొరవడి కాలువలు పూడిపోతున్నాయని చెబుతున్నారు. దీనికి తోడు చెత్త తరలింపు బండిని వదిలేయడంతో తుప్పు పట్టి నిరుపయోగంగా మారింది. ఈ విషయమై శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామకోటయ్యను సంప్రదించగా కాలువను వెంటనే శుభ్రం చేసి చెత్త తరలింపు బండిని వినియోగంలోకి తీసుకొస్తామని చెప్పారు. **- న్యూస్‌టుడే, నరసరావుపేట సెంట్రల్**

» గుంతలతో ప్రయాణానికి చింత

గుంటూరు నుండి నరసరావుపేట వచ్చే ప్రధాన రహదారిలో అడుగడుగునా గుంతలతో ప్రయాణికులు అష్టకష్టాలు పడుతున్నారు. రాత్రిళ్లు గుంతలు కనబడక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని వాపోతున్నారు. వాహనాలు దెబ్బతింటున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. అధికారులు గుంతలు పూడ్చాలని కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ డీఈ నరేంద్రరెడ్డిని సంప్రదించగా నిధులు మంజూరు కాగానే రహదారి మరమ్మతులు చేపడతామన్నారు. **- న్యూస్‌టుడే, మల్లమ్మ సెంటర్(నరసరావుపేట)**

» తీగలే ఆధారం

వినుకొండ నుంచి నూజండ్ల వైపు వెళ్తున్న 33/11 విద్యుత్తు లైన్‌లో నూజండ్ల మేజర్ దగ్గర స్తంభాలు ఒరిగి తీగలపై ఆధారపడి ఉన్నాయి. బలమైన గాలివీస్తే నేలకొరిగే అవకాశం ఉంది. మూడు, నాలుగు స్తంభాలు ఒరిగి ఉన్నాయని కూలితే తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నారు. ఒరిగిన స్తంభాలను సరిచేస్తున్నామని ఏఈ సుధాకర్ తెలిపారు. వీటిని కూడా సరి చేసి ప్రమాదాలు జరగకుండా చూస్తామన్నారు. **- న్యూస్‌టుడే, నూజండ్ల**

» అంధకారంలో రాష్ట్ర రహదారి

రొంపిచర్ల నుంచి నరసరావుపేట వెళ్లే మార్గంలో స్థానిక విద్యుత్తు సబ్‌స్టేషన్ వద్ద అద్దంకి - నార్కెట్‌పల్లి రాష్ట్రీయ రహదారిని దాటాల్సి ఉంది. ఈ రోడ్డు క్రాస్ వద్ద విద్యుత్తు దీపాలు లేకపోవడంతో అంధకారం నెలకొంది. ఈ ప్రాంతంలో తరచూ రోడ్డు దాటుతూ వాహనదారులు ప్రమాదాలకు గురై మృతి చెందటం, గాయపడటం పరిపాటిగా మారింది. కనీసం ఈ ప్రాంతంలో సిగ్నల్ లైట్లు లేదా సూచికలు ఉండేలా రాష్ట్రీయ రహదారి పర్యవేక్షణ చేసే సిబ్బంది ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నరసరావుపేట వ్యవసాయం**

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

నూజండ్ల, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య లభిస్తుందని ఎంఈవో రవిచంద్ర అన్నారు. పాతరెడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ తరగతిని బుధవారం ప్రారంభించారు. ప్రస్తుత ప్రభుత్వం అన్ని రంగాల్లోకెల్లా విద్యకే ప్రథమ ప్రాధాన్యం ఇచ్చిందన్నారు. పిల్లలకు కార్పొరేట్ స్థాయి విద్య అందించడానికే అన్ని వసతులు సమకూర్చుతుందని తెలిపారు. అవకాశాలను సద్వినియోగం చేసుకొని గ్రామంలోని నూరుశాతం పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివించాలన్నారు. విద్యాకమిటీ ఛైర్మన్ రాజారావు, ప్రధానోపాధ్యాయుడు దుర్గేశ్వరరావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రారంభం

శావల్యాపురం, న్యూస్‌టుడే : ఉపాధి పథకం కింద 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన పనులపై సామాజిక తనిఖీ చేపట్టనున్నట్లు ఎస్ఆర్పీ బత్తుల అపులయ్య తెలిపారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన బుధవారం మాట్లాడుతూ మండలంలో 15 గ్రామ పంచాయతీల్లో గత ఆర్థిక సంవత్సరంలో 467 పనులకు రూ.7.90కోట్లు వెచ్చించగా వీటిలో కూలీలకు రూ.5.90కోట్లు, మెటీరియల్ వ్యయం రూ.2కోట్లు ఖర్చు చేశారన్నారు. వీటిలో సీసీ రోడ్లు, డ్రెయిన్లు గోకులం షెడ్లు, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు తనిఖీ చేస్తామని, గురువారం ఉపాధి హామీ క్షేత్రసహాయకులు, ఆడిట్ సిబ్బందితో సమన్వయ సమావేశం నిర్వహిస్తామన్నారు. ఎంపీడీవో పేరుమీన సీతారామయ్య, విశ్రాంత ఏపీవో కె. రామారావు తదితరులు ఉన్నారు.

గుర్తింపు పొందిన పార్టీలతో 4న సమావేశం

వినుకొండ, న్యూస్‌టుడే: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు తహసీల్దార్ కార్యాలయంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సురేష్ తెలిపారు. ప్రతి నెల మొదటి వారం సహాయ ఓటరు నమోదు అధికారులు (ఏఈ ఆర్వోలు), రాజకీయ పార్టీల నేతలతో ఓటర్ల జాబితాల స్వచ్ఛీకరణ, పోలింగ్ కేంద్రాల వసతులు ఇతరత్రా అంశాలపై సలహాలు, సూచనలు స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

నేటి నుంచి పోలింగ్ కేంద్రాల అధికారులకు శిక్షణ

వినుకొండ, న్యూస్‌టుడే: నియోజకవర్గంలో అన్ని పోలింగ్ కేంద్రాల అధికారులకు (బీఎల్‌వోలు) శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎస్.సురేష్ తెలిపారు. స్థానిక జాషువా కళాప్రాంగణంలో ఈనెల 3న వినుకొండ మండలం, 8న వినుకొండ పురపాలక సంఘం, 9న నూజండ్ల, 10న బొల్లాపల్లి, 11న శావల్యాపురం, 15న ఈపూరు మండలం బీఎల్‌వోలకు శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఆయన వివరించారు.

అవీ ఇవీ

ఆక్రమణదారులపై చర్యలకు వినతి

నూజండ్ల, న్యూస్‌టుడే: అటవీ, అసైన్డ్ భూములు ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మండల జనసేన అధ్యక్షుడు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ రమేష్‌కుమార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఆక్రమణలో ఉన్న భూములను స్వాధీనం చేసుకోకపోతే జనసేన ఉద్యమం చేపడుతుందన్నారు.

సకాలంలో పంట కాలువల మరమ్మతులు

ఈపూరు, న్యూస్‌టుడే: పంటకాల్వల మరమ్మతుల పనులు సకాలంలో పూర్తిచేసి రైతులకు సజావుగా సాగునీరందేలా చర్యలు తీసుకుంటున్నట్లు డీసీ అధ్యక్షుడు గడిపూడి వేణుగోపాలరావు అన్నారు. ఈపూరు మండలం అంగలూరు మేజరు కాల్వపై జరుగుతున్న కంపతొలగింపు పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పరిధిలో ఆరు పనులు మంజూరుకాగా అయిదు పనులు మొదలైనట్లు తెలిపారు. మేజరు, మైనరు కాల్వలపైన కంపతొలగింపు, పూడికతీత, కట్టలు బలపరిచే పనులు జరుగుతున్నట్లు తెలిపారు. పనులు వేగవంతంగా నిర్వహించి కాల్వలకు నీళ్లు విడుదలచేసేలోపుగా పూర్తిచేస్తామని తెలిపారు.

ఇన్‌ఛార్జి అధికారుల నియామకం

ఈపూరు, న్యూస్‌టుడే: ఈపూరు ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా వి.శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ స్థానంలో ఉన్న కె.ప్రభాకరరావు ఉద్యోగ విరమణ చేయడంతో నకరికల్లులో పరిపాలనాధికారిగా పనిచేస్తున్న శ్రీనివాసరావుకు ఈపూరు ఇన్‌ఛార్జి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు. ప్రభుత్వం అప్పగించిన సర్వేలను త్వరితగతిన పూర్తి చేస్తూ అర్హులైన అందరికీ సంక్షేమ కార్యక్రమాలు అందేలా చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

నాదెండ్ల (చిలకలూరిపేట (గ్రామీణ): నాదెండ్ల మండలం ఇన్‌ఛార్జి డిప్యూటీ ఎంపీడీవోగా రాఘవయ్య నియమితులయ్యారు. ఇప్పటి వరకు పనిచేసిన నిర్మల లక్ష్మీకుమారి జూన్ 30న పదవీ విరమణ చేయడంతో సాతులూరు పంచాయతీ ఈవో రాఘవయ్యకు ఇన్‌ఛార్జి బాధ్యతలు అప్పగించారు.

'రేషన్' అర్జీలను పరిష్కరించాలి

వినుకొండ, న్యూస్‌టుడే: రేషన్ కార్డుల అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని తహసీల్దార్ సురేష్ సూచించారు. వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లతో రెవెన్యూ కార్యాలయంలో బుధవారం సమావేశం నిర్వహించారు. నీటి తీరువా వసూలు చేయాలని నిత్యావసరాల పంపిణీపై శ్రద్ధపెట్టాలని సూచించారు. కౌలు రైతు కార్డుల నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. అన్ని రకాల ప్రభుత్వ సేవలను ప్రజలకు సక్రమంగా అందించేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ మురళి, ఆర్ఐ పాల్గొన్నారు.

పీర్ల ఊరేగింపునకు ఏర్పాట్లు

మల్లమ్మ సెంటర్(నరసరావుపేట): త్యాగానికి ప్రతీకగా నిలిచే మొహరంను భక్తిప్రపత్తులతో నిర్వహించేందుకు ముస్లింలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. నరసరావుపేటలోని వరవకట్ట, కోట సెంటర్, గుంటూరు రోడ్, ఇస్లాంపేట, పనసతోట, తదితర ప్రాంతాల్లో ఇప్పటికే పీర్ల పంజాలను అలకరించారు. పీర్ల ఊరేగింపులో వందల సంఖ్యలో పాల్గొననున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

గణపవరం (చిలకలూరిపేట (గ్రామీణ), న్యూస్‌టుడే : రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వృద్ధుడు బుధవారం మృతి చెందినట్లు నాదెండ్ల ఎస్సై పుల్లారావు తెలిపారు. యడ్లపాడు మండలం ఉన్నవకు చెందిన కూరాకుల దేవదానం (80) మే 14న ద్విచక్రవాహనంపై చిలకలూరిపేటకు వస్తుండగా గణపవరం పరిధిలో ఏఎంజీ ఎదుట ముందు వెళ్తున్న వాహనాన్ని దాటే క్రమంలో ఎదురుగా వస్తున్న మరో వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో తీవ్ర గాయాలైన ఆయనను ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. కుమారుడు సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అయిదుగురు జూదరుల అరెస్టు

చిరుమామిళ్ల(చిలకలూరిపేట (గ్రామీణ), న్యూస్‌టుడే : నాదెండ్ల మండలం చిరుమామిళ్ల గ్రామ పరిధిలో జూదం ఆడుతున్న అయిదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై పుల్లారావు బుధవారం తెలిపారు. వారి నుంచి రూ.8 వేల నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు.

బాధ్యతగా పనిచేస్తే గుర్తింపు

నూజండ్ల, న్యూస్‌టుడే: బాధ్యతలు గుర్తెరిగి పనిచేసిన వారికి సమాజంలో గుర్తింపు, గౌరవం ఉంటాయని డీఎల్‌డీఏ మాజీ ఛైర్మన్ లగడపాటి వెంకట్రావు అన్నారు. నూజండ్ల జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన, ఇక్కడకు బదిలీపై వచ్చిన వారికి పూర్వ విద్యార్థుల కమిటీ ఆధ్వర్యంలో బుధవారం సన్మానం నిర్వహించారు. పాఠశాలకు కావల్సిన వసతులు సమకూర్చడానికి పూర్వ విద్యార్థుల కమిటీ తోడ్పాటు ఇస్తుందని కమిటీ అధ్యక్షుడు గంగినేని రాఘవరావు అన్నారు. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవోలు సాంబశివరావు, రవిచంద్ర, నేతలు గంగినేని ఆంజనేయులు, జడ్డా రామయ్య, బేతపూడి చిరంజీవి, సర్పంచి వెంకట స్వామి, విద్యాకమిటీ ఛైర్మన్ శ్రీను, ప్రధానోపాధ్యాయురాలు శ్రీదేవి తదితరులున్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

నూజండ్ల, న్యూస్‌టుడే: ప్రతి గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయించాలని లేదంటే చర్యలు తప్పవని ఎంపీడీవో ఉమాదేవి హెచ్చరించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ కార్యక్రమంలో భాగంగా బుధవారం నూజండ్ల, ఉప్పలపాడులో ఆమె పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. ఘనవ్యర్థాల కేంద్రాలు అందుబాటులోకి తీసుకు రాని కార్యదర్శులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. కాలువల్లో చెత్త, మురుగు తొలగించాలని ఆదేశించారు.

పంటల బీమా పథకం.. రైతుకు వరం

నరసరావుపేట: పత్తిలో సస్యరక్షణ చర్యలు వివరిస్తున్న ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో శాంతి

నరసరావుపేట సెంట్రల్, రొంపిచర్ల, చిలకలూరిపేట గ్రామీణ, యడ్లపాడు. వినుకొండ రూరల్, నూజండ్ల, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచించారు. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ నియోజకవర్గాల్లోని మండలాల్లో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాలు నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. ఆయా కార్యక్రమాల్లో అధికారులు మాట్లాడుతూ మోతాదుకు మించి రసాయన ఎరువుల వాడకం వల్లన భూమి నిస్సారంగా మారుతుందని, మొక్కజొన్నలో కలుపు యాజమాన్య పద్ధతులు, పత్తిలో సస్యరక్షణ చర్యలు వివరించారు. అన్ని రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట పైరులైన జనుము, జీలుగ, విత్తనాలు 50 శాతం రాయితీతో రైతులకు అందుబాటులో ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులు పొగాకు బేళ్లలో తేమ 20 శాతం లోపు ఉండేలా ఆరబెట్టుకుని, సక్రమంగా గ్రేడింగ్ చేసుకుని కొనుగోలు కేంద్రానికి తీసుకు రావాలని సూచించారు. కౌలు రైతులు పంట సాగుదారు హక్కు పత్రాలు పొందాలని కోరారు. ఉద్యాన పంటలు సాగు చేయడం ద్వారా అధిక ఆధాయం పొందవచ్చునని 5 ఎకరాల లోపు రైతులకు ఉపాధిహామీ పథకంలో ఖర్చు లేకుండా పంటలు సాగు చేయవచ్చని వివరించారు. నరసరావుపేట మండలం పమిడిపాడు, కేతముక్కల అగ్రహారం గ్రామాల్లో ఏడీఏ శ్రీనివాసరావు, ఏవో శాంతి రైతులు పాల్గొన్నారు. ఆయా మండలాల్లో ఏవోలు శివలలిత, సీహెచ్ సరిత, హరిప్రసాద్, ఆంజనేయులు నాయక్ వినుకొండ మండల ఉద్యాన శాఖాధికారి రసూల్ తదితరులు పాల్గొన్నారు.

వడివడిగా బస్‌షెల్టర్ల నిర్మాణం

వినుకొండ, న్యూస్‌టుడే: పట్టణంలో బస్‌షెల్టర్ల నిర్మాణ పనులు వేగవంతమయ్యాయి. ప్లాట్‌ఫారంలు పూర్తి చేసి షెల్టర్లు బిగిస్తున్నారు. పురపాలకసంఘ కార్యాలయం వద్ద దాదాపు అన్ని పనులు పూర్తి చేశారు. ఎల్‌ఈడీ బల్బులతో నామ ఫలకాలు ఏర్పాటు చేయడంతో రాత్రి వేళ వెలుగులతో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. ఎన్నెస్పీకాలనీ, ముళ్లమూరు బస్టాండ్, వెల్లటూరు రోడ్డులో షెల్టర్ల పనులు చేస్తున్నారు. వీటి నిర్మాణానికి పురపాలకసంఘం రూ.లక్ష ఖర్చు చేయగా మిగిలినది శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ భరిస్తోంది. త్వరలో పనులు పూర్తి చేసి ప్రారంభోత్సవాలు నిర్వహిస్తామని మున్సిపల్ ఏఈ ఆదినారాయణ తెలిపారు. ఇవి అందుబాటులోకి వస్తే ప్రయాణికులకు నీడ దొరుకుతుంది.

LOSS OF PASSPORT

I, VADETHE BOHJYA NAIK (Cell: 9701125487) S/o. Deva Chand Naik, Resident of Door No. 3-174, Domalagundam Thanda, Bollapalli Mandal, Palnadu District, Andhra Pradesh. I Lost my original Passport No. R3022075 (Issued at Vijayawada on 08-08-2017 valid upto 07-08-2027) while Shifting From my Old House to New House in the Village of Domalagundam Thanda on 28-06-2025. If anybody finds it, please inform me.

(c) eenadu

సత్తెనపల్లి
• సత్తెనపల్లి • పెదకూరపాడు • మాచర్ల • గురజాల

జ్వరం వస్తే పరీక్ష తప్పనిసరి

రాజుపాలెంలో ప్రదర్శన నిర్వహిస్తున్న సిబ్బంది

రాజుపాలెం, న్యూస్‌టుడే: దోమకాటుతో జ్వరం వస్తే.. డెంగీ కాదో నిర్ధారించుకోవడానికి రక్త పరీక్ష తప్పనిసరిగా చేయించుకోవాలని పీహెచ్‌సీ వైద్యుడు రవితేజానాయక్ అన్నారు. బుధవారం రాజుపాలెంలో నిర్వహించిన డెంగీ మాసోత్సవ అవగాహన ప్రదర్శనలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఇంటితోపాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. దోమకాటుకు గురికాకుండా తెరలు వినియోగించాలని సూచించారు.

రెంటచింతలలో సాయి రథయాత్ర

రెంటచింతల, న్యూస్‌టుడే: పుట్టపర్తి సాయిబాబా జయంతి వేడుక రెంటచింతలలో బుధవారం నిర్వహించారు. గురజాల నుంచి వచ్చిన రథాన్ని పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు హారతులతో స్వాగతం పలికారు. రామకృష్ణ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు. నాయకులు బాబు, సాంబ, గణేష్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం రథాన్ని మాచర్లకు తరలించారు.

ఊరేగింపులో విద్యార్థులు

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

సత్తెనపల్లి: 80085 73171 పెదకూరపాడు: 80088 31888
రెంటచింతల: 80085 73185 గురజాల: 80085 7 3176

? కొండమోడులోని పలు కాలనీల్లో మురుగు కాలువలు పూడికతో నిండాయి. నీరు నిల్వ ఉండి దోమలు విజృంభిస్తున్నాయి. - **నూరేట్** ✓ వెంటనే పరిశీలించి పారిశుద్ధ్య కార్మికులతో మురుగు తొలగిస్తాం. - **శ్యాంప్రసాద్, కార్యదర్శి, - న్యూస్‌టుడే, రాజుపాలెం**

? నకరికల్లు చౌత్రాసెంటర్ వద్ద ఎస్సై నివాసం కోసం నిర్మించిన క్వార్టర్స్ శిథిలావస్థకు చేరింది. భవనం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. - **స్థానికులు** ✓ ఈ విషయం మా దృష్టికి రాలేదు. పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం. - **ప్రసాద్, కార్యదర్శి, - న్యూస్‌టుడే, నకరికల్లు**

ఎట్టకేలకు కదిలిన అధికారులు

ఈనాడు స్పందన

బడి బస్సు వద్ద ఆర్టీవో అధికారులు

దాచేపల్లి, న్యూస్‌టుడే: రవాణా శాఖ అధికారులు ఎట్టకేలకు కదిలారు. 'బడి బస్సు భద్రమేనా' శీర్షిక జూన్ 26న 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి ఆర్టీవో అధికారులు స్పందించారు. బుధవారం ఉదయం మాచర్ల మోటారు వాహన తనిఖీ అధికారి శేషిరెడ్డి ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడి దాచేపల్లిలో పలు ప్రైవేట్ పాఠశాల బస్సులను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించకుండా నడుపుతున్న డ్రైవర్లు, ప్రథమ చికిత్స బాక్సులు లేని బస్సులను గుర్తించి యాజమాన్యాలపై కేసులు నమోదు చేశారు. మండలం వ్యాప్తంగా 20 బస్సులను తనిఖీ చేశారు. 6 బస్సులపై కేసులు నమోదు చేసి, రూ.28,300 అపరాధ రుసుం విధించారు. ఈ సందర్భంగా శేషిరెడ్డి మాట్లాడుతూ పాఠశాల బస్సులను నిరంతరం తనిఖీ చేస్తామన్నారు.

తెదేపాలో చేరిన సంజీవరెడ్డి, ఎంపీటీసీ సభ్యులతో ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి

తెదేపాలో చేరిన ఎంపీపీ

వెల్దుర్తి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి వైకాపా నాయకులు తెదేపాలోకి చేరుతున్నారని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. బుధవారం శిరిగిరిపాడు గ్రామానికి చెందిన ఎంపీపీ అలుగుమల్లి సంజీవరెడ్డి ఎమ్మెల్యే సమక్షంలో తెదేపాలోకి చేరారు. అలాగే గంగులకుంట, వెల్దుర్తి, శిరిగిరిపాడు-2 ఎంపీటీసీ సభ్యులు దాసరి చిన్న శ్రీనివాసరావు, రాయనూతల లక్ష్మి, రమావత్ బొడిబాయి తదితరులు తెదేపా తీర్థం పుచ్చుకున్నారు.

మొక్కలు పెంచే తరుణమిదే!

పట్టణాల్లో పచ్చదనానికి ప్రాధాన్యమివ్వాలి

సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మాచర్ల (కారంపూడి), న్యూస్‌టుడే

భౌగోళిక విస్తీర్ణంలో 33 శాతం పచ్చదనం ఉండాలి. పల్నాడు ప్రాంతంలో 20 శాతం కూడా పచ్చదనం లేదు. మొక్కలు నాటి, సంరక్షించే బాధ్యత పాలకులు, అధికారులు తీసుకోవడం లేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. మొక్కలు నాటేందుకు ఇదే అనువైన సమయం. గత తెలుగుదేశం ప్రభుత్వంలో పచ్చదనం పెంచేందుకు పట్టణాల మధ్య పోటీ పెట్టారు. మొక్కలు నాటడం దగ్గరుండి వాటిని సంరక్షించే వరకు పచ్చదనానికి పాయింట్లు ఇచ్చి ప్రోత్సాహకాలు కూడా అందజేశారు. 2014-19 మధ్య పెద్దఎత్తున మొక్కలు నాటారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ కార్యక్రమాన్ని ఆటకెక్కించారు. పురపాలక సంఘాలు ప్రత్యేక చొరవ చూపిస్తే తప్పించి పచ్చదనం ఊసే లేకుండాపోయింది. ప్రత్యేక నిధులు కేటాయింపు లేదు. ఇదే సందర్భంలో వాహనాలు, పరిశ్రమల సంఖ్య గణనీయంగా పెరిగి కాలుష్యం కోరల్లో ప్రజలు చిక్కుకుంటున్నారు. ఈ ఏడాది నుంచైనా పట్టణాల్లో పచ్చదనం పెంచడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తే, కాలుష్యానికి కళ్లెం వేయొచ్చు.

మళ్లీ పోటీ అవసరం: గతంలో ఉన్న పచ్చదనపు పోటీ మళ్లీ పెడితే మున్సిపాల్టీలు హరిత శోభను సంతరించుకుంటాయి. సత్తెనపల్లి, పిడుగురాళ్ల, మాచర్ల పట్టణాలతోపాటు దాచేపల్లి, గురజాల నగర పంచాయతీల్లో పచ్చదనం తక్కువగా ఉంది. సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు పరిశ్రమల్లో కాలుష్యం ఎక్కువగా ఉంటే.. మాచర్ల, దాచేపల్లి పట్టణాలకు పరిశ్రమల సెగ ఉంది. సత్తెనపల్లి, గురజాలల్లో వ్యవసాయ వ్యర్థాల తాకిడి ఎక్కువ. పర్యాటక ప్రాంతం అమరావతిలోనూ పచ్చదనం లోపిస్తోంది.

☛ సత్తెనపల్లి పట్టణంలో రైల్వేస్టేషన్ రోడ్డులో పాత రక్షిత చెరువును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడంతో అక్కడ పచ్చదనం పెరిగింది. అటు భాగంగా జలాలు.. ఇటు పచ్చదనమూ నవ్వడి ఆ ప్రాంతాన్ని చల్లగా ఉంచుతోంది. పిడుగురాళ్ల, మాచర్ల పట్టణాల్లోనూ చెరువుల వెంట పచ్చదనాన్ని పెంచే చర్యలు చేపట్టాలి.

☛ ఆహ్లాదకర జీవనం, పర్యావరణ పరిరక్షణలో భాగంగా రోడ్ల వెంబడి.. ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటడంతోపాటు పర్యావరణ ప్రేమికులకు నీడ, పండ్లు, పూల వంటివి ఇచ్చే మొక్కలు పంపిణీ చేయాలి. మనిషికి కనీసం 10 మొక్కలు నాటాలని పర్యావరణ ప్రేమికులు చెబుతున్నారు. ఒకటి కూడా నాటలేని దుస్థితి కొన్నాళ్లుగా ఉంది.

☛ 15వ ఆర్థిక సంఘం నిధులు పర్యావరణ పరిరక్షణకు వినియోగించుకోవచ్చనే మార్గదర్శకాలు ఉన్నా, ఆ నిధుల లభ్యత ప్రశ్నార్థకంగా ఉంది.

అభివృద్ధి దిశగా అడుగు

అంబడిపూడిలో తెదేపా నేతల ప్రచారం

అంబడిపూడి (అచ్చంపేట), న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, రాష్ట్రాన్ని ప్రగతి దిశగా తీసుకెళుతున్నట్లు మండల తెదేపా అధ్యక్షుడు ఆశీర్వాదం పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమం అంబడిపూడిలో ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి కరపత్రాలు అందజేశారు. నాయకులు శ్రీను, పాపిరెడ్డి, అంజనేయులు, నరసింహారావు, నవీన్, బుచ్చిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆశీస్సులు అందించాలి

సాగరమాత ఆలయంలో ప్రార్థనలు చేస్తున్న తెలుగు మహిళలు

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వానికి ఆశీస్సులు అందించాలని కోరుతూ సాగర మాత మందిరంలో తెలుగు మహిళలు ప్రార్థనలు నిర్వహించారు. 2024లోనూ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ గెలుపునకు ఇక్కడ ప్రార్థనలు చేశామని తెలుగు మహిళలు అన్నారు. బుధవారం విజయపురిసౌత్‌లోని సాగరమాత ఆలయానికి వెళ్లి తెలుగు మహిళలు అంబికా, వందనదేవి, సుశీల, అనురాధ తదితరులు ప్రార్థనలు చేశారు.

కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులందరికీ షరతులు లేకుండా ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రాజశేఖర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సత్తెనపల్లి మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన చేసి నిరసన తెలిపారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పత్తిలో సస్యరక్షణపై అవగాహన

మాచవరం, న్యూస్‌టుడే: 'పొలం పిలుస్తోంది' కార్యక్రమాన్ని బుధవారం మోర్జంపాడులో నిర్వహించారు. దీనికి జిల్లా వనరుల కేంద్రం డీడీఏ శివకుమారి, ఏవో రాజ్యం హాజరయ్యారు. పత్తి, మిరప పంటలో అనుసరించాల్సిన సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు రైతులకు తెలియజేశారు.

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: ఉద్యాన పంటల సాగుకు రైతులను ప్రోత్సహించాలని డ్వామా పీడీ సిద్ధ లింగమూర్తి చెప్పారు. బుధవారం గుత్తికొండలో ఓ రైతు ఉపాధి పథకం ద్వారా మూడు ఎకరాల్లో మామిడి మొక్కలు నాటుతున్నారు. వాటిని పరిశీలించేందుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయన రైతులు ముందుకు వస్తే ఉపాధి పథకం ద్వారా మొక్కలు ఇస్తామని తెలిపారు.

భూముల వివరాలు ఇవ్వరూ..

కారంపూడి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని అటవీ, అసైన్డ్, ప్రభుత్వ భూములు, వాటిలో ఆక్రమణల వివరాలు ఇవ్వాలని జనసేన మండల నాయకులు బుధవారం తహసీల్దార్ వెంకటేశ్వరనాయక్‌కు వినతిపత్రం అందించారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదేశాలతో వినతి పత్రాలు అందిస్తున్నామన్నారు.

సుపరిపాలన అందిస్తున్నాం.. ఆశీర్వదించండి

పెదకూరపాడులో కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ప్రవీణ్, నేతలు

సత్తెనపల్లిలో పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కన్నా

పెదకూరపాడు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం తొలి ఏడాది పాలన అద్భుతమని ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. పెదకూరపాడులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధిని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల కరపత్రాలను అందజేశారు. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో అందిస్తున్న ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని కోరారు. తాలూకా పంచాయతీ కార్యాలయం వద్ద రూ.40 లక్షలతో నిర్మించనున్న నూతన నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. సాగునీటి సంఘాల ఆధ్వర్యంలో ఎన్.ఎస్. కాలువ పరిధిలో పూడికతీత పనులు పరిశీలించారు.

దిడుగు(అమరావతి): మండల పరిధిలోని దిడుగులో ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ ఆధ్వర్యంలో బుధవారం ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్సీ కాలనీలో రూ.8 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు.

వెల్దుర్తి: రాష్ట్రానికి పెద్దఎత్తున పెట్టుబడులు తీసుకొస్తూ, పేదల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి కోరారు. మండల పరిధిలోని శిరిగిరిపాడులో బుధవారం 'సుపరిపాలనలో తొలి అడుగు.. ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ప్రతి ఇంటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించి, కరపత్రాలు అందజేశారు.

సత్తెనపల్లి: రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పాలన అందిస్తుందని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని 11వ వార్డులో బుధవారం సుపరిపాలన తొలి అడుగు.. ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమాన్ని నిర్వహించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తున్నామన్నారు. మంచి ప్రభుత్వానికి ప్రజలందరూ అండగా నిలవాలని కోరారు.

మాదుగులలో మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు

గురజాల గ్రామీణ: కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన గురించి ప్రజలకు వివరించాలని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు కోరారు. మాదుగుల గ్రామంలో బుధవారం సాయంత్రం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. తొలుత గురుకుల పాఠశాలను సందర్శించారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేశారు. పలువీధుల్లో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాలను ఆవిష్కరించారు. అనంతరం గ్రామసభలో.వారు మాట్లాడుతూ మాదుగుల గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందేలా గ్రామస్థాయి నాయకులు కృషి చేయాలని సూచించారు. అనంతరం పల్లెనిద్ర కార్యక్రమాన్ని యరపతినేని నిర్వహించారు.

మురుగు పొంగి.. రోడ్డుపై చేరి

మండలంలోని శిరిగిరిపాడు వీరాంజనేయస్వామి ఆలయ వీధిలోని మురుగు కాలువలు పూడికతో నిండాయి. మురుగు నీరు పొంగి రోడ్లపైకి చేరుతోంది. దోమలకు ఆవాసంగా మారి, వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి కాలువల్లో పూడిక తీయించాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, వెల్దుర్తి**

ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత

మండల పరిధిలోని బూదవాడ అంబేడ్కర్ కాలనీలో మంచినీటి ట్యాంకు చుట్టూ అపరిశుభ్రత నెలకొంది. ట్యాంకుకు పాచిపట్టింది. దుర్వాసన వస్తోంది. ఈ ట్యాంకు నీటినే తాగుతున్నామని కాలనీవాసులు ఆవేదన చెందుతున్నారు. రోగాల బారిన పడుతున్నామని, అధికారులు స్పందించి ట్యాంకులను శుభ్రం చేయాలని కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, గురజాల గ్రామీణ**

మారని అధికారుల తీరు

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయింది. అయినా నకరికల్లు మండలం చేజర్ల గ్రామ రైతు సేవా కేంద్రం గోడలపై మాజీ ముఖ్యమంత్రి జగన్ చిత్రపటాలు దర్శనమిస్తున్నాయి. దీనిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు స్పందించి వాటిని తొలగించాలని కూటమి నాయకులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, నకరికల్లు**

తాగునీరు వృథా

నీటిని పొదుపు చేయాలని సందేశాలు ఇస్తున్న అధికారులు మాత్రం ఆచరణలో పెట్టడం లేదు. వీధుల్లో ఏర్పాటు చేసిన కుళాయిలకు ట్యాప్‌లు లేకపోవడం, పైపు లైన్ల లీకేజీలు అరికట్టకపోవడంతో తాగు నీరు వృథాగా పోతోంది. పెదకూరపాడు మండలం ముస్సాపురంలో వీధి కుళాయిలకు ట్యాప్‌లు లేవు. నిత్యం నీరు వృథా అవుతోంది. **- న్యూస్‌టుడే, పెదకూరపాడు**

నేడు ప్రైవేట్ పాఠశాలల మూసివేత

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలలపై తీసుకుంటున్న ఏకపక్ష చర్యలపై గురువారం రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలియజేస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు పీజేఎస్ ధన్, వెంకట్రామయ్య, రామయ్య తెలిపారు. ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు తల్లికి వందనం, ప్రతిభా అవార్డులు ఇచ్చినందుకు ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కొంత మంది అధికారులు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలపై అతిగా స్పందించటం, తనిఖీలు చేయటం, త్రీమెన్ కమిటీలు వేయటం దురదృష్టకరమని పేర్కొన్నారు. బెదిరింపు చర్యలకు నిరసనగా నేడు ప్రైవేట్ పాఠశాలలు రాష్ట్ర వ్యాప్తంగా మూసివేస్తున్నట్లు తెలిపారు.

అనుమతుల్లేని బడికి నోటీసు

వెల్దుర్తి, న్యూస్‌టుడే: మండలంలోని గుండ్లపాడులో అనుమతులు లేకుండా ఇరవై రోజుల నుంచి నిర్వహిస్తున్న భ్రమరాంబ పాఠశాల యాజమాన్యానికి బుధవారం ఎంఈవో ఖాసిం నోటీసులు జారీ చేశారు. గుండ్లపాడులో ఒకే లైసెన్స్‌తో రెండు పాఠశాలలు నడుపుతున్నట్లు సమాచారం అందడంతో తనిఖీ చేశామని, అనుమతులు లేని పాఠశాలకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నోటీసులు ఇచ్చామని ఎంఈవో వివరించారు. రెండ్రోజుల్లో వివరణ అనంతరం తదుపరి చర్యలు కొనసాగుతాయన్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

తుళ్లూరు, న్యూస్‌టుడే: అనుమానాస్పదస్థితిలో ద్విచక్రవాహన చోదకుడు మృతి చెందిన ఘటన బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల వివరాల ప్రకారం.. అమరావతి మండలం లేమల్లె గ్రామానికి చెందిన మేకల లక్ష్మణరావు (26) మంగళగిరి మండలంలోని అక్షయపాత్రలో వాటర్ ప్లాంట్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నారు. రోజు లేమల్లె నుంచి మంగళగిరికి పెదపరిమి మీదుగా ద్విచక్ర వాహనంపై రాకపోకలు సాగిస్తున్నాడు. ఈ క్రమంలో అక్షయపాత్ర సంస్థకు వెళ్లడానికి ఈ నెల 30న లేమల్లె నుంచి బయలు దేరిన లక్ష్మణరావు ఇంటికి తిరిగి రాలేదు. బుధవారం పెదపరిమి, నీరుకొండ గ్రామాల మధ్య మేకల కాపరులు అటుగా వెళ్లారు. రహదారి పక్కన ఉన్న కాలువలో మేత మేయటానికి బెదురుతున్న మేకలను చూసి అక్కడ మృతదేహం ఉన్నట్టు గమనించిన కాపరులు అధికారులకు సమాచారం అందించారు. రహదారి పక్కన కాలువలో ముళ్లచెట్ల పక్కన లక్ష్మణరావు మృతదేహం, కొద్ది దూరంలో చెట్ల మధ్య ద్విచక్ర వాహనం పడి ఉన్నాయి. రహదారిపై ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు కాలువలో పడి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తుళ్లూరు ఎస్.ఐ బాబురావు తెలిపారు.

సీనియర్ వైద్యుల సేవలు బాగు

వైద్యులను సత్కరిస్తున్న ఐఎంఏ సభ్యులు

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పల్నాటి ప్రజలకు నాలుగున్నర దశాబ్దాలుగా వైద్యసేవలు అందించిన సీనియర్ వైద్యులను ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిడుగురాళ్ల ఆధ్వర్యంలో పట్టణంలోని బాలాజీ కల్యాణ మండపంలో సత్కరించారు. అసోసియేషన్ రాష్ట్రశాఖ ప్రధాన కార్యదర్శి సుభాష్ చంద్రబోసు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఇండియన్ మెడికల్ అసోసియేషన్ పిడుగురాళ్ల శాఖ అధ్యక్షుడు ధూళిపాళ్ల భరత్‌కుమార్ మాట్లాడుతూ పల్నాడు ప్రాంతంలో వైద్య సేవలు అందించి ప్రజల మన్ననలు సీనియర్ వైద్యులు పొందుతున్నారని చెప్పారు. 45 ఏళ్లుగా సేవలతో మంచి గుర్తింపు పొందారని కొనియాడారు. వైద్యులు కేవీ సుబ్బారావు, బాదం శివారెడ్డి, సీసీ సుబ్బారావు, నాయుడు వసంతరావు, ఆలా సాంబశివరావులను సత్కరించారు. వారికి డాక్టర్ ఆఫ్ డిస్టింక్షన్ అవార్డు 2025ను అందజేశారు. క్యాన్సర్ వ్యాధిపై డాక్టర్ రాము కందుల అవగాహన కల్పించారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య

వెల్దుర్తి, న్యూస్‌టుడే: కుటుంబ కలహాలతో మండాది- రచ్చుమల్లపాడు జంక్షన్ వద్ద మడేలయ్య స్వామి ఆలయ ప్రాంగణంలో ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. రచ్చుమల్లపాడు గ్రామంలో నివసించే నాగేశ్వరనాయక్ (52) బుధవారం ఉదయం ఆలయ ప్రాంగణంలో పురుగుల మందు తాగి మృతి చెందాడు. కుటుంబ కలహాలే కారణమని అతడి బంధువులు తెలిపారు.

కార్మికుడి మృతి

పిడుగురాళ్ల, న్యూస్‌టుడే: పిల్లుట్ల రోడ్డులో ఓ కార్మికుడు మృతి చెందాడు. దుర్గి మండలం అడిగొప్పల గ్రామానికి చెందిన మాదాసు రామయ్య (55) ఎనిమిదేళ్ల నుంచి కొండమోడు ప్రాంతంలో ఉంటూ సున్నపు మిల్లుల్లో పనిచేస్తున్నాడు. మిల్లులో పని ముగించుకుని పిల్లుట్ల రోడ్డుకు వచ్చాడు. ఓ దుకాణం ముందు నిలబడి ఉన్నట్లుండి కుప్పకూలి మృతి చెందాడు. గుండెపోటుతో మృతి చెంది ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు.

శివాలయ కమిటీ ఛైర్మన్ ఎన్నిక

రెంటచింతల, న్యూస్‌టుడే: స్థానిక శివాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడిగా కొత్త గోపాలరావును ఎన్నుకున్నట్లు ఈవో రామిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి అనుమతితో చేపట్టిన కమిటీలో 9 మంది సభ్యులు ఉంటారన్నారు. ఉత్తర్వులు జారీ చేయగానే అధ్యక్షుడు పదవీ బాధ్యతలు చేపడతారన్నారు.

ట్యాబ్‌ల అందజేత

గురజాల, న్యూస్‌టుడే: గురజాల నగర పంచాయతీ పరిధిలో పనిచేసే మెప్మా యానిమేటర్లకు ట్యాబ్‌లను ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు బుధవారం అందజేశారు. పంచాయతీరాజ్ అతిథి గృహంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. నాయకులు కాంతారావు, లక్ష్మీనారాయణ, బొల్లయ్య, శ్రీనివాసరావు, కమిషనరు శివన్నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదం చేయండి

క్రోసూరు(అచ్చంపేట), న్యూస్‌టుడే: నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేసి, కనీస వేతన చట్టాన్ని అమలు చేయాలని కోరుతూ ఈనెల 9న చేపట్టే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సంఘం జిల్లా కార్యదర్శి మల్లేశ్వరి, సీఐటీయూ నాయకుడు హనుమంతరావు కోరారు. బుధవారం క్రోసూరులో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు.

సుస్థిర అభివృద్ధి ప్రణాళికలపై సమీక్ష

సత్తెనపల్లి, న్యూస్‌టుడే: నియోజకవర్గ సుస్థిర అభివృద్ధికి దోహదపడేలా పీ-4 స్వర్ణాంధ్ర 2047 ప్రణాళికలు రూపొందించాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అధికారులకు సూచించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో బుధవారం తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ అనుబంధ రంగాలు, పరిశ్రమలు, పర్యాటకం, రవాణా రంగాల్లో నియోజకవర్గం అభివృద్ధి సాధించేలా ప్రణాళికలు ఉండాలని చెప్పారు. ఆర్డీవో రమణకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

అచ్చంపేట: విద్యాభివృద్ధికి స్నేహ హస్తాలు ఫౌండేషన్ చేస్తున్న సేవలు మరువలేనివని స్థానిక ఆదర్శ ప్రాథమిక పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్‌పర్సన్ సాయికుమారి అన్నారు. బుధవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 70 మంది విద్యార్థులకు విద్యా సామగ్రి అందజేశారు. ప్రధానోపాధ్యాయుడు నరసింహారావు, స్నేహహస్తాలు ప్రతినిధి కరిముల్లాబాబు పాల్గొన్నారు.

ప్రకటన

మా క్లయింటు - **NTR జిల్లా, ఎనికేపాడు కాపురస్తులు, బొబ్బా రాఘవేంద్ర రావు** గారి భార్య **లక్ష్మి** గారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా - మా క్లయింటు **తెలంగాణ రాష్ట్రం , రంగారెడ్డి జిల్లా, దుండిగల్ మండలం, దుండిగల్ గ్రామ కాపురస్తులైన వేముల వెంకటరావు** వద్ద దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని కొనుగోలు చేయుటకు అగ్రిమెంటు కుదుర్చుకుని, రిజిస్ట్రేషన్ కొరకు ఏర్పాట్లు చేసుకునియున్నారు. సదరు కొనుగోలుపై ఎవరికి ఎట్టి అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్ననూ, నేటి మొదలు 10 రోజులలోగా ఈ దిగువ తెలిపిన అడ్రసు నందు తెలియజేయగలరనియూ, గడువు దాటిన పిదప వచ్చు ఎట్టి అభ్యంతరములు ఆక్షేపణలు చెల్లనేరవనియూ,మా క్లయింటును బైండు చేయజాలవనియూ ఇందుమూలముగా తెలియజేయడమైనది.

షెడ్యూలు : **అయిటం నెం.1:-** గుంటూరు జిల్లా, **సత్తెనపల్లి మండలం,** సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రార్ వారి యిలాకా, పాకాలపాడు శివారు గోగులపాడు గ్రామ పంచాయితీ ఏరియాలోని **D.No.561-E** మరియు **561-D** దాఖలా **య.1-75ట్ల** భూమికి హద్దులు- తూర్పు:గొల్లపల్లి వీరమ్మ భూమి, దక్షిణం: అంకమ్మ మరియు అంజమ్మ స్వామి వార్ల గుడి మరియు బావి భూమి హద్దు మరియు R&B రోడ్డు హద్దు, పడమర: తన్నీరు సుబ్బారావు భూమి, ఉత్తరం : అయిటం నెం.2.

అయిటం నెం.2 - గుంటూరు జిల్లా, **సత్తెనపల్లి మండలం,** సత్తెనపల్లి సబ్ రిజిస్ట్రార్ వారి యిలాకా, పాకాలపాడు శివారు గోగులపాడు గ్రామ పంచాయితీ ఏరియాలోని **D.No.561-E** మరియు **561-D** దాఖలా **య.0-08ట్ల** భూమికి హద్దులు- తూర్పు:గొల్లపల్లి వీరమ్మ భూమి, దక్షిణం: అయిటం నెం.1 పడమర: తన్నీరు సుబ్బారావు భూమి, ఉత్తరం: తన్నీరు ఆంజనేయులు భూమి.

ఇట్లు,
రావి రామమోహన్ రావు, గుమ్మడి అనిత, తూమాటి బాలమురళీకృష్ణ, అడ్వకేట్స్
ఫస్ట్ ఫ్లోర్, శ్రీ సాయిదత్త టవర్స్, శేషాద్రిశాస్త్రి స్ట్రీట్,
గవర్నర్‌పేట, విజయవాడ - 520002.
ఫోన్ : 98481 23311

ప్రాణాలు తీస్తున్న విద్యుత్తు తీగలు

రెండ్రోజుల్లో నాలుగు మూగజీవాలు మృతి

☛ గ్రంథసిరి గ్రామ సమీపంలోని పొలంలో బుధవారం సాయంత్రం విద్యుత్తు తీగ తగిలి గేదె మృతి చెందింది. దీంతో పోషకుడు జకరయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

☛ అచ్చంపేట మండలంలో విద్యుత్తుశాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా మంగళవారం రెండు మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. నిండుజర్ల గ్రామంలోని రామాలయం వద్ద విద్యుత్తు స్తంభానికి ఉన్న ఎర్త్ తీగె తెగిపడిపోయింది. ఉదయం ఆ తీగె తగిలి పొట్టేలు మృతి చెందింది. విద్యుత్తు సిబ్బందికి సమాచారం అందించగా తాత్కాలిక మరమ్మతులు చేశారు. తిరిగి సాయంత్రం అదే తీగకు విద్యుత్తు సరఫరా కావడంతో ఎద్దు మృత్యువాత పడింది.

☛ కోనూరులో పొలం వద్ద విద్యుత్తు తీగెను తాగి గేదె చనిపోయిందని రైతు సీతారామప్రసాద్ పేర్కొన్నారు.

న్యూస్‌టుడే, అచ్చంపేట (క్రోసూరు)

విద్యుత్తు శాఖ నిర్లక్ష్యం ప్రాణాలమీదకు తెస్తోంది. మూగజీవాల ఆయువు తీస్తోంది. అచ్చంపేట మండలంలో రెండ్రోజుల వ్యవధిలో నాలుగు మూగజీవాలు విద్యుత్తు షాక్‌తో మృత్యువాత పడ్డాయి. సిబ్బందికి సమాచారం అందించినా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని గ్రామీణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రూ.వేలు వెచ్చించి కొనుగోలు చేసిన పశువులు నష్టపోవాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. గాలివానకు విద్యుత్తు తీగలు తెగిపడుతున్నాయి. కొన్నిచోట్ల కిందకు వేలాడుతున్నాయి. ఎర్త్ వైర్లు కూడా ప్రమాదకరంగా మారాయి. నియంత్రికల వద్ద మంటలు వచ్చి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. సకాలంలో విద్యుత్తు సిబ్బంది మరమ్మతులు చేయకపోవడంతో ముప్పు పొంచిఉంది.

నిండుజర్లలో విద్యుత్తు తీగె తగిలి మృతి చెందిన ఎద్దు

సిబ్బంది కొరత

అచ్చంపేట మండలంలో 23 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 16 వేలకుపైగా విద్యుత్తు కనెక్షన్లు ఉన్నాయి. 9 మంది మాత్రమే సిబ్బంది ఉన్నారు. రెగ్యులర్ ఏఈ లేరు. ఏడేళ్లుగా ఇన్‌ఛార్జి ఏఈ విధులు నిర్వర్తిస్తున్నారు. వారికి కూడా ఇతర పనులు అప్పగిస్తున్నారు. అవసర సమయాల్లో ఫోన్లు చేసినా సిబ్బంది స్పందించడం లేదని గ్రామీణులు ఆరోపిస్తున్నారు. అన్ని గ్రామాల్లో ప్రతి చిన్న పనికి ప్రైవేటు హెల్పర్లపై ఆధారపడాల్సి వస్తోంది. లైన్‌మెన్లు ప్రైవేటు సిబ్బందితో పనులు చేయిస్తున్నారు.

నష్టపరిహారం మంజూరులో జాప్యం

విద్యుదాఘాతంతో మృతిచెందిన పశువులకు నష్టపరిహారం అందజేయడంలోనూ జాప్యం జరుగుతోందని రైతులు తెలిపారు. ఏడాది గడుస్తున్నా పరిహారం సొమ్ము అందలేదని పలువురు పేర్కొన్నారు.

హలో.. హలో.. ఎప్పుడో?

న్యూస్‌టుడే- పార్వతీపురం

ఆశావహ జిల్లాల్లో మారుమూల ప్రాంతాలకు సమాచార, అంతర్జాల సౌకర్యాలను కల్పించేందుకు కేంద్రం సెల్ టవర్లను మంజూరు చేసింది. మన్యం ఏర్పడిన తర్వాత జిల్లాలోని అన్ని గిరిజన ప్రాంతాల్లో 190 టవర్లు ఏర్పాటు చేయడానికి అనుమతులు వచ్చాయి. 2022 నుంచి ప్రక్రియ ప్రారంభించారు. ఇప్పటికీ కొన్ని చోట్ల ఏర్పాటు పూర్తికాలేదు. అభ్యంతరాలు, అడ్డంకుల మధ్య గిరిజనులకు సమాచార వ్యవస్థ చేరువకావడంలేదు.

గిరిజన ప్రాంతాల్లో నత్తనడకన టవర్ల ఏర్పాటు

అభ్యంతరాలతో అడ్డంకులు..

సాలూరు మండలం గంజాయిభద్రలో టవర్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఇక్కడ కొఠియా గ్రామాల వివాదం అడ్డుపడుతుండడంతో. ఒడిశా యంత్రాంగం అభ్యంతరం చెబుతోంది. ★ సిరివర, చోర గ్రామాల్లో ఇంకా పనులు జరగాలి. ★ సాలూరు, కొమరాడ, గుమ్మలక్ష్మీపురం మండలాల్లో ఐదు గ్రామాలకు రోడ్డు లేదనే కారణంతో పనులు ప్రారంభించలేదు. ★ కొన్ని ప్రాంతాల్లో టవర్లు ఏర్పాటు చేయడానికి అవసరమైన స్థలాలు కుదరలేదు. ★ మంజూరు చేసిన గ్రామాలకు బదులు మరో చోట పెట్టాలని మార్పులు సూచించినవి కొన్ని ఉన్నాయి.

ఉపాధిహామీ నిధులతో రోడ్లు..

రహదారి సౌకర్యం లేని కారణంగా అవసరమైన సామగ్రి తరలించే వెసులుబాటు లేకపోవడంతో నిలిచిన ఐదు గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించడానికి అధికార యంత్రాంగం ముందుకొచ్చింది. ★ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఈ రహదారులు మంజూరు చేశారు. ★ గుమ్మలక్ష్మీపురం బయ్యాడ గ్రామానికి రోడ్డు వేసేందుకు రూ.4.20 కోట్లు, సాలూరు మండలం లోలింగభద్ర రహదారికి రూ.కోటి, కొమరాడ మండలం ఊటకోసు- బొడ్డిడి మార్గానికి రూ.3.50 కోట్లు, బొడ్డిడి నుంచి టినుకు వరకు రూ.3.10 కోట్లు మంజూరు చేశారు. జాకూరు నుంచి ఉలిగేసు మార్గానికి రూ.1.80 కోట్లు ఉపాధిహామీ నిధులు కేటాయించారు.

వర్షాలు తగ్గితే ప్రారంభిస్తాం..: టవర్లు లేని గ్రామాలకు రహదారి పనుల మంజూరు ఉత్తర్వులు వచ్చాయి. వర్షాలు తగ్గితే పనులు ప్రారంభించడానికి చర్యలు చేపడతాం. గిరిజన ప్రాంతంలో రహదారులు నిర్మించడానికి అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నాం. వీలైనంత త్వరగా పనులు ముగించేలా సమాయత్తం చేస్తున్నాం. **- మణిరాజు, కార్యనిర్వాహక ఇంజినీరు, గిరిజన సంక్షేమ శాఖ పార్వతీపురం**

గిరిజన సంక్షేమ శాఖకు బాధ్యత..

ఈ రోడ్లను మొదట పంచాయతీరాజ్ శాఖకు కేటాయించి పనులు నిర్వహించాలని ఆదేశించారు. ఆశాఖ బాధ్యతల నుంచి తప్పుకోవడంతో గిరిజన సంక్షేమ శాఖకు అప్పగించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో పనులు ముందుకెళ్లే పరిస్థితి లేదు. మళ్లీ డిసెంబరు వరకు నిరీక్షించాల్సి వస్తుందేమోననే అనుమానాలు ఉన్నాయి.

మంజూరైన టవర్లు	ఏర్పాటు	ప్రగతిలో ఉన్నవి	ప్రారంభం కానివి
190	134	22	34

సమస్యలు చెప్పండి.. పరిష్కారం పొందండి

వర్షాలు పడటంతో మలేరియా, వైరల్ జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఆసుపత్రులకు రోగులు వరుస కడుతున్నారు. ఈ నేపథ్యంలో మీ ప్రాంతాల్లో అధ్వాన పరిసరాలు, మురుగుతో నిండిన కాలువలు, ఆసుపత్రుల్లో మందులు, వైద్యుల కొరత, వైద్య చికిత్సకు ఎదురవుతున్న సమస్యలను నేరుగా కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్ దృష్టికి తీసుకురావొచ్చు. 'ఈనాడు' ఫోన్‌ఇన్‌కు కాల్ చేసి సమస్యలకు పరిష్కారం పొందవచ్చు. – న్యూస్‌టుడే, పార్వతీపురం

తేదీ: 04.07.2025, శుక్రవారం
సమయం: ఉదయం 10 నుంచి 11 గంటల మధ్య
ఫోను నంబరు: 08963-358680

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు	మొత్తం విద్యార్థులు	కేజీబీవీలు, మోడల్ స్కూల్స్	గిరిజన, సాంఘిక సంక్షేమ బడులు, గురుకులాలు	విద్యార్థులు	అంగన్‌వాడీ కేంద్రాలు	చిన్నారులు
1490	68 వేల మంది	18	72	30 వేల మంది	2,064	53 వేల మంది

బాలల ఆరోగ్యానికి భరోసా!

న్యూస్‌టుడే, పార్వతీపురం పట్టణం

నేటి నుంచి బడుల్లో ఆరోగ్య పరీక్షలు

చదువులు, ఆటలు, ఆహారపు అలవాట్లు, స్మార్టు పరికరాలతో సహవాసం, మార్కులు, ర్యాంకుల పైనే ధ్యాస వంటి కారణాలతో పిల్లలు మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలతో తరచూ ఇబ్బంది పడుతున్నారు. ఆసుపత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వస్తోంది. ఈ నేపథ్యంలో చిన్నారుల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా బాలల సంపూర్ణ ఆరోగ్య రక్ష (రాష్ట్రీయ బాలల స్వాస్థ్య కార్యక్రమం, ఆర్బీఎస్‌కే)కు శ్రీకారం చుట్టింది. దీనిలో భాగంగా మంగళవారం నుంచి పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేపట్టారు. ఇందులో ఆరోగ్య సమస్యలు గుర్తించి సత్వర చికిత్స అందిస్తారు.

జిల్లాలోని 15 మండలాల పరిధిలో 37 పీహెచ్‌సీల వైద్య సిబ్బందికి చిన్నారులకు చేయాల్సిన వైద్య పరీక్షలపై శిక్షణ ఇచ్చారు. వీరు తమ పరిధిలోని విద్యాలయాల్లోని ప్రతి విద్యార్థిని పరీక్షించి ఆరోగ్య సమస్యలు గుర్తిస్తారు. అవసరం మేరకు పీహెచ్‌సీ, ప్రాంతీయ, జిల్లా ఆసుపత్రులకు వారిని తరలిస్తారు. అక్కడ సమస్య నమోదు చేసి, అవసరాన్ని బట్టి పెద్దాసుపత్రులకు తరలించి చికిత్స చేయిస్తారు. తర్వాత పర్యవేక్షిస్తారు.

ముందుగానే గుర్తిస్తే...

వ్యాధి తీవ్రత పెరిగాక ఆసుపత్రుల పాలవ్వడం కంటే ముందుగానే దాన్ని గుర్తించి తొలిదశలోనే సరైన వైద్యం అందించాలన్నది ప్రభుత్వ ఆలోచన. ప్రస్తుతం చాలా మంది కంటిచూపు లోపం, తలనొప్పి, రక్తలేమి, ఆయాసం, చర్మసంబంధ రుగ్మతలతో ఇబ్బంది పడుతున్నారు. వీటి తీవ్రత పెరిగేవరకూ తెలియకపోవడంతో ఒక్కోసారి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. ఆ పరిస్థితి రాకూడదని ఈ కార్యక్రమం చేపడుతున్నారు.

అంతా సిద్ధం..

జిల్లాలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు ఆరోగ్య పరీక్షలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తిచేశాం. ఇప్పటికే సిబ్బందికి దీనిపై శిక్షణ ఇచ్చాం. చిన్నారులకు వైద్య పరీక్షలు చేసి అవసరం మేరకు వైద్యం అందిస్తాం. **- భాస్కరరావు, డీఎంహెచ్‌వో, పార్వతీపురం**

అభివృద్ధి వివరిస్తూ.. సమస్య తెలుసుకుంటూ

'సుపరిపాలనకు తొలిఅడుగు' ప్రారంభించిన మంత్రి

సాలూరు గ్రామీణం, న్యూస్‌టుడే: సాలూరు మండలంలోని శివరాంపురంలో బుధవారం 'ఇంటింటికి తెలుగుదేశం- సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉదయం నుంచి జోరువాన కురుస్తున్నా మంత్రి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే ఆర్‌పీ భంజ్‌దేవ్, ఇతర నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అంతకు ముందు గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మంత్రి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుంటే, కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో తెదేపా మండలాధ్యక్షుడు పరమేశు, భాస్కరరావు, ఎంపీటీసీ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మహిళకు కరపత్రం ఇస్తున్న మంత్రి సంధ్యారాణి, మాజీ ఎమ్మెల్యే

జీఎస్టీ వసూలయ్యేలా సహకరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ తదితరులు

పార్వతీపురం, న్యూస్‌టుడే: పన్నులు వసూలు చేయడానికి అవకాశం ఉన్న వాణిజ్య సముదాయాలు, ఇతర ఆస్తులకు సంబంధించిన వివరాలను స్థానిక సంస్థల అధికారులు వాణిజ్య పన్నుల శాఖకు సమర్పించాలని కలెక్టరు శ్యామ్‌ప్రసాద్ ఆదేశించారు. బుధవారం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వానికి ఆదాయం తెచ్చిపెట్టే శాఖలు జీఎస్టీ వసూలయ్యేలా సహకరించాలన్నారు. గనులు, రిజిస్ట్రేషన్లు, స్టాంపులు, పురపాలక, పంచాయతీ, ఇంజినీరింగు, పరిశ్రమలు, రవాణా శాఖల అధికారులు తమ వద్ద ఉన్న జాబితా అందజేయాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల నుంచి వృత్తి పన్నులు వసూలు చేయాలన్నారు. జిల్లాలో పన్నుల వసూళ్లు తక్కువగా ఉన్నాయని ఆ శాఖ సంయుక్త కమిషనరు నాగార్జున అన్నారు. ఇంజినీరింగు శాఖలు తమ పరిధిలో చేపడుతున్న పనుల వివరాలు తెలియజేస్తే జీఎస్టీ వసూలు చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. అన్ని శాఖల సహకారం ఉంటే జిల్లా నుంచి ఆదాయం పెరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. డీఆర్వో హేమలత, సహాయ కమిషనరు మోహనరావు, ఎస్డీసీ ధర్మచంద్రారెడ్డి, జిల్లా రిజిస్ట్రారు రామలక్ష్మి, ఎంపీఐ దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలుడు.. దస్త్రాల్లోనే భూస్వామి..!

● స్వామికి వందల ఎకరాలు ● ఆలయ నిర్వహణకు అగచాట్లు

న్యూస్‌టుడే, బొబ్బిలి

పేరుకు రూ.వేల కోట్ల ఆసామి.. కానీ ధూపదీప నైవేద్యానికి వెతుక్కోవాల్సిన పరిస్థితి. ఆలయ నిర్వహణకూ ఇబ్బందులే. ఇదంతా బొబ్బిలి వేణుగోపాలస్వామి గురించే. ఉత్తరాంధ్రాలోని స్వామి ఆలయ భూముల వ్యవహారం ఏళ్లుగా తేలడం లేదు. ఫలితంగా స్వామి కోవెల కళ తప్పుతోంది.

బలిజిపేట మండలం అజ్జాడలోని స్వామి భూములు

బ్యాంకు లాకర్లలో బంగారం

2020 ఆగస్టులో దేవాదాయశాఖ రాష్ట్ర బృందం స్వామి ఆస్తులను ప్రత్యేకంగా లెక్కించింది. ఆభరణాల లెక్క చూసి, సుమారు 18 కిలోల బంగారు, వెండి పలు బ్యాంకు లాకర్లలో భద్రపరిచారు. భూముల వ్యవహారాన్ని తేల్చలేకపోయారు. త్వరలోనే ప్రత్యేక కమిటీని వేసి గుర్తిస్తామని అప్పట్లో చెప్పినా.. ఇంతవరకు క్షేత్రస్థాయిలో పరిశీలించలేదు. రికార్డుల్లో వేల ఎకరాల భూములు ఉన్నాయే తప్ప అవి ఎక్కడ అన్నదీ తేల్చడం లేదు. ఇటీవల ఎమ్మెల్యే బేబీనాయన దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి వెంటనే భూముల గుర్తింపుపై దృష్టి సారించాలని కోరారు.

సర్వే ఆగడంతో తంటా

రీసర్వేతోనే వేణుగోపాలస్వామి భూముల వ్యవహారంపై స్పష్టత వస్తుందని అప్పట్లో అన్నారు. కొన్నిచోట్ల సర్వే పూర్తయినా లెక్కలు తేలలేదు. మరికొన్ని చోట్ల సర్వే జరగలేదు. కొన్నింటికి సర్వే నంబర్లు లేక సమస్య వస్తోంది. ఆలయ భూములే అని చెప్పడానికి కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకుని రెవెన్యూ సిబ్బంది తాత్సారం చేస్తున్నారు.

ఆదాయం ఏడాదికి సుమారు రూ.లక్షే..!!

- గుర్తించిన వాటిలో బలిజిపేట మండలం అజ్జాడతోపాటు బొబ్బిలి మండలంలో 714 ఎకరాలున్నాయి. వాటి నుంచి ఎలాంటి శిస్తు రావడం లేదు.
- పాతబొబ్బిలిలో 10 ఎకరాలు, గొల్లపల్లిలో 9.30, ఎంబన్నవలసలో మూడు, తెర్లాంలో 6.87 ఎకరాల నుంచి నామమాత్రపు శిస్తులు వస్తున్నాయి. నిబంధనల మేరకు దేవాదాయశాఖకు చెల్లించాల్సిన రుసుములు జమ చేయడంలేదు. అంతా కలిపి ఏడాదికి రూ.లక్ష కూడా రావడం లేదు. చేసేది లేక ఆలయ అనువంశిక ధర్మకర్త సుజయ్‌కృష్ణ, సోదరుడు బేబీనాయన నెలకు దాదాపు రూ.2 లక్షల సొంత నిధులు నిర్వహణకు ఖర్చు చేస్తున్నారు.
- మోఖాసా కొత్తవలసలో 1,585 ఎకరాలు ఉన్నప్పటికీ వాటి ఆనవాళ్లు గుర్తించడం లేదు.
- శ్రీకాకుళం జిల్లా పద్మాపురంలో 1.32 ఎకరాలు, రామంపేటలో 9, మల్లివీడులో 240, వాటపాగులో 30 ఎకరాలు ఉన్నట్లు దస్త్రాల్లో ఉన్నా అవి ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి.

దస్త్రాల్లోనే భూములు	
మొత్తం ఎకరాలు	4,011
గుర్తించినవి	714
గుర్తించాల్సింది	3,297

దృష్టి సారిస్తాం..: వేణుగోపాలస్వామి భూములపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. క్షేత్రస్థాయికి వెళ్లి గుర్తించి, స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ అధికారుల సహకారం కూడా తీసుకుంటాం. సమగ్రంగా పరిశీలించాల్సి ఉంది. **- లక్ష్మణరావు, కార్యనిర్వాహక అధికారి, వేణుగోపాలస్వామి ఆలయం**

లక్ష మొక్కల పెంపకం లక్ష్యం

రాంనరేష్

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పార్వతీపురం అటవీశాఖ రేంజి పరిధిలో ఈ ఏడాది లక్ష మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నామని రేంజ్ అధికారి బి.రాంనరేష్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో మాట్లాడారు. స్థానిక రేంజి పరిధిలో 25 వేలు, ఉపాధి హామీ, రైతులు, ఇతర మార్గాల్లో 75 వేల మొక్కలు నాటేలా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. అటవీ శాఖ పరిధిలో అంటిపేట, మరిపివలస, చినబోగిలి, బిత్తరపాడు గ్రామాల్లోని నర్సరీల్లో సరుగుడు, జామాయిలు, ఉసిరిక, వేప, మారేడు, నేరేడు, జామ, బొప్పాయి, మర్రి, రావి తదితర మొక్కల పెంపకం జరుగుతోందన్నారు. రైతులు తమ పాసు పుస్తకం, ఆధార్ నకలు తీసుకొస్తే కావాల్సిన మొక్కలు అందిస్తామన్నారు. పాఠశాలలు, దేవాలయాల ప్రాంగణాల్లో వారు దరఖాస్తు చేస్తే ఇస్తామని తెలిపారు.

అర్తాం కొండల్లో 'నగరవనం'

న్యూస్‌టుడే, పార్వతీపురం

జిల్లాలో ఏర్పాటుకు రూ.2కోట్లతో ప్రణాళిక

మన్యం జిల్లాను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు వేస్తోంది అటవీ శాఖ. ఈ రంగానికి ఊతం కల్పించేలా చర్యలు చేపడుతోంది. ఇందులో భాగంగా సీతంపేట ప్రాంతంలో సున్నపుకొండలు సమీపంలోని అటవీ ప్రాంతంలో జలపాతాలను పర్యాటకంగా తీర్చిదిద్దే ప్రయత్నాలు చేస్తోంది. పట్టణ ప్రజలు అడవిలో విహరించే అనుభూతిని కలిగించేందుకు 'నగర వనం' పేరిట ప్రతిపాదనలు రూపొందించింది. ఉన్నతాధికారుల నుంచి అనుమతులు లభిస్తే జిల్లా కేంద్రానికి సమీపంలోని కొమరాడ మండలం అర్తాం వద్ద 'నగర వనం' రూపుదిద్దుకోనుంది.

అర్తాం సమీపంలోని అటవీ ప్రాంతంలో పర్యాటకులను ఆకర్షించేందుకు ప్రతిపాదించిన నగరవనం నమూనా చిత్రం

ప్రణాళిక ఇదీ..

కొమరాడ మండలం అర్తాం సమీపంలోని 50 హెక్టార్లలో నగరవనాన్ని అభివృద్ధి చేయాలని అటవీశాఖ ప్రతిపాదించింది. ★ ఈ విస్తీర్ణంలో నడకమార్గం, ట్రెక్కింగ్‌పాత్, పగోడాలు, పిల్లలు ఆడుకొనేందుకు ఉద్యానం, రాశివనం, నక్షత్రవనం, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ప్రత్యేక స్థలం ఏర్పాటుచేయనున్నారు. ★ సందర్శకులు తమ వాహనాలు నిలిపేందుకు పార్కింగ్, కేఫ్‌టేరియన్ ఏర్పాటు. ★ సంరక్షణకు, టికెట్లు అమ్మేందుకు వేర్వేరుగా ప్రత్యేక ఏర్పాట్లు. వీటన్నింటికీ రూ.2కోట్లు అవసరమని అంచనాలు వేశారు. ★ స్థలాలను గుర్తించి ఉన్నతాధికారులకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపారు. వీటితోపాటు మరో 40 లక్షలతో నగరవాటికను ఏర్పాటుచేయనున్నారు.

ఆమోదిస్తే పర్యాటకానికి ప్రయోజనం

అటవీ శాఖ అధికారుల ప్రతిపాదనలను గుంటూరులోని ప్రధాన అటవీ కార్యాలయానికి ఇప్పటికే సమర్పించారు. వీటిని ఉన్నతాధికారులు ఆమోదించి, పూర్తిస్థాయిలో నిధులను మంజూరు చేస్తే పార్వతీపురానికి ఐదారు కిలోమీటర్ల దూరంలోని అటవీప్రాంతంలో విహరించామన్న అనుభూతిని పర్యాటకులు, పట్టణవాసులకు కలిగించనున్నారు. నిధులు మంజూరు చేసే దిశగా అటవీ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ప్రతిపాదనలు పంపించాం

నగరవనం ప్రతిపాదన దశలో ఉంది. దీనిపై పూర్తిస్థాయి వివరాలతో ప్రధాన కార్యాలయానికి నివేదించాం. 50 హెక్టార్ల విస్తీర్ణంలో అడవిని సృష్టించేలా ప్రణాళిక రూపొందించాం. విస్తృతంగా మొక్కలు నాటడం, సాహస క్రీడలు, ఉద్యానాలు, ఇతర పర్యాటకాంశాలతో ప్రజలను ఆకట్టుకునే లక్ష్యంతో దీన్ని ప్రతిపాదించాం. ఆమోదం లభించి, నిధులు విడుదలైతే పర్యాటక అభివృద్ధిలో అటవీశాఖ భాగస్వామ్యం అయినట్లే. **- జీపీపీ ప్రసూన, డీఎఫ్‌ఓ, పార్వతీపురం మన్యం జిల్లా**

వట్టిగెడ్డ జలాశయం కళకళ

379 అడుగులకు చేరిన నీటి మట్టం

జలాశయంలో చేరిన నీరు

జియ్యమ్మవలస, న్యూస్‌టుడే: జియ్యమ్మవలస మండలంలో అతి ప్రధాన సాగునీటి వనరైన వట్టిగెడ్డ జలాశయం నీటిమట్టం పెరిగింది. ఈ ప్రాజెక్టు ద్వారా కురుపాం, జియ్యమ్మవలస, గరుగుబిల్లి మండలాల్లోని సుమారు 17 వేల ఎకరాలకు ఖరీఫ్‌లో సాగునీరు అందిస్తారు. ఏటా ఆగస్టు మొదటి వారంలో నీరు విడుదల చేస్తుంటారు. కొన్ని రోజులుగా వర్షాలు విస్తారంగా కురుస్తుండటంతో బుధవారం సాయంత్రానికి 50 క్యూసెక్కుల ఇన్‌ఫ్లోతో 379 అడుగుల మేర జలాశయంలో నీరు ఉంది. రానున్న రోజుల్లో పూర్తిస్థాయిలో 399 అడుగులకు మేర చేరుతుందని ఆశిస్తున్నామని ఏఈ వినయ్ తెలిపారు.

అనుమతులున్న దుకాణాల్లోనే కొనాలి

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాలో అనుమతులున్న దుకాణాల వద్ద మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి శ్రీనాథుడు ఓ ప్రకటనలో కోరారు. అనధికార వ్యక్తుల వద్ద మద్యం కొనుగోలు చేయడం ప్రమాదకరమన్నారు. వివాహాలు, పార్టీలు ఇతర వేడుకల సందర్భాల్లో మద్యం తగ్గింపు ధరలకు సరఫరా చేస్తామని ఎవరైనా చెబితే నమ్మొద్దన్నారు. అనుమానితులు తారసపడితే 14405 టోల్ ఫ్రీ నంబరుకు, జిల్లా అధికారి 94409 02360 నంబరుకు చెప్పండి.

ఎస్‌బీఐ ఆర్‌ఎస్‌ఈటీఐ సంచాలకుడిగా భాస్కరరావు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(ఆర్‌ఎస్‌ఈటీఐ) ఉమ్మడి జిల్లా సంచాలకుడిగా డి.భాస్కరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా ఫైనాన్స్ ఇంక్లూజన్ మేనేజర్‌గా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు సంచాలకుడిగా పనిచేసిన జి.బి.బి.రమణ రాజమహేంద్రవరం వెళ్లారు.

16 నుంచి కోర్సుల ప్రారంభం..

చరవాణి మరమ్మతులు- సర్వీస్, ఎల్‌ఎంవీ డ్రైవర్(ఎల్‌ఎల్‌ఆర్ తప్పనిసరి) కోర్సులకు సంబంధించి ఈనెల 16 నుంచి తరగతులు ప్రారంభిస్తున్నట్లు భాస్కరరావు తెలిపారు. అభ్యర్థులకు 30 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తామని, ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆసక్తి గలవారు 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు.

అతివల ఆర్థిక స్వావలంబనకు అడుగులు

● ముఖాముఖిలో డీఆర్‌డీఏ పీడీ సుధారాణి

న్యూస్‌టుడే, పార్వతీపురం

ప్రతి ఇంటా ఒక మహిళను పారిశ్రామికవేత్తగా నిలపడమే లక్ష్యంగా జిల్లాలో మహిళా స్వయం సహాయక సంఘాలను తీర్చిదిద్దుతున్నాం.. జిల్లాలో 406 మంది వ్యాపారాలు ప్రారంభించేలా సహకరించాం. జీవనోపాధులను మెరుగుపరిచి ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రణాళికలు అమలు చేస్తున్నామని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకురాలు సుధారాణి అన్నారు.

వ్యవసాయేతర రంగాలకు ఊతం

జిల్లాలో వ్యవసాయ ఆధారిత కుటుంబాల సభ్యులు ఎక్కువ మంది మహిళా సంఘాల్లో ఉన్నారు. ఆ రంగానికి సంబంధించిన రుణాలే తీసుకుంటున్నారు. అందుకు భిన్నంగా ఉద్యాన, పశుపోషణ, ప్రకృతిసేద్యం వంటి రంగాల్లోనూ తీసుకుంటే ఫలితం ఉంటుంది. ఆదిశగా ప్రోత్సహిస్తున్నాం. ఆడ దూడలు పుట్టే అవకాశమున్న 'ట్రిపుల్ ఎస్' ఇంజెక్షన్లు పశువులకు ఇప్పించేందుకు పశుసంవర్ధకశాఖతో కలిసి పనిచేస్తున్నాం.

ముఖాముఖి



మిషన్‌మత్స్యశక్తి

నాలుగు కేప్టివ్ నర్సరీలు ఏర్పాటు చేయడానికి అవసరమై చర్యలను ఉపాధి పథకం సహకారంతో చేపట్టాం. ఇందులో చేపపిల్లలు పెంచి, వాటిని చెరువుల్లో పెంచే కార్యక్రమం చేపడుతున్నాం. చేపల పెంపకం, ఉత్పత్తి రంగాల్లో మహిళలకు శిక్షణ ఇస్తాం. మత్స్యశక్తి మిషన్‌లో భాగస్వాములయ్యే వారి పేరిట బ్యాంకు ఖాతా తెరిచి లావాదేవీలు జరిగేలా చూస్తాం.

సభ్యుల ఆసక్తి మేరకు ఎంపిక

సంఘ సభ్యుల ఆసక్తిని గుర్తించి ఆ మేరకు సూక్ష్మ రుణప్రణాళికను రూపొందిస్తున్నాం. ఇప్పటికే 80 శాతం మంది ఆలోచనలను స్వీకరించాం. 6949 సంఘాల సభ్యుల్లో కొందరు రుణం వద్దని పేర్కొనగా, మరికొందరు రుణ బకాయిలు చెల్లిస్తుండడం వల్ల అర్హత రాలేదు.

సమావేశాలకు ముఖహాజరు

ఈ లక్ష్యాన్ని చేరుకోడానికే సమావేశాల్లో ముఖ ఆధారిత హాజరును, సమావేశం నిర్వహించే స్థలాన్ని జియోట్యాగింగు వంటి సాంకేతిక అంశాలను జోడించాం. ఇప్పటికే 89 శాతం సభ్యుల ముఖహాజరు పరిశీలించేందుకు ఆన్‌లైన్‌లో నమోదు చేశాం.

ఆర్థిక అవకతవకలు సహించం

సంఘాల లావాదేవీలు, సిబ్బంది వ్యవహారాల్లో అవకతవకలు జరిగితే సహించేది లేదు. అన్ని దస్త్రాలు పరిశీలిస్తాం. లోపాలుంటే బాధ్యుల నుంచి వసూలు చేస్తాం. కొన్ని మండలాల్లో సీసీలు మహిళా సంఘాలకు సమాచారం లేకుండా, బ్యాంకు రుణాలు తీసుకుంటున్నట్లు వచ్చిన ఫిర్యాదులపై విచారణకు ఆదేశించాం.

(c) eenadu

దారంతా.. అడుగుకో గుంత

సాలూరు పట్టణం నుంచి దుగ్గసాగరం గ్రామం వరకు ఉన్న 3.4 కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడే గుంతలతో ప్రయాణికులకు పరీక్ష పెడుతోంది. ఈ మార్గంలో పాచిపెంట మండలంలోని పాంచాలి, మోసూరు, మాతుమూరు తదితర గ్రామాలకు రోజూ వందల సంఖ్యలో వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బీటీ రోడ్డు ఏర్పాటుకు రూ.1.50 కోట్లు మంజూరయ్యాయని, టెండర్లు పిలిచి పనులు చేపడతామని పీఆర్ డీఈ శర్మ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. – న్యూస్‌టుడే, సాలూరు, గ్రామీణం

అద్దింటి చదువుతో తప్పని అవస్థ

సాలూరు మండలం మరుపల్లి పంచాయతీ గంగన్నదొరవలస మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలను నాడు-నేడు పేరుతో తొలగించారు. దాని స్థానంలో పునాదులు వేశారు. పక్కనే ఓ షెడ్డు నిర్మించారు. నిధులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. రెండేళ్లుగా అద్దె ఇళ్లలో, పాఠశాల వద్ద నిర్మించిన చిన్న గదిలో తరగతులు కొనసాగిస్తున్నారు. 24 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. ఐదు తరగతులను రెండుగా విభజించి ఒకరు అద్దె భవనంలో, మరొకరు కొత్తగా నిర్మించిన చిన్నగదిలో పాఠాలు చెబుతున్నారు. దీనిపై డీఈవో రాజ్‌కుమార్ మాట్లాడుతూ నిధులు విడుదల కావాల్సి ఉందన్నారు.

– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

అద్దె ఇంట్లో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

పునాదుల్లో నిలిచిన పాఠశాల భవన నిర్మాణ పనులు

ఏనుగులు తిరిగే ప్రాంతంలో ఇదేం రక్షణ?

ప్రహరీ లేక వెదురు కర్రలతో కంచె ఏర్పాటు చేశారిలా..

సీతంపేట మండలం కె.గుమడలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో మూగజీవాలు, జంతువులు లోపలికి రాకుండా తాత్కాలికంగా వెదురు కర్రలతో కంచెలు ఏర్పాటు చేసుకున్నారు. నాలుగు ఏనుగుల గుంపు ఈ పాఠశాలకు ఆనుకుని ఉన్న బగ్గ జీడి వనంలో ఎక్కువగా సంచరిస్తోంది. విద్యాలయ సమీపంలోని ఆ తోట ఉండడంతో గజరాజులు లోపలికి ప్రవేశిస్తే విద్యార్థుల పరిస్థితి ఏంటని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రహరీ నిర్మిస్తే కొంత ఉపయోగం ఉంటుందని పేర్కొంటున్నారు. ఈ విషయమై ఎంఈవో పి.కోటిబాబు వద్ద ప్రస్తావించగా.. ప్రహరీ కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని, నిధులు రావాలన్నారు.

– న్యూస్‌టుడే, సీతంపేట

డిప్లొమా ప్రవేశాలకు గడువు పెంపు

గరివిడి, న్యూస్‌టుడే: తిరుపతి శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని పది ప్రభుత్వ, మరో 12 అనుబంధ పశు సంవర్ధక పాలిటెక్నిక్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో వెటర్నరీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణకు విధించిన గడువును ఈనెల 7 వరకు పొడిగించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ పి.రవికుమార్ తెలిపారు. పదో తరగతి విద్యార్హత ఆధారంగా ప్రవేశాలు ఉంటాయని, అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, ఇతర వివరాలకు www.svvu.edu.in ను సంప్రదించాలన్నారు.

ఆనకట్ట ఎగువన పూడికతీత

ఈనాడు కథనానికి స్పందన

సంతకవిటి, న్యూస్‌టుడే: నాగావళి నదిపై సంతకవిటి మండలం రంగరాయపురం వద్ద ఉన్న నారాయణపురం ఆనకట్ట ఎగువన ఎట్టకేలకు పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి. సుమారు 50 వేల ఎకరాలకు ఆధారమైన ఈ ప్రాజెక్టు వద్ద ఏళ్లుగా పూడిక, రెల్లిగడ్డి పేరుకుపోయాయి. ఈ సమస్యపై ఏప్రిల్ 7న 'ఈనాడు'లో 'పూడిక పోదు- నీరు నిలవదు' శీర్షికన వచ్చిన కథనానికి కలెక్టరు అంబేడ్కర్ స్పందించి, ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. దీంతో రూ.5 లక్షలతో పనులు చేస్తున్నట్లు జలవనరులశాఖ ఈఈ సుధాకర్ తెలిపారు.

షాక్‌తో శోకం

ఎస్.కోట శివారులోని కర్రివాని కల్లాలు వద్ద బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఓ కొబ్బరిచెట్టు విద్యుత్తు స్తంభంపై పడడంతో నేలకొరిగింది. ఈక్రమంలో అక్కడే ఉన్న రెండు చూడి గేదెలు, ఒక పెయ్యికి తీగలు తగిలి మరణించాయి. ★ తీగ కింద పడడంతో రామభద్రపురం మండలం కొండకెంగువలో మూడు మేకలు చనిపోయాయి.

అంశం	2022-23	2023- 24	2024- 25
మృతుల సంఖ్య	17	27	30
చనిపోయిన పశువులు	24	17	16

● ఇప్పటివరకు రూ.1.52 కోట్ల మేర పరిహారం అందించినట్లు విద్యుత్తు శాఖాధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో విద్యుత్తు ప్రమాదాలు పెరుగుతున్నాయి. వర్షాకాలంలో ఆ సంఖ్య మరింత ఎక్కువవుతోంది. ఎక్కడ ఏ తీగ పడి ఉందో.. ఏ స్తంభం కుప్పకూలిందో తెలియక ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. శాఖాధికారుల నిర్లక్ష్యంతో పాటు వినియోగదారులు కనీస జాగ్రత్తలు పాటించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం, ఎస్.కోట, రామభద్రపురం, పాలకొండ

ఎస్.కోటలో మరణించిన గేదె

ఏటా పెరుగుతున్న సంఖ్య..

గత నాలుగేళ్లలో 81 మంది మృత్యువాత పడగా.. 67 పశువులను తీగలు బలిగొన్నాయి. ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో ఏడుగురు కన్నుమూశారు. 10 పశువులు చనిపోయాయి. బుధవారం సైతం రెండు చోట్ల ఘటనలు జరిగాయి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

★ వర్షాల సమయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ స్తంభాలను, స్టేవైర్లను తాకకూడదు ★ ఇంటి పరిసరాల్లో కూలితే వెంటనే శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి ★ పిడుగులు పడితే ఇంట్లో సరఫరాను ఆపేయాలి ★ చిన్నపిల్లలకు ఎలక్ట్రికల్ పరికరాలను దూరంగా ఉంచాలి. ★ పొలాలు, గట్ల మీదుగా వెళ్లేటప్పుడు అప్రమత్తత అవసరం ★ సొంత ప్రయోగాలకు దూరంగా ఉండాలి ★ అత్యవసరమైతే 1912కి తెలియజేయొచ్చు

లోపాలివీ..

★ తీగలు వేలాడుతుండడం ★ స్తంభాల మధ్య దూరం ఎక్కువ కావడం ★ ఇనుపతో చేసిన వాటిని ఇంకా మార్చకపోవడం ★ నియంత్రికల వద్ద రక్షణ కరవవడం ★ సకాలంలో మరమ్మతులు లేకపోవడం ★ తుపాన్లు, వర్షాల వేళ లైన్లు తెగినా స్పందించకపోవడం ★ హై, లోవోల్టేజీ ఫిర్యాదులున్నా పరిశీలన చేపట్టకపోవడం

సకాలంలో పరిహారం..

ప్రమాదాలపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. మరమ్మతులు సైతం సకాలంలో జరుగుతున్నాయి. కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడంతో కొన్నిచోట్ల ఘటనలు జరుగుతున్నాయి. నియంత్రణకు సిబ్బందికి సూచనలు చేశాం. ఇప్పటివరకు జరిగిన మరణాలకు సంబంధించి పరిహారం అందించాం. దరఖాస్తులు, పత్రాల్లో లోపాల కారణంగా కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలోనే వారికీ అందజేస్తాం.

– ఎం.లక్ష్మణరావు, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్

మత్స్య సంపద పెంపునకు ప్రత్యేక పరీక్షలు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: మత్స్య సంపదను పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆక్వారంగాన్ని ప్రోత్సహించడానికి వివిధ కార్యక్రమాలు చేపడుతున్నాయి. దీనిలో భాగంగా మత్స్యకారుల ఆర్థిక స్వావలంబన కోసం విజయనగరంలో ఆక్వా ల్యాబ్‌ను ఏర్పాటు చేశాయి. ఇప్పటికే అక్కడ పరీక్షలు(నీరు, మట్టి, మైక్రోబయోలజీ) ప్రారంభమయ్యాయి. గత రెండేళ్లలో 920 నమూనాల ద్వారా ప్రభుత్వానికి రూ.66,770 చేరింది.

ఉమ్మడి జిల్లాకు సంబంధించి విజయనగరంలో ఏర్పాటైన ల్యాబ్

గత రెండేళ్లలో ఇలా..

నీటి పరీక్షలు	:	820
మట్టి	:	20
మైక్రోబయోలజీ	:	80

ఆ మూడూ తప్పనిసరి..

చేపలు, రొయ్యల పెంపకం ప్రారంభం, ఉత్పత్తి పెంచుకోవాలంటే నీరు, మట్టి, మైక్రోబయాలజీ పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఆక్వాకల్చర్‌ను ప్రారంభించడానికి ముందు మట్టి సేకరించి ఇవ్వాలి. దీంతో చెరువును ఎలా తవ్వాలి, పరిమాణం, రక్షణ చర్యలను సూచిస్తారు. నీటిని అందిస్తే ఆక్సిజన్, ఎదుగుదలను ప్రోత్సహించే ఎంజైములను విశ్లేషిస్తారు. రోగాలు ప్రబలకుండా మైక్రోబయోలజీ పరీక్ష చేస్తారు. ఇక్కడ సాధ్యం కాకపోతే కాకినాడలోని స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ కేంద్రానికి పంపించి, ఫలితాలను తెలుసుకుంటారు.

అందుబాటులో మందులు..

'యూనిట్ ప్రారంభించాక ఏ దశలోనైనా కేంద్రాన్ని సంప్రదించవచ్చు. తక్కువ ధరలకే పరీక్షలు చేస్తున్నాం. అనంతరం అవసరమైన మందులు ఇస్తాం. అన్నివేళలా సిబ్బంది అందుబాటులో ఉంటారు. సందేహాలుంటే 79930 45899ను సంప్రదించాలి' అని ఆక్వాల్యాబ్ ఎఫ్‌డీవో వెంకటేశ్వరరావు తెలిపారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటక ప్రాజెక్టులు

విశాఖపట్నం(వన్‌టౌన్), న్యూస్‌టుడే: అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా విశాఖలో పర్యాటక ప్రాజెక్టుల రూపకల్పన జరగాలని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా స్టార్ రేటింగ్ కలిగిన పది వేల గదుల్ని అందుబాటులోకి తీసుకురావాల్సి ఉందని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ సూచించారు. బుధవారం విశాఖ వచ్చిన ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో విజయనగరం, విశాఖ జిల్లాల అధికారులతో సమావేశమయ్యారు. భోగాపురం మండలంలో నిర్మించబోయే ఒబెరాయ్ హోటల్, భీమిలి మండలం అన్నవరంలో ఏర్పాటయ్యే మై ఫెయిర్స్ హోటల్ నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరగా చేపట్టాలన్నారు. అనుసంధాన రహదారులు, విద్యుత్తు సౌకర్యం కల్పించాలని చెప్పారు. గోస్తనీ నది నుంచి పైపు లైన్ల ద్వారా ఆయా హోటల్స్‌కు అవసరమైన నీటిని సరఫరా చేయాలని కోరారు. భూ సేకరణ ప్రక్రియ, ఇతర సాంకేతికపరమైన అంశాలను త్వరితగతిన పూర్తి చేసి, యజమానులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. జిల్లా నుంచి ఆర్డీవో కీర్తి తదితరులు పాల్గొన్నారు.

6న జగన్నాథ యాత్రకు బస్సు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్య క్షేత్రం పూరీ జగన్నాథుని రథ యాత్రకు ఈనెల ఆరో తేదీన ఆర్టీసీ ప్రత్యేక బస్సును ఏర్పాటు చేస్తున్నట్లు విజయనగరం డిపో ప్రబంధకుడు జె.శ్రీనివాసరావు తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు ఆర్టీసీ సముదాయం నుంచి బయలుదేరి భువనేశ్వర్, కోణార్క్, పూరీ ఆలయాలను దర్శించుకొని 8వ తేదీ ఉదయం 8 గంటలకు తిరిగి విజయనగరం చేరుతుందని చెప్పారు. టిక్కెట్ ధర రూ.25 వేలుగా నిర్ణయించామని, కౌంటర్ వద్ద గానీ, www.apsrtconline.in వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చని, ఇతర వివరాలకు 99592 25620, 94943 312213, 94403 59596 నంబర్లను సంప్రదించాలన్నారు.

మెప్మాలో బదిలీల పర్వం పూర్తి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న కమ్యూనిటీ ఆర్గనైజర్లు, డీఈవోలకు బదిలీలు జరిగినట్లు మెప్మా పీడీ జీవీ.చిట్టిరాజు తెలిపారు. కౌన్సెలింగుకు 19 మంది హాజరు కాగా.. 17 మందికి స్థానచలనమైనట్లు వెల్లడించారు. విజయనగరంలో డీఈవోగా పనిచేస్తున్న భాగ్యలక్ష్మికి సాలూరు, అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్.భానుప్రకాష్‌నాయుడుకు బొబ్బిలి, అక్కడున్న ఉల్లి లక్ష్మీదేవికి విజయనగరం కేటాయించామని చెప్పారు.

ప్రతిష్ఠాత్మకంగా పీటీఎం 2.0

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల్లో ఈనెల 10న తల్లిదండ్రులు, అధ్యాపకుల మెగా సమావేశం నిర్వహించాలని డీఐఈవో వై.నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు సమాయత్తం కావాలన్నారు. ప్రభుత్వం మెగా పీటీఎం 2.0 కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల పురోగతి తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

'పదవి పోయాక ఉత్తరాంధ్ర గుర్తొచ్చిందా'

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పదవులు పోయాకే జగన్ అతని అనుచరులకు ఉత్తరాంధ్ర అభివృద్ధి గుర్తుకు వస్తోందని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఎద్దేవా చేశారు. మండలంలోని గుణిదాంలో బుధవారం జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో చేసిన అభివృద్ధి, సంక్షేమం, హామీల అమలు గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం దౌర్జన్యంతో చేసిన పాలనకు ప్రజలు చరమగీతం పాడారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్-6 హామీలను సీఎం చంద్రబాబు నెరవేరుస్తున్నారని వివరించారు. చీపురుపల్లిలో రానున్న రెండు నెలల్లో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తోటపల్లి కాలువ నిర్వహణకు నిధుల మంజూరుపై ఇచ్చిన హామీ మేరకు పార్వతీపురం, విజయనగరం జిల్లాల పరిధిలో పనులు ప్రారంభించామన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు రౌతు కామునాయుడు, చీపురుపల్లి ఆర్ఈసీఎస్ మాజీ అధ్యక్షుడు రామచంద్రుడు, నాయకులు వర్మరాజు, ఎం.రమేష్, టి.అమ్మారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కళా తదితరులు

రూ.2.64 కోట్లతో రహదారి బాగు

విశాఖపట్నం(కార్పొరేషన్), న్యూస్‌టుడే: విశాఖ నగరానికి నీటిని అందించే విజయనగరం జిల్లా తాటిపూడి జలాశయం సమీపంలోని మధుపాడ గ్రామం- కృష్ణాపురం వాటర్ హెడ్‌వర్క్స్ రహదారిని రూ.2.64 కోట్ల జీవీఎంసీ నిధులతో ఇటీవల పునరుద్ధరించారు. ఆ రహదారిని బుధవారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మధుపాడ కూడలి నుంచి తాటిపూడి వరకు ఉన్న రోడ్డు పూర్తిగా మరమ్మతులకు గురికావడంతో అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో నీటి సరఫరా ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో మంత్రి కొండపల్లి, మేయర్ శ్రీనివాసరావు తదితరులు

ప్రజల అవసరాలకే ప్రాధాన్యం: ఈఈ

తాటిపూడి(గంట్యాడ), న్యూస్‌టుడే: ప్రస్తుతం ఉన్న అవసరాలను తప్పించి, తాటిపూడి నీటిని ఎక్కడికీ తరలించే పరిస్థితి లేదని జలవనరుల శాఖ ఈఈ ఎంవీ.రమణ స్పష్టం చేశారు. బుధవారం తాటిపూడి జలాశయం వద్ద ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు సామర్థ్యం 3.20 టీఎంసీలని, ప్రస్తుతం 2.63 టీఎంసీల నీరు ఉందన్నారు. జీవీఎంసీ, విశాఖ తాగునీటి కోసం కొంతమేర నీరు ఇస్తున్నామన్నారు. ఎస్.కోట, గజపతినగరం నియోజకవర్గాల ప్రజలకు కూడా అందిస్తున్నామని చెప్పారు. తాగునీటికే తమ ప్రాధాన్యమని ఇప్పటికే ఉన్నతాధికారులకు తెలియజేశామని, ఇంకా నీటి లభ్యత ఉంటే పరిశ్రమలకు ఇవ్వాలన్నది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. రైతులు గ్రామాల్లో ఉన్న కాలువలను బాగు చేసుకోవాలని, అందుకు కావాల్సిన పరిపాలన అనుమతులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	90	150	160

పొరుగు సేవల గురువులకు తీపికబురు

వేతనం పెంచుతూ ఉత్తర్వులు

పార్వతీపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలలు, ప్రతిభ, క్రీడా పాఠశాలల్లో పొరుగు సేవలపై పని చేస్తున్న అతిథి ఉపాధ్యాయులకు వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 1,659 మంది ఉన్నారు. గురుకులాల్లో పని చేస్తున్న సిబ్బంది కంటే వీరి జీతాలు తక్కువ. దీంతో విషయం గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి దృష్టికి వారంతా తీసుకెళ్లారు. ఆమె స్పందించి వేతనాలు సవరించాలని నిర్ణయం తీసుకున్నారు.

పెంచారిలా.. (రూ.లలో)

గతంలో..	ఇకపై..
25000	31,250
30000	37,500
35000	43,750
40000	50 వేలు
45000	56,250
49000	61,250
52000	65 వేలు

ఎవరెవరికి ఎంతంటే..

✦ గురుకుల జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 200 మంది జూనియర్ అధ్యాపకులు, 19 మంది పీడీలు, 15 మంది గ్రంథాలయాధికారులకు రూ.18 వేల నుంచి రూ.24,150 చేశారు. ✦ 283 మంది పీజీటీలకు రూ.16,100లు ఉండగా రూ.24,150 అందనుంది. ✦ 832 మంది టీజీటీలు, 35 మంది పీడీలు(పాఠశాలల్లో ఉన్నవారు) రూ.14,800 నుంచి రూ.19,350 అందుకోనున్నారు. ✦ 122 మంది పీఈటీలు, 90 మంది క్రాఫ్ట్, ఆర్ట్, మ్యూజిక్ శిక్షకులకు గతంలో రూ.10,900 ఇచ్చేవారు. ఇకపై రూ.16,350 అందిస్తారు. ✦ క్రీడా పాఠశాలల్లో కోచ్‌లకు రూ.25 వేల నుంచి రూ.31,250, సహాయ కోచ్‌లకు రూ.22 వేల నుంచి రూ.27,500కు పెంచుతూ గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రతిభ కళాశాలల్లో..

ప్రతిభ కళాశాలల్లో పనిచేస్తున్న 40 మంది అతిథి జూనియర్ అధ్యాపకులు, 18 మంది పీడీలకు చెల్లించే నెలవారీ వేతనాలు పెరిగాయి.

EENADU Classifieds

BUSINESS SERVICES

GK గోల్డ్ లోన్ బ్యాంక్/ప్రైవేటు తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ ధరకు కొనబడును లేదా అధిక ఋణం ఇప్పించబడును. ✆ 8897731257.

JOBS

రాజాం TVS Showroomలో పనిచేయుటకు Sales Executives కావలెను. (M/F) సంప్రదించండి : 9010074740.

FACULTY/ TEACHERS

KNBR Upper Primary School, కొత్త అగ్రహారం 1వ వీధి, విజయనగరం నందు పర్మ్ చేయుటకు అనుభవంగల క్వాలిఫైడ్ టీచర్స్ కావలెను. జీతం అనుభవం ఆధారంగా ఇవ్వబడును. సెల్: 9391446385.

WANTED

Teachers of TELUGU, ENGLISH & SOCIAL Studies with high school Teaching Experience are Required to work at SSS School (Garividi). Salary Negotiable as per the candidate's Experience. Send Resume to ✆ 9063666325

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

అనుమానాస్పదస్థితిలో మహిళ మృత్యువాత

ఇంటి ఆవరణలో రక్తపు మరకలు

కరగాన పద్మ (పాతచిత్రం)

బొబ్బిలి, న్యూస్‌టుడే: మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన బొబ్బిలి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పెదచాకలి వీధి కూడలిలో నివాసం ఉంటున్న కరగాన పద్మ(45) భర్త పైడిరాజు గొర్రెల కాపరి. ఆమె ఇళ్లల్లో పనులు చేస్తుంటారు. వీరి ఇద్దరు కుమారులు కిరణ్, చందు భార్యాపిల్లలతో వేరే చోట కాపురం ఉంటున్నారు. బుధవారం సాయంత్రం ఇంట్లో ఉన్న పద్మ కేకలు వేయడంతో స్థానికులు చేరుకుని చూడగా రక్తపు మడుగులో కనిపించారు. అపస్మారక స్థితిలో ఉన్న బాధితురాలిని ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె కత్తిపీట మీద ప్రమాదవశాత్తు పడిపోవడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. భర్త ఇంట్లో లేని సమయంలో ఘటన చోటుచేసుకోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డీఎస్పీ భవ్యారెడ్డి, ఎస్సై రమేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

హత్యగా అనుమానం?.. పద్మ ఇంట్లో ఒంటరిగా ఉండడాన్ని చూసి పథకం ప్రకారం హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఛాతి, మెడ భాగంలో గాయాలున్నాయి. ఇంటి నిండా రక్తపు చుక్కలు పడి ఉన్నాయి. కుటుంబంలో ఏమైనా తగాదాలు ఉన్నాయా? అని ఆరా తీస్తున్నారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించింది. మృతిపై అనుమానాలు ఉన్నాయని, దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు.

పార్కింగ్ విషయంలో ఘర్షణ: కత్తితో దాడి

గోపాలపట్నం, న్యూస్‌టుడే: ఓ వ్యక్తిపై కత్తితో దాడిచేసిన ఘటన గోపాలపట్నం పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. వేపాడ ప్రాంతానికి చెందిన జి.శ్రీనివాసరావు(25), సాయి అన్నదమ్ములు. వీరు సింహాచలం దరి గోశాల సమీపంలోని కె.కన్వెన్షన్‌లో పని చేస్తున్నారు. ఈనెల 1న భూలోకనగర్‌లోని ఓ వీధిలో సాయి తన ద్విచక్రవాహనం నిలిచి ఉంచారు. ఇదే ప్రాంతానికి చెందిన ఎస్.చంద్రశేఖర్ తన కారును ఆ ద్విచక్రవాహనానికి అడ్డంగా పెట్టారు. ఈ విషయమై ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. విషయాన్ని సాయి తన సోదరుడు శ్రీనివాసరావుకు చెప్పాడు. దీంతో రాత్రి 8 గంటల ప్రాంతంలో అన్నదమ్ములిద్దరూ చంద్రశేఖర్ ఇంటికి వెళ్లారు. అక్కడ ముగ్గురి మధ్య గొడవ జరిగింది. ఈక్రమంలో చంద్రశేఖర్ తన ఇంట్లో ఉన్న కూరగాయల కత్తితో శ్రీనివాసరావుపై దాడికి పాల్పడ్డాడు. గాయపడిన అతడిని స్థానికులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అప్పలనాయుడు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండుకు తరలించామన్నారు. చంద్రశేఖర్ ఆరిలోవలో జీవీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు.

బడుల నిర్వహణకు నిధులొచ్చాయోచ్!

పార్వతీపురం పట్టణం, కొత్తవలస, వీరఘట్టం, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడుల బలపేతం దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా స్కూల్ గ్రాంట్ కింద తొలి విడతలో 50 శాతం నిధులు విడుదల చేసింది. 2025-26 ఏడాదికి గానూ రెండు జిల్లాల్లోని 3,344 విద్యాలయాలకు రూ.7.64 కోట్లు కేటాయించింది. దీనిలో రూ.3.82 కోట్లు విడుదలయ్యాయి. దీనికి సంబంధించి సమగ్ర శిక్షా రాష్ట్ర సంచాలకులు బి.శ్రీనివాసరావు జిల్లా ఏపీసీకి సమాచారం పంపారు.

పాఠశాలల నిర్వహణకు గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరుకాక ప్రధానోపాధ్యాయులు ఇబ్బంది పడ్డారు. కొందరు సొంత నిధులు వెచ్చించారు. వైకాపా పాలనలో స్కూల్ గ్రాంటును పీడీ ఖాతాల్లో జమచేసినట్లే చేసి వెనక్కి తీసుకున్న దాఖలాలున్నాయి. ఆయా సమస్యలు పరిష్కరిస్తూనే బడుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు పుస్తకాలు అందించింది. బ్యాగులు, దుస్తులు, బూట్లు ఇస్తోంది. సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతోంది. ఇప్పుడు నిర్వహణ నిధులు ఇవ్వడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వీరభద్రపురంలోని ప్రాథమికోన్నత పాఠశాల

జిల్లా	పాఠశాలలు	కేటాయింపు (రూ.కోట్లలో)	విడుదల
విజయనగరం	1770	4.30	2.15
పార్వతీపురం	1574	3.33	1.67

ఖర్చులు ఇలా..

విద్యార్థుల సంఖ్యను బట్టి ఈ నిధుల వినియోగానికి గానూ మార్గదర్శకాలు విడుదల చేశారు. ఇందుకు అనుగుణంగా రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు స్కూల్ గ్రాంట్ లభిస్తుంది. సుద్దముక్కలు, తెల్ల కాగితాలు, రిజిస్టర్లు, పరీక్షల నిర్వహణకు రూ.5 వేలు, జాతీయ పండగల కోసం రూ.2 వేలు, విద్యుత్తు బిల్లుల చెల్లింపునకు రూ.3,500, అంతర్జాలం వసతికి రూ.2,500, జిరాక్స్ ముద్రణకు రూ.2 వేలు, చేతులు శుభ్రం చేసుకునే రసాయనాలు, శానిటైజర్ తదితరాలకు రూ.2,500, పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల నిర్వహణకు రూ.2,500 ఖర్చు చేసేలా వెసులుబాటు కల్పించారు. చిన్నచిన్న మరమ్మతులకు ఇందులో అవకాశం ఇచ్చారు. ఈనెల 10న నిర్వహించ తలపెట్టిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల(ఎంపీటీఎం) మెగా సమావేశానికి 20 శాతం నిధులు వాడుకోవచ్చని సమగ్ర శిక్షా రాష్ట్ర సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు.

చోరీపై కేసు నమోదు

గజపతినగరం, న్యూస్‌టుడే: గజపతినగరం రైల్వే స్టేషన్ కాలనీలోని ఇంట్లో మంగళవారం అర కిలో వెండి, రూ.10 వేల నగదు అపహరణకు గురైందని యజమాని పాండ్రంకి గణేష్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్‌నాయుడు తెలిపారు. గణేష్ తల్లి పార్వతి ఆదివారం హైదరాబాద్‌లోని కుమార్తె వద్దకు వెళ్లగా పట్టపగలు కారులో వచ్చిన దొంగలు ఇంటి తాళాలు విరగ్గొట్టి దోచుకెళ్లారు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని, క్లూస్‌టీం ఆధారాలు సేకరించిందని ఎస్సై తెలిపారు.

ఊరమెట్ట లోయలో పడి 30 గొర్రెల మృతి

వేపాడ, న్యూస్‌టుడే: వేపాడ మండలం రామస్వామిపేట సమీపంలోని ఊర మెట్ట అంచున ఉన్న లోయలో పడి బుధవారం 30 గొర్రెలు మృతి చెందాయి. రూ.4 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు చెబుతున్నారు. వారి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పి.బాలకృష్ణ, రామారావుకు చెందిన గొర్రెల మందను ఊరమెట్టపై మేతకు వదిలిపెట్టారు. అక్కడున్న కోతులు బెదిరించడంతో మెట్ట అంచుకు చేరుకున్నాయి. ప్రస్తుత వర్షాలకు ఒడ్డు జారిపోవడంతో 30 వరకు రాళ్లు, మట్టితో పాటు లోయలో పడి అక్కడికక్కడే మృతి చెందాయి. విషయం తెలుసుకున్న సర్పంచి వి.శర్మ, జి.మంగరాజు తదితరులు ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించారు. బొద్దాం పశు వైద్యాధికారి అనిల్‌కుమార్ పోస్టుమార్టం నిర్వహించారు.

కళేబరాల వద్ద వైద్యుడు, స్థానికులు

(c) eenadu

ప్లాస్టిక్‌తో నిండిన కాలువలు

పార్వతీపురం పట్టణంలో ప్లాస్టిక్ వినియోగం రోజు రోజుకూ పెరిగిపోతోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆర్టీసీ కూడలి వద్ద కాలువల్లో గుట్టలుగా సీసాలు బయటపడ్డాయి. చిన్నపాటి కాలువలోనే ఇన్ని ఉంటే.. ప్రధాన కాలువలో ఇంకెన్ని ఉంటాయోనని ప్రజలు వాపోతున్నారు. పట్టణంలో పాలిథిన్ నిషేధం ఒట్టిమాటగానే ఉంది. నీటి సీసాలు ఎక్కువగా వినియోగించి కాలువల్లో వేస్తుండటంతో మురుగు రోడ్డెక్కుతోంది. విషయం శానిటరీ ఇన్‌స్పెక్టర్ పకీరు రాజు వద్ద ప్రస్తావించగా.. కాలువల్లో చెత్త వేయవద్దని చెబుతున్నామని, దుకాణ దారులకు నోటీసు కూడా ఇచ్చామన్నారు. చర్యలు తీసుకుంటామని తెలిపారు. - న్యూస్‌టుడే, పార్వతీపురం

ప్రజారోగ్యంతో చెలగాటం..!

పాలకొండ పట్టణ పరిధిలోని గాయిత్రీనగర్‌లో పద్మకుండం తాగునీటి కుళాయిలు మురుగు కాలువలో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అలాగే వదిలేశారు. చిన్న రంధ్రం పడినా మురుగు తాగునీటిలో కలిసే ప్రమాదముంది. రోగాల బారిన పడే అవకాశముందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పైపులను మురుగు కాలువల నుంచి బయటకు మార్చాలని కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని నగర పంచాయతీ కమిషనర్ రత్నరాజ్ తెలిపారు. - న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

అటు అధ్వానం.. ఇటు ప్రమాదం

మక్కువ మండల కేంద్రంలో సువర్ణముఖి నది వద్ద అపరిశుభ్రత నెలకొంది. గ్రామంలో సేకరించిన వ్యర్థాలను నదిపై ఉన్న వంతెన పక్కన వేస్తున్నారు. దీనికితోడు రోడ్డంతా గుంతలమయంగా ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఆ ప్రాంతం బురదతో నిండి అధ్వానంగా తయారైంది. ఓ వైపు వ్యర్థాల దుర్వాసన, మరోవైపు గుంతల రోడ్డుతో అవస్థలు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నది నీరు కలుషితమవుతోందని వాపోతున్నారు. చర్యలు తీసుకోవాలని ఈ మార్గంలో రాకపోకలు సాగించే 50 గ్రామాల ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మక్కువ

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

పార్వతీపురం - 8008566244
పాలకొండ - 8008574299
సాలూరు - 8008786820
కురుపాం - 9849044696

? పాలకొండలోని రామాకళామందిర్ రహదారిలో వీధి దీపాలు లేవు. - రమేష్

● వీధి దీపాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటాం. - రత్నరాజ్, నగరపంచాయతీ కమిషనర్ - న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

? పుట్టూరు సమీపంలోని సాకిగెడ్డ వంతెన పైపులకు అడ్డంగా చెత్త పేరుకుపోయింది. వర్షపు నీరు రోడ్డుపైకి వస్తోంది. - రమణయ్య

● క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - విజయకుమార్, ఏఈ, ఆర్‌అండ్‌బీ - న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

? లక్ష్మీపురం కాలనీలోని రెండో వీధిలో దీపాలు వెలగడంలేదు. - వెంకటరమణ

● అధికారి పరిశీలించి దీపాలు ఏర్పాటు చేస్తాం. - వెంకటనాయుడు, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, సీతానగరం

గోతులు పూడ్చారు (స్పందనకు వందనం)

జియ్యమ్మవలస: జియ్యమ్మవలస బస్టాండులో గోతుల్లో నీరు నిలిచిపోయి అధ్వానంగా మారింది. దీనిపై ఈనాడులో 'మేమున్నాం.. మీకు తోడుగా' లో వార్త ప్రచురితమవడంతో ఎంపీడీవో కె.ధర్మారావు, ఎంపీటీసీ సభ్యుడు శంకరరావు స్పందించారు. గ్రావెల్‌తో గోతులను పూడ్చి బాగు చేశారు.

చెత్త తొలగింపు

సాలూరు గ్రామీణం: సాలూరు మండలం కుర్మరాజుపేట సచివాలయం ఎదుట వ్యర్థాలు పేరుకుపోయాయని ఇటీవల ఈనాడులో 'సచివాలయం ఎదుటే చెత్తకుప్పలు' శీర్షికతో వార్త ప్రచురితమైంది. దీనిపై అధికారులు స్పందించారు. పంచాయతీ కార్యదర్శి ప్రసాదు ఆధ్వర్యంలో సిబ్బంది వ్యర్థాలను తొలగించారు.

ప్రాజెక్టులు పూర్తిచేయాలి.. కలెక్టరేట్ ప్రాంగణం: ఖరీఫ్ ప్రారంభమైనప్పటికీ సాగునీటి ప్రాజెక్టుల వద్ద పనులు అసంపూర్తిగా ఉన్నాయని సీపీఎం జిల్లా కార్యదర్శి కె.గంగునాయుడు అన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో మాట్లాడారు. పనులు పూర్తిచేసి రైతులను ఆదుకోవాలని కోరారు. తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడి.. వసతులు కొరవడి

న్యూస్‌టుడే- వీరఘట్టం, సీతంపేట, పాలకొండ, భామిని, మెంటాడ, పాచిపెంట

గత ప్రభుత్వ పాలనలో నాడు-నేడు పేరిట రూ.కోట్లు ఖర్చు చేసి అవసరం లేని చోట అదనపు భవనాలు నిర్మించారు. అవసరమైన చోట గాలికొదిలేశారు. జిల్లాలోని చాలా ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని రేకుల షెడ్లలో, మరికొన్ని అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. తాగునీటి సౌకర్యం కూడా లేని దుస్థితి. వంట శాలలు సైతం లేక ఆరుబయటే వంటలు చేస్తున్నారు. ఐటీడీఏ పాఠశాలలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం.

మండలం	పాఠశాలలు	శిథిల భవనాలు	వంటశాలల్లేనివి	మరుగుదొడ్లు లేనివి
వీరఘట్టం	62	04	38	02
సీతంపేట	168	08	130	168
పాలకొండ	59	01	20	-
భామిని	66	03	34	-
మెంటాడ	121	05	91	18

పాచిపెంట మండలం కొత్తవలసలో పనులు పూర్తికాని గదిలో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

ఎనిమిదేళ్లుగా అసంపూర్తి నిర్మాణాలు..

పాచిపెంట మండలంలోని కొత్తవలస జడ్పీ ఉన్నత పాఠశాలలో అసంపూర్తి భవనాలతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఇక్కడ 139 మంది చదువుతున్నారు. ఎనిమిదేళ్ల కిందట రూ.22 లక్షలతో చేపట్టిన భవన సముదాయం పూర్తికాలేదు. అయిదేళ్ల క్రితం ఎస్‌ఎస్‌ఏ నిధులతో చేపట్టిన అదనపు తరగతి గదులు అసంపూర్తిగా ఉన్నాయి. అందులోనే పాఠాలు చెబుతున్నారు. నాడు-నేడులో ప్రారంభించిన మరుగుదొడ్ల పనులు పూర్తికాలేదు. విషయం హెచ్‌ఎం నిర్మల వద్ద ప్రస్తావించగా.. ఉన్నతాధికారులకు నివేదించామని తెలిపారు.

రక్షణ గోడలు కరవు..

సీతంపేట మండలం కె.గుమ్మడ గిరిజన ఆశ్రమ సంక్షేమ ప్రాథమిక పాఠశాల రక్షణగోడ లేక విలువైన వస్తువులు, దస్త్రాలకు రక్షణ కరవవుతోంది. చుట్టూ వెదురు కర్రలతో కంచెను ఏర్పాటు చేసుకున్నారు. భామిని మండలం బురుజోల ప్రాథమిక పాఠశాల శిథిలమవడంతో రేకుల షెడ్డులో తరగతులు నిర్వహిస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం..

ప్రభుత్వ పాఠశాలల్లో అసౌకర్యాలపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరైతే చర్యలు చేపడతాం. - పి.కృష్ణమూర్తి, డీడీఈవో, పాలకొండ

రక్తహీనత నివారణకు కృషి చేయాలి

పోషకాహారం అందజేస్తున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

పార్వతీపురం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: రక్తహీనత నివారణకు కృషి చేయాలని డీఎంహెచ్‌వో భాస్కరరావు అన్నారు. బుధవారం పార్వతీపురం మండలం తాళ్లబురిడి, పెదబొండపల్లిలో నిర్వహించిన ఎనిమియా యాక్షన్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. గర్భిణులకు పోషకాహారం కిట్లు అందజేశారు. జిల్లా ప్రోగ్రాం అధికారి జగన్మోహనరావు, డీపీఎం రమణకుమార్ పాల్గొన్నారు. ● గరుగుబిల్లి, జియ్యమ్మవలస: గర్భిణుల వివరాలు సక్రమంగా నమోదు చేయాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో కేవీఎస్ పద్మావతి అన్నారు. గరుగుబిల్లి మండలం గొట్టివలస పీహెచ్‌సీని తనిఖీ చేశారు. ● కురుపాం గ్రామీణం: వైద్యాధికారి శంకర్రావు కురుపాం సచివాలయంలో రక్తహీనత నివారణ కమిటీ సమావేశం నిర్వహించారు.

తప్పిపోయిన బాలుడి అప్పగింత

పార్వతీపురం పట్టణం, గ్రామీణం: పట్టణంలోని ఆర్టీసీ కూడలి వద్ద తప్పిపోయిన బాలుడ్ని పోలీసులు గంటల వ్యవధిలోనే పట్టుకుని తల్లికి అప్పగించారు. ఎస్సై సంతోషి వివరాల మేరకు.. పార్వతీపురం మండలం చందలింగికి చెందిన కె.సుధీర్ విజయనగరంలోని వసతి గృహంలో చదువుతున్నాడు. తల్లి శాంతి బాలుడ్ని వసతి గృహానికి చేర్చాలని ఆర్టీసీ కాంప్లెక్సుకు తీసుకురాగా.. ఎటో వెళ్లిపోయాడు. పోలీసులు వెతికి పట్టుకొని అప్పగించారు.

6న చదరంగం పోటీలు

సాలూరు గ్రామీణం: ఆంధ్రా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సాలూరు చిన్నబజారు వద్దనున్న ఆర్యవైశ్య ధర్మశాలలో ఈనెల 6న చెస్ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రతినిధి తిరుమలేశ్ తెలిపారు. 16 ఏళ్ల లోపు వయసున్న బాల, బాలికలకు వేర్వేరుగా పోటీలుంటాయన్నారు. ఆసక్తి ఉన్నవారు జనన ధ్రువపత్రం తీసుకురావాలన్నారు. వివరాలకు 80080 08272, 91823 37499 నంబర్లను సంప్రదించాలని కోరారు.

భవనం పూర్తయ్యేదెన్నడో?

సీతానగరం మండలం పెదబోగిల పంచాయతీ పరిధిలో రైతుసేవా కేంద్రం నిర్మాణం రెండేళ్లుగా గోడలకే పరిమితమైంది. సీతానగరం కొమ్మరపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం స్థలంలో నాలుగేళ్ల కిందట పనులు ప్రారంభించారు. ముక్కుతూ.. మూలుగుతూ రెండేళ్లలో గోడల వరకు తీసుకొచ్చి అక్కడితో వదిలేశారు. ప్రస్తుతం తీగలు, పనికిరాని మొక్కలు అల్లుకుని గోడలు సగం మూసుకుపోయాయి. భవనం పూర్తికి చర్యలు తీసుకుంటామని ఏఈ చంద్రమౌళి తెలిపారు. - న్యూస్‌టుడే, సీతానగరం

పెచ్చులూడుతున్నాయ్.. పట్టించుకోండి

పార్వతీపురంలోని ఉప తహసీల్దారు కార్యాలయ భవనం పెచ్చులూడి ప్రమాదకరంగా తయారైంది. ఇటీవల కురిసిన వర్షాలకు స్లాబుపై నీరు చేరి దిగువన ఉన్న పెచ్చులు ఊడిపోతున్నాయి. ప్రధాన గదిలో ఉప తహసీల్దారు, ఇద్దరు గుమస్తాలు, కంప్యూటర్ గదిలో ముగ్గురు విధులు నిర్వర్తిస్తున్నారు. ప్రజలు నిత్యం వస్తూనే ఉంటారు. ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. విషయం తహసీల్దారు ఎం.సురేష్ వద్ద ప్రస్తావించగా.. ఇటీవల బాధ్యతలు స్వీకరించానని, సమస్య ఉన్నతాధికారులకు తెలియజేస్తామన్నారు. - న్యూస్‌టుడే, పార్వతీపురం గ్రామీణం

అంపిలి వెళ్లాలంటే అవస్థలే

పాలకొండ నుంచి అంపిలి వెళ్లాలంటే పాట్లు తప్పడం లేదు. స్థానిక ఆంజనేయకూడలి నుంచి గ్రామం వరకు గుంతలతో అధ్వానంగా తయారైంది. వర్షాలకు నీరు చేరి రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. అన్నవరంలో పీహెచ్‌సీ, డీఏవీ పాఠశాల ఉండడంతో వడమ, అన్నవరం గ్రామస్థులు ఈ మార్గంలోనే వెళ్తూ ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వం రెండేళ్ల కిందట మరమ్మతులు చేపట్టినా.. నాణ్యత లేక రోడ్డు పాడైంది. రహదారి మరమ్మతులకు ఉన్నతాధికారులకు నివేదిస్తామని ఎంపీడీవో రంగారావు తెలిపారు. - న్యూస్‌టుడే, పాలకొండ గ్రామీణం

అద్దె బస్సు చోదకుల ధర్నా

డిపో ఆవరణలో ధర్నా చేస్తున్న డ్రైవర్లు

కలెక్టరేట్ ప్రాంగణం, న్యూస్‌టుడే: అద్దె బస్సుల డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలని బుధవారం పార్వతీపురం ఆర్టీసీ డిపో ఆవరణలో ధర్నా చేపట్టారు. వీరికి సిటూ నాయకులు రెడ్డి వేణు, వెంకటరమణ మద్దతు తెలిపారు. కిలోమీటర్లు పరిగణనలోకి తీసుకుని వేతనాలు చెల్లించాలన్నారు. యాజమాన్యం, అధికార యంత్రాంగం సానుకూలంగా స్పందించి సమస్యలు పరిష్కరించాలని కోరారు. స్పందించకపోతే ఈ నెల 10 నుంచి నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించారు. కె.వి.చారి, పి.డి.ప్రసాద్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

యూరియా కోసం రైతుల ఇక్కట్లు

పలగర సొసైటీ వద్ద కర్షకులు

బలిజిపేట, న్యూస్‌టుడే: మండలంలో కొద్ది రోజులుగా యూరియా కొరత తీవ్రంగా ఉండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. వేరే దారిలేక ప్రైవేటు మార్కెట్‌లో అధిక ధరలకు కొనుగోలు చేస్తున్నారు. బుధవారం పలగర ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘానికి 400 బస్తాల యూరియా వచ్చిందనే విషయం తెలుసుకుని అక్కడకు చేరుకున్నారు. కార్యాలయమంతా రైతులతో నిండిపోయింది. మండల వ్యవసాయాధికారి శ్రావణ్‌కుమార్ సొసైటీకి వచ్చి రైతుల భూముల ఆధారంగా యూరియా అందజేశారు. గంగాడ, గళావల్లి, వంతరాం, తుమరాడ, పలగర, వెంగాపురం తదితర గ్రామాల్లోని రైతుసేవా కేంద్రాలకు రెండు, మూడు రోజుల్లో యూరియా తెప్పిస్తామని ఏవో తెలిపారు.

ఇంటింటికీ సంక్షేమ పథకాలు

పథకాల కోసం వివరిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కురుపాం గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏడాదిలో ఇంటింటికీ సంక్షేమ పథకాలు అందించిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సుపరిపాలనలో తొలిఅడుగు ఇంటింటి ప్రచార కార్యక్రమాన్ని బుధవారం కురుపాం మండల కేంద్రంలో నిర్వహించారు. ఆమె ఇంటింటికీ వెళ్లి ఏడాది పాలనలో అందించిన సంక్షేమ పథకాలు, రాష్ట్రాభివృద్ధిని వివరించారు. తెదేపా మండల కన్వీనర్ కొండయ్య, మాజీ ఏఎంసీ ఛైర్మన్ కోలా రంజిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ★ పార్వతీపురం గ్రామీణం: ఐదేళ్లలో వైకాపా చేయలేని కార్యక్రమాలను ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం చేసిందని ఎమ్మెల్యే విజయచంద్ర అన్నారు. అడ్డాపుశీల పంచాయతీ బంటువానివలసలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ప్రారంభించారు. జిల్లా ఉపాధ్యక్షుడు జీవీ నాయుడు, మండల అధ్యక్ష, కార్యదర్శులు చంటి, చంద్రమౌళి ఉన్నారు. ★ సీతంపేట: తెదేపా పాలకొండ నియోజకవర్గ ఇన్‌ఛార్జి పడాల భూదేవి, నియోజకవర్గం పరిశీలకులు ఎస్.సూర్యనారాయణ, ఎస్.ఢిల్లీశ్వరరావు సీతంపేట మండలం గొయిదిలో ఇంటింటికీ వెళ్లి పథకాల కోసం వివరించారు. ★ భామిని: అరకు పార్లమెంటరీ తెదేపా పరిశీలకుడు హర్షవర్ధన్ పసుకిడిలో కార్యక్రమం చేపట్టారు.

బంటువానివలసలో ఎమ్మెల్యే విజయచంద్ర..

అగ్ని ప్రమాదాలపై అవగాహన

సీతంపేట, న్యూస్‌టుడే: అగ్ని, నీటి ప్రమాదాలు జరిగితే వెంటనే 101 నంబరుకు సమాచారం అందించాలని పాలకొండ అగ్నిమాపక అధికారి జామి సర్వేశ్వరరావు తెలిపారు. బుధవారం సీతంపేట మండలం పూతికవలస బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. మంటలను అదుపు చేయడం, క్షతగాత్రులను రక్షించడం తదితర విషయాలు వివరించారు. ప్రధానోపాధ్యాయురాలు వి.శారద, ఉపాధ్యాయులు, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి

తాడికొండ డిపోలో తనిఖీ చేస్తున్న డీఎం

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: డీఆర్ డిపోల నిర్వహణలో సేల్స్‌మెన్‌లు సమయపాలన పాటించి, సరకులు అందించాలని జీసీసీ డీఎం రామారావు ఆదేశించారు. బుధవారం గుమ్మలక్ష్మీపురం మండలం కేదారిపురం, రెల్ల, తాడికొండ డిపోలను సందర్శించారు. నిల్వలు, దస్త్రాలు పరిశీలించి విక్రయాలు గురించి ఆరా తీశారు. పరిసరాలు పరిశుభ్రంగా తీర్చిదిద్ది ప్రజలకు అందుబాటులో ఉంచాలన్నారు. అటవీ ఉత్పత్తుల కొనుగోలుపై దృష్టిసారించాలని సూచించారు. బీఎం రాము, ఎస్ఎం భాస్కరరావు ఉన్నారు.

సంపద సృష్టి జరగాలి

సచివాలయ సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో కొండలరావు

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీల పరిధిలోని చెత్త సంపద కేంద్రాల్లో సంపద సృష్టి జరగాలని డీపీవో టి.కొండలరావు అన్నారు. బుధవారం చినబొండపల్లి, పెదబొండపల్లిల్లో పారిశుద్ధ్య పనులు, చెత్త సంపద కేంద్రాల తీరును పరిశీలించారు. జిల్లాలోని 451 పంచాయతీల్లోని కేంద్రాల్లో చెత్త నుంచి సంపద సృష్టించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఉప ఎంపీడీవో మూర్తి, సర్పంచి శంకరరావు తదితరులు ఉన్నారు.

70 మంది రక్తదానం

శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు

సీతంపేట, న్యూస్‌టుడే: స్థానిక ప్రభుత్వ ఐటీఐలో సీతంపేట ప్రాంతీయాసుపత్రి ఆధ్వర్యంలో బుధవారం రక్తదాన శిబిరం నిర్వహించినట్లు పర్యవేక్షకుడు బి.శ్రీనివాసరావు తెలిపారు. 30 మంది రక్తదానం చేశారన్నారు. ప్రిన్సిపల్ ఎం.గోపాలకృష్ణ, వైద్య నిపుణులు పి.అమృత పాల్గొన్నారు. ★ పాచిపెంట: పాచిపెంట ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మాతృభూమి సేవా సంఘం కార్యదర్శి గోపాలరావు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. 40 మంది యువకులు రక్తదానం చేశారు. తహసీల్దారు రవి ధ్రువపత్రాలు అందజేశారు.

రేషన్ కోసం పాట్లు

కె.గుమడ జీసీసీ డిపో వద్ద రేషన్ కోసం నిరీక్షిస్తున్న మహిళలు

సీతంపేట, న్యూస్‌టుడే: రేషన్ సరకుల కోసం లబ్ధిదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండలంలోని 23 గిరిజన సహకార సంస్థ (జీసీసీ) డిపోల పరిధిలో ఒక్కో చోట 10 నుంచి 44 గ్రామాలు ఉన్నాయి. ఎక్కువ మంది ఉండడంతో గిరిశిఖర, దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో డిపో మూసివేస్తే లబ్ధిదారులు అక్కడే నిరీక్షిస్తున్నారు. గ్రామాలకు సమీపంలో డిపోలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. 15 రోజుల్లో ఎప్పుడైనా సరకులు తీసుకోవచ్చని సీతంపేట జీసీసీ బ్రాంచి మేనేజర్ దాసరి కృష్ణ తెలిపారు. రీసర్వే చేసి సమీప గ్రామాలను డిపోకు ట్యాగ్ చేస్తే దూరాభారం తగ్గుతుందన్నారు.

సీతంపేటలో డెంగీ మాసోత్సవం

ర్యాలీ ప్రారంభిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో విజయపార్వతి

సీతంపేట, న్యూస్‌టుడే: జాతీయ డెంగీ మాసోత్సవం సందర్భంగా సీతంపేటలోని ఎన్టీఆర్ సాహస ఉద్యాన పార్కు నుంచి ప్రధాన కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో కె.విజయపార్వతి ర్యాలీని ప్రారంభించారు. ప్రధాన కూడలిలో మానవహారం చేపట్టారు. కార్యక్రమంలో డీఎంవో పి.వి.సత్యనారాయణ, దోనుబాయి వైద్యాధికారి భానుప్రతాప్, మలేరియా సబ్ యూనిట్ అధికారి జె.మోహనరావు, కన్సల్టెంట్ శ్రీకాంత్, ప్రాంతీయాసుపత్రి నర్సింగ్ పర్యవేక్షకురాలు సుజన పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై దృష్టిసారించాలి

పార్వతీపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మహిళా సర్పంచులు పంచాయతీల అభివృద్ధిపై దృష్టిసారించాలని ఎంపీడీవో జి.రమేష్ సూచించారు. బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో తొలివిడత మహిళా సర్పంచుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో మాట్లాడారు. మక్కువ ఎంపీడీవో స్వరూపరాణి, పాచిపెంట, సాలూరు, ఉప ఎంపీడీవోలు, మహిళా సర్పంచులు పాల్గొన్నారు. ★ నియోజకవర్గం లోని మూడు మండలాలు, కొమరాడ మండల మహిళా సర్పంచులకు నేటి నుంచి శిక్షణ ప్రారంభమవుతుందని ఎంపీడీవో తెలిపారు.

ఘనంగా గ్రామదేవత ఉత్సవాలు

పాలకొండ: అట్టలిలో గ్రామదేవత ఉత్సవాలు ఘనంగా జరిగాయి. భక్తులు అమ్మవారి ఘటాలతో మొక్కులు చెల్లించుకున్నారు. పోలమ్మతల్లి, దేశమ్మతల్లికి పసుపు, కుంకుమలు సమర్పించారు.

8న ధర్నా.. పాలకొండ, న్యూస్‌టుడే: పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ ఈనెల 8న చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి అప్పలనాయుడు అన్నారు. పాలకొండలో బుధవారం సమావేశం నిర్వహించారు. వైకాపా నివాస యోగ్యం కాని చోట స్థలాలిచ్చిందని, కనీస మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు.

మొక్కలు నాటిన ఎమ్మెల్యే

పార్వతీపురం: పచ్చదనం, పరిశుభ్రతతో భారతావని వికసించాలని పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర ఆకాంక్షించారు. పట్టణంలోని శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో 'క్లీన్ ఇండియా- గ్రీన్ ఇండియా' కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. విద్యా సంస్థల ప్రాంతీయ పర్యవేక్షకుడు శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ ఎం.గిరిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నాటుసారాతో ఒకరి అరెస్టు

కురుపాం గ్రామీణం: కురుపాంలో అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న ఓ యువకుడిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ పి.శ్రీనివాసరావు తెలిపారు. 40 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో యువకుడు తప్పించుకున్నాడని, త్వరలోనే అరెస్టు చేస్తామన్నారు.

పోరాటాలతోనే పరిష్కారం

సీతంపేట: గిరిజన సంక్షేమ సంఘం పోరాటం ఫలితంగానే గిరిజన గురుకులాల్లో పని చేస్తున్న ఔట్ సోర్సింగ్ బోధన సిబ్బందికి ప్రభుత్వం వేతనాలు పెంచిందని ఆ సంఘ ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ అన్నారు. కలిసి పోరాడితే సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. గి.సం. ఆశ్రమ పాఠశాలలు, పోస్టుమెట్రిక్ వసతి గృహాల్లో ఆరోగ్య సిబ్బందిని నియమించాలని కోరారు.

డిప్యూటీ ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ

గుమ్మలక్ష్మీపురం: గుమ్మలక్ష్మీపురం డిప్యూటీ ఎంపీడీవోగా ఎల్.శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ధర్మారావు ఉద్యోగోన్నతిపై జియ్యమ్మవలస ఎంపీడీవోగా వెళ్లడంతో విజయనగరం డీపీవో కార్యాలయంలో సీనియర్ సహాయకునిగా పనిచేస్తున్న శ్రీనివాసరావు ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు.

నిలిచిన తాగునీటి సరఫరా

పాలకొండ: నగర పంచాయతీ పరిధిలోని వడమ రక్షిత పథకం పరిధిలో బుధవారం నీటి సరఫరా నిలిచిపోయి ప్రజలు ఇబ్బంది పడ్డారు. నాగావళి నది నుంచి పథకానికి నీరు సరఫరా అవుతున్న పైపులైన్లకు అన్నవరం కూడలి వద్ద పొక్లెయిన్ తాకడంతో పగిలిపోయాయి.

కలప అక్రమ రవాణా అడ్డగింత

భామిని: మనుమకొండ నుంచి బత్తిలి కొత్త కాలనీ మీదుగా మంగళవారం ఓ వ్యాన్‌లో టేకు తరలిస్తుండగా పట్టుకున్నామని తహసీల్దారు శివన్నారాయణ బుధవారం తెలిపారు. వాహనం సీజ్ చేసి కలపను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. వాహనాన్ని పోలీసులకు అప్పగించామన్నారు.

తెదేపాలో 70 కుటుంబాల చేరిక

సీతానగరం: బూర్జ గ్రామానికి చెందిన 70 కుటుంబాలు ఎమ్మెల్యే విజయచంద్ర సమక్షంలో తెదేపాలో చేరాయి. కూటమి పాలనలోని సంక్షేమం నచ్చి చేరినట్లు వారు తెలిపారు. నాయకుడు కె.బలరాం పాల్గొన్నారు.

గోరపాడులో గజగజ

సీతంపేట, న్యూస్‌టుడే: సీతంపేట మండలం గోరపాడు సమీపంలోని జీడి తోటల్లోకి ఏనుగుల గుంపు ప్రవేశించింది. దీంతో కొండపోడు, ఇతర వ్యవసాయ పనులకు వెళ్లేందుకు స్థానికులు భయాందోళన చెందుతున్నారు. అటవీ సిబ్బంది, ట్రాకర్లు స్థానికుల్ని అప్రమత్తం చేస్తున్నామని అటవీశాఖ బీట్ అధికారి కె.దాలినాయుడు తెలిపారు.

సేవలతోనే గుర్తింపు..!

పద్మావతిని సత్కరిస్తున్న సిబ్బంది

కొత్తగూడలో ఉపాధ్యాయుడికి సత్కారం

గుమ్మలక్ష్మీపురం, న్యూస్‌టుడే: ఏ రంగంలోనైనా అందించిన సేవలతోనే ఉద్యోగులకు గుర్తింపు వస్తుందని ప్రభుత్వ విప్ తోయక జగదీశ్వరి, పార్వతీపురం ఐటీడీఏ పీవో అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. గుమ్మలక్ష్మీపురం మండలం కొత్తగూడ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన బిడ్డిక సొంబరను బుధవారం వేర్వేరుగా సత్కరించారు. ఇన్‌ఛార్జి డీడీ చంద్రబాబు, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు ఉన్నారు. ★ భద్రగిరి ఏపీఆర్ బాలుర కళాశాల, ఏకలవ్య పాఠశాలను పీవో సందర్శించారు. ఏకలవ్య పాఠశాలలో తాగునీటి సమస్య ఉన్నట్లు పీవో దృష్టికి తీసుకెళ్లారు. ఏపీఆర్ కళాశాలలో మొక్కలు నాటారు. ★ జియ్యమ్మవలస: జియ్యమ్మవలస పీహెచ్‌సీలో మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్‌గా పనిచేసి విరమణ పొందిన ఎంపీ పద్మావతిని ఘనంగా సత్కరించారు. మాజీ ఎమ్మెల్యే నిమ్మక జయరాజు, వైద్యులు పి.జగదీశ్, సాయి ప్రసన్న పాల్గొన్నారు.

తూర్పుకాపుల సంక్షేమానికి కృషి

నివాళులర్పిస్తున్న యశస్వి, నాయకులు

పాలకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: తూర్పుకాపుల సంక్షేమానికి కృషి చేస్తామని ఆ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్‌పర్సన్ పాలవలస యశస్వి అన్నారు. బుధవారం పాలకొండలో రాష్ట్ర డైరెక్టర్ టి.దుర్గారావు చిత్రపటానికి నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ.. దుర్గారావు కాపుల సమస్యలను సమావేశాల్లో తమ దృష్టికి తీసుకొచ్చేవారన్నారు. ఆయన కుటుంబానికి కూటమి అండగా ఉంటుందన్నారు. తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్లు శేఖర్‌పాత్రుడు, సత్తిబాబు, ఎంపీపీ బి.భాను, ఉపాధ్యక్షుడు అనిల్, కూటమి నాయకులు ప్రశాంత్, లీలాప్రసాద్, కన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలను పంపించలేమని ఆందోళన

ఉపాధ్యాయుడితో వాగ్వాదానికి దిగుతున్న తల్లిదండ్రులు

బలిజిపేట, న్యూస్‌టుడే: పలగర పంచాయతీ పరిధిలోని గుడివాడ నిర్వాసిత పాఠశాలలో చదువుతున్న పిల్లలను 2 కి.మీ దూరంలోని పలగర ఆదర్శ పాఠశాలకు పంపించలేమని తల్లిదండ్రులు ఉపాధ్యాయులతో వాగ్వాదానికి దిగారు. బుధవారం పలగర పాఠశాల ఉపాధ్యాయులు గుడివాడ కాలనీకి వెళ్లి పిల్లలను పంపించాలని అభ్యర్థించారు. గ్రామంలో కొనసాగిస్తే పంపిస్తామని, లేదంటే టీసీలు ఇచ్చేయాలన్నారు. ఇదే విషయం కలెక్టరుకు తెలియజేశామన్నారు.

13వ వర్ధంతి
మంచికి మారుపేరుగా నిలిచి, ప్రజలందరి మన్ననలు పొంది మా సింబన్నగారు స్వర్గస్తులై 13 సం॥లు గడిచినను ఇప్పటికీ, ఎప్పటికీ వారి జ్ఞాపకాలతోనే మెదులుతూ ఉంటాము. వారి పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతుని ప్రార్థిస్తూ...
శ్రీ శ్రీ మరిశర్ల సింహాచలంనాయుడుగారు (సింబన్న)
మాజీ D.C.C.B. అధ్యక్షులు, D.C.C.B. విజయనగరం
మరణం: 03-07-2012



విద్యోపాసక
శ్రీ మురపాక కాళిదాసు శర్మ, M.A.,
ప్రముఖ నాడీ జ్యోతిష్కులు
ప్రధాన అర్చకులు : శ్రీ అయ్యప్పస్వామి దేవస్థానం, పార్వతీపురం

ఈనాడు ప్రకాశం

సుపరిపాలనలో తొలి అడుగు!

▶ పాల్గొన్న ఎమ్మెల్యేలు, తెదేపా శ్రేణులు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: తెదేపా అధినేత, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు నెల రోజులపాటు నిర్వహించనున్న 'సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికీ తెదేపా' కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా బుధవారం ప్రారంభమైంది. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో తొలిరోజు స్థానిక ఎమ్మెల్యేలతోపాటు తెదేపా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గత ఏడాదిగా అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించడంతోపాటు ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొండపి మండలం గోగినేనివారిపాలెంలో రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఒంగోలు నగరంలోని 5, 6 డివిజన్లల్లో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, కనిగిరి నియోజకవర్గంలో చింతలపాలెం ఎస్సీ కాలనీ, పీసీపల్లి, పామూరు మండలం బొట్లగూడూరులో ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, గిద్దలూరులో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి, మద్దిపాడులో ఎమ్మెల్యే బీఎన్.విజయకుమార్, మార్కాపురంలో ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, తెదేపా శ్రేణులు పాల్గొన్నారు. గత ఏడాదిగా కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి నియోజకవర్గాల వారీగా ముద్రించిన కరపత్రాలను ఇంటింటికీ పంపిణీ చేశారు. పింఛన్లు, ఇంటి పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ స్థానికులు విన్నవించారు. ఆయా ప్రాంతాల్లో స్థానిక ఎమ్మెల్యేలకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు.

ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

2,645 పొగాకు బేళ్ల తిరస్కరణ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జిల్లాలోని రెండు రీజియన్ల పరిధిలోని పొగాకు వేలం కేంద్రాల్లో బుధవారం 2,645 పొగాకు బేళ్లు తిరస్కరణకు గురయ్యాయి. ఎస్‌బీఎస్ రీజియన్ పరిధిలోని కేంద్రాలకు 5,053 బేళ్లు రాగా 1,265, ఎస్‌ఎల్‌ఎస్ రీజియన్ పరిధిలోని కేంద్రాలకు 5,011 బేళ్లు రాగా 1,380 బేళ్లను తిరస్కరించారు. కిలో అత్యధిక ధర రూ.280, అత్యల్ప ధర రూ.150 చొప్పున పలికింది.

అటు పౌరసేవ... ఇటు ఉపాధి తోవ!

జిల్లాలోని పుర ప్రజలకు పౌర సేవలందించేందుకు కామన్ సర్వీసు సెంటర్లు (సీఎస్‌సీ) అందుబాటులోకి రానున్నాయి. ఇవి పట్టణ ప్రాంతాల్లో మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటుకానున్నాయి. పొదుపు సంఘాల్లోని పేద మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతోపాటు ప్రజలకు అందుబాటులో సేవలందించేవిధంగా రూపకల్పన చేశారు. ఇప్పటికే శిక్షణ తరగతులు పూర్తి కాగా, పురపాలకశాఖ పర్యవేక్షణలో 'డిజి లక్ష్మి' పేరిట ఏర్పాటవుతున్నాయి.

▶ పట్టణాల్లో పొదుపు సంఘాల ఆధ్వర్యంలో కామన్ సర్వీసు సెంటర్ల ఏర్పాటు

ఈనాడు, ఒంగోలు

పట్టణాల్లో పొదుపు సంఘాలను పర్యవేక్షించే మెప్మా ఆధ్వర్యంలో జిల్లాలో 326 కేంద్రాల ఏర్పాటుకు ప్రణాళిక రూపొందించారు. పొదుపు సంఘాల్లో ఒక్కో సమాఖ్య పరిధిలో ఒక కేంద్రాన్ని కేటాయించారు. ఆయా సమాఖ్య పరిధిలో డిగ్రీ పూర్తి చేసిన వారికి అవకాశం కల్పించారు. ఒంగోలు నగరంతోపాటు అయిదు పట్టణాల్లో 182 చోట్ల కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చారు. కంప్యూటర్‌లో ప్రాథమిక శిక్షణ అందించడంతోపాటు కేంద్రం నిర్వహణపై మెప్మా ఆధ్వర్యంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. కేంద్రాల ఏర్పాటుకు అవసరమయ్యే పెట్టుబడి సొమ్ము రూ.2 లక్షలు బ్యాంకు ద్వారా రుణం అందించనున్నారు. కంప్యూటరు, ప్రింటర్లు, స్కానర్లు, అంతర్జాల సౌకర్యానికి పరికరాలు.. వంటివి ఈ నగదుతో సమకూర్చుకోవాల్సి ఉంటుంది. వీటిని పొదుపు సంఘాల్లోని మహిళలతో పాటు ఆయా వార్డుల్లో ప్రజలు వినియోగించుకోవచ్చు.

పొదుపు మహిళలకు వేలిముద్ర యంత్రాలు అందిస్తున్న పీడీ శ్రీహరి

ఏయే సేవలు..

కామన్ సర్వీసు సెంటర్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పౌర సేవలు వినియోగించుకోవచ్చు. విద్యుత్తు బిల్లులు, పురపాలక సంఘాల పన్నులు తదితరాలు చెల్లించవచ్చు. సాధారణ ఎల్ఐసీ పాలసీల నగదుతో పాటు రైతులు బీమా సొమ్ములు చెల్లించవచ్చు. అసంఘటిత రంగంలో పనిచేసే కార్మికులు ఈ-శ్రమ కార్డులు వంటివి పొందవచ్చు.

పురపాలక సంఘాల వారీగా కేంద్రాలు

పట్టణం	లక్ష్యం	ప్రస్తుతం ఏర్పాటు
చీమకుర్తి	20	09
దర్శి	15	11
గిద్దలూరు	35	12
కనిగిరి	31	15
మార్కాపురం	61	19
ఒంగోలు	164	116

ఈ నెలలో ప్రారంభిస్తాం

కేంద్రాల ఏర్పాటు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాం. ఇప్పటికే పరిశీలన పూర్తయినచోట్ల ఈ నెలలో ప్రారంభిస్తాం. వీటి ద్వారా నెలకు రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు సంపాదించు కునే అవకాశం ఉంటుంది.

– పి.శ్రీహరి, పీడీ, మెప్మా

తాగునీరు... తాగలేరు!

మురుగుకూపంలో ఉన్న తాగునీటి ట్యాంకు వద్ద చిన్నారులు నీటిని తాగుతున్న ఈ ప్రాంతం పొదిలి మండలం తలమల్ల పంచాయతీ ఫిర్‌దౌస్‌నగర్‌లోనిది. ట్యాంకు పాచిపట్టడమే కాకుండా చుట్టూ మురుగు, చెత్త నిల్వలు, పిచ్చిమొక్కలతో దర్శనమిస్తోంది. పైపులు, ట్యాపులు లేకపోవడంతో గ్రామస్థులు ట్యాంకుకు ఓ పైపును అమర్చుకుని ఆ నీటిని తాగుతున్నారు. తాగునీటి సరఫరా నియంత్రణకు ట్యాపులేక పాచిపట్టిన కర్ర ముక్కను ఉపయోగిస్తున్నారు. ట్యాంకుతోపాటు పరిసరాలు పూర్తిగా అపరిశుభ్రంగా ఉన్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. –ఈనాడు, ఒంగోలు

రహదారులు, భవనాల శాఖ ఇన్‌ఛార్జి ఎస్ఈగా రవినాయక్

ఒంగోలు, న్యూస్‌టుడే: రహదారులు, భవనాలశాఖ ఇన్‌ఛార్జి ఎస్ఈగా ఎస్.రవినాయక్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కాంతిలాల్ దండే బుధవారం ఉత్తర్వులిచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎస్ఈ దేవానందం ఈ ఏడాది ఏప్రిల్‌లో ఉద్యోగ విరమణ పొందారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లా ఎస్ఈ గంగాధరం ఇన్‌ఛార్జిగా ఉన్నారు. ఇటీవల జరిగిన బదిలీల్లో శ్రీకాకుళం జిల్లాలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా పని చేస్తున్న ఎస్.రవినాయక్‌ను ఒంగోలు ఇన్‌ఛార్జి ఎస్ఈ నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

ఉప ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురంలో ఈ నెల 4న ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాట్లను బుధవారం కలెక్టర్ తమీమ్ అన్సారియా, జేసీ రోణంకి గోపాలకృష్ణ, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, జిల్లా అధికారులు పరిశీలించారు. మార్కాపురం-తర్లుపాడు రహదారిలో బహిరంగ సభతోపాటు నరసింహపురం గ్రామపరిధిలో హెలిప్యాడ్ స్థలాలను ఎంపిక చేశారు. ఈ రెండు చోట్ల ఏర్పాట్లు సత్వరమే పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వీరి వెంట ఉప కలెక్టర్ వెంకట త్రివినాగ్, డీఎస్పీ నాగరాజు, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి కాశీనాథ్, జిల్లా అధికారులు తదితరులున్నారు.

ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, అధికారులు

షెడ్యూలు ఇలా: ఈ నెల 4న ఉదయం 8.30 గంటలకు మాదాపూర్‌లోని తన నివాసం నుంచి బేగంపేట విమానాశ్రయానికి ఉప ముఖ్యమంత్రి చేరుకుంటారు. ఉదయం 9 గంటలకు బయలుదేరి గన్నవరం విమానాశ్రయానికి వస్తారు. 9.45 గంటలకు హెలికాప్టర్‌లో బయలుదేరి 10.45 గంటలకు మార్కాపురం మండలం నరసింహాపురం గ్రామానికి చేరుకుంటారు. 11.15 నుంచి 11.25 గంటల మధ్య జేజేఎం కింద రూ.1,290 కోట్లతో చేపట్టనున్న తాగునీటి సరఫరా పనులకు శంకుస్థాపన చేస్తారు. 11.25 నుంచి 12.45 గంటల మధ్య బహిరంగ సభలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.30 గంటలకు తిరిగి వెళతారు.

పశ్చిమ ప్రకాశం... వెలిగొండతో వికాసం!

▶ 1,387 గ్రామాలకు తాగునీటి సరఫరా
▶ పనులకు 4న ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శంకుస్థాపన

న్యూస్‌టుడే, మార్కాపురం

పశ్చిమ ప్రకాశంలో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఎన్డీయే ప్రభుత్వం నడుం బిగించింది. వెలిగొండ జలాలను ఇంటింటికి సరఫరా చేసేందుకు శ్రీకారం చుట్టింది. జలజీవన్ మిషన్ ద్వారా రూ.1,290 కోట్లతో 12 ఎకరాల్లో వెలిగొండ జలాలను నిల్వ చేసే గొట్టాల ద్వారా జిల్లాలోని ఆరు నియోజకవర్గాలు, 31 మండలాలు, 1387 ఆవాస గ్రామాల్లో ఇంటింటికి సరఫరా చేయనున్నారు. ఇందుకోసం మార్కాపురం మండలం గొట్టిపడియలోని వెలిగొండ ఆనకట్ట వద్ద రూ.73 కోట్లతో చేపట్టిన ఇన్‌టేక్ వెల్ నిర్మాణ పనులు 95 శాతం పూర్తయ్యాయి. దీని ద్వారా వెలిగొండ జలాలను రూ.1,290 కోట్లతో 12 ఎకరాల్లో నిర్మించనున్న పంపుహౌస్‌లో నిల్వ చేస్తారు. అనంతరం యంత్రాలతో శుద్ధి చేసి పైపులైన్ల ద్వారా పశ్చిమ ప్రాంతంలోని 1,387 గ్రామాల్లో ఇంటింటికి సరఫరా చేస్తారు. ఈ పథకానికి ఈ నెల 4న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ శంకుస్థాపనతో పాటు పైలాన్‌ను ఆవిష్కరించనున్నారు. జలజీవన్ మిషన్ కింద తొలి విడతగా రూ.1,290 కోట్లు మంజూరు కాగా, అనంతరం రెండో విడతగా రూ.1,850 కోట్లు విడుదల చేయనున్నారు.

ఇన్‌టేక్ వెల్ నిర్మాణం (వాటర్‌గ్రిడ్)

▶ జలజీవన్ మిషన్ పథకం ద్వారా మూడు విడతలుగా ఆరు నియోజకవర్గాలకు తాగునీటి సరఫరా జరగనుంది. తొలి విడతగా మార్కాపురం, కనిగిరి నియోజకవర్గాలతోపాటు కొండపి నియోజకవర్గం మర్రిపూడి మండలంలోని ఆరు గ్రామాలు, నెల్లూరు జిల్లా కందుకూరు నియోజకవర్గంలోని మండలాలకు తాగునీటి సరఫరా చేస్తారు. రెండో విడత గిద్దలూరు నియోజకవర్గంలో ఉన్న మండలాలకు, మూడో విడత ఎర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాల్లోని మండలాలకు నీటి సరఫరా జరగనుంది. మొత్తం ఆరు నియోజకవర్గాల్లోని 31 మండలాల్లోని 1,387 గ్రామాలకు నీటి సరఫరా చేపట్టనున్నారు. ప్రస్తుతం రూ.1,290 కోట్లతో చేపట్టే పనులను సుధాకర ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రైవేటు లిమిటెడ్- ఏఎంఆర్ ఇండియా లిమిటెడ్ కంపెనీలు సంయుక్త భాగస్వామ్యంతో దక్కించుకున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్ తెలిపారు.

మహా వారాహి... మనసా స్మరామి

మార్కాపురం పట్టణంలోని మార్కండేశ్వర స్వామి దేవస్థానంలో జగదంబ అమ్మవారి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం అమ్మవారు మహా వారాహి అలంకరణలో దర్శనమిచ్చారు. అమ్మవారిని పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు.

–న్యూస్‌టుడే, మార్కాపురం పట్టణం

కౌలుకు కొర్రీలు!

▶ సీసీఆర్సీ కార్డుల జారీకే పరిమితం
▶ రైతులపై బ్యాంకర్లు చిన్న చూపు

2024-25లో సీసీఆర్సీ కార్డుల లక్ష్యం	: 45 వేలు
రైతులకు పంపిణీ చేసిన కార్డులు	: 44,089
రుణం మంజూరు చేసినవి	: 5,068
బ్యాంకులు ఇచ్చిన రుణం	: రూ.31.82 కోట్లు
2025-26లో సీసీఆర్సీ కార్డుల జారీ లక్ష్యం	: 46,015
ఇప్పటివరకు మంజూరు చేసినవి	: 11,579

న్యూస్‌టుడే, ఒంగోలు కలెక్టరేట్

కౌలు రైతులకు లక్ష్యాలకు అనుగుణంగా బ్యాంకులు రుణాలివ్వడంలేదు. వీరికి రుణాలివ్వాలని ప్రభుత్వ ప్రకటన మాటలకే పరిమితమవుతోంది. వ్యవసాయాధికారులు కౌలు రైతులను బ్యాంకులకు తీసుకెళ్లి రుణాలిప్పించాలని ఆదేశిస్తున్నా క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదు. జిల్లాలో 3.90 లక్షల మంది రైతులుండగా, సగం మంది కౌలు రైతులే. వీరికి ప్రభుత్వ పథకాలు వర్తింపజేయడంతోపాటు, రుణాలు అందించేందుకు రెవెన్యూ, వ్యవసాయ శాఖల ఆధ్వర్యంలో పంట సాగు హక్కు పత్రాలను జారీ చేస్తున్నారు. వీరికి అందించే రుణాలు మాత్రం అరకొరగానే ఉంటున్నాయి. గత కొన్నేళ్లుగా రుణ పంపిణీ లక్ష్యాన్ని నిర్దేశించుకున్నా మంజూరు చేయడంలో బ్యాంకర్లు మోకాలడ్డుతున్నారు. దీంతో పంట పెట్టుబడికి బంగారం కుదవ పెట్టడం,.లేదంటే వడ్డీ వ్యాపారులను ఆశ్రయించడం పరిపాటిగా మారుతోంది.

సీసీఆర్సీ కార్డులకే పరిమితం...: కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు జారీ చేయడానికే రెవెన్యూ, వ్యవసాయశాఖల అధికారులు పరిమితమవుతున్నారు. కార్డు జారీ చేసిన ప్రతి రైతుకు పంట రుణం ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. కార్డు జారీ సమయంలో కౌలుకు తీసుకున్న పొలానికి సంబంధించి సదరు భూ యజమాని అప్పటికే పంట రుణం తీసుకుంటున్నారు. ఆ సమయంలో బ్యాంకర్లు...'మీ భూమి' పోర్టల్‌లో ఆయా సర్వే నంబర్లపై వ్యవసాయ రుణం ఇచ్చినట్లు నమోదు చేస్తారు. మళ్లీ అదే సర్వే నంబర్లపై కౌలు రైతులు సీసీఆర్సీ కార్డులు పొందినా రుణం ఇచ్చేందుకు అవకాశం ఉండదని బ్యాంకర్లు చెబుతున్నారు. దీంతో నిబంధనలు సాకుగా చూపి బ్యాంకర్లు మొండి చేయి చూపుతున్నారు.

పేరుకే జేఎల్‌జీ సంఘాలు... : పంట రుణం సకాలంలో తిరిగి చెల్లించేవిధంగా ప్రతి అయిదుగురు కౌలు రైతులతో జాయింట్ లయబిలిటీ గ్రూప్ (జేఎల్‌జీ) ఏర్పాటు చేస్తున్నారు. ఆయా సంఘాలకు రూ.10 లక్షల వరకు రుణం ఇచ్చేవిధంగా మార్గదర్శకాలున్నా గరిష్ఠంగా రూ.2.50 లక్షల మాత్రమే ఇచ్చేందుకు బ్యాంకర్లు ముందుకొస్తున్నారు. అది కూడా మొక్కుబడిగానే జరుగుతోంది. ప్రస్తుతం సాగుకు పెరిగిన ఖర్చుల దృష్ట్యా ఎకరా పెట్టుబడికి కూడా సరిపోవడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో లీడ్ బ్యాంకుగా ఉన్న కెనరా బ్యాంకునే కౌలు రైతులకు రుణాలిచ్చేందుకు నిబంధనలను సాకుగా చూపుతోంది. అయిదుగురు కౌలు రైతులకు కలిపి ఇవ్వడంతో వీరిలో ఒకరికి నష్టం వచ్చి కట్టకపోయినా బ్యాంకర్లు మిగతా రైతులను అడుగు తారన్న ఉద్దేశంతో సంఘంగా రుణం తీసుకునేందుకు కొందరు రైతులు ఆసక్తి చూపడంలేదు.

కనుమరుగైన పచ్చదనం

ఫౌంటెయిన్ల తీరిది

లక్షల వ్యయం... లక్ష్యం మాయం!

ఒంగోలు నగరంలోని కర్నూలు రోడ్డు వంతెన దిగువ ప్రాంతాన్ని 2014-19 మధ్య అప్పటి తెలుగు దేశం ప్రభుత్వం ఉద్యానవనంలా అభివృద్ధి చేసింది. దాదాపు రూ.60 లక్షలు వెచ్చించి వంతెన దిమ్మెలపై స్వాతంత్ర్య సమరయోధులు, మహనీయుల చిత్రాలను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. భరతమాత, ఎన్టీఆర్, దామచర్ల ఆంజనేయులు విగ్రహాలు, ఫౌంటెయిన్లు ఏర్పాటు చేశారు. ఆ పరిసరాలు ఆహ్లాదకరంగా ఉండడంతో నగరవాసులు సేద తీరేవారు. అనంతరం అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం నిర్వహణను గాలికొదిలేయడంతో ఆ ప్రాంగణం కళావిహీనంగా మారిపోయింది. పచ్చదనం ఆనవాళ్లు కనిపించడంలేదు. ఎన్డీయే ప్రభుత్వమైనా దృష్టి సారించి పూర్వవైభవం తీసుకురావాలని నగరవాసులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

ట్రిపుల్‌ఐటీలో రభస!

▶ గుత్తేదారుల మధ్య వివాదం ▶ విద్యార్థినుల భయాందోళన

న్యూస్‌టుడే, ఒంగోలు నేరవిభాగం: ఒంగోలు ట్రిపుల్‌ఐటీ క్యాంటీన్‌లో బుధవారం రభస చోటుచేసుకుంది. మధ్యాహ్నం భోజన విరామ సమయంలో విద్యార్థినులు భోజనం చేస్తుండగా, సుమారు 20 మంది క్యాంటీన్‌లోకి చొరబడి వంట పాత్రలు, వంటకాలను చెల్లాచెదురు చేశారు. కొత్తగా కాంట్రాక్టు తీసుకున్న వ్యక్తిని దుర్భాషలాడుతూ చొక్కా పట్టుకుని బయటకు లాక్కెళ్లి దౌర్జన్యానికి పాల్పడ్డారు. ఈ అనూహ్య ఘటనతో విద్యార్థినులు భయాందోళనకు గురయ్యారు. గుత్తేదార్ల మధ్య తలెత్తిన వివాదం ఘటనకు దారి తీసినట్లు సమాచారం. స్థానిక ఎస్ఎస్ఎన్ ఇంజినీరింగ్ కళాశాలలో గత కొన్నేళ్లుగా ఒంగోలు ట్రిపుల్‌ఐటీని నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలో గతేడాది అధికార మార్పిడి అనంతరం బాలబాలికలకు అప్పటిదాకా భోజనం సరఫరా చేసిన గుత్తేదారు తప్పుకొన్నారు. దీంతో ఏడాది కిందట కొత్తపట్నం మండలానికి చెందిన బలగాని రామచంద్రగౌడ్‌కు భోజన సరఫరా కాంట్రాక్టు అప్పగించగా, ఆయన వేరొకరికి సబ్ కాంట్రాక్టు ఇచ్చారు. మరోవైపు తాజాగా వేసవి సెలవులకు ముందు ఒంగోలుకు చెందిన గుత్తేదారు వీరగంధం శ్రీదేవి బాలికలకు భోజనం సరఫరా చేసేవిధంగా ఒప్పందం జరిగింది. ఈ నేపథ్యంలో గుత్తేదారు శ్రీదేవి భర్త వెంకటేశ్వర్లు బుధవారం మధ్యాహ్నం విద్యార్థినులకు భోజనం సరఫరా చేస్తున్న సమయంలో సుమారు 20 మంది యువకులు లోపలకు దౌర్జన్యంగా ప్రవేశించి దాడికి పాల్పడ్డారు. అక్కడే ఉన్న కొందరు వ్యక్తులు ఘటనను చరవాణిలో చిత్రీకరిస్తుండగా వారి ఫోన్లు లాక్కుని పగలుగొట్టారు. ఈ క్రమంలో వెంకటేశ్వర్లు వారి నుంచి తప్పించుకుని కళాశాల డీన్ రూఫస్‌కు మార్‌కు ఫిర్యాదు చేశారు. ఇదే సమయంలో రామచంద్రగౌడ్‌తో పాటు ఒంగోలుకు చెందిన తెలుగు యువత నాయకుడు, ఆయన అనుచరులు అక్కడకు చేరుకోవడంతో తీవ్ర వాగ్వాదం జరిగింది. ప్రస్తుతం డైరెక్టర్, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ అందుబాటులో లేరని, ఇక్కడ గొడవపడొద్దని, ఉన్నతాధికారులు వచ్చిన తర్వాత వారితో చర్చించాలని డీన్ ఇరు వర్గాలకు సూచించడంతో గొడవ సద్దుమణిగింది.

ప్రాంగణంలో గుత్తేదారు అనుచరులు

వక్ఫ్‌బోర్డు స్థలాల్లో ఆక్రమణల పరిశీలన

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలిలోని వక్ఫ్‌బోర్డు స్థలాల్లో అనధికారిక నిర్మాణాలు, ఆక్రమణలను బుధవారం కనిగిరి ఆర్డీవో కేశవర్ధనరెడ్డి పరిశీలించారు. పొదిలి-ఒంగోలు మార్గం పక్కన, బాప్టిస్టుపాలెం పడమరవైపు అనధికారికంగా నిర్మించిన గృహాలను తనిఖీ చేశారు. వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్, మేనేజింగ్ కమిటీ సభ్యులు వక్ఫ్‌బోర్డు స్థలాల్లో ఎక్కడెక్కడ ఆక్రమణలు జరిగాయో వివరించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కృష్ణారెడ్డి, నగర పంచాయతీ కమిషనర్ కె.ఎల్.నారాయణరెడ్డి, వక్ఫ్‌బోర్డు అధికారులతో చర్చించారు. నోటీసులు ఇచ్చి చట్టప్రకారం ఆక్రమణలను తొలగించాలని నిర్ణయించారు. మరోపక్క అధికారుల పరిశీలన అనంతరం యథేచ్ఛగా అనధికారిక నిర్మాణాలు ప్రారంభించడం గమనార్హం.

వక్ఫ్‌బోర్డు భూముల్లో నిర్మాణ పనులు

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా ఈ నెల 9న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్సీ కేఎస్.లక్ష్మణరావు కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక యూటీఎఫ్ భవన్‌లో బుధవారం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల, ఒప్పంద, పొరుగు సేవల వర్గాల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వేతన సంఘం సిఫార్సుల మేరకు కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు శ్రీనివాసరావు, రమేష్, .కొండారెడ్డి, పుల్లారావు, .వెంకటేశ్వర్లు, వీరాంజనేయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్సీ లక్ష్మణరావు

ఆధ్యాత్మిక యాత్ర!

▶ ప్రముఖ క్షేత్రాల సందర్శనకు ప్రణాళిక

ఈనాడు, ఒంగోలు

ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని ఆధ్యాత్మిక క్షేత్రాలెన్నో ఉన్నాయి. అక్కడికి వెళ్లేందుకు సామాన్యులు వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ఆయా క్షేత్రాలకు నేరుగా చేరేందుకు బస్సు సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటిని అధిగమించేందుకు పర్యాటకశాఖ దృష్టిసారించింది. తక్కువ ఖర్చుతో అన్ని క్షేత్రాలను చుట్టి వచ్చేవిధంగా ప్రణాళిక రూపొందిస్తున్నారు. ఆధ్యాత్మిక పర్యాటకాన్ని ప్రోత్సహించడంతోపాటు పర్యాటకుల సందర్శనతో స్థానికంగా ఆయా ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగవుతాయని భావిస్తున్నారు.

▶ ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రాలను సందర్శించాలనుకుంటే ఒక్కోదానికి కనీసం ఒక్కో రోజు కేటాయించాల్సి ఉంటుంది. ఇది వ్యయంతో పాటు సమయం వెచ్చించాలి. రోజున్నర లేదా రెండు రోజుల వ్యవధిలో అన్ని క్షేత్రాలను చుట్టి వచ్చేవిధంగా ప్రణాళిక రూపొందిస్తున్నారు. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఆయా క్షేత్రాల సందర్శనకు వాహనాలు ఏర్పాటు చేయడంతో పాటు యాత్రికులకు భోజనం, వసతిని నామమాత్రపు ఛార్జీలతో అందించేవిధంగా ఆలోచన చేస్తున్నారు.

▶ ఉమ్మడి ప్రకాశం జిల్లా శింగరకొండ ఆంజనేయస్వామి దేవస్థానంతో మొదలయ్యే యాత్ర శ్రీశైలం మల్లన్న దర్శనంతో పూర్తవుతుంది. వాహనాల్లో సందర్శకులను ఆలయాలకు తీసుకెళతారు. పర్యాటకశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న వసతి గృహాల్లో బస సౌకర్యం కల్పిస్తారు. వాడరేవు, పాకాల, కొత్తపట్నం సముద్రతీరాల సందర్శనకు వెళ్లేవారు ఉంటే వారికి అవకాశం కల్పిస్తారు. సందర్శనీయ క్షేత్రాల వారీగా ప్యాకేజీలు అందుబాటులోకి తీసుకురానున్నారు. తక్కువ ధరకు అందుబాటులో ఆధ్యాత్మిక యాత్రకు అవకాశం కల్పిస్తే జిల్లాలోని సందర్శనీయ స్థలాలకు ప్రాచుర్యం లభించి పర్యాటకులను ఆకర్షించే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు.

త్రిపురాంతకం క్షేత్రం

సందర్శనకు ప్రతిపాదించిన క్షేత్రాలు

- శింగరకొండ
- సింగరాయకొండ
- మాలకొండ
- భైరవకోన
- నెమలిగుండం
- త్రిపురాంతకం
- శ్రీశైలం

▶ సముద్ర తీరానికి వచ్చే పర్యాటకులను ఆకర్షించేవిధంగా టెంట్‌హౌస్‌లు పర్యాటకశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు కానున్నాయి. తక్కువ ఖర్చుతో వీటి నిర్మాణంతో పాటు పర్యాటకులకు నామమాత్రపు ధరకు అందు బాటులోకి రానున్నాయి. కొత్తపట్నం సముద్ర తీరానికి వచ్చేవారికి సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ ఛైర్మన్ నూకసాని బాలాజీ పేర్కొన్నారు. జిల్లాలోని వనరులను సద్వినియోగం చేసుకుని పర్యాటక అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు వివరించారు.



(c) eenadu

ఆ రూపం మూన్నాళ్లకే శిథిలం !
ఈ దీపం చాన్నాళ్లుగా పదిలం !!

నాటి..నేటి నాణ్యతకు దర్పణం పడుతున్నాయి ఈ రెండు లైట్‌హౌస్‌లు. కొత్తపట్నం సముద్రతీరంలో వీటిని పక్కపక్కనే నిర్మించారు. సముద్రంలోని మత్స్యకారులు, నావికులకు ఉపకరించేలా ఎడమ వైపునున్న ఈ లైట్‌హౌస్‌ను 1893లో నిర్మించారు. నేటికి 132 వసంతాలు దాటినా..చెక్కు చెదరకుండా ఠీవిగా నిలబడి నాటి పనుల నాణ్యతకు అద్దంపడుతోంది. కుడి వైపునున్న మరో లైట్‌హౌస్‌ను 1995లో నిర్మించి మెట్లు కూడా ఏర్పాటు చేశారు. ముప్పై ఏళ్లు కాకుండానే మెట్లు కూలిపోయి..నిర్మాణం శిథిలమై దీనంగా దర్శనమిస్తోంది.

-ఈనాడు, ఒంగోలు

చలాకీ రత్నం.. వందేళ్ల స్వప్నం

చిత్రంలో కనిపిస్తున్న బామ్మ పేరు బత్తుల రత్నం. ఈమెది..ఒంగోలు నగరంలోని మామిడిపాలెం. అయితే ఏంటనేగా మీ సందేహం. బుధవారమే తన 104వ జన్మదినోత్సవాన్ని బంధువులు, కుటుంబ సభ్యుల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. 1921లో జన్మించిన ఆమె అప్పట్లోనే చక్కగా చదువుకొని ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. చివరిగా బాపట్ల జిల్లా అద్దంకి మండలం దేనువకొండ ప్రాథమిక పాఠశాలలో పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. నలుగురు సంతానం. ప్రస్తుతం కుమార్తె ప్రభావతి ఇంట్లో ఉంటున్నారు. రక్తపోటు, మధుమేహం, చూపు మందగించడం వంటి సమస్యలేవీ లేవు. ఇప్పటికీ తన పని తానే చేసుకుంటున్నారు. గత ఆరేళ్లుగా ఉదయం ఒక ఇడ్లీ, మధ్యాహ్నం రాగిజావ, రాత్రి ఏదైనా ఫలం మాత్రమే తీసుకుంటున్నారని కుటుంబీకులు తెలిపారు.

- న్యూస్‌టుడే, ఒంగోలు నగరం

సమగ్ర శిక్ష ఉద్యోగులకు నేడు బదిలీల కౌన్సెలింగ్

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: జిల్లా సమగ్ర శిక్షలో బదిలీల కోసం దరఖాస్తు చేసిన వారి సీనియారిటీ జాబితాను వెబ్‌సైట్‌లో ఉంచినట్లు డీఈవో కిరణ్‌కుమార్ తెలిపారు. ఒప్పంద, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది అభ్యర్థన, పరస్పర బదిలీలు, కేజీబీవీల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది, సైట్ ఇంజినీర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మండలస్థాయి అకౌంటెంట్లకు బదిలీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి స్థానిక సమగ్ర శిక్ష కార్యాలయంలో ఈ కౌన్సెలింగ్ నిర్వహిస్తామన్నారు.

ఎక్సైజ్ చట్టాలపై అవగాహన తప్పనిసరి

మాట్లాడుతున్న కమిషనర్ నిశాంత్‌కుమార్, చిత్రంలో డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మ

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: ఎక్సైజ్ ట్రైనీ సబ్ ఇన్‌స్పెక్టర్లు చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని, ఈ మేరకు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎక్సైజ్‌శాఖ కమిషనర్ నిశాంత్ కుమార్ సూచించారు. ఒంగోలులోని పోలీసు శిక్షణ కళాశాల (పీటీసీ)లో జరుగుతున్న శిక్షణను ఆయన ఆ శాఖ డైరెక్టర్ రాహుల్‌దేవ్ శర్మతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చట్టాలపై పట్టు ఉంటేనే విధి నిర్వహణ సులభతరమవుతుందని, సమర్థంగా పనిచేయగలరని చెప్పారు. ఎక్సైజ్ చట్టంతో పాటు ఎన్‌డీపీఎస్ చట్టంపైనా దృష్టి పెట్టాలని సూచించారు. ఆయా కేసుల్లో నిందితులను అరెస్టు చేయాల్సిన సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మహిళా నిందితుల అరెస్టు విషయంలో చట్టాలకు లోబడి వ్యవహరించాలని సూచించారు. చెక్‌పోస్టుల నిర్వహణ, అనుమానిత వాహనాల తనిఖీల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. శిక్షణ పొందుతున్న ఎస్సైల నుంచి వివరాలు సేకరించారు. వారికి ఔట్‌డోర్‌లో ఇస్తున్న డ్రిల్‌ను ఉన్నతాధికారులు పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పీటీసీ వైస్ ప్రిన్సిపల్ లక్ష్మణ్‌కుమార్, ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ హేమంత్ నాగరాజు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ షేక్ ఆయేషా బేగం, ఒంగోలు సీఐ ఎ.లీనా పాల్గొన్నారు.

పేద విద్యార్థి.. ఇక ప్రబల శక్తి

న్యూస్‌టుడే, మద్దిపాడు

- నీట్, ఐఐటీ సాధించేలా ప్రభుత్వ శిక్షణ

జిల్లాలో 24 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. ఇవికాక కేజీబీవీలు 28, ఆదర్శ పాఠశాలలు 06, హైస్కూల్ ప్లస్ కళాశాలలు 13, గిరిజన సాంఘిక సంక్షేమ కళాశాలలు 12 వరకూ ఉన్నాయి. వాటిలో సుమారు 4,200 మంది ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్నారు. ప్రవేశ గడువు కూడా ఈ నెల 30 వరకూ పొడిగించడంతో ఇంకా విద్యార్థులు చేరే అవకాశముంది. తద్వారా నిరుపేద ప్రతిభావంతులు లబ్ధి పొందే అవకాశముంది. ఇప్పటి వరకూ సరైన శిక్షణ పొందే వీలులేక వారు పోటీ పరీక్షల్లో ర్యాంకులు పొందలేకపోయారు. ఈ పరిస్థితిలో సమూల మార్పు తీసుకొచ్చేందుకు కొత్త ప్రభుత్వం వడివడిగా అడుగులేసింది. ఇందుకోసం ప్రభుత్వ కళాశాలల్లో 'విద్యా శక్తి' పేరిట పథకాన్ని అమలుచేస్తోంది. ఆయా కళాశాలల్లో ఏర్పాటుచేసిన ఐఎఫ్‌పీ ప్యానల్స్ ద్వారా అంతర్జాల సదుపాయాన్ని వినియోగిస్తూ వారంలో పది తరగతులు నిర్వహించేలా ఏర్పాట్లు చేశారు. ఇంటర్ తరగతులు పూర్తయిన తరువాత సాయంత్రం అదనపు తరగతులు నిర్వహిస్తున్నారు. వారికి ఉచితంగా పాఠ్య, రాత పుస్తకాలు, రికార్డులు, సన్న బియ్యంతో మధ్యాహ్న భోజనం, చిక్కీలు కూడా అందిస్తున్నారు. దీనిపై ఆర్ఐవో సైమన్ విక్టర్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఆంజనేయులు మాట్లాడుతూ నైపుణ్యాలు పెంపొందించుకునేలా పోటీ పరీక్షలకు శిక్షణ ఇస్తున్నామన్నారు. దీన్ని పేద విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివే పేద విద్యార్థి కూడా ప్రబల శక్తిగా మారనున్నాడు. ప్రైవేటుకు దీటుగా నిలబడనున్నాడు. కూటమి ప్రభుత్వం అందిస్తున్న శిక్షణతో నీట్, జేఈఈ మెయిన్స్ తదితర పరీక్షల్లో విజేతగా ఆవిర్భవించే అవకాశాన్ని సొంతం చేసుకోనున్నాడు. ఈ మేరకు ప్రభుత్వం అందిస్తున్న శిక్షణ వారికెంతో ఉపకరించనుంది.



నీట్, జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్ పుస్తకాలు



ఐఎఫ్‌పీ ప్యానల్స్ ద్వారా భౌతికశాస్త్రం పాఠ్యాంశాలు బోధిస్తున్న అధ్యాపకుడు

ఐఐటీ సీటు సాధిస్తా

నేను మద్దిపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎంపీసీ చదువుతున్నా. ఐఐటీ, ఎన్ఐటీలలో సీటు సాధించాలనే తపన ఉన్నా ఎలా సన్నద్ధం కావాలో తెలియలేదు ఈ ఏడాది మా కళాశాలలోనే ఉచిత శిక్షణ, అధ్యాపకులు విలువైన సలహాలతో నా కల నిజం చేసుకుంటా.

- షేక్ ఆయేషా, ఇంటర్ ప్రథమ సంవత్సర విద్యార్థిని

జిల్లా శిక్షణ కేంద్రంలో వసతులు పరిశీలిస్తున్న ఎస్పీ దామోదర్, అదనపు ఎస్పీ నాగేశ్వరరావు తదితరులు

డీటీసీలో వసతుల కల్పనపై దృష్టి

ఒంగోలు నేరవిభాగం, న్యూస్‌టుడే: పోలీసు శాఖలోకి నూతనంగా ఎంపికైన కానిస్టేబుళ్ల శిక్షణ త్వరలో ప్రారంభమయ్యే అవకాశమున్న నేపథ్యంలో జిల్లా శిక్షణ కేంద్రం (డీటీసీ)లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి పెట్టాలని ఎస్పీ దామోదర్ అధికారులను ఆదేశించారు. స్థానిక కొత్తమామిడిపాలెం రోడ్డులోని డీటీసీని ఆయన బుధవారం పరిశీలించారు. ట్రైనీ క్యాడెట్లకు కేటాయించే బ్యారక్‌లు, ఓపెన్ జిమ్, తరగతి గదులు, కవాతు మైదానంలో కలియదిరిగారు. శిక్షణార్థులకు శారీరక శిక్షణ, పెరేడ్ ప్రాక్టీస్‌కు ఉపయోగపడే మైదానం అభివృద్ధి పనులు సత్వరమే చేపట్టాలని ఆదేశించారు. రన్నింగ్ ట్రాక్, డ్రిల్ ఏరియాను అభివృద్ధి చేయాలని, సుందరీకరణ పనులు చేపట్టాలన్నారు. శిక్షణ కేంద్రంలో మరమ్మతులు సత్వరం పూర్తి చేయాలని, అదనపు సౌకర్యాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ కె.నాగేశ్వరరావు, ఏఆర్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, డీటీసీ ఇన్‌స్పెక్టర్ సమీముల్లా, పీసీఆర్ ఎస్సై వేణుగోపాల్, ఆర్ఎస్సై రవికుమార్ ఉన్నారు.

క్షణికావేశంలో తప్పులు చేస్తే భారీ మూల్యం

ఒంగోలు న్యాయవిభాగం, న్యూస్‌టుడే: జాతీయ న్యాయసేవాధికార సంస్థ సూచన మేరకు నెలవారీ తనిఖీలో భాగంగా ఒంగోలు జిల్లా జైలును జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి షేక్ ఇబ్రహీం షరీఫ్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షణికావేశంలో తప్పులు చేసి కుటుంబాలకు దూరంగా ఉంటూ భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని ఖైదీలకు హితబోధ చేశారు. వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలు ఆలకించారు. వంటశాలను, సరుకుల నిల్వ గదులను పరిశీలించారు. నిత్యావసర సరుకుల నాణ్యతను పరిశీలించారు. ఆర్థిక స్థోమత లేనివారికి ఉచితంగా న్యాయవాదిని నియమించి..న్యాయ సహాయాన్ని అందిస్తామన్నారు. అర్హులు అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా జైలు పర్యవేక్షణాధికారి పి. వరుణారెడ్డి, వైద్యులు బ్రహ్మాజీ, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ జి. రవికిరణ్, డిప్యూటీ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ పి.వి.రాముడు, జైలర్ యలమందయ్య తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసరాల నాణ్యతను పరిశీలిస్తున్న న్యాయమూర్తి ఇబ్రహీం షరీఫ్

జాతీయస్థాయి హాకీ పోటీలకు లోహిత

మైనంపాడు (సంతనూతలపాడు), న్యూస్‌టుడే: జాతీయస్థాయి సబ్ జూనియర్ మహిళా పోటీలకు మైనంపాడు విద్యార్థిని ఆకుల లోహిత ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు డి.వి.ఎల్.నరసింహారావు తెలిపారు. మంగళవారం విద్యార్థిని అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. హాకీ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 3 నుంచి 12 వరకు రాంచీలో జరిగే జాతీయ స్థాయి సబ్ జూనియర్ మహిళల హాకీ పోటీల్లో రాష్ట్ర జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. విద్యా కమిటీ ఛైర్మన్ ఆకుల బ్రహ్మయ్య, పీఈటీ దాసరి శ్రీనివాసరావు, తిరుమలశెట్టి రవికుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థినితో ప్రధానోపాధ్యాయులు డి.వి.ఎల్.నరసింహారావు, ఉపాధ్యాయులు

రూ.520 ఎరజూపి 2 లక్షలు దోచేశారు !

త్రిపురాంతకం, న్యూస్‌టుడే: స్వేదం చిందించి సంపాదించుకున్న నగదును దుండగులు సినీ ఫక్కీలో చోరీ చేశారు. రూ.520 నగదును ఎరజూపి రూ.2 లక్షలతో ఉడాయించారు. ఈ సంఘటన త్రిపురాంతకం మండలంలోని గణపవరంలో బుధవారం చోటు చేసుకుంది. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..గణపవరానికి చెందిన తిరుపతి చిన్నయ్య దంపతులు వలస కూలీలుగా తెలంగాణ వెళ్లి కాయకష్టం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. బుధవారం చిన్నయ్య స్వగ్రామానికి వచ్చారు. కష్టపడి సంపాదించి దాచిపెట్టుకున్న నగదును తెచ్చుకునేందుకు త్రిపురాంతకంలోని స్టేట్‌బ్యాంక్‌కు వెళ్లారు. అక్కడ రూ.2 లక్షల నగదు డ్రా చేసుకుని తిరిగి స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలుదేరారు. గణపవరం వద్ద మరో ద్విచక్ర వాహనంపై వచ్చిన ఇద్దరు వ్యక్తులు అతని పక్కనుంచి వెళుతూ రూ.500, రూ.20 నోట్లను పడేశారు. మీ డబ్బులు పడిపోయాయని చిన్నయ్యకు చెప్పడంతో ఆయన తన ద్విచక్ర వాహనం ఆపి నోట్లను తీసుకునేందుకు వెళ్లారు. ఇదే అదనుగా దుండగులు చిన్నయ్య ద్విచక్ర వాహనం ట్యాంక్ కవర్‌లో ఉన్న రూ.2 లక్షల నగదుతో ఉడాయించారు. దీంతో బాధితుడు స్థానిక పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై శివ బసవరాజు వివరాలు సేకరించి సీసీ కెమెరాలను పరిశీలించారు. అనంతరం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఏకేయూ వీసీ మూర్తితో ఉప కులపతి శ్రీనివాసరావు, అధికారులు

ఏకేయూ వీసీని కలిసిన విక్రమసింహపురి ఉప కులపతి

ఒంగోలు నగరం, న్యూస్‌టుడే: నెల్లూరు విక్రమసింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి అల్లం శ్రీనివాసరావు బుధవారం ఏకేయూ వీసీ డీవీఆర్ మూర్తిని కలిశారు. కొమరోలు నివాసి అయిన శ్రీనివాసరావు విక్రమసింహపురి యూనివర్శిటీ రెగ్యులర్ వీసీగా ఇటీవల నియమితులయ్యారు. ఈ సందర్భంగా మర్యాదపూర్వకంగా యూనివర్శిటీకి వచ్చి వీసీతోపాటు, వివిధ విభాగాల అధికారులతో మాట్లాడారు. ప్రిన్సిపల్ రాజమోహన్‌రావు, వైస్ ప్రిన్సిపల్ నిర్మలామణి, డీన్ సోమశేఖర, సీఈ కేవీఎన్ రాజు తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ ఛైర్మన్ నూకసాని బాలాజీ బుధవారం వైస్ ఛాన్సలర్ మూర్తిని కలసి వివిధ అంశాలపై మాట్లాడారు.

మత సామరస్యానికి ప్రతీక ఖాసిం దర్గా

- నేటి నుంచి మొహర్రం ఏర్పాట్లు

తుమ్మలచెరువు ఖాసిం దర్గా

న్యూస్‌టుడే, తర్లుపాడు : తెలుగు రాష్ట్రాల్లో ఖ్యాతి గాంచిన ఖాసిం దర్గాలో మొహర్రం ఏర్పాట్లు మొదలయ్యాయి. కులమతాలకతీతంగా జరిగే ఊరేగింపులో వేలాదిమంది పాల్గొంటారు. తర్లుపాడు మండలంలోని తుమ్మలచెరువులో కొలువుదీరిన హజరత్ కాశిం స్వామి..తాము కోరిక కోర్కెలు నెరవేరుస్తాడని స్థానికుల నమ్మకం. అక్కడి దర్గా ఆధ్వర్యంలో గురువారం నుంచి మొహర్రం జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం చిన్న షరగత్, జులై 6న పెద్ద షరగత్ నిర్వహించనున్నారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా పెద్దఎత్తున భక్తులు దర్గాను సందర్శిస్తారని అంచనా వేస్తున్నారు. ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ప్రశాంతంగా జరిపేందుకు ఎస్సై బ్రహ్మనాయుడి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి దుర్మరణం

తర్లుపాడు, న్యూస్‌టుడే: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందిన సంఘటన మండలంలోని కలుజువ్వలపాడు సమీపంలో బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై బ్రహ్మనాయుడు తెలిపిన వివరాల ప్రకారం..కలుజువ్వలపాడు వద్ద బుధవారం రెండు బైకులు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాంలో కొండారెడ్డిపల్లెకు చెందిన మేకల వెంకటస్వామి(65) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ప్రమాదంలో మంగళకుంట పంచాయతీ నాతనాంపల్లెకు చెందిన తంగిరాల కాశయ్యకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఎస్సై సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. అనంతరం కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్కాపురం వైద్యశాలకు తరలించారు. మృతుడికి భార్యతోపాటు పిల్లలున్నారు. అయిదు నిముషాల్లో ఇంటికి చేరాల్సిన భర్త అంతలోనే మృత్యు ఒడికి చేరడంతో భార్య కన్నీరుమున్నీరయ్యారు.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 590 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.88/-.

ప్రకాశం జిల్లాలో బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం ధర - 101, రిటైల్ లైవ్ - 123, చికెన్ విత్ స్కిన్ - 178, చికెన్ స్కిన్‌లెస్- 203

విగ్రహాలు దొంగిలిస్తున్న ముఠా అరెస్టు

ఈనాడు, హైదరాబాద్: చోరీలకు పాల్పడుతున్న ముఠా ఎల్బీనగర్ సీసీఎస్, ఇబ్రహీంపట్నం పోలీసులకు చిక్కింది. నిందితుల నుంచి రూ.5.36 లక్షల విలువైన 12 పంచలోహ, వెండి విగ్రహాలు, గుడి గంటలు, దీపం స్టాండ్లు, రెండు హుండీలు, పుస్తెలతాడు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు బుధవారం ఎల్బీనగర్‌లో కేసు వివరాలు వెల్లడించారు. కర్నూలుకు చెందిన కె.శివానంద(52), ఉమ్మడి ప్రకాశం జిల్లా బల్లికురవ మండలం వల్లపల్లికి చెందిన ఎస్‌కే షరీఫ్(38) ఎల్బీనగర్, వనస్థలిపురం ప్రాంతాల్లో ఉంటూ కూలీలుగా పనిచేస్తున్నారు. ఫిబ్రవరిలో యాచారంలోని గండ్లగూడలో మల్లికార్జున స్వామి, శివాలయాల్లో నాలుగు గుడి గంటలు దొంగిలించారు. జూన్ 15న ఇబ్రహీంపట్నంలోని ఉప్పరగూడలో మల్లన్నస్వామి ఆలయంలో పుస్తెలతాడు, రెండు దీపం స్టాండ్లు చోరీ చేశారు.

పారిపోవడానికి ద్విచక్రవాహనం..

దొంగతనం సమయంలో పారిపోవడానికి ఇబ్బందిగా ఉందని ఉప్పల్‌లో ద్విచక్రవాహనం కొట్టేశారు. జూన్ 29న ఒకేరోజు సద్దుపల్లిలోని హనుమాన్, దండుమైలారంలో అయ్యప్పస్వామి ఆలయాల్లో చోరీలు చేశారు. నేరుగా ఉప్పల్‌లోని అన్నపూర్ణకాలనీలో నివాసముండే తుక్కు వ్యాపారి సిద్ధిపేట జిల్లా దుబ్బాక మండలం దుంపలపల్లికి చెందిన అక్కపల్లి క్రాంతికుమార్(31) దగ్గరకు వెళ్లి రూ.18,500లకు విగ్రహాలు అమ్మేశారు. జూన్ 30న ఇబ్రహీంపట్నంలోని పొల్కంపల్లిలోని శివగంగ, హనుమాన్ ఆలయాల్లో చోరీలు చేశారు. వరుసగా చోరీలు జరగడంతో ఎల్బీనగర్ సీసీఎస్ పోలీసులు ఆలయాలకు సమీపంలో సీసీ కెమెరాలను విశ్లేషించారు. నిందితులు ద్విచక్రవాహనాల మీద వెళ్లడాన్ని గుర్తించి దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం ఇబ్రహీంపట్నంలోని మంగళపల్లి దగ్గర శివానంద, షరీఫ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారిచ్చిన సమాచారంతో ఉప్పల్‌లో క్రాంతిని అదుపులోకి తీసుకున్నారు. శివానంద మీద వరంగల్ జిల్లా కాజీపేట ఠాణాలో రెండు, రాచకొండ పరిధిలోని మీర్‌పేట, నాగోల్‌లో రెండు, షరీఫ్ మీద ఇబ్రహీంపట్నంలో నాలుగు, యాచారం, అబ్దుల్లాపూర్‌మెట్‌లో రెండు, ఉప్పల్‌లో ఒక్కో కేసు నమోదైనట్టు స్పష్టం చేశారు.

మద్యం తాగొద్దన్నందుకు యువకుడు ఆత్మహత్య

తాళ్లూరు, న్యూస్‌టుడే : మద్యం తాగొద్దని కుటుంబీకులు మందలించడంతో కోపోద్రిక్తుడైన ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన తాళ్లూరు మండలం గుంటిగంగలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు తూర్పుగంగవరానికి చెందిన బి.మహేష్ (30) మద్యానికి బానిసయ్యాడు. ఇంటి పనులు చేయకుండా జులాయిగా తిరుగుతున్నాడు. దీంతో ఇంట్లో తరచూ గొడవలు జరుగుతున్నాయి. మద్యం తాగొద్దని బుధవారం రాత్రి తల్లిదండ్రులు మరోమారు మందలించారు. దీంతో మహేష్ ఇంటిలోని తల్లి చీర తీసుకొని గుంటిగంగలోని వృద్ధుల ఆశ్రమం వద్దకు వెళ్లి అక్కడి చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి తండ్రి బి.బ్రహ్మం ఫిర్యాదు మేరకు ఏఎస్సై మోహన్‌రావు కేసు నమోదు చేయగా ఎస్సై ఎస్.మల్లికార్జునరావు సంఘటనాస్థలిని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నారు.

పొగాకు బోర్డు ఆర్.ఎం. బాధ్యతల స్వీకరణ

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: పొగాకు బోర్డు ఆర్.ఎం.గా శీలం రామారావు స్థానిక దక్షిణ బైపాస్‌లోని కార్యాలయంలో బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ప్రస్తుతం విజిలెన్స్ ఓఎస్డీగా కొనసాగుతూ బదిలీపై ఒంగోలుకు వచ్చారు. ఈ సందర్భంగా బోర్డు ఉద్యోగులు, వేలం కేంద్రాల నిర్వహణాధికారులు, రైతు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

వైకాపా నాయకుడి నివాసంలో సీబీఐ సోదాలు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: వైద్యవిద్యార్థులకు సీట్ల కేటాయింపు, ఆసుపత్రుల అనుమతుల కోసం మధ్యవర్తిగా వ్యవహరిస్తూ భారీగా లంచాలు తీసుకున్నారన్న ఆరోపణలపై శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లికి చెందిన వైకాపా నాయకుడు, డాక్టర్ బత్తల హరిప్రసాద్ నివాసంలో మంగళవారం అర్ధరాత్రి వరకు సీబీఐ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో వారు నగదు వివరాలు నమోదు చేసిన పుస్తకంతోపాటు కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. బత్తల హరిప్రసాద్ దిల్లీలోని సీబీఐ అధికారుల ఎదుట హాజరుకావాలని ఆయన కుటుంబసభ్యులకు నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. ఎన్ఎంసీ సభ్యులతో సత్సంబంధాలు కలిగిన డాక్టర్ బత్తల హరిప్రసాద్ చెన్నై వేదికగా మరికొందరితో కలిసి రెండు తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల్లో వైద్య విద్యార్థులకు యాజమాన్య కోటా సీట్లు, ప్రైవేటు వైద్యశాలలకు సంబంధించిన అనుమతుల కోసం పెద్దమొత్తంలో లంచాలు తీసుకున్నట్లు ఫిర్యాదుల అందినట్లు తెలుస్తోంది. కోట్లాది రూపాయలు వసూలు విషయమై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణల దృష్ట్యా దాదాపు 35 చోట్ల ఒకేరోజు సీబీఐ అధికారులు తనిఖీలు చేసినట్లు సమాచారం. డాక్టర్ బత్తల హరిప్రసాద్‌కు చెన్నై, తిరుపతి, హైదరాబాద్ ప్రాంతాల్లో ఇళ్లు, ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నట్లు సీబీఐకి ఫిర్యాదు అందినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే సీబీఐ అధికారులు హరిప్రసాద్ స్వగ్రామమైన కుమ్మరవాండ్లపల్లిలో తనిఖీలు చేసినట్లు తెలుస్తోంది.

పశు దాణాలో సిబ్బంది చేతివాటం

పశు వైద్యశాల వద్ద ఆందోళన చేస్తున్న పశు పోషకులు

మద్దిపూడి, న్యూస్‌టుడే: పశువుల దాణాలో చేతివాటం ప్రదర్శించి రైతన్నలను దోచుకున్నారు.. ప్రభుత్వం అన్నదాతలకు అండగా నిలిచేందుకు యాభై శాతం రాయితీపై పైలెట్ ద్రావణాన్ని పంపిణీ చేపట్టింది. ఇదే అదనుగా సిబ్బంది వందమంది పశు యజమానుల నుంచి సుమారు రూ.1.50 లక్షల వరకు వసూలు చేశారని బాధితులు ఆరోపిస్తున్నారు. మద్దిపూడి వైద్యశాల పరిధిలోని మద్దిపూడి, రాజుపాలెం, గంగపాలెం, వల్లాయిపాలెం గ్రామాలకు చెందిన రైతుల నుంచి బస్తాకు రూ.600 చొప్పున వైద్యశాలలో పనిచేసే ఉద్యోగి వసూలు చేశాడు. ఆ నగదును వైద్యాధికారికి జమ చేయకపోవటంతో పశువుల దాణా రాలేదు. ఇది జరిగి నెల అవుతున్నా దాణా అందలేదు. ఈ నేపథ్యంలో ఇటీవల 44 బస్తాల దాణా వచ్చిందన్న విషయం తెలుసుకున్న పశు పోషకులు బుధవారం స్థానిక వైద్యశాల వద్దకు చేరుకుని ఆందోళనకు దిగారు. దీనికి స్పందించిన వైద్యాధికారి మణిశేఖర్ వారితో మాట్లాడుతూ తాను ఇటీవలే బాధ్యతలు తీసుకున్నానని నగదు చెల్లించిన విషయం తనకు తెలియదన్నారు. దీంతో బాధిత రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. తమ వద్ద నుంచి నగదు వసూలు చేసిన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేశారు. ఉన్నతాధికారులు పూర్తిస్థాయిలో విచారించి న్యాయం చేయాలన్నారు.

పీసీ పల్లి : చెంచులక్ష్మమ్మను ఎమ్మెల్యే ఉగ్ర వాహనంలో తరలిస్తున్న చిత్రం

క్షతగాత్రుని పరిస్థితి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

అధికారం కాదు.. మమకారం

- క్షతగాత్రులకు ఆదుకున్న ఎమ్మెల్యేలు

పీసీపల్లి, గిద్దలూరు : గాయాలతో విలవిల్లాడుతున్న క్షతగాత్రులకు తెదేపా ఎమ్మెల్యేలు చేయూతనిచ్చి ఆదుకున్నారు. గజ్జలకొండకు చెందిన నారు చెంచులక్ష్మమ్మ ద్విచక్ర వాహనంపై కూర్చొని కందుకూరు నుంచి కనిగిరికి వస్తూ పెదఅలవలపాడు వద్ద పడిపోయి గాయపడ్డారు. గుంటుపల్లి నుంచి వస్తున్న ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి సంఘటన స్థలంలో వాహనం ఆపించి క్షతగాత్రురాలిని తన వాహనంలో కనిగిరి వైద్యశాలకు తరలించారు. గిద్దలూరు మండలం దిగువమెట్ట వద్ద బుధవారం ఓ వ్యక్తి మోటారు సైకిల్‌పై వెళుతూ అదుపుతప్పి పడి గాయాల పాలయ్యారు. ఆ సమయంలో కర్నూలు నుంచి గిద్దలూరు వస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి గుర్తించి వాహనం ఆపారు. దగ్గరుండి మరో వాహనంలో గిద్దలూరులోని ప్రైవేటు వైద్యశాలకు క్షతగాత్రుడిని తరలించి మానవత్వం చాటుకున్నారు.

EENADU Classifieds

PEOPLE CARE

OLD AGE HOME

రామకృష్ణ గ్రూప్ (AP No:1) VJA. వృద్ధులకు, పేషంట్ల సేవలకు, ఇంటి/వంటపని, బేబికేర్ కొరకు M/F వర్కర్లను మీ ఇంటికి పంపగలము. ✆ 95052 76677, 82474 49036.

అధిక స్పందనలు పొందండి. వాహనాలు అమ్మకం, ఉద్యోగాల భర్తీ, ఇళ్లు, ప్లాట్లు, స్థలాలు అమ్మకాలు, కొనుగోళ్లు, ఇళ్లు, షాపులు, ప్లాట్లు అద్దెకు మరియు అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు..

B/W 5 లైన్ల ప్రకటన రూ.275/- మాత్రమే

వివరాలకు..

97011 12824

ఒంగోలు 80087 09902

మార్కాపురం 80081 11050

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి. B&W : రూ. 500 Colour : రూ. 700

ప్రకటనలపై 5% GST వర్తించును

JOBS

మా కంపెనీలో పనిచేయుటకు సూపర్‌వైజర్స్, డ్రైవర్స్, స్టోర్ ఇన్‌ఛార్జి ITI, Dip All. Ex ఆర్మీ కావలెను. (రూ. బో) PF, ESI. జీతం 18-32 వేలు. సెల్ : 99891 76281.

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. బో+వ+మంచి జీతం + ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

శివకార్తికేయ హోంకేర్ నందు వృద్ధులను/పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు ఇంటి/వంట పనిచేయుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 20K. ✆ 99120 11499, 99120 11899.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటన దారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటన కర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

(c) eenadu

మార్కాపురం
•మార్కాపురం • గిద్దలూరు • యర్రగొండపాలెం

గిద్దలూరులో మహిళకు కరపత్రం అందించి పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

తర్లుపాడులో మహిళలకు కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి

పదోన్నతులు కల్పించాలని డిమాండు

గిద్దలూరు పట్టణం: అర్హులైన వీఆర్వోలకు సీనియర్ సహాయకులు, ఆర్ఐలుగా పదోన్నతులు కల్పించాలని జిల్లా వీఆర్వో సంఘం అధ్యక్షుడు వై.పి.రంగయ్య కోరారు. ఆయన బుధవారం గిద్దలూరు తహసీల్దారు కార్యాలయం ఆవరణలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1గా పదోన్నతి కల్పించాలని, గతంలో ఉన్న విధంగా తహసీల్దారు కార్యాలయం ఆధ్వర్యంలో విధులు నిర్వహించేలా చూడాలన్నారు.

సమావేశంలో ప్రసంగిస్తున్న జిల్లా వీఆర్వో సంఘం అధ్యక్షుడు వై.పి.రంగయ్య

అభివృద్ధి, సంక్షేమమే కూటమి ప్రభుత్వం లక్ష్యం

పొదిలి, తర్లుపాడు, మార్కాపురం గ్రామీణం, గిద్దలూరు పట్టణం, కంభం, పుల్లలచెరువు: అభివృద్ధి, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తున్నట్లు మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పేర్కొన్నారు. పొదిలి ఒకటో వార్డులో బుధవారం 'సుపరిపాలనలో తొలి ఏడాది' కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అనంతరం ఇంటింటికి తిరిగి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల కరపత్రాలను పంచారు .తర్లుపాడు గ్రామంలోని పలు ఇళ్లను ఎమ్మెల్యే కందుల సందర్శించి సూపర్-6 పథకాలను ప్రజలకు వివరించారు. ● మార్కాపురం పట్టణంలోని ఆరో వార్డులో, మండలంలోని దరిమడుగులో ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి బుధవారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటి ప్రచారం నిర్వహించి, పాఠశాల విద్యార్థులను తల్లికివందనం అందిందా అని అడిగారు. ● ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి గిద్దలూరు పురపాలకలోని 2వ వార్డులో ఇంటింటికి తిరిగి లబ్ధిదారులు, కుటుంబసభ్యులతో మాట్లాడారు. ● కంభం మండలంలోని తురిమెళ్ల గ్రామంలో తెదేపా నాయకులు ఇంటింటికీ తిరిగి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. కరపత్రాలు పంపిణీ చేశారు. ● యర్రగొండపాలెం తెదేపా నియోజకవర్గ బాధ్యులు గూడూరి ఎరిక్షన్ బాబు పుల్లలచెరువులో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.


పుల్లలచెరువులో ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి పనులను వివరిస్తున్న ఎరిక్షన్‌బాబు

వసతి గృహాలు.. సంక్షేమ ఆలయాలు

☛ విద్యార్థులకు భరోసా ☛ నిత్య పర్యవేక్షణ ☛ స్టడీ అవర్లు

త్రిపురాంతకం సంక్షేమ వసతి గృహంలో స్టడీ అవర్స్‌లో ఉన్న విద్యార్థులు

మార్కాపురం, న్యూస్‌టుడే

ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల్లో అధికారుల సంరక్షణలో ఉంటూ నాణ్యమైన భోజనంతో పాటు విద్యను అభ్యసించడానికి అర్హులైన విద్యార్థిని, విద్యార్థులకు సాంఘిక సంక్షేమశాఖ చక్కటి అవకాశం కల్పిస్తుంది. మార్కాపురం డివిజన్‌లోని మూడు నియోజకవర్గాల్లోని 13 మండలాల్లో ఉన్న సాంఘిక సంక్షేమ శాఖ (ఎస్సీ) ఆధ్వర్యంలో నడుస్తున్న ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లో జూన్ 12వ తేదీ నుంచి అడ్మిషన్లు తీసుకుంటున్నారు.

● పశ్చిమ ప్రకాశంలో బాలుర వసతి గృహాలు 13, బాలికల వసతి గృహాలు నాలుగు, కళాశాల వసతి గృహాలు అయిదు వరకు ఉన్నాయి. మొత్తం 22 వసతి గృహాల్లో 2200 సీట్లకుగాను 750 వరకు సీట్లు ఖాళీగా ఉన్నట్లు అధికారులు చెప్పారు.

సౌకర్యాలు ఇవీ

వసతి గృహాల్లో విద్యార్థులకు ఉచిత వసతితో పాటు సన్నబియ్యంతో పాటు నాణ్యతతో కూడిన మూడు పూటలా మెనూ ప్రకారం భోజనం, కాస్మోటిక్ ఛార్జీలు, రాత పుస్తకాలు, దుప్పట్లు, స్నానం చేయడానికి గదులు, మరుగుదొడ్లు ఇలా అన్ని రకాల సౌకర్యాలతో పాటు సదుపాయాలతో వసతి గృహంలో ఉంటూ చదువుకోవచ్చని అధికారులు కోరుతున్నారు. వసతి గృహంలో ఉండి చదువుకోవడం వల్ల నిత్యం సంక్షేమ అధికారి పర్యవేక్షణతో పాటు ఉదయం, సాయంత్రం ప్రత్యేక ఉపాధ్యాయులతో స్టడీ అవర్లు ఏర్పాటు చేసి ఉత్తీర్ణతకు కృషి చేస్తారు. ఇప్పటికే అడ్మిషన్లు చివరి దశకు వచ్చాయని ఆసక్తిగల విద్యార్థినీ, విద్యార్థులు వసతి గృహాల్లో చేరవచ్చునని అధికారులు పేర్కొంటున్నారు.

మంచి ఉత్తీర్ణతకు అవకాశం

గిద్దలూరు పరిధిలోని ముండ్లపాడు గ్రామంలో ఉన్న సంక్షేమ వసతి గృహంలో ఉంటూ చదువుకున్న గత ఏడాది పదో తరగతి విద్యార్థులు 17 మంది 500 కంటే మార్కులు దాటడంతో రాష్ట్ర స్థాయిలో అవార్డును అందుకున్నారు.

సద్వినియోగం చేసుకోండి

బయట ప్రైవేటు వసతి గృహాల్లో ఉంటూ రూ.వేలకు వేలు ఖర్చు చేసుకోవడం కన్నా ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటే ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. త్వరగా విద్యార్థులు వసతి గృహాల్లో అడ్మిషన్ల కోసం దరఖాస్తులు తీసుకోవాలి.
– అరుణకుమారి, సహాయ సాంఘిక సంక్షేమ అధికారి, మార్కాపురం

బ్రీత్ ఎనలైజర్ అందజేత

బేస్తవారపేట, న్యూస్‌టుడే: బేస్తవారపేట, కంభం లారీ, మినీ లారీ యూనియన్ సభ్యులు బ్రీత్ ఎనలైజర్ పరికరాన్ని మార్కాపురం డీఎస్పీ నాగరాజు చేతుల మీదుగా బేస్తవారపేట పోలీస్ స్టేషన్‌కు బహూకరించారు. బుధవారం మార్కాపురం పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయంలో డీఎస్పీ చేతుల మీదుగా బ్రీత్ ఎనలైజర్‌ను ఎస్సై రవీంద్రారెడ్డికి అందజేశారు.

పశువైద్యశాల ఆకస్మిక తనిఖీ

తర్లుపాడు, న్యూస్‌టుడే: మండలంలోని కలుజువ్వలపాడు పశువైద్యశాలను జేడీఏ రవి బుధవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని మందులను, దస్త్రాలను పరిశీలించారు.

అంగన్‌వాడీలో అక్షరాభ్యాసం

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీ బడిబాటలో ఏర్పాటు చేసిన ప్రీస్కూల్ కార్యక్రమంలో తల్లిదండ్రులు తమ పిల్లలను ఉత్సాహంగా చేర్పిస్తున్నారని రాయవరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.సుబ్బయ్య పేర్కొన్నారు. ఆయన ఆధ్వర్యంలో గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో 3 సంవత్సరాలు నిండిన పిల్లలకు ప్రీస్కూల్ సంసిద్ధత కార్యక్రమంలో భాగంగా అక్షరాభ్యాసం చేయించారు.

అక్షింతలు వేస్తున్న పాఠశాల హెచ్ఎం సుబ్బయ్య, అంగన్‌వాడీ సిబ్బంది

అందరూ సమన్వయంతో పనిచేయండి : కలెక్టర్

మార్కాపురం, న్యూస్‌టుడే: అన్నిశాఖల అధికారులు సమన్వయంతో పని చేసి ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటనను విజయవంతం చేయాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. మార్కాపురంలో ఈ నెల 4వ తేదీన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పర్యటించనున్న నేపథ్యంలో బుధవారం ఉప కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అధికారులతో సమావేశమయ్యారు. ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉన్నందున సభా వేదిక, పార్కింగ్ ప్రదేశాల్లో బ్యారికేడ్ల ఏర్పాట్లు పటిష్ఠంగా చేపట్టాలని ఆదేశించారు. సభా వేదిక ప్రాంగణంలో అవసరమైన మందులను వైద్యఆరోగ్యశాఖ అధికారులు సిద్ధంగా ఉంచాలన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలుగకుండా సౌకర్యాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సభ స్థలిలో సరిపడా సీటింగ్, తాగునీరు అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ రోణంకి గోపాలకృష్ణ, ఉప కలెక్టర్ సహాత్ వెంకట త్రివినాగ్, జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఇమ్మడి కాశీనాథ్, డీఎస్పీ నాగరాజు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా, పక్కన అధికారులు

దారి తప్పుతున్న చోదకులు

పెద్దదోర్నాల, న్యూస్‌టుడే: హైదరబాద్ నుంచి పెద్దదోర్నాల మీదుగా పెద్దారవీడు నుంచి తోకపల్లె వరకు జాతీయ రహదారి నిర్మిస్తున్నారు. రహదారి నిర్మాణ పనులు పూర్తి కావస్తున్నాయి. పెద్దదోర్నాలలో కర్నూలు-గుంటూరు రహదారిని అనుసంధానిస్తూ శ్రీశైలం వైపు బైపాస్ రహదారి వేశారు. రహదారి అనుసంధానం జరిగిన ప్రదేశంలో సూచిక బోర్డు లేకపోవడంతో పెద్దదోర్నాల, కర్నూలు వైపు వెళ్లాల్సిన వాహన చోదకులు పొరపాటున శ్రీశైలం రహదారి వైపు వెళుతున్నారు. అక్కడి అటవీశాఖ చెక్ పోస్టు వద్దకు వెళ్లి తిరిగి పెద్దదోర్నాలకు రావాల్సి వస్తోంది. ఇబ్బంది నెలకొనడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు చోద్యం చూస్తున్నారే తప్ప సూచిక బోర్డు ఏర్పాటు చేయడంలేదని చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సూచిక బోర్డులేని కూడలి

గడియారం పెట్టే సమయమే లేదా?

మార్కాపురం గ్రామీణం, న్యూస్‌టుడే: మార్కాపురం అంటే టక్కున గుర్తుకు వచ్చేది గడియార స్తంభం. పట్టణ నడిబొడ్డున ఉండే గాంధీ పార్కులో ఉండే ఈ స్తంభానికి ఎంతో చరిత్ర ఉంది. గతంలో నాలుగు వైపులా అందరికీ సమయం తెలియజేసే గడియారాలు ఉండేవి. నేడు అవి కనుమరుగయ్యాయి. ఒక వైపు మాత్రమే కనిపిస్తున్న గడియారం మరమ్మతులకు గురై సరైన సమయం చూపించడం లేదు. వ్యాపార కూడలిలో ఉండే ఈ స్తంభం వివిధ పనులపై వచ్చే వారు పార్కులో కాసేపు సేద దీరి సమయం చూసుకొని వెళ్లేవారు. పార్కు ఆక్రమణలకు గురైంది. గడియార స్తంభం నిరుపయోగంగా మారింది. అధికారులు, నాయకులు తక్షణమే స్పందించి నలువైపులా గడియారాలను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

గాంధీపార్కులోని గడియార స్తంభం

తెగిన విద్యుత్తు తీగలు

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి ప్రభుత్వ ఆసుపత్రి ముందు బుధవారం విద్యుత్తు తీగలు తెగిపడ్డాయి. అదృష్టవశాత్తు ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. స్థానిక వైద్యశాల సిబ్బంది, స్థానికులు గమనించి విద్యుత్తుశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు వచ్చి సరి చేసేంత వరకు అటుగా ఎవరూ రాకుండా చూశారు. స్పందించిన విద్యుత్తుశాఖ సిబ్బంది హుటాహుటిన వచ్చి సరఫరా నిలిపి వేసి తీగలను సరిచేశారు. తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించారు.

విద్యుత్తు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు: ఈఈ

మార్కాపురం, న్యూస్‌టుడే: మార్కాపురం డివిజన్‌లో విద్యుత్తు ప్రమాదాల నివారణకు పటిష్ఠ చర్యలు తీసుకోవడం జరుగుతుందని మార్కాపురం విద్యుత్తుశాఖ ఈఈ నాగేశ్వరరావు పేర్కొన్నారు. బుధవారం మార్కాపురంలో విద్యుత్తు జాతీయ భద్రత వారోత్సవాల సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ పట్టణంలోని పలు వీధుల మీదుగా సాగింది. తెగిపడిన తీగలకు దూరంగా ఉండాలని, తడి చేతులతో స్తంభాలను పట్టుకోవడం, వాటి సమీపంలో దుస్తులు ఆర వేయడం తగదని ప్రజలకు అవగాహన కల్పించారు. రైతులు పొలాల్లో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ సీయానాయక్, ఏఈ నాగేంద్రారెడ్డి, డివిజన్‌లోని ఏఈలు, అధికారులు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న ఈఈ నాగేశ్వరరావు

కదలని ట్రాక్టర్లు

కొనకనమిట్ల, న్యూస్‌టుడే : కొనకనమిట్ల, గొట్లగట్టు పంచాయతీలకు గతేడాది నవంబరులో రెండు ట్రాక్టర్లు మంజూరు చేశారు. చెత్త సేకరించేందుకు అవసరమైన తొట్టెలు లేక రూ. లక్షల విలువైన వాహనాలు మూలకు చేరాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. సమస్యను ఎంపీడీవో ఈశ్వరమ్మ దృష్టికి తీసుకెళ్లగా తొట్టె రాగానే చెత్త సేకరణ పనులు చేపడతామన్నారు.

చెత్త సేకరణకు కొన్న ట్రాక్టరు

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)

మార్కాపురం : 8008631313
గిద్దలూరు పట్టణం: 8008574135
యర్రగొండపాలెం : 8008552658

కొనకనమిట్ల, న్యూస్‌టుడే:

?: మండలంలోని గరిమినపెంటలో రహదారులకు రెండు వైపులా కాలువలు లేవు. తాగునీటి వైపుల వద్ద వృథాగా పోయే నీరు రహదారిపై నిలిచి నడవడానికి ఇబ్బందిగా మారింది.
– శ్రీనివాసులు, గరిమినపెంట.

✓: గ్రామంలో మురుగు కాలువలు నిర్మించడానికి చర్యలు తీసుకుంటాం. – శ్రీదేవి, ఈవోఆర్డీ

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

పొదిలి, పొదిలి గ్రామీణం, కొనకనమిట్ల, గిద్దలూరు పట్టణం, రాచర్ల, మార్కాపురం గ్రామీణం, పెద్దదోర్నాల, న్యూస్‌టుడే : రైతులకు జనుము, జీలుగ విత్తనాలు 50 శాతం రాయితీపై పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని ఏవో డి.శ్రీనివాసులు పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఆముదాలపల్లి, అన్నవరం గ్రామాల్లో ఏవో, ఉద్యానవనశాఖాధికారి(ఇన్‌ఛార్జి) బి.ధనలక్ష్మి పర్యటించారు. పశుపోషకులకు నట్టల నివారణ మందు అందజేశారు. ● కొనకనమిట్ల మండలంలోని వద్దిమడుగు, రేగుమానపల్లె గ్రామాల్లో ఏవో ప్రకాష్ పర్యటించారు. కౌలు రైతులు తప్పనిసరిగా పంట సాగు హక్కు పత్రాలు తీసుకోవాలని కోరారు. ● గిద్దలూరు మండలంలోని కొత్తకోట, సంజీవరాయునిపేట గ్రామంలో రైతులు సాగుచేసిన మిరప, టమోటా పొలాలను బుధవారం ఉద్యానశాఖ అధికారి శ్వేత పరిశీలించారు. తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచించారు. ● రాచర్ల మండలంలోని ఆకవీడు, ఆరవీటికోట గ్రామాల్లో ఏవో మహబూబ్‌బాష పర్యటించారు. ● మార్కాపురం మండలంలోని శివరాంపురం, కొండేపల్లి గ్రామాలల్లో ఏడీఏ డి.బాలాజీనాయక్ పర్యటించి రైతులకు కౌలు కార్డుల గురించి సందేహాలు నివృత్తి చేశారు.● పెద్దదోర్నాల శివసదనంలో గుంటూరుకు చెందిన ప్రాంతీయ పరిశోధన సంస్థ లాం సైంటిస్టులు పత్తి పంట సాగుపై చెంచు గిరిజన రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు

పశుపోషకులకు నట్టల నివారణ మందు అందజేస్తున్న అధికారులు

మండల పరిషత్తు సమావేశం వాయిదా

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: వై.పాలెం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం కోరం సరిపోక వాయిదా పడింది. ఎంపీడీవో సమావేశానికి రాకపోవడం.. పలు అభివృద్ధి పనులకు సంబంధించి గత సమావేశంలో ఆమోదించిన 12 తీర్మాణాల అమలు ఉత్తర్వులు ఇవ్వకపోవడం వంటి కారణాలను చూపిస్తూ వైకాపా ఎంపీటీసీ సభ్యులు సమావేశం ప్రారంభానికి ముందే బయటకొచ్చి నిరసన తెలిపారు. దీంతో కోరంలేక వాయిదా పడింది. ఎంపీడీవో ఏకపక్షంగా వహిస్తున్నారంటూ ఎంపీపీ కిరణ్‌గౌడ్, జడ్పీటీసీ విజయభాస్కర్, వైస్ ఎంపీపీ ఆదిశేషు, ఇతర సభ్యులు నిరసన తెలిపారు. ఈవిషయంపై ఎంపీడీవో శ్రీనివాసులు మాట్లాడుతూ.. ఉన్నతాధికారులతో సమావేశం ఉండడంతో జిల్లా కేంద్రానికి వెళ్లినట్లు.. డిప్యూటీ ఎంపీడీవోతో సమావేశం నిర్వహించవచ్చన్నారు. ఇప్పటికే చేసిన పనులకు సంబంధించి దాదాపు రూ. 35లక్షలు బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో నూతన తీర్మాణాలకు ఉత్తర్వులు ఇవ్వనట్లు ఆయన వివరించారు.

బాధ్యతల స్వీకరణ... వీడ్కోలు సమావేశం

కంభం, న్యూస్‌టుడే : మండల ఎంఈవో-1గా అబ్దుల్ సత్తార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనను సీఆర్పీలు, కార్యాలయ సిబ్బంది తదితరులు పూలమాల, శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈవో-2 శ్రీనివాసులు, గత ఎంఈవో-1 మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీ అయిన ప్రధానోపాధ్యాయుడు మాల్యాద్రి, ఉద్యోగోన్నతిపై వెళ్లిన మొయినుద్దీన్‌కు వీడ్కోలు సమావేశం నిర్వహించారు.

వీడ్కోలు సమావేశంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు

విద్యుత్తు ఉపకేంద్రం నిర్మాణానికి నేడు శంకుస్థాపన

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలి మండలం యేలూరు గ్రామసమీపంలో విద్యుత్తు ఉపకేంద్రం నిర్మాణానికి గురువారం రాష్ట్ర విద్యుత్తుశాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, ఎమ్మెల్యే కె.నారాయణరెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు పొదిలి ఏడీఈ డి.హరిబాబు తెలిపారు. రూ.3.90 కోట్ల అంచనా వ్యయంతో 33/11 కె.వి.సబ్‌స్టేషన్ నిర్మాణం చేయనున్నట్లు చెప్పారు. దీని వల్ల సల్లూరు, యేలూరు, పిన్నికవారిపల్లి గ్రామాల్లోని వ్యవసాయ, పారిశ్రామిక కనెక్షన్లకు లోఓల్టేజి సమస్య తీరుతుందన్నారు. యేలూరులో నిర్మించనున్న విద్యుత్తు ఉపకేంద్రం స్థలాన్ని బుధవారం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి, దర్శి డీఈఈ పి.శ్రీనివాసరావులు పరిశీలించారు. ఈ ఉపకేంద్రం నిర్మాణం వల్ల ఈ ప్రాంతంలోని విద్యుత్తు వినియోగదారులకు మెరుగైన సేవలు అందనున్నట్లు వారు తెలిపారు.

ద్విచక్ర వాహనాలు ఇవ్వకండి

గిద్దలూరు పట్టణం, న్యూస్‌టుడే : మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే వాహన యజమానులకు శిక్ష తప్పదని గిద్దలూరు సీఐ సురేష్ హెచ్చరించారు. ఆయన బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ ఇటీవల ముగ్గురు మైనర్లు మోటారు సైకిల్‌పై వెళుతూ ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయేందుకు కారకులయ్యారని తెలియజేశారు. మైనర్లు మోటారు సైకిళ్లు నడుపుతూ పోలీసులకు పట్టుబడితే వాహనం సీజ్ చేస్తామని హెచ్చరించారు.

మద్యం సీసాలు స్వాధీనం

బేస్తవారపేట, న్యూస్‌టుడే : కంభం ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమ మద్యం కలిగి ఉన్న ఇద్దరి వ్యక్తులను బుధవారం అదుపులోకి తీసుకున్నట్లు సీఐ కొండారెడ్డి తెలిపారు. వీరిద్దరి నుంచి 22 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మొక్కల పెంపకం... పర్యావరణ హితం

కంభం: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని సీఎల్ఆర్ విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ సయ్యద్ షా అలీబాష అన్నారు. స్థానిక కళాశాల ఆవరణలో బుధవారం మొక్కలు నాటారు. కార్యక్రమంలో జూనియర్ కళాశాల డైరెక్టర్ శిరిగిరి బ్రహ్మం, అధ్యాపకులు ముక్తేశ్వరరావు, మౌలాలి, రవికుమార్, శ్రీనివాసరెడ్డి, ఆంజనేయులు, శ్రీనివాసులు, పవన్, చిన్నరాయుడు, అబ్రహ్మం, తిరుపతిరావు, రాజేశ్వరి, జ్యోతి, సాహితీ, అరుణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

మొక్క నాటుతున్న అధ్యాపకులు, విద్యార్థులు

బాధితులకు న్యాయం చేస్తాం

యర్రగొండపాలెం పట్టణం, న్యూస్‌టుడే: యర్రగొండపాలెం ప్రభుత్వ వైద్యశాలలో మంగళవారం ఓ గర్భిణికి సిజేరియన్‌తో పాటు సంతాన నిరోధక శస్త్ర చికిత్స చేయడంతో బాధితులు డాక్టర్ల నిర్వాకంపై వారు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విధితమే. దీనిపై బుధవారం ఈనాడులో వచ్చిన 'అడక్కుండానే సంతాన నిరోధక ఆపరేషన్ ' కథనం వెలువడింది. దీనిపై ప్రభుత్వ వైద్యశాల సూపరింటెండెంట్ యదిద్యా స్పందించారు. తమకు సంతానం కలుగకుండా ఆపరేషన్ చేయమంటేనే మా వైద్యులు చేశారన్నారు. బాధితురాలి గర్భసంచి బాగా బలహీనంగా ఉందని ఆ దంపతుల కోర్కె మేరకు ఆమె ఆరోగ్యం కుదుట పడిన తరువాత తనకు సంతాన సాఫల్యత కలిగేలా చికిత్స చేస్తామన్నారు. ఈ సంఘటనపై వైద్యపరమైన తప్పిదానికి క్షమాపణ కోరతామన్నారు. శస్త్ర చికిత్స చేసేటప్పుడు ప్రొటోకాల్ పాటించామని పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ చేసే ముందు దంపతుల సంతకం సైతం తీసుకున్నామని తెలిపారు.

ఎక్సైజ్‌శాఖ- ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల విస్తృత తనిఖీలు

మార్కాపురం : అనుమతులు లేకుండా మద్యం సరఫరా చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తప్పవని మార్కాపురం ఎక్సైజ్‌శాఖ సీఐ వెంకటరెడ్డి హెచ్చరించారు. బుధవారం ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు- ఎక్సైజ్‌శాఖ అధికారులతో పాటు సిబ్బంది కలిసి మార్కాపురం, దోర్నాల, పెద్దారవీడు మండలాల్లో ఉన్న అనధికారిక బెల్ట్ దుకాణాలు, ట్రాన్స్‌పోర్టులు, అనుమానాస్పందంగా ఉన్న గోదాముల్లో తనిఖీలు నిర్వహించారు. కొరియర్ పార్శిల్ కేంద్రాలను తనిఖీ చేశారు. .

మార్కాపురం ట్రాన్స్‌పోర్టు కేంద్రంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

అభివృద్ధికి సహకరించండి

పొదిలి, న్యూస్‌టుడే: మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి పొదిలి పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారించాలన్న ఆదేశాల మేరకు ముందుకెళ్తున్నట్లు నగర పంచాయతీ కమిషనరు కె.ఎల్.నారాయణరెడ్డి చెప్పారు. నెల రోజులుగా పట్టణంలోని కొత్త బస్టాండ్, ప్రధాన రహదారికి ఇరువైపులా రహదారిని ఆక్రమించి నిర్మించిన అక్రమ కట్టడాలను తొలగించినట్లు చెప్పారు. కొత్తూరులోని రహదారికి ఇరువైపులా ఉన్న మట్టిదిబ్బలను పూర్తిస్థాయిలో తొలగించనున్నట్లు చెప్పారు. రోజు రోజుకు పట్టణం విస్తరిస్తున్నందున భవిష్యత్తులో ప్రజలు, ప్రయాణికుల సౌకర్యార్థం ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు విశాలమైన రహదారులు అవసరమన్నారు. ప్రజలు నగరంలో చేస్తున్న అభివృద్ధి పనులకు సహకరించాలని ఆయన కోరారు.

సారా నిర్మూలనకు సహకరించండి

పెద్దదోర్నాల: సారా నిర్మూలనకు అందరూ సహకరించాలని ఎక్సైజ్ సీఐ వెంకటరెడ్డి కోరారు. పెద్దదోర్నాలలో బుధవారం ప్రదర్శన నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. వ్యాపారస్తులు బెల్లం క్రయ, విక్రయాలకు సంబంధించిన సమాచారాన్ని తమకు అందజేయాలన్నారు. అనంతరం ముగ్గురు పాత నేరస్తులను తహసీల్దార్ వద్ద రూ. 2 లక్షలకు బైండోవర్ చేయించారు.

ర్యాలీలో పాల్గొన్న సీఐ వెంకటరెడ్డి, తదితరులు

మారని భవనాల తలరాతలు

❑ వెంటాడుతున్న గత ప్రభుత్వ పాపం ❑ ప్రభుత్వం మారినా అదే పరిస్థితి

నిరుపయోగంగా ఉన్న రైతు సేవ కేంద్రం

త్రిపురాంతకం, న్యూస్‌టుడే:

గ్రామ సచివాలయాల ద్వారా సుపరిపాలన అంటూ గత వైకాపా ప్రభుత్వం చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. గ్రామాల్లో లక్షలు వెచ్చించి రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ క్లినిక్‌లు, పాల కేంద్రాల కోసం భవనాలను నిర్మించారు. అయితే అవి పూర్తి స్థాయిలో నిర్మాణాలు పూర్తి కానప్పటికీ.. పూర్తయిన భవనాలను మాత్రం గత పాలకులు ప్రారంభించకుండా అలానే వదిలేశారు. దీంతో ఆ భవనాలు ప్రస్తుతం నిరుపయోగంగా మారాయి. త్రిపురాంతకం మండల కేంద్రంలో జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న పౌర సరఫరాల గోదాము వద్ద గత ప్రభుత్వంలో ప్రభుత్వ భవన సముదాయాల కోసం అధికారులు భూమిని కేటాయించారు. దీంతో అక్కడ రైతు భరోసా కేంద్రం, విలేజ్ క్లినిక్, పాల కేంద్రాల భవనాలను గత ప్రభుత్వ హయాంలో నిర్మించారు. అయితే భవన నిర్మాణాలు పూర్తయి రంగులు వేసినప్పటికీ అవి ప్రారంభానికి నోచుకోలేదు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయింది.. రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా మార్చాలంటూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినా అధికారులు పట్టించుకోలేదు. రైతు సేవ కేంద్రంగా పేరు మార్చలేదు. విలేజ్ క్లినిక్ పేరును కూడా మార్చకుండా వదిలేశారు..

వెంటనే అందుబాటులోకి తేవాలి

మండల కేంద్రంలో జాతీయ రహదారికి ఆనుకుని నిర్మించిన విలేజ్ క్లినిక్, రైతు సేవా కేంద్రాలు నిరుపయోగంగా ఉన్నాయి. వెంటనే సిబ్బందిని కేటాయించి సేవలను అందుబాటులోకి తీసుకురావాలి. – బి.రామయ్య, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి, త్రిపురాంతకం.

వ్యర్థాలు ఇలా... నీరు పారేది ఎలా?

పొదిలి, న్యూస్‌టుడే: పొదిలోని పెద్దచెరువు, చిన్నచెరువు నిండి అలుగుపారే ప్రధాన కాలువ ఇది. ఒంగోలు- కర్నూలు ప్రధాన రహదారిపై పెద్దబస్టాండ్ సమీపంలో ఉంది. సుమారు 30 అడుగుల లోతు, వంద అడుగులపైన వెడల్పు ఉన్న ఈ కాలువలో స్థానికులు వ్యర్థాలతో నింపారు. దీంతో కాలువ ఎక్కువ భాగం పూడికతో నిండిపోతుంది. ఈ కాలువ ఇరు వైపులా ఆక్రమణలకు గురికావడంతో క్రమంగా కుచించుకు పోతుంది. చెరువులు నిండితే నీరంతా బయటకు వెళ్లే ప్రధాన కాలువ కావడంతో ఈ కాలువను అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పూడికతో నిండిన పొదిలిలోని ప్రధాన కాలువ

(c) eenadu

కనిగిరి

•కనిగిరి •దర్శి •కొండపి

కూటమి ప్రభుత్వంతోనే గ్రామాభివృద్ధి

కొండెపి గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే గ్రామ అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. బుధవారం మండలంలోని గోగినేనివారిపాలెం గ్రామంలో కూటమి ప్రభుత్వం సంవత్సర కాలంలో ప్రజలకు ఇచ్చిన పథకాలను తెలియజేసే విధంగా ఇంటింటికి సుపరిపాలన కరపత్రాలను పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా గ్రామంలోని లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆయన పూజలు చేసి ఇంటింటికీ తిరుగుతూ మాట్లాడారు.

● టంగుటూరు: స్వర్ణాంధ్ర-2047 లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి అన్నారు. స్వర్ణాంధ్ర విజన్-2047పై బుధవారం టంగుటూరు మండలం తూర్పు నాయుడుపాలెంలో కొండపి నియోజకవర్గ స్వర్ణాంధ్ర విజన్ యాక్షన్ ప్లాన్ సభ్యులతో మంత్రి సమీక్షించి మాట్లాడారు.

● కూటమి ప్రభుత్వ ఏడాదిగా సంపద సృష్టిస్తున్నా. అప్పులు తీరుస్తూ పాలన సాగిస్తోందని మంత్రి డోలా స్వామి, ఏపీ మారిటైం బోర్డు ఛైర్మన్ దామచర్ల సత్య అన్నారు. తొలి అడుగు కార్యక్రమంపై కొండపి నియోజకవర్గ స్థాయి విస్తృత సమావేశాన్ని టంగుటూరు మండలం ఐటీసీ సమీపంలో బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మంత్రి స్వామి, సత్య మాట్లాడారు.

● పామూరు: ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి మండలంలోని బొట్లగూడూరు గ్రామంలో మాట్లాడుతూ త్వరలో రైతన్నలకు అన్నదాత సుఖీభవ పథకం కింద నగదు అందజేస్తామన్నారు.

● తాళ్లూరు: ఎన్నికల సందర్భంగా ప్రజలకు ఇచ్చిన హామీలన్నింటిని ఏడాది పాలనలోనే అమలు చేసిన ఘనత కూటమి ప్రభుత్వానికే సాధ్యమైందని మండల తెదేపా అధ్యక్షులు మేదగం వెంకటేశ్వర రెడ్డి కొనియాడారు.

కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి

హామీలను నిలబెట్టుకున్న కూటమి ప్రభుత్వం

కనిగిరి, న్యూస్‌టుడే: ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నిలబెట్టుకుందని ఎమ్మెల్యే ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పేర్కొన్నారు. బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా కనిగిరి మున్సిపాలిటీ చింతలపాలెం ఎస్సీకాలనీలో పర్యటించి మాట్లాడారు.

● పీసీపల్లి: శాసన సభ్యులు ఉగ్రనరసింహారెడ్డి మండలంలోని గుంటుపల్లిలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అమలుపై ఇంటింటికీ తిరుగుతూ సమస్యలపై ఆరా తీశారు. కార్యకర్తలు పాల్గొన్నారు.

● ముండ్లమూరు: పేద అభ్యున్నతి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని తెదేపా మండల అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, క్లస్టర్ ఇన్‌ఛార్జి రామిరెడ్డి అన్నారు. మండలంలోని శంకరాపురం గ్రామంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం బుధవారం దర్శి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి ఆదేశాలతో నిర్వహించి మాట్లాడారు.

దర్శి: రామచంద్రాపురంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే పాపారావు, ఇతర తెదేపా నాయకులు

మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న మండల తెదేపా అధ్యక్షులు వెంకటేశ్వర్‌రెడ్డి, నాయకులు

230 బేళ్ల తిరస్కరణ

కొండపి గ్రామీణం: కొండపి వేలం కేంద్రంలో 230 పొగాకు బేళ్లను తిరస్కరించినట్లు నిర్వహణాధికారి జి.సునీల్ కుమార్ తెలిపారు. బోర్డు పరిధిలోని పెదకండ్లగుంట, అయ్యప్పరాజుపాలెం, చతుకుపాడు, కె.ఉప్పలపాడు గ్రామాలకు చెందిన రైతులు కేంద్రానికి 958 పొగాకు బేళ్లను అమ్మకానికి తీసుకురాగా, అందులో 728 బేళ్లను కొనుగోలు చేశారు. మిగిలినవి వివిధ కారణాలతో తిరస్కరించారు. కిలో పొగాకు గరిష్ఠ ధర రూ.280. కనిష్ఠ ధర రూ.160 పలికిందన్నారు.

వేలం ప్రక్రియలో బోర్డు సిబ్బంది

నీరు ఇంకించు.. పుడమి పులకించు

న్యూస్‌టుడే, తాళ్లూరు

☛ ఊపందుకుంటున్న ఇంకుడుగుంతల నిర్మాణాలు

భూగర్భ జలాల పెంపుదలకు ఇంకుడు గుంతల నిర్మాణం ఎంతో అవసరమని అటు ప్రభుత్వం, ఇటు పర్యావరణ నిపుణులు పదే పదే చెబుతున్నారు. వాటి నిర్మాణంలో ప్రజలు శ్రద్ధ కనబర్చేందుకు ప్రభుత్వాలు సైతం తోడ్పాటు అందిస్తున్నాయి. ఈ ఫలితంగా దర్శి నియోజకవర్గంలో ఇటీవల కాలంలో వీటి నిర్మాణాలు ఊపందుకుంటున్నాయి.

రాయితీలు అందిస్తున్నారు..

ఇంకుడు గుంతల నిర్మాణం కోసం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా రాయితీలను అందిస్తున్నారు. ఒక్కో గుంత నిర్మాణం కోసం రూ.6,000 వంతున రాయితీ నగదును అందజేస్తున్నారు. కూలీకోసం రూ.580లు, మిగతా రూ.5,420లను మెటీరియల్‌కోసం కేటాయించి అందజేస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరి నెల్లో ఒకేరోజున భారీ ఎత్తున ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని నిర్ణయించినా దర్శి నియోజకవర్గంలో సుమారు 150 వరకూ నిర్మింప జేయగలిగారు.

నియోజకవర్గంలో గుంతల వివరాలు ఇలా..

మండలం	లక్ష్యం	మంజూరు	పూర్తి
దర్శి	1000	433	148
దొనకొండ	600	525	270
కురిచేడు	300	174	66
ముండ్లమూరు	400	349	32
తాళ్లూరు	200	129	17

లక్ష్యం 2,500, మంజూరు 1,610

దర్శి నియోజకవర్గం ఐదు మండలాల పరిధిలోని 95 గ్రామ పంచాయతీల్లో ప్రస్తుత ఏడాదిలో 2500 ఇంకుడు గుంతలను నిర్మింపజేయాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించి 1610 గుంతలను మంజూరు చేశారు.

ఇవీ ప్రయోజనాలు..

● ఇంకుడు గుంతల కారణంగా వర్షపు నీరు భూమిలో ఇంకుతుంది. వృథా తగ్గుతుంది. భూగర్భ జలాలు పెరుగుతాయి.

తాళ్లూరు ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంత

● ఇళ్లముందు వాడుక నీరు సైతం ఇంకుడు గుంతల్లోకి వెళ్లే విధంగా చేయడం వల్ల ఎంతో ప్రయోజనం కలుగుతుంది.

● పొలాల్లో సేదపు కుంటలు, ఇంకుడు గుంతలు నిర్మించడం వల్ల భూమిలో నీటి నిల్వలు పెరుగుతాయి. కరవు కాలంలో నీటి సమస్యతో రైతులు ఇబ్బంది పడే అవసరం ఉండదు.

● మున్సిపాలిటీలు, కాలనీల్లో వర్షపు నీరు నేరుగా ఇంకుడు గుంతల్లోకి వెళ్లే విధంగా చూడాలి. తద్వారా సమీప బావులు, నేలల్లో నీటి నిల్వలు ఎక్కువ కాలం నిలుస్తాయి.

ఉపాధి పనికి రావాలి

దొనకొండ, న్యూస్‌టుడే: దొనకొండ మండలంలో ఉపాధిహామీ పథకం కింద అందరికీ పని కల్పించాలని ఎంపీడీవో వసంతరావు నాయక్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ సిబ్బందితో ఆయన అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలత ప్రకారం పనిచేసినట్లయితే ఒక్కొక్క కూలీకి ప్రతిరోజూ రూ.307లు వస్తాయని చెప్పారు. మండలంలో పండ్ల తోటలు పెంచుకోవాలనే వారు దరఖాస్తు చేసుకుంటే వెంటనే మంజూరు చేస్తామని 3 సంవత్సరాల పాటు వాటి రక్షణకు నగదు వస్తుందన్నారు.

పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు

ముండ్లమూరు: గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఎంపీడీవో శ్రీదేవి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి ఆమె మాట్లాడారు. గ్రామాల్లో సైడ కాలువలు పరిశుభ్రం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో వెంకట్రావు, ఈసీ శివరామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

పండ్లతోటల సాగుకు ప్రోత్సాహకాలు

తాళ్లూరు, న్యూస్‌టుడే: పండ్ల తోటల సాగుకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా ప్రోత్సాహకాలు అందజేయనున్నట్లు ఎంపీడీఓ దారా హనుమంతరావు తెలియజేశారు. తాళ్లూరు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఆ పథకం పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఐదెకరాల్లోపు భూములున్న సన్న, చిన్నకారు రైతులకు ఉచితంగా వివిధ రకాల పండ్ల తోటల సాగుకు రాయితీలు ఇస్తారన్నారు. ఏపీఓ వెంకటేశ్వర్లు, సాంకేతిక సహాయకులు, క్షేత్ర సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రైతులు పంటల బీమా చేయించుకోవాలి

దర్శి, న్యూస్‌టుడే: రైతులు సాగు చేసిన పంటలకు కచ్చితంగా బీమా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి రాధ అన్నారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా మండలంలోని పోతవరం, దేవవరంలో రైతులు సాగు చేస్తున్న పంటలను బుధవారం ఆమె పరిశీలించి సూచనలు చేశారు.

▸ ముండ్లమూరు: రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు ప్రభుత్వం అందజేస్తుందని మండల వ్యవసాయ విస్తర్ణాధికారి వేమూరి శ్రీకీర్తి అన్నారు. మండలంలోని మారెళ్ల, జమ్మలమడక గ్రామాల్లో రైతులతో మాట్లాడారు.

▸ హనుమంతునిపాడు: రైతులు వ్యవసాయ శాఖ ద్వారా అందిస్తున్న రాయితీ పథకాలు వినియోగించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రవికుమార్ అన్నారు.

▸ తాళ్లూరు: విత్తనోత్పత్తి సాధించి నాణ్యమైన విత్తనాలను మరికొందరు రైతులకు అందించడం ద్వారా విత్తన సమృద్ధి కలుగుతుందని ఏఓ బి.ప్రసాదరావు తెలియజేశారు. వెలుగువారిపాలెం, బొద్దికూరపాడులలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడారు.

పోతవరంలో రైతులతో మాట్లాడుతున్న ఏవో రాధ

విద్యుత్తు ప్రమాదాల నివారణకు అప్రమత్తత అవసరం

పామూరు, న్యూస్‌టుడే: విద్యుత్తు ప్రమాదాలు జరగకుండా ఉండేలా సిబ్బంది అప్రమత్తంగా ఉండి జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్తుశాఖ పామూరు డీఈఈ డి.వెంకట కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక డీఈఈ కార్యాలయం ప్రాంగణంలో విద్యుత్తు భద్రతా వారోత్సవాల ముగింపు సందర్భంగా బుధవారం పామూరు, సి.ఎస్.పురం, వెలిగండ్ల మండలాల పరిధిలోని విద్యుత్తు ఉపకేంద్రాల్లో పనిచేస్తున్న షిఫ్ట్ ఆపరేటర్లు, పామూరు సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షా కాలంలో ప్రజలు, పిల్లలు విద్యుత్తు స్తంభాలను, స్తంభాలకు ఉన్న ఇనుప సపోర్టు తీగలు తాకవద్దన్నారు. కార్యక్రమంలో పామూరు ఏఈఈ షేక్ జిలాని, సిబ్బంది పాల్గొన్నారు.

సూచనలిస్తున్న విద్యుత్తుశాఖ డీఈఈ వెంకట కృష్ణారెడ్డి

సింగరాయకొండ ప్రధాన రహదారిపై ర్యాలీ నిర్వహిస్తున్న ఏడీఈ యుగంధర్, ఏఈలు సాంబశివరావు, హర్దీష్, శ్రీనివాసులు తదితరులు

బాల్య వివాహం అడ్డగింత

టంగుటూరు, న్యూస్‌టుడే: టంగుటూరు మండల కేంద్రంలో బుధవారం బాల్య వివాహాన్ని ఆర్డీవో లక్ష్మీప్రసన్న అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. టంగుటూరులో 21 ఏళ్ల యువకుడికి 16 ఏళ్ల బాలికతో బుధవారం వివాహం జరుగుతుండగా..స్థానికులు ఇచ్చిన సమాచారంతో ఆర్డీవో లక్ష్మీప్రసన్నకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న ఆర్డీవో, తహసీల్దార్ ఆంజనేయులు ఇతర శాఖల అధికారులను అప్రమత్తం చేశారు. ఈ క్రమంలో వివాహాన్ని అడ్డుకొని కుల పెద్దలు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఆర్డీవో వెంట ఎంపీడీవో దేవసేన కుమారి, ఐసీడీఎస్, ఎంఈవో-2 బాలాజీ ఇతర అధికారులు పాల్గొన్నారు.

శనగ పంటకోత ప్రయోగంపై విచారణ

మద్రిపూడి, న్యూస్‌టుడే: మండలంలోని వేమవరంలో రబీ సీజన్ 2024లో శనగపైరు పంట కోత ప్రయోగం చేయకుండానే చేసినట్లు వ్యవసాయధికారులు నివేదిక పంపించారని వేమవరం గ్రామానికి చెందిన పలువురు రైతులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. స్పందించిన జిల్లా కలెక్టర్ దర్శి ఏడీఏ బాలాజీ నాయక్‌ను విచారణకు ఆదేశించారు. ఆమేరకు బుధవారం మండలంలోని గార్లపేట సచివాలయంలో వేమవరం, రామచంద్రాపురం, కూచిపూడి గ్రామాల రైతులతో గ్రామసభ నిర్వహించారు. ఏవో వెంకటేష్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎల్‌పీఎం ఇబ్బందులు తెలియజేయండి

కురిచేడు, న్యూస్‌టుడే: ఎల్‌పీఎం సంఖ్య వల్ల ఇబ్బందులు ఏర్పడితే తమ దృష్టికి తీసుకు రావాలని తహసీల్దార్ రజినీ కుమారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో రీసర్వే జరిగిన పడమర గంగవరం, బయ్యవరం, నమశ్శివాయపురం గ్రామాల్లో జాయింట్ ఎల్‌పీఎంలు కలిగిన రైతులు సంక్షేమ పథకాలకు అవరోధాలు ఏర్పడితే సంప్రదించాలన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

కనిగిరి : 8008574114, (10 AM TO 1 PM)
దర్శి: 9848 671678, కొండపి: 96424 56296

?: తాళ్లూరు శివారున యానాదుల కాలనీ ప్రధాన వీధిలోని విద్యుత్తు దీపాలు వెలగడం లేదు. ట్యాంకు పక్కనున్న రెండు, మూడు స్థంభాల దీపాలు వెలగక పోవడంతో రాత్రి వేళ ప్రజలు చీకటిలో మగ్గిపోతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలి...
–అంజమ్మ, స్థానికురాలు, తాళ్లూరు.

✓: రెండు రోజుల్లో మరమ్మతులు చేయిస్తాం...
– దారా హనుమంతరావు, ఎంపీడీఓ, తాళ్లూరు.

?: పడమర వీరాయపాలెం పంచాయతీ పరిధిలోని కురిచేడు ఎస్సీస్పీ కాలనీలో పక్కా కాలువ లేకపోవడంతో మురుగునీరంతా సమీపంలోని హెచ్‌పీ పెట్రోల్ బంకు సమీపంలో రహదారిపైకి చేరుతోంది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. పక్కా కాలువ ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని కోరుతున్నాం. – కోటేశ్వరరావు, స్థానికుడు

✓: పక్కా కాలువ నిర్మించడానికి స్థానిక స్థలం కలిగిన వ్యక్తులు సహకరించడం లేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. వారి ఆదేశాల మేరకు త్వరలోనే పరిష్కరిస్తాం. – శివలక్ష్మి, సర్పంచి, పడమర వీరాయపాలెం

?: మద్రిపూడి పంచాయతీలోని పడమర బజారులోని కాలువలు చెత్తాచెదారంతో నిండింది. వర్షం కురిస్తే నీరు రోడ్డుపైకి చేరుతోంది. – కోటయ్య, స్థానికుడు

✓: పంచాయతీ కార్యదర్శితో మాట్లాడి పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. నాగూర్‌వలి, ఈవోఆర్డీ

- న్యూస్‌టుడే, కురిచేడు, తాళ్లూరు, మద్రిపూడి

బాలికలూ... మోసపోకండి

దర్శి: బాలికలు చదువుపై శ్రద్ధ పెట్టాలని, మోసాలకు గురి కాకుండా అవగాహన పెంచుకోవాలని సీఐ రామారావు అన్నారు. దర్శి కస్తూరిబా విద్యాలయంలో బుధవారం బాలికలకు అవగాహనా సదస్సు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ గుడ్ టచ్, బ్యాడ్ టచ్, చట్టాలపై అవగాహన కలిగించారు.

ప్రమాదాలకు గురిచేస్తే కఠిన చర్యలు

సింగరాయకొండ గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధిలో ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను తరలిస్తూ ప్రమాదాలకు గురి చేసే చోదకులపై కఠిన చర్యలు చేపడతామని ఎస్సై మహేంద్ర హెచ్చరించారు. స్థానిక ప్రధాన రహదారి, కూడళ్ల వద్ద సిబ్బందితో ఆయన బుధవారం వాహనాల తనిఖీలు చేపట్టి మాట్లాడారు.

భక్తిశ్రద్ధలతో సాయి సప్తాహ వేడుకలు

కనిగిరి, న్యూస్‌టుడే: కనిగిరి పట్టణంలోని షిరిడీ సాయి బాబా దేవస్థానంలో బుధవారం సాయిబాబా అఖండసాయి సప్తాహ వేడుకలను ఎమ్మెల్యే ఉగ్రనరసింహారెడ్డి ప్రారంభించారు. మహిళా భక్తులు వీధుల్లో బిక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు కొప్పరపు సత్యాలు, తిరుపతిరెడ్డి, మాలకొండేశ్వరరావు, ఓబులరెడ్డి, మారుతి, ధర్మారావు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పాల్గొన్న మహిళా భక్తులు

వేగ నిరోధకం... రాకపోకలకు ఆటంకం

న్యూస్‌టుడే, దర్శి

దర్శి - పొదిలి ఆర్ అండ్ బీ ప్రధాన రోడ్డులో కొత్తరెడ్డిపాలెం వద్ద వేసిన వేగ నిరోధకాలు వాహనదారులను ఇక్కట్ల పాలుచేస్తున్నాయి. దర్శి మున్సిపల్ పరిధిలో చిన్న గ్రామమైన కొత్తరెడ్డిపాలెం లో నాలుగు వేగ నిరోధాలు ఏర్పాటు చేశారు. ప్రమాదాలు జరుగుతున్నాయనే నెపంతో గ్రామస్థులు నిబంధనలకు విరుద్ధంగా, పరిమితికి మించిన ఎత్తులో వేగ నిరోధాలు ఏర్పాటు చేశారు. వీటిపై ఎలాంటి గుర్తులు వేయక పోవడంతో దగ్గరకు వచ్చే వరకు కనిపించక వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాల నివారణకు వేసిన ఈ వేగ నిరోధాలు కొత్త ప్రమాదాలను సృష్టిస్తున్నాయి. అధిక శాతం వీటిని గుర్తించలేక తరచూ ప్రమాదాల పాలవతున్నారు. ఈ మార్గంలో నిత్యం తిరిగే వాహనాలు తక్కువ సమయంలో మరమ్మతులుకు గురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. అధికారులు స్పందించి అవసరం లేని వాటిని తొలగించటంతో పాటు ఎత్తు తగ్గించటం, కనిపించేలా రంగులు వేయటం చేయాలని వాహనదారులు కోరుతున్నారు. దీనిపై ఆర్ అండ్ బి అధికారులను వివరణ కోరగా పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

దర్శి–పొదిలి రోడ్డులో ఎత్తుగా, ఎలాంటి గుర్తులు లేని వేగ నిరోధకం

మంత్రి ఆగ్రహంతో ఆబ్కారీ అధికారుల్లో కదలిక

టంగుటూరు: ఎన్టీఆర్ భరోసా పంపిణీలో భాగంగా టంగుటూరు మండలం పొందూరు గ్రామంలో మంగళవారం మంత్రి స్వామి పర్యటించారు. ఈ నేపథ్యంలో ఎస్సీకాలనీలో పింఛను సొమ్ము పంపిణీ చేస్తుండగా మహిళలు సమస్యలు విన్నవించారు. ఈ క్రమంలో మంత్రి స్వామి ఆగ్రహించి ఎక్సైజ్ శాఖ అధికారులు ఏం చేస్తున్నారంటూ ఆగ్రహానికి గురయ్యారు. దీంతో బుధవారం రాత్రి ఎక్సైజ్ సీఐ లీనా, ఎస్సై గీతా గ్రామంలో పర్యటించి విచారణ చేశారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

దర్శి: తరిగి పోతున్న పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, సంరక్షించాలని తెదేపా నాయకులు పరిటాల సురేష్ అన్నారు. పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మండలంలోని లంకోజనపల్లిలో బుధవారం ప్రజలకు మొక్కలను పంపిణీ చేశారు. సురేష్ మాట్లాడుతూ వాతావరణ సమతుల్యతకు మొక్కలు నాటడమే పరిష్కారం అన్నారు.

అధికారుల తప్పు... అన్నదాతలకు ముప్పు

☛ రేగులచెలక భూముల ఖాతాలు వివాదాస్పదం

న్యూస్‌టుడే, సి.ఎస్.పురం: సీఎస్ పురం మండలంలోని రేగులచెలక గ్రామలోని భూములు కలిగిన రైతుల ఖాతాలన్నీ రెవెన్యూ అధికారులు వివాదాస్పద స్థితిలో పెట్టారు. దీంతో ఆ గ్రామ పరిధిలోని రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రేగులచెలక సర్పంచి బత్తుల కృష్ణకుమారి, పలువురు రైతులు, స్థానికులు తమ గ్రామంలోని పలు సర్వే నంబర్లలోని ప్రభుత్వ భూములను అక్రమంగా కొందరు వైకాపా నాయకులు, ఇతరులకు ఆన్‌లైన్ చేశారని దీనిపై విచారించాలని కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే రెవెన్యూ అధికారులు స్థానికులు ఇచ్చిన ఫిర్యాదుపై విచారించి అక్రమాలు జరిగిన భూములను డిస్‌ప్యూట్‌లో పెట్టకుండా గ్రామం మొత్తంలో ఉన్న రైతుల భూములన్నింటినీ 2023 సెప్టెంబర్‌లో డిస్‌ప్యూట్‌లో ఉంచేశారు.

951 మంది ఖాతాలకు తప్పని అవస్థలు..

రేగులచెలక రెవెన్యూ గ్రామ పరిధిలో 951 ఖాతాలు ఉన్నాయి. వీరంతా భూములు కలిగి ఉన్నారు. ఆయా ఖాతాల్లో 3,432 ఎకరాల భూములు ఉన్నాయి. వీటికి రెండేళ్ల నుంచి ఆన్‌లైన్‌లో 1బి, అడంగల్ పత్రాలు రావడం లేదు. రైతులందరూ రెవెన్యూ అధికారుల నిర్లక్ష్యంతో అగచాట్లు పడుతున్నారు.

సి.ఎస్‌పురం హక్కు పత్రాలను చూపుతున్న రైతులు

సంయుక్త కలెక్టర్‌కు నివేదిక పంపించాం

రేగులచెలక రెవెన్యూ గ్రామ పరిధిలో భూములకు సంబంధించి విచారించి సంయుక్త కలెక్టర్‌కు నివేదికను పంపించాం. భూముల డిస్‌ప్యూట్ సమస్యను తొలగించే దానిపై ఉన్నతాధికారులతో చర్చిస్తాం.
–జి.కేశవర్ధన్‌రెడ్డి, ఆర్డీవో, కనిగిరి

అటు పదవీ విరమణ.. ఇటు పాఠశాల మూత

కనిగిరి, న్యూస్‌టుడే: ఓ..పక్క ప్రభుత్వం విద్యా వ్యవస్థ బాగు పడేందుకు...ఎన్నో ప్రణాళికలు చేపడుతోంది. ఇంత చేస్తున్నా ఎక్కడో ఒకచోట సమస్య తెలుత్తుతోంది. ఇందుకు తాజా ఉదాహరణగా కనిగిరి మున్సిపాలిటీలోని శంకవరం ఉర్దూ ప్రాథమిక పాఠశాల మూత పడటాన్ని పేర్కొనవచ్చు. మూడు నెలల క్రితం సింగిల్ టీచర్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు పదవీ విరమణ చేశాడు. తిరిగి ఉర్దూ ఉపాధ్యాయుడిని నియమించక పోవడంతో పాఠశాలను మూత వేసి ఉన్న విద్యార్థులను మరో పాఠశాలకు పంపారు.. ఈ విషయమై ఎంఈవో యు.నారాయణరెడ్డిని వివరణ కోరగా ఉన్న ఒక్క ఉర్దూ ఉపాధ్యాయుడు పదవీ విరమణ చేశాడని అయితే తిరిగి ఉర్దూ ఉపాధ్యాయుడిని నియమించాలంటే ఎవరూ లేరని .. 5 మంది విద్యార్థులు మాత్రమే ఉండటంతో మరో పాఠశాలలో చేర్పామని తెలిపారు.

శంకవరం ఉర్దూ ప్రాథమిక పాఠశాల

దాతల చేయూత స్ఫూర్తిదాయకం

హనుమంతునిపాడు, న్యూస్‌టుడే: విద్యార్థులకు దాతలచేయూత పలువురికి స్ఫూర్తిదాయకమని ఎంఈవో పెద్దిరాజు అన్నారు. గురువారం మండలంలోని నందనవనం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ గ్రామానికి చెందిన ఎంపీటీసీ సూరిసెట్టి నారాయణస్వామి,, కుళ్లూరి వెంకటకోటయ్య, మచ్చా వెంకటేశ్వర్లు వారి తల్లిదండ్రుల జ్ఞాపకార్థం పుస్తకాలు, మెటీరియల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

ముండ్లమూరు: పుస్తకాలు అందుకున్న విద్యార్థులతో విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, రోటరీ సభ్యులు పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి,

వైద్యులకు లయన్స్ సభ్యుల సత్కారం

దర్శి, న్యూస్‌టుడే: లయన్స్ క్లబ్ ఆఫ్ దర్శి స్నేహ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలోని పలు విభాగాలకు చెందిన వైద్యులను ఘనంగా సత్కరించారు. వైద్యులు విక్రమసింహారెడ్డి, వెంకటహర్షవర్ధన్‌రెడ్డి, మల్లారెడ్డి, బాబ్జాన్ లను శాలువా, పూలదండలతో సత్కరించి అభినందించారు. లయన్స్ సభ్యులు సత్యనారాయణ, అశోక్, శ్రీనివాసరెడ్డి, గోవిందరెడ్డి, ఆంజనేయులు, విద్యాసాగర్‌రెడ్డి, ఇతరులు పాల్గొన్నారు.

సమస్యలు త్వరగా పరిష్కరించండి

తాళ్లూరు: మండలంలోని రైతులు, విద్యార్థులు దరఖాస్తు చేసిన వెంటనే ఎలాంటి జాప్యం లేకుండా విచారణ త్వరగా పూర్తి చేసి ధ్రువపత్రాలు జారీ చేయాలని పలువురు మండల తెదేపా ప్రధాన నాయకులు తహసీల్దారు ఎల్.లక్ష్మీనారాయణకు విన్నవించారు. ఆయన తాళ్లూరుకు రెండ్రోజుల క్రితం నూతనంగా రావడంతో మండల తెదేపా అధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్‌రెడ్డి, ప్రధాన నాయకులు రమేష్ కొండలు, ఓబుల్ రెడ్డి తదితరులతో కలిసి ఆయనను అభినందించారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం

సి.ఎస్.పురం: సి.ఎస్.పురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులను సత్కరించి పాఠశాల ప్రధానోపాధ్యాయిని షేక్ ఖాదరున్నిసా బేగం.పాల్గొన్న పాఠశాల యాజమాన్య కమిటీ అధ్యక్షురాలు షేక్ హుస్సేన్ బీ, తదితరులు.

ముందస్తు మేలుకొలుపు.. రొయ్య రైతుకు పిలుపు

న్యూస్‌టుడే, టంగుటూరు:

జిల్లాకు మణిహారంగా ఆక్వాసాగు ఏళ్లతరబడి వర్ధిల్లుతోంది. అంతటి ప్రాధాన్యం సంతరించుకున్న ఈ సాగు కొన్నాళ్లుగా ఒడిదుడుకుల మధ్య కొట్టుమిట్టాడుతుండగా.. ప్రస్తుతం కాస్త కుదుటపడింది. వనామీలో ధరలు మాత్రం మందగించి ఉన్నాయని రైతులు చెబుతున్నారు. దీనికి తోడు రాబోవు ఈశాన్య రుతుపవనాల సమయంలో కల్చర్‌లో జాగ్రత్తలు తీసుకోవాలని లేని పక్షంలో వైరస్‌ల బెడద అధికంగా ఉంటుందని, రైతులు ముందస్తు మేలుకోవడమే ఉత్తమమని అనుభవజ్ఞులైన రైతులు, అధికారులు సూచిస్తున్నారు.

జిల్లాలో సాగు ఇలా..

ఉమ్మడి ప్రకాశంలో ఆక్వా సాగు 14 వేల ఎకరాల్లో ఉండేది. జిల్లా విభజన అనంతరం 7 వేల ఎకరాల్లో సాగవుతోంది. ప్రస్తుతం జిల్లాలో 85 శాతం టైగర్, 15 శాతం వనామీ రకాన్ని రైతులు సాగు చేస్తున్నారు. టంగుటూరు, కొత్తపట్నం, ఒంగోలు, సింగరాయకొండ, మద్దిపాడు మండలాల్లో అధికంగా సాగు చేస్తున్నారు.

వైరస్‌ల బెడద తట్టుకుని..

ఏడాది సాగులో మడగాస్కర్‌కు చెందిన సీడ్ నాణ్యత బాగుందని రైతులు చెబుతున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు వైరస్‌ల బెడద తట్టుకున్నట్లు, కొద్దో గొప్ప మాత్రమే వైరస్‌ల బారిన పడ్డట్లు రైతులు తెలిపారు. చెరువులో సారం, మేతలో నాణ్యత లేకపోవడం వంటి ఇతర కారణాలతో ఈ ఏడాది ప్రగతి నెమ్మదించిందని, అయితే కల్చర్ మాత్రం సాఫీగానే సాగవుతుందన్నారు. వైరస్‌ల తాకిడి తక్కువగా ఉందని రైతులు గత మూడేళ్లుగా వనామీ రకాన్ని సాగు చేశారు. అయితే విపరీతంగా వైరస్‌ల తాకిడి, ధరలు పతనమవడం, ఈ లోగా ట్రంప్ ఎగుమతుల సుంకాల పెంపుదలతో ఆక్వా సాగు తీవ్ర సంక్షోభంలో పడింది. వీటన్నింటికీ తట్టుకొని నిలబడిన రైతులకు, వ్యాపారులకు కూటమి ప్రభుత్వం ధైర్యం నింపడంతో ప్రస్తుతం వనామీ ధరలు కాస్త ఉపశమనం కలిగిస్తున్నాయి. రైతులకు పూర్తి స్థాయిలో గిట్టుబాటుకాకపోయినా గుడ్డిలో మెల్లగా వంద కౌంట్ ధర రూ.220కి విక్రయిస్తున్నారు.

రుతుపవనాల రాకతో వైరస్‌లకు వీలు..

ఆక్వా సాగులో వైరస్‌ల తాకిడి సహజం. ఇది రుతుపవనాల రాక సమయంలో (అక్టోబర్) మరింత ఉద్ధృతంగా ఉంటుంది. రొయ్య మంచి దిగుబడికి పగలు 35 డిగ్రీలు, రాత్రి వేళ 25 డిగ్రీల ఉష్ణోగ్రతలు ఉండాలి. అంతకు మించి పెరిగినా, తగ్గినా వైరస్‌ల తాకిడి దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపుతుంది. వాతావరణ మార్పుల కారణంగా ఏమాత్రం ఉష్ణోగ్రతలు తగ్గినా రొయ్య సాగులో విబ్రియోసిస్, వైట్‌స్పాట్ వైరస్‌లు ప్రబలుతాయి. జూన్ వరకు సాఫీగా సాగిన కల్చర్‌లో రానున్న రుతుపవనాల (అక్టోబర్) కాలానికి ముందు చూపుతో తగిన జాగ్రత్తలు తీసుకుని రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

(c) eenadu

ఒంగోలు

•ఒంగోలు • సంతనూతలపాడు

సేంద్రియ విధానాలతో రైతులకు మేలు

కొత్తపట్నం, న్యూస్‌టుడే: కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో కిషోర్‌బాబు తెలిపారు. వ్యవసాయ, అనుబంధ శాఖల సిబ్బందితో కలిసి గమళ్లపాలెం, వజ్జిరెడ్డిపాలెంలో బుధవారం నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో మాట్లాడారు. సాగులో రసాయనాల వినియోగాన్ని తగ్గించి... సేంద్రియ పద్ధతులు అవలంబించాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ శిక్షకుడు నరసింహులు, సర్పంచి నారాయణ, అజయ్‌కుమార్, రవి, సురేష్ పాల్గొన్నారు.

❖ చీమకుర్తి: పచ్చి రొట్ట పైర్లను పూతదశలో కలియ దున్నడం వల్ల నేల సారం పెరిగి మంచి దిగుబడులు సాధించవచ్చని ఏవో డి.విజయ్‌భాస్కర్ తెలిపారు. ఇల పావులూరు, గాడిపర్తివారిపాలెంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మొక్కజొన్న, వరి, కంది సాగులో మెలకువలు తెలియజేశారు. విస్తరణాధికారి శ్రీహరి, సహాయకులు పాల్గొన్నారు.

ప్రైవేటు పాఠశాలల బంద్!

ఒంగోలు నగరం: ప్రైవేటు పాఠశాలలపై ఏకపక్ష చర్యలకు నిరసనగా అపుస్మా ఆధ్వర్యంలో గురువారం రాష్ట్ర వ్యాప్తంగా బంద్ పాటిస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాధవరావు, మల్లికార్జునరెడ్డి తెలిపారు. విద్యాహక్కు చట్టం కింద 25 శాతం ఉచిత ప్రవేశాలకు సంబంధించి స్పష్టత కొరవడిందన్నారు. ధ్రువపత్రాలు లేకున్నా చేర్చుకోవాలని అధికారులు ఒత్తిడి తెస్తున్నారని.. లేనిపక్షంలో గుర్తింపు రద్దు చేస్తామని బెదిరిస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు కొత్తపట్నం మండల సమావేశం

కొత్తపట్నం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం గురువారం మధ్యాహ్నం 2.30 గంటలకు ఎంపీపీ అధ్యక్షతన జరుగుతుందని ఎంపీడీవో శ్రీకృష్ణ తెలిపారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హాజరు కానున్నారని చెప్పారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులతో పాటు ఆయా శాఖల అధికారులు పూర్తి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

ఉత్సాహంగా తొలి అడుగు


ఒంగోలులో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే జనార్దన్

నిర్మల్‌నగర్‌లో కరపత్రాలు అందజేస్తున్న పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ డాక్టర్ సీతారామయ్య, నాయకులు

ఒంగోలు గ్రామీణం, నగరం - న్యూస్‌టుడే: 'సుపరి పాలనలో తొలి అడుగు - ఇంటింటికీ తెదేపా' కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా ప్రారంభించారు. ఒంగోలు 5, 6 డివిజన్లలో నిర్వహించిన వేడుకలో ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పాల్గొన్నారు. గత ఏడాదిగా అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. స్థానిక సమస్యలు తెలుసుకున్నారు. పింఛన్లు, రేషన్‌కార్డులు, ఇంటి పట్టాలు, టిడ్కో ఇళ్లు, దీపం-2 పథకం, తాగునీటి సమస్యలను పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చారు. తక్షణమే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అర్హత ఉండి ఏదైనా పథకం అందని వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. నిర్మల్‌నగర్‌లో పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్పొరేటర్ దాచర్ల రమణయ్య, తెదేపా నగర అధ్యక్షుడు బండారు మదన్, షేక్ కపిల్‌బాషా, ఆవుల శ్రీనివాసరావు, దాయినేని ధర్మా, దీపక్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడు: బీసీ కాలనీలో ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. అంగన్వాడీ భవన నిర్మాణం, కాలువ సమస్యలను కొందరు తెలియజేయగా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. 'పల్లె పండగ'లో భాగంగా మద్దిపాడులో రూ.1.20 కోట్లతో సీసీ రోడ్లు, కాలువలు నిర్మించినట్లు తెలిపారు. తెదేపా, జనసేన, భాజపా మండల అధ్యక్షులు ఉప్పుగుండూరు నాగేశ్వరరావు, నున్నా బాల

మద్దిపాడులో ర్యాలీగా సాగుతున్న కూటమి నాయకులు

మద్దిపాడు: సంక్షేమ పథకాలు వివరిస్తూ కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్

సుబ్రహ్మణ్యం, రమణ; మండవ జయంత్‌బాబు, పోతినేని శ్రీనివాసరావు, అప్పలకుమారస్వామి, గట్టినేని అయ్యన్న, క్లస్టర్, యూనిట్ ఇన్‌ఛార్జులు కూటమి నాయకులు పాల్గొన్నారు.

సంతనూతలపాడు: 'సుపరిపాలనలో తొలి అడుగు' నిర్వహణపై ఎమ్మెల్యే విజయ్‌కుమార్... ఒంగోలులోని కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో సమీక్ష నిర్వహించారు. ఏఎంసీ ఛైర్మన్ రాజేశ్వరిప్రసాద్, పరిశీలకుడు చౌట శ్రీనివాసరావు, స్వాములు, మండలాధ్యక్షులు గొట్టిపాటి రాఘవరావు, ఎం.చలమయ్య, హరిబాబు; నాయకులు అబ్బూరి శ్రీనివాసరావు, కె.లోకేష్, సుబ్బారావు, సురేష్, ఎ.శేషయ్య, ఆర్.అంకారావు పాల్గొన్నారు.

తప్పిపోయిన బాలిక అప్పగింత

ఒంగోలు నేరవిభాగం: తప్పిపోయిన బాలికను గంటల వ్యవధిలోనే పోలీసులు పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. వివరాలిలా ఉన్నాయి. ఒంగోలు వెంకటేశ్వర కాలనీకి చెందిన దాసరి వెంకాయమ్మ, సత్యం దంపతుల ఆరేళ్ల కుమార్తె కోటమ్మ... బుధవారం మధ్యాహ్నం ఆడుకుంటూ తప్పిపోయింది. పరిసరాల్లో గాలించినా ఫలితం లేకపోవడంతో తల్లిదండ్రులు తాలూకా పోలీసులను సంప్రదించారు. సీఐ టి.విజయకృష్ణ వెంటనే స్పందించి సిబ్బందితో వెతికించారు. సాయంత్రం ఆరు గంటలకు బాలికను గుర్తించి అప్పగించడంతో... కుటుంబీకులు, స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

Union Bank of India యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
UMFB ఒంగోలు (ఒంగోలు-3 బ్రాంచ్), గాంధీ రోడ్డు, ఒంగోలు, ప్రకాశం జిల్లా. ఫోన్ : 79911 58816, ఇ-మెయిల్ : ubin0902756@unionbankofindia.bank

బంగారు నగల వేలం ప్రకటన

ఈ క్రింద ఉదహరించిన ఖాతాదారులు మా బ్యాంకు నందు బంగారు నగలు తనఖా పెట్టి అప్పు తీసుకొని తిరిగి చెల్లించమని నోటీసులు పంపినప్పటికీ చెల్లించని కారణంగా బ్యాంకు నిబంధనల ప్రకారం తేది.11.07.2025 శుక్రవారం ఉ॥ 3.00 గం॥ల నుండి సా॥ 4.00 గం॥ల వరకు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి బ్రాంచి ఆవరణలో బహిరంగ వేలం వేయబడును. వేలం వేయగా వచ్చిన సొమ్ముతో సదరు అకౌంటు పూర్తిగా చెల్లుబాటు కాని యెడల వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకొని మిగిలిన బకాయి వసూలు చేయబడును. [illegible]

లోన్ ఖాతా నెం.	ఋణగ్రహీతల పేర్లు & చిరునామా	స్థూల బరువు
027526540000553	శ్రీ పొతూరి రామారావు, తండ్రి : వెంకట కృష్ణయ్య, C/o ఎ. రాజేష్, TVP వీధి, డి.నెం.33-1-10, ఒంగోలు, ఆం.ప్ర-523001.	48.20 గ్రాములు
560951007172638	శ్రీ పేర్ల శ్రీనివాసులు, డి.నెం.12-020-647, హోరిసన్ స్ట్రీట్, 2వ అంతస్తు, జిల్లా కోర్టు ఎదురుగా, ఒంగోలు, ప్రకాశం జిల్లా, ఆం.ప్ర-523001	23.100 గ్రాములు

నియమ నిబంధనలు: 1) వేలంలో పాల్గొనువారు రూ.10,000/- (అక్షరాల పది వేల రూపాయలు మాత్రమే) ధరావత్తు చెల్లించవలెను. 2) వేలంలో సక్సెస్‌ఫుల్ బిడ్డరు ధరావత్తు సొమ్ము మినహా మిగిలిన సొమ్మును వెంటనే చెల్లించి ఆభరణములను పొందవలెను. వేలంలో అనసక్సెస్‌ఫుల్ బిడ్డరు వారికి ధరావత్తు సొమ్ము వేలం అనంతరం తిరిగి చెల్లించబడును. 3) వేలంలో పాడిన సొమ్మును అంగీకరించుటకు లేక తిరస్కరించుటకు బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు. 4) ఏ స్థితిలోనైనా వేలం రద్దు చేయుటకు గాని, [illegible] చేయుటకు గాని, నియమ నిబంధనలు మార్చుటకు గాని బ్యాంకు వారికి పూర్తి అధికారం కలదు.

తేది: 02.07.2025, స్థలం: ఒంగోలు సం/- బ్రాంచ్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

విద్యార్థుల హాజరు పెంచాలి

చీమకుర్తి, న్యూస్‌టుడే: పాఠశాలల్లో పిల్లల నమోదు, హాజరు శాతం పెంచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖాధికారి కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ఆర్ఎల్‌పురం జడ్పీ ఉన్నత పాఠశాలను బుధవారం సందర్శించారు. తరగతి గదులు, బడి పరిసరాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సిబ్బందికి సూచించారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)

ఒంగోలు నగరం: 8008574067
ఒంగోలు గ్రామీణం : 8008564455
ఒంగోలు అంజయ్య రోడ్డు : 8247324766
ఒంగోలు కర్నూల్ రోడ్డు : 8464085451
ఎస్.ఎన్.పాడు: 8008552692

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలను, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపవచ్చు. లేదా ఫోన్లో వివరించవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: **ఒంగోలు అంజయ్యరోడ్డు:** లాయర్‌పేట నుంచి రాజీవ్‌నగర్ వెళ్లే మార్గం; నిర్మల్ నగర్ పార్కు నుంచి నారాయణ పాఠశాలకు వెళ్లే రహదారుల్లో పైపులైన్లు దెబ్బతిని తాగునీరు వృథాగా పోతోంది. చాన్నాళ్లుగా సమస్య ఉన్న పట్టించుకోవడం లేదు.
– పవన్, లాయర్‌పేట; లక్ష్మి నిర్మల్‌నగర్
✓: త్వరలో సిబ్బందిని పంపి ఆయా లీకేజీలకు మరమ్మతులు చేయిస్తాం.
– యేసయ్య, మున్సిపల్ ఇంజినీర్

?: **ఒంగోలు కర్నూలు రోడ్డు:** రెవెన్యూ కాలనీ రెండో లైన్‌లోని కాలువలు శుభ్రం చేయక వ్యర్థాలు పేరుకుపోయి ఎక్కడికక్కడ మురుగు నిలిచిపోతోంది.
– రావూరి శ్రీనివాసరావు, కాలనీవాసి
✓: ఆ ప్రాంతంలో వెంటనే పారిశుద్ధ్య పనులు చేపడతాం.
– బాబ్జీ, ఇన్‌ఛార్జి శానిటరీ సూపర్‌వైజర్

?:**మద్దిపాడు:** పడమర పాలెంలో వీధి దీపాలు వెలగక రాత్రి వేళ రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి.
– పి.సుబ్బారావు, గ్రామస్థుడు
✓: పంచాయతీ సిబ్బందితో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం.
– చెన్నారెడ్డి, విద్యుత్తు ఏఈ

?: **మద్దిపాడు:** వెల్లంపల్లి కూడలిలో సాయంత్రం వేళ అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపుతుండడంతో ట్రాఫిక్ చిక్కులు తలెత్తుతున్నాయి.– ముచ్చు శ్రీనివాసరావు, స్థానికుడు
✓: సిబ్బందిని పంపి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటాం.
– బి.శివరామయ్య, ఎస్సై

పడిపోతాయేమో... పట్టించుకోండి!

తిమ్మన పాలెం నుంచి తక్కెళ్లపాడుకు విద్యుత్తు సరఫరా చేసే స్తంభాల పరిస్థితి ఇది. ఓ వైపుగా వాలి ప్రమాదకరంగా మారాయి. గట్టిగా గాలి వీస్తే పడిపోయేలా ఉండడంతో... ఆ సమీప పొలాల్లో భయంభయంగా పనులు చేయాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. అధికారులు స్పందించి స్తంభాలు సరిచేయాలని వారు కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, నాగులుప్పలపాడు

దారంతా బురద... దాటాలంటే బాధ!

మద్దిపాడు జూనియర్ కళాశాలకు వెళ్లే దారిలో ఎస్సీ బాలుర వసతి గృహం వద్ద కనిపించిన దృశ్యమిది. ఇక్కడి సిమెంట్ రోడ్డు కుంగి గుంతలా మారడంతో... ఆదివారం రాత్రి కురిసిన చిన్నపాటి జల్లుకే నీరు నిలిచి మడుగులా తయారైంది. దీంతో ఇటుగా రాకపోకలు సాగించే ప్రభుత్వ ఉన్నత పాఠశాల, కళాశాల విద్యార్థులతో పాటు... ఘుడియాపూడి, ఇస్లాం పేట, ఇందిరమ్మకాలనీ వాసులు ఇబ్బంది పడుతున్నారు. వర్షం పడిన ప్రతిసారీ సమస్య తలెత్తుతున్నందున రోడ్డు బాగుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు విజ్ఞప్తి చేస్తున్నారు. – న్యూస్‌టుడే, మద్దిపాడు

బోరుమంటోంది!

చీమకుర్తి మండలం బండ్ల మూడి ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలోని బోరు గత కొద్ది నెలలుగా పనిచేయడం లేదు. దీంతో నీటి వసతి లేక భోజనాల సమయంలో చిన్నారులు ఇబ్బంది పడుతున్నారు. వెంటనే మరమ్మతులు చేయాలని వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈ విషయమై గ్రామీణ నీటి సరఫరా విభాగం ఏఈ శాంతిప్రియ స్పందిస్తూ... గురువారమే బాగు చేయిస్తామన్నారు.
– న్యూస్‌టుడే, చీమకుర్తి

నోరు తెరిచిన ప్రమాదం!

ఒంగోలు - కొత్తపట్నం రహదారిలో ఎన్టీఆర్ కాలనీ వద్ద పరిస్థితి ఇది. పైపులైను మరమ్మతుల కోసం నెల రోజుల క్రితం మ్యాన్‌హోల్ మూత తొలగించి తరువాత అలానే వదిలేశారు. దీనికితోడు చుట్టూ మట్టిని కుప్పలా పోశారు. రాత్రి వేళ ఇటుగా వచ్చే వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నందున... సంబంధిత అధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. – న్యూస్‌టుడే, ఒంగోలు అంజయ్యరోడ్డు

విద్యుత్తు వినియోగంలో జాగ్రత్తలు తప్పనిసరి

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: జాతీయ విద్యుత్తు భద్రతా వారోత్సవాల్లో భాగంగా రామనగర్‌లోని విద్యుత్తు భవన్ నుంచి కలెక్టరేట్ వరకు బుధవారం ఉదయం అవగాహన ర్యాలీ నిర్వహించారు. చర్చి సెంటర్‌లో మానవహారం ఏర్పాటు చేశారు. ఈఈ ఎం.హరిబాబు మాట్లాడుతూ... పాదరక్షలు లేకుండా విద్యుత్తు పరికరాలను తాకరాదని పేర్కొన్నారు. తగిన భద్రతా ప్రమాణాలు కలిగిన నాణ్యమైన ఉపకరణాలను వినియోగించాలన్నారు. ఈఈలు ఉషారాణి, వీరయ్య, డీఈఈలు పాండురంగారావు, మోహనరావు పాల్గొన్నారు.

చర్చి సెంటర్‌లో విద్యుత్తు ఉద్యోగుల మానవహారం

సూపర్‌బజార్ ఎండీగా సురేంద్రబాబు

ఒంగోలు నగరం: నగరంలోని కో ఆపరేటివ్ సెంట్రల్ స్టోర్స్ (సూపర్‌బజార్) మేనేజింగ్ డైరెక్టర్‌గా అసిస్టెంట్ రిజిస్ట్రార్ **నర్రా సురేంద్రబాబు**.. బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సంస్థ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. గతంలో ఇన్‌ఛార్జిగా చేసిన పి.రాజశేఖర్ కావలికి బదిలీ అయ్యారు.

విద్యా సామగ్రి పంపిణీ

చీమకుర్తి, న్యూస్‌టుడే: చీమకుర్తి మండలం రంగసాయిపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు సురేందర్ రెడ్డి, దినేష్ రెడ్డి, వెంకటలక్ష్మమ్మలు సమకూర్చిన రాత పుస్తకాలు, ఇతర విద్యా సామగ్రిని.. . ఎంఈవోలు నరసింహారావు, శివాజీలు బుధవారం పంపిణీ చేశారు.

విద్యుత్తు సర్దుబాటు ఛార్జీలు తగదు

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: స్మార్ట్ మీటర్ల ఏర్పాటును తక్షణమే ఉపసంహరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య డిమాండ్ చేశారు. ఒంగోలులోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పెంచిన విద్యుత్తు సర్దుబాటు ఛార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ నెల 5న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించే నిరసనలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి ఎం.ఎల్.నారాయణ, నాయకులు ఆర్.వెంకటరావు, శ్రీరామ శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

భవిత కేంద్రం తనిఖీ

వివరాలు తెలుసుకుంటున్న సమన్వయకర్త నాగేంద్ర నాయక్, చిత్రంలో ఎంఈవో పద్మావతి

కొత్తపట్నం, న్యూస్‌టుడే: కొత్తపట్నం ఎంపీపీ వన్ పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రాన్ని సర్వశిక్ష అభియాన్ సమన్వయకర్త నాగేంద్ర నాయక్, ఎంఈవో పద్మావతి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడి పిల్లల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. టీఎల్ఎంలకు సంబంధించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లల కోసం ప్రతి బుధవారం నిర్వహిస్తున్న ఫిజియోథెరపీ సేవలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు.

దొంగకు దేహశుద్ధి

మద్దిపాడు, న్యూస్‌టుడే: చోరీకి పాల్పడిన వ్యక్తిని స్థానికులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. బుధవారం చోటుచేసుకున్న సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఒంగోలు మండలానికి చెందిన రాజా... మద్దిపాడు మండలం బసవన్నపాలేనికి చెందిన జూపూడి వెంకటేశ్వర్లు ఇంట్లో చొరబడి రూ.31,500 అపహరించాడు. పరారయ్యే సమయంలో స్థానికులు గమనించి పట్టుకున్నారు. దొంగిలించిన నగదు ఇవ్వకపోవడంతో దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు తమదైన శైలిలో విచారించడంతో సొమ్ము అప్పగించాడు.

శ్రీగిరిపై అభయాంజనేయుని వేడుక

ఒంగోలు సాంస్కృతికం, న్యూస్‌టుడే: శ్రీగిరిపై అభయాంజనేయస్వామి ఆగమన ఆరాధనోత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు స్వామివారిని విశేషంగా అలంకరించి పూజాదికాలు నిర్వహించారు. భక్తులు 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణ చేశారు. సాయంత్రం... శ్రీవారికి ఊంజల్ సేవ నిర్వహించారు. వీవీఎస్ వినోద్‌కుమార్ ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు అలరించాయి.

హనుమాన్ చాలీసా పారాయణం చేస్తున్న మహిళలు

బహిరంగ ప్రకటన

నా క్లయింటు ప్రకాశం జిల్లా, ఒంగోలు నగరం, మంగమూరురోడ్డులోని శివప్రసాద్ కాలనీ, 6వలైనులో డోర్‌నెం. 167రుగల ఇంటి నందు నివాసం గల **శ్రీ పట్నాపు గోపాలరత్న ప్రసాద్ గారి భార్య శ్రీమతి అట్లూరి విజయలక్ష్మి** గారు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మందికి తెలియజేయునది ఏమనగా..

నా క్లయింటు క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిపై సర్వ సంపూర్ణ హక్కులు కలిగి అనుభవిస్తూయుండిరి. కాగా ఇటీవలె సదరాస్తికి సంబంధించిన ఒరిజినల్ లింకు దస్తావేజు అనగా తే. 17-11-2004దిన శ్రీ కోలా ప్రభాకరరావు గారి భార్య కోలా సుగుణ తరపున రిజిస్టర్డ్ విక్రయ ఖరారు అగ్రిమెంటుతో కూడిన జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ పొందిన ఏజెంట్ శ్రీ బొక్కిసం సుబ్బారావు గారి కుమారుడు బొక్కిసం శ్రీనివాసరావు అనువారు శ్రీ పేర్ల పిచ్చయ్య గారి కుమారుడు పేర్ల శ్రీమన్నారాయణ గారి పేరిట వ్రాయించి ఒంగోలు సబ్-రిజిస్ట్రార్ కార్యాలయం నందు రిజిస్టర్ చేసిన ద.నెం. **6848/2004**రు గల రిజిస్టరు విక్రయ పత్రము నా క్లయింటు వద్ద పోయినందువలన సదరు విషయమై నా క్లయింటు ఈనాడు తెలుగు వార్తాపత్రిక నందలి ప్రకాశం జిల్లా ఎడిషన్ నందు తే. 25-05-2025దిన ప్రకటన ఇచ్చిననూ దొరకనందున పోలీస్ రిపోర్టు ఇవ్వగా ఒంగోలు 2వ టౌన్ పోలీస్ స్టేషన్ వారు సదరు విషయమై విచారణ చేసి సదరు దస్తావేజు దొరకలేదని తే. 06-06-2025దిన సర్టిఫికెట్ జారి చేసియుండిరి.

కాగా ప్రస్తుతం నా క్లయింటు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని తన అవసరముల నిమిత్తం ఇతరులకు విక్రయించదలచిరి. కావున నా క్లయింటు చేయబోవు విక్రయమును గూర్చి ఎవ్వరికైనను ఎట్టి ఆక్షేపణలు వగైరాలు ఉన్నయెడల ఈ ప్రకటన వెలువడిన తేదీ నుండి 7 రోజుల లోగా క్రింది అడ్రసు నందు తగిన సాక్ష్యాధారములతో వ్రాత పూర్వకంగా తెలియపరచగలరు. తదుపరి చేయు ఎట్టి ఆక్షేపణలు వగైరాలు చట్టరీత్యా చెల్లనేరవనియు మరియు నా క్లయింటును ఏవిధంగాను బద్ధపరచవనియు రూఢీగా తెలియజేయడమైనది.

షెడ్యూలు: ప్రకాశం జిల్లా, ఒంగోలు సబ్.డి.యిలాకా ఒంగోలు మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో చేరిన మామిడిపాలెం గ్రామ సర్వేనెం. 14/2రులో య. 8-13సెంట్లులో య. 2-00 సెంట్లులో ప్లాను దాఖలా ప్లాటు నెం. 15రులో దక్షిణ దిశ వైపున గల 1332చ.అ.లు లేక 18 గదుల 36 చ.అ.లు లేక 148. చ.గ.లు లేక 124.32 చ.మీ.లు విస్తీర్ణం గల ఖాళీ స్థలమునకు హద్దులు. **తూర్పు:** 25 అడుగులు వెడల్పు గల రోడ్డు ఈ దిశ 18 అ.6 అం.లు. **దక్షిణం:** ప్లాటు నెం. 16రు స్థలం, ఈదిశ 72 అ.లు. **పడమర:** ప్లాటు నెం. 22రు స్థలం ఈదిశ 18అ.6 అం.లు. **ఉత్తరం:** ఈ ప్లాటు నెం. 15రులో పల్లపోతు శివరామప్రసాద్ గారి స్థలము, ఈ దిశ 72అ.లు.

ఇట్లు/- **ఇమ్మడిశెట్టి శివజ్యోతి**, M.A.LLM
న్యాయవాది, A-17, న్యాయవాది సదన్
జిల్లాకోర్టు ఆవరణ, ఒంగోలు, ప్రకాశం జిల్లా.
ఒంగోలు
తేది: 02-07-2025

హెచ్చరిక

నా క్లయింట్లు అయిన **I. కొప్పోలు వాస్తవ్యులు బాలినేని నాగేశ్వరావు 2 విజయవాడ వాస్తవ్యులు రామినేని సూరిబాబు & పద్మలత** గార్లు నాకు ఇచ్చిన సంజాయిషీ ప్రకారం ఈ క్రింది నోటీసు జారీచేయడమైనది. 1. ఇందలి నా మొదటి క్లైయింట్ అయిన **బాలినేని నాగేశ్వరావు** ఈ క్రింది షెడ్యూలులోని 2&5 ఐటముల కొనుగోలు నిమిత్తం ఒంగోలు వాస్తవ్యులైన **శ్రీ బెజవాడ పూర్ణచంద్రరావు** గారి భార్య విజయలక్ష్మి గారితో కొనుగోలు ఒప్పందం చేసుకొని దరిమిలా **State Bank of India, Sarb Vijayawada Account. No. 41711447071** లోనికి వారి అనుమతితో అడ్వాన్స్ అమౌంట్‌గా పంపియున్నారు. సదరు అమ్మకపు అడ్వాన్స్ అమౌంట్‌ను **State Bank of India, Sarb Vijayawada** వారు స్వీకరించియున్నారు. సదరు అగ్రిమెంట్ ఒంగోలు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ వారి ఆఫీసులో డాక్యుమెంట్ **No. 26978/2024 Dt.4/4/2024** తో రిజిస్ట్రేషన్ చేసుకొనియున్నారు.

2. ఇందలి నా రెండవ క్లైయింట్లు అయిన **రామినేని సూరిబాబు & పద్మలత** గార్లు క్రింది **3&6** షెడ్యూలు ఆస్తుల కొనుగోలు నిమిత్తం ఇందలి ఒంగోలు వాస్తవ్యులైన **శ్రీ బెజవాడ పూర్ణచంద్రరావు** గారితో అమ్మకపు ఒప్పందం చేసుకొని **State Bank of India, Sarb Vijayawada Account. No. 41711447071**కు వారి అనుమతితో అడ్వాన్స్ అమౌంట్ పంపియున్నారు. సదరు అడ్వాన్స్ అమౌంట్‌ను **State Bank of India, Sarb Vijayawada** వారు వారి తరపున స్వీకరించియున్నారు.

సదరు అమ్మకందారులు వారికీ ముట్టినట్లు అగ్రిమెంట్ ఆఫ్ సేల్ చేసుకొని ఒంగోలు సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లో డాక్యుమెంట్ **No. 27460/2024 Dt.4/4/2024** తో రిజిస్ట్రేషన్ చేసుకొనియున్నారు.
సదరు పై అగ్రిమెంట్‌లు నిమిత్తం రిజిస్ట్రేషన్ చేయమని అమ్మకందారులను అడుగుచుండగా వారు కాలయాపన చేయుచున్నారు. ఇట్లుండగా **State Bank of India. Sarb. Vijayawada.** వారు సదరు షెడ్యూలు ఆస్తులను అమ్మకమునకు sarfassi ప్రకారం అమ్మకం నోటీసు 10/6/2025న ఇచ్చియున్నారు. దానిపై నా క్లయింట్లు **DRT** విశాఖపట్నం కోర్టులో **SA.No.334/2025**తో కేసు వేసి యున్నారు. సదరు ఆక్షన్ నిలుపుదలకు పిటీషన్ వేసియున్నారు, సదరు పిటీషన్ పెండింగ్‌లో ఉన్నది. మరియు నా క్లయింట్లు రిజిస్టర్డ్ సేల్ అగ్రిమెంట్లు అమలు నిమిత్తం సివిల్ కోర్టులో **Specific Performance** కేసు దఖలు పరచియున్నారు. కాబట్టి పై విషయములను జనులందరికి తెలియపరుచుచు ఈ నోటీసు ఇవ్వడమైనది. భవిష్యత్‌లో నా క్లయింట్లు తీసుకొనబోవు చట్టబద్ధమైన చర్యలను ఇందులో తెలియబరచడమైనది.

షెడ్యూలు: ఐటమ్ నెం.2: సేల్ డీడ్ నెంబర్. 7703/2007. తేది. 09-08-2007 ప్రకారం శ్రీమతి బెజవాడ విజయలక్ష్మి గారి పేరున గల స్థిరాస్తి ప్రకాశం జిల్లా-ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ రాజీవ్‌నగర్. సర్వే నెం. 305లోని ఉత్తరం వైపు ప్లాట్ నెంబర్ 15 మొత్తం మరియు ప్లాట్ నెంబర్ 17 భాగంతో గల 347.30 చ.గ.లు. లేదా 290.3 చ.మీ. ల ఖాళీ స్థలం. శ్రీమతి బెజవాడ విజయలక్ష్మి గారికి చెందినది. టైటిల్ డీడ్ నెంబర్ 7703/2007. తేది.9/8/2007
హద్దులు: తూర్పు: సి. హెచ్.సుబ్బారావు గారు ఇతరులకు అమ్మిన ప్లాట్లు, **దక్షిణం:** ఎన్. వెంకటేశ్వర్లు మరియు ఇతరులకు చెందిన ప్లాట్ నెంబర్ 17, **పడమర:** 30 అ.ల. బజారు, **ఉత్తరం:** ప్లాట్ నెంబర్ 13.

ఐటమ్ నెంబర్ 5: టైటిల్ డీడ్ నెంబర్ 4738/2007 తేది.4/5/2007 ప్రకారం శ్రీమతి బెజవాడ విజయలక్ష్మి గారి పేరున గల స్థిరాస్తి, ప్రకాశం జిల్లా, ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్, రాజీవ్ నగర్ సర్వే నెంబర్ 306లోని ప్లాట్ నెంబర్ 16లో గల 212.0 చ.గ.లు లేదా 178.01చ.మీ.ల ఖాళీ స్థలం. శ్రీమతి బెజవాడ విజయలక్ష్మి గారికి చెందినది. టైటిల్ డీడ్ నెంబర్ 4738/2007 తేది.4/5/2007 ఎస్.ఆర్.ఓ. ఒంగోలు
హద్దులు: తూర్పు: కె.విశ్వనాధం గారికి చెందిన ప్లాట్ నెంబర్ 17, **దక్షిణం:** వి.నారాయణరావు మరియు ఇతరులకు చెందిన ప్లాట్ నెంబర్ 18, **పడమర:** 30 అడుగుల రోడ్, **ఉత్తరం:** 40 అడుగులరోడ్

ఐటమ్ నెంబర్ 3: సేల్‌డీడ్ నెంబర్ 7016/2007 తేది.18/7/2007 ప్రకారం శ్రీ బెజవాడ పూర్ణచంద్రరావు గారి పేరున గల స్థిరాస్తి: ప్రకాశం జిల్లా 523001. ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్, రాజీవ్ నగర్ సర్వే నెంబర్ 305లోని దక్షిణం వైపు ప్లాట్ నెంబర్ 15 మొత్తం మరియు ప్లాట్ నెంబర్ 17 భాగంతో గల 347.3 చ.గలు లేదా 290.3 చ.మీల ఖాళీ స్థలం. శ్రీ బెజవాడ పూర్ణచంద్రరావు గారికి చెందినది. టైటిల్ డీడ్ నెంబర్ 7016/2007 తేది.18/7/2007 ఎస్.ఆర్.ఓ. ఒంగోలు ప్రకారం, **హద్దులు: తూర్పు:** సి. హెచ్.సుబ్బారావు గారు ఇతరులకు అమ్మిన ఆస్తి, **దక్షిణం:** ఎన్.వెంకటేశ్వర్లు మరియు ఇతరులకు చెందిన ప్లాట్‌నెంబర్ 17. **పడమర:** 30 అడుగుల బజారు. **ఉత్తరం:** ప్లాట్‌నెంబర్ 13

ఐటమ్ నెంబర్ 6: టైటిల్ నెంబర్ 3724/2006 తేది. 6-6-2006 ప్రకారం శ్రీ బెజవాడ పూర్ణచంద్రరావు గారి పేరున గల స్థిరాస్తి ప్రకాశం జిల్లా 523001. ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్, రాజీవ్‌నగర్. సర్వేనెంబర్ 289/1లోని ప్లాట్ నెంబర్ 3తో గల 416/9 చ.గ.లు లేదా 349.99 చ.మీ.ల ఖాళీ స్థలం శ్రీ బెజవాడ పూర్ణచంద్రరావు గారికి చెందినది. టైటిల్ డీడ్ నెంబర్. 3724/2006. తేది. 6-6-2006 ఎస్.ఆర్.ఒ, ఒంగోలు. హద్దులు. **తూర్పు:** డి. బుడ్డయ్య గారు ఇతరులకు అమ్మిన ప్లాటు **దక్షిణం:** 100 అడుగుల రోడ్డు. **పడమర:** 30 అడుగుల రోడ్డు. **ఉత్తరం:** వి. పిచ్చయ్య గారికి చెందిన ప్లాట్ నెంబర్4.

సం/- **రామకృష్ణ A.V**, అడ్వకేట్, ఒంగోలు, సెల్: 9848624147

పూర్తి వేతనం అందేలా ఉపాధి పనులు

సంతనూతలపాడు, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో నీటి కుంటల పనులు ప్రారంభించాలని ఎంపీడీవో సురేష్‌బాబు పేర్కొన్నారు. ఉపాధి పనులపై బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడారు. కూలీలకు పూర్తి వేతనం అందేలా పనులు చేయించాలన్నారు. కంపోస్టు పిట్‌ల ఏర్పాటుకు అంచనాలు తయారు చేయాలని పేర్కొన్నారు. ఏపీవో వాసంతి, సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారుల ఆధార్ నమోదు పరిశీలన

ఒంగోలు గ్రామీణం, న్యూస్‌టుడే: సంతపేటలోని సీఎస్‌సీ కేంద్రంలో నిర్వహిస్తున్న అయిదేళ్లలోపు పిల్లల ఆధార్ నమోదు ప్రక్రియను సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్, జిల్లా మహిళా సంక్షేమశాఖ అధికారిణి ఎస్.సువర్ణ బుధవారం పరిశీలించారు. త్వరితగతిన పిల్లల ఆధార్ ప్రక్రియ పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. సీడీపీవో ఫణి రాజకుమారి, పర్యవేక్షకురాలు స్వర్ణ ఆదిలక్ష్మి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సిబ్బందితో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ న్యాయమూర్తి షేక్ ఇబ్రహీం షరీఫ్, మహిళా సంక్షేమశాఖ అధికారిణి సువర్ణ

లబ్ధిదారుకే పోషకాహారం

❖ అంగన్‌వాడీ కేంద్రాల్లో ముఖ ఆధారిత గుర్తింపు అమలు

న్యూస్‌టుడే - ఒంగోలు గ్రామీణం

అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు ఇచ్చే పోషకాహార పంపిణీలో మరింత పారదర్శకత తెచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకున్నాయి. అందులో భాగంగా మహిళా, శిశు సంక్షేమశాఖ ద్వారా ప్రత్యేకంగా ముఖ ఆధారిత గుర్తింపు, పోషణ్ ట్రాకర్ యాప్‌లను అందుబాటులోకి తెచ్చాయి. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఈ విధానంలోనే లబ్ధిదారులకు సరకులు, ఆహారం పంపిణీ చేస్తున్నారు.

ఒంగోలు బాలాజీరావుపేటలోని అంగన్‌వాడీ కేంద్రంలో ముఖ హాజరు నమోదు చేస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

యాప్ నిర్వహణపై శిక్షణ...

ఒంగోలు, సంతనూతలపాడు నియోజకవర్గాల్లో 560 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో 5,704 మంది చిన్నారులు, 24,316 మంది గర్భిణులు, బాలింతలు ఉన్నారు. వీరికి పోషకాహారం అందించడంతో పాటు చిన్నారులకు పూర్వ ప్రాథమిక విద్య బోధిస్తున్నారు. గత వైకాపా ప్రభుత్వం తీసుకొచ్చిన యాప్‌లు లోపభూయిష్టంగా ఉండడంతో పలు కేంద్రాల్లో సరకులు పక్కదారి పట్టేవి. ఈ లోటుపాట్లు సరిచేసి లబ్ధిదారులకు పక్కాగా పోషకాహారం అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు ప్రారంభించింది. సరకులు పక్కదారి పట్టకుండా ఇటీవల బాల సంజీవని యాప్ 2.0 తీసుకొచ్చింది. రోజూ ఉదయం, సాయంత్రం ముఖ హాజరు తప్పనిసరి చేసింది. కేంద్రాలకు ఎంత మంది వచ్చారో చరవాణి ద్వారా ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తున్నారు. యాప్ నిర్వహణపై ఇప్పటికే కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు.

పర్యవేక్షణ సులభతరం...

కేంద్ర ప్రభుత్వం ఈ నెల ఒకటో తేదీ నుంచి మరో ముఖ ఆధారిత యాప్‌ను అమల్లోకి తీసుకొచ్చింది. క్షేత్రస్థాయిలో తప్పనిసరిగా అమలు చేయాలని ఆదేశాలు ఉండటంతో అంగన్‌వాడీ కార్యకర్తలు అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన రెండు యాప్‌ల్లోనూ లబ్ధిదారుల వివరాలు నమోదు చేస్తున్నారు. దీంతో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఏ మేరకు పోషకాహారం పంపిణీ అవుతుందన్న పర్యవేక్షణ సులభతరమవుతోంది. మధ్యాహ్న భోజనం అందించే సమయంలో ఫొటో తీసి ఆ వివరాలను పోషణ్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేస్తున్నారు.

నియోజకవర్గం	అంగన్‌వాడీ కేంద్రాలు	చిన్నారులు	బాలింతలు, గర్భిణులు
ఒంగోలు	274	3,872	13,190
సంతనూతలపాడు	286	1,832	11,126

(c) eenadu

ప్రభుత్వ సంక్షేమ పథకాలను మహిళలకు వివరిస్తున్న మంత్రి నారాయణ.. కరపత్రాలు పంపిణీ చేస్తున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

కూటమి పాలనపై ప్రజల్లో ఆనందం

మంత్రులు నారాయణ, ఆనం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఆత్మకూరు, మర్రిపాడు, న్యూస్‌టుడే: జిల్లా వ్యాప్తంగా బుధవారం 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమం ఘనంగా ప్రారంభమైంది. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. నెల్లూరు నగర నియోజకవర్గ పరిధిలోని 13వ డివిజన్ యలమవారిదిన్నె ప్రాంతంలో మంత్రి నారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలు సంతోషంగా ఉన్నారని అన్నారు. ఇంటింటికి తెదేపా కార్యక్రమంతో పండగ వాతావరణం కనిపించిందన్నారు. కార్యక్రమంలో భాగంగా మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆత్మకూరు పట్టణంలోని ఒకటో వార్డు ముస్తాపురంలో పర్యటించారు. ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వ విజయాలను గడప గడపకు వెళ్లి వివరించారు. పీ4 స్ఫూర్తితో జనసేన ప్రవాస భారతీయ దంపతులు హరీష్‌కుమార్, మృదుల.. విద్యార్థులకు ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేయగా.. మర్రిపాడు మండల మాజీ ఎంపీపీ కటారి రమణయ్య ఓ కుటుంబాన్ని దత్తత తీసుకుని రూ.50వేలు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏపీ టిడ్కో ఛైర్మన్ అజయ్‌కుమార్, డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, మున్సిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, జడ్పీటీసీ మాజీ సభ్యులు విజేతారెడ్డి, పాల్గొన్నారు.

దిల్లీ వెళ్లిన కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(కలెక్టరేట్) : జిల్లా కలెక్టర్ ఒ.ఆనంద్ దిల్లీ వెళ్లారు. ఎన్నికల శిక్షణ కోసం రెండు రోజుల పాటు అక్కడ ఉండనున్నట్లు అధికారులు తెలిపారు. శనివారం తిరిగి జిల్లాకు రానున్నారు. అప్పటి వరకు జేసీ కార్తీక్ జిల్లా బాధ్యతలు చూస్తారు.

ఏడాదికి రూ. 60 లక్షలా!

బారాషహీద్ దర్గాలోని ఈద్గాలో రంజాన్ సమయంలో ఏర్పాటు చేసిన షెడ్డు ఇది. అప్పట్లో రూ. 15 లక్షలు చెల్లించారు. ఆ తర్వాత షెడ్డును ఊడదీసేందుకు కూలీల ఖర్చుతో పాటు ఆ సామగ్రి పెట్టుకునేందుకు స్థలం వృథా ఎందుకని భావించారో! ఎప్పుడైనా మనమే కదా షెడ్డు వేసేది అనుకున్నారో!! గుత్తేదారు దీన్ని తీయలేదు. బక్రీద్ పండగకు మరో రూ. 15 లక్షలు చెల్లించారు. తాజాగా ఇదే షెడ్డును మూడు ముక్కలుగా చేసి.. ఒక్కో భాగానికి రూ. పది లక్షల చొప్పున.. మొత్తం రూ. 30 లక్షల బిల్లులు చేస్తున్నారు. ఈ లెక్కన తాత్కాలిక షెడ్డుకు ఏడాదికి రూ. 60 లక్షలు పెడుతున్నారు. వాస్తవానికి ఆ సామగ్రి మొత్తం ప్రభుత్వమే కొనుగోలు చేసినా.. అంత ఖర్చు ఉండదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

- కేవలం ఈ ఒక్క పనిలోనే కాదు.. ప్రజలకు సౌకర్యాల పేరిట చేస్తున్న టాయిలెట్లు, పారిశుద్ధ్య సామగ్రి, విద్యుద్దీపాలంకరణ.. ఇలా అన్నింటా లెక్కకు మించి ఖర్చులు చూపిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

పండగకు ముందే.. కోర్కెలు తీరాయ్!

తాత్కాలిక పనుల్లో చేతివాటం

ఈనాడు, నెల్లూరు: నగరపాలక సంస్థ, న్యూస్‌టుడే: రొట్టెల పండగకు తరలివచ్చే భక్తులకు సౌకర్యాల కల్పన పేరిట నగరపాలక సంస్థ చేస్తున్న పనుల్లో డొల్లతనం కనిపిస్తోంది. ఏటా మాదిరిగానే.. ఈ నెల ఆరో తేదీ ప్రారంభం కానున్న పండగకు 20 రోజుల ముందు నుంచే పనులు ప్రారంభించారు. ఆన్‌లైన్‌లో టెండర్లు పిలిచినా.. వాటిని తెరవక ముందే రూ. 3 కోట్ల విలువైన పనులు పంచిపెట్టారనే విమర్శలు.. మరో రూ. 50 లక్షలను అప్పనంగా కాజేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అన్నింటా... అదే తీరు

పారిశుద్ధ్య నిర్వహణకు ప్రైవేటు సిబ్బంది కోసం రూ. 54 లక్షలు, సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ. 17 లక్షలు, ఘాట్‌లో దెబ్బతిన్న టైల్స్ మరమ్మతులకు రూ. పది లక్షలు, పార్కింగ్, ఘాట్‌లో ఇసుక వేసేందుకు రూ. 9.90 లక్షలు, ఈద్గా ఆవరణలోని స్వచ్ఛ మరుగుదొడ్లు, సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్‌కు రూ. 17.45 లక్షలు, తాగునీటికి రూ. 18.40 లక్షలు, కంట్రోల్ రూం, రిసెప్షన్ సెంటర్ల ఏర్పాటుకు రూ. 14.25 లక్షలు, లంగర్ ఖానాతో పాటు వివిధ ప్రాంతాల్లో షామియానాలకు రూ. 37.85 లక్షలు ఖర్చు చేస్తున్నారు. పార్కింగ్ స్థలాల్లో ఏర్పాటు చేసే సంచార టాయిలెట్లకు రూ. 30 లక్షలు ఖర్చు చేస్తుండటం గమనార్హం. దర్గాకు రంగులు, విద్యుద్దీపాలు, భక్తులకు క్యాలెండ్లు, ఐడీ కార్డులు తదితరాలన్నీ వక్ఫ్‌బోర్డు చేపడుతోంది. ముగింపు ఉత్సవం సందర్భంగా జ్ఞాపికలు, 1500 మందికి భోజన సదుపాయం కల్పిస్తుండగా.. వీటికి రూ. 25 లక్షలు వక్ఫ్‌బోర్డు నిధులు కేటాయించారు. అదనంగా మరో రూ. 25 లక్షల బిల్లులు పెట్టనున్నారనే ప్రచారం జరుగుతోంది.

దెబ్బతిన్న టైల్స్ మార్చకుండా ఇసుక బస్తాలు

భక్తులకు ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు

రొట్టెల పండగకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేస్తున్నాం. దర్గాకు రంగులు, విద్యుద్దీపాలు, షామియానాలు, బారికేడ్లు తదితర సౌకర్యాలు వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో కల్పిస్తున్నాం. వక్ఫ్‌బోర్డు రూ. 25 లక్షల నిధులు కేటాయించింది. అడ్వాన్స్‌లు చెల్లించి పనులు చేపడుతున్నాం. - ఖుదావన్, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్

కంప చెట్ల తొలగింపు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: సోమశిల జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రానికి ఎట్టకేలకు మోక్షం వచ్చింది. జలాశయంలో వదిలే చేప పిల్లలను ఇక్కడే ఉత్పత్తి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్దేశించడంతో.. దీన్ని వినియోగంలోకి తెచ్చే చర్యలు మొదలయ్యాయి.

సుమారు 25 ఎకరాల్లో..

కేంద్ర ప్రభుత్వ నిధులతో 25 ఎకరాల్లో సోమశిల జాతీయ చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మించారు. ఇక్కడ ఉత్పత్తి చేసిన పిల్లలను జలాశయంలో వదిలేవారు. వైకాపా ప్రభుత్వంలో అయిదేళ్లు.. ఈ ప్రక్రియను గాలికి వదిలేశారు. దాంతో తల్లి చేపల కుంటల్లో కంపచెట్లు పెరిగాయి. పిల్ల చేపల పెంపకం తొట్లు, పైప్‌లైన్లు దెబ్బతిన్నాయి. మొత్తంగా కేంద్రం మూలకు చేరింది.

అలా సరికాదని..

సోమశిల జలాశయం ఆధారిత మత్స్యకారుల జీవన భృతి పెంచేలా మత్స్య సంపదను వృద్ధి చేసేందుకు ఏటా చేప పిల్లలను వదులుతారు. అదే రీతిలో గత ఏడాది వదలాలని చూశారు. ఇతర ప్రాంతాల్లోని చేపపిల్లలను టెండర్ల ద్వారా సేకరించి.. వదలాలని యత్నించారు. కానీ, సోమశిలలోనే ఉత్పత్తి కేంద్రం ఉండగా.. అలా వదలడం సరికాదని కూటమి ప్రభుత్వం భావించింది. ఆ మేరకు సన్నద్ధం చేయాలని ఆదేశించింది. దాంతో అందుబాటులోకి తెచ్చే పనులు మొదలయ్యాయి. ఇందుకు రూ. 1.8 కోట్లు అవసరమవుతాయని నివేదికలు పంపారు. నిధులు అందుబాటులోకి రావాల్సి ఉంది. ఈ లోపు రూ. 50వేలతో జంగిల్ క్లియరెన్స్, ఇతర అడ్డంకుల తొలగింపు పనులు చేపట్టారు. దీనిపై హర్షం వ్యక్తమవుతోంది.

ప్రభుత్వ ఆదేశాలతో...

ఇక్కడి ఉత్పత్తి కేంద్రంలో పెంచిన పిల్లలనే జలాశయంలో వదలాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. ఆ మేరకు చర్యలు తీసుకుంటున్నాం. కంపచెట్లు, ఇతర అడ్డంకులు తొలగిస్తున్నాం. - శ్రీనివాసులు, ఏడీ మత్స్యశాఖ

బాధ్యతలు చేపడుతున్న డాక్టర్ మాధవి

జీజీహెచ్ సూపరింటెండెంట్‌గా మాధవి

నెల్లూరు(జీజీహెచ్), న్యూస్‌టుడే: జిల్లా ప్రభుత్వాస్పత్రి పూర్తి అదనపు బాధ్యతల సూపరింటెండెంట్‌గా బయో కెమిస్ట్రీ ప్రొఫెసరు డాక్టర్ మాధవిని నియమిస్తూ డీఎంఈ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఉద్యోగ విరమణ చేసిన సూపరింటెండెంట్ డాక్టర్ సిద్ధా నాయక్ నుంచి బాధ్యతలు తీసుకున్నారు. ఈమె ప్రభుత్వ వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు. పలువురు వైద్యులు ఆమెకు పుష్పగుచ్ఛాలిచ్చి అభినందనలు తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కన్వీనర్ శ్రీనివాసులు, సభ్యులు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు.

క్రీడలతో ఉద్యోగుల్లో ఒత్తిడి దూరం

ఉత్సాహంగా 'ఈనాడు ఛాంపియన్ చెస్' పోటీలు

ఈనాడు ఈటీవీ ఛాంపియన్స్

న్యూస్‌టుడే, నెల్లూరు(పద్మావతి సెంటర్): విధి నిర్వహణలో నిత్యం ఉద్యోగులపై ఒత్తిడి ఉంటుందని.. క్రీడలతో దాన్ని దూరం చేయొచ్చని కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి టి. విజయకుమార్ అన్నారు. 'ఈనాడు'-ఛాంపియన్ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో ఉద్యోగులకు నిర్వహించిన చెస్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'ఈనాడు' ఆధ్వర్యంలో ఉద్యోగులకు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. పోటీల్లో కలెక్టరేట్‌లోని రెవెన్యూ ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మహిళా విభాగంలో సీనియర్ అసిస్టెంట్ సి.సుప్రియ ప్రథమ, జూనియర్ అసిస్టెంట్ పి.యశస్విని ద్వితీయ, పురుషుల విభాగంలో ఎలక్ట్రికల్ ఇంజినీరు వి.దిలీప్ ప్రథమ, సీనియర్ అసిస్టెంట్ కె.శ్రీధర్ ద్వితీయ బహుమతులు సాధించారు. విజేతలకు టి.విజయ్‌కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. పోటీలకు ఆర్బిటర్లుగా అబ్దుల్ అజీజ్, బషీర్, విష్ణువర్ధన్‌రెడ్డి వ్యవహరించారు.

పోటీల్లో తలపడుతున్న ఉద్యోగులు

విజేతలు సుప్రియ, యశస్విని, దిలీప్, శ్రీధర్‌తో కలెక్టరేట్ ఏవో విజయకుమార్

తగరమా.. తరుణమా!

నేడు అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల రహిత దినోత్సవం

ఈనాడు, నెల్లూరు

2050వ సంవత్సరం నెల్లూరులో...

'పాఠశాలకు వెళ్లేందుకు ఓ చిన్నారి 'యాంటీ డేంజరస్ మాస్క్'తో సిద్ధమైంది. మిగిలిన పిల్లలదీ అదే పరిస్థితి. బడి దగ్గరకు చేరుకోగానే.. సెక్యూరిటీ గార్డు యాంటీ రేస్ కేబిన్‌లోకి తీసుకువెళ్లి.. పూర్తిగా తనిఖీ చేసి.. పర్యావరణ హానికారకాలు లేవని నిర్ధారించుకున్న తర్వాతే తరగతి గదిలోకి పంపారు. తరగతి గదిలోని ఉపాధ్యాయుడు సైతం అదే మాస్క్ ధరించి పాఠాలు బోధిస్తున్నారు. ఆయన ఏం చెబుతున్నారంటే.. ఆ రోజుల్లో (35 ఏళ్ల కిందట) మన నగరంలో 25 శాతం మాత్రమే ప్లాస్టిక్ కాలుష్యం ఉండేది. నిపుణులు హెచ్చరించినా ప్రజలు ప్లాస్టిక్ వస్తువులు, పాలిథిన్ కవర్ల వాడకం మానలేదు. దాంతో 2035లో కాలుష్య స్థాయి 50 శాతానికి.. 2045 నాటికి 90 శాతానికి పెరిగింది. భూమి సారం కోల్పోయి పంటలు పండలేదు. భూగర్భ జలాలు కరవై.. తాగేందుకు గుక్కెడు నీరు కరవయ్యాయి. అప్పటికి గానీ ప్రజలు స్పందించి ప్లాస్టిక్ వినియోగం మానలేదు. అయినా.. 2 శాతమే కాలుష్యాన్ని నియంత్రించగలిగాం. మరో 50 ఏళ్లు మనం కాలుష్య నియంత్రణ పాటిస్తేగానీ.. విపత్తు నుంచి బయటపడలేం' అన్నారు. ఈ దృశ్యాన్ని ఊహించుకుంటే పర్యావరణ హెచ్చరికలు ఎంత తీవ్రమైనవో తెలుస్తాయి.

2025కు వద్దాం..

రాబోయే విపత్తును ముందే గ్రహించి.. మన పిల్లలకు ఆరోగ్యకర సమాజాన్ని అందించేందుకు ఇప్పటి నుంచైనా నడుం బిగించాల్సిన అవసరం ఉంది. ఇంటి నుంచి ఉత్త చేతులతో బయటకు వెళ్లకుండా.. వస్త్రం సంచిని తీసుకువెళితే.. ఆ తర్వాత కూరగాయలు, పండ్లు తేవాలని ఫోన్ వచ్చినా.. నచ్చిన వస్తువులు కొనుగోలు చేసినా.. ప్లాస్టిక్ కొనుగోలు చేసే పని ఉండదు. నెల్లూరు నగరపాలక సంస్థతో పాటు 3 మున్సిపాలిటీలు, రెండు నగర పంచాయతీల నుంచి రోజుకు 480 మెట్రిక్ టన్నుల వరకు చెత్త వెలువడుతుండగా- ఇందులో 30 శాతానికిపైగా ప్లాస్టిక్ వస్తువులు ఉంటున్నాయి. చెత్తలోనే ప్లాస్టిక్ వస్తువులు కలిసిపోతుండటంతో.. సమస్యలు వస్తున్నాయి.

పర్యావరణ పరిరక్షణకు తన వంతుగా..

జూట్ సంచులతో శీలారాణి

నెల్లూరుకు చెందిన శీలా రాణి.. చదువుకునే రోజుల్లోనే తల్లిదండ్రుల ప్రోత్సాహంతో ప్లాస్టిక్ వస్తువుల వాడకం తగ్గించారు. పిల్లలు స్థిరపడిన తర్వాత ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంపై దృష్టిపెట్టారు. తొలుత ముద్ర పథకంలో రూ. 2 లక్షలు రుణం తీసుకుని.. వస్త్ర సంచులను ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి విక్రయించడం ప్రారంభించారు. కోర్టుకు సమీపంలో విన్నీ జూట్ బ్యాగ్స్ పేరుతో దుకాణం ఏర్పాటు చేశారు. కొద్ది రోజులకే దాన్ని విస్తరించి.. ఇతర ప్రాంతాల నుంచి ముడిసరకు తీసుకొచ్చి.. ఇక్కడే సంచులు తయారు చేస్తున్నారు. అవకాశం దొరికినప్పుడల్లా ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు ప్రభుత్వ కార్యక్రమాలు జరిగే సమయంలోనూ స్టాల్ ఏర్పాటు చేసి.. వస్త్ర, జూట్ సంచుల వాడకం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. ఒకప్పుడు పదుల్లో కొనుగోలు చేసే పరిస్థితి నుంచి. . ఏకంగా వేల సంఖ్యలో ఆర్డర్లు వస్తున్నాయని, ఇదంతా ప్రజల్లో మార్పునకు నిదర్శనమన్నారు.

జాతీయ సదస్సుకు డిప్యూటీ మేయర్ తహసీన్

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: హరియాణాలోని గురుగ్రామ్‌లో భారత పార్లమెంటు ఆధ్వర్యంలో లోక్‌సభ జనరల్ సెక్రటరీ ఉత్పల్‌కుమార్‌సింగ్ నేతృత్వంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న జాతీయ సదస్సులో నెల్లూరు నగరపాలకసంస్థ డిప్యూటీ మేయర్ సయ్యద్ తహసీన్ ఇంతియాజ్ పాల్గొననున్నారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి విజయానంద్ నుంచి సమాచారం అందింది. ఈనెల 3, 4 తేదీల్లో 'రాజ్యాంగ పరిరక్షణ, జాతి నిర్మాణంలో స్థానిక సంస్థల పాత్ర' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహించనున్నారు.

గుర్తింపుతో సరి.. స్వాధీనమేదీ!

జడ్పీ ఆస్తులు అన్యాక్రాంతం

న్యూస్‌టుడే, నెల్లూరు(జడ్పీ) పాలనలో కీలకమైన జడ్పీకి జిల్లాలో రూ. కోట్ల విలువైన ఆస్తులు ఉండగా.. పర్యవేక్షణ కొరవడి కబ్జాకు గురవుతున్నాయి. అడపా దడపా వీటిపై చర్చ జరుగుతున్నా.. ఆక్రమణలను గుర్తిస్తున్నా.. నోటీసులతో సరిపెట్టడం మినహా.. స్వాధీనానికి చర్యలు తీసుకోవడం లేదు.

నివేదిక ఏమైందో?

కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో ఆచారివీధిలో జడ్పీ భవనాలు ఉన్నాయి. వీటిలో గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం కార్యాలయం ఉండేది. భవనం శిథిలావస్థకు చేరడంతో.. దాన్ని మరోచోటుకు మార్చారు. అనంతరం పాత భవనం గురించి ఎవరూ పట్టించుకోలేదు. అందులో కొంత భాగం ఆక్రమణకు గురైంది. గత ప్రభుత్వంలో పాలకులు స్వయంగా పరిశీలించి.. ఆక్రమణలను నిర్ధారించి.. విచారణకు ఆదేశించారు. ఇప్పటికీ ఆ నివేదిక ఏమైందో తెలియని పరిస్థితి.

అంతటా.. అదే పరిస్థితి

కావలి మండల పరిధిలో సుమారు 2.3 ఎకరాల స్థలం ఆక్రమణకు గురైంది. అప్పట్లో అధికారులు సకాలంలో స్పందించకపోవడంతో కేసు కోర్టు పరిధిలోకి వెళ్లింది. మనుబోలు మండలం వీరంపల్లె వద్ద అన్యాక్రాంతమవగా.. చిట్టమూరు మండల పరిధిలోని కొత్త కుండం వద్ద పది అంకణాలు పరులపాలైంది. సంగం మండలం దువ్వూరు వద్ద అదే పరిస్థితి. అల్లూరు మండలం నార్తు మోపూరు వద్ద దాదాపు 58 అంకణాలు, చెన్నూరు కట్టుబడిపాళెం వద్ద దాదాపు 12 మంది జడ్పీ స్థలాన్ని ఆక్రమించినట్లు అధికారులే గుర్తించారు. సైదాపురం మండలం మల్లపూడి వద్ద రెండు ఎకరాల స్థలం కబ్జా చేశారు. ఉన్నతాధికారులు స్పందించి ఆక్రమణలను అడ్డుకోవడంతో పాటు ఇప్పటికే ఆక్రమించిన స్థలాలనూ తిరిగి స్వాధీనం చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నగరంలో ఆక్రమించిన జడ్పీ స్థలాన్ని పరిశీలిస్తున్న ఛైర్‌పర్సన్ (పాత చిత్రం)

రీసర్వే తర్వాత..

జడ్పీ ఆస్తులు ఎవరు ఆక్రమించినా చర్యలు తప్పవు. ఎక్కడా వదిలిపెట్టం.. అన్నీ స్వాధీనం చేసుకుంటాం. ఇప్పటికే మండల రెవెన్యూ అధికారులకు లేఖలు రాశాం. పలు స్థలాలను సర్వే చేయించాం. పలువురిపై గతంలో కేసులు పెట్టాం. కొన్ని కోర్టులో ఉన్నాయి. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి.. పటిష్ఠమైన ప్రణాళికతో ముందుకు పోతాం. రీసర్వే పూర్తయిన తర్వాత జడ్పీ ఆస్తులు కాపాడుకుంటాం. - మోహన్‌రావు, జడ్పీ ఇన్‌ఛార్జి సీఈవో

శ్రీ సాయి పీతాంబరి శారీస్
ప్రదర్శన మరియు అమ్మకం
తేదీలు : జూలై 4,5 మరియు 6
స్థలం : D.R అతిథి గృహ గెస్ట్ హౌస్, పిచ్చి రెడ్డి కల్యాణ మండపము వెనుక, మాగుంట లేఅవుట్, నెల్లూరు,
కంచి పెట్టిట్ వర్క్, పార్శి గారా, కాటన్ జాంధాని, సిల్క్ జాంధాని, ఏక్ తారా, బెనారస్, కోరా, జార్జెట్స్, ఖాదీ, టస్సర్ మరియు ఫ్యాన్సీ వెరైటీస్
రాజా. అక్కినేని
ఫోన్: 9100599 599

నాటి లెక్క.. నేడు సరిచేస్తారా!

జలాశయంలో మట్టి తవ్వకాల అంశంలో.. అధికారులపైనా విచారణ

నెల్లూరు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో.. అయిదేళ్లు సహజ వనరుల దోపిడీ అడ్డూఆపు లేకుండా సాగింది. వెంకటాచలం మండలంలోని సర్వేపల్లి జలాశయం, కనుపూరు చెరువుల్లో జరిగిన రూ. కోట్ల విలువైన గ్రావెల్ తవ్వకాలే అందుకు నిదర్శనం. వీటిపై అప్పట్లో ఫిర్యాదులు అందినా జలవనరులశాఖ అధికారులు.. తిలాపాపం తలా పిడికెడు అన్నట్లు వ్యవహరించారు. కూటమి ప్రభుత్వం ప్రస్తుతం నాటి లెక్కలను సరిచేసేందుకు సిద్ధమైంది. ఏకంగా అధికారులపై శాఖాపరమైన విచారణకు సిద్ధమైంది. దాంతో జలవనరులశాఖ అధికారుల్లో ఆందోళన మొదలైంది.

తవ్వకాలు అలా..

సర్వేపల్లి జలాశయంలో తవ్వకాలకు అవసరమైన అనుమతుల కోసం నాడు ఏకంగా ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి సంతకాన్ని ఫోర్జరీ చేశారు. జలవనరులశాఖ అధికారులు కనీసం.. ఆ దరఖాస్తు ఎవరు చేశారు? అన్న అంశం కూడా పరిశీలించకుండా అనుమతులు ఇచ్చారు. వాటిని అడ్డు పెట్టుకుని సదరు తరలింపుదారులు రూ. కోట్ల విలువైన గ్రావెల్ కొల్లగొట్టారు. తరలింపు సమయంలోనూ అటువైపు కన్నెత్తి చూడలేదు. అనుమతులు తీసుకున్నదానికంటే ఎక్కువగా కొల్లగొట్టడంపై ఫిర్యాదులు వెల్లువెత్తడం, ప్రజలు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో స్పందించిన అధికారులు వెంకటాచలం పోలీసులకు ఫిర్యాదు చేయగా.. కేసు కూడా నమోదు చేశారు. ఆ సమయంలో ఎంపీ సంతకం ఫోర్జరీ వ్యవహారం వెలుగు చూసింది. అప్పట్లోనే ఈ వ్యవహారం దుమారం రేపగా.. పోలీసులు మొక్కుబడి విచారణతో మమ అనిపించారు. కూటమి ప్రభుత్వం రాగానే.. ఈ విషయమై విచారణకు సిట్‌ను నియమించింది. విచారణలో భాగంగా ఎంపీ సంతకం ఫోర్జరీ, గ్రావెల్ తరలింపులపై మాజీ మంత్రి కాకాణితో పాటు మరికొందరిపై కేసు నమోదైన విషయం తెలిసిందే.

ఇప్పుడు వీరి వంతు..

ఎంపీ సంతకం ఫోర్జరీ, గ్రావెల్ తవ్వకాలపై విచారణ జరిపిన సిట్.. అందులో అధికారుల పాత్ర కూడా ఉన్నట్లు గుర్తించింది. నిబంధనలు అమలు చేయకుండా.. తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించి అక్రమాలకు సహకరించారంటూ ప్రభుత్వానికి నివేదిక పంపింది. దాంతో నాటి జలవనరులశాఖ అధికారులపై చర్యలకు ఉపక్రమించింది. అందులో భాగంగానే విచారణకు హాజరుకావాలంటూ నాటి ఈఈ, డీఈ, ఏఈలకు ఆదేశాలు జారీ చేసింది. పది రోజుల్లో విచారణ పూర్తికానుండగా.. ఏం చర్యలు ఉంటాయోనని అధికారుల్లో ఉత్కంఠ నెలకొంది.

జలాశయంలో మట్టి తవ్వకాలపై కొలతలు తీస్తున్న అధికారులు (పాత చిత్రం)

ట్రేడింగ్ పేరుతో రూ.30.40లక్షల సైబర్ మోసం

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: ట్రేడింగ్‌లో లాభాలు చూపిస్తామంటూ పలు దఫాలుగా రూ.30.40లక్షలు సైబర్ మోసగాళ్లు దోచుకున్న ఘటనపై నెల్లూరు నగరం చిన్నబజారు పోలీసులు కేసు నమోదు చేశారు. వారి కథనం మేరకు.. నగరంలోని డైకస్ రోడ్డు హాల్‌తాలీం వీధికి చెందిన షేక్ మతీన్ ఫైజాన్ బీటెక్ పూర్తి చేసి ఓ కంపెనీలో పనిచేశారు. ప్రస్తుతం ఇంటి వద్దే ఉంటూ ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. సామాజిక మాధ్యమంలో ఓ కంపెనీకి చెందిన వారు పరిచయమయ్యారు. తాము ఆన్‌లైన్‌లో ఇచ్చే సూచనలు, సలహాలు పాటిస్తే లాభాలు వచ్చేటట్టు చేస్తామని చెప్పి గ్రూపులో యాడ్ కావాలని సూచించారు. వారు పంపిన లింక్ ఆధారంగా అన్ని వివరాలు పొందుపరిచారు. అనంతరం స్టాక్ ట్రేడింగ్, బ్లాక్ ట్రేడింగ్, ఐపీవో షేర్లు, హాట్ స్టాక్ రెకమండేషన్స్ తదితరాలు చెప్పి పెట్టుబడులు పెట్టమని చెప్పారు. రూ. 1.25లక్షలు లాభాలు వచ్చేలా చేశారు. పెద్ద మొత్తంలో నగదు పెట్టుబడి పెడితే అధిక మొత్తంలో ఆదాయం వస్తుందని నమ్మించారు. పలు దఫాలుగా స్నేహితులు, కుటుంబ సభ్యుల ఖాతాల నుంచి రూ. 30,40,576 గతనెల 3 నుంచి 24వ తేదీ వరకు డిపాజిట్ చేశారు. అనంతరం జరిగిన పరిణామాల నేపథ్యంలో బాధితుడి ఖాతాలో 2,29,94,722 నగదు ఉన్నట్లు చూపించగా విత్ డ్రా చేసుకునేందుకు ప్రయత్నించగా. . నగదు రాలేదు. అందుకు కమీషన్ కోసం మరింత నగదు డిపాజిట్ చేయాలని సూచించడంతో అనుమానం వచ్చి గత నెల 30న ఎన్‌సీఆర్‌పీ పోర్టల్‌లో ఫిర్యాదు చేశారు. మోసపోయినట్లు తెలుసుకుని న్యాయం చేయాలని బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

ప్రకటనల కొరకు సంప్రదించండి: 800 800 1790

ఇదిగో చెత్త.. అదిగో కేంద్రం

మర్రిపాడులో చెత్త సంపద తయారీ కేంద్రం డంపింగ్ యార్డును తలపిస్తోంది. గ్రామంలో సేకరించిన చెత్తను వేరు చేసి వర్మీకంపోస్టు తయారు చేయాల్సి ఉన్నా.. నిరుపయోగంగా వదిలేశారు. దీంతో అక్కడ వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇక గ్రామాల్లో రోడ్ల వెంబడి చెప్పాల్సిన పనే లేదు. చెత్త రోజుల తరబడి అక్కడే ఉండటంతో దుర్వాసనతో పాటు, దోమల వ్యాప్తి అధికమైంది. రూ.లక్షల వ్యయంతో నిర్మించినా అధికారుల నిర్లక్ష్యంతో వృథాగా మారిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెత్త కేంద్రాన్ని అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, మర్రిపాడు (ఆత్మకూరు గ్రామీణం)

కనిపించని స్వచ్ఛత.. అపరిశుభ్రత

రాష్ట్ర ప్రభుత్వం స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణాంధ్ర.. కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోంది. జిల్లా, పట్టణ, గ్రామస్థాయిలో ప్రతి ప్రభుత్వ కార్యాలయం శుభ్రంగా ఉంచుకోవాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా కలెక్టరేట్ పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. కార్యాలయం చుట్టూ చెట్లు పెరిగాయి. అక్కడ వ్యర్థాలు నిల్వ చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. - ఈనాడు, నెల్లూరు

అవస్థల దారి

అధికలోడుతో వాహనాలు తిరుగుతుండడంతో వెంకటరెడ్డిపల్లి వద్ద ప్రధాన రహదారి గుంతలమయమైంది. అక్కడ ఉన్న పైపులైను పగలడంతో రోడ్డుపైకి నీరు చేరుతోంది. అటుగా ప్రయాణం చేయాలంటే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. తాగునీటి పైపులైనుకు మరమ్మతులు చేయించడంతోపాటు గుంతలు పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. - న్యూస్‌టుడే, కలువాయి

కౌన్సెలింగ్ నిర్వహించకనే బదిలీలా?

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: మెరిట్ జాబితా ప్రకటించి.. కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహించి బదిలీలు చేయడం పరిపాటి.. ఇలాంటివేవి లేకుండానే విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్స్ బదిలీలు చేసినట్లు విమర్శలు వస్తున్నాయి.. అందిన వివరాలు మేరకు.. ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలోని పలు సచివాలయాలలో 68 మంది విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్స్ పనిచేస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం ఉద్యోగుల బదిలీలకు పచ్చజెండా ఊపడంతో అన్ని ప్రభుత్వ శాఖలలో బదిలీల జాతర జరుగుతోంది. ఇదే క్రమంలో మత్స్యశాఖలో పనిచేస్తున్న విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్స్‌కు బదిలీల కౌన్సెలింగ్ చేపడుతున్నట్లు ఆ శాఖ ప్రకటించింది. గతనెల 28న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని చెప్పినా.. అందుకు సంబంధించి ఎటువంటి ప్రక్రియ నిర్వహించలేదు. చాలా మంది వీఎఫ్ఏలు కౌన్సెలింగ్ నిర్వహించలేదని అనుకుంటున్న సమయంలో వారికి ఆందోళన కలిగించే విషయం తెలిసింది. కౌన్సెలింగ్ నిర్వహించినట్లు.. జాబితా విడుదలైంది. 30వ తేదీ జిల్లా శాఖ ఉన్నతాధికారి ఉద్యోగ విరమణ చేశారు. అదేరోజు బదిలీ చేసినట్లు జాబితాపై ఉన్నతాధికారుల సంతకాలు ఉన్నాయి. ఇలా చేయడం వల్ల తమకు అర్హత ఉన్నా, కోరుకున్న చోటుకు బదిలీ అయ్యే అవకాశం కోల్పోయామని కొందరు ఉద్యోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదే విషయం బుధవారం జేసీ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. తమకు న్యాయం చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు.

వేడుకగా సుభద్ర కల్యాణం

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: శ్రీకృష్ణ ధర్మరాజులస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం చప్పర వాహనంపై ద్రౌపతి సమేత ధర్మరాజులస్వామి శ్రీకృష్ణుడు ఊరేగారు. రాత్రికి శ్రీ సుభద్ర కల్యాణం వైభవోపేతంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాల మధ్య భక్తులు శ్రీకృష్ణ నామం చేస్తుండగా కార్యక్రమం వేడుకగా సాగింది. ఈవో జానకమ్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చదువుల నేస్తం.. సమస్యలే సమస్తం

జూనియర్ కళాశాలల్లో వసతుల కొరత

జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలకు ఆదరణ ఉన్నా.. విద్యార్థులను సమస్యలు వేధిస్తున్నాయి. 24 కళాశాలలు ఉండగా.. 8,589 మంది చదువుతున్నారు. ముఖ్యంగా తరగతి గదులు, అధ్యాపకుల కొరత, తాగునీటి సమస్య నెలకొంది. కొన్నిచోట్ల కళాశాల స్థలాలు ఆక్రమణలకు గురయ్యాయి.

– న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య), బిట్రగుంట, పొదలకూరు, కందుకూరు పట్టణం, ఉదయగిరి, కోవూరు

డిగ్రీ కాలేజీలో ప్రయోగశాల.. కందుకూరులోని టీఆర్ఆర్ జూనియర్ కళాశాలలో బోటనీ, జువాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ ప్రయోగశాలలకు గదులు లేక డిగ్రీ కళాశాల భవనంలో నిర్వహిస్తున్నారు. గదుల కొరత నెలకొంది.

- పొదలకూరు జూనియర్ కళాశాలలో 200 మంది విద్యార్థులు చదువుతున్నారు. కళాశాల తూర్పువైపు ప్రహరీ పడిపోయింది. వ్యాయామ అధ్యాపకుడ్ని నియమించలేదు.

స్థలం ఆక్రమణ.. కోవూరు మండలం ఇనమడుగు జూనియర్ కళాశాలలో 120 మంది విద్యార్థులు చదువుతున్నారు. వీరికి సరిపడా తరగతి గదులు, ప్రయోగశాలకు, గ్రంథాలయానికి భవనాలు లేవు. అరకొర మరుగుదొడ్లతో ఇబ్బందులు పడుతున్నారు. ప్రహరీ నిర్మించేందుకు ప్రభుత్వం రూ.22 లక్షలు మంజూరు చేయగా... కళాశాలకు కేటాయించిన భూమి సుమారు పది సెంట్లు ఆక్రమణలకు గురవడంతో పనులు చేపట్టలేదని ప్రిన్సిపల్ మధుబాబు తెలిపారు.

నెల్లూరు నగరం.. కేవీసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల

పురాతన భవనంలో తరగతులు

నెల్లూరు నగరంలోని కేవీసీ కళాశాలలో 600 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇక్కడ పురాతన భవనంలో తరగతులు, ప్రయోగశాలలు నిర్వహిస్తున్నారు. డీకే ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలకు అయిదు ఎకరాలు కేటాయించారు. విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేవు. కొన్నేళ్లుగా డిగ్రీ కళాశాల తరగతి గదుల్లో జూనియర్ కళాశాల నిర్వహిస్తున్నారు. ఇక్కడ 1900 మంది చదువుతున్నారు. అధ్యాపకుల కొరత వేధిస్తోంది.

ఉదయగిరి.. శిథిలావస్థకు చేరిన ల్యాబ్ గదులు

ప్రతిపాదనలోనే నూతన భవనాలు

ఉదయగిరిలోని ఏఆర్ఆర్ జూనియర్ కళాశాలలో గదుల కొరత నెలకొంది. గతంలో జూనియర్ కళాశాల, ప్రభుత్వ ఉన్నత పాఠశాల కలిసి ఉండేవి. విభజనలో భాగంగా కొన్ని గదులను కళాశాలకు కేటాయించారు. అందులో ప్రస్తుతం ల్యాబ్‌లు కొనసాగుతున్నాయి. ల్యాబ్ గదులు మినహా విద్యార్థుల బోధనకు నాలుగు గదులే ఉన్నాయి. అవి సరిపోవడం లేదు. ల్యాబ్ గదులు కూడా శిథిలావస్థకు చేరాయి. నూతన భవనాల కోసం గత ప్రభుత్వంలో ప్రతిపాదనలు పంపినా మంజూరు కాలేదు.

వ్యాయామ ఉపాధ్యాయుడు లేక..

బిట్రగుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వ్యాయామ ఉపాధ్యాయుడు లేరు. ప్రిన్సిపల్ శ్రీనివాసరావు సూచనల మేరకు ఫిజిక్స్ లెక్చరర్ సుధేష్ణకుమార్ క్రీడలను నేర్పిస్తున్నారు.

కూటమి పాలనలో ప్రజలు సుభిక్షం: ఎంపీ

బుచ్చిరెడ్డిపాళెం, విడవలూరు: కూటమి పాలనలో ప్రజలు సుభిక్షంగా ఉన్నారని ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. బుధవారం బుచ్చిరెడ్డిపాళెంలో ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డితో కలిసి 'సుపరిపాలనలో తొలి అడుగు-ఇంటింటికీ తెదేపా' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పింఛన్ల పెంపు, ఉచిత సిలెండర్లు, తల్లికి వందనం పథకాలు పేదలకు ఎంతో మేలు చేశాయన్నారు.

మహిళలతో మాట్లాడుతున్న ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

అవినీతిలో ప్రసన్న పీజీ: ఎమ్మెల్యే

ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి మాట్లాడుతూ అవినీతిలో మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పీజీ చేశారని ఎద్దేవా చేశారు. పర్సంటేజీల ప్రసన్న అంటూ ఆరోపించారు. విద్యాశాఖామంత్రి లోకేశ్ విద్యారంగంలో చేపట్టిన సంస్కరణలు ఉత్తమ ఫలితాలనిస్తున్నాయన్నారు. విడవలూరు మండలం రామతీర్థం, రామచంద్రాపురం గ్రామాల్లో ఆమె పర్యటించారు.

మల్బరీ సాగుకు రాయితీలు

నెల్లూరు(పద్మావతిసెంటర్): మల్బరీ సాగు చేపట్టే రైతులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ ఆర్థిక సంవత్సరంలో రాయితీలు విడుదల చేశాయని పట్టు పరిశ్రమల శాఖ జిల్లా అధికారి ఎన్.సత్యనారాయణ ప్రకటనలో తెలిపారు. పట్టు మొక్కలు నాటే ఎస్సీ, ఎస్టీ రైతులకు ఎకరానికి 27 వేలు, షెడ్డు నిర్మాణానికి రూ.4.50 లక్షలు, బీసీ, ఓసీ రైతులకు మొక్కలకు ఎకరానికి రూ.22,500, షెడ్డు నిర్మాణానికి రూ.3,37,500 ప్రభుత్వం రాయితీ ఇవ్వనున్నట్లు వివరించారు. పంటల సాగులో తెగుళ్ల నిరోధక మందులకు 75 శాతం రాయితీ ఇస్తామన్నారు. అవకాశాన్ని జిల్లాలోని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బంగారం ధరలు

గ్రాముధర: (3 శాతం జీఎస్టీ కలిసిన ధర)	రూ. 9,337
సవర ధర:	రూ. 74,696
వెండి గ్రాము :	రూ. 111.70

వెంకాబ్ కోళ్ల ధరలు

బ్రాయిలర్ (రైతుధర)	100
రిటైల్	122
లేయర్	115
బ్రాయిలర్స్	176
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	201
లేయర్ మాంసం	195
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	116
లేయర్	112
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	234
లేయర్ మాంసం	190

ర.భ.లో అధికారుల బదిలీ

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: జిల్లా పరిధిలోని ర.భ.శాఖలో పని చేస్తున్న ఈఈ స్థాయి అధికారులను బదిలీ చేస్తూ బుధవారం రాత్రి జీవో వచ్చింది. నెల్లూరు ఈఈగా పని చేస్తున్న వై.మురళీకృష్ణను అనంతపురానికి బదిలీ చేసి.. ఇన్‌ఛార్జి ఎస్ఈ హోదా కల్పించారు. నెల్లూరు ఎస్ఈ ఆఫీసులో పని చేస్తున్న ఈఈ హోదా కలిగిన స్టాన్లే జాన్స్‌ను విజయవాడకు బదిలీ చేశారు. అక్కడ ఇన్‌ఛార్జి ఎస్ఈ హోదా ఇచ్చారు.

ఎస్ఈఐఎల్‌కు భూమి కేటాయింపు

ముత్తుకూరు : నేలటూరు పంచాయతీ పరిధిలో సర్వేనం 313-2, 314-3లోని 5.04 ఎకరాల ప్రభుత్వ భూమిని ఎస్ఈఐఎల్‌కు కేటాయిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. పవర్ ప్రాజెక్టు అభివృద్ధి కార్యక్రమాల కోసం మార్కెట్ ధర ప్రకారం రూ.1.13 కోట్లకు కేటాయించారు. ఈ భూమిని కేటాయించిన పనికి మాత్రమే వినియోగించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పెట్రోలియం పైపులైన్ ఏర్పాటు అడ్డగింత

ముత్తుకూరు, న్యూస్‌టుడే: పెట్రోలియం సంస్థ తమను సంప్రదించకుండానే తమ పొలాల మధ్యలో పైపులైన్ ఏర్పాటు చేయటం దారుణమని కృష్ణపట్నం రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పైపులైన్ పనులను బుధవారం అడ్డుకున్నారు. దీంతో సదరు సంస్థ ప్రతినిధులు, పోలీసులు, రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతులతో మాట్లాడారు. పొలాల్లో పైపులైన్ వేస్తే నష్టపోతామని అన్నదాతలు వాపోయారు. గట్లు పక్కన లేక ఇతర మార్గంలో ఏర్పాటు చేయాలని కోరగా, తమకు ఇచ్చిన ప్లాన్ ప్రకారం చేస్తున్నామని సంస్థ ప్రతినిధులు తెలిపారు. దీంతో వాగ్వాదం జరిగింది. ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రత్యామ్నాయ మార్గాల్లో పైపులైన్ ఏర్పాటుపై ఒకటి రెండు రోజుల్లో చర్యలు తీసుకుంటామని సంస్థ ప్రతినిధులు స్పష్టం చేశారు.

పైపులైన్ మ్యాప్ పరిశీలిస్తున్న అధికారులు

పీజీ సెట్‌లో విద్యార్థుల ప్రతిభ

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు పీజీసెట్‌లో మెరుగైన ర్యాంకులు సాధించారని ప్రిన్సిపల్ డాక్టర్ రవికుమార్ తెలిపారు. బోటనీలో **రేణిమాలప్రియాంక** 34వ ర్యాంకు, ఎస్.కె.ఉజ్మా 45వ ర్యాంకు, ఇంగ్లిషులో కె.సాంసన్ 58, కె.భార్గవి 81, చరిత్రలో మోజెస్ 85, రాజనీతిశాస్త్రంలో ఎం.శివ 161, సాయి, వీరప్ప, విష్ణు 279వ ర్యాంకులు సాధించారన్నారు. ఎడ్‌సెట్‌లో వై.స్నేహ 371, ఉదయ 423, బి.స్వీటీ 466 ర్యాంకులు సాధించారని తెలిపారు. అలాగే కళాశాల పూర్వ విద్యార్థిని ఇట్టా సింధుజ సెంట్రల్ విశ్వవిద్యాలయం ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత సాధించి తమిళనాడులో ఎంఏ ఇంగ్లిష్ సీటు సాధించడం కళాశాలకు గర్వకారణమన్నారు.

మెప్మాలో పారదర్శక సేవలు

ఆర్పీలకు ట్యాబ్‌లు

నెల్లూరు(కలెక్టరేట్), న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం మహిళల ఆర్థికాభివృద్ధికి శ్రీకారం చుట్టింది. గత అయిదేళ్లుగా నిర్వీర్యమైన మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేస్తోంది. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా)లో డిజిటల్ సేవలు అందుబాటులోకి వచ్చాయి.

పారదర్శకతతో పాటు సేవలను వేగవంతం చేసేందుకు గతంలో తెదేపా ప్రభుత్వం ఆర్పీలకు ట్యాబ్‌లు అందించింది. వైకాపా అయిదేళ్ల పాలనలో వాటి నిర్వహణను విస్మరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ డిజిటల్ విధానానికి శ్రీకారం చుట్టారు. మహిళా సంఘాల్లో సభ్యులకు ఉపాధి కల్పించే దిశగా సేవలను మరింత వేగవంతం చేసేందుకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నారు.

అక్రమాలకు అడ్డుకట్ట

వైకాపా పాలనలో సరైన పర్యవేక్షణ లేకపోవడంతో కొన్ని మెప్మా సంఘాలకు చెందిన సొమ్మును సిబ్బంది దుర్వినియోగం చేశారు. బ్యాంకు వాయిదాల నగదును స్వాహా చేసిన సంఘటనలు వెలుగు చూశాయి. కొందరిపై కేసులు నమోదయ్యాయి. ట్యాబ్‌ల వినియోగంతో ఇలాంటి అక్రమాలకు అడ్డుకట్ట వేయవచ్చని అధికారులు చెబుతున్నారు.

ఫోన్ల స్థానంలో..

జిల్లాలో 396 మంది రిసోర్స్ పర్సన్లకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నారు. ఎప్పటి సమాచారం అప్పుడే ఆన్‌లైన్‌లో నమోదు చేసేందుకు ఇవి ఉపయోగపడతాయి. ఇప్పటి వరకు కొన్ని యాప్‌ల సమాచారాన్ని ఆర్పీలు తమ సొంత చరవాణుల ద్వారా ఆన్‌లైన్‌లో అనుసంధానం చేసేవారు. యాప్‌లకు చరవాణి సహకరించకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వీటిని అధిగమించేందుకు రూ.34వేలు విలువైన ట్యాబ్‌లను ప్రభుత్వం అందిస్తోంది. వీటి వినియోగంపై ఇప్పటికే అవగాహన కల్పించారు.

ట్యాబ్‌ల పంపిణీ ఇలా.. నెల్లూరు : 266 కావలి : 68 కందుకూరు: 24 ఆత్మకూరు: 27 బుచ్చిరెడ్డిపాళెం: 11

భూసేకరణ నోటిఫికేషన్ రద్దు చేయండి: సీపీఎం

ఉలవపాడు, న్యూస్‌టుడే: పరిశ్రమల కోసం బలవంతంగా భూసేకరణ చేయొద్దని, నోటిఫికేషన్ రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఇండోసోల్ పరిశ్రమ కోసం భూసేకరణ చేయనున్న ఉలవపాడు మండలం కరేడు పంచాయతీలోని ఉప్పరపాలెం, రామకృష్ణాపురం, పొట్టేనుగుంట, అలగాయపాలెం, బాలకోటయ్య సంఘంలో బుధవారం పది వామపక్ష పార్టీల ప్రతినిధులతో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇండోసోల్ కంపెనీ కారుచౌకగా రైతుల భూములు తీసుకుంటుందని ఆరోపించారు. చేవూరులో పరిశ్రమ ఏర్పాటు చేస్తుంటే ఇక్కడ ఇంత పెద్దమొత్తంలో భూములు ఎందుకని ప్రశ్నించారు. సీపీఎం కార్యవర్గసభ్యులు కేవీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ నెల నాలుగో తేదీ జరిగే గ్రామసభలో ప్రజలందరూ పాల్గొని భూములు ఇవ్వమని తీర్మానం చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీపీఎం నెల్లూరు జిల్లా కార్యదర్శి మూలం రమేశ్, సభ్యులు అజయ్‌కుమార్, పుల్లయ్య, గౌస్, జి.వెంకటేశ్వర్లు, ఆంధ్రా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న వి.శ్రీనివాసరావు

ANDHRA PRADESH STATE WAQF BOARD
(Imdad Ghar, 4th Floor, Opp: K.R.Market, Vijayawada)
F.No. 05/KAS/AUC/2016/DM-S. Dated: 01-07-2025

E-AUCTION NOTICE

The interested persons/ firms/ agencies are invited to participate in the E-Auction **for the offering items of Dargah Hazrath Syed Kareemullah Shah Quadri (Rh), Kasmur (V), Venkatachalam (M), SPSR Nellore District for a period of (12) months.**

The E-Auction details are available on the website: https://konugolu.ap.gov.in under Auction ID: 25168 For further information please contact: 99493 52388

Sd/- **Chief Executive Officer**

ఇంటర్ విద్యార్థి బలవన్మరణం

అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు

నెల్లూరు(నేర విభాగం) : ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదివే ఓ విద్యార్థి బాత్‌రూమ్‌లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు.. నగరంలోని రామచంద్రాపురం మూడో వీధిలో నివాసం ఉంటున్న ఎన్.సాయిరామ్, కవిత దంపతుల కుమారుడు రేవంత్(18).. నెల్లూరుగ్రామీణ మండలం ధనలక్ష్మీపురంలోని కళాశాల వసతి గృహంలో ఉంటున్నాడు. ఏమైందో ఏమోగానీ బుధవారం ఉదయం తాను ఉంటున్న హాస్టల్ బాత్‌రూమ్‌లోని కిటికీకి ఉరేసుకుని వేలాడుతూ ఉండగా సిబ్బంది గుర్తించి. . వెంటనే ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అనంతరం పోలీసులు, కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.

కుమారుడి మృతిపై అనుమానాలున్నాయి.. తమ కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని మృతుని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం రాత్రి రేవంత్ ఫోన్ చేసి ఎదురుగా ఉండే గదిలో అయిదుగురు విద్యార్థులు గది మారుద్దామని చెబుతున్నారని, దుర్భాషలాడుతున్నారని, భయంగా ఉందని చెప్పినట్లు తెలిపారు. ప్రిన్సిపల్, ఇన్‌ఛార్జికి చెప్పినా వారు పట్టించుకోలేదని ఆరోపించారు. కళాశాల సిబ్బంది ఉదయం ఫోను చేసి కుమారుడు కొన ఊపిరితో ఉన్నట్లు చెప్పారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆసుపత్రికి వెళ్లిన తర్వాత మృతి చెందినట్లు చెప్పడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విషయం మీడియాకు చెప్పవద్దని, సెటిల్‌మెంట్ చేసుకుందామని కళాశాల నిర్వాహకులు బేరసారాలు చేస్తున్నారని ఆరోపించారు. విచారించి న్యాయం చేయాలని కోరారు. పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

రైలు నుంచి పడి వ్యక్తి దుర్మరణం

మనుబోలు, న్యూస్‌టుడే: ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం చెందిన ఘటన మనుబోలు-గూడూరు పరిధిలో బుధవారం జరిగింది. రైల్వే పోలీసుల వివరాల మేరకు.. సుమారు 45 ఏళ్ల వయసు ఉన్న గుర్తు తెలియని వ్యక్తి గూడూరు నుంచి విజయవాడ వైపు వెళుతున్న రైలు నుంచి జారిపడ్డారు. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాన్ని పంచనామా నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే ఎస్సై హరిచందన తెలిపారు.

కసాయి అల్లుడి అరెస్టు

కావలి, న్యూస్‌టుడే: మద్యం మత్తులో అత్తామామలను హతమార్చిన కసాయి అల్లుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం రాత్రి ఈ కేసుకు సంబంధించిన వివరాలను కావలి డీఎస్పీ పి.శ్రీధర్ వెల్లడించారు. దుత్తలూరు పంచాయతీ పరిధిలోని ఏసీ కాలనీకి చెందిన ఏలూరి వెంగయ్య గత ఆదివారం అర్ధరాత్రి తన అత్తమామలైన చలంచర్ల కల్లయ్య, జయమ్మను కత్తితో పొడిచి దారుణంగా హతమార్చాడు. వారి కుమార్తె వెంకాయమ్మను 13 ఏళ్ల క్రితం వెంగయ్యకిచ్చి వివాహం చేశారు. భార్యను ఎప్పుడూ అనుమానించేవాడు. మద్యానికి బానిసగా మారి వేధిస్తుండగా అమ్మగారింటికి వెళ్లింది. దీంతో అక్కడికి వెళ్లి భార్యతో ఘర్షణ పడగా వారించిన అత్తమామలపై కట్టెలు నరికే కత్తితో దాడి చేసి హతమార్చాడు. నిందితుడు అప్పటి నుంచి పరారీలో ఉన్నాడు. దుత్తలూరు మండలంలోని లక్ష్మీపురం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో బుధవారం అరెస్టు చేసినట్లు డీఎస్పీ వివరించారు. ఆయన వెంట పోలీసు అధికారులు పలువురు ఉన్నారు.

కోలాహలంగా ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

కలిగిరి, న్యూస్‌టుడే: కలిగిరమ్మ తిరునాళ్ల సందర్భంగా బుధవారం నిర్వహించిన ఎడ్ల బల ప్రదర్శన పోటీలు కోలాహలంగా జరిగాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 13 ఎడ్ల జతలు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. వీటిని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. విజేతలకు నగదు బహుమతులను అందజేశారు. కలిగిరి వీధుల్లో అమ్మవారి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు.

సాగు పత్రం.. అందనంత దూరం

ప్రభుత్వ సాయాన్ని కోల్పోతున్న కౌలు రైతులు

సీసీఆర్సీ కార్డు ఉంటేనే లబ్ధి

మర్రిపాడు (ఆత్మకూరు గ్రామీణం), పద్మావతి సెంటర్, న్యూస్‌టుడే: కౌలు రైతులను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోంది. పంట సాగుదారు హక్కు పత్రాలు(సీసీఆర్సీ) అందజేసి అన్నదాత సుఖీభవతోపాటు పలు ప్రయోజనాలను భూ యజమానులతో సమానంగా పొందే అవకాశం కల్పిస్తోంది. అధికారుల నిర్లక్ష్యం, అన్నదాతలకు అవగాహన లేకపోవడం, భూ యజమాన్య అంగీకారం తప్పనిసరి కావడం వంటి ఇతర కారణాలతో చాలా మంది కౌలు రైతులు వీటిని అందుకోలేకపోతున్నారు.

200 కార్డులు మాత్రమే జారీ

జిల్లాలో సుమారు అయిదు లక్షల సాగు విస్తీర్ణం ఉంది. లక్ష మందికిపైగా కౌలు రైతులు ఉంటారు. ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ, రుణాలు, పథకాలు, నష్ట పరిహారం, బీమాలు పొందాలంటే సీసీఆర్సీ తప్పనిసరి. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ రూ.6 వేలుతోపాటు రాష్ట్ర ప్రభుత్వం రూ.14 వేలు కలిపి మూడు విడతల్లో అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయనుంది. ఈ నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా 38 వేలు సీసీఆర్సీ కార్డులు జారీ చేయాలనే లక్ష్యాన్ని అధికారులు నిర్దేశించుకున్నారు. గత నెలలో ఈ ప్రక్రియ ప్రారంభమైనా ఇప్పటి వరకు 200 కార్డులు మాత్రమే ఇచ్చారు. గత ఏడాది రైతులకు ఇచ్చిన వాటిని రెన్యూవల్ మాత్రమే చేశారు. కొత్తవి ఇవ్వలేదు.

సహకరించని భూ యజమానులు

రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఖరీఫ్ ప్రారంభానికి ముందే రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి కౌలు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించాల్సి ఉన్నా అధికారులు చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. జిల్లాలో అధికశాతం రైతులు భూమిని కౌలుకే ఇచ్చేస్తున్నారు. మాటమీద నమ్మకంతోనే నగదు, కాలం, పంట ఉత్పత్తిలో భాగం ఇవ్వడం వంటి ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో భూయజమానులు అంగీకార పత్రం ఇస్తేనే సీసీఆర్సీ కార్డుకు అర్హులవుతారు. దీంతో వారు ఇబ్బందులొస్తాయనే అపోహతో సహకరించడం లేదని కౌలు రైతులు చెబుతున్నారు.

నష్టపోతున్నా.. గౌస్ బాష, రైతు, మర్రిపాడు

నాకు సొంత భూమిలేదు. మూడేళ్లగా ఇద్దరు రైతుల నుంచి అయిదెకరాల పొలం తీసుకుని సాగుచేస్తున్నాను. కౌలుకార్డు నేటికీ రాలేదు. రుణాలు, ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నాను.

సెప్టెంబర్‌కు పూర్తి చేస్తాం.. సత్యవాణి, జిల్లా వ్యవసాయాధికారిణి

రెవెన్యూ, వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కౌలురైతులకు సాగు హక్కు పత్రాలు అందజేస్తున్నాం. దీనిపై అన్ని ఆర్ఎస్‌కే పరిధిలోని రైతులకు అవగాహన కల్పించాం. సెప్టెంబర్ కల్లా లక్ష్యాన్ని పూర్తి చేస్తాం.

EENADU Classifieds

REAL ESTATE

FLAT FOR SALE

TO LET

COMMERCIAL

TO-LET 5000 Sft. G+2 Commercial Building Fathekhanpeta, Main Road, Nellore. Contact : 9849048316, 9299990603.

★ Wanted Female Tele-callers Educations Institute. Qualification. Any Degree Salary + Incentives. Contact: 91773 86631

JOBS

R.K. GRAND Guest Inn

నెల్లూరు 80080 01790

మీ చిన్నారులకు పుట్టినరోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి.

B&W : రూ. 600
Colour : రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

(c) eenadu

కావలి

•కావలి •ఉదయగిరి •కందుకూరు

ప్రజల హృదయాల్లో నిలిచిన రంగా: నిమ్మల

మంత్రులు, రఘురామకృష్ణరాజు, గొట్టిపాటి ఆధ్వర్యంలో రంగా విగ్రహం ఆవిష్కరించిన మంత్రులు

కావలి, న్యూస్‌టుడే: మూడున్నరేళ్ల ఎమ్మెల్యేగా చేసినా ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిన నాయకుడు వంగవీటి మోహన రంగా అని రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు. బుధవారం కావలిలో రంగా విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ పేదల అభివృద్ధికి పాటుపడి వారి మనసుల్లో నిలిచిపోయారన్నారు. జైలు నుంచే పోటీ చేసి ప్రజాప్రతినిధిగా ఎన్నికైన ఘనత ఆయనదేనని పురపాలక మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రంగా తనయుడు రాధాకృష్ణ, ఎమ్మెల్యే డి.వి.కృష్ణారెడ్డి, విగ్రహ ఏర్పాటు కమిటీ అధ్యక్షులు దేవరకొండ శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు అల శ్రీనివాసులు తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ మలిశెట్టి వెంకటేశ్వర్లు, మహిళా నాయకురాలు పద్మావతి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పలు అభివృద్ధి పనులను మంత్రులు పొంగూరు నారాయణ, నిమ్మల రామానాయుడు ప్రారంభించారు. రూ.20 లక్షలతో పూర్తి చేసిన పుల్లారెడ్డినగర్ పార్కును ప్రారంభించారు. మెప్మా మహిళల వస్తువుల ప్రదర్శనను తిలకించారు. పాఠిమంజిలోని పునఃప్రారంభించారు. ఇందిరమ్మ కాలనీలో సీసీ రోడ్లను ప్రారంభించారు.

బీఎమ్మార్ జన్మదిన వేడుకలు

వేడుకల్లో దేవరాల సుబ్రమణ్యం తదితరులు

కావలి, బిట్రగుంట, దగదర్తి, న్యూస్‌టుడే: రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్‌రావు జన్మదిన వేడుకల్ని కావలి, సర్వాయపాలెం, ఆనెముడుగులు, బోగోలు మండలంలోని ముంగమూరుతోటలలో ఉన్న ఆదరణ కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. కేకులు కోసి సంబరాలు చేశారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ దేవరాల సుబ్రహ్మణ్యం, పురపాలక మాజీ ఛైర్మన్ నగళ్ల శ్రీనివాసకిరణ్, గాదంశెట్టి వేణుగోపాల్, పాదర్తి నాగరాజు, గోళ్ల మురళి, ఖాదర్‌బాషా, టీసీ మాల్యాద్రి, రాజు, శేషయాదవ్, కావలి శ్రీనివాసులు, ఆనంద్, మదన్, బలరామయ్య పాల్గొన్నారు. దగదర్తి మండలంలోని కౌరుగుంటలో యువకులు రక్తదాన శిబిరం నిర్వహించారు.

తప్పులు లేని రికార్డులే లక్ష్యం

బిట్రగుంట, న్యూస్‌టుడే: బోగోలు మండలం కోవూరుపల్లిలో రీసర్వేపై బుధవారం గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దారు శ్రీనివాసులరెడ్డి డ్రాఫ్ట్ ల్యాండ్ రిజిస్టర్‌లోని వివరాలను రైతులకు వివరించారు. తప్పులు లేని రెవెన్యూ రికార్డుల రూపుదిద్దడమే రీసర్వే లక్ష్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపతహసీల్దారు భరత్, సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్‌వో తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM)
కావలి : 80080 51666, 91548 46698
కందుకూరు:70939 81624, ఉదయగిరి : 80085 73944

సమస్య: తుమ్మలపెంట రహదారి నిర్మాణ పనులు నాసిరకంగా జరుగుతున్నాయి.
– ఈకూరు గంగయ్య, తుమ్మలపెంట

సమాధానం: నిబంధనల ప్రకారం పనులు జరిగేలా చూస్తున్నాం. – గుండాల భరత్‌కుమార్‌రెడ్డి, ఏఈఈ, ర.భ శాఖ – న్యూస్‌టుడే, కావలి

? మా గ్రామంలోని ప్రధాన మార్గంలో వీధి దీపాలు వెలగడం లేదు.
– రమణారెడ్డి, శ్రీరంగరాజపురం

✓ సిబ్బందిని పంపి మరమ్మతులు చేయిస్తాం.
– రత్నజ్యోతి, ఎంపీడీవో
– న్యూస్‌టుడే, కందుకూరు గ్రామీణం

? పట్టణంలోని మళ్లా మసీదు వీధిలో కాలువలో పూడిక తీయక మురుగునీరు నిల్వ ఉంటుంది – ఎస్.కె.తెహరా, 8వ వార్డు

✓ పారిశుద్ధ్య సిబ్బందిని పంపి కాలువలు శుభ్రం చేయిస్తాం. – కె.అనూష, మున్సిపల్ కమిషనర్ –న్యూస్‌టుడే, కందుకూరు పట్టణం

? మా గ్రామంలోని బస్టాండ్ సెంటర్ నుంచి కృష్ణ మందిరం మీదుగా గ్రామ పంచాయతీ కార్యాలయానికి వెళ్లే రహదారిపై మురుగునీరు చేరడంతో నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నాం. –వేణుగోపాల్, జలదంకి

? మురుగునీరు చేరకుండా చర్యలు తీసుకుంటాం. – వెంకట కృష్ణ, పంచాయతీ కార్యదర్శి, జలదంకి – న్యూస్‌టుడే, జలదంకి

పైపులైన్ల ధ్వంసం.. నీటి సరఫరాకు ఆటంకం

న్యూస్‌టుడే, కావలి

కేబుల్ కోసం తవ్విన గుంత

పట్టణంలో ప్రైవేటు సంస్థల కేబుళ్ల ఏర్పాటుతో పైపులు దెబ్బతింటున్నాయి. దీంతో నీటి సరఫరాకు ఆటంకం కలుగుతుంది. జెండీవల తుఫాన్ నగర్, బైరాగుల కాలనీ తదితర ప్రాంతాల్లో ఓ ప్రైవేట్ సంస్థ తరఫున అంతర్జాల సంస్థ కేబుళ్ల అమరిక చేపట్టారు. సదరు సంస్థ ప్రతినిధులు పురపాలక సంఘం నుంచి అనుమతులు తీసుకోకుండా ఈ పనులు చేస్తున్నారు. మున్సిపల్ సిబ్బందికి తెలియజేస్తే, ఎక్కడెక్కడ పైపులున్నాయనే వివరాలు తెలియజేస్తారు. అలాగాకుండా వారిష్ట ప్రకారం తవ్వి కేబుళ్లు వేస్తుండడంతో పైపులు దెబ్బతింటున్నాయి. ఆయా ప్రాంతాల్లో రోజుల తరబడి నీటి సరఫరాకు అంతరాయం వాటిల్లుతోంది. చేసేది లేక పురపాలక సిబ్బందే వాటిని పక్కాగా వేసి పైపులైన్లు చక్కదిద్దుతున్నారు.

నీరు మోసుకొస్తున్నాం: బొట్లగుంట నాయుడు, తుఫాన్‌నగర్, కావలి

కొద్ది రోజులుగా నీటికి ఇబ్బందులు పడుతున్నాం. నీరు పడినప్పుడల్లా రోడ్డంతా రొచ్చుగా మారుతుంది. అధికారులకు చాలాసార్లు తెలియజేశాం. ఇప్పటికైనా సమస్య పరిష్కరించాలి.

నీరు ఎర్రగా వస్తోంది: వెంకటాద్రి, బైరాగుల కాలనీ

మా ప్రాంతంలో నీరు సరిగా రావడం లేదు. వచ్చినా ఎర్రగా ఉంటున్నాయి. ఆ కేబుళ్ల అమరిక జరిగిన పుటి నుంచే మాకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి.

పోలీసులకు ఫిర్యాదు చేస్తాం
– సాయిరాం, డీఈ, కావలి పురపాలక సంఘం

అనుమతులు లేకుండానే రోడ్లను తవ్వేశారు. వారి వల్ల మా పైపులైన్లు ధ్వంసమయ్యాయి. ప్రస్తుతం ఆ పనులు నిలిపివేయించాం. వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తాం.

చినుకు రాలి.. మడుగుగా మారి

పట్టణంలో గండిపాలేనికి వెళ్లే మార్గం వర్షం కురిస్తే మడుగును తలపిస్తుంది. నీరంతా రోడ్డుపై నిలిచిపోయి పాదచారులు, వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. ఈప్రాంతంలోనే మండల పరిషత్తు, పంచాయతీ రాజ్ తదితం ప్రభుత్వ శాఖల కార్యాలయాలున్నాయి. అధికారులు అటువైపుగా రాకపోకలు సాగిస్తున్నా పట్టించుకోవటం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. – న్యూస్‌టుడే, ఉదయగిరి

ప్రధాన మార్గం.. మురుగుమయం

గ్రామంలోని ప్రధాన రహదారిలో ఆర్టీసీ బస్టాండు నుంచి బంగ్లా కూడలి వరకు మురుగుకాలువలు అసంపూర్తిగా ఉన్నాయి. కొన్ని చోట్ల నిర్మించలేదు. దీంతో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. జనం ఇందులోనే రాకపోకలు సాగించాల్సి వస్తోంది. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి రామారావును వివరణ కోరగా పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని వివరించారు. -వింజమూరు, న్యూస్‌టుడే

నీటి తొట్టెలు కావివి..

ఇది మురుగు నీరు నిల్వ చేసేందుకు ఇళ్ల ముందు నిర్మించిన తొట్టె. పట్టణంలోని ముసునూరు పశ్చిమ ప్రాంతంలో కాలువలు లేకపోవడంతో ఇళ్ల ముందు ఇలా ఏర్పాటుచేసుకున్నారు. ఇవి నిండగానే మోటార్లతో అవతల ప్రాంతానికి తోడేస్తున్నారు. ఈ విషయమై ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి స్పందిస్తూ త్వరలో రహదారులు, మురుగునీటి కాలువల నిర్మాణానికి కృషి చేస్తామని వివరించారు. –న్యూస్‌టుడే, కావలి

ఉదయగిరిలో భారీ వర్షం

మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో బుధవారం సాయంత్రం ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. పట్టణంలోని వీధుల్లో నీరు ప్రవహించింది. రోడ్లు, మురుగునీటి కాలువలతోపాటు పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో నిలిచిపోయింది. మురుగు కాలువల్లో చెత్తాచెదారం రోడ్లపైకి చేరడంతో ప్రజలు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులుపడ్డారు. – న్యూస్‌టుడే, ఉదయగిరి

వాలిన స్తంభం. నిర్లక్ష్యానికి చిహ్నం

మండలంలోని కేపీఎన్ రహదారి పక్కన విద్యుత్తు ఉపకేంద్రం నుంచి నలదలపూరు రోడ్డు వెంబడి 32కేవీ విద్యుత్తు లైను స్తంభాలు ఒకవైపు వాలిపోయాయి. గాలి వీస్తే కూలిపోయేలా ఉన్నాయి. సమీపంలో ఇళ్లు కూడా ఉన్నాయి. దీనిపై విద్యుత్తు ఏఈ మధుబాబు మాట్లాడుతూ పరిశీలించి చర్యలు తీసుకుంటామని వివరించారు. – న్యూస్‌టుడే, వలేటివారిపాలెం

పథకాల సద్వినియోగంతో పశుపోషణ లాభదాయకం

వలేటివారిపాలెం, న్యూస్‌టుడే: రాయితీ పథకాల సద్వినియోగంతో పశుపోషణ లాభదాయకమవుతుందని ఆ శాఖ ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు చెన్నకేశవులు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని శామీరపాలెం, కొండసముద్రంలో పశువైద్యులు ఎస్.సుధాకర్ ఆధ్వర్యంలో నట్టల నివారణ మందు కార్యక్రమాన్ని నిర్వహించారు. శామీరపాలెం సర్పంచి రాజా రమేష్, నాయకులు ఘట్టమనేని సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

అదుపుతప్పి పడిపోయిన ట్రాక్టర్.. ఒకరి మృతి

అల్లూరు, న్యూస్‌టుడే : ట్రాక్టర్ పడిపోయిన ప్రమాదంలో ఒకరు మృతి చెందిన వైనమిది. అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని నార్తుమోపూరు ఏటీఎస్ ఛానల్ వద్ద ఈ ఘటన జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. నార్తుమోపూరు గ్రామానికి చెందిన ట్రాక్టర్ మంగళవారం పొలాల్లోకి వెళుతుండగా ఏటీఎస్ ఛానల్ వద్ద అదుపుతప్పి పడిపోయింది. ఈసమయంలో రోడ్డు పక్కనే ఉన్న అదే గ్రామానికి చెందిన కొట్టు వెంకటరమణ(42)కు తగలడంతో గాయపడ్డారు. అతన్ని నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఎస్సై శ్రీనివాసులు రెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆరోగ్య కేంద్రంలో చోరీ

ఆరోగ్య మందిర్‌లో విచారిస్తున్న పోలీసులు

వింజమూరు, న్యూస్‌టుడే : గ్రామంలోని అయిదో సచివాలయం పరిధిలోని ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య మందిర్‌లో దొంగలు కంప్యూటర్, కుర్చీలు, బల్ల చోరీ చేశారు. ఈ విషయమై చాకలకొండ పీహెచ్‌సీ వైద్యులు మురళీధర్ మాట్లాడుతూ సుమారు రూ.65 వేల విలువైన వస్తువులు దొంగలు అపహరించారన్నారు. ఈ కేంద్రం సీహెచ్‌ఓ విజయలక్ష్మి శనివారం సాయంత్రం తాళాలు వేసి వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చి చూడగా తాళాలు పగులకొట్టి మరో తాళం వేసి ఉంది. ఉన్నతాధికారులకు తెలిపి బుధవారం పోలీసుల సమక్షంలో తాళం పగలగొట్టి పరిశీలించగా వస్తువులు దొంగిలించినట్లు తెలిసింది. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేయగా వచ్చి పరిశీలించారు.

అమ్మవారి ఆలయంలో..

కొండాపురం: మండలంలోని రామానుజపురం పోలేరమ్మ ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. దుండగులు హుండీ పగలగొట్టి చోరీ చేసినట్లు బుధవారం ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ద్విచక్ర వాహనం, కారు ఢీ.. ఇద్దరికి గాయాలు

గుడ్లూరు, న్యూస్‌టుడే: గ్రామంలోని ఉప్పుటేరు వద్ద కందుకూరు రహదారిలో ద్విచక్ర వాహనం కారును ఢీకొన్న ప్రమాదంలో లోకేశ్, కృపారావుకు గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. కొండముడుసుపాలేనికి చెందిన సురేశ్ కావలిలో కారు కొనుగోలు చేసి సొంతూరుకు వస్తుండగా ఉప్పుటేరు వద్ద ఎదురుగా ద్విచక్రవాహనంపై వస్తున్న వారు ఢీకొట్టారు. వీరిని 108 వాహనంలో కందుకూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారు మాచవరం కొండ వద్ద ఉన్న ఎస్టీ కాలనీకి చెందిన వారని తెలిపారు.

సున్నపుబట్టీ ప్రాంతంలో..

దగదర్తి : మండలంలోని సున్నపుబట్టి సమీపంలో బుధవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరు యాచకులు గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. జాతీయ రహదారిపై నడిచి వెళుతుండగా గుర్తు తెలియని వాహనాలు వారిని ఢీకొన్నాయి. హైవే మొబైల్ సిబ్బంది వారికి ప్రాథమిక చికిత్స చేసి నెల్లూరులోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కారు ఢీకొని..

ఉదయగిరి : పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద గుర్తుతెలియని కారు ఢీకొని మోటారు బైక్‌పై వెళుతున్న వ్యక్తికి గాయాలయ్యాయి. కృష్ణంపల్లి గ్రామానికి చెందిన కంభాల సుబ్బారెడ్డి ఉదయగిరి కొటాలపల్లి సొసైటీ కార్యాలయంలో క్లర్క్‌గా చేస్తున్నారు. బుధవారం విధులు ముగించుకొని బైక్‌పై స్వగ్రామానికి వస్తుండగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద వెనుక వైపు నుంచి వచ్చిన కారు ఢీకొని వెళ్లిపోయింది. స్థానికుల సమాచారంతో 108 వాహన సిబ్బంది అతన్ని ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చెర్లోపల్లిలో..

వలేటివారిపాలెం: కందుకూరు నుంచి పోకూరు వైపు మోపెడ్‌పై వెళుతుండగా చెర్లోపల్లె దగ్గర జాతీయ రహదారిపై కారును ఢీకొన్నారు. ఈ ప్రమాదంలో గాయాలైన మోపెడ్ వాహన చోదకుడు బాషాకు కారు డ్రైవరు సపర్యలు చేశారు.

బస్సులో నుంచి పడి..

లింగసముద్రం : బస్సులో నుంచి జారి పడి ఒకరు గాయపడిన ఘటన బుధవారం వాకమళ్లవారిపాలెంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన ఎం.కృష్ణయ్య కందుకూరు నుంచి మొగిలిచర్ల బస్సులో ఇంటికి వస్తున్నాడు. అతను దిగే స్టేజి రావడంతో సీట్లో నుంచి లేవగా డ్రైవరు బస్సు నిలుపుదల చేయడంతో అదుపు తప్పి రోడ్డుపై పడడంతో గాయాలయ్యాయి. బంధువులు ఆసుపత్రికి తరలించారు.

వాడవాడలా సుపరిపాలనలో తొలి అడుగు

కరపత్రాలను పంపిణీచేసి ప్రజలకు పథకాలను వివరిస్తున్న చెంచలబాబుయాదవ్, నాయకులు

న్యూస్‌టుడే బృందం, కావలి, కందుకూరు, ఉదయగిరి : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాది పూర్తికావడంతో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమాన్ని కావలి, కందుకూరు, ఉదయగిరి నియోజకవర్గాల్లో బుధవారం పార్టీ శ్రేణులు నిర్వహించాయి. వీటిలో ప్రభుత్వం చేస్తున్న పథకాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కావలి బుధవారం ముసునూరు 15వ వార్డులో ఈ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే డీవీ కృష్ణారెడ్డి ప్రారంభించారు.


కరపత్రాలు అందజేస్తున్న తెదేపా పట్టణ నాయకులు

రోడ్లు అధ్వానం.. రాకపోకలకు కష్టం

ఇది మండలంలోని ఇస్కదామెర్ల నుంచి పొట్టిపల్లి గ్రామానికి వెళ్లే రోడ్డు. గత వైకాపా హయాంలో అభివృద్ధి చేసేందుకు పనులు చేట్టారు. కల్వర్టుల ఏర్పాటు మాత్రమే జరిగింది. మిగిలిన పనులు చేయలేదు. దీంతో గుంతలు పడిన రోడ్డు మీదనే రాకపోకలు సాగిస్తున్నారు.

న్యూస్‌టుడే, కొండాపురం, ఉదయగిరి

గ్రామీణ ప్రాంతాల్లో రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. కొండాపురం మండలంలో 19 పంచాయతీలు 52 మజరా గ్రామాలున్నాయి. మారుమూల మండలం కావడంతో అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. సౌకర్యాల కల్పనలో వివక్ష చూపుతున్నారు. మండలంలోనే మేజర్ పంచాయతీ అయిన సాయిపేట నుంచి ఇస్కపాలెం, మక్కెనవారిపాలెం, కొమ్ముపాలెం, వెల్లటూరివారిపాలెం గ్రామాలకు వెళ్లే రోడ్డు దారుణంగా తయారైంది. కంకర లేచిపోయింది. మార్జిన్‌లలో గుంతలు పడి ప్రజలకు నరకం కనిపిస్తోంది. నేకునాంపేట- కొండాపురం ర.భ రోడ్డు నుంచి తూర్పుపాలెం రోడ్డు నిర్మాణానికి కంకర తోలి వదిలేశారు. ఆదిమూర్తిపురం నుంచి తూర్పుఎర్రబల్లి, ఇస్కదామెర్ల వరకు కంకర పరిచి మిగతా పనులు చేయలేదు. దీంతో ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురైన సంఘటనలు ఉన్నాయి. తూర్పుఎర్రబల్లి నుంచి పొట్టిపల్లి గ్రావెల్ రోడ్డు అధ్వానంగా మారింది. వీటిపై వాహనాలు పోవాలంటే నానా యాతన పడుతున్నారు. ఇవన్నీ వైకాపా హయాంలో బిల్లులు సక్రమంగా రాక నిలిపోయిన రోడ్లని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు చర్యలు తీసుకుని పనులు పూర్తిచేసేలా చూడాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు తెలియజేశాం
ఫయాజ్, ఏఈ, ర.భ

కొన్ని రోడ్లు ర.భ శాఖకు చెందినవి కాదు. బిల్లులు సకాలంలో రాకపోవడంతో గుత్తేదారులు నిలిపివేశారు. వారితో మాట్లాడుతున్నాం. త్వరలో ప్రారంభించి పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటాం.

వినియోగంలోకి చేతిపంపులు

కొండాపురం, న్యూస్‌టుడే: మండలంలోని ఆదిమూర్తిపురంలో మరమ్మతులకు గురైన రెండు చేతిపంపులను బాగుచేసి బుధవారం వాడుకలోకి తెచ్చారు. వీటి విషయమై అయిదేళ్లుగా మొరపెట్టుకున్నా పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామస్థులు తెలియజేశారు. ఈ సమస్యను తెదేపా నాయకుడు జాగర్లమూడి శ్రీనివాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఆయన ఆదేశాలతో సిబ్బంది మరమ్మతులు చేసి వినియోగంలోకి తీసుకొచ్చారు.

రేపటి నుంచి కామ్యహోమ సప్తాహ మహోత్సవాలు

నెల్లూరు(జడ్పీ): నెల్లూరులో ఈనెల 4 నుంచి 10వ తేదీ వరకు కామ్యహోమ సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కంచి పీఠానికి చెందిన నెల్లూరు శంకర మఠం నిర్వాహకులు ప్రకటించారు. మూలాపేట కంచి కామాక్షితాయి, చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో మేనేజరు నందకిషోర్, ఈవో ఉషాకుమారి విలేకరులతో మాట్లాడారు.

లక్ష్యాల వైపు అడుగులు పడాలి

బిట్రగుంట, న్యూస్‌టుడే: లక్ష్యాలు ఎంపిక చేసుకొని బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని కావలి డివిజన్ ఉప విద్యాశాఖాధికారి హరిప్రసాద్ సూచించారు. బుధవారం బోగోలు మండలం ముంగమూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఎంఈవో నరసింహారావుతో కలిసి తనిఖీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు ధరణికోట విజయ్ ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు.

సూచనలిస్తున్న కావలి డివిజన్ ఉపవిద్యాశాఖాధికారి హరిబాబు

4న భూసేకరణపై కరేడులో గ్రామసభ

గుడ్లూరు ఉలవపాడు, న్యూస్‌టుడే: ఈ నెల నాలుగో తేదీ మధ్యాహ్నం మండలంలోని కరేడులో భూసేకరణపై గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు శ్రీనివాసులు బుధవారం తెలిపారు. పరిశ్రమల స్థాపన కోసం భూములు సేకరించనున్నామన్నారు. కరేడు ప్రాంత రైతులు ఇందులో పాల్గొని అభిప్రాయాలు తెలియజేయాలని సూచించారు.

మండల సభ వాయిదా

వింజమూరు, న్యూస్‌టుడే: కోరం లేకపోవడంతో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. బుధవారం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయగా ఒక్క సభ్యుడు వచ్చారు. దీంతో వాయిదా వేసినట్లు ఎంపీడీవో శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

ఆంజనేయ స్వామి విగ్రహం నిర్మాణానికి విరాళం

గుడ్లూరు, న్యూస్‌టుడే: మండలంలోని చెమిడిదిపాడు బస్టాండు వద్ద ఆంజనేయస్వామి విగ్రహం నిర్మాణానికి బుధవారం సింగరాయకొండకు చెందిన జ్యేష్ఠ నరసింహం కుటుంబసభ్యులు రూ.10116 విరాళంగా అందజేశారని నిర్వాహకులు హనుమంతరావు తెలిపారు. విగ్రహ నిర్మాణం వేగంగా జరుగుతోందని ఆయన వివరించారు.

నేడు ఎంపీ, ఎమ్మెల్యేల రాక

ఉదయగిరి, న్యూస్‌టుడే : సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని దిలావర్‌భాయ్ వీధిలో గురువారం నిర్వహించే కార్యక్రమానికి ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ముఖ్య అతిథులుగా హాజరవుతున్నట్లు తెదేపా మండల కన్వీనరు చింతనబోయిన బయ్యన్న బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఎరువుల యాజమాన్యంపై అవగాహన అవసరం

ఉదయగిరి, న్యూస్‌టుడే : రైతులు ఎరువుల యాజమాన్యంపై అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయాధికారి విజయభాస్కర్ పేర్కొన్నారు. మండలంలోని శకునాలపల్లి, కృష్ణంపల్లి రైతు సేవా కేంద్రాల పరిధిలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎరువుల యాజమాన్యం, కలుపు నివారణ చర్యలు, విత్తనశుద్ధి, భూసార పరీక్ష ఫలితాల ప్రకారం సిఫార్సు చేసిన ఎరువుల వాడకం అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం సాగులో ఉన్న పంటలను పరిశీలించి సలహాలిచ్చారు. కార్యక్రమంలో ఏఈవోలు రాజశేఖర్‌రెడ్డి, వినోద్, వీఏఏలు చల్లా పూజిత, కోనయ్య తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగు

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో చెన్నారెడ్డి

సీతారామపురం : మొక్కజొన్నలో కాండం తొలుచు పురుగు నివారణకు రైతులు చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి చెన్నారెడ్డి సూచించారు. మండలంలోని సింగారెడ్డిపల్లిలో పొలంపిలుస్తోంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా మొక్కజొన్న పంటను పరిశీలించారు. కాండం తొలుచు పురుగు ఉన్నట్లు గుర్తించారు. నివారణకు లీటరు నీటికి 0.5గ్రాముల ఇమామెక్టిన్ బెంజోయేట్ పిచికారీ చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు సుధీర్, సాంబశివయ్య, వీఏఏ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాల పరుగులు.. రహదారులకు పగుళ్లు

న్యూస్‌టుడే, దుత్తలూరు, వరికుంటపాడు

పరిమితికి మించి లోడుతో వెళుతున్న లారీలతో గ్రామీణ, జాతీయ రహదారులు ఛిద్రమవుతున్నాయి. సంబంధిత శాఖల అధికారులు మామూళ్ల మత్తులో పడి పట్టీపట్టనట్లుగా వ్యవహరిస్తుండడంతో రోజురోజుకీ రోడ్లు అధ్వానంగా తయారవుతున్నాయి. మితిమీరిన వేగంగా వెళుతుండడంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

ఉదయగిరి నియోజకవర్గంలోని గ్రామీణ, జాతీయ రహదారులపై నెల్లూరుతోపాటు ఇతర ప్రాంతాల నుంచి 30 నుంచి 40 వరకు ఇసుక టిప్పర్లు, లారీలు రాకపోకలు సాగిస్తున్నాయి. వాస్తవంగా గ్రామీణ రహదారుల సామర్థ్యం 20 టన్నులు కాగా 40 నుంచి 50 టన్నుల లోడుతో వెళుతున్నాయి. పది చక్రాల టిప్పరు లోడు 15 నుంచి 20 టన్నులు కాగా 35 టన్నుల వరకు రవాణా చేస్తున్నాయి. పట్టా కప్పకుండా పోతున్నందున గాలికి ఇసుక లేచి వెనుక వస్తున్న వాహనదారులపై పడుతుండడంతో ప్రమాదాలకు గురవుతున్నారు. జిల్లాలో మర్రిపాడు నుంచి వరికుంటపాడు వరకు 60 కి.మీ మేర 565వ జాతీయ రహదారి వెళుతోంది. దీనిపై అధిక లోడుతో వెళ్లే లారీలతో రహదారి పగుళ్లిచ్చి కుంగిపోతోంది. గ్రామీణప్రాంతాల్లోని రహదారులపై నిర్మించిన వంతెనలు సైతం ధ్వంసమవుతున్నాయి. వీటిపై రాకపోకలు సాగించేందుకు ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు.

దుత్తలూరు కూడలిలో దెబ్బతిన్న రోడ్డు. (అంతరచిత్రంలో) అధిక లోడుతో వెళుతున్న ఇసుక లారీ

మామూళ్ల మత్తులో...

నిబంధనలు అతిక్రమించిన వాహనాలను రవాణా, పోలీసుల శాఖ అధికారులు నియంత్రించాల్సి ఉంది. వారు పట్టించుకుంటున్న లాఖలాల్లేవు. లారీలను ఆపి వారిచ్చే మామూళ్లు తీసుకుని వదిలేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇసుక పేరుకుపోవడంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాలకు గురవుతున్నారు.

చర్యలు తీసుకుంటాం: సుధాకర్, కావలి ఆర్టీవో

అనుమతికి మించి అధిక లోడుతో వెళుతున్న వాహనాలపై దాడులు చేసి చర్యలు తీసుకుంటాం. క్షేత్రస్థాయిలో సిబ్బందిని కూడా అప్రమత్తం చేసి వాహనాలను నియంత్రిస్తాం.

బలవంతపు భూసేకరణ ఆపాలి: బుర్రా

కందుకూరు పట్టణం, న్యూస్‌టుడే: కరేడు ప్రాంతంలోని వ్యవసాయ భూముల్లో ఇండోసోల్ కంపెనీకి 8500 ఎకరాలు సేకరించాలని ప్రభుత్వం చూస్తోందని, దీనిని తక్షణమే ఆపాలని నియోజకవర్గ వైకాపా ఇన్‌ఛార్జి బుర్రా మధుసూదన్ కోరారు. పట్టణంలోని వైకాపా కార్యాలయంలో బుధవారం కరేడు ప్రాంత రైతులతో కలసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పచ్చని పొలాల్లో వారి అనుమతి లేకుండా భూసేకరణకు పాల్పడడం అన్యాయమన్నారు. ప్రశ్నించిన 39 మందిపై కేసులు పెట్టడం దుర్మార్గమని, వెంటనే కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సుందరరామిరెడ్డి, చేవూరి శ్రీనివాసులు, పోకూరి వినయ్, వెంకటరమణయ్య, చెంచయ్య, వైకాపా నాయకులు చంద్రమౌళి, రాజా, గంగిరెడ్డి, రాజేష్, ముప్పవరపు కిషోర్ పాల్గొన్నారు.

(c) eenadu

కోవూరు

• కోవూరు • సర్వేపల్లి • ఆత్మకూరు

అనసూయనగర్ ప్రత్యేక పంచాయతీకి ఏకగ్రీవ తీర్మానం

సంగం, న్యూస్‌టుడే: సిద్దీపురం పంచాయతీ అనుబంధమైన అనసూయనగర్‌ను ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ బుధవారం ఏకగ్రీవంగా తీర్మానించారు. సర్పంచి బండ్ల ప్రసన్న అధ్యక్షతన జరిగిన సమావేశంలో పాలకవర్గం ఈమేరకు ఆమోదించింది. 1132 మంది జనాభా, 850 మంది ఓటర్లు ఉన్నారు. జిల్లా పంచాయతీ అధికారికి తీర్మానం అందిస్తామని కార్యదర్శి శ్రీనివాసులురెడ్డి తెలిపారు.

ఏఎస్‌పేటలో పీర్ల ప్రతిష్ఠ

అనుమసముద్రంపేట, న్యూస్‌టుడే: ఏఎస్‌పేటలోని తూర్పు వీధిలోని పీర్లచావడిలో మంగళవారం రాత్రి పీర్ల ప్రతిష్ఠాపన కార్యక్రమం జరిగింది. మత పెద్దల ఆధ్వర్యంలో అలంకరించిన పీర్లను ప్రత్యేక పతనాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి చావలిలో ప్రతిష్ఠించారు. అనంతరం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తూర్పువీధిలోని ముస్లిం సోదరులు హాజరయ్యారు.

ఘనంగా గ్రామోత్సవం

రాపూరు, న్యూస్‌టుడే: రాపూరు సమీపంలోని మద్దెల మడుగు అయ్యప్పస్వామి ఆలయ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం రాత్రి నుంచి బుధవారం తెల్లవారు జాము వరకు అయ్యప్పస్వామి గ్రామోత్సవాన్ని గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మేమున్నాం.. మీకు తోడుగా!

(10 AM to 1 PM) కోవూరు : 80085 73987, సర్వేపల్లి : 80085 73980, ఆత్మకూరు: 8008573949

సమస్య : సంగం మండలం వీర్లగుడిపాడులో సౌరశక్తి ఆధారంగా పనిచేసే తాగునీటి పథకం పనిచేయడం లేదు. – **సుధాకర్‌నాయుడు**

సమాధానం : ఆర్‌డబ్ల్యూఎస్ అధికారితో చర్చించి చర్యలు చేపడతాం. – **షాలెట్, ఎంపీడీవో**

? పొదలకూరు రూరల్ పరిధిలోని సీహెచ్‌సీ వద్ద సమీపంలోని దుకాణాదారులు వ్యర్థాలు వేయంతో దుర్వాసన వస్తోంది. – **నవదీప్**

✓ పరిశీలించి చర్యలు తీసుకుంటాం.
– **యశ్వంత్ సింగ్, పంచాయతీ కార్యదర్శి**

? మర్రిపాడు మండలంలోని పెగళ్లపాడు చెరువు తూము దెబ్బతింది. – **తిరుపాలు, స్థానికుడు**

✓ పరిశీలించి తూము బాగుకు ప్రతిపాదనలు పంపుతాం. – **రాజేశ్వరరావు, ఇరిగేషన్ ఏఈ**

? మర్రిపాడు మండలం, కేతిగుంట సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్తు సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుంది. – **వెంకటేష్, స్థానికుడు**

✓ విద్యుత్తు లైన్లు బాగు చేసి అంతరాయం లేకుండా చూస్తాం. – **హరికృష్ణ, విద్యుత్తు శాఖ ఏఈ**

? పొదలకూరు పట్టణంలోని నారాయణ స్కూలు వీధి ప్రాంతంలో మంచినీరు దుర్వాసన వస్తోంది. మంచినీటి పైపులైను లీకైనట్లుగా ఉంది. – **రమణమ్మ, స్థానికురాలు**

✓ పరిశీలించి వెంటనే చర్యలు తీసుకుంటాం.
– **యశ్వంత్ సింగ్, కార్యదర్శి**

? మండలంలోని పడుగుపాడులోని చంద్రమౌళినగర్‌లో మురుగునీటి కాలువలను శుభ్రం చేయడం లేదు. – **వెంకయ్య, చంద్రమౌళినగర్.**

? మండలంలోని ఇనమడుగులోని జమ్మిపాళెంలో వ్యర్థాలు పేరుకునిపోవడంతో దుర్వాసన భరించలేకున్నాం. – **ప్రభాకర్, జమ్మిపాళెం**

✓ వెంటనే శుభ్రం చేయిస్తాను.
– **శ్రీహరిరెడ్డి, ఎంపీడీవో, కోవూరు**

? చేజర్ల మండలం పాడేరు-గొల్లపల్లి మధ్య దారి అధ్వానంగా మారి రాకపోకలకు ఇబ్బందిగా ఉంటోంది. గొలపల్లి గ్రామస్థులు

✓ చర్యలు తీసుకుంటాం. – **హరీశ్, ఏఈ**

? కోవూరులోని కొత్తకాలనీలో మురుగునీటి కాలువలు నిర్మించండి. – **రమేష్‌బాబు**

? కోవూరు మండలం పోతిరెడ్డిపాళెంలోని తిప్పకాలనీలో చేతిపంపులు మరమ్మతులకు గురయ్యాయి. – **కామేశ్వరమ్మ, స్థానికురాలు**

✓ వెంటనే పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం.
– **శ్రీహరిరెడ్డి, ఎంపీడీవో**

వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి

రాపూరు, న్యూస్‌టుడే: కండలేరు అంబేడ్కర్ బాలికల గురుకులాన్ని బుధవారం వేపినాపి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యులు, సిబ్బంది సందర్శించారు. ఈ మేరకు వంటగది, మరుగుదొడ్లను పరిశీలించారు. పూర్తి స్థాయి వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం బాలికలకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసి.. ఆహారపు అలవాట్లపై అవగాహన కల్పించారు. ప్రిన్సిపల్ కె.భారతి తదితరులు ఉన్నారు.

గురుకులం వసతులపై చర్చిస్తున్న వైద్యాధికారి

చెట్లు తొలగింపు

వెంకటాచలం, న్యూస్‌టుడే: వెంకటాచలం మండలం గొలగమూడి రోడ్డు వద్ద పరిశ్రమల కేంద్రంలోని పైలాన్ చుట్టూ ఉన్న చెట్లను తొలగించారు.

చెట్లు తొలగింపుతో కనిపిస్తున్న పైలాన్

రహదారి పక్కన ఏర్పాటు చేసిన దీని చుట్టూ ముళ్ల చెట్లు పెరగడంతో గత నెల 27న 'ఈనాడు'లో 'చెట్టంత నిర్లక్ష్యం' శీర్షికతో వార్త ప్రచురితమైంది. స్పందించిన పరిశ్రమల శాఖ అధికారులు మొక్కలను తొలగించి ఆప్రాంతం మొత్తం శుభ్రం చేశారు.

● **పొదలకూరు రూరల్, న్యూస్‌టుడే :** పొదలకూరులోని నరసారెడ్డికాలనీ మూడో వీధిలో నివాసాల వద్ద రోడ్డుపై ఉన్న పూడిక కుప్పలను బుధవారం తొలగించారు. గత నెల 30న 'ఈనాడు'లో 'పూడిక కుప్పలు తొలగించక తిప్పలు' శీర్షికతో కథనం ప్రచురితమైంది. ఎంపీడీవో నరసింహరావు సిబ్బందికి చెప్పి శుభ్రం చేయించారు.

రుచిగా.. శుచిగా

సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం

ఏఎస్‌పేట జడ్పీ ఉన్నత పాఠశాలలో భోజనం చేస్తున్న విద్యార్థులు

న్యూస్‌టుడే, అనుమసముద్రంపేట

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్యావ్యవస్థల్లో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో విద్యార్థులకు ఈ ఏడాది ప్రారంభం రోజు నుంచే డొక్కాసీతమ్మ మధ్యాహ్నభోజన పథకం ద్వారా సన్నబియ్యంతో రుచిగా, శుచిగా అన్నం వడ్డిస్తున్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో ఆరు మండలాలు ఉన్నాయి. ప్రస్తుతం విద్యార్థులు సంఖ్య పెరుగుతోంది. ఈ సందర్భంగా ఏఎస్‌పేటలోని జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు మధ్యాహ్న భోజనంపై తమ అభిప్రాయాలను తెలిపారు.

చాలా బాగుంది

– వెంకటకృష్ణ, 9వ తరగతి

గతంలో దొడ్డుబియ్యంతో అన్నం పెట్టేవారు, ముద్దగా ఉండటంతో సరిగా తినలేకపోయేవారం. ఇప్పుడు సన్న బియ్యంతో భోజనం పెడుతుండటంతో ఎంతో ఇష్టంగా తింటున్నాం.

కడుపునిండా తింటున్నాం

– వెన్నెల, ప్రణతి, 7వ తరగతి

గతంలో భోజనం తింటున్నా తృప్తి ఉండేది కాదు. ఇప్పుడు మేలు రకం బియ్యంతో వండి పెడుతున్నారు. దాంతో కడుపునిండా తింటున్నాం. ఇంట్లో భోజనం చేసిన అనుభూతి పొందుతున్నాం.

నియోజకవర్గం వారీగా వివరాలు

మండలం	మొత్తం విద్యార్థులు	హాజరైంది (బుధవారం)	భోజనం చేసినది
1. అనంతసాగరం	3212	2857	2767
2. ఆత్మకూరు	4800	3303	3303
3. మర్రిపాడు	3495	3120	3056
4 చేజర్ల	3200	3125	3125
5. సంగం	3885	3383	3283
6. ఏఎస్‌పేట	2233	2101	2086

బాక్సు తీసుకురావడం లేదు

– అశ్విని, ఏడో తరగతి

సన్నబియ్యంతో భోజనం, రోజుకో రకం కూర, ఉడికించిన కోడిగుడ్డు పెడుతున్నారు. ఎంతో రుచిగా ఉండటంతో ఇంటి వద్ద నుంచి బాక్సు తెచ్చుకోవడం లేదు.

హాజరుశాతం పెరుగుతుంది

ఏఎస్‌పేట, సాయిప్రసాద్, ఎంఈవో2

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు రుచికరమైన మధ్యాహ్న భోజనం వసతి ఉంది. దీని వల్ల హాజరుశాతం పెరిగే అవకాశం ఉంటుంది. ప్రభుత్వ అందిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి.

మలుపులు.. వాహనదారులకు అవస్థలు

చెరువు కట్ట వద్ద ప్రమాదకరంగా మలుపు

అనంతసాగరం, న్యూస్‌టుడే: ఆత్మకూరు- సోమశిల, అనంతసాగరం- గంగుంట ప్రధాన రహదారుల్లోని మూల మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గాల్లో రాకపోకలు చేయాలంటే వాహనదారులు అవస్థలు పడుతున్నారు. అనంతసాగరం చెరువు కట్ట రహదారి సుమారు 500 మీటర్ల దూరం ఉంటుంది. అక్కడ మలుపులు ఎక్కువగా ఉండటంతో పాటు హెచ్చరిక బోర్డులను ముళ్ల చెట్లు కమ్మేశాయి. దీంతో వేగంగా వచ్చే వాహనదారులు స్పీడ్‌ను నియంత్రించలేక ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో ఒకవైపు బారికేడ్లు లేవు. ఏ మాత్రం అదుపుతప్పినా సుమారు 100 అడుగుల కిందకు పడిపోయే అవకాశముంది. గంగుంట ప్రధాన మార్గంలో మూలమలుపులతోపాటు ముళ్లచెట్లు రోడ్డుపైకి వచ్చేశాయి. పలుచోట్ల గుంతలు ఉన్నాయి. ఎంపీడీవో ఐజాక్ ప్రవీణ్ మాట్లాడుతూ సంబంధిత అధికారులకు తెలియజేసి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసేలా కృషిచేస్తామన్నారు. ముళ్ల చెట్ల తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.

డీఎల్‌పీవో బదిలీ

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: స్థానిక డీఎల్‌పీవోగా పనిచేస్తున్న రవీంద్ర నెల్లూరు జిల్లా సైదాపురం ఎంపీడీవో(పూర్తి అదనపు బాధ్యతలు)గా బదిలీయ్యారు. ఆయన స్థానంలో డీఎల్‌పీవో జాలిరెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన ఇక్కడ రిలీవ్ అయి అక్కడ బాధ్యతలు చేపట్టారు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు

మనుబోలు, న్యూస్‌టుడే: విత్తన శుద్ధితో అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయాధికారి వెంకటకృష్ణయ్య తెలిపారు. మండలంలోని మడమనూరు, వెంకన్నపాలెం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో బుధవారం పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులకు వరిసాగులో పాటించాల్సిన జాగ్రత్తలు వివరించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కోవూరు : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నెల్లూరు డీఎల్‌పీవో రమణయ్య తెలిపారు. మండలంలోని పోతిరెడ్డిపాళెంలో మంగళవారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి తడి, పొడిచెత్త సేకరణను పరిశీలించారు. ప్రజలు పంచాయతీ సిబ్బందికి సహకారం అందించాలన్నారు.

పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

మహిళకు కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, శృతిరెడ్డి

మనుబోలు, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్ సారథ్యంలో కూటమి ప్రభుత్వం ఏపీ కొత్త చరిత్ర సృష్టిస్తోందని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. బుధవారం కమ్మలపూడిలో 'సుపరిపాలనలో తొలి అడుగు- ఇంటింటికీ తెదేపా' కార్యక్రమాన్ని సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, శృతిరెడ్డిలతో కలిసి ప్రారంభించారు. కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో అమలు చేసిన పథకాలను ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల అభ్యున్నతే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. ఏఎంసీ ఛైర్మన్ గాలి రామకృష్ణారెడ్డి, మండలాధ్యక్షుడు రామకృష్ణయ్య పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట, కలువాయి: ఏఎస్‌పేట మండలంలో మండల తెదేపా కన్వీనర్ అబ్బూరి రమేష్‌నాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలను వివరించారు. నాయకులు జిలానీబాషా, గోవిందయ్య, హజరత్తయ్య తదితరులు పాల్గొన్నారు. కలువాయిలో వెంకటగిరి ట్రస్ట్ మాజీ సభ్యుడు చల్లా రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఏఎస్‌పేటలో..

ఈకేవైసీ తప్పనిసరి

పొదలకూరు, న్యూస్‌టుడే: అన్నదాత సుఖీభవ పథకం జాబితాలో పేర్లు రాని రైతులు వ్యవసాయశాఖ కార్యాలయంలో పొలానికి సంబంధించిన పత్రాలు ఇచ్చి పేర్లు నమోదు చేసుకోవాలని పొదలకూరు ఏవో ప్రతాప్ తెలిపారు. బుధవారం ఆర్.వై.పాళెం సచివాలయంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో మాట్లాడుతూ రైతులు ఈకేవైసీ చేయించుకుంటునే పథకం కింద రూ.20,000లు మూడు విడతల్లో బ్యాంకు ఖాతాలకు జమ అవుతుందని తెలిపారు.

డేగపూడిలో ఉచిత కంటి వైద్యశిబిరం

పొదలకూరు, న్యూస్‌టుడే: పొదలకూరు మండలం డేగపూడి గ్రామంలో బుధవారం ఉచిత కంటివైద్య శిబిరాన్ని నెల్లూరు సుశీలా నేత్రాలయం ఆసుపత్రికి చెందిన వైద్యులు 45 మందిని పరీక్షించి మందులు పంపిణీ చేశారు. 15 మందికి కంటి అద్దాలు అందజేశారు. ఏడుగురికి శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధారించారు. ఈ కార్యక్రమంలో వైద్యులు కేశవులు, తెదేపా నాయకులు భాస్కర్‌నాయుడు, మల్లికార్జున్‌యాదవ్, మాజీ సర్పంచు మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు వృథా

తరుణవాయి ఎస్సీ కాలనీలో తాగునీటి పైపు దెబ్బతినడంతో నీరు రోడ్డుపాలవుతోంది. రాకపోకలకు అసౌకర్యంగా ఉంది. వెంటనే మరమ్మతులు చేయించాలని వృథాకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. పంచాయతీ కార్యదర్శి ప్రవీణ దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే మరమ్మతులు చేయిస్తామన్నారు.

– న్యూస్‌టుడే, సంగం

రహదారులు ధ్వంసం

వరినాట్లు ముమ్మరంగా ఉన్న నేపథ్యంలో అనంతసాగరం మండలంలో కేజ్ వీల్స్‌తో ట్రాక్టర్లు రహదారులపై దర్శనమిస్తున్నాయి. ఎవరు పట్టించుకోవడం లేదన్న ధీమాతో కొందరు పరుగు పెట్టిస్తున్నారు. ఇనుప చక్రాల ధాటికి సోమశిల- ఆత్మకూరు ప్రధాన రహదారి, గ్రామాల్లోని అంతర్గత రోడ్లు దారుణంగా దెబ్బతింటున్నాయి. ఆత్మకూరు మోటర్ వెహికల్ అధికారి రాములు మాట్లాడుతూ కేజ్ వీల్స్‌తో రోడ్డుపైకి వస్తే జరిమానా విధిస్తామన్నారు. పొలాల్లో కేజ్ వీల్స్‌ను మార్చుకోవాలని సూచించారు.

– న్యూస్‌టుడే, అనంతసాగరం

పేరుకుపోతున్న ఇసుక

పొదలకూరు మండలంలోని పెన్నానది నుంచి ట్రాక్టర్లు, లారీల్లో తరలించే ఇసుకపై పట్టకట్టక పోవడంతో రోడ్డుపై పడుతోంది. విరువూరు రోడ్డంతా ఇసుక పేరుకుపోతోంది. రాకపోకలకు ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తక్షణమే ఇసుక లేకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. – న్యూస్‌టుడే, పొదలకూరు

వినియోగంలోకి వచ్చేదెప్పుడో?

రామానాయడుపల్లి పంచాయతీ, రాంపల్లిలో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రం ఏళ్లు గడుస్తున్నా అందుబాటులోకి రావడంలేదు. రూ.17.50 లక్షల వ్యయంతో పనులు మొత్తం పూర్తి చేశారు. ప్రారంభోత్సవం చేయకపోవడంతో మూడేళ్లుగా భవనం నిరుపయోగంగా ఉంది. కొందరు స్థానికులు వారి అవసరాలకు వినియోగించుకుంటున్నారని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

– న్యూస్‌టుడే, మర్రిపాడు (ఆత్మకూరు గ్రామీణం)

కండలేరులో చేపల వేట నిషేధం

రాపూరు,న్యూస్‌టుడే: మండలంలోని కండలేరు జలాశయంలో ఆగస్టు 31 వరకు చేపల వేట నిషేధమని మనుబోలు మత్స్యశాఖ సహాయ పరిశీలకులు సంజయ్‌స్టీఫెన్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చేప గుడ్డుపెట్టే కాలం కావడంతో నిషేధిస్తున్నామన్నారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయన్నారు.

సోమశిల నీటిమట్టం

అనంతసాగరం, న్యూస్‌టుడే: సోమశిల జలాశయంలో బుధవారం నాటికి 77.988కి 31.357 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు. ప్రస్తుతం జలాశయంలో 301.709 అడుగుల మేర నీటి మట్టం నమోదైంది. ఎగువ ప్రాంతాల నుంచి 208 క్యూసెక్కుల వరద జలాశయానికి చేరుతోంది. -17, -18 రివర్స్ స్లూయిస్ ద్వారా 30, పవర్ టన్నల్ ద్వారా 3,220 క్యూసెక్కులు డెల్టాకు విడుదల చేస్తున్నారు. నాన్‌డెల్టాలైన దక్షిణ కాలువకు 850, ఉత్తర కాలువకు 425 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. రోజుకు సగటున 139 క్యూసెక్కులు ఆవిరవుతున్నట్లు ప్రాజెక్టు అధికారులు వివరించారు.

దారి దోపిడీ కేసులో నిందితుల అరెస్ట్

ముత్తుకూరు, న్యూస్‌టుడే: దారి దోపిడీకి పాల్పడిన నిందితులను ముత్తుకూరు పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. మేకల తిరుమల అనే వ్యక్తి జెన్‌కో రోడ్డులో గత నెల 30 ద్విచక్రవాహనంపై వెళ్తుండగా.. పిడూరు రామయ్య, షేక్ ఆసీఫ్ అనే యువకులు అడ్డగించి కత్తి చూపించి హత్య చేస్తామని బెదిరించారు. రూ.1200 నగదు, చరవాణిలను అపహరించుకుని వెళ్లారు. ఆ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయగా.. కృష్ణపట్నం పోర్టు సీఐ రవినాయక్ పర్యవేక్షణలో, ఎస్సై విశ్వనాథరెడ్డి సిబ్బంది దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్నారు.

కులదూషణపై కేసు నమోదు

సంగం, న్యూస్‌టుడే: సంగం గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామమైన వెంకటేశ్వరపురానికి చెందిన బి.వెంకటరవికుమార్‌ను కొందరు కులం పేరుతో దూషించడంపై సంగం పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. గతేడాది జూన్ 15న ఇంటి నిర్మాణం చేస్తుండగా. . గ్రామానికి చెందిన కె.రామకృష్ణారెడ్డి, వెంకటసుబ్బమ్మ, వెంకటరమణమ్మ, ఆదిలక్ష్మమ్మ.. కులం పేరుతో దూషించారని రవికుమార్ కోవూరు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో కేసు నమోదు చేయాలంటూ ఉత్తర్వులు అందడంతో ఆ మేరకు చర్యలు తీసుకున్నామని పోలీసులు తెలిపారు.

అతిగా మద్యం తాగి వృద్ధుడి మృతి

దక్కిలి, న్యూస్‌టుడే: అతిగా మద్యం తాగి వృద్ధుడు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. దక్కిలి తెలుగుగంగ కాలువ వద్ద శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సైదాపురం మండలం కనుమరాజుపల్లి గ్రామానికి చెందిన కొండూరు రవీంద్ర రాజు(60) బుధవారం అతిగా మద్యం తాగి అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు.

యువతి అదృశ్యం

పొదలకూరు: మండలంలో ఓ గ్రామానికి చెందిన యువతి (23) గత నెల 23 నుంచి కనిపించక పోవడంతో ఆమె తల్లి బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై హనీఫ్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

వరద కాలువ అండగా.. సాగు మెండుగా

చేజర్ల: సోమశిల దక్షిణ కాలువ ఆయకట్టు మొత్తానికి రెండో పంటకు నీరివ్వాలన్న లక్ష్యానికి కండలేరు వరద కాలువ అండగా నిలిచింది. మేనెల చివరి వారం నుంచి దక్షిణ కాలువకు సాగునీటి విడుదల జరిగింది. రెండో పంటకు నీరొస్తుందని ప్రజా ప్రతినిధులు, అధికారులు తెలిపారు. రైతులంతా నారు పోసి సాగు ప్రారంభించారు. కానీ జూన్ రెండో వారం నాటికే నీరందక నారుమళ్లు ఎండిపోయే పరిస్థితి వచ్చింది. కాలువ నిర్మాణ సమయంలో ఆయకట్టుకు సరిపడినంత నీరొచ్చే విధంగా తవ్వక పోవటంతో చివరికి నీరు అందలేదు. దీంతో పైరు కాపాడటానికి కండలేరు వరద కాలువ నుంచి దక్షిణ కాలువకు సరఫరా చేయటంతో ప్రస్తుతం దిగువకు దండిగా నీరు ప్రవహిస్తుంది. రైతులు వరినాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు.

సోమశిల దక్షిణ కాలువలో నీటి ప్రవాహం

ఉపాధ్యాయుడికి సన్మానం

అనంతసాగరం, న్యూస్‌టుడే: ఐగాట్ కర్మయోగి కోర్సుల్లో 413 పూర్తి చేసి జాతీయ స్థాయిలో 10వ ర్యాంకు సాధించిన చిలకలమర్రి జడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన గణిత ఉపాధ్యాయుడు చల్లా చంద్రశేఖర్ రెడ్డిని మండల విద్యాశాఖ అధ్వర్యంలో బుధవారం సత్కరించారు. ఎంఈవోలు పద్మనాభం, ప్రభాకర్‌రెడ్డిలు ఉపాధ్యాయునికి శాలువా కప్పి జ్ఞాపికను అందజేశారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడుని సత్కరిస్తున్న ఎంఈవోలు, ఉపాధ్యాయులు

సంగం, న్యూస్‌టుడే: సంగంలోని మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాల(ఆర్.ఎస్)లో ఉపాధ్యాయురాలిగా పనిచేసి, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్థుల మన్ననలను పొందిన మేరి మంజుల బదిలీ కావడంతో బుధవారం ఆమెను పాఠశాలలో ఘనంగా సత్కరించారు.



ఉపాధ్యాయురాలినితో విద్యార్థులు, గ్రామస్థులు

చెరువును పరిశీలించిన ఈఈ

కలువాయి, న్యూస్‌టుడే: స్థానిక చెరువులోని సమస్యలను తెలుసుకుని మరమ్మతులకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సోమశిల ప్రాజెక్టు ఆరవ డివిజన్ ఈఈ శ్రీనివాసకుమార్ సూచించారు. బుధవారం కలువాయి చెరువును పరిశీలించారు. డీఈ మస్తానయ్య, ఏఈ నారాయణరాజు, నీటి సంఘం అధ్యక్షుడు విజయభాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది కొరత.. అందని చేయూత

న్యూస్‌టుడే, చేజర్ల

చేజర్ల ప్రాథమిక సహకార సంఘంలో సిబ్బంది కొరత రైతులను ఇబ్బందులకు గురిచేస్తోంది. మండలంలో గతంలో నాలుగు పీఏసీఎస్‌లు ఉండగా వాటిని కలిపి ఒక సంఘాన్ని ఏర్పాటు చేశారు. అయిదు వేల మందికిపై సభ్యులు ఉన్నారు. వీరంతా కలిసి పాలక వర్గాన్ని ఎన్నుకొనే వారు. గత ప్రభుత్వంలో ఎన్నికలు లేకుండా నామినేటెడ్ విధానంలో పాలకవర్గాన్ని ఏర్పాటు చేసింది. వారి పదవీకాలం ముగిసిన అనంతరం పర్సన్ ఇన్‌ఛార్జిల పర్యవేక్షణలో నడుస్తున్నాయి. ప్రస్తుతం రైతులకు అందించాల్సిన వివిధ సేవలు కరవయ్యాయి.

చేజర్లలోని సహకార సంఘ కార్యాలయం

సంఘాల ఉద్యోగులను ఒకే చోటకు తీసుకుని రావటంతో మంచి సేవలు అందేవి. ప్రస్తుతం ఎరువులు అమ్మకాలు జరగడం లేదు. దీని పరిధిలో పది ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలు ఉన్నాయి. గత పంటకాలంలో మండల వ్యాప్తంగా 30-35 వేలు పుట్లు ధాన్యం ఉత్పత్తి కాగా.. అందులో కొంతమేర ధాన్యాన్ని రూ.నాలుగు కోట్లకు కొనుగోలు చేశారు. ప్రస్తుతం గోదాముల నిర్వహణ సరిగా లేదు.

గతం ఘనం.. నేడు అస్తవ్యస్తం

గతంలో ఎరువులు విత్తనాల అమ్మకాలు, ధాన్యం కొనుగోళ్లతో రూ.కోట్ల వ్యాపారం చేసి జిల్లాలో అగ్రగామిగా నిలిచింది. రూ.20 కోట్ల మేర పంట, వ్యవసాయ అనుబంధ రుణాలు పంపిణీ చేసింది. ఏటా రూ. కోట్లు విలువ చేసే ఎరువులు నిర్దేశిత ధరలకు విక్రయిస్తూ రైతులకు అనుకూలంగా ఉండేది. అన్ని

నియామకాలు జరగకనే..

ఉద్యోగ విరమణ చేసిన వారి స్థానంలో కొత్తగా నియామకాలు చేయకపోవటంతో ఏడుగురు ఉద్యోగులకుగాను ముగ్గురే ఉన్నారు. రుణ వసూళ్ల ఇతర విధుల్లో వీరు ఉండటంతో ఎరువుల అమ్మకాలు పూర్తిగా నిలిచిపోయాయి. ఫలితంగా యూరియా, ఇతర ఎరువులు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బంగారు తాకట్టు రుణాల కోసం ప్రత్యేక విభాగం ప్రారంభించినా ఆశించిన ప్రయోజనం లేకుండా పోయింది. ప్రస్తుతం సిబ్బందికి కొన్నాళ్లుగా వేతనాలు లేవు. పీఏసీఎస్‌లో సిబ్బందిని నియమించి సేవలు పునరుద్ధరించాలని అన్నదాతలు కోరుతున్నారు.

కరెంటు ఖాతాలో నిధుల్లేవు..

– వెంకట్రావు, పర్సన్ ఇన్‌ఛార్జి

సిబ్బంది నియామకంపై ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకోవాలి. కొందరికి తొమ్మిది నెలలు, మరికొందరికి మూడు నెలల జీతాలు చెల్లించాల్సి ఉంది. కరెంటు ఖాతాలో నగదు నిల్వలు లేని కారణంగా జాప్యం జరుగుతుంది. ఎరువుల అమ్మకాలు, రైతు సేవల పునరుద్ధరణకు చర్యలు తీసుకుంటాం.

పౌష్టికాహారంతో ఆరోగ్యం

పొదలకూరు రూరల్, న్యూస్‌టుడే: పౌష్టికాహారంతోనే ఆరోగ్యమని సూపర్‌వైజర్ జ్యోతిలక్ష్మి అన్నారు. మండలంలోని ఆర్‌వై పాలెం అంగన్‌వాడీ కేంద్రంలో మహిళలకు అవగాహన కల్పించారు. 6 నెలల నుంచి 6 ఏళ్లు కలిగిన పిల్లల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వారి తల్లులకు తెలియజేశారు. అలాగే పిల్లల బరువు, ఎత్తును కొలిచి పౌష్టికారలోపంతో బాధపడుతున్న వారి ఎదుగుదలకు తగు సూచనలు చేశారు. అనంతరం పరిసరాల శుభ్రత,కాలానుగుణ వ్యాధుల పట్ల అవగాహన కల్పించారు. నిర్వాహకురాలు నారాయణమ్మ పాల్గొన్నారు.

మృతికి సంతాపం

చేజర్ల: చిత్తలూరులో దొరసానమ్మ కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి పరామర్శించారు. ఇటీవల ఆమె భర్త అనారోగ్యంతో చనిపోవటంతో విషయం తెలుసుకున్న ఆయన పరామర్శించారు. మృతికి సంతాపం వ్యక్తం చేశారు. అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

గూడూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

EPNo:7/2021

O.S.No:49/2016

Gulimcherla @ Gurimcherla Venkata Subbamma .. ..DHR

Vs

Karna Srinivasulu ..JDR

వేలం ప్రకటన

పై నెంబరు E.P.లో డిక్రీ హోల్డర్ డిక్రీ బాకీని రాబట్టుకొనుటకు జె.డి.ఆర్. తాలుకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని తేది: 17-07-2025న ఉదయం 10:30 గం॥ ని॥ల నుండి సాయంత్రం 5:00 గం॥ లోపల పైన తెలిపిన కోర్టులో బహిరంగంగా వేలం పాట జరపబడును. కావున పాటదారులు ఎవ్వరైనా వేలం పాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.

SCHEDULE

SPSR Nellore District (Tirupati District) - Gudur District Registration -Gudur Sub-Registration-Manubolu Mandal and Panchayat-Manubolu Village- Survey No:267, Door No:170- Assessment No: 280- house site of about 26 ankanams Containing to about 10 ankanams of Terraced building.

Within the following boundaries:

East: House and site of Jakkala Chinnabbaiah and Manne Sankaraiah. South: House and site of Karna Venkata Ramanaiah. West: Vacant site of Yarasi Sudhakar to some extent and house and site of Yekambaram Gurunadham. North: Public Street

DHR Value: 9,00,000/-

Amin Value: 20,00,000/-

ఇట్లు

DHR తరపు న్యాయవాదులు

పి.గోపాల్ రెడ్డి B.com, B.L.

పి.నరేంద్ర Bsc, LL.B.,

గూడూరు

రేపటి నుంచి కామ్యహోమ సప్తాహ మహోత్సవాలు

నెల్లూరు(జడ్పీ), న్యూస్‌టుడే: నెల్లూరులో ఈనెల 4 నుంచి 10వ తేదీ వరకు కామ్యహోమ సప్తాహ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు కంచి పీఠానికి చెందిన శంకర మఠం నిర్వాహకులు ప్రకటించారు. మూలాపేట కంచి కామాక్షితాయి, చంద్రమౌళీశ్వర స్వామి ఆలయంలో మేనేజరు సందడిరెడ్డి, ఈవో ఉపాసనాని విలేకరులతో మాట్లాడారు. 4న గణపతి, సుబ్రహ్మణ్య స్వామి హోమాలతో మహోత్సవాలు ప్రారంభం అవుతాయన్నారు.

అన్న క్యాంటీన్ల పరిశీలన

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: నెల్లూరు నగరపాలకసంస్థ పరిధిలోని ఏడు అన్న క్యాంటీన్లలో ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ వైవో నందన్ నిర్వాహకులను ఆదేశించారు. బుధవారం మద్రాస్ బస్టాండు కూరగాయల మార్కెట్ సమీపంలోని అన్న క్యాంటీన్‌ను సందర్శించి ప్రజలకు అందుతున్న ఆహార నాణ్యతను పరిశీలించారు. అనంతరం పొగతోట ప్రాంతంలో కాలువల పూడికతీత పనులను పర్యవేక్షించారు.

నెల్లూరు

•నెల్లూరు • నెల్లూరు గ్రామీణం

కోర్టు కేసుల మాఫీకి అవకాశం

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: ఆస్తి పన్ను ఎగవేతదారులు 265 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి సమన్లు జారీ చేశామని, వారంతా ఈనెల ఆయిదో తేదీన నిర్వహించనున్న లోక్‌అదాలత్‌కు హాజరై బకాయిలు అపరాధ రుసుంతో సహా చెల్లించి కేసులను మాఫీ చేయించుకోవాలని కమిషనర్ వైవో నందన్ తెలిపారు. బుధవారం కార్యాలయంలోని ఛాంబరులో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బకాయిలు చెల్లించని వారికి మూడేళ్ల వరకు కారాగార శిక్ష విధించేందుకు చట్టం అనుమతిస్తుందని తెలిపారు. సమావేశంలో మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ రంగారావు పాల్గొన్నారు.

భక్తులకు అనుగుణంగా ఏర్పాట్లు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: బారాషహీద్ దర్గా రొట్టెల పండగకు లక్షలాది మంది భక్తులు వస్తారని, అందుకనుగుణంగా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెదేపా నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి తెలిపారు. దర్గాలో చేపడుతున్న ఏర్పాట్లను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా భక్తులకు సేవలు అందించేందుకు కట్టుదిట్టంగా ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో మైనార్టీ నేతలు సయ్యద్ సమీ, సాబిర్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా! (10 AM to 1 PM) నెల్లూరు, గ్రామీణం 80085 50332 80085 74001

సమస్య: బారాషహీద్ దర్గా ఆవరణలో 20కి పైగా కుక్కలు తిరుగుతున్నాయి. భక్తులు భయాందోళన చెందుతున్నారు. – రియాజ్
సమాధానం: కుక్కలను పట్టించేందుకు చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ మదన్ మోహన్, వెటర్నరీ అధికారి

? పొదలకూరు రోడ్డు టైలర్స్ కాలనీలో కాలువలు శుభ్రం చేయడం లేదు. మురుగునీరు నిలిచి దుర్వాసన వస్తోంది. – రత్నమ్మ
✓ కాలువలు శుభ్రం చేయిస్తాం. – డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

? నగరంలోని చిన్నబజారు సమీపంలోని పంతులవారివీధిలో ఏపీఎం2/54 స్తంభం వీధి దీపం వెలగడం లేదు. – బాబు
✓ కొత్తవి ఏర్పాటు చేస్తాం. – వైవో నందన్, కమిషనర్

? చిన్నపాటి వర్షానికే పొగతోట వెంకటరమణ హోటల్ వెనుక ప్రాంతంలో రోడ్డుపై నీరు నిలిచిపోతోంది. – వెంకట్
✓ నీరు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం. – డాక్టర్ చైతన్య, ఆరోగ్యాధికారి

– న్యూస్‌టుడే, నెల్లూరు(టౌన్, నవాబుపేట)

మాట్లాడుతున్న కమిషనర్ వైవో నందన్

పారిశుద్ధ్యానికి ప్రాధాన్యం

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: బారాషహీద్ దర్గాలో ఈనెల ఆరో తేదీ నుంచి నిర్వహించనున్న రొట్టెల పండుగలో పారిశుద్ధ్య నిర్వహణకు అత్యంత ప్రాధాన్యం ఇచ్చి, భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పారిశుద్ధ్య విభాగం ప్రణాళికాబద్ధంగా విధులను నిర్వహించాలని కమిషనర్ వైవో నందన్ సూచించారు. బుధవారం కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటరులో పారిశుద్ధ్య విభాగం అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు మార్గదర్శక సూచికలు ఏర్పాటు చేయాలని, పార్కింగ్ వసతులతో పాటు దర్గా ప్రాంగణంలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించేలా కృషి చేయాలన్నారు. చెరువు నీటిలో ప్లాస్టిక్ కవర్లు, వ్యర్థాలు తొలగించడంతో పాటు మరుగుదొడ్లను నిరంతరం శుభ్రంగా ఉంచాలన్నారు. ప్రాంగణంలో విక్రయించే ఆహార పదార్థాలు నాణ్యతతో ఉండేలా తనిఖీలు చేయాలని సూచించారు. సమావేశంలో ఆరోగ్యాధికారి డాక్టర్ చైతన్య, వెటర్నరీ అధికారి డాక్టర్ మదన్‌మోహన్, మలేరియా అధికారి జయరామయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమాలకు దన్ను.. అరకొరగా పన్ను!

నగరపాలక సంస్థలో ఇదీ పరిస్థితి

● నెల్లూరు నగరంలోని శివగిరికాలనీలో ఓ భారీ భవనానికి గత 20 ఏళ్ల నుంచి ఇంటి, కుళాయి పన్ను చెల్లించడం లేదు. యజమాని గతంలో పని చేసిన ఆర్ఐలకు ఎంతోకొంత ముట్టచెప్పి పన్నులు వేయకుండా సర్దుబాటు చేసుకున్నట్లు విమర్శలున్నాయి.

● ఇరుగాళమ్మ సంఘం రాజీవ్ గృహకల్ప పక్కన 15 ఏళ్ల నుంచి పన్నులు చెల్లించడం లేదు. దీంతో నగరపాలకసంస్థకు భారీగా గండిపడింది.

న్యూస్‌టుడే, నెల్లూరు(నగరపాలకసంస్థ)

శివగిరికాలనీలో పన్ను చెల్లించని భవనానికి కుళాయి కనెక్షన్ తొలగిస్తున్న రెవెన్యూ సిబ్బంది

నెల్లూరు నగరం గత పదేళ్లలో భారీగా విస్తరించింది. శివారు కాలనీలు వెలిశాయి. నగరపాలకసంస్థకు పన్ను పెరగడం లేదు. 54 డివిజన్లు ఉండగా.. 1.56 లక్షల వరకు అసెస్‌మెంట్లు ఉన్నాయి. ఆ స్థాయిలో ఆదాయం రావడం లేదు. గత అయిదేళ్ల వైకాపా పాలనలో రూ.70కోట్లకు మించిన దాఖలాలు లేవు. గతంలో రెవెన్యూ విభాగంలో పని చేసిన కొందరు ఆర్ఐలు వాణిజ్య భవనాలను నివాసాలుగా చూపి పన్నులు తగ్గించి ఆదాయానికి గండి కొట్టారు. పలు భవనాలకు ఏళ్ల తరబడి పన్నులు వసూలు చేసిన దాఖలాలు లేవు. ఇటీవల సర్వేలో పలు అక్రమాలు బయటపడ్డాయి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రెవెన్యూ విభాగం ప్రక్షాళన చేపట్టింది. నగరపాలకసంస్థకు చెల్లించాల్సిన ఆస్తి పన్ను ఎగవేతదారులు 265 మందిపై క్రిమినల్ కేసులు నమోదు చేసి సమన్లు జారీ చేయడం విశేషం.

సంవత్సరం	పన్ను వసూలు (రూ.కోట్లలో..)
2020–21	41.19
2021–22	49.44
2022–23	62.63
2023–24	69.47
2024–25	80.55

సామాన్యులపైనే ప్రతాపం

రూ.500 నుంచి రూ.1000 వరకు బకాయిలు ఉన్న పేద, మధ్య తరగతి సాధారణ వ్యక్తులపై పురపాలక సంస్థ అధికారులు తమ ప్రతాపం చూపుతున్నారు. అటువంటి వారిపై ఆర్ఆర్ యాక్ట్‌లు ప్రయోగించడం, నీటి కుళాయిలు కనెక్షన్లు కత్తిరించడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. భారీగా బకాయిలు పడిన పెద్దలు, రాజకీయ నాయకుల వైపు వెళ్లేందుకు సాహసించలేకపోతున్నారు. ఫలితంగా రూ.కోట్లలో బకాయిలు ఉన్నారు. గత అయిదేళ్లలో కొందరు రెవెన్యూ సిబ్బంది భవన యజమానుల వద్దకు వెళ్లి డబ్బులు డిమాండ్ చేశారు. ఎంతో కొంత ముట్టగానే పన్నులు వేయకుండా మిన్నకుండిపోయారు.

● పన్ను వసూలులో అక్రమాలు జరగకుండా గట్టి చర్యలు తీసుకున్నట్లు నగరపాలక కమిషనర్ వైవో నందన్ తెలిపారు. ఎవరైనా అవినీతికి పాల్పడితే సహించేది లేదు.

ప్రైవేట్ విద్యా సంస్థలు మూసివేసి నేడు నిరసన

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే: అధికారులు ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటూ ప్రైవేట్ విద్యా సంస్థలను ఇబ్బంది పెడుతున్నారని, అందుకు నిరసనగా గురువారం ప్రైవేట్ విద్యా సంస్థలను మూసివేస్తున్నట్లు ప్రైవేట్ విద్యా సంస్థల యజమానుల సంఘం నాయకులు అన్నారు. బుధవారం నగరంలో అపస్మా, ఇస్మా, యునైటెడ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్, సీబీఎస్ఈ స్కూల్ అసోసియేషన్ తదితర సంఘాలు సంయుక్తంగా సమావేశం నిర్వహించాయి. అపస్మా రాష్ట్ర సీనియర్ నాయకులు ఎంవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ ఆర్టీఈ చట్టం అమలులో భాగంగా అధికారులు ప్రైవేట్ స్కూల్స్ యాజమానులను భయభ్రాంతులకు గురిచేస్తూ నోటీసులు ఇస్తున్నట్లు తెలిపారు. దీనికి నిరసనగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేట్ స్కూల్స్ మూసివేస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో అపస్మా రాష్ట్ర గౌరవ సలహాదారు వెంకట్రామయ్య, జిల్లా గౌరవ ధ్యక్షుడు రవీంద్రరెడ్డి, నగర అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ప్రైవేట్ విద్యా సంస్థల అసోసియేషన్ నాయకులు

రామలింగాపురంలో భారీగా వ్యర్థాలు

నగరంలోని రామలింగాపురం ప్రధాన రోడ్డు అంచున మట్టి, చెత్త, భవన నిర్మాణ వ్యర్థాలు నిల్వ చేరాయి. గత కొన్ని రోజులుగా రోడ్డు పక్కన ఉండటంతో వాహనదారులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. ఇవి రోడ్డుమీదకు చేరడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రాత్రిపూట పాదచారులకు కనిపించక పడిపోతున్నారు. పలువురు గాయాలపాలయ్యారని స్థానికులు చెబుతున్నారు.
–న్యూస్‌టుడే, నెల్లూరు(విద్య)

పేరుకుపోయిన చెత్త

నగరంలో చెత్త సేకరణ సక్రమంగా జరగడం లేదు. జీఎన్‌టీ రోడ్డు నుంచి పొదలకూరు రోడ్డుకు వెళ్లే మార్గంలో పోస్టాఫీసు సమీపంలో రోడ్డుపైనే కొందరు చెత్త వేస్తున్నారు. ఇది రోడ్డును ఆక్రమించడంతో రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. మూడు రోజులుగా తొలగించకపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ట్రాన్స్‌ఫార్మర్ పక్కనే చెత్త వేస్తుండటంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.
–న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

తవ్వేసి.. వదిలేశారు

నెల్లూరు నగరం నాలుగుకాళ్ల మండపం వద్ద పైపులైన్ ఏర్పాటుకు రోడ్డు తవ్వి సిమెంట్ వ్యర్థాలను అలాగే వదిలేశారు. వీటి కారణంగా వాహనాల రాకపోకలకు సమస్యలు ఎదురవుతుండగా, పాదచారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నాలుగుకాళ్ల మండపం నుంచి రంగనాయకులపేట వరకు ఇదే పరిస్థితి నెలకొంది. రెండు నెలలుగా సమస్య ఉందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి రాకపోకలకు ఇబ్బంది లేకుండా వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

రోడ్డుపైనే మురుగు

నెల్లూరు నగరం బట్వాడిపాలెం సెంటర్ దగ్గర మురికి నీరు రోడ్డుపైకి చేరుతోంది. బట్వాడిపాలెం నుంచి కస్తూరిబా కళాక్షేత్రానికి వెళ్లే మార్గంలో కాలువలు పూడికతో నిండిపోయాయి. పూడిక కారణంగా మురుగు ముందుకు కదలడంలేదు. దీంతో మురుగంతా రోడ్డు పైకి చేరి దుర్వాసన వెదజల్లుతోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించేవారు, స్థానికులు అసౌకర్యానికి గురవుతున్నారు. అధికారులు స్పందించి మురుగునీరు పారేలా చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.
–న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

తాగునీటి బావిని విస్మరించారు

నగరంలోని బీవీ నగర్‌లో రోడ్డు రవాణా సంస్థ కార్యాలయం వద్ద ఉన్న 70 సంవత్సరాల నాటి తాగునీటి బావిని కార్పొరేషన్ అధికారులు పట్టించుకోవడం లేదు. గతంలో ఈ బావి ద్వారా చుట్టుపక్కల ప్రజలకు తాగునీరు అందించేవారు. పది నెలల నుంచి దాని నిర్వహణ వదిలేశారు. అక్కడి స్థానికులు చెబుతున్నారు. మోటారు పైపులు అలాగే ఉంచారు. రోడ్డుకు పక్కనే ఉండటంతో వాహనదారులు పడిపోయే ప్రమాదం ఉంది. –న్యూస్‌టుడే, నెల్లూరు(వద్దాపతిసెంటర్)

కత్తి చూపించి ఫోన్ పే

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: ఉత్తర ప్రదేశ్ కాన్పూర్‌కు చెందిన అన్సార్ ఏడేళ్లుగా నగరంలోని ఓ బొటిక్ సెంటరులో పనిచేస్తున్నారు. గత నెల 25న వనంతోపు సెంటరులోని ఓ వీధి రోడ్డుపక్కనే ఉండగా ఇద్దరు వ్యక్తులు అతని దగ్గర వచ్చి కత్తి చూపించి నగదు ఇవ్వాలని సూచించారు. తన వద్ద లేవని చెబుతున్నా.. వినకుండా చంపేస్తామని బెదిరించారు. ఫోన్ పేలో ఉన్నాయని చెప్పగానే వెంటనే వారి నంబరుకు రూ.వెయ్యి చేయించుకుని అక్కడి నుంచి పరారయ్యారు. బాధితుడు బుధవారం వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

హోటల్‌లో దొంగలు పడ్డారు

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: నగరంలోని మెక్లిన్స్ రోడ్డులో నివాసం ఉండే జొహైబ్ హుస్సేన్ స్థానిక మద్రాసు బస్టాండు వహాబ్‌పేట వద్ద పరివార్ పారడైజ్ హోటల్ నడుపుతున్నారు. రోజు మాదిరిగానే ఈ నెల ఒకటో తేదీ రాత్రి హోటల్‌ను మూసివేసి ఉదయం 10.30 గంటలకు తెరవగా లోపల ఉన్న ఎనిమిది సీసీ కెమెరాలు పగిలిపోయి, నాలుగు టేబుల్ లాకర్స్ పగులగొట్టి ఉన్నాయి. క్యాష్ కౌంటర్‌ను పరిశీలించగా అందులో ఉన్న రూ.4,200 మాయమయ్యాయి. హోటల్ వెనక ఉన్న గ్రిల్స్‌ను తొలగించి గుర్తుతెలియని వ్యక్తులు లోపల ప్రవేశించి దొంగతనం జరిగినట్లు గుర్తించిన బాధితుడు బుధవారం చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బ్యాగ్ మాయం కేసు రాజీ

ఈనాడు, అమరావతి: నెల్లూరు నగరానికి చెందిన వంశీకృష్ణ విజయవాడ దుర్గమ్మ గుడికి వెళ్లగా అక్కడ క్లాక్ రూంలో ఉంచిన బ్యాగు, అందులోని నగదు, చరవాణి మాయంపై బుధవారం 'ఈనాడు'లో కథనం రాగా నిర్వాహకులు అతనితో రాజీకి వచ్చారు. రూ.30వేలతోపాటు పాత మొబైల్ ఇచ్చారు.

బెట్టింగ్ యాప్‌లకు ఉపాధ్యాయుడి బలి

కావలి, న్యూస్‌టుడే: బెట్టింగ్ యాప్‌ల వలలో చిక్కి ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు బలవన్మరణం చెందిన ఉదంతమిది. సేకరించిన సమాచారం మేరకు.. కావలిలోని పుచ్చలపల్లి వారి వీధిలో ఉంటున్న ఎల్.విజయరోశిరెడ్డి (43) ముసునూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో పీఈటీగా పనిచేస్తున్నారు. బెట్టింగ్ యాప్‌లలో పందాలు కాసి రూ.5 కోట్ల వరకు నష్టపోయారని సమాచారం. ఈ వ్యసనం కోసం బంధువులు, మిత్రుల దగ్గర భారీగా అప్పులు చేశారు. యాప్‌లలో పందేలు పెట్టి డబ్బులు పోవడంతో ఆత్మహత్య చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. ఈక్రమంలో గత నెల 19వ తేదీ కుటుంబ సభ్యులతో కలిసి తిరుమలకు వెళ్లారు. మరుసటి రోజు తిరుగు ప్రయాణంలో తిరుపతి బస్టాండ్‌కు రాగానే కుటుంబసభ్యులకు కనిపించకుండాపోయారు. రెండురోజుల క్రితం వారణాసిలోని గంగానదిలో దూకి ఆత్మహత్య చేసుకున్నారు. నదిలో దూకే ముందు కొన్ని వివరాలు రాసి పేపరు గట్టుపై పెట్టడంతో ఈ సమాచారం అక్కడి పోలీసులకు తెలిసింది. మృతదేహాన్ని వెలికి తీయించిన పోలీసులు కావలి ఒకటో పట్టణ స్టేషన్‌కు తెలిపారు. మృతదేహానికి అక్కడే అంత్యక్రియలు పూర్తి చేశారు.

రెండు లారీలు ఢీ.. డ్రైవర్ మృతి

ఏర్పేడు, న్యూస్‌టుడే: రెండు లారీలు ఢీకొన్న ఘటనలో డ్రైవర్ మృతి చెందారు. ఈ ఘటన రేణిగుంట-నాయుడుపేట ప్రధాన రహదారిపై చెర్లోపల్లి సమీపంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నుంచి చేపల లోడుతో తిరుపతి వెళ్తున్న లారీని ఏర్పేడు మండలం మేర్లపాక సమీపంలోని ఓ పరిశ్రమకు చెందిన లారీ బుధవారం వేకువజామున ఢీకొట్టింది. ఈ ఘటనలో చేపలలోడు డ్రైవర్ బండారుపల్లి ఎస్టీ కాలనీకి చెందిన శోభన్‌బాబు(35) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో వాహనాలు దెబ్బతిన్నాయి. శోభన్‌బాబు కుటుంబ సభ్యులతో కలిసి కొన్నేళ్లుగా నెల్లూరులో జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. శవ పంచనామా నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

సేవలతో పురస్కారాలు సొంతం

నెల్లూరు(టౌన్), న్యూస్‌టుడే: నెల్లూరు పొర్లుకట్ట రాజేంద్రనగర్ బదర్ మసీదు కమిటీ సభ్యులు, సుదీర్ఘకాలం ఆర్టీసీలో డ్రైవర్‌గా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన సయ్యద్ సిరాజ్‌ను బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా మసీదు అధ్యక్షుడు షౌకత్ మాట్లాడుతూ సిరాజ్ 35 ఏళ్లుగా డ్రైవర్‌గా విధులు నిర్వహించి ఆరు అవార్డులు అందుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఇమామ్ హఫీజ్ ఖలీల్ అహ్మద్ మాట్లాడుతూ ఉద్యోగంలో మంచి పేరు తెచ్చుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో హాజీ బాషా, డాక్టర్ హఫీజ్ అల్లాహ్, రఫి, యాకుబ్, చాంద్‌బాషా, సిద్దిక్ తదితరులు పాల్గొన్నారు.

సయ్యద్ సిరాజ్‌ను సత్కరిస్తున్న మసీదు కమిటీ సభ్యులు

విద్యార్థి ఆత్మహత్యపై విచారణకు డిమాండ్

నెల్లూరు(విద్య), న్యూస్‌టుడే : విద్యార్థి ఆత్మహత్యపై విచారణ జరిపించాలంటూ స్థానిక వీఆర్‌సీ సెంటర్‌లో బుధవారం ఆంధ్రప్రదేశ్ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. జేఏసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదిత్యసాయి మాట్లాడుతూ ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యార్థుల జీవితాలకు భద్రత లేదని నెల్లూరు గ్రామీణ మండలం ధనలక్ష్మీపురంలోని ఓ ప్రైవేట్ విద్యాసంస్థలో విద్యార్థి మృతిపై లోతైన దర్యాప్తు జరిపించాలని, సీసీ ఫుటేజ్ బయట పెట్టాలని అన్నారు. కళాశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హరీష్, బాలు, సాయి, మురళి, జనార్దన్ పాల్గొన్నారు.

ప్రశ్నార్థకంగా సచివాలయ సేవలు

వీఆర్ హైస్కూల్‌కు 18 మంది సెక్రటరీలు

నెల్లూరు(నగరపాలకసంస్థ), న్యూస్‌టుడే: వీఆర్ మున్సిపల్ హైస్కూల్‌లో ఉపాధ్యాయులుగా సచివాలయాల కార్యదర్శులను నియమించారు. వార్డు శానిటేషన్, అడ్మిన్, ప్లానింగ్, ఎడ్యుకేషన్ సెక్రటరీలు 18 మందిని డిప్యుటేషన్‌పై పంపించారు. వీరు హిందీ, సైన్స్, మ్యాథ్స్, కెమిస్ట్రీ, ఇంగ్లిష్, కంప్యూటర్ సబ్జెక్టులను బోధించనున్నారు. ఉపాధ్యాయులుగా వెళ్లి వారంతా యవత కావడంతో తమకు మున్సిపల్ పాఠశాలల్లోనే ఉపాధ్యాయులుగా కొనసాగిస్తామని హామీ ఇస్తేనే వెళతామని కోరినట్లు సమాచారం.

● హైస్కూల్లో 12 మంది, ప్రైమరీ స్కూల్లో 12 మంది ఉపాధ్యాయులు అవసరం ఉంది. ఖాళీలను భర్తీ చేసేందుకు నగరపాలకసంస్థలోని సచివాలయ ఉద్యోగులను నియమించారు. 18 మందిలో పది మంది పారిశుద్ధ్య విభాగం సెక్రటరీలు కావడం గమనార్హం. నగరవ్యాప్తంగా 166 సచివాలయాలు ఉండగా.. ఒక్కోదానిలో 8 మంది పని చేయాల్సి ఉంది. వివిధ కారణాలతో దాదాపు 200 మందికిపైగా విధులకు హాజరు కావడం లేదు. ఇన్‌ఛార్జులను నియమించి ప్రజలకు సేవలు అందిస్తున్నారు. నగరంలో పారిశుద్ధ్య నిర్వహణలో కీలకంగా వ్యవహరిస్తున్న శానిటరీ సెక్రటరీలను డిప్యుటేషన్‌పై పంపడం గమనార్హం. ఒక పక్క స్వచ్ఛాంధ్ర- స్వర్ణాంధ్ర అంటూ ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతోంది. సెక్రటరీల కొరత కారణంగా పలు ప్రాంతాల్లో పారిశుధ్యం పడకేయనుంది. సచివాలయాల సేవలు ప్రశ్నార్థకంగా మారనున్నాయి.

సంక్షిప్త సమాచారం

తెదేపాలో చేరిక

నెల్లూరుగ్రామీణం: నెల్లూరు రూరల్ నియోజకవర్గం 19వ డివిజన్‌కు చెందిన వైకాపా నాయకుడు కందికట్టు శరత్‌కుమార్ తెదేపాలో చేరారు. నగరంలోని మాగుంటలేఅవుట్ నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో తెదేపాలో చేరిన వారికి ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నెల్లూరు రూరల్ నియోజకవర్గం 31వ డివిజన్‌లో పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, గిరిధర్‌రెడ్డి ప్రారంభించారు.

ఉచిత కంటి శస్త్ర చికిత్స శిబిరం ముగింపు

నెల్లూరు(మార్కెట్ సెంటర్): నెల్లూరు రూరల్ సౌత్‌మోపూరులో చెన్నై శంకర నేత్రాలయ వైద్యశాల, కాటంరెడ్డి ప్రసాద్‌రెడ్డి, శోభారెడ్డి సౌజన్యంతో జరిగిన ఉచిత కంటి శుక్లాల శస్త్రచికిత్స శిబిరం బుధవారం ముగిసింది. వారం రోజులపాటు శిబిరం నిర్వహించారు. తెదేపా నాయకులు కోటంరెడ్డి గిరిధర్ రెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, దశయ్య, సురేందర్ రెడ్డి, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ సభ్యులకు సత్కారం

నెల్లూరు(మార్కెట్ సెంటర్): నెల్లూరు బార్ అసోసియేషన్ ఎన్నికల్లో గెలుపొందిన వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, పాలెన్‌ను బుధవారం తెలుగు మహిళా నాయకురాలు భూలక్ష్మి సత్కరించారు. పనబాక భూలక్ష్మి సేవా సమితి ఆధ్వర్యంలో హైకోర్టు బార్ కౌన్సిల్ మెంబర్ చంద్రశేఖర్‌రెడ్డి కార్యాలయంలో గంగరాజు, అయ్యప్పరెడ్డి, నాగరాజు, కేవీఎల్ నారాయణ, చంద్రశేఖర్ నాయుడు, సారిక, మహేశ్వరి, కిరణ్‌కుమార్, వెంకటేశ్వర్లుకు సత్కారం జరిగింది.

నోటీసులు ఇవ్వకుండా దర్గా కూల్చివేత

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: నెల్లూరు వెంకటేశ్వరపురంలోని శ్రీ మస్తానమ్మ దర్గాను అధికారులు కూల్చేశారని దర్గా ముతవల్లీ ఆవేదన వ్యక్తం చేశారు. నెల్లూరులోని ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 15 అంకణాల స్థలంలో దర్గా ఏర్పాటు చేసుకుని 40 సంవత్సరాలుగా ప్రార్థనలు చేసుకుంటున్నామని తెలిపారు. పెన్నా బ్రిడ్జి పనులు సాగుతుండటంతో నోటీసులు ఇవ్వకుండా కూల్చివేయడం బాధాకరమన్నారు.

అమ్మా పెన్షన్ వస్తుందా.. సంక్షేమ పథకాలు అందుతున్నాయా..

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), న్యూస్‌టుడే: అవ్వ.. అమ్మా పెన్షన్ వస్తుందా.. సంక్షేమ పథకాలు అందుతున్నాయా.. సమస్యలు ఏమైనా ఉన్నాయా అంటూ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి ఇంటింటా ప్రచారం సాగింది. సుపరిపాలనపై తొలి అడుగు కార్యక్రమాన్ని నెల్లూరు రూరల్ నియోజకవర్గ పరిధి లేక్‌వ్యూ కాలనీ 6వ వీధి నుంచి ఎమ్మెల్యే బుధవారం ప్రారంభించారు. సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ప్రతి ఇంటికి వెళ్లి వారి యోగక్షేమాలు అడిగి, వారికి అందుతున్న సంక్షేమ పథకాలను తెలుసుకున్నారు.

వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి

● కూటమి ప్రభుత్వంలో ఇంటింటికీ రెట్టింపు సంక్షేమం అందుతోందని తెదేపా బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు అన్నారు. నగరంలోని 47వ డివిజన్‌లో ఇంటింటా కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పథకాలపై ప్రచారం చేశారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌ఛార్జి డాక్టర్ గణేష్, తెదేపా డివిజన్ అధ్యక్షుడు కల్వకుంట భాస్కర్, ఉపాధ్యక్షుడు మునిశేఖర్, అద్దంకి చంద్ర తదితరులు పాల్గొన్నారు.

మహిళా సర్పంచులకు శిక్షణ

నెల్లూరు(మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: స్థానిక స్వపరిపాలనలో మహిళా సాధికారిత - గ్రామీణాభివృద్ధి దిశగా మార్పు అనే అంశంపై మహిళా సర్పంచులకు శిక్షణ తరగతులు ప్రారంభమయ్యాయి. నెల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో మూడు రోజులపాటు జరగనున్న శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించిన ఎంపీడీవో శైలేంద్రకుమార్ మాట్లాడుతూ మహిళలు విద్య, ఆర్థిక, రాజకీయ రంగాల్లో రాణిస్తూ, పాలనలోనూ భాగస్వామ్యం కావాలన్నారు. సమాజంలో స్త్రీ, పురుషులు సమానంగా రాణించాలనే ఉద్దేశంతోనే శిక్షణ తరగతులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో డీపీఆర్‌సీ నుంచి బ్రహ్మయ్య, సుల్తాన్ అజీజ్, శ్రీవిద్య, జిలానీ, శివ తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో శైలేంద్రకుమార్.

భవనాలు శిథిలం.. జీతాలు భారం

నెల్లూరులోని జిల్లా గ్రంథాలయ భవనం

న్యూస్‌టుడే, నెల్లూరు(మార్కెట్ సెంటర్)

విజ్ఞానాన్ని అందించే గ్రంథాలయాలు నిధుల లేమితో నీరసిస్తున్నాయి. స్థానిక సంస్థల చెల్లించాల్సిన సెస్ బకాయిలు పేరుకుపోవడంతో కనీసం సంస్థ ఉద్యోగులకు జీతాలు కూడా చెల్లించలేని దుస్థితిలో గ్రంథాలయాలు ఉన్నాయి. ఉమ్మడి నెల్లూరు జిల్లా వ్యాప్తంగా గ్రంథాలయాలకు రూ.50కోట్లపైనే సెస్ బకాయిలు ఉన్నాయి. ఒక్క నెల్లూరు నగర పాలక సంస్థ నుంచే రూ.41.76కోట్లు నిలిచిపోయాయి. జిల్లాలో 61 శాఖా గ్రంథాలయాలు ఉన్నాయి. వీటిలో 12 భవనాలు కూలిపోయే స్థితికి చేరాయి. నెల్లూరులోని ప్రధాన గ్రంథాలయం పగుళ్లిచ్చింది. నూతన భవన నిర్మాణం రూ.3కోట్లతో చేపట్టినా.. నిధుల లేక మూడేళ్లుగా నిలిచిపోయింది.

సిబ్బంది కొరత

గ్రంథాలయాలను సిబ్బంది కొరత వేధిస్తోంది. జిల్లాలో 105 మంది సిబ్బంది ఉండాల్సి ఉండగా 48 ఉన్నారు. ఉద్యోగుల జీతాలు, అవసరమైన పుస్తకాలు, పేపర్లు ఇలా నెలనెలా రూ.60 లక్షల నుంచి రూ.65 లక్షలు ఖర్చవుతోంది. సెస్ రాబడి నెలకు రూ.30 లక్షలే వస్తుండటంతో జీతాలు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బకాయిల వసూళ్లపై జిల్లా కలెక్టర్ ఆనంద్, జేసీ కార్తీక్ రెండుసార్లు సమావేశాలు ఏర్పాటు చేసినా పరిస్థితిలో మార్పు రాలేదు.

బకాయిలు ఇలా..

కావలి మున్సిపాలిటీ రూ.1.23 కోట్లు, గూడూరు రూ.94 లక్షలు, ఆత్మకూరు రూ.65 లక్షలు, వెంకటగిరి రూ.76లక్షలు, నాయుడుపేట మున్సిపాలిటీ రూ.65లక్షలు, బుచ్చి నగర పంచాయతీ రూ.31 లక్షలు, అల్లూరు నగర పంచాయతీ రూ.5లక్షలు, 961 గ్రామ పంచాయతీలు రూ.3.01 కోట్లు చెల్లించాల్సి ఉంది.

నిర్వహణ కష్టం

– కుమార్ రాజా, జిల్లా గ్రంథాలయం కార్యదర్శి, నెల్లూరు

సెస్ బకాయిలు విడుదల కాకపోవడంతో గ్రంథాలయాల నిర్వహణ కష్టంగా మారుతోంది. నగర పాలక సంస్థ, మున్సిపాలిటీలు, పంచాయతీల నుంచి దాదాపు రూ.50కోట్ల వరకు రావాల్సి ఉంది. చెల్లించాలని పలుమార్లు స్థానిక సంస్థల అధికారులకు లేఖలు రాశాం. కలెక్టర్ ఆదేశాలతో నెల్లూరు కార్పొరేషన్ నెలకు రూ.20లక్షల బకాయిలు విడుదల చేస్తోంది. సకాలంలో చెల్లిస్తేనే అభివృద్ధి సాధ్యం.

రివ్యూ కామెంట్ల పేరుతో ఆన్‌లైన్ మోసం

నెల్లూరు(నేర విభాగం), న్యూస్‌టుడే: హోటళ్లకు రివ్యూ కామెంట్లు చేస్తే ఆన్‌లైన్‌లో నగదు సంపాదించవచ్చని కలెక్టరేట్‌లో పనిచేసే ఓ ఉద్యోగి నుంచి రూ.2.34లక్షలు కాజేసిన ఘటనపై వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరుగ్రామీణ మండలం తెలుగుగంగ కాలనీలో నివాసం ఉంటున్న మహేంద్ర బాబు కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్నారు. గతేడాది నవంబరు 20న టెలిగ్రామ్ ద్వారా ఆన్‌లైన్‌లో పార్ట్‌టైమ్ జాబ్స్ పేరుతో ఒక గ్రూపులో చేర్పించారు. హోటళ్లకు రివ్యూ ఇవ్వాలని, అందుకు తగిన కమీషన్ ఇస్తామని నమ్మబలికారు. ఈ క్రమంలో పలు దఫాలుగా రూ.2,34,207 డిపాజిట్ చేశారు. దీనిపై విచారించి న్యాయం చేయాలని బుధవారం బాధితుడు వేదాయపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

(c) eenadu

మహిళలకు కరపత్రాలు అందజేస్తున్న మంత్రి సవిత, తెదేపా జిల్లా అధ్యక్షుడు అంజినప్ప తదితరులు

కులమతాలకు అతీతంగా సంక్షేమ ఫలాలు

సుపరిపాలనలో తొలి అడుగులో మంత్రి సవిత

గోరంట్ల, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అందిస్తోందని.. వైకాపా అధినేత జగన్‌మోహన్‌రెడ్డి 2019లో జరిగిన ఎన్నికల్లో గాలికొట్టి.. గతేడాది ఎన్నికల్లో అదే గాలికి కొట్టుకుపోయాడని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత అన్నారు. కూటమి సర్కారు ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని గోరంట్ల మండలం వానవోలు పంచాయతీ కొలిమిపల్లిలో మంత్రి బుధవారం ప్రారంభించారు. గ్రామంలో ఇంటింటికీ తిరుగుతూ ఏడాదిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై వివరిస్తూ అభిప్రాయాలు తెలుసుకున్నారు. భూముల రీసర్వే చేసిన గ్రామాల్లో జగనే తప్పిదాలతో చాలా కుటుంబాలకు తల్లికి వందనం అందలేదని.. వాటిని సరిచేయడానికి చర్యలు చేపడతామన్నారు. మేనమామగా చెప్పుకొన్న జగన్ ఒకరికే అమ్మఒడి ఎందుకు ఇచ్చాడని ప్రశ్నించారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం, అన్నదాత సుఖీభవ అందజేస్తామన్నారు. గోరంట్లలో రూ.3.15 కోట్లతో ఇంటింటికీ కుళాయి నీరు అందించడానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. త్వరలో సొంత నిధులతో గోరంట్లలో అన్న క్యాంటీన్ ప్రారంభిస్తామన్నారు. తెదేపా జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, పార్టీ పరిశీలకుడు నరసింహారావు, నాయకులు బాలకృష్ణచౌదరి, రంగనాథం, రవినాయక్, జిలాన్, రమణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం పర్యటన విజయవంతం చేద్దాం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: సీఎం చంద్రబాబునాయుడు కొత్తచెరువులో ఈ నెల 10న పర్యటించే అవకాశం ఉంది. అధికారికంగా షెడ్యూల్ రావాల్సి ఉంది. అధికారులు సమన్వయంతో పని చేసి పర్యటన విజయవంతం చేయాలి' అని కలెక్టర్ టీఎస్ చేతన్ ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లో సీఎం పర్యటనపై జేసీ అభిషేక్‌కుమార్, డీఆర్వో విజయసారథితో కలిసి కలెక్టర్ జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించారు. తల్లికి వందనం కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం కొత్తచెరువులో పర్యటించే అవకాశం ఉంది. ఈ పర్యటనకు సంబంధించి ప్రతి శాఖకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించామని, ఎటువంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికాబద్ధంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో ప్రోటోకాల్‌కు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని, భద్రతా చర్యల విషయంలో పోలీసు విభాగం పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కాన్వాయ్‌లో ప్రత్యేక వైద్యులతోపాటు అత్యవసర మందులకు అంబులెన్స్ సిద్ధంగా ఉంచుకోవాలని వైద్యఆరోగ్యశాఖ అధికారులను ఆదేశించారు. బ్యారికేడింగ్ తదితర ఏర్పాట్లు ఆర్‌అండ్‌బీ అధికారులు పటిష్ఠంగా చేపట్టాలన్నారు. నిరంతరం విద్యుత్తు సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నైరుతి.. నైరాశ్యం

- మేఘాలు ఊరింపు
- ఖరీఫ్ సాగుపై కర్షకుల్లో సందిగ్ధం

"అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: మరో రెండు రోజుల్లో ఆరుద్ర కార్తె ముగియనుంది. ఇంతవరకు చినుకు జాడలేదు. గతేడాది కంటే ఈసారి ఉమ్మడి అనంత జిల్లాలో ముందస్తుగా రుతుపవనాలు ప్రవేశించడంతో భారీ వర్షాలు కురుస్తాయని తొలుత వాతావరణ శాఖ సంకేతాలు ఇచ్చింది. దీంతో అన్నదాతల్లో ఆశలు రేకెత్తాయి. జులై వచ్చినా వరుణుడు కరుణించడం లేదు. కారుమబ్బులు కమ్ముకుంటున్నా బలమైన గాలులతో మేఘాలను తరిమేస్తున్నాయి. దుక్కులు చేసుకుని సిద్ధంగా ఉన్న అన్నదాతలు నిత్యం ఆకాశం వైపు చూస్తున్నారు"

అనంతపురం: ఎదగని కంది మొక్కలు

వేసవిలో అధికం..

ఉమ్మడి జిల్లాలో సాధారణంగా ఏప్రిల్, మే నెలల్లో భారీగా ఉష్ణోగ్రతలు పెరిగాయి. ఆయా నెలల్లోనే సాధారణం కంటే అత్యధిక వర్షపాతం నమోదు కావడం గమనార్హం. మే చివరి వారంలో నైరుతి రుతుపవనాలు రావడంతో భారీ వర్షాలు కురిసి పంటలకు నష్టం వాటిల్లింది.

★ అనంత జిల్లాలో గతేడాది జూన్‌లో 61.0 మి.మీ సాధారణ వర్షపాతం కాగా 142 మి.మీ నమోదైంది. శ్రీసత్యసాయి జిల్లాలో గతేడాది జూన్‌లో 66.6 మి.మీ గాను 148.9 మి.మీ అత్యధికంగా నమోదైంది.

47 వేల ఎకరాల్లోనే..

జూన్ ఒకటి నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభమైంది. అన్ని రకాల పంటల సాధారణ సాగు లక్ష్యం 16,12,991 ఎకరాలు. ఇప్పటి వరకు 47,487 ఎకరాల్లోనే సాగయ్యాయి. అనంత జిల్లాలో సాధారణ సాగు లక్ష్యం 8,48,149 ఎకరాలు కాగా... అందులో 24,044 ఎకరాలు, శ్రీసత్యసాయి జిల్లాలో సాధారణ సాగు లక్ష్యం 6,64,842 ఎకరాలకుగాను 23,449 ఎకరాల్లో పంటలు సాగయ్యాయి.

గత మూడు నెలల్లో ఇరు జిల్లాల్లో సాధారణ, నమోదైన వర్షపాతం (మి.మీలో)

నెల	అనంతపురం		శ్రీసత్యసాయి	
	సాధారణ	నమోదు	సాధారణ	నమోదు
ఏప్రిల్	12.1	56.3	13.0	46.4
మే	36.7	101.5	42.4	116.9
జూన్	61.0	47.0	66.6	34.8

18 వేల ఎకరాల్లోనే వేరుసెనగ

ఉమ్మడి జిల్లాలో ప్రధాన పంట వేరుసెనగ ఇప్పటివరకు 18,786 ఎకరాల్లోనే సాగైంది. ఈనేపథ్యంలో కర్షకుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

★ కంది 8,653 ఎకరాలు, మొక్కజొన్న 6,714, పత్తి 6,675, ఆముదం 2,595, సజ్జ 1000 ఎకరాలు సాగైనట్లు వ్యవసాయశాఖ గణాంకాలు పేర్కొంటున్నాయి.

అరకొర పదునులో విత్తు వేసుకోవద్దు

- డాక్టర్ మల్లీశ్వరి, ప్రధాన శాస్త్రవేత్త, కేవీకే, రెడ్డిపల్లి

ఖరీఫ్ పంటల సాగుకు సమయం ఉంది. రైతులు ఆందోళన చెందాల్సిన పనిలేదు. జులై మొదటి వారం తర్వాత వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ పేర్కొంది. అరకొర పదునులో విత్తు వేసుకోవద్దు. మొలకరాక నష్టపోతారు. జులై నెలంతా సాగుకు అనుకూలమే. వేరుసెనగతో పాటు కంది, సజ్జ, కొర్రలు, పెసర తదితరాలు సాగు చేసుకోవడం ఉత్తమం.

మినీగోకులాల పాడిపోషకులకు రూ. 11.20 కోట్లు జమ

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శ్రీసత్యసాయి జిల్లావ్యాప్తంగా మినీ గోకులాలు నిర్మించుకున్న పాడిపోషకులకు ప్రభుత్వం రూ.11.20 కోట్లు నిధులు విడుదల చేసింది. లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ అయ్యింది. పూర్తి చేసిన వాటితో పాటు వివిధ దశల్లో ఉన్న వాటికి పనులకు అనుగుణంగా నగదు జమ అవుతోంది. చేసిన పనులను పరిగణనలోకి తీసుకుని క్షేత్రస్థాయిలో సిబ్బంది ఇప్పటి వరకు కొలతలు వేశారని డ్వామా పీడీ విజయప్రసాద్ తెలిపారు. ఆ మేరకు నగదు జమ అవుతుందన్నారు. సాంకేతిక, ఇతరత్రా కారణాల వల్ల ఎవరికైనా నగదు జమ కాకుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కూటమి ప్రభుత్వం జిల్లాలో 1,335 మినీ గోకులం షెడ్లను మంజూరు చేసింది. ఇందులో 904 పూర్తయ్యాయి. బిల్లులు సకాలంలో అందక పునాదిస్థాయిలో 230, పైకప్పు వరకు 82 నిర్మాణాలు నిలిచిపోయాయి. 119 నిర్మాణాలు నేటికీ చేపట్టలేదు. ఎట్టకేలకు బిల్లులు మంజూరు కావడంతో పాడిపోషకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

జగరాజుపల్లిలో నిర్మించిన మినీగోకులం షెడ్డు

రూపు మారనున్న రహదారి ఇదే..

రోడ్డు మరమ్మతుకు రూ.50 లక్షలు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ధర్మవరం పట్టణంలోని పోతుకుంట ఉపరితల వంతెనపై రోడ్డు మరమ్మతులకు కూటమి ప్రభుత్వం రూ.50 లక్షలు మంజూరు చేసింది. కి.మీ. పొడవున్న వంతెనపై అడుగడుగునా గోతులు పడ్డాయి. వందల సంఖ్యలో చోదకులు గోతులను అంచనా వేయలేక, వాహనాల వేగాన్ని నియంత్రించలేక కిందపడి గాయపడ్డారు. గత వైకాపా ప్రభుత్వంలో సంబంధిత శాఖా అధికారులు దారి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ప్రతిపాదనలు పంపినా అవి బుట్ట దాఖలయ్యాయి. రహదారులు, భవనాల శాఖాధికారులు ఉపరితల వంతెనకు నిధులు మంజూరు చేయాలని రెండు నెలల కిందట ప్రభుత్వానికి నివేదించారు. దీంతో నిధులు మంజూరు చేసి పనులకు టెండర్లు ఆహ్వానించారు. గుత్తేదారులతో పనులు నాణ్యతగా చేయించి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూస్తామని రహదారులు, భవనాల శాఖ డీఈ నాగపుల్లంరావు చెప్పారు.

విద్యార్థులూ.. బస్ పాసులు పొందండిలా

- 11 ఏళ్ల బాలురు.. పదోతరగతి వరకు బాలికలకు ఉచితం

కదిరి, పుట్టపర్తి, ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: పాఠశాలలు పునః ప్రారంభం అయ్యాయి. తరగతులు మారిన, కొత్తగా చేరేవారు ఇప్పటికే ప్రవేశాలు పొందారు. బడిలో పుస్తకాలు, ఇతర సామగ్రి కూడా పంపిణీ పూర్తయింది. దూరప్రాంత పిల్లలు బడికి వెళ్లేందుకు అనువుగా ఆర్టీసీ బస్సు పాసులు ఇస్తోంది. జిల్లాలో ఆయా ఆర్టీసీ డిపోల్లోని బస్టాండుల్లో విద్యార్థుల పాసుల కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. దూర ప్రయాణంతో బడికి వెళ్లే విద్యార్థులు ఉచిత, రాయితీ బస్ పాసులు పొందండిలా..

ఏమేం కావాలి..

ఆర్టీసీ బస్ పాసులు పొందేందుకు ప్రభుత్వ గుర్తింపు పొందిన విద్యాసంస్థల్లో విద్యార్థులు చదువుతుండాలి. ఆ పాఠశాలలో విద్యార్థి చదువుతున్న తరగతిని ప్రధానోపాధ్యాయుడితో ధ్రువపత్రం పొందాల్సి ఉంటుంది. దాంతోపాటు ఆధార్, రెండు పాసుపోర్టు సైజు ఫొటోలు దరఖాస్తుకు జత చేయాలి. పాసు కార్డు కోసం రూ.50 చెల్లించాల్సి ఉంటుంది. ఉచిత పాసులకైతే 20 కి.మీ. ప్రయాణించే అవకాశం ఉంటుంది. రాయితీ పాసుల విద్యార్థులకైతే 50 కి.మీ. దూర ప్రయాణానికి అనుమతి ఉంటుంది. అంతకు మించి పెరిగితే దూరానికి సీజనల్ పాసులు పొందాల్సి ఉంటుంది. ఆర్టీసీ గ్రామీణ ప్రాంత విద్యార్థులకు బడి బస్సులను నడుపుతోంది. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవచ్చు.

జిల్లా	శ్రీసత్యసాయి
ఆర్టీసీ డిపోలు	6
గతేడాది బస్‌పాసులు	6,741
ఈ ఏడాది ..	7,850

ఎవరెవరికి ఏఏ పాసులంటే..

ఆర్టీసీ పాఠశాల నుంచి కళాశాల విద్యార్థుల ప్రయాణానికి సదుపాయం కల్పిస్తోంది. ఇందులో పాఠశాలలో చదువుకునే 11 ఏళ్ల బాలురు, పదో తరగతి వరకు బాలికలకు ఉచిత పాసులు ఇస్తారు. ఒకసారి ఇచ్చే ఈ పాసులకు విద్యాసంవత్సరం ఆఖరు వరకు కాలపరిమితి ఉంటుంది. రాయితీ ప్రయాణ పాసులను 12 ఏళ్లు దాటిన పాఠశాల బాలురు, ఇంటర్, డిగ్రీతో పాటు వృత్తివిద్యా కోర్సులు చదువుకునే కళాశాల విద్యార్థులు పొందే అవకాశం ఉంది. రాయితీ ప్రయాణానికి నెలవారీ, త్రైమాసిక, వార్షిక బస్సు పాసులను పొందొచ్చు. విద్యార్థులు 33 శాతంతో కాలవ్యవధిని బట్టి మొత్తాలు చెల్లించాల్సి ఉంటుంది. ఆన్‌లైన్‌లో అయితే డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏపీఎస్‌ఆర్టీసీఆన్‌లైన్.ఇన్‌లో వివరాలు నమోదు చేసుకుని పొందిన పత్రాన్ని ఆర్టీసీ బస్టాండులోని కౌంటర్‌లో ఇస్తే పాస్ ఇస్తారు.

సీజనల్ వ్యాధులు ఎదుర్కోవడమెలా?

న్యూస్‌టుడే, అనంతపురం (వైద్యం): ప్రస్తుతం వాతావరణ మార్పులతో పాటు తాగునీరు కలుషితంతో మలేరియా, టైఫాయిడ్, డెంగీ, అతిసారం తదితర సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ఎలాంటి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి? ఒకవేళ సోకినా ఆయా ప్రభుత్వ వైద్యశాలల్లో ఎలాంటి సేవలు అందిస్తారు. వైద్యపరీక్షలు, అవసరమైన ఔషధాలు అందుబాటులో ఉన్నాయా.. తదితర అంశాలను మీరు తెలుసుకోవాలని అనుకుంటున్నారా.. అయితే మీకు 'ఈనాడు-మీతోడు' చక్కటి అవకాశం కల్పించనుంది. **అనంతపురం జిల్లా వైద్యఆరోగ్య శాఖాధికారిణి డాక్టర్ ఈ.బి.దేవి**తో ఫోన్‌లో నేరుగా మాట్లాడి.. సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు. సూచనలు, సలహాలు స్వీకరించవచ్చు. మీరు చేయాల్సిందల్లా కింద పేర్కొన్న నిర్ణీత తేదీన ఫోన్ నంబరుకు కాల్ చేయడమే..!

- ఫోన్ చేయాల్సిన తేదీ: 04-07-2025 (శుక్రవారం)
- సమయం: ఉదయం 10 గంటల నుంచి 11 గంటల మధ్య
- నంబర్లు : 80085 73008, 08554-277434

క్వాంటమ్ కంప్యూటింగ్‌పై ఒప్పందం

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: జేఎన్‌టీయూలో విద్యార్థులకు క్వాంటమ్ కంప్యూటింగ్‌పై తర్ఫీదు ఇవ్వడానికి గ్లోబల్ ఫౌండేషన్‌తో అవగాహన ఒప్పందం చేసుకొన్నట్లు ఉపకులపతి ఆచార్య సుదర్శనరావు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం రంగారెడ్డి జిల్లాలోని అడ్వెంట్ గ్లోబల్ ఫౌండేషన్, అనంతపురం జేఎన్‌టీయూ మధ్య బుధవారం అవగాహన ఒప్పందం జరిగింది. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆధ్వర్యంలో అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ ఏర్పాటు చేస్తున్నారు. అదే కోవలో రాష్ట్రంలోనే మొదటిసారి జేఎన్‌టీయూలో క్వాంటమ్ కంప్యూటింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. విద్యార్థులకు ఉన్నతమైన శిక్షణ, పారిశ్రామిక నైపుణ్యానికి సంబంధించిన కార్యకలాపాలు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు మెరుగు పరచుకోవాలన్నారు. ఇంటర్న్‌షిప్‌కు సంబంధించిన అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనుబంధ కళాశాలల విద్యార్థులకు ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. విశ్వవిద్యాలయం పర్యావరణ వ్యవస్థ, దేశ భవిష్యత్తు, సాంకేతిక అవసరాలకు అనుగుణంగా మార్పులు చేయడానికి ఈ ఒప్పందం తోడ్పడుతుందన్నారు. రిజిస్ట్రార్ కృష్ణయ్య మాట్లాడుతూ.. ఈ ఒప్పందంతో ఎన్ఎస్‌డీసీ, గ్లోబల్ ప్రమాణీకరించిన నైపుణ్యాలు, అడ్వాన్స్‌డ్ ల్యాబొరేటరీస్, డ్రోన్ కిట్స్, ఐఓటీ, అటానమస్ సిస్టమ్స్, క్వాంటమ్ కంప్యూటింగ్‌కు సంబంధించిన ప్రయోగశాలలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీసీ, రిజిస్ట్రార్‌తో పాటు ఓఎస్‌డీ దేవన్న, డైరెక్టర్లు సత్యనారాయణ, భానుమూర్తి, వైశాఖి ఘోర్పడే, సుబ్బారెడ్డి, సుజాత, సంస్థ ప్రతినిధులు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీనివాస్ భారతిపూడి, కిశోర్ పాల్గొన్నారు.

ఒప్పంద పత్రాలతో జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ కృష్ణయ్య తదితరులు

ద్విచక్ర వాహనాలను ప్రారంభిస్తున్న ఎస్పీ రత్న

ట్రాఫిక్ నియంత్రణకు కొత్త వాహనాలు

పుట్టపర్తి, న్యూస్‌టుడే: శాంతి భద్రతలు, అవాంఛనీయ ఘటనలు జరిగినప్పుడు, ట్రాఫిక్ నియంత్రణకు అత్యాధునిక ద్విచక్ర వాహనాలు దోహదపడతాయని ఎస్పీ రత్న పేర్కొన్నారు. బుధవారం వాహనాలకు ఎస్పీ జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం పుట్టపర్తిలో వాహనాలతో ర్యాలీ నిర్వహించారు. అత్యాధునిక టెక్నాలజీతో రూపొందించిన ఒక బుల్లెట్, 15 అపాచి, 5 శక్తి వాహనాలను మంజూరు చేసినట్లు చెప్పారు. వీటిని హిందూపురం, ధర్మవరం, పుట్టపర్తి సబ్ డివిజన్లకు కేటాయిస్తున్నామని తెలిపారు. విజిబుల్ పోలీసింగ్ పెరగడంతో ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తారని భావిస్తున్నామని తెలిపారు. వాహనాలను కేటాయించిన సీఎం చంద్రబాబు, డీజీపీ హరీష్‌కుమార్‌గుప్తాకు ఎస్పీ ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. డీఎస్పీలు విజయ్‌కుమార్, నరసింగప్ప, శివనారాయణస్వామి, ఆదినారాయణ, హేమంత్‌కుమార్, కేవీ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైకాపా నాయకుడి నివాసంలో పత్రాలు స్వాధీనం

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: వైద్యవిద్యార్థులకు సీట్ల కేటాయింపు, ఆసుపత్రుల అనుమతుల కోసం మధ్యవర్తిగా వ్యవహరిస్తూ భారీగా లంచాలు తీసుకున్నారన్న ఆరోపణలపై కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లికి చెందిన వైకాపా నాయకుడు, డాక్టర్ బత్తల హరిప్రసాద్ నివాసంలో మంగళవారం రాత్రి సోదాలు నిర్వహించిన సీబీఐ అధికారులు నగదు వివరాలు నమోదు చేసిన పుస్తకంతోపాటు కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అర్ధరాత్రి దాటాక కూడా తనిఖీలు చేసిన అధికారులు బత్తల హరిప్రసాద్ దిల్లీలోని సీబీఐ అధికారుల ఎదుట హాజరుకావాలని ఆయన కుటుంబసభ్యులకు నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. ఎన్ఎంసీ సభ్యులతో సత్సంబంధాలు కలిగిన డాక్టర్ బత్తల హరిప్రసాద్ చెన్నై వేదికగా మరికొందరితో కలిసి రెండు తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల్లో వైద్యవిద్యార్థులకు యాజమాన్య కోటా సీట్లు, ప్రైవేటు వైద్యశాలలకు సంబంధించిన అనుమతుల కోసం పెద్దమొత్తంలో లంచాలు తీసుకున్నట్లు ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. కోట్లాది రూపాయలు వసూలు విషయమై వచ్చిన ఫిర్యాదులు, ఆరోపణల దృష్ట్యా దాదాపు 35 చోట్ల ఒకేరోజు సీబీఐ అధికారులు తనిఖీలు చేసినట్లు సమాచారం. డాక్టర్ బత్తల హరిప్రసాద్‌కు చెన్నై, తిరుపతి, హైదరాబాద్ ప్రాంతాల్లో ఇళ్లు, ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నట్లు సీబీఐకి ఫిర్యాదు అందినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే సీబీఐ అధికారులు హరిప్రసాద్ స్వగ్రామమైన కుమ్మరవాండ్లపల్లిలో తనిఖీలు చేసినట్లు తెలుస్తోంది.

అటు వెడల్పు.. ఇటు లైనింగ్

- వేగంగా హంద్రీనీవా ఆధునికీకరణ
- మందకొడిగా పీబీసీ పనులు

అనంతపురం (శ్రీనివాస్‌నగర్), న్యూస్‌టుడే: ఉమ్మడి అనంత జిల్లా వరప్రదాయినిగా భావించే హంద్రీనీవా ప్రధాన కాలువ ఆధునికీకరణ పనులు కొనసాగుతున్నాయి. నీటి సీజన్ మొదలు కావడం.. శ్రీశైలం ప్రాజెక్టుకు వరద పోటెత్తడంతో పనుల పురోగతిపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారించింది. కాలువకు ఈనెలాఖరులోపు నీటిని విడుదల చేసే అవకాశం ఉండటంతో జిల్లా జలవనరుల శాఖ సీఈ నాగరాజు, ఎస్ఈ అన్నవరం స్వరూప్‌కుమార్.. క్షేత్ర స్థాయి పనులను పర్యవేక్షిస్తున్నారు. దీంతో ప్రధాన కాలువ పనుల్లో వేగం పెరిగింది. కానీ పుంగనూరు ఉప కాలువ(పీబీసీ) పనులు మందకొడిగా సాగుతున్నాయి. ఇక్కడ మట్టి తొలగింపులో వేగం పెరగాల్సి ఉంది. ఈనెల 10 నాటికి పూర్తి చేయాలని గడువు పెట్టుకున్నారు. ప్రధాన కాలువ తొలి దశ కింద వెడల్పు, రెండో దశలో పీబీసీ లైనింగ్ పనులు చేస్తున్న సంగతి తెలిసిందే.

తొలి దశ కింద కొనసాగుతున్న విస్తరణ పనులు

తొలి దశ కీలకం: ప్రధాన కాలువ తొలి దశ కింద విస్తరణ పనులు చేస్తున్నారు. 88 కి.మీ. నుంచి 216.300 కి.మీ. దాకా వెడల్పు చేయడానికి ప్రభుత్వం రూ.695.53 కోట్ల అంచనా వ్యయంతో పరిపాలన ఉత్తర్వు ఇచ్చిన సంగతి తెలిసిందే. 3850 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యంతో విస్తరిస్తున్నారు. మార్చి రెండో వారం నుంచి పనులు మొదలయ్యాయి. ఇప్పటివరకు 71.02 శాతం పనులు జరిగాయి. ● రెండో దశలో ప్రధాన కాలువ, పీబీసీ కలిపి లైనింగ్ పనులు 259 కి.మీ. చేయాల్సి ఉంది. 216 నుంచి 400 కి.మీ. దాకా ఇద్దరు గుత్తేదారులు ఐదు ప్యాకేజీలుగా విభజించారు. ఇందుకు రూ.1256.30 కోట్ల అంచనా వ్యయంతో పని చేస్తున్నారు. లైనింగ్ పనుల్లో జాప్యం జరుగుతోంది.

జేఎన్‌టీయూ ఇంజినీరింగ్ కళాశాల

జేఎన్‌టీయూ టు స్వీడన్

డబుల్ డిగ్రీ కోర్సులు ప్రారంభం

జేఎన్‌టీయూ, న్యూస్‌టుడే: అనంత జేఎన్‌టీయూలో ఇంజినీరింగ్ చదివితే స్వీడన్‌కు వెళ్లే అవకాశం ఉంది. స్వీడన్‌లోని బకింగ్‌హమ్ విశ్వవిద్యాలయంతో జేఎన్‌టీయూ ఒప్పందం కుదుర్చుకుంది. సాధారణంగా బీటెక్ చదివితే ఒక డిగ్రీ పట్టా వస్తుంది. జేఎన్‌టీయూ అందిస్తున్న డబుల్ డిగ్రీ కోర్సుల్లో నాలుగేళ్ల బీటెక్ కోర్సు పూర్తి చేస్తే ఒకేసారి రెండు డిగ్రీలు పొందొచ్చు. ఇక్కడ మూడేళ్లు, స్వీడన్‌లో ఏడాది చదవాల్సి ఉంటుంది. కోర్సు పూర్తి చేసిన విద్యార్థులకు జేఎన్‌టీయూ బీటెక్ పట్టా, స్వీడన్‌లోని ఇంజినీరింగ్ కళాశాల సర్టిఫికెట్ ప్రదానం చేయనున్నారు. 2017 నుంచి కళాశాల ఈ సదవకాశాన్ని కల్పిస్తోంది. ఇటీవలే మాస్టర్స్ డిగ్రీ జత కలిపారు.

ప్రవేశాలు ఎలా..

డబుల్ డిగ్రీ కోర్సుల్లో చేరాలంటే ఇంటర్మీడియట్‌లో 60 శాతంతో ఉత్తీర్ణులై ఉండాలి. జేఈఈ, ఈఏపీసెట్ గాని, తెలంగాణ ఈఏపీసెట్‌లో అర్హత సాధించి ఉండాలి. జేఈఈలో ర్యాంకు సాధించిన వారికి 50 శాతం ప్రవేశాలు కల్పిస్తారు. కంప్యూటర్ సైన్స్ విభాగంలో 20, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ విభాగంలో 10 సీట్లున్నాయి.

ప్రయోజనం ఏమిటి?

విదేశీ విద్య, ఉద్యోగాలు చేయాలనుకొనేవారికి కోర్సు ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. జేఎన్‌టీయూ అందించే బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (బీఎస్సీ) సర్టిఫికెట్‌తో ఎంఎస్‌లో చేరడానికి ప్రవేశ పరీక్ష రాయాల్సిన అవసరం ఉండదు. నేరుగా ఎంఎస్‌లో చేరి స్వీడన్‌లోనే కొలువులు సాధించవచ్చు.

ఈనెల 10 వరకు గడువు

- ఆచార్య సుదర్శనరావు, ఉపకులపతి, జేఎన్‌టీయూ

దరఖాస్తుకు ఈనెల 10 తుది గడువుగా నిర్ణయించాం. 14 న కౌన్సెలింగ్ నిర్వహించనున్నాం. ఏటా రూ.1.50 లక్షలు చెల్లించాల్సి ఉంటుంది. చివరి ఏడాది స్వీడన్ కళాశాల నిర్ణయించిన మేరకు ఫీజు చెల్లించాలి. అక్కడ ఉత్తమ మార్కులు సాధిస్తే ఉపకారవేతనం లభిస్తుంది. సాధారణ బీటెక్‌లా కాకుండా డబుల్‌డిగ్రీ కోర్సుల్లో చేరడం వల్ల రెండు డిగ్రీలు లభిస్తాయి. ఆసక్తి గలవారు సద్వినియోగం చేసుకోవచ్చు.

రూ.వంద కోసం గొడవ..

కత్తితో గొంతు కోసిన వైనం

నంబులపూలకుంట (గాండ్లపెంట), న్యూస్‌టుడే: రూ.వంద కోసం గొడవపడి కత్తితో గొంతు కోసిన ఘటన ఎన్పీకుంట మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. నల్లగుట్టపల్లికి చెందిన నరసింహులు, చీమలచెరువుపల్లికి చెందిన రవీంద్రారెడ్డి రూ.100 కోసం వాదించుకున్నారు. ఈ క్రమంలో రవీంద్రారెడ్డి కత్తితో నరసింహులు గొంతు కోశాడు. ఈ ఘటన పోలీసు స్టేషన్‌కు కూతవేటు దూరంలో జరిగింది. బాధితుడు చికిత్స చేయించుకొని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఇద్దరిని విచారిస్తున్నట్లు ఎస్ఐ వలిబాషా తెలిపారు. మామిడి కాయల డబ్బుల విషయంలో గొడవపడినట్లు ఆయన తెలిపారు.



(c) eenadu

భక్తిశ్రద్ధలతో ఐదో సరిగెత్తు

గూగూడుకు పోటెత్తిన భక్తులు

పూజలందుకున్న కుళ్లాయిస్వామి పీర్లు

నార్పల, న్యూస్‌టుడే : మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన గూగూడు కుళ్లాయిస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఐదో సరిగెత్తును భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తెల్లవారుజాము నుంచే పీర్ల చావిడిలో అర్చకులు హుసేనప్ప ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి భక్తులకు స్వామి దర్శన భాగ్యం కల్పించారు. జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. పోలీసులు ఆలయం వద్ద ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులు గుండంలో చక్కెర, కొబ్బెర వేసి మొక్కులు చెల్లించారు.

జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాలకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ప్రసాద్‌బాబు విజ్ఞప్తి చేశారు. కనీసం 10 సంవత్సరాలు ఉపాధ్యాయులుగా పని చేసి ఉండాలన్నారు. ఇతర వివరాలకు డీఈవో బ్లాక్‌స్పాట్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలన్నారు. ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు.

కూరగాయల నార్లు సిద్ధం

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే : జిల్లాలో కూరగాయ పంటలు సాగు చేసే రైతులను దృష్టిలో ఉంచుకుని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో టమాటా, వంగ, మిరప నార్లు అందుబాటులో ఉంచుతున్నామని కేవీకే శాస్త్రవేత్త త్రికల మాధవి తెలిపారు. షేడ్ నెట్‌లో ఆరోగ్యకరమైన వాతావరణంలో నాణ్యమైన విత్తనాలతో కూరగాయల నారు మడులు పెంచుతున్నామన్నారు. పీకేఎం-1 రకం మునగ మొక్కలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆసక్తి ఉన్న రైతులు నేరుగా రెడ్డిపల్లి కేవీకేలో సంప్రదించాలన్నారు. పూర్తి వివరాలకు చరవాణి : 99497 37160 నంబరుకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చని శాస్త్రవేత్త తెలిపారు.

నాన్న దిద్దిన జీవితం

జన్మనిచ్చిన నాన్నే వారికి బ్రహ్మగా మారారు. బ్రహ్మ రాసిన తలరాతను సైతం తన రెక్కల కష్టంతో మార్చి బ్రహ్మాండమైన జీవితాన్నిచ్చారు. తండ్రి కష్టాన్ని కళ్లారా చూసిన ఆ కుర్రాళ్లు కసితో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించి.. తల్లిదండ్రుల కలలు నెరవేర్చారు. నాన్న ఆటోడ్రైవర్ కాగా.. కుమారుల్లో ఒకరు శాస్త్రవేత్త, మరొకరు ఇంజినీరు. రాప్తాడు నియోజకవర్గం కనగానపల్లికు చెందిన తండ్రీకుమారుల స్ఫూర్తిదాయక కథనం.

– ఈనాడు, పుట్టపర్తి

పూజారి నాగభూషణం, ఉమాదేవిలకు ఇద్దరు కుమారులు నాగప్రదీప్, నాగసాయి. కనగానపల్లిలో ఉన్న నాలుగెకరాల్లో పంటలు పండేవి కావు. పిల్లలకు రెండుపూటలా భోజనం పెట్టడం కష్టమైన పరిస్థితుల్లో నాగభూషణం సరకుల రవాణా వ్యాన్ నడుపుతూ జీవనం సాగించేవారు. తన కష్టం పిల్లలకు రాకూడదని, ఉన్నతస్థానాల్లో చూడాలని కలలు కన్నారు. వారిని 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ధర్మవరంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో చేర్పించారు. హాస్టల్‌లో ఉంచి చదివించే ఆర్థిక స్థోమత లేకపోవడంతో డేస్కాలర్‌గా చేర్పించారు.

ఆటోడ్రైవర్‌గా మారి..

పిల్లలు రోజూ పాఠశాలకు వెళ్లి రావడం కష్టంగా మారింది. దీంతో రవాణా వ్యాన్‌ను విక్రయించి తనే ఆటోడ్రైవర్‌గా మారారు. ఉదయాన్నే పిల్లలను ధర్మవరంలో వదిలిన తర్వాత సాయంత్రం వరకు ఆటో తిప్పేవారు. తర్వాత పిల్లలను గ్రామానికి తీసుకొచ్చేవారు. అలా 12 ఏళ్లు గడిచింది. పదో తరగతి అనంతరం విజయవాడలోని ప్రైవేట్ కళాశాలల్లో ఇంటర్మీడియట్‌లో చేర్పించారు.

కుమారులతో తల్లిదండ్రులు నాగభూషణం, ఉమాదేవి

భారం తగ్గించాలని..

ఇంటర్మీడియట్ వరకు తండ్రి కష్టమ్మీద ఆధారపడిన యువకులు తర్వాత బాగా చదివి ర్యాంకులు తెచ్చుకున్నారు. నాగప్రదీప్ ఎంసెట్‌లో మంచి ర్యాంకు సాధించి అనంతపురం జేఎన్‌టీయూలో 2020లో బీటెక్ పూర్తి చేశాడు. ఎంటెక్ ప్రవేశ పరీక్షలోనూ ఉత్తమ ర్యాంకుతో బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌లో సీటు సాధించాడు. ఇక్కడ చదువుతుండగానే తన పరిశోధనలపై గతేడాది సెప్టెంబరులో ఇటలీ, ఫ్రాన్స్, ప్యారిస్, రోమ్ తదితర నగరాల్లో పేపర్ ప్రజంటేషన్ ఇచ్చాడు. ఎంటెక్ తర్వాత సెంట్రల్ ఇంటెలిజెన్స్ బ్యూరో, బార్క్, ఇస్రోతోపాటు రెండు కంపెనీల్లో ఉద్యోగాలు సాధించాడు. శాస్త్రవేత్త కావాలని చిన్నప్పటి నుంచి లక్ష్యంగా పెట్టుకున్న నాగప్రదీప్ ఈ ఏడాది ఫిబ్రవరిలో శ్రీహరికోటలో ఇస్రో శాస్త్రవేత్తగా విధుల్లో చేరాడు.

అన్నబాటలో..

నాన్నపై ఆర్థిక భారం తగ్గించాలని భావించిన రెండో కుమారుడు నాగసాయి అన్నలాగే కష్టపడి చదివి ఎస్వీయూలో బీటెక్ పూర్తి చేశాడు. ఎన్‌టీపీసీలో ఉద్యోగంలో చేరాడు. తర్వాత ఐవోసీఎల్‌లో ఉద్యోగానికి ఎంపికయ్యాడు. అక్కడ చేరడం ఇష్టంలేని నాగసాయి తను కలలుకన్న ఓఎన్‌జీసీలో ఇంజినీరుగా ఉద్యోగం సాధించాడు. ప్రస్తుతం రాజమండ్రిలో పనిచేస్తున్నాడు. ఇక్కడ రెండువారాలు విధులు, మరో రెండు వారాలు సెలవులు ఉండటంతో దీన్ని అనుకూలంగా మార్చుకొని సివిల్స్‌కు సిద్ధమవుతున్నాడు. ఎస్పీ కావాలన్న అమ్మ కోరికను తీర్చేందుకు శాయశక్తులా ప్రయత్నిస్తున్నాడు.

న్యాయవాదవృత్తితో బాధితులకు న్యాయం..

నమూనా పరీక్షలు రాస్తున్న అభ్యర్థులు

అనంతపురం (మూడో రోడ్డు), న్యూస్‌టుడే: న్యాయవాద వృత్తితో బాధితులకు న్యాయం అందించడం సాధ్యమవుతుందని ఐఏఎల్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ రసూల్ అన్నారు. ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ఆధ్వర్యంలో బుధవారం బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో జూనియర్ సివిల్ న్యాయమూర్తుల ఉద్యోగ పోటీ పరీక్షల అభ్యర్థులకు నమూనా నిర్వహించారు. అబ్దుల్ రసూల్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగాల్లో జడ్జి ఉద్యోగాలు భిన్నమైనవన్నారు. నేరం చేసిన వాడికి శిక్ష విధించి, అభాగ్యులైన బాధితులకు న్యాయం అందించే అవకాశం ఉందన్నారు. సమాజంలో ఎక్కడా న్యాయం జరిగే పరిస్థితి లేకపోవడంతో సామాన్యులు పూర్తిగా కోర్టులపై ఆధార పడుతున్నారన్నారు. సివిల్ కేసులైనా, క్రిమినల్ కేసుల్లోనైనా కోర్టుల్లోనే న్యాయం లభిస్తుందన్నారు. విభిన్నమైన ఉద్యోగాన్ని ఎంచుకున్న అభ్యర్థులను ఆయన అభినందించారు. ప్రజల్లో కోర్టులపై ఉన్న విశ్వాసాన్ని కాపాడేలా న్యాయవాదులు కృషి చేయాలన్నారు. చట్టాల్లోని లోపాలను సవరించేందుకు కూడా ఐఏఎల్ కృషి చేస్తుందన్నారు.

శింగనమల తెదేపాలో భగ్గుమన్న వర్గ విభేదాలు

ఎమ్మెల్యేపై కార్యకర్తల తిరుగుబాటు

గొడవ కారణంగా సమావేశం నుంచి బయటకు వెళ్తున్న తెదేపా నాయకులు

రాంనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే : శింగనమల నియోజకవర్గం తెదేపాలో మరోసారి వర్గ విభేదాలు భగ్గుమన్నాయి. గ్రామ, మండల కమిటీల ఏర్పాటుకు బుధవారం సాయంత్రం అనంతపురం రహదారుల, భవనాల శాఖ అతిథి గృహంలో ఎమ్మెల్యే బండారు శ్రావణి ఆధ్వర్యంలో సమావేశమయ్యారు. ఈ సమావేశానికి ద్విసభ్య కమిటీ సభ్యులు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, కార్యకర్తలు, నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. పార్టీ కోసం ఎంతో కష్టపడ్డాం. ఎన్నికల ముందు ఎమ్మెల్యే గెలుపునకు శక్తివంచన లేకుండా పనిచేశాం. తెదేపా అధికారంలోకి వస్తే న్యాయం జరుగుతుందని అంతా ఆశించాం. ఏడాది గడిచిపోయినా ఏ ఒక్కరికీ న్యాయం జరగలేదు..అంటూ పలు సమస్యలపై నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యేను ప్రశ్నించారు. నియోజకవర్గంలో కనీసం చౌకధరల దుకాణాలు, ఉపాధి హామీ పథకంలో క్షేత్రస్థాయి సహాయకుల పోస్టులు ఇవ్వడం లేదని నిలదీశారు. కష్టపడితే మీరిచ్చే గుర్తింపు ఇదేనా అంటూ ఆగ్రహంతో ఊగిపోయారు. క్లస్టర్ ఇన్‌ఛార్జులు పనిచేయడం లేదని, ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని ఎమ్మెల్యే అసహనం వ్యక్తం చేయడంతో కార్యకర్తల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. బుక్కరాయసముద్రంలో చౌకధర దుకాణం నిర్వహిస్తున్న వ్యక్తిని రాజీనామా చేయించి ఇస్తాం. దరఖాస్తు చేసుకోవాలని స్వయానా ఎమ్మెల్యే చెప్పారని క్లస్టర్ ఇన్‌ఛార్జి నరేంద్ర యాదవ్ తెలిపారు. ఎన్నోసార్లు ఇస్తామని చెప్పి.. చివరకు దుకాణం డీలరు ఇచ్చే ప్రసక్తే లేదని తెగేసి చెప్పి అవమానపరుస్తారా? అంటూ ఎమ్మెల్యేని ప్రశ్నించారు. పరిశీలకులు పర్వీన్‌తాజ్, కాటమయ్య ఎంత సర్దిచెప్పే ప్రయత్నం చేసినా కార్యకర్తలు వినలేదు. ఎమ్మెల్యే మాట్లాడిన మాట తీరుపై ఏడీసీసీ బ్యాంకు ఛైర్మన్ కేశవరెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, పర్వతనేని శ్రీధర్‌బాబు, రామలింగారెడ్డి, ఆయా మండలాల కన్వీనర్లు, ఇతర నాయకులంతా బయటకు వెళ్లిపోయారు. పోలీసులు చేరుకుని ఇరువర్గాలకు సర్దిచెప్పి పంపించారు.

మెస్‌బిల్లుల స్వాహా.. ఉద్యోగిపై కేసు

అనంత నేరవార్తలు: అనంతపురం మెడికల్ కళాశాలలో వైద్య విద్యార్థుల మెస్ బిల్లులు పక్కదారి పట్టించిన కేసులో ప్రధాన ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగిని సాకే ఓబులేశ్వరి అలియాస్ వాణిని రెండో పట్టణ పోలీసులు బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. మెస్ బిల్లులు సుమారు రూ.20 లక్షలు కాజేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ గత నెలలో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితురాలిని అరెస్టు చేశారు.

ధాన్యం సరే.. డబ్బులు ఇవ్వరా!

కలెక్టరేట్ వద్ద అన్నదాతల నిరసన

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: రెండు మాసాల క్రితం రబీ సీజన్ వరి ధాన్యాన్ని సేకరించారు. దీనికి తగిన రూ.10 కోట్ల డబ్బులు ఇవ్వకుండా రైతులను ఇబ్బందికి గురి చేయడం సరికాదని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున విమర్శించారు. బుధవారం రైతు సంఘం ఆధ్వర్యంలో అనంత కలెక్టర్ కార్యాలయం ప్రధాన గేటు ముందు నిరసన తెలిపారు. మొన్నటి రబీ సీజన్‌లో రైతుల నుంచి రూ.వంద కోట్ల ఖరీదు చేసే ధాన్యాన్ని తీసుకున్నారు. కొంతమేర డబ్బులు చెల్లించారు. బొమ్మనహాళ్, కణేకల్లు వంటి మండలాలకు చెందిన రైతుల నుంచే 10 వేల మెట్రిక్ టన్నుల వరిని ప్రభుత్వం సేకరించింది. అక్కడి రైతులకు ఇంకా రూ.10 కోట్లు బకాయి ఉందని గుర్తుచేశారు. ఈ బకాయిలు సత్వరమే చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామన్నారు. ఆ తర్వాత డీఆర్‌ఓ మాలోలకు వినతి అందజేశారు. ఈ నిరసనలో సీపీఐ రాయదుర్గం కార్యదర్శి నాగార్జున, నాయకులు తిప్పేస్వామి, బండి రామకృష్ణ, టి.నారాయణస్వామి, రామాంజనేయులు, ఆనంద్, తిమ్మప్ప, గోవిందు, పెద్దిరెడ్డి, ఆంజనేయులు, దేవా, తేజ పాల్గొన్నారు.

ఎస్కేయూలో టెండర్లు

ఎస్కేయూ, న్యూస్‌టుడే: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో అద్దె గదులు, క్యాంటీన్ నిర్వహణకు బుధవారం టెండర్లు నిర్వహించారు. రిజిస్ట్రార్ రమేశ్‌బాబు నేతృత్వంలోని కమిటీ సమక్షంలో ప్రక్రియ జరిగింది. క్యాంటీన్‌కు రూ.29 వేలు అద్దె ప్రకారం టెండరు నిర్ణయించారు. దీంతో పాటు మరో నాల్గు దుకాణాలకు టెండర్లు నిర్వహించారు.

EENADU Classifieds

EDUCATION

GNM అడ్మిషన్స్: ఇంటర్మీడియట్‌లో Any గ్రూపు పాస్ స్టూడెంట్స్‌కి G.N.M (నర్సింగ్) గవర్నమెంట్ సీట్స్‌కి అడ్మిషన్స్ జరుగుచున్నవి. Only గర్ల్స్ కాలేజీలో అడ్మిషన్స్ పొందవచ్చు. G.మురళి 9030661651, ATP.

REAL ESTATE

PLOT FOR SALE

ముదిగుబ్బ మండలం రాళ్ళ అనంతపురంలో హైవేకు అనుకొని ఉన్న 75 సెంట్ల స్థలము, ATP టౌన్ ఈనాడు ఆఫీసు దగ్గరలో ఉన్న 4 సెంట్ల స్థలం వెంటనే అమ్మబడును. Con: 9912733883.

JOBS

Wanted: Tutors (Gents), Bus Incharges, PET's Montessori Elite EM School, Gollapalli, Rapthadu (M), Anantapur. Cont: 9666332816, 9866676304.

ప్రముఖ సప్లయర్స్ నందు పనిచేయుటకు మేనేజర్ కావలెను. వయస్సు 35 పైన ఉండవలెను. ఆకర్షణీయమైన జీతం. సంప్రదించండి: 9949089001.

MARKETING/ SALES

ATP టౌన్‌లోని కన్‌స్ట్రక్షన్స్ & ఇంటీరియర్స్ ఆఫీస్ నందు మార్కెటింగ్ చేయడానికి లేడీస్ ఫీల్డ్ స్టాఫ్ కావలెను. ఆకర్షణీయమైన జీతం + టూవీలర్ మస్ట్. వివరాలకు సంప్ర: 9666958268.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU CLASSIFIEDS

5 లైన్ల ప్రకటన రూ.395/- మాత్రమే

తక్కువ ఖర్చుతో... ప్రతిరోజు క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వండి.... అధిక స్పందనలు పొందండి. వాహనాల అమ్మకం... ఉద్యోగాల భర్తీ... ఇళ్లు, ఫ్లాట్లు, స్థలాల అమ్మకాలు, కొనుగోళ్లు... ఇళ్లు, షాపులు, ఫ్లాట్లు అద్దెకు మరియు అన్నిరకాల బిజినెస్ వ్యవహారాలు...

వివరాలకు : 8008709784

ప్రకటనలపై జి.ఎస్.టి. 5% వర్తించబడును

ANDHRA PRADESH STATE WAQF BOARD

(Imdad Ghar, 4th Floor, Adjacent to Head Post Office, Vijayawada-01)

F.No. 149/Lease/DM&Rent/ATP/2024, Dated: 02-07-2025

TENDER NOTICE

Sealed tenders are invited from the interested bidders / persons to participate in the bid for utilization of JCNRM (Moulana Abul Kalam) Shadi Khana hall only for Exhibition of Handicrafts and Handlooms purpose situated at Tadipatri (Town & Mandal) Anantapuramu District for a period of Forty five (45) days only from the date of handing over of the premises.

The tender schedule can be obtained from the 0/o A.P.State Waqf Board at Vijayawada during office hours or can be downloaded from the QR code. For further details please contact Mobile No.9949352388.

Sd/- CHIEF EXECUTIVE OFFICER

టెండర్ నోటీసు

మైరాడ కదిరి ప్రాజెక్ట్, కుమ్మరవాండ్లపల్లి గ్రామం, కదిరి, శ్రీ సత్యసాయి జిల్లా, ఆంధ్రప్రదేశ్. వద్ద కార్యాలయ భవనం నిర్మాణం కోసం అర్హత కలిగిన సివిల్ కాంట్రాక్టర్ల నుండి సీల్డ్ టెండర్లు ఆహ్వానించబడ్డాయి.

నిర్మాణ పనుల ప్రాంతం వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి:

గ్రౌండ్ ఫ్లోర్ 193.2 చదరపు మీటర్లు

మొదటి అంతస్తు @ 7.2 మీ LVL - 59.94 చదరపు మీటర్లు

మొదటి అంతస్తు @ 8.55 మీ LVL - 135.36 చదరపు మీటర్లు

ప్రధాన గది-24.88 చదరపు మీటర్లు

బిడ్డర్ అర్హత:

1. టెండరర్ సంబంధిత ప్రభుత్వ అధికారుల నుండి క్లాస్‌వన్ లైసెన్స్ కలిగి ఉండాలి.
2. తన పేరు మీద ఉన్న టెండరర్ గత ఐదు సంవత్సరాలలో అంటే 2020-21 నుండి 2024-25 వరకు ప్రధాన కాంట్రాక్టర్‌గా సంతృప్తికరంగా పూర్తి చేసి, కనీసం రూ. 100.00 లక్షల విలువైన ఒకేలాంటి పనిని పూర్తి చేసి ఉండాలి.

పైన పేర్కొన్న చిరునామాలో బిడ్డింగ్, సపోర్టింగ్ డాక్యుమెంట్లతో పాటు, సమర్పించడానికి చివరి తేది:- 25, జులై 2025.

వివరణాత్మక బిడ్డింగ్ మరియు సంబంధిత పత్రాలు మరియు మరిన్ని ప్రశ్నల కోసం దయచేసి సంప్రదించండి:

మైరాడ కదిరి ప్రాజెక్ట్

రాయచోటి రోడ్, కుమ్మరవాండ్ల పల్లి, కదిరి- 515591, ఆంధ్రప్రదేశ్.

Contact No : 6281153249, 7893673959, 9490802988

ఇమెయిల్ :- kdrmyrada@gmail.com

HEFT ENERGY CONCEPT TO COMPLETION

WALK-IN DRIVE
M/s HEFT ENERGY PRIVATE LIMITED

Join one of the fastest-growing companies in Renewable Energy Sector We are conducting walk-in interviews for the following roles:

★ Positions: Technicians

★ Date & Time: 05-07-2025 to 06-07-2025, Time: 9.00 AM to 05.00 PM

★ Venue: Alexander Hotels, No.11-120, Sapthagiri Circle, OPP. To Municipal Corporation office, Anantapur, AP – 515001.

★ Eligibility

- Qualification: ITI - Fitter, Electrician, Rigger & Mechanical
  Experience: 1–5 years – Preferable from Wind Sector, Engineering & Construction. ITI / Diploma – Freshers
- Experienced Technicians (Non-Qualified)
  Minimum 3 Years experience in Wind, Engineering & Construction.
- Helper – Experienced in construction Sector – Minimum 3 yrs

Bring updated resume, Present employer salary slips, Aadhar Card, PAN Card, Passport Size photo, Academic & Experience Certificates.

Note: "Male Candidates Only"

Contact: 9344997784, 9626499837
Email: hr@heft-energy.com

ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి : శ్రీరామ్

గీతానగర్‌లో కరపత్రాలు అందజేస్తున్న పరిటాల శ్రీరామ్ తదితరులు

ధర్మవరం, న్యూస్‌టుడే: ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, రాష్ట్రాభివృద్ధి గురించి తెదేపా శ్రేణులు ఇంటింటికి వెళ్లి ప్రజలకు తెలియజెప్పాలని ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంపై ధర్మవరంలోని మారుతి రాఘవేంద్రస్వామి కల్యాణ మండపంలో బుధవారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పరిటాల శ్రీరామ్ పాల్గొని మాట్లాడారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం చంద్రబాబు నెరవేర్చారన్నారు. ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, తల్లికి వందనం, దీపం పథకం గురించి పార్టీ శ్రేణులు ప్రజలకు తెలియజెప్పాలన్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం స్థానిక 17వ వార్డు గీతానగర్‌లో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని పరిటాల శ్రీరామ్ ప్రారంభించారు. ఇంటింటా వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు అందించారు. కార్యక్రమంలో రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కాటమయ్య, తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి రమేశ్‌బాబు, మార్కెట్ యార్డు వైస్ ఛైర్మన్ అయ్యప్ప, ఉమ్మడి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు నాగభూషణ, మాజీ ఎంపీపీలు మద్దిలేటి, వేణుగోపాల్‌రెడ్డి, జడ్పీటీసీ మాజీ సభ్యుడు రామాంజనేయులు, తెలుగు మహిళా నియోజకవర్గ అధ్యక్షురాలు ముతుకూరు బీబీ, తెదేపా పట్టణాధ్యక్షుడు సుధాకర్, నియోజకవర్గ క్లస్టర్ ఇన్‌ఛార్జి మహేశ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ముగ్గురు సర్వేయర్లకు షోకాజ్ నోటీసులు

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: గత నెల 29న జరిగిన సాధారణ బదిలీల కౌన్సెలింగ్‌లో అనవసర రాద్ధాంతం చేయడం, సహ ఉద్యోగులకు ఇబ్బందులు సృష్టించారన్న అభియోగంపై ముగ్గురు గ్రామ సర్వేయర్లకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. జిల్లా సర్వే, భూమి రికార్డుల అధికారి (డీఎస్ఎల్ఏ) రూపా నాయక్ ఈ ఉత్తర్వులు జారీ చేశారు. తాఖీదులు పొందిన వారిలో శ్రీసత్యసాయి జిల్లా అమడగూరు మండలం జౌకుల కొత్తపల్లి గ్రామ సర్వేయర్ ఎం.మహేశ్ నాయుడు, అగళి మండలం అగళి సచివాలయ సర్వేయర్ యు.తిప్పేస్వామి, అనంత జిల్లా గుత్తి మండలం కరడికొండకు చెందిన ఎస్.రవికుమార్ ఉన్నారు. ఈ ముగ్గురూ కౌన్సెలింగ్ రోజున తరచూ గొడవలు చేయడమే కాదు.. అరుపులు, కేకలతో కౌన్సెలింగ్‌కు అంతరాయం కలిగించారని నోటీసులో పేర్కొన్నారు. వీరి మూలంగా చంటి బిడ్డలతో హాజరైన మహిళలు ఇబ్బంది పడ్డారు. ఆ రోజు రాత్రంతా కౌన్సెలింగ్ జరగడానికి వారే కారణమని చెప్పారు. ఏవైనా సమస్యలు, అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా తెలపాలని సూచించినా పెడచెవిన పెట్టారని తెలిపారు.

పంచాయతీరాజ్‌శాఖ ఇన్‌ఛార్జి ఎస్ఈగా ప్రభాకర్‌రెడ్డి

లక్ష్మీనగర్ (అనంతపురం),న్యూస్‌టుడే: అనంతపురం జిల్లా పంచాయతీరాజ్‌శాఖ ఇన్‌ఛార్జి ఎస్ఈగా ప్రభాకర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు తీసుకున్నారు. అనంతపురం పీఆర్ఐ డివిజన్ ఈఈగా పనిచేస్తున్న ఆయనకు ఇన్‌ఛార్జి ఎస్ఈగా నియమించారు. ఇక్కడ ఎస్ఈగా పనిచేస్తున్న జహీర్ అస్లాం ఈ నెల 30న పదవీ విరమణ పొందారు. నూతనంగా బాధ్యతలు తీసుకున్న ఎస్ఈని డీఈలు లక్ష్మీనారాయణ, రవీంద్రతో పాటు అధికారులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలిపారు. పీఐయూ ఇన్‌ఛార్జి ఈఈగా పనిచేస్తున్న ప్రభాకర్‌రెడ్డిని తప్పించి ఆయన స్థానంలో చిత్తూరు జిల్లాలో డీఈగా పనిచేస్తున్న నవీన్‌కు బాధ్యతలు అప్పగిస్తూ ఆశాఖ ఈఎన్‌సీ బాలునాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.

భారీ స్కోరు దిశగా చిత్తూరు జట్టు

125 పరుగులకే కుప్పకూలిన కడప

శతకం చేసిన శశాంక్ సూర్యచరణ్ (5 వికెట్లు)

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: సౌత్‌జోన్ అంతర్ జిల్లా మూడు రోజుల క్రికెట్ రెండో రౌండు పోటీల్లో చిత్తూరు జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో భారీస్కోరు దిశగా పయనిస్తోంది. తొలిరోజు బుధవారం ఆటముగిసే సమయానికి ఆ జట్టు కడప జట్టుపై 33 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా 194 పరుగులు చేసింది. బ్యాటర్లు శశాంక్ (104), సీఆర్ జ్ఞానేశ్వర్ (89) అద్భుత బ్యాటింగ్‌తో అజేయంగా నిలిచారు. అంతకుముందు ఉదయం టాస్ గెలిచి మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్ చేపట్టిన కడప జట్టు 38.4 ఓవర్లలో 125 పరుగులకే కుప్పకూలింది. ధ్రువకుమార్ (35), జయవర్ధన్ (24)లు తప్ప మిగతా బ్యాటర్లు పేలవంగా ఆడారు. చిత్తూరు బౌలరు దీప్ సాయినాథ్ 5 వికెట్లు కూల్చి కడప జట్టు పతనాన్ని శాసించాడు. మరో పోటీలో కర్నూలు జట్టు నెల్లూరు జట్టుపై మొదటి ఇన్నింగ్స్‌లో 70 ఓవర్లలో 8 వికెట్లకు 208 పరుగులు చేసింది. వి.సంజయ్ నాయుడు (85), సూర్యతేజ (61) బ్యాటింగ్‌లో రాణించారు. గురువారం ఈ రెండు పోటీలు ఎలా మలుపు తిరుగుతాయో వేచిచూడాల్సిందే!

జూన్‌లో రూ.92 కోట్ల జీఎస్టీ వసూలు

అరవిందనగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: ఈ ఆర్థిక సంవత్సరం జూన్‌లో రూ.92 కోట్లు జీఎస్టీ వసూలైంది. 70 శాతం వృద్ధి నమోదుతో ఉమ్మడి అనంతపురం జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచింది. 2024లో ఇదే నెలలో వసూళ్ల (రూ.54 కోట్లు) కంటే ఇది రూ.38 కోట్లు ఎక్కువ. అదే సమయంలో ఈ ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసిక నికర జీఎస్టీ వసూళ్లతో ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. గతేడాది తొలి త్రైమాసిక పన్ను వసూళ్లు రూ.307 కోట్లు కాగా గత ఆర్థిక సంవత్సరంలో తొలి 3 నెలల్లో వసూళ్లు రూ. 261 కోట్లు.

కడుపులో ఆరు కిలోల గడ్డ తొలగింపు

సర్వజన వైద్యశాలలో మహిళకు అరుదైన శస్త్రచికిత్స

లక్ష్మితో శస్త్రచికిత్స చేసిన గైనకాలజీ వైద్యుల బృందం

అనంతపురం(వైద్యం), న్యూస్‌టుడే: నగరంలో ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గైనకాలజీ విభాగంలో వైద్యసేవలు పొందేందుకు చేరిన లక్ష్మి అనే మహిళకు వైద్యులు అరుదైన శస్త్రచికిత్స చేశారు. ఈ మేరకు గుత్తికి చెందిన లక్ష్మి (44) కడుపులో గడ్డ పెరుగుతుండటంతో తీవ్ర ఆయాసంతో ఇబ్బంది పడుతుండటంతో ఆమె కుమారైలు చికిత్స చేయించేందుకు గత నెల 23న తీసుకువచ్చి గైనకాలజీ ఓపీలో వైద్యులకు చూపించారు. ఆమెను పరిశీలించిన వైద్యులు స్కానింగ్, రక్త పరీక్షలు చేయించి. కడుపులో 6 కిలోల గడ్డ ఉన్నట్లు గుర్తించారు. ఆమెకు హిమోగ్లోబిన్ కేవలం నాలుగు శాతం ఉండటంతో మొదటగా నాలుగు యూనిట్లు రక్తం ఎక్కించారు. అనంతరం ఆమెకు బుధవారం ఆపరేషన్ థియేటర్‌లో గైనకాలజీ హెచ్‌వోడీ షంషాద్ బేగం పర్యవేక్షణలో వైద్యులు నిస్సార్ బేగం, సౌజన్యలతో పీజీలు ఊర్మిల, రమణిలు శస్త్రచికిత్స చేసి గడ్డను తొలగించారు. ప్రస్తుతం లక్ష్మి ఐసీయూలో ఉందని ఆరోగ్యం నిలకడగా ఉందని తెలిపారు.

రైలు కిందపడి ఒకరి బలవన్మరణం

గుత్తి, న్యూస్‌టుడే : గుత్తి జీఆర్పీ స్టేషన్ పరిధిలోని గుంతకల్లు మండలంలోని తిమ్మాపురం వద్ద బుధవారం ఉదయం గుర్తు తెలియని ఓ వ్యక్తి(50) బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి వివరాలు తెలియరాలేదని రైల్వే పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పంచనామా నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

అప్పులు తీర్చే మార్గం కానరాక..

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణం కక్కలపల్లి కాలనీకి చెందిన బండి నాగార్జున (32) ఆర్థిక ఇబ్బందులతో బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతడు గొర్రెల వ్యాపారంతో పాటు కాపరిగా ఉండేవాడు. వ్యాపారం నిమిత్తం ప్రైవేటు వ్యక్తుల వద్ద రూ.15 లక్షల వరకు అప్పులు చేశాడు. వాటిని తీర్చే మార్గం లేకపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. ఈ క్రమంలో చెట్టుకు ఉరి బిగించుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుని భార్య చందన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

బ్యాంకు ఖాతాలో నగదు మాయంపై ఫిర్యాదు

యాడికి, న్యూస్‌టుడే : ఓ మహిళ బ్యాంకు ఖాతాలో నగదు మాయం అయిన ఘటన యాడికిలో బుధవారం వెలుగుచూసింది. యాడికిలోని అంత్రాలవీధిలో వడ్డే జయమ్మ నివాసం ఉంటున్నారు. వైకాపా ప్రభుత్వంలో సచివాలయ పరిధిలో వాలంటీర్లు పింఛన్లు పంచేవారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వాలంటీర్ల వ్యవస్థే లేకుండా పోయింది. అప్పటి నుంచి సచివాలయ ఉద్యోగులే పింఛన్లు పంపిణీ చేస్తూ వచ్చారు. ఇటీవల పింఛన్ పంపిణీ సమయంలో పలు చోట్ల మాజీ వాలంటీర్ల సేవలను సచివాలయం ఉద్యోగులు వినియోగించుకుంటున్నారు. దీంతో వడ్డే జయమ్మకు పింఛన్ ఇచ్చేటప్పుడు యాడికి సచివాలయంలోని ఓ కార్యదర్శి మాజీ వాలంటీరును తన వెంట తీసుకెళ్లాడు. ఈక్రమంలో మాజీ వాలంటీరు పింఛను లబ్ధిదారురాలు జయమ్మ ఇంటి వద్దకు వెళ్లి జనాభా లెక్కలు అంటూ ఆధార్ తీసుకుని డివైజ్ ద్వారా వేలిముద్రను వేయించుకున్నాడు. ఆ తర్వాత ఆమె ఖాతాలోని రూ.10 వేలు ఉపసంహరించినట్లు చరవాణికి సంక్షిప్త సమాచారం వచ్చింది. అనుమానంతో వాలంటీరు చరవాణికి ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని రావడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసుల విచారణలో అసలు విషయం తెలియాల్సి ఉంది.

450 అరటి మొక్కల నరికివేత

నరికివేసిన అరటి మొక్కల వద్ద రైతు

తాడిపత్రి, న్యూస్‌టుడే : కొండపల్లి గ్రామానికి చెందిన విజయ్‌కుమార్ పొలంలో అరటి మొక్కలను మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు నరికివేశారు. విజయ్‌కుమార్ కిష్టిపాడు సమీపంలో కొంతపొలాన్ని కౌలుకు తీసుకుని అరటి పంటను సాగు చేశారు. తనపై కక్ష పెంచుకున్న కొందరు 450 మొక్కలు నరికివేసినట్లు బాధితుడు వాపోయారు. గ్రామంలో తనపై ఎవరికీ కక్షసాధింపు లేదని, తనను ఆర్థికంగా దెబ్బతీయాలనే ఎవరో ఇలా చేశారని పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదని భార్యపై భర్త దాడి

ఆపై ఉరి వేసుకొని ఆత్మహత్య

ధర్మవరం, న్యూస్‌టుడే: మద్యం తాగేందుకు డబ్బు ఇవ్వలేదని భార్యపై భర్త దాడి చేశాడు. ఆపై ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ధర్మవరంలో చోటుచేసుకుంది. వన్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. ధర్మవరం ప్రియాంకనగర్‌కు చెందిన లింగారెడ్డి (45), లక్ష్మీదేవి దంపతులు మగ్గం నేస్తూ జీవనం సాగిస్తున్నారు. మద్యానికి బానిస అయిన అతడు బుధవారం భార్యను డబ్బు అడిగాడు. తన వద్ద లేవని చెప్పడంతో మగ్గం కర్ర తీసుకొని భార్యపై దాడి చేశాడు. స్థానికుల సమాచారం మేరకు కుమారుడు సాయినాథ్ రెడ్డి గాయపడిన లక్ష్మీదేవిని చికిత్స నిమిత్తం అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. లింగారెడ్డి ఇంట్లోకి వెళ్లి చీరతో ఉరి బిగించి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు లింగారెడ్డి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ధర్మవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

హిందూపురం

•హిందూపురం •పెనుకొండ •మడకశిర

'ధర్నా విజయవంతం చేయండి'

హిందూపురం, న్యూస్‌టుడే: ఏపీపీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ఈనెల 4, 5 తేదీల్లో చేపట్టే ధర్నా విజయవంతం చేయాలని ఆ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక ఆర్టీసీ బస్టాండులో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం రీజినల్ నాయకులు నారాయణస్వామి, బాబయ్య తదితరులు మాట్లాడుతూ.. ఆర్టీసీలో పదోన్నతులకు వెంటనే అనుమతులు, విద్యుత్తు బస్సులను ప్రభుత్వ సాయంతో నిర్వహించాలని, ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం చెల్లించాల్సిన పీఆర్సీ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. ఆర్టీసీ ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నాయకులు ఇర్షాదుల్లా, నాగరాజు, హనుమంతరెడ్డి, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

హిందూపురం : 80085 73018
పెనుకొండ : 91000 20922
మడకశిర : 76759 19016

సమస్య: రంగనపల్లి ప్రాథమిక పాఠశాల ముందు భాగంలోని ట్యాంకుకు నీరందించడం లేదు. **- రంగనాథ్**
సమాధానం: ట్యాంకును శుభ్రం చేయించి, కుళాయిలు బిగించి నీరందిస్తాం. **- అనిత, సర్పంచి**
సమస్య: ఎల్.కే.పల్లి వడ్రహట్టిలో వీధి దీపాలు మరమ్మతుకు గురవడంతో రాత్రివేళల్లో ఇబ్బందులు పడుతున్నాం. **- గంగాధర్**
సమాధానం: వారంలోగా కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. **- లక్ష్మమ్మ, సర్పంచి**
– న్యూస్‌టుడే, రొళ్ల
సమస్య: అమరాపురం మండలం కోర్రేవు ఎస్సీ కాలనీలో కాలువలు లేవు. దీంతో మురుగు రోడ్డుపై ప్రవహిస్తోంది. **- కదురుప్ప**
సమాధానం: మురుగు నిల్వ లేకుండా చర్యలు తీసుకుంటాం. **- నరేశ్, పంచాయతీ కార్యదర్శి**
సమస్య: నిద్రఘట్ట ఇందిరమ్మ కాలనీలో వీధి దీపాలు వెలగడం లేదు. **- కృష్ణమూర్తి**
సమాధానం: వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయిస్తాం. **- ఈరన్న, పంచాయతీ కార్యదర్శి**
– న్యూస్‌టుడే, అమరాపురం

సమస్యలు.. పరిష్కారం

హిందూపురం అర్బన్: పట్టణంలోని వివిధ కాలనీల్లో నెలకొన్న సమస్యలను 'ఈనాడు'లో మేమున్నాం..మీకు తోడుగా అనే శీర్షిక ప్రచురితం కావడంతో సంబంధిత అధికారి స్పందించారు. పట్టణంలోని శ్రీనివాస థియేటర్ నుంచి తేజ నర్సింగ్ హోం ఆసుపత్రి వరకు రోడ్డుకు ఎడమవైపు, కంసలపేటలోని చౌడేశ్వరి ఆలయం నుంచి మెయిన్‌బజార్ వెళ్లే ప్రాంతంలో కాలువలు శుభ్రం చేయకపోవడంతో దుర్గంధం వస్తోంది. మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ శంకర్ పారిశుధ్య కార్మికులను పంపి శుభ్రం చేయించారు.

మట్టిదారులు.. రాకపోకలకు అవస్థలు

సీసీ రోడ్లు, కాలువల నిర్మాణాల కోసం ఎదురుచూపులు

గుడ్డం వెళ్లే మట్టి రోడ్డు ఇలా..

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పురపాలిక పరిధిలోకి చేరి ఏళ్లు గడుస్తున్నా.. పూర్తిస్థాయిలో సిమెంటు రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యేదెన్నడోనని పట్టణ పరిధిలోని నింకంపల్లి, గుడ్డం ప్రాంతాల ప్రజలు ఎదురుచూస్తున్నారు. పదేళ్ల కిందట వేసిన సీసీరోడ్లు మినహా తర్వాత కొత్తగా నిర్మించలేదు. తాత్కాలికంగా ఉన్న మట్టిరోడ్లే శరణ్యం. ప్రస్తుతం అవి కూడా దెబ్బతిన్నాయి. చిన్నపాటి వర్షం వచ్చినా బురదమయంగా మారడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చాలా వీధుల్లో సీసీ రోడ్లు ఉన్నా కాలువలు లేవు. కొన్నిచోట్ల కాలువలు ఉన్నా అపరిశుభ్రత తొలగించడం లేదని ఆందోళన చెందుతున్నారు.

మున్సిపాలిటీ	: హిందూపురం
ప్రాంతాలు	: నింకంపల్లి, గుడ్డం
గృహాలు	: 879
జనాభా	: 3,526 మంది

సమస్య ఉన్న ప్రాంతాలు..

ఎంజీఎం మైదానం మీదుగా గుడ్డం ఆలయానికి, బైపాస్ రోడ్డు నుంచి పాలిటెక్నిక్ కళాశాల, రైల్వే వంతెన నుంచి ఎస్‌డీజీఎస్ కళాశాల మీదుగా, నింకంపల్లి ప్రధాన రోడ్డు నుంచి విద్యారణ్య ఆవాస విద్యాలయం, సప్తగిరి కళాశాల, శ్మశానవాటికకు వెళ్లే దారులన్నీ మట్టిరోడ్లే. దీంతో తరచూ వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడుతున్నట్లు చోదకులు వాపోయారు. ఇళ్లలోని వృథా నీరు రోడ్లపై వేయడంతో దుర్వాసనతో పాటు దోమల అభివృద్ధి, పందుల స్వైరవిహారం చేయడంతో తీవ్ర అపరిశుభ్రత నెలకొంటుందని ప్రజలు వాపోతున్నారు. శివారు ప్రాంతాల్లో వీధి దీపాలు పనిచేయడం లేదు. కొన్నిచోట్ల స్తంభాలు ఏర్పాటు చేయలేదు.

అంచెలంచెలుగా నిర్మాణాలు

వచ్చిన నిధులు సర్దుబాటు చేసి కాలనీలు, ప్రాంతాలను గుర్తించి అంచెలంచెలుగా సిమెంటు రోడ్లు, కాలువల నిర్మాణాలు సాగుతున్నాయి. గుడ్డం, నింకంపల్లిని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. రెండ్రోజుల్లో తాత్కాలిక మరమ్మతులు చేపడతాం.

- మల్లికార్జున, మున్సిపల్ కమిషనర్

గోరంట్లను పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేస్తాం

గోరంట్ల: వంతెన నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న మంత్రి సవిత

గోరంట్ల, న్యూస్‌టుడే: గోరంట్ల ప్రాంతాన్ని పారిశ్రామిక హబ్‌గా అభివృద్ధి చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మండలంలోని బూదిలి సమీపంలో చిత్రావతి నదిపై రూ.8.52 కోట్లతో ప్రధానమంత్రి గ్రామీణ సడక్‌యోజన (పీఎంజీఎస్‌వై) నిధులతో చేపట్టిన నూతన వంతెన నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేశారు. అధికారులు, గుత్తేదారు సమన్వయంతో పనులను రెండేళ్లలోపు వంతెన నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. గత ప్రభుత్వం భూమిపూజలు, కొబ్బరికాయలు కొట్టడం, రంగులు వేయడం తప్ప సరి చేసిందేమీ లేదని విమర్శించారు. 190 మీటర్ల పొడవుతో నిర్మిస్తున్న వంతెనతో 14 గ్రామాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ బాలకృష్ణచౌదరి, మాజీ కన్వీనర్ సన్న, నియోజకవర్గ పరిశీలకుడు నరసింహారావు, సోమశేఖర్, విద్యాధరణి, నటరాజ్, ప్రభుశంకర్, రవి, లక్ష్మీపతి, శంకరరెడ్డి, కుమార్, తహసీల్దారు మారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి నుంచి పారిశ్రామికవేత్తగా ఎదగాలి

పెనుకొండ: ప్రతి ఇంటి నుంచి ఓ మహిళ పారిశ్రామికవేత్తగా ఎదిగేలా అవగాహన కల్పించాలని వెలుగు అధికారులను మంత్రి సవిత ఆదేశించారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ఐదు మండలాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. వెలుగు 25వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా కేకు కోసి సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు. కమ్యూనిటీ పెట్టుబడి నిధి ద్వారా సోమందేపల్లి మండలానికి రూ.10 లక్షలు, గోరంట్లకు రూ.15 లక్షలు, పెనుకొండకు రూ.20 లక్షల మెగా చెక్కు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, ఏపీఎం రవిచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాలపై జాగ్రత్తలు పాటించండి

సోమందేపల్లి: రోడ్డు ప్రమాదాలపై ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని సీఐ రాఘవన్ తెలిపారు. ఎస్సై రమేశ్‌బాబుతో కలిసి మండలంలోని పందిపర్తి గ్రామస్థులకు అవగాహన కల్పించారు. వాహన చోదకులు శిరస్త్రాణం ధరించాలన్నారు. సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నాయకులు అమీనుల్లా, శ్రీనివాస్‌రెడ్డి, జగన్నాథ్ నాయక్ పాల్గొన్నారు.

రోటరీక్లబ్ అభివృద్ధికి పాటుపడతాం

ఎన్నికైన సభ్యులు

హిందూపురం అర్బన్, న్యూస్‌టుడే: పట్టణంలోని రోటరీ క్లబ్‌లో 2025-26 నూతన కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా అనంతపురం రోటరీక్లబ్ డీజీఈ కేశవరెడ్డి హాజరై క్లబ్ అధ్యక్షుడిగా కల్యాణ్‌కుమార్, కార్యదర్శిగా శ్రీధర్‌గౌడ్, ట్రెజరర్‌గా విజయ్‌కుమార్‌లతో ప్రమాణం చేయించారు. క్లబ్ అభివృద్ధికి పాటు పడతామని, సభ్యుల సహకారంతో మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. ఇన్నర్‌వీల్ క్లబ్ అధ్యక్షురాలిగా శ్రీలక్ష్మి, కార్యదర్శిగా స్వాతి ఎన్నికయ్యారు. వారిని తోటి మిత్రులు, బంధువులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ సుమంత్, సభ్యులు శ్రీనివాసులు, గోవర్ధన్‌రెడ్డి, అరుణ్, వరదరాజులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

లేపాక్షి: సన్మానం అందుకున్న ఉపాధ్యాయులతో హెచ్ఎం శేషగిరిబాబు, తదితరులు

లేపాక్షి: మండలంలోని కొండూరు ఉన్నత పాఠశాలలో పని చేసి బదిలీపై వివిధ ప్రాంతాలకు వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం హెచ్ఎం శేషగిరిబాబు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయులు గోపి, అనిల్‌కుమార్, జగదీశ్, అశోక్‌బాబు, శంకర్, భద్రయ్య, విశ్వనాథ్‌బాబు సేవలు కొనియాడారు.

మడకశిర గ్రామీణం: మండలంలోని ఉన్నత పాఠశాలలో పని చేసి బదిలీపై వివిధ పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులను గ్రామ పెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి కృషి చేశారని ప్రధానోపాధ్యాయురాలు గిరిజ వారి సేవలను ప్రశంసించారు.

కూటమి ప్రభుత్వంతోనే ప్రజాసంక్షేమం

మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ తిప్పేస్వామి తదితరులు

హిందూపురం: కరపత్రం అందజేస్తున్న తెదేపా జిల్లా అధ్యక్షుడు అంజినప్ప, నాయకులు

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమం సాధ్యమని ఎంపీ బీకే పార్థసారథి, ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి పేర్కొన్నారు. మండలంలోని చందకచర్ల, గొడనపల్లి గ్రామాల్లో బుధవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం నిర్వహించారు. చందకచర్ల ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రతి ఇంటికి వెళ్లి కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరించారు. ఎన్టీఆర్ భరోసా పింఛను, దీపం పథకం, తల్లికి వందనం అమలు, మెగా డీఎస్సీ, పరిశ్రమల స్థాపన వంటి అనేక కార్యక్రమాలను వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. వివిధ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన వినతులను స్వీకరించి వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం చందకచర్లలోని 78 కుటుంబాలు వైకాపా నుంచి తెదేపాలోకి చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డా. శ్రీనివాసమూర్తి, మండల కన్వీనర్, క్లస్టర్, యూనిట్ తదితరులు పాల్గొన్నారు.

గుడిబండ: గుడిబండ, మండలపల్లి, ముత్తుకూరు, సీసీగిరి రాళ్లపల్లి తదితర పంచాయతీ గ్రామాల్లో తెదేపా నాయకులు ప్రచారం నిర్వహించారు. మండల కన్వీనర్ ఓబన్నరసప్ప, మాజీ కన్వీనర్ మద్దనకుంటప్ప, యూనిట్ ఇన్‌ఛార్జులు జనార్దన్, దర్శన్, బుడ్డేన్, చెరువు ఆయకట్టు సంఘం అధ్యక్షుడు నిరంజన్, శ్రీరామప్ప, ఈరన్న, సుధాకర్, రుద్రముని, తిప్పేస్వామి ప్రభుత్వ పథకాలను ప్రజలకు తెలియజేశారు.

హిందూపురం: కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందని ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిజం చేశామని తెదేపా జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప అన్నారు. 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమం బుధవారం స్థానిక సూగూరు ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేసి ప్రారంభించారు. సూగూరు, తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం చేపట్టిన పథకాలు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేశ్, ఎమ్మెల్యే బాలకృష్ణ వ్యక్తిగత కార్యదర్శి డా. సురేంద్ర, కార్యదర్శి బాలాజీ, పార్టీ నియోజకవర్గం సమన్వయకర్త శ్రీనివాసరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు వెంకటేశ్, గ్రామీణ మండల అధ్యక్షుడు రాము, మార్కెట్‌యార్డు అధ్యక్షుడు అశ్వర్థనారాయణ, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపల్ బాధ్యతల స్వీకరణ

హిందూపురం గ్రామీణం: సి. వెల్లేపల్లి వద్ద ఉన్న ఏపీ ఆదర్శ పాఠశాల ప్రిన్సిపల్‌గా రమేశ్‌బాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. పుట్టపర్తి నుంచి బదిలీపై వచ్చారు. ఇక్కడ ఉన్న ప్రిన్సిపల్ శోభన్‌నాయక్ బదిలీపై మంత్రాలయం వెళ్లారు. పాఠశాల, కళాశాలల అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు.

పరిశ్రమల యాజమాన్యాలకు సమ్మె నోటీసులు

హిందూపురం: కార్మికుల సమస్యల పరిష్కారానికి దేశవ్యాప్తంగా ఈనెల 9న తలపెట్టిన సార్వత్రిక సమ్మె నేపథ్యంలో తూముకుంట పారిశ్రామికవాడలోని వివిధ పరిశ్రమల యాజమాన్యాలకు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం నోటీసులు అందజేశారు. పరిశ్రమల్లో పని చేసే కార్మికులు, వస్త్ర పరిశ్రమల్లో పనిచేసే మహిళా కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి నోటీసులు ఇవ్వడం జరిగిందని సీఐటీయూ పట్టణ కార్యదర్శి రాము తెలిపారు.

రహదారి పనుల పరిశీలన

సోమందేపల్లి: మండలంలోని రంగేపల్లి నుంచి అదే గ్రామంలోని రైల్వేస్టేషన్ మధ్య ఉన్న మట్టి రోడ్డు పనులను బుధవారం ఎంపీడీవో వెంకటలక్ష్మమ్మ పరిశీలించారు. ప్రయాణికులతో పాటు రైతుల రాకపోకలకు అనువుగా ఉంటుందని సర్పంచి నరసింహులు, జడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరమణ సూచనల మేరకు ఉపాధి కూలీలతో పనులు చేయిస్తున్నారు.

గుంత తవ్వారు.. పూడ్చడం మరిచారు

హిందూపురం పట్టణంలోని ఎన్టీఆర్ సర్కిల్ రోడ్డు నుంచి కంసలపేటకు వెళ్లే రహదారి ఎప్పుడు జనసంచారంతో రద్దీగా ఉంటుంది. నీటి పైపుల మరమ్మతుల కోసం మున్సిపల్ సిబ్బంది గుంతను తవ్వి.. పూడ్చడం మరిచారు. దీంతో రాత్రిళ్లు గమనించకపోతే కిందపడి ప్రమాదానికి గురై అవకాశం లేకపోలేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గుంతను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయమై మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను వివరణ కోరగా.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

– న్యూస్‌టుడే, హిందూపురం అర్బన్

దెబ్బతిన్న సూచిక బోర్డులు

కొడికొండ చెక్‌పోస్టు నుంచి మడకశిర మీదుగా శిరకు వెళ్లే జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన సూచిక బోర్డులు పలుచోట్ల విరిగిపోయాయి. మడకశిర పట్టణ సమీపంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డు వద్ద మడకశిర, ఆగళి రహదారులను సూచిస్తూ ఏర్పాటు చేసిన బోర్డు వాహనం ఢీకొని ధ్వంసమైంది. దీంతో వాహన చోదకులు స్థానిక ప్రజలను మార్గం అడిగి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. వెంటనే దెబ్బతిన్న సూచిక బోర్డులకు మరమ్మతులు చేసి వాహనచోదకులకు మార్గం తెలిసేలా చూడాల్సిన అవసరం ఉంది. ఈ విషయమై జాతీయ రహదారుల అధికారి గిడ్డయ్యను వివరణ కోరగా పరిశీలించి, సూచిక బోర్డులను ఏర్పాటు చేయిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, మడకశిర గ్రామీణం

తడి, పొడి చెత్తను వేరుచేయండి

చెత్తను సేకరిస్తున్న పంచాయతీ సిబ్బంది

హిందూపురం గ్రామీణం, న్యూస్‌టుడే: పంచాయతీ కేంద్రమైన తూముకుంటలో సర్పంచి రత్నమ్మ అధ్యక్షతన బుధవారం వానపాముల ఎరువు తయారీపై అధికారులు ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామ కార్యదర్శి కెంచరాయప్ప పర్యవేక్షణలో పారిశుధ్య సిబ్బందికి చెత్తను అందజేయాలని ప్రజలను కోరారు. తడి, పొడి చెత్తను వేరు చేయడం, ఇంటి దగ్గరకు తెచ్చే కుండీలకు వేయాలని సూచించారు. వారానికి రెండుసార్లు ప్రతి ఇంటి నుంచి వేరు చేసిన చెత్తను సంపద కేంద్రానికి తీసుకెళ్లి వానపాముల ఎరువును తయారు చేయడం జరుగుతుందని కార్యదర్శి తెలిపారు.

భక్తులకు సౌకర్యాలు కల్పించాలి

చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, కమిటీ సభ్యులు

మడకశిర, న్యూస్‌టుడే: మడకశిర పట్టణంలోని శ్రీ సద్గురు షిర్డీసాయిబాబా ఆలయంలో ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించే గురుపౌర్ణమికి భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఆలయ కమిటీ సభ్యులకు సూచించారు. బుధవారం కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. స్వామి వారి దర్శనానికి భక్తులకు ఎలాంటి ఆటంకం లేకుండా చూడాలన్నారు. సాయిబాబా ట్రస్టు వ్యవస్థాపకుడు రిటైర్డ్ డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి పీహెచ్‌సీలో కాన్పులు జరగాలి: డీఎంహెచ్‌వో

ఫ్లెక్సీని ప్రదర్శిస్తున్న డీఎంహెచ్‌వో ఫైరోజా బేగం, తదితరులు

మడకశిర గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పులు జరిగేలా చూడాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిణి డా. ఎస్. ఫైరోజా బేగం, డిప్యూటీ జిల్లా వైద్యాధికారిణి డా. మంజువాణి పేర్కొన్నారు. బుధవారం మడకశిర అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు, చిన్న పిల్లల వ్యాధి నిరోధక టీకాలు వందశాతం అందించాలన్నారు. అందరికి ఆరోగ్య గుర్తింపు కార్డులు అందేలా చూడాలని తెలిపారు. జులై నెల డెంగ్యూ నివారణ మాసోత్సవంగా ప్రభుత్వం గుర్తించిన సందర్భంగా ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అనంతరం డెంగ్యూ మాసోత్సవ ఫ్లెక్సీని ప్రదర్శించారు. కార్యక్రమంలో డా. నాగేంద్ర నాయక్, డీపీహెచ్‌ఎన్‌వో వీరమ్మ, ఎస్‌వో కళాధర్, అసిస్టెంట్ మలేరియా అధికారి లక్ష్మానాయక్, సబ్‌యూనిట్ అధికారి షమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలి

సోమందేపల్లి: చాలకూరులో రైతులకు మొక్కజొన్న సాగుపై అవగాహన కల్పిస్తున్న ఏవో విజయభారతి, తదితరులు

కొడిగెనహళ్లి (పరిగి), న్యూస్‌టుడే: ఖరీఫ్ పంటల సాగులో సస్యరక్షణ చర్యలు పాటించాలని ఏవో శ్రీకృష్ణ సూచించారు. బుధవారం మండలంలోని పెద్దరెడ్డిపల్లిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. జిల్లా తెలుగు యువత కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఉద్యానవన శాఖ సహాయకులు అనిల్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

అగళి: వ్యవసాయంలో నూతన పద్ధతులు పాటిస్తే మంచి దిగుబడి సాధించవచ్చని ఏవో నాగరాజు తెలిపారు. మండలంలోని ఇరిగేపల్లి, పి. బ్యాడిగెర గ్రామాల్లో 'పొలం పిలుస్తుంది' కార్యక్రమం నిర్వహించారు. విత్తనశుద్ధి, కౌలు కార్డులపై రైతులకు వివరించారు.

సోమందేపల్లి: ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధాన మంత్రి పసల్ బీమా యోజనా పథకాన్ని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి విజయభారతి తెలిపారు. బుధవారం మండలంలోని చాలకూరు, కేతగానిచెరువు గ్రామ రైతులకు పలు పంటల సాగు విధానాలు, సస్యరక్షణ చర్యలపై వివరించారు. బీమా కంపెనీ ప్రతినిధులు నరేంద్ర, అశోక్, ఏఈవో అలేఖ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని వినతి

హిందూపురం: చిలమత్తూరు మండలం కోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పరిధిలోని గ్రామాలకు ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలని ఆ ప్రాంతానికి చెందిన నాయకులు బుధవారం డీఎం శ్రీకాంత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. విద్యార్థులు జడ్పీ ఉన్నత పాఠశాలకు రావాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని డీఎం తెలిపారు. కార్యక్రమంలో తెదేపా మండల కన్వీనర్ శ్రీనివాస్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, నాగార్జున, సూర్యనారాయణ, సూరి, రిజ్వాన్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డీఎం శ్రీకాంత్‌తో మాట్లాడుతున్న నాయకులు

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరి మృతి

గోరంట్ల: మండలంలోని కసిరెడ్డిపల్లి సమీపంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో ఒకరు మృతిచెందాడు. తలపై వాహనం వెళ్లడంతో మృతుడి ఆచూకీ గుర్తుపట్టలేని విధంగా మారింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు.

దారికి కంచె వేశారని ఫిర్యాదు

రొద్దం, న్యూస్‌టుడే: రొద్దం పంచాయతీలోని చిన్నకోడిపల్లిలో తన ఇంటికి దారి లేకుండా కంచె వేశారని బాధితుడు పోతన్న బుధవారం తహసీల్దారు ఉదయ్‌శంకర్‌రాజుకు ఫిర్యాదు చేశాడు. ఇళ్ల మధ్యలో ఉన్న రహదారికి సమీపంలో మల్లికార్జున తన గృహం చుట్టూ కంచె వేసుకున్నట్లు తెలుసుకున్న పోతన్న నిలదీశాడు. ఈ విషయమై ఇద్దరు వాగ్వాదం చేసుకున్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దారు తెలిపారు.

ఇంటి తాళాలు పగలగొట్టి చోరీ

హిందూపురం: పట్టణంలోని మార్కండేయ నగర్‌లో నివాసముంటున్న కృష్ణవేణిబాయి, తన భర్త బాలునాయక్‌తో కలిసి రెండ్రోజుల కింద కొత్తచెరువు సమీపంలోని గంగేపల్లికి వెళ్లారు. గమనించిన దుండగులు ఇంటి తాళం పగలగొట్టి బీరువాలోని 5 తులాల బంగారు నగలు, రూ. 10వేల నగదు దోచుకెళ్లారు. ఇంటి తలుపులు తీసి ఉండటంతో సమీపంలోని వారు గుర్తించి చరవాణిలో సమాచారం అందజేశారు. వెంటనే వారు వచ్చి చూడగా చోరీ జరిగినట్లు గుర్తించి, పట్టణ ఒకటో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు.

బిల్లుల మంజూరుకు నిరీక్షణ

మడకశిర మండలం జక్కేపల్లిలో నిర్మించిన సీసీరోడ్డు

మడకశిర గ్రామీణం, గుడిబండ, న్యూస్‌టుడే: గ్రామాల్లో సరైన అంతర్గత రహదారులు లేక ప్రజలు నానా అవస్థలు పడ్డారు. ఏళ్లుగా సిమెంటు రోడ్ల కోసం ఎదురుచూసిన గ్రామీణుల కల కూటమి ప్రభుత్వంతో నెరవేరింది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్మిస్తారని ఎదురుచూసినా ప్రయోజనం లేకుండా పోయింది. ప్రజల ఇబ్బందులను చూసిన కూటమి ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన ప్రతి గ్రామంలోనూ సీసీదారులు నిర్మించారు. అయితే అందుకు సంబంధించిన బిల్లులు ఏడు నెలలైనా అందక గుత్తేదారులు అవస్థలు పడుతున్నారు.

రూ.13.50 కోట్లతో..

జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా నియోజకవర్గంలోని రొళ్ల, అగళి, గుడిబండ, అమరాపురం, మడకశిర మండలాల్లో 30 కిలోమీటర్ల మేరా రూ. 13.50 కోట్లతో 215 సీసీ దారులు నిర్మించారు. గుత్తేదారులు పనులను పూర్తిచేశారు. బిల్లుల మంజూరులో జాప్యం కావడంతో తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సత్వరమే బిల్లులు మంజూరుచేస్తే ఎంతో ఊరట లభిస్తుందని పేర్కొంటున్నారు.

రూ.12 లక్షలతో నిర్మించాం -తిప్పేస్వామి, కేకేపాళ్యం, గుడిబండ మండలం

గుడిబండ మండలం కేకేపాళ్యం, మద్దనకుంట, కురుబరపల్లి గ్రామాల్లో రూ. 12లక్షలతో సీసీదారులు నిర్మించాం. సిమెంటు, కంకర, ఇసుక, సీసీదారులు నిర్మించే యంత్రాలకు బాడుగలు చెల్లించేందుకు అప్పులు చేశాం. ఏడు నెలలపైబడినా బిల్లులు మంజూరు కాలేదు. వడ్డీలు పెరిగి నష్టం వాటిల్లుతోంది. ప్రభుత్వం చొరవ తీసుకుని వెంటనే బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలి.

దశలవారీగా విడుదలవుతాయి

గుత్తేదారులు ఆందోళన చెందొద్దు. ఇప్పటికే బిల్లులు పడుతున్నాయి. సీనియార్టీ ప్రాతిపదికన దశలవారీగా బిల్లులు అందరి ఖాతాలకు జమ అవుతాయి.

-వెంకటేశ్వర్లు, పీఆర్ డీఈ, మడకశిర

మెరుగైన వైద్య సేవలకు చర్యలు

హిందూపురం, న్యూస్‌టుడే: ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్, ఆర్ఎంవోగా బాధ్యతలు చేపట్టిన అన్నపూర్ణ, రాంనాయక్ పేర్కొన్నారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఆసుపత్రిలో ప్రధాన సమస్యలు గుర్తించి, పరిష్కారానికి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. సిటీ స్కాన్ నూతన యంత్రం ఏర్పాటు చేయాల్సి ఉందన్నారు. 13 స్టాఫ్ నర్సు పోస్టులు, గౌనిక్ విభాగంలో వైద్యుల కొరతను తీర్చాలని ఉన్నతాధికారులకు నివేదిక పంపనున్నట్లు తెలిపారు.

ఐటీఐ రెండోవిడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకోండి

హిందూపురం, న్యూస్‌టుడే: శ్రీకంఠపురంలోని ప్రభుత్వ ఐటీఐలో రెండోవిడత కౌన్సెలింగ్‌కు ఈనెల 15 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ మురళీధర్ తెలిపారు. ఈనెల 17న పరిశీలన కొనసాగుతుందన్నారు. 21న నిర్వహించే కౌన్సెలింగ్‌కు దరఖాస్తు చేసుకొన్న వారు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలన్నారు.

'యేసు మార్గంలో సాగుదాం'



సన్మానం అందుకున్న పాస్టర్లు

హిందూపురం, న్యూస్‌టుడే: యేసు బోధనలు ప్రజలకు తెలియజేస్తూ ముందుకు సాగుదామని హిందూపురానికి చెందిన పాస్టర్లు పిలుపునిచ్చారు. హిందూపురం పాస్టర్స్ ఫెలోషిప్ 25వ వార్షికోత్సవాన్ని బుధవారం సూగూరులోని బేతేలు పెంతికోస్ట్ ప్రార్థన మందిరంలో ఘనంగా జరుపుకొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బెంగళూరుకు చెందిన బి. బాబిఅబ్రహం పాల్గొన్నారు. ఫెలోషిప్ వ్యవస్థాపకులు ఎన్. డేవిడ్, సంఘం వైస్ ప్రెసిడెంట్ యేసురత్నం, కార్యదర్శి కె. జయరాజ్, కోశాధికారి విజయ్‌కుమార్, ఉప కోశాధికారి జేమ్స్ లైఫ్ వరల్డ్ ఛారిటబుల్ ట్రస్ట్ కన్వీనర్ ఉదయ్‌కుమార్, మాజీ కౌన్సిలర్ రామ్మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పుట్టపర్తి
•పుట్టపర్తి •ధర్మవరం • కదిరి •రాప్తాడు

కాటన్ సంచులను ఆవిష్కరిస్తున్న డీపీఓ సమత

ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

పుట్టపర్తి పట్టణం, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ రహిత సమాజాన్ని నిర్మించాలని జిల్లా పంచాయతీ అధికారిణి సమత పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా పంచాయతీ కార్యాలయంలో హార్ట్‌టుహెల్ప్ ఛారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షుడు రవినాయక్ ఆధ్వర్యంలో కాటన్ సంచులను డీపీఓ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనర్థాలను ఆమె వివరించారు. ట్రస్టు సభ్యులను అభినందించారు.

డెంగీ నియంత్రణపై అవగాహన

కొత్తచెరువు: జాతీయ డెంగీ మాసోత్సవాల సందర్భంగా బుధవారం కొత్తచెరువు 1, 2 గ్రామ సచివాలయాల పరిధిలోని మార్కెట్ ప్రాంతంలో స్థానికులకు వైద్య సిబ్బంది అవగాహన కల్పించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో సత్యవతి, మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ గోపీనాయక్ మాట్లాడారు.

యువత మత్తుకు బానిస కావద్దు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: యువత లక్ష్యాలపై దృష్టి సారించాలని, మత్తుకు బానిస కావద్దని ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ సురేశ్‌బాబు, అబ్కారీ శాఖాధికారి చంద్రమణి తెలిపారు. బుధవారం కళాశాలలో మాదక ద్రవ్యాల నిరోధంపై అవగాహన కల్పించారు. విద్యార్థులచే అధికారులు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అబ్కారీ శాఖ ఎస్సైలు నాగరాజు, చాంద్‌బాషా, అధ్యాపకులు బాల జోషి, రాజేశ్, అనూష, ఉమా పాల్గొన్నారు.

ఖాసీంస్వామికి విశేష అలంకరణ

బత్తలపల్లి: మొహర్రంలో భాగంగా ఐదోరోజు బత్తలపల్లిలో ఖాసీంస్వామికి వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. ముస్లింలు స్వామిని దర్శించుకొని చక్కెర చదివించారు. పలువురు పక్కీరుబాబా దీక్ష చేపట్టారు.

పైప్‌లైన్ వేయరు.. గొంతు తడపరు

రామాపురంలో తీవ్ర తాగునీటి ఎద్దడి

ధర్మవరం పట్టణం, తాడిమర్రి, న్యూస్‌టుడే: తాడిమర్రి మండలం రామాపురం గ్రామంలో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. గుక్కెడు నీటి కోసం ప్రజలు అల్లాడుతున్నారు. గత ఆరేళ్లుగా ఈ సమస్య ఉంది. కూలీ పనులు వదులుకొని నీళ్ల కోసం వేచి ఉండాల్సి వస్తోందని గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలో పలుచోట్ల బోర్లు వేసిన చుక్క నీరు పడలేదు. రెండు నెలల కిందట ఊరికి కాస్తా దూరంలో గ్రా.నీ.శా అధికారులు బోరు వేయగా సమృద్ధిగా నీరు పడ్డాయి. దానికి పైపులు అమర్చకపోవడంతో నీరు వృథాగా పోతోంది. ప్రజలు బోరు నీటిని తెచ్చుకొని తాగుతున్నారు. పైపులైన్ ఏర్పాటుకు సంబంధించి పనులను డివిజన్ అధికారులు అంతర్జాలంలో నమోదు చేయడంలో జాప్యం చేస్తున్నారు. గత నెల 27వ తేదీ లోపు రూ.10 లక్షల టెండర్ పనులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంది. కానీ కిందిస్థాయి సిబ్బంది పనితీరుతో తాగునీటి సమస్య తీరడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

నాయకులకు భారంగా ట్యాంకర్లతో సరఫరా

ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ పార్టీకి చెందిన నాయకులు తాగునీటి సమస్య ఉన్నపుడు రోజూ రెండు, మూడు అద్దె ట్యాంకర్లతో నీటిని సరఫరా చేసేవారు. మొదట ట్యాంకర్లతో నీటిని సరఫరా చేయండి.. ఆ తరువాత బిల్లులు అందజేస్తామని చెప్పిన అధికారులు ఆ ఊసే ఎత్తడం లేదని, గౌరవానికి పోతే అప్పుల పాలవుతున్నామని, లక్షల్లో ఖర్చు పెట్టాల్సి వస్తోందని నాయకులు వాపోతున్నారు. గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలని, ప్రతి గ్రామానికి జేజేఎం పథకం ద్వారా కోట్లాది నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తోంది. కానీ గ్రా.నీ.శా అధికారులు మాత్రం నిధుల వినియోగంలో అలసత్వం చూపుతున్నారనే విమర్శలు ఉన్నాయి.

ట్యాంకర్ నీరు పట్టుకుంటున్న గ్రామస్థులు

సమస్య పరిష్కారానికి కృషి

రామాపురంలో తాగునీటి సమస్యను దృష్టిలో ఉంచుకుని బోరు వేశాం. నీరు సమృద్ధిగా పడ్డాయి. పైపులైన్ పనులు రూ.10 లక్షలు దాటడంతో ఆన్‌లైన్ చేయాల్సి ఉంది. ఉన్నతాధికారులతో మాట్లాడి వాటిని అప్లోడ్ చేయిస్తాం. నిధులు రాగానే పనులు పూర్తి చేయించి, సమస్య పరిష్కరిస్తాం.
- ఫామీదా, గ్రా.నీ.శా జేఈ

మేమున్నాం.. మీకు తోడుగా

పుట్టపర్తి: 80085 73039, **కదిరి :** 80085 73033, **ధర్మవరం:** 99596 98222

సమస్య: పుట్టపర్తిలోని ఇండోర్ స్టేడియం వెనుక భాగంలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ ఛాంబర్ మరమ్మతులకు గోతులు తీశారు. పూడ్చకుండా అలాగే వదిలేయడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. **- కిరణ్, సాయి, గోకులం**
సమాధానం: గుంతను వెంటనే పూడ్చివేయిస్తాం.
సమస్య: పెద్దకమ్మవారిపల్లి ఆరోగ్య ఉపకేంద్రానికి వెళ్లే రహదారిలో వీధి దీపాలు రెండు నెలలుగా వెలగడం లేదు. **- హనుమంతు, శ్రీనివాసులు**
సమాధానం: దీపాల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. **- ఏఈ స్వాతి**
సమస్య: పట్టణంలోని ఎనుములపల్లి ప్రధాన రహదారి మురుగునీటి గుంతలను తలపిస్తోంది. శుభ్రం చేయాలి. **- పురుషోత్తం, మధు**
సమాధానం: పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటాం.
- శానిటేషన్ అధికారి శివయ్య - న్యూస్‌టుడే, పుట్టపర్తి
సమస్య: నల్లచెరువు మండలం కె.పూలకుంటలోని కుళాయిల్లో కలుషిత నీరు సరఫరా అవుతున్నాయి. **- నాగరాజు, అదెప్పా**
సమస్య: కె.పూలకుంటలోని మసీదు వీధిలో దీపాలు వెలగడం లేదు. కొన్ని వీధుల్లో పగలు దీపాలు వెలుగుతున్నాయి. **- మునాఫ్, శేఖర్**
సమాధానం: కుళాయిల్లో రక్షిత నీరు సరఫరా అయ్యేలా చూస్తాం. వీధులో దీపాలు వేయిస్తాం. పగలు దీపాలు వెలగకుండా చర్యలు తీసుకుంటాం.
- నరసింహులు, పంచాయతీ కార్యదర్శి - న్యూస్‌టుడే, నల్లచెరువు
సమస్య: దాడితోట నుంచి కాటికోటేశ్వర క్షేత్రంలోకి వెళ్లే దారిలో కి.మీ మేర ఏర్పడిన ఇసుక మేటలను తొలగించాలి. **- దాడితోట గ్రామస్థులు**
సమాధానం: డోజర్ వాహనంతో ఇసుక తొలగించేస్తాం. సీసీరోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాం.
సమస్య: తాడిమర్రి నుంచి పిన్నదరి మార్గంలో రోడ్డుకిరువైపులా కంపచెట్లు, పిచ్చి మొక్కలు పెరిగాయి, తొలగించాలి. **- అశ్వర్థ, సదా, శ్రీనివాసులు**
సమాధానం: ఈ గ్రామాల పరిధిలో దారికి నిధులు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు ప్రారంభిస్తాం. **- పీఆర్ జేఈ బాలనరసింహులు**
- న్యూస్‌టుడే, తాడిమర్రి
సమస్య: ఈదులపల్లిలోని వీధి దీపాలు సక్రమంగా వెలగకపోవడంతో శివారులో చిమ్మచీకట్లు కమ్ముకుంటున్నాయి. **- రమణ, ఈదులపల్లి**
సమాధానం: వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం.
సమస్య: కొడవండ్లపల్లిలోని ప్రధాన రహదారిపై మురుగు నీరు నిలబడటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. **- సురేష్, కొడవండ్లపల్లి**
సమాధానం: మురుగు తొలగించి శాశ్వత పరిష్కారం చూపుతాం.
(పై సమస్యలకు ఈదులపల్లి పంచాయతీ కార్యదర్శి ప్రమోద్ సమాధానమిచ్చారు)
- న్యూస్‌టుడే, ముదిగుబ్బ

తప్పులు సవరించి తల్లికి వందనం అందిస్తాం

పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి

అమడగూరు(కదిరి), న్యూస్‌టుడే: రెవెన్యూ రికార్డుల్లో దొర్లిన తప్పులను సవరించి, తల్లికి వందనం అందేలా చూస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి తెలిపారు. అమడగూరు మండలంలోని కస్సముద్రం పంచాయతీలో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాలన, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా పలువురు తల్లికి వందనం రాలేదని గగ్గోలు పెట్టారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు, హంద్రీనీవాతో చెరువులకు నీళ్లు నింపనున్నట్లు తెలిపారు. తద్వారా కరవు నేలను సస్యశ్యామలం చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోపాల్‌రెడ్డి, కార్పొరేషన్ డైరెక్టరు కాలేనాయక్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, రాజారెడ్డి, రమణారెడ్డి, కృష్ణమూర్తి, భాస్కర్, నంజప్ప, నాగేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

‘కూటమి ప్రభుత్వంతోనే సుపరిపాలన’

వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి గ్రామీణం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో కూటమి ఏడాది సంక్షేమ పాలనపై సామాన్యుల్లో హర్షం వ్యక్తం అవుతుండగా, అబద్ధాలు ప్రచారం చేసే వైకాపా నాయకుల్లో భయం మొదలవుతోందని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం బుధవారం మండల పరిధిలోని కుమ్మరవాండ్లపల్లి గ్రామంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ చేపట్టారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఇంటింటా తిరుగుతూ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరును ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో పరిశీలకులు వాహిద్ హుసేన్, తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పవన్‌కుమార్‌రెడ్డి, పర్వీన్ బాను, మండల, యువజన కన్వీనర్లు చెన్నకేశవులు, హరి, తహసీల్దార్ మురళీకృష్ణ, ఎంపీడీవో పోలప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నంబులపూలకుంట(గాండ్లపెంట): ఎన్పీకుంట మండలం గౌకనపల్లి, కమ్మగుట్టపల్లి గ్రామాలలో సుపరిపాలనపై తొలిఅడుగులో భాగంగా సమస్యలను గ్రామస్థులతో మాట్లాడి తెలుసుకున్నారు. తెదేపా మండల కన్వీనర్ చంద్రశేఖర్‌నాయుడు, నాయకులు పాల్గొన్నారు.

రామగిరి, చెన్నేకొత్తపల్లి: మండల కేంద్రంలో బుధవారం తెదేపా నాయకులు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జ్ శివకుమార్, మండల కన్వీనర్ సుధాకర్ ఆధ్వర్యంలో ఇంటింటా తిరుగుతూ సూపర్ సిక్స్ పథకాల అమలు తీరును వివరించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

కొత్తచెరువు, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ప్రశాంతి నిలయం రైల్వే స్టేషన్ దగ్గర అనాథ మృదేహానికి ఖిద్మత్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో అంత్యక్రియలు నిర్వహించారు. గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సమాచారం తెలుసుకున్న జమేదార్లు అశోక్, రవికుమార్ ఘటనా స్థలంలో విచారణ చేశారు. ఎలాంటి ఆధారాలు లభించక అనాథగా గుర్తించారు. ఖిద్మత్ ట్రస్టు అధ్యక్షుడు షామీర్, సభ్యులు గోపి, రామాంజి, నయాజ్, సాయి, మారుతిలకు పోలీసులు సమాచారం అందించారు. సభ్యులు మృతదేహాన్ని వైకుంఠ రథంలో తీసుకెళ్లి అంత్యక్రియలు పూర్తి చేశారు.

చెత్త సేకరణపై నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

కదిరి గ్రామీణం: గ్రామాల్లో ఇంటింటా చెత్త సేకరణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఎంపీడీవో పోలప్ప పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని మొటుకుపల్లి సంపద కేంద్రాన్ని ఆయన పరిశీలించి, చెత్త సేకరణ వాహనాలను తనిఖీ చేశారు.

ప్రభుత్వ పాఠశాలల్లో క్రమశిక్షణతో కూడిన విద్య

బుక్కపట్నం, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యను అందిస్తున్నామని ఎంఈవో గోపాల్‌నాయక్ పేర్కొన్నారు. బుక్కపట్నం మండలంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు మహేశ్వర్ రెడ్డి, శ్రీనివాసులు, రాజేంద్రప్రసాద్ తమ పిల్లలను బుచ్చయ్యగారిపల్లి, బుక్కపట్నం ఎస్సీ కాలనీ పాఠశాలలో గత మూడు సంవత్సరాలుగా చదివిస్తున్నారు. వారిని, వారి పిల్లలను ఎంఈఓ అభినందించారు.

పైకప్పు బిగించారు

ముదిగుబ్బ, న్యూస్‌టుడే: ముదిగుబ్బ మండలంలోని సానేవారిపల్లి గ్రామంలో ప్రమాదకరంగా ఉన్న స్టార్టర్ పెట్టెకు అధికారులు పైకప్పు బిగించారు. స్టార్టర్ పెట్టెకు పై కప్పు లేక ఫీజులు, తీగలు బయటకు కనిపిస్తున్నాయి. వీటిపై ఈ నెల 2న ‘పొంచి ఉన్న ప్రమాదం ’అన్న శీర్షికతో ‘ఈనాడు’లో కథనం ప్రచురితమైంది. పంచాయతీ కార్యదర్శి రాధ బుధవారం స్టార్టర్ పెట్టెకు పైకప్పు బిగించారు.

తవ్వారు.. వదిలేశారు

ధర్మవరంలోని గాంధీనగర్ శ్మాశానవాటిక సమీపంలో ప్రధాన రహదారిపై మున్సిపాలిటీ అధికారులు తాగునీటి పైపుల మరమ్మతు కోసం గుంత తవ్వారు. మట్టిని చదును చేయకుండా వదిలేశారు. రాత్రివేళ మట్టి కుప్పలను ఢీకొని వాహన చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. సమస్యను డీఈ వీరేశ్ దృష్టికి తీసుకెళ్లగా మట్టిని తొలగించేస్తామన్నారు. **- న్యూస్‌టుడే, ధర్మవరం పట్టణం**

ప్రమాదకరంగా విద్యుత్తు తీగలు

బుక్కపట్నం మండలంలోని కృష్ణాపురం అంగన్‌వాడీ కేంద్రం-2లో 20 మంది చిన్నారులు ఉన్నారు. భవనంపై విద్యుత్తు తీగలు ప్రమాదకరంగా ఉన్నాయి. ప్రమాదం జరిగితే తీవ్ర నష్టం వాటిల్లుతుందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమస్యను ఏఈ నారాయణస్వామి దృష్టికి తీసుకెళ్లగా త్వరలోనే మార్పు చేయిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, బుక్కపట్నం**

మలుపుల్లో జాగ్రత్త

ముదిగుబ్బ మండలంలోని మలకవేముల క్రాస్ నుంచి ఒడ్డుకిందతండా, పి.కొట్టాలకు వెళ్లే మార్గంలో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. రహదారికిరువైపులా కంపచెట్లు ఏపుగా పెరగడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. మలుపుల్లో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు. దీనిపై పట్నం ఎస్సై రాజశేఖర్‌ను వివరణ కోరగా సూచిక బోర్డుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, ముదిగుబ్బ**

మురుగు కాలువలు అస్తవ్యస్తం

కదిరి పట్టణంలోని నానా దర్గా పరిసర ప్రాంతాల్లో మురుగు కాలువలు అస్తవ్యస్తంగా మారాయి. అవి చెత్తా చెదారంతో నిండి ఉంటున్నాయి. ఫలితంగా మురుగు నిల్వ చేరి దుర్వాసన వస్తుంది. తరచూ డ్రైనేజీలు పొంగుతున్నాయి. సమస్యను మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ నటరాజ్ బాబు దృష్టికి తీసుకెళ్లగా పారిశుద్ధ్య కార్మికులను పంపి కాలువలను శుభ్రం చేయిస్తామన్నారు. **- న్యూస్‌టుడే, కదిరి**

ముత్యాలమ్మ దేవతకు జ్యోతులు

సీకేపల్లి మండల కేంద్రంలోని ఓబుళ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్థానిక ముత్యాలమ్మ దేవతకు బుధవారం వేకువ జామున జ్యోతుల కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు అమ్మవారికి జ్యోతులు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. **- న్యూస్‌టుడే, చెన్నేకొత్తపల్లి**

పాఠశాల గదులు ప్రారంభం

ధర్మవరం, న్యూస్‌టుడే: మండలంలోని పోతుకుంట గ్రామంలో మోడల్ ప్రైమరీ పాఠశాల గదులను స్థానికులు, ఉపాధ్యాయులతో కలిసి బుధవారం ధర్మవరం నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులతో మాట్లాడారు.

భాజపాలో పలువురి చేరిక

ధర్మవరం: పట్టణంలోని 9వ వార్డుకు చెందిన పలువురు బుధవారం భాజపాలో చేరారు. ఎన్డీఏ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో న్యాయవాది రామానాయుడు, రంజిత్‌తో పాటు పలువురు భాజపాలో చేరారు. పార్టీలో చేరిన వారికి మంత్రి సత్యకుమార్ యాదవ్ కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. భాజపా పట్టణ, గ్రామీణ అధ్యక్షులు జింకా చంద్రశేఖర్, గొట్లూరు చంద్ర, సాకే ఓబిలేసు పాల్గొన్నారు.

10 నుంచి క్రికెట్, కబడ్డీ పోటీలు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: ఆర్డీటీ ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ నుంచి స్థానిక ఆర్డీటీ క్రీడా మైదానంలో పాఠశాల స్థాయి క్రికెట్, కబడ్డీ టోర్నమెంట్లు నిర్వహిస్తామని కోచ్‌లు రాజశేఖర్, పృథ్వీ తెలిపారు. బుధవారం కోచ్‌లు మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన బాలురు, బాలికల క్రికెట్, కబడ్డీ జట్లకు వేర్వేరుగా పోటీలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల జట్లు 99859 29285, 99664 92540 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

పుత్తా శివారెడ్డి సేవలు మరువలేనివి

ధర్మవరం, న్యూస్‌టుడే: పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం పుత్తా శివారెడ్డి సంస్మరణ సభ నిర్వహించారు. మనోబంధు ప్రతినిధి సత్య నిర్ధారణ్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్రాంత డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, వ్యవసాయశాఖ ఏడీ లక్ష్మీనాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు వైఎస్ఆర్ కడప జిల్లాకు చెందిన పుత్తా శివారెడ్డి, రహదారి మానసిక బాధితులకు అండగా నిలచి వారిని చేరదీసి సేవలు అందించారన్నారు. ఆయన మరణం తీరని లోటన్నారు. సంతాపం తెలియజేస్తూ మౌనం పాటించారు. కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు చలపతి, సుధాకర్, రోటరీక్లబ్ శివయ్య, మెహర్‌బాబా సేవా సంస్థ ప్రతినిధి గంగరాజు, సుజాతమ్మ, తదితరులు పాల్గొన్నారు.

‘4 నుంచి అత్యవసర సేవలు బంద్ చేస్తాం’

మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు

ధర్మవరం పట్టణం, న్యూస్‌టుడే: జీవో నంబర్ 36 ప్రకారం వేతనాలు అందజేసి, గతేడాది 17 రోజులపాటు ఇంజినీరింగ్ కార్మికులు సమ్మె చేసిన కాలంలో ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని లేకుంటే ఈ నెల 4 నుంచి అత్యవసర సేవలు బంద్ చేస్తామని ఆ సంఘం జిల్లా జాయింట్ సెక్రటరీ బాబు హెచ్చరించారు. పట్టణంలోని మున్సిపాలిటీ కార్యాలయం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ కార్మికులు చేపడుతున్న రిలే నిరాహార దీక్ష బుధవారం 7వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా కార్మికులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు పనికి తగిన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

పలువురిపై కేసు నమోదు

తాడిమర్రి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని దాడితోట గ్రామ సరిహద్దులో ఓ దాబా వద్ద మంగళవారం జరిగిన ఘర్షణలో బాధితుడు అశోక్‌కుమార్ ఫిర్యాదు మేరకు పుల్లయ్యనాయుడు, ధనుంజయనాయుడు, శ్రీనివాసులు, ఎం.శ్రీనివాసులు, మరో నలుగురు గుర్తుతెలియని వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై కృష్ణవేణి తెలిపారు. బుధవారం ఎస్సై మాట్లాడుతూ అదానీ పవర్ ప్రాజెక్టులో పనులు చేపట్టే విషయంలో కడప జిల్లా లింగాల మండలం పార్నపల్లె గ్రామానికి చెందిన వ్యక్తుల మధ్య విభేదాలు పొడచూపాయి. దీంతో ఇరువర్గాలు గొడవ పడ్డారు. ఇది సోషల్ మీడియాలో హల్‌చల్ కావడంతో పోలీసు ఉన్నతాధికారులు వివరాలు సేకరించి, కేసు నమోదు చేయాలని ఎస్సైను ఆదేశించారు.

అసభ్యకర ప్రవర్తనపై..

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువులో ఒక మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు సీఐ మారుతి శంకర్ తెలిపారు. మహిళ ఒక హోటల్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. గత నెల 10, 13వ తేదీల్లో హోటల్ యజమాని తనకోరిక తీర్చాలంటూ అసభ్యకరంగా ప్రవర్తించాడని మహిళ ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

దాడి చేశారని ఫిర్యాదు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: కదిరిపట్టణం అనంతపురం రోడ్డులోని అపార్ట్‌మెంట్‌లో వాచ్‌మెన్ కిష్టప్ప కుటుంబసభ్యులు తనపై దాడి చేశారని ప్లాట్ యజమాని అమర్‌నాథ్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అమర్‌నాథ్‌రెడ్డి ఇళ్లు ఖాళీగా ఉంది. ఆయన ఇంటి నుంచి మరో ఇంటికి విద్యుత్తు సరఫరాను కిష్టప్ప ఇచ్చినట్లు గుర్తించారు. ఎక్కువ మొత్తంలో బిల్లు వస్తుండటంతో వాచ్‌మెన్‌ను పిలిచి ప్రశ్నించారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకున్న కిష్టప్ప కుమారుడు పవన్‌కుమార్, కుటుంబసభ్యులు ఆరుగురు తనపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారని బాధితుడు ఫిర్యాదులో పేర్కొన్నారు.

బిందు సేద్యం పరికరాల చోరీ

రామగిరి, న్యూస్‌టుడే: మండల పరిధిలోని ఎగువపల్లి కొత్తగేరిలో గుర్తు తెలియని దుండగులు బిందు పరికరాలు అపహరించారు. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు కొత్తగేరి గ్రామానికి చెందిన రమణయ్య తన వ్యవసాయ పొలంలో బోరుబావికి కింద పంట సాగుకోసం.. 25 వేలు విలువల బిందు పరికరాలు 12 కట్టలను తోటలో ఉంచాడు. గుర్తుతెలియన దుండగులు రాత్రి పూట అపహరించారని బాధిత రైతు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

వివాహిత అదృశ్యం

తనకల్లు, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గోపి తెలిపారు. ఆమెను నాలుగేళ్ల క్రితం కర్ణాటక రాష్ట్రం చింతామణి తాలూకాలోని ఓ గ్రామానికి చెందిన వ్యక్తికి ఇచ్చి వివాహం చేశారు. మే 30న పుట్టింటికి వచ్చి జూన్ 12న ఆస్పత్రికని అన్నమయ్య జిల్లా ములకలచెరువుకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. తల్లి బుధవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చెప్పారు.

పుట్టపర్తిలో బాలుడు..

పుట్టపర్తి: బాలుడి అదృశ్యంపై పుట్టపర్తి గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై లింగన్న వివరాల మేరకు.. వెంగళమ్మ చెరువుకు చెందిన కల్లూరి గంగాద్రి కుమారుడు నవీన్ (16) గత నెల 30న ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. గాలించినా ఆచూకీ లభించలేదు. తండ్రి బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు. తప్పిపోయిన బాలుడికి మాటలు సరిగా రావని, పేరు, ఊరు చెప్పలేడని అందులో పేర్కొన్నారు. ఆచూకీ తెలిసిన వారు 94407 96839 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

కంకర తేలి.. గుంతలు పడి

పల్లె దారుల్లో ప్రయాణం నరకం

గొల్లపల్లితండాలోని కదిరి-పులివెందుల రోడ్డు నుంచి సబ్బునగుంతపల్లికి వెళ్లే రహదారి అడుగడుగునా గుంతలు పడింది. ఏపులపల్లి సమీపంలోని కల్వర్టు వద్ద గోతులతో ఇబ్బందికరంగా మారింది. దాంపల్లి సమీపంలో, సబ్బునగుంతపల్లి చెరువు వద్ద తదితర చోట్ల రోడ్డు పూర్తిగా దెబ్బతింది.

బత్రేపల్లి-మలకవేముల క్రాస్ నుంచి లక్కసముద్రానికి ఒకటిన్నర కిలోమీటరు రోడ్డు పాడైపోయింది. చెరువుకట్టపై ప్రయాణం చేయాలంటే మరింత ఇబ్బందికరంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుత సీజన్‌లో చెరువులో నీరు లేకపోవడంతో కట్టపై కాకుండా చెరువులో వెళ్లుతున్నట్లు గ్రామస్థులు చెబుతున్నారు.

తలుపుల, న్యూస్‌టుడే: తలుపుల మండలంలో మారుమూల గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా మారాయి. వాటిపై ప్రయాణం నరకప్రాయంగా ఉందని ప్రజలు వాపోతున్నారు. గత వైకాపా ప్రభుత్వం గ్రామీణ రోడ్లను నిర్లక్ష్యం చేసింది. వాటి ఆలనా పాలనా ఏమాత్రం పట్టించుకోలేదు. కనీసం గుంతలను పూడ్చలేని దుస్థితి. కూటమి ప్రభుత్వం గ్రామీణ రహదారులను బాగుచేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేటికి మట్టిరోడ్డే

పెద్దన్నవారిపల్లి పంచాయతీ వడ్డిపల్లికి నేటికీ మట్టిరోడ్డే ఉంది. తలుపుల-వేంపల్లి రెండు వరుసల బీటీ రోడ్డు నుంచి ఈ గ్రామం దాదాపు 3.5 కిలో మీటర్లు ఉంటుంది. గుంతలు, రాళ్లు తేలిన రోడ్డులో ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్థులు వాపోతున్నారు. అత్యవసర పనిపై గ్రామానికి ఆటోలో రూ.200 ఇచ్చి రావ్వాల్సి ఉందన్నారు. రోడ్డు బాగుంటే తమకు కష్టాలు తప్పుతాయని చెబుతున్నారు. దీనిపై పీఐయూ డీఈ హనుమంతయ్య వివరణ కోరగా లక్కసముద్రం రోడ్డుకు నాబార్డు కింద రూ.80 లక్షలు మంజూరు అయ్యాయి. మిగిలిన రోడ్లకు ప్రతిపాదనలు పంపాం. నిధులు రావాల్సి ఉంది. రాగానే పనులు చేపడతామని చెప్పారు.

సన్మానం అందుకున్న ఉద్యోగులతో ఎస్పీ రత్న

ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సహజం

పుట్టపర్తి, న్యూస్‌టుడే: పదవీ విరమణ ప్రతి ఉద్యోగి జీవితంలో ముఖ్యమైన ఘట్టమని ఎస్పీ రత్న పేర్కొన్నారు. బుధవారం సాయంత్రం జిల్లా పోలీసు కార్యాలయంలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులను ఎస్పీ ఘనంగా సత్కరించి, సేవలను కొనియడారు. పోలీసుశాఖలో అంకితభావంతో పని చేశారని అభినందించారు. శేష జీవితం ప్రశాంతంగా గడపాలని ఆకాంక్షించారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఎస్సైలు రెడ్డప్ప, ఆంజనేయులు, లక్ష్మన్న, శ్రీరాములు, అబ్దుల్‌కలాంఆజాద్, ఏఆర్ ఎస్సై లక్ష్మన్న, నాగరాజు, గోపికుమార్‌ను ఘనంగా సన్మానించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయులను సత్కరిస్తున్న విద్యాధికారులు, గ్రామస్థులు

గాండ్లపెంట, న్యూస్‌టుడే: మండల పరిధిలోని నాయనవారిపల్లి ప్రాథమిక పాఠశాల నుంచి బదిలీపై వెళుతున్న ఉపాధ్యాయుడు షౌకరున్, బదిలీపై వచ్చిన చంద్రశేఖర్‌ను విద్యాధికారులు కృష్ణానాయక్, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు వెంకటరాయుడు, రామ్మోహన్, సురేష్‌బాబు, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. గ్రామంలో బాణసంచా కాలుస్తూ ఉపాధ్యాయులను ఊరేగించారు. షౌకరున్‌పై గ్రామస్థులు చూపిన ఆప్యాయత, అనురాగం అతను పాఠశాలకు చేసిన సేవలను గుర్తు చేస్తూ కన్నీరు పెట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ లక్ష్మీపతి, విద్యార్థులు తల్లిదండ్రులు శ్రీనివాసులరెడ్డి, పురుషోత్తం, రామాంజనేయులు, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

వెళ్లడమే కష్టం.. ఇల్లెక్కడ కడతాం..!

ఇళ్లు కాదు.. ఊళ్లు నిర్మిస్తామని వైకాపా నాయకులు నమ్మించి నట్టేట ముంచారనేందుకు నిదర్శనమే ఈ చిత్రం. శ్రీకాకుళం గ్రామీణ మండలం లింగాలవలసలోని జగనన్న కాలనీలో రహదారులు అత్యంత అధ్వానంగా ఉన్నాయి. అడుగు తీసి అడుగేయలేని దుస్థితి.. ఇక్కడ మొత్తం 1,850 మందికి స్థలాలు కేటాయించగా, 1,550 గృహాలు వివిధ దశల్లో నిలిచిపోయాయి. కనీస వసతుల్లేకపోవడంతో పూర్తి చేసేందుకు ఎవరూ ఆసక్తి చూపట్లేదు. ప్రస్తుతానికి కొన్ని ఇళ్లలో సుమారు 100 మంది వరకు ఇక్కడ నివసిస్తున్నారు. వారు కూడా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై లింగాలవలస పంచాయతీ కార్యదర్శి హెచ్.రవికాంత్ మాట్లాడుతూ రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించామని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.
– న్యూస్‌టుడే, శ్రీకాకుళం గ్రామీణం, కలెక్టరేట్(శ్రీకాకుళం)

పొంగిపొర్లిన వంశధారలు..

● ఎడమ కాలువకు నీరు విడుదల

ఎడమ ప్రధాన కాలువకు నీరు విడిచిపెడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యేలు గోవిందరావు, రమణమూర్తి, అధికారులు

హిరమండలం, న్యూస్‌టుడే: ఖరీఫ్ సాగుకు వంశధార నీటిని బుధవారం విడిచిపెట్టారు. హిరమండలంలోని గొట్టాబ్యారేజీ వద్ద కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, పాతపట్నం, నరసన్నపేట ఎమ్మెల్యేలు గోవిందరావు, రమణమూర్తిలతో కలిసి ఎడమ ప్రధాన కాలువకు నీరు వదిలారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతులు ముందుగా నీటిని చెరువులకు మళ్లించాలని కోరారు. ఎడమ కాలువ ద్వారా 13 మండలాల్లో 1.48 లక్షల ఎకరాలకు సాగునీరందుతుందన్నారు. 250 క్యూసెక్కుల నీరు విడిచిపెట్టామని, క్రమేపీ పెంచుతామని వంశధార ఎస్ఈ స్వర్ణకుమార్, ఈఈ ఎంఏ సీతారామనాయుడు పేర్కొన్నారు. మరో పదిరోజుల్లో కుడి ప్రధాన కాలువ ద్వారా నీరు వదులుతామని చెప్పారు. వంశధార కాలువలు, షట్టర్ల సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా కలెక్టర్‌ను ఎమ్మెల్యేలు గోవిందరావు, రమణమూర్తి కోరారు. ఎడమ ప్రధాన కాలువ ఆధునికీకరణకు రూ.1,800 కోట్లతో ప్రతిపాదించారని, కేంద్ర ప్రభుత్వ నిధులతో ఈ పనులు జరిగేలా చొరవ తీసుకోవాలన్నారు. వంశధార ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ అధ్యక్షుడు ఎ.రవీంద్ర, అంబావల్లి నీటి సంఘం అధ్యక్షుడు చెట్టు శ్రీనివాసరావు, టెక్కలి ఈఈ శేఖర్ పాల్గొన్నారు.

వైకుంఠపాళి ఆడితే నష్టమే: అచ్చెన్న

తర్లిపేటలో చిన్నారులను ఎత్తుకున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు

కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: ప్రజలు వైకుంఠ పాళి ఆటలా చంద్రబాబును గెలిపించడం, ఓడించడం చేస్తే నష్టపోతారని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. సంతబొమ్మాళి, మండలం కాపుగోదాయవలస, కోటబొమ్మాళి మండలం తర్లిపేటలో మంత్రి 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వ పనితీరును వివరించారు. 'జగన్ అనే చీడ పురుగును రాష్ట్రంలో లేకుండా చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. 2019లో ఒక అవకాశం పేరుతో జగన్‌ను సీఎం చేస్తే రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారు. ఏడాది కూటమి పాలనలో రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఆరు లక్షల మందికి ఉద్యోగాలొచ్చే అవకాశం ఉంది. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ఏడాది పాలన సంతృప్తిగా ముగిసింది. ఈ ఏడాది నుంచే గేర్ మారుస్తాం' అని అచ్చెన్న తెలిపారు.

వ్యాధుల నివారణకు ముందస్తు చర్యలు

● జ్వరాలపై ప్రత్యేక ప్రణాళిక
● డీఎంహెచ్‌వో కె.అనిత ముఖాముఖి

ఈనాడు డిజిటల్, శ్రీకాకుళం

వర్షాకాలం నేపథ్యంలో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు కార్యాచరణ రూపొందించి గ్రామస్థాయి నుంచి అమలు చేస్తున్నాం. టైఫాయిడ్, మలేరియా, డెంగీ జ్వరాల నివారణకు ప్రణాళిక వేశాం' అని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి కె.అనిత పేర్కొన్నారు. శాఖాపరంగా కాలానుగుణ వ్యాధులపై సన్నద్ధత, నివారణకు తీసుకుంటున్న చర్యలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై 'ఈనాడు' ముఖాముఖిలో ఆమె వివరించారు.

ఊరూరా అవగాహన..

గ్రామీణ ప్రాంతాలు, అంగన్‌వాడీలు, పాఠశాల, కళాశాలల్లో కాలానుగుణ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలోని 2,185 మంది ఆశా, ఆరోగ్య కార్యకర్తలు ఇందుకోసం పనిచేస్తున్నారు. 11 మంది హెల్త్ ఎడ్యుకేటర్ల ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జులై నెలను డెంగీ నిర్మూలన మాసంగా ప్రకటించారు. దీనిద్వారా డెంగీ జ్వరాలు రాకుండా నెలరోజుల పాటు చర్యలు తీసుకుంటున్నాం.

డ్రోన్ల ద్వారా పిచికారీ..

విద్యా సంవత్సరానికి ముందే పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాల వద్ద దోమల నియంత్రణ మందు పిచికారీ చేయించాం. గిరిజన ప్రాంతాలు, పొదలు, నీరు నిల్వ ఉండే చెరువుల వద్ద డ్రోన్ల సాయంతో ప్రక్రియ చేపట్టాం. శ్రీకాకుళం, ఆమదాలవలస, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం పట్టణాల్లోని ఖాళీ స్థలాల్లోనూ పిచికారీ చేపట్టనున్నాం.

సమయపాలన పాటించకపోతే చర్యలు

ఆసుపత్రిలో వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాల్సిందే. నిరంతర పర్యవేక్షణ ఉంటుంది. ఎఫ్ఆర్ఎస్‌లో హాజరు నమోదు చేసి ఆసుపత్రిలో ఉన్నారా లేదా అనే వివరాలు జిల్లా వ్యాప్తంగా సేకరించి ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. రోగి ఓపీ నుంచి వైద్యుడి వద్దకు వచ్చిన తర్వాత 'డాక్టర్ కేర్' యాప్‌లో వివరాలు నమోదు చేస్తారు. ఇలా ఆసుపత్రిలో ఎంత సమయం గడుపుతున్నారనేది తెలుస్తుంది. సేవల్లో జాప్యం జరిగితే వెంటనే సంబంధిత వైద్యుడిని సంప్రదించి ఆలస్యానికి కారణాలు తెలుసుకుంటున్నాం.

వైద్యసేవలు అందకపోతే ఫిర్యాదు చేయండి..

గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు పీహెచ్‌సీలను బలోపేతం చేశాం. 66 పీహెచ్‌సీలు, 16 అర్బన్ హెల్త్ సెంటర్లు ఉన్నాయి. వీటి పరిధిలో 142 మంది వైద్యులు అందుబాటులో ఉన్నారు. చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లిన వారికి సకాలంలో సేవలందకపోయినా, అక్కడి వైద్యులు, సిబ్బంది సరిగ్గా స్పందించకుండా ఎలాంటి ఇబ్బంది ఎదురైనా బాధితులు తక్షణమే ఫిర్యాదు చేయవచ్చు.

అతిసారంపై ప్రత్యేక దృష్టి..

ప్రస్తుతం జిల్లాలో అతిసార బాధితులు పెరుగుతున్నారు. జూన్ వరకు 806 కేసులు నమోదయ్యాయి. వీటి నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. బాధితులు శుద్ధిచేసిన నీటిని తీసుకోవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం చేయాలి. ఒక్క కేసు నమోదైనా వైద్య అధికారులను అప్రమత్తం చేసి సేవలు, సదుపాయాలతో పాటు పర్యవేక్షణ చేపడుతున్నాం. ఇప్పటివరకు 21 మలేరియా కేసులు నమోదయ్యాయి. జ్వరాలు ప్రబలకుండా బాధితుల ఇంటి పరిసరాలను దోమల మందు పిచికారీ చేస్తున్నాం. వారి కుటుంబ సభ్యులకు రక్త పరీక్షలు చేస్తున్నాం.

అందుబాటులో పాముకాటు మందు..

వర్షాకాలం కావడంతో పాముకాటు కేసులు పెరిగే ఆస్కారం ఎక్కువగా ఉంది. దీనికోసం అన్ని పీహెచ్‌సీల్లో యాంటీ స్నేక్ వీనమ్ మందు అందుబాటులో ఉంచాం. కుక్కకాట్లకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ సైతం ఉంది. సకాలంలో బాధితులను తీసుకొస్తే సేవలందేలా చర్యలు తీసుకుంటున్నాం. కాలానుగుణ వ్యాధులకు సంబంధించి మందుల కొరత లేదు. 214 రకాల ఔషధాలు అందుబాటులో ఉన్నాయి.

దశాబ్దమైనా దశ మారదా..?



న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యనందించేందుకు ప్రభుత్వం రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయాన్ని(ఆర్జీయూకేటీ) ఏర్పాటు చేసింది. రాష్ట్రంలో నాలుగు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లున్నాయి. ఇందులో ఎచ్చెర్ల మండలం షేర్ మహ్మద్‌పురంలో నెలకొల్పిన శ్రీకాకుళం క్యాంపస్ ఒకటి. 2015లో ప్రారంభించిన పదేళ్లు పూర్తయినా ఇంకా మౌలిక సదుపాయాల కల్పన జరగలేదు. దీనికి తోడు అధికారుల ఇష్టానుసార నిర్ణయాలతో విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపకులకు అవస్థలు తప్పలేదు.

తొలి ఏడాది 2015-16 విద్యా సంవత్సరం విద్యార్థులకు ఇక్కడ వసతులు లేకపోవడంతో నూజివీడులో తరగతులు నిర్వహించారు. రెండో ఏడాది నుంచి స్థానికంగానే పీయూసీ-1 తరగతులు ప్రారంభించారు. వారి రెండేళ్ల చదువు పూర్తయి, ఇంజినీరింగ్‌కు వచ్చేసరికి వసతుల లేమి కారణంగా నూజివీడులోనే కొన్నాళ్లు తరగతులు నిర్వహించారు. అనంతరం దశలవారీగా తరగతి, వసతి, ఇతర భవనాలు నిర్మాణాలు చేపట్టారు. నాలుగేళ్ల నుంచి పీయూసీ-2, ఇంజినీరింగ్-1, 2 బ్యాచ్‌లు ఇక్కడే నడుపుతున్నారు. ఈ ఏడాది నుంచి పీయూసీ-1ను నూజివీడుకు తరలించి అక్కడ ఉన్న ఈ-3, 4 బ్యాచ్‌లను ఇక్కడికి తీసుకురావాలని అధికారులు నిర్ణయించారు. దీంతో స్థానికంగానే చదువుకోవచ్చని భావించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆశలపై నీళ్లు చల్లినట్లయింది. ఈసారి శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికైనవారికి కౌన్సెలింగ్ కూడా నూజివీడులోనే నిర్వహిస్తుండటంపై అసహనం వ్యక్తం చేస్తున్నారు.

పనులు చేస్తేనే పాట్లు తప్పేది..

నాలుగేళ్ల కిందట మూడు వేల మందికి ఉపయోగపడేలా రూ.66.7 కోట్లతో అకడమిక్ బ్లాక్ నిర్మాణం ప్రారంభించారు. అత్యాధునిక తరగతి గదులు, ప్రయోగశాలలు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రూ.24 కోట్లతో గుత్తేదారులు పనులు చేశారు. వీటి బకాయిలు ఉండటంతో మూడున్నరేళ్లుగా నిర్మాణాలు నిలిచిపోయాయి. క్యాంపస్‌లోని బోర్లు తరచూ కలుషితమై విద్యార్థులు అనారోగ్యం పాలవుతున్నారు. ఈ సమస్య పరిష్కారానికి రూ.2.4 కోట్లతో చేపట్టిన వ్యర్థ జలాల శుద్ధి ప్లాంట్ నిర్మాణ పనులు రెండేళ్ల నుంచి అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.

● నూజివీడు నుంచి ఈ-3, 4 బ్యాచులను జిల్లాకు తీసుకొస్తే స్థానికంగా వసతి సమస్య ఎదురవుతుంది. ప్రస్తుతం షేర్‌మహ్మద్‌పురం క్యాంపస్‌లో సుమారు 3,400 మంది ఉంటున్నారు. తాజాగా మరో వెయ్యి మందికి సదుపాయాలు కల్పించాలి. ఇప్పటికే ఉన్న బోర్లలో అరకొరగా నీరొస్తోంది.

● ఐదు అంతస్తుల భవనాలకు లిఫ్ట్ సౌకర్యం లేదు.
● ఈ-3, 4 విద్యార్థులకు అవసరమైన ప్రయోగశాలలు, ప్లేస్‌మెంట్ సెల్ వంటి సౌకర్యాల్లేవు.

● పీయూసీ-1, 2 బ్యాచులకు చెందిన బాలురకు మాత్రమే శివాని ఇంజినీరింగ్ కళాశాల క్యాంపస్‌లో తరగతులు నిర్వహించేవారు. ఈ ఏడాది నుంచి పీయూసీ-2 బాలికలను అక్కడే ఉంచాలని నిర్ణయించారు. అక్కడ ప్రహరీ లేకపోవడంతో భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశముందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఇబ్బందుల్లేకుండా చూస్తాం..

పీయూసీ-1 తరగతులు నూజివీడులో ఇబ్బందుల్లేకుండా నిర్వహిస్తాం. అంతా ఒక చోట ఉంటే సీనియర్, జూనియర్లు సహకరించుకోవడంతో పాటు ప్రాంగణ ఎంపికల్లోనూ మంచి ఫలితాలొచ్చే అవకాశం ఉంటుంది. అందుకే ఈ-3, 4 బ్యాచ్‌లను ఇక్కడికి మారుస్తున్నాం. ఇతర సమస్యలకు స్థానిక అధికారులే పరిష్కారం చూపాలి.
– సంధ్ర అమరేంద్రకుమార్, రిజిస్ట్రార్, ఆర్జీయూకేటీ

జై జగన్నాథ్

జగన్నాథుడి రథ యాత్ర ఉత్సవాలు జిల్లాలో వైభవంగా జరుగుతున్నాయి. రోజుకో రూపంలో స్వామి భక్తులకు కనువిందు చేస్తున్నారు. శ్రీకాకుళం నగరం మొండేటివీధి శిర్డీసాయి మందిరంలో రామావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథుడిని చిత్రంలో చూడొచ్చు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతిక

ఇక్కడే వంట.. ఇంకెన్నాళ్లీ తంటా..!

రణస్థలం మండలం జేఆర్ పురం ఉన్నత పాఠశాలలో వంట గది లేక చెట్ల కిందనే వంట చేస్తున్నారు. దీనికి తోడు గ్యాస్ సిలిండర్లు సరఫరా కాకపోవడంతో కట్టెల పొయ్యిల మీదే వండుతున్నారు. వర్షం పడితే నిర్వాహకుల అవస్థలు అంతా ఇంతా కాదు. పాఠశాలలో సుమారు 640 మంది విద్యార్థులున్నారు. రణస్థలం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు కూడా ఇక్కడే వండి తీసుకెళ్తారు. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణయ్య వద్ద ప్రస్తావించగా సమస్యను ఎమ్మెల్యే, ఎంపీ దృష్టికి తీసుకెళ్లామని, వారి సహకారంతో త్వరలో షెడ్డు నిర్మిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, రణస్థలం

పచ్చందనమే.. పచ్చదనమే..

● జిల్లాలో 67 నర్సరీల్లో మొక్కల పెంపకం

న్యూస్‌టుడే, రణస్థలం

గరిష్ఠ ఉష్ణోగ్రతలు, ప్రకృతి వైపరీత్యాలు కొంత వరకైనా తగ్గాలంటే అటవీ విస్తీర్ణాన్ని పెంపొందించాలని, తీర ప్రాంతంలో తుపాన్ల నుంచి రక్షణ పొందాలంటే తీరం వెంబడి సరుగుడు, తాటిచెట్లను పెంచాలని నిపుణులు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నర్సరీల ద్వారా వివిధ రకాల మొక్కలను ఉచితంగా అందజేయాలని నిర్ణయించింది.

● జిల్లాలో 67 నర్సరీల్లో 20,60,000 వివిధ రకాల మొక్కలు పెంచుతున్నారు. 65 నర్సరీలు ప్రైవేటు వ్యక్తుల ద్వారా పెంచగా, రెండు అటవీశాఖ ఆధ్వర్యంలో లావేరు మండలం రావివలస, నరసన్నపేట మండలం తామరాపల్లిలో ఏర్పాటు చేశారు. ఇందుకు ఉపాధి పథకం ద్వారా రూ. 1,04,67,216 కేటాయించారు. వేతనాల రూపంలో రూ. 39,92,312, రూ. 64,74,904 మెటీరియల్ రూపంలో చెల్లిస్తున్నారు.

బంటుపల్లి నర్సరీలో పెంచుతున్న సరుగుడు మొక్కలు

పెంచుతున్న మొక్కలు

బాదం, బొగడ, సరుగుడు, చింత, దేవదారు, కానుగ, కరక, కుంబిని, నల్లమద్ది, వేప, నెమలనార, నేరేడు, రెయిన్‌ట్రీ, సీమబాదం, తెల్లమద్ది, ఉసిరి, వేప, విప్ప, వెదురు, టేకు, పెద్దబాదం, సీతాఫలం, రావి, దేవకాంచన, కాగు, ఏగిస, గుమ్మడిటేకు, జామ, నీలగిరి

నియోజకవర్గాల వారీగా వివరాలు

నియోజకవర్గం	పెంచిన మొక్కలు
ఆమదాలవలస	2,70,000
ఎచ్చెర్ల	4,15,000
ఇచ్ఛాపురం	1,80,000
నరసన్నపేట	2,65,000
పలాస	60,000
పాతపట్నం	1,60,000
శ్రీకాకుళం	3,00,000
టెక్కలి	4,10,000

'పచ్చదనాన్ని పెంపొందించాలనే ప్రభుత్వం ఈ ఏడాది నర్సరీలు పెంచి ఉచితంగా మొక్కలు పంపిణీ చేస్తోంది. ఇప్పటికే 8 లక్షల మొక్కలు సరఫరా చేశాం. ఆసక్తి ఉన్నవారు అధికారులను సంప్రదిస్తే మొక్కలు అందజేస్తారు. తీర ప్రాంతం వెంబడి మొక్కలు నాటనున్నాం' అని జిల్లా అటవీ శాఖ అధికారి ఎస్.వెంకటేశ్ అన్నారు.

శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ ప్రారంభం

● తొలి రోజు 437 మందికి ప్రవేశాలు

విద్యార్థినికి సీటు కేటాయింపు పత్రం అందజేస్తున్న ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ బాలాజీ

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో 2025-26 విద్యాసంవత్సరంలో పీయూసీ-1లో ప్రవేశాలకు నూజివీడులో బుధవారం కౌన్సెలింగ్ ప్రారంభమైంది. ఈ ప్రక్రియ రెండు రోజులపాటు కొనసాగనుంది. తొలి రోజు 517 మందిని కౌన్సెలింగ్‌కు పిలవగా 437 మంది హాజరై ప్రవేశాలు పొందారు. విద్యార్థులతో వచ్చిన తల్లిదండ్రులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశామని డైరెక్టర్ కె.వి.జి.డి.బాలాజీ తెలిపారు. ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్రకుమార్ పర్యవేక్షణలో ప్రక్రియ జరిగింది.

పారదర్శకంగా మహిళా పోలీసులకు బదిలీలు

సూచనలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న మహిళా పోలీసుల బదిలీల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహించినట్లు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని జడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం కార్యక్రమం జరిగింది. ర్యాంకుల ఆధారంగా దివ్యాంగులు, అనారోగ్య సమస్యలు, ఏజెన్సీ ప్రాంతాలు, స్పౌజ్ కోటా, జనరల్ ప్రాతిపదికన ఎస్పీ పర్యవేక్షణలో ప్రభుత్వ నిబంధనల మేరకు అభ్యర్థులకు స్థానచలనం కల్పించారు.

జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ఎంపికకు షెడ్యూల్

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల ఎంపికకు షెడ్యూల్ ప్రకటించినట్లు డీఈవో ఎస్.తిరుమలచైతన్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్నవారు http://nationalawardstoteachers.education.gov.in/Login.apx పోర్టల్‌లో పూర్తి వివరాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వాటిని సంబంధిత డీఈవో కార్యాలయానికి అందజేయాలని చెప్పారు. ఆన్‌లైన్‌లో జులై 1 నుంచి 13 వరకు నమోదు చేసుకోవాలని, జులై 16 నుంచి ప్రాంతీయ కమిటీ ఎంపిక, 26 నుంచి ఆగస్టు 4 వరకు రాష్ట్ర కమిటీ ఎంపిక ఉంటాయన్నారు. ఆగస్టు 13 పేర్లు ప్రకటించి. సెప్టెంబరులో పురస్కారాలు అందజేస్తారని చెప్పారు.

ఆర్అండ్‌బీ ఎస్ఈగా సత్యనారాయణ

ఎస్ఈ సత్యనారాయణకు పుష్పగుచ్ఛం అందిస్తున్న సిబ్బంది

శ్రీకాకుళం అర్బన్, న్యూస్‌టుడే: రహదారులు, భవనాలశాఖ పర్యవేక్షక ఇంజినీరుగా పుచ్చల సత్యనారాయణ నియమితులయ్యారు. టెక్కలి డివిజన్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజినీరుగా పనిచేసిన ఈయన బదిలీపై ఇక్కడికి వచ్చారు. జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో బుధవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్ఈ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా రహదారుల నిర్మాణాల్లో నాణ్యత పక్కాగా ఉండేలా చూస్తానని పేర్కొన్నారు. టెక్కలి ఈఈగా చిత్తూరు జిల్లా నుంచి ఎం.సత్యమూర్తి బదిలీపై రానున్నారు.

మేం వెళ్లం.. ఇక్కడే ఉంటాం..

గార మండలం కళింగపట్నం-మత్స్యలేశం గ్రామంలోని ఎంపీయూపీ పాఠశాలలో 6, 7, 8 తరగతులను వేరే చోటుకు తరలించొద్దని విద్యార్థులు బుధవారం రోడ్డెక్కి నిరసన తెలిపారు. కళింగపట్నం - బందరువానిపేట రహదారిలో కాసేపు వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. విలీనం చేయొద్దని అంతా కలిసి తీర్మానం చేసినా.. అధికారులు పట్టించుకోలేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని పునరాలోచించాలని కోరుతున్నారు.
– న్యూస్‌టుడే, గార(కళింగపట్నం)

పునరావాసం.. సమస్యలతో సావాసం..!

ఈనాడు ఈటీవీ పరిశీలన

ఆఫ్‌షోర్ నిర్వాసితుల ఆవేదన

న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

మహేంద్రతనయ నదిపై ఆఫ్‌షోర్ జలాశయం నిర్మాణం కారణంగా పలాస మండలం రేగులపాడు, మెళియాపుట్టి మండలం చీపురుపల్లి, దాసుపురం, నందిగాం మండలం చిన్నగురువూరు, శారదాపురం గ్రామాల ప్రజలు నిర్వాసితులయ్యారు. దాసుపురం మినహా 4 గ్రామాల వాసులకు పలాస మండలం రామకృష్ణాపురం, గోపీవల్లభపురం పరిధిలో పునరావాసం కల్పించారు. మౌలిక వసతులు కల్పించకపోవడంతో కొన్నేళ్లుగా నరకయాతన అనుభవిస్తున్నారు. కూటమి ప్రభుత్వం చొరవ తీసుకుని సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నారు.

గోపీవల్లభపురంలో రోడ్డు దుస్థితి

చాలా ఇబ్బంది పడుతున్నాం..

రేగులపాడు నుంచి ఇక్కడికి వచ్చి రెండేళ్లవుతోంది. అప్పటి నుంచి ఇబ్బంది పడుతున్నాం. రోడ్లు, డ్రైనేజీలు లేవు. తాగునీటి సరఫరా చేయడం లేదు. బోర్లు ఉన్నవారి ఇళ్లకెళ్లి నీరు తెచ్చుకుంటున్నాం. శ్మశానం లేదు. మట్టి రోడ్లపై నడిచి వెళ్లడానికి ఇబ్బందులు పడుతున్నాం.
– పానిల బాలరాజు, గోపీవల్లభపురం

● పునరావాస కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, శ్మశానాలు, తాగునీరు లేక అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా పరిస్థితి మారడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

● 2008లో అప్పటి ప్రభుత్వం ఆఫ్‌షోర్ జలాశయం నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. 2016-17లో నిర్వాసిత గ్రామాల్లో సామాజిక ఆర్థిక సర్వే చేశారు. వలస కూలీలు, ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న వారు ఇందులో పాల్గొనలేకపోయారు. సుమారు 150 మందికి జీవన భృతి కింద సొమ్ము రాలేదు.

● నిర్వాసితులు ప్రభుత్వం చూపిన ప్రదేశాల్లో ఇంటి స్థలం తీసుకుంటే రూ.ఐదు లక్షలు తీసుకోకపోతే రూ.10 లక్షలు ఇస్తామన్నారు. ఇంటి స్థలం తీసుకున్న వారికి రూ.9.91 లక్షలు, తీసుకోని వారికి రూ.11.25 లక్షలు వచ్చాయి. రెండింటి మధ్య రూ.1.34 లక్షల వరకు వ్యత్యాసం ఉంది. తమకూ ఇంటి స్థలం కావాలని రూ.11.25 లక్షలు తీసుకున్న వారు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీనికి అనుమతించినా ఇప్పటివరకు ఆ ఊసే లేదు.

● ఆఫ్‌షోర్ వచ్చిన సమయంలోనే హిరమండలంలోని వంశధార ప్రాజెక్టుకు సంబంధించి నిర్వాసితులకు పదేళ్ల గడువు పెంచి యూత్ ప్యాకేజీ ఇచ్చారు. ఆఫ్‌షోర్ నిర్వాసితులకు 2016-17లో సర్వే జరిగినా 2013 జులై 31 వరకు గడువు పెట్టారు. తమకూ పదేళ్లు పెంచి సొమ్ము ఇవ్వాలని నిర్వాసితులు కోరారు. ఈ విషయమై అధికారులు మాట్లాడటం లేదు. గుడి, బడి నిర్మిస్తామని చెప్పినా జరగలేదు.

త్వరలోనే ప్రారంభం..

నిర్వాసిత కాలనీల్లో రోడ్లు, డ్రైనేజీలు, శ్మశానాలు ఇతర పనులకు అంచనాలు వేసి ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. సుమారు రూ.8 కోట్లు అవసరమని గుర్తించాం. కలెక్టర్ అనుమతితో నెల రోజుల్లోపు పనులు ప్రారంభమవుతాయని భావిస్తున్నాం.
– జి.వెంకటేశ్, ఆర్డీవో, పలాస

అడుగు వేయలేం.. అటు వెళ్లలేం..!

బూర్జ మండలంలోని పణుకు పర్త నుంచి అల్లెన వెళ్లే రహదారి ఇది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు ఇలా బురదమయంగా తయారైంది. పాదచారులు నడిచి వెళ్లాలన్నా, వాహనదారులు రాకపోకలు సాగించాలన్నా అవస్థలు పడుతున్నారు. ఈ దారి మీదుగానే నిత్యం అల్లెన, గంగాభగీరథపురం, కిలంత్ర, ఏటొడ్డుపర్త గ్రామాలకు చెందిన విద్యార్థులు పాలవలస ఉన్నత పాఠశాలకు రాకపోకలు సాగిస్తున్నారు. సమస్యను ఆర్‌అండ్‌బీ, పీఆర్, పీయూ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా తమ పరిధిలోనిది కాదంటూ ఎవరికివారు తప్పించుకుంటున్నారు.

– న్యూస్‌టుడే, పణుకుపర్త(బూర్జ)

అసంపూర్తి నిర్మాణం.. అవస్థల ప్రయాణం

పొలాకి మండలం పిన్నింటిపేటలో డీపీఎన్ రోడ్డు పనులు మధ్యలో నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. నిర్మాణానికి రూ.2.5 కోట్లు విడుదలయ్యాయి. పనులు రెండేళ్ల కిందటే పూర్తి కావాల్సి ఉండగా బిల్లుల చెల్లింపుల్లో జాప్యంతో పరిస్థితి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా పరిస్థితి మారింది. వారం రోజుల కిందట చేపట్టి, మళ్లీ వదిలేశారు. వర్షాలకు నీరు నిలిచి, రాకపోకలకు ఇక్కట్లు పడుతున్నాం.. చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. దీనిపై ఆర్‌అండ్‌బీ ఏఈఈ హరనాథ్ మాట్లాడుతూ.. చర్యలు తీసుకుంటామన్నారు.

– న్యూస్‌టుడే, పొలాకి

రూ.లక్షలు వ్యయం.. లక్ష్యానికి దూరం..!

ఆమదాలవలస పుర పరిధి పంతులుపేట కూడలిలో ప్రజా సౌకర్యార్థం స్వచ్ఛభారత్ పేరిట రూ. లక్షలు ఖర్చు చేసి నిర్మించిన సామాజిక మరుగుదొడ్లు వినియోగంలో లేకపోవడంతో అలంకారప్రాయంగానే శిథిలావస్థకు చేరుకున్నాయి. వీటి నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో తలుపులు, అందులో సామగ్రి పూర్తిగా పాడయ్యాయి. ఈ విషయాన్ని ఇన్‌ఛార్జి పుర కమిషనర్ జాన్సన్ వద్ద ప్రస్తావించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు.

– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

నేడు ప్రైవేటు పాఠశాలల బంద్

సమావేశంలో పాల్గొన్న అపుస్మా జిల్లా ప్రతినిధులు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: అధికారుల కక్ష సాధింపు చర్యలకు నిరసనగా గురువారం రాష్ట్ర వ్యాప్తంగా ప్రైవేటు పాఠశాలల బంద్‌కు పిలుపునిచ్చినట్లు అపుస్మా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు బి.లక్ష్మణరావు తెలిపారు. శ్రీకాకుళం నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యాహక్కు చట్ట ప్రకారం ప్రైవేటు బడుల్లో 25 శాతం ఉచిత విద్య అందిస్తున్నామని, వీటికి సంబంధించి మూడేళ్లుగా ప్రభుత్వం నుంచి తమకు రావాల్సిన సొమ్ము చెల్లించడం లేదన్నారు. ఈ ఏడాది కూడా ప్రవేశాలు చేపడుతున్నామని, బకాయిలపై ఎలాంటి సమాచారం లేదన్నారు. విద్యార్థిని చేర్చుకునేందుకు చట్టంలోని నిబంధనలను సరి చూసుకునే సమయం కూడా ఇవ్వడం లేదన్నారు. దీనిపై రాష్ట్రంలోని కొంత మంది జిల్లా అధికారులు కక్ష సాధింపు చర్యలకు పాల్పడి పాఠశాలలను మూసివేయడం తగదన్నారు. రాష్ట్ర శాఖ నిర్ణయం మేరకు తదుపరి కార్యాచరణ ఉంటుందన్నారు. అనంతరం డీఈవో ఎస్.తిరుమల చైతన్యకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో అపుస్మా జిల్లా కార్యదర్శి ఎస్.మోహనరెడ్డి, సంయుక్త కార్యదర్శి జ్యోతిభాస్కర్, కోశాధికారి ఎ.అనంతరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు చంద్రమోహన్, నియోజకవర్గ కార్యదర్శి కె.మురళీకృష్ణ, కె.వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహాల్లో ప్రవేశాల సందడి..!

– న్యూస్‌టుడే, పాతశ్రీకాకుళం

ఆర్థిక ఇబ్బందులతో పాఠశాల, కళాశాల విద్యార్థులు చదువుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాలను నిర్వహిస్తోంది. వాటిని గత వైకాపా హయాంలో నిర్వీర్యం చేశారు. మరమ్మతులకు సైతం నిధులు విడుదల చేయకుండా సమస్యల సుడిలో పడేశారు. కూటమి అధికారంలోకి వచ్చాక బీసీ, ఎస్సీ సంక్షేమ వసతి గృహాలపై ప్రత్యేక దృష్టి సారించింది. మరమ్మతులతో పాటు అవసరమైన చోట్ల శాశ్వత భవనాల మంజూరు నిధులు కేటాయించింది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రుల్లోనూ నమ్మకం కలిగి పిల్లల్ని చేర్పించేందుకు ముందుకొస్తున్నారు. ఉపాధ్యాయులు సైతం ప్రచారం చేస్తున్నారు.

జిల్లాలో వెనుకబడిన తరగతుల(బీసీ) సంక్షేమశాఖ, సాంఘిక సంక్షేమశాఖల పరిధిలో మొత్తం 1120 వసతి గృహాలున్నాయి. వాటిల్లో 13,240 సీట్లు అందుబాటులో ఉన్నాయి. వాటిల్లోని సమస్యలను ఏడాది కాలంలో చాలా వరకు పరిష్కరించిన ప్రభుత్వం పోషకాహారంపైనా దృష్టి సారించింది. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనానికి వినియోగిస్తున్న మాదిరిగానే సంక్షేమ వసతి గృహాలకు సైతం సన్న బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఫలితంగా ప్రవేశాలు పెరుగుతున్నాయి. ప్రీ మెట్రిక్ కంటే పోస్టు మెట్రిక్ వసతి గృహాల్లో పరిమితికి మించి ప్రవేశాలు జరుగుతూ కిటకిటలాడుతున్నాయి. ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్ తదితర కోర్సులు అభ్యసించే విద్యార్థులు నిత్యం గ్రామాల నుంచి వెళ్లి రాలేక పట్టణాల్లోని పోస్టు మెట్రిక్ హాస్టళ్లలో చేరుతున్నారు.

కోటబొమ్మాళిలో నమోదైన కొత్త విద్యార్థులతో వసతి గృహ సంక్షేమాధికారి

అందుబాటులో 13,240 సీట్లు

రూ.8 కోట్లతో పనులు..

◆ బీసీ హాస్టళ్లలో మరమ్మతులకు ప్రభుత్వం రూ.1.17 కోట్లు మంజూరు చేయగా.. ఆ పనులు కొనసాగుతున్నాయి. దీనికి అదనంగా కలెక్టర్ తన నిధుల నుంచి 50 వసతి గృహాలకు మరో రూ.25 లక్షలను మరమ్మతుల నిమిత్తం కేటాయించారు. స్వచ్ఛభారత్ మిషన్ కింద 18 చోట్ల 30 మరుగుదొడ్ల బ్లాక్‌ల నిర్మాణానికి రూ.90 లక్షలిచ్చారు. విద్యుత్తు సరఫరా నిలిచినప్పుడు విద్యార్థులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు అన్ని బీసీ వసతి గృహాలకు ఇన్వర్టర్లను సరఫరా చేశారు.

◆ ఎస్సీ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు గతేడాదిలో రూ.4.05 కోట్లు ఖర్చు చేశారు. మొత్తం 27 చోట్ల కనీస అవసరాలైన తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్తు వైరింగ్, పెయింటింగ్ తదితర సదుపాయాలకు సంబంధించి మరమ్మతులు చేపట్టారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా 18 హాస్టళ్లలో మరుగుదొడ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి.

జిల్లాలో వివరాలిలా..

సంక్షేమశాఖ	ప్రీ మెట్రిక్	సీట్లు	పోస్టు మెట్రిక్	సీట్లు
బీసీ	63	7,440	18	1,800
ఎస్సీ	20	2,900	11	1100

త్వరగా చేర్పించాలి..: విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో జిల్లాలోని అన్ని వసతి గృహాల్లోనూ ప్రవేశాలు ప్రారంభమయ్యాయి. విద్యార్థులు వచ్చిన రోజునే ప్రవేశం కల్పిస్తున్నాం. ఆసక్తి ఉన్న తల్లిదండ్రులు వీలైనంత త్వరగా పిల్లల్ని చేర్పించాలి. గతం కంటే మెరుగైన సౌకర్యాలు, పోషకాహారం అందిస్తున్నాం. వాటిని సద్వినియోగం చేసుకోవాలి.

- ఇ.అనూరాధ, జిల్లా బీసీ సంక్షేమ శాఖాధికారి, డి.మధుసూదనరావు, డీడీ, సాంఘిక సంక్షేమశాఖ

కల్తీ మద్యంతో అనారోగ్యం

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: కల్తీ మద్యంతో అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని జిల్లా ఎక్సైజ్ అధికారి సీహెచ్ తిరుపతినాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో తక్కువ ధరలకు కల్తీ మద్యం సరఫరా జరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. నాసిరకమైన మద్యం తాగితే కొన్నిసార్లు మరణించే అవకాశాలుంటాయని చెప్పారు. అబ్కారీ శాఖ అనుమతులుండే దుకాణాల్లో కొనుగోలు చేయొచ్చన్నారు. కల్తీ మద్యం తయారీ, విక్రయాలపై సమాచారం తెలిస్తే వివరాలను 14405, 94409 02332 నంబర్ల ద్వారా అధికారులకు తెలియజేయాలన్నారు.

రేపటితో ముగియనున్న దరఖాస్తు గడువు

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే సీజీఎల్(కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్) పరీక్షకు దరఖాస్తు గడువు ఈ నెల 4వ తేదీతో ముగియనుందని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వ విభాగాల్లో గ్రూప్-బి, గ్రూప్-సి పోస్టుల భర్తీకి పరీక్ష జరగనుందని చెప్పారు. ఆగస్టు 13 నుంచి 30 వరకు పరీక్షలు ఉంటాయని స్పష్టం చేశారు.

బలవంతపు భూసేకరణకు అంగీకరించం

వాహనాలను అడ్డుకుని నిరసన తెలుపుతున్న రైతులు

వజ్రపుకొత్తూరు, న్యూస్‌టుడే: మండల పరిధి అనకాపల్లి సమీప ప్రాంతాలకు వచ్చిన కార్గో విమానాశ్రయం నిర్మాణ సంబంధిత సర్వే సామగ్రి వాహనాలను బుధవారం స్థానిక రైతులు అడ్డుకున్నారు. వాహనాలు ముందుకు వెళ్లకుండా రోడ్డుపై అడ్డంగా నిల్చుని ఎయిర్‌పోర్టు వద్దు.. మా భూములు ముద్దంటూ నినాదాలు చేశారు. లారీ, పొక్లెయిన్, ఇతర వాహనాలను వెనక్కి మళ్లించారు. కాశీబుగ్గ గ్రామీణ సీఐ తిరుపతి ఘటనా స్థలానికి చేరుకుని గ్రామస్థులకు నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. 'మీ భూముల్లో పనులు చేపడితే తెలియజేయాలి. వివాదాలకు దారి తీసేలా నడుచుకోవద్దు' అని సూచించారు. రెండో రోజూ నేల స్వభావ పరీక్షల సర్వే సామగ్రి వాహనాలను తీసుకు రావడంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అనకాపల్లి ప్రయాణికుల విశ్రాంత భవనం వద్ద ఎయిర్‌పోర్టు నిర్మాణ వ్యతిరేక పోరాట కమిటీ అధ్యక్షుడు కొమర వాసు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ నెల 5న ఒంకులూరు సామాజిక భవనంలో లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం ప్రారంభించాలని నిర్ణయించారు. బాధిత గ్రామాల రైతులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బలవంతపు భూసేకరణకు అంగీకరించబోమని స్పష్టం చేశారు. విమానాశ్రయ నిర్మాణ ఒప్పందం రద్దు చేసేలా ఎమ్మెల్యే గౌతు శిరీష, కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు.

పాత విధానం అమలు కాకుంటే ఉద్యమం

నినాదాలు చేస్తున్న కార్మికులు

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: వాహనాల సామర్థ్య పరీక్ష ఇచ్ఛాపురంలోనే కొనసాగించాలని.. సుమారు 150 కిలోమీటర్ల దూరంలోని జిల్లా కేంద్రానికి వెళ్లమంటే ఉద్యమాన్ని ఉద్ధృతం చేస్తామని ఇచ్ఛాపురం నియోజకవర్గ భజరంగ్ వాహన యజమానులు, కార్మిక సంఘాలు పునరుద్ఘాటించాయి. ఈ విషయమై బుధవారం ఇచ్ఛాపురంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. బాహుదా నదీ తీరం నుంచి పురుషోత్తపురం వరకు నాలుగు మండలాల్లోని ఆటో చోదకులు, మ్యాక్సీ క్యాబ్ సంఘాల సభ్యులు పాల్గొన్నారు. ఎర్రన్నాయుడు కూడలి నుంచి ఎంవీఐ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ సాగారు. అక్కడి నుంచి ఆటోల్లో పురుషోత్తపురం వద్ద రాష్ట్ర సరిహద్దు వరకు వెళ్లి తిరిగి వచ్చారు. సమస్యను ప్రభుత్వ విప్ బెందాళం అశోక్‌కు వివరించగా ఆయన శాసనసభలో చర్చించారని నాయకులు మోహనరావు, యర్రయ్య తదితరులు తెలిపారు. కొత్త విధానాన్నే అమలు చేయడానికి రవాణాశాఖ సిద్ధమైన నేపథ్యంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఉద్యమ బాట పట్టాల్సి వచ్చిందన్నారు. ఇచ్ఛాపురం ఎంవీఐ కార్యాలయంలో పాత విధానంలోనే సేవలందేలా పర్యవేక్షించాలని కోరారు. నాలుగు మండలాల ఆటో, మ్యాక్సీ క్యాబ్ సంఘాలు, సీఐటీయూ ప్రతినిధులు పాల్గొన్నారు.

న్యాయమూర్తుల నియామకంపై ప్రధాన తీర్మానం

సర్వసభ్య సమావేశంలో పాల్గొన్న బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

పాతబస్టాండ్, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరంలోని జిల్లా బార్ అసోసియేషన్ కార్యాలయంలో బుధవారం సర్వసభ్య సమావేశం జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు తంగి శివప్రసాదరావు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలు సమస్యలపై చర్చించారు. జిల్లా న్యాయస్థానాల్లోని మూడు కోర్టులలో న్యాయమూర్తుల నియామకానికి చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకతపై ప్రధాన తీర్మానం చేశారు. వినియోగదారుల న్యాయస్థానం భవన నిర్మాణానికి అవసరమైన నిధుల మంజూరుకు ప్రయత్నించాలని, న్యాయవాదులకు వసతుల కల్పనపై దృష్టి సారించాలని ప్రభుత్వాన్ని కోరాలని తీర్మానించుకున్నారు. స్వాతంత్ర దినోత్సవాన్ని ఈ ఏడాది ప్రత్యేక కార్యక్రమంగా జరపాలని కార్యవర్గ సభ్యులు నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పిట్టా దామోదరరావు, రాష్ట్ర బార్ అసోసియేషన్ సభ్యులు గేదెల వాసుదేవరావు, జిల్లా అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఇప్పిలి సీతరాజు, మహిళా కార్యదర్శి వనజాక్షి, సభ్యులు భవానీ ప్రసాద్, రమణమూర్తి, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

కారు ఢీకొని యువకుడి దుర్మరణం

వంశీ (పాత చిత్రం)

రణస్థలం, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన రణస్థలం మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు మండలంలోని సంచాం గ్రామానికి చెందిన దాకమర్రి వంశీ (21) బుధవారం సాయంత్రం రామతీర్థాలు నుంచి రణస్థలం వైపు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. గిరిజాలపేట వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న కారును ఢీకొనడంతో కిందపడిపోయారు. వాహనం అతనిపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే దుర్మరణం పాలయ్యారు. మృతుడి తల్లిదండ్రులు అప్పారావు, లక్ష్మి కూలి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వంశీ ఇంటర్ వరకు చదివారు. ప్రస్తుతం డాన్సరుగా ఈవెంట్లలో ప్రదర్శనలిస్తున్నాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై చిరంజీవి తెలిపారు.

యువ వైద్యులపై దాడి గర్హనీయం

మాట్లాడుతున్న మాజీ మంత్రి అప్పలరాజు

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: ఇతర దేశాల్లో వైద్య విద్య అభ్యసించిన యువ వైద్యుల సమస్యలు పరిష్కరించాలని నిరసన తెలుపుతుంటే వారిపై పోలీసులు దాడి చేయడం సరికాదని మాజీ మంత్రి, వైకాపా వైద్యుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సీదిరి అప్పలరాజు విమర్శించారు. కాశీబుగ్గలోని ఆ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇతర దేశాల్లో చదువుకున్న యువ వైద్యులకు సంబంధించి రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేయాలని.. ప్రభుత్వం ఏడాదిగా కాలయాపన చేయడంతో వారు శాంతియుతంగా నిరసన తెలుపుతున్నారని పేర్కొన్నారు. వారిపై వైద్యుల దినోత్సవం నాడే పోలీసులు దాడి చేయడం దారుణమని వ్యాఖ్యానించారు. యువ వైద్యులను వేధింపులకు గురిచేయడం సరికాదన్నారు.

THE DIST. CO-OPERATIVE CENTRAL BANK LTD., NO.M.210, SRIKAKULAM

DCCB SRIKAKULAM

Address : Collector Bunglow Road, Dandiveedi, Srikakulam-532001
PHONE : 222301, 228297; FAX: - 08942-223409
Email : ceo_sklm@apcob.org, ceo@dccb-srikakulam.org
Website : www.dccb-srikakulam.org
GST : 37AAEAT8853D1Z7

2025 International Year of Cooperatives

ANNEXURE - II
SALE NOTIFICATION

It is hereby notified that the under mentioned immovable properties attached and mortgaged in satisfaction of monies amount to Rs.11,96,499/- (Rupees Eleven lakhs Ninety Six thousand Four hundred and Ninetynine only) upto 20-06-2025 due by Sri Yejjala Kesavarao S/o Late Chiranjeevulu of Singupuram Village of Nandigam Mandal in Srikakulam District to the District Co-operative Central Bank Ltd., TEKKALI Branch will be sold by public auction 'where it is and as it is' at the **PREMISES OF THE DISTRICT CO-OPERATIVE CENTRAL BANK LTD., TEKKALI BRANCH, MAIN ROAD, TEKKALI, SRIKAKULAM DISTRICT on 06 day of August, 2025 (Wednesday) at 11-00 a.m.** or other day to which the sale may be adjourned.

Details of the properties proposed for auction:
Survey No.260-3B, Extent Ac.0-97 Cts.,Wet Land, Majji Gopalapuram Village, Nandigam Mandal, Srikakulam District
BOUNDARIES: East: Tadi Narayana, **West:** Nasu Bhaskararao
North: Matta Simhachalam **South:** Yejjala Kesavarao
Upset Price fixed for Property : Rs.20,00,000/-
EMD Fixed : Rs.50,000/- (Payable by DD in favouring **"Sale Officer"** or can be paid in cash on the spot)

The Physical inspection of the property and verification of title deeds may be done **from 03-07-2025 to 04-08-2025** during working hours of the DCC Bank, Tekkali Branch. The detailed sale notification and further details regarding sale and details of property proposed for auction may be obtained from Supervisor/Sale Officer, DCC Bank, Tekkali with mobile **No.9160019496** and Branch Manager, DCC Bank, Tekkali with mobile **No.9160018934.**

Sd/- **S. PHALGUNA RAO**
SUPERVISOR/SALE OFFICER,
DCC BANK, TEKKALI BRANCH.

గిరిజన భూములకు రక్షణ కల్పించండి

గిరిజనులతో కలిసి నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

మందస, న్యూస్‌టుడే: మందస మండలంలో గిరిజనుల సాగులో ఉన్న భూములకు రక్షణ కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు డిమాండు చేశారు. సరిహద్దు గ్రామాలైన డలసరి, కొండమేర, మాణిక్యపట్నం, గుడ్డికోల తదితర గ్రామాల్లో సీపీఎం నాయకుల బృందం బుధవారం పర్యటించింది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ తప్పుడు పత్రాలతో గిరిజనేతరులు గిరిజనుల సాగులోని భూములను అన్యాయంగా ఆక్రమించుకుంటున్నారని తెలిపారు. డలసరి ప్రాంతంలో గిరిజనులకు ఆంధ్ర ప్రభుత్వం డీపట్టాలివ్వగా ఒడిశా అధికారులు ఆక్రమించి ప్రభుత్వ నిర్మాణాలు చేపట్టారని పేర్కొన్నారు. కొండమేర ప్రాంతంలో ఒడిశా గిరిజనులకు ఆ రాష్ట్ర అధికారులు కట్టబెట్టారని వివరించారు. సింగుపురం రుద్రభూమిని ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆక్రమించిందని ఆరోపించారు. సమస్యల పరిష్కారానికి ఈ నెల 10న మందస తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా రైతు నాయకులు కె.మోహనరావు, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గురునాథం, ఫల్గుణరావు, పరశురాం, జీడిరైతు సంఘం జిల్లా సమన్వయకర్త టి.అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పట్టాభిరామ్ మృతికి జన విజ్ఞాన వేదిక సంతాపం

కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ప్రముఖ ఇంద్రజాలికుడు, వ్యక్తిత్వ వికాస నిపుణులు బి.వి.పట్టాభిరామ్ మృతి పట్ల జనవిజ్ఞాన వేదిక, మూఢ నమ్మక నిరోధక చట్ట సాధన కమిటీ ప్రతినిధులు సంతాపం వ్యక్తం చేశారు. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేందుకు ఆయన ఎంతో కృషి చేశారని కొనియాడారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ప్రోత్సాహంతో ప్రభుత్వ పథకాలు, మద్యపాన నిషేధం వంటి కార్యక్రమాలకు తన వంతు ప్రచారం చేశారని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, మూఢ నమ్మక నిరోధక చట్ట సాధన కమిటీ గౌరవాధ్యక్షుడు హనుమంతు సాయిరాం బుధవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

పీజీ డిప్లొమా ఇన్ గాంధీయన్ సోషల్ వర్క్ కోర్సులో ప్రవేశాలు

ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: డా.బీఆర్. అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న పీజీ డిప్లొమా ఇన్ గాంధీయన్ సోషల్ వర్క్ కోర్సులో 2025-26 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వర్సిటీ రిజిస్ట్రార్ పీలా సుజాత బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు రూ.2 వేల రుసుం చెల్లించి జులై 15వ తేదీలోగా వర్సిటీలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కోర్సులో 30 సీట్లు అందుబాటులో ఉన్నాయని, రోజూ మధ్యాహ్నం 2 నుంచి 4.30 వరకు తరగతులు జరుగుతాయన్నారు. దరఖాస్తు చేసుకున్నవారికి ఈనెల 20న కౌన్సెలింగ్ నిర్వహించి ప్రవేశాలు కల్పిస్తామన్నారు. అదనపు సమాచారానికి 78930 54967 నంబరును సంప్రదించాలని సూచించారు.

చికెన్ ధరలు

రకం	(బ్యాగ్)లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
బ్రాయిలర్	100	155	175

పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

టంకాలదుగ్గివలస గ్రామంలో వైద్యసిబ్బంది, అధికారులతో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా

జి.సిగడాం, న్యూస్‌టుడే: ప్రస్తుతం వ్యాధుల కాలం కావడంతో అధికారులు గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జడ్పీ సీఈవో శ్రీధర్‌రాజా అన్నారు. జి.సిగడాం మండలం టంకాల దుగ్గివలసలో పలువురు జ్వరాలతో బాధపడుతున్నందున ఆయన గ్రామాన్ని పర్యటించారు. పారిశుద్ధ్యం, తాగునీటి వనరుల వద్ద క్లోరినేషన్ వంటివి ఎప్పటికప్పుడు చేపట్టాలని సిబ్బందికి సూచించారు. జ్వరాలు వ్యాప్తి చెందకుండా ముందు జాగ్రత్త తీసుకోవాలన్నారు. జ్వరాలు తగ్గుముఖం పట్టే వరకు వైద్య శిబిరాన్ని కొనసాగించాలని తెలిపారు. ఇంటింటికీ వెళ్లి జ్వర బాధితుల పరిస్థితి తెలుసుకున్నారు. మండల పరిషత్తు, వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంపీడీవో రామకృష్ణ, వైద్యాధికారి యశ్వంత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొంచెం చూడండి.. గుంతలు పూడ్చండి..!

శ్రీకాకుళం రోడ్డు రైల్వేస్టేషన్ ప్రధాన రహదారి గోతులతో అధ్వానంగా మారింది. ఇటీవల కురుస్తున్న వర్షాలు కారణంగా గోతుల్లో నీరు చేరి వాహనాలు అదుపు తప్పుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. స్టేషన్ ఆవరణలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులు వల్ల భారీ వాహనాలు రహదారిపై రాకపోకలు సాగిస్తుండటంతో గోతులు ఏర్పడ్డాయి. ఈ సమస్యపై రైల్వేస్టేషన్ సూపరింటెండెంట్ ఉమామహేశ్వరరావును వివరణ కోరగా త్వరలోనే రహదారి నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు.

– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

గుర్రాలపాలెం సమీపంలోని రెయిన్‌బో పరిశ్రమలో యంత్రాలు పరిశీలిస్తున్న బృందం

పరిశ్రమలో ఆకస్మిక తనిఖీ

లావేరు, న్యూస్‌టుడే: లావేరు మండలం గుర్రాలపాలెం సమీపంలోని రెయిన్‌బో (ఆసుపత్రి వ్యర్థాలు నిర్వీర్యం చేసే) పరిశ్రమను కేంద్ర, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి అధికారుల బృందం తనిఖీ చేసింది. పరిశ్రమలో నిర్వీర్యం చేసే వ్యర్థాలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, దీంతోపాటు పంట పొలాలు దెబ్బతింటున్నాయని పలువురు జాతీయ హరిత మండలి(ఎన్‌జీటీ)లో కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో కోర్టు ఆదేశాల మేరకు బుధవారం పరిశ్రమలోని యంత్రాలు, నిర్వీర్యం చేస్తున్న వ్యర్థాలు తదితర వాటిని కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి శాస్త్రవేత్తలు సౌమ్య, పద్మావతి, ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఎస్ఈ సురేంద్రబాబు, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటేశ్వరరావు, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈఈ కరుణశ్రీ పరిశీలించారు. తుది నివేదికను ఎన్‌జీటీకి, ఉన్నతాధికారులకు ఈనెల 8 లోపు సమర్పిస్తామని అధికారుల బృందం తెలిపింది. తహసీల్దారు జీఎల్ఈ శ్రీనివాసరావు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించండి
Cell: 80085 97609
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 80081 11237

EENADU Classifieds

BUSINESS SERVICES

GK గోల్డ్ లోన్ బ్యాంక్/ప్రైవేటు తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ ధరకు కొనబడును లేదా అధిక రుణం ఇప్పించబడును. ✆ 8897731257.

REAL ESTATE

FLAT FOR SALE

1 BHK, 2 BHK Deluxe Flats is for sale Hitech Paradise, Patrunivalasa, near Dental College, Srikakulam. Contact : 9573992444.

HOUSE FOR SALE

శ్రీకాకుళం మున్సఫ్ పేట హైవే దగ్గర రెవెన్యూ ఎంప్లాయిస్ లేఅవుట్‌లో SUDA అప్రూవల్, 40 ఫీట్ రోడ్స్, 30x50లో నిర్మించిన 2ఫ్లోర్స్ ఇండిపెండెంట్ ఇల్లు అమ్మకమునకు కలదు. Ph: 9492764750.

JOBS

FACULTY/ TEACHERS

IIT Foundation course హయ్యర్ క్లాసులకు బోధించుటకు మేథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ సబ్జెక్ట్ టీచర్స్ (F) కావలెను. అనుభవంగలవారికి ప్రాధాన్యత ✆ 9490068665.

ACCOUNTING

శ్రీకాకుళంటౌన్‌లో గల ప్రముఖ స్కూల్ నందు అకౌంటెంట్‌గా పనిచేయుటకు M.Com అర్హత కలిగి స్కూల్ అకౌంటింగ్ నందు అనుభవం గలవారు వెంటనే సంప్రదించండి: 8885331377.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన కేవలం 315 /- (GST 5% అదనం) మాత్రమే సంప్రదించండి: 8008597609

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

పలాస

• పలాస • ఇచ్ఛాపురం

ఆకతాయిలతో ఇబ్బందులు పడుతున్నారా..?

నేడే కాశీబుగ్గ డీఎస్పీకి ఫోన్ చేయండి..

మీ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందా... రౌడీ మూకలు, ఆకతాయిలతో ఇబ్బంది పడుతున్నారా.. కళాశాలలు, విద్యా సంస్థల వద్ద వేధింపులు ఉన్నాయా.. పోలీస్ ఠాణాకు వెళ్తే న్యాయం జరగడం లేదా.. రహదారి ప్రమాదాలకు నిలయంగా మారిన ప్రాంతాలున్నాయా.. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు మీ పరిసర ప్రాంతంలో ఎవరైనా విక్రయిస్తున్నారా.. సమాజ శ్రేయస్సు కోరి చట్టపరిధిలోకి వచ్చే ఏ సమస్య అయినా కాశీబుగ్గ డీఎస్పీ వి. వెంకట అప్పారావుతో నేరుగా చెప్పుకొనే అవకాశం 'ఈనాడు' కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా కింది నంబరుకు ఫోన్ చేయడమే. - న్యూస్‌టుడే, కాశీబుగ్గ

తేదీ: 03.07.2025 (గురువారం) | ఫోన్ నంబరు: 63099 90805

(ఉదయం 10 నుంచి 11 గంటల వరకు).. వివరాలు పంపాల్సిన వాట్సాప్ నంబరు: 93900 63987

తెదేపా సోంపేట మండల అధ్యక్షుడిగా కుమార్ ఎన్నిక

9 మంది పోటీ పడగా ఆయన వైపే పెద్దల మొగ్గు

ప్రభుత్వ విప్ అశోక్, గౌతు శ్యామసుందర శివాజీతో కుమార్

సోంపేట, న్యూస్‌టుడే: తెదేపా సోంపేట మండల అధ్యక్షుడిగా మద్దు కుమార్‌ను ఎన్నుకుంటూ ఆ పార్టీ పెద్దలు నిర్ణయం తీసుకున్నారు. 9 మంది ఆశావహులు పోటీ పడటంతో ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ కొన్ని రోజులుగా నేతలతో సమీక్షించారు. ఎట్టకేలకు బుధవారం మండల పార్టీ సర్వసభ్య సమావేశాన్ని మద్దిల నాగేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. అభిప్రాయ సేకరణలో భాగంగా తెదేపా నాయకుడు కె.రాజేష్ మాట్లాడుతూ పార్టీ సమావేశాలు సరిగా నిర్వహించకపోవడంతో కార్యకర్తలు ఇబ్బందులు పడుతున్నారని.. కొందరు వ్యక్తిగత పనుల కోసమే పెద్దల వద్దకు వెళ్తున్నారని వ్యాఖ్యానించారు. ఆశావహులు రవి, పురుషోత్తం, గోపాల్, శ్రీకాంత్, మల్లా బాబూరావు తదితరులు మాట్లాడుతూ తమకు ఒకసారి అవకాశం కల్పించాలని కోరారు. పెద్దలు ప్రత్యేకంగా చర్చించుకున్న తరువాత అధ్యక్షుడిగా మద్దు కుమార్ పేరును మాజీ మంత్రి శివాజీ ప్రకటించడంతో అందరూ ఏకగ్రీవంగా అంగీకరించారు. తొమ్మిదేళ్లుగా అధ్యక్ష బాధ్యతలు నిర్వహిస్తున్న మద్దిల నాగేశ్వరరావును శివాజీ, అశోక్ ఘనంగా సన్మానించారు.

అభివృద్ధిపై మాట్లాడండి..

ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనుల గురించి ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని కోరారు. సోంపేట మండల వ్యవహారాలు మాజీ మంత్రి శివాజీ పర్యవేక్షించడంపై వివరణ ఇచ్చారు. శివాజీ మాట్లాడుతూ అన్ని ఎన్నికల్లో సోంపేట మండలం నుంచే అత్యధిక మెజార్టీ వస్తోందని గుర్తు చేశారు. ఇకపైన కార్యకర్తలు, నాయకులు చిత్తశుద్ధితో పని చేస్తేనే కీలక పదవులు వస్తాయన్నారు. ఆశావహులు నిరాశ చెందకుండా పని చేయాలని.. మిగిలిన పదవుల పరంగా న్యాయం జరుగుతుందన్నారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి సూరాడ చంద్రమోహన్, పరిశీలకుడు పి.సాంబమూర్తి, మాజీ సర్పంచి గాంధీ, సీనియర్ నాయకులు గురుమూర్తి, జగన్నాథం, సూర్యనారాయణ, శ్రీను, ఆనంద్, శేఖర్, రాజారావు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

ఇచ్ఛాపురం: 9440437129
పలాస: 8008574279
కవిటి గ్రామీణం: 8309936875
పలాస గ్రామీణం: 7386409926
కంచిలి గ్రామీణం: 9704568736

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్ ద్వారా వివరించొచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తెచ్చి పరిష్కారానికి కృషి చేస్తాం.

?: ఇచ్ఛాపురం పట్టణ పరిధి లాలాపేట మసీదు పక్కన ఉండే కొత్త వీధిలో రోడ్డు నిర్మించాలి. -డా.సూర్యం, ఇచ్ఛాపురం

★: కౌన్సిల్ ప్రతిపాదించి సమావేశంలో సమస్యను పరిష్కరిస్తాం.- ఎన్.రమేష్, కమిషనర్, ఇచ్ఛాపురం

?: పలాస మండలం సున్నాదేవి పెద్ద వీధిలో మురుగు నీరు రోడ్డుపై పారుతుండటంతో ఇబ్బందిపడుతున్నాం.-సారికలు

★: రెండు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తాం.- సద్గుణ, ఇన్‌ఛార్జి పంచాయతీ కార్యదర్శి, లొద్దభద్ర-న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం, పలాస గ్రామీణం

ప్లాస్టిక్ ముప్పు.. కలగదా కనువిప్పు!

న్యూస్‌టుడే, పలాస, ఇచ్ఛాపురం

ప్లాస్టిక్ వినియోగంతో పర్యావరణానికి ముప్పు వాటిల్లుతోందని నివారణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నా క్షేత్రస్థాయిలో మార్పు రావడం లేదు. విచ్చలవిడిగా వినియోగిస్తుండటంతో ఎక్కడ చూసినా గుట్టలుగా దర్శనమిస్తున్నాయి. కాలువల్లో పేరుకుపోతుండటంతో పారిశుద్ధ్య పనులు చేపట్టడానికి ఇబ్బందులు కలుగుతున్నాయి. రోజూ చెత్త సేకరణలో టన్నుల కొద్దీ నిషేధిత పాలిథిన్ సంచులు బయటపడుతుండటంతో కట్టడి చేయడం అధికారులకు సవాల్‌గా మారుతోంది. గురువారం అంతర్జాతీయ ప్లాస్టిక్ బ్యాగ్ రహిత దినోత్సవం సందర్భంగా కథనం.

కొరవడిన పర్యవేక్షణ

గతంలో పెద్దలు ఓ సంచి, గొడుగు పట్టుకుని బజారుకు వెళ్లేవారు. ప్రస్తుతం సరుకులు కొనుగోలు చేశాక తీసుకెళ్లడానికి సంచి లేదని చెబుతుండటంతో కొందరు దుకాణదారులు తప్పనిసరి పరిస్థితుల్లో నిషేధిత పాలిథిన్ సంచులు అందజేస్తున్నారు. ఇంటికి తెచ్చాక కవర్లు బయట పడేస్తున్నారు. అవి ఎక్కడికక్కడ పేరుకుపోయి మరిన్ని సమస్యలకు కారణమవుతున్నాయి. మూగజీవాలు వాటిని తినేస్తుండటంతో అనారోగ్యానికి గురై మృత్యువాత పడుతున్నాయి. పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం పరిధి 31 వార్డుల్లో రోజూ 28 టన్నుల చెత్త సేకరిస్తున్నారు. ఇందులో సుమారు 5 టన్నుల వరకు ప్లాస్టిక్ వ్యర్థాలే ఉంటున్నాయి. ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధి 23 వార్డుల్లో నిత్యం 21 టన్నుల చెత్త సేకరిస్తుండగా వాటిలో సుమారు 3.5 టన్నులు ప్లాస్టిక్ వ్యర్థాలు ఉంటున్నాయి. విచ్చలవిడిగా విక్రయిస్తుండటం, అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో వినియోగం పెరిగిపోతోంది.

విచ్చలవిడిగా పెరుగుతున్న వినియోగం

అపరాధ రుసుం అంతంతే..

అధికారుల తనిఖీల్లో నిషేధిత పాలిథిన్ సంచులు బయటపడితే విక్రేతలకు అపరాధ రుసుం నామమాత్రంగా విధిస్తున్నారు. రూ.50 లేదా రూ.100 విధిస్తుండటంతో దుకాణదారులు చెల్లించి తిరిగి అమ్మకాలకు ఉపక్రమిస్తున్నారు. అధికారులకు ఈ విషయం తెలిసినా మిన్నకుంటున్నారు. కొందరు పెద్ద దుకాణదారులతో లోపాయికారి ఒప్పందాలు కుదుర్చుకుని లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు.

మహిళా మార్టులతో ప్రయోజనం

పురపాలక సంఘాల పరిధిలో మహిళా మార్టులు ఏర్పాటు చేసి వస్త్ర, కాగిత సంచులు విక్రయించేలా చర్యలు తీసుకుంటే సంఘాలు ఆర్థిక బలోపేతమవుతాయి. నిషేధిత పాలిథిన్ సంచుల వినియోగాన్ని పక్కాగా నియంత్రించడానికి అవకాశం ఉంటుంది. చెన్నైలో మాదిరిగా వస్త్ర సంచుల కియోస్క్‌లు ఏర్పాటు చేస్తే భవిష్యత్తులో పాలిథిన్ సంచుల వినియోగం తగ్గుతుందని పర్యావరణవేత్తలు అభిప్రాయపడ్డారు.

నిషేధిత పాలిథిన్ సంచులు విక్రయించకుండా చర్యలు

ప్లాస్టిక్ రహిత పురపాలక సంఘంగా తీర్చిదిద్దడానికి ప్రణాళికలు అమలు చేస్తున్నాం. మహిళా సంఘాల ఆధ్వర్యంలో వస్త్ర సంచుల తయారీపై శిక్షణ ఇచ్చాం. నిషేధిత పాలిథిన్ సంచులు విక్రయించకుండా చర్యలు తీసుకుంటాం.- ఎన్.రామారావు, కమిషనర్, పలాస-కాశీబుగ్గ పురపాలక సంఘం

చూసిన కనులదే భాగ్యం

సోంపేట: వామనావతారంలో దర్శనమిస్తున్న జగన్నాథస్వామి

కవిటి, సోంపేట, ఇచ్ఛాపురం, పలాస, న్యూస్‌టుడే: రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా బుధవారం జగన్నాథస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కవిటి, సోంపేట, బారువలో వామనావతారంలో, ఇచ్ఛాపురంలో శ్రీకృష్ణ, బలరాముడి రూపాలలో జగన్నాథుడు, బలభద్రస్వామి దర్శనమిచ్చారు. పలాస రైల్వే కాలనీలో పరశురామావతారంలో జగన్నాథుడికి పూజలు చేశారు.

వైభవంగా గ్రామదేవత సంబరాలు

వజ్రపుకొత్తూరు మండలం పూడిలంకలో బుధవారం అమ్మవారి సంబరాలు వైభవంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన యువత, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కళాకారులు ప్రత్యేక వేషాధరణలతో అలరించారు. కోలాటం, బిందెల నృత్యాలు, డ్యాన్స్ హంగామా ఆకట్టుకున్నాయి. పెద్దమ్మతల్లి, మంకినమ్మ, భూలోకమ్మ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. - న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు గ్రామీణం

మీటరు అమర్చారు..రక్షణ మరిచారు

ఇచ్ఛాపురం పట్టణ పరిధి దాసన్నపేట కూడలిలో దీప స్తంభానికి విద్యుత్తు మీటరు, నిర్వహణ పెట్టెలు అమర్చారు. రక్షణ చర్యలు లేకపోవడంతో తరచూ విద్యుదాఘాతానికి గురవుతున్నారని స్థానికులు తెలిపారు. ఉపకరణాలను ఎత్తులో అమర్చాలని.. దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సమస్యను పరిష్కరిస్తామని పుర ఏఈ కామేశ్వరరావు తెలిపారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

కుండీలతో బెంబేలు

వజ్రపుకొత్తూరు మండలం డోకులపాడు, చినవంక, గరుడభద్ర ఇతర ప్రాంతాల్లో మెగా రక్షిత నీటి పథకం పైపులైన్ వాల్వ్‌కు ఏర్పాటు చేసిన కుండీలు లోతుగా ఉండటంతో ప్రమాదకరంగా మారాయి. వాటిపై పలకలు అమర్చకపోవడంతో జీవాలు లోపల పడి మృత్యువాత పడుతున్నాయి. వాహనదారులు భయాందోళనలకు గురవుతున్నారు. పరిశీలించి పలకలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని ఉద్దానం రక్షిత నీటి సరఫరా పథకం జేఈ తేజేశ్ తెలిపారు. – న్యూస్‌టుడే, వజ్రపుకొత్తూరు

ప్రమాద సూచికలేవీ..?

కవిటి మండలం రాజపురం నుంచి కొజ్జిరియా వెళ్లే ఆర్ అండ్‌బీ రోడ్డులో మూడు చోట్ల ప్రమాదకర మలుపులున్నాయి. ప్రమాద సూచికలు లేకపోవడంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై ఆర్అండ్‌బీ ఏఈ విక్రమ్‌ను 'న్యూస్‌టుడే' సంప్రదించగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

పగలూ వెలుగులు

కంచిలిలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద వీధి దీపాలు కొన్ని రోజులుగా పగలూ వెలుగుతున్నాయి. విద్యుత్తు వృథా అవుతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఈవోపీఆర్డీ రాంబాబును 'న్యూస్‌టుడే' సంప్రదించగా గతంలో ఏర్పాటు చేసిన ఎంసీబీలు (స్విచ్‌లు) మరమ్మతులకు గురయ్యాయని.. కొత్తవి ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, కంచిలి

ఉల్లాసంగా..ఉత్సాహంగా

మహిషాసురమర్దిని నృత్యరూపకంలో ఓ ఘట్టం

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: జగన్నాథస్వామివారి రథోత్సవాల్లో భాగంగా ఇచ్ఛాపురంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకుంటున్నాయి. హీరా పంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని మంగళవారం రాత్రి శ్రీవెంకటేశ్వర డాన్స్ అకాడమీ సంస్థ నాట్య గురువు శృతి పట్నాయక్ ఆధ్వర్యంలో, చిన్నాగురుస్వామి, జయలక్ష్మి పర్యవేక్షణలో శాస్త్రీయ, నృత్య ప్రదర్శనలు సాగాయి.

కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం

పలాస మండలం కిష్టుపురంలో వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న నాయకులు

పలాస గ్రామీణం, వజ్రపుకొత్తూరు, మందస, ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: కూటమి పాలన ప్రారంభమైన ఏడాదిలోనే తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పెంపు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, అన్న క్యాంటీన్ల పునరుద్ధరణ, మత్స్యకారులకు వేట నిషేధ భృతి పెంపు తదితర పథకాలను ప్రజలకు అందజేశామని తెదేపా పలాస నియోజకవర్గ పరిశీలకుడు చౌదరి బాబ్జీ అన్నారు. ఏ సమస్య ఉన్నా స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా పలాస మండలం కిష్టుపురంలో బుధవారం ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం సాధించిన విజయాలను ప్రజలకు వివరించారు. నాయకులు పీరికట్ల విఠల్, కృష్ణంరాజు, గంగారాం పాల్గొన్నారు. ● వజ్రపుకొత్తూరు మండలం చినవంక పంచాయతీ పరిధి గుల్లలపాడులో క్లస్టర్ ఇన్‌ఛార్జి దువ్వాడ హేమబాబు చౌదరి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిశీలకుడు చౌదరి బాబ్జీ, తెదేపా మండల అధ్యక్షుడు మోహనరావు పాల్గొన్నారు.● అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తామని తెదేపా మందస మండల అధ్యక్షుడు బి. దుర్యోధనరావు అన్నారు. మండల పరిధి బొగాబంద, కొంకడాపుట్టి పంచాయతీ గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి పథకాలపై అవగాహన కల్పించారు. ● ఇచ్ఛాపురం పట్టణం, మండలంలో గురువారం నుంచి సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాలు చేపట్టాలని తెదేపా నాయకులు నిర్ణయించారు.

ఇంట్లోనే సేంద్రియ ఎరువు..!

ఉపాధి హామీ పథకంలో గుంతల తవ్వకం

పలాస మండలం చిన్న నీలావతిలో ఎరువు గుంత తవ్వుతున్న వేతనదారు

న్యూస్‌టుడే, పలాస గ్రామీణం

ఉపాధి హామీ పథకాన్ని కూటమి ప్రభుత్వం రైతులకు మరింత చేరువ చేస్తోంది. పశువుల వ్యర్థాలు, ఇంట్లోని తడి చెత్తను బయట పడేయకుండా గుంతల్లో వేసి ఎరువు తయారు చేసేలా ప్రణాళిక రూపొందించింది. గుంతలు తీయించుకోవడానికి నిధులు సమకూరుస్తోంది. వర్మీ కంపోస్టు, ఇతర సేంద్రియ ఎరువులు తయారు చేసుకోవాలని సూచిస్తోంది.

కార్యాచరణ ఇలా..

గుంతలను రెండు రకాలుగా విభజించారు. పశువులుంటే 1.5 మీటర్ల పొడవు, 1.5 మీటర్ల వెడల్పు, 0.9 మీటర్ల లోతుతో గుంత తవ్వాలి. ఇందుకు రూ.958 మంజూరు చేస్తున్నారు. జీవాలు లేని వారు ఒక మీటరు డయామీటర్ 0.9 మీటర్ల లోతుతో వృత్తాకారంలో రెండు గుంతలు తవ్వాలి. ఒక్కో గుంతకు మధ్య 0.5 మీటర్ల ఖాళీ ఉండాలి. ఇందుకు రూ.647 ఇస్తున్నారు.

అర్హులు వీరే..

మండలం	గుంతల లక్ష్యం	పూర్తయినవి
ఇచ్ఛాపురం	5,041	4,953
కవిటి	7,889	7,340
కంచిలి	6,389	5,584
సోంపేట	7,684	4,760
మందస	7,973	6,710
పలాస	4,157	2,706

సొంత స్థలాలున్న వారు గుంతలు తవ్వుకోవచ్చు. జాబ్ కార్డు కలిగిన వ్యక్తి ఎరువు గుంతలు తవ్వాలనుకుంటే ఉపాధి హామీ క్షేత్ర సహాయకుడిని కలిసి విషయం చెప్పాలి. అనంతరం గుంత తవ్వుకున్న ఉపాధి హామీ వేతనదారు బ్యాంకు ఖాతాలో డబ్బులు జమ అవుతాయి. ఎరువు గుంతలు త్వరగా నిర్మించుకుంటే పంటలు, మొక్కలకు ఉపయోగం ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి..

ఎరువు గుంతలు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలందరికీ ఉపయోగపడే మంచి పథకం. ఇంట్లోని తడి చెత్తను వాటిలో వేసుకుంటే సుమారు 3 నెలలకు ఎరువు తయారవుతుంది. పంట పొలాల్లో, పూలు, కాయగూరల మొక్కలకు వినియోగించుకోవచ్చు. ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటే పరిసరాలు శుభ్రంగా ఉంటాయి. – సీహెచ్ శ్రీనివాసరెడ్డి, ఏపీడీ, డ్వామా, పలాస క్లస్టర్

గౌతమ బుద్ధుడి విగ్రహావిష్కరణ

సోంపేట ఆదర్శ పాఠశాలలో తెదేపా పట్టణ అధ్యక్షుడు బీన ఆనంద్ ఏర్పాటు చేసిన గౌతమ బుద్ధుడి విగ్రహాన్ని బుధవారం ప్రభుత్వ విప్ బెందాళం అశోక్, మాజీ మంత్రి గౌతు శ్యామసుందర శివాజీ ఆవిష్కరించారు. స్కూల్ మ్యాగజైన్, ల్యాబ్ గదులు ప్రారంభించారు. పది, ఇంటర్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు భౌతికశాస్త్రం ఉపాధ్యాయురాలు హరిత సమకూర్చిన నగదు, బహుమతులు అందజేశారు. తల్లిదండ్రుల కమిటీ అధ్యక్షుడు బీన ఈశ్వరరావు ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ప్రిన్సిపల్ డి. చిన్నాజీవర్మ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో పలువురు ప్రసంగించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ ఎ.మోహన్‌రావు, తెదేపా నాయకులు చంద్రమోహన్, నాగేశ్వరరావు, శేఖర్, శ్రీను, రాజారావు, ధర్మారావు, రాజు పాల్గొన్నారు. ఎంఈవోలకు ఆహ్వానం లేకపోవడంతో అసంతృప్తి వ్యకం చేస్తూ గైర్హాజరయ్యారు. – న్యూస్‌టుడే, సోంపేట

మహిళా సర్పంచులకు శిక్షణ

పలాస గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వం అన్ని రంగాల్లోనూ మహిళలకు ప్రత్యేక స్థానం కల్పిస్తోందని.. ఈ అవకాశాన్ని మహిళా సర్పంచులు అందిపుచ్చుకోవాలని పలాస ఎంపీడీవో కార్గ్గి వసంతకుమార్ అన్నారు. పలాస మండల పరిషత్తు కార్యాలయంలో పలాస, మెళియాపుట్టి, నందిగాం మండలాలకు చెందిన మహిళా సర్పంచులకు బుధవారం నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పాలనలో మెలకువలు తెలుసుకుని పంచాయతీలను అభివృద్ధి చేయాలని సూచించారు. అనంతరం శిక్షకులు కె. కామరాజు, ఎన్.మన్మథరావు, వై.జ్యోతిశ్రీనివాస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ ఎంపీడీవో మెట్ట వైకుంఠరావు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ పాటించకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రామారావు

సోంపేట, న్యూస్‌టుడే: ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేకపోయినప్పటికీ అధికారులు అత్యుత్సాహం ప్రదర్శించి వ్యవస్థలు, పాలనా పద్ధతులను నిర్వీర్యం చేస్తున్నారని ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ డాక్టర్ ఎన్.దాసు, పలువురు సభ్యులు ధ్వజమెత్తారు. సోంపేటలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీడీవో ఈశ్వరమ్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ అధికారులు ప్రొటోకాల్ పాటించకపోవడం, అనధికార వ్యక్తులతో కార్యక్రమాలు నిర్వహించడం సబబు కాదన్నారు. పి.కామేషు, ధర్మారావు తదితరులు మాట్లాడుతూ అధికార పార్టీ పెద్దలు సోంపేటలో కాలువలు ఆక్రమించి లేఅవుట్లు వేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆక్షేపించారు. ఎంపీపీ మాట్లాడుతూ తనకు సమాచారం లేకుండానే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని.. పెద్దల మెప్పు కోసం అధికారులే సమస్యలు సృష్టిస్తున్నారని ఆరోపించారు. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రధాన కార్యదర్శికి ఫిర్యాదు చేస్తామని.. న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని స్పష్టం చేశారు. వ్యవసాయాధికారి నర్సింహమూర్తి మాట్లాడుతూ ఖరీఫ్‌లో వరి సాగు విస్తీర్ణం ఏటా తగ్గిపోతోందని వివరించారు. మండల ఉపాధ్యక్షుడు జి.శ్రీను మాట్లాడుతూ విత్తనాలు చల్లిన తరువాత వర్షాలు లేకపోవడంతో నారు మొలకెత్తలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సోంపేట జగనన్న కాలనీలో ఇళ్లు విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని కామేషు, పలువురు సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. సమావేశానికి సగానికి పైగా ఎంపీటీసీ సభ్యులు గైర్హాజరయ్యారు. వచ్చిన వారిలో భర్తలే ఎక్కువగా ఉన్నారు. ఉదయం 11.20 వరకు సభ్యులతో పాటు మెజార్టీ అధికారులు హాజరు కాలేదు. కోరం పూర్తిగా లేని పరిస్థితి ఉండగా ఎక్కువ మంది సంతకాలకే పరిమితమవుతున్నారు. తహసీల్దారు అప్పలస్వామి, ఎంఈవోలు జొరాడు, కృష్ణంరాజు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కేజీబీవీకి వితరణ

ఇచ్ఛాపురం రోటరీ క్లబ్ ప్రతినిధులు బుధవారం కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయానికి 250 పరుపులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వో డా.పి.శిరీష, రోటరీ క్లబ్ జిల్లా గవర్నర్ రొబినారాయణ్ నంద, క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.రాజకుమార్, పి.ప్రదీప్‌కుమార్, ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు తిప్పన మోహనవెంకటేష్, కాదా రామకోటి, దక్కత కృష్ణమూర్తిరెడ్డి, పాక తులసీదాస్, దేవరపల్లి గోపాల్, కృష్ణారావు, జోగారావు, అప్పారావు, ఉలాసి శ్యామ్, నవీన్‌కుమార్ పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఇచ్ఛాపురం

పర్యావరణ పరిరక్షణపై మరిన్ని పుస్తకాలు రాయాలి

పర్యావరణ పరిరక్షణపై మరిన్ని పుస్తకాలు రాయాలని ప్రభుత్వ విప్ అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలోని ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం ఇచ్ఛాపురానికి చెందిన ప్రముఖ పర్యావరణ పరిశోధకుడు మద్ది విశ్వనాథరెడ్డి పర్యావరణంపై రాసిన ప్రాక్టికల్ ఫ్యూచర్ బియాండ్ యుటోపియా పుస్తకాన్ని ఆవిష్కరించారు. బనారస్ హిందూ విశ్వవిద్యాలయం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బీవీస్వీ ప్రసాద్, కుసుంపురం మాజీ సర్పంచి బత్తిన కృష్ణారావు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, కవిటి గ్రామీణం

కత్తివరం..పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

న్యూస్‌టుడే, కంచిలి

గొల్లవీధిలో కాలువలు లేకపోవడంతో రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

కంచిలి మండలం కత్తివరంలో 2 వేలకు పైగా జనాభా ఉంది. గ్రామంలో 80 శాతానికి పైగా సీసీ రోడ్లున్నప్పటికీ వాటి పక్కన కాలువలు లేకపోవడంతో వాడుక, మురుగు నీరు రోడ్లపై పారుతోంది. ఎక్కడికక్కడ చెత్త పేరుకుపోయి దుర్వాసన వ్యాపిస్తుండటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దోమలు విజృంభిస్తున్నాయి. పెద్ద, గొల్ల, చాకలి వీధుల్లో పరిస్థితి మరింత అధ్వానంగా ఉండటంతో వ్యాధుల ముప్పు పొంచి ఉంది. కొన్ని వీధుల్లో నీరు అందుబాటులో లేక మహిళలు బిందెలతో మోసుకెళ్తున్నారు. జల్‌జీవన్ మిషన్ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

ఇదీ పరిస్థితి

● కత్తివరం పంచాయతీలో విద్యుత్తు కోతల సమస్య తీవ్రంగా ఉంది. నియంత్రిక వద్ద సాంకేతిక సమస్యలు తలెత్తుతుండటంతో తరచూ సరఫరా నిలిచిపోతోంది. లోవోల్టేజీతో ఉపకరణాలు మరమ్మతులకు గురవుతున్నాయి. మరో నియంత్రిక ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. సోంపేట నుంచి కత్తివరం మీదుగా ఆర్టీసీ బస్సు సౌకర్యం లేకపోవడంతో ఆటోలు, ఇతర వాహనాలపై ఆధారపడుతున్నారు. స్వర్గధామానికి మండపం లేక వర్షాల సమయంలో అంత్యక్రియలకు ఇబ్బందులు పడుతున్నారు. బోరు తీయించాలని, సీసీ రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు.

సమస్యల పరిష్కరిస్తాం..

కత్తివరం పంచాయతీ పరిధిలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. పంచాయతీ కార్యదర్శి, ఇతర శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులతో మాట్లాడి ప్రతిపాదనలు రూపొందిస్తాం. – వి.తిరుమలరావు, ఎంపీడీవో, కంచిలి

కొబ్బరి మొక్కల పంపిణీ

కంచిలి మండలం పెద్దశ్రీరాంపురంలో ఆర్అండ్ఆర్ పథకంలో భాగంగా సహాయ ఉద్యానాధికారి చిట్టిబాబు ఆధ్వర్యంలో బుధవారం రైతులకు కొబ్బరి మొక్కలు పంపిణీ చేశారు. తెదేపా మండల అధ్యక్షుడు రామారావు, ఉద్యాన శాఖ అధికారిణి మాధవీలత, రామారావు, బాలరాజు, గంగరాజు, లలిత పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, కంచిలి గ్రామీణం

అతిసారంపై అప్రమత్తత అవసరం

కవిటి గ్రామీణం, న్యూస్‌టుడే: కాలానుగుణ వ్యాధుల్లో ప్రమాదకరమైన అతిసారంపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు.

తెలుగు మహిళ పట్టణాధ్యక్షురాలిగా ప్రసన్న

ఇచ్ఛాపురం, న్యూస్‌టుడే: తెలుగు మహిళ ఇచ్ఛాపురం పట్టణ అధ్యక్షురాలిగా నర్తు ప్రసన్న, ప్రధాన కార్యదర్శిగా నందిక ధనలక్ష్మి, తెలుగు యువత అధ్యక్షుడిగా ఆశి ధర్మరాజురెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కోయిల రామారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పురపాలక సంఘ క్లస్టర్ ఇన్‌ఛార్జిగా తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆశి లీలారాణి, సహాయ క్లస్టర్ ఇన్‌ఛార్జిగా కాళ్ల దిలీప్‌యాదవ్‌ను పార్టీ నియమించినట్లు పట్టణ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పత్రి తవిటయ్య, నందిగాం కోటి తెలిపారు. మాజీ అధ్యక్ష, కార్యదర్శులు కాళ్ల ధర్మారావు, నందిక జాని, మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు పాల్గొన్నారు.

కోనేరులో మొక్కల తొలగింపు

పలాస, న్యూస్‌టుడే: పలాసలోని ముత్యాలమ్మ కోనేరులో పనికి రాని మొక్కల్ని తొలగించే పనులు చేపట్టారు. వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నడకదారిలో ఉన్న పొదల్ని తొలగించారు. ఉద్యానంలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరారు. ప్రతినిధులు రాజేంద్ర, రాంబాబు, మురళీమోహన్ పాల్గొన్నారు.

అత్యవసర పరిస్థితిలో శక్తి యాప్ వినియోగించండి

ప్రసంగిస్తున్న సీఐ సూర్యనారాయణ

కాశీబుగ్గ, న్యూస్‌టుడే: మహిళల రక్షణకు పోలీసు శాఖ పలు యాప్‌లు రూపొందించిందని. అత్యవసర పరిస్థితుల్లో వాటిని ఉపయోగించాలని కాశీబుగ్గ సీఐ సూర్యనారాయణ అన్నారు. స్థానిక ప్రజ్ఞ డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర పరిస్థితుల్లో శక్తి యాప్ ద్వారా సమాచారం అందించాలని సూచించారు. కళాశాల సిబ్బంది, శక్తి టీం ఎస్సై రవికుమార్ పాల్గొన్నారు.

వివాహితకు గాయాలు

కంచిలి గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిధి మకరాంపురం కూడలి వద్ద బుధవారం ట్రాక్టర్‌ను తప్పించబోయిన కంటెయినర్ లారీ అదుపు తప్పి విద్యుత్తు ఫీడర్‌ను ఢీకొట్టింది. ఇచ్ఛాపురం వైపు వెళ్తున్న కంటెయినర్ లారీ మకరాంపురం కూడలి వద్దకు చేరుకోగానే రహదారి దాటుతూ ఎదురుగా ట్రాక్టర్ వచ్చింది. దాన్ని తప్పించే క్రమంలో కంటెయినర్ లారీ అదుపు తప్పి పక్కనున్న బడ్డీ కొట్టు మీదుగా దూసుకెళ్లి 33 కేవీ విద్యుత్తు ఫీడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో బడ్డీ కొట్టు నిర్వాహకురాలికి స్వల్ప గాయాలయ్యాయి. ప్రమాద సమయంలో అక్కడ ఎవరూ లేకపోవడంతో ముప్పు తప్పింది. ఈ ఘటనలో బడ్డీ కొట్టు, విద్యుత్తు ఫీడర్, నాలుగు స్తంభాలు ధ్వంసమయ్యాయి. ఆ శాఖ అధికారులు ప్రత్యామ్నాయ మార్గంలో సరఫరాను పునరుద్ధరించారు.

(c) eenadu

టెక్కలి

•టెక్కలి •నరసన్నపేట •పాతపట్నం

డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీ

ఎత్తురాళ్లపాడు(కోటబొమ్మాళి), న్యూస్‌టుడే: నిమ్మాడ పీహెచ్‌సీని బుధవారం డీఎంహెచ్‌వో కె.అనిత ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, మందులను పరిశీలించారు. ఓపీ వివరాలపై సిబ్బందితో మాట్లాడారు. అందుతున్న సేవల గురించి రోగులను అడిగి తెలుసుకున్నారు. వైద్యులు సురేష్‌కుమార్, నిఖిల్‌కుమార్ పాల్గొన్నారు.

నిమ్మాడ పీహెచ్‌సీలో మందుల తేదీలు పరిశీలిస్తున్న అనిత

బొంతు పీహెచ్‌సీ పరిశీలన

సారవకోట, న్యూస్‌టుడే: బొంతు పీహెచ్‌సీని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బుధవారం పరిశీలించారు. ఉపకేంద్రంలోని గదులు, రికార్డులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రసవాల సంఖ్య పెరగాలని వైద్యాధికారికి సూచించారు. నౌతళ గ్రామ సమీపంలో జాతీయ రహదారికి అనుకుని చెత్త కుప్పగా ఉండటంతో కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఎస్సీ వీధిని పరిశీలించారు. ఎంపీడీవో మోహన్‌కుమార్, ఈవోపీఆర్డీ ప్రభాకరరావు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM) 9441426248 8374620852

మీ ప్రాంతంలో ఏ ప్రజా సమస్యనైనా పరిష్కరించే క్రమంలో 'ఈనాడు' మీకు తోడుగా ఉంటుంది. వివరాలు, చిత్రాలను వాట్సాప్ ద్వారా పంపొచ్చు. లేదా ఫోన్ చేయవచ్చు. వాటిని బాధ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తాం.

తొలి అడుగులో ఎనలేని అభివృద్ధి

నరసన్నపేట, నరసన్నపేట గ్రామీణం, సారవకోట, జలుమూరు, హిరమండలం, పాతపట్నం, టెక్కలి, కొత్తూరు, న్యూస్‌టుడే: వైకాపా పాలకులు రాష్ట్రాన్ని దివాలా తీయించారని, కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే అభివృద్ధి పథాలు అందించిందని ప్రజా ప్రతినిధులు, కూటమి నాయకులు పేర్కొన్నారు. బుధవారం పలుచోట్ల 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం జరిగింది. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. సంవత్సర కాలంలో చేపట్టిన కార్యక్రమాలను వివరించారు.

తామరాపల్లిలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ఆధ్వర్యంలో..

చింగులో కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, కూటమి నాయకులు

టెక్కలి మండలం శాసనాం గ్రామంలో..

అన్నదాతా మేలుకో.. భూసారం కాపాడుకో

– న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

రైతులు వేసవి దుక్కులు చేపట్టి ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్నారు. అధిక శాతం వెద విధానంలో సాగు చేపట్టారు. కొన్ని చోట్ల సంప్రదాయ పద్ధతిలో నాట్లు వేస్తున్నారు. భూమి సారం కోల్పోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటే పెట్టుబడులు తగ్గి అధిక దిగుబడులు సాధించేందుకు అవకాశం కలుగుతుందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

అనుకూల సమయం

ప్రస్తుతం వర్షాలు పడుతుండటంతో భూమిని దుక్కి చేసి పచ్చిరొట్ట విత్తనాలు వేసుకోవాలి. సుమారు 40 నుంచి 50 రోజుల్లో పచ్చిరొట్ట పైరు ఏపుగా పెరిగి పూతకు వస్తుంది. ఈ దశలో కలియదున్నితే సేంద్రియ ఎరువుగా తయారై పంటకు ప్రయోజనం చేకూరుతుంది. గతంలో రైతుల ఇంట పాడి సంపద ఉండేది. వాటి వ్యర్థాలను నిల్వ చేసి కొన్ని నెలల తరువాత పొలాల్లో వేయడం, మేకలు, గొర్రెల మందలను పొలాల్లో కాపు వేయడం తదితర చర్యలతో భూసారం పెరిగేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేకపోవడంతో రసాయన ఎరువుల వినియోగం అధికమైంది. వాటి ధరలు గణనీయంగా పెరగడంతో అన్నదాతలకు సాగు భారంగా మారింది. భూసారం క్షీణించింది. దీనికి ప్రత్యామ్నాయ మార్గాలు చూపేందుకు ప్రభుత్వం పచ్చిరొట్ట విత్తనాలను రాయితీపై అందించడంతో పాటు ప్రకృతి వ్యవసాయ విధానాలపై రైతులకు అవగాహన కల్పిస్తుంది.

నరసన్నపేట నియోజకవర్గం వివరాలు

మండలం	వరి సాగు (హెక్టార్లలో)	నాట్ల విధానంలో (శాతం)
నరసన్నపేట	7,906	30
పోలాకి	7,665	60
జలుమూరు	8,165	25
సారవకోట	6,514	20

నరసన్నపేట మండలం తోటాడ వద్ద వేసిన పచ్చిరొట్ట

రైతులకు ఎంతో మేలు

జీలుగ, పిల్లి పెసర, జనుము వంటి పచ్చిరొట్ట విత్తనాలు వేసుకుంటే పంటకు నష్టం కలిగించే శత్రు పురుగులు దూరమై మిత్ర పురుగులు వృద్ధి చెందుతాయి. సూక్ష్మ, స్థూల పోషకాలు, నీటి నిల్వ సామర్థ్యం పెరిగి రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. – ఎల్.వి.మధు, వ్యవసాయశాఖ ఏడీ, నరసన్నపేట

పరశురాముని అవతారంలో జగన్నాథుడు

జలుమూరులో పూజలందుకుంటున్న దేవతామూర్తులు, లక్ష్మీనర్సుపేట గ్రామంలో..

టెక్కలి, సారవకోట, జలుమూరు, ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: జగన్నాథ రథోత్సవాలు టెక్కలి, పాతపట్నం, నరసన్నపేట నియోజకవర్గాల వ్యాప్తంగా వైభవంగా జరుగుతున్నాయి. నల్లనయ్య బుధవారం పరశురాముని అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్వామికి ప్రత్యేక పూజలు చేపట్టి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

హిరమండలం ఈవోగా భాస్కరరావు

హిరమండలం, న్యూస్‌టుడే: హిరమండలం మేజర్ పంచాయతీ ఈవోగా ఎం.భాస్కరరావు నియమితులయ్యారు. ఈయన విజయనగరం జిల్లా రేగిడి ఆమదాలవలస మండలం కొడిశ పంచాయతీ నుంచి ఇక్కడకు వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన టి.హరికృష్ణ బదిలీపై అదే పంచాయతీకి వెళ్లారు.

నడవాలన్నా నరకమే

జలుమూరు మండలం గొటివాడ- పాగోడు రహదారి పనులు గతేడాది డిసెంబరులో రూ.1.6 కోట్ల నిధులతో ప్రారంభించారు. రాళ్లు వేసి వదిలేయడంతో పాదచారులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 1.8 కిలోమీటర్ల మేర ఇదే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని కోరుతున్నారు. దీనిపై పంచాయతీరాజ్ శాఖ జేఈ కె.శ్రీధర్ మాట్లాడుతూ.. వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, జలుమూరు

నిలువెత్తు నిర్లక్ష్యం..!

నరసన్నపేట మండలం ఉర్లాం రైలు నిలయం రహదారి పక్కనే విద్యుత్తు స్తంభానికి పనికిరాని మొక్కలు అల్లుకుని ప్రమాదకరంగా ఉంది. కొన్ని నెలలుగా పరిస్థితి ఇలాగే ఉన్నా.. పట్టించుకునే వారే లేకుండా పోయారని వాహనదారులు వాపోతున్నారు. అసలే వర్షాకాలం.. అనుకోని ఘటన జరగక ముందే అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సిబ్బందికి తెలియజేసి, సమస్యను పరిష్కరిస్తామని ఉర్లాం విద్యుత్తు ఉపకేంద్రం ఏఈ బాలకృష్ణ – న్యూస్‌టుడే, నరసన్నపేట గ్రామీణం

ఏడాదిగా నిరుపయోగం

కొత్తూరులో శ్రీకాకుళం రహదారిలోని ఎస్సీ బాలుర వసతిగృహం నిరుపయోగంగా ఉంది. గతంలో వర్షాలకు భవనంలోకి నీరు చేరడంతో విద్యార్థులను ఖాళీ చేయించి, వేరే చోట వసతి కల్పించారు. ఏడాది నుంచి ఇదే పరిస్థితి ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవనానికి ఆనుకుని ఉన్న స్థలం ఆక్రమణకు గురయ్యే అవకాశముందని చెబుతున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని సంక్షేమాధికారి ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

ఆరు వీధులు.. ఒకటే కుళాయి

ఎల్ఎన్‌పేట మండలం మోదుగువలస కాలనీలో ఆరు వీధులకు ఒకే కుళాయి ద్వారా తాగునీరు సరఫరా జరుగుతోంది. దీంతో ప్రజలు తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలువల నిర్మాణం చేపట్టడంతో పైపులైన్లు తొలగించారు. సంబంధిత అధికారులు స్పందించి లోపలి వీధుల్లో కుళాయిలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటామని గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం జేఈ రాజేశ్వరి తెలిపారు. – న్యూస్‌టుడే, ఎల్ఎన్‌పేట

అడుగుకో గుంత.. తీరని చింత

కొత్తూరు మండలం లబ్బ పంచాయతీ కేంద్రానికి వెళ్లే రహదారి దుర్భరంగా మారింది. లబ్బ, కొరిగాడ పంచాయతీ వాసులకు ఇదే ప్రధాన మార్గం. ఐటీడీఏ వసతి గృహం, జీసీసీ డిపో, గ్రామ సచివాలయం, ఆరోగ్య ఉప కేంద్రానికి వెళ్లే ప్రజలు, ఉద్యోగులకు ఈ రోడ్డే దిక్కు. రహదారిని బాగు చేసి, ఇబ్బందులు తీర్చాలని వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయాన్ని పీఆర్ ఏఈ దుర్గాప్రసాద్ వద్ద ప్రస్తావించగా.. ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. – న్యూస్‌టుడే, కొత్తూరు

వైద్య నిపుణులను సర్దుబాటు చేయాలి

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: అన్ని ఆసుపత్రుల్లో వైద్య నిపుణులు ఉండేలా చర్యలు తీసుకోవాలని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు జిల్లా ఆసుపత్రుల సమన్వయాధికారికి సూచించారు. నిమ్మాడలో బుధవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. అనంతరం వివిధ శాఖల అధికారులతో సమీక్ష చేపట్టారు. కోటబొమ్మాళి సామాజిక ఆసుపత్రిలో చిన్నపిల్లల వైద్యులు సెలవుపై ఉండటాన్ని గుర్తించారు. టెక్కలి, నరసన్నపేట ప్రాంతాల్లో ప్రత్యేక వైద్యులు ముగ్గురేసి ఉన్నారని, వారిలో చెరొకరిని కోటబొమ్మాళి పంపించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా రహదారుల పక్కన పనికిరాని మొక్కలను ఉపాధిహామీ వేతనదారులతో తొలగించేలా చూడాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు చరవాణిలో తెలిపారు. వివిధ రోడ్ల పనులు అసంపూర్తిగా ఉండటంపై అసహనం వ్యక్తం చేశారు. డీఈలు సుధాకర్, రామకృష్ణ పాల్గొన్నారు. ఎన్జీవో ప్రతినిధులు హనుమంతు సాయిరాం, డీఎంహెచ్‌వో కె.అనిత మంత్రిని కలిశారు.

అధికారులకు సూచనలిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

సేవలతో గుర్తింపు

నరసన్నపేట, జలుమూరు, ఎల్ఎన్‌పేట, న్యూస్‌టుడే: సేవలతో ఉద్యోగులకు గుర్తింపు లభిస్తుందని తహసీల్దారు సత్యనారాయణ అన్నారు. జమ్ము కూడలిలో వీఆర్వోగా ఉద్యోగ విరమణ చేసిన పంగ వెంకటేశ్వరరావును బుధవారం రెవెన్యూ సిబ్బంది ఘనంగా సత్కరించారు. ★ శ్రీముఖలింగేశ్వరస్వామి ఆలయం ఈవోగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పి.ప్రభాకరరావును అర్చకులు, గ్రామస్థులు సన్మానించారు. ★ కరకవలస జడ్పీ ఉన్నత పాఠశాలలో సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయినిగా పనిచేసి విరమణ పొందిన లీలాకుమారిని హెచ్‌ఎం రామారావు ఆధ్వర్యంలో సత్కరించారు.

నరసన్నపేట: వెంకటేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు

శ్రీముఖలింగంలో పూర్వ ఈవో ప్రభాకరరావుకు సత్కారం

భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా పరమేశ్వర్

టెక్కలి, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా జెన్ని పరమేశ్వరరావు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర కమిటీ నుంచి ఉత్తర్వులు అందినట్లు ఆయన తెలిపారు. పార్టీ బలోపేతానికి, ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

ఉపాధ్యాయుడి ఆదర్శం

కుమార్తెలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించిన దామోదరరావు

నరసన్నపేట గ్రామీణం, న్యూస్‌టుడే: గేదెలవానిపేట పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఎస్.దామోదరరావు ఆదర్శంగా నిలిచారు. తన ఇద్దరు కుమార్తెలు జ్యోతిక, లిఖితలను నరసన్నపేట మండలం వీఎన్‌పురం మోడల్ ప్రైమరీ పాఠశాలలో బుధవారం చేర్పించారు. హెచ్‌ఎం ఉంకిలి రామారావు, ఉపాధ్యాయులు అభినందించారు.

సాంకేతిక విద్యపై దృష్టిపెట్టండి

నరసన్నపేట, న్యూస్‌టుడే: విద్యార్థులు సాంకేతిక విద్యపై దృష్టి సారించాలని, ఉపాధి నైపుణ్యాలు పెంచుకోవాలని నరసన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ పి.లత సూచించారు. కళాశాలలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. విద్యార్థులకు పలు సూచనలు చేశారు. వైస్ ప్రిన్సిపల్ శాంతి హేమ్, అధ్యాపకుడు రవికుమార్ పాల్గొన్నారు.

క్షయపై అవగాహన ర్యాలీ

టెక్కలి, న్యూస్‌టుడే: క్షయ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని టీబీ యూనిట్ సూపర్‌వైజర్ ప్రసాద్ కోరారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా స్థానిక శేరి వీధిలో వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. సీహెచ్‌వో భారతి పాల్గొన్నారు.

ఆధునిక కిట్లు అందజేత

సంతబొమ్మాళి, న్యూస్‌టుడే: లక్ష్మీపురంలో ఆధునిక కంది, మినుము రకం విత్తనాల కిట్లను రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు బుధవారం రైతులకు పంపిణీ చేశారు. వీటితో అధిక దిగుబడులు వస్తాయని ఉమ్మడి గుంటూరు, కృష్ణ జిల్లాల్లో వీటిని ఉపయోగిస్తున్నట్లు మండల వ్యవసాయాధికారి ఆర్.అప్పారావు తెలిపారు.

రేపు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

పాతపట్నం, న్యూస్‌టుడే: పాతపట్నం విద్యుత్తు ఉపకేంద్రం పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుందని విద్యుత్తు శాఖ టెక్కలి ఈఈ జి.శంకరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్తు లైన్ నిర్వహణలో భాగంగా ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

గురుభక్తి చాటుకున్న విద్యార్థులు

టెక్కలి: స్థానిక జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన తమ్మినేని ఆనందరావుపై విద్యార్థులు గురుభక్తి చాటుకున్నారు. ఈయన సోమవారం ఉద్యోగ విరమణ చేయగా ఆయన స్వగ్రామం జయకృష్ణాపురంలోని ఇంటి వరకు విద్యార్థులు నినాదాలు చేస్తూ సాగనంపిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది.

అన్న క్యాంటీన్ వద్ద రద్దీ

కోటబొమ్మాళి, న్యూస్‌టుడే: స్థానిక తెదేపా కార్యాలయంలోని అన్న క్యాంటీన్ వద్ద బుధవారం రద్దీ నెలకొంది. వివిధ పనులకు మండల కేంద్రానికి వచ్చిన ప్రజలు పెద్ద ఎత్తున భోజనాలకు తరలొచ్చారు. రూ.5లకే రుచికరమైన ఆహారం దొరకడంతో సంతృప్తి వ్యక్తం చేశారు.

భగత్‌సింగ్ ట్రస్టుకు రూ.50 వేల విరాళం

కొత్తూరు, న్యూస్‌టుడే: భగత్‌సింగ్ ట్రస్టుకు తెదేపా నాయకుడు బామిడి రాజు రూ.50 వేల విరాళాన్ని అందించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ట్రస్టు సభ్యులకు బుధవారం ఈ మొత్తాన్ని అందించారు. మరో రూ.12,500 ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీకి అందించారు. సీఐ చింతాడ ప్రసాద్, ట్రస్టు, రెడ్‌క్రాస్ సొసైటీ సభ్యులు ఆయన్ను సన్మానించారు.

సమస్యల పరిష్కారంలో జాప్యం చేయొద్దు

సమీక్షలో పాల్గొన్న కలెక్టర్ స్వప్నిల్ పుండ్కర్ దినకర్, జేసీ, ఆర్డీవో

హిరమండలం, న్యూస్‌టుడే: గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు పరిష్కారంలో జాప్యం చేయొద్దని కలెక్టర్ స్వప్నిల్ పుండ్కర్ దినకర్ అన్నారు. బుధవారం కల్లటలో టెక్కలి డివిజన్ రెవెన్యూ ఉద్యోగులతో సమీక్ష నిర్వహించారు. శాఖల వారీగా రెవెన్యూ అంశాలతో ముడిపడి ఉన్న సమస్యలపై చర్చించారు. తహసీల్దార్లతో మాట్లాడి సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. గృహ నిర్మాణ పథకంలో గత ప్రభుత్వం మంజూరు చేసిన కాలనీల్లో నిర్మాణాలు చేపట్టని వారి జాబితా వెంటనే సిద్ధం చేయాలన్నారు. టెక్కలి డివిజన్ పరిధిలో కాలనీల్లో 18 వేల ఇళ్ల స్థలాలు మంజూరైతే ఇంతవరకు కేవలం 4 వేల మంది మాత్రమే నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. వీఆర్వోలు క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమస్య పరిష్కారం కాకుంటే ఎందుకు కావడం లేదో అక్కడి ప్రజా ప్రతినిధుల ద్వారా లబ్ధిదారులకు చెప్పాలని పేర్కొన్నారు. జేసీ ఫర్మాద్ అహ్మద్ ఖాన్, ఆర్డీవో కృష్ణమూర్తి, ఎస్‌డీసీలు జయదేవి, పద్మావతి, ట్రైనీ కలెక్టర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆదిలోనే కలుపు మొక్కలు నివారించాలి

రావిచెంద్రిలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

ఎల్ఎన్‌పేట, కొత్తూరు, నరసన్నపేట, న్యూస్‌టుడే: ఆదిలోనే కలుపు మొక్కలను నివారించాలని ఏవో సింహాచలం పేర్కొన్నారు. రావిచెంద్రిలో బుధవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. జడ్పీటీసీ మాజీ సభ్యుడు తేజేశ్వరరావు పాల్గొన్నారు. ★ అంతర పంటలతో అధిక లాభాల సాధ్యమని రాష్ట్ర సీఈఎస్ బృందం సీనియర్ సభ్యుడు బి.చక్రవర్తి అన్నారు. కాకరగూడలో సేంద్రియ పద్ధతులతో సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. మురళి, హరికృష్ణ, ఎంటీ ఎస్.సూర్యనారాయణ, ఐసీఆర్పీ జగన్ పాల్గొన్నారు. ★ విత్తనాలు నాటే ముందు శుద్ధి చేసుకోవాలని వ్యవసాయశాఖ ఏడీ వెంకటమధు సూచించారు. తామరాపల్లి గ్రామంలో ఆయన రైతులకు వరి సాగులో మెలుకువలను వివరించారు. వ్యవసాయాధికారి సూర్యకుమారి, కె.వి.కె. శాస్త్రవేత్త కిరణ్, వీఏఏ శిరీష పాల్గొన్నారు.

ఆలయానికి దారి చూపండి

మెళియాపుట్టి, న్యూస్‌టుడే: శివాలయానికి వెళ్లే దారిలో చేపట్టిన నిర్మాణాన్ని తొలగించాలంటూ స్థానిక ప్రజాప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోవాలని కోరారు. ఆలయ నిర్వాహకులు మాత్రం గోశాల నిర్మాణం చేస్తున్నామని పేర్కొంటున్నారు. దేవాదాయశాఖాధికారుల సమన్వయంతో సమస్య పరిష్కరిస్తామని పోలీసులు పేర్కొన్నారు.

పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ప్రజాప్రతినిధులు

బాధితులకు న్యాయం చేయాలి

సమావేశంలో పాల్గొన్న అగ్రిగోల్డ్ ప్రతినిధులు

టెక్కలి, న్యూస్‌టుడే: అగ్రిగోల్డ్ బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయసింహ కోరారు. బుధవారం టెక్కలిలో డివిజన్ పరిధిలో సమావేశం నిర్వహించారు. బాధితులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం ముందుకు రావడం అభినందనీయమన్నారు. అలేలమ్మ, కోదండరావు, రవికుమార్, అప్పలస్వామి, రామారావు, జగదీశ్వరరావు పాల్గొన్నారు.

ఇది మందుబాబుల అడ్డా

అలుదు సంపద తయారీ కేంద్రాన్ని మాకివలస గ్రామ సమీపంలోని కొండకు ఆనుకుని నిర్మిస్తున్నారు. చివరి దశలో పనులు కొన్ని నెలలుగా నిలిచిపోయాయి. కొందరు ఇక్కడ మద్యం తాగి ఖాళీ సీసాలు తొట్టెల్లో వేస్తున్నారు. పర్యవేక్షణ లేకపోవడంతో పరిసరాలు సైతం అధ్వానంగా తయారయ్యాయి. త్వరలోనే వినియోగంలోకి తెచ్చి సమస్యను పరిష్కరిస్తానని కార్యదర్శి సుబ్బినాయుడు తెలిపారు. – న్యూస్‌టుడే, సారవకోట

పనికిరాని మొక్కల తొలగింపు

స్పందనకు వందనం

హిరమండలం, న్యూస్‌టుడే: పాతహిరమండలం గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉపాధిహామీ వేతనదారులు బుధవారం పనికిరాని మొక్కలు తొలగించారు. ఈ ఏడాది మే 27న 'రక్షణ కరవు.. సమస్యలకు నెలవు' శీర్షికతో వార్త ప్రచురితమవడంతో ఏపీవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సమస్యను పరిష్కరించారు.

ప్రభుత్వ సాయం.. ఆర్థికాభివృద్ధికి ఊతం

– న్యూస్‌టుడే, సారవకోట

ప్రభుత్వం వెనకబడిన వర్గాల మహిళలకు ఉచితంగా కుట్టు యంత్రాలు అందించాలని నిర్ణయించింది. దరఖాస్తు చేసుకున్న వారికి 90 రోజుల పాటు శిక్షణ ఇస్తోంది. సారవకోట మండలంలోని గొర్రిబంద రైతు సేవా కేంద్రంలో ఈ ఏడాది ఏప్రిల్ 24న తర్ఫీదు ప్రారంభించారు. పోలాకి మండలం దండులక్ష్మీపురం, నరసన్నపేట రైతు సేవా కేంద్రంలోనూ తరగతులు నిర్వహిస్తున్నారు. హాజరైన మహిళలకు మెలకువలు నేర్పిస్తుండటంతో ఆశలు చిగురిస్తున్నాయి. ఇంటి వద్దే ఉంటూ ఆర్థికాభివృద్ధి సాధిస్తామని అతివలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

గొర్రిబంద కేంద్రంలో కుట్టు శిక్షణలో తర్ఫీదు పొందుతున్న మహిళలు

మూడు నెలల కాల పరిమితి

ప్రభుత్వ సూచనల మేరకు 3 నెలల్లో అన్ని రకాల దుస్తుల తయారీని నేర్పిస్తున్నాం. రెండు నెలల శిక్షణ పూర్తయింది. గొర్రిబంద కేంద్రానికి 105 మందిని కేటాయించారని శిక్షకురాలు రేవతి పేర్కొన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకుంటే ఆర్థికాభివృద్ధి సాధించడానికి అవకాశం లభిస్తుందని సారవకోట ఎంపీడీవో మోహన్‌కుమార్ తెలిపారు.

నమ్మకం కలిగింది

గొర్రిబంద కేంద్రంలో రెండు నెలలుగా శిక్షణ పొందుతున్నాను. ఇప్పటి వరకు వివిధ రకాల దుస్తులు కుట్టడం నేర్చుకున్నాను. మరో నెల రోజుల్లో పూర్తిస్థాయిలో అవగాహన వస్తుంది. శిక్షణ వల్ల అవలీలగా దుస్తులు కుట్టగలననే నమ్మకం కలిగింది. - దోల మీనాక్షి, నారాయణపురం

మంచి ఆలోచన

కుట్టు యంత్రాలకు దరఖాస్తు చేసిన వారికి శిక్షణ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం మంచి ఆలోచన. కేంద్రంలో శిక్షకురాలు బాగా తర్ఫీదు ఇస్తున్నారు. టైలరింగ్‌పై మొదటి నుంచి ఆసక్తి ఉన్నప్పటికీ ఎక్కడ నేర్చుకోవాలో తెలియక ఇబ్బంది పడ్డాను. ప్రస్తుతం శిక్షణకు హాజరవుతున్నాను. - తెంబూరు పుష్పలత, పెద్దలంబ

నవధాన్యాల సాగుతో పుడమికి మేలు

వ్యవసాయం క్షేత్రంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

నరసన్నపేట, న్యూస్‌టుడే: నవధాన్యాల సాగులో భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం అదనపు డీపీఎం ధనంజయరావు అన్నారు. మాకివలస, దేవాది గ్రామాల్లో వ్యవసాయ క్షేత్రాలను బుధవారం ఆయన పరిశీలించారు. నవధాన్యాల సాగు వల్ల నేల గుల్లబారి పంటలకు పోషకాలు అందుతాయన్నారు. ప్రకృతి వ్యవసాయ శిక్షకుడు తోట రమణ, యూనిట్ ఇన్‌ఛార్జి రాజేశ్వరమ్మ, ఐసీఆర్పీ కమలమ్మ పాల్గొన్నారు.

ఫిర్యాదుపై జేసీ, ఆర్డీవో పరిశీలన

కొత్తూరు, న్యూస్‌టుడే: నేరడి రెవెన్యూ పరిధిలోని మెట్టూరు సమీపంలో భూ సమస్యపై స్థానికుడు జగన్మోహన్‌రావు రాష్ట్ర విద్యా మంత్రి నారా లోకేశ్‌కు వినతుల విభాగంలో విన్నవించారు. తన భూమి అన్యాక్రాంతం చేశారంటూ అందిన ఫిర్యాదుపై పరిశీలించాల్సిందిగా ప్రభుత్వం నుంచి ఆదేశాలు వెలువడ్డాయి. దీంతో జిల్లా సంయుక్త కలెక్టర్ ఫర్మాద్ అహ్మద్ ఖాన్, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దస్త్రాల ఆధారంగా, వాస్తవ పరిస్థితిని నమోదు చేసుకున్నారు. సమగ్ర నివేదికను ప్రభుత్వానికి నివేదిస్తున్నట్లు పేర్కొన్నారు. తహసీల్దార్ కె.బాలకృష్ణ పాల్గొన్నారు.

(c) eenadu

శ్రీకాకుళం

•శ్రీకాకుళం •ఆమదాలవలస •ఎచ్చెర్ల

ఆకతాయిలతో అవస్థలు పడుతున్నారా..?

నేడే శ్రీకాకుళం డీఎస్పీకి ఫోన్ చేయండి..

మీ ప్రాంతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిందా... రౌడీ మూకలు, ఆకతాయిలతో ఇబ్బంది పడుతున్నారా.. కళాశాలలు, విద్యా సంస్థల వద్ద వేధింపులు ఉన్నాయా.. పోలీస్ ఠాణాకు వెళ్తే న్యాయం జరగడం లేదా.. రహదారి ప్రమాదాలకు నిలయంగా మారిన ప్రాంతాలున్నాయా.. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలు మీ పరిసర ప్రాంతంలో ఎవరైనా విక్రయిస్తున్నారా.. సమాజ శ్రేయస్సు కోరి చట్టపరిధిలోకి వచ్చే ఏ సమస్య అయినా శ్రీకాకుళం డీఎస్పీ వివేకానందతో నేరుగా చెప్పుకొనే అవకాశం 'ఈనాడు' కల్పిస్తోంది. మీరు చేయాల్సిందల్లా కింది నంబర్లకు ఫోన్ చేయడమే. – ఈనాడు, డిజిటల్ శ్రీకాకుళం

తేదీ: 03.07.2025 (గురువారం) | ఫోన్ నంబరు: 63900 90804

(ఉదయం 10 నుంచి 11 గంటల వరకు).. వివరాలు పంపాల్సిన వాట్సాప్ నంబరు: 63900 90804

సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా
కూటమి ప్రభుత్వం అడుగులు

ఆనందపురంలో కరపత్రం అందజేస్తున్న ఎంపీ కలిశెట్టి

శ్రీకాకుళం గ్రామీణం: వెంకటాపురంలో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్

జి.సిగడాం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం గ్రామీణం, పొందూరు/గ్రామీణం, లావేరు,(తాళ్లవలస), రణస్థలం, న్యూస్‌టుడే: రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా కూటమి ప్రభుత్వం దూసుకుపోతుందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు గొండు శంకర్, కూన రవికుమార్ అన్నారు. జి.సిగడాం మండలం ఆనందపురంలో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఎంపీ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అమలు తీరుపై అడిగి తెలుసుకున్నారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పొందూరు మండలం ధర్మపురంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రతి ఇంటికి వెళ్లి సంక్షేమ పథకాలు అమలు తీరుపై అడిగి తెలుసుకున్నారు.

గ్రామాలను సుందరంగా మారుస్తాం

శ్రీకాకుళం గ్రామీణం, కలెక్టరేట్(శ్రీకాకుళం), న్యూస్‌టుడే: ప్రతి గ్రామాన్ని సుందరంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం మండలం నైర పంచాయతీ వెంకటాపురంలో రూ.77 లక్షలతో నిర్మించిన పలు రహదారులను బుధవారం ప్రారంభించారు. స్థానిక రక్షిత మంచినీటి సరఫరా పథకాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో శైలజ, డిప్యూటీ ఎంపీడీవో కె.సూర్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. విశాఖ ఏ కాలనీలోని నియోజకవర్గ కార్యాలయంలో సీఎం సహాయనిధి కింద పలువురు పేదలకు రూ. 7,46,851 చెక్కులను బుధవారం అందజేశారు.

సంకల్పంతోనే సన్మార్గం

శ్రీకాకుళం నేరవార్తావిభాగం, న్యూస్‌టుడే: యువత సన్మార్గంలో పయనించేందుకు సంకల్పం అవసరమని రెండో పట్టణ సీఐ పి. ఈశ్వరరావు పేర్కొన్నారు. నగరంలోని పీఎస్ఎన్ఎం పాఠశాలలో బుధవారం పోలీసుశాఖ ఆధ్వర్యంలో సంకల్పం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యాలను నిర్దేశించుకుని ముందుకు సాగాలని చెప్పారు. గంజాయి వినియోగంతో కలిగే అనర్థాలు అవగాహన కల్పించారు. ఎస్సై రామారావు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

శ్రీకాకుళం గ్రామీణం, న్యూస్‌టుడే: బైరి గ్రామ పరిధి నిర్మానుష్య ప్రాంతంలో బుధవారం జూదమాడుతున్న తొమ్మిది మంది పోలీసులు అరెస్టు చేశారు. వీరి నుంచి రూ.3800 నగదు, ఆరు చరవాణులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు గ్రామీణ ఎస్సై కె.రాము తెలిపారు.

పురమా.. గ్రామమా..!

– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

శివారు వార్డుల్లో కానరాని కనీస సౌకర్యాలు

ఆమదాలవలస పురపాలిక ఏర్పడి నేటికి ఆరు పాలక వర్గాలు మారినా ఇక్కడి ప్రజలు కనీస సౌకర్యాలు నోచుకోలేకపోతున్నారు. తాగునీరు, పారిశుద్ధ్యం, రహదారులు, వీధి దీపాలు, ప్రభుత్వ స్థలాలు, ఫుట్‌పాత్ ఆక్రమణలు, ట్రాఫిక్ తదితర సమస్యలు నేటికీ వేధిస్తూనే ఉన్నాయి.

★ 1వ వార్డు తిమ్మాపురం, జగ్గశాస్త్రులపేట, పార్వతీశంపేట, 4వ వార్డు గేదెలవానిపేట, కొండపేట, గేదెలపేట, 5వ వార్డు రెడ్డిపేట, సొట్టవానిపేట, పంతులపేట, 6వ వార్డు సప్తసరాలు, నందగిరిపేట, తురకపేట, పంతులపేట, టి.మన్నయ్యపేట, కె.మన్నయ్యపేట, 7వ వార్డు చింతల, చింతడకాలనీ, 21వ వార్డు కుద్దిరాం, మెట్టక్కివలసలోని కొంత ప్రాంతం తదితర వార్డుల్లో నేటికీ ట్రాక్టర్లతో తాగునీటిని అందిస్తున్నారు. బోర్లున్నా అవి పనిచేయక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు.

★ పట్టణంలో పారిశుద్ధ్య నిర్వహణ అధ్వానంగా ఉంది. ఇక్కడ 78 మంది కార్మికులున్నారు. రోజూ సుమారు 26 టన్నుల వ్యర్థాలు వస్తూ ఉంటాయి. వీటిలో 18 టన్నుల మాత్రమే సేకరిస్తున్నారు. శివారు వార్డుల్లో రెండు, మూడు రోజులకు ఒకసారి మాత్రమే కాలువల్లో చెత్త తీస్తున్నారు, మిగిలిన చెత్త రహదారులు, చెరువు గట్లపై వేస్తున్నారు.

సొట్టవానిపేట కాలనీకి వెళ్లే ప్రధాన రహదారి దుస్థితి..

★ కొన్ని ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదు, కొన్ని చోట్ల ఉన్నా అవి ఆగి వెలగడంతో ప్రయోజనం లేకుండా పోతుంది. పూజారిపేట, పాతినవానిపేట, ప్రధాన రహదారి, కుద్దిరాం, కె.మన్నయ్యపేట, టి.మన్నయ్యపేట, కంచరవానిపేట, నాదాసవరం, సనపలవానిపేట, ఊసవానిపేట తదితర ప్రాంతాల్లో ఈ సమస్య ఎక్కువగా ఉంది. పుర పరిధిలో సుమారు 300పైగా నూతన విద్యుత్తు దీపాలు వేయాల్సి ఉంది.

★ చాలా వార్డుల్లో నేటికీ మట్టి రహదారులే దర్శనమిస్తున్నాయి. కొన్ని వార్డుల్లో సీసీ దారులున్నా వాటికి కాలువలు లేకపోవడం, కొన్నిచోట్ల ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురికావడంతో ప్రజలు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

పురపాలిక	: ఆమదాలవలస
వార్డులు	: 23
జనాభా	: 49,826
కుటుంబాలు	: 22 వేలు

నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం.. ఎమ్మెల్యే కూన రవికుమార్ ఆదేశాల మేరకు ఇప్పటికే పారిశుద్ధ్య నిర్వహణకు రూ. 36 లక్షలు, కాలువలతో కూడిన రహదారులకు రూ. 6 కోట్లుపైగా, తాగునీటికి రూ. 64 కోట్లు ఏఐఐబీ నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం. ప్రభుత్వ ఆమోదం కూడా పొందింది. నిధులు రాగానే పనులు ప్రారంభిస్తాం. – జాన్సన్, ఇన్‌ఛార్జి పుర కమిషనర్, ఆమదాలవలస

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM TO 1 PM) 9502198883 8008552704

? ఇప్పిలిపేటలో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రం పనులు మధ్యలో నిలిచిపోయాయి. – ఎస్.రమణ, ఇప్పిలిపేట
● కేంద్రం పనులు చివరి దశలో ఉన్నాయి. గుత్తేదారు తాళాలు ఇవ్వడం లేదు. – జానకీలక్ష్మి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, షణ్ముఖ సిక్దార్ – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

? ఆమదాలవలస పట్టణ ప్రధాన రహదారిలో ఇష్టానుసారం ఆటోలు, ప్రైవేటు బస్సులు, లారీలు నిలుపుతున్నారు. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. – మోహనరావు, స్థానికులు
● ట్రాఫిక్ సమస్య లేకుండా చూస్తాం. – బాలరాజు, ఎస్సై, ఆమదాలవలస

? చింతాడ ఎస్సీ కాలనీ రహదారులపైకి మురుగునీరు చేరుతోంది. అధికారులు చర్యలు తీసుకోవాలి. – సావిత్రి, స్థానికులు
● చర్యలు తీసుకుంటాం. – జాన్సన్, ఇన్‌ఛార్జి పుర కమిషనర్, ఆమదాలవలస

? పట్టణ శివారు వార్డుల్లో రాత్రి సమయంలో కొందరు యువత రహదారులపై పక్కనున్న తోటల్లో మద్యం తాగుతున్నారు. – జనార్దనరావు, స్థానికులు
● పరిశీలించి చర్యలు చేపడతాం. – బాలరాజు, ఎస్సై, ఆమదాలవలస

– న్యూస్‌టుడే, ఆమదాలవలస పట్టణం

ఇది తారురోడ్డే నమ్మండి..

సరుబుజ్జిలి మండలంలోని మూలసవలాపుర-తురకపేట గ్రామాల మధ్య ఏర్పాటు చేసిన తారు రోడ్డు చూస్తే మట్టి దారిలా కనిపిస్తోంది. ఇక్కడ నాలుగు రోజులుగా కురుస్తున్న తేలికపాటి వర్షాలకు మంగళవారం రోడ్డుపై ఇలా మారింది. ఇతర వాహనాలు, దుక్కులకు వెళ్లే ట్రాక్టర్లు రాకపోకలు సాగిస్తుండటంతో ఇలా తయారైందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ద్విచక్ర వాహనాలు అదుపుతప్పుతున్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, సరుబుజ్జిలి

అల్లుకున్న నిర్లక్ష్యం

ఎచ్చెర్ల మండలం ఎచ్చెర్ల, చిలకపాలెం గ్రామాల మధ్య జాతీయరహదారి పక్కనే ఉన్న కొన్ని స్తంభాలకు, మండల కేంద్రం కూడలి సమీపంలో విద్యుత్తు స్తంభాలకు తీగజాతి మొక్కలు అల్లుకున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని వాహనదారులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటు విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు శాఖ ఏఈ హరికృష్ణ దృష్టికి సమస్యను తీసుకెళ్లగా పరిశీలించి మొక్కలు తొలగిస్తామని తెలిపారు. – న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

తీరు మారదు.. చెత్త తొలగదు

ఆమదాలవలస పట్టణం నుంచి రామచంద్రాపురం పొన్నాంపేట వెళ్లే రహదారిలో చెత్త పేరుకుపోవడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. పట్టణం నుంచి లక్ష్మీనగర్ వీధి గుండా కిల్లోడు చెరువు గట్టుపై ఉన్న రహదారిలో సిబ్బంది చెత్తపోగులు వేయడంతో రహదారి ఇలా తయారైందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. చెత్తను తొలగించి రహదారి బాగు చేస్తామని ఇన్‌ఛార్జి పుర కమిషనర్ జాన్సన్ తెలిపారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

ఇక్కడో బోరుంది..

జే.ఆర్.పురంలోని సినిమా థియేటర్ సమీపంలో రాజాం రోడ్డులో మరమ్మతులకు గురై వినియోగంలో లేని మంచినీటి బోరును బాగు చేసి వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు. ఇది మరమ్మతులకు గురవ్వడంతో మంచినీటికి ఇబ్బందులు పడుతున్నామని స్థానిక మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని గ్రామీణ నీటి సరఫరా ఏఈ రేవతి వద్ద ప్రస్తావించగా సిబ్బందిని పంపించి మరమ్మతులు చేయిస్తామన్నారు. – న్యూస్‌టుడే, రణస్థలం

నిత్యం వెలుగులు!

పొందూరు మండలం లోలుగులో విద్యుత్తు దీపాలు రాత్రి, పగలు తేడా లేకుండా నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. దీంతో విద్యుత్తు వృథా తోపాటు దీపాలు పాడైపోతున్నాయని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. అధికారులకు పలుమార్లు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని, స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై ఎంపీడీవో మన్మథరావును వివరణ కోరగా కార్యదర్శితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని తెలిపారు. – న్యూస్‌టుడే, పొందూరు/గ్రామీణం

మండలస్థాయి కమిటీలతో పార్టీ బలోపేతం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

పొందూరు, న్యూస్‌టుడే: కార్యకర్తలను, నాయకులను సమన్వయ పరిచి తెదేపాను మరింత బలోపేతం చేయడమే లక్ష్యంగా విస్తృతస్థాయి సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. పొందూరులో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీలో గ్రామ, బూత్ కమిటీలతో నేరుగా మాట్లాడారు. పార్టీ మండల కార్యవర్గం, వివిధ కమిటీ నియామకాలపై శ్రేణుల అభిప్రాయం సేకరించారు. సభ్యత్వ నమోదులో నియోజకవర్గంలోనే అద్భుతంగా పనిచేసిన పొందూరు ఎంపీటీసీ సభ్యుడు అనకాపల్లి వాణిని ప్రత్యేకంగా అభినందించారు. ● పార్టీ మండలాధ్యక్షుడిగా సీహెచ్.రామ్మోహన్‌రావును నాలుగోసారి నియమించారు. తెలుగు యువత మండలాధ్యక్షుడిగా కె.శ్రీనివాసరావు, తెలుగు మహిళా మండలాధ్యక్షురాలిగా ఎ.విజయలక్ష్మి, తెదేపా రైతు విభాగం మండలాధ్యక్షులుగా జి.అనంతరామకృష్ణ, బీసీ విభాగం అధ్యక్షుడిగా ఎం.తవిటినాయుడు, ఎస్సీ విభాగం అధ్యక్షుడిగా కె.వెంకటరమణ నియమిస్తూ అనుమతి కోసం అధిష్ఠానానికి పంపించారు. నియోజకవర్గ పరిశీలకులు వజ్జ బాబూరావు, నాయకులు పాల్గొన్నారు.

మా పాఠశాలను విలీనం చేయకండి

తమ పాఠశాలను విలీనం చేయొద్దని విద్యార్థులు, తల్లిదండ్రులు బుధవారం గాజులకొల్లివలస ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వద్ద నిరసన చేపట్టారు. ఇక్కడ 30 మంది పిల్లలున్నారని, దీనిని ఆర్ఆర్ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాలలో విలీనం చేస్తున్నారని సర్పంచి ప్రతినిధి కూర్మారావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. – న్యూస్‌టుడే, ఆమదాలవలస గ్రామీణం

కూర్మావతారంలో జగన్నాథుడు

శ్రీకాకుళం సాంస్కృతికం, ఆమదాలవలస గ్రామీణం, న్యూస్‌టుడే: జగన్నాథస్వామి రథోత్సవంలో భాగంగా శ్రీకాకుళం నగరంలో బుధవారం పూజలు చేశారు. ఇల్లీసుపురంలో గుండిచా మందిరంలో బలభద్ర, సుభద్ర, జగన్నాథస్వామిలకు పూజలు చేశారు. గుజరాతీపేటలోని ఇంద్రద్యుమ్నంలో కూర్మావతారంలో స్వామి దర్శనమిచ్చారు. ★ ఆమదాలవలస పట్టణం, మండలంలోని పలు ప్రాంతాల్లోని వెంకటేశ్వర, లక్ష్మీనారాయణ, సత్యనారాయణస్వాముల ఆలయాల్లో జగన్నాథస్వామికి పూజలు చేశారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

శ్రీకాకుళం నగరం, గార, ఎచ్చెర్ల, న్యూస్‌టుడే: సుప్రీంకోర్టు తీర్పునకు అనుగుణంగా కార్మికులకు సమాన వేతనాలు అమలు, లేబర్ కోడ్ రద్దు తదితర డిమాండ్లతో ఈనెల 9న దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు చేపడుతున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ నాయకుడు టి.తిరుపతిరావు పిలుపునిచ్చారు. బుధవారం శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు. నాయకులు అప్పలరాజు, శ్యామలరావు, సరస్వతి, కరుణ, జి.లక్ష్మి పాల్గొన్నారు. ★ సీఐటీయూ మండల కన్వీనర్ జల్లు కాంచన గారలో సమావేశం నిర్వహించి సూచనలు చేశారు. కార్మిక సంఘాల ప్రతినిధులు పి.రమణమ్మ, కె.అప్పన్నమ్మ, పి.ధనలక్ష్మి పాల్గొన్నారు. ★ సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్.వి.రమణ అరిణాంఅక్కివలసలోని శ్యామ్‌పిస్టన్స్ పరిశ్రమ ఆవరణలో సమ్మె కరపత్రాన్ని ఆవిష్కరించారు.

అరిణాంఅక్కివలసలోని గోడప్రతులు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నేతలు, కార్మికులు

శ్రీకాకుళంలో కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకుడు తిరుపతిరావు, కార్మికులు

చెరువులోకి దూసుకెళ్లిన ద్విచక్ర వాహనం

రాగోలు సమీపంలో ఓ ద్విచక్ర వాహదారుడు అదుపుతప్పి పక్కనే ఉన్న చెరువులోకి దూసుకెళ్లాడు. బుధవారం జరిగిన ఈ ఘటనలో స్థానికులు వెంటనే స్పందించి, తాళ్ల సాయంతో అతడిని ఒడ్డుకు చేర్చారు.

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం గ్రామీణం

మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్‌గా నీలవేణి?

రణస్థలం, న్యూస్‌టుడే: ఎచ్చెర్ల మార్కెట్ కమిటీ ఛైర్మన్ పదవి ఎస్సీలకు కేటాయించారు. ఈనేపథ్యంలో రణస్థలం మండలం తెప్పలవలస పంచాయతీ నీలంపేటకు చెందిన దుంగ నీలవేణిపై తెదేపా అధిష్ఠానం ఐవీఆర్ఎస్ ద్వారా అభిప్రాయ సేకరిస్తోంది. తెదేపాలో సుదీర్ఘంగా కొనసాగుతూ క్రియాశీలకంగా వ్యవహరిస్తున్న దుంగ శ్రీరాములు కుటుంబానికి చెందిన ఈమె ప్రస్తుతం పార్టీ గ్రామ ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఈమె భర్త వెంకటరావు ఎస్సీ విభాగం మండలాధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా నియామకంపై హర్షం

భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడుగా పైడి వేణుగోపాలం నియమితులవ్వడంపై జిల్లా నేతల హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు బుధవారం ఆయన కార్యాలయంలో పార్టీ నేతలంతా కలిసి అభినందనలు తెలిపారు. నాగేశ్వరరావు, భాస్కరరావు, గోవిందరావు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, ఎచ్చెర్ల

రోటరీ క్లబ్‌కు అవార్డుల పంట

రోటరీక్లబ్ శ్రీకాకుళం సెంట్రల్‌కు 20 అవార్డులొచ్చాయని క్లబ్ కార్యదర్శి నాగేశ్వరరావు ఓ ప్రకటనలో తెలిపారు. రాజమహేంద్రవరంలో జరిగిన అవార్డుల ప్రదానోత్సవంలో క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఉత్తమ అధ్యక్షుడిగా దుర్గారావు, ఉత్తమ కార్యదర్శిగా నాగేశ్వరరావులను ఎంపిక చేసి అవార్డులు ప్రదానం చేసినట్లు ఆయన చెప్పారు. జిల్లా గవర్నర్ వెంకటేశ్వరరావు అధ్యక్షతన ఈ అవార్డులిచ్చారు. – న్యూస్‌టుడే, శ్రీకాకుళం సాంస్కృతికం

లోకేశ్‌ను కలిసిన ఎమ్మెల్యే



ఎచ్చెర్ల ఎమ్మెల్యే ఎన్. ఈశ్వరరావు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి లోకేశ్‌ను బుధవారం విజయవాడలో కలిశారు. నియోజకవర్గాన్ని ఎడ్యుకేషనల్ హబ్‌గా తీర్చిదిద్దడంలో పూర్తి సహకారం అందించాలని, నియోజకవర్గ పర్యటనకు రావాల్సిందిగా ఆయనను కోరారు. నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని, డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని, అంబేడ్కర్ విశ్వవిద్యాలయం అభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. – న్యూస్‌టుడే, రణస్థలం

రేపు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

ఆమదాలవలస పట్టణం/గ్రామీణం, ఎచ్చెర్ల, పొందూరు, శ్రీకాకుళం అర్బన్, గార, న్యూస్‌టుడే: శ్రీకాకుళం నగరం హడ్కోకాలనీ సమీపంలోని 11కేవీ ఫీడర్, గార మండలం తూలుగు, ఆమదాలవలస పుర పరిధి వెంకటయ్యపేట, గాజులకొల్లివలస, ఎచ్చెర్లలోని కొయ్యాం, లోలుగు సబ్‌స్టేషన్ బాణాం ఫీడర్ల పరిధిలో మరమ్మతులు, చెట్టు కొమ్మలు తొలగింపు పనుల నిమిత్తం శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుతుశాఖ ఈఈ పి.యోగేశ్వరరావు తెలిపారు. ★ ఆయా ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా ఉండదన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణ.. ఆమదాలవలస గ్రామీణం: చిన్నజొన్నవలసలోని ప్రభుత్వ స్థలాన్ని గ్రామానికి చెందిన వారు ఆక్రమించుకున్నారు. దీంతో గ్రామస్థులు ఫిర్యాదు చేయగా అధికారులు వచ్చి బోర్డు ఏర్పాటు చేశారు. దానిని ఆక్రమణదారులు తొలగించి దుక్కి దున్ని విత్తనాలు వేసేశారు. తహసీల్దార్ రాంబాబు మాట్లాడుతూ ప్రభుత్వ స్థలం వద్ద బోర్డులు ఏర్పాటు చేశామని, తొలగిస్తే పరిశీలించి ఆక్రమణదారులపై శాఖాపరమైన చర్యలు చేపడతామని తెలిపారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

జి.సిగడాం మండలం జాడ ప్రాథమికోన్నత పాఠశాల నుంచి నలుగురు ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లడంతో బుధవారం వారిని ప్రధానోపాధ్యాయులు బెవర రామినాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులు సన్మానించారు. చదువుల అప్పలరాజు, కొత్తకోట జగదీశ్వరరావు, వడిపల్లి రామకృష్ణమ్మ, కొండక కృష్ణలకు వీడ్కోలు పలికారు. ఉపాధ్యాయులు, విద్యా కమిటీ సభ్యులు పాల్గొన్నారు. – న్యూస్‌టుడే, జి.సిగడాం

రూ. కోట్లు ఖర్చు చేశారు... వృథాగా వదిలేశారు..

– న్యూస్‌టుడే, శ్రీకాకుళం నగరం

వినియోగంలోకి రాని విద్యుత్తు దహన సంస్కార వాటిక

పొదలు, పనికిరాని మొక్కలతో నిరుపయోగంగా..

శ్రీకాకుళం నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో కొత్త వంతెన సమీపంలో స్వర్గధామం (శ్మశన వాటిక) వద్ద రూ.కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన విద్యుత్తు దహన సంస్కార వాటిక ప్రారంభానికి నోచుకోక నిరుపయోగంగా మారింది. ఇది నగరపాలక సంస్థ ప్రత్యేకాధికారి, కలెక్టర్‌తోపాటు అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది.

మౌలిక సదుపాయాలున్నా.. మూలకే..

కొవిడ్ రెండో దశ ఉద్ధృతిగా ఉన్నప్పుడు వైరస్ బారిన పడి మృతి చెందిన వారి దహన సంస్కారాలు అధికారులకు సవాలుగా మారింది. పెద్ద ఎత్తున ఆరుబయట దహన సంస్కారాలు చేపట్టాల్సి వచ్చింది. దీంతో అప్పటి కలెక్టర్ నివాస్ శ్రీకాకుళం నగరంలో డే అండ్ నైట్ కూడలి సమీపంలో నగరపాలకసంస్థ పరిధిలోని స్వర్గధామం వద్ద పర్యావరణానికి నష్టం చేకూర్చని పద్ధతిలో విద్యుత్తు దహన సంస్కార వాటిక నిర్మాణానికి ఆదేశాలు జారీ చేశారు. 14వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1.47 కోట్లతో చేపట్టిన ఈ పనులు మూడేళ్ల కిందట పూర్తయ్యాయి. గుత్తేదారుకు బిల్లులు సైతం పూర్తిగా చెల్లించేశారు. ఇక్కడ మృతదేహాలు దహనం చేసేందుకు అనువుగా భవనాలు, యంత్రాలు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించారు. నిర్వహణ బాధ్యతలు రోటరీ క్లబ్ లేదా ఇతర స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాల్సి ఉండగా నేటి వరకు ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు చొరవతో ఇండిగో విమాన సంస్థ సామాజిక బాధ్యతగా దీనిని ఆధునికీకరించేందుకు ప్రాథమికంగా సంసిద్ధత వ్యక్తం చేసినా ఆ నిధులు తీసుకురావడంలో ఎవరూ చొరవ చూపలేదు. విద్యుత్తు లేని సమయంలో ఇక్కడ కాలుష్య రహిత దహన సంస్కారాలకు పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలున్నా వినియోగంలోకి తీసుకురావడానికి చర్యలు చేపట్టడం లేదు.

శిథిలావస్థకు పరికరాలు, భవనాలు.. మూడేళ్ల కిందట నిర్మాణాలు పూర్తయినా నిరుపయోగంగా ఉండటంతో కాలిబాట కోసం ఏర్పాటు చేసిన టైల్స్ ఊడిపోతున్నాయి. యంత్ర పరికరాలు, జనరేటర్లు తుప్పుపట్టిపోతున్నాయి. ఈ ప్రాంగణంలో సుందరీకరణ కోసం చేపట్టిన మొక్కల సంరక్షణ కరవైంది. ప్రాంగణంలో పనికిరాని మొక్కలు, పొదలు పేరుకుపోతున్నాయి. ఈ ప్రాంతంలో రోజూ ఆరుబయట పాత విధానంలో చేపడుతున్న దహన సంస్కారాలతో వెలువడే పొగతో సమీప ప్రాంతాల్లోని నివాసితులు, కొత్త వంతెన ప్రాంతంలో నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు ఇబ్బంది పడుతున్నారు. పర్యావరణానికి సైతం హాని చేకూరుతోంది. 'స్వచ్ఛంద సంస్థకు అప్పగించేందుకు కలెక్టర్ అనుమతి కోరాం. దీని నిర్వహణ స్వచ్ఛంద సంస్థ అప్పగించి సాధ్యమైనంత తొందరలో వినియోగంలోకి తీసుకొచ్చేలా చర్యలు తీసుకుంటామ'ని నగరపాలక సంస్థ కమిషనర్ పి.వి.వి.డి.ప్రసాదరావు తెలిపారు.

మండల అధ్యక్షుడి కినుక.. బుజ్జగించిన నాయకులు..

లావేరు, న్యూస్‌టుడే: లావేరు మండలం తెదేపా అధ్యక్ష పదవి కోసం వర్గపోరు కొనసాగుతోంది. పాత కమిటీనే కొనసాగించాలని మెజార్టీ పంచాయతీలకు చెందిన నాయకులు కోరుతున్నారు. మండలంలో అధ్యక్షుడికి తెలియకుండా వ్యతిరేక వర్గం కార్యక్రమం నిర్వహించడంతోపాటు అధ్యక్ష పదవి ఎటూ తేల్చకపోవడంతో మండలాధ్యక్షులు ముప్పిడి సురేష్ తన పదవికి రాజీనామా చేయాలని సిద్ధపడ్డారు. సమాచారం అధిష్ఠానానికి తెలియడంతో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, తెదేపా ఎచ్చెర్ల నియోజకవర్గం పరిశీలకులు అన్నెపు రామకృష్ణ, పార్టీ జిల్లా పూర్వపు అధ్యక్షుడు నారాయణమూర్తి బుధవారం తాళ్లవలసలోని సురేష్ ఇంటి వద్దకు చేరుకుని బుజ్జగించారు. పరిశీలకులు రామకృష్ణ మాట్లాడుతూ మండలంలోని పార్టీ కార్యక్రమాలన్నీ సురేష్ ఆధ్వర్యంలోనే జరుగుతాయని తెలిపారు.

వ్యాధుల కాలం.. అప్రమత్తత అవసరం

ఆనందపురంలో స్థానికులతో మాట్లాడుతున్న డీపీవో భారతీసౌజన్య

జి.సిగడాం, రణస్థలం, న్యూస్‌టుడే: చెత్తనుంచి సంపద కేంద్రాల నిర్వహణ పక్కాగా ఉండాలని జిల్లా పంచాయతీ అధికారిణి (డీపీవో) భారతీసౌజన్య అన్నారు. ఆనందపురంలో బుధవారం తడి, పొడి చెత్తపై గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చెత్తను బయట పడేయకుండా కేంద్రాలకు తరలించాలని సూచించారు. పలు అంశాలు వివరించారు. ఎంపీడీవో రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు. ★ ఇది వ్యాధుల కాలమని అందరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ఈశ్వరరావు అన్నారు. బుధవారం కోటపాలేన్ని సందర్శించి సచివాలయ, వైద్య సిబ్బందికి సూచనలు చేశారు. అతిసారం, విషజ్వరాలు ప్రబలే అవకాశమున్నందున తప్పనిసరిగా పారిశుద్ధ్య పనులు చేపట్టాలన్నారు. ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయొద్దని సూచించారు. డిప్యూటీ ఎంపీడీవో ప్రకాశరావు, కార్యదర్శి శ్రీధర్ పాల్గొన్నారు.

(c) eenadu

ఉత్తర చెన్నై అభివృద్ధి పథకంపై సమీక్ష

చెన్నై, న్యూస్‌టుడే: సీఎండీఏ ఆర్థిక భాగస్వామ్యంతో ఉత్తర చెన్నై అభివృద్ధి పథకం కింద పనులు జరుగుతున్నాయి. పనులపై మంత్రి పి.కె.శేఖర్‌బాబు బుధవారం సమీక్ష నిర్వహించారు. రిప్పన్ భవనం ప్రాంగణంలోని సమావేశ హాల్‌లో జరిగిన సమీక్షలో పథకం కింద ఇప్పటివరకు జరిగిన, కొనసాగుతున్న పనులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పనులను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో మేయర్ ప్రియ, డిప్యూటీ కమిషనర్లు శివకృష్ణమూర్తి(వర్క్స్), కట్టా రవితేజ(ఉత్తర ప్రాంతీయం), హెచ్.ఆర్.కౌశిక్ (మధ్య ప్రాంతీయం), అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి శేఖర్ బాబు, పాల్గొన్న అధికారులు

చెన్నై అన్నానగర్‌లోని వళ్లియమ్మాళ్ మహిళా కళాశాలలో మొదటి సంవత్సరం విద్యార్థినులకు బుధవారం మూడో సంవత్సరం విద్యార్థినులు పసుపు సంచులతో స్వాగతం పలికారు. ప్లాస్టిక్ ఉపయోగించొద్దని అవగాహన కల్పించారు.

తిరువారూర్‌లో నాట్లు వేస్తున్న కూలీలు

జోరుగా వరి సాగు

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: మెట్టూర్ నీటి విడుదలతో తంజావూర్, నాగపట్టణం తిరువారూర్, మైలాడుదురై జిల్లాల్లో వరిసాగు జోరందుకుంది. తిరువారూర్ జిల్లా తిరుమకోట్టై వద్ద బైంగానాడు, రాజగోపాలపురం, రాధానరసింహపురం ప్రాంతాల్లో నాట్లు వేస్తున్నారు.

దళిత నాయకులకు భద్రతేదీ?

సైదాపేట, న్యూస్‌టుడే: తమిళనాడులో దళిత నాయకులకు భద్రత లేదని పురట్చి తమిళగం అధ్యక్షుడు మూర్తి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దళితులను మూడో తరగతి పౌరులుగా రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. దళిత ఎమ్మెల్యేల గళం అణిచివేసే యత్నం జరుగుతోందని ఆరోపించారు. రాష్ట్రంలోని దళిత సంఘాలన్నీ కలిసి గవర్నర్‌కు ఫిర్యాదు చేసేందుకు నిర్ణయించామని చెప్పారు. ఆర్మ్‌స్ట్రాంగ్ హత్య కేసులో న్యాయం దక్కలేదని తెలిపారు.

విలేకర్లతో మాట్లాడుతున్న మూర్తి

టీవీకే ఆందోళన వాయిదా

చెన్నై, న్యూస్‌టుడే: అజిత్‌కుమార్ లాకప్‌డెత్ ఘటనను నిరసనగా టీవీకే ప్రకటించిన ఆందోళన 6వ తేదీకి వాయిదా వేసింది. ఎగ్మూర్‌లోని రాజరత్నం స్టేడియం వద్ద గురువారం ఆందోళన చేపట్టనున్నట్లు టీవీకే ప్రకటించింది. వేరు కారణాల దృష్ట్యా ఆ చోటును ఉపయోగించనున్నట్లు పోలీసులు వెల్లడించడంతో ఆందోళనను 6వ తేదీ ఉదయం 10 గంటలకు శివానంద రోడ్డులో నిర్వహించనున్నట్లు పార్టీ ప్రధానకార్యదర్శి బుస్సీ ఆనంద్ తెలిపారు.

నన్ను తొలగించే అధికారం అన్బుమణికి లేదు: ఎమ్మెల్యే అరుళ్

సైదాపేట, న్యూస్‌టుడే: తనను తొలగించే అధికారం అన్బుమణికి లేదని పీఎంకే ఎమ్మెల్యే అరుళ్ తెలిపారు. అన్బుమణి రామదాస్ అధికారం లేని పదవిలో ఉన్నారని, ఆయన కార్యనిర్వాహక అధ్యక్షుడు మాత్రమే అన్నారు. తనను తొలగించే అధికారం పీఎంకే వ్యవస్థాపకుడు రామదాస్‌కు మాత్రమే ఉందన్నారు. రామదాస్, అన్బుమణి కలిసి మాట్లాడుకోవాలని, అప్పుడే పార్టీని కాపాడటం కుదురుతుందని తెలిపారు.

కష్టాలు ఎదిరించి.. చదువులో రాణిస్తూ

స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్న విద్యార్థినులు

చదవలేం, రాయలేం అంటూ కష్టాల్ని చూసి ఏడవటం కన్నా వాటి నుంచి ఎలా బయటపడాలని ఆలోచించడమే ఉత్తమం. చీకటి నుంచి వెలుగు చూసేందుకు అవకాశాలెన్నున్నాయో వెతకడం శ్రేయస్కరం. అలాంటి బాటపట్టి, చదువుల్లో శభాష్ అనిపించుకుని నేటితరం విద్యార్థులకు స్ఫూర్తిగా నిలుస్తున్నారు ఈ అమ్మాయిలు. తమిళనాడు విద్యార్థులు వారిని చూసి ఎంతో నేర్చుకోవాలని పాఠశాల విద్యాశాఖ వారి గాథల్ని అన్ని జిల్లాలకు పంపింది.

- ఈనాడు-చెన్నై

కూలీ పనిచేస్తూ ఐహెచ్‌ఎంకు

మాది తిరువణ్ణామలై దగ్గర్లోని చిన్న గ్రామం. పేద వ్యవసాయ కుటుంబం. చిన్నతనం నుంచి నాకో భయముండేది. పొలాల్లో పనులు, పశువులు మేపుతూ అలా ఉండిపోవాల్సిందేనా అని. నాకు చదవడిది. తల్లి నిర్మాణ కూలీగా వెళ్లేది. దాంతోనే మాకు అన్నం దొరుకుతోంది. చదువు కోసం కాలేజీకెళ్లడమనేది కలే అనుకునేదాన్ని. ఫీజులు కట్టే స్తోమతలేదు. ప్లస్-2లో 87శాతం మార్కులొచ్చాయి. మార్కుల్ని చూసి ఊర్లో పొగడనివారంటూ లేరు. ఓ రోజు స్కూల్ నుంచి ఫోన్. హలో అనగానే.. 'అభినందనలు కృతిక. నీకు మంచిరోజులు రాబోతున్నాయ్' అన్నారు. ఎందుకని అడిగితే చెన్నైలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోటల్‌మేనేజ్‌మెంట్(ఐహెచ్‌ఎం)లో సీటొచ్చిందని సమాచారమిచ్చారు. అర్హత పరీక్షలో మంచి మార్కులతో అంతర్జాతీయ ప్రమాణాలున్న ఇన్‌స్టిట్యూట్‌కు ఎంపికయ్యాను. జీవితాన్ని ఒక్కసారి వెనక్కి తిరిగి చూసుకున్నా.. నా తల్లిని నేను పోగొట్టుకోలేను. ఉన్నతంగా ఎదగగలను. 'పేదరికం ఇకపై ఉండదు' అనే ధైర్యం వచ్చింది. ఈ ఇన్‌స్టిట్యూట్‌లో ప్రతిభ చూపితే అంతర్జాతీయ స్థాయి ఉద్యోగాల్లో స్థిరపడటం ఖాయం. ఈ నమ్మకంతోనే ఇప్పుడు కాలేజీకి వెళ్తున్నా. ఫీజులన్నీ రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తోంది. ఉపకార వేతనాల సాయంతో ట్యూషన్ ఫీజులు, హాస్టల్, బోర్డింగ్ ఫీజులు అందుతున్నాయి. నాలాగా ఇప్పటివరకు 900మంది వివిధ పాఠశాలల నుంచి అత్యున్నత ఇన్‌స్టిట్యూట్స్‌లో చదువుతున్నారు.

- ఎ.కృతిక

లక్ష్యం సాధించాకే ఊరెళ్తా

మాది బిహార్. అక్కడి నుంచి చాలాఏళ్ల కిందట మా తల్లిదండ్రులు పని కోసం చెన్నై వలసొచ్చారు. ఇతర రాష్ట్రాలవారికి తమిళం కష్టం. పేదరికం చూసి నేనలా అనుకోలేదు. బాగుపడేందుకు చదువు తప్పితే వేరే ప్రత్యామ్నాయం లేదనిపించింది. పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకునేందుకు రోజూ కష్టపడేదాన్ని. చెన్నై కొల్‌బజార్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తిచేశా. బోర్డుపరీక్షల్లో తమిళంలో 93 మార్కులు వచ్చాయి. 467 మార్కులతో టాపర్‌గా నిలిచాను. 'ఇంకా ఎన్నాళ్లక్కడ? బిహార్ వచ్చేయండి' అంటూ కుటుంబ పెద్దల నుంచి ఒకటే పోరు. ఒకటే చెప్పాను.. 'ఇక్కడ బడి సౌకర్యం ఉంది, ఎంతకష్టమైనా చదువు పూర్తి చేస్తా, ఉన్నతంగా ఎదుగుతా. నా లక్ష్యాలు సాధించుకున్న తర్వాతే ఊరికి వస్తా' అని చెప్పాను. ప్లస్2 సైతం ఇంత కసితో చదవాలనుకుంటున్నా.

- జియకుమారి

4 ఏళ్లు బడి మానేశా..

మాది వేలూరు జిల్లా. గ్రామం నుంచి బడికెళ్లాలంటే నరకమే. దారినిండా గోతులు, వర్షపు నీటితో తెగిన మట్టి, సూదుల్లాంటి రాళ్లు. ఇలా రెండు గంటలు నడిస్తే బడొస్తుంది. పరిస్థితి చూసి నాన్న చాలాసార్లు ఏడ్చారు. 'తిండిలేక ఓ ద్విచక్రవాహనం తీసుకుంటా, అందులో నిన్నొదిలిపెడతా' అని ధైర్యం చెప్పేవాడు. ఇల్లు గడవటమే కష్టం, అలాంటిది బండిలా తెస్తాడు, దానికి పెట్రోలెలా పోస్తాడూ ఆలోచిస్తూ.. నిద్రపట్టేది కాదు. అప్పుడే నాది 8వ తరగతి చదువు అంతంతమాత్రం. ఇక చదువు ఆపేస్తున్నా ఇంట్లో చెప్పేశా. అమ్మానాన్నలకు తోడుగా పొలం పనులకు వెళ్లా. అలా 4ఏళ్లు గడిచాయి. ఒక్కసారి అనిపించింది.. చదువుకుని ఉంటే బాగుండు, మన జీవితాలు బాగుపడేవేమోనని. గ్రామం వదిలి మంచి ఉద్యోగం సాధించుకునేవాళ్లంకదా అని. అప్పుడే నా అదృష్టం తలుపుతట్టినట్లు అనిపించింది. మా స్కూల్ టీచర్లు ఇంటికొచ్చారు. పరిస్థితి అడిగి తెలుసుకున్నారు. నా మనసులో ఉన్న లక్ష్యాలు గురించి చెప్పాను. పది చదవుకొందవు అంటూ బడికి తీసుకెళ్లారు. బడికి వెళ్లేందుకు పథకంద్వారా ప్రత్యేకంగా జీపు ఏర్పాటుచేశారు. అందులో మా ఊరినుంచి నాతో పాటూ మరి కొంత విద్యార్థులను వెళ్లేవాళ్లం. నేరుగా పదో తరగతికి అవకాశమిచ్చారు. ప్రత్యేక తరగతులు తీసుకున్నారు. లక్ష్యం కోసం కసిగా చదివా. బోర్డు పరీక్షల్లో 421 మార్కులొచ్చాయి. మంచి కాలేజీలో సీటొచ్చింది. వెలుగు కనిపిస్తోంది.

- ఆర్.శైలజ

విమర్శలు పట్టించుకోను.. ప్రజాసేవే కర్తవ్యం: స్టాలిన్

చెన్నై, న్యూస్‌టుడే: తనపై వస్తున్న విమర్శలు పట్టించుకోనని, ప్రజాసేవే కర్తవ్యమని ముఖ్యమంత్రి స్టాలిన్ తెలిపారు. రాజా అన్నామలైపురంలోని కపాలీశ్వరర్ కర్పగాంబాళ్ కల్యాణ మండపంలో హిందూ దేవాదాయ, ధర్మాదాయశాఖ తరపున జరిగిన కార్యక్రమంలో 32 జంటలకు ముఖ్యమంత్రి స్టాలిన్ వివాహం జరిపించి సారె అందించారు. ఆయన మాట్లాడుతూ... ఇప్పటివరకు తాను పాల్గొన్న ప్రభుత్వ కార్యక్రమాల్లో ఎక్కువగా హిందూ దేవాదాయ, ధర్మాదాయశాఖ కార్యక్రమాలే ఉన్నాయన్నారు. ఈ శాఖకు నాలుగేళ్ల తమ ప్రభుత్వం పలు పథకాలు అందించిందని, పలు పనులు చేపట్టిందని గణాంకాలతో వెల్లడించారు. ఆ జాబితాలో ఇప్పటివరకు 2,376 వివాహాలను ఉచితంగా జరిపించి వధూవరులకు సారె అందించామని తెలిపారు. డీఎంకే ప్రభుత్వం చేపడుతున్న పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను విద్వేషం, సామాజిక వేర్పాటు భావాలు కలిగినవారు సహించలేకపోతున్నారని, భక్తి పేరిట పగటివేషం వేస్తున్నారని విమర్శించారు. ఓ వార్తాపత్రికలో తనపై వ్యంగ్యచిత్రం గీశారని, అందులో తాను కావడి మోస్తున్నట్లు, మంత్రులు శూలాలు గుచ్చుకుని పొర్లు దండాలు పెడుతున్నట్లు ఉందన్నారు. ఇది కొందరిలో గూడుకట్టుకున్న పలు సంవత్సరాల విద్వేషానికి ప్రతిరూపమని పేర్కొన్నారు. దానిని తాను పట్టించుకోనని, తన పని ప్రజాసేవ అని తెలిపారు. ప్రజల అవసరాలు గుర్తించి అందుకు అనుగుణంగా సేవలందించడమే తన కర్తవ్యమన్నారు. కార్యక్రమంలో మంత్రులు కె.ఎన్.నెహ్రూ, సుబ్రమణియన్, పి.కె.శేఖర్‌బాబు, జీసీసీ మేయర్ ప్రియ, డిప్యూటీ మేయర్ మహేశ్‌కుమార్, ఎమ్మెల్యేలు వేలు, తాయగం కవి, కరుణానిధి, జోసెఫ్ సామువేల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సమక్షంలో మంగళసూత్రం కడుతున్న వరుడు

ప్రజల అవసరాలకు సరిపడా బస్సులు నడపాలి: ఓపీఎస్

సైదాపేట, న్యూస్‌టుడే: ప్రజల అవసరాలకు తగినట్లు బస్సులు నడపాలని మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్‌సెల్వం డిమాండ్ చేశారు. బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. 2021 నుంచి 2025 వరకు ఐదు ఆర్థిక నివేదికలు డీఎంకే ప్రభుత్వం సమర్పించిందన్నారు. ఇందులో 8,500 కొత్త బస్సులు కొనుగోలు చేయనున్నట్లు తెలిపిందన్నారు. అందులో పావువంతు కూడా కొనుగోలు చేయలేదని ఆరోపించారు. తాంబరం వెస్ట్ నుంచి మన్నివాక్కం, ముడిచ్చూరు. వండలూరు ప్రాంతాలకు సాయంత్రం 7 నుంచి 8 వరకు గంటసేపట్లో 12 బస్సులు నడవాలని, కేవలం మూడు మాత్రమే తిరుగుతున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇదే పరిస్థితని పేర్కొన్నారు.

హెచ్‌ఎంలు మెరుగ్గా పనిచేయాలి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: అత్యల్ప పనీతీరు కనబరిచిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెరుగ్గా పనిచేయాలని పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. తిరువారూర్ జిల్లా కలెక్టరేట్‌లో ప్రధానోపాధ్యాయులకు రాష్ట్ర స్థాయి-2025 అధ్యయన సమావేశం బుధవారం జరిగింది. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ.. చెన్నైలో ముఖ్యమంత్రి అధ్యక్షతన జరిగిన సమావేశం తర్వాత పరీక్షలలో తక్కువ మార్కులు సాధించిన విద్యార్థులు ఏ సబ్జెక్టులలో తక్కువగా ప్రతిభ చూపారని తెలుసుకోవడానికి అధ్యయనం నిర్వహించారన్నారు. అందులో అంశాల ఆధారంగా జిల్లా అంతటా సమావేశం నిర్వహిస్తున్నామని తెలిపారు. తిరువారూర్‌లో అత్యల్ప పనితీరు కనబరిచిన ప్రాంతాలకు చెందిన హెచ్‌ఎంలను పిలిపించి సూచనలు చేశామన్నారు.

మాట్లాడుతున్న మంత్రి అన్బిల్ మహేష్

అజిత్‌కుమార్ సోదరుడికి ఉద్యోగ నియాక ఉత్తర్వు అందిస్తున్న మంత్రి పెరియకరుప్పన్

కాపలాదారుడు అజిత్‌కుమార్ మృతిపై విచారణ ప్రారంభం

ప్యారిస్, న్యూస్‌టుడే: చోరీ కేసులో పోలీసుల దర్యాప్తునకు తీసుకెళ్లిన అజిత్‌కుమార్ మృతిచెందిన వ్యవహారమై మదురై నాలుగో అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి జాన్ చంద్రలాల్ సురేష్ విచారించాలని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. నివేదికను 8వ తేదీ దాఖలు చేయాలని తెలిపింది. న్యాయమూర్తి జాన్ సుందర్‌లాల్ సురేష్ బుధవారం విచారణ ప్రారంభించారు. కేసుకి సంబంధించిన అన్ని పత్రాలను శివగంగై పోలీసులు న్యాయమూర్తికి అప్పగించారు. అజిత్‌కుమార్ దాడికి గురైన పోలీస్‌స్టేషన్, మడపురంలోని ఆలయ ప్రాంగణానికి న్యాయమూర్తి వెళ్లి వివరాలు సేకరించారు. ఓ పోలీసు అధికారి, మరి కొందరిపై చర్యలు చేపట్టనున్నట్లు సమాచారం వెలువడింది. పైనుంచి వచ్చిన ఒత్తిడి కారణంగా పోలీసులు క్రూరంగా దాడిచేసినట్లు తెలిసింది.

బాధిత కుటుంబీకులకు పరామర్శ

అజిత్‌కుమార్ సోదరుడు నవీన్‌కుమార్‌కు ఉద్యోగ నియామక పత్రం, ఇంటి పట్టా బుధవారం మంత్రి పెరియకరుప్పన్ అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అజిత్‌కుమార్ కుటుంబానికి డీఎంకే తరపున రూ.5 లక్షలు ఇచ్చినట్లు తెలిపారు. అజిత్‌కుమార్ కేసులో నిందితులకు శిక్ష పడేలా చేస్తారన్నారు. వీసీకే అధ్యక్షుడు తిరుమావళవన్ అజిత్‌కుమార్ ఇంటికి వెళ్లి అతని కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ తరపున రూ.లక్ష అందించారు. మాజీ మంత్రి ఆర్బీఉదయకుమార్, తమిళగ వాళ్వురిమై కట్చి వ్యవస్థాపకుడు, ఎమ్మెల్యే వేల్‌మురుగన్ తదితరులు అజిత్‌కుమార్ కుటుంబీకులను పరామర్శించారు.

రూ.500 అడిగినందుకే..

అజిత్‌కుమార్ తరపు లాయరు మాట్లాడుతూ.. నికితా అనే డాక్టరు గతనెల 27న ఆలయానికి వచ్చిందని, అప్పుడు వీల్ ఛైర్‌కి రూ.500 అడగడంతో సమస్య ఏర్పడిందని తెలిపారు. అజిత్‌కుమార్ రూ.500 అడిగాడని, ఆమె రూ.100 ఇస్తానని చెప్పడంతో వాగ్వాదం ఏర్పడిందన్నారు. కావాలనే అతనిపై 10 సవర్ల నగలు కనిపించలేదని ఆరోపణలు మోపారన్నారు. సచివాలయంలో ఉన్న ఓ ఐఏఎస్ అధికారి సహకారంతో అజిత్‌ను పోలీస్‌స్టేషన్‌కి తీసుకెళ్లారని, నిఖిత పలుకుబడిని ఉపయోగించి తప్పుడు ఆరోపణలు చేసినట్లు పేర్కొన్నారు. ఆ ఐఏఎస్ అధికారి ఎవరో గుర్తించాలన్నారు. 27న స్టేషన్‌కి తీసుకెళ్లిన పోలీసులు 28న సాయంత్రం వరకు కొడుతూనే ఉన్నారని, కోర్టులో హాజరుపరచకుండా, ఎఫ్ఐఆర్ నమోదు చేయకుండా చిత్రహింసలకు గురిచేశారని తెలిపారు.

అనుమానంతో ఫిర్యాదు..

అజిత్‌కుమార్‌పై ఫిర్యాదు చేసిన నిఖిత మాట్లాడుతూ.. తన తల్లికి అనారోగ్యంగా ఉండటంతో స్కానింగ్‌కు బయల్దేరగా నగలు తీసి కారులో పెట్టామన్నారు. ఆమె హఠాత్తుగా ఆలయానికి వెళ్లాలనడంతో భద్రకాళి అమ్మన్ గుడికి వెళ్లినట్లు చెప్పారు. ఆలయ సిబ్బందిని వీల్‌ఛైర్ అడగడంతో అజిత్‌కుమార్ ఇచ్చినట్లు తెలిపారు. అతనే కారును పార్క్ చేస్తానని చెప్పి తాళాలు తీసుకున్నాడని, దర్శనం ముగించుకున్న తర్వాత భోజనానికి హోటల్‌కి వెళ్లినట్లు పేర్కొన్నారు. బ్యాగులో నగలు లేకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అనంతరం ఆలయానికి వెళ్లి అజిత్‌కుమార్‌ను పోలీసులకు అప్పగించినట్లు చెప్పారు. అజిత్‌కుమార్‌పై తమకు అనుమానం ఉందని, ఆలయ యాజమాన్యం తరపున విచారించినప్పుడు అతను పొంతన లేని సమాధానాలు చెప్పాడన్నారు. వీల్‌ఛైర్ తీసుకొచ్చేందుకు రూ.500 అడిగాడని, తాను రూ.100 ఇచ్చినట్లు వివరించారు.

నివాళులర్పిస్తున్న తిరుమావళవన్

నిఖితపై నగదు మోసం కేసు

కాపలాదారుడు అజిత్‌కుమార్‌పై ఫిర్యాదు చేసిన నిఖితపై ఇదివరకే నగదు మోసం కేసు ఉన్నట్లు తెలిసింది. ఉద్యోగం ఇప్పిస్తానని రూ.16 లక్షలు మోసం చేసినట్లు 2011లో నిఖితపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఉప ముఖ్యమంత్రి తెలుసని 2010లో నిఖిత మోసానికి పాల్పడినట్లు, నగదు అడిగిన బాధితులను ఆమె కుటుంబీకులు బెదిరించినట్లు సమాచారం.

న్యాయం చేయాలి ..

అజిత్‌కుమార్ మృతి కేసులో న్యాయం చేయాలని అన్నాడీఎంకే తరపున తిరుపువనం వద్ద ఎమ్మెల్యే సెంథిల్‌నాథన్ నేతృత్వంలో బుధవారం ఆందోళన జరిగింది. ప్రత్యేక బృందం దర్యాప్తునకు ఎవరు ఉత్తర్వులు ఇచ్చారని ప్రశ్నించారు. పోలీసుల తీరును ఖండిస్తూ నినాదాలు చేశారు. ఆందోళనలో మాజీ మంత్రులు ఆర్బీ ఉదయకుమార్, భాస్కరన్, భాజపా సీనియర్ నేత హెచ్ రాజా తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న నాయకులు

పోలీసులకు శిక్షణ ఇవ్వండి: అన్బుమణి

సైదాపేట, న్యూస్‌టుడే: అజిత్‌కుమార్ హత్య కేసులో ప్రమేయం ఉన్న ఐఏఎస్ అధికారి ఎవరని పీఎంకే అధ్యక్షుడు అన్బుమణి రామదాస్ ప్రశ్నించారు. బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. తమిళనాడు పోలీసుశాఖ కొందరి చేతుల్లో కీలుబొమ్మగా మారిందన్నారు. పోలీసు శాఖను అలా మార్చింది డీఎంకే ప్రభుత్వమే అన్నారు. హత్యను దాచేందుకు యత్నించటం అతిపెద్ద నేరమని పేర్కొన్నారు. ప్రజలతో మానవత్వంతో ఎలా నడుచుకోవాలో పోలీసుశాఖకు శిక్షణ తరగతులు నిర్వహించాలని సూచించారు.

సారీ చెబితే సరిపోతుందా?

◆ నయినార్ నాగేంద్రన్

సైదాపే, న్యూస్‌టుడే: సారీ అని ఒక్క మాట చెప్పటం ఎలా న్యాయమని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ప్రశ్నించారు. బుధవారం ఆయన విడుదల చేసిన ప్రకటనలో.. అజిత్‌కుమార్ తల్లితో ముఖ్యమంత్రి స్టాలిన్ సారీ మా అని ఫోన్లో చెప్పిన వీడియోలు విడుదలయ్యాయని తెలిపారు. అమాయక యువకుడిని హత్య చేసి ఒక్కవాక్యంతో సారీ చెబితే సరిపోతుందా అని ప్రశ్నించారు. ఇలాంటి మరణాలను అడ్డుకోవటమే ముఖ్యమంత్రి మొదటి పనని తెలిపారు.

ఉన్నతాధికారుల ఆధ్వర్యంలోని ప్రత్యేక బృందాలను తొలగించాలి: డీజీపీ

ప్యారిస్, న్యూస్‌టుడే: పోలీసు ఉన్నతాధికారుల ఆధ్వర్యంలో పని చేస్తున్న ప్రత్యేక బృందాలను తొలగించాలని డీజీపీ శంకర్ జివాల్ ఉత్తర్వులు ఇచ్చారు. ఏదైనా నేర కేసు జరిగితే దానిని ఛేదించడానికి మాత్రమే డిప్యూటీ కమిషనర్లు, సహాయ కమిషనర్లు, డీఎస్పీలు తమ ఆధ్వర్యంలో పని చేసేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసుకోవాలని కొత్తగా ఉత్తర్వులు జారీచేశారు. ఇందుకు జోన్ ఐజీలు, కమిషనర్లు తదితరులు తగిన అనుమతి పొందాలని సూచించారు. అన్ని ఠాణాల్లో ప్రత్యేక బృంద పోలీసులు ఇకపై దర్యాప్తు ఖైదీల వద్ద హద్దులు దాటి ప్రవర్తించడం, దాడిచేసి చిత్రహింసలకు గురిచేయడాన్ని పూర్తిగా అడ్డుకోవచ్చని ఓ పోలీసు అధికారి తెలిపారు.

ఏఐ కోర్సులకు పెరుగుతున్న డిమాండు

వడపళని, న్యూస్‌టుడే:

రాష్ట్రంలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) కోర్సుల్లో చేరే వారి సంఖ్య పెరుగుతోంది. గత మూడేళ్లలో ఈ కోర్సుల్లో చేరేందుకు చాలామంది ముందుకొస్తున్నారు. ఈ ఏడాది ఆ సంఖ్య గరిష్ఠంగా ఉంటుందని పలువురు విద్యానిపుణుల అంచనా వేస్తున్నారు.

ప్రతి సంవత్సరం పెరుగుతూ..

◆ యూజీ స్థాయిలో ఏఐ, డేటా సైన్స్ కోర్సుల్లో 2023-23లో 7,049 విద్యార్థులు చేరగా 2024-25లో ఆ సంఖ్య 15,702కి చేరుకుంది. దేశవ్యాప్తంగా పలు విద్యాసంస్థలు ఏఐకు సంబంధించి 800 రకాలైన బీటెక్ కోర్సులు అందిస్తున్నాయని ఐఐటీ మద్రాస్‌లోని డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ విభాగ అధిపతి బలరామన్ రవీంద్రన్ అన్నారు. కోర్సులు బోధించేందుకు తగిన అర్హత, ఏఐలో అనుభవమున్న అధ్యాపకులు మాత్రం లేరు. ఏఐకి పునాదిలాంటి కంప్యూటర్ సైన్స్ అభివృద్ధి చెందుతున్న రంగాలలో ప్రధానంగా కావాల్సినదాన్ని కలిగి ఉండదు. అందుకు కారణం ఏఐకి అల్గారిథం అభివృద్ధి చేయడానికి గణితంలో మెళకువలు, సూత్రాలపై ఆధారపడాల్సిన అవసరం ఉందని రవీంద్రన్ చెప్పారు.

అధ్యాపకులు అంతంత మాత్రమే

సన్నద్ధత అవసరం..

◆ ఏఐ బోధించే అధ్యాపకులు మంచి అనుభవం కలిగిన వారుగా ఉండాలి లేదా ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ల (ఎఫ్‌డీఎఫ్) ద్వారా తమను తాముగా సన్నద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉందని ఎస్సారెమ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ(ఎస్ఆర్ఎంఐఎస్‌టీ) కంప్యూటింగ్ టెక్నాలజీస్ విభాగ ఆచార్యులు సీఎన్ శుభలలిత తెలిపారు. ఇక్కడ పది వేర్వేరు రకాల ఏఐ కోర్సులు అందిస్తున్నా అధ్యాపకుల కొరత పెను సవాలుగా తయారైంది. అధిక శాతం మంది విద్యార్థులు ఏఐ కోర్సులలో చేరేందుకు సుముఖంగా ఉండటంతో సర్టిఫికేషన్లు, ఎఫ్‌డీఎఫ్‌లు అనేవి అధ్యాపకులకు సన్నద్ధం చేసుకునే మార్గాల్లాంటివని లలిత అన్నారు. ఏఐని ఇతర కోర్ ఇంజినీరింగ్ సబ్జెక్టులతో అనుసంధానించే ఆలోచనలు కూడా ఉన్నాయని, ఈ క్రమంలో సంస్థల నుంచి నిధులు కూడా అందుతున్నాయని, ఏఐ గణితంతో కూడిందని ఆమె పేర్కొన్నారు.



◆ ఏఐ పరిశోధకులు, అధ్యాపకులు, లేదా డెవలపర్లపై పని చేసే వివిధ నిపుణుల ఆలోచనలు కూడా భిన్నంగా ఉంటాయి. ఆ రకమైన అప్లికేషన్‌ల అభివృద్ధికి గణితం అంతగా ఉపయోగపడకపోవచ్చు. భాషా నమూనాల అభివృద్ధికి ఇది చాలా అవసరం. అవి ప్రాధాన్యం ప్రకారం సమలేఖనం చేయడం జరుగుతుందని లలిత అన్నారు.

◆ ఏఐ అధ్యాపకుల కొరత ఆందోళన కలిగించే విషయంగా ఉంది. పరిశ్రమల సహకారం కొంత వరకు తగ్గించగలదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అధ్యాపక అభివృద్ధికి రోడ్ మ్యాప్‌లాంటిది ఉండాలి, అధ్యాపకులకు శిక్షణ కార్యక్రమాలతో పాటు, ఏఐలో నైపుణ్యం కలిగిన యువత విద్యావేత్తల వైపు ఆకర్షితులను చేయాల్సిన అవసరం కూడా ఉంది.

300 ఈ-మెయిల్ ఐడీలతో బాంబు బెదిరింపులు

ప్యారిస్, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వ్యక్తులు తమిళనాడు పేరుతో అమెరికా సైన్యానికి బాంబు బెదిరింపులకు పాల్పడినట్లు రాష్ట్ర యాంటీ టెర్రరిజం స్క్వాడ్(ఏటీఎస్) దర్యాప్తులో తెలిసింది. రాష్ట్రవ్యాప్తంగా ఏడాదిన్నరగా ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులకు పాల్పడే ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఇందుకు సంబంధించిన కేసులను ఏటీఎస్ దర్యాప్తు చేస్తోంది. ఇప్పటి వరకు 300కుపైగా ఈ-మెయిల్ ఐడీల నుంచి విద్యాలయాలు, స్టార్ హోటళ్లు, ఆరాధన స్థలాలు, ఆస్పత్రులు, మాల్స్, విమానాశ్రయం, రైల్వేస్టేషన్‌లకు బాంబు బెదిరింపులకు పాల్పడినట్లు తెలిసింది. అమెరికా సైన్యం, చైనా, పాకిస్థాన్, శ్రీలంక రాయబార కార్యాలయాలకు కూడా తమిళనాడు పేరుతో బాంబు బెదిరింపులకు పాల్పడినట్లు గుర్తించారు. ఒక్క అన్నాయూనివర్సిటీకి మాత్రమే 18 సార్లు బెదిరింపులు వచ్చినట్లు తేలింది. కేసు దర్యాప్తును నాలుగు రకాలుగా విభజించి వేగవంతం చేశారు. వాటిలో అన్నా వర్సిటీ, ప్రైవేటు పాఠశాలలకు వరుసగా వచ్చిన బాంబు బెదిరింపులు వ్యక్తిగత కారణాలతో వచ్చినవిగా ఏటీఎస్ పోలీసులు అనుమానిస్తున్నారు.

డార్క్ వెబ్ టెక్నాలజీతో..

బెదిరింపులు వచ్చిన ఈ-మెయిల్ ఐడీలు నిర్దిష్ట గంటలు లేదా రోజుల్లో కనిపించకుండా పోయేలా రూపొందించడంతో దానికి సంబంధించిన డేటాను సేకరించేందుకు సైబర్ క్రైం నిపుణులతో కలిసి దర్యాప్తు చేస్తున్నారు. డార్క్ వెబ్ టెక్నాలజీతో గుర్తు తెలియని వ్యక్తులు బెదిరింపులకు పాల్పడినట్లు గుర్తించారు. తనను ప్రేమించలేదని యువకుడిపై ప్రతీకారం తీర్చుకునేందుకు దేశవ్యాప్తంగా 12 రాష్ట్రాల్లో 21 బాంబు బెదిరింపులకు పాల్పడిన చెన్నైకి చెందిన ఐటీ ఉద్యోగిని రినే జోష్‌లిడాను ఇటీవల అహ్మదాబాద్ సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన అనంతరమే తమిళనాడు పోలీసులు బాంబు బెదిరింపుల కేసులు వేగవంతం చేశారు. సైబర్ క్రైం పోలీసులు, సైబర్ నిపుణుల సాయంతో బాంబు బెదిరింపులకు పాల్పడిన వారిని అరెస్టు చేస్తామని ఏటీసీ పోలీసులు పేర్కొన్నారు.

(c) eenadu

ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాలి

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నామక్కల్ జిల్లాలోని తోపుడు బండ్లు, హోటళ్లు, రెస్టారెంట్లలో రీసైక్లింగ్ చేసిన నూనె ఉపయోగిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ దుర్గామూర్తి హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆమె ప్రకటన విడుదల చేశారు. రెస్టారెంట్లు, టీ దుకాణాలు తదితరాల్లో ఆహార వస్తువులను పాత ముద్రిత పేపర్లు, ప్లాస్టిక్ కవర్లలో ప్యాక్ చేయడం నిషేధించారన్నారు. కిరాణా దుకాణాలు, రెస్టారెంట్లు, స్నాక్ బార్ల వ్యాపారులు ఆహార భద్రతా ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఆహార భద్రతా లైసెన్స్, లేక రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రం పొందాలని పేర్కొన్నారు. ఎక్కడైనా నిబంధనలు ఉల్లంఘించినట్లు తెలిస్తే ప్రజలు 94440 42322 అనే వాట్సాప్ నెంబరుకు ఫిర్యాదు చేయొచ్చని ప్రకటనలో తెలిపారు.

అద్దె చెల్లించని దుకాణాలకు సీల్

విల్లివాక్కం, న్యూస్‌టుడే: ఈరోడ్ నగరపాలక సంస్థ వాణిజ్య సముదాయంలో రూ.5.48 లక్షలు బకాయిపడిన ఆరు దుకాణాలకు సీల్ వేసినట్లు నగరపాలక సంస్థ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. కొందరు దుకాణదారులు అద్దె చెల్లించకపోవడంతో వసూలు చేయాలని కమిషనర్ అర్పిత్‌జైన్ ఉత్తర్వులు ఇచ్చారు. ఆ ప్రకారం నగరపాలక సంస్థ రెవెన్యూ విభాగం తరపున నోటీసులు జారీ చేశారు. 6 దుకాణాలకు రెవెన్యూ అసిస్టెంట్ కమిషనర్ కార్తికేయన్, ఇన్‌స్పెక్టర్ శివకుమార్ నేతృత్వంలోని అధికారులు సీల్ వేసినట్లు నగరపాలక సంస్థ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

బోనులో చిక్కిన చిరుత

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నీలగిరి జిల్లా గూడలూర్ సమీపంలోని తమిళనాడు-కేరళ సరిహద్దు గ్రామంలో అటవీశాఖ పెట్టిన బోనులో మంగళవారం చిరుత చిక్కింది. వయనాడు జిల్లా రాష్ట్ర సరిహద్దు గ్రామం నంబియార్‌కున్ను ప్రాంతంలో నెలరోజులుగా రైతుల పెంపుడు జంతువులు, మేకలపై చిరుత దాడి చేయడం కలకలం సృష్టించింది. చిరుత సంచారం ఉన్న ప్రాంతాల్లో బోను పెట్టడంతో సోమవారం రాత్రి చిక్కింది. దానిని అటవీశాఖ సిబ్బంది సంరక్షణ కేంద్రానికి తీసుకెళ్లారు.

నివాస ప్రాంతంలో..

విల్లివాక్కం: నీలగిరి జిల్లా కోత్తగిరితో పాటు పరిసర ప్రాంతాలు దట్టమైన అడవులు, తేయాకు తోటలతో ఉన్నాయి. వన్యప్రాణుల సంచారం ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలో కేర్ కొంబై ప్రాంతంలో సోమవారం రాత్రి చిరుత సంచరిస్తున్న వీడియో వైరలవుతోంది. చిరుత కదలికలను పర్యవేక్షించి అటవీశాఖ చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

దర్యాప్తునకు తీసుకెళ్లిన వ్యక్తిపై పోలీసుల దాడి

● వీడియో వైరల్

ప్యారిస్, న్యూస్‌టుడే: దర్యాప్తుకోసం తీసుకెళ్లిన వ్యక్తిపై పోలీస్‌స్టేషన్‌లో పోలీసులు దాడి చేసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. తేని జిల్లా దేవదానపట్టి పోలీస్‌స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్‌గా అబ్దుల్‌హా, ప్రత్యేక సబ్ ఇన్‌స్పెక్టరుగా సుయశంబు విధులు నిర్వహిస్తున్నారు. దాడికి గురైన యువకుడిని ఈ ఏడాది జనవరి 14న సంక్రాంతి రోజున పోలీసులు దర్యాప్తు కోసం తీసుకెళ్లినట్లు తెలిసింది. ఆటో డ్రైవరు అయిన అతన్ని పోలీస్‌స్టేషన్‌లో దాడిచేసిన వీడియోను అతని తరపు న్యాయవాది విడుదల చేశారు. ఈ వ్యవహారమై ఏడీఎస్పీ నేతృత్వంలో దర్యాప్తు చేయాలని ఎస్పీ ఉత్తర్వులు ఇచ్చారు.

శోళింగర్‌లో పీఎంకే నిర్వాహకుల సమావేశం

శోళింగర్, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా తూర్పు పీఎంకే నిర్వాహకుల ఆలోచన సభ మంగళవారం రాత్రి జరిగింది. జిల్లా పీఎంకే కార్యదర్శి అడ్వకేట్ శరవణన్ అధ్యక్షత వహించారు. కొత్త సభ్యుల చేరిక, ప్రతి ప్రాంతంలో పార్టీ జెండాలు ఎగురవేయాలని తీర్మానించారు.

పోటీలో పాల్గొంటే పతకమే

వెయిట్ లిఫ్టర్‌గా రాణిస్తున్న ఐటీ ఉద్యోగిని

వెయిట్ లిఫ్టింగ్ ఎత్తుతూ...

పతకాలతో సౌమ్య కాళిదాస్

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: విజయం పొందాలనే తపన ఉంటే ఏదైనా సాధించవచ్చని నిరూపించి చూపుతున్నారు సౌమ్య కాళిదాస్. బీఎస్సీ పట్టభద్రురాలైన ఈమె ఐటీ రంగంలోని సైబర్ టెక్నాలజీ విభాగంలో పనిచేస్తున్నారు. రెండేళ్లుగా వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లోనూ సత్తా చాటుతున్నారు. ఆ వివరాలు ఆమె మాటల్లోనే తెలుసుకుందాం.

మాది కోయంబత్తూరు. చిన్నతనం నుంచి ఫిట్‌నెస్‌పై మక్కువ ఉంది. నా అభిరుచికి విరుద్ధంగా శరీరం బరువెక్కింది. బంధువులు, స్నేహితులు ఎగతాళిగా మాట్లాడేవారు. అందులో నుంచి బయటికొచ్చేందుకు వ్యాయామం చేయడం ప్రారంభించాను. ఐదేళ్లుగా విరామం లేకుండా కొనసాగిస్తూ శరీరాన్ని మంచి స్థితిలోకి తీసుకొచ్చాను. అదే వెయిట్ లిఫ్టింగ్‌కు పునాదిగా ఏర్పడింది.

వ్యాయామం చేసే జిమ్‌లోనే వెయిట్‌లిఫ్టింగ్‌కి కూడా శిక్షణ ఇచ్చేవారు. చాలామంది మగవాళ్లే ఉండేవారు. నా ఆసక్తిని కోచ్‌కు చెప్పడంతో అర్థం చేసుకొని శిక్షణ ఇవ్వడానికి ఒప్పుకొన్నారు. రెండేళ్లుగా సాధన చేసి పలు పోటీల్లో పాల్గొంటున్నాను. ఈ శిక్షణ చాలా కష్టంగా ఉండేది. మనం ఉన్న బరువు కంటే రెండింతలు ఎక్కువ ఎత్తాల్సి ఉండేది.

ఓవరాల్ ఛాంపియన్‌షిప్..

52 నుంచి 55 కిలోల బరువు విభాగంలో పాల్గొంటున్నాను. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని బంగారం, ఇతర పతకాలు సాధించాను. ప్రతి పోటీలోనూ ఏదో ఒక పతకం గెలుచుకుంటున్నాను. డెడ్ లిఫ్ట్ ఈవెంట్‌లో బంగారు పతకం సాధించడమే కాక 'ఓవరాల్ చాంపియన్‌షిప్' కూడా గెలుచుకున్నాను. ఇప్పుడు బాడీ బిల్డింగ్ పోటీలకు సిద్ధమవుతున్నాను. ఎలాంటి టార్గెట్ లేకుండా వ్యాయామం చేయడం కంటే ఇలాంటి పోటీలను లక్ష్యంగా పెట్టుకుంటే ఆసక్తి పెరుగుతుంది. నిత్యం ఉదయం, సాయంత్రం శిక్షణ తీసుకుంటున్నాను.

విమర్శలు ఎదురొన్నా..

నేను జిమ్‌లోకి అడుగుపెట్టినపుడు చాలామంది విమర్శించారు. మహిళలకు ఇలాంటి పోటీలు అవసరమా అని ప్రశ్నిస్తున్నారు. వెయిట్ లిఫ్టింగ్‌తో గర్భసంచి దెబ్బతింటుందని, అధిక బరువు ఎత్తితే నడుమునొప్పి వస్తుందని నాకు, నా తల్లిదండ్రులకు చాలామంది చెప్పారు. వాటన్నింటినీ పట్టించుకోకుండా లక్ష్యం దిశగా పయనించాను. నన్ను చూసి చాలామంది మహిళలు జిమ్‌కు వచ్చి శిక్షణ తీసుకుంటున్నారు. మీపై మీకు నమ్మకం ఉంటే శ్రమ వృథా కాదు. కష్టానికి తగ్గ ఫలితం తప్పకుండా దక్కుతుందని చెప్పారు.

వధూవరులతో ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్, మంత్రి దురైమురుగన్ తదితరులు

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

ఉదయనిధి స్టాలిన్

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు జిల్లా కాట్పాడి నార్త్ జోన్ కార్యదర్శి జి.వన్నియరాజా-వేలూరు కార్పొరేషన్ జోనల్ కమిటీ అధ్యక్షురాలు పుష్పలత కుమార్తె విష్ణుప్రియకు, నవల్‌పూర్‌కి చెందిన సురేష్‌కుమార్‌తో బుధవారం కల్పుదూర్‌లో వివాహం జరిగింది. ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి స్టాలిన్ పాల్గొని వరుడికి తాళి అందించి వివాహాన్ని జరిపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... తన రాజకీయ జీవితానికి కాట్పాడి నియోజకవర్గమే పునాది వేసిందని తెలిపారు. మహిళలు చదువుకుని స్వతంత్రంగా ఉండాలని కలైజ్ఞర్ భావించారన్నారు. దానిని సాకారం చేసింది ముఖ్యమంత్రి స్టాలిన్ అన్నారు. మహిళలు చదువుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. మంత్రులు దురైమురుగన్, ఆర్.గాంధీ, ఎమ్మెల్యేలు జగద్రజగన్, కదిర్ ఆనంద్, ఎంపీలు నందకుమార్, దేవరాజ్ కార్తికేయన్, అమలు విజయన్, ఈశ్వరప్పన్, వీఐటీ ఉపాధ్యక్షుడు శంకర్ విశ్వనాథన్, నరువి ఆస్పత్రి ఛైర్మన్ సంపత్, కార్పొరేషన్ మేయర్ సుజాత, డిప్యూటీ మేయర్ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు బసిలికా చర్చి వేడుక ఆహ్వానపత్రిక

చెన్నై, న్యూస్‌టుడే: సెయింట్ థామస్ మౌంట్ బసిలికా చర్చి ఆహ్వానపత్రికను ముఖ్యమంత్రి స్టాలిన్‌కు అందించారు. జాతీయ బసిలికా చర్చిగా ఉన్న సెయింట్ థామస్ మౌంట్‌ను ప్రపంచ ప్రఖ్యాత బసిలికాగా పోప్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన వేడుక ఆహ్వానపత్రికను బుధవారం ముఖ్యమంత్రి స్టాలిన్‌కు బసిలికా ప్రతినిధి ఛార్లెస్, సెయింట్ థామస్ మౌంట్ ఆలయ ప్రధాన మైకేల్ తదితరులు అందించారు. వెంట తమిళనాడు టెక్స్ట్‌బుక్స్, ఎడ్యుకేషనల్ సర్వీసెస్ కార్పొరేషన్ ఛైర్మన్ దిండుగల్ ఐ.లియోని తదితరులు ఉన్నారు.

ఆహ్వానపత్రిక అందుకుంటున్న ముఖ్యమంత్రి స్టాలిన్

ఓఎంఆర్, షోళింగనల్లూర్‌లలో

తగ్గిన మెట్రోవాటర్ సరఫరా

విల్లివాక్కం, న్యూస్‌టుడే: రద్దీ సమయాల్లో నీటి ట్యాంకర్ రాకపోకలపై పోలీసుల ఆంక్షలు విధించిన తర్వాత మెట్రోవాటర్ సరఫరా 75 శాతం వరకు తగ్గింది. తద్వారా ఓఎంఆర్(ఓల్డ్ మహాబలిపురం రోడ్డు), షోళింగనల్లూర్ వాసులు నీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. పదేళ్ల బాలిక మృతి చెందిన తర్వాత ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 వరకు నగరంలోకి వాటర్ ట్యాంకర్లు సహా భారీ వాహనాలను పోలీసులు నిషేధించారు. రోజుకు 5 ట్రిప్పులు మాత్రమే సరఫరా అవుతున్నందున అవసరాలకు సరిపోవడంలేదు. దీంతో ఓఎంఆర్, షోళింగనల్లూర్ వాసులు పొరుగు జిల్లాలపై ఆధారపడ్డారు. భూగర్భ జలవనరులు లేకపోవడం, ఎన్ను చెల్లించినా సక్రమంగా సరఫరా కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అధికారులు తమ ప్రాంతంలో ఆంక్షలు తొలగించాలని కోరుతున్నారు. ఫెడరేషన్ ఆఫ్ ఓఎంఆర్ రెసిడెంట్స్ అసోసియేషన్ సహ వ్యవస్థాపకుడు హర్ష కోడా మాట్లాడుతూ.. కోర్ సిటీ నివాసితులు మెట్రోవాటర్ కోసం నెలకు రూ.150 చెల్లిస్తుండగా, ఓఎంఆర్, షోళింగనల్లూర్ వాసులు రూ.1,000 చెల్లిస్తున్నారని చెప్పారు. వాటర్ ట్యాంకర్ లారీల పరిమితి సమయాలను సవరించాలని పోలీసుశాఖను అభ్యర్థించినట్లు జలమండలి సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

డిసెంబరు ఆఖరులోపు గృహాల నిర్మాణం పూర్తి

సమీక్ష సమావేశంలో మంత్రి టీఎం అన్బరసన్, అధికారులు

వేళచ్చేరి, న్యూస్‌టుడే: చెన్నైలో రూ.1223.62 కోట్లతో చేపట్టిన 7,212 గృహాల పునర్నిర్మాణ పనులు డిసెంబరు ఆఖరులోపు పూర్తవుతాయని మంత్రి టీఎం అన్బరసన్ తెలిపారు. తమిళనాడు రీహాబిటాట్ అభివృద్ధి సంస్థ ప్రధాన కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ.. 40 ఏళ్ల కిందట నిర్మించి శిథిలస్థితికి చేరుకున్న ఇళ్లను తొలగించి వాటి స్థానంలో నిపుణుల కమిటీల సూచనల మేరకు కొత్తగా బహుళ అంతస్తులతో కూడిన గృహాలను నిర్మించే పనులు వేగవంతంగా సాగుతున్నాయని తెలిపారు. చెన్నై రాజాతోట, వేంబులి అమ్మవారి ఆలయం వీధి, సుబేదార్ గార్డెన్, డాక్టర్ థామస్ రోడ్డు, వన్నియపురం, శెట్టితోట, అప్పావునగర్, సుబ్బుపిళ్లై తోట, జామ తోట, పెరియపాళత్తు అమ్మవారి వీధి, కోటూర్‌పురం, ఎస్.ఎస్.నగర్, నాడాన్ తోట, చింతాద్రిపేట, గాంధీనగర్, గంగైకరై పురం, మదురై జిల్లా సుబ్రమణియపురం సహా 20 ప్రాంతాల్లో పనులు ఈ ఏడాది చివరినాటికి పూర్తవుతాయని అనంతరం లబ్ధిదారులకు అప్పగిస్తామని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు కాకర్ల ఉష, శ్రేయాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

అన్నామలైపై కేసు నమోదు

ప్యారిస్, న్యూస్‌టుడే: మురుగన్ భక్తుల మహానాడులో మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడిన భాజపా రాష్ట్ర మాజీ అధ్యక్షుడు అన్నామలై తదితరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. హిందూ మున్నని తరపున గత నెల 22న మదురైలో మురుగన్ భక్తుల మహానాడు జరిగింది. ఇందులో విద్వేషాన్ని సృష్టించేలా రాజకీయ ప్రసంగం ఉండకూడదని మద్రాసు హైకోర్టు మదురై ధర్మాసనం ఉత్తర్వులు ఇచ్చింది. కోర్టు ఆదేశాలను ఉల్లంఘించి మహానాడులో మత విద్వేషాలను రెచ్చగొట్టేలా మాట్లాడినట్లు న్యాయవాది వాంజినాథన్ ఫిర్యాదు చేశారు. మదురై అన్నానగర్ పోలీసులు అన్నామలై, హిందూ మున్నని రాష్ట్ర అధ్యక్షుడు కాడేశ్వర సుబ్రమణియం, నిర్వాహకుడు సెల్వకుమార్ తదితరులపై నాలుగు సెక్షన్ల కింద మంగళవారం కేసు నమోదు చేశారు.

సినీ నిర్మాతల మండలి, ఫెఫ్సీ మధ్య వివాదం

మధ్యవర్తిని నియమించిన హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: తమిళ సినీ నిర్మాతల మండలి, ఫిల్మ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆఫ్ సౌత్ ఇండియా(ఫెఫ్సీ) మధ్య వివాదాలు పరిష్కరించేలా విశ్రాంత న్యాయమూర్తి గోవిందరాజ్‌ను మధ్యవర్తిగా నియమిస్తూ మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది. ఫెఫ్సీకి వ్యతిరేకంగా తమిళ సినీ నిర్మాతల మండలి కొత్త సంఘాన్ని ఏర్పాటు చేసిందని ఫెఫ్సీ ఆరోపణలు చేస్తున్న నేపథ్యంలో తమిళ సినీ నిర్మాతల మండలి సభ్యులు తయారు చేసే సినిమాల్లో ఫెఫ్సీ సభ్యులు పనిచేయడం మానుకోవాలని, సహకరించకూడదని ఏప్రిల్ 2న ఉత్తరం రాసింది. సినిమా షూటింగ్, నిర్మాణ పనులు ప్రభావితం అవుతున్నాయని తమిళ సినీ నిర్మాతల మండలి మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేసింది. ఈ పిటిషన్‌ను న్యాయమూర్తి జస్టిస్ కుమరేశ్ బాబు జూన్ 30న విచారించారు. మధ్యవర్తిని ఎవరిని నియమించాలో ఇరు తరపుల చర్చించి నిర్ణయాన్ని తెలపాలని ఉత్తర్వులు ఇచ్చారు. ఈ నేపథ్యంలో పిటిషన్ బుధవారం విచారణకు వచ్చింది. విశ్రాంత న్యాయమూర్తి గోవిందరాజ్‌ను మధ్యవర్తిగా నియమించేందుకు రెండువైపులా ఆమోదం తెలిపారు.

రితన్య ఆత్మహత్య కేసు దర్యాప్తు సీబీఐకి మార్చాలి

కుటుంబీకుల వినతి

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రాజకీయ ఒత్తిళ్లు ఉన్నందున రితన్య ఆత్మహత్య కేసు దర్యాప్తు సీబీఐకి మార్చాలని కుటుంబీకులు కోరారు. తిరుప్పూర్ జిల్లా అవినాశీ కైక్కాట్టుపుదూర్ ప్రాంతానికి చెందిన కవిన్‌కుమార్, రితన్యకు మూడునెలల కిందట వివాహమైంది. అత్తింటి వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకుంటున్నట్లు ఇటీవల రితన్య వాట్సాప్‌లో తండ్రికి ఆడియో పంపి విషం తీసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి కవిన్‌కుమార్, అతని తండ్రి ఈశ్వరమూర్తి, తల్లి చిత్రాదేవిని అరెస్ట్ చేశారు. రితన్య తల్లిదండ్రులు మాట్లాడుతూ.. వివాహమైన 20రోజులకే అత్తింట్లో సమస్య తలెత్తి అర్ధరాత్రి తన కుమార్తె ఇంటికి వచ్చిందన్నారు. అప్పటి నుంచే ఆమె మనశ్శాంతి కోల్పోయిందన్నారు. పోస్ట్‌మార్టం వరకు పోలీసుల విచారణ సరిగానే సాగిందని, మృతదేహాన్ని తీసుకున్న తర్వాత చిత్రాదేవిని విడిచిపెట్టేశారన్నారు. తొలుత ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు అనంతరం ఆమెను వదిలేశారన్నారు. రాజకీయ ఒత్తిడి కారణంగా కేసు విచారణ పక్కన పెట్టేస్తున్నారన్నారు. సీఎం స్టాలిన్ జోక్యం చేసుకోవాలని, దర్యాప్తు సీబీఐకి మార్చాలని కోరారు.

రితన్య కుటుంబీకులను పరామర్శిస్తున్న మహిళా సంఘం నిర్వాహకులు

త్వరలో తిరుప్పూర్‌లో ఆందోళన..

ఆర్కేనగర్: రితన్య కుటుంబీకులను అఖిల భారత ప్రజాస్వామ్య మహిళా సంఘం రాష్ట్ర కార్యదర్శి రాధిక, నిర్వాహకులు బుధవారం పరామర్శించారు. అనంతరం రాధిక విలేకరులతో మాట్లాడుతూ.. ఈ కేసులో ఎలాంటి రాజకీయ జోక్యం ఉండకూడదన్నారు. రితన్యకు న్యాయం చేసేందుకు తిరుప్పూర్‌లో ఆందోళన చేస్తామన్నారు. కోవై, తిరుప్పూర్ ప్రాంతాల్లో వరకట్న వేధింపులు అధికంగా జరుగుతున్నాయని తెలిపారు. వెంటనే ప్రభుత్వం దృష్టి సారించాలన్నారు.

తాగునీటికి గ్రామస్థుల నిరసన

వేళచ్చేరి, న్యూస్‌టుడే: తాగునీటి కోసం గ్రామస్థులు నిరసన చేపట్టారు. కడలూర్ జిల్లా విరుధాచలం సమీప ఎరుమాణూర్ గ్రామంలో సుమారు 700 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇక్కడ 6 నెలలుగా ఉప్పునీరు సరఫరా అవుతుండటంతో ప్రజలు ఆ నీటిని ఇతర అవసరాలకు మాత్రమే వాడుకుంటున్నారు. తాగడానికి, వంటకు ఉపయోగించలేక అవస్థలు పడుతున్నారు. వారం రోజులుగా నీటి సరఫరా పూర్తిగా ఆగిపోవడంతో స్థానికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో బుధవారం విరుధాచలం- ముగాసాపడూర్ మార్గంలో ఖాళీ బిందెలతో బైఠాయించారు. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలీసులు సంబంధిత పంచాయతీ అధికారులతో ఫోన్‌లో మాట్లాడించడంతో శాంతించారు.

నిరసనలో పాల్గొన్న గ్రామ ప్రజలు

ఖైదీల నుంచి సెల్‌ఫోన్లు స్వాధీనం

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పుళల్‌లోని కేంద్ర కారాగారంలో ఖైదీలు కొందరు సెల్‌ఫోన్లు వినియోగిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఈ మేరకు జైలర్ శాంతకుమార్ నేతృత్వంలో వారు మంగళవారం రాత్రి జైల్లో తనిఖీ నిర్వహించారు. 9వ బ్లాక్‌లోని చెన్నైకి చెందిన రాధా, సంజయ్, కన్నదాసన్, మనోహర్, మదురైకి చెందిన కాళిముత్తు అనే ఖైదీలు సెల్‌ఫోన్లలో మాట్లాడుండడాన్ని పసిగట్టి స్వాధీనం చేసుకున్నారు. వారిపై పుళల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీవో కార్యాలయం ముట్టడి

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరులో వందలాది ఆటో వాలాలు ఉన్నారు. ఆ వాహనాలు ఎక్కడపడితే అక్కడ పార్కింగ్ చేస్తుండడంతో రాకపోకలకు అంతరాయం కలుగుతోంది. ఇష్టానుసారం పార్కింగ్ చేసిన 11 ఆటోలను పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఇందుకు నిరసనగా ఆటోవాలాలు బుధవారం ఆర్టీవో కార్యాలయాన్ని ముట్టడించారు. అధికారులు చర్చలు జరిపారు. 7 ఆటోలకు తలా రూ.500 జరిమానా విధించి వదిలేశారు. మిగతా 4 ఆటోలకు సరైన దస్త్రాలు లేకపోవడంతో విడిపించలేదు.

తమిళచ్చి తంగపాండియన్‌కు

సోదరుడి పుట్టినరోజు శుభాకాంక్షలు

సైదాపేట, న్యూస్‌టుడే: ఆర్థికశాఖ మంత్రి తంగం తెన్నరసు తన ఎక్స్ పేజీలో పాత ఫొటో ఒకటి షేర్ చేసి తన సోదరి, దక్షిణ చెన్నై నియోజకవర్గ ఎంపీ తమిళచ్చి తంగపాండియన్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. తల్లికి సమానమైన ప్రేమ, నాన్నలాంటి దయ చూపుతూ ముందుండి నడిపిస్తున్న సోదరికి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు పేర్కొన్నారు.

తంగం తెన్నరసు, తమిళచ్చి తంగపాండియన్ (పాతచిత్రం)

పినాకిని ఎక్స్‌ప్రెస్ సమయంలో మార్పు

విల్లివాక్కం, న్యూస్‌టుడే: చెన్నై డివిజన్‌లోని వివిధ విభాగాల్లో ఇంజినీరింగ్ పనులు సులభతరం చేయడానికి ఫిక్స్‌డ్ టైమ్ కారిడార్ బ్లాక్ చేస్తున్నారు. ఈ కారణంగా తాత్కాలికంగా చెన్నై సెంట్రల్-విజయవాడ పినాకిని ఎక్స్‌ప్రెస్ రైలు వేళలను మార్చారు. ఈనెల 3, 10, 17 తేదీల్లో మధ్యాహ్నం 2.05 గంటలకు చెన్నై సెంట్రల్ నుంచి బయలుదేరుతున్న పినాకిని సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (నెం.12712) గంటన్నర ఆలస్యంగా 3.35 గంటలకు బయలుదేరుతుందని బుధవారం దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

ముఖ్యమంత్రి స్టాలిన్‌ను అన్నా అరివాలయంలో ఎండీఎంకే ప్రధాన కార్యదర్శి వైగో మర్యాదపూర్వకంగా కలిసిన దృశ్యం
-న్యూస్‌టుడే, చెన్నై

అజిత్‌కుమార్ హత్య కేసులో ప్రజలను మోసం చేయలేరు

భాజపా ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: తిరుపువనం ఆలయ కాపలాదారుడు అజిత్‌కుమార్ హత్య కేసులో ప్రజలను మోసం చేయలేరని, నిజం మొత్తం బయటికి రావాలని భాజపా జాతీయ మహిళా విభాగ అధ్యక్షురాలు, కోయంబత్తూరు ఎమ్మెల్యే వానతి శ్రీనివాసన్ ప్రకటనలో కోరారు. అజిత్‌కుమార్‌పై దర్యాప్తునకు ఆదేశించిన అధికారి ఎవరో ప్రజలకు తెలియజేయాలన్నారు. డీఎంకే అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పోలీసులు చట్టప్రకారం కాక డీఎంకే కార్యనిర్వాహకుల ఆదేశాల మేరకు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తూనే ఉన్నాయన్నారు.

వధూవరులకు సారె ఇస్తున్న దృశ్యం

నాలుగు జంటలకు ఉచిత వివాహం

తిరుత్తణి, న్యూస్‌టుడే: రాష్ట్ర దేవాదాయ శాఖ తరపున తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో బుధవారం నాలుగు జంటలకు ఉచిత వివాహాలు జరిపించారు. ఆలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆలయ జాయింట్ కమిషనర్ రమణి, తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ పాల్గొన్నారు. వధూవరులకు నాలుగు గ్రాముల బంగారం, పట్టు వస్త్రాలతో పాటు రూ.30 వేల విలువ చేసే కుటుంబ సామగ్రి అందించారు. ఆలయం తరపున విందు ఏర్పాటు చేశారు.

యువతకు క్రీడా సామగ్రి పంపిణీ

శోళింగర్, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా శోళింగర్ యూనియన్‌కు చెందిన మేలేరి, అగవలం, కన్నత్తూర్, కావేరిపురం, ఈచందాంగల్, వెన్‌పాక్కం, పుదుపట్టు, బాలకృష్ణాపురం సహా 22 గ్రామాలకు చెందిన యువకులకు బుధవారం క్రీడా సామగ్రి అందించారు. వాంగూర్ పంచాయతీ అధ్యక్షురాలు హంసవేణి కిట్లను పంపిణీ చేశారు.

క్రీడా కిట్లతో యువకులు

ఇందిరా కళాశాలలో సంత

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు సమీప పాండూరులోని ఇందిరా కళాశాలలో విద్యార్థులకు ఆకుకూరల సాగుపై అవగాహన కల్పించేందుకు 'కళాశాల సంత' బుధవారం నిర్వహించారు. ఉద్యానశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన సంతను జిల్లా కలెక్టర్ ప్రతాప్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ....విద్యార్థులు తమ ఇంటి పెరట్లో కూరగాయలు సాగు చేస్తే ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని సూచించారు. ఇందుకు వ్యవసాయ డిపోల్లో అతి తక్కువ ధరతో విత్తనాలు అందజేస్తున్నామని తెలిపారు.

కూరగాయలు పరిశీలిస్తున్న కలెక్టర్ ప్రతాప్

ఆలయానికి పెంపుడు శునకంతో వచ్చిన భక్తుడు

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వర స్వామి ఆలయానికి ఆంధ్ర రాష్ట్రానికి చెందిన ఓ భక్తుడు తన పెంపుడు శునకంతో ఆలయం లోపలికి వెళ్లాడు. అతన్ని పోలీసులు, ఆలయ సిబ్బంది అడ్డుకోలేదు. ఆలయంలో స్వామి దర్శనం చేసుకుని అతను పెంపుడు శునకంతో 2వ ప్రాకారం ద్వారా వెలుపలికి వచ్చినప్పుడు మరో భక్తుడు అతన్ని ఫొటో తీసి సామాజిక మాధ్యమాల్లో ఉంచడంతో వైరల్ అయింది. ఇలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరారు.

ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఉపాధ్యాయులు

విజేతలకు బహుమతి ప్రదానం

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా అరక్కోణంలోని డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఎడ్యుకేషనల్ ట్రస్ట్ తరపున జూన్ 26న మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ఇంటర్నెట్ ద్వారా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు జరిగాయి. ప్రభుత్వ, ప్రభుత్వ సాయాన్ని పొందుతున్న ఏడు పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు చిత్రాలు వేశారు. విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందించే కార్యక్రమం బుధవారం స్థానిక ఆండ్రూస్ మహోన్నత పాఠశాల ఆవరణలో ట్రస్టు నిర్వాహకురాలు సుగంధి వినోదిని నేతృత్వంలో జరిగింది. ప్రధానోపాధ్యాయుడు సురేష్ సెల్వకుమార్, డాక్టర్ చర్చిల్, ఉపాధ్యాయులు అద్భుతరాజ్, సామిల్ పాల్గొన్నారు.

నిర్మాణాలను పరిశీలిస్తున్న రాణిపేట జిల్లా కలెక్టరు చంద్రకళ

గృహ నిర్మాణాల పరిశీలన

అరక్కోణం, న్యూస్‌టుడే: రాణిపేట జిల్లా అరక్కోణం పంచాయతీ యూనియన్‌లోని కోనలం గ్రామం వద్ద ప్రభుత్వ పోరంబోకు స్థలంలో ఇరులర్ ఎస్టీలు 76 మందికి ఒక్కోటి రూ.5.07 లక్షలతో ఇళ్లు నిర్మిస్తున్నారు. పనులను జిల్లా కలెక్టరు చంద్రకళ బుధవారం పరిశీలించారు. కార్యక్రమంలో జిల్లా పథకాల అమలు అధికారిణి జయసుధ, కార్యనిర్వాహక ఇంజినీరు సెంథిల్‌కుమార్, తహసీల్దారు వెంకటేశన్, కోనలం పంచాయతీ అధ్యక్షురాలు లక్ష్మి పాల్గొన్నారు.

(c) eenadu

ఎళిల్‌తో కాంబినేషన్‌కు పాతికేళ్లు పట్టింది: విద్యాసాగర్

ఆడియో ఆవిష్కరిస్తున్న దృశ్యం

చెన్నై, న్యూస్‌టుడే: ఎళిల్ దర్శకత్వంలో 2013లో విడుదలైన 'దేసింగు రాజా'కు 12 ఏళ్ల తర్వాత ప్రస్తుతం రెండో భాగం రూపొందింది. ఇన్ఫినిటీ క్రియేషన్స్ పతాకంపై పి.రవిచంద్రన్ నిర్మించిన ఈ చిత్రంలో విమల్, కొత్త నటుడు జనా ప్రధాన పాత్రల్లో నటించగా నాయికలుగా పూజిత పొన్నాడ, జూలి, హర్షిత నటించారు. 11న విడుదల కానున్న నేపథ్యంలో ఆడియో ఆవిష్కరణ నగరంలో నిర్వహించారు. సంగీత దర్శకుడు విద్యాసాగర్ మాట్లాడుతూ... దర్శకుడు ఎళిల్‌తో తన తొలిచిత్రం 'పూవెల్లం ఉన్ వాసం' కాగా తమ కాంబినేషన్‌కు మళ్లీ 25ఏళ్లు పట్టిందన్నారు. ఎళిల్ ట్రెండ్‌గా ఉన్న కుటుంబ నేపథ్యానికి భిన్నంగా ఈ చిత్రం యాక్షన్‌తో కనిపించిందని తెలిపారు. విజయకాంత్ స్థానాన్ని విమల్ భర్తీ చేయనున్నారని దర్శకుడు ఆర్వీ ఉదయకుమార్ చెప్పగా ఆయన కార్తిక్ రూట్‌లో పనిచేస్తున్నారని నటుడు శ్యామ్ తెలిపారు. ఇళయరాజా తర్వాత సంగీతాన్ని ఎక్కువగా ప్రేమించే వ్యక్తి విద్యాసాగర్ అని దర్శకుడు ఆర్కే సెల్వమణి చెప్పగా, తనను దర్శకుడిగా విద్యాసాగర్ మార్చారని పేరరసు తెలిపారు. కార్యక్రమంలో చిత్ర బృందం సభ్యులు, సినీ రంగానికి చెందిన కొందరు ప్రముఖులు పాల్గొన్నారు.

పరందు పోలో 19 పాటలు

సంతోష్ దయానిధి

సంతోష్ దయానిధి

చెన్నై, న్యూస్‌టుడే: రామ్ దర్శకత్వంలో మిర్చి శివ, అంజలి తదితరులు ప్రధాన పాత్రధారులుగా నటించిన 'పరందు పో' 4న విడుదల కానుంది. చిత్రంపై సంగీత దర్శకుడు సంతోష్ దయానిధి పలు విషయాలు పంచుకున్నారు. యువన్ శంకర్ రాజా బిజీగా ఉండటంతో తనకు ఇందులో పనిచేసే అవకాశం వచ్చిందన్నారు. 19 పాటలు ఉన్నాయని తెలిపారు. నేపథ్య సంగీతంలోనూ పలు పాటలను ఉపయోగించడం ఇదే తొలిసారి అన్నారు. కమర్షియల్ చిత్రమైనా ఇందులో దర్శకుడు రామ్ శైలి ఉందని తెలిపారు.

పూజా కార్యక్రమంలో సెల్వరాఘవన్ తదితరులు

డెన్నిస్ మంజునాథ్ కొత్త చిత్రానికి పూజ

చెన్నై, న్యూస్‌టుడే: డెన్నిస్ మంజునాథ్ దర్శకత్వంలో కొత్త చిత్రాన్ని బుధవారం సేలంలో పూజా కార్యక్రమంతో ప్రారంభించారు. వ్యోమ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మితమవుతుతోంది. ముఖ్యపాత్రల్లో దర్శకుడు సెల్వరాఘవన్ నటిస్తున్నారు. ఖుషీ రవి, వైజీ మహేంద్రన్, మైమ్ గోపీ, కౌశల్య, సతీశ్, సేలం దీపక్ తదితరులు ఇతర ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. చిత్రానికి ఏకే ప్రియన్ సంగీతం అందిస్తున్నారు.

సమావేశమైన సంఘం ప్రతినిధులు

తెలుగు రాష్ట్రాల తరహాలో అంబేడ్కర్‌కు భారీ విగ్రహం

● తమిళనాడు బౌద్ధుల సంఘం మహాసభ డిమాండ్

చెన్నై, న్యూస్‌టుడే: తెలుగు రాష్ట్రాల తరహాలో తమిళనాడులో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్‌కు భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తమిళనాడు బౌద్ధుల సంఘం మహాసభ కార్యవర్గ సమావేశం తీర్మానం చేసింది. ఈ మహాసభ రెండో రాష్ట్ర స్థాయి కార్యవర్గ సమావేశం పెరంబూరులోని దక్షిణ భారత బుద్ధ విహార్‌లో మంగళవారం జరిగింది. ఇందులో పలు తీర్మానాలు చేశారు. అంబేడ్కర్ బౌద్ధం స్వీకరించిన నాగపూర్‌కు పవిత్ర యాత్ర చేపట్టేందుకు 144 మంది బౌద్ధులకు రాయితీ, బుద్ధుడికి సంబంధించిన ప్రాంతాలకు పవిత్రయాత్ర చేపట్టేందుకు 50 మంది బౌద్ధులకు రూ.10 వేలు చొప్పున రాయితీ ఇవ్వాలని తీర్మానించారు. కాంచీపురంలో బౌద్ధ సాంస్కృతిక కేంద్రం, నాగపట్టినంలో బౌద్ధ మ్యూజియం ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించినందుకు ముఖ్యమంత్రి, ఆర్థిక, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రులకు కృతజ్ఞతలు తెలిపింది.

శిరస్త్రాణం ఆవశ్యకతపై ర్యాలీ

కాంచీపురం: కాంచీపురం కలెక్టరు కార్యాలయం ప్రాంగణంలో రీజనల్ ట్రాన్స్‌పోర్టు(ఆర్టీఓ) కార్యాలయం తరఫున శిరస్త్రాణధారణ ఆవశ్యకతపై బుధవారం అవగాహన ర్యాలీ జరిగింది. కలెక్టరు కలైసెల్వి జెండా ఊపి ద్విచక్ర ర్యాలీని ప్రారంభించారు. పోలీసులు, ద్విచక్ర వాహన చోదకులు పాల్గొని అవగాహన కల్పించారు. ఆర్టీఓ నాగరాజన్, పోలీసు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టరు కలైసెల్వి

ఘనంగా కుంభాభిషేకం

పొన్నేరి, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీప మీంజూరులోని ప్రసిద్ధ ఏకాంబరనాథుని ఆలయం శిథిలావస్థకు చేరింది. భక్తుల విరాళాలతో చేపట్టిన జీర్ణోద్ధరణ పనులు పూర్తవడంతో బుధవారం కుంభాభిషేకం నిర్వహించారు. పవిత్ర జలాలకు పూజలు నిర్వహించి గోపుర కలశాలపై అభిషేకించారు. భక్తులకు అన్నదానం చేశారు.

అలంకరణలో దేవతామూర్తులు

పొన్నేరి: తిరువళ్లూరు జిల్లా పొన్నేరి సమీప కావల్‌పట్టిలోని పురాతన గోమాతమ్మ ఆలయంలో బుధవారం శాస్త్రోక్తంగా కుంభాభిషేకం నిర్వహించారు. యాగగుండాలు ఏర్పాటు చేసి విశేష పూజలు జరిపారు. పవిత్ర జలాలకు పూజలు నిర్వహించి విమాన కలశాలపై అభిషేకించారు.

గోమాతమ్మ ఆలయం వద్ద భక్తుల సందడి

కనులపండువగా ఆరుద్ర దర్శనం

తిరువణ్ణామలై, న్యూస్‌టుడే: తిరువణ్ణామలై అరుణాచలేశ్వరాలయంలో ఆరుద్ర దర్శనం బుధవారం వైభవంగా జరిగింది. ఆలయంలో నటరాజ స్వామి, శివగామసుందరి అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణ, దీపారాధనలు నిర్వహించారు. శివగామసుందరి, నటరాజస్వామిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయ మాడ వీధుల్లో ఊరేగించారు.

ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

వైభవంగా వార్షికోత్సవం

సైదాపేట, న్యూస్‌టుడే: జార్జిటౌన్ వరద ముత్తి అప్ప వీధిలో శ్రీవెంకటేశ్వర సుప్రభాత గోష్ఠి నిర్వహణలోని శ్రీవెంకటేశ్వర మందిరంలో శ్రీవారి విగ్రహ ప్రతిష్ఠ 41వ వార్షికోత్సవానికి శుభారంభం పలికారు. శ్రీవారి విగ్రహాన్ని వివిధ రకాల పుష్పాలతో అలంకరించి ఆరాధనలు చేశారు. పరబ్రహ్మ స్వరూపమైన అన్నాన్ని శ్రీవారి ముందు రాశిగా పోసి పిండి వంటలతో సహా నైవేద్యం సమర్పించారు. భక్తులకు, పేదలకు అన్న ప్రసాదాలు పంచారు. వేడుకలలో భాగంగా ఉభయ వేదాంత వేలుకుడి రంగనాథన్ స్వామి దివ్య ప్రబంధం గురించి ఉపన్యసించారు. పరిసర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేడుకలు 12 వరకు జరగనున్నాయి.

అలంకరించిన శ్రీవారి విగ్రహం ఎదుట అన్నంరాశి, పిండి వంటలు

కూరగాయల వ్యాపారుల రాస్తారోకో

ట్రిప్లికేన్, న్యూస్‌టుడే: తిరుప్పత్తూరు మున్సిపల్ కమిషనర్ శాంతి బుధవారం ఉదయం వాణియంబాడి రోడ్డులో మార్కెట్‌కు బయట దుకాణాలు పెట్టి వ్యాపారం చేయకూడదని చెప్పారు. దుకాణాలు తొలగించాలని లేదంటే కూరగాయలు చెత్తలో పడేస్తామని మున్సిపల్ ఉద్యోగులు వ్యాపారులతో అన్నారు. ఈ నేపథ్యంలో తిరుప్పత్తూరు నుంచి వాణియంబాడి వెళ్లే రోడ్డులో వ్యాపారులు రాస్తారోకో చేపట్టారు. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నగర పోలీసులు అక్కడికి చేరుకుని వ్యాపారులతో చర్చలు జరపడంతో విరమించారు.

శిశువు మావిలో ప్లాస్టిక్ సూక్ష్మరేణువులు

పరిశోధనల్లో నిర్ధారణ

చెన్నై, న్యూస్‌టుడే: శిశువు మావి(ప్లాసెంటా)లో ప్లాస్టిక్ సూక్ష్మరేణువులు ఉండటాన్ని కోయంబత్తూరులోని పీఎస్‌జీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రిసెర్చ్ వైద్యపరిశోధకులు నిర్ధారించారు. పుట్టిన పిల్లల శరీరంలో ప్లాస్టిక్ సూక్ష్మరేణువుల జాడ కోసం వైద్య పరిశోధకుల బృందం మూడు నెలల కిందట పరిశోధనలు ప్రారంభించింది. పిల్లల రక్తం సేకరించకుండా పుట్టగానే వేరయ్యే మావిని సేకరించి అందులోని రక్తాన్ని పరిశోధించారు. ప్రాథమిక దశలోనే ప్లాస్టిక్ సూక్ష్మరేణువులను నిర్ధారించారు. మావి అనేది గర్భధారణ సమయంలో ఏర్పడే తాత్కాలిక అవయవం. ఇది గర్భంలో పెరుగుతున్న శిశువుకు ఆక్సిజన్, పోషకాలను అందిస్తుంది. వ్యర్థాలను తొలగిస్తుంది. పరిశోధన ఫలితాలతో గర్భిణులు ఆహారం తీసుకోవడంలో చాలా జాగ్రత్తగా ఉండాలని, బయటి ప్రదేశాలకు వెళ్లేటప్పుడు మాస్క్ ధరించాలని, సరైనపాళ్లలో పోషకాహారం తీసుకోవాలని పరిశోధకులు డాక్టర్ శివసెల్వకుమార్ హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్ బాటిళ్లలో నీటిని తాగకపోవడం శ్రేయస్కరమని తెలిపారు.

రైతుల రక్తంలో క్రిమిసంహారక మందుల ప్రభావం

కోయంబత్తూర్ వేడపట్టిలో 350 మంది రైతులను ఎంపిక చేసి వారి శరీరంలో క్రిమిసంహారక మందుల ప్రభావాన్ని గుర్తించేందుకు అధ్యయనం చేయగా ఆరు రకాల క్రిమిసంహారక మందుల ప్రభావం ఉన్నట్లు వెలుగుచూసింది. ఈ కారణంగా ఆ రైతుల్లో మధుమేహ ప్రభావం పెరిగిందని నిర్ధారించారు. క్రిమిసంహారక మందుల ప్రభావం రక్తంలో ఉండటంతో క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందనీ పరిశోధకులు హెచ్చరిస్తున్నారు.

పదవి కోల్పోయిన మున్సిపల్ ఛైర్‌పర్సన్

ఉమామహేశ్వరి

ప్యారిస్, న్యూస్‌టుడే: తెన్‌కాశి జిల్లా శంకరన్‌కోవిల్ మున్సిపల్ ఛైర్‌పర్సన్‌గా డీఎంకేకు చెందిన ఉమామహేశ్వరి ఉన్నారు. ఉమామహేశ్వరి వార్డుల్లో కనీస వసతులు కల్పించడంలేదని ఆమెపై అన్నాడీఎంకే కౌన్సిలర్లు, కొందరు డీఎంకే కౌన్సిలర్లు అసంతృప్తిలో ఉన్నారు. ఆమెపై అవిశ్వాస తీర్మానం తీసుకురావాలని మున్సిపల్ కమిషనరుకు 24 మంది కౌన్సిలర్లు వినతి ఇచ్చారు. బుధవారం అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ జరిగింది. 28 మంది అవిశ్వాస తీర్మానానికి మద్దతుగా ఓటు వేయడంతో ఉమామహేశ్వరి పదవి కోల్పోయారు.

పచ్చదనం పెంపునకు కృషి

విల్లివాక్కం, న్యూస్‌టుడే: దక్షిణ రైల్వే మహిళా సంక్షేమ సంస్థ(ఎస్ఆర్‌డబ్ల్యూడబ్ల్యూఓ), భారత వాణిజ్య మండలి, పరిశ్రమ, మహిళా సమాఖ్య(ఎఫ్ఐసీసీఐఎఫ్ఎల్ఓ) సహకారంతో బుధవారం నిర్వహించిన గ్రీన్ ఇనిషియేటివ్ కార్యక్రమంలో దక్షిణ రైల్వే ఉమన్స్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షురాలు సోనియా సింగ్ నేతృత్వంలో మొక్కలు నాటారు. పెరంబూరులో సంస్థ నిర్వహిస్తున్న ఆశ్రయ స్పెషల్ చిల్డ్రన్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు రేఖ కౌశల్, సభ్యులు పాల్గొని వివిధ రకాల మొక్కలు నాటారు.

డీఎంకేలో 2 కోట్ల మందిని చేర్చడమే లక్ష్యం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: మొత్తం ఓటర్లలో 30 శాతం మందిని డీఎంకేలో సభ్యులుగా చేర్చేందుకు లక్ష్యంగా నిర్ణయించామని పురపాలకశాఖ మంత్రి కేఎన్ నెహ్రూ తెలిపారు.

విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి కేఎన్ నెహ్రూ

తిరుచ్చి తిల్లైనగంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఓరణియిల్ తమిళనాడు అనే పథకాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారని తెలిపారు. నీట్ పరీక్ష మినహాయింపు, హిందీ భాష రుద్దడంపై కేంద్రం తమిళనాడును మోసం చేస్తోందన్నారు. ఇప్పటి వరకు కోటికి పైగా సభ్యులు ఉన్నారని దానిని రెండు కోట్లుగా మార్చాలని సీఎం తెలిపారన్నారు. టాస్మాక్‌లు దశలవారీగా తగ్గిస్తామని, ఇకపై తెరవబోమని కోర్టులో ప్రభుత్వం తరఫున తెలియజేశామన్నారు.

గోశాలలో అధిక రుసుములు

యజమానుల అసంతృప్తి

కొత్తగా నిర్మించిన పశువుల షెడ్ (పాతచిత్రం)

విల్లివాక్కం, న్యూస్‌టుడే: నగరంలో రోడ్లపై సంచరిస్తున్న పశువుల కోసం బేసిన్‌బ్రిడ్జి సమీపం మూలకొత్తలంలో రూ.1.30 కోట్లతో నిర్మించిన గోశాల ఇటీవల ప్రారంభమైంది. అద్దె మొత్తం అడ్వాన్స్‌గా ఇవ్వాలని నిర్వహణ సంస్థ డిమాండ్ చేస్తుండటంతో పశువుల యజమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్తు, నీటిని ఉపయోగించినందుకు అదనపు రుసుము చెల్లించాల్సి వస్తోందని యజమానులు ఆరోపిస్తున్నారు. నెలవారీ అద్దె వసూలు చేయకూడదని చెన్నై మహానగర కార్పొరేషన్(జీసీసీ)ని కోరుతున్నారు. చెన్నైలోని మొదటి పశువుల షెడ్ ఒకేసారి 250 పశువులను నిలిపేలా నిర్మించారు. పశు వైద్యుల గదులు, ఫార్మసీ, టాయ్‌లెట్‌లు, అనారోగ్య, గర్భిణి పశువులకు చికిత్స అందించడానికి ప్రత్యేక వార్డు లాంటి సౌకర్యాలు ఉన్నాయి. ప్రతి పశువుకు నెలకు రూ.10 వసూలు చేయాలని జీసీసీ నగరపాలక సంస్థ నిర్ణయించింది. కాల్నడై మున్నేట్ర సంఘం రూ.10 అదనంగా వసూలు చేస్తోందని పశువుల యజమానులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఒక పశువుకు నాలుగు నెలల ముందస్తు నిర్వహణ రుసుము చెల్లించమంటోందని చెబుతున్నారు. తమకు ఆదాయం అంతంత మాత్రమేనని, అంత మొత్తం చెల్లించలేమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఐఐటీఎం 'స్కూల్ కనెక్ట్'లో మరిన్ని ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులు

చెన్నై, న్యూస్‌టుడే: ఐఐటీ మద్రాస్ తన 'స్కూల్ కనెక్ట్' కార్యక్రమం ద్వారా అందించే ఆన్‌లైన్ హ్యాండ్స్-ఆన్ సర్టిఫికెట్ కోర్సుల సంఖ్యను విస్తరించింది. పాఠశాల విద్య, ఉన్నత విద్య అంతరాన్ని తగ్గించే లక్ష్యంతో ప్రధాన ఔట్‌రీచ్ కార్యక్రమంగా 'స్కూల్ కనెక్ట్'ను ఐఐటీ మద్రాస్‌లోని సెంటర్ ఫర్ ఔట్‌రీచ్ డిజిటల్ ఎడ్యుకేషన్ నిర్వహిస్తోంది. దీనిని పాఠశాల విద్యార్థులకు, ముఖ్యంగా పది, 11, 12వ తరగతి విద్యార్థులు కొత్త రంగాలను అన్వేషించడానికి, వారి భవిష్యత్ విద్య, ఉద్యోగ మార్గాలు గురించి మరింత సమాచారం కలిగిన నిర్ణయాలు తీసుకోవడానికి సమర్థవంతులను చేసే ఉద్దేశంతో నిర్వహిస్తోంది. విద్యా సంవత్సరంలో ఆగస్టు, అక్టోబరు, జనవరిలలో మూడు బ్యాచ్‌లుగా నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో 'డేటా సైన్స్ అండ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్', 'ఎలక్ట్రానిక్ సిస్టమ్స్' అనే రెండు కోర్సులను గతంలో అందించగా ప్రస్తుతం దానిని 10 ఆన్‌లైన్ హ్యాండ్స్-ఆన్ సర్టిఫికెట్ కోర్సులుగా విస్తరించారు. ఆ మేరకు ఇంట్రడక్షన్ టు డేటా సైన్స్ అండ్ ఏఐ, ఇంట్రడక్షన్ టు ఎలక్ట్రానిక్ సిస్టమ్స్, ఇంట్రడక్షన్ టు ఆర్కిటెక్చర్ అండ్ డిజైన్, ఫన్ విత్ మాథ్స్ అండ్ కంప్యూటింగ్, మాథ్స్ అన్‌ప్లగ్డ్: గేమ్స్ అండ్ పజిల్స్, ఇంట్రడక్షన్ టు ఇంజినీరింగ్ బయోలాజికల్ సిస్టమ్స్, ఇంట్రడక్షన్ టు లా, ది ఫండమెంటల్స్ ఆఫ్ ఏరోస్పేస్, హ్యుమానిటీస్ అన్‌ప్లగ్డ్ కోర్సులను అందిస్తున్నారు. ఇవి 8 వారాల వ్యవధి గలవి. ఈ ఏడాది ఆగస్టు బ్యాచ్ కోసం రిజిస్ట్రేషన్ ఇప్పటికే ప్రారంభించగా చివరి తేది ఈనెల 25. ఈ కార్యక్రమం కోసం పాఠశాలలు, విద్యార్థులు code.iitm.ac.in/schoolconnect/ అనే వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోవచ్చని ఐఐటీఎం ప్రకటనలో తెలిపింది.

విద్యార్థిని ఆత్మహత్య

ప్యారిస్, న్యూస్‌టుడే: హాస్టల్ ప్రాంగణంలో తొమ్మిదో తరగతి విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడిన ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. శివగంగై జిల్లా ఇళైయాన్‌కుడికి చెందిన ఫ్రాన్సిస్ కుమార్తె బృంద(14) ఆండిచ్చియూరణి గ్రామంలోని విద్యార్థినుల వసతిగృహంలో ఉంటూ పక్కనే ఉన్న బాలికల హయ్యర్ సెకండరీ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. సోమవారం రాత్రి విద్యార్థినులు నిద్రపోయారు. మంగళవారం ఉదయం హాస్టల్ ప్రాంగణంలోని వేపచెట్టుకు దుప్పటితో ఉరి వేసుకుని బృంద కనిపించింది. సమాచారం అందిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విద్యార్థిని చెట్టు పైకి ఎక్కి ఎలా ఉరి వేసుకుంటుందని తల్లిదండ్రులు, బంధువులు ఆస్పత్రి వద్ద ఆందోళన చేపట్టారు. వారితో పోలీసులు చర్చించారు. కేసు నమోదు చేసుకొన్న పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

లారీ ఢీకొని బాలుడి దుర్మరణం

ఆర్కేనగర్, న్యూస్‌టుడే: రోడ్డు ప్రమాదంలో బాలుడు మృత్యువాతపడ్డాడు. తిరువారూర్ జిల్లా మన్నార్‌కుడికి చెందిన శివగణేష్ కుమారుడు అమరేష్(13) ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్నాడు. బుధవారం ఉదయం అమరేష్‌ను శివగణేష్ ద్విచక్ర వాహనంలో పాఠశాలకు తీసుకెళ్లాడు. రుక్మిణికులం రోడ్డులో వస్తుండగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొనడంతో ఇద్దరు ఎగిరిపడ్డారు. అమరేష్‌పై లారీ ఎక్కడంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. తీవ్రంగా గాయపడిన శివగణేష్‌ను చికిత్స కోసం ఆస్పత్రికి తరలించారు.

ఇద్దరు పిల్లల్ని హత్య చేసి తండ్రి ఆత్మహత్య

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పుళల్ సమీప కదిర్‌వేడు బ్రిటానియానగర్‌కు చెందిన సెల్వరాజ్(57) లారీ ట్రాన్స్‌పోర్ట్ బుకింగ్ సెంటర్ నిర్వహించాడు. భార్య మాలా, కుమారులు సుమన్‌రాజ్(15), గోకుల్‌రాజ్(13), కుమార్తె ఇదయా ఉన్నారు. సుమన్‌రాజ్ పది, గోకుల్‌రాజ్ తొమ్మిదో తరగతి చదువుతున్నారు. సెల్వరాజ్ తన కుమారులు ఇద్దరితో ఓ గదిలో, మాలా, ఇదయా మరో గదిలో మంగళవారం రాత్రి నిద్రించారు. బుధవారం ఉదయం ఎంతసేపటికి సెల్వరాజ్ నిద్రించిన గది తలుపులు తీయకపోవడంతో అనుమానంతో మాలా కిటికీ ద్వారా చూడగా భర్త, ఇద్దరు కుమారులు విగతజీవులుగా పడి ఉండడాన్ని గమనించి పుళల్ పోలీసులకు సమాచారం అందించింది. మృతదేహాలను పోస్టుమార్టానికి తరలించారు. సెల్వరాజ్ తన కుమారులకు విషం ఇచ్చి చంపి తాను బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఇందుకు కారణాలు తెలియరాలేదు.

సెల్వరాజ్, సుమన్‌రాజ్, గోకుల్‌రాజ్(పాతచిత్రాలు)

ఫోన్ ట్యాపింగ్ గోప్యత హక్కును ఉల్లంఘించడమే

మద్రాసు హైకోర్టు

ప్యారిస్, న్యూస్‌టుడే: ఓ వ్యక్తి ఫోన్ సంభాషణలను ట్యాప్ చేయడం గోప్యత హక్కును ఉల్లంఘించడమే అని మద్రాసు హైకోర్టు తెలిపింది. నేరాలను గుర్తించేందుకు ఒకరి ఫోన్ సంభాషణలు, సమాచారాన్ని ట్యాప్ చేయడానికి వీల్లేదని పేర్కొంది. చెన్నైకి చెందిన కిషోర్ అనే వ్యక్తిపై సీబీఐ కేసు నమోదు చేసిన నేపథ్యంలో అతని ఫోన్ సంభాషణలు, సమాచారాన్ని ట్యాప్ చేసేందుకు అధికారం ఇస్తూ కేంద్ర హోంమంత్రిత్వ శాఖ 2011లో ఉత్తర్వులు ఇచ్చింది. ఈ ఉత్తర్వులు రద్దు చేయాలని కిషోర్ మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ న్యాయమూర్తి జస్టిస్ ఆనంద్ వెంకటేశ్ ఎదుట బుధవారం విచారణకు వచ్చింది. చట్టప్రకారం సమర్థించనంతవరకు ఓ వ్యక్తి ఫోన్ సంభాషణలు ట్యాప్ చేయడం గోప్యత హక్కుని ఉల్లంఘించడమే అని న్యాయమూర్తి తెలిపారు. నేర కార్యకలాపాలను గుర్తించడానికి రహస్యంగా ట్యాప్ చేయడం అనుమతించదగినది కాదని తెలిపి హోంమంత్రిత్వశాఖ ఉత్తర్వులను రద్దు చేశారు. ప్రజా భద్రతా, ప్రజా అత్యవసర పరిస్థితుల కారణంగా మాత్రమే వ్యక్తుల ఫోన్ సంభాషణలు ట్యాప్ చేయవచ్చన్నారు. దేశ సార్వభౌమత్వం, ఐక్యత, భద్రత, విదేశాలతో స్నేహపూర్వక సంబంధాలు, ప్రజా శాంతి, నేరాలను అడ్డుకోవడంలాంటి విషయాల్లో మాత్రమే ఫోన్ సంభాషణలు ట్యాప్ చేయడానికి అనుమతి ఉందన్నారు. ఈ కేసులో ప్రజా భద్రత, ప్రజా ఎమర్జెన్సీ లాంటి వాటితో సంబంధం లేదని తెలిపారు.

రౌడీపై ఏడోసారి గూండాచట్టం

కాంచీపురం, న్యూస్‌టుడే: కాంచీపురం పొయ్యాకులం ప్రాంతానికి చెందిన త్యాగు రౌడీ. కంబోడియాలో ఆత్మహత్య చేసుకున్న తన గురువైన కాంచీపురం తిరుపరుత్తికుండ్రంకు చెందిన శ్రీధర్ తర్వాత కాంచీపురంలో వ్యాపారులను బెదిరించి లక్షల్లో డబ్బులు వసూలు చేస్తూ వచ్చాడు. ఇతనిపై 12 హత్య, 23 హత్య బెదిరింపు కేసులు సహా 80 కేసులు ఉన్నాయి. జైల్లోనే ఉంటూనే బయట ఉన్న సహచరులతో ప్రముఖుల హత్యకు కుట్ర పన్నేవాడు. విళుపురం డీఎంకే పట్టణ కార్యదర్శి సెల్వరాజ్, కాంచీపురం డీఎండీకే నిర్వాహకుడు శరవణన్ హత్య కేసుల్లో త్యాగు ప్రధాన నిందితుడు. ఇప్పటి వరకు ఆరుసార్లు గూండా చట్టం కింద అరెస్టై శిక్ష అనుభవించాడు. ఈ ఏడాది మార్చిలో కాంచీపురానికి చెందిన రౌడీ రాజా హత్య కేసులో అరెస్టై జైలులో ఉంటున్నాడు. త్యాగుపై గూండాచట్టం ప్రయోగించాలని జిల్లా ఎస్పీ కె.షణ్ముగం కలెక్టరు కలైసెల్వికి సిఫార్సు చేశారు. ఆ మేరకు త్యాగును ఏడోసారి గూండా చట్టం కింద అరెస్టు చేస్తూ కలెక్టరు మంగళవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు.

సారా విక్రయం కేసులో మహిళపై..

సెల్వి

వేళచ్చేరి: మైలాడుదురై జిల్లా వైదీశ్వరన్ కోవిల్ పోలీసు రేంజి మేలచ్చాలై ప్రాంతానికి చెందిన సెల్వి గతనెల 10న సెల్వి తన ఇంటి సమీపంలో ప్రభుత్వ అనుమతి లేకుండా సారా విక్రయించింది. ఎక్సైజ్, ప్రొహిబిషన్ పోలీసులు సెల్విని అరెస్టు చేసి 150 లీటర్ల పాండిచ్చేరి సారాను స్వాధీనం చేసుకున్నారు. కోర్టులో హాజరు పరచి రిమాండుకు తరలించారు. ఆమెపై ఇప్పటికే కేసులు ఉండడంతో గూండాచట్టం కింద అరెస్టు చేయాలని ఎస్పీ స్టాలిన్ కలెక్టరుకు సిఫార్సు చేశారు. ఆ మేరకు కలెక్టరు శ్రీకాంత్... సెల్విని గూండా చట్టం కింద అరెస్టు చేస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

నిషేధిత పొగాకు ఉత్పత్తులు స్వాధీనం

విల్లివాక్కం: నిషేధిత పొగాకు ఉత్పత్తులను ధర్మపురి పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కారిమంగళం పోలీసు ఇన్‌స్పెక్టర్ పార్తిబన్ నేతృత్వంలో ఎస్సైలు సుందరమూర్తి, ఆనందకుమార్, సిబ్బంది మంగళవారం సాయంత్రం వాహన తనిఖీ చేపట్టారు. ఆపకుండా వెళ్లిన మూడు లగ్జరీ కార్లను వెంబడించారు. కొంచెం దూరం వెళ్లిన తర్వాత కార్లను నిలిపి డ్రైవర్లు పరారయ్యారు. పోలీసులు తనిఖీ చేసి రూ.7 లక్షల విలువైన 3 టన్నుల నిషేధిత పొగాకు ఉత్పత్తులను స్వాధీనం చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ బోల్తా: రైతు మృతి

సుధాకర్ (పాతచిత్రం)

వేలూరు, న్యూస్‌టుడే: వేలూరు జిల్లా గుడియాత్తం సమీపం కీళ్‌కొల్లపల్లికి చెందిన సుధాకర్(45) రైతు. బుధవారం ఉదయం పొలానికి ట్రాక్టర్‌లో రాళ్లు ఎక్కించుకుని వెళుతుండగా అదుపుతప్పి బోల్తాపడింది. తీవ్రగాయాలకు గురైన సుధాకర్‌ను స్థానికులు గుడియాత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ...

విల్లివాక్కం: నామక్కల్ జిల్లా పరమత్తివేలూర్ సిందునగర్‌కు చెందిన కుప్పుసామి(60) రహదారుల శాఖలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి పదవీ విరమణ చేశారు. ఈయన భార్య తమిళరసి(54). దంపతులిద్దరు మంగళవారం ద్విచక్ర వాహనంలో కరూర్‌లోని బంధువు ఇంటికి వెళ్లి తిరిగి పరమత్తివేలూర్ వైపు వస్తున్నారు. దళవాపాలయం ప్రాంతంలోని ఓ ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో వెనుక కరూర్ నుంచి వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొంది. తమిళరసి అక్కడికక్కడే మృతి చెందారు. గాయపడిన కుప్పుసామిని వేలాయుధంపాళయం ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఠాణాలో మహిళా ప్రత్యేక ఎస్ఐ..

విల్లివాక్కం: నామక్కల్ జిల్లా పేవలకురిచ్చి పోలీసుస్టేషన్‌లో మహిళా ప్రత్యేక ఎస్ఐ కామాక్షి మృతి చెందింది. గుండెపోటుతో మృతి చెందినట్లు చెబుతున్నారు. పని భారమే కారణమని ఆమె సహోదరి ఇన్‌స్పెక్టర్‌పై ఫిర్యాదు చేశారు. అందుకు సంబంధించిన వీడియో కలకలం సృష్టించింది. తన అక్కకు కడుపులో గడ్డ ఉన్నందున రక్తస్రావమైందని, సెలవు అడిగితే కావాలనే నైట్ డ్యూటీకి రప్పించారని పేర్కొన్నారు. పోలీసుస్టేషన్‌లోనే ప్రాణాలు కోల్పోయిందని, ఆస్పత్రికి తీసుకెళ్లి ఉంటే రక్షించేవారని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసుస్టేషన్‌లో ప్రథమ చికిత్స సౌకర్యం కూడా లేదని కన్నీరుమున్నీరయ్యారు.

నవవధువు ఆత్మహత్య కేసులో భర్త, అత్త అరెస్టు

రెడ్‌హిల్స్, న్యూస్‌టుడే: తిరువళ్లూరు జిల్లా పొన్నేరి ముస్లింనగర్‌కు చెందిన లోకేశ్వరి(24)కి కాట్టూరునకు చెందిన పన్నీరుతో జూన్ 27న వివాహం జరిగింది. కట్నంగా 5 సవర్ల బంగారు నగలు ఇస్తామని చెప్పిన యువతి తల్లిదండ్రులు 4 సవర్లు ఇచ్చారు. మిగిలిన నగలు తీసుకురావాలని భర్త, అత్త మామలు వేధించడంతో లోకేశ్వరి సోమవారం రాత్రి పడకగదిలో ఫ్యానుకు ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. ఆత్మహత్యకు ప్రేరేపించినట్లు తేలడంతో పన్నీరు, అత్త పూంగోదైను బుధవారం అరెస్టు చేశారు.

హత్య కేసులో నిందితులు..


మునియన్ (పాతచిత్రం)

సేలం, న్యూస్‌టుడే: వ్యక్తి హత్య కేసులో నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. వాళప్పాడి సమీపంలోని అత్తనూర్‌పట్టి పుదూర్ గ్రామానికి చెందిన రైతు మునియన్(46) నాలుగు నెలల క్రితం అదృశ్యమయ్యాడు. కుటుంబీకులు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు రంగంలోకి దిగి విచారణ చేపట్టారు. మునియన్‌ను అతని బావమరిది వెంకటాచలం హత మార్చి ఉంటాడని కుటుంబీకులు అనుమానం వ్యక్తం చేశారు. ఆ మేరకు పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించగా నేరాన్ని అంగీకరించాడు. ఆస్తి కోసం తన స్నేహితుడు శేఖర్‌తో కలిసి హత్య చేసినట్లు తెలిపాడు. శ్మశానవాటిక సమీపంలోని ముళ్లపొదల్లో మృతదేహాన్ని పడేసినట్లు చెప్పడంతో పోలీసులు అక్కడికెళ్లి స్వాధీనం చేసుకున్నారు. వెంకటాచలం స్నేహితుడు శేఖర్‌ను అరెస్టు చేశారు. మంగళవారం సాయంత్రం కోర్టులో హాజరు పరిచి రిమాండుకు తరలించారు.

వెంకటాచలం, శేఖర్‌ను జైలుకు తరలిస్తున్న పోలీసులు

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Ph: 044-28232390
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 97910 83205, 97910 74993

(c) eenadu

స్వర్ణ కుప్పం.. సాకారమే లక్ష్యం

● సొంత నియోజకవర్గ పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు

"ఏడాది పాలనలో..

● కుప్పం అభివృద్ధికి రూ.1,293 కోట్లు మంజూరు చేసి.. రూ.123 కోట్ల విలువైన పనుల్ని పూర్తి చేశాం.

● పారిశ్రామిక ప్రగతిలో భాగంగా రూ.1,645 కోట్ల పెట్టుబడులకు శంకుస్థాపనలు చేశాం.

● శ్రీశైలం నుంచి 'హంద్రీ- నీవా కాలువ సాకారానికి రూ.3,895 కోట్లు ఖర్చు చేశాం.

● 2026లోపు పెండింగ్ పనులన్నింటినీ పూర్తి చేస్తాం."

ఈనాడు- చిత్తూరు; న్యూస్‌టుడే, శాంతిపురం, కుప్పం పట్టణం, గ్రామీణ: స్వర్ణ కుప్పం సాకారమే లక్ష్యంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. రెండు రోజుల కుప్పం నియోజకవర్గ పర్యటనలో భాగంగా.. బుధవారం శాంతిపురం మండలం తుమ్మిశి ఏపీ మోడల్ స్కూల్ వద్ద ఏర్పాటు చేసిన ప్రజావేదిక బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. కుప్పం ప్రజలు అందిస్తున్న ఆశీస్సులతోనే నవ్యాంధ్రకు రెండో దఫా సేవలు చేసే అవకాశం కలిగిందని తెలిపారు. కుప్పం అభివృద్ధి బాధ్యత నాది.. సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత మీదే.. అని స్పష్టం చేశారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కలెక్టర్ సుమిత్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజావేదిక కార్యక్రమంలో ప్రసంగిస్తున్న సీఎం చంద్రబాబు నాయుడు

పాడి రైతుకు ప్రాధాన్యం

నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో రోజుకు పది లక్షల లీటర్ల పాల ఉత్పత్తి లక్ష్యంగా పాడి పరిశ్రమ అభివృద్ధికి ప్రాధాన్యమిస్తామని ముఖ్యమంత్రి వెల్లడించారు.

కరవుకు శాశ్వత పరిష్కారం

కుప్పానికి ఈ ఏడాదిలోనే హంద్రీ- నీవా జలాలు తెచ్చి నీటి కరవుకు శాశ్వత పరిష్కారం చూపుతామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు.

ఇంటింటా సౌరభం

ప్రతి ఇంటా సౌర విద్యుత్తు ఏర్పాటుకు ప్రజలు సహకరించాలని చంద్రబాబు కోరారు. నియోజకవర్గంలో ప్రతి ఇంటా సోలార్ పవర్ సాకారానికి రూ.564 కోట్లు ఖర్చు చేస్తామన్నారు.

వైద్యసేవల మెరుగుకు..

కుప్పం ప్రాంతంలో వైద్య సేవలు మెరుగుపరచేందుకు రూ.5 కోట్లతో నెర్వ్ సెంటర్‌ను నెలకొల్పనున్నట్లు చంద్రబాబు తెలిపారు. ఈ పైలెట్ ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామన్నారు.

లోటుపాట్లు ఉంటే సరిదిద్దుకోవాలి

తెదేపా నాయకులు, కార్యకర్తలు రాష్ట్రంలోని ఇళ్లకు వెళ్లి ఏడాది పరిపాలన గురించి వివరించాలని చంద్రబాబు సూచించారు. ప్రజలు ఏమైనా లోటుపాట్లు చెబితే సరిదిద్దుకోవాలన్నారు. త్వరలోనే నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. చదువుకున్న వారికి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ఒక ఇంట్లో తల్లికి వందనం కింద రూ.1.05 లక్షలు పడ్డాయని చెప్పారు.

స్వచ్ఛ కుప్పం ఒప్పంద పత్రాలతో ఐటీసీ ప్రతినిధులు

ఆత్మీయంగా పలకరించి.. అభివృద్ధిని వివరించి..

'నమస్కారం అమ్మా.. బాగున్నారా? పిల్లలు ఏం చదువుతున్నారు? ఈ ఏడాదిలో ప్రభుత్వ పరిపాలన ఎలా ఉంది? ఇంకా మీకు ఏమైనా చేయాలా? నేనూ ఈ ప్రాంతంలోనే ఇల్లు కట్టుకున్నా. ఎప్పుడు వచ్చినా ఇక్కడే ఉంటా' అంటూ బుధవారం రాత్రి తెదేపా కుటుంబ సాధికార సారథి సభ్యుడి హోదాలో చంద్రబాబు తిమ్మరాజుపల్లెలోని 49వ పోలింగ్ బూత్ పరిధిలోని 26 కుటుంబాలను కలుసుకున్నారు. 'సార్ మా ఇంటికి మీరు రావడం ఎంతో ఆనందంగా ఉంది. మీరు చల్లగా ఉండాలి. మేడమ్ (నారా భువనేశ్వరి) బాగున్నారా? లోకేశ్, బ్రాహ్మణి ఎలా ఉన్నారు? మా కుప్పం దేవుడు సార్ మీరు. మీ హయాంలో నియోజకవర్గం ఎంతో అభివృద్ధి చెందింది' అని అందరూ హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు అందరితో కుటుంబ పెద్దలా మాట్లాడారు. రాత్రి 11 గంటల వరకు ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు.

చిన్నారిని పలకరిస్తున్న సీఎం

మీరు జైలులో ఉన్నన్ని రోజులు ఒక్క పూటే అన్నం తిన్నా

సల్లాపురి అనే వ్యక్తి గృహానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వెళ్లారు. ఇప్పటికీ తాము ఉమ్మడిగానే 19 మంది కలిసి ఉంటున్నామని ఆయన చెప్పారు. అయితే మీతో మాట్లాడాల్సింది ఎంతో ఉందని చెప్పారు. తెలుగుదేశం ప్రభుత్వం గతంలో విదేశీ విద్యకు రూ.10 లక్షల సాయమందించిందని దాంతో తాను అమెరికాలో చదువుకుని ఉద్యోగం చేస్తున్నానని సల్లాపురి కుమారుడు బాలసుబ్రహ్మణ్యం ఆనందం వ్యక్తం చేశారు. ఆ పథకం కారణంగా మా జీవితాలు మారిపోయాయన్నారు. 'మీరు జైలులో ఉన్నన్ని రోజులు.. మూడు పూటలకు బదులు ఒక్క పూటే అన్నం తిన్నా. బయటకు వచ్చి ముఖ్యమంత్రి అయితే తిరుపతి లోనే ఉంటానని వేంకటేశ్వరుడిని మొక్కుకున్నా' అని సల్లాపురి చంద్రబాబుకు వివరించారు.

సల్లాపురి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి

గుట్టకో.. కబ్జా గుట్టు

ప్రభుత్వ భూమిలో నిర్మాణం

● రామచంద్రాపురంలో ఐదేళ్లూ కొనసాగిన ఆక్రమణలు

● నేటికీ పట్టించుకోని రెవెన్యూ అధికారులు

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: మండలంలో ప్రభుత్వ భూముల ఆక్రమణలకు ఎంతకూ అడ్డుకట్ట పడటం లేదు. ఐదేళ్లూ యథేచ్ఛగా సాగిన కబ్జాలు ఇప్పటికీ కొనసాగుతున్నాయి. రామాపురంలో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములను కబ్జా చేసి ప్లాట్లుగా విభజించి విక్రయించారు. సర్వే నంబరు 28లో ఐదెకరాల భూమిని కబ్జా చేయడమే కాకుండా లేఅవుట్ వేసి అమాయక ప్రజలకు అంటగడుతున్నారు. రోడ్డువైపు ఇప్పటికే వాణిజ్య సముదాయం నిర్మించి విక్రయించేశారు. తహసీల్దార్ల బదిలీల నేపథ్యంలో ఇప్పటికే ఆక్రమించిన భూముల్లో రాత్రికి రాత్రే కట్టడాలు వెలుస్తున్నాయి. ఈ దందాలో 20 శాతం రెవెన్యూ, 30 శాతం ప్రతిపక్షం, 50 శాతం అధికారపక్షం దండుకుంటోందనే ఆరోపణలున్నాయి. ప్రధానంగా నెన్నూరు సమీపంలోని జూబ్లీహిల్స్ పక్కన, కొత్తకండ్రిగ, మిట్టకండ్రిగ పంచాయతీల మధ్యలోని గుండోడు కణంగుట్ట, రాయలచెరువుపేట, గణేష్‌పురం ప్రాంతాల్లోని గుట్టలపై కబ్జాకోరులు పట్టు బిగించారు. భారీ యంత్రాలు ఉపయోగించి గ్రావెల్ తరలించడం, ఆపై చదును చేసి దర్జాగా కబ్జా చేస్తున్నా అధికారులు నోరు మెదపడం లేదు.

పరిశీలించి చర్యలు చేపడతాం

గతంలోనే ప్లాట్లు వేసి విక్రయించారన్న ఆరోపణలు ఉన్నాయి. క్షేత్రస్థాయిలో పరిశీలించి జిల్లా స్థాయి అధికారుల ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటాం.

- అన్వర్ బాషా, ఉపతహసీల్దారు

గరుడుడిపై కల్యాణ వెంకన్న సాక్షాత్కారం

సాక్షాత్కార వైభవోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామివారు గరుడ వాహనంపై తిరువీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉత్సవాల నేపథ్యంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊయల సేవ నిర్వహించారు. గురువారం మెట్టు మార్గంలోని మండపం వద్ద పార్వేట ఉత్సవం జరగనుంది. - న్యూస్‌టుడే, చంద్రగిరి

భవితకు బంగారు బాట

● ప్రత్యేక అవసరాలు గల పిల్లలకు బాసట

● కూటమి ప్రభుత్వ చొరవ

ప్రత్యేక అవసరాలున్న చిన్నారులను భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు ఉమ్మడి చిత్తూరు జిల్లాలో నిర్వహించిన సర్వే ఇటీవల ముగిసింది. సహిత విద్య ఉపాధ్యాయులు పలు కారణాలతో చదువుకు దూరంగా ఉంటున్న చిన్నారుల ఇళ్ల వద్దకు వెళ్లి వివరాలు సేకరించారు. ఇలా ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 563 మందిని గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడి కొందరిని ఇప్పటికే భవిత కేంద్రాల్లో చేర్పించడం గమనార్హం.

- న్యూస్‌టుడే, పుత్తూరు

జిల్లాలో భవిత కేంద్రాలు: **34**

విద్యనభ్యసించే ప్రత్యేక అవసరాల విద్యార్థులు: **3,658 మంది**

సహిత ఉపాధ్యాయులు: **66 మంది**

స్పెషల్ ఎడ్యుకేటర్లు: **42 మంది**

సర్వేలో కొత్తగా గుర్తించిన చిన్నారులు: **349 మంది**

పుత్తూరులో ప్రత్యేక అవసరాలున్న పిల్లల్ని గుర్తిస్తున్న సిబ్బంది (పాత చిత్రం)

ఫిజియోథెరపీ సేవలతో..

భవిత కేంద్రంలో పిల్లలకు వారంలో ఒక రోజు ఉచితంగా ఫిజియోథెరపీ సేవలు అందించనున్నారు. అవసరమైన వారికి వినికిడి యంత్రాలు, వీల్‌ఛైర్లు, మూడు చక్రాల సైకిళ్లు, బ్రెయిలీ కిట్లు ఇవ్వనున్నారు. ప్రతి విద్యార్థికి ఆట వస్తువులు అందజేస్తారు. పాఠశాలకు నడచి రాలేని వారికి 1 నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులకు తల్లిదండ్రులకు సాయంతో పాఠశాలలకు తీసుకెళ్లేందుకు నెలకు రూ.300, బడికి రాలేని స్థితిలో ఉన్న వారికి ఇంటి వద్ద విద్య అలవెన్స్ కింద నెలకు రూ.200, దృష్టి లోపం విద్యార్థులకు నెలకు రూ.300 చొప్పున చెల్లిస్తారు.

ఆటపాటలతో బోధన..

ప్రత్యేక అవసరాల చిన్నారులకు సహిత విద్య ఉపాధ్యాయులు పుస్తకాలతో పాటు విద్య ఉపకరణాలతో పాఠాలు చెబుతారు. అందరి మాదిరిలా కాకుండా వారికి అర్థమయ్యేలా బోధిస్తూ రోజూ చిన్నారులు భవిత కేంద్రానికి వచ్చేలా చూస్తారు.

అవగాహనా లోపం..

భవిత కేంద్రాల్లో చిన్నారులకు ప్రభుత్వం పలు సదుపాయాలు కల్పిస్తోంది. చాలామంది తల్లిదండ్రుల్లో అవగాహన లేక భవిత కేంద్రాల్లో చేర్పించలేకపోతున్నారు. గత నెల 13 నుంచి ఈ నెల తొమ్మిదో తేదీ వరకు జిల్లా సహిత విద్య సమన్వయకర్తల పర్యవేక్షణలో సర్వే చేపట్టారు. 18 ఏళ్ల లోపు వయసున్న ప్రత్యేక అవసరాల చిన్నారులను భవిత కేంద్రాల్లో చేర్పించేందుకు సిద్ధం చేస్తున్నారు.

స్వర్ణ నారావారిపల్లె ప్రణాళికలు సిద్ధం చేయాలి

అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్, చిత్రంలో డీపీవో సుశీలాదేవి

తిరుపతి (కలెక్టరేట్), న్యూస్‌టుడే: స్వర్ణ నారావారిపల్లె-2029 అభివృద్ధి పనులకు త్వరగా ప్రణాళికలు సిద్ధం చేయాలని.. గ్రామాల్లో ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం స్వర్ణ నారావారిపల్లె కార్యక్రమాలపై ఆయన సమీక్షించారు. అన్నిశాఖల నుంచి త్వరగా అనుమతులు పొంది పనులు పూర్తి చేయాలన్నారు. స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలు మంజూరు చేయించాలని, రిటైల్ అవుట్‌లెట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, వ్యవసాయ రంగానికి సంబంధించి కిచెన్, టెర్రస్ గార్డెనింగ్‌పై ప్రత్యేక శిక్షణ ఇవ్వాలన్నారు. వరిపొలాల్లో ద్రవ జీవామృతం దాదాపు వెయ్యి ఎకరాల్లో పిచికారి చేయాలని, రైతులకు పీఎండీఎస్ కిట్లు అందించాలని అధికారులను ఆదేశించారు. డీపీవో సుశీలాదేవి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా.. పుష్పయాగం

శ్రీగోవిందరాజ స్వామివారి ఆలయంలో బుధవారం పుష్పయాగ మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం స్నపన తిరుమంజనం, మధ్యాహ్నం 1-4 గంటల మధ్య పుష్పయాగ మహోత్సవం కనుల పండుగగా చేపట్టారు. ఇందుకు మూడు టన్నుల పుష్పాలు వినియోగించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లు ఆలయ మాడవీధుల్లో విహరించి భక్తులను అనుగ్రహించారు. - న్యూస్‌టుడే, తిరుపతి (తితిదే)

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల, న్యూస్‌టుడే: ఎలాంటి టోకెన్లు లేని భక్తులకు పది గంటల్లో, రూ.300 టికెట్లు కలిగిన భక్తులకు మూడు గంటల్లో శ్రీవారి దర్శనం లభించనుంది. మంగళవారం శ్రీవారిని 76,126 మంది దర్శించుకోగా రూ.3.97 కోట్ల హుండీ కానుకలు లభించాయి.

● ఆర్టీసీ పరిసరాల్లో ప్రైవేటు ట్రావెల్స్ దందా

● ప్రతి నెలా రూ.లక్షల్లో ఆదాయానికి గండి

తిరుపతిలోని ఆర్టీసీ కేంద్రీయ బస్‌స్టేషన్ పరిసరాలు ప్రైవేట్ ట్రావెల్స్ దందాకు వేదికగా మారాయి. ప్రభుత్వ నిబంధనలు ఇక్కడ కాగితాలకే పరిమితమయ్యాయి. ఫలితంగా శ్రీవారి భక్తులు, సాధారణ ప్రయాణికులు పెద్దఎత్తున దోపిడీకి గురవుతున్నారు. ట్రాఫిక్ ఇబ్బందులతోపాటు ఆర్టీసీ నష్టపోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. - న్యూస్‌టుడే,తిరుపతి (ఆర్టీసీ)

తిరుపతి నుంచి బస్సుల రాకపోకలు ఇలా..

మార్గం	ఆర్టీసీ	ప్రైవేట్
హైదరాబాద్	7	58
విజయవాడ	98	42
బెంగళూరు	72	11
చెన్నై	67	8

ఏ బిడ్డా.. ఇదీ మా అడ్డా

బస్టాండ్‌లోకి బస్సులు ప్రవేశించే మార్గానికి ఎదురుగా నిలిపిన ప్రైవేట్ బస్సులు

ఆర్టీసీ, రవాణా శాఖల నిబంధనల మేరకు ప్రైవేట్ బస్సులను ఆర్టీసీ బస్‌స్టేషన్‌కు రెండు కి.మీ. పరిధిలో నిలపడానికి, ప్రయాణికులను ఎక్కించుకోవడానికి లేదు. కానీ తిరుపతిలో ప్రాంగణానికి ఇరువైపులా పెద్దఎత్తున వాహనాలు ఆపుతున్నారు. సమీపంలోనే అనధికార బస్టాప్‌లు ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడి నుంచి 24 గంటలూ ఏ సమయంలోనైనా వాహనాలు అందుబాటులో ఉంచుతూ ఆర్టీసీ ఆదాయానికి పెద్దఎత్తున గండికొట్టేలా తమ కార్యకలాపాలు సాగిస్తున్నారు. విద్యుత్తు కాంతులు, టీవీ, ఏసీలతో ప్రయాణికులను ఆకర్షిస్తున్నారు. పగలు విశాఖపట్నం, విజయవాడ, బెంగళూరు, చెన్నై వైపు.. సాయంత్రం హైదరాబాద్ వైపు బస్సులు నడుపుతున్నారు. సోమ, మంగళ, బుధ, గురు వారాల్లో ఆర్టీసీ కంటే తక్కువ ఛార్జీలతో నడుపుతూ శుక్ర, శని, ఆదివారాల్లో మూడింతలు వసూలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఈవీలు అందుబాటులోకి రావడంతో ప్రయాణ ఛార్జీల్లో తరచూ ఆర్టీసీ కంటే తక్కువ వసూలు చేస్తున్నారు.

సమన్వయంతో చర్యలు తీసుకుంటాం.. ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులపై ఇదివరకు జిల్లా ప్రజారవాణాధికారితో కలిసి ఎస్పీకి ఫిర్యాదు చేశాం. ఆయన సానుకూలంగా స్పందించి చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసు, రవాణా శాఖాధికారుల సమన్వయ సహకారంతో ముందుకెళ్తాం.

- విశ్వనాథ్, ఆర్టీసీ జిల్లా డిప్యూటీ సీటీఎం

చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవు: ఎస్పీ

ఎస్పీ హర్షవర్ధన్‌రాజు

తిరుపతి (నేరవిభాగం): చట్టాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఎస్పీ హర్షవర్ధన్‌రాజు హెచ్చరించారు. జూన్ మాసం నేర గణాంకాలను ఆయన బుధవారం వెల్లడించారు. 'రాత్రివేళ రోడ్లపై తిరుగుతున్న 1,837 మంది అనుమానిత వ్యక్తులకు కౌన్సెలింగ్ ఇచ్చాం. 18 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నాం. 314 మంది రౌడీషీటర్లు, బహిరంగంగా మద్యం తాగుతున్న 1,687 మందికి అవగాహన కల్పించాం. మద్యం తాగే పది ప్రాంతాలు గుర్తించి శుభ్రంచేశాం. 313 వాహనాలకు అనధికారిక స్టిక్కర్లు తొలగించాం. స్టాప్ అండ్ వాష్ కార్యక్రమం ద్వారా 5,549 వాహనాలు తనిఖీ చేసి డ్రైవర్లను అప్రమత్తం చేశాం. 98 మంది ఇంటి యజమానులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించాం. 297 వాహనాలపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు, 1,696 మంది చిరువ్యాపారులపై న్యూసెన్స్ ఎంవీ నిబంధనలు పాటించని 14,899 వాహనాలపై కేసులు నమోదు చేశాం. 2,128 సమస్యాత్మక ప్రాంతాల ప్రజలతో ముఖాముఖి నిర్వహించాం. 94 డ్రోన్ ఆపరేషన్లు చేపట్టాం. పార్కుల వద్ద 15,217 మంది వృద్ధులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నాం. 465 హోమ్ స్టేలు తనిఖీ చేశాం. కార్డెన్‌సెర్చ్‌తో 178 వాహనాలు సీజ్ చేశాం' అని ఎస్పీ వివరించారు.

అధిక శబ్దం చేసే వాహనాలా..?

● 80999 99977 నంబర్‌కు వాట్సప్ చేయండి

తిరుపతి(నేరవిభాగం): ప్రజలు, వాహనదారులను భయపెట్టేలా అధిక శబ్దాలు చేసే వాహనాలు కన్పిస్తే ఫొటో తీసి పోలీస్ వాట్సప్ నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ హర్షవర్ధన్ రాజు పేర్కొన్నారు. జిల్లాలో నిషేధిత హారన్లపై పోలీసులు నిఘా పెట్టారని తెలిపారు. కార్లు, ద్విచక్ర వాహనాలు, బస్సులు, లారీలు, భారీ వాహనాలు, ట్రాక్టర్లకు అధిక శబ్దం చేసే హారన్లు ఉంటే వెంటనే తొలగిస్తామన్నారు. అలాంటి వాహనాలు కన్పిస్తే నంబరు కనిపించేలా ఫొటో తీసి పోలీస్ వాట్సప్ నంబరు 80999 99977కు షేర్ చేయాలన్నారు.

తవ్వారు.. చెరువుల్లా మార్చారు

ఈనాడు ఈటీవీ ఆంధ్రప్రదేశ్ పరిశీలన

ఊనుగుంటపాలెం వద్ద ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ తవ్వకాలతో ఇలా

గూడూరు గ్రామీణం, న్యూస్‌టుడే: అక్రమ గ్రావెల్ తవ్వకాలకు కోట మండలం ఊనుగుంటపాలెం చిరునామాగా మారింది. వైకాపా పాలనలో ఐదేళ్లు ప్రభుత్వ అసైన్‌మెంట్ భూముల్లో అక్రమంగా గ్రావెల్ తవ్వి తరలించగా నేడూ యథేచ్ఛగా కొనసాగుతోంది. ఆరేళ్ల తవ్వకాలతో ఇక్కడ భూములు ప్రస్తుతం భారీ గుంతలతో ప్రమాదకరంగా, చెరువుల్లా మారాయి. భూముల ఆనవాళ్లు కనిపించడం లేదు. నాటిన జామాయిల్ చెట్ల అంచుల్లోనూ తవ్వుతున్నారు. సాగరమాల పేరుతో పట్టా భూములతో పాటుగా అసైన్‌మెంట్, ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు ఆరేళ్లుగా అనుమతులు లేకుండా కొనసాగుతున్నాయి. భూములు సాగుకు పనికి రావని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాగరమాల పేరుతో ఓ వైపు అక్రమంగా గ్రావెల్ తరలిస్తుండగా.. ఇదే అదనుగా కొందరు నేతలు ప్రభుత్వ అసైన్‌మెంట్ భూముల్లో తవ్వకాలు చేపట్టారు. ఇది వారికి వ్యాపారంగా సాగుతోంది. కొందరు రైతుల వద్ద అసైన్‌మెంట్ భూములు కొనుగోలు చేసి గ్రావెల్ తవ్వుతున్నారు. వీటికి గనులు, రెవెన్యూ, పోలీసు శాఖల అనుమతులు ఎక్కడా లేవు. కేవలం రాజకీయ పలుకుబడితో అక్రమ తంతు కొనసాగుతోంది.

● ఇదే తరహాలో గూడూరు నియోజకవర్గంలో గాంధీనగర్, కాండ్ర, చిల్లకూరు మండలంలోని కలవకొండ, వాకాడు మండలంలోని కొండాపురం, చిట్టమూరు మండలంలో గ్రావెల్ అక్రమ తరలింపులు సాగుతున్నాయి. రాత్రీపగలు తేడా లేకుండా టిప్పర్లు రోడ్లపై కనిపిస్తున్నాయి.

● గనుల శాఖ ఏడీ శ్రీనివాసరావును వివరణ కోరగా.. గ్రావెల్ అక్రమ తవ్వకాలపై పరిశీలించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సాగరమాల వారితో చర్చిస్తామన్నారు.

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక

మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు ఈనాడులో ప్రకటనల ద్వారా తెలియజేయండి

లీగల్ ప్రకటనలు | ఈనాడు క్లాసిఫైడ్స్ | వేడుక ఏదైనా.. ఈనాడు ను చేసుకోండి వేదిక | జన్మదిన శుభాకాంక్షలు | పదవీ విరమణ శుభాకాంక్షలు | అంత్యక్రియలు, వర్ధంతి, జయంతి | ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి

జి.ఎస్.టి. 5% అదనం

ప్రకటనల కొరకు సంప్రదించండి : 80085 13290

గోవిందరాజస్వామి సన్నిధిలో అర్ధరాత్రి అగ్ని ప్రమాదం

తిరుపతి(తితిదే), న్యూస్‌టుడే: నగరంలోని శ్రీగోవిందరాజస్వామివారి ఆలయ రాజగోపురం ముందు భాగంలో బుధవారం అర్ధరాత్రి అనంతరం అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఓ దుకాణంలో ప్రమాదవశాత్తూ మంటలు వ్యాపించాయి. దీంతో ఒక్కసారిగా దట్టమైన పొగలు పరిసరాల చుట్టూ అలుముకున్నాయి. మంటలు పైనున్న చలువ పందిళ్ల వరకు వ్యాపించడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కాసేపటికి మంటలు అదుపులోకి తెచ్చారు. ప్రమాదానికి గల పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

దొంగ చేతికి తాళాలిచ్చినట్లు..!

● అవినీతి అధికారికే లెక్కలు అప్పజెప్పే యత్నం

● పోలీసు పహారా నడుమ ఉపాధి పనులపై విచారణ

అవినీతిపై విచారిస్తున్న ఏపీడీ సరిత, ఎంపీడీవో మాలతి

కేవీబీ పురం, న్యూస్‌టుడే: మండలంలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అవినీతిపై జిల్లా అధికారులు పోలీసుల పహారా నడుమ బుధవారం విచారణ చేపట్టారు. 'ఉపాధి.. అక్రమాల నిధి', 'పనులొకరివి.. పథకం మరొకరిది' శీర్షికలతో 'ఈనాడు'లో కథనాలు ప్రచురితం కావడంతో జిల్లా అధికారులు స్పందించారు. శ్రీకాళహస్తి ఏపీడీ సరిత, ఎంపీడీవో మాలతి, ఏపీవో భాస్కరయ్య నేతృత్వంలో కోటమంగాపురం, దిగువపుత్తూరు పంచాయతీల్లో జరిగిన తప్పిదాలపై విచారణ చేపట్టారు. గ్రామంలో లేనివారు, చనిపోయిన వారి వివరాలను స్థానిక ఉపాధి కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఎస్‌ఐ నరేష్, హెడ్‌కానిస్టేబుల్ బసవయ్య పర్యవేక్షణలో విచారణ ప్రారంభించారు.

వైకాపాతో అంటకాగిన వ్యక్తికే మళ్లీ..

ఎగువపూడి సమీపంలోని అటవీ ప్రాంతంలోని పాలగుంట వద్ద కందకాల తవ్వకాలకు వర్క్ ఐడీ 0210023014 డబ్ల్యూసీ19185020052130 కింద పనుల అంచనా విలువ రూ.9.81 లక్షలను అధికారులు మంజూరు చేశారు. ఈ పనిని మే5 నుంచి జూన్ 22 వరకు రూ.4.86 లక్షలు ఖర్చు చేసి, ఎన్ఎంఎంఎస్ ద్వారా నకిలీ ఉపాధి కూలీల చిత్రాలతో క్షేత్రసహాయకుడు బంధువుల పేర్లతో స్వాహా చేశారని స్థానికులు ఫిర్యాదు చేశారు. మూడు నెలల్లో పనులు చేపట్టకుండానే మోసం చేసిన, వైకాపాకు అంటకాగిన అధికారికే బాధ్యత అప్పగించడంపై దొంగకే తాళాలిస్తున్నారనే విమర్శలు గుప్పుమంటున్నాయి. విచారణ నివేదిక పీడీకి పంపి చర్యలు తీసుకుంటామని ఏపీడీ సరిత తెలిపారు.

జలపాతంలో మునిగి యువకుడి దుర్మరణం

సాహిల్ (పాతచిత్రం)

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: తలకోన జలపాతం వద్ద నీటిలో దిగి యువకుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. మదనపల్లెకు చెందిన సాహిల్ (20) తన ఆరుగురు మిత్రులతో కలసి తలకోన సందర్శనకు వచ్చాడు. బుధవారం మధ్యాహ్నం జలపాతం వద్ద సరదాగా అందరూ కలసి ఈత కొట్టారు. లోతు ఉండదనే అభిప్రాయంతో ఈత రాని సాహిల్ నీటిలో దిగడంతో ప్రవాహం ధాటికి బండరాళ్లలో ఇరుక్కుపోయి మృతి చెందినట్లు ఎస్సై బాలకృష్ణ తెలిపారు. మృతదేహం వెలికితీయడానికి సమయం పడుతుందన్నారు. స్థానికంగా పర్యాటక శాఖ మనిషికి రూ.30 చొప్పున వసూలు చేస్తున్నా ఎలాంటి రక్షణ చర్యలు తీసుకోవడం లేదని, కనీసం అందుబాటులో ఉండటం లేదని, హెచ్చరిక బోర్డులు సైతం లేవని పలువురు ఆరోపించారు.

104FM Tirupati — 104 Mee FM

ఈఎఫ్ఎమ్ కార్యక్రమాలు

సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm

For Advertising on Eenadu FM Contact 8008555167, 9000180635

(c) eenadu

శ్రీవారిని దర్శించుకున్న ప్రముఖులు

తిరుమల, న్యూస్‌టుడే: శ్రీవారిని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తితిదే బోర్డు సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు బుధవారం దర్శించుకున్నారు. ఉదయం వీఐపీ బ్రేక్‌లో శ్రీవారి ఆలయం వద్దకు చేరుకున్న వారికి తితిదే అధికారులు స్వాగతం పలికి శ్రీవారి మూలమూర్తి దర్శనం చేయించారు. అనంతరం రంగనాయకుల మండపంలో వేదాశీర్వచనం అందించగా తితిదే అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆలయం ఎదుట ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తితిదే బోర్డు సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి దంపతులు

ముగిసిన డీఎస్సీ పరీక్షలు.. 30,952 మంది హాజరు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: రాష్ట్రంలో ఉపాధ్యాయ ఖాళీల భర్తీ నిమిత్తం నిర్వహించిన డీఎస్సీ పరీక్షలు ముగిశాయి. గతనెల ఆరో తేదీ నుంచి బుధవారం వరకు జిల్లాలోని ఎనిమిది కేంద్రాల్లో ఆన్‌లైన్ పద్ధతిలో పరీక్షలు నిర్వహించారు. మొత్తం 33,181 మంది దరఖాస్తు చేయగా 30,952 మంది హాజరయ్యారు. 2,229 మంది గైర్హాజరయ్యారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పరీక్షలు నిర్వహించినట్లు డీఈవో కేవీఎన్ కుమార్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

పీపీ, ఏపీపీల నియామకం

రామకృష్ణ ◆ బాలాజీ

చిత్తూరు (న్యాయవిభాగం), న్యూస్‌టుడే: చిత్తూరులోని ప్రధాన జిల్లా సెషన్స్ కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ)గా వి.ఆర్.రామకృష్ణ నియమితులయ్యారు. స్థానిక ఆరో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ)గా ఎం.బాలాజీని నియమించారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడేళ్ల పాటు వీరు ఈ పదవుల్లో కొనసాగనున్నారు. వీరి నియామకంపై పలువురు న్యాయవాదులు హర్షం వ్యక్తం చేశారు. తనను నియమించిన సీఎం చంద్రబాబు, కూటమి నాయకులకు పీపీ రామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ ప్రవేశాల గడువు పొడిగింపు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: ఇంటర్ విద్యాశాఖ ఆదేశానుసారం జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాల గడువును జులై 31వ తేదీ వరకు పొడిగించినట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి జి.రాజశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

కడప ఆర్ అండ్ బీ ఇన్‌ఛార్జి ఎస్‌ఈగా తిరుపతి ఈఈ

తిరుపతి(రెవెన్యూ), న్యూస్‌టుడే: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ కడప సర్కిల్ ఇన్‌ఛార్జి ఎస్‌ఈగా తిరుపతి ఈఈ డి.మధుసూదన్ రావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆశాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీచేశారు.

జనసేన జిల్లా అధ్యక్ష పదవికి పోటాపోటీ

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తిరుపతి జిల్లా జనసేన అధ్యక్ష పదవిపై ఆశావహులు తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఇప్పటివరకు ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన అధ్యక్షుడిగా ఉన్న డా. పసుపులేటి హరిప్రసాద్‌కు రాష్ట్రస్థాయిలో హస్తకళల ఛైర్మన్ పదవి దక్కడంతో జిల్లా అధ్యక్ష పదవి కోసం పలువురు పోటీపడుతున్నట్లు చెబుతున్నారు. రెండు జిల్లాలకు వేర్వేరుగా అధ్యక్షులను నియమించే ఆలోచనలో పార్టీ అధిష్ఠానం ఉన్నట్లు సమాచారం. తిరుపతి జిల్లా అధ్యక్ష పదవిపై స్థానిక ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆసక్తి చూపుతున్నట్లు తెలుస్తోంది. కిరణ్ రాయల్, శ్రీకాళహస్తికి చెందిన వినుత సైతం పోటీలో ఉన్నట్లు సమాచారం. స్థానిక ఎన్నికలు రానున్న నేపథ్యంలో పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సామాజిక సమీకరణలను ఎంపిక చేయడంపై దృష్టి సారించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

10న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశాలు

తొలిసారి ప్రైవేటు విద్యాసంస్థల్లోనూ నిర్వహణ

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే లక్ష్యంతో ఈనెల 10వ తేదీన మెగా పేరెంట్, టీచర్ మీటింగ్ (పీటీఎం) మీటింగ్ జరగనుంది. ఇందుకు సంబంధించి జిల్లాలోని 2,289 పాఠశాలల్లో కార్యక్రమం నిర్వహించడానికి జిల్లా విద్యాశాఖ సమాయత్తమవుతోంది. పరిసరాల శుభ్రత, తరగతి గదిలో అనువైన సౌకర్యాల నిమిత్తం విద్యార్థుల సంఖ్య ఆధారంగా నిధులు మంజూరు చేసే అంశం చర్చకు రానుంది. ఇందుకు సంబంధించి ఇప్పటికే విద్యార్థుల సంఖ్య ఆధారంగా 50% నిధులు విడుదల చేశారు. 20 శాతం మొత్తాన్ని మెగా పీటీఎం కోసం వినియోగించనున్నారు. విద్యార్థుల చదువు, ప్రగతిపై తల్లిదండ్రులకు ప్రోగ్రెస్ కార్డులు అందించనున్నారు. తొలిసారిగా విద్యాశాఖ ఆదేశానుసారం ప్రైవేటు పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లోనూ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

ఫ్లోబస్.. సాంకేతికత అదుర్స్

❖ విద్యార్థుల చెంతకు ఏఐ పాఠాలు ❖ ఏపీలో మొదటిసారిగా మహిళా వర్సిటీలో ప్రారంభం

ఫ్లోబస్

తిరుపతి(మహిళా వర్సిటీ), న్యూస్‌టుడే: 'ఎవడబ్బ సొత్తు కాదురా ట్యాలెంటు'.. అన్న మాటలను నిజం చేశాడా కుర్రాడు. చిన్న నాటి నుంచి తాను అందిపుచ్చుకోలేని సాంకేతికతను నేటితరానికి పరిచయం చేస్తూ సరికొత్త ఆవిష్కరణకు శ్రీకారం చుట్టాడు. కళాశాలల్లో సరైనా ప్రయోగశాలల్లేక తాను పడిన కష్టం మరెవ్వరికీ ఎదురవ్వకూడదని బస్సులోనే ల్యాబ్ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రి, ప్రముఖుల ప్రశంసలు అందుకున్నాడు. మూడేళ్ల శ్రమకోర్చి దేశంలో ఎక్కడా లేని విధంగా మొదటి సారి ఫ్లో (ఫ్యూచర్ ల్యాబ్ ఆన్ వీల్స్) బస్సులో ల్యాబ్‌ను ఆవిష్కరించాడు. అతడే పశ్చిమగోదావరి జిల్లా పాలకోడేరు మండలం శృంగవృక్షానికి చెందిన క్రొవ్విడి మధులాష్‌బాబు. ఆ ఆవిష్కరణ గురించి తెలుసుకుందాం రండి.

● ఆలోచనతో మెరిసి..

మధుకు చిన్నప్పటి నుంచి సాంకేతిక పరిజ్ఞానంపై మక్కువ ఎక్కువ. తండ్రి లారీ డ్రైవర్ కావడంతో ఇంటర్ వరకు ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే చదివాడు. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు కళాశాలలో బీటెక్‌లో ఎలక్ట్రానిక్స్ కోర్సు తీసుకుని వినూత్నంగా రాణించాలనుకున్నాడు. కానీ కళాశాలలో సరైన ప్రయోగశాలలు, పరికరాల్లేక ఆశించిన స్థాయిలో విద్యాబోధన లేదని మదనపడ్డాడు. తాను పడిన కష్టం మరెవరికీ కలగకూడదని వినూత్న ఆలోచనకు శ్రీకారం చుట్టాడు. సాంకేతిక పరికరాలతో కూడిన బస్సును రూపొందించాలనుకున్నాడు. అది ఖర్చు తో కూడుకున్న పనైనా విశ్రమించలేదు. తన ఆలోచనలతో ఇన్వెస్టర్లను ఆకర్షించాడు.

16రకాల పరిజ్ఞానాలు..

బస్సులోపల విద్యుత్తు సరఫరా కోసం బస్సుపై 2కే సోలార్ ప్యానల్, త్రీడీ ప్రింటింగ్‌తో బొమ్మలు, అంతరిక్షంలో అడుగుపెట్టినట్లు అనుభూతిని కలిగించే ప్లానెటోరియం, డ్రోన్‌లు, రోబోటిక్స్ తయారీ, సైబర్ సెక్యూరిటీ, బ్లాక్‌చెయిన్ టెక్నాలజీ, ఐవోటీ, వర్చువల్, ఆగ్మెంటెడ్ రియాలిటీ, ఏఐ వంటి పదహారు రకాల టెక్నాలజీలను ఇక్కడ నేర్పిస్తారు. విద్యార్థులు తమకు నచ్చిన విభాగంలో డీఐవై కిట్ల సాయంతో సొంతంగా ప్రయోగాలు చేయొచ్చు. బస్సులో ఉన్న మెంటార్లు సాయం అందిస్తారు.

బస్సు లోపల ఏర్పాటు చేసిన సాంకేతిక పరికరాలు

● దేశంలోనే మొదటిది..

తన ఆలోచనను వివరిస్తూ శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలోని టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేషన్ సెంటర్(టీబీఐ)కు దరఖాస్తు చేసుకోగా.. వారు దాన్ని పరిశీలించి స్టార్టప్ ఇండియా సీడ్ ఫండ్ కింద రూ.25 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేసింది. ఇదే కాకుండా అమెరికాకు చెందిన జార్జ్ మాసన్ యూనివర్సిటీ నుంచి రూ.80 లక్షల నిధులొచ్చాయి. ఈ ఏడాది జూన్‌లో హైదరాబాద్‌లో 'ఎడోధ్వజ' అనే పేరుతో తన స్నేహితులతో కలిసి ఒక సంస్థ ఏర్పాటు చేశాడు. ఈ నిధులతో దేశంలోనే తొలి సంచార ఫ్యూచరిస్టిక్ ల్యాబ్ ఆన్ వీల్స్ (ఫ్లో) బస్సును రూపొందించాడు.

మేమే వస్తాం



ఇప్పటి వరకు తెలంగాణలో 40వేల విద్యార్థులకు బస్సులో ఉన్న పరికరాలు, పనితీరు, ప్రయోగాలకు ఎలా వినియోగించుకోవాలో చూపించాం. మొదటి సారిగా మహిళా వర్సిటీలో ప్రారంభించాం. విద్యార్థుల చెంతకు మేమే వచ్చి సందేహాలు నివృత్తి చేస్తాం. ఆసక్తి ఉన్న యాజమాన్యాలు చరవాణి నెంబరు : 9010388921, వెబ్‌సైట్: డబ్ల్యు.డబ్ల్యు.ఇడీవోడీడబ్ల్యుఏజేఏ.కామ్‌లో సంప్రదించవచ్చు.

- మధులాష్‌బాబు, ఎడోధ్వజ సంస్థ వ్యవస్థాపకులు, సీఈవో

శ్రీకాళహస్తి ఆర్టీసీకి రూ.6 కోట్ల రికార్డు ఆదాయం

తొట్టంబేడు, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి ఆర్టీసీ డిపో జూన్ నెలకు సంబంధించి రూ.6.10 కోట్ల రికార్డు ఆదాయాన్ని నమోదు చేసినట్లు డిపో ఇన్‌ఛార్జి మేనేజర్ మునిచంద్రయ్య బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. రోజుకు రూ.20 లక్షలు చొప్పున గరిష్ఠ కలెక్షన్లతో జిల్లాలో ప్రథమ స్థానం సాధించిందని పేర్కొన్నారు. మే, జూన్‌లలో శ్రీకాళహస్తి, తిరుపతి, తిరుమల పుణ్యక్షేత్రాలకు విచ్చేసే భక్తులను లక్ష్యంగా చేసుకుని వీలైనన్ని బస్సు సర్వీసులను నడపడంతో ఆదాయాన్ని ఆర్జించినట్లు వెల్లడించారు.

అరణియార్‌లో చేపల వేట నిషేధం

చేపల వేటలో మత్స్యకారుడు (పాత చిత్రం)

నాగలాపురం, న్యూస్‌టుడే: ఆగస్టు చివరి వరకు అరణియార్‌లో చేపల వేట నిషేధించినట్లు జిల్లా మత్స్యశాఖాధికారి రాజేష్, ఎఫ్‌డీవో మధుసూదన్‌లు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జులై, ఆగస్టుల్లో చేపల సంతానోత్పత్తి ప్రక్రియ జరుగనున్నందున వేటపై నిషేధం విధించామన్నారు. నిబంధనలు ఉల్లంఘించి మత్స్యకారులు వేట సాగిస్తే వారి లైసెన్సులు రద్దు చేయటంతో పాటు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మా బడి మాకే కావాలి

ఎంపీడీవో కార్యాలయం ఎదుట బైఠాయించిన విద్యార్థులు, తల్లిదండ్రులు

తడ, న్యూస్‌టుడే: మా బడి మాకే కావాలంటూ తడ, అక్కంపేట ఎస్సీ కాలనీల విద్యార్థుల తల్లిదండ్రులు నినాదాలు చేస్తూ తడ ఎంపీడీవో కార్యాలయం ఎదుట బుధవారం బైఠాయించారు. రేషనలైజేషన్‌లో భాగంగా తడ ఎస్సీకాలనీ, అక్కంపేట ఎస్సీ కాలనీల్లోని ప్రాథమిక పాఠశాలలను సమీపంలోని ప్రాథమికోన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. దాంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు. అక్కంపేటలో విలీనం చేసిన పాఠశాల జాతీయ రహదారికి అవతల వైపు ఉండడంతో రోడ్డు దాటి పిల్లలు ఎలా బడికి వెళ్లాలని అధికారులను ప్రశ్నించారు. ఎంపీడీవో శేఖర్, ఎంఈవో మల్లికార్జున్‌రావుకు ఫిర్యాదు చేశారు. కలెక్టరుతో చర్చించి పరిస్థితి తెలియజేస్తానని ఎంఈవో వారికి హామీ ఇచ్చాక ఆందోళన విరమించారు. సీఐటీయూ జిల్లా, మండల కార్యదర్శులు నాగరాజు, లక్ష్మయ్య, అల్లెయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యాటకశాఖకు 12.70 ఎకరాల భూమి కేటాయింపు

తిరుపతి (నగరం, నగరపాలిక), న్యూస్‌టుడే: వడమాలపేట మండలం ఎస్వీపురంలో సర్వేనెం.428/2, 428/3లోని 12.70 ఎకరాల భూమిని రాష్ట్ర పర్యాటకశాఖకు కేటాయిస్తూ సీసీఎల్ఏ జయలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. పర్యాటకశాఖకు సంబంధించిన వివిధ ప్రాజెక్టుల నిర్మాణం కోసం ఈ భూమిని కేటాయించారు. భూమిని అప్పగించాలంటూ జిల్లా రెవెన్యూశాఖ అధికారులకు ఉత్తర్వులు జారీ చేశారు.

భాజపా జాతీయ కౌన్సిల్‌లో చోటు

సన్నారెడ్డి దయాకర్ రెడ్డి | ముని సుబ్రహ్మణ్యం

తిరుపతి (గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: భాజపా జాతీయ కౌన్సిల్‌లో జిల్లా నుంచి ఇద్దరికి చోటు లభించింది. ఈ మేరకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడి పేరు ప్రకటించిన వేదికపై నుంచే ఎన్నికల పరిశీలకుడు బెంగళూరు సెంట్రల్ ఎంపీ పీసీ మోహన్ మండలి సభ్యుల పేర్లను ప్రకటించారు. మొత్తం 40 మందికి చోటు దక్కగా జిల్లాకు చెందిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, కార్యదర్శి మునిసుబ్రహ్మణ్యం జాతీయ సభ్యులుగా అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా పలువురు హర్షం వ్యక్తం చేస్తూ వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. త్వరలో జరగనున్న జాతీయ అధ్యక్షుడి ఎన్నికల్లో వీరు పాల్గొననున్నారు.

పుత్తూరు నుంచి నిషిధ ఎంపిక..

పుత్తూరు, న్యూస్‌టుడే: భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యురాలిగా పుత్తూరుకు చెందిన నిషిధ ఎన్నుకున్నట్లు బుధవారం ప్రకటించారు. గతంలో ఆమె పార్టీ మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలిగా బాధ్యతలు నిర్వర్తించారు. ఆమె మాట్లాడుతూ ఏపీలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానన్నారు. పార్టీలో సముచిత స్థానం దక్కడంపై ఆమె జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, జాతీయ మహిళా మోర్చా అధ్యక్షురాలు వానతి శ్రీనివాసన్, రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరికి కృతజ్ఞతలు తెలియజేశారు.

తిరుమలలో హోటళ్ల ధరలపై దుష్ప్రచారం తగదు: తితిదే

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలోని హోటళ్ల ధరలపై సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారం చేయడం తగదని తితిదే హెచ్చరించింది. భోజన ధరలు, ఇతర వివరాలను అవాస్తవంగా వ్యాప్తి చేస్తూ భక్తులను గందరగోళానికి గురిచేస్తున్న నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పేర్కొంది. ఏ సమాచారమైన భక్తులు తితిదే వెబ్‌సైట్ www.tirumala.org , తితిదే కాల్ సెంటర్ 18004254141 ద్వారా మాత్రమే తెలుసుకోవాలని కోరింది.

◆ శ్రీవారి ఆలయం వద్ద అనధికార ఫొటోగ్రాఫర్, ప్రైవేటు సెక్యూరిటీ గార్డు మధ్య జరిగిన గొడవపై అవాస్తవాలు ప్రచారం చేయడాన్ని తితిదే ఖండించింది. తిరుమలలో తితిదే సిబ్బంది తన్నుకున్నారనడంలో వాస్తవం లేదని ఓ ప్రకటనలో పేర్కొంది. గతనెల 29న ఆస్థాన మండపంలో వారిద్దరూ గొడవపడిన సమయంలో సెక్యూరిటీ గార్డు చొక్కా విప్పడం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. ఘటనపై ఫొటోగ్రాఫర్‌ను వివరణ కోరడంతో పాటు ప్రైవేటు సెక్యూరిటీ గార్డును తిరుపతికి పంపించామని తితిదే వెల్లడించింది.

భక్తుల సేవలకు ఆటంకం కలిగిస్తే చర్యలు

తిరుపతి (తితిదే), న్యూస్‌టుడే: శ్రీవారి భక్తులకు సేవలందించే కాంట్రాక్టు ఉద్యోగులు విధులు బహిష్కరించి నిరసనలకు దిగితే చర్యలు తప్పవని తితిదే బుధవారం ప్రకటనలో పేర్కొంది. కాంట్రాక్టు ఉద్యోగులు తమ న్యాయమైన డిమాండ్లను శాఖాధిపతులతో చర్చించి పరిష్కరించుకోవాలని, న్యాయమైన అంశాలపై యాజమాన్యం సానుకూలంగా ఉందని పేర్కొంది. నిబంధనలను ఉల్లంఘించి సమ్మెబాట పడితే ఎస్మా చట్టాన్ని అమలు చేస్తామన్నారు. స్విమ్స్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ శ్రీనివాస కార్పొరేషన్ పరిధిలోని కాంట్రాక్టు ఉద్యోగులు కొంతకాలంగా విధులు బహిష్కరించేందుకు సిద్ధపడుతున్నారని, వారు శాఖాధిపతులతో చర్చించి సమస్యలు పరిష్కరించుకోవాలని, స్విమ్స్‌తో సంబంధం లేని బయట వ్యక్తుల ప్రమేయంతో నిరసనలకు దిగితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

జింక మృతి

రేణిగుంట, న్యూస్‌టుడే: మండలంలోని గుత్తివారిపల్లి ఎస్టీ కాలనీ సమీపంలో ఒక జింక మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. అయితే జింకను వేటగాళ్లు హతమార్చారా లేదా ఏదైనా గుర్తు తెలియని వాహనం ఢీకొనిందా అనేది తెలియాల్సి ఉంది.

అధికారులున్నా వెట్టిచాకిరి గుర్తించలేదు: ఆర్డీవో

తడ తహసీల్దార్‌ను ప్రశ్నిస్తున్న ఆర్డీవో కిరణ్మయి

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: డివిజన్‌లో తహసీల్దార్లు, పోలీసులు, ఎంపీడీవోలతోపాటు ఇతర శాఖల అధికారులు ఉండి కూడా ఒక వెట్టి చాకిరిని గుర్తించకపోవడంతో నిండు ప్రాణం వేధింపులకు బలి కావాల్సి వచ్చిందని ఆర్డీవో కిరణ్మయి ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సంఘటన జిల్లాలోని సూళ్లూరుపేట డివిజన్‌లో జరగడం చాలా బాధాకరమన్నారు. డివిజన్ స్థాయి విజిలెన్సు అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఆర్డీవో అధ్యక్షతన స్థానిక మండల పరిషత్ సమావేశం మందిరంలో బుధవారం జరిగింది. ఆమె మాట్లాడుతూ ఇంత పెద్ద ప్రభుత్వ యంత్రాంగం ఉన్నా సత్యవేడు మండలంలో ఓ బాలుడు వెట్టిచాకిరితోపాటు, యజమాని పెట్టిన చిత్రహింసలకు మృతి చెందడం శోచనీయమన్నారు. ఇక్కడ రెవెన్యూ, పోలీసు యంత్రాంగం నిర్లక్ష్యం తెలుస్తోందని చెప్పారు. ఇకపై ఇలాంటి సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తడ మండలంలోని కారిజాతలో భూమి విషయమై ఫిబ్రవరిలో జరిగిన సమావేశంలో ఫిర్యాదు చేశారని, నేటి వరకు పురోగతి లేకపోవడంపై ఇన్‌ఛార్జి తహసీల్దార్ శరత్‌ను ప్రశ్నించారు. 9 మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, కమిటీ సభ్యులు నలజాం రాము, వెంకటయ్య తదితరులు హాజరయ్యారు.

9 మండలాలకు ఒక్క పోలీసు అధికారే..

ఈ సమావేశానికి నాయుడుపేట, పుత్తూరు, శ్రీకాళహస్తి, శ్రీసిటీ డీఎస్పీలు హాజరు కావాల్సి ఉంది. అయితే ఎవరూ హాజరు కాలేదు. కేవలం బుచ్చినాయుడుకండ్రిగ సీఐ ఎం.తిమ్మయ్య మాత్రమే హాజరయ్యారు. సాయంత్రం 5 గంటలకు నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు వచ్చారు. పోలీసు అధికారులు సమావేశానికి రాని విషయమై ఎస్పీ దృష్టికి తీసుకెళ్లాలని ఆర్డీవో సిబ్బందికి సూచించారు.

వైకాపా నాయకుడి నివాసంలో సీబీఐ సోదాలు

కదిరి పట్టణం, న్యూస్‌టుడే: వైద్యవిద్యార్థులకు సీట్ల కేటాయింపు, ఆసుపత్రుల అనుమతుల కోసం మధ్యవర్తిగా వ్యవహరిస్తూ భారీగా లంచాలు తీసుకున్నారన్న ఆరోపణలపై శ్రీసత్యసాయి జిల్లా కదిరి మండలం కుమ్మరవాండ్లపల్లికి చెందిన వైకాపా నాయకుడు, డాక్టర్ బత్తల హరిప్రసాద్ నివాసంలో మంగళవారం అర్ధరాత్రి వరకు సీబీఐ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సోదాల్లో వారు నగదు వివరాలు నమోదు చేసిన పుస్తకంతోపాటు కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. బత్తల హరిప్రసాద్ దిల్లీలోని సీబీఐ అధికారుల ఎదుట హాజరుకావాలని ఆయన కుటుంబ సభ్యులకు నోటీసులు ఇచ్చినట్లు తెలిసింది. ఎన్ఎంసీ సభ్యులతో సత్సంబంధాలు కలిగిన డాక్టర్ బత్తల హరిప్రసాద్ చెన్నై వేదికగా మరికొందరితో

పలు కీలక పత్రాలు స్వాధీనం

కలిసి ఉభయ తెలుగు రాష్ట్రాలు, తమిళనాడు, కర్ణాటక ప్రాంతాల్లో వైద్యవిద్యార్థులకు యాజమాన్య కోటా సీట్లు, ప్రైవేటు వైద్యశాలల అనుమతుల కోసం పెద్దమొత్తంలో లంచాలు తీసుకున్నట్లు ఫిర్యాదులు అందినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో దాదాపు 35 చోట్ల ఒకేరోజు సీబీఐ అధికారులు తనిఖీలు చేసినట్లు సమాచారం. డాక్టర్ బత్తల హరిప్రసాద్‌కు చెన్నై, తిరుపతి, హైదరాబాద్ ప్రాంతాల్లో ఇళ్లు, ప్రైవేటు ఆసుపత్రులు ఉన్నట్లు సీబీఐకి ఫిర్యాదు అందినట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే సీబీఐ అధికారులు హరిప్రసాద్ స్వగ్రామమైన కుమ్మరవాండ్లపల్లిలో తనిఖీలు చేసినట్లు తెలుస్తోంది.

తుది దశకు బయోగ్యాస్ ప్లాంట్ పనులు

వచ్చేనెలలో ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు

బయోగ్యాస్ ఉత్పత్తికి సిద్ధం చేసిన భారీ ట్యాంక్‌లు

తిరుమల, న్యూస్‌టుడే: స్థానిక కాకులమానుతిప్ప వద్ద నిర్మిస్తున్న భారీ బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణ పనులు తుదిదశకు చేరాయి. తితిదే, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్) ఆధ్వర్యంలో దీనిని నిర్మిస్తున్నారు. క్షేత్రంలో రోజూ ఉత్పత్తి అవుతున్న తడిపొడి చెత్త నిర్వహణ తలకుమించిన భారంగా మారుతోంది. కాలుష్య నియంత్రణలో భాగంగా తితిదే అధికారులు దీర్ఘకాలిక ప్రణాళికలు చేపట్టారు. వ్యర్థాల నియంత్రణతోపాటు వాటి నుంచి బయోగ్యాస్ ఉత్పత్తి చేసేందుకు గతేడాది బయోగ్యాస్ ప్లాంట్ నిర్మాణం ప్రారంభించారు. ఇందుకు కాకులమాను తిప్ప వద్ద 2.2 ఎకరాలు కేటాయించారు. రోజుకు 40 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ప్లాంటు నిర్మిస్తున్నారు. రూ.12.85 కోట్ల అంచనా వ్యయంలో రూ.7.05 కోట్లు ఐఓసీఎల్, రూ.5.80 కోట్లను తితిదే సమకూర్చింది. బెంగళూరుకు చెందిన జీపీఎస్ రెన్యూవబుల్స్ ఆధ్వర్యంలో నిర్మాణం పూర్తికావస్తోంది. ఇక్కడే 0.17 ఎకరాల్లో కంపోస్టు నిల్వ కేంద్రం నిర్మించారు. ఇక్కడ ఉత్పత్తి చేసిన బయోగ్యాస్‌ను రెండున్నర కి.మీ. దూరంలోని తరిగొండ అన్నప్రసాద కేంద్రానికి పైపులైన్ ద్వారా సరఫరా చేయనున్నారు. తద్వారా తితిదేకు ఎల్‌పీజీ గ్యాస్ వినియోగం భారీగా తగ్గనుంది.

ప్లాంట్ వద్ద సిద్ధంగా ఉన్న తడిచెత్త

తక్కువ ధరకు మద్యం ఇస్తామంటే.. నమ్మకండి

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: పార్టీలు, వివాహాలు, ఇతర సామూహిక వేడుకలు జరుగుతున్న విషయం తెలుసుకుని కొందరు అనధికార వ్యక్తులు తక్కువ ధరకు మద్యం విక్రయిస్తామని మోసం చేయాలని చూస్తే సమాచారం ఇవ్వాలని జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగమల్లేశ్వరరెడ్డి కోరారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖ నుంచి లైసెన్స్ పొందిన రిటైల్ వ్యాపారులు, మద్యం దుకాణాల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలని సూచించారు. అనధికార వ్యక్తుల నుంచి కొనుగోలు చేసే మద్యంతో ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశం ఉందని, కొన్ని సందర్భాల్లో మరణాలు సంభవించే అవకాశం ఉందని ఆయన బుధవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు.

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి

నోటీసు

Roc.No.DA2-108021(31)/351/2023

తిరుమల తిరుపతి దేవస్థానములందు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్-1 డివిజన్, తి.తి.దే., తిరుమల నందు శ్రీ ఎం.శంకరయ్య, మజ్దూర్‌గా విధులు నిర్వహించుచూ తేది: 14-02-2023 నుండి ఇంతవరకు ఎటువంటి సెలవు మంజూరు కానీ, అధికారుల అనుమతి కానీ లేకుండా గైర్హాజరులో ఉన్నందున సదరు ఉద్యోగి ఆంధ్రప్రదేశ్ ప్రవర్తనా నియమావళిని మరియు ఆంధ్రప్రదేశ్ సెలవు నియమావళి-5ని ఉల్లంఘించినట్లు గుర్తించడమైనది. కావున శ్రీ ఎం.శంకరయ్య, మజ్దూర్, జిఐఎస్.నెం.15133, అనువారు 14-02-2023 నుండి నిరంతరముగా గైర్హాజరు అయినందున మరియు క్రమశిక్షణా విభాగము ఇచ్చిన తాఖీదులను (Whatsapp) తీసుకోకపోవడం వలన మరియు ఫోన్ చేసిన స్పందించడము లేదు. కనుక జి.ఓ.ఎం.ఎస్.నెం.129 ఫైనాన్సు ఎఫ్.ఆర్.1 డిపార్టుమెంటు తేది: 01-06-2007 ప్రకారము క్రమశిక్షణా చర్యలను ముగింపు చేయవలసియున్నందున పైన కనపరిచిన ఉద్యోగి ఈ తాఖీదు ప్రకటించిన 15 రోజుల లోపు నేరుగా క్రమశిక్షణా చర్యల అధికారి వారికి, తన గైర్హాజరుకి సంబంధించిన వివరములతో కూడిన సంజాయిషీతో తన అభ్యర్థనను సమర్పించని యెడల తదుపరి శాఖాపరమైన నియమ నిబంధనలను పైన కనబరచిన ప్రభుత్వ ఉత్తర్వులకు లోబడి తీసుకొను కఠిన చర్యలకు వారే బాధ్యులగుదురని కఠినముగా హెచ్చరికలు జారీచేస్తూ ఈ ఆఖరి అవకాశము వినియోగించుకోవలసినదిగా తెలియజేయడమైనది.

TTD-40021/10/2025-PRO SEC (Adv.No:125), Dt: 02-07-2025 కార్యనిర్వహణాధికారి

రెండు లారీలు ఢీ.. డ్రైవర్ దుర్మరణం

శోభన్‌బాబు

ఏర్పేడు, న్యూస్‌టుడే: రెండు లారీలు ఢీకొన్న ఘటనలో డ్రైవర్ మృతి చెందారు. ఈ ఘటన రేణిగుంట-నాయుడుపేట ప్రధాన రహదారిపై చెర్లోపల్లి సమీపంలో బుధవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నెల్లూరు నుంచి చేపల లోడుతో తిరుపతి వెళ్తున్న లారీని ఏర్పేడు మండలం మేర్లపాక సమీపంలోని ఓ పరిశ్రమకు చెందిన లారీ బుధవారం వేకువజామున ఢీకొట్టింది. ఈ ఘటనలో చేపలలోడు డ్రైవర్ బండారుపల్లి ఎస్టీ కాలనీకి చెందిన శోభన్‌బాబు(35) తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో వాహనాలు దెబ్బతిన్నాయి. శోభన్‌బాబు కుటుంబ సభ్యులతో కలిసి కొన్నేళ్లుగా నెల్లూరులో జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. శవ పంచనామా నిమిత్తం మృతదేహాన్ని శ్రీకాళహస్తి ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు.

అతిగా మద్యం తాగి వృద్ధుడి మృతి

దక్కిలి, న్యూస్‌టుడే: అతిగా మద్యం తాగి వృద్ధుడు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు. దక్కిలి తెలుగుగంగ కాలువ వద్ద శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా సైదాపురం మండలం కనుమరాజుపల్లి గ్రామానికి చెందిన కొండూరు రవీంద్ర రాజు(60) బుధవారం అతిగా మద్యం తాగి అక్కడికక్కడే మృతిచెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు.

పీ4 కింద తడుకు పంచాయతీని దత్తత తీసుకోండి

మాట్లాడుతున్న ఆర్డీవో రామ్మోహన్

పుత్తూరు, న్యూస్‌టుడే: తడుకు పంచాయతీని పీ4 కింద దత్తత తీసుకుని అభివృద్ధి చేయాలని సర్పంచి వెంకటేష్ డిమాండ్ చేశారు. తడుకు పంచాయతీ కార్యాలయం వద్ద స్థానిక సర్వే నంబరు 507/1, 2లో 2.520 హెక్టార్లలో శ్రీకనకదుర్గ మైనింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌కు లీజుకు సంబంధించి ఆర్డీవో అధ్యక్షతన బుధవారం పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరిగింది. సర్పంచి మాట్లాడుతూ మండలంలోనే మేజర్ పంచాయతీ తడుకు అభివృద్ధికి సహకరించాలని, గ్రామంలో తాగునీటి శుద్ధి యంత్రాలు దశల వారీగా ఏర్పాటు చేయాలని, రోడ్లు, మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం పలువురు మాట్లాడుతూ శ్మశానాలు ఏర్పాటు చేయడంతో పాటు దారి సౌకర్యం కల్పించాలన్నారు. ఎంపీటీసీ సభ్యురాలు సుబ్బరత్నమ్మ భర్త గంగాధరం మాట్లాడుతూ తనకు సమాచారం ఇవ్వకుండా ప్రజాభిప్రాయ సేకరణ ఎలా చేస్తారని ప్రశ్నించారు. అందరికీ ముందుగానే తెలియజేశామని అధికారులు చెప్పారు. పలువురు ఎన్జీవోలు పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టాలని కోరారు. కాలుష్య నియంత్రణ బోర్డు ఈఈ రాజశేఖర్, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, వీఆర్వో జయప్రకాష్, కార్యదర్శి అనిల్, గ్రామస్థులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో పాత బంగారం కొనుగోలు ముఠా

పెదకాకాని, న్యూస్‌టుడే: పాత బంగారం కొనుగోలు చేస్తామని మోసగించిన ముఠాను శ్రీకాళహస్తి పోలీసులు గుంటూరు జిల్లా పెదకాకాని గ్రామంలోని బాజీబాబా దర్గా వద్ద బుధవారం అదుపులోకి తీసుకున్నారు. పెదకాకాని, శ్రీకాళహస్తి పోలీసుల కథనం ప్రకారం..పాత బంగారానికి రెట్టింపు ధర ఇచ్చి కొనుగోలు చేస్తామని శ్రీకాళహస్తిలో కొందరిని నమ్మించారు. బంగారం కొనుగోలు చేసిన తర్వాత నోట్ల కట్టపై అసలు కరెన్సీ పెట్టి లోపల డమ్మీ నోట్లు ఉంచారు. గుర్తు పట్టకుండా ప్యాకింగ్ చేసి ఇచ్చారు. ఇలా పలువురిని మోసగించినట్లు బాధితుల ఫిర్యాదుతో శ్రీకాళహస్తి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ మేరకు ముగ్గురు వ్యక్తులు, ఇద్దరు మహిళలు పెదకాకాని బాజీబాబా దర్గాలో తలదాచుకున్నట్లు వచ్చిన సమాచారంతో స్థానిక పోలీసుల సహకారంతో నిందితులను అదుపులోకి తీసుకొని శ్రీకాళహస్తికి తరలించారు.

చికెన్ ధరలు

వెన్‌కాబ్ (కిలో రూ.ల్లో)	
బ్రాయిలర్ (రైతు ధర)	95
రిటైల్	117
లేయర్	115
బ్రాయిలర్	170
బ్రాయిలర్ స్కిన్ లెస్	193
లేయర్ మాంసం	195

EENADU Classifieds

AUTO

VEHICLES WANTED

Wanted Vehicle: అశోక్ లేలాండ్ దోస్త్, టాటా ఇంట్రా, టాటా పికప్ వాహనాలు నెలవారీ అద్దె ప్రాతిపదికన ప్రముఖ కంపెనీకి వాహనం అద్దెకు కావలెను. సంప్ర: ✆: 63022 27985.

REAL ESTATE

PLOT FOR SALE

GENERAL

ఎర్రచందనం మొక్కలతో సహా ఫైనల్ అప్రూవ్డ్ కలిగిన ప్లాట్లు తిరుపతి IIT దగ్గరలో స్పాట్ రిజిస్ట్రేషన్. డైరెక్ట్ ఓనర్ ✆ 95027 74175 / 79959 92114.

అతి తక్కువ ధరల్లో, 42 సులభ వాయిదా పద్ధతిలో, తుడా/ డిటిసిపి అమోదించబడిన స్పాట్ రిజిస్ట్రేషన్ ప్లాట్లు కొరకు : ✆ 91145 61456.

JOBS

SHREE VINAYAKA AGENCIES: Chittoor, Tirupati. Marketing Sales Man & Mis System Operator Wanted Age: 20 Years to 25 Years. Comapanys: Realme & Nokia, Infinix, Noise. Phone No: 97047 07019, 98852 11199.

WANTED FOR Primary Teachers (Subject: English), Depends upon Skills, Salary: Above 25K, Contact: ✆ 77318 09480.

స్టాఫ్ నర్సులు (GNM, ANM & B.Sc. Nursing) వార్డుబాయ్స్ (10th/ Inter) ఆయాలు (F) OT టెక్నీషియన్లు, రిసెప్షనిస్టులు, నర్సింగ్ సూపరింటెండెంట్లు కావలెను. M.S. హాస్పిటల్, తిరుపతి. ✆ 98492 84543.

నవయుగ గ్రూప్ ఆఫ్ కంపెనీలో పనిచేయుటకు టీం లీడర్స్ (&) మార్కెటింగ్ మేనేజర్స్ కావలెను. జీతం : 20K to 25K, Qua: Inter పైన Age: 25 to 40 yrs. ఆసక్తి గల అభ్యర్థులు సంప్రదించవలసిన Cell No: ✆ 91828 98446.

కర్నాటక కొప్పళ జిల్లాలో ఉన్న కోళ్ళ ఫారంలో పని చేయుటకు సూపర్‌వైజర్స్ కావలెను, ఫ్యామిలీకి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. Ph: 7829928044

మోహన్‌సాయి ఫైనాన్స్ నందు పనిచేయుటకు కలెక్షన్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. విద్యార్హత: ఇంటర్/ డిగ్రీ, వయస్సు: 20 సం॥లు పైబడిన వారు. Cont: ✆ 86399 12874, 99083 94931.

FACULTY/ TEACHERS

శ్రీ వత్సల్ గురుకుల విద్యాలయ, తిరుపతి CBSE సంస్థలో చేరేందుకు మహిళా వైస్ ప్రిన్సిపాల్ (CBSE పాఠశాల అనుభవం అవసరం), హైస్కూల్ ఇంగ్లీష్ టీచర్, రెసిడెన్షియల్ మహిళా వార్డెన్. Ph: 7997555530, 7997557999, 9000256532.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

EENADU THE WAY CLASSIFIEDS

B/W 5 లైన్ల ప్రకటన రూ. 470/- మాత్రమే

అన్ని రకాల బిజినెస్ వ్యవహారాలు

వివరాలకు...

80085 13290

మీ చిన్నారులకు పుట్టిన రోజు శుభాకాంక్షలు ఈనాడు ద్వారా తెలపండి

B/W: రూ. 600

Colour: రూ. 800

ప్రకటనలపై 5% GST వర్తించును

తిరుపతి

•తిరుపతి • చంద్రగిరి

కళాకారులపై చిన్నచూపు తగదు

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: కళాకారులు పట్ల కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిన్నచూపు చూస్తున్నాయని ప్రజానాట్య మండలి రాష్ట్ర అధ్యక్షుడు చంద్రనాయక్, ప్రధాన కార్యదర్శి చిన్నంపెంచలయ్య ఆరోపించారు. బుధవారం తిరుపతిలోని సీపీఐ కార్యాలయంలో జరిగిన ప్రజానాట్య మండలి కళాకారుల శిక్షణ శిబిరంలో వారు పాల్గొని ప్రసంగించారు. గ్రామీణ జానపద, పౌరాణిక వృత్తి కళాకారులకు ఉచిత బస్సు, రాయితీపై రైలు ప్రయాణం కల్పించాలని డిమాండ్ చేశారు. గుర్రప్ప, జింక నాగరాజు, చారులత తదితరులు పాల్గొన్నారు.

24 మందికి ఉద్యోగావకాశాలు

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో బుధవారం జరిగిన మేళాలో పలువురు ఉద్యోగావకాశాలు పొందినట్లు సంఘం అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు ఓ ప్రకటనలో తెలిపారు. రెండు ప్రముఖ ప్రైవేటు సంస్థల్లో 24 మందికి ఉద్యోగావకాశాలు లభించాయన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
తిరుపతి : 80080 20003
చంద్రగిరి : 80085 74561
పాకాల : 80085 74563

భాకరాపేట: **సమస్య:** రెండు రోజులుగా భాకరాపేట బీసీ కాలనీలోని వినాయక గుడి పక్క వీధిలో వీధి దీపాలు వెలగడం లేదు. **- స్థానికులు, బీసీకాలనీ**

సమాధానం: సిబ్బందిని పంపి వీధి దీపాలు వెలిగేలా చర్యలు తీసుకుంటాం.

- పంచాయతీ కార్యదర్శి, భాకరాపేట

తిరుపతి(నగరపాలిక): **సమస్య:** భవానీనగర్‌లో దేవేంద్ర థియేటర్ పక్క సందులో మురుగునీటి కాలువలు శుభ్రం చేసి వ్యర్థాలు అక్కడే వదిలేశారు. దీంతో తిరిగి కాలువలోకి చేరుతున్నాయి. **- సంతోష్, భవానీనగర్**

సమాధానం: వ్యర్థాలు తొలగించేందుకు చర్యలు చేపడుతాం. **- డా.యువ అన్వేష్, నగరపాలిక వైద్యాధికారి**

సమస్య: రాములవారి గుడి మాడ వీధుల్లో అపరిశుభ్రత, పార్కింగ్, ఆక్రమణలు ఎక్కువగా ఉన్నాయి.

- విశ్వేశ్వర శర్మ, భక్తుడు

సమాధానం: అన్ని విభాగాల అధికారులతో చర్చించి సమస్యల పరిష్కారానికి చర్యలు చేపడుతాం.

- అమరయ్య, నగరపాలిక ఉప కమిషనర్

చంద్రగిరి, న్యూస్‌టుడే: **సమస్య:** చంద్రగిరి పంచాయతీ ఆర్.ఎఫ్.రోడ్డు మార్గంలోని శ్రీమల్లేశ్వస్వామి దేవాలయం సమీపంలో రోడ్డుపక్కన పంచాయతీకి చెందిన తాగునీటి పైపులైను పగిలిపోయి తాగునీరు వృథా అవుతోంది. **- సుబ్రహ్మణ్యంరాయల్, స్థానికుడు**

సమాధానం: విషయం మా దృష్టికి వచ్చింది. విద్యుత్తు సరఫరాలేని సమయంలో జేసీబీ యంత్రంతో తవ్వి కొత్తపైప్ అమర్చేందుకు చర్యలు తీసుకుంటాం.

- చంద్రశేఖర్‌రెడ్డి, పంచాయతీ ఈవో

చెత్తాచెదారం తొలగింపు

స్పందనకు వందనం

చంద్రగిరి, న్యూస్‌టుడే: కొత్తపేట ద్వారకానగర్‌కు వెళ్లే మార్గంలోని మూడు రోడ్ల కూడలి వద్ద చెత్తాచెదారాన్ని బుధవారం పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. దుర్గంధం వ్యాపించకుండా బ్లీచింగ్ పౌడర్ వెదజల్లించారు. తొందర్లో ఇక్కడ చెత్తకుండీ ఏర్పాటు చేయిస్తామని పంచాయతీ ఈవో చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

ప్రత్యేక తరగతులు నిర్వహించండి

పదో తరగతి విద్యార్థుల రాత పుస్తకాలు పరిశీలిస్తున్న ఉప విద్యాశాఖాధికారి బాలాజీ

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులకు ప్రతిరోజూ సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని ఉప విద్యాశాఖాధికారి బాలాజీ పేర్కొన్నారు. ముత్యాలరెడ్డిపల్లి ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు, రికార్డులను పరిశీలించారు. విద్యార్థి మిత్ర కిట్లు, మధ్యాహ్న భోజనం గురించి హెచ్ఎం హరినాథ్‌రెడ్డిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. పదోతరగతి విద్యార్థుల నోట్‌బుక్‌లను పరిశీలించారు. సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించి ఉత్తమ ఫలితాల కోసం విద్యార్థులను ఇప్పటి నుంచే సన్నద్ధం చేయాలన్నారు. ఈనెల 10న జరిగే తల్లిదండ్రుల సమావేశానికి అందరూ హాజరయ్యేలా చూడాలని సూచించారు.

ఆగిన ఇళ్లకు.. రూ.2.28 కోట్లు

❖ ఒక్కో లబ్ధిదారుడికి రూ.50 వేలు ❖ చంద్రగిరి నియోజకవర్గంలో 1,123 మందికి లబ్ధి

తిరుపతి (గ్రామీణ), న్యూస్‌టుడే: పేదల సొంతింటి కల సాకారం దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పేదలకు ఇళ్లు కాదు ఊర్లు నిర్మించి ఇస్తామంటూ చెప్పిన వైకాపా ప్రభుత్వం ఆచరణలో చతికిలపడింది. కొండగుట్టల్లో పట్టాలిచ్చి ఇళ్లు నిర్మించుకోవాలంటూ లబ్ధిదారులకు హుకుం జారీచేసింది. దీంతో నిర్మాణాలు వివిధ దశల్లో ఆగిపోగా కూటమి ప్రభుత్వం స్పందించి ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.50 వేల చొప్పున ఆర్థిక సాయం అందించింది. దీంతో ఒకప్పుడు వెలవెలబోయిన జగనన్న కాలనీలు (ఎన్టీఆర్ నగర్‌లు) నిర్మాణాలతో కళకళలాడుతున్నాయి.

నియోజకవర్గంలో మంజూరైన గృహాలు, లబ్ధిపొందిన వారు ఇలా..

మండలం	మొత్తం	లబ్ధి
తిరుపతి గ్రామీణ	1419	365
చంద్రగిరి	980	235
పాకాల	726	325
రామచంద్రాపురం	86	44
యర్రావారిపాలెం	178	86
చిన్నగొట్టిగల్లు	164	68

చంద్రగిరి నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో వైకాపా ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 3,553 ఇళ్లు మంజూరు చేసింది. ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించింది. కొండ గుట్టలు, అటవీ ప్రాంతాల్లో పట్టాలు మంజూరు చేసింది. పేదలకు ప్రభుత్వమే ఇళ్లు నిర్మించి ఇస్తుందని, ఆర్థిక స్థోమత ఉన్న వాళ్లు నిర్మించుకోవచ్చని మొదట్లో ప్రకటించింది. చివరకు లబ్ధిదారులే ఇళ్లు నిర్మించుకోవాలని లేకుంటే రద్దు చేస్తామని బెదిరించింది. కొందరు పేదలు నిర్మాణాలు ప్రారంభించినా పూర్తిచేసే స్థోమత లేక ఎక్కడికక్కడ వదిలేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 2025 జనవరికి ఇళ్ల నిర్మాణం ప్రారంభించి వివిధ దశల్లో ఆగిపోయిన 1123 మంది ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రూ.50 వేలు చొప్పున మొత్తం రూ.2.28 కోట్లు అదనంగా ప్రకటించింది. దీంతో ఒకప్పుడు ఆగిపోయిన ఇళ్లు ఇప్పుడు పూర్తవుతుండటంతో లబ్ధిదారులు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

▸ తుడా క్వార్టర్స్‌లో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి ▸ మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ తదితరులు ▸ పాకాల: ఇంటింటి ప్రచారంలో నాయకులు ▸ ఆర్సీపురం : పథకాలు వివరిస్తున్న కూటమి నాయకులు

అభివృద్ధికి.. తొలి అడుగు

తిరుపతి (మంగళం), న్యూస్‌టుడే

ఏడాది కూటమి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం సమర్థంగా అమలుచేసి మంచి ప్రభుత్వంగా పేరు తెచ్చుకుందని తిరుపతి శాసన సభ్యుడు పులివర్తినాని అన్నారు. మంగళం పరిధిలోని తుడా క్వార్టర్స్‌లో బుధవారం సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమం నిర్వహించారు. తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి, తెదేపా రూరల్ అధ్యక్షుడు ఈశ్వర్‌రెడ్డితో కలిసి స్థానిక సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, తుడా క్వార్టర్స్‌లో నూతనంగా నిర్మించిన సీసీరోడ్లను ప్రారంభించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలను వివరించారు. నియోజకవర్గంలో ఏడాదిలో రూ.650 కోట్లతో 972 అభివృద్ధి పనులు చేశామన్నారు.

ఎన్నికల హామీలను సమర్థంగా అమలు

తిరుపతి (నగరం): ఎన్నికల హామీలను ఏడాదిలోనే సమర్థంగా అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ అన్నారు. బుధవారం స్థానిక 34వ డివిజన్‌లోని శివాలయం వీధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సంతోషంగా ఉండడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందన్నారు. యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహయాదవ్, ఉమామహేశ్వర్ ఆర్టీ మునిక్రిష్ణ, నాయకులు డాక్టర్ కోడూరు బాలసుబ్రహ్మణ్యం, శ్రీధర్‌వర్మ, మునిశేఖర్‌రాయల్, ఊట్ల సురేంద్రనాయుడు, రుద్రకోటి సదాశివం, మస్తాన్ శ్రీనివాసులు, పాలకం వెంకటేష్, సింగంశెట్టి సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

తెదేపా ఆధ్వర్యంలో..

పాకాల, న్యూస్‌టుడే: తెదేపా ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని పార్టీ మండల కన్వీనర్ నాగరాజానాయుడు బుధవారం ప్రారంభించారు. పలలోని అనంతగిరి శ్రీ సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వద్ద పార్టీ కార్యకర్తలు, నాయకులు పూజలు చేసిన అనంతరం గ్రామంలో ఇంటింటికి వెళ్లి ప్రజలను కలుసుకున్నారు. పార్టీ కార్యదర్శి పల్లవి, ఏఎంసీ అధ్యక్షుడు సుధాకరయ్య, నాయకులు సావిత్రి, ఈశ్వర్ చౌదరి, గంగాబాబురెడ్డి, మహేష్‌నాయుడు, బుజ్జి, ప్రవీణ్, కోటి, చలపతి, మోహన్, హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

యర్రావారిపాలెం, చిన్నగొట్టిగల్లు : యర్రావారిపాలెం మండల కేంద్రంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని పార్టీ మండలాధ్యక్షుడు రమణారెడ్డి, చిన్నగొట్టిగల్లు మండలం తిప్పిరెడ్డిగారిపల్లి పంచాయతీలో పార్టీ మండల అధ్యక్షుడు శంకర్‌రెడ్డి మురళి ప్రారంభించారు.

రామచంద్రాపురం: తెదేపా మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి తదితరులు రావిళ్లవారిపల్లి పంచాయతీ బ్రాహ్మణ కాలవ ఏడుమల్లు పంచాయతీలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. జనార్దన్ చౌదరి, గిరిబాబు, ఉమాపతి నాయుడు, నరసింహారెడ్డి, నిరంజన్ సాద్ తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుమారుడికి చేయూత

తిరుపతి(నేరవిభాగం): జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో పనిచేస్తున్న హోంగార్డు కిషోర్ కుమారుడు ఎన్.సూర్యకి ఎస్పీ హర్షవర్ధన్ రాజు రూ.50 వేల చెక్కు అందజేశారు. శ్రీలంకలో గురువారం నుంచి 7వ తేదీ వరకు జరగనున్న కరాటే భారత ఛాంపియన్‌షిప్‌లో సూర్య పాల్గొననుండటంతో ఎస్పీ స్పందించారు. ఏవో సురేష్ బాబు, సూపరింటెండెంట్ వెంకటేష్ పాల్గొన్నారు.

చేతివృత్తి కళాకారులకు అండగా ప్రభుత్వం

దేవతామూర్తుల ప్రతిమ పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, హరిప్రసాద్

తిరుపతి (కలెక్టరేట్): చేతివృత్తి కళాకారుల ఉత్పత్తులకు తగిన ప్రచారం ఉంటే మంచి ఆదాయం లభిస్తుందని.. ఆదిశగా ప్రచారం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. బుధవారం స్థానిక హస్తకళ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డా.పసుపులేటి హరిప్రసాద్‌తో కలిసి జిల్లాలోని చేతివృత్తి కళాకారులతో సమావేశం నిర్వహించారు. హరిప్రసాద్ మాట్లాడుతూ హస్త కళాకారులను ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కలంకారీ, కళాకారులు తయారు చేసిన దేవతామూర్తుల ప్రతిమలను వారి పరిశీలించారు.

I.A.NOTICE
IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE, TIRUPATI
I.A.No. 1048 of 2021
O.S.No. 1012 of 2021
Batte Chanikya Prathap ..Petitioner
Vs
1. S.Saradamma and 12 others ..Respondents
To:R-3
S.Ravi, S/o. S.Chengalrayulu, Residing at Padamativaddipalli village, Bodevandlapalli post, Yerravaripalli Mandal, Tirupati District.
Whereas the plaintiff has filed petition in the above matter. If you have got any objection you may appear before this court at 10:30 am., on 17-07-2025 either in person or through an advocate and file your objection. If you fail to do so, the matter will be decided exparte.
Sd/- R.SREEHARI
Y.Maruthi Ram
Advocates, Tirupathi

పైకా భవనం.. నిధులిస్తే సద్వినియోగం

గ్రామీణ యువతలో దాగిన క్రీడా నైపుణ్యాలను వెలికితీసే లక్ష్యంతో కేంద్రం ప్రారంభించిన పంచాయతీ యువ క్రీడా ఖేల్ అభియాన్ (పైకా) భవనం వృథాగా మారింది. పాకాలలో స్థానిక విద్యావనరుల కేంద్రం పక్కనే ప్రారంభించినా నిర్మాణం పూర్తికాకుండా ఆపేశారు. కొద్దిపాటి నిధులు ఖర్చుచేస్తే ఈ భవనాన్ని విద్యావసరుల కేంద్రానికి అనుబంధంగా పాఠశాలలకు వచ్చే సామగ్రిని భద్రపరుచుకునే వీలుంది. ఉన్నతాధికారులు స్పందించి నిర్మాణాన్ని పూర్తిచేసి వినియోగంలోకి తీసుకోవాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, పాకాల**

సరిపోని.. జలప్రసాదం

రుయా ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులు, వారి బంధువులకు నీటి కష్టాలు తప్పడం లేదు. జలప్రసాదం వద్ద ఉన్న ఆరు కుళాయిల్లో ఒకటే పనిచేస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నారు. **- ఈనాడు, తిరుపతి**

వీవీపీ రహదారికి మోక్షం

కొన్నేళ్లుగా పాదచారులు, వాహనచోదకులను వేధిస్తున్న రహదారి సమస్యకు మోక్షం లభించింది. మహిళా వర్సిటీ ముందున్న వీవీపీ రహదారి గుంతలతో రాళ్లుతేలిపోయింది. దీంతో వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దీనిపై గత నెలలో 'వీవీపీల దారి.. దుస్థితికి చేరి' శీర్షికన 'ఈనాడు'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన అధికారులు రహదారికి మరమ్మతులు చేశారు. **- న్యూస్‌టుడే, తిరుపతి(మహిళా వర్సిటీ)**

ముగిసిన నైపుణ్య శిక్షణ

ప్రసంగిస్తున్న వీసీ ఉమ

తిరుపతి (మహిళా వర్సిటీ): శ్రీపద్మావతి మహిళా వర్సిటీలో మూడురోజులుగా జరుగుతున్న జీవన నైపుణ్యాల శిక్షణ కార్యక్రమం బుధవారం ముగిసింది. ముఖ్యఅతిథిగా విచ్చేసిన వీసీ ఆచార్య వి.ఉమ మాట్లాడుతూ ఎనిమిదో తరగతి నుంచే జీవన నైపుణ్యాలను పొందుపరచాలని, ఇది విద్యార్థుల అభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని చెప్పారు. రిసోర్స్ పర్సన్ సంజీవ్‌కుమార్, పీఎం ఉష కోఆర్డినేటర్ వాణి, కన్వీనర్ ఉష, అధ్యాపకులు పాల్గొన్నారు.

వైకాపా శ్రేణుల నిరసన

భాకరాపేట, న్యూస్‌టుడే: మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా భాకరాపేటలో వైకాపా శ్రేణులు బుధవారం నిరసన వ్యక్తం చేశాయి. కార్యక్రమంలో వైకాపా నాయకుడు భూపాల్ తదితరులు పాల్గొన్నారు.

SUIT SUMMONS
IN THE COURT OF THE HON'BLE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE, TIRUPATI
O.S.No.1012 of 2021
Batte Chanikya Prathap ..Plaintiff
Vs
1.S.Saradamma and 12 others ..Defendants
TO: Defendant 3:
S.Ravi, S/o. S.Chengalrayulu, Residing at Padamativaddipalli village, Bodevandlapalli post, Yerravaripalli Mandal, Tirupati District.
Whereas the plaintiff has instituted a suit against you, you are hereby summoned to appear in the court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the suit or who shall be accompanied by some other person able to answer all such questions on the date 17-07-2025 at 10:30 am., in the forenoon answer the claim and you are directed to produce on that day all the documents upon which you intend to rely in support of defence. Take summons that in default of your appearance on the day above mentioned, the suit will be heard and determined in your absence.
Sd/- R.SREEHARI
Y.Maruthi Ram
Advocates, Tirupathi

విద్యుత్తు పరికరాలకు దూరంగా ఉండాలి

తిరుపతి (నగరం), న్యూస్‌టుడే: విద్యుత్తు పరికరాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని ఈఈ చంద్రశేఖర్‌రావు తెలిపారు. బుధవారం నగరంలోని ఈఈ కార్యాలయం వద్ద విద్యుత్తు భద్రతా వారోత్సవాలను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ఆవిష్కరించారు. వినియోగదారులు నాణ్యమైన విద్యుత్తు పరికరాలు మాత్రమే వాడాలని, రైతులు వ్యవసాయ పంపుసెట్ల వద్ద అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. ఏడీఈలు మునిప్రసాద్, రమేష్, ఏఈలు కేశవులు, వెంకటరమణ, విద్యుత్తు ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్వీయూలో పచ్చదనం పెంపునకు విరాళం

తిరుపతి (ఎస్వీయూ), న్యూస్‌టుడే: ఎస్వీయూలో పచ్చదనం పెంపొందించేందుకు రూ.25 వేల చెక్కును బుధవారం అందజేశారు. తిరుపతికి చెందిన యూనియన్ బ్యాంక్ విశ్రాంత సీనియర్ మేనేజర్ ఎం.ఎస్.దామోదరం గుప్తా తన మిత్రుడు పత్తికొండకు చెందిన సివిల్ అసిస్టెంట్ సర్జన్ కె.కాశీనాథ్ స్మిత్ జ్ఞాపకార్థం ఉపకులపతి అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడులకు చెక్కు అందజేశారు.



పిల్లర్‌ను ఢీకొని ఆగిన బస్సు

రామానుజం కూడలిని ఢీకొన్న బస్సు

తిరుపతి(గాంధీరోడ్డు), న్యూస్‌టుడే: రామానుజం కూడలిని ఓ బస్సు ఢీకొట్టిన ఘటన వాహనచోదకులను, పాదచారులను ఆందోళనకు గురిచేసింది. రేణిగుంటలోని ఓ పరిశ్రమకు చెందిన బస్సుకు బుధవారం మధ్యాహ్నం రామానుజం కూడలిలో వస్తుండగా బ్రేకులు ఫెయిల్ అయ్యాయి. అప్రమత్తమైన డ్రైవర్ శీను బస్సును నేరుగా రోడ్డుపైకి పోనివ్వకుండా పిల్లర్ గోడను ఢీకొట్టడంతో పెనుప్రమాదం తప్పింది.

బదిలీ చేసినా సీటు వదలనంటున్న ఉద్యోగి

తిరుపతి (విద్య), న్యూస్‌టుడే: ఇంటర్ విద్యాధికారి కార్యాలయంలో వైఎస్సార్ కడప జిల్లాకు చెందిన జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వైకాపా ప్రభుత్వంలో నాలుగేళ్ల కిందట బదిలీపై ఇక్కడికి రాగా సాధారణ బదిలీల్లో భాగంగా కడప ఆర్జేడీ కార్యాలయానికి బదిలీ చేస్తూ గతనెల 30వ తేదీన ఉత్తర్వులు ఇచ్చారు. వాటిని ఖాతరు చేయని ఆయన ఈనెల మొదటి నుంచి సాధారణ సెలవు పెట్టి కార్యాలయంలో ఎవరి అనుమతి లేకుండా వెళ్లిపోయినట్లు సమాచారం. ఈ విషయమై డీఐఈవో రాజశేఖర్ రెడ్డిని వివరణ కోరగా శ్రీనివాసులుకు బదిలీ వచ్చిన విషయం వాస్తవమేనని, తాను రిలీవ్ చేయడం జరిగిందని, అయితే ఆయన సెలవు చీటీని తన టేబుల్‌పై ఉంచి ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయారన్నారు. అతని వాట్సప్, మెయిల్‌కు బదిలీ ఉత్తర్వులు అందించామన్నారు.

భక్తుడికి ఐఫోన్ అప్పగింత

తిరుమల, న్యూస్‌టుడే: మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద కేంద్రంలో బుధవారం హైదరాబాద్‌కు చెందిన రాజేష్ రూ.1.10 లక్షల విలువైన ఐఫోన్‌ను మరిచిపోగా తితిదే ఉద్యోగి డి.రూపశేఖర్ గుర్తించి అన్నప్రసాదం ఉన్నతాధికారులకు అందించారు. వారు భక్తుడిని గుర్తించి తిరిగి అప్పగించారు.

అమ్మవారికి పట్టువస్త్రాల సమర్పణ

రామచంద్రాపురం, న్యూస్‌టుడే: రాయలచెరువు సమీపంలోని శ్రీశక్తి పీఠంలో జరుగుతున్న శ్రీవారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం తెదేపా మండల అధ్యక్షుడు తిరుమలరెడ్డి దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పీఠాధిపతులు సిద్ధేశ్వరానంద భారతి, రమ్యానంద భారతి నుంచి ఆశీర్వాదం పొందారు.

గంగజాతర నిధులకు ఆమోదముద్ర

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: తాతయ్యగుంట గంగమ్మ జాతరకు తితిదే నుంచి రూ.50 లక్షలు ఖర్చు చేయగా బుధవారం వాటికి ఆమోద ముద్ర మేస్తూ రాష్ట్ర దేవాదాయ శాఖ కార్యదర్శి వినయ్‌చంద్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో దేవస్థానం పాలకమండలి తీర్మానం మేరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. మే 6-14 వరకు జరిగిన జాతరలో చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలు, పుష్పాల అలంకరణల నిమిత్తం తితిదే రూ.50 లక్షల పనులను టెండరుపై అప్పగించింది.

గంటపాటు విధుల బహిష్కరణ

తిరుపతి(వైద్యవిభాగం), న్యూస్‌టుడే: కార్మికుల వేతనాలు పెంచాలని.. హోదాను మార్చాలని స్విమ్స్ కార్మికులు బుధవారం గంటపాటు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఆస్పత్రిలోని 800 మంది కార్మికులు నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు.

ప్రగతినగర్ సమస్యలకు తక్షణ పరిష్కారం

తిరుపతి (బైరాగిపట్టెడ), న్యూస్‌టుడే: మూడో డివిజన్ పరిధిలోని ప్రగతినగర్‌లో నగరపాలక కమిషనర్ మౌర్య బుధవారం పర్యటించారు. సమస్యలు సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే ఆరణి పింఛను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకువచ్చారు. దీంతో కమిషనర్ తమ సిబ్బందితో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. తాగునీటి సమస్య, వీధి దీపాలు, కాలువల శుభ్రత తదితర సమస్యలను ఆగమేఘాలపై పరిష్కరించారు.

22 వాహనాలకు జరిమానా

తిరుమల: ఆర్టీవో నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లను వేసుకుని తిరుగుతున్న వాహనాలపై తిరుమల ట్రాఫిక్ సీఐ హరిప్రసాద్, తిరుపతి ఆర్టీవో అధికారులు ప్రత్యేక డ్రైవ్‌ను బుధవారం నిర్వహించారు. 45 వాహనాలను తనిఖీ చేసి 22 వాహనాలకు రూ.1,31,220 జరిమానా విధించారు.

IN THE COURT OF THE HON'BLE XXIV ADDITIONAL CHIEF JUDGE, CITY CIVIL COURT; AT HYDERABAD
I.A.No. 1115 of 2024
IN
O.S.No. 30 of 2021
Between:
SRI G.SRINIVAS BABU ...Petitioner/Plaintiff
And.
SRI S.SUBBARAYULU (Died per L.Rs.) & others ...Respondents/ Defendants/Proposed parties
To,
Respondent No.4
Smt. G.BHARATHI, D/o late S.Subbarayulu, Aged 43 years, Occ: House Wife, R/o Flat No.504, Block -7, Green Park Apartments, Opp. Venkatasai Apartments, Behind Mayuri Hotel, Near Railway Station, Tirupati- 51750-(AP).
Take notice that the Petitioner/ Plaintiff above named has filed the suit for recovery of damages for defamation of my client by the deceased S.Subbarayulu and S.Devika Rani who are D.Ns. 1 & 2 in the above suit. In view of the death of D.No.1 Subbarayulu, the petitioner/ plaintiff filed the IA No.1115 of 2024 to implead his legal heirs namely Sri S.Harikrishna and yourself as Defendant Nos.3 & 4 in the above suit. The notices sent to you in the above IA were returned unserved. The said IA No.1115 of 2024 is posted to 09-07-2025 for your appearance. You are therefore summoned to appear before to the said Hon'ble Court on 09-07-2025 at 10.30 a.m. to answer your claim. In default, the matter will be heard and decided exparte in your absence.
(By Order of the Court)
Sd/- N.AMARNATH, Advocate
#1-8-307, Chikkadpally, Hyderabad - 500020
Cont: 9849020247
Counsel for Petitioner/Plaintiff

పురుగుమందు తాగి వివాహిత ఆత్మహత్య

యర్రావారిపాలెం, న్యూస్‌టుడే: పురుగుల మందు తాగి వివాహిత మృతిచెందిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. యర్రావారిపాలెం పంచాయతీ ఎస్టీ కాలనీకి చెందిన రేఖ (19) అనారోగ్య సమస్యలతో పురుగుమందు తాగడంతో కుటుంబసభ్యులు హుటాహుటిన చిన్నగొట్టిగల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించినట్లు అధికారులు తెలిపారు. మృతురాలికి ఆరు నెలల కుమార్తె ఉంది.

జ్వరంతో బాలిక మృతి

చంద్రగిరి, న్యూస్‌టుడే: రాయలపురం పంచాయతీ పరిధికి చెందిన బాలిక టైపాయిడ్ జ్వరం, ఫిట్స్ లక్షణాలతో బుధవారం మృతిచెందారు. ఉలుకూ..పలుకూలేకుండా ఉన్న బాలిక జాస్మిన్(16)ను గుర్తించి బంధువులు వైద్యసేవల నిమిత్తం చంద్రగిరిలోని ప్రాంతీయ ఆసుపత్రికి బుధవారం మధ్యాహ్నం తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బాలిక బంధువులను విచారించగా వారంరోజులుగా టైఫాయిడ్‌తో బాధపడుతున్నట్లు తెలిపారు.

తిరుమలకు వచ్చి అనారోగ్యంతో..

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలకు వచ్చిన వ్యక్తి అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి ఆపై మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. తిరుమల టూటౌన్ సీఐ శ్రీరాముడు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన శ్రీనివాస్(43) గత నెల 29వ తేదీన సాయంత్రం అనారోగ్యంతో స్థానిక అశ్విని ఆసుపత్రిలో చేరారు. అనంతరం అతడిని మెరుగైన చికిత్స నిమిత్తం స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. వివరాల కోసం 94407 96772లో సంప్రదించాని పోలీసులు తెలిపారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్‌పై దాడి

తిరుపతి (నేరవిభాగం), న్యూస్‌టుడే: పూర్ణకుంభం సర్కిల్ నుంచి లీలామహల్ వైపు రిజిస్ట్రేషన్ లేని జీపు బుధవారం సాయంత్రం అత్యంత వేగంగా దూసుకొచ్చి బస్టాండు ముందు పార్కింగ్‌లో ఉన్న రెండు ఆటోలను ఢీకొంది. అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ వెంకట్‌రెడ్డి, డ్రైవర్‌ను వాహనం పక్కకు పెట్టమని ఆదేశించగా అతను కానిస్టేబుల్‌పై దాడికి యత్నించారు. ఆటోడ్రైవర్లు నిలువరించేందుకు యత్నించడంతో అక్కడి నుంచి వాహనంతో వేగంగా వెళ్లిపోయాడు.

'చిరు వ్యాపారులపై దాడి అమానుషం'

తిరుపతి (భవానీనగర్), న్యూస్‌టుడే: పాతికేళ్లుగా శ్రీవారి మెట్టు మార్గంలో వెళ్లే భక్తులకు చిరుతిళ్లను విక్రయించుకుంటూ జీవనం సాగిస్తున్న వారిపై విజిలెన్స్, పోలీసుల దాడులు దారుణమని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జయచంద్ర ఆరోపించారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బాధిత వ్యాపారులతో కలిసి మాట్లాడారు. శ్రీవారి మెట్లపైన వ్యాపారం చేసుకుంటున్న మోహన్, ప్రకాష్, శ్రీనివాసులు, భార్గవ్, శేఖర్‌లను ఏవీఎస్ఓ శైలేంద్ర, సీఐ శ్రీరాములు, ఐదో సెక్టార్ రమేష్ తదితరులు సిబ్బందితో కలిసి దాడులకు పాల్పడ్డారని ఆరోపించారు.

డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో రెండురోజుల జైలు

తిరుపతి (లీగల్): నగరంలో డ్రంకన్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన ఎనిమిది మంది వాహన చోదకులకు రెండురోజుల జైలుశిక్షతో పాటు రూ.10 వేల జరిమానా విధిస్తూ నాలుగో అదనపు మున్సిఫ్ కోర్టు న్యాయమూర్తి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు వెలువరించారు. 23 మంది మద్యం తాగి వాహనాలు నడపగా ఎనిమిది మందికి రెండు రోజుల జైలుశిక్షతో పాటు రూ.10వేల జరిమానా, మిగిలిన వారికి జరిమానా విధించారు.

పనపాకంలో ఇరువర్గాల ఘర్షణ

చంద్రగిరి, న్యూస్‌టుడే: పనపాకం ఎస్సీ కాలనీలో మాతమ్మ ఆలయ నిర్మాణంపై ఇరువర్గాలు బుధవారం ఘర్షణ పడ్డారు. ఆలయ నిర్మాణానికి రూ.5 లక్షలు చందాలు వసూలు చేయగా సగభాగం అజయ్‌కుమార్ తనవద్ద ఉంచుకుని మోసం చేశారని ఓ వర్గం ఆరోపించింది. డబ్బులు అడిగితే దుస్తులు చింపుకొని కళ్లల్లో కారంపొడి కొట్టారంటూ అజయ్‌కుమార్ వర్గం పోలీసు స్టేషన్‌లో పార్టీల ప్రస్తావన తెచ్చిందని గ్రామస్థులు ఆరోపించారు. అయితే అజయ్‌కుమార్ మాత్రం రాజకీయ కక్షలతో తన కుటుంబంపై దాడి చేశారని ఆరోపించాడు. భార్యాపిల్లలతో బస్టాండు వద్ద నిరసన చేపట్టారు. ఇరువర్గాల పరస్పర ఫిర్యాదుల మేరకు పోలీసులు కేసులు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

(c) eenadu

శ్రీకాళహస్తి

•శ్రీకాళహస్తి •సత్యవేడు

తొలి అడుగులోనే ఘన ప్రగతి సాధించాం

ప్రభుత్వ విజయాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి, తదితరులు

తొట్టంబేడు, న్యూస్‌టుడే: అభివృద్ధి... సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్లని ఆ లక్ష్యంతోనే ఏడాదిలోనే మన ప్రగతిని సాధించినట్లు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని చిన్నసింగమాల పంచాయతీ నుంచి బుధవారం ప్రారంభించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఇంటింటికెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో రూ.3.52 కోట్ల అభివృద్ధి పనులు చేసినట్లు వివరించారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి, మునిరాజా, జయచంద్ర, వెంకటాచలం, ప్రతాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. **శ్రీకాళహస్తి:** పట్టణంలోని 19వ వార్డులో బుధవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని తెదేపా పట్టణ కమిటీ అధ్యక్షులు విజయకుమార్ నిర్వహించారు. **రేణిగుంట:** మండలంలోని కట్ట పుత్తూరులో బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి దొడ్డమిట్టలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం తెదేపా నాయకులు చేపట్టారు. తిరుపతి పార్లమెంటు ఉపాధ్యక్షులు సుబ్రహ్మణ్యంరెడ్డి, బుజ్జినాయుడు, రాజేంద్ర పాల్గొన్నారు. **శ్రీకాళహస్తి గ్రామీణ(ఏర్పేడు):** తెదేపా అధికారంలోకి వస్తేనే సుపరిపాలన సాధ్యమవుతుందని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి గురవారెడ్డి తెలిపారు. మండలంలోని బండారుపల్లి, ముసలిపేడులో బుధవారం సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమం ప్రారంభించారు. తెదేపా నియోజకవర్గ పరిశీలకులు అరుణ్య చౌదరి ఆధ్వర్యంలో అరవింద్ కుమార్, కమ్మకొత్తూరులోనూ కార్యక్రమం నిర్వహించారు. నాగరాజు, ధనుంజయులు, శివశంకర్‌రెడ్డి, కృష్ణవేణి, మనోహర్, కృష్ణయాదవ్, పాపిరెడ్డి పాల్గొన్నారు.

ఏర్పేడు: ముసలిపేడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న గురవారెడ్డి, నేతలు

పేద కుటుంబాలకు అండగా ఉంటా

శ్రీకాళహస్తి గ్రామీణ (ఏర్పేడు), న్యూస్‌టుడే: 'పేద కుటుంబాలకు తమ వంతుగా ఆదుకోవాలనే లక్ష్యంతో సిపాయి భరోసా కార్యక్రమాన్ని ప్రవేశపెట్టామని ఎమ్మెల్సీ డా.సిపాయి సుబ్రహ్మణ్యం తెలిపారు. శ్రీకాళహస్తి మండలంలోని నారాయణపురానికి చెందిన సోమయ్య జీవనం ఇబ్బందిగా ఉందని బుధవారం కుటుంబ సభ్యులను పరామర్శించి సరుకులు పంపిణీ చేశారు. అండగా ఉంటామన్నారు. రత్నంరెడ్డి, బాలకృష్ణారెడ్డి, భరత్‌రెడ్డి, డా.బాబు పాల్గొన్నారు.

కిశోర బాలికలు పూర్తి అవగాహనతో ఉండాలి

రేణిగుంట: కిశోర బాలికల్లో వచ్చే మార్పులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తేజో ఫౌండేషన్ ఛైర్మన్ కోలా విశాలక్ష్మి తెలిపారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఫౌండేషన్ ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలకు శానిటరీ నాప్‌కిన్, పుస్తకాలు అందజేశారు.

వ్యతిరేక విధానాలొద్దు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: కార్మిక వ్యతిరేక విధానాలు వద్దంటూ ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు రవి అన్నారు. పట్టణంలోని రామసేతు వంతెన వద్ద బుధవారం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులపై అవలంబిస్తున్న చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. నియోజకవర్గ కార్యదర్శి మల్లికార్జున, రవికుమార్, బాబు, విజయకుమార్ పాల్గొన్నారు.

నేర నియంత్రణే ప్రధాన లక్ష్యం

పట్టణ వ్యాప్తంగా కవాతు ప్రారంభిస్తున్న డీఎస్పీ నరసింహమూర్తి

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: నేరాలు నియంత్రించడం ప్రధాన లక్ష్యంగా చేసుకున్నట్లు డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. పట్టణంలోని పెళ్లి మండపం వద్ద బుధవారం అర్ధరాత్రి పట్టణ వ్యాప్తంగా నిశిత పరిశీలన (ఏరియా డామినేషన్) కార్యక్రమాన్ని చేపట్టారు. సబ్‌డివిజన్ పరిధిలోని విభాగాల పోలీసులతో చేపట్టారు. డీఎస్పీ మాట్లాడుతూ అనుమానిత వ్యక్తుల గుర్తింపుతో మత్తు పదార్థాల వినియోగం తదితర వాటిని కట్టడి చేసే విధంగా తనిఖీలు చేపట్టినట్లు వివరించారు. సీఐ గోపి, తొట్టంబేడు సీఐ తిమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

అక్రమ రవాణా.. ఆపై అంతులేని వేగం

● బెంబేలెత్తిస్తున్న ఇసుక, గ్రావెల్ మాఫియా ● తరచూ ప్రమాదాలు

పూడి గ్రామ సమీపంలో వరి పొలాల్లో బోల్తా పడ్డ ఇసుక ట్రాక్టర్

రాత్రి వేళ శ్రీకాళహస్తిలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ (పాత చిత్రం)

గతేడాది అక్టోబరులో చియ్యవరానికి చెందిన రాజేంద్ర (35), గురవమ్మలు వారి కుమారుడు చైతన్య(05)కు శ్రీకాళహస్తికొచ్చి చికిత్స చేయించుకుని వెళ్తుండగా... దొమ్మరపాలెం వద్ద ఎదురుగా వస్తున్న ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. ఘటనలో రాజేంద్ర, చైతన్య మృతిచెందగా, గురవమ్మ తీవ్రంగా గాయపడింది. అతివేగమేనని పోలీసులు నిర్ధారించారు. ● గతేడాది ఇసుక తీసుకొచ్చేందుకు తెలుగుగంగ కాలువపై అతివేగంగా వెళ్తూ అదుపు తప్పి పల్టీలు కొట్టి పొలాల్లో పడింది. డ్రైవర్ మృతిచెందాడు...

తొట్టంబేడు, న్యూస్‌టుడే: అసలే అక్రమంగా తరలిస్తున్న ఇసుక.. ఆపై అతివేగం.. అనుభవం లేని, లైసెన్సు లేకుండా.. ఇష్టారాజ్యమైన డ్రైవింగ్‌తో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మితిమీరిన వేగం ప్రజలకు ప్రాణసంకటంగా మారుతోంది. దూసుకొస్తున్న వాహనాలతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. ఇసుక, గ్రావెల్‌ను అక్రమ రవాణాకు పాల్పడుతున్న వాహనాల హద్దుల్లేని వేగం, డ్రైవర్ల నిర్లక్ష్యంతో బోల్తా కొట్టడం, ఎదురుగా వచ్చే వారిని ఢీకొట్టడం లాంటి ఘటనలు శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో నిత్యకృత్యంగా మారాయి.

చర్యలేవి?

తొట్టంబేడు మండలం పూడి, పెన్నలపాడు, విరూపాక్షపురం గ్రామాల సమీపంలోని స్వర్ణముఖినది నుంచి అక్రమంగా ఇసుక తరలించేందుకు నిత్యం చిన్న, పెద్ద వాహనాలు వెళ్తుంటాయి. ఈ ప్రాంతాల నుంచి అక్రమార్కులు గమ్యం చేరేంతవరకు ట్రాక్టర్లు, టిప్పర్లు మితిమీరిన వేగంతో వాహనాలను నడుపుతుండటంతో ప్రజలు రోడ్డు దాటాలంటేనే వణుకుతున్నారు. వీటి వల్ల పలువురు మరణిస్తున్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. ప్రజా పరిష్కార వేదికలోనూ పలువురు ఫిర్యాదు చేస్తున్నా.. క్షేత్రస్థాయిలో పట్టించుకోవడం లేదని సర్వత్ర విమర్శలు గుప్పుమంటున్నాయి.

వాహనాలకు కళ్లెమేది?

ట్రాక్టర్ల డ్రైవర్ల నిర్లక్ష్యం, మితిమీరిన వేగంతో ప్రయాణిస్తూ ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్నారు. రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారుల కళ్లెదుటే అక్రమ రవాణా జరుగుతున్నా చోద్యం చూడటం తప్ప నిలువరించలేకపోతున్నారు. లైసెన్సులు లేని డ్రైవర్లు, లేబర్లే డ్రైవర్లుగా అవతారమెత్తుతూ ట్రాక్టర్లు నడుపుతుండటంతో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మాఫియా అగడాలకు కళ్లెం ఎప్పుడేస్తారని ప్రజలు నిలదీస్తున్నారు.

డ్రోన్‌తో నిఘా

రేణిగుంట, న్యూస్‌టుడే: గంజాయి, మత్తు పదార్థాల నివారణ కోసం డ్రోన్‌తో నిఘా చర్యలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. బుధవారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని కరకంబాడి పంచాయతీ తారకరామానగర్‌లో డ్రోన్‌తో నిఘా పెట్టారు. ఎస్సై అరుణ్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు

రైతుల సమస్యలు పరిష్కరించాలి

శ్రీకాళహస్తి గ్రామీణ(ఏర్పేడు), న్యూస్‌టుడే: రైతుల ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రైతు సంఘం నేత రామానాయుడు తెలిపారు. శ్రీకాళహస్తి మండలంలోని రెడ్డిపల్లిలో రైతులతో బుధవారం సమావేశం నిర్వహించి సమస్యలు తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. నియోజకవర్గ కార్యదర్శి గురవయ్య, శివకుమార్, రమేష్, మల్లీశ్వరయ్య, వెంకటయ్య, చెంచయ్య పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM TO 1 PM)
శ్రీకాళహస్తి: 80085 74555
నాగలాపురం: 98854 43308

తొట్టంబేడు, న్యూస్‌టుడే: సమస్య: మండలంలోని లింగమనాయుడుపల్లి ఎస్సీ కాలనీలో రోడ్డుపై నీరు నిల్వ చేరడంతో బురదమయంగా మారింది. **- ప్రసాద్**

సమాధానం: పరిశీలించి రోడ్డుపై బురద తొలగించేందుకు చర్యలు తీసుకుంటాం. **- సురేంద్రనాథ్, ఎంపీడీవో**

మురుగు తొలగింపు

పట్టణంలోని ఎం.ఎం.వాడను ఆనుకున్న కాల్వల్లో వ్యర్థాలు తొలగించారు. నీటి ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడటంపై ఈనాడులో సమస్య ప్రచురితమైంది. స్పందించిన కమిషనర్ సంజీవకుమార్ సూచనలతో పారిశుద్ధ్యం విభాగం అధికారులు వ్యర్థాలను తొలగించారు. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

హమ్మయ్యా.. తీరింది కష్టం

శ్రీకాళహస్తీశ్వరుని దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం శివయ్య గోపురం వద్ద ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు అందుబాటులోకి వచ్చాయి. మరమ్మతుల దృష్ట్యా వీటికి తాళాలు వేయడంతో 'రద్దీ ఘనం.. తప్పని కష్టం' శీర్షికన 'ఈనాడు'లో సోమవారం చిత్ర కథనం ప్రచురితమైంది. స్పందించిన ఇంజినీరింగ్ శాఖ మురళీధర్‌రెడ్డి సూచనలతో సిబ్బంది పనులు సత్వరం పూర్తి చేసి అందుబాటులోకి తీసుకొచ్చారు. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

పురవీధుల్లో శ్రీకృష్ణస్వామి ఊరేగింపు

శ్రీకాళహస్తి: శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజుల స్వామి వార్షిక ఉత్సవాల్లో రాజసూయ యాగం ఉత్సవాన్ని ఘనంగా జరిపారు. బుధవారం శ్రీకృష్ణస్వామితో పాటు అర్జునుడు, ద్రౌపతమ్మ ఉత్సవమూర్తులకు విశేష అలంకరణలు చేపట్టి పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఉదయం నవదంపతులుగా పురవీధుల్లో ఊరేగారు.

ఉత్సవాలకు విస్తృత బందోబస్తు

ద్రౌపతమ్మ తిరునాళ్లలో భాగంగా అర్జున తపస్సు, అగ్నిగుండ మహోత్సవానికి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశముంది. ఈ ఉత్సవాల దృష్ట్యా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. బుధవారం సీఐలతో కలిసి అక్కడ చేపట్టదల్చిన ఏర్పాట్లను పరిశీలించారు.

కనుల పండువగా పరాశరేశ్వరస్వామి కల్యాణం

అశ్వవాహనంపై పరాశరేశ్వరస్వామి

నారాయణవనం: శ్రీ చంపకవల్లి సమేత పరాశరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి అమ్మవార్ల కల్యాణం కనుల పండువగ జరిగింది. బుధవారం ఉదయం ఆలయంలో మూలవర్లకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం అమ్మవార్లకు కల్యాణం నిర్వహించారు. రాత్రి అశ్వవాహనంపై గ్రామంలో విహరించారు. తితిదే ఆలయాధికారి నాగరాజు, అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ గంగమ్మ జాతర

ఏర్పేడు: చిందేపల్లిలో వెలసిన గ్రామదేవత శ్రీ గంగమ్మదేవికి బుధవారం ఘనంగా జాతర నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి మంగళవారం అర్ధరాత్రి నుంచి గ్రామోత్సవం చేపట్టారు. స్థానికులంతా కలిసికట్టుగా పొంగళ్లు పెట్టి సారె సమర్పించారు. అనంతరం దేవతామూర్తి ప్రతిమను నిమజ్జనం చేపట్టారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

తెదేపా నియోజకవర్గ సమన్వయకర్తగా శంకర్‌రెడ్డి

నారాయణవనం: తెదేపా జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సత్యవేడు నియోజకవర్గ తెదేపా కార్యక్రమాల సమన్వయకర్తగా కూరపాటి శంకర్ రెడ్డి పేరును ఖరారు చేస్తూ పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్బీఐ మేనేజర్లుగా ..

సూర్య ప్రకాష్

చిరంజీవి

సత్యవేడు, న్యూస్‌టుడే: మండలంలోని రాళ్లకుప్పం, స్థానిక స్టేట్ బ్యాంకుల మేనేజర్లుగా చిరంజీవి, సూర్యప్రకాష్‌లు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న మేనేజర్లు బదిలీ కావడంతో హైదరాబాద్ నుంచి సూర్యప్రకాష్, శ్రీకాళహస్తి నుంచి చిరంజీవి వచ్చారు.

భాజపా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడికి స్వాగతం

లక్ష్మణ్‌కు స్వాగతం పలుకుతున్న నాయకులు

రేణిగుంట, న్యూస్‌టుడే: రాజ్యసభ సభ్యుడు, భాజపా ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్‌కు రేణిగుంట విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. తిరుమల శ్రీవారి దర్శనార్థం బుధవారం ఆయన ఇక్కడికి వచ్చారు. విమానాశ్రయంలో ఆయనకు భాజపా రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు రాజారాయల్, తదితరులు స్వాగతం పలికారు. రోడ్డు మార్గంలో ఆయన తిరుమలకు బయలుదేరి వెళ్లారు.

భాజపా రాష్ట్రాధ్యక్షులకు తీర్థ ప్రసాదాలు

శ్రీకాళహస్తి, న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర అధ్యక్షులుగా నియమితులైన పీవీఎస్ మాధవ్‌ను ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ కలిశారు. విజయవాడలోని ఎస్‌ఎస్ కన్వెన్షన్ హాలులో ఎన్నికల్లో ఆయన పాల్గొన్నారు. మాధవ్‌కు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వ్యర్థం.. తప్పని దుర్గంధం

వ్యర్థాల నుంచి వచ్చే దుర్గంధంతో శివయ్య భక్తులకు ఇబ్బందులు తప్పడం లేదు. భక్తుల సౌకర్యార్థం సన్నిధి వీధిలో టాయ్‌లెట్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే ఇటీవల ఇక్కడ ఏర్పాటు చేసిన సెప్టిక్ ట్యాంక్ నిండిపోయి వ్యర్థాలన్నీ సువర్ణముఖి నదిలోకి వెళ్లిపోతున్నాయి. అంతేకాకుండా అక్కడి పరిసరాలు దుర్గంధంగా మారాయి. దీన్ని శుభ్రం చేయించి ఇబ్బందులు తప్పించేలా అధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, శ్రీకాళహస్తి**

నిర్లక్ష్యంతో ప్రమాదం

ఏర్పేడులోని వెంకటగిరి ప్రధాన రహదారి పక్కన కేబుల్ మరమ్మతులు చేసేందుకు కొన్నిరోజుల కిందట తవ్విన గుంతలను అలానే వదిలేయడంతో ప్రమాదం పొంచి ఉంది. గుత్తేదారుల నిర్లక్ష్యంతో స్థానికులతో పాటు ప్రధాన రహదారిపై రాకపోకలు సాగించే వాహన చోదకులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అసలే ఇరుకు రహదారి కావడంతో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించలేక ఇబ్బందులు పడుతున్నారు. పెను ప్రమాదాలు జరగక ముందే అధికారులు స్పందించి పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, ఏర్పేడు

డంప్ చేసిన ఇసుక సీజ్

మండలంలోని వానెల్లూరు రెవెన్యూ పరిధిలోని రాజగోపాలపురం గ్రామ సమీపం తెలుగుగంగ కాలువ వద్ద డంపింగ్ చేసిన సుమారు 4 టిప్పర్ల ఇసుకను తహసీల్దార్ రాజశేఖర్, బృందం బుధవారం సీజ్ చేసి శ్రీసిటీ పోలీసులకు అప్పగించారు. ఓ పాత్రికేయుడు పగటిపూట ట్రాక్టర్ల ద్వారా ఇసుకను మండలంలోని రాజగోపాలపురం గ్రామ సమీపంలో డంప్ చేసి రాత్రి సమయాల్లో టిప్పర్ల ద్వారా తమిళనాడు రాష్ట్రానికి తరలిస్తున్నారన్నారు. సీఐలు శ్రీనివాసులు, మురళీనాయుడు, ఎస్సైలు, వీఆర్‌ఏ బాష తదితరులు పాల్గొన్నారు. **- న్యూస్‌టుడే, సత్యవేడు**

కాలనీకి వెళ్లే దారుణాలు చూడండి

మండలకేంద్రం నుంచి గోపాలరావుకాలనీకి వెళ్లే దారి అడుగడుగునా గుంతలతో నిండింది. వరదయ్యపాళెం పంచాయతీ పరిధిలోని ఈ కాలనీలో దాదాపు 200 కుటుంబాలకు పైగా ఉన్నాయి. ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోకపోవడంతో రహదారి పొడవునా గుంతలతో నిండింది. కదూరు ఏరు నుంచి ఇసుక, మట్టి అక్రమరవాణా చేసే మట్టిమాఫియా ఈ కాలనీ మీదుగా నిత్యం వందలాది ట్రాక్టర్లలో రాకపోకలు సాగిస్తుండటంతో రహదారి అధ్వానంగా తయారైంది. వర్షాలకు మురికిగుంతలతో నిండటంతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, వరదయ్యపాళెం

నీటి సరఫరాకు పరిశీలన

ఏర్పేడు, న్యూస్‌టుడే: శ్రీకాళహస్తి మండలంలోని ఎలక్ట్రోస్టీల్ కాస్టింగ్ లిమిటెడ్ పరిశ్రమకు నీరు సరఫరా చేసేందుకు అవసరమైన ప్రణాళికల కోసం అధికారులు క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో జలవనరుల శాఖ ఈఈ వెంకటశివారెడ్డి బుధవారం మేర్లపాక చెరువును సందర్శించారు. సోమశిల-స్వర్ణముఖి కాలువ నుంచి మేర్లపాక చెరువు, వెంకటరంగాపురం చెరువు ఇలా గొలుసుకట్టు విధానంలో నీరు అందించాలని పరిశ్రమ ప్రతినిధులు అధికారులకు విన్నవించుకున్నారు. ఈ ప్రక్రియ జరిగేందుకు ఆలస్యం కానున్నదంతో ప్రస్తుతం చెరువుల్లోకి చేరే వర్షపు నీరును పరిశ్రమకు సరఫరా చేయాలని కోరారు. అయితే దీనిపై స్థానికులు వ్యతిరేకించారు. చెరువు నీటిపైనే ఆధారపడి వ్యవసాయం సాగు చేస్తూ గ్రామీణులు జీవిస్తుండగా ఉన్ననీటిని పరిశ్రమకు సరఫరా చేస్తే రైతులు పరిస్థితి దారుణంగా మారుతుందని అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తహసీల్దార్ భార్గవి, డీఈ ఆదినారాయణరెడ్డి, ఏఈ జయకుమార్, అధికారులు పాల్గొన్నారు.

తరగతుల విలీనం వద్దు

జాతీయ రహదారిపై ఆందోళన చేపడుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

నారాయణవనం, న్యూస్‌టుడే: మండలంలోని ఇప్పతాంగేల్ ప్రాథమిక పాఠశాలలోని 3, 4, 5 తరగతులు దిగువకనకం పాలెం ప్రాథమిక పాఠశాలలో విలీన చేసే ప్రక్రియ వెనక్కి తీసుకొని యథావిధిగా కొనసాగించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన చేపట్టారు. జాతీయ రహదారిపై, ఎంఈవో కార్యాలయం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు, తల్లిదండ్రులు పిల్లలతో కలిసి బుధవారం నిరసన చేపట్టారు. విలీనం నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు.

తైలాభిషేకానికి నగదు విరాళం

శ్రీకాళహస్తి: ముక్కంటి ఆలయంలో కొలువుదీరిన శనిభగవానునికి నిత్య తైలాభిషేకాల నిమిత్తం విష్ణు బేరియం ప్రైవేటు లిమిటెడ్ ఎండీ చెరుకూరి కృష్ణమూర్తి రూ.1.09 లక్షలు నగదు విరాళంగా ఇచ్చారు. చెక్కును బుధవారం ఆలయ ఈవో టి.బాపిరెడ్డికి అందజేశారు.

● హైదరాబాదు బీరంగూడకు చెందిన పెద్దిశెట్టి శంకరప్రసాద్ దంపతులు ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి రూ.55,558 నగదును చెక్కు రూపంలో బుధవారం ఏఈవో మోహన్‌కు అందజేశారు. దాతలకు ఆలయం తరపున తీర్థప్రసాదాలు అందజేశారు.

ట్రాఫిక్ ఇబ్బందులు రానీయొద్దు

శ్రీకాళహస్తి: దుకాణదారులు ట్రాఫిక్‌కు ఇబ్బందులు తీసుకువస్తే సహించబోమని డీఎస్పీ నరసింహమూర్తి, సీఐ గోపీలు సంయుక్తంగా సూచించారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్ వీధిలో వీధులోకి వచ్చిన దుకాణాలను బుధవారం వెనక్కి పంపారు.

తిరుమలకు వచ్చి.. అనారోగ్యంతో మృతి

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలకు వచ్చిన వ్యక్తి అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరి ఆపై మృతిచెందిన ఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. తిరుమల టూటౌన్ సీఐ శ్రీరాముడు తెలిపిన వివరాల మేరకు.. శ్రీకాళహస్తి రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన శ్రీనివాస్(43) గతనెల 29వ తేదీన సాయంత్రం అనారోగ్యంతో స్థానిక అశ్విని ఆసుపత్రిలో చేరారు. అనంతరం అతడిని మెరుగైన చికిత్స నిమిత్తం స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందారు. వివరాల కోసం 94407 96772లో సంప్రదించాని పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి దుర్మరణం

నాగలాపురం, న్యూస్‌టుడే: గ్రామ శివారులోని తిరుపతి-చెన్నై జాతీయ రహదారిపై లారీ ఢీకొని ద్విచక్ర వాహనంపై వెళ్తున్న చెన్నైకు చెందిన విజయ్‌కుమార్(62) తీవ్రంగా గాయపడ్డారు. నగరిలో ప్రాథమిక వైద్యం అందించి మెరుగైన చికిత్స నిమిత్తం మంగళవారం రాత్రి తరలిస్తుండగా మరణించినట్లు పోలీసులు తెలిపారు. మృతదేహానికి మరణోత్తర పరీక్షలు నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యువతి అదృశ్యం

కేవీబీపురం, న్యూస్‌టుడే: మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు బాధితులు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువతి అన్న ఫిర్యాదు మేరకు.. తన కుటుంబ సభ్యులతో కలిసి మంగళవారం రాత్రి 11 గంటల సమయంలో ఇంట్లో నుంచి బయటకెళ్లారు. ఎంతసేపటికీ రాకపోవడంతో తెలిసినవాళ్లు, బంధువుల నివాసాల్లో వెతికినా ఆచూకీ కనిపించలేదు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంపద కేంద్రం.. ఆకతాయిల నిలయం

శిథిలావస్థలో చెత్త సేకరణ బండి

సత్యవేడు, న్యూస్‌టుడే: పరిసరాలు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రభుత్వం నూతనంగా స్వచ్ఛాంధ్రా-స్వర్ణాంధ్రా కార్యక్రమం చేపట్టింది. ఇంటింటా సేకరించిన పొడి, తడి, ఎలక్ట్రానిక్ వస్తువులను వేరు చేసి సంపద కేంద్రాల ద్వారా సంపద సృష్టించి వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి, కార్మికుల జీతాలకు వినియోగించాలని ఆదేశాలు జారీచేసింది. కానీ నిధులు కొరతతో పర్యవేక్షణ కొరవడి పలు కేంద్రాలు పిచ్చిమొక్కలు, ఆకతాయిలకు నిలయాలుగా మారాయి. కూటమి ప్రభుత్వమైనా వాటిపై దృష్టి పెట్టి అభివృద్ధి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

యంత్రాలు దుస్థితిలో..

గ్రామీణ ప్రాంతాలనూ పరిశుభ్రంగా ఉంచి స్వచ్ఛ భారత్‌గా తీర్చిదిద్దాలని గత తెదేపా హయాంలో శ్రీకారం చుట్టింది. ప్రతి పంచాయతీలో ఏర్పడే చెత్తతో సంపద తయారీ కేంద్రాలు, చెత్త సేకరణకు ఎలక్ట్రానిక్

కొరవడిన పర్యవేక్షణ

ఆటోలు, మూడు చక్రాల సైకిళ్లు అందజేసింది. వైకాపా ప్రభుత్వంలో సకాలంలో పంచాయతీ కార్మికులకు జీతాలు చెల్లించకపోవడంతో నిర్వహణ మొత్తం అస్తవ్యస్తంగా తయారైంది. రూ.లక్షల విలువ చేసే యంత్రాలు శిథిలావస్థకు చేరడంతో ప్రజాధనం కూడా వృథా అయిందని స్థానికులు వాపోతున్నారు.

అసాంఘిక కార్యకలాపాలు

సంపద కేంద్రాల్లో పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో మందుబాబులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పరిశుభ్రతపై స్వచ్ఛాంధ్రా-స్వర్ణాంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. కానీ అధికారుల నిర్లక్ష్యంతో పలు సంపద కేంద్రాలు మూలకుచేరాయి.

నిధుల కొరత

యంత్రాల మరమ్మతులు, బృందావనాలు అభివృద్ధి చేసేందుకు కేటాయించాల్సిన నిధులను పంచాయతీ కార్యదర్శులు వేరే దానికి వినియోగించడంతో అవి నిరుపయోగంగా మారాయి. సత్యవేడు నియోజకవర్గంలో 100పైగా సంపద కేంద్రాలు ఉన్నప్పటికీ సుమారు 60పైగా మరమ్మతులు నోచుకోకా గోడలు, తొట్టెలు బీటలు వారుతున్నాయి. నిధుల కొరతతో చెత్త సేకరణ చేయలేకపోతున్నారు. ప్రతి నెల మూడో శనివారం నిర్వహించే స్వచ్ఛ దివస్ కార్యక్రమం మేజర్ పంచాయతీలో తప్ప మిగతా గ్రామాల్లో ఊసే లేదు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా గ్రీన్ అంబాసిడర్లకు జీతాలు చెల్లించేవారు. వైకాపా నిర్లక్ష్యంతో పారిశుద్ధ్య కార్మికులకు జీతాలు లేకపోవడంతో చెత్త సేకరణ విధానం పూర్తిగా నిర్వీర్యం అయింది.

చర్యలు తీసుకుంటాం..

పలు పంచాయతీల్లో నిధులు కొరతతో గ్రామీణ ప్రాంతాల్లో చెత్త సేకరణ పూర్తిస్థాయిలో చేయలేకపోతున్నాం. నిధులను బోరు మరమ్మతులకు తదితర ఉపయోగిస్తుండటంతో ఇబ్బందులు పడుతున్నాం. స్వచ్ఛాంధ్రా-స్వర్ణాంధ్రా కార్యక్రమంలో భాగంలో చెత్త సేకరణ సక్రమంగా ఇంటింటా సేకరించాలని కార్యదర్శులకు సూచించాం. ఎవరైనా నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటాం.

- త్రివిక్రమరావు, ఇన్‌ఛార్జి ఎంపీడీవో

'భూములు తీసుకుని మోసం చేస్తారా'

భూ అభివృద్ధి పనులు అడ్డుకున్న స్థానికులు

వరదయ్యపాళెం: మాయమాటలతో తక్కువ ధరకు తమ భూములు కొనుగోలు చేసి, ఇచ్చిన హామీలను వంచించి మోసం చేస్తారా అంటూ కంచరపాళెంలో కొందరు భూబాధితులు నిరసన తెలిపారు. మండలంలోని కంచరపాళెంలో 60 ఎకరాల ఎస్సీ కార్పొరేషన్ భూములను కొనుగోలు చేసిన యజమానుల తీరుపై స్థానిక భూబాధితులు నిరసన తెలుపుతూ భూఅభివృద్ధి పనులను అడ్డుకున్నారు. వారు మాట్లాడుతూ తక్కువ ధరకు భూములను విక్రయించడానికి తాము అంగీకరించకపోవడంతో ఎకరాకు అదనంగా రూ.2లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి కొనుగోలు చేసిన తర్వాత ముఖం చాటేశారని అన్నారు. కాంట్రాక్టు పనులను స్థానికులకే కల్పిస్తామని హామీ ఇచ్చి విస్మరించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. న్యాయం చేయకపోతే రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసి పోరాటం చేస్తామన్నారు.

(c) eenadu

గూడూరు

•గూడూరు • వెంకటగిరి • సూళ్లూరుపేట

కోళ్ల ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్	
బ్రాయిలర్	116
లేయర్	112
బ్రాయిలర్స్	212
బ్రాయిలర్స్ స్కిన్‌లెస్	234
లేయర్ మాంసం	190

పాఠశాలలో వసతుల కల్పన

వెంకటగిరి, న్యూస్‌టుడే: పాఠశాలల్లో మరిన్ని మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందని జిల్లా సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు సమన్వయకర్త గౌరీశంకర్ అన్నారు. బుధవారం కేజీబీవీ, ఆదర్శ, పల్లివేడు, జడ్పీ పాఠశాలల్లో వసతులను పరిశీలించారు. కేజీబీవీలో సిబ్బంది మధ్య నెలకొన్న వివాదంపై విచారించారు. సిబ్బందిపై మండిపడి తొలగించాలని సూచించారు. సహాయక ప్రాజెక్టు సమన్వయకర్త శివశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి దిశగా కూటమి అడుగులు

ఓజిలి, న్యూస్‌టుడే: సుపరిపాలన, అభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. బుధవారం ఓజిలి మండలం కురుగొండ, మానమాల గ్రామాల్లో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటా పర్యటించి ప్రభుత్వం ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం, నాయకులు మధుసూదన్‌రెడ్డి, విజయకుమార్, ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

కురుగొండలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నాయకులు

మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

తిక్కవరంలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

చిల్లకూరు, న్యూస్‌టుడే: మండలంలోని తిక్కవరంలో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో తెదేపా నేతలు 'సుపరిపాలనలో తొలి అడుగు'లో భాగంగా బుధవారం పర్యటించారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఏడాది కాలంలో చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించే కరపత్రాలను ఇంటింటికీ వెళ్లి అందజేశారు. స్థానికంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీశారు. అధికారులతో చర్చించి పరిష్కారానికి చొరవ చూపుతామని హామీ ఇచ్చారు. తెదేపా మండలాధ్యక్షుడు దువ్వూరు రాజశేఖర్‌రెడ్డి, సర్పంచి సత్యనారాయణరెడ్డి, పలువురు నేతలు పాల్గొన్నారు.

వైద్యం కోసం ఆర్థికసాయం

చిల్లకూరు, న్యూస్‌టుడే: పాలిచర్లవారిపాలెం గ్రామానికి చెందిన యస్దాని కొన్నేళ్లుగా క్షయ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆయన వైద్య ఖర్చుల నిమిత్తం రాజనేని రామానాయుడు ఛారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు శ్రీనివాసులునాయుడు సహకారంతో బుధవారం ట్రస్టు సభ్యుడు ప్రజేంద్రరెడ్డి రూ. 15 వేల ఆర్థికసాయాన్ని బాధితుడికి అందజేశారు.

కబ్జాలపై షార్ అధికారుల పరిశీలన

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: పట్టణంలోని షార్ స్థలాల ఆక్రమణపై అధికారులు ఆరా తీస్తున్నారు. సూళ్లూరుపేట పురపాలక సంఘంలోని జాతీయ రహదారి నుంచి శ్రీహరికోటకు వెళ్లే రహదారి, షార్ బస్టాండ్ నుంచి వైజంక్షన్ వరకు, గూడ్సుషెడ్డు రోడ్డు, తదితర షార్ యాజమాన్యం పరిధిలో ఉన్నాయి. ఈ స్థలాలను పలువురు ఆక్రమించి పండ్ల దుకాణాలు, టిఫిన్ సెంటర్లు, చేపల మార్కెట్‌తోపాటు ఇతర వ్యాపారాలు చేస్తున్నారు. దాంతో శ్రీహరికోటకు వెళ్లే వాహనాలకు ఇబ్బందిగా మారింది. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. రాత్రివేళ షార్ బస్సులు వెళ్లేందుకు బాగా ఇబ్బందిగా ఉండటంతో యాజమాన్యం దృష్టి పెట్టింది. ఇప్పటికే పలుమార్లు ఆక్రమణదారులకు షార్ యాజమాన్యం హెచ్చరికలు చేసినా ఎవరూ ఖాతరు చేయలేదు. దాంతో బుధవారం సాయంత్రం షార్ ఎంఎస్‌ఏ గ్రూపు డైరెక్టర్ గోపీకృష్ణతోపాటు మరికొందరు అధికారులు వచ్చి షార్ యాజమాన్యానికి చెందిన రోడ్లు, ఇతర స్థలాలను పరిశీలించారు. వాటి వల్ల రాకపోకలకు కలిగే ఇబ్బందులను గుర్తించారు. దీనిపై నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నారు. తదుపరి చర్యలకు ఉపక్రమించనున్నారు.

డీఎల్‌పీవో బదిలీ

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: స్థానిక డీఎల్‌పీవోగా పనిచేస్తున్న రవీంద్ర నెల్లూరు జిల్లా సైదాపురం ఎంపీడీవో(పూర్తి అదనపు బాధ్యతలు)గా బదిలీ య్యారు. ఆయన స్థానంలో డీఎల్‌డీవో జాలిరెడ్డికి బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆయన ఇక్కడ రిలీవ్ అయి అక్కడ బాధ్యతలు చేపట్టారు.

రిజర్వు స్థలాలు లేకుండా లేఅవుట్లు

మేనకూరులో వెలసిన అక్రమ లేఅవుట్

నాయుడుపేట, న్యూస్‌టుడే: పట్టణం, మేనకూరు పారిశ్రామికవాడ ప్రాంతాల్లో ప్రజాప్రయోజనాలకు అవసరమైన స్థలాల కేటాయింపు లేకుండానే అక్రమ పద్ధతిలో లేఅవుట్లు నిర్మిస్తున్నారు. దీంతో ఆ ప్రాంతాల్లో సామాజిక అవసరాల కోసం మౌలిక వసతుల కల్పనకు ఇబ్బందులు ఏర్పడే పరిస్థితి. నాయుడుపేట పట్టణం, మేనకూరు, తాళ్వాయిపాడు గ్రామాలు జాతీయ రహదారులు, పారిశ్రామికవాడకు దగ్గరగా ఉండడంతో ఈ ప్రాంతాల్లో స్థిరాస్తి వ్యాపారం క్రమంగా పెరుగుతోంది. కొందరు వ్యాపారులు వ్యవసాయ భూములు కొని వెంచర్లు నిర్మిస్తుండటం తెలిసిందే. తుడా నిబంధనల మేరకు లేఅవుట్ భూముల్లో పది శాతం రిజర్వుడు స్థలం కేటాయించాలి. పది ఎకరాలు లేఅవుట్లు నిర్మిస్తే ఇందులో ఒక ఎకరం భూమిని సామాజిక ప్రజాప్రయోజనాలు కింద పురపాలక సంఘం లేదా గ్రామ పంచాయతీ పేరున రిజిస్ట్రేషన్ చేయాలి. అయితే కొందరు వ్యాపారులు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులను ఆశ్రయించి అనధికార లేవుట్లు నిర్మించి ప్లాట్లు విక్రయిస్తున్నారు.

● సామాజిక అవసరాలకు కేటాయింపులు లేని వైనం

నేతల అండదండలతో..

నాయుడుపేట పట్టణ పరిధిలోని జువ్వలపాళెం, బిరదవాడ తుమ్మూరు, విన్నమాల, ఏల్చూరు సాగరం, పిచ్చిరెడ్డితోపు, అగ్రహారపేట, మేనకూరు, పెళ్లకూరు మండలం తాళ్వాయిపాడు ప్రాంతాల్లో ఉన్న 26 లేఅవుట్లలో రిజర్వు స్థలాలు కనిపించడం లేదు. స్థిరాస్తి వ్యాపారులు రాజకీయ నాయకులు, కొందరు ప్రజాప్రతినిధులతో ఉన్న సంబంధాలతో ఇక్కడ అనధికార లేవుట్లు నిర్మించి.. గతంలో కొందరు నేతలకు గుడ్‌విల్ కింద రిజిస్ట్రేషన్లు చేశారన్న విమర్శలున్నాయి. తాజాగా, నాయుడుపేట, మేనకూరు ప్రాంతాల్లో వెలసిన వెంచర్లలో కూడా ఇదే తరహా వ్యవహారం కొనసాగుతుండటం విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారిక లేఅవుట్లలో ప్రజాప్రయోజనాలకు అరకొర యోగ్యం కాని స్థలాలు కేటాయించడంతో ఉపయోగం లేకుండా ఉన్నాయి.

ప్రాంతం	లేఅవుట్లు	అనధికారికం
నాయుడుపేట పట్టణం	21	15
మేనకూరు	10	02
తాళ్వాయిపాడు	05	04

వివరాలు సేకరిస్తున్నాం

ఇప్పటికే కొన్నిచోట్ల అనధికార లేవుట్లు గుర్తించాం. ప్లాట్లలో హద్దు రాళ్లు తొలగించాం. లేఅవుట్లదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించి అనుమతులు తీసుకోవాలి. రిజర్వు స్థలాలు కేటాయించిన జాబితాలను సిద్ధం చేశాం. **- ఫజులుల్లా, కమిషనర్ నాయుడుపేట**

మేమున్నాం.. మీకు తోడుగా..

గూడూరు : 85002 02046
నాయుడుపేట: 80085 73970
సూళ్లూరుపేట: 96188 78782
వెంకటగిరి : 80085 73966
సమయం 10 AM TO 1 PM

కోట, న్యూస్‌టుడే: సమస్య: చెందోడు పంచాయతీ పరిధిలోని విద్యానగర్‌లో మురుగుకాలువ తరుచుగా చెత్తతో నిండి పూడిపోతోంది. **- నాగలక్ష్మి, స్థానికురాలు**
సమాధానం: త్వరలోనే మురుగు కాలువకు పైపులు వేసి సమస్య పరిష్కరిస్తాం. **-కిరణ్, గ్రామ కార్యదర్శి**

సూళ్లూరుపేట, న్యూస్‌టుడే: సమస్య: నాగరాజాపురంలో బీఎస్ఎన్ఎల్ కార్యాలయం పక్కన స్తంభానికి వీధి దీపం వెలగడం లేదు. **- ఎంవీ కృష్ణయ్య, విశ్రాంత వైద్య ఉద్యోగి**
సమాధానం: వీధి దీపం వెంటనే ఏర్పాటు చేయిస్తాం. **- కె.చిన్నయ్య, పుర కమిషనర్**

వెంకటగిరి, న్యూస్‌టుడే: సమస్య: పట్టణంలోని 16వ వార్డు దక్షిణపు వీధిలోని చర్చికి ఎదురు లైనులో మురుగు నీరు రోడ్డుపైకి పొంగిపొర్లుతోంది. **-శేఖర్, వెంకటగిరి**
సమాధానం: కాలువలో వ్యర్థాలు తొలగించి మురుగు నీరు వెళ్లేలా చూస్తాం. **- రామారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్**

బాలాయపల్లి, న్యూస్‌టుడే: సమస్య: పెరిమిడి పంచాయతీ సీసీ కండ్రిగకు రోడ్డు వసతి లేదు. మట్టి రోడ్డున్నా అధ్వానంగా తయారైంది. **-అంకయ్య, గ్రామస్థుడు**
సమాధానం: పంచాయతీరాజ్ శాఖ నిధులకు ప్రతిపాదనలు పంపాల్సి ఉంది. ఇందుకు తగు చర్యలు తీసుకుంటాం. **- వినీల్‌కుమార్, ఎంపీడీవో**

నాయుడుపేట, న్యూస్‌టుడే: సమస్య: లక్ష్మణ్‌నగర్‌లో రోడ్డుకు మధ్యలో డ్రెయిన్ పైపు దెబ్బతిని అపరిశుభ్రంగా ఉంది. రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. **-స్థానికులు**
సమాధానం: సిబ్బంది ద్వారా దెబ్బతిన్న పైపు స్థానంలో కొత్తది ఏర్పాటు చేయిస్తాం. **-ఫజులుల్లా, కమిషనర్**

గూడూరు పట్టణం: సమస్య: చవటపాలెం వద్ద అధ్వాన కాలువతో ఇబ్బందులు పడుతున్నాం. **-శ్రీనివాసులు**
సమాధానం: కాలువలను పరిశుభ్రం చేస్తాం. బ్లీచింగ్ చల్లిస్తాం. **- వెంకటేశ్వర్లు, కమిషనర్**

నాయుడుపేట పట్టణం : సమస్య: అగ్రహారపేట ప్రధానవీధిలో వాహనాలు నిలపడంతో సమస్యగా ఉంది. **-వెంకటయ్య**
సమాధానం: రోడ్డుపై వాహనాలు పెట్టకుండా చర్యలు తీసుకుంటాం. **-బాబీ, సీఐ**

సమస్య: నాయుడుపేట ప్రధాన వీధిలో డివైడర్లపై సంచార జాతుల నివాసాలతో వ్యాపారులకు ఇబ్బంది కలుగుతోంది. **-స్థానికుడు**
సమస్య: బజారువీధుల్లో కేబుల్ తీగలు నేలకు తక్కువ ఎత్తులో ఉన్నాయి. **-మణి, స్థానికుడు**
సమాధానం: సంచార జాతుల వారు రోడ్డుపైకి రాకుండా చేస్తాం. వారి సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటాం. తీగల సమస్య పరిష్కరిస్తాం.
- ఎస్‌కే ఫజులుల్లా, కమిషనర్

విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఎంఈవో మునిరత్నం

పాఠశాలకు తాళాలు వేసి నిరసన

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: పురపాలక పరిధి చంద్రబాబునగర్‌లోని ప్రాథమిక పాఠశాలకు బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులు తాళాలు వేసి నిరసన వ్యక్తం చేశారు. ఇక్కడి 3, 4, 5వ తరగతుల విద్యార్థులు 20 మందిని స్థానిక తుమ్మూరు పాఠశాలలోకి విలీనం చేశారు. అక్కడికి వెళ్లేందుకు విద్యార్థులు రైల్వే వంతెన, జాతీయ రహదారి దాటి పోవాల్సి ఉంది. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలకు తాళాలు వేసి ఉన్నతాధికారులు స్పందించి కాలనీవాసులకు న్యాయం చేయాలని డిమాండు చేశారు. ఇక్కడే ఐదు తరగతులు కొనసాగించాలని నినదించారు. ఎంఈవో మునిరత్నం పాఠశాల వద్దకు చేరుకుని తల్లిదండ్రులతో మాట్లాడి పోలీసుల సమక్షంలో పాఠశాలను తెరిపించారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఎంఈవో తెలిపారు.

భూముల పరిశీలన

బాలాయపల్లి, న్యూస్‌టుడే: మన్నూరులో చిన్న పరిశ్రమల స్థాపనకు ప్రభుత్వ భూములను తహసీల్దారు విజయలక్ష్మి బుధవారం పరిశీలించారు. మండలం నుంచి సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు 40 ఎకరాలు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశాలున్నాయి. దీంతో గతంలో మన్నూరులో భూములున్నట్లు నివేదికలు పంపడంతో ఆ మేరకు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ భూములు కొంత అనధికారికంగా ఆక్రమించినట్లు గుర్తించారు. **దొరవారిసత్రం:** తనయాలి వద్ద ఎస్టీలు సాగు చేసుకుంటున్న 25 ఎకరాల ప్రభుత్వ భూములను బుధవారం ఐటీడీఏ పీవో నిరంజన్ స్థానిక తహసీల్దారు శైలకుమారితో కలిసి పరిశీలించారు. 25 కుటుంబాలకు చెందిన ఎస్టీలు ఈ భూములను ఎన్నో ఏళ్లుగా సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. గతంలో జరిగిన రెవెన్యూ సదస్సుల్లో తమకు డీకేటీ పట్టాలు మంజూరు చేయాలని ఫిర్యాదు చేశారు. దీనిపై బుధవారం ఐటీడీఏ, రెవెన్యూ అధికారులు పరిశీలన చేశారు.

ఐఐహెచ్‌టీలో స్పాట్ అడ్మిషన్లు

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని భారతీయ చేనేత శిక్షణ కేంద్రం(ఐఐహెచ్‌టీ)లో ప్రవేశాలకు ఈ నెల 15 వరకు స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కేంద్రం ఓఎస్‌డీ గిరిధర్‌రావు తెలిపారు. పదో తరగతి పాసైన వారికి ఈ కేంద్రంలో చేనేత, జౌళి రంగంలో మూడేళ్లపాటు డిప్లొమా కోర్సు అందించనున్నట్లు వివరించారు. నెలకు రూ.2500 చొప్పున ఉపకారవేతనం అందించనున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన వారు 98661 69908, 90102 43054 నంబర్లను సంప్రదించాల్సిందిగా కోరారు.

ఆక్రమణ చెరలో పాఠశాల భవనం

రంగన్నగుంటలోని పాఠశాల భవనం కొన్నేళ్లుగా ఆక్రమణకు గురవుతోంది. అధికారులు హెచ్చరిస్తున్నా ఫలితం లేదు. పదేళ్ల క్రితం విద్యార్థులు లేరని పాఠశాలను ఎత్తేశారు. అయితే రూ.లక్షలతో నిర్మించిన భవనం మాత్రం పరులపాలవుతోందని కొందరు స్టోర్ రూములుగా కూడా వినియోగించుకుంటున్నారు. పరిసరాలను ఆక్రమించుకొంటున్నారు. ఈ విషయమై ఎంఈవో మస్తానయ్యను వివరణ కోరగా.. పరిశీలించి ఆక్రమణకు గురై ఉంటే నోటీసులిచ్చి చర్యలు తీసుకుంటామన్నారు. **- న్యూస్‌టుడే, కోట**

ఈ కాలువలో సాగునీరు పారేనా?

నెల్లూరుపల్లి పెన్నక్క చెరువుకు సాగునీరు వెళ్లే సప్లయ్ ఛానల్ పూర్తిగా మొక్కలతో నిండి అధ్వానంగా తయారైంది. దీంతో రైతులు పొలాలకు సాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారు. కోట-అడ్డ రోడ్డు సమీపాన ఉన్న చల్లకాలువ నుంచి సప్లయ్ ఛానల్ ద్వారా సాగునీరు వెళ్తుంది. కాలువ మొక్కలు, వ్యర్థాలతో తరచూ నిండిపోతోంది. తొలగించినా యథావిధిగానే మారుతోంది. ఇరిగేషన్ ఏఈ మునిరత్నంను వివరణ కోరగా త్వరలోనే మరమ్మతులు చేయిస్తామన్నారు.
- న్యూస్‌టుడే, కోట

మలుపులో ప్రమాదకరంగా గుంత

నాయుడుపేట అగ్రహారపేట వెళ్లే వీధి మలుపులో ఇనుప చువ్వలు పైకి లేచిన గుంత ప్రమాదకరంగా ఉంది. నిత్యం వేలాది మంది విద్యార్థులు రాకపోకలు సాగించే మలుపులో గుంతతో ఇబ్బంది పడుతున్నారు. మురుగు కాలువ రోడ్డు దాటే చోట గుంత పడి ఇనుప చువ్వలు కనిపిస్తున్నాయి. విద్యార్థులు సైకిళ్లపై ముందుకు సాగడం, వాహనాలు రావడంతో తిప్పలు పడుతున్నారు. గుంతను పూడ్చాల్సి ఉంది. **- న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం**

కేటాయింపు ఒకదానికి.. వినియోగం మరోదానికి

నాయుడుపేట పురపాలక సంఘం పరిధిలోని సెప్టిక్ ట్యాంకు వ్యర్థాలను బయటకు తరలించే వాహనాన్ని అధికారులు చెట్లకు నీళ్లు పట్టడానికి వినియోగిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వం వాహనాన్ని పురపాలక సంఘం పరిధిలోని సెప్టిక్ ట్యాంకులను తక్కువ రుసుముతో క్లీన్ చేసేదానికి కేటాయించారు. అయితే అధికారులు ఆ పని చేయకుండా చెట్లకి నీళ్లు పట్టడానికి వినియోగిస్తున్నారు. కొందరు ప్రైవేటు వ్యక్తుల ఒత్తిళ్లకు లోబడి వాహనాన్ని వేరే అవసరాలకు వినియోగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. **- న్యూస్‌టుడే, నాయుడుపేట పట్టణం**

బంగారుపేటలో ఎమ్మెల్యే పర్యటన నేడు

వెంకటగిరి, న్యూస్‌టుడే: పట్టణంలోని బంగారుపేటలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా గురువారం ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ పర్యటించనున్నారు.

జ్ఞాపికలు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

ఘనంగా ఉద్యోగ విరమణ వీడ్కోలు

నిడిగల్లు(బాలాయపల్లి), న్యూస్‌టుడే: నిడిగల్లు ఉన్నత పాఠశాలలో పదిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు గ్రామస్థుడు వెలుగోటి నారాయణ బుధవారం జ్ఞాపికలను అందించారు. మండలానికే ప్రథమ, ద్వితీయ స్థానంలో మార్కులు పొందిన హరిణి, దేవిశ్రీకు నగదు బహూకరించారు. పాఠశాలలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగ విమరణ చేసిన వాణెమ్మకు, బదిలీ అయిన ఉపాధ్యాయులకు వీడ్కోలు సభ నిర్వహించి.. సర్పంచి గాయిత్రి, హెచ్‌ఎం మంజుల తదితరులు సత్కరించారు. **నాయుడుపేట, న్యూస్‌టుడే:** గొట్టిప్రోలు గ్రామంలో బీసీ వసతి గృహం వార్డెన్‌గా పని చేసి ఉద్యోగ విరమణ చేసిన పేరంశెట్టి శ్రీనివాసులును బుధవారం నాయుడుపేట పడమటి వీధిలో జరిగిన ఒక కల్యాణమండపంలో ఘనంగా సన్మానించారు. పలువురు నాయకులు, వసతి గృహాల సంక్షేమ అధికారులు పాల్గొన్నారు.

జడ్పీటీసీ సభ్యుడిపై విచారణ

వాకాడు: తన విధులకు ఆటంకం కలిగిస్తున్నారన్న ఉపాధి పథకం ఏపీవో విజయమ్మ ఫిర్యాదు మేరకు జడ్పీటీసీ సభ్యుడు రౌతు రామకృష్ణ, మరో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై మండల పరిషత్ కార్యాలయంలో ఎస్ఐ నాగబాబు బుధవారం విచారణ జరిపారు. ఎంపీడీవో శ్రీనివాసులు గదిలో జరిగిన సంఘటనపై ఆయన్ను ఎస్ఐ విచారించారు. అలాగే ఉపాధి పథకం ఉద్యోగి పాండును కూడా విచారించారు. కేసులో ఏ1గా ఉన్న శేషయ్యను అరెస్టు చేసినట్లు ఎస్ఐ చెప్పారు.

తెదేపా అధ్యక్షుడికి సన్మానం

కోట : నూతనంగా నియమితులైన తెదేపా మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డిని బుధవారం కొక్కుపాడులో మాజీ మండలాధ్యక్షుడు అశోక్‌కుమార్, నాయకులు, కార్యకర్తలు ఘనంగా సన్మానించారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి

నరసింహారావు

వెంకటగిరి: ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తానని బాధ్యతలు చేపట్టిన తహసీల్దారు నరసింహారావు అన్నారు. బుధవారం గ్రామశక్తి పోలేరమ్మ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుని కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు.

సమ్మె విజయవంతానికి పిలుపు

వెంకటగిరి, న్యూస్‌టుడే: లేబర్ కోడ్ రద్దు చేయాలంటూ ఈ నెల 9న చేపట్టే సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాలసుబ్రహ్మణ్యం అన్నారు. బుధవారం యూటీఎఫ్ కార్యాలయంలో నాయకులతో సమావేశం నిర్వహించారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి

డక్కిలి: నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ గోను రాజశేఖర్ తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ.. గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా, మురుగు సమస్య లేకుండా చూడాలని అధికారులకు చెప్పారు. ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి, తహసీల్దార్ శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ రెడ్డి, దగ్గవోలు సర్పంచి మస్తాన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపీపీ రాజశేఖర్

అక్రమ మద్యం విక్రయాలపై సమాచారమివ్వండి

గూడూరు పట్టణం, న్యూస్‌టుడే: అక్రమంగా మద్యం విక్రయించినా, లైసెన్స్ లేని అనుమానిత వ్యక్తుల నుంచి మద్యం కొనుగోలు చేసినా ఎక్సైజ్ అధికారులకి సమాచారం ఇవ్వాలని జిల్లా ఎక్సైజ్ అధికారి నాగమల్లేశ్వరరెడ్డి తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం డివిజన్‌లోని ఎక్సైజ్ అధికారులకి శిక్షణ తరగతులు నిర్వహించారు.

గూడలిలో ట్యాంకర్లతో నీటి సరఫరా

కోట, న్యూస్‌టుడే: గూడలి స్వర్ణముఖి ద్వారా నీటి సరఫరా చేసే బోరుకు సంబంధించిన విద్యుత్తు హెచ్‌టీ నియంత్రిక ఇటీవల కాలిపోవడంతో 10 గ్రామాలకు స్వచ్ఛమైన తాగునీటి సరఫరా నిలిచిన విషయం విదితమే. మరమ్మతులకు మరో కొద్ది రోజులు సమయం పడుతుందని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు అంటున్నారు. దీంతో గూడలి పంచాయతీలోని గూడలి, రాజుపాళెం, కొండమిట్ట గిరిజన కాలనీ తదితర ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టారు. దీంతో తాత్కాలికంగా తాగునీటి ఇబ్బందులు గూడలి పంచాయతీలో తీర్చారు. మిగతా గ్రామాల్లో అవసరమైన చోట ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

చెరువుల్ని చెరిపేస్తున్నారు

తుమ్మూరు చెరువులో యంత్రాలతో తవ్వకాలు

యంత్రాలతో మట్టి తరలింపు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: మట్టి తవ్వకాలతో సాగునీటి వనరులు ధ్వంసం అవుతున్నాయి. రూపురేఖలు కోల్పోతున్నాయి. ఎక్కడబడితే అక్కడ గోతులు తీయడంతో నీరు తూముల వద్దకు చేరక ఆయకట్టుకు నీటి కొరత ఏర్పడుతోంది. అక్రమార్కులు పోటాపోటీగా నువ్వానేనా అన్నట్లు తవ్వకాలు జరిపి సొమ్ము చేసుకుంటున్నారు..

నాయుడుపేట పురపాలక సంఘం పరిధిలోని తుమ్మూరులోని ఇరిగేషన్ చెరువులో మూడు రోజుల నుంచి మట్టి తవ్వకాలు జరుపుతున్నారు. అధికారుల నుంచి మూడువేల క్యూబిక్ మీటర్ల మట్టి తరలించేలా అనుమతులు పొంది మరీ యంత్రాలతో తోలుతున్నారు. చెరువులోని లోతట్టు ప్రాంతంలో గోతులు తీసి మట్టి తరలిస్తున్నారు. రాజకీయ నాయకులు రైలు పేరిట చెరువులో మట్టి తరలింపులకు అధికారుల నుంచి అనుమతులు పొంది ఇటుకల వ్యాపారులకు తోలుతున్నారు. రోజూ కొన్ని పదుల సంఖ్యలో ట్రాక్టర్లలో తరలిస్తున్నారు. చెరువు కట్టలు తెగ్గొట్టి మరీ దుమ్ము ధూళీ లేచి రహదారులు దెబ్బతినేలా చేస్తున్నారు.

● మండలంలోని పూడేరు చెరువులోనూ ఇదే తరహాలో వైకాపా హయాంలో మట్టి, గ్రావెల్ భారీగా తరలించారు. ఇటీవల మేనకూరు సెజ్ పరిధిలోని కోనేటిరాజుపాళెం చెరువులోనూ మట్టి తరలించారు. చెరువు లోపలి భాగంలో భారీగా గోతులు తీశారు. చెరువు తూముల నుంచి నీరు వ్యవసాయ పొలాలకు పారే అవకాశం లేకుండా చేశారు. ఇరిగేషన్ డీఈ విశ్వనాథంను వివరణ కోరగా.. రైతులు పొలాలకు మట్టి తోలుకునేందుకు అనుమతులు పొందారన్నారు.

చినుకు పడితే చిత్తడే

గత వైకాపా ప్రభుత్వ వైఫల్యం అండగుండాల గ్రామ ప్రజలకు శాపంలా మారింది. ఐదేళ్లుగా తారు రోడ్డుకు మరమ్మతులు చేపట్టకపోవడంతో అది ఏకంగా మట్టి రోడ్డుగా మారింది. తారు లేచి కంకర తేలి దారి పొడవునా గోతులమయంగా మారింది. చినుకు పడితే ఆ మార్గంలో వాహన దారులు రాకపోకలు సాగించలేక అవస్థలు పడుతున్నారు. అక్కంపేట వద్ద జాతీయ రహదారి నుంచి అండగుండాల గ్రామానికి వెళ్లే రోడ్డు పూర్తిగా ధ్వంసం అయింది. ఈ మార్గంలో దాదాపు ఏడు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. చినుకు పడితే ఆటోలు అండగుండాల గ్రామానికి నడపలేం అంటున్నారు. గోతుల్లో ద్విచక్ర వాహనాలు నడపలేక పలువురు అపాచీ కార్మికులు దారి మళ్లించి చేనిగుంట మీదుగా జాతీయ రహదారిపైకి చేరుతున్నారు. త్వరలోనే టెండర్లు పిలిచి తారురోడ్డు ఏర్పాటు చేస్తామని ఇటీవల ఎమ్మెల్యే హామీ కూడా ఇచ్చారు. హామీని త్వరితగతిన అమలు చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, తడ**

చిట్టమూరు విద్యుత్తు శాఖ ఏఈ మృతి

చిట్టమూరు(కోట), న్యూస్‌టుడే: చిట్టమూరు విద్యుత్తు ఉపకేంద్రం ఏఈ పోలయ్య(57) బుధవారం రాత్రి కోట మండలం చెందోడులోని నివాసంలో గుండెపోటుతో మృతి చెందారని కుటుంబీకులు తెలిపారు. విధి నిర్వహణ నుంచి ఇంటికి వచ్చిన ఆయన అస్వస్థతకు గురయ్యారు. ఈ క్రమంలోనే మృతి చెందాడు. ఈయనకు భార్య, ముగ్గురు పిల్లలున్నారు. ఈయన మృతికి ఏడీ చిన్నయ్య, పలువురు ఏఈలు, సిబ్బంది, సంఘ నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు.

దుబాయ్ నుంచి మృతదేహం తరలింపు

నాయుడుపేట పట్టణం, న్యూస్‌టుడే: స్థానిక బలిజ సంఘం నాయకుడు, వ్యాపారి మదిరి చిట్టిబాబు పెద్ద కుమారుడు మదిరి మునిరత్నం(36) మృతదేహాన్ని బుధవారం ఇంటికి తరలించారు. దుబాయ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పని చేస్తున్న మునిరత్నం ప్రమాదవశాత్తు ఇంట్లో పడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతదేహాన్ని దుబాయ్ నుంచి స్వగృహానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. మాజీ మంత్రి పరసారత్నం శ్రీకాళహస్తి మాజీ ఛైర్మన్ శ్రీనివాసులు, పార్థసారథి, బలిజ సంక్షేమ సంఘం నాయకులు, వ్యాపారులు, తెదేపా, జనసేన, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

బీరు సీసాతో యువకుడిపై దాడి

నాయుడుపేట పట్టణం : బీడీ కాలనీ వద్దనున్న మద్యం దుకాణం వద్ద బుధవారం ఆంథోని అనే యువకుడిని మరో ముగ్గురు యువకులు కలిసి బీరుసీసాతో దాడి చేయడంతో తలపై గాయమైంది. పోలీసులకు బాధితులు ఫిర్యాదు చేశారు.

గూడూరు సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
EPNo:7/2021
O.S.No:49/2016
Gulimcherla @ Gurimcherla
Venkata Subbamma .. ..DHR
Vs
Karna Srinivasulu ..JDR
వేలం ప్రకటన
పై నెంబరు E.P.లో డిక్రీ హోల్డర్ డిక్రీ బాకీని రాబట్టుకొనుటకు జె.డి.ఆర్. తాలుకు ఈ క్రింది షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని తేది: 17-07-2025న ఉదయం 10:30 గం॥ ని॥ల నుండి సాయంత్రం 5:00 గం॥ లోపల పైన తెలిపిన కోర్టులో బహిరంగంగా వేలం పాట జరుపబడును. కావున పాటదారులు ఎవ్వరైనా వేలం పాటలో పాల్గొని పాట పాడుకొనవచ్చును.
SCHEDULE
SPSR Nellore District (Tirupati District) - Gudur District Registration -Gudur Sub-Registration-Manubolu Mandal and Panchayat-Manubolu Village- Survey No:267, Door No:170- Assessment No: 280- house site of about 26 ankanams Containing to about 10 ankanams of Terraced building.
Within the following boundaries:
East: House and site of Jakkala Chinnabbaiah and Manne Sankaraiah. South: House and site of Karna Venkata Ramanaiah. West: Vacant site of Yarasi Sudhakar to some extent and house and site of Yekambaram Gurunadham. North: Public Street
DHR Value: 9,00,000/-
Amin Value: 20,00,000/-
ఇట్లు
DHR తరపు న్యాయవాదులు
పి.గోపాల్ రెడ్డి B.com, B.L.
పి.నరేంద్ర Bsc, LL.B.,
గూడూరు

(c) eenadu

విశాఖ తీరానికి 'కార్డేలియా' కళ!!

ప్రయాణికులకు బోర్డింగ్ పాస్‌ను అందజేస్తున్న మంత్రి కందుల దుర్గేష్, ప్రజాప్రతినిధులు, అధికారులు

ఆర్‌కే బీచ్ తీరంలో పర్యాటకులు

విశాఖ పోర్టులో అంతర్జాతీయ టెర్మినల్ నిర్మాణం తరువాత తొలిసారిగా బుధవారం విహార నౌక 'కార్డేలియా' వచ్చింది. దీంతో తీర ప్రాంతం సరికొత్త కళ సంతరించుకుంది. తెల్లని భారీ నౌక సాగర జలాల్లో వస్తుంటే సమీప కొండలపైనుంచి జనం ఆసక్తిగా తిలకించారు. వందల మంది ప్రయాణికులతో వచ్చిన ఈ నౌకకు ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. రాత్రి కడలి జలాలపై వెళుతున్న సమయంలో విద్యుత్తు కాంతుల్లో మెరిసిన తీరు ఎంతగానో ఆకట్టుకుంది. నౌకలో వచ్చిన పర్యాటకులను ప్రత్యేక బస్సుల్లో ఆర్‌కే బీచ్ ప్రాంతానికి చేర్చగా... పలువురు సాగర తీర అందాలను సెల్‌ఫోన్లలో బంధించారు. వందల మంది ఒకేసారి బీచ్ రోడ్డుకు చేరుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది.

–ఈనాడు, విశాఖపట్నం, న్యూస్‌టుడే, వన్‌టౌన్

నౌకలో వచ్చిన ప్రయాణికులు... ఆర్‌కే బీచ్ వద్ద సెల్ఫీలు దిగుతూ...

నేడు భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ రాక

బైక్ ర్యాలీతో స్వాగతానికి ఏర్పాట్లు

వివరాలు వెల్లడిస్తున్న పరశురామరాజు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన తర్వాత, తొలిసారిగా గురువారం విశాఖ వస్తున్న పీవీఎన్ మాధవ్‌కు బైక్ ర్యాలీతో స్వాగతం పలికేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని పార్టీ జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు తెలిపారు. బుధవారం భాజపా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గురువారం సాయంత్రం నాలుగు గంటలకు మాధవ్ విమానాశ్రయానికి చేరుకుంటారని, అక్కడి నుంచి ర్యాలీ ప్రారంభమవుతుందన్నారు. విమానాశ్రయం, ఎన్ఏడీకూడలి, మర్రిపాలెం, ఊర్వశికూడలి, తాటిచెట్లపాలెం, అక్కయ్యపాలెం 80 అడుగులరోడ్డు, దొండపర్తి, ఆర్టీసీ కాంప్లెక్స్, సిరిపురం మీదుగా భాజపా కార్యాలయానికి చేరుకుంటుందన్నారు. సమావేశంలో నాయకులు శ్రీరామ్మూర్తి, దామోదర్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల కొనసాగింపుపై తర్జనభర్జన

ఏయూ ప్రాంగణం, న్యూస్‌టుడే: ఏయూలో విధులు నిర్వహిస్తున్న అతిథి అధ్యాపకులు, ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్, అనుబంధ, ఛైర్ ప్రొఫెసర్ల కొనసాగింపుపై ఏయూ ఉన్నతాధికారులు తర్జనభర్జన పడుతున్నట్లు సమాచారం. వీరి కొనసాగింపుపై ఆయా విభాగాధిపతులతో ఉపకులపతి ఆచార్య జి.పి.రాజశేఖర్ బుధవారం సాయంత్రం సమావేశం నిర్వహించారు. వీరిని ఎలా నియమించారు, పరిశోధక విద్యార్థులను ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్, అనుబంధ ప్రొఫెసర్లుగా ఎలా తీసుకున్నారని విభాగాధిపతులను వీసీ ప్రశ్నించినట్లు తెలిసింది. ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్, అనుబంధ ప్రొఫెసర్లకు వేసవి సెలవుల్లో వేతనాలు ఎలా చెల్లించారని, తదుపరి నిర్ణయం తీసుకొనే వరకు వీరితో బోధన చేయించొద్దని ఆదేశించినట్లు సమాచారం. తమ ప్రమేయం లేకుండా నాలుగేళ్ల క్రితం అప్పటి వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి వారిని నియమించారని విభాగాధిపతులు చెప్పినట్లు సమాచారం. కొంతమంది కాలపరిమితి ముగిసిందని, మరికొందరికి 2026 వరకు ఉందని వీసీ దృష్టికి తీసుకెళ్లారు. కాలపరిమితి ముగిసిన వారికి మళ్లీ ఇంటర్వ్యూలు నిర్వహించి, వారి బోధనా సామర్థ్యం పరీక్షించిన తర్వాత తిరిగి విధుల్లోకి తీసుకోవాలని యోచిస్తున్నట్లు తెలిసింది. ఒక్కో విభాగానికి ఎంతమంది అవసరమో రాతపూర్వకంగా తెలియజేయాలని ఆయా విభాగాధిపతులను ఆదేశించినట్లు చెబుతున్నారు. ఇప్పటికే ఇంజినీరింగ్ విభాగంలో చాలా మంది వెళ్లిపోయారని, ఉన్నవారిని కొనసాగించాలని విభాగాధిపతులు కోరినట్లు సమాచారం. కొత్తగా ఎవరినైనా విధుల్లోకి తీసుకుంటే వారి నుంచి బాండ్లు తీసుకోవాలని సూచించినట్లు తెలిసింది. అనంతరం ప్రిన్సిపల్స్‌తో వీసీ సమావేశం నిర్వహించి వసతి గృహాల్లో సమస్యలు లేకుండా చూడాలని ఆదేశించారు.

'కూటమి' పాలనపై అంతటా సంతృప్తి: ఎంపీ

35వ వార్డులో పర్యటిస్తున్న ఎంపీ శ్రీభరత్, నేతలు

పూర్ణమార్కెట్(అల్లిపురం), న్యూస్‌టుడే : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రభుత్వ పనితీరుపై ప్రజాభిప్రాయం తెలుసుకునేందుకు 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమం దోహదపడుతుందని ఎంపీ శ్రీభరత్ పేర్కొన్నారు. బుధవారం ఆయన 35వ వార్డు వెలంపేట, పూర్ణమార్కెట్ తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడంతో పాటు, ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా సమస్యలు పరిష్కరించాలని స్థానిక అధికారులు, నాయకులకు సూచించారు. ఏడాది పాలనపై ప్రజా స్పందన బాగుందని, అంతటా సంతృప్తి వ్యక్తం అవుతుందని ఎంపీ అన్నారు. కార్యక్రమంలో దక్షిణం తెదేపా ఇన్‌ఛార్జి సీతంరాజు సుధాకర్, వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కర్‌రావు, నాయకులు పాల్గొన్నారు.

రైలు పట్టాలపై విరిగిపడిన కొండచరియలు

ట్రాక్‌పై పడిన కొండచరియలు

జయపురం, రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: ఒడిశాలోని కొరాపుట్ జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాలతో రైల్వే ట్రాక్‌పై కొండచరియలు విరిగిపడి రైళ్ల రాకపోకలు నిలిచిపోయాయి. కొరాపుట్-జయపురం రైల్వేస్టేషన్ల మధ్య జరటి రైల్వేస్టేషన్ సమీపంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీంతో జగదల్‌పూర్ నుంచి భువనేశ్వర్ వెళ్లే హిరాఖండ్ ఎక్స్‌ప్రెస్, కిరండూల్-విశాఖపట్నం ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దు చేశారు. 3న విశాఖ-కిరండూల్ రైలు అరకు వరకే వెళుతుంది. కిరండూల్-విశాఖ, జగదల్‌పూర్-హావ్‌డా రైళ్లు కొరాపుట్ నుంచి బయలుదేరతాయి.

రౌడీషీటర్ హత్య కేసులో ఆరుగురికి రిమాండ్

మాధవధార, న్యూస్‌టుడే: రౌడీషీటర్ నాగమల్లి ఎల్లాజీ హత్య కేసులో ఆరుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు కంచరపాలెం పోలీసులు తెలియజేశారు. జ్ఞానాపురం శ్మశానవాటిక వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన ఘటనలో ఆరుగురు ఎల్లాజీని కొట్టడంతోనే మృతి చెందినట్లు పోలీసులు సీసీ కెమెరాల ఆధారంగా గుర్తించారు. కాగితాల నరసింగరావు, సాయి విశ్వనాథ్, ఏనుగుల సన్యాసిరావు, కాగితాల శ్రీనివాసరావు, దొడ్డి రాజేశ్, బండారు సుందరరావుపై హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

విభాగాలు సరే.. వైద్యం చేయరే!!

★ కేజీహెచ్‌లో ఇదేం దుస్థితి..!
★ పని చేయని పరికరాలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: ఉత్తరాంధ్ర జిల్లాల ఆరోగ్య ప్రదాయినిగా గుర్తింపు పొందిన కేజీహెచ్‌లో కీలకమైన విభాగాల్లో పూర్తిస్థాయి వైద్యసేవలు అందక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. వైద్య పరికరాలు, వైద్యుల కొరతతో రోగులకు అవస్థలు తప్పడం లేదు.

'గుండె'కు అందని వైద్యం: గుండె శస్త్రచికిత్స (కార్డియో థొరాసిక్) విభాగంలో కీలకమైన హార్ట్‌లంగ్ మిషన్, పంపింగ్ స్టేషన్ వైద్య పరికరాలు మూలకు చేరాయి. వైద్యనిపుణులు ఉన్నా.. పరికరాలు లేక రెండు నెలల నుంచి గుండె శస్త్రచికిత్సలు, కవాటాల (వాల్వ్) మార్పిడి చికిత్సలు నిలిచిపోయాయి. 1996లో హిందుస్థాన్ షిప్‌యార్డు ఆర్థిక చేయూతతో కేజీహెచ్‌లో ఓపెన్ హార్ట్ శస్త్రచికిత్సలకు శ్రీకారం చుట్టారు. నెలకు 25 నుంచి 30 వరకు సర్జరీలు చేసేవారు. ఆ తర్వాత పీపీపీ (ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం) కింద హార్ట్‌లంగ్ మిషన్, పంపింగ్ స్టేషన్‌కు ప్రతి నెలా అద్దె చెల్లిస్తూ...సర్జరీలు చేశారు. అలా అద్దెకు తీసుకున్న పరికరాలు పాడయ్యాయి. కొత్త పరికరాల కొనుగోలుకు రూ.5 కోట్లు అవసరమని ప్రతిపాదిస్తూ.. ఇప్పటికే ప్రభుత్వానికి నివేదిక పంపారు. ఈ విషయాన్ని వైద్యాధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఊపిరితిత్తులు, వాస్క్యులర్ సర్జరీలు మాత్రం చేస్తున్నారు.

మూలకు చేరిన హార్ట్‌లంగ్ మిషన్, పంపింగ్ స్టేషన్

సీట్లు కోల్పోయే ప్రమాదం: నెఫ్రాలజీ విభాగంలో పని చేస్తున్న ప్రొఫెసర్, సహ ప్రొఫెసర్‌ను ఇటీవల బదిలీ చేశారు. ఆ స్థానాలను భర్తీ చేయలేదు. ప్రస్తుతం ఇద్దరు సహాయ ప్రొఫెసర్లతో విభాగం నడుస్తోంది. ఇక్కడ నాలుగు డీఎం కోర్సు సీట్లు ఉన్నాయి. ఆ సీట్లు కొనసాగాలంటే కచ్చితంగా ప్రొఫెసర్, సహ ప్రొఫెసర్ ఉండాల్సిందే. ఆయా ఖాళీలు భర్తీ కాకుంటే, సీట్ల కొనసాగింపునకు నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) అనుమతులు జారీ చేయదు.

★ ఈనెల 5 తర్వాత సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల కానుంది. ఈలోపు కొత్తవారిని నియమించాల్సి ఉంది. కేజీహెచ్‌లో వంద మందికి రోజూ డయాలసిస్ జరుగుతుంది. 60 నుంచి 70 మంది కిడ్నీ బాధితులు చికిత్స పొందుతున్నారు. ఇంతటి కీలకమైన విభాగంలో నియామకాలపై దృష్టిసారించాలి.

'ఎముకల'కు ఒక్కరే: ఎముకల విభాగంలో పని చేస్తున్న ఇద్దరు ప్రొఫెసర్లు డాక్టర్ శివానంద, డాక్టర్ లోక్‌నాథ్‌కు ఇటీవల బదిలీ అయింది. వారి స్థానంలో ఎవర్నీ నియమించలేదు. దీంతో ఆ విభాగం బాధ్యతల్ని కేవలం ఒకే ప్రొఫెసర్ పర్యవేక్షిస్తున్నారు. రోజూ ఎముకల ఓపీ ఉంటుంది. వందల సంఖ్యలో రోగులు వస్తుంటారు.

కృతజ్ఞతాభివందనాలు

మా సంస్థ YALLAS Technology Solutions Private Limited ఆధ్వర్యంలో KAUMODAKI LABS అనే ఆధునిక IOT మరియు ఇండస్ట్రీ 4.0 ఇన్నోవేషన్ సెంటర్‌ను అధికారికంగా ప్రారంభించిన భీమిలి శాసనసభ్యులు గౌ॥ శ్రీ గంటా శ్రీనివాసరావు గార్కి కృతజ్ఞతలు తెలియజేస్తూ....
Yallas Technology Solutions has signed a landmark MoU with Croma Campus, MSMEs and Startups Forum – Bharat, KC GlobEd, Skills for Transformation, Meyvn Systems, and Polytechnic College.
YALLAS TECHNOLOGY SOLUTIONS
In Collaboration with Croma Campus is Organizing

అంధుల జీవితాల్లో 'అక్షర' వెలుగులు

★ విశాఖలో బాలికలకు ప్రత్యేక ఆశ్రమ పాఠశాల
★ ప్రభుత్వం మరింత చేయూత ఇస్తే ఎందరికో మేలు

ఈనాడు, విశాఖపట్నం: రాష్ట్రంలో అంధ బాలికలకు ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏకైక ఆశ్రమ పాఠశాల అది. విశాఖ బీచ్ రోడ్డులో సాగర్‌నగర్ సమీపంలో దాదాపు మూడెకరాల్లో విస్తరించి ఉంది. దృష్టి లోపంతో బాధపడుతున్న బాలికల జీవితాల్లో 38 ఏళ్లుగా వెలుగులు నింపుతోంది. ఏపీ విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న పాఠశాలకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు సహకారం అందిస్తున్నారు.

● రాష్ట్రంలో అంధ బాలికలకు ప్రత్యేక పాఠశాల ఉందనే విషయం చాలా మందికి తెలియదు. దీనికి ప్రభుత్వం ప్రాచుర్యం కల్పించడంతోపాటు మరిన్ని సదుపాయాలు సమకూరిస్తే ఎంతో మందికి ఆశాకిరణంగా మారుతుంది.

ఏడాదంతా..: ప్రస్తుతం పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు 52 మంది విద్యార్థులు చదువుతున్నారు. 40 శాతం, అంత కంటే ఎక్కువ అంధత్వమున్న విద్యార్థులను 'సదరం' ధ్రువపత్రం, ఆధార్ కార్డు ఉంటే చేర్చుకుంటారు. ఒకటి నుంచి తొమ్మిది తరగతులకు ఏడాదిలో ఎప్పుడొచ్చినా ప్రవేశాలు కల్పిస్తారు. పదో తరగతి విద్యార్థులకు ఆగస్టు నెలాఖరులోగా ప్రవేశాలు కల్పిస్తారు. ఏటా పదో తరగతి విద్యార్థులు 100 శాతం ఉత్తీర్ణత సాధిస్తున్నారు. ఈ ఏడాది ఫలితాల్లో అత్యధికంగా శ్రీకాకుళానికి చెందిన ఓ విద్యార్థిని 378 మార్కులు సాధించింది. పాఠశాల పూర్వ విద్యార్థిని ఎం.సత్యవతి ఇటీవల జరిగిన అంధుల ప్రపంచ కప్ క్రికెట్ పోటీల్లో రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహించింది.

కళాశాల ఏర్పాటు చేస్తే: ఉమ్మడి రాష్ట్రంలో 1987లో పాఠశాలను స్థాపించారు. బోధనకు 19 పోస్టులు మంజూరు కాగా ఉద్యోగ విరమణలు, బదిలీల తర్వాత ప్రస్తుతమున్న ఉపాధ్యాయులు ఆరుగురే. డీఎస్సీ ఫలితాల తర్వాత ఉపాధ్యాయులను కేటాయిస్తారనే ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. బోధనేతర సిబ్బంది పోస్టులు 13 మంజూరు కాగా ఆరు ఖాళీలున్నాయి. ఇక్కడ బాలికల కోసం జూనియర్ లేదా వొకేషనల్ కళాశాల ఏర్పాటు చేయాలని గతేడాది ప్రతిపాదన వచ్చింది. ఇప్పటికీ ఆ దిశగా చర్యలు లేవు. కళాశాల ఏర్పాటైతే ఇక్కడ చదువు పూర్తి చేసుకున్న విద్యార్థులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

ప్రవేశాలకు ఆహ్వానం: అంధుల పాఠశాలలో ప్రవేశాల ప్రక్రియ చేపడుతున్నాం. ఆరు నుంచి 14 ఏళ్ల లోపు వయసు గల బాలికలు అర్హులు. ఇక్కడ విద్యార్థులకు బ్రెయిలీ లిపిలో బోధన సాగుతుంది. అందుకు తగ్గ పుస్తకాలు ప్రభుత్వం సరఫరా చేస్తుంది. ఉచిత విద్యతోపాటు పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, ఏకరూప దుస్తులు, ఉచిత వసతి, భోజనం, అన్ని వేళలా వైద్య సౌకర్యం, కంప్యూటర్ శిక్షణ అందుబాటులో ఉంటుంది. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలి.

–డి.విజయ, ప్రధానోపాధ్యాయురాలు

9న జడ్పీ సర్వసభ్య సమావేశం

వన్‌టౌన్, న్యూస్‌టుడే : ఉమ్మడి విశాఖ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 9న నిర్వహిస్తామని జడ్పీ సీఈఓ నారాయణమూర్తి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 11 గంటలకు జడ్పీ ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన జరిగే సమావేశంలో జడ్పీటీసీ సభ్యులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పాల్గొంటారన్నారు. ★ గత సమావేశంలో ప్రజా సమస్యలపై పూర్తిస్థాయిలో చర్చ సాగలేదు. కీలక ప్రజాప్రతినిధులు కూడా హాజరు కాలేదు. ఈసారైనా అందరూ హాజరై చర్చించాలని పలువురు కోరుతున్నారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటక ప్రాజెక్టులు

మాట్లాడుతున్న రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్. చిత్రంలో కలెక్టర్ హరేంధిరప్రసాద్, జేసీ మయూర్‌అశోక్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్ తదితరులు

వన్‌టౌన్, న్యూస్‌టుడే : అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా విశాఖలో పర్యాటక ప్రాజెక్టుల రూపకల్పన జరగాలని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా స్టార్ రేటింగ్ కలిగిన పది వేల గదుల్ని అందుబాటులోకి తీసుకురావాల్సి ఉందని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ సూచించారు. బుధవారం విశాఖ వచ్చిన ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో విజయనగరం, విశాఖపట్నం జిల్లాల అధికారులతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. భోగాపురం మండలంలో నిర్మించబోయే ఒబెరాయ్ హోటల్, భీమిలి మండలం అన్నవరంలో నిర్మించే మై ఫెయిర్స్ హోటల్ నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ ప్రక్రియ త్వరగా చేపట్టాలన్నారు. అనుసంధాన రహదారులు, విద్యుత్తు సౌకర్యం కల్పించాలన్నారు. గోస్తనీ నది నుంచి పైపులైన్ల ద్వారా ఆయా హోటళ్లకు అవసరమైన నీటిని సరఫరా చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్ మాట్లాడుతూ... ఆర్కేబీచ్, రుషికొండ, మధురవాడ, భీమిలి, కాపులుప్పాడ, దబ్బంద, ఎండాడ, యారాడ తదితర ప్రాంతాల్లో చేపట్టబోయే ప్రాజెక్టులు, భూసేకరణ ప్రక్రియ పురోగతిని వివరించారు. సమావేశంలో వీఎంఆర్‌డీఏ కమిషనర్ విశ్వనాథన్, జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్, జేసీ మయూర్‌అశోక్, విజయనగరం జేసీ సేతుమాధవన్, ఆయా హోటళ్ల ప్రతినిధులు శంకర్, మనోజ్, విజయనగరం, భీమిలి ఆర్డీఓలు కీర్తి, సంగీత్‌మాధుర్, పర్యాటక శాఖ అధికారులు జగదీష్, మాధవి, విద్యుత్తు శాఖ ఎస్ఈ శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇష్టారాజ్య ఫీజులను నియంత్రించండి!! 8లో

సందర్భమేదైనా ఈనాడు ను చేసుకోండి వేదిక
మీ బంధుమిత్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులకు
ఈనాడు లో ప్రకటనల ద్వారా తెలియజేయండి

వేడుక ఏదైనా..
ఈనాడు ను
చేసుకోండి వేదిక
ఈనాడు యాడ్స్ ద్వారా తెలియజేయండి
ప్రకటనల కొరకు సంప్రదించండి
80087 09638

స్వాగతం... సుస్వాగతం..
గౌ॥ శ్రీ పి.వి.ఎన్. మాధవ్ గారు
రాష్ట్ర బి.జె.పి. అధ్యక్షులు
ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భారతీయ జనతా పార్టీ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికై
విజయవాడ (అమరావతి)లో ప్రమాణ స్వీకారం చేసి నేడు విశాఖపట్నం విచ్చేయుచున్న
గౌ॥ శ్రీ పి.వి.ఎన్. మాధవ్ గార్కి మా హృదయపూర్వక స్వాగతం... సుస్వాగతం..
NAVSHIP MARINE SERVICES PVT. LTD.
(Steamer Agents, Stevedores & Ship Brokers)
Dr. BHUPESH MALARATUA
CHAIRMAN & MANAGING DIRECTOR
smsea SMSEA MARINES PRIVATE LIMITED
VISAKHAPATNAM
S. VENKATESH
CMD, SMSEA Group
Millennium SOFTWARE SOLUTIONS Pvt.Ltd
CMMI Maturity Level 5
J.V. PRASAD
DIRECTOR
Bean Board
Y. ISAAC JEREMIAH
MANAGING DIRECTOR
SRINIVAS PANDA
M.S.RAJU MUDUNURU
HEMAMBARA RAO BODDETI

(c) eenadu

MARGADARSI CHIT FUND PVT. LTD.
Chit Groups are available at our SEETHAMPET BRANCH

CHIT GROUP	DURATION IN MONTHS	MONTHLY INSTALLMENT	CHIT VALUE
LT VV	50	2,00,000	1,00,00,000
LT V	50	1,00,000	50,00,000
LT CC	50	60,000	30,00,000
LT D	50	50,000	25,00,000
LT C	50	30,000	15,00,000
LT X	50	20,000	10,00,000
LT T	50	10,000	5,00,000
LT S	50	6,000	3,00,000
LT B	50	5,000	2,50,000
LT A	50	3,000	1,50,000
FT WA	40	2,50,000	1,00,00,000
FT Z	40	25,000	10,00,000
FT N	40	12,500	5,00,000
TT V	30	1,00,000	30,00,000
TT X	30	20,000	6,00,000
TT T	30	10,000	3,00,000
TT B	30	5,000	1,50,000
ST VV	25	2,00,000	50,00,000
ST I	25	40,000	10,00,000

Please Contact Branch Manager **Mr. K.RAMA KRISHNA**, for further Details. Mobile No's. 8008771312, 9848171312
Landline: 0891-2575562, 2573669, 2552345, 2703634.

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
SME సూర్యబాగ్ బ్రాంచ్ (కోడ్ : 63647), పోర్ట్ హోటల్ ఎదురుగా, సూర్యబాగ్ మెయిన్ రోడ్డు, విశాఖపట్నం – 530020.

స్వాధీనతా ప్రకటన (Rule 8(1)) (చర & స్థిరాస్తుల కొరకు)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 ప్రకారం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, SME సూర్యబాగ్ బ్రాంచ్ (కోడ్-63647), విశాఖపట్నం యొక్క అధీకృత అధికారి అయిన ఈ దిగువ సంతకందారు [illegible] ... Account Nos: CC-43618309372 ... తేదీ.27.04.2025 ... రూ.80,79,293/- ... తేది.28.04.2025 ... [illegible]

ఆస్తుల వివరములు

[illegible]

ఫ్లాట్ నెం.బి-505 యావత్తు ఆస్తి డీడ్ డాక్యుమెంట్ నెం.1907/2024 ప్రకారం శ్రీమతి వెంకటలక్ష్మి తండ్రంగి గారి పేరున కలదు. **హద్దులు: తూర్పు :** ఓపెన్ సెట్ బ్యాక్ స్పేస్, **దక్షిణం :** ఓపెన్ టు స్కై, **పడమర :** కామన్ కారిడార్, **ఉత్తరం :** ఓపెన్ టు స్కై మరియు **పైన :** ఓపెన్ టెర్రస్, **క్రింద :** మూడవ అంతస్తులోని ఫ్లాట్ నెం.బి-405.

తేది : 01-07-2025 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : విశాఖపట్నం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, SME సూర్యబాగ్ బ్రాంచ్, విశాఖపట్నం

ఇష్టారాజ్య ఫీజులను నియంత్రించండి!!

ఈనాడు తోడు

■ 'తల్లికి వందనం' మంజూరు చేయండి ■ డీఈఓతో 'ఈనాడు ఫోన్ ఇన్'కు విశేష స్పందన

సందేహాలు నివృత్తి చేస్తున్న డీఈఓ ఎన్.ప్రేమకుమార్

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే

పాఠశాలల్లో సమస్యలపై డీఈఓ ప్రేమకుమార్‌తో 'ఈనాడు' నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. పలు ప్రాంతాల నుంచి విద్యార్థులు, తల్లిదండ్రులు ఫోన్ చేసి సమస్యలు వివరించారు. కొన్ని ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నాయని, పేద విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పించాలనే నిబంధన ఉన్నా డబ్బులు అడుగుతున్నారనే అంశాలు అందులో ఉన్నాయి. డీఈఓ ప్రేమకుమార్, డిప్యూటీ డీఈఓ సోమేశ్వరరావు వారి సందేహాలను నివృత్తి చేశారు.

?: మా పిల్లల్ని కేంద్రీయ విద్యాలయంలో చదివిస్తున్నాం. గతంలో అమ్మఒడి పథకం వచ్చింది. ప్రస్తుతం తల్లికి వందనం పథకం రాలేదు. - కనకవల్లి, రామలక్ష్మి (పెదవాల్తేరు), సత్యవతి (మధురవాడ), గోవింద్ (గోపాలపట్నం), బొట్టా మంగ (దువ్వాడ), అనిత (సీతమ్మధార), మోహనలక్ష్మి (104 ఏరియా), సువర్ణలత (వాల్తేరు), ఒమ్మి కిరణ్ (ఇసుకతోట), కృష్ణ (గాజువాక), రమాదేవి (కురుపాం మార్కెట్), రాజకుమారి (ఆరిలోవ).

✓: **డీఈఓ :** రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలోని విద్యాసంస్థల్లో చదువుతున్న వారికే తల్లికివందనం ఇవ్వాలన్నది ప్రభుత్వం నిబంధన. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సిలబస్ చదువుతున్న విద్యార్థులకు ఈ పథకం వర్తించదు. ఆ విద్యాసంస్థల డేటా మా వద్ద లేదు.

?: కొన్ని ప్రైవేటు పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. ప్లేస్కూళ్లకే రూ.వేలు కట్టించుకుంటున్నారు. నియంత్రణ చర్యలు చేపట్టాలి. - మాధవస్వామి (కొమ్మాది), అరుణ (గాజువాక), తిరుపతిరావు (పాతడెయిరీఫారం), శివాజీ (విశాలాక్షినగర్), శరణ్య (సిరిపురం), దయాసాగర్ (ఎన్ఏడీ), గురునాథ్ (ఆనందపురం), దివాకర్ (ఆరిలోవ), మీనాక్షి (పెదగదిలి), లలిత (అగనంపూడి).

✓: **డీఈఓ :** ప్రైవేటు పాఠశాలల్లో ఎంత ఫీజులు వసూలు చేయాలో గతంలో నిబంధనలు పంపించాం. ఆ విధంగా అయితే పాఠశాలలు నిర్వహించలేమని యాజమాన్యాలు కోర్టుకు వెళ్లాయి. కోర్టు తీర్పు అనుసరించి నిర్ణయం తీసుకుంటాం.

?: నిర్బంధ విద్యా హక్కు చట్టం ప్రకారం ప్రైవేటు యాజమాన్య పాఠశాలల్లో పేద విద్యార్థులకు ఉచిత ప్రవేశాలు కల్పించారు. కానీ, పుస్తకాలకు డబ్బులు చెల్లించాలంటున్నారు. - దేవి (నీలమ్మవేపచెట్టు), చిన్నారావు (పెందుర్తి), ఈశ్వరరావు (జగదాంబ), నాయుడు (పెందుర్తి), ధర్మరాజు (మారికవలస), సూర్యానారాయణ (వేపగుంట), గణేష్ కుమార్ (మధురవాడ), కుమార్ (అడివివరం), పద్మావతి (శొంఠ్యాం), నీలవేణి (ఎంవీపీకాలనీ), కవిత (హెచ్‌బీకాలనీ), కరుణ (రామాటాకీస్), స్వర్ణలత (ఆంథోనినగర్), రమాదేవి (సీతంపేట), కుసుమ (పూర్ణమార్కెట్), కరుణ (పందిమెట్ట), వరలక్ష్మి (ఊటగెడ్డ), ధనలక్ష్మి (అల్లిపురం), సువర్ణ (డాబాగార్డెన్స్), భవాని (అక్కయ్యపాలెం), రవికుమార్ (జ్ఞానాపురం), వెంకటరమణ (తాటిచెట్లపాలెం).

✓: **డీఈఓ :** వాస్తవంగా పాఠ్యపుస్తకాలు ఉచితంగా ఇవ్వాలి. వారు రూపొందించుకున్న ప్రత్యేక సిలబస్ ఆధారంగా అదనపు పుస్తకాలకు డబ్బులు అడుగుతున్నట్లు ఉన్నారు. పాఠశాలల యాజమాన్యాలతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తాం.

?: పదోతరగతి ఉత్తీర్ణ సాధించిన విద్యార్థులకు ఒక పాఠశాలలో టీసీ కావాలని దరఖాస్తు చేస్తే రూ.వెయ్యి చెల్లించాలని అంటున్నారు. ఫీజు పూర్తిగా కట్టిన వారికి కూడా ఇదే వర్తిస్తుందని అంటున్నారు. - కృష్ణ (గోపాలపట్నం).

✓: **డీఈఓ :** పాఠశాల యాజమాన్యంతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాం

?: మా ప్రాంతంలో ఇద్దరు విద్యార్థులకు వయసు ఎక్కువగా ఉన్నందున గంట్యాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆరు, ఏడు తరగతులకు నేరుగా ప్రవేశాలు కల్పించమంటే పాఠశాల ఉపాధ్యాయులు నిరాకరిస్తున్నారు. - అర్జున్‌రెడ్డి పెదగంట్యాడ, ✓: **డీఈఓ :** పరీక్ష నిర్వహించి ఏ తరగతికి అర్హులో ఉపాధ్యాయులు నిర్ణయిస్తారు. తగిన విధంగా ఉపాధ్యాయులకు ఆదేశాలు జారీ చేస్తాం. పాఠశాలకు వెళ్లండి.

?: మా బాబు గతేడాది ఒక పాఠశాలలో ఒకటో తరగతి చదివాడు. ఇప్పుడు మరో పాఠశాలలో ఒకటో తరగతిలో చేర్పిస్తే ఉచిత ప్రవేశం కుదరదంటున్నారు. - నాయుడు, పెందుర్తి, ✓: **డీఈఓ:** విద్యార్థి ఒక తరగతి ఒకసారి చదివిన తర్వాత తిరిగి అదే తరగతిలో ఉచిత ప్రవేశాలకు అర్హుడు కాదు.

31 వరకు ఇంటర్ ప్రవేశాల గడువు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ప్రవేశాల గడువు ఈనెల 31 వరకు పొడిగించినట్లు ఇంటర్ బోర్డు ఆర్ఐఓ పి.మురళీధర్ తెలిపారు. ఈ మేరకు బుధవారం అమరావతిలో ఇంటర్ బోర్డు కమిషనర్ కృతికాశుక్లా ఉత్తర్వులు విడుదల చేశారన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ప్రభుత్వ కళాశాలల్లో ప్రవేశాలు పొందాలని సూచించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కార్పొరేషన్, న్యూస్‌టుడే : ఆర్టీసీ టికెట్ బుకింగ్ ఏజెంట్లుగా పని చేయడానికి ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆర్ఎం బి.అప్పలనాయుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం నుంచి హైదరాబాద్, విజయవాడ, తిరుపతి, కడప, ప్రొద్దుటూరు, కర్నూలు, శ్రీశైలం, జైపూర్, నవరంగపూర్, గుణపూర్, పర్లాఖెముండి మొదలైన రూట్లలో ముందుగా రిజర్వేషన్ బుకింగ్‌లు చేయుటకు నగర పరిధిలో ఆథరైజ్డ్ ఏజెంట్లుగా పని చేసే వారు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

చురుగ్గా రేషన్ సరకుల పంపిణీ

వన్‌టౌన్, న్యూస్‌టుడే : జిల్లాలో రేషన్ సరకుల పంపిణీ చురుగ్గా సాగుతోంది. రెండు రోజుల వ్యవధిలో 25.48 శాతం కార్డులకు సరకులు అందజేశారు. వర్షాల నేపథ్యంలో పంపిణీకి ఎలాంటి ఇబ్బందులు లేకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నామని డీసీఎస్ఓ వి.భాస్కర్‌రావు తెలిపారు. మొత్తం 5,24,986 కార్డులు ఉండగా, 1,33,747 కార్డులకు సరకులు అందాయన్నారు. ★ వృద్ధులు, దివ్యాంగులకు సంబంధించి ఇంటి వద్దే అందించాల్సిన సరకుల పంపిణీ మందకొడిగా సాగుతోంది. గత నెల 26న ప్రారంభమైనా... ఇప్పటి వరకు 52.41 శాతం కార్డులకు సరకులు అందించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

సమావేశంలో ఎంపీ శ్రీభరత్, సీపీ శంఖబ్రత బాగ్చీ, కలెక్టర్ హరేంధిరప్రసాద్, కమిషనర్ కేతన్‌గార్గ్

వన్‌టౌన్, న్యూస్‌టుడే : విశాఖ నగరంలో ట్రాఫిక్ అంతరాయాలు లేకుండా చూడాలని ఎంపీ ఎం.శ్రీభరత్ సూచించారు. సాంకేతిక పరిజ్ఞానం వినియోగిస్తూ... క్రమబద్ధీకరణ చర్యలు చేపట్టాలన్నారు. బుధవారం రాత్రి కలెక్టరేట్ సమావేశ మందిరంలో 'ట్రాఫిక్ సమస్య- పరిష్కార మార్గాలపై' నిర్వహించిన సమీక్షలో ఎంపీతో పాటు కలెక్టర్ హరేంధిరప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ పాల్గొన్నారు. నగరంలో ట్రాఫిక్ పరిస్థితులు, సిబ్బంది విధులు, వాహన తనిఖీలు, జరిమానాల విధింపు... తదితర అంశాలపై సీపీ శంఖబ్రతబాగ్చీ వివరించారు. ట్రాఫిక్‌లో సాంకేతిక పరిజ్ఞానం వినియోగంపై వివిధ సంస్థల ప్రతినిధులు పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. నిబంధనలు ఉల్లంఘించే వారిని ముఖ ఆధారిత వ్యవస్థ ద్వారా గుర్తించే పరిజ్ఞానం అందుబాటులోకి తీసుకురావాలని ఎంపీ సూచించారు.

'వామన, నృసింహ' జగన్నాథ్..!

వన్‌టౌన్, న్యూస్‌టుడే : పాతనగరం టర్నర్ చౌల్ట్రీ ఆవరణలో జరుగుతున్న జగన్నాథస్వామి రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా బుధవారం బలభద్ర, జగన్నాథస్వామి వామన, నృసింహస్వామి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఉత్సవ అధికారి, విశాఖ జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ టి.అన్నపూర్ణ ఆధ్వర్యంలో ఈఓ టి.రాజగోపాల్ రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. సాయంత్రం న్యాయవాదుల బృందం ఆధ్వర్యంలో సంగీత విభావరి, చందన డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు.

జీఎస్టీ తగ్గింపుపై ప్రభుత్వానికి వినతి

'రిటైల్ సదస్సు'లో ఆర్ఏఐ సీఈవో కుమార్ రాజగోపాలన్

జ్యోతి వెలిగిస్తున్న సీఎంఆర్ అధినేత మావూరి వెంకటరమణ, కంకటాల టెక్స్‌టైల్స్ అధినేత మల్లికార్జునరావు...చిత్రంలో రిటైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సీఈవో కుమార్ రాజగోపాలన్, వ్యాపారవేత్తలు

ఈనాడు, విశాఖపట్నం: రిటైల్ రంగానికి సంబంధించి అవసరమైన ప్రోత్సాహకాలు, నూతన వాణిజ్య అంశాలపై ఎప్పటికప్పుడు ప్రభుత్వాలతో చర్చిస్తున్నామని రిటైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఆర్ఏఐ) సీఈవో కుమార్ రాజగోపాలన్ అన్నారు. ఇటీవల కొన్ని ప్రాధాన్య వస్తువులపై వస్తు సేవల పన్ను (జీఎస్టీ) తగ్గించాలని కేంద్ర ప్రభుత్వానికి విన్నవించగా కొంత సానుకూలత వ్యక్తం చేసిందన్నారు. బుధవారం విశాఖలో 'రిటైల్ సమ్మిట్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రిటైల్ రంగానికి గతంలో పాలసీని రూపొందించగా దాన్ని మొదటిసారిగా అమలు చేసింది ఏపీలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడేనని గుర్తు చేశారు. సీఎంఆర్ సంస్థల అధినేత మావూరి వెంకటరమణ మాట్లాడుతూ రిటైల్ రంగంలో కొత్తపుంతలు తొక్కించడానికి పుష్కలమైన అవకాశాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాపార పోకడల గురించి చర్చించుకొని ఆలోచనలు పంచుకోవడం ద్వారా వ్యాపారాభివృద్ధికి అవకాశం కలుగుతుందన్నారు. దీంతో అందరి వ్యాపారాలు బాగుంటాయని, రిటైల్ సంఘం విశాఖలో సదస్సు నిర్వహించడం శుభపరిణామమన్నారు. కంకటాల టెక్స్‌టైల్స్ అధినేత మల్లికార్జునరావు మాట్లాడుతూ ఏదైనా వ్యాపారంలో రాణించాలంటే వస్తువుల నాణ్యతతో పాటు పనిచేసే సిబ్బంది వ్యక్తిత్వం బాగుండాలన్నారు. మనం ఏం విక్రయించాలో కాకుండా వినియోగదారుడికి ఏం కావాలో తెలుసుకొని ముందుకు సాగాలన్నారు. వ్యాపార రంగంలో యువతకు అవకాశం ఇవ్వాలన్నారు. అనంతరం 'ఏపీలో రిటైల్ వ్యాపారం లాభదాయకం' అనే అంశం మీద హిరావత్స్, క్రీమ్‌స్టోన్, విశాల్ పెరిఫరల్స్, సీఎంఆర్ గ్రూప్ ప్రతినిధులు చర్చించారు. రిటైల్ రంగంలో డిజిటల్ సాంకేతికత ప్రభావం చూపే తీరుపైనా చర్చించారు.

రూ.2.64 కోట్లతో రహదారి పునరుద్ధరణ

కార్పొరేషన్, న్యూస్‌టుడే : విశాఖ నగరానికి నీటిని అందించే తాటిపూడి రిజర్వాయర్ సమీప మధుపాడ (గ్రామం- కృష్ణాపురం వాటర్‌హెడ్ వర్క్స్) రహదారిని రూ.2.64 కోట్ల జీవీఎంసీ నిధులతో ఇటీవల పునరుద్ధరించారు. ఆ రహదారిని బుధవారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ... మధుపాడ కూడలి నుంచి తాటిపూడి వరకు ఉన్న రహదారి పూర్తిగా మరమ్మతులకు గురికావడంతో పునరుద్ధరించామన్నారు. కార్యక్రమంలో నీటి సరఫరా ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, మేయర్ పీలా శ్రీనివాసరావు, తదితరులు

దివ్యాంగుడి దుకాణానికి విద్యుత్తు పునరుద్ధరణ

హైకోర్టు ఆదేశాలతో యంత్రాంగం కదలిక

మధురవాడ, న్యూస్‌టుడే: రోడ్డు పక్కన చిల్లర దుకాణం పెట్టుకుని జీవనం సాగిస్తున్న దివ్యాంగుడికి రాష్ట్ర హైకోర్టు ఊరటనిచ్చింది. సంబంధిత కాలనీలో రోడ్డుకిరువైపులా వందల బడ్డీలు ఉండగా ఈ ఒక్క దుకాణానికి విద్యుత్తు తొలగించడంపై విద్యుత్తు, జీవీఎంసీ అధికారులపై న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. దీంతో బుధవారం పీఎం పాలెం విద్యుత్తు విభాగం అధికారులు దుకాణానికి విద్యుత్తు కనెక్షన్‌ను పునరుద్ధరించారు. మధురవాడ మిధిలాపురి వుడా కాలనీ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం సమీపంలోని ఓ మద్యం దుకాణం ఎదురుగా రోడ్డు పక్కన దివ్యాంగుడైన గోవింద్ చిన్న బడ్డీ పెట్టుకుని జీవనోపాధి పొందుతున్నాడు. దీనిపై రెండు నెలల క్రితం స్థానిక వైకాపా నాయకుడు ఫిర్యాదు చేయడంతో జీవీఎంసీ అధికారుల సూచన మేరకు ఈపీడీసీఎల్ సిబ్బంది దుకాణానికి విద్యుత్తు సరఫరా నిలిపి వేశారు. తాను దివ్యాంగుడునని, వ్యాపారం లేకుంటే కుటుంబ పోషణ కష్టమని అధికారుల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదు. బెదిరింపులకు సైతం గురి చేశారు. ఈ నేపథ్యంలో ఆయన హైకోర్టును ఆశ్రయించగా ఓ దుకాణాన్ని లక్ష్యంగా చేసుకుని విద్యుత్తు కనెక్షన్ తొలగించి వివక్ష చూపించడం సరికాదని ధర్మాసనం వ్యాఖ్యానించింది. వెంటనే విద్యుత్తును పునరుద్ధరించాలని ఆదేశించడంతో ఆ మేరకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	79	70
లైవ్	101	90
డ్రెస్డ్	146	150
స్కిన్‌లెస్	167	160

బహిరంగ ప్రకటన

యిందుమూలంగా యావన్మందికి తెలియజేయునది ఏమనగా విశాఖపట్నం కాపురస్తులు శ్రీ కొత్తల తాతరావు గారి కుమార్తెయునూ శ్రీ పాసల సన్యాసినాయుడు గారి భార్యయునూ శ్రీమతి కొత్తల రాజేశ్వరి గారి దగ్గర నుండి నా క్లయింటు అయిన కె.ఆర్.యమ్ కోలని, విశాఖపట్నం కాపురస్థులు లేటు శ్రీ నల్లమిల్లి రామచంద్రరెడ్డి గారి భార్య శ్రీమతి నల్లమిల్లి శాంతకుమారి ఈ దిగువ తెలిపిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని కొనుగోలు చేయుటకు ఒప్పందము కుదుర్చుకుని అధిక మొత్తము బయానా చెల్లించియున్నారు.

కావున సదరు షెడ్యూలు ఆస్తిపై ఎవరికైనా ఏ విధమైన అక్షేపణలు, తనఖాలు చార్జీలు ఉన్న యెడల తగు ఆధారములతో ఈ ప్రకటన తేది నుండి ఏడు రోజులలోగా దిగువ అడ్రస్సునందు గాని, పైన తెలిపిన నా క్లయింటుకు గాని లిఖితపూర్వకముగా తెలియజేయవలసినదిగా కోరడమైనది. అట్లు ఏ విధమైన అభ్యంతరములు గడువు తేదీలోగా రాని యెడల సదరాస్తిని నిర్వివాద నిష్పేచి ఆస్తిగా పరిగణించి నా క్లయింటు రిజిష్టరు చేయించుకుందురు. తదుపరి వచ్చు అభ్యంతరములు నా క్లయింటును ఏ విధముగాను బంధింపజాలవని తెలియజేయడమైనది.

షెడ్యూలు

విశాఖపట్నం జిల్లా, మధురవాడ సబ్‌రిజి., గ్రేటర్ విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్ ఏరియాలో చేరిన మధురవాడ పంచాయితీ, మధురవాడ గ్రామంలో చేరిన సర్వే నెంబర్లు: 114/1, 114/2, 114/3, 114/4, 114/8 మరియు 114/9లో నగరాభివృద్ధి సంస్థ వారిచే అప్రూవ్ కాబడిన అప్రూవ్ లే అవుట్ నెం.ఎల్.పి. 11/1993లో చేరిన ప్లాట్ నెంబర్లు 139 మరియు 140 పార్ట్‌లో గల 400 చ॥గజాలు లేక 334-452 చ॥మీ॥ల ఖాళీ స్థలముకు హద్దులు:
తూర్పు: ప్లాట్ నెం.138, దక్షిణం: 33 అడుగుల వెడల్పు రోడ్డు, పడమర: ప్లాట్ నెం.140లో మిగతా భాగం, ఉత్తరం: ప్లాట్ నెంబర్లు 132 మరియు 131.

P.L.R.V. RAMANA RAO, Advocate
Plot No.8, Sapthagiri, D.No. 54-11-52, M.G. Officer Colony, Isukathota, Visakhapatnam-530022
Cell: 9440172097, 9346359767

'ఐఎన్ఎస్ టెగ్' సందర్శన ముగింపు

సింధియా, న్యూస్‌టుడే: భారత నౌకాదళానికి చెందిన 'ఐఎన్ఎస్ టెగ్' నౌక సీషెల్స్ దేశ సందర్శన ముగిసిందని బుధవారం నేవీ వర్గాలు తెలిపాయి. ఆ దేశ 49వ జాతీయ దినోత్సవం సందర్భంగా సీషెల్స్‌లోని పోర్టు విక్టోరియాను సందర్శించి అక్కడ జరిగిన వేడుకల్లో పాల్గొందని పేర్కొన్నాయి. పర్యటనలో భాగంగా ఆ దేశ పౌరులు టెగ్ నౌకను తిలకించారు. సీషెల్స్ మేజర్ జనరల్ మిఖాయిల్ రోజెట్లి, భారత రాయబారి కార్తిక్ పాండేలు పరస్పరం రక్షణ ఒప్పందాలపై చర్చించుకున్నారు.


సీషెల్స్‌లోని విక్టోరియా పోర్టులో భారత నౌక ఐఎన్ఎస్ టెగ్

9న భారీ వాహనాల రాకపోకలు నిలిపివేత

ట్రావెలర్స్ ప్రతినిధులతో మాట్లాడుతున్న సీఐ ప్రసాదరావు

గురుద్వారా, న్యూస్‌టుడే: గురు పౌర్ణమి సందర్భంగా ఈనెల 9న భక్తులు సింహాచలం గిరి ప్రదక్షిణ చేయనున్నందున నగరంలోకి, జాతీయ రహదారిపై ట్రావెల్స్ బస్సులు, భారీ వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు ద్వారకా సబ్ డివిజన్ ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు పేర్కొన్నారు. రామాటాకీస్ దరి అంబేడ్కర్ భవన్‌లో ట్రావెల్ బస్సుల యాజమాన్యంతో బుధవారం ఆయన సమావేశమయ్యారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఉండేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఆ ఒక్క రోజు బస్సులు రాకుండా జాగ్రత్తలు వహించి నగర పోలీసులకు సహకరించాలని కోరారు. స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

EENADU Classifieds

AUTO

VEHICLES FOR SALE

Creta 2022 Run 72000 Diesel * TATA Punch 2022 Run 7000 Petrol Owner Dirven for Sale. ✆ 9849113313, 8333859555.

BUSINESS SERVICES

లోకేష్ గోల్డ్ లోన్స్ బ్యాంక్/ ప్రైవేట్ తాకట్టులో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ రేటుకు కొనబడును. ✆ 9848488068, 7799223300.

శ్రీవల్లి గోల్డ్ లోన్స్ బ్యాంకు/ ప్రైవేట్ తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదేరోజు మార్కెట్ ధరకు కొనబడును. అధిక రుణం ఇప్పించబడును. ✆ 9908545224.

PERSONAL CLASSIFIEDS

CHANGE OF NAME

I, **Steffie** Ann Gonsalvez, daughter of Leslie Michael Gonsalvez, residing at Laasya Residency, Bakkanapalem, Visakhapatnam, formerly known as Steffie Ann Gonsalvez Achanalu have changed my name to Steffie Ann Gonsalvez (affidavit number: 2865/2025) will henceforth be known and addressed as such. All concerned may note.

HEALTH & CARE

మందు మానేయడం ఎలా? బరువు పెరుగుటకు, జాయింట్ పెయిన్స్, షుగర్‌కు విశాఖపట్నం : హోటల్ దాక్షాయణి, రైల్వేస్టేషన్ రోడ్, చావుల మదుం జంక్షన్ వద్ద, ప్రతీనెల 5, 19 తేదీల్లో మందులు.

PERSONAL INTEREST COURSES

MUSIC & DANCE CLASSES

ఉచితంగా కర్ణాటక శాస్త్రీయ సంగీతం & సంస్కృత పాఠాలు, భగవద్గీత, భాగవతం మొదలగు శ్లోకాలు, పద్యాలు నేర్పబడును. ఫోన్: 9000323878, 9963532805.

REAL ESTATE

HOUSE FOR SALE

ATCHYUTAPURAM

North- East Corner Building for Sale. Ready to Move. 121 Sq.Yds. (Cellar+ G+1) 60 Ft., Double Rd., Facing. Prime Location at Atchutapuram ✆ 9885824528.

PLOT FOR SALE

GENERAL

Prime Site 72 & 54 Cents at Dabbanda Near Simhachalam 18km from RTC Complex, Vizag. Contact: 8333859555, 9440320255.

JOBS

Delivery Boys Wanted Visiting Card Co. - Vizag Salary 13K - 15K + Petrol Speak Telugu, Hindi. Call : 9887840205.

Wanted Office Assistant Female with knowledge of Cash, minimum Accounts and Computer knowledge. 8.30 AM to 6 PM. Contact: 9393003003.

శ్రీరామ్ గ్రూప్‌లో విశాఖజిల్లా అంతటా ఎంప్లాయిస్ కావలెను. BDES-15+ Inc., BDMs-24K+ Inc. Exp. Min. 2 Yrs. Age: 25-35. Any Degree. 9666331353.

రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో+వ+మంచి జీతం + ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.

శివకార్తికేయ హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు ఇంటి/ వంట పనిచేయుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 20K. ✆ 99120 11499, 99120 11899.

ద్వారకానగర్ 3rd లేన్ దగ్గర, S.B.I. ప్రక్కన, ఆశీర్వాద్ జ్యూవెలర్స్‌లో పనిచేయుటకు హెల్పర్స్ (Male, వ॥ 50-60 Years) కావలెను. బయోడేటాతో సంప్రదించవలెను. 5pm-8:30pm.

WANTED

స్త్రీ అధికార్ సెంటర్ - పరవాడ నందు పనిచేయుటకు ఉమెన్ సెంటర్ ఇన్‌ఛార్జ్ కావలెను. (Female)
వయస్సు: 35 సం॥ కంటే ఎక్కువ
అర్హత: కనీస డిగ్రీ
గౌరవ వేతనం: 28,000/- to 35,000/- (భత్యాలతో సహా స్థూల)
దరఖాస్తు గడువు: 15-07-2025
స్త్రీ అధికార్ సెంటర్ - పరవాడ అనే సబ్జెక్టుతో దరఖాస్తును breds.rk@gmail.com కు పంపాలి. 25-07-2025 నాటికి ఇంటర్వ్యూకి పిలుస్తాము.
గమనిక: అభ్యర్థినిలు మా సెంటర్ నందు నిరంతర పర్యవేక్షణలో ఉండాలి. వసతి కల్పించబడును.
స్త్రీ అధికార్ సెంటర్ - పరవాడ
సెల్: 9440387563

FACULTY/ TEACHERS

నవోదయ, సైనిక్ స్కూల్ 6th క్లాస్ ఎంట్రన్స్ పరీక్ష కొరకు Maths, Mental ability, English faculty మరియు ఆఫీస్ అసిస్టెంట్ కావలెను. ప్రతిభ పెందుర్తి. 9393121315.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారులు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బులు వసూలు చేయరాదు. డబ్బులు వసూలు చేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

హోంగార్డ్‌ల ఆర్థిక చేయూత

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : నగర పరిధిలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డ్‌లు తమ ఒక్క రోజు వేతనాన్ని సాయంగా అందించి, ఉదారత చాటుకున్నారు. ఆ వివరాలు... హోంగార్డుగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన జి.శ్రీనివాసరావు భార్య ప్రసన్నకుమారికి రూ.6,85,860లు, పదవీ విరమణ పొందిన సత్యనారాయణకు రూ.6,99,350లు ఆర్థికసాయం ప్రకటించారు. బుధవారం సాయం చెక్కుల్ని సీపీ శంఖబ్రతబాగ్చీ చేతుల మీదుగా అందించారు.

సత్యనారాయణకు చెక్కు అందిస్తున్న సీపీ శంఖబ్రతబాగ్చీ

స్నేహితులను కలిసేందుకు వెళ్లి మృత్యుఒడిలోకి..

చందక రాము (పాతచిత్రం)

మాధవధార, న్యూస్‌టుడే: గుర్తు తెలియని వాహనం కారును ఢీకొట్టడంతో ఒకరు మృతి చెందిన ఘటన జాతీయ రహదారి తాటిచెట్లపాలెం కూడలి సిగ్నల్స్ వద్ద బుధవారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ ఫైబర్ నెట్ కంపెనీలో పనిచేస్తున్న ఆర్.రాకేష్, వి.చిరంజీవి, పి.పైడిరాజు కలిసి మంగళవారం రాత్రి ఎన్ఏడీ వద్దనున్న స్నేహితుడు ఇంటికి వెళ్లారు. అర్ధరాత్రి వరకు అక్కడే ఉండి కారులో తిరుగుపయనమయ్యారు. కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాల వద్ద అదే కంపెనీలో పనిచేస్తున్న స్నేహితుడు చందక రాము((25)ను ఎక్కించుకుని నగరంలోకి వెళ్తుండగా తాటిచెట్లపాలెం సిగ్నల్స్ వద్ద మలుపు తిరుగుతుండగా మద్దిలపాలెం నుంచి బిర్లా కూడలి వైపు వేగంగా వస్తున్న గుర్తు తెలియని వాహనం వీరి కారును బలంగా ఢీకొట్టింది. దీంతో కారు వెనుకాల సీటులో కుడివైపు కూర్చొని ఉన్న చందక రాము అక్కడికక్కడే మృతి చెందాడు. రాకేష్, చిరంజీవి, పైడిరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు సంఘటన ప్రాంతానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. గాయాలైన వారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రాముకు భార్య ఉంది. వివాహం జరిగి రెండేళ్లు అవుతోంది. స్నేహితులను కలిసి వస్తానని అర్ధరాత్రి ఇంటి నుంచి బయటకు వెళ్లి ప్రమాదంలో మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

PUBLIC NOTICE

NOTICE is hereby given that my client Sri Ismail Shaik, Door No.8-20-4, Tamil Street, Chinna Waltair, Visakhapatnam -530017 entered into agreement of sale with regard to the schedule mentioned property from Sri. **ADDALA SUBBA VENKATA SATYA RAMACHANDRA RAO,** S/o, late Addala Bennaiah, residing at Tower No.6, Flat No.401, Skycity Apartments, Ambathur Road, Vanagam, Adayalampattu, Thiruvallur -600095, Tamil Nadu State and he stated that this property is free from all encumbrances. Any persons / financial institutions having any right, title, interest, claim or demand of any nature, whatsoever, in respect of the schedule mentioned property, is hereby required to make the same known, in writing along with the documentary proof thereof, to the undersigned within seven days from the date of publication hereof, failing which the negotiations shall be completed and proceed for registration of the same, without any reference to such claims and there after any claims, whatsoever, shall not bind my client.

A-SCHEUDLE: All that total site measuring an extent of **3235 Square yards** or 2704.46 Square meters. Plot No's. 1A, 1B, 2A, 2B, 3A, 3B, 4A, 4B, 5A, 5B, 6, 7A, 7B, 8A, 8B, 9, 10A, 10B, 11A, 11B, 12A, 12B, 13A, 13B, 14, 15A, 15B and 16 in **Town Survey No.124 Part** and **125/2A7** of **Waltair Ward,** situated at East Point Colony, within the limits of the Greater Visakhapatnam Municipal Corporation area and boundaries and the measurements of the total extent by:
BOUNDARIES: East: Vacant Land, **South:** 40 feet Road, **West:** 30 feet Road, **North:** SGK Apartments.

B-SCHEDULE: Out of which the Schedule mentioned Property, together with **Flat No.503** Super Built-up Area of **1008 Sft.** including balconies and proportionate undivided share in the corridors and other common areas situated on the **FOURTH FLOOR** in **Block-B** including Car parking space No.23 measuring 58 Sft. in the Cellar of the building of **"EAST COAST APARTMENTS"** in Schedule "A" site together with undivided and unspecified share of **52 Square yards** or **43.478 Square meters. BOUNDARIES OF FLAT NO.503 IN FOURTH FLOOR: East:** Open to Sky and Flat No.502, **South:** Open to Sky, **West:** Flat No.504, **North:** Corridor, **Top:** Terrace, **Below:** Flat No.403.

A. PRABHAKAR REDDY, ADVOCATE
Abhimanyu Apts., K.D.P.M. High School Road, East Point Colony, Waltair, Visakhapatnam -530017. **Cell: 9949425399**

తెరపై ఈనాడు

పెందుర్తి, న్యూస్‌టుడే

లక్ష్మీకాంత్ స్క్రీన్-1 - కుబేర

స్క్రీన్-2 - కన్నప్ప

పెందుర్తి ఏసీపీ బాధ్యతల స్వీకరణ

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి ఏసీపీగా ఎన్.వి.భాస్కర రావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడి ఏసీపీ అప్పలరాజు బదిలీపై వెళ్లగా.. ఆ స్థానంలో ద్వారకా పోలీస్ స్టేషన్ ట్రాఫిక్ విభాగంలో విధులు నిర్వహిస్తున్న భాస్కరరావును నియమిస్తూ సీపీ శంఖబ్రత బాగ్చీ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు ఆయన విధుల్లో చేరారు.

పెందుర్తి

భోజన పథకం కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పరవాడ, న్యూస్‌టుడే: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని జిల్లా ఐద్వా అధ్యక్షురాలు పి.మాణిక్యం డిమాండ్ చేశారు. పరవాడలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పప్పులు, కూరగాయల ధరలు ఆకాశాన్ని అంటడంతో మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ప్రభుత్వం ఇచ్చే ధరలు సరిపోక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. నెల నెలా బిల్లులు చెల్లించాలని, గుర్తింపు కార్డులు, యూనిఫారాలు అందించాలని, మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదిలక్ష్మి, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

80085 74978 సమయం: ఉ. 10 నుంచి మ. ఒంటి గంట వరకు

పరవాడ, న్యూస్‌టుడే: ?: పరవాడ సబ్‌స్టేషన్ కూడలిలోని రహదారి వర్షాలకు అధ్వానంగా తయారై రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. - రమణ, పరవాడ

✓: మీపాంత రహదారి సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు చేపడతాం. - వర్మరావు, ఈఈ, ఆర్‌అండ్‌బీ, పరవాడ

వేపగుంట, న్యూస్‌టుడే: ?: 94వ వార్డు రవి నగర్ కాలనీలో మురుగు డ్రైనేజీ గోతులు ప్రమాదకరంగా మారాయి. - సూర్యకళ, వేపగుంట

✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపడతాం. - హేమవతి, జోనల్ కమిషనర్, జోన్-8

వేపగుంట, న్యూస్‌టుడే: ?: సబ్బవరం మండలం గుల్లేపల్లిలో పందుల సంచారం ఎక్కువగా ఉంది. - వి.కోటేశ్వరరావు, గుల్లేపల్లి

✓: క్షేత్రస్థాయిలో పరిశీలించి నివారణ చర్యలు చేపడతాం. - వి.మంగ, పీఆర్‌ఏ, గుల్లేపల్లి

?: సబ్బవరం కళావారు కాలనీలో అంతర్గత రోడ్లు, కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నాం. - ఎం.భాస్కరరావు, కళావారు కాలనీ

✓: ఇక్కడ మౌలిక వసతుల కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపుతాం. - వై.రాజేశ్వరరావు, గ్రామ కార్యదర్శి, సబ్బవరం

రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించేదెప్పుడో..!

రాకపోకలకు స్థానికులకు నిత్యం ఇక్కట్లే..

పరవాడ, న్యూస్‌టుడే

జీవీఎంసీ 79వ వార్డు పరిధిలోని లంకెలపాలెం రైల్వే గేటు మూసివేత కారణంగా స్థానికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో ఫార్మాసిటీ ఏర్పాటుతో 18 ఏళ్ల క్రితం ఇక్కడి రైల్వేగేటును మూసివేసి పైవంతెన నిర్మించారు. రైలు పట్టాలకు అవతల వైపు గ్రామం ఉండడంతో స్థానికులు నిత్యం ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజలు వివిధ పనుల నిమిత్తం జాతీయ రహదారి మీదకి వెళ్లాలన్నా.. తిరిగి రావాలన్నా వంతెన చుట్టూ రెండు వైపులా కలుపుకొని అదనంగా 3 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. రైల్వే గేటు వద్ద రాకపోకలకు వీలుగా అండర్ బ్రిడ్జి నిర్మించకపోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొంది. గత వైకాపా ప్రభుత్వ పాలకులు అప్పట్లో.. అండర్‌బ్రిడ్జి నిర్మాణం త్వరలో జరుగుతుందని పదేపదే చెప్పి మోసగించారని వాపోతున్నారు. కూటమి పాలకులు ఇక్కడి ఇబ్బందులు తీర్చాలని స్థానికులు కోరుతున్నారు.

తప్పనిసరి పరిస్థితిలో ప్రమాదకర ప్రయాణాలు

ఇక్కడ 5వేలకు పైగా జనాభా నివసిస్తున్నారు. రైల్వే గేటుకు అవతల పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, దుకాణాలు, ఆసుపత్రులు, బస్‌స్టాప్‌లు ఉన్నాయి. పాదచారులు దగ్గరి దారిలో వేరుకోవచ్చునని పైవంతెన చుట్టూ తిరిగి వెళ్లకుండా, మూసివేసిన రైల్వే గేటులో నుంచి ప్రమాదకరంగా రైలు పట్టాలు దాటుతున్నారు. ఆ సమయంలో పలువురు ప్రమాదానికి గురవుతుండగా కొందరు ప్రాణాలు కోల్పోతున్నారని స్థానికులు అంటున్నారు. ఊరిలోకి అంబులెన్స్‌లు, ఆటోలు, పాఠశాల బస్సులు రావాలన్నా ఎక్కువ మొత్తంలో అడుగుతున్నారని గగ్గోలు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఇక్కడి రైల్వే అండర్‌బ్రిడ్జి నిర్మించాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబుకు స్థానికులు వినతులు ఇచ్చారు. ఈమేరకు ఎమ్మెల్యే ఈ ఏడాది ఏప్రిల్ నెలలో స్థల పరిశీలన చేశారు.

నానా ఇబ్బందులు పడుతున్నాం....

18ఏళ్లుగా ఇక్కడ రైల్వే అండర్ బ్రిడ్జి కోసం ఎదురు చూస్తున్నాం. రైల్వేగేటు మూసివేత వల్ల నిత్యం వ్యయప్రయాసలకు గురవుతున్నాం. పిల్లలు, వృద్ధులు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు రైల్వేగేటు నుంచే పాఠశాలలకు వెళుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి ఇక్కడ అండర్ బ్రిడ్జి నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలి.

- జి.నాయుడు, స్థానిక నివాసి

దగ్గరి దారిలో వెళ్లేందుకు రాకపోకలిలా..

గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణపై ఆరా..

వి.జుత్తాడ (పెందుర్తి), న్యూస్‌టుడే: గ్రామాల్లో ఇంటింటి చెత్త సేకరణ కార్యక్రమాన్ని క్షేత్రస్థాయి అధికారులు, సిబ్బంది ప్రణాళిక ప్రకారం అమలు చేయాలని జడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి ఆదేశించారు. బుధవారం ఆయన పెందుర్తి మండలం వి.జుత్తాడ పంచాయతీలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించి వ్యర్థాల నిర్వహణ తీరుపై ఆరా తీశారు. ఇంటింటి చెత్త సేకరణకు సిబ్బంది వీలున్నప్పుడు వెళ్లడం కాకుండా సమయపాలన పాటించాలన్నారు. ఈ ప్రక్రియ రోజు విడిచి రోజు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. తాగునీటి నమూనాలను పరిశీలించి నాణ్యత తనిఖీ చేశారు. పెందుర్తి ఎంపీడీవో గుండు అప్పలరాజు ఇతర అధికారులు పాల్గొన్నారు.

చెత్త నుంచి సంపద తయారీ కేంద్రంలో సూచనలిస్తున్న జడ్పీ సీఈవో నారాయణమూర్తి

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించాలి

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి నియోజకవర్గ పరిధిలోని జీవీఎంసీ వార్డుల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను కోరారు. బుధవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలో కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో కలవాలని సత్కరించి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉప మేయర్ దల్లి గోవిందరెడ్డి, జీవీఎంసీ జనసేన పార్టీ ఫ్లోర్ లీడర్, 39వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, 92వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ కేతన్ గార్గ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు

అవీ ఇవీ

■ పెయింటర్ ఆత్మహత్య

కృష్ణరాయపురం(వేపగుంట), న్యూస్‌టుడే: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఆ వివరాలిలా.. కృష్ణరాయపురం సమీప జ్యోతినగర్‌కు చెందిన పెయింటర్ బమ్మిడి గోరేశ్(41), భార్య పద్మ, తల్లి నూకాలమ్మలతో కలసి ఓ అద్దె గృహంలో నివసిస్తున్నారు. కొద్దిరోజులుగా గోరేశ్ పనులకు వెళ్లకుండా మద్యానికి బానిస కావడంతో భార్య కన్నవారింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో తల్లి నూకాలమ్మను అతడు మానసికంగా వేధించడంతో మంగళవారం రాత్రి ఆమె కాలనీలో తెలిసిన వారింటికి వెళ్లి తలదాచుకుంది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గోరేశ్ ఫ్యాన్ హుక్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మర్నాడు ఉదయం తల్లి ఇంటికి వెళ్లి చూడగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఆత్మహత్యగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించామన్నారు.

■ విధుల నుంచి కానిస్టేబుల్ సస్పెన్షన్

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం పోలీసు స్టేషన్‌లో బీట్ మొబైల్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జి.బాబూరావును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ సీపీ శంఖబ్రతబాగ్చీ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల విధి నిర్వహణలో భాగంగా రుషికొండ ప్రాంతంలోని కొందరు సందర్శకుల నుంచి అనధికారికంగా నగదు వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో కానిస్టేబుల్ సూచనతో సందర్శకులు స్థానిక మద్యం దుకాణంలో పనిచేస్తున్న వ్యక్తికి ఫోన్‌పే ద్వారా నగదు పంపించడం, ఆపై కానిస్టేబుల్‌కు ఆ మొత్తం చేరడాన్ని గుర్తించారు. దీంతో విధుల నుంచి సస్పెండ్ చేస్తూ సీపీ చర్యలు తీసుకున్నారు. పోలీసుశాఖలో పని చేసే అధికారులు, సిబ్బంది పూర్తి పారదర్శకంగా విధులు నిర్వహించాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులు ఎవరైనా లంచం అడిగితే 79950 95799 నంబరుకు ఫోన్‌లో తెలియజేయాలని సూచించారు.

■ పర్యావరణ పరిరక్షణకు కృషి

సబ్బవరం, న్యూస్‌టుడే: అంతర్జాతీయ సహకార దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పీఏసీఎస్ కార్యాలయ ఆవరణలో బుధవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌ఛార్జి పీవీఎస్ శాస్త్రి తదితరులు మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. సంస్థ సీఈవో గొంప రమణ తదితరులు పాల్గొన్నారు.

■ జగన్నాథుడికి భక్తుల జేజేలు

చింతలగ్రహారం (వేపగుంట), న్యూస్‌టుడే: చింతలగ్రహారం కృష్ణాలయంలో జరుగుతున్న జగన్నాథస్వామి రథోత్సవాల్లో భాగంగా బుధవారం పరశురాముని అవతారంలో జగన్నాథుడు భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు ఆలయానికి చేరుకుని జగన్నాథస్వామిని దర్శించుకున్నారు. రాత్రి ఆలయ ప్రాంగణంలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

వేద పాఠశాలకు భూమి కేటాయించరూ..

పెందుర్తి, న్యూస్‌టుడే: వేద పాఠశాలతో పాటు పిత్యకార్యాల కోసం అవసరమైన భవన నిర్మాణానికి ప్రభుత్వం తరఫున భూమి కేటాయించాలని విశాఖ జిల్లాలో పౌరోహిత్యం చేస్తున్న శుక్లయజుర్వేద, స్మార్త అభివృద్ధి సంఘం ప్రతినిధులు జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాసరావును కోరారు. ఈ మేరకు బుధవారం మేయర్‌ను పెందుర్తిలోని ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. మేయర్ సానుకూలంగా స్పందించినట్లు సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 93వ వార్డు కార్పొరేటర్ రాపర్తి కన్నా, పురోహితులు, వేద విద్యార్థులు పాల్గొన్నారు.

మేయర్ పీలా శ్రీనివాసరావుకు వినతిపత్రం అందిస్తున్న శుక్లయజుర్వేద స్మార్త సంఘం ప్రతినిధులు

రోడ్డు మధ్యలో గుంత.. నిత్యం చింత

బాలాజీనగర్ మూడవ వీధిలో ప్రమాదకరంగా..

పెందుర్తి, న్యూస్‌టుడే: జీవీఎంసీ 96వ వార్డు పెందుర్తి బాలాజీనగర్ మూడవ వీధి రోడ్డు మధ్యలో గొయ్యి ప్రమాదకరంగా మారిందని నివాసితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రోడ్డు మధ్యలోని కాలువపై ఉన్న పలక కొన్నాళ్ల క్రితం ధ్వంసమైపోయింది. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. రాత్రివేళ చీకట్లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పరవాడ, న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమం, గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా మండల కేంద్రం పరవాడలో బుధవారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను అర్హులంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఏడాది కాలంలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు త్వరలో అమల్లో తీసుకురానున్న పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. తొలుత పరవాడ సంతబయలు వద్ద ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెదేపా పరిశీలకుడు కోరాడ రాజబాబు, మాజీ ఎంపీపీ పైలా జగన్నాథరావు, మాసవరపు అప్పలనాయుడు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ర్యాలీలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, నియోజకవర్గ పరిశీలకుడు కోరాడ రాజబాబు తదితరులు

పాలవలస(పరవాడ), న్యూస్‌టుడే: పెదగంట్యాడ మండలం జీవీఎంసీ 77వవార్డు పరిధి ఈతలవానిపాలెంలో బుధవారం ఈ కార్యక్రమం నిర్వహించారు. వార్డు తెదేపా అధ్యక్షుడు పాల అచ్చినాయుడు ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన పథకాలతో పాటు త్వరలో అమలు చేయనున్న పథకాలు, అభివృద్ధి గురించి వివరించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి వారి అభిప్రాయాలు, సమస్యలు తెలుసుకున్నారు.

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం అమృతపురంలో గురువారం ఈ కార్యక్రమం జరుగుతుందని సబ్బవరం మండల తెదేపా అధ్యక్షుడు గండి ముత్యాలునాయుడు పేర్కొన్నారు. సాయంత్రం 5గంటలకు చేపట్టనున్న ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులంతా హాజరు కావాలని కోరారు.

77వ వార్డులోని ఓ దుకాణం వద్ద ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న నాయకులు

ఆబ్కారీ పోలీసుల ఆకస్మిక తనిఖీ

అక్రమ స్పిరిట్ నిల్వలున్నట్లు అనుమానం

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడలో అక్రమ స్పిరిట్ నిల్వలు ఉన్నాయనే సమాచారం మేరకు ఆబ్కారీ పోలీసు అధికారులు బుధవారం రెండు గృహాల్లో సోదాలు నిర్వహించారు. ఆ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుర్జీత్‌సింగ్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు. అమలాపురంలో ఇటీవల అక్రమ స్పిరిట్, నకిలీ మద్యం దొరికిన సమయంలో విచారించగా.. పరవాడలో కూడా ఆ నిల్వలు ఉన్నట్లు సంబంధిత కేసులోని నిందితుడు చెప్పడంతో ఈ సోదాలు చేపట్టినట్లు తెలుస్తోంది. తొలుత వెన్నెలపాలెం సమీప జగనన్నకాలనీలోని ఓ ఇంటి వద్దకు వెళ్లారు. తాళం వేసి ఉండడంతో ఓ పోలీసును అక్కడ కాపలా పెట్టి వెళ్లిపోయారు. పరవాడ కొత్తకాలనీలోని మరో ఇంట్లో కూడా సోదాలు చేపట్టారు. ఇక్కడ స్పిరిట్‌తో మద్యం తయారు చేసి విక్రయిస్తున్నారని పోలీసులు అనుమానిస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారి సుర్జీత్‌సింగ్‌ను వివరణ కోరగా.. ఇక్కడ అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని, దర్యాప్తు అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఆయన పేర్కొన్నారు.

'గోల్‌మాల్'పై చర్యలేవీ..

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట జోనల్ కార్యాలయ సౌకర్యం కేంద్రంలో సుమారు రూ.50లక్షల ప్రజాధనం గోల్‌మాల్ అయిన విషయం పక్కాగా వెలుగులోకి వచ్చినా బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు మీనమేషాలు లెక్కిస్తున్నారు. ఈ విషయాన్ని 'ఈనాడు' వెలుగులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. దీనిపై జోనల్ అధికారులు విచారణ చేపట్టి రూ.49లక్షలు పక్కదారి పట్టినట్టు తేల్చారు. సంబంధిత ఉద్యోగి నుంచి ఆ మొత్తాన్ని రికవరీ చేసి కమిషనర్‌కు నివేదిక సమర్పించారు. ఈ నేపథ్యంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించినా.. ఇప్పటివరకు ఎలాంటి చర్యలు లేకపోవడంతో స్థానికంగా పలువురు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో కూడా గత పన్నుల కుంభకోణంలో మాదిరిగా వదిలేస్తారా అని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. ఈ విషయమై జోనల్ కమిషనర్ హేమవతిని వివరణ కోరగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

గ్రామాల్లో 'పొలంబడి'

పరవాడ, న్యూస్‌టుడే: రైతులంతా అధునాతన పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని తద్వారా పెట్టుబడులు తగ్గడంతో పాటు మంచి దిగుబడులు సాధించవచ్చునని పరవాడ మండల వ్యవసాయాధికారిణి ఎం.రమాదేవి అన్నారు. వాడచీపురుపల్లి, రావాడ గ్రామాల్లో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పొలంబడి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా వరి విత్తన శుద్ధి, భూసార పరీక్షల వల్ల కలిగే లాభాలు వివరించారు. వాడచీపురుపల్లి సర్పంచి శివలంక లక్ష్మి, ఉపసర్పంచి కూండ్రపు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతో అధిక దిగుబడి

రాంపురం (పెందుర్తి), న్యూస్‌టుడే: ఆధునిక వ్యవసాయ పద్ధతులు పాటించడం ద్వారా తక్కువ వ్యయంతో అధిక దిగుబడులు సాధించవచ్చని పెందుర్తి మండల వ్యవసాయాధికారి చంద్రావతి పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా బుధవారం రాంపురం గ్రామంలో విత్తనాల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ రెడ్డి నారాయణరావు, ఎంపీటీసీ సభ్యురాలు గండి హిమబిందు అతిథులుగా పాల్గొని విత్తనాలు పంపిణీ చేశారు.

రైతులకు విత్తన శుద్ధిపై అవగాహన కల్పిస్తున్న మండల వ్యవసాయాధికారిణి రమాదేవి తదితరులు

సేవలకు సత్కారం

చింతలగ్రహారం(వేపగుంట), న్యూస్‌టుడే: చింతలగ్రహారం జడ్పీ పాఠశాలలో పనిచేసి బదిలీ అయిన 11 మంది ఉపాధ్యాయులను సహచర ఉద్యోగులు, గ్రామ పెద్దలు బుధవారం ఘనంగా సత్కరించారు. ఇక్కడ ప్రధానోపాధ్యాయురాలిగా పనిచేసిన ఎల్.అనంతలక్ష్మికి పదోన్నతిపై స్థానచలనం కాగా.. మిగిలిన వారిలో జె.శాంతి, కె.మాధవి, ఎస్.ఎస్.నాగమణి, లక్ష్మీ, డి.హేమలత, జి.అవతారం, బి.వేలంగిణి, బి.గిరివరప్రసాద్ వేర్వేరు పాఠశాలలకు బదిలీ అయ్యారు. ఈ నేపథ్యంలో ప్రస్తుత ప్రధానోపాధ్యాయిని పి.వి.ఎస్.ఎన్.నాగమణి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సర్పంచి దాడి గోపీఅప్పలనాయుడు, ఇతర నాయకులు కాళ్ల వరలక్ష్మి, పి.వెంకటరమణ, ఆళ్ల తాతారావు, పి.అప్పారావు, బొడ్డేటి నూకరాజు, మద్దాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులతో పాఠశాల బోధనా సిబ్బంది

అభ్యసన సామర్థ్యాలపై ఆరా..

సబ్బవరం, న్యూస్‌టుడే: అనకాపల్లి డీఈవో అప్పారావునాయుడు బుధవారం సబ్బవరం మండలం గొట్టివాడ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. కొద్దిసేపు పిల్లలతో మమేకమై వారి అభ్యసన సామర్థ్యాలను పరిశీలించారు. నూతన ప్రవేశాలను ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. బడిఈడు పిల్లలంతా బడిలో ఉన్నట్లు చూడాలన్నారు. ప్రభుత్వ పథకాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఈకార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో అప్పారావునాయుడు

చందనం అరగదీతకు సన్నాహాలు

సింహాచలం, న్యూస్‌టుడే: ఆషాఢ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 10న అప్పన్న స్వామికి చివరి విడత చందన సమర్పణ జరగనుంది. ఆ మేరకు గంధం అరగదీతకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. బుధవారం ఏఈవో ఎన్.ఆనందకుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆలయ బాండాగారంలోని చందనం చెక్కలను బయటకు తీసి తూకం వేశారు. అరగదీసేందుకు వీలుగా ముక్కలుగా కోశారు. శనివారం నుంచి సిబ్బంది గంధం అరగదీతను ప్రారంభిస్తారు.

చందనం చెక్కలను ముక్కలుగా చేస్తున్న సిబ్బంది

వివాదాస్పద స్థలంలో వాగ్వాదం

మొక్కలు తొలగించేందుకు వచ్చిన సిబ్బందిపై రైతుల ఆగ్రహం

పోలీసులతో మాట్లాడుతున్న స్థానిక నాయకులు

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట వుడా వివాదాస్పద 144 ఎకరాల్లో రైతులు మొక్కలు వేసిన చోట వీఎంఆర్డీఏ సిబ్బందికి, రైతులకు మధ్య బుధవారం వాగ్వాదం చోటుచేసుకుంది. రెండు రోజులుగా రైతులు ఆ భూమిలో యూకలిప్టస్ మొక్కలు వేస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న వీఎంఆర్డీఏ భూపరిరక్షణ సిబ్బంది సంబంధిత స్థలానికి చేరుకోగా రైతులు వారిని నిలదీశారు. మొక్కలు తొలగించేందుకు యత్నిస్తే ఊరుకోబోమని హెచ్చరించడంతో వారు పెందుర్తి పోలీసు స్టేషన్‌లో రైతులపై ఫిర్యాదు చేశారు. పోలీసులు ఘటనా స్థలికి చేరుకోగా గ్రామ పెద్ద ముత్తానాయుడు తదితరులు పోలీసులతో మాట్లాడారు. యోగా పార్కింగ్ కోసం ఈ స్థలాన్ని అధికారులు చదును చేయించి అందుకు వినియోగించలేదని, ప్రస్తుతం రైతులు ఆ భూమిలో మొక్కలు వేసుకుంటే అడ్డు పడడమేమిటని ప్రశ్నించారు. ఈ విషయమై చర్చించేందుకు పోలీసు స్టేషన్‌కు రావాలని పోలీసులు కోరగా.. అధికారులే ఇక్కడికొచ్చి సమాధానం చెప్పాలని రైతులు డిమాండ్ చేశారు. ఈ విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులు తమకు న్యాయం జరిగేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

రైతులు వేసిన మొక్కలను పరిశీలిస్తున్న వీఎంఆర్డీఏ భూపరిరక్షణ సిబ్బంది

ట్రాఫిక్ సమస్య లేకుండా సహకరించాలి

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాచలం గిరి ప్రదక్షిణ సందర్భంగా భక్తులకు సేవలందించే స్వచ్ఛంద సేవా సంస్థలు భక్తుల పాదయాత్రకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు కోరారు. గిరి ప్రదక్షిణలో సేవలందించే సంస్థలతో బుధవారం దేవస్థానం కార్యాలయంలో సమావేశం జరిగింది. సుమారు 40 సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. దేవస్థానం సూచించిన ప్రదేశాల్లోనే స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. గోపాలపట్నం బంకు - గోశాల, గోశాల - ధారపాలెం, గోశాల - వేపగుంట మార్గాల్లో ఆహార పదార్థాల పంపిణీకి అనుమతి లేదని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈవో రాధ, ఈఈ సీహెచ్‌వీ రమణ, ఏఈవోలు రమణమూర్తి, ఎన్.ఆనందకుమార్, డీఈఈ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

సేవా సంస్థల ప్రతినిధులకు సూచనలిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు, అధికారులు

రాయితీ విత్తనాల పంపిణీ

సబ్బవరం, న్యూస్‌టుడే: ప్రభుత్వం సరఫరా చేస్తున్న రాయితీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని పెందుర్తి తెదేపా ఇన్‌ఛార్జి గండి బాబ్జీ అన్నారు. సబ్బవరంలో బుధవారం చేపట్టిన విత్తనాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఏవో రమాదేవి మాట్లాడుతూ ఎంటీయూ 1224 రకం, బీపీటీ 3291, బీపీటీ 5204, ఎంటీయూ 1121 రకం విత్తనాలు అందుబాటులో ఉన్నాయని వాటి ధరలు, రాయితీ వివరాలు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు తమరాన బంగారునాయుడు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు అతిథులు రైతులకు విత్తనాలు అందజేశారు.

రైతులకు విత్తన బస్తాలు అందిస్తున్న గండి బాబ్జీ తదితరులు

ఐఐపీఈ స్వచ్ఛత పక్వాడా

సబ్బవరం, న్యూస్‌టుడే: ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) ఆధ్వర్యంలో బుధవారం వంగలి గ్రామంలో స్వచ్ఛత పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఐఐపీఈ డైరెక్టర్ శాలివాహన్, రిజిస్ట్రార్ రాంపాల్ తదితరులు స్థానిక ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణాన్ని శుభ్రపర్చారు. ఈ సందర్భంగా పాఠశాలకు కంప్యూటర్, డస్ట్‌బిన్; పంచాయతీ కార్యాలయానికి, అంగన్‌వాడీ కేంద్రాలకు డస్ట్‌బిన్లు, విద్యార్థులకు ఆట వస్తువులు అందించారు. ఈ సందర్భంగా శాలివాహన్ మాట్లాడుతూ ఈ పాఠశాలను దత్తత తీసుకుని అన్ని విధాలా అభివృద్ధి చేస్తామన్నారు. అనంతరం గ్రామంలోని గ్రీన్ అంబాసిడర్లను సత్కరించి దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్ మురళీకృష్ణ, ఎంఈవో-2 రవీంద్రబాబు, సర్పంచి ఆకుల శ్రీహేమ ఇతర నాయకులు గణేశ్, గవర తులసి, గవర రాజు, జెట్టి హేమంత్ తదితరులు పాల్గొన్నారు.

వంగలి ప్రాథమికోన్నత పాఠశాల ప్రాంగణంలో శుభ్రత పనులు చేపడుతున్న ఐఐపీఈ అధికారులు

(c) eenadu

భీమిలి

సినిమాలు

చిట్టివలస (తగరపువలస), న్యూస్‌టుడే

గణేశ్: ఎఫ్1

రాములమ్మ: మారాన్

డ్రాగన్, తాతా : కుబేర

సప్తగిరి : కన్నప్ప

మద్యం విక్రేతలపై కేసు నమోదు

పద్మనాభం, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా మద్యం గొలుసు దుకాణాలు నిర్వహిస్తున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్.ఐ జె.సురేష్ తన సిబ్బందితో కలిసి బుధవారం దాడి చేయగా మద్ది పంచాయతీ తునిపాలెం గ్రామంలో మద్యం గొలుసు దుకాణం నిర్వహిస్తున్న కాళ్ల రాంబాబు, నేరెళ్లవలస పంచాయతీ విజయానందపురం గ్రామానికి చెందిన బంగారు లక్ష్మణ్‌లను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి 11 మద్యం సీసాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

99122 22247 సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎండాడ, న్యూస్‌టుడే : ?: భీమిలి మండలం లక్ష్మీపురం నుంచి సింగనబంద వెళ్లే మార్గంలో వీధి కుళాయి నుంచి నీరు లీకేజీ అవుతోంది. – స్థానికులు ✓: లీకేజీ సమస్యను పరిశీలించి పరిష్కరిస్తాం. – నీటి సరఫరా విభాగం అధికారి

?: పీఎంపాలెం ఎఫ్‌సీఐ లేఅవుట్ రోడ్డు నెం-7లో పందుల బెడద ఎక్కువగా ఉంది. – కాలనీవాసులు ✓: పందుల సంచారాన్ని నిరోధిస్తాం. –కిశోర్ (జోన్–2, సహాయ ఆరోగ్యాధికారి)

మద్దిలో అగ్ని ప్రమాదం

నాలుగు ఆవులు మృతి

పద్మనాభం, న్యూస్‌టుడే: మద్ది గ్రామంలో బుధవారం రాత్రి అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో రెండు పశువుల పాకలు పూర్తిగా దగ్ధం కావడంతో నాలుగు ఆవులు మృతి చెందాయి. మూడు ఆవులు గాయాలతో బయటపడ్డాయి. రామకోటి ఆశ్రమం సమీపంలోని లక్ష్మినాయుడు గారి కళ్లాల నుంచి సాయంత్రం పశువులకు పాలు తీసుకొని రైతులంతా ఇంటికి వెళ్లిపోయారు. రాత్రి 8 గంటల సమయంలో మంటలను చూసి రైతులంతా అక్కడికి చేరుకున్నారు. అప్పటికే రెండు పాకలు పూర్తిగా దగ్ధమయ్యాయి. ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియాల్సి ఉంది.

చెరువును తలపిస్తున్న దారులు

రేవళ్లపాలెంలో గుంతల్లో నుంచి రాకపోకలు..

కొమ్మాది, న్యూస్‌టుడే: జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెం బృహత్తర ప్రణాళిక రహదారి గత కొన్నేళ్లుగా అసంపూర్తిగా నిలిచింది. దీంతో ఎక్కడికక్కడ గుంతలతో ప్రయాణం నరకం చూపిస్తోంది. చిన్నపాటి వర్షానికి దారులు చెరువును తలపిస్తున్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నీరు చేరడంతో గోతేదో, దారేదో తెలియక అవస్థలు పడుతున్నారు. ఇక్కడ గతంలో ప్రణాళిక లేకుండా పనులు చేపట్టడం, విస్తరణలో స్థలాలు కోల్పోయిన బాధితులకు టీడీఆర్‌లు జారీ చేయకపోవడంతో రహదారి అభివృద్ధికి నోచుకోక దిక్కులు చూస్తోంది.

★ **టీడీఆర్‌ల మంజూరుపై ఆందోళన:** మధురవాడ పైవంతెన నుంచి కొమ్మాది నవోదయ వరకూ 2.25 కిలోమీటర్ల మేర 80 అడుగుల రహదారి నిర్మించాల్సి ఉంది. రోడ్డు విస్తరణలో వచ్చిన అడ్డంకులను అధిగమించేందుకు బాధితులతో చర్చించి నష్టపరిహారం అందించారు. ఇంకా మూడు చోట్ల టీడీఆర్‌లు ఇవ్వాల్సి ఉంది. ‘ప్రధానంగా రేవళ్లపాలెం గ్రామంలో 32 మందికి టీడీఆర్‌లను అందించే ప్రక్రియలో అధికారులు చొరవ చూపడం లేదు. ఈ ఏడాది మార్చిలో 24 మంది జీవీఎంసీ సంస్థకు గిఫ్ట్‌డీడ్ రిజిస్ట్రేషన్ చేశారు. మరో 8 మందికి టౌన్‌ప్లానింగ్ అధికారులు ఎండార్స్‌మెంట్స్ ఇవ్వక రిజిస్ట్రేషన్లు ఆగిపోయాయి. మా గృహాలు కూల్చివేసి రెండేళ్లు అవుతోంది. వేలల్లో అద్దె చెల్లిస్తూ నివాసముంటున్నాం’ అని బాధితులు ఆవేదన చెందుతున్నారు. ఈ సమస్యపై బుధవారం ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావును కలిసి టౌన్‌ప్లానింగ్ అధికారుల నిర్లక్ష్య వైఖరిపై ఫిర్యాదు చేశారు.

★ **ప్రయాణం నరకమయం..:** ఈ రహదారి గుండా బక్కన్నపాలెం ఏపీఎస్పీ 16వ బెటాలియన్, 234 సీఆర్‌పీఎఫ్, పీఎంపాలెం పోలీస్‌స్టేషన్, నవోదయ, దివ్యాంగుల ఐటీఐ శిక్షణ ఉత్పత్తి కేంద్రం, పాఠశాలలు, కళాశాలలు ఉండటంతో పాటు చుట్టూ పలు కాలనీలు సైతం ఏర్పడ్డాయి. రోజూ వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అంతటి ప్రాధాన్యం కలిగిన రహదారిని అభివృద్ధి చేయకపోవడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. డ్రైనేజీ సైతం లేకపోవడంతో మురుగంతా గుంతల్లోకి చేరుతోంది. దీంతో వాహనచోదకులు అందులో నుంచే ప్రయాణం సాగించాల్సి వస్తోంది. కొంతమంది ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు రోడ్డు అభివృద్ధికి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

పీఎంపాలెం పోలీస్‌స్టేషన్ సమీపంలో ఇలా..

త్వరలో అందుబాటులోకి డబుల్‌డెక్కర్ బస్సులు

సాగర్‌నగర్, న్యూస్‌టుడే: ప్రజలు, విహార యాత్రికులకు మరింత ఆహ్లాదాన్ని అందించేందుకు నగరంలో కొత్తగా డబుల్ డెక్కర్ బస్సులు అందుబాటులోకి రానున్నాయని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ పేర్కొన్నారు. సాగర్‌నగర్ ప్రాంత బీచ్ రోడ్డులోని ఈపీడీసీఎల్ కార్యాలయానికి చేరువలో డబుల్ డెక్కర్ విద్యుత్తు బస్సులతో పాటు సంబంధిత ఛార్జింగ్ కేంద్రాన్ని బుధవారం జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బస్సుల్లోని సౌకర్యాలను, ఛార్జింగ్ స్టేషన్ నిర్వహణ తీరుతెన్నులను క్షుణ్ణంగా పరిశీలించి ట్రయల్ రన్ నిర్వహించారు. గ్రేటర్ విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ లిమిటెడ్, టూరిజం శాఖ సంయుక్తంగా విశాఖ పోర్టు అథారిటీ సౌజన్యంతో రెండు డబుల్ డెక్కర్ బస్సులను త్వరలో ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. అనంతరం బస్సుల ఛార్జింగ్ నిర్వహణ, తదితర అంశాలను జీవీఎంసీ కమిషనర్‌ను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ కేతన్‌గార్గ్ మాట్లాడుతూ నగరవాసులతో పాటు విహార యాత్రికులకు ఈ బస్సులు మరింత సౌకర్య, ఆహ్లాదకర ప్రయాణానికి అనువుగా ఉంటాయన్నారు. టూరిజం ఆర్డీ జగదీష్, పర్యవేక్షక ఇంజినీర్ పి.వి.వి.సత్యనారాయణరాజు, డీటీవో కె.మాధవి, జెడ్సీ కె.కనకమహాలక్ష్మి, స్మార్ట్ సిటీ మేనేజర్ ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్ నుంచి వివరాలు తెలుసుకుంటున్న రాష్ట్ర పర్యాటక శాఖ ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్

ప్రజా సంక్షేమమే కూటమి ధ్యేయం

చిప్పాడ (తగరపువలస), న్యూస్‌టుడే: మత్స్యకారులకు ప్రభుత్వం అన్నివిధాలుగా అండగా ఉంటుందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు అన్నారు. ‘సుపరిపాలన-తొలిఅడుగు’ కార్యక్రమాన్ని భీమిలి మండలం అన్నవరం పంచాయతీ ఎర్రయ్యపాలెం మత్స్యకార గ్రామంలో బుధవారం సాయంత్రం ప్రారంభించి మాట్లాడారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మత్స్యకార భరోసాను రూ.10 వేల నుంచి రూ.20 వేలకు, పింఛను రూ.3 వేల నుంచి రూ.4 వేలకు పెంచామన్నారు. తల్లికి వందనం కింద రూ.15 వేలు అందజేశామని, మూడు గ్యాస్ సిలిండర్లను ఉచితంగా ఇస్తున్నామని, రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా సంక్షేమాన్ని అందిస్తున్నామన్నారు. తల్లికి వందనం ఇంకా అందలేదని కొందరు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా అర్హులైన ప్రతిఒక్కరికీ ఖాతాల్లో సొమ్ము జమవుతుందని పేర్కొన్నారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రానికి వంటసామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో తెదేపా మాజీ సర్పంచి మైలపల్లి లక్ష్మణరావు, మాజీ జడ్పీటీసీ సభ్యులు సరగడ అప్పారావు, మాజీ వైస్ ఎంపీపీ గరికిన పరశురాం, తదితరులు పాల్గొన్నారు.

అన్నవరం పంచాయతీ ఎర్రయ్యపాలెంలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు

ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయులతో భీమిలి ఏఎంసీ అధ్యక్షుడు రామస్వామినాయుడు

పద్మనాభం, న్యూస్‌టుడే: బి.ఆర్.తాళ్లవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అధ్యాపక సిబ్బందికి భీమిలి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కె.రామస్వామినాయుడు బుధవారం సత్కరించారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో శత శాతం ఉత్తీర్ణత సాధించడంతో పాటు ట్రిపుల్ ఐటీకి పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ఎంపికైన సందర్భంగా ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రాంగణంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు అప్పలరాజుతో పాటు ఉపాధ్యాయ సిబ్బందిని సన్మానించారు.

కార్మికుల నుంచి అర్జీల స్వీకరణ

చిట్టివలస(తగరపువలస), న్యూస్‌టుడే: బకాయిలు చెల్లించేందుకు కార్మికుల నుంచి చిట్టివలస జ్యూటుమిల్లు యాజమాన్యం బుధవారం అర్జీలను స్వీకరించింది. ఈ మేరకు స్థానిక జ్యూటుమిల్లు గేటు వద్ద ఏర్పాటు చేసిన కౌంటరు వద్ద పలువురు కార్మికులు, వారి కుటుంబీకులు యాజమాన్య సిబ్బందికి దరఖాస్తులను అందజేశారు. తొలి రోజు 65 దరఖాస్తులు వచ్చాయని కార్మిక శాఖ కార్యాలయ కమిటీ నాయకులు చెప్పారు. ఈనెల 20వ తేదీ వరకు అర్జీలను స్వీకరించడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అర్జీలను స్వీకరిస్తున్న జ్యూటుమిల్లు యాజమాన్య ప్రతినిధులు

‘పీఎం సూర్యఘర్’పై అవగాహన

కరపత్రాలతో గుడిలోవ గ్రామస్థులు

ఆనందపురం, న్యూస్‌టుడే: ప్రధాన మంత్రి సూర్యఘర్ పథకంపై అవగాహన కార్యక్రమాన్ని విద్యుత్తు శాఖ అధికారులు గుడిలోవ గ్రామంలో బుధవారం నిర్వహించారు. ఈ మేరకు విద్యుత్తు శాఖ ఏఈ మండల అప్పలనాయుడు మాట్లాడుతూ.. సౌర విద్యుత్తు వినియోగిస్తే పర్యావరణ పరిరక్షణతో పాటు విద్యుత్తు ఛార్జీల ఇబ్బందులు తప్పుతాయన్నారు. రాయితీపై సంబంధిత పరికరాలను అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, విద్యుత్తుశాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఆనందపురం, న్యూస్‌టుడే: ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెదేపా యువ నాయకుడు గంటా రవితేజ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. బుధవారం పెద్దిపాలెం సమీప కల్యాణ మండపంలో తెదేపా భీమిలి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ మేరకు రాష్ట్ర తెదేపా కార్యాలయం నుంచి విచ్చేసిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం పరిశీలకులు శ్రీకాంత్, సాయిలు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో నాయకులు తాట్రాజు అప్పారావు, బీఆర్బీ.నాయుడు, కోరాడ రమణ, హేమలత, గాడు చిన్ని కుమారి, బమ్మిడి ఉమ, కురిమిన లీలావతి, కప్పల రమేష్, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న గంటా రవితేజ

పాఠశాలలో స్వచ్ఛ సర్వేక్షణ్ పరిశీలన

పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న అధికారులు

ఆనందపురం, న్యూస్‌టుడే: జిల్లా స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం అధికారులు గంభీరం ప్రాథమిక పాఠశాలను బుధవారం సందర్శించారు. ఈ మేరకు పాఠశాలలో మరుగుదొడ్లు, తడి-పొడి చెత్త నిర్వహణ, నీటి వినియోగం, పరిసరాల శుభ్రత వంటి అంశాలను పరిశీలించారు. దీనిలో స్వచ్ఛ సర్వేక్షణ జిల్లా కో-ఆర్డినేటర్ బి.పద్మిని, పంచాయతీ కార్యదర్శి చలపతిరావు, ప్రధానోపాధ్యాయుడు యు.వెంకట ప్రసాద్, సర్వే సిబ్బంది ఆర్.ప్రభాకర్, డీవీఎల్.మూర్తి తదితరులు పాల్గొన్నారు.

విధుల నుంచి కానిస్టేబుల్ సస్పెన్షన్

వీఎంపాలెం, న్యూస్‌టుడే: వీఎంపాలెం పోలీసు స్టేషన్‌లో బీట్ మొబైల్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జి.బాబూరావును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ సీపీ శంఖబ్రతబాగ్చీ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల విధి నిర్వహణలో భాగంగా రుషికొండ ప్రాంతంలోని కొందరు సందర్శకుల నుంచి అనధికారికంగా నగదు వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో కానిస్టేబుల్ సూచనతో సందర్శకుడు స్థానిక మద్యం దుకాణంలోని వ్యక్తికి ఫోన్‌పేలో నగదు పంపించడం, ఆపై కానిస్టేబుల్‌కు రావడం గుర్తించారు. దీంతో విధుల నుంచి సస్పెండ్ చేస్తూ సీపీ చర్యలు తీసుకున్నారు. పోలీసుశాఖలో పని చేసే అధికారులు, సిబ్బంది పూర్తి పారదర్శకంగా విధులు నిర్వహించాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులు ఎవరైనా లంచం అడిగితే 79950 95799 నెంబరుకు తెలియజేయాలని సూచించారు. ఫిర్యాదు వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

మార్ఫింగ్ ఫొటోలు పెట్టి.. డబ్బులు డిమాండ్

నిందితుడి అరెస్టు

ఎండాడ, న్యూస్‌టుడే: మార్ఫింగ్ చేసిన కూతురు ఫొటోలను ఆ అమ్మాయి తల్లికి పెట్టి డబ్బులు డిమాండ్ చేసిన వ్యక్తిని బుధవారం సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. ఆ వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన ఓ అమ్మాయికి ఇన్‌స్టాగ్రాం ద్వారా గుర్తు తెలియని వ్యక్తి పరిచయమయ్యాడు. ఈ నేపథ్యంలో వీడియోకాల్ సైతం చేసుకునేవారు. వాటిని ఫొటోల రూపంలో రికార్డు చేసుకున్నాడు. వాటిని మార్ఫింగ్ వేసి ఆ అమ్మాయి తల్లి చరవాణికి పెట్టి డబ్బులు కావాలని డిమాండ్ చేశాడు. లేకుంటే సామాజిక మాధ్యమాల్లో వైరల్ చేస్తానని బెదిరించాడు. ఈ నేపథ్యంలో భయాందోళనకు గురైన ఆమె సైబర్‌క్రైం పోలీసులను ఆశ్రయించారు. దర్యాప్తు చేపట్టిన పోలీసులు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన వ్యక్తిగా నిందితుడ్ని గుర్తించి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అపరిచిత వ్యక్తులకు సామాజిక మాధ్యమాల్లో స్పందించవద్దని.. ఎవరైనా ఇటువంటి బెదిరింపులకు పాల్పడితే 1930 లేదా 79950 95799 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

గెడ్డలో పశు కళేబరాలు.. దుర్వాసనతో ఇక్కట్లు

ఎండాడ, న్యూస్‌టుడే: జీవీఎంసీ 8వ వార్డు గొల్లల ఎండాడ గ్రామానికి సమీప ప్రధాన గెడ్డలో పశువుల కళేబరాలను వేయడంతో స్థానికులు దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. పరిసర ప్రాంతాలకు చెందిన పశువుల పెంపకందారులు వివిధ కారణాలతో మృత్యువాత పడిన గేదెలు, ఆవుల కళేబరాలను ఇష్టానుసారం గెడ్డలో పడేస్తున్నారు. అవి కుళ్లి దుర్వాసన వ్యాపించడంతో నివాసితులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈగలు, దోమలు వృద్ధి చెందుతున్నాయని, ఇప్పటికే జ్వరాల బారిన పడుతున్నామని పలువురు మహిళలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ట్రాఫిక్ సమస్య లేకుండా సహకరించాలి

సింహాచలం, న్యూస్‌టుడే: సింహాచలం గిరి ప్రదక్షిణ సందర్భంగా భక్తులకు సేవలందించే స్వచ్ఛంద సేవా సంస్థలు భక్తుల పాదయాత్రకు, ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వెస్ట్ జోన్ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు కోరారు. గిరి ప్రదక్షిణలో సేవలందించే సంస్థలతో బుధవారం దేవస్థానం కార్యాలయంలో సమావేశం జరిగింది. సుమారు 40 సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. దేవస్థానం సూచించిన ప్రదేశాల్లోనే స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. గోపాలపట్నం బంకు - గోశాల, గోశాల - ధారపాలెం, గోశాల - వేపగుంట మార్గాల్లో ఆహార పదార్థాల పంపిణీకి అనుమతి లేదని సీఐ శ్రీనివాసరావు తెలిపారు. కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఈవో రాధ, ఈఈ సీహెచ్‌వీ రమణ, ఏఈవోలు రమణమూర్తి, ఎన్.ఆనంద్‌కుమార్, డీఈఈ రామరాజు, తదితరులు పాల్గొన్నారు.

సేవా సంస్థల ప్రతినిధులకు సూచనలిస్తున్న ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు, అధికారులు

చందనం అరగదీతకు సన్నాహాలు

సింహాచలం, న్యూస్‌టుడే: ఆషాఢ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 10న అప్పన్న స్వామికి చివరి విడత చందన సమర్పణ జరగనుంది. ఆ మేరకు గంధం అరగదీతకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. బుధవారం ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆలయ భాండాగారంలోని చందనం చెక్కలను బయటకు తీసి తూకం వేశారు. అరగదీసేందుకు వీలుగా ముక్కలుగా కోశారు. శనివారం నుంచి సిబ్బంది గంధం అరగదీతను ప్రారంభిస్తారు.

చందనం చెక్కలను ముక్కలుగా చేస్తున్న సిబ్బంది

అభివృద్ధికి సహకరించాలని వినతి

సింహాచలం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 98వ వార్డు పరిధిలో అభివృద్ధి పనులకు సహకరించాలని వార్డు కార్పొరేటర్ పీవీ.నరసింహం జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను కోరారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన కమిషనర్‌ను బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం శాలువాతో సత్కరించి అప్పన్న స్వామి చిత్రపటం అందజేశారు.

కమనీయం నరహరి నిత్య కల్యాణం

సింహాచలం, న్యూస్‌టుడే: శ్రీవరాహలక్ష్మీ నృసింహ స్వామివారి నిత్య కల్యాణోత్సవం బుధవారం సింహగిరిపై కమనీయంగా జరిగింది. అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత గోవిందరాజ స్వామిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఆలయ ఆస్థాన మండపంలోని ఉత్సవ వేదికపై ఆశీనులను చేశారు. వేదమంత్రాలు, నాదస్వర మంగళవాయిద్యాల నడుమ దేవతామూర్తుల వివాహ వేడుకను జరిపించారు. భక్తులు పాల్గొని స్వామిని సేవించారు. ఆలయంలో జరుగుతున్న పెరియాళ్వార్ తిరునక్షత్రం వేడుకల సందర్భంగా పండితులు విశేష పారాయణలు చేశారు.

తలంబ్రాల తంతు నిర్వహిస్తున్న అర్చకులు

అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణ

పండ్ల అలంకరణలో రాసపోలమ్మతల్లి

నెమలి పింఛాలు, పూలతో సుత్తమ్మతల్లి

తగరపువలస, గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భీమిలి మండలం మజ్జివలస గ్రామదేవత రాసపోలమ్మతల్లిని వివిధ పండ్లతో, చిప్పాడ గ్రామదేవత శ్రీ సుత్తమ్మతల్లిని నెమలి పింఛాలు, పూలతో బుధవారం అలంకరించారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసి అమ్మవార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

నేడు ప్రైవేటు పాఠశాలల బంద్

గ్రామీణభీమిలి, న్యూస్‌టుడే: భీమిలి నియోజకవర్గంలోని ప్రైవేటు పాఠశాలలు గురువారం మూసివేయనున్నట్లు సంఘం అధ్యక్షులు వాండ్రాసి సతీశ్ తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బంద్‌ను పాటిస్తున్నామన్నారు. ఆకస్మిక తనిఖీల పేరిట వేధింపులకు గురి చేయడంపై తాము ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు.

బడిలో చేరాలంటూ ర్యాలీ

కె.నగరపాలెం(గ్రామీణభీమిలి), న్యూస్‌టుడే: బడిఈడు పిల్లలంతా పాఠశాలల్లో చేరాలని కోరుతూ సమగ్రశిక్షా ఆధ్వర్యంలో కె.దిబ్బడిపాలెం మత్స్యకార గ్రామంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ జె.చంద్రశేఖర్‌రావు, ఏఎస్‌వో జి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

దశాబ్దాల కల.. సాకారమైన వేళ

బక్కన్నపాలెం బడి ఉన్నత పాఠశాలగా మార్పు

కొమ్మాది, న్యూస్‌టుడే: మధురవాడలో ఇప్పటి వరకు ఉన్న రెండు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల జాబితాలో మరో పాఠశాల చేరింది. కూటమి ప్రభుత్వం చొరవతో జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెం ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నత పాఠశాలగా స్థాయి పెంచారు. దీంతో ప్రస్తుత విద్యా సంవత్సరం (2025-26) నుంచి 10వ తరగతి వరకు చదువుకునే అవకాశం విద్యార్థులకు దక్కింది. తాజా బదిలీల్లో ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ సైతం పూర్తయింది.

★ 1959లో ఏర్పడిన బక్కన్నపాలెం ప్రాథమిక పాఠశాల 2007-08లో ప్రాథమికోన్నతగా మారింది. తాజాగా ఉన్నత పాఠశాలగా రూపుదిద్దుకుంది. ఇప్పటి వరకు బక్కన్నపాలెం ప్రాంతంలోని విద్యార్థులు మధురవాడ జాతీయ రహదారి పక్కనున్న చంద్రంపాలెం ఉన్నత పాఠశాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ ఇబ్బంది లేకుండా రేవళ్లపాలెం, లక్ష్మీవానిపాలెం, పీఎంపాలెం, గాయత్రీనగర్, బీ-2 కాలనీ, కే-1, కే-2 కాలనీ తదితర ప్రాంతాల విద్యార్థులకు కూడా అందుబాటులో ఉంటుంది.

ఉన్నత పాఠశాలగా మారిన బక్కన్నపాలెం ప్రాథమికోన్నత పాఠశాల

★ మధురవాడలో వాంబేకాలనీలో సునీల్ శర్మ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, చంద్రంపాలెం ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. ఎన్నో ఏళ్ల తర్వాత ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు చొరవతో బక్కన్నపాలెం పాఠశాలను మూడో ఉన్నత పాఠశాలగా అందుబాటులోకి తెచ్చారు. 1 నుంచి 5వ తరగతి వరకు 111 మంది విద్యార్థులు, 6 నుంచి 9వ తరగతి వరకు 160 మంది విద్యార్థులు ఉండగా ప్రధానోపాధ్యాయులతో పాటు 12 మంది ఉపాధ్యాయులు విద్యను బోధిస్తున్నారు. వ్యాయామ ఉపాధ్యాయుడ్ని సైతం నియమించారు. 6 నుంచి 10వ తరగతి వరకు ఐఎఫ్‌పీ స్మార్ట్ టీవీల ద్వారా డిజిటల్ బోధన చేపడుతున్నారు. ఉన్నత పాఠశాలగా స్థాయి పెంచడంతో మరిన్ని సౌకర్యాలు కల్పించనున్నారు. ఇక్కడ అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లను నిర్మించడంతో పాటు క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేయాల్సిన అవసరముంది.



★ **అందరి సహకారంతో..:** నక్కపల్లి మండలం రాజయ్యపేట నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చా. ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ, గ్రామపెద్దలు, ప్రభుత్వ తోడ్పాటుతో ఆదర్శ పాఠశాలగా తీర్చిదిద్దేందుకు ప్రయత్నిస్తా. ఇప్పుడు విద్యార్థులకు ఒకటి నుంచి పదోతరగతి వరకు ఒకే చోట చదివే అవకాశం ఉండటంతో డ్రాపౌట్‌లు తగ్గే అవకాశముంది. ప్రవేశాల సంఖ్య పెంచేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపడుతున్నాం. – జి.నారాయణరావు, ప్రధానోపాధ్యాయులు, బక్కన్నపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత సీట్ల భర్తీ తప్పనిసరి

కొమ్మాది, న్యూస్‌టుడే: నిరుపేద విద్యార్థులకు కార్పొరేట్ విద్యనందించాలన్న లక్ష్యంతో సర్కారు తెరపైకి తెచ్చిన ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం క్షేత్రస్థాయిలో అమలు కావడం లేదని, ఇందుకు ప్రైవేటు పాఠశాలలు అనేక కొర్రీలు పెడుతున్నాయని వస్తున్న ఫిర్యాదుల మేరకు విద్యాశాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. బుధవారం మారికవలసలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ఆర్జేడీ విజయభాస్కర్ నేతృత్వంలో డీఈవో ఎన్.ప్రేమకుమార్, సమగ్రశిక్ష ఏపీసీ చంద్రశేఖర్‌లు వివరాలు సేకరించారు. 25 శాతం సీట్ల భర్తీకి ఎంపికైన విద్యార్థులను ఆ పాఠశాలలో ప్రవేశాలు కల్పించారు. ఈ సందర్భంగా ఆర్జేడీ, డీఈవోలు మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలల్లో ఉచిత సీట్లు పొందిన విద్యార్థులకు వెంటనే ప్రవేశాలు కల్పించాలని లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంఈవోలు రవీంద్రబాబు, అనురాధ, సమగ్ర శిక్ష సెక్టోరియల్ అధికారులు అప్పలనాయుడు, దేవుడుబాబు, ఎఎల్ఎస్‌వో శ్రీనివాస్, ఏఎంవో శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.

మారికవలసలోని ఓ ప్రైవేటు పాఠశాలలో వివరాలు సేకరిస్తున్న విద్యాశాఖ అధికారులు

సుపరిపాలన సమావేశం నుంచి వాకౌట్

సంగివలస (తగరపువలస), న్యూస్‌టుడే: ఆనందపురం మండలం పెద్దిపాలెంలోని ఓ ఫంక్షన్ హాలులో బుధవారం జరిగిన సుపరిపాలన - తొలి అడుగు నియోజకవర్గ స్థాయి సమావేశం నుంచి జీవీఎంసీ రెండో వార్డు తెదేపా నాయకులు వాకౌట్ చేశారు. తగరపువలస సమీప జీరుపేట గ్రామానికి చెందిన సత్యనారాయణ అనే కార్యకర్తను వార్డు అధ్యక్షుడిగా ప్రకటించడంతో మిగిలిన వారంతా తీవ్ర అభ్యంతరం తెలిపారు. అధ్యక్ష పదవికి ఆరుగురు బరిలో ఉండగా ఎవరి అభిప్రాయాలు తీసుకోకుండా ఏకపక్షంగా ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. ఏకపక్ష నిర్ణయాలతో పార్టీలో గందరగోళం సృష్టిస్తే సహించేది లేదని కొందరు తేల్చి చెప్పారు. అనంతరం అక్కడి నుంచి బయటకు వచ్చేశారు. మూడో వార్డు భీమిలి నాయకులు సైతం వార్డు అధ్యక్షుని ఎంపికపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

హౌసింగ్‌బోర్డు స్థలాల ఆక్రమణ!

పీఎంపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ ఆరో వార్డు పీఎంపాలెం ప్రాంతాల్లో రూ.కోట్లు విలువ చేసే హౌసింగ్ బోర్డు స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. స్థానిక విజేత సూపర్‌మార్కెట్ వెనుక ఓ వ్యక్తి హౌసింగ్‌బోర్డు స్థలం ఆక్రమించి ఇటీవల దుకాణం నిర్మించాడు. దీనిపై స్థానికులు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆక్రమణ జరిగినట్లు గుర్తించినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. కట్టడం అనధికారం అని తెలిసినా జీవీఎంసీ ప్రణాళిక విభాగం అధికారులు సైతం స్పందించలేదు. అదే ప్రాంతంలో గెడ్డ పక్కన హౌసింగ్‌బోర్డుకు చెందిన సుమారు 300 గజాల స్థలంలో మరో వ్యక్తి బడ్డీ ఏర్పాటు చేసి భవన నిర్మాణ సామగ్రి విక్రయాలు సాగిస్తున్నాడు. దీనిపై ఫిర్యాదులు రావడంతో అధికారులు ఆయా స్థలాన్ని ఖాళీ చేయించకుండా హౌసింగ్‌బోర్డు పేరుతో ఓ మూలన హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేసి వదిలేశారు. ఈ వ్యవహారంలో హౌసింగ్ బోర్డుకు చెందిన ఓ ఒప్పంద ఉద్యోగి ఆక్రమణదారుడి నుంచి ప్రతి నెలా అద్దె రూపంలో నగదు వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఆరోపణలున్నాయి. సదరు ఉద్యోగి పీఎంపాలెం మూడో బస్టాప్ రామాలయం ఎదురుగా హెచ్‌పీసీఎల్ రోడ్డులో హౌసింగ్ బోర్డు స్థలంలో ఉన్న పలువురు దుకాణదారుల వద్ద నెలవారీ వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఈ విషయం ఉన్నతాధికారులకు తెలియకుండా అతను జాగ్రత్తలు పడుతూ ఇక్కడ ఆక్రమణలకు సహకరిస్తున్నట్లు సమాచారం. ఆక్రమణలు అడ్డుకోవాల్సిన అధికారులే కబ్జాదారులకు సహకరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై హౌసింగ్‌బోర్డు ఉన్నతాధికారులు దృష్టి సారించి ఆక్రమణలు తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

హౌసింగ్‌బోర్డు స్థలం ఆక్రమించి నిర్మిస్తున్న దుకాణాలు

(c) eenadu

విశాఖ తూర్పు

ప్రయాణికుల రద్దీకి ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎస్ఎంవీ బెంగళూర్- మల్దాటౌన్- ఎస్ఎంవీ బెంగళూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 13న ఎస్ఎంవీ బెంగళూర్‌లో రాత్రి 11.40 గంటలకు బయలుదేరే రైలు.. మర్నాడు సాయంత్రం 6.13 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ 6.15 గంటలకు బయలుదేరి మల్దాటౌన్‌కు వెళ్తుంది. ఈనెల 16న సాయంత్రం 4 గంటలకు మాల్దాటౌన్‌లో బయలుదేరే రైలు.. మర్నాడు మధ్యాహ్నం 3.33 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 3.35 గంటలకు బయలుదేరి ఎస్ఎంవీ బెంగళూర్‌కు వెళ్తుంది.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య

ఎంవీపీ కాలనీ: 8008574768

మద్దిలపాలెం: 9912120229

న్యూస్‌టుడే, మద్దిలపాలెం: ?: జీవీఎంసీ 22వ వార్డు న్యూరేసపువానిపాలెంలో కొన్ని రోజుల నుంచి వీధి దీపాలు వెలగడం లేదు. –బి.ప్రసన్న,న్యూరేసపువానిపాలెం ✓: తక్షణమే సిబ్బందిని పంపి, సమస్య పరిష్కరిస్తాం. –ఆశ, వీధి దీపాల నిర్వహణ అధికారి

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ?: హనుమంతువాక కొండవాలులో ఇటీవల దోమలు వృద్ధి చెంది సమస్యగా ఉంటోంది. పగలు, రాత్రి తేడాలేకుండా కుడుతున్నాయి. జ్వరాల బారిన పడుతున్నాం.– రామకృష్ణ, సంజయ్‌గాంధీ కాలనీ ✓: దోమల నివారణకు చర్యలు తీసుకుంటాం. – మంగరాజు, మలేరియా విభాగం, అధికారి

ఇందిరానగర్(విశాలాక్షినగర్), న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ పదో వార్డు ఆదర్శనగర్‌లో రెండు రోజులకొకసారి తాగునీరు ఇస్తున్నారు. నీరు సరిపోవడం లేదు. ప్రతిరోజు సరఫరా చేయాలి. – వనిత, గృహిణి ఆదర్శనగర్ ✓: పరిశీలించి సమస్య లేకుండా చూస్తాం. – శ్రీనివాస్, ఏఈ, మంచినీటి సరఫరా విభాగం

స్పందనకు వందన

వ్యర్థాలు తరలించారు..!: మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 17వ వార్డు ఎంవీపీకాలనీ సెక్టార్-4 పార్కు రహదారిపై వ్యర్థాలు పేరుకుపోయి, తీవ్ర దుర్వాసన వ్యాప్తి చెందుతుందన్న సమస్యపై 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. వార్డు పారిశుద్ధ్య ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పర్యవేక్షణలో సిబ్బంది శుభ్రత పనులు చేశారు.

వీధి దీపాలు వెలిగించారు: విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: జీవీఎంసీ పదో వార్డు ఆదర్శనగర్‌లో వీధి దీపాలు వెలగడం లేదని శివారు ప్రాంతం కావడంతో చిల్లర దొంగలు బెడద అధికంగా ఉందన్న స్థానికుల ఫిర్యాదు మేరకు 'ఈనాడు మేమున్నాం.. మీకు తోడుగా' శీర్షికతో ప్రచురితమైన వార్తకు వీధి దీపాల ఏఈ గాయత్రి స్పందించారు. వెంటనే సిబ్బందిని పంపించి దీపాలు సరి చేసి వెలిగించారు.

విద్యుత్తు స్తంభం తొలగింపు: మద్దిలపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురంకాలనీ, కళాభారతి రహదారిలో కాలువ నిర్మాణ పనుల్లో జాప్యం జరుగుతోందని, పనుల్లో భాగంగా తవ్విన మట్టిని, నేలకూలిన విద్యుత్తు స్తంభాన్ని తరలించలేదన్న సమస్యపై బుధవారం 'సాగుతున్న పనులు.. ప్రజలకు ఇక్కట్లు..!' శీర్షికతో 'ఈనాడు'లో వార్త ప్రచురితమైంది. ఏఈ హేమతార స్పందించి... తమ సిబ్బందితో పనులు చేయించి, స్తంభాన్ని, మట్టిని తొలగించారు.

విమ్స్ ఈఎన్‌టీ వైద్య సేవలు భేష్

ఓపీకి పెరుగుతున్న రోగులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే

విశాఖ వైద్య విజ్ఞాన సంస్థ(విమ్స్) ఆసుపత్రిలో చెవి ముక్కు గొంతు(ఈఎన్‌టీ) విభాగానికి రోగుల సంఖ్య రోజు రోజుకు పెరుగుతోంది. ఇక్కడ అందిస్తున్న వైద్యసేవల పట్ల ప్రజల్లో నమ్మకం ఏర్పడటం, ప్రైవేట్ ఆసుపత్రుల్లో రూ.వేలల్లో ఖర్చులు అవుతుండటంతో ప్రజలు విమ్స్ ఆసుపత్రి వైపు చూస్తున్నారు.

ఆసుపత్రికి వచ్చిన వారిని పరీక్షిస్తున్న వైద్యులు

అందిస్తున్న సేవలు: చెవినొప్పి, చీము కారటం, వినికిడి లోపం, ముక్కు మూసుకుపోవటం, రక్తస్రావం, అలెర్జీ, తుమ్ములు, తల వంచితే ముక్కులోంచి నీరు కారటం, ఆహారం మింగటంలో ఇబ్బందులు, టాన్సిల్స్ వాపు, నిద్రలో ఇబ్బందులు, గురక తదితర సమస్యలు.

చేస్తున్న శస్త్రచికిత్సలు: టాన్సిల్స్, అడినాయిడ్ గ్రంథులు, వంకర ముక్కు, మధ్య భాగం సరి చేయటం, కర్ణభేరి పునర్ నిర్మాణం లోపాలను సరి చేయటం, చెవిలో, శ్వాస నాళంలో పడే రంధ్రాలను సరి చేయటం, సైనసైటీస్, వాయిస్ థెరపీ, చెవి వెనుకభాగంలో అదనంగా పెరిగిన ఎముక తొలగింపు, సరిచేయడం, కాక్లియర్ ఇంప్లాంట్ తదితర శస్త్రచికిత్సలు చేస్తున్నారు.

విభాగం	: ఈఎన్‌టీ	2024లో వచ్చిన ఓపీలు	: 8838
వైద్యుల సంఖ్య	: 2	నిర్వహించిన శస్త్రచికిత్సలు	: 396
సహాయ సిబ్బంది	: 6	2025లో (ఇప్పటివరకు) వచ్చిన ఓపీలు	: 6465
రోజుకు సరాసరి ఓపీలు	: 70-80	నిర్వహించిన శస్త్రచికిత్సలు	: 298

చెవి బాగా వినిపిస్తోంది..: నాకు చెవి సరిగా వినిపించేది కాదు. చెవిలో ఏదో హోరు వస్తున్నట్లు ఆందోళన ఉండేది. రాత్రి సరిగా నిద్రపట్టేది కాదు. విమ్స్ ఆసుపత్రిలో చూపించుకున్నాను. ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులందించారు. అనంతరం శస్త్రచికిత్స చేశారు. ఇప్పుడు చక్కగా వినిపిస్తోంది. రెండో చెవికి మందులతోనే తగ్గించారు. వైద్యులు ఓపికగా చూస్తున్నారు. – రామలక్ష్మి, హనుమంతువాక

రెండు చెవులకు కాక్లియర్ శస్త్ర చికిత్స చేసిన తొలి ప్రభుత్వ ఆసుపత్రి: పుట్టుకతో రెండు చెవులకు వినికిడి సమస్య ఉన్న పాపకు రెండు చెవులకు శస్త్రచికిత్స చేసి ఇంప్లాంట్స్ అమర్చిన తొలి ప్రభుత్వ ఆసుపత్రిగా విమ్స్ రికార్డుకెక్కింది. ఆసుపత్రికి వచ్చే పేద, మధ్య తరగతి రోగులకు ఉత్తమ సేవలు అందించటమే ధ్యేయంతో ముందుకెళ్తున్నాం. గతంలో ఉన్న రూ. 10 ఓపీ రుసుము కూడా తొలగించి పూర్తిగా ఉచితం చేశాం.– డాక్టర్ రాంబాబు, డైరెక్టర్, విమ్స్

హరిత విశాఖ.. అందరి లక్ష్యం

విత్తనాలు పంపిణీ చేస్తున్న మహిళలు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: హరిత విశాఖ లక్ష్యంగా మహిళలు కృషి చేయాలని వనమాలి, మన కూరగాయల తోట, సిటీ టెర్రస్ గార్డెన్ నర్సరీ గ్రూపుల ప్రతినిధులు అరుణ, జ్యోతి, సరిత పిలుపునిచ్చారు. బుధవారం పిఠాపురంకాలనీ కళాభారతి ఆడిటోరియంలో వివిధ జాతుల మొక్కలు, విత్తనాల ప్రదర్శన ఏర్పాటు చేసి, మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హాజరైన వారికి పండ్ల జాతి మొక్కల విత్తనాలు పంపిణీ చేశారు. అనంతరం పలువురు చిన్నారులు వివిధ అంశాలపై ప్రదర్శించిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భాజపా జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు, జనసేన నాయకులు బొడ్డేపల్లి రఘు, గ్రీన్ క్లైమేట్ సంస్థ కార్యదర్శి జె.వి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న మొక్కల ఆకృతులు

చందనం అరగదీతకు సన్నాహాలు

సింహాచలం, న్యూస్‌టుడే: ఆషాఢ పౌర్ణమి సందర్భంగా ఈ నెల 10న అప్పన్న స్వామికి చివరి విడత చందన సమర్పణ జరగనుంది. ఆ మేరకు గంధం అరగదీతకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. బుధవారం ఏఈవో ఎన్.ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో సిబ్బంది ఆలయ భాండాగారంలోని చందనం చెక్కలను బయటకు తీసి తూకం వేశారు.

పంపిణీకి సిద్ధం

నర్సరీలో సిద్ధం చేసిన మొక్కలు

ఆరిలోవ, న్యూస్‌టుడే: ముడసర్లోవ జీవీఎంసీ నర్సరీలో ఉచితంగా పంపిణీ చేసేందుకు వివిధ రకాల మొక్కలు సిద్ధం చేశారు. ఈనెల 7వ తేదీ వరకు నిర్వహిస్తోన్న వనమహోత్సవాల సందర్భంగా నగరంలో పచ్చదనాన్ని పెంచడం, పర్యావరణాన్ని కాపాడడమే లక్ష్యంగా వీటిని అందజేస్తున్నారు. సపోటా, మామిడి, జామ, కొబ్బరి మొక్కలతో పాటు వేప, తురాయి, కాము తదితర రకాల మొక్కలు సిద్ధం చేశారు. జీవీఎంసీ అవసరాలతో పాటు ప్రయివేటు సంస్థలకు, కాలనీ వాసులకు ఆలయ ప్రాంగణాల్లో పెంచుకునే వారికి వీటిని అందిస్తామని జీవీఎంసీ ఉద్యాన విభాగం డిప్యూటీ డైరెక్టర్ దామోదరరావు తెలిపారు. అయితే వీటి కోసం జీవీఎంసీ కమిషనర్ పేరిట లిఖిత పూర్వకంగా అభ్యర్థన లేఖ ఇవ్వాలని సూచించారు.

అరకొర పనులు.. అవస్థలు నిండా..

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: నగరంలో చేపడుతున్న అభివృద్ధి పనులను సకాలంలో పూర్తి చేయకపోవడంతో ప్రజలు మరిన్ని ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. హనుమంతువాక బీఆర్‌టీఎస్ రహదారిలో రోడ్లను తవ్వేసి మట్టి, ఇసుకను అక్కడే వదిలేశారు. ఇసుక కారణంగా ద్విచక్రవాహన ప్రయాణికులు జారిపడి గాయాల పాలవుతున్నారు. ఈ దారిలో విద్యుత్తు దీపాలు సరిగా వెలగకపోవడంతో రాత్రుళ్లు ఈ దారిలో ప్రయాణించాలంటే నానా అవస్థలు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. త్వరితగతిన పనులను పూర్తి చేసి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఎల్వీ ప్రసాద్ ఆసుపత్రి రహదారిలో ఇసుక

ఈ రహదారికి మోక్షమెప్పుడో..?

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఆరిలోవలో నూతన పోలీస్‌స్టేషన్ భవనాన్ని ప్రారంభించి ఆరునెలల అవుతున్నా సరైన రహదారి మాత్రం నిర్మించలేదు. దీంతో వర్షాకాలంలో స్టేషన్‌కు వచ్చే వారంతా అవస్థలు పడుతున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మట్టి రోడ్డు బురదగా మారి గోతులు పడటంతో నీరు చేరి తీవ్ర అసౌకర్యంగా ఉంటోందని, ద్విచక్రవాహనాలు అదుపు తప్పి పడిపోతున్నామని స్థానికులు వాపోతున్నారు. బీఆర్‌టీఎస్ వైపు కల్వర్టు పనులు ఎప్పుడు పూర్తవుతుందో అంతవరకు తిప్పలు తప్పవని వాపోతున్నారు. ఆ పనులు వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆరిలోవ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లే రహదారి దుస్థితి

వ్యర్థాలు తొలగించారు.. తరలించడం మరిచారు..

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: ఎంవీపీకాలనీ గాదిరాజు ప్యాలెస్, జగన్నాథస్వామి ఆలయానికి మధ్యలోని ప్రధాన గెడ్డలో వ్యర్థాలను తొలగించి మూడు రోజులు అవుతున్నా వాటిని తరలించలేదు. దీంతో అక్కడ జరుగుతున్న ఉత్సవాలకు వచ్చే భక్తులు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ప్రతిరోజు ఇక్కడ అన్నదానం చేస్తుంటారు. దీనికోసం చుట్టుపక్కల ఉన్న అనాథలు, పేదలు వస్తుంటారు. వీరంతా నిత్యం అవస్థలు పడుతుంటారు. వ్యర్థాలను అక్కడే వదిలేయడంతో వర్షాలకు మళ్లీ అవి గెడ్డలో చేరుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. తక్షణం వాటిని తొలగించేలా చూడాలని కోరుతున్నారు.

గెడ్డ పక్కనే వదిలేసిన వ్యర్థాలు

సీఎం సహాయనిధితో ఆర్థిక భరోసా

మంజూరు పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : ముఖ్యమంత్రి సహాయనిధితో ఆపదలో ఉన్న వారికి ఆర్థిక భరోసా కలుగుతుందని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు అన్నారు. బుధవారం ఎంవీపీకాలనీలో ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో పలువురి లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి మంజూరు పత్రాలను రామకృష్ణబాబు అందించారు. 22వ వార్డు శివాజీపాలేనికి చెందిన కె.రవిశంకర్‌కు రూ.1,62,654, జి.ఆద్యకు రూ.2,50,000 మంజూరయ్యాయి. నాయకులు ప్రతాప్‌రుద్ర, రమణ, శంకర్, పోలారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించాలి

ఆటోమోటివ్(మద్దిలపాలెం), న్యూస్‌టుడే : ప్రభుత్వం వెంటనే డిగ్రీ ప్రథమ సంవత్సరం ప్రవేశాల ప్రక్రియ ప్రారంభించాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంస్థ (పీడీఎస్ఓ) జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి డిమాండ్ చేశారు. బుధవారం మద్దిలపాలెంలోని కృష్ణా డిగ్రీ కళాశాల ప్రవేశద్వారం వద్ద సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యాసంవత్సరం ప్రారంభమై 20 రోజులు గడుస్తున్నా... ప్రవేశాల ప్రకటన విడుదల చేయకపోవడం సరైంది కాదన్నారు. సంఘం సభ్యులు లక్ష్మణ్, సతీష్, యమున తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా డిగ్రీ కళాశాల వద్ద పీడీఎస్ఓ సభ్యుల నిరసన ప్రదర్శన

ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవం

విశ్వనాథం దంపతులను సన్మానిస్తున్న పాఠశాల కమిటీ ప్రతినిధులు

విశాలాక్షినగర్, న్యూస్‌టుడే: సమాజంలో అన్ని వృత్తుల కంటే ఉపాధ్యాయ వృత్తి చాలా గౌరవమైనదని తోటగరువు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ బంగారమ్మ పేర్కొన్నారు. పాఠశాలలో 10 ఏళ్లకు పైగా సేవలందించి పదవీ విరమణ చేసిన ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథం దంపతులను బుధవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాల అభివృద్ధికి చేసిన కృషిని కొనియాడారు. ఉపాధ్యాయులు నజ్మ, షబానా, రమేష్, లక్ష్మి, ఎస్ఎంసీ, ఎండీఎం సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే ఉద్యోగులకు మెరుగైన వైద్యసేవలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే : వాల్తేర్ డివిజన్ రైల్వే ఆసుపత్రికి సమకూరిన ఆధునిక ఐస్‌లైన్ రిఫ్రిజిరేటర్లను బుధవారం వాల్తేర్ రైల్వే డీఆర్ఎం లలిత్‌బోహ్రా, తూ.కో.రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు జ్యోత్స్న బోహ్రా ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ... రోగులకు అందించే అత్యంత ఖరీదైన ఇంజిక్షన్లు నిల్వ చేయడానికి కొత్త రిఫ్రిజిరేటర్లు ఉపకరిస్తాయన్నారు. రైల్వే ఉద్యోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఆసుపత్రి చీఫ్ మెడికల్ అధికారి శరత్‌బాబు, ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్‌సాహు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో తూ.కో.రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు జ్యోత్స్న, డీఆర్ఎం లలిత్‌బోహ్రా

అ వీ ఇ వీ

మర్యాదపూర్వక కలయిక

శివాజీపాలెం(మద్దిలపాలెం), న్యూస్‌టుడే : భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన పీవీఎన్. మాధవ్‌ను బుధవారం 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. కేంద్రం సహకారంతో రాష్ట్రానికి మరిన్ని నిధులు తీసుకురావాలని మూర్తియాదవ్ కోరారు.

'జీఓ రద్దు చేయాలి'

మద్దిలపాలెం, న్యూస్‌టుడే : అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం పెదకోటలో హైడ్రోపవర్ ప్రాజెక్టు నిర్మాణ సామర్థ్యం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన జీఓ నెంబర్ 51ని తక్షణమే రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం విశాఖ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కె.చిన్నంనాయుడు, జి.వి.రమణమూర్తి బుధవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. అదానీ గ్రీన్ ఎనర్జీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాలు రద్దు చేసుకోవాలని కోరారు.

6న సత్కారం

హెచ్‌బీకాలనీ(మద్దిలపాలెం), న్యూస్‌టుడే : తెలుగు సినిమాటోగ్రాఫర్ ఎంవీ.రఘును 6న వైజాగ్ ఫిల్మ్‌సొసైటీ ఆధ్వర్యంలో సత్కరిస్తామని సంస్థ కార్యదర్శి నరవ ప్రకాశరావు బుధవారం ఓ ప్రటనలో తెలిపారు. సినిమాటోగ్రాఫర్‌గా రఘు 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సీతమ్మధార రాయల్‌పార్కు హోటల్లో సన్మానం ఏర్పాటు చేశామన్నారు.

సేవలు మరువలేనివి

మద్దిలపాలెం, న్యూస్‌టుడే: ఇందిరాగాంధీ జాతీయ విశ్వవిద్యాలయం (ఇగ్నో) వ్యవస్థాపకులు ప్రొఫెసర్ జి.రామిరెడ్డి సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. బుధవారం ఎంవీపీకాలనీలోని ఇగ్నో కార్యాలయంలో రామిరెడ్డి స్మారక సభ ఏర్పాటు చేశారు. ఇగ్నో సీనియర్ ప్రాంతీయ సంచాలకులు డాక్టర్ జి.ధర్మారావు, తదితరులు పాల్గొని. రామిరెడ్డి చిత్రపటానికి నివాళి అర్పించారు.

నివాళి అర్పిస్తున్న ఇగ్నో ప్రతినిధులు

4న అల్లూరి సీతారామరాజు జయంతి

అల్లిపురం, న్యూస్‌టుడే : డాబాగార్డెన్స్ సమీప అల్లూరి సీతారామరాజు విజ్ఞాన కేంద్రంలో 4న అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గురజాడ సాంస్కృతిక వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బిల్డర్స్ అసోసియేషన్ సభ్యుడు జి.వి.రవిరాజు చేతుల మీదుగా కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ... 4న ఆరోగ్య శిబిరాలు, బాలలకు వ్యాసరచన పోటీలతో పాటు, కళారూపాల ప్రదర్శనలు ఉంటాయన్నారు. కార్యక్రమం పి.వి.రమణ, జి.ఎస్.రాజేశ్వరరావు, ఎన్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని విడుదల చేస్తున్న సభ్యులు

'విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలి'

అల్లిపురం, న్యూస్‌టుడే : విద్యుత్తు సర్దుబాటు ఛార్జీలు తగ్గించి, స్మార్ట్ మీటర్ల బిగింపునుఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్ డిమాండ్ చేశారు. బుధవారం అల్లిపురం సమీప సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఛార్జీలు తగ్గించాలని కోరుతూ 5న ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. అనంతరం ధర్నాకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, సీఎన్.క్షేత్రపాల్, ఎం.మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ప్రదర్శిస్తున్న సీపీఐ నాయకులు

క్యాంటీన్ తాళాల అప్పగింత

విశాఖ లీగల్, న్యూస్‌టుడే : జిల్లా కోర్టు ప్రాంగణంలోని ప్రధాన క్యాంటీన్ తాళాలను న్యాయవాదుల సంఘానికి అప్పగించినట్లు న్యాయవాదుల సంఘం కార్యదర్శి ఎల్.పార్వతీనాయుడు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో పలువురు గుత్తేదారులు క్యాంటీన్‌ను నిర్వహించలేకపోవడంతో గత కొంతకాలంగా మూసే ఉంది. ఈ అంశంపై న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్.రాజుతో మాట్లాడటంతో బుధవారం క్యాంటీన్ తాళాలు న్యాయవాదుల సంఘానికి అందించారు.

వేధింపుల కేసులో యువకుడి అరెస్టు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : యువతికి సంబంధించిన అసభ్యకర చిత్రాలు తన వద్ద ఉన్నాయని, అడిగినంత డబ్బు ఇవ్వకపోతే ఆ చిత్రాలను బయటపెడతానని యువతి తల్లిని వేధిస్తున్న యువకుడిని అరెస్టు చేశామని సీపీ శంఖబ్రత బాగ్చీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ వివరాలు... నగరానికి చెందిన ఓ యువతి ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్న రోజుల్లో ఇంటర్ రెండో ఏడాది చదువుతున్న కోనసీమ జిల్లాకు చెందిన యువకుడితో పరిచయం ఏర్పడింది. ఆమె చిత్రాలు కొన్ని యువకుడి వద్ద ఉన్నాయి. ఇటీవల యువకుడు ఆ చిత్రాలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి యువతి తల్లి వాట్సప్‌కు పంపించి, నగదు డిమాండ్ చేశాడు. బాధితులు సీపీని ఆశ్రయించగా, కేసు నమోదు చేసి బుధవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా వ్యవస్థాపక వేడుకలు

జ్ఞానాపురం, న్యూస్‌టుడే : జ్ఞానాపురం సమీప సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల 67వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలోని సెయింట్ జోసెఫ్ స్వరూపం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ హేమ... భవిష్యత్తు ప్రయోజనాలు, విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించడమే కళాశాల లక్ష్యమన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల అధ్యాపకులు

విధుల నుంచి కానిస్టేబుల్ సస్పెన్షన్

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం పోలీసుస్టేషన్‌లో బీచ్ మొబైల్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జి.బాబూరావును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ సీపీ శంఖబ్రతబాగ్చీ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల విధి నిర్వహణలో భాగంగా రుషికొండ ప్రాంతంలోని కొందరు సందర్శకుల నుంచి అనధికారికంగా నగదు వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో కానిస్టేబుల్ సూచనతో సందర్శకుడు స్థానిక మద్యం దుకాణంలోని వ్యక్తికి ఫోన్‌పేలో నగదు పంపించడం, ఆపై కానిస్టేబుల్‌కు రావడం గుర్తించారు. దీంతో విధుల నుంచి సస్పెండ్ చేస్తూ సీపీ చర్యలు తీసుకున్నారు. పోలీసుశాఖలో పని చేసే అధికారులు, సిబ్బంది పూర్తి పారదర్శకంగా విధులు నిర్వహించాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులు ఎవరైనా లంచం అడిగితే 79950 95799 నెంబరుకు తెలియజేయాలని సూచించారు. ఫిర్యాదు వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

కార్యవర్గం ప్రమాణస్వీకారం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : డాబాగార్డెన్స్ సమీప ప్రేమసమాజం నూతన కార్యవర్గం సభ్యుల ప్రమాణ స్వీకారం బుధవారం నిర్వహించారు. అధ్యక్షునిగా మట్టపల్లి హనుమంతరావు, కార్యదర్శిగా బి.మోహన్‌రావు, ఉపాధ్యక్షులుగా కె.నరసింహమూర్తి, కె.మల్లికార్జునరావు, కోశాధికారిగా ఎంవీవీకే. గుప్తా, ఇతర సభ్యులు హాజరయ్యారు. వారితో సంఘం గౌరవ సలహాదారు పి.విశ్వేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు.

కొత్తగా ఎంపికైన ప్రతినిధులు

దోమల నియంత్రణపై అవగాహన

కార్పొరేషన్, న్యూస్‌టుడే : దోమల నియంత్రణ చర్యలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా మలేరియా నియంత్రణ విభాగం సహాయ సంచాలకులు కేవీఎస్.ప్రసాదరావు అన్నారు. జాతీయ డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

బాధ్యులపై చర్యలకు డిమాండ్

జగదాంబకూడలి, న్యూస్‌టుడే : నిబంధనలకు విరుద్ధంగా పరిశ్రమలు నిర్వహిస్తూ, కార్మికుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న ఫార్మా సంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ(సిటూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నరసింగరావు డిమాండ్ చేశారు. బుధవారం జగదాంబకూడలిలోని సిటూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్, అనకాపల్లి జిల్లాలో జరిగిన ఘటనల్లో అమాయక ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయా యాజమాన్యాలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. తరచూ పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించాలన్నారు. కార్మిక సమస్యల పరిష్కారం కోరుతూ జులై 9న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలన్నారు. కార్మిక నాయకులు కె.ఎం.శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిటూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు

కార్మికుల్ని విధుల్లోకి చేర్చుకోవాలి : ఐద్వా

కార్పొరేషన్, న్యూస్‌టుడే : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఇటీవల తొలగించిన ఒప్పంద కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఐద్వా అధ్యక్షురాలు బి.పద్మ కోరారు. బుధవారం అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, కార్మిక సంక్షేమాన్ని కోరుతూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ఐద్వా సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మ మాట్లాడుతూ.. . ప్లాంట్‌ను నిర్వీర్యం చేయడానికి కేంద్రం చేస్తున్న ప్రయత్నాల్లో భాగంగానే కార్మికుల్ని తొలగించారని ఆరోపించారు. ఆందోళనలో ఐద్వా సభ్యులు ఆర్.విమల, ఈశ్వరమ్మ, బి.భారతీ, కె.కుమారి, జి.లక్ష్మి, డి.కొండమ్మ, వి.ప్రభావతి, మమత, నిర్మల, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో పాల్గొన్న ఐద్వా సభ్యులు

(c) eenadu

విశాఖ ఉత్తరం

•విశాఖ ఉత్తరం •విశాఖ దక్షిణం

విధుల నుంచి కానిస్టేబుల్ సస్పెన్షన్

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం పోలీసు స్టేషన్‌లో బీట్ మొబైల్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న జి.బాబూరావును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ సీపీ శంఖబ్రతబాగ్చీ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల విధి నిర్వహణలో భాగంగా రక్షిత ప్రాంతంలోని కొందరు సందర్శకుల నుంచి అనధికారికంగా నగదు వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో కానిస్టేబుల్ సూచనతో సందర్శకుడు స్థానిక మద్యం దుకాణంలోని వ్యక్తికి ఫోన్‌పే ద్వారా నగదు పంపించడం, ఆపై కానిస్టేబుల్‌కు రావడం గుర్తించారు. దీంతో విధుల నుంచి సస్పెండ్ చేసిన సీపీ పోలీసుశాఖలో సిబ్బంది పూర్తి పారదర్శకంగా విధులు నిర్వర్తించాలని లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులు ఎవరైనా లంచం అడిగితే 79950 95799 నెంబరుకు తెలియజేయాలని సూచించారు.

వేధింపుల కేసులో యువకుడి అరెస్టు

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: యువతికి సంబంధించిన అసభ్యకర చిత్రాలు తన వద్ద ఉన్నాయని, అడిగినంత డబ్బు ఇవ్వకపోతే ఆ చిత్రాలను బయటపెడతానని యువతి తల్లిని బెదిరిస్తున్న యువకుడిని అరెస్టు చేశామని సీపీ శంఖబ్రత బాగ్చీ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ వివరాలు... నగరానికి చెందిన ఓ యువతి ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్న రోజుల్లో ఇంటర్ రెండో ఏడాది చదువుతున్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాకు చెందిన యువకుడితో పరిచయం ఏర్పడింది. ఆమె చిత్రాలు కొన్ని యువకుడి వద్ద ఉన్నాయి. ఇటీవల యువకుడు ఆ చిత్రాలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి యువతి తల్లి వాట్సప్‌కు పంపించి, నగదు డిమాండ్ చేశాడు. బాధితులు సీపీని ఆశ్రయించగా, కేసు నమోదు చేసి బుధవారం నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఆక్రమణలో ఆర్‌అండ్‌బీ స్థలాలు..

మాధవధార, న్యూస్‌టుడే: నగరంలో ఆర్ అండ్ బీ శాఖకు సంబంధించిన భూములు ఆక్రమణకు గురవుతున్నాయి. జీవీఎంసీ 53వ వార్డు ఆర్‌అండ్‌బీ ప్రాంతం నుంచి శివాజీనగర్ వెళ్లే ప్రధాన రహదారిలో ఉన్న ఈ శాఖ స్థలాలు గత కొంత కాలంగా నిరుపయోగంగా ఉండటంతో పలువురు ఇష్టానుసారంగా ఆక్రమించి బడ్డీలు ఏర్పాటు చేయడం, ఇతర నిర్మాణాలు చేపడుతున్నారు. గతంలో రోడ్లు భవనాలు, జాతీయ రహదారుల సంస్థకు సంబంధించిన కార్యాలయాలు ఇక్కడ ఉండేవి. విశాలాక్షినగర్ వద్ద నూతన భవనాలను నిర్మించడంతో కార్యాలయాలను అక్కడికి తరలించారు. దీంతో అప్పటినుంచి ఈ స్థలాలు నిరుపయోగంగా ఉండటంతో కొంచెం కొంచెం ఆక్రమణకు గురవుతున్నాయి. దుకాణాలు పెట్టడం, ఇసుక, పిక్క, ఇటుక వంటి భవన నిర్మాణ సామగ్రి నిల్వ ఉంచి విక్రయించడం వంటివి చేస్తున్నారు.

రహదారి పక్కనున్న ఆర్‌అండ్‌బీ స్థలంలో పెట్టిన బడ్డీ

శిశుగృహం ఎదురుగా ఉన్న ఆర్‌అండ్‌బీ భూమిలో..

✦ **అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా:** ఇక్కడి ఖాళీ స్థలం ఎదురుగా శిశు సంక్షేమ శాఖకు సంబంధించిన శిశు గృహం, మహిళలు వసతి గృహం, అర్బన్ సీడీపీఓ కార్యాలయాలు ఉన్నాయి. ఈ ప్రాంతంలో బడ్డీలు ఏర్పాటు చేసుకుని, ఎదురుగా ఉన్న ఆర్‌అండ్‌బీ భవనాలను ఆక్రమించి మద్యం విక్రయించి అందులో తాగేలా వసతులు కల్పిస్తున్నారు. పలు రకాల అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారు. దీంతో శిశు గృహంలో ఉండే అనాథ చిన్నారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యపై పలుమార్లు జోనల్, సచివాలయ అధికారులకు ఫిర్యాదు ఇచ్చినా ఎటువంటి చర్యలు లేవు.

✦ **ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి:** ఇక్కడి ఖాళీ స్థలంలో రవాణా శాఖ అధికారులు కొంత స్థలాన్ని తీసుకొని, పీపీపీ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ప్రస్తుతం కార్యాలయ పనులకు ఉపయోగిస్తున్నారు. మరికొంత స్థలాన్ని వైద్య ఆరోగ్య శాఖ తీసుకొని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్మించారు. అధికారులు తక్షణమే స్పందించి మిగిలిన స్థలంలోని ఆక్రమణలను తొలగించి వివిధ విభాగాల ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు చేసేందుకు తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

రైల్వే ఉద్యోగులకు మెరుగైన వైద్యసేవలు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: వాల్తేర్ డివిజన్ రైల్వే ఆసుపత్రికి సమకూరిన ఆధునిక వెన్లైన్ రిఫ్రిజిరేటర్లను బుధవారం వాల్తేర్ రైల్వే డీఆర్ఎం లలిత్‌బోహ్రా, తూ.కో.రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు జ్యోత్స్న బోహ్రా ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్ఎం మాట్లాడుతూ... రోగులకు అందించే అత్యంత అరుదైన ఇంజక్షన్లు నిల్వకు ఈ రిఫ్రిజిరేటర్లు ఉపకరిస్తాయన్నారు. రైల్వే ఉద్యోగులకు మెరుగైన వైద్యసేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి చీఫ్ మెడికల్ అధికారి శరత్‌బాబు, ఏడీఆర్ఎం మనోజ్‌కుమార్‌సాహు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభోత్సవంలో తూ.కో.రైల్వే మహిళా సంక్షేమ సంఘం అధ్యక్షురాలు జ్యోత్స్న, డీఆర్ఎం లలిత్‌బోహ్రా

ప్రయాణికుల రద్దీకి ప్రత్యేక రైళ్లు

రైల్వేస్టేషన్, న్యూస్‌టుడే: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఎస్ఎంవీ బెంగళూరు- మల్దాటౌన్- ఎస్ఎంవీ బెంగళూరు మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు వాల్తేర్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. ఈనెల 13న ఎస్ఎంవీ బెంగళూరులో రాత్రి 11.40 గంటలకు బయలుదేరే రైలు.. మర్నాడు సాయంత్రం 6.13 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ 6.15 గంటలకు బయలుదేరి మల్దాటౌన్‌కు వెళ్తుంది. ఈనెల 16న సాయంత్రం 4 గంటలకు మల్దాటౌన్‌లో బయలుదేరే రైలు.. మర్నాడు మధ్యాహ్నం 3.33 గంటలకు దువ్వాడ చేరుకుని, అక్కడ నుంచి 3.35 గంటలకు బయలుదేరి ఎస్ఎంవీ బెంగళూరుకు వెళ్తుంది.

నిధుల కేటాయింపుపై విన్నపం

కార్పొరేషన్, న్యూస్‌టుడే: పెందుర్తి నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కోరారు. బుధవారం ఆయన జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను ప్రధాన కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఉపమేయర్ దల్లి గోవిందరెడ్డి, కార్పొరేటర్లు బీశెట్టి వసంతలక్ష్మి, కుందుల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతుబజార్ ఏర్పాటుకు విన్నపం

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విశాఖ దక్షిణం పరిధిలో రైతుబజార్ ఏర్పాటు చేయాలని స్వామి వివేకానంద సేవా సంస్థ అధ్యక్షులు సూరాడ అప్పారావు కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం దక్షిణం ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రైతుబజార్ లేకపోవడంతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని ఎమ్మెల్యేకు వివరించారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ.10 నుంచి మ.ఒంటి గంట వరకు

విశాఖ ఉత్తరం: 8008574796

విశాఖ దక్షిణం: 8008574977

మురళీనగర్, న్యూస్‌టుడే: ?: సెక్టార్-7 బ్యాంకుల వీధిలో యూజీడీ పైపుల కోసం గోతులు తవ్వి పూడ్చకుండా వదిలేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బందిగా ఉంది. - నన్నిబాబు, తెన్నేటినగర్ ✓: సమస్యను పరిశీలించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటాం. - సుమన్, జీవీఎంసీ నీటి సరఫరా అధికారి

మాధవధార, న్యూస్‌టుడే: ?: జీవీఎంసీ 51వ వార్డు పుడాకాలనీ ప్రధాన రహదారిలో గత రెండు రోజుల నుంచి వీధి దీపాలు వెలగడం లేదు. రాత్రి సమయాల్లో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నాం. - రాజారావు, స్థానికుడు ✓: తక్షణమే పరిశీలించి వీధి దీపాలు ఏర్పాటు చేస్తాం. - జీవన్, వీధి దీపాల నిర్వాహకుడు

మాజీ ఎంపీ మూర్తి సేవలు మరువలేనివి

అల్లిపురం, న్యూస్‌టుడే: విశాఖ అభివృద్ధిలో మాజీ ఎంపీ, దివంగత ఎంవీవీఎస్ మూర్తి సేవలు మరువలేనివని ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం డాబాగార్డెన్స్ దరి అల్లూరి సీతారామ రాజు విజ్ఞాన కేంద్రంలో మూర్తి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆత్రేయ స్మారక కళాపీఠం ఆధ్వర్యంలో 'తెలుగుజాతి మనది- నిండుగ వెలుగు జాతి మనది' పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీ శ్రీభరత్ మాట్లాడుతూ... విద్యాప్రదాతగా, ప్రజాప్రతినిధిగా మూర్తి ఎనలేని కృషి చేశారన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే గణబాబు, మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ.రెహమాన్, ఇతరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యే వంశీకృష్ణ, తదితరులు

అంతా మా ఇష్టం..!

దర్పణం

కొంతమంది భవన నిర్మాణ యజమానులు రహదారులపై నిర్మాణ సామగ్రిని ఉంచడంతో పరిసర కాలనీవాసుల ఇబ్బందులు వర్ణనాతీతం. దారి లేకుండా ఇలా రోడ్డుమీద రోజుల తరబడి సామగ్రి ఉంచితే ఎలా అని ప్రశ్నిస్తే మాపై దాడులకు దిగుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. జీవీఎంసీ 26వ వార్డు శాంతిపురంలోని లాల్ బహదూర్‌శాస్త్రి పార్కు పక్కనున్న రోడ్డులో ఓ వ్యక్తి గత కొద్ది రోజులుగా భవన నిర్మాణ పనులు చేపడుతున్నారు. భారీగా భవన నిర్మాణ సామగ్రిని తీసుకొచ్చి రోడ్డుపై నిల్వ చేశారు. రోడ్డులో ఎటువంటి వాహనాలు రాకుండా అడ్డంగా కర్రలు పెడుతున్నారని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రహదారులపై నిర్మాణ సామగ్రి నిల్వ ఉంచకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. - న్యూస్‌టుడే, అక్కయ్యపాలెం

రోడ్డుపై ఉంచిన భవన నిర్మాణ సామగ్రి

ఎట్టకేలకు మురుగు సమస్యకు మోక్షం

అక్కయ్యపాలెం(దొండపర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 27వ వార్డు దొండపర్తి దరి శ్రీసూర్య కాలనీ నుంచి కమ్మరి వీధి వరకు ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న కాలువలో ప్లాస్టిక్, ఇతర వ్యర్థాలు పేరుకుపోయి మురుగు ముందుకు కదలడం లేదు. దుర్వాసనతో పాటు దోమల ఉద్ధృతి పెరగడంతో స్థానికులు నానా అవస్థలు పడుతున్నారు. ఇక్కడి సమస్యను వార్డు కార్పొరేటర్ గొలగాని వీరారావుకు తెలియజేయడంతో ఆయన వార్డు ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ మాధురితో మాట్లాడారు. పొక్లెయిన్ తెప్పించి పూడుకుపోయిన వ్యర్థాలను తొలగించారు.

కాలువలో వ్యర్థాలను తొలగిస్తున్న దృశ్యం

తోటి వైద్యుడి కుటుంబానికి అండ

అక్కయ్యపాలెం, న్యూస్‌టుడే: కంచరపాలెంలో గత 40 ఏళ్లుగా ప్రాథమిక చికిత్స అందించి పేదల వైద్యుడిగా పేరు గాంచిన బాలశంకరం కొన్ని నెలలు కిందట గుండె పోటుతో మరణించారు. ఆయన సతీమణి దివ్యాంగురాలు కావడంతో చక్రాల కుర్చీకే పరిమితమయ్యారు. ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంఘం సభ్యులు ముందుకొచ్చారు. మర్రిపాలెంలో ఉంటున్న ఆమెను పరామర్శించి రూ.25 వేలు నగదు అందజేశారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు జంగం జోషి, జిల్లా అధ్యక్షుడు ఆకుల శ్రీనివాసరావు, జోనల్ గౌరవాధ్యక్షుడు మమ్ముల తిరుపతిరావు, సలహాదారు కోన ప్రకాశ్, నరేంద్రకుమార్, ఎస్.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగురాలికి నగదు అందజేస్తున్న ఉత్తరాంధ్ర గ్రామీణ వైద్యుల సంఘం ప్రతినిధులు, సభ్యులు

ఉత్తమ సేవలకు గుర్తింపు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించే వారికి గుర్తింపు ఉంటుందని పలువురు వైద్యాధికారులు పేర్కొన్నారు. కింగ్‌జార్జి ఆసుపత్రి యూరాలజీ విభాగం ప్రొఫెసర్‌గా పని చేసిన డాక్టర్ రాంబాబు పదవీ విరమణ చేయడంతో, బుధవారం వైద్యాధికారులు ఆయన్ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసీ ప్రిన్సిపల్ డాక్టర్ సంధ్యాదేవి, కేజీహెచ్ పర్యవేక్షక వైద్యాధికారి డాక్టర్ ఐ.వాణి, విశ్రాంత ప్రిన్సిపల్ డాక్టర్ బుచ్చిరాజు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రాంబాబును సత్కరిస్తున్న వైద్యాధికారులు

గిరి ప్రదక్షిణ భక్తులకు సౌకర్యాల కల్పన

గురుద్వారా, న్యూస్‌టుడే: గురుపౌర్ణమి సందర్భంగా ఈనెల 9న జరిగే సింహాచలం గిరి ప్రదక్షిణలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా జీవీఎంసీ యంత్రాంగం చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా 14వ వార్డు సీతమ్మధార నార్త్‌ఎక్స్‌టెన్షన్ పరిసరాల్లో శుభ్రత పనులు నిర్వహిస్తున్నారు. సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపం, పోర్టు స్టేడియం వెనుక రహదారి మీదుగా భక్తులు నడిచి వెళ్తుంటారు. ఈ మార్గంలో విభాగినులపై ఉన్న వ్యర్థాలను, మట్టి కుప్పలను పొక్లెయిన్‌తో చదును చేస్తున్నారు. పది రోజులుగా ఈ పనులు కొనసాగుతున్నాయని వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ క్రాంతికుమార్ తెలిపారు.

పొక్లెయిన్‌తో మట్టి కుప్పలను చదును చేస్తున్న దృశ్యం

రేపు విద్యుత్తు సరఫరా నిలిపివేత

మాధవధార, న్యూస్‌టుడే: ఎన్ఏడీ, మర్రిపాలెం రెండు సబ్‌స్టేషన్ల పరిధిలో విద్యుత్తు మరమ్మతులు నిర్వహిస్తుండటంతో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తున్నట్లు జోన్-2 ఈఈ బి.కె.నాయుడు తెలియజేశారు. దీనిలో భాగంగా మాధవధార, సీతన్నగార్డెన్స్, కళింగనగర్, మాధవధార వుడాకాలనీ, ఇండస్ట్రియల్ ఎస్టేట్, ఐ.టి.ఐ కూడలి, హ్యాపీ హోమ్స్ అపార్ట్‌మెంట్స్, మర్రిపాలెం, మహారాణీ వీధి, రాణాప్రతాప్‌నగర్, బర్మాక్యాంప్, ధర్మానగర్, శ్రీనివాసనగర్, సుభాష్‌నగర్, దుర్గానగర్, బిర్లా కూడలి, గ్రీన్‌గార్డెన్స్, ఎన్ఏడీ, కాకానినగర్, రెల్లి వీధి, సాకేతపురం, వినోద్‌నగర్, విమాన్‌నగర్, దుర్గాపురం, ఎస్.వి.కె నగర్ పరిసర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నకిలీ మద్యంపై అప్రమత్తంగా ఉండాలి

మాధవధార, న్యూస్‌టుడే: ఎక్సైజ్ శాఖ ద్వారా లైసెన్సు పొందిన మద్యం దుకాణాల్లో మాత్రమే మద్యం కొనుగోలు చేయాలని ఎక్సైజ్ శాఖ అధికారులు ప్రజలకు కోరుతున్నారు. తక్కువ ధరకు మద్యం విక్రయిస్తున్నామని లైసెన్సు లేని వారు ఎవరైనా విక్రయిస్తే అటువంటివి కొనుగోలు చేయవద్దని అది ప్రమాదకరమైన నకిలీ మద్యం కావచ్చునన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎవరైనా తక్కువ ధరకు మద్యం విక్రయిస్తున్నట్లు తెలిస్తే ఎక్సైజ్ శాఖ టోల్ ఫ్రీ 14405, కార్యాలయం నెంబర్లు 0891-2550241, 9440902377 తెలియజేయాలని కోరారు.

జనసేనలో వైకాపా కార్యకర్తల చేరిక

సీతంపేట, న్యూస్‌టుడే: జనసేన పార్టీలోకి బుధవారం వైకాపా కార్యకర్తలు అధిక సంఖ్యలో చేరారు. సీతంపేటలోని రాజేంద్రనగర్‌లో గల పార్టీ నగర కార్యాలయంలో జిల్లా పార్టీ అధ్యక్షుడు, దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ సమక్షంలో 38వ వార్డు పార్టీ ఇన్‌ఛార్జి కొల్లి సింహాచలం, హీరా, సలీం ఆధ్వర్యంలో వార్డుకు చెందిన బెంగాలీ అసోసియేషన్‌కు చెందిన షేక్ రాజవులహక్, షేక్ ఇస్మాయిల్, షేక్ నూర్‌హుస్సేన్, షేక్ అల్లావుద్దీన్, ఎం.డి. ఫారుక్ చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువా వేసి ఆహ్వానించారు.

భగవద్గీత పఠనంపై ఉచిత శిక్షణ

మురళీనగర్, న్యూస్‌టుడే: సెక్టార్-8 వైశాఖి స్పోర్ట్స్ పార్కు యోగా హాలులో గురువారం నుంచి భగవద్గీత పఠనంపై ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నారు. ప్రతిరోజు సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు జరిగే ఈ శిక్షణలో ఆసక్తి ఉన్నవారెవరైనా హాజరుకావచ్చునని పార్కు అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వరప్రసాద్, పి.వి.ఎస్.ఎన్.రాజు తెలిపారు.

అలరించిన కవి సమ్మేళనం

సీతంపేట, న్యూస్‌టుడే: కవులకు అధ్యయనం, భాషా పరిజ్ఞానం, భావ పరిపుష్టి ఉండాలని బీవీకే కళాశాల పూర్వ అధ్యాపకులు డాక్టర్ డి.వి.సూర్యారావు అన్నారు. రాజేంద్రనగర్‌లోని ప్రిజమ్ కళాశాలలో సహృదయ సాహితీ అధ్యక్షులు శేఖరమంత్రి ప్రభాకర్ అధ్యక్షతన బుధవారం కవి సమ్మేళనం నిర్వహించారు. డాక్టర్ కె.వి.ఎస్.మూర్తి కవులకు సూచనలు చేశారు. కుప్పిలి భీమేశ్వరరావు, సీహెచ్ చిన సూర్యనారాయణ, కె.రాంప్రసాద్, కొత్తూరు రమణ, అయ్యల సోమయాజుల ప్రసాద్, కె.విశ్వేశ్వరరావు, పి.వి.ఆర్ కుమార్‌రావు, ఎం.పరమేశ్వరరావు, రవికుమార్, ఆర్.శివాజీ తదితరులు తమ కవితలను చదివి వినిపించారు.

లక్ష్య నిర్దేశంతో ఉన్నత స్థాయికి..

మురళీనగర్, న్యూస్‌టుడే: రాత్రి తొందరగా నిద్రపోయి వేకువనే లేవడాన్ని విద్యార్థులు చిన్నతనం నుంచే అలవర్చుకోవాలని రాజయోగి బి.కె.దిల్‌రెడ్డి పేర్కొన్నారు. మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో గత మూడు రోజులుగా 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వ్యక్తిత్వ వికాస తరగతుల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పలు విజ్ఞానదాయకమైన విషయాలను బోధించారు. బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం మురళీనగర్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో ఒత్తిడి నుంచి ఎలా బయటపడాలి, చదువుపై ఏకాగ్రత సాధించడం వంటి సూచనలను విద్యార్థులకు తెలియజేశారు. లక్ష్య నిర్దేశంతో జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోగలమన్నారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌ఛార్జి ప్రధానోపాధ్యాయుడు పి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు భారతి, అనూరాధ, బి.కె.విద్య, హైమ, ప్రవీణ్, ధర్మరాజు తదితరులు పాల్గొన్నారు.

రాజయోగి దిల్‌రెడ్డితో విద్యార్థులు

క్యాంటీన్ తాళాల అప్పగింత

విశాఖ లీగల్, న్యూస్‌టుడే: జిల్లా కోర్టు ప్రాంగణంలోని ప్రధాన క్యాంటీన్ తాళాలను న్యాయవాదుల సంఘానికి అప్పగించినట్లు న్యాయవాదుల సంఘం కార్యదర్శి ఎల్.పార్వతీనాయుడు తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో పలువురు గుత్తేదారులు క్యాంటీన్‌ను నిర్వహించలేకపోవడంతో గత కొంతకాలంగా మూసే ఉంది. ఈ అంశంపై న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం.కె.శ్రీనివాస్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్.రాజుతో మాట్లాడటంతో... బుధవారం క్యాంటీన్ తాళాలు న్యాయవాదుల సంఘానికి అందించారు.

సార్వత్రిక సమ్మెలోకి బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు

మురళీనగర్, డాబాగార్డెన్స్, న్యూస్‌టుడే: వివిధ జాతీయ కార్మిక సంఘాలు, ఫెడరేషన్లు, అసోసియేషన్ల ఆధ్వర్యంలో ఈనెల 9న నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో బీఎస్ఎన్ఎల్ ఉద్యోగులు భాగస్వాములవుతున్నారని పబ్లిక్ సెక్టార్ సమన్వయ కమిటీ కన్వీనర్ వి.కుమారమంగళం, యూనియన్ నాయకులు పీఈసీహెచ్‌వీ సాగర్ పేర్కొన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను కార్మిక వర్గం ప్రతిఘటిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా డాబాగార్డెన్స్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయం వద్ద బుధవారం జెండాలు పట్టుకుని నిరసన చేపట్టారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ నిలిపివేయాలని, బీఎస్ఎన్ఎల్ ఉద్యోగుల వేతన సవరణ వెంటనే చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు విశ్వేశ్వరరావు, త్రినాథ రెడ్డి, శ్రీనివాస్, బి.దొర, ఉద్యోగులు పాల్గొన్నారు.

ప్రధాన కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

ఘనంగా వ్యవస్థాపక వేడుకలు

జ్ఞానాపురం, న్యూస్‌టుడే: జ్ఞానాపురం సమీప సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల 67వ వ్యవస్థాపక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలోని సెయింట్ జోసెఫ్ స్వరూపం వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ హేమ... భవిష్యత్తు ప్రయోజనాలు, విలువలతో కూడిన విద్యను విద్యార్థులకు అందించడమే కళాశాల లక్ష్యమన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్యక్రమంలో పాల్గొన్న కళాశాల అధ్యాపకులు

'శిశువులకు ఊపిరి పోయాలి'

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: నవజాత శిశువులకు పుట్టిన సమయంలో తగినంత ఆక్సిజన్ అందించే ప్రక్రియపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని మెడికవర్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ సాయి సునీల్‌కిషోర్ అన్నారు. బుధవారం మహారాణిపేటలోని ఆసుపత్రిలో ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించి, ఆక్సిజన్ అందించే ప్రక్రియను బొమ్మల సహాయంతో వివరించారు. సకాలంలో ఆక్సిజన్ అందకపోతే.. శిశు మరణాలు తప్పవని సూచించారు. వైద్యులు విజయకృష్ణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

బొమ్మల సహాయంతో వివరిస్తున్న వైద్యులు

బాధ్యులపై చర్యలకు డిమాండ్

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: నిబంధనలకు విరుద్ధంగా పరిశ్రమలు నిర్వహిస్తున్న ఫార్మా సంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.నరసింగరావు డిమాండ్ చేశారు. బుధవారం జగదాంబకూడలిలోని సిటూ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల హైదరాబాద్, అనకాపల్లి జిల్లాలో జరిగిన ఘటనల్లో ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కె.ఎం.శ్రీనివాసరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నరసింగరావు

'కేంద్రంపై ఐక్య పోరాటాలు'

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: కేంద్రంలోని భాజపా ప్రభుత్వం కార్మిక వ్యతిరేక విధానాలు వీడాలని సీఐటీయూ జగదాంబ జోన్ అధ్యక్షులు టి.నూకరాజు డిమాండ్ చేశారు. బుధవారం జగదాంబకూడలిలోని సిటూ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రానికి వ్యతిరేకంగా అందరూ ఐక్య పోరాటాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘం నాయకులు చంద్రమౌళి, వై.రాజు, కె.నర్సింగరావు, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల్ని విధుల్లోకి చేర్చుకోవాలి : ఐద్వా

కార్పొరేషన్, న్యూస్‌టుడే: విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఇటీవల తొలగించిన ఒప్పంద కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఐద్వా అధ్యక్షురాలు బి.పద్మ కోరారు. బుధవారం అఖిల పక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ, కార్మిక సంక్షేమాన్ని కోరుతూ జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహించిన నిరసన ప్రదర్శనలో ఐద్వా సభ్యులు పాల్గొన్నారు. ఆర్.విమల, ఈశ్వరమ్మ, బి.భారతి, కె.కుమారి, జి.లక్ష్మి, డి.కొండమ్మ, వి.ప్రభావతి, మమత, నిర్మల, హైమావతి తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనలో పాల్గొన్న ఐద్వా సభ్యులు

కరపత్రాలు ప్రదర్శిస్తున్న సీపీఐ నాయకులు

'విద్యుత్తు ఛార్జీలు తగ్గించాలి'

అల్లిపురం, న్యూస్‌టుడే: విద్యుత్తు సర్దుబాటు ఛార్జీలు తగ్గించి, స్మార్ట్ మీటర్ల బిగింపును ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి షేక్ రెహమాన్ డిమాండ్ చేశారు. బుధవారం అల్లిపురం సీపీఐ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. 5న ఏపీఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. ధర్నాకు సంబంధించిన కరపత్రాలు ఆవిష్కరించారు. సీపీఐ నాయకులు కె.సత్యనారాయణ, పి.చంద్రశేఖర్, సీఎన్.క్షేత్రపాల్, ఎం.మన్మథరావు పాల్గొన్నారు.

కార్యవర్గం ప్రమాణస్వీకారం

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: డాబాగార్డెన్స్ సమీప ప్రేమసమాజం నూతన కార్యవర్గం సభ్యుల ప్రమాణస్వీకారం బుధవారం నిర్వహించారు. అధ్యక్షునిగా మట్టపల్లి హనుమంతరావు, కార్యదర్శిగా బి.మోహన్‌రావు, ఉపాధ్యక్షులుగా కె.నరసింహమూర్తి, కె.మల్లికార్జునరావు, కోశాధికారిగా ఎంవీవీకే.గుప్తా, ఇతర సభ్యులు హాజరయ్యారు. వారితో సంఘం గౌరవ సలహాదారు పి.విశ్వేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు.

కొత్తగా ఎంపికైన ప్రతినిధులు

దోమల నియంత్రణపై అవగాహన

కార్పొరేషన్, న్యూస్‌టుడే: దోమల నియంత్రణ చర్యలపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా మలేరియా నియంత్రణ విభాగం సహాయ సంచాలకులు కేవీఎస్.ప్రసాదరావు అన్నారు. జాతీయ డెంగీ వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా బుధవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దోమల వృద్ధి, వ్యాధుల వ్యాప్తి, నివారణ చర్యలు.. తదితర అంశాలపై ప్రజలకు వివరించి, ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీలో మలేరియా విభాగం అధికారి ప్రసాదరావు, ఇతర సిబ్బంది

4న అల్లూరి జయంతి

అల్లిపురం, న్యూస్‌టుడే: డాబాగార్డెన్స్ సమీప అల్లూరి సీతారామ రాజు విజ్ఞాన కేంద్రంలో 4న అల్లూరి సీతారామరాజు జయంతి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు గురజాడ సాంస్కృతిక వేదిక కార్యదర్శి దండు నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో బిల్డర్స్ అసోసియేషన్ సభ్యుడు జి.వి.రవిరాజు చేతుల మీదుగా కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం నాగేశ్వరరావు మాట్లాడుతూ... 4న ఆరోగ్య శిబిరాలు, బాలలకు వ్యాసరచన పోటీలతో పాటు, కళారూపాల ప్రదర్శనలు ఉంటాయన్నారు. కార్యక్రమం పి.వి.రమణ, జి.ఎస్.రాజేశ్వరరావు, ఎన్.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాన్ని విడుదల చేస్తున్న సభ్యులు

సత్ప్రవర్తనతో మెలగాలి

జగదాంబకూడలి, న్యూస్‌టుడే: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో సమాజంలో గుర్తింపు తెచ్చుకోవాలని రెండోపట్టణ సీఐ ఎర్రంనాయుడు అన్నారు. బుధవారం స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరికి కదలికలపై నిఘా ఉంటుందని, నేర సంబంధిత ఘటనలకు దూరంగా ఉండాలని సీఐ హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐలు సతీష్, కాంతారావు, సింహాచలం పాల్గొన్నారు.

(c) eenadu

గాజువాక

● గాజువాక ● విశాఖ పశ్చిమం

డిఫెన్స్ మద్యం స్వాధీనం

పట్టుకున్న డిఫెన్స్ మద్యంతో ఎక్సైజ్ సిబ్బంది

గాజువాక, న్యూస్‌టుడే : శ్రీనగర్‌లో సూరెడ్డి మహేష్ అనే వ్యక్తి మద్యం విక్రయిస్తున్నట్లు ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులకు సమాచారం అందటంతో నిఘా ఉంచారు. నిందితుడు మహేశ్ నేవీ ఉద్యోగులకు ఉన్న పరపతిని ఉపయోగించి మద్యం సేకరించి అధిక ధరలకు అమ్ముతున్నట్లు గుర్తించి దాడిచేసి 29 బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆర్.ప్రసాద్ ఆదేశాలతో ఏఈఎస్ రాజశేఖర్, ఎస్సై మసిలీనాయుడు, రామకృష్ణలు నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గాజువాక ఎక్సైజ్ సిబ్బంది కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయులకు సత్కారం

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి పరిధి పెదమడక, కొండయ్యవలస, ఫార్మాసిటీ పునరావాస కాలనీల్లోని పాఠశాలల్లో పనిచేసి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను బుధవారం ఘనంగా సత్కరించారు. ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో పెదమడక, కొండయ్యవలస నుంచి డి.శ్రీనివాసరావు, కె.అప్పారావులు, ఫార్మాసిటీ పునరావాస కాలనీ నుంచి వెంకటరావు, రమణమూర్తి, రాములునాయుడు, అరుణ, ఇమ్మాన్యుయేల్, చంద్రకళ, రామకృష్ణలు ఇతర పాఠశాలలకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో ఆత్మీయ వీడ్కోలు సమావేశాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 85వ వార్డు తెదేపా నాయకుడు ఇల్లపు ప్రసాద్, వార్డు తెదేపా అధ్యక్షుడు కర్రి దశేంద్ర, ప్రధానోపాధ్యాయులు అమ్మాజీ, మల్లీశ్వరి, ప్రసాద్, పాఠశాల కమిటీల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

సమయం: ఉ॥ 10 నుంచి మ॥ ఒంటి గంట మధ్య
గాజువాక: 98494 65088
పశ్చిమం (గోపాలపట్నం): 95428 96869

న్యూస్‌టుడే, గాజువాక, పెదగంట్యాడ

సమస్య: అగనంపూడి ఏడుమెట్లమర్రిపాలెం బీసీకాలనీలో వీధిదీపాలు వెలగడం లేదు. కూర్మన్నపాలెం అశోక్‌నగర్‌లోనూ ఇదే పరిస్థితి. -వేపుడు, బీసీ కాలనీ, అసూరా, అశోక్‌నగర్, **సమాధానం:** సిబ్బందిని పంపి వీధి దీపాలు వెలిగేలా చేస్తాం. -శివ, వీధి దీపాల నిర్వాహకుడు.

?: దుర్గానగర్‌లో దారి మధ్యలో గుంతల వల్ల రాకపోకలు సాగించలేక పోతున్నాం. ఏదైనప్పుడు ఇబ్బందులు పడుతున్నాం. -ప్రవీణ్, గాజువాక, **✔:** సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటాం. - శేషాద్రి, జెడ్సీ,

గోపాలపట్నం, న్యూస్‌టుడే : ?: గోపాలపట్నం రైతుబజార్ గోడకు ఆనుకుని పైపులైను మరమ్మతులు చేపట్టారు. అయితే అదే స్థానంలో అనధికార దుకాణాలు ఏర్పాటయ్యాయి. వాటిని తొలగించి గోడ నిర్మించాలి. - వి.శంకర్‌రావు, గోపాలపట్నం, **✔:** త్వరలో అనధికార దుకాణాలను తొలగించాలని టౌన్‌ప్లానింగ్ అధికారులకు విన్నవించాం. - రాజశేఖర్, మంచినీటి విభాగం ఏఈ

ఇక సమృద్ధిగా జలధార..!

2 లక్షల జనాభా నీటి కష్టాలకు చెక్

కొనసాగుతున్న పైపులైను పనులు

గాజువాక, న్యూస్‌టుడే : వేళకు కుళాయి నీరు రాదు. వచ్చినా బొటాబొటిగానే వస్తుంది. ఎప్పటికో గానీ బిందెలు నిండవు. ఎక్కడైనా భూగర్భ పైపులైన్లు పగిలిపోతే ఆ రోజంతా ఎదురు చూపులతో గడపాల్సిందే. మొరాయిస్తున్న పంపింగ్ మోటార్లు, పుటుక్కుమంటున్న కాలంచెల్లిన పైపులు, తరచూ విద్యుత్తు ప్యానల్ బోర్డుల్లో సమస్యలు ఏళ్లనాటి శనిగా పీడిస్తున్నాయి. గాజువాక పరిధిలోని 10 ఎంజీడీ నీటి పథకం పరిధిలో 2 లక్షల మంది జనాభా పడుతున్న తాగునీటి కష్టాలివి. అయితే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలో ఓ ప్రధాన సమస్యకు చెక్ పెట్టేందుకు సిద్ధమైంది. దీనిలో భాగంగా సుందరయ్యకాలనీలోని కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (కేబీఆర్) వద్ద 10 ఎంజీడీ నీటి పథకం పునరుద్ధరణ పనులకు జీవీఎంసీ నీటి సరఫరా విభాగం అధికారులు శ్రీకారం చుట్టారు.

ఏమిటి సంగతి..!: గాజువాక జోన్‌లో సుమారు 8 వార్డులకు నీటి సరఫరా అందించే ఈ పథకం తరచూ అంతరాయాలతో కొట్టుమిట్టాడుతోంది. నగరవ్యాప్తంగా అమృత్ పథకం కింద లైన్ల పునరుద్ధరణ, నీటిశుద్ధి ప్లాంట్ల పనులు చేపట్టగా గాజువాకలోనూ ఆ దిశగా అడుగులు పడ్డాయి. ప్రస్తుతం కేబీఆర్ ప్లాంటు నుంచి ఎస్‌ఆర్-2కు పాత ఎంఎస్ లైను ద్వారా సరఫరా జరుగుతోంది. ఎప్పుడో మున్సిపాలిటీ హయాంలో వేసిన ఎంఎస్, డీఐ లైన్ల కారణంగా ఎప్పటికప్పుడు లీకులు, ఓవర్ ఫ్లో సమస్య ఉంటోంది. దీనికి ఫుల్‌స్టాప్ పెట్టడానికి ఇప్పుడు 600 డయా లైన్లు కొత్తగా వేస్తున్నారు.

★ కేబీఆర్ వద్ద 100 కేవీ పంపింగ్ మోటార్ల స్థానే ఇప్పుడు 220 కేవీకి చెందిన 10 హెచ్‌పీ మోటార్లు కొత్తగా బిగిస్తున్నారు. ఇవి కాకుండా పాత పైపులైన్ల వాల్వులను మార్చి, ఇంటర్నల్ కనెక్షన్లు, రిజర్వాయర్లలో వాటర్ ఓవర్‌ఫ్లో కాకుండా ప్రత్యేకంగా సెన్సార్ సిస్టం అమరుస్తున్నారు.

★ రిజర్వాయర్ వాటర్ బెడ్లు ఆటోమెటిక్ వ్యవస్థ ద్వారా పనిచేసేలా సాంకేతికతను వినియోగిస్తున్నారు. ఈ పనులు పూర్తిస్థాయిలో కొలిక్కిరావాలంటే ఇంకో 10 రోజులు పట్టే అవకాశం ఉందని, భవిష్యత్తులో లీకులు, మోటార్ల మొరాయింపు సమస్య ఉండదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. అన్ని కాలనీలకు సమృద్ధిగా నీరందించేందుకు మార్గం సుగమమవుతుంది.

★ కొత్త కనెక్షన్లు కలుపుతున్నందున గాజువాక 65, 66, 71, 72, 73, 74, 75, 76 వార్డుల్లో నీటి సరఫరాకు అంతరాయం కలుగుతోంది. గతంలో వైకాపా ప్రభుత్వం నీటి సరఫరా మెరుగునకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెబుతున్నారు. జోన్-6 కమిషనర్ శేషాద్రి, డీఈ, ఏఈలు ఆ పనులను పర్యవేక్షించారు.

ప్లాంట్‌లో ప్యానల్ బోర్డులు

అడుగడుగునా గండమే..

ఫోకస్

బీసీ గేటు వంతెనపై విరిగిన పలకలు

రక్షణ గోడ ధ్వంసమై..

ఉక్కు కర్మాగార రాకపోకలతో రద్దీగా ఉండే బీసీ గేటు వంతెన ప్రమాదాలకు నిలయంగా తయారైంది. గంగవరం పోర్టు గేటు నుంచి బీసీ గేటుకు వెళ్లే దారిలో వంతెనపై ఇరువైపులా రెయిలింగ్ ధ్వంసమై వాహనదారులకు ముప్పు పొంచి ఉంది. ఏ మాత్రం ఆదమరిచినా వాహనాలు వంతెనపై నుంచి పడి పోయే పరిస్థితి ఉంది. రెండు వైపులా కాలిబాటలపై సిమెంట్ పలకలు విరిగిపోయి భయానకంగా తయారయ్యాయి. అటుగా నడిచే వారంతా ఒక్కోసారి విరిగిన పలకల మధ్య కాళ్లు నలిగిపోయి ప్రమాదాల్లో చిక్కుకుంటున్నారు. రద్దీ మార్గాన్ని దృష్టిలో పెట్టుకుని తక్షణం వంతెనను పునరుద్ధరించాలని పలువురు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, పెదగంట్యాడ

ఆసుపత్రికి విద్యుత్తు కష్టాలు !

అగనంపూడి, న్యూస్‌టుడే : అగనంపూడి ప్రాంతీయ ఆసుపత్రిలో రోగులకు బుధవారం విద్యుత్తు కష్టాలు ఎదురయ్యాయి. పలుమార్లు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలగడంతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు మూడుసార్లు విద్యుత్తు సరఫరా నిలిచి పోయింది. రెండు జనరేటర్లు ఉన్నా నిర్వహణ లోపాలతో మొరాయించాయి. దీంతో దోమల బెడద, ఉక్కపోతతో రోగులు, వారి సహాయకులు అవస్థలు పడ్డారు. ఓపీ విభాగంలో దీపాలు వెలగక, ఫ్యాన్లు తిరగక వైద్య సిబ్బంది ఇబ్బంది పడ్డారు. మధ్యాహ్నానికి సరఫరాను పునరుద్ధరించడంతో వారంతా ఊపిరిపీల్చుకున్నారు. ఇలాంటి సమస్యలు పునరావృతం కాకుండా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

స్పందనకు వందనం

మురుగుపారి.. దుర్గంధం పోయి..

గాజువాక, న్యూస్‌టుడే: 'ఈనాడు'లో బుధవారం 'మూసుకుపోయిన మార్గం.. ఒకటే దుర్గంధం' శీర్షికన వచ్చిన వార్తకు స్పందించి జోన్-6 ఏఎంహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్ శానిటరీ సిబ్బందిని రంగంలోకి దింపి అదనపు సిబ్బందితో 66వ వార్డు ఇందిరాకాలనీ, అజీమాబాద్‌లో పూడిక నిండిన కాలువల్లో ప్రత్యేక శుభ్రత పనులు చేపట్టారు. స్థానికులు హర్షం వ్యక్తంచేశారు.

దోమల నియంత్రణకు చర్యలు

గోపాలపట్నం (కొత్తపాలెం), న్యూస్‌టుడే : జీవీఎంసీ 89వ వార్డులో కాలువల్లో పూడికలు సరిగా తీయకపోవడం వల్ల దోమలు వృద్ధి చెందుతున్న వైనంపై 'ఈనాడు మేమున్నాం' లో వచ్చిన వార్తకు అధికారులు స్పందించారు. బుధవారం సాయంత్రం వార్డులో దోమల నియంత్రణకు ఫాగింగ్ చేశారు.

కనీస వేతనం పెంపునకు డిమాండ్

సింధియా, న్యూస్‌టుడే : నిత్యావసరాల ధరలు సామాన్యులకు అందుబాటులో లేవని కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు చెల్లించాలని ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బోగవల్లి నాగభూషణం డిమాండ్ చేశారు. బుధవారం రిఫైనరీ లేబర్ గేటు వద్ద నిర్వహించిన అఖిలపక్ష కార్మిక సంఘాల ధర్నాలో ఆయన మాట్లాడారు. కాంట్రాక్టు కార్మికుల సమస్యలపై ఈనెల 9న జరపనున్న దేశవ్యాప్త కార్మిక సమ్మెలో అన్ని వర్గాలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ధర్నాలో పారిశ్రామిక ప్రాంత కార్మిక సంఘాల నాయకులు కె.పెంటారావు, తాతబాబు, రాంబాబు, నరేష్, పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

రిఫైనరీ లేబర్ గేటు వద్ద సమ్మె జయప్రదానికి ప్రచారం చేస్తున్న అఖిలపక్ష కార్మిక సంఘాల కార్యకర్తలు

వీధి విక్రయదారులకు అండగా ఉంటాం

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, చిత్రంలో జెడ్సీ శేషాద్రి, తదితరులు

గాజువాక, న్యూస్‌టుడే: వీధి విక్రయదారులకు, చిరు వ్యాపారులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జోనల్ కార్యాలయంలో పట్టణ వీధి విక్రయదారుల సంఘం ఏర్పాటుకు అభిప్రాయాలు, మార్కెట్ సంఘాలు, వ్యాపార సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ చిరు వ్యాపారులను ఇటు జీవీఎంసీగానీ, పోలీసులుగానీ ఇబ్బందులు కలిగించరాదని స్పష్టం చేశారు. సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, తోపుడుబళ్ల సంఘం అధ్యక్షుడు పప్పు అప్పారావు, గాజువాక హోల్‌సేల్ పండ్ల వ్యాపార సంఘం అధ్యక్ష కార్యదర్శులు కర్రి నాగేశ్వరరావు, విల్లూరి శ్రీనివాస్, సీపీఎం నుంచి రమణ, రాంబాబు, కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్, సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, యూసీడీ విభాగం ఏపీడీలు గంగాధర్, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

అక్కిరెడ్డిపాలెం, న్యూస్‌టుడే: ఆటోనగర్ ఐలా ఆవరణలో రైట్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. నిర్వాహకులు పలు రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఐలా ప్రాంగణంలో రైట్ మెడికల్ సెంటర్‌ను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, మేయర్ పీలా శ్రీనివాసరావులు ప్రారంభించారు. ఐలా కమిషనర్ కిశోర్, ఐలా, వానీ ప్రతినిధులు సత్యనారాయణరెడ్డి, ఈశ్వరరావు, డీబీకే సత్యనారాయణ, పాండురంగ ప్రసాద్, ప్రభాకర్, కార్పొరేటర్లు కాకి గోవిందరెడ్డి, పల్లా శ్రీనివాస్, గంధం శ్రీను, బొండా జగన్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

అక్కిరెడ్డిపాలెం(నాతయ్యపాలెం), న్యూస్‌టుడే: శ్రీనగర్ రెండో వంతెన కింద గుర్తు తెలియని మృతదేహాన్ని గుర్తించినట్లు గాజువాక సీఐ పార్థసారథి తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. వంతెన కింద దుర్గంధం వస్తుండటంతో 112కు సమాచారం రావడంతో పోలీసులు పరిశీలించగా సుమారు 40 ఏళ్ల వయసు ఉన్న ఓ వ్యక్తి మృతిచెందినట్లు గుర్తించామన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించామన్నారు. ఏ విధంగా చనిపోయాడో దర్యాప్తు చేస్తున్నామని, మృతుడి వివరాలు తెలిస్తే గాజువాక పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని కోరారు.

సేవలతోనే వ్యక్తులకు గుర్తింపు

గొడ్డువానిపాలెం(పెదగంట్యాడ), న్యూస్‌టుడే: ఉత్తమ సేవలందించే వ్యక్తులకు సమాజంలో తగిన గుర్తింపు ఉంటుందని డిప్యూటీ మేయర్ దల్లి గోవిందరాజు అన్నారు. బుధవారం గొడ్డువానిపాలెంలో కుంచ మాంబ శెట్టిబలిజ సంఘం ఆధ్వర్యంలో ఇంటక్ రాష్ట్ర నాయకుడు నెల్లి అప్పలరాజును ఘనంగా సత్కరించారు. సంఘం గౌరవాధ్యక్షుడిగా నియమితులైన సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. నాయకులు గురుమూర్తి, ప్రసాద్, చిన్నారావు, మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ఇంటక్ రాష్ట్ర నాయకుడు అప్పలరాజును సత్కరిస్తున్న డిప్యూటీ మేయర్ గోవిందరాజు, తదితరులు

స్వచ్ఛభారత్‌పై కమిషనర్‌కు నివేదన

కూర్మన్నపాలెం, న్యూస్‌టుడే: జీవీఎంసీ 87వ వార్డు పరిధిలోని తిరుమలనగర్‌లో చేపడుతున్న స్వచ్ఛభారత్ కార్యక్రమాలను కార్పొరేటర్ బొండా జగన్ ఆధ్వర్యంలో కాలనీ సంఘం ప్రతినిధులు కలిసి జీవీఎంసీ కమిషనర్ కేతన్‌గార్గ్‌కు బుధవారం వివరించారు. కాలనీలో చేపడుతున్న అవగాహన కార్యక్రమాలు, సాధించిన అవార్డుల గురించి తెలిపారు. కాలనీ సమస్యల పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు విశ్వేశ్వరరావు, పరమానందం, సన్యాసిరావు, మహేశ్వరరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ కేతన్ గార్గ్‌కు స్వచ్ఛభారత్ కార్యక్రమాలు వివరిస్తున్న కార్పొరేటర్ జగన్, తిరుమలనగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

వ్యక్తిపై కత్తితో దాడి

నిందితుడు రిమాండ్‌కు తరలింపు

గాయపడిన శ్రీనివాసరావు

గోపాలపట్నం, న్యూస్‌టుడే : ఓ వ్యక్తిపై కత్తితో దాడిచేసిన ఘటన గోపాలపట్నం పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. దీనికి సంబంధించి ఆ స్టేషన్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. విజయనగరం జిల్లా వేపాడ మండలానికి చెందిన గనిరెడ్డి శ్రీనివాసరావు(25), సాయి అన్నదమ్ములు. వీరు సింహాచలం దరి గోశాల సమీపంలోని కె.కన్వెన్షన్‌లో పని చేస్తున్నారు. ఈనెల 1న భూలోకనగర్‌లోని ఓ వీధిలో సాయి తన ద్విచక్రవాహనం పార్క్ చేశారు. ఇదే ప్రాంతానికి చెందిన సిరిపురపు చంద్రశేఖర్(22) తన కారును ఆ ద్విచక్రవాహనానికి అడ్డంగా పార్క్ చేశారు. ఈ విషయమై ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఈ విషయాన్ని సాయి తన సోదరుడు శ్రీనివాసరావుకు చెప్పారు. దీంతో రాత్రి 8 గంటల ప్రాంతంలో అన్నదమ్ములిద్దరూ కలిసి చంద్రశేఖర్ ఇంటికి వెళ్లారు. అక్కడ కూడా ముగ్గురి మధ్య ఘర్షణ జరిగింది. దీంతో చంద్రశేఖర్ తన ఇంట్లో ఉన్న కూరగాయల కత్తితో శ్రీనివాసరావుపై దాడికి పాల్పడ్డాడు. గాయపడిన శ్రీనివాసరావును స్థానికుల సాయంతో ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ ఎన్.వి.ప్రభాకరరావు ఆధ్వర్యంలో ఎస్సై అప్పలనాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండుకు తరలించారు. చంద్రశేఖర్ ఆరిలోవలో జీవీఎంసీ శానిటరి సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

గెడ్డలో పూడికతీతకు చర్యలు

సింధియా, న్యూస్‌టుడే : జీవీఎంసీ 60వ వార్డు గుల్లలపాలెం మార్కెట్ వద్ద ఉన్న గెడ్డలో పూడికతీత పనులకు బుధవారం అధికారులు చర్యలు తీసుకున్నారు. గత ఆర్నెల్లుగా ఎంఐజీ వుడాకాలనీలోంచి పారుతున్న రెండు గెడ్డలు మార్కెట్ వద్ద కలుస్తాయి. రెండు గెడ్డలు కలిసిన ప్రదేశం నిత్యం రాళ్లతో నిండి ఉండటం వల్ల పూడికతో వ్యర్థాలు నిలిచిపోతున్నాయి. ఈ సమస్యపై 'ఈనాడు'లో వచ్చిన వార్తకు అధికారులు స్పందించి పొక్లెయిన్‌తో పూడిక తొలగించారు.

75, 76 వార్డుల్లోని ప్రధాన గెడ్డల్లో..

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: గాజువాక 75, 76 వార్డుల్లోని ప్రధాన గెడ్డల్లో పూడికతీత పనులకు జీవీఎంసీ సిబ్బంది శ్రీకారం చుట్టారు. బీసీ రోడ్డులో మేటలు వేసిన వ్యర్థాలను నాలుగు జేసీబీలను రంగంలోకి దింపి వెలికి తీశారు. బుధవారం ఆయా పనులను డిప్యూటీ ఫ్లోర్ లీడర్ గంధం శ్రీనివాస్, 75వ వార్డు పులి లక్ష్మీబాయి, తెదేపా నగర ఉపాధ్యక్షుడు పులి వెంకటరమణారెడ్డి, ఏఎంఓహెచ్ డాక్టర్ కిరణ్‌కుమార్, శానిటరీ సూపర్‌వైజర్ కోటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ తాతారావులు పరిశీలించారు. వారం, పది రోజులపాటు పూడిక తీత కొనసాగిస్తామని సంబంధిత అధికారులు తెలిపారు.

రేపు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

అక్కిరెడ్డిపాలెం(శ్రీనగర్), న్యూస్‌టుడే: శ్రీనగర్, బీహెచ్‌పీవీ క్వార్టర్లు, గవర జగ్గయ్యపాలెం, మార్కెట్ రోడ్డు, కుమిలీ లేఔట్ల పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి 2 గంటల వరకు విద్యుత్తు నిలిచిపోతుందని జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు.

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ ప్రగతి పార్కు, వుడా ఫేజ్-2 ఏరియా, టింపనీ పాఠశాల ఏరియా, అమరావతినగర్, భరత్‌నగర్‌లో సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ పేర్కొన్నారు.

మాధవధార, న్యూస్‌టుడే: శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మర్రిపాలెం, మహరాణీవీధి, రాణాప్రతాప్ నగర్, ధర్మానగర్, శ్రీనివాసనగర్, సుభాష్‌నగర్, దుర్గానగర్, గ్రీన్‌గార్డెన్స్, ఎన్ఏడీ, కాకానినగర్, రెల్లివీధి, సాకేతపురం, వినోద్‌నగర్, విమాన్‌నగర్, దుర్గాపురం, ఎస్.వి.కె నగర్ పరిసర ప్రాంతాల్లో సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు.

నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విరాళం

వాడపల్లి (ఆత్రేయపురం), న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో వేంకటేశ్వర ఆలయం వద్ద చేపట్టిన వకుళమాత నిత్యాన్నదాన భవన నిర్మాణానికి విశాఖపట్నంలో గాజువాకకు చెందిన శ్రీసాయి వైష్ణవి ఇన్‌ఫ్రా సర్వీసెస్ ప్రైవేటు లిమిటెడ్ అధినేత నాగబిల్లి అప్పలరాజు, సంతోషి దంపతులు రూ.50,001 విరాళాన్ని బుధవారం అందజేశారు. వీరికి స్వామి వారి చిత్రపటం అందించి దేవస్థానం ఈవో ఎన్ఎస్ చక్రధరరావు అభినందించారు.

గోపాలపట్నంలో సినిమాలు	నరసింహ: కన్నప్ప, సుకన్య: కుబేర, సౌజన్య: మార్గన్

సంక్షేమ పాలనకు తొలి అడుగు: పల్లా శ్రీనివాసరావు

ఇంటింట తెదేపా ర్యాలీలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, కార్పొరేటర్లు, నాయకులు

56వ వార్డులో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు

హైస్కూలురోడ్డు(గాజువాక), న్యూస్‌టుడే: అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా కూటమి ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోందని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. బుధవారం గాజువాక 67వ వార్డు జోగవానిపాలెంలో కార్పొరేటర్ పల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో 'సుపరిపాలన తొలి అడుగు..' పేరుతో ఇంటింట తెదేపా కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే పల్లా మాట్లాడుతూ.. ప్రజాభిప్రాయ సేకరణ కోసం ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ప్రజలు స్వచ్ఛందగా అభిప్రాయాలు తెలపవచ్చన్నారు. సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్, కార్పొరేటర్లు గంధం శ్రీను, లేళ్ల కోటేశ్వరరావు, కాకి గోవిందరెడ్డి, బీఎన్ పాత్రుడు, తెదేపా నాయకులు విజయకుమార్, నల్లూరి సూర్యనారాయణ, పప్పు రాజారావు, వార్డు అధ్యక్ష కార్యదర్శులు పల్లా రంగయాదవ్, కొమ్మనాపల్లి సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

ఇది ప్రజా ప్రభుత్వం : ఎమ్మెల్యే గణబాబు

కరాస, న్యూస్‌టుడే : సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని బుధవారం ఉదయం 56వ వార్డులో విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. పైడిమాంబకాలనీ నుంచి గవర కంచరపాలెం వరకు పార్టీ జెండాలతో ర్యాలీగా తరలివెళ్లారు. ఇంటింటికి వెళ్లి కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. కార్యక్రమంలో నియోజకవర్గ తెదేపా పరిశీలకుడు రంగనాయకులు, 56వ వార్డు కార్పొరేటర్ శరగడం రాజశేఖర్, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

ఉపాధి శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

గాజువాక, న్యూస్‌టుడే: భాగవతుల ఛారిటబుల్ ట్రస్ట్, టెక్‌మహేంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో గాజువాక బీసీ రోడ్డులోని సెంటర్లో నిరుద్యోగ యువతకు ఉచిత ఉపాధి శిక్షణ కోర్సుల్లో చేరడానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సంస్థ కార్యదర్శి శ్రీరామ్మూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఈఎస్, బీపీఓ, కేపీఓ, ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్, ఎంఎస్ ఆఫీస్, సాఫ్ట్ స్కిల్స్, తదితర కోర్సుల్లో 3 నెలల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు అవకాశం వినియోగించుకోవాలని, వివరాలకు ఫోన్: 63099 56383కు సంప్రదించాలని కోరారు.

మాధవ్‌కు అభినందనలు

గాజువాక, న్యూస్‌టుడే : భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పీవీఎన్ మాధవ్‌ను గాజువాక ప్రతినిధి బృందం విజయవాడలో కలిసి అభినందించింది. కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు, పలువురు మండల కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉక్కునగరం(స్టీల్ సెక్టారు-3) న్యూస్‌టుడే: భాజపా రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ వెన్నా శ్రీరామమూర్తి సైతం మాధవ్‌ను అభినందించారు. ఆయన నేతృత్వంలో పార్టీ మరింత పురోభివృద్ధి సాధించాలన్నారు.

విధుల నుంచి కానిస్టేబుల్ సస్పెండ్

పీఎంపాలెం, న్యూస్‌టుడే: పీఎంపాలెం పోలిసు స్టేషన్‌లో బీచ్ మొబైల్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న జి.బాబూరావును విధుల నుంచి సస్పెండ్ చేస్తూ సీపీ శంఖబ్రతబాగ్చీ బుధవారం ఆదేశాలు జారీ చేశారు. ఇటీవల విధి నిర్వహణలో భాగంగా రుషికొండ ప్రాంతంలోని కొందరు సందర్శకుల నుంచి అనధికారికంగా నగదు వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో కానిస్టేబుల్ సూచనతో సందర్శకుడు స్థానిక మద్యం దుకాణంలోని వ్యక్తికి ఫోన్ పేలో నగదు పంపించడం, ఆపై కానిస్టేబుల్‌కు రావడం గుర్తించారు. దీంతో విధుల నుంచి సస్పెండ్ చేస్తూ సీపీ చర్యలు తీసుకున్నారు. పోలీసు శాఖలో పని చేసే అధికారులు, సిబ్బంది పూర్తి పారదర్శకంగా విధులు నిర్వహించాలని.. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. పోలీసులు ఎవరైనా లంచం అడిగితే 79950 95799 నెంబరుకు తెలియజేయాలని సూచించారు. ఫిర్యాదు వ్యక్తుల వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.



గాయపడ్డ విద్యార్థులకు ఆర్థిక సాయం

పెదగంట్యాడ, న్యూస్‌టుడే: పెదగంట్యాడ క్రీడా మైదానంలో క్రికెట్ ఆడుతుండగా గాయపడ్డ పెదకోరాడ కాలనీకి చెందిన బసా కార్తిక్‌రెడ్డి, గొందేశి భరత్‌చంద్రలను పలు సంఘాల ప్రతినిధులు బుధవారం పరామర్శించారు. గ్రామ కమిటీ అభ్యర్థన మేరకు సేవా ప్రతినిధి మిత్తాన అప్పలరెడ్డి ఇద్దరు విద్యార్థుల ఇళ్లకు వెళ్లి చెరో రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. నాయకులు గొందేశి వెంకటరమణారెడ్డి, పులి రమణారెడ్డి, బసా పీరురెడ్డి, సీరపు వెంకటరావు పాల్గొన్నారు.

ఎన్ఏడీకూడలి సమీపంలో వాహనాల బారులు

గోపాలపట్నం బాజీకూడలిలో..

అసలే వర్షం.. ఆపై ట్రాఫిక్..

ఎన్ఏడీకూడలి, న్యూస్‌టుడే : ఎన్ఏడీకూడలి, నుంచి పెట్రోల్‌బంకు కూడలి వరకు బుధవారం పలుమార్లు ట్రాఫిక్ జామ్ కావడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. వర్షాలు పడుతున్నందున ఎక్కువమంది ద్విచక్రవాహనాలకు ప్రత్యామ్నాయంగా కార్లు ఉపయోగించడం కూడా ట్రాఫిక్ పెరగడానికి దోహదం చేసింది. బాజీకూడలి, ఎన్ఏడీకూడలిలో ట్రాఫిక్ నియంత్రించేందుకు పోలీసులు కనిపించలేదు. కళాశాలలు, పాఠశాలలు వదిలే సమయాల్లో ఈ ట్రాఫిక్ మరింత ఎక్కువగా పెరిగి.. మళ్లీ సాధారణ స్థితి రావడానికి చాలా సమయం పట్టింది.

20.1 మి.మీ వర్షపాతం నమోదు

విజయనగరం వ్యవసాయ విభాగం, న్యూస్‌టుడే: రుతు పవనాల ప్రభావంతో జిల్లాలో రోజంతా చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. మంగళవారం ఉదయం నుంచి బుధవారం ఉదయం వరకు జిల్లాలో 20.1 మిల్లీమీటర్ల సరాసరి వర్షపాతం నమోదైంది. గుర్ల మండలంలో అత్యధికంగా 36.2 మి.మీ, బొండపల్లి, ఎస్.కోటలో 32.4, గజపతినగరం- 29.2, జామి- 28, విజయనగరం- 26.2, బొబ్బిలి- 23.4, గంట్యాడ- 22.6, వేపాడ- 22.4, రాజాం- 22.4, దత్తిరాజేరు- 20.4, మెంటాడ- 20.2, తెర్లాం- 20.2, మిగిలిన మండలాల్లో 20 మి.మీల లోపు వర్షం పడింది.

తాటిపూడి నీరు విడుదల

● రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం: కొండపల్లి

నీటిని విడుదల చేస్తున్న మంత్రి శ్రీనివాస్, అధికారులు

గంట్యాడ, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో కూటమి ప్రభుత్వం రైతు సంక్షేమానికి కట్టుబడి ఉందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. బుధవారం తాటిపూడి జలాశయం నుంచి ఖరీఫ్ కాలానికి సాగునీటిని విడుదల చేసి, మాట్లాడారు. సకాలంలో విత్తనాలు, ఎరువులు, సాగునీరు అందేలా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. తనపై కొంతమంది తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ఓ పరిశ్రమకు తాటిపూడి నీరు ఇస్తున్నట్లు చెబుతున్నారని, అది వాస్తవం కాదన్నారు. నీటి సంఘాలు బాధ్యతగా చేయాలని కోరారు. చెక్‌డ్యామ్‌లు, కాలువలు బాగు చేసుకోవాలని సూచించారు. ఇరిగేషన్ ఈఈ ఎమ్‌వీ రమణ, డీఈఈలు రామునాయుడు, శ్రీచరణ్, గోపాలపల్లి, ఆయకట్టు సంఘం అధ్యక్షుడు కె.జగన్నాథరావు, కొండపల్లి కొండలరావు, కె.భాస్కరనాయుడు, విజయ్‌కుమార్, ఎర్రినాయుడు తదితరులు పాల్గొన్నారు.

5న జాతీయ లోక్ అదాలత్

నేరవార్తా విభాగం, న్యూస్‌టుడే: జిల్లాలో ఈనెల 5న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారమయ్యే విధంగా పోలీసు అధికారులు, సిబ్బంది చర్యలు చేపట్టాలని ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశించారు. వివిధ రకాల కేసులకు సంబంధించి ఇరు వర్గాల సమ్మతితో రాజీ అయ్యేలా చూడాలని పేర్కొన్నారు.

అనుమతి ఉన్న దుకాణాల వద్దే కొనుగోళ్లు

విజయనగరం నేరవార్తా విభాగం: అబ్కారీ శాఖ ద్వారా లైసెన్సు పొందిన ప్రభుత్వ మద్యం దుకాణాల వద్దే కొనాలని, ప్రైవేటు వ్యక్తుల వద్ద తీసుకుంటే కేసులు తప్పవని ఆ శాఖ జిల్లా సూపరింటెండెంటు బి.శ్రీనాథుడు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. వేడుకల సందర్భంగా చాలామంది ప్రైవేటు వ్యక్తులను ఆశ్రయిస్తూ, నకిలీ సరకు కొని మోసపోతున్నారన్నారు.

నేడు ప్రైవేటు పాఠశాలల బంద్!

విజయనగరం విద్యావిభాగం: ప్రభుత్వం ఆర్టీఈ చట్టాన్ని పూర్తిస్థాయిలో, పక్కాగా అమలు చేయాలని కోరుతూ గురువారం ప్రైవేటు పాఠశాలలు బంద్‌కు పిలుపునిచ్చాయి. అసోసియేషన్ పిలుపు మేరకు జిల్లాలోనూ తరగతులు నిలిపివేస్తున్నట్లు యాజమాన్యాలు విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారాన్ని అందించాయి.

రూ.కోట్ల ఆసామి.. సెంటు లేని భూస్వామి

● దస్త్రాల్లో స్వామి వందల ఎకరాలు ● ఆలయ నిర్వహణకు అగచాట్లు

న్యూస్‌టుడే, బొబ్బిలి

పేరుకు రూ.వేల కోట్ల ఆసామి.. కానీ ధూపదీప నైవేద్యానికి వెతుక్కోవాల్సిన పరిస్థితి. ఆలయ నిర్వహణకూ ఇబ్బందులే. ఇదంతా బొబ్బిలి శ్రీ వేణుగోపాలస్వామి ఆస్తుల గురించే. ఆలయ భూముల వ్యవహారం ఏళ్లుగా తేలడం లేదు. ఫలితంగా స్వామి కోవెల కళ తప్పుతోంది.

బ్యాంకు లాకర్లలో బంగారం

2020 ఆగస్టులో దేవాదాయశాఖ రాష్ట్ర బృందం స్వామి ఆస్తులను ప్రత్యేకంగా లెక్కించింది. ఆభరణాల లెక్క చూసి, సుమారు 18 కిలోల బంగారు, వెండి పలు బ్యాంకు లాకర్లలో భద్రపరిచారు. భూముల వ్యవహారాన్ని తేల్చలేకపోయారు. త్వరలోనే ప్రత్యేక కమిటీని వేసి గుర్తిస్తామని అప్పట్లో చెప్పినా.. ఇంతవరకు క్షేత్రస్థాయిలో పరిశీలించలేదు. రికార్డుల్లో వేల ఎకరాల భూములు ఉన్నాయే తప్ప అవి ఎక్కడ అన్నదీ తేల్చడం లేదు. ఇటీవల ఎమ్మెల్యే బేబీనాయన దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి వెంటనే భూముల గుర్తింపుపై దృష్టి సారించాలని కోరారు.

బలిజిపేట మండలం అజ్జాడలోని స్వామి భూములు

సర్వే ఆగగడంతో తంటా

రీసర్వేతోనే వేణుగోపాలస్వామి భూముల వ్యవహారంపై స్పష్టత వస్తుందని అప్పట్లో అన్నారు. కొన్నిచోట్ల సర్వే పూర్తయినా లెక్కలు తేలలేదు. మరికొన్ని చోట్ల సర్వే జరగలేదు. కొన్నింటికి సర్వే నంబర్లు లేక సమస్య వస్తోంది. ఆలయ భూములే అని చెప్పడానికి కొన్ని సాంకేతిక ఇబ్బందులు ఎదురవుతున్నాయి. దీన్ని ఆసరాగా చేసుకుని రెవెన్యూ సిబ్బంది తాత్సారం చేస్తున్నారు.

ఆదాయం ఏడాదికి సుమారు రూ.లక్షే..!!

- గుర్తించిన వాటిలో బలిజిపేట మండలం అజ్జాడతోపాటు బొబ్బిలి మండలంలో 714 ఎకరాలున్నాయి. వాటి నుంచి ఎలాంటి శిస్తు రావడం లేదు.
- పాతబొబ్బిలిలో 10 ఎకరాలు, గొల్లపల్లిలో 9.30, ఎంబన్నవలసలో మూడు, తెర్లాంలో 6.87 ఎకరాల నుంచి నామమాత్రపు శిస్తులు వస్తున్నాయి. నిబంధనల మేరకు దేవాదాయశాఖకు చెల్లించాల్సిన రుసుములు జమ చేయడంలేదు. అంతా కలిపి ఏడాదికి రూ.లక్ష కూడా రావడం లేదు. చేసేది లేక ఆలయ అనువంశిక ధర్మకర్త సుజయ్‌కృష్ణ, సోదరుడు బేబీనాయన నెలకు దాదాపు రూ.2 లక్షల సొంత నిధులు నిర్వహణకు ఖర్చు చేస్తున్నారు.
- మోఖాసా కొత్తవలసలో 1,585 ఎకరాలు ఉన్నప్పటికీ వాటి ఆనవాళ్లు గుర్తించడం లేదు.
- శ్రీకాకుళం జిల్లా పద్మాపురంలో 1.32 ఎకరాలు, రామంపేటలో 9, మల్లివీడులో 240, వాటపాగులో 30 ఎకరాలు ఉన్నట్లు దస్త్రాల్లో ఉన్నా అవి ఎక్కడ ఉన్నాయో తెలియని పరిస్థితి.

దస్త్రాల్లోనే భూములు

మొత్తం ఎకరాలు: 4,011
గుర్తించినవి: 714
గుర్తించాల్సింది: 3,297

"దృష్టి సారిస్తాం..: వేణుగోపాలస్వామి భూములపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. క్షేత్రస్థాయికి వెళ్లి గుర్తించి, స్వాధీనం చేసుకునేందుకు చర్యలు తీసుకుంటాం. రెవెన్యూ అధికారుల సహకారం కూడా తీసుకుంటాం. సమగ్రంగా పరిశీలించాల్సి ఉంది." - **లక్ష్మణరావు, కార్యనిర్వాహక అధికారి, వేణుగోపాలస్వామి ఆలయం**

సుపరిపాలన సందడి

నియోజకవర్గాల్లో తెదేపా తొలి అడుగు ప్రచారం

ఈనాడు, విజయనగరం

ఉభయ జిల్లాల్లోని 11 శాసనసభ నియోజకవర్గాల్లో తెదేపా ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని సందడిగా కొనసాగించారు. గ్రూపులుగా ప్రతి ఇంటినీ సందర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంచెలంచెలుగా అమలు చేస్తున్న 'సూపర్6' హామీల పురోగతిని ప్రజలకు వివరించారు. అన్ని హామీలను నెరవేర్చుతామని వారికి భరోసా ఇచ్చారు. విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల్లో ఏడాదిలో సంక్షేమ పథకాల అమలు, రోడ్ల మరమ్మతులు, కీలక ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు విడుదల చేసిన నిధుల వివరాలతో ఆయా నియోజకవర్గాల్లో జరిగిన అభివృద్ధి పనులను వారికి వివరించారు. ఈ పథకాల అమలు తీరు, ప్రభుత్వ పాలనపై ప్రజల నుంచి అభిప్రాయాలు, సలహాలు, సూచనలు స్వీకరిస్తున్నారు. గత ప్రభుత్వ హయాంలో అర్హత ఉండీ సంక్షేమ పథకాలు అందుకోలేకపోయామని, ఇప్పుడు చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం అందరికీ సమానంగా అందిస్తోందని పలువురు గ్రామీణ ప్రజలు నేతల వద్ద అభిప్రాయపడ్డారు. గజపతినగరం నియోజకవర్గంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, సాలూరులో మంత్రి సంధ్యారాణి, ఎమ్మెల్యేలు అదితి గజపతిరాజు, లలితకుమారి, కళావెంకటరావు, మురళీమోహన్, బేబీనాయన, విజయచంద్ర, జగదీశ్వరి, జిల్లా అధ్యక్షుడు కిమిడి నాగార్జున, గొంప కృష్ణ, బంగార్రాజు పాల్గొన్నారు.

నా కోసం ఆలోచించొద్దు..

● సన్నిహితులతో ఉగ్ర కుట్ర కేసు నిందితుడు

సిరాజ్ ఉర్ రెహ్మాన్

సయ్యద్ సమీర్

ఈనాడు, విజయనగరం

నా జీవితం అయిపోయింది.. ఇక నా కోసం మర్చిపోండి.. ఎలా జరగాలని ఉంటే అలా జరుగుతుంది.. అని ఉగ్ర కుట్ర కేసులోని ఇద్దరు నిందితుల్లో విజయనగరానికి చెందిన సిరాజ్ ఉర్ రెహ్మాన్(29) తన కుటుంబ సభ్యులు, సన్నిహితుల వద్ద వాపోయినట్లు విశ్వసనీయంగా తెలిసింది. బాంబులు తయారు చేసి వాటిని ప్రయోగించే దశలో అందిన సమాచారంపై విజయనగరం పోలీసులు మే 16న కేసు నమోదు చేసి అతన్ని అరెస్టు చేసిన విషయం విదితమే. ప్రస్తుతం విశాఖ కేంద్ర కారాగారంలో సోదరి సహా ఒకరిద్దరు సన్నిహిత బంధువులు ములాఖత్‌లో కలిసినట్లు తెలిసింది. బాధపడవద్దని తిరిగి వారిని సముదాయించినట్లు సమాచారం. ఇదే కేసులో అరెస్టయిన రెండో నిందితుడు సయ్యద్ సమీర్(28) ఇదే కారాగారంలో ఉన్నాడు. తల్లి ఆరోగ్యం బాగోలేదని, హైదరాబాద్‌లో ఉంటున్న తల్లిని చూసుకునే వారు లేరని జైలు సిబ్బంది వద్ద ఆవేదన వ్యక్తం చేసినట్లు సమాచారం. గాడి తప్పి ఇలా ఇరుక్కుపోయానని, చివరకు జైల్లో గడపాల్సి వస్తోందని పశ్చాత్తాపం చెందినట్లు తెలిసింది. వీరిద్దరిని వేర్వేరు గదుల్లో ఉంచిన వారిపై ప్రత్యేకంగా నిఘా పెట్టినట్లు జైలు అధికారి ఒకరు 'ఈనాడు'తో అన్నారు.

మళ్లీ ఎన్ఐఏ అధికారుల రాక

ఉగ్ర కుట్ర కేసును జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ)కు అప్పగించాలని కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఈ కేసు నమోదు చేసిన విజయనగరం పోలీసులను కోరింది. ఆ మేరకు రాతపూర్వకంగా ఆదేశాలిచ్చింది. కేసు బదిలీకి నిబంధనల ప్రకారం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఎన్ఐఏ అధికారులు కొందరు బుధవారం మళ్లీ విజయనగరం వచ్చారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన రెండో పట్టణ పోలీసు అధికారులను కలిసి చర్చించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసిన తర్వాత న్యాయస్థానం అనుమతితో వారం రోజులపాటు స్థానిక పోలీసు అధికారులు, ఎన్ఐఏ అధికారులు, కౌంటర్ ఇంటెలిజెన్స్ అధికారులు, యాంటీ టెర్రరిస్టు స్క్వాడ్ అధికారులు వేర్వేరుగా విచారించారు. దాదాపు నెల రోజుల తర్వాత వచ్చి, ఈ కేసుకు సంబంధించి వివిధ కోణాల్లో అదనపు సమాచారం కోసం చర్చించి, కేసు బదిలీ ప్రక్రియ పూర్తి చేసుకున్నట్లు తెలిసింది. ఒకటి రెండు రోజుల్లో ఈ కేసు అధికారికంగా ఎన్ఐఏ అధికారుల చేతికి వెళ్లనుంది.

కలెక్టరేట్ కారుతోంది..!

విజయనగరంలోని కలెక్టరేట్ భవనం శిథిలస్థితికి చేరింది. పలు విభాగాలకు వెళ్లే మార్గాల్లో నీరు చేరుతోంది. పైకప్పు పెచ్చు లూడుతోంది. దీంతో ఉద్యోగులు, సిబ్బంది తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. బుధవారం ఆడిటోరియం నుంచి భూములు, సర్వేశాఖ, విద్యా శాఖ విభాగాలకు వెళ్లే దారిలో పెచ్చులూడి కింద పడ్డాయి. ఆ ప్రాంతంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది.

– న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

అడుగు జారితే మడుగే!

రాజాం పట్టణంలోని పాలకొండ రహదారిలో గుంతలు చోదకులను హడలెత్తిస్తున్నాయి. రహదారి విస్తరణ పనులు పూర్తి కాకపోవడంతో ఇంకా అక్కడక్కడ పనులు మిగిలి ఉన్నాయి. రెండు సార్లు పనులను గుత్తేదారు నిలిపేయడంతో జాప్యం చోటు చేసుకుంది. ఎమ్మెల్యే మురళీమోహన్ ప్రత్యేక చొరవతో పనులు మళ్లీ గాడిలో పడ్డాయి. పాలకొండ కూడలిలో పెద్ద గుంత ఏర్పడింది. ఇది ప్రమాదాలకు కారణమవుతోంది. డోలపేట తనిఖీ కేంద్రం వద్ద గుంతలో నీళ్లు చేరాయి. పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్అండ్‌బీ జేఈ నాగభూషణరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. – న్యూస్‌టుడే, రాజాం

ఉద్యోగ భద్రత కల్పించాలని ధర్నా

విజయనగరం ఉడాకాలనీ, న్యూస్‌టుడే: ఉపాధి హామీ పథకం కింద పనిచేస్తున్న తమను రెన్యువల్ చేయాలని, మూడు నెలల బకాయి జీతాలు చెల్లించాలని జిల్లా క్షేత్ర సహాయకులు కోరారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజారావు ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాజారావు మాట్లాడుతూ 19 ఏళ్లుగా పనిచేస్తున్నామని, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని డిమాండు చేశారు. సంఘ సభ్యులు ఈశ్వరరావు, తిరుపతి, సత్తిబాబు, రమణ పాల్గొన్నారు.

రేషన్ కార్డులకు 50 వేల దరఖాస్తులు

● పేర్ల జోడింపునకే అత్యధికం

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: రేషన్‌కార్డుల్లో పేర్లు జోడింపునకే అధికంగా దరఖాస్తులు వచ్చాయి. తమ కుటుంబ సభ్యులను చేర్పించాలని ఎక్కువ మంది ముందుకొచ్చారు. కొత్తగా కుటుంబ సభ్యుడి పేరు జోడింపు, వివాహమైన మహిళలు, పుట్టిన పిల్లలను చేర్పించాలని కోరారు. సచివాలయాల్లో కొత్త బియ్యం కార్డుల మంజూరు, ఉన్న వాటిలో చేర్పులు, మార్పుల కోసం మే 7వ తేదీ నుంచి అవకాశం కల్పించారు. ఈక్రమంలో అదనంగా పేర్లు చేర్చాలని 37,135 మంది కోరారు. కొందరు కార్డుల విభజన, కొత్తవి ఇవ్వాలని విన్నవించారు.

నెలాఖరుకు అందజేత..

ఏడు రకాల సేవలను గ్రామ, వార్డు సచివాలయాల్లో పునరుద్ధరించారు. కొత్త కార్డు, సభ్యుల జోడింపు, తొలగింపు, విభజన, సరెండర్, చిరునామా మార్పు, తప్పుగా నమోదైన ఆధార్ సీడింగ్ దిద్దుబాటుకు అవకాశం కల్పించారు. ఇప్పటివరకు 50,450 మంది దరఖాస్తులు చేసుకోగా, వీటిలో 45,319 కార్డుల విచారణ పూర్తి చేశారు. ఇంకా 5,131 పత్రాలను పరిశీలించాల్సి ఉంది. వీటిల్లో కుటుంబ సభ్యుడిని చేర్పించాల్సినవి 3,794 దరఖాస్తులున్నాయి. విచారణ అనంతరం ఈనెలాఖరులోగా స్మార్ట్ కార్డులు అందించనున్నామని పౌరసరఫరాలశాఖ జిల్లా అధికారి ఎన్.మధుసూదనరావు తెలిపారు. కొన్నింటికి ఆధార్ అవ్వకపోవడంతో పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు.

సేవల వారీగా దరఖాస్తులు..

అంశం	సంఖ్య
చిరునామా మార్పు	1750
ఆధార్ సీడింగ్ దిద్దుబాటు	679
పేర్ల జోడింపు	37,135
తొలగింపు	1,063
కొత్త కార్డులు	3,253
విభజన	6,528
సరెండర్ చేసినవారు	09

ఆర్థిక సేవల్లో కీలకపాత్ర పోషించాలి

బ్యాంకు సిబ్బందితో సమావేశమైన డీసీసీబీ ఛైర్మన్ నాగార్జున

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: రైతులు, ప్రజలకు ఆర్థిక సేవలందించడంలో సహకార బ్యాంకులు కీలక పాత్ర పోషించాలని డీసీసీబీ ఛైర్మన్ కిమిడి నాగార్జున అన్నారు. బుధవారం విజయనగరంలోని వి.టి.అగ్రహారం ఉన్న బ్రాంచిని సందర్శించారు. పరిసరాలు అధ్వానంగా ఉండడంపై మండిపడ్డారు. మెరుగుపర్చాలని ఆదేశించారు. సిబ్బందితో సమావేశమై సేవలపై ఆరా తీశారు. డిపాజిట్లు పెంచాలని, ఇతర బ్యాంకులకు దీటుగా ముందుకెళ్లాలన్నారు. జీఎం కె.వి.వి.ఆర్.ఎన్.సత్యనారాయణ, డీజీఎం బి.ప్రసాద్, సతీష్ పాల్గొన్నారు.

విచారిస్తారా.. విస్మరిస్తారా!

● పూర్వపు డీఎంపై విచారణకు విజిలెన్స్ డీజీకి లేఖ

ఈనాడు, విజయనగరం

పౌర సరఫరాల సంస్థలో గత అయిదేళ్లలో అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న పూర్వపు డీఎం కె.మీనాకుమారిపై విచారణకు ఆ శాఖ ఎండీ ఎట్టకేలకు విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంటు డీజీకి లేఖ రాయడం చర్చనీయాంశమైంది. మే 12న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత అధ్యక్షతన జరిగిన జిల్లా సమీక్ష సమావేశం (డీఆర్సీ)లో స్వయంగా మంత్రి ఆమెపై విచారణకు ఆదేశించిన విషయం విదితమే. ఆరు వారాలైనా కదలిక లేకపోవడంతో ఇప్పుడు ఈ లేఖతో విచారణ చేపడతారా.. విస్మరిస్తారా.. అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయిదేళ్ల కాలంలో ధాన్యం, గోనె సంచుల కొనుగోళ్లు, మిల్లులకు ధాన్యం రవాణా, సంచుల ధర రైతులకు చెల్లింపు నిధులు, ఎఫ్‌సీఐ గోదాములకు బియ్యం సరఫరాలో మిల్లర్ల నుంచి వసూలు చేశారన్న ఆరోపణలు వచ్చాయి. శ్రీకాకుళం జిల్లాలో తిరస్కరించిన 25 మెట్రిక్ టన్నుల నాసిరకం కందిపప్పు జిల్లాలో సరఫరాకు అనుమతులకు ప్రయత్నించారంటూ విమర్శలు వచ్చాయి. ఇన్‌ఛార్జి మంత్రి అనిత వీటిపై వచ్చిన ఫిర్యాదులపై ఆరా తీశారు. ఇటీవల జరిగిన డీఆర్సీలో సుమోటోగా విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. విచారణ వద్దని ఎవరు ఒత్తిడి చేసినా డీఆర్సీ నిర్ణయాన్ని తొక్కిపెట్టలేమని ఇన్‌ఛార్జి మంత్రి చెప్పినట్లు సమాచారం.

ప్రస్తుతం కమిషనర్ కార్యాలయంలో విధులు

గత ప్రభుత్వ హయాంలో మీనాకుమారి ఎఫ్‌ఏసీ డీఎంగా బాధ్యతలు చేపట్టారు. గత సెప్టెంబరులో ఆమెను ప్రధాన కార్యాలయానికి బదిలీ చేయగా, పక్షంలోగా మళ్లీ ఇక్కడే కొనసాగేలా ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఇందుకు జిల్లాలోని ఒక కీలక ప్రజాప్రతినిధి, మరో ఉన్నతాధికారి సహకరించినట్లు తెలిసింది. ఫిబ్రవరిలో ప్రభుత్వం రెగ్యులర్ డీఎంని నియమించింది. సవరణ ఉత్తర్వులకు రెండు నెలలు జాప్యం జరిగింది. జిల్లాకు చెందిన ఓ ప్రజాప్రతినిధి జోక్యంతో ఏప్రిల్‌లో మీనాకుమారిని రిలీవ్ చేశారు. ప్రస్తుతం ఆమె పౌరసరఫరాల కమిషనర్ కార్యాలయంలో ఐటీ మేనేజరుగా పనిచేస్తున్నారు.

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎస్టీ సెల్ ఏర్పాటు చేయాలి

రోగులతో మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ ఛైర్మన్ శంకరరావు

విజయనగరం వైద్య విభాగం, న్యూస్‌టుడే: విజయనగరంలోని మహారాజా, ఘోషాసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు జవాబుదారీతనం పెంచేందుకు మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డీవీజీ.శంకరరావు పేర్కొన్నారు.. బుధవారం ఆయన వైద్యాలయాలను తనిఖీ చేసి, రోగులతో మాట్లాడారు. ముందుగా మహారాజా ఆసుపత్రికి వెళ్లి ఓపీ, జనరల్ వార్డు, సర్జరీ, ఐసీయూ, రేడియాలజీ, సిటీ స్కాన్ విభాగాలను తనిఖీ చేశారు. అనంతరం ఘోషలో ప్రసూతి విభాగం, పిల్లల వార్డు, ఐసీయూ, చిన్నారులకు పోషకాహారం అందించే వార్డులను చూశారు. గర్భిణులు, బాలింతలతో మాట్లాడారు. ఓపీకి తగ్గట్లు సిబ్బంది, పరికరాలు లేవని డీవీజీ తెలిపారు. ఈమేరకు ఎస్టీ సెల్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ అంబేడ్కర్‌ను కోరుతామన్నారు. సూపరింటెండెంటు ఎస్.అప్పలనాయుడు, డీసీహెచ్ఎస్ పద్మశ్రీరాణి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ఆర్‌ఎస్ఈటీఐ సంచాలకుడిగా భాస్కరరావు

విజయనగరం అర్బన్, న్యూస్‌టుడే: స్టేట్‌బ్యాంకు ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ(ఆర్‌ఎస్ఈటీఐ) ఉమ్మడి జిల్లా సంచాలకుడిగా డి.భాస్కరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా ఫైనాన్స్ ఇంక్లూజన్ మేనేజర్‌గా పనిచేసి ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు సంచాలకుడిగా పనిచేసిన జి.బి.బి.రమణ రాజమహేంద్రవరం వెళ్లారు.

16 నుంచి కోర్సుల ప్రారంభం..

చరవాణి మరమ్మతులు- సర్వీస్, ఎల్ఎంవీ డ్రైవర్(ఎల్ఎల్ఆర్ తప్పనిసరి) కోర్సులకు సంబంధించి ఈనెల 16 నుంచి తరగతులు ప్రారంభిస్తున్నట్లు భాస్కరరావు తెలిపారు. అభ్యర్థులకు 30 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇస్తామని, ఉచిత భోజనం, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. ఆసక్తి గలవారు 15వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. పదోతరగతి పాస్ లేదా ఫెయిల్, 18 నుంచి 45 ఏళ్ల వయసు కలిగిన గ్రామీణ అభ్యర్థులు అర్హులని, తెల్లరేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, అయిదు కలర్ పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకురావాలన్నారు. ఇతర వివరాలకు 99595 21662, 99857 87820, 94939 07505 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్యమే మహాబాల్యం!

● నేటి నుంచి పాఠశాలల్లో విద్యార్థులకు వైద్య పరీక్షలు

న్యూస్‌టుడే, కొత్తవలస

పాఠశాలల విద్యార్థుల ఆరోగ్యం పెంపొందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ద్వారా జిల్లాలో జులై మొదటి వారం నుంచి వైద్య పరీక్షలు చేసేందుకు వైద్యారోగ్య శాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గురుకులాలు, కేజీబీవీల్లో చదువుకుంటున్న విద్యార్థులకు ఆరోగ్య తనిఖీలు చేస్తారు. అంగన్‌వాడీల్లోని పిల్లల నుంచి 18 ఏళ్లలోపు వరకు దీంట్లో పరీక్షలు చేస్తారు.

ప్రణాళిక రూపకల్పన



చిరుప్రాయంలోనే వ్యాధులను గుర్తించి విద్యార్థి ఆరోగ్య జీవనానికి బాటలు వేయాలన్నది ఈ కార్యక్రమం ఉద్దేశంగా చెబుతున్నారు. ఆర్‌బీఎస్‌కే ద్వారా ఈ ఏడాది మరింత పటిష్ఠంగా అమలుచేసేందుకు ఆరోగ్యశాఖ ఇప్పటికే ప్రణాళిక వేసింది. ఇందుకోసం నియమించిన ఏఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ ఇవ్వనున్నారు. ఈ నెలాఖరులోగా పీహెచ్‌సీ వైద్యులకు శిక్షణ ఇస్తారు. అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న చిన్నారులను గుర్తించి జిల్లా సర్వజన ఆసుపత్రిలో వైద్యం అందిస్తారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి నేషనల్ హెల్త్ మిషన్ ఆధ్వర్యంలో ఉచితంగా చేస్తారు.

2.83 లక్షల మంది

అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలో 2,800 విద్యాలయాల్లో 2.83 లక్షలు మంది చిన్నారులు ఉన్నట్లు గుర్తించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి గురు, శని వారాల్లో ఈ కార్యక్రమం చేపడతారు. ఇందుకు ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలతో కూడిన వైద్య బృందాలు ఏర్పాటు చేశారు. విద్యార్థికి ఆరోగ్య సమస్యలు ఉన్నట్లు గుర్తిస్తే ప్రాథమికంగా స్థానిక వైద్యాధికారికి కేసు రిఫర్ చేస్తారు. ఇంకా అనుమానం ఉంటే జిల్లా సర్వజన ఆసుపత్రికి తరలించి అవసరమైన వైద్య సేవలు అందిస్తారు.

చిన్నారుల ఆరోగ్యమే ప్రధానం

"పాఠశాలల విద్యార్థుల ఆరోగ్యం బాగుండాలని, ముందుగా సమస్యలు గుర్తించి అనుగుణంగా చికిత్స అందించడమే లక్ష్యంగా ఆర్‌బీఎస్‌కే అమలు చేస్తున్నాం. ఇది వరకు శిక్షణ పొందిన వైద్య సిబ్బందికి జూమ్ యాప్ ద్వారా మరోసారి శిక్షణ ఇస్తాం. కొత్తగా ఉద్యోగాల్లో చేరిన వారికి మాత్రం ఫిజికల్‌గా శిక్షణ ఇస్తాం. కార్యక్రమ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నాం."

- డా. సుబ్రహ్మణ్యం, ఆర్‌బీఎస్‌కే జిల్లా సమన్వయకర్త

(c) eenadu

దారంతా.. అడుగుకో గుంత

సాలూరు పట్టణం నుంచి దుగ్గసాగరం గ్రామం వరకు ఉన్న 3.4 కిలోమీటర్ల రోడ్డు అధ్వానంగా మారింది. ఎక్కడికక్కడే గుంతలతో ప్రయాణికులకు పరీక్ష పెడుతోంది. ఈ మార్గంలో పాచిపెంట మండలంలోని పాంచాలి, మోసూరు, మాతుమూరు తదితర గ్రామాలకు రోజూ వందల సంఖ్యలో వెళ్లే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. బీటీ రోడ్డు ఏర్పాటుకు రూ.1.50 కోట్లు మంజూరయ్యాయని, టెండర్లు పిలిచి పనులు చేపడతామని పీఆర్ డీఈ శర్మ 'న్యూస్‌టుడే'కు తెలిపారు. – న్యూస్‌టుడే, సాలూరు, గ్రామీణం

అద్దింటి చదువుతో తప్పని అవస్థ

సాలూరు మండలం మరుపల్లి పంచాయతీ గంగన్నదొరవలస మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలను నాడు-నేడు పేరుతో తొలగించారు. దాని స్థానంలో పునాదులు వేశారు. పక్కనే ఓ షెడ్డు నిర్మించారు. నిధులు రాకపోవడంతో పనులు నిలిచిపోయాయి. రెండేళ్లుగా అద్దె ఇళ్లలో, పాఠశాల వద్ద నిర్మించిన చిన్న గదిలో తరగతులు కొనసాగిస్తున్నారు. 24 మంది విద్యార్థులు, ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. ఐదు తరగతులను రెండుగా విభజించి ఒకరు అద్దె భవనంలో, మరొకరు కొత్తగా నిర్మించిన చిన్నగదిలో పాఠాలు చెబుతున్నారు. దీనిపై డీఈవో రాజ్‌కుమార్ మాట్లాడుతూ నిధులు విడుదల కావాల్సి ఉందన్నారు.

– న్యూస్‌టుడే, సాలూరు గ్రామీణం

అద్దె ఇంట్లో పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

పునాదుల్లో నిలిచిన పాఠశాల భవన నిర్మాణ పనులు

ఏనుగులు తిరిగే ప్రాంతంలో ఇదేం రక్షణ?

ప్రహరీ లేక వెదురు కర్రలతో కంచె ఏర్పాటు చేశారిలా..

సీతంపేట మండలం కె.గుమడలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ప్రాథమిక పాఠశాలకు ప్రహరీ లేకపోవడంతో మూగజీవాలు, జంతువులు లోపలికి రాకుండా తాత్కాలికంగా వెదురు కర్రలతో కంచెలా ఏర్పాటు చేసుకున్నారు. నాలుగు ఏనుగుల గుంపు ఈ పాఠశాలకు ఆనుకుని ఉన్న బగ్గా టేకు వనంలో ఎక్కువగా సంచరిస్తోంది. విద్యాలయ సమీపంలోని ఆ తోట ఉండడంతో గజరాజులు లోపలికి ప్రవేశిస్తే విద్యార్థుల పరిస్థితి ఏంటని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రహరీ నిర్మిస్తే కొంత ఉపయుక్తంగా ఉంటుందని పేర్కొంటున్నారు. ఈ విషయమై ఏఎంవో పి.కోటిబాబు వద్ద ప్రస్తావించగా.. ప్రహరీ కోసం ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని, నిధులు రావాలన్నారు.

– న్యూస్‌టుడే, సీతంపేట

డిప్లొమా ప్రవేశాలకు గడువు పెంపు

గరివిడి, న్యూస్‌టుడే: తిరుపతి శ్రీవేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం పరిధిలోని పది ప్రభుత్వ, మరో 12 అనుబంధ పశు సంవర్ధక పాలిటెక్నిక్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో వెటర్నరీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 7 వరకు పొడిగించినట్లు వర్సిటీ రిజిస్ట్రార్ పి.రవికుమార్ తెలిపారు. పదో తరగతి విద్యార్హత ఆధారంగా ప్రవేశాలు ఉంటాయని, అర్హులైన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, ఇతర వివరాలకు www.svvu.edu.in ను సంప్రదించాలన్నారు.

ఆనకట్ట ఎగువన పూడికతీత

ఈనాడు కథనానికి స్పందన

సంతకవిటి, న్యూస్‌టుడే: నాగావళి నదిపై సంతకవిటి మండలం రంగారాయపురం వద్ద ఉన్న నారాయణపురం ఆనకట్ట ఎగువన ఎట్టకేలకు పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి. సుమారు 50 వేల ఎకరాలకు ఆధారమైన ఈ ప్రాజెక్టు వద్ద ఏళ్లుగా పూడిక, రెల్లిగడ్డి పేరుకుపోయాయి. ఈ సమస్యపై ఏప్రిల్ 7న 'ఈనాడు'లో 'పూడిక పోదు- నీరు నిలవదు' శీర్షికన వచ్చిన కథనానికి కలెక్టరు అంబేడ్కర్ స్పందించి, ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. దీంతో రూ.5 లక్షలతో పనులు చేస్తున్నట్లు జలవనరులశాఖ ఈఈ సుధాకర్ తెలిపారు.

6న జగన్నాథ యాత్రకు బస్సు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: ప్రముఖ పుణ్యక్షేత్రం పూరీ జగన్నాథుని రథ యాత్రకు ఈనెల ఆరో తేదీన ఆర్టీసీ ప్రత్యేక బస్సును ఏర్పాటు చేస్తున్నట్లు విజయనగరం డిపో ప్రబంధకుడు జె.శ్రీనివాసరావు తెలిపారు. ఆ రోజు సాయంత్రం 4 గంటలకు ఆర్టీసీ సముదాయం నుంచి బయలుదేరి భువనేశ్వర్, కోణార్క్, పూరీ ఆలయాలను దర్శించుకొని 8వ తేదీ ఉదయం 8 గంటలకు తిరిగి విజయనగరం చేరుతుందని చెప్పారు. టిక్కెట్ ధర రూ.25 వేలుగా నిర్ణయించామని, కౌంటర్ వద్ద గానీ, www.apsrtconline.in వెబ్‌సైట్ ద్వారా బుక్ చేసుకోవచ్చని, ఇతర వివరాలకు 99592 25620, 94943 312213, 94403 59596 నంబర్లను సంప్రదించాలన్నారు.

మెప్మాలో బదిలీల పర్వం పూర్తి

విజయనగరం పట్టణం, న్యూస్‌టుడే: ఉమ్మడి జిల్లాలో పనిచేస్తున్న కమ్యూనిటీ ఆర్గనైజర్లు, డీఈవోలకు బదిలీలు జరిగినట్లు మెప్మా పీడీ జీవీ.చిట్టిరాజు తెలిపారు. కౌన్సెలింగుకు 19 మంది హాజరు కాగా.. 17 మందికి స్థానచలనమైనట్లు వెల్లడించారు. విజయనగరంలో డీఈవోగా పనిచేస్తున్న భాగ్యలక్ష్మికి సాలూరు, అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎస్.భానుప్రకాష్‌నాయుడుకు బొబ్బిలి, అక్కడున్న ఉల్లి లక్ష్మీదేవికి విజయనగరం కేటాయించామని చెప్పారు.

ప్రతిష్ఠాత్మకంగా పీటీఎం 2.0

పార్వతీపురం పట్టణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం పార్వతీపురం మన్యం జిల్లాలోని అన్ని యాజమాన్యాల జూనియర్ కళాశాలల్లో ఈనెల 10న తల్లిదండ్రులు, అధ్యాపకుల మెగా సమావేశం నిర్వహించాలని డీఐఈవో వై.నాగేశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు సమాయత్తం కావాలన్నారు. ప్రభుత్వం మెగా పీటీఎం 2.0 కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా రూపొందించిందన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లల పురోగతి తెలుసుకునేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

షాక్‌తో శోకం

ఎస్.కోట శివారులోని కర్రివాని కల్లాలు వద్ద బుధవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఓ కొబ్బరిచెట్టు విద్యుత్తు స్తంభంపై పడడంతో నేలకొరిగింది. ఈక్రమంలో అక్కడే ఉన్న రెండు చూడి గేదెలు, ఒక పెయ్యికి తీగలు తగిలి మరణించాయి. ★ తీగ కింద పడడంతో రామభద్రపురం మండలం కొండకెంగువలో మూడు మేకలు చనిపోయాయి.

అంశం	2022-23	2023-24	2024-25
మృతుల సంఖ్య	17	27	30
చనిపోయిన పశువులు	24	17	16

● ఇప్పటివరకు రూ.1.52 కోట్ల మేర పరిహారం అందించినట్లు విద్యుత్తు శాఖాధికారులు చెబుతున్నారు.

ఉమ్మడి జిల్లాలో విద్యుత్తు ప్రమాదాలు పెరుగుతున్నాయి. వర్షాకాలంలో ఆ సంఖ్య మరింత ఎక్కువవుతోంది. ఎక్కడ ఏ తీగ పడి ఉందో.. ఏ స్తంభం కుప్పకూలిందో తెలియక ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. శాఖాధికారుల నిర్లక్ష్యంతో పాటు వినియోగదారులు కనీస జాగ్రత్తలు పాటించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడుతోంది.

– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం, ఎస్.కోట, రామభద్రపురం, పాలకొండ

ఎస్.కోటలో మరణించిన గేదె

ఏటా పెరుగుతున్న సంఖ్య..

గత నాలుగేళ్లలో 81 మంది మృత్యువాత పడగా.. 67 పశువులను తీగలు బలిగొన్నాయి. ప్రస్తుత ఆర్థిక ఏడాదిలో ఏడుగురు కన్నుమూశారు. 10 పశువులు చనిపోయాయి. బుధవారం సైతం రెండు చోట్ల ఘటనలు జరిగాయి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి..

★ వర్షాల సమయంలో ఎర్తి పరిస్థితిలోనూ స్తంభాలను, స్టేవైర్లను తాకకూడదు ★ ఏదైనా పరిసరాల్లో కూలిన వెంటనే శాఖ సిబ్బందికి సమాచారం ఇవ్వాలి ★ పిడుగులు పడితే ఇంట్లో సరఫరాను ఆపివేయాలి ★ చిన్నపిల్లలకు ఎలక్ట్రికల్ పరికరాలను దూరంగా ఉంచాలి. ★ పొలాలు, గట్ల మీదుగా వెళ్లేటప్పుడు అప్రమత్తత అవసరం ★ సొంత ప్రయోగాలకు దూరంగా ఉండాలి ★ అత్యవసరమైతే 1912కి తెలియజేయొచ్చు

లోపాలివీ..

★ తీగలు వేలాడుతుండడం ★ స్తంభాల మధ్య దూరం ఎక్కువ కావడం ★ ఇనుప స్తంభాల పాత వేసిన వాటిని ఇంకా మార్చకపోవడం ★ నియంత్రికల వద్ద రక్షణ కరవవడం ★ సకాలంలో మరమ్మతులు లేకపోవడం ★ తుపాన్లు, వర్షాల వేళ లైన్లు తెగినా స్పందించకపోవడం ★ హై, లోవోల్టేజీ ఫిర్యాదులున్నా పరిశీలన చేపట్టకపోవడం

సకాలంలో పరిహారం..

ప్రమాదాలపై ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. మరమ్మతులు సైతం సకాలంలో జరుగుతున్నాయి. కనీస జాగ్రత్తలు తీసుకోకపోవడంతో కొన్నిచోట్ల ఘటనలు జరుగుతున్నాయి. నియంత్రణకు సిబ్బందికి సూచనలు చేశాం. ఇప్పటివరకు జరిగిన మరణాలకు సంబంధించి పరిహారం అందించాం. దరఖాస్తులు, పత్రాల్లో లోపాల కారణంగా కొన్ని పెండింగ్‌లో ఉన్నాయి. త్వరలోనే వారికీ అందజేస్తాం.

– ఎం.లక్ష్మణరావు, ఎస్ఈ, ఏపీఈపీడీసీఎల్

మత్స్య సంపద పెంపునకు ప్రత్యేక పరీక్షలు

విజయనగరం అయ్యన్నపేట, న్యూస్‌టుడే: మత్స్య సంపదను పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నాయి. ఆక్వారంగాన్ని ప్రోత్సహించడానికి వివిధ కార్యక్రమాలు చేపడుతున్నాయి. దీనిలో భాగంగా మత్స్యకారుల ఆర్థిక స్వావలంబన కోసం విజయనగరంలో ఆక్వా లాబ్‌ను ఏర్పాటు చేశాయి. ఇప్పటికే అక్కడ పరీక్షలు(నీరు, మట్టి, మైక్రోబయాలజీ) ప్రారంభమయ్యాయి. గత రెండేళ్లలో 920 నమూనాల ద్వారా ప్రభుత్వానికి రూ.66,770 చేరింది.

ఉమ్మడి జిల్లాకు సంబంధించి విజయనగరంలో ఏర్పాటైన ల్యాబ్

గత రెండేళ్లలో ఇలా..

నీటి పరీక్షలు	820
మట్టి	20
మైక్రోబయోలజీ	80

ఆ మూడూ తప్పనిసరి..

చేపలు, రొయ్యల పెంపకం ప్రారంభం, ఉత్పత్తి పెంచుకోవాలంటే నీరు, మట్టి, మైక్రోబయాలజీ పరీక్షలు తప్పనిసరిగా చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఆక్వాకల్చర్‌ను ప్రారంభించడానికి ముందు మట్టి సేకరించి ఇవ్వాలి. దీంతో చెరువును ఎలా తవ్వాలి, పరిమాణం, రక్షణ చర్యలను సూచిస్తారు. నీటిని అందిస్తే ఆక్సిజన్, ఎదుగుదలను ప్రోత్సహించే ఎంజైములను విశ్లేషిస్తారు. రోగాలు ప్రబలకుండా మైక్రోబయోలజీ పరీక్ష చేస్తారు. ఇక్కడ సాధ్యం కాకపోతే కాకినాడలోని స్టేట్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫిషరీస్ టెక్నాలజీ కేంద్రానికి పంపించి, ఫలితాలను తెలుసుకుంటారు.

అందుబాటులో మందులు..

'యూనిట్ ప్రారంభించాక ఏ దశలోనైనా కేంద్రాన్ని సంప్రదించవచ్చు. తక్కువ ధరలకే పరీక్షలు చేస్తున్నాం. అనంతరం అవసరమైన మందులు ఇస్తాం. అన్నివేళలా సిబ్బంది అందుబాటులో ఉంటారు. సందేహాలుంటే 79930 45899ను సంప్రదించాలి' అని ఆక్వాల్యాబ్ ఎఫ్‌డీవో వెంకటేశ్వరరావు తెలిపారు.

అంతర్జాతీయ ప్రమాణాలతో పర్యాటక ప్రాజెక్టులు

విశాఖపట్నం(వన్‌టౌన్), న్యూస్‌టుడే: అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా విశాఖలో పర్యాటక ప్రాజెక్టుల రూపకల్పన జరగాలని, భవిష్యత్తు అవసరాల దృష్ట్యా స్టార్ రేటింగ్ కలిగిన పది వేల గదుల్ని అందుబాటులోకి తీసుకురావాల్సి ఉందని రాష్ట్ర పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ సూచించారు. బుధవారం విశాఖ వచ్చిన ఆయన కలెక్టరేట్ సమావేశ మందిరంలో విజయనగరం, విశాఖ జిల్లాల అధికారులతో సమావేశమయ్యారు. భోగాపురం మండలంలో నిర్మించబోయే ఒబెరాయ్ హోటల్, భీమిలి మండలం అన్నవరంలో ఏర్పాటయ్యే మై ఫెయిర్స్ హోటల్ నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను త్వరగా చేపట్టాలన్నారు. అనుసంధాన రహదారులు, విద్యుత్తు సౌకర్యం కల్పించాలని చెప్పారు. గోస్తనీ నది నుంచి పైపు లైన్ల ద్వారా ఆయా హోటల్స్‌కు అవసరమైన నీటిని సరఫరా చేయాలని కోరారు. భూ సేకరణ ప్రక్రియ, ఇతర సాంకేతికపరమైన అంశాలను త్వరితగతిన పూర్తి చేసి, యజమానులకు సహాయ సహకారాలు అందించాలన్నారు. జిల్లా నుంచి ఆర్డీవో కీర్తి తదితరులు పాల్గొన్నారు.

'పదవి పోయాక ఉత్తరాంధ్ర గుర్తొచ్చిందా'

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కళా తదితరులు

చీపురుపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పదవులు పోయాకే జగన్ అతని అనుచరులకు ఉత్తరాంధ్ర అభివృద్ధి గుర్తుకు వస్తోందని తెదేపా పొలిట్ బ్యూరో సభ్యుడు, చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు ఎద్దేవా చేశారు. మండలంలోని గుణిదాంలో బుధవారం జరిగిన 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో చేసిన అభివృద్ధి, సంక్షేమం, హామీల అమలు గురించి వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత ప్రభుత్వం దౌర్జన్యంతో చేసిన పాలనకు ప్రజలు చరమగీతం పాడారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్-6 హామీలను సీఎం చంద్రబాబు నెరవేరుస్తున్నారని వివరించారు. చీపురుపల్లిలో రానున్న రెండు నెలల్లో అన్న క్యాంటీన్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. తోటపల్లి కాలువ నిర్వహణకు నిధుల మంజూరుపై ఇచ్చిన హామీ మేరకు పార్వతీపురం, విజయనగరం జిల్లాల పరిధిలో పనులు ప్రారంభించామన్నారు. పార్టీ మండలాధ్యక్షుడు రౌతు కామునాయుడు, చీపురుపల్లి ఆర్ఈసీఎస్ మాజీ అధ్యక్షుడు రామచంద్రుడు, నాయకులు వర్మరాజు, ఎం.రమేష్, టి.అమ్మారావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రూ.2.64 కోట్లతో రహదారి బాగు

ప్రారంభోత్సవంలో మంత్రి కొండపల్లి, మేయర్ శ్రీనివాసరావు తదితరులు

విశాఖపట్నం(కార్పొరేషన్), న్యూస్‌టుడే: విశాఖ నగరానికి నీటిని అందించే విజయనగరం జిల్లా తాటిపూడి జలాశయం సమీపంలోని మధుపాడ (గ్రామం- కృష్ణాపురం వాటర్ హెడ్‌వర్క్స్) రహదారిని రూ.2.64 కోట్ల జీవీఎంసీ నిధులతో ఇటీవల పునరుద్ధరించారు. ఆ రహదారిని బుధవారం రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశాఖ మేయర్ పీలా శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ మధుపాడ కూడలి నుంచి తాటిపూడి వరకు ఉన్న రోడ్డు పూర్తిగా మరమ్మతులకు గురికావడంతో అభివృద్ధి చేశామన్నారు. కార్యక్రమంలో నీటి సరఫరా ఇంజినీరింగ్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

ప్రజల అవసరాలకే ప్రాధాన్యం: ఈఈ

తాటిపూడి(గంట్యాడ), న్యూస్‌టుడే: ప్రస్తుతం ఉన్న అవసరాలను తప్పించి, తాటిపూడి నీటిని ఎక్కడికీ తరలించే పరిస్థితి లేదని జలవనరుల శాఖ ఈఈ ఎంవీ.రమణ స్పష్టం చేశారు. బుధవారం తాటిపూడి జలాశయం వద్ద ఆయన మాట్లాడారు. ప్రాజెక్టు సామర్థ్యం 3.20 టీఎంసీలని, ప్రస్తుతం 2.63 టీఎంసీల నీరు ఉందన్నారు. జీవీఎంసీ, విశాఖ తాగునీటి కోసం కొంతమేర నీరు ఇస్తున్నామన్నారు. ఎస్.కోట, గజపతినగరం నియోజకవర్గాల ప్రజలకు కూడా అందిస్తున్నామని చెప్పారు. తాగునీటికే తమ ప్రాధాన్యమని ఇప్పటికే ఉన్నతాధికారులకు తెలియజేశామని, ఇంకా నీటి లభ్యత ఉంటే పరిశ్రమలకు ఇవ్వాలన్నది ప్రభుత్వ ఉద్దేశమన్నారు. రైతులు గ్రామాల్లో ఉన్న కాలువలను బాగు చేసుకోవాలని, అందుకు కావాల్సిన పరిపాలన అనుమతులు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

చికెన్ ధరలు

రకం	బ్రాయిలర్
(బ్యాగ్)లైవ్	90
డ్రెస్డ్	150
స్కిన్‌లెస్	160

పొరుగు సేవల గురువులకు తీపికబురు

వేతనం పెంచుతూ ఉత్తర్వులు

పార్వతీపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలలు, ప్రతిభ, క్రీడా పాఠశాలల్లో పొరుగు సేవలపై పని చేస్తున్న అతిథి ఉపాధ్యాయులకు వేతనాలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర వ్యాప్తంగా 1,659 మంది ఉన్నారు. గురుకులాల్లో పని చేస్తున్న సిబ్బంది కంటే వీరి జీతాలు తక్కువ. దీంతో విషయం గిరిజన శాఖ మంత్రి సంధ్యారాణి దృష్టికి వారంతా తీసుకెళ్లారు. ఆమె స్పందించి వేతనాలు సవరించాలని నిర్ణయం తీసుకున్నారు.

ఎవరెవరికి ఎంతంటే..

✦ గురుకుల జూనియర్ కళాశాలల్లో పనిచేస్తున్న 200 మంది జూనియర్ అధ్యాపకులు, 19 మంది పీడీలు, 15 మంది గ్రంథాలయాధికారులకు రూ.18 వేల నుంచి రూ.24,150 చేశారు. ✦ 283 మంది పీజీటీలకు రూ.16,100లు ఉండగా రూ.24,150 అందనుంది. ✦ 832 మంది టీజీటీలు, 35 మంది పీడీలు(పాఠశాలల్లో ఉన్నవారు) రూ.14,800 నుంచి రూ.19,350 అందుకోనున్నారు. ✦ 122 మంది పీఈటీలు, 90 మంది క్రాఫ్ట్, ఆర్ట్, మ్యూజిక్ శిక్షకులకు గతంలో రూ.10,900 ఇచ్చేవారు. ఇకపై రూ.16,350 అందిస్తారు. ✦ క్రీడా పాఠశాలల్లో కోచ్‌లకు రూ.25 వేల నుంచి రూ.31,250, సహాయ కోచ్‌లకు రూ.22 వేల నుంచి రూ.27,500కు పెంచుతూ గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.

పెంచారిలా.. (రూ.లలో)

గతంలో..	ఇకపై..
25000	31,250
30000	37,500
35000	43,750
40000	50 వేలు
45000	56,250
49000	61,250
52000	65 వేలు

ప్రతిభ కళాశాలల్లో..

ప్రతిభ కళాశాలల్లో పనిచేస్తున్న 40 మంది అతిథి జూనియర్ అధ్యాపకులు, 18 మంది పీడీలకు చెల్లించే నెలవారీ వేతనాలు పెరిగాయి.

EENADU Classifieds

BUSINESS SERVICES

GK గోల్డ్ లోన్ బ్యాంక్/ప్రైవేటు తనఖాలో ఉన్న బంగారాన్ని విడిపించి అదే రోజు మార్కెట్ ధరకు కొనబడును లేదా అధిక రుణం ఇప్పించబడును. ✆ 8897731257.

JOBS

రాజాం TVS Showroomలో పనిచేయుటకు Sales Executives కావలెను. (M/F) సంప్రదించండి : 9010074740.

FACULTY/ TEACHERS

KNBR Upper Primary School, కొత్త అగ్రహారం 1వ వీధి, విజయనగరం నందు పర్మ. చేయుటకు అనుభవంగల క్వాలిఫైడ్ టీచర్స్ కావలెను. జీతం అనుభవం ఆధారంగా ఇవ్వబడును. సెల్: 9391446385.

WANTED
Teachers of TELUGU, ENGLISH & SOCIAL Studies with high school Teaching Experience are Required to work at SSS School (Garividi). Salary Negotiable as per the candidate's Experience.
Send Resume to
✆ 9063666325

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా
స్పందన అతివేగం
ఈనాడు క్లాసిఫైడ్స్
5 లైన్ల ప్రకటన
కేవలం 315 /-
(GST 5% అదనం)
మాత్రమే
సంప్రదించండి:
8008597609

అనుమానాస్పదస్థితిలో మహిళ మృత్యువాత

ఇంటి ఆవరణలో రక్తపు మరకలు

కరగాన పద్మ (పాతచిత్రం)

బొబ్బిలి, న్యూస్‌టుడే: మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన ఘటన బొబ్బిలి పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. పెదచాకలి వీధి కూడలిలో నివాసం ఉంటున్న కరగాన పద్మ(45) భర్త పైడిరాజు గొర్రెల కాపరి. ఆమె ఇళ్లల్లో పనులు చేస్తుంటారు. వీరి ఇద్దరు కుమారులు కిరణ్, చందు భార్యాపిల్లలతో వేరే చోట కాపురం ఉంటున్నారు. బుధవారం సాయంత్రం ఇంట్లో ఉన్న పద్మ కేకలు వేయడంతో స్థానికులు చేరుకుని చూడగా రక్తపు మడుగులో కనిపించారు. అపస్మారక స్థితిలో ఉన్న బాధితురాలిని ఆసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆమె కత్తిపీట మీద ప్రమాదవశాత్తు పడిపోవడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. భర్త ఇంట్లో లేని సమయంలో ఘటన చోటుచేసుకోవడం పట్ల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. డీఎస్పీ భవ్యారెడ్డి, ఎస్సై రమేష్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

హత్యగా అనుమానం?.. పద్మ ఇంట్లో ఒంటరిగా ఉండడాన్ని చూసి పథకం ప్రకారం హత్య చేసి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు. ఛాతి, మెడ భాగంలో గాయాలున్నాయి. ఇంటి నిండా రక్తపు చుక్కలు పడి ఉన్నాయి. కుటుంబంలో ఏమైనా తగాదాలు ఉన్నాయా? అని ఆరా తీస్తున్నారు. క్లూస్‌టీం ఆధారాలు సేకరించింది. మృతిపై అనుమానాలు ఉన్నాయని, దర్యాప్తు చేస్తున్నామని డీఎస్పీ తెలిపారు.

పార్కింగ్ విషయంలో ఘర్షణ: కత్తితో దాడి

గోపాలపట్నం, న్యూస్‌టుడే: ఓ వ్యక్తిపై కత్తితో దాడిచేసిన ఘటన గోపాలపట్నం పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. వేపాడ ప్రాంతానికి చెందిన జి.శ్రీనివాసరావు(25), సాయి అన్నదమ్ములు. వీరు సింహాచలం దరి గోశాల సమీపంలోని కె.కన్వెన్షన్‌లో పని చేస్తున్నారు. ఈనెల 1న భూలోకనగర్‌లోని ఓ వీధిలో సాయి తన ద్విచక్రవాహనం నిలిచి ఉంచారు. ఇదే ప్రాంతానికి చెందిన ఎస్.చంద్రశేఖర్ తన కారును ఆ ద్విచక్రవాహనానికి అడ్డంగా పెట్టారు. ఈ విషయమై ఇద్దరి మధ్య ఘర్షణ జరిగింది. విషయాన్ని సాయి తన సోదరుడు శ్రీనివాసరావుకు చెప్పాడు. దీంతో రాత్రి 8 గంటల ప్రాంతంలో అన్నదమ్ములిద్దరూ చంద్రశేఖర్ ఇంటికి వెళ్లారు. అక్కడ ముగ్గురి మధ్య గొడవ జరిగింది. ఈక్రమంలో చంద్రశేఖర్ తన ఇంట్లో ఉన్న కూరగాయల కత్తితో శ్రీనివాసరావుపై దాడికి పాల్పడ్డాడు. గాయపడిన అతడిని స్థానికులు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై అప్పలనాయుడు తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండుకు తరలించామన్నారు. చంద్రశేఖర్ ఆరిలోవలో జీవీఎంసీ శానిటరీ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు.

బడుల నిర్వహణకు నిధులొచ్చాయోచ్!

పార్వతీపురం పట్టణం, కొత్తవలస, వీరఘట్టం, న్యూస్‌టుడే: ప్రభుత్వ బడుల బలపేతం దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా స్కూల్ గ్రాంట్ కింద తొలి విడతలో 50 శాతం నిధులు విడుదల చేసింది. 2025-26 ఏడాదికి గానూ రెండు జిల్లాల్లోని 3,344 విద్యాలయాలకు రూ.7.64 కోట్లు కేటాయించింది. దీనిలో రూ.3.82 కోట్లు విడుదలయ్యాయి. దీనికి సంబంధించి సమగ్ర శిక్షా రాష్ట్ర సంచాలకులు బి.శ్రీనివాసరావు జిల్లా ఏపీసీకి సమాచారం పంపారు.

వీరభద్రపురంలోని ప్రాథమికోన్నత పాఠశాల

పాఠశాలల నిర్వహణకు గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరుకాక ప్రధానోపాధ్యాయులు ఇబ్బంది పడ్డారు. కొందరు సొంత నిధులు వెచ్చించారు. వైకాపా పాలనలో స్కూల్ గ్రాంటును పీడీ ఖాతాల్లో జమచేసినట్లే చేసి వెనక్కి తీసుకున్న దాఖలాలున్నాయి. ఆయా సమస్యలు పరిష్కరిస్తూనే బడుల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. పాఠశాలల ప్రారంభం రోజే విద్యార్థులకు పుస్తకాలు అందించింది. బ్యాగులు, దుస్తులు, బూట్లు ఇస్తోంది. సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం పెడుతోంది. ఇప్పుడు నిర్వహణ నిధులు ఇవ్వడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

జిల్లా	పాఠశాలలు	కేటాయింపు (రూ.కోట్లలో)	విడుదల (రూ.కోట్లలో)
విజయనగరం	1770	4.30	2.15
పార్వతీపురం	1574	3.33	1.67

ఖర్చులు ఇలా..

విద్యార్థుల సంఖ్యను బట్టి ఈ నిధుల వినియోగానికి గానూ మార్గదర్శకాలు విడుదల చేశారు. ఇందుకు అనుగుణంగా రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు స్కూల్ గ్రాంట్ లభిస్తుంది. సుద్ద ముక్కలు, తెల్ల కాగితాలు, రిజిస్టర్లు, పరీక్షల నిర్వహణకు రూ.5 వేలు, జాతీయ పండగల కోసం రూ.2 వేలు, విద్యుత్తు బిల్లుల చెల్లింపునకు రూ.3,500, అంతర్జాలం వసతికి రూ.2,500, జిరాక్స్ ముద్రణకు రూ.2 వేలు, చేతులు శుభ్రం చేసుకునే రసాయనాలు, శానిటైజర్ తదితరాలకు రూ.2,500, పారిశుద్ధ్యం, మరుగుదొడ్ల నిర్వహణకు రూ.2,500 ఖర్చు చేసేలా వెసులుబాటు కల్పించారు. చిన్నచిన్న మరమ్మతులకు ఇందులో అవకాశం ఇచ్చారు. ఈనెల 10న నిర్వహించ తలపెట్టిన తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల(ఎంపీటీఎం) మెగా సమావేశానికి 20 శాతం నిధులు వాడుకోవచ్చని సమగ్ర శిక్షా రాష్ట్ర సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు.

చోరీపై కేసు నమోదు

గజపతినగరం, న్యూస్‌టుడే: గజపతినగరం రైల్వే స్టేషన్ కాలనీలోని ఇంట్లో మంగళవారం అర కిలో వెండి, రూ.10 వేల నగదు అపహరణకు గురైందని యజమాని పాండ్రంకి గణేష్ బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కిరణ్‌కుమార్‌నాయుడు తెలిపారు. గణేష్ తల్లి పార్వతి ఆదివారం హైదరాబాద్‌లోని కుమార్తె వద్దకు వెళ్లగా పట్టపగలు కారులో వచ్చిన దొంగలు ఇంటి తాళాలు విరగ్గొట్టి దోచుకెళ్లారు. సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నామని, క్లూస్‌టీం ఆధారాలు సేకరించిందని ఎస్సై తెలిపారు.

ఊరమెట్ట లోయలో పడి 30 గొర్రెల మృతి

వేపాడ, న్యూస్‌టుడే: వేపాడ మండలం రామస్వామిపేట సమీపంలోని ఊర మెట్ట అంచున ఉన్న లోయలో పడి బుధవారం 30 గొర్రెలు మృతి చెందాయి. రూ.4 లక్షల నష్టం వాటిల్లినట్లు బాధితులు చెబుతున్నారు. వారి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన పి.బాలకృష్ణ, రామారావుకు చెందిన గొర్రెల మందను ఊర మెట్టపై మేతకు వదిలిపెట్టారు. అక్కడున్న కోతులు బెదిరించడంతో మెట్ట అంచుకు చేరుకున్నాయి. ప్రస్తుత వర్షాలకు ఒడ్డు జారిపోవడంతో 30 వరకు రాళ్లు, మట్టితో పాటు లోయలో పడి అక్కడికక్కడే మృతి చెందాయి. విషయం తెలుసుకున్న సర్పంచి వి.శర్మ, జి.మంగరాజు తదితరులు ఘటనా స్థలానికి చేరుకొని బాధితులను పరామర్శించారు. బొద్దాం పశు వైద్యాధికారి అనిల్‌కుమార్ పోస్టుమార్టం నిర్వహించారు.

కళేబరాల వద్ద వైద్యుడు, స్థానికులు

(c) eenadu

బొబ్బిలి

●బొబ్బిలి ●రాజాం ●గజపతినగరం ●చీపురుపల్లి

చినుకు పలకరింపు ప్రమాదాల వెక్కిరింపు

తెర్లాం రామ మందిరం మలుపులో దుస్థితి

తెర్లాం, బొబ్బిలి గ్రామీణం, రేగిడి, సంతకవిటి, బొండపల్లి, న్యూస్‌టుడే: చినుకు పడితే రహదారులు ప్రయాణికుల్ని భయపెడుతున్నాయి. ఎక్కడికక్కడ ఏర్పడిన గోతుల్లో నీరు చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత అయిదేళ్లు రోడ్లను పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. కనీస చిన్నపాటి మరమ్మతులు లేక గుంతలు మరింత పెద్దవై, తరచూ ప్రమాదాలకు కారణం అవుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కొన్ని పనులు చేసినా.. ఇంకా పూర్తి స్థాయిలో మరమ్మతులు చేపట్టాల్సి ఉంది. వర్షాకాలం నేపథ్యంలో అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

పనులు ఎప్పుడో?

తెర్లాం మండలంలోని పెరుమాళి కూడలి నుంచి నెమలాం వెళ్లే మధ్యలో పలు చోట్ల రహదారి బాగా దెబ్బతింది. ఆర్‌అండ్‌బీ పరిధిలో ఉన్న ఈ మార్గంలోని పెద్ద గుంతల్ని మాత్రం సంక్రాంతి పండగ సమయంలో సుమారు రూ.3 లక్షలతో పూడ్చారు. చిన్న గోతులు, బీటలను వదిలేశారు. ఆటోలు బోల్తా పడుతున్నాయి. ద్విచక్ర వాహనాలు అదుపు తప్పుతున్నాయి. అలాగే తెర్లాం రామమందిరం మలుపు దగ్గర గుంతలు పెద్దవయ్యాయి. నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించామని, వచ్చిన వెంటనే బాగుచేయిస్తామని ఆర్‌అండ్‌బీ ఏఈ రాజు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

అలజంగి-కారాడ రహదారి ఇలా..

ఇక్కడా అంతే..

బొబ్బిలిలో కురుస్తున్న వర్షాలకు బట్టివలస గిరిజన గ్రామానికి వెళ్లే రహదారి బురదమయంగా మారింది. గోపాలరాయుడుపేట, వెంకటరాయుడుపేట పాఠశాలలకు వెళ్లడానికి పాట్లు పడుతున్నారు. అలజంగి-కారాడ, కుమందానపేట, లింగమ్మవలస, గొంగావలస రహదారుల్లో ఏర్పడిన గుంతల్లో నీరు చేరింది. లోతు తెలియక దిగిన ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. రేగిడి మండలంలోని ఉనుకూరు, సోమరాజుపేట గ్రామాల ఆర్‌అండ్‌బీ రహదారులు వర్షాలకు అధ్వానంగా మారాయి. నిధులు రాక పనులు చేపట్టలేదని ఏఈ నాగభూషణం అన్నారు. సంతకవిటి మండలం మల్లయ్యపేట-హొంజరాం రహదారిపై గోతుల్లో నీరు చేరి చెరువులను తలపిస్తున్నాయి. చర్యలు చేపడతామని ఏఈ రియాజ్ తెలిపారు.

విజిలెన్స్ దాడులు..

రాజాం: గృహ వినియోగ గ్యాస్‌ను వాణిజ్య అవసరాలకు వాడుతున్నారనే ఆరోపణలపై విజిలెన్స్ అధికారులు రాజాంలోని హోటళ్లపై దాడులు చేశారు. మూడుచోట్ల 10 సిలిండర్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్సై రామారావు తెలిపారు. హెచ్‌సీ పురుషోత్తం, కన్నబాబు పాల్గొన్నారు.

పనులు పూర్తయ్యేలా.. దాహార్తి తీరేలా

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం కల్పించి ప్రజల దాహార్తి తీర్చడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఇంటింటి కుళాయిలు లేని చోట ఏర్పాటు చేయాలని భావించి ఇటీవల ప్రతిపాదనలు కోరింది. నిధులు మంజూరైతే పనులు ప్రారంభించి.. రక్షిత నీటి పథకాలు నిర్మించనున్నారు. 2019లో జలజీవన్ మిషన్ పథకంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సగం సగం నిధులతో ఇంటింటికి కుళాయిలు ఏర్పాటు చేయాలని నిధులు మంజూరు చేశాయి. అయితే బిల్లులు చెల్లించకపోవడంతో పనులు పూర్తిస్థాయిలో జరగలేదు. ఇప్పుడు వాటికి కొత్తగా ప్రతిపాదనలు పంపారు.

రూ.61 కోట్లతో ప్రతిపాదనలు

ముత్తాయవలసలో వీధి కుళాయిల వద్ద వేచి ఉన్న మహిళలు

నిధులు రాగానే..

ప్రతిపాదనలు పంపించిన మేరకు నిధులు మంజూరు కాగానే ఇంటింటి కుళాయిలు ఏర్పాటు చేస్తాం. జలజీవన్ మిషన్‌లో ఇంటింటి కుళాయిలు వేయని ఇళ్లను గుర్తించాం. ఇప్పుడు వాటికి ఏర్పాటు చేస్తాం. ఇప్పటికే వాటర్ గ్రిడ్‌కు కూడా ప్రతిపాదనలు పంపించాం.

– ఢిల్లీశ్వరరావు, డీఈ, ఆర్‌డబ్ల్యూఎస్, బొబ్బిలి సబ్ డివిజన్

ఎమ్మెల్యేల వినతి మేరకు..

గత ప్రభుత్వ హయాంలో మొదటి విడతలో కొన్ని గ్రామాలకు కుళాయిలు ఏర్పాటు చేశారు. రెండో విడతలో సుమారు రూ.44 కోట్లతో టెండర్లు పిలిచినా గుత్తేదారులు ముఖం చాటేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వాటర్ గ్రిడ్ ద్వారా తాగునీరు అందించాలని భావించి రూ.500 కోట్లతో ప్రతిపాదనలు పంపించారు. అది అమల్లోకి వచ్చేసరికీ ఆలస్యం అవుతుందని, ప్రత్యామ్నాయం ఆలోచించాలని ఎమ్మెల్యేలంతా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. వారి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుని కొత్తగా ప్రతిపాదనలు పంపించాలని కోరగా.. జిల్లా అధికారులు ఇటీవల చర్యలు తీసుకున్నారు. నియోజకవర్గంలోని బొబ్బిలి, రామభద్రపురం, బాడంగి, తెర్లాం మండలాల్లోని 68 గ్రామాల్లో మంచినీటి పథకాలు నిర్మించి 329 కిలోమీటర్ల మేర పైపులైను వేయడానికి, 25,127 కుళాయిల ఏర్పాటుకు దాదాపు రూ.61 కోట్లతో ప్రతిపాదనలు పంపారు.

మండలం	నిర్మించనున్న రక్షిత నీటి పథకాలు	ఏర్పాటు చేయనున్న కుళాయిలు	ప్రతిపాదించిన నిధులు (రూ.కోట్లలో)
బొబ్బిలి	12	7,800	12.60
రామభద్రపురం	32	7,300	17.26
బాడంగి	13	3,900	13.80
తెర్లాం	11	6,127	17.95

కూరగాయల ధరలు

రాజాం రైతు బజారులో బుధవారం కూరగాయల ధరలు (కి.లో రూ.లలో) ● టమాటా: 36.00, వంకాయలు: 28.00 దొండ: 30.00, బీర: 35.00 ● బెండ: 20.00 ● కాకర: 25.00 ● చిక్కుడు: 25.00 ● ఆనపకాయ (ఒకటి): 10.00 ● అరటి (జత): 12.00 ● మునగ: 40.00 ● ఉల్లి: 25.00 ● బంగాళాదుంపలు: 20.00 ● అల్లం: 50.00 ● వెల్లుల్లి: 70.00/75.00

– న్యూస్‌టుడే, రాజాం

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

బొబ్బిలి - 80085 74367
గజపతినగరం - 80085 74332
రాజాం - 80085 74308
గరివిడి - 80085 74348

? గుజ్జంగివలసలో వెల్‌నెస్ సెంటరు నిర్మాణం అసంపూర్తిగా ఉంది. **- స్థానికులు**
● చర్యలు తీసుకుంటాం. **- రమేష్, ఏఈ**
–న్యూస్‌టుడే, గుర్ల

? రామానుజులపేట గ్రామం వద్ద రహదారి పక్కనే చెత్త వేస్తున్నారు. రోజూ దుర్వాసన, దోమలతో ఇబ్బంది పడుతున్నాం. **- స్థానికులు**
● కార్యదర్శితో మాట్లాడి చెత్తను తొలగిస్తాం. **- శ్రీనివాసరావు, ఎంపీడీవో**
– న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం

? పెంట పంచాయతీలో రూ.35 వేలతో నిర్మించిన నీటి తొట్టి నిరుపయోగంగా ఉంది. - స్థానికులు
● పరిశీలించి, నీరు నింపేలా చూస్తాం. **- లక్ష్మీపతిరాజు, ఏపీవో**
– న్యూస్‌టుడే, బొబ్బిలి గ్రామీణం

రక్షణ గోడ నిర్మాణం

స్పందనకు వందనం

రేగిడి: గోమెంపేట రహదారిలోని చెరువు వద్ద అధికారులు రక్షణ గోడ నిర్మించారు. ఇక్కడ సమస్యపై ఇటీవల 'ఈనాడు'లో వచ్చిన వార్తకు స్పందించారు. చెరువు వద్ద రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు.

పూడిక తొలగింపు

బొండపల్లి, న్యూస్‌టుడే: ఆంధ్ర జలాశయం నుంచి నెలివాడకు సాగునీరు పారే ఎంఎన్ ఛానల్‌లో పూడిక పేరుకుపోవడంపై గత నెల 'ఈనాడు'లో వచ్చిన కథనానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ స్పందించారు. ఆయన సూచనలతో కాలువల్లో పూడిక తీసినట్లు ఏఈ ఎ.సూరీడు తెలిపారు.

పూడిక.. ఇంకెప్పుడు తీస్తారు?

రాజాం మండలం శ్యాంపురం నుంచి సారథి మీదుగా అంతకాపల్లి వెళ్లే పిల్ల కాలువ పూడికతో నిండి ఉంది. ఖరీఫ్ మొదలైందని, సాగునీరు ఎలా పారుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో పలు మార్లు పూడిక తొలగించాలని అధికారులకు విన్నవించుకున్నా ఫలితం లేదని వాపోయారు. త్వరలో పిల్ల కాలువలో పూడిక తీసేలా చర్యలు చేపడతామని తోటపల్లి డీఈఈ శంకరరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు. – న్యూస్‌టుడే, రాజాం గ్రామీణం

ఫైబర్‌నెట్ పని చేయక అవస్థలు

గ్రామ సచివాలయాల్లో ఏర్పాటు చేసిన ఫైబర్‌నెట్ పరికరాలు మూలకు చేరాయి. గత ఎనిమిది నెలలుగా పని చేయడం లేదని చెబుతున్నారు. రేగిడి మండలంలో 25 గ్రామ సచివాలయాలు ఉండగా అందులో ఒక్క దేవుదల సచివాలయంలో మాత్రమే పరికరం పనిచేస్తోంది. దీంతో సేవలు అందించేందుకు ఇబ్బందులు తప్పడం లేదని ఉద్యోగులు అంటున్నారు. సొంత ఫోన్ నుంచి ఇంటర్నెట్ వినియోగించాల్సి వస్తోందని, అది కూడా సిగ్నల్ ఉండటం లేదన్నారు. డేటా సరిపోక వేగవంతమైన సేవలకు విఘాతం కలుగుతోందని చెబుతున్నారు. సంబంధిత ఏజెన్సీలకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని అంటున్నారు. అధికారులతో మాట్లాడి పనిచేసేలా చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో శ్యామలా కుమారి అన్నారు. - న్యూస్‌టుడే, రేగిడి

విద్యార్థులూ.. మత్తు జోలికి పోవద్దు

చీపురుపల్లి, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాలతో విద్యార్థుల బంగారు భవిష్యత్తు నాశనమవుతుందని చీపురుపల్లి ఆర్డీవో ఆశయ్య, డీఎస్పీ రాఘవులు అన్నారు. చీపురుపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్స్ వల్ల వచ్చే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు చదువు, ఉన్నత భవిష్యత్తుపై దృష్టి సారించాలన్నారు. ప్రిన్సిపల్ ఎస్తేర్ పాల్, కళాశాల ఉప ప్రధానాచార్యుడు రమేష్ కుమార్, తహసీల్దార్ ధర్మరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఎస్పీ రాఘవులు, ఆర్డీవో ఆశయ్య

పదిలో మెరుగైన ఫలితాలు సాధించాలి

ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈవో

గుర్ల, న్యూస్‌టుడే: పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఈవో మాణిక్యంనాయుడు సూచించారు. బుధవారం గుజ్జంగివలస, పాలవలస ఉన్నత పాఠశాలలను సందర్శించారు. రోజూ హోం వర్కు ఇచ్చి.. పరిశీలించాలని సూచించారు. ఇప్పటి నుంచి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగితే మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. 10న నిర్వహించనున్న తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశానికి విద్యార్థులు కొత్త దుస్తులతో హాజరు కావాలన్నారు. గుజ్జంగివలసలో పాఠశాల స్థల సమస్య గురించి గ్రామ పెద్దలు, అధికారులను సమన్వయం చేసుకొని స్థలం కేటాయించేలా చూడాలని ఎంఈవో భానుప్రకాష్‌ను ఆదేశించారు

పెచ్చులూడుతోంది సారూ..

మెంటాడ మండల వనరుల కేంద్రం స్లాబు పెచ్చులూడి పడిపోతోంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల భవనం తలుపులు ఊడిపోవడంతో విధులు నిర్వహించే సిబ్బంది సొంత నిధులు పోగేసి.. మరమ్మతులు చేయించారు. మండల సర్వసభ్య సమావేశంలో సమస్యను తెలిపామని, మండల పరిషత్ సాధారణ నిధులతో అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని ఎంఈవో-2 వర్మ రాజు చెప్పారు.

– న్యూస్‌టుడే, మెంటాడ

6న తోటపల్లి నీరు విడుదల

తెర్లాం, న్యూస్‌టుడే: ఈనెల 6వ తేదీన తోటపల్లి కాలువ నీరు విడుదల చేసేందుకు ఉన్నతాధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు రాజాం సెక్షన్ ఏఈ రఘు చెప్పారు. బుధవారం తెర్లాంలో విలేకర్లతో మాట్లాడారు. ఇటీవల తెర్లాం మండలంలోని పలు గ్రామాలకు వెళ్లే ప్రధాన కాలువతో పాటు పిల్ల కాలువల్లో పూడికను కొంతమేర తొలగించామని, మిగిలిన పనులు డిసెంబరు తర్వాత చేపడతామని ఆయన తెలిపారు.

తాటిపూడి ఏఈగా శంకర్

గంట్యాడ, న్యూస్‌టుడే: తాటిపూడి జలవనరుల శాఖ ప్రాజెక్టు ఏఈగా కె.శంకర్ నియమితులయ్యారు. తోటపల్లి నుంచి బదిలీపై వచ్చారు. తాటిపూడి జలాశయ నిర్వహణపై పూర్తిగా దృష్టి సారిస్తామని, సాగునీటి కాలువలను మెరుగుపరచడానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

రామభద్రపురంలో తాగునీటి ఇక్కట్లు

రామభద్రపురం, న్యూస్‌టుడే: రామభద్రపురం మేజర్ పంచాయతీలో నాలుగు రోజులుగా రక్షిత నీటి పథకం పనిచేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పైపులైను పాడైపోవడంతో సరఫరా నిలిచిందని చెబుతున్నారు. సర్పంచి రవ్వా ఈశ్వరరావు వద్ద సమస్యను 'న్యూస్‌టుడే' ప్రస్తావించగా.. రెండ్రోజుల్లో పైపులైన్లు బాగు చేసి తాగునీరు అందిస్తామని తెలిపారు.

విధులకు హాజరు కావాలి

రాజాం, న్యూస్‌టుడే: పుర ఇంజినీరింగ్ విభాగం కార్మికులు జూన్ 24 నుంచి సమ్మె చేస్తుండడంతో అత్యవసర సేవలకు విఘాతం కలుగుతోందని, వెంటనే విధులకు హాజరు కావాలని రాజాం పురపాలిక కమిషనర్ జాగరపు రామప్పలనాయుడు బుధవారం ప్రాథమిక నోటీసు జారీ చేశారు. వీధి దీపాలు, తాగునీటి సరఫరాకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని, సమ్మె విరమించాలని శ్రీముఖంలో పేర్కొన్నారు. విధులకు హాజరు కాకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇలాంటి చర్యలతో తమ ఉద్యమాన్ని ఆపలేరని సంఘం అధ్యక్ష కార్యదర్శులు హరిబాబు, అనిల్, గౌరవాధ్యక్షుడు రామ్మూర్తినాయుడు స్పష్టం చేశారు.

కూటమితోనే సుపరిపాలన సాధ్యం

కూటమితోనే సుపరిపాలన సాధ్యపడుతుందని ఎమ్మెల్యే బేబీనాయన అన్నారు. పట్టణంలోని రాజానగర్ కాలనీలో బుధవారం 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమాన్ని ప్రారంభించి, మాట్లాడారు. ఏడాదిలో ఎంతో ప్రగతి సాధించామని, రానున్న నాలుగేళ్లలో మరింత అభివృద్ధి చేస్తామని భరోసా ఇచ్చారు. ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో సాధించిన ప్రగతికి సంబంధించిన గోడపత్రికలను పంపిణీ చేశారు. పురపాలక అధ్యక్షుడు రాంబార్కి శరత్‌బాబు, తెదేపా పట్టణాధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు. ● పారాదిలోనూ బేబీనాయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలతో కూడిన పత్రాలను అందించారు. భాస్కరరావు, ఈశ్వరరావు, కృష్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు. ● బొబ్బిలి కోటలో బేబీనాయన, బుడా అధ్యక్షుడు తెంటు లక్ష్మునాయుడు, మాజీ ఎమ్మెల్యే ఆర్వీ భంజ్‌దేవ్ నాయకులకు కార్యక్రమం అమలుపై దిశానిర్దేశం చేశారు. ● గంట్యాడ మండలం జగ్గాపురం మధుపాడ, గొర్లిపేట గ్రామాల్లో చేపట్టిన కార్యక్రమాన్ని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రారంభించి, మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చుతోందని చెప్పారు. మధుపాడలో నూతన రహదారిని ప్రారంభించారు. కె.భాస్కరరావు, రంధి అర్జున మహేశ్వరరావు, అల్లు విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ● చంద్రబాబు ఏడాది పాలనలో ఇంటింటికీ సంక్షేమం, వాడవాడలా అభివృద్ధి కళ్లముందే కనిపిస్తోందని ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ పేర్కొన్నారు. రాజాం పట్టణంలోని పొనుగుటివలసలో కార్యక్రమం నిర్వహించారు. రహదారులు, కాలువలు నిర్మించాలని పలువురు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గురవాన నారాయణరావు, తెదేపా పట్టణాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్.సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు. సంక్షేమ పథకాలను ఊరూరా అందించిన ఘనత కూటమి ప్రభుత్వానిదేనని ఏఎంసీ ఛైర్మన్ పీవీవీ గోపాలరాజు అన్నారు. గజపతినగరం మండలం కేఎస్సార్‌పురం గ్రామంలో కార్యక్రమాన్ని ప్రారంభించారు. మక్కువ శ్రీధర్, గంట్యాడ శ్రీదేవి, ప్రదీప్‌కుమార్, గోవిందరావు తదితరులు పాల్గొన్నారు. ● దత్తిరాజేరు మండలం విజయరాంపురంలో తెదేపా మండల కన్వీనరు చప్ప చంద్రశేఖర్, సంతకవిటిలో తెదేపా సీనియర్ నాయకుడు కొల్ల అప్పలనాయుడు, గట్టి భాను, బొండపల్లిలో ఏఎంసీ వైస్ ఛైర్మన్ కోరాడ కృష్ణ, క్లస్టర్ ఇన్‌ఛార్జి ఎన్.రాజేష్, రేగిడి మండలంలోని ఉంగరాడలో క్లస్టరు ఇన్‌ఛార్జి ధనుంజయరావు, మెంటాడలో మండలాధ్యక్షుడు సీహెచ్ వెంకటరావు ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి.

- న్యూస్‌టుడే బృందం

కరపత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే బేబీనాయన

రాజాం పట్టణంలోని పొనుగుటివలసలో..

జగ్గాపురంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్, నాయకులు తదితరులు

కేఎస్సార్‌పురంలో ప్రభుత్వ సేవలు వివరిస్తున్న నేతలు

జవాన్‌కు సత్కారం

బొబ్బిలి, న్యూస్‌టుడే: దేశ సరిహద్దుల్లో సెక్యూరిటీ ఫోర్సులో హెడ్‌కానిస్టేబుల్‌గా పని చేస్తూ ఇటీవల జరిగిన 'ఆపరేషన్ సిందూర్'లో భాగస్వామ్యం వహించిన బొబ్బిలి పట్టణానికి చెందిన బీకే అప్పారావును బ్రహ్మకుమారీలు బుధవారం సత్కరించారు.

అప్పారావును సన్మానిస్తున్న బ్రహ్మకుమారీలు

ఏడాదిగా ఇంతే..!

గంట్యాడ మండలంలోని బోనంగి సమీప విజయనగరం-ఎస్.కోట ప్రధాన రహదారిపై మూడు అడుగుల గొయ్యి ఏర్పడింది. ఈ మార్గంలో నిత్యం వందలాది మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. ఏడాదిగా ఈ గొయ్యి ఉన్నా పట్టించుకున్న నాథుడు లేడని స్థానికులు వాపోతున్నారు. ఈ విషయమై ఎంపీడీవో రమణమూర్తిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. ఆ శాఖాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామన్నారు. – న్యూస్‌టుడే, గంట్యాడ గ్రామీణం

ప్రవేశాలకు సంప్రదించండి

బాడంగి, న్యూస్‌టుడే: బాడంగి సాంఘిక సంక్షేమ గురుకులంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ధ్రువపత్రాలతో నేరుగా కళాశాలలో సంప్రదించాలని ప్రిన్సిపల్ వరప్రసాద్ కోరారు. 5వ తరగతిలో చేరే వారు 4, 5వ తేదీల్లో, ఇంటర్ కోసం 6, 7వ తేదీల్లో హాజరు కావాలని సూచించారు.

విద్యార్థినికి అభినందనలు

వంగర, న్యూస్‌టుడే: మడ్డువలస జూనియర్ కళాశాలలో ఇంటర్ (ఎంపీసీ) చదివి 964 మార్కులు సాధించిన **బూరాడ ప్రమీల** 'స్టార్ కీ' పథకం ద్వారా వెల్లూరు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అమరావతికి ఎంపిక కావడం పట్ల ప్రిన్సిపల్ రవిశంకర్, అధ్యాపకులు అభినందనలు తెలిపారు. ఈ పథకం ద్వారా జిల్లాలో ఎంపీసీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఉచితంగా ఇంజినీరింగ్ సీటుతోపాటు వసతి సౌకర్యం కల్పిస్తారని చెప్పారు.

పాఠశాలకు వితరణ

గంట్యాడ గ్రామీణం, న్యూస్‌టుడే: పెంటశ్రీరాంపురం పూర్వ విద్యార్థి పాండ్రంకి ఎర్నిబాబు ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. ఆయన జ్ఞాపకార్థం స్నేహితులు రూ.21 వేలు విలువైన ప్రింటర్, జిరాక్స్ పరికరం, అయిదు ఫ్యాన్లు, విద్యార్థులకు కిట్లు అందజేశారు. గంట్యాడ ఎంఈవో-2 వెంకటరావు, ప్రసాద్ పట్నాయక్, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గది కారుతోంది.. వరండా దిక్కైంది!

గుర్ల మండలంలోని చింతపల్లిపేట ప్రాథమిక పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. వర్షం వస్తే కారిపోతోంది. గతంలో తొమ్మిది మంది విద్యార్థులుండే ఈ పాఠశాలలో ఇప్పుడు 22 మంది ఉన్నారు. ఒకే ఉపాధ్యాయుడు బోధిస్తున్నారు. భవనం పెచ్చులూడిపోవడంతో ఎప్పుడు, ఏం జరుగుతుందోనన్న భయం వెంటాడుతోంది. ప్రత్యామ్నాయం లేక వరండాలోనే ఐదు తరగతులు బోధిస్తున్నారు. పాఠశాలకు నూతన భవనం మంజూరుకు అధికారులకు విన్నవించినా ప్రయోజనం లేకపోయిందని సర్పంచి జమ్ము శ్రీదేవి ఆవేదన వ్యక్తం చేశారు. ఎంఈవో భానుప్రకాష్ వద్ద ప్రస్తావించగా నూతన భవనానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.

–న్యూస్‌టుడే, గుర్ల

ప్రభుత్వ భూమి ఆక్రమణ

బాడంగి, న్యూస్‌టుడే: కోడూరు గ్రామం బీసీ కాలనీలో ప్రభుత్వ భూమి, దానికి ఆనుకుని ఉన్న వాగు స్థలాన్ని స్థానికులు ఆక్రమించారు. చుట్టూ కంచె ఏర్పాటు చేశారు. ఆ స్థలంలోనే ప్రభుత్వ తాగునీటి బోరు కూడా ఉంది. దీనిపై ఎమ్మెల్యే బేబీనాయనకు ఫిర్యాదు చేసినట్లు పలువురు స్థానికులు తెలిపారు. ఆర్‌ఐ, వీఆర్వోను పంపి, చర్యలు తీసుకుంటామని తహసీల్దారు సుధాకర్ అన్నారు.

ఉమ్మడి తనిఖీ నిర్వహించండి

మెంటాడ, న్యూస్‌టుడే: బిరసాడవలస సమీప కోళ్లఫారంపై ఉమ్మడి తనిఖీ నిర్వహించి నివేదికివ్వాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులను కలెక్టర్ ఆదేశించారని తహసీల్దారు అరుణకుమారి తెలిపారు. సమస్యపై గత 27 రోజులుగా గ్రామస్థులు నిరసన చేస్తున్నారు. స్పందించిన కలెక్టరు అంబేడ్కర్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ, కాలుష్య నియంత్రణా మండలి, రెవెన్యూ, పోలీస్, జిల్లా పంచాయతీ అధికారులతో తనిఖీలు చేయించి నివేదిక ఇవ్వాలని జేడీ వైవీ రమణను ఆదేశించినట్లు చెప్పారు.

వర్షాకాలంలో చెత్త ఉంటే సహించం

బొబ్బిలి, న్యూస్‌టుడే: వర్షాకాలంలో రహదారుల పక్కన, వీధుల్లో చెత్త గుట్టలుగా కనిపిస్తే సహించేది లేదని పుర కమిషనర్ రామలక్ష్మి హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని తాండ్రపాపారాయ కూడలి, మార్కెట్ ప్రాంతాల్లో చెత్త గుట్టలుగా ఉండడంతో వాటిని కార్మికులతో శుభ్రం చేయించారు. రాజానగర్ కాలనీ, టీబీఆర్ థియేటర్ తదితర ప్రాంతాల్లో కాలువలు మూసుకుపోవడంతో పూడిక తొలగించాలని సూచించారు. రహదారులపై మురుగు నీరు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ మురళి, డీఈ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ● వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా సచివాలయ కార్యదర్శులు అప్రమత్తంగా ఉండాలని కమిషనర్ రామలక్ష్మి అన్నారు. తన ఛాంబర్‌లో వారితో సమీక్షించారు. సిబ్బంది ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

రాజాం, న్యూస్‌టుడే: మెప్మా పరిధిలోని ఆర్పీల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆదిలక్ష్మి, ధనలక్ష్మి డిమాండ్ చేశారు. రాజాం పురపాలిక కమిషనర్ జె.రామప్పలనాయుడుకు బుధవారం కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని, మహిళా వికాస్ యాప్‌ను రద్దు చేయాలని, అర్హులకు పదోన్నతులు కల్పించాలని కోరారు. సంఘం గౌరవాధ్యక్షుడు రామ్మూర్తినాయుడు, నాయకులు స్వాతి, సునీత, నాగరత్నం, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కమిషనర్ రామప్పలనాయుడుకు వినతి పత్రం అందజేస్తున్న ఆర్పీలు

చిత్తారపురానికి బస్సు సర్వీసు పునరుద్ధరణ

బస్సుకు పూజలు చేస్తున్న స్థానికులు

సంతకవిటి, న్యూస్‌టుడే: పాలకొండ, రాజాం పట్టణాలను కలుపుతూ సంతకవిటి మండల కేంద్రం మీదుగా చిత్తారపురం గ్రామానికి గతంలో ఆర్టీసీ బస్సు సర్వీసు ఉండేది. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆదాయం రాలేదన్న కారణంతో సర్వీసును రద్దు చేశారు. దీంతో సంతకవిటి మండలంలోని 25 గ్రామాల ప్రజలు, విద్యార్థులు ప్రయాణాలకు ఇబ్బందులు పడేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే కోండ్రు మురళీమోహన్ చొరవతో మళ్లీ ఆర్టీసీ సర్వీసు పాలకొండ డిపో నుంచి పునరుద్ధరించారు. రోజుకు మూడుసార్లు రాజాం వయా సంతకవిటి మీదుగా చిత్తారపురానికి బస్సు నడుపుతున్నారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఆదాయం రాకపోతే మళ్లీ సర్వీసు నిలిపే అవకాశం ఉందని పాలకొండ డిపో మేనేజర్ వెంకటేశ్వరరావు 'న్యూస్‌టుడే'కు తెలిపారు.

జూనోటిక్ వ్యాధులపై అవగాహన

గరివిడి, న్యూస్‌టుడే: ప్రపంచ జూనోసిస్ దినాన్ని పురస్కరించుకుని గరివిడి పశువైద్య కళాశాలలో అసోసియేట్ డీన్ మక్కెన శ్రీను అధ్యక్షతన బుధవారం ఆశా కార్యకర్తలకు అవగాహన సదస్సు నిర్వహించారు. జంతువుల నుంచి సంక్రమించే వ్యాధులు, నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి పశురోగ అధ్యయన విభాగాధిపతి డాక్టర్ నాగమల్లిక, అణి సుప్రియా వివరించారు. పూర్తి అవగాహన పెంచుకొని గ్రామాల్లో ప్రజలను చైతన్యపరచాలని ఆశా కార్యకర్తలకు సూచించారు.

ఆశా కార్యకర్తలకు అవగాహన కల్పిస్తున్న పశువైద్య కళాశాల అధ్యాపకురాలు నాగమల్లిక

ఉపాధ్యాయులకు సన్మానం

బొబ్బిలి గ్రామీణం, న్యూస్‌టుడే: పెంట ఉన్నత పాఠశాలలో పనిచేసి ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లిన సీహెచ్ రమణ, సత్యనారాయణ, పార్వతి, గోవిందరావునాయుడు, పి.శ్రీనివాసరావు, పద్మావతి, ఎం.శ్రీనివాసరావును ప్రధానోపాధ్యాయుడు ఎం.వేణుగోపాలరావు ఆధ్వర్యంలో బుధవారం సన్మానించారు. ● **రామభద్రపురం:** రామభద్రపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పని చేసి ఉద్యోగ విరమణ పొందిన జయమ్మను బుధవారం సన్మానించారు. విశ్రాంత డిప్యూటీ డీఈవో జార్జ్ ఎబినేజర్, ఏపీటీఎఫ్ రాష్ట్ర అకడమిక్ కన్వీనర్ జేసీ రాజు, యూటీఎఫ్ రాష్ట్ర నాయకురాలు కె.విజయగౌరి, ఎంఈవోలు తిరుమల ప్రసాద్, పెంటయ్య, ప్రధానోపాధ్యాయుడు వి.గోపాల్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

కూరగాయల ధరలు

రైతుబజార్లలో ధరల వివరాలు (కిలో రూ.లో)

★ వంకాయలు: (రవివంగ, తెల్లవి) 45, ★ నల్లవి: 30 ★ టమోటా: 30 ★ బెండ: 40 ★ కాకర: 35 ★ బీర: 35 ★ క్యాబేజీ: 30 ★ పొడవుచిక్కుడు: 45 ★ బరబాటీ: 48 ★ క్యారెట్: 55 ★ దొండ: 50 ★ బీట్‌రూట్: 35 ★ ఉల్లి: 23 ★ బంగాళదుంపలు: 19 ★ గోరుచిక్కుడు: 35 ★ క్యాప్సికమ్: 90 ★ పొటల్స్: 35 ★ బీన్స్: 90 ★ పందిరిచిక్కుడు: 60 ★ పచ్చి బఠాణి: 75. – న్యూస్‌టుడే, విజయనగరం వ్యవసాయ విభాగం

తెరపై ఈనాడు

విజయనగరంలో.. ❖ ఎన్సీఎస్: **కన్నప్ప** ❖ శ్రీకృష్ణ: **8 వసంతాలు, ఎఫ్-1(తెలుగు డబ్బింగ్)** ❖ లీలామహల్: **కుబేర** ❖ రంజనీ స్క్రీన్-1: **కన్నప్ప** ❖ శివరంజనీ స్క్రీన్-2: **కుబేర** ❖ హిమగిరి: **మార్గన్** ❖ సప్తగిరి: **కన్నప్ప**
– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

విజయనగరం

• విజయనగరం • నెల్లిమర్ల • ఎస్.కోట

బుద్ధ, కల్కి అవతారాల్లో దర్శనభాగ్యం

విజయనగరంలోని ఇంద్రజమున మందిరంలో కొలువై ఉన్న జగన్నాథుడు, బలభద్రస్వామి బుధవారం బుద్ధ, కల్కి అవతారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా స్వామివార్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. తోమాల మందిరం, దాసన్నపేట, ఉల్లివీధి కాలరాయుడు మందిరంలో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.
– న్యూస్‌టుడే, కంటోన్మెంట్

మేమున్నాం.. మీకు తోడుగా (10 AM TO 1 PM)

విజయనగరం పట్టణం	80089 02900
విజయనగరం గ్రామీణం	80085 74317
ఎస్.కోట	80085 74326
భోగాపురం	70959 54646

? పెద్దవీధి దారిలో మురుగు రోడ్డెక్కుతోంది. - **స్థానికులు** ● అక్కడ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - **శ్రీనివాసరావు, డీఈఈ**

? వీటీఅగ్రహారంలో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. - **స్థానికులు** ● సంతాన నిరోధక శస్త్ర చికిత్సలు చేయిస్తాం. - **సాంబమూర్తి, ప్రజారోగ్య అధికారి** – న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

దీపాలు వెలిగాయ్

స్పందనకు వందనం

విజయనగరం పట్టణం: నగరంలోని బాబామెట్ట, కాళీఘాట్‌కాలనీ, దాసన్నపేట ప్రాంతాల్లో వీధి దీపాలు వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు ఫిర్యాదు చేశారు. ఏఈ స్రవంతి దృష్టికి తీసుకెళ్లగా చర్యలు తీసుకున్నారు.

స్తంభానికి అల్లుకున్న తీగల తొలగింపు

శృంగవరపుకోట: ఆసుపత్రి ఆవరణలో స్తంభానికి అల్లుకున్న తీగలపై బుధవారం 'ఈనాడు'లో 'చెట్టు కాదు.. విద్యుత్తు స్తంభమే' శీర్షికన వెలువడిన కథనంపై ఈపీడీసీఎల్ అధికారులు స్పందించి తీగలు, చెట్టు కొమ్మలు తొలగించారు.

శివారుల్లో సమస్యలతో సావాసం

డివిజన్ విజిట్

న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

విజయనగరంలోని 35వ డివిజన్ పారిశ్రామిక వాడగా గుర్తింపు పొందింది. గతంలో అనేక పరిశ్రమలు, మిల్లులు ఉండేవి. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వెంచర్లు వెలిశాయి. జాతీయ రహదారి ఉండడంతో అపార్టుమెంట్ల సంస్కృతి పెరిగింది. ఇంత అభివృద్ధి చెందినా ఈ ప్రాంత వాసులు సమస్యలతో సావాసం చేస్తున్నారు. ఇక్కడ పెద్దవీధి, రొంగలివీధి, యాతవీధి, చుక్కవీధి, రౌతువీధి, రెడ్డివీధి, సంతోష్‌నగర్, ఎస్సీకాలనీ, గణేష్‌నగర్, సంతోష్‌నగర్, యూస్ఫీనగర్, బూర్లిపేట, బంటుపల్లివారి కల్లాలు, ప్రియా నగర్ తదితర ప్రాంతాలు విస్తరించాయి.

ఆర్టీసీ జోనల్ వర్కు షాపు సమీపంలో పేరుకుపోయిన వ్యర్థాలు

డివిజన్	35
జనాభా	12 వేలు
ఇళ్లు	1850
ఓటర్లు	5,100

ఇబ్బందులివీ..

● యాత, రెడ్డి, మంగళ, పెద్ద, రౌతు వీధుల నుంచి రొంగలివీధి వరకు డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. ఇక్కడి సామాజిక మరుగుదొడ్డి రెండేళ్ల క్రితం పాడైంది. 300 వరకు కుటుంబాలకు అదే దిక్కయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ● దాదాపు అన్ని వీధుల్లో రహదారుల సమస్య ఉంది. కొన్నిచోట్ల మట్టిదారులే దర్శనమిస్తున్నాయి. ● ఆర్టీసీ వర్క్‌షాపు మార్గం గోతులమయమైంది. ఇక్కడి వీధుల్లో చెత్త నిండిపోయి, డంపింగు యార్డులను తలపిస్తున్నాయి. ● వీటీ అగ్రహారం పరిధిలోని జాతీయ రహదారిలో కాలువలను కప్పేసి, నిర్మాణాలు చేపట్టారు. దీంతో మురుగు పారడం లేదు. ఇక్కడ గతంలో ఉన్న బస్ షెల్టర్‌ను వైకాపా హయాంలో తొలగించారు. నేటికీ పునరుద్ధరించలేదు ● సంతోష్‌నగర్‌లో కల్వర్టులు భీతిగొల్పుతున్నాయి. ● డివిజన్ పరిధిలో ఒక్క పార్కు కూడా లేదు. ● శ్మశాన వాటికలు అధ్వానంగా ఉన్నాయి. కుక్కలు, పందుల సంచారం ఎక్కువగా కనిపిస్తోంది.

ప్రత్యేక దృష్టి..

డివిజన్‌కు కేటాయించిన రూ.20 లక్షలతో యాత వీధిలో కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం ప్రతిపాదించామని కార్పొరేటర్ చండక శ్రీను తెలిపారు. డివిజన్ పరిధిలో రూ.1.36 కోట్లతో అర్బన్ హెల్త్ సెంటర్ నిర్మించామని, జిమ్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటీఅగ్రహారంలో బస్‌షెల్టర్ నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు. మరుగుదొడ్లు, శ్మశానవాటికలను బాగుచేస్తామని పేర్కొన్నారు.

● వీధిదీపాలు, పందులు, కుక్కల సంచార సమస్యపై దృష్టిసారిస్తామని కమిషనర్ నల్లనయ్య తెలిపారు.

ప్రజలు ఆనందంగా ఉండాలన్నదే సీఎం లక్ష్యం

విజయనగరం గ్రామీణం, అయ్యన్నపేట, కొత్తవలస, భోగాపురం, డెంకాడ, న్యూస్‌టుడే: ప్రజలందరూ సంతోషంగా కుటుంబాలతో జీవితం గడపాలన్నదే సీఎం నారా చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ లక్ష్యమని ఎమ్మెల్యే అదితి గజపతిరాజు పేర్కొన్నారు. ఆ దిశగా పాలన విజయవంతంగా సాగిస్తున్నారని చెప్పారు. బుధవారం కొండకరకంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొని, సంక్షేమ పథకాలను వివరించారు. నాయకులు చంద్రదేవ్, ఐవీపీ రాజు, బొద్దుల నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. ● కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో నియోజకవర్గంలో సుమారు రూ.135 కోట్ల విలువ చేసే అభివృద్ధి కార్యక్రమాలు అమలుచేసినట్లు ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి చెప్పారు. నియోజకవర్గంలో 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమాన్ని బలిఘట్టంలో ప్రారంభించారు. నాయకులు గొరపల్లి రాము, యల్లపు సూరిబాబు, కనకాల శివ, కోళ్ల వెంకటరమణ, బొబ్బిలి అప్పారావు, రత్నాజీ పాల్గొన్నారు.● రాష్ట్రంలో కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని తెదేపా మండల అధ్యక్షుడు, ఏఎంసీ మాజీ ఛైర్మన్ కర్రోతు సత్యనారాయణ పేర్కొన్నారు. బుధవారం రావాడలో సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని ఇంటింటా నిర్వహించారు. ●డెంకాడ మండలంలోని దొడ్డిబాడువ, ఆకులపేటలో నాయకులు ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో ప్రభుత్వం అమలు చేసిన పథకాలను వివరించారు. మాజీ ఎంపీపీ కంది చంద్రశేఖర్, జడ్పీటీసీ మాజీ సభ్యుడు పతివాడ అప్పలనారాయణ ఆధ్వర్యంలో కరపత్రాలు అందజేశారు.

కరపత్రాలతో ఎమ్మెల్యే అదితి గజపతిరాజు, మహిళలు

కార్యక్రమాల పత్రాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి

CHANGE OF NAME

I, MOHAMMED ABDUL NADEEM S/o ABDUL KHADER, r/o D.No. 1-2-32, Telakala Veedhi, contonment, Vizianagaram, do hereby confirm that my name was entered in my son MOHAMMED SADEEM QURESHI's Pass port No. N3043818 as ABDUL NADEEM instead of MOHAMMED ABDUL NADEEM. I may be called as new Name MOHAMMED ABDUL NADEEM hereafter.

కాలువలు ఇలా.. నీరు పారేదెలా

విజయనగరం నగరపాలక సంస్థ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా దర్శనమిస్తోంది. శివారు ప్రాంతాలు, కాలనీల్లో మరింత ఘోరం. పక్కా కాలువలు లేకపోవడంతో ఇళ్ల ముందే మురుగు నిలిచిపోతోంది. స్థానిక గాజులరేగలోని కేపీటెక్ ప్రాంతంలో సిమెంటు కాలువలు లేవు. ఇళ్ల ముందే గుంతలు తీసుకుని, మురుగు వెళ్లేలా ఏర్పాట్లు చేసుకున్నారు. దోమలు విజృంభిస్తున్నాయని ఆ ప్రాంతం వాసులు వాపోతున్నారు. నిధుల లభ్యత మేరకు కాలువలు నిర్మిస్తామని కమిషనరు పి.నల్లనయ్య తెలిపారు.
– న్యూస్‌టుడే, విజయనగరం పట్టణం

కూడలిలో నిలిచిన నీరు

రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షానికి పట్టణ ప్రధాన కూడలిలో నీరు నిలిచి దుకాణదారులు ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా సెలూన్ షాపుల ముందు నీరు నిలిచిపోవడంతో రాకపోకలు లేక జీవనోపాధి దెబ్బతింటోందని ఆవేదన చెందుతున్నారు. పట్టణంలోని ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీరు ఈ దుకాణాల ముందు ఉన్న కాలువ ద్వారా వారపు సంతలోని కాలువలోకి వెళ్లేది. కాలువ పూడికతో నిండిపోవడంతో నీరు నిలిచిపోతోంది. దీనిపై పంచాయతీ పాలకులు చొరవ తీసుకుని పరిస్థితి మెరుగుపర్చాలని కోరుతున్నారు. –న్యూస్‌టుడే, కొత్తవలస

మెగా ఉద్యోగ మేళాకు స్పందన

ముఖ్యులతో ఉద్యోగాలకు ఎంపికైన యువతులు

కొత్తవలస, న్యూస్‌టుడే: తుమ్మికాపల్లిలోని వాగ్దేవి కళాశాల ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన మెగా ఉద్యోగ మేళాకు 300 మంది హాజరు కాగా 12 సంస్థల కొలువులకు పలువురు ఎంపికైనట్లు వెల్లడించారు. దీనికి ఏయూ పరీక్షల విభాగం విశ్రాంత డీన్ డా.చంద్రమౌళి ముఖ్య అతిథిగా హాజరై ఎంపికైనవారికి నియామక పత్రాలు అందించి అభినందించారు. కళాశాల కరస్పాండెంట్ కోట్ని మహేశ్వరరావు, డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, ప్రిన్సిపాళ్లు లక్ష్మణరావు, సతీష్, సురేష్, రాజ్‌కుమార్, లెర్నింగ్ ట్రీ డైరెక్టర్ ధనుంజయ్, ఇన్ఫోసిస్ ప్లేస్‌మెంట్ అధికారి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్సీ కమిషన్‌కు జిందాల్ నిర్వాసితుల ఫిర్యాదు

శృంగవరపుకోట, న్యూస్‌టుడే: న్యాయం చేయాలంటూ మండలంలోని బొడ్డవర ప్రాంతంలోని జిందాల్ భూనిర్వాసితులు మంగళవారం సాయంత్రం ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కె.ఎస్.జవహర్‌కు వినతిపత్రం అందించారు. అమరావతిలో ఆయన్ను కలిసి సమస్యలు వివరించారు. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నిర్వాసితులను భయాందోళనలకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అమరావతిలో తెదేపా, జనసేన కేంద్ర కార్యాలయాల్లో బుధవారం ఉదయం ఫిర్యాదు చేశారు. ★ జిందాల్ అవకతవకలపై సమగ్ర విచారణ చేపట్టాలని సీపీఎం నాయకుడు చల్లా జగన్ డిమాండు చేశారు. బుధవారం బొడ్డవరలో ఆందోళన చేశారు.

నిరసన వ్యక్తం చేస్తున్న భూనిర్వాసితులు

డెంగీ జ్వరాలపై అప్రమత్తత అవసరం

కొత్తవలస: డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు వియ్యంపేట పీహెచ్‌సీ వైద్యాధికారి గోపాలకృష్ణ సూచించారు. డెంగీ మాసోత్సవంలో భాగంగా సిబ్బంది తుమ్మికాపల్లిలో బుధవారం ర్యాలీచేసి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆరోగ్య పర్యవేక్షకుడు ఈశ్వరరావు, సహాయకుడు ఎల్.సత్యారావు, ఎంఎల్‌హెచ్‌పీ కామేశ్వరి, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 వాహన సిబ్బంది పాల్గొన్నారు.

ఏజీపీగా రమణమూర్తి

శృంగవరపుకోట: స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రభుత్వ సహాయ న్యాయవాదిగా టీవీ రమణమూర్తి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ మేరకు జిల్లా కలెక్టరు ఉత్తర్వులు జారీ చేశారు. అనంతరం జూనియర్ సివిల్ జడ్జి బి.కనకలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఏజీపీగా నియామకానికి కృషి చేసిన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి కృతజ్ఞతలు తెలిపారు.

వన్‌స్టాప్ సేవలను వినియోగించుకోవాలి

అయ్యన్నపేట: వన్‌స్టాప్ కేంద్రం సేవలను వినియోగించుకోవాలని సెంటర్ కేస్ వర్కర్ తానా అనిత కోరారు. రామవరం జడ్పీ పాఠశాలలో లీగల్ కౌన్సిలర్ కె.బ్యూలారాణితో కలిసి విద్యార్థులకు హెల్ప్‌లైన్ నంబర్లు, గృహహింస, సైబర్‌క్రైమ్, బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు.

ఎస్సైపై చర్యలకు ఎస్పీకి ఫిర్యాదు

నేరవార్తా విభాగం: ఓ టీవీ ప్రతినిధిపై దురుసుగా ప్రవర్తించిన రెండో పట్టణ ఎస్సై మురళిపై చర్యలు తీసుకోవాలని డిమాండు చేస్తూ పలువురు పాత్రికేయులు, సంఘ నాయకులు బుధవారం ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఫిర్యాదు చేశారు.

గంజాయి కేసులో ఒడిశా వాసి అరెస్టు

నేరవార్తా విభాగం: ఒకటో పట్టణ పోలీసు స్టేషన్‌లో గతంలో నమోదైన గంజాయి కేసులో తప్పించుకు తిరుగుతున్న ఒడిశా ప్రాంతానికి చెందిన గిరి అనే వ్యక్తిని బుధవారం అదుపులోకి తీసుకొని అక్కడి న్యాయస్థానానికి అప్పగించినట్లు సీఐ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.

సమ్మె విజయవంతానికి పిలుపు

అయ్యన్నపేట, మయూరికూడలి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల తొమ్మిదో తేదీన జరిగే దేశవ్యాప్త సమ్మెలో ఆశా కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ పి.లక్ష్మి పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని ఎల్బీజీ భవన్‌లో మాట్లాడారు.

సమస్యలు, అభివృద్ధిపై చర్చ

కొత్తవలస: ప్రభుత్వాదేశాల మేరకు మండలంలో సర్పంచుల అధ్యక్షతన కార్యదర్శుల ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహిస్తున్నారు. మండలంలోని చింతలపాలెం, మంగళపాలెం, రెల్లి, ఉత్తరాపల్లి, దెందేరు, చీడివలస, గనిశెట్టిపాలెం, చిన్నిపాలెం, కంటకాపల్లి, కాటకాపల్లి పంచాయతీల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారని ఎంపీడీవో ఎస్.రమణయ్య, డిప్యూటీ ఎంపీడీవో ఎం.శ్రీదేవి తెలిపారు.

అయ్యరక కార్పొరేషన్ ఏర్పాటుకు వినతి

కొత్తవలస: అయ్యరక కార్పొరేషన్‌ను ఏర్పాటు చేసి, ఛైర్మన్, డైరెక్టర్లను ప్రకటించాలని ఆ వర్గం రాష్ట్ర అధ్యక్షుడు పి.ఎస్.ఎన్.పాత్రుడు కూటమి ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రంలో తమ సామాజికవర్గానికి 5 లక్షల జనాభా ఉన్నట్లు తెలిపారు.

సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

నెల్లిమర్ల: ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహనతో ఉండాలని ఎస్సై గణేష్ సూచించారు. బుధవారం సారిపల్లి టిడ్కో లబ్ధిదారులకు సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. పూతికపేటలో సీసీ కెమెరాలను అందజేశారు. గ్రామాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు నేరాలను అరికట్టడానికి దోహదపడతాయన్నారు.

యాంత్రీకరణతో వరిలో అధిక దిగుబడులు

డెంకాడ, భోగాపురం, న్యూస్‌టుడే: యాంత్రీకరణ విధానంతో వరిలో అధిక దిగుబడులు సాధించవచ్చని నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని సింగవరంలో రైతు పిట్ట శ్రీనివాసరావు పొలంలో యంత్రంతో వరి సాగు విధానంలో భాగంగా వరి నారు తయారీ చేసే ప్రక్రియను బుధవారం ఆమె ప్రారంభించారు. ఏడీఏ నాగభూషణరావు మాట్లాడుతూ వరి గట్లపై కంది సాగు చేస్తే అదనపు ఆదాయం వస్తుందని తెలిపారు. రాయితీపై మినుము విత్తనాలను రైతులకు అందజేశారు. ఏవో టి.సంగీత, నాయకులు బి.వాసుదేవరావు, కంది చంద్రశేఖర్, పల్లె భాస్కరరావు, ఫాణి రాజు, పిట్టా అప్పారావు పాల్గొన్నారు. ● నియోజకవర్గంలో విజన్-2047కు అనుగుణంగా అధికారులు పని చేయాలని ఎమ్మెల్యే నాగమాధవి సూచించారు. బుధవారం ముంజేరులోని ఆమె క్యాంపు కార్యాలయంలో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో పీ4 విధానం ద్వారా అందరికీ మంచి జరిగేలా సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మార్గదర్శకాలు నిర్దేశించారన్నారు. పరిపాలనలో పారదర్శకత, సమర్థత, సమస్యలపై వేగవంతమైన చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గ అధికారులు పాల్గొన్నారు.

విత్తనాల కిట్టును అందజేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి

పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలి: జడ్పీ సీఈవో

భోగాపురం, న్యూస్‌టుడే: గ్రామాల్లో పరిసరాల పరిశుభ్రతపై దృష్టి సారించాలని జడ్పీ సీఈవో బీవీ సత్యనారాయణ సూచించారు. బుధవారం రామచంద్రంపేటలో ఆయన ఇంటింటా చెత్త సేకరణ, తాగునీటి సరఫరా, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. తాగునీటిని క్లోరినేషన్ చేయాలన్నారు.

గిరిజన విద్యార్థి ఆరోగ్యంపై ఆరా

విద్యార్థితో మాట్లాడుతున్న శంకరరావు

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: నెల్లిమర్ల గిరిజన ఆశ్రమ పాఠశాల 7వ తరగతి విద్యార్థి మున్నాను విజయనగరం ఘోష ఆసుపత్రిలో బుధవారం ఎస్టీ కమిషన్ ఛైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు పరామర్శించారు. అనంతరం విద్యార్థి ఆరోగ్య పరిస్థితులపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు. డీఎస్‌టీడబ్ల్యువో కె.శ్రీనివాసరావు, హెచ్‌ఎం సూర్యనారాయణ, హెచ్‌డబ్ల్యూవో పి.రామానాయుడు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

నెల్లిమర్ల, న్యూస్‌టుడే: మండలంలో సతివాడ, కొండవెలగాడ విద్యుత్తు ఉప కేంద్రం పరిధిలో గురువారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఈఈ త్రినాథరావు బుధవారం తెలిపారు.

రేపు లక్కవరపుకోటలో..

లక్కవరపుకోట: ఎల్.కోటలోని 11 కేవీ రూరల్ ఫీడరులో నిర్వహణ పనుల వల్ల శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరాలో అంతరాయం ఉంటుందని ఇన్‌ఛార్జి ఇంజినీరింగు అధికారి చప్ప సూరిబాబు, సబ్ ఇంజినీరు వెంకటసత్యారావు తెలిపారు.

హెచ్‌ఎంకు విద్యార్థుల అభిమాన కానుక

జామి, శృంగవరపుకోట, జరజాపుపేట (నెల్లిమర్ల), న్యూస్‌టుడే: జామి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్ రెహమాన్‌పై ఆ విద్యార్థులు ఎనలేని అభిమానం ప్రదర్శించారు. చిత్రలేఖన ఉపాధ్యాయుడు రాము సహకారంతో హెచ్‌ఎం దంపతులు కూర్చోడానికి ప్రత్యేక ఆసనం తయారు చేశారు. సన్మాన కార్యక్రమంలో దానిపై కూర్చుంటే చూసి ఆనందించారు. విద్యార్థుల అభిమానానికి హెచ్‌ఎం భావోద్వేగానికి గురయ్యారు. ★ జిల్లా డైట్ కళాశాల ప్రిన్సిపల్ జి.పగడాలమ్మను డీఈవో మాణిక్యంనాయుడు, అధ్యాపకులు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ రామకృష్ణారావు, విశ్రాంత డీఈవో తిరుపతినాయుడు, అధ్యాపకులు, ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పారసాం ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడు కొమ్ముాజి మహేశ్వరరావును ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు సన్మానించారు. ★ కుమరాం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా ఉద్యోగ విరమణ చేసిన ఎ.రామారావు దంపతులను ఎమ్మెల్సీ శ్రీనివాసులునాయుడు చేతులమీదుగా సన్మానించారు. ★ ఎస్.కోట మండలంలోని బొడ్డవర ప్రాథమికోన్నత పాఠశాల నుంచి బదిలీ అయిన సీహెచ్ భారతి, బి.పద్మావతి, కె.జగదీశ్వరి, వి.కనకారావు, కేవీ రమణ, భాస్కరరావులను ఘనంగా సత్కరించారు.

ప్రత్యేక ఆసనంలో కూర్చున్న హెచ్‌ఎం దంపతులు

పగడాలమ్మను సన్మానిస్తున్న డీఈవో మాణిక్యంనాయుడు, అధ్యాపకులు

ఔరబంద గట్టుకు గండి

శృంగవరపుకోట, న్యూస్‌టుడే : పట్టణంలోని ఔరబంద గట్టుకు గుర్తు తెలియని వ్యక్తులు గండి కొట్టారని రైతు అవనాపు వెంకటరమణ బుధవారం మధ్యాహ్నం తహసీల్దారు డి.శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. గట్టును కొట్టేసి చెరువులో మట్టిని తరలించుకుపోయారన్నారు. వందల ఎకరాలకు జీవనాధారమైన చెరువుకు గండి కొట్టడం వల్ల ఆయకట్టు రైతులు ఇబ్బందులు తప్పవని తెలిపారు. దీనిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరగా.. సిబ్బందిని పంపి విచారణ చేయిస్తామని తహసీల్దారు తెలిపారు.

చిన్నఖాతాతో పెద్ద ప్రయోజనం!

3 నెలలపాటు గ్రామస్థాయి జనసురక్ష

జిల్లాలో గ్రామీణులందరికీ బ్యాంకు ఖాతాలు

పాలకొల్లు, యలమంచిలి, న్యూస్‌టుడే: పెనుగొండ మండలం వడలికి చెందిన లక్ష్మికి తల్లికి వందనం మంజూరైనట్లు జాబితాలో పేర్కొంది. ఎన్ని రోజులు చూసినా ఖాతాకు జమ కావడం లేదని బ్యాంకుకు వెళ్లి ఆరాతీయగా ఈకేవైసీ పెండింగ్‌లో ఉందని తెలిసింది.

ఖాతాలు మనుగడలో లేకపోవడంతో ఎదురయ్యే ఇబ్బందులను గ్రామీణులు ఎందరో ఎదుర్కొంటున్నారు. వీరి కోసం కేంద్రప్రభుత్వం, ఆర్థిక మంత్రిత్వ శాఖ, ఆర్థికసేవల విభాగం సంయుక్తంగా ఈ నెల 1నుంచి గ్రామస్థాయి జనసురక్ష కార్యక్రమాలు అమలు చేస్తున్నారు.

ఈకేవైసీ లేనివి 2 లక్షలకుపైనే.. జిల్లాలో ఈకేవైసీ పూర్తిగా నిర్వహించని ఉన్న ఖాతాలు 2.55 లక్షల వరకు ఉన్నట్లు 2024 నవంబరులో నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గుర్తించింది. దీనిపై ఇప్పట్లో అప్రమత్తమైన అధికారులు కొన్ని ఖాతాలను మనుగడలోకి తీసుకొచ్చినా ఇంకా 2 లక్షలకు పైబడి నవీకరణ చేయాల్సినవి ఉంటాయి. వీటన్నిటిని పునరుద్ధరించాల్సిన అతిపెద్ద బాధ్యత ఇప్పుడు బ్యాంకర్లపై ఉంది.

బీమాతో ప్రయోజనం.. పేదలకు అనేక ప్రమాద బీమాలున్నా వాటిని చేయించుకోకపోవడంలో అవగాహన లేక ప్రయోజనాలను కోల్పోతున్నారు. ప్రస్తుత కార్యక్రమాల్లో పేదలకు వారి స్తోమతను బట్టి ఖాతాలకు అనుసంధానమయ్యే ప్రమాద బీమా చేయించే కార్యక్రమాలు చేపట్టనున్నారు. ఉదాహరణకు ప్రధానమంత్రి సురక్షబీమా యోజనలో ఏడాదికి రూ.20 చెల్లిస్తే 18 నుంచి 70ఏళ్ల నిండినవారంతా ప్రమాదవశాత్తు చనిపోతే రూ.2 లక్షలు ఆ కుటుంబానికి దక్కుతుంది.

రోజుకు 7 గ్రామాలు.. జిల్లాలో ఉన్న జాతీయ బ్యాంకు శాఖలతో పాటు జిల్లా సహకారబ్యాంకు కూడా భాగస్వామ్యం అవుతుంది. రోజుకు 7 గ్రామాల చొప్పున ఈ కార్యక్రమం జరగనుంది. దీనిపై లీడ్‌బ్యాంకు మేనేజర్ నాగేంద్రప్రసాద్‌ను సంప్రదించగా బ్యాంకులు, డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం 3నెలల పాటు జరుగుతుందన్నారు. గ్రామాల్లో ఖాతాలు లేనివారందరికి కల్పించడం బీమా చేయించడం జరుగుతుందన్నారు.

369 గ్రామాల్లో సేవలు.. జులై 1 నుంచి సెప్టెంబరు 30 వరకు గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించబోయే బ్యాంకింగ్ కార్యక్రమాలు 369 గ్రామాల్లో అమలుకానున్నాయి. ఒక్కోగ్రామాన్ని ఒక్క బ్యాంకు దత్తత తీసుకుని ఆయా గ్రామాల్లో ప్రతి ఒక్కరికీ బ్యాంకు ఖాతా ఉండేలా చర్యలు తీసుకుంటుంది. పేదలకు సున్నా నిల్వతో జన్‌ధన్ ఖాతాలను ప్రారంభిస్తారు.

ప్రత్యేక రైళ్ల సేవల పొడిగింపు

ఏలూరు అర్బన్, న్యూస్‌టుడే: ప్రత్యేక రైళ్ల సేవలను పొడిగిస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి - నరసాపూర్ - 07131 ప్రత్యేక రైలు ఆగస్టు 3 నుంచి వచ్చే ఏడాది మార్చి 9 వరకు ప్రతి ఆదివారం పయనిస్తుందని అన్నారు. నరసాపూర్-తిరుపతి-07132 ప్రత్యేక రైలు ఆగస్టు 4 నుంచి వచ్చే ఏడాది మార్చి 30 వరకు ప్రతి సోమవారం పయనిస్తుందని వెల్లడించారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

రాజీకాదగిన కేసులను గుర్తించాం

5న జాతీయ లోక్‌అదాలత్

ఏలూరు టూటౌన్, న్యూస్‌టుడే: కేసుల సత్వర పరిష్కారానికి లోక్‌అదాలత్‌లను సద్వినియోగం చేసుకోవాలని ఈ నెల 5న ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.శ్రీదేవి అన్నారు. ఏలూరు కోర్టు ప్రాంగణంలోని న్యాయసేవాధికార సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఇప్పటికే రాజీ కాదగిన కేసులు 4,633 గుర్తించామన్నారు. గత మార్చిలో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 5 వేలకు పైగా వివిధ కేసులను పరిష్కరించగలిగామన్నారు. రాజీ రాజమార్గమని, కేసులు పరిష్కారమైతే కక్షిదారులిద్దరూ గెలిచినట్లేనన్నారు. జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి రత్నప్రసాద్ మాట్లాడుతూ నిర్వహించబోయే లోక్‌అదాలత్‌కు జిల్లాలో 34 బెంచ్‌లు ఏర్పాటు చేశామని దూరప్రాంతాల నుంచి రాలేని కక్షిదారులు ఆన్‌లైన్ ద్వారా కూడా తమ కేసులను పరిష్కరించుకోవచ్చని చెప్పారు. ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కోనే సీతారామారావు తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనపై ప్రజలు సంతృప్తి: మంత్రి

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వ ఏడాది పాలనపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారని మంత్రి రామానాయుడు అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా ఆయన తిల్లపూడిలో బుధవారం పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. ఏడాదిలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై కరపత్రాలను అందజేశారు. ప్రభుత్వ పథకాల అమలు తీరుపై ప్రజలను ఆరా తీశారు. మాజీ ఎమ్మెల్సీ అంగర రామమోహన్, డీసీఎంఎస్ ఛైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు. ★ జిల్లా వ్యాప్తంగా సాగిన కార్యక్రమాల్లో నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అత్తిలి మండలంలో ఎమ్మెల్యే రాధాకృష్ణ ఇంటింటికీ వెళ్లి కూటమి పాలనలో ఏడాదిలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి వివరించారు.

సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో నిమ్మల తదితరులు

అత్తిలి మండలం కె.సముద్రపుగట్టులో సంక్షేమ పథకాల కరపత్రాన్ని మహిళకు అందిస్తున్న ఎమ్మెల్యే రాధాకృష్ణ

దొరికితే చూద్దాం.. అప్పుడే రాద్దాం

- దొంగ పట్టుబడితేనే కేసుల నమోదు
- వాహనాల అపహరణ ఫిర్యాదులపై ఉదాసీనం

భీమవరం పట్టణం, మార్టేరు, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: వాహనం కనిపించకపోతే వెంటనే పోలీసులను ఆశ్రయిస్తాం.. వారు స్పందించి ఎక్కడ ఉందో గుర్తించి, ఎవరు ఎత్తుకెళ్లారో తెలుసుకుంటారనుకుంటాం. కానీ.. చుట్టుపక్కల వెతకండి.. ఎక్కడో ఉండే ఉంటుంది. ఇదీ వారి నుంచి సమాధానం. కేసును ఫిర్యాదు కూడా తీసుకోవడం లేదని బాధితులు వాపోతున్నారు. ఎక్కడైనా దొంగ దొరికినప్పుడు మాత్రం కొన్ని నెలల కిందట పోయిన వాహనాలన్నింటినీ ఆగమేఘాలపై కేసులు నమోదు చేయడం పరిపాటిగా మారింది. వందల సంఖ్యలో వాహనాలు ఆయా స్టేషన్ల పరిధిలో అపహరణకు గురవుతున్నా నమోదయ్యేవి ఏక సంఖ్యలో ఉండటం గమనార్హం.

భీమవరం పరిధిలో శేఖర్ అనే యువకుడు ద్విచక్రవాహనం పోయిందని పోలీసులను ఆశ్రయించాడు. ఇది జరిగి కొన్ని నెలలైనా ఇప్పటికీ ఫిర్యాదు తీసుకోలేదు.

నరసాపురంలో పార్కు దగ్గర ఉంచిన ద్విచక్ర వాహనం గత నవంబరులో చోరీ గురైందని పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసే ఐడీపార్టీ వారు తిరుగుతున్నారు, దొరికిన వెంటనే ఫోన్ చేస్తామన్నారు. ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదని' అని బాధితుడు వాపోయాడు. ప్రతి 15 రోజులకోసారి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి వస్తున్నానన్నారు.

తాడేపల్లిగూడెం మార్కెట్ దగ్గర నిలుపుదల చేసిన రెండు ద్విచక్రవాహనాలు అపహరణకు గురయ్యాయని ఫిర్యాదు చేయగా.. కొన్ని రోజుల తర్వాత వివరాలు తీసుకున్నారు.

పెనుమంట్ర మండలం మామిడూరులో రెండు ద్విచక్రవాహనాలు అపహరణకు గురైనా కేసులు నమోదు కాలేదు. ఇప్పుడు రెండేళ్ల కాలంలో దాదాపు 20 ద్విచక్రవాహనాలు ఎత్తుకెళ్లిపోయారంటున్నారు.

పట్టించుకోకపోతే నేరుగా చెప్పండి.. ఫిర్యాదులను వెంటనే నమోదు చేయాలని ఎస్పీ అద్నాన్ నయీం అస్మి తెలిపారు. ఎక్కడైనా వాహనాలు అపహరణకు గురైతే ఆ వివరాలను సంబంధిత పోలీస్‌స్టేషన్లో చెప్పినా పట్టించుకోకపోతే నేరుగా ఉన్నతాధికారులకు తెలుపవచ్చన్నారు.

వెతుక్కోవాల్సిందే!.. పాలకోడేరు మండల పరిధిలో రెండున్నరేళ్ల కిందట ద్విచక్రవాహనం ఎత్తుకెళ్లిపోగా బాధితుడు వెంటపడి కొంతదూరం వెంబడించాడు. అయినా తప్పించుకుని వెళ్లిపోగా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొన్నేళ్ల తర్వాత గణపవరంలో ఉన్నట్లు గుర్తించి అప్పుడు కేసు నమోదు చేశారు, ఇందుకు ఖర్చులయ్యాయని బాధితుడు ఆవేదన చెందాడు. కాళ్ల మండల పరిధిలో లారీ అపహరణకు గురికాగా అనుమానితుల కదలికలను తెలుసుకుని బాధితుడే పట్టుకున్నారు.

వివరాలు చెప్పగానే కేసులు నమోదు.. దొరికిన దొంగ ఇచ్చే వివరాలతో హడావుడిగా కేసులు నమోదు చేస్తున్నారు. భీమవరం సబ్‌డివిజన్ పరిధిలో ఓ స్టేషన్‌కు చెందిన పోలీసులు ఓ వ్యక్తిని ఇటీవల పట్టుకున్నారు. 6 స్టేషన్ల పరిధిలో దాదాపు 12 ఆటోలు ఎత్తుకెళ్లిపోయినట్లు అతడు చెప్పగానే పలు చోట్ల కేసులు నమోదు ప్రక్రియ మొదలుపెట్టారు. గతేడాది నవంబరు, డిసెంబరులో అపహరణకు గురైతే ఇప్పటి వరకు బాధితులు వెతుక్కున్నారని, ఇప్పుడు వచ్చి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని పోలీసులు చెప్పడం విడ్డూరం.

మెనూ ప్రకారం ఆహారం పెట్టాలి : కలెక్టర్

మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న నాగరాణి

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: చినరంగనిపాలెంలోని పస్తుల సాగరం పురపాలకోన్నత పాఠశాలను కలెక్టర్ నాగరాణి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. బాగా చదువుకుంటున్నారా, ఉపాధ్యాయులు చెప్పే పాఠాలు అర్థమవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనం తయారీ, రుచులను పరిశీలించారు. మెనూ ప్రకారం ఆహార పదార్థాలు వండి వడ్డించాలన్నారు. తర్వాత విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఎంఈవో ఎన్.ఎన్ శ్రీనివాసు, ప్రధానోపాధ్యాయుడు కె.వెంకట్రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కలిసి కట్టుగా.. ఒకటే జట్టుగా	జాతీయ రహదారిపై లారీల బీభత్సం	8లో	మిత్రుడే ఉసురు తీశాడు!

(8లో)

జయహో.. జగన్నాథ!

భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: భీమవరంలో అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం (ఇస్కాన్) పట్టణ శాఖ ఆధ్వర్యంలో జగన్నాథ రథయాత్ర అంగరంగ వైభవంగా బుధవారం జరిగింది. పంచారామ క్షేత్రం గునుపూడి సోమేశ్వరజనార్దనస్వామి ఆలయం నుంచి సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామి రథం ప్రధాన రహదారుల మీదుగా హరేకృష్ణ హరేరామ సంకీర్తనలతో సాగింది.

రెండో పట్టణంలో అల్లూరి సీతారామ రాజు సాంస్కృతిక కేంద్రం వరకు సాగిన యాత్రలో మహిళా భక్తులు దారి పొడవునా వివిధ రంగులతో రంగవల్లులు వేసి స్వాగతం పలికారు. పట్టణ శాఖ ప్రతినిధి వంశీకృష్ణదాస్ పర్యవేక్షణలో భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు.

రథం లాగుతున్న భక్తులు

రథయాత్ర తిలకిస్తున్న భక్తజన సందోహం

పన్నుల సొమ్ము పక్కదారి

కొందరు కార్యదర్శుల చేతివాటం

ఈనాడు డిజిటల్, భీమవరం, తణుకు, భీమవరం గ్రామీణం, న్యూస్‌టుడే: పల్లెల అభివృద్ధికి ప్రధాన ఆదాయ వనరులైన పన్నుల సొమ్మును కొంత మంది కార్యదర్శులు తమ సొంత ఖాతాలకు మళ్లిస్తున్నారు. ప్రజల నుంచి వసూలు చేసి సకాలంలో జమ చేయకుండా ఖజానాకు గండి కొడుతున్నారు. పర్యవేక్షణ లేకపోవడంతో చేతివాటం చూపుతున్నారు.

జిల్లాలో 20 మండలాల్లో గతేడాది పన్ను రూపంలో రూ.1.70 కోట్లు బకాయిలున్నాయి. వీటిలో రూ.61.83 లక్షలు వసూలైంది. ఇంకా రూ.కోటిపైనే వసూళ్లు కావాల్సి ఉంది. పాలకొల్లు, యలమంచిలి, పోడూరు, ఆచంట మండలాల్లో మినహా పూర్తి స్థాయిలో ఎక్కడా వసూలు కాలేదు. అత్యధికంగా పాలకోడేరులో రూ.58,70,226, వీరవాసరంలో రూ.47,20,345, తణుకు రూ.10,17,863, అత్తిలి రూ.7,80,251, గణపవరం రూ.7,67,465, పెనుగొండ రూ.7,39,639, నరసాపురం రూ.6,81,583 వసూళ్లు కావాల్సి ఉంది. ఆఖరిలో చూద్దామని కొందరు నిర్లక్ష్యం చేయడం, వసూళ్లు చేసినా కొందరు కార్యదర్శులు చెల్లించకపోవడమే వీటికి కారణంగా కనిపిస్తున్నాయి.

తన వద్దే ఉంచుకొని.. గతంలో పెనుమంట్ర మండలం పొలమూరు పంచాయతీలో అప్పటి కార్యదర్శి ఇంటి పన్నుల సొమ్మును ప్రభుత్వం ఖాతాకు జమ చేయకుండా కొద్ది రోజులు తన వద్దే ఉంచుకున్నారు. తర్వాత మరో కార్యదర్శి లక్షలాది రూపాయలను నిబంధనలకు విరుద్ధంగా బయట వ్యక్తులకు బదిలీ చేశారు.

ఇదే వరమైంది: గ్రామాల్లో వ్యాపార, వాణిజ్య దుకాణాల లైసెన్సు రుసుం, తాగునీరు, వినోదం, గదుల అద్దె, సంతలు, స్థలాల వేలం ద్వారా పన్నులు వసూళ్లు కావాల్సి ఉంది. ప్రజల నుంచి వసూలు చేసిన 24 గంటల్లో ఖజానా ద్వారా సాధారణ నిధి ఖాతాకు జమ చేయాలి. క్షేత్రస్థాయిలో పన్నుల వసూలు, జమపై పర్యవేక్షణ లేదు. దీంతో కొంతమంది వ్యక్తిగత అవసరాలకు వాడుకుంటూ తర్వాత తిరిగి చెల్లిన్నారు. ఏ రోజు ఎవరెవరు ఎంత కట్టారు, జనరల్ ఫండ్ ఖాతాలోకి సర్దుబాటు చేయడానికి ఎప్పుడు చలానా తీశారు, ఎన్ని రోజులకు చెల్లించారు తదితర అంశాలను పరిశీలించడం లేదు. ఇదే కొంత మంది కార్యదర్శులకు వరమైంది.

- ఇటీవల ఇరగవరం మండలంలో ఓ పంచాయతీ కార్యదర్శి పన్నులు వసూలు చేసి సొంత ఖాతాలకు మళ్లించుకున్నారనే ఫిర్యాదులపై అధికారులు విచారణ చేశారు. గతంలో దువ్వలో సిబ్బంది వసూలైన పన్నులు, ఇతర ఆదాయ సొమ్మును సొంతానికి వాడుకున్నారు.
- భీమవరం మండలం చినఅమిరం, రాయలం పంచాయతీల్లో గతంలో పనిచేసిన కార్యదర్శి ప్రజల నుంచి వసూళ్లు చేసిన పన్నులు, ఇతరత్రా ఆదాయ సొమ్ము సుమారు రూ.2 కోట్లు దుర్వినియోగం చేశారు. ఇదే మండలంలో మరికొన్ని పంచాయతీల్లో జరిగిన ఆర్థిక వ్యవహారాలపై విచారణలు జరిగాయి.

మండలాలు 20 | అసెస్‌మెంట్లు 3,11,247 | గతేడాది బకాయిలు రూ.1,70,20,210

పన్నుల వసూళ్లపై ప్రత్యేక పర్యవేక్షణ చేస్తామని డీపీవో రామ్‌నాథ్ రెడ్డి తెలిపారు.

వర్షాలతో పాపికొండల విహారయాత్రకు విరామం

దేవీపట్నం, వరరామచంద్రాపురం, న్యూస్‌టుడే: రుతు పవనాల ప్రభావంతోపాటు ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు గోదావరిలో నీటి మట్టం క్రమంగా పెరుగుతోంది. పాపికొండల విహారయాత్రను రెండు రోజులపాటు తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు జల వనరుల శాఖ ఏఈ భాస్కర్ తెలిపారు. ఈ క్రమంలో దేవీపట్నం మండలం పోశమ్మగండి, వీఆర్‌పురం మండలం పోచవరం రేవుల నుంచి పాపికొండల విహారయాత్రకు వెళ్లే పర్యాటక బోట్లు మొత్తం నిర్వాహకులు పూర్తిగా నిలిపివేశారు. వర్షాలు తగ్గి వాతావరణం పూర్తిగా అనుకూలిస్తే విహారయాత్రను పునరుద్ధరిస్తామన్నారు.

ఖరీఫ్ వేళ.. మురిసె నేల

నవధాన్యాల సాగుతో భూమికి సత్తువ

ఉండి, న్యూస్‌టుడే: నిస్సత్తువుగా ఉన్న నేలమ్మ నవధాన్యాల సాగుతో శక్తిని పెంచుకుంటోంది. జిల్లాలో 25వేల ఎకరాల్లో 22 రకాల విత్తనాలు కిట్ల రూపంలో రెవెన్యూ, వ్యవసాయం, డీఆర్‌డీఏ, ప్రకృతి వ్యవసాయ శాఖలు సంయుక్తంగా రైతులకు అందించాయి. అన్ని జిల్లాల్లో గుర్తించిన ఆదర్శ రైతుల నుంచి మేలైన విత్తనాలు సేకరించి 12 కిలోలను కిట్‌గా చేసి ఎస్‌హెచ్‌జీల ద్వారా విక్రయించారు.

రెండు దశాబ్దాల కిందట వరకు ఉమ్మడి జిల్లాలో అపరాలు, పచ్చిరొట్ట తదితర పంటలు సాగయ్యేవి. పశువుల పెంట, సేంద్రియ ఎరువులు చల్లేవారు. తర్వాత అధిక దిగుబడి కోసం మోతాదుకు మించి రసాయన ఎరువులు, పురుగు మందుల వినియోగాన్ని పెంచుతున్న ప్రాంతాల్లో పశ్చిమ డెల్టా ఉందని కేంద్రం గుర్తించింది.

బృహత్తర ప్రణాళిక.. జీలుగ, పిల్లి పెసర, జనుము వంటి పచ్చిరొట్ట, తోటకూర, పాలకూర, మెంతి కూర, చుక్కకూర తదితర ఆకుకూరలు, వంగ, బెండ, బీర, దోస, టమాట, సొర వంటి కూరగాయలు, పెసర, మినుము, జొన్న, బొబ్బర్లు, సజ్జలు, ఉలవలు, నువ్వులు, వేరుశనగ విత్తనాలను నవధాన్యాలుగా రైతులకు ఇచ్చేందుకు కలెక్టర్ నాగరాణి ఆధ్వర్యంలో నాలుగు నెలల నుంచి బృహత్తర ప్రణాళిక అమలు చేస్తున్నారు. కిట్ రూ.800 చొప్పున 25 వేల మందికి రూ.2 కోట్ల విలువైన విత్తనాలిచ్చారు. రబీ కోతకు ముందు విత్తనాలు చల్లిన చోట్ల మంచి ఫలితాలొచ్చాయి. వేసవిలో వర్షాలు పంట ఎదుగుదలకు కలిసొచ్చాయని జిల్లా వ్యవసాయాధికారి జడ్.వెంకటేశ్వరరావు తెలిపారు. 'పచ్చిరొట్ట, ఆకుకూరలు, కూరగాయలు, పప్పుధాన్యాల పెంపకంతో మొక్కల వేర్ల నుంచి విడుదలయ్యే ద్రవాలు భూమిలో కలిసి అన్ని రకాల పోషక పదార్థాలు అందుతాయి. తద్వారా 25 వేల ఎకరాల్లో బస్తా చొప్పున కాంప్లెక్స్ ఎరువుల వినియోగం తగ్గినా రూ.4 కోట్ల వరకు పెట్టుబడి ఆదా అవుతుందని' ఆయన వివరించారు.

ఎన్నార్పీ అగ్రహారంలో నవధాన్యాల పంట

జిల్లాలో రసాయన ఎరువుల వినియోగం ఇలా

సంవత్సరం	సీజన్	టన్నుల్లో
2023-24	ఖరీఫ్	30,335
2023-24	రబీ	32,923
2024-25	ఖరీఫ్	38,650
2024-25	రబీ	43,983

అంతా సానుకూలమే!

ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలపై పరిశీలన

స్థానిక అధికారులు, నాయకులతో చర్చిస్తున్న కేంద్ర బృందం

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: నరసాపురం మండలం బియ్యపుతిప్పతో పాటు కోనసీమ జిల్లా ఓడలరేవు వద్ద నిలిచిపోయిన ఫిష్ ల్యాండింగ్ కేంద్రాల నిర్మాణాలను తిరిగి చేపట్టే దిశగా నివేదిక సమర్పించనున్నట్లు సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కోస్టల్ ఇంజినీరింగ్ ఫర్ పిషరీస్ (బెంగళూరు) ఉప సంచాలకుడు బిలియప్ప పేర్కొన్నారు. బియ్యపుతిప్పలో పిష్ ల్యాండింగ్ కేంద్రం నిర్మాణ ప్రాంతాన్ని ఆయన నేతృత్వంలో అధికారుల బృందం బుధవారం పరిశీలించింది. తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు, మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య రాష్ట్ర ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, జిల్లా సమాఖ్య అధ్యక్షుడు మైల వసంతరావు, ఆ శాఖ జిల్లా అధికారులతో వారు పలు అంశాలపై చర్చించారు. ఈ రెండు ప్రాంతాల్లో కేంద్రాల నిర్మాణాలను పునఃప్రారంభించే దిశగా కసరత్తు జరుగుతోందని నాయకులు తెలిపారు. జిల్లా మత్స్యశాఖ అధికారి కేఎస్‌వీ నాగలింగాచార్యులు, ఏపీ ఈడబ్ల్యూఐడీసీ కార్యానిర్వాహక ఇంజినీరు రంగనాథస్వామి, మత్స్యశాఖ జిల్లా సహాయ సంచాలకుడు ఎల్ఎన్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పోలవరం, బుట్టాయగూడెం, న్యూస్‌టుడే: పోలవరం వద్ద బుధవారం తెల్లవారే సరికి గోదావరిలో నీరు రంగు మారడంతో పాటు ప్రాజెక్టు స్పిల్‌వే నుంచి వడివడిగా దిగువకు ప్రవహిస్తోంది. స్పిల్‌వే వద్ద నీటిమట్టం 27.16 మీటర్లకు పెరిగింది. 48 గేట్ల నుంచి 1.06 లక్షల క్యూసెక్కులు స్పిల్ ఛానల్ ద్వారా తిరిగి గోదావరిలోకి వెళ్తోంది. ప్రాజెక్టులో భారీ వాహనాల రాకపోకల కోసం 902 కొండ సమీపంలో మహానందీశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో స్పిల్‌ఛానల్‌లో వేసిన రహదారి నీటమునిగింది. నిన్నటి వరకు పోలవరం, గూటాల గ్రామాల మధ్యలో కనిపించిన ఇసుక తిన్నెలు క్రమేపీ నీటమునుగుతున్నాయి. పట్టిసీమ ఆలయానికి పడవపై నది దాటి ఇసుక తిన్నెలపై నడిచి వెళ్లే భక్తులకు వరద పెరిగి ఇసుక తిన్నెలు మునగడంతో నడక భారం తగ్గింది.

జలాశయాల్లో పెరుగుతున్న నీటిమట్టం.. ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షానికి బుట్టాయగూడెం మండలం అలివేరు వద్ద గుబ్బల మంగమ్మ జల్లేరు జలాశయంలోకి నీరు వచ్చి చేరుతుండటంతో నీటిమట్టం పెరుగుతోంది. జలాశయ పూర్తిస్థాయి నీటిమట్టం 217.80 మీటర్లు కాగా, బుధవారం సాయంత్రానికి 210.60 మీటర్లు ఉంది. చింతలగూడెం సమీపాన ఉన్న పోగొండ జలాశయం సామర్థ్యం 157 మీటర్లు కాగా, 156 మీటర్లకు చేరింది.

ముగిసిన డీఎస్సీ పరీక్షలు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: మెగా డీఎస్సీ-2025 పరీక్షకు 10 మంది గైర్హాజరయ్యారని డీఈవో ఇ.నారాయణ తెలిపారు. జిల్లాలోని మూడు కేంద్రాల్లో బుధవారం ఉదయం, మధ్యాహ్నం జరిగిన పరీక్షలకు 768 మందికి 758 మంది హాజరయ్యారని చెప్పారు. జూన్ 6న ప్రారంభమైన పరీక్షలు ముగిశాయన్నారు.

94.49 ఎకరాల్లో అప్పా నిర్మాణానికి సన్నాహాలు

ఆగిరిపల్లి, న్యూస్‌టుడే: అత్యాధునిక సాంకేతిక హంగులు, అన్ని వసతులతో దేశంలోనే మోడల్ పోలీస్ అకాడమీ నిర్మిస్తామని ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం నూగొండపల్లి, పిన్నమరెడ్డిపల్లి గ్రామాల పరిధిలో ఏపీ పోలీస్ అకాడమీ కేంద్రం నిర్మాణ ప్రతిపాదిత ప్రాంతాన్ని డీజీపీ బుధవారం పరిశీలించారు. అప్పా నిర్మాణ ప్రాంతాన్ని మ్యాప్, వీడియో, చిత్రాల ద్వారా ఎస్పీ కె.ప్రతాప్ శివ కిశోర్, తహసీల్దారు పీఎన్వీ ప్రసాద్‌లు డీజీపీకి వివరించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ... 94.49 ఎకరాల్లో ఏపీ పోలీస్ అకాడమీ కేంద్రం నిర్మించేందుకు సన్నాహాలు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు డీజీపీ మధుసూదన రెడ్డి, ఐజీలు జి.వి.జి.అశోక్ కుమార్, ఎం.రవి ప్రకాశ్, డీఐజీ సత్య ఏసుబాబు, సబ్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్, డీఎస్పీ కేవీవీఎన్వీ ప్రసాద్, సీఐ కె.రామకృష్ణ, ఎస్సై కె.శుభశేఖర్, రెవెన్యూ, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిపాదిత స్థలాన్ని పరిశీలిస్తున్న డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా, అదనపు డీజీపీ, ఐజీ, ఎస్పీ తదితరులు

మళ్లీ త్రిసభ్య కమిటీలు!

ఆగస్టు తొలివారానికి నియామకాలు

నరసాపురం, మొగల్తూరు, న్యూస్‌టుడే: సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలను నియమించే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. గతంలో వైకాపా సర్కారు నియమించిన కమిటీలను కూటమి సర్కారు రద్దు చేసింది. ఆ వెంటనే నూతన కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు నాయకులు ప్రకటించినా సాంకేతిక కారణాలతో కార్యరూపం దాల్చలేదు. ఆ శాఖ అధికారులను సొసైటీలకు ప్రత్యేక అధికారులుగా నియమించారు. వారి పాలనను ఈ నెలాఖరు వరకు ప్రభుత్వం పొడిగించింది. ఆగస్టు తొలి వారానికి కమిటీల ఎంపిక ప్రక్రియ పూర్తి చేసే దిశగా కసరత్తు జరుగుతోందని నాయకులు, అధికారులు చెబుతున్నారు.

సహకార సంఘాలు: 122
పదవులు : 366

ఔత్సాహికుల యత్నాలు.. కూటమి పార్టీలకు చెందిన ఔత్సాహికులు సొసైటీల పదవులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. గతంలోనే ఎంపిక ప్రక్రియ కొలిక్కి వచ్చినా కొన్ని చోట్ల కూటమి పార్టీల మధ్య సర్దుబాటు ప్రభావం ఉండనుంది. రాష్ట్ర వ్యాప్తంగా కమిటీల నియామకానికి నాయకుల నుంచి ప్రతిపాదనల స్వీకరణను అధికారులు ప్రారంభించారు. ఆగస్టు తొలి వారానికి కమిటీల నియామకం పూర్తిచేయనున్నట్లు కూటమి నాయకులు చెబుతున్నారు. ఈ అంశంపై 'న్యూస్‌టుడే' సహకార శాఖ జిల్లా అధికారి ఎ.శ్రీనివాస్‌ను సమాచారం కోరగా ఇప్పటి వరకు ఒక సంఘానికి మాత్రమే ప్రతిపాదనలు అందినట్లు తెలిపారు.



(c) eenadu

కొంటాం.. అడ్డంగా తింటాం

తూకంలో మోసం చేస్తున్న ట్రేడర్లు

ఆందోళన చేస్తున్న రొయ్యల రైతులు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: హఠాత్తుగా క్షీణిస్తున్న ధరలు, విజృంభిస్తున్న వ్యాధులతో ఆక్వా రైతులు ఇప్పటికే తీవ్రంగా నష్టపోతున్నారు. ఇది చాలదన్నట్లు రొయ్యల పట్టుబడి పట్టాక తూకం వేసే సమయంలో కొందరు ట్రేడర్లకు చెందిన ఏజెంట్లు మోసగిస్తున్నారు. ప్రతి కిలోకు 60 గ్రాములు తగ్గేలా కాటా యంత్రంలో మార్పులు చేస్తున్నారు. దానివల్ల ధర తగ్గిపోవడంతో పాటు కౌంట్లు వారీగా తీవ్ర నష్టం కలుగుతుంది. టన్నుకు 60 కిలోల నష్టం వాటిల్లుతోంది. మొత్తం మీద రూ.40 వేలు కోల్పోతున్నామని రైతులు వాపోతున్నారు. ఇదే అంశంపై రొయ్య రైతుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో బుధవారం గొల్లలకోడేరులో సమావేశమయ్యారు. సాంకేతిక నిపుణుడితో కాటాలో మోసం ఎలా చేస్తున్నారో ప్రయోగాత్మకంగా రైతులకు చూపించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు, ఆక్వా రైతులు మళ్ల తులసీరాం, వీరవల్లి చంద్రశేఖర్, నాని, వర్మ తదితరులు పాల్గొన్నారు.

రొయ్యల సాగు విస్తీర్ణం: 90 వేల ఎకరాలు
వార్షిక ఉత్పత్తి: 2 లక్షల టన్నులు
వాటి విలువ: రూ.6 వేల కోట్లు
తూకంలో మోసంతో ఏటా నష్టం: సుమారు రూ.500 కోట్లు

మోసాలపై దృష్టి పెట్టాలి.. ప్రభుత్వం మోసాలపై తక్షణం దృష్టి సారించాలి. బాధ్యులైన వారిని చట్టపరంగా శిక్షించాలి. 20 సెకన్ల వ్యవధిలో కాటాలో మార్పులు చేయగలుగుతున్నారు. అది కూడా రైతు దృష్టిని మరల్చి అతని కాటాలో ఆ విధంగా చేయడం సైబర్ నేరం కింద మేము భావిస్తున్నాం. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి సాగులో నిత్యం ఎంతో ఒత్తిడికి గురవుతూ ఆర్థికంగా నష్టపోతున్నాం.
- గజపతిరాజు, జీకేఎస్ సుబ్బరాజు, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జిల్లా రొయ్య రైతుల సంక్షేమ సంఘం

☛ ఇటీవల కైకలూరులో ఓ రైతులు ఈ తరహా మోసాన్ని గ్రహించి నిలదీస్తే సంబంధిత ట్రేడర్లు ఈ తప్పు ఏజెంట్ల వల్ల జరిగిందని చెప్పి బాధిత రైతుకు రూ.15 లక్షలు నష్ట పరిహారంగా చెల్లించారు. ఈ విషయం బయటకు రానివ్వొద్దని కోరారు.

☛ కొన్ని రోజుల కిందట అమలాపురంలోనూ ఇలాంటివి ఎక్కువగా జరిగాయి. ఇటీవల పాలకొల్లు పరిధిలో ఈ తరహా మోసం జరిగింది. ఇలాంటివి జరిగినప్పుడు వారిచ్చే పరిహారం తీసుకుని సాగుదారులు మౌనంగా ఉండొద్దు. విషయాన్ని బయటపెట్టాలి.

తడిసి ముద్దయిన మన్యం

రికార్డు స్థాయిలో వాన

ఉద్ధృతంగా ప్రవహిస్తున్న పెదవాగు

కుక్కునూరు, వేలేరుపాడు గ్రామీణ, న్యూస్‌టుడే: ఆవర్తనం ప్రభావంతో కురుస్తున్న వర్షాలు జిల్లాలోని మన్యం ప్రాంతాన్ని తడిసి ముద్ద చేశాయి. మూడ్రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం మంగళవారం రాత్రి కుంభవృష్టికి దారితీసింది. మంగళవారం ఉదయం 7 నుంచి బుధవారం ఉదయం 7 గంటల వరకూ నమోదయిన వర్షపాతంలో వేలేరుపాడు మండలంలో రికార్డు స్థాయిలో 103.2 మి.మీ. కురిసింది. కుక్కునూరు మండలంలో 82.0 మి.మీ నమోదయింది. వర్షాకాలం ప్రారంభం అయ్యాక కురిసిన అతి భారీ వర్షం ఇదే. పోలవరం, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, టి.నరసాపురం మండలాల్లోనూ భారీ వర్షం కురిసింది. గ్రామాల్లోని పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. వేలేరుపాడు మండలంలోని పెదవాగు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. కుక్కునూరు మండలంలోని గుండేటివాగు, రాళ్లవాగు, పాలవాగు, పాములేరు, కిన్నెరసాని వరద ప్రవాహంతో పోటెత్తాయి.

వర్షపాతం వివరాలిలా..

మండలం	నమోదు (మి.మీ.లలో)
వేలేరుపాడు	103.2
కుక్కునూరు	82.0
పోలవరం	28.4
కొయ్యలగూడెం	25.6
బుట్టాయగూడెం	17.4
జంగారెడ్డిగూడెం	16.6

పెరిగిన ప్రవాహం.. గోదావరి ఎగువ ప్రాంతంలో భారీగా వర్షాలు కురుస్తుండటంతో గోదావరిలో ప్రవాహం పెరుగుతోంది. నిన్నమొన్నటి వరకూ 8 అడుగులు వరకూ ఉన్న నీటిమట్టం బుధవారం 12 అడుగులు దాటింది. ఇది మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. గోదావరి తీరప్రాంతంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. తీరప్రాంతంలో మునిగిపోయే గ్రామాలకు పునరావాసం కల్పించే ప్రాంతాల్లో పరిస్థితులను పరిశీలిస్తున్నారు. పునరావాస కేంద్రాల్లో ముందుగా మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలనే కలెక్టర్ ఆదేశాలతో ఆ దిశగా ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రస్తుతం ప్రమాదకర పరిస్థితి లేనప్పటికీ, వర్షాల ప్రభావం మరింత పెరిగితే నదికి వరద పోటెత్తుతుంది.

ప్రాణాన్ని బలిగొన్న బురద దారి

వాటర్ ట్యాంకర్ నీటితో రహదారిపై పేరుకున్న బురదను శుభ్రం చేస్తున్న సిబ్బంది

తణుకు, న్యూస్‌టుడే: ఉండ్రాజవరం కూడలి వద్ద మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన దూసనపూడి దుర్గాప్రసాద్ (30) రాజమహేంద్రవరం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందారు. తణుకు సజ్జాపురానికి చెందిన దుర్గాప్రసాద్ పాలు తీసుకొచ్చేందుకు వేలంగి వైపు నుంచి తణుకు వస్తుండగా బురద రోడ్డుపై ద్విచక్ర వాహనం అదుపు తప్పి లారీచక్రాల కిందకు వెళ్లడంతో తీవ్రంగా గాయపడిన తెలిసిందే. దుర్గాప్రసాద్ తాపీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మృతునికి భార్య నాగమాధవి, నాలుగేళ్ల కుమారుడు వెంకటకృష్ణ గంగాధర్ ఉన్నారు. యజమాని మృతి చెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడింది. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు బొల్లాడ నాగరాజు మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

దుర్గా ప్రసాద్ (పాత చిత్రం)

దిద్దుబాటు చర్యలు.. అధికారుల నిర్లక్ష్యం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్టు ప్రమాదం అనంతరం అర్ధరాత్రి సమయంలో దిద్దుబాటు చర్యలకు పూనుకున్నారు. బురదమయంగా మారిన రోడ్డును వాటర్ ట్యాంకర్ తీసుకొచ్చి శుభ్రపరిచారు. ప్రమాదం జరగక ముందే ఈ చర్యలు చేపట్టి ఉంటే ఒక కుటుంబం రోడ్డున పడేది కాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు.

మిత్రుడే ఉసురు తీశాడు!

హత్య కేసులో నిందితుడి అరెస్టు

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అద్నాన్ నయీం అస్మి

నరసాపురం, న్యూస్‌టుడే: కాలువలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైన ఘటనపై నమోదైన కేసులో పోలీసులు లోతైన దర్యాప్తు చేసి అతడు హత్యకు గురైనట్లు నిర్ధారించారు. ఈ కేసులో కీలక ఆధారాలు సేకరించి నిందితుడిని అరెస్టు చేశారు. నరసాపురం పట్టణంలోని ఎస్‌డీపీవో కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆ వివరాలు వెల్లడించారు. ఈ ఏడాది జనవరి 27న నరసాపురం మండలం కొప్పర్రు సమీపాన జిన్నూరు కాలువలో గుర్తుపట్టలేని స్థితికి చేరిన మృతదేహం ఉన్నట్లు వీఆర్వో పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై నరసాపురం గ్రామీణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో నమోదైన అదృశ్యం కేసులపై ఆరా తీసి మృతుడిని పెరవలి మండలం నడిపల్లి గ్రామానికి చెందిన చుక్కల శ్రీనివాస్‌గా ప్రాథమికంగా గుర్తించారు. శవ పంచనామాలో మృతదేహం నుంచి నమూనాలు సేకరించి పరీక్షలు చేయించగా అతడి తల్లి డీఎన్‌ఏతో సరిపోలినట్లు ఎస్పీ తెలిపారు.

చంపి.. కాలువలో పడేసి.. మృతుడిని గుర్తించాక లోతుగా దర్యాప్తు చేయడంతో అతడు హత్యకు గురైనట్లు తేలింది. మృతుడు చుక్కల శ్రీనివాస్, పెరవలి మండలం కాకరపర్రు గ్రామానికి చెందిన పూల వ్యాపారి మట్టపర్తి శ్రీనివాస్ మిత్రులు. రామకృష్ణాపురం డీస్పీ కోళ్లంకకు వెళ్లే ఆలంలో వారి మధ్య జనవరి 3న వాగ్వాదం చోటు చేసుకుని పరస్పరం దాడి చేసుకున్నారు. ఈ క్రమంలో పెరవలి వద్ద మల్లిపూడి శ్రీనివాస్ తన మిత్రుడిని బీరు సీసా ముక్కతో కడుపులో పొడిచి హతమార్చాడు. తరువాత మృతదేహానికి దుస్తులు తొలగించి కాళ్లు, చేతులు తాళ్లతో కట్టి పెరవలి కాలువలో పడేశాడు. ప్రవాహ ఉద్ధృతితో మృతదేహం జిన్నూరు కాలువలోకి చేరింది. సాంకేతిక ఆధారాల ద్వారా దర్యాప్తు చేయడంతో నిందితుడు పట్టుబడినట్లు ఎస్పీ తెలిపారు. ఈ కేసును ఛేదించేందుకు కృషి చేసిన అదనపు ఎస్పీ వి.భీమారావు, డీఎస్పీ జి.శ్రీవేద అరవింద, సీఐ జి.దుర్గాప్రసాద్, ఎస్సైలు టీవీ సురేశ్, బి.సురేంద్రకుమార్, కె.సుధాకరరెడ్డి, కె.వెంకటరమణ, హెచ్‌సీ ఆర్.వెంకటేశ్వరరావు, కానిస్టేబుళ్లను ఎస్పీ అభినందించారు.

ఈపీఎఫ్‌వోలో నమోదయ్యే కొత్త ఉద్యోగులకు ఈఎల్‌ఐ ప్రయోజనాలు

వి.ఎల్.పురం(రాజమహేంద్రవరం), న్యూస్‌టుడే: ఉద్యోగుల భవిష్యనిధి సంస్థ(ఈపీఎఫ్‌వో)లో నమోదయ్యే కొత్త ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వం ఉపాధి ఆధారిత ప్రోత్సాహక(ఈఎల్‌ఐ) పథకం ప్రయోజనాలు వర్తిస్తాయని రాజమహేంద్రవరం ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్-2 వెంకటేశ్వర్లు కలువాయి తెలిపారు. స్థానిక వి.ఎల్.పురంలోని ఈపీఎఫ్‌వో కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేంద్ర మంత్రివర్గం ఆమోదించిన ఈఎల్‌ఐ పథకానికి సంబంధించిన వివరాలు, ప్రయోజనాల గురించి వివరించారు. కొత్తగా ఉద్యోగాల్లో చేరే వారికి ఆర్థిక ప్రయోజనం చేకూర్చడం, మరిన్ని ఉద్యోగాలు కల్పించేలా అన్ని రంగాల్లోని యాజమాన్యాలను ప్రోత్సహించడం దీని ఉద్దేశమన్నారు. ఈ ఏడాది ఆగస్టు ఒకటి నుంచి కొత్తగా ఉద్యోగాల్లో చేరి తొలిసారి ఈపీఎఫ్‌వోలో నమోదైన ఉద్యోగులకు రూ.15 వేల ఆర్థిక ప్రోత్సాహాన్ని ప్రభుత్వం ఏడాది కాలవ్యవధిలో రెండు విడతలుగా అందిస్తుందన్నారు. ఆరు నెలల సర్వీసు పూర్తి చేసుకున్న తర్వాత సగం మొత్తం, మరో ఆరు నెలల సర్వీసు అనంతరం మిగతా సగం మొత్తం నేరుగా ఉద్యోగుల ఖాతాలో డీబీటీ విధానంలో జమ చేస్తుందన్నారు. నెలకు రూ.లక్ష వరకు సంపాదించే కొత్త ఉద్యోగులందరికీ ప్రభుత్వం అందించే ఈ ఆర్థిక ప్రయోజనం వర్తిస్తుందన్నారు.

కన్న బిడ్డను.. కళ్లారా చూడకుండానే..!

అధిక రక్తస్రావంతో మహిళ మృతి

ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగిన బంధువులు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: సాధారణ కాన్పు తరువాత అధిక రక్తస్రావం కావడంతో మహిళ మృతి చెందిన ఘటన పాలకొల్లు పట్టణంలో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో బుధవారం చోటు చేసుకుంది. దీంతో ఆమె కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణానికి చెందిన సంగినీడి జయశ్రీ(28)కి ఉదయం పురిటినొప్పులు రావడంతో ఆసుపత్రికి తీసుకువెళ్లారు. సాయంత్రం ఆమె పాపకు జన్మనిచ్చింది. అనంతరం అధిక రక్తస్రావం జరగడంతో ఆమె ఆరోగ్య పరిస్థితి విషమించింది. అప్పటికప్పుడు వైద్యులు రక్తాన్ని ఎక్కించి ఆమెను కాపాడేందుకు యత్నించినా పరిస్థితి మెరుగుపడలేదు. మరోపక్క శిశువుకు కూడా ఆరోగ్య సమస్యలు ఉండటంతో మరో ఆసుపత్రికి తరలించారు. ఇంతలోనే ఆ తల్లి కన్నుమూసింది. తగిన చికిత్స అందించకపోవడమే ఆమె మృతికి కారణమంటూ బంధువులు, కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. కన్న బిడ్డను కళ్లారా చూసుకోకుండానే తల్లి మృతి చెందడంపై కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. ఈ ఘటనపై పాలకొల్లు పట్టణ పోలీసులను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

ఆస్తి అమ్మేసి.. సొమ్ము కాజేసి

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ఆస్తి విక్రయించగా వచ్చిన రూ.4 కోట్లను ఇవ్వకుండా మోసం చేశారంటూ అందిన ఫిర్యాదు మేరకు యలమంచిలి పోలీస్‌స్టేషన్‌లో బుధవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం తాటిపాకకు చెందిన పితాని వెంకటేశ్వరరావుకు అమలాపురం పట్టణంలో 13 సెంట్ల భూమి ఉంది. దీనిని విక్రయిస్తామంటూ యలమంచిలి మండలం గుంపర్రుకు చెందిన తుంగ నాగేశ్వరరావు, మరో 8 మంది కలిసి పత్రాలు తీసుకున్నారు. జూన్ 11న ఆ భూమిని మరో వ్యక్తికి విక్రయించారు. దీని నిమిత్తం వచ్చిన సుమారు రూ.4 కోట్ల నగదును వెంకటేశ్వరరావుకు ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారు. దీనిపై ప్రశ్నిస్తే దుర్భాషలాడారు. దీంతో వెంకటేశ్వరరావు పోలీసులను ఆశ్రయించగా ఎస్సై కె.గురయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కలిసి కట్టుగా.. ఒకటే జట్టుగా

ఆదర్శంగా లంక గ్రామాలు

కైకలూరు, మండవల్లి, న్యూస్‌టుడే: ప్రపంచ ప్రసిద్ధిగాంచిన కొల్లేరు తీరంలోని గ్రామాలు అందంగా తయారవుతున్నాయి. ప్రభుత్వ నిధులతో సంబంధం లేకుండా అభివృద్ధిలో ముందుంటూ ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. గ్రామస్థుల సమష్టి కృషితో మౌలిక వసతుల కల్పన, వాటి నిర్వహణలో ప్రత్యేకతను చాటుకుంటున్నాయి. అవసరాన్ని గుర్తించి.. ప్రణాళిక సిద్ధం చేసుకుని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటారు. ఆయా గ్రామాల్లోని పారిశుద్ధ్యం, రోడ్లు, కమ్యూనిటీ భవనాలు, పాఠశాలల అభివృద్ధి అంతా గ్రామస్థులే పూర్తి బాధ్యతను తీసుకుంటారు.

కట్టుబాట్లతో ప్రగతి బాట

కొల్లేరు ప్రాంతంలోని గ్రామాల్లో ఒకే సామాజిక వర్గానికి చెందిన ప్రజలు అధికంగా నివసిస్తుంటారు. వీరంతా బంటాలు(జట్లు)గా ఏర్పడి ఏటా కొంతమంది పెద్దలను ఎన్నుకుంటారు. ఈ పెద్దలు తీసుకున్న నిర్ణయాలను ప్రతి ఒక్కరు గౌరవించాల్సిందే. గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయాలన్నా ముందు రోజే మైక్ ద్వారా బంటాకు కొంత మంది వచ్చి పనులు చేయాలని ఆదేశిస్తారు. దీంతో రెండో రోజు పనులన్నీ పూర్తయిపోతాయి.

ఇంగిలిపాకలంక

ప్రతి ఇంటికీ ఇంకుడు గుంత...

సాధారణంగా కొల్లేరులో దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. ఇంగిలిపాకలంక గ్రామస్థులు దోమల పెరుగుదలకు మురుగే ప్రధాన కారణంగా 30 ఏళ్ల కిత్రమే తెలుసుకున్నారు. గ్రామంలో ఎక్కడ మురుగు ఉండకూడదని నిర్ణయం తీసుకున్నారు. ప్రతి ఇంట్లో ఓ ఇంకుడు గుంత ఏర్పాటు చేసుకున్నారు. ఇంట్లో వాడే ప్రతి నీటి బొట్టు, వర్షం నీరు సైతం అందులోకి వెళ్లాల్సిందే. వారికి తెలియకుండానే భూగర్భ జలాల్ని రీఛార్జి చేస్తున్నారు. దీంతో పాటు పాఠశాల అభివృద్ధి, ఆలయాల నిర్మాణాలు సైతం గ్రామస్థుల నిధులతోనే జరుగుతున్నాయి.

పాఠశాల అభివృద్ధిలో చింతపాడు కీలకం..

చింతపాడు జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల అభివృద్ధిలో కీలకంగా గ్రామస్థులు వ్యవహరిస్తున్నారు. విద్యార్థులకు తాగు, వాడుక నీటి సమస్యను పరిష్కరించేందుకు శాశ్వత ప్రాతిపదికన రూ.4 లక్షలతో ట్యాంక్‌ను ఏర్పాటు చేసి ప్రతి రెండు నెలలకు 30 ట్యాంకర్ల నీటిని నిల్వ చేస్తుంటారు. పాఠశాలలో రహదారుల నిర్మాణం, విద్యార్థులకు అన్ని అవసరాలను గ్రామస్థులే తీర్చుతుంటారు. ఆగస్టు 15, జనవరి 26 వేడుకలను ఎంతో వైభవంగా నిర్వహిస్తూ దేశభక్తిని చాటుకుంటున్నారు. గ్రామంలోని కమ్యూనిటీ హాలు, వివేకానందుడి విగ్రహం, ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణంతో పాటు అన్ని రహదారులు సీసీ రోడ్లుగా మార్చుకున్నారు.

గ్రామ స్వరాజ్యానికి ఆదర్శం చటాకాయ

మహాత్ముడు కలలు కన్న గ్రామ స్వరాజ్యానికి నిలువెత్తు నిదర్శనం చటాకాయ గ్రామం. ఐక్యతతో గ్రామస్థులు ముందుకు సాగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే అన్ని నిధులను సద్వినియోగం చేసుకుని రెండు సార్లు ఆదర్శ గ్రామంగా నిర్మల్ పురస్కారాన్ని పొందారు. ప్రతి వీధిలో సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణంతో పాటు మంచినీటి చెరువులు ఏర్పాటు చేసుకున్నారు. పారిశుద్ధ్య రహిత గ్రామమంటే ముందు గుర్తొచ్చేది చటాకాయ మాత్రమే. రెండు దశాబ్దాల కిందటే వీధుల్లో ఎవరూ చెత్త వేయరాదనే నిబంధన విధించారు. పశువులు సీసీ రోడ్లపై పేడ వేసినా.. మూత్రం పోసినా వాటి యజమానులకు అపరాధ రుసుం చెల్లించేలా హుకుం జారీ చేశారు. నూరుశాతం వ్యక్తిగత మరుగుదొడ్లు కలిగిన ఏకైక గ్రామం కూడా ఇదే.

గ్రామంలో నిర్మించుకున్న సీసీ రోడ్డు

జగజ్జనని మావుళ్లమ్మ.. **భీమవరం ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే:** ఆషాఢమాసం సందర్భంగా భీమవరం మావుళ్లమ్మకు విశాఖకు చెందిన దంపతులు భారీ గజమాల బుధవారం సమర్పించారు.

జాతీయ రహదారిపై లారీల బీభత్సం

- ఇద్దరికి తీవ్ర గాయాలు
- పదుల సంఖ్యలో ద్విచక్రవాహనాలు ధ్వంసం

ఫ్యాన్సీ దుకాణంలోకి దూసుకెళ్లిన లారీ

జంగారెడ్డిగూడెం పట్టణం, న్యూస్‌టుడే: దేవరపల్లి- తల్లాడ జాతీయ రహదారిపై జంగారెడ్డిగూడెం మండలం వేగవరం వద్ద బుధవారం రెండు లారీలు బీభత్సం సృష్టించాయి. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్ నుంచి విశాఖపట్నానికి సిమెంటు లోడుతో వెళ్తున్న లారీని.. వేగవరం గ్రామ ప్రధాన సెంటర్ వద్ద ముంబాయి నుంచి రాజమహేంద్రవరం పేపరులోడుతో వెళ్తున్న బలంగా ఢీకొట్టింది. దీంతో ముందు వెళ్తున్న లారీ రోడ్డుపై పలు కార్లను ఢీకొట్టుకుంటూ ఎడమ చేతి వైపు దుకాణాల్లోకి దూసుకుపోయింది. అదే సమయంలో వెనుక లారీ సైతం రహదారిపై కుడిచేతి వైపు ఉన్న దుకాణాల్లోకి దూసుకువెళ్లింది. ఈ ఘటనలో లారీ చోదకుడు పపన్న పిన్నెభాయ్, రోడ్డు పక్కన నిలుచున్న వ్యక్తి కొప్పర్తి నాగేంద్రబాబుకు తీవ్రగాయాలయ్యాయి. సమాచారం అందుకున్న జంగారెడ్డిగూడెం సీఐ సుభాష్ ఘటనాస్థలికి చేరకుని క్షతగాత్రులను పోలీసు వాహనంలో జంగారెడ్డిగూడెం ప్రాంతీయాసుపత్రికి తరలించారు. ప్రమాదంలో రోడ్డు పక్కన నిలుపుదల చేసిన పదుల సంఖ్యలో ద్విచక్రవాహనాలు ధ్వంసమయ్యాయి. అనంతరం రహదారికి ఇరువైపులా దుకాణాలు ముందుకు వచ్చేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, ఆక్రమణలను తొలగించాలని గ్రామస్థులు జాతీయ రహదారిపై బైఠాయించి నినాదాలు చేశారు. సీఐ వారితో మాట్లాడి ఆందోళనను విరమింపజేశారు.

చక్రాల కింద ద్విచక్రవాహనాలు

పాఠశాలల బస్సుల తనిఖీ

భీమవరంలో తనిఖీలు చేస్తున్న వాహన తనిఖీ అధికారులు

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలో విద్యాసంస్థలకు చెందిన కొన్ని బస్సులకు సామర్థ్య పరీక్షలు చేయించలేదని గుర్తించిన ఆర్టీఏ అధికారులు తనిఖీలు ముమ్మరం చేశారు. జిల్లావ్యాప్తంగా బుధవారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పేరుపాలెం పరిధిలో అసలు రిజిస్ట్రేషన్ చేయించకుండా తిరుగుతున్న ఒక విద్యాసంస్థ బస్సును సీజ్ చేశారు. దానికి రూ.40 వేల వరకు అపరాధ రుసుము చెల్లించాలని అధికారులు ఆదేశించారు. భీమవరం, తణుకు, తాడేపల్లిగూడెం, పాలకొల్లులో ఎంవీఐలు ప్రసాద్, శ్రీనివాస్, డీఎస్ఎస్ నాయక్, ఏఎంవీఐ సుబ్బలక్ష్మి, సత్యనారాయణ, రవికుమార్, తేజ తదితరులు తనిఖీలు చేశారు. బస్సులకు సామర్థ్య పరీక్ష వెంటనే చేయించుకోవాలని, లేదంటే చర్యలు తీసుకోవాల్సి వస్తుందని జిల్లా రవాణాధికారి ఉమామహేశ్వరరావు హెచ్చరించారు.

6న రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: ఈ నెల 6న జంతు సంక్రమణ వ్యాధి నిరోధక దినం (జూనోసిస్ డే) సందర్భంగా పెంపుడు జంతువులకు ఉచితంగా టీకాలు వేయనున్నట్లు పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి మురళీకృష్ణ బుధవారం తెలిపారు. వీధి, పెంపుడ శునకాలు, పిల్లులకు పట్టణ, మండల ప్రధాన కార్యాలయాల పరిధిలో ఉన్న పశు వైద్యశాలలో టీకాలు వేయించాలన్నారు.

బ్రాయిలర్ ధరలు (కృష్ణాజిల్లా)
(కిలో 1 కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -93 రిటైల్ ధర 115 చికెన్ విత్ స్కిన్ - 167, చికెన్ స్కిన్‌లెస్ - 190.
అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 100, 108, 119 చికెన్ విత్ స్కిన్ - 190 చికెన్ స్కిన్‌లెస్ - 200.

ఇంటర్మీడియట్ అధికారిగా బాధ్యతలు

ప్రభాకరరావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: పశ్చిమ గోదావరి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారిగా జి.ప్రభాకరరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కార్యాలయ అధికారులు, సిబ్బంది, అధ్యాపకులు పుష్పగుచ్ఛాలు అందజేశారు. తణుకులోని చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న ఈయనకు అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు పనిచేసిన ఎ.నాగేశ్వరరావు జూన్ 30న ఉద్యోగ విరమణ చేశారు.

అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్ర

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: గురుపౌర్ణమి సందర్భంగా 'అరుణాచల గిరి ప్రదక్షిణ యాత్ర'ను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని భీమవరం డిపో సహాయ మేనేజర్ సురేష్ తెలిపారు. ఈ నెల 7న భీమవరం కొత్తబస్టాండ్ నుంచి బస్సు బయల్దేరి శ్రీకాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపుల్ దర్శనాల అనంతరం గురుపౌర్ణమికి అరుణాచలం చేరుకుంటుంది. అక్కడ గిరి ప్రదక్షిణ పూర్తయిన తర్వాత తిరుగు ప్రయాణంలో కంచి కామాక్షి, విష్ణు కంచి దర్శనం చేయించి భీమవరం తీసుకొస్తామని, టిక్కెట్ ధర రూ.3 వేలు అని చెప్పారు. వివరాలకు 73829 24754, 96660 89036 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

92.7 FM Rajamahendravaram
ఈఎఫ్‌ఎమ్ కార్యక్రమాలు
సోమవారం నుంచి శుక్రవారం

కార్యక్రమము	ప్రసార వేళలు
ఉషోదయం	ఉ॥ 5 - ఉ॥ 7
ఈ-మార్నింగ్స్	ఉ॥ 7 - ఉ॥ 11
నువ్వా నేనా	ఉ॥ 11 - మ॥ 2
సత్యభామ	మ॥ 2 - సా॥ 5
లైట్ తీస్కో	సా॥ 5 - రా॥ 9
సరదాగా కాసేపు	రా॥ 9 - రా॥ 12
బ్యాక్ టు బ్యాక్ సాంగ్స్	రా॥ 12 - తె॥ 5

/Eenadufm
For Advertising on Eenadu FM Contact
9000180626, 6304901226

SBI స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
స్ట్రెస్డ్ అస్సెట్స్ రికవరీ బ్రాంచి, పరిపాలన కార్యాలయ ప్రాంగణం, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం
అధీకృత అధికారి వివరములు: పేరు: శ్రీ. వై. శ్రీకాంత్ (చీఫ్ మేనేజర్), మొబైల్ నెం. 80994 44378,
ఇ-మెయిల్ ఐడి: sbi.10077@sbi.co.in, ఆస్తి తనిఖీ కొరకు: 79951 98451.

ఇ-వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్ 2002 లోని రూల్ 8(6) / రూల్ 9(1) ని నిబంధనలతో చదువబడు (సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 (కింద బ్యాంకులకు తనఖాచేసిన స్థిరాస్తుల అమ్మకము) [illegible]

డిమాండ్ నోటీసు తేది: 19.12.2022, ... తేది 25.06.2025 నాటికి రూ. 81,02,653.99/- ... తేది 26.06.2025 ... [illegible]

స్థిరాస్తి వివరములు [illegible]

రిజర్వు ధర	ధరావత్తు	బిడ్ పెంపుదల
రూ.29,00,000/-	రూ.2,90,000/-	రూ. 10,000/-
రూ.40,00,000/-	రూ.4,00,000/-	రూ. 10,000/-

ఇ-వేలం తేది : 21-07-2025 | సమయం: ఉ. 11:00 గం.ల నుండి సా. 04.00 గం.ల వరకు
ఆస్తి తనిఖీ తేది మరియు సమయం: తేది 04-07-2025 నుండి తేది 20-07-2025 వరకు ఉ. 10.00 గం.ల నుండి సా. 4.00 గం.ల వరకు
www.sbi.co.in/web/sbi-in-the-news/auction-notices ... https://baanknet.com/eauction-psb/bidder-registration & https://www.baanknet.com ... support.baanknet@psballiance.com [illegible]
తేది: 26.06.2025, ప్రదేశం: విశాఖపట్నం | సం/- అధీకృత అధికారి, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

EENADU Classifieds

AUTO
VEHICLES WANTED
Wanted Vehicle: అశోక్ లేలాండ్ దోస్త్, టాటా ఇంట్రా, టాటా పికప్ వాహనాలు నెలవారి అద్దె ప్రాతిపదికన ప్రముఖ కంపెనీకి వాహనం అద్దెకు కావలెను. సంప్ర: ✆: 63022 27985.

REAL ESTATE
PLOT FOR SALE
భీమవరం మెంటేవారి తోటలో బైపాస్ రోడ్‌కు దగ్గర్లో 5 సెంట్లు చొప్పున 2 స్థలాలు అమ్మకం. కాంటాక్ట్: 98482 09906.
తాడేపల్లిగూడెం యాగర్లపల్లి కరెంట్ ఆఫీసు దగ్గరలో 600 చ॥గ॥ మరియు 200 చ॥గ॥ తూర్పుఫేసింగ్ స్థలం అమ్మకం. సంప్ర: ✆ 99895 15392, 98498 49363.

JOBS
అభినయ ఎంటర్‌ప్రైజెస్, రాజమండ్రి, టాటా సోలార్ నందు పనిచేయుటకు అనుభవంగల టెక్నీషియన్స్ & కంప్యూటర్ ఆపరేటర్ కావలెను. Cont: 94924 44555.
రామకృష్ణ బిల్డర్స్ & డెవలపర్స్ VJA కొరకు 10th ఆపైన చదివిన టెలీకాలర్స్, కస్టమర్‌కేర్ మరియు అన్ని రకాల M/F స్టాఫ్ కావలెను. భో+వ+మంచి జీతం + ఇన్సెంటివ్స్ కలవు. 9959021122/ 9959031122.
MAX గోల్డ్ సేంద్రీయ ఎరువులు డైరెక్ట్‌గా మార్కెట్ చేయుటకు Q: 10th, ఇంటర్, డిగ్రీ. శాలరీ: 15000, TA, DA + ఇన్‌సెంటివ్. వయస్సు: 20 సం॥ - 45 సం॥. కాంటాక్ట్: ✆ 99666 34933.
రామకృష్ణ ఓల్డేజ్ హోం. VJA శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు, పేషంట్లు సేవకు ఇంటి/ వంటపని, బేబీకేర్ కొరకు వర్కర్లు కావలెను. భో. వ. + జీతం: 16-18 వేలు. ఏజెంట్లకు 5000/- కమీషన్. ✆ 92814 52845, 82475 00574.
రామకృష్ణ ఓల్డేజ్ హోం (TG No-1) Hyd శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులు/ పేషెంట్ల సేవకు ఇంటి/ వంట పని, బేబీకేర్ కొరకు స్త్రీ/పు. వర్కర్లు కావలెను. భో+ వ+ జీతం: 16-18 వేలు. ఏజెంట్ కమీషన్ 5000/-. ✆ 9515119430, 9618802390.
ప్రముఖ SML ISUZU జయలక్ష్మి మోటార్స్ ఏలూరు నందు సర్వీస్ ఎడ్వైజర్స్, మెకానిక్స్, సిస్టమ్ ఆపరేటర్స్, ఎలక్ట్రీషియన్స్ కావలెను. ✆ 94405 80868.
శివకార్తికేయ హోంకేర్ నందు వృద్ధులను/ పేషంట్స్/ పిల్లలను చూసుకొనుటకు ఇంటి/ వంట పనిచేయుటకు వర్కర్స్/ నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 20K. ✆ 99120 11499, 99120 11899.

SECURITY GUARDS
పశ్చిమ గోదావరి జిల్లాలోని భీమవరం, తణుకులలో సెక్యూరిటీ గార్డులు కావలెను. 8 గం॥ డ్యూటీ, వీక్లీ ఆఫ్, జీతం: 15,000/- PF + ESI. Ex. సర్వీస్ జీతం: 20,000/-, PF + ESI. ✆ 95818 58667.

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతి స్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు, ప్రకటనల్నద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలు చేసే ప్రకటన కర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ప్రకటన చిన్నదైనా స్పందన అతివేగం

నెక్ సూచించిన కోడిగ్రుడ్ల ధర
★ For the Information of Trade & Industry
★ గోదావరి జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గ్రుడ్డు ధర రూ. 5.70 పైౖ
తణుకు ఆఫీసు: 08819-224254

భీమవరం

• భీమవరం • ఉండి

5న జాతీయ లోక్ అదాలత్

మాట్లాడుతున్న న్యాయమూర్తి లక్ష్మీనారాయణ

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ఈ నెల 5న జరిగే జాతీయ లోక్ అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవాలని భీమవరం మూడో అదనపు జిల్లా జడ్జి, న్యాయ సేవా సంస్థ ఛైర్మన్, పోక్సో కోర్టు ప్రత్యేక న్యాయమూర్తి డాక్టర్ బి.లక్ష్మీనారాయణ సూచించారు. లోక్‌అదాలత్‌లో రాజీ పడితే కక్షిదారులు ఇద్దరూ గెలిచినట్లే అవుతుందన్నారు. సివిల్, క్రిమినల్, చెక్కు బౌన్సు, వాహన ప్రమాద బీమా, మనోవర్తి, గృహహింస తదితర కేసులు రాజీ చేసుకోవచ్చని చెప్పారు. సామరస్య పూర్వక వాతావరణంలో కేసులు రాజీ చేసుకుని కాలాన్ని, డబ్బును ఆదా చేసుకోవాలన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల అందజేత

మహిళకు చెక్కు అందజేస్తున్న భరత్‌వర్మ

పెదఅమిరం (కాళ్ల), న్యూస్‌టుడే: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి మెరుగైన వైద్యం నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి వచ్చిన ఆర్థిక సాయం చెక్కులను ఉపసభాపతి, ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు తనయుడు భరత్‌వర్మ అందించారు. ఎమ్మెల్యే కార్యాలయంలో 32 మందికి రూ.17,47,756 ఇచ్చారు. సర్పంచి డి.సోమేశ్వరరావు, కూటమి ప్రతినిధులు పాల్గొన్నారు.

వీరపేరంటాలమ్మ హుండీల ఆదాయం రూ.7.06 లక్షలు

లెక్కిస్తున్న దేవాదాయ శాఖ అధికారులు, గ్రామ ప్రముఖులు

వెలివర్రు(ఉండి), న్యూస్‌టుడే: వీరపేరంటాలమ్మ హుండీలను దేవాదాయ శాఖ అధికారులు బుధవారం తెరిచారు. భీమవరం దేవాదాయ శాఖ తనిఖీదారు వెంకటేశ్వరరావు సమక్షంలో ఆలయ కార్యనిర్వహణాధికారి తోట శ్రీనివాసరావు, ట్రస్టు బోర్డు ఛైర్మన్ గాదిరాజు వెంకట్రాజులు హుండీలను తెరిచారు. పద్మావతి వేంకటేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి సత్యనారాయణరాజు, యనమదుర్రు శక్తీశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి డీవీ కృష్ణంరాజు, ఎన్నార్పీ అగ్రహారంలోని విశ్వేశ్వరస్వామి ఆలయ కార్యనిర్వహణాధికారి ఎంవీ రామాంజనేయులు, ట్రస్టు బోర్డు మాజీ ఛైర్మన్లు ముదునూరి వీర్రాజు, మంతెన రంగరాజు ఆదాయాన్ని లెక్కించారు. ఉగాది జాతర మహోత్సవాలతో పాటు 5 నెలల 20 రోజులకు రూ.7,06,798 ఆదాయం వచ్చిందని ఆలయ కార్యనిర్వహణాధికారి తోట శ్రీనివాసరావు తెలిపారు.

పెట్టారు.. పక్కనెట్టారు

వర్షపు నీటిలో ట్రాఫిక్ పార్కు

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే ప్రయాణ సమయాల్లో ఎలా వెళ్లాలి.. కాలిబాట, రహదారుల వివరాలు తెలిపే గుర్తులను సులువుగా తెలిపేందుకు భీమవరంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలో ట్రాఫిక్ పార్కును ఏర్పాటు చేశారు. ఇందుకు రూ.10 లక్షలు ఖర్చు చేశారు. పార్కు స్థలంలో రోడ్లు, బస్సులు రూట్ తెలిపే, పాఠశాల ప్రాంతం, ట్రాఫిక్ రద్దీ సమయంలో వేచి ఉండటం తెలిపేలా బోర్డులు ఉంచారు. వేలాది కుటుంబాలతో అధునాతన భవనాల్లో ఉంటున్న చిన్నారులు, యువత, మహిళలకు గతంలో సేవలందించిన ఈ పార్కు ఇప్పుడు మురుగుతో నిండిపోయింది. పాఠశాలల్లోని విద్యార్థులను ఇక్కడికి తీసుకొచ్చి ఒక్కసారి కూడా అవగాహన కల్పించలేదు.

నీటిలో వ్యాయామ పరికరాలు

పార్కు పరిసరాల్లో నిలిచిన మురుగు

రూ.లక్షల ఖర్చు

2005-06లో రూ.7 లక్షలతో పార్కు చుట్టూ రక్షణ గోడ నిర్మించారు. వెనుక స్థలాన్ని మాత్రం మెరక చేయలేదు. దీంతో ఆకాశన్నంటే భవంతుల మధ్య ఇదొక తటాకంలా కనిపిస్తుంది. వర్షాలకు మోకాలిలోతు నీరు చేరుతుంది. ఇందులోనే చిన్నారులు ఆడుకునేందుకు రూ.2.50 లక్షలతో క్రీడా పరికరాలు ఏర్పాటు చేశారు. రూ.4 లక్షల విలువైన వ్యాయామ పరికరాలు బిగించారు. మురుగును దాటుకుని అక్కడికి వెళ్లే సాహసం చేసేవారు లేక అవి తుప్పు పట్టాయి. కాలనీలోని పలు ప్రాంతాల్లో సేకరించిన చెత్తను తీసుకొచ్చి ఇక్కడే పోస్తున్నారు. అధికారులు ముందుకొస్తే తమవంతు భాగస్వామ్యంతో అభివృద్ధికి సహకరిస్తామని హౌసింగ్ బోర్డు కాలనీ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు సరిపిడకల రామారావు, ఉపాధ్యక్షుడు కుక్కల బాల, సంయుక్త కార్యదర్శి ఎం.రామ్‌ప్రసాద్ తెలిపారు. పార్కు స్థలం మెరక చేసి పరికరాలను వినియోగంలోకి తెస్తామని పుర కమిషనర్ కె.రామచంద్రారెడ్డి చెప్పారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

10 AM to 1 PM

భీమవరం పట్టణం	:80085 74471	వీరవాసరం	:80085 74475
భీమవరం మండలం	:80085 74533	ఉండి	:80085 74526
ఆకివీడు	:80085 74525	పాలకోడేరు	:80085 74467
కాళ్ల	: 80085 74474		

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: ? రెండో పట్టణంలోని పెద్దాడవారి వీధిలో రాత్రివేళల్లో వీధి దీపాలు వెలగడం లేదు. వరుసగా రెండు చోట్ల వెలగకపోవడంతో చీకట్లో ప్రయాణానికి ఇబ్బందిగా ఉంది. **- స్థానికులు**

? డాక్టర్ బీవీరాజు మార్గంలో కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. కొన్ని స్తంభాలకు బల్బులు లేవు. **- డి.నరేంద్ర, ప్రైవేటు ఉద్యోగి**

✔ వర్షాలకు బల్బులు మరమ్మతులకు గురవుతున్నాయి. వెంటనే కొత్తవి ఏర్పాటు చేయిస్తాం **- వై.శ్రీను, పురపాలక డీఈ**

? జువ్వలపాలెం రోడ్డు నుంచి ఆనంద బ్లడ్ బ్యాంకు రోడ్డులో డ్రెయిన్లలో పూడిక తీయడం లేదు. సిబ్బంది వచ్చినా అరుగులపై కొద్దిసేపు కూర్చొని వెళ్లిపోతున్నారు. డ్రెయిన్లలోని మురుగు వెళ్లడం లేదు. **- స్థానికులు**

✔ పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షించాలని సంబంధిత ప్రాంత శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు చెప్పాం. మస్తరు అనంతరం క్షేత్రస్థాయిలో పనులను ఆకస్మికంగా పరిశీలిస్తాను. సమస్య ఉన్న ప్రాంతంలో వెంటనే శుభ్రం చేయిస్తాను. **- కె.రామచంద్రారెడ్డి, పురపాలక కమిషనర్**

ఉండి, న్యూస్‌టుడే: ? వర్షం కురిస్తే ఉండిలోని వివిధ ప్రాంతాల్లో రహదారులపై మురుగు నిలవడంతో ఇబ్బందులు పడుతున్నాం. కచ్చా డ్రెయిన్లు తవ్వించి సమస్యను పరిష్కరించాలని అధికారులను వేడుకుంటున్నాం. **- నాగలక్ష్మి, కొండ్రోతుపేట**

✔ గతంలో చర్యలు తీసుకున్నాం. మరోసారి పరిశీలించి అవసరమైన పనులు చేపడతాం. **- అనిల్‌కుమార్, పంచాయతీ కార్యదర్శి**

కూటమి పాలనలోనే అభివృద్ధి

మహిళకు కరపత్రం అందిస్తున్న సీతారామలక్ష్మి

భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: కూటమి పాలనలో రాష్ట్రం అభివృద్ధి పథంలో సాగుతోందని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి తోట సీతారామలక్ష్మి అన్నారు. భీమవరం పట్టణం చినరంగనిపాలెంలో బుధవారం జరిగిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎన్నికల హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుండటంతో ప్రజలు సంతోషంగా ఉన్నారని పేర్కొన్నారు. నియోజకవర్గ పరిశీలకుడు దాసరి శ్యామ్‌చంద్రశేషు, రాష్ట్ర కోశాధికారి మెంటే పార్థసారథి, పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మద్దల రాము, చెల్లబోయిన గోవింద్, మెరగాని నారాయణమ్మ పాల్గొన్నారు.

నేలపోగుల (వీరవాసరం), న్యూస్‌టుడే: ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం సూపర్-6 పథకాలను అమలు చేస్తోందని ఎంపీపీ వీరవల్లి దుర్గాభవాని అన్నారు. మండల తెదేపా అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నేలపోగుల నుంచి ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమంతో ముందుకు నడిపిస్తున్నారన్నారు. పార్టీ మండల కార్యదర్శి వీరవల్లి శ్రీనివాసరావు, నీటి సంఘం అధ్యక్షుడు మళ్ల శ్రీమ్మూర్తి, ఎంపీటీసీ సభ్యుడు కడలి నెహ్రూ పాల్గొన్నారు.

ఉండి, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రంలో సుపరిపాలన సాధ్యపడుతోందని ఎమ్మెల్యే రఘు రామకృష్ణరాజు తనయుడు భరత్ అన్నారు. ఉండిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమ కరపత్రాలను ఆయన బుధవారం విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను, రఘురామకృష్ణరాజు నియోజకవర్గంలో దాతల సహకారంతో చేపట్టిన అభివృద్ధి పనులను వివరించారు. పట్టణ తెదేపా అధ్యక్షుడు కాగిత బుజ్జి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తెదేపా మండల అధ్యక్షుడు కమెరెడ్డి నాగరాజు, ఎతెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి యశోద కృష్ణయ్య, ఎంపీటీసీ సభ్యురాలు కునుకు రమాదేవి, నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడు మంతెన సాయి లచ్చిరాజు, కన్నెగంటి రూత్‌కళ పాల్గొన్నారు.

కాళ్ల, న్యూస్‌టుడే: కాళ్లలో 'సుపరిపాలనలో తొలి అడుగు - ఇంటింటికి తెలుగుదేశం' కార్యక్రమం కరపత్రాన్ని ఉప సభాపతి రఘురామ తనయుడు భరత్‌వర్మ ఆవిష్కరించారు. అనంతరం తెదేపా ఉండి నియోజకవర్గ పరిశీలకుడు కొత్త నాగేంద్రకుమార్‌తో కలిసి ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ హామీలు, అమలు చేసిన పథకాలపై ప్రజల మనోభావాలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎంపీపీ ఆరేటి వెంకటరత్నప్రసాద్, జడ్పీటీసీ సభ్యుడు పి.సోమేశ్వరరావు, గ్రామాధ్యక్షుడు పి.నాగేశ్వరరావు, సీనియర్ నాయకుడు పెన్మెత్స విశ్వనాథరాజు తదితరులు పాల్గొన్నారు.

నేలపోగులలో పాల్గొన్న తెదేపా నాయకులు

చెప్పకుండా తనిఖీలకు వస్తా: డీపీవో

సిబ్బందితో మాట్లాడుతున్న రామ్‌నాథ్‌రెడ్డి

వీరవాసరం, న్యూస్‌టుడే: పంచాయతీలు, సచివాలయాల్లో సిబ్బంది ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని జిల్లా పంచాయతీ అధికారి ఎన్.రామ్‌నాథ్‌రెడ్డి సూచించారు. వీరవాసరం పంచాయతీలో సచివాలయం, పంచాయతీ సిబ్బందితో మాట్లాడారు. గ్రామంలో పారిశుద్ధ్య నిర్వహణ పనులు, తాగునీటి సరఫరాపై ఆరా తీశారు. వీరవాసరం మండలం ఇంటి పన్నుల వసూళ్లలో వెనుకబడి ఉండటంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించాలని చెప్పారు. ఇంటి పన్నుల చెల్లింపు యజమాని ఆధార్‌ను అనుసంధానించే ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా పారిశుద్ధ్య నిర్వహణపై ప్రతి రోజూ చెప్పకుండా తనిఖీలకు వస్తానని, సరిగా లేకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉదయం దిగమర్రు, పూలపల్లి, లంకలకోడేరు, చిక్కాల తదితర గ్రామాల్లో పర్యటించి పారిశుద్ధ్య పనులపై ఆరా తీసినట్లు పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీడీవో బీవీ.అప్పారావు, పంచాయతీ విస్తరణ అధికారి ఫణికుమార్, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

సారెతో వనితా క్లబ్ ప్రతినిధుల ఊరేగింపు

వాసవీమాతకు సారె సమర్పణ

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే: ఆషాఢ మాసం సందర్భంగా వాసవీమాతకు వాసవీ వనితా క్లబ్ ఆధ్వర్యంలో ఆడపడుచు సారె బుధవారం సమర్పించారు. గునుపూడి నాయకులకాలనీలో ఉన్న కనకదుర్గమ్మ ఆలయం నుంచి కిరాణా మర్చంట్స్ భవనంలోని వాసవీ మాత మందిరం వరకు మహిళలు ఊరేగింపుగా తీసుకొచ్చారు. అతిథులుగా క్లబ్ గవర్నర్ ప్రసాద్ దంపతులు పాల్గొని పసుపు, కుంకుమ, చీర, గాజులు, 108 రకాల మిఠాయిలు, 11 రకాల పండ్లు, 9 రకాల పువ్వులు అందించారు. సుమారు 130 మంది మహిళలకు పసుపు, కుంకుమ, జాకెట్ ముక్క, ప్రసాదం పంపిణీ చేసినట్లు క్లబ్ అధ్యక్షురాలు మునగ శాంతిలక్ష్మి, కార్యదర్శి కె.కోటేశ్వరి, కోశాధికారి ఎం.వెంకటలక్ష్మి తెలిపారు. కిరాణా మర్చంట్స్ అధ్యక్షుడు అయిత కృష్ణారావు, కార్యదర్శి అద్దంకి శివ పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

ఉండి, న్యూస్‌టుడే: ఈ నెల 9న జరగనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ధనికొండ శ్రీనివాస్ కోరారు. ఉండిలో బుధవారం ఆయన మాట్లాడారు. లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని, కార్మిక చట్టాలను పునరుద్ధరించాలని, సమాన పనికి సమాన వేతనం అందించాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, అంగన్‌వాడీలు, ఆశా కార్యకర్తలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కాంట్రాక్టు, ఒప్పంద ఉద్యోగుల విధానాన్ని రద్దు చేయాలని, శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగాలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో సమ్మె చేపడుతున్నామన్నారు.

కుట్టు శిక్షణతో ఉపాధి అవకాశాలు

కాళ్ల, న్యూస్‌టుడే: ఉచిత కుట్టు శిక్షణతో మహిళలు ఉపాధి అవకాశాలు పొందవచ్చని ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు తనయుడు భరత్‌వర్మ అన్నారు. బుధవారం కాళ్ల బాలుర వసతి గృహ ప్రాంగణంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్, ఈడబ్ల్యూఎస్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. మండలంలో 144 మందికి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈఓపీఆర్డీ బాస్కరరావు, తహసీల్దార్ సుందర్‌సింగ్, సర్పంచి బందా విజయ పాల్గొన్నారు.

ఉండి, న్యూస్‌టుడే: ఉండిలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు, కూటమి నాయకులతో కలిసి బుధవారం కనుమూరు భరత్ ప్రారంభించారు. ఎంపీడీవో ఎంవీఎస్ఎస్ శ్రీనివాస్, తెదేపా మండల అధ్యక్ష, కార్యదర్శులు కరిమెరక నాగరాజు, కిన్నెర వెంకన్న, మాజీ సర్పంచి ముదునూరి విజయ కృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ముంపు రాక ముందే మేల్కోండి!

మేజర్ కాలువల్లో భారీగా మేటవేసిన వ్యర్థాలు

వెంకయ్యవయ్యేరులో భారీగా గుర్రపు డెక్క

ఆకివీడు, న్యూస్‌టుడే: మండలంలోని మేజర్ కాలువలైన వెంకయ్యవయ్యేరు, పాతవయ్యేరు సాగునీటి కాలువలతో పాటు చినకాపవరం డ్రెయిన్ తదితర మురుగు కాలువల్లో తూడు, గుర్రపుడెక్క నీటి ప్రవాహానికి ఆటంకంగా మారాయి. కాలువల పొడవునా వంతెనలు తాకుతూ గుర్రపుడెక్క పేరుకుపోయి ఉంది. ఇటీవల కురుస్తున్న వర్షాలకు కాలువల్లో నీటిమట్టం పెరుగుతోంది. ఈ వ్యర్థాలతో నీరు వేగంగా దిగువకు ప్రవహించడం లేదు. భారీ వర్షాలు కురిస్తే ముంపు సమస్య తలెత్తే పరిస్థితి వస్తుందని ప్రజలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కాలువల్లోని గుర్రపుడెక్క, తూడు తొలగించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు. నీటిపారుదల శాఖ డీఈ పీఎన్‌వీ సత్యనారాయణమూర్తిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా.. గుర్రపు డెక్క తొలగింపు పనులు చేయించేలా చర్యలు తీసుకుంటామన్నారు.

అధ్వాన దారి... మరింత దిగబడి

వాండ్రం - కోపల్లె మధ్య కుంగిన ఆర్‌అండ్‌బీ రహదారి

ఉండి, న్యూస్‌టుడే: ఉండి నుంచి కోపల్లె వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి అధ్వానంగా తయారైంది. వాండ్రం - కోపల్లె ప్రాంతాల మధ్య వివిధ చోట్ల రహదారి అంచులు బొండాడ మేజర్ డ్రెయిన్‌లోకి దిగబడి పోతున్నాయి. ఏ మాత్రం ఆదమరిచినా పక్కనున్న డ్రెయిన్‌లోకి దూసుకెళ్లే ప్రమాదం ఉందని వాహన చోదకులు వాపోతున్నారు. ఈ మార్గంలో ఆక్వా హేచరీలు, ఐస్ ఫ్యాక్టరీలు, మేత గోదాములు ఉన్నాయి. వాటి ఉత్పత్తులను తరలించేందుకు భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దీంతో అంతంత మాత్రంగా ఉన్న రహదారి మరింత దిగబడిపోతోందని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. ఆర్‌అండ్‌బీ ఏఈ శ్రీహరిరాజు 'న్యూస్‌టుడే'తో మాట్లాడుతూ రహదారి దిగబడిపోతున్న చోట్ల డ్రెయిన్ వెంబడి రక్షణ గోడలు నిర్మించాలనే ప్రతిపాదన ఉందని, మరమ్మతులకు చర్యలు తీసుకుంటున్నామన్నారు.

జాగ్రత్త.. ఇచ్చట ప్రమాదం ఉంది

భీమవరంలో చిన్న వంతెన పక్కన షట్టరు కల్వర్టును కొన్నేళ్ల కిందట తవ్వి వదిలేశారు. పట్టణంలోని మురుగును యనమదుర్రు కాలువలోకి తరలించే ఈ షట్టరు గోడలు నిర్మాణానికి రూ.1.50 లక్షలతో ప్రతిపాదనలు చేసినట్లు గతంలో అధికారులు చెప్పారు. అప్పట్నుంచి ఇటువైపు కన్నెత్తి చూడలేదు. భీమవరం గ్రామీణ, మొగల్తూరు, నరసాపురం మండలాల నుంచి పట్టణంలోకి ఈ మార్గంలోనే వాహనాలు వస్తాయి. కార్లు, ద్విచక్ర వాహన చోదకులు అందులో పడిపోతున్నా ఎవరికీ పట్టడం లేదు. **- న్యూస్‌టుడే, భీమవరం పట్టణం**

రహదారికి మరమ్మతులు

ఈనాడు కథనానికి స్పందన

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు-ఉండి 165 నంబరు జాతీయ రహదారిలో అజ్జమూరు శివారు చెక్‌పోస్ట్ సమీపంలో రెండు చోట్ల రహదారి బీటలు వారి కుంగిపోయింది. వాహన చోదకులు, ప్రయాణికులు భయాందోళన చెందుతున్న తీరుపై గత నెల 30న 'ఈనాడు'లో 'బూడిద పోస్తే నిలుస్తుందా..?' శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. బుధవారం కుంగిపోయిన ప్రాంతంలో రాళ్లు, మెటల్ కంకరతో తాత్కాలిక మరమ్మతులు చేయించారు. 'వాహనాలు ప్రమాదాలకు గురికాకుండా మరమ్మతులు చేయించామని, 200 నుంచి 800 మీటర్ల మేర రక్షణ గోడ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపామని ఉన్నతాధికారులు సూచనలతో పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయిస్తామని ఎన్‌హెచ్ డీఈ శ్రీనివాస్ అన్నారు.

లేబర్ కోడ్‌లతో కార్మికులపై దాడి

సమావేశంలో మాట్లాడుతున్న నాగేశ్వరరావు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: దేశంలో అధిక ధరలు, పరిశ్రమల మూసివేత, ప్రమాదాలతో ఉత్పత్తి రంగాలు కుదేలవుతున్నా కేంద్ర ప్రభుత్వం లేబర్ కోడ్‌ల పేరుతో ఉద్యోగ, కార్మికులపై దాడి చేస్తూనే ఉందని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ.నాగేశ్వరరావు ఆరోపించారు. పట్టణంలోని యూటీఎఫ్ హాలులో జరిగిన సీఐటీయూ జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వాలు కార్మికులను ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్, ఫిక్స్ ఉద్యోగులుగా విభజించి హక్కులు దక్కకుండా అడ్డుపడుతున్నారని విమర్శించారు. లేబర్ కోడ్‌ల రద్దు కోరుతూ దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలు ఈ నెల 9న నిర్వహించే సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. ఇటీవల రాష్ట్రంతో పాటు దేశవ్యాప్తంగా పలు చోట్ల పరిశ్రమల్లో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నా వాటి యాజమాన్యాలపై చర్యలు తీసుకోవడం లేదని, ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టడం లేదన్నారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్ మాట్లాడుతూ దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయడం కోసం ఈ నెల 6, 7 తేదీల్లో జిల్లావ్యాప్తంగా ద్విచక్ర వాహనాలతో ప్రదర్శన చేయనున్నట్లు తెలిపారు. జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ.గోపాలన్, బి.వాసుదేవరావు, పీవీ.ప్రతాప్, ఎన్.వెంకటేశ్వరరావు, ఎస్.రంగారావు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలతో రైతులకు అన్యాయం

మాట్లాడుతున్న హరేరాం

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామంటూ అధికారంలోకి వచ్చిన భాజపా ప్రభుత్వం రైతులను మోసగించిందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం విమర్శించారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో సంఘ నాయకుడు తాళ్లూరి హరిహర లక్ష్మణ్ అధ్యక్షతన ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగా ఆక్వా, కోకో, మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారని వాపోయారు. రబీ ధాన్యం బకాయిలు జమ చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. రాష్ట్ర రైతులకు వెంటనే పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పెట్టుబడి సాయాన్ని జమ చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతు, వ్యవసాయ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 9 చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెలో రైతు సోదరులంతా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. నాయకులు రుత్తుల శ్రీరామచంద్రుడు, కిలారి తవిటినాయుడు, చల్లబోయిన వెంకటేశ్వరరావు, చిర్ల పుల్లారెడ్డి, కొప్పిశెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదం

ఆకివీడు, న్యూస్‌టుడే: ఆకివీడు 7వ వార్డు పరిధిలోని ఆనాల చెరువు వద్ద ఉన్న వాటర్ ప్లాంట్‌లో బుధవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగింది. స్థానికుల సమాచారం మేరకు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలు అదుపు చేశారు. ప్లాంట్‌లోని సామగ్రి కొంత కాలిపోయిందని తెలిపారు. కొన్నేళ్లుగా ప్లాంట్ నిరుపయోగంగా ఉంది. ఆకతాయిలు ఇక్కడ మద్యం సేవిస్తుంటారని, వారు చేసిన అల్లరి పనిగా అంతా భావిస్తున్నారు.

పోలీసుల అదుపులో దొంగ?

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: చరవాణులు అపహరిస్తున్న దొంగను రెండో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది. గతంలో అతనిపై ఇంకా ఏమైనా కేసులు ఉన్నాయా, ఎక్కడెక్కడ దొంగతనాలు చేశాడు తదితర వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

కారు ఆపి నగదు అపహరణ?

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పట్టణ శివారులోని ఓ ప్రాంతంలో కారును ఆపి డ్రైవర్ నుంచి రూ.5 వేలు నగదు లాక్కెళ్లిన ఘటన బుధవారం సాయంత్రం జరిగినట్లు తెలుస్తోంది. ఆరుగురు ముఠాగా వచ్చారని, నగదు తీసుకున్నాక బాధితుడి మెడలోని బంగారు గొలుసు లాక్కెళ్లే యత్నం చేశారు. కారుకు పోలీస్ వాహన సైరన్ ఉండటంతో అది మోగడంతో వాళ్లంతా పారిపోయారని స్థానికులు చెబుతున్నారు. కారు పట్టణానికి చెందిన ఓ ప్రముఖుడిది అన్నారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి సీసీ కెమెరా ఫుటేజీ పరిశీలిస్తున్నట్లు సమాచారం.

ఆక్వా జోన్‌లో బీడు భూములు చేర్చండి

ఉండి, న్యూస్‌టుడే: ఆక్వా జోన్‌లోకి బీడు, సాగుకు పనికిరాని భూముల సర్వే నంబర్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని మత్స్య శాఖాధికారి వివేక్ తెలిపారు. గ్రామ పంచాయతీలో సర్పంచి సౌజన్య అధ్యక్షతన బుధవారం జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఇప్పటికే తవ్విన కొన్ని చెరువుల సర్వే నంబర్లు ఆక్వా జోన్ పరిధిలోకి రాలేదన్నారు. వ్యవసాయానికి అనుకూలంగా లేని ఆక్వా చెరువులు తవ్వేందుకు వీలుగా ఉన్న భూముల సర్వే నంబర్లను జోన్‌లో చేర్చేందుకు రైతుల నుంచి అభ్యంతరాలు సేకరిస్తున్నామన్నారు. గ్రామ కార్యదర్శి అనిల్‌కుమార్, గ్రామ మత్స్య సహాయకుడు రాజేశ్, వీఏఏ ఆల్ఫ్రెడ్, రైతులు పాల్గొన్నారు.

కనీస వేతన చట్టం అమలు చేయాలి

నినాదాలు చేస్తున్న హమాలీలు

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: కార్మికుల హక్కులను ఐక్య పోరాటాల ద్వారా కాపాడుకోవాలని సీఐటీయు జిల్లా ఉపాధ్యక్షుడు బి.వాసుదేవరావు కోరారు. పట్టణంలోని హమాలీ కార్మికుల సమావేశాన్ని స్థానిక తటవర్తి భాస్కరరావు దుకాణం వద్ద బుధవారం నిర్వహించారు. ఈ నెల 9న దేశవ్యాప్తంగా జరిగే సార్వత్రిక సమ్మెలో కార్మికులు పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పెరుగుతున్న ధరలు అరికట్టాలని, కనీస వేతన చట్టం సవరించి అమలు చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు పి.సత్యనారాయణ, రమేష్, అప్పారావు, శ్రీను, సాంబ పాల్గొన్నారు.

క్విట్ ఇండియా స్తూపం వద్ద అల్లూరి చిత్రపటానికి నివాళులు

అల్లూరి పోరాటం స్ఫూర్తిదాయకం

భీమవరం గునుపూడి, న్యూస్‌టుడే: అల్లూరి సీతారామరాజు యువజన సంఘాల జిల్లా సమాఖ్య, శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో అల్లూరి సీతారామరాజు జయంతోత్సవాలు క్విట్ ఇండియా స్తూపం వద్ద బుధవారం ప్రారంభించారు. స్తూపం వద్ద అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దేశం కోసం అల్లూరి చేసిన పోరాటాన్ని నేటితరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. సమాఖ్య అధ్యక్షుడు కె.వెంకట్రాజు, వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి పాల్గొన్నారు.

4న జయంతి: భీమవరం అర్బన్, న్యూస్‌టుడే: ఈ నెల 4న జరిగే మన్యం వీరుడు అల్లూరి జయంతిని విజయవంతం చేయాలని అల్లూరి యువజన సంఘాల సమాఖ్య జిల్లా అధ్యక్షుడు కంతేటి వెంకట్రాజు కోరారు.

కౌలురైతులకు కార్డులు అందజేత

భీమవరం గ్రామీణ, న్యూస్‌టుడే: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాయలం, చినఅమిరం గ్రామాల్లో బుధవారం గ్రామసభలు నిర్వహించారు. కౌలురైతులకు కార్డులు అందజేశారు. అన్నదాత సుఖీభవ పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. మండల వ్యవసాయాధికారి ప్రసాద్, నీటి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

నరసాపురం, న్యూస్‌టుడే: గురుపౌర్ణమి సందర్భంగా నరసాపురం నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశామని డీఎం సత్తి సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈ నెల 8న నరసాపురంలో బయలుదేరి శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం మీదుగా 10న అరుణాచలం చేరుకుంటుందన్నారు. వివరాలకు 73829 08122, 99592 25486 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

తప్పుల తడక.. వసూళ్లు పడక

పన్నులు చెల్లించేందుకు క్యూలైన్‌లో జనం

ఆకివీడు, న్యూస్‌టుడే: మేజర్ పంచాయతీగా ఉన్న ఆకివీడుకు 2020 జనవరి 28 నుంచి నగర పంచాయతీ హోదా వచ్చింది. అనంతరం వార్డుల విభజన పూర్తిచేసి 2021 నవంబరు 15న పాలకవర్గ ఎన్నికలు నిర్వహించారు. నగర పంచాయతీ కాగానే ఇంటి, కుళాయి పనులు పెంచేశారు. మున్సిపాల్టీ నిబంధనల మేరకు ప్రతి ఆరు నెలలకు పన్నులు చెల్లించే నిబంధన అమలులోకి తెచ్చారు. దీంతో అభివృద్ధి, వసతులు పెరుగుతాయని ప్రజలు భావించారు. కానీ దానికి భిన్నంగా ప్రగతి సంగతి దేవుడెరుగు అనేక ఇంటి, కుళాయి పనుల రసీదుల్లో పేరు మినహా ఇంటి డోర్ నంబర్లు, చిరునామాలు తప్పుల తడకగా ఉన్నాయి. ఒకే పేరు మీద రెండు సార్లు నమోదు కావడం (డబుల్ ఎంట్రీలు) ఉన్నాయి. పన్ను రసీదులు సరిగా లేకపోవడంతో బ్యాంకు రుణాలు తీసుకోవడానికి తదితర వాటికి ఇబ్బందులు ఎదురవుతున్నాయని, వాటిని సరిచేయాలని గడిచిన నాలుగేళ్లుగా అధికారులు, కార్యాలయాల చుట్టూ ఇళ్ల యజమానులు తిరుగుతున్నారు. మరో వైపు పన్నుల వసూలు పడకేశాయి. ఈ విషయాన్ని కమిషనర్ కృష్ణమోహన్ దృష్టికి 'న్యూస్‌టుడే' తీసుకెళ్లగా డబుల్ ఎంట్రీలను సరిచేస్తున్నామని, డోర్ నంబరు, చిరునామాలు మార్పులు చేస్తున్నట్లు చెప్పారు. త్వరలో నూరుశాతం కుళాయిలను ఆన్‌లైన్ చేయిస్తామని చెప్పారు.

కొత్త వాహనాలొచ్చాయ్

భీమవరం పట్టణం, న్యూస్‌టుడే: భీమవరం పురపాలక సంఘంలో చెత్త తరలించడానికి ఏడు కొత్త వాహనాలను కొనుగోలు చేశారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 55 లక్షలతో 5 ట్రాక్టర్లు, రెండు ట్రక్కులు కొన్నట్లు డీఈ రహీం తెలిపారు.

భీమవరం సినిమాలు

భీమవరం సాంస్కృతికం, న్యూస్‌టుడే

శ్రీపద్మాలయ స్క్రీన్ 1	కన్నప్ప
శ్రీపద్మాలయ స్క్రీన్ 2	కుబేర
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 1	కన్నప్ప
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 2	మార్గన్
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 3	కుబేర
ఏవీజీ సినిమాస్ స్క్రీన్ 4	ఎఫ్1 ది మూవీ (తెలుగు)
విజయలక్ష్మి స్క్రీన్	మార్గన్

(c) eenadu

నరసాపురం

• నరసాపురం • పాలకొల్లు • ఆచంట

శాకంబరి రూపంలో వారాహి మాత

పెనుమంట్ర, న్యూస్‌టుడే: మల్లిపూడి గ్రామంలో శ్రీ వారాహి మాత నవ రాత్రి మహోత్సవాల్లో భాగంగా ఏడో రోజైన బుధవారం అమ్మవారిని శాకంబరి రూపంలో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అర్చకుడు వారణాశి రామలింగశాస్త్రి ఆధ్వర్యంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, సహస్రనామార్చనలు చేశారు. ఈ నెల 5న అమ్మవారి గ్రామోత్సవం జరుగుతుందని నిర్వాహకుడు గుడిమెట్ల సాయిబాబా రెడ్డి తెలిపారు.

అరుణాచలానికి ప్రత్యేక బస్సు సర్వీసు

నరసాపురం, న్యూస్‌టుడే: గురుపౌర్ణమి సందర్భంగా నరసాపురం నుంచి అరుణాచలానికి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేశామని డీఎం సత్తి సుబ్బన్నరెడ్డి తెలిపారు. ఈ నెల 8న నరసాపురంలో బయలుదేరి శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురం మీదుగా 10న అరుణాచలం చేరుకుంటుందన్నారు. వివరాలకు 73829 08122, 99592 25486 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

డేటా సైన్స్ ల్యాబ్ ప్రారంభం

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని వైఎన్ కళాశాలలో ఓఎన్‌జీసీ సమకూర్చిన రూ.10 లక్షలతో ఏర్పాటు చేసిన డేటా సైన్స్ ల్యాబ్‌ను బుధవారం బొమ్మిడి నాయకర్, ఓఎన్‌జీసీ జీఎం స్నేహాల్ రాహుల్కుండే, పాలకవర్గ ఉపాధ్యక్షుడు చినిమిల్లి సత్యనారాయణరావు తదితరులు ప్రారంభించారు.

హుండీ ఆదాయం రూ. 5.76 లక్షలు

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండలోని నగరేశ్వర, మహిషాసుర మర్దని, వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించినట్లు ఈవో గుబ్బల రామ పెద్దింట్లరావు తెలిపారు. 100 రోజులకు 5,76,505 ఆదాయం సమకూరినట్లు పేర్కొన్నారు. అన్నదాన హుండీ ద్వారా మరో రూ. 25,626 ఆదాయం వచ్చిందన్నారు. దేవాదాయ శాఖ తనిఖీదారు జి.ప్రసాద్ పర్యవేక్షణలో భక్తులు, గ్రామస్థులు, బ్యాంకు సిబ్బంది లెక్కింపులో పాల్గొన్నట్లు పేర్కొన్నారు.

చినుకుపడితే.. అడుగేయలేం!

దారుణంగా పుంత మార్గాలు

వరిధనం- దిగమర్రు మార్గం దుస్థితి..

పాలకొల్లు సాంస్కృతికం, గ్రామీణ, నరసాపురం గ్రామీణ, పెనుగొండ న్యూస్‌టుడే: తమది రైతు ప్రభుత్వమంటూ గొప్పలు చెప్పుకొన్న నాటి వైకాపా సర్కారు.. సాగుదారుల రాకపోకలకు అవసరమయ్యే పుంత మార్గాల నిర్వహణ, అభివృద్ధిని గాలికొదిలేసింది. పలు సందర్భాల్లో వీటిని అభివృద్ధి చేస్తామంటూ ఆ పార్టీ నేతలు హామీలు గుప్పించినా అవి అమలుకు నోచుకోలేదు. చిన్నపాటి వర్షం కురిసినా పుంత దారులు బురద కయ్యల్లా మారి అడుగుతీసి అడుగేయలేని స్థితికి చేరాయి. దీంతో ఎరువులు, యంత్రాల తరలింపు, పంట ఉత్పత్తులను బయటకు తెచ్చేందుకు రైతులు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. అధికశాతం ప్రాంతాల్లో ఈ మార్గాలు దయనీయంగా మారడంతో ప్రస్తుత ఖరీఫ్ పనులకు ఇబ్బందులు తప్పడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇదీ పరిస్థితి.. ● పాలకొల్లు నియోజకవర్గంలో 147 కి.మీ పరిధిలో 183 పుంత రహదారులు ఉన్నాయి. గతంలో తెదేపా సర్కారు హయాంలో 16 రహదారులను అభివృద్ధి చేశారు. వైకాపా ప్రభుత్వంలో ఎలాంటి పనులు చేపట్టలేదు.

● నరసాపురం మండలంలోని 28 గ్రామాల్లో 45 పుంత రహదారులు ఉన్నాయి. వీటిలో 18 మినహా మిగిలినవి అభివృద్ధికి నోచుకోలేదు. సీతారాంపురం-రాజుగారితోట, చిట్టవరం- కొత్త నవరసపురం, పెదమామిడిపల్లి- చిట్టవరం తదితర మార్గాలు దుస్థితిలో ఉన్నాయి. ● పెనుగొండ మార్కెట్ యార్డు పరిధిలో 90 పుంత రహదారులు ఉండగా కొన్నింటి అభివృద్ధికి ప్రతిపాదనలు పంపారు. పనులు కార్యరూపం దాల్చలేదు.

పెనుగొండ అడ్డపుంత దారి

అభివృద్ధికి ప్రతిపాదనలు

'అన్ని పుంత మార్గాలను జాతీయ ఉపాధి హామీ పథకంలో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేసి పంపాం. నిధులు మంజూరైన వెంటనే పనులు చేపడతాం.' అని పంచాయతీరాజ్ ఏఈ వైవీఆర్ నాగేశ్వరరావు తెలిపారు.

10 AM to 1 PM
మేమున్నాం..
మీకు తోడుగా..
నరసాపురం:80085 74504
పాలకొల్లు :80085 74510
ఆచంట :91212 29087

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: ? పట్టణంలోని సబ్ కలెక్టర్ బంగ్లా వెనుకవీధిలో చెత్త వేస్తున్నారు. - ఆనందరావు, నరసాపురం

✔ చర్యలు తీసుకుంటాం. - వి.ప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్

? పట్టణ పరిధి చలవ పేటలో రహదారిపై గుంతలు ఏర్పడింది. రాత్రి వేళ వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. -సూరిబాబు

✔ గుంత పూడ్చివేతకు చర్యలు చేపడతాం. - అంజయ్య, కమిషనర్

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: ? [illegible]శ్వరం పరిధి అంబేడ్కర్ కాలనీలో డ్రెయినేజీ పూడిపోయి మురుగు రహదారిపై నిలిచిపోతోంది. - శేఖర్, స్థానికుడు

✔ డ్రెయిన్‌ను శుభ్రం చేయిస్తాం. - రవిశంకర్, పంచాయతీ కార్యదర్శి

పెనుగొండ, న్యూస్‌టుడే: ? పెనుగొండ కెనాల్ రహదారిలోని వీధిదీపాలు వెలగడం లేదు. - ఎం.నాగేశ్వరరావు, స్థానికుడు

✔ మరమ్మతులు చేయించేలా సంబంధిత సిబ్బందికి సూచిస్తాం. - టి.సూర్యనారాయణమూర్తి, ఎంపీడీవో

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: ? డీఎన్నార్ మహిళా కళాశాల సమీపాన వీధి దీపాలు వెలగడం లేదు. -లక్ష్మి, పాలకొల్లు

✔ పరిశీలించి చర్యలు తీసుకుంటాం. - రాజకుమార్, పురపాలక ఏఈ

వ్యర్థాలు, పొదలు తొలగింపు

స్పందనకు స్పందన

పెనుగొండ, న్యూస్‌టుడే: వడలిలోని పడవలరేవు వీధిలో చెత్త పేరుకుపోయిన తీరుపై గత నెల 25న 'ఈనాడు మేమున్నాం.. మీకు తోడుగా'లో ప్రచురితమైన వార్తకు సర్పంచి కాసాని విజయలక్ష్మి, కార్యదర్శి ఎస్.శ్రీనివాసరెడ్డి స్పందించారు. పారిశుద్ధ్య సిబ్బందితో ఆ ప్రాంతాన్ని శుభ్రం చేయించారు.

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: కాపవరంలో విద్యుత్తు పరివర్తకం చుట్టూ పొదులు, మొక్కలు పెరిగిన తీరుపై ఈ నెల 2న ప్రచురితమైన వార్తకు విద్యుత్తు ఏఈ ఎల్.శ్రీనివాసరావు స్పందించారు. సిబ్బందితో పొదలను తొలగించారు.

ఐక్యతతో గ్రామాభివృద్ధి

పెనుగొండ, న్యూస్‌టుడే: పెనుగొండ గ్రామాభివృద్ధికి ఐక్యంగా కృషి చేయాలని సర్పంచి నక్కా శ్యామలాసోని పిలుపునిచ్చారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన గ్రామసభకు ఆమె అధ్యక్షత వహించి మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రగతి నివేదికను వివరించారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు సంబంధించిన తీర్మానాలు ఆమోదించారు. వార్డు సభ్యులు, పంచాయతీ, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను గుర్తించేందుకే వైఎఫ్ఎస్ఐ

మాట్లాడుతున్న ప్రిన్సిపల్ రాజేశ్వరి

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: విద్యార్థులు సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించేందుకు, పరిష్కారానికి వైఎఫ్ఎస్ఐ కార్యక్రమం ఉపయోగపడుతుందని ప్రిన్సిపల్ టి.రాజరాజేశ్వరి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు యూత్ ఫర్ సోషల్ ఇంపాక్ట్ (వైఎఫ్ఎస్ఐ) కార్యక్రమాన్ని స్థానిక ఏఎస్ఎన్ఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించారు. అధ్యాపకుడు టి.కృష్ణ, సభ్యులు కె.భద్రాచలం, బి.వెంకటస్వామి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ ప్రారంభం

ఆచంట, న్యూస్‌టుడే: ఆచంట మండలం వల్లూరులో మహిళలకు కుట్టు శిక్షణ తరగతులను తెదేపా యువ నాయకుడు వెంకట్ సురేశ్ బుధవారం ప్రారంభించారు. మహిళలు స్వశక్తితో ఆర్థికంగా ఎదిగేలా ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఎంపీపీ డి.సూర్యకుమారి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

మాట్లాడుతున్న విప్ నాయకర్, రామరాజు

నరసాపురం, గ్రామీణ, న్యూస్‌టుడే: ప్రజా సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్, తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజు అన్నారు. 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ఒకటో వార్డు, చిట్టవరం, గొంది గ్రామాల్లో వారు బుధవారం కూటమి పార్టీల నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ప్రజలతో మాట్లాడి సంక్షేమ పథకాల అమలు తీరును వివరించారు. మత్స్య సహకార సంఘాల ఫెడరేషన్ రాష్ట్ర ఛైర్మన్ కొల్లు పెద్దిరాజు, నాయకులు జక్కం శ్రీమన్నారాయణ, గుబ్బల నాగరాజు, వాతాడి ఉమ, కోపల్లి శ్రీనివాస్, బందిల రవీంద్ర, ఎన్టీ రామారావు తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: అయిదేళ్ల వైకాపా పాలనలో రాష్ట్రం తిరోగమనంలోకి వెళ్తే.. కూటమి సర్కారు వచ్చాక ప్రగతి బాట పడిందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ అన్నారు. గొంది గ్రామంలో బుధవారం నిర్వహించిన 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో ఆయన పాల్గొని ఏడాది కాలంలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి పొత్తూరి రామరాజుతో కలిసి ప్రజలకు వివరించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నట్లు చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో పయనిస్తోందన్నారు. అనంతరం చిట్టవరం గ్రామంలో కూటమి నాయకులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆర్వోవాటర్ ప్లాంట్‌ను, బీఎస్ఎన్ఎల్ ఇంటర్నెట్ సదుపాయాన్ని ప్రారంభించారు.

ఆచంట, న్యూస్‌టుడే: ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నారని తెదేపా యువ నాయకుడు పితాని వెంకట్‌సురేశ్ అన్నారు. బుధవారం ఆయన వల్లూరు గ్రామంలో పర్యటించారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను నాయకులతో కలిసి స్థానికులకు వివరించారు.

ఆశీల వేలంతో రూ.38.16 లక్షల ఆదాయం

నరసాపురం, న్యూస్‌టుడే: పట్టణంలోని వ్యాపారుల నుంచి పన్ను(ఆశీలు) వసూలు చేసే హక్కుల కోసం బుధవారం నిర్వహించిన వేలం ద్వారా రూ.38.16 లక్షల ఆదాయం సమకూరింది. గతంలో నిర్వహించిన వేలంలో పాటదారులు తక్కువ మొత్తానికి పరిమితం కావడంతో ఖరారు కాలేదు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పురపాలక కమిషనర్ యం.అంజయ్య పర్యవేక్షణలో ఆర్వో ఎస్.కృష్ణమోహనరావు బుధవారం వేలం నిర్వహించారు. ఈ అంశాన్ని కౌన్సిల్‌కు నివేదిస్తామని కృష్ణమోహనరావు తెలిపారు.

రహదారి నిర్మించాలంటూ ఆందోళన

పోడూరు, న్యూస్‌టుడే: మట్టపర్రు రహదారిని నిర్మించాలని గ్రామస్థులు బుధవారం ఆందోళన చేపట్టారు. మట్టపర్రులో ఎఫ్‌సీఐ గోదాముల నుంచి లారీల్లో బియ్యాన్ని రైల్వే వ్యాగన్లకు తరలిస్తుంటారు. రెండు రోజుల నుంచి వర్షం కురవడంతో ఈ రోడ్డు బురదగా మారి ఆటోలపై పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీంతో గ్రామస్థులు బుధవారం ఎఫ్‌సీఐ గోదాములకు లారీలు వెళ్లకుండా నిలుపుదల చేసి ఆందోళనకు దిగారు. పాలకొల్లు-మార్టేరు రోడ్డు నుంచి మట్టపర్రులో గోదాముల వరకు మరమ్మతులు చేసి రహదారి సమస్యను పరిష్కరించాలని వారు కోరారు. ఈ సమస్య మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి వెళ్లడంతో ఆయన ఆదేశాల మేరకు సర్పంచి దొమ్మేటి శ్రీను, తెదేపా మండల అధ్యక్షుడు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు తదితరులు ఆందోళనకారులతో మాట్లాడారు. సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు.

ఇంటింటి చెత్త సేకరణ తప్పనిసరి

ఫిల్టర్‌బెడ్‌లో నీటిని పరిశీలిస్తున్న రామనాథ్‌రెడ్డి

పాలకొల్లు ఆధ్యాత్మికం, న్యూస్‌టుడే: పల్లెలో తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు లేకుండా చర్యలు చేపట్టాలని జిల్లా పంచాయతీ అధికారి రామనాథ్ రెడ్డి ఆదేశించారు. పాలకొల్లు మండలం దిగమర్రులో మంచినీటి ఫిల్టర్‌బెడ్‌లను, లంకలకోడేరులో ఘన వ్యర్థాల కేంద్రాలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అందరి సహకారంతో గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుకోవచ్చన్నారు. ఇంటింటా తడి, పొడి చెత్త సేకరణను తప్పనిసరిగా అమలు చేయాలన్నారు. ఈవోపీఆర్డీ మూర్తిబాబు, సర్పంచి రాపాక నగేశ్‌కుమార్, పంచాయతీ కార్యదర్శులు డి.శ్రీనివాస్, కె.రాజేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

పాలకొల్లు మార్కెట్, న్యూస్‌టుడే: విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు సొంతమవుతుందని.. పిల్లలు క్రమం తప్పకుండా బడికి వచ్చేలా తల్లిదండ్రులు బాధ్యత వహించాలని బీఆర్ఎంవీ ప్రభుత్వ పాఠశాల హెచ్ఎం ఝాన్సీ లక్ష్మీబాయి అన్నారు. స్థానిక జీవీఆర్ఎం ప్రాథమిక పాఠశాల ఆధ్వర్యంలో బ్రహ్మానందరెడ్డి కాలనీ, చింతలతోట తదితర ప్రాంతాల్లో విద్యార్థుల నమోదు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆమె ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు గ్రామంలో పర్యటించి ఇళ్ల వద్ద ఉన్న చిన్నారులను గుర్తించి వారి తల్లిదండ్రులతో మాట్లాడారు.

కొనసాగిన ఒప్పంద ఉద్యోగుల దీక్ష

నరసాపురం, న్యూస్‌టుడే: నరసాపురం పురపాలక ఇంజినీరింగ్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు చేపట్టిన నిరసన దీక్ష పదోరోజైన బుధవారం కొనసాగింది. అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమ్మె చేయకూడదని, ఆందోళన విరమించకుంటే విధుల నుంచి తొలగించి కొత్త సిబ్బందిని నియమిస్తామని తెలియజేస్తూ అధికారులు జారీ చేసిన నోటీసు ప్రతులను శిబిరం వద్ద పురపాలక సిబ్బంది ఐకాస నాయకులకు అందజేశారు.

'అధికారుల తీరు సరికాదు'

ఎంఈవోకు వినతిపత్రం ఇస్తున్న విద్యాసంస్థల నిర్వాహకులు

ఆచంట, న్యూస్‌టుడే: ప్రైవేటు విద్యా సంస్థల విషయంలో అధికారులు అనుచితంగా వ్యవహరిస్తున్నారని.. పలు అంశాలపై అన్యాయంగా నోటీసుల జారీ చేస్తున్నారని నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ అంశాలను ఖండిస్తూ గురువారం ప్రయివేట్ విద్యా సంస్థల బంద్ పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం ఆచంట ఎంఈవో రాజేంద్ర ప్రసాద్‌కు అపుస్మా జోన్ కార్యదర్శి కె.రవికుమార్, నాయకులు వినతిపత్రం అందించారు.

పెనుగొండ, న్యూస్‌టుడే: సమస్యలు పరిష్కరించాలంటూ ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాల సంఘం ప్రతినిధులు బుధవారం ఎంఈవో డి.శుభాకరరావుకు వినతిపత్రం అందించారు. సంఘం ప్రతినిధులు టి.సుబ్బరాయుల రెడ్డి, కె.రామకృష్ణ, జి.వెంకటేశ్వరరావు, జక్కం విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సుజలం.. బహు భారం!

పట్టణంలో రెట్టింపైన తాగునీటి కష్టాలు

ట్యాంకరు కోసం వేచి చూస్తున్న మహిళలు

ట్రైసైకిల్‌పై డబ్బాల్లో నీళ్లు తీసుకెళ్తున్న దివ్యాంగురాలు

నరసాపురం పట్టణం, న్యూస్‌టుడే: నరసాపురం పట్టణంలో గత రెండు రోజులుగా తాగునీటి కష్టాలు రెట్టింపయ్యాయి. పురపాలక ఇంజినీరింగ్ పొరుగు సేవల ఉద్యోగులు విధులు బహిష్కరించారు. దీనికి తోడు తాగునీటి సరఫరాకు ఉపయోగించే మోటార్లు మరమ్మతులకు గురయ్యాయి. దీంతో పలు ప్రాంతాలకు కుళాయిల ద్వారా నీటి సరఫరా నిలిచిపోయింది. దీంతో మహిళలు ఉదయం నుంచి టాంకర్ల కోసం వీధుల్లో పడిగాపులు కాస్తున్నారు. మరికొందరు ప్రైవేటు ఆర్వో ప్లాంట్ల వద్ద బారులు తీరుతున్నారు. ఇంటి అవసరాలకు నీరు అందకపోవడంతో శ్రీహరిపేట, రెల్లి పేట, కాలువ గట్టు వెంబడి నివసించే ప్రజలు బకెట్లకు తాళ్లు కట్టి పంట కాలువల్లో నీటిని డబ్బాల్లో తోడుకుని తీసుకెళ్తున్నారు. అధికారులు స్పందించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని కోరుతున్నారు. మోటార్లకు మరమ్మతులు చేపట్టామని.. త్వరలోనే పూర్తిస్థాయిలో నీటిని సరఫరా చేస్తామని పురపాలక కమిషనర్ ఎం.అంజయ్య తెలిపారు.

తప్పని అవస్థలు.. మా ప్రాంతాలకు కొద్ది రోజులుగా కుళాయి నీళ్లు సక్రమంగా రావడం లేదు. వచ్చే కొన్ని బురదగా ఉంటున్నాయి. రెండు రోజులు సరఫరా పూర్తి స్థాయిలో నిలిచిపోయింది. ఇంటి అవసరాలకు కూడా నీళ్లు లేక అవస్థలు పడుతున్నాం. - **పాతవరపు లక్ష్మి, శ్రీహరి పేట, భారతి లక్ష్మీదుర్గ, నందమూరి కాలనీ**

మూడు నెలలకే తూట్లు!

కవిటం సమీపాన కుంగిన రహదారి

పోడూరు, న్యూస్‌టుడే: పాలకొల్లు-మార్టేరు ప్రధాన రహదారిని ఇటీవల రూ.25 కోట్లతో ఆధునికీకరించారు. నిర్మించి మూడు నెలలు కూడా పూర్తికాకుండా కొన్ని చోట్ల ఈ రహదారి దిగబడిపోతోంది. గతంలో 23 అడుగుల వెడల్పు ఉన్న ఈ రహదారిని 33 అడుగులకు విస్తరించారు. కవిటం కూడలి వద్ద ఇరువైపులా వెడల్పు చేసిన భాగంలో ఈ రహదారి కుంగి గుంతలు ఏర్పడుతున్నాయి. ఇలాంటి చోట్ల గుంత తవ్వి కాంక్రీటు వేసి మరమ్మతులు చేస్తున్నారు. ఈ అంశంపై ఆర్అండ్‌బీ డీఈ బీవీ రమణ మాట్లాడుతూ కొత్తగా వేసిన రోడ్డు కావడంతో అక్కడక్కడా గుంతలు పడే అవకాశం ఉందన్నారు. రెండేళ్ల పాటు సంబంధిత గుత్తేదారే వీటికి మరమ్మతులు చేస్తారన్నారు.

తప్పిన పెనుముప్పు

మొగల్తూరు, న్యూస్‌టుడే: పాఠశాల బస్సు అదుపుతప్పిన ఘటనలో విద్యార్థులకు పెనుముప్పు తప్పింది. నరసాపురంలో ఓ ప్రయివేటు పాఠశాల బస్సు బుధవారం సాయంత్రం విద్యార్థులను తీసుకువెళ్తూ జెట్టిపాలెంలో పైడిమారమ్మ ఆలయ సమీపాన అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టి ఆగింది. ఆ సమయంలో బస్సులో సుమారు 15 మంది విద్యార్థులు ఉన్నారు. బస్సు బోల్తాపడకుండా ఆగడంతో పెనుప్రమాదం తప్పిందని స్థానికులు చెబుతున్నారు.

తాకీదులతో సరి.. చర్యలేవి మరి!

పండితవిల్లూరు పంచాయతీలో నిధుల దుర్వినియోగం

పోడూరు, న్యూస్‌టుడే: పండితవిల్లూరులో 2021-22, 2022-23 ఆర్థిక సంవత్సరాల్లో రూ.20,22,994 మేర పంచాయతీ నిధులు దుర్వినియోగమైనట్లు డీఎల్‌పీవో విచారణ ద్వారా నిర్ధారించి నివేదికను గతంలో జిల్లా పంచాయతీ అధికారికి అందజేశారు. దీనిపై సర్పంచి వివరణ కోరుతూ గతేడాది అక్టోబరు 4న డీపీవో షోకాజ్ నోటీసు జారీ చేశారు. పది నెలలు గడచినా సంబంధిత వ్యక్తులపై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇటీవల 'పల్లె పల్లెకు మన పితాని' కార్యక్రమంలో ఆ గ్రామానికి చెందిన గణపతినీడి రామమోహన్‌రావు (రాంబాబు) ఎమ్మెల్యే పితాని, జిల్లా పంచాయతీ అధికారి రామనాథ్ రెడ్డి దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లారు. సర్పంచి సీఎఫ్ఎంఎస్ ఖాతా నుంచి సంబంధిత లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు నిధులు జమ చేయాలి. కానీ వ్యక్తిగత ఖాతాకు నిధులు జమ చేసుకుని దుర్వినియోగానికి పాల్పడినట్లు డీఎల్‌పీవో నిర్ధారించారు. ఒకే పని నిమిత్తం రూ.1,01,045 ఖర్చు చేసి రెండు సార్లు నగదు డ్రా చేశారని.. ఈ మొత్తాన్ని సర్పంచి, పంచాయతీ కార్యదర్శులు సమాన నిష్పత్తిలో పంచాయతీ ఖాతాకు చెల్లించాల్సి ఉందని నివేదించారు. ఈ నిధులకు సంబంధించి పంచాయతీ ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, హౌసింగ్ ఏఈల అనుమతులు తీసుకోలేదని నిర్ధారించారు. ఈ అంశంపై జిల్లా పంచాయతీ అధికారి రామనాథ్‌రెడ్డిని 'న్యూస్‌టుడే' సంప్రదించగా కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లామని.. సర్పంచి చెక్ పవర్ రద్దు చేసేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

అవి ఇవి అన్నీ

కిడ్నీ బాధితులకు చేయూత..

పోడూరు, న్యూస్‌టుడే: జిన్నూరుకు చెందిన చేబ్రోలు సత్యనారాయణ, శాంతకుమారి దంపతులు కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. వారికి వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకట్రామరాజు బుధవారం రూ.15 వేల ఆర్థిక సాయం సమకూర్చారు. దీనికి సంబంధించిన చెక్కును ఫౌండేషన్ కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు వారికి బుధవారం అందజేశారు.

95 శాతం పింఛన్ల పంపిణీ

పోడూరు, న్యూస్‌టుడే: పోడూరు మండలంలోని 16 గ్రామాల్లో మంగళ, బుధవారాల్లో 95.74 శాతం మంది లబ్ధిదారులకు పింఛన్ల సొమ్ము పంపిణీ చేసినట్లు ఎంపీడీవో బీఎస్ఎల్ మంగకుమారి తెలిపారు. 8,373 మందికి గాను 8016 మందికి నగదు అందజేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన 357 మందికి రానున్న రెండు రోజుల్లో పంపిణీ చేస్తామని చెప్పారు.

విద్యా సామగ్రి అందజేత

పోడూరు, న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెచ్ఎం డి.మాధవి అన్నారు. పైడావ నం.2 ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆమె సమకూర్చిన రాత పుస్తకాలను ఎస్ఎంసీ ఛైర్‌పర్సన్ బుంగా భాగ్యలక్ష్మి బుధవారం పంపిణీ చేశారు. అనంతరం ప్రభుత్వం సమకూర్చిన విద్యా కిట్లను అందజేశారు. బండారు వారి చెరువు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పోడూరు నాగమణి, వ్యాఘ్రు సత్యశ్రీనివాస్‌ల విరాళాలతో భోజనం కంచాలు, రెండు ఫ్యాన్‌లు అందజేశారు.

ప్రభుత్వ విధానాలతో రైతులకు అన్యాయం

భీమవరం వన్‌టౌన్, న్యూస్‌టుడే: పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామంటూ అధికారంలోకి వచ్చిన భాజపా ప్రభుత్వం రైతులను మోసగించిందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరేరాం విమర్శించారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఏపీ రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగా ఆక్వా, కోకో, మామిడి రైతులు తీవ్రంగా నష్టపోయారని వాపోయారు.

ఉరేసుకుని ఆత్మహత్య

పాలకొల్లు గ్రామీణ, న్యూస్‌టుడే: కుటుంబ సమస్యలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన పాలకొల్లు మండలం చింతపర్రులో చోటు చేసుకుంది. గ్రామీణ పోలీసుల కథనం ప్రకారం.. చింతపర్రుకు చెందిన ఉందుర్తి రాజు(31) కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ సమస్యల కారణంగా మద్యానికి బానిస అయ్యారు. మంగళవారం రాత్రి ఆయన ఇంట్లో నిద్రించారు. బుధవారం ఉదయం అతడి తల్లి పాపాయమ్మ చూసేసరికి చీరతో ఉరివేసుకుని కనిపించారు. ఈ మేరకు తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై బి.సురేంద్రకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

నేటి నుంచి యోగా శిక్షణ తరగతులు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: వాసవి, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో గురువారం నుంచి తొమ్మిది రోజుల పాటు తూర్పుతాళ్లులో ఉచిత ధ్యాన, యోగా శిక్షణ తరగతులు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణంలో ఉదయం 5 నుంచి 7 గంటల వరకు, సాయంత్రం 6 గంటలకు తరగతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

నిఘా కెమెరాలతో నేరాల కట్టడి

దాతను సత్కరిస్తున్న విప్, ఎస్పీ

నరసాపురం, న్యూస్‌టుడే: నిఘా కెమెరాల ఏర్పాటుకు విరాళాలు అందించేందుకు దాతలు ముందుకు రావాలని ప్రభుత్వ విప్ బొమ్మిడి నాయకర్ పిలుపునిచ్చారు. ఎస్‌డీపీవో కార్యాలయంలో డీఎస్పీ జి.శ్రీవేద అరవింద అధ్యక్షతన బుధవారం సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.5 లక్షల విరాళం అందిస్తానని ప్రకటించారు. ఎస్పీ నయీం అస్మి మాట్లాడుతూ నేరాల నియంత్రణకు నిఘా కెమెరాలు, సాంకేతిక పరికరాలు ఉపయోగపడుతున్నాయన్నారు. నూతనంగా ఏర్పాటు చేస్తున్న కెమెరాల్లో ఏఐ సాంకేతికత ఉంటుందని.. దీనిని ద్వారా నేరస్థులను వేగంగా పట్టుకోవచ్చని చెప్పారు. రాబోయే పుష్కరాల్లో బందోబస్తుకు అవసరమైన సిబ్బంది, ఇతర ఏర్పాట్లపై ప్రభుత్వానికి నివేదికలు అందించామన్నారు. అనంతరం సీసీ కెమెరాల ఏర్పాటుకు పడాల సురేష్, వైఎన్ కళాశాల, బీజీబీఎస్ మహిళా కళాశాలలు రూ.లక్ష చొప్పున, పోలిశెట్టి శ్రీను, మేకా సత్యనారాయణ రూ.50 వేల చొప్పున, సజ్జా బుజ్జి, బొల్లంపల్లి రామప్రసాద్ రూ.25వేల చొప్పున, విశ్రాంత ఉద్యోగులు అందె రంగారావు, శిరిగినీడి భవానీ శంకర్ తదితరులు విరాళాలు అందించారు. అదనపు ఎస్పీ వి.భీమారావు, సీఐలు బి.యాదగిరి, దుర్గాప్రసాద్, ఎస్సైలు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో అనర్థాలు:ఎస్పీ

ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

నరసాపురం గ్రామీణ, న్యూస్‌టుడే: మాదక ద్రవ్యాలు సమాజ ప్రగతికి విఘాతమని ఎస్పీ నయీం అస్మి అన్నారు. సీతారాంపురం సౌత్‌లోని స్వర్ణాంధ్ర ఇంజినీరింగ్ కళాశాలలో 'మహిళల రక్షణ-సైబర్ క్రైం, ఎన్‌డీపీసీ యాక్టు' అంశంపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. యువత, విద్యార్థులు మాదకద్రవ్యాల జోలికి వెళ్లవద్దని హితవు పలికారు. మహిళలకు రక్షణ కల్పించే శక్తి యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అదనపు ఎస్పీ భీమారావు మాట్లాడుతూ మాదక ద్రవ్యాల కట్టడిలో విద్యార్థులు, యువత భాగస్వాములు కావాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఎస్పీ ప్రతిజ్ఞ చేయించారు. కళాశాల ప్రిన్సిపల్ ఎస్.సురేశ్ కుమార్, పాలకవర్గ సభ్యుడు అడ్డాల శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

జోరందుకున్న ఖరీఫ్ పనులు

దేవలో పవర్ టిల్లర్‌తో మురగ దమ్ము

పెనుగొండ గ్రామీణ, న్యూస్‌టుడే: డెల్టాలో ఖరీఫ్ సాగు పనులు జోరందుకున్నాయి. కొద్ది రోజులుగా వర్షాలు కొనసాగుతుండటంతో రైతులు చేలను దమ్ము చేసి నాట్లు వేసేందుకు సిద్ధమవుతున్నారు. ముందస్తు సాగుతో ప్రకృతి వైపరీత్యాల ప్రభావం నుంచి బయటపడవచ్చని వ్యవసాయాధికారులు అవగాహన కల్పించడంతో రైతులు ఇప్పటికే నారుమడులు వేసుకున్నారు. పెనుగొండ మండలంలో 11,700 ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు. స్వర్ణ, పీఎల్ 1100, ఎంటీయూ 1318 రకాల సాగుకు రైతులు ఆసక్తి చూపుతున్నారని మండల వ్యవసాయాధికారిణి పి.స్పందన తెలిపారు.

సేంద్రియ ఎరువులతో మేలు



సిబ్బందికి సూచనలిస్తున్న కృష్ణమోహన్

ఆచంట, న్యూస్‌టుడే: సాగులో సేంద్రియ ఎరువుల వినియోగిస్తే ఆరోగ్యకరమైన పంట ఉత్పత్తులను పొందవచ్చని.. ఈ ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో బి.కృష్ణమోహన్ సూచించారు. సంబంధిత సిబ్బందితో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఆచంట మండలంలో 1800 కంపోస్టు తొట్టెలను నిర్మించాల్సి ఉందన్నారు. గ్రామాల్లో కుటుంబాల సంఖ్యల ఆధారంగా వీటి నిర్మాణానికి ఉపాధి, వెలుగు సిబ్బంది చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏపీఎం పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

(c) eenadu

తాడేపల్లిగూడెం

• తాడేపల్లిగూడెం • తణుకు

హుండీ ఆదాయం లెక్కింపు

అలంకరణలో పెంట్లమ్మ

పెంటపాడు, న్యూస్‌టుడే : పెంటపాడు మండలం కస్పాపెంటపాడులోని పెంట్లమ్మ ఆలయంలో అమ్మవారి హుండీ ఆదాయాన్ని బుధవారం కమిటీ సభ్యులు లెక్కించారు. ఏడాది కాలానికి రూ.1,34,500 ఆదాయం సమకూరినట్లు ఆలయ కమిటీ ఛైర్మన్ పంతం శేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షుడు గంధం సతీశ్, సర్పంచి పీతల సత్యనారాయణ, పెద్దలు కంబాల కొండయ్య, వీరాబత్తుల పేసియ్య, నరాలశెట్టి సంతోశ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సత్కారం

సీట్లు సాధించినవారితో ఉపాధ్యాయులు

తణుకు, న్యూస్‌టుడే: తణుకు జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించిన నలుగురు విద్యార్థినులకు ప్రధానోపాధ్యాయురాలు కె పద్మావతి ఆధ్వర్యంలో బుధవారం అభినందన సభ నిర్వహించారు. పడాల కావ్యశ్రీ, కాలుకులూరి తన్మయి ప్రియ, పాలాటి వర్షిణి, తిరుపతిపాటి శ్రీవల్లి ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారని తెలిపారు. కార్యక్రమంలో స్టాఫ్ కార్యదర్శి సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సర్వమంగళ అమ్మవారికి పూజలు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: స్థానిక ఏలూరు రోడ్డు శంకరమఠంలో సర్వ మంగళ అమ్మవారికి బుధవారం విశేష పూజా కార్యక్రమాలను నిర్వహించారు. వేద పండితులు అమ్మవారికి నదీజలాలు, సుగంధ ద్రవ్యాలు, ఫల రసాలతో విశేష అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పట్టు వస్త్రాలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

మాతృ వేదన

నత్తనడకన సీమాంక్ నిర్మాణం

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ నిర్లక్ష్యం, పాలకుల ఉదాసీనత వెరసి తాడేపల్లిగూడెం పట్టణంలోని సర్కారు దవాఖానా దయనీయ స్థితికి చేరుకుంది. నూతన భవన నిర్మాణం పూర్తి చేయడం పక్కన పెడితే కనీసం మౌలిక సదుపాయాలు కల్పించలేకపోయారు. ప్రధానంగా గర్భిణులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు తలపెట్టిన సీమాంక్ నిర్మాణంపై కూటమి ప్రభుత్వం సైతం నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

గంటల తరబడి నిరీక్షణ.. తాడేపల్లిగూడెం ప్రాంతీయ ఆసుపత్రిలో పేరుకు వంద పడకలు ఉన్నప్పటికీ ఆ మేరకు రోగులు వైద్య సేవలు అందడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇక్కడ ప్రతి రోజు సుమారు 250- 300 వరకు ఓపీ నమోదవుతోంది. ఇందులో 100 మందికి పైగా గర్భిణులు, బాలింతలు ఉండటం గమనార్హం. వైద్యులను సంప్రదించేందుకు వీరు గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. పూర్తిస్థాయిలో కుర్చీలు, బల్లలు అందుబాటులో లేకపోవడంతో నిలబడి నిరీక్షించాల్సి వస్తోంది.

ఇరుకు గదుల్లో ఇక్కట్లు.. ఆసుపత్రిలో ప్రస్తుతం ముగ్గురు గైనకాలజిస్టులు అందుబాటులో ఉన్నారు. వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఇక్కడ కేవలం రెండు గదులు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. ఒకే గదిలో ఇద్దరు వైద్యులు ఉంటూ గర్భిణులు, బాలింతలకు సేవలందిస్తున్నారు.

సౌకర్యాలు లేక రోగుల అవస్థలు

బిల్లుల విడుదలలో జాప్యం మాతాశిశు సంరక్షణకు రూ.12 కోట్ల వ్యయంతో నాలుగేళ్ల కిందట ప్రారంభించిన సీమాంక్ భవన నిర్మాణ పనులు నేటికీ కొలిక్కి రాలేదు. వాస్తవానికి ఏడాదిన్నర కిందటే పనులు పూర్తి చేసి భవనాలను ఆసుపత్రికి అప్పగించాల్సి ఉంది. గత ప్రభుత్వం గుత్తేదారుడికి బిల్లులు విడుదల చేయడంలో తీవ్ర జాప్యం చేసింది.

ఏడాది గడిచినా.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా ఎలాంటి పురోగతి లేదు. ప్రస్తుతం నత్తనడకన నిర్మాణ పనులు జరుగుతున్నాయి. భవనాలు అందుబాటులోకి వస్తే బాలింతలు, గర్భిణులు, శిశువులకు సౌకర్యవంతంగా ఉండటమే కాకుండా మెరుగైన వైద్య సేవలు అందించే అవకాశం ఉంది. 'మాతాశిశు సంరక్షణకు సంబంధించిన భవన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తాం.' అని డీసీహెచ్ఎస్ సూర్యనారాయణ తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తాడేపల్లిగూడెం : 79950 67078
పెంటపాడు : 79939 36123
తణుకు : 85558 50851
తణుకు గ్రామీణం : 63005 79402

పెంటపాడు, న్యూస్‌టుడే : ? ప్రత్తిపాడు ఎస్సీ కాలనీలో డ్రెయిన్ పూడిపోవడంతో మురుగంతా రహదారిపైకి చేరుతోంది. దుర్వాసన, దోమలతో ఇబ్బందులు పడుతున్నాం. -**రాజు, స్థానికుడు**

✔ పూడిక తొలగిస్తాం. - **నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి**

? పెంటపాడు శ్మశానానికి వెళ్లే మార్గంలో జంతు కళేబరాలను పడేస్తున్నారు. భరించలేని దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. - **సూర్యనారాయణరెడ్డి, గ్రామస్థుడు**

✔ చర్యలు తీసుకుంటాం. - **బాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి**

పూరీ, రామేశ్వరం యాత్రలకు ప్రత్యేక బస్సులు

తణుకు, న్యూస్‌టుడే: తణుకు పరిసర ప్రాంతాల భక్తుల సౌకర్యార్థం ఆషాఢ మాసంలో పూరీ జగన్నాథ యాత్ర, షట్ షణ్ముఖ- రామేశ్వరం యాత్రకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ సప్పా గిరిధర్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం డిపో ఆవరణలో గోడపత్రాలను ఆవిష్కరించి మాట్లాడారు. భువనేశ్వర్, పూరీ, కోణార్క్, అరసవిల్లి, శ్రీకూర్మం పుణ్యక్షేత్రాలతో కూడిన పూరీ యాత్రకు(సూపర్ లగ్జరీ) రూ.3500 చెల్లించాలన్నారు. శ్రీకాళహస్తి, కంచి, మధురై, త్రిపురకుండ్రమ్, రామేశ్వరం, తిరుచందూర్, కన్యాకుమారి, పళణి, తిరువణ్ణమలై, శ్రీపురం, కాణిపాకం పుణ్యక్షేత్రాల దర్శనంతో కూడిన షట్- షణ్ముఖ- రామేశ్వరం వెళ్లే ఏడు రోజుల యాత్రకు టికెట్ ధర రూ.8 వేలు అని తెలిపారు. వీడియో కోచ్ కలిగిన సూపర్ లగ్జరీ బస్సుకు అల్పాహారం, మధ్యాహ్న భోజనం, రాత్రి టిఫిన్ అందిస్తారని వివరించారు. అలాగే 35 మంది భక్తులు ఉంటే ఏ రోజు కావాలంటే ఆ రోజు బస్సు ఏర్పాటు చేస్తామని వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ మురళి, సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

గోడపత్రాలు ఆవిష్కరించి చూపుతున్న గిరిధర్‌కుమార్ తదితరులు

ప్రజల భాగస్వామ్యంతో డెంగీ నివారణ

తణుకు, తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ప్రజల భాగస్వామ్యంతోనే డెంగీ నివారణ సాధ్యమని తణుకు సబ్ యూనిట్ అధికారి జి వెంకటేశ్వరరావు అన్నారు. డెంగీ మాసోత్సవాలను పురస్కరించుకుని బుధవారం పైడిపర్రులోని జడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు దోమ కాటు వ్యాధులపై అవగాహన కల్పించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఏడుకొండలు అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వార్డు ఆరోగ్య కార్యదర్శి వి.బులిపండు, ఆశా కార్యకర్త విజయ, ఆరోగ్య సహాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ✦ డెంగీ మాసోత్సవాలను పురస్కరించుకుని తాడేపల్లిగూడెం జూబ్లీరోడ్డు పట్టణారోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎస్‌వీఎస్ ప్రసాద్ మాట్లాడుతూ నివాస ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యాధికారి వన్య శిరి, కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శనలో వెంకటేశ్వరరావు తదితరులు

ఇంకా ఎంత మంది ప్రాణాలు తీస్తారు?

అధికారులపై ఎమ్మెల్యే ఆగ్రహం

ఉండ్రాజవరం కూడలి వద్ద మాట్లాడుతున్న రాధాకృష్ణ

తణుకు, న్యూస్‌టుడే: 'ఇంకా ఎంత మంది ప్రాణాలు తీస్తారు.. ఇంత మంది ప్రాణాలు పోతున్నా కనీసం మానవత్వం అంటూ లేదా? హైవే నిర్వహణ అధికారుల పనితీరు కారణంగా ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తి చేయడానికి ఇంకా ఎన్నేళ్లు పడుతుంది? అంటూ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సజ్జాపురం ప్రాంతానికి చెందిన దుర్గా ప్రసాద్ టిప్పరు కింద పడి మృతి చెందడంతో ఆయన స్పందించారు. బుధవారం పైవంతెన నిర్మాణం జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించారు. సంబంధిత అధికారులతో ఫోనులో మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితిని చూడకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎప్పటికి నిర్మాణం పూర్తవుతుందనే కనీస సమాచారం లేకపోవడం దారుణమన్నారు. తక్షణమే క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. ముందుగా సర్వీసు రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని సూచించారు. నిర్మాణ ప్రాంతంలో వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా, ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ టి రామ్‌కుమార్, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

6న కుక్కలకు వ్యాధి నిరోధక టీకాలు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రపంచ జునోసిస్ డే సందర్భంగా ఈనెల 6న అత్తిలి పశువైద్యశాలలో కుక్కలకు ఉచితంగా రేబిస్ వ్యాధి నిరోధక టీకాలు వేస్తామని మండల పశువైద్యాధికారి కరణం శంకర భావన్నారాయణ తెలిపారు. ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభిస్తామేని, అత్తిలి పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు: ఆరిమిల్లి

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ సంక్షేమం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అన్నారు. అత్తిలి మండలం కె.సముద్రపుగట్టులో బుధవారం నిర్వహించిన సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ తిరిగి కూటమి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పింఛన్ల సొమ్ము పెంపు, మూడు గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం వంటి ఎన్నికల హామీలను అమలు చేశామన్నారు. రాబోయే రోజుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, అన్నదాత పథకం, యువతకు ఉద్యోగ కల్పనే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. గ్రామంలో దాదాపు రూ.90 లక్షల అభివృద్ధి పనులతో పాటు రూ.5 కోట్ల మేర సంక్షేమ పథకాలు అందించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, ఏఎంసీ ఛైర్మన్ దాసం ప్రసాద్, తెదేపా మండల అధ్యక్షుడు పోలిశెట్టి చందు, ఆనాల ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి

మహిళకు కరపత్రం అందజేస్తున్న బాబ్జీ

పెంటపాడు, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని భవన ఇతర నిర్మాణ కార్మికుల బోర్డు ఛైర్మన్ వలవల బాబ్జీ అన్నారు. పెంటపాడులో తెదేపా మండల అధ్యక్షుడు కిలపర్తి వెంకట్రావు ఆధ్వర్యంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న బాబ్జీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలో జరిగిన అభివృద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఏడాది పాలనలో రహదారుల ఆధునికీకరణ, గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్లు నిర్మించామన్నారు. కార్యక్రమంలో దాసరి అప్పన్న, కృష్ణవేణి, బండారు వెంకట్రావు, పాతూరి రాంప్రసాద్ చౌదరి, బుద్ధన ధనరాజు, ముప్పిడి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

తణుకు సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం మార్పు

తణుకు, న్యూస్‌టుడే: తణుకు సబ్ రిజిస్ట్రారు కార్యాలయాన్ని పాత ఏకేటీ పాఠశాల ఎదురుగా ఉన్న అపార్టుమెంటులోకి మార్చామని తణుకు జాయింట్ సబ్ రిజిస్ట్రార్ డి రాధాబాయి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో కార్యాలయాన్ని మార్పు చేసినట్లు పేర్కొన్నారు.

నేడు తాడిపూడి నుంచి సాగునీరు విడుదల

తాళ్లపూడి, న్యూస్‌టుడే: తాళ్లపూడి మండలంలోని తాడిపూడి ఎత్తిపోతల పథకం స్టేజ్-1, స్టేజ్-2 నుంచి గురువారం మధ్యాహ్నం సాగునీరు విడుదల చేస్తున్నామని ఈ పథకం డీఈ రామేశ్వరనాయుడు తెలిపారు. సాగునీరు విడుదల ప్రారంభోత్సవ కార్యక్రమానికి జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, పలు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు ముఖ్య అతిథులుగా హాజరవుతారని వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించాలని డిమాండ్

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం తమ డిమాండ్లను తక్షణం పరిష్కరించాలని మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన కార్మికులు డిమాండ్ చేశారు. హక్కుల సాధన కోసం స్థానిక పురపాలక కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న సమ్మె బుధవారం పదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ రోజుల తరబడి సమ్మె చేస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో బండారు శ్రీను, మద్రిపూడి సతీష్‌కుమార్, ఆవిడి కుమార్, యర్రంశెట్టి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులు

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

అత్తిలి గ్రామీణం, న్యూస్‌టుడే : అత్తిలి మండలం ఆరవల్లిలో గత కొద్ది రోజులుగా రెండు వర్గాల మధ్య గొడవలు జరుగుతున్న నేపథ్యంలో తణుకు రూరల్ సీఐ ఆధ్వర్యంలో బుధవారం ఇరువర్గాల పెద్దల మధ్య శాంతి సమావేశం ఏర్పాటు చేశారు. ఇకపై ఎవరైనా ఒకరి కులాన్ని ఒకరు కించపరుస్తూ వాట్సాప్ సందేశాలు పంపి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ప్రేమరాజు ఒక ప్రకటనలో తెలిపారు.

మాట్లాడుతున్న గంగాధర్

సాగులో మెలకువలపై అవగాహన

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: రైతులకు సాగులో మెలకువలు, విత్తన మార్పిడి, ప్రభుత్వ పథకాల గురించి అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తోందని వ్యవసాయ సహాయ సంచాలకుడు ఆర్ గంగాధర్ సూచించారు. తాడేపల్లిగూడెం మండలం చినతాడేపల్లి, కొండ్రుప్రోలు గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల సంక్షేమం కోసం ఎన్నో పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వి.నారాయణరావు, తెదేపా మండల అధ్యక్షుడు పరిమి రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సొమ్ములు రాక.. అప్పులు తీర్చలేక

❑ మండపాకకు చెందిన మంగ గత మే నెల 10న ధాన్యం విక్రయించగా ప్రభుత్వం రూ.1.45 లక్షలు చెల్లించాల్సి ఉంది. నేటికీ రాకపోవడంతో సాగు పెట్టుబడికి వెతుకులాడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

మండపాక, తణుకు, న్యూస్‌టుడే

రైతులు జోరుగా నాట్లు వేసే ప్రక్రియలో నిమగ్నమయ్యారు. కానీ గత రబీలో విక్రయించిన ధాన్యం సొమ్ము నేటికీ అందలేదు. దీంతో చేసిన అప్పులు తీర్చుకోలేక.. మరో పక్క ఖరీఫ్ పెట్టుబడులకు సొమ్ములు లేక రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆర్‌బీకే, వ్యవసాయాధికారి కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. త్వరలో రైతులు ఖాతాల్లో సొమ్ములు జమవుతుతాయని తణుకు, ఇరగవరం, అత్తిలి మండలాల ఏవోలు రాజేంద్రప్రసాద్, రాఘవేంద్ర, రాజేశ్ తెలిపారు.

ఖరీఫ్ పెట్టుబడికి రైతుల పాట్లు

మిల్లుకు తరలించేందుకు ధాన్యం లారీలో ఎగుమతి (పాతచిత్రం)

మండలం	ఎకరాలు	కొనుగోలు చేసింది	సొమ్ములు జమ(రూ.కోట్లలో)	బకాయిలు(రూ.కోట్లలో)
తణుకు	10,620	39098	82.70	7.28
ఇరగవరం	15,503	46325	91.07	15.84
అత్తిలి	14000	45717	79.28	25.97

ఇదీ పరిస్థితి.. తణుకు నియోజకవర్గంలో 40,123 ఎకరాల్లో వరి సాగు చేపట్టగా 1,35,350 మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడులు వచ్చాయి. రైతుల నుంచి 1,31,140 టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసింది. ఇప్పటి వరకు వారికి రూ.253.05 కోట్లు చెల్లించగా ఇంకా రూ.49.09 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. కొనుగోళ్లు ప్రారంభించిన సమయంలో కేవలం గంట వ్యవధిలోనే రైతుల ఖాతాల్లో సొమ్ములు జమయ్యేవి. ప్రస్తుతం ధాన్యం విక్రయించి నెలలు గడుస్తున్నా విడుదల కావడం లేదు.

పెట్టుబడికి ఇబ్బందులు

ఎకరా సొంత పొలంతో పాటు కౌలుకు నాలుగెకరాల్లో వరి సాగు చేస్తున్నా. ప్రభుత్వానికి ధాన్యం విక్రయించి రెండు నెలలు దాటినా.. నేటికీ చిల్లిగవ్వ పడలేదు. మళ్లీ ఖరీఫ్ పంటకు పెట్టుబడి పెట్టేందుకు సొమ్ములు లేవు. తీవ్ర ఇబ్బందులుపడుతున్నా. -ఎ. రామ్మూర్తి

వడ్డీలు కట్టలేకపోతున్నాం

ఏడెకరాలు వరి సాగు చేస్తున్నా. మే 10న ధాన్యం విక్రయించా. ఇంకా రెండెకరాల ధాన్యం సొమ్ము జమకాలేదు. ఎరువుల దుకాణాల వద్ద అరువు తీసుకొస్తున్నాం. ధాన్యం సొమ్ములు సకాలంలో రాక వడ్డీ కూడా వసూలు చేస్తున్నారు. తీవ్రంగా నష్టపోతున్నాం. -ఆర్ గోపాల్

ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్షయవ్యాధి చికిత్స

పెంటపాడు, న్యూస్‌టుడే : టీబీ ముక్తిభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పెంటపాడు మండలంలోని పెంటపాడు, ముదునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో బుధవారం లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్(డీఎల్ఏటీసీవో) జిల్లా అధికారి రవికుమార్ టీబీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు వారాలకు మించి దగ్గు, బరువు తగ్గడం, నిద్రలేకపోవడం, జ్వరం రావడం వంటివి టీబీ లక్షణాలన్నారు. ప్రభుత్వాసుపత్రుల్లో టీబీకి అవసరమైన చికిత్స లభిస్తోందన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు రాజేశ్ కుమార్, పూజిత సిబ్బంది పాల్గొన్నారు.

సమ్మె విజయవంతానికి పిలుపు



రామ్‌కుమార్‌కు సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు

తణుకు, న్యూస్‌టుడే: ఈ నెల 9న జరిగే జాతీయ సమ్మెలో కార్మికులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ టి రామ్‌కుమార్‌కు యూనియన్ నాయకులు సమ్మె నోటీసు అందజేసి మాట్లాడారు. లేబర్ కోడ్స్ ద్వారా శ్రమ దోపిడీ ద్వారాలు తెరిచారని విమర్శించారు. కార్యక్రమంలో నాయకులు ఏ కృష్ణ బాబు, ఎన్ ఆదినారాయణ బాబు, ఎం.నాగేంద్ర కుమార్, ఎన్ సురేష్, జి పెద్దిరాజు, కె పల్లపు రావు, పి జ్యోతి బాబు తదితరులు పాల్గొన్నారు.

సాల్వేషన్ ఆర్మీ సేవలు స్ఫూర్తిదాయకం

దుస్తులు పంపిణీ చేస్తున్న కృష్ణ తులసి

తణుకు, న్యూస్‌టుడే: ప్రపంచ వ్యాప్తంగా సాల్వేషన్ ఆర్మీ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించిన వ్యవస్థాపకుడు విలియమ్ బూత్ ఎంతో మందికి స్ఫూర్తిదాయకమని ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ సతీమణి కృష్ణ తులసి అన్నారు. సాల్వేషన్ ఆర్మీ స్థాపించి 160 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా స్థానిక హెడ్‌పోస్టాఫీసు రోడ్డులోని బాలికల వసతి గృహంలో బుధవారం ఏర్పాటు చేసిన వేడుకల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. అనంతరం వసతిగృహంలోని విద్యార్థులకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేశారు. అంతకుముందు విలియమ్ బూత్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాస్టర్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్త సేకరణ తీరుపై పరిశీలన

గణపవరం, న్యూస్‌టుడే: ఇంటింటికి చెత్త సేకరణ కార్యక్రమాన్ని పరిశీలించేందుకు వాకపల్లి, వీరేశ్వరపురం, జల్లికొమ్మర గ్రామాల్లో ఇన్‌ఛార్జి డీఎల్పీవో వై.దోసిరెడ్డి బుధవారం పర్యటించారు. ఐవీఆర్ఎస్ సర్వేలో ఆ గ్రామాల్లో చెత్త సేకరణ అధ్వానంగా ఉందని పలు ఫిర్యాదులు రావడంతో ఎంపీడీవో బేబి శ్రీలక్ష్మి, పంచాయతీ విస్తరణాధికారి సత్యనారాయణలతో కలిసి ఆయన పరిశీలన చేశారు. ఆయా గ్రామాల సర్పంచులు, ఈవోలకు చెత్త సేకరణపై పలు సూచనలు చేశారు.

రెండు వాహనాలను ఢీకొట్టిన లారీ

అతివేగమే ప్రమాదానికి కారణం

కృష్ణలంక, న్యూస్‌టుడే: మితిమీరిన వేగంతో వచ్చిన లారీ, రెండు వాహనాలను ఢీకొట్టిన ఘటన విజయవాడలోని కృష్ణలంక వద్ద జాతీయ రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా వినుకొండకు చెందిన బొమ్మిడి నాగార్జున మంగళవారం రాత్రి కాకినాడలో సన్‌ఫ్లవర్ ఆయిల్ లోడు చేసుకొని గొల్లపూడిలో దింపేందుకు వెళ్తున్నారు. మితిమీరిన వేగంతో వస్తున్న లారీ కృష్ణలంక సత్యం హోటల్ సెంటర్ వద్ద అదుపు తప్పి ముందు వెళ్తున్న ఆర్టీసీ బస్సును వెనుక నుంచి ఢీకొట్టింది. తరువాత లారీని పక్కకు తప్పించే క్రమంలో డివైడర్ ఎక్కి రహదారి అవతలి భాగం వైపునకు వెళ్లి.. ఆ సమయంలో బస్టాండ్ వైపు నుంచి వారధి వైపునకు వెళ్తున్న ఐసర్ వాహనాన్ని ఢీకొట్టింది. రెండు వాహనాల ముందు భాగాలు నుజ్జునుజ్జయ్యాయి. డ్రైవర్లు, క్లీనర్లు క్యాబిన్లలో ఇరుక్కుపోయారు. ట్రాఫిక్ పోలీసులు.. స్థానికుల సాయంతో ఇద్దరిని వెలుపలికి తీసినప్పటికీ.. మరో ఇద్దరు లోపల ఉండిపోయారు. రెండు క్రేన్లను తెప్పించి వారిని కూడా బయటకు తీశారు.

క్షతగాత్రులను 108 వాహనంలో ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఐషర్ వాహనాన్ని నడుపుతున్న డ్రైవర్ తాడేపల్లిగూడెంకు చెందిన ఆరిమిల్లి వెంకటేశులు కాగా... గొల్లపూడిలో స్టీల్‌సామాన్లు లోడ్ చేసుకుని తణుకు వెళ్తున్నట్లు చెప్పారు. గాయపడిన క్లీనర్లు గొల్ల వంశీకృష్ణ, గుడిపూడి వెంకటేశ్వర్లుగా గుర్తించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ఇద్దరిపై కేసు

పెంటపాడు, న్యూస్‌టుడే: పాత గొడవల నేపథ్యంలో జరిగిన ఘర్షణకు సంబంధించి ఇద్దరిపై బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్వామి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. పెంటపాడు ఎస్సీ కాలనీకి చెందిన నెల్లి చంటి, అతని కుమారుడు లీలాదుర్గాప్రసాద్‌లకు అదే గ్రామానికి చెందిన గుబ్బల దుర్గాప్రసాద్‌కు మధ్య పాత గొడవలున్నాయి. మంగళవారం సాయంత్రం మత్స్యకార సొసైటీకి సంబంధించి లీలా దుర్గాప్రసాద్, దుర్గాప్రసాద్‌ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో దుర్గాప్రసాద్‌పై నెల్లి లీలాదుర్గాప్రసాద్, చంటి దాడిచేశారు. ఈ ఘటనలో గాయపడిన ప్రసాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఎస్సై స్వామి లీలాదుర్గాప్రసాద్, చంటిలపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

కార్యక్రమంలో పాల్గొన్న ఆచార్యులు, విద్యార్థులు

తాడేపల్లిగూడెం అర్బన్, న్యూస్‌టుడే: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం తాడేపల్లిగూడెం ప్రాంగణంలో పీజీ విభాగానికి సంబంధించి జూనియర్ విద్యార్థులు సీనియర్ విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక, సంప్రదాయ నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం ప్రిన్సిపల్ టి.అశోక్ మాట్లాడుతూ పీజీ పట్టా పొందిన విద్యార్థులు మంచి నిపుణులుగా రాణించి ప్రాంగణానికి మంచి పేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో ఆచార్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిమి వెంకటేశ్వరరావు (వెంకన్నబాబు) తణుకు మున్సిపల్ మాజీ చైర్మన్
మంత్రిరావు వెంకటరత్నం (బాబు) తణుకు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్
మల్లిన వెంకట్రావు (గిరి) శ్రీలతా డెవలపర్స్, తణుకు
చిట్టూరి పవన్
మారిన వెంకటసుబ్బారావు
మద్దినపూడి రామకృష్ణ శివరావు (గాంధీ అబ్బులు)
మద్దినపూడి ఓంకార్
తాతిని శశిధర్
తాతిని శ్రీధర్
నల్ల రాజేష్
మాగంటి వరప్రసాద్ (APTECH బాబు)
చిట్టూరి సురేష్
చిప్పాడ రాజు

(c) eenadu

రాయచోటి రహస్యం

◆ అడ్డాగా చేసుకున్న ఉగ్ర మూకలు
◆ పసిగట్టడంలో విఫలమైన జిల్లా పోలీసులు

గున్నికుంట్ల రోడ్డులో మహ్మద్ అలీ చీరల వ్యాపారం చేసిన ఇల్లు

కొత్తపల్లిలోని అబూబకర్ సిద్ధిక్ నివాసం ఉన్న రెండు అంతస్తుల భవనం

రాయచోటి, న్యూస్‌టుడే: అన్నమయ్య జిల్లా కేంద్రం. ఘన చరిత్ర.. ప్రశాంతతకు నిలయం రాయచోటి. తమిళనాడుకు చెందిన ఇద్దరు ఉగ్రవాదులు గత ముప్పై ఏళ్లుగా ఈ పట్టణాన్ని అడ్డాగా చేసుకుని ఉన్నారనే విషయం తెలిసి స్థానికులు కలవరపడుతున్నారు. దశాబ్దాలపాటు నివాసాల మధ్య నక్కి ఉండటంపై ఉలిక్కిపడుతున్నారు. అనేకచోట్ల బాంబు పేలుళ్లకు పాల్పడిన వరుసకు సోదరులైన అబూబక్కర్ సిద్ధిఖీ, మహమ్మద్ అలీలు స్థానికుల్లో ఒకరుగా కలిసిపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

● ఆ ఇద్దరు కొందరికే తెలుసు: బాంబు పేలుళ్ల కేసులో ప్రధాన నిందితులుగా అనుమానిస్తున్న సిద్ధిఖీ, అలీలు యుక్త వయస్సులోనే రాయచోటికి వచ్చారు. నాటి నుంచి వారి కదలికలు కొందరికే తెలుసనే విషయాన్ని పోలీసు వర్గాలు గుర్తించాయి. పెట్టెల్లో సామగ్రి తేవడం, ఇళ్లలోకి వెళ్లిన తర్వాత బయటికి రాకుండా రహస్య జీవితాన్ని ఒకరు గడుపుతుండగా.. మరొకరు చీరల వ్యాపారం చేస్తూ ఇతరులకు అనుమానం రాకుండా మసిలారని తెలుసుకున్నారు. రహస్య శిక్షణలు, మందుగుండు సామగ్రి తయారీలో ఈ ఇద్దరూ సిద్ధహస్తులనే విషయాన్ని నిఘా వర్గాలు పసిగట్టాయి.

● ఇంతకీ చేరదీసిందెవరు!: ఉగ్రమూలాలు కలిగిన వ్యక్తులను రాయచోటిలో తొలుత చేరదీసిన వారు ఎవరనే విషయం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది.

● ఆధార్ కార్డులు.. బ్యాంకు ఖాతాలు: తీవ్రవాదుల ఇళ్లల్లో ఐబీ అధికారులతో పాటు పోలీసులు తనిఖీ చేసినప్పుడు కొన్ని పరికరాలు, పుస్తకాలు, ఆధార్ కార్డులు, బ్యాంకుల ఖాతాల వివరాలు లభ్యమయ్యాయి. ఒక్కొక్కరికి 2 నుంచి 4 వరకు ఆధార్ కార్డులు ఉండడం, నాలుగైదు బ్యాంకుల్లో ఖాతాలు ఉన్నట్లు గుర్తించారు. అబూబకర్ సిద్ధిక్ ఇంట్లో పేలుడు పదార్థాలతో పాటు ఎలక్ట్రిక్ పరికరాలు, అమ్మోనియం నైట్రేట్ లభించినట్లు సమాచారం. ఇదే నివాసంలో బకెట్ బాంబు కూడా ఉందని.. నిర్వీర్యం చేసేందుకు సాంకేతిక బృందాన్ని పిలిపించినట్లు తెలుస్తోంది.

తమిళనాడుకు చెందిన ఆ ఇద్దరు.. ఎవరి పరిచయం, ప్రోద్బలంతో వచ్చారనే దిశగా ఐబీ అధికారులతో పాటు జిల్లా పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. స్వాధీనం చేసుకున్న చరవాణుల ఆధారంగా వారి కదలికలు, ఎవరితో ఎక్కువసార్లు మాట్లాడారు.. అనే విషయాలను సాంకేతిక పరిజ్ఞానం సాయంతో విశ్లేషిస్తున్నారు. పేలుడు పదార్థాలను ఎక్కడి నుంచి తెస్తున్నారనే అంశంపై విచారిస్తున్నారు.

● విస్తృత సోదాలు: రాయచోటి పట్టణంలోని కొత్తపల్లి, మహబూబ్‌నగర్ వీధుల్లోని ఉగ్రవాదుల ఇళ్లలో ఐబీ అధికారులు బుధవారం రాత్రి విస్తృత సోదాలు నిర్వహించారు. పోలీసులు, రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకున్న బాంబు తయారీ సామగ్రిని పరిశీలించినట్లు తెలిసింది. మూడు దశాబ్దాలుగా రాయచోటిలోనే ఉగ్రమూకలు మకాం వేసినప్పటికీ స్థానిక పోలీసులు పసిగట్టకపోవడంపై ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు.

మహేశ్వరరెడ్డి..
అప్పట్లో కలెక్టర్ కంటే ఎక్కువ

☛ స్థాయిని మించి అధికారం చెలాయింపు
☛ వెలుగు చూస్తున్న మరిన్ని భూదందాలు

ఈనాడు, కడప: వైకాపా హయాంలో ఆ పార్టీ నేతలు ఎక్కడికక్కడ రెచ్చిపోయారు. కొందరు అధికారులు వారి అడుగులకు మడుగులొత్తారు. అక్రమాలకు వత్తాసు పలికారు. మరికొందరు ఇంకొంత ఎక్కువ స్వామిభక్తి ప్రదర్శించారు. నాటి పాలకుల అండతో కలెక్టర్‌ను మించిన అధికారాన్ని ప్రదర్శించారు. తమ వారికి ప్రభుత్వ భూములను అప్పనంగా కట్టబెట్టేశారు. ఈ విషయంలో అప్పట్లో సీకే దిన్నె తహసీల్దార్‌గా పని చేసి.. ఇప్పుడు నెల్లూరు జీజీహెచ్ పరిపాలనాధికారిగా విధులు నిర్వహిస్తున్న మహేశ్వర్ రెడ్డి మరింత ఘనుడిగా పేరొందారు. గత ప్రభుత్వంలో అతను చేసిన మాయలు మరిన్ని ఇప్పుడు వెలుగు చూస్తున్నాయి.

● హద్దు మీరి చుక్కలు చెరిపారు: నిషేధిత జాబితాతో పాటు చుక్కల భూముల వ్యవహారాల్లో ఏదేని చర్యలకు కలెక్టర్లకు మాత్రమే అధికారాలుంటాయి. వైకాపా పాలకుల అండతో మహేశ్వరరెడ్డి ఈ విషయాన్ని విస్మరించారు. ఆయన 2020, 2021 సంవత్సరాల్లో తహసీల్దార్‌గా పని చేసిన సమయంలో తానే కలెక్టర్ స్థాయి అధికారాలను చూపుతూ ఇష్టానుసారంగా భూములను రాసిచ్చారు. నిషేధిత జాబితాలో ఉన్న సర్వే నంబరు 455/5లోని అయిదు ఎకరాల భూమిని డీకేటీ నంబరు 308/78 కింద మారుస్తూ గువ్వల రాయప్పకు, సర్వే నంబరు 455/6లోని డీకేటీ నంబరు 308/78 కింద 1.13 ఎకరాలను గోవిందు ఆంథోనికి అప్పగించారు. ఈ వ్యవహారాన్ని కడప కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సీసీఎల్ఏ జయలక్ష్మి తాజాగా మహేశ్వరరెడ్డికి నోటీసులు జారీ చేశారు.

● చట్టవిరుద్ధంగా మార్పులు.. చేర్పులు: వెబ్‌ల్యాండ్ రికార్డుల నుంచి పేర్లను ఇష్టారాజ్యంగా తొలగించడం, ఇతరుల పేర్లను చేర్చడం వంటి చర్యలకు మహేశ్వరరెడ్డి పాల్పడినట్లు వెలుగు చూసింది. డీకేటీ పట్టాలు లేని వ్యక్తుల పేర్లను ఆన్‌లైన్ రికార్డుల్లో చట్ట విరుద్ధంగా మార్చారు. సీకే దిన్నె మండలంలో రూ.400 కోట్ల విలువైన భూముల విషయంలో ఇలానే వ్యవహరించారు. 296 మ్యుటేషన్లు చేపట్టగా వాటిలో 96 వరకు అక్రమాలే అని అధికారులు గుర్తించారు. చలమల ఎల్లారెడ్డికి 1.23 ఎకరాలు, భాస్కర్‌రెడ్డికి 6.12 ఎకరాలు, ఎ.మాధవికి 7 ఎకరాలు చొప్పున ప్రభుత్వ భూముల్ని కట్టబెట్టేశారు. ఈ విషయమై మాధవి మాట్లాడుతూ.. మహేశ్వరరెడ్డి అక్రమాలు ప్రోత్సహించిన కారణంగా తామూ నష్టపోయామని, ఈ విషయంలో న్యాయ పోరాటం చేస్తున్నట్లు తెలిపారు.

జిల్లా ప్రగతికి కార్యాచరణ ప్రణాళిక

మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్.. పక్కన జేసీ అదితిసింగ్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే: జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని అధికారులను కలెక్టర్ శ్రీధర్ ఆదేశించారు. సంయుక్త కలెక్టర్ అదితి సింగ్‌తో కలిసి కడప కలెక్టరేట్ నుంచి క్షేత్రస్థాయి, నియోజకవర్గ అధికారులతో ఆయన బుధవారం వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్ష చేపట్టారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం సంబంధిత అధికారులు ప్రణాళికలు రూపొందించాలన్నారు. జీరో పావర్టీ, పీ4 విధానాలపై అవగాహన కల్పించుకుని, వచ్చే నాలుగేళ్లల్లో ప్రధాన రంగాలపై ప్రత్యేక దృష్టిసారించి ప్రణాళిక అమలుకు కృషిచేయాలని దిశా నిర్దేశం చేశారు. ముఖ్యంగా వ్యవసాయంతో పాటు పారిశ్రామికాభివృద్ధికి చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లాలోని అన్ని వనరులను వినియోగించుకుని అభివృద్ధి దిశగా పయనించేందుకు, పీ4లో భాగంగా పేదల ఆర్థిక స్థితిగతులు మెరుగు పడేలా చూడాలన్నారు. సమీక్షలో డీఆర్వో వెంకటపతి, సీపీవో హజరత్తయ్య, డీఆర్డీఏ పీడీ రాజ్యలక్ష్మి, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, ఆర్డీవోలు జాన్ ఇర్విన్, చంద్రమోహన్, సాయిశ్రీ, కడప కమిషనర్ మనోజ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు ఎంఈవోలు, ఉపాధ్యాయుడికి తాఖీదులు

కడప విద్య, న్యూస్‌టుడే: ఇటీవల చేపట్టిన ఉపాధ్యాయ బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కేటగిరీ నిబంధనలు ఉల్లంఘించినందుకు కడప, ప్రొద్దుటూరు ఎంఈవోలు గంగిరెడ్డి, సావిత్రమ్మలకు డీఈవో షంషుద్దీన్ బుధవారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. అధికారులకు తప్పుడు సమాచారం ఇచ్చారని నోటీసుల్లో పేర్కొన్నారు. కడప నగరం ఆలంఖాన్‌పల్లెలోని ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న శివారెడ్డికీ షోకాజ్ నోటీసులు ఇచ్చారు.

కరపత్రాలు ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరెడ్డి, ఎమ్మెల్యే మాధవి

జగన్‌కు జైలు యాత్ర తప్పదు

అరవిందనగర్(కడప), న్యూస్‌టుడే: వైకాపా అధినేత జగన్ మోహన్ రెడ్డి జైలుయాత్ర చేయక తప్పదని తెదేపా పొలిట్‌బ్యూరో సభ్యుడు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కడపలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే మాధవితో కలిసి ఆయన బుధవారం మాట్లాడారు. వైకాపా పాలనలో పథకాలు, సంక్షేమ కార్యక్రమాలపై తప్పుడు ప్రచారం చేస్తున్నారని అన్నారు. ప్రజలు మెచ్చే పాలన చేస్తూ ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో భాగంగా ఉక్కు పరిశ్రమ నిర్మాణం కోసం జిందాల్ సంస్థ చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఎమ్మెల్యే మాధవి మాట్లాడుతూ.. కడప నగరంలో తాగునీటితో పాటు రహదారులు, కాలువల నిర్మాణం చేపట్టేలా ప్రత్యేక ప్రణాళికతో చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. తొలుత సుపరిపాలనలో తొలి అడుగు కరపత్రాలను ఆవిష్కరించారు.

తెలుగు గంగ.. తీర్చనుంది బెంగ

◆ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
◆ రూ. 99.70 కోట్లతో పనులు త్వరలో ప్రారంభం

తెలుగు గంగ ప్రాజెక్టులోని రెండో ఉప జలాశయం

మైదుకూరు, న్యూస్‌టుడే: గొంతెండిపోతోంది మహాప్రభూ.. గుక్కెడు మంచినీళ్లు ఇవ్వండని జనం వేడుకుంటుంటే- 'ఆ సంగతి తర్వాత, ముందు మా గొప్పలు వినండి' అన్నట్టు వ్యవహరించింది గత వైకాపా ప్రభుత్వం. రక్షిత నీటి పథకాలతో ప్రతి ఊరి దాహార్తిని తీరుస్తున్న జగన్ హామీలన్నీ గంగ పాలయ్యాయి. తాగునీటి కోసం పల్లెలు, పట్టణాలు తల్లడిల్లాయి. మనిషి బతకాలంటే తాగేందుకు పనికొచ్చే నీళ్లు కావాలనే విషయాన్ని విస్మరించారు. వైకాపా ప్రభుత్వం చేయలేని పనిని తమ కూటమి ప్రభుత్వం ఇప్పుడు భుజానెత్తుకుంది. మైదుకూరు వాసులకు ఇంటింటికీ తాగునీరు అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా అమృత్ పథకం కింద రూ. 99.70 కోట్లు మంజూరయ్యాయి.

● 2019లోనే శంకుస్థాపన: తెలుగు గంగలో భాగమైన రెండో ఉప జలాశయం నుంచి మైదుకూరు పుర వాసులకు తాగునీరు అందించేలా 2019లో రూ. 89.76 కోట్లు మంజూరయ్యాయి. అదే ఏడాది ఫిబ్రవరి 20న అప్పటి మంత్రి సి.ఆదినారాయణరెడ్డి శంకుస్థాపన చేశారు. ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే ఎన్నికల కోడ్ రావడంతో పనులు నిలిచిపోయాయి. అనంతరం ప్రభుత్వం మారడంతో గుత్తేదారు వెనుకడుగు వేశారు. ఎమ్మెల్యేగా ఉన్న ఎస్.రఘురామిరెడ్డి జోక్యంతో రెండో ప్యాకేజీ పనులు దక్కించుకున్న అనంతపురానికి చెందిన గుత్తేదారు రూ. 3.11 కోట్ల విలువైన పనులే చేశారు. 2024 ఎన్నికలతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో గుత్తేదారు అర్ధాంతరంగా నిలిపేశారు.

● కూటమి పాలకుల చొరవ: పురపాలకలో తాగునీటి సరఫరాపై ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. తెలుగు గంగ రెండో ఉప జలాశయం ఆధారంగా పుర వాసులకు తాగునీరు అందించే పథకంపై దృష్టి పెట్టారు. రూ. 99.70 కోట్లను అమృత్ పథకం కింద మంజూరు చేయించారు. ఈ పథకం ద్వారా పుర వాసుల దాహార్తి తీరనుంది. సకాలంలో టెండరు ప్రక్రియ పూర్తి చేసి పనులు చేపడితేనే అది సాధ్యం అవుతుంది.

● ట్యాంకులు ఏర్పాటు చేసే ప్రాంతాలు: లింగాలదిన్నె, కేశలింగాయపల్లె, చిన్నయ్యగారిపల్లె, ఎర్రబల్లి, మాబునగర్, పాత మున్సిపల్ కార్యాలయం.

తాగునీటి అవసరం

సంవత్సరం	జనాభా	తాగునీరు (ఎం.ఎల్.డీలలో)
2028	60,885	12.29
2043	76,071	14.84
2058	92,754	17.65

పరీక్ష కేంద్రంలో పరిశీలిస్తున్న వైవీయూ రిజిస్ట్రార్ పద్మ, ప్రొఫెసర్ కృష్ణారావు

బీఈడ్ రెండో సెమిస్టర్ పరీక్షలు ప్రారంభం

మారుతీనగర్, న్యూస్‌టుడే: యోగి వేమన విశ్వవిద్యాలయం అనుబంధ బీఈడీ కళాశాలల్లో రెండో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలను ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా పదమూడు కేంద్రాల్లో నిర్వహిస్తున్నారు. నిర్వహణ తీరును వైవీయూ రిజిస్ట్రార్ పద్మ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ కేఎస్వీ.కృష్ణారావు తనిఖీ చేశారు. కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాల, నాగార్జున మహిళా డిగ్రీ కళాశాల, పలు కేంద్రాల్లో పర్యటించి విద్యార్థుల హాల్‌టికెట్లు, వసతులను పరిశీలించారు. మొదటి రోజు పరీక్షకు మొత్తం 4,551 మంది విద్యార్థులు హాజరైనట్లు తెలిపారు.

మొక్కవోని దీక్షతోనే హరిత గడప

వన మహోత్సవానికి అధికారుల ప్రణాళిక

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే: జీవకోటి మనుగడకు పర్యావరణ పరిరక్షణ ఎంతో అవసరం. ఈ భూమ్మీద స్వచ్ఛమైన గాలి అందకుంటే అనేక వ్యాధులు ప్రబలుతాయి. ప్రాణులు అంతరించే పోయే ప్రమాదం తలెత్తుతుంది. ప్రాణావసరం అయిన పర్యావరణ పరిరక్షణను గత ఐదేళ్లలో వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. మొక్కల పెంపకాన్ని విస్మరించింది. ఉన్న నర్సరీలను మూసేసింది. ప్రస్తుతం కూటమి సర్కారు అధికారం చేపట్టిన తర్వాత పర్యావరణ పరిరక్షణకు చర్యలు చేపట్టింది. పచ్చదనాన్ని మరింత పెంపొందించే లక్ష్యంతో మొక్కల పెంపకాన్ని ఉద్యమంలా చేపట్టనుంది. ఇందుకు అటవీ శాఖ, సామాజిక అడవుల పెంపకం విభాగం ఆధ్వర్యంలో వన మహోత్సవ వారోత్సవాల నిర్వహణకు సిద్ధమైంది. మొత్తంగా 25 లక్షల మొక్కలు నాటించాలని ప్రణాళిక రూపొందించారు.

● ఒకే రోజు నాలుగు లక్షలు: ఈ నెల 5న అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ఒకేరోజు నాలుగు లక్షలు నాటించాలని. . ఆ తర్వాత ఈ క్రతువులో అన్ని వర్గాలను భాగస్వామ్యం చేస్తూ కార్తిక మాసం వరకు కొనసాగించాలని అధికారులు నిర్ణయించారు. తల్లి పేరిట ప్రతిఒక్కరూ ఒక మొక్క నాటి సంరక్షణ బాధ్యతను బిడ్డలకు ఇచ్చేలా అవగాహన కల్పిస్తున్నారు. వచ్చే నెలలో నిర్వహించే మెగా తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం(ఎంపీటీఎం) సందర్భంగా ప్రభుత్వ పాఠశాలల్లోనూ పెద్దఎత్తున నాటేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

● పర్యవేక్షించనున్న అధికారులు: జిల్లా నీటి యాజమాన్య సంస్థ ఆధ్వర్యంలో పండ్ల తోటలు 3,500 ఎకరాల్లో సాగు చేయించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. ఒక్కో ఎకరాకు సగటున వంద మొక్కలు నాటనున్నారు. ఇప్పటికే 2,100 ఎకరాలను గుర్తించారు. రహదారులకు ఇరువైపులా 50 కి.మీగాను 36 కి.మీ మేర ఇప్పటికే సర్వే చేశారు. ఒక కి.మీ రెండు వైపుల అయితే 400, ఒక పక్కన 200 నాటిస్తారు. ప్రభుత్వ బీడు, బంజరు భూముల్లో 50 ఎకరాల్లో పచ్చదనం పెంపొందించాల్సి ఉంటుంది. ప్రభుత్వ కార్యాలయాల్లో 50 ప్రదేశాల్లో పనులు చేయాలి. పూర్వం తోపులు, వనాల తరహాలో జిల్లాలో ఈసారి 25 చోట్ల పల్లె వనాలను తీర్చిదిద్దేలా జిల్లా యంత్రాంగం సన్నద్ధమవుతోంది.

● జిల్లా భౌగోళిక విస్తీర్ణం: 11,22,760 హెక్టార్లు
● అటవీ భూభాగం: 4,03,690 హెక్టార్లు
● వాస్తవంగా ఉండాల్సిన అడవులు: 33 శాతం

తూముకుంటలో బయో గ్యాస్ ప్లాంట్

గాలివీడు, న్యూస్‌టుడే: గత వైకాపా ప్రభుత్వం పరిశ్రమల ఏర్పాటుపై నిర్లక్ష్యం వహించింది. ఇప్పుడు అధికారం చేపట్టిన ప్రభుత్వం.. పెట్టుబడులు రాబట్టేందుకు సిద్ధమైంది. పారిశ్రామికవేత్తలనూ ఆహ్వానిస్తోంది. ఈ క్రమంలో తూముకుంట రెవెన్యూ గ్రామ సమీపంలో బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు రిలయన్స్ సంస్థ ముందుకొచ్చింది. ఈ మేరకు అక్కడి ప్రభుత్వ భూములను రాయచోటి ఆర్డీవో శ్రీనివాసులు బుధవారం పరిశీలించారు. బయో గ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు అవసరమైన భూమి సేకరణ కోసం క్షేత్రస్థాయిలో పర్యటించారు. దస్త్రాలు పరిశీలించి అందుబాటులో భూములున్నట్లు గుర్తించారు.

చరవాణే సేవలకు మన మిత్రుడు

పీలేరు గ్రామీణ, న్యూస్‌టుడే: పరిపాలనలో విప్లవాత్మక మార్పులకు రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ఇప్పటికే అనేక విధానాలు తీసుకొచ్చింది. ప్రస్తుతం చరవాణి లేని జేబులు.. కానరాని చేతులు ఉండటం లేదు. ఈ నేపథ్యంలో చరవాణి సాయంతో పౌర సహాయక సేవలను వినియోగించుకునే అవకాశాన్ని అమలు చేస్తోంది. ఇందుకుగాను మన మిత్ర(వాట్సప్ గవర్నెన్స్)ను 9552300009 నంబరుతో అందుబాటులోకి తెచ్చింది. తద్వారా పౌరులు కార్యాలయాల మెట్లు ఎక్కకుండానే తమ పనులు చక్కబెట్టుకునే అవకాశం కల్పించింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కొన్ని ముఖ్యమైన పౌర సహాయక సేవలను ఓసారి తెలుసుకుందాం...

● ఫిర్యాదుల పరిష్కారానికి చర్యలు: ఏదైనా దీర్ఘకాలికంగా పరిష్కారం కాని సమస్య ఉంటే పీజీఆర్ఎస్ పోర్టల్‌లో పౌరులు ఫిర్యాదు చేయొచ్చు. కలెక్టర్ పరిశీలిస్తారు. సంబంధిత శాఖ అధికారులను క్షేత్రస్థాయిలో విచారించి నివేదిక కోరతారు. తదుపరి సదరు ఫిర్యాదు పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

● విద్యుత్తు వెతలకు చెల్లు: విద్యుత్తు బిల్లుల చెల్లింపు, కొత్త కనెక్షన్లు, సరఫరాలో అంతరాయంపై సేవా నంబరు నమోదు చేసి సహాయం పొందే అవకాశం ఉంది.

● దైవ దర్శనానికి నమోదు: రాష్ట్రంలో ప్రముఖ ఆలయాల్లో దైవ దర్శన టికెట్లకు చరవాణి ద్వారా నమోదు చేసుకోవచ్చు. మన మిత్ర యాప్‌లో సేవల రకాల సమాచారమూ తెలుసుకునే అవకాశం ఉంది. దర్శనం, వసతి, తేదీ ఎంపిక చేసుకోవచ్చు.

● వైద్య సేవలు తెలుసుకోవచ్చు: యాప్‌లో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ, ఆరోగ్య కార్డు ద్వారా అందుబాటులో ఉన్న వైద్య సేవలను ఆధార్ సంఖ్యను నమోదు చేసి తెలుసుకోవచ్చు.

● ఇంటి నుంచే బస్సు టికెట్లు: జిల్లా నుంచి హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, విజయవాడ తదితర మెట్రో నగరాలకు రాకపోకలు ఎక్కువగా సాగిస్తుంటారు. ప్రభుత్వం సూచించిన మన మిత్ర యాప్ ద్వారా ఎక్కడికి వెళ్లాలన్నా ఇంట్లో నుంచే టికెట్లు నమోదు చేసుకోవచ్చు.

● ధ్రువపత్రాలు పొందొచ్చు: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అవసరమైన రెవెన్యూ ధ్రువపత్రాలు పొందొచ్చు. కుటుంబ సభ్యుల ధ్రువపత్రం, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, నీటి పన్ను, టైటిల్ డీడ్, పట్టాదారు పాసుపుస్తకం, వివాహ ధ్రువపత్రం, కంప్యూటరైజ్డ్ అడంగల్, కుల, ఆదాయ ధ్రువపత్రాలు పొందవచ్చు.

● ఆదుకునే పోలీసులు: ఆపద అంటే మొదట గుర్తుకొచ్చేది పోలీసులే. ఎవరైనా అదృశ్యమైనా, ధ్రువపత్రాలు, వస్తువులు పోగొట్టుకున్నా మన మిత్ర యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు. అందుకు ఆధార్, ఇతర వివరాలు నమోదు చేయాల్సి ఉంటుంది.

● పన్నుల వివరాలు: నీటి, ఆస్తి పన్ను, కుళాయి కనెక్షన్లు, మురుగు నీటి సమస్యలు, నిర్మాణాలకు అనుమతులు, నీటి ఛార్జీల బకాయిలు మన మిత్ర ద్వారా తెలుసుకోవచ్చు.

విద్యార్థుల జీవితాలతో వైకాపా చెలగాటం

విశ్వవిద్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు

మారుతీనగర్, న్యూస్‌టుడే: విద్యార్థుల జీవితాలతో గత వైకాపా ప్రభుత్వం చెలగాటమాడిందని.. వైఎస్సార్ ఆర్కిటెక్చర్ విశ్వవిద్యాలయం పేరుతో అనుమతులు లేకుండా నడిపి ఐదు వందల మంది బతుకులను అగమ్యగోచరంగా మార్చిందని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలరాజు విమర్శించారు. కడప నగరం సమీపంలోని విశ్వవిద్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి ఆయన బుధవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వలరాజు మాట్లాడుతూ.. పది రోజుల్లో విద్యా సంవత్సరం పూర్తి కావస్తున్నప్పటికీ విశ్వవిద్యాలయానికి సీవోఏ అనుమతులు లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. ఈ విషయంపై విద్యార్థులు ఆందోళన చెందుతుంటే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వసతి గృహానికి ముందస్తుగా విద్యార్థుల నుంచి డబ్బులు కట్టించుకుని.. ముందస్తు సమాచారం లేకుండా ఇప్పుడు ఖాళీ చేయాలని చెప్పడం ఎంతవరకు న్యాయమని ప్రశ్నించారు. విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పందించి విశ్వవిద్యాలయంపై సమగ్ర విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శులు చంద్ర, అరుణ్, నగర కార్యదర్శి తేజ, విద్యార్థులు పాల్గొన్నారు.

దివ్యాంగుల భవితకు ఏదీ భరోసా!

● అసౌకర్యాల మధ్యనే ప్రత్యేక చిన్నారులు

దివ్యాంగ పిల్లలను గుర్తిస్తున్న జిల్లా అధికారులు

● జిల్లాలో భవిత కేంద్రాలు: 36
● విద్యనభ్యసించే పిల్లలు: 4,852
● ఫిజియోథెరపీ సేవలు అందుకునేది: 310
● ఇంటి వద్ద విద్యనభ్యసించేది: 360

ప్రొద్దుటూరు, న్యూస్‌టుడే: విభిన్న ప్రతిభావంతులకు విద్య, ప్రత్యేక అవసరాలు కల్పించి వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలనే ఉద్దేశంతో భవిత కేంద్రాలను నిర్వహిస్తున్నారు. ఏటా 0 నుంచి 18 ఏళ్ల ప్రత్యేక అవసరాల పిల్లలను అధికారులు గుర్తిస్తుంటారు. ఈ ఏడాది మే 13 నుంచి జూన్ 9వ తేదీ వరకు సర్వే నిర్వహించారు. 277 మంది దివ్యాంగ చిన్నారులను గుర్తించారు. వీరికి సర్కారు అమలు చేసే పలు ప్రయోజనాలు అందించడంతో పాటు ప్రజ్ఞాస్థాయికి తగ్గట్లుగా బోధిస్తారు. అతి తీవ్ర వికలత్వం ఉన్న వారికి ప్రతి శనివారం ఇంటి వద్దనే బోధిస్తారు. అవసరమైన వారికి ఫిజియోథెరపీ సేవలందిస్తారు.

● సొంత భవనాలూ కరవు: జిల్లాలో 36 భవిత కేంద్రాలకు గాను 11 వాటికే సొంత భవనాలున్నాయి. మిగిలినవి కనీస సౌకర్యాల్లేని బడి భవనాల్లో నడుస్తున్నాయి. దీంతో దివ్యాంగ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెద్దముడియం, దువ్వూరు, బి.కోడూరు, బి.మఠం, గోపవరం, చాపాడు, కొండాపురం మండలాల్లోని భవిత కేంద్రాలకు పూర్తిగా భవనాల్లేవు. ఖాజీపేట, బద్వేలు, ప్రొద్దుటూరు, మైదుకూరు, సిద్ధవటం, జమ్మలమడుగు, సి.కె.దిన్నె, అట్లూరు, రాజుపాళెం కేంద్రాలకు మరమ్మతులు చేయాల్సి ఉంది. ఈ విషయమై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు లేవు. ఈ విషయమై జిల్లా భవిత కేంద్రాల సమన్వయకర్త రమణమూర్తి మాట్లాడుతూ.. భవిత కేంద్రాల్లో మానసిక, బధిర, అంధత్వం, శారీరక తదితర 21 రకాల వైకల్యం ఉన్న పిల్లలకు ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు. వారి స్థాయిలకు అనుగుణంగా బోధన, శిక్షణ ఇస్తామని, సర్వేలో గుర్తించిన పిల్లలందరికీ బోధనతో పాటు అన్ని ప్రయోజనాలు కల్పించనున్నట్లు చెప్పారు. సొంత భవనాలు, మరమ్మతులకు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

కడప ఇన్‌ఛార్జి ఎస్ఈగా మధుసూదన్‌రావు

తిరుపతి, న్యూస్‌టుడే: రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ కడప సర్కిల్ ఇన్‌ఛార్జి ఎస్ఈగా తిరుపతి ఈఈ డి.మధుసూదన్‌రావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆ శాఖ ఉన్నతాధికారులు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

శ్రావణ మాస ఉత్సవాలకు పకడ్బందీ ఏర్పాట్లు

సూచనలిస్తున్న గండి ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య

చక్రాయపేట, వేంపల్లె, న్యూస్‌టుడే : జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం గండిక్షేత్రంలో ఈ నెల 26 నుంచి జరగనున్న శ్రావణమాస ఉత్సవాల కోసం పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం గండిలో శ్రావణ మాస ఉత్సవాల ఏర్పాట్లపై ఆలయ కమిటీ ఛైర్మన్ కావలి కృష్ణతేజ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శ్రావణమాసాల్లో గండికి వచ్చే వీఐపీలకు పరిమిత సంఖ్యలో మాత్రమే పాసులివ్వాలని సూచించారు. సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఉత్సవాల సందర్భంగా వాహన పూజలను రద్దు చేయాలన్నారు. గండిలోని హరిత రెస్టారెంట్ నుంచి భూమానంద ఆశ్రమం వరకు ఉన్న కాలువలో పూడికతీత పనులు చేయించాలన్నారు.

(c) eenadu

స్పందనకు వందనం

అక్రమ నిర్మాణాల కూల్చివేత

ఈనాడు, కడప : సీకే దిన్నె మండలం మామిళ్లపల్లెలో ఆక్రమణలను రెవెన్యూ అధికారులు బుధవారం కూల్చివేశారు. వివిధ సర్వే నంబర్ల కింద ఉన్న ప్రభుత్వ రిజర్వ్ భూమిని వైకాపా నేతలు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపట్టారు. ఈ దందాపై 'ఈనాడు'లో మంగళవారం 'నీకింత.. నాకెంత!' శీర్షికతో ప్రచురితమైన కథనంపై తహసీల్దార్ నాగేశ్వరావు స్పందించారు. అధికారుల బృందంతో కలిసి నిర్మాణాల వద్దకు చేరుకుని యంత్రం ద్వారా గోడలను కూల్చివేసి ఆక్రమితులకు హెచ్చరికలు చేశారు. ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

యంత్రంతో కూల్చివేత పనులు

బహిరంగ ప్రకటన

సమాచార నిమిత్తం ఇందుమూలముగా తెలియజేయునది ఏమనగా M/s అదీప్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్‌చే అభివృద్ధి చేయబడుతున్న ప్లాటు నెం.27, వైయస్ఆర్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్, కొప్పర్తి, యాదవపురం గ్రామం, వల్లూరు రెవెన్యూ మండలం వైయస్ఆర్ కడప జిల్లా ఆంధ్రప్రదేశ్- 516003 వద్ద నిర్మించబోయే సింథటిక్ ఆర్గానిక్ కెమికల్ మాన్యుఫ్యాక్చరింగ్ యూనిట్ డెవలప్‌మెంట్ చేయుటకు 14, సెప్టెంబర్,2006వ తేదీ నాటి EIA నోటిఫికేషన్ S.O.నెం.1533 ద్వారా మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ ఛేంజ్ వారిచే పర్యావరణ క్లియరెన్స్ ఇవ్వబడినది.
సదరు పర్యావరణ క్లియరెన్స్ యొక్క కాపీ ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి వద్ద లభించును మరియు MoEFCC వెబ్‌సైట్ www.parivesh.nic.in నందు కూడా చూడవచ్చును.

M/s అదీప్ లైఫ్ సైన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్
అధీకృత సంతకందారుడు

నవోదయం... భవితకు శుభోదయం

ఇరు జిల్లాల్లో మెరుగైన సౌకర్యాలు

6వ తరగతిలో ప్రవేశాలకు అవకాశం

మదనపల్లె విద్య, న్యూస్‌టుడే : కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే నవోదయ విద్యాలయంలో 2026-27లో 6వ తరగతిలో ప్రవేశానికి గాను విద్యాలయ సమితి వారు ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభించారు. ఇప్పటికే ప్రభుత్వంచే గుర్తింపు పొందిన ప్రైవేటు, ఎయిడెడ్, ప్రభుత్వ విద్యా సంస్థల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడం ప్రారంభించారు. నవోదయ విద్యాలయం వారు నిర్వహించే ప్రవేశపరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తే 6వ తరగతి నుంచి 12వ తరగతి వరకు మంచి విద్యను అభ్యసించవచ్చు. క్రమశిక్షణతో పాటు ఆరోగ్యకరమైన వాతావరణంలో ఉంటూ చదువుకునే వెసులుబాటు ఉంటుంది. అందుకే నవోదయ విద్యాలయానికి ప్రతి సంవత్సరం పోటీ పెరుగుతోంది. ఉమ్మడి కడప జిల్లాలో రాజంపేట మండలం ఆకెపాడులో, ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మదనపల్లెలో నవోదయ విద్యాలయాలు ఉన్నాయి. వీటి పరిధిలో ఒక్కోచోట 80 సీట్ల భర్తీకి గాను ప్రతి ఏటా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులో సీటు పొందేందుకు ఏటా 6 వేల నుంచి 7 వేల మంది విద్యార్థులు పోటీ పడతారు. అందులో అత్యధిక మార్కులు సాధించేవారికే సీటు లభ్యం అవుతుంది. అందుకే ఇప్పటి నుంచే దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు దృష్టి పెడితే సీటు సాధించడం సులభం అవుతుందని నిపుణులు చెబుతున్నారు.

ఎన్‌సీసీలో శిక్షణ తీసుకుంటున్న నవోదయ విద్యార్థినులు

విద్యాలయంలో ఉన్న సౌకర్యాలు ఇవే..

మదనపల్లె జవహర్ నవోదయ విద్యాలయం పట్టణానికి మూడు కిలోమీటర్ల దూరంలో ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంది. అత్యాధునిక ల్యాబ్ సౌకర్యాలు, విశాలమైన గదులు, కంప్యూటర్ ల్యాబ్‌తో పాటు భౌతిక, జీవశాస్త్రం ల్యాబ్‌లు, దీంతో పాటు అటల్ టింకరింగ్ ల్యాబ్ అందుబాటులో ఉన్నాయి. వీటి ద్వారా అధునాతన నైపుణ్యాలను పెంచుకోవచ్చు. ఆవరణలో విశాలమైన క్రీడా మైదానం, రన్నింగ్‌ట్రాక్ ఉన్నాయి. ఏటా విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొని అత్యధిక బహుమతులు సాధిస్తున్నారు. ప్రతి విద్యార్థి ఏదో ఒక ఆటలో రాణించేలా శిక్షణ ఇస్తున్నారు. ఎన్‌సీసీ, స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. అలాగే విద్యార్థులకు నృత్యం, సంగీతంలో శిక్షణ ఇచ్చి కళా ఉత్సవ్ పేరుతో వివిధ పోటీల్లో పాల్గొనేలా నైపుణ్యాలు పెంచుతున్నారు. దక్షిణ, అవంతి ఫౌండేషన్ సహకారంతో ఐఐటీ పరీక్షలకు సన్నద్ధం చేసేందుకు పేద విద్యార్థులకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నారు. అలాగే ఖాన్ అకాడమి వారు గణితంలో విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఆన్‌లైన్ ద్వారా శిక్షణ ఇస్తున్నారు. త్రిభాషా సూత్రం ద్వారా అంటే ఆంగ్లం, హిందీ, తెలుగు ద్వారా విద్యార్థులకు విద్యాబోధన ఉంటుంది. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో బోధన అందిస్తున్నారు. అమ్మాయిలకు, అబ్బాయిలకు ప్రత్యేకమైన వసతి గృహాలు, డార్మెటరీలు అందుబాటులో ఉన్నాయి. అలాగే విద్యార్థులకు పౌష్టికాహారం అందించడంతో పాటు స్థానికంగా పండించే కూరగాయలను వినియోగిస్తున్నారు. ఆయుర్వేద మొక్కలు పెంచుతున్నారు. గణిత గార్డెన్ అందుబాటులో ఉంది. చిత్రలేఖనంలోనూ విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. నవోదయ విద్యాలయంలో సీటు సాధిస్తే ఏడేళ్ల పాటు ఉచిత విద్యతో పాటు వసతి, దుస్తులు, పుస్తకాలు, బ్యాగులు అన్నీ ప్రభుత్వం నుంచే అందిస్తారు.

ఈ నెల 29 వరకు గడువు

విద్యాలయంలో 6వ తరగతిలో ప్రవేశానికి గాను ప్రస్తుతం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ నెల 29వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. ఈ ఏడాది డిసెంబరు 13వ తేదీన ప్రవేశ పరీక్ష ఉంటుంది. గ్రామీణ విద్యార్థులకు 75 శాతం సీట్లు, పట్టణ ప్రాంతాల వారికి 25 శాతం సీట్లు కేటాయించడం జరుగుతుంది. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు http:/// cseitems.rcil.gov.in/nvs వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

\- ఎం.గీత, ప్రిన్సిపల్, నవోదయ విద్యాలయం, మదనపల్లె

విద్యారంగంలో సమస్యలా?

ఈనాడు ఆధ్వర్యంలో డీఈవోతో ఫోన్‌ఇన్ నేడు

జిల్లాలోని పాఠశాలల్లో వసతుల లేమి, నిర్వహణ సమస్యలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాఠశాల యాజమాన్యాల నుంచి ఎదుర్కొంటున్న ఇబ్బందులు, నాణ్యమైన విద్య అందేందుకు ఎదురవుతున్న వెతలు, ఉపాధ్యాయుల కొరత తదితర సమస్యలను డీఈవో షంషుద్దీన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసేందుకు 'ఈనాడు మీతోడు' మీకు అండగా నిలుస్తోంది. విద్యారంగ సమస్యలను నేరుగా డీఈవో దృష్టికి తీసుకెళ్లే అవకాశం కల్పిస్తోంది. ఇందుకు మీరు చేయాల్సిందల్లా దిగువ తెలిపిన నంబర్‌కు ఫోన్ చేయడమే.

\- న్యూస్‌టుడే, కడప విద్య

92469 40687 | తేదీ : గురువారం 03-7-2025 | సమయం : ఉదయం 10 గంటల నుంచి 11 వరకు

పేద విద్యార్థులకు వరం మహా గురుకులం

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే : పేద విద్యార్థులకు వరం మహా గురుకులమని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. బుధవారం తోట్లపల్లె సమీపంలోని మహా గురుకులం విద్యాలయంలో తరగతులను ఎస్పీ అశోక్‌కుమార్, ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. తరగతి గదులు, వసతి సముదాయాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ అత్యాధునిక గురుకుల పాఠశాల పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు రూపుదిద్దుకుందన్నారు. వెయ్యి మంది విద్యార్థులకు వసతి కలిగి ఉందన్నారు. ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ మాట్లాడుతూ రూ.21 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టారన్నారు. ప్రస్తుతం కలెక్టర్ చొరవతో పెండింగ్‌లో ఉన్న రహదారులు, ఆట స్థలం, పలు సుందరీకరణ పనులను పూర్తి చేశామన్నారు. బ్రహ్మంగారిమఠం అభివృద్ధికి కలెక్టర్ ప్రత్యేకంగా రూ.6 కోట్లు మంజూరుకు హామీ ఇచ్చారని తెలిపారు. పలుగురాళ్లపల్లె రెవెన్యూ పొలంలో 30 ఎకరాల భూమిని జవహర్ నవోదయ పాఠశాలకు కేటాయించడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో ఆర్‌డీఓ చంద్రమోహన్, డీఈఓ షంషుద్దీన్, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, తెదేపా మండల అధ్యక్షుడు సుబ్బారెడ్డి, జిల్లా అధికారులు, మండల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులు, అధికారులతో కలిసి భోజనం చేస్తున్న కలెక్టర్ శ్రీధర్

ఎంఈవోలపై చర్యలు తీసుకోకపోతే 9న ధర్నా

కడప విద్య, న్యూస్‌టుడే : ఇటీవల విద్యాశాఖ చేపట్టిన సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయ బదిలీల మాన్యువల్ కౌన్సెలింగ్‌లో ప్రిఫరెన్షియల్ కేటగిరీలో కేటాయించాల్సిన స్థానాల కన్నా అధికంగా కేటాయించి ఇష్టానుసారంగా వ్యవహరించిన కడప, ప్రొద్దుటూరు ఎంఈవోలపై చర్యలు తీసుకోవాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయకుమార్, పాలెంమహేష్‌బాబు డిమాండ్ చేశారు. దీనిపై స్పందించకపోతే ఈ నెల 9న జిల్లా డీఈవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తామన్నారు. బుధవారం డీఈవో షంషుద్దీన్‌ను కలిసి ధర్నా నోటీసు అందజేశారు. బదిలీల్లో కడప, ప్రొద్దుటూరు ఎంఈవోలు వ్యవహరించిన తీరుతో ఉపాధ్యాయులకు తీవ్ర నష్టం జరిగిందన్నారు. బదిలీల కౌన్సెలింగ్‌లో కడప, ప్రొద్దుటూరు మండలాల పరిధిలో నిబంధనల కన్నా ఎక్కువ పోస్టులను ప్రిఫరెన్షియల్ కేటగిరిలో చూపించి జనరల్ కేటగిరిలో ఉన్న వారికి తీవ్ర అన్యాయం చేశారన్నారు.

అధిక విద్యుత్తు బిల్లుతో అవాక్కు

కమలాపురం, న్యూస్‌టుడే : పట్టణంలోని తెలుగు వీధికి చెందిన గంగాదేవి ఇంటికి ప్రతి నెల రూ.200 నుంచి రూ.500 లోపే విద్యుత్తు బిల్లు వచ్చేది. ఈ నెలలో ఏకంగా రూ.21,932 బిల్లు రావడంతో కుటుంబ సభ్యులు అవాక్కయ్యారు. విద్యుత్తు అధికారులు స్పందించి బిల్లు మొత్తాన్ని సరి చేసి సాధారణ బిల్లు వచ్చేలా చూడాలని కోరుతున్నారు.

12, 13 తేదీల్లో బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపికలు

కడప ఏడురోడ్లు : ఉమ్మడి కడప జిల్లా స్థాయి బ్యాడ్మింటన్ ఎంపికలను ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు జిల్లా బ్యాడ్మింటన్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ సింగం భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి తెలిపారు. అండర్-15, 17 విభాగాలకు చెందిన బాలబాలికలకు ఈ నెల 12న కడప డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో, 13న ప్రొద్దుటూరులోని జార్జ్‌క్లబ్‌లో అండర్-11, 13 విభాగాలకు ఎంపికలు జరుగుతాయన్నారు. బాల బాలికలకు సింగిల్స్, డబుల్స్ విభాగాల్లో వేర్వేరుగా పోటీలు నిర్వహించి జిల్లా జట్టును ఎంపిక చేస్తామన్నారు. ఎంపికల్లో పాల్గొనేవారు ఈ నెల 10వ తేదీ సాయంత్రం లోపు తమ పేర్లను 94401 07080, 94402 23908 నంబర్లకు పంపించాల్సి ఉంటుందన్నారు. డబుల్స్ విభాగంలో పాల్గొనే వారు తమ జోడీ పేరును తప్పనిసరిగా జతచేసి పంపించాల్సి ఉంటుందన్నారు. సింగిల్స్ విభాగంలో మొదటి రెండు స్థానాల్లో నిలిచిన క్రీడాకారులు, డబుల్స్ విభాగంలో ప్రథమ స్థానం సాధించిన జోడీ మాత్రమే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హులన్నారు.

కడప-నెల్లూరు క్రికెట్ మ్యాచ్ డ్రా

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : ఏపీఏ అండర్-19 పురుషుల మల్టీ డే క్రికెట్ పోటీల్లో భాగంగా బుధవారం కడప-నెల్లూరు జట్ల మధ్య జరిగిన క్రికెట్ మ్యాచ్ డ్రాగా ముగిసింది. 144 పరుగుల ఓవర్‌నైట్ స్కోరుతో మూడో రోజు (బుధవారం) బ్యాటింగ్ ప్రారంభించిన నెల్లూరు జట్టు 8 వికెట్ల నష్టానికి 419 పరుగుల వద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. కారుణ్య ప్రసాద్ 103, సయ్యద్ షాహుల్ హమీద్ 80, రోహిత్ 73, లోకేశ్ 59 పరుగులతో సత్తా చాటారు. కడప బౌలర్లలో ఆర్థిక్‌రెడ్డి 4, చరణ్ 3 వికెట్లు తీసుకున్నారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు మూడో రోజు మ్యాచ్ ముగిసే సమయానికి 13 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 59 పరుగులు చేసింది. దీంతో మ్యాచ్ డ్రాగా ముగిసింది. తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కడప జట్టుకు 3 పాయింట్లు రాగా.. నెల్లూరు జట్టుకు ఒక పాయింట్ లభించింది.

కారుణ్య ప్రసాద్

ఆర్థిక్‌రెడ్డి

మహిళతో దురుసు ప్రవర్తన

● కానిస్టేబుల్ సస్పెన్షన్

కడప నేరవార్తలు, న్యూస్‌టుడే : కడప ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న ఉత్తమ్‌కుమార్ ఓ మహిళతో దురుసుగా వ్యవహరించడంతో బాధితురాలు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. ఎస్పీ విచారణ చేపట్టి కానిస్టేబుల్ తప్పు చేసినట్లు గుర్తించారు. ఈ మేరకు ఆయనను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఆయనపై గతంలోనూ పలు ఆరోపణలున్నాయి.

అత్యాచారం కేసులో ఇద్దరి అరెస్ట్

దువ్వూరు, న్యూస్‌టుడే : దువ్వూరు మండలం చెందిన ఓ యువతిపై అత్యాచారం చేసిన కేసులో ఒక మైనర్ బాలుడు, మరో యువకుడిని బుధవారం అరెస్టు చేసినట్లు ఖాజీపేట సీఐ మోహన్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల మేరకు.. ఒక మైనర్ బాలుడు, మరో యువకుడు ఓ యువతితో కోలాటం నేర్చుకునే క్రమంలో పరిచయం ఏర్పరుచుకున్నారు. ఆ యువతిపై అత్యాచారం చేసి వీడియో తీశారు. ఆ వీడియో బహిర్గతం చేస్తామని చెప్పి బెదిరింపులకు పాల్పడుతూ పలుమార్లు అత్యాచారం చేశారు. బాధిత యువతి, కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గత నెల 26న దువ్వూరు ఎస్ఐ వినోద్‌కుమార్ కేసు నమోదు చేశారు. ఈ కేసు దర్యాప్తు చేపట్టి నిందితులైన ఓ బాల నేరస్థుడు, ఓ యువకుడిని గుడిపాడు క్రాస్ వద్ద అరెస్టు చేసి కోర్టుకు హాజరు పరచగా రిమాండు విధించినట్లు సీఐ తెలిపారు.

ANDHRA PRADESH SOLAR POWER CORPORATION PVT LTD
(A Joint venture company of Government of A.P and Government of India)
e - Procurement Tender Notice
APSPCL invites tender for the work "Kadapa UMSP(1000 MW) – Completion of Balance works for the Community Hall (Open shed) at S.Uppalapadu Village of Jammalamadugu Mandal of Kadapa Dist. A.P" Approximate Value of Work Rs. 36.07 Lakh. Schedule Available Date & Time: 02.07.2025 from 05.00 PM. For details visit: www.apspcl.ap.gov.in (or) www.apeprocurement.gov.in

శ్రీశ్రీశ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం
గండిక్షేత్రము, గండి (గ్రామము), చక్రాయపేట (మం), వై.ఎస్.ఆర్. కడప జిల్లా, ఫోన్ : 9676661801, e-mail aceosrigandiveeranjaneyaswamy@gmail.com

"రెండవ పర్యాయము" సీల్డ్ టెండరు ప్రకటన

శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానము, గండిక్షేత్రము నందు శ్రావణమాస ఉత్సవముల సందర్భముగా 25.07.2025 నుండి 23.08.2025 వరకు [illegible] సీల్డ్ టెండర్ల యందు పాల్గొనుటకు ఆసక్తి గల టెండరుదారులు సదరు హక్కులకు సంబంధించిన టెండరు షెడ్యూలు దేవస్థానము కార్యాలయము పనివేళల యందు 03.07.2025వ తేదీ నుండి 07.07.2025 సాయంత్రం 5.00 గంటలలోపు తీసుకొని, 08.07.2025వ తేదీన ఉదయం 11.00 గంటలకు దేవస్థానము కార్యాలయము నందు ఉంచిన టెండరు బాక్స్ నందు సీల్డ్ టెండర్లు వేయవలెను. మిగతా వివరములకు దేవస్థాన కార్యాలయము నందు సంప్రదించవలెను.

చైర్మన్ మరియు పాలకమండలి సభ్యులు | సహాయ కమిషనరు & కార్యనిర్వహణాధికారి

ఎర్రగుంట్లలో దారుణ హత్య

ఎర్రగుంట్ల, న్యూస్‌టుడే : ఎర్రగుంట్లలోని మార్కెట్‌యార్డులో బుధవారం షేక్ షేక్షావలి (40) దారుణహత్యకు గురయ్యారు. ఎర్రగుంట్ల పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కడప పట్టణం మాసాపేటకు చెందిన షేక్ అజీజ్‌బీ, బీబీజాన్ దంపతులకు నలుగురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. రెండో కుమారుడు షేక్ షేక్షావలి భవన నిర్మాణ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం ఇంటి వద్ద నుంచి వెళ్లిన అతను తిరిగి రాలేదు. ఎర్రగుంట్లలోని మార్కెట్ యార్డులో వ్యక్తి మృతి చెంది ఉన్నట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు విచారణ చేసి కడప చెందిన షేక్ షేక్షావలిగా గుర్తించారు. పరిసరాలను పరిశీలించగా రాళ్లతో కొట్టి హత్య చేసినట్లు ఆనవాళ్లను గుర్తించారు. హత్యకు గల కారణాలపై పోలీసులు విచారణ చేస్తున్నారు. క్లూస్ టీం సభ్యులు నమూనాలు సేకరించారు. ఘటనా స్థలాన్ని జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఎర్రగుంట్ల సీఐ నరేశ్‌బాబు పరిశీలించారు. షేక్షావలి సోదరుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న జమ్మలమడుగు డీఎస్పీ వెంకటేశ్వరరావు, ఎర్రగుంట్ల సీఐ నరేశ్‌బాబు

కారు అదుపు తప్పి ఒకరి మృతి

ముద్దనూరు, న్యూస్‌టుడే : ముద్దనూరు - తాడిపత్రి ప్రధాన రహదారిలోని శెట్టివారిపల్లె గ్రామ సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణానికి చెందిన ప్రభాకర్ (29) ఫ్లెక్సీ దుకాణం నిర్వహిస్తున్నారు. అతను సొంత పనిమీద కారులో కడపకు వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో శెట్టివారిపల్లె గ్రామ సమీపాన వాహనం అదుపు తప్పింది. పంట పొలాల్లోకి కారు దూసుకెళ్లి పడిపోవడంతో ప్రభాకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. అతనితో కలిసి ప్రయాణిస్తున్న తేజేశ్వర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. అతనికి 108 సిబ్బంది ప్రథమ చికిత్స చేసి.. ఆసుపత్రికి తీసుకెళ్లారు.

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking
కడప మెయిన్-II బ్రాంచ్ (13190)
సిండికేట్ బ్యాంక్ బిల్డింగ్ 7రోడ్స్, పిబి నెం 47, కడప, వైయస్ఆర్ జిల్లా, ఆంధ్రప్రదేశ్-516001

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, కడప మెయిన్-II బ్రాంచ్ వారికి ఋణగ్రహీతలు: శ్రీమతి రాధిక బండారు, భర్త: యు గౌరి శంకర్, శ్రీమతి మచ్చా ఎర్రమ దేవి, భర్త: బండారు తాండవ కృష్ణ మరియు హామీదారు: శ్రీ బండారు తాండవ కృష్ణ, తండ్రి: లేటు బండారు వెంకట రామయ్య వారు తేది 02-07-2025 నాటికి చెల్లించవలసిన బకాయి రూ.61,82,545.59/- + తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్, కడప మెయిన్-II బ్రాంచ్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఛార్జ్/తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది 22-07-2025 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీతలు & హామీదారులకు తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 22-07-2025, ఉ॥ 10.30 గం. నుండి ఉ॥ 11.30 గం.ల వరకు
రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములుకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 21-07-2025, సా॥ 4.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:
కడప జిల్లా, కడప అర్బన్ సబ్-జిల్లా, కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, కడప సిటీ, వై.యస్.నగర్-1, సర్కార్ పుంజి, డి.నెం. 896/1A, 896/1B, వార్డు నెం. 4 (కొత్త వార్డు నెం. 39), డోరు నెం. 4/508-9, 4/508-10 (కొత్త డోరు నెంబర్లు 39/508-9 & 39-508-10) నందు ఏ.0.02 సెంట్లు 400 చ॥లింకులు లేదా 2.40 సెంట్లు లేదా 116.16 చ॥గ॥ విస్తీర్ణంలోని ఇంటి ఆస్తి యావత్తు. హద్దులు: తూర్పు: డి.నెం.8/582-2 గల పుల్లప్పగారి గోపాల్ ఇల్లు, పడమర: డి.నెం.8/543 గల గొర్ల లలితమ్మ ఇల్లు, ఉత్తరం: రోడ్డు, దక్షిణం: మండపల్లి లక్ష్మయ్య ఇల్లు & ట్యాంక్ బండ్. టైటిల్ హోల్డర్: శ్రీమతి రాధిక బండారు & మచ్చా ఎర్రమ దేవి.

రిజర్వు ధర: రూ. 28,44,000/- **ధరావత్తు సొమ్ము: రూ. 2,84,400/-**

గమనిక: బ్యాంకుకు తెలిసి/తెలియని బకాయిలు/ట్యాక్సులు ఏవైనా ఉన్నచో వేలం కొనుగోలుదారు మాత్రమే వాటిని భరించవలసి ఉంటుంది మరియు చివరి మొత్తం బిడ్డు సొమ్ముకు అది అదనం.
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, కడప ప్రాంతీయ కార్యాలయం, అధీకృత అధికారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించుగలరు. ఫోన్: 79016 26769.
ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com/ హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 02-07-2025, ప్రదేశం: కడప | సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

కెనరా బ్యాంక్ Canara Bank (భారత ప్రభుత్వరంగ సంస్థ) సిండికేట్ Syndicate A Government of India Undertaking
పులివెందుల బ్రాంచ్ (13205)
పర్ణపల్లి రోడ్డు, పులివెందుల, వైయస్ఆర్ కడప, ఆంధ్రప్రదేశ్-516390 & 9346375353

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 లోని 8(6) నిబంధనలతో చదవబడు సెక్యూరిటైజేషన్ & రీకనస్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్టు, 2002 క్రింద స్థిరాస్తుల అమ్మకానికి ఇ-వేలం ప్రకటన.

సెక్యూర్డ్ క్రెడిటార్ అయిన కెనరా బ్యాంక్, పులివెందుల బ్రాంచ్ వారికి ఋణగ్రహీతలు: శ్రీ సూలి సిద్ధారెడ్డి (ఋణగ్రహీత), తండ్రి: సిద్ధారెడ్డి, శ్రీమతి సూలి పుల్లమ్మ (ఋణగ్రహీత), భర్త: సిద్ధారెడ్డి మరియు హామీదారు(లు): శ్రీ రాజుల పద్మనాభ రెడ్డి (హామీదారు), తండ్రి: ఆర్. లింగారెడ్డి మరియు శ్రీ సూలి హరికృష్ణ రెడ్డి (హామీదారు), తండ్రి: ఎస్ సిద్ధారెడ్డి, వారు తేది 30-06-2025 నాటికి చెల్లించవలసిన బకాయి రూ.31,23,628.74/- + తదుపరి వడ్డీ, ఖర్చులు మరియు ఛార్జీలు కలిపి మొత్తమును రాబట్టుకొనుటకు కెనరా బ్యాంక్, పులివెందుల బ్రాంచ్ అధీకృత అధికారిచే నిర్మాణాత్మక/భౌతిక స్వాధీనం చేసుకున్న, సెక్యూర్డ్ క్రెడిటార్‌కు ఛార్జ్/తనఖాపెట్టిన దిగువ వివరించిన స్థిరాస్తిని తేది 22-07-2025 న "ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా" మరియు "అక్కడ ఏమున్నదో అది" అనే ప్రాతిపదికన విక్రయించబడునని ప్రజానీకానికి మరియు ముఖ్యంగా పైన తెలిపిన ఋణగ్రహీతలు & హామీదారులకు తెలియజేయడమైనది.

ఇ-వేలం తేది & సమయం: 22-07-2025, ఉ॥ 10.30 గం. నుండి ఉ॥ 11.30 గం.ల వరకు
రిజర్వు ధరలో 10% ధరావత్తు సొమ్మును M/s. పిఎస్‌బి అలియన్స్ ప్రైవేట్ లిమిటెడ్ (baanknet) పోర్టల్ యొక్క ఇ-వ్యాలెట్‌లో నేరుగా గాని లేదా ఆ పోర్టల్‌లో చలానా జెనరేట్ చేసుకొని చలాన్‌లోని ఖాతా వివరములుకు ధరావత్తును RTGS/NEFT ద్వారా తేది: 21-07-2025, సా॥ 4.00 గం.ల లోపుగా పొందుపరిచి జమచేయాలి.

ఒకవేళ ఎన్‌కంబ్రెన్స్‌లు ఏమైనా ఉన్నచో వాటితో కలిపి స్థిరాస్తి వివరములు:
1. కడప జిల్లా, పులివెందుల సబ్-జిల్లా, పులివెందుల మున్సిపాలిటీ ఏరియా, పులివెందుల గ్రామ ఫీల్డ్స్, ప్రభుత్వ మెట్ట, సర్వే నెం.232/3 మరియు 234/2 లో తూర్పు నుండి పడమరకు 18.288 మీ॥, ఉత్తరం నుండి దక్షిణంకు: 3.657 మీ॥, స్థలానికి హద్దులు: తూర్పు: దొడ్డి రస్తా, పడమర: రోడ్డు, ఉత్తరం: 18వ ప్లాట్, దక్షిణం: 12వ ప్లాట్ (నాగన్న).
2. కడప జిల్లా, పులివెందుల సబ్-జిల్లా, పులివెందుల మున్సిపాలిటీ ఏరియా, పులివెందుల గ్రామ ఫీల్డ్స్, సర్వే నెం. 234/2 మరియు 232/3 లో తూర్పు నుండి పడమరకు 18.288 మీ॥, ఉత్తరం నుండి దక్షిణంకు: 3.657 మీ॥, 12వ ప్లాట్ స్థలానికి హద్దులు: తూర్పు: దొడ్డి రస్తా, పడమర: రోడ్డు, ఉత్తరం: 13వ ప్లాట్, దక్షిణం: 7వ ప్లాట్. గంగిరెడ్డి ఫ్యాక్టరీ నుండి సగరిగుట్టకు ½ కిలోమీటర్ దూరం. ఉత్తరం X దక్షిణం: 35 అ॥లు లేదా 10.663 మీ॥లు. టైటిల్ హోల్డర్ పేరు: శ్రీమతి సూలి పుల్లమ్మ.

రిజర్వు ధర: రూ. 29,70,000/- **ధరావత్తు సొమ్ము: రూ. 2,97,000/-**

గమనిక: బ్యాంకుకు తెలిసి/తెలియని బకాయిలు/ట్యాక్సులు ఏవైనా ఉన్నచో వేలం కొనుగోలుదారు మాత్రమే వాటిని భరించవలసి ఉంటుంది మరియు చివరి మొత్తం బిడ్డు సొమ్ముకు అది అదనం.
అమ్మకానికి సంబంధించిన సవివరమైన నియమ నిబంధనల కొరకు కెనరా బ్యాంక్ వెబ్‌సైట్ www.canarabank.com లో ఏర్పాటు చేసిన "ఇ-వేలం" లింక్‌ను రిఫర్ చేయండి లేదా కెనరా బ్యాంక్, పులివెందుల బ్రాంచ్, అధీకృత అధికారిని ఆఫీసు పనివేళలలో సంప్రదించుగలరు. ఫోన్: 7901626769
ఇ-వేలం విధానం కొరకు సర్వీసు ప్రొవైడర్‌ను సంప్రదించండి: మెస్సర్స్ పిఎస్‌బి అలయన్స్ (baanknet), వెబ్‌పోర్టల్ https://baanknet.com/ హెల్ప్‌డెస్క్: 8291220220, ఇ-మెయిల్: support.baanknet@psballiance.com

తేది: 02-07-2025, ప్రదేశం: కడప | సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

అంత్యక్రియలకు వెళ్లి వచ్చేలోగా దోచేశారు

సిద్దవటం, న్యూస్‌టుడే : మాధవరం-1 పరిధిలోని రోడ్డు నంబరు-10 వీధిలో ఉన్న మోదుగుల నరసింహులు ఇంట్లో మంగళవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు బంగారు నగలు, నగదు, మరికొన్ని వస్తువులు అపహరించారు. నరసింహులు జీవనోపాధి నిమిత్తం గల్ఫ్‌కు వెళ్లారు. ఆయన తండ్రి నరసింహులు ఆదివారం ఉదయం మాధవరం-1లో మృతి చెందారు. వీరి స్వగ్రామమైన అన్నమయ్య జిల్లా పొత్తపిలో అంత్యక్రియలు నిర్వహించాలని నరసింహులు భార్య లక్ష్మీప్రసన్న ఇంటికి తాళం వేసి మృతదేహాన్ని పొత్తపికి తీసుకెళ్లారు. తండ్రి మృతి చెందిన సమాచారాన్ని తెలుసుకున్న నరసింహులు సోమవారం స్వగ్రామానికి వచ్చారు. అదే రోజు తండ్రి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. బుధవారం మాధవరం-1లోని నరసింహులు ఇంటి తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించిన స్థానికులు ఆయనకు ఫోన్ చేసి సమాచారం అందించారు. వెంటనే ఆయన ఇంటికి వచ్చి బీరువాను పరిశీలించగా అందులోని ఎనిమిది తులాల బంగారు నగలు, రూ.30 వేల నగదు, ఒక చరవాణి చోరీకి గురైనట్లు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై మహమ్మద్ రఫీ, ఏఎస్సై సుబ్బరామచంద్ర ఘటనాస్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి విచారిస్తున్నామన్నారు.

పూడ్చిన మృతదేహాన్ని వెలికితీసి పంచనామా

ఖాజీపేట, న్యూస్‌టుడే : మండలంలోని అప్పనపల్లికి చెందిన శ్రీనివాసులు (50) జూన్ 11న అనుమానాస్పద స్థితిలో (ఉరి వేసుకుని) మృతిచెందాడు. అతనికి ఇద్దరు భార్యలున్నారు. మొదటి భార్య లక్ష్మీదేవి, రెండవ భార్య సునీత. అతను చనిపోయిన రోజున కుటుంబ సభ్యులు మొదటి భార్యకు సమాచారం ఇవ్వకుండానే దహన సంస్కారాలు చేశారు. విషయం తెలుసుకున్న లక్ష్మీదేవి తన భర్త అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అధికారులు విచారణ ప్రారంభించి బుధవారం మధ్యాహ్నం మృతదేహాన్ని తవ్వి పంచనామా నిర్వహించారు. తహసీల్దారు కార్యాలయ సిబ్బంది, సీఐ మోహన్, కడప రిమ్స్ వైద్యులు హాజరై పంచనామా నిర్వహించారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు చేపట్టనున్నట్లు సీఐ తెలిపారు.

అప్పులబాధతో చిరు వ్యాపారి ఆత్మహత్య

రాజుపాళెం, న్యూస్‌టుడే : మండలంలోని వెలవలి గ్రామానికి చెందిన చిన్నబ్బిగాల్ల నాగరాజు (42) మంగళవారం అర్ధరాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు రాజుపాళెం ఏఎస్ఐ సిద్దయ్య తెలిపారు. నాగరాజు, భార్య సుధామణి ప్రొద్దుటూరులో చెరకు రసం (జ్యూస్) బండి రెండు చోట్ల పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు. వాటి ఏర్పాటుకు రుణాలు తీసుకున్నారు. వ్యాపారం లేకపోవడంతో అప్పులు ఎలా చెల్లించాలో అర్థం కావడం లేదని భార్యతో మదనపడుతుండేవాడు. అప్పులతో సతమతవుతున్న క్రమంలో మంగళవారం అర్ధరాత్రి భార్య, ఇద్దరు పిల్లలు నిద్రపోతున్న సమయంలో మరో గదిలోకి వెళ్లి ఉరి వేసుకుని నాగరాజు ఆత్మహత్య చేసుకున్నాడు. ఉదయం భార్య సుధారాణి గుర్తించి కేకలు వేయడంతో ఇరుగు పొరుగు వారు వచ్చి వేలాడుతున్న నాగరాజు శవాన్ని దించారు. వారికి ఇద్దరు కుమారులు.. ఒకరు 8, మరొకరు 3వ తరగతి చదువుతున్నారు.

నాగరాజు (పాత చిత్రం)

మృతదేహంతో జాతీయ రహదారిపై నిరసన

బ్రహ్మంగారిమఠం, న్యూస్‌టుడే : మండలంలోని బద్వేలు - మైదుకూరు జాతీయ రహదారిలోని డి. అగ్రహారం వద్ద రహదారిపై బి.కోడూరు మండలం, గుంతపల్లె గ్రామస్థులు మృతదేహంతో బుధవారం నిరసన తెలిపారు. గత ఆదివారం మైదుకూరు, సర్వాయపల్లె రోడ్డులో ఉన్న బైపాస్ రోడ్డు వద్ద జరిగిన కాంక్రీట్ మిల్లర్ ప్రమాదంలో జయరామిరెడ్డి తీవ్ర గాయాలై చికిత్స పొందుతూ మృతి చెందారు. కాంక్రీట్ మిల్లర్ ఓ రహదారుల నిర్మాణం చేపడుతున్న కంపెనీకి చెందినది. మృతుడి భార్య, బంధువులు బుధవారం కంపెనీ సమీపంలో రహదారిపై మృతదేహాన్ని అంబులెన్స్‌లో ఉంచి పరిహారం ఇవ్వాలని బంధువులు రహదారిపై బైఠాయించారు. వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి. వెంటనే మైదుకూరు సీఐ రమణారెడ్డి బద్వేల్ సీఐ రాజగోపాల్, పోలీసులు బాధితులతో మాట్లాడి రహదారిపై నిరసన విరమింపజేశారు. అనంతరం మృతుడి బంధువులు మృతదేహాన్ని రహదారుల నిర్మాణ కంపెనీ వద్ద వాహనంలో ఉంచి నిరసన కొనసాగించారు.

బద్వేలు - మైదుకూరు రహదారిపై నిరసన తెలుపుతున్న గుంతపల్లె గ్రామస్థులు

పుస్తకాల వితరణ అభినందనీయం

మారుతీనగర్, న్యూస్‌టుడే : హైదరాబాద్‌కు చెందిన దూరదర్శన్ విశ్రాంత అదనపు డైరెక్టర్ జనరల్ డాక్టర్ రేవూరి అనంతపద్మనాభరావు, విద్యుత్తు శాఖ విశ్రాంత సూపరింటెండింగ్ ఇంజినీర్ కోడూరు పుల్లారెడ్డి సీపీబ్రౌన్ భాషా పరిశోధనా కేంద్రానికి 500 పుస్తకాలను బుధవారం తమ నివాసంలో అందించినట్లు పరిశోధనా కేంద్రం సంచాలకులు ఆచార్య పార్వతి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. వారు అందించిన పుస్తకాల్లో రివర్స్ ఆఫ్ ఇండియా, పుట్టపర్తి రచనల్లో భారతీయ సంస్కృతి, శతజయంతి, సాహితీ మూర్తులు తదితర అమూల్యమైన తెలుగు, ఆంగ్లం గ్రంథాలు ఉన్నాయన్నారు. దాతలను వైవీయూ వైస్‌ఛాన్సలర్ ఆచార్య అల్లం శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ ఆచార్య పద్మ అభినందించారు.


బ్రౌన్ గ్రంథాలయ సిబ్బందికి పుస్తకాలు అందజేస్తున్న అనంతపద్మనాభరావు దంపతులు

మంగపట్నం టోల్ ప్లాజా ప్రారంభం

కొండాపురం, న్యూస్‌టుడే : కడప - తాడిపత్రి ప్రధాన జాతీయ రహదారిలోని ముద్దనూరు నుంచి తాడిపత్రి వరకు ఇటీవల నాలుగు వరుసల రోడ్డు నిర్మించారు. మంగపట్నం వద్ద టోల్‌ప్లాజా ఏర్పాటు చేయగా బుధవారం ఎన్‌హెచ్ ఏఐ (అనంతపురం) పీడీ తరుణ్‌కుమార్, ఏపీడీ మురళీకృష్ణ, డీఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఎన్‌హెచ్ ఏఈ సురేంద్రరెడ్డి ప్రారంభించారు. ఈ మార్గంలో వెళ్తున్న వాహనాలను బట్టి రుసుం వసూలు చేస్తున్నారు. టోల్‌ప్లాజాలో ఎనిమిది వాహనాలు వెళ్లడానికి.. మరో ఎనిమిది రావడానికి.. ఒకే సారి పదహారు వరకు రాకపోకలు సాగించడానికి వీలుగా తీర్చిదిద్దారు.

రైల్వే ఇన్‌స్టిట్యూట్ భవన్ ఎన్నిక ఏకగ్రీవం

కడప ఏడురోడ్లు, న్యూస్‌టుడే : రైల్వే ఇన్‌స్టిట్యూట్ భవన్ ఎన్నిక ఏకగ్రీవమైంది. గత నెల 26న రైల్వే ఇన్‌స్టిట్యూట్ భవన్‌కు ఎన్నిక నిర్వహించారు. మజ్దూర్ యూనియన్ నాయకులు మాత్రమే నామినేషన్ వేయడంతో ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ మేరకు బుధవారం ఏడీఈఎన్ రాధాకృష్ణ, వెల్ఫేర్ ఇన్‌స్పెక్టర్ గంగాదేవి వారికి ఉత్తర్వుల ప్రతిని అందజేశారు.

★ కడప రైల్వే ఇన్‌స్టిట్యూట్ భవన్ సెక్రటరీగా రవికుమార్, సంయుక్త కార్యదర్శిగా నరేష్‌కుమార్, కోశాధికారిగా వెంకటేశ్వరరెడ్డి, ఆపరేటింగ్ కమిటీ సభ్యులుగా లక్ష్మీనారాయణ, చినబాబు, ఎలక్ట్రికల్ కమిటీ సభ్యుడిగా రాజేష్‌కుమార్, కమర్షియల్ కమిటీ సభ్యులుగా గీత, ఇంజినీరింగ్ కమిటీ సభ్యుడిగా అనిల్‌కుమార్, ఎస్అండ్‌టీ కమిటీ సభ్యుడిగా మస్తాన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

కార్యవర్గ సభ్యులకు ఉత్తర్వు ప్రతిని అందజేస్తున్న ఏడీఈఎన్ రాధాకృష్ణ

EENADU Classifieds

AUTO

VEHICLES WANTED

Wanted Vehicle: అశోక్ లేలాండ్ దోస్త్, టాటా ఇంట్రా, టాటా పికప్ వాహనాలు నెలవారి అద్దె ప్రాతిపదికన ప్రముఖ కంపెనీకి వాహనం అద్దెకు కావలెను. సంప్ర: ✆: 63022 27965.

JOBS

పల్లా హాస్పిటల్, 7 రోడ్స్, కడప నందు పనిచేయుటకు X-RAY & C-ARM టెక్నీషియన్స్ కావలెను. Contact: 98490 40153.

కర్నాటక కొప్పళ జిల్లాలో ఉన్న కోళ్ళ ఫారంలో పని చేయుటకు సూపర్‌వైజర్స్ కావలెను, ఫ్యామిలీకి ప్రాధాన్యత ఇవ్వబడుతుంది. Ph: 7829928044

SBI లైఫ్ కడప బ్రాంచ్ నందు అడ్వైజర్‌గా మరియు సేల్స్ ఆఫీసర్ ఉద్యోగ ఉపాధి నియామకాలు జరుగుచున్నవి. విద్యార్హత పదవ తరగతి మరియు ఆ పైన ఉన్నత విద్య కలిగిన వారు అర్హులు. వివరాలకు SBI లైఫ్ మేనేజర్ గారిని సంప్ర: 9491111140.

FACULTY/ TEACHERS

శ్రీ వత్సల్ గురుకుల విద్యాలయ, తిరుపతి CBSE సంస్థలో చేరేందుకు మహిళా వైస్ ప్రిన్సిపాల్ (CBSE పాఠశాల అనుభవం అవసరం), హైస్కూల్ ఇంగ్లీష్ టీచర్, రెసిడెన్షియల్ మహిళా వార్డెన్. Ph: 7997555530, 7997557999, 9000256532.

ఈనాడు క్లాసిఫైడ్స్ 5 లైన్ల ప్రకటన రూ॥ 350/- మాత్రమే Contact: KDP: 9989997626 8008514248 PDTR: 8008597620 ప్రకటనలపై జి.ఎస్.టి. 5% అదనం

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్పు ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసి ప్రకటనకర్తను బ్లాక్-లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

‘సంఘటితమై డిమాండ్లు సాధించుకుందాం’

మైదుకూరు : డ్రైవర్ల సంక్షేమానికి ప్రభుత్వం నుంచి న్యాయమైన కోర్కెల సాధనకు కృషి చేయాలని ఆల్ ఇండియా సేఫ్ డ్రైవర్స్ అసోసియేషన్ సౌత్ ఇండియా ప్రతినిధి అస్గర్‌బాషా పిలుపునిచ్చారు. జిల్లాలో చేపట్టిన డ్రైవర్ల జాతా యాత్ర బుధవారం మైదుకూరుకు చేరుకుంది. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండు ఆవరణంలోని జీపు స్టాండులో నిర్వహించిన సమావేశంలో అస్గర్‌బాషా మాట్లాడారు. ఉభయ రాష్ట్రాల్లో 50 లక్షల మంది డ్రైవర్లు ఉన్నా ఐక్యత లేదన్నారు. అందరినీ సంఘటితం చేసేందుకు జాతా యాత్ర చేపట్టినట్లు పేర్కొన్నారు. డ్రైవర్లకు కాలనీలు ఏర్పాటు చేయాలని, ప్రమాద సమయంలో మృతి చెందితే రూ.20 లక్షల బీమా, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండు చేశారు. జాతీయ రహదారులు, పుణ్యక్షేత్రాలు, పట్టణాల్లో డ్రైవర్ల వసతులతో కూడిన విశ్రాంత భవనాలు నిర్మించాలన్నారు. డిమాండ్ల సాధనకు డ్రైవర్లు సంఘటితం కావాలన్నారు.

ప్రొద్దుటూరు

• ప్రొద్దుటూరు • జమ్మలమడుగు • బద్వేలు • మైదుకూరు

కమిషనర్‌తో ‘వాక్-విత్ ఈనాడు’ నేడు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే : జమ్మలమడుగు పురపాలక సంఘ కమిషనర్ వెంకటరామిరెడ్డి 14వ వార్డు దిగువపట్నం కాలనీలో గురువారం పర్యటించనున్నారు. పట్టణ సమస్యలపై ‘ఈనాడు’-‘న్యూస్‌టుడే’ చేపట్టే పరిశీలనలో భాగంగా పలు వీధుల్లో కమిషనర్ పర్యటించి, ప్రజలతో మాట్లాడనున్నారు. ఈ సందర్భంగా మురుగు కాలువల్లో పూడికతీత పనులు, తాగునీటి సరఫరా, వీధి దీపాలు వెలగకపోవడం, ఇంటింటి చెత్త సేకరణ, రోడ్లు తదితర సమస్యలను మున్సిపల్ కమిషనర్‌కు తెలియజేయవచ్చు.

వెంకటరామిరెడ్డి, కమిషనర్

తేదీ : గురువారం 03-7-2025 | సమయం : ఉదయం 7.00 గంటలకు ప్రారంభం

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM to 1 PM)
ప్రొద్దుటూరు : 9966343431
జమ్మలమడుగు : 9494249241
మైదుకూరు : 8008573447
బద్వేలు గ్రామీణ : 8008573493

?: గత నాలుగు రోజులుగా గ్రామంలో తాగునీటి కష్టాలు పడుతున్నాం. బోరులోని విద్యుత్తు మోటారు మరమ్మతుల కోసం తీసుకెళ్లారే కానీ నేటికీ అమర్చలేదు. నీటి కోసం వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్తున్నాం. - కళ్యాణ్‌కుమార్, విజయనగరం

✓: అల్లాడుపల్లె పంచాయతీలో మొత్తం మూడు మోటార్లు కాలిపోయాయి. వెంటనే మరమ్మతులు చేయించి ప్రజలకు ఇబ్బందులు తొలగిస్తాం. - మహమ్మద్‌వాసిన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ. - న్యూస్‌టుడే, చాపాడు

అసంపూర్తి నిర్మాణాలు.. సమకూరని వసతులు

జమ్మలమడుగు ఎన్టీఆర్ నగర్‌లో వేధిస్తున్న నీటి సమస్య

జమ్మలమడుగు, న్యూస్‌టుడే : జమ్మలమడుగులోని ఎన్టీఆర్ నగర్ అంబవరం లేఅవుట్‌లో వసతులు సమకూరకపోవడంతో లబ్ధిదారులు నిర్మాణాలపై ఆసక్తి చూపడంలేదు. నీటి సమస్య వేధిస్తోంది. మొత్తం 13 బోర్లు ఉండగా ప్రస్తుతం రెండు మాత్రమే పనిచేస్తున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత బీసీ, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు అదనపు సాయం ఇస్తున్నా.. అంబవరం లేఅవుట్లలో నీటి సమస్య కారణంగా లబ్ధిదారులు ముందుకు రావడం లేదు. ముద్దనూరు రోడ్డులోని పాలిటెక్నిక్ కళాశాల వెనకాల అంబవరం లేఅవుట్‌లో 1,621 ఇళ్లకుగాను 590 పూర్తయ్యాయి. లేఅవుట్-1లో 565లో 101 పూర్తయ్యాయి. మొత్తం 2,186 ఇళ్లకు 691 పూర్తికాగా 1,495 వివిధ దశల్లో ఉన్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చాక, ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు అదనపు సాయం ప్రకటించింది. ఎస్టీ లబ్ధిదారులకు రూ.75 వేలు, ఎస్సీ, బీసీలకు రూ.50 ప్రకటించినా ఇళ్ల నిర్మాణాల్లో కదలిక లేదు. జమ్మలమడుగులోని అంబవరం లేఅవుట్‌లో మొత్తం 1,253 లబ్ధిదారులను గుర్తించగా, బీసీలు 1,027, ఎస్సీ 205, ఎస్టీ 21 మంది ఉన్నారు. వీరిలో పది మంది, ఎస్టీ కేటగిరీలో ఇద్దరు మాత్రమే ముందుకు వచ్చారు. అంబవరం లేఅవుట్‌లో ఏడు, లేఅవుట్-1లో నాలుగు బోర్లు వేశారు. కొత్తగా వెన్నాలలో రెండు బోర్లు వేయగా ఇప్పుడు అవి మాత్రమే పనిచేస్తున్నాయి. లేఅవుట్-1లో ఒక్క నీటి మోటారు లేక నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. లే అవుట్ ఊరికి దూరంగా ఉండటంతో రాత్రి వేళల్లో ఇంటి సామగ్రికి రక్షణ కరువు, ఎత్తుకెళ్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. అంబవరం లేఅవుట్‌లో కొన్ని బోర్లు పనిచేయడం లేదని, లేఅవుట్-1లో నీటి సమస్యను త్వరలో పరిష్కరిస్తామని గృహనిర్మాణశాఖ ఇన్‌ఛార్జి ఈఈ రాజశేఖర్ వివరణ ఇచ్చారు.

జమ్మలమడుగు మండలం అంబవరం లేఅవుట్‌లో ముందుకు సాగని నిర్మాణాలు

ఆర్టీసీ ఇంజినీర్ల నిర్లక్ష్యం.. ప్రయాణికులకు గండం

ఆర్టీసీ ఇంజినీర్ల నిర్లక్ష్యం ప్రయాణికులకు దినదిన గండంగా మారింది. బద్వేలు ఆర్టీసీ బస్టాండు ప్రాంగణంలో సెప్టిక్ ట్యాంకు పైపు లీకేజీ కావడంతో నెల రోజుల కిందట గుంతను తవ్వి ఓపెన్ చేసి వదిలేశారు. దానిపై చిరిగి పోయిన ఫ్లెక్సీ మూసి మమ అనిపించారు. అందులో గేదె పడి రాలేక ఇరుక్కుపోయింది. ఆర్టీసీ అధికారులు దాన్ని బయటకు తీసి రక్షించారు. ఇక ప్రయాణికులు ఏమాత్రం ఏమరుపాటుగా ఉన్నా గుంతలో పడిపోయే ప్రమాదం ఉంది. సమస్యను కడప ఆర్టీసీ ఈఈ శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లగా మరమ్మతులు చేపట్టి ప్రమాదకర గుంతను పూడ్చేస్తామన్నారు. - న్యూస్‌టుడే, బద్వేలు

విద్యుత్తు స్తంభం ఏర్పాటు

బద్వేలు, న్యూస్‌టుడే : బద్వేలు పురపాలికలోని శివానగర్‌లో ప్రమాదకర విద్యుత్తు స్తంభాన్ని బుధవారం తొలగించారు. దాని స్థానంలో కొత్త స్తంభాన్ని పురపాలక కమిషనర్ వాకమళ్ల నరసింహారెడ్డి ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. సమస్యలు గుర్తించి.. అక్కడికక్కడే పరిష్కరించి, వాక్ విత్ ఈనాడు బుధవారం ప్రచురితమైన కథనానికి స్పందించి చర్యలు చేపట్టారు. ప్రమాదకర విద్యుత్తు స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రొద్దుటూరు ఈఈగా రామాంజనేయులు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే : ప్రొద్దుటూరు రహదారుల భవనాల శాఖ డివిజన్ ఈఈగా మైల రామాంజనేయులు ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఆయన మార్కాపురం నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. సుదీర్ఘకాలం ఇన్‌ఛార్జి ఈఈగా విజయభాస్కర్‌రెడ్డి కొనసాగారు.. కర్నూలుకు ఆయన్ను బదిలీ చేశారు.

ఎమ్మెల్యే వరదరాజులుకు శస్త్ర చికిత్స



ప్రొద్దుటూరు వైద్యం, న్యూస్‌టుడే : ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులురెడ్డి హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో గుండె శస్త్ర చికిత్స (ఓపెన్ హార్ట్ సర్జరీ) చేయించుకున్నారు. గుండె ఉన్న కారణంగా వైద్యులు బైపాస్ సర్జరీ విజయవంతంగా పూర్తి చేశారని ఆయన కుమారుడు, తెదేపా రాష్ట్ర కార్యదర్శి కొండారెడ్డి బుధవారం తెలిపారు. శస్త్రచికిత్స కారణంగా 10 రోజులు విశ్రాంతి అవసరమని వైద్యులు సూచించినట్లు పేర్కొన్నారు. ఈ మేరకు ఎవరూ ఎమ్మెల్యేను కలిసేందుకు, పరామర్శించేందుకు రావద్దని కోరారు. ఆయన పూర్తిగా కోలుకున్నాక యథావిధిగా అందరితో కలుస్తారని తెలిపారు. అంతవరకు ఆయన ఆరోగ్య విషయాన్ని ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలకు తెలుపుతామన్నారు.

సాహితీ సేవా పురస్కారం ప్రదానం

బద్వేలు గ్రామీణ : బద్వేలు ప్రాంతంలోని కమలకూరు మొల్ల విగ్రహ సన్నిధిలో బుధవారం వివిధ రంగాల్లో అర్ధ శతాబ్దానికి పైగా సేవ చేసిన జింకా సుబ్రహ్మణ్యానికి మొల్ల సాహితీ సేవా పురస్కారాన్ని అందజేశారు. మొల్ల సాహితీ పీఠం అధ్యక్షుడు గానుగపెంట హనుమంతరావు, ప్రొద్దుటూరుకు చెందిన జింకా సుబ్రహ్మణ్యానికి శాలువా, జ్ఞాపిక, పూలమాల, నగదు పురస్కారం అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మనోజ్‌కుమార్, యశోవర్ధనరాజు, మనోహర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభావంతులకు నగదు బహుమతి

విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మునిరాజారెడ్డి, ప్రధానోపాధ్యాయులు ఓబులేశు, సిబ్బంది

ముద్దనూరు, న్యూస్‌టుడే : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో 2024-25 సంవత్సరంలో పదో తరగతిలో ప్రతిభ చూపిన మొదటి 10 మంది విద్యార్థులకు బుధవారం కీర్తిశేషులు గజ్జల చెన్నారెడ్డి, భార్య అచ్చమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు గజ్జల ప్రభాకర్‌రెడ్డి రూ.లక్ష మునిరాజారెడ్డి చేతుల మీదుగా అందజేశారు. మొదటి స్థానం వచ్చిన విద్యార్థికి రూ.25 వేలు, రెండో స్థానంలో నిలిచిన విద్యార్థినికి రూ.20 వేలు, మూడో స్థానం వచ్చిన విద్యార్థికి రూ.15 వేలు, మిగిలిన ఏడుగురికి ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున అందజేశారు.

ఇళ్ల స్థలాల ఆక్రమణపై తహసీల్దారుకు ఫిర్యాదు

ప్రొద్దుటూరు గ్రామీణ : స్థానిక అమృతానగర్-3లోని ప్రధాన రోడ్డు పక్కన 8వ వీధిలో లబ్ధిదారులకు కేటాయించిన పక్కా గృహాల స్థలాలను కామనూరు, నక్కలదిన్నెకు చెందిన ముగ్గురు నాయకులు ఆక్రమించారని స్థానికులు బుధవారం తహసీల్దారు గంగయ్యకు ఫిర్యాదు చేశారు. ఆక్రమణదారులు చదును చేసి పునాదుల కోసం గుంతలు తవ్వారని తెలిపారు. స్పందించిన తహసీల్దారు వీఆర్వోలను పంపించి ఆక్రమ నిర్మాణాలను నిలిపేశారు. లబ్ధిదారులకు కేటాయించిన స్థలాల్లో కట్టడాలు చేపడితే ఆక్రమణదారులపై చర్యలు చేపడతామని ఆయన హెచ్చరికలు చేశారు.

IN THE HON'BLE COURT OF THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR : KADAPA.
DRK No. 199/2023
Between : Shriram Chits (India) Pvt. Ltd., Badvel Branch, Rep. by its Legal Manager cum Authorized person. ... **Disputant**
Vs
S.Md. Rizwan & others ... **Opponents**
1. Shaik Mohammad Rizwan, S/o S.Silar Saheb, aged about 36 years, Muslim, R/at D.No. 15/341, Besthaveedi, Porumamilla, Kadapa District, Cell No. 9849682138.
NOTICE TO OPPONENT No. 1
డిస్ప్యూటెంట్, డిస్ప్యూట్ బాకీ మొత్తం రూ. **3,19,330/-** రాబట్టుకొనుటకు గాను మీపై దాఖలు చేసిన దావాలో 1 వ అపోనెంట్ అయిన మీరు హాజరు అగుటకు గాను **16.07.2025**వ తేదీన వాయిదా ఉన్నది. పై దినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, O/o ది జిల్లా రిజిస్ట్రార్ (R&S), కడప వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు ఉన్న తెలుపుకోనంతట డిస్ప్యూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.
By order of Dy. Registrar of Chits, O/o The District Registrar (R & S), Kadapa.

కార్మికుల వినూత్న నిరసన

నామాలతో కార్మికులు

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే : ప్రొద్దుటూరు పురపాలక సంఘం కార్యాలయ ఇంజినీరింగ్ ఒప్పంద కార్మికులు బుధవారం వినూత్న నిరసన తెలిపారు. వేతనాలు పెంచడంతోపాటు, పలు సౌకర్యాలను అందించాలని కోరుతూ బుధవారం కార్మికులు నామాలు పెట్టుకుని నిరసన తెలిపారు.

రూ.1.04 కోట్లతో నిర్మాణ పనులు మొదలు

ప్రొద్దుటూరు పట్టణం : ప్రొద్దుటూరు కోర్టు ఆవరణలో మరుగుదొడ్డ నిర్మాణ స్థలం చదును పనులు బుధవారం మొదలయ్యాయి. కలెక్టర్ చొరవతో ఈ స్థలంలో నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించడంతో పనులు ప్రారంభించినట్లు ఏఈ వెంకటరమణ తెలిపారు. ఈ స్థలంలో న్యాయశాఖ నిధులు రూ.1.04 కోట్లతో కోర్టులో వివిధ నిర్మాణాలు చేపడతున్నామన్నారు.

పొక్లెయిన్‌తో గుంతలు తవ్వకం

వైకాపా నాయకుల భూదందాపై..

కాశినాయన (కలసపాడు), న్యూస్‌టుడే : కలసపాడు మండలంలోని రెడ్డిపల్లె, గంగాయపల్లె రెవెన్యూ గ్రామాల్లో వైకాపా నాయకులు చేసిన భూదందాపై విచారణ చేసి వెంటనే వాటిని స్వాధీనం చేసుకోవాలని కోరుతూ డీటీ మోహన్‌రాజుకు ఎగువ రామాపురం గ్రామస్థులు వినతి పత్రం అందించారు. వైకాపా నాయకులు కలిసి సుమారు 150 ఎకరాలమేర ప్రభుత్వ భూమిని కబ్జా చేసి జామాయిల్ తోటలు వేశారని ఆరోపించారు. దీనిపై సత్వరం చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఇంటి పన్నులు పెంచాలి

ఇళ్లను పరిశీలిస్తున్న డీపీఓ రాజ్యలక్ష్మి, ఎంపీడీఓ రాధాకృష్ణవేణి

ముద్దనూరు, న్యూస్‌టుడే : పట్టణంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలోని పలు రికార్డులను బుధవారం డీపీఓ రాజలక్ష్మి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పట్టణంలోని పలు కాలనీల్లోని అసెస్మెంట్ ఇళ్లకు సంబంధించి దాదాపు 74 ఇళ్ల కొలతలను డీపీఓ పరిశీలించారు. అయితే ఇళ్ల కొలతలు తప్పుగా ఉండటంతో తదుపరి ఇళ్ల కొలతలను పరిశీలించి రిపోర్ట్‌ను తమకు పంపాలని డిప్యూటీ ఎంపీడీఓ వీరభద్రుడును ఆదేశించారు. పట్టణంలోని ప్రతి ఇంటిని కొలతలు వేసి.. దాని ఆధారంగా పన్నులు పెంచి పంచాయతీకి ఆదాయం వచ్చేలా చూడాలన్నారు. మండలంలోని ఉప్పలూరులో చెత్త సేకరణ గురించి డీపీఓ ఆరా తీశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనరసింహులు, ఉప్పలూరు సర్పంచి పల్లా గంగయ్య, భాజపా నాయకుడు గోపాలకృష్ణయ్య పాల్గొన్నారు.

భర్తపై భార్య దాడి

బద్వేలు, న్యూస్‌టుడే : భర్తపై కట్టుకున్న భార్య మరో నలుగురితో కలిసి దాడి చేసి గాయపరిచిన ఘటన బద్వేలు పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని లక్ష్మీపాళెంలో జరిగింది. పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హరికృష్ణ కూలి పనులు చేసుకుంటూ భార్య లక్ష్మీదేవి ముగ్గురు పిల్లలతో జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ కలహాల కారణంగా మంగళవారం రాత్రి భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. బుధవారం ఫిట్స్ రావడంతో హరికృష్ణను కుటుంబ సభ్యులు బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తుండగా భార్య లక్ష్మీదేవి మరో నలుగురు కలిసి దాడిచేసి గాయపరిచారు. క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. జరిగిన ఘటనపై పట్టణ పోలీసులకు హరికృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

యువకుడికి తీవ్ర గాయాలు

రాజుపాలెం, న్యూస్‌టుడే : మండలంలోని కొర్రపాడులో బుధవారం గ్రామానికి చెందిన యువకుడు మాబు షరీఫ్ రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. అతను ద్విచక్ర వాహనంపై పని నిమిత్తం ప్రొద్దుటూరుకు వెళ్తొస్తుండగా కొర్రపాడు సమీపాన ఏస్సీ కాలనీ వద్ద రాళ్లను ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. 108లో ఆసుపత్రికి తరలించారు.

చౌకబియ్యం పట్టివేత

ప్రొద్దుటూరు నేర వార్తలు, న్యూస్‌టుడే : స్థానిక కొర్రపాడురోడ్డులో ఆటోలో అక్రమంగా తరలిస్తున్న 30 చౌకబియ్యం బస్తాలను పట్టుకున్నట్లు మూడో పట్టణ ఠాణా పోలీసులు తెలిపారు. పట్టణానికి చెందిన వీరాంజనేయులు, గోపాలకృష్ణ, దివాకర్ అక్రమంగా బియ్యం తరలిస్తున్నట్లు గుర్తించారు. ప్రొద్దుటూరు నుంచి మైదుకూరుకు తీసుకెళ్తుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

జూద గృహంపై దాడులు

జమ్మలమడుగు, న్యూస్‌టుడే : మండలంలోని ఒంటిమిద్దె గ్రామ సమీపంలో జూద గృహంపై ఆకస్మికంగా దాడులు నిర్వహించినట్లు పట్టణ సీఐ లింగప్ప తెలిపారు. బుధవారం దాడులు జరిపి రూ.35 వేల నగదు, అయిదు ద్విచక్ర వాహనాలు, ఒక కారు, ఆటో జప్తు చేశామన్నారు. ఏడుగురిని అరెస్టు చేశామని మరో నలుగురు పారిపోయినట్లు చెప్పారు. ఈ దాడుల్లో పట్టణ ఎస్ఐ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగు గంగ జలాలు విడుదల

మైదుకూరు : తాగునీటి అవసరాల కోసం మైదుకూరు సమీప ఎర్రచెరువుకు బుధవారం తెలుగుగంగ రెండో ఉప జలాశయం నుంచి నీరు విడుదల చేశారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఏపీ రవీంద్ర కొబ్బరికాయ కొట్టి నీరు విడుదల కార్యక్రమాన్ని నిర్వహించారు. కాలువలోకి 70 క్యూసెక్కులు నీరు విడుదల చేసినట్లు గంగ అధికారులు తెలిపారు. గతేడాది ఒకసారి చెరువుకు నీరు నింపగా వేసవి దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది మరోసారి నింపారు. పురపాలకలో తాగునీటి సమస్య ఉత్పన్నం కాకుండా నీరు విడుదల చేశారు.

IN THE HON'BLE COURT OF THE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATOR : KADAPA.
DRK No. 171/2023
Between : Shriram Chits (India) Pvt. Ltd., Proddatur Branch, Rep. by its Legal Manager cum Authorized person. ... **Disputant**
Vs
T.Konda Reddy & Others ... **Opponents**
1. Tappeta Konda Reddy, S/o T.Konda Reddy, aged about 58 years, Hindu, R/at D.No. 14/86, Sainathapuram, Mydukur, Kadapa District.
2. Yeturu Gangaiah, S/o Y.Raja Sekhar, aged about 46 years, Hindu, R/at D.No. 1/88, M.Obayapalli Village, Chapadu Mandal, Kadapa District. Working as Village Revenu Officer, Tahsildar Office, Mydukur Village and Mandal, Kadapa District.
NOTICE TO OPPONENT No. 1 & 2
డిస్ప్యూటెంట్, డిస్ప్యూట్ బాకీ మొత్తం రూ. **92,332/-** రాబట్టుకొనుటకు గాను మీపై దాఖలు చేసిన దావాలో 1 & 2 వ అపోనెంట్స్ అయిన మీరు హాజరు అగుటకు గాను **16.07.2025**వ తేదీన వాయిదా ఉన్నది. పై దినం ఉదయం 11.00 గంటలకు డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, O/o ది జిల్లా రిజిస్ట్రార్ (R&S), కడప వారి ఎదుట హాజరై మీ ఆక్షేపణలు ఉన్న తెలుపుకోనంతట డిస్ప్యూట్ మీ పరోక్షమున తీర్మానించబడును.
By order of Dy. Registrar of Chits, O/o The District Registrar (R & S), Kadapa.

ఉత్తర కాలువలో జమ్మ తొలగింపు

పనులను పరిశీలిస్తున్న డీఈ మద్దిలేటి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే : మైలవరం జలాశయం ఉత్తర కాలువ పరిధిలోని ప్రొద్దుటూరు, రాజుపాలెం మండలాల పరిధిలోని ఉప కాలువలపై ఉన్న ముళ్లకంపలు, కాలువల్లో ఉన్న జమ్మ తొలగింపు పనులు చేపట్టారు. టంగుటూరు ఉప కాలువ పరిధిలోని జె.కొత్తపల్లె నుంచి అర్కటవేముల గ్రామం వరకు, పర్లపాడు, వెల్లాల, పగిడాల గ్రామాల వరకు మైనర్ కాలువల్లో ఉన్న కంపలను తొలగించారు. సుమారు 14 కిలో మీటర్ల మేర ఉపకాలువల పరిధి వరకు కంప, జమ్మ తొలగించారు. రూ.12.26 లక్షలతో పనులు చేపట్టారు. చివరి ఆయకట్టు భూములకు నీరందించడమే లక్ష్యంగా పనులు చేపట్టామని డీఈ మద్దిలేటి తెలిపారు. ఈ పనులను ఏఈలు హనుమాన్‌రెడ్డి, లలిత, పల్లా శ్రావణి పర్యవేక్షించారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

ప్రొద్దుటూరు గ్రామీణ : మండలంలోని కొర్రపాడురోడ్డులోని రైస్ మిల్లు బయట ప్రధాన రహదారి పక్కన కంచె లేని నియంత్రిక వద్దకు వెళ్లిన ఆవు విద్యుదాఘాతానికి గురై బుధవారం మృతి చెందింది. సమీపంలోని కేసీ కాలువ వద్ద గోసంరక్షణ సమితి ఆధ్వర్యంలో ఆవును ఖననం చేశారు. ఆ సమితి సభ్యులు నియంత్రిక వద్దకు వెళ్లకుండా ఇనుప రేకును అడ్డుపెట్టారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కాశినాయన, న్యూస్‌టుడే : మా పాఠశాలలోనే 3, 4, 5 తరగతులు నిర్వహించాలని మిద్దెల గ్రామస్థులు మండల అధికారులను కోరారు. దీంతో డీఈఓ షంషుద్దీన్ బుధవారం ఆ పాఠశాలను పరిశీలించి, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. మీ పిల్లలు సమీపంలోని మోడల్ పాఠశాలకు వెళ్లాల్సిందేనన్నారు. ఇక్కడ సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

సుపరి పాలనకు తొలి అడుగు

మైదుకూరు, న్యూస్‌టుడే : కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం మైదుకూరు పురపాలక పరిధి రాజీవ్‌గాంధీనగర్‌లో ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ శ్రీకారం చుట్టారు. మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఏపీ రవీంద్రతోపాటు పార్టీ నాయకులు పాల్గొన్న కార్యక్రమంలో ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి కరపత్రాలు అందజేశారు. కుటుంబ సభ్యులతో ముచ్చటించారు. ఏడాదిలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధితోపాటు అమలు చేయబోయే అన్నదాత సుఖీభవ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం గురించి వివరించారు. కార్యక్రమంలో నాయకులు దాసరిబాబు, జగన్, శ్రీనివాసులు, రవీంద్ర, యుగంధర్, మునిశేఖర్‌రెడ్డి, కృష్ణ, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు : మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

ఎన్డీయే ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి

జమ్మలమడుగులో వృద్ధురాలికి కరపత్రం అందజేస్తున్న తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి, నాయకులు నాగేశ్వరరెడ్డి, రమణారెడ్డి తదితరులు

జమ్మలమడుగు : కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదిలోనే అనేక పథకాలు అమలు చేసిందని, సుపరిపాలన అందిస్తున్నందుకు ఆశీర్వదించాలని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి కోరారు. బుధవారం ‘సుపరిపాలనలో తొలి అడుగు’ కార్యక్రమాన్ని మండలంలోని గూడెంచెరువు, పట్టణంలోని 20వ వార్డులో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రమణారెడ్డి, నాగేశ్వరరెడ్డి, జీకే గైబు, షేక్షావలి, గౌస్‌మొహిద్దీన్, షాషా, జాకీర్, సంతోష్, దస్తగిరి, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు వైద్యం: ప్రతి ఇంటికీ సంక్షేమం అందించడంతో ప్రజలంతా సీఎం చంద్రబాబు పాలనపై సంతృప్తిగా ఉన్నారని మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి పేర్కొన్నారు. ప్రొద్దుటూరు పురపాలక ఒకటో వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు తెదేపా ఇంటింటి కార్యక్రమం చేపట్టారు.

స్వర్ణయుగంలా కూటమి పాలన

బద్వేలు గ్రామీణ : రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి ఏడాది పాలన స్వర్ణయుగం లాంటిదని మాజీ ఎమ్మెల్యే కె.విజయమ్మ, తెదేపా బద్వేలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి కె.రితేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని రాజుపాళెంలో సుపరి పాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా 96 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రి పదవి చేపట్టినప్పటి నుంచి సమర్థంగా పాలన చేస్తూ ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలను అమలు చేశారన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రోశన్న, తెదేపా నాయకులు రవికుమార్ రెడ్డి, రామచంద్రారెడ్డి, సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఇంటి పట్టా అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ, తెదేపా బద్వేలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రితేష్‌రెడ్డి

మహారాజశ్రీ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టు, ప్రొద్దుటూరు
ఐ.పి. నెం : 29/2024
మల్లెల జాఫర్ హుస్సేన్, తండ్రి షబ్బీర్ అహ్మద్, 21/141-9, క్యూబా మాస్క్ వీధి, ప్రొద్దుటూరు. **- పిటీషనర్**
Vs
1. యస్.ఖాదర్‌బాషా, తండ్రి వఖార్‌సాబ్, 16/399-76, గౌస్‌నగర్, కడప. 2. పి.ఖాన్‌సాబ్, రూం నెం : 7, మార్కెట్ యార్డ్, కడప. 3. యస్.సజ్జర్‌బాషా, తండ్రి ఖాదర్‌బాషా, 14/448, దస్తగిరిపేట, ప్రొద్దుటూరు. 4. చల్లా శ్రీనివాసుల యాదవ్, తండ్రి శివరామయ్య, 22/160, రోటరీ క్లబ్ వీధి, ప్రొద్దుటూరు. 5. చల్లా రాజగోపాల్ యాదవ్, తండ్రి శివరామయ్య, 22/156, రోటరీ క్లబ్ వీధి, ప్రొద్దుటూరు. 6. సుధాకర్‌రెడ్డి, ఫైనాన్స్ బిజినెస్, 6/11, ఈశ్వర్‌రెడ్డినగర్, ప్రొద్దుటూరు. 7. వసులు, బిజినెస్, 19/105, జోక్‌పాలెం, ప్రొద్దుటూరు. 8. సుభహాన్, ఫైనాన్షియర్, 21/291, జోక్‌పాలెం, ప్రొద్దుటూరు. 9. పి.మహబూబ్‌ఖాన్, బిజినెస్, 21/118, క్యూబా మాస్క్ మజీద్ వీధి, ప్రొద్దుటూరు. 10. ఈ.రామిరెడ్డి, చీటీల వ్యాపారం, 25/896-1, పుట్ట వీధి, 3వ లైన్, సుబ్బారావుకొట్టాల, ప్రొద్దుటూరు. **- రెస్పాండెంట్లు**

పబ్లిక్ నోటీసు

పై నెంబర్‌లోని పిటీషనర్ ఇన్‌సాల్వెంట్‌గా నిర్ధారణ చేయమని రెస్పాండెంట్ల పైన ఐ.పి. దాఖలు చేసియున్నారు. అట్టి ఐ.పి. పైన ఎవరికైనా ఆక్షేపణలు ఉన్న యెడల పై కోర్టు వారి ఎదుట తేదీ : **14-07-2025**న ఉదయం 10.30 లకు హాజరై ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకోవలసినది. లేని యెడల పరోక్షమున ఎక్స్‌పార్టీగా తీర్మానించబడును.

వాయిదా : 14-07-2025 **బై ఆర్డర్ ఆఫ్ ది కోర్టు**
జి.చంద్రశేఖర్‌రెడ్డి, జి.నిర్మలాదేవి,
యస్.శివప్రసాద్, వై.యస్.సోఫియ
అడ్వకేట్స్, ప్రొద్దుటూరు.

ఉప్పరపల్లెలో ఆరాధనోత్సవాలు

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే : మండలంలోని ఉప్పరపల్లెలోని సద్గురు సమర్థ నారాయణ ఆశ్రమంలో స్వామి ఆరాధనోత్సవంలో భాగంగా బుధవారం దేవతామూర్తులకు అభిషేకాలు చేశారు. యాగశాలలో పూర్ణాహుతి కోసం హోమ ద్రవ్యాలను సమర్పించారు. అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు. హైదరాబాద్ నుంచి వచ్చిన ప్రభుదత్త మహారాజు ఆధ్యాత్మిక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకుడు గోపాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె జయప్రదానికి పిలుపు

బద్వేలు గ్రామీణ, న్యూస్‌టుడే : దేశ వ్యాప్తంగా ఈ నెల 9వ తేదీ జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ బద్వేలు పట్టణ ప్రధాన కార్యదర్శి నగేశ్ కార్మికులకు పిలుపునిచ్చారు. బుధవారం బద్వేలు పురపాలిక కమిషనర్ నరసింహారెడ్డికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా సమ్మె చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు శ్రీనివాసరాజు, ప్రసాద్, వెంకటరెడ్డి, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యం అధ్వానం.. వీధులు దుర్గంధం

ప్రొద్దుటూరు గ్రామీణ, న్యూస్‌టుడే : మండలంలోని తాళ్లమాపురం పంచాయతీలోని సగిలిగుడ్డపల్లెలో మురుగు పారుదల వ్యవస్థ లేకపోవడంతో రోడ్లపై వృథా నీరు నిలుస్తోంది. రోడ్డుపై మట్టి కుప్పలు.. బురద.. చిత్తడి ఉండటంతో చోదకులు, పాదచారులు రాకపోకలకు అవస్థలు పడుతున్నారు. రాకపోకలు సాగించే క్రమంలో అప్రమత్తంగా లేకపోతే జారికిందపడి ఆసుపత్రుల పాలవుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడంలేదు. ఓటు బ్యాంకు దృష్ట్యా వీధుల్లో ఆక్రమణలు తొలగించడం లేదు. ఫలితంగా వర్షా కాలంతోపాటు, ఇతర సమయాల్లో వీధుల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉంటోంది. వీధి కుళాయిల బిరడాలు తిప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో రక్షిత నీరు వృథాగా పోతున్నాయి. దీంతో వీధులు చిత్తడిగా మారుతున్నాయి. ఖాళీ స్థలాలు, గుంతల్లో నీరు నిలవడంతో పరిసరాలు దుర్వాసన వస్తున్నాయి. దీనకితోడు దోమలు బెడద అధికంగా ఉంటోంది. సీసీ రోడ్లు ఉన్నా మురుగు వెళ్లేందుకు వీలుగా కాలువలు ఏర్పాటు చేయకపోవడంతోనే స్వచ్ఛత కొరవడింది. కూటమి ప్రభుత్వం ఉపాధి హామీ నిధులతో మురుగు పారుదల వ్యవస్థను అభివృద్ధి చేసి పారిశుద్ధ్య సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. సమస్యను డిప్యూటీ ఎంపీడీఓ రామాంజనేయరెడ్డి దృష్టికి తీసుకెళ్లగా నిధుల లభ్యత ఆధారంగా కాంక్రీట్ కాలువల నిర్మాణానికి ప్రాధాన్యమిస్తామన్నారు. రోడ్లపై మట్టి కుప్పలు, బురద తొలగింపునకు చర్యలు తీసుకుంటామన్నారు.

సగిలిగుడ్డుపల్లెలో రోడ్డుపై మురుగు నిల్వలు

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (Union Bank of India)
ప్రాంతీయ కార్యాలయం : కడప
చిరునామా : 21/58, బిఎస్ఎన్ఎల్ భవనం, హెడ్ పోస్టాఫీసు ప్రక్కన, ట్రంక్ రోడ్, కడప-516001.

లీజుపై ఆవరణ కావలెను

కడప జిల్లాలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా యొక్క కడప జిల్లా, వేపరాల శాఖకు బాగుగా నిర్మించబడి, అనువుగా ఉండి, ప్రధానంగా గ్రౌండ్ ఫ్లోర్‌లో, ముందు ఖాళీ ప్రదేశంతో, మెయిన్ రోడ్డుకు సులువుగా చేరుకునేలా ఉండి, తగినంత పార్కింగ్ సౌకర్యం మరియు బ్యాంక్‌కు అవసరమైన ఇతర ఆవశ్యకతలు / సౌకర్యాలను కలిగి, “స్వాధీనతకు సిద్ధంగా ఉన్న” లేదా “నిర్మాణంలో ఉన్న” వాణిజ్య ఆవరణ లేదా “బ్యాంక్ స్పెసిఫికేషన్ల మేరకు వాణిజ్య ఆవరణను నిర్మించుటకు సంసిద్ధత కలిగియున్న యజమానుల నుండి స్వాధీనతకు సిద్ధంగా ఉన్న ఖాళీ ప్లాట్” కావలెను.

ప్రదేశం / ప్రాంతం	జిల్లా	కార్పెట్ ఏరియా (చ.అ.లలో)
వేపరాల	కడప	1200+10%

ఔత్సాహిక యజమాని / యజమానులు లేదా యజమానుల తరుపున బేరసారాలు జరుపగలవారు టెక్నికల్ బిడ్ మరియు ప్రైస్ బిడ్ నమూనాలను దిగువ తెలిపిన చిరునామా వద్ద **03-07-2025** తేది నుండి బ్యాంక్ కార్యాలయ వేళల్లో పొందవచ్చును లేదా వెబ్‌సైట్ : **www.unionbankofindia.co.in** నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును. ఆవరణ యొక్క ఆఫరును రెండు వేర్వేరు సీల్డు కవర్లలో ఉంచి, **1. “వేపరాల శాఖ కొరకు టెక్నికల్ బిడ్”** మరియు **2. “వేపరాల శాఖ కొరకు ప్రైస్ బిడ్”** అని కవర్లపై వ్రాసి, ఆ రెండు కవర్లను **మూడవ (ప్రధాన) కవర్‌లో** ఉంచి, దానిపై **“వేపరాల శాఖ కొరకు లీజుపై ఆవరణ నిమిత్తం టెండరు”** అని వ్రాసి, దిగువ తెలిపిన చిరునామా వద్ద దాఖలు చేయవలెను.
చిరునామా: రీజనల్ మేనేజర్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ప్రాంతీయ కార్యాలయము, డోర్ నెం. 21/58, బిఎస్ఎన్ఎల్ భవనం, హెడ్ పోస్టాఫీసు ప్రక్కన, ట్రంకు రోడ్డు, కడప - 516001.
బిడ్లు దాఖలుకు చివరి తేది : **23-07-2025, సా॥ 4.00 గం.లోపు,**
బిడ్లు 23-07-2025, సా॥ 4.30 గం.లకు పైన తెలిపిన చిరునామా వద్ద యజమానులు/వారి ప్రతినిధుల సమక్షంలో తెరవబడతాయి. టెండర్ ప్రకటనలో నిర్దేశించబడిన చివరి తేది మరియు సమయం తర్వాత వచ్చిన బిడ్స్ అంగీకరించబడవు. బ్రోకర్లు లేదా మధ్యవర్తులు అనుమతించబడరు. ఎట్టి కారణములు తెలుపకనే ఏదేని అన్ని బిడ్స్/ఆఫర్లను అంగీకరించు లేదా తిరస్కరించు హక్కు బ్యాంకుకు కలదు. ఏదేని తదుపరి సమాచారం, సవరణలు మరియు అమెండ్మెంట్లు బ్యాంకు వెబ్‌సైట్ నందు మాత్రమే ఉంచబడతాయి.
తేది : 03.07.2025 సం/-రీజినల్ హెడ్

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu

కడప

• కడప • పులివెందుల • కమలాపురం

కమిషనర్‌తో 'వాక్‌-విత్‌ ఈనాడు' నేడు

పులివెందుల పురపాలక కమిషనర్ రాముడు గురువారం 12వ సచివాలయం అంకాళమ్మపేట పరిధిలో పర్యటించనున్నారు. పట్టణ సమస్యలపై 'న్యూస్‌టుడే' వార్డు పరిశీలనలో భాగంగా అంకాళమ్మపేటలోని వీధుల్లో పర్యటిస్తారు. ఈ సందర్భంగా 12వ సచివాలయం పరిధిలోని ప్రజలు పడుతున్న ఇబ్బందులను కమిషనర్ దృష్టికి తీసుకురావచ్చు. పురపాలక శాఖ పరిధిలో ఎదుర్కొంటున్న సమస్యలను ఆ ప్రాంత ప్రజలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరించాలని విన్నవించుకోవచ్చు. **న్యూస్‌టుడే, పులివెందుల**

రాముడు కమిషనర్

తేదీ : గురువారం 03-7-2025 | సమయం : ఉదయం 7.00 గంటలకు ప్రారంభం

బాలుర వసతి గృహం పరిశీలన

కడప న్యాయవిభాగం : ఒంటిమిట్టలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని బుధవారం సీనియర్ జడ్జి బాబా ఫక్రుద్దీన్ పరిశీలించారు. పరిసరాల శుభ్రత, భద్రత తదితర అంశాలను తనిఖీ చేశారు. వసతి గదులు, మరుగుదొడ్లను పరిశీలించారు. అనంతరం పలు దస్త్రాలు తనిఖీ చేశారు. సమస్యలుంటే జిల్లా న్యాయసేవా అధికార సంస్థ దృష్టికి తీసుకురావాలన్నారు.

దస్త్రాలు పరిశీలిస్తున్న జడ్జి బాబా ఫక్రుద్దీన్

మేమున్నాం.. మీకు తోడుగా..

(10 AM to 1 PM)
కడప : 8008573428, 8688701384
పులివెందుల : 8008573466, 8008573474
కమలాపురం : 8008573475

- కడప గంజికుంట కాలనీలోని కాలువలో పూడికలు తీయకపోవడంతో ఇటీవల ఈనాడులో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు సిబ్బందిని పంపించి కాలువల్లో పూడిక తొలగించారు.
- కడప బుగ్గవంక కాలువలో పిచ్చి మొక్కలు, బుగ్గవంక పరివాహక ప్రాంతాల్లో ఆక్రమణలు నెలకొనడంపై 'బుగ్గవంక.. చూడరా జబువంక' అనే శీర్షికతో ఇటీవల ఈనాడులో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు బుగ్గవంకలో యంత్రాలతో పిచ్చిమొక్కలను తొలగించారు.
- వేంపల్లె పాతపేట శివాలయం వద్ద కాలువలు పొంగి రోడ్డుపై మురుగు ప్రవహిస్తోందని ఈ నెల 28న మేమున్నాం.. మీకుతోడుగాలో భాగంగా ప్రచురితమైంది. స్పందించిన గ్రామపంచాయతీ ఈవో మాధవరెడ్డి పారిశుద్ధ్య సిబ్బందితో రోడ్డుపై మురుగు పారకుండా చర్యలు తీసుకున్నారు. - **న్యూస్‌టుడే, వేంపల్లె**

?: బుగ్గవంక ప్రహరీ పక్కన నిర్మించిన కాలువలో పిచ్చి మొక్కలు, గడ్డి పెరిగాయి. మురుగునీరు ముందుకు కదలడం లేదు. - **కుమార్, రవీంద్రనగర్**

?: కడప చిన్నచౌకులోని కాలువ పూడికతో నిండిపోయింది. కాలువల్లోని పూడికలు తొలగించాలి. - **మనోహర్, కడప**

✓: పారిశుద్ధ్య కార్మికులచే మురుగు కాలువల్లోని పూడికలు, పిచ్చిమొక్కలు తొలగిస్తాం. - **చంద్రశేఖర్, వైద్యాధికారి, నగరపాలక, కడప**

నకిలీ విత్తనం... ఏమారితే అపార నష్టం

మొలకలు రాకపోవడంతో ఉల్లి పంటను దున్నేస్తున్న రైతు (పాత చిత్రం)

కమలాపురం, తొండూరు, న్యూస్‌టుడే : ఖరీఫ్ సాగుకు రైతులు సన్నద్ధమయ్యారు. నాణ్యమైన విత్తనాలు వేసి అధిక దిగుబడులు సాధించాలనే తపనతో ముందుకు వెళుతున్నారు. పంట సాగులో విత్తన ఎంపిక అత్యంత కీలకం. వ్యాపారులు అన్నదాతను మోసం చేసేందుకు కల్తీ, నకిలీ విత్తనాలు అంటగట్టే ప్రయత్నం చేస్తున్నారు. విత్తన ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే అన్నదాతలు తీవ్రంగా నష్టపోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో విత్తనాన్ని సరి చూసుకొని కొనుగోలు చేయాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు.

- కమలాపురం, పులివెందుల నియోజకవర్గాలలో ఖరీఫ్‌లో వేరుసెనగ, వరి, కంది, మొక్కజొన్న, మినుముతో పాటు పత్తి సాగు చేస్తారు. ఈ పంటల సాగుకు అనేక మంది రైతులు ప్రైవేట్ వ్యాపారుల వద్దే విత్తనాలు కొనుగోలు చేస్తున్నారు. రైతులు దుకాణాల వద్దకు వెళ్లి పంట రకం పేరు చెప్పి విత్తనాలు కొనుగోలు చేస్తారు. విత్తన నాణ్యత, రసీదులు, విత్తన రకం సైతం పరిశీలించకుండానే కొనుగోలు చేస్తున్నారు. వ్యాపారులు రైతులను మోసం చేసేందుకు వివిధ రకాల పేర్లతో అనేక కంపెనీల విత్తనాలు విక్రయిస్తున్నారు. గతేడాది పులివెందుల నియోజకవర్గంలో నకిలీ విత్తనాల కారణంగా సుమారు 271 హెక్టార్లలో పంటలు మొలకలు రాక రైతులు తీవ్రంగా నష్టపోయారు.

ఈ విషయాలు గుర్తించాలి

- అన్నదాతలు మొదట విత్తన రకాన్ని ఎంపిక చేసుకోవాలి.
- రైతులు కచ్చితంగా రసీదుతో పాటు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయాలి.
- ప్రభుత్వ గుర్తింపు పొందిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలి.
- రసీదు, సంచులను భద్రపరచుకోవాలి. మొలక శాతం పరిశీలించాలి.
- వంద విత్తనాలు నానబెట్టి వాటిలో 80 విత్తనాలు మొలక బాగా వస్తే ఆ విత్తనం వినియోగించవచ్చు.
- విత్తన సంచిపై ఉన్న నంబర్లు ప్యాకింగ్ చేసిన తేదీని సరి చూసుకోవాలి.
- రాయితీ విత్తనాలతో నష్టం ఉండదు

బాలల సంరక్షణ అందరి బాధ్యత

మాట్లాడుతున్న స్త్రీ శిశు సంక్షేమాధికారి శ్రీలక్ష్మి, చిత్రంలో స్టెప్ సీఈవో సాయిగ్రేస్

జిల్లా సచివాలయం, న్యూస్‌టుడే : బాలల రక్షణ అందరి బాధ్యతని స్త్రీ శిశు సంక్షేమశాఖ అధికారి శ్రీలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం కడప కలెక్టరేట్‌లో మహిళా సాధికారికత శాఖ ఆధ్వర్యంలో మిషన్ వాత్సల్యపై తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు, పోలీసు అధికారులకు ఒకరోజు కార్యశాల నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు సంబంధించిన కేసుల్లో అన్నిశాఖల సమన్వయం ఎంతో అవసరమన్నారు. బాల్య వివాహాల నిరోధించడంలో తహసీల్దార్ల సహకారం ఎంతో అవసరమన్నారు. స్టెప్ సీఈవో సాయిగ్రేస్, డీసీపీవో సుభాష్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యనందించాలి

పులివెందుల, లింగాల, న్యూస్‌టుడే : కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనందించాలని లింగాల ఎంఈవో-1 బి.శ్రీనివాసులురెడ్డి, ఎంఈవో-2 బి.రామక్రిష్ణ పేర్కొన్నారు. బుధవారం పులివెందులలోని అహోబిలాపురం ఉన్నత పాఠశాలలో లింగాల మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు అవగాన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ విలువలతో కూడిన విద్యను అందించాలని సూచించారు.

అలరించిన నీ గానమే నా ప్రాణం

మారుతీనగర్, న్యూస్‌టుడే : అఖిల భారత అయ్యప్ప దీక్షా ప్రచార జిల్లా సమితి ఆధ్వర్యంలో నగర శివారుల్లోని డీఎస్ఆర్ సమావేశ మందిరంలో బుధవారం నీ గానమే నా ప్రాణం .. . ఊరూరా అయ్యప్ప గానం .. సర్వ మానవాళికి శుభప్రదం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం కాషాయ ధ్వజారోహణం, గోపూజ, అఖండ జ్యోతి ప్రజ్వలన, సాయంత్రం అయ్యప్ప స్వామికి అభిషేకం, పడిపూజ, మంగళహారతి తదితర పూజలు నిర్వహించారు. పలు రాష్ట్రాల నుంచి వచ్చిన గురుస్వాములు ప్రత్యేక ఆత్మీయ సమావేశం నిర్వహించి పలు అంశాలపై చర్చించారు.

అయ్యప్ప కీర్తనలు ఆలపిస్తున్న గురు స్వాములు

వైవీయూ గురుకులంలో భోజనశాల ప్రారంభం

మారుతీనగర్, న్యూస్‌టుడే : యోగి వేమన విశ్వవిద్యాలయంలోని గురుకులంలో ప్రత్యేక భోజనశాల ప్రారంభించినట్లు రిజిస్ట్రార్ పద్మ తెలిపారు. వైవీయూలో బుధవారం ఆమె డైనింగ్‌హాలును ప్రారంభించి మాట్లాడారు. గురుకులంలో కామర్స్, ఎంబీఏ, ఎంసీఏ విభాగాల విద్యార్థులు మధ్యాహ్నం భోజనం కోసం పడే ఇబ్బందులను గుర్తించి వైవీయూ గురుకులం విభాగంలో ప్రత్యేక డైనింగ్‌హాలును ఏర్పాటు చేసి భోజన వసతి కల్పించామని తెలిపారు. కామర్స్, మేనేజ్‌మెంట్ విభాగ డీన్ ప్రొఫెసర్ సుబ్బరాయుడు, కామర్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ రఘునాథరెడ్డి, ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ సరిత, ఎంసీఏ విభాగాధిపతి డాక్టర్ శ్రీనివాసరావు, ఆచార్య విజయభారతి, డాక్టర్ రెడ్డెయ్య పాల్గొన్నారు.

గంజాయి కేసులో నిందితుడికి రిమాండ్

పులివెందుల, న్యూస్‌టుడే : గంజాయి కేసులో ఒకరిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పులివెందుల పట్టణ సీఐ చాంద్‌బాషా బుధవారం తెలిపారు. ఏప్రిల్‌లో నమోదైన గంజాయి కేసులో అప్పట్లో ఏ1 గా మల్లికార్జున అనే వ్యక్తి వద్ద కిలో గంజాయి స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు పంపామన్నారు. అదే కేసులో పరారీలో ఉన్న రియాజ్‌ను వ్యక్తిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

పోలీసులు న్యాయం చేయడం లేదని ఆరోపణ

ఒంటిమిట్ట, న్యూస్‌టుడే : ఒంటిమిట్ట పోలీసులు బాధితుల గోడు ఆలకించడం లేదని కొత్తమాధవరం పంచాయతీ మల్లేశ్వరపురానికి చెందిన శిరీషా అనే యువతి ఆరోపించారు. ఆమె బుధవారం ఓ వీడియో విడుదల చేశారు. ఇటీవల తన తల్లి అలిశెట్టి లక్ష్మీదేవి (57)పై సమీప బంధువులు దాడి చేయడంతో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వివరించారు. ఠాణాకు వెళ్లి ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని వాపోయారు. కేసు వెనక్కి తీసుకోవాలని, రాజీ కావాలని పోలీసులే ఒత్తిడి చేశారని ఆరోపించారు. దాడి చేసిన ఎనిమిది మందిపై ఫిర్యాదు చేసి వారం రోజులైనా కనీసం విచారణ కూడా చేయలేదన్నారు. న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని వివరించారు. ఈ విషయంపై సీఐ బాబుతో 'న్యూస్‌టుడే' చరవాణిలో మాట్లాడగా కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నామని తెలిపారు. శిరీషా చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదన్నారు.

శిరీషా

పంచాయతీ ఉద్యోగి మోసగించారని ఫిర్యాదు

వేంపల్లె, న్యూస్‌టుడే : వేంపల్లె పంచాయతీలో క్లాప్ మిత్రగా పనిచేస్తున్న అంజికి గ్రామ పంచాయతీ ఉద్యోగి హరికృష్ణ టోకరా వేశారు. ఇంటి ప్లాన్ అప్రూవల్ కోసం నాలుగేళ్ల కిందట రూ. 72 వేలు ఇచ్చినప్పటికీ అందుకు సంబంధించి ఎలాంటి రసీదు ఇవ్వలేదు. దీంతో తాను మోసపోయానని, ఈ విషయంలో తనకు న్యాయం చేయాలని అంజి బుధవారం సర్పంచి ఆర్.శీను, ఈవో మాధవరెడ్డిని ఆశ్రయించారు. ఈ విషయమై గ్రామపంచాయతీ ఈవో మాధవరెడ్డిని 'న్యూస్‌టుడే' వివరణ కోరగా ఇంటి ప్లాన్ అప్రూవల్ కోసం అంజి చెల్లించిన డబ్బుల వివరాలు తెలుసుకునేందుకు రికార్డులు పరిశీలిస్తామన్నారు. లేని పక్షంలో విచారణ జరిపి చర్యలు తీసుకుంటామన్నారు.

సహకార సంఘాల బలోపేతానికి కృషి

కడప గ్రామీణ, న్యూస్‌టుడే : జిల్లాలోని వ్యవసాయ సహకార పరపతి సంఘాలు ఆర్థికంగా బలోపేతం కావాలని జిల్లా సహకారశాఖ అధికారి వెంకటసుబ్బయ్య పేర్కొన్నారు. బుధవారం కడప పరిధి సహకార అధికారి కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అంతర్జాతీయ సహకార సంవత్సరాన్ని పురస్కరించుకుని సంఘాలు బాగా పనిచేసేందుకు అధికారులు, ఉద్యోగులు కృషి చేయాలన్నారు. సమావేశంలో సహకార శిక్షణ కేంద్రం ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిన్నరలోపు రైల్వే పైవంతెన పనులు పూర్తి

కమలాపురం, సీకేదిన్నె: న్యూస్‌టుడే : కమలాపురంలో రైల్వే పైవంతెన నిర్మాణానికి త్వరలో టెండర్లు పిలుస్తారని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో నూతనంగా నిర్మించనున్న అన్నా క్యాంటీన్‌కు తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షుడు పుత్తా నరసింహారెడ్డితో కలిసి బుధవారం భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. రైల్వే పైవంతెన పనులను నెలన్నరలో ప్రారంభించి ఏడాదిన్నరలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వివరించారు. మూడు నెలల్లో క్యాంటీన్ పనులు పూర్తి చేయించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. అంతకుముందు సీకేదిన్నె మండలంలోని వెలుగు కార్యాలయ ఆవరణలో రివాల్వింగ్ ఫండ్ స్త్రీ నిధి బ్యాంకు రుణాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. డ్వాక్రా సంఘాల మహిళలకు రూ.1.65 కోట్ల రుణాలిచ్చి వారు ఆర్థికంగా అభ్యున్నతి సాధించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. అనంతరం డ్వాక్రా మహిళలకు చెక్కును పంపిణీ చేశారు. పబ్లిక్ హెల్త్ ఈఈ రమణమూర్తి, డీఈ కావ్య, తహసీల్దార్లు శివరామిరెడ్డి, నాగేశ్వరరావు, ఎంపీడీవోలు గౌస్‌బాషా, కుళ్లాయిబాబా, నగర పంచాయతీ ఏఈ తిరువెంగలప్ప, నాయకులు రాఘవరెడ్డి, ఖాదర్‌బాషా, దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నా క్యాంటీన్ నిర్మాణానికి సంబంధించిన పటాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి

మాజీ సైనికుల సంక్షేమానికి కృషి

చిన్న చౌకు(కడప), న్యూస్‌టుడే : జిల్లాలోని మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా సైనిక సంక్షేమాధికారి భక్తవత్సల్‌రెడ్డి పేర్కొన్నారు. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న రజాక్ బదిలీ కావడంతో ఆయన స్థానంలో కడపకు వచ్చిన భక్తవత్సల్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మాజీ సైనికులకు ఎలాంటి సమస్య ఎదురైనా తన దృష్టికి తీసుకొస్తే వెంటనే న్యాయం చేస్తానని వివరించారు. జిల్లా మాజీ సైనిక సంక్షేమం సంఘం అధ్యక్షుడు రమణయ్య ఆధ్వర్యంలో ఆయనను శాలువా కప్పి సత్కరించారు. ప్రతినిధులు రాముడు, చంద్రయ్య, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తవత్సల్‌రెడ్డిని సన్మానిస్తున్న మాజీ సైనికులు

రైతులు సద్వినియోగం చేసుకోవాలి

పులివెందుల, న్యూస్‌టుడే : రైతులకు ప్రభుత్వం రాయితీలో అందిస్తున్న డ్రిప్, స్ప్రింక్లర్లను సద్వినియోగం చేసుకోవాలని మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటేశ్వరరెడ్డి కోరారు. బుధవారం ఆయన పులివెందుల, తొండూరు, లింగాల, సింహాద్రిపురం మండలాల్లోని రైతుల పొలాల్లో అమర్చిన డ్రిప్ పరికరాలు, స్ప్రింక్లర్లను పరిశీలించారు. 10 ఎకరాల వరకు ఓసీ, బీసీలకు 90 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం రాయితీతో పరికరాలు అందజేస్తున్నామన్నారు.

భాజపా రాష్ట్ర అధ్యక్షుడికి సత్కారం

వేంపల్లె, న్యూస్‌టుడే : గ్రామస్థాయిలో భాజపా బలోపేతానికి కృషి చేయాలని భాజపా జాతీయ కౌన్సిల్ సభ్యుడు రామచంద్రారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి హరిప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం విజయవాడకు వెళ్లి భాజపా నూతన అధ్యక్షుడు మాధవ్‌ను కలిసి ఘనంగా సత్కరించారు. ప్రజల ప్రయోజనాలు, వికసిత్ భారత్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని మాధవ్ వెల్లడించారన్నారు. బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు ఎర్రబోయిన రవి యాదవ్, భాజపా వీరపునాయునిపల్లె మండల అధ్యక్షుడు తులసినాయుడు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

లింగాల, న్యూస్‌టుడే : మండల పరిధిలోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ ఈశ్వరయ్య బుధవారం పరిశీలించారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల పరిధిలోని 31 పోలింగ్ కేంద్రాల్లో త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించనున్నారు. దీంతో ఆయా కేంద్రాల్లో తాగు నీరు, విద్యుత్తు సౌకర్యంపై ఆరా తీశారు.

రేషన్ బియ్యం స్వాధీనం

సింహాద్రిపురం, న్యూస్‌టుడే : మండలంలోని నంద్యాలపల్లెకు చెందిన ఓ మహిళ అక్రమంగా నిల్వ ఉంచిన 450 బస్తాల రేషన్ బియ్యాన్ని బుధవారం విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మహిళపై కేసు నమోదు చేశారు.

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమ పాలన

మహిళకు కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవి

అరవిందనగర్ (కడప), న్యూస్‌టుడే : కడప నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే, విప్ మాధవి పేర్కొన్నారు. బుధవారం ఎన్జీవో కాలనీలో సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలు అందజేశారు. రూ.వెయ్యి కోట్లతో కడప, కొప్పర్తికి నీటి సౌకర్యం కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు భరోసా ఇచ్చారని త్వరలోనే కార్యరూపం దాల్చుతుందన్నారు. నాయకులు రెడ్డెయ్యయాదవ్, రాంప్రసాద్, మలిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రాంప్రసాద్‌రెడ్డి, కార్పొరేషన్ అదనపు కమిషనర్ రాకేష్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

✦ సీఎం చంద్రబాబు అందించిన సుపరిపాలనలో ప్రజలు సంతోషంగా ఉన్నారని ఎస్సీ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గన్నెపాటి మల్లేశ్, తెదేపా నగర అధ్యక్షుడు శివకొండారెడ్డి పేర్కొన్నారు. తెదేపా సుపరిపాలనలో తొలిఅడుగులో భాగంగా బుధవారం చిన్నచౌక్ పరిధిలో పలువురు నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు.

✦ నగరంలోని 21వ డివిజన్‌లో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమాన్ని తెదేపా రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు.

కమలాపురం: ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేస్తున్నామని ఎమ్మెల్యే పుత్తా కృష్ణచైతన్యరెడ్డి పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వ పాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా 'సుపరిపాలనకు తొలి అడుగు' కార్యక్రమాన్ని బుధవారం గంగవరంలో ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించారు. సామాజిక పింఛన్ల పెంపు, ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు, డీఎస్సీ పోస్టుల భర్తీ, ఉచితంగా గ్యాస్ సిలిండర్ల పంపిణీ, అన్నా క్యాంటీన్లు పునఃప్రారంభం, తల్లికి వందనం తదితర పథకాలు అమలు చేస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గ పరిశీలకుడు మనోహర్‌నాయుడు, నాయకులు వీరప్రసాదర్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఆరోగ్యం, సుధాకర్‌రెడ్డి, గండి నారాయణ, ప్రసాద్‌రెడ్డి, మల్లేశ్, మురళి రెడ్డి, పాల్గొన్నారు.

పులివెందుల : కూటమి ప్రభుత్వానికి ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తోందని తెదేపా నియోజకవర్గ బాధ్యుడు బీటెక్ రవి పేర్కొన్నారు. బుధవారం పులివెందులలోని శ్రీనివాస థియేటర్ వెనుక వీధిలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలకు సంబంధించిన వివరాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. తెదేపా రాష్ట్ర కార్యదర్శి తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, హజ్‌కమిటీ రాష్ట్ర డైరెక్టర్ మహబూబ్‌బాషా, భాస్కర్‌రెడ్డి, తెదేపా సీనియర్ నాయకులు తూగుట్ల సిద్ధారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పులివెందుల: ప్రజలకు ప్రభుత్వ పథకాలను వివరిస్తున్న బీటెక్ రవి

జాతీయ రహదారి అలైన్‌మెంట్ మార్పునకు చర్యలు

వేంపల్లె, న్యూస్‌టుడే : జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం గండిక్షేత్రంలో జాతీయ రహదారి 440 అలైన్‌మెంట్ మార్పునకు చర్యలు తీసుకుంటున్నట్లు జాతీయ రహదారి అథారిటీ ఇంజినీరింగ్ విభాగం టీమ్ లీడర్ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన గండిక్షేత్రానికి వచ్చారు. అంజన్న ఆలయ పునర్నిర్మాణ పనులకు సంబంధించి రాజగోపురం పనులు రోడ్డు మధ్యలోకి వచ్చినట్లు గుర్తించారు. ఈ కారణంగా వీరన్నగట్టుపల్లె నుంచి రాయచోటి వరకు చేపట్టిన ఎన్‌హెచ్-440 రహదారి విస్తరణ పనుల అలైన్‌మెంట్‌ను మార్చాలని ఆలయ సహాయ కమిషనర్ వెంకటసుబ్బయ్య, ఆలయ కమిటీ ఛైర్మన్ కావలి కృష్ణతేజ అధికారులను కోరారు. ఆలయ పునర్నిర్మాణ పనుల దృష్ట్యా రోడ్డు మలుపు ఏర్పాటు చేసి 15 మీటర్ల మేర పాపఘ్ని నదిలోకి రోడ్డును మార్చేలా డిజైన్లు రూపొందిస్తామన్నారు. ఆలయ కమిటీ, అధికారుల సూచన మేరకే రోడ్డు విస్తరణ పనుల అలైన్‌మెంట్‌ను మారుస్తామన్నారు. కార్యక్రమంలో హైవే అథారిటీ రెసిడెన్షియల్ ఇంజినీర్ సాయిప్రసాద్‌రెడ్డి, అసిస్టెంట్ ఇంజినీర్ శివప్రసాద్‌రెడ్డి, ఆలయ కమిటీ మాజీ ఛైర్మన్ కావలి వీరభాస్కరుడు, ఆలయ అర్చకుడు కేసరి, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ కట్టడాలను పరిశీలిస్తున్న నేషనల్ హైవే అథారిటీ విభాగం టీమ్ లీడర్ రమేష్‌రెడ్డి

ట్రిపుల్ ఐటీ భోజన నిర్వహణ బాధ్యతల మార్పునకు వినతి

వేంపల్లె, న్యూస్‌టుడే : ఆర్జీయూకేటీ పరిధిలోని ఇడుపులపాయ, నూజివీడు, ఒంగోలు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలలో మెస్‌ల బాధ్యతను అక్షయపాత్ర సంస్థకు గానీ, మరేదైనా స్వచ్ఛంద సంస్థలకు అప్పగించాలని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను కోరారు. ఈ మేరకు ఉండవల్లికి వెళ్లి మంత్రి లోకేశ్‌ను కలిసి మెస్‌ల సమస్యలపై ఆయనకు వినతిపత్రం అందజేశారు. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం లేదని, మెస్‌ల నిర్వాహకులు విద్యార్థుల పట్ల దురుసుగా ప్రవర్తిస్తున్నారన్న ఆరోపణలు కూడా ఉన్నాయన్నారు. ఇలాంటి వివాదాలకు ముగింపు పలకాలని కోరారు.

మంత్రి లోకేశ్‌తో ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి

నలుగురికి ఈవోఆర్డీలుగా ఉద్యోగోన్నతి

వేంపల్లె, న్యూస్‌టుడే : జిల్లాలోని వివిధ గ్రామపంచాయతీల్లో కార్యదర్శులుగా పనిచేస్తున్న నలుగురికి ఈవోఆర్డీలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కృష్ణతేజ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె గ్రామపంచాయతీ ఈవో రామమోహన్‌రెడ్డి, ఎర్రగుంట్ల మండలం కలమల్ల గ్రామపంచాయతీ ఈవో హరనాథ, జమ్మలమడుగు, కడప డీఎల్పీవో కార్యాలయాల్లో పనిచేస్తున్న అనిల్‌కుమార్, ప్రసాద్‌కు ఈవోఆర్డీలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కె.పల్లెలో దాహం కేకలు

పొలాల నుంచి తాగునీటిని తీసుకెళుతున్న గ్రామస్థులు

చెన్నూరు, న్యూస్‌టుడే : కొక్కరాయపల్లెలో రెండు రోజులు కిందట తాగునీటి యంత్రం మరమ్మతులకు గురవడంతో నీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకపోవడంతో తాగునీటి సమస్య నెలకొందని బుధవారం మండిపడ్డారు. సమీపంలోని పొలాల్లోకి వెళ్లి నీరు తెచ్చుకోవాల్సిన దుస్థితి నెలకొందని వాపోయారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి శివకుమార్‌ను వివరణ కోరగా, యంత్రం మరమ్మతులకు గురవడంతో తాగునీటి సమస్య నెలకొందని, త్వరలోనే మరమ్మతులు చేస్తామని పేర్కొన్నారు.

వైకాపా నిర్లక్ష్యం.. అసంపూర్తిగా నిర్మాణం

పెండ్లిమర్రి, వీరపునాయునిపల్లె, న్యూస్‌టుడే : గత వైకాపా పాలకుల నిర్లక్ష్యం కారణంగా పలు కార్యాలయాల భవన నిర్మాణాలు అసంపూర్తిగా నిలిచిపోయాయి. దీంతో సేవలు పొందేందుకు రైతులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కమలాపురం నియోజకవర్గం పరిధిలోని పలు గ్రామాల్లో గ్రామ సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్, రైతు సేవా కేంద్రాల భవన నిర్మాణ పనులను గత వైకాపా ప్రభుత్వం ప్రారంభించింది. పాలకుల అసమర్థత, నిధుల కొరత కారణంగా చాలా చోట్ల పనులు పూర్తి కాలేదు. పెండ్లిమర్రి మండల పరిధిలోని తుమ్మలూరు, వెల్లటూరు గ్రామ సచివాలయాలు, పాత సంగటిపల్లె, పెండ్లిమర్రి, గొందిపల్లె, వెల్లటూరులో రైతు సేవా కేంద్రాలు, పాత సంగటిపల్లె, వెల్లటూరు, గొందిపల్లెలో విలేజ్ హెల్త్ క్లినిక్ భవన నిర్మాణాలు అర్ధాంతరంగా నిలిచిపోయాయి.

✦ వీరపునాయునిపల్లె మండల పరిధిలోని కొమ్మర్ధి, ఇందుకూరు రైతు సేవా కేంద్రాల భవన నిర్మాణాలు మధ్యలోనే నిలిచిపోయాయి. ఈ విషయంపై మండల పీఆర్ ఏఈ రహంతుల్లాను న్యూస్‌టుడే వివరణ కోరగా.. అసంపూర్తిగా నిలిచిపోయిన భవన నిర్మాణాలపై ఉన్నతాధికారులకు నివేదించామన్నారు. నిధులు రాగానే పనులు చేపట్టి పూర్తి చేయిస్తామని వివరించారు.

పెండ్లిమర్రిలో నిలిచిపోయిన రైతు సేవా కేంద్రం భవన నిర్మాణం

అనధికారిక మద్యం కొనుగోలు చేయొద్దు

చిన్నచౌకు(కడప), న్యూస్‌టుడే : అనధికారిక వ్యక్తుల నుంచి మద్యం కొనుగోలు చేయకూడదని ఎక్సైజ్ అదనపు పర్యవేక్షణాధికారి వినోద్‌కుమార్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అనుమతి పొందిన దుకాణాల్లోనే కొనుగోలు చేయాలన్నారు. లైసెన్సు లేకుండా విక్రయిస్తున్న వారి సమాచారాన్ని తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనధికారికంగా మద్యం విక్రయిస్తుంటే టోల్‌ఫ్రీ సంఖ్య 14405, 63007 20018 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

CHANGE OF NAME

I, **Y.S.Santhi Suresh Kumar, S/o Y.S.Jayapal,** R/o D.No. 4-34, R.T.C. Colony, Chinna Chowk, Y.S.R. Kadapa Town & Dist., I State that in my Service records & Medical Book my son name wrongly recorded in GIFFTY. Hereby declare that my son name actual & Correct name as **Y.S.ADINETH PRIYATHAM GIVESON KUMAR** (as per Aadhaar & Birth Certificate) for all future Purposes.

IN THE COURT OF THE HON'BLE PRINCIPAL SENIOR CIVIL JUDGE: KADAPA
I.A.No: 179 of 2025 in O.S.No: 234 of 2015

V.S.Sultan Basha, Son of late V.S.Gulam Ghouse Peer, residing at Door No: 6/189, Burandeen Street, Kadapa City.
- Petitioner/Defendant No : 1
Vs
1) Nawab Sayyad Nazeer, S/o Sayyad Nawab, 2) Sayyad Shabana Shabnam, W/o Nawab Sayyad Nazeer, Both are residing at Door No: 7/529, N.G.O.Colony, Kadapa City.
- Respondents/Defendants No: 2 & 3

NOTICE TO RESPONDENTS/DEFENDANTS No: 2 & 3 UNDER ORDER 9 RULE 13 C.P.C

Where as the Petitioner/Defendant No: 1 herein filed the Petition against the Respondent/Plaintiff and both of you being Respondents/Defendants No: 2 & 3 to set-aside the ex-parte decree against him and the said case stand posted on 16-07-2025 for your appearance therefore you being the Respondents/Defendants No: 2 & 3 here by instructed to appear before the Hon'ble Court on **16-07-2025** at 10.30 A.M. sharp personally or through an Advocate, failing which the matter will be decide as Ex-parte.

BY ORDER OF THE HON'BLE COURT
ADVOCATES FOR PETITIONER/DEFENDANT No: 1
(S.MD.KHALEEL GHOUSE & ABBAS KHAN)

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell: 99899 97626
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell: 91771 11468

(c) eenadu